ఈనాడు
అల్లూరి సీతారామరాజు
మంగళవారం 2 డిసెంబరు 2025

మన్యానికి మరో మణిహారం

మన్యంలో వంజంగి, చెరువులవేనం, మాడగడ మేఘాల కొండలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ జాబితాలోకి మరో కొత్త మేఘాల కొండ చేరింది. గూడెంకొత్తవీధి మండల కేంద్రానికి సమీపంలోని బోడి కొండపై వ్యూపాయింట్ విశేషంగా ఆకట్టుకుంటోంది. అక్కడ బోడికొండమ్మ అమ్మవారి పూజలు అందుకుంటున్నారు. డేరాల గ్రామానికి చెందిన యువకులు ఇటీవల ఆ కొండపైకి వెళ్లి అక్కడే ఉండి.. తెల్లవారుజామున మేఘాలు, సూర్యోదయ సుందర దృశ్యాలను ఆస్వాదించారు. ఈ కొండకు వెళ్లే మార్గాన్ని అభివృద్ధి చేస్తే మన్యానికి మరో మణిహారంగా వెలుగొందుతుందని ఆ యువకులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, గూడెంకొత్తవీధి

గర్భిణులకు వరం.. మాతృవందనం!

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి మాతృ వందన యోజనలో భాగంగా గర్భిణులకు ప్రభుత్వం ఆర్థికంగా భరోసా కల్పిస్తోంది. అర్హులైన గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకుంటే ఈ పథకం వర్తిస్తుంది. మొదటి ప్రసవానికి రూ. 5 వేలు, రెండో ప్రసవానికి రూ. 6 వేలు అందజేస్తారు. విడతలవారీగా ఆర్థిక సాయం అందించడంతో పాటు గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ కోసం పోషకాహారం అందిస్తారు. గర్భిణుల్లో పోషకాహార లోపం నివారించేలా నిరంతరం అంగన్‌వాడీ సిబ్బంది పర్యవేక్షిస్తారు.

అంగన్‌వాడీలకు బాధ్యతలు : పీఎం మాతృ వందన యోజనకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను గతంలో వైద్యారోగ్యశాఖ నిర్వహించేది. తాజాగా ఈ బాధ్యతలను ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు ప్రభుత్వం అప్పగించింది. అనంతగిరి మండలంలో 99 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. గర్భిణిగా నమోదైన 5 నెలల్లోపు రూ. 2 వేలు, అన్ని రకాల టీకాలు వేయించుకుని, వైద్య పరీక్షలు చేయించుకుంటే 9 నెలల లోపు మరో రూ. 2 వేలు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమైతే మరో రూ. 1000 అందజేస్తారు. రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే పుట్టిన మూడున్నర నెలల తర్వాత మొత్తం రూ. 6 వేలు బాలింత వ్యక్తిగత ఖాతాలో జమ చేస్తారు.

గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న ఐసీడీఎస్ పీవో సుగుణ

అల్లూరి జిల్లాలో వివరాలు ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాలు : 3314	
మెయిన్: 1891	మినీ: 1423
ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న గర్భిణులు: 3286 మంది	
మొదటి కాన్పులో: 998 మంది	
రెండో కాన్పులో: 2288 మంది	

★ గర్భిణులకు 18 ఏళ్ల 7 నెలల వయసు నిండితేనే ఈ పథకానికి అర్హులని అనంతగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సుగుణ తెలిపారు. అర్హులు బ్యాంకు ఖాతాలకు ఆధార్, ఫోన్ నంబర్లు లింక్ చేయాలని చెప్పారు. పోషణ్ ఖాతాలో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అరకుకు దక్కని ప్రాధాన్యం

వరి రైతులకు తప్పని అన్యాయం

అరకులోయ, న్యూస్‌టుడే

గిరి రైతుల ఆరుగాలం శ్రమ దళారుల పాలవుతోంది. అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి, హుకుంపేట, పెదబయలు మండలాల్లో ఏటా సుమారు 30 వేల ఎకరాల్లో వరి పండిస్తారు. ఈ నియోజకవర్గంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. ఫలితంగా రైతులు పండించిన పంట గత్యంతరం లేక దళారీలు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ ఏడాది ధాన్యానికి మద్దతు ధర ప్రకటించింది. కానీ ఆ ధరకు కొనుగోలు చేసే ఎవరూ లేకుండాపోయారు. వ్యాపారులంతా కోటరీగా ఏర్పడి ప్రభుత్వం నిర్ణయించిన ధరలో సగం మాత్రమే చెల్లిస్తామని తెగేసి చెబుతున్నారు. దూరప్రాంతానికి తీసుకెళ్లడానికి అవసరమైన డబ్బుల్లేకపోవడంతో నష్టమని తెలిసినా వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయిస్తున్నారు. మొదటి రకం ధాన్యంతోపాటు సాధారణ రకం సైతం ఇదే ధరకి విక్రయించాల్సి వస్తోంది.

అరకులోయ సమీపంలో వరి కోతలు

పరిస్థితులు మారినా.. : రెండేళ్ల కిందట వరకు అరకులోయలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెటింగ్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసేవారు. గతేడాది ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానికంగా ఏర్పాటు చేయలేదు. ఈ ఏడాది సైతం కొనుగోలు కేంద్రం ఊసే అధికారులు ఎత్తలేదు. వాస్తవంగా గతంలోనూ స్థానికంగా విక్రయాలు పూర్తయ్యేవరకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. ఒకరిద్దరు రైతులు ఇక్కడకు తీసుకొచ్చి విక్రయించినా సొమ్ము చెల్లింపులో బాగా జాప్యం చేశారు. దీంతో తక్కువ మంది రైతులే ముందుకొచ్చారు. అప్పటి పరిస్థితులకు.. ఇప్పటికి మార్పులు చోటు చేసుకున్నా అధికారులు దానినే సాకుగా చూపించి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారు. ప్రస్తుతం వరి సాగు చేసిన రైతుల్లో 50 శాతం మంది వరకు ధాన్యం విక్రయిస్తున్నారు. ఈ తరుణంలో కొనుగోలు కేంద్రం తక్షణం ఏర్పాటు చేస్తే రైతులకు మద్దతు ధర లభించే అవకాశం ఉంది.

ధరల్లో వ్యత్యాసమిలా (క్వింటాకు రూ. లలో)	ప్రభుత్వ మద్దతు	వ్యాపారులు ఇస్తోంది
'ఎ' గ్రేడ్	2,389	1400
సాధారణ రకం	2,369	1400

ఉన్నతాధికారులకు నివేదిస్తాం : ఈ విషయంపై అరకులోయ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మోహన్‌రావును వివరణ కోరగా రెండేళ్ల నుంచి అరకులోయలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదన్నారు. ఉన్నతాధికారులకు నివేదించి రైతుల శ్రమకి ప్రతిఫలం వచ్చే విధంగా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ఏఓబీలో భయంభయం

నేటి నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలు

సీలేరు, న్యూస్‌టుడే: ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం(పీఎల్‌జీఏ) వారోత్సవాలు డిసెంబరు 2 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏఓబీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈనెల 8 వరకు వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని మావోయిస్టులు ప్రణాళికలు తయారు చేస్తుండగా.. ఎలాగైనా అడ్డుకోవాలని పోలీసులు ప్రతివ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులతోపాటు హిట్ లిస్ట్‌లో ఉన్నవారు మైదాన ప్రాంతానికి వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా సీఆర్‌పీఎఫ్ బలగాలతో గస్తీ నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎదురుకాల్పులకు నిరసనగా మావోయిస్టులు ప్రతీకార దాడులకు దిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. మావోయిస్టు ఏవోబీ కీలక నాయకుడు చెల్లూరి నారాయణరావు అలియాస్ సురేష్ పోలీసుల అదుపులో ఉన్నట్లు విప్లవ సంఘాలు ప్రకటించడం, వరుస సంఘటనల నేపథ్యంలో మావోయిస్టుల కదలికలపై పోలీసులు నిఘా పెంచారు.

గాలింపులో పోలీసు బలగాలు

రాత్రి బస్సు సర్వీసులు రద్దు: వారోత్సవాల నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు జిల్లాలో రాత్రి బస్సు సర్వీసులను రద్దు చేశారు. విశాఖపట్నం-భద్రాచలం, రాత్రి బస్సు సర్వీసులను రద్దు చేసినట్లు విశాఖ ఆర్టీసీ డిపో మేనేజర్ మాధురి తెలిపారు. ఈ నెల 9 నుంచి యథావిధిగా నడుస్తాయని పేర్కొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు జట్ల ఎంపిక

పరవాడ, న్యూస్‌టుడే: లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో గత నెల 28 నుంచి 30 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన వివిధ జిల్లాలకు చెందిన బాలబాలికలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ పరిశీలకులు పట్టాభిరామ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ఎం.నాయుడు వెల్లడించారు. రాజస్థాన్‌లో త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు బాలుర, బాలికల జట్లకు 12 మంది చొప్పున క్రీడాకారులతోపాటు మరో ఐదుగురు చొప్పున స్టాండ్‌బై ప్లేయర్స్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

మంచు వర్షం.. రాకపోకలకు ఆటంకం

దిత్వా తుపాను ప్రభావంతో సోమవారం పాడేరు, హుకుంపేట తదితర మండలాల్లో వర్షాలు కురిశాయి. పాడేరు ఘాట్‌రోడ్డులో మంచు వర్షం కురవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పాడేరు పట్టణంలో ఒక్కసారిగా దట్టమైన పొగమంచు అలముకుంది. ఆకాశం నుంచి ఊడిపడినట్లు పట్టణం మొత్తాన్ని కమ్మేసింది. ఈ దృశ్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

– పాడేరు, న్యూస్‌టుడే

ఉదయాన్నే ఘాట్ రోడ్డుపై లైట్ల వెలుగులో వాహనాల రాకపోకలు

జాతీయ రహదారి.. జర్రున జారి!

చింతపల్లి మండలం లంబసింగి నుంచి తాజంగి మీదుగా పాడేరు వెళ్లే 516-ఈ జాతీయ రహదారి దుర్భరంగా మారింది. ప్రస్తుతం మన్యంలో వర్షాలు పడుతున్నాయి. లంబసింగి, తాజంగి మధ్య ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రహదారి విస్తరణలో భాగంగా మట్టి పోసి చదును చేస్తున్నారు. వర్షాల కారణంగా రహదారిపై పోసిన మట్టి జారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. ప్రధానంగా ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారిలో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – చింతపల్లి, న్యూస్‌టుడే

పొల్లూరులో సినిమా చిత్రీకరణ

మోతుగూడెం, న్యూస్‌టుడే: రవితేజ హీరోగా నటిస్తున్న నూతన సినిమా చిత్రీకరణ సోమవారం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైంది. మోతుగూడెం పర్యాటక ప్రాంతాల్లో 20 రోజుల వరకు కొనసాగనుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు శివ నిర్వాణ. పొల్లూరు పిక్నిక్ స్పాట్, శివాలయం, పొల్లూరు ఎగువ దిగువ జలపాతాలు, సీలేరు నది పరివాహక ప్రాంతాలు, ఫోర్‌బే, పికప్ జలాశయాల వద్ద మరికొన్ని సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రవితేజ అభిమానులు తరలివచ్చారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

పోశమ్మగండి వద్ద దుకాణాలను ముంచెత్తిన గోదావరి

దేవీపట్నం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు దిగువ కాఫర్ డ్యాం సమీపంలో పనులు జరుగుతున్న నేపథ్యంలో గోదావరిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. గండిపోశమ్మ అమ్మవారి ఆలయ మండపంలోకి నీరు చేరింది. ఆలయం సమీపంలోని దుకాణాలు నీట మునిగాయి. డి.రావిలంక-దండంగి గ్రామాల మధ్య రహదారిపైకి వరద చేరడంతో పురుషోత్తపట్నం వైపు రాకపోకలు నిలిచాయి. సీతపల్లి వాగులో వరద ఉద్ధృతి పెరగడంతో రాకపోకలను నిలిపివేశారు.

మేఘాల నడుమ.. కొండల మధ్య

ఈనాడు, అరకులోయ

ఆకట్టుకునేలా ఏపీటీడీసీ రిసార్టులు

పర్యాటక సీజన్ ఆరంభంతో సందర్శనీయ ప్రదేశాలు కళకళలాడుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటకుల వసతి కోసం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక ప్యాకేజీలు నిర్వహిస్తోంది. విశాఖతో పాటు అరకు, అనంతగిరి, లంబసింగిలో విలాసవంత సౌకర్యాలతో అందుబాటు ధరల్లో పర్యాటకులకు గదులు సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా లోయలను ఆనుకొని కొండల మధ్య ప్రశాంత వాతావరణం అందరిని ఆకట్టుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

లంబసింగి రిసార్టు

అద్భుతం.. అనంతగిరి: ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థకు అనంతగిరి హిల్ రిసార్టు ఎంతో ప్రత్యేకం. కొండ వాలుకు ఆనుకొని ప్రత్యేకంగా నిర్మించిన రిసార్టు ఎంతగానో అలరిస్తుంది. ఏసీ సూట్ గదుల నుంచి చూస్తే ప్రకృతి అందాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి.

లంబసింగిలో: లంబసింగిలోని హరితా రిసార్టు పచ్చని కొండల నడుమ అలరిస్తుంది. తెల్లవారుజాము పొగమంచు, చల్లటి వాతావరణంతో సందర్శకులను మైమరపిస్తుంది. ఇక్కడి గదులు రూ. 4 వేల నుంచి అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేక ప్యాకేజీలతో: పర్యాటకుల కోసం ఏపీటీడీసీ వసతులను సిద్ధం చేసింది. గదుల వద్ద క్యాంప్‌ఫైర్, థింసా నృత్యం ఉంటాయి. బృందాలుగా, కుటుంబ సభ్యులతో వచ్చే వారికి ప్రత్యేక ప్యాకేజీలున్నాయి. బొంగు చికెన్, నాటు కోడి రుచులు అందిస్తాం' అని ఏపీటీడీసీ డీవీఎం జగదీష్ పేర్కొన్నారు.

ఏపీటీడీసీ హోటళ్లలో ధరలు ఇలా (రూ.లలో)

గదుల రకం	సోమ-గురు	వారాంతం
అరకు వ్యాలీ రిసార్టు		
ప్రీమియం ఏసీ లగ్జరీ	4,200	4,900
ఏసీ సూట్	3,080	3,640
ఏసీ డీలక్స్	2,800	3,360
హిల్ రిసార్టు మయూరి (అరకు)		
ప్రీమియం ఏసీ లగ్జరీ	4,928	5,600
ఏసీ సూట్స్	3,8,08	4,480
ప్రీమియం ఏసి	3,1,36	3,584
ఏసీ డీలక్స్	2,688	3,136
ఏసీ స్టాండర్డ్	2,240	2,688
క్రాఫ్ట్ సెంటర్	1,680	2,016
యాత్రి నివాస్ (విశాఖ)		
ఏసీ డీలక్స్	4,856	5,250
ఏసీ ఎగ్జిక్యూటివ్	3,281	3,675
ఏసీ సూట్	3,938	4,331

బుకింగ్ కోసం.. www.aptdc.in, www.tourism.ap.gov.in 9848813584 నంబర్‌లో సంప్రదించొచ్చు.

ఆదమరిస్తే అంతే

ఇటీవల మన్యంలో కురిసిన భారీ వర్షాలకు కల్వర్టులు, రహదారులు శిథిలావస్థకు చేరాయి. పలు రహదారులు గుంతలమయంగా మారాయి. లోతుగెడ్డ పంచాయతీ చోడిరాయి గ్రామానికి వెళ్లే రహదారిలో నిర్మించిన కల్వర్టు కోతకు గురైంది. కల్వర్టుకు ఆనుకుని ఉన్న సిమెంట్ రహదారి గోతులమయంగా మారింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన లోతుగెడ్డ ఎంపీటీసీ సభ్యుడు పాంగి బాబూరావు తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కరించలేదన్నారు. కోతకు గురైన కల్వర్టు వల్ల అనేక ప్రమాదాలు జరిగాయన్నారు. ఇంజినీరింగ్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. – చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

కోతకు గురైన చోడిరాయి రహదారి

సకాలంలో పింఛన్ల పంపిణీ : కలెక్టర్

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రంపచోడవరం ఎస్టీ కాలనీలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. పింఛను సొమ్ము కోసం సచివాలయ సిబ్బందికి డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదన్నారు. ఎవరైనా డబ్బులు డిమాండు చేసినా, తీసుకున్నట్లు తెలిసినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచి బొజ్జయ్య, సబ్ కలెక్టర్ శుభం నొఖ్వాల్, తహసీల్దారు బాలాజీ, వార్డు సభ్యుడు చక్రపాణి, పంచాయతీ కార్యదర్శి కామరాజు పాల్గొన్నారు.

రంపచోడవరం ఎస్టీ కాలనీలో పింఛను పంపిణీ చేస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

రంపచోడవరం, న్యూస్‌టుడే: సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిరీషాదేవి చెప్పారు. రంపలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. మౌలిక వసతుల కల్పనతోపాటు అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అనంతరం కొత్తగా పింఛన్లు మంజూరైన వారికి నగదు అందజేశారు. నాయకులు నిరంజనీదేవి, సింహాచలం, బాపన్నదొర, బాపిరాజు, చెల్లన్నదొర, వెంకటరమణ, సుభాన్, డిప్యూటీ ఎంపీడీవో రాజబాబు పాల్గొన్నారు.

వినతిపత్రం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

విద్యార్థులకు నచ్చేలా.. అందరూ మెచ్చేలా!

ఉపాధ్యాయురాలి ప్రతిభకు ప్రశంసల వెల్లువ

పెందుర్తి, న్యూస్‌టుడే

సాధారణంగా పిల్లలు బడికి వెళ్లాలంటే మారాం చేస్తారు. డుమ్మా కొట్టేందుకు ఏదొక రకంగా ప్రయత్నిస్తారు. కానీ, పెందుర్తి మండలం పినగాడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మాత్రం దీనికి విరుద్ధం. బడి తలుపులు ఎప్పుడు తెరుస్తారా..? అని ఎదురు చూస్తుంటారు. ఇందుకు కారణం అక్కడి ఉపాధ్యాయురాలు పల్టాసింగి అలివేలి మంగ అలియాస్ సుధ. ఆటపాటలతో ఆమె బోధించే విధానానికి పిల్లలు ఆకర్షితులయ్యారు. ఆమె వినూత్న అభ్యసనా పద్ధతులను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమాల వేదికగా అభినందించడంతో ఆమెకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. 'సర్కారు బడుల్లో సృజనాత్మక బోధన జరగదనే అపోహ ప్రజల్లో ఉంది. దీన్ని రూపుమాపి పిల్లల్లో ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతోనే కృత్యాధారిత బోధనను కొనసాగిస్తున్నా' అని ఆమె పేర్కొన్నారు.

ఆటపాటలతో పిల్లలకు బోధిస్తూ..

ఆ ఆలోచన మార్చాలని: 'మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన పెదబయలు మా స్వస్థలం. తండ్రి నిత్యానందం కార్పెంటర్. తల్లి సూర్యకాంతమ్మ గృహిణి. ఇద్దరు తమ్ముళ్లున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వసతిగృహంలో చదివా. కష్టపడి చదివి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించా. 2014లో విధుల్లో చేరా. పినగాడిలో చేరిన కొత్తల్లో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పిల్లలను బడికి పంపాలని ఉపాధ్యాయులం కోరేవాళ్లం. ఆ క్రమంలో తల్లిదండ్రులు సర్కారు బడుల్లో బోధనపై అనుమానాలు వ్యక్తం చేసేవారు. అప్పుడే ఈ భావనను మార్చాలని నిర్ణయించుకున్నా. బడిలో ఉన్న కొద్దిమంది పిల్లలకే కమ్యూనికేషన్, ఆంగ్లం, డ్రెస్సింగ్, నడవడిక, సులభమైన పద్ధతుల్లో చదవడం, ఆటపాటలతో చదువుకోవడం వంటి వినూత్న పద్ధతులు వివరించగా ఎంతగానో ఆకర్షితులయ్యారు. తొలిరోజుల్లో వీడియోలు తీసి వాట్సాప్‌లో స్టేటస్‌గా పెట్టాను. స్నేహితురాలి సూచన మేరకు ఇన్‌స్టాలో 'మిస్ యూనిక్' పేరిట వీడియోలు అప్‌లోడ్ చేయడం ప్రారంభించా.

ప్రస్తుతం 1.65 లక్షల మంది అనుసరిస్తున్నారు. ఈ వీడియోలను చూసిన మంత్రి నారా లోకేశ్ పిల్లల చదువుల కోసం చేస్తున్న కృషిని అభినందించారు. మంత్రి ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా పిల్లలకు బోధన చేస్తా' అని సుధ పేర్కొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో రెవెన్యూ సంబంధ సమస్యలపై వచ్చిన వినతుల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ తహసీల్దార్లను ఆదేశించారు. సబ్ కలెక్టరేట్‌లో రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లకు చెందిన ప్రత్యేక ఉప కలెక్టర్లు, తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, ఆర్ఐలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఇన్‌ఛార్జి జేసీ శ్రీపూజ, సబ్‌కలెక్టర్ శుభం నొఖ్వాల్, ప్రత్యేక ఉప కలెక్టర్ సరళ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతులను పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలన్నారు. నిబంధనల ప్రకారం పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రతి వారం 60 వరకు వినతులు కలెక్టరేట్‌కు వస్తున్నాయని చెప్పారు. మండల పరిధిలో పరిష్కారం కాని సమస్యలను డివిజన్, జిల్లా స్థాయిల్లో పరిష్కారం కోరుతూ నివేదికలు పంపాలన్నారు. అనంతరం సందర్భంగా అటవీ అభ్యంతరాలతో నిలిచిన రహదారులపై ఆరా తీశారు. జాతీయ రహదారి-516కు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై చర్చించి నిర్వాసితులకు భూములు, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమీక్షలో ప్రత్యేక ఉప కలెక్టర్లు అంబేడ్కర్, నాజరయ్య, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే అధికారి దేవేంద్రుడు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులతో సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్

■ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఎస్టీఆర్ కాలనీలోని మండల పరిషత్తు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆహార పదార్థాలను రుచి చేశారు. సబ్‌కలెక్టర్ శుభం నొఖ్వాల్, ఎంపీడీఓ ప్రసాద్, సర్పంచి బొజ్జయ్య, తహసీల్దారు బాలాజీ, సీడీపీఓ ఉమ వెంట ఉన్నారు.

రేపు సింహగిరిపై శ్రీనృసింహ దీక్షలకు శ్రీకారం

సింహాచలం, న్యూస్‌టుడే: భక్తులు తనపై విశ్వాసం ఉంచి.. ఆర్తితో పిలిస్తే ఎందెందు వెదికినా అందందే.. ఉన్నానని ప్రత్యక్షమయ్యే దైవం నృసింహ స్వామి. అంతటి మహిమాన్విత మూర్తి సింహగిరిపై వరాహ, నృసింహ అవతారాల కలయికతో శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామిగా సింహగిరిపై భక్తులను అనుగ్రహిస్తున్నాడు. సింహాద్రినాథుడిపై భక్తిశ్రద్ధలతో ఏటా శ్రీనృసింహ దీక్షలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులు. మార్గశిర శుద్ధ త్రయోదశి సందర్భంగా బుధవారం 41 రోజుల మండల దీక్షకు శ్రీకారం చుట్టనున్నారు.

★ శ్రీనృసింహ దీక్షలను భక్తులు రెండు విడతలుగా స్వీకరిస్తుంటారు. 41 మండల దీక్ష 3న ప్రారంభమవుతుంది. 32 రోజుల మూలమంత్ర దీక్ష ఈనెల 11న చేపట్టాలని ఆలయ పెద్దలు నిర్ణయించారు. అప్పన్న స్వామికి 32 సంఖ్యతో అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని పెద్ద సంఖ్యలో భక్తులు ఈ దీక్ష స్వీకరిస్తుంటారు. పురుషులు ఏ వయసు వారైనా దీక్షలు స్వీకరించవచ్చు. 10 ఏళ్లలోపు బాలికలు, 50 ఏళ్లు దాటిన మహిళలు మాత్రమే దీక్షకు అర్హులు. ఈనెల మూడున దేవస్థానం ఆధ్వర్యంలో మాలధారణ చేయించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

అంటుకునేది కాదు.. అంటించుకునే వ్యాధి

రంపచోడవరం, న్యూస్‌టుడే: హెచ్ఐవీ ఎయిడ్స్. అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గతంలో కంటే ఎయిడ్స్ తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం రంపచోడవరంలో ఐటీడీఏ కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎయిడ్స్ నివారణకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ర్యాలీలో ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, సబ్‌కలెక్టర్ శుభం నొఖ్వాల్, డీడీ రుక్మాంగదయ్య, ఏపీవో డీఎన్‌వీ రమణ, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ సరిత, డీఎల్‌పీవో కోటేశ్వరరావు, తహసీల్దారు బాలాజీ, ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రంపలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వినతులపై దృష్టిసారించండి: పీవో

రంపచోడవరం, న్యూస్‌టుడే: సమస్య పరిష్కారం కోరుతూ గిరిజనులు ఇచ్చే వినతులపై సంబంధిత అధికారులు దృష్టిసారించాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ సూచించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏపీవో డీఎన్‌వీ రమణ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ రుక్మాంగదయ్యతో కలిసి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై 60 వినతులు వచ్చాయి. నరసాపురం క్వారీ వల్ల ఇళ్లు, పంట పొలాలు దెబ్బతింటున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు ఆధ్వర్యంలో ఉద్యమిస్తుంటే.. క్వారీ నిర్వాహకులు దాడులకు తెగబడుతున్నారని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మధు పీవో దృష్టికి తీసుకువచ్చారు. ప్రధాన కార్యదర్శి శ్రీను, గిరిజనులతో కలిసి వినతిపత్రం అందజేశారు. రంపచోడవరం సాయినగరంలో ప్రభుత్వ బంజరు భూమికి సంబంధించి 20 మంది గిరిజనులకు పట్టాలు ఉన్నాయి. ఆ భూమి తనదంటూ తీగల పండయ్య అనే వ్యక్తి కోర్టులో కేసు వేశారన్నారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని కోరుతూ పాడేరులో మూడుసార్లు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల్లో వినతులు ఇచ్చినా ఫలితం లేదని గంగరాజు, వీరభద్రం, తమ్మన్నదొర తదితరులు పీవో ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, రోడ్లు వేయాలని పలువురు వినతులు అందజేశారు. ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ శ్రీనివాసరావు, ఏడీఎంహెచ్‌వో సరిత, పీహెచ్‌వో దేవదానం, డీఎల్‌పీవో కోటేశ్వరరావు, పీఆర్, ఆర్అండ్‌బీ డీఈలు వెంకటరమణ, భవాని, వెటర్నరీ డీడీ షరీఫ్, ఏడీఏ మోహనరావు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్

అన్నదాతల పంట పండింది

ఆశాజనకంగా వరి దిగుబడి | 35 వేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చురుగ్గా అడుగులు వేస్తోంది. అనకాపల్లి జిల్లాలో 65 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. విక్రయించిన 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటోంది. వ్యాపారులు, దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

★ ఈ ఏడాది వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో అన్నదాతలకు శ్రమకు తగిన ఫలితం దక్కింది. ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 54,465 హెక్టార్లు కాగా 66,116 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. సాగునీటికి ఢోకా లేకపోవడంతో మెట్ట ప్రాంతాల్లోనూ బాగా పండింది. ఇప్పటికే చాలా చోట్ల కోతలు ప్రారంభమయ్యాయి.

★ ధాన్యం సేకరణలో ఇబ్బందులు, సకాలంలో డబ్బులు రాకపోవడం తదితర కారణాలతో రైతులు ఎక్కువగా దళారులను ఆశ్రయిస్తున్నారు. మద్దతు ధర కంటే తక్కువకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గమనించి ఈసారి ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసింది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 65 చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రేడ్-ఎ రకం క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకాలకు రూ.2,369 ధరగా నిర్ణయించింది.

వడ్డాది కస్బా పొలంలో పండిన వరి

● ధాన్యం విక్రయాలకు వాట్సాప్ సేవలు: ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేస్తూ, రైతుల సమయం వృథా కాకుండా ఉండేందుకు వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. విక్రయించాలనుకున్న రైతులు 73373 59375 నంబరుకు వాట్సాప్‌లో 'హాయ్' అని మెసేజ్ పంపి షెడ్యూల్ చేసుకోవచ్చు.

రైతేరాజు

★ దేవరాపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కలెక్టర్‌తో కలిసి ఇటీవల ప్రారంభించారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది, కోమళ్లపూడి, బుచ్చెయ్యపేట రైతు సేవా కేంద్రాల వద్ద కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు.

● 'హాయ్' మెసేజ్ పంపగానే ఏఐ ద్వారా ప్రత్యేక వాయిస్‌తో సేవల వినియోగంపై మార్గనిర్దేశం చేస్తుంది. రైతు ఆధార్ నంబర్ నమోదు చేశాక పేరును ధ్రువీకరించాలి. ధాన్యం విక్రయించాలనుకున్న తేదీలకు సంబంధించి మూడు ఐచ్ఛికాల్లో ఏదో ఒక తేదీని, సమయాన్ని ఎంపిక చేసుకోవాలి. ధాన్యం రకం నమోదు చేశాక, ఎన్ని బస్తాలు విక్రయిస్తున్నారో నమోదు చేయాలి. ఆ తర్వాత రైతులకు ధాన్యం విక్రయ స్లాట్ బుక్ అయినట్లు షెడ్యూల్ చేసిన కూపన్ కోడ్ వస్తుంది. ఆ కోడ్ చూపి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించవచ్చు.

పాలుసు పురుగులు ఆశిస్తే నల్లటి మచ్చలు

రైతు ప్రశ్న – శాస్త్రవేత్త సలహా

? ఎకరా విస్తీర్ణంలో చెరకు సాగు చేస్తున్నా. గడల మీద నల్లటి మచ్చలు వస్తున్నాయి. నివారణకు ఏం చేయాలి. – దాడి శివ, మునగపాక

✔: పొలుసు పురుగులు ఆశిస్తే ఇలా జరుగుతుంది. నివారణకు మొవ్వు నుంచి కనీసం 8 ఆకులు ఉంచి మిగిలిన వాటిని తొలగించాలి. డైమిథేయేట్ 2 మి.లీ. మందు లీటరు నీటిలో కలిపి గడలు తడిసేలా పిచికారీ చేయాలి.

? వరి కోతల అనంతరం దుక్కిలేకుండా మొక్కజొన్న సాగు చేయవచ్చా. – ఎస్.వి.ఆర్.నాయుడు, అరబుపాలెం

✔: దుక్కి లేకుండా సాగు చేయవచ్చు. వరి కోతల అనంతరం భూమిలో తగిన తేమ ఉంటే చిన్న చిన్న గుంతలు తీసి మొక్కజొన్న గింజలు నాటుకోవాలి. ఎకరాకు ఏడు కేజీల విత్తనం అవసరం. నాటిన మరుసటి రోజు కలుపు మందు పిచికారీ చేయాలి.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త **కె.వి.రమణమూర్తి** సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి

రబీలో చోడి సాగుకు ఇదే అదును

అనకాపల్లి, న్యూస్‌టుడే: రబీలో చోడి సాగుకు ఇదే సరైన సమయమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. డిసెంబరు నెలాఖరు వరకు నాటుకోవచ్చు. అనువైన రకాలను ఎంచుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త దాడి ఉమామహేశ్వరరావు చెబుతున్నారు.

★ ఈ ఏడాది కురిసిన వర్షాలకు చెరువులు, నూతుల్లో పుష్కలంగా నీరు చేరింది. ఈ నీటిని సద్వినియోగం చేసుకుంటూ రబీలో పంటలు పండించవచ్చు. ఏ పంటకైనా రకాల ఎంపికే ప్రధానం. చోడిలో రబీ సాగుకు గోదావరి, సప్తగిరి, చంపావతి, భారతి రకాలు అనుకూలం. నారు పెంచి నాటితే ఎకరాకు 2.5 కేజీల విత్తనం సరిపోతుంది. వరి కోతలు అయిన వెంటనే భూమిలో వెదజల్లడం మేలు. ఇలా చేస్తే దుక్కి ఖర్చులు తగ్గుతాయి. ఇందుకోసం ఎకరాకు నాలుగు కేజీల విత్తనం అవసరం అవుతుంది. వెదజల్లే ముందు రోజు విత్తనాన్ని బాగా నానబెట్టాలి.

■ గోదావరి రకం 120 నుంచి 125 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 12 నుంచి 16 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఎక్కువగా పిలకలు వస్తాయి. మొక్క పచ్చగా ఉంటుంది. వెన్నులు పెద్దవిగా ఉంటాయి. గింజలు ఎరుపు, గోధుమ రంగులో మధ్యస్థంగా ఉంటాయి.

■ సప్తగిరి రకం 110 నుంచి 115 రోజుల్లో కోతకు వస్తుంది. పంట ఏపుగా పెరుగుతుంది. పిలకలు ఎక్కువగా వస్తాయి. భారతి రకం 105 నుంచి 110 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 14 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. వెన్ను పెద్దగా ఉండి అగ్గితెగులును తట్టుకుంటుంది.

■ చంపావతి స్వల్పకాలికం. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. 80 నుంచి 85 రోజుల్లో కోతకు వస్తుంది. కందిలో అంతర పంటగా వేసుకోవచ్చు. దిగుబడి ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు రావచ్చు.

■ ఎకరాకు 12 కేజీల నత్రజని, 12 కేజీల భాస్వరం, 8 కేజీల పొటాష్ నాటే సమయంలో వేసుకోవాలి. నాటిన నెల రోజులకు 12 కేజీల నత్రజని వేసుకోవాలి. కలుపు నివారణకు విత్తనం వేసే ముందు / నారు నాటే ముందు ఎకరాకు 600 మి.లీ. పెండిమిథలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నాటిన 25 రోజులకు 400 గ్రాముల 2,4డి సోడియం సాల్ట్ 200 లీటర్ల నీటిలో కలిపి చల్లాలి.

సంక్షేమమే అజెండా

అనంతగిరి, న్యూస్‌టుడే: సంక్షేమమే కూటమి ప్రభుత్వ మొదటి అజెండా అని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. దముకు గ్రామంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. పలువురు పింఛన్‌దారులతో ముచ్చటించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను మొత్తం పెంచినట్లు పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామన్నారు. ఎటువంటి సమస్యలున్నా ప్రజా దర్బార్‌లో తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. సర్పంచి పున్నమ్మ, పంచాయతీ కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని సూచించారు. వర్గ విభేదాలను పక్కన పెట్టాలన్నారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, నరేంద్ర, లేబర్‌బోర్డు డైరెక్టర్ మోస్య, జోగులు, దయానిధి, చిరంజీవి, బుజ్జిబాబు, ఆనంద్, లక్ష్మణ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

దముకులో పింఛన్ అందిస్తున్న కిడారి తదితరులు

బురదలో దిగిన లారీ

జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల నుంచి పాడేరు వెళ్లే మార్గంలో సంతబయలు సమీపంలో సోమవారం లారీ బురదలో కూరుకుపోయింది. నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి 516-ఈ మధ్యలో లారీ నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాడేరు- జి.మాడుగుల, చింతపల్లి ప్రధాన మార్గం కావడంతో బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. 108 వాహనం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కొంత సమయం తరువాత జాతీయ రహదారి అధికారులు స్పందించి లారీని తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

దౌనూరు చెక్‌పోస్ట్ తనిఖీ

కొయ్యూరు, న్యూస్‌టుడే: దౌనూరులోని చెక్‌పోస్ట్‌ను కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. చింతపల్లి నుంచి మైదాన ప్రాంతం వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. వాహన చట్టంపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

ఎడతెరిపి లేని వాన

అరకులోయ, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో అరకులోయలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అరకులోయ సందర్శనార్థం వచ్చిన పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామాల నుంచి పనుల నిమిత్తం వచ్చిన గిరిజనులు అవస్థలకు గురయ్యారు. ఎండపల్లివలస సమీపంలో బురదగెడ్డ వద్ద వర్షపునీరు నిల్వ ఉండిపోవటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ సమీపంలోని చొంపి, కొత్తవలస మార్గంలో పాత వంతెనపై బురద పేరుకుపోయి చిత్తడిగా మారింది. ఈ మార్గంలో వాహనాలు జారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అరకులోయ నుంచి పది కిలోమీటర్ల దూరంలోని మాడగడ మీదుగా బస్కి, చొంపి, సిరగాం పంచాయతీలకు రాకపోకలు చేపట్టారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: జీకేవీధి మండలంలో తెరపిలేకుండా వర్షం కురిసింది. ఆర్వీనగర్ వారపు సంతలో క్రయ విక్రయాలు నిలిచిపోయాయి.

బురదగెడ్డ వంతెన వద్ద నిలిచిన వర్షపు నీరు

నేడు హనుమత్ వ్రతం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమత్ వ్రతం నిర్వహించనున్నట్లు కమిటీ పెద్దలు తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం లక్షనామ సిందూర పూజ, సహస్ర పత్ర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు పాడేరు ఏరువాక కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్ సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10- సా. 4 గంటల వరకు 95505 06498 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

తగ్గిన బెల్లం ధరలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా అన్ని రకాల బెల్లం ధరలు తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.195, మధ్య రకాలు రూ.210, నాసి రకాలు రూ.635 ధరలు తగ్గాయి.

రకం	రంగులు	మధ్య	నాసి
గత వారం (రూ.)	4,180	3,895	3,765
ఈ వారం (రూ.)	3,985	3,685	3130

వేతనాలు అందక ఇబ్బందులు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ జీకేవీధిలో గోదాము ఎదుట జీసీసీ హమాలీలు సోమవారం నిరసన చేపట్టారు. నిత్యావసర సరకులను డిపోలకు తరలించకుండా విధులు బహిష్కరించారు. రెండు నెలలుగా జీసీసీ, పౌరసరఫరాల నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు చెల్లించే వరకు సరకులను డిపోలకు చేర్చమని పేర్కొన్నారు.

గూడెంకొత్తవీధిలో జీసీసీ గోదాము వద్ద హమాలీల నిరసన

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన సహకార సంస్థ (జీసీసీ)లో పనిచేస్తున్న హమాలీలకు రెండు నెలలుగా చెల్లించాల్సిన వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సంఘ నాయకులు రామిరెడ్డి, అప్పారావు డిమాండు చేశారు. జీసీసీ గోదాము ఎదుట సోమవారం ధర్నా చేశారు. వేతనాలు చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో..

వేర్వేరుగా చెత్త సేకరణ

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి.. సంపద కేంద్రాలకు తీసుకురావాలని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. అనంతగిరిలో సంపద తయారీ కేంద్రం వద్ద సర్పంచి సోమెల రూతు, ఎంపీడీవో ప్రభాకర్ తదితరులతో కలిసి వర్మీకంపోస్టు తయారు చేసే విధానాన్ని కార్మికులకు వివరించారు. వర్మీకంపోస్టు తయారీకి అవసరమైన వానపాములు విడిచిపెట్టారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇక్కడ తయారైన ఎరువులను తక్కువ ధరలకే రైతులకు అమ్మాలని చెప్పారు. కార్యదర్శి దేవా, తదితరులు పాల్గొన్నారు.

వానపాములు వదులుతున్న ఎంపీపీ నీలవేణి తదితరులు

విద్యతోనే విభిన్న రంగాల్లో రాణింపు

చింతపల్లి, న్యూస్‌టుడే: బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్‌లో ఏ రంగంలోనైనా రాణించేందుకు అవకాశాలుంటాయని ఎంపీడీఓ సీతామహలక్ష్మి అన్నారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో కిశోర బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యలో బడి మానేసిన బాలికలకు చదువు ప్రాధాన్యత, భవిష్యత్ అవసరాలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వివరించారు. ఐసీడీఎస్ పీఓ శ్రీదేవి మాట్లాడుతూ.. వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని కోరారు. వాసవ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీఓ, పక్కన ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి

జలాశయంలో సమస్యలపై ఆరా

జోలాపుట్ జలాశయంలో గేట్లను పరిశీలిస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలోని మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రాన్ని ఏపీజెన్‌కో విద్యుత్తు సౌధ సీఈ సివిల్ పి.రవీందర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. జోలాపుట్ ప్రధాన జలాశయం, గేట్లు పరిశీలించారు. ఇక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈ సివిల్ అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మాచ్‌ఖండ్ ఎస్ఈ ఎ.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఈఈ సివిల్ కురేష ప్రధాన్, ఈఈ బి.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

అంగులూరు ఘటనలో మరొకరి మృతి

ముగ్గురికి జీజీహెచ్‌లో వైద్య సేవలు

కాకినాడ, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లా అంగులూరు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతిచెందాడు. పశ్చిమగోదావరి జిల్లా బండివానిగుంటకు చెందిన గెద్దాడ రాజేష్ (28)తోపాటు మరికొంతమంది అల్లూరిజిల్లా గండిపోశమ్మ గుడికి వెళ్లి వస్తుండగా అంగులూరు వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 15 మంది గాయపడ్డారు. వీరిలో గెద్దాడ రాజేష్, శ్రీనును ఆదివారం రాత్రి జీజీహెచ్‌కు తీసుకురాగా శ్రీను, రాజేష్‌కు మెరుగైన వైద్యం నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం రాజేష్ మృతి చెందాడు. ఇదిలా ఉండగా ఇదే ఘటనలో జి.వరప్రసాద్, జీవరాజు, సురేష్ పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మెరుగైన చికిత్స నిమిత్తం సోమవారం జీజీహెచ్‌కు తరలించి న్యూరాలజీ విభాగంలో చికిత్స అందిస్తున్నారు.

చికిత్స పొందుతున్న వరప్రసాద్

పగలు తవ్వకాలు.. రాత్రుళ్లు పంపకాలు

కమిటీలేసినా.. కళ్లుగప్పి ఇసుక తరలింపు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో ఇసుకాసురులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రకృతి వనరులను దోచేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇటీవల మొంథా తుపాను ధాటికి జిల్లా పరిధిలోని శారదా నది ఉప్పొంగి ప్రవహించింది. చాలాప్రాంతాల్లో ఇసుక మేటలు చేరాయి. వీటిని కొల్లగొట్టేందుకు ఎక్కడికక్కడ పోటీపడుతున్నారు. జిల్లా కలెక్టరే స్వయంగా కన్నెర్ర చేసినా కానీ.. దందాకు అడ్డుకట్ట పడటం లేదు.

దేవరాపల్లిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు..

★ దేవరాపల్లి మండలం చింతలపూడి, సమ్మెద, తామరబ్బ, దేవరాపల్లి, వెంకటరాజపురం, మారేపల్లి, తిమిరాం, కలిగొట్ల, బోయిలకింతాడ నదీ పరివాహక గ్రామాలు. ఇక్కడ యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. దీంతో దేవరాపల్లి, తెనుగుపూడి, తారువ, కలిగొట్ల, గవరవరం వంతెనలకు ముప్పు వాటిల్లుతోంది.

★ మాడుగుల మండలం సత్యవరం, సాగరం, గొట్టివాడ అగ్రహారం, వీరవల్లి అగ్రహారంలో ఇసుక తవ్వకాలు నిత్యకృత్యం. నది నుంచి ఒడ్డుకు ఎడ్లబళ్లతో.. అక్కడ నుంచి ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తున్నారు. అధికంగా రావికమతం, పాడేరు ఏజెన్సీ ప్రాంతానికి తరలిస్తూ దూరాన్ని బట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

★ శారదా నదిలో ఇసుక తవ్వకాలకు దేవరాపల్లి మండలంలోని ఓ గ్రామంలో కొన్నాళ్ల క్రితం వేలంపాట నిర్వహించారు. భారీ స్థాయిలో ఈ బహిరంగ వేలంలో పాల్గొని.. రూ. 30 లక్షలకు పాట పాడారు. ఇక్కడ నుంచే శృంగవరపుకోట, వేపగుంట ప్రాంతాలకు రాత్రి వేళల్లో తరలించేస్తున్నారు.

అధికారులంతా గప్‌చుప్..

జిల్లాలోని నది పరివాహక ప్రాంతాలవైపు అధికార యంత్రాంగం కనీసం కన్నెత్తి చూడటంలేదు. అక్రమార్కులు కూడా కొత్త పంథాకు తెరలేపారు. అర్ధరాత్రి వేళ ఒకేసారి పెద్దసంఖ్యలో లారీలతో రవాణా చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం దేవరాపల్లిలో ఇసుక అక్రమ రవాణా అధికంగా జరుగుతోందని తెలిసి.. కలెక్టరే నేరుగా ప్రతి గ్రామంలో నలుగురితో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. వీరు గ్రామాల్లో ఇసుక పక్కదారి పట్టకుండా చూడాలి. కానీ.. క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదు. ఇప్పటికి ఒక్క ట్రాక్టర్‌ను కూడా అడ్డుకోలేదు.

కేసులు నమోదు చేస్తాం

మాడుగుల, దేవరాపల్లి మండలాల్లో ఇసుక పక్కదారి పడుతున్నట్టు తెలిసింది. వాటిని కట్టడి చేసేందుకు నది పరివాహక గ్రామాల్లో కమిటీలు వేశాం. పోలీసులు సాయంతో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. అక్రమ నిల్వలు స్వాధీనం చేసుకుంటున్నాం. దారిలో కందకాలు తవ్వి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాం. అప్పటికీ నిబంధనలు పాటించక పోతే.. చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం.
– శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

ఫలించిన నిరీక్షణ

చింతపల్లి, న్యూస్‌టుడే: కొత్తపాలెం పంచాయతీలోని భీమసింగి గ్రామానికి చెందిన లేగుల గంగమ్మ, పొటుకూరి వెంకాయమ్మ భర్తలు 2012లో మరణించారు. వీరు వితంతు పింఛనుకు అర్హులైనప్పటికీ సాంకేతిక సమస్య కారణంగా వీరికి ఇప్పటివరకూ కొత్త పింఛను మంజూరు కాలేదు. 13 ఏళ్ల కాలంలో వీరు పింఛను కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల కొత్తపాలెం-2 సచివాలయానికి బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగి రాము సాంకేతిక సమస్యను గుర్తించి పరిష్కరించడంతో ప్రభుత్వం వీరిద్దరికీ వితంతు పింఛన్లు మంజూరు చేసింది. సోమవారం కొత్తపాలెం సచివాలయంలో తెదేపా మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు సర్పంచి సోమరత్నం, నాయకులు బాలకృష్ణ, శ్రీను, బెన్నుబాబు చేతులమీదుగా పింఛన్లు అందించారు.

పింఛను అందుకుంటున్న గంగమ్మ, వెంకాయమ్మ

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై చర్యలు

అనంతగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనా, విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరించినా చర్యలు తప్పవని ఆర్‌డీఓ లోకేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని గిరిజనేతర పంచాయతీల్లో సోమవారం పర్యటించారు. భీంపోలు పంచాయతీ నందకోట గ్రామంలో సుమారు 50 ఎకరాల భూమి 22ఏ జాబితాలో ఉందని, దాన్ని తొలగించాలని అందిన ఫిర్యాదు మేరకు ఆయా భూములను పరిశీలించారు. స్థానికులతో విచారణ జరిపి.. వివరాలు నమోదు చేసుకున్నారు. గుమ్మకోట పంచాయతీ పరిధిలోని భీమవరం రెవెన్యూ గ్రామం పరిధిలో కొందరు తమ భూమికి రికార్డు హక్కులు కల్పించాలని కోరుతూ ఆర్ఓఆర్ అప్పీల్ వేయడంతో దానిపై విచారణ జరిపారు. దానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: బైక్ అదుపుతప్పి టిప్పర్ కిందకు పోయిన ఘటనలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. కాకరపాడు పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రాజవొమ్మంగి మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన లోతా రవీంద్ర బైక్‌పై కొయ్యూరు వస్తున్నాడు. కొయ్యూరు నుంచి టిప్పర్ మైదాన ప్రాంతానికి వెళ్తోంది. బైక్ అదుపుతప్పి తనవైపే వస్తుండటాన్ని గమనించిన టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపివేశాడు. టిప్పర్ కింద భాగంలోకి ద్విచక్రవాహనంతోపాటు రవీంద్ర వెళ్లిపోయాడు. అతడికి తీవ్రగాయాలవగా.. స్థానికులు 108 అంబులెన్స్‌లో రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్ ఏమాత్రం వాహనాన్ని ముందుకు కదిపినా అతని ప్రాణాలు పోయేవని స్థానికులు తెలిపారు.

టిప్పర్ కిందకు దూసుకెళ్లిన బైక్

బలిఘట్టంలో కేంద్రీయ విద్యాలయం?

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పరిధిలోని బలిఘట్టంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ విద్యాలయం తొలుత అనకాపల్లికి మంజూరైనప్పటికీ.. బలిఘట్టంలో దాదాపు పది ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున ఇక్కడ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశించడంతో రాజీవ్ విద్యామిషన్ సహాయ ప్రాజెక్ట్ సమన్వయకర్త జయప్రకాశ్, ఆర్‌డీఓ వి.వి.రమణ, తహసీల్దారు రామారావు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ వెంట ఉన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ రమణ తదితరులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు స్పోర్ట్స్ మీట్ 6న

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఈనెల 6న ఏఎంఏఎల్ కళాశాలలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామని సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాథమిక సమన్వయ కర్త ఆర్.జయప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా రాష్ట్ర, జాతీయ స్థాయి పారాలింపిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే వారి ఎంపికకు 17 నుంచి 20 ఏళ్లలోపు ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలు అర్హులన్నారు. నిర్దేశించిన ప్రమాణాలు మేరకు పరుగు పందెం, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో, క్లబ్‌త్రో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పారాలింపిక్స్‌కు పంపిస్తామన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	112	110
లైవ్	139	130
డ్రెస్‌డ్	202	230
స్కిన్‌లెస్	229	240

(c) eenadu

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

చింతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీడీ పరిమళ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకమని, శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు (డీడీ) పరిమళ అన్నారు. చింతపల్లి బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలను సోమవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, వార్డెన్లతో మాట్లాడారు. పది విద్యార్థులను పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. క్లిష్టమైన పాఠ్యాంశాలను రెండు, మూడు భాగాలుగా విభజించి పునశ్చరణ చేయించాలని పేర్కొన్నారు. డిసెంబరు ఆరు నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. హెచ్ఎం రాజు, వార్డెన్లు గణేశ్వరరావు, తిరుపతి, శ్రీనివాస్, కృష్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మన్యం.. భిన్న వాతావరణం!

మధ్యాహ్నం 3.30 గంటలకు తాజంగి జలాశయాన్ని పూర్తిగా కమ్మేసిన పొగమంచు

దిత్వా తుపాను కారణంగా మన్యంలో భిన్నమైన వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతల్లో స్వల్పమార్పులు చోటు చేసుకోగా చిరుజల్లులు కురుస్తున్నాయి. తాజంగి జలాశయం వద్ద సోమవారం మధ్యాహ్నం దట్టంగా పొగమంచు అలుముకుంది. మధ్యాహ్నం 3.30 గంటలకే జలాశయాన్ని పూర్తిగా పొగమంచు కమ్మేసింది. కురిసేది పొగమంచో.. చిరుజల్లులో తెలియని విధంగా వాతావరణం మారింది. హుకుంపేటలో 15.2, అరకులోయ, డుంబ్రిగుడ, గూడెంకొత్తవీధిలో 15.7 డిగ్రీలు, చింతపల్లిలో 16.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. - న్యూస్‌టుడే, చింతపల్లి

ప్రయాణం.. ప్రమాదకరం!

రహదారిని ఆనుకొని పడిన గోతులు

జి.మాడుగుల మండలంలోని వంతాల నుంచి రాసపనుకు, జర్రాయి గ్రామాలకు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. పూర్తిగా ధ్వంసమై గుంతలతో నిండిపోయింది. రహదారిని ఆనుకొని పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇందులో పడి ద్విచక్రవాహదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ప్రాణాలు అరచేత పట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. - జి.మాడుగుల, న్యూస్‌టుడే

వంతెన వద్ద యాతన

అనంతగిరి- హుకుంపేట మండలాల సరిహద్దు గ్రామమైన వేలమామిడికి కిలోమీటరు దూరంలో వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. గతంలో ఇక్కడ వంతెన లేకపోవడంతో వాగులోనే వాహనాల రాకపోకలు సాగించేవి. వంతెన పనులు ప్రారంభించిన గుత్తేదారు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రస్తుతం ప్రయాణికులు దీని పక్క నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గం కూడా పూర్తిగా బురదమయంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. - అనంతగిరి, న్యూస్‌టుడే

బురదమయంగా రహదారి

బురదగెడ్డ వంతెన వద్ద రోడ్డు ఇలా..

తూతూమంత్రంగా మరమ్మతులు

అరకులోయ నుంచి అరకు వెళ్లే మార్గంలో బురదగెడ్డ వంతెన వద్ద ఇటీవల మరమ్మతు పనులు తూతూమంత్రంగా చేపట్టారు. వంతెన వద్ద రహదారి కోతకు గురవుతుండటంతో ప్రభుత్వం రూ.20 లక్షల నిధులను మంజూరు చేసింది. ఆర్అండ్‌బీ శాఖ పనులు చేపట్టిన గుత్తేదారు కేవలం రక్షణగోడని మాత్రమే నిర్మించి వదిలేశారు. వంతెన వద్ద రహదారి గోతులమయంగా మారింది. రక్షణగోడ నిర్మించిన తర్వాత మట్టి పోశారు. ఇక్కడ బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉన్నా.. ఈ పనులు చేయలేదు. ఆర్అండ్‌బీశాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. గుత్తేదారు వదిలేసిన నిర్మాణ సామగ్రి సైతం వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి.. ప్రభుత్వ నిధులు సద్వినియోగమయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అరకులోయ

జెన్‌కో ఎస్ఈగా హుస్సేన్

సీలేరు, న్యూస్‌టుడే: ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ పర్యవేక్షక ఇంజినీర్‌గా జకీర్ హుస్సేన్‌ను నియమిస్తూ ఏపీ జెన్‌కో ఎండీ నాగలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎస్ఈగా పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో.. దామోదర సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (నెల్లూరు)లో డిప్యుటేషన్‌పై ఈఈగా పనిచేస్తున్న జకీర్ హుస్సేన్‌కు పదోన్నతి కల్పించి సీలేరు ఎస్ఈగా నియమించారు. పోలవరం జలవిద్యుత్కేంద్రంలో ఈఈగా పనిచేస్తున్న సి.హనుమాకు పదోన్నతి కల్పించి.. సీలేరు పంప్ స్టోరేజ్ ఎస్ఈగా నియమించారు.

జీసీసీ బీఎంగా రాజుబాబు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గిరిజన సహకార సంస్థ జీకేవీధి బ్రాంచి మేనేజరుగా కుడుముల రాజుబాబును నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న బీఎం విజయ్‌కుమార్‌ను కొయ్యూరు బ్రాంచి మేనేజరుగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జీకేవీధిలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న రాజుబాబుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

తుప్పల బాధ తప్పదా!

తుప్పలతో నిండిన రహదారి

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక వాల్మీకిపేటలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని దీనిపై పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచి, నియోజకవర్గ అధ్యక్షురాలు వై.నిరంజనీదేవి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై సోమవారం పీఓ స్మరణ్‌రాజ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మంచినీటి పథకానికి వెళ్లే రహదారిలో పెరిగిన తుప్పలు పెరిగిపోవడంతో ఈ మార్గంలో కాలువకు వెళ్లి దుస్తులు ఉతుక్కొనే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూగర్భ డ్రైనేజీ నుంచి మురుగునీరంతా బయటికి వస్తోందని, తక్షణమే అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆమె కోరారు.

వీధిదీపాలు లేక వెతలు

పెదబయలులో రెండు నెలల నుంచి వీధి దీపాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. పంచాయతీ నిధులతో వీధిదీపాలు కొనుగోలు చేశామని.. దసరా నాటికల్లా అమరుస్తామని పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు చెప్పారని, నేటికీ ఈ పనులు జరగలేదని పలువురు పేర్కొన్నారు. వీధిదీపాలు లేక రాత్రివేళల్లో అంధకారం అలముకుంటోంది. ప్రధాన రహదారిలో ఎల్ఈడీ లైట్లు ఒకటి, రెండు చోట్లే వెలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ రమేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఎల్ఈడీ దీపాలకు పంచాయతీ సిబ్బందితో మరమ్మతులు చేయిస్తామన్నారు. మూడు రోజుల్లో వీధిదీపాలను బాగు చేస్తామని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. - పెదబయలు, న్యూస్‌టుడే

వసతి ఇబ్బందులు ఉండవిక!

పునాదుల కోసం గోతులు తవ్వుతున్న పొక్లెయిన్

పెదబయలులో ఉపాధ్యాయ నివాసగృహాలతో పాటు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల అదనపు వసతిగృహ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.3.86 కోట్లు నిధులు మంజూరయ్యాయి. శిథిలస్థితిలో ఉన్న ఉపాధ్యాయ నివాసగృహాలను కూల్చివేసి వాటిస్థానంలో కొత్తవి నిర్మిస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - పెదబయలు, న్యూస్‌టుడే

గుమ్మంలోనే నూర్పు!

మన్యంలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సాధారణంగా పొలం పొలిమేరలో కల్లాన్ని తయారు చేసి కోత కోసిన వరి దుబ్బులను నూర్పుతారు. ప్రస్తుతం చాలామంది దుక్కిటెద్దులతో కాకుండా యంత్రాలతో నూర్పులు చేపడుతున్నారు. దీనికి భిన్నంగా వంతాల గ్రామానికి చెందిన ఓ రైతు పండించిన వరి దుబ్బులను కోత కోసి ఇంటి వద్దకు తరలించాడు. ఇంటి లోగిళ్లనే కల్లంగా మార్చేసి దుక్కిటెద్దులతో నూర్పుతున్నారు. - పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

మూణ్నాళ్ల ముచ్చట!

మేజర్ పంచాయతీ చింతపల్లిని శుభ్రంగా ఉంచేదుకు సంబంధిత అధికారులు సుమారు 20 చెత్తబుట్టలను పలు వీధుల్లో, ప్రధాన రహదారిలో దుకాణాల వద్ద ఏర్పాటు చేశారు. చెత్తను రహదారిపై వేయవద్దని, బుట్టల్లో వేయాలని గ్రామస్థులకు సూచించారు. ఇవి మూణ్నాళ్ల ముచ్చటగా తయారయ్యాయి. వీధుల్లో ఏర్పాటు చేసిన బుట్టలను పక్కనపడేశారు. ఇంటింటికీ చెత్త సేకరణలో భాగంగా వీటిని తొలగించామని సిబ్బంది తెలిపారు. రూ. లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన ఇనుప బుట్టలు రహదారి పక్కన వృథాగా పడి ఉన్నాయి. - చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

అ వీ ఇ వీ

పోలవరం జిల్లాలో కలపండి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పోలవరం ముంపుతో పునరావాస కాలనీలకు వెళ్లిన నిర్వాసితులను పోలవరం జిల్లాలో కలపాలని కొండరెడ్డి సంఘ నాయకులు వెట్ల ముత్యాలరెడ్డి అధికారులను విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెంలోని రామన్నగూడెం పునరావాస కాలనీలో సోమవారం నిర్వహించిన నిర్వాసితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుమ్మిలేరు, జీడిగుప్ప పంచాయతీల నుంచి వచ్చిన ఐదు గ్రామాల ప్రజలు ఇక్కడ ఉంటున్నారు. వచ్చే ఏడాది మరికొందరు వస్తారన్నారు. పోలవరం జిల్లా పేరు పెట్టారు, ఇటు వైపు ఏజెన్సీ ప్రాంతాలను అందులో కలిపితే, మాకు రేషన్, పిల్లల చదువు, ఉద్యోగ, ఉపాధి కష్టాలు తొలగిపోతాయన్నారు. నిర్వాసితులకు న్యాయం జరుగుతుందన్నారు. సర్పంచి సీతారామిరెడ్డి, రాజేంద్రరెడ్డి, పోసిరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాలరెడ్డి

హక్కులను తెలుసుకుందాం

అనంతగిరి, న్యూస్‌టుడే: ఆదివాసీలకు వారి హక్కులు, చట్టాలపై పూర్తి స్థాయి అవగాహన ఉండాలని మానవహక్కుల నేర నిరోధక సంఘం ఛైర్మన్ బోడ రాకేష్‌నాయక్ అన్నారు. మరదగుడ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు... హక్కులు, చట్టాలపై అవగాహన లేకపోతే అన్యాయానికి గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. అనంతరం సంఘం మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా వంతలరాజు, చిట్టం రమేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళ అధ్యక్షురాలు కృష్ణకుమారి, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం 7న

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 7న మారేడుమిల్లిలో మెగా వైద్య శిబిరం జరగనుంది. సాధారణ వ్యాధులతోపాటు కంటి, చర్మ సంబంధ సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య నిపుణులు సేవలు అందజేస్తారని సేవా సంస్థల ప్రతినిధి యోగేశ్వరరావు చెప్పారు.

కలెక్టరేట్ ఎదుట 5న నిరసన

పెదబయలు, న్యూస్‌టుడే: వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 5 కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శనకు వెళ్తున్నట్లు మండలంలోని వీఆర్ఏలు సోమవారం తహసీల్దార్ త్రినాథరావుకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. కూటమి ప్రభుత్వం తమకు వేతనాలు పెంచి, డీఏ ఇస్తున్నా.. పేస్కేలు అమలుచేయడం లేదని సంఘం నాయకులు జి.నీలకంఠం, సుందర్‌దేవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎం.కోటి, సీహెచ్.ఈశ్వర్‌రావు, సీహెచ్.రమేష్, ఆర్.నాగన్న, సీహెచ్.సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మినుములూరులో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, డీఆర్‌డీఏ పీడీ

పాడేరు, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. పాడేరు మండలంలోని మినుములూరు పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీలో ప్రతి నెలా రాష్ట్రంలో అల్లూరి జిల్లా ప్రథమ స్థానంలో ఉండటంతో అధికారులను అభినందించారు. డీఆర్‌డీఏ పీడీ మురళీ, తెదేపా నాయకులు విజయరాణి, పీసీఎస్ ఛైర్మన్ డి.వెంకటరమణ, సర్పంచి చిట్టమ్మ, పార్వతమ్మ, పాడేరు ఎంపీడీఓ ఆర్.వి.ఎస్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: దేశంలో అత్యధిక పింఛన్లు అందిస్తోంది ఏపీ ప్రభుత్వమేనని ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర అన్నారు. కించుమండలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కోట్లాది రూపాయల నిధులతో మన్యంలో డోలీమోతల నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కితలంగిలో అరకు పార్లమెంటరీ కోశాధికారి నాగేశ్వరరావు పింఛన్లు అందజేశారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు, తెదేపా, జనసేన మండల అధ్యక్షులు ఆనందరావు, దన్నేశ్వరరావు, అర్జున్, స్వామి, నర్సయ్య పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, కొయ్యూరు, సీలేరు, న్యూస్‌టుడే: తెదేపా చింతపల్లి పట్టణ అధ్యక్షుడు రీమల ఆనంద్ ఆధ్వర్యంలో పెంటపాడు గ్రామంలో పింఛన్ల పంపిణీ జరిగింది. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బేతాళుడు, చిన్న, పెసా కమిటీ అధ్యక్షుడు దూరి రామకృష్ణ, పెద్ద తదితరులు పాల్గొన్నారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల, మర్రివాడ, గుడ్లపల్లి గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ కె.వి.రమేష్‌నాయుడు, మాజీ ఎంపీపీ జి.సత్యనారాయణ పాల్గొన్నారు. సీలేరులో పట్టణ తెదేపా అధ్యక్షుడు నాగూర్ మీరా, కూటమి నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. తెదేపా ఎస్సీ సెల్ నేత సీహెచ్ రాము పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, కూనవరం, ఎటపాక: అన్నవరం, ఉమ్మడివరం, శుద్ధగూడెం, ఉమ్మడివరం గ్రామాల్లో ఎస్టీ సెల్ మండల కార్యదర్శి రాజేంద్రప్రసాద్, తెదేపా వాణిజ్య విభాగం డివిజన్ కార్యదర్శి ప్రకాశరావు తదితరులు పింఛను సొమ్ము పంపిణీ చేశారు. గౌరిదేవిపేట, ఎటపాక, లక్ష్మీపురం, తోటపల్లి గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో తెదేపా మండల అధ్యక్షుడు పుల్లయ్య, అరకు పార్లమెంట్ కార్యదర్శి చలపతిరావు, నాయకులు చందు, మధు, శ్రీకాంత్, శివకనకరాజు, రాము, నర్సింహరావు, సతీష్ పాల్గొన్నారు. కూనవరంలో తెదేపా ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, రవి, వెంకటలక్ష్మి, పింఛను సొమ్ము లబ్ధిదారులకు అందజేశారు.


కించుమండలో నగదు అందజేస్తున్న ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర

గౌరిదేవిపేటలో...

బోధనేతర ఉద్యోగుల సమస్యలపై వినతి

ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు

రంపచోడవరం, న్యూస్‌టుడే: గురుకులాల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు కోరారు. ఈ మేరకు పీఎంఆర్‌సీలో ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘ ప్రతినిధులు మనోహర్‌రెడ్డి, బాలురెడ్డి, బుల్లబ్బాయి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించండి

క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపల్ వసుధ, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు, సిబ్బంది ఆయన్ను సన్మానించారు.

మెనూ అమలు తప్పనిసరి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: మారుమూల గసభ పంచాయతీ మొర్రిగుడ మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు సోమవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథక అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. విద్యార్థుల హాజరు పట్టికతోపాటు రికార్డులు, మరుగుదొడ్లు పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలను పూర్తి చేయాలని సర్పంచి సునీత డీఈవోను కోరారు. ఎంఈవో సుందర్‌రావు, మాజీ సర్పంచి సురేష్, వార్డు సభ్యులు సత్యనారాయణ, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మొర్రిగుడలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు

డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ

చింతపల్లి, న్యూస్‌టుడే: డిజిటల్ మార్కెటింగ్‌పై చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. విజయభారతి తెలిపారు. నాలుగో విడత సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించిన తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన రిసోర్సు పర్సన్ కృష్ణకాంత్ విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్‌లో నైపుణ్యాలు వివరించారు. పీఎం ఉషా కార్యక్రమంలో భాగంగా పాడేరు డిగ్రీ కళాశాల ఆర్థిక సహకారంతో ఈ శిక్షణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కన్వీనర్లు రమణ, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిసోర్సుపర్సన్ కృష్ణకాంత్, వేదికపై విజయభారతి తదితరులు

కొర్రాలో వరికుప్పలపై కప్పిన టార్పాలిన్లు

అన్నదాతల్లో అలజడి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో మన్యంలో ముసురు పట్టింది. ఆదివారం రాత్రి నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. గిరి రైతులు వరినూర్పులను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. కల్లాల్లో వరి కుప్పలను పేర్చి టార్పాలిన్లు కప్పారు. కోతకొచ్చిన వరి పనలను పొలాల్లో వదిలేసి దిగులు చెందుతున్నారు.

కొయ్యూరు: కొయ్యూరు మండలంలో వర్షంతో రైతులంతా ఆందోళన చెందుతున్నారు. కొంత మంది రైతులు వరి చేను కోసేశారు. మరికొందరు రైతులు మినుప పంట తీసేశారు. పనలు తడిచిపోతుండటంతో రైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి అడుగులు

ర్యాలీగా వస్తున్న వెలుగు ఏపీడీ దేగలయ్య, ఏపీఎం కిషోర్‌బాబు, సీఆర్‌పీలు, సీసీలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం ఉన్న మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అడుగులు వేస్తోందని వెలుగు ఏపీడీ దేగలయ్య చెప్పారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 'మన డబ్బులు - మన లెక్కలు' కార్యక్రమంపై స్వయం సహాయక సంఘాల మహిళలకు సోమవారం అవగాహన కల్పించారు. ఎంత అప్పు తీసుకున్నారు.. ఎంత చెల్లించారు.. ఇంకా ఎంత చెల్లించాలనే వివరాలు 'మన డబ్బులు - మన లెక్కలు' యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. పొదుపు, రుణాలకు సంబంధించిన నిధుల దుర్వినియోగానికి ఎటువంటి ఆస్కారం ఉండదన్నారు. అనంతరం ర్యాలీ చేశారు. ఏపీఎం కిషోర్‌బాబు, సీఆర్‌పీలు మేరీ, నాగమణి, సీసీలు శ్రీరాములు, సుందర్, కల్యాణి, పద్మ, బుల్లబ్బాయి సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం శబరిమలలో ఇరుముడులు

సీలేరు, న్యూస్‌టుడే: మన్యం శబరిమలగా పేరుగాంచిన సీలేరు అయ్యప్ప ఆలయంలో సోమవారం అయ్యప్పమాలధారుల ఇరుముడుల కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ దీక్ష ధరించిన భక్తులతోపాటు మాకవరపాలెం, ధారకొండకు చెందిన భక్తులు ఇరుముడులు కట్టుకుని రాజమహేంద్రవరం పయనమయ్యారు. ముందుగా స్థానిక శివాలయం నుంచి రామాలయం కూడలి వరకూ ర్యాలీ చేపట్టారు.

ఇరుముడులతో చిన్నారులు

పెదబయలు, న్యూస్‌టుడే: పంచాయతీ కొత్తూరు గ్రామానికి సిమెంటు రోడ్డు నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం - అప్పారావు, కొత్తూరు

✓: సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరై.. తరువాత నిధులు ఆగిపోయాయి. డీఈఈతో మాట్లాడి మళ్లీ నిధులు మంజూరయ్యేలా చూస్తాం. - తెరవాడ అన్నమ్మ, సర్పంచి, జామిగుడ

మేమున్నాం..	మీకు తోడుగా
పాడేరు 89853 66570	అరకులోయ: 63034 86346 రంపచోడవరం: 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో పాఠశాలలకు వెళ్లే దారిలో సీసీ రోడ్లు నిర్మించారు. ఇరువైపులా అంచుల వెంబడి గ్రావెల్ వేయకపోవడంతో చిన్నారులు కిందపడుతున్నారు. - మణికంఠ, మారేడుమిల్లి. ✓: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. - వెంకటరమణ, పీఆర్ డీఈఈ

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ

పాడేరు ర్యాలీలో ప్రోగ్రాం అధికారి కిరణ్‌కుమార్, ప్రిన్సిపల్ హేమలత తదితరులు

పాడేరు, చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అవగాహనతోనే హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ సాధ్యమని ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం మినుములూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కాఫీ హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ హేమలత మాట్లాడుతూ.. గర్భిణులు తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. లంబసింగిలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు వరప్రసాద్ మాట్లాడుతూ.. హెచ్ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీహెచ్ఈవో చిన్నయ్యపడాల్, హెచ్‌వీ లక్ష్మి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: డుంబ్రిగుడలో జరిగిన ర్యాలీలో వైద్యాధికారులు రాంబాబు, అంబిక పాల్గొన్నారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ, మహిళా కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపల్స్ నాయక్, చలపతిరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, వరరామచంద్రాపురం, చింతూరు: రాజవొమ్మంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుష్మ సిబ్బందితో ర్యాలీ చేశారు. రేఖపల్లి, జీడిగుప్ప వైద్యులు నీలోఫర్, నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రదర్శనలు, మానవహారాలు నిర్వహించారు. తులసిపాక వైద్య సిబ్బంది చింతూరులో ర్యాలీ చేశారు. వైద్యాధికారి ఉదయ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ చేశారు. ప్రిన్సిపల్ రత్నమాణిక్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

అరకులోయ ర్యాలీలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

(c) eenadu

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. విద్యార్థులు ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీ పాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం, గుంటూరులో డిసెంబరు 11వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి ● పాఠశాల/ బ్రాంచ్ కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానం ● రిజిస్ట్రేషన్ చివరి తేదీ : డిసెంబరు 7

నమోదు కొరకు: 91549 91113 సమయం : ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

93 శాతం మందికి పింఛన్ల పంపిణీ

జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకంలో 93 శాతం మందికి పింఛన్ల నగదు పంపిణీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు సోమవారం ఉదయం 7 గంటల నుంచే పంపిణీని ప్రారంభించారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఏటీ అగ్రహారం నాలుగో వీధిలోని వృద్ధుల ఆశ్రమంలో వయోవృద్ధులకు నగదు అందజేసి వారితో ఆత్మీయంగా మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. జిల్లాలో 2,56,904 మందికి రూ.111.34 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కలెక్టర్ వెంట డీఆర్డీఏ పీడీ జె.వి.విజయలక్ష్మి, జీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 2,37,326 మందికి రూ.102.95 కోట్లు పంపిణీ చేశారు. వివిధ కారణాలతో పింఛన్లు తీసుకోని వారికి మంగళవారం అందజేయనున్నారు.

వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

బొమ్మను గీసి.. ప్రాణం పోసి

కాదేదీ చిత్రకళకు అనర్హం అని నిరూపిస్తోంది ఏఎన్‌యూ ఆర్ట్ విభాగం. సాంకేతికతతోపాటు పలు రకాల వస్తువులతో చిత్రాలు తీర్చిదిద్దడంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. కాన్వాస్ మీద వేసే చిత్రాలే కాకుండా [illegible] అందమైన చిత్రాలు ఆవిష్కరించడం, లినోకట్, జింక్ ప్లేట్ కటింగ్‌తో ప్రింట్ మేకింగ్, మౌల్డింగ్, ఇన్‌స్టలేషన్, మిమిటికల్ పెయింటింగ్ తదితర అంశాలను నేర్పిస్తున్నామని అధ్యాపకులు జాగీర్‌ఖాన్ తెలిపారు. - ఈనాడు గుంటూరు.



తెలుగు లిపి ఘనత చాటేలా

తెలుగు భాష ప్రాచీనతను తెలిపేలా కాలం నుంచి మారుతూ వచ్చిన వర్ణమాల క్రమాన్ని తెలుసుకోవాలంటే విజయపురి సౌత్ వెళ్లాల్సిందే. నాగార్జున కొండ పురావస్తు మ్యూజియంలో ఏర్పాటు చేసిన తెలుగు అవిర్భావ పట్టిక సందర్శకులను ఆకట్టుకుంటోంది. శాతవాహన కాలపు బ్రహ్మీలిపి నుంచి దశల వారీగా రూపాంతరం చెందుతూ శ్రీకృష్ణదేవరాయల కాలం వరకు ఉన్న తెలుగు వర్ణమాలను అక్కడ పొందుపరిచారు. - ఈనాడు, నరసరావుపేట

వైద్యులేం చేస్తున్నారు?

■ విధులను వదిలి ఎక్కడికెళ్తున్నారు?
■ కూపీ లాగిన వైద్యారోగ్యశాఖ కార్యదర్శి

సౌరభ్‌గౌర్ సూచనతో ఓపీ కౌంటర్ వద్ద ఏర్పాటైన అద్దాలు, మెష్‌లు

ఈనాడు–అమరావతి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో పరిస్థితులను చక్కదిద్దేందుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారు. వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆకస్మిక తనిఖీలు చేసిన 48 గంటల వ్యవధిలోనే కొన్ని మార్పులు మొదలయ్యాయి. జీజీహెచ్‌లో నెలకొన్న సమస్యలను అనేకసార్లు 'ఈనాడు' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. వీటిపై స్పందించిన సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.వి.వి. రమణ [illegible] ఆసుపత్రిలోని పరిస్థితిని పరిశీలించి కొన్ని లోపాలను గుర్తించి సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. నవంబరు 29న సౌరభ్‌గౌర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, కొన్ని విభాగాల్లో వైద్యులు లేకపోవడాన్ని గుర్తించారు.

సమగ్ర వివరాల సేకరణ

జీజీహెచ్‌లో కొంతమంది వైద్యుల పనితీరు, సమయపాలనపై కొంతకాలంగా ఫిర్యాదులొస్తున్నాయి. కేవలం హాజరు కోసం వచ్చి.. ప్రైవేటు ప్రాక్టీసు కోసం వారి విధులను పీజీ విద్యార్థులపై వదిలేసి వెళ్లిపోతున్న విషయం బహిరంగ రహస్యం. పీజీలు చేతికి లాగులు ఇచ్చి తామే వైద్యం చేసినట్లు నమోదు చేయిస్తున్నారు. సౌరభ్‌గౌర్ ఈ మొత్తం వ్యవహారంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. వైద్యులవారీగా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు (కేపీఐ) తీసుకొస్తున్నారు. ఆది, సోమవారాల్లో మరింత సమాచారం కోరినట్లు తెలుస్తోంది. నిత్యం ఏ వైద్యుడు ఎన్ని ఓపీ కేసులు చూస్తున్నారు? ఎంత సమయం ఆసుపత్రిలో ఉంటున్నారు? పీజీలకు వదిలేసి వెళ్లిపోతున్నవారు ఎవరు? ఇలా అన్ని కోణాల్లోనూ సమాచారం సేకరించారు. సాంకేతికంగా కొన్ని వ్యవస్థలను అనుసంధానించడం ద్వారా ముందుముందు వైద్యుల పనితీరును మదింపు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిసింది.

విభాగాల్లోనూ మార్పులు

జీజీహెచ్‌లోని పలు విభాగాల్లో సైతం మార్పులు చేయాలని సౌరభ్ సూచించారు. ఆ మేరకు ఓపీ కౌంటర్ వద్ద కొన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు ఇక్కడ రోగి తన వివరాలు చెప్పడానికి ఎన్నో ఇబ్బందులు పడేవారు. శస్త్ర చికిత్స చేయించుకున్నవారికి, తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నవారికి ఇక్కడి పరిస్థితులు అనువుగా లేవని ఆయన గుర్తించారు. దీంతో సోమవారం అద్దాలు, మెష్‌లతో కౌంటర్లలో మార్పులు చేశారు. మరుగుదొడ్లు, వార్డుల్లో సౌకర్యాలపరంగా ఎలాంటి మార్పులు చేయాలో జీజీహెచ్‌వర్గాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

భూసమీకరణపై కార్యాచరణ ప్రణాళిక

● రైతులతో చర్చించి ఒప్పించేలా కసరత్తు ● ముందుకురాని పక్షంలో భూసేకరణ

ఈనాడు – అమరావతి

రాజధాని ప్రాంతంలో తొలివిడత భూసమీకరణలో రైతుల నుంచి ఇంకా 2,492 ఎకరాలు సమీకరించాల్సి ఉంది. ఇందులో కొంతమంది ఆ విధానంలో ఇవ్వడానికి ఇటీవల ముందుకొచ్చారు. మరికొందరు న్యాయస్థానాల్లో కేసులు వేశారు. వీరితో సీఆర్డీఏ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు చర్చించడంతో కొందరు కేసులు ఉపసంహరించుకున్నారు. దీంతో మొత్తం 45 కేసులకుగాను ప్రస్తుతం 27 కేసులు మిగిలాయి. వీటిపై విచారణ డిసెంబరు 3న ఉంది.

ఇంకా సమీకరించాల్సిన 2,492 ఎకరాల్లో వివిధ అవసరాలకు ఎంతెంత వినియోగించనున్నారో ఆ వివరాలు

విభాగం	ఎకరాలు
సీడ్‌యాక్సెస్ రోడ్డు నిర్మాణం	22.40
భూముల కేటాయింపు	42.47
మౌలికవసతుల కల్పనలో వినియోగం	441.96
రిటర్నబుల్ ప్లాట్లకు కేటాయింపు	131.77
వివిధ అవసరాలకుపోగా మిగిలేది	1,853.50
మొత్తం	2492.10

సందేహాల నివృత్తి.. రాజధాని అమరావతి నగరం అభివృద్ధి చెందితే భూములిచ్చినవారికి కలిగే ప్రయోజనాలపై అధికారులతోపాటు త్రిసభ్య కమిటీ సభ్యులు రైతులకు వివరిస్తున్నారు. వారి సందేహాలను కమిటీ నివృత్తి చేస్తోంది. అందరూ సహకరిస్తే రాజధాని నిర్మాణం వేగవంతమవుతుందని చెబుతోంది. దీంతో కొంతమంది కేసులను ఉపసంహరించుకున్నారు.

☛ మరికొంతమంది భూసమీకరణకు వ్యతిరేకంగా ఉండడంతో వారి నుంచి భూసేకరణ ద్వారా తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను క్షేత్రస్థాయి యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ నెలలోనే ప్రకటన ఇవ్వడానికి కసరత్తు చేస్తోంది.

రెండు సొసైటీల్లో రికార్డులు స్వాధీనం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజలు, రైతుల సొమ్ముతో వ్యాపారం చేసిన కురగల్లు, మంగళగిరి సొసైటీలపై 51 విచారణకు సహకార కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార శాఖ అధికారి నేతృత్వంలో బృందం ఏర్పాటైంది. సోమవారం రికార్డులను స్వాధీనం చేసుకుంది. అక్రమాలకు కారణమైన సొసైటీ సీఈవో రమేశ్‌పై క్రిమినల్ కేసు నమోదుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆలోచన అదిరింది

వినియోగదారులకు అందుబాటులో మొబైల్ పసుపుపాడి వాహనం

నూనెలు.. పిండి.. పసుపు... కారం... ఇలా ప్రతీదాంట్లోనూ కల్తీనే. పక్కా ప్యాకింగ్‌లోనే విక్రయించాలని ప్రభుత్వ నిబంధనలున్నా... విడి విక్రయాలు ఎక్కడా తగ్గడం లేదు. ఇందులో నాణ్యత ఎంతో చెప్పక్కర్లేదు. ఇలాంటి ఇబ్బందుల్లేకుండా అక్కడికక్కడే మిల్లింగ్ చేసి స్వచ్ఛమైన పసుపు ఇవ్వాలన్న ఆలోచనతో నిజామాబాద్‌కు చెందిన ఓ కుటుంబం వినూత్న ప్రయోగం చేసింది. ఓ మినీ వాహనంలో రూ.లక్షతో కొనుగోలు చేసిన యంత్రాలను అమర్చింది. బ్యాటరీల సహాయంతో అవి పని చేస్తున్నాయి.

పొలాల నుంచి పసుపు కొమ్ములు సేకరించి ఆ వాహనంలో ఉంచారు. ప్రధాన రహదారుల పక్కన ఆపి.. కొనుగోలుదారుల ఎదుటే పసుపు కొమ్ములను తూకం వేసి... యంత్రంలో మర ఆడిస్తున్నారు. కిలో పసుపునకు రూ.400 వరకు తీసుకుంటున్నారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో తిరిగామని, ప్రస్తుతం గుంటూరు వచ్చామని నిర్వాహకులు తెలిపారు. స్వచ్ఛమైన పసుపు కొమ్ములను వినియోగదారుల ఎదుటే మర ఆడించి ఇస్తుండడంతో అందరూ ఇష్టపడుతున్నారని చెప్పారు.

- న్యూస్‌టుడే, నెహ్రూనగర్

మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం 5న

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 5న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంతో పాటు సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుతున్న సేవలు, గృహాల నిర్మాణం, మద్దతు ధరకు ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పనులపై ఆమె సోమవారం సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎంపీటీయూని నిర్వహించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ జిల్లాలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

ఆర్జేడీ సీరియస్.. డీఈవో విచారణ

ఈనాడు కథనానికి స్పందన

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ ఉన్నతాధికారులు హెచ్చరించారు. ఇప్పటివరకు అలా వసూలు చేసిన పాఠశాలల వివరాలపై నివేదిక ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారులకు సూచించారు. పదో తరగతి పరీక్ష ఫీజును రూ.125గా ప్రభుత్వం నిర్ణయించింది. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు, ప్రైవేటు పాఠశాలల్లో రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు అడ్డగోలుగా వసూలు చేస్తున్న వైనంపై సోమవారం 'ఈనాడు'లో 'పదిరెట్ల దోపిడీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన గుంటూరు ఆర్జేడీ లింగేశ్వర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిస్థితిపై ఆరా తీశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఎంఈవోలతో ప్రత్యేకంగా వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలిచ్చినా.. ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అనంతరం గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారిణి సీవీ రేణుక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, ఎంఈవోల ద్వారా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల నుంచి నివేదికలు రప్పిస్తామన్నారు. అధిక ఫీజులు వసూలు చేసినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రధానోపాధ్యాయులు పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు నేరుగా చెల్లిస్తారని.. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఎలాంటి సంబంధం ఉండదన్నారు. ఎవరైనా నిర్ణీత రుసుముకు మించి వసూలు చేస్తున్నట్లయితే.. తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు.

పండింది కొంతే.. ధర అంతంతే

ఈనాడు – అమరావతి

పత్తి రైతులు తెల్లబోతున్నారు. అధిక వర్షాలతో దిగుబడులు తగ్గిపోయి.. గిట్టుబాటు ధర లేక.. సీసీఐ కేంద్రాల్లో నాణ్యత పేరుతో కొనుగోలు చేయకపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. మొంథా తుపాను దెబ్బకు దిగుబడులు సగానికి పడిపోయి.. మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నారు. గుంటూరు జిల్లాలో నవంబరు 26 వరకు 12,400 క్వింటాళ్లు, పల్నాడులో 22 వేల క్వింటాళ్ల పత్తినే సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధరకు కొనుగోలు చేశారు.

పత్తి సాగు ఇలా.. హెక్టార్లలో

జిల్లా	విస్తీర్ణం
పల్నాడు	90,872
గుంటూరు	23,934
బాపట్ల	1,834
మొత్తం	1,16,640

అక్కడే మాటేసి.. సీసీఐ కేంద్రాల పక్కనే మాటేసిన దళారులు.. రైతుల అసహాయతను సొమ్ము చేసుకుంటున్నారు. సీసీఐ జిన్నింగ్ మిల్లులను ఎల్-1, ఎల్-2, ఎల్-3గా విభజించి స్లాట్లు కేటాయిస్తుండడంతో రైతులు దూరమైనా వారికి కేటాయించిన కేంద్రాలకు తీసుకెళ్లడం భారంగా మారింది. ఇది ప్రైవేటు వ్యాపారులకు కలిసొస్తోంది.

తెల్లబోతున్న పత్తి రైతు

పెరిగిన పెట్టుబడి.... తగ్గిన దిగుబడి : ఎకరా సాగుకైన వ్యయం రూ.35 వేల నుంచి రూ.40 వేలు. కౌలు రూ.15 వేల వరకు అదనం. ☛ బాగా పండితే ఎకరాకొచ్చే దిగుబడి 12 నుంచి 15 క్వింటాళ్లు. ప్రస్తుతం 5 క్వింటాళ్లలోపే వస్తోంది. ☛ మార్కెట్లో క్వింటా రూ.5 వేల నుంచి రూ.6 వేలకే కొంటున్నారు. ఈ లెక్కన రైతుకొచ్చేది రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకే. ☛ పత్తి తీతకు కూలీల కొరత కారణంగా క్వింటాకు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. ☛ సీసీఐ ఇవ్వాల్సిన మద్దతు ధర రూ.8,110. తేమ, నాణ్యత పేరుతో కొనడం లేదు. ☛ తేమశాతాన్ని 8 నుంచి 12 శాతం వరకే అనుమతించడం రైతులకు ప్రతికూలంగా మారింది.

దెబ్బకొట్టిన వర్షం

ఎనిమిదెకరాల్లో సాగు చేశా. ఎకరాకు 6 క్వింటాళ్ల చొప్పున వచ్చింది. అధికవర్షాలకు పంట దెబ్బతింది. తేమ శాతం అధికంగా ఉందని, నాణ్యత లేదని సీసీఐ కేంద్రంలో తిరస్కరించారు. గత్యంతరం లేక వ్యాపారులకు అమ్ముకుంటున్నాం. **- పాములు, రైతు, ఎంద్రాయి**

మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

దిగుబడులు సగానికిపైగా పడిపోయాయి. ధరలూ అంతంతమాత్రంగానే ఉన్నాయి. వర్షాలకు దెబ్బతినడం వల్ల రంగు మారింది. నాణ్యత లేదని సీసీఐ కొనడం లేదు. అందరూ ఒకేసారి పత్తి తీస్తుంటే కూలీల కొరత ఏర్పడి చెల్లించే మొత్తం పెరిగింది. మద్దతు ధర అందేలా చూడాలని కోరుతున్నాం. **- పాదిలి శ్రీనివాసరావు, పెదమద్దూరు**

పారిశ్రామికవాడలో స్థలం ఆక్రమణకు యత్నం

మంగళగిరి, న్యూస్‌టుడే: యర్రబాలెం పారిశ్రామికాభివృద్ధి సంస్థకు చెందిన స్థలాన్ని కొంతమంది ఆక్రమించేందుకు యత్నించారు. సమాచారం తెలుసుకున్న ఐలా కమిషనర్ రహీమ్ హుటాహుటిన సోమవారం ఘటనా ప్రదేశానికి చేరుకుని అడ్డుకున్నారు. పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు అవసరమైన నీటి సౌకర్యం కోసం నాలుగు సెంట్ల స్థలాన్ని కేటాయించారు. విలువ సుమారు రూ. 50 లక్షలు. ఖాళీగా ఉన్నట్టు గమనించిన కొందరు నగరపాలక సంస్థ నుంచి విద్యుత్తు మీటరు ఏర్పాటునకు అనుమతి తీసుకుని సర్వీసు పొందారు. ఇందులో కూరగాయల దుకాణం ఏర్పాటుకు సోమవారం భూమి పూజ చేయడంతో పరిశ్రమల యజమానులు గుర్తించారు. వెంటనే ఐలాకు ఫిర్యాదు చేశారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రహీమ్

ఆహ్లాదం.. అందనంత దూరం

గుంటూరులోని గాంధీ పార్కు అధ్వానంగా మారింది. గత వైకాపా ప్రభుత్వం దీని అభివృద్ధి పేరుతో రూ.6.25 కోట్లు ఖర్చు చేసి అస్తవ్యస్త పనులతో సరిపెట్టింది. దీంతో కొన్నాళ్లకే కళావిహీనంగా మారింది. చెస్ కోర్టు, జంగిల్ పార్కులోని బొమ్మలు, పిల్లలు ఆడుకునే రైలుబండి రూపుకోల్పోయాయి. ఆహ్లాదం పంచేలా దీన్ని తీర్చిదిద్దాలని సందర్శకులు కోరుతున్నారు. **- ఈనాడు గుంటూరు**

వృత్తిపన్ను బకాయిలపై నోటీసులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: వృత్తి పన్ను బకాయిల వసూళ్లపై వాణిజ్యపన్నులశాఖ అధికారులు దృష్టి సారించారు. వ్యాపారవర్గాలవారికి ఫోన్ల ద్వారా సమాచారం అందివ్వడంతోపాటు మెయిళ్లు పంపిస్తున్నారు. గుంటూరు-2 డివిజన్‌లో కొత్తపేట, బ్రాడీపేట, అరండల్‌పేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నరసరావుపేట, బాపట్ల చీరాల పరిధిలో 35 వేలమందికిపైగా వ్యాపారులు బకాయి ఉన్నట్టు గుర్తించారు. వీరిలో కొంతమందికి నోటీసులు పంపించారు. వాటికి స్పందించని వ్యాపారులపై ఆర్.ఆర్.(రెవెన్యూ రికవరీ యాక్టు) ప్రయోగిస్తామని చెబుతున్నారు.

నిబంధనలు ఇలా...

☛ వార్షిక టర్నోవర్ రూ.10 లక్షలున్న వ్యాపారులు దీన్ని చెల్లించాల్సిన అవసరం లేదు.
☛ రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల్లోపు టర్నోవర్ చేసేవారు రూ.1,250; రూ.50 లక్షలకుమించి ఉంటే రూ.2,500 చొప్పున చెల్లించాల్సి ఉంది.
☛ భాగస్వామ్య సంస్థల నిర్వాహకులు సంస్థ తరపున రూ.2,500తోపాటు ఒక్కో భాగస్వామి రూ.2,500 చొప్పున చెల్లించాలన్న నిబంధన ఉంది.

ఎనిమిదేళ్ల నుంచి....

ఏటా ఆర్థిక సంవత్సరం ముగిశాక జూన్ 30లోగా వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యాపార సంస్థలో ఉద్యోగికి నెలకు రూ.15 వేల వేతనం ఇస్తే రూ.150; రూ.20 వేల జీతమిస్తే రూ.200 సదరు నిర్వాహకులు కట్టాలి. జీఎస్టీ అమల్లోకి వచ్చాక దాదాపు ఎనిమిదేళ్ల నుంచి వీటిపై వాణిజ్య పన్నులశాఖ పెద్దగా దృష్టి పెట్టలేదు.

నీరు నిలిపేస్తారు.. మురుగు ఆపేస్తారు

■ మేజర్ పన్ను బకాయిదార్లకు ఝలక్ ■ జీఎంసీ ప్రత్యేక డ్రైవ్

ఈనాడు – అమరావతి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మేజర్ డిఫాల్టర్ల జాబితాలో ఉన్నవారి నుంచి పన్నుల వసూళ్లకు అధికారులు కొత్త విధానాలపై దృష్టి పెట్టారు. కట్టగలిగే సత్తా ఉన్నా.. కావాలని ఎగ్గొడుతున్నవారితో డిప్యూటీ కమిషనర్ స్థాయిలో ప్రత్యేకంగా మాట్లాడాక... స్పందన రాకపోతే నీరు, డ్రెయిన్ కనెక్షన్లను తొలగించాలని నిర్ణయించారు. ఈ మేరకు సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

నీటి పన్ను, ఆస్తిపన్ను సహా ఖాళీ స్థలాలపరంగా ఏటా లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. గత నాలుగేళ్లలో ఆస్తిపన్ను వసూలు 50 శాతానికే పరిమితమవుతోంది. ఏటా రూ.కోట్లలో నీటి సేకరణ, శుద్ధికి ఖర్చు పెడుతుండగా.. అందులో సగం కూడా నీటిపన్ను వసూలు కావడం లేదు. వాణిజ్య భవనాలపరంగా బకాయిలు పేరుకుపోయాయి. కొంతమంది నివాస భవనాల పేరుతో ఆసుపత్రి, వ్యాపార సముదాయాలకు మున్సిపల్ నీటిని వాడుతున్నారు. 50కుపైగా ప్రభుత్వ కార్యాలయాలు సైతం నీటి పన్ను చెల్లించడం లేదు. ● కొంతమంది వార్డు సెక్రటరీలు రోజువారీ వసూలు సున్నా శాతం నమోదు చేస్తుండడంతో కారణాలపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. వారికి షోకాజ్ నోటీసులిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..: డిమాండ్‌కు తగ్గ వసూళ్లు ఉండాలన్న లక్ష్యంతో జీఎంసీ ప్రత్యేక డ్రైవ్ చేస్తోంది. మేజర్ బకాయిదారులపై దృష్టి పెట్టింది. కొన్ని పన్నులకు డిసెంబరు, మరికొన్నింటికి 2026 మార్చి తుది గడువుగా పెట్టుకుంది. ● 2025-26లో ఆస్తిపన్ను డిమాండ్ రూ.191 కోట్లు. ఇప్పటివరకు రూ.75 కోట్ల వరకు వసూలైందని అధికారులు చెబుతున్నారు. వచ్చే మార్చి వరకు రోజుకు రూ.కోటి వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ● నీటి మీటర్ల డిమాండ్ రూ.51 కోట్లు. . రూ.4.50 కోట్లే వసూలైంది. రోజువారీ వసూలు లక్ష్యం రూ.44 లక్షలు. ● వాటర్ సెస్ డిమాండ్ రూ.29 కోట్లు. వసూలైంది రూ.5 కోట్లే. రోజువారీ లక్ష్యం రూ.24 లక్షలు. ● ఖాళీ స్థలాల పన్ను డిమాండ్ రూ.110 కోట్లు. వచ్చింది రూ.4 కోట్లు. రోజువారీ లక్ష్యం రూ.93 లక్షలు

వ్యాపారుల చెలగాటం.. రైతుకు ప్రాణసంకటం

వేరే దారిలేక అయినకాడికి ధాన్యం విక్రయం

ఈనాడు – అమరావతి

ఆకాశంలో మబ్బులు... చల్లటి గాలులు వీస్తున్న నేపథ్యంలో రైతులు కోత కోసిన ధాన్యం ఆరబెట్టుకునే పరిస్థితి లేకుండాపోయింది. నూర్పిడి చేసిన వెంటనే నిల్వ చేసుకునే వెసులుబాటు లేక చాలామంది అన్నదాతలు ప్రైవేటుగా విక్రయిస్తున్నారు. పరిస్థితులను సొమ్ము చేసుకునేందుకు వ్యాపారులు ధర మరీ తగ్గించేయడం గమనార్హం. కోతల ప్రారంభంలో 75 కిలోల బస్తాను రూ.1,400కు కొనగా.. ఇప్పుడు రూ.1,280 మాత్రమే ఇస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందని సాకు చూపించి రైతులను ముంచేస్తున్నారు.

ధాన్యం నిల్వ చేసి ఆరబెట్టడానికి సౌకర్యాల్లేకపోవడం, టార్పాలిన్ల కొరత, వర్షం వస్తే తడిచిపోతుందన్న ఆందోళన రైతులను నిలబడనీయడం లేదు. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం 17కంటే ఎక్కువగా ఉంటే ఆరబెట్టుకుని తీసుకురావాలని చెబుతున్నారు. పంట నూర్పిడి చేసిన వెంటనే ధాన్యంలో 22 నుంచి 25 శాతం వరకు తేమ ఉంటోంది. దీనిని 17శాతానికి తగ్గించాలంటే ఎండ అవసరం. ప్రభుత్వం టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నా అందరికీ అందడం లేదు.

కొల్లిపర: ధాన్యం నాణ్యత పరిశీలిస్తున్న మిల్లర్లు

ధాన్యం కొనుగోలుకు ఎంపిక చేసిన ఆర్ఎస్‌కేలు: 47
ధాన్యం విక్రయించిన రైతులు: 329
సేకరించిన ధాన్యం విలువ: రూ.5.11 కోట్లు
రైతుల ఖాతాలకు జమైన సొమ్ము : రూ.2.68 కోట్లు
ఇప్పటివరకు కొన్న ధాన్యం: 2,140 టన్నులు

తొందరపడొద్దంటున్న యంత్రాంగం : ధాన్యాన్ని ఆరబెట్టి జాగ్రత్త చేసుకుంటే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జిల్లా యంత్రాంగం రైతులకు అవగాహన కల్పిస్తోంది. తేమ 17శాతానికి వచ్చాక ఆరబెట్టి సమాచారం ఇస్తే కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారు. బహిరంగమార్కెట్లో విక్రయిస్తే బస్తాపై రూ.300 వరకు నష్టం వస్తుందని, రైతులు తొందరపడొద్దని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లో సొమ్ము జమ చేస్తున్నామన్నారు.

రూ.40 కోట్లకు రైతులను ముంచేసి..

పెట్టుబడి పేరుతో వసూలు చేసిన పురుగుమందుల వ్యాపారి

గుంటూరు నేరవార్తలు, గుంటూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులను నమ్మించి రూ. 40 కోట్ల మేరకు స్వాహా చేశారంటూ ప్రత్తిపాడు మండలం మల్లాయపాలేనికి చెందిన పురుగుమందుల వ్యాపారి, తిరుమల ఎంటర్‌ప్రైజెస్ యజమాని అన్నపురెడ్డి నాగిరెడ్డిపై బాధితులతో కలిసి ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సోమవారం ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పంట అమ్మగా వచ్చిన డబ్బును తన వ్యాపారంలో పెట్టుబడి పెడితే వడ్డీ ఇస్తానని నాగిరెడ్డి పలువురిని నమ్మించాడన్నారు. పాతమల్లాయపాలెం, ప్రత్తిపాడు, గింజుపల్లివారిపాలెం, కోయవారిపాలెం తదితర 10 గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతుల వద్ద రూ. 40 కోట్ల వరకు తీసుకొని మోసగించాడని చెప్పారు. 2021 నుంచి రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నా వారికి న్యాయం జరగలేదన్నారు. వసూలు చేసిన డబ్బులతో నాగిరెడ్డి తన భార్య, గుమస్తా, బినామీల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేశాడన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

పట్టించుకోని నాటి వైకాపా ప్రభుత్వం : నాగిరెడ్డికి అప్పటి వైకాపా నాయకులు సహకరించారని బాధితులు ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా వ్యాపార లావాదేవీలు చేస్తూ నమ్మించాడని, వైకాపా ప్రభుత్వ హయాంలోనే రూ. 40 కోట్ల వరకు వసూలు చేసి పరారయ్యాడని వాపోయారు. అప్పటి హోంమంత్రి సుచరితకు ఫిర్యాదు చేయగా.. విచారణ చేయాలని ఆమె అప్పటి సీఐ, ఎస్సైలను ఆదేశించినా వారు పట్టించుకోలేదని చెప్పారు. డబ్బులు అడిగినవారిపై అప్పటి వైకాపా ప్రభుత్వంలో అధికారుల సహాయంతో ఎదురు కేసులు బనాయించి వేధించారని చెప్పారు. న్యాయం చేయాలని వేడుకున్నారు.

RAMOJI

WALK-IN-INTERVIEW

MARGADARSI CHIT FUND PRIVATE LIMITED

REQUIRES ASSISTANTS IN BUSINESS DEVELOPMENT, CUM RECOVERIES FOR OUR NEW BRANCH AT MANGALAGIRI

BUSINESS DEVELOPMENT CUM RECOVERIES ASSISTANTS:

Male graduates with pleasing personality below 30 years with 2/3 years of experience in relevant fields. Candidates having valid two wheeler driving licence are preferred. The above posts are mainly field oriented. Experience in chit fund/financial iinstitutions will be given preference.

Fresh graduates also can attend for Trainee position.

Please attend **WALK-IN-INTERVIEW ON EITHER 3rd DECEMBER, 2025 (TUESDAY) or 4th DECEMBER, 2025 (WEDNESDAY) AT OUR MANGALAGIRI BRANCH from 10.30 A.M. to 2.00 P.M.** alongwith latest Resume, xerox copies of educational certificates, recent colour Passport size photographs and copy of Pan Card, Aadhaar card & Bank Passbook First page at the following address:

The Branch Manager,
MARGADARSI CHIT FUND PRIVATE LIMITED
D.No. 7-331A, 2nd Floor ATR Complex, Opp: Urvasi Theatre,
Gowtham Buddha Road, Mangalagiri Guntur District - 522 503, A.P.
☎ **Phone No. 08645-297993 / 9381401759**

(c) eenadu

అర్జీల వేగవంత పరిష్కారమే లక్ష్యం

కలెక్టరేట్‌లో వినతిని ఇచ్చేందుకు వచ్చిన నల్లపాడు చెరువు వద్ద నివాసం ఉంటున్న ప్రజలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు వేగవంతంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 260 అర్జీలు నమోదయ్యాయి. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఎక్కువ అర్జీలు నమోదవుతున్న శాఖల అధికారులతో సమీక్షించి సూచనలు చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎందుకు జాప్యం జరిగిందనే వివరాలు స్పష్టంగా తెలపాలన్నారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపండి: నల్లపాడులోని తెలగమాంబ చెరువు అభివృద్ధి నేపథ్యంలో.. అక్కడ ఏళ్లుగా ఉంటున్న తమను ఇళ్లు ఖాళీ చేయిస్తున్నారని, ఇప్పటికిప్పుడు ఎక్కడకు వెళ్లాలని బాధితులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయంగా ఇళ్లు చూపించాలని, స్థలాలు ఇప్పించాలని కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు.

కలెక్టరేట్ వద్ద భాజపా నాయకులు

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు, నాయకులు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. జిల్లాలోని 74 సంక్షేమ వసతి గృహాల్లోనూ సిబ్బంది కొరత ఉందన్నారు. రుచికరమైన భోజనం విద్యార్థులకు అందజేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో భాజపా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దారా అంబేడ్కర్, ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మయ్య, నాయకులు అబ్దుల్ ఖుర్దుస్, నాగలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌పై కార్యశాల

ప్రసంగిస్తున్న ఆచార్య మధుమూర్తి, వేదికపై అతిథులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని కళాశాలలు తమ సమాచారాన్ని నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) వెబ్‌సైట్‌లో కచ్చితంగా అప్‌లోడ్ చేయాలని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఏఎన్‌యూలో ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో 'డ్రైవింగ్ ఎక్సలెన్స్ ఇన్‌స్టిట్యూషనల్ స్ట్రాటజీస్ ఫర్ ఎన్ఐఆర్ఎఫ్' పేరుతో ఒకరోజు కార్యశాల నిర్వహించారు. దీంట్లో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి సుమారు 250 కళాశాలల సమన్వయకర్తలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య మధుమూర్తి మాట్లాడుతూ.. కళాశాలలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల విషయంలో ఏ విధంగా ముందుకెళ్లాలి, ఎలా లాగిన్ చేయాలి? అనే వివరాలను వెల్లడించారు. ప్రవేశాలు, విద్యార్థుల హాజరు, ప్రవేశాల శాతం, ఉత్తీర్ణత, తదితర వివరాలను తమ వెబ్‌సైట్‌లో ఉంచాలని ఆదేశించారు. వెబ్‌సైట్‌లు ప్రారంభించని కళాశాలలు వెంటనే పనులు చేపట్టాలన్నారు. కళాశాలలు ఇచ్చే సమాచారం ఆధారంగా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు కేటాయిస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని కళాశాలలు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించాలనే లక్ష్యంతో కార్యశాలను ఏర్పాటు చేశామన్నారు. ఉన్నత విద్య నాణ్యత, ప్రమాణాలు, పరిశోధనా సామర్థ్యం పెంపు, విద్యార్థుల ఫలితాలు, మెరుగుదల, పరిశ్రమలు-కళాశాల అనుసంధానం, డేటా ఆధారిత పరిపాలన తదితర అంశాలపై సమన్వయకర్తలకు అవగాహన కల్పించారు. ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, ఉన్నత విద్యామండలి అకడమిక్ ఆఫీసర్ మ్యాథ్యూ, ఓఎస్డీ డాక్టర్ విజయబాబు, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అవి ప్రభుత్వ వైద్య కళాశాలలైతే రిజర్వేషన్లు అమలు చేస్తారా?

సమావేశంలో కేఎస్ లక్ష్మణరావు, ఆలా వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: పీపీపీ విధానంలో నిర్మించి, నిర్వహించే వైద్య కళాశాలలకు ప్రభుత్వ ఆసుపత్రి అని పేరు పెట్టాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవటం హాస్యాస్పదంగా ఉందని ప్రభుత్వ వైద్యకళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. జనచైతన్య వేదిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలలైతే ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, యుజీ సీట్లలో 50 శాతం ఆలిండియా కోటాకు కేటాయించాలని, రోగులకు పూర్తిగా ఉచిత వైద్యం అందించాల్సి ఉంటుందన్నారు. కొన్ని ప్రైవేటు మెడికల్ కళాశాలల యాజమాన్యాలు పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాల పూర్తయినా.. తరగతులు నిర్వహించకపోవటంతో 150 మెడికల్ సీట్లు కోల్పోయామన్నారు. జనచైతన్య వేదిక అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పీపీపీ పేరుతో వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయటాన్ని నిరసిస్తూ ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వందమంది మేధావులతో విజ్ఞాపన పత్రం రూపొందించి గవర్నర్ దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు. విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పావుకిలో నకిలీ బంగారం రూ.7 లక్షలు

మోసపోయిన గుంటూరువాసి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: తక్కువ ధరకు బంగారం ఇస్తామంటూ మోసగించినవారిపై సోమవారం కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నెహ్రూనగర్‌కు చెందిన సెలూన్ నిర్వాహకుడు సురేష్‌కు కర్ణాటక నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. పొలంలో తవ్వుతుండగా బంగారం దొరికిందని, తక్కువ ధరకు ఇస్తామని చెప్పాడు. తన నంబరు ఎవరిచ్చారని సురేష్ ప్రశ్నించగా.. గతంలో గుంటూరులో సెలూన్‌కు వచ్చినప్పుడు తీసుకున్నానని నమ్మకంగా చెప్పాడు. రూ.30 లక్షల విలువైన బంగారం రూ.15 లక్షలకే ఇస్తానన్నాడు. అది నమ్మిన సురేష్ ఇటీవల కర్ణాటక వెళ్లి కొన్ని నమూనా ముక్కలు తీసుకొచ్చి గుంటూరులో పరీక్షి చేయిస్తే అసలు బంగారమేనని తేలింది. కర్ణాటక వ్యక్తి ఫోన్ చేయగా.. రూ.7 లక్షలకు ఇస్తానంటే తీసుకుంటానని సురేష్ చెప్పారు. అతను గుంటూరు వచ్చి 250 గ్రాముల వస్తువు ఇచ్చి రూ.7 లక్షలు తీసుకెళ్లిపోయాడు. దాన్ని పరీక్ష చేయించగా.. నకిలీ బంగారమని తేలింది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్యచౌదరి తెలిపారు.

3 నుంచి ఎన్టీఆర్ వర్సిటీ క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో 3న ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలలో పురుషుల వాలీబాల్, 5న ఏలూరు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల మైదానంలో పురుషుల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని విశ్వ విద్యాలయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. క్రీడాకారులు సంబంధిత కళాశాల వ్యాయామ సంచాలకుడి వద్ద ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు సంబంధిత పత్రాలతో హాజరవ్వాలని ఆయన సూచించారు.

అన్నదాతకు భరోసా క్యాబేజీ సాగు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: క్యాబేజీ ధర అన్నదాతలకు ఆశాజనకంగా ఉంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని రైతులు ఈ ఏడాది దుగ్గిరాల మండలంలో పేరకలపూడి, కంఠంరాజుకొండూరు, మంచికలపూడి, పెదపాలెం, శృంగారపురం తదితర గ్రామాల్లో క్యాబేజీ సాగు చేశారు.

పేరకలపూడి: క్యాబేజీని మార్కెట్‌కు తరలించేందుకు ట్రాక్టర్లలోకి ఎత్తుతున్న రైతు, కూలీలు

పేరకలపూడి రైతు **యలవర్తి శ్రీనివాసరావు** క్యాబేజీ సాగులో అనుభవాలను పంచుకున్నారు. ఈ పంట కాలం నాలుగు నెలలు. సాగుకు మొదట రెండు సార్లు దుక్కిచేయాలి. దీనికి రూ.1500 వరకు ఖర్చయ్యింది. విత్తనాలు మడి చేసి నారు పోసుకున్నా. నేను కౌలుకు తీసుకుని అరెకరంలో పంట సాగుచేశాను. 10 గ్రాముల విత్తనం ప్యాకెట్ రూ.240 చొప్పున 12 ప్యాకెట్లు తెచ్చి వేశా. అంటే విత్తనానికి రూ.2880 అయింది. నారు పోసి నాటినందుకు రూ.3500 కూలి అయ్యింది. సాగు మొదలు పెట్టిన 10 రోజులకే వేళ్లు ఏర్పడాలి కాబట్టి అర బస్తా చొప్పున యూరియా డీఏపీ వేశాను. ఒకటి, రెండు సార్లు కొద్దిగా ఎక్కువగా కూడా వేశాను. వర్షాలతో కొంత అదనపు ఖర్చయ్యింది. మొత్తం మీద బలానికి రూ.12 వేలు వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. పురుగుల నివారణకు నెలలో నాలుగుసార్లు అయినా మందు పిచికారీ చేయాలి. చేలో మేమే మందు కొట్టుకుంటాం కాబట్టి కూలి లేదు. 17 గ్రాముల మందు ఖరీదు రూ.900 తడవకు వేస్తాం. ఇలా 6 సార్లు పిచికారీ చేశాం. ఇది కాకుండా వేరే మందులూ కొట్టాం. మొత్తం మీద పైపాటు మందుకే రూ.9000 వరకు అయ్యింది. పంటలో ఎప్పుడూ కలుపు వస్తూనే ఉంటుంది. మొత్తం మేమే చేయలేక కలుపు తీయడానికి మాత్రం కొన్నిసార్లు కూలీల్ని పెట్టుకున్నాం. దీనికి తడవకు రూ.800 వరకు అయ్యింది. మొత్తం మీద నాలుగుసార్లు తీయించాం. అంటే రూ.3200 అయ్యింది. కోతకు రూ.8 వేలు, కౌలు రూ.30 వేలు ఉంది. ఇక్కడ నుంచి సరకు మంగళగిరి లేదా గుంటూరు తీసుకెళ్లాలి. దీనికి రూ.2 వేలు ఖర్చు అయినా మొత్తం మీద రూ.66,580 పెట్టుబడి పెట్టాను.

దిగుబడి గమనిస్తే.. అరెకరానికి 125 బస్తాల దిగుబడి వచ్చింది. బస్తా అంటే 70 కిలోలు ఉంటుంది. 10 కిలోలు ఇప్పుడు రూ.150 ఉంది. అంటే బస్తాకు రూ.1050 వస్తుంది. 125 బస్తాలంటే రూ.1,31,250 వరకు ఆదాయం వస్తోంది. ఖర్చులు పోను రూ.64670 వచ్చింది. పంట చాల జాగ్రత్తగా రోజూ చూసుకుంటూ ఉండాలి. తెగుళ్లు కానీ, పురుగు కానీ పట్టించుకోకుండా ఉంటే పంట మొత్తం పోతుంది.

ప్రశ్న: మొక్కజొన్న సాగుకు అనుకూలమైన వంగడాలతోపాటు సేద్య విధానం గురించి చెప్పండి?

– కోటేశ్వరరావు, పెదరావూరు, తెనాలి మండలం.

సమాధానం: మొక్కజొన్న హైబ్రిడ్ల రకాలు పీఏసీ-751, పీఏసీ-741, పీ3396, ఎన్‌కే-7720, విన్నర్, బయో9544 వంగడాలు విత్తుకోవచ్చు.

విత్తన మోతాదు: మెట్టలో ఎకరానికి 8 కిలోలు, వరి మాగాణిలో ఎకరానికి 3 కిలోలు అవసరమవుతాయి. మెట్టలో 60×20, సెం.మీ.. మాగాణిలో 45×10-15 సెం.మీ లేదా 60×20 సెం.మీ దూరంలో విత్తాలి.

విత్తన శుద్ధి: కత్తెర పురుగును మొదటి 25-30 రోజుల వరకు నియంత్రించడానికి కిలో విత్తనానికి ఫోర్టాంజా డియో 6 మి.లీ చొప్పున విత్తన శుద్ధి చేసుకుని విత్తుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరానికి 3 కిలోల చొప్పున మొవ్వల్లో వేసుకోవాలి. గుళికలు వేసుకోలేక పోతే ఎకరానికి కొరాజిన్ 60 మి.లీ. లేదా డెలిగేటు 100 మి.లీ. లేదా ఫేమ్ 40 మి.లీ. చొప్పున వేయాలి. పెద్ద పురుగులు కనిపిస్తే ఎకరానికి తవుడు 10 కిలోలు, 2 కిలోలు బెల్లం, క్లోరిఫైరిఫాస్ 500 మి.లీ, 2 లీటర్ల నీరు కలుపుకుని చిన్న గోళీలు చేసి మొవ్వల్లో వేసుకోవాలి.

నీటి తడులు: ఎర్ర నేలల్లో 7-10 రోజులు, నల్ల నేలల్లో 15-20 రోజుల వ్యవధిలో పొలానికి నీరు పెట్టాలి. **– డాక్టర్ ఎం. నగేష్, ఆంగ్రూ ఏరువాక కేంద్రం సమన్వయకర్త.**

రాయితీపై అపరాల విత్తనాలు

ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో 30 శాతం రాయితీపై మినుములు, పెసల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని డీఏం సుమలత వెల్లడించారు. ఎల్‌బీజీ-752, పీయూ-31, వీబీఎన్-8 విత్తనాలు 270 క్వింటాళ్లు, ఐపీఎం2-14 పెసలు విత్తనాలు 250 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. మినుములు కేజీ రూ.138గాను రూ.41.60 రాయితీ పోను రైతులు రూ.96.60 చెల్లించాలి. పెసలు కేజీ రూ.135 ధర ఉండగా రూ.40.50 రాయితీ పోను రైతులు రూ.94.50 జమ చేయాలి. అపరాల విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలోని సిబ్బంది కలిసి కృషి యాప్‌లో పేరు నమోదు చేసుకుంటే జిల్లా అధికారులు అందజేస్తారు.

– న్యూస్‌టుడే, పొన్నూరు

చలికాలంలో పశువుల సంరక్షణ చర్యలు





చలి కాలంలో పశువుల సంరక్షణకు, పశుగ్రాసం కోత, ఎదకు వచ్చిన పశువుల మేపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంచార వాహన **పశువైద్యులు కొంగర బసవపున్నయ్య** సూచించారు. చలికాలంలో పశువులకు పచ్చగడ్డి పుష్కలంగా అందించాలి. చలి, మంచు ప్రభావం పశుగ్రాసంపై పడి పెరుగుదల మందగిస్తుంది. బూజు పట్టిన పచ్చిమేత తిన్న పశువులు ఎస్పోటాక్సామియా వంటి స్లోపాయిజన్ వ్యాధి బారిన పడతాయి. ఇది వచ్చిన వాటిలో తక్కువ మేత మేయడం, పొట్ట ఉబ్బరంగా ఉండడం, వరుసగా జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ క్రమంలో పశువు నీరసించి ఐదారు రోజుల్లో మృతి చెందుతుంది. ఈకాలంలో పశువుల్లో చర్మవ్యాధులు ఎక్కువ వస్తుంటాయి. చర్మం పెట్లిపోతుంది. గజ్జి సోకుతుంది. వీటిని తొలిదశలో గుర్తించి నూనె రాస్తే నయమవుతాయి. ఆలస్యమైతే పశువైద్య నిపుణుడిని సంప్రదించాలి. చలిలో ఆరుబయట ఉంచిన పశువులు మేత తగినంత తీసుకోవు. జీర్ణ ప్రక్రియ మందగిస్తుంది. రక్తం గడ్డకట్టి చనిపోతుంటాయి. ఇదే కారణంతో ఈ కాలంలో ఎక్కువ సంఖ్యలో దూడలు మృతి చెందుతుంటాయి. పచ్చి మేత కోసేటప్పుడు దానికి పట్టిన బూజు తొలగించాలి. కోసిన తరవాత తడి ఆరే వరకు 2 లేదా 3 గంటలు నిలబెట్టి ఉంచాలి. ఆరిన దానినే పశువులకు మేపాలి. ఇది లేని చోట ప్రత్యామ్నాయంగా ఎండుగడ్డి మేపాలి. ఈ కాలంలో పశువులు ఎక్కువగా ఎదకు వస్తాయి. ఈ లక్షణాలు రెండు మూడ్రోజులు స్పష్టంగా కనిపిస్తాయి. కొన్నింటిలో ఐదు నుంచి ఆరు రోజులు కూడా ఉంటాయి. వీటిలో వీర్యం బయటకు వచ్చినప్పటి నుంచి ఎద ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులూ రోజుకు ఒక డోసు ఎద ఇంజక్షన్ చేయించాలి. వీటి శరీరం వెచ్చదనం కోసం ఎండుగడ్డి ఎక్కువ మేపాలి. ఇలా చేయడం వల్ల జీర్ణ ప్రక్రియ సక్రమంగా ఉంటుంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఎండకాసే సమయంలో నీరు తాగించాలి. ఈ నీటిలో రెండు గుప్పెళ్ల కల్లుప్పు కలిపితే మంచిది.

– న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT.వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq.Yards గజాలు Site 10,000+Sq.Ft విల్లా అమ్మకమునకు కలదు. నోబ్రోకర్స్ Ph.99662 28370.

JOBS

Wanted area SalesManager. Qua:Inter/Degre. Min Exp. 2Yrs in building Material Industry. Sal: 25K. Ema Timbers, Gnt. 9989920203.

Wanted Sales Executives For Guntur, Ongole for Mahesh Extruions (P) Ltd Bellari Send Your Resumes maheshpvcpipes@gmail.com.

LG **ఆథరైజ్డ్‌డీలర్,** పద్మకేశవ సర్వీసెస్, మంగళగిరివారికి డిగ్రీ అర్హత, కంప్యూటర్ అనుభవమున్న లేడీ డేటాఎంట్రీ ఆపరేటర్స్, ITI/డిప్లొమో అర్హతగల హెల్పర్స్ కావలెను. 9542992200.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జిస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. జీతం : 10000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు : ఇంటర్ మరియు డిగ్రీ. వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర ఫోన్ 8978480435.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జిస్, క్లాసు ఇన్‌ఛార్జిస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు : ఇంటర్ నుండి పి.జి వరకు. వయస్సు 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యిఉండాలి. సంప్ర. ఫోన్ నెంబర్ : 8978480429.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Computer Operatorగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు : any Degree, 55 wpm Typing Speed, M.S Office Skils, వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర ఫోన్: 89784 80429.

గుంటూరు ఆర్.టి.సి కాలనీలోని ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సం॥సెల్: 80740 28964.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

వంట మాస్టర్లు భార్య భర్తలు కావలెను వసతి కలదు, వరంగల్ సిటీలోని ప్రైవేటు మెడికల్ కాలేజిలో వంటచేయుటకు. ✆ 9390809999, 9849235255.

లలిత కోల్డ్ స్టోరేజ్, ప్రత్తిపాడునకు గుమస్తా కావలెను. జీతం: 14,000/-. Age: 30Y, లలిత కోల్డ్ స్టోరేజి ఆఫీస్, జూనియర్ కాలేజ్ ప్రక్కన, ప్రత్తిపాడు.

గుంటూరు అరండల్‌పేటలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారికి 10th అర్హత కలిగి స్వంత సైకిల్ ఉన్న ఆఫీసు బాయ్ కావలెను. సంప్ర॥ 9391526523.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

గీత కులాల సంక్షేమానికి మరింత ప్రాధాన్యం

సంఘీభావం తెలియజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, వీరంకి వెంకట గురుమూర్తి, చెల్లుబోయిన శ్రీనివాస్, వేములకొండ శ్రీనివాస్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గీత కులాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి స్పష్టం చేశారు. గీత కులాల సంక్షేమ సంఘం ఏపీ మహాసభ గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ 'రాజకీయ, విద్య, ఆర్థిక రంగాల్లో బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యం ఇస్తుంది. తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల సంక్షేమానికి పాటు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వంలో బీసీలపై విచ్చలవిడిగా దాడులు జరిగాయి. బీసీలు ఐక్యతతో ముందుకు సాగాలి'.. అని పిలుపునిచ్చారు. వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ గీత కులాల సంక్షేమానికి కార్పొరేషన్ నుంచి సహకారం అందిస్తామన్నారు. ఎన్టీఆర్.. బీసీలకు స్థానిక సంస్థల్లో 24 శాతం రిజర్వేషన్ కల్పిస్తే. చంద్రబాబు 34 శాతానికి పెంచారన్నారు. గీత కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ మిగులు భూముల్లో తాటి, ఈత వనాల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశమివ్వండి

కల్లుగీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ఇచ్చే గుర్తింపు కార్డులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. తెదేపా బీసీ సెల్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ గాయపడిన కార్మికులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ మద్యం దుకాణాలు, బార్ లైసెన్సుల కేటాయింపులో గీత కులాలకు ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించిందన్నారు. రాష్ట్ర ఈడిగ సంఘం అధ్యక్షుడు మేకల వేణుగోపాల్, యాత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంగటి రాము, శ్రీశయన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోడ అప్పారావు, కంచర్ల వెంకటేశ్వరరావు, పేరం ఆదివిష్ణు, వీరవల్లి శ్రీనివాస్, వీరమల్లు సూరిబాబు, కంచర్ల కోటయ్య, జంపన సుధాకర్, యేమినీడి లక్ష్మీ శైలజ పాల్గొన్నారు. తొలుత గీత కులాల ప్రతినిధులు భారీ ప్రదర్శన నిర్వహించారు.

దివ్యాంగులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి

మాట్లాడుతున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: దివ్యాంగులకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందని శాప్ ఛైర్మన్ రవి నాయుడు పేర్కొన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గుంటూరు బీఆర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను రవి నాయుడుతో పాటు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, శాప్ ఎండీ భరణి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. రవి నాయుడు మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు. బీఆర్ స్టేడియం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల నిర్వహణను గాలికి వదిలేయడంతో శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టేడియాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. శాప్ ఎండీ భరణి మాట్లాడారు. స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి అఫ్రోజ్‌ఖాన్, కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, మీరావలి, తెదేపా నాయకులు మన్నెం శివనాగమల్లేశ్వరరావు, మన్నవ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	39,823
అమ్మకాలు:	37,392
నిల్వలు:	9,063

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	10,000-17,300
నంబర్ 5	11,000-15,000
341	10,500-17,000
సూపర్ 10	11,500-16,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-15,200
బాడిగ	10,500-17,400
దేవనూరు డీలక్స్	11,000-16,700
ఆర్మూర్	10,500-13,300

ఏసీ కామన్ వెరైటీ

334	11,000-17,400
నంబర్ 5	10,500-15,800
341	12,000-17,000
4884	12,000-14,000

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,500-15,000
బాడిగ	11,000-17,500
దేవనూరు డీలక్స్	10,500-16,300
తాలు	5,200-8,000

– న్యూస్‌టుడే, మిర్చియార్డు

తుపాను ప్రభావంతో తేలికపాటి జల్లులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో దిత్వా తుపాను ప్రభావంతో ఆది, సోమవారాల్లో పలు మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు కొల్లిపర మండలంలో 2 మి.మీ వర్షం కురిసింది. దుగ్గిరాల 1.2, కాకుమాను 1.2, మంగళగిరి 1.2, పెదకాకాని 1, పొన్నూరు 0.6, పెదనందిపాడు 0.4, గుంటూరు పశ్చిమ 0.2, మేడికొండూరు 0.2, తాడేపల్లి 0.2, తుళ్లూరు 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

91.9FM Vijayawada ఈఎఫ్‌ఎం కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

యువతిపై అత్యాచారం.. కేసు నమోదు

చేబ్రోలు, న్యూస్‌టుడే: యువతిని నమ్మించి అత్యాచారం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. చేబ్రోలు ఎస్సై వీరనారాయణ కథనం మేరకు.. తెనాలి ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని మండలంలోని ఓ విద్యాలయంలో చదువుతూ వసతిగృహంలో ఉంటుంది. అదే కళాశాలలో చదువుతున్న కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన నందు అనే యువకుడు తోటి విద్యార్థుల ద్వారా ఆమెకు పరిచయం అయ్యాడు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పలుమార్లు హోటల్లో వీరిద్దరు కలిశారు. ఇటీవల నందు ఆ యువతికి మాయమాటలు చెప్పి నారాకోడూరు, గుంటూరులోని లాడ్జీలకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. తర్వాతా నగ్నంగా ఉన్న వీడియోలు, ఫొటోలు తీసి కొద్ది రోజులుగా నగదు కోసం వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సోమవారం పొన్నూరు గ్రామీణ సీఐ కృష్ణయ్య తన సిబ్బందితో నారాకోడూరులో అత్యాచారం జరిగిన లాడ్జీని తనిఖీ చేసి సీసీ కెమెరాలు పరిశీలించి పలు వివరాలు సేకరించారు.

ఎస్ఆర్ఎంలో ఐఐసీ ప్రాంతీయ సమ్మేళనం నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మంగళవారం ప్రతిష్ఠాత్మకమైన ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ)-2025 ప్రాంతీయ సమ్మేళనం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలోని ఉన్నత విద్యాశాఖ మాజీ కార్యదర్శి డా. ఆర్.సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ గ్రూప్ సీఈఓ పి.ధాత్రి రెడ్డి, ముఖ్యకార్యదర్శి జి.కృష్ణన్‌లు విశిష్ట అతిథులుగా పాల్గొంటారు. విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆవిష్కరణలు, నూతన పరిశ్రమల వ్యవస్థాపక సంస్కృతిని పెంపొందించేందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను సమ్మేళనంలో సమీక్షించనున్నారు. ఈ కార్యక్రమానికి 150 మంది ఆవిష్కర్తలు, అంకుర సంస్థల ప్రతినిధులు రానున్నట్లు వర్సిటీ ప్రతినిధులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

జప్తు చేసిన ఆభరణాలు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీలు

గుంటూరు నేరవార్తలు: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను గుంటూరు నేరవిభాగ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ వివరాలు వెల్లడించారు. గుంటూరులోని గోరంట్లకు చెందిన చిల్లర సురేష్ జల్సాలకు అలవాటుపడి కొన్నేళ్లుగా దొంగతనాలు చేస్తున్నాడు. ఇతనిపై పట్టాభిపురం, అరండల్‌పేట, కొత్తపేట, లాలాపేట, పాతగుంటూరు, నల్లపాడు సహా రెండు తెలుగురాష్ట్రాల్లో 78కుపైగా చోరీ కేసులున్నాయి. గుంటూరు జిల్లాలోని మొదటి పదిమంది దొంగల జాబితాలో ఇతని పేరుంది. ఇతనికి గంజాయి కేసులో అరెస్టై జైలులో ఉన్న విజయవాడలోని రామలింగేశ్వర్‌నగర్‌కు చెందిన కాజా నాగవీర భాస్కరరావుతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ జైలు నుంచి వచ్చాక దొంగతనాలు చేశారు. చోరీ సొత్తును గుంటూరులోని శివనాగరాజుకాలనీకి చెందిన లంకా రాజేష్ ద్వారా విక్రయించి.. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. నవంబరు 8న సంపత్‌నగర్‌లోని వెంకటఅప్పయ్య శాస్త్రి కుటుంబం తిరుపతి వెళ్లగా.. ఆయన ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 152 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఎస్పీ ఆదేశాలతో సీసీఎస్ డీఎస్పీ మధుసూదనరావు, సీఐలు కిశోర్, శివప్రసాద్ కేసు దర్యాప్తు చేశారు. నిందితులు లాలాపేటలో ఉన్నట్టు గుర్తించి సీఐలతోపాటు ఎస్సైలు రాములు, ఏఎస్సై రామకృష్ణ, సిబ్బంది పీటర్‌రాజు, కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు, శివప్రసాద్ చాకచక్యంగా అరెస్టు చేశారు. రూ.26.50 లక్షల విలువైన 227 గ్రాముల బంగారు ఆభరణాలు, 182 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 118, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -113 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, 135, 146 చికెన్ విత్ స్కిన్ - 236 చికెన్ స్కిన్‌లెస్ - 246.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

తెనాలి

• తెనాలి • పొన్నూరు

విద్యార్థుల మనోవికాసానికి భగవద్గీత

ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన అతిథులు, నిర్వాహకులు, ఉపాధ్యాయులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థుల మనోవికాసానికి భగవద్గీత తోడ్పడుతుందని.. ప్రగతికి, వ్యక్తిత్వ వికాసానికి, భయాందోళనలు నిరాశను దూరం చేసే శక్తి శ్లోకాలకు ఉందని.. రోజూ కొన్నింటిని చదివి పాటిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని స్వామి భాష్యానంద సరస్వతి తెలిపారు. గీతా జయంతి సందర్భంగా తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద కేంద్రీయ విద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'విద్యార్థుల మనోవికాసానికి భగవద్గీత' సంచికను విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ దావా మురళీకృష్ణ ఆవిష్కరించగా పెద్దసంఖ్యలో హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉచితంగా అందించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ రావిపాటి వీరనారాయణ, సీతావెంకట్రామ్ పర్యవేక్షించారు. శ్రీలక్ష్మీ కూచిపూడి నృత్య కళా కేంద్రం విద్యార్థినులు ప్రదర్శించిన 'శ్రీకృష్ణలీలలు' నృత్య రూపకం ఆకట్టుకుంది.

భోగి మణిహార శతక గ్రంథావిష్కరణ

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు భావనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి భోగి మణిహార శతక గ్రంథావిష్కరణ సంస్కృత కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు వేదాల సీతారామాచార్యులు, బ్రాహ్మణ మహాసభ పూర్వ అధ్యక్షుడు ప్రసాద్, ఆగమశాస్త్ర నిపుణులు నాగలింగం హరినారాయణ్, పుస్తక రచయిత నాదెళ్ల భార్గవ్ రామచంద్రన్ ఆవిష్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణంలోని రోడ్డు విభాజకంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ గాలికి సగం ఊడిపోయి వాహనాలపై రాకపోకలు సాగించే వారి మీదకు వస్తున్నాయి. - **పవన్, ఖాదర్ - తెనాలి**

✔ వాటిని వెంటనే తొలగింపజేస్తాం.

? తెనాలి బాలాజీరావుపేట రామమందిరం రోడ్డులోని కాలువల్లో మురుగు పారడం లేదు. దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - **రామారావు, బాలాజీరావుపేట**

✔ పూడికలు, అడ్డంకులు తొలగింపజేస్తాం.- **రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్**

◆ తెనాలి పట్టణ జయప్రకాశ్‌నగర్‌లో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు స్పందించి పరిష్కరించారు.

◆ తెనాలి చెంచుపేటలోని రైతుబజార్‌లో బోర్డు మీద ధరల కంటే అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. దుకాణాల నిర్వాహకులతో మాట్లాడి.. నిర్ణయించిన ధరలకే విక్రయించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేశారు. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

? పొన్నూరు పట్టణంలోని 18వ వార్డు శివారులో వీధి దీపం వెలగడం లేదు. మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. - **పి. రంగనాథ్, 18వ వార్డు**

✔ వీధి దీపాన్ని బాగు చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. - **షేక్ హసీనా, సహాయ ఇంజినీరు**

? పొన్నూరు పరిధిలోని పాత పొన్నూరులో రెండు రోజులుగా చెత్తను తొలగించడం లేదు. - **కె.నారాయణరావు, పాత పొన్నూరు**

✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. - **పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**

◆ పట్టణ పరిధి బాలాజీనగర్‌లోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి.. కార్మికులతో వ్యర్థాలను తొలగింపజేశారు. - **న్యూస్‌టుడే, పొన్నూరు**

ఉత్సాహంగా త్రోబాల్ పోటీలు

కాకుమాను (ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: ప్రత్తిపాడులోని బీవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించి గుంటూరు డివిజన్ స్థాయి పోటీలకు జట్టును ఎంపిక చేశారు.

ఆక్రమణల తొలగింపు

తెనాలి టౌన్: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారీసుపేట, చెంచుపేట ప్రాంతాల్లో ఆక్రమణలను సీఐ సాంబశివరావు సోమవారం తొలగింపజేశారు.

◆ తెనాలి పట్టణ ప్రకాశంబజార్‌లో రెండో పట్టణ సీఐ రాములునాయక్ సోమవారం రాత్రి పర్యటించారు. రాకపోకలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని సంబంధితులకు స్పష్టంచేశారు.

సమస్యల మధ్య.. ఐటీఐ విద్యా..!

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

జిల్లాలోనే అతి పెద్దదైన తెనాలి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) సంవత్సరాలుగా పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పాలకులు, అధికారులు దృష్టిపెడితే మరింత మంది యువతకు ఉపాధి కల్పనకు మార్గం సుగమం అవుతుంది. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు కొత్త కోర్సులు ప్రవేశ పెడితే స్థానికంగానే శిక్షణ అవకాశాలు అందివస్తాయి.

ఏటా 464 మంది విద్యార్థులకు శిక్షణ..

తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం కేంద్రంగా ప్రభుత్వ ఐటీఐ 1963లో ఏర్పడింది. మొత్తం 19.75 ఎకరాలకు గాను 10 సంవత్సరాల కిందట కేంద్రీయ విద్యాలయానికి 4.75 ఎకరాలు కేటాయించడంతో 15 ఎకరాల్లో కొనసాగుతుంది. 10 యూనిట్ల ద్వారా ఏటా 464 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఆటో క్యాడ్, కంప్యూటర్ ఆధారిత కోర్సులతో పాటు టర్నింగ్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్, మోటారు మెకానిక్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

సిబ్బంది కొరత...

ఐటీఐలో సిబ్బంది కొరత ప్రధాన సమస్యగా మారింది. మొత్తం 27 మంది శిక్షకులు కావాల్సి ఉండగా 13 మందే ఉన్నారు. 14 మంది నియామకం జరగాల్సి ఉంది. నైట్ వాచ్‌మెన్లు ఇద్దరు, స్వీపర్లు ఇద్దరు లేరు.

★ మౌలిక సదుపాయాల పరంగా అంతర్గత రోడ్లు, మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. ప్రధానంగా చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. సాయంత్రం అయితే చాలు మందుబాబులు చేరుతున్నారు. ఒక వైపు నుంచి రెండో వైపు ఉన్న రోడ్డు మీదకు వచ్చేందుకు కొందరు ఐటీఐను మార్గంగా వాడుతున్నారు. అలాగే పశువులు, పందులు వచ్చేస్తుండడంతో.. కొంత మేర ఇనుప తీగలతో అడ్డంకి ఏర్పాటు చేశారు. అయినా దానిని వంచేసి లోపలికి చేరుతున్నారు.

ప్రహరీ లేకుండా..

ఇనుప తీగల మెష్ వేశారిలా..

త్వరలోనే పరిష్కారం : ఐటీఐ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వెనుక వైపు ప్రహరీ నిర్మాణానికి అంచనాలు రూపొందించాం. త్వరలోనే సమస్యలు పరిష్కారం అవుతాయి. - **రావి చిన్నవెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్**

సామూహిక పారాయణం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: చిన్మయ మిషన్ 75 వసంతాలు, గీతా జయంతి, తపోవన్ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్మలా నంద మాతాజీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. విశ్వశాంతి కోసం 701 మంది భక్తులు దీపారాధనలు చేశారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)



అత్యధికం: 1400
అత్యల్పం: 1000
సగటు: 1200

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

'అనేక ఇబ్బందులున్నా పింఛన్లు ఇస్తున్నాం'

పింఛను నగదు లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల నగదు పెంచి లబ్ధిదారులకు అందిస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం తెనాలి చెంచుపేట, సుందరయ్యనగర్లలోని పింఛనుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదు అందజేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో అనేక ఇబ్బందులున్నా.. పింఛన్ల సొమ్ము క్రమం తప్పకుండా అర్హులకు అందజేస్తున్నట్లు చెప్పారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని నిడుబ్రోలు, విద్యానగర్, శాంతినగర్, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన అంబేడ్కర్‌నగర్ పార్కును పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో సచివాలయ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. పార్కులో పిచ్చి మొక్కలను వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ రమేషుబాబు

హరిప్రసాదరావు సేవలు ఎనలేనివి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రముఖ కంటి వైద్య నిపుణులు దివంగత డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించారని ఐఎంఏ తెనాలిశాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ గవిని రవిశంకరరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. వీరు సోమవారం ఐఎంఏ తెనాలిశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఆయన జయంతి సభలో పాల్గొని మాట్లాడారు. అనంతరం హరిప్రసాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయం అందిస్తున్న వనరులను వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ ఆకాంక్షించారు. సోమవారం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. శిక్షణ తరగతులు.. ఇతర సహాయాన్ని అందించడంలో విశ్వవిద్యాలయం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ఉన్నత స్థానాలకు ఎదిగిన మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, టెస్లా అధినేత ఎలన్ మస్క్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రెక్టార్ ఆచార్య శివరామ్ ప్రసాద్, ప్రిన్సిపల్ ఆచార్య లింగరాజు, కిశోర్‌బాబు, గోపీ, హరికిరణ్, సాయికిరణ్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్

ఆన్‌లైన్ మూల్యాంకన పరిశీలన

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్-2026' పేరుతో నిర్వహించిన వ్యాసరచన పోటీల రెండో దశ మూల్యాంకనాన్ని సోమవారం ఏఎన్‌యూలో నిర్వహించారు. యువత అభివృద్ధి, ప్రజాస్వామ్యం, మహిళా నేతృత్వం, స్టార్ట్ అప్ భారత్, ఫిట్ భారత్, సుస్థిర వ్యవసాయం, గ్రీన్ వికసిత్ భారత్, ఆవిష్కరణలు-సంప్రదాయాలు, భవిష్యత్ వర్క్ ఫోర్స్‌పై విద్యార్థులకు గత నెలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 3,659 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. వీళ్లు పంపించిన వ్యాస రచనను వివిధ విశ్వవిద్యాలయాల నుంచి 40 మంది అధ్యాపకులు మూల్యాంకనం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని సోమవారం పరిశీలించారు.

7న పురస్కారాల ప్రదానం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ తెనాలి, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సంయుక్తంగా ఈ నెల 6, 7 తేదీల్లో తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ చందు సాంబశివరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడో తేదీ సాయంత్రం సాహితీవేత్త బొల్లిముంత శివరామకృష్ణ పేరున సినీనటుడు కె.బ్రహ్మానందానికి జాతీయ స్థాయి జీవనసాఫల్య, రంగస్థల నటులు గుమ్మడి గోపాలకృష్ణకు విశిష్ట రంగస్థల, ప్రజా సాహితీ పత్రిక సంపాదకులు కొత్తపల్లి రవిబాబుకు విశిష్ట సాహితీ పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. ఆరో తేదీన తెలుగు భాష సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్, ఏఎన్‌యూ ఆచార్యులు నారిశెట్టి వెంకటకృష్ణారావు, శాస్త్రవేత్త చందు సాంబశివరావు ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం మొవ్వా విజయలక్ష్మి స్మారక సమితి వ్యవస్థాపకుడు సత్యనారాయణ, మైత్రి ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్, వైష్ణవి కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు, వి.కె.ఫౌండేషన్ కార్యదర్శి తుమ్మల కిశోర్‌బాబు, ఫౌండేషన్ అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, మాజీ సర్పంచి చందు నాగేశ్వరరావు, ప్రియదర్శిని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, దర్శకుడు కనపర్తి రత్నాకర్, తన్నీరు శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమ కరపత్రం ఆవిష్కరించారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న సాంబశివరావు, కృష్ణ సందీప్, శ్రీనివాసరావు

గ్రంథాలయానికి టీవీ.. కంప్యూటర్ల అందజేత

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కర్ణాటకలోని శిక్షణ ఫౌండేషన్, డెల్ కంపెనీ వారు సంయుక్తంగా తెనాలి శాఖ గ్రంథాలయానికి స్మార్ట్ టీవీ.. రెండు కంప్యూటర్లు, మొబైల్ ఉచితంగా అందించినట్లు ఆలపాటి కళాపీఠం అధ్యక్షుడు అయినాల మల్లేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో మాట్లాడారు. ఈ విధంగా రాష్ట్రంలోని ఆరు ఉమ్మడి జిల్లాల్లోని గ్రంథాలయాలకు అందించినట్లు ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ బుజ్జిబాబు చెప్పారు. గ్రంథాలయం తరపున కె. పూర్ణచంద్రరావు, లావణ్య సుధ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

కొల్లిపర, న్యూస్‌టుడే: తుపాను ప్రకటన నేపథ్యంలో కూటమి నేతలు ధాన్యం కొనుగోళ్లలో రైతన్నలకు మరింత చేరువవుతున్నారు. ఆది, సోమవారాల్లో మండల పరిధిలో 31 లారీల ధాన్యం ఎగుమతులు చేపట్టారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెనాలి నియోజకవర్గంలో చేపట్టిన పర్యటనలే ఇందుకు కారణమని చెప్పొచ్చు. మంత్రి మనోహర్ తీరుపట్ల చివలూరులోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

✦ ధాన్యం ఎగుమతుల్లో సాంకేతిక సమస్యలను తొలగిస్తున్నారు. జీపీఎస్ నిబంధనను సడలించారు. రైతులు తమకు నచ్చిన మిల్లులో ధాన్యం విక్రయించుకునే వెసులుబాటు కల్పించారు. మిల్లర్లు, రైతులను సమన్వయం చేస్తూ తేమశాతం, తరుగు సమస్యలను అధిగమిస్తున్నారు.

కాకినాడకు ఎగుమతులు..

ధాన్యం ఎగుమతులకు ప్రణాళిక సిద్ధమైందని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. సోమవారం సమావేశం అనంతరం మిల్లర్లు క్షేత్రస్థాయిలో ధాన్యం నమూనాలను పరిశీలించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ సూచనల మేరకు పెద్దాపురం, కాకినాడ తదితర ప్రాంతాలకు ధాన్యం ఎగుమతులకు మార్గం సుగమం కానుందని తెలిపారు. తెనాలి నుంచి కాకినాడకు రోడ్డు రైలు మార్గాల్లో ఎగుమతి కానున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారులు పేర్కొన్నారు. దళారులను నమ్మి ధాన్యం తక్కువ ధరకు విక్రయించొద్దని.. ప్రభుత్వం నూరుశాతం ధాన్యం కొనుగోలు చేస్తుందని భరోసానిచ్చారు.

పొన్నూరు, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో పొన్నూరులో సోమవారం వర్షం కురవడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. ఇప్పటికే కోసిన ధాన్యంపై పట్టాలను కప్పారు. రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కొత్త ఆలోచన.. కోతుల బెడద తగ్గించేలా

చేబ్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలు పంచాయతీలోని పాతరెడ్డిపాలెం, నరాలశెట్టిపాలెం, కొత్తరెడ్డిపాలెం గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా వచ్చి కూరగాయ, పండ్ల తోటలను నాశనం చేస్తున్నాయి. ఒంటరిగా వస్తున్న వారిపై దాడిచేసి గాయపరిచిన సంఘటనలు అనేకం ఉన్నాయి. సమస్యను పరిష్కరించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా తిరిగి వస్తుండడంతో.. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఓ వ్యక్తికి చింపాంజీ వేషం వేయించి కోతులు తిరిగే ప్రదేశంలో తిప్పుతున్నారు. చింపాంజీ వేషధారణలో ఉన్న వ్యక్తిని చూసి కోతులు పరారవుతున్నాయి. ఇదే విధంగా గ్రామంలో కోతుల బెడద తగ్గే వరకు ప్రయత్నిస్తామని వెల్లడించారు.

పంచాయతీ కార్యదర్శితో చింపాంజీ వేషధారి

నూతన స్తంభం ఏర్పాటు

స్పందనకు వందనం

గత నెల 17, 23 తేదీల్లో 'కొత్త రేకు బిగించరూ' తీగల ఆధారంగా.. నిత్యం భయంగా' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనాలకు మున్సిపల్, విద్యుత్తు అధికారులు స్పందించారు. ఇటీవల మార్చు చేసిన మున్సిపల్ కార్యాలయం పైకప్పున బిగించిన రేకుకు పడిన రంధ్రంపై మరో రేకు బిగించారు. దీంతో కార్యాలయం సెల్లార్లో పడుతున్న వర్షపు నీటితో ఎదుర్కొంటున్న ఇక్కట్లు తీరాయని కూరగాయల వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే విద్యుత్తు అధికారులు గొలిడొంక లేఔట్లో విరిగిన స్తంభం తొలగించి కొత్తది వేశారు.

- **న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**

సమస్యల పరిష్కారానికి చర్యలు

పొన్నూరు, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు దారులు నేరుగా వచ్చి అర్జీ ఇవ్వాలని తహసీల్దారు మహమ్మద్ జియావుల్‌హక్ పేర్కొన్నారు. సోమవారం పొన్నూరు తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని 6 అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులు ఆయా శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం తీసుకుంటున్న తహసీల్దార్

5లోగా వక్ఫ్ ఆస్తులను నమోదు చేయండి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 5వ తేదీ లోగా వక్ఫ్ ఆస్తులను ఉమ్మీద్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్ బేగ్ సోమవారం తెలిపారు. ముతవల్లీలు, ఆస్తుల సంరక్షకుల వివరాలు పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్రం ఆధ్వర్యంలో జనవరి 7, 8 తేదీల్లో నిర్వహించే జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ సోమవారం ఆవిష్కరించారు. ఆచార్య నాగార్జున ఆల్కెమికల్ వారసత్వం-సాంప్రదాయక, ఆధునిక దృక్పథం పేరుతో సదస్సు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఆచార్య రామచంద్రన్ చెప్పారు. ఇన్‌ఛార్జి వీసీ గంగాధర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఈ సదస్సు ఉపయోగపడుతోందని.. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రపంచ శాస్త్రీయ వేదికపై భారతీయ జ్ఞాన వ్యవస్థకు ఉన్న ప్రాముఖ్యతను ఈ సదస్సు తెలియజేస్తోందన్నారు. రెక్టార్ ఆచార్య శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రతినిధి ఆచార్య రోశయ్య, పీజీ పరీక్షల విభాగం సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు, ఆచార్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన అవసరం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: సిరి మహిళా సాధికారత వెల్ఫేర్ సొసైటీ, తెనాలి జిల్లా ఆసుపత్రి సంయుక్తంగా సోమవారం తెనాలి జిల్లా ఆసుపత్రిలో వరల్డ్ ఎయిడ్స్ డే నిర్వహించారు. ఎయిడ్స్ నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని పలువురు వైద్యులు పేర్కొన్నారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. సూపరింటెండెంట్ టి.సౌభాగ్యవాణి, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ప్రదర్శనలో సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఎయిడ్స్ అవగాహన దినోత్సవం సందర్భంగా సోమవారం తెనాలి జేయంజే మహిళా కళాశాల విద్యార్థినులు.. అధ్యాపకులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. లోగో ఆకారంలో ఒదిగారు. ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్లిన్, వనజ, నిర్మలజ్యోతి, ఎస్తేరు తదితరులు పర్యవేక్షించారు. ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలను కరస్పాండెంట్ అన్నాబత్తుని సత్యనారాయణ చౌదరి పర్యవేక్షించారు.

రెడ్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థినులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

పొన్నూరు, న్యూస్‌టుడే: గత నెల 27, 28, 29 తేదీల్లో నంద్యాల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో బ్రాహ్మణకోడూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.సంజన విశేష ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పీవీ.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. దిల్లీలో జనవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పీడీ తన్నీరు శివరామయ్య, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

సంజనతో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పీడీ శివరామయ్య

రోడ్లు.. కాలువలు నిర్మించాలని వినతి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని సర్వే నంబరు 268/1లోని భూముల యజమానుల వివరాలు తెలియజేయాలని, నాజర్‌పేటలోని 9వ వార్డులో మురుగునీరు పారుదలకు కాలువ నిర్మించాలని, చెంచుపేట ఇందిరా యానాది కాలనీలో 40 అడుగుల రోడ్డు వేయాలని అర్జీదారులు కమిషనర్ రామ అప్పలనాయుడును కోరారు. ఆయన సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. మున్సిపల్ ఎంఈ పి.శ్రీకాంత్, ఆర్వో రామ్ ప్రసాద్, ఏసీపీ వాణి పాల్గొన్నారు.

130 మందితో శతాధిక గళ సంపూర్ణ భగవద్గీత పారాయణం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి వాసులు కంకణాల ప్రభాకర్, వరలక్ష్మి దంపతులు గీతా జయంతి సందర్భంగా సోమవారం కొత్తపేటలోని వారి స్వగృహంలో 130 మంది సభ్యులతో శతాధిక గళ సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ నేపథ్యంలో రోజూ రెండు శ్లోకాల అధ్యయనాన్ని ఏడాది పాటు గీతా సత్సంగంగా నిర్వహించుకోనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, ఒడిశా నుంచి సత్సంగ సభ్యులు రావడం విశేషం. దీనిని తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో నమోదు చేస్తున్నామని టి.బి.ఆర్ జ్యూరీ, చీఫ్ కోఆర్డినేటర్ టి.వి.అశోక్ కుమార్ ప్రకటించారు. ధ్రువపత్రం, జ్ఞాపికను ఆ దంపతులకు అందించారు.

గేట్‌మెన్‌పై దాడి.. యువకుల అరెస్ట్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రైలు రాక నేపథ్యంలో తెనాలి పట్టణ పినపాడు రైల్వేగేటు ఆదివారం సాయంత్రం మూసి వేయగా.. వెంటనే తెరవాలని మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు గేట్‌మెన్‌పై దాడి చేశారు. వారు నిజాంపట్నానికి చెందిన యువకులుగా గుర్తించిన రైల్వే పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు.

'స్పా'లో అసాంఘిక కార్యకలాపాలు

తెనాలి టౌన్: తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ స్పా కేంద్రంలో పోలీసులు సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేసి.. అక్కడ వ్యభిచారం జరుగుతుందని గుర్తించారు. మేనేజర్, విటుడు, మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

అర్జీల స్వీకరణ

తెనాలి టౌన్: తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారాల వేదికలో ఏవో శ్రీధర్‌బాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రోడ్డు నిర్మాణం, కాలుష్యం తదితర అంశాలపై నాలుగు అర్జీలు అందాయని చెప్పారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ తెనాలి 2nd అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP. 207/2024 in OS 132/2023

Bet:
Vecha Ramamohana rao ...DHR.
S/o. Subba Rao, Nazerpet, Tenali
and
Sistla Venkata Murali Krishna ...JDR.
S/o. Suryanarayana, Nazerpet, Tenali

పై నెంబరు EP లో ఈ దిగువ షెడ్యూలు దాఖలా జె.డి.ఆర్. యొక్క స్థిరాస్తిని పై కోర్టు వారిచే ది.17-12-2025వ తేది ఉదయం గం.10.30 ని॥ల లగాయతు వేలం వేయబడును. కావలసినవారు వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.
షెడ్యూలు: గుంటూరు జిల్లా, తెనాలి సబ్ రిజిష్ట్రారు వారి యిలాకా, తెనాలి మున్సిపల్‌లో చేరిన తెనాలి పట్టణ, నాజరుపేట, అనుగోలు వారివీధి, 8వ వార్డు, 10వ బ్లాకు, టి.యస్. నెం.509/3 రు, చ.గ.336లు మింజుమలె, అసెస్మెంటు నెం.8799 రు, ఉత్తరపు వైపు చ.గ.219, డోర్ నెం.1-37-68రు గల ఆస్తికి హద్దులు. **తూర్పు:** చదలవాక రవీంద్రనాథ్ గారికి ఆస్తి హద్దు అ॥ 47-00లు, **దక్షిణం:** ఈరోజున మీరు మా వగైరాల వలన విక్రయం పొందిన ఆస్తి హద్దు అ॥ 42-00, **పడమర:** మున్సిపల్ రోడ్డు (విష్ణుబొట్లవారివీధి) హద్దు అ॥ 47-00లు, **ఉత్తరము:** అనుగోలువారివీధి అను మున్సిపల్ బజారు హద్దు అ॥ 42-00లు.
ఈ హద్దుల మధ్య చ.గ.219లు లేక 183-08 చ్లు స్థలము, ఇందలి చ.అ. 810లులో కట్టబడిన ఆర్.సి.సి. డాబా 72 చదరపు అడుగులలో ఏ.సి.సి రేకులు, లెట్రిన్, బాత్‌రూమ్, యస్.సి.సి. నెం.3256 రు గల కరెంటు మీటరు, మీటరు డిపాజిట్లు యింటికి సంబంధించిన యావత్తు సామానులు, మాకు గల యావత్తు రాకపోకల హక్కులతో సహా.
DHR Value Rs: 1,00,00,000/- Amina Value Rs. 1,50,00,000/-
Sale Dated: 17-12-2025, Further Hearing: 24-12-2025
Note: (1) E.C. దాఖలా JDr శిష్ట్లా వెంకట మురళీకృష్ణ గారు లంకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి వగైరాలకు ది.28-1-2022న రిజిష్టరు తనఖా చేసియున్నారు.
(2) EC దాఖలా JDr శిష్ట్లా వెంకట మురళీకృష్ణ గారు జొన్నల బసవమ్మ వగైరాలకు ది.19-2-2019న రిజిస్టరు తనఖా చేసియున్నారు. సదరు తనఖాలకు లోబడి వేలం పాట జరుగవలయును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
P.Nagendram, DHR తరపు అడ్వకేటు
తెనాలి, సెల్ నెం.90305 61113

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బోస్ రోడ్డు బ్రాంచ్-20349, తెనాలి, గుంటూరు జిల్లా-522201, ఆంధ్రప్రదేశ్

అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన
SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8(6) ప్రకారం జారీ చేయడమైనది.

టు:
ఋణగ్రహీత : శ్రీమతి మేకల లక్ష్మి కరుణ కుమారి, భర్త : అద్దేపల్లి శ్యామ్‌దాస్ బిల్లి గ్రహం, డి నెం.15-8/2, కోనేటిపురం గ్రామం, కొలకలూరు పోస్ట్, తెనాలి మండలం, గుంటూరు జిల్లా-522307. HTL A/c : **62272055742; 41136523078 & 40613213948**
డియర్ సార్ / మేడమ్
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) లోని సెక్షన్ 13(2) దీనితో చదువుకోవలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు భారతీయ స్టేట్ బ్యాంక్, బోస్ రోడ్డు బ్రాంచ్, తెనాలి, గుంటూరు జిల్లా యొక్క అధీకృత అధికారి తేది.19.08.2025 న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా తేది.19.08.2025 నాటికి రూ.23,94,212/- (అక్షరాల ఇరవై మూడు లక్షల తొంభై నాలుగు వేల రెండు వందల పన్నెండు రూపాయలు మాత్రమే) కాంట్రాక్టువల్ రేటు ప్రకారం వడ్డీతో ఖర్చులు, ఛార్జీలు మొ॥నవి సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.
మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని తేది. 30.10.2025 న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును తేది.03.11.2025 న ఇంగ్లీష్ (ఇండియన్ ఎక్స్‌ప్రెస్) మరియు తెలుగు (ఈనాడు) దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.
తేది. 19.08.2025 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులు విక్రయించుటకు "అక్కడ ఉన్నది ఉన్నట్లే" మరియు "ఏది ఉన్నదో అదే" ప్రాతిపదికన బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం వద్ద నుండి ఆహ్వానించబడును.

స్థిరాస్తి వివరములు
గుంటూరు జిల్లా, దుగ్గిరాల సబ్ డివిజన్, కొలకలూరు గ్రామ పంచాయితీ ఏరియా, కొలకలూరు గ్రామం, డి నెం.868 ఉమ్మడి సడప పద్ద ఉత్తరం వైపున డోర్ నెం.15-8/2, ఆంజనేయ స్వామి గుడి దగ్గర విస్తీర్ణం 461 ½ చ॥గ॥లు (427 ½ చ॥గ॥లు + 34 చ॥గ॥లు)లోని 2 ఐటమ్స్ మరియు నిర్మించబడిన ఆర్‌సిసి రూఫ్ భవనం రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.429/2013, తేది.26.02.2013 ప్రకారం శ్రీమతి మేకల లక్ష్మీ కరుణ కుమారి, భర్త : అద్దేపల్లి శ్యామ్‌దాస్ బిల్లి గ్రహం గారికి చెందినది. ఐటమ్ నెం.1 విస్తీర్ణం – 421½ చ॥గ॥లు హద్దులు : తూర్పు : కోనేటి పురం శ్రీ ఆంజనేయ స్వామి గుడి యొక్క ఆస్తి – 79 లింకులు, దక్షిణం : ఓలేటి సౌభాగ్యమ్మ గారి ఆస్తి – 113 లింకులు, పడమర : ఆర్‌హెచ్ స్కూల్ యొక్క ఆస్తి – 79 లింకులు, ఉత్తరం : పసుపులేటి రాజేష్ గారి ఆస్తి కొంతవరకు & ఐటమ్–2 యొక్క ఆస్తి కొంతవరకు – 110.50 లింకులు. ఐటమ్ నెం.2 విస్తీర్ణం – 34 చ॥గ॥లు హద్దులు : తూర్పు : 14 అ॥ల వెడల్పు గల ఉమ్మడి సడప, కోనేటిపురం శ్రీ ఆంజనేయ స్వామి గుడి యొక్క ఆస్తి, దక్షిణం : ఐటమ్ నెం.1 ఆస్తి, పడమర : పసుపులేటి రాజేష్ గారి ఆస్తి, ఉత్తరం : బద్దుల మహేశ్వర రావు గారి ఆస్తి.
పైన పేర్కొన్న 2 ఐటమ్స్ క్రింద ఆస్తి ఒకదానికొకటి ప్రక్కనే కలదు, మొత్తం 461 ½ చ॥గ॥ల స్థలం మరియు RCC రూఫ్ రెసిడెన్షియల్ భవనంతో గల ఒకే ప్లాట్ కలదు.

తేది : 28.11.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : తెనాలి భారతీయ స్టేట్ బ్యాంక్

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

దోమల నివారణకు చర్యలు

అబ్బరాజుపాలెంలో ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

ఈనాడు కథనానికి స్పందన

తుళ్లూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం సరిగా లేక దోమలు వృద్ధి చెంది స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారని ‘జ్వరాల పడగ.. జనాల పడక’ శీర్షికన ఈ నెల 1న ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. దీనిపై బోరుపాలెం, అబ్బరాజుపాలెం పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం అబ్బరాజుపాలెం గ్రామ కార్యదర్శి కె.శివ సత్యనారాయణ నూతన ఫాగింగ్ యంత్రాన్ని కొనుగోలు చేసి ఫాగింగ్ చేయించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాయపూడిలో సైడు కాలువల్లో మురుగు నీరు నిలుస్తుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా కార్యక్రమం ద్వారా సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు పారిశుద్ధ్య కార్మికులతో గ్రామంలోని సైడు కాలువలను శుభ్రం చేయించి దోమల మందు చల్లించారు. ● అనంతవరంలో రహదారుల వెంట పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉంటుందని గ్రామస్థులు ‘మేమున్నాం మీకు తోడుగా’ కార్యక్రమం ద్వారా సమస్యను పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ పారిశుద్ధ్య కార్మికులతో గ్రామంలో కలుపు నివారణ మందు చల్లించి శుభ్రం చేయించారు.

బీసీ వసతి గృహాల్లో ఖాళీలను భర్తీ చేయండి

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా బీసీ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న 384 గ్రేడ్ -2 వసతి గృహ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు మంగళగిరిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.

సరైన జీవన శైలి, ఆహారంతో వ్యాధులు దూరం

‘ఈనాడు-ఈటీవీ’ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు

ఈనాడు మీతోడు

విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యుడు శ్రీనివాసరావు, చిత్రంలో తుళ్లూరు సి.ఐ-2 ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: క్రమబద్ధమైన జీవన శైలి.. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతో వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని వైద్యులు, వక్తలు సూచించారు. తుళ్లూరులోని కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ‘ఈనాడు- ఈటీవీ’ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తుళ్లూరు సి.ఐ-2 మాతంగి శ్రీనివాసరావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. తుళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీనివాసరావు, సిబ్బంది సుమారు 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారో.. లేదో పరిశీలించి తగిన సూచనలు చేశారు. సీఐ-2 శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, నిత్యం వ్యాయామం చేయడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ★ వైద్యాధికారి డా.శ్రీనివాసరావు విద్యార్థులకు పరీక్షలు చేసి జలుబు, దగ్గు వంటి సమస్యలను గుర్తించి మందులు పంపిణీ చేశారు. నీటి కుంటలు, చెరువుల్లోకి దిగవద్దని, మరుగుదొడ్లకు వెళ్లి వచ్చినప్పుడు తప్పని సరిగా చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. హెల్త్ కార్డులు తీసుకోని ఎప్పటికప్పుడు ఆరోగ్య వివరాలు అందులో నమోదు చేయించుకోవాలని విద్యార్థులకు చెప్పారు. ఉపాధ్యాయులు, ఆషా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, తుళ్లూరు పీహెచ్‌సీ సిబ్బంది కరీం పాల్గొన్నారు.

జంక్ ఫుడ్ వద్దు.. పోషకాహారం ముద్దు..

వైద్య సేవలందిస్తున్న వైద్యురాలు శైలజ, సిబ్బంది

తాడికొండ: విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి.. పౌష్టికాహారం తీసుకోవాలని పొన్నెకల్లు పీహెచ్‌సీ వైద్యురాలు శైలజ పేర్కొన్నారు. దీని వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరి చదువుపై ఏకాగ్రత కుదురుతుందని వివరించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ‘ఈనాడు-ఈటీవీ’ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న 90 మంది చిన్నారులకు పలు వైద్య పరీక్షలు చేసి నులిపురుగులు, ఐరన్, జలుబు, దగ్గు తదితర సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయిని శాంతి, ఎంపీహెచ్‌ఈవో మురళి, వెంకటేశ్వరరావులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జగదీష్, ఏఎన్ఎం జమీలా, జీవికా రాణీ, ఆశాలు సునీత, దీనమ్మలు పాల్గొన్నారు.

నృసింహ స్వామికి ఆభరణాల బహూకరణ

దాత సమర్పించిన బంగారు పూత కిరీటం, కర్ణాభరణాలు

మంగళగిరి,న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీ నృసింహస్వామికి దాత వెనిగళ్ల ఉమాకాంతం, భాగ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు, బంధువులు ఆధ్వర్యాన రూ. 5 లక్షల విలువైన బంగారు పూతతో తయారు చేయించిన మూడు కిరీటాలు, ఆరు కర్ణాభరణాలను సోమవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి వార్లు, అమ్మవార్లకు సమర్పించారు. కల్యాణంలో ఉత్సవమూర్తులకు వీటిని అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంత పద్మనాభాచార్యులు, అర్చకులు నల్లూరి రఘు, స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ సునీల్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్మికుల భద్రతపై అవగాహన

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఎత్తైన ప్రదేశాల్లో పని చేసే కార్మికులు తీసుకోవాల్సి భద్రతాపరమైన చర్యలను సీఆర్డీఏ అధికారులు వివరించారు. సోమవారం నేలపాడు ఏపీ ఎన్జీఓ ఉద్యోగుల భవన సముదాయాల ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద కరమ్ సేఫ్టీ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. పరికరాల వినియోగం, ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించాల్సిన తీరును నిపుణులు వివరించారు. సీనియర్ ఓహెచ్ఎస్ స్పెషలిస్ట్ జి.గోపికృష్ణ, ప్రదీప్, సుధాకర్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించరూ..!

దుగ్గిరాల: దుగ్గిరాల నుంచి గుంటూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని వైకాపా మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని సోమవారం కోరారు. గతంలో సర్వీసునురోడ్లు బాగా లేవని తీసేశారన్నారు. దీంతో మంగళగిరి లేదా తెనాలి వెళ్లి అక్కడి నుంచి వెళ్లాల్సి వస్తోందన్నారు.

ఆసుపత్రికి వెళ్లి.. పింఛను అందజేసి..

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండలం సిరిపురానికి చెందిన తెదేపా కార్యకర్త షేక్ అబ్దుల్ బాషా(నన్నే) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు కొత్తగా మంజూరైన సామాజిక భద్రత పింఛను నగదు రూ.6 వేలును అధికారులు, స్థానిక నాయకులు కలిసి ఆసుపత్రి వెళ్లి అందించారు. కార్యక్రమంలో స్థానిక వెల్ఫేర్ అధికారి దివ్య, కడియాల గణేష్, కొప్పుల శరత్ తదితరులు పాల్గొన్నారు.

షేక్ అబ్దుల్ బాషాకు నగదు అందిస్తున్న నాయకులు, అధికారులు

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణ

కార్యక్రమంలో భక్తులు

మంగళగిరి, న్యూస్‌టుడే: పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య శిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఆలయ ప్రతినిధి పాతూరి సుధారాణి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మందిరం అధ్యక్షుడు పాతూరి శ్రీనివాసరావు, రాధిక దంపతులు పర్యవేక్షించారు.

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని సీతానగరం కొండపై ఉన్న విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో సోమవారం గీతా జయంతి మహోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. అర్జునుడికి కర్తవ్య బోధ చేస్తూ కృష్ణ పరమాత్మ అనుగ్రహించిన భగవద్గీతను సామూహికంగా పారాయణ చేశారు. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ముందంజ

తుళ్లూరు, తాడేపల్లి, ఫిరంగిపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వం దూసుకుపోతుందని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తెలిపారు. నియోజకవర్గంలో రూ. 19.45 కోట్ల మేర పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు. అర్హులందరికీ గృహాలు మంజూరు చేస్తామన్నారు. సోమవారం తుళ్లూరు మండలంలోని బోరుపాలెం, దొండపాడు గ్రామాల్లో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాల పనులను జనవరి నుంచి ప్రారంభిస్తామన్నారు. నాయకులు మైనేని గిరిజ, కట్టా నరసింహారావు, ధనేకుల వెంకట సుబ్బారావు, విజయ శేఖర్, కంతేటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ● తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో ఏపీ ఎడ్యుకేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ రాజశేఖర్ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, గ్రామ అధ్యక్షుడు ఈపూరి బాబు, గోరా బాలాజీ, కంచర్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దొండపాడులో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, అధికారులు

● ఫిరంగిపురం మండలం తాళ్ళూరు గ్రామంలో తెదేపా మండలాధ్యక్షుడు మండవ చిన్న నరసింహారావు, నాయకులు డేగల సీతారామయ్య, అల్లకుంట శివయ్య, సంపతి నాగేశ్వరరావు, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.

తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో ..

ఫిరంగిపురంలో తెదేపా నాయకులు

‘వైకాపా నాయకులు ఇకనైనా కళ్లు తెరవాలి’

పెదనందిపాడు, న్యూస్‌టుడే: ఇప్పటికైనా వైకాపా నాయకులు కళ్లు తెరిచి.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. అన్నవరంలో సోమవారం రూ. 52.54 లక్షల అంచనా విలువలతో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పాలపర్రులో జీడీసీఎంఎస్ గిడ్డంగిని ప్రారంభించారు. అనంతరం ఆయన వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి నుంచి తొమ్మిది మందికి రూ. 7.70 లక్షలు చెక్కులు, అన్నవరంలో తారకరామ కిసాన్ గ్రూప్‌నకు రాయితీ డ్రోన్‌ను అందజేశారు. పాలపర్రులో 32 కుటుంబాల వారు తెదేపాలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, జీడీసీఎంఎస్ ఛైర్మన్ హరిబాబు, యార్డు డైరెక్టర్ ఉపేంద్రరావు, తెదేపా నాయకులు వందనా దేవి, హనుమంతరావు, రఘురామారావు, ఈశ్వరమ్మ, సర్పంచి దానమ్మ, డీఈ బానుప్రకాష్, వ్యవసాయ శాఖ అధికారులు మోహనరావు, సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ హేనాప్రియ, ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బూర్ల, మాజీ మంత్రి పెదరత్తయ్య తదితరులు

ఉపాధ్యాయుడిగా మారిన ఎమ్మెల్యే

అన్నవరం (పెదనందిపాడు) న్యూస్‌టుడే: అన్నవరంలోని ప్రాథమిక పాఠశాలలను ఎమ్మెల్యే రామాంజనేయులు సోమవారం సందర్శించి విద్యార్థులు ఎలా చదువుతున్నారో తెలుసుకున్నారు. వారికి కొంతసేపు పాఠాలు చెప్పారు. గణితంలో వెనుకబడి ఉన్నారని శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం అదనపు తరగతి గదిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

న్యూస్‌టుడే బృందం: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఫిరంగిపురంలోని దీనపూర్ క్యాంపస్ ఫార్మసీ కాలేజీ విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్స్ సుదర్శన్, జీవన్ మణి బాబు, ఎస్.ఐ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు. ● మేరికపూడి గ్రామంలో నిర్వహించిన సదస్సులో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లింగరాజు మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతోనే ఎయిడ్స్ రహిత సమాజం సాధ్యం అని తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు. తాడేపల్లి మండలం కొలనుకొండలో గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ, ఛైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యాన, పెదనందిపాడు లో పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ పీడీ పి. శ్రీనివాస్, అధ్యాపకులు ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీలు జరిగాయి.

ఫిరంగిపురంలో విద్యార్థులు మానవహారం

‘అమ్మ’ పేరుతో అన్నం పెట్టడం అభినందనీయం

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: ‘అమ్మ’ జ్ఞాపకార్థం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి రెండేళ్లుగా నిత్యం 200 మందికి అన్నదానం చేస్తున్న ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్ చౌదరి ఆదర్శనీయుడని సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ అన్నారు. పుల్లడిగుంటలోని క్యాంటీన్ వద్ద నిర్వహించిన మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పుటూరి సీతామహాలక్ష్మి జయంతి కార్యక్రమంలో బండ్ల గణేష్ దంపతులు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్టు సమకూర్చిన యూటీఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్ల పుస్తకాలను 1200 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు.. ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పుటూరి చినరాములుతో కలిసి కోశారు. అనంతరం మోడల్ టెస్ట్ పేపర్లను విద్యార్థులకు అందజేశారు. కూటమి నాయకులు భీమినేని వందనాదేవి, కొర్రపాటి నాగేశ్వరరావు, గోగినేని కల్యాణ చక్రవర్తి, పాతూరి కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, మలినేని ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ పెరుమాళ్లు, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, చిరుమామిళ్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమకూర్చిన పుస్తకాలతో బండ్ల గణేష్, ఆయన సతీమణి కవిత, ఉప్పుటూరి చినరాములు తదితరులు

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

దుగ్గిరాల: మూడు గ్రామాల్లో సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత పంపిణీ చేశారు. మంచికలపూడిలో యార్లగడ్డ శివనాగప్రసాద్‌కు రూ. 1,45,000 విలువైన చెక్కు మండల పరిషత్తు వైస్ ఛైర్మన్ మరీదు రాము, యేమినేని కోటేశ్వరరావు, యార్లగడ్డ రమేష్‌లతో కలిసి అందజేశారు. మోరంపూడిలో కొంగర బాబూరావుకు రూ. 1,02,329, శృంగారపురంలో పినపాటి రవికుమార్‌కు రూ. 1,42,555 విలువైన చెక్కులను ఆమె అందజేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి

తాడికొండ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకురాలు సౌమ్యారెడ్డి తెలిపారు. తాడికొండ గ్రామంలోని శ్రీమల్లేశ్వర ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా సౌమ్యారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందిన నాయకులకే పదవులు అందిస్తామని అన్నారు. అలాంటి నాయకుల వివరాలను పీసీసీకి పంపుతామని చెప్పారు. సదస్సులో పాల్గొన్న వారి అభిప్రాయాలను తీసుకున్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు.

పెదనందిపాడు, న్యూస్‌టుడే: ఏఐసీసీ పరిశీలకురాలు, మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రత్తిపాడులోని పమిడి వెంకటరావు, ఫంక్షన్ హాల్‌లో నాయకత్వ ఎంపిక కోసం సదస్సు జరగనుందని నియోజకవర్గ సమన్వయకర్త కొరివి వినయ్‌కుమార్ సోమవారం తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ల నిర్వహించాలి

ముట్లూరు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: పునీతశౌరివారి తిరునాళ్ల ప్రశాంత వాతావరణంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని గుంటూరు దక్షిణ మండల డీఎస్పీ భానోదయ సూచించారు. ముట్లూరులో ఈ నెల 3న జరగనున్న తిరునాళ్లను పురస్కరించుకుని గ్రామ పెద్దలతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్సవాల్లో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చివరికి మిగులుతుందా..?

❖ రైతుల గుండెల్లో ‘దిత్వా’ అలజడి

❖ కోత యంత్రాలు, కూలీల కొరత

వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మొన్న మొంథా.. ఇప్పుడు దిత్వా తుపాను రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. దిత్వా హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు పంటను ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో కూలీల కొరత, వరికోత యంత్రాల కొరత ఏర్పడింది. గ్రామీణ గుంటూరు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో సుమారు 15260 హెక్టార్లలో వరి సాగైంది. రైతుల భయాందోళనల నేపథ్యంలో ఎక్కువ ధర చెల్లించాలని కోత యంత్రాల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ఇటు కూలీల ఖర్చులు రెట్టింపు అయ్యాయి. మరో వైపు వర్షంతో విచ్చుకున్న పత్తి పూలు తడిసి పోయాయి. వీటిని కోయించేందుకు అధికంగా ఖర్చులు భరించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

కోసిన ధాన్యంపై పట్టాలు కప్పారిలా..

రూ.8000ల నుంచి రూ.16000కు..

సాధారణ పరిస్థితిలో హెక్టారుకు నూర్పిడి ఖర్చు రూ. 8000లు అయ్యేది. ఇప్పుడు అది రూ. 16000 లకు చేరింది. వర్షాలతో రైతులంతా యంత్రాలను ఒకేసారి ఉపయోగించుకోవాల్సి రావడంతో ఈ పరిస్థితి వచ్చింది. కూలీలకు రోజు కూలి రూ. 500 నుంచి రూ. 700లు ఉండేది. ఇప్పుడు ఇది రూ. 1000కి పెరిగింది.

పంట నూర్చితే ధాన్యం నిల్వ కష్టం

పంటలను వర్షాలకు భయపడి నూర్చితే వీటిని నిల్వ చేసేందుకు కష్టపడాల్సి వస్తోంది. దీంతో పొలంలో టార్పాలిన్లు కప్పి వదిలేస్తున్నాం.

-కాప శివయ్య, ముట్లూరు

పట్టు తప్పితే కాలువలోకే..!

కాజ శివారు గుంటూరు ఛానల్‌పై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో చేలకు వెళ్లేందుకు అన్నదాతలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతిరోజు వందలాది వాహనాలు ఇటుగా వెళ్తుంటాయి. వంతెనకు ఇరుపక్కలా రక్షణ గోడలు లేకపోవడంతో ఆదమరిస్తే వాహనం కాలువలోకి దూసుకుపోవడం ఖాయం. - న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: కొర్నెపాడు రైతునేస్తం ఫౌండేషన్‌లో ప్రకృతి వ్యవసాయంపై జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం కర్షకులకు రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. కర్షకుల క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో.. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంత శాస్త్రవేత్త రమేష్‌బాబు, ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావులు పాల్గొని కషాయాల తయారీ, ప్రకృతి సాగు, చిరుధాన్యాలతో ఉప ఉత్పత్తులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

వంతెన నిర్మించాలని వినతి

మేడికొండూరు, న్యూస్‌టుడే: వర్షాలు కురిసినప్పుడు మేడికొండూరు యడ్లపాటి వెంకట్రావు నగర్‌లో లోలెవల్ చప్టా నీట మునిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని, దీంతో చెంచు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ కోఆర్డినేటర్ రాచపూడి వెంకట నరసింహారావు అన్నారు. ఇక్కడ వంతెన నిర్మించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన వినతి పత్రం అందజేశారు.

ఉత్సాహంగా త్రోబాల్ పోటీలు

కాకుమాను (ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: ప్రత్తిపాడులోని బీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు నిర్వహించి గుంటూరు డివిజన్ స్థాయి పోటీలకు జట్టును ఎంపిక చేశారు. ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు కూడా నిర్వహించారు. డివిజన్ స్థాయి పోటీలకు జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు రమాదేవి, లీలారాణి, ప్రధానోపాధ్యాయుడు ఆలీషా, మండల క్రీడల సమన్వయకర్త కరీముల్లా పాల్గొన్నారు.

విశ్రాంత సైనిక ఉద్యోగికి సన్మానం

పెదనందిపాడు: గోగులమూడికి చెందిన విశ్రాంత సైనిక ఉద్యోగి జక్కం సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా సోమవారం రాత్రి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆయనను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగించి సన్మానించారు. ఆయన దేశానికి అందించిన సేవలను వక్తలు కొనియాడారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

అవీ ఇవీ

తాడేపల్లి, న్యూస్‌టుడే: వడ్డేశ్వరంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ చొరవతో 30 మందికి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. విద్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలలను సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు కాకుమాను జోజప్ప, కాట్రగడ్డ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోండి

తాడేపల్లి, న్యూస్‌టుడే: వడ్డేశ్వరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ లెర్నింగ్ రిసోర్స్ సెంటర్‌ను ఏపీ మౌలిక వసతుల అభివృద్ధి కల్పన సంస్థ ఛైర్మన్ రాజశేఖర్ సోమవారం ప్రారంభించారు. మారుతున్న సమాజంలో సాంకేతికతను విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే అందిపుచ్చుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఇందుకు ఉపాధ్యాయులు తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప, తెదేపా నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, దాతలు బచ్చు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో బాలల సత్తా

ఫిరంగిపురం న్యూస్‌టుడే: వేములూరిపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్విజ్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి ప్రతిభాన్వేషణ పరీక్షకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య సోమవారం తెలిపారు. ఉప్పు మోనాలిక, వేముల ఐశ్వర్య (6వ తరగతి), భీమనాధుని లోహిత, షేక్ అన్వర్, ఓబులశెట్టి యవన వెంకటేశ్వరరావు (7వ తరగతి) వీరిలో ఉన్నారన్నారు. విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వీఎస్ రామాంజనేయులును ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

తాగునీటి మోటారు చోరీ

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో చేతి పంపు వద్ద ఏర్పాటు చేసిన మోటార్‌ను శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరా పుటేజీలో రికార్డు అయ్యాయని హెచ్ఎం శోభాదేవి సోమవారం తెలిపారు. మూడు నెలల క్రితం గ్రంథాలయం సమీపంలో ఇదే తరహాలో మోటారు చోరీ చేసినట్లు చెబుతున్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామాల అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక పాతూరి అన్నారు. ఆ కళాశాల ఆధ్వర్యంలో చినపలకలూరులో వారం రోజులు జరగనున్న ప్రత్యేక సేవా శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళల ఆరోగ్యం, విద్య, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ సచివాలయం వద్ద విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారిణి భవాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు గుంటూరు జిల్లా, మంగళగిరి కాపురస్తులు మనిక ఆనంద్ బాబు గారి భార్య మనిక నిర్మల జ్యోతి గారి నుండి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా..

నా క్లయింటుకు మరియు (1) గుమ్మడి శ్రీనివాసరావు గారి భార్య గుమ్మడి అరుణ కుమారి (2) ప్రసాదంపాడు, హనుమాన్ నగర్ కాపురస్తులు గురికపూడి సుధీర్ కుమార్ గారి భార్య గురికపూడి మల్లేశ్వరి గారు (3) తాడేపల్లి మండలం పెనుమాక గ్రామం కాపురస్తులు సన్నికంటి రత్నశేఖర్ గారి భార్య సన్నికంటి ప్రియాంక గార్లు పాకనాటి (లేటు) లక్ష్మీ నారాయణమ్మ మరియు పాకనాటి వెంకటరత్నం గార్ల సంతతి అయివున్నారు. నా క్లయింటు తల్లి గారు అయిన పాకనాటి లక్ష్మీనారాయణమ్మ గారు ది. 27-04-2011వ తేదీన గుంటూరు జిల్లా, మంగళగిరి, ఆత్మకూరు కాపురస్తులు పఠాన్ అబ్దుల్ ఖాన్ గారి కుమారుడు పఠాన్ రహమతుల్లా ఖాన్ గారి నుండి దస్తావేజు నెం. 3041/2011 మంగళగిరి, సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయము ద్వారా రిజిస్ట్రీ చేయించుకొని వారి హక్కుభుక్తములలో ఉండగా నా క్లయింటు తల్లి గారు డి.17-07-2017వ తేదీన ఇంటెస్టేట్‌గా మరణించియున్నారని వారి మరణానంతరము ముఖ్యవారసులైన మనకు, మన తండ్రి గార్కి, షెడ్యూలు ఆస్తి జాయింటుగా సంక్రమించినది అని, ఆ విధముగా ఉండగా మన తండ్రి గారు ది.03-01-2020వ తేదీన ఇంటెస్టేట్‌గా మరణించియున్నారని వారి మరణానంతరము దిగువ షెడ్యూలు ఆస్తికి మన నలుగురము ముఖ్య వారసులై వుండుట వలన జాయింటుగా సంక్రమించగా ఆ విధముగా ఉండుట వలన మన నలుగురుకు ఉపయోగకరముగా ఉండదు అనే ఉద్దేశ్యముతో (1) గుమ్మడి అరుణ కుమారి (2) గురికపూడి మల్లేశ్వరి (3) ప్రియాంక గార్లు వారి యొక్క దిగువ షెడ్యూలులో ఉన్న 3/4వ వంతు అనిర్దిష్టపు హక్కును ది. 24-04-2025వ తేదీన నా క్లయింటు అయిన నిర్మల జ్యోతి గార్కి వారలకు గల హక్కు వదులుకొనుచూ మంగళగిరి, సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయములో హక్కు విడుదల దస్తావేజు నెం.10115/2025 రిజిస్టరు చేయించి ఇచ్చినారని ఆ విధముగా నా క్లయింటు తన తల్లిగారి ద్వారా సంక్రమించిన 1/4వ వంతు మరియు పై దస్తావేజు ద్వారా సంక్రమించినటువంటి 3/4వ వంతు మొత్తం ఆస్తి నా క్లయింటుకు సంక్రమించి తన యొక్క సర్వసంపూర్ణ హక్కుభుక్తములలో ఉన్న ఆస్తి అని గతములో యీ దిగువ షెడ్యూలు సంబంధించిన లింక్ దస్తావేజులు అనగా :

1) రిజిష్టరు విక్రయ దస్తావేజు నెం. 2097/2004, తేది. 06-04-2004,
2) రిజిష్టరు విక్రయ అగ్రిమెంటు కమ్ జి.పి.ఏ దస్తావేజు నెం.2633/2010, తేది: 13-04-2010,
3) రిజిష్టరు క్యాన్సిలేషన్ దస్తావేజు నెం.2119/2011, తేది: 21-03-2011.

పై చెప్పబడిన ఒరిజినల్ లింక్ దస్తావేజులను నా తల్లి గారి విక్రయదారులు నా తల్లి గార్కి ఇచ్చివుండకపోవుట వలన నా తల్లి గారి ద్వారా మాకు పై చెప్పబడిన ఒరిజినల్ లింక్ దస్తావేజు నా క్లయింటు దగ్గర లేదు అని ఈ నోటీసు ద్వారా యావన్మందికీ తెలియజేయడమైనది. ఆ విధమైన దిగువ షెడ్యూలు ఆస్తిని నా క్లయింటు ఏదైనా బ్యాంకు వారికి హామీ ఉంచి తగు ఋణ సదుపాయము పొందుటకు నిర్ణయించుకున్నారని ఈ నోటీసు ద్వారా తెలియచేయుచున్నారు. ఆ విధముగా చేయుటలో ఎవ్వరికైనా, ఏదైనా న్యాయపరమైన ఆక్షేపణలు ఉన్న యెడల ఈ నోటీసు వెలువడిన 7 (ఏడు) దినముల లోపల ఈ క్రింది చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియచేయగలరు.

షెడ్యూలు: గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన ఆత్మకూరు గ్రామ డి.నెం.210, డోరు నెం.12-6-44, అసెస్మెంటు నెం. 1023024221రు దాఖలా ఆర్.సి.సి. డాబా ఇంటితో సహా గల చ.గ.173-0లు స్థలమునకు హద్దులు:- **తూర్పు:** కొమ్మూ దావీదు గారి ఆస్తి, **దక్షిణం:** పంచాయతీ బజారు హద్దు, **పడమర:** పంచాయతీ బజారు హద్దు, **ఉత్తరం:** దాసి సౌజన్య గారి స్థలము హద్దు.

పై తెలుపబడిన నాలుగు హద్దుల మధ్య చ.గ.173-0లు లేక చ.మీ. 144-64ర్లు స్థలము, సదరు స్థలములో వున్న ఆర్.సి.సి డాబా ఇంటికి యావత్తు ఋజ్‌మెంటు హక్కులతో సహా.

ఇట్లు: D.S.V. PRASADA RAO, S.K. SUBHASHINI, Advocates, Flat : 502 Datta Sai Towers, Alluri Sita Rama Raju Road, Azit Singh Nagar, Vijayawada.

(c) eenadu

గుంటూరు తూర్పు

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 37, వంగ 24, బెండ 44, పచ్చిమిర్చి 38, కాకర 36, క్యారెట్ 44, క్యాబేజీ 26, బీర 30, దొండ 29, బంగాళదుంప 30, ఉల్లిపాయలు 17, గోరుచిక్కుడు 44, దోస 25, పొట్ల 39, చామదుంప 23, మునగ 10, గోంగూర 12, తోటకూర 15, చుక్కకూర 14, కొత్తిమీర 25, బీట్ రూట్ 35, కీర 30, క్యాప్సికం 69, అల్లం 80, ఫ్రెంచి బీన్స్ 54, సొర 13, అరటి 8.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

? పొన్నూరురోడ్డులో సాయంత్రం వేళ గుంపులుగా యువకులు చేరుతున్నారు. ఇటుగా రాకపోకలు చేసే మహిళలు, యువతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - హర్ష, అలినగర్

✔ ఆ ప్రాంతంలో పోలీసుల గస్తీలు ముమ్మరం చేసి రోడ్లపై యువకులు గుంపులుగా చేరకుండా చర్యలు తీసుకుంటాం. -శివప్రసాద్, లాలాపేట సీఐ

? లాంచెస్టర్‌రోడ్డులోని పార్శిల్ సర్వీసుల కారణంగా ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిషేధ సమయాల్లో సైతం లారీలు నగరంలోకి ప్రవేశించి లాంచెస్టర్‌రోడ్డులో నిలుపుతున్నారు. - రవీంద్రరెడ్డి, సంగడిగుంట

✔ నిషేధ సమయాల్లో నగరంలోకి ప్రవేశించే లారీలపై చర్యలు తీసుకుంటాం. -అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ

? బాలాజీనగర్ 5వ లైను పరిసర ప్రాంతాల్లో రోడ్లపై వీధికుక్కలు గుంపులుగా చేరుతున్నాయి. చిన్నారులపై దాడి చేస్తున్నాయి. -శ్రీను, మణిహోటల్ సెంటర్

✔ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం. -రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ -న్యూస్‌టుడే, పట్నంబజారు

☛ మోతీలాల్‌నగర్ ప్రధానరోడ్డులో చెత్తకుప్పలను తొలగించకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికుడు మహమూద్ జలీల్ 'మేమున్నాం'.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ట్రాక్టర్ పంపి చెత్త కుప్పలు తీయించారు.

☛ ప్రకాష్‌నగర్ 3 వలైన్‌లో సైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీటి పారుదలకు అటంకం ఏర్పడి దోమల వ్యాప్తి అధికంగా ఉంటోందని స్థానికుడు ప్రసాద్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ ఆయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో సిబ్బందిని పంపి కాలువల్లో పూడికలు తీయించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

స్పందనకు వందనం

పారిశుద్ధ్య విధుల్లో నిర్లక్ష్యం వద్దు

నగరపాలక సంస్థ: నగరంలో మైక్రోప్యాకెట్ వారీగా పారిశుద్ధ్య పిన్ పాయింట్ కార్యక్రమం అమలు చేయాలని, మధ్యాహ్నంవేళ గ్యాంగ్ వర్క్ తప్పనిసరిగా చేయించి, సైడుకాలువలను శుభ్రం చేయించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం పాతగుంటూరు, మారీసుపేటవారిపేట, కొండావారివీధి ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, అభివృద్ధి పనుల తీరుపై అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొడతాం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను జీవీ కృష్ణారావు స్ఫూర్తితో కార్మికవర్గం ఐక్యంగా తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సంగడిగుంటలో జీవీ కృష్ణారావు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావుకు జీవీకే అవార్డును ప్రదానం చేశారు.

రహదారులా.. డంపింగ్ కేంద్రాలా?

న్యూస్‌టుడే - నగరపాలక సంస్థ

నగరపాలకసంస్థ పరిధిలోని శివారు ప్రాంతాల్లో పలు రహదారులు డంపింగ్ కేంద్రాలుగా మారిపోతున్నాయి. ప్రజారోగ్య, పారిశుద్ధ్య విభాగాలు నగరంలో అనేక రకాలుగా స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నా వాటి సిబ్బందికి ఇవేమీ కనిపించకపోవడం గమనార్హం. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు... అధికారులు, ప్రజాప్రతినిధులు తిరిగే ప్రాంతాలపై దృష్టి పెట్టి పారిశుద్ధ్య, స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్న అధికారులు శివారు ప్రాంతాల్లోని పరిస్థితులు కనుగొనడం లేదు. కొన్నిచోట్ల వ్యర్థాలను తగలబెట్టడంతో వాటి నుంచి వచ్చే పొగతో పర్యావరణం కలుషితమై చుట్టుపక్కల ప్రాంతవాసులు ఇబ్బంది పడుతున్నారు.

నగరంలో అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి

సీతమ్మకాలనీ నుంచి నల్లపాడు రోడ్డులో పోగుపడిన వ్యర్థాలు

ఈ ప్రాంతాల్లోనే సమస్యలు.. తూర్పు పరిధిలో ఆటోనగర్ టయోటా షోరూం పక్కగా జాతీయ రహదారి వరకు వెళ్లే రహదారిలో వాహనాల్లో చుట్టుపక్కల పరిశ్రమలు, దుకాణాల నుంచి వ్యర్థాలు తీసుకొచ్చి పడేస్తున్నారు. నెలలుగా వీటిని తొలగించకపోవడంతో వర్షాలకు తడిసి ఆ ప్రాంతం మరింత అపరిశుభ్రంగా తయారవుతోంది. దీనితో ఆ రహదారి నుంచి రాకపోకలు సాగించాలంటే భయపడే పరిస్థితి.

☛ పశ్చిమంలోని సీతమ్మకాలనీ వెనుక నుంచి నల్లపాడు వైపు వెళ్లే రహదారి దారుణంగా మారింది. స్థానికంగా చుట్టుపక్కల ప్రాంతవాసులు ఈ రహదారిలో భవననిర్మాణ వ్యర్థాలు, చెత్త పెద్దఎత్తున తెచ్చి కుప్పలుగా వేయడంతో రహదారి మొత్తం అపరిశుభ్రంగా మారుతోంది. రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికుల వాపోతున్నారు. తారకరామానగర్ ఎక్స్‌టెన్షన్ ప్రధాన రహదారి చెరువు ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి. చెరువు చుట్టూ భారీగా నిర్మాణ వ్యర్థాలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు వేయడంతో రహదారి అపరిశుభ్రంగా మారి పరిసరాలు కలుషితమౌతున్నాయి.

దృష్టి పెడితే... అనేక ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న ఈ రహదారులు శుభ్రంగా ఉండేలా అధికారులు వెంటనే దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాల్సి ఉంది. వ్యర్థాల పోగులను నాయుడుపేట డంపింగ్‌యార్డుకు తరలిస్తే ఇబ్బంది రాకపోకలకు ఇబ్బందులు తప్పుతాయి.

అక్రమించి.. దౌర్జన్యం చేసి...

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి బాధితులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు మధుసూదనరావు, శ్రీనివాసరెడ్డి, బెల్లం శ్రీనివాసరావు ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశించారు.

ఇంటిని అక్రమించుకున్నారు.. టీడీపీ నాయకుడు వైవీ సురేష్ మృతి చెందడంతో ఆయన తల్లి వృద్ధురాలైన భ్రమరాంబ, ఆమె మనవరాలు ఎనిమిదేళ్ల అమృతవల్లిని కాలగర్భంలో కలిపేందుకు యత్నిస్తూ కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇంటిలో వారి ఇంటిని ఆక్రమించుకున్నారు. చంపేస్తామని బెదిరించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. - ఉగ్గం సాంబశివరావు, జూపూడి శ్రీనివాసరావు, నీలాంబరం, బీసీ సంఘాల నాయకులు

నష్టపరిహారం ఇప్పించండి: బ్రాడీపేటలో ఏడాదిగా వస్త్రదుకాణం నిర్వహిస్తున్నా. రహదారి విస్తరణలో భాగంగా నాకు సమాచారం ఇవ్వకుండా దుకాణాన్ని కూల్చేశారు. పెద్దమొత్తంలో నష్టం వాటిల్లింది. కుటుంబం రోడ్డునపడ్డాం. నష్టపరిహారం ఇప్పించాలని కోరా. - సీతారామయ్య, శ్రీనగర్

రక్షణ కల్పించండి: మా ఇంటి ఎదురుగా ఉన్న 1.75 ఎకరాల దేవాదాయ భూమిని కొంతమంది ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ భూమిని దేవాదాయ శాఖకు అప్పగించాలని నేను అధికారులకు ఫిర్యాదు చేశా. దీంతో కొంతమంది కక్ష పెంచుకుని మాఇంటిపైకి దాడికి వచ్చారు. రక్షణ కల్పించాలని పోలీసులను కోరా. -శ్రీనివాసరావు, నగరంపాలెం

రెవెన్యూ సమస్యలు తెలపండి

ఈనాడు మీతోడు

నేడు డయల్ యువర్ తహసీల్దారు కార్యక్రమం

పట్నంబజారు, న్యూస్‌టుడే: అడంగల్‌లో భూముల నమోదులో తేడాలున్నాయా? ఆధారు, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతుందా? రేషన్‌కార్డుల్లో సమస్యలున్నాయా? ఇలా వివిధ రెవెన్యూ సమస్యలను సరాసరి తహసీల్దార్ దృష్టికి తీసుకు రావాలనుకుంటున్నారా..? ఇందుకుగాను 'ఈనాడు' ఆధ్వర్యంలో డయల్ యువర్ తహసీల్దార్' కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలపై స్పందించనున్నారు తహసీల్దార్ మహబూబ్ సుభానీ ఆంగీకరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంతోపాటు బుడంపాడు, గోరంట్ల, ఏటుకూరు, జొన్నలగడ్డ, రెడ్డిపాలెం ప్రాంతవాసులు చేయాల్సిందల్లా ఈ కింది నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను సూటిగా చెప్పడమే.

79939 55719 | తేదీ: మంగళవారం (2.12.2025) | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

లబ్ధిదారునికి పింఛను సొమ్ము అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: పింఛనుదారులకు సోమవారం ఉదయం 6 గంటల నుంచే ఇళ్లకెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇచ్చామని కమిషనర్ శ్రీనివాసులు చెప్పారు. సోమవారం ఆయన కొండావారివీధి, మాచిరాజువారివీధి ప్రాంతాల్లో పింఛను సొమ్ము లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నగరంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ ప్రతిభావంతులు, ఒంటరి మహిళలు తదితర 27 కేటగిరీల్లో 57,762 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. వీరికి రూ.25,12,59,500 మొత్తాన్ని వారి ఇళ్ల వద్ద 1,632 మంది వార్డు సచివాలయాల కార్యదర్శులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

రాజామాస్టర్ సేవలకు ప్రశంస

దాసరి రాజామాస్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్, కూటమి నాయకులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర గ్రంథాలయ సంస్థల మాజీ ఛైర్మన్ దాసరి రాజామాస్టర్ పుట్టిన రోజు వేడుక సోమవారం నెహ్రూనగర్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 36 నియోజకవర్గాలకు చెందిన వేలాదిమంది కార్యకర్తలు తెదేపా శిక్షణ కేంద్రంలో రాజామాస్టర్ వద్ద శిక్షణ తీసుకున్నారని, వారంతా పార్టీకి కొండంత అండగా నిలిచారన్నారు. అంతకు ముందు రాజామాస్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు

నగరపాలక సంస్థ: బీఆర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. సోమవారం ఆయన స్టేడియంలో వాకర్లతో మాట్లాడారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు, ఆవసరమైన అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. డైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం గమనించి వెంటనే శుభ్రం చేయాలని సూచించారు. జంగిల్ క్లియరెన్స్ చేయాలన్నారు. ఇప్పటికే రూ.80 లక్షలతో చేపట్టిన వాకింగ్‌ట్రాక్ పనులు వేగవంతం చేయాలన్నారు. యోగాసెంటర్ మరమ్మతులు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు జరిపించండి

నగరపాలక సంస్థ: జీఎంసీ పరిధిలో ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సెమీ క్రిస్మస్ వేడుకల నిర్వహణకు తేదీ ఖరారు చేయాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ ట్రేడ్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం కమిషనర్ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధు, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ వకుల్ జిందాల్ నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న డీఎస్పీ మధుసూదనరావు

ప్రతిభకు గుర్తింపు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను చాకచక్యంగా అరెస్టు చేసిన పోలీసులకు సోమవారం ఎస్పీ వకుల్ జిందాల్ తన కార్యాలయంలో రివార్డులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. డీఎస్పీలు మధుసూదనరావు, అజీజ్, సీఐలు కిషోర్, శివప్రసాద్, ఎస్సై రాములు, ఏఎస్సై రామకృష్ణ, సిబ్బంది పీటర్‌రాజు, కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు, శివప్రసాద్‌లు ప్రశంసాపత్రాలు స్వీకరించారు.

సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం పేదలకు కొండంత అండ అని, సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సోమవారం 33వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛను అందజేత కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజన్ తెదేపా అధ్యక్షుడు నరేంద్ర, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

విస్తృత అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విస్తృత అవగాహన పెంపొందించుకుంటేనే హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమని వక్తలు చెప్పారు. సోమవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడారు. క్రమశిక్షణతో ఉంటామని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రమాజ్యోత్స్నకుమారి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి తమీమ్ అన్సారియా

మహిళ అదృశ్యం

పట్నంబజారు, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని మొఘల్ జరీనా బేగం (35) కనిపించటం లేదని సోమవారం లాలాపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఆమె సోమవారం మధ్యాహ్నం బారాయి మాంపంజా సెంటర్‌కు వెళ్లిందని, అక్కడి నుంచి కనిపించడం లేదని పోలీసులు తెలిపారు.

లాడ్జిలో వ్యభిచారం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రామిరెడ్డినగర్‌లోని ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం తనిఖీలు చేశారు. ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులను అదుపులోకి తీసుకున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

నూతన కూడళ్లు, శాశ్వత బారికేడ్ల ఏర్పాటు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

నగరంలో ట్రాఫిక్ రద్దీ సమస్య పరిష్కారానికి పోలీసులు చర్యలు చేపట్టారు. శంకర్ విలాస్ వంతెన నిర్మాణ పనుల నేపథ్యంలో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వైపు వాహనాల మళ్లింపు చేపట్టారు. ఆయా మార్గాలలో తాత్కాలికంగా ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. లాడ్జిసెంటర్, అమరావతిరోడ్డు, శ్రీనగర్, బ్రాడీపేట, అరండల్‌పేట వైపు నుంచి తూర్పునకు మూడు వంతెన మీదుగా వాహనాలు మళ్లిస్తున్నారు. అయితే నానాటికీ వాహనాల రద్దీ రెట్టింపవుతుంది. ఇనుప బారికేడ్లను తోసేసుకొని వాహనాలు ఎదురెదురుగా వెళ్లడంతో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంటుంది. దీనికి తోడు బ్రిడ్జి నిర్మాణ పనులు ఆలస్యమవడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తూర్పు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

బోసుబొమ్మకూడలి మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంట్ బారికేడ్లు

పశ్చిమ నుంచి తూర్పుకు వాహనాలు వెళ్లే మార్గాల్లో కూడళ్లను అందుబాటులోకి తెచ్చారు. శనక్కాయల ఫ్యాక్టరీ నుంచి ఇండియన్ స్ప్రింగ్స్ వద్ద ఏర్పాటు చేసిన కూడలితో పాటు అక్కడి నుంచి కొత్తపేట బోసుబొమ్మ వద్ద మరో కూడలి ఏర్పాటు చేశారు. కొత్తగా సిమెంట్ దిమ్మెలు తెప్పించారు. వాహనాలు సాఫీగా వెళ్లడానికి రెండు వరుసల రహదారిగా తీర్చిదిద్దారు. నాజ్‌సెంటర్, రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, కొత్తపేట వైపు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా భగత్‌సింగ్ బొమ్మకూడలి వద్ద అదనపు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. తూర్పులో ఉన్న రహదారులను ఉపయోగించుకుంటూ అవకాశం ఉన్నంత వరకు ట్రాఫిక్ ఆగకుండా చర్యలు తీసుకుంటున్నామని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

సీపీఎం నిరసన

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నవారికి ప్రభుత్వం అండగా నిలవాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు కోరారు. గంజాయి మాఫియా దాడిలో ప్రాణాలు కోల్పోయిన పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం శంకర్‌విలాస్‌కూడలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నేతాజీ, రామారావు, నళినీకాంత్, అరుణ; కృష్ణకాంత్, పద్మ, పవన్‌కుమార్, ముత్యాలరావు, లక్ష్మణరావు, అప్పారావు, రమణ, సలీం, బాషా, ఖాసీం పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న చలమయ్య కాలేజీ ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు

ఎయిడ్స్‌పై అవగాహన

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చలమయ్య కాలేజీ ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు అన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కాలేజీలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైరస్ సోకిన సూదులు, సిరంజీలు ఉపయోగించటం, రక్తమార్పిడి ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.శ్రీధర్, వై. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

పట్నంబజారు, న్యూస్‌టుడే: ముందు జాగ్రత్త చర్యలతో ఎయిడ్స్ బారిన పడకుండా బయటపడొచ్చని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరుశాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నిరోధక దినోత్సవం సందర్భంగా ఐఎంఏ గుంటూరుశాఖ, అపెక్స్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఇంగ్లీషు సంస్థలో సోమవారం నిర్వహించిన హెచ్ఐవి శాస్త్రీయ అవగాహన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సాయి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయం కేసులో ఇద్దరి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ వెంకటప్రసాద్

పట్నంబజారు, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తున్న కేసులో పాతగుంటూరుకు చెందిన మహంకాళి శివమణికంఠ, నెహ్రూనగర్‌కు చెందిన భేటి బద్రినారాయణలను అరెస్టు చేసినట్టు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. సోమవారం పాతగుంటూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. పాతగుంటూరుకు చెందిన నిందితులిద్దరూ స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలై డబ్బు కోసం గంజాయి విక్రయిస్తున్నారు. మార్టూరు సమీపంలోని క్వారీ వద్ద ఒడిశాకు చెందిన మంగళ్‌పాండే అనే క్వారీ కార్మికుడి వద్ద గంజాయి కొనుగోలు చేసి చిన్నచిన్న పొట్లాలుగా ప్యాక్ చేసి హెచ్చు ధరలకు విక్రయిస్తున్నారు. గత నెల 30న కాకానిరోడ్డులోని ఖాళీ స్థలంలో వీరిని సీఐ వెంకటప్రసాద్ అరెస్టు చేసి 1,160 గ్రాముల గంజాయితోపాటు ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన సీఐ వెంకటప్రసాద్, ఎస్సై రెహ్మాన్, సిబ్బంది మోహన్, నూరుద్దీన్, రామారావు, మురళిలను ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు.

భూసమీకరణ తగదు

మాట్లాడుతున్న బాబూరావు, నేతాజీ, పాశంరామారావు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అమరావతిలో మరోసారి భూసమీకరణ చేయడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. సోమవారం బ్రాడీపేటలోని కార్యాలయంలో జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి నేతాజీ మాట్లాడుతూ పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు నాయకులు అప్పారావు, భావన్నారాయణ, నళినీకాంత్ పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

నా క్లయింటు ఏలూరి బాల దత్త కుమార్, తండ్రి : గురవయ్య, గుంటూరు. ఏలూరి బాల దత్త కుమార్ పేరిట గల ఒరిజినల్ దస్తావేజునకు సంబంధించిన లింకు దస్తావేజు అయిన గురవయ్య గారి పేరిటకు APIIC (Auto Nagar, Guntur) వారి ద్వారా క్రయం పొంది దస్తావేజు నెం.3682/1992 గా గుంటూరు జిల్లా రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన దస్తావేజు ది.25-11-2025 న గుంటూరు లో లక్ష్మీపురం నుండి నగరంపాలెం కు ప్రయాణిస్తుండగా పోయినవి. సదరు లింకు దస్తావేజు దొరికిన వారు ఈ క్రింది అడ్రసు లో ఇవ్వవలసినదిగా కోరుచున్నాము. ఒరిజినల్ లింకు దస్తావేజు వెతికి తెచ్చిన వారికి తగిన పారితోషకము ఇవ్వబడును.

Sanam Padmaja, Advocate
3/1, Arundelpet, Guntur. Cell : 9949524655

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE(SENIOR DIVISION): GUNTUR
SUCCESSION O.P. No. 79/2025

Between:
1) Perumalla Lalitha Kalyani,
2) Perumalla Koteswara Rao,
3) Perumalla Sathya Varshini
....Petitioners
and
Nil ....Respondents

పైనెంబరు కేసులోని పిటీషనరు నెం.1 వారికి భర్త మరియు 2,3 వార్లకు తండ్రి అయిన Perumalla Gangadhara Rao, S/o. Koteswara Rao గారు IndusInd Bank, Arundelpet Branch, Guntur నందు డిపాజిట్ చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు అయిన పిటీషన్ షెడ్యూల్ చరాస్థికి వారి మరణానంతరం వారసత్వ సర్టిఫికేట్ కొరకు కోరుచూ పై కోర్టు నందు ఇందలి పిటీషనర్లు ఈ పిటీషను దాఖలు చేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు వున్నచో తెలియజేయమని కోరుచూ ఈ వార్తపత్రిక ద్వారా పేపరు ప్రకటన చేయమని **ది.19-12-2025**వ తేదికి ఈ కేసును వాయిదావేసి యున్నారు. కావున ఆ రోజు ఉ॥గం॥**10-30**ని॥లకు సదరు పైనెంబరు పిటీషన్‌పై ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములు వున్నచో శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీకుగల అభ్యంతరములు తెలుపుకొనగలరు.

Schedule: 1) FDR A/c. No.300915695279, Amount Rs.10,80,000/-
2) FDR A/c. No.300930794544, Amount Rs.25,00,000/-
3) FDR A/c. 300857795457, Amount Rs.10,00,000/-
4) FDR A/c. No.300945523771, Amount Rs.35,00,000/-
5) FDR A/c. No.300945523924, Amount Rs.35,00,000/-

కొల్లా చంద్రశేఖర రావు, కొల్లా లలిత, అడ్వకేట్స్
డోర్.నెం.4-133, గాంధిచౌక్, బంటుమిల్లి, కృష్ణాజిల్లా. సెల్ : 8885381788

గడువులోగా అర్జీల పరిష్కారానికి చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థకు వివిధ మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులు, అర్జీలు పునరావృతం కాకుండా గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 21 ఫిర్యాదులు రాగా వాటిని వివిధ విభాగాల అధికారులకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి 21 అర్జీలు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు వీలుగా క్షేత్రస్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డీసీ సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, డీసీపీ సూరజ్‌కుమార్, ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజరు బాలాజీబాష తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యపన్నులశాఖ సీపీసీకి పదోన్నతి

పట్నంబజారు, న్యూస్‌టుడే: వాణిజ్యపన్నులశాఖ బ్రాడీపేట సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ కె.కేదారేశ్వరరావుకు కడప డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. గతంలో ఆయన కొత్తపేట సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేశారు.

పోలీసు జాగిలం రెమో మృతి

పోలీసు జాగిలం రెమోకు నివాళులర్పిస్తున్న ఏఎస్పీ హనుమంతు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు జాగిలం రెమో వయోభారంతో అనారోగ్య సమస్యలతో సోమవారం మృతి చెందింది. గత 12 సంవత్సరాలుగా జిల్లా భద్రత విభాగంలో సేవలందించింది. పేలుడు పదార్థాలను పసిగట్టడంలో ఆరితేరింది. వీవీఐపీల బందోబస్తులో అనుమానాస్పద పదార్థాలను గుర్తించడంతో కీలక పాత్ర పోషించింది. రెమో మృతికి ఎస్పీ వకుల్ జిందాల్ సంతాపం తెలిపారు. ఏఎస్పీ హనుమంతు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, సురేష్, ఆర్ఎస్సైలు యేసురాజు, రాజారత్నం, ఏఎస్సై రవి నివాళులర్పించారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

సంక్షేమానికి చిరునామా కూటమి ప్రభుత్వం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఒకటో తేదీ వచ్చిందంటే అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయని.. సంక్షేమానికి చిరునామాగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సోమవారం ఆయన ఆరో డివిజన్ రాజావారితోట సచివాలయం ఉద్యోగులతో కలిసి పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా ఒకటోతేదీనే పింఛను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కొలువు పేరుతో రూ. 5.30 లక్షలు స్వాహా

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.5.30 లక్షలు తీసుకుని మోసగించారంటూ బాధితుల తల్లి శాంతిస్వప్న సోమవారం పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం. తన కుమారుడు, కుమార్తె బీటెక్, పీజీ పూర్తి చేశారని, వారి స్నేహితుల ద్వారా పరిచయమైన కడపకు చెందిన రఘుతేజ, శిరీష ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించారన్నారు. తన కుమారుడికి ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేసి ఉద్యోగానికి ఎంపికైనట్టు చెప్పారన్నారు. రూ. 4.80 లక్షలు వారి ఖాతాలకు ఆన్‌లైన్ ద్వారా జమ చేయించుకున్నారని చెప్పారు. మొదటి నెల రూ. 12 వేలిచ్చారని, అమ్మాయికి కూడా ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి మరో రూ. 50 వేలు జమ చేయించుకున్నారన్నారు. ఆ తర్వాత నుంచి ఫోన్లు తీయడం లేదని, వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

ఆ దుకాణాలకు తిరిగి వేలం నిర్వహించాలి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లో దుకాణాలను పాడుకుని ఇప్పటి వరకు గుడ్‌విల్ చెల్లించని వాటికి తిరిగి వేలం నిర్వహించాలని ప్రస్తుతం దుకాణాలు నిర్వహిస్తున్న వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం జీఎంసీలో వినతిపత్రం అందజేశారు.

ఫారం ఐఎన్‌సి- 26
(కంపెనీస్ (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014 యొక్క రూల్ 30(5)(ఎ)ని అనుసరించి)
కేంద్ర ప్రభుత్వము
రీజినల్ డైరెక్టర్, సౌత్ ఈస్ట్ రీజియన్, హైదరాబాద్‌వారి సమక్షంలో

బ్రెవిటి సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్
(CIN: U72900AP2009PTC065413)

రిజిస్టర్డు ఆఫీసు: డి.నెం.26-29-89, 9వ లేన్, అగ్రహారం, గుంటూరు-522 004, ఆంధ్రప్రదేశ్ విషయంలో.

కంపెనీల చట్టం 2013 యొక్క సెక్షన్ 13(4)లోని నిబంధనలననుసరించి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రానికి తన రిజిస్టర్డు ఆఫీసును తరలించుటకు రీజినల్ డైరెక్టర్‌కు ఒక దరఖాస్తును దాఖలు చేయవలెనని కంపెనీ ప్రతిపాదించినది.

కార్యకలాపాలు, క్లయింట్లు, ఉద్యోగులు మరియు డైరెక్టర్లు ప్రాథమికంగా హైదరాబాద్, తెలంగాణలో ఉన్నందున పాలనా సౌకర్యం నిమిత్తం కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించినది.

రిజిస్టర్డు ఆఫీసు మార్పునకు సంబంధించి స్థాపన పత్రం యొక్క ప్రతిపాదిత సవరణ వలన ప్రయోజనం ప్రభావితమయ్యే అవకాశంగల ఎవరేని వ్యక్తి ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 21 రోజుల్లోగా చిరునామా: **రీజినల్ డైరెక్టర్ (సౌత్ ఈస్ట్ రీజియన్),** కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, 3వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500 068, తెలంగాణకు తెలియజేయవచ్చును.

బ్రెవిటి సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున
రాజశేఖర్ వెనుమల
తేది:1-12-2025 డైరెక్టర్, డిఐఎన్: 03638863
ప్రదేశం: గుంటూరు ఇమెయిల్ ఐడి: shareholders@brevitytech.com

గుంటూరు పశ్చిమ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897
స్పందనకు వందనం

వ్యర్థాలు తొలగింపు: నగరంపాలెంలోని పలు వీధుల్లో చెత్తతో కూడిన వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగిడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగింపజేశారు.

కాలువల్లో పూడికతీత: శివరామ్‌నగర్ దగ్గర కాలువల్లో మురుగు ముందుకు కదలకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: చెట్ల కొమ్మల తొలగింపు, రహదారి విస్తరణ పనుల్లో భాగంగా లైన్ల మార్పిడికి ఆశోక్‌నగర్, పండరీపురం, లక్ష్మీపురం మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని గుంటూరు-2 డీఈఈ ఎస్ గురవయ్య తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామన్నారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 37, వంగ 39, బెండ 44, పచ్చిమిర్చి 38, కాకర 39, బీర 45, క్యాబేజీ 26, క్యారెట్ 60, దొండ 29, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 29, గోరుచిక్కుడు 44, దోస 25, సొర 22, పొట్ల 39, అరటికాయ 10, పెద్దచిక్కుడు 120, చామదుంప 23, ముల్లంగి 10, బీట్‌రూట్ 35, కీరదోసకాయ 30, బీన్స్ 54, క్యాప్సికమ్ 69, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 25, అల్లం 80, వెల్లుల్లి 110. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

అన్న సమారాధన మహత్తర కార్యక్రమం

అయ్యప్ప దీక్షాపరులకు వడ్డిస్తున్న దాతలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అన్న సమారాధన మహత్తర కార్యక్రమమని అయ్యప్ప సేవా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు వెంకట శ్రీధర్‌శర్మ పేర్కొన్నారు. అయ్యప్ప సేవా సమాజ్ ఆధ్వర్యంలో అరండల్‌పేట లోని శ్రీపంచ విరూపాక్ష పీఠ పాలిత శివాలయంలో దీక్ష స్వాములకు 41 రోజుల పాటు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త ఏక ప్రసాద్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. రాత్రి పూట భిక్ష ఉంటుందన్నారు. దాతల సహకారంతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి జనవరి 10వ తేదీ వరకు అన్నసమారాధన, భిక్ష కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో అర్చకులు సుబ్రహ్మణ్యం, భాస్కర శర్మ, శ్రీనివాస్, నిత్య దాతలు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు.. క్రీడాకారులకు వెతలు

ఎన్టీఆర్ స్టేడియంలో పరిస్థితి ఇదీ

పట్టాభిపురం, నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:

విషయం: ఎన్టీఆర్ స్టేడియంలో అభివృద్ధి పనులు సగంలో వదిలేయడం

ఎప్పుడు చేపట్టారు: ఆయిదారు నెలల క్రితం

వ్యయం ఎంత: మొత్తం రూ.24 లక్షలకు పైగా..

ఏమేం పనులంటే: ప్రహరీ నిర్మాణం రూ.6 లక్షలు, రన్నింగ్, వాకింగ్ ట్రాక్‌ల పునరుద్ధరణకు రూ.18 లక్షలు, షాట్‌పుట్ రింగ్, లాంగ్‌జంప్ పిట్ అభివృద్ధి చేయడం..

ఎలా జరిగాయంటే: రన్నింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మించిన తీరు సక్రమంగా లేదని వాకర్స్ సభ్యులు చెబుతూనే ఉన్నారు. జూన్ 1 నుంచి వాకర్స్‌ను అనుమతించడం లేదని బోర్డులు ఏర్పాటు చేశారు. ముందుగా అధికారులు కెర్బ్ వాల్ ఏర్పాటు చేయాల్సి ఉండగా.. రన్నింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టారు. రన్నింగ్ ట్రాక్ పూర్తయ్యాక వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టాల్సి ఉండగా.. రెండింటినీ ఒకేసారి చేసుకుంటూ వెళ్లారు. తర్వాత కెర్బ్ వాల్ నిర్మాణం ప్రారంభించారు. భారీ వర్షాలతో ట్రాక్‌లో ఎర్రమట్టి కొట్టుకుపోయి డ్రెయిన్లు నిండిపోయాయి. ఫలితంగా ట్రాక్‌లు కోతకు గురయ్యాయి.

నగరంలో వదిలేశారు: షాట్‌పుట్ రింగ్, లాంగ్ జంప్ పిట్ పనులు సైతం పూర్తి చేయలేదు. షాట్‌పుట్ రింగ్ నిర్మించి లోపల కాంక్రీట్ వేసి ఫినిషింగ్ చేయకుండా వదిలేశారు. దీంతో క్రీడాకారులు రింగ్ వెలుపల మైదానంలో ప్రాక్టీస్ చేసుకోవాల్సి వస్తోంది. లాంగ్ జంప్ పిట్ సైతం అసంపూర్తిగానే ఉంది. చుట్టూ ఫినిషింగ్ చేయకుండా వదిలేశారు.

పక్కాగా పూర్తి చేస్తారా.. వాకింగ్, రన్నింగ్ ట్రాక్‌ల పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయని 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనికి స్పందించిన మేయర్ కోవెలమూడి రవీంద్ర పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అధికారులు పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. ప్రస్తుతం జరిగిన తప్పుల్ని సరిదిద్దుతూ పనులు చేపట్టారు. ఈసారైనా ట్రాక్ దెబ్బతినకుండా, మట్టి కొట్టుకుపోకుండా వాకర్స్‌కు నడిచేలా వాకింగ్ ట్రాక్, క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేలా రన్నింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని క్రీడాకారులు, వాకర్స్ కోరుతున్నారు. షాట్‌పుట్ రింగ్, లాంగ్‌జంప్ పిట్ పనులు సైతం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అథ్లెట్స్ విజ్ఞప్తి చేస్తున్నారు.

షాట్‌పుట్ రింగ్ పనులు అసంపూర్తిగా ఇలా..

ఇలా ఉంటే లాంగ్ జంప్ చేసేదెలా...

ఏఎన్ఎంలకు వైద్యారోగ్య శాఖ విధులే కేటాయించాలి

కలెక్టరేట్: ఏఎన్ఎంలకు వైద్యారోగ్య శాఖ విధులను మాత్రమే కేటాయించాలని ఏపీ ఎన్జీఓల సంఘం ఆధ్వర్యంలో ఘంటసాల శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సంఘం నాయకులు పాల్గొన్నారు.

మలేరియా సబ్‌యూనిట్లకు వసతి కల్పించండి

నగరంలోని 1, 3 మలేరియా సబ్ యూనిట్లకు వసతి కల్పించాలని మలేరియా విభాగంలోని అధికారులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. పట్టాభిపురంలోని మలేరియా యూనిట్ను ఇటీవల రాత్రి వేళ పడేస్తున్నామని చెప్పారని, ఆ సమయంలో కార్యాలయంలోని సామగ్రిని భద్రపర్చుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. కార్యాలయం లేకుంటే ప్రజలకు ఏవిధంగా సేవలు అందించగలమన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఏపీ ఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఆరాధ్యుల శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, నగర అధ్యక్షుడు ఎస్వీఎస్ సూరి, వెంకట్‌రెడ్డి, కృష్ణకిశోర్, విజయ్ పలువురు అర్బన్ సచివాలయ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సైనికులకు అందరం అండగా ఉండాలి

గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా సైనిక సంక్షేమ నిధి, ఉద్యోగ మేళా గోడ పత్రికలను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సైనిక సంక్షేమ నిధి పోస్టర్‌ను సోమవారం ఆమె ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైనికులకు అండగా ఉండాలన్నారు.

● రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న పొన్నూరులోని వెలగా నాగేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న ఉద్యోగ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో భగవద్గీత పారాయణం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గీతా జయంతి సందర్భంగా సోమవారం రాత్రి భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం జరిగింది. డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి నిర్వహణలో సత్సంగ సభ్యులు పారాయణం చేశారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ పాలక మండలి సభ్యుల పాల్గొన్నారు.

పారాయణం చేస్తున్న శ్రీరంగనాయకి తదితరులు

గీతా పఠనం.. పంచామృతాభిషేకాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నల్లచెరువు 5వ లైన్‌లో గీతా జయంతి సందర్భంగా స్వరరాగసుధ ఆధ్వర్యంలో భగవద్గీత 21 సార్లు పఠనం చేశారు. కేవీ సాయిబాబాశర్మ, కృష్ణకుమారి, ఆర్వీఎల్ నరసింహారావు బృందంతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ భగవానుడికి పంచామృతాభిషేకాలు, అలంకార పూజ నిర్వహించారు.

పకడ్బందీగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

జిల్లాపరిషత్తు: జిల్లాలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా పట్టణాలు, గ్రామాల్లో పకడ్బందీగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. తాగునీటిని పూర్తి స్థాయిలో క్లోరినేషన్ చేసి ట్యాంకులను శుభ్రం చేసి రక్షిత నీటిని సరఫరా చేయడం ద్వారా కీటక జనిత వ్యాధులు అరికట్టవచ్చన్నారు. పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మండలంలో ఓ గ్రామాన్ని ఎంపిక చేసేందుకు ఎంపీడీవోలు ప్రతిపాదనలు పంపాలన్నారు.

రెక్కల కష్టాన్ని దోచేశారు

కలెక్టరేట్ వద్ద రైతులు, ప్రజల ఆందోళన

గోరంట్ల: రెక్కల కష్టాన్ని దోచేశారని కురగల్లు సొసైటీలో నగదు డిపాజిట్ చేసిన పలువురు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. బాధితులు మాట్లాడుతూ కూలి పనులు చేసుకుంటూ వచ్చిన సొమ్మును కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో దాచుకున్నామన్నారు. ఏళ్లుగా పని చేస్తున్న సొసైటీ సీఈవో రమేష్ నమ్మకంగా డబ్బులు తీసుకున్నాడని, నగదు ఇవ్వాలని కోరుతున్న సమయంలో మాట దాటవేసేవాడన్నారు. నగదును సీఈవో రమేశ్ సొంత వ్యాపారానికి మళ్లించుకున్నాడని తెలిసిందన్నారు. దీంతో ఆందోళన చెంది సహకార బ్యాంకును ఆశ్రయించామన్నారు. ఇటీవల ఆయన్ను సస్పెండ్ చేసి కేసు నమోదు చేశారని, అధికారులు స్పందించి సొమ్ము తిరిగి ఇప్పించాలన్నారు.

తెగిపడుతున్న తీగలతో తిప్పలు

కేబుల్ తీగలతో వాహనచోదకులకు తిప్పలు తప్పడం లేదు. పలు సంస్థలకు చెందిన కేబుల్ వైర్ల చుట్టలు విద్యుత్తు స్తంభాలకు చుడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆ తీగలు తెగి రోడ్లపై పడుతుండడంతో వాహనాలకు చుట్టుకుపోయి చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరమ్మతులు చేసేందుకు విద్యుత్తు స్తంభాల పైకి ఎక్కాలంటే సిబ్బంది పడుతున్న వెతలు అన్నీ ఇన్నీ కావు. ఇటీవల కేబుల్ వైర్లు కాలిపోయిన ఘటనలున్నాయి. వైర్ల చుట్టలతో పాటు జంక్షన్ బాక్సులు ఇష్టం వచ్చినట్లు వేలాడదీస్తుండడం వల్లే సమస్యలు వస్తున్నాయంటున్నారు. కృష్ణనగర్‌లో ఒక అడ్డరోడ్డులో మలుపు తిరిగే వద్ద తెగిన కేబుల్ తీగలతో పరిస్థితిదీ. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

ఏ వీధిలో చూసినా వ్యర్థాలే..

ప్రశాంతినగర్‌లో రోడ్డు పక్కన డంపర్ బిన్లలో చెత్త, వ్యర్థాలు

నగరపాలక సంస్థలో విలీనమైన రెడ్డిపాలెం గ్రామంలోని కాలనీల్లో పారిశుద్ధ్యం నిర్వహణపై అధికారులు దృష్టి సారించడం లేదు. సరస్వతికాలనీ ప్రధాన రహదారితో పాటు అంతర్గత వీధుల్లోనూ చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. ప్రధాన రహదారిలో చెత్తను సేకరించే ట్రాలీ మీదనే వ్యర్థాలు గుట్టలుగా ఉండడం గమనార్హం. అమరావతి రోడ్డు నగరాలు ప్రశాంతినగర్‌లో డంపర్ బిన్లలో చెత్త, వ్యర్థాలు నిండి రోడ్డుపై పడుతున్నాయి. జీఎంసీ అధికారులు.. వీధుల్లో చెత్త, వ్యర్థాలు నిల్వ లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు

శివారు.. వసతులు కానరావు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే

గాయత్రి నగర్‌లో అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డు

గుంటూరు శివారు ప్రాంతాల ప్రజలు కనీస వసతులు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. నగరంలో అంతర్భాగంగా ఉన్నప్పటికీ పలు ప్రాంతాల్లో తాగునీరు సరఫరా జరగడంలేదు. వందల సంఖ్యలో నివాసాలు ఉన్నప్పటికీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు శివారు ప్రాంతాల ప్రజలు పలుమార్లు అర్జీలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కావడంలేదు.

☛ మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు సెకండ్ ఫేజ్‌లో రహదారికి ఇరువైపులా నివాసాలు ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజలకు తాగునీరు అందించడంలేదు. రహదారికి ఇరువైపులా బహుళ అంతస్తుల భవనాలు వందల సంఖ్యలో నిర్మించారు. వ్యక్తిగత నివాసగృహాలు వేలల్లో ఉన్నాయి. వీరంతా ఐదేళ్లుగా నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. 'పన్నులు కడుతున్నాం వసతులు కల్పించండి' అని ప్రజలు గగ్గోలు పెడుతున్నా అధికారులకు పట్టడంలేదు.

గోరంట్ల తాగునీటి పథకం అందుబాటులోకి వస్తేనే..

☛ ఇన్నర్ రింగ్‌రోడ్డులోని గాయత్రినగర్, శ్రీరామ్ నగర్, హనుమాన్ నగర్ తదితర ప్రాంతాలు ఏర్పడి ఐదేళ్లు గడిచినా ఇంతవరకు తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయలేదు. గోరంట్ల కొండపైన నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు నిలిచిపోవడంతో పలు ప్రాంతాల్లో అంతర్గత పైపులైన్లు ఏర్పాటు చేయలేదు. గోరంట్ల కొండపైన నీటి పథకం అందుబాటులోకి వస్తేనే గుంటూరు శివారు ప్రాంతాల ప్రజల తాగునీటి ఇబ్బందులకు పరిష్కారం లభిస్తుంది. 2019లో ప్రారంభమైన ఈ పథకం పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి. ☛ ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతర్గత వీధులు అధ్వానంగా ఉండడంతో కాలనీ ప్రజలు నడవడానికి నరకయాతన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించి, రోడ్లు నిర్మించాలని గాయత్రినగర్, శ్రీరామ నగర్ తదితర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

అవగాహనతో ఉండండి.. అపోహలు వీడండి..

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని, పరీక్షలు చేయించుకుని ఎటువంటి అపోహలు లేకుండా సురక్షితంగా ఉండాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా కలెక్టరేట్ నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతిలోనే ఉందన్నారు. హెచ్ఐవీ పరీక్ష చేయించుకోండి- సమాచారం కలిగి ఉండండి-సురక్షితంగా ఉండండి అనే నినాదంతో ప్రపంచ ఎయిడ్స్ దినం ఈ ఏడాది నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి సోకిన వ్యక్తులు వివక్షకు గురికాకుండా, ఆత్మస్థైర్యంతో మంచి జీవితం గడిపేందుకు పీపుల్ నెట్‌వర్క్ సంస్థలు పని చేస్తున్నాయన్నారు. సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్.ఎస్.కె. ఖాజావలి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏటీ అగ్రహారం: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బత్తుల ఉమాదేవి నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ సమన్వయకర్తలు ఎన్.మాధవీలత, జి.సుచరిత ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతలతో కళాశాల ప్రిన్సిపల్ ఉమాదేవి

గోరంట్ల: ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైరస్ వ్యాప్తిపై ప్రదర్శన ద్వారా సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు జె.ఆదిలక్ష్మి, కె.సుస్మిత పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రదర్శన

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బాలాజీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని కార్పొరేటర్ నూకవరపు బాలాజీ పేర్కొన్నారు. విజయపురి కాలనీలో రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం ఆయన భూమి పూజ నిర్వహించారు. బాలాజీ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో విజయపురికాలనీ ఏడో లైను ప్రధాన రహదారిని పట్టించుకోకపోవడంతో గుంతలమయంగా తయారై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్య క్రమంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

జీవనోపాధుల యూనిట్ల నిర్వహణపై శిక్షణ నేడు

జిల్లాపరిషత్తు: జిల్లాలోని మండల సమాఖ్యల ప్రతినిధులు, ఏపీఎంలు, ఎఫ్‌పీవో సీసీలు, బోర్డు డైరెక్టర్లు, సిబ్బందికి.. జీవనోపాధుల యూనిట్ల నిర్వహణపై లాం కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వి.విజయలక్ష్మి.. సిబ్బందిని శిక్షణకు హాజరుకావాలని ఆదేశించారు.

భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించాలి

రాజా మాస్టారుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, తెదేపా నేత దాసరి రాజా మాస్టారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. శ్రీవికాస్ విద్యా సంస్థల ఆవరణలో దాసరి రాజా మాస్టారు జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మహంకాళి నరసింహారావు, ఎర్రగోపు నాగేశ్వరరావు, గుడిపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం ఏర్పాటుకు వినతి

పట్టాభిపురం: రాజధాని అమరావతిలో అబ్దుల్ కలాం పేరిట పది ఎకరాల స్థలంలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకమేడల అప్పారావు, సభ్యులు యర్రా నాగేశ్వరరావు, తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్‌వజీర్ కోరారు. ఫౌండేషన్ సభ్యులు మంత్రి లోకేశ్‌కు రాష్ట్ర మైనార్టీ సలహాదారు ఎంఏ షరీఫ్ ద్వారా వినతిపత్రం అందజేశారు.

13న క్విజ్, స్పెల్-బి పోటీలు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కృష్ణప్రసాద్ తదితరులు

నవభారత్ నగర్, న్యూస్‌టుడే: గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పాఠశాలలో ఈనెల 13న రాష్ట్ర స్థాయి సూపర్‌క్విజ్-బి, 14న జిల్లా స్థాయి స్పెల్-బి పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. పోటీలకు సంబంధించిన కరపత్రాలను పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.రత్తయ్యతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ రెండు పోటీల్లో పాల్గొనడానికి 8, 9, 10 తరగతుల విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. వివరాలకు 99482 27362, 99482 27362 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫ్లాట్ కోసం చెల్లించిన నగదు వడ్డీతో తిరిగివ్వాలి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఫ్లాట్ కోసం చెల్లించిన నగదును వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని మచిలీపట్నం వినియోగదారుల కమిషన్ సోమవారం తీర్పు చెప్పింది. మచిలీపట్నంకు చెందిన వి.శ్రీదుర్గ గుంటూరుకు చెందిన ఎఫ్ఐఆర్ఎంయూఏఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో 2020 నవంబరు 4న ఒక్కో ఫ్లాట్ రూ.33.78లక్షల చొప్పున రెండు కొనుగోలు చేశారు. రెండింటికి కలిపి రూ.62 లక్షలు చెల్లించారు. మిగిలిన మొత్తం ఫ్లాట్లు స్వాధీనం చేసిన తరవాత ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. నిబంధనల ప్రకారం 2021 జనవరిలో ఫ్లాట్స్ అప్పగించాలి. నాలుగేళ్లు అవుతున్నా ఫ్లాట్లు కేటాయించకపోగా నిర్మాణం కూడా పూర్తి చేయలేదు. సంస్థ యాజమాన్యాన్ని పలుమార్లు సంప్రదించినా స్పందించకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్ 23న లీగల్ నోటీసులు పంపించినా సమాధానం రాలేదు. బ్యాంకు రుణం తీసుకుని చెల్లించడంతో నెలవారీ వాయిదాలు భారంగా మారిన తరుణంలో ఆమె వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిర్వహించి కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం ఒక్కో ఫ్లాట్‌కు రూ.31లక్షల చొప్పున రెండు ఫ్లాట్లకు కట్టిన రూ.62లక్షలను 9 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలని కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యురాలు శ్రీలక్ష్మీ రాయల తీర్పు చెప్పారు. తీర్పు వెలువరించిన నాటి నుంచి 30 రోజుల్లోపు ఆ మొత్తాన్ని చెల్లించాలని, లేదంటే 12 శాతం వడ్డీతో ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. మానసిక వేదన కలిగించినందుకు రూ.5లక్షలు, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.25వేలు అదనంగా ఫిర్యాదుదారుకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

వ్యాధిరహిత సమాజమే లక్ష్యం కావాలి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

ఎస్వీఎన్‌కాలనీ: వ్యాధిరహిత సమాజమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని జేకేసీ కళాశాల ప్రిన్సిపల్ పి.గోపీచంద్ అన్నారు. దీర్ఘాయుష్మాన్ సహకారంతో కళాశాల ఎక్స్‌టెన్షన్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆరోగ్యవాహిని, జీవన సేతు ద్వారా సేవలందిస్తున్నట్లు దీర్ఘాయుష్మాన్ సమన్వయకర్త శ్రీవల్లి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ఎక్స్‌టెన్షన్ విభాగం సమన్వయకర్త పి.నాగసుశీల, అధ్యాపకులు ప్రశాంతి, చరణ్, అజయ్‌బాబు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

నా క్లయింటు ఏలూరి బాల దత్త కుమార్, తండ్రి : గురవయ్య, గుంటూరు. ఏలూరి బాల దత్త కుమార్ పేరిట గల ఒరిజినల్ దస్తావేజునకు సంబంధించిన లింకు దస్తావేజు అయిన గురవయ్య గారి పేరిటకు APIIC (Auto Nagar, Guntur) వారి ద్వారా క్రయం పొంది దస్తావేజు నెం.3682/1992 గా గుంటూరు జిల్లా రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన దస్తావేజు ది.25-11-2025 న గుంటూరు లో లక్ష్మీపురం నుండి నగరంపాలెం కు ప్రయాణిస్తుండగా పోయినవి. సదరు లింకు దస్తావేజు దొరికిన వారు ఈ క్రింది అడ్రసు లో ఇవ్వవలసినదిగా కోరుచున్నాము. ఒరిజినల్ లింకు దస్తావేజు వెతికి తెచ్చిన వారికి తగిన పారితోషకము ఇవ్వబడును.

Sanam Padmaja, Advocate
3/1, Arundelpet, Guntur. Cell : 9949524655

In The Court of Additional Civil Judge (Senior Division) Narasaraopet

IA 765/2024 in IA 456/2023 in OS 42/2023

Upputuri Venkata Rao ...Petitioner/Plaintiff

Pamulapati Bhavani Prasad (Died) and Others ...Respondents/ Defendant & Proposed Parties

To (R4): Pamulapati Sudeep, S/o. Late Bhavani Prasad, 11-970/1, JKC College Road, 5th Lane, Vijayapuri Colony, Guntur.

పై నెంబర్ దావాలో వారసుల పిటీషన్ IA 765/2024 నెంబర్న శ్రీ కోర్టు వారి ... వాయిదా తేదీ: 19-12-2025

N.Lakshmi Narayana, Advocate for Petitioner/Plaintiff, Arundelpet, Narasaraopet

In The Court of Additional Civil Judge (Senior Division) Narasaraopet

IA 766/2024 in IA 456/2023 in OS 42/2023

Upputuri Venkata Rao ...Petitioner/Plaintiff

Pamulapati Bhavani Prasad (Died) and Others ...Respondents/ Defendant & Proposed Parties

To (R4): Pamulapati Sudeep, S/o. Late Bhavani Prasad, 11-970/1, JKC College Road, 5th Lane, Vijayapuri Colony, Guntur.

పై నెంబర్ దావాలో వారసుల పిటీషన్ IA 766/2024 ... వాయిదా తేదీ: 19-12-2025

N.Lakshmi Narayana, Advocate for Petitioner/Plaintiff, Arundelpet, Narasaraopet

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE(SENIOR DIVISION): GUNTUR SUCCESSION O.P. No. 79/2025

Between: 1) Perumalla Lalitha Kalyani, 2) Perumalla Koteswara Rao, 3) Perumalla Sathya Varshini ...Petitioners

and Nil ...Respondents

Perumalla Gangadhara Rao, S/o. Koteswara Rao from Indusind Bank, Arundelpet Branch, Guntur ... ది.19-12-2025వ తేదీ ఉదయం 10-30ని.లకు ...

Schedule: 1) FDR A/c. No.300916952 79, Amount Rs.10,80,000/- 2) FDR A/c. No.300930794544, Amount Rs.25,00,000/- 3) FDR A/c. 300857795457, Amount Rs.10,00,000/- 4) FDR A/c. No.300945523771, Amount Rs.35,00,000/- 5) FDR A/c. No.300945523924, Amount Rs.35,00,000/-

ఫారం ఐఎన్‌సి- 26

(కంపెనీస్ (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014 యొక్క రూల్ 30(5)(ఎ)ని అనుసరించి)

కేంద్ర ప్రభుత్వము

రీజినల్ డైరెక్టర్, సౌత్ ఈస్ట్ రీజియన్, హైదరాబాద్‌వారి సమక్షంలో

బ్రెవిటి సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్

(CIN: U72900AP2009PTC065413)

రిజిస్టర్డు ఆఫీసు: డి.నెం.26-29-89, 9వ లేన్, అగ్రహారం, గుంటూరు-522 004, ఆంధ్రప్రదేశ్ విషయంలో.

కంపెనీల చట్టం 2013 యొక్క సెక్షన్ 13(4)లోని నిబంధనలననుసరించి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రానికి తన రిజిస్టర్డు ఆఫీసును తరలించుటకు రీజినల్ డైరెక్టర్‌కు ఒక దరఖాస్తును దాఖలు చేయవలెనని కంపెనీ ప్రతిపాదించినది.

కార్యకలాపాలు, క్లయింట్లు, ఉద్యోగులు మరియు డైరెక్టర్లు ప్రాథమికంగా హైదరాబాద్, తెలంగాణలో ఉన్నందున పాలనా సౌకర్యం నిమిత్తం కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించినది.

రిజిస్టర్డు ఆఫీసు మార్పునకు సంబంధించి స్థాపన పత్రం యొక్క ప్రతిపాదిత సవరణ వలన ప్రయోజనం ప్రభావితమయ్యే అవకాశంగల ఎవరేని వ్యక్తి ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 21 రోజుల్లోగా చిరునామా: **రీజినల్ డైరెక్టర్ (సౌత్ ఈస్ట్ రీజియన్),** కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, 3వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500 068, తెలంగాణకు తెలియజేయవచ్చును.

బ్రెవిటి సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున
రాజశేఖర్ వెనుమల
డైరెక్టర్, డిఐఎన్: 03638863

తేది:1-12-2025
ప్రదేశం: గుంటూరు
ఇమెయిల్ ఐడి: shareholders@brevitytech.com

విజయవాడకు.. మరో మణిహారం!

- గొల్లపూడి-కనకదుర్గ వారధి మధ్య భారీ పైవంతెన
- ఎన్‌హెచ్-65 విస్తరణలో 5 కి.మీ. మేర నిర్మాణం

గొల్లపూడి ప్రాంతం

ఈనాడు – అమరావతి

విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్-65 ఆరు వరుసల విస్తరణలో భాగంగా నగర పరిధిలో భారీ పైవంతెన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. గొల్లపూడి నుంచి కనకదుర్గ వారధి వరకు 5 కి.మీ. మేర దీన్ని నిర్మించే ప్రతిపాదనలను కన్సల్టెన్సీ డీపీఆర్‌లో పొందుపరిచింది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే వారికి ఈప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ పరీక్ష పెడుతోంది. ఈ పైవంతెన నిర్మిస్తే సాఫీగా రావచ్చు. ప్రస్తుత రహదారిని సర్వీస్ రోడ్డుగా మారుస్తారు.

రూ. 500 కోట్ల వ్యయం...

❖ ఆరులైన్ల విస్తరణకు అవసరమైన భూమి వెడల్పు (ఆర్ఓడబ్ల్యూ) 60 మీటర్లు ఉండాలి. ఇక్కడ 40-50 మీటర్ల మధ్యలో ఉంది. రహదారి పక్కన భూమి మార్కెట్ విలువ గజం రూ. లక్ష ఉంది.

❖ ఈ ఐదు కిలోమీటర్లు భూమి సేకరించి విస్తరించాలంటే రూ.వెయ్యి కోట్లు అవసరమని ఎన్‌హెచ్ అంచనా. పైవంతెన అయితే.. రూ.500 కోట్లు చాలు. అన్ని విధాలుగా ప్రయోజనం కూడా.

❖ ఈ ప్రాంతం.. దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలకు కేంద్రం. ఆవాస గృహాలూ ఉన్నాయి. విస్తరణ నేపథ్యంలో భూమి సేకరిస్తే ఇవన్నీ తొలగించాల్సిందే.

❖ ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో భారీ పైవంతెన నిర్మాణం కష్టమని భావించినా.. ఒకవైపు ట్రాఫిక్ వదిలి మరోవైపు నిర్మించాలని నిర్ణయించారు.

❖ ప్రస్తుతం డీపీఆర్ ప్రాజెక్టు అప్రైజల్ అండ్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీ(పీఏటీఎస్‌సీ) ముందుకు వెళ్లింది. అక్కడ ఆమోదిస్తే మిగిలిన దశల్లో పరిశీలన పూర్తయ్యాక 2026 ఏప్రిల్ నాటికి పనులు మొదలయ్యే వీలుంది.

శేషమ్మ సంకల్పం.. శ్రీవారి ఆలయం సాకారం

తిరుమల వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం, శ్రీవారి కల్యాణోత్సవాలు నిర్వహించడం ఆమె జీవనంలో ఒక భాగమైంది. ఆ దేవదేవుడికి తన వంతుగా సేవ చేయడానికి ఓ ఆలయం నిర్మించాలనుకుంది. అలా 30 ఏళ్లుగా ఆ ఆలోచన తన మదిలో ఉండిపోయింది. జీవిత చరమాంకంలోనైనా దాన్ని కార్యరూపంలోకి తేవడానికి సిద్ధపడింది. అందుకు రూ.కోటి విలువ చేసే స్థలం ఇవ్వడంతో పాటు ఆలయ నిర్మాణానికి మరో రూ.కోటి విరాళంగా అందించింది. కంకిపాడు మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన భీమవరపు శేషమ్మ(90) వేంకటేశ్వరుడికి పరమభక్తురాలు. గుడి నిర్మిద్దామని నిర్ణయించుకున్న తర్వాత గ్రామ పరిధిలో జాతీయ రహదారికి సమీపంలో ప్రధాన మార్గానికి పక్కనే ఉన్న 30 సెంట్ల స్థలాన్ని గతేడాది కేటాయించింది. అంతేకాకుండా పనుల కోసం రూ.కోటి ఇచ్చింది. ఎట్టకేలకు 90 శాతం పనులు పూర్తికాగా త్వరలోనే ప్రతిష్ఠాపనోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమె సంకల్పానికి కుటుంబ సభ్యుల సహకారం తోడవడంతో ఇదంతా సాధ్యమైంది. భక్తులకు ఆపదమొక్కులవాడి దర్శన భాగ్యం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు శేషమ్మ చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు(కంకిపాడు)

దారిపైనే ధాన్యం.. దాచలేక దైన్యం..

రైతులను వణికిస్తున్న చిరుజల్లులు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం, న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

చినముత్తేవి: రోడ్డుపై పట్టాలతో కప్పిన రాశులు

జిల్లాలో ధాన్యం ఆరబోసుకున్న రైతులను మబ్బు పట్టిన మేఘాలు, చిరు జల్లులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. మొంథా తుపానుకు పంటలు నేలవాలిపోవడంతో జిల్లాలోని చాలా మండలాల్లో ధాన్యం రంగు మారి.. మానుగాయి వచ్చింది. దీంతో మిల్లర్లు ధాన్యం కొనేందుకు ముందుకు రావట్లేదు. చాలాచోట్ల పీపీసీలను, ఆర్‌బీకేల్లోని సిబ్బంది, వారి సన్నిహితులే దళారుల అవతారమెత్తారు. గోనెసంచులు, లారీలను వీరు బేరం ఆడుకున్నవారికి మాత్రమే పంపుతున్నారు. దీంతో మిగిలిన రైతులకు సంచులు, లారీలు దొరకట్లేదు. చిరుజల్లులు పడుతుండడంతో దళారులు రూ. 1200కు బస్తా అడుగుతున్నారు. పామర్రు, మొవ్వ, పమిడిముక్కల, మోపిదేవి, పెడన, మచిలీపట్నం తదితర మండలాల్లో ధాన్యం నాలుగైదు రోజులుగా రోడ్లపైనే ఉంది.

వేధిస్తున్న లారీలు, గోనెసంచుల కొరత.. పెనమలూరు, గుడివాడ నియోజకవర్గాల్లో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మొవ్వ, పామర్రు, పమిడిముక్కల, పెదపారుపూడి, మోపిదేవి తదితర మండలాల్లోని ఆర్‌బీకేలకు 10 రోజులుగా లారీలు రావట్లేదు. మొవ్వ మండలంలోని కోసూరు, కాజ, చినముత్తేవి, నిడుమోలు తదితర గ్రామాల్లో కొన్ని చోట్ల 17 శాతం లోపే తేమ ఉన్నా గోనె సంచులు ఇవ్వట్లేదని రైతులు వాపోతున్నారు.

ఇప్పటివరకు సేకరించిన ధాన్యం:	1.75లక్షల టన్నులు
విక్రయించిన రైతులు:	20,917
ఖాతాల్లో నగదు జమ:	రూ.409కోట్లు
కోతలు జరిగినవి:	59వేల హెక్టార్లు
ఇంకా జరగాల్సినవి:	లక్ష హెక్టార్లు

వేడికి నల్లగా మారుతోంది:

– రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కాజ

నాలుగు రోజుల నుంచి రైతు సేవా కేంద్రం వద్దే ధాన్యం ఆరబోసుకున్నా. చినుకులు పడడంతో కుప్పగా వేసి పట్టాలు కప్పా. వేడికి నల్లగా మారిపోతోంది. 24 శాతం తేమ ఉంది. మిల్లులకు వెళ్లిన లారీలు మళ్లీ తిరిగిరావట్లేదు.

బస్తా రూ.1200కు అడిగారు: – డి.బాబూరావు, చినముత్తేవి

యంత్రం వచ్చిందని శనివారం సాయంత్రం పంట కోసి రోడ్డుపై ఆరబోసుకున్నా. తేమ శాతం ఎక్కువగా ఉందని రూ.1200కు బస్తా అడిగారు. ఓ వైపు వర్షం వస్తోంది. వారం నుంచి ఆరబోసుకున్నవారికే అధికారులు కొనలేదు. ఆధ్వాన్నమైనా దళారులకే ఇచ్చేసి.. మినుము వేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి.

ఇబ్బంది లేకుండా చూస్తాం: ఎం.నవీన్, జేసీ

ఒకేసారి పంటలు కోయడంతో కొన్నిచోట్ల లారీలు, గోనెసంచులు సమయానికి వెళ్లట్లేదని మా దృష్టికి వచ్చింది. గోనెసంచులు, లారీలు మరిన్ని పెంచి ఇబ్బంది లేకుండా చూస్తాం. రంగుమారినా కొనుగోలు చేస్తాం.

రాయనపాడులో దిగితే.. అంతే..!

- అర్ధరాత్రి దాటాక ఆగే రైళ్లే అధికం..
- స్టేషన్ నుంచి ఇంటికెళ్లాలంటే చుక్కలే

అమృత్ భారత్‌లో భాగంగా తీర్చిదిద్దిన రాయనపాడు స్టేషన్

“రాయనపాడు రైల్వేస్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా మారుస్తామని ఆరేళ్ల కిందట ప్రకటించారు. 2019 డిసెంబరు నుంచి ప్రయోగాత్మకంగా కొన్ని రైళ్లను మళ్లించి అక్కడ ఆపుతున్నారు. రాజమహేంద్రవరం, వరంగల్ వైపు వెళ్లే ఏడేసి రైళ్లను ఆపుతున్నా వీటిలో అర్ధరాత్రి ఆగేవే అధికం.”

“ఆ సమయంలో... స్టేషన్ నుంచి నగరానికి చేరేదెట్లు.. ప్రైవేటు వాహనాలు, ఆటోలే దిక్కు. ఆర్టీసీకి లేఖలు రాసినా స్పందించలేదని రైల్వే చెప్పారు. తాజాగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా.. రాయనపాడును అభివృద్ధి చేశారు. ఇప్పటికైనా రవాణా సౌకర్యాలపై దృష్టి పెట్టాలి.”

ఈనాడు – అమరావతి

విజయవాడ రాకుండా రాయనపాడు నుంచి గుండలకు నేరుగా బైపాస్‌లో కొన్ని రైళ్లను ఆరేళ్ల కిందట పంపించారు. తర్వాత కొన్ని ప్రత్యేక రైళ్లను రాయనపాడు మీదుగా మళ్లించారు. ఆపై రాయనపాడు స్టేషన్ నుంచి విజయవాడ ఈశాన్య కేబిన్ మీదుగా.. బల్క్‌కేబిన్ పక్కనుంచి నేరుగా గుండల రైల్వే [illegible] చేరుకునేలా దారేశారు. ఈదారిని గతంలో గూడ్స్ రైళ్లు తిప్పేందుకు వాడేవారు. తర్వాత ఎక్స్‌ప్రెస్‌లు నడిచేలా మార్చారు. ఈ ట్రాక్‌పై ప్రత్యేక రైళ్ల రాకపోకలు సత్ఫలితాలు ఇవ్వడంతో... పూర్తిస్థాయిలో రోజువారీ ఎక్స్‌ప్రెస్ రైళ్లనూ నడపడం ఆరంభించారు.

14 రైళ్లను ఆపుతున్నా... విజయవాడ స్టేషన్‌తో సంబంధం లేకుండా 2020 ఏప్రిల్ నుంచి రాయనపాడు నుంచి నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లను... కాకినాడ పోర్ట్-లింగంపల్లి గౌతమి(12737/38), కాకినాడటౌన్-లింగంపల్లి కోకెనడా(12775/76), నాందేడ్-సంబల్‌పూర్(20809/10), విశాఖ-నాందేడ్ (20811/12) నడపడం ఆరంభించారు. ఇప్పటికీ ఇవే ఇక్కడి నుంచి నడిచే ప్రధాన రైళ్లు. అవికాకుండా.. పండగలు, సెలవుల్లో నడిపే రైళ్లనూ రాయనపాడులోనే ఆపుతున్నారు. ప్రయాణికులు తెలియక.. విజయవాడ అనుకుని రాయనపాడుకు టిక్కెట్ బుక్ చేసుకుంటే.. అంతే.. ఏ అర్ధరాత్రో రైల్లోంచి ఆగుతుంది. అక్కడి నుంచి ఇంటికెలా వెళ్లాలో తెలియక.. ఆటోవాలాల బాదుడు భరించలేక లబోదిబోమంటున్నారు.

రవాణా సౌకర్యాలే కీలకం... హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు.. రాయనపాడుకు రావడానికి ఎంత ఖర్చవుతుందో, ఇక్కడి నుంచి ఇంటికి చేరడానికి అంతే అవుతోంది. ప్రస్తుతం ఆగుతున్న రైళ్లలో అధికంగా అర్ధరాత్రి 12.30, 1, 2 గంటలకు వస్తున్నవే అధికం. ఆర్టీసీ 24 గంటల సర్వీసులను ఆరంభిస్తామని ఆరేళ్ల కిందట చెప్పినా ఒక్క సర్వీసునూ నడపక పోవడంతో ప్రయాణికులకు వాత తప్పడం లేదు.

అంబేడ్కర్ భవన్‌కు.. రూ.10 కోట్లు!

- సీఎస్సార్ కింద కోల్ ఇండియా మంజూరు
- ఫలించిన ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి

ఈనాడు, అమరావతి: మచిలీపట్నంలో అంబేడ్కర్ భవన్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తొలి అడుగు పడింది. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌గా దీనిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకురూ.10 కోట్ల నిధులను కోల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సీఎస్సార్ కింద మంజూరు చేసింది. ఎంపీ బాలశౌరి విజ్ఞప్తి మేరకు. . నిధులను ఇచ్చేందుకు ముందుకొచ్చిన సంస్థ.. తొలిగా రూ.4 కోట్లు మంజూరు చేస్తూ కలెక్టర్‌కు లేఖ పంపింది.

బందరులోని జిల్లా కోర్టు సెంటర్‌లో సాయిబాబా ఆలయం వెనుక వైపున అంబేడ్కర్ భవన్ అభివృద్ధికి రూ.5 కోట్లను మంజూరు చేస్తామని వైకాపా జమానాలో పేర్ని నాని హడావుడి చేశారు. నాటి సీఎం జగన్‌తోనే రూ.5 కోట్లను ఇస్తామని చెప్పించినా.. ఒక్క రూపాయి ఇవ్వలేదు. దీనిని అభివృద్ధి చేయాలని.. అంబేడ్కర్ అభిమానులు, ఎస్సీ నాయకులు ఏళ్లుగా విన్నవిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. అంబేడ్కర్ భవన్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎంపీ బాలశౌరి గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. గెలిచాక.. సీఎస్సార్ కింద నిధులు తెచ్చేందుకు ఆయన చేసిన కృషి ఫలించింది. అంబేడ్కర్ భవన్‌లో ఒక స్టడీ సర్కిల్, సెమినార్ హాలు, నైపుణ్య, ఉద్యోగ, ఉపాధి శిక్షణ, సోషల్ వెల్ఫేర్ కార్యక్రమాల నిర్వహణకు, విద్యార్థులు, ఉద్యోగార్థులకు అవసరమైన గదులు నిర్మిస్తామని గతంలో ప్రకటించారు.

అందరితో చర్చించాకే అభివృద్ధి.. అంబేడ్కర్ భవన్ అభివృద్ధిపై ఎస్సీ సంఘాల నాయకులు, అంబేడ్కర్ అభిమానులతో సమావేశమై.. చర్చించి నిర్ణయిస్తామని ఎంపీ బాలశౌరి వెల్లడించారు. వారి అవసరాల మేరకు ఏ సౌకర్యాలు కల్పించాలో అన్నీ సమకూరుస్తామన్నారు. నిధులు మంజూరు చేసిన కోల్ ఇండియా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లాట్ కోసం చెల్లించిన నగదు వడ్డీతో తిరిగివ్వాలి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఫ్లాట్ కోసం చెల్లించిన నగదును వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని మచిలీపట్నం వినియోగదారుల కమిషన్ సోమవారం తీర్పు చెప్పింది. మచిలీపట్నంకు చెందిన వి.శ్రీదుర్గ గుంటూరుకు చెందిన ఎఫ్ఐఆర్ఎంయూఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో 2020 నవంబరు 4న ఒక్కో ఫ్లాట్ రూ.33.78లక్షల చొప్పున రెండు కొనుగోలు చేశారు. రెండింటికి కలిపి రూ.62లక్షలు చెల్లించారు. మిగిలిన మొత్తం ఫ్లాట్లు స్వాధీనం చేసిన తరవాత ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. నిబంధనల ప్రకారం 2021 జనవరిలో ఫ్లాట్స్ అప్పగించాలి. నాలుగేళ్లు అవుతున్నా ఫ్లాట్లు కేటాయించకపోగా నిర్మాణం కూడా పూర్తి చేయలేదు. సంస్థ యాజమాన్యాన్ని పలు మార్లు సంప్రదించినా స్పందించకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్ 23న లీగల్ నోటీసులు పంపించినా సమాధానం రాలేదు. బ్యాంకు రుణం తీసుకుని చెల్లించడంతో నెలవారీ వాయిదాలు భారంగా మారిన తరుణంలో ఆమె వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిర్వహించి కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం ఒక్కో ఫ్లాట్‌కు రూ.31లక్షల చొప్పున రెండు ఫ్లాట్లకు కట్టిన రూ.62లక్షలను 9 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలని కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యురాలు శ్రీలక్ష్మీ రాయల తీర్పు చెప్పారు. తీర్పు వెలువరించిన నాటి నుంచి 30 రోజుల్లోపు ఆ మొత్తాన్ని చెల్లించాలని, లేదంటే 12 శాతం వడ్డీతో ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. మానసిక వేదన కలిగించినందుకు రూ.5లక్షలు, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.25వేలు అదనంగా ఫిర్యాదుదారుకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

ఆలోచించండి.. ఓ అమ్మానాన్నా!

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

- విద్యార్థుల నడవడికపై శ్రద్ధ పెట్టండి..
- ‘పీటీఎం’లకు అందరూ హాజరైతేనే మేలు

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) కీలక వేదికగా పనిచేస్తుంది. గతంలో ఈ సమావేశాలు మొక్కుబడిగా జరిగేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. పిల్లలను ఉన్నతంగా చదివించి.. మంచి ఉద్యోగం చేసేలా తీర్చిదిద్దాలన్నది కన్నవారి ఆశ. పాఠశాలకు వెళ్లి వారి నడవడిక, చదువు, ఆటల్లో సామర్థ్యం, ఎందులో వెనకపడ్డారు.. ఉన్నతంగా రాణించాలంటే ఏం చేయాలి.. తదితర వివరాలను ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. సర్కారు బడుల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు పనికెళ్తేకానీ ఇల్లు గడవకపోవడంతో సమావేశాలకు హాజరు కాలేకపోతున్నారు. కనీసం మూడు నెలలకోసారైనా పాఠశాలకు వెళ్లి విద్యార్థుల చదువు, వ్యక్తిత్వం, నడవడిక తెలుసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. డిసెంబరు 5న నిర్వహించనున్న పీటీఎంకు ప్రతి విద్యార్థి తల్లి లేదా తండ్రి వచ్చేలా అధికారులు సన్నహాలు ప్రారంభించారు.

ఆ ఒక్కరోజు వీలుకల్పించుకుంటే..!

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో గ్రామీణ ప్రాంతానికి చెందిన, పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే ఎక్కువ. ఇంట్లో తల్లిదండ్రులిద్దరూ పనికి వెళ్లి రాత్రి ఆలస్యంగా ఇంటికొస్తున్నారు. పిల్లలపై పూర్తి శ్రద్ధ పెట్టలేకపోవడంతో కొందరు పక్కదారి పడుతున్నారు. పిల్లలు ఇంటికి రాగానే ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఆ ఒక్కరోజు సమావేశానికి వెళ్తే పిల్లల్లో లోపాలున్నా, సరిగ్గా చదవకపోయినా ఉపాధ్యాయులు వాటిని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లే వీలుంది.

★ గతంలో పీటీఎం నిర్వహణలో ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో అందరి ప్రగతిని ఒకే రోజు సమీక్షించడం కష్టమైంది. చాలాచోట్ల సరైన వేదికలు లేకపోవడంతో అందరినీ ఒకేచోట సమావేశ పరచడం ఇబ్బందిగా మారింది. ఈసారి సమావేశంలో 100 శాతం పిల్లలు, తల్లిదండ్రుల హాజరు ఉండేలా అవగాహన కల్పిస్తున్నామని డీఈవో రామారావు తెలిపారు.

- జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు : 1,842
- విద్యార్థులు : 2,65,574
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలు : 8
- విద్యార్థులు : 3,000

తల్లిదండ్రులు తప్పక హాజరు కావాలి

– కలెక్టర్ బాలాజీ

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య వారధిగా ప్రభుత్వం ఈ సమావేశాలను ఏర్పాటు చేస్తోంది. ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లోనే సమావేశాలు నిర్వహిస్తున్నాం. పిల్లల ప్రస్తుత పురోగతిపై కన్నవారికి వివరించి 100 రోజుల ప్రణాళిక ప్రకారం వచ్చే సమావేశంలో పిల్లలు ఎలాంటి పురోగతి సాధించారో వివరిస్తాం. అందరు తల్లిదండ్రులు తప్పకుండా హాజరుకావాలి.

పర్యాటక అభివృద్ధికి హోంస్టేలు సువర్ణావకాశం

పాయకాపురం: పర్యాటక అభివృద్ధికి హోంస్టేలు ఒక సువర్ణావకాశం అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో రాష్ట్ర పర్యాటక విధానం-హోంస్టేస్, బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానంపై సమన్వయశాఖల అధికారులకు కార్యశాల నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యాటకులు స్థానిక ఇళ్లల్లో ఆతిథ్యం, సంస్కృతి సంప్రదాయాల ఔన్నత్యం వంటివి తెలుసుకోవడం, ప్రత్యేక రుచులను ఆస్వాదించడం వంటివి హోంస్టేస్, బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానాలతో వీలవుతుందని తెలిపారు. 2029 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా పది వేలకు పైగా రిజిస్టర్ హోంస్టేల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని వివరించారు. వీటిపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఔత్సాహికులు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. వాటి యజమానులకు విద్యుత్తు నీటి సరఫరా, ఆస్తి పన్నుల్లో రాయితీ ప్రయోజనాలు ఉంటాయన్నారు. జిల్లాను నంబర్-1గా నిలిపేందుకు అధికారులంతా కృషి చేయాలని కోరారు.

అక్షర ఆడితే.. పతకం సొంతమే

న్యూస్‌టుడే, కానూరు, పోరంకి

పోరంకికి చెందిన **ఆళ్ల అక్షర** వయసు పదమూడు. 7వ తరగతి చదువుతున్న చిన్నారి గోగేమ్, ఐస్ స్కేటింగ్, స్కేటింగ్, కూచిపూడి నృత్యాల్లో రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తన అసమాన ప్రతిభ చాటుతోంది. తండ్రి నరేంద్రకుమార్, తల్లి వైష్ణవీదేవి. వారు అక్షరకు చిన్ననాటి నుంచి కూచిపూడి నృత్యంతో పాటు తనకు ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ అందించారు. కోచ్ ప్రసాద్ వద్ద స్కేటింగ్, ఐస్‌స్కేటింగ్‌తో పాటు, జపనీస్ గోగేమ్‌లో శిక్షణ తీసుకుంది. వాటిల్లో నైపుణ్యం చూపిస్తూ పోటీలకు సిద్ధమైంది. చక్కగా రాణిస్తూ బంగారు, వెండి పతకాలతో అదరగొడుతోంది.

గోగేమ్‌లో అవార్డులు..

★ 2024లో బిహార్‌లో జరిగిన గోగేమ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అక్షర అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బంగారు పతకాలు సాధించింది.

★ 2025 ఫిబ్రవరిలో బిహార్‌లో జరిగిన పోటీల్లోనూ అదే రీతిలో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకుంది.

★ 2025 నవంబరులో ఒడిశాలో జరిగిన గోగేమ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-14 విభాగంలో సిల్వర్, అండర్-17లో బంగారు పతకాలు సాధించింది.

స్కేటింగ్‌లో సత్తా..

■ 2024లో ఐస్ స్కేటింగ్ పోటీలు గుర్గ్రావ్‌లో జరగ్గా అక్షర జాతీయ స్థాయిలో సిల్వర్ పతకం అందుకుంది.

■ 2025లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి ఐస్‌స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

కూచిపూడి నృత్యంలో రాణిస్తూ

అక్షర గురువు నరేంద్ర వద్ద కూచిపూడి నృత్య శిక్షణ తీసుకుంది. ఇందులోనూ రాణిస్తూ 2024లో ఫ్రాన్స్‌కు చెందిన వరల్డ్ పెర్ఫార్మెన్స్ ఆర్ట్ ఛాంపియన్‌షిప్-2024 అవార్డు అందుకుంది. ఇంకా జాతీయ స్థాయిలో 12కు పైగా అవార్డులు సొంతం చేసుకుంది. ఆమెకు శివనంది, బసవనంది, నృత్యప్రభ, నృత్యకృష్ణవేణి, శ్రీకృష్ణనాట్యరవళి అవార్డులు వచ్చాయి. క్రీడల్లోనూ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నది తన లక్ష్యమని అక్షర చెబుతోంది.

స్త్రీశక్తి.. అంచనాలకు మించి!

వంద రోజుల్లో కోటి మంది వరకు ప్రయాణం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ప్రారంభించి గత నెల 22కి 100 రోజులు పూర్తయ్యింది. ఈ క్రమంలో కృష్ణా జిల్లా వ్యాప్తంగా నిర్దేశిత బస్సుల్లో అతివలంతా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఆధార్‌తో పాటు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఇతర గుర్తింపు కార్డులు చూపి ఎలాంటి నగదు చెల్లించకుండానే వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

అంచనాలకు మించి..

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమల్లోకి రాక ముందు జిల్లా వ్యాప్తంగా సగటున రోజుకు 60 వేల మంది మహిళలు ప్రయాణించే వారు. ఆ సంఖ్య 80 వేలకు పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. కానీ వంద రోజుల గణాంకాలు పరిశీలిస్తే రోజుకు దాదాపు లక్ష మంది రాకపోకలు సాగించడం విశేషం. మూడు కీలక జాతీయ రహదారులను ఆనుకుని బస్టాండ్లు ఉండటం, సరిహద్దున ఉన్న ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు నిరంతరం బస్సు సర్వీసులు తిరగడం, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ముఖ్య ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో అధిక సంఖ్యలో అతివలు స్త్రీశక్తి పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు.

మహిళలకు టికెట్లు జారీ చేస్తున్న కండక్టరు

జిల్లాలో ఇలా..

డిపోలు: 5	రోజూ నడిచే బస్సులు : 408
ఉచిత ప్రయాణానికి వీలున్నవి	: 285
100 రోజుల్లో ప్రయాణించిన మహిళలు:	97,46,575
రాయితీ టికెట్ల విలువ (రూ.)	: 32,25,94,456

ప్రాంగణాలు కిక్కిరిసి..

గత 100 రోజుల్లో జిల్లాలోని 5 డిపోల ద్వారా నిరంతరం తిరిగే 285 బస్సుల్లో మూడొంతుల మంది ప్రయాణికులు మహిళలే కావడం గమనార్హం. ప్రధాన బస్టాండ్లైన మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ, గన్నవరం, ఉయ్యూరు, హనుమాన్ జంక్షన్ ప్రాంగణాలు ఎప్పుడు చూసినా అతివలతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి.

అసౌకర్యం కలగకుండా చర్యలు.. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జిల్లా వ్యాప్తంగా స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్నాం. అవసరమైతే సర్వీసులు పెంచేందుకు కృషి చేస్తున్నాం. డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు సమన్వయంతో పని చేస్తూ మహిళా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూస్తున్నారు.

– కె.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రజా రవాణా అధికారి

పార్టీ రంగులపై శ్రద్ధ.. నాణ్యతలో చూపొద్దా?

గుడివాడలో తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలకు వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస వసతులు కల్పించకుండా పార్టీ రంగులు వేసి పేదలకు పంచేశామని ఆర్భాటం చేశారు. గృహ సముదాయాలకు చేరుకునే దారి పనులు నాణ్యత లేకుండా చేపట్టడంతో వంతెన చాలాచోట్ల కుంగిపోయింది. రాత్రివేళ ఈ దారిలో వెళ్లాలంటే బిక్కుబిక్కుమంటున్నారు.

– ఈనాడు, కృష్ణా

ఆర్జిత సేవల వేదిక మార్పు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలోని ఆర్జిత సేవలను నూతనంగా నిర్మించిన ఏసీ పూజ మండపంలోకి మార్పు చేస్తున్నామని ఈవో శీనానాయక్ తెలిపారు. సోమవారం దుర్గమ్మ ఆలయ ప్రాంగణాన్ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కుంకుమార్చన, శ్రీచక్రార్చన సేవలను పూజ మండపంలో నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న ఆశీర్వచన మండపంలో కాకుండా అమ్మవారి దర్శనం చేసుకొని వచ్చిన వారికి వేద ఆశీర్వచనం మూల విరాట్‌కు ఎదురుగా కుంకుమార్చన చేసే ప్రాంతంలో చేసేందుకు వారం రోజుల పాటు ట్రయల్ రన్ వేస్తున్నామని తెలిపారు. ఈ మార్పులతో దుర్గమ్మ ప్రధాన ఆలయం చుట్టూ కొంత వెసులుబాటు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఈ రాంబాబు, ఏఈవో వెంకటరెడ్డి పాల్గొన్నారు.

RAMOJI
WALK-IN-INTERVIEW
MARGADARSI CHIT FUND PRIVATE LIMITED

REQUIRES ASSISTANTS IN BUSINESS DEVELOPMENT, CUM RECOVERIES FOR OUR NEW BRANCH AT MANGALAGIRI

BUSINESS DEVELOPMENT CUM RECOVERIES ASSISTANTS:

Male graduates with pleasing personality below 30 years with 2/3 years of experience in relevant fields. Candidates having valid two wheeler driving licence are preferred. The above posts are mainly field oriented. Experience in chit fund/financial iinstitutions will be given preference.

Fresh graduates also can attend for Trainee position.

Please attend **WALK-IN-INTERVIEW ON EITHER 3rd DECEMBER, 2025 (TUESDAY) or 4th DECEMBER, 2025 (WEDNESDAY) AT OUR MANGALAGIRI BRANCH from 10.30 A.M. to 2.00 P.M.** alongwith latest Resume, xerox copies of educational certificates, recent colour Passport size photographs and copy of Pan Card, Aadhaar card & Bank Passbook First page at the following address:

The Branch Manager,
MARGADARSI CHIT FUND PRIVATE LIMITED
D.No. 7-331A, 2nd Floor ATR Complex, Opp: Urvasi Theatre,
Gowtham Buddha Road, Mangalagiri Guntur District - 522 503, A.P.
☎ Phone No. 08645-297993 / 9381401759

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

జగమే చూసేలా.. జయమే మురిసేలా..

- అంధుల మహిళా టీ 20 ప్రపంచ కప్ కైవసంలో కీలకపాత్ర
- కరుణకుమారి విజయగాథ

ఆసక్తి, ఎంచుకున్న లక్ష్యంపై మనసు పెడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించింది అల్లూరి సీతారామరాజు జిల్లా వంట్లమామిడి గ్రామానికి చెందిన **పంగి కరుణ కుమారి** (15). తల్లిదండ్రులు సంధ్య, రాంబాబు వ్యవసాయ కూలీలు. భారత అంధుల మహిళా టీ 20 జట్టులో స్థానం సాధించి ప్రత్యేకత చాటుకుంది. గత నెలలో కొలంబోలో జరిగిన తొలి అంధుల మహిళ టీ 20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్‌పై 28 బంతుల్లో 42 పరుగులు సాధించి జట్టు విజయంలో ఆమె కీలకపాత్ర పోషించింది. దీంతో ఒక్కసారిగా ప్రపంచవ్యాప్తంగా కరుణకుమారి పేరు మార్మోగింది. ఆమె ఈ స్థాయికి ఎదగడానికి దోహదపడిన అంశాలు ఇలా...

★ **మనోనేత్రమే దివిటీ..:** మన్యం ప్రాంతానికి చెందిన కరుణకుమారి చిన్నతనం నుంచి అంధురాలు. పాడేరులోని బాల సదన్ స్కూల్‌లో ఏడో తరగతి వరకు చదివింది. ఆమెకు చిన్నతనం నుంచి ఆటలపై మక్కువ. కానీ ఆడలేని పరిస్థితి. ఎనిమిదో తరగతిలో విశాఖలోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశించింది. అక్కడ ఆట, క్రీడల్లో సాధన చేసే అవకాశం వచ్చింది. క్రికెట్‌పై ఆసక్తి ఉన్నా.. కంటిచూపు లేక ఆడలేకపోయేది. అంధుల పాఠశాలలో ప్రవేశించాక అథ్లెటిక్స్.. షాట్‌పుట్, డిస్కస్ త్రోలో సాధన ప్రారంభించింది. ఈ సమయంలో సహచరులు క్రికెట్ ఆడటం తనకు వినబడింది. అంధుల క్రికెట్‌లో వాడే బాల్ నుంచి బౌలింగ్ చేస్తే శబ్దం వస్తుంది. దీంతో అథ్లెటిక్స్‌ను పక్కనపెట్టి పీఈటీ రవికుమార్ సహకారంతో క్రికెట్ సాధన ప్రారంభించింది. మరో పీఈటీ ఉపాధ్యాయిని సత్యవతి బ్యాటింగ్, బౌలింగ్‌లో మెలకువలు నేర్పింది. ప్రిన్సిపల్ డి. విజయ ప్రోత్సాహం మరింత తోడైంది.

★ **మువ్వన్నెల రెపరెప..**

మే నెలలో కేరళలో జరిగిన ఇన్ఫినిటీ ట్రోఫీలో తలపడి సెంచరీ (114)తో సత్తా చాటింది. ఈ ప్రతిభతో భారత మహిళా అంధుల టీ20 క్రికెట్ జట్టులో స్థానం లభించింది. తల్లిదండ్రులు విదేశానికి వెళ్లేందుకు వద్దన్నా.. బాగా ఆడి దేశానికి ట్రోఫీ అందిస్తానని తల్లిదండ్రులకు మాట ఇచ్చింది కరుణ. ఫైనల్‌లో మెరుగైన ఆటతీరు కనబరచి విజయానికి తోడ్పడింది. ఇచ్చిన మాట నిలబెట్టిన తమ కుమార్తెను చూసి కన్నవారు మురిసి పోతున్నారు. భవిష్యత్తులో చదువు కొనసాగిస్తూనే.. క్రికెట్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించి.. భారత కీర్తి పతాకను ఎగురవేస్తానంటోది కరుణ కుమారి.

– న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

ఉంగుటూరు పోస్టాఫీస్‌లో నిధుల గోల్‌మాల్

- రూ.2 కోట్ల ఖాతాదారుల నగదు పక్కదారి
- పోస్టుమాన్, మాస్టర్ మోసంపై బాధితుల ఆందోళన

ఉంగుటూరు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: నకిలీ స్టాంపులు, పాస్‌పుస్తకాలతో పోస్టాఫీస్ మాస్టర్, పోస్టుమాన్ ఖాతాదారులకు చెందిన రూ. 2 కోట్ల నగదును కాజేసిన ఘటన ఉంగుటూరు మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో చోటుచేసుకుంది. బాధితులు, అధికారుల కథనం మేరకు.. స్థానిక పోస్టాఫీస్‌లో గత పదేళ్లుగా దేవేంద్రరావు మాస్టర్‌గా, కె. శేఖర్ పోస్టుమాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిద్దరు కలిసి ఏడాది నుంచి పోస్టాఫీస్‌లోని ఎఫ్‌డీలు, ఇతర లావాదేవీలకు సంబంధించిన రికార్డుల్లో మోసానికి పాల్పడ్డారు. నకిలీ స్టాంపులు, పాస్‌పుస్తకాలతో అందినకాడికి దోచేశారు. ఇటీవల ఓ మహిళ తన ఎఫ్‌డీలను తీసుకొనేందుకు రాగా అసలు విషయం బయటపడింది. దీంతో ఇతర ఖాతాదారులు ఒక్కొక్కరిగా వచ్చి తమ నగదు సరిచూసుకోగా.. వారి పేరు మీద ఎలాంటి నగదు లేదని సిబ్బంది చెప్పడంతో అవాక్కయ్యారు. దీంతో పోస్టుమాస్టర్‌ను సస్పెండ్ చేసిన అధికారులు.. నలుగురు ఇన్‌స్పెక్టర్లతో విచారణకు ఆదేశించారు. సుమారు 2 వేలకుపైగా ఖాతాలకు చెందిన ఎఫ్‌డీలు, సేవింగ్స్ నగదు మొత్తం అంచనా రూ. 2 కోట్ల మేర పక్కదారి పట్టించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. వారందరూ సోమవారం పోస్టాఫీస్‌కు వచ్చి ఆందోళన చేపట్టారు.

ఉంగుటూరు పోస్టాఫీస్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

తుపాను షెల్టర్లు నిర్మించాలి

లోక్‌సభలో ఎంపీ బాలశౌరి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సముద్ర, కృష్ణా నదీ తీరాల్లో తరచూ సంభవిస్తున్న ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను రక్షించేందుకు తుపాను రక్షిత భవనాలు నిర్మించాలని ఎంపీ బాలశౌరి సోమవారం లోక్‌సభలో ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మాట్లాడుతూ ‘1977 దివిసీమ ఉప్పెనతో కృష్ణా డెల్టా తీవ్రంగా దెబ్బతింది. వేలల్లో ప్రాణ, రూ.వేల కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే ప్రజల రక్షణ కోసం అప్పట్లో పెద్దఎత్తున తుపాను షెల్టర్లు నిర్మించారు. అవన్నీ 40 ఏళ్ల కిందటివి కావడంతో దాదాపు అన్నీ శిథిలావస్థకు చేరాయి. ప్రకృతి విపత్తులు సంభవిస్తే తీర ప్రాంత ప్రజల రక్షణకు ఎంతగానో ఉపయోగపడే తుపాను రక్షిత భవనాలు నిర్మించాలి. ఇవి విపత్తుల సమయంలో రక్షిత భవనాలుగా.. సాధారణ సమయాల్లో సామాజిక కార్యక్రమాలు, డ్వాక్రా మహిళల శిక్షణ కార్యక్రమాలకు ఉపయోపడతాయి’ అని ఎంపీ బాలశౌరి అభిప్రాయం వ్యక్తం చేశారు.

సిద్ధార్థ డీమ్డు విశ్వవిద్యాలయం 2026-27 అడ్మిషన్ల బ్రోచర్ విడుదల

కానూరు, న్యూస్‌టుడే: సిద్ధార్థ డీమ్డు విశ్వవిద్యాలయంలో 2026-27 సంవత్సరానికి బీటెక్‌లో అడ్మిషన్లకు సంబంధించిన బ్రోచర్‌ను సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మలినేని రాజయ్య మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం నిర్వహించే ఎస్ఈఈఈ-2026 ప్రవేశపరీక్ష, జేఈఈ, ఈఏపీసెట్‌లలో ర్యాంకుల ఆధారంగా మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ.. వర్సిటీ పోర్టల్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈ ప్రవేశపరీక్ష రెండు దశల్లో ఉంటుందని స్పష్టత ఇచ్చారు. మొదటి దశ ఏప్రిల్‌లో ప్రతి శని, ఆదివారాలు.. రెండో దశ మే నెలలో ప్రతి శని, ఆదివారాల్లో జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఉపకులపతి పి. వెంకటేశ్వరరావు, ప్రోవైస్‌ఛాన్సలర్ ఏవి రత్నప్రసాద్, డీన్ అడ్మిషన్లు జీవీఆర్‌స్వామి, ఈసీఈ విభాగాధిపతి వెంకటరావు, రిజిస్ట్రార్ రవిచంద్ పాల్గొన్నారు.

అడ్మిషన్ల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మలినేని రాజయ్య, పాలడుగు లక్ష్మణరావు, పి.వెంకటేశ్వరరావు, ఏవి రత్నప్రసాద్, తదితరులు

ఉత్తమ వైద్యులుగా రాణించాలి

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

చిన్నఅవుటపల్లి(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: సమాజంలోని అన్ని వృత్తుల కన్నా వైద్యవృత్తికి ప్రత్యేకత ఉందని.. అలాంటి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులంతా ఉత్తమ వైద్యులుగా ఎదిగేందుకు కృషి చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గన్నవరం మండలం చిన్న అవుటపల్లిలోని డా.పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల 23వ బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల ‘తెల్ల కోటు వేడుక’ను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. వైద్యవృత్తిని అత్యంత గౌరవంగా భావించి సేవాదృక్పథంతో సమాజంలో మెలగాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేయడానికి యువ వైద్యులు ముందుకు రావాలన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయకత్వంలో వైద్యరంగం బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మించే వైద్య కళాశాలలను ఎందుకు పీపీపీ పద్ధతిలో నిర్మించాల్సి వస్తుందో విద్యార్థులకు వివరించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, డీజీ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డా. మేజర్ ఎమ్.వీ. భీమేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ డా. బి. అనిల్‌కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్. చిత్రంలో మలినేని రాజయ్య, పాలడుగు లక్ష్మణరావు, డీజీ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డా.ఎమ్.వీ.భీమేశ్వర్ తదితరులు

ప్రతి ఫిర్యాదుకూ చట్టపరిధిలో పరిష్కారం

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: ప్రతి ఫిర్యాదుదారుడికి చట్ట పరిధిలో తగు పరిష్కారం చూపుతామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పీజీ పూర్తి చేసిన తనకు ఉద్యోగం ఇప్పిస్తానంటూ స్నేహితుడు రూ.2లక్షలు తీసుకుని మోసం చేశాడని, తిరిగి నగదు ఇవ్వమంటే బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని బంటుమిల్లికి చెందిన సాకేత్, అదనపు కట్నం కోసం అత్తింటివారి చిత్రహింసల నుంచి రక్షణ కల్పించాలని పెనమలూరు ప్రాంతానికి చెందిన సీత, తన వ్యక్తిగత అవసరాల కోసం అప్పు తీసుకుని నెలవారీ వడ్డీ కడుతున్నా అప్పు ఇచ్చిన వ్యక్తి బలవంతంగా చెక్కు రాయించుకుని బెదిరిస్తున్నాడని.. రక్షణ కల్పించాలని అవనిగడ్డకు చెందిన వ్యక్తి ఫిర్యాదులు సమర్పించారు. వీటితో పాటు వివిధ వ్యక్తిగత సమస్యలు పరిష్కారం కోరుతూ వేర్వేరు వ్యక్తులు సమర్పించిన 35 ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ చట్ట పరిధిలో వాటిని విచారించి న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి, పూర్వ వైభవం తీసుకురావాలని ఏఐసీసీ కార్యదర్శి సంజయ్‌దత్ చెప్పారు. సోమవారం స్థానిక ఏఎస్ఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆనాడు ఇందిరాగాంధీ పేద, బడుగు బలహీన వర్గాలకు సేవలు అందిస్తే, నేడు భాజపా ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి బడా వ్యక్తులకు అండగా ఉందని ఆరోపించారు. నేడు కేంద్రంలో భాజపా, రాష్ట్రంలో తెదేపా, జనసేన నేతలను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. నాడు కాంగ్రెస్ పాలనలో ఆహార భద్రత ఉండేదన్నారు. నేడు అమలులో లేదన్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ భాజపా కుట్రలను ప్రజలకు వివరిస్తున్నారని చెప్పారు. పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం, ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల ఎలీజా, అర్షద్, పామర్రు మాజీ ఎమ్మెల్యే దాస్, శ్రీరామమూర్తి, 6 మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంజయ్‌దత్

ఏడాదికి రూ.35వేల కోట్లు పింఛన్లకు వెచ్చిస్తున్నాం

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి ఏడాది రూ. 35వేల కోట్లు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నగరంలో సోమవారం ఐదు రోడ్ల సెంటరు తదితర ప్రాంతాల్లో ఆయన ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, తదితరులతో కలిసి స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా కచ్చితంగా ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఇంటి వద్దే పింఛను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఐదు రోడ్ల సెంటరులో ఇరువురు లబ్ధిదారులకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బాబాప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్, వెంకటస్వామి, సోడిశెట్టి బాలాజీ, లంకిశెట్టి నీరజ, కార్పొరేటర్లు సుధాకర్, సమతా కీర్తి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి, ఆర్టీసీ ఛైర్మన్, కూటమి నాయకులు

స్థానికులతో మమేకమైన నాయకులు.. పింఛన్ల పంపిణీ సందర్భంగా మంత్రి, ఇతర నాయకులు స్థానికులతో పాటు కూడళ్లలో ఉన్న ప్రజలతో మమేకమయ్యారు. వారితో మాట్లాడుతూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆర్‌కే హోటల్స్ అధినేత అయిన డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ గత కాలపు అనుభవాలను అక్కడివారితో పంచుకున్నారు. ఓ టీస్టాల్‌లో సరదాగా మంత్రి, ఆర్టీసీ ఛైర్మన్‌ల సహకారంతో స్వయంగా కాఫీ తయారు చేసి అందరికి అందజేయడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు సందడి వాతావరణం నెలకొంది.

జోగి సోదరుల కుమారులకు సిట్ నోటీసులు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు రాము కుమారులకు సిట్, ఎక్సైజ్ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. బుధవారం విజయవాడలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు రావాలని వాటిలో పేర్కొన్నారు. ఈమేరకు జోగి రమేష్ కుమారులు రాజీవ్, రోహిత్.. రాము కుమారులు రాకేష్, రామ్మోహన్‌లకు సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నంలోని వారి నివాసాలకు వెళ్లి వీటిని అందజేశారు. జోగి సోదరుల అరెస్టు సమయంలో వారి నివాసాల నుంచి పోలీసులు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. రమేష్, రాముల కస్టడీ చివరి రోజైన ఆదివారం వారి ఫోన్ల ఫేస్‌లాక్‌ను వారి సమక్షంలో ఫోరెన్సిక్ బృందం తెరిచింది. అదేసమయంలో ల్యాప్‌టాప్‌లను కూడా తెరవాలని పోలీసులు కోరగా.. అవి కుమారులకు చెందినవనీ, వాటి పాస్‌వర్డ్‌లు వారికే తెలుసని సమాధానమిచ్చారు. ల్యాప్‌టాప్‌లను తెరిచేందుకు వీరికి నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.

విద్యార్థిని బెత్తంతో గాయపరిచిన ప్రైవేట్ వ్యక్తి

మోపిదేవి జడ్పీ పాఠశాలలో ఘటన

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న గుర్రం నాగసంతోష్‌ను అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యేకంగా నియమించిన అటెండర్ దోనే శ్రీధర్ బెత్తంతో ఇష్టారీతిన కొడుతూ తీవ్రంగా గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన శనివారం సాయంత్రం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు సెలవులో ఉన్నారు. బెత్తం దెబ్బలు తిన్న సంతోష్ పాఠశాల విడిచిపెట్టిన అనంతరం మోపిదేవి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పాడు. వారు పాఠశాలకు వచ్చి నిలదీశారు. ఆపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమ కుమారుడిని చూపి ఫిర్యాదు చేశారు. అనంతరం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. దండించిన వ్యక్తి శ్రీధర్ ఓ ప్రైవేటు సంస్థ తరపున ఒప్పంద అటెండరుగా పనిచేసేవాడు. ఆ సంస్థ కొంతకాలం నుంచి వేతనాలు ఇవ్వకపోవటంతో ప్రధానోపాధ్యాయురాలు కొంత వేతనం ఇచ్చి కొనసాగిస్తున్నారు. అతడిని ప్రైవేటు సిబ్బందిగా పరిగణిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు కాలేదు.

వీపు మీద బెత్తం దెబ్బలు

వాచిన పెదవి

ఘనంగా ఎమ్మెల్యే రాము పుట్టినరోజు వేడుకలు

గుడ్లవల్లేరు, నందివాడ - న్యూస్‌టుడే: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గుడ్లవల్లేరు మండలం వేమవరం శ్రీకొండలమ్మ తల్లి దేవస్థానం ఈవో కొండలరావు, ఛైర్మన్ ఈడే మోహన్, సభ్యులు వడ్లమూడి రవీంద్రబాబు, కళ్లేపల్లి సుగుణశేఖర్, మన్నెం నాగేంద్రరావు, తూము రాజ్యలక్ష్మి, పెద్దిబోయిన శ్యామలాదేవి, ముంగం ఆంజనేయులు, నూతులపాటి పావనిలు అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకి అందజేశారు.

☛ గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్వమత గురువులు ప్రార్థనలు చేసి ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. శ్రేణులు ఏర్పాటు చేసిన 55 కేజీల భారీ కేక్‌ను ఎమ్మెల్యే కోశారు. ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి రవికుమార్, జిల్లాపాల సమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, డీసీ ఛైర్మన్ మల్లిసుబ్రహ్మణ్యం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ శాయన పుష్పావతి, సొసైటీ అధ్యక్షులు అట్లూరి శ్రీరామచంద్రప్రసాద్, వడ్లమూడి యుగంధర్, వెనిగళ్ల నాగేశ్వరరావు, కొప్పినేని పిచ్చేశ్వరరావు, చింతపల్లి శివారెడ్డి, అడపా బాబీ, నీటిసంఘ అధ్యక్షులు శాయన సూర్యప్రసాదరావు, పోలవరపు వెంకట్రావ్, మద్దాల జోజి, కంచర్ల ప్రకాశ్, బొబ్బా శేషు తదితరులు అభినందనలు తెలిపారు.

గుడ్లవల్లేరులో కేక్ కోస్తున్న ఎమ్మెల్యే రాము తదితరులు

నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలి

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: ఆంక్షలు సడలించి తేమశాతంతో నిమిత్తం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి యద్దనపూడి మధు, ఇస్మాయిల్ బేగ్.. కోతకోసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకున్న రైతులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని వారు నినాదాలు చేశారు. తహసీల్దార్ కిరణ్మయికి వినతిపత్రం అందించారు. నాయకులు ఆవుల బసవయ్య, రేపల్లె యోగప్రకాష్, మహమ్మద్ కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

‘నవోదయ’లో పోలీసుల విచారణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వేలేరు జవహర్ నవోదయలో గత కొన్ని రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఆరా తీశారు. ఎస్సై వి.సురేష్ నేతృత్వంలోని బృందం సోమవారం విద్యాలయాన్ని సందర్శించి ఉపాధ్యాయులు, కొంతమంది తల్లిదండ్రులతో మాట్లాడింది. నిబంధనలకు విరుద్ధంగా పలువురు విద్యార్థులు గోడ దూకి మరీ బయటి ఆహారాన్ని తెచ్చుకోవడం దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 19 మంది విద్యార్థులను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఇళ్లకు పంపడం, తమ పిల్లలను ఉపాధ్యాయులు దారుణంగా కొట్టారంటూ ఆరోపణలు చేయడం తీవ్రచర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో సంఘటన పూర్వాపరాల గురించి ఎస్సై తెలుసుకున్నారు. విద్యార్థులు ఏ విధంగా ఫోన్లు చేసి, గోడలు దూకి పొలాల మీదుగా ఆహార పొట్లాలు తెచ్చుకుంటుంది తమ వద్ద ఉన్న ఆధారాలతో ఉపాధ్యాయులు ఎస్సైకు వివరించారు. మరోవైపు తాము ఏ విద్యార్థిని కొట్టలేదని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడంతో గట్టిగా మందలించి, తల్లిదండ్రులకు కబురు చేసి ఇళ్లకు పంపినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విలేకర్ల సమావేశం నిర్వహించి పునరుద్ఘాటించారు. ఇళ్లకు వెళ్లిన 19 మంది విద్యార్థుల్లో 10 మంది సోమవారం తిరిగి విద్యాలయానికి వచ్చేశారు. మంగళవారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉపాధ్యాయులను విచారిస్తున్న ఎస్సై సురేష్

యువతిపై అత్యాచారం.. కేసు నమోదు

చేబ్రోలు, న్యూస్‌టుడే: యువతిని నమ్మించి అత్యాచారం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. చేబ్రోలు ఎస్సై వీర నారాయణ కథనం మేరకు.. తెనాలి ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని మండలంలోని ఓ విద్యాలయంలో చదువుతూ వసతిగృహంలో ఉంటుంది. అదే కళాశాలలో చదువుతున్న కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన నందు అనే యువకుడు తోటి విద్యార్థుల ద్వారా ఆమెకు పరిచయం అయ్యాడు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పలుమార్లు హోటల్లో వీరిద్దరు కలిశారు. ఇటీవల నందు ఆ యువతికి మాయమాటలు చెప్పి నారాకోడూరు, గుంటూరులోని లాడ్జీలకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. తర్వాత నగ్నంగా ఉన్న వీడియోలు, ఫొటోలు తీసి కొద్ది రోజులుగా నగదు కోసం వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సోమవారం పొన్నూరు గ్రామీణ సీఐ కృష్ణయ్య తన సిబ్బందితో నారాకోడూలో అత్యాచారం జరిగిన లాడ్జీని తనిఖీ చేసి సీసీ కెమెరాలు పరిశీలించి పలు వివరాలు సేకరించారు.

జీవో నంబరు–800 అమలుకు డిమాండ్

ధర్నాలో లైసెన్స్‌డ సర్వేయర్లు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు-800ను అమలు చేయాలని లైసెన్స్‌డ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముత్యంగౌడ్ కోరారు. సోమవారం ఈ విషయమై ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019 సంవత్సరం నుంచి సర్వేయర్లను రెన్యూవల్ చేయకుండా ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే కుటుంబాలు రోడ్డునపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తమతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అజయ్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -113 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

3 నుంచి ఎన్టీఆర్ వర్సిటీ క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో 3న ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలలో పురుషుల వాలీబాల్, 5న ఏలూరు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల మైదానంలో పురుషుల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని విశ్వ విద్యాలయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న వైద్య, దంత, ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత కళాశాల వ్యాయామ సంచాలకుడి వద్ద ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు సంబంధిత పత్రాలతో హాజరవ్వాలని ఆయన సూచించారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము
వాడపల్లి గ్రామం, ఆత్రేయపురం మండలం, Dr. B.R.Ambedkar కోనసీమ జిల్లా

ఇ-టెండరు ప్రకటన

Rc.No.V25/2025, Dt: 01-12-2025

తేది.01-01-2026 నుండి 31-12-2026 వరకు దేవస్థానమునకు అవసరమగు ఆవు నెయ్యి సరఫరా చేయుటకు గాను ఆంధ్రప్రదేశ్ నందుగల కో-ఆపరేటివ్ సొసైటీలు / పాల ఉత్పత్తిదారుల సంఘాలు/ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు/ రైతు పరస్పర సహాయ సహకార పాడి పరిశ్రమల వారి నుండి ఇ-టెండర్స్ కోరబడుచున్నవి. వివరముల కొరకు https:\\tender.apeprocurement.gov.in/login.html గాని లేక ఫోన్ నెం. 94910 00157ను సంప్రదించవచ్చును.

సం/- నల్లం సూర్యచక్రధరరావు
డిప్యూటీ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును.స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

BUSINESS OFFER

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైం or ఫుల్ టైం ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలోనే తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

TENDER

ITC లిమిటెడ్ ABD, అనపర్తి-533342 వద్ద గల 124 KL HSD ట్యాంక్, 225 KVA స్టెబిలైజర్, MS, ఫుడ్, కన్వేయర్ బెల్టులు, SS, అల్యూమినియం, రబ్బర్, కేబుళ్లు కెపాసిటర్లు వగైరాలకు 15-12-2025న e-కోట్ కలదు. తనిఖీ 08-12-2025 నుండి 10-12-2025. టెండరు ఫారం ధర రూ.500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14. ఫోన్: 098407 31925. www. welcomeauctioneers.com.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద గ్రూపు, VJA, వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 967670 1122, 97047 41122

REAL ESTATE

HOUSE FOR SALE

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq.Yards గజాలు Site 10,000+Sq.Ft విల్లా అమ్మకమునకు కలదు. నోబ్రోకర్స్ Ph.99662 28370

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

కేవలం 23 లక్షలకే 132 గజాలు E/F ప్లాట్ @ 200 గజాలు లేఅవుట్ ప్లాట్ @ 50 లక్షలు ★ బందరు రోడ్డు పోరంకి బ్లూమింగ్ డేల్ స్కూల్ రోడ్డులో ఈ ప్లాట్లు కలవు. ✆ 77320 51576.

TO LET

COMMERCIAL

VJA భవానీపురం స్వాతి రోడ్‌లో HB కాలనీ ఎదురుగా నేతాజీ స్కూల్ దగ్గర 4 అంతస్తుల బిల్డింగ్ ఫ్లోర్‌కి 1500 Sq.ft ఆఫీసులకు, బ్యాంకులకు, హాస్పిటల్స్‌కు అద్దెకు. ✆ 93904 55676

JOBS

Wanted Real Estate Door to Door Field Marketing Executives in Nandigama & Vijayawada and Tele callers. ✆ 94324 54545.

On-Roll Jobs In APC Channel Life Insurance 2Yrs Exp Q: Degree A: 28-40. Sal+Inc+ 77806 95356 Email: bond68127@gmail.com.

మ్యారేజ్ సంస్థలో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ గల ఇన్‌ఛార్జ్ (F) జీ. 20K రిసెప్షనిస్ట్ (F). జీ. 15K ఏదైనా డిగ్రీ VJA -7 ✆ 87905 99799.

స్వగృహ ఫుడ్స్‌లో VJAలో పని చేయుటకు సేల్స్‌గరల్స్/ సేల్స్ బాయస్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 20 సం|| to 30సం||లోపు. పార్ట్‌టైం/ ఫుల్‌టైం. ✆ 81425 45000

గుడివాడలోని ప్రముఖ విద్యా సంస్థలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సం|| సెల్: 99123 40968.

వంట మాస్టార్లు భార్యాభర్తలు కావలెను. వసతి కలదు, వరంగల్ సిటీలోని ప్రైవేటు మెడికల్ కాలేజిలో వంట చేయుటకు. ✆ 93908 09999, 98492 35255.

హైదరాబాద్ పాతబస్తీలో పని చేయడానికి అనుభవం ఉన్న దోశ, ఇడ్లీ మాస్టార్లు కావలెను. మంచి జీతం ఉంటుంది. సంప్రదించండి: 63024 59695

ప్రముఖ గైనిక్ హాస్పిటల్‌లో మెడికల్ షాపు (ఫార్మసి)లో పని చేయుటకు B.Pharmacy చదివి అనుభవం కలిగిన స్త్రీ అభ్యర్థులు కావలెను. సంప్ర. 93973 41745.

ACCOUNTING

అనుభవం గల అకౌంటెంట్ కావలెను. విజయం పబ్లికేషన్స్ హనుమాన్‌పేట, విజయవాడ. ✆ 98854 79105

SECURITY GUARDS

Wanted Security Guards age 30-50Yrs, Good Salary with weekly off, For all over andhra. ✆ 91000 58959, 96185 08494.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

డిప్యూటీ ఎంపీడీవోగా హేమప్రకాశ్

పెడన, న్యూస్‌టుడే: మండల డిప్యూటీ ఎంపీడీవోగా ఆర్ హేమప్రకాశ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అవనిగడ్డ ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయనను పదోన్నతిపై పెడనలో నియమించారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల పర్యవేక్షణ(జీడబ్ల్యూఎస్) బాధ్యతలను హేమప్రకాశ్ నిర్వర్తిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సచివాలయాల పర్యవేక్షణ బాధ్యతలను డిప్యూటీ ఎంపీడీవోలకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఈనియామకం జరిగింది. స్థానిక మండల పరిషత్తు సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.విజయకుమారిని పదోన్నతిపై నాగాయలంక డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు. ఆమె పెడనలో రిలీవై నాగాయలంకలో బాధ్యతలు చేపట్టారు.

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?

మండల పరిధిలోని రాయవరం నుంచి పోలవరం వెళ్లే ప్రధాన రహదారి పొడవునా గుంతలు పడ్డాయి. ఈ రోడ్డు వెంబడి రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు చేరితే గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -గూడూరు, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

★ నగరంలోని పోస్టల్ కాలనీ నుంచి పీఆర్ కాలనీకి వెళ్లే దారిలో ప్రధాన రోడ్డు పక్కన వేసిన చెత్త తొలగించకపోవడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఆ ప్రాంత వాసులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులు స్పందించి సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ★ నగరంలోని ఖొజ్జిల్లిపేటలో రహదారి పక్కన డ్రెయిన్ పూడిపోయి మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా అధికారులకు వివరించగా సిబ్బందిని పంపి పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు.
-మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

పన్ను వసూళ్లు వేగంగా చేపట్టాలి

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీవో ఎం.నాగిరెడ్డి తెలిపారు. మండలంలో ఇళ్ల పన్ను వసూళ్లు తక్కువగా ఉన్న కార్యదర్శులతో ఆయన సోమవారం మాట్లాడి వేగవంతం చేయాలని సూచించారు. మడక, కొంకేపూడి, కొప్పల్లి గ్రామాల్లో ఇళ్ల పన్ను వసూళ్లు మందకొడిగా ఉందని పేర్కొన్నారు. ఈ నెల 3 నాటికి మండలంలో అన్ని గ్రామాలు 10 శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. ఈ సందర్భంగా మడక గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి అక్కడి కార్యదర్శికి పలు సూచనలు చేశారు.

వారధి.. శిథిల తీరిది..

గూడూరు: తరకటూరులో శిథిలావస్థకు చేరిన వంతెన

న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

బందరు, పెడన నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన వంతెనలు వణుకు పుట్టిస్తున్నాయి. వైకాపా హయాంలోనే పలు వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేసినా పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో శిథిలస్థితిలో ఉన్న వంతెనలు క్రమేపీ మరింత ప్రమాదకరంగా మారడంతో ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

రక్షణ గోడలు లేవని మొత్తుకున్నా..

★ గూడూరు మండలం ఆకుమర్రు లాకుల వంతెనకు రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకోలేదు. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో నిర్మించినా వంతెన పటిష్ఠంగానే ఉంది. కానీ రిటైనింగ్ వాల్స్ లేకపోవడంతో వంతెనపై నుంచి రాకపోకలు అంటేనే భయపడిపోతున్నారు. గూడూరు, మొవ్వ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన వందల మంది రోజూ రాకపోకలు సాగిస్తారు. అలాంటి వంతెన విషయంలోనూ అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

★ మల్లవోలు పంచాయతీ పరిధిలోని వంతెన అడుగుభాగంలోని ఇనుప గ్రిల్స్ తుప్పుపట్టి కుంగిపోయింది. ఇటీవల దీనిపై మల్లవోలుతో పాటు వివిధ గ్రామాల ప్రజలు ఎంపీ బాలశౌరిని కలిసి వినతిపత్రం అందించారు.

ప్రతిపాదనలు చేసి వదిలేసి..

గూడూరు మండలం తరకటూరు గ్రామంలో వంతెన శిథిలావస్థకు చేరడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెన నిర్మాణం కోసం వైకాపా హయాంలోనే రూ.8.60 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఆ తరవాత దాని గురించి పట్టించుకోలేదు. తరకటూరుతో పాటు మద్దిపట్ల, కంచాకోడూరు, మొవ్వ మండలం పెద్దారాయుడుతోట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తారు. ప్రస్తుతం వంతెన ప్రమాదకరంగా మారడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ గ్రామాల్లోని వంతెనలూ ఇలాగే తయారయ్యాయి.

★ బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి సమీప డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. వంతెన రిటైనింగ్ వాల్ తుప్పుపట్టి పాడైపోవడంతో పలు ప్రమాదాలు జరిగాయి. లారీలు, ట్రాక్టర్లు డ్రెయిన్‌లో పడిపోయిన ఘటనలు ఉన్నాయి. రద్దీగా ఉండే రహదారి కావడంతో త్వరితగతిన అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

★ పెడన మండలం కమలాపురం వంతెన వద్ద రహదారి కోతకు గురై సగం మేర రోడ్డు ధ్వంసమైంది. ఇటీవల తాత్కాలికంగా మరమ్మతులు చేసినా సమస్య యథాస్థితికి చేరింది.

★ బందరు మండలం పల్లెతాళ్లపాలెంలో రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన వంతెన కేవలం అప్రోచ్‌లు నిర్మించక అలంకారప్రాయంగా ఉండిపోయింది.

ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం

పెడన, న్యూస్‌టుడే: ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేశామని ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ పీవీ నరసింహారావు చెప్పారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా ఈ మ్యాపింగ్ జరుగుతోందని తెలిపారు. 2002లో పెడన నియోజకవర్గ ఓటర్లు 1,56,327 కాగా 2025లో ఆ మొత్తం 1,67,922కు చేరుకుందన్నారు. 2002లో ఒక కుటుంబంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు. 2025లో అదే కుటుంబంలో పెరిగిన ఓటర్లు ఎంత మంది అన్నది మ్యాపింగ్ ప్రధాన లక్ష్యమన్నారు. 2026 ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు సంసిద్ధంలో భాగంగా మ్యాపింగ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఒక కుటుంబంలోని ఓటర్లను ఒకే పోలింగ్ కేంద్రంలోకి తీసుకురావడం, వలసలు వెళ్లినా, మృతి చెందినా జాబితా నుంచి తొలగించడం ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యమన్నారు. పెడనలో మ్యాపింగ్ ప్రక్రియ 70.44శాతం పూర్తయిందని, నియోజకవర్గంలోని 217 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఈ ప్రక్రియ వేగవంతం చేశారన్నారు. దేశంలోని 3 కేంద్ర పాలిత ప్రాంతాలు, 9 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ జరుగుతోందన్నారు. పూర్తి పారదర్శక ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం ఎస్ఐఆర్ లక్ష్యమని డిప్యూటీ తహసీల్దార్ చెప్పారు.

ప్రశాంత ఉత్సవాలకు సహకరించండి

డీటీపాలెం వాసులకు సూచనలిస్తున్న సీఐ, ఎస్సైలు

పెడన, న్యూస్‌టుడే: ఈ నెల 4 నుంచి 14 వరకు పెడనలో జరగనున్న పైడమ్మ ఉత్సవాల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలు సహకరించాలని రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో పెడనలోని డీటీపాలెం, గూడూరు మండలం పిండివానిపాలెం, పోసినవానిపాలెం గ్రామాల ప్రజలతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఉత్సవాల సందర్భంగా జరిపే ప్రభల ఊరేగింపులో డీజేలను పరిమితంగా అనుమతిస్తామని సీఐ స్పష్టం చేశారు. విద్వంసాలు రెచ్చగొట్టే పాటలకు అనుమతి లేదన్నారు. సమావేశంలో ఎస్సైలు గంట్ల సత్యనారాయణ, జి.సత్యనారాయణ కౌన్సిలర్ చిరువెళ్ల జయేష్, తెదేపా నేత పరసా జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు: ఆర్డీవో

216 జాతీయ రహదారిపై బల్లిపర్రులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న స్వాతి

పెడన, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో కురుస్తున్న తేలికపాటి వర్షాలకు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని మచిలీపట్నం ఆర్డీవో స్వాతి అన్నారు. మండలంలో సోమవారం పర్యటించిన ఆమె 216 జాతీయ రహదారిపై బల్లిపర్రు వద్ద రైతులతో మాట్లాడారు. ధాన్యం తడవకుండా పరదాలను సరఫరా చేస్తున్నామని, మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పెడనలో ఇప్పటివరకు 13వేల ఎంటీ ధాన్యాన్ని సేకరించామని, కొనుగోళ్ల పూర్తయ్యేవరకు కేంద్రాలు కొనసాగుతాయని చెప్పారు. రైతులు తొందరపడి తడి ధాన్యాన్ని విక్రయించవద్దని, తద్వారా ధర తగ్గి నష్టపోతారని చెప్పారు. మొంథా తుపాను ప్రభావానికి వరికి మానుగాయ తెగులు సోకి నష్టపోయామని, 75 కిలోల బస్తాకు రూ.1200 కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో చెప్పారు. ఈ పర్యటనలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఏవో సజ్జా జెన్నీ, ఆర్ఐ ఈడే విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

మల్లంపూడిలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచె నాని ఆధ్వర్యంలో...

పెనుమల్లిలో కొత్త పింఛన్లు అందజేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు

మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు: అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. నగరంలోని 45వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గోపీచంద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. నగరంలోని 39వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి అక్కుమహంతి రాజా, డివిజన్ ఇన్‌ఛార్జి కట్టా అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. గూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో డీసీ ఛైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి, కూటమి నాయకులు ఎస్ఏజీ, బాసుశెట్టి విజయ్ తదితరులు పింఛన్లు అందజేశారు.

పోతేపల్లి (మచిలీపట్నంరూరల్): మచిలీపట్నం మండలం పోతేపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మచిలీపట్నం మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్(నాని) సోమవారం పంపిణీ చేశారు. తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జ్ తలారి సోమశేఖర్, తెదేపా గ్రామ కార్యదర్శి కమ్మిల మధు, నారగాని వాణి, శేషు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

★ **వన్నారుకానూరులో:** జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ సోమవారం వన్నారుకానూరులో పింఛన్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, బొమ్మిడి ఏడుకొండలు, పీత రాము, మోపిదేవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెడన: పెడన నియోజకవర్గానికి కొత్తగా మంజూరైన 33 సామాజిక పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం బంటుమిల్లిలో ప్రారంభించారు. స్పౌజ్ కింద భర్తలు మరణించిన మహిళలకు ఈ పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పెడన అర్బన్‌లో మూడు, కృత్తివెన్ను 17, బంటుమిల్లి 2, గూడూరు 6, పెడన రూరల్‌లో ఐదుగురికి మంజూరయ్యాయి. పెడన మండలం పెనుమల్లిలో జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. మండల తెదేపా ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మల్లంపూడి, కృత్తివెన్ను (కృత్తివెన్ను): కృత్తివెన్ను పంచాయతీ, బంటుమిల్లి మండలం మల్లంపూడి గ్రామంలో సోమవారం ఉదయం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, డయాలసిస్ రోగులకు రూ.15వేలు చొప్పున పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో రెండు మండలాల నాయకులు, ఏఎంసీ ఛైర్మన్ ఒడుగు తులసీరావు, దేవస్థానం ఛైర్మన్ చేకూరి వెంకట్రావు, మండల తెదేపా అధ్యక్ష కార్యదర్శులు నాగిడి చెన్నకేశవరావు, యాదవరెడ్డి శ్రీనివాసరావు(కొండ), తిరుమాని యేసు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల గుర్తింపునకు సర్వే

కొంకేపూడిలో పరీక్ష నిర్వహిస్తున్న సీఆర్పీలు

పెడన: 1-5 తరగతుల విద్యార్థుల్లో చదువుకు సంబంధించి సామర్థ్యాలను గుర్తించేందుకు విద్యాశాఖ జేసీఎల్ఎన్ అసెస్మెంట్ సర్వే చేపట్టింది. పెడన మండలంలోని 60 ప్రాథమిక పాఠశాలల్లో ఐదు క్లస్టర్లుగా విభజించి క్లస్టర్‌కు ఒక సీఆర్పీ, అంగన్‌వాడీ ట్రైనీ కళాశాల విద్యార్థి ఒకరిని ఇన్విజిలేటర్‌గా నియమించారు. 1459 మంది విద్యార్థులకు టీఎల్ఎమ్ యాప్‌లో పొందుపర్చిన ప్రశ్నలపై మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ యాప్‌లో విద్యార్థి పేరు, పాఠశాల వివరాలతో అప్‌లోడ్ చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి అరగంట సమయం పడుతోంది. సోమవారం నాటికి 1210 మంది విద్యార్థుల సర్వే పూర్తయిందని ఎంఈవో వైవీ హరినాథ్ చెప్పారు.

చెత్త మేట.. వదిలేస్తే ఎట్టా?

నగరంలోని ఆంధ్రా ఆసుపత్రి సమీపంలోని వీధిలో రహదారి పక్కన వేసిన చెత్త తొలగించకపోవడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత పరుపులు, చెత్త తదితర వ్యర్థాలు గుట్టగా ఉన్నాయి. వాటిని తొలగించాలని ఇప్పటికే పలుమార్లు సిబ్బందితో పాటు నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

రహదారిలో గుంత..తీరని చింత..

నగరంలోని జిల్లా పరిషత్ కూడలిలోని ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంతతో రాకపోకలకు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే గుంతలో నీరు చేరుతోంది. ఎప్పటి నుంచో ఇలాగే ఉంటున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగే వదిలేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు గుంత పూడ్చించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

స్పందించారు.. శుభ్రం చేశారు

నగరంలోని జిల్లా పరిషత్ కూడలి సమీపంలో రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పొదలు వ్యాపించి ప్రమాదకరంగా మారాయి. ఈ సమస్యపై అల్లుకున్న తీగ...ప్రాణంమీదకేగా అన్న శీర్షికన ఈనాడులో చిత్రకథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు పొదలు తొలగించి శుభ్రం చేయించడంతో ఆ ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

చొచ్చుకొస్తున్న పొదలు.. రాకపోకలకు అవస్థలు

నగరంలోని మచిలీపట్నం ప్రధాన రైల్వేస్టేషన్ ట్రాక్ పక్కన కోచ్ వర్క్‌షాప్‌కు వెళ్లే దారిలో ముళ్లపొదలు వ్యాపించి రోడ్డుపైకి చొచ్చురొస్తున్నాయి. పొదలు తొలగించకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రాత్రి సమయాల్లో ఆకతాయిలు కూడా చేరుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

విజేతలతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

గళమెత్తారు.. బహుమతి పట్టారు..

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మచిలీపట్నం (గొడుగుపేట): ప్రతిభా పాటవ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బాలాజీ విద్యాలయ ప్రధానోపాధ్యాయిని కొమరగిరి హిమబిందు అన్నారు. ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించగా వివిధ తరగతుల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో జీకేకే జగన్నాథ్ (9వ తరగతి), కె.కృతి (8వ తరగతి), సీహెచ్ వాహినీఅక్షయ(8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు పి.సతీష్, బి.పద్మజ తదితరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను చాటుకునేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. ఈనాడు సంస్థలు విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించేలా పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కొమరగిరి చంద్రశేఖర్ విజేతలకు అభినందనలు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఎయిడ్స్‌ను ద్వేషించండి.. రోగిని ఆదరించండి

సర్వజన ఆస్పత్రి వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఎయిడ్స్‌ను ద్వేషించండి... ఆ వ్యాధి బారిన పడిన రోగిని ఆదరించండి అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. కృష్ణావిశ్వవిద్యాలయంలో జాతీయ సేవాపథక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ రాంబాబు మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు నోడల్ అధికారి సుశీల తదితరులు ప్రసంగించారు. హెచ్ఐవీ సోకిన వ్యక్తి శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సల్మా, రవి, శేషారెడ్డి, శాంతికృప తదితరులు పాల్గొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి నుంచి ప్రారంభించిన ర్యాలీని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి యుగంధర్ జెండా ఊపి ప్రారంభించారు. డీసీహెచ్ఎస్ శేషుకుమార్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. లేడియాంప్తిల్ కళాశాల జాతీయ సేవా పథక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని చిలకలపూడి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్రావ్య ప్రారంభించారు. ప్రిన్సిపల్ పి.లక్ష్మీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు లంకిశెట్టి హరనాథ్‌బాబు, అధ్యాపకులు హిరణ్మయి, సాజిదాసుల్తానా, జ్యోతి, స్పందన పాల్గొన్నారు.

బంటుమిల్లి డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల ర్యాలీ

జాగ్రత్తలతో ఎయిడ్స్ దూరం

బంటుమిల్లి, న్యూస్‌టుడే: జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎయిడ్స్‌ను నివారించవచ్చని బంటుమిల్లి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.జగన్మోహనరావు తెలిపారు. సోమవారం కళాశాలలో సమావేశం నిర్వహించారు. ర్యాలీ చేపట్టి విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ బండి దేవజయరాజు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జి.బి.ఆనంద్‌కుమార్, ఆర్.హిమాలినీదేవి, సత్యరాజేష్, రామారావు, చలం ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

దత్తరామేశ్వరంలో గీతా పారాయణం

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మంగినపూడి (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: గీతా జయంతిని పురస్కరించుకుని మంగినపూడిలోని దత్తరామేశ్వర తీర్థ క్షేత్రంలో సోమవారం 300 మంది భక్తులు గీతాపారాయణం చేశారు. భక్తులు, కార్యక్రమ నిర్వాహకులకు ఆలయ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ కూరాళ్ల రమేష్‌బాబు అభినందనలు తెలిపారు.

అయ్యో.. ఎంత కష్టం!

రైతులను భయపెడుతున్న చినుకులు

న్యూస్‌టుడే, మచిలీపట్నం గ్రామీణ

ధాన్యాన్ని గుట్టగా పోస్తున్న మహిళా కూలీలు

దిత్వా తుపాను ప్రభావం రైతుల గుండెల్లో అలజడి రేపుతోంది. మారిన వాతావరణాన్ని చూసి రైతులు బెంబేలెత్తుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి దక్కుతుందో లేదో అని కలవరపడుతున్నారు. మచిలీపట్నం మండలంలో ఎస్.ఎన్.గొల్లపాలెం, అరిశేపల్లి, చిట్టిపాలెం గ్రామాల్లో సోమవారం ధాన్యాన్ని కొందరు రైతులు ఆరబెడుతుండగా, కొందరు రైతులు వర్షం వస్తుందేమోనని ఆరబెట్టిన ధాన్యాన్ని గుట్టగా చేసి టార్పాలిన్లు కప్పుతూ కనిపించారు. కొన్నిచోట్ల వరిపైరు నేలవాలింది. మిల్లర్లు తేమ శాతం ఎక్కువగా ఉందని తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖర్చులు కూడా వచ్చేలా లేవు: మూడెకరాలు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశా. ఎకరానికి రూ.25వేల చొప్పున రూ.75 వేలు ఖర్చయింది. దిగుబడి 60 నుంచి 65 బస్తాలు వస్తాయని అంచనా వేస్తున్నా. తుపాను భయంతో పంట కోశాను. తేమ శాతం ఎక్కువగా ఉందని మిల్లర్ చెప్పడంతో ధాన్యాన్ని ఆరబెట్టా. ఈలోపు వాతావరణం మారి వర్షం కురుస్తోంది. పట్టాలు అద్దెకు తెచ్చి ధాన్యంపై కప్పాను. వర్షం వెలిసిన తరవాత కూలీలతో ధాన్యాన్ని ఆరబెడుతున్నా. సోమవారం చిరుజల్లులు పడుతుండడంతో ధాన్యాన్ని గుట్టగా చేసి మళ్లీ పట్టాలు కప్పాలి. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేటట్లు లేవు. - **గుదే రాజమోహనరావు, ఎస్.ఎన్.గొల్లపాలెం**

ధాన్యం రంగు మారింది: ధాన్యాన్ని కోసే సమయంలో వర్షం రావడంతో రంగు మారింది. మానుగాయ రంగు రావడం, తేమ శాతం ఉండడంతో ఆరబెడుతున్నా. - **సముద్రాల సత్యనారాయణ, రైతు సహాయకుడు, చిట్టిపాలెం**

మెరైన్ స్టేషన్‌లో సేవలు అభినందనీయం

మురళీకృష్ణను సత్కరించిన స్టేషన్ అధికారులు, సిబ్బంది

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: దాదాపు ఏడేళ్ల పాటు మెరైన్ స్టేషన్‌లో ఎస్సై మురళీకృష్ణ అందించిన సేవలు ప్రశంసనీయమని మెరైన్ సీఐ వంశీకృష్ణ కొనియాడారు. గిలకలదిండి మెరైన్ స్టేషన్ ఎస్సై మురళీకృష్ణ బదిలీపై ఏలూరు వీఆర్‌కు వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం స్టేషన్‌లో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉద్యోగంలో నిబద్ధత, సమయపాలన, కలుపుగోలుతనంతో పనిచేసే వారు తప్పనిసరిగా ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. మెరైన్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధుల్లో చేరి ఎస్సైగా పదోన్నతి పొందిన మురళీకృష్ణ స్థానికుల మన్ననలు చూరగొన్నారన్నారు. ఎస్సై చంద్రబోస్, మెరైన్ స్టేషన్ సిబ్బంది మురళీకృష్ణ దంపతులను సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

విద్యుత్తు సామగ్రి దుకాణంలో చోరీ

గుడివాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఏలూరు రోడ్డులోని జ్ఞానహనుమాన్ ఎలక్ట్రికల్ శానిటరీ దుకాణం షట్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పగలకొట్టి లోపల ఉన్న రూ.1.50 లక్షలను దొంగిలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సినిమాలు

రేవతి: రివాల్వర్ రీటా, మినీరేవతి: ప్రేమంటే, సిరికృష్ణ: రాజు వెడ్స్ రాంబాయి, సిరివెంకట్: ఆంధ్రాకింగ్ తాలూకా. -మచిలీపట్నం (గొడుగు పేట), న్యూస్‌టుడే

ధర వరలు

రైతుబజారులో కూరగాయల ధరలు.. టమాట 39, వంగ 24, బెండ 42, పచ్చిమిర్చి 40, కాకర 36, క్యాబేజీ 24, క్యారెట్ 60, దొండ 26, బంగాళదుంప 31, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 46, దోస 28, సొర 20, అరటికాయ 7,6, చిక్కుళ్లు 95, బీర 30, చామదుంప 28, మునగ 20/18, కంద 40, బీట్‌రూట్ 32, కీరదోస 30, బీన్స్ 65, క్యాప్సికం 80, అలసందలు 50, కొత్తిమీర 18/08, పుదీనా 15/05. మంగళవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. - మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

(c) eenadu

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

గోదాదేవికి ప్రత్యేక పూజలు

గన్నవరం పట్టణ శివారు దావాజీగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో కొలువైన గోదాదేవి సమేత శ్రీకృష్ణస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి ధనుర్మాస వేడుకల్లో భాగంగా విష్ణుసహస్ర పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన జరపనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు రామాచార్యులు తెలిపారు. పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

ముగిసిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గత రెండ్రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు సోమవారంతో ముగిశాయి. అండర్ 14 బాలబాలికల విభాగంలో నిర్వహించిన పోటీల్లో కర్నూలు జిల్లా బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. బాలుర విభాగంలో కృష్ణా ద్వితీయ, విశాఖపట్నం తృతీయ స్థానాల్లో, బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రతిభ కనబర్చాయి. ఆయా పోటీల్లో విజేతలను గుడివాడ డీవైఈవో రవికుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు బహుమతులతో సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

పెనమలూరు, న్యూస్‌టుడే: • పెదపులిపాక శ్రీనగర్‌కాలనీలో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగటం లేదంటూ కాలనీవాసులు ఆదివారం 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా గ్రామ కార్యదర్శి వెంకటలక్ష్మికి ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి సోమవారం 8 చోట్ల కొత్తదీపాలను ఏర్పాటు చేయించారు. • పెదపులిపాకలోని పలు ప్రాంతాల్లో రహదారుల వెంట మట్టికుప్పలు పేరుకుపోతుండటంతో గ్రామస్థులు శనివారం 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా గ్రామకార్యదర్శి వెంకటలక్ష్మికి ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి సోమవారం ఆయా ప్రాంతాల్లోని మట్టికుప్పలను తొలగించి డంపింగ్‌యార్డుకు తరలించారు. • గోసాల సాయిబాబా కట్టపై రెండుచోట్ల, రాజుగారి డొంకలో 5 చోట్ల వీధి దీపాలు వెలగటం లేదంటూ ఆ ప్రాంత నివాసితులు ఆదివారం 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా గ్రామకార్యదర్శి కూర్మారావుకు తెలియజేశారు. స్పందించిన కార్యదర్శి సోమవారం ఆయా ప్రాంతాల్లో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

దిత్వా.. ఆందోళనే సర్వత్రా

పరదాల కిందే వరి పంట

హనుమాన్‌జంక్షన్, కంకిపాడు, పెనమలూరు, న్యూస్‌టుడే

దిత్వా తుపాను నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆదివారం ఉదయం నుంచి వాతావరణంలో చోటుచేసుకున్న మార్పు, సోమవారం కూడా కొనసాగడంతో పంట సవ్యంగా చేతికొస్తుందో, లేదోనన్న దిగులు పట్టుకుంది. ఆరుగాలం కష్టించి, సాగునీటికి నానా తంటాలు పడి పండించిన ధాన్యం ఇప్పుడు పొలంలోంచి బయటకొస్తుందా, లేదా అన్నది గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో రైతాంగానికి కునుకు లేకుండా చేస్తుంది. రెండో రోజూ కూడా స్వల్ప చినుకులు మినహా పెద్దగా వాన లేకపోవడంతో కర్షకులు కాస్త ఊపిరి పీల్చుకున్నా, మరో 15 రోజులు ప్రకృతి అనుకూలిస్తే గానీ పండిన పంట చేతికి రాదని, అప్పటివరకు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందేనంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20 వేల హెక్టార్లలో..

గన్నవరం నియోజకవర్గంలోని మూడు ప్రధాన మండలాల్లో సుమారు 20 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. సాగునీటికి ఇబ్బంది లేకపోవడంతో పాటు, వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది డెల్టాలో వరిపైరు చక్కగా పెరిగింది. దిగుబడులు ఎకరాకు 40 బస్తాలకు పైగానే ఉంటుందన్న ఆశాభావం కర్షకుల్లో నెలకొంది. ఇందులో 50 శాతం పైబడి పంట ఇంకా నిలువు మీదే ఉంది. కోసిన పంట చాలా వరకు తేమ కారణంగా రాశుల మీద ఉంది. కొన్నిచోట్ల పనల మీదే ఉండగా, మిగతా చోట్ల కోతకు అనుగుణంగా సన్నాహాలు మొదలయ్యాయి. పనల మీద ఉన్న పంటను దాదాపుగా కుప్పలు చేసేశారు. రాశుల మీద ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పి ఉంచారు.

కోడూరుపాడు వద్ద ధాన్యంపై కప్పిన పరదాలు

• పెనమలూరు నియోజకవర్గంలో మాత్రం కొంతమేర ధాన్యం సేకరణ జరుగుతోంది. తుపాను హెచ్చరికల దృష్ట్యా ఉంచుకుని కల్లాలు, రహదారులపై నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు మిల్లులకు చేర్చే విధంగా వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్ఎస్‌కేల ద్వారా సేకరించిన ధాన్యంలో 17 శాతానికి అధికంగా తేమ ఉంటే 1 శాతానికి ఒక కిలో తరుగుతో మిల్లర్లు సేకరిస్తున్నారు.

ఈడుపుగల్లు పరిధిలో వరి కుప్పలు

ఇలా చేస్తే మేలు

వాతావరణం ప్రతికూలంగా మారిన నేపథ్యంలో రైతులు నష్టతీవ్రత తగ్గించుకునేందుకు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కోతలు నిలిపివేయడంతో పాటు దగ్గరుండి రాశులపై పట్టాలు కప్పాలని చెబుతున్నారు. 1075, బీపీటీ 5204 రకం సాగు చేసినవారు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని, పనల మీద ఉన్నవారు ఒకవేళ జల్లులకు తడిస్తే వెంటనే కుప్పలు వేయొద్దంటున్నారు. నీళ్లు సత్వరమే బయటకు పోయేలా చేసి, ఉప్పు ద్రావణం పిచికారీ చేసేలా చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

ప్రతిభ చాటి.. బహుమతి పట్టి

కానూరు, పోరంకి, న్యూస్‌టుడే: కానూరు నారాయణ ఈ టెక్నో పాఠశాలలో ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితంపై చరవాణి ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మమత, లక్ష్మనాగశ్రీ, లీలాశ్రీలకు డీన్‌లు శ్రీనివాసరావు, రమేష్, క్లస్టర్ ప్రిన్సిపల్ ముత్యాలరెడ్డిలు బహుమతులు అందజేశారు.

★ పోరంకిలో సంవిధ విద్యాపీఠ్‌లో జరిగిన ఉపన్యాస పోటీలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నిఖిల, తన్మయిశ్రీ, భవానీలకు ప్రిన్సిపల్ రామ్మోహనాచారి, వైస్ ప్రిన్సిపల్ కవిత బహుమతులు అందించారు.

కానూరు నారాయణ ఈ టెక్నోలో విజేతలతో డీన్లు శ్రీనివాసరావు, రమేష్, తదితరులు

సంవిధ విద్యాపీఠ్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ రామ్మోహనాచారి తదితరులు

అర్హులందరికీ పింఛన్లు

గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పింఛను అందజేస్తోన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

నున్న, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడులో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా నెలకు 40,871 మందికి పింఛన్ల రూపంలో రూ.17.53 కోట్లు పంపిణీ చేస్తున్నామని, ఈ నెల 50 మందికి నూతన పింఛన్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాబూరావు, గొడ్డళ్ల చిన్నరామారావు పాల్గొన్నారు.

పెనమలూరులోనూ పంపిణీ

కానూరు, న్యూస్‌టుడే: పింఛన్ల పంపిణీలో భాగంగా యనమలకుదురు, కంకిపాడు మండలం వేల్పూరులో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కానూరులో దుర్గగుడి పాలకవర్గ సభ్యులు వెలగపూడి శంకరబాబు, పోరంకిలో సీనియర్ తెదేపా నాయకులు అనుమోలు ప్రభాకరరావు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందించారు.

యనమలకుదురులో పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

డివైడర్‌పై వాహనాలు తొలగించండి

రామవరప్పాడు, న్యూస్‌టుడే: రామవరప్పాడు రింగ్ సమీపంలోని డివైడర్ మధ్యలో ఉంచిన ద్విచక్రవాహనాలను తొలగించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పోలీసులకు సూచించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ ఉంచుతున్నారు. నెలల తరబడి ఇలాగే వదిలేయడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఆ రహదారిలో వెళ్తున్న ఎమ్మెల్యే వాటిని చూసి తొలగించాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు.

ప్రకటన

నా క్లయింటు NTR జిల్లా, విజయవాడ రూరల్ ప్రసాదంపాడు, సాయిబాబా టెంపుల్ దగ్గర, వికాస్ స్కూల్ రోడ్డు VKR టవర్స్ ఫ్లాట్ నెం GF-2 రు కాపురస్తులు ముద్దన అశోక్ గారి భార్య రజిని గారు కృష్ణా జిల్లా విజయవాడ రూరల్ మండలం నిడమానూరు రామానగర్ డోర్ నెం. 1-119/3రు కాపురస్తులు పుట్టెపు లేటు శ్రీరాములు గారి కుమారుడు శ్రీనివాసరావు గారికి చెందిన ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని కొనదలచి కొంత పైకము బయానాగా చెల్లించియున్నారు. ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని ఆత్కూరి శ్రీనివాసరావు గారికి క్రయ దస్తావేజు నెం- 55/1999 రుగా సంక్రమించగా తదుపరి వారు ది. 05-06-2002వ తేదీన విజయవాడ ప్రసాదంపాడు కాపురస్తులు పుట్టెపు లేటు సన్యాసిరావు గారి కుమారుడు రాములు, వీరి కుమారుడు అప్పారావు గార్ల పేరున విక్రయ దస్తావేజు నెం- 1337/2002 రుగా విక్రయించినారనియు అయితే రాములు గారు వారికి గల జాయింటు హక్కును గురించి ఏవిధములైన లిఖిత పూర్వకములైన ఏర్పాట్లు చేయకుండానే ది.24-04-2010వ తేదీన పరమపదించినారని, వారి మరణానంతరము వారి ముఖ్య సన్నిహిత వారసులు భార్య సత్యవతి, కుమార్తెలు కోలా సూరిడమ్మ, మొగసాల రమణ, అల్లాడి దుర్గ కుమారులు అప్పారావు, శ్రీనివాసరావు గార్లు కలసి పంచుకుని అందుకు గాను పార్టిషన్ దస్తావేజు నెం - 6959/2014 రుగా రిజిష్టరు చేయించుకున్న రీత్యా F షెడ్యూలు ఆస్తి శ్రీనివాసరావు గారికి సంక్రమించినదని తెలియచేయుచూ నా క్లయింటుకి విక్రయించదలచినారని తెలియచేయుచున్నారు. అయితే ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని Cholamandalam Investment And Finance Company LTD వారికి హామీగా ఉంచి ఋణమును పొందుట తప్ప మరి ఏ ఇతర లావాదేవీలు జరిపియుండలేదని తెలియచేయుచున్నారు. కనుక ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైననూ ఏవిధములైన చెల్లదగు అభ్యంతరములు, కోర్టు జప్తులు, ఇంజక్షన్లు, బాగలబద్ద తాగాయిదాలు వగైరాలు ఏదైనా యున్నచో ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులు లోపు ఈ దిగువ తెలిపిన అడ్రసునకు రిజిష్టరు పోస్టు తిరుగు టపా ద్వారా పంపమనవి. లేనిచో అభ్యంతరములు లేవని ఎంచి నా క్లయింటు పైన తెలిపిన వారికి పూర్తి క్రయ ధనమును చెల్లించుట కొరకు ఏదైనా బ్యాంకులో ఋణమును పొంది ఆ ఋణమును పైన తెలిపిన వారికి చెల్లించి వారికి సంబంధిత రిజిస్ట్రార్ వారి ఆఫీసులో క్రమమైన విక్రయ దస్తావేజులు రిజిష్టరు చేయించుకొనగలరు. తదుపరి వచ్చు క్లయిములు, అభ్యంతరములు నా క్లయింటును ఏ విధముగాను బైండ్ చేయజాలవు.

ఆస్తి షెడ్యూల్ : కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్ మండలం, నిడమానూరు గ్రామ ఆర్.యస్.నెం. 117/2, ప్లాటు నెం.37, 38 పార్టు దాఖలా స్థిరాస్తికి హద్దులు: **తూర్పు:** అ. 20-0లు వెడల్పు గల పంచాయితీ రోడ్డు, **దక్షిణం:** పుట్టెపు అప్పారావు గారి ఆస్తి, **పడమర:** కోలా సూరిడమ్మ గారి ఆస్తి, **ఉత్తరం:** అ. 20-0లు వెడల్పు గల పంచాయితీ రోడ్డు. పై నాలుగు హద్దుల మధ్య చ॥గ॥ 91.70లు లేక చ॥మీ॥ 76.67ర్లు స్థిరాస్తి నివేశన స్థలము, అందలి యావత్తు యీజ్‌మెంట్ హక్కులతో సహా.

P.Rama Mohana Rao, D.Lakshman Kumar, K. Rajendra, Advocates
Satyanarayanapuram, Vijayawada-3 ✆ 93921 14922

గ్రంథాలయ నిర్మాణానికి ఏకగ్రీవ తీర్మానం

పెనమలూరు: చోడవరంలో గ్రంథాలయ నిర్మాణానికి గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సర్పంచి కాకర్ల వెంకటరత్నం అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. అజెండాలోని అంశమైన గ్రంథాలయ నిర్మాణానికి సమావేశంలో పాల్గొన్న వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం గ్రామ కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ.. తీర్మానాన్ని వెంటనే కెనరా బ్యాంకు అధికారులకు పంపనున్నట్లు వివరించారు. బ్యాంకు ఉన్నతాధికారులు వారంలోగా పంచాయతీకి రూ.10 లక్షలు అందజేయనున్నట్లు వెల్లడించారు. భవన నిర్మాణానికి చాగర్లమూడి వెంకటరామ సత్యవరప్రసాద్ అనే దాత కొద్దిరోజుల క్రితం స్థలాన్ని విరాళంగా అందించారు.

గన్నవరంలో రక్తదాన శిబిరం

అవీ ఇవీ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం పట్టణ శివారు దావాజీగూడెం ఎన్టీటీఎఫ్ కళాశాల ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదాన ఆవశ్యకతను లయన్స్‌క్లబ్ ప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ మహీధర్, కె.పద్మజ పాల్గొన్నారు.

లెదర్ సర్వే టెక్నాలజీపై శిక్షణ తరగతులు

కానూరు, న్యూస్‌టుడే: పీవీపీసిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ విభాగం నేతృత్వంలో లెదర్ సర్వే టెక్నాలజీపై శిక్షణ తరగతులను ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ నిర్మాణాల్లో విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలపై ఈ నెల 1 నుంచి 6వ తేదీ వరకు శిక్షణ ఇస్తామన్నారు. సివిల్ విభాగాధిపతి వెంగల జగదీష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోగంటి శ్యామ్‌ప్రకాష్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ తరగతులు సివిల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

నలుగురు కార్యదర్శులకు పదోన్నతి

కంకిపాడు, న్యూస్‌టుడే: మండలంలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న నలుగురికి గ్రామ, వార్డు సచివాలయ(జీడబ్ల్యూఎస్) అధికారులుగా పదోన్నతి లభించింది. పునాదిపాడు కార్యదర్శి బాపూజీ కంకిపాడు మండలం, వేల్పూరు కార్యదర్శి ఎన్.ప్రసాద్ ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు, కుందేరు కార్యదర్శి కోటేశ్వరరావు కృష్ణా జిల్లా కోడూరు జీడబ్ల్యూఎస్ అధికారిగా నియమితులయ్యారు. కోలవెన్ను కార్యదర్శి శ్రీనివాసరావు కోనసీమ జిల్లాకు పదోన్నతిపై వెళ్లగా ఇంకా మండలం కేటాయించలేదని సంబంధిత అధికారులు తెలిపారు.

త్రైత సిద్ధాంతం అనుసరణీయం

కోలవెన్ను(కంకిపాడు), న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించడానికి భగవద్గీతలో శ్రీకృష్ణుడు ప్రబోధించిన త్రైత సిద్ధాంతం అనుసరణీయమని ఇందూ జ్ఞానవేదిక నూజివీడు కమిటీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ చెప్పారు. కోలవెన్నులో సోమవారం భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. సమితి ప్రతినిధులు కోటేశ్వరరావు, అశోక్, శ్యామ్, శ్రీకాంత్, రామాంజనేయులు పాల్గొన్నారు.

జిప్సం.. దారుణంగా కాలుష్యం

పొక్లెయిన్‌తో లారీలోకి దిగుమతి చేస్తున్న జిప్సం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: నూజివీడు(హనుమాన్‌జంక్షన్) రైల్వేస్టేషన్‌లో గత కొన్ని వారాల నుంచి జిప్సం దిగుమతి జరుగుతుంది. విశాఖపట్నం నుంచి ప్రత్యేక రైళ్లలో వస్తున్న దీనిని పొక్లెయిన్లతో తోడి లారీల్లోకి దిగుమతి చేస్తున్నారు. ఇక్కడ్నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. బస్తాల్లో కాకుండా విడిగా వస్తుండటంతో వ్యాగన్లలోంచి తోడే సమయంలోనూ, లారీల్లోకి చేర్చే క్రమంలోనూ జిప్సం గాలికి ఎగురుతూ విపరీతమైన కాలుష్యం వెదజల్లుతుంది. దీంతో రైల్వేస్టేషన్ ప్రాంగణంతోసహా, పరిసరాలు, సమీపంలో ఉన్న జగనన్న కాలనీలోని నివాసాలు జిప్సంతో నిండిపోతున్నాయి. ఇప్పటికే నాలుగు రైళ్లలో 230కు పైగా వ్యాగన్లలో సరకు ఇక్కడికి చేరింది. ఇంకా కొన్ని వారాల పాటు రవాణా కొనసాగుతుందని సమాచారం. దీని కారణంగా రైల్వే ప్రయాణికులు, ఉద్యోగులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా గుత్తేదారు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై స్టేషన్ సూపరింటెండెంట్ విశ్వేశ్వరరావుని 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. జిప్సం దిగుమతి వల్ల ఇబ్బంది తలెత్తుతున్న మాట వాస్తవమేనని, తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా గుత్తేదారుకు సూచించామన్నారు.

నాడు పనులు.. నేడు పగుళ్లు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కానుమోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద చేపట్టిన పనులు నాసిరకంగా జరిగినట్లు అప్పట్లోనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా మారి, రాజకీయ పెత్తనంతో నిర్వహించిన ఈ పనుల్లో డొల్లతనం కళ్లకు కడుతుంది. ప్రధానోపాధ్యాయుడి కార్యాలయం, కంప్యూటర్ ల్యాబ్ కోసం నిర్మించిన అదనపు గదుల ఫ్లోరింగ్ అనతి కాలంలోనే పాడైపోయింది. ఎక్కడికక్కడ కుంగిపోయి, టైల్స్ బీటలు వారిపోయాయి.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

వేల్పూరులో రహదారులను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్‌లో చేరడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని వేల్పూరులో ఎస్ఆర్‌కే కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ క్యాంపునకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి రహదారులను శుభ్రం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి సమాజంపై అవగాహన, వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై శ్రద్ధ ఉండాలన్నారు. దీంతోపాటు మొక్కలు నాటడం, లక్ష్యసాధన, సమయపాలన తదితర అంశాలను నిత్యం పాటిస్తే వారి జీవితాలు ఉన్నత శిఖరాలకు చేరతాయన్నారు.

కానూరు, న్యూస్‌టుడే: తాడిగడప పురపాలికను సమగ్రంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. కానూరు కేసీపీ కాలనీలో రూ.78 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాడిగడప పురపాలికను రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో యార్లగడ్డ సుచిత్ర, వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవికిరణ్, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ 2nd అడిషనల్ జిల్లా జడ్జివారి కోర్టులో కృష్ణా, విజయవాడ
E.P. No. 27 of 2017 in O.S. No. 53 of 2014
Between:
గోగినేని సుబ్బారావు ...డి.హెచ్.ఆర్.
వర్సెస్
ప్రత్తిపాటి శ్రీనివాసరావు ...జె.డి.ఆర్.

ఈక్రింది తెలియపరచిన షెడ్యూలు దాఖలా ఆస్తి ది.20-01-2026వ తేదీన పై కోర్టు వారి ఎదుట వేలం వేయబడును. పాట పాడుకొను పాటదారులు పై కోర్టు వారి ఎదుట ది.20-1-2026వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరై పాట పాడుకొనవచ్చును.

షెడ్యూలు

A - షెడ్యూలు:- కృష్ణా జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామంలో ఆర్.యస్.నెం. 89/2లో 241.36 చ॥గ॥ల స్థలములో 39 చ॥గజముల అవిభక్త అనిర్దిష్టపు ఖాళీ ఇంటి స్థలమునకు హద్దులు. **తూర్పు:** 33 అ॥ వెడల్పు గల పంచాయితీ రోడ్డు - 29.6 అ॥, **దక్షిణం:** గాది నరశింహారెడ్డి వగైరాల ఆస్తి - 73.6 అ॥, **పడమర:** గొల్లనపల్లి సుబ్బలక్ష్మి వగైరాల ఆస్తి - 29.3 అ॥, **ఉత్తరం:** జనపాల నరశింహారావు గారి ఆస్తి - 74.5 అ॥ ఈ హద్దుల మధ్య అవిభక్తపు మరియు అనిర్దిష్టపు 39 చ॥గ॥ల ఖాళీ నివేశన స్థలం.

B - షెడ్యూల్: కృష్ణా జిల్లా, పటమట సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా, పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామములో, సాయి నిలయం అపార్ట్‌మెంట్, 1వ ఫ్లోర్‌లో ప్లాటు నెంబరు FF-1 పై ఉదహరించిన A షెడ్యూల్‌లో కట్టబడిన 1000 చ॥ అ॥ల (కారు పార్కింగ్ 80 చ॥అ॥ లతో సహా) నిర్మించబడిన ప్లాటు యొక్క హద్దులు. **తూర్పు:** ఓపెన్‌టు స్కై, **దక్షిణం:** ఓపెన్‌టు స్కై, **పడమర:** స్టేర్స్ మరియు ఓపెన్‌టు స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై. పై ఉదహరించిన A మరియు B షెడ్యూలు ఆస్తిలో జేడీఆర్‌కి కలిగి వున్న 1/2వ వంతు అవిభక్తపు మరియు అనిర్దిష్టపు ఆస్తి.

డి.హెచ్.ఆర్ విలువ : రూ. 12,50,000/-
అమీనా విలువ : రూ. 15,00,000/-
మార్కెట్ విలువ : రూ. 14,63,100/-
వేలం తేది : 20-1-2026
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
ఇట్లు : జి. శ్రీనివాస్
డి. హెచ్. ఆర్ తరపున న్యాయవాది
మచిలీపట్నం.

12న బాలోత్సవం

బ్రోచర్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు, వెంకట్రావు తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పిల్లల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు బాలోత్సవాలు దోహదపడతాయని గన్నవరం బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు తెలిపారు. డిసెంబరు 12న స్థానిక బాలికోన్నత పాఠశాలలో బాలోత్సవం నిర్వహించనున్నట్లు సోమవారం తెలిపారు. సాంస్కృతిక, అకాడమిక్, ఇతర విభాగాల్లో 33 అంశాలపై నిర్వహించే పోటీల్లో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. బాలోత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను కమిటీ ప్రతినిధులు గన్నె వెంకట్రావు, తదితరులతో కలిసి ఆవిష్కరించారు.

డిప్యూటీ ఎంపీడీవోల నియామకం

గన్నవరం గ్రామీణం, హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అందించే సేవల పర్యవేక్షణకు ప్రభుత్వం గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండల పరిషత్తులకు గాను డిప్యూటీ ఎంపీడీవోలను నియమించింది. గన్నవరం మండలానికి సాయిబాబు, ఉంగుటూరు మండలానికి కేతేపల్లి వెంకటేశ్వరరావు, బాపులపాడు మండలానికి సంపత్‌కుమార్‌ను నియమించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

చికిత్స పొందుతూ మృతి

ఉయ్యూరు, న్యూస్‌టుడే: స్థానిక శివాలయం వద్ద గత నెల 23వ తేదీ సాయంత్రం జరిగిన విద్యుదాఘాతంలో తీవ్రంగా గాయపడిన యువకుడు విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. శివాలయం ఎదురుగా భవనంపై పెట్టిన ఫ్లెక్సీ కిందకు దించే ప్రయత్నంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి నలుగురు యువకులు గాయపడ్డారు. వారందరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. వారిలో తీవ్రంగా గాయపడిన జొన్నలగడ్డ పృథ్వీనాథ్(19) సోమవారం మరణించాడు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వం విద్యావ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం మండిపడ్డారు. 17 వైద్యకళాశాలల్ని ప్రైవేటుపరం చేసే ప్రతిపాదనలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. స్థానిక శ్రామిక భవన్‌లో సోమవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉప్పులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది

ఏజీఎస్‌జీఎస్ కళాశాలలో మాట్లాడుతున్న ఉయ్యూరు వైద్యశాల సూపరింటెండెంట్ మురళి

ర్యాలీలో పాల్గొన్న సిద్ధార్థ డీమ్డు విశ్వవిద్యాలయం ఉపకులపతి వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెరిగితేనే నియంత్రించవచ్చని వైద్యులు తెలిపారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. రోగులు రోగనిరోధక శక్తిని పెంపొందించుకొనే ప్రక్రియ ద్వారా జీవితకాలాన్ని పెంచుకోవచ్చని పేర్కొన్నారు.
- న్యూస్‌టుడే, బృందం

కాటూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

జాతీయ భావం లక్ష్యంగా విద్యాబోధన అవసరం

మాట్లాడుతున్న బి.రాజశేఖర్

రామవరప్పాడు: నేటితరం బాలబాలికలకు జాతీయ భావం, దేశభక్తి సమ్మిళితమైన విద్యాబోధన అవసరమని ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ బి.రాజశేఖర్ అన్నారు. ఎనికేపాడు విజ్ఞాన విహార స్కూల్‌లో 41వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మరింతగా విస్తరించనున్న సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భక్తితో కలశోత్సవం.. కంకిపాడు: భవానీమాలదీక్షధారులు సోమవారం కంకిపాడులో కలశోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి కలశాలు తలపై పెట్టుకుని గ్రామంలోని ప్రధాన వీధుల్లో పాదయాత్ర జరిపారు.

ఖాళీ స్థలాలపై పన్నులో భారీ ఊరట

వీఎల్‌టీ వసూలులో తాడిగడప మొదటి స్థానం ● సద్వినియోగించుకుంటే ఆదాయం

ఉయ్యూరు, న్యూస్‌టుడే

పురపాలక సంఘాల్లో ఖాళీ స్థలాలపై 50 శాతం పన్ను మినహాయింపు ఇస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంతో స్థల యజమానులకు ఊరట లభించనుంది. దానికి తోడు పురపాలికలకు పెద్దఎత్తున ఆదాయం సమకూరేందుకు వీలవుతుంది. పెనమలూరు నియోజకవర్గంలోని తాడిగడప, ఉయ్యూరు పురపాలికల్లో ఈ పథకం అమలైతే ఆదాయం బాగా పెరిగే అవకాశం ఏర్పడింది. ఇప్పటికే ఖాళీ స్థలాలపై పన్ను(వీఎల్‌టీ) వసూలులో జిల్లాలో తాడిగడప లక్ష్యానికి మించి ముందంజలో ఉండగా, ఉయ్యూరు నాలుగో స్థానంలో నిలిచింది. అయితే పురపాలికల్లో నమోదు కాని ఖాళీ స్థలాలు వేలల్లో ఉన్నాయి. వాటిపై కూడా పన్ను వసూలు చేస్తే ఆదాయం రూ.కోట్లలో ఉంటుంది.

డిసెంబరు ఒకటో తేదీ నాటికి వీఎల్‌టీ వివరాలు

	తాడిగడప	ఉయ్యూరు
అసెస్‌మెంట్లు	1,191	462
పన్ను డిమాండ్	రూ.1.85 కోట్లు	రూ.49 లక్షలు
పన్ను వసూలు	రూ. 1.92 కోట్లు	రూ.0.12 లక్షలు
వసూలు శాతం	103.73	27.13 శాతం

● మంత్రివర్గ నిర్ణయం ప్రకారం బకాయి ఎంత ఉన్నా మూడేళ్ల పన్ను మాత్రమే వసూలు చేయనున్నారు. ఈ మొత్తం కూడా ఆరు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. తాడిగడప, ఉయ్యూరు పురపాలికల్లో నమోదైన ఖాళీ స్థలాల కంటే నమోదు కాని స్థలాల సంఖ్య మూడింతలుంటుందని అంచనా. అన్నింటికి వీఎల్‌టీని పకడ్బందీగా వసూలు చేయగలిగితే సమకూరే ఆదాయం పట్టణ అభివృద్ధికి దోహదపడుతుంది. ఇటీవల కాలంలో స్థలాల విలువ బాగా పెరిగింది. ఈ రెండు పురపాలికల్లో గజం ధర మరింత ఎక్కువగా ఉంది. స్థలం ధరలో 0.5 శాతం చెల్లించాల్సి ఉన్నా ఎక్కువ మొత్తంలోనే రాబడి ఉంటుంది. మరోవైపు వీఎల్‌టీ చెల్లిస్తేనే ఆయా ఖాళీ స్థలాలు రిజిస్ట్రేషన్లు జరుగుతాయని కూడా అధికారులు చెబుతున్నారు. అలాగే భవన నిర్మాణ అనుమతుల్లో సైతం ఇదే పంథా అవలంబించనున్నారు. త్వరలో విడుదలయ్యే ప్రభుత్వ నియమావళి ఆధారంగా ఆయా నిర్ణయాలుంటాయి.

ఉయ్యూరులో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలం

(c) eenadu

బాలోత్సవ్‌లో ఐనపూరు విద్యార్థుల ప్రతిభ

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఐనపూరు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: శ్రీనివాస విద్యాసంస్థలు ఉయ్యూరు వారి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి బాలోత్సవ్ కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థులు జూనియర్ విభాగంలో నృత్యప్రదర్శనలో ప్రథమస్థానంలో నిలిచారని ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసా వేణు గోపాలరావు సోమవారం తెలిపారు. ఆ ప్రదర్శనలో దూదల శివవెంకట నాగలాస్య, నల్లూరి సుశ్మిత, బొప్పన పల్లి చందన, ఉమ్మిడాల పూజిత ఉన్నారన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు

పామర్రు, న్యూస్‌టుడే: బుచ్చమ్మ ఆశ్రమంలో రాధాకృష్ణులకు గీతా జయంతిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజ కార్యక్రమాలు తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్యేక పర్యవేక్షకులుగా ఎలీషారావు

గుడ్లవల్లేరు: మండలంలోని గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక పర్యవేక్షకులుగా అంగలూరు కార్యదర్శి ఎలీషారావు సోమవారం నియమితులయ్యారు. పదోన్నతిపై మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఎలీషారావును ఎంపీడీవో ఇమ్మాన్, డిప్యూటీ ఎంపీడీవో అంజనాదేవి, కార్యదర్శులు, సిబ్బంది సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ? అవనిగడ్డ హెడ్ పోస్టాఫీసు సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన కొడుతోంది. వెంటనే తొలగించాలి. **-కిషోర్, సుబ్బారావు, అవనిగడ్డ**

✔ సిబ్బందిని పంపించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తాం. **-తోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, అవనిగడ్డ**

? అవనిగడ్డ రెండో వార్డు పాత కరెంటు ఆఫీసు ఎదురుగా చెత్త పేరుకుపోయి దుర్వాసన కొడుతోంది. **-ఎం.శేఖర్, అవనిగడ్డ**

✔ చెత్త తొలగిస్తాం. **-శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి**

భక్తిశ్రద్ధలతో గీతాపారాయణ

కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గీతాపారాయణ చేస్తున్న భక్తులు

పామర్రు, న్యూస్‌టుడే: గీతా జయంతిని పురస్కరించుకుని సోమవారం పలు దేవాలయాలు, పాఠశాలల్లో భక్తిశ్రద్ధలతో గీతా జయంతిని నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి, బుచ్చమ్మ ఆశ్రమం, ఎన్టీఆర్ కళాపీఠం, హితమ్ పాఠశాలలో గీతా పారాయణ నిర్వహించారు. లలితా కుమారి మాట్లాడుతూ విద్యార్థులకు భగవద్గీత జీవితానికి అన్వయించేలా బోధించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ హేమంత రెడ్డి, ఉపాధ్యాయులు తనూజ, విజయలక్ష్మి, పల్లవి పాల్గొన్నారు.

అవనిగడ్డ: స్థానిక గీతా మందిరంలో సోమవారం గీతా జయంతిని పురస్కరించుకుని గీతాచార్యులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేష పూజలు చేశారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 10 రోజులుగా భగవద్గీత పఠనంలో శిక్షణ ఇచ్చి, పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

చల్లపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా బాలాజీ

చల్లపల్లి: డీపీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన ఎం.బాలాజీ పదోన్నతిపై చల్లపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను చల్లపల్లి ఈవో పి.వి.మాధవేంద్రరావు కలసి అభినందించారు.

శివరామప్రసాద్ సేవలు అభినందనీయం

ఘంటసాల: గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి శివరామప్రసాద్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం ఘంటసాల ఎంపీడీవో కార్యాలయం వద్ద జీఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందిన యార్లగడ్డ శివరామప్రసాద్‌ను పలువురు సత్కరించారు. సర్పంచి అంకం మారుతీరావు, శ్రీనివాస చంద్, ఈవోపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

అవనిగడ్డ, న్యూస్‌టుడే: డీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఎం.బాలాజీ చల్లపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా, కె.పద్మావతి అవనిగడ్డ డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు. వారు సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

రైతన్నల్లో గుబులు

ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం

కొండిపర్రులో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో శివనాగరాణి

కాజ(కూచిపూడి), న్యూస్‌టుడే: దిత్వా తుపాను నేపథ్యంలో నూర్పిడి చేసిన ధాన్యం రాశుల కల్లాలలో, రోడ్ల వెంబడి ఆరబెట్టడంతో రక్షించుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. మొంథా తుపాను గాయం మానకముందే దిత్వా గండం వచ్చిందంటూ వారి పంటను కాపాడుకునేందుకు విలవిల లాడుతున్నారు. సోమవారం ఉదయం నుంచే చిరుజల్లులు పడటంతో రైతుల గుండెల్లో దైర్యం పరుగెడుతున్నాయి. తేమశాతం బాగా పెరగటంతో దాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగ్గించుకునేందుకు ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో ఉన్నారు. అయితే రైతు సేవా కేంద్రాలలో సంచులు, వాహనాల కొరత ఉంది. కాజలో 4వేల ఎకరాలలో వరి పంట వేయగా దాదాపు 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. అయితే సోమవారం నాటికి కేవలం 1400ల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. మిగిలిన ధాన్యం గ్రామంలో నివాసాల ముందు, ఖాళీ ప్రదేశాలలో, రహదారులపై, సచివాలయం ప్రాంగణంలో ఎక్కడ చూసినా రాశులుగా పోశారు. కొంతమేరకు

కాజలో రైతుసేవా కేంద్రం వద్ద ధాన్యం నిల్వలు

వాసన రావటంతో దళారులు కూడా కొనక ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామానికి చెందిన రైతులు రావులపాటి కాజిరెడ్డి, గంగ్రపు మోహనరావు, మర్రివాడ సురారెడ్డి, మంద అశోక్, రావులపాటి శ్రీనివాసరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు 'న్యూస్‌టుడే' ఎదుట తమ ఆవేదన వెల్లడించారు. తమ గోడు ఏ అధికారి పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో దిక్కుతోచని స్థితిలో ఉన్న తమను ప్రభుత్వం ఆదుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు.

వరికోతలు నిలిపివేయాల్సిందే...

పామర్రు(గ్రామీణం), న్యూస్‌టుడే: తుపాను కారణంగా వరికోతల్ని నిలుపుదల చేయాలని మండల వ్యవసాయశాఖాధికారిణి వి.శివనాగరాణి సూచించారు. సోమవారం మండలంలోని పామర్రు, కొండిపర్రు, అడ్డాడ, పెదమద్దాలి తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుకోవాలని ప్రభుత్వ సూచన మేర కోతల్ని నిలుపుదలచేయాలన్నారు. రాశుల్లో ధాన్యం మొలకెత్తకుండా, రంగుమారకుండా ఉండటానికి ఒక క్వింటా ధాన్యానికి కేజీ ఉప్పు, 20కిలోల పొడి ఊక కలపాలన్నారు. పనలపై ఉన్న వరిపైరు, కుప్పమీద ఉన్న ధాన్యం తడిస్తే మొలకలు రాకుండా 5% ఉప్పుద్రావణం పిచికారి చేయాలని సూచించారు.

గుడివాడలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే రాము, శిరీషా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో..

సేవా కార్యక్రమాలతో వెల్లువెత్తిన అభిమానం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జన్మదినం సందర్భంగా గుడివాడ పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, నేతలు, భారీ కేకు కోశారు. నేతలు దింట్యాల రాంబాబు, లింగం ప్రసాద్, డాక్టర్ సత్యనారాయణ, బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఆర్డీవో జి.బాల సుబ్రహ్మణ్యం, తహసీల్దారు కిరణ్ కుమార్, సిబ్బంది నోటు పుస్తకాలు బహుమతిగా అందజేశారు. శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో శిరీషా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానాన్ని వాసే మురళీ ప్రారంభించారు. పట్టణంలోని పలు వసతి గృహాల విద్యార్థులకు దేవాదాయ శాఖ సిబ్బంది సమకూర్చిన దుప్పట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. తెదేపా నేత నిరంజన్ సహకారంతో ఓ పేద విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. జనసేన ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద గోకవరపు సునీల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ❖ గుడివాడ ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానాలు మరువలేనివని వారికి జన్మంతా రుణపడి ఉంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ప్రతీ వార్డులోనూ సేవా కార్యక్రమాలు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు.

☛ నందివాడ మండలం పోలుకొండలో రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో రామును మార్కెట్‌యార్డు ఛైర్మన్ చోరగుడి రవికుమార్, మండల తెదేపా అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు, సర్పంచిలు సింగాల రాధాకృష్ణ, యలమంచిలి సతీశ్, ఆరేకపూడి వెంకటరామశాస్త్రులు, డీసీ ఛైర్మన్ నంబూరి రాకేశ్, బొమ్మనబోయిన ఏసుబాబు, మసిముక్కు వేణుగోపాలరావు, దారం శ్రీనివాసరావు, గద్దే సురేశ్, ఎరికపాటి రత్నప్రసాద్, కుంపటి ప్రసాద్, ఎర్రంశెట్టి శివ తదితరులు ఆయన్ను అభినందించారు.

అభాగ్యుల జీవనానికి తోడ్పాటు

లంకమ్మ మాన్యంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: అభాగ్యుల కుటుంబ జీవనానికి ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం తోడ్పడుతోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. సోమవారం స్థానిక లంకమ్మమాన్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో ఆయన మాట్లాడి వారి ఆర్థిక, కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు, అడపా వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: గుడివాడ పట్టణం 10వ వార్డులో ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను సోమవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రజాశ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పింఛన్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. గుడివాడ నియోజకవర్గంలో 43 కొత్త పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. కూటమి పాలనలో ప్రణాళిక ప్రకారం పరిపాలన జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ సి.మనోహర్, గోర్జి సత్యనారాయణ, జగన్మోహనరావు, పంద్రాజు సాంబయ్య, షేక్ మౌలాలీ, సయ్యద్ జబీన్, తదితరులు పాల్గొన్నారు

పెనమకూరు(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతినెలా ఒకటోతేదీన ఇంటివద్దే పింఛన్లు అందిస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. మండలంలోని పెనమకూరు గ్రామంలో వృద్ధులు, ఇతరులకు పింఛన్లు సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్, తెదేపా నాయకులు పిట్టు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమకూరులో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, శివరామప్రసాద్

ఆక్రమణల తొలగింపునకు పరిశీలన

ఆక్రమణల గుర్తింపులో అధికారులు సాయిబాబు, హరనాథ్ తదితరులు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి ఆర్అండ్‌బీ రహదారిపై ఆక్రమణల తొలగింపునకు సోమవారం చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ పెరగటం, ట్రాఫిక్ సమస్యతో ఆర్టీసీ బస్సులను దేవాలయం వరకు రాకుండా కిలోమీటరు దూరంలో ఉన్న బైపాస్ రహదారి వద్దే నిలిపేశారు. పార్కింగ్ సమస్యపై పత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో నియోజకవర్గ అభివృద్ధి అధికారి పెనుమూడి సాయిబాబు, తహసీల్దార్ హరనాథ్, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు, ఆర్అండ్‌బీ డీఈ, ఈవోపీఆర్డీ త్రిపుర సుందరి, సర్వే బృందం రంగంలోకి దిగారు. మార్కింగ్ ఇచ్చారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా మంగళవారంలోగా తొలగించాలని ఆదేశించారు.

వాసవీ వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ

పామర్రు: స్థానిక మచిలీపట్నం రోడ్డులోని వాసవీ వృద్ధశరణాలయానికి బెంగళూరుకు చెందిన కంటేటి శ్రీనివాస్, భవానీ దంపతులు గీతా జయంతి సందర్భంగా సోమవారం వృద్ధులకు అవసరమైన రూ.10 వేల విలువైన నిత్యావసర సరుకులను వారి ప్రతినిధులు ఊటుకూరి ఉమామహేశ్వరరావు, నిర్వాహకుడు ఘంటసాల భరతుడునకు అందించారు. దివ్వెల శివయ్య, రామారావు, ప్రణీత్ పాల్గొన్నారు.

నేడు కేన్సర్ పరీక్షల నిర్వహణ

అవనిగడ్డ, గ్రామీణం, న్యూస్‌టుడే: అవనిగడ్డ మండలం కొత్తపేటలోని 5వ సచివాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటల నుంచి కేన్సర్ పరీక్షల వాహనం అందుబాటులో ఉంటుందని వేకనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి బి.రాహుల్ ప్రభాకర్ తెలిపారు. వాహనంలో గైనకాలజిస్ట్, రేడియోలజిస్ట్, ల్యాబ్ పరీక్షలు ఉంటాయన్నారు. ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్, తదితర పరీక్షలు చేస్తారని చెప్పారు. పరిసర ప్రాంత వాసులు, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

» శిథిలావస్థలో పర్రచివర అంగన్‌వాడీ కేంద్రం

పెచ్చులు ఊడిన స్లాబు

మండలంలోని పర్రచివర అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది. స్లాబు పెచ్చులు ఊడుతూ ఇనుపచువ్వలు కనపడుతూ ప్రమాదకరంగా ఉంది. చిన్నపాటి వర్షానికి స్లాబులో నుంచి భవనం లోపలికి చేరి పాఠశాల కార్యకలాపాలకు ఇబ్బందికరంగా ఉంటోంది. ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రంలో పది మంది చిన్నారులు ఉన్నారు. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- పర్రచివర(నాగాయలంక), న్యూస్‌టుడే**

» గమనించకపోతే ప్రమాదమే సుమా!

గుడివాడ పట్టణం సత్యనారాయణపురం నలంద ఉన్నత పాఠశాల సమీపంలో గతంలో కురిసిన వర్షాల కారణంగా కల్వర్టుపై నిర్మించిన సిమెంట్ స్లాబ్ కుంగిపోవడంతో తాత్కాలికంగా చెట్టు కొమ్మను ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి సమయాల్లో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు గుంతను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే**

» ఆదమరిస్తే అంతే మరి

నాగాయలంక గుల్లలమోద ప్రధాన రహదారి పెదపాలెం సమీపంలో ప్రమాదాన్ని సూచిస్తోంది. పంట కాలువ వైపు రహదారి నిలువునా బీటలు వారింది. పట్టపగలే ప్రయాణం భయానకంగా ఉందని ద్విచక్రవాహన దారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో వాహనం అదుపుతప్పితే ప్రాణాలు గాలిలో కలసిపోతాయి. అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో ప్రమాద హెచ్చరికల సూచికలు ఏర్పాటు చేయడం, తక్షణమే మరమ్మతులు చేయాలని ద్విచక్ర వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- నాగాయలంక, న్యూస్‌టుడే**

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

బాంధవిక నిహారిక

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే :రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి నెక్కలపూడి బాంధవిక, నిహారిక జాతీయ స్థాయికి ఎంపికయ్యారని మండల తెలుగు రైతు అధ్యక్షుడు నెక్కలపూడి మురళి తెలిపారు. 2026 జనవరి నెలలో అయోధ్యలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అక్క చెల్లెలు ఎంపిక అవ్వడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

3న ఘంటసాలలో మెగా ఉచిత వైద్యశిబిరం

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల విశ్వేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఈనెల 3వ తేదీ ఉదయం 8గంటలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, స్వచ్ఛ ఘంటసాల సంయుక్త సమన్వయంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సీనియర్ జనరల్ మేనేజర్ జ్యేష్ఠ రాజశేఖర్ తెలిపారు. గుండె, మెదడు, నరాలు, ఊపిరితిత్తులు, నేత్ర వైద్య నిపుణులు ఈ వైద్య శిబిరానికి విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బండి పరాత్పరరావు, శ్రీకాకుళం డీసీ ఛైర్మన్ అయినపూడి భానుప్రకాష్, పాల్గొన్నారు.

మండల స్థాయి జి.ఎస్.డబ్ల్యూ అధికారిగా శాంసన్‌బాబు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: మండల స్థాయి సచివాలయాల అధికారిగా శాంసన్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో రవికాంత్, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరమ్మ శాంసన్‌బాబును అభినందలు తెలియజేశారు. ఆయన విజయవాడ క్వాలిటీ కంట్రోల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై మండల స్థాయి పర్యవేక్షణ అధికారిగా తోట్లవల్లూరు వచ్చారు.

విద్యుత్ సామగ్రి దుకాణంలో చోరీ

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో ఏలూరు రోడ్డులోని శ్రీ జ్ఞాన హనుమాన్ ఎలక్ట్రికల్ శానిటరీ దుకాణం షట్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పగులకొట్టి లోపల ఉన్న రూ.1.50 లక్షలను దొంగిలించారు. దుకాణం యజమాని రాజ్‌పుత్ సింగ్ ఫిర్యాదు మేరకు గుడివాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుడివాడ, న్యూస్‌టుడే: నాగవరప్పాడుకు చెందిన మొవ్వా వెంకటేశ్వరరావు(45) కొంత కాలంగా మతి స్థిమితం లేక బాధ పడుతున్నాడు. ఈక్రమంలో గత నెల 30వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని భార్య అంకమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ర్యాలీ చేస్తున్న గుడ్లవల్లేరు వీవీ ఫార్మసీ కళాశాల విద్యార్థినిలు

అవగాహన ర్యాలీలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి తదితరులు

హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదు

గుడివాడ, న్యూస్‌టుడే: సమాజంలో మనతో పాటు జీవించే హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదని, వారిని ఆదరించి మనోధైర్యం నింపాలని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఆషా పర్వీన్ సయ్యద్ పేర్కొన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. వ్యాధి సోకిన వారు ఏడాదికి ఓసారి సీడీ4 పరీక్షను చేయించుకోవాలని, దాని కౌంట్ 250 లోపు ఉంటే చికిత్స ప్రారంభిస్తారన్నారు. గతంలో కన్నా ప్రస్తుతం ఎయిడ్స్ వ్యాధికి చాలా మంచి మందులు వచ్చాయని ఇవి వారి ఆయుష్షును పెంచుతాయన్నారు. అధ్యక్షుడు ఎల్ఆర్‌కె.ప్రసాద్, కరస్పాండెంట్ కేఎస్.అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్.కుమార్ పాల్గొన్నారు.

యువత అప్రత్తమంగా ఉండాలి

ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని గుడివాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరా దేవి పేర్కొన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎయిడ్స్ డేను పురస్కరించుకుని హెచ్ఐవి నివారణకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది, ఏఆర్‌టీ సిబ్బంది ప్లకార్డులతో ఎయిడ్స్ నివారణ విధానాలను తెలియచేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

మొవ్వ : ర్యాలీలో అధ్యాపకులు, డిగ్రీ విద్యార్థులు

ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ వాలంటీర్లు

సొర్లగొంది(నాగాయలంక), న్యూస్‌టుడే: సొర్లగొంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి పౌరుడు బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రెడ్ రిబ్బన్ క్లబ్, జాతీయ సేవా పథకం పీవో ఎ.వీరకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉమారాణి మాట్లాడారు. ఈసందర్భంగా వాలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోస్టర్ ప్రజంటేషన్ చేసి, రెడ్ రిబ్బన్ ఆకృతులతో విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు.

కృత్రిమ శ్వాస అందించి కాపాడారు

బాధితుడికి కృత్రిమ శ్వాస అందిస్తున్న ఆర్ఎంపీ వైద్యుడు శేషగిరిరావు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిపోయి అపస్మారక స్థితికి చేరిన యువకుడికి స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ పూర్వపు ఛైర్మన్, ఆర్ఎంపీ వైద్యుడు వంగర శేషగిరిరావు వెంటనే కృత్రిమ శ్వాస అందించారు. అతడు స్పృహలోకి వచ్చేలా చేసి, అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ గాయాలకు చికిత్స చేసిన అనంతరం యువకుడు వెళ్లిపోయినట్లు ఆసుపత్రి సిబ్బంది చెప్పారు.

కౌలు రైతులకు రూ.15లక్షల రుణాల పంపిణీ

కౌలురైతులకు రుణాలను అందచేస్తున్న పీఏసీఎస్ ఛైర్మన్ కమలాకరరావు

చల్లపల్లి, న్యూస్‌టుడే: రైతుల వ్యవసాయాభివృద్ధికి మంగళాపురం పీఏసీఎస్ రుణాలను పంపిణీ చేస్తూ తోడ్పాటును అందిస్తున్నట్లు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ పరుచూరి వెంకటేశ్వరరావు తెలిపారు. 30మంది కౌలు రైతుల్ని గ్రూపులుగా ఏర్పాటు చేసి ఒక్కొక్క రైతుకు రూ.50వేల చొప్పున రూ.15లక్షలు రుణాలను అందచేశామని చెప్పారు. ఏవో కె.మురళీకృష్ణ, సీఈవో చంద్ర రవికుమార్, వెంకటేశ్వరరావు, నిడమానూరు జగన్, కౌలు రైతులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ప్రస్తుతం USAలో నివసిస్తున్న నా క్లయింట్ శ్రీధన S చిట్టినేని, W/o చిట్టిబాబు చిట్టినేనికి ఏసియన్ పెయింట్స్ లిమిటెడ్‌లో షేర్లు కలిగి ఉన్నారు.

నా క్లయింట్ యొక్క ఏసియన్ పెయింట్స్ లిమిటెడ్ యొక్క ఒరిజినల్ షేర్ సర్టిఫికేట్ నెం.2729, ఫోలియో నెం.ANS 0046177, అతని సోదరి శ్రీమతి సీతారావమ్మ వేములపల్లి కస్టడీలో ఉంది. శ్రీమతి సీతారావమ్మ వేములపల్లి, మొవ్వ మండలం పెదపూడి గ్రామానికి చెందినవారు.

మా క్లయింట్ సోదరి అంటే సీతారావమ్మ వేములపల్లి తేదీ 19-11-2025న వీరంకిలాకు గ్రామం, పమిడిముక్కల మండలానికి వచ్చి శ్రీధన ఎస్ చిట్టినేని సర్టిఫికేట్ నెం: 2729 ANS 0046177 ఏసియన్ పెయింట్స్ లిమిటెడ్‌కు చెందిన ఒరిజినల్ షేర్ సర్టిఫికేట్ జిరాక్స్ తీసుకొని, ఆ తర్వాత ఆమె పని మీద కపిలేశ్వరపురం గ్రామంలో గల మీసేవా కేంద్రానికి వెళ్లి, అక్కడ ఒరిజినల్ మరియు జిరాక్స్ షేర్ సర్టిఫికేట్లు కనిపించలేదని గుర్తించి, వెంటనే వీరంకిలాకు గ్రామానికి తిరిగి వెళ్లి, దారిలో ఒరిజినల్ మరియు జిరాక్స్ షేర్ సర్టిఫికేట్ కోసం వెతికి, వీరంకిలాకు గ్రామంలోని జిరాక్స్ సెంటర్‌కు వెళ్లి ఒరిజినల్ మరియు జిరాక్స్ షేర్ సర్టిఫికేట్ల కోసం వెతికినా అది దొరకలేదు. కాబట్టి నా క్లయింట్ Dnrs 11464101 నుండి 11467460తో 3360 షేర్లు ఉన్న ఏసియన్ పెయింట్స్ లిమిటెడ్ సర్టిఫికేట్ నెం: 2729 - ఫోలియో నెం: ANS 0046177 యొక్క ఒరిజినల్ మరియు జిరాక్స్ షేర్ సర్టిఫికేట్‌ను పోగొట్టుకున్నది.

పైన పేర్కొన్న ఒరిజినల్ మరియు జిరాక్స్ షేర్ సర్టిఫికేట్‌ను ఎవరైనా వ్యక్తి/వ్యక్తులు కనుగొంటే, దానిని నాకు అందజేయమని అభ్యర్థించు ప్రార్థన, పైన పేర్కొన్న షేర్ సర్టిఫికేట్‌కు సంబంధించిన షేర్లతో ఇతర వ్యక్తులతో వ్యవహరించవద్దని మరియు పైన పేర్కొన్న షేర్ సర్టిఫికేట్ షేర్లకు సంబంధించి ఇతర వ్యక్తులు/వ్యక్తులతో ఎలాంటి లావాదేవీలు జరపరాదని మరియు అలాంటి లావాదేవీలు జరిపినచో అవి నా క్లయింట్‌ను బాధ్యురాలను చేయజాలవని ప్రజలకు తెలియజేయడమైనది.

సి.హెచ్.బి.ఆర్.పి. శేఖర్, న్యాయవాది
ప్లాట్ నెం: 28, సిటీ సెంట్రల్ కాలనీ, లబ్బీపేట, విజయవాడ - 520 010 ✆ 98489 33516.
విజయవాడ, తేదీ: 01-12-2025

నేటినుంచి దోకిపర్రు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయం

దోకిపర్రు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని దోకిపర్రు శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి శుక్రవారం వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. ఉత్సవాల ప్రారంభ సూచికగా సోమవారం పరివార ధ్రువమూర్తులకు ఏకాంత అభిషేకం, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకూ స్వామివారిని పలు వాహనాలపై గ్రామోత్సవాలు, శుక్రవారం శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

ప్రథమ స్థానం సాధించిన యన్నం తేజశ్రీకి బహుమతి అందిస్తున్న ఎంపీపీ రావి దుర్గావాణి

మోపిదేవి, న్యూస్‌టుడే: ఈనెల 7వ జరగనున్న జాతీయ మీన్స్, మెరిట్ ఉపకార వేతనాల అర్హత పరీక్ష కోసం మండలంలోని 10 పాఠశాలలకు చెందిన 129 మంది విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ఎంఈవోలు గోపాల్, ఏవీ రమణ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థుల సంసిద్ధత పరీక్షను సోమవారం మోపిదేవి జడ్పీ పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థినిలు యన్నం తేజశ్రీ, భావిక, నాగభార్గవిలు తొలి మూడు స్థానాలు సాధించారు. ముగ్గురు విజేతలతో పాటు మరో 15 మందికి ప్రత్యేక బహుమతులను ఎంపీపీ రావి దుర్గావాణి, రావి నాగేశ్వరరావు, ఎంఈవోలు, ఇన్‌ఛార్జి హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు అందజేశారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

(c) eenadu

చదువు

e-mail: edc@eenadu.in

ఎల్‌ఎల్‌బీ తర్వాత ఎంబీఏ?

ఎల్‌ఎల్‌బీ చేస్తున్నాను. దీని తర్వాత ఎంబీఏలో చేరితే కెరియర్ ఎలా ఉంటుంది. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు వస్తాయా? - గంటా రాకేశ్

ఎల్‌ఎల్‌బీ తర్వాత ఎంబీఏ చదవాలనుకోవడం నేటి ఉద్యోగ మార్కెట్‌లో సరైన నిర్ణయమే. ఈ రెండు డిగ్రీల ద్వారా.. చట్ట పరిజ్ఞానం, నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ సామర్థ్యం, వ్యాపార అవగాహన లాంటి అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. కార్పొరేట్ ప్రపంచం, బ్యాంకింగ్, కన్సల్టింగ్, హ్యూమన్ రిసోర్సెస్, కంప్లయెన్స్, పాలసీ మేకింగ్ వంటి రంగాల్లో ఈ రెండు డిగ్రీల కలయిక మీకు మంచి కెరియర్‌ను అందిస్తుంది.

ప్రస్తుత ఉద్యోగ పోటీ ప్రపంచంలో ఒకే డిగ్రీతో పరిమితం కాకుండా, చాలామంది విద్యార్థులు కెరియర్‌కి బలమైన పునాది వేయడానికి వివిధ కోర్సులను కలిపి చదవడం సాధారణమైంది. ముఖ్యంగా ఎల్‌ఎల్‌బీ తర్వాత ఎంబీఏ చేస్తే.. ఒకవైపు న్యాయ పరిజ్ఞానం, మరోవైపు మేనేజ్‌మెంట్ ప్రతిభ పొందవచ్చు. ఈ రెండిటి సమ్మేళనం ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను అందిస్తుంది.

ఎల్‌ఎల్‌బీలో న్యాయ ప్రక్రియలు, ఒప్పందాలు, నమోదు విధానాలు, వివాద పరిష్కారం, చట్టపరమైన అనాలిసిస్ వంటి కీలక నైపుణ్యాలను పొంది ఉంటారు. దీనికి అదనంగా ఎంబీఏ చదివితే.. నిర్వహణ, ఆర్థిక వ్యవస్థ, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్, ఫైనాన్స్, ఆపరేషన్స్, లీడర్‌షిప్, స్ట్రాటజీ వంటి రంగాల్లో ప్రావీణ్యం పొందుతారు. ఈ రెండు నైపుణ్యాలూ కలిసినప్పుడు కార్పొరేట్ రంగంలో ఉద్యోగావకాశాలు బాగా మెరుగవుతాయి.

ఎల్‌ఎల్‌బీ తర్వాత ఎంబీఏతో..

కార్పొరేట్ లా విభాగాల్లో: వివిధ సంస్థల మధ్య ఒప్పందాలు, లీగల్ అనాలిసిస్, కంప్లయెన్స్, పాలసీలు, నియామకాలు, బిజినెస్ అగ్రిమెంట్లు నిర్వహించడానికి అవసరమైన నైపుణ్యాలు నేర్చుకుని.. లీగల్ మేనేజర్, కార్పొరేట్ లీగల్ అడ్వైజర్, కంప్లయెన్స్ ఆఫీసర్, కాంట్రాక్ట్ స్పెషలిస్ట్‌గా స్థిరపడవచ్చు.

హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో: చాలా చట్టపరమైన అంశాలు ఉంటాయి. ఉద్యోగ ఒప్పందాలు, కార్మిక చట్టాలు, వేతన నిబంధనలు, ఉద్యోగ వివాదాలు, పాలసీల రూపకల్పన లాంటి వాటికి న్యాయ పరిజ్ఞానం బాగా అవసరం. ఈ అంశాలపై పట్టు సాధిస్తే, హెచ్‌ఆర్ మేనేజర్, ఎంప్లాయీ రిలేషన్స్ మేనేజర్, లేబర్ లా స్పెషలిస్ట్‌గా ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

బిజినెస్ కన్సల్టింగ్: బిజినెస్ కన్సల్టింగ్ కంపెనీల్లో.. కార్పొరేట్ స్ట్రాటజీ కన్సల్టెంట్, లీగల్ కంప్లయన్స్ కన్సల్టెంట్ లాంటి ఉద్యోగాలకూ ప్రయత్నించవచ్చు.

మెరుగైన కెరియర్ కోసం కనీసం మూడేళ్లు న్యాయవాద వృత్తిలో కొనసాగి, ఆ తర్వాత నేషనల్ లా యూనివర్సిటీల్లో కానీ, ఐఐఎం లాంటి ప్రముఖ విద్యా సంస్థల్లో ఎంబీఏ చేస్తే, మీకు మంచి కెరియర్ ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వ్యక్తులైనా, వ్యవస్థలైనా ఉన్న స్థితి నుంచి అత్యున్నత స్థాయికి చేరుకోవడానికి 'మార్పు'ను అస్త్రంగా మలచుకోవాలి. ఆధునిక అవసరాల ప్రకారం మారడాన్ని నిత్య వ్యవహారంగా భావించినవాళ్లే ప్రపంచంతో పరుగు తీయగలరు. ఎప్పుడూ ఒకేలా ఉంటే పోటీ నుంచి పక్కకు జరిగిపోతారు. అందుకే మిమ్మల్ని మీరు మలుచుకోవాలి. ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచానికి అడాప్టబిలిటీ(ఒదిగే స్వభావం) కీలకమైన జీవన నైపుణ్యం.

సాఫ్ట్ స్కిల్స్

ఒదిగే గుణం.. ఎదిగే నైపుణ్యం

సారిక.. పేరొందిన కళాశాల నుంచి 9.1 సీజీపీఏతో ఇంజినీరింగ్ పూర్తి చేసింది. బహుళజాతి సంస్థ నిర్వహిస్తోన్న ప్రాంగణ ఎంపికలకు హాజరైంది. రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, బృంద చర్చలలో విజయవంతమైంది. చివరి హెచ్‌ఆర్ రౌండ్లో ఆమెకు ఊహించని ప్రశ్న ఎదురైంది. అదేంటంటే..'మీరు చేస్తున్న ప్రాజెక్టులో ఒక పరికరం కనిపించలేదు.. దాన్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నించినా లభించలేదు. ఆ సమయంలో మీరు ఆ ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారు?' దీనికి సారిక సమాధానం.. 'ఆ పరికరం కోసం మళ్లీ ఆర్డర్ చేస్తాను.. వచ్చే వరకూ వేచి ఉంటాను'. దీంతో ఆమె ఉద్యోగానికి ఎంపికయ్యే అవకాశాన్ని కోల్పోయింది. ఎందుకంటే.. ప్రాజెక్టులో అకస్మాత్తుగా వచ్చిన సవాలుకు ఆ సమయంలో ఆమె పరిష్కారం చూపలేకపోయింది. ప్రత్యామ్నాయ ప్రణాళిక, మార్పులకు సర్దుబాటు చేసుకోలేకపోయింది. ఆమెలో అడాప్టబిలిటీ నైపుణ్యం లోపించింది.

సంస్థలు ఆశిస్తాయివీ..

కార్పొరేట్ ప్రపంచ పని వాతావరణంలో అనేక సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని సమయస్ఫూర్తితో అధిగమించ గలిగే సామర్థ్యం ఉన్నవారినే సంస్థలు కోరుకుంటాయి. ఎంపికలో సాంకేతిక నైపుణ్యాల కంటే అడాప్టబిలిటీ వంటి సాఫ్ట్‌స్కిల్స్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. సాంకేతిక మార్పులు, ప్రపంచవ్యాప్త బృందాలను సమన్వయం చేసుకోవడం, ఇంటి నుంచే పని, నిత్యం మారుతోన్న వ్యాపార అవసరాల కారణంగా.. 'నేను ఈ పద్ధతిలోనే పనిచేయగలుగుతాను' అంటే అవకాశాలు కోల్పోతారు. 'ఎలా పని చేయాలో చెప్పండి, నేర్చుకుంటాను' అనే ఆలోచనా విధానం(ఫ్లెక్సిబుల్ మైండ్ సెట్) ఉన్న వారినే సంస్థలు ఎంచుకుంటున్నాయి. కృత్రిమ మేధ, ఆటోమేషన్ కారణంగా ఉద్యోగానికీ, ఎదుగుదలకూ అవసరమైన నైపుణ్యంగా 'అడాప్టబిలిటీ' అవతరించింది.

అడాప్టబిలిటీ ఎలా..

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, నూతన పద్ధతులు, సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. వేగవంతమైన పని విధానానికి త్వరితగతిన అలవాటు పడాలి. ఆలోచనా సరళినీ, వ్యవహార విధానాన్నీ పని వాతావరణానికి అనుగుణంగా మార్చుకోగలిగే నేర్పరితనం కలిగి ఉండాలి. మార్పులకు అనుగుణంగా ఒదిగిపోవడం లేదా ఆ వాతావరణంలో ఇమిడిపోవడం పుట్టుకతో రాదు. అలా అని నేర్చుకోలేనంత కష్టమైందీ కాదు.

అపార్థం చేసుకోవద్దు..

చాలా మంది అడాప్టబిలిటీని చేతగానితనం అని అపార్థం చేసుకుంటారు. పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవడం అంటే.. గుడ్డి ఎద్దు వచ్చి చేలో పడ్డట్టు తలాడించడం అని కాదు. 'ఎప్పుడు తగ్గాలి.. ఎప్పుడు మీ అభిప్రాయంపై స్థిరంగా ఉండాలి' అనేది కచ్చితంగా తెలుసుకోవడం కూడా అడాప్టబిలిటీలో భాగమే. వెన్నెముకలా వ్యవహరించాలి. అది ఫ్లెక్సిబుల్‌గా ఉంటూనే మిమ్మల్ని నిటారుగా నిలబెడుతుంది. ఈ గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి.

✦ నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్ రిపోర్టు ప్రకారం.. మన దేశంలో 2026 నాటికి 90 శాతం ఉద్యోగాలకు అడాప్టబిలిటీతో పాటు కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకునే సామర్థ్యం అత్యవసరంగా మారుతుంది.

✦ లింక్డ్‌ఇన్ గ్లోబల్ ట్యాలెంట్ ట్రెండ్స్ 2024-25.. రిక్రూటర్లు అడాప్టబిలిటీ, సాఫ్ట్‌స్కిల్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొంది.

✦ మెకిన్సే సర్వే.. అడాప్టబిలిటీ నైపుణ్యం ఉన్న వారు ఇతరుల కంటే నాలుగు రెట్లు ఎక్కువగా విజయవంతం కావడానికి, ఉన్నతి సాధించడానికి అవకాశం ఉందని తేల్చింది.

వీటితో సాధ్యం..

స్వీయ అవగాహన: ఇది అడాప్టబిలిటీకి పునాది లాంటిది. ఎలాంటి పరిస్థితులు, సందర్భాల్లోనైనా.. భావోద్వేగాలు, ఆలోచనలు, వ్యవహార శైలిని క్రమ పద్ధతిలో ఉంచుకోవాలి. ఒత్తిడిలో ఉన్నా, ఊహించని పరిణామాలు ఎదురైనా వాటిని అవకాశాలుగా మలుచుకుని, సంస్థకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలి.

కంఫర్ట్ జోన్ నుంచి బయటకు: ఎప్పుడూ కొత్త ఆలోచనలు, కొత్త విధానాలు, సరికొత్త అనుభవాలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉండాలి. అవి సానుకూలమైనవైనా, ప్రతికూలమైనవైనా.. అకస్మాత్తుగా జరిగిన ఏ మార్పునైనా స్వీకరించాలి. అది మీ కెరియర్ ఉన్నతికి ఉపయోగపడేలా చేసుకోవాలి. కంఫర్ట్ జోన్ కెరియర్‌ను అక్కడే ముగిసేలా చేస్తుంది. సవాళ్లను స్వీకరించేందుకు సిద్ధపడితేనే ముందుకెళ్తారు.

నేర్చుకోవాలనే తపన: కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ప్రశ్నలు అడగడానికి సందేహించకూడదు. వీటితో జ్ఞానం పెరుగుతుంది. నిత్య విద్యార్థిలా అభ్యాసం చేస్తూ, కొత్త పద్ధతులతో ప్రభావవంతంగా పని చేయగలగాలి.

ఆశావహ దృక్పథం: ఎప్పుడూ సానుకూలంగా ఉండాలి. ఉన్నతమైన కలలు కనాలి. వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడాలి. ఈ గుణం మిమ్మల్ని మీ పని వాతావరణంలో ఎదురయ్యే సవాళ్లు, మార్పులను సానుకూల దృక్పథంతో స్వీకరించగలిగే అవకాశాన్ని కల్పిస్తుంది. తద్వారా పరిస్థితులకు అనుగుణంగా ఒదిగిపోవడానికి ఉపయోగపడుతుంది. 'ఎందుకు' అని కాకుండా.. 'ఎలా' అనే దానిపై ఫోకస్ పెట్టాలి.

అభిప్రాయాలు స్వీకరించాలి: ఇతరుల ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకోవడం, వాటిని స్వీకరించడమూ అడాప్ట్ నైపుణ్యంగానే పరిగణించాలి. ఇది ఎదుటివారికి మీపై నమ్మకాన్ని ఇవ్వడంతో పాటూ, మీ బృందం పని తీరును మెరుగుపరుస్తుంది. సమస్యలు పరిష్కారమవుతూ, మీపై గౌరవమూ పెరుగుతుంది.

సాంకేతిక నైపుణ్యాలతో కొన్నాళ్లు లేదా కొన్నేళ్లే ప్రయాణం చేయగలం. ఎందుకంటే ఇవి ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి. కానీ అడాప్టబిలిటీ నైపుణ్యం ఎప్పటికీ మిమ్మల్ని వదిలిపోదు. జీవితాంతం మీతో ఉపయోగమే. వ్యక్తిగత జీవితంలోనూ ఈ నైపుణ్యాలెంతో మేలు చేస్తాయి.

- గంపా నాగేశ్వరరావు, సైకాలజిస్ట్, ఇంపాక్ట్ వ్యవస్థాపకులు

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

కస్టమర్ సర్వీస్/ కస్టమర్ సపోర్ట్

సంస్థ: క్లాపింగో ఎడ్యుకేషన్ ప్రై.లి. **నైపుణ్యాలు:** కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, మల్టీటాస్కింగ్, టీమ్‌వర్క్. **స్టైపెండ్:** రూ.5,000-8,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 26
☛ https://shorturl.at/Gkczm

బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోబోటిక్స్ **నైపుణ్యాలు:** బిజినెస్ డెవలప్‌మెంట్, కోల్డ్ కాలింగ్, ఈమెయిల్ మార్కెటింగ్, మార్కెటింగ్ ఆటోమేషన్, సేల్స్ **స్టైపెండ్:** రూ.5,000-6,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 26
☛ https://shorturl.at/hv01A

ఆండ్రాయిడ్ యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: క్రాక్‌కోడ్ **నైపుణ్యాలు:** ఆండ్రాయిడ్, ఫైర్‌బేస్, జావా, కాట్లిన్, రెస్ట్ ఏపీఐ, ఎక్స్‌ఎంఎల్ **స్టైపెండ్:** రూ.3,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 27
☛ https://shorturl.at/rOPJB

సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో..

సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, లఖ్‌నవూ.. 44 టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● టెక్నికల్ అసిస్టెంట్: 12 ● టెక్నీషియన్-1: 32 **అర్హతలు:** టెక్నీషియన్‌కు పదో తరగతి, ఐటీఐ. టెక్నికల్ అసిస్టెంట్‌కు సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ ఉండాలి. **వయసు:** చివరి తేదీ నాటికి 28 ఏళ్లు మించకూడదు. **వేతనం:** నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.67,530; టెక్నీషియన్‌కు రూ.36,918. **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్టులతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 26.12.2025. **వెబ్‌సైట్:** https://cdri.res.in/

ఐహెచ్‌బీటీలో టెక్నికల్ అసిస్టెంట్లు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ బయోరిసోర్స్ టెక్నాలజీ.. ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● టెక్నికల్‌అసిస్టెంట్-I: 04 ● టెక్నీషియన్: 05 **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, బీఎస్సీతో పాటూ ఉద్యోగానుభవం ఉండాలి. **వేతనం:** టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.35,400; టెక్నీషియన్‌కు రూ.19,900. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాత పరీక్ష/సీబీటీ, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌కు రూ.500; ఎస్సీ/ ఎస్టీ, మహిళలు, దివ్యాంగులకు ఫీజు లేదు. **తపాలా ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** 29-12-2025 **చిరునామా:** ది సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్, సీఎస్ఐఆర్-ఐహెచ్‌బీటీ, పోస్ట్ బాక్స్ 6, పాలంపుర్, కంగ్రా జిల్లా, హిమాచల్ ప్రదేశ్.
వెబ్‌సైట్: https://www.ihbt.res.in/en/othernlinks/recruitment

---

ఆన్‌లైన్‌లో తిరుపతమ్మ దర్శనం టికెట్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో దర్శనం, ఇతర సేవలు బుకింగ్, ప్రసాదాల టోకెన్లను ఆన్‌లైన్ ద్వారా భక్తులు బుక్ చేసుకోవచ్చని ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు అమ్మవారి దర్శనం కల్పించేందుకు ఆలయంలో ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశామన్నారు. టికెట్లను ఆన్‌లైన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటెంపుల్స్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా లేదా మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009లో బుక్ చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునేందుకు ఆలయం వద్ద క్లోక్ రూమ్ పక్కన ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. విరాళాలు ఇచ్చేందుకు కూడా వెబ్‌సైట్‌లో వీలుందని.. ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

అంధ క్రికెటర్ కరుణకుమారికి ఘన స్వాగతం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : అంధుల టీ 20 మహిళా వరల్డ్ కప్ కైవసం చేసుకున్న భారత జట్టులో సభ్యురాలిగా కీలకపాత్ర పోషించిన రాష్ట్ర క్రీడాకారిణి పంగి కరుణకుమారికి సోమవారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. వరల్డ్ కప్ సాధించాక.. ఆమె తొలిసారిగా సోమవారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి, పాలక మండలి సభ్యులు ఎస్.సంతోష్ కుమార్, కె.జగదీశ్వరి, అర్జున అవార్డు గ్రహీత ఐ.అజయ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘ అధ్యక్షుడు చెన్నా శరత్‌బాబు, కార్యదర్శి జి.రవీంద్రబాబు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, పలువురు శిక్షకులు, క్రీడాకారులు, గన్నవరం సెయింట్ జాన్స్ క్రీడాకారిణులు హాజరై కరుణకు ఘన స్వాగతం పలికారు.

క్రీడాకారిణికి స్వాగతం పలుకుతున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎండీ భరణి తదితరులు

మట్టి తవ్వకాలపై.. సమగ్ర విచారణ!

వైకాపా హయాంలో భారీగా తవ్వేశారు ● ఏం చర్యలు చేపట్టారని లోకాయుక్త దృష్టి

ఈనాడు, అమరావతి

కొత్తూరు రిజర్వు ఫారెస్టులో వైకాపా హయాంలో.. విచ్చలవిడిగా జరిగిన అక్రమ మట్టి తవ్వకాలు, అటవీ భూముల ఆక్రమణపై.. లోకాయుక్త తాజాగా విచారణ చేపట్టింది. ఈ తవ్వకాలపై ఆధారాలతో సహా లోకాయుక్తకు 2023లో ఫిర్యాదు చేసిన వారిని సోమవారం పిలిచి.. విచారించింది. గతంలోనే దీనిపై లోకాయుక్త స్పష్టంగా ఆదేశించినా.. వాటిని అటవీ, రెవెన్యూ అధికారులు పాటించలేదు. ఈ నేపథ్యంలోనే మరోసారి ఫిర్యాదు దారైన.. కొత్తూరు తాడేపల్లివాసి మెండెం జమలయ్యను కర్నూలులో లోకాయుక్త ప్రధాన కార్యలయానికి సోమవారం పిలిచి.. వివరాలు సేకరించింది. తవ్వకాలు జరిగిన ప్రాంతం అటవీ పరిధిలో లేదని ఆ శాఖ అధికారులు చెప్పడంతో.. రెవెన్యూతో కలిసి సంయుక్త సర్వే చేపట్టాలని.. రెండేళ్ల కిందటే లోకాయుక్త సూచించింది. కానీ.. ఇంతవరకూ అధికారులు సర్వే చేపట్టకుండా.. ఒకరిపై మరొకరు తప్పు నెట్టేస్తూ.. కాలయాపన చేస్తున్నారు. దీనిపైనే తాజాగా ఫిర్యాదుదారు నుంచి లోకాయుక్త వివరాలు సేకరించింది.

సంయుక్త సర్వే ఊసేదీ...?

అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ చేయాలంటూ.. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీపీఎఫ్)కు లోకాయుక్త 2023లోనే సూచించింది. ఫారెస్ట్ విజిలెన్స్ 02 విభాగం ఆధ్వర్యంలో విచారణ కూడా చేశారు. తవ్వకాలు జరిగాయనే అనుమానాలున్నాయని, అటవీ భూములు సైతం ఆక్రమించారని తేల్చారు. దీంతో అప్పట్లోనే.. ఇద్దరు ఉద్యోగులపై చర్యలు కూడా చేపట్టారు. వెరసి తవ్వకాలు జరిగిన ప్రాంతం అటవీ పరిధిలో ఉందా లేదా అనేది సంయుక్త సర్వే చేసి తేల్చాలని లోకాయుక్త ఆదేశించింది. అయినా.. ఇప్పటికీ సర్వే, చర్యలు వంటివేవీ చేయలేదు. తాజాగా మరోసారి అధికారులకు వీటిపై స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని లోకాయుక్త చెప్పినట్లు ఫిర్యాదుదారు జమలయ్య తెలిపారు.

హద్దు రాళ్ల తొలగింపు నేరం...

అటవీ ప్రాంతంలో హద్దు రాళ్లను పీకేసి మరీ లోపలకు వెళ్లి మట్టి తవ్వకాలు చేపట్టడం తీవ్ర నేరం. అందుకే.. అది తమ పరిధిలో లేదని అప్పట్లో అటవీ అధికారులు చెప్పారు. 310, 311 నంబర్లున్న హద్దురాళ్లను తొలగించేసి.. ఈ ప్రాంతంలో భారీలోతున తవ్వకాలు చేపట్టారు.

చాణక్య బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న బూనేటి చాణక్య (ఏ8) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈనెల 3వ తేదీకి వాయిదా వేశారు. ఈ పిటిషన్ సోమవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. దీనిని తదుపరి విచారణ నిమిత్తం వాయిదా వేశారు. ఇదే కేసులో సిట్ స్వాధీనం చేసుకున్న తమ కారును విడుదల చేయాలని కోరుతూ సత్యం ఇస్పాత్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను బుధవారానికి వాయిదా పడింది.

ఐపీఎస్ అధికారి సంజయ్..: అగ్నిమాపక శాఖ, సీఐడీలో డీజీగా పనిచేసిన కాలంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంజయ్.. నాలుగోసారి బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ పిటిషన్‌పై విచారణ సోమవారం ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. తదుపరి విచారణ నిమిత్తం ఈనెల 3వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. ఇదే కేసులో కొండలరావు (ఏ4) దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ కూడా 5వ తేదీకి వాయిదా పడింది.

జోగి, అద్దేపల్లి సోదరులు..: నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్, రాము దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై విచారణ ఈనెల 4వ తేదీకి వాయిదా పడింది. ఇదే కేసులో ప్రధాన నిందితులైన అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావుల బెయిల్ పిటిషన్లు గురువారానికి వాయిదా పడ్డాయి. నిందితుల బెయిల్ పిటిషన్లు సోమవారం విజయవాడ ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చాయి. వీటిని తదుపరి విచారణ నిమిత్తం వాయిదా వేశారు.

'సీసీ ఫుటేజీ కోర్టు ముందుంచేలా ఆదేశించండి'

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై కిడ్నాప్, దాడి కేసుకు సంబంధించి పటమట పోలీసు స్టేషన్‌లోని సీసీ కెమెరా ఫుటేజీని కోర్టు ముందుంచేలా దర్యాప్తు అధికారి (ఐవో)ని ఆదేశించాలని కోరుతూ వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో పిటిషన్ వేశారు. ఈఏడాది ఫిబ్రవరి 10న వంశీపై పటమట స్టేషన్‌లో కేసు నమోదైంది. తెదేపా కార్యాలయంపై దాడి కేసు ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను అపహరించి, దాడి చేసి కేసు ఉపసంహరింపజేశారని కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పటమట స్టేషన్, ప్రాంగణంలోని సీసీ కెమెరాల్లో ఈఏడాడి ఫిబ్రవరి 10 నుంచి 15 వరకు నిక్షిప్తమైన దృశ్యాలను న్యాయస్థానం ముందుంచేలా ఆదేశించాలని పిటిషన్‌లో వంశీ కోరారు. ఆ ఫుటేజీని కేసు రికార్డుగా భావించి భద్రపరచాలని కోరారు. పిటిషనపై నోటీసుల నిమిత్తం మంగళవారానికి వాయిదా పడింది.

స్లీపర్ మార్పిడి పనులు విజయవంతం

రైల్వేస్టేషన్(విజయవాడ), న్యూస్‌టుడే: రైలు పట్టాల మధ్య ఉన్న స్లీపర్ మార్పిడి పనులను అత్యాధునిక యంత్రం సహాయంతో విజయవంతంగా మార్పిడి చేసినట్లు విజయవాడ రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే నెలలో 10.70 కిలో మీటర్ల పనులను ట్రాక్ రిలేయింగ్ ట్రైన్(టీఆర్‌టీ) సహాయంతో నిర్ణీత వ్యవధిలో చేపట్టారు. ఏలూరు సెక్షన్‌లో ఈ పనులను డీఆర్‌ఎం మోహిత్ సొనాకియా పరిశీలించారు. ఇంజినీరింగ్, ఆపరేటింగ్, ఎస్‌అండ్‌టీ, టీఆర్‌డీ విభాగాల సిబ్బంది ట్రాక్ మార్పిడి పనుల్లో భాగస్వామ్యం వహించారు. విజయవాడ డివిజన్‌కు అత్యాధునిక యంత్రం అందుబాటులోకి రావడంతో తక్కువ వ్యవధిలోనే స్లీపర్ మార్పిడి పనులు పూర్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధికారులు, సిబ్బందిని డీఆర్‌ఎం ప్రత్యేకంగా అభినందించారు.

రైతేరాజు

పోషకాల పండు.. ఆదాయం మెండు!

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: పోషకాలు పుష్కలంగా ఉండే గ్యాక్ పండ్లను ప్రయోగాత్మకంగా సాగుచేసి విజయం సాధించారు ఓ యువ రైతు. కేరళ రాష్ట్రం నుంచి మొక్కలను తెప్పించారు. ఇక్కడి వాతావరణానికి అనువుగా అవి ఎదిగి పండ్ల దిగుబడి వచ్చింది. వాటిని విక్రయించడంతో పాటు ఆయా మొక్కలను పెంచి ఆసక్తి ఉన్న రైతులకు విక్రయించి ఆదాయం పొందుతున్నారు.

ఏడాదిన్నర కిందట.. రామిరెడ్డిపల్లికి చెందిన బొద్దులూరి శేషుబాబు ఏడాదిన్నర క్రితం వంద గ్యాక్ పండ్ల సాగును 25 సెంట్ల విస్తీర్ణంలో సాగుచేశారు. ఎనిమిది మాసాల్లో కాయలు కాశాయి. మొక్కల ఎదుగుదల బాగుండటంతో మరో అరెకరంలో 220 వేశారు. తానే నర్సరీలో పెంచి పొలంలో పందిరి ఏర్పాటు చేసి నాటారు. ప్రస్తుతం వాటికి పండ్లు కాస్తున్నాయి. ఇవి పచ్చ, పసుపు, ఆరంజ్, ఎరుపు రంగుల్లో ఉంటాయి. ఎర్రగా పక్వానికి వచ్చిన వాటిని తింటారు. వీటిని కిలో రూ.500కు విక్రయిస్తున్నారు. మార్కెట్ కంటే తక్కువ ధరకు హైదరాబాద్, బెంగళూరులోని మాల్‌కు వారానికి 50 కిలోల పండ్లు అమ్ముతున్నారు. వినియోగదారుల నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్ తీసుకుని కొరియర్ ద్వారా పంపుతున్నారు.

తోటలో గ్యాక్ పండును చూపుతున్న రైతు శేషుబాబు

రూ.4 లక్షల నికర ఆదాయం.. ఏడాది పాటు పెంచిన గ్యాక్ పండ్ల తోటలో ఆడ మొక్కల కాండం నుంచి ముక్కలను సేకరించి నర్సరీలో మొక్కలు పెంచుతున్నారు. నెల రోజుల్లో చేతికొస్తుంది. ఎకరానికి 450 నాటాలి. వంద ఆడ మొక్కలకు 30 మగవి నాటించాలి. రెండింటి పువ్వులకు పరాగ సంపర్కం(పాలినేషన్) చేయిస్తారు. ఒక్కో మొక్కను రూ.300 వంతున విక్రయిస్తున్నారు. ఏపీ, తెలంగాణలో ఆసక్తి ఉన్న రైతులకు ఇప్పటి వరకు 1800 అమ్మారు. పండ్లు, మొక్కల విక్రయం ద్వారా ఇప్పటి వరకు రూ.3.50 లక్షలు ఆదాయం పొందారు. మరో అరెకరంలో సాగుచేసిన తోటలో పండ్లు చేతికొచ్చాయి. ఒక్కో మొక్కకు 15 కిలోల పండ్ల దిగుబడి వస్తోంది. అన్నీ ఖర్చులు పోను రూ.4 లక్షల నికర ఆదాయం వస్తోందని రైతు ఆశిస్తున్నారు.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: బెంగళూరు మిర్చి(కూరమిరప) సాగుకు వాతావరణం, నేలలు, విత్తనమోతాదు, నారుమడి యాజమాన్యం గురించి వివరించండి.

- టి.వెంకట్రావు, రైతు, చినకళ్లేపల్లి

సమాధానం: కారం లేని బెంగళూరు మిర్చి(కూరమిరప) గంట ఆకారంలో లావుగా ఉంటుంది. వీటిని పచ్చి కూరగాయలుగా ఉపయోగిస్తారు. దీన్ని సిమ్లా మిర్చి అనికూడా అంటారు. వీటిలో ఎ, సి విటమిన్లు అధికంగా ఉంటాయి. శీతాకాలం రాత్రి వేళల్లో అత్యల్ప ఉష్ణోగ్రత 10-17 డిగ్రీల మధ్య 30-40 రోజుల పాటు ఉంటే ఈ పంటకు అనుకూలం. రాత్రి ఉష్ణోగ్రత పెరిగే కొద్దీ పూతరాలడం ఎక్కువవుతుంది. కాయ నాణ్యత తగ్గుతుంది. నీరు బాగా ఇంకే బరువైన, సారవంతమైన నేలలు అనుకూలం. సుమారు 250 గ్రాముల విత్తనాలను 25 చ.మీ నారుమడిలో పలుచగా చల్లుకోవాలి. కిలో విత్తనాన్ని 3 గ్రాముల చొప్పున థైరమ్ లేదా మాంకోజెబ్‌తో శుద్ధి చేయాలి. నారుమడిలో ఫ్యూరడాన్ గుళికలు(100 గ్రాములు) వేసుకోవాలి. విత్తిన 12, 19వ రోజున కాపర్ సంబంధిత శిలీంధ్ర నాశనిలతో నేల తడిచేలా పిచికారీ చేసి నారుకుళ్లు తెగులు నివారించుకోవాలి. **- వి.మంజువాణి, ఉద్యానశాస్త్రవేత్త, కేవీకే, ఘంటసాల**

వ్యర్థాల దహనం.. భూసారం హననం!

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: పంట వ్యర్థాలను చాలా మంది రైతులు దహనం చేస్తున్నారు. ఇలా.. చేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ముున్ముందు మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కె.నాగేంద్రరావు తెలిపారు. మంటల కారణంగా భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు మృతిచెందడమే కాకుండా చక్కటి ఎరువును చేతులారా నాశనం చేసినవాళ్లమవుతామంటున్నారు. మనిషి ఆరోగ్యం ప్రమాదం బారిన పడకుండా ఉండాలంటే చెరకు చెత్త, వరిగడ్డి, అపరాల వ్యర్థాలను ఎరువులుగా మలచుకోవాలి. ఇలా వ్యర్థాలతో భూమిని మల్చింగ్ చేయడం ద్వారా తేమశాతం నిల్వ ఉండి పంటలకు ఉపయోగపడుతుంది. సాగునీటి ఎద్దడి సమయంలో పంట దెబ్బతినకుండా ఉంటుంది. ప్రస్తుతం వరి కోతలు యంత్రాలతో కోస్తున్నారు. గడ్డిని తగలబెట్టకుండా పంటకు వినియోగించుకోవాలని నాగేంద్రరావు సూచిస్తున్నారు.

భూమిపై వ్యర్థాలతో మల్చింగ్

రబీలో అనువైన మినుము రకాలు

-ఘంటసాల, న్యూస్‌టుడే

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో అనువైన మినుము వంగడాలు, వాటి తీరు తెన్నులు, పంట కాలపరిమితి, దిగుబడులు తదితర విషయాలను ఘంటసాల కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, సమన్వయకర్త డి.సుధారాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మీలు ఇలా వివరించారు.

ఎల్‌బీజీ రకాలు.. 752: ఇది పల్లాకు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. వరి మాగాణుల్లో ఆలస్యంగా విత్తుకునేందుకు అనువైన రకం. పంట కాలం 75-80 రోజులు. దిగుబడి ఎకరానికి 6-7 క్వింటాళ్లు. ★ **884:** ఇది పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలు, వరి మాగాణుల్లో సాగుకు అనువైన రకం. పంట కాలం 75-80 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **787:** ఈ రకం పల్లాకు తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. కాండం కణుపుల వద్ద కూడా కాయలు వస్తాయి. పంట కాలం 75-80 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. ★ **932:** పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **904:** ఈ రకం పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలు, వరి మాగాణుల్లో అనువైన రకం. పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **645:** ఈ రకం ఎండు తెగులును తట్టుకుంటుంది. పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **648:** ఈ రకం ఎండు తెగులును తట్టుకుంటుంది. బూడిద, ఆకుమచ్చ, తుప్పు తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. వరి మాగాణుల్లో అనువైన రకం. పంట కాలం 90-95 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. * **709:** మాగాణి భూముల్లో ఆలస్యంగా విత్తుకునేందుకు అనువైన రకం. పంట కాలం 80-85 రోజులు. దిగుబడి 6-7క్వింటాళ్లు. ★ **టీబీజీ 104:** ఇది పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలకు అనువైన రకం. పంట కాలం 70-75 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. ★ **129:** ఈ రకం పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలు, వరి మాగాణుల్లో అనువైన రకం. పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **జీబీజీ1:** ఈ రకం వరి మాగాణుల్లో ఆలస్యంగా విత్తుకునేందుకు అనువైన రకం. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. పంట కాలం 70-75 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. ★ **పీయూ 31:** ఈ రకం పల్లాకు తెగులును పూర్తిగా తట్టుకుంటుంది. పంట కాలం 70-75 రోజులు. దిగుబడి 5-6 క్వింటాళ్లు.

(c) eenadu

మన నగరికి.. మరో మణిహారం!

- గొల్లపూడి-కనకదుర్గ వారధి మధ్య భారీ పైవంతెన
- ఎన్‌హెచ్-65 విస్తరణలో 5 కి.మీ. మేర నిర్మాణం

ఈనాడు – అమరావతి

గొల్లపూడి ప్రాంతం

విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్-65 ఆరు వరుసల విస్తరణలో భాగంగా నగర పరిధిలో భారీ పైవంతెన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. గొల్లపూడి నుంచి కనకదుర్గ వారధి వరకు 5 కి.మీ. మేర దీన్ని నిర్మించే ప్రతిపాదనలను కన్సల్టెన్సీ డీపీఆర్‌లో పొందుపరిచింది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే వారికి ఈప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ పరీక్ష పెడుతోంది. ఈ పైవంతెన నిర్మిస్తే సాఫీగా రావచ్చు. ప్రస్తుత రహదారిని సర్వీస్ రోడ్డుగా మారుస్తారు.

రూ. 500 కోట్ల వ్యయం...

- ఆరులైన్ల విస్తరణకు అవసరమైన భూమి వెడల్పు (ఆర్ఓడబ్ల్యూ) 60 మీటర్లు ఉండాలి. ఇక్కడ 40-50 మీటర్ల మధ్యలో ఉంది. రహదారి పక్కన భూమి మార్కెట్ విలువ గజం రూ. లక్ష ఉంది.
- ఈ ఐదు కిలోమీటర్లు భూమి సేకరించి విస్తరించాలంటే రూ.వెయ్యి కోట్లు అవసరమని ఎన్‌హెచ్ అంచనా. పైవంతెన అయితే.. రూ.500 కోట్లు చాలు. అన్ని విధాలుగా ప్రయోజనం కూడా.
- ఈ ప్రాంతం.. దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలకు కేంద్రం. ఆవాస గృహాలూ ఉన్నాయి. విస్తరణ నేపథ్యంలో భూమి సేకరిస్తే ఇవన్నీ తొలగించాల్సిందే.
- ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో భారీ పైవంతెన నిర్మాణం కష్టమని భావించినా.. ఒకవైపు ట్రాఫిక్ వదిలి మరోవైపు నిర్మించాలని నిర్ణయించారు.
- ప్రస్తుతం డీపీఆర్ ప్రాజెక్టు అప్రైజల్ అండ్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీ(పీఏటీఎస్‌సీ) ముందుకు వెళ్లింది. అక్కడ ఆమోదిస్తే మిగిలిన దశల్లో పరిశీలన పూర్తయ్యాక 2026 ఏప్రిల్ నాటికి పనులు మొదలయ్యే వీలుంది.

శేషమ్మ సంకల్పం.. శ్రీవారి ఆలయం సాకారం

తిరుమల వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం, శ్రీవారి కల్యాణోత్సవాలు నిర్వహించడం ఆమె జీవనంలో ఒక భాగమైంది. ఆ దేవదేవుడికి తన వంతుగా సేవ చేయడానికి ఓ ఆలయం నిర్మించాలనుకుంది. అలా 30 ఏళ్లుగా ఆ ఆలోచన తన మదిలో ఉండిపోయింది. జీవిత చరమాంకంలోనైనా దాన్ని కార్యరూపంలోకి తేవడానికి సిద్ధపడింది. అందుకు రూ.కోటి విలువ చేసే స్థలం ఇవ్వడంతో పాటు ఆలయ నిర్మాణానికి మరో రూ.కోటి విరాళంగా అందించింది. కంకిపాడు మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన భీమవరపు శేషమ్మ(90) వేంకటేశ్వరుడికి పరమభక్తురాలు. గుడి నిర్మిద్దామని నిర్ణయించుకున్న తర్వాత గ్రామ పరిధిలో జాతీయ రహదారికి సమీపంలో ప్రధాన మార్గానికి పక్కనే ఉన్న 30 సెంట్ల స్థలాన్ని గతేడాది కేటాయించింది. అంతేకాకుండా పనుల కోసం రూ.కోటి ఇచ్చింది. ఎట్టకేలకు 90 శాతం పనులు పూర్తికాగా త్వరలోనే ప్రతిష్ఠాపనోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమె సంకల్పానికి కుటుంబ సభ్యుల సహకారం తోడవడంతో ఇదంతా సాధ్యమైంది. భక్తులకు ఆపదమొక్కులవాడి దర్శన భాగ్యం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు శేషమ్మ చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు(కంకిపాడు)

వీడిపో మేఘమా.. వేదనే తేకుమా

ఈనాడు – అమరావతి

- అన్నదాతల్లో దిత్వా తుపాను కలవరం
- పంటలు కాపాడుకునేందుకు ఆరాటం

దిత్వా తుపాను తీవ్ర ప్రభావం లేకున్నా అన్నదాతల్లో అంతులేని అలజడి నింపింది. క్షణక్షణం... భయం భయంగా రైతులు గుండెలు గుప్పిట పెట్టుకుని కాలం గడుపుతున్నారు. పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న తడిసిపోకుండా రక్షించుకునేందుకు ఖర్చు తడిసిమోపెడవుతోంది.

మొక్కజొన్న... దక్కేనా..? 11 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. 50 శాతం కోత పూర్తవగా ఎక్కువ పంట కల్లాల్లోనే ఉంది. కొనుగోలు కేంద్రాలు తెరవని వేళ.. రైతులకు మద్దతు ధర రూ. 2,400 దక్కడం లేదు. దళారులు రూ. 1700లకే కొంటున్నారు. ఇప్పుడు ఏమాత్రం తడిసినా ఎందుకూ పనికి రాదు. ఒక్కో పట్టా రూ.5వేలు పెట్టి కొని పంటను కాపాడుకుంటున్నారు. మొక్కజొన్న పోగు చేయడానికి కూలీల ఖర్చు అదనం.

ముంగిట విపత్తు... జిల్లాలో 89 వేల ఎకరాల్లో పత్తి సాగైంది. మొంథా తాకిడితో నందిగామ, వీరులపాడు, కంచికచర్ల, పెనుగంచిప్రోలు, మైలవరం పరిధిలో వందల ఎకరాల్లో పత్తి నిలువునా కుళ్లింది. నాణ్యత లేమితో ధర పడిపోవడం, సీసీఐ కొనుగోలు చేయకపోవడంతో ఇప్పటికే రైతులు కుదేలయ్యారు. కాస్తో.. కూస్తో మిగిలిన పంట రెండ్రోజుల జల్లులకు తడిసింది.

కలవరింతలే... జిల్లాలో 1. 46 లక్షల ఎకరాల్లో వరి వేశారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, రెడ్డిగూడెం తదితర మండలాల్లో 50 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ధాన్యం మొత్తం రహదారుల మీద, పొలాల్లో కల్లాలపైనే ఉంది. వర్షం పడితే అంతే సంగతులు. కోత పూర్తి కానిచోట్ల గాలులు వీస్తే పైరు పడిపోతోందని వాపోతున్నారు. ప్రభుత్వం సొసైటీల ద్వారా 2,200 పట్టాలు రైతులకు అందించింది.

రూ.13 వేలు అదనపు భారం...

నాలుగెకరాల్లో మొక్కజొన్న వేస్తే... 100 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వర్షానికి తడిస్తే ఎవరూ కొనరు. రూ.10 వేలు పెట్టి రెండు పట్టాలు కొన్నా. పంట పోగేసేందుకు నలుగురు కూలీలకు రూ.3 వేల వరకు ఖర్చయింది. అప్పు తెచ్చి రూ.13 వేలు ఖర్చు చేశా. కొనుగోలు కేంద్రాలు తెరవాలి.

– చెరుకూరి గోపాలరావు, వీరులపాడు

వాతావరణం భయపెడుతోంది

నాలుగెకరాల్లో వరి వేశా. జల్లుల దెబ్బకు... తిండి, నిద్ర లేకుండా అల్లాడుతున్నాం. ఎకరాకు రూ.35 వేల పెట్టుబడి పెట్టాం. మిల్లర్లు తేమ శాతం 17 దాటితే ధాన్యం కోత పెడుతున్నారు. కూలీలకు రోజుకు రూ.2 వేలు ఖర్చు చేస్తున్నాం. 20 శాతం తేమ ఉన్నా కోత లేకుండా ప్రభుత్వమే కొనాలి. – నాగభూషణం, పెనుగంచిప్రోలు

రాయనపాడులో దిగితే.. అంతే..!

- అర్ధరాత్రి దాటాక ఆగే రైళ్లే అధికం...
- స్టేషన్ నుంచి ఇంటికెళ్లాలంటే చుక్కలే

అమృత్ భారత్‌లో భాగంగా తీర్చిదిద్దిన రాయనపాడు స్టేషన్

> రాయనపాడు రైల్వేస్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా మారుస్తామని ఆరేళ్ల కిందట ప్రకటించారు. 2019 డిసెంబరు నుంచి ప్రయాణాలు కంగా కొన్ని రైళ్లను రాయనపాడు మళ్లించి అక్కడ ఆపుతున్నారు. రాజమహేంద్రవరం, వరంగల్ వైపు వెళ్లే ఏడేసి రైళ్లను ఆపుతున్నా వీటిలో అర్ధరాత్రి ఆగేవే అధికం.

> ఆ సమయంలో... స్టేషన్ నుంచి నగరానికి చేరేందుకు.. ప్రైవేటు వాహనాలు, ఆటోలే దిక్కు. ఆర్టీసీ లేకుంటే రాదని స్పందించడం లేదని రైల్వే మాట. తాజాగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా.. రాయనపాడును అభివృద్ధి చేశారు. ఇప్పటికైనా రవాణా సౌకర్యాల పెంపుపై దృష్టి పెట్టాలి.

ఈనాడు – అమరావతి

విజయవాడకు రాకుండా రాయనపాడు నుంచి గుణదలకు నేరుగా బైపాస్‌లో కొన్ని రైళ్లను ఆరేళ్ల కిందట పంపించారు. తర్వాత కొన్ని ప్రత్యేక రైళ్లను రాయనపాడు మీదుగా మళ్లించారు. ఆపై రాయనపాడు స్టేషన్ నుంచి విజయవాడ ఈశాన్య కేబిన్ మీదుగా.. బల్బ్‌కేబిన్ పక్కనుంచి నేరుగా గుణదలకు రైళ్లు చేరుకునేలా దారేశారు. ఈదారిని గతంలో గూడ్స్ రైళ్లు తిప్పేందుకు వాడేవారు. తర్వాత ఎక్స్‌ప్రెస్‌లు నడిచేలా మార్చారు. ఈ ట్రాక్‌పై ప్రత్యేక రైళ్ల రాకపోకలు సత్ఫలితాలు ఇవ్వగా.. పూర్తిస్థాయిలో రోజువారీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపడం ఆరంభించారు.

14 రైళ్లను ఆపుతున్నా... విజయవాడ స్టేషన్‌తో సంబంధం లేకుండా 2020 ఏప్రిల్ నుంచి రాయనపాడు నుంచి నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లను... కాకినాడ పోర్ట్-లింగంపల్లి గౌతమి(12737/38), కాకినాడటౌన్-లింగంపల్లి కోకెనడా(12775/76), నాందేడ్-సంబల్‌పూర్(20809/10), విశాఖ-నాందేడ్ (20811/12) నడపడం ఆరంభించారు. ఇప్పటికీ ఇవే ఇక్కడి నుంచి నడిచే ప్రధాన రైళ్లు. ఇవికాక.. పండగలు, సెలవుల్లో నడిపే రైళ్లనూ రాయనపాడులో ఆపుతున్నారు. ప్రయాణికులు తెలియక.. విజయవాడ అనుకుని రాయనపాడుకు టిక్కెట్ బుక్ చేసుకుంటే.. అంతే. ఏ అర్ధరాత్రికో రైలొచ్చి ఆగుతుంది. అక్కడి నుంచి ఇంటికెలా వెళ్లాలో తెలియక.. ఆటోవాలాల బాదుడు భరించలేక లబోదిబోమంటున్నారు.

రవాణా సౌకర్యాలే కీలకం... హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు.. రాయనపాడుకు రావడానికి ఎంత ఖర్చవుతోందో, ఇక్కడి నుంచి ఇంటికి చేరడానికీ అంతే అవుతోంది. ప్రస్తుతం ఆపుతున్న రైళ్లలో అధికంగా అర్ధరాత్రి 12.30, 1, 2 గంటలకు వస్తున్నవే అధికం. ఆర్టీసీ 24 గంటల సర్వీసులను ఆరంభిస్తామని ఆరేళ్ల కిందట చెప్పినా ఒక్క సర్వీసునూ నడపక పోవడంతో ప్రయాణికులకు వాత తప్పడం లేదు.

బుల్లి పిట్టకు.. బుజ్జి గూడు..

పక్షి ప్రేమికులు వాటికి ఆహారాన్ని అందించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. వాటికి కృత్రిమ గూళ్లు, అందమైన బాటిళ్లలో ఆహారంగా చిరుధాన్యాలను ఉంచి ఇళ్ల ముందు వేలాడదీస్తున్నారు. పక్షులు ఏదో ఒక సమయంలో వచ్చి గింజలను తింటాయి. విజయవాడ నగరం హనుమాన్‌పేటలోని సీపీఐ దాసరి భవన్ ముందు కనిపించిన గూళ్లివి.

– ఈనాడు, అమరావతి

ఆర్జిత సేవల వేదిక మార్పు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలోని ఆర్జిత సేవలను నూతనంగా నిర్మించిన ఏసీ పూజ మండపంలోకి మార్పు చేస్తున్నామని ఈవో శీనానాయక్ తెలిపారు. సోమవారం దుర్గమ్మ ఆలయ ప్రాంగణాన్ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కుంకుమార్చన, శ్రీచక్రార్చన సేవలను పూజ మండపంలో నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న ఆశీర్వచన మండపంలో కాకుండా అమ్మవారి దర్శనం చేసుకొని వచ్చిన వారికి వేద ఆశీర్వచనం మూల విరాట్‌కు ఎదురుగా కుంకుమార్చన చేసే ప్రాంతంలో చేసేందుకు వారం రోజుల పాటు ట్రయల్ రన్ వేస్తున్నామని తెలిపారు. ఈ మార్పులతో దుర్గమ్మ ప్రధాన ఆలయం చుట్టూ కొంత వెసులుబాటు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఈ రాంబాబు, ఏఈవో వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఇదేం వేట.. ప్రాణాలతో ఆట..



సరదాగా గాలాలతో చేసే చేపల వేట కారణంగా ఎంతో మంది ప్రమాదాల పాలై ప్రాణాలు కోల్పోతున్నారు. బస్టాండు సమీపంలో ఉన్న రైల్వే వంతెన పైకి ఎవరినీ వెళ్లనివ్వరు. అయినప్పటికీ అటు రైల్వే, ఇటు పోలీసుల కళ్లు గప్పి రైల్వే వంతెన కింద ఉన్న గట్టు పైకి చేరి ఇలా ప్రమాదకరంగా చేపల వేట సాగిస్తున్నారు.

– ఈనాడు, అమరావతి

అక్షర ఆడితే.. పతకం సొంతమే

న్యూస్‌టుడే, కానూరు, పోరంకి

పోరంకికి చెందిన **ఆళ్ల అక్షర** వయసు పదమూడు. 7వ తరగతి చదువుతున్న చిన్నారి గోగేమ్, ఐస్ స్కేటింగ్, స్కేటింగ్, కూచిపూడి నృత్యాల్లో రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తన అసమాన ప్రతిభ చాటుతోంది. తండ్రి నరేంద్రకుమార్, తల్లి వైష్ణవీదేవి. వారు అక్షరకు చిన్ననాటి నుంచి కూచిపూడి నృత్యంతో పాటు తనకు ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ అందించారు. కోచ్ ప్రసాద్ వద్ద స్కేటింగ్, ఐస్‌స్కేటింగ్‌తో పాటు, జపనీస్ గోగేమ్‌లో శిక్షణ తీసుకుంది. వాటిల్లో నైపుణ్యం చూపిస్తూ పోటీలకు సిద్ధమైంది. చక్కగా రాణిస్తూ బంగారు, వెండి పతకాలతో అదరగొడుతోంది.

గోగేమ్‌లో అవార్డులు..

★ 2024లో బిహార్‌లో జరిగిన గోగేమ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అక్షర అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బంగారు పతకాలు సాధించింది.

★ 2025 ఫిబ్రవరిలో బిహార్‌లో జరిగిన పోటీల్లోనూ అదే రీతిలో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకుంది.

★ 2025 నవంబరులో ఒడిశాలో జరిగిన గోగేమ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-14 విభాగంలో సిల్వర్, అండర్-17లో బంగారు పతకాలు సాధించింది.

స్కేటింగ్‌లో సత్తా..

- 2024లో ఐస్ స్కేటింగ్ పోటీలు గుర్గావ్‌లో జరగ్గా అక్షర జాతీయ స్థాయిలో సిల్వర్ పతకం అందుకుంది.
- 2025లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి ఐస్‌స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

కూచిపూడి నృత్యంలో రాణిస్తూ

అక్షర గురువు నరేంద్ర వద్ద కూచిపూడి నృత్య శిక్షణ తీసుకుంది. ఇందులోనూ రాణిస్తూ 2024లో ఫ్రాన్స్‌కు చెందిన వరల్డ్ పెర్ఫార్మెన్స్ ఆర్ట్ ఛాంపియన్‌షిప్-2024 అవార్డు అందుకుంది. ఇంకా జాతీయ స్థాయిలో 12కు పైగా అవార్డులు సొంతం చేసుకుంది. ఆమెకు శివనంది, బసవనంది, నృత్యప్రభ, నృత్యకృష్ణవేణి, శ్రీకృష్ణనాట్యరవళి అవార్డులు వచ్చాయి. క్రీడల్లోనూ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నది తన లక్ష్యమని అక్షర చెబుతోంది.

జగమే చూసేలా.. జయమే మురిసేలా..

- అంధుల మహిళా టీ 20 ప్రపంచ కప్ కైవసంలో కీలకపాత్ర
- కరుణకుమారి విజయగాథ

ఆసక్తి, ఎంచుకున్న లక్ష్యంపై మనసు పెడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించింది అల్లూరి సీతారామరాజు జిల్లా వంట్లమామిడి గ్రామానికి చెందిన **పంగి కరుణ కుమారి** (15). తల్లిదండ్రులు సంధ్య, రాంబాబు వ్యవసాయ కూలీలు. భారత అంధుల మహిళా టీ 20 జట్టులో స్థానం సాధించి ప్రత్యేకత చాటుకుంది. గత నెలలో కొలంబోలో జరిగిన తొలి అంధుల మహిళ టీ 20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్‌పై 28 బంతుల్లో 42 పరుగులు సాధించి జట్టు విజయంలో ఆమె కీలకపాత్ర పోషించింది. దీంతో ఒక్కసారిగా ప్రపంచవ్యాప్తంగా కరుణకుమారి పేరు మార్మోగింది. ఆమె ఈ స్థాయికి ఎదగడానికి దోహదపడిన అంశాలు ఇలా...

★ **మనోనేత్రమే దివిటీ..:** మన్యం ప్రాంతానికి చెందిన కరుణకుమారి చిన్నతనం నుంచి అంధురాలు. పాడేరులోని బాల సదన్ స్కూల్‌లో ఏడో తరగతి వరకు చదివింది. ఆమెకు చిన్నతనం నుంచి ఆటలపై మక్కువ. కానీ ఆడలేని పరిస్థితి. ఎనిమిదో తరగతిలో విశాఖలోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశించింది. అక్కడ ఆట, క్రీడల్లో సాధన చేసే అవకాశం వచ్చింది. క్రికెట్‌పై ఆసక్తి ఉన్నా.. కంటిచూపు లేక ఆడలేకపోయేది. అంధుల పాఠశాలలో ప్రవేశించాక అథ్లెటిక్స్.. షాట్‌పుట్, డిస్కస్ త్రోలో సాధన ప్రారంభించింది. ఈ సమయంలో సహచరులు క్రికెట్ ఆడటం తనకు వినబడింది. అంధుల క్రికెట్‌లో వాడే బాల్ నుంచి బౌలింగ్ చేస్తే శబ్దం వస్తుంది. దీంతో అథ్లెటిక్స్‌ను పక్కనపెట్టి పీఈటీ రవికుమార్ సహకారంతో క్రికెట్ సాధన ప్రారంభించింది. మరో పీఈటీ ఉపాధ్యాయిని సత్యవతి బ్యాటింగ్, బౌలింగ్‌లో మెలకువలు నేర్పింది. ప్రిన్సిపల్ డి. విజయ ప్రోత్సాహం మరింత తోడైంది.

★ **మువ్వన్నెల రెపరెప..**

మే నెలలో కేరళలో జరిగిన ఇన్ఫినిటీ ట్రోఫీలో తలపడి సెంచరీ (114)తో సత్తా చాటింది. ఈ ప్రతిభతో భారత మహిళా అంధుల టీ20 క్రికెట్ జట్టులో స్థానం లభించింది. తల్లిదండ్రులు విదేశానికి వెళ్లేందుకు వద్దన్నా.. బాగా ఆడి దేశానికి ట్రోఫీ అందిస్తానని తల్లిదండ్రులకు మాట ఇచ్చింది కరుణ. ఫైనల్‌లో మెరుగైన ఆటతీరు కనబరచి విజయానికి తోడ్పడింది. ఇచ్చిన మాట నిలబెట్టిన తమ కుమార్తెను చూసి కన్నవారు మురిసి పోతున్నారు. భవిష్యత్తులో చదువు కొనసాగిస్తూనే.. క్రికెట్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించి.. భారత కీర్తి పతాకను ఎగురవేస్తానంటోంది కరుణ కుమారి.

– న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

RAMOJI

WALK-IN-INTERVIEW

MARGADARSI CHIT FUND PRIVATE LIMITED

REQUIRES ASSISTANTS IN BUSINESS DEVELOPMENT, CUM RECOVERIES FOR OUR NEW BRANCH AT MANGALAGIRI

BUSINESS DEVELOPMENT CUM RECOVERIES ASSISTANTS:

Male graduates with pleasing personality below 30 years with 2/3 years of experience in relevant fields. Candidates having valid two wheeler driving licence are preferred. The above posts are mainly field oriented. Experience in chit fund/financial institutions will be given preference.

Fresh graduates also can attend for Trainee position.

Please attend WALK-IN-INTERVIEW ON EITHER 3rd DECEMBER, 2025 (TUESDAY) or 4th DECEMBER, 2025 (WEDNESDAY) AT OUR MANGALAGIRI BRANCH from 10.30 A.M. to 2.00 P.M. alongwith latest Resume, xerox copies of educational certificates, recent colour Passport size photographs and copy of Pan Card, Aadhaar card & Bank Passbook First page at the following address:

The Branch Manager,
MARGADARSI CHIT FUND PRIVATE LIMITED
D.No. 7-331A, 2nd Floor ATR Complex, Opp: Urvasi Theatre,
Gowtham Buddha Road, Mangalagiri Guntur District - 522 503, A.P.
Phone No. 08645-297993 / 9381401759

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

డైరెక్ట్ వీవర్స్ ప్రదర్శన మరియు అమ్మకం
వివాహ సీజన్ ప్రత్యేకం
29 నవంబర్ నుండి 7 డిసెంబర్
శ్రీ శేషసాయి కళ్యాణ వేదిక, బందర్ రోడ్డు, విజయవాడ
UP TO 50% DISCOUNT
M: 9441987009 | Entry Free | All UPI Online / Debit & Credit Cards Accepted

చైతన్యమే రక్ష..!

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం మాచవరంలోని ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మానవహారం ఆకట్టుకుంది. ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రెడ్ రిబ్బన్ ఆకారంలో నిలబడ్డారు. 'ఒకే జీవితం-సురక్షితంగా జీవిద్దాం' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త లక్ష్మీ జానకి, వైస్ ప్రిన్సిపల్ పి.శైలజ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మాచవరం

8,9 తేదీల్లో ప్రత్యేక సర్వే

విజయవాడ వైద్యం: ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈనెల 08, 09వ తేదీలలో బోదకాలు నివారణ సర్వే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని జిల్లా మలేరియా అధికారి డా.ఇందుమతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి ఫైలేరియా వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాత్రి 08:30 గంటల నుంచి 12 గంటల వరకు రక్తపోటు సేకరణ కార్యక్రమాన్ని కూడా చేపడతామని వివరించారు. ప్రజలు ఇంటింటికి వచ్చే ఏఎన్ఎంలు, ఆశాలకు సహకరించాలని ఆమె కోరారు.

సందర్భమైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి 98496 97616

3 నుంచి ఎన్టీఆర్ వర్సిటీ క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో 3న ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలలో పురుషుల వాలీబాల్, 5న ఏలూరు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల మైదానంలో పురుషుల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని విశ్వ విద్యాలయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న వైద్య, దంత, ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత కళాశాల వ్యాయామ సంచాలకుడి వద్ద ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు సంబంధిత పత్రాలతో హాజరవ్వాలని ఆయన సూచించారు.

మాటలతో బేడీలు.. ముంచేసే కేడీలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే



★ 'ఆధార్ కార్డు, చరవాణితో సదఖత్ ఖాన్ అనే బడా నేరస్థుడితో కలిసి మనీ ల్యాండరింగ్ చేశారు. మీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. మిమ్ములను అరెస్టు చేస్తున్నాం..' అంటూ పటమటకు చెందిన ఓ విశ్రాంత ఉద్యోగిని హెచ్చరిస్తూ రూ. 50.7 లక్షలు కొట్టేశారు.

ముందుగా భయపెట్టి... సైబర్ నేరస్థులు తొలుత ఫోన్ చేసి సీబీఐ, ఈడీ, కస్టమ్స్ అంటారు. మీ మీద కేసులు నమోదయ్యాయని భయపెట్టేస్తారు. సుప్రీంకోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని రంగు రంగుల లెటర్‌హెడ్‌లపై వారెంట్లు తయారు చేసి పంపిస్తారు. ఆలోచించుకునే వ్యవధి ఇవ్వకుండా.. ఎవరితోనూ మాట్లాడకూదని.. జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని బుకాయిస్తారు. ఎవరికైనా చెబితే 3 సంవత్సరాల జైలు, రూ.5లక్షల జరిమానా కట్టాలని హెచ్చరిస్తారు.

బుజ్జగించి... అసలు విషయానికి వస్తారు... రెండు రోజుల పాటు భయపెట్టి తర్వాత మెత్తబడినట్లు నటిస్తారు. మీరు అమాయకులని మాకు తెలుసని.. కానీ కోర్టులకు తెలియవు కదా అంటారు. మీ మీద కేసు లేకుండా ఉండాలంటే కొంత సొమ్ము న్యాయస్థానంలో జమ చేయాలంటారు. కేసు పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించేస్తారని.. ష్యూరిటీ కోసమే ఇదంతా అని బుజ్జగిస్తారు. లేకపోతే మిమ్ములను అరెస్టు చేసేందుకు వచ్చేస్తున్నామని భయపెట్టి ఆందోళనకు గురిచేసి నగదు బదిలీ చేయించేసుకుంటారు. డిజిటల్ అరెస్టుల పేరుతో జరిగే కేసులన్నీ ఇదే తరహాలో జరుగుతున్నాయి.

ఎవరికీ మినహాయింపు లేదు.. డిజిటల్ అరెస్టు పేరుతో జరిగే మోసాల్లో అక్షరాస్యులు, నిరక్షరాస్యులు మోసపోతూనే ఉన్నారు. బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారూ బలైపోతున్నారు. మేం అలాంటి వారు కాదని చెబుతున్నా.. పట్టించుకోకుండా వారిని భయపెట్టేస్తున్నారు. ట్రాన్స్‌కో యువ ఇంజినీర్ తనకు ఏ విధమైన సంబంధం లేదని మొత్తుకుంటున్నా డబ్బులు గుంజేశారు.

ఫోన్లు వస్తే ఇలా చేయండి...

- ఎవరైనా సీబీఐ, పోలీస్, కస్టమ్స్, ఈడీ పేరుతో అరెస్టు చేస్తామని ఎవరైనా మీకు ఫోన్లు చేస్తే ఆందోళన చెందొద్దు. వారు సైబర్ నేరగాళ్లే. కాల్ కట్ చేయండి.
- ఆధార్ కార్డు, పాన్‌కార్డు పంపించమంటే నమ్మవద్దు.
- పిల్లలను అరెస్టు చేశామని బెదిరిస్తారు. అదే సమయంలో పిల్లల ఫోన్లు పనిచేయకుండా చేయగల సత్తా సైబర్ నేరగాళ్లకు ఉంది. మిమ్ములను మరింతగా భయపెట్టేందుకు సైబర్ నేరగాళ్లు ఇలా చేస్తుంటారు. పిల్లల ఫోన్లు కలవకపోతే భయపడకండి. బంధువులకో, స్నేహితులకో ఫోన్ చేసి నిజం నిర్ధారించుకోండి.
- తరచూ ఫోన్లు వస్తుంటే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయండి.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో 11 కేవీ టౌన్ ఫీడర్ నందు విద్యుత్తు తీగల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 నుంచి 10.30 వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఏఈ.కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక నేడు

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి పురపాలిక కో-ఆప్షన్ ఎన్నికను పురపాలిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నారు. ఛైర్మన్ చిట్టిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరగనుంది. తెదేపా తరఫున మాబు సుభానీ, జనసేన తరఫున యర్రంశెట్టి సాంబశివరావు, భాజపా తరఫున షేక్ నగీనా ఇప్పటికే నామినేషన్లు సమర్పించగా కూటమిలో భాగంగా ఈ ముగ్గురికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

నేత్రదానం

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు నగర పంచాయతీ పరిధిలో పసుమర్తి శకుంతల(85), సామినేని సీతమ్మ(75) అనే ఇద్దరు వృద్ధ మహిళలు మృతి చెందారు. వీరి నేత్రాలు దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో లయన్స్ క్లబ్ సభ్యులు పి.వెంకటేశ్వరరావు, కొమ్మినేని రాజేష్‌ఖన్నా చొరవతో సోమవారం వీరిద్దరి కార్నియాలను సేకరించి ఖమ్మం నేత్ర నిధికి దానం చేశారు.

విజేతలకు అభినందన

కొండపల్లి, న్యూస్‌టుడే : జాతీయ స్థాయిలో డీపీవీ కీర్తి పతాకం ఎగురవేయాలని ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీరు శివరామాంజనేయులు అన్నారు. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎన్.నిహారిక, ఎన్.బాంధవికలను పాఠశాల యాజమాన్యం సోమవారం అభినందించింది. ఉపాధ్యాయులు, ఎన్టీటీపీఎస్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

• జి.కొండూరు బీసీ కాలనీలోని కాలువల్లో పూడిక పేరుకుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవ లింగేశ్వరరావు సిబ్బందితో పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు** • తిరువూరు 14వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, బురద పేరుకుందని స్థానికుడు దుర్గారావు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయించారు. • తిరువూరు 8వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుని మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికురాలు సామ్రాజ్యం అధికారులకు తెలిపారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి తమ సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

? కూనపరాజుపర్వ గ్రామంలోని వడ్డెర పల్లె పాఠశాల దగ్గర రోడ్డుపైకి మురుగు చేరుతోంది. **- పుల్లయ్య, స్థానికుడు** ✔ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

? విస్సన్నపేట పంచాయతీలోని రాజీవ్ నగర్ కాలనీలో కోతుల బెడద అధికంగా ఉంది. **- కాలనీ నివాసితులు** ✔ కోతులను పట్టి గతంలో అడవుల్లో వదిలేశాం. ఆవాసాలను వెతుక్కుంటూ మరల వచ్చాయి. వీటి నియంత్రణపై చర్యలు చేపడతాం.- **కేశవ హరికృష్ణ కుమార్, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, విస్సన్నపేట**

తుండ్లు, రాత పుస్తకాలు పంపిణీ

గంపలగూడెం, న్యూస్‌టుడే : గీతా జయంతి ఉత్సవంలో భాగంగా పెనుగొలనులో సోమవారం సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన ప్రాథమిక పాఠశాలలో 4, 5 తరగతులు చదువుతున్న 25 మంది బాల బాలికలకు తుండ్లు, రాత పుస్తకాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

గంపలగూడెం, తిరువూరు: తిరువూరు మండలం లక్ష్మీపురం పీఏసీఎస్‌లో సభ్యుడైన బాలమర్తి వెంకటేశ్వరరావు మృతి చెందారు. ఈ మేరకు సహకార సంఘం నుంచి మంజూరు చేసిన రూ.10 వేలు అతని కుటుంబ సభ్యులకు ఛైర్‌పర్సన్ నెక్కడపు ప్రమీల, సర్పంచి జి.శ్రీనివాసరావు, సీఈవో బి.రఘురామ్ సోమవారం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మద్దులపర్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా ఆర్.శైలజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గంపలగూడెం మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఆమె పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న జి.సుధాకర్ గంపలగూడెం మండలంలోని ఆదర్శ పాఠశాలకు వెళ్లారు.

సర్వే ముగిసింది.. ఎంపిక మిగిలింది

సొంతింటి నిర్మాణానికి స్థలాలు గుర్తింపు

గంపలగూడెం, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉన్న పేదలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ప్లస్ కింద గృహాలు మంజూరు చేయడానికి అందిన అర్జీలపై అధికారులు క్షేత్ర స్థాయిలో నిర్వహించిన సర్వే ప్రక్రియ ముగిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించే ఆర్థిక చేయూతతో పేదలు తమ సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొనేందుకు దరఖాస్తులు ఆహ్వానించారు. వీటిపై అసలు అర్జీదారులకు స్థలాలు ఉన్నాయా.. లేదా అని నిర్ధారించేందుకు నవంబరు 11 నుంచి 30వ తేదీ వరకు గృహ నిర్మాణ సంస్థ అధికారులు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో సర్వే చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2.50 లక్షల వరకు ఇంటి నిర్మాణాలకు సాయం అందించే అవకాశం ఉంది.

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో సొంత స్థలాలు ఇలా..	
మండలం	స్థలాలు
గంపలగూడెం	2,987
ఎ.కొండూరు	2,708
విస్సన్నపేట	2,670
తిరువూరు	2,150
రెడ్డిగూడెం	1,452

• అర్జీదారులకు ఖాళీ స్థలాలు ఉన్నా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పీఎంఏవై ప్లస్‌లో ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం మంజూరుకు అర్హతను గుర్తించాల్సి ఉంది. లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు మరోసారి విచారించి అర్హులా కాదా అని నిర్ధారిస్తారు. కాలనీ గృహాలు మంజూరు చేయొచ్చని అధికారులు ధ్రువీకరిస్తే రానున్న రెండేళ్లలో అవన్నీ మంజూరు చేస్తారు. తిరువూరు, రెడ్డిగూడెం, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో ఆదివారం సాయంత్రం 5.30 గంటల వరకు సర్వే ద్వారా 11,967 మంది అర్జీదారులకు సొంత స్థలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

గంపలగూడెం మండలం రాజులపాలెంలో సర్వే చేస్తున్న అధికారులు

సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

ప్రజా సమస్యలు పరిష్కరించండి

రామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని రామచంద్రాపురంలో డ్రెయినేజీ, వీధి దీపాలు, తాగునీరు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక, మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందించారు. నాయకులు పి.ఆనందరావు, ఎ.ఉమాదేవి, సీహెచ్.శివపార్వతి, సీహెచ్.దుర్గ తదితరుల పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీ మేరకు పింఛను మొత్తం పెంపు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లబ్ధిదారులకు సామాజిక పింఛన్ల సాయం పెంచిందని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్లు పంపిణీ చేశారు. ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో జరిగిన పంపిణీలో తెదేపా నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని వెలగలేరులో స్థానిక నాయకులతో కలిసి ఆయన పింఛన్ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రాభివృద్ధిని చూసి వైకాపాకు చెందిన 20 మంది కార్యకర్తలు తెదేపాలో వస్తామనగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

గొల్లపూడిలో వివరాలు వెల్లడిస్తున్న దేవినేని ఉమ

గొల్లపూడి, న్యూస్‌టుడే : ప్రజల సంక్షేమ పథకాలు అందించడంలో కూటమి ప్రభుత్వం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో రూ.50 వేల కోట్లు పైగా నగదును పింఛన్ల రూపంలో అందించిందని తెలిపారు.

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, తెదేపా నాయకులు కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో జరిగిన పింఛన్ల పంపిణీలో తెదేపా మండల అధ్యక్షుడు జె.వేణుగోపాలరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వర రెడ్డి, ఉప సర్పంచి కె.వెంకటేశ్వరరావు(బాబు) నాయకులు పాల్గొన్నారు.

తిరువూరు: పింఛను పంపిణీ చేస్తున్న శాసన సభ్యుడు శ్రీనివాసరావు

వెలగలేరు: వృద్ధురాలికి నగదు ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

మొర్సుమిల్లి (మైలవరం), న్యూస్‌టుడే : పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించి, ఆ భూతాన్ని తరిమికొట్టాలని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డీన్ పిచ్చిరెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ దత్తత గ్రామం మొర్సుమిల్లిలో సోమవారం వారం రోజుల పాటు నిర్వహించే శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామంలో భారీ ప్రదర్శన చేశారు. ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రోగ్రాం అధికారి శివహరిప్రసాద్, ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఉపన్యసిస్తున్న విద్యార్థిని

ప్రతిభ చాటి.. గెలుపొంది

మైలవరం, న్యూస్‌టుడే : అసాధారణ అంశాలపై ఉపన్యసించిన విద్యార్థినులు సత్తా చాటి పోటీల్లో పతకాలు సాధించారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థినులకు 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందులో జూనియర్ ఇంటర్ విద్యార్థులు పసుపులేటి ప్రగతి(ఎంపీసీ), దేశబోయిన ప్రగతి(బైపీసీ), జరబల శ్రావణి(ఎంపీసీ) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. ఈ మేరకు వీరికి ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్, ఉపాధ్యాయులు రాంప్రసాద్, సూరిబాబు, గోపాలం, శంకర్ నాయక్, ఆనంద్, సాంబిరెడ్డి తదితరులు బహుమతులు అందించారు.

ఆర్థిక నేరాలపై అవగాహన

జి.కొండూరు, న్యూస్‌టుడే : కుటుంబ వ్యవస్థ సరిగా ఉంటేనే మంచి సమాజం తయారవుతోందని డీసీపీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. జి.కొండూరు మండలం గంగినేనిపాలెం, సున్నంపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రుల పాత్ర ప్రధానమని సూచించారు. ఏసీపీ వై.ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్, ఎస్సై కె.సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ, పక్కన ఏసీపీ ప్రసాదరావు

ధ్రువపత్రాల అందజేత

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణకు హాజరైన మహిళలకు ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ కార్యాలయంలో సోమవారం ధ్రువపత్రాలు అందజేశారు. రెండు విడతల్లో 55 మందికి రెండు నెలల పాటు శిక్షణ అందించామని చెప్పారు.

కుంగిన వారధి.. స్పందించండి సారథి

జి.కొండూరు, న్యూస్‌టుడే

మండలంలోని హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరుపై ఉన్న వంతెన కుంగి ప్రమాదకరంగా మారింది. దీనిపై నిత్యం పలు గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల కిందట నిర్మించిన వారధి 2022 వరకు సేవలందించి ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో దీనికి ప్రత్యామ్నాయంగా అప్పటి వైకాపా నాయకులు రూ.55 లక్షలు పెట్టి తాత్కాలిక వంతెన నిర్మించి చేతులు దులుపుకొన్నారు. దీంతో బుడమేరు ఉద్ధృతంగా ప్రవహించినప్పుడు దీనిపై నుంచి వరద నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. శాశ్వత వంతెన నిర్మాణం చేపడితేనే సమస్య తీరుతోందని ప్రజలు వాపోతున్నారు. దానిపై ప్రయాణం చేసే సమయంలో వంతెన కూలిపోయి అనుకోని విపత్తు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

నిర్లక్ష్యమే కారణం

వైకాపా హయాంలో వంతెన దిగువన ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడంతో ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు వాపోతున్నారు. దాని కింద ఉన్న మట్టి మొత్తం కోతకు గురై కుంగిపోయిందని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు గత ప్రభుత్వంలో వంతెన కుంగినా శాశ్వత ప్రతిపాదికన వారధి నిర్మాణం చేపట్టక పోవడంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి పాలకులైనా స్పందించి బుడమేరుపై శాశ్వత వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా వంతెనపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

అంచనాలు సిద్ధం చేసి అధికారులకు నివేదించాం

వంతెన నిర్మాణానికి రూ.10.5 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైతే ఆయా పనులు చేపట్టి వాహనదారుల అవస్థలు తీరుస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- అప్పారావు, ఆర్అండ్‌బీ సహాయక ఇంజినీరు**

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఇబ్రహీంపట్నం మండల నూతన కార్యవర్గ ఎన్నిక ఇబ్రహీంపట్నంలో సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా వి.నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా వై.శ్రీనివాసరావు, ప్రవీణ, అశోక్ కుమార్, రమాదేవి ఎన్నికయ్యారు. ఉపాధ్యాయులకు 30 శాతం ఇంటీరియల్ రిలీఫ్ ఇచ్చేందుకు సంఘం కృషి చేయాల్సిన అవసరం ఉందని అధ్యక్షుడు నరేంద్ర పేర్కొన్నారు. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక స్థలం తిరిగి ఇప్పించాలని వినతి

కొండపల్లి, న్యూస్‌టుడే : డ్వాక్రా మహిళా సామాజిక స్థలాన్ని కబ్జా చేశారని పలువురు మహిళలు ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం, ఛైర్మన్ చిట్టిబాబులకు విన్నవించారు. కొండపల్లి పురపాలికలోని 27వ డివిజన్ నేతాజీ నగర్‌లో రెండు సెంట్ల సామాజిక స్థలం ఉంది. దీన్ని డ్వాక్రా మహిళా సామాజిక భవనం నిర్మించుకునేందుకు గతంలో కేటాయింపులు జరిగాయి. కొందరు వ్యక్తులు ఆ స్థలానికి కాగితాలు పుట్టించి ఇతరులకు అమ్మకాలు జరిపారు. విషయం తెలుసుకున్న డ్వాక్రా సంఘ సభ్యులు ఈ విషయాన్ని సోమవారం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

వైభవంగా గీతా జయంతి వేడుకలు

మైలవరం, న్యూస్‌టుడే : గీతాజయంతిని పురస్కరించుకుని సోమవారం ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భగవద్గీత పారాయణం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య పర్యవేక్షణలో ప్రధానార్చకుడు టి.గోపాలాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. నమో వెంకటేశాయ, జై జనార్ధన భక్త బృందాల ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం చేశారు.

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా తిరువూరులోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాల స్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమా గౌరీ శంకరుని ఆలయంలోని శివలింగాన్ని అర్చకుడు పి.కోటేశ్వరరావు శోభాయమానంగా అలంకరించారు. భక్తులు శివ లింగం దర్శించుకుని పూజలు చేశారు. గంపలగూడెం, మేడూరు, పెనుగొలను, తిరువూరు, ఎ.కొండూరు మండలం కంభంపాడు శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

మైలవరంలో భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

శంకరరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ శ్రేణులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ విస్సన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంఈవో- 1 శంకరరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. సంఘ జిల్లా కార్యదర్శి జి.బాల్యా, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.అంకరాజు, పి.చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ వాలీబాల్ విజేత క్యూఐఎస్ కళాశాల జట్టు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన కాకినాడ జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ వాలీబాల్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ఒంగోలులోని క్యూఐఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు, నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల జట్టు వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. మూడో స్థానాన్ని బాపట్ల జిల్లా చీరాలలోని సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల, వీఆర్ సిద్ధార్థ కళాశాల జట్లు సంయుక్తంగా సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఎల్బీఆర్‌సీఈ గౌరవ ఛైర్మన్ లకిరెడ్డి జయప్రకాశరెడ్డి, జేఎన్‌టీయూ ఐసీటీ కార్యదర్శి లోవరాజు, కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి తదితరులు బహుమతులు అందించారు.

మొదటి స్థానం సాధించిన వారికి ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

అప్రమత్తతతో హెచ్ఐవీ దూరం

మైలవరం, న్యూస్‌టుడే : ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారానే ప్రమాదకరమైన హెచ్ఐవీ వ్యాధికి దూరంగా ఉండొచ్చని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప ప్రిన్సిపల్ పి.రంగారావు పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఫణికుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సుభాషిణి, అధ్యాపకులు రాముడు, దేవానంద్ కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

మైలవరం : మాట్లాడుతున్న ఉప ప్రిన్సిపల్ రంగారావు

తిరువూరు : అవగాహన ర్యాలీలో వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భానుతేజా, ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ ఎ.దుర్గాప్రసాద్, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

తిరువూరు టౌన్: స్థానిక బాలికోన్నత పాఠశాలలో తిరువూరు మండల స్థాయి ఆటల పోటీలను ఎంఈవో- 2 పీయస్‌యన్.రాజు సోమవారం ప్రారంభించారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే డివిజన్ పోటీలకు పంపనున్నారు.

రిబ్బను కత్తిరిస్తున్న ఎంఈవో- 2 పీయస్‌యన్.రాజు

ముగిసిన.. జి.కొండూరు: జి.కొండూరు మండలంలో రెండు రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయుల క్రీడా ఎంపికలు సోమవారంతో ముగిశాయని ఎంఈవో ఎం.వీరాస్వామి తెలిపారు. ఆయా క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని మండలానికి ఎంపిక చేశామని, వీరు డివిజన్ స్థాయిలో విజయవాడలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పీడీ పురుషోత్తం తెలిపారు. పాఠశాల హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్ ఆలోచన మానుకోవాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : డొక్కా సీతమ్మ పేరుతో ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరణ చేసే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని మధ్యాహ్న భోజన పథక వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కె.రాజేశ్వరి అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈవో పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. రాజేశ్వరి, లక్ష్మి, కోటేశ్వరి, ఉషా, పూర్ణకల్యాణి, మహేష్ పాల్గొన్నారు.

ఎంఈవో పుష్పలతకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ సభ్యులు

క్రైమ్ కార్నర్

చెరువులో మృతదేహం లభ్యం

జి.కొండూరు, న్యూస్‌టుడే : ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి కుళ్లిన స్థితిలో మృతదేహంగా లభ్యమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు .. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా కటేకళ్యాణ్ మండలం, కటేకళ్యాణ్ గ్రామం నుంచి మైసరమ్ నాగ్(45) అనే వ్యక్తి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఏడాది కిందట జి.కొండూరు మండలం చెవుటూరుకు వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో అతను మద్యానికి బానిసై ఇంటి నుంచి బయటకెళ్లి కనిపించకుండా ఉంటూ మరలా తిరిగి రావడం పరిపాటిగా మారింది. వారం కిందట ఇదే మాదిరిగా ఇంటి నుంచి వెళ్లిన నాగ్ పక్కనే ఉన్న చెరువులో విగతజీవిగా దర్శనమిచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో వైద్యులు చెరువు వద్దే పోస్టుమార్టం చేశారు. భార్య బిజినీ ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనదారుడికి తీవ్ర గాయాలు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక ఆల్ఫా సర్కిల్ వద్ద, జాతీయ రహదారి బైపాస్‌పై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక రాజాపేటకు చెందిన బి.జనార్దన్, బైపాస్‌లో ఓ బండి వద్ద పానీపూరి తీసుకొని ఇంటికెళ్లేందుకు తన ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో జి.కొండూరు వైపు నుంచి వస్తున్న టాటా ఏసర్ ఆటో బైక్‌కు తగిలింది. దీంతో రహదారిపై పడిపోయిన అతనికి తీవ్ర గాయాలు కావడంతో, స్థానికులు పక్కనే ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడి నుంచి విజయవాడకు తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము, పెనుగంచిప్రోలు, యన్.టి.ఆర్. జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్- కం- షార్ట్ టెండర్- కం- బహిరంగ వేలము ప్రకటన

Computer No.76867/2024 Dt. 01-12-2025 (License Bid Amounts must be exclusive of all taxes)

వ.నెం.	లైసెన్స్ హక్కుల వివరము	ధరావత్తు సొమ్ము
1.	శ్రీ అమ్మవారి మండల దీక్ష మాలధారణ సందర్భముగా ది. 13-12-2025 నుండి ది. 24-12-2025 వరకు 12 రోజులు (దేవస్థానము వారు సూచించిన ప్రదేశములో శ్రీ అమ్మవారి దీక్షా మాలధారణకు సంబంధించిన వస్తువులు, తదితరములు విక్రయించుకొనుటకు తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకొనుట	రూ. 5,000/- తో
2	శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము, పెనుగంచిప్రోలునకు అవసరమైన సిబ్బందిని అవుట్ సోర్సింగ్ ఏజన్సీ ద్వారా వినియోగించుకొనుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్-టెండర్ ప్రక్రియ నిర్వహించుటకు ది. 01-01-2026 నుండి 31-03-2028 ఆర్థిక సంవత్సరం ముగింపునాటికి అనగా 27 నెలల కాల పరిమితికి	రూ. 5,00,000/-
3.	ది.01-01-2026 నుండి ది. 30-06-2026 వరకు (6 నెలలు)కు శ్రీ అమ్మవారి దేవస్థానమునకు అవసరమైన నెయ్యి సరఫరా చేయుట (రెండవ పర్యాయము)	రూ. 3,00,000/-
4	దేవస్థానము అప్పగించిన తేదీ నుండి రెండు సంవత్సరముల కాల పరిమితికిగాను దేవస్థానమునకు అవసరమైన లడ్డు మరియు పులిహోర ప్రసాదం తయారీ మరియు ప్యాకింగ్ చేసి కౌంటర్‌కు చేరవేయుటకు (6వ పర్యాయము)	రూ. 1,00,000/-
5.	మున్నేరు అవతల గల ఆడిటోరియం వద్ద గల 2 షెడ్లు, 4 ఎ.సి. రూములు నిర్వహించుకొను లైసెన్సు హక్కు (అప్పగించిన తేదీ నుండి 2.సం.ల వరకు)	రూ. 3,00,000/-

1. వ. సంఖ్య 1కి సంబంధించి తేది. 06-12-2025న బహిరంగ వేలం నిర్వహించబడును. **2.** వ. సంఖ్య 2 నుండి 4 వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్-కం-టెండర్ నిర్వహించబడును. www.apeprocurement.gov.in ది. 05-12-2025 నుండి ది. 19-12-2025 వరకు అందుబాటులో ఉండును. **3.** వ. సంఖ్య 5కి సంబంధించి తేది 10-12-2025న టెండరు-కం-బహిరంగ వేలం నిర్వహించబడును. **4.** పాటదారులు (ఆధార్, పాన్ మరియు వృత్తి పన్ను సర్టిఫికెట్ తప్పనిసరి) ధరావత్తు సొమ్మును కార్యనిర్వహణాధికారి, శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, పెనుగంచిప్రోలు వారి పేరున డి.డి. రూపములో మాత్రమే చెల్లించవలెను. నగదు స్వీకరించబడదు. **5.** వరుస సంఖ్య 4 వరకు టెండర్ షెడ్యూల్ ఖరీదు రూ. 1000+GST రూ.180/-; టెండర్ షెడ్యూల్ విక్రయము ది. 05-12-2025 నుండి ది. 18-12-2025 వరకు; టెండరు దాఖలు తేది 19-12-2025 ఉదయం గం. 11.00 గం.లోపు టెండర్ దాఖలు చేయవలెను. తదుపరి టెండర్ బాక్సు తెరువబడును. **6.** మిగిలిన వివరములు దేవస్థాన కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.

శ్రీ అమ్మవారి సేవలో

శ్రీ జంగాల శ్రీనివాసరావు, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

బిహెచ్.వి.యస్.యన్.కిషోర్ కుమార్, డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి

(c) eenadu

విజయవాడ తూర్పు

పాఠశాల అభివృద్ధికి రూ.35 లక్షలు అందజేత

పటమట, న్యూస్‌టుడే : తూర్పు నియోజకవర్గం కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు పాఠశాల అభివృద్ధికి శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ సీఎస్ఆర్‌లో భాగంగా రూ.35 లక్షలు అందజేయడం అభినందనీయమని కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సోమవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు కలిసి సీఎస్ఆర్‌లో భాగంగా రూ.35 లక్షల చెక్కు అందజేశారు. శ్రీరామ్ ఫైనాన్స్ ఎండి చక్రవర్తికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. శ్రీరామ్ కంపెనీ ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, నాగేంద్ర, సయ్యద్ ఉస్మాన్ పాల్గొన్నారు.

కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వరరావు, నాగేంద్ర, సయ్యద్ ఉస్మాన్

అన్న క్యాంటీన్ల పరిశీలన

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : అన్న క్యాంటీన్లకు వచ్చే ప్రజలకు అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు, పశ్చిమంలోని అన్న క్యాంటీన్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్న క్యాంటీన్లలోని ఆహార పదార్థాలు, వస్తు సామగ్రి పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలని అన్నారు. నోడల్ అధికారులు నిత్యం పరిశీలించాలని తెలిపారు. క్యాంటీన్లలో మరమ్మతులు ఉన్నా వెంటనే చేపట్టాలని సూచించారు. తాగునీరు, వాడకం నీటి సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు రమ్యకీర్తన, అన్నపూర్ణ, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార పదార్థాల నిల్వ పాత్రలను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఆదాయం వద్దంట..

- పార్కింగ్ టెండర్ వ్యవహారంలో అనుమానాలు అనేకం
- కొందరు స్థాయీ సంఘ సభ్యుల తీరుపై విమర్శలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

కార్పొరేషన్‌కు ఆదాయం కింద రూ.5 కోట్లకు పైగా వస్తుంటే.. వద్దనేవారు ఎవరూ ఉండరు.. కొందరు స్థాయీ సంఘ సభ్యులు మాత్రం వద్దనే అంటున్నారు. ఫలితంగానే భారీగా ఆదాయం వచ్చే ఓ పార్కింగ్ లీజు టెండరు తిరస్కరించి.. ఔరా అనిపించారు.

కెనాల్ రోడ్డు- బొడ్డుబొమ్మ పార్కింగ్ ప్రాంతం నగరంలో అతి కీలకమైంది. వ్యాపారులు, భక్తులు పెద్దసంఖ్యలో వాహనాలు నిలుపుతారు. ఈ ప్రాంతానికి ఈ ఏడాది అక్టోబర్‌తో లీజుకాలం ముగియగా అదేనెల 2న అధికారులు ఈ- వేలం నోటీసు ఇచ్చారు.

- 23న పోర్టల్‌లో ముగ్గురు బిడ్డర్లు షెడ్యూళ్లు దాఖలు చేసినట్లు గుర్తించారు. వీరిలో 'గమ్మాడియన్ స్టూడియో, జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థలు మాత్రమే అర్హత సాధించినట్లు గుర్తించి వేలం నిర్వహించారు. వేలంలో ఈ రెండు సంస్థలు కెనాల్ పార్కింగ్ లీజు దక్కించుకునేందుకు తీవ్రంగా పోటీపడ్డాయి. అప్‌సెట్ ధర రూ.41,56,130 నిర్ణయించగా, గమ్మాడియన్ స్టూడియో రూ.5,71,20,130 చెల్లించేందుకు పోటీ పడింది. జీఎంఆర్ సంస్థ అదనంగా రూ.6 వేలు కోట్ చేసి, రూ.5,71,26,120కు టెండరు దక్కించుకుంది.
- దీంతో భారీగా ఆదాయం దక్కిందని భావించారు. ఇందుకు సంబంధించి లీజు టెండరు ప్రతిపాదనను స్థాయీ సంఘం ఆమోదించాలి. తర్వాతే గుత్తేదారు సంస్థకు వర్కు ఆర్డరు (కేటాయింపు) ఇవ్వాలి. అందుకు అధికారులు ప్రతిపాదన సిద్ధం చేసి, ఆమోదానికి నవంబరు 29న స్థాయీ సంఘం ముందుకు తేగా సభ్యులు ఏకపక్షంగా తిరస్కరించారు.

నష్టపోతారంటూ ఉచిత సలహా

పార్కింగ్ టెండరు ద్వారా కార్పొరేషన్‌కు రూ.5,71,26,120 ఆదాయం వస్తుండటంతో గుత్తేదారు సంస్థకు వెంటనే వర్కు ఆర్డర్ ఇచ్చి, లీజు కేటాయించాలి. భిన్నంగా స్థాయీ సంఘ సభ్యులు కొందరు ఆయా గుత్తేదారు సంస్థ పట్ల సానుభూతి చూపారు. రూ.కోట్లకు టెండరు దక్కించుకోవడం వల్ల నష్టపోతారంటూ సూచించారు. ప్రతిపాదన తిరస్కారానికి ఒప్పందం కుదరడంతో ఏకపక్షంగా తిరస్కరించారు.

నిబంధనల ప్రకారం

నిబంధనల ప్రకారం పార్కింగ్ టెండరు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ వెంటనే రూ.2,38,02,555 సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించి, పార్కింగ్ స్థలం స్వాధీనం చేసుకోవాలి. లేనిపక్షంలో ఆ సంస్థ చెల్లించిన రూ.10,39,100 ఈఎండీని జప్తు చేయాలి. వేలంలో పోటీపడి అత్యధిక ధర చెల్లించేందుకు ముందుకొచ్చి, ఆపై కాలయాపన చేయడం, పార్కింగ్ లీజు స్వాధీనం చేసుకోకుండా కాలయాపన చేయడం వల్ల 2 నెలల ఆదాయం పోయింది. ఈ కారణాలుగా గుత్తేదారు సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టాలి. అందుకు తగిన తీర్మానం ఆమోదించాల్సి ఉన్నా, సభ్యులు తిరస్కరించారని విమర్శలు వస్తున్నాయి.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ప్రకృతి, సేంద్రియ పద్ధతులలో సాగు చేసిన ఉత్పత్తులు ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్ అన్నారు. కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రకృతి, సేంద్రియ పద్ధతుల్లో విద్యార్థినులు సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయల ప్రదర్శనను సోమవారం ఆయన ప్రారంభించారు. కళాశాల వృక్షశాస్త్రం విభాగం అధ్యాపకులు టి.సలోమి, బి.శైలజ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేత

విజయవాడ నగరపాలక సంస్థ: అర్హులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్మును నగరపాలక సంస్థ అధికారులు మూడు నియోజకవర్గాల్లోని లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. సాయంత్రం వరకు మొత్తం రూ.26.98 కోట్లు అందించారు. కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు నియోజకవర్గాల్లో.. ❖ పశ్చిమంలో 20,191 మంది లబ్ధిదారులు ఉండగా, 19,162 మందికి రూ.8.32 కోట్లు పంపిణీ చేశారు. ❖ మధ్యలో 25,662 మంది లబ్ధిదారులు ఉండగా, 24,141 మందికి రూ.10.44 కోట్లు చెల్లించారు. ❖ తూర్పులో 20,204 మంది లబ్ధిదారులు ఉండగా, 18,990 మందికి రూ.8.21 కోట్లు అందించారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొత్తపేట కూరపాటి చంద్రశేఖరరావు ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 108 మంది విద్యార్థులతో సోమవారం భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. గీతామందిరం ప్రధాన కార్యదర్శి కుందేపు మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి టీటీలో విద్యార్థి ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : గురునానక్ కాలనీలోని నెక్స్ట్ జెన్ స్కూల్‌లో నాలుగో తరగతి విద్యార్థి అత్తోట అక్షయ్ ఆనంద్ టేబుల్ టెన్నిస్‌లో మెరుగైన ప్రతిభ ప్రదర్శించి కాంస్య పతకం సాధించినట్లు స్కూలు ప్రిన్సిపల్ సమానా పర్వీన్ తెలిపారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో అక్షయ్ అండర్- 11 జట్టుకు ప్రాతినిధ్యం వహించి వ్యక్తిగత విభాగంలో తృతీయ స్థానాన్ని సాధించాడని పేర్కొన్నారు. ఈ ప్రతిభ ఆధారంగా జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

అక్షయ్ ఆనంద్‌ను అభినందిస్తున్న సమానా పర్వీన్, చిత్రంలో ఉపాధ్యాయులు

కృష్ణా వర్సిటీ టీటీ ఛాంప్ 'శాతవాహన' జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల టేబుల్ టెన్నిస్ టోర్నీలో శాతవాహన కళాశాల జట్టు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకుంది. పోటీల్లో అయిదు కళాశాలల జట్లు తలపడ్డాయి.. కేబీఎన్ కళాశాల ద్వితీయ, ఎస్వీడీ న్యాయ కళాశాల తృతీయ స్థానాల్లో నిలిచాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపల్ ఎస్.అరవింద బాబు ప్రారంభించారు. సాయంత్రం ముగింపు కార్యక్రమానికి కళాశాల కన్వీనర్ కమిటీ సభ్యుడు రాజా రత్నం ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పోటీల కార్య నిర్వాహక కార్యదర్శి ఎల్.వినయ్‌శేఖర్ పర్యవేక్షించారు.



రాజారత్నం నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న శాతవాహన కళాశాల జట్టు

పీబీ సిద్ధార్థలో 5 నుంచి వేదాంత, సైన్స్ చర్చా సదస్సు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పీబీ సిద్ధార్థ కళాశాల, పశ్చిమ బెంగాల్‌లోని శ్రీచైతన్య సరస్వత్ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో సిద్ధార్థ ఆడిటోరియంలో వేదాంత- సైన్స్ రెండో అంతర్జాతీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య సరస్వత్ ఇనిస్టిట్యూట్ అధ్యక్షుడు శ్రీ భక్తి విజ్ఞానమని మహరాజ్, మఠ్ అధ్యక్షుడు శాస్త్రవేత్త శంకర మహారాజ్ మాట్లాడుతూ వేదాంతం, శాస్త్ర విజ్ఞానంపై చర్చ వేదిక నిర్వహించే సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరవుతారని వెల్లడించారు. కార్యక్రమంలో వృక్ష, జంతు, జీవ సాంకేతిక శాస్త్ర విభాగాల అధ్యాపకుడు పువ్వాడ శ్రీనివాసరావు, ఇనిస్టిట్యూట్ సభ్యుడు కృష్ణప్రసాద్ దాస్ పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న బాబూరావు, రమేష్, భక్తి విజ్ఞానమని తదితరులు

ప్రయాణికులున్నా.. బస్సులు ఆపరు..

కృష్ణలంక జాతీయ రహదారి ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో గతం నుంచి ఆర్టీసీ బస్టాపు ఉంది. ఏలూరు, గుంటూరు, మచిలీపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు ఇక్కడ బస్సులు ఎక్కేవారు. కాగా బస్సు డ్రైవర్లు అక్కడ బస్సులను ఆపకుండా వెళుతుండటంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఆర్టీసీ అధికారులు బస్టాపు వద్ద బోర్డు ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, కృష్ణలంక**

తాగునీరు వృథా.. పట్టించుకోరా?

తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మూడో డివిజన్ కరెన్సీనగర్ నడిపల్లి సుందరం వారి, బాయన బాబూజీ రహదారి, శాంతినగర్ శివయ్య వీధుల్లో వారం రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతులకు పరికరాలు లేవని చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

సేవలు అభినందనీయం

మొగల్రాజపురం (విజయవాడ సిటీ): పేద, మధ్య తరగతి వర్గాలకు వివిధ రూపాల్లో చేయూత అందిస్తున్న వైఎస్ఆర్ ఛారిటీస్ సేవలు అభినందనీయమని వైకాపా జిల్లా అధ్యక్షుడు, తూర్పు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఛారిటీస్ ఆధ్వర్యంలో రూ.25 వేల విలువైన బడ్డీకొట్టును మొగల్రాజపురంలో సోమవారం ఒకరికి ఆయన అందజేశారు. ఛారిటీస్ ఛైర్మన్ యలమంచిలి జయప్రకాశ్, కార్పొరేటర్ వి.అమర్నాథ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండాలన్న ధ్యేయంతో..

కృష్ణలంక: తుపాను తదితర విపత్కర పరిస్థితుల్లో పేదలకు అండగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నెలలో మొదటి తేదీనే పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు తెదేపా 18వ డివిజన్ అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్య అన్నారు. డివిజన్‌లో సోమవారం స్థానిక నేతలతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

పింఛను అందజేస్తున్న తిరుపతయ్య తదితరులు

విద్యార్థులకు భాషా సామర్థ్య పోటీలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో పద జాలం, స్పెల్లింగ్ ప్రావీణ్యం, ఉచ్చారణ, భాషా సామర్థ్యాన్ని పెంపొందించే పోటీలు సోమవారం ఆంధ్రా లయోల ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. యుఫోనియస్ వాయిసెస్ క్లబ్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు రాపిడ్ ఫైర్ రౌండు పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. అధ్యాపకుడు దైవ కృప మోడరేటర్‌గా పనిచేయగా, ప్రియదర్శిని న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. విజేతల్లో కె.బ్యూలా రాణి, ఎ.విక్టోరియా, టి.అవినారెడ్డిలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కళాశాల డైరెక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపల్ ఒ.మహేష్, పరీక్షల నియంత్రణాధికారి ఇమ్మాన్యుయేల్, ఐక్యూఏసీ సమన్వయకర్త సిస్టర్ క్యాండీ అందజేశారు.

జగన్మాత సేవలో సినీ నటుడు నరేష్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను సినీ నటుడు నరేష్ సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నరేష్‌కు ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

రిటైనింగ్ గోడలు నిర్మించాలి

చిట్టినగర్: కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ గోడలు నిర్మాణం వెంటనే చేపట్టాలని, గొల్లపాలెంగట్టు ప్రాంతంలోని సామాజిక భవనం పూర్తి చేయాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ ధ్యానచంద్రకు పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. వర్షానికి కూలిపోయిన రిటైనింగ్ గోడలు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయడంతో పాటుగా పాడైన గోడలకు మరమ్మతులు చేపట్టాలని సూచించినట్లు వివరించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని విన్నవించినట్లు తెలిపారు. స్పందించిన కమిషనర్ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించండి

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, వివిధ ప్రాంతాల ప్రజల నుంచి పలు సమస్యలపై ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్యలపై ప్రజలు ఎక్కువగా కమిషనర్‌కు ఫిర్యాదులు వచ్చాయి. వాటిని బాధ్యులైన అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు.

వినతులు..ఇలా.. గుణదల, గిరిపురంలో నీటి సరఫరా సమస్యలపై వినతులు అందగా ఇక నీటిని విడుదల చేసే సిబ్బంది తీరుపై పలు ఫిర్యాదులు అందాయి. మరోవైపు టీడీఆర్ బాండ్ల జారీ, ఇంటి రిజిస్ట్రేషన్, ఇళ్ల తొలగింపు, ఖాళీ స్థలం పన్ను, రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, కొండ ప్రాంతంలో రాళ్ల తొలగింపు, ఆస్తిపన్ను మార్పు, వీధి దీపాలు, బీపీఎస్, రహదారుల మరమ్మతులు, కోతుల సమస్యపై వినతులు అందాయి. కార్యక్రమంలో అధికారులు రవీంద్రరావు, డి.చంద్రశేఖర్, అర్జునరావు, లత, సృజన, శ్రీధర్, సత్యకుమారి, కామేశ్వరరావు, చంద్రశేఖర్, మాల్యాద్రి, సోమశేఖర్ రెడ్డి, చంద్రబోస్ పాల్గొన్నారు.

అవగాహన చర్యలతో ఎయిడ్స్ కట్టడి

ర్యాలీలో ఆసుపత్రి సిబ్బంది, ఏఆర్‌టీ వైద్యాధికారులు తదితరులు

లయోల కళాశాలలో ప్రిన్సిపల్ ఫాదర్ మిల్కియోర్ తదితరులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండి, ముందస్తు చర్యలు తీసుకుంటే దాన్ని కట్టడి చేయవచ్చని రోగులకు ఆసుపత్రి సిబ్బంది అవగాహన కల్పించారు. సోమవారం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఆర్‌టీ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. రోగులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ వైద్యాధికారులు శ్రీధర్, బాల, సాయి నిఖిత, స్టాఫ్ నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

మొగల్రాజపురం (విజయవాడ సిటీ) : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ ఆధ్వర్యంలో కార్యాలయంలో అవగాహన సదస్సు, తరువాత మొగల్రాజపురంలో ర్యాలీ నిర్వహించారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో విద్యార్థినులు అవగాహన ప్రదర్శన చేశారు.

కరెన్సీనగర్ : రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్రా లయోల కళాశాల విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు పోస్టల్ పెయింటింగ్, ఫేస్ పెయింటింగ్, రంగోలీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఎస్.ఎస్. కో-ఆర్డినేటర్ కె.రమేష్ హాజరై హెచ్ఐవీ లేని సమాజాన్ని భవిష్యత్తులో చూడాలని, వ్యాధి సోకిన వారి పట్ల దయాగుణం కలిగి ఉండాలని చెప్పారు. ర్యాలీని ప్రిన్సిపల్ ఫాదర్ మిల్కియోర్, వైస్ ప్రిన్సిపాళ్లు ఫాదర్ జి.కిరణ్ కుమార్, బి.సురేష్ కుమార్ ప్రారంభించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త కె.శేఖర్, జాన్, ఎన్ఎస్ఎస్ కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం పెంపునకు భగవద్గీత దోహదం

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : భగవద్గీత మనిషిని సక్రమ మార్గంలో నడిపించడంతో పాటు నైతిక విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తుందని సాహితీవేత్త వలివేటి వెంకట శివరామకృష్ణమూర్తి అన్నారు. భగవద్గీత జయంతి సందర్భంగా సోమవారం సిద్ధార్థ మహిళా కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'గీతా సందేశం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివరామకృష్ణ మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలను పఠించడం వల్ల ధారణ, మేధోశక్తి పెరుగుతోందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్, తెలుగు విభాగాధిపతి కె.సరళ, ఐ.మంజుల పాల్గొన్నారు.

ఎట్టకేలకు బారికేడ్లు ఏర్పాటు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : మూడో డివిజన్ హైటెన్షన్ రోడ్డు కరెన్సీనగర్ మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఆరు బారికేడ్లు అమర్చి రెండు వైపులా మార్గాలను విడగొట్టారు. దీంతో బాయన బాబూజీ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు జాతీయ రహదారికి, కరెన్సీనగర్‌కు వెళ్లేందుకు మార్గం సుగమం అయింది.

ఏర్పాటు చేసిన బారికేడ్లు

వ్యర్థాలు, పిచ్చిమొక్కల తొలగింపు

కరెన్సీనగర్: నాలుగో డివిజన్ భారతీనగర్ 13వ రోడ్డులో చెట్లకొమ్మలు, వ్యర్థాలు తొలగించక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, విష పురుగుల సంచారం పెరిగిందని ఈనాడులో 'వ్యర్థాల తిష్ట' శీర్షికన శనివారం చిత్రవార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. పొక్లెయిన్ సాయంతో వ్యర్థాలను ట్రాక్టరులో వేసి తరలించారు.

పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

నూతన విమానాశ్రయాలతో అభివృద్ధి, ఉపాధి

బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో మరిన్ని విమానాశ్రయాలు రానున్నాయని, వీటి వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని క్యాలిబర్ ఏవియేషన్ అకాడమీ సీఈవో పి.రమణి అన్నారు. నూతన విమానాశ్రయాల నిర్మాణం ద్వారా రాష్ట్రం అభివృద్ధి దశలో పయనిస్తోందని తెలిపారు. బెంజి సర్కిల్‌లోని చంద్రమౌళిపురంలోని అకాడమీ కార్యాలయంలో నూతన విమానాశ్రయాల రాక, యువత ఉపాధి అవకాశాలు అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంకా మరిన్ని విమానాశ్రయాల ఏర్పాటుకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. అయితే ఈ రంగంలో ఉపాధి పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను యువత పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఏవియేషన్ రంగం వేగంగా విస్తరిస్తుండటంతో భారతదేశంలో కూడా భారీ డిమాండ్ ఏర్పడిందని తెలిపారు.

సదస్సులో రమణి, పక్కన విద్యార్థులు

సేవా, క్రమశిక్షణ ఉన్నతికి మార్గం

మొగల్రాజపురం (విజయవాడ సిటీ): విద్యార్థి దశలో సేవాభావం, క్రమశిక్షణ ఉంటేనే జీవితంలో ఉన్నత స్థానానికి వెళతారని, సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తారని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ ఛైర్మన్ కంచమరెడ్డి నారాయణ అన్నారు. సదరన్ ఇండియా ఛార్టెడ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ (శికాశా) దినోత్సవం సందర్భంగా సోమవారం సీఏ విద్యార్థులు ఐసీఏఐ భవన్‌లో రక్తదానం చేశారు. బందరు రోడ్డులో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు రేడియం గార్మెంట్స్ అందజేశారు. డిసెంబరు నెలలో పుట్టినరోజు చేసుకోబోయే సీఏ విద్యార్థులు నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. శికాశా విజయవాడ బ్రాంచ్ ఛైర్మన్ టి.వినీల, ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జయంత్, కార్యదర్శి మనీష్‌కుమార్ జైన్, కోశాధికారి వి.వీరపవన్ కుమార్, వేణు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మృతుడి ఆచూకీ లభ్యం

కృష్ణలంక, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభించింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓరుసు వెంకటస్వామి (56) సెక్యూరిటీ గార్డు. కుటుంబంతో రాణిగారితోట కరెంటు ఆఫీసు రోడ్డులో నివాసం ఉండేవాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈక్రమంలో పండ్లు కొనుగోలు నిమిత్తం వెంకటస్వామి ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. నేతాజీ వంతెన సమీపంలో డివైడర్‌ను దాటుకుని ఇంటికి వెళుతుండగా బెంజి సర్కిల్ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు అభిషేక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టోల్‌గేట్ గుత్తేదారుకు రూ.50 వేల జరిమానా

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: టెండరు నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై టోల్‌గేటు గుత్తేదారు మహేష్‌కు రూ.50 వేలు జరిమానా చెల్లించాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ సోమవారం నోటీసు ఇచ్చారు. టెండరు షరతులు 12(ఇ), 17, 18, 22, 23 ఉల్లంఘించినట్లు నోటీసులో పేర్కొన్నారు. భక్తులతో గుత్తేదారుల అనుచరుల ప్రవర్తనపై ఫిర్యాదులు రావడంతో నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. జరిమానాతోపాటు దేవస్థానానికి చెల్లించాల్సిన బకాయి మొత్తం రూ.1,11,58,199 మూడు రోజుల్లోపు చెల్లించాలని పేర్కొన్నారు.

లీగల్ సెల్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ లీగల్ సెల్ విభాగం సూపరింటెండెంట్ పి.శ్రీనివాస చక్రవర్తి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు, లీగల్ సెల్ ఉద్యోగులు ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. 30 ఏళ్లపాటు, వివిధ హోదాల్లో నిబద్ధతలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు.


సన్మానిస్తున్న ఉద్యోగులు

క్రీడల్లో ఉత్తమ ప్రతిభ

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే : గత నెల 28 నుంచి 30 వరకు రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ వర్సిటీ ఆధ్వర్యంలో 27వ అంతర్ విద్యాలయ క్రీడా పోటీలు నిర్వహించగా తమ కళాశాల వైద్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావు సోమవారం తెలిపారు. లాన్ టెన్నిస్ విభాగంలో విన్నర్స్ ట్రోఫీతో పాటు ఐదు స్వర్ణ పతకాలు సాధించారని వెల్లడించారు. లాన్ టెన్నిస్ జట్టులో విద్యాసాగర్, కార్తీక్ అతుల్యానోరి, రాకేష్‌కుమార్ విజేతలుగా నిలిచారని చెప్పారు. వారిని ఆయన అభినందించారు. కళాశాల పీడీ రాము, వైస్ ప్రిన్సిపల్ కె.ప్రశాంతి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఏడుకొండలరావు, పీడీ రాము తదితరులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

నేటి నుంచి గ్రామదేవత తిరునాళ్ల

నూకేశ్వరి అమ్మవారు

చందర్లపాడు, న్యూస్‌టుడే: చింతలపాడు గ్రామదేవత నూకేశ్వరి తిరునాళ్ల మహోత్సవాలు నేటి నుంచి నిర్వహించనున్నారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రానున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ లక్ష్మీనారాయణ, నందిగామ ఏసీపీ తిలక్, గ్రామీణ సీఐ చవాన్, ఎస్సై దుర్గారావు ఆలయాన్ని సందర్శించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బందోబస్తుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు, ఇతరత్రా ఏర్పాట్లు చేశారు.

కనుల పండువగా శ్రీకృష్ణుని కల్యాణం

పుష్పాలంకరణలో ఉత్సవమూర్తులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ రైతుపేట గీతా మందిరంలో సోమవారం గీతా జయంతిని పురస్కరించుకుని రుక్మిణి, సత్యభామా సమేత శ్రీకృష్ణుని కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అర్చకులు కల్యాణం చేయించారు. దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించి స్వామికి తలంబ్రాలు, నూతన వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అవగాహనతో ఎయిడ్స్ నియంత్రణ

ర్యాలీలో ప్రభుత్వ విప్ సౌమ్య, వైద్యులు

నందిగామ, న్యూస్‌టుడే: ఎయిడ్స్ వ్యాధిని అవగాహనతో నియంత్రించవచ్చని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. నందిగామలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఏరియా వైద్యశాల వద్ద నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధిపై భయం అవసరం లేదని, ఆరోగ్యకర జీవన శైలిని అలవాటు చేసుకోవాలని కోరారు. పరీక్షలు చేయించుకుంటూ.. జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తోందని చెప్పారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వేల్పూరి నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ సత్యనారాయణ ప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

వినతి పరిశీలిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఎక్సైజ్, వ్యవసాయ శాఖలు ఒక్కొక్కటి చొప్పున నాలుగు, విద్యుత్తు శాఖకు సంబంధించి రెండు దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి సమస్యలను నేరుగా అర్జీదారులను అడిగి తెలుసుకున్నారు. దీనిలో పరిమితం వేర్వేరు సమస్యలపై నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించి అర్జీదారులకు అర్జీలు అందజేశారు. రెవెన్యూ శాఖకు ఐదు, సర్వే, తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

దిత్వా తుపానుతో రైతులు దిగాలు

❑ తేమ శాతంతో ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు ❑ ముమ్మరంగా వరి కోతలు

నందిగామ, పెనుగంచిప్రోలు న్యూస్‌టుడే

దిత్వా తుపాను ప్రభావంతో చిరుజల్లులు పడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ముమ్మరంగా వరి కోతలు చేస్తుండగా.. తుపాను హెచ్చరికలతో ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. చేతికి వచ్చిన పంట కోత పూర్తి చేసి ధాన్యం ఇళ్లకు చేర్చుకోవటానికి అష్టకష్టాలు పడుతున్నారు. మరో వైపు ధాన్యంలో తేమశాతం అధికంగా ఉండటంతో కల్లాల్లో ఆరబోస్తున్నారు. వీటిని వర్షాల నుంచి కాపాడుకునేందుకు పట్టాలు వేస్తున్నారు.

◆నందిగామ డివిజన్‌లోని ఏడు మండలాల్లో 50 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరిసాగు చేశారు. మునేరు, ఎత్తిపోతల పథకాలు, చెరువులు, వాగుల ఆయకట్టులో వరి కోతలు చేస్తున్నారు. మునేరు ఆయకట్టులో వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల్లో, చందర్లపాడు మండలంలో ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో వరి పైర్లలో యంత్రాలతో కోతలు చేస్తున్నారు. పంట చేతికి వస్తుందని సంతోషం కంటే వర్షం వస్తే పాడవకుండా కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యంపై పట్టాలు కప్పుతున్నారు.

◆ మబ్బుల వాతావరణంతో ధాన్యం ఆరబోసిన తేమ శాతం తగ్గట్లేదు. 24 శాతం పైగా తేమ ఉంటే కొనట్లేదు. ఈ పరిస్థితుల్లో కల్లాల్లో, పొలాల్లో, డొంక రోడ్లు, పంక్షన్ హాళ్ల ఆవరణలో ఆరబోస్తున్నారు. 17 నుంచి 24 శాతం లోపు ఉంటేనే కొనుగోలు కేంద్రాల్లో తీసుకుంటున్నారు. ప్రభుత్వం నిబంధనలు సడలించి కొనాలని రైతులు కోరుతున్నారు.

పెనుగంచిప్రోలులో వర్షం ధాన్యం తడవకుండా పట్టా కప్పుతున్న రైతు

కంచికచర్ల, న్యూస్‌టుడే: దిత్వా తుపాను హెచ్చరికలతో ధాన్యం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులతో రైతులు పంటను దక్కించుకునేందుకు కోత యంత్రాల కోసం పరుగులు పెడుతున్నారు. కంచికచర్ల మండలంలో ఇప్పటికే పరిటాల, చెవిటికల్లు, కునికినపాడు, మోగులూరు, వీరులపాడు మండలంలో జయంతి, వెల్లంకి, దొడ్డదేవరపాడులో ధాన్యం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోసిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

తేమ తగ్గడం లేదు



తుపాను ప్రభావం వల్ల ధాన్యం ఆరబెట్టిన తేమ శాతం తగ్గట్లేదు. ప్రతిరోజు నిల్వలపై పట్టాలు కప్పాల్సి వస్తోంది. మరో వైపు తుపాను భయం వెన్నాడుతోంది. ప్రభుత్వం నిబంధనలు సడలించి కొనాలి. లేకుంటే రైతులకు ఇబ్బందే. - చుంచు నాగభూషణరావు, రైతు

రోజుల తరబడి పొలంలోనే..

యంత్రంతో వరి కోత కోయించాం. రోజుల తరబడి ఆరబెట్టేం దుకు పొలంలోనే ఉండాల్సి వస్తోంది. వర్షం వస్తుందేమోనని భయంతో రోజంతా కల్లాల వద్దనే పరదాలు పెట్టుకుని ఉంటున్నాం. నిబంధనల్లో సడలించి తేమ ఉన్నా పంట కొనాలి. -మాదల గోపాలకృష్ణమూర్తి, రైతు

విద్యార్థులకు మనోవికాస శిక్షణ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట ల్యాబ్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గురుకుల బాలికల హైస్కూల్, శ్రీరాం అమ్మణి కళాశాల, వాగ్దేవి కళాశాలల్లో నిర్వహించిన మనో వికాస శిక్షణలో జోడుకులు అన్నపరెడ్డి కోటిరెడ్డి విద్యార్థులకు పలు అంశాలపై సూచనలు చేశారు. 'లక్ష్య నిర్దేశం, కార్యాచరణ, కఠిన సాధన, మార్గదర్శనం' అనే అంశాలపై సాగిన శిక్షణలో సమకాలీన సమాజంలో అవసరమైన మెలకువలు, భవిష్యత్తు జీవన పురోగతికి అవసరమైన నైపుణ్యాలను గురించి చెప్పారు. కళాశాల ప్రతినిధులు లక్ష్మీసుజాత, సుధీర్, సురేష్, రంగాపురం నరసింహారావు, లయన్స్ ప్రతినిధులు శ్రీరాం బద్రీనారాయణ, బండారు రవికుమార్, ఖాశీం సైదా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతాజయంతి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: శ్రీగురుదామ్ ధర్మక్షేత్రంలో సోమవారం తాళ్లూరుకు గింజెల వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో గీతాజయంతి నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను వెంకటరమణ దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో శ్రీరాం చినబాబు, భక్తులు పాల్గొన్నారు. * ఆనంద సాయి ఆలయంలో గీతాపారాయణం, కృష్ణాష్టాష్టకం, శాంతి హోమం కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రాణాంతకం.. బైపాస్ మలుపు

నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పెనుగంచిప్రోలు బైపాస్ రోడ్డు ప్రాణాంతకంగా మారింది. స్థానిక పాత సినిమా హాలు సెంటర్ వద్ద నుంచి విజయవాడ రోడ్డును కలిసే ఆర్‌అండ్‌బీ బైపాస్ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. సుమారు కిలోమీటరున్నర పొడవున ఉన్న రోడ్డుపై తారు పూర్తి ధ్వంసమైంది. స్థానిక రామాలయం వద్ద బైపాస్‌రోడ్డు మలుపులో పెద్ద గుంతలు పడటం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నాలుగు చక్రాల వాహనాలు వెళ్లాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం పట్టించుకోవట్లేదు. గత తెదేపా ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వైకాపా ప్రభుత్వంలో నిర్మాణం చేయలేదు. అధికారులు రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

పగటి వెలుగులు కనిపించవా?

ఐతవరంలో..

గొల్లమూడి, ఐతవరం గ్రామాల్లో పట్టపగలే ఎల్ఈడీ దీపాలు కాంతులీనుతున్నాయి. గొల్లమూడి అంబేడ్కర్ విగ్రహం సెంటర్, సొసైటీ బజారు, గ్రామ సచివాలయం బజారులో, ఐతవరం జగన్నకాలనీ వద్ద నిత్యం పగలే దీపాలు వెలుగుతున్నాయి. రాత్రివేళ మాత్రమే వెలిగేలా చేసి విద్యుత్తు దుబారా అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. – నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

కంపచెట్లు రాకపోకలకు పాట్లు

గొల్లమూడి వద్ద రహదారిపై గుంత, కంపచెట్లు

పల్లగిరి- దాములూరు ఆర్‌అండ్‌బీ రహదారికి రెండు వైపులా దట్టంగా కంపచెట్లు పెరిగి వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పల్లగిరి, గోళ్లమూడి, రుద్రవరం, సోమవరం, దాములూరు వరకు రహదారిపై పలుచోట్ల గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. రాత్రివేళ కంపచెట్లతో మరింత ప్రమాదకరంగా ఉందని ఆ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. – నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

నిధులిచ్చి.. నిర్మిస్తే మేలు

అసంపూర్తిగా భవన నిర్మాణం

గత వైకాపా ప్రభుత్వం ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించేందుకు పనులు ప్రారంభించింది. అందులో భాగంగా కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో రెండు కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన అనంతరం ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయక నిర్మాణం నత్తనడకన సాగింది. అనంతరం ఎన్నికలు రావడంతో నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. కూటమి ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – కంచికచర్ల, న్యూస్‌టుడే

శివాలయానికి విరాళం



జగ్గయ్యపేటలో కృష్ణశిలతో నిర్మిస్తున్న మరకత శివాలయానికి వ్యాపారి నోముల వెంకటేశ్వరరావు కుమార్తె మద్దిలక్ష్మి తన భర్త వేణు పేరిట రూ.51 వేలు విరాళంగా అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి జ్ఞాపికలు అందజేశారు. -జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

సంజీవరాయ పురస్కారం అందజేత

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: విజయవాడలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గణితావధాని ఐత్మళ్ల సంజీవరాయ శర్మ జయంతి సందర్భంగా జగ్గయ్యపేట బాలుర హైస్కూల్ గణితం ఉపాధ్యాయుడు కొమ్మవరపు కరుణాకర్‌కు సంజీవరాయ పురస్కారాన్ని అందజేశారు. సంఘం అధ్యక్షుడు కోసూరి రాజశేఖర్, కార్యదర్శి బవిరి రవి, కోశాధికారి కె.గురుబ్రహ్మాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంజీవరాయ శర్మ సాధించిన గణితావధానాలను వివరించారు.

ఉపన్యాస పోటీల్లో ప్రతిభ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: స్థానిక నాగార్జున స్కూల్‌లో సోమవారం 'ఈనాడు, ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన బి.మన్విత, పి.ఆద్య, డి.దీక్షితలను ప్రిన్సిపల్ చావా కృష్ణయ్య, ఉపాధ్యాయులు బి.టి.నాయక్, బీఎస్ఆర్ ఆనందబాబు బహుమతులు అందజేశారు.

విజేతలతో ప్రిన్సిపల్ కృష్ణయ్య తదితరులు

స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈత సాధనకు శ్రీకారం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మున్సిపల్ ఇండోర్ స్టేడియం ఈత కొలను ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చింది. గత నెలలో స్టేడియం లోపాలను గురించి, వినియోగంలోకి రాకపోవడంతో 'ఈనాడు'లో ఆగస్టులో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య స్పందించారు. శాప్, మున్సిపాలిటీ అధికారులను సమన్వయం చేసి ట్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ ద్వారా ఈత సాధన, నిర్వహణ సాగేలా చొరవ చూపారు. సోమవారం మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సమక్షంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈత శిక్షకులు పొట్లబత్తిన పాండురంగారావు, లక్ష్మీ దంపతుల నేతృత్వంలో ప్రారంభ కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మండవ శ్రీనివాసరావు, డీఈ శశికోటేశ్వరరావు, ధూళిపాళ లక్ష్మణరావు, సామినేని మనోహర్, స్టాలిన్, చెరుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకూ పురుషులకు అనుమతి, మహిళల కోసం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకూ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పూజలో మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర తదితరులు

బోధన.. వసతి ఒక్కచోటే

❑ గిరిజన బాలికల గురుకులానికి సొంత భవనం కరవు

❑ అటకెక్కిన కార్యాచరణ.. విద్యార్థినులకు ఇక్కట్లు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

నందిగామ నెహ్రూనగర్ గిరిజన బాలికల వసతి గృహాన్ని 2016లో గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలగా మార్చారు. అప్పటి నుంచి అక్కడే విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు వసతి కల్పించారు. ప్రస్తుతం ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు 182 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఈ భవనంలో వసతులు సరిపడక పలు తరగతుల బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. పదో తరగతి బాలికలు డార్మెటరీ గదిలోనే పుస్తకాలు సంచులను ఒక పక్కన ఉంచి పాఠాలు బోధిస్తున్నారు. మిగిలిన తరగతుల్లో బల్లలు ఉన్నా వీరికి గదులు సరిపడక ఈ పరిస్థితి ఏర్పడింది.

దశాబ్దం క్రితం స్థల సేకరణకు ప్రతిపాదన

ఈ పాఠశాలకు సొంత భవనం నిర్మించడానికి పదేళ్ల క్రితం స్థల సేకరణకు ప్రతిపాదన చేశారు. రామాపురం కొండ వద్ద నాలుగు ఎకరాలు సేకరించాలని ప్రతిపాదనలు రెవెన్యూ అధికారులకు పంపారు. ప్రస్తుతం దాని ఊసే ఎత్తడం లేదు. ఇదే రామాపురం కొండ వద్ద కేంద్రీయ విద్యాలయ భవనం నిర్మించడానికి అయిదు ఎకరాలు సేకరించారు. ఈ ప్రాంతంలోనే భవనం నిర్మిస్తే నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని గిరిజన బాలికలకు సౌకర్యంగా ఉంటుంది. కానీ ఆ దిశగా చర్యలు లేవు.

◆ దీనిపై గిరిజన బాలికల పాఠశాల ప్రిన్సిపల్ రమాదేవిని అడుగగా సొంత భవనం నిర్మించడానికి ప్రతిపాదనలు కలెక్టర్ కార్యాలయానికి దస్త్రం పంపారని అన్నారు. దీనిపై తహసీల్దారు ఎన్.సురేష్ బాబును అడుగగా దస్త్రం ప్రస్తావన తన దృష్టికి రాలేదని పేర్కొన్నారు. గురుకుల పాఠశాల అధికారులు సంప్రదిస్తే దీనిపై పరిశీలన చేస్తామని చెప్పారు.

ప్రమాదాల నివారణపై సమీక్ష

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర సరిహద్దులో జాతీయ రహదారి-65పై ప్రమాదాల అవకాశాలను పరిశీలించిన డీఎస్పీ లక్ష్మీనారాయణ పోలీస్, ఎన్‌హెచ్ అధికారులతో కలిసి నివారణ మార్గాలను సమీక్షించారు. పలు కూడళ్లు, క్రాస్‌ల వద్ద బ్లైండ్ స్పాట్‌లను సందర్శించి పలు సూచనలు చేశారు. అవసరమైన చోట్ల రేడియం స్టిక్కర్లు, స్పీడ్ బ్రేకర్లు, హెడ్ లైట్లు ఏర్పాట్లపై చర్చించి ఆదేశించారు. సీఐ వెంకటేశ్వర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కర్లపాటికి అభినందనలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రెండు దశాబ్దాలుగా నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కర్లపాటి ఛారిటబుల్ ట్రస్ట్ ఐటీఐ ఆవిష్కృతం కాగా ఐఎస్ఓ గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు కర్లపాటి శ్రీనివాసరావును సోమవారం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నాళ్ల చినసత్యం, వివిధ సంస్థల ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఆర్వీ రామారావు, రాయపూడి వెంకటేశ్వరరావు, రమేష్, డాక్టర్ అనిల్, విజయకుమారి, రాజశేఖర్, లక్ష్మీ తదితరులు అభినందించారు.

వాసవీ వృద్ధాశ్రమ పింఛన్లు అందజేత

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో ఆర్యవైశ్య మండల సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో వాసవీ వృద్ధాశ్రమ పింఛన్లు పంపిణీ చేశారు. పట్టాభి రామ్ నుంచి దివంగత సమ్మెట కృష్ణమూర్తి జ్ఞాపకార్థం భార్య జయలక్ష్మి, కుమారుల వితరణతో పది మందికి పింఛన్లు పంపిణీ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వినతి

నందిగామ: నందిగామలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ లోవరాజుకు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో తాగునీరు సక్రమంగా సరఫరా చేయక ఇబ్బంది పడుతున్నారని, ప్రతిరోజు సరఫరా చేయాలని నాయకులు కోరారు. ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు వెలగట్లేదన్నారు. పార్టీ మండల కార్యదర్శి గోపాల్, సయ్యద్ ఖాశీం, జి.గోపీనాయక్, బి.లాజర్ పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

నందిగామ గ్రామీణం: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణులు అయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు సూచించారు.

అ వి ఇ వి

ఉపాధ్యాయుల శ్రద్ధ చూపాలని డీవైఈవో ఎ.శ్యామ్ సుందరరావు కోరారు. సోమవారం నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో డివిజన్‌లోని గణితం సబ్జెక్టు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ

జగ్గయ్యపేట: శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు నాసా కిట్లను సోమవారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జోనల్ డీన్ వాసు, కృష్ణ, నాసా ఇన్‌ఛార్జి జె.నరసింహారావు, ఈజీఎం మురళీకృష్ణ, ఆర్ఎ వినోద్ పాల్గొన్నారు.

సభావేదిక పైకప్పు ఏర్పాటు

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే: మండల పరిధి జుజ్జూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్థానిక విశాఖ సిమెంట్ ఫ్యాక్టరీ కర్మాగారం వారు రూ.25 లక్షల వెచ్చించి సభావేదికపై పైకప్పును నిర్మించి నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి తెలిపారు.

అర్హులందరికీ ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: అర్హులందరికీ ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. మండలంలోని కొల్లికుళ్ల గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు చింతల సీతారామయ్య, నాయకులు వెల్ది శ్రీనివాసరావు, ప్రభాకర్, కుంచుమక్కుల ఉమామహేశ్వరరావు, లింగయ్య పాల్గొన్నారు. పెనుగంచిప్రోలులో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను గ్రామ సచివాలయాల సిబ్బంది సోమవారం పంపిణీ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య, నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు.

నగదు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

నందిగామ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటే ఉంటుందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. స్థానిక ఏడో వార్డులో సోమవారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పథకంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ లోవరాజు, తెదేపా పట్టణ అధ్యక్షుడు యేచూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు పసుపులేటి సాంబశివరావు, దారెల్లి బుజ్జి, షేక్ ఖాజా, మారం అమరయ్య పాల్గొన్నారు.

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: తక్కెళ్లపాడు, అంబారుపేటలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. ఎంపీడీవో ఆర్వీఎస్ ప్రసాదరావు పరిశీలించారు. పాతకంచలలో తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, పంచాయతీ కార్యదర్శి వెంకటగోపి పింఛను డబ్బులు అందజేశారు.

పిచ్చికుక్క స్వైర విహారం

● నలుగురు వ్యక్తులు, పశువులకు గాయాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్త బెల్లంకొండవారిపాలెం గ్రామంలో సోమవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. దారిన వెళుతున్న పెమ్మసాని చెంచిన పెమ్మసాని వెంకటేశ్వర్లు, గోరంట్ల ధనుంజయ, మేడిశెట్టి నాగేశ్వరరావులను గాయపరిచింది. వీరంతా నంది గామ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. గ్రామంలోని ఆరు పశువులను కరిచింది. పిచ్చికుక్కను స్థానికులు వెంబడించినా దొరకలేదని తెదేపా గ్రామ నాయకుడు పెమ్మసాని శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్‌టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఏడుగురిపై 'పీడీ'కిలి బిగించారు!

సైదాబాద్, మాదన్నపేట, న్యూస్‌టుడే: మలక్‌పేట రాణా పరిధి ఆరుగురు, డబీర్‌పుర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరిపై పోలీసులు ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం ప్రయోగించారు. సీపీ సజ్జనార్ ఆదేశాలతో.. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ ఏడుగురు నేరస్థులపై పీడీ చట్టం అమలు చేస్తూ సోమవారం వివరాలు వెల్లడించారు. మలక్‌పేట రాణా పరిధిలోని శాలివాహననగర్ ఉద్యాన వనం వద్ద జులై 15న సీపీఐ తెలంగాణ కౌన్సిల్ సభ్యుడు, గిరిజన నేత కేతావత్ చందు రాథోడ్‌ను దారుణంగా హతమార్చారు. ఆరుగురు నిందితులను అప్పట్లో అరెస్టు చేయగా కోర్టు వారిని జైలుకు పంపించింది. శాంతి భద్రతల పరిరక్షణలో వారిపై పీడీ చట్టం అమలుకు చర్యలు తీసుకున్నారు. ఉప్పల్ భగాయత్‌వాసి దొంతి రాజేష్ అలియాస్ రాజన్న, వన్న(48), రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ నివాసి కుంచం ఏడుకొండలు(35), కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం నివాసి అత్తుకూరి శ్రీను అలియాస్ నాగరాజు(45), యాదాద్రి జిల్లా ఆద్దగూడూరు నివాసి కుదుకూరి ప్రశాంత్(30), ఏపీ నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం నివాసి అర్జున్ జ్ఞాన ప్రకాష్ (26), మైసారం మండలం లింగబోడి నివాసి లింగబోడి ప్రవీణ్ (30) ఉన్నారు. డబీర్‌పుర ... ఉన్నారు.

పార్కింగ్ స్థలంలో తోపుడుబండ్లు తొలగింపు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో ట్రాఫిక్ సమస్య తీవ్రం కావటంతో స్థానిక సీఐ వైవీఎల్ నాయుడు క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. సోమవారం స్థానిక ప్రధాన రోడ్డులో వాహనాలు నిలిపే స్థలంలో ఏర్పాటు చేసిన తోపుడుబండ్లను పక్కకు తీయించారు. ఎస్సై మోహనరావు, ట్రాఫిక్ ఎస్సై నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించవద్దని సూచిస్తున్న సీఐ వైవీఎల్ నాయుడు

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము, పెనుగంచిప్రోలు, ఎన్.టి.ఆర్. జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్- కం- షార్ట్ టెండర్- కం- బహిరంగ వేలము ప్రకటన

Computer No.76867/2024 Dt. 01-12-2025 (License Bid Amounts must be exclusive of all taxes)

వ.సం.	లైసెన్స్ హక్కుల వివరము	ధరావత్తు సొమ్ము
1.	శ్రీ అమ్మవారి మండల దీక్ష మాలధారణ సందర్భముగా ది. 13-12-2025 నుండి ది. 24-12-2025 వరకు 12 రోజులు (దేవస్థానము వారు సూచించిన ప్రదేశములో శ్రీ అమ్మవారి దీక్షా మాలధారణ సంబంధించిన వస్తువులు, తదితరములు విక్రయించుకొనుటకు తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకొనుట	రూ. 5,000/-
2.	శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము, పెనుగంచిప్రోలునకు అవసరమైన సిబ్బందిని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వినియోగించుకొనుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్-టెండర్ ప్రక్రియ నిర్వహించుట. ది. 01-01-2026 నుండి 31-03-2028 వరకు అనగా 27 నెలల కాల పరిమితికి	రూ. 5,00,000/-
3.	ది.01-01-2026 నుండి ది. 30-06-2026 వరకు (6 నెలలు)కు శ్రీ అమ్మవారి దేవస్థానమునకు అవసరమైన నెయ్యి సరఫరా చేయుట (రెండవ పర్యాయము)	రూ. 3,00,000/-
4.	దేవస్థానము ఎదురుగా గల సంతతరుణ నందు రూ. పరిమితికేను దేవస్థానమునకు అవసరమైన లడ్డు మరియు పులిహోర ప్రసాదం తయారీ మరియు ప్యాకింగ్ చేసి కౌంటర్‌కు చేరవేయుటకు (6వ పర్యాయము)	రూ. 1,00,000/-
5.	మున్సేరు అవతల గల అడితోరియం వద్ద గల 2 షెడ్లు, 4 ఏ.సి. రూములు నిర్వహించుకొను హక్కు (లైసెన్సు పరిమితి తేది నుండి 3 సం.ల వరకు)	రూ. 3,00,000/-

1. వ. సంఖ్య 1కి సంబంధించి తేది. 06-12-2025న బహిరంగ వేలం నిర్వహించబడును. 2. వ. సంఖ్య 2 నుండి 4 వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్-కం-టెండర్ నిర్వహించబడును. www.apeprocurement.gov.in ది.05-12-2025 నుండి ది. 19-12-2025 వరకు అందుబాటులో ఉండును. 3. వ. సంఖ్య 5కి సంబంధించి తేది 10-12-2025న టెండరు-కం-బహిరంగ వేలం నిర్వహించబడును. 4. పాటదారులు (ఆధార్, పాన్ మరియు వృత్తి పన్ను సర్టిఫికెట్ తప్పనిసరి) ధరావత్తు సొమ్మును కార్యనిర్వహణాధికారి, శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, పెనుగంచిప్రోలు వారి పేరున డి.డి. రూపములో మాత్రమే చెల్లించవలెను. నగదు స్వీకరించబడదు. 5. వరుస సంఖ్య 4 వరకు టెండర్ షెడ్యూల్ ఖరీదు రూ. 1000+GST రూ.180/-. టెండర్ షెడ్యూల్ విక్రయము ది. 05-12-2025 నుండి ది. 18-12-2025 వరకు, టెండరు దాఖలు తేది 19-12-2025 ఉదయం గం. 11.00 గం.లోపు టెండర్ దాఖలు చేయవలెను. తదుపరి టెండర్ బాక్సు తెరవబడును. 6. మిగిలిన వివరాలకు దేవస్థానం కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.

శ్రీ అమ్మవారి సేవలో

శ్రీ జంగాల శ్రీనివాసరావు, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

బిహెచ్.వి.యస్.యన్.కిషోర్ కుమార్, డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి

(c) eenadu

విజయవాడ పశ్చిమ

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ప్రకృతి, సేంద్రియ పద్ధతులలో సాగు చేసిన ఉత్పత్తులు ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్ అన్నారు. కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రకృతి, సేంద్రియ పద్ధతుల్లో విద్యార్థినులు సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయల ప్రదర్శనను సోమవారం ఆయన ప్రారంభించారు. కళాశాల వృక్షశాస్త్రం విభాగం అధ్యాపకులు టి.సలోమి, బి.శైలజ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, వివిధ ప్రాంతాల ప్రజల నుంచి పలు సమస్యలపై ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్యలపై ప్రజలు ఎక్కువగా కమిషనర్‌కు ఫిర్యాదులు వచ్చాయి. వాటిని బాధ్యులైన అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు.

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

వినతులు..ఇలా..

గుణదల, గిరిపురంలో నీటి సరఫరా సమస్యలపై వినతులు అందగా ఇక నీటిని విడుదల చేసే సిబ్బంది తీరుపై పలు ఫిర్యాదులు అందాయి. మరోవైపు టీడీఆర్ బాండ్ల జారీ, ఇంటి రిజిస్ట్రేషన్, ఇళ్ల తొలగింపు, ఖాళీ స్థలం పన్ను, రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, కొండ ప్రాంతంలో రాళ్ల తొలగింపు, ఆస్తి పన్ను మార్పు, వీధి దీపాలు, బీపీఎస్, రహదారుల మరమ్మతులు, కోతుల సమస్యపై వినతులు అందాయి. వాటిని గడువులోపు పరిష్కరించాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు రవీంద్రరావు, డి.చంద్రశేఖర్, అర్జునరావు, లత, సృజన, శ్రీధర్, సత్యకుమారి, కామేశ్వరరావు, చంద్రశేఖర్, మాల్యాద్రి, సోమశేఖర్‌రెడ్డి, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

◆ పూలబావి వీధిలో కర్పూరం తయారీ కంపెనీ వద్ద రోడ్డుపై చెత్త తీయడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్త తీయించి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

? చిట్టినగర్ అమ్మవారి ఆలయం వెనుక వీధిలో కుక్కల బెడద అధికంగా ఉంది. **- విద్యాలక్ష్మి, స్థానికురాలు.** ✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- సోమశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్**

? కేఎల్ రావు నగర్, సౌమ్య థియేటర్ ప్రాంతాల్లో కార్పొరేషన్ సరఫరా చేసే మంచినీరు రంగుమారి వస్తున్నాయి. **- రాజారావు, స్థానికుడు** ✔ మంచినీటి పరీక్షలు నిర్వహిస్తాం. **- రామకృష్ణ, మంచినీటి విభాగం, ఏఈ**

? ఎర్రకట్ట ఫ్రైజర్‌పేట చర్చి పక్క వీధిలో రోడ్డుపై చెత్త తరలించడం లేదు. - సౌమ్య, స్థానికురాలు ✔ చెత్త తరలిస్తాం. **- కృష్ణ, స్థానిక శానిటరీ అధికారి** – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

ఎల్‌వోసీ పత్రాల పంపిణీ

భవానీపురం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ఎమ్మెల్యే సుజనాచౌదరి సహకారంతో మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను భవానీపురంలోని కార్యాలయంలో సోమవారం అందజేశారు. వాగుసెంటర్‌కు చెందిన జి.వెంకటేష్‌కు రూ.1.75 లక్షలు, 34వ డివిజన్‌లో నివాసం ఉండే కె.మహితకు రూ.3.90 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని అందించారు. కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, నాయకులు ఖాదర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేత

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: అర్హులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్మును నగరపాలక సంస్థ అధికారులు మూడు నియోజకవర్గాల్లోని లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. సాయంత్రం వరకు మొత్తం రూ.26.98 కోట్లు అందించారు. ◆ పశ్చిమలో 20,191 మంది లబ్ధిదారులు ఉండగా, 19,162 మందికి రూ.8.32 కోట్లు పంపిణీ చేశారు. ◆ మధ్యలో 25,662 మంది లబ్ధిదారులు ఉండగా, 24,141 మందికి రూ.10.44 కోట్లు చెల్లించారు.

కాలువలపై కట్టడాలు.. ప్రజలకు కష్టాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే

సొంత స్థలంలో నిర్మాణం చేయాలన్నా మురుగు కాలువల నుంచి ఐదు అడుగులు వదిలి నిర్మించుకోవాలనే నిబంధన ఉంది. టౌన్ ప్లానింగ్ అధికారులకు మామూళ్లు ఇస్తే మురుగు కాలువ ఆక్రమించి ఐదు అడుగులు ముందుకు వచ్చిన చూసీచూడనట్లు వదిలి వేయడం పరిపాటిగా మారింది.

గుప్తా సెంటరు కన్యకాపరమేశ్వరి సత్రం ఎదురుగా..

నిబంధనలు గాలికి..

నిత్యం రద్దీగా ఉండే రహదారుల్లో సైతం అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నా గట్టు వెనక ప్రాంతంలో ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. గుప్తా సెంటరు సమీపంలోని కన్యకా పరమేశ్వరి సత్రం ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే కాల్వ గట్టును దాటి బడ్డీ కొట్టు కోసం ఆక్రమణదారులు రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. కన్యకా పరమేశ్వరి సత్రంలో వినాయక చవితి, దసరా వేడుకలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. తాత్కాలిక పందిళ్లు వేసినప్పుడు ఇక్కడ వాహనాలు నడపడం అంటే కత్తి మీద సాము లాంటిదని వాహన చోదకులు వాపోతున్నారు. కీలకమైన మలుపులో రేకుల షెడ్డు నిర్మాణం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

శంకరమఠం వద్ద గది నిర్మించి..

కామకోటినగర్‌లో..

శంకం మఠం వీధిలో మురుగు కాలువను పూర్తిగా ఆక్రమించి దుకాణాన్ని ఏర్పాటు చేశారు. కాలువలో సిల్టు తీసేందుకు కూడా అవకాశం లేకుండా మూసి వేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. షెడ్డు వేయడంతోపాటు చుట్టు గ్రిల్ కూడా ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో మురుగు తీయడం లేదని శానిటేషన్ సిబ్బందిని అడిగితే కాల్వలు ఆక్రమిస్తే ఏవిధంగా తీస్తామని వారు ఎదురు ప్రశ్న వేస్తున్నారని, వచ్చే భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ గట్టువెనక ప్రాంతంలో మురుగు కాలువలపై అక్రమ నిర్మాణాలు పెరగడంపై కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి కృష్ణను సంప్రదించగా.. మురుగు కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపడితే యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తామన్నారు. పారిశుద్ధ్య సమస్యలతోపాటు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తేచోట ఆక్రమణలను అనుమతించమని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆక్రమణల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

స్థానిక ఐజాక్‌వీధిలో క్యాటరింగ్ నిర్వాహకుడు ఏకంగా నడిచే రోడ్డును ఆక్రమించి కూరగాయల ట్రేలు పెట్టడం, నీడ కోసం పట్టా కట్టి ప్రజలు నడిచేందుకు దారి లేకుండా చేసిన నేపథ్యంలో గత నెల 30న విజయవాడ పశ్చిమ పేజీలో 'అంతా నా ఇష్టం' చిత్ర వార్త ప్రచురితమైంది. దీనికి నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. కర్రలు, పట్టా తొలగించి రోడ్డుపై ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

జగన్మాత సేవలో సినీ నటుడు నరేష్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను సినీ నటుడు నరేష్ సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నరేష్‌కు ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

లీగల్ సెల్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ లీగల్ సెల్ విభాగం సూపరింటెండెంట్ పి.శ్రీనివాస చక్రవర్తి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు, లీగల్ సెల్ ఉద్యోగులు ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. 30 ఏళ్లపాటు, వివిధ హోదాల్లో నిబద్ధతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు.

సన్మానిస్తున్న ఉద్యోగులు

బాక్సింగ్‌లో కేబీఎన్ విద్యార్థుల సత్తా

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఆంధ్ర లయోలా కళాశాలలో గత నెల 27న నిర్వహించిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు పురుషుల, మహిళల రెండు విభాగాల్లో సర్వ పతకాలు సాధించినట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి తెలిపారు. ఆయా విభాగాల్లో విద్యార్థులు ఎ.చరణ్, పి.యశ్వంత్, పి.శ్రీవైష్ణవ కృష్ణవంశీ, వి.రక్షిత, దీపాంజలి, మైనా బంగారు పతకాలు సాధించారన్నారు. పంజాబ్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ విశ్వవిద్యాలయంలో జరగబోయే అఖిల భారత విశ్వవిద్యాలయాల స్త్రీ బాక్సింగ్ పోటీల్లో రక్షిత, దీపాంజలి, మైనా పాల్గొంటారని, పంజాబ్‌లోని కురుక్షేత్ర విశ్వవిద్యాలయంలో జరగబోయే అఖిల భారత విశ్వవిద్యాలయాల పురుషుల బాక్సింగ్ పోటీల్లో యశ్వంత్ పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ అందించిన క్రీడావిభాగాధిపతి డి.హేమచంద్రరావును పోటీల్లో పాల్గొనే విద్యార్థులను కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, బాక్సింగ్ శిక్షకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

పరిశుభ్రతపై అవగాహన సదస్సు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థినులు పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలని అమ్మ ఆసుపత్రి గైనకాలజిస్టు దుర్గాశ్రీలక్ష్మి, మౌలానా ఆజాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్ ప్రిన్సిపల్ కె.కల్యాణి సూచించారు. పాతబస్తీలోని పాఠశాలలో సోమవారం సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారికి శానిటరీ నాప్కిన్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఫౌండేషన్ హెడ్ వీరమాచనేని కిరణ్, ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ పైలా సురేష్, రిటైర్డ్ ఎస్‌ఈ ఆర్నిపల్లి ఉదయ్‌కుమార్, సుజనా మిత్ర కోఆర్డినేటర్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌కు శానిటరీ నాప్కిన్లు అందజేస్తున్న సుజనా ఫౌండేషన్ సభ్యులు

అన్న క్యాంటీన్ల పరిశీలన

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్లకు వచ్చే ప్రజలకు అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు, పశ్చిమంలోని అన్న క్యాంటీన్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్న క్యాంటీన్లలో ఆహార పదార్థాలు, వస్తు సామగ్రి పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలని అన్నారు. నోడల్ అధికారులు నిత్యం పరిశీలించాలని తెలిపారు. క్యాంటీన్లలో మరమ్మతులు ఉన్నా, వెంటనే చేపట్టాలని సూచించారు. తాగునీరు, వాడకం నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. ఆహారాన్ని ఆయన రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు రమ్యకీర్తన, అన్నపూర్ణ, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ఉత్తమ ప్రతిభ

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: గత నెల 28 నుంచి 30 వరకు రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ వర్సిటీ ఆధ్వర్యంలో 27వ అంతర్ విద్యాలయ క్రీడా పోటీలు నిర్వహించారని తమ కళాశాల వైద్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావు సోమవారం తెలిపారు. లాన్ టెన్నిస్ విభాగంలో విన్నర్స్ ట్రోఫీతో పాటు ఐదు స్వర్ణ పతకాలు సాధించారని వెల్లడించారు. జట్టులో విద్యాసాగర్, కార్తీక్ రాకేష్‌కుమార్ విజేతలుగా నిలిచారు.

ఆదాయం వద్దంట..

- పార్కింగ్ టెండర్ వ్యవహారంలో అనుమానాలు అనేకం
- కొందరు స్థాయీ సంఘ సభ్యుల తీరుపై విమర్శలు

విజయవాడ నగరపాలక సంస్థ, విద్యాధరపురం, న్యూస్‌టుడే

కార్పొరేషన్‌కు ఆదాయం కింద రూ.5 కోట్లకు పైగా వస్తుంటే.. వద్దనేవారు ఎవరూ ఉండరు.. కొందరు స్థాయీ సంఘ సభ్యులు మాత్రం వద్దనే అంటున్నారు. ఫలితంగానే భారీగా ఆదాయం వచ్చే ఓ పార్కింగ్ లీజు టెండరు తిరస్కరించారు.

కెనాల్ రోడ్డు- బొడ్డుబొమ్మ పార్కింగ్ ప్రాంతం నగరంలో అతి కీలకమైంది. వ్యాపారులు, భక్తులు పెద్దసంఖ్యలో వాహనాలు నిలుపుతారు. ఈ ప్రాంతానికి ఈ ఏడాది అక్టోబర్‌తో లీజుకాలం ముగియగా అదేనెల 2న అధికారులు ఈ- వేలం నోటీసు ఇచ్చారు.

● 23న పోర్టల్‌లో ముగ్గురు బిడ్డర్లు షెడ్యూళ్లు దాఖలు చేసినట్లు గుర్తించారు. వీరిలో 'గమ్మాడియన్ స్టూడియో, జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థలు మాత్రమే అర్హత సాధించినట్లు గుర్తించి వేలం నిర్వహించారు. వేలంలో ఈ రెండు సంస్థలు కెనాల్ పార్కింగ్ లీజు దక్కించుకునేందుకు తీవ్రంగా పోటీపడ్డాయి. అప్‌సెట్ ధర రూ.41,56,130 నిర్ణయించగా, గమ్మాడియన్ స్టూడియో రూ.5,71,20,130 చెల్లించేందుకు పోటీ పడింది. జీఎంఆర్ సంస్థ అదనంగా రూ.6 వేలు కోట్ చేసి, రూ.5,71,26,120కు టెండరు దక్కించుకుంది.

● దీంతో భారీగా ఆదాయం దక్కిందని భావించారు. ఇందుకు సంబంధించి లీజు టెండరు ప్రతిపాదనను స్థాయీ సంఘం ఆమోదించాలి. తర్వాతే గుత్తేదారు సంస్థకు వర్కు ఆర్డరు (కేటాయింపు) ఇవ్వాలి. అందుకు అధికారులు ప్రతిపాదన సిద్ధం చేసి, ఆమోదానికి నవంబరు 29న స్థాయీ సంఘం ముందుకు తేగా సభ్యులు ఏకపక్షంగా తిరస్కరించారు.

ఏకపక్షంగా తిరస్కరించి..

పార్కింగ్ టెండరు ద్వారా కార్పొరేషన్‌కు రూ.5,71,26,120 ఆదాయం వస్తుండటంతో గుత్తేదారు సంస్థకు వెంటనే వర్కు ఆర్డర్ ఇచ్చి, లీజు కేటాయించాలి. భిన్నంగా స్థాయీ సంఘ సభ్యులు కొందరు ఆయా గుత్తేదారు సంస్థ పట్ల సానుభూతి చూపారు. రూ.కోట్లకు టెండరు దక్కించుకోవడం వల్ల నష్టపోతారంటూ సూచించారు. ప్రతిపాదన తిరస్కారానికి ఒప్పందం కుదరడంతో ఏకపక్షంగా తిరస్కరించారు.

నిబంధనల ప్రకారం

నిబంధనల ప్రకారం పార్కింగ్ టెండరు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ వెంటనే రూ.2,38,02,555 సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించి, పార్కింగ్ స్థలం స్వాధీనం చేసుకోవాలి. లేనిపక్షంలో ఆ సంస్థ చెల్లించిన రూ.10,39,100 ఈఎండీని జప్తు చేయాలి. వేలంలో పోటీపడి అత్యధిక ధర చెల్లించేందుకు ముందుకొచ్చి, ఆపై కాలయాపన చేయడం, పార్కింగ్ లీజు స్వాధీనం చేసుకోకుండా కాలయాపన చేయడం వల్ల 2 నెలల ఆదాయం పోయింది. ఈ కారణాలుగా గుత్తేదారు సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టాలి. అందుకు తగిన తీర్మానం ఆమోదించాల్సి ఉన్నా, సభ్యులు తిరస్కరించారని విమర్శలు వస్తున్నాయి.

కొండ ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టండి..!

గొల్లపాలెంగట్టు క్వారీ ప్రాంతంలో ఆవాసాలకు ఆనుకుని కొండ నుంచి వర్షాల సమయంలో రాళ్లు దొర్లిపడడం, ఈదారుగాలులు వీచినప్పుడు చెత్త మొత్తం ఇళ్ల మీద పడడంతో అక్కడి నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో సుమారు 500 కుటుంబాలకు పైగా నివాసితులు ఉన్నారు. ఎన్నికల్లో వచ్చిన ప్రతి నాయకులకు ఈ సమస్య చెబుతున్నప్పటికీ గెలిచిన అనంతరం ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులో కొండకు చేసినట్లుగా గ్రౌటింగ్ గానీ, ఇనుప మెష్ ఏర్పాటు చేసే విధంగా పాలకులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

దొంగల బారిన పడకుండా..

ఇటీవల పలు చోట్ల ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. జీపీఎస్ ట్రాకర్ ఏర్పాటు చేసిన చోరీలు ఆగడం లేదు. ఈ నేపథ్యంలో సోమవారం పండిత్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ఓ ద్విచక్ర వాహనదారుడు తన వాహనం దొంగల బారిన పడకుండా గొలుసుతో తాళం వేశారు. దీన్ని పలువురు ప్రయాణికులు ఆసక్తిగా గమనించారు. **- న్యూస్‌టుడే, విజయవాడ బస్‌స్టేషన్**

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు 39వ డివిజను తెదేపా అధ్యక్షుడు కె.శివశర్మ తెలిపారు. కామకోటినగర్‌లో సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు మంజూరైన పింఛన్లను అందజేశారు. ఈసందర్భంగా శివశర్మ మాట్లాడుతూ.. పింఛనుదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకే ప్రతి నెల ఒకటో తేదీకి కూటమి ప్రభుత్వం ఇంటి వద్దే పింఛను అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ఏలూరు వెంకన్న కె సాంబయ్య, సాయి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న శివశర్మ తదితరులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీ నాటికి పింఛన్లు పంపిణీ పూర్తి చేస్తుందని 55, 56వ డివిజన్ల క్లస్టర్ ఇన్‌ఛార్జి ధనేకుల వెంకట సుబ్బారావు తెలిపారు. సోమవారం కంసాలిపేట, నైజాం గేటు, పాతరాజరాజేశ్వరీపేట ప్రాంతాల్లో వార్డు సచివాలయం అధికారులతో కలిసి నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిన శ్యామ్‌సుందర్, రఫీ, శాంతి, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు అందిస్తున్న తెదేపా నాయకులు

కృష్ణా వర్సిటీ టీటీ ఛాంప్ 'శాతవాహన' జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల టేబుల్ టెన్నిస్ టోర్నీలో శాతవాహన కళాశాల జట్టు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకుంది. పోటీల్లో అయిదు కళాశాలల జట్లు తలపడగా.. కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ద్వితీయ, ఎస్వీడీ న్యాయ కళాశాల తృతీయ స్థానాల్లో నిలిచాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపల్ యు.అరవింద బాబు ప్రారంభించగా.. సాయంత్రం ముగింపు కార్యక్రమానికి కళాశాల కన్వీనర్ కమిటీ సభ్యుడు రాజా రత్నం ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలో విద్యార్థి ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : గురునానక్ కాలనీలోని నెక్స్ట్ జెన్ స్కూల్‌లో నాలుగో తరగతి విద్యార్థి అత్తోట అక్షయ్ ఆనంద్ టేబుల్ టెన్నిస్‌లో మెరుగైన ప్రతిభ ప్రదర్శించి కాంస్య పతకం సాధించినట్లు సోమవారం స్కూల్ ప్రిన్సిపల్ సమ్రానా పర్వీన్ తెలిపారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో అక్షయ్ అండర్- 11 జట్టుకు ప్రాతినిధ్యం వహించి వ్యక్తిగత విభాగంలో తృతీయ స్థానాన్ని సాధించాడని పేర్కొన్నారు.

రిటైనింగ్ గోడలు నిర్మించాలి

చిట్టినగర్, న్యూస్‌టుడే: కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ గోడలు నిర్మాణం వెంటనే చేపట్టాలని, గొల్లపాలెంగట్టు ప్రాంతంలోని సామాజిక భవనం పూర్తి చేయాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ ధ్యానచంద్రకు పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. వర్షానికి కూలిపోయిన రిటైనింగ్ గోడలు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయడంతో పాటుగా పాడైన గోడలకు మరమ్మతులు చేపట్టాలని సూచించినట్లు వివరించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని విన్నవించినట్లు తెలిపారు. స్పందించిన కమిషనర్ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొత్తపేట కూరపాటి చంద్రశేఖరరావు ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 108 మంది విద్యార్థులతో సోమవారం భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. గీతమందిరం ప్రధాన కార్యదర్శి కుందేపు మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు పార్థసారథి 108 కమల ఫలాలతో అర్చన చేసి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ యుగంధరాచార్య, పాఠశాల కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కోశాధికారి వెంకటరమేష్, కన్వీనర్ పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

పారాయణం చేస్తున్న విద్యార్థులు

ఆత్మవిశ్వాసం పెంపునకు భగవద్గీత దోహదం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : భగవద్గీత మనిషిని సక్రమ మార్గంలో నడిపించడంతో పాటు నైతిక విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తుందని సాహితీవేత్త వలివేటి వెంకట శివరామకృష్ణమూర్తి అన్నారు. భగవద్గీత జయంతి సందర్భంగా సోమవారం సిద్ధార్థ మహిళా కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'గీతా సందేశం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివరామకృష్ణ మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలను పఠించడం వల్ల ధారణ, మేధోశక్తి పెరుగుతోందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్, తెలుగు విభాగాధిపతి కె.సరళ, ఐ.మంజుల పాల్గొన్నారు.

బస్సుల్లో రద్దీ.. ప్రయాణికులకు ఇబ్బంది

బస్సుల కోసం ఎదురుచూపులు ఇలా..

చిట్టినగర్, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తుంది. అయితే సమయానికి బస్సులు రాక.. వచ్చిన వాటిల్లో స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం విద్యార్థుల రద్దీతో అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. బస్సుల కోసం పడిగాపులు పడాల్సి వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. కొందరు డ్రైవర్లు బస్టాప్‌లో ఆపకుండా వెళ్లిపోతున్నారని మహిళలు వాపోతున్నారు. ఎక్కువ సర్వీసులు తిప్పాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఖాళీగా ఉన్నా ఆపడం లేదు

మేము కొత్తపేటలో ఉంటున్నాం. మహిళలకు ఉచితంగా బస్సులో ప్రయాణం చేయవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. కొంతకాలం బాగానే ఉన్నప్పటికీ ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు ఆపకుండా వెళ్లి పోతున్నారు. బస్టాపుల్లో పడిగాపులు పడుతున్నాం. ఖాళీ బస్సులు సైతం ఆపడం లేదు. జిల్లా బస్సుల్లో ఈ పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం సమస్యలపై చర్యలు తీసుకోవాలి.

- లక్ష్మీప్రసన్న, కొత్తపేట

ఎక్కువ సర్వీసులు తిప్పాలి

మేము చిట్టినగర్‌లో ఉంటున్నాం. మాకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పించినప్పటికీ బస్సులు ఎక్కడానికి ఇబ్బంది పడుతున్నాం. అత్యవసరంగా వెళ్లే సమయాల్లో అవస్థలు తప్పడం లేదు. ఉన్న బస్సుల్లో రద్దీ తీవ్రంగా ఉంది. కొన్ని సిటీ బస్సులు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కువ మంది ఎక్కడంతో ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు స్పందించి ఎక్కువ బస్సు సర్వీసులు ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- అరుణకుమారి, చిట్టినగర్

టోల్‌గేట్ గుత్తేదారుకు రూ.50 వేల జరిమానా

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: టెండరు నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై టోల్‌గేటు గుత్తేదారు మహేష్‌కు రూ.50 వేలు జరిమానా చెల్లించాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ సోమవారం నోటీసు ఇచ్చారు. టెండరు షరతులు 12(ఇ), 17, 18, 22, 23 ఉల్లంఘించినట్లు నోటీసులో పేర్కొన్నారు. భక్తులతో గుత్తేదారుల అనుచరుల ప్రవర్తనపై ఫిర్యాదులు రావడంతో నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. జరిమానాతోపాటు దేవస్థానానికి చెల్లించాల్సిన బకాయి మొత్తం రూ.1,11,58,199 మూడు రోజుల్లోపు చెల్లించాలని పేర్కొన్నారు.

అవగాహన చర్యలతో ఎయిడ్స్ కట్టడి

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండి, ముందస్తు చర్యలు తీసుకుంటే దాన్ని కట్టడి చేయవచ్చునని రోగులకు ఆసుపత్రి సిబ్బంది అవగాహన కల్పించారు. సోమవారం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఆర్‌టీ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో అవగాహన ప్రదర్శనను నిర్వహించారు. రోగులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ వైద్యాధికారులు శ్రీధర్, బాల, సాయి నిఖిత, స్టాఫ్ నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బంది, ఏఆర్‌టీ వైద్యాధికారుల ర్యాలీ

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

స్పందనకు వందనం

పాయకాపురం, న్యూస్‌టుడే : డిస్నీ సిబార్ ల్యాండ్‌లో రాత్రి వేళ ఆకతాయిలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై 'ఈనాడు'లో ఆదివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన నున్న పోలీసులు.. పలువురు ఆకతాయిలను పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు.

❖ కృష్ణా హోటల్ సమీపంలో చెత్త కుండీలో వ్యర్థాలు తరలించడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు తెలియజేశారు. దీనిపై 'ఈనాడు'లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. కార్మికులతో చెత్త తరలింపజేశారు.

? అజిత్‌సింగినగర్ నందమూరినగర్ గ్రీన్ మెడోస్ అపార్టుమెంట్ల వెనుక భాగంలో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. చెరువును తలపిస్తోంది. అనారోగ్య సమస్యలకు నిలయంగా మారింది. **- ఫణికుమార్, స్థానికుడు**

✔ నిల్వ నీటిని తోడిస్తాం. - బాబూ శ్రీనివాసన్, ఏఎంవో హెచ్, సర్కిల్-2

? అజిత్‌సింగ్‌నగర్, భరతమాత మందిర్ రోడ్డులో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. **- కె.వి.డి.నాగేశ్వర రావు, స్థానికుడు**

✔ చెత్త సేకరణకు సిబ్బందిని పంపిస్తాం. **- బాబూ శ్రీనివాసన్, ఏఎంవోహెచ్, సర్కిల్-2**

? వాంబేకాలనీ నుంచి ప్రశాంతినగర్ చెరువు మార్గంలో రోడ్డుపై చెత్త పేరుకుపోయింది. **- ప్రకాష్, స్థానికుడు**

✔ చెత్తను తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరావు, శానిటరీ అధికారి** – న్యూస్‌టుడే, పాయకాపురం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గవర్నర్‌పేట: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని ఐవీ ప్యాలెస్‌కు మరమ్మతులు చేపట్టేందుకు రూ.40లక్షలు మంజూరు చేశారు. మంగళవారం ఆయా పనులకు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లి బండ్ల బాలస్వామి శంకుస్థాపన చేశారు. కార్పొరేట్ తరహాలో ఐవీ ప్యాలెస్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఏఈ భవానీ పాల్గొన్నారు.

చెత్త తొలగించారు

మధురానగర్, న్యూస్‌టుడే : మధురానగర్ నేతాజీకాలనీలో స్థానికులకు ఇబ్బందికరంగా మారిన చెత్త కుప్పలను నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది సోమవారం తొలగించారు. 'చెత్త తొలగించరూ..' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ జమలయ్య స్పందించారు. పేరుకుపోయిన వ్యర్థాల కుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే. . చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

భగవద్గీత పఠనంతో సన్మార్గం

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే : భగవద్గీత గ్రంథాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని కేఎల్ విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ పైడిపాటి ఉమానాథ శర్మ సూచించారు. గీతా జయంతి వేడుకలను సోమవారం గాంధీనగర్‌లోని శారద డిగ్రీ, జూనియర్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి మనిషి మానవత్వంతో మెలగడానికి అవసరమయ్యే విషయాలన్నీ ఈ గ్రంథంలో ఉంటాయని చెప్పారు. సొసైటీ కరస్పాండెంట్ వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్స్ నాగేశ్వరశర్మ, లుక్కా శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇలాగేనా.. చెత్త సేకరణ..?

ఆంధ్రప్రభ కాలనీలో పరిస్థితి..

ఆంధ్రపత్రిక కాలనీలో ఇళ్ల ముందు చెత్త డబ్బాలు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే

నగరంలోని శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయడం లేదు. అజిత్‌సింగ్‌నగర్ నందమూరి నగర్, ఇందిరానాయక్ నగర్, ఆంధ్రప్రభ కాలనీ, ఆంధ్రపత్రిక కాలనీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ప్రతి ఆదివారం సెలవు తర్వాతి రోజు సోమవారంనాడు పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణ, సైడు కాల్వల పూడికతీతలో అలసత్వం వహిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాలనీల్లో ఇళ్ల ముందు నిల్వలు పేరుకుపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. శనివారం నుంచి మంగళవారం వరకు చెత్త తరలించే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యం వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త సేకరణలో జాప్యం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఈల వినిపిస్తే కదా..

ఉదయం లేచిన దగ్గర నుంచి ఇంటి పనులు.. వంట తదితరాలతో ఖాళీ లేకుండా పనుల్లో ఉంటాం. ఇంటి ముందు చెత్త ఉంచితే వీధి కుక్కలు నాశనం చేస్తున్నాయని ఇంట్లోనే పెట్టుకోవాల్సిన దుస్థితి. ఉదయం పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణ సమయంలో ఈల వేసేది కూడా వినిపించదు. శనివారం సేకరించకుండానే అలా వెళ్లిపోయి.. మళ్లీ మంగళవారం వస్తారు. దీని వల్ల నాలుగు రోజుల పాటు చెత్త ఇంట్లోనే ఉంటోంది. అధికారులు తగు చర్యలు తీసుకుంటే బాగుంటుంది. **- వెంకట రమణమ్మ, ఆంధ్రప్రభ కాలనీ**

దోమల తీవ్రత పెరుగుతోంది..

చెత్త సేకరణలో జాప్యం చేయడం వల్ల కొంత మంది రహదారులపై, సైడు కాల్వల్లో వ్యర్థాల సంచులు విసురుతున్నారు. కల్వర్టుల వద్ద నీరు పారకుండా అవి అడ్డు పడుతున్నాయి. మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. దోమలు విజృంభిస్తున్నాయి. ఇంటి తలుపులు వేసి ఉన్నా.. వచ్చేస్తున్నాయి. దోమల తాకిడికి నిద్ర రావడం లేదు. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో కాల్వల పూడికతీత నిర్వహించి.. చెత్త సేకరణ సక్రమంగా ఉండేలా చూడాలి. **- రామారావు, ఆంధ్రపత్రిక కాలనీ**

తాగునీటి సమస్యలు పరిష్కరించండి

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, వివిధ ప్రాంతాల ప్రజల నుంచి పలు సమస్యలపై ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్యలపై ప్రజలు ఎక్కువగా కమిషనర్‌కు ఫిర్యాదులు వచ్చాయి. వాటిని బాధ్యులైన అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు.

వినతులు..ఇలా.. గుణదల, గిరిపురంలో నీటి సరఫరా సమస్యలపై వినతులు అందగా ఇక నీటిని విడుదల చేసే సిబ్బంది తీరుపై పలు ఫిర్యాదులు అందాయి. మరోవైపు టీడీఆర్ బాండ్ల జారీ, ఇంటి రిజిస్ట్రేషన్, ఇళ్ల తొలగింపు, ఖాళీ స్థలం పన్ను, రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, కొండ ప్రాంతంలో రాళ్ల తొలగింపు, ఆస్తిపన్ను మార్పు, వీధి దీపాలు, బీపీఎస్, రహదారుల మరమ్మతులు, కోతుల సమస్యపై వినతులు అందాయి. అధికారులు రవీంద్రరావు, డి.చంద్రశేఖర్, అర్జునరావు, లత, సృజన, శ్రీధర్, సత్యకుమారి, కామేశ్వరరావు, చంద్రశేఖర్, మాల్యాద్రి, సోమశేఖర్‌రెడ్డి, చంద్రబోస్ పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

గవర్నర్‌పేటలో ఆయుర్వేద కళాశాల బృందం ప్రదర్శన

పాయకాపురం : కండ్రికలో పూర్ణిమ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్‌లో ఎం.కె.బేగ్. పాఠశాల విద్యార్థులు..

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల విద్యార్థులు సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ నిర్మల జ్యోతిబాయి నేతృత్వంవహించారు. నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివరించారు. ప్రారంభ దశలోనే గుర్తించి మందులు వాడితే.. ఆయుష్షు పెంచవచ్చని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ బుల్లయ్య, బి.అక్కమ్మ, కోల విజయకుమారి, కృష్ణవేణి, బి.రాజా కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం : కండ్రిక ప్రధాన కూడలిలో జనశిక్షణ సంస్థ అవగాహన ప్రదర్శన నిర్వహించింది. డైరెక్టర్ ఎ. పూర్ణిమ మాట్లాడుతూ.. మందులు వాడి జీవితకాలాన్ని పెంచుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

మాచవరం: స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.కృష్ణకాంత్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి ఏలూరు రోడ్డులో ర్యాలీ నిర్వహించారు.

ఎస్సారార్ అండ్ సీవీఆర్ విద్యార్థులు..

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అజిత్‌సింగ్‌నగర్, లూనా సెంటర్‌లో సోమవారం ఎం. కె. బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని.. నినాదాలు చేస్తూ.. ముందుకు సాగారు. ప్రధానోపాధ్యాయుడు మైనం హుస్సేన్ మాట్లాడుతూ. . హెచ్ఐవీ వైరస్ కారణంగా అనేక కుటుంబాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. వ్యాధి నిరోధంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబా మందిర సేవలు అభినందనీయం

పరీక్ష ఫీజు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, గౌతమ్‌రెడ్డి తదితరులు

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సాయిబాబా మందిరం కమిటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. సోమవారం ముత్యాలంపాడులోని బాబా మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులకు సంబంధించిన చెక్కులను ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కమిటీ గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని 13 పాఠశాలలకు చెందిన దాదాపు 1300 మంది విద్యార్థులకు రూ.1.80లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి వేదాంత, సైన్స్ చర్చా సదస్సు

మొగల్రాజపురం, న్యూస్‌టుడే : పీబీ సిద్ధార్థ కళాశాల, పశ్చిమ బెంగాల్‌లోని శ్రీచైతన్య సరస్వత్ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో సిద్ధార్థ ఆడిటోరియంలో వేదాంత- సైన్స్ రెండో అంతర్జాతీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మేకా రమేశ్, డైరెక్టర్ వేమూరి బాబురావు అన్నారు. కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య సరస్వత్ ఇనిస్టిట్యూట్ అధ్యక్షుడు శ్రీల భక్తి విజ్ఞానముని మహారాజ్, మఠ్ అధ్యక్షుడు శాస్త్రవేత్త శాంత మహారాజ్ మాట్లాడుతూ వేదాంతం, శాస్త్ర విజ్ఞానంపై చర్చ పేరుతో నిర్వహించే సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరవుతారని వెల్లడించారు.

ఘనంగా ఇరుముడులు

సిద్ధార్థ, రవితేజలతో ఎమ్మెల్యే ఉమా దంపతులు

గవర్నర్‌పేట: గవర్నర్‌పేటలోని శ్రీకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవస్థానంలో సోమవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తనయులు సిద్ధార్థ, రవితేజ తదితరులు దేవస్థానంలో ఇరుముడి ధరించారు. ఉమా, సుజాత దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చదరంగంలో విద్యార్థి ప్రతిభ

రోహన్‌ను అభినందిస్తున్న రేణుక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : చుట్టుగుంటలోని ఎస్సారార్ చెస్ కోచింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎం.రోహన్ తొలి సారిగా ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ (1512)సాధించాడని డైరెక్టర్ పి.రేణుక తెలిపారు. గత నెలలో మారిస్ స్టెల్లా కళాశాలలో ఇంటర్నేషనల్ బిలో 1800 రేటింగ్ చెస్ టోర్నీలో నాలుగు పాయింట్లు సాధించడం ద్వారా ఫిడే రేటింగ్ లభించిందని వివరించారు. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కోచ్ ఫణికుమార్ వద్ద శిక్షణ పొందుతున్నాడని పేర్కొన్నారు. క్రీడాకారుడిని పలువురు అభినందించారు.

ఆదాయం వద్దంట..

- పార్కింగ్ టెండర్ వ్యవహారంలో అనుమానాలు అనేకం
- కొందరు స్థాయీ సంఘ సభ్యుల తీరుపై విమర్శలు

విజయవాడ నగరపాలక సంస్థ, మధురానగర్, న్యూస్‌టుడే

కార్పొరేషన్‌కు ఆదాయం కింద రూ. 5 కోట్లకు పైగా వస్తుంటే.. వద్దనేవారు ఎవరూ ఉండరు.. కొందరు స్థాయీ సంఘ సభ్యులు మాత్రం వద్దనే అంటున్నారు. ఫలితంగానే భారీగా ఆదాయం వచ్చే ఓ పార్కింగ్ లీజు టెండరు తిరస్కరించి.. ఔరా అనిపించారు.

కెనాల్ రోడ్డు- బొడ్డుబొమ్మ పార్కింగ్ ప్రాంతం నగరంలో అతి కీలకమైంది. వ్యాపారులు, భక్తులు పెద్దసంఖ్యలో వాహనాలు నిలుపుతారు. ఈ ప్రాంతానికి ఈ ఏడాది అక్టోబర్‌తో లీజుకాలం ముగియగా అదేనెల 2న అధికారులు ఈ- వేలం నోటీసు ఇచ్చారు.

● 23న పోర్టల్‌లో ముగ్గురు బిడ్డర్లు షెడ్యూళ్లు దాఖలు చేసినట్లు గుర్తించారు. వీరిలో 'గమ్మాడియన్ స్టూడియో, జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థలు మాత్రమే అర్హత సాధించినట్లు గుర్తించి వేలం నిర్వహించారు. వేలంలో ఈ రెండు సంస్థలు కెనాల్ పార్కింగ్ లీజు దక్కించుకునేందుకు తీవ్రంగా పోటీపడ్డాయి. అప్‌సెట్ ధర రూ.41,56,130 నిర్ణయించగా, గమ్మాడియన్ స్టూడియో రూ.5,71,20,130 చెల్లించేందుకు పోటీ పడింది. జీఎంఆర్ సంస్థ అదనంగా రూ.6 వేలు కోట్ చేసి, రూ.5,71,26,120కు టెండరు దక్కించుకుంది.

● దీంతో భారీగా ఆదాయం దక్కిందని భావించారు. ఇందుకు సంబంధించి లీజు టెండరు ప్రతిపాదనను స్థాయీ సంఘం ఆమోదించాలి. తర్వాతే గుత్తేదారు సంస్థకు వర్కు ఆర్డరు (కేటాయింపు) ఇవ్వాలి. అందుకు అధికారులు ప్రతిపాదన సిద్ధం చేసి, ఆమోదానికి నవంబరు 29న స్థాయీ సంఘం ముందుకు తేగా సభ్యులు ఏకపక్షంగా తిరస్కరించారు.

నష్టపోతారంటూ ఉచిత సలహా

పార్కింగ్ టెండరు ద్వారా కార్పొరేషన్‌కు రూ.5,71,26,120 ఆదాయం వస్తుండటంతో గుత్తేదారు సంస్థకు వెంటనే వర్కు ఆర్డర్ ఇచ్చి, లీజు కేటాయించాలి. భిన్నంగా స్థాయీ సంఘ సభ్యులు కొందరు ఆయా గుత్తేదారు సంస్థ పట్ల సానుభూతి చూపారు. రూ.కోట్లకు టెండరు దక్కించుకోవడం వల్ల నష్టపోతారంటూ సూచించారు. ప్రతిపాదన తిరస్కారానికి ఒప్పందం కుదరడంతో ఏకపక్షంగా తిరస్కరించారు.

నిబంధనల ప్రకారం

నిబంధనల ప్రకారం పార్కింగ్ టెండరు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ వెంటనే రూ.2,38,02,555 సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించి, పార్కింగ్ స్థలం స్వాధీనం చేసుకోవాలి. లేనిపక్షంలో ఆ సంస్థ చెల్లించిన రూ.10,39,100 ఈఎండీని జప్తు చేయాలి. వేలంలో పోటీపడి అత్యధిక ధర చెల్లించేందుకు ముందుకొచ్చి, ఆపై కాలయాపన చేయడం, పార్కింగ్ లీజు స్వాధీనం చేసుకోకుండా కాలయాపన చేయడం వల్ల 2 నెలల ఆదాయం పోయింది. ఈ కారణాలుగా గుత్తేదారు సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టాలి. అందుకు తగిన తీర్మానం ఆమోదించాల్సి ఉన్నా, సభ్యులు తిరస్కరించారని విమర్శలు వస్తున్నాయి.

వేదనలోనూ ఆదరువు..!

నిబద్ధత చాటిన సచివాలయ ఉద్యోగి

సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి కె.భవానీ సోమవారం ఉదయాన్నే పింఛన్ల పంపిణీ చేస్తుండగా.. ఆమె తండ్రి చనిపోయినట్లు సమాచారం వచ్చింది. 7 గంటల సమయంలో. . వాంబే కాలనీలో వృద్ధులకు నగదు అందిస్తుండగా.. భర్త ఫోన్ చేసి ఆమెకు ఈ విషయం చెప్పారు. ఒకవైపు బాధను దిగమింగుతూ.. మరోవైపు లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ చేశారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాతే తండ్రి అంత్యక్రియల్లో ఆమె పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఉద్యోగులు నిబద్ధతతో చేస్తున్నారడానికి ఇదే ఒక ఉదాహరణ అంటూ పలువురు అభినందించారు.

– న్యూస్‌టుడే, సత్యనారాయణపురం(గాంధీనగర్)

పింఛను పంపిణీ కార్యక్రమంలో భవానీ

సంక్షోభంలోనూ సంక్షేమ పథకాల అమలు

అంబేడ్కర్ కాలనీలో నగదు అందిస్తున్న ఎమ్మెల్యే బొండా

చుట్టుగుంట, అజిత్ సింగ్‌నగర్ : రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. 24వ డివిజన్, 26వ డివిజన్‌లో సోమవారం ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పేద, అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలను ఉన్నతం చేయడానికి కూటమి ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు దేవతోటి నాగరాజు, సీడీవో జగదీశ్వరి, 26వ డివిజన్ ఇన్‌ఛార్జి వల్లభనేని సతీష్, అధ్యక్షుడు తోట పాండు, 24వ డివిజన్ అధ్యక్షుడు ఇజ్జాడ దుర్గారావు, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూరాజరాజేశ్వరిపేటలో ఎరుబోతు రమణారావు

పాయకాపురం : స్థానిక 61, 62, 63, 64వ డివిజన్లలో కూటమి పార్టీల నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. ఆకుల సూర్యప్రకాష్, బత్తుల కొండ, పైడి శ్రీను, పలగాని శివ, తదితరులు అధికారులతో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : అన్న క్యాంటీన్లకు వచ్చే ప్రజలకు అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు, పశ్చిమంలోని అన్న క్యాంటీన్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్న క్యాంటీన్లలోని ఆహార పదార్థాలు, వస్తు సామగ్రి పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలని అన్నారు. నోడల్ అధికారులు నిత్యం పరిశీలించాలని తెలిపారు. క్యాంటీన్లలో మరమ్మతులు ఉన్నా, వెంటనే చేపట్టాలని సూచించారు. తాగునీరు, వాడకం నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. ఆహారాన్ని ఆయన రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు రమ్యకీర్తన, అన్నపూర్ణ, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార పదార్థాల నిల్వ పాత్రలను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

క్రీడలతో శారీరక దృఢత్వం

ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభిస్తున్న హసీనా

చుట్టుగుంట, న్యూస్‌టుడే : క్రీడా పోటీల ద్వారా శారీరక దృఢత్వం, కండరాల బలం, ఏకాగ్రత వంటివి పెంపొందుతాయని నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ హసీనా పేర్కొన్నారు. చుట్టుగుంట మారుతీనగర్‌లోని నారాయణ స్కూల్‌లో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభించారు. ఏజీఎం రమేష్‌రెడ్డి పాల్గొనగా.. ఈ-ఛాంప్స్ కో-ఆర్డినేటర్ మేరీ శ్రావణి, వైస్ ప్రిన్సిపల్ ప్రభావతి, ఏవో ఇర్ఫాన్ పాల్గొన్నారు.

లీగల్ సెల్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ

సన్మానిస్తున్న ఉద్యోగులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ లీగల్ సెల్ విభాగం సూపరింటెండెంట్ పి.శ్రీనివాస చక్రవర్తి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు, లీగల్ సెల్ ఉద్యోగులు ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. 30 ఏళ్లపాటు, వివిధ హోదాల్లో నిబద్ధతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

సత్యనారాయణపురం(గాంధీనగర్): విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్ పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏఎస్‌రాజు రోడ్డు, కనకరాజు వీధి, కొమ్ము వారి వీధి, వానపాల వారి వీధి, పాపరాజు వీధి, పెనుమత్స వారి వీధి, దేవాలయం, పాల వీధి, బెజ్జం వీధిలో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గుర్తు తెలియని ఓ వ్యక్తి (40) ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. గత నెల 23న కళాక్షేత్రం గేటు వద్ద అపస్మారక స్థితిలో ఉండగా.. ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. నల్లని శరీరచ్ఛాయతో బూడిద రంగు స్వెట్టర్ ధరించి ఉన్నాడని.. అతని ఆచూకీ తెలిసిన వారు గవర్నర్‌పేట స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : ఈ నెల 7న ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆరోగ్య సదస్సు నిర్వహిస్తున్నట్లుగా ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు-పరిష్కారాలు, ప్రజల్లో మానసిక ఆందోళన సమస్యలు- నివారణ అనే రెండు అంశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. బాలోత్సవ భవన్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం మరింత శ్రద్ధవహించి, బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలన్నారు. చికిత్స కన్నా నివారణే ముఖ్యమన్న భావనతో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయప్రకాష్ మాట్లాడుతూ.. ఎ.కొండూరు మండలంలో మూత్రపిండ వ్యాధులు అధికంగా ఉన్నాయని, ప్రభుత్వాలు స్పందించినప్పటికీ వ్యాధులను ఇప్పటికీ పూర్తిగా నివారించలేకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్, ఇతర వైద్య ప్రముఖులు సదస్సులో పాల్గొననున్నట్లు తెలిపారు. వైద్యులు, వైద్య విద్యార్థులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

మాట్లాడుతున్న కామేశ్వరరావు. పక్కన విజయ ప్రకాష్

ఆకట్టుకునేలా.. ఆలోచింపజేసేలా..

మాచవరం : స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫేస్ పెయింటింగ్, మైమ్, పోస్టర్.. రీల్ తయారీ, వాద ప్రతివాదం, మానవహారం, ర్యాలీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మణిపాల్ ఆసుపత్రి జనరల్ ఫిజిషియన్ మనోజ్‌కుమార్ చికిత్సలు.. జాగ్రత్తల గురించి వివరించారు. ప్రిన్సిపల్ వల్లూరి నీరజ తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో గురుకుల విద్యార్థినుల మైమ్ ప్రదర్శన

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ సీఐ దుర్గాప్రసాద్ కోరారు. సోమవారం దుర్గాపురంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టంలో డిజిటల్ అరెస్ట్ అనేది లేనేలేదని చెప్పారు. ఎవరైనా వీడియో కాల్‌లో డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని బెదిరిస్తే భయపడవద్దని సూచించారు. నగర సీపీ రాజశేఖర బాబు ఆదేశాలతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోసాలపై బాధితులు వెంటనే 1930కి ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

టోల్‌గేట్ గుత్తేదారుకు జరిమానా

ఇంద్రకీలాద్రి: టెండరు నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై టోల్‌గేటు గుత్తేదారు మహేష్‌కు రూ.50 వేలు జరిమానా చెల్లించాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ సోమవారం నోటీసు ఇచ్చారు. టెండరు షరతులు 12(ఇ), 17, 18, 22, 23 ఉల్లంఘించినట్లు నోటీసులో పేర్కొన్నారు. భక్తులతో గుత్తేదారుల అనుచరుల ప్రవర్తనపై ఫిర్యాదులు రావడంతో నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. జరిమానాతోపాటు దేవస్థానానికి చెల్లించాల్సిన బకాయి మొత్తం రూ.1,11,58,199 మూడు రోజుల్లోపు చెల్లించాలని పేర్కొన్నారు.

చెట్ల కొమ్మలతో చింత

వాంబేకాలనీ ఏ, బీ బ్లాకుల మధ్య ఖాళీ స్థలంలోని బోరు వద్ద చెట్ల కొమ్మలు రోజుల తరబడి అలానే ఉన్నాయి. విద్యుత్తు సిబ్బంది వార్షిక తనిఖీల్లో భాగంగా తీగలకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించి, ఇక్కడ వేశారు. వీటివల్ల పురుగులు, పాములు వస్తున్నాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సమస్యను శానిటరీ ఇన్‌స్పెక్టర్ జయపాల్ దృష్టికి తీసుకెళ్లగా... వెంటనే తీయిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్

(c) eenadu

చదువు

e-mail: edc@eenadu.in

ఎల్ఎల్‌బీ తర్వాత ఎంబీఏ?

ఎల్ఎల్‌బీ చేస్తున్నాను. దీని తర్వాత ఎంబీఏలో చేరితే కెరియర్ ఎలా ఉంటుంది. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు వస్తాయా? - గంటా రాకేశ్

■ ఎల్ఎల్‌బీ తర్వాత ఎంబీఏ చదవాలనుకోవడం నేటి ఉద్యోగ మార్కెట్‌లో సరైన నిర్ణయమే. ఈ రెండు డిగ్రీల ద్వారా.. చట్ట పరిజ్ఞానం, నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ సామర్థ్యం, వ్యాపార అవగాహన లాంటి అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. కార్పొరేట్ ప్రపంచం, బ్యాంకింగ్, కన్సల్టింగ్, హ్యూమన్ రిసోర్సెస్, కంప్లయెన్స్, పాలసీ మేకింగ్ వంటి రంగాల్లో ఈ రెండు డిగ్రీల కలయిక మీకు మంచి కెరియర్‌ను అందిస్తుంది.

ప్రస్తుత ఉద్యోగ పోటీ ప్రపంచంలో ఒకే డిగ్రీతో పరిమితం కాకుండా, చాలామంది విద్యార్థులు కెరియర్‌కు బలమైన పునాది వేయడానికి వివిధ కోర్సులను కలిపి చదవడం సాధారణమైంది. ముఖ్యంగా ఎల్ఎల్‌బీ తర్వాత ఎంబీఏ చేస్తే.. ఒకవైపు న్యాయ పరిజ్ఞానం, మరోవైపు మేనేజ్‌మెంట్ ప్రతిభ పొందవచ్చు. ఈ రెండిటి సమ్మేళనం ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను అందిస్తుంది.

ఎల్ఎల్‌బీలో న్యాయ ప్రక్రియలు, ఒప్పందాలు, నమోదు విధానాలు, వివాద పరిష్కారం, చట్టపరమైన అనాలిసిస్ వంటి కీలక నైపుణ్యాలను పొంది ఉంటారు. దీనికి అదనంగా ఎంబీఏ చదివితే.. నిర్వహణ, ఆర్థిక వ్యవస్థ, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్, ఫైనాన్స్, ఆపరేషన్స్, లీడర్‌షిప్, స్ట్రాటజీ వంటి రంగాల్లో ప్రావీణ్యం పొందుతారు. ఈ రెండు నైపుణ్యాలూ కలిసినప్పుడు కార్పొరేట్ రంగంలో ఉద్యోగావకాశాలు బాగా మెరుగవుతాయి.

ఎల్ఎల్‌బీ తర్వాత ఎంబీఏతో..

కార్పొరేట్ లా విభాగాల్లో: వివిధ సంస్థల మధ్య ఒప్పందాలు, లీగల్ అనాలిసిస్, కంప్లయెన్స్, పాలసీలు, నియామకాలు, బిజినెస్ అగ్రిమెంట్లు నిర్వహించడానికి అవసరమైన నైపుణ్యాలు నేర్చుకుని.. లీగల్ మేనేజర్, కార్పొరేట్ లీగల్ అడ్వైజర్, కంప్లయెన్స్ ఆఫీసర్, కాంట్రాక్ట్ స్పెషలిస్ట్‌గా స్థిరపడవచ్చు.

హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో: చాలా చట్టపరమైన అంశాలు ఉంటాయి. ఉద్యోగ ఒప్పందాలు, కార్మిక చట్టాలు, వేతన నిబంధనలు, ఉద్యోగ వివాదాలు, పాలసీల రూపకల్పన లాంటి వాటికి న్యాయ పరిజ్ఞానం బాగా అవసరం. ఈ అంశాలపై పట్టు సాధిస్తే, హెచ్‌ఆర్ మేనేజర్, ఎంప్లాయీ రిలేషన్స్ మేనేజర్, లేబర్ లా స్పెషలిస్ట్‌గా ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

బిజినెస్ కన్సల్టింగ్: బిజినెస్ కన్సల్టింగ్ కంపెనీల్లో.. కార్పొరేట్ స్ట్రాటజీ కన్సల్టెంట్, లీగల్ కంప్లయన్స్ కన్సల్టెంట్ లాంటి ఉద్యోగాలకూ ప్రయత్నించవచ్చు.

మెరుగైన కెరియర్ కోసం కనీసం మూడేళ్లు న్యాయవాద వృత్తిలో కొనసాగి, ఆ తర్వాత నేషనల్ లా యూనివర్సిటీల్లో కానీ, ఐఐఎం లాంటి ప్రముఖ విద్యా సంస్థల్లో ఎంబీఏ చేస్తే, మీకు మంచి కెరియర్ ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

సాఫ్ట్ స్కిల్స్

ఒదిగే గుణం.. ఎదిగే నైపుణ్యం

వ్యక్తులైనా, వ్యవస్థలైనా ఉన్న స్థితి నుంచి అత్యున్నత స్థాయికి చేరుకోవడానికి 'మార్పు'ను అస్త్రంగా మలచుకోవాలి. ఆధునిక అవసరాల ప్రకారం మారడాన్ని నిత్య వ్యవహారంగా భావించినవాళ్లే ప్రపంచంతో పరుగు తీయగలరు. ఎప్పుడూ ఒకేలా ఉంటే పోటీ నుంచి పక్కకు జరిగిపోతారు. అందుకే మిమ్మల్ని మీరు మలుచుకోవాలి. ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచానికి అడాప్టబిలిటీ(ఒదిగే స్వభావం) కీలకమైన జీవన నైపుణ్యం.

సారిక.. పేరొందిన కళాశాల నుంచి 9.1 సీజీపీఏతో ఇంజినీరింగ్ పూర్తి చేసింది. బహుళజాతి సంస్థ నిర్వహిస్తోన్న ప్రాంగణ ఎంపికలకు హాజరైంది. రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, బృంద చర్చలలో విజయవంతమైంది. చివరి హెచ్‌ఆర్ రౌండ్లో ఆమెకు ఊహించని ప్రశ్న ఎదురైంది. అదేంటంటే..'మీరు చేస్తున్న ప్రాజెక్టులో ఒక పరికరం కనిపించలేదు.. దాన్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నించినా లభించలేదు. ఆ సమయంలో మీరు ఆ ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారు?' దీనికి సారిక సమాధానం.. 'ఆ పరికరం కోసం మళ్లీ ఆర్డర్ చేస్తాను.. వచ్చే వరకూ వేచి ఉంటాను'. దీంతో ఆమె ఉద్యోగానికి ఎంపికయ్యే అవకాశాన్ని కోల్పోయింది. ఎందుకంటే.. ప్రాజెక్టులో అకస్మాత్తుగా వచ్చిన సవాలుకు ఆ సమయంలో ఆమె పరిష్కారం చూపలేకపోయింది. ప్రత్యామ్నాయ ప్రణాళిక, మార్పులకు సర్దుబాటు చేసుకోలేకపోయింది. ఆమెలో అడాప్టబిలిటీ నైపుణ్యం లోపించింది.

సంస్థలు ఆశిస్తాయివీ..

కార్పొరేట్ ప్రపంచ పని వాతావరణంలో అనేక సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని సమయస్ఫూర్తితో అధిగమించ గలిగే సామర్థ్యం ఉన్నవారినే సంస్థలు కోరుకుంటాయి. ఎంపికలో సాంకేతిక నైపుణ్యాల కంటే అడాప్టబిలిటీ వంటి సాఫ్ట్‌స్కిల్స్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. సాంకేతిక మార్పులు, ప్రపంచవ్యాప్త బృందాలను సమన్వయం చేసుకోవడం, ఇంటి నుంచే పని, నిత్యం మారుతోన్న వ్యాపార అవసరాల కారణంగా.. 'నేను ఈ పద్ధతిలోనే పనిచేయగలుగుతాను' అంటే అవకాశాలు కోల్పోతారు. 'ఎలా పని చేయాలో చెప్పండి, నేర్చుకుంటాను' అనే ఆలోచనా విధానం(ఫ్లెక్సిబుల్ మైండ్ సెట్) ఉన్న వారినే సంస్థలు ఎంచుకుంటున్నాయి. కృత్రిమ మేధ, ఆటోమేషన్ కారణంగా ఉద్యోగానికీ, ఎదురయ్యే సవాళ్లకు అవసరమైన నైపుణ్యంగా 'అడాప్టబిలిటీ' అవతరించింది.

అడాప్టబిలిటీ ఎలా..

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, నూతన పద్ధతులు, సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. వేగవంతమైన పని విధానానికి తగ్గట్టుగా అలవాటు పడాలి. ఆలోచనా సరళినీ, వ్యవహార విధానాన్నీ పని వాతావరణానికి అనుగుణంగా మార్చుకోగలిగే నేర్పరితనం కలిగి ఉండాలి. మార్పులకు అనుగుణంగా ఒదిగిపోవడం లేదా ఆ వాతావరణంలో ఇమిడిపోవడం పుట్టుకతోనే రాదు. అలా అని నేర్చుకోలేనంత కష్టమైందీ కాదు.

అపార్థం చేసుకోవద్దు..

చాలా మంది అడాప్టబిలిటీని చేతగానితనం అని అపార్థం చేసుకుంటారు. పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవడం అంటే.. గుడ్డి ఎద్దు చేలో పడ్డట్టు తలాడించడం అని కాదు. 'ఎప్పుడు తగ్గాలి.. ఎప్పుడు మీ అభిప్రాయంపై స్థిరంగా ఉండాలి' అనేది కచ్చితంగా తెలుసుకోవడం కూడా అడాప్టబిలిటీలో భాగమే. వెన్నెముకలా వ్యవహరించాలి. అది ఫ్లెక్సిబుల్‌గా ఉంటూనే మిమ్మల్ని నిటారుగా నిలబెడుతుంది. ఈ గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి.

✦ నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్ రిపోర్ట్ ప్రకారం.. మన దేశంలో 2026 నాటికి 90 శాతం ఉద్యోగాలకు అడాప్టబిలిటీతో పాటు కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకునే సామర్థ్యం అత్యవసరంగా మారుతుంది.

✦ లింక్డిన్ గ్లోబల్ ట్యాలెంట్ ట్రెండ్స్ 2024-25.. రిక్రూటర్లు అడాప్టబిలిటీ, సాఫ్ట్‌స్కిల్స్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొంది.

✦ మెకిన్సే సర్వే.. అడాప్టబిలిటీ నైపుణ్యం ఉన్న వారు ఇతరుల కంటే నాలుగు రెట్లు ఎక్కువగా విజయవంతం కావడానికి, ఉన్నతి సాధించడానికి అవకాశం ఉందని తేల్చింది.

వీటితో సాధ్యం..

స్వీయ అవగాహన: ఇది అడాప్టబిలిటీకి పునాది లాంటిది. ఎలాంటి పరిస్థితులు, సందర్భాల్లోనైనా.. భావోద్వేగాలు, ఆలోచనలు, వ్యవహార శైలిని క్రమ పద్ధతిలో ఉంచుకోవాలి. ఒత్తిడిలో ఉన్నా, ఊహించని పరిణామాలు ఎదురైనా వాటిని అవకాశాలుగా మలుచుకుని, సంస్థలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలి.

కంఫర్ట్ జోన్ నుంచి బయటకు: ఎప్పుడూ కొత్త ఆలోచనలు, కొత్త విధానాలు, సరికొత్త అనుభవాలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉండాలి. అవి సానుకూలమైనవైనా, ప్రతికూలమైనవైనా.. ఆశ్చర్యంగా జరిగినా ఏ మార్పునైనా స్వీకరించాలి. అది మీ కెరియర్ ఉన్నతికి ఉపయోగపడేలా చేసుకోగలగాలి. కంఫర్ట్ జోన్ కెరియర్‌ను అక్కడే ముగించేస్తుంది. సవాళ్లను స్వీకరించేందుకు సిద్ధపడితేనే ముందుకెళ్తారు.

నేర్చుకోవాలనే తపన: కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ప్రశ్నలు అడగడానికీ సందేహించకూడదు. వీటితోనే జ్ఞానం పెరుగుతుంది. నిత్య విద్యార్థిలా అభ్యాసం చేస్తూ, కొత్త పద్ధతిలో ప్రభావవంతంగా పని చేయగలగాలి.

ఆశావహ దృక్పథం: ఎప్పుడూ సానుకూలంగా ఉండాలి. ఉన్నతమైన కలలు కనాలి. వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడాలి. ఈ గుణం మిమ్మల్ని మీ పని వాతావరణంలో ఎదురయ్యే సవాళ్లు, మార్పులను సానుకూల దృక్పథంతో స్వీకరించగలిగే అవకాశాన్ని కలిగిస్తుంది. తద్వారా పరిస్థితులకు అనుగుణంగా ఒదిగిపోవడానికి ఉపయోగపడుతుంది. 'ఎందుకు' అని కాకుండా..'ఎలా' అనే దానిపై ఫోకస్ పెట్టాలి.

అభిప్రాయాలూ స్వీకరించాలి: ఇతరుల ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకోవడం, వాటిని స్వీకరించడమూ అడాప్టివ్ నైపుణ్యంగానే పరిగణించాలి. ఇది ఎదుటివారికి మీపై నమ్మకాన్ని ఇవ్వడంతో పాటూ, మీ బృందం పని తీరునూ మెరుగుపరుస్తుంది. సమస్యలూ పరిష్కారమవుతాయి, మీపై గౌరవమూ పెరుగుతుంది.

సాంకేతిక నైపుణ్యాలతో కొన్నాళ్లు లేదా కొన్నేళ్లే ప్రయాణం చేయగలం. ఎందుకంటే ఇవి ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి. కానీ అడాప్టబిలిటీ నైపుణ్యాలు ఎప్పటికీ మిమ్మల్ని వదిలిపోవు. జీవితాంతం వీటితో ఉపయోగమే. వ్యక్తిగత జీవితంలోనూ ఈ నైపుణ్యాలెంతో మేలు చేస్తాయి.

– గంపా నాగేశ్వర్‌రావు, సైకాలజిస్ట్, ఇంపాక్ట్ వ్యవస్థాపకులు

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

కస్టమర్ సర్వీస్/ కస్టమర్ సపోర్ట్

సంస్థ: క్లాపింగో ఎడ్యుకేషన్ ప్రై.లి. **నైపుణ్యాలు:** కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, మల్టీటాస్కింగ్, టీమ్‌వర్క్ **స్టైపెండ్:** రూ.5,000-8,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 26
☛ https://shorturl.at/Gkczm

బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోబోటిక్స్ **నైపుణ్యాలు:** బిజినెస్ డెవలప్‌మెంట్, కోల్డ్ కాలింగ్, ఈమెయిల్ మార్కెటింగ్, మార్కెటింగ్ ఆటోమేషన్, సేల్స్ **స్టైపెండ్:** రూ.5,000-6,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 26
☛ https://shorturl.at/hv01A

ఆండ్రాయిడ్ యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: క్రాక్‌కోడ్ **నైపుణ్యాలు:** ఆండ్రాయిడ్, ఫైర్‌బేస్, జావా, కాట్లిన్, రెస్ట్ ఏపీఐ, ఎక్స్‌ఎంఎల్ **స్టైపెండ్:** రూ.3,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 27
☛ https://shorturl.at/rOPJB

సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో..

సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, లఖ్‌నవూ.. 44 టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● టెక్నికల్ అసిస్టెంట్: 12 ● టెక్నీషియన్-1: 32 **అర్హతలు:** టెక్నీషియన్‌కు పదో తరగతి, ఐటీఐ. టెక్నికల్ అసిస్టెంట్‌కు సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ ఉండాలి. **వయసు:** చివరి తేదీ నాటికి 28 ఏళ్లు మించకూడదు. **వేతనం:** నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.67,530; టెక్నీషియన్‌కు రూ.36,918. **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్టులతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 26.12.2025. **వెబ్‌సైట్:** https://cdri.res.in/

ఐహెచ్‌బీటీలో టెక్నికల్ అసిస్టెంట్లు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ బయోరిసోర్స్ టెక్నాలజీ.. ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● టెక్నికల్‌అసిస్టెంట్-I: 04 ● టెక్నీషియన్: 05 **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, బీఎస్సీతో పాటూ ఉద్యోగానుభవం ఉండాలి. **వేతనం:** టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.35,400; టెక్నీషియన్‌కు రూ.19,900. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాత పరీక్ష/సీబీటీ, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌కు రూ.500; ఎస్సీ/ ఎస్టీ, మహిళలు, దివ్యాంగులకు ఫీజు లేదు. **తపాలా ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** 29-12-2025 **చిరునామా:** ది సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్, సీఎస్ఐఆర్-ఐహెచ్‌బీటీ, పోస్ట్ బాక్స్ 6, పాలంపూర్, కంగ్రా జిల్లా, హిమాచల్ ప్రదేశ్.
వెబ్‌సైట్: https://www.ihbt.res.in/en/othernlinks/recruitment

ఆన్‌లైన్‌లో తిరుపతమ్మ దర్శనం టికెట్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో దర్శనం, ఇతర సేవలు బుకింగ్, ప్రసాదాల టోకెన్లను ఆన్‌లైన్ ద్వారా భక్తులు బుక్ చేసుకోవచ్చని ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు అమ్మవారి దర్శనం కల్పించేందుకు ఆలయంలో ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశామన్నారు. టికెట్లను ఆన్‌లైన్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీటెంపుల్స్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా లేదా మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009లో బుక్ చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునేందుకు ఆలయం వద్ద క్లోక్ రూమ్ పక్కన ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. విరాళాలు ఇచ్చేందుకు కూడా వెబ్‌సైట్‌లో వీలుందని.. ఈసేవలను వినియోగించుకోవాలని కోరారు.

అంధ క్రికెటర్ కరుణకుమారికి ఘన స్వాగతం

క్రీడాకారిణికి స్వాగతం పలుకుతున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎండీ భరణి తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : అంధుల టీ 20 మహిళా వరల్డ్ కప్ కైవసం చేసుకున్న భారత జట్టులో సభ్యురాలిగా కీలకపాత్ర పోషించిన రాష్ట్ర క్రీడాకారిణి పంగి కరుణకుమారికి సోమవారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. వరల్డ్ కప్ సాధించాక.. ఆమె తొలిసారిగా సోమవారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి, పాలక మండలి సభ్యులు ఎస్.సంతోష్ కుమార్, కె.జగదీశ్వరి, అర్జున అవార్డు గ్రహీత ఐ.అజయ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘ అధ్యక్షుడు చెన్నా శరత్‌బాబు, కార్యదర్శి జి.రవీంద్రబాబు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, పలువురు శిక్షకులు, క్రీడాకారులు, గన్నవరం సెయింట్ జాన్స్ క్రీడాకారిణులు హాజరై కరుణకు ఘన స్వాగతం పలికారు.

మట్టి తవ్వకాలపై.. సమగ్ర విచారణ!

వైకాపా హయాంలో భారీగా తవ్వేశారు ● ఏం చర్యలు చేపట్టారని లోకాయుక్త దృష్టి

ఈనాడు, అమరావతి

కొత్తూరు రిజర్వు ఫారెస్టులో వైకాపా హయాంలో.. విచ్చలవిడిగా జరిగిన అక్రమ మట్టి తవ్వకాలు, అటవీ భూముల ఆక్రమణపై.. లోకాయుక్త తాజాగా విచారణ చేపట్టింది. ఈ తవ్వకాలపై ఆధారాలతో సహా లోకాయుక్తకు 2023లో ఫిర్యాదు చేసిన వారిని సోమవారం పిలిచి.. విచారించింది. గతంలోనే దీనిపై లోకాయుక్త స్పష్టంగా ఆదేశించినా.. వాటిని అటవీ, రెవెన్యూ అధికారులు పాటించలేదు. ఈ నేపథ్యంలోనే మరోసారి ఫిర్యాదుదారైన.. కొత్తూరు తాడేపల్లివాసి మెండెం జమలయ్యను కర్నూలులో లోకాయుక్త ప్రధాన కార్యాలయానికి సోమవారం పిలిచి.. వివరాలు సేకరించింది. తవ్వకాలు జరిగిన ప్రాంతం అటవీ పరిధిలో లేదని ఆ శాఖ అధికారులు చెప్పడంతో.. రెవెన్యూతో కలిసి సంయుక్త సర్వే చేపట్టాలని.. రెండేళ్ల కిందటే లోకాయుక్త సూచించింది. కానీ.. ఇంతవరకూ అధికారులు సర్వే చేపట్టకుండా.. ఒకరిపై మరొకరు తప్పు నెట్టేస్తూ.. కాలయాపన చేస్తున్నారు. దీనిపైనే తాజాగా ఫిర్యాదుదారు నుంచి లోకాయుక్త వివరాలు సేకరించింది.

సంయుక్త సర్వే ఊసేదీ...?

అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ చేయాలంటూ.. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్)కు లోకాయుక్త 2023లోనే సూచించింది. ఫారెస్ట్ విజిలెన్స్ 02 విభాగం ఆధ్వర్యంలో విచారణ కూడా చేశారు. తవ్వకాలు జరిగాయనే అనుమానాలున్నాయని, అటవీ భూములు సైతం ఆక్రమించారని తేల్చారు. దీంతో అప్పట్లోనే.. ఇద్దరు ఉద్యోగులపై చర్యలు కూడా చేపట్టారు. వెరసి తవ్వకాలు జరిగిన ప్రాంతం అటవీ పరిధిలో ఉందా లేదా అనేది సంయుక్త సర్వే చేసి తేల్చాలని లోకాయుక్త ఆదేశించింది. అయినా.. ఇప్పటికీ సర్వే, చర్యలు వంటివేవీ చేయలేదు. తాజాగా మరోసారి అధికారులకు వీటిపై స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని లోకాయుక్త చెప్పినట్లు ఫిర్యాదుదారు జమలయ్య తెలిపారు.

హద్దు రాళ్ల తొలగింపు నేరం...

అటవీ ప్రాంతంలో హద్దు రాళ్లను పీకేసి మరీ లోపలకు వెళ్లి మట్టి తవ్వకాలు చేపట్టడం తీవ్ర నేరం. అందుకే.. అది తమ పరిధిలో లేదని అప్పట్లో అటవీ అధికారులు చెప్పారు. 310, 311 నంబర్లున్న హద్దురాళ్లను తొలగించేసి.. ఈ ప్రాంతంలో భారీలోతున తవ్వకాలు చేపట్టారు.

స్లీపర్ మార్పిడి పనులు విజయవంతం

రైల్వేస్టేషన్(విజయవాడ), న్యూస్‌టుడే: రైలు పట్టాల మధ్య ఉన్న స్లీపర్ మార్పిడి పనులను అత్యాధునిక యంత్రం సహాయంతో విజయవంతంగా మార్పిడి చేసినట్లు విజయవాడ రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే నెలలో 10.70 కిలో మీటర్ల పనులను ట్రాక్ రిలేయింగ్ ట్రైన్(టీఆర్‌టీ) సహాయంతో నిర్ణీత వ్యవధిలో చేపట్టారు. ఏలూరు సెక్షన్‌లో ఈ పనులను డీఆర్ఎం మోహిత్ సొనాకియా పరిశీలించారు. ఇంజినీరింగ్, ఆపరేటింగ్, ఎస్అండ్‌టీ, టీఆర్‌డీ విభాగాల సిబ్బంది ట్రాక్ మార్పిడి పనుల్లో భాగస్వామ్యం వహించారు. విజయవాడ డివిజన్‌కు అత్యాధునిక యంత్రం అందుబాటులోకి రావడంతో తక్కువ వ్యవధిలోనే స్లీపర్ మార్పిడి పనులు పూర్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధికారులు, సిబ్బందిని డీఆర్ఎం ప్రత్యేకంగా అభినందించారు.

చాణక్య బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న బూనేటి చాణక్య (ఏ8) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈనెల 3వ తేదీకి వాయిదా వేశారు. ఈ పిటిషన్ సోమవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. దీనిని తదుపరి విచారణ నిమిత్తం వాయిదా వేశారు. ఇదే కేసులో సిట్ స్వాధీనం చేసుకున్న తమ కారును విడుదల చేయాలని కోరుతూ సత్యం ఇస్పాత్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను బుధవారానికి వాయిదా పడింది.

ఐపీఎస్ అధికారి సంజయ్..: అగ్నిమాపక శాఖ, సీఐడీలో డీజీగా పనిచేసిన కాలంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంజయ్.. నాలుగోసారి బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ పిటిషన్‌పై విచారణ సోమవారం ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. తదుపరి విచారణ నిమిత్తం ఈనెల 3వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. ఇదే కేసులో కొండలరావు (ఏ4) దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ కూడా 5వ తేదీకి వాయిదా పడింది.

జోగి, అద్దేపల్లి సోదరులు..: నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్, రాము దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై విచారణ ఈనెల 4వ తేదీకి వాయిదా పడింది. ఇదే కేసులో ప్రధాన నిందితులైన అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావుల బెయిల్ పిటిషన్లు గురువారానికి వాయిదా పడ్డాయి. నిందితుల బెయిల్ పిటిషన్లు సోమవారం విజయవాడ ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చాయి. వీటిని తదుపరి విచారణ నిమిత్తం వాయిదా వేశారు.

'సీసీ ఫుటేజీ కోర్టు ముందుంచేలా ఆదేశించండి'

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై కిడ్నాప్, దాడి కేసుకు సంబంధించి పటమట పోలీసు స్టేషన్‌లోని సీసీ కెమెరా ఫుటేజీని కోర్టు ముందుంచేలా దర్యాప్తు అధికారి (ఐవో)ని ఆదేశించాలని కోరుతూ వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో పిటిషన్ వేశారు. ఈఏడాది ఫిబ్రవరి 10న వంశీపై పటమట స్టేషన్‌లో కేసు నమోదైంది. తెదేపా కార్యాలయంపై దాడి కేసు ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను అపహరించి, దాడి చేసి కేసు ఉపసంహరింపజేశారని కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పటమట స్టేషన్, ప్రాంగణంలోని సీసీ కెమెరాల్లో ఈఏడాది ఫిబ్రవరి 10 నుంచి 15 వరకు నిక్షిప్తమైన దృశ్యాలను న్యాయస్థానం ముందుంచేలా ఆదేశించాలని పిటిషన్‌లో వంశీ కోరారు. ఆ ఫుటేజీని కేసు రికార్డుగా భావించి భద్రపరచాలని కోరారు. పిటిషనపై నోటీసుల నిమిత్తం మంగళవారానికి వాయిదా పడింది.

రైతేరాజు

పోషకాల పండు.. ఆదాయం మెండు!

తోటలో గ్యాక్ పండును చూపుతున్న రైతు శేషుబాబు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: పోషకాలు పుష్కలంగా ఉండే గ్యాక్ పండ్లను ప్రయోగాత్మకంగా సాగుచేసి విజయం సాధించారు ఓ యువ రైతు. కేరళ రాష్ట్రం నుంచి మొక్కలను తెప్పించారు. ఇక్కడి వాతావరణానికి అనువుగా అవి ఎదిగి పండ్ల దిగుబడి వచ్చింది. వాటిని విక్రయించడంతో పాటు ఆయా మొక్కలను పెంచి ఆసక్తి ఉన్న రైతులకు విక్రయించి ఆదాయం పొందుతున్నారు.

ఏడాదిన్నర కిందట.. రామిరెడ్డిపల్లికి చెందిన బొద్దులూరి శేషుబాబు ఏడాదిన్నర క్రితం వంద గ్యాక్ పండ్ల సాగును 25 సెంట్ల విస్తీర్ణంలో సాగుచేశారు. ఎనిమిది మాసాల్లో కాయలు కాశాయి. మొక్కల ఎదుగుదల బాగుండటంతో మరో అరెకరంలో 220 వేశారు. తానే నర్సరీలో పెంచి పొలంలో పందిరి ఏర్పాటు చేసి నాటారు. ప్రస్తుతం వాటికి పండ్లు కాస్తున్నాయి. ఇవి పచ్చ, పసుపు, ఆరంజ్, ఎరుపు రంగుల్లో ఉంటాయి. ఎర్రగా పక్వానికి వచ్చిన వాటిని తింటారు. వీటిని కిలో రూ.500కు విక్రయిస్తున్నారు. మార్కెట్ కంటే తక్కువ ధరకు హైదరాబాద్, బెంగళూరులోని మాల్‌కు వారానికి 50 కిలోల పండ్లు అమ్ముతున్నారు. వినియోగదారుల నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్ తీసుకుని కొరియర్ ద్వారా పంపుతున్నారు.

రూ.4 లక్షల నికర ఆదాయం.. ఏడాది పాటు పెంచిన గ్యాక్ పండ్ల తోటలో ఆడ మొక్కల కాండం నుంచి ముక్కలను సేకరించి నర్సరీలో మొక్కలు పెంచుతున్నారు. నెల రోజుల్లో చేతికొస్తుంది. ఎకరానికి 450 నాటాలి. వంద ఆడ మొక్కలకు 30 మగవి నాటించాలి. రెండింటి పువ్వులకు పరాగ సంపర్కం(పాలినేషన్) చేయిస్తారు. ఒక్కో మొక్కను రూ.300 వంతున విక్రయిస్తున్నారు. ఏపీ, తెలంగాణలో ఆసక్తి ఉన్న రైతులకు ఇప్పటి వరకు 1800 అమ్మారు. పండ్లు, మొక్కల విక్రయం ద్వారా ఇప్పటి వరకు రూ.3.50 లక్షలు ఆదాయం పొందారు. మరో అరెకరంలో సాగుచేసిన తోటలో పండ్లు చేతికొచ్చాయి. ఒక్కో మొక్కకు 15 కిలోల పండ్ల దిగుబడి వస్తోంది. అన్నీ ఖర్చులు పోను రూ.4 లక్షల నికర ఆదాయం వస్తోందని రైతు ఆశిస్తున్నారు.

ప్రశ్న: బెంగళూరు మిర్చి(కూరమిరప) సాగుకు వాతావరణం, నేలలు, విత్తనమోతాదు, నారుమడి యాజమాన్యం గురించి వివరించండి.
- టి.వెంకట్రావు, రైతు, చినకళ్లేపల్లి

సమాధానం: కారం లేని బెంగళూరు మిర్చి(కూరమిరప) గంట ఆకారంలో లావుగా ఉంటుంది. వీటిని పచ్చి కూరగాయలుగా ఉపయోగిస్తారు. దీన్ని సిమ్లా మిర్చి అనికూడా అంటారు. వీటిలో ఎ, సి విటమిన్లు అధికంగా ఉంటాయి. శీతాకాలం రాత్రి వేళల్లో అత్యల్ప ఉష్ణోగ్రత 10-17 డిగ్రీల మధ్య 30-40 రోజుల పాటు ఉంటే ఈ పంటకు అనుకూలం. రాత్రి ఉష్ణోగ్రత పెరిగే కొద్దీ పూతరాలడం ఎక్కువవుతుంది. కాయ నాణ్యత తగ్గుతుంది. నీరు బాగా ఇంకే బరువైన, సారవంతమైన నేలలు అనుకూలం. సుమారు 250 గ్రాముల విత్తనాలను 25 చ.మీ నారుమడిలో పలుచగా చల్లుకోవాలి. కిలో విత్తనాన్ని 3 గ్రాముల చొప్పున థైరమ్ లేదా మాంకోజెబ్‌తో శుద్ధి చేయాలి. నారుమడిలో ఫ్యూరడాన్ గుళికలు(100 గ్రాములు) వేసుకోవాలి. విత్తిన 12, 19వ రోజున కాపర్ సంబంధిత శిలీంధ్ర నాశనిలతో నేల తడిచేలా పిచికారీ చేసి నారుకుళ్లు తెగులు నివారించుకోవాలి. **- వి.మంజువాణి, ఉద్యానశాస్త్రవేత్త, కేవీకే, ఘంటసాల**

వ్యర్థాల దహనం.. భూసారం హననం!

భూమిపై వ్యర్థాలతో మల్చింగ్

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: పంట వ్యర్థాలను చాలా మంది రైతులు దహనం చేస్తున్నారు. ఇలా.. చేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మున్ముందు మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కె.నాగేంద్రరావు తెలిపారు. మంటల కారణంగా భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు మృతిచెందడమే కాకుండా చక్కటి ఎరువును చేతులారా నాశనం చేసినవాళ్లమవుతామంటున్నారు. మనిషి ఆరోగ్యం ప్రమాదం బారిన పడకుండా ఉండాలంటే చెరకు చెత్త, వరిగడ్డి, అపరాల వ్యర్థాలను ఎరువులుగా మలచుకోవాలి. ఇలా వ్యర్థాలతో భూమిని మల్చింగ్ చేయడం ద్వారా తేమశాతం నిల్వ ఉండి పంటలకు ఉపయోగపడుతుంది. సాగునీటి ఎద్దడి సమయంలో పంట దెబ్బతినకుండా ఉంటుంది. ప్రస్తుతం వరి కోతలు యంత్రాలతో కోస్తున్నారు. గడ్డిని తగలబెట్టకుండా పంటకు వినియోగించుకోవాలని నాగేంద్రరావు సూచిస్తున్నారు.

రబీలో అనువైన మినుము రకాలు

-ఘంటసాల, న్యూస్‌టుడే పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో అనువైన మినుము వంగడాలు, వాటి తీరు తెన్నులు, పంట కాలపరిమితి, దిగుబడులు తదితర విషయాలను ఘంటసాల కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, సమన్వయకర్త డి.సుధారాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మీలు ఇలా వివరించారు.

ఎల్‌బీజీ రకాలు.. 752: ఇది పల్లాకు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. వరి మాగాణుల్లో ఆలస్యంగా విత్తుకునేందుకు అనువైన రకం. పంట కాలం 75-80 రోజులు. దిగుబడి ఎకరానికి 6-7 క్వింటాళ్లు. ★ **884:** ఇది పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలు, వరి మాగాణుల్లో సాగుకు అనువైన రకం. పంట కాలం 75-80 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **787:** ఈ రకం పల్లాకు తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. కాండం కణుపుల వద్ద కూడా కాయలు వస్తాయి. పంట కాలం 75-80 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. ★ **932:** పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **904:** ఈ రకం పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలు, వరి మాగాణుల్లో అనువైన రకం. పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **645:** ఈ రకం ఎండు తెగులును తట్టుకుంటుంది. పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **648:** ఈ రకం ఎండు తెగులును తట్టుకుంటుంది. బూడిద, ఆకుమచ్చ, తుప్పు తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. వరి మాగాణుల్లో అనువైన రకం. పంట కాలం 90-95 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. * **709:** మాగాణి భూముల్లో ఆలస్యంగా విత్తుకునేందుకు అనువైన రకం. పంట కాలం 80-85 రోజులు. దిగుబడి 6-7క్వింటాళ్లు. ★ **టీబీజీ 104:** ఇది పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలకు అనువైన రకం. పంట కాలం 70-75 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. ★ **129:** ఈ రకం పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలు, వరి మాగాణుల్లో అనువైన రకం. పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **జీబీజీ1:** ఈ రకం వరి మాగాణుల్లో ఆలస్యంగా విత్తుకునేందుకు అనువైన రకం. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. పంట కాలం 70-75 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. ★ **పీయూ 31:** ఈ రకం పల్లాకు తెగులును పూర్తిగా తట్టుకుంటుంది. పంట కాలం 70-75 రోజులు. దిగుబడి 5-6 క్వింటాళ్లు.

(c) eenadu

ఈనాడు అనకాపల్లి

మంగళవారం 2 డిసెంబరు 2025

గృహయోగానికి ఇంకాస్త గడువు

నక్కపల్లి, న్యూస్‌టుడే

ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించారు. గతనెల 30తోనే సమయం ముగిసినా ప్రజల నుంచి వినతులు వస్తుండటంతో గడువు పెంచారు.

జిల్లాలో 24 మండలాల పరిధిలో కొద్దినెలల కిందట ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో అధికారులు ప్రతి గ్రామానికో సర్వే బృందాన్ని నియమించారు. వీరంతా గ్రామాల్లో తిరిగి ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీరి వివరాలను ఆవాస్ ప్లస్ 2024 యాప్‌లో నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా వేలాది దరఖాస్తులు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు మంజూరు చేసినా బిల్లులు చెల్లించక అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయించే బాధ్యతనూ కూటమి సర్కారు తీసుకుంది. ఇలాంటి ఇళ్లకు అదనపు సాయాన్ని అందించింది. మరోవైపు సొంత స్థలం కలిగిన వారంతా ఇళ్లను కట్టుకోవడానికి చూస్తున్నారు. తాజా ప్రక్రియలో ఇలాంటి వారికి అవకాశం కలిగింది. దరఖాస్తు చేసుకోడానికి తొలుత గతనెల 5 వరకు మాత్రమే అవకాశం ఇచ్చారు. దీని తర్వాత నవంబరు 30 వరకు పొడిగించారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం మరో రెండు వారాలు గడువిచ్చింది. ఆసక్తి, అర్హత ఉన్నవారంతా ఈనెల 14 వరకు తమ దరఖాస్తులను సచివాలయాలు / సర్వే బృందాలకు ఇవ్వొచ్చు. పథకంలో అర్హత పొందిన వారికి ఉపాధితో కలిపి కేంద్రం ద్వారా రూ. 1.59 లక్షలు వస్తుంది.

జిల్లావ్యాప్తంగా ఇళ్ల కోసం	
దరఖాస్తులు	: 38,127
పాయకరావుపేట	: 3336
పరవాడ	: 3209
కోటవురట్ల	: 3149
ఎలమంచిలి	: 219

సర్వే చేస్తున్న ఉద్యోగులు

అందరికీ ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

అనకాపల్లి, బుచ్చెయ్యపేట: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ్ పథకం కింద గృహాల నిమిత్తం చేస్తున్న సర్వేను ఈనెల 14 వరకు పొడిగించారు. వాస్తవానికి గత నెల 30 తేదీతో సమయం ముగిసింది. అనేక మంది అర్హులు ఉన్నందున సమయం పొడిగించారు. 2029 నాటికి పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.
– బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్

దిత్వా తుపానుతో దిగులు

ఎస్.రాయవరం, మునగపాక, పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో వాతావరణం చల్లబడి చిరుజల్లులు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి గాలులు వీచాయి. పలు మండలాల్లో కోసిన వరి పనలు తడిసిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాయకరావుపేట మండలం పాల్తేరు, సత్యవరం, గోపాలపట్నం, పెంటకోట తదితర ప్రాంతాల్లో గింజ దశలో ఉన్న వరిపనలు నేలవాలాయి.

పగలు తవ్వకాలు.. రాత్రుళ్లు పంపకాలు

కమిటీలేసినా.. కళ్లుగప్పి ఇసుక తరలింపు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో ఇసుకాసురులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రకృతి వనరులను దోచేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇటీవల మొంథా తుపాను ధాటికి జిల్లా పరిధిలోని శారదా నది ఉప్పొంగి ప్రవహించింది. చాలాప్రాంతాల్లో ఇసుక మేటలు చేరాయి. వీటిని కొల్లగొట్టేందుకు ఎక్కడికక్కడ పోటీపడుతున్నారు. జిల్లా కలెక్టరే స్వయంగా కన్నెర్ర చేసినా కానీ.. దందాకు అడ్డుకట్ట పడటం లేదు.

దేవరాపల్లిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు..

★ దేవరాపల్లి మండలం చింతలపూడి, సమ్మెద, తామరబ్బ, దేవరాపల్లి, వెంకటరాజపురం, మారేపల్లి, తిమిరాం, కలిగొట్ల, బోయిలకింతాడ నదీ పరివాహక గ్రామాలు. ఇక్కడ యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. దీంతో దేవరాపల్లి, తెనుగుపూడి, తారువ, కలిగొట్ల, గవరవరం వంతెనలకు ముప్పు వాటిల్లుతోంది.

★ మాడుగుల మండలం సత్యవరం, సాగరం, గొట్టివాడ అగ్రహారం, వీరవెల్లి అగ్రహారంలో ఇసుక తవ్వకాలు నిత్యకృత్యం. నది నుంచి ఒడ్డుకు ఎడ్లబళ్లతో.. అక్కడ నుంచి ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తున్నారు. అధికంగా రావికమతం, పాడేరు ఏజెన్సీ ప్రాంతానికి తరలిస్తూ దూరాన్ని బట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

★ శారదా నదిలో ఇసుక తవ్వకాలకు దేవరాపల్లి మండలంలోని ఓ గ్రామంలో కొన్నాళ్ల క్రితం వేలంపాట నిర్వహించారు. భారీ స్థాయిలో ఈ బహిరంగ వేలంలో పాల్గొని.. రూ. 30 లక్షలకు పాట పాడారు. ఇక్కడ నుంచే శృంగవరపుకోట, వేపగుంట ప్రాంతాలకు రాత్రి వేళల్లో తరలించేస్తున్నారు.

అధికారులంతా గప్‌చుప్..

జిల్లాలోని నది పరివాహక ప్రాంతాలవైపు అధికార యంత్రాంగం కనీసం కన్నెత్తి చూడటంలేదు. అక్రమార్కులు కూడా కొత్త పంథాకు తెరలేపారు. అర్ధరాత్రి వేళ ఒకేసారి పెద్దసంఖ్యలో లారీలతో రవాణా చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం దేవరాపల్లిలో ఇసుక అక్రమ రవాణా అధికంగా జరుగుతోందని తెలిసి.. కలెక్టరే నేరుగా ప్రతి గ్రామంలో నలుగురితో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. వీరు గ్రామాల్లో ఇసుక పక్కదారి పట్టకుండా చూడాలి. కానీ.. క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదు. ఇప్పటికి ఒక్క ట్రాక్టర్‌ను కూడా అడ్డుకోలేదు.

కేసులు నమోదు చేస్తాం

మాడుగుల, దేవరాపల్లి మండలాల్లో ఇసుక పక్కదారి పడుతున్నట్లు తెలిసింది. వాటిని కట్టడి చేసేందుకు నది పరివాహక గ్రామాల్లో కమిటీలు వేశాం. పోలీసులు సాయంతో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. అక్రమ నిల్వలు స్వాధీనం చేసుకుంటున్నాం. దారిలో కందకాలు తవ్వి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాం. అప్పటికీ నిబంధనలు పాటించక పోతే.. చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం.
– శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

బలిఘట్టంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ తదితరులు

బలిఘట్టంలో కేంద్రీయ విద్యాలయం?

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పరిధిలోని బలిఘట్టంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ విద్యాలయం తొలుత అనకాపల్లికి మంజూరైనా పలు కారణాలతో ఏర్పాటు కాలేదు. బలిఘట్టంలో దాదాపు పది ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున ఇక్కడ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశించడంతో రాజీవ్ విద్యామిషన్ సహాయ ప్రాజెక్ట్ సమన్వయకర్త జయప్రకాశ్, ఆర్డీఓ వి.వి. రమణ, తహసీల్దారు రామారావు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ వెంట ఉన్నారు.

నాణ్యతకు ప్రమాణం.. నారీమణికి ప్రయోజనం

నక్కపల్లి, న్యూస్‌టుడే

పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధిలో సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా కొన్నేళ్లగా ఆహార పదార్థాల తయారీ, విక్రయాల్లో జోరు పెంచారు. జిల్లావ్యాప్తంగా వేలాది మంది మహిళలు ఈ రంగంలో రాణిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా, వీరు తయారు చేసే ఆహార పదార్థాలకు కచ్చితంగా భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ) ధ్రువ పత్రం కచ్చితంగా ఉండాలి. ఇవి లేకుండా ఆహార పదార్థాలు విక్రయిస్తే సంబంధిత అధికారులు నిబంధనలు పాటించలేదని గుర్తిస్తే ఇబ్బందులు తప్పవు. బహిరంగ వ్యాపారం ఆపేయాల్సిన పరిస్థితి తోడు జరిమానా కట్టాల్సి ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులు లేకుండా చేయడానికి ప్రభుత్వం కేవలం వెలుగు ద్వారా రూ. 100 నామ మాత్ర ఖర్చుతో ధ్రువపత్రాలు ఇప్పిస్తున్నారు.



« జిల్లాలో డ్వాక్రా సభ్యులు పూతరేకులు, హల్వా, పచ్చళ్లు, చిరుధాన్యాల, బెల్లంతో ఉత్పత్తులు, తిను బండారాలు, పిండి వంటలు తదితర వాటిని తయారు చేసి అమ్మకం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

« విక్రయాల్లో నాణ్యతాపరమైన ఇబ్బందులు లేకుండా లైసెన్సులు జారీకి జిల్లా గ్రామీణ వృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అండగా నిలుస్తోంది. వ్యాపారం చేసే మహిళలు ముందుకు వస్తే ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ. ద్వారా ధ్రువపత్రాలు జారీ చేయిస్తున్నారు.

« ఇందుకోసం వీరు తమ వివరాలను సమీప వెలుగు కార్యాలయంలో అందిస్తే స్థానిక అధికారులు లైసెన్స్ జారీ చేసే అధికారులతో మాట్లాడతారు. వారు ఆహార నాణ్యతను పరిశీలించి, అవసరమైతే తయారీలో నాణ్యత ప్రమాణాల పాటింపుపై అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ ఇస్తారు. ఆహార తయారీ సమయంలో నెత్తిన క్యాప్, చేతులకు గ్లౌజ్‌లు, నోటికి మాస్కు ధరించాలి.

రాయితీపై రుణాలు

మహిళలు తయారు చేస్తున్న ఆహార ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెంచేందుకు ప్రభుత్వం నాణ్యత ధ్రువీకరణపత్రం అందించే ఏర్పాటు చేస్తోంది. గతంలో దాదాపు రూ. వెయ్యి ఉన్న లైసెన్స్‌ను కేవలం రూ. 100కే ఇప్పుడు వెసులుబాటు కల్పించింది. దీనిపై జిల్లా అధికారుల ఆధ్వర్యంలో గ్రామాల్లో అందరికీ అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు సమీప వెలుగు కార్యాలయంలో సంప్రదించాలి. వ్యాపారం పెంచుకునే మహిళలకు ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పథకం ద్వారా రాయితీపై బ్యాంకు రుణాలూ ఇప్పిస్తున్నాం. – కలిగట్ల శ్రీనివాసరావు, ఏపీఎం, నక్కపల్లి



జిల్లా సమాచారం		
సంఘాలు	సభ్యులు	ఆహార ఉత్పత్తులు తయారు చేసేవారు
39,553	4,09,467	1330

'ఈ-ఔషధి'.. తప్పుతోంది గాడి

దారికి రాకుంటే ప్రాణాలకు ముప్పు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల నిర్వహణ గాడి తప్పుతోంది. వీటిని సక్రమంగా నమోదు చేయడానికి 'ఈ - ఔషధి' ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులో ఉన్నా ఫలితం దక్కడం లేదు. ఒక్కోసారి కాలం చెల్లిన మందులు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. ఇటీవల కాకినాడలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ (సీడీఎస్) నుంచి సరఫరా అయిన మందుల పరిస్థితిపై దుమారం చెలరేగింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు రాష్ట్రమంతా వీటిపై అప్రమత్తమయ్యారు. జిల్లాలోనూ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇవి పకడ్బందీగా చేపట్టేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మందు సీసాపై తేదీలు పరిశీలిస్తున్న వైద్యాధికారులు

పక్కాగా లేని ఈ-ఔషధి విషయంపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. దీనిపై అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాలకు ప్రత్యేక సూచనలు చేశారు. పకడ్బందీగా ఆన్‌లైన్లో ఇవి నమోదు కాకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ అయ్యాయి. అనకాపల్లి జిల్లాలోనూ అక్కడక్కడ ఇవి గాడి తప్పుతున్నాయి. విశాఖపట్నంలోని సీడీఎస్ నుంచి అనకాపల్లి సహా విశాఖ, అల్లూరి జిల్లాకు ఇండెంట్ ప్రకారం మందులు సరఫరా అవుతుంటాయి. ఆరోగ్య కేంద్రాల్లో రోగి పేరు, ఓపీ కార్డు నంబరు నమోదు చేసి, రాసిన మందుల బ్యాచ్ నంబర్లు నిక్షిప్తం చేస్తే వాటి మనుగడ తీరే తేదీ పోర్టల్‌లో కనిపిస్తాయి. ఫార్మసిస్టులు కొందరు పనుల ఒత్తిడి, ఓపీ రద్దీ తదితర కారణాలతో ఆన్‌లైన్ విధానం పట్ల శ్రద్ధ చూపడం లేదు. కొందరికి సాంకేతికతపై పట్టు లేకపోవడంతోనూ సమస్యలు అధికమవుతున్నాయి.

సాధారణంగా సీడీఎస్‌ల నుంచి జిల్లా కేంద్రాలకు అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు ఔషధాలు సరఫరా అవుతుంటాయి. కాకినాడ నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి వచ్చే మందుల నిర్వహణ సరిగ్గా లేదని గుర్తించారు. ఇవి ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో ఏ బ్యాచ్ మందులు ఏయే ఆసుపత్రికి పంపించారో తెలియని పరిస్థితి ఉంది. స్వయంగా ఏపీఎంఎస్ఐడీసీ ఉన్నతాధికారుల విచారణలోనే ఈ విషయం బయటపడింది. దీని వల్ల గడువు మీరిన ఔషధాల వివరాల తెలియడం లేదు. ఫలితంగా నెల రోజులలోపే కాలం చెల్లినవి రోగులకు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా వచ్చిన ఫిర్యాదు సైతం కలకలం రేపింది.

జిల్లాలో మూడు నెలలకు ఒకసారి ఒక్కో ఆరోగ్య కేంద్రానికి రూ. 3.5 లక్షల ఖరీదైన మందులు పంపిణీ అవుతున్నాయి. ఈ-ఔషధిలో అన్నీ నమోదయ్యేలా పక్కాగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమవతి తెలిపారు. అన్ని పీహెచ్‌సీల్లో ప్రత్యేక రిజిస్టర్ ఉంచి వాటిలో మందుల వివరాలు, తేదీలు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా మందులు ఉండిపోతే అవసరమైన ఆసుపత్రులకు వాటిని పంపేలా చూస్తున్నాం. కాలం చెల్లడానికి దగ్గర పడుతున్న వాటిని ముందుగానే గుర్తించి పంపిణీకి తొలుత ప్రాధాన్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేశామని వివరించారు.

మేఘాల నడుమ.. కొండల మధ్య

ఈనాడు, విశాఖపట్నం

ఆకట్టుకునేలా ఏపీటీడీసీ రిసార్టులు

పర్యాటక సీజన్ ఆరంభంతో సందర్శనీయ ప్రదేశాలు కళకళలాడుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటకుల వసతి కోసం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక ప్యాకేజీలు నిర్వహిస్తోంది. విశాఖతో పాటు అరకు, అనంతగిరి, లంబసింగిలో విలాసవంత సౌకర్యాలతో అందుబాటు ధరల్లో పర్యాటకులకు గదులు సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా లోయలను ఆనుకొని కొండల మధ్య ప్రశాంత వాతావరణం అందరినీ ఆకట్టుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

లంబసింగి రిసార్టు

ప్రత్యేక ప్యాకేజీలతో: పర్యాటకుల కోసం ఏపీటీడీసీ వసతులను సిద్ధం చేసింది. గదుల వద్ద క్యాంప్‌ఫైర్, ధింసా నృత్యం ఉంటాయి. బృందాలుగా, కుటుంబ సభ్యులతో వచ్చే వారికి ప్రత్యేక ప్యాకేజీలున్నాయి. బొంగు చికెన్, నాటు కోడి రుచులు అందిస్తాం' అని ఏపీటీడీసీ డీవీఎం జగదీష్ పేర్కొన్నారు.

అద్భుతం.. అనంతగిరి: ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థకు అనంతగిరి హిల్ రిసార్టు ఎంతో ప్రత్యేకం. కొండ వాలుకు ఆనుకొని ప్రత్యేకంగా నిర్మించిన రిసార్టు ఎంతగానో అలరిస్తుంది. ఏసీ సూట్ గదుల నుంచి చూస్తే ప్రకృతి అందాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి.

లంబసింగిలో: లంబసింగిలోని హరితా రిసార్టు పచ్చని కొండల నడుమ అలరిస్తుంది. తెల్లవారుజాము పొగమంచు, చల్లటి వాతావరణంతో సందర్శకులను మైమరపిస్తుంది. ఇక్కడి గదులు రూ. 4 వేల నుంచి అందుబాటులో ఉన్నాయి.

ఏపీటీడీసీ హోటళ్లలో ధరలు ఇలా (రూ.లలో)

గదుల రకం	సోమ-గురు	వారాంతం
అరకు వ్యాలీ రిసార్టు		
ప్రీమియం ఏసీ లగ్జరీ	4,200	4,900
ఏసీ సూట్	3,080	3,640
ఏసీ డీలక్స్	2,800	3,360
హిల్ రిసార్టు మయూరి (అరకు)		
ప్రీమియం ఏసీ లగ్జరీ	4,928	5,600
ఏసీ సూట్స్	3,8,08	4,480
ప్రీమియం ఏం	3,1,36	3,584
ఏసీ డీలక్స్	2,688	3,136
ఏసీ స్టాండర్డ్	2,240	2,688
క్రాఫ్ట్ సెంటర్	1,680	2,016
యాత్రి నివాస్ (విశాఖ)		
ఏసీ డీలక్స్	4,856	5,250
ఏసీ ఎగ్జిక్యూటివ్	3,281	3,675
ఏసీ సూట్	3,938	4,331

బుకింగ్ కోసం.. www.aptdc.in, www.tourism.ap.gov.in 9848813584 నంబర్‌లో సంప్రదించొచ్చు.

ఉపాధ్యాయుల్లో ఉత్సాహం

జిల్లావ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. గురువులు బృందాలుగా ఏర్పడి పోటీల్లో పాల్గొంటున్నారు. నక్కపల్లిలో ఉత్సాహంగా పోటీలో పాలు పంచుకుంటున్న ఉపాధ్యాయిని. – నక్కపల్లి, న్యూస్‌టుడే

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన వివిధ జిల్లాలకు చెందిన బాలబాలికలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ పరిశీలకులు పట్టాభిరామ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ఎం.నాయుడు సోమవారం వెల్లడించారు. జాతీయ స్థాయి బాలుర జట్టుకు 12 మంది, బాలికల జట్టుకు 12 మంది క్రీడాకారులతో పాటు మరో ఐదుగురు చొప్పున స్టాండ్‌బై ప్లేయర్స్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. రాజస్థాన్‌లో త్వరలో జరిగే పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని వారు పేర్కొన్నారు. ఎంపికైన జట్లను అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు అభినందించారు.

★ బాలుర జట్టులో విశాఖ నుంచి జె.హర్షవర్ధన్, జి.మనోహర్‌నాయుడు టి.శ్రుతిసాయికీర్తన్, చరణ్.. బాలికల జట్టులో.. ఆర్.శ్రుతిక, ఆర్.లలితాదేవి ఉన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కదిలేనా.... కలగానే మిగిలేనా

సాకారం కాని పూడిమడక ఫిషింగ్ హార్బర్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

ఫిషింగ్ హార్బర్‌కు ప్రతిపాదించిన స్థలం

పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ప్రజాభిప్రాయ సేకరణకే పరిమితమైంది. గత వైకాపా ప్రభుత్వం హార్బర్ ఏర్పాటుపై రెండేళ్లపాటు హడావుడి చేసి ఎన్నికల ముందు గాలికొదిలేసింది. ఫలితంగా మత్స్యకారులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

20 వేల జనాభాగల పూడిమడక రాష్ట్రంలోనే అతిపెద్ద మత్స్యకార గ్రామం. విశాఖపట్నం హార్బర్ తరవాత అతి ఎక్కువగా చేపలవేట సాగించేది ఇక్కడే. గ్రామంలోని 90 శాతం మందికి ఇదే జీవనాధారం. వైకాపా ప్రభుత్వం ఇక్కడ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని ప్రకటించింది. దీనికి గ్రామంలోని సర్వే నం. 139లో ప్రాజెక్టుకు అవసరమైన భూమిని గుర్తించింది. 2020 డిసెంబర్ 31న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. మత్స్యకారులంతా పార్టీలకు అతీతంగా ప్రాజెక్టును ఆహ్వానిస్తూ మాట్లాడారు. రోజూ చేపల వేటకు బోట్లను మోసుకుంటూ వెళ్తుండడం చాలా కష్టంగా ఉంటోందని, హార్బర్ నిర్మాణం పూర్తయితే ఈ కష్టాలు తీరిపోతాయని ఆశించారు. నిర్మాణానికి రూ.350కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతి ఇచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్మాణానికి టెండర్లు పిలవకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో మత్స్యకారుల ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు ఆదిలోనే అటకెక్కినట్లయింది.

మత్స్యకారుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం పూడిమడక ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టుపై సాంకేతిక నిపుణులతో ప్రత్యేకంగా అధ్యయనం చేయించింది. నూతన సాంకేతికత వినియోగించి తక్కువ వ్యయంతో తక్కువ సమయంలో ప్రాజెక్టు పూర్తయ్యేలా నివేదిక అందివ్వాలని కోరింది. దీంతో నిపుణులు వచ్చి ప్రాజెక్టుపై విచారణ చేసినా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. పూడిమడకలో తీరం తరచూ కోతకు గురవుతుండటం, కెరటాల తాకిడికి పడవలు, వలలు దెబ్బతినడం మత్స్యకారులు ఎన్నెన్నో ఇబ్బందులు పడుతున్నారు.

పూడిమడక జనాభా :	సుమారు 20 వేలు
బోట్లు :	600 వరకు
హార్బర్‌కు ఎంపిక చేసిన భూమి :	37 ఎకరాలు
ప్రతిపాదిత వ్యయం :	రూ. 350 కోట్లు

ఎన్టీపీసీ పీడీ 'సింహాద్రి' సందర్శన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీని సోమవారం ఎన్టీపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ కె.షణ్ముగ సుందరం సందర్శించారు. తొలుత ఆయనకు సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంస్థ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో సంస్థ సీనియర్ అధికారులతో సుందరం సమావేశమయ్యారు. సింహాద్రి సంస్థ పురోగతి, కార్యాచరణ, పనితీరు తదితర కీలకాంశాలపై సమీక్షించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు స్పోర్ట్స్ మీట్ 6న

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఈనెల 6న ఏఎంఏఎల్ కళాశాలలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామని సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాథమిక సమన్వయ కర్త ఆర్.జయప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా రాష్ట్ర, జాతీయ స్థాయి పారాలింపిక్స్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనే వారి ఎంపికకు 17 నుంచి 20 ఏళ్లలోపు ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలు అర్హులన్నారు. నిర్దేశించిన ప్రమాణాలు మేరకు పరుగుపందెం, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో, క్లబ్‌త్రో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పారాలింపిక్స్‌కు పంపిస్తామన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. పట్టణంలో ఏఎంఏఎల్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాల ప్రధానాచార్యులతో జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో నమూనా పరీక్షలు నిర్వహించి పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి మంచి ఫలితాలను రాబట్టాలన్నారు. ఈనెల 5న జరిగే మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని పండగ వాతావరణంలో జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదే అన్నారు. ఆర్‌ఐఓ వినోద్‌బాబు, జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు, సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలల సమన్వయకర్త మేరీగ్రేస్, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు మంగవేణి, ఏపీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఏపీలోనే అధిక పింఛను : సభాపతి

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఎక్కువ పింఛను సొమ్ము ఇచ్చేది ఏపీలోనేనని సభాపతి అయ్యన్నపాత్రుడు చెప్పారు. నర్సీపట్నం మండలం అమలాపురంలో సోమవారం పింఛనుదారులకు నగదు పంపిణీ చేశారు. ప్రతి నెలా 63.26 లక్షల మందికి రూ.2,738 కోట్లు పింఛనుగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణాలో రూ.2 వేలు, ఒడిశాలో రూ.500, కర్ణాటకలో రూ.600, తమిళనాడులో రూ. వెయ్యి మాత్రమే పింఛనుగా ఇస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలా ఒకటో తేదీనే రూ. 4 వేల చొప్పున ఇస్తున్నారన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రూ. 15 వేలు, కిడ్నీ సంబంధ రోగులకు రూ. 10 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేల చొప్పున అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అమలాపురంలో నాలుగు సీసీ రోడ్లకు రూ. 18.85 లక్షలు, శ్మశానం అభివృద్ధికి రూ. 10 లక్షలు, బయ్యపురెడ్డిపాలెం నుంచి యరకన్నపాలెం, వెలగలపూడి రోడ్లకు రూ.2 కోట్లు మంజూరు చేశామన్నారు. ఆర్‌డీఓ రమణ, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యచంద్ర, జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, వేములపూడి ఎంపీటీసీ సభ్యుడు రామప్రసాద్ పాల్గొన్నారు.

అమలాపురంలో పింఛను నగదు అందిస్తున్న అయ్యన్న

2,38,259 మందికి రూ.100 కోట్ల పంపిణీ

పరవాడ మండలం కన్నూరుపాలెంలో దివ్యాంగ పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 24 మండలాలతో పాటు అనకాపల్లి జీవీఎంసీ, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీల పరిధిలో 2,56,338 మంది పింఛను లబ్ధిదారులకు తొలి రోజు సోమవారం 2,38,259 మందికి రూ.100 కోట్ల మేర పింఛను నగదు పంపిణీ చేశామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి పేర్కొన్నారు. 18079 మంది మిగిలిపోయారన్నారు. ఇంటి వద్ద అందుబాటులో ఉన్న అందరికీ సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ ఆధారంగా అందజేశారన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ పరవాడ మండలం కన్నూరుపాలెంలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగ, వితంతు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛను పంపిణీ చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

గంజాయి నిందితులకు పదేళ్ల జైలు

చోడవరం, న్యూస్‌టుడే: 2015 నాటి గంజాయి కేసులో నలుగురు నిందితులపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ స్థానిక కోర్టు తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ సోమవారం తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. నిందితుల్లో రోలుగుంట మండలానికి చెందిన మడ్డు నరసింహరాజు, చీడికాడ మండలం అడవి అగ్రహారం వాసి దాలిబోయిన ఫాల్గుణ, నర్సీపట్నంలోని ద్వారకానగర్‌కు చెందిన బంగారు సంతోష్, తెలంగాణ రాష్ట్రం తొర్రూరు మండలం చిన్న వంగర గ్రామానికి చెందిన ధారావత్ రవి ఉన్నారు. 2015 మార్చి 1న పోలీసుల తనిఖీల్లో నలుగురు నిందితులు కారులో 140 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. ఏపీపీ చంద్రశేఖర్ వాదనలు వినిపించారు.

వైద్యుడిగా ఆరోగ్యదానం.. అవయవదాతగా ప్రాణదానం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: చెట్టుపల్లి గ్రామంలో ఆర్‌ఎంపీగా మేడిశెట్టి రాజు స్థానికులకు ప్రాథమిక వైద్య సేవలు అందించేవారు. ఆయన జీవితం అకస్మాత్తుగా బ్రెయిన్‌డెడ్‌తో ముగిసిపోయింది. అవయవదానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో ఇద్దరి ప్రాణాలు నిలిచాయి. కొద్దిరోజుల కిందట కిందట పక్షవాతానికి గురైన రాజును విశాఖపట్నంలోని కిమ్స్ ఆసుపత్రిలో చేర్చారు. ఆకస్మికంగా బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు వైద్యులు ధ్రువీకరించారు. జీవన్‌దాన్ సభ్యుల విన్నపం మేరకు అంతటి బాధలోనూ కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకారం తెలిపారు. అదే ఆసుపత్రిలో ఓ రోగికి కాలేయాన్ని అమర్చగా, ఊపిరితిత్తులను గ్రీన్ ఛానల్ ద్వారా సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ తరలించారు.

మేడిశెట్టి రాజు (పాత చిత్రం)

పార్టీలకు అతీతంగా సేవలందిస్తా

రాజాన శేషుకు నేమ్ బోర్డును బహూకరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి ఎంపీపీగా జనసేన నాయకుడు రాజాన సూర్య చంద్ర శేషగిరిరావు (శేషు) సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులతో భారీ ర్యాలీగా కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శేషును సత్కరించారు. కార్యాలయ ఆవరణ అభిమానులతో నిండిపోయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయకుమార్ సహకారంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. అవిశ్వాసంలో ఓడిపోయిన వైకాపా నాయకుడు గోవింద్ వెంటనే ఎంపీపీ పదవికి రాజీనామా చేయాల్సిందిపోయి కూటమి నాయకులపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. గోవింద్ ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీకి సాయం చేశారంటూ జరిగిన రాజకీయ పరిణామాలన్నీ వివరించారు. పార్టీలకు, కులాలకు అతీతంగా ప్రజలకు సేవలందిస్తానన్నారు. నాయకులు అన్నం బాబ్జీ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కాండ్రకోట చిరంజీవి, పిట్టా శ్రీను, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా మునిగే నావ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వైకాపా మునిగే నావ అని, జగన్‌ను నమ్ముకుంటే నాయకులు మునిగిపోవడం, జైలుకెళ్లడం ఖాయమని ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి సుశాంత్ మిత్రా తెలిపారు. అచ్యుతాపురంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్ నమ్ముకొని అక్రమాలు, అన్యాయాలు చేసిన ఎంతోమంది జైలుకు వెళ్లారని, వైకాపా అవినీతిలో పుట్టుకొచ్చిన పార్టీ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కేంద్రం నాశనం చేస్తోందని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం మనగడ సాధించాలన్నా, అన్నివర్గాలకు మేలు జరగాలన్నా కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయాలన్నారు. పార్టీ నుంచి వైకాపాలోకి వెళ్లి నాయకులు తిరిగి కాంగ్రెస్ గూటికి రావాలన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తనకాల అనంతరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎంవీ రాహుల్ ఆయనకు జ్ఞాపికను అందించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేడ సురేష్, రావి రామసత్యం, దొడ్డి రవి, రాము, నాగమంత్రి సాయి పాల్గొన్నారు.

సుశాంత్‌మిత్రాకు జ్ఞాపిక అందజేస్తున్న అనంతరావు, రాహుల్

కరాటే పోటీల్లో బంగారు పతకాలు

పతకాలు సాధించిన విద్యార్థులు

మునగపాక, న్యూస్‌టుడే: గాజువాకలో నిర్వహించిన నేషనల్ కరాటే పోటీల్లో మునగపాక మండలానికి క్రీడాకారులు బంగారు, వెండి, రజత పతకాలు సాధించారని కోచ్ కాకర శివ తెలిపారు. మునగపాకకు చెందిన సాంబారు దివ్యశ్రీ, జి.రాజేష్ బంగారు.. హర్షవర్ధన్, సాయి వెండి.. కాండ్రేగుల శతన్ కాంస్య పతకాలు సాధించారన్నారు. వీరిని కరాటే మాస్టారు శివ, నాయుడు అభినందించారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు సోమవారం చెప్పారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ టోర్నమెంట్‌లో అండర్-17 విభాగంలో విశాఖ జిల్లా బాలుర జట్టులో ఎస్.తుల సిరాజ్, జి.రాజేష్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఢిల్లీలో జనవరిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఉపాధ్యాయులు రవి, చంద్రదేవి, నాయుడు, శ్రీను విద్యార్థులను అభినందించారు.

అన్నదాతల పంట పండింది

65 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు | 35 వేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చురుగ్గా అడుగులు వేస్తోంది. జిల్లాలో 65 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. విక్రయించిన 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటోంది. వ్యాపారులు, దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధరలకు విక్రయించాలని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

★ ఈ ఏడాది వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో అన్నదాతలకు శ్రమకు తగిన ఫలితం దక్కింది. ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 54,465 హెక్టార్లు కాగా 66,116 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. సాగు నీటికి ఢోకా లేకపోవడంతో మెట్ట ప్రాంతాల్లోనూ బాగా పండింది. ఇప్పటికే చాలా చోట్ల కోతలు ప్రారంభమయ్యాయి.

★ ధాన్యం సేకరణలో ఇబ్బందులు, సకాలంలో డబ్బులు రాకపోవడం తదితర కారణాలతో రైతులు ఎక్కువగా దళారులను ఆశ్రయిస్తున్నారు. మద్దతు ధర కంటే తక్కువకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గమనించి ఈసారి ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసింది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 65 చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రేడ్-ఎ రకం క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకాలకు రూ.2,369 ధరగా నిర్ణయించింది.



వడ్డాది కస్పా పొలంలో పండిన వరి

★ దేవరాపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కలెక్టర్‌తో కలిసి ఇటీవల ప్రారంభించారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది, కోమళ్లపూడి, బుచ్చెయ్యపేట రైతు సేవా కేంద్రాల వద్ద కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు.

● ధాన్యం విక్రయాలకు వాట్సాప్ సేవలు: ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేస్తూ, రైతుల సమయం వృథా కాకుండా ఉండేందుకు వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. విక్రయించాలనుకున్న రైతులు 73373 59375 నంబరుకు వాట్సాప్‌లో 'హాయ్' అని మెసేజ్ పంపి షెడ్యూల్ చేసుకోవచ్చు.

రైతేరాజు

● 'హాయ్' మెసేజ్ పంపగానే ఏఐ ద్వారా ప్రత్యేక వాయిస్‌తో సేవల వినియోగంపై మార్గనిర్దేశం చేస్తుంది. రైతు ఆధార్ నంబర్ నమోదు చేశాక పేరును ధ్రువీకరించాలి. ధాన్యం విక్రయించాలనుకున్న తేదీలకు సంబంధించి మూడు ఐచ్ఛికాల్లో ఏదో ఒక తేదీని, సమయాన్ని ఎంపిక చేసుకోవాలి. ధాన్యం రకం నమోదు చేశాక, ఎన్ని బస్తాలు విక్రయిస్తున్నారో నమోదు చేయాలి. ఆ తర్వాత రైతులకు ధాన్యం విక్రయ స్లాట్ బుక్ అయినట్లు షెడ్యూల్ చేసిన కూపన్ కోడ్ వస్తుంది. ఆ కోడ్ చూపి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించవచ్చు.

పొలుసు పురుగులు ఆశిస్తే నల్లటి మచ్చలు

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సలహా

? ఎకరా విస్తీర్ణంలో చెరకు సాగు చేస్తున్నా. గడల మీద నల్లటి మచ్చలు వస్తున్నాయి. నివారణకు ఏం చేయాలి. – దాడి శివ, మునగపాక

✔: పొలుసు పురుగులు ఆశిస్తే ఇలా జరుగుతుంది. నివారణకు మొవ్వు నుంచి కనీసం 8 ఆకులు ఉంచి మిగిలిన వాటిని తొలగించాలి. డైమిథేయేట్ 2 మి.లీ. మందు లీటరు నీటిలో కలిపి గడలు తడిసేలా పిచికారీ చేయాలి.

? వరి కోతల అనంతరం దుక్కిలేకుండా మొక్కజొన్న సాగు చేయవచ్చా. – ఎస్.వి.ఆర్.నాయుడు, అరబుపాలెం

✔: దుక్కి లేకుండా సాగు చేయవచ్చు. వరి కోతల అనంతరం భూమిలో తగిన తేమ ఉంటే చిన్న చిన్న గుంతలు తీసి మొక్కజొన్న గింజలు నాటుకోవాలి. ఎకరాకు ఏడు కేజీల విత్తనం అవసరం. నాటిన మరుసటి రోజు కలుపు మందు పిచికారీ చేయాలి.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త **కె.వి.రమణమూర్తి** సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి

రైతుల ప్రశ్నలు, సందేహాలకు పాడేరు ఏరువాక కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్ సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10- సా. 4 గంటల వరకు 95505 06498 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

రబీలో చోడి సాగుకు ఇదే అదును

అనకాపల్లి, న్యూస్‌టుడే: రబీలో చోడి సాగుకు ఇదే సరైన సమయమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. డిసెంబరు నెలాఖరు వరకు నాటుకోవచ్చు. అనువైన రకాలను ఎంచుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త దాడి ఉమామహేశ్వరరావు చెబుతున్నారు.

★ ఈ ఏడాది కురిసిన వర్షాలకు చెరువులు, నూతుల్లో పుష్కలంగా నీరు చేరింది. ఈ నీటిని సద్వినియోగం చేసుకుంటూ రబీలో పంటలు పండించవచ్చు. ఏ పంటకైనా రకాల ఎంపికే ప్రధానం. చోడిలో రబీ సాగుకు గోదావరి, సప్తగిరి, చంపావతి, భారతి రకాలు అనుకూలం. నారు పెంచి నాటితే ఎకరాకు 2.5 కేజీల విత్తనం సరిపోతుంది. వరి కోతలకు ముందు నేరుగా భూమిలో వెదజల్లడం మేలు. ఇలా చేస్తే దుక్కి ఖర్చులు తగ్గుతాయి. ఇందుకోసం ఎకరాకు నాలుగు కేజీల విత్తనం అవసరం అవుతుంది. వెదజల్లే ముందు రోజు విత్తనాన్ని బాగా నానబెట్టాలి.

■ గోదావరి రకం 120 నుంచి 125 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 12 నుంచి 16 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఎక్కువగా పిలకలు వస్తాయి. మొక్క పచ్చగా ఉంటుంది. వెన్నులు పెద్దవిగా ఉంటాయి. గింజలు ఎరుపు, గోధుమ రంగులో మధ్యస్థంగా ఉంటాయి.

■ సప్తగిరి రకం 110 నుంచి 115 రోజుల్లో కోతకు వస్తుంది. పంట ఏపుగా పెరుగుతుంది. పిలకలు ఎక్కువగా వస్తాయి. భారతి రకం 105 నుంచి 110 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 14 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. వెన్ను పెద్దగా ఉండి అగ్గితెగులును తట్టుకుంటుంది.

■ చంపావతి స్వల్పకాలికం. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. 80 నుంచి 85 రోజుల్లో కోతకు వస్తుంది. కందిలో అంతర పంటగా వేసుకోవచ్చు. దిగుబడి ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు రావచ్చు.

■ ఎకరాకు 12 కేజీల నత్రజని, 12 కేజీల భాస్వరం, 8 కేజీల పొటాష్ నాటే సమయంలో వేసుకోవాలి. నాటిన నెల రోజులకు 12 కేజీల నత్రజని వేసుకోవాలి. కలుపు నివారణకు విత్తనం వేసే ముందు / నారు నాటే ముందు ఎకరాకు 600 మి.లీ. పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నాటిన 25 రోజులకు 400 గ్రాముల 2.4డి సోడియం సాల్ట్ 200 లీటర్ల నీటిలో కలిపి చల్లాలి.

తగ్గిన బెల్లం ధరలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా అన్ని రకాల బెల్లం ధరలు తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.195, మధ్య రకాలు రూ.210, నాసి రకాలు రూ.635 ధరలు తగ్గాయి.

రకం	రంగులు	మధ్య	నాసి
గత వారం (రూ.)	4,180	3,895	3,765
ఈ వారం (రూ.)	3,985	3,685	3130

అర్జీదారులకు భరోసా కల్పించండి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి భారీగా అర్జీదారులు తరలివచ్చారు. అనంతరం కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అర్జీని నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. సంతృప్తి చెందేలా అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. నేరుగా అర్జీదారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి భరోసా కల్పించాలని సూచించారు. పరిష్కారం కాని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి శాఖ అధికారులు నిత్యం వీటిపై సమీక్ష చేపట్టాలన్నారు. వివిధ సమస్యలపై 276 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ 149, పంచాయతీరాజ్ 32, పోలీసు 15, మార్కెటింగ్ శాఖకు సంబంధించి 7 అర్జీలు ఉన్నాయి. వీటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించారు.

★ జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు తక్షణమే కార్మిక చట్టాలు అమలు చేయాలని ఒప్పంద వైద్య కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే బకాయి వేతనాలు మంజూరు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలన్నారు. కనీస వేతనం రూ. 16 వేలు అమలు చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ కార్మికులకు సకాలంలో చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు.

★ ఎలమంచిలి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వైకాపా ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా నక్కపల్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం తగదన్నారు.

అనకాపల్లిలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినంలో భాగంగా సోమవారం జిల్లా ఆసుపత్రి నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని న్యాయమూర్తి రమేశ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక పరివర్తనతో ఎయిడ్స్‌ను నిర్మూలించవచ్చన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హైమావతి, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు ఉచిత ప్రయాణ సౌకర్యం

జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న రమేష్, హరనాథ్‌బాబు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులు, ప్రజలకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ రమేష్, జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు ప్రకటించారు. శంకరం వద్ద వాహనాన్ని సోమవారం ప్రారంభించారు. కలెక్టరేట్‌కు రావడానికి సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్జీదారుల రవాణా కష్టాలు తీర్చాలనే లక్ష్యంతో శంకరం జాతీయ రహదారి వద్ద టాటా ఏస్ వాహనం ప్రతి సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.

బిల్లు చెల్లించాలని కలెక్టర్‌తో వాగ్వాదం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆరోగ్య సేవా కేంద్రం బిల్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సబ్బవరం మండలం వైకాపా ఉపాధ్యక్షుడు ఎర్ల నాయుడు కలెక్టర్, అధికారులతో వాగ్వాదానికి దిగారు. నాయుడు మాట్లాడుతూ కేంద్రం నిర్మాణ పనులు పూర్తైనా రూ. 7.5 లక్షలు చెల్లించకుండా తాత్సర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది క్రితం పంచాయతీ ఖాతాలో నగదు జమ చేసినా చెల్లించడం లేదని, పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పంచాయతీరాజ్ అధికారులు, కలెక్టర్‌తో బిల్లు చెల్లించేవరకు కదలనని స్పష్టం చేశారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతో గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం హెచ్చరించి వదిలిపెట్టారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

మాట్లాడుతున్న మాజీ మంత్రి వీరభద్రరావు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రైతాంగ సమస్యల పరిష్కారానికి అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం తరఫున ప్రత్యేక చొరవ చూపుతామని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో సంఘ నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. సంఘ అధ్యక్షులుగా దాడి వీరభద్రరావు, ఉపాధ్యక్షులుగా విల్లూరి పైడారావు, ఆళ్ల నూకేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా విల్లూరి రాము, కార్యదర్శిగా విల్లూరి మాధవరావు, కర్రి మోదినాయుడు, కోశాధికారిగా కర్రి గుణతో పాటు 25 మంది సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అనకాపల్లితో కలిసి ఉన్న మునగపాక, అచ్యుతాపురం ప్రాంతాలను నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌లో కలిపే ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. అనకాపల్లిలో రైతుబజార్‌ను రైతు సంఘాలతో చర్చించి నిర్మాణ పనులు చేయాలని తీర్మానించారు. మార్క్‌ఫెడ్ అధికారులు మొక్కజొన్న, టమాటాలను కొనుగోలు చేయాలని, శారదానదిపై గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టాలని, రైతుల బీమా ప్రభుత్వం చెల్లించి నష్ట పరిహారం అందించాలన్నారు. అనకాపల్లిలో పంటకాలువ ఆక్రమణలు తొలగించాలని, తుమ్మపాల చక్కెర కర్మాగార స్థలాలు ప్రైవేటు వ్యక్తులకు కాకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంచాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు దాడి రత్నాకర్, కొణతాల సత్యనారాయణ, బాబీ, భీశెట్టి కృష్ణప్పారావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును. అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

TENDER

ITC లిమిటెడ్ ABD, అనపర్తి-533342 వద్ద గల 124 KL HSD ట్యాంక్, 225 KVA స్టెబిలైజర్, MS, పుడ్, కన్వేయర్ బెల్టులు, SS, అల్యూమినియం, రబ్బర్, కేబుళ్లు కెపాసిటర్లు వగైరాలకు 15-12-2025న e-కోట్ కలదు. తనిఖీ 08-12-2025 నుండి 10-12-2025. టెండరు ఫారం ధర రూ.500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14. Contact Phone No : 09840731925. www. welcomeauctioneers.com.

REAL ESTATE

PLOT FOR SALE

GAJUWAKA

296 Sq. Yards North Facing. Srinagar, Ginger Hotel Backside. Gajuwaka, Visakhapatnam. Cont.: 9346717891, 9949839498.

GENERAL

VZM Local Skanda Township near JNTU Jn., VMRDA Approved Plots for Sale. Ready for House Construction 90% bank loan facilities on market value. ✆ 8247755114.

JOBS

Marketing Executives 30K, Telecallers 15K, Digital (GMP, Web, Social Media seo) 20K. Contact: 9381756318, 9948011609

Wanted ITI and Diploma in Electrical Freshers Candidates Contact: Positive Controls, Vizag. ✆ 9505055334, 9581643934.

Wanted PROs & Telecallers (Reputed College, Vizag) PROs Required: Vijayanagaram (Local/ Non-Local) All Areas & Gajuwaka (Vizag) Telecallers Required: Visakhapatnam-Local. Work Location: NAD, Gajuwaka Salary: Negotiable. Contact : 9640205759, 8328684222 For Telecallers: 8886465396/ 7702222927.

Wanted Sr. Marketing Team Leader/ Manager for a reputed Wholesale Furniture Factory in Vizag. 2 Wheeler Mandatory. Marketing Experience must. Salary 20,000/- to 25,000/- +TA +Incentives. Contact: ✆ 8096806969.

Urgent Opening /Tele Callers. Male /Female with Good Communication Skills. Salary upto 30,000/-. ✆ 8008182346, 9381065292.

JANANI MOTHER & CHILD NOW HIRING! FRONT OFFICE EXECUTIVE - 1 OP NURSE - 1 OT Nurse - 1 (Above all Posts Required 2 to 3 years Experience) Kommadi Double Road, Madhurawada, Vizag ✆ 9673113306

మీ ఇంటి దగ్గరలో PRO జాబ్. లెస్ పర్క్, లెస్ టైమ్. ఈజీ వర్క్. నో టార్గెట్. గుడ్ కమీషన్. అందరూ అర్హులే. నో ఎక్స్‌పీరియన్స్. ✆ 9490972901.

ఆయా కావలెను : స్కూల్లో పనిచేయుటకు 45సం॥లోపు ఆడ మనిషి కావలెను: N.T. స్కూలు, అక్కయ్యపాలెం, వైజాగ్-16. ✆ 9398709459, 9959094720.

FACULTY/ TEACHERS

Wanted Exp. Leady Teachers for 6th to 9th English, Social and 1st & 2nd Hindi. Cont: Success "N" Success School. 9492641179.

DRIVERS

Wanted TATA ACE Drivers & Heavy Vehicle Drivers for International Courier in Vizag. Cont: 9966052040.

ACCOUNTING

Accountant required with tally experience as account at our firm Salary 14000/-. contact: 9866048888.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్: ఆటోనగర్, పెందుర్తి, శొంఠ్యాం ఏరియాల్లో చేయుటకు గార్డ్స్ కావలెను. అర్హత: 10th, 8గం॥ డ్యూటీ. Age:25-45. ✆ 2721672, 9440387815

సెక్యూరిటీగార్డులు కావలెను. RTC కాంప్లెక్స్, జగదాంబ ఏరియాల్లో పనిచేయుటకు. జీతము: 12,000/- - 15,000/- ✆ 7780236249 / 6300725191.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

చట్టపరిధిలో సమస్యల సత్వర పరిష్కారం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: చట్ట పరిధిలోని సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ఎస్‌హెచ్‌ఓలు శ్రద్ధ చూపాలని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 70 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో ఆయన నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వీటిని పరిష్కరించేలా చూడాలన్నారు. ఒకవేళ పరిష్కారం కాకపోతే ఎందుకు చేయలేకపోయారో చెప్పాలన్నారు. అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

క్షేత్రస్థాయిలో భాజపా బలోపేతానికి కృషి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో భాజపాను బలోపేతం చేసేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా కిల్లాడ వెంకట సత్యనారాయణ, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షులుగా శరగడం వరహా వెంకట శంకరావు, జిల్లా మహిళామోర్చా అధ్యక్షులుగా ఓరుగంటి నాగమణి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా గొటివాడ సామ్రాట్‌కుమార్, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా షేక్ బాబాజీ నియామకయ్యారు. అనంతరం వీరిని సత్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, పలకా రవి, రత్నభరత్ పాల్గొన్నారు.

పరిహారంలో న్యాయం చేయాలని ఆందోళన

నక్కపల్లి, న్యూస్‌టుడే: పరిశ్రమల నిమిత్తం ఇళ్లను కోల్పోయిన తమ్మయ్యపేట నిర్వాసితులకు పరిహారం విషయంలో న్యాయం చేయాలని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, గ్రామానికి చెందిన లబ్ధిదారులతో కలిసి నక్కపల్లి రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లను సర్వే చేసి నష్టపరిహారం అంచనా వేయడంలో అధికారులు అన్యాయం చేశారన్నారు. దీని కారణంగా బాధితులకు తక్కువ పరిహారం వచ్చిందన్నారు. పెళ్లయిన ఆడపిల్లలకూ ప్యాకేజీతోపాటు ఇంటిస్థలాలు ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దారు ఆర్.నరసింహమూర్తికి కలిసి వినతిపత్రం అందించారు. నాయకులు గంటా తిరుపతిరావు, తళ్ల భార్గవ్, గొర్ల గోవింద్, చిన్న, రోహిణిరాణి పాల్గొన్నారు.

నక్కపల్లి రెవెన్యూ కార్యాలయం ఎదుట లబ్ధిదారులు

భార్యను హత్య చేసిన భర్తపై కేసు

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం ఇంద్రపాలెంలో ఆదివారం భార్యను హత్యచేసిన కేసులో నిందితుడిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశామని సీఐ చైతన్యకృష్ణ, ఎస్సై వీరబాబు తెలిపారు. సీఐ మాట్లాడుతూ నర్సీపట్నం వేములపూడుకు చెందిన బేతా గంగరాజు బజ్జీల బండి నిర్వహిస్తుంటాడు. కొంతకాలంగా భార్య మల్లీశ్వరి(45)పై అనుమానంతో పని మానేసి ఇంటివద్దనే ఉంటూ తరచూ భార్యతో గొడవపడుతున్నాడు. నివాస స్థలం మారితే గొడవలు సర్దుకుంటాయని పెద్దలు చెప్పడంతో రెండు నెలల క్రితం వచ్చి ఇంద్రపాలెంలో ఉంటున్నారు. ఆదివారం రాత్రి భార్యతో గొడవపడి రాయితో తల పగలగొట్టి హత్య చేసి పరారయ్యాడు. గతంలో కుటుంబసభ్యులతో భార్యను చంపి తానుకూడా చచ్చిపోతానని హెచ్చరించేవాడని చెబుతున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	112	110
లైవ్	139	130
డ్రెస్డ్	202	230
స్కిన్‌లెస్	229	240

(c) eenadu

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

ప్రభుత్వ భూమిని కాపాడాలని దీక్ష

ఎలమంచిలి: పెదపల్లిలో ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం పెదపల్లి, మంత్రి పాలెం, గొల్లలపాలెం గ్రామాలకు చెందిన బాజపా పట్టణశాఖ అధ్యక్షులు బొద్దపు శివ, పడాల నాగేష్, బొద్దపు రాజా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. చెరువు గర్భంలో ఉన్న 3.7 ఎకరాల ప్రభుత్వ భూమిని 22ఏ నుంచి తొలగించి జిరాయితీగా మార్చారని ఆరోపించారు. యువకులు చేస్తున్న న్యాయపోరాటానికి తాము మద్దతు ఇస్తున్నామని గ్రామపెద్దలు బొద్దపు ఎర్రయ్యదొర, దాసరి కుమార్, గణేష్, నాని చెప్పారు.

దీక్ష చేపట్టిన యువకులు

బాధిత కుటుంబానికి రూ. 3.10 లక్షల సాయం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: తాపీ మేస్త్రి కుటుంబానికి రూ.3.10 లక్షల ఆర్థికసాయం తుని, పాయకరావుపేట తాపీ మేస్త్రిల సంఘం అధ్యక్షుడు జి.నారాయణరావు అందజేశారు. నక్కపల్లి మండలం చిన రామభద్రపురం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి చిరంజీవి భవన నిర్మాణ పనిలో ప్రమాదానికి గురై ఇటీవల చనిపోయారు. దీంతో సంఘం నుంచి ఆర్థిక సాయాన్ని సోమవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ప్రతినిధులు చందక శ్రీను, చంటి, రమణ పాల్గొన్నారు.

అనుమానాస్పద బ్యాంకు ఖాతాలపై నిఘా

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అనుమానాస్పద బ్యాంకు ఖాతాలపై నిఘా ఉంచాలని సీఐ చంద్రశేఖరరావు కోరారు. పోలీసుస్టేషన్‌లో సోమవారం వివిధ బ్యాంకు అధికారులతో సమావేశమయ్యారు. ఖాతాదారులు తెలియకుండా జరిగే లావాదేవీలు, ఖాతాలపై దృష్టిపెట్టాలని కోరారు. ఎస్సైలు సుధాకర్ రావు, వెంకటరావు పాల్గొన్నారు.

అమలుకాని ఆదేశాలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

అనకాపల్లిలో కుక్కల దాడులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఆసుపత్రికి కుక్కలు కరిచిన బాధితులు రోజుకు 10 మంది వస్తున్నారంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. అనకాపల్లిలో ఏదోచోట మనిషిని కుక్కలు కరిచిన సంఘటనలు ఎక్కువగా ఉంది. దీన్ని అరికట్టాలని జీవీఎంసీ అధికారులను కలెక్టర్ ఆదేశించినా మార్పు కని పించడంలేదు.

అనకాపల్లిలో మూతపడిన శస్త్రచికిత్స కేంద్రం

కుక్కలకు షెల్టర్ ఏర్పాటు చేసి వీటికి ఆహారం అందించి వీధుల్లో సంచరించకుండా చూడాలని ఆదేశాలు అనకాపల్లిలో అమలు కావడం లేదు. షెల్టర్ ఏర్పాటు కోసం ఇప్పటి వరకు స్థల పరిశీలనే చేయలేదు. ఇలా కుక్కల సంచారాన్ని నివారించడానికి జీవీఎంసీ పరంగా చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీధుల్లో తిరుగుతున్న కుక్కలు వాహనాల వెంట పడుతుండడంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.

సంకరజాతి వద్ద కుక్కలకు కు.ని. శస్త్రచికిత్స చేయడానికి కేంద్రాన్ని ఏర్పాటు చేసినా ఇది మూతపడింది. శస్త్రచికిత్సలు చేయడానికి వెటర్నరీ అసిస్టెంట్ నియమించినా ఆమె రావడం లేదు. కుక్కలను పట్టుకుని ఇక్కడికి తీసుకురావాలి నెలగు రిని నియమించారు. వీరికి జీతాలు ఇవ్వని కారణంగా చుట్టూ పనిచేయడం లేదు. ఫలితంగా అనకాపల్లిలో కుక్కల నివారణ సాధ్యం కావడంలేదు. కుక్కలను నివారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక: కు.ని. శస్త్రచికిత్స సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ఇక్కడ పనిచేసే సిబ్బందితో మాట్లాడి పనులు చేయాలని ఆదేశాలు జారీచేశాం. ఇటీవల జీవీఎంసీ చీఫ్ వెటర్నరీ అధికారి అనకాపల్లిలో పర్యటించారు. త్వరలోనే కు.ని. శస్త్రచికిత్స కేంద్రాన్ని తెరిపిస్తాం. కుక్కలను ఉంచడానికి షెల్టర్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్నాం. - చక్రవర్తి, జోనల్ కమిషనర్

నత్తనడకన సమావేశ మందిర నిర్మాణం

మున్సిపల్ కార్యాలయంపై నిర్మాణ పనులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి మున్సిపాలిటీలో సమావేశ మందిరం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫలితంగా మున్సిపల్ పాలకవర్గ సమావేశాలు అరుబయట సెల్లార్‌లో నిర్వహించే పరిస్థితి ఎదురవుతోంది. 2011 డిసెంబరులో మున్సిపాలిటీగా స్థాయి పెరిగింది. చాలా కాలం పంచాయతీ భవనంలో మున్సిపల్ కార్యాలయం నడిచింది. ఆ తరవాత మున్సిపల్ కార్యాలయం నిర్మించినా గత 12 సంవత్సరాలుగా సమావేశాలు నిర్వహించుకునే వసతికి మందిరం లేక వాహనాల పార్కింగ్ చేసే సెల్లార్‌లో మట్టా తెరలు కట్టి అందులో నిర్వహిస్తున్నారు. మూడేళ్ల కిందట దీని నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది పనులు ప్రారంభించినా ఆశించిన ప్రగతి కని పించడంలేదు. అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమావేశ మందిరాన్ని వెంటనే పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రసంగంలో ప్రతిభ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ప్రసంగంలో అదరగొట్టి.. బహుమతులు సొంతం చేసుకున్నారు. పట్టణంలోని శ్రీకార్తికేయ జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు' నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వక్తృత్వం పోటీలు ఏర్పాటు చేశారు. దీనిలో కె.మాధురి, పి.లక్ష్మీప్రసన్న, ఎం.విమల చక్కటి ప్రతిభ చూపి బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.గోవిందబాబు, శర్మ, జి.ఎస్.వి.ఎస్.శివ, జయ, జి.సాయి పాల్గొన్నారు.

పేట కార్తికేయ కళాశాలలో మాట్లాడుతున్న విద్యార్థిని

బహుమతులు అందుకున్న విద్యార్థులు

చెక్కు అందిస్తున్న తెదేపా నాయకులు

సీఎం సహాయనిధి సాయం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి కింద కొండకర్లకు చెందిన మేడపాటి సుధీర్ కుటుంబానికి రూ.44,850 చెక్కును తెదేపా ప్రధాన కార్యదర్శి బొద్దపు సుధాకర్, యూనిట్ ఇన్‌చార్జి కంఠంరెడ్డి శ్యామలరాజు సోమవారం అందించారు. నాయకులు కట్టమూరి విట్టేశ్వరరావు, కోసూరి భానుప్రకాష్, పాసిల అప్పలరాజు, సూరిశెట్టి మూర్తి పాల్గొన్నారు.

అనకాపల్లి పరిశోధనా కేంద్రం ఎదుట విద్యార్థులు

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం విజ్ఞాన యాత్రకు వెళ్లారు. ప్రధానోపాధ్యాయిని విజయ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి వీరిని ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. అనంతరం పరిశోధన కేంద్రం ప్రత్యేకత, ఇతర అంశాలను ప్రధాన శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు టి.వి.రమణ, డి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెంచీలు ఇలా.. కూర్చునేదెలా?

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద సిమెంట్ బెంచీలు విరిగిపోయాయి. కార్యాలయానికి వివిధ పనులపై వచ్చేవారు కూర్చోడానికి వీలుగా ఇక్కడ సిమెంట్‌తో బెంచీలు ఏర్పాటుచేశారు. వీటిలో కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. మరికొన్ని విరిగిపోవడంతో కూర్చోడానికి ఇబ్బంది పడుతున్నారు. వీటిని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

దారి తెలియక తికమక

రాంబిల్లి, న్యూస్‌టుడే: దిక్సూచీ నేల కూలడంతో ప్రయాణికులు తికమక పడుతున్నారు. రాంబిల్లి ప్రధాన మార్గంలో అప్పన్నపాలెం కాలనీ సమీపంలో లాలంకోడూరు కూడలిలో ఏర్పాటు చేసిన దిక్సూచీ కింద పడిపోయింది. సెజ్ పరిశ్రమలకు వెళ్లే వారు దారి తెలియక ఇబ్బందులు పడుతున్నారు. అచ్యుతాపురం మండల కేంద్రంలో పైవంతెన నిర్మాణ పనులతో సెజ్ పరిశ్రమలకు వెళ్లే వాహనాలను సెజ్ పునరావాస కాలనీ మీదుగా పంపిస్తున్నారు. ఈ క్రమంలో వాహనచోదకులు సెజ్ కాలనీ దాటిపోయి రాంబిల్లి వరకు వచ్చేస్తున్నారు. ఇక్కడి నుంచి లాలంకోడూరు మీదుగా సెజ్ పరిశ్రమలకు వెళ్లేందుకు దగ్గరగా ఉంటుంది. దీనిని పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై మురుగు

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై పలుచోట్ల వాడుక నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. నక్కపల్లి, వేంపాడు, ఉద్దండపురం గ్రామాల మధ్య నుంచి జాతీయ రహదారి విస్తరించింది. ఈ రోడ్డును ఆనుకుని ఇళ్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో స్థానికులు వినియోగించే వాడుక నీరు వెళ్లేందుకు సరైన కాలువలు నిర్మించారు. కొన్నిచోట్ల ఇవి దెబ్బతినడంతో పూడుకుపోయాయి. ఫలితంగా నివాసాలనుంచి వస్తున్న నీరు రోడ్డు పైకి చేరుతుంది. దీంతో రోడ్డుపై గుంతలు పడుతోంది.

నీరు తాగేదెట్లా?

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో గుర్తింపు పొందిన అనకాపల్లి ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో వసతుల మెరుగుపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బెల్లం కొనుగోలు, అమ్మకాలకు భవనాలను నిర్మించారు. ప్రతి భవనానికి పక్కనే కుళాయిలు ఏర్పాటు చేశారు. వీటి చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ఇక్కడి నీరు తాగడానికి ఇబ్బంది పడుతున్నామని పలువురు వాపోతున్నారు. పరిసరాలను మెరుగుపరచాలని కోరుతున్నారు.

రామాలయానికి రూ. 40 వేల విరాళం

మునగపాక: మునగపాక రామాలయం అభివృద్ధికి శరగడం గోవింద, ఉదయ దంపతుల కుమారుడు ప్రసాదు రూ.40 వేల విరాళం సోమవారం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాల్తేరులో తెదేపా నేత దేవవరపు రాజుబాబు జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు రక్తం దానం చేశారు. తెదేపా నియోజకవర్గ సమన్వకర్త కొప్పిశెట్టి వెంకటేష్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు హాజరై కేకు కోశారు. పేదలకు దుపట్లు, చీరలు, ఆహారం పంపిణీ చేశారు.

విద్యార్థుల్లో సేవాభావం

కశింకోట, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ శిబిరాల నిర్వహణ ద్వారా విద్యార్థులలో సేవాభావం అలవడుతుందని అనకాపల్లి దాడి వీరునాయుడు కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్ అన్నారు. తీడ, చెరకాం గ్రామాల్లో వారం రోజులుపాటు ఏర్పాటుచేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. హెచ్ఎం ఉషా కిరణ్, మాజీ సర్పంచి పి.దేముడు, సీహెచ్. ఈశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసర్ ఈ.నాగేశ్వరరావు, బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

వరి కోతలకు దూరంగా ఉండాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో రైతులు వరి కోతలకు దూరంగా ఉండాలని ఏడీఏ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శంకరంలో సోమవారం పర్యటించి తుపాను ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు.

మాదక ద్రవ్యాల బారిన పడొద్దు

కశింకోట, న్యూస్‌టుడే: విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడితే భవిష్యత్ అంధకారంగా మారుతుందని సీఐ అల్లుస్వామినాయుడు సూచించారు. కశింకోట జడ్పీ పాఠశాల విద్యార్థులకు సోమవారం మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'శక్తి యాప్'పై వివరించి అత్యవసర పరిస్థితులలో ఎలా ఉపయోగపడుతుందో స్పష్టం చేశారు. ఎస్సై పి.మనోజ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమబోర్డు పునరుద్ధరించరూ!

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కార్మిక సంఘం అధ్యక్షులు రాజాన అప్పలనాయుడు కోరారు. తిమ్మరాజుపేట, దోసూరు, అచ్యుతాపురం గ్రామాల్లో సంఘ నాయకులు సోమవారం సమావేశమయ్యారు.

ఉత్సాహంగా పోటీలు

అచ్యుతాపురం, నక్కపల్లి, న్యూస్‌టుడే: అచ్యుతాపురంలో జడ్పీ పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుల క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అచ్యుతాపురంలో ఎంఈఓ దేవరాయల్, హరిపాలెంలో ఎంఈఓ-2 రజని ఈ పోటీలను ప్రారంభించారు. వీటిలో ప్రతిభ చూపించిన క్రీడాకారులకు ఈనెల 13, 14 తేదీల్లో డివిజనల్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు పార్వతి, పీఈటీలు ధర్మిరెడ్డి రాజు, పట్నాల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. నక్కపల్లి ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను ఎంపీడీఓ బి.చైతన్య ప్రారంభించారు. గెలుపొందిన జట్లు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓలు కె.నరేశ్, ఆర్.నాగన్నదొర తెలిపారు. కార్యక్రమంలో హెచ్.ఎం.లు విజయ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

అనకాపల్లి, న్యూస్‌టుడే: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను పెంచాలని మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ కోరారు. అనకాపల్లిలో జోనల్ కార్యాలయం ముందు సోమవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంగా ఉన్న సమయంలో 450 కార్మికులు ఉండేవారన్నారు. జనాభా పెరిగినా కార్మికుల సంఖ్య పెరగకపోగా 210 మందికి తగ్గిపోయారన్నారు. మరణించిన, పదవీవిరమణ చేసిన వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. నాయకులు కాళ్ల తేలయ్య, నిమ్మకాయల అజయ్, పొట్నూరు గోవింద, పోలరావు, నూకరాజు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయం ముందు కార్మికుల ఆందోళన

కోటవురట్ల, న్యూస్‌టుడే: సాగు చేసుకున్న భూములకు హక్కు పత్రాలివ్వాలని సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సాగుదారులు ఆందోళన చేపట్టి తహసీల్దార్ తిరుమలబాబుకు వినతి పత్రాన్ని అందించారు.

పాయకరావుపేట: ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల సిబ్బందికి అందించారు.

రాంబిల్లి, న్యూస్‌టుడే: అప్పారాయుడుపాలెం పంచాయతీలో వీధిదీపాలు, పారిశుద్ధ్య పనులు చేపట్టడంలేదని కలెక్టరేట్‌లో గ్రామస్థులు సేనాపతి సన్యాసిరావు, ఉరిటి నానాజీ ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యాలయం కూడా ఏర్పాటు చేయలేదన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు సహకరించండి

ఎలమంచిలి, నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.చంద్రశేఖర్ కోరారు. ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని సోమవారం ఎలమంచిలిలో జూనియర్, డిగ్రీకళాశాలల విద్యార్థులు పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు. కోటవురట్ల సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన కూడలి వరకు సూపరింటెండెంటు ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నక్కపల్లి 50 పడకల ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ చేపట్టారు.

ఎలమంచిలిలో విద్యార్థుల మానవహారం

మునగపాకలో విద్యుత్తు వెలుగులు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయి కృష్ణ వీధి దీపాలను సోమవారం ప్రారంభించారు. రైతుల ఇబ్బందులను గుర్తించి తన సొంత సొమ్ముతో 58 దీపాలను ఏర్పాటు చేశారు. ఉల్లూరి నూకనరసింగరావు, పెంటకోట ప్రకాష్, ఆడారి మహేష్, సభ్యులు దాడి శివ పాల్గొన్నారు.

రేగుపాలెంలో 50 ఎకరాల్లో మెడికల్ హబ్

వంతెన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: రేగుపాలెంలో 50 ఎకరాల్లో మెడికల్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చెప్పారు. సోమవారం ఆయన ఎలమంచిలిలోని పలు వార్డుల్లో పింఛన్లు పంపిణీ చేశారు. రామారాయుడుపాలెంలో వంతెన పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎలమంచిలి పట్టణంలో రూ. 3 కోట్లతో రైతు బజార్‌ను నిర్మిస్తున్నామన్నారు. మెడికల్ హబ్‌లో 30కి పైగా కార్పొరేట్ ఆసుపత్రులు వస్తాయన్నారు. వీటితో పాటు ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలగా అభివృద్ధి చేస్తానన్నారు. రెవెన్యూ డివిజన్ అడ్డురోడ్డులో ఏర్పాటు అవుతుందని, ప్రజల అభిప్రాయాలను తీసుకుని దాని ప్రకారం నిర్ణయం తీసుకుంటామన్నారు. నాయకులు కరణం రవికుమార్, గుర్రాల శేఖర్, పిట్టా శ్రీను, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

నిరుపేదలకు పింఛను పథకం అండ

అనకాపల్లి, కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం నిరుపేదలకు అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. రేబాక గురజాడ నగర్ కాలనీలో సోమవారం ఇంటింటా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల వద్దకు వెళ్లి పింఛను నగదు అందజేశారు. మారేడిపూడిలో తెదేపా నేత దాడి రత్నాకర్, అనకాపల్లిలోని పూడిమడక రహదారిలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, 81వ వార్డులో గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పింఛన్లు అందజేశారు. మళ్లవీధికి చెందిన మళ్ల పార్వతి అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వార్డు తెదేపా ఇన్‌ఛార్జి పొలిమేర ఆనంద్ సచివాలయ సిబ్బందితో వెళ్లి ఆమెకు పింఛను డబ్బు అందజేశారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో 93.03 శాతం మందికి పింఛన్లు అందించామని జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. 9,554 మందిలో 8,888 మందికి రూ.3.83 కోట్లు పంపిణీ చేశామన్నారు.

రేబాకలో పింఛను నగదు అందిస్తున్న పీలా గోవింద

పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు ప్రాంతాల్లో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, తెదేపా పట్టణశాఖ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. పెద గుమ్ములూరులో మాజీ ఎంపీపీ వినోద్‌రాజు, ధర్మవరం-అగ్రహారంలో తెదేపా మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు సుంకర శ్రీను పింఛన్లు అందించారు. నక్కపల్లిలో కొప్పిశెట్టి వెంకటేష్, దేవవరంలో దేవర సత్యనారాయణ, ఉద్దండపురంలో తుమ్మల వెంకటరమణ, ఉపమాకలో పాము గణేష్, దొండవాకలో బొంది దేముడు, కోటవురట్లలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పింఛన్లు అందజేశారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఖాజీపాలెంలో తెదేపా మండల అధ్యక్షులు పీలా తులసీరామ్, హరిపాలెంలో తెదేపా నాయకుడు కాండ్రేగులు వెంకటరమణ, దొప్పెర్లలో ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు పింఛన్లు పంపిణీ చేశారు.

పేటలో పింఛను ఇస్తున్న కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబాబు

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి వేడుకలు

కశింకోట, పాయకరావుపేట, మునగపాక, కోటవురట్ల, న్యూస్‌టుడే: గీతా జయంతి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కశింకోట జ్ఞానయోగాశ్రమంలో కృష్ణభగవానునికి గురు చంద్రశేఖర్‌స్వామి పూజలు నిర్వహించారు. అనంతరం భగవద్గీత పఠించి, దీని వైభవాన్ని వివరించారు. బాలబాలికలు ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. ఈ సందర్భంగా అన్నసమారాధన చేశారు. పాయకరావుపేటలోని రాజుగారిబీడులోని వరద వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భగవద్గీత పారాయణం చేశారు.

◆ మునగపాక కాశీ విశ్వేశ్వరాలయంలో నిత్యం భగవద్గీత పారాయణం చేస్తున్న తేలు నూకరాజు దంపతులను గ్రామపెద్దలు, మహిళలు ఘనంగా సత్కరించారు. కోటవురట్లలో చత్రపతి శివాజీ హిందూసేన ఆధ్వర్యంలో హిందూ మహా సమ్మేళనాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి తంగేడు చెరకు తూనిక కేంద్రం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హిందూ జనశక్తి అధ్యక్షులు లలిత కుమార్ మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలను తెలియజేయాలని కోరారు. నాయకులు నక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న హిందువులు

గంటా నివాసానికి పోటెత్తిన నాయకులు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

అనకాపల్లి పట్టణం, కశింకోట, నక్కపల్లి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం గవర సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు విశాఖలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 'జనం మెచ్చిన నాయకుడు గంటా' 27 ఏళ్ల రాజకీయ ప్రయాణం పుస్తకాన్ని కశింకోట మండల తెదేపా అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు గంటా దంపతులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణరావు, గంటా యువసేన ప్రతినిధులు జెర్రిపోతుల నూకునాయుడు, గొంతిన ప్రసాద్ కాశీ, నారిపల్లి ప్రసాద్ పాల్గొన్నారు. నక్కపల్లిలో పార్టీ నాయకుడు మీగడ సత్తిబాబు ఆధ్వర్యంలో కేకును కోసి అందరికి పంచారు. కార్యక్రమంలో కె.వి.సత్యనారాయణ, పెదిరెడ్డి రమేశ్, అల్లాడ తాతారావు, పాము గణేష్, కోసూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

అనకాపల్లి పట్టణం, అనకాపల్లి క్రీడా మైదానంలో పరిశుభ్రమైన తాగునీరు అందడం లేదు. ఇక్కడ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి. **– సూరిబాబు, అనకాపల్లి**, ✓: పరిశుభ్రమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటాం. **– చక్రవర్తి, జోనల్ కమిషనర్**

అనకాపల్లి గాంధీనగరం ఉద్యానంలో ఎటువంటి సౌకర్యాలు లేవు. **– బొడ్డు లక్ష్మి**, ✓: ఉద్యానాన్ని అభివృద్ధి చేస్తాం. **– కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్**

అచ్యుతాపురం ఎం.జగన్నాథపురంలో తాగునీటి పైపులు కాలవల్లో ఉన్నాయి. కొన్ని కుళాయిలకు చప్టాలు లేవు. **– రాములమ్మ, గృహిణి**, ✓: కాలువల్లో పైపులు తొలగిస్తాం. పంచాయతీ నిధులతో నిర్మిస్తాం. **–కరెడ్ల బుల్లమ్మ, సర్పంచి, ఎం.జగన్నాథపురం.**

పాయకరావుపేట గ్రామీణం కంది పూడిలో తాగునీటి పథకం చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. **– స్థానికులు**, ✓: పరిసరాలు శుభ్రం చేయిస్తాం. **– విజయలక్ష్మి, ఎంపీడీవో**

కాలనీల కాలువల్లో పూడికతీత పనులు చేయడం లేదు. **– దుర్గా, కంటోన్మెట్ కాలనీ**, ✓: కాలువలు శుభ్రం చేయిస్తాం. **– డేవిడ్, ఈవో**

ఎలమంచిలి, న్యూస్‌టుడే ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ గేట్ల ముందు ఆక్రమణలు పెరిగిపోయాయి. **– వి.రమణ ఎలమంచిలి**, ✓: పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగిస్తాం. **– బాకూరి ప్రసాదరాజు, కమిషనర్**

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అనకాపల్లిలో కలిసిన పూర్వవిద్యార్థులు

మునగపాక జడ్పీ పాఠశాలలో..

నెహ్రూచౌక్ (అనకాపల్లి), మునగపాక, న్యూస్‌టుడే: పట్టణంలో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1969-71 ఏడాది పది విద్యార్థులు సోమవారం పాఠశాలలో కలిశారు. సరస్వతిదేవి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం రోటరీ హాల్ సమావేశమయ్యారు. పూర్వవిద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షులు యిమ్మిడిశెట్టి చక్రపాణి, రాజేశ్వరరావు, వంకాయల శంకరరావు, పార్వతీశం, విజయ్‌కుమార్, పట్నాల రామకోటి పాల్గొన్నారు. మునగపాక జడ్పీ పాఠశాలలో 2005-06లో పది విద్యార్థులు మూలపేట గంగాలమ్మ ఆలయ ప్రాంగణంలో భేటీ అయ్యారు.

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

నర్సీపట్నంలో ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు

విజేతలతో ప్రిన్సిపల్ శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు

చరవాణికి అతుక్కుపోవద్దు

'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

నర్సీపట్నం, చోడవరం, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్లకు అతుక్కుపోతే చదువు ముందుకు సాగదని విద్యార్థులు పేర్కొన్నారు. నర్సీపట్నంలోని నారాయణ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఏడు నుంచి పదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై చక్కని హావభావాలతో ఆకట్టుకునేలా మాట్లాడారు. వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, డీన్ శేషు పర్యవేక్షణలో ఉపాధ్యాయుడు వి.సూర్య న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన జి.వైష్ణవి, ఎల్.లోహిత, హిమకేశ్ విఠల్‌కు ప్రిన్సిపల్ శ్రీరామ్మూర్తి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

★ చోడవరం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, ఫకీరుసాహెబ్‌పేటలోని జడ్పీ పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఏడు నుంచి పదో తరగతి విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బాలికోన్నత పాఠశాలకు చెందిన బి.మాన్విత, జి.జాహ్నవి, టి.భాగ్యశ్రీ విజేతలుగా నిలిచారు. వీరికి హెచ్‌ఎం ఐ.వి.రామిరెడ్డి ప్రశంసాపత్రం, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నర్సింహమూర్తి, భీమరాజు, వ్యాయామ ఉపాధ్యాయిని గంగాభవాని పాల్గొన్నారు.

★ ఫకీరుసాహెబ్‌పేట జడ్పీ పాఠశాలలో షేక్ తనూషా, మజ్జి చరణవర్ధన సాయి, టి.గౌతమ్ విజేతలుగా నిలిచారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, సరోజ, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరావు సహకరించారు.

ఉపన్యాస పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి

విజేతలతో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రమణమూర్తి

'సంకల్ప్' బలంతో శత శాతం ఉత్తీర్ణత

2302 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రత్యేక తరగతుల్లో జూనియర్ కళాశాల విద్యార్థులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 'సంకల్ప్-2026' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా చదువులో వెనుకబడిన 2302 మంది విద్యార్థులకు ఇప్పటికే గుర్తించారు. వీరందర్నీ గ్రేడ్ 'సి' నుంచి 'ఎ, బి' గ్రేడ్లలోకి తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందించారు.

★ పదో తరగతిలో సత్ఫలితాలు వస్తున్నా ఇంటర్మీడియట్‌లో తగ్గుతున్నాయి. ఇంటరుతో పాటు ఎంసెట్, నీట్‌లో విద్యార్థులు నెగ్గుకొచ్చేలా చూడటంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తాజాగా సంకల్ప్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరు ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దేందుకు 50 రోజుల ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జనవరి 20 వరకు ప్రత్యేక తరగతులు కొనసాగనున్నాయి.

★ జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 5,657 మంది పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. వీరికి ఉదయం 9 గంటల నుంచి 12.40 వరకు తరగతులు, మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఆయా సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతిని అంచనా వేస్తూ తదుపరి కార్యాచరణ రూపొందిస్తున్నారు. విద్యార్థుల్లో గ్రేడ్ 'ఎ'లో 1,430, 'బి'లో 1,925, 'సి'లో 2,302 ఉన్నట్లు గుర్తించారు. గ్రేడ్ 'సి'లో ఉన్న వారిని 'బి' కి, గ్రేడ్ 'బి'లో ఉన్న వారిని 'ఎ' కి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. గ్రేడ్ 'ఎ'లో ఉన్న వారిని టాపర్లుగా తీర్చిదిద్దనున్నారు.

★ ఈ ఏడాది పరీక్షలకు 38, ప్రయోగాలకు 90 కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. డిసెంబరు 15 నుంచి 20 వరకు ప్రీఫైనల్ వచ్చే, వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు, సాధారణ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటరు బోర్డు అధికారి వినోద్‌బాబు పేర్కొన్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి1:** రివాల్వర్ రీటా, జనతా బార్, స్కూల్ లైఫ్, రాజు వెడ్స్ రాంబాయి, **ఆడి 2:** ది గర్ల్ ఫ్రెండ్, రాజు వెడ్స్ రాంబాయి, నాట్ ఆల్ మూవీస్ ఆర్ ది సేమ్ డ్యూయల్ **ఆడి 3:** ఆంధ్రా కింగ్ తాలుకా, **ఆడి 4:** జూటోపియా, ఆంధ్రా కింగ్ తాలుకా, **బంగార్రాజు:** ప్రీ వెడ్డింగ్‌షో, **రాజు:** జింగిరి, **చోడవరం:** శ్రీసాయిలక్ష్మి: ఆంధ్రా కింగ్ తాలుకా **సాయిలక్ష్మి:** శివ, **పూర్ణా:** రాజు వెడ్స్ రాంబాయి

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం ఉప కేంద్రం పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాసరాజు చెప్పారు. చోడవరం పట్టణంతోపాటు పీఎస్‌పేట, లక్ష్మీపురం, గాంధీగ్రామం, గవరవరం, లక్కవరం, రేవళ్లు, మైచర్లపాలెం, దామునాపల్లి, నర్సయ్యపేట, గౌరీపట్నం, శ్రీరామపట్నం గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

జనరల్ సర్జన్‌గా నాగభూషణం

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జనరల్ సర్జన్‌గా నాగభూషణం నియమితులయ్యారు. ఈయన స్వస్థలం ఏటికొప్పాక. గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

కృష్ణదేవిపేట ఎస్సైగా రుషికేశ్వరరావు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఎస్సైగా రుషికేశ్వరరావు నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన సోమవారం విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్సై తారకేశ్వరరావు నాతవరం బదిలీ అయ్యారు.

తవ్వేశారు.. వదిలేశారు!

జులైలో ఎమ్మెల్యే రాజు శంకుస్థాపన

నేటికీ ప్రారంభంకాని పనులు

రాళ్లుతేలిన పెదమదిన రోడ్డు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: ఎర్రవాయి ప్రాంత గ్రామాలకు వెళ్లే రహదారులు రాళ్లు తేలి అధ్వానంగా మారాయి. కె.బి.రోడ్డులో వెదుళ్ల గెడ్డ వంతెన నుంచి పెదమదిన, గున్నెంపూడి మీదుగా పిల్లవానిపాలెం వరకు రోడ్డు అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రెండేళ్ల కిందట రూ.1.84 కోట్ల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే ధర్మశ్రీ శంకుస్థాపన చేశారు. గుత్తేదారు కొంతవరకు పనులు చేసి బిల్లులు చెల్లింపులు నిలిచిపోవడంతో మధ్యలో వదిలేశారు. శిథిలమైన తారు రోడ్డును పూర్తిగా తవ్వేసి వదిలేయడంతో ప్రయాణికుల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడినట్లుగా తయారైంది. రాళ్లు తేలిన రోడ్డుపై రాకపోకలు సాగించలేక నరకయాతన పడుతున్నారు. ఎన్నికలకు ముందు హడావుడిగా పిక్క, డస్ట్ మిక్స్ వేసి చదును చేయించారు. ఇప్పటివరకు తారు రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. డస్ట్ మిక్స్ వేసి వదిలేయడంతో దుమ్ము రేగుతోంది.

★ బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో పలు గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే అనకాపల్లికి రాకపోకలు సాగిస్తుంటారు. విశాఖపట్నం నుంచి పెదమదిన వరకు ఆర్టీసీ బస్సు వస్తోంది. ఆటోలు, స్కూలు బస్సులు, ఇతర వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. రోడ్డు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

★ రాజాం నుంచి సీతయ్యపేట మీదుగా తట్టబంద వరకు తారు రోడ్డు దెబ్బతింది. రాజాం, తైపురం, చిట్టియ్యపాలెం సమీపంలో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. వర్షం కురిస్తే నీరు నిలిచి ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియడం లేదు.

★ చింతపాక నుంచి పెదమదిన వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. రాజాం - తట్టబంద, చింతపాక రోడ్డు అభివృద్ధి పనులకు ఈ ఏడాది జులైలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శంకుస్థాపన చేశారు. నాటి నుంచి ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. వెంటనే పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నదాతల్లో 'దిత్వా' దిగులు

మత్స్యపురంలో వరి పనలను తరలిస్తున్న రైతులు

రావికమతం, రోలుగుంట, చీడికాడ, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావం వరి కోతలపై పడింది. తుపాను హెచ్చరికలతో రైతుల్లో దిగులు మొదలైంది. రావికమతం మండలంలో సుమారు మూడు వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. పంట కోత దశకు రావడంతో ఇప్పటికే పలుచోట్ల రైతులు కోతలు కోశారు. వరి పనలు పొలాల్లోనే ఉన్నాయి. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశం మేఘావృతమైంది. ఆదివారం రాత్రి మొదలు సోమవారం రోజంతా చిరు జల్లులు పడ్డాయి. ఈ దశలో వరి పనలు తడిచిపోకుండా కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు.

★ గుడివాడ, రావికమతం, దాసరయ్యపాలెం, చినపాచిల, కొమిర, గర్నికం, కొత్తకోట, పి.పొన్నవోలు తదితర గ్రామాల్లో వారం రోజులుగా వరి కోతలు కోస్తున్నారు. పనలు ఎండాక కుప్పలు వేయవచ్చని మడుల్లోనే ఉంచారు. తుపాను ప్రభావంతో చిరు జల్లులు పడుతుండటంతో వరి పనలు తడిచిపోకుండా కళ్లాలకు చేర్చేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. పనలను మోపులుగా కట్టి కళ్లాల్లో కుప్పలుగా పెట్టాల్సి ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పొలాల్లోనే వరి కుప్పలు పెడుతూ పంటను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొన్నాళ్లు వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి రమేష్‌బాబు సూచిస్తున్నారు.

★ రోలుగుంట మండలం నిండుగొండ, ఎన్.కొత్తూరు, గొల్లపేట తదితర ప్రాంతాల్లో ఇప్పటికే కోసిన వరి పనలను గట్లపై ఆరబెడుతూ గింజలు తడవకుండా చర్యలు చేపడుతున్నారు. ఎన్.కొత్తూరు ప్రాంతంలో పొలాల్లో నుంచి వరి పనలను కళ్లాలకు తరలిస్తున్నారు. తడిసిన వరి పనలపై ఐదు శాతం ఉప్పు నీటి ద్రావణం పిచికారీ చేయాలని, పొలంలో నీరుంటే.. పంటను ఒడ్డుకు చేర్చాలని చీడికాడ మండల వ్యవసాయాధికారిణి కృష్ణవేణి సూచించారు. తడిసిన వరి పంటను సోమవారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

చీడికాడలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారిణి కృష్ణవేణి

అ వీ ఇ వీ

300 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల గ్రామీణం: పెద్దేరు జలాశయం నీటితో కళకళలాడుతోంది. సోమవారం నాటికి నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకుందని జలాశయం పర్యవేక్షణ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. పూర్తిస్థాయి నీటి మట్టం 137 మీటర్లు కాగా... 136.25 మీటర్లకు చేరిందన్నారు. స్పిల్‌వే గేటు ద్వారా 300 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఎగువ నుంచి 125 క్యూసెక్కులు చేరుతోందన్నారు.

ప్రతిభ చూపితే ప్రోత్సాహం

నాతవరం: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహిస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను సోమవారం రాత్రి సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన మహిళా కానిస్టేబుల్ రాజేశ్వరికి రివార్డు అందజేశారు. ఎస్సై తారకేశ్వరరావు వెంట ఉన్నారు.

దిబ్బిడిలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం

బుచ్చెయ్యపేట: దిబ్బిడి గ్రామంలో మ్యాజిక్ డ్రైన్ నిర్మాణం చేపట్టారు. ఉపాధి హామీ నిధులు రూ.72 వేలతో వంద మీటర్ల పొడవున నిర్మించారు. ప్రయోగాత్మకంగా మండలానికి ఒకటి చొప్పున మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

మురుగు సమస్యలపై వినతులు

నర్సీపట్నం: సబ్ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 12 వినతులు దాఖలయ్యాయి. పెదబొడ్డేపల్లి 13వ వార్డుకు చెందిన దుర్గా భవాని ఇళ్లలోని నీరు బయటకు పోయేందుకు కాలువ నిర్మించాలని విన్నవించారు.

తాండవ రోడ్డు టెండర్ల ఖరారు

నాతవరం: తాండవ రోడ్డు నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని ఏఈ నాయుడు చెప్పారు. నాతవరం నుంచి తాండవ బాలికల వసతిగృహం వరకు రోడ్డు విస్తరణకు రూ.3.5 కోట్లు మంజూరయ్యాయి. తాండవ - జోగుంపేట రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

కృష్ణదేవిపేట: సామాజిక తనిఖీలో గుర్తించిన లోపాలపై గొలుగొండ, నాగాపురం గ్రామాల్లో సోమవారం సంబంధింత అధికారులు, సర్పంచులు గ్రామసభలు నిర్వహించారు. వచ్చే ఏడాది చేపట్టాల్సిన పనులను ప్రతిపాదించారు.

కోడిపందేల శిబిరంపై దాడి

బుచ్చెయ్యపేట, చోడవరం గ్రామీణం: దిబ్బిడి గ్రామంలో కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పది మందిని అదుపులోకి తీసుకుని రూ.5,040 నగదు, మూడు కోళ్లు, తొమ్మిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రాజాంలో జూదం ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని, రూ.3,660 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. అడ్డూరు మజ్జిగైరమ్మ ఆలయం వద్ద జూదం ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.63,080 నగదు, స్వాధీనం చేసుకున్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

నర్సీపట్నంలో పింఛను నగదు అందజేస్తున్న కౌన్సిలర్ పద్మావతి

చోడవరం, రావికమతం, న్యూస్‌టుడే: పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. చోడవరం పట్టణం, రావికమతం మండలం కొత్తకోటలో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. యడ్లవీధి నుంచి లక్ష్మీ థియేటర్ వరకు కాలువ నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచి నూకాలమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డీవీ అప్పారావు, సుధాకర్, శ్రీను, కోటేశ్వరరావు, వెంకట్ పాల్గొన్నారు.

★ చోడవరం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.12.50 కోట్లు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే రాజు చెప్పారు. విజయరామరాజుపేట, వడ్డాది వంతెనల నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలవనున్నట్లు పేర్కొన్నారు. కొత్తకోటలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. వీధి రోడ్లు, కాలువలు శుభ్రం చేయడం లేదు. సీసీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడారు. మాజీ ఎంపీపీ దంగేటి రామకృష్ణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కొండాలయుడు, నాయకులు నీలాదేవి, శ్రీనివాసరావు, గోవిందరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం అర్బన్, కృష్ణదేవిపేట: నర్సీపట్నంలో కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, గొలుగొండ మండలం రేఖపల్లి, కొత్తయల్లవరం, గొలుగొండ, గుండుపాల, పాకలపాడు గ్రామాల్లో తెదేపా నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. రేఖపల్లిలో మాజీ సర్పంచి గడ్డం సత్యనారాయణ, తెదేపా బూత్ కమిటీ అధ్యక్షుడు వంతు అర్జున, జి.కొత్తూరులో తెదేపా మండల అధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు, మాడుగుల గ్రామీణం: సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. సోమవారం సూరెడ్డిపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పింఛన్లు అందిస్తున్నామన్నారు. గృహ నిర్మాణ పథకం గడువును ఈ నెల 14 వరకు ప్రభుత్వం పెంచినందున అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, కస్పూరు సూర్యనారాయణ, జూరెడ్డి రాము, సబ్బవరపు రామునాయుడు, చవ్వవల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు. మాడుగుల మండలంలో కొత్తగా 98 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. కొత్తగా మంజూరైన పింఛన్లతో 11511 పింఛన్లు సోమవారం అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో పంపిణీ చేశామన్నారు.

చోడవరంలో సామాజిక పింఛను నగదు ఇస్తున్న ఎమ్మెల్యే రాజు

గ్రామాభివృద్ధిలో రాజకీయాలొద్దు

నాతవరం, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధిలో రాజకీయాలు వద్దని సభాపతి అయ్యన్నపాత్రుడు హితవు పలికారు. యర్రవరంలో సోమవారం పింఛన్ల పంపిణీ, పలు భవనాల ప్రారంభోత్సవాల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి తెచ్చిన నిధులను సక్రమంగా ఖర్చు చేయడం లేదని నాయకుల తీరును దుయ్యబట్టారు. నాయకుల మధ్య ఆధిపత్య పోరు వల్ల అభివృద్ధి పనుల్లో వేగం మందగిస్తోందన్నారు. నాతవరం మండల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.120 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అనంతరం యర్రవరంలో రూ.2 కోట్లతో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని, రూ.25 లక్షలతో నిర్మించిన పీఎంశ్రీ గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. సర్పంచి సత్యవతి, నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి రాజాన సూర్యచంద్ర, ఆర్డీవో వి.వి.రమణ, తాండవ ఛైర్మన్ సత్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ రమణ, తెదేపా నాయకులు నాయుడు, ఎస్.వి.రమణ, సమగ్ర శిక్ష ఏపీసీ జయప్రకాష్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఒమ్మలిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం క్వింటా ఏ గ్రేడుకు రూ 2389, సాధారణ రకానికి రూ.2369 ఇస్తుందని తెలిపారు. ధాన్యం పంపిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. మండలంలో 6 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, తెదేపా మండల అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు, సర్పంచి సుంకరి సింహాచలం నాయుడు, ఎంపీడీవో అప్పారావు, కృష్ణాపురం సర్పంచి చారుమతి దేవి, మండల వ్యవసాయ శాఖ అధికారి అనసూయ, పౌర సరఫరాల అధికారి రవిబాబు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్లు, ఏఈవో సతీష్, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

ట్రాక్టరుకు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే బండారు

యువతను ప్రోత్సహిద్దాం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రయాణాలంటే అభిరుచి ఉన్న యువత దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించేలా ప్రోత్సహించాలని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ చీమల రవిపాల్ సూచించారు. బయ్యపురెడ్డిపాలెంలోని లయన్స్ క్లబ్ హాలులో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడుతూ.. ట్రెక్కింగ్, క్యాంపింగ్, సైక్లింగ్ తదితర కార్యక్రమాల వల్ల శారీరక, మానసిక అభివృద్ధి సాకరమవుతుందన్నారు. వివిధ రాష్ట్రాల సందర్శన వల్ల ఆయా రాష్ట్రాల సంస్కృతి, జీవన విధానాలు తెలుసుకోవచ్చన్నారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో యూత్ హాస్టళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. తక్కువ ఖర్చుతోనే సురక్షితమైన వసతి లభిస్తుందని చెప్పారు. నర్సీపట్నం శాఖ ద్వారా కార్యకలాపాలను విస్తృతం చేయాలని కోరారు. ఉపాధ్యక్షుడు జగపతిరాజు, కార్యదర్శి అబ్రహం, జాతీయ సమితి సభ్యుడు శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. నర్సీపట్నంలో యూత్ హాస్టల్ (అడ్‌హక్) శాఖను లయన్స్ క్లబ్ మాజీ ఛైర్మన్ డి.రాఘవేంద్రరావు ప్రారంభించారు. కన్వీనర్లుగా పాలపర్తి సత్యానందం, డాక్టర్ అధికారి గోపాలరావు, పందల శివ, కిరణ్‌ప్రసాద్, సోమిరెడ్డి నియమితులయ్యారు. విశాఖ ఉక్కు నగరం శాఖ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, భాస్కరరాజు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న రవిపాల్

ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయం

నర్సీపట్నం/అర్బన్, గొలుగొండ, న్యూస్‌టుడే: వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ఎయిడ్స్ నివారణ సాధ్యమని స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిత్ సూచించారు. గబ్బాడలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడారు. మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాజు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చక్రవర్తి, ఐ-క్యూ సమన్వయకర్త రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. గొలుగొండలో వైద్యాధికారి శ్యామ్‌కుమార్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

చోడవరం పట్టణం, రోలుగుంట, రావికమతం: చోడవరం ప్రభుత్వాసుపత్రిలో ఐసీటీసీ కేంద్రం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డీవీ అప్పారావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆసుపత్రి నుంచి కొత్తూరు కూడలి వరకు ర్యాలీగా చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. సర్పంచి నూకాలమ్మ, వైద్యులు నాగభూషణం, విష్ణుప్రియ, హిమబిందు, రేష్మా, రవికుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ రవికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ ర్యాలీ చేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ సత్యవతి, జాతీయ సేవా పథం ప్రోగ్రాం అధికారిణి రత్నభారతి, మాల్యాద్రి, పిచ్చమ్మ, నారాయణమూర్తి, సుధీర్, అప్పలనాయుడు, కృష్ణారావు పాల్గొన్నారు. రోలుగుంటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, కొత్తకోటలో పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి సురేఖ, ఎంపీహెచ్‌ఈవో పి.రామారావు, హెచ్‌వీ ఎర్రమ్మ, ఫార్మసిస్ట్ పద్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

మాడుగుల గ్రామీణం: యువత ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని మాడుగుల సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ నాయుడు, కళాశాల ప్రిన్సిపల్ సీవీఎస్ఎస్ శాస్త్రి పేర్కొన్నారు. మాడుగుల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్థులపై వివక్ష ఉండరాదన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. ఉపన్యాసకులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ వాలంటీర్లు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో మానవహారంగా విద్యార్థులు

ఇసుక తరలింపులో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ఇసుక తరలింపులో నాటుబళ్ల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఉప తహసీల్దారు అప్పారావు, ఎస్సై సత్యనారాయణ హెచ్చరించారు. బోయిలకింతాడ శ్మశాన వాటిక సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సోమవారం సీజ్ చేశారు. దీన్ని శారదా నది నుంచి నాటుబళ్ల యజమానులు తీసుకొచ్చి ఇక్కడ నిల్వ ఉంచారని, ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేసినట్లు తహసీల్దారు పి.లక్ష్మీదేవికి ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన ఆమె అక్కడకు ఉప తహసీల్దారుతోపాటు ఎస్సైను పంపించారు. నాటుబళ్లు తిరగకుండా ట్రెంచిలు తవ్వించాలని వీఆర్వోని ఆదేశించారు. కేవలం స్థానిక అవసరాలకు మాత్రమే నాటుబళ్లపై తరలించాలని, దానికి విరుద్ధంగా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మట్టి తవ్వకాలను నిరోధించాలి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండలంలో విచ్చలవిడిగా జరుగుతున్న మట్టి తరలింపును నిరోధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో తహసీల్దారు పి.లక్ష్మీదేవికి ఫిర్యాదు చేశారు. పేద రైతులు తమ పొలాలకు మట్టి తవ్వుకుంటే అధికారులు వేధించిన ఘటనలు గతంలో చాలా జరిగాయన్నారు. ప్రస్తుతం అధికారులు చూస్తుండగానే మట్టి తరలిస్తున్నా ఎందుకు పట్టించుకోలేదన్నారు.

పాఠశాలల పనితీరుపై సర్వే

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలల పనితీరు, మూల్యాంకనంపై స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన విద్యను అందించేందుకు అనుసరిస్తున్న విధానాలపై పాఠశాలల వారీగా సామాజిక తనిఖీ చేసేందుకు విద్యాశాఖలో పనిచేస్తున్న సీఆర్ఎంటీలను పర్యవేక్షకులుగా నియమించారు. యాజమాన్య కమిటీ ఛైర్మన్, హెచ్‌ఎంలు, సభ్యులు, తల్లిదండ్రుల సమక్షంలో తనిఖీలు జరుగుతున్నాయి. జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సర్వేను ఎంఈఓలు పాండురంగారావు, సింహాచలం, హెచ్‌ఎం రామిరెడ్డి, ఛైర్మన్ గూమ్మాల సత్యనారాయణ, సత్యవతి సమక్షంలో సీఆర్ఎంటీలు నాయుడు పర్యవేక్షించారు.

సొంత విత్తనం వాడిన పొలాల్లోనే మానిపండు తెగులు

రావికమతం, న్యూస్‌టుడే: రైతులు సొంత విత్తనం వాడిన వరి పొలాల్లోనే మానిపండు తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉందని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల బృందం నిర్ధారించింది. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాజకుమార్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్య, నర్సీపట్నం వ్యవసాయ సహాయ సంచాలకురాలు శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి రమేష్ బాబు, గ్రామీణ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరావు సోమవారం కొమిర, మత్స్యపురం, చినపాచిల గ్రామాల్లో పర్యటించి మానిపండు తెగులు ఆశించిన వరి పొలాలను పరిశీలించారు. ఆర్‌జీఎల్ 2537 రకం వరి పైరును మానిపండు తెగులు వ్యాప్తిని గుర్తించారు. తెగులు వ్యాప్తికి రైతులు సొంత విత్తనం వాడటమే కారణమని పేర్కొన్నారు. తక్కువ ఉష్ణోగ్రతల వల్ల తెగులు వ్యాప్తి అధికంగా ఉంటుందని కేవీకే శాస్త్రవేత్త రాజకుమార్ చెప్పారు. తెగులు నివారణ చర్యలను రైతులకు సూచించారు.

చినపాచిలలో తెగులు సోకిన వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1
ఆంధ్ర కింగ్ తాలూకా
స్క్రీన్-2 - రాజు వెడ్స్ రాంబాయి

3 నుంచి విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.భోనంగి సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా పరవాడ, వాడచీపురుపల్లి, వెంకటాపురం, పెదముషిడివాడ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడురోజుల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని, వీలైనంత వరకు ప్రత్యామ్నాయమార్గాల ద్వారా సరఫరా అందించడానికి కృషి చేస్తామని చెప్పారు.

నూతన నియామకం

సబ్బవరం, న్యూస్‌టుడే: భారతీయ జనతాపార్టీ అనకాపల్లి జిల్లాలోని 5 విభాగాలకు నూతన అధ్యక్షులను నియమించింది. వీరిలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడుగా కిల్లాడ వెంకట సత్యనారాయణ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడుగా ఎస్.వి.వి. శంకరరావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఓరుగంటి నాగమణి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడుగా గొట్టివాడ స్మామ్రాట్ కుమార్, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడుగా షేక్ బాబ్జీలను నియమిస్తూ జిల్లా భాజపా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు నియామక పత్రాలు విడుదల చేశారు. ఈ ప్రక్రియలో సబ్బవరం మండలం నుంచి ఇద్దరికి ప్రాధాన్యం లభించడం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ? : పరవాడలోని లుపిన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన పార్కు అధ్వానంగా తయారైంది. పిచ్చిమొక్కలు పెరిగిపోయి, ఆట వస్తువులు తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. –నాగేశ్వరరావు, పరవాడ. ✓: నిధుల సమస్య ఉన్నందున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో వినియోగంలో తీసుకొస్తాం. –మురళీధర్ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి, పరవాడ.

బాలలు సామాజిక సేవలో ముందుండాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్న వయసు నుంచే సామాజిక సేవాదృక్పథం కలిగి ఉండాలని పెందుర్తి శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ తారకేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో సామాజిక సేవా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలోని పారిశుద్ధ్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. డీన్ శేషగిరి, సి-బ్యాచ్ ఇన్‌ఛార్జి హఫసా, తదితరులు పాల్గొన్నారు.

సర్వే రాళ్ల ఏర్పాటుకు అనుమతించరూ..

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం పోర్లుపాలెం గ్రామంలో గతంలో తమకు కేటాయించిన స్థలాలకు సర్వే రాళ్ల ఏర్పాటు చేసుకోవడానికి సహకరించాలని ఆంధ్ర సిమెంట్స్ కంపెనీ ఇళ్ల స్థలాల యజమానుల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే రమేశ్‌బాబును కోరారు. ఈ మేరకు సోమవారం రత్నగిరినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. స్థలాల్లో తుప్పలు తొలగించుకుని సర్వే రాళ్ల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు అనుమతించాలని కోరారు. సంఘ ప్రతినిధులు ఆర్.అప్పారావు, వై.మోహన్‌రావు, బీకే నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి సిటూ మహాసభలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) అఖిల భారత మహాసభలు ఈనెల 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరుగుతాయని సిటూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం సబ్బవరం మండలం వంగలి గ్రామంలో గోడపత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీఐటీయూ ఏర్పడిన తర్వాత ఈ మహాసభలు తొలిసారిగా విశాఖలో జరగనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఈ సభలను జయప్రదం చేయాలని కోరారు. సిటూ నాయకులు ఎర్ర సోంబాబు, రమణనాయుడు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థల సమస్యకు పరిష్కారం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం శ్మశాన వాటిక సమస్యపై ఆ గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు గతంలో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ విచారణ చేపట్టి కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న సమస్యను పరిష్కరించారు. ఈ మేరకు అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులతోపాటు ఆ గ్రామ ఎస్సీ సామాజికవర్గ ప్రతినిధులు సోమవారం తహసీల్దార్ చిన్నికృష్ణను శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తమరాన బంగారునాయుడు, వీఆర్వో శేఖర్, సర్వేయర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

వాడచీపురుపల్లి(పరవాడ), న్యూస్‌టుడే: విద్యార్థులు బాల్యం నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నతస్థాయిలో రాణించాలని పరవాడ ట్రైనీ ఎస్సై ఎస్.విజయకుమారి అన్నారు. ముత్యాలమ్మపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ బాగా చదువుకోవాలని బాలబాలికలను చైతన్యపర్చారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రైనీ ఎస్సై విజయకుమారి

7న జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు ఈనెల 7వ తేదీన పోర్టు స్టేడియంలో జరగనున్నట్లు విశాఖపట్నం అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎ.నారాయణరావు తెలిపారు. అండర్-16, 18, 20 విభాగాల్లో బాల, బాలికలు; సీనియర్ విభాగంలో మహిళలు, పురుషులకు ఈ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ మేళాలో 18 మంది ఎంపిక

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఆర్.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యాకల్పన, నివేదిత, కిరణ్మయి, వరలక్ష్మి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ ఆర్.మంజుల, వివిధ కంపెనీల ప్రతినిధులు

గురి తప్పని బాణాలు..

విలువిద్యలో అదరగొడుతున్న క్రీడాకారులు..
రాష్ట్ర, జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పతకాల పంట

పరవాడ, న్యూస్‌టుడే: విలువిద్య (ఆర్చరీ) ఏకాగ్రతతో కూడిన క్రీడ. బాణం గురిపెట్టి వేస్తే గాని లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం. ఈ క్రీడలో సత్తా చాటాలంటే పట్టుదల, ఓర్పు, ఆత్మవిశ్వాసం చాలా అవసరం. ఈ మేరకు బాల్యం నుంచి ఆసక్తి పెంచుకున్న పరవాడ మండలం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు చదువుతో పాటు ఈ క్రీడకు సమయం కేటాయించి ప్రతిభ చాటుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కోచ్‌ల వద్ద తర్ఫీదు పొందుతున్నారు. ఇటీవల జరిగిన వివిధ పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించిన పలువురి మనోగతం వారి మాటల్లోనే.

ఆర్చరీ పోటీల్లో క్రీడాకారులు

నా స్వస్థలం చింతల గొర్లెవానిపాలెం. తండ్రి సురేష్‌కుమార్ ఫార్మా ఉద్యోగి. తల్లి రమ్యకృష్ణ గృహిణి. ఇటీవల పాడేరులో అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పసిడి పతకం సాధించి జనవరిలో రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. గతంలో రాష్ట్ర స్థాయిలో 2 పసిడి, 2 రజత, 5 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నా. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని లక్ష్యం. –సాయిమనస్వి, 9వ తరగతి

మాది తాటిచెట్లపాలెం. తండ్రి వెంకటరావు బైకు మెకానిక్, తల్లి సరోజని గృహిణి. పాడేరులో అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో పసిడి పతకం సాధించి మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించా. జిల్లాస్థాయిలో ఒక రజత, రెండు కాంస్య పతకాలు సాధించా. –ఎన్.మోహిత, 12వ తరగతి

మా సొంతూరు విజయవాడ. నాన్న సునీల్‌కుమార్ ఎలక్ట్రీషియన్. అమ్మ ఉమాకుమారి గృహిణి. పాడేరులో అండర్-19 పోటీల్లో రజతం సాధించి జనవరిలో మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించా. జిల్లా స్థాయిలో రెండు కాంస్య, ఒక రజత పతకాలు సాధించా. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని లక్ష్యం –సీహెచ్ ప్రణీత్, 12వ తరగతి

మా ఊరు బొబ్బిలి. తండ్రి మధుసూదనరావు. తల్లి సీతామహాలక్ష్మి గృహిణి. పాడేరులో అండర్-14 పోటీల్లో కాంస్య పతకం సాధించి వారణాసిలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. గతంలో జిల్లా స్థాయిలో ఒక కాంస్య, రజత పతకాలు సాధించా. ఆర్చరీలో దేశానికి గుర్తింపు తేవాలనేది లక్ష్యం. –జి.జానేష్, 8వ తరగతి

మాది గాజువాక. తల్లిదండ్రులు చైతన్య, సృజన వైద్యులు. పాడేరులోని అండర్-14 పోటీల్లో రజత పతకం కైవసం చేసుకుని వారణాసిలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. గతంలో మినీ రాష్ట్ర స్థాయి పోటీల్లో రజత పతకం సాధించి విజయవాడలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జిల్లా స్థాయిలో 2 పసిడి, 2 రజత, ఒక కాంస్య పతకాలు సాధించా. ఆర్చరీలో దేశానికి పసిడి పతకం అందించాలని లక్ష్యం. –ఆద్య, 8వ తరగతి

ఘనంగా గీతాజయంతి వేడుకలు

గోపీజనవల్లభస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న గండి బాబ్జీ, రాపర్తి కన్నా తదితరులు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట పరిసర ప్రాంతాల్లో సోమవారం గీతాజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. లక్ష్మీనరసింహనగర్ గోపీజనవల్లభస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, పెందుర్తి మండల తెదేపా ఇన్‌ఛార్జి గండిబాబ్జీ, కార్పొరేటర్ రాపర్తి కన్నా, జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, జోనల్ కమిషనర్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు. సచివాలయ కార్యదర్శులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చింతలగ్రహారం కృష్ణాలయంలో ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

ప్రతిభ చాటారు..బహుమతి పొందారు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

ఎస్‌వీఎల్ఎన్, ఎస్‌వీపీ జూనియర్ కళాశాలలో ప్రసంగిస్తున్న విద్యార్థి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ పి.సత్య, అధ్యాపకుడు వెంకటరమణ

వేపగుంట, న్యూస్‌టుడే: 'కృత్రిమ మేధ (ఏఐ)తో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై సోమవారం ఆర్.ఆర్.వెంకటాపురం ఎస్‌వీఎల్ఎన్, ఎస్‌వీపీ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రసంగించారు. హెచ్.అఖిల, జాన్సన్ విజయ్‌పాల్, ప్రియాంక పాల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ పి.సత్య, అధ్యాపకుడు ఎ.వెంకటరమణ బహుమతులు అందజేశారు.

వేంకటాద్రిపై 16 నుంచి ధనుర్మాసోత్సవాలు

ఉత్సవాల ప్రచార కరపత్రం విడుదల చేస్తున్న ఈవో నీలిమ, తదితరులు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాసోత్సవాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమవుతాయని దేవస్థానం ఈవో నీలిమ తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించిన ప్రచార కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ వివరాలను ఆలయ ప్రధానార్చకులు మహాదేవ రామానుజాచార్యులు తెలియజేశారు. 16వ తేదీన మధ్యాహ్నం నెల గంట పెట్టినప్పటి నుంచి వచ్చే ఏడాది జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస వ్రతం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నెల రోజుల పాటు ప్రతిరోజు తిరుప్పావై పాశుర విన్నపం, విశేష ఆరాధనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. అలాగే గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. జనవరి 1న ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా శ్రీనివాసుడు నవనీత అలంకరణలో భక్తులను అనుగ్రహిస్తారన్నారు. జనవరి 4న సుదర్శన హోమం, అన్న సమారాధన, 11న కూడారై ఉత్సవం, 13న తిరువీధి మహోత్సవం, 14న గోదా శ్రీరంగనాథుల కల్యాణంతో ధనుర్మాసోత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలియజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

93.08 శాతం పింఛన్ల పంపిణీ

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్న పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ

పెందుర్తి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం చురుగ్గా జరిగింది. పెందుర్తి మండలంలో తెల్లవారుజాము నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. మండలంలోని పది పంచాయతీల పరిధిలో 4,193 పింఛన్లకు గాను 3,903 పంపిణీ చేసి 93.08శాతం పూర్తి చేసినట్లు పెందుర్తి ఎంపీడీవో గుండు అప్పలరాజు తెలిపారు. తొలిరోజు రూ.1,64,11,500 నగదు పంపిణీ చేసినట్లు వివరించారు. పలు గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, కూటమి నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

గొల్లనారాయణపురం(వేపగుంట), న్యూస్‌టుడే: 93వవార్డు గొల్లనారాయణపురంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, జోనల్ కమిషనరు శంకర్రావు, ఏపీడీ చిరంజీవి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు తదితరులు

సబ్బవరం, న్యూస్‌టుడే: మొగలిపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అందజేశారు. స్థానిక నాయకులు తమరాన బంగారునాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సబ్బవరంలో తాతారావు, ఐరువాడలో రేపుపాక రమణ, బాటజంగాలపాలెంలో సర్పంచి పడాల వెంకటరమణ, బల్లిపాలెంలో శ్రీనివాసరావు సమక్షంలో అధికారులు వీటిని లబ్ధిదారులకు అందించారు. అనకాపల్లి జిల్లాలో సోమవారం సాయంత్రం 4 గంటలకు 94శాతం పింఛన్ల పంపిణీ చేసి జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నట్లు ఎంపీడీవో పి.పద్మ పేర్కొన్నారు.

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను సోమవారం సచివాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. కన్నూరు గ్రామంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఇద్దరు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గ్రామీణాభివృద్ధిశాఖ పీడీ శచీదేవి, తహసీల్దార్ నాగరాజు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో షేక్ బేగం తదితరులు పాల్గొన్నారు.

కన్నూరులో లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 132 ఫిర్యాదులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 132 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడి ఆయా వినతులపై త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు సీపీ పేర్కొన్నారు.

ధోబీఖానా ప్రారంభించేదెప్పుడో..!

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అమృతపురం గ్రామంలో పదేళ్ల కిందట చేపట్టిన ధోబీఖానా నిర్మాణం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎట్టకేలకు పూర్తయ్యింది. ఇందుకోసం సుమారు రూ.13లక్షలు వెచ్చించారు. వీలైనంత తొందరగా దీన్ని ప్రారంభించాలని స్థానిక రజకులు కోరుతున్నారు.

సౌర ఫలకాల ఏర్పాటుకు ఈపీడీసీఎల్‌తో ఒప్పందం


ఒప్పంద పత్రాన్ని చూపుతున్న సీఎండీ పృథ్వీతేజ్, సద్బన్ సంస్థ డైరెక్టర్, తదితరులు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గృహాలపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసేందుకు ఏపీఈపీడీసీఎల్‌తో సద్బన్ ఫ్యూచర్‌టెక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. గురుద్వారా దరి ఈపీడీసీఎల్‌లోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి.సూర్యప్రకాశ్ సమక్షంలో సీజీఎం ఎల్.దైవప్రసాద్, సద్బన్ ఫ్యూచర్ టెక్ డైరెక్టర్ భూపేంద్ర సింగ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. పలు డివిజన్లలో 44,998 సర్వీసులకు 90 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో సుమారు రెండు లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలపై ఉచితంగా ప్లాంటు ఏర్పాటుచేయడానికి టెండర్ ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరు సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

వేపగుంట, న్యూస్‌టుడే: జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం జరిగింది. జెడ్సీ శంకర్రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏసీపీ రామలింగారెడ్డి, మంచినీటి విభాగం ఏఈ రాజశేఖర్, ఏపీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు తోటి అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కాలుష్యం, భూసమస్యలు తదితర వాటిపై 9 అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ శంకర్రావు

జీవీఎంసీకి 111 వినతులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 111 వినతులు వచ్చాయి. మేయరు పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ వాటిని స్వీకరించారు. జోన్-2కు 18, జోన్-3కు 16, జోన్-4కు 9, జోన్-5కు 11, జోన్-6కి 15, జోన్-8కు 11, ప్రధాన కార్యాలయానికి 31 చొప్పున వచ్చాయి. వాటిలో పరిపాలనకు 13, రెవెన్యూకు 13, ప్రజారోగ్యానికి 7, ప్రణాళికకు 48, ఇంజినీరింగ్‌కు 21, ఉద్యాన విభాగానికి 5, యూసీడీకి 4 వచ్చాయి. ఆయా సమస్యలను పరిష్కరించాలని మేయరు అధికారులను ఆదేశించారు.

★ బీచ్‌రోడ్డులో ఓ బహుళ అంతస్తు నిర్మాణానికి సంబంధించి దరఖాస్తు చేసిన ప్లానుకు కేంద్ర, పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అనుమతులు తీసుకోలేదని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 20 బోర్లు వేశారని, వాటిని తక్షణమే మూసివేయాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన

చింతలగ్రహారం (వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం జడ్పీ పాఠశాలలో ఇటీవల జరిగిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సంబంధిత విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని నాగమణి, ఉపాధ్యాయ బృందం సోమవారం అభినందించింది.

ఫుడ్‌ఫెస్టివల్‌లో పాల్గొన్న బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అప్రమత్తతతోనే ఎయిడ్స్ నివారణ

పెందుర్తి, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరు ఎయిడ్స్ వ్యాధి పట్ల అప్రమత్తతతో వ్యవహరించడం ద్వారానే నివారణ సాధ్యమని పెందుర్తి సీహెచ్‌సీ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ హెచ్ఆర్‌కే దొర అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం పెందుర్తి ఐసీటీసీ కౌన్సిలర్లు చీపురుపల్లి సురేశ్‌కుమార్, హేమలత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. వైద్యాధికారులు డాక్టర్ అవంతి, డాక్టర్ అరుణాదేవి, సిబ్బంది పాల్గొన్నారు. ★ పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఫ్లోరా ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ థియోఫిలస్, ఉప ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో మంజుల తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో అవగాహన ర్యాలీ

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మానవహారం

పెందుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ వైద్యులు, ఐసీటీసీ సిబ్బంది

సబ్బవరం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన సబ్బవరంలో చేపట్టిన ర్యాలీని పీహెచ్‌సీ వైద్యుడు ఎన్ఎస్ఆర్ చక్రవర్తి ప్రారంభించారు. సీఐ రామచంద్రరావు, ఐసీటీసీ కౌన్సిలర్ రాజశేఖర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించి ఎయిడ్స్ వ్యాధిని తరిమి కొడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం వైద్యుడు కె.కన్నంనాయుడు, ప్రధానాచార్యుడు కేశవరావు, సబ్బవరం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.శిరీషారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వార్డు పరిధి ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రిన్సిపల్ వివేకానందరావు ప్రారంభించారు. అవగాహన ద్వారానే ఎయిడ్స్ నివారణ సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులు ఫ్లకార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పరవాడ మండలం ఇస్లాంపేటలో..

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవ బెహరా కళాశాలలో విద్యార్థులు ఎయిడ్స్ రిబ్బన్ ఆకృతిలో ప్రదర్శన చేపట్టారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ వరలక్ష్మీ ఆధ్వర్యంలో విద్యార్థులు నరవ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ చేపట్టి స్థానికులను చైతన్యపర్చారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

కాంగ్రెస్ బలోపేతం దిశగా అడుగులు

మురళీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తోందని, దీనికోసం పార్టీ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు సునీల్ అహీరే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అహీరే పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి పార్టీకి సేవ చేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రశంసిస్తూ పార్టీ ఎక్కడా బలహీన పడలేదని త్వరలోనే పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకోవాలంటే యువత కాంగ్రెస్‌ను ముందుండి నడిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో పార్టీని నడిపించే నాయకుల అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, పీసీసీ పరిశీలకులు మార్టిన్ లూథర్, అమర్‌బేగ్, వేగి వెంకటేశ్, ఇతర నాయకులు లక్కరాజు రామారావు, తదితరులు హాజరయ్యారు.

వన్డే మ్యాచ్‌కు ముమ్మరంగా పనులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఈనెల 6వ తేదీన ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న భారత్-దక్షిణాఫ్రికా వన్డే మ్యాచ్ నిర్వహణకు సంబంధించిన పిచ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే తయారు చేసిన పిచ్‌ను రోలింగ్ చేయడం వంటి పనులు సోమవారం చేపట్టారు. స్టేడియం హెడ్ క్యూరేటర్ నాగమల్లయ్య, ఏసీఏ మీడియా మేనేజర్ వై.వెంకటేష్ సంబంధిత పనులను పరిశీలించారు. గ్యాలరీల్లో సీట్లను శుభ్రపర్చడమే కాక స్టేడియంలోని అవుట్‌ఫీల్డ్ పనులు కూడా చకచకా సాగుతున్నాయి. ఈ మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఆంధ్రా క్రికెట్ సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెంకటేశ్ తెలిపారు. ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, సెక్రటరీ ఎంపీ సానా సతీష్‌లు ఈ మ్యాచ్ నిర్వహణకు అన్ని విభాగాలను సన్నద్ధం చేశారని పేర్కొన్నారు

CHANGE OF NAME
I, ATCHYUTAMBA PEMMARAJU (Old Name), W/o. K Visweswara Rao, residing at D.No.10-13/1/9, Flat No.204, Lakshmi Kamalasri Enclave, PF Colony, Near Baba Temple, Chinamushidiwada, Pendurthi, Visakhapatnam-530051, Andhra Pradesh. Changing my Name from ATCHYUTAMBA PEMMARAJU (Old Name) to KROVVIDI ACHYUTAMBA (New Name), henceforth I am being called KROVVIDI ACHYUTAMBA (New Name), for all purposes

(c) eenadu

ఎట్టకేలకు గేటు తెరుచుకుంది

పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల


కుడి కాలువలో ప్రవహిస్తున్న జలాలు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), కూడేరు, న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ అత్యవసర గేటు పైకిలేచింది. సోమవారం ఉదయం నుంచే గేటును పైకిలేపడానికి మరోసారి ప్రయత్నాలు మొదలు పెట్టారు. హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, డీఈలు కవిత, వెంకటరమణ, శ్రీనివాసులు, ఏఈలు ఓబిరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు అక్కడే మకాం వేశారు. గేట్ల మరమ్మతు టెండర్ దక్కించుకున్న కర్నూలు ఎస్వీ ఇంజినీరింగ్ సంస్థ నిర్వాహకులు శ్రీనివాసులు తమ సిబ్బందితో గత నెల 14 నుంచి విశ్వప్రయత్నాలు చేశారు. సిబ్బందే ప్రస్తుత గేటును ఎత్తారు. రాష్ట్ర జలవనరుల మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు సూచనలను పాటించారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గేటు పైభాగం కదిలింది. తొలుత అర అడుగు పైకిలేవడంతో సిబ్బందిలో ఉత్సాహం రెట్టింపు అయింది. మొదట్లో 150 క్యూసెక్కుల ప్రవాహం మొదలైంది. తరువాత రెండు అడుగులు పైకిలేపి 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మంగళవారం మరో 200 క్యూసెక్కులు పెంచి.. ప్రవాహాన్ని కొనసాగిస్తారు.

గతేడాది రెండు.. ఇప్పుడు ఒకటి

పీఏబీఆర్ కుడి కాలువకు గతేడాది అతికష్టంపై గేట్లను ఎత్తారు. అప్పట్లో డిసెంబరు 2న నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం అష్టకష్టాలు పడి ఒకటో తేదీన నీటిని విడుదల చేయడం విశేషం. సోమవారం రాత్రి 7 గంటల సమయానికి కూడేరు మండలం హంసాపల్లి దాటాయి. కాలువ పూర్తి సామర్థ్యం 800 క్యూసెక్కులు. గరిష్ఠంగా 700 క్యూసెక్కుల ప్రవాహాన్ని కొనసాగిస్తారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 5.3 టీఎంసీలు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 620.. అవుట్‌ఫ్లో 990 క్యూసెక్కులు నమోదు అవుతోంది. డ్యాం ఎగువ ప్రాంతాల్లోని పొలాలు మునగడంతో అత్యవసరంగా దిగువన ఉన్న నదికి 560 క్యూసెక్కులు వదిలారు.

రైతులు సహకరించాలి

- సుధాకర్‌రావు, ఎస్ఈ, హెచ్చెల్సీ

కుడి కాలువకు కనీసం 2.5 టీఎంసీలు ఇస్తాం. రైతులు సమన్వయం పాటించాలి. చివరి దాకా నీరు వెళ్లడానికి రైతులు సహకరించాలి. అటు తాడిమర్రి, ఇటు ధర్మవరం దాకా నీరు వెళ్లాల్సి ఉంటుంది. ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు సహకరించాలని మనవి. నిర్దేశిత చెరువులకు నీటిని సరఫరా చేస్తాం. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

'శిశుగృహ' సిబ్బందికి తొలగింపు ఉత్తర్వులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రెండు మాసాల పసిబిడ్డ మృతిపై అభియోగం ఎదుర్కొంటున్న శిశుగృహ సిబ్బందికి ఉద్యోగాల తొలగింపు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులపై కలెక్టర్ ఆనంద్ రెండోసారి ఆమోదం తెలపడంతో ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి సదరు సిబ్బందిని తన కార్యాలయానికి పిలిపించి వ్యక్తిగతంగా అందించారు. తొలగింపు ఉత్తర్వులు జారీ అయిన వారిలో... శిశుగృహ మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం గుణవతి, ఆయాలు ఆదిలక్ష్మి, ప్రభావతి, నూర్జహాన్, వాచ్‌మెన్ రాజశేఖర్ ఉన్నారు. వీరిలో మేనేజర్, సోషల్ వర్కర్ మాత్రమే ఉత్తర్వులు తీసుకోడానికి రాలేదు. మిగతా ఐదుగురికి అందించారు. ఆ ఇద్దరు కూడా మంగళవారం వచ్చి ఉత్తర్వులను తీసుకుంటామని పీడీ కార్యాలయానికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

త్వరలోనే ఉద్యోగాల భర్తీకి ప్రకటన

శిశుగృహలో పని చేసే మొత్తం సిబ్బందిని తొలగించిన సంగతి తెలిసిందే. వీరి స్థానంలో కొత్త వారిని నియమిస్తారు. ఇందుకు త్వరలోనే ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. దస్త్రాన్ని పీడీ కార్యాలయం సిద్ధం చేస్తోంది. రెండు, మూడు రోజుల్లో కలెక్టర్‌కు దస్త్రాన్ని పంపిస్తారు. ఐసీపీఎస్, ఛైల్డ్‌లైన్ సిబ్బందిని షిఫ్టు పద్ధతిలో పని చేసేలా పీడీ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు.

అభ్యసన సామర్థ్యాల సర్వేలో అధమం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సర్వేకు ఉపక్రమించింది. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో సర్వేలో అనంత జిల్లా రాష్ట్రంలోనే అధమస్థానంలో ఉండటం గమనార్హం. మొత్తం 1416 ప్రాథమిక పాఠశాలల్లో సర్వే నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికీ 755 బడుల్లో ఆరంభించలేదు. 83,103 మంది విద్యార్థులను సర్వే చేయాల్సి ఉండగా కేవలం 13,088 మందితోనే వివరాలు రాబట్టారు. సర్వే చేసింది 15.75 శాతం మందిని మాత్రమే. సీఆర్పీలు, టీటీసీ విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో సర్వే చేస్తున్నారు. ప్రతి విద్యార్థిని లీప్‌యాప్ ద్వారా ప్రశ్నలు అడుగుతారు. ఇచ్చిన సమాధానాల ప్రకారం వారి సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. ఈనెల 5లోపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. 6వ తేదీ నుంచి 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సర్వే కొలిక్కి రాలేదు.

సొంతింటి కల సాకారం దిశగా!

యాప్‌లో లబ్ధిదారుల వివరాల అనుసంధాన ప్రక్రియను పరిశీలిస్తున్న పీడీ శైలజ, ఇతర అధికారులు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: సొంతిళ్ల నిర్మాణం కోసం పేదల నుంచి భారీగా డిమాండ్ కనిపిస్తోంది. గత వైకాపా హయాంలో ఊర్లకు ఊళ్లు నిర్మించామంటూ ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంతిల్లు, స్థలం కావాల్సిన వారు, సొంత స్థలం ఉండి ఇళ్లు కావాల్సిన వారి వివరాలను క్రోడీకరిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ ఇళ్ల

దరఖాస్తుకు గడువు పెంపు

కావాలంటూ పేదలు కోరుతున్నారు. నిజంగా వైకాపా హయాంలో పేదలు అందరికీ ఇళ్లు నిర్మించి ఉంటే ఇంత డిమాండ్ ఏర్పడేది కాదని స్పష్టం అవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటి నిర్మాణాలకు పలు వెసులుబాట్లు కల్పించడంతో ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నట్లు స్పష్టం అవుతోంది.

నియోజకవర్గం-దరఖాస్తుదారులు	
కళ్యాణదుర్గం	12,210
రాయదుర్గం	9,142
ఉరవకొండ	9,468
రాప్తాడు	9,319
శింగనమల	6,920
తాడిపత్రి	6,308
గుంతకల్లు	5,038

సాగిన ఇంటింటా సర్వే!

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ప్రత్యేకంగా ఆవాస్ యాప్‌ను తీసుకొచ్చి నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎవరికి అవసరమో వారి వివరాలను ముఖ ఆధారిత, వేలిముద్రలు ద్వారా వివరాలు యాప్‌లో అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పలు గ్రామాల్లోని ఇంజినీరింగ్ సహాయకులు సచివాలయాలకు వచ్చిన వారికి మాత్రమే ముఖ ఆధారిత వివరాలు నమోదు చేస్తున్నారు. సొంత స్థలం ఉంటే స్థలంతో పాటు లబ్ధిదారు వివరాలను స్థలం ఉన్న ప్రదేశంలోనే చేయాల్సి ఉండటంతో వెళుతున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేస్తే ఇంకొంత మంది పేదలకు సొంతిల్లు సాకారం అయ్యే అవకాశం ఉంటుంది. గత నెల 30 నాటికి గడువు ముగిసినా ఇంకొంత మందికి లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ఈనెల 14 వరకు గడువు పొడిగించారు.

సద్వినియోగం చేసుకోవాలి

- శైలజ, గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు అధికారిణి

సచివాలయం సిబ్బంది కచ్చితంగా ఇంటింటా సర్వే చేసి వివరాలు అనుసంధానం చేయాలి. ఈనెల 14 వరకు గడువు పొడిగించారు. ఆలోపు ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే సంబంధిత సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామంలో పింఛను సొమ్ము అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తాం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లు మంజూరు చేస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సోమవారం రేకులకుంట గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. పింఛన్లు ప్రతి నెలా ఇంటివద్దకు వచ్చి అధికారులు ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. గ్రామాల్లో అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, ఎంపీడీవో సాల్మన్‌రాజు, తహసీల్దారు శ్రీధరమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో సదాశివ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీలో అనంత ప్రథమం

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఉరవకొండ మండలం బూదగవిలో మంత్రి పయ్యావుల కేశవ్, బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలో కలెక్టరు ఆనంద్, అనంతపురంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. అనంతపురం జిల్లాలో 2,78,905 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా మొదటి రోజే 2,65,418 మందికి రూ.118.034 కోట్లు పింఛన్ దారులకు సొమ్ము అందజేశారు. తాడిపత్రి అర్బన్‌లో 97.57 శాతం మందికి పంపిణీ చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండగా బెళుగుప్ప మండలంలో 93.46 శాతం మందికి పంపిణీ చేసి చివరలో ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 2,63,048 మందికి అందజేయాల్సి ఉండగా 2,46,104 మందికి రూ.107.28 కోట్లు అందజేశారు. 93.56శాతం మందికి పంపిణీ చేసి 12వ స్థానంలో నిలిచింది.

ఆక్రమించారయ్యా... ఆదుకోండి!



ఈయన పేరు షేక్షావలి. గార్లదిన్నె మండలం పెనకచర్ల గ్రామం. 1992లో ప్రభుత్వం మూడెకరాలకుపైగా డిపట్టా భూమి మంజూరు చేసింది. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామానికి చెందిన ఆరుగురు ఆక్రమించారని.. దయచేసి భూమి ఇప్పించాలని కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికి నాలుగుసార్లు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చా. ఎటువంటి ఫలితం లేదు. నువ్వు ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో.. ఏమీ చేయలేరని ఆక్రమణదారులు హెచ్చరిస్తున్నారని వాపోయారు. ప్రస్తుతం వికలాంగుల పింఛను కింద రూ.15 వేలు వస్తోంది. దాంతోనే జీవనం సాగుతోందన్నారు. సోమవారం మళ్లీ అర్జీ ఇవ్వడానికి భార్యతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చినట్లు షేక్షావలి చెప్పారు.

-ఈనాడు, అనంతపురం

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీని విధిగా పరిష్కరించాల్సిందే. ఇందులో ఎవరు నిర్లక్ష్యం ప్రదర్శించినా శాఖపరమైన చర్య తప్పదు.. అని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తోపాటు జేసీ శివనారాయణ శర్మ, శిక్షణ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్‌ఓ మాలోల, ఉప కలెక్టర్లు రామ్మోహన్, ఆనంద్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ వినతులు తీసుకున్నారు. 437 మంది అర్జీలు ఇచ్చారు. ఆ తర్వాత జిల్లా అధికారులతో మాట్లాడారు. పీజీఆర్ఎస్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. జిల్లా అధికారి నుంచి క్షేత్ర స్థాయి అధికారి దాకా తగిన శ్రద్ధ చూపాలి. బాధితుల వద్దకే వెళ్లి అర్జీలను పరిశీలించి..పరిష్కరించాలన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బాబయ్య దర్గా

నేటి నుంచి ఉరుసు

పెనుకొండ, న్యూస్‌టుడే: దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన పెనుకొండ బాబయ్యస్వామి దర్గా శతాబ్దాల కాలం నుంచి మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. దర్గా 753 గంధం, ఉరుసు వేడుకలు హిందూ, ముస్లిం ఐక్యతకు చిహ్నంగా నిలుస్తాయి. బాబయ్యస్వామి దర్గా పీఠాధిపతి నజర్‌హుస్సేనీ, వంశపారంపర్య ముతవల్లి తాజ్‌బాబా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించే జాతీయ సర్వమత సమ్మేళనంలో ప్రముఖులు పాల్గొంటారు. ప్రభుత్వం తరపున రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత దర్గాకు చాదర్ సమర్పిస్తారు. రాత్రి 9గంటల నుంచి సర్వమత సమ్మేళనం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 2గంటలకు సందల్‌మహల్ నుంచి పీఠాధిపతి ఊరేగింపుగా గంధం తీసుకువచ్చి స్వామివారికి సమర్పిస్తారు. ఇక్కడ 38సంవత్సరాలుగా జాతీయ సర్వమత సమ్మేళనం నిర్వహిస్తున్నారు.

దీపాలంకరణలో బాబయ్యస్వామి దర్గా ప్రధాన ద్వారం

నవయుగ వైతాళికుడు గురజాడ

ప్రసంగిస్తున్న ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం విద్య: సమాజాన్ని చైతన్య పరచిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో సోమవారం గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ. . సమాజంలో పేరుకుపోయిన కులాలు, మతాలు, మూఢనమ్మకాలు, ఛాందస వాదాలను నిర్మూలించడానికి గురజాడ కృషి చేశారన్నారు. సమాజాన్ని చైతన్య పరచాలంటే విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గురజాడ చేసిన రచనల గురించి వివరించారు. జనవిజ్ఞాన వేదిక ప్రసూన, భాస్కర్, అధ్యాపకులు హేమమాలిని, అంకే శ్రీనివాస్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, తిరుపాలు, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఖనిజ సంపద దోపిడీ

అడ్డగోలుగా అటవీభూముల్లో తవ్వకాలు

కొండుపల్లి వద్ద అటవీ భూములు.. వీటి కిందనే తవ్వకాలు సాగుతున్నాయి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ఆ ప్రాంతంలో ఏ భూముల్లో చూసినా విలువైన భూగర్భ ఖనిజాలు ఉంటాయి. దీంతో సదరు భూముల ధరకు రెక్కలొచ్చాయి. ఎకరం రూ.అరకోటి పైమాటే. ఉమ్మడి అనంత జిల్లాలో అత్యధికంగా పెద్దవడుగూరు మండలం కొండుపల్లి, క్రిష్టిపాడు గ్రామాల పరిధిలో సుమారు 36 భూగర్భగనులు ఉన్నాయి. కొందరికి మాత్రమే అనుమతులు ఉండగా మరికొందరు అడ్డగోలుగా భూగర్భగనుల్లో తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా భూములకు విలువ పెరుగుతూ వస్తోంది. మరోవైపు రాజస్థాన్‌లో భూగర్భగనులు బంద్ కావడంతో ప్రస్తుతం ఇక్కడి వాటికి డిమాండ్ పెరిగింది. అక్రమార్జనే ధ్యేయంగా తవ్వకాలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. రోజూ వేల టన్నుల ఖనిజం తరలిపోతున్నా అటవీ, రెవెన్యూ, గనులశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రెండు గ్రామాల పరిధిలోని భూగర్భంలో స్టియటైట్, డోలమైట్, సున్నపురాయి ఉన్నాయి. ఇందులో స్టియటైట్‌కు మంచి గిరాకీ ఉంది. దీంతో తవ్వకాలు జరిపి.. జేబులు నింపుకోవడానికి అక్రమార్కులు పోటీ పడుతున్నారు.

రహదారుల కింద సైతం..

కొండుపల్లి సమీపంలో అటవీ భూములు వందలాది ఎకరాల్లో ఉన్నాయి. సర్వే నంబరు 302-ఎలో 267.69 ఎకరాలు.. 1007 సర్వే నంబరులో 715.30 ఎకరాలతోపాటు కొండలు విస్తరించి ఉన్నాయి. అనుమతి గనుల పక్కనే ఉన్న అటవీభూముల వైపు తవ్వకాలు జరిపి విలువైన ఖనిజ సంపదను దోచుకుంటున్నారు. ఇదిలా ఉండగా గ్రామాలకు వెళ్లే రహదారుల కింది భాగంలో తవ్వకాలు జరిపి అక్రమార్జనకు తెరలేపారు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే ఎప్పుడు కుంగిపోతాయోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండుపల్లి, క్రిష్టిపాడు ప్రాంతాల్లో 16 గనులకే అనుమతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి వెళ్లారు. తిరిగి అక్రమార్కులు తవ్వకాలు సాగిస్తూ ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు.

పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం

-నారపరెడ్డి, అటవీశాఖ సెక్షన్ అధికారి, గుత్తి

కొండుపల్లి ప్రాంతంలోని అటవీభూముల్లో కొందరు భూగర్భంలో తవ్వకాలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తవ్వకాలు జరిపిన వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

రాయదుర్గంలో ప్రయోగాత్మకంగా మునగ సాగు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా 50 ఎకరాల్లో మునగ సాగు చేపట్టనున్నట్లు వెలుగు ప్రాజెక్టు మేనేజర్ గంగాధర తెలిపారు. ఇప్పటకే రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డి వద్ద 15 ఎకరాల్లో మునగ మొక్కలను నాటినట్లు చెప్పారు. కరవు రైతులను ఆదుకుని.. వారి ఆదాయాన్ని పెంచేందుకు అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, రాప్తాడు నియోజకవర్గాల్లో దశలవారీగా మునగ తోటల పెంపకానికి చర్యలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఎన్నో పోషక విలువలు ఉన్న ఆకులు, ఔషధ గుణం ఉన్న మునగ పొడి వేర్వేరుగా విక్రయించే సౌలభ్యం ఉంటుందన్నారు. మూడు నెలలకోమారు పంట ద్వారా రైతులకు ఆదాయం వస్తుందన్నారు మునగాకు విక్రయాలకు కోసం ఇప్పటికే హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రాల్లోని వ్యాపారులతో ఒప్పందాలు చేసుకున్నట్లు ఆయన వివరించారు.

పేదింటి బిడ్డలు.. ఆటల్లో ఆణిముత్యాలు

మడకశిర, రొళ్ల, న్యూస్‌టుడే : నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన ఈ విద్యార్థులు కఠోర సాధనతో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు. కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూనే క్రీడలపై మక్కువ పెంచుకుని జాతీయ స్థాయి వరకు ఎంపికై ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆకట్టుకునే ఆటతీరు - లక్ష్మీప్రియ

రొళ్ల మండలం ఎం.రాయాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. తండ్రి లేకపోయినా తల్లి పార్వతి కూలీ చేసుకుంటూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తోంది. వాలీబాల్‌లో మంచి ఆట తీరు కనబరచడంతో అండర్-17 విభాగంలో జిల్లా స్థాయిలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఇటీవల తూర్పు గోదావరిలో కొవ్వూరులో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ఆడింది. డాక్టర్ కావాలని బాగా చదువుతున్నట్లు చెప్పింది.

ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే లక్ష్యం.. - దీక్ష

మడకశిర మండలం గంగులవాయిపాళ్యం రాజు, రత్నమ్మల కుమార్తె తల్లిదండ్రులు కూలీ పనులు చేసి గుండుమల కేజీబీవీలో చదివిస్తున్నారు. అండర్ 17 విభాగంలో పరుగు పందెంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించింది. చిన్నప్పటి నుంచి పరుగు పందెంలో ఎక్కడ పాల్గొన్న మొదటి స్థానంలో నిలిచేది. గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని 800మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించింది. దీంతో ఆ విద్యార్థిని జాతీయస్థాయికి ఎంపికైంది. లక్నోలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధం అవుతోంది. ఒలింపిక్స్‌లో పాల్గొని భారత్‌కు పతకాన్ని తీసుకురావాలనేదే తన లక్ష్యం అంటోంది దీక్ష.

క్రికెట్‌లో మూడుసార్లు జాతీయ స్థాయికి..

- వరుణ్ సందేశ్

రొళ్ల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ అండర్-17లో మూడు సార్లు క్రికెట్‌లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరు అంజలీదేవి, మధుసూదన్‌లు పెయింటింగ్ పని చేసుకుని చదివిస్తున్నారు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై మక్కువతో కష్టపడి ఆడుతూ ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు వెళ్లాడు. నెల్లూరులో నిర్వహించిన మినీ సౌత్ జోన్ అండర్-14లో ఏపీ జట్టు తరుపున ఆడాడు. హైదరబాద్‌లో 6వ జాతీయ క్రికెట్ టోర్నమెంటులో ఏపీ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ నెలలో దిల్లీలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనున్నాడు. ఇండియా క్రికెట్ జట్టులో ఆడాలని కోరికతో ఆడుతున్నాడు.

బస్సులు ఆపడం లేదని నిరసన

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం-అనంతపురం ప్రధాన దారిలోని పాతచెరువు గ్రామం వద్ద ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని ఆగ్రహానికి గురైన మహిళలు, గ్రామస్థులు సోమవారం రోడ్డుపై బైఠాయించారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం అయినప్పటి నుంచి సక్రమంగా బస్సులు ఆపడం లేదని వాపోయారు. పిల్లలు, మహిళలు, బాలింతలు, వృద్ధులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. విషయం తెలుసుకున్న గ్రామీణ పోలీసు స్టేషన్ శిక్షణ ఎస్సై నరసింహారెడ్డి సిబ్బందితో చేరుకుని మహిళలకు నచ్చజెప్పినా ప్రయోజనం లేకపోయింది. డీఎం రామచంద్రకు చరవాణిలో సమస్యను వివరించి బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు.

(c) eenadu

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు (మంగళవారం) రాత్రి 7.30 గంటలకు వెండి రథ ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు సాధారణ దర్శనం ఉంటుంది. 7 నుంచి 9 గంటల మధ్య అభిషేకం, స్వర్ణకవచ సేవలు జరుగుతాయి. 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

భక్తరపల్లిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలిరోజు సోమవారం స్వామి వారి ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని వివిధ పూలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు, కలశపూజ, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పట్టువస్త్రాలతో వస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు దంపతులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

రైల్వే డీసీఎం బాధ్యతల స్వీకరణ

మోహన్‌కృష్ణ

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు డివిజన్ కమర్షియల్ మేనేజరు(డీసీఎం)గా సోమవారం మోహన్‌కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈయన సికింద్రాబాద్‌లో డివిజనల్ ఆపరేటింగ్ మేనేజరుగా విధులు నిర్వహించే వారు. ఇక్కడ పనిచేస్తున్న డీసీఎం శ్రీకాంత్‌రెడ్డి సికింద్రాబాదుకు డీఓఎంగా బదిలీపై వెళ్లారు. మోహన్‌కృష్ణ కార్యాలయానికి రాగానే సిబ్బంది స్వాగతం పలికారు. అతను డివిజన్‌కు చెందిన ఇతర శాఖల అధికారులతో పాటు సీనియర్ డీసీఎం మనోజ్‌ను కలిశారు. డివిజన్ గుండా వెళ్లే ప్రయాణికుల సమస్యలను పరిష్కరించడానికి, రైళ్లలో టికెట్లు లేని వారు ప్రయాణించకుండా చూడడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది తమకు పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు.

శతకంతో విజృంభించిన వీరారెడ్డి

భారీ స్కోరు దిశగా ఆంధ్ర

శతకంతో మెరిసిన వీరారెడ్డి, శ్రీనివాస్ (98)

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: వీరారెడ్డి (114), కెవెల్ శ్రీనివాస్ (98) బ్యాటింగ్‌లో చెలరేగడంతో అంతర్ రాష్ట్ర అండర్-19 కూచ్‌బెహార్ నాలుగు రోజుల క్రికెట్ పోటీలో ఆంధ్ర భారీస్కోరు దిశగా పయనిస్తోంది. ఆంధ్ర జట్టు కర్ణాటక జట్టుపై తొలిరోజు సోమవారం ఆటముగిసే సమయానికి 91 ఓవర్లలో ఐదు వికెట్లకు 300 పరుగులు చేసింది. రాయలసీమ క్రికెట్ మైదానంలో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మొదటి ఓవర్‌లోనే వికెట్ చేజార్చుకుంది. కేహెచ్ వీరారెడ్డి, శ్రీనివాస్‌లు ఆచితూచి ఆడి రెండో వికెట్‌కు 202 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. వీరారెడ్డి ఔట్ కాగానే వెంటనే మూడు వికెట్లు కూలాయి. ఏఎన్‌వీ లోహిత్, పరమ్‌వీర్‌లు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. కర్ణాటక బౌలర్లు హిరేమత్ (3/86), రతన్ (2/54)లు ఆంధ్ర బ్యాటర్ల దూకుడుకు కళ్లెం వేశారు. రెండోరోజు ఆంధ్ర జట్టు మరో వంద పరుగులు జోడిస్తే మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించే అవకాశం ఉంటుంది.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఈ నెల 2 నుంచి 19 వరకూ 3, 5 సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం సంచాలకులు జీవీ రమణ తెలిపారు. 54 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 15 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు వివరించారు.

ఉప ఎంపీడీఓ, ఇద్దరు కార్యదర్శులకు తాఖీదులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన ఒక ఉప ఎంపీడీఓ, ఇద్దరు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పీజీఆర్ఎస్ అర్జీలను చూడకుండా నిర్లక్ష్యం ప్రదర్శించడంతో వారికి డీపీఓ నాగరాజునాయుడు తాఖీదులు జారీ చేశారు. ఉరవకొండ ఉప ఎంపీడీఓ ఎం.సతీష్‌కుమార్, తాడిపత్రి మండలం చిన్నపొలమాడ పంచాయతీ కార్యదర్శి బలరామమూర్తి, విడపనకల్లు మండలం హవళిగి కార్యదర్శి జె.రామకృష్ణకు నోటీసులు అందజేశారు. విధుల పట్ల ఏ మాత్రం అశ్రద్ధ చూపి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని డీపీఓ హెచ్చరించారు. గ్రామ పంచాయతీ పనులకు సంబంధించి ప్రభుత్వం అడిగిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంపించాలన్నారు. ఎవరు నిర్లక్ష్యం చేసినా సస్పెండ్ చేయాలన్న ఆదేశాలు వచ్చాయని ఆయన హెచ్చరించారు.

బొప్పాయి.. రాబడికి ఢోకాలేదోయ్!

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే : బొప్పాయి పంట వైపు మొగ్గు చూపి మంచి దిగుబడులతోపాటు అదే స్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నారు కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లికి చెందిన రైతు మహేంద్ర. తనకున్న 25 ఎకరాల్లో గతంలో టమాటా, మిరప, కర్బూజా పంటలు సాగు చేసిన నష్టాలు మూటగట్టుకున్నాడు. ఆయా పంటల మధ్యలో కొంత వరకు బొప్పాయి పంట సాగు చేశారు. అందులో లాభాలు రావడంతో 6 ఎకరాల్లో బొప్పాయి పంట సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. తాజాగా మరో నాలుగెకరాల్లో పంట సాగు చేసేందుకు సిద్ధమయ్యారు.

ఏపుగా పెరిగిన బొప్పాయి

రైతేరాజు

● ప్రస్తుతం నంబరు -15 (పండ్రా) రకం బొప్పాయి రకాన్ని 9 నెలల కిందట 6×6 దూరంలో మొక్కలు నాటారు. నంబరు -15 (పండ్రా) రకం మహారాష్ట్రలోని పూణె నుంచి ఒక్కో మొక్క రూ.12తో 6 వేల మొక్కలు కొనుగోలు చేశారు. మొక్కలకు రూ.72 వేలు, కంపోస్ట్ ఎరువులకు రూ.40 వేలు, సేంద్రియ ఎరువులకు గాను ట్రాక్టర్‌కు రూ.6 వేలు వంతున 15 ట్రాక్టర్లు, డ్రిప్, ఫర్టిలైజర్ ఎరువులకు రూ.45 వేలు, కూలీలు ఇతర పెట్టుబడులు కలిపి దాదాపుగా రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు.

ప్రారంభమైన కోతలు..

నెల నుంచి పంట కోత దశకు వచ్చింది. మొదట, రెండో కోతలో ఒక్కో కోతకు 12-15 టన్నుల దిగుబడి వచ్చింది. మార్కెట్లో విక్రయించగా దాదాపు రూ.1.80 లక్షలు వచ్చింది. మూడో కోతలో 25 టన్నుల వరకు దిగుబడి రానుంది. నెలలో రెండు కోతల వరకు వస్తుంది. ఏడాదిన్నర వరకు పంట కోత ఉంటుంది. కాలానుగుణంగా బొప్పాయి ధరలు పెరిగితే పంట కాలం పూర్తయ్యేంత వరకు రూ.20 లక్షల నుంచి రూ.32 లక్షల వరకు ఆదాయం వస్తుంది. సేంద్రియ ఎరువులు ఒక సారి తోటలో వేస్తే రెండేళ్ల పాటు పోషకాలు ఉంటాయి.

● వ్యాపారులు తోట వద్దకే వచ్చి దిగుబడులను కొనుగోలు చేస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పండిన బొప్పాయి కాయలకు మంచి గిరాకీ ఉంది. దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ మార్కెట్లో విక్రయాలు చేస్తున్నారు. దీంతో రవాణా ఖర్చులు కలిసొస్తున్నాయి.

విపణిలో మంచి డిమాండ్

- మహేంద్ర, కుర్లపల్లి

గతంలో వ్యవసాయ క్షేత్రంలో పలు రకాల ఉద్యాన పంటలు సాగు చేసినా నష్టాలు వచ్చాయి. బొప్పాయి పంట పెట్టినప్పటి నుంచి దిగుబడులతో పాటు మంచి లాభాలు వస్తున్నాయి. ఈ పంట ఏడాదిన్నర పాటు ఆదాయం తెస్తోంది. సేంద్రియ ఎరువుల వాడకంతో బొప్పాయి కాయలకు డిమాండ్ కూడా బాగానే ఉంటోంది. బొప్పాయి సాగు ఎంతో ఊరట ఇస్తోంది.

మామిడిలో సస్యరక్షణ చర్యలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మామిడి తోటల్లో పూత దశ ఎంతో కీలకం. తెగుళ్లు అధికమైతే పూతరావడం చాలా ఆలస్యమవుతుంది. ఫలితంగా దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. పూతరాక ముందే ఇప్పటి నుంచి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మామిడి పూత ఒకేసారిరాదు. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి వరకు పూత వస్తూనే ఉంటుంది. ఈ సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం రైతులకు కష్టం, ఈ సమస్యను అధిగమించేందుకు తేమ తక్కువ ఉండే నేలల్లో తేలికపాటి నీటితడులివ్వాలి.

తేనె మంచు పురుగు నివారణ..

మామిడిలో తేనె మంచు పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ, సల్ఫర్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పదిరోజుల తర్వాత ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ, హెక్సాకొనజోల్ 2 మి.లీ, 13:0:45 -10 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత పది రోజులకు బోరాన్ 2 గ్రా. సూక్ష్మధాతువు 2 గ్రా. కార్బండాజిమ్ ఒక గ్రా. లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయడం ద్వారా తేనెమంచు పురుగు, బూడిద తెగుళ్లను నివారించవచ్చు. దీంతో మామిడి పూత ఆరోగ్యంగా రావడానికి ఎంతో దోహదపడుతుంది.

బెండకు మొవ్వకుళ్లు తెగులా?

గోవిందపల్లిలో సాగులో ఉన్న బెండతోట

చిట్కా

నార్పల, న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలో బెండ పంటను సాగు చేసిన రైతులు తెగుళ్లను సమర్థంగా నివారించి, తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. పంటకు మొవ్వకుళ్లు, కాయతొలిచే పురుగులు ఆశిస్తే తీవ్ర నష్టం వస్తుందన్నారు. ఇలాంటివి సోకినపుడు రైతులు వేప నూనె 5 మి.లీ, ఇమామెక్టిన్ బెంజాయేట్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకుంటే తెగుళ్లు పూర్తిగా నివారించవచ్చని శాస్త్రవేత్త తెలిపారు.

సమస్య సమాధానం

నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రబీ వ్యవసాయ సీజన్‌లో జిల్లాలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నారాయణస్వామి నంబరు: 62812 84235కు ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేయడానికి ఉల్లినారు వేశాం. దీనికి నారుకుళ్లు తెగులు సోకింది. తెగులు నివారణకు మార్గం తెలపండి. **- వెంకటేష్, పెద్దవడుగూరు**

సమాధానం : ఉల్లినారు కుళ్లు తెగులు నివారణకు రైతులు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి 10 రోజులకు ఒక సారి పిచికారీ చేసుకుంటే తెగులు ఉద్ధృతి తగ్గుతుంది.

సమస్య : మామిడి తోటలో పూత రాలిపోతుంది. పూత రాలకుండా ఉండాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలి. **-నరసింహులు, గొల్లపల్లి**

సమాధానం: మామిడి చెట్లకు నీరు ఎక్కువగా పెట్టకూడదు. తేలికపాటి తడులు ఇవ్వాలి. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు, అర్కమాంగో స్పెషల్ 5 గ్రాముల చొప్పున పిచికారీ చేసుకుంటే సరిపోతుంది.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ జ్యువెల్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్క్రాప్ గోల్డ్ కొంటాము/ సిల్వర్ గోల్డ్ ట్రేడింగ్ కు|| ☎ 7382114647.

REAL ESTATE

FLAT FOR SALE

3BHK, 2BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో సరసమైన ధరతో అనంతపురంలో నిర్మిస్తున్న మీనాక్షిఅపార్ట్మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. 7416560179, 9515651111

JOBS

Wanted: (1) ITI Electrician/ Operators (Cold Storage) (2) Supervisor@Fresh Cart Agro (P) Ltd., Kidroad, ATP (Intervie 03/12/2025) Cell: 9490571605, 8143697965

ట్రాక్టర్ అమ్మకంలో 4-5 సం||ల అనుభవం కల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. స్వరాజ్ ట్రాక్టర్స్ మార్కెటింగ్ కొరకు రామగిరి, నార్పల, గుత్తి, శింగనమల, తాడిపత్రి, పెద్దప్పూరు, BKS, కనగానపల్లి, యల్లనూరు, పుట్లూరు మండలాలకి. 8465066566, 8374559867.

డ్రీమ్‌హోమ్ కన్‌స్ట్రక్షన్, ATP నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్/ టెలీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. శాలరీ + ఇన్సెంటివ్స్. Ph: 7893932828.

S.R.రెడ్డి అపార్ట్మెంట్ గుత్తి రోడ్డు నందు పనిచేయుటకు వాచ్‌మెన్ కావలెను. రూమ్ సదుపాయం కలదు. సంప్రదించు Cell No: 9000610030.

MARKETING/ SALES

Ceiling Fans, Electrical Geyser (Standard Company) & Holiday Packagesలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల వ్యక్తులు కావలెను. Cell: 9440294666.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రచురించడానికి ముందు తగిన రీతిలో శ్రద్ధ తీసుకుంటున్నప్పటికీ ప్రకటనల్లోని విషయాలకు పాఠకులు స్వయంగా నిర్ధారించుకోవాలని సూచిస్తున్నాము. ప్రకటనదారులు చెబుతున్న విషయాలను నిర్ధారించుకున్న తరువాతనే వారితో సంప్రదింపులు జరపాలి. ప్రకటనల్లోని అంశాలకు ఈనాడు బాధ్యత వహించదు. డబ్బులు పంపే ముందు, బ్లాంక్ చెక్కులు ఇచ్చే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

6 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఈనాడు క్లాసిఫైడ్‌లో ప్రకటన ఇవ్వండి.

వివరాలకు: 8008709784

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యం

హెచ్ఐవీపై ప్రదర్శన ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై అందరికీ అవగాహన కల్పించటం ద్వారానే పూర్తిస్థాయిలో నియంత్రణ సాధ్యం అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరి రాజశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా సోమవారం అనంతపురంలో నిర్వహించిన అవగాహన ప్రదర్శనను వారు జెండా ఊపి ప్రారంభించారు. ఎయిడ్స్ నియంత్రణ అందరీ బాధ్యత అని, హెచ్ఐవీ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కళాశాల, పాఠశాలల్లో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించటంతోపాటు పెయింటింగ్, పోస్టర్ మేకింగ్ వంటి పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులను అందజేశామని తెలియజేశారు. హెచ్ఐవీ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. క్షయ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జయలక్ష్మి, డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ హేమలత, డెమో నాగరాజు, హెచ్ఈవో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈవో గంగాధర్ పాల్గొన్నారు. హెచ్ఐవీ బాధుతుల పట్ల వివక్ష చూపకూడదని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయశ్రీ తెలిపారు.

రాయలసీమ అభివృద్ధికి కృషి: మంత్రి పయ్యావుల

లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాయలసీమ, వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. సోమవారం ఉరవకొండ మండలం బూదగవిలో ఇంటింటా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వానికి భిన్నంగా రాయలసీమలోని హంద్రీనీవా ప్రాజెక్టు పనులు పూర్తిచేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మాజీ ఎంపీపీ కుళ్లాయప్ప, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రేగటి నాగరాజు, తెదేపా మండల కన్వీనరు విజయభాస్కర్, కార్యదర్శి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పరిష్కారం చూపాలి

సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ జగదీశ్

అనంత నేరవార్తలు: గడువు లోగా ఫిర్యాదులకు చట్టపరమైన పరిష్కారం చూపాలని ఎస్పీ జగదీశ్ అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులతో సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమస్యలపై త్వరితగతిన స్పందించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: వాణిజ్య పన్నుల శాఖలో రాష్ట్రవ్యాప్తంగా కొందరు డిప్యూటీ కమిషనర్లను పదోన్నతిపై సంయుక్త కమిషనర్ బాధ్యతలు అప్పగిస్తూ బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో అనంతపురం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ భాస్కరవల్లికి సంయుక్త కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ విశాఖపట్నం డివిజన్‌కు బదిలీ చేశారు. సూర్యాపేట డివిజన్ డిప్యూటీ కమిషనర్ షహనాజ్ బేగం అనంతపురం డివిజన్‌కు బదిలీ అయ్యారు. తాడిపత్రి సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సానియాతార పదోన్నతిపై విజయవాడ డివిజన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పదోన్నతులు, బదిలీలపై ఆ శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

35 ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతూ..

పట్టుబడిన బస్సు దోపిడీ నిందితుడు!

పోలీసుల అదుపులో నిందితుడు నరసింహులు

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: ఒకటి కాదు.. రెండు కాదు.. 35 ఏళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఓ నిందితుడు ఎట్టకేలకు పట్టుబడిన ఘటన సోమవారం స్థానికంగా చోటుచేసుకుంది. కూడేరు సీఐ రాజు తెలిపిన వివరాలిలా... 1992 డిసెంబరు 28న అనంతపురం జాతీయ రహదారిలో జల్లిపల్లి- కూడేరు గ్రామాల మధ్య మదనపల్లి డిపోకు చెందిన బస్సును ముగ్గురు దొంగలు దోపిడీ చేశారు. ఈ ఘటనలో అప్పటి పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా.. తదుపరి వారు బెయిల్‌పై విడుదలయ్యారు. తదుపరి వారు పోలీసులకు లొంగిపోకపోవడంతో వారిమీద జారీ అయిన వారెంట్లు(ఎన్‌బీడబ్ల్యూ) 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ఎస్పీ పర్యవేక్షణలో పాత కేసుల ఛేదనలో భాగంగా ఈ కేసుపై అనంతపురం పోలీసులు దృష్టి సారించారు. ఇందులో ఏ3గా ముద్దాయిగా ఉన్న బోయ నరసింహులును సోమవారం అనంతపురంలో సీసీఎస్ సీఐ శేషగిరి ఆధ్వర్యంలోని పోలీసు బృందం అదుపులోకి తీసుకుంది. అనంతపురం గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసులోనూ నరసింహులు నిందితుడిగా ఉన్నట్లు తేలింది. వెంటనే అనంతపురం కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి ఈనెల 9 వరకు రిమాండు విధించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

పట్టుబడిన నిందితులు

అనంత నేరవార్తలు: అనంతపురం నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నవోదయ కాలనీలో గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను సీఐ వెంకటేశ్వర్లు సోమవారం మీడియాకు తెలియజేశారు. టీవీ టవర్ సమీపంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన షికారీ శీనా, షేక్ మహమ్మద్‌లు ఇతరుల వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, నగరానికి రవాణా చేసి అధిక ధరకు విక్రయిస్తుంటారు. ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు సరఫరా చేస్తుంటారు. వీరిపై పక్కా నిఘా ఉంచిన పోలీసులు నవోదయ కాలనీలోని హిందూ శ్మశాన వాటిక వద్ద గంజాయిని విక్రయిస్తుండగా ఆకస్మిక దాడి చేసి ఇరువురినీ పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. నిందితులను జిల్లా కోర్టు ఎదుట హాజరుపరచగా, కోర్టు నిందితులకు రిమాండ్ విధించింది.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

LiFE Lifestyle for Environment

ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము , డి.నెం.6-3-145, రాంనగర్, రెవిన్యూ వార్డునెం.6, అనంతపురము- 515004, ఫోన్: 08554-226066, ఈమెయిల్:roatp-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533, తేది:14.09.2006 మరియు తదుపరి సవరణలకు అనుగుణంగా మెస్సర్స్ శ్రీనివాస స్టోన్ క్రషర్స్ వారు అనంతపురము జిల్లా & మండలం, చియ్యేడు గ్రామంలో సర్వే నం.231/పి నందు 3.0 హెక్టార్ల విస్తీర్ణంలో రోడ్డు మెటల్ , బిల్డింగ్ స్టోన్ & గ్రావెల్ మైను ఏర్పాటు చేయుట కొరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారిచే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కొరకు ఈ ప్రకటన జారీ చేయడమైనది. ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరములు దిగువ పేర్కొనబడినవి:

1. కంపెనీ పేరు, చిరునామా మరియు ఫోన్ నెంబరు	మెస్సర్స్ శ్రీనివాస స్టోన్ క్రషర్స్, సర్వేనెం.231/పి, చియ్యేడు గ్రామం, అనంతపురం మండలం & జిల్లా, ఆంధ్రప్రదేశ్
2. ప్రతిపాదిత స్థాపన ప్రదేశం సర్వేనెంబర్లతో సహా & భూమి విస్తీర్ణం	సర్వేనెం.231/పి, చియ్యేడు గ్రామం, అనంతపురం మండలం & జిల్లా, ఆంధ్రప్రదేశ్ మొత్తం మైను లీజు విస్తీర్ణం 3.0 హెక్టార్లు
3. సంప్రదించవలసిన వ్యక్తి పేరు, ఫోన్ నెంబరు	మెస్సర్స్ శ్రీనివాస స్టోన్ క్రషర్స్, శ్రీ ఎం.వెంకటనాయుడు మేనేజింగ్ పార్టనర్ డి.నెం.28-4-229, విజయనగర్ కాలనీ, అనంతపురము మండలం & జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఫోన్: 93909 39911
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.50 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	1,02,500 టిపిఏల ఉత్పత్తి సామర్థ్యం గల రోడ్డుమెటల్, బిల్డింగ్ స్టోన్ & 34,835 టిపిఏల గ్రావెల్ మైను ఏర్పాటు కొరకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 06.01.2026 సమయం : ఉ.11.00 గం॥లకు ప్రదేశం : ప్రతిపాదిత మైను స్థలం దగ్గర, చియ్యేడు గ్రామం, అనంతపురము మండలం & జిల్లా, ఆంధ్రప్రదేశ్

7. ప్రతిపాదించిన ప్రాజెక్టు యొక్క కార్యనిర్వాహక సారాంశం(తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ EIA సాధారణ ప్రజానీకం పరిశీలన కొరకు అందుబాటులో వుంచిన ప్రదేశాలు.

ఎ) కలెక్టరు & జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, అనంతపురము

బి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, అనంతపురము జిల్లా, అనంతపురము

సి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ వారి కార్యాలయం, APPCB, క్షేత్రీయ కార్యాలయం, కర్నూలు

డి) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, అనంతపురము

ఇ) పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ప్రాంతీయ కార్యాలయం,(ఐఆర్ఓ) గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ - 520010

ఎఫ్) ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము

జి) తహశీల్దార్ వారి కార్యాలయము, అనంతపురము రూరల్ మండలము, అనంతపురము జిల్లా,

హెచ్) కార్యనిర్వహణాధికారి/ పంచాయతీ కార్యదర్శి వారి కార్యాలయము, చియ్యేడు గ్రామం, అనంతపురము మండలం & జిల్లా

ఈ ప్రాజెక్ట్ మూలంగా స్థానికంగా ప్రభావితమగు వ్యక్తులు మరియు ఇతర సంబంధిత వ్యక్తులందరూ (MoE&F నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ. 1533, తేది: 14.09.2006 యొక్క వరుస నెం.7III(ii) (ఎ) మరియు (బి)నిర్వచించినట్లుగా) ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 దినములలోగా తమ లిఖిత పూర్వక స్పందనలను క్రింది సంతకం దారునకు దాఖలు చేయవచ్చును. అట్టివారు పైన తెలియపరచిన సమయం, తేది యందు నిర్వహింపబడు పర్యావరణప్రజాభిప్రాయ సేకరణ యందు పాల్గొనవచ్చును.

సం/-

పర్యావరణ ఇంజనీర్(FAC),

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము

ప్రదేశం : అనంతపురము

తేది : 01.12.2025

విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యం... చికిత్స పొందుతూ రైతు మృతి

రామాంజినేయులు

కుందుర్పి, శెట్టూరు, న్యూస్‌టుడే: కుందుర్పి మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన రైతు నిజవళ్ళి రామాంజినేయులు(58) ఐదు రోజుల కిందట వ్యవసాయ పొలంలోని తీగల మరమ్మతు విషయంలో స్తంభం ఎక్కినప్పుడు విద్యుత్తు ప్రసరణ జరిగి కిందపడటంతో తీవ్ర గాయాలై అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

నిర్లక్ష్యమే కారణం: వ్యవసాయ బోరుబావికి విద్యుత్తు సరఫరాలో లోపం ఉందని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. రామాంజినేయులు శెట్టూరు మండలం అనుంపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా వారు సరఫరాలో లోపాన్ని సరిదిద్దడానికి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆయన అక్కడి ఆపరేటర్ సాయంతో కరెంటు సరఫరా నిలిపివేయించి, ఎల్‌సీ తీసుకున్నాక రామాంజినేయులు స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్తు ప్రసరణ జరగడంతో ఆయన కిందపడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. విద్యుత్తు అధికారులు, ఆపరేటర్ తప్పిదంతోనే రైతు మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యాయత్నం

రాప్తాడు, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం ఓ కానిస్టేబుల్ వేధించడంతో యువతి ఆత్మహత్యాయత్నం ఘటన సోమవారం అనంతపురం రూరల్ ఆకుతోటపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం రూరల్ చిన్నకుంటకి చెందిన అగ్నిమాపక శాఖలో పని చేస్తున్న ఓ కానిస్టేబుల్‌కు రాప్తాడుకు చెందిన యమునతో 2014లో డబ్బు, బంగారం ఇచ్చి ఘనంగా పెళ్లి చేశారు. కొన్ని సంవత్సరాల తరువాత అదనపు కట్నం తీసుకొని రావాలని భర్త, అత్తమామలు వేధింపులు ప్రారంభించారు. పుట్టినింటి నుంచి ఎకరా పొలం తీసుకొని రావాలని తరచూ ఇంటిలో గొడవలు జరుగుతుండటంతో భరించలేక చాలాసార్లు బలవన్మరణానికి పాల్పడబోయింది. ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భార్యను పిల్లలను బాగా చూసుకుంటానని తెలపడంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. కానీ తరువాత కూడా ఎకరం పొలం తీసుకొని రావాలని వేధింపులకు గురి చేయడంతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబీకులు చికిత్స కోసం అనంతపురం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తరలించారు. బాధితురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వేధిస్తున్నారు.. కాపాడండి

ఎస్పీకి ఓ వైద్యుడి వేడుకోలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తనకు సంబంధం లేని అప్పులను చెల్లించాలని కొందరు మానసికంగా వేధిస్తున్నారనీ, బెదిరింపులకు పాల్పడుతున్నారని నగరానికి చెందిన వైద్యుడు కేఎస్ అబ్దుల్ రజాక్ గఫూర్ ఎస్పీ జగదీశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సోమవారం పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన తెలుపుతూ. .తన కుమారుడు అర్షద్ నగరంలోని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించే వైద్యశాలలో వైద్యుడిగా పనిచేసేవాడనీ, ఈ క్రమంలో 2024, నవంబరు 4న ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. వ్యసనాలను తీర్చుకోవడానికి నగరంలోని కొందరి వద్ద తనకు తెలియకుండా అప్పులు చేశాడనీ, అవి తీర్చలేక, రుణదాతల ఒత్తిళ్లు భరించలేక చనిపోయాడని తర్వాత తెలిసిందన్నారు. వారిలో ప్రియాంక అనే యువతికి చెందిన బంగారం, డబ్బులు తీసుకున్నాడనీ, అవి చెల్లించాలనీ ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ యువతి కుటుంబ సభ్యులు తనను కుల సంఘాల వారితో పంచాయితీ చేయించి, బెదిరించి రూ. 12 లక్షలు ఇచ్చేలా ఒప్పించారన్నారు. తాను ఇవ్వడానికి సిద్ధపడ్డానన్నారు. ఇంకా ఎక్కువ డబ్బులు, బంగారం కావాలని బెదిరిస్తున్నారన్నారు. గత నెల 29న యువతి తరపు వారు ఆసుపత్రి వద్దకు వచ్చి రాజకీయ నాయకులు, పెద్దవాళ్ల పేర్లు చెప్పి బెదిరించారని తెలిపారు. మానసికంగా కుంగిపోయి అనారోగ్యం పాలయ్యానని చెప్పారు. వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విన్నవించారు.

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి

రాయదుర్గం గ్రామీణం, కళ్యాణదుర్గం, వజ్రకరూరు, బొమ్మనహాళ్: మల్లాపురం సమీపం విద్యాలైలైని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు రామమూర్తి స్వామి, విప్ర మల్లె ఆలయ కమిటీ అధ్యక్షుడు బీవీఎస్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న పాల్గొన్నారు. ● భగవద్గీత చదివితే తలరాతలు మారుతాయని శ్రీసరస్వతి విద్యా మందిరం హెచ్ఎం కరణం తిరుమలరావు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా బెంగళూరు బేకరి యజమాని సతీష్, సమితి ఉపాధ్యక్షుడు నాగభూషణం పాల్గొన్నారు. ● వజ్రకరూరు మండలం గడేహోతూరులో శివాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 'గీతా జయంతి' నిర్వహించారు. ● ఉంతకల్లులో వెలసిన లక్ష్మీ పాండురంగ స్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి పూజలు ఘనంగా సాగాయి. రాత్రి పల్లకీ మహోత్సవం సాగింది.

నకిలీ మద్యంపై నిఘా పెట్టండి

కళ్యాణదుర్గం గ్రామీణం: కర్ణాటక, నకిలీ మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తదుపరి జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ ఎంవీ రెడ్డి, ఎక్సైజ్ సీఐలు సోమశేఖర్, సునీల్‌కుమార్‌తో కలిసి కళ్యాణదుర్గం స్టేషన్ పరిధిలో పలు మట నల్లో పట్టుబడిన మద్యం, నాటుసారాను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, సిబ్బంది ఇమామ్‌బాషా, ప్రతాప్ పాల్గొన్నారు.

టెట్రా ప్యాకెట్లు ధ్వంసం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: డి.హీరేహాళ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం కేసులలో పట్టుబడిన టెట్రా ప్యాకెట్లను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో ధ్వంసం చేసినట్లు ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: గౌనూరులో తాగునీటి బోరు వేశా మోటారు అమర్చలేదు. దీంతో నీటి సమస్య పరిష్కారం కాలేదు. **-గ్రామస్థులు, గౌనూరు**
సమాధానం: కొత్తగా వేసిన బోరుకు విద్యుత్తు మోటారు అమర్చేలా పంచాయతీ అధికారులకు సూచిస్తాం. **-శివానాయక్, ఏఈఈ**
సమస్య: శ్రీధరఘట్ట నుంచి ఉద్దేహాళ్ క్రాస్‌వరకు రోడ్డుపై గుంతలు పడి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. **-అంజనేయులు, శ్రీధరఘట్ట**
సమాధానం: గుంతలు పడిన రహదారిని పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాం. **-రవిశంకర్‌రెడ్డి, డీఈఈ**
- న్యూస్‌టుడే, బొమ్మనహాళ్

ఎరువులు సీజ్

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీచైతన్య ఎరువుల దుకాణంలో వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) యల్లప్ప, ఏవో శ్రావణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. దస్త్రాలు, నిల్వలు పరిశీలించి.. తేడాలు గుర్తించారు. రూ.2.16,054 విలువ చేసే ఎరువులను సీజ్ చేశామని తెలియజేశారు.

బడి బస్సులపై నజర్

తనిఖీ నిర్వహిస్తున్న ఆర్టీఏ అధికారులు

రాయదుర్గంలో బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ విశ్వనాథరెడ్డి

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా బడి బస్సుల స్థితిగతులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కండిషన్, భద్రత లేని బస్సులు రోడ్లపై రాకుండా ఆ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా బడి బస్సుల తనిఖీ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. రోడ్డు రవాణా శాఖ అధికారులు డిసెంబరు 4 వరకు ఈ తనిఖీ చేపట్టి లోపాలు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

25 బస్సులకు తాఖీదులు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 65, రాయదుర్గం నియోజకవర్గంలో 85 బడి బస్సులు ఉన్నాయి. రాయదుర్గంలో ఇప్పటికే 50 బస్సుల తనిఖీ పూర్తవగా 25 బస్సుల్లో అగ్నిమాపక యంత్రాల పనితీరు సరిగాలేదని గుర్తించి తాఖీదులు జారీ చేశారు. వీటిని ఏడు రోజుల్లోపు సరి చేసుకోవాలని ఆదేశించారు. పూర్తిస్థాయి కండిషన్, భద్రత యంత్రాలు ఏర్పాటు చేసిన తరువాత ఆ బస్సులను అధికారులకు చూపించాలని ఆర్టీఏ సిబ్బంది పేర్కొన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సోమవారం నుంచి బస్సుల తనిఖీ ప్రక్రియ మొదలైంది.

లోటుపాట్లు లేకుండా చూస్తున్నాం

- రమేశ్, కళ్యాణదుర్గం రవాణాశాఖ ప్రాంతీయ అధికారి

నవంబర్ 28 నుంచి రెండు నియోజకవర్గాల పరిధిలోని బడి బస్సుల తనిఖీ ప్రక్రియ కొనసాగుతోంది. భద్రత విషయంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూస్తున్నాం. నిబంధనలు పాటించని బస్సులను రోడ్లపై తిరగనివ్వం. లోపాలు దిద్దుబాటు చేసుకున్నాకే రోడ్లపైకి వచ్చేలా చర్యలు తీసుకున్నాం. వీటిపై ఇప్పటికే పాఠశాల యాజమాన్యాలకు ఆదేశాలిచ్చాం. గడువులోపు బస్సులు ఎంవీఐ కార్యాలయాల్లో తనిఖీలు చేసుకోకపోతే సీజ్ చేస్తాం.

బస్సుల్లో ఉండాల్సిన సౌకర్యాలు..

- ✦ ప్రైవేట్ పాఠశాలలు, విద్యా సంస్థల బస్సుల్లో సీటింగ్ ఏర్పాట్లు విశాలంగా ఉండాలి.
- ✦ ఇంజిన్ అన్ని విధాలుగా కండిషన్‌లో ఉండాలి.
- ✦ అత్యవసర ద్వారం, అగ్ని ప్రమాదాలు నివారించే సిలిండర్లు(వాయువు) బస్సులో అందరికి కనిపించేలా ఏర్పాట్లు చేసుకోవాలి.
- ✦ బస్సుకు బీమా, అనుమతి పత్రాలు, చోదకుడి డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలు తప్పనిసరి.
- ✦ 2023 తరువాత తయారైన బడి బస్సులో అనుకోకుండా ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే దానిని గుర్తించి డ్రైవర్లు అప్రమత్తం చేసే ఎఫ్‌డీఎస్ఎస్(అగ్ని ప్రమాదాలు ఆటోమెటిక్‌గా మంటలు అదుపు చేసే యంత్రం) ఎఫ్‌డీఏఎస్ (మంటలు చెలరేగితే గుర్తించి శబ్దం చేసే యంత్రం) ఏర్పాట్లు తప్పకుండా ఉండాలి.
- ✦ ప్రమాదాలు జరుగుతున్నట్లు డ్రైవర్లు ముందుగానే గురించి బస్సులోని పిల్లలు, ప్రయాణికులను అప్రమత్తం చేసి రక్షించే నేర్పు ఉండాలి.
- ✦ బస్సుల స్పీడు విషయంలో డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రతిభా పోటీలు నిర్వహించినప్పుడు విద్యార్థులు పాల్గొని రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గోల్డెన్ బెల్స్ ఉపాధ్యాయుడు డి.వి.సురేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని గోల్డెర్ బెల్స్ పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై నిర్వహించిన పోటీలకు 7, 8, 9, పదో తరగతి విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న దీక్షిత ప్రథమ, ఎనిమిదో తరగతి చదువుతున్న భవ్య ద్వితీయ, గమ్య తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు డి.వి.సురేష్, తిప్పేస్వామి, జ్యోతి, ప్రేమలతలు బహుమతులు అందజేశారు.

హామీల అమలులో విఫలం: సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

ఉరవకొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సమర్థంగా అమలు చేయడంలో విఫలం అయ్యిందని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి ఆరోపించారు. సోమవారం ఉరవకొండలోని ఆ పార్టీ కార్యాలయంలో తాలూకా సహాయ కార్యదర్శి చెన్నరాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పార్టీలు ప్రజా వ్యతిరేఖ విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేశవరెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, మహిళా సమాఖ్య జిజిల్లా అధ్యక్షురాలు పార్వతి, నాయకులు సుల్తాన్, హాశేన్‌బాషా, మల్లేశ్, తిప్పయ్య, వెంకటేశులు, శ్రీధర్, శ్రీరాములు, రమణ పాల్గొన్నారు.

ఒక్కో విద్యార్థిపై రూ.90 వేల ఖర్చు: మంత్రి పయ్యావుల

యూటీఎఫ్ రూపొందించిన మాదిరి ప్రశ్నాపత్రాలు ఆవిష్కరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ: ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధిలో భాగంగా మధ్యాహ్న భోజనం, మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల వేతనాలు ఇలా ఏటా ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం రూ.90 వేలు ఖర్చు చేస్తోందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ మండలం బూదగవిలో రూ.65 లక్షలతో నిర్మించిన జడ్పీ ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు భయాన్ని వీడి, ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఏదైనా సాధించాలంటే అది గ్రామీణ విద్యార్థులు, యువతతోనే సాధ్యం అవుతుందన్నారు. పది ఫలితాల్లో మంచి ఉత్తీర్ణతను సాధించాలన్నారు. ఉరవకొండ తెదేపా కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి పాల్గొన్నారు. సమగ్రశిక్షా ఏపీసీ శైలజ, ఏపీఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, కుల్లాయప్ప, చిరంజీవి, రేణుకమ్మ, యర్రగుంట్ల వెంకటేశ్, ప్యారం కేశవ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాల ఆవిష్కరణ: పదో తరగతి విద్యార్థుల ప్రయోజనార్థం యూటీఎఫ్ ప్రత్యేకంగా రూపొందించిన మాదిరి ప్రశ్నా పత్రాలను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహా అధ్యక్షుడు రామప్పచౌదరి, జిల్లా కార్యదర్శులు శేఖర్, సంజీవకుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు. ★ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందికి గురవుతున్నామని విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకురాగా.. బస్సులు నడపాలని ఆర్ఎంను మంత్రి ఆదేశించారు.

గోళ్లలో పింఛన్ పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు, అధికారులు

ఇంటింటా పింఛన్ల పంపిణీ

కళ్యాణదుర్గం గ్రామీణం, విడపనకల్లు, న్యూస్‌టుడే: ప్రతి నెలా పింఛన్‌దారులకు కూటమి ప్రభుత్వం పింఛన్ సొమ్మును ఒకటో తేదీన అందజేస్తోందని తెదేపా మండల కన్వీనర్ వెంటేశులు సోమవారం పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి హేమలత, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పింఛనదారుల ఇళ్ల వద్దకు వెళ్లి సొమ్మును అందజేశారు. ● విడపనకల్లు మండలంలో వివిధ గ్రామాల్లో ఎంపీడీఓ రాధాకృష్ణ, ఈఓ మహేష్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి 6783 పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో బాలికలు విజయాలు సాధించాలి

డి.హీరేహాల్ కేజీబీవీ విద్యార్థులకు చట్టంపై అవగాహన కల్పిస్తున్న మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు

బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: బాలికలకు భరోసా ఇస్తే అన్ని రంగాల్లో విజయం సాధిస్తారని మహిళా శిశు సంక్షేమ శాఖ మిషన్ కోఆర్డినేటర్ బీఎస్ శ్రీదేవి, ఎస్‌వో కమలమ్మ పేర్కొన్నారు. సోమవారం కేజీబీవీలో బాలికల హక్కులు, సంరక్షణ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు అరికట్టడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. బాలికల్లో ప్రతిభను వెలికితీయడానికి పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసినట్లు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శైలజ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీపీవో మంజునాథ్, సీడీపీవో నాగమణి, ఎంఈవో మల్లికార్జున, ఎస్‌వో కమలమ్మ, సూపర్‌వైజర్లు శాంతకుమారి, గీత పాల్గొన్నారు. ● బాలికలకు స్వేచ్ఛను ఇస్తే ఏదైనా సాధిస్తారని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ అరుణకుమారి డి.హిరేహాళ్ కస్తూర్బాలో పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమారాణి, ఇతర అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో కేజీబీవి పాఠశాల ప్రిన్సిపల్ శిల్ప, పీవో చంద్రకళ, ఛైల్డ్‌లైన్ కేస్ వర్కర్ సుహాసిని, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యూబీఐ ఎదుట ధర్నా చేస్తున్న కౌలు రైతులు

రుణాలివ్వాలని ధర్నా

ఉరవకొండ, న్యూస్‌టుడే: గుర్తింపు కార్డులు కలిగిన కౌలు రైతులకు రుణాలను ఇవ్వడంలో బ్యాంకర్లు ముందుకు రావడం లేదని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య సోమవారం ఉరవకొండలో యూబీఐ ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం వారు మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆ సంఘం నియోజకవర్గ కార్యదర్శి వెంకటేశులు, నాయకులు సురేశ్, సుంకన్న, సీనప్ప, రామాంజనేయులు, ఆంజనేయులు, నాగవేణి, తిప్పమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన నిర్మాణం.. చిన్నారుల ఇక్కట్లు

వజ్రకరూరు మండలం గూళపాళ్యం అంగన్‌వాడీ కేంద్రం-1 నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. 'నాడు- నేడు'లో భవన నిర్మాణ పనులు మొదలు పెట్టి పైకప్పు వరకు పూర్తిచేసి రెండేళ్లుగా వదిలేశారు. ప్రస్తుతం స్థానికంగా ఒకే భవనంలో అంగన్‌వాడీ కేంద్రం-1, 2 కలిపి ఒకేచోట నిర్వహిస్తుండటంతో చిన్నారులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుచున్నారు.

– న్యూస్‌టుడే, వజ్రకరూరు

అసంపూర్తి మరుగుదొడ్లు

కణేకల్లు మండలంలోని బ్రహ్మసముద్రం ఉన్నత పాఠశాలలో చేపట్టిన మరుగుదొడ్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో పాఠశాలలోని 200 మందికిపైగా బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, అనుమతులు మంజూరవగానే పనులు చేపట్టనున్నట్లు పేర్కొంటున్నారు.

– న్యూస్‌టుడే, కణేకల్లు

తొట్టంతా నాచు.. నీరు తాగేదెట్లా?

కూడేరు మండలం మరుట్ల-1 గ్రామంలోని పశువులు, జీవాల సదుపాయార్థం ఏర్పాటు చేసిన నీటి తొట్టిలో అపరిశుభ్రత పేరుకుపోయింది. పాచిపట్టి ఉండడంతో పశువులు నీరు తాగడానికి కష్టంగా మారింది. ఎప్పటికప్పుడు శుభ్రం చేయించేలా పంచాయతీ, పశుసంవర్ధక శాఖ అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో మూగజీవాలు అపరిశుభ్రమైన నీటిని తాగాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి తొట్టిని శుభ్రం చేయించాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, కూడేరు (ఉరవకొండ)

ఎద్దుల బండిని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

విడపనకల్లు, న్యూస్‌టుడే: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లిలో సోమవారం రైతు ఎర్రిస్వామిరెడ్డికి చెందిన ఎద్దుల బండిని ఢీకొనడంతో రెండెడ్లు మృతిచెందిన ఘటన విడపనకల్లు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. బండి పూర్తిగా ధ్వంసం కాగా.. .. రైతు ఎర్రిస్వామిరెడ్డికీ తీవ్ర గాయాలయ్యాయి. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు అవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాజాహుసేన్ పేర్కొన్నారు.

ఎయిడ్స్ నివారణకు ర్యాలీలు

కళ్యాణదుర్గంలో కొనసాగుతున్న ర్యాలీ

రాయదుర్గంలో పుర ఛైర్‌పర్సన్, సీఐ, కమిషనర్, వైద్యులు

ఉరవకొండలో...

ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలోని వివిధ మండలాల్లో సోమవారం ఆరోగ్య సిబ్బందితోపాటు వివిధ సంచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీలు కొనసాగాయి. ఎయిడ్స్ నివారణకు ప్రతిజ్ఞ చేశారు.

- న్యూస్‌టుడే బృందం.

వాడీవేడిగా మండల సభ

మాట్లాడుతున్న ఎంపీడీవో కొండన్న, వేదికపై ఎంపీపీ విద్యావతి, వైస్ ఎంపీపీ

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి మంజూరైన నిధుల వివరాలు మండల సభలో వెల్లడించాలని వడ్రవన్నూరు ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ అరుణ్‌కుమార్ డిమాండు చేశారు. ఎంపీడీవో కొండన్న కుదరదని చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సోమవారం రాయదుర్గం ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, విద్యుత్తు, సీసీ రోడ్లు, విద్య, వైద్య సౌకర్యాల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగిన అభివృద్ధి కార్యక్రమాలు వెల్లడించారు. అనంతరం పలు పనుల తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో రాయదుర్గం వైస్ ఎంపీపీ-2 శాంతి బాయి, కోఆప్షన్- సభ్యుడు దిల్, డిప్యూటీ ఎంపీడీవో మురళీకృష్ణ, ఏవో శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ ఇర్షాద్ అహమ్మద్, జేఈ మునిస్వామి, ఏఓ బాష తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నాయకుల సంతకాల సేకరణ!

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు ఆదర్శ పాఠశాలలో వైకాపా నాయకులు సోమవారం మెడికల్ కళాశాలల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులతో సంతకాలు తీసుకోవడం విమర్శలకు తావిస్తోంది. విద్యాలయం ప్రిన్సిపల్ హనుమంతురాయుడు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ మంగళవారం ఈ ఘటనపై విచారిస్తామని తెలిపారు.

వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: మాజీ ప్రధాని, రాజనీతిజ్ఞుడు అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సోమవారం భూమిపూజ చేశారు. నగరంలోని గుత్తిరోడ్డులో ఈనెల 12న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు రాజేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు జి.మహమ్మద్ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రయ్య, రత్నమయ్య, దేవిరెడ్డి లక్ష్మీదేవి, గోవిందప్రసాద్ పాల్గొన్నారు.

నేడు బీటీ ప్రాజెక్టు రైతుల సమావేశం

గుమ్మఘట్ట: మండలంలోని బీటీ ప్రాజెక్టు కింద ఉన్న గుమ్మఘట్ట మండలం, బ్రహ్మసముద్రం మండలాల ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సమావేశం మంగళవారం స్థానిక వసతి గృహం ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్టు ఇరిగేషన్ జేఈ హరిష్ తెలియజేశారు.

ద్విచక్ర వాహనదారుడికి వేల జరిమానా

ఉరవకొండ, న్యూస్‌టుడే: కూడేరు మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన ఆదర్స్ ఇటీవల మద్యం తాగి ద్విచక్రవాహనం నడిపి పోలీసులకు చిక్కాడు. నిందితుడిని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టగా.. జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి నిందితుడికి రూ.10 వేల జరిమానా విధించారు.

తాగునీటి సమస్య తీర్చిన ఉపాధ్యాయుడు

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు, కళ్యాణదుర్గం 'ఇన్ఫినిటీ రిటబుల్ ట్రస్ట్' ఛైర్మన్ బద్దేనాయక్ సోమవారం బోరు వేయించి తాగునీటి సమస్యను తీర్చారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల విద్యా కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూఉపాధ్యాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థి తోడ్పాటు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండలోని మండల పరిషత్ ఆది ఆంధ్ర పాఠశాలకు పూర్వ విద్యార్థి, ప్రస్తుతం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఓబుళపతి కార్యాలయ బల్లతోపాటు అక్కడ చదువుతున్న విద్యార్థులకు సామగ్రిని సోమవారం హెచ్‌ఎం పద్మావతికి అందించారు. పూర్వ విద్యార్థిని హెచ్‌ఎం అభినందించారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

ఉపాధ్యాయ సభ్యత్వాలు నమోదు

వజ్రకరూరు: పందికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, కౌన్సిలర్ సురేష్, జిల్లా కార్యదర్శి భాష, మండల అధ్యక్షుడు నాగేష్, చంద్ర, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం పాల్తూరు అంగన్వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ అదనపు సీడీపీవో ఎల్లమ్మ తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరును పరిశీలించారు. కార్యకర్తలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి, అంగన్వాడీ టీచర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం వజ్రకరూరు కేవీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్టీఆర్ జిల్లా నున్నాలో జరిగిన 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో ఐదుగురు పాల్గొని ప్రతిభ చూపారు. అండర్- 17 బాలుర విభాగంలో రాహుల్‌నాయక్, శివప్రసాద్, అండర్-14 బాలికల విభాగంలో షబానా, అండర్- 14లో దినేష్‌సాయి, లిఖిత్‌నాయక్ ప్రతిభ చూపారు. ఈ విద్యార్థులను పీఈటీలు అయూబఖాన్, శ్రీనివాసు, హెచ్‌ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు అభినందించారు.

క్షేత్ర సహాయకుడిపై చర్యలు తీసుకోవాలి

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మురడిలో ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో దాసనాయక్‌కు మురడి గ్రామస్థులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఉపాధి కూలీల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని వారు ఆరోపించారు. గ్రామస్థులు చిదానంద, పుష్పరాజు, లోకేష్, ప్రదీప్, హేమంత్, మారుతి, భూలక్ష్మి తదితరులు పాల్గొని విన్నవించారు.

కొత్త పంచాయతీల ఏర్పాటుకు వినతి

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని పెద్ద గ్రామ పంచాయతీగా కొనసాగుతున్న మలయనూరును విడదీసి, వడ్డేపాళ్యం, శీగలపల్లి, మలయనూరు మూడు పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని సోమవారం తెదేపా నాయకులు ఎంపీడీవో మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మలయనూరు పంచాయతీకి చెందిన తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు గంగాధర, సీనియర్ నాయకులు సంజీవస్వామి, రాజ్‌కుమార్, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల్లో జాప్యమేలా?

నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం

డివైడర్ల మధ్య తొలగించని మట్టి

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఉన్నతాశయంతో ప్రారంభించిన దుర్గం పట్టణ సుందరీకరణ పనులు పడకేశాయి. డివైడర్ల మధ్య ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి పట్టణానికి శోభనిచ్చే కొత్తవి నాటాలని మున్సిపల్ అధికారులు రూ.7.5 లక్షలతో పనులను ఓ గుత్తేదారుకు అప్పగించారు. ఇది జరిగి సుమారు నాలుగు నెలలు కావస్తున్నా నేటికీ పనుల్లో వేగం పుంజుకోలేదు. నెల రోజుల్లోనే పనులు పూర్తిచేసే అవకాశం ఉన్నా.. గుత్తేదారు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. వినాయక కూడలిలోని డివైడర్ల మధ్య పాత మట్టిని తొలగించకుండానే కొత్త మట్టిని కొంత మేర వేశారు. దీనిని ఇటీవల పలువురు ప్రశ్నించడంతో ఆ పనులు నిలిపివేయడం గమనార్హం.

కౌన్సిల్ సమావేశంలో నిలదీసినా..

ఒక కిలోమీటరు దూరంలో వాహనాలు స్వేచ్ఛగా తిరిగేందుకు ఇటీవల కొంత మేర డివైడర్ల పొడవును తగ్గించారు. దీంతో వీటి మధ్య ప్రస్తుతం వాహనాలు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. వర్షపు నీరు స్వేచ్ఛగా వెళ్లేలా మధ్యలో కొత్త గ్రిల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు చేస్తున్నది అధికార పార్టీకి చెందిన ఓ గుత్తేదారు కావటంతో అధికారులు సైతం గట్టిగా చెప్పలేకపోతున్నారు. పనులు నిచిచిన తీరుపై ప్రతినెలా సమావేశంలో పలువురు కౌన్సిలర్లు నిలదీస్తుండటంతో అధికారులు సమాధానం ఇవ్వలేక నీళ్లు నములుతున్నారు.

త్వరగా చేయాలని ఆదేశాలిచ్చాం

- వి.దివాకర్‌రెడ్డి, కమిషనరు

పట్టణ సుందరీకరణ పనులు వేగంగా చేయాలని పలుమార్లు గుత్తేదారుకు సూచించాం. ఇటీవల సదరు వ్యక్తికి తాఖీదులు జారీచేశాం. ఇప్పటికే డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేయాల్సిన గ్రిల్స్ సిద్ధమయ్యాయి. కొత్త మొక్కలు తెప్పించి అక్కడ నాటించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పనులు యుద్ధప్రాతిపదికన చేయాలని ఆదేశాలు ఇచ్చాం.

శత జయంతి

కీ॥శే॥ డా॥ చిక్కాకె ఎస్.చంద్రశేఖర్ గారు
B.Sc., MBBS., DPH, (రిటైర్డ్ సివిల్ సర్జన్)
జననం: 02-12-1925, నిర్యాణం: 31-12-2007

కుమారుడు: డా॥ చిక్కాకె. ఎస్.కృష్ణమోహన్ MD.,DAC (ACU)., PGDND ఫిజిషియన్ & న్యూట్రిషియన్ స్పెషలిస్ట్ (పోషకాహార నిపుణులు) కమల్ శ్రీ క్లినిక్
కోడలు: శ్రీమతి చిక్కాకె గీతాంజలి
మనుమడు: సి.ఎం.రితేష్, M.Tech., Structural Engg. BITS Pilani, HYD
మనుమరాలు: సి.శ్వేత, B.E. (Civil) & మనుమనుమడు: సి.ఆర్.వేదాంత్
అల్లుడు: డా॥ జింకా లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ప్రిన్సిపల్, MA.,Ph.D., Govt. డిగ్రీ కాలేజ్, కుప్పం.
కుమార్తె: శ్రీమతి చిక్కాకె విజయలక్ష్మి MA., B.Ed., Retd. ఆంధ్రాబ్యాంక్ CRO
మనుమడు: డా॥ జింకా భార్గవ్, M.B.B.S., M.D. Final Year (Radiology MIMS, Vijayanagaram)
మనుమడు: భోగా కౌశిక్, M.Tech., Software Engg. Canada
మనుమరాలు: భోగా జాహ్నవి, M.Tech., Software Engg. Canada

(c) eenadu

గుంతకల్లు

• గుంతకల్లు • శింగనమల • తాడిపత్రి

గ్రామస్థుడి పళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: క్యాన్సర్, ఫ్లోరోసిస్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గుత్తి మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో బేతాపల్లి పీహెచ్‌సీ అధ్వర్యంలో వివిధ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లోరోసిస్ జిల్లా అధికారి ఆంజినేయులు మాట్లాడుతూ బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. తాగునీటి విషయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లులో రోటరీ స్కూల్‌కు వెళ్లే రోడ్డులో డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడి ఉన్నాయి. మురుగు దుర్వాసన వస్తోంది.
- ప్రసాద్.

సమాధానం: కాలువలను శుభ్రం చేయడానికి చర్యలు తీసుకుంటాం.
- వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

వరి పంటకోత ప్రయోగం

గార్లదిన్నె గ్రామీణం : కల్లూరు గ్రామంలో జీఎస్‌డీపీ అంచనాల కోసం సాధారణ పంట కోత ప్రయోగాల్లో భాగంగా ప్రయోగం నిర్వహించారు. సోమవారం నాగేంద్ర రైతు పొలంలో 25అడుగుల చుట్టూ కొలతలతో ప్రయోగం చేయగా 10.200కిలోలు దిగుబడి వచ్చిందని మండల సహాయ గణాంకాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

కఠోర శిక్షణ.. బెల్టుల సాధన

• కరాటేలో రాణిస్తున్న విద్యార్థులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో మాంటిస్సోరి పాఠశాలలలో చదువుతున్న చిన్నారులు కరాటేలో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కరాటే మాస్టర్ మల్లికార్జున దగ్గర మెలకువలను నేర్చుకుని ఆరెంజ్ బెల్ట్ సాధించి ప్రతిభ కనబరుస్తున్నారు.

బ్లాక్‌బెల్ట్ కైవసమే ధ్యేయం

2023 బళ్లారిలో జరిగిన 8వ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాను. 2024 హోసపేటలో జరిగిన పోటీల్లో రెండవ స్థానం, ఈ ఏడాది 9వ జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్ పోటీల్లో 3వ స్థానం సాధించాను. గత నెల 30న బళ్లారిలో ఆల్ ఇండియా కరాటే పోటీల్లో ప్రథమ స్థానం సాధించాను.
- హర్షిత్‌రెడ్డి, 7వ తరగతి

ఆత్మరక్షణ కోసం

ఆత్మరక్షణ కోసం ఎంతో ఉపయోగపడుతుంది. మూడేళ్ల క్రితం బళ్లారిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో 3వ స్థానం సాధించాను. గత ఏడాది హోసపేటలో జరిగిన పోటీల్లో 3వ స్థానంలో నిలిచాను. ఈ ఏడాది నవంబరులో తుముకూరులో 9వ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాను.
- తారక్, 4వ తరగతి

పతకాలు సాధించాను

మూడేళ్ల క్రితం బళ్లారిలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ముగ్గురిపై గెలిచి మెడల్ సాధించాను. గతేడాది జాతీయ స్థాయిలో ముగ్గురిపై గెలిచి ట్రోఫీ గెలిచాను. ఈ ఏడాది తుముకూరు, బళ్లారిలో జరిగిన పోటీల్లోనూ పాల్గొన్నాను.
- లక్షిత రఘువర్మ, 3వ తరగతి

జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో అధ్యాపకులు

రైల్వే హైస్కూల్‌లో విద్యార్థులు, హెచ్ఎం

ఉపన్యసించారు..

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కృత్రిమ మేధతో భవిష్యత్తులో వచ్చే మార్పులు అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. విద్యార్థినులు ఉత్సాహంగా ఉపన్యసించారు. విజేతలుగా హబీబా(ప్రథమ), ఎస్.కే ఆయేషా సిద్దిక(ద్వితీయ), పి.షిఫాజా సుల్తాన(తృతీయ) స్థానంలో నిలిచారు. ప్రిన్సిపల్ సాలాబాయి వారికి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు లత, సలీమ్, శివప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటారు

● స్థానిక రైల్వే హైస్కూల్‌లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణుల ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. 9వ తరగతి చదువుతున్న ఎస్. వీభవ కార్య(ప్రథమ), వి.ఐదిత్(ద్వితీయ), పదో తరగతి చదువుతున్న ఎస్. అమీన్ తైబా(తృతీయ) స్థానంలో నిలిచారు. హెచ్ఎం విజేతలకు బహుమతులను అందజేశారు.

సుందరీకరణ చెట్లు మాయం

కసాపురం రోడ్డు మధ్యలో నాటిన మొక్కలు మాయం కాగా బోసిపోయిన రోడ్డు

గుంతకల్లు, న్యూస్‌టుడే : పట్టణ సుందరీకరణ కోసం అధికారులు చెట్లు పెంచడానికి పెద్దఎత్తున నిధులు ఖర్చు చేశారు. గుంతకల్లు-కసాపురం నడుమ ఉండే నాలుగు వరుసల రోడ్డు మధ్యలో గతంలో మొక్కలు నాటారు. కొన్ని బాగా పెరిగాయి. మరికొన్ని చోట్ల మొక్కలు లేకుండా పోయాయి. లేని చోట్ల తిరిగి కొత్త మొక్కలు నాటడంలో పురపాలిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డు

నార్పల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న రవీంద్రకు జిల్లా ఉత్తమ ల్యాబ్‌టెక్నీషియన్ అవార్డు వరించింది. సోమవారం అనంతపురంలో ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వైద్యశాఖ అధికారి దేవి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన జిల్లాలోనే అత్యధిక రక్తనమూనా పరీక్షలు నిర్వహించారన్నారు. దీంతో ఆయనను వైద్యశాల డాక్టర్లు భూషణ్, సీహెచ్‌వో బాలాజీ ఇతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

'మార్కెట్‌లో దుకాణాలు నిర్మించాలి'

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిఆర్.ఎస్. మెయిన్ బజార్‌లో ఐదేళ్ల కిందట కూల్చివేసిన కూరగాయల మార్కెట్ స్థానంలో కొత్తగా దుకాణాలను నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు. కూరగాయల మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో స్థానిక పురపాలక అధికారులు కూల్చివేశారు. కూరగాయల మార్కెట్‌లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్థలాన్ని సర్వేచేసి దుకాణాలను నిర్మించాలని వారు కోరుతున్నారు.

'దారి ఆక్రమణలపై చర్యలు తీసుకోండి'

గుత్తి,న్యూస్‌టుడే: గుత్తి-గుత్తిఆర్.ఎస్. మధ్య పొలాలకు వెళ్లే దారిని కొందరు ఆక్రమిస్తున్నారని రైతులు సోమవారం తహసీల్దారు పుణ్యవతికి ఫిర్యాదు చేశారు. శ్రీసాయి డిగ్రీకళాశాల దగ్గర ఉన్న దారిని సమీపంలోని ఓ హోటల్ నిర్వాహకులు ఆక్రమించినట్లు వెల్లడించారు. దీని వల్ల పొలాలకు వెళ్లలేక పోతున్నట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రైల్వే అందించే డబ్బును జాగ్రత్తగా వినియోగించండి

ఉద్యోగ విరమణ చేసిన వారికి బకాయిలను అందజేస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఉద్యోగ విరమణ చేసే వారికి రైల్వే చాలా త్వరగా బకాయిలను అందజేస్తోందని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త అన్నారు. డివిజన్‌లో ఉద్యోగ విరమణ చేసిన వారికి ఆయన డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశపు మందిరంలో సోమవారం బకాయిలను అందజేశారు. విశ్రాంత ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అధిక వడ్డీ వస్తుందని ఇతర వ్యక్తులకు ఇవ్వడం, భద్రత లేని బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే నష్టపోతారని సూచించారు. వృద్ధాప్యంలో డబ్బు అవసరం చాలా ఉంటుందని, ఇతరులకు డబ్బు ఇచ్చి తరువాత బాధపడడం మంచిదికాదని తెలిపారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం, నడక అవసరమని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ డీఎఫ్ఎం సందీప్, ఏడీఎఫ్ఎం శివప్రసాద్, డీపీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని పారదోలుదాం

గుంతకల్లు, న్యూస్‌టుడే: ఎయిడ్స్ మహమ్మారిని పారదోలడానికి అందరూ కృషిచేయాలని గుంతకల్లు జ్యుడీషియల్ మొదటి తరగతి న్యాయమూర్తి ఎం. మంజుల అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయమూర్తి సోమవారం సిబ్బందితో కలిసి పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న వ్యాధిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ వ్యాధి పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగశేష, బాబా తాజుద్దీన్, చంద్రశేఖర్, తిమ్మప్ప, రమేశ్, మస్తాన్, వైద్యులు పాల్గొన్నారు.

గుంతకల్లులో న్యాయమూర్తి మంజుల ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ

గుత్తిలో ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు, వైద్యసిబ్బంది

గుత్తి: గుత్తిలో సోమవారం జ్యుడీషియల్ అధికారులు, సిబ్బందితోపాటు వైద్య ఉద్యోగులు, ఆరోగ్యకార్యకర్తలు ర్యాలీ చేశారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథాచారి, వైద్యాధికారి ఎల్లప్ప, రైడ్స్ సంస్థ ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు.

గోదాము నిర్మించారు.. మరిచారు!

యాడికి లో బుగ్గ రోడ్డు ఎర్రగుట్ట వద్ద ఏళ్ల కిందట గోదామును నిర్మించి వదిలేశారు. రైతులు పండించిన వ్యవసాయ పంటలను నిల్వ ఉంచి, గిట్టుబాటు ధరలు వచ్చేదాక ఇక్కడ భద్రపరిచే నిమిత్తం యాడికి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో గోదాము నిర్మించారు. అయితే దీని గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో పశువులు, విషసర్పాలకు ఆవాసంగా మారింది. ఇకనైనా గోదాము వినియోగంలోకి తీసుకొచ్చేలా అధికారులు కృషిచేయాలని రైతులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, యాడికి

మురుగులో.. తాగునీటి పైప్‌లైన్

మురుగు నీటిలో తాగునీటి పైప్‌లైన్ వాల్వు ఉండటంతో నీరు కలుషితమవుతోంది. గుంతకల్లు పట్టణానికి చెందిన మురుగు నీరు వెళ్లే కాలువలో రైల్వేకు చెందిన పైప్‌లైన్ వాల్వు సత్యనారాయణ పేట దగ్గర మోరీ వద్ద ఉంది. పైపుల్లో నీటి సరఫరా ఆగిన సమయంలో కాలువలోని మురుగు నీరు పైపుల్లోకి చేరుతోంది. దీనిపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైల్వే ఉద్యోగులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, గుంతకల్లు

ఉత్సాహంగా క్రీడాపోటీలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం ఉపాధ్యాయ క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శెక్షావలి, ఎంఈవో నాగరాజులు పోటీలు ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులను ఆటవిడుపు ఉంటుందని ప్రభుత్వ ఇలాంటి పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఎంఈవో-2 రామగోవందరెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక చేయూత

పామిడి: పట్టణ ఆదర్శ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న అనూష గత నెల 6న విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించింది. ఆమె తల్లిదండ్రులు కృష్ణ, అనిత పామిడిలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అనూష జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు కోచ్ రాఘవేంద్ర సోమవారం తెలిపారు. స్పందించిన భాజపా రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాసులు, యువనేత రాజశేఖర్‌గౌడ్, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి అజేశ్ యాదవ్‌లు రూ. 10వేలు ఆర్థిక ప్రోత్సాహం అందజేశారు.

ఘనంగా గీతా జయంతి

తగ్గు దేవాలయంలో గీతా జయంతి పూజలు చేస్తున్న భక్తులు

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని అనంత గజ గరుడ లక్ష్మీనారాయణ స్వామి తగ్గుదేవాలయంలో భగవద్గీత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఓం ఆకారాన్ని సుందరంగా తీర్చిదిద్ది భగవద్గీత పుస్తకం ఉంచి పూజలు చేశారు. గీతా పారాయణం చేసి మహామంగళ హారతి ఇచ్చారు.

● పట్టణంలోని శ్రీసరస్వతీ విద్యామందిర పాఠశాలలో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాల కమిటీ సభ్యులు బీవీ. రత్నమయ్య, నగరూరు విశ్వనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

ఎస్‌పీఎల్ ఎన్నికకు పోలింగ్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: డాక్టర్ రాజేంద్రప్రసాద్ పురపాలక ఉన్నత పాఠశాలలో స్కూల్ పీపుల్ లీడర్(ఎస్‌పీఎల్), తరగతి లీడర్(సీపీఎల్) ఎన్నికకు సోమవారం ప్రజాస్వామ్య పద్ధతిలో పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు పోలింగ్ ఏజెంట్లు, సిబ్బందిగా వ్యవహరించగా ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపవిద్యాధికారి మల్లారెడ్డి హాజరయ్యారు.

సేవలను విస్మరించొద్దు : ఎమ్మెల్యే

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సేవలను విస్మరించకూడదని ఎమ్మెల్యే జయరాం పింఛన్ లబ్ధిదారులకు సూచించారు. సోమవారం ఆయన నాయకులతో కలిసి భాగ్యనగర్‌లో పింఛన్లు పంపిణీ చేశారు. పలు చోట్ల సమావేశాలను నిర్వహించారు. ప్రతినెలా రూ. 4 వేలు పింఛను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రిదేనని తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి, నాయకులు రామరాజు యాదవ్, నగేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రణాళికతో పారిశుద్ధ్యం సాధ్యం

గుంతకల్లు, న్యూస్‌టుడే: సమగ్ర పారిశుద్ధ్యాన్ని సాధించడానికి, పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకుని మంగళవారం నుంచి అమలు చేస్తున్నామని మున్సిపల్ అధ్యక్షురాలు భవానీ, కమిషనర్ నయీం అహమ్మద్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను తెలియజేశారు. రాత్రివేళలో పారిశుద్ధ్య పనులను చేపడుతూ ఇందుకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించామన్నారు. మన్సిపాలిటీలో కనీసం 300 మంది పారిశుద్ధ్య కార్మికుల అవసరముంది. ప్రస్తుతం చెత్తను తరలించడానికి ఉన్న వాహనాలకు తోడుగా ప్రభుత్వం 26 ఆటోలను అందజేయనుందని, దీంతో ఇంటింటా చెత్తను సేకరిస్తామని తెలిపారు. సమావేశంలో సహాయ కమిషనర్ లక్ష్మి, శానిటరీ పర్యవేక్షకుడు వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు చికిత్సలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మల్లేనిపల్లి, లక్షుంపల్లి గ్రామాల్లో సోమవారం పాడిపశువులకు గర్భకోశ చికిత్సలను పెద్దవడుగూరు పశువైద్యుడు రమేష్ నిర్వహించారు. అనంతరం ఆయన లక్షుంపల్లిలోని పశువైద్యశాలను సందర్శించి దస్త్రాలు తనిఖీ చేశారు. ఆయన వెంట పశువైద్య సహాయకురాలు తేజస్విణి ఉన్నారు.

బోర్డును తొలగించింది ఎవరు..?

అంబేడ్కర్ విగ్రహం వద్ద బోర్డును తొలగించిన దృశ్యం.

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రచార బోర్డును ఆదివారం గుర్తుతెలియని దుండగులు తొలగించారు. వివరాల్లోకి వెళితే నవంబరు 26వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తహసీల్దారు శ్రీధరమూర్తి ఆధ్వర్యంలో విగ్రహం ఉన్న ప్రదేశానికి అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేసి బోర్డును ప్రారంభించారు. ఇది ఇష్టంలేని దుండగులు ఆదివారం రాత్రి బోర్డును తొలగించి ఎత్తుకెళ్లారు. దళిత సంఘాల నాయకులు సోమవారం ఈ విషయంపై తహసీల్దారు, సీఐ పుల్లయ్యకు ఫిర్యాదు చేశారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: శింగనమల నియోజకవర్గంలో మొక్కజొన్న, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుసంఘం నాయకులు సోమవారం తహసీల్దారు శ్రీధరమూర్తికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శివారెడ్డి, రవీంద్ర, కుళ్లాయప్ప, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిందే..

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలో సీఐటీయూలో సభ్యులుగా ఉన్న కార్మికులకు అధికారులు ఇళ్లస్థలాలు కేటాయించి, పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ఆందోళన నిర్వహించారు. అధికారులు వెంటనే సర్వే నిర్వహించి అర్హులైన వారికి స్థలాలు కేటాయించాలన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుళ్లాయప్ప, శ్రీనివాసులు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అంజన్న భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు

గుంతకల్లు, న్యూస్‌టుడే : కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం జరుగనున్న హనుమద్ వ్రతంలో పాల్గొనడానికి రాష్ట్రం నలుమూలల నుంచి హనుమాన్ మాలధారులు కసాపురానికి రానున్నారు. ట్రాఫిక్ స్తంభించకుండా వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, గుత్తి రోడ్డు నుంచి కసాపురానికి వెళ్లే రోడ్ల గుండా ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. ఇందుకు సంబంధించి ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దారు రమాదేవి, ఆలయ ఉప కమిషనర్ విజయరాజు, సహాయ కమిషనర్ లక్ష్మి రోడ్లను పరిశీలించారు. మాలధారులే కాకుండా ఇతర ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడకుండా చూడాలని ఆర్డీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టీసీఓ మోహన్, ఏఈ హరికృష్ణ, వీఆర్ఓ కృష్ణ తదతరులు పాల్గొన్నారు.

వన్‌వే ట్రాఫిక్ రోడ్డును పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

కొత్త పంచాయతీలు రాబోతున్నాయ్

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుంతకల్లు నియోజకవర్గంలో మరికొన్ని గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు కానున్నాయి. గ్రామాల అభివృద్ధిలో భాగంగా కూటమి ప్రభుత్వం నూతన పంచాయతీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టబోతోంది. కొత్తగా ఏర్పాటైనా గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు, అధికారులనూ నియమకం చేశారు. నూతనంగా ఏర్పాటైన పంచాయతీలకు నేరుగా నిధులు వస్తాయి. దీంతో ఆ దిశగా అధికారులు మండలాల్లో జనాభా, ఆదాయ వనరులను బట్టి కొన్ని గ్రామాలను ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో గుంతకల్లు మండలంలోని నరసాపురం గ్రామాన్ని ఎంపిక చేశారు. ప్రస్తుతం నక్కదొడ్డి పంచాయతీలో కొనసాగుతోంది. ఆ గ్రామంలో జనాభా సుమారు 5,500 వేలకు పైగా ఉంది. నరసాపురం గ్రామ పరిధిలో ఐటీసీ, వాణిజ్య సముదాయాలు ఉండటంతో ఆదాయం సమకూరునుంది. పామిడి మండలంలోని కోనేపల్లి, కాలాపురం గ్రామాలను అధికారులు ఎంపిక చేశారు. గుత్తి మండలంలో కె.ఊబిచెర్ల, గొందిపల్లి గ్రామాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపారు.

గొందిపల్లిలోని ఓ రోడ్డు దుస్థితి

ప్రతిపాదనలు పంపాం..

గ్రామాల్లో ప్రజలు, పాలకులు తమ గ్రామాలను పంచాయతీలుగా చేయాలని వినతులు అందాయి. దీంతో గుత్తి మండలంలో కె.ఊబిచెర్ల, గొందిపల్లి గ్రామాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపాం. త్వరలో నిర్ణయం రానుంది.
- ప్రభాకర్ నాయక్, ఎంపీడీవో, గుత్తి

చెత్తసేకరణ వాహనాలు సిద్ధం

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిపురపాలిక అధికారులు ఎట్టకేలకు చెత్తసేకరణ వాహనాలను తెప్పించారు. సోమవారం వాటిని కార్మికులకు పంపిణీ చేశారు. గతనెల 22న పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తం శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈపరిస్థితిని వివరిస్తూ కథనం ప్రచురించడంతో కమిషనర్ జబ్బార్ మియా స్పందించారు. గుంటూరులోని గుత్తేదారుడి నుంచి 18వాహనాలను అత్యవసరంగా తెప్పించారు. వాహనాలను తెప్పించడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

తెప్పించిన చెత్తసేకరణ వాహనాలు

అరటి రైతులను ఆదుకుని తీరుతాం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న అరటి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తెలిపారు. సోమవారం ఆమె పుట్లూరు మండల పరిధిలో సంజీవపురం గ్రామంలో అరటి రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. కొన్ని నెలలుగా ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అరటి పంటను రైళ్లద్వారా ముంబై, దిల్లీ దేశీయ మార్కెట్లకు తరలించి అక్కడ విక్రయించి రైతులకు మంచి ధరలు దక్కేలా చూస్తామని స్పష్టం చేశారు. దీన్ని ఆసరాగా తీసుకుని వైకాపా నాయకులు రాజకీయ లబ్ధి పొందడానికి కూటమి ప్రభుత్వం విమర్శలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్టుయార్డు ఛైర్మన్ శ్రీనివాసులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అరటి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ.

పేదలకు ఎన్టీఆర్ పింఛన్ ఆసరా

తాడిపత్రి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్ అందిస్తూ పేదలకు భరోసా కల్పిస్తున్నట్లు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం భగత్‌సింగ్‌నగర్‌లో పింఛన్లను అందజేసి వారి సమస్యలను తెలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. పింఛన్ల పంపిణీ వేగంగా అందించి తాడిపత్రి పురపాలికను ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. కాలనీలో కొనసాగుతున్న తాగునీటి పైపులైన్, భూగర్భ మురుగునీటి పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ శివరామకృష్ణ, కౌన్సిలర్లు మల్లికార్జున, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, కమిషనర్ శివరామకృష్ణ

ముచ్చుకోటలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న తెదేపా మండల కన్వీనర్ లోకనాథరెడ్డి)

తెదేపాతోనే సంక్షేమం సాధ్యం

పెద్దపప్పూరు: అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం తెదేపాతోనే సాధ్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ లోకనాథరెడ్డి పేర్కొన్నారు. ముచ్చుకోటలో ఇంటింటా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తెదేపా అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

(c) eenadu

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

చిన్నారులకు నంది అవార్డులు

అనంత సాంస్కృతికం: గుంతకల్లులో రెండు రోజులపాటు జరిగిన శ్రీవెంకటేశ్వరస్వామి నృత్యోత్సవంలో నగరానికి చెందిన చిన్నారులు నంది అవార్డులు కైవసం చేసుకున్నారు. గుంతకల్లు శ్రీవాగ్దేవి వాగ్గేయసంగీత కళానృత్య సంస్కృతి సంస్థ నిర్వహించిన నృత్యోత్సవంలో నాగలక్ష్మమ్మ కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన మన్విత, మానస, హర్షిత, దేవాన్ని, భవానిలకు అవార్డులు దక్కాయి.

వాజ్‌పేయీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: మాజీ ప్రధాని, రాజనీతిజ్ఞుడు అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సోమవారం భూమిపూజ చేశారు. నగరంలోని గుత్తిరోడ్డులో ఈనెల 12న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు రాజేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు జి.మహమ్మద్ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రయ్య, రత్నమయ్య, దేవిరెడ్డి లక్ష్మీదేవి, గోవిందప్రసాద్ పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న భాజపా నాయకులు

దారి వదలండి !

రాంనగర్‌పై వంతెన నుంచి రాంగ్ రూట్‌లో వంతెన కిందకు వెళ్లడానికి వస్తున్న ఆటో.. దీంతో వంతెన పైకి వెళ్లాల్సిన వాహనాలు ఆగిపోవాల్సి వచ్చింది.

అనంత నగరంలో ఆటోవాలాలు రోడ్లపై మధ్యలో ఆపేస్తున్న పరిణామాలు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. వెనుక నుంచి వాహనాలు ఆగిపోవాల్సి వస్తుంది. కొన్నిసార్లు ఇష్టానుసారంగా పరిమితికి మించి ప్రమాదకరంగా విద్యార్థులను తరలిస్తున్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించి పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొంతమంది ఆటోవాలాలు ఆటోలను రోడ్డంతా ఆక్రమించేస్తున్నారు. వెనుక నుంచి వచ్చే బస్సులుకు అసలు దారి ఇవ్వడం లేదు.

- ఈనాడు అనంతపురం

సప్తగిరి కూడలిలో ఒకవైపు నుంచి వాహనాలు మరోవైపు పూర్తిగా వెళ్లకుండానే ఆటో దూసుకురావడంతో మధ్యలో ఇరుక్కుపోయిన వాహనదారులు.

శ్రీకంఠం కూడలి నుంచి సూర్యానగర్ కూడలికి బస్సులు వెళ్లే మార్గంలో ఆటోలు ఇలా వరుస మార్గంలో ఆపేశారు. బస్టాండ్ నుంచి వచ్చిన బస్సులు ఇలా కొంతసేపు ఆపాల్సి వస్తోంది. రోడ్డు మధ్యలో ఆటోను నిలపడంతో బస్సు ముందుకు రాలేని పరిస్థితి.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

సమస్య: పాతూరు లాల్‌బంద్ వీధిలోని ప్రధాన రోడ్డు పక్కనే మట్టి కుప్పలున్నాయి. **-బాషా**

సమాధానం: వెంటనే మట్టిని తరలిస్తాం.

సమస్య: అశోక్‌నగర్ సాయిబాబా పాఠశాల వద్ద చెత్త అంతా పడేస్తుండటంతో వ్యాధులకు ఆస్కారంగా ఉంది. **-నారాయణప్ప**

సమాధానం: చెత్త అక్కడ వేయకుండా చర్యలు చేపడతాం.

(ప్రశ్నలకు నగరపాలక ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి నరసింహ సమాధానాలు ఇచ్చారు.) - న్యూస్‌టుడే, అశోక్‌నగర్

ఆత్మకూరులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఎయిడ్స్ నివారణకు కృషి చేయాలి

ఆత్మకూరు: ఎయిడ్స్ నివారణకు అందరూ కృషి చేయాలని వైద్యాధికారి సబిహా సుల్తాన పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆత్మకూరు ఆర్‌హెచ్‌సి నుంచి ప్రధాన వీధుల్లో విద్యార్థులు, వైద్య సిబ్బంది చైతన్య ప్రదర్శన నిర్వహించారు. హెచ్‌ఐవి ఉన్న వ్యక్తి నుంచి రక్తాన్ని మరొకరికి ఎక్కించినా, ఒకరికి వేసిన సూదిని మరొకరికి వేసినా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. వైరస్ శరీరంలోకి ప్రవేశించాక వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. హెచ్‌ఐవీ సోకిన గర్భిణి నుంచి శిశువుకి వచ్చే ప్రమాదముందన్నారు.

వేడుకగా గీతాజయంతి

అనంత సాంస్కృతికం: మార్గశిర శుక్ల పక్ష ఏకాదశి 'గీతా జయంతి' పురస్కరించుకుని అశోక్‌నగర్ రమా సమేత సత్య నారాయణ స్వామి ఆలయంలో సోమవారం గీతా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి ఫణిరాజ్ ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం గీతా పరివార్ ఆధ్వర్యంలో 'సంపూర్ణ సామూహిక భగవద్గీత పారాయణం' మొత్తం 18 అధ్యాయాలు చదివారు. పరివార్ ప్రతినిధి జగదీశ్వర రెడ్డి సారథ్యంలో పారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది.

పారాయణం నిర్వహణలో భక్తులు

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

అనంత సాంస్కృతికం: నగరంలోని మొదటిరోడ్డు శివాలయంలో సోమవారం రాత్రి శోభాయమానంగా జరిగిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళాభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు లలితా పరమేశ్వరీమాతను స్తుతిస్తూ అమ్మవారి నామస్మరణలు చేశారు. కార్యక్రమానికి స్థానిక జీఆర్‌టీ సంస్థ ప్రతినిధులు ఉభయదాతలుగా వ్యవహరించి చేయూతనందించారు. ఆలయ ఛైర్మన్ అమిలినేని నరేంద్ర చౌదరి, ఈవో నాగేంద్రుడు, పాలకమండలి సభ్యులు, దేవాదాయశాఖ పరమేశ్వర, నవీన్‌లు పర్యవేక్షించారు.

జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఉద్యోగులు

జేఎన్‌టీయూ వీసీకి అభినందనల వెల్లువ

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ఉత్తమ పరిపాలన అధికారిగా పురస్కారం అందుకున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు మరిన్ని అవార్డులు అందుకోవాలని రిజిస్ట్రార్ కృష్ణయ్య పేర్కొన్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇటీవల జేఎన్‌టీయూ వీసీకి సాంకేతిక విద్యా సంస్థల్లో ఉత్తమ పరిపాలన అధికారిగా పురస్కారం అందుకున్నారు. రిజిస్ట్రార్‌తో పాటు ఓఎస్‌డీ దేవన్న, విశ్వవిద్యాలయం డైరెక్టర్లు, ప్రిన్సిపల్, బోధన, బోధనేతర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

4న శివకోటిలో దత్తాత్రేయ జయంత్యుత్సవం

అనంత సాంస్కృతికం: బెంగళూరు రోడ్డులోని శివకోటి ఆలయంలో శ్రీ మార్గశిర పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 4న దత్తాత్రేయ స్వామి జయంత్యుత్సవం వైభవంగా జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురుకులందరికీ మూలపురుషుడైన దత్తాత్రేయ స్వామి జయంతి గురువారం రావడంతో ఉదయం 9గంటలకు విశేష పూజలు జరుగుతా యన్నారు. పూజలు చేయదలచిన వారు 85008 50016, 70366 46646 చరవాణిలో ఆలయ ట్రస్టు సభ్యులతో సంప్రదించాలని సూచించారు.

పేద విద్యార్థులకు నిఘంటువుల వితరణ

తపోవనం: అనంతపురం గ్రామీణ మండలం రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలో ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆంగ్లం-తెలుగు నిఘంటువులను వితరణ చేశారు. రాయలసీమ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రఘునాథరావు ఆధ్వర్యంలో 100 మంది పిల్లలకు నిఘంటువులను పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాప్తాడు: మండలంలోని రాప్తాడుకు చెందిన వనజాక్షి (40) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. రాప్తాడుకు చెందిన ఆంజనేయులు ఆదివారం బుక్కచెర్లలో తన పొలంలోకి కారులో భార్య, ఇద్దరు పిల్లలు వెళ్లారు. తిరిగి రాప్తాడుకు వస్తున్న సమయంలో కారు పల్టీలు కొట్టింది. భార్యకు తీవ్రగాయాలు, భర్తకు చేయి విరిగింది. పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. వనజాక్షిని అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సాయంత్రం మృతి చెందింది. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

పక్కదారి పట్టిన నిధులను రాబడతాం

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.100 కోట్లు పక్కదారి పట్టించారని, వీటిపై విచారణ చేయిస్తాం. ఎంతటి వారినైనా సరే వదిలిపెట్టే ప్రసక్తేలేదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. మేయర్ వసీం ఉంటున్న 38వ డివిజన్‌లోని పార్కును కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. 4 రోజుల క్రితం వరకు విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగాయి. పందులు తిరిగేవన్నారు. స్థానిక తెదేపా నాయకులు చొరవతో సొంత ఖర్చులతో పార్కును శుభ్రం చేయించామన్నారు. పార్కును ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. అనంతరం కాలనీలో స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడారు. మేయర్ సొంత డివిజన్‌లోని పార్కును కూడా నిరుపయోగంగా మార్చి.. పందులకు నిలయంగా మార్చారంటే ఆయన పనితీరు ఎలా ఉందో అర్థమవుతోందన్నారు.

తారు రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

రూపు రేఖలు మార్చబోతున్నాం

అశోక్‌నగర్: మరో ఏడాదిలో నగరం రూపు రేఖలు మారబోతున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 27వ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో రూ.70 లక్షలతో నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించారు. అనంతరం 38వ డివిజన్‌లోని కోవూరు నగర్‌లో రూ.39 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అశోక్‌నగర్ ప్రధాన రోడ్డు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉండగా తాము అధికారంలోకి రాగానే పనులు ప్రారంభించి పూర్తి చేశామన్నారు. నగరంలో రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

వెయ్యి పెంపునకు ఐదేళ్లు

అనంత నగరపాలక: పింఛన్ సొమ్ము పెంచడానికి జగన్‌కు మనసు ఒప్పక ఐదేళ్లకు కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 16వ డివిజన్ బాబానగర్, 38వ డివిజన్ కోవూరు నగర్‌లో లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి కమిషనరు బాలస్వామితో కలిసి పింఛన్ సొమ్మును అందజేశారు.

హామీలు ఇచ్చాం.. నెరవేరుస్తున్నాం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చామని వాటిని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని దామాజీపల్లిలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. గ్రామంలోని పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందించి వారి బాగోగులకు అడిగి తెలుసుకున్నారు. దారిలో స్థానికులతో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని ఆరాదీశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రే నేరుగా పేదవాడి ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్న వైనం ఈ ప్రభుత్వ పనితీరుకి నిదర్శనమన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ఎంతో ఉపయోగమన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రెండు విడతలు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పంపిణీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామన్నారు. త్వరలోనే ఇంటి పట్టాలు, పక్కా ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. పలువురు గ్రామస్థులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో బాలకృష్ణుడు, తెదేపా మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఓబుళేసు, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

జిల్లా క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి మృతి

ఎం.శ్రీనివాసులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి ఎం. శ్రీనివాసులు సోమవారం రాత్రి కన్నుమూశారు. ప్రభుత్వ సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జిల్లా క్రికెట్ సంఘానికి దాదాపు పదేళ్ల పాటు కార్యదర్శిగా పనిచేసి ఎంతోమంది ఉత్తమ క్రికెటర్లను ఆయన అందించారు. ఉమ్మడి జిల్లాలో అనేకమంది క్రికెటర్లు రంజీ, రాష్ట్రస్థాయికి ఆడి వివిధ హోదాల్లో స్థిరపడ్డారు. కొంతకాలంగా అతను అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఆయన మృతి పట్ల జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్, కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, సభ్యులు పగడాల మల్లికార్జున, టీవీ చంద్రమోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

తపాలా ఉద్యోగులకు సంఘం అండ..

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: తపాలాశాఖ అనంతపురం డివిజన్లో ఉద్యోగులకు భారతీయ తపాలా ఉద్యోగుల సంఘం అండగా ఉంటుందని డివిజన్ సంఘం నూతన అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి జాకీఫ్, కోశాధికారి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. నగరంలో జరిగిన డివిజనల్ సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తెలుగులో దివ్యాంగుల చట్టాలు

జిల్లా సచివాలయం: అంధ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తెలుగులో అనువదించిన వికలాంగుల హక్కుల చట్టం- 2016 పుస్తకాన్ని కలెక్టర్ ఆనంద్ ఆవిష్కరించారు. దివ్యాంగుల హక్కులు, చట్టాలపై తెలుగులో పుస్తకాన్ని తీసుకుని రావడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. ప్రతి దివ్యాంగుడికి ఈ పుస్తకాన్ని అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అరటికి గిట్టుబాటు ధర కల్పించాలి

కలెక్టరేట్ ముందు వైకాపా నాయకుల నిరసన

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అరటి పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ శింగనమల వైకాపా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. వైకాపా శింగనమల సమన్వయకర్త శైలజానాథ్ ఆధ్వర్యంలో అనంత నగరంలో నిరసన ర్యాలీ జరిపారు. అరటి గెలలను నెత్తుని ఎత్తుకుని ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడి నుంచి కలెక్టరేట్ ప్రధాన గేటు ముందు బైఠాయించారు. అక్కడే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన నినాదాలు చేశారు. ట్రాక్టర్‌లో తీసుకొచ్చిన అరటి గెలలను రోడ్డుపై పడేసే క్రమంలో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ నిరసనలో శైలజానాథ్ మాట్లాడుతూ.. అరటి పంటకు ధర గణనీయంగా పడిపోయింది. టన్ను రూ.2 వేలు కూడా ధర పలకలేదని ఆవేదన చెందారు. కనీసం రూ.10 వేలతో ప్రభుత్వమే కొనాలని ఆయన డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.50 వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. సత్వరమే పంట ధరల స్థిరీకరణ చేయాలని డిమాండ్ చేశారు. తర్వాత కలెక్టర్‌కు వినతి అందజేశారు. జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ పాల్గొన్నారు.

శ్రీచైతన్య టాలెంట్ పాఠశాలలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

అవసరానికి మించి ఫోన్లు వాడొద్దు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు అవసరాలకు మించి మొబైల్‌స్లు వాడకూడదని పలువురు ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. ఈనాడు ఆధ్వర్యంలో సోమవారం ప్రకాష్‌రోడ్డులోని శ్రీచైతన్య టాలెంట్ పాఠశాల, నాలుగో రోడ్డులోని నేతాజీ నగరపాలకోన్నత పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతల వివరాలు: శ్రీచైతన్య పాఠశాలలో జరిగిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని సంహిత ప్రథమ, 7వ తరగతి విద్యార్థులు సంకీర్తన ద్వితీయ, తాసిన్ తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు ప్రభంజన్ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రాజేష్, షమీమ్, గాయత్రి పాల్గొన్నారు.

● నేతాజీ సుభాష్‌చంద్రబోస్ పాఠశాలలో జరిగిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థులు హసీబ్ ప్రథమ, నియాజ్ ద్వితీయ, 7వ తరగతి విద్యార్థి అఫ్జల్ అహమ్మద్ తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రకాష్‌రావు బహుమతులు అందజేశారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగరపాలకోన్నత పాఠశాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : గంగ : **ఖైదు,** గౌరి : **రివాల్వర్ రీటా,** గాయత్రి : **జనతా బార్,** త్రివేణి : **బిజినెస్‌మ్యాన్,** తేజస్విని : **జూటోపీయా-2,** ఎస్వీ సినిమా : **రాజు వెడ్స్ రాంబాయి,** శాంతి : **ఆంధ్రకింగ్ తాలుకా.**

గోడు చెప్పాలని..

చేతిలో కర్ర పట్టుకున్న వృద్ధురాలు పేరు గౌరమ్మ (69), జేఎన్టీయు ఇంజినీరింగ్ కళాశాల పక్కన కాలనీలో నివాసం ఉంటుంది. ఈమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు.. అందరికీ పెళ్లిళ్లు చేసింది. ప్రస్తుతం ఈమె పేరు మీద మూడు సెంట్లు భూమి ఉంది. తన కోడలు మొత్తం మూడు సెంట్లు భూమి తనకే కావాలని గొడవ పెడుతున్నది. మొత్తం కోడలుకు ఇచ్చేస్తే తన భవిష్యత్తు ఏంటని తనకి ఒక్క సెంటు భూమి అయినా ఇవ్వాలని అనగా.. నీకెందుకు అని చెప్పి రోజూ గొడవ పడుతోందని వాపోయింది. సోమవారం కలెక్టరేట్‌కు అర్జీ ఇవ్వడానికి పొరుగునున్న మరో వృద్ధురాలిని తోడు పట్టుకుని కలెక్టరేట్‌కు వచ్చింది. ఈమెతోపాటు ఆమె మనవళ్లను కూడా తీసుకు వచ్చింది.

- ఈనాడు అనంతపురం

అవీ.. ఇవీ..

కాలవ రమణ మృతికి సీపీఐ సంతాపం

ఆర్కేనగర్: సీనియర్ పాత్రికేయుడు, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకుడు కాలవ రమణ మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డిలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అనారోగ్యంతో రమణ మృతి చెందడం బాధాకరమన్నారు. వివిధ పత్రికల్లో జిల్లా పరిస్థితులను కళ్లకు కట్టినట్లు కథనాలు రాసి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డు అందుకున్నారని గుర్తు చేసుకున్నారు.

ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం విద్య: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్ఐవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నిబంధలనకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పుస్తకాలు, మెటీరియల్‌కు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆర్ఐవోకి అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

అనంత నగరపాలక: ఫిర్యాదులు పరిష్కారం ప్రజలు సంతృప్తికర స్థాయిలో ఉండాలని కమిషనరు బాలస్వామి అధికారులకు సూచించారు. సోమవారం నగరపాలకలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలు స్వీకరించారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని ప్రజలు టౌన్‌ప్లానింగ్, షాపింగ్ కాంప్లెక్స్, రోడ్డు నిర్మాణం, పారిశుద్ధ్యం తదితర అంశాలపై 9 ఫిర్యాదులు అందాయి.

వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

ఆర్కేనగర్: ఈనెల 11 నాటికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందేళ్ల వార్షికోత్సవాన్ని జరుపుకుంటోందని, కావున ఆ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పాతూరు ప్రాంతంలో 'పోరాట నిధి 'పేరుతో ప్రచారం నిర్వహించారు

'నేను సైతం' పోస్టర్ ఆవిష్కరణ

మహిళలు, బాలికలపై జరిగే హింసను నిర్మూలించేలా 'నేను సైతం' అన్న ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. మహిళలపై హింస వ్యతిరేక అంతర్జాతీయ పక్షోత్సవాల నేపథ్యంలో జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ పోస్టర్లను రెవెన్యూ భవన్‌లో ఆవిష్కరించారు. అక్కడే సెల్ఫీ బూత్, సైన్‌బోర్డును ఏర్పాటు చేశారు.

శ్రద్ధాంజలి / శత జయంతి

కీ.శే. డా॥ చిక్కాకె ఎస్.చంద్రశేఖర్ గారు
B.Sc., MBBS., DPH, (రిటైర్డ్ సివిల్ సర్జన్)
జననం: 02-12-1925, నిర్యాణం: 31-12-2007

కుమారుడు: డా॥ చిక్కాకె. ఎస్.కృష్ణమోహన్ MD.,DAC (ACU)., PGDND ఫిజిషియన్ & న్యూట్రిషియన్ స్పెషలిస్ట్ (పోషకాహార నిపుణులు) కమల్ శ్రీ క్లినిక్
కోడలు: శ్రీమతి చిక్కాకె గీతాంజలి
మనుమడు: సి.ఎం.రితేష్, M.Tech., Structural Engg. BITS Pilani, HYD
మనుమరాలు: సి.శ్వేత, B.E. (Civil) & మునిమనుమడు: సి.ఆర్.వేదాంత్
అల్లుడు: డా॥ బింకా లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ప్రిన్సిపల్, MA.,Ph.D., Govt. డిగ్రీ కాలేజ్, కుప్పం.
కుమార్తె: శ్రీమతి చిక్కాకె విజయలక్ష్మి MA., B.Ed., Retd. ఆంధ్రాబ్యాంక్ CRO
మనుమడు: డా॥ బింకా భరత్, M.B.B.S., M.D. Final Year (Radiology MIMS, Vijayanagaram)
మనుమడు: భోగా కౌశిక్, M.Tech., Software Engg. Canada
మనుమరాలు: భోగా జాహ్నవి, M.Tech., Software Engg. Canada

IN THE COURT OF THE 1st ADDL. JUNIOR CIVIL JUDGE; ANANTHAPURAMU.
E.P.No. 251/2023 in O.S.No. 138/2021
Between:
K.Thulasamma @ Tolisamma ... **Decree Holder**
Vs
M.Viswanatha Naidu (Died) by L.Rs 1) M.Vijayalakshmi, 2) M.Neha, Minor, D/o M.Viswanatha Naidu, 3) M.Kousik, Minor S/o Viswanatha Naidu ... **Judgment Debtors**

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా అర్జీదారులు తన E.P. మొత్తమును రాబట్టుకొనుటకు J.Drకు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెల్పిన కోర్టులో వేలంకు తెచ్చియున్నారు. వేలంలో పాల్గొనదలచినవారు 17-12-2025వ తేది ఉదయం 10-30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

Property situated in R.D and S.R.D. of Ananthapuramu of Rapthadu Village fields. **Babu:** Govt. **Description:** Dry, **Sy.No.** 153/2, **A.C.** 7.27 పైకి **A.C.** 0.10, **Hectors:** 0.040, **Plot No's:** 101 & 102 **Boundaries: East:** Plot No. 93&94, **South:** Plot No. 100, **West:** 30 feet Road, **North:** Road in Sy No. 153/1. **Measurements: East-West:** 69 feet or 21.04 Meters, **North-South:** 68 feet or 20.23 meters or 484 Sq. Yards.
Decree Holders Estimated Value: Rs. 9,00,000/-
"By order of the Court"
J.CHITTARANJAN, Advocate, Ananthapuramu. Cell No. 9440222366

నిప్పు.. నిర్లక్ష్యం

ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్త కొత్త సమస్యలను తెచ్చి పెడుతోంది. నగరంలోని హౌసింగ్ బోర్డులో పదుల సంఖ్యలో ఖాళీగా ఉన్న స్థలాలు, నివాసాలు ఏళ్ల తరబడి శుభ్రం చేయకుండా వదిలేశారు. ఒక్కోసారి మంటలు చెలరేగి నివాసాల్లో ఉన్న వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఆయా యజమానులకు నగరపాలక అధికారులు వారికి తాఖీదులు ఇవ్వాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. హౌసింగ్ బోర్డులోని ఎంఐజీ 248 నివాసం సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో చెత్తా చెదారం ఉండటంతో మంటలు రేగాయి. చుట్టు పక్కల నివాసం ఉంటున్న వారు నీళ్లు చల్లి అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

- న్యూస్‌టుడే, అశోక్‌నగర్

అధికారి మారినా.. పేరు మారలేదప్పా!

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం ప్రకారం జిల్లా ప్రజా సమాచార అధికారి, సహాయ ప్రజా సమాచార అధికారి, అప్పీల్ అధికారుల పేర్లు బోర్డులో రాయించారు. అయితే గత జూన్ 5వ తేదీన సహాయ ప్రజా సమాచార అధికారి(సహాయ పౌరసరఫరాల అధికారి) జగన్మోహన్‌రావు డిప్యుటేషన్‌పై మైనారిటీ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో శోభారాణి విధుల్లో చేరారు. ఇప్పటికీ స.హ.చట్టం బోర్డులో ఆయన పేరును అలాగే ఉంచారు. అధికారి మారిన పేరు మార్చకపోవడంతో చట్టం ఎక్కడ అమలు చేస్తున్నారని పలువురు పౌరులు ప్రశ్నిస్తున్నారు.



'గత వైకాపా పాలనలో అంతా పక్షపాతమే'

ఆత్మకూరు: వైకాపా పాలనలో అంతా పక్షపాతం చూపుతూ ప్రభుత్వ పథకాలు అందించారని తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు మండిపడ్డారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత వైకాపా పాలనలో అర్హులందరికి పింఛన్లంటూ డప్పు కొట్టి తెదేపా సానుభూతిపరుల పింఛన్లను తొలగించారన్నారు. ఏదో ఒక సాకు చెబుతూ పింఛన్లను తొలగించి రాక్షసానందాన్ని పొందారని చెప్పారు. నేడు అర్హతే ప్రామాణికంగా పింఛన్ల పంపిణీ ప్రతి నెలా 1న జరుగుతోందని తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు విద్యార్థి ఎంపిక

అనంతపురం విద్య: రాష్ట్రస్థాయి అండర్-19 జూడో పోటీలకు నలంద జూనియర్ కళాశాల విద్యార్థి పి.అర్జున్ ఎంపికయ్యాడు. నవంబరు 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆవిద్యార్థి ఎంపికయ్యాడు. ప్రిన్సిపల్ ఖాజీబాబు అర్జున్‌ని అభినందించారు.

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ప్రభుత్వ భూముల ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దారు క్రాంతికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు క్రాంతికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను అధికారులు కాపాడాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సిద్దవటం విద్యార్థి ఎంపిక

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి **శ్రీవిద్య** జాతీయ స్థాయి గట్కా క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ చంద్రావతి తెలిపారు. కర్నూలులోని ఎమ్మిగనూరులో సోమవారం అండర్-19 రాష్ట్ర స్థాయి గట్కా పోటీలు జరగగా శ్రీవిద్య ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. అదే పాఠశాలకు చెందిన వెంకట దివ్య, వంశీలు బ్రాంజ్ మోడల్ సాధించినట్లు ఆమె చెప్పారు. త్వరలో పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో శ్రీవిద్య పాల్గొననుండటంతో బాధ్య హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు వై. పవన్‌కుమార్‌రెడ్డి కుటుంబానికి సోమవారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి రూ.2.30 లక్షల ఆర్థిక సాయం అందించారు. జిల్లాలోని హోంగార్డులు ఒక్క రోజు డ్యూటీ అలవెన్సును స్వచ్ఛందంగా విరాళంగా ఇచ్చారని ఆయన తెలిపారు. పోలీసులు కేవలం చట్టాన్ని కాపాడే వారు మాత్రమే కాదని ఒకరికొకరు అండగా నిలిచే కుటుంబమని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) ఎం. వెంకటాద్రి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఎం. పెద్దయ్య, ఆర్ఎస్సై శ్రీనివాసులు, ఏఆర్ఎస్సై బాలాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే

బురద తొక్కాల్సిందే

మండల పరిషత్తు కార్యాలయానికి వెళ్లే దారి ఇలా ఉంది

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రైల్వేకోడూరు మండల పరిషత్తు ప్రాంగణంలో ఎంపీడీవో కార్యాలయంతో పాటు విద్యాశాఖ, పంచాయతీరాజ్, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధిహామీ, తహసీల్దారు, వ్యవసాయ శాఖ, ఐసీడీఎస్, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యమున్న ప్రాంతంలో కనీసం ఒక్క కార్యాలయానికి సరైన దారి లేదు. చిన్నపాటి వర్షం కురిస్తే ప్రతి కార్యాలయం ముందు బురద, వర్షపునీరు నిండుకుంటోంది. కాలు పెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. రూ. కోట్లు ఖర్చు చేసి భవనాలు నిర్మించారు. కానీ ఒక్క కార్యాలయానికీ సరైన దారి ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఆ ప్రాంగణమంతా వర్షపునీరు నిలిచిపోయి ఇబ్బందికరంగా ఉంది. ప్రజలు కనీసం అధికారులను కలవాలన్నా వీల్లేకుండా మారింది. అన్ని ముఖ్యమైన శాఖల అధికారులు ఇక్కడే తిరుగుతున్నా ఏ ఒక్కరు స్పందించడంలేదని వాపోతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో నాగిరెడ్డి మాట్లాడుతూ కార్యాలయాల ముందు పరిస్థితి ఇబ్బందికరంగానే ఉందన్నారు. వర్షాలు ఆగిపోగానే ఉన్నతాధికారులతో మాట్లాడి ఇక్కడి కార్యాలయాలకు మంచి దారులు వేయడానికి చర్యలు చేపడతామని వివరించారు.

సచివాలయం ఎదుట ఇలా...

సీఎం దృష్టికి రాజంపేట ప్రజల ఆకాంక్ష

సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలనే ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రం ఏర్పాటు విషయంలో గత వైకాపా పాలనలో తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే అంశంపై ప్రజల అభిప్రాయాలను సీఎంకి విన్నవిస్తానన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన

రాజంపేట గ్రామీణ: రాజంపేట మండలం హత్యరాల వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు, హత్యరాల మాజీ ఆలయ ఛైర్మన్ నరసింహులు, పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్‌నాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల చెంతకు చేరిన పింఛను నగదు

సుండుపల్లి: దివ్యాంగుడికి నగదు అందిస్తున్న కూటమి నాయకులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. రాజంపేట మండలంలో మందరం, కొత్తపల్లి, హత్యరాల గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు.

రాయచోటి గ్రామీణ: రాయచోటి మండలం గుంటిమడుగు గ్రామంలో సోమవారం ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. **లక్కిరెడ్డిపల్లె:** వృద్ధులకు ఆపన్న హస్తంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని రాష్ట్ర అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డెయ్య యాదవ్ అన్నారు. సోమవారం ఆయన తెదేపా మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ షఫీనాయక్‌తో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. **సుండుపల్లి:** ఎన్టీఆర్ పింఛన్ భరోసా కార్యక్రమంలో భాగంగా మండలంలో తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సి. మహేష్‌నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సి. రమేష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి యూసుఫ్‌లతో కలిసి పింఛన్ల పంపిణీ చేశారు.

లక్కిరెడ్డిపల్లెలో పింఛను పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

రాయచోటి: లబ్ధిదారుకు పింఛను అందిస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి

చెన్నకేశవా.. తాళం తొలగదా!

● అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

డిజిటల్ తాళం లేక పోవడంతో తెరవని చెన్నకేశవ స్వామి ఆలయం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: తాళ్లపాక అన్నమాచార్యులు స్వయంగా పూజలు చేసిన చెన్నకేశవ స్వామి ఆలయం నిర్వహణ తితిదే ఆధ్వర్యంలో ఉంది. ఆలయంలో విలువైన ఆభరణాలు, వస్తువులు ఉండడంతో ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ తాళం ఏర్పాటు చేశారు. ఈ ఆలయం తలుపులు తెరవాలంటే తప్పని సరిగా ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ అధికారుల ఆధ్వర్యంలో జరగాల్సి ఉంది. అయితే ఆదివారం పూజలు పూర్తి చేసున అనంతరం ఆ తాళాన్ని ఆలయం లోపల ఉంచి, ఆలయం తలుపులు మూసి వేశారు. తిరిగి సోమవారం ఆలయం తలుపులు తెరవడానికి ప్రయత్నం చేయగా తాళం లేకపోవడం, మరొక తాళం తితిదే విజిలెన్స్ అధికారులు వద్ద ఉండటంతో ఆలయం తెరవలేకపోయారు. దీంతో గ్రామస్థులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ... ఇక్కడ పని చేయాల్సిన అధికారులు, తిరుపతి, ఒంటిమిట్ట ప్రాంతాలకు వెళ్లడంతోనే ఇలాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. దీనిపై స్పందించిన అధికారులు, తిరుపతి నుంచి వచ్చి ఆలయం తలుపులు తెరిచారు. ఈ వ్యవహారంపై తితిదే అధికారులు విచారణకు ఆదేశించారు.

వాడవాడలా చైతన్య ప్రదర్శనలు

రాజంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో, వైద్యులు, సిబ్బంది

రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. అధికారులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొని ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. **- న్యూస్‌టుడే, బృందం**

సంబేపల్లె పీహెచ్‌సీలో వైద్య అధికారులు, సిబ్బంది

డిప్యూటీ ఎంపీడీవోగా జ్యోతీశ్వర్‌రాజు

వీరబల్లి, న్యూస్‌టుడే: డిప్యూటీ ఎంపీడీవోగా జ్యోతీశ్వర్‌రాజు స్థానిక కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. అనంతరం ఆయన్ని కూటమి నాయకులు కలిసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

5న మండల సమావేశం

చిన్నమండెం: చిన్నమండెం మండల సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 5న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆదినారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సమస్యలపై సభ్యులు చర్చిస్తారన్నారు. ఎంపీపీ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య.. కేసు నమోదు

సుండుపల్లి, న్యూస్‌టుడే: రాయవరం కస్పాహరిజనవాడకు చెందిన హర్షవర్ధన్(20) ఈ నెల27 విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బంధువులు గుర్తించి బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందారు. అందిన సమాచారంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

రైల్వేకోడూరు: రోడ్డు దాటుతున్న ఓ మహిళను కారు ఢీకొట్టిన ఘటన రాఘవరాజపురం వద్ద చోటుచేసుకుంది. బాలిరెడ్డిపల్లెకు చెందిన సింగిరి గంగమ్మ ఆదివారం అర్ధరాత్రి కారులో తిరుపతి నుంచి రాఘవరాజపురం వచ్చింది. తమ బంధువుల ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. కేసు పోలీసు విచారణలో ఉంది.

రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తారనే ఆశాభావం

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యంనాయుడు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తారనే సంపూర్ణ నమ్మకం ఉందని తెదేపా నాయకుడు, మన్నూరు సొసైటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. స్థానిక ర.భ.శాఖ అతిథి గృహంలో సోమవారం రాజంపేట సాధన సమితి ఐకాస సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు రాజంపేటలో ఉన్నాయన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తానని, మెడికల్ కళాశాలను తీసుకొస్తానని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుబ్బనరసయ్యనాయుడు, ఐకాస నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభల విజయవంతానికి వినతి

గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు కోరారు. ఈ మహాసభలకు సంబంధించిన గోడ పత్రాలను స్థానిక పురపాలక కార్యాలయ ఆవరణలో సోమవారం సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాగ్యలక్ష్మి, రమణ, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటాన్ని విలీనం చేయొద్దంటూ వినతులు

సిద్దవటంలో తహసీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న ఐకాస నాయకులు

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం మండలాన్ని అన్నమయ్య జిల్లాలో విలీనం చేసే ప్రక్రియను విరమించుకుని కడప జిల్లాలోనే కొనసాగించాలంటూ సిద్దవటం మండలంలోని తెదేపా, జనసేన నాయకులు సోమవారం పలువురు ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. అన్నమయ్య జిల్లాలో విలీనం చేస్తే ప్రజలకు కలిగే నష్టాలను తహసీల్దారు తిరుమలబాబుకు వివరించారు. మాధవరం-1 ఐకాస నాయకులు మండల ప్రజలతో సంతకాలు సేకరించి ఆ నివేదికను ఆయనకు అందజేశారు.

శిక్షణ తరగతులకు తెదేపా శ్రేణులు

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుతో మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు తదితరులు

వీరబల్లి, న్యూస్‌టుడే: విజయవాడలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా తరగతులకు సోమవారం వీరబల్లి తెదేపా మండల అధ్యక్షుడు ఎం. భానుగోపాల్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు హాజరయ్యారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎలా తీసికెళ్లాలనే విషయాలపై నాయకులు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితను, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కలిశారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ

సంబేపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కర్నూల్- చిత్తూరు జాతీయ రహదారిపై మొటుకువాండ్ల పల్లె క్రాస్ వద్ద రూరల్ సీఐ వరప్రసాద్ సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సులను, వాహన రికార్డులను పరిశీలించారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంబేపల్లె ఎస్సై రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ వరప్రసాద్

మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No. 23/2025

షేక్ ఖుద్రుతుల్లా సాహెబ్, తండ్రి రసూల్ సాహెబ్, ముస్లిం, వయస్సు 52 సం॥లు, కొత్తపల్లె గ్రామం, రాయచోటి టౌన్ & మండలం. - వాది

Vs

పీలం రామయ్య, తండ్రి నాగయ్య, 79 సం॥లు, సాకిన్ బోసనగర్ వీధి, రాయచోటి టౌన్ & మండలం. - ప్రతివాది

నోటీసు ప్రకటన

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీపైన అగ్రిమెంటు కొరకు దావా మరియు IA No. 383/25 రు ఇంజంక్షను పిటీషన్ను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మరియు ఇంజంక్షను పిటీషన్నులో 10-12-25 తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెల్పుకోవలయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు : శ్రీ యం.ఇలియాస్, B.Sc., LLB
వాదిపరం అడ్వకేటు, రాయచోటి.

ఆ బొమ్మలు పాఠాలు చెబుతున్నాయ్

✧ 425 పాఠశాలల్లో అమలు



రెడ్డివారిపల్లె పాఠశాలలో బొమ్మలతో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రాథమిక స్థాయి విద్యార్థులకు బొమ్మలతో విద్యను అందించేందుకు సరఫరా చేసిన 'జాదూయి పిటారా'తో(మాయా పెట్టె) ఉపాధ్యాయులు సాధన చేయిస్తున్నారు. ఇందులోని పలు రకాల బొమ్మలతో చిన్నారులు అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు దోహదపడతాయి. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో అమలు చేస్తోంది. జిల్లాలో 1798 ప్రాథమిక పాఠశాలలు ఉండగా మాయాపెట్టెలు 425 పాఠశాలలకు సరఫరా చేశారు.

పెట్టెలో 62 రకాల వస్తువులు

ఈ పెట్టెలో మొత్తం 62 రకాల వస్తువులున్నాయి. రంగు రంగుల బొమ్మలు, బోధనోపకరణాలు, ఫ్లాష్ కార్డులు, కథల పుస్తకాలు, అంకెలు, అక్షరాలు, రంగు పెన్సిళ్లు, తోలు బొమ్మలు, పోస్టర్లు, తెలుగు, ఆంగ్ల అక్షరాలు, గణిత సంబంధ వస్తువులను సులువుగా లెక్కించేటటువంటి వస్తువులున్నాయి. వీటిని ప్రాథమిక పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు అనుబంధంగా ఒకటి, రెండు తరగతులున్న పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా సరఫరా చేశారు.

ప్రయోజనం ఉంది

విద్యార్థుల హాజరు వంద శాతం ఉంటుంది. ఆసక్తికర అభ్యసనానికి బొమ్మలు దోహదం చేస్తే కథల పుస్తకాలు, తోలుబొమ్మలు చిన్నారుల్లో ఊహాశక్తి, భాషా నైపుణ్యాల పెంపుకు ఉపయోగపడతాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఫ్లాష్ కార్డులు గుర్తింపునకు, అంకెలు, తెలుగు, ఆంగ్ల అక్షరాలు గుర్తించడంతో పాటు పదాలను కలిపి పలికేందుకు, పోస్టర్లు, వర్క్‌షీట్లు అభ్యసనా కార్యకలాపాలకు ఉపయోగపడతాయని అంటున్నారు. మాయాపెట్టె చిన్నారుల్లో ప్రాథమిక విద్య పునాదికి దోహదపడుతుందని ఎస్ఎస్ఏ ఏఎంవో అసదుల్లా తెలిపారు.

సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న సీఐ ఏపీ మస్తాన్

పుల్లంపేట, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను నివారించి బాలికల భవిష్యత్తుకు బంగారు బాట వేద్దామని సీఐ ఏపీ మస్తాన్ అన్నారు. సోమవారం పుల్లంపేట మండలంలోని కేజీబీవీలో బాలికలకు సైబర్ నేరాలు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో వచ్చే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ రూత్‌మేరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఐసీటీసీ కౌన్సిలర్‌గా వెంకటసుబ్బయ్య

అవార్డు స్వీకరిస్తున్న వెంకటసుబ్బయ్య

రాజంపేట: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాయచోటిలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య చేతుల మీదుగా ఉత్తమ ఐసీటీసీ కౌన్సిలర్‌గా అవార్డును వెంకటసుబ్బయ్య అందుకున్నారు. హెచ్‌ఐవీ పరీక్షలు, మందుల అందజేయడం వంటి విభాగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఈ అవార్డు లభించిందన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

ఘనంగా గీతా జయంతి

గీతా పారాయణం చేస్తున్న భక్తులు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణ పరిధి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం శ్రీభగవాన్ గీతా సేవా సత్సంగం ఆధ్వర్యంలో గీతా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని భగవద్గీతలోని 18 అధ్యాయలను సంపూర్ణ పారాయణం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు, అధ్యాత్మిక ఉపన్యాసకులు అరవ రమణయ్య, తితిదే ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు వెంకటరమణ, గీతా సేవా సత్సంగ సంఘ అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయా ఆలయాల్లోని మూలవిరాట్ విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం గీతాపారాయణం చేపట్టారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

6వ వర్ధంతి



మంచితనం మూర్తీభవించే మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన మీరు మా కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి మా నుండి దూరమై దైవసన్నిధికి చేరి 6 సం॥ గడిచినను మీ జ్ఞాపకాలు మా వెంటే ఉన్నాయి. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో...

భార్య : కీ॥శే॥ శ్రీమతి మట్లి ప్రభావతమ్మ, Rtd. H.M.,

కుమారులు : కీ॥శే॥ మట్లి కృష్ణమోహన్‌రావు, మట్లి రవి ప్రతాప్, మట్లి లక్ష్మి మనోహరరావు
కోడళ్లు : జి.శ్రీకళాదేవి, ఎం.సునీత, ఎం.దేవిశ్రీ

మనుమలు : మనుమరాండ్రు :
డా॥ఎం.ధీరజ్, M.D., ఎం.హృతిక, B.Tech., ఎం.జైహింద్, M.Tech ఎం.చంద్రసేన, B.D.S., ఎం.భోళా ప్రభాత్ ఎం.జైదీప్ నారాయణ్

కీ॥శే॥ మట్లి లక్ష్మీనారాయణ గారు
Rtd. Head Master, రాయచోటి.
S/o కీ॥శే॥ మట్లి సుబ్బమ్మ, Rtd. Teacher
జననం : 01.07.1940 మరణం : 02.12.2019

(c) eenadu

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: చెరకు పంటలో పీక పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంది. నివారణ చర్యలు తెలుపగలరు. - చిన్న బాబు, మందరం, రైతు

సమాధానం: చెరకులో పీక పురుగు ఉద్ధృతి తీవ్ర స్థాయిలో ఉంటే క్లోరోపైరిపాస్ 2.5 మి.లీ. లేక మోనోక్రాటోఫాస్ 1.6 మి.లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొలం చుట్టూ ఉన్న రేగి, తుమ్మ, వేపచెట్ల కొమ్మలు పైరు పైకి రాకుండా కత్తిరించుకోవాలి.

- సుబ్రహ్మణ్యం, ఏవో, పెనగలూరు - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

రైతేరాజు

నీలి నాలుక వ్యాధిపై..
అప్రమత్తత తప్పనిసరి

చిన్నమండెం, న్యూస్‌టుడే: గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ కె.గుణశేఖరపిళ్లై తెలిపారు. వైరస్‌తో ఈ వ్యాధి వర్షాకాలంలో సోకుతుందన్నారు. బాహ్య పరాన్న జీవులైన దోమలను నివారిస్తేనే ఈ వ్యాధి నుంచి జీవాలను కాపాడుకోవచ్చన్నారు. ఆయన పలు సూచనలు చేశారు. ● దోమల తాకిడి అధికంగా ఉండే డిసెంబరు, జనవరి నెలల్లో వ్యాధి ఉద్ధృతి కనపడే అవకాశాలున్నాయి. వ్యాధి సోకిన జీవాల్లో తీవ్ర జ్వరం, నోటిలో పుండ్లు ఏర్పడుట, పెదవుల వాపు, మేత మేయలేకపోవుట, జొల్లు కార్చుట, తీవ్రమైన పరిస్థితుల్లో నాలుక నీలిరంగులోకి మారడం, అసంపూర్తిగా నెమరు వేసి మింగడంతో విరేచనాలు, నీరసించిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నిర్లక్ష్యం చేస్తే ఈసుకుపోయే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు. ● వ్యాధి సోకిన వాటిని మంద నుంచి వేరు చేసి నీరసించకుండా గ్లూకోజ్ ద్రావణం, కొబ్బరినీళ్లు, మజ్జిగ, రాగిజావ వంటివి తాపడం ద్వారా త్వరగా కోలుకుంటాయి. అవసరాన్ని బట్టి పశువైద్యుల సలహా మేరకు చికిత్స అందించాలి. ● పొక్కిపోయిన నోటిని పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో ఉదయం, సాయంత్రం శుభ్రం చేయాలి. బోరిక్ పౌడరు, కొబ్బరి నూనె కలిపి పూత మందుగా పూయాలి. ● దోమల వ్యాప్తిని అరికట్టడానికి డెల్టా మిత్రిన్ లీటరు నీటిలో అయిదు మిల్లీ లీటర్లు కలిపి జీవాలపై పిచికారీ చేయాలి. ఇలా చేయడం వలన రెండు వారాల వరకు దోమల నుంచి జీవాలను కాపాడుకోవచ్చు. గొర్రెలు ఉండే పాకలో వేపాకు పొగ వేసుకోవాలి. పాకలు శుభ్రంగా, పొడిగా ఉండేటట్లు చూసుకోవాలి. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలను సకాలంలో వేయించాలి.

బీడు పొలాల్లో మేస్తున్న గొర్రెలు

అరటికి రాయితీ రక్ష కవచ

కడప, న్యూస్‌టుడే: అరటి సాగు చేసే రైతులను ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. సమగ్ర ఉద్యానాభివృద్ధి పథకం ద్వారా రాయితీలు ఇచ్చి వెన్నుదన్నుగా నిలవాలని సంకల్పించింది. ఆర్థికంగా ఊతమిస్తే కొంత వరకు ఉపశమనం కలుగుతుందని పాలకులు నిర్ణయించారు. జిల్లాలో 34,543.40 ఎకరాల్లో అరటి సాగు చేశారు. మార్కెట్లో ధరలు నిలకడగా ఉండటం లేదు. గిట్టుబాటు దక్కక ఇబ్బందులు పడుతున్నారు. దళారుల దందా, చేతవాటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. మరోవైపు సాగు వ్యయం క్రమేణా పెరుగుతూ వస్తోంది. కర్షకులపై భారం పడుతోంది. ఇలాంటి కష్టాల నుంచి ఉపశమనం కల్పించాలని ప్రణాళికలు రూపొందించారు.

● కొత్తగా పంట వేస్తున్న రైతులకు తొలి ఏడాది సేద్యం ఖర్చులు, మొక్కలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లు, కలుపుతీత, నీటి తడులకు కలిపి హెక్టారుకు రూ.42 వేలు రాయితీ ఇస్తారు. రెండో సంవత్సరంలోనూ నిర్వహణ కోసం మరో రూ.28 వేలు ఇవ్వనున్నారు. రెండేళ్లు కలిపి రూ.70 వేలు పొందవచ్చు. పంట కుంట తవ్వకానికి 220x20x30 మీటర్ల వైశాల్యం) రూ.1.80 లక్షలు ఖర్చు అవుతుంది. అందులో 50 శాతం ప్రభుత్వం భరిస్తుంది. మరో సగం (రూ.90 వేలు) రైతు భరించాల్సి వస్తోంది.

● పండ్ల సంరక్షణ కోసం హెక్టారుకు రూ.55 వేలు ఖర్చు కానుంది. ప్రభుత్వం రూ.25,500 రాయితీ ఇస్తుంది. పండ్లను మగ్గబెట్టే శీతల యూనిట్ (రైపనింగ్ చాంబర్)కు ఏర్పాటు చేయాలంటే ఒక మెట్రిక్ టన్ను సామర్థ్యానికి రూ.1.20 లక్షలు ఖర్చు అవుతుంది. అందులో రాయితీ రూ.35 వేలు లబ్ధి పొందవచ్చు. ఔత్సాహికులు 10-30 టన్నుల సామర్థ్యంతో నిర్మించుకోవచ్చు. ● టిష్యూకల్చర్ మొక్కల ఉత్పత్తి యూనిట్‌ను పెట్టాలంటే కనీసం రూ.2.50 కోట్లు కావాలి. ప్రభుత్వం ద్వారా 40 శాతం లబ్ధి కలుగుతుంది. గరిష్ఠంగా రూ.కోటి వరకు పొందవచ్చు. కష్టకాలంలో ఉన్న కర్షకులకు చేయూత ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా ఉప సంచాలకులు సతీష్ తెలిపారు.

చిట్కా

వరిలో ఎలుకల నివారణ

వర్షాలు కురుస్తున్న వేళ వరి పంటపై ఎలుకల దాడి ఎక్కువగా ఉంటుంది. పొట్ట, కోత దశలో ఉన్న వరిని ఎలుకల నుంచి కాపాడుకునేందుకు రైతులు పొలం గట్లపై ఎకరాకు 20 చొప్పున తాటాకు బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. అందులో బ్రోమోడయోలిన్ ఎర(మందు+వంట నూనె+వరినూక 2:2:96 నిష్పత్తి)లో తయారు చేసిన ఎరను బుట్టలలో ఉంచడం ద్వారా ఎలకలు ఆకర్షించి బుట్టలలోకి వచ్చి చేరి చనిపోయే అవకాశం ఉంటుందని వీరబల్లి వ్యవసాయ శాఖ గ్రామ సహాయకుడు జగదీష్ తెలిపారు.

- న్యూస్‌టుడే, రాయచోటి

బొప్పాయి సాగులో సీతప్ప గొప్పోయి!

స్ఫూర్తి

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం మండలం చెంబకూరు గ్రామపంచాయతీ బలిజపల్లెకు చెందిన రైతు సీతప్ప తనకున్న 7.5 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు. అందులో ఎకరాకు ఐదు ట్రాక్టర్ లోడ్ల పశువుల ఎరువును దుక్కిలో కలిపారు. 20 రోజుల పాటు ముగ్గిన తరువాత 4x4 వెడల్పుతో బెడ్లు ఏర్పాటు చేశారు. బెడ్లకు మల్చింగ్ పేపర్ వేసి బిందుసేద్యం అమర్చారు. ఎకరా విస్తీర్ణంలో 800 చొప్పున హైబ్రిడ్ రకం బొప్పాయి మొక్కలు (రెడ్ లేడీ) నాటారు. మొక్కల ఎదుగుదలకు ఎకరా సాగుకు 25 కిలోల చొప్పున పోషక ఎరువులను బిందుసేద్యం ద్వారా అందించారు. అనంతరం మొక్క కాండం పటిష్ఠం కావడానికి మూడు నెలల పాటు పోషక ఎరువులు అందించకుండా సాగుకు నీరు మాత్రమే అందించారు. అయిదో నెల నుంచి మొక్కల్లో పూత, పిందెదశకు వచ్చాయి. కాయల పరిమాణం, నాణ్యత పెరగడానికి మొక్కలకు కాంప్లెక్స్ ఎరువులు అందించారు. ఆరు నెలల నుంచి దిగుబడులు ప్రారంభమయ్యాయి. దిల్లీ, హరియాణా వంటి మార్కెట్లకు ఎగుమతి చేశారు. 7.5 ఎకరాలకు సాగు వ్యయం రూ.20 లక్షలుకాగా రూ.30 లక్షల మేర రాబడి సమకూరినట్లు రైతు సీతప్ప తెలిపారు.

సాగు చేసిన బొప్పాయి తోట

సీతప్ప, రైతు

అభివృద్ధి పనుల్లో జాప్యం.. ప్రభుత్వంపై ఆర్థిక భారం

● నిర్లక్ష్యం వీడని గుత్తేదారులు, మున్సిపల్ అధికారులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లె పురపాలక సంఘం పరిధిలో రూ.కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సంవత్సరాలు గడుస్తున్నా అవి పూర్తి కాకపోవడంతో నిర్మాణ వ్యయం పెరుగుతోంది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోంది.

బైపాస్ రోడ్డులో నిర్మాణంలో మురుగు నీటి శుద్ధి యూనిట్

★ మున్సిపాలిటీ పరిధిలో వెలువడే మురుగు నీటిని శుద్ధి చేయడానికి అమృత్ పథకం ఎస్టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంటు ప్లాంటు) నిర్మాణ పనులు చేపట్టారు. రూ.15.95 కోట్ల అంచనా వ్యయంతో 2018 సెప్టెంబరులో పనులు చేపట్టారు. ఇప్పటి వరకు 25 శాతం పనులు జరిగాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పనులు అర్ధాంతరంగా ఆపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది.

★ వడ్డిపల్లెలోని ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉంది. దీన్ని పడగొట్టి అదే స్థలంలో కొత్తది నిర్మించడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ.1.5 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేయడానికి ఇంజినీరింగ్ విభాగం అధికారులు అప్పట్లో టెండర్లు నిర్వహించారు. నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

★ పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేయడానికి అమృత్ పథకం కింద నాలుగు ఈఎల్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇందులో మూడింటిని పూర్తి చేయగా ఒకదాన్ని నిర్మించాల్సి ఉంది. ఇందుకోసం 2016లో ఎన్టీఆర్ పార్కులో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ట్యాంకు నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దీనిపై స్థానికుల నుంచి అభ్యంతరాలు రావడంతో పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని రూ.33 లక్షలు పెట్టి కొనుగోలు చేసి ట్యాంకు నిర్మించడానికి కౌన్సిల్ అనుమతి తీసుకున్నారు. అయితే సంవత్సరాలు గడిచినా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

★ అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతున్న వైనంపై మున్సిపల్ డీఈఈ శ్రావణిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పనులు దక్కించుకున్న గుత్తేదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. మరోసారి అందరితో మాట్లాడి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్టీపీ ప్లాంటు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు.

★ పట్టణంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు సత్వర ప్రాథమిక వైద్య చికిత్సలు అందించడానికి నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ) నిర్మాణం చేపట్టారు. ఇందులో రెండు పూర్తి కాగా మరో రెండు నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఒక్కో దాని నిర్మాణానికి రూ.88 లక్షలు ఖర్చు చేసి పనులు చేపట్టారు. అమ్మచెరువుమిట్ట, దొంతి లేఅవుట్‌లో ప్రారంభించిన యూహెచ్‌సీ నిర్మాణ పనులు సంవత్సరాలు గడిచినా పూర్తికాలేదు.

★ కోమటివానిచెరువు అభివృద్ధి చేయడానికి అర్బన్ గ్రీన్ డెవలప్‌మెంట్ కింద రూ.2.20 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు నిర్వహించారు. దీన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పట్టణ ప్రజలకు అంకితం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే ఈ పనులు కూడా ఒక్క అడుగు ముందుకు పడలేదు. సంవత్సరాలు తరబడి జాప్యం జరుగుతుండటంతో ఎస్ఎస్ఆర్ రేట్లు పెరిగి ప్రభుత్వంపై అదనపు భారం పడుతోంది.

జిల్లాకు శ్రీకృష్ణదేవరాయల పేరు పెట్టాలని వినతి

మదనపల్లె గ్రామీణ : నూతనంగా ప్రకటించిన మదనపల్లె జిల్లాను శ్రీకృష్ణదేవరాయలు పేరు పెట్టాలని రాయల్ యూత్ సొసైటీ అధ్యక్షుడు ప్రసాద్‌కుమార్ డిమాండు చేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం ప్రతినిధులు నినాదాలు చేసిన అనంతరం సబ్ కలెక్టర్ కల్యాణికి అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా కూటమి ప్రభుత్వం మదనపల్లెను జిల్లాగా ప్రకటించడం హర్షిస్తున్నామన్నారు. జిల్లాకు చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు నామకరణం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, గణి, జయరాం, మునిగోపాలకృష్ణ, వేమన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని కట్టడి చేయాలి

రాయచోటి, న్యూస్‌టుడే: ఎయిడ్స్ మహమ్మారిని పారదోలేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య తెలిపారు. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అవగాహన ర్యాలీని ప్రారంభించారు. యువత అధైర్య పడకుండా ముందుకు సాగాలని తెలియజేశారు. అనంతరం పట్టణంలోని బస్టాండు రోడ్డు, నేతాజీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎండీవో రామచంద్రారెడ్డి, మహిళ కళాశాల ప్రిన్సిపల్ హైదర్‌అలీ, చెన్నారెడ్డి, విశ్వప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి, న్యూస్‌టుడే: సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రై మాసికంలో అందిన దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు అంశాలపై సమీక్షించారు. గడిచిన 45 రోజుల కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు, రెన్యువల్‌ను కోరుతూ 987 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో 961 పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయన్నారు. మిగిలిన 26 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహకానికి పెట్టుబడి రాయితీ, ఉత్పాదక, సేవా రంగాలలోని 27 యూనిట్లకు రూ.57.88 లక్షల విలువైన రాయితీల ప్రయోజనాలకు కమిటీ ఆమోదం తెలిపింది. గుర్రంకొండ, వాయల్పాడు, మదనపల్లె ప్రాంతాల్లో వర్క్ షాపులు నిర్వహించామని జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ కృష్ణకిశోర్ కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై దృష్టి సారించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ జి.రవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎక్కువ వర్మీకంపోస్టు తయారు చేయాలి

పీలేరు, న్యూస్‌టుడే : సంపద కేంద్రాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఎక్కువ వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయాలని రాయచోటి డివిజనల్ పంచాయతీల అభివృద్ధి అధికారి లక్ష్మీపతి అన్నారు. సోమవారం లక్ష్మీపతి పీలేరు పంచాయతీ పరిధిలోని సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అందులో తయారు చేస్తున్న ఎరువును పరిశీలించారు. కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులతో ఆయన మాట్లాడారు. పీలేరు పంచాయతీలో ఎక్కువ చెత్త సేకరించి, రైతులకు ఉపయోగపడేవిధంగా ఎరువు తయారు చేయాలని సూచించారు. కేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పీలేరు ఎంపీడీవో శివకుమార్, పంచాయతీల విస్తరణాధికారి యుగంధర్, పీలేరు ఈవో బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో లక్ష్మీపతి

చిక్కిన అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా

విశ్రాంత ఉద్యోగి ఖాతా నుంచి రూ.48 లక్షలు కాజేసిన మోసగాళ్లు

రాయచోటి, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు పేరుతో ఫేక్ సీబీఐ, ఈడీ అధికారుల అవతారం మెత్తి మోసాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ ముఠాను అన్నమయ్య జిల్లా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ ముఠా గుట్టు విప్పారు. ఈ ఏడాది జులై 25న మదనపల్లె వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నివాసం ఉంటున్న విశ్రాంత ఉద్యోగి మేల్ నర్స్ రేపూరి జెంజి మేరి(75)కు సైబర్ నేరగాళ్లు పోలీసులం అని ఫోన్ చేశారు. మీ ఖాతాలో హవాల సొమ్ము రూ.48 లక్షలు జమ అయ్యాయి అని ఓ రసీదును పంపి నమ్మబలికారు. దీనిపై దిల్లీలో మీపై సీబీఐ, ఈడీ కేసు నమోదు అయిందిని భయభ్రాంతులకు గురిచేశారు. ఆ సొమ్మును వెంటనే వెనక్కి పంపాలని లేదంటే పోలీసులు వచ్చి అరెస్ట్ చేసి దిల్లీకి తీసుకెళ్తారని చెప్పి బాధితుని ఖాతా నుంచి రూ.48లక్షలు కాజేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. సైబర్ సెల్ సిబ్బంది హవాల ద్వారా డబ్బులు ఎలా బదిలీ చేస్తున్న విషయాన్ని గుర్తించి చాకచక్యంగా వ్యవహరించారన్నారు. రాయచోటిలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ముగ్గురు కీలక నిందితులు పఠాన్ ఇంతియాజ్‌ఖాన్, షేక్ అమీన్, షేక్ ఇర్ఫాన్‌లను అరెస్టు చేశారన్నారు. పట్టుబడిన వారంతా రాయచోటికి చెందిన వారని, వారి వయస్సు 25-30 ఏళ్లలోపే ఉంటుందన్నారు. నిందితులు కాంబోడియా, కువైట్ కేంద్రంగా ఈ అంతర్జాతీయ రాకెట్ నడిపిస్తున్నారని విచారణలో తేలిందని వివరించారు. వారి నుంచి రూ.32 లక్షలు నగదు, 25 ఏటీఎం కార్డులు, 3 చరవాణిలు, 4 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకొన్నామన్నారు. అదనంగా వారి ఖాతాల్లో ఉన్న రూ.7.65 లక్షలు నగదు ఫ్రీజ్ చేశామని చెప్పారు. వారి వెనుక ప్రధాన వ్యక్తి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆలీ అనే వ్యక్తి పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకోగలిగారు. అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

వివరాలు తెలుపుతున్న ఎస్పీ ధీరజ్‌కునుబిల్లి

స్థానిక సంస్థల ఎన్నికల్లో
తెదేపా విజయమే లక్ష్యం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని తెదేపా పార్టీ పరిశీలకులు మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోమవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలో తెదేపా శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి, మండల అధ్యక్షుడు దాముర్రెడ్డి, మాజీ సర్పంచి రాజేంద్రచారితో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఆత్మస్థైర్యంతో పని చేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాన్ని బాధ్యతగా తీసుకుని మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమాన స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ముందుకెళ్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అందిస్తున్నామని మన రాయలసీమ ప్రాంతానికి హంద్రీ-నీవా జలాలను విజయవంతంగా తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులు చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు శ్రీనివాసులురెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మధనమోహన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, పీవీ, కేకే, సయ్యద్‌బాషా, చాను, డిష్‌బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

6, 9 తేదీల్లో వైవీయూ డిగ్రీ, పీజీ పరీక్షలు

వైవీయూ, న్యూస్‌టుడే: దిత్వా తుపాను కారణంగా యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో వాయిదా పడిన డిగ్రీ, పీజీ పరీక్షలు నూతన తేదీలను వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1న డిగ్రీ వారికి జరగాల్సిన పరీక్షను ఈ నెల 6 వ తేదీన, పీజీ పరీక్ష ఈ నెల 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి ఆయా తేదీల్లో జరిగే పరీక్షలకు హాజరు కావాలన్నారు.

ఎయిర్‌టెల్ టవర్ జనరేటర్ గదిలో అగ్నిప్రమాదం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎయిర్‌టెల్ టవర్ పక్కనే ఉండే జనరేటర్ గదిలో అగ్నిప్రమాదం జరిగి బ్యాటరీలు, జనరేటర్ కాలిపోయిన ఘటన మదనపల్లె మండలంలో సోమవారం రాత్రి జరిగింది. మదనపల్లె మండలం సీటీఎం సమీపంలోని నేతాజీకాలనీలో ఉండే ఎయిర్‌టెల్ టవర్ సమీపంలో జనరేటర్ గదిలో మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.7 లక్షలకు పైగా విలువ చేసే జనరేటర్, బ్యాటరీలు, గదిలో ఉండే వస్తువులు కాలిపోయినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

కాలిపోతున్న గదిలోని వస్తువులు

నకిలీ సీఐ అరెస్ట్

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే : పోలీసుశాఖలో తాను సీఐని అంటూ పలువురిని బెదిరిస్తున్న నకిలీ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపారు. జంగావాండ్లపల్లి పంచాయతీ అప్పేపల్లికి చెందిన రెడ్డిఈశ్వర్, భానుశ్రీలు భార్యాభర్తలు.. వీరిమధ్య మనస్పర్థలు రాగా శివకుమార్ అనే వ్యక్తి జోక్యం చేసుకున్నాడు. తాను సీఐని అంటూ రెడ్డిఈశ్వర్‌ను బెదిరించాడు. దీంతో అతను అనుమానంతో భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు కేవీపల్లి మండలం పెద్దకంపల్లికి చెందిన శివకుమార్ కడప స్పెషల్ బ్రాంచ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చలామణి అవుతున్నట్లు గుర్తించారు. సోమవారం భాకరాపేట హైవేరోడ్డులోని హోటల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు గతంలోనూ కలకడ మండలానికి చెందిన ఆంజనేయులుకు ఉద్యోగం ఇప్పిస్తానని అతని నుంచి రూ.8 లక్షలు తీసుకొని మోసగించినట్లు వెల్లడైంది. ఎస్సైలు రాఘవేంద్ర, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

చెత్త సేకరణలో ప్రగతి సాధించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమంలో ప్రగతి సాధించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సేకరిస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్‌లో జిల్లా స్థానాన్ని మెరుగు పరిచేందుకు ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. జిల్లాలో ములకలచెరువు, పెద్దమండెం, సంబేపల్లె, రామసముద్రం, పుల్లంపేట మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి ఆవాస్ ప్లస్ సర్వే రెండు వారాల్లో పూర్తి చేసి ఆర్ఎల్, ఆర్సీ, స్టేజ్ కన్వర్షన్ పనులను వెంటనే పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. డిసెంబరు 5న జరిగే మెగా పీటీఎం కార్యక్రమానికి జిల్లాలోని 2,140 పాఠశాలల్లో షెడ్యూల్ ప్రకారం నిర్వహించే కార్యక్రమాలకు సంసిద్ధతతో ఉండాలన్నారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా పీటీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, సీపీవో వెంకట్, జీఎస్‌డబ్ల్యూఎస్ లక్ష్మీపతి, డీపీవో రాధమ్మ, పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, డీఏవో శివనారాయణ పాల్గొన్నారు.

దొరికిన ఆలయాల్లో హుండీ చోరులు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : జిల్లాలో ఆలయాల్లోని హుండీలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను పట్టుకుని రిమాండుకు పంపినట్లు వాల్మీకిపురం సీఐ రాఘవరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. వాల్మీకిపురం, రామాపురం, లక్కిరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని పలు ఆలయాల్లో తలుపులు పగులగొట్టి హుండీల్లోని సొమ్మును నిందితులు అపహరించారు. మదనపల్లె మండలం బూసేపల్లె గ్రామం కోతవారిపల్లెకి చెందిన ఎదుర్ల బాలాజీ, నిమ్మనపల్లె కొల్లపారం చెందిన బాలు, చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన కొరువు రమేశ్‌లు స్థానిక అమిలేపల్లె క్రాస్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతుంటే పట్టుకున్నట్లు చెప్పారు. విచారణ చేయగా ఆలయాల్లోని హుండీల సొమ్ము చోరీ విషయం వెల్లడైనట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10 వేలు నగదు, 25 కిలోల రాగి వైరు, 250 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. కేసును ఛేదించిన ఎస్ఐ బాలకృష్ణ, హెస్‌సీ నాగరాజు నాయక్, పీసీలు అబ్దుల్లా, అచ్యుతానంద, కృష్ణయ్య, హోంగార్డులు చంద్ర, మదీన, ఇంతియాజ్‌లను ఎస్పీ అభినందించి, వారికి అవార్డులు ప్రకటించారని పేర్కొన్నారు.

హుండీ దొంగతనాల కేసులలో పట్టుబడిన నిందితులు

EENADU
eClassifieds
BUSINESS SERVICES
JOBS
BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.
Wanted PRO's for Admissions - Jeevan Jyothi Junior College and Edify Proddatur. Cell: 9440914765, 9908278718.
పల్లా హాస్పిటల్, 7 రోడ్స్ సర్కిల్, కడప నందు పని చేయుటకు వార్డు బాయిస్, నర్సింగ్ స్టాఫ్ కావలెను. Contact: 9849040153.
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ|| 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

దేవాదాయశాఖలో అక్రమాలు
ఈఓపై క్రమశిక్షణ చర్యలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోటలోని దేవాదాయ శాఖ భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన ఈఓ మునిరాజపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. భూముల పరిరక్షణలో సమర్థంగా వ్యవహరించలేకపోయిన ఈఓకు రెండు ఇంక్రిమెంట్లతో కోత విధించారు. ఈ మేరకు సోమవారం దేవాదాయశాఖ కార్యాలయం నుంచి బి.కొత్తకోటకు చెందిన ఫిర్యాదుదారుడు చిట్టా రామకృష్ణారెడ్డికి సమాచారం అందింది. పట్టణ శివార్లలోని దేవాదాయశాఖ భూముల నుంచి ఇసుక అక్రమంగా తరలివెళ్తున్నప్పటికీ ఈఓ ఆపలేకపోయారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆలయ భూముల్లో బంకులను అక్రమంగా ఏర్పాటు చేసుకోవడం, బీసీ కాలనీ వద్ద ఉన్న భూముల్లో ఉన్న దుకాణాలు, ఇటుక బట్టీల నుంచి అద్దెల వసూళ్లలో అవకతవకలు జరిగినట్లు దేవాదాయశాఖ కమిషనరుకు ఫిర్యాదు వెళ్లింది. ఈ విషయంపై ఈ ఏడాది జనవరిలో ప్రత్యేక విచారణ జరిగింది. నంద్యాల జిల్లా దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనరు ఎం.రామాంజనేయులు విచారణ అధికారిగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అక్రమాలపై నివేదికను అందజేశారు. దేవాదాయశాఖ ఆస్తుల పరిరక్షణలో వైఫల్యం చెందిన ఈఓను బదిలీ చేయడంతో పాటు తగు చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో ఈఓ ఇంక్రిమెంట్లతో కోత విధించారు. అయితే ఆలయ భూముల వ్యవహారంలో భారీగా అక్రమాలకు పాల్పడిన ఈఓకు నామమాత్రంగా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారని, ఆయన్ను సస్పెండ్ చేయాలని మరోసారి ఉన్నతాధికారులను సంప్రదించనున్నట్లు ఫిర్యాదుదారుడు స్థానిక విలేకరులకు తెలిపారు.

రైల్వేకోడూరు పంచాయతీ కార్యదర్శిపై వేటు
ఇన్‌ఛార్జిగా డిప్యూటీ ఎంపీడీవో హరిత నియామకం

స్పందనకు వందనం

ఈనాడు, కడప: రైల్వేకోడూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిపై జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ బదిలీ చేశారు. 'ఈనాడు'లో నవంబరు 8న 'కోడూరు పంచాయతీలో కేటుగాళ్లు', గత నెల 14న 'పంచాయతీల్లో కంత్రీలు' శీర్షికన కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన కలెక్టర్ గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న డీవీ ప్రసాదరావును బదిలీ చేస్తూ జిల్లా పంచాయతీ కార్యాలయానికి అటాచ్ చేశారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించి సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారిణి రాధమ్మను ఆదేశించారు. పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా డిప్యూటీ ఎంపీడీవో హరితను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీలో రూ.3 కోట్ల వరకు నిధులు దుర్వినియోగం జరగడంతో పాటు ఆపై నిర్మాణాలకు అక్రమ అనుమతులిచ్చి ఆదాయానికి గండికొట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఫోర్జరీ సంతకాలతో అనుమతులున్నాయని అధికారులు తప్పించుకునే ఎత్తుగడ వేశారు. రూ.కోట్లల్లో నిధుల దుర్వినియోగం జరగగా కేవలం బదిలీతో సరిపెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

(c) eenadu

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

మాజీ సైనికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని వినతి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : మాజీ సైనికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలు అమలు చేయాలని మదనపల్లె మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండు చేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కల్యాణికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి సేవ చేసిన వారికి ఇంటి స్థలంతోపాటు, వ్యవసాయానికి 5 ఎకరాల బంజరు భూమి లేదా, రెండున్నర ఎకరాల సాగు భూమి ఇవ్వాలనే జీవో ఉందన్నారు. ఇది జీవో వరకే పరిమితమైందన్నారు. దేశానికి సేవ చేసే వారికి ఇలాంటి పథకాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సైనికులు సుబ్బరాయుడు, ప్రతాప్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, భీమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

డీఎంహెచ్‌ఓ లక్ష్మీనరసయ్య నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఐసీటీసీ కౌన్సిలర్ దీప్తి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం రాయచోటిలో జరిగిన కార్యక్రమంలో మదనపల్లె ఐసీటీసీ కౌన్సిలర్ పల్లయ్యగారిపల్లె ఉత్తమ కౌన్సిలర్‌గా, ఐసీటీసీలో పనిచేసే దీప్తికి ఉత్తమ మహిళా కౌన్సిలర్‌గా, ఆరోగ్యమిత్ర సంస్థ ప్రతినిధి పురుషోత్తంకి ఉత్తమ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడిగా ప్రశంసా పత్రాలు అందజేశారు. వారికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసయ్య, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాధిక, జిల్లా అధికారులు ప్రశంసా పత్రం అందించారు.

చెరువులకు కృష్ణా జలాలు

మదనపల్లె మండలం రెడ్లచెరువులోకి చేరిన కృష్ణాజలాలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లె మండలంలోని పలు చెరువులకు హంద్రీనీవా కాలువలో వచ్చే కృష్ణా జలాలు చేరాయి. మండలంలోని బసినికొండ పంచాయతీలోని సిద్ధలచెరువు, రెడ్లచెరువు, వడ్డిచెరువు, పాముల చెరువు, బుచ్చన్న చెరువు, తాటి చెరువు, పెద్దచెరువు, మాచిరెడ్డిగారిపల్లె చెరువులకు సోమవారం కృష్ణా జలాలు వదిలారు. జలవనరుల శాఖ ఈఈ సురేశ్‌బాబు, డీఈఈ దయారాంప్రసాద్, ఏఈఈ రాయల్‌బాబు, హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ అమర్‌నాథరెడ్డి, డీఈఈ ప్రతాప్‌చౌదరి సమక్షంలో సోమవారం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ నుంచి చెరువులకు నీటిని వదిలారు. కొత్తపల్లె చెరువు, వలసపల్లె చెరువు, పొన్నెప్పనాయనిచెరువు, రంగనాథునిచెరువు, జన్యవాణిచెరువులు నిండి మరువ పారుతున్నాయి.

క్వారీలతో రహదారుల విధ్వంసం

అవస్థల్లో గ్రామీణ ప్రజలు

అధ్వానంగా మారిన రహదారి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలో క్వారీలు ఇష్టానుసారంగా నిర్వహిస్తుండటంతో గ్రామీణులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గ్రానైట్ క్వారీలకు అనుమతులు తీసుకునే సమయాల్లో యజమానులు అధికారుల సమక్షంలో హామీలు ఇచ్చి.. ఆ తరువాత వాటిని అమలు చేయడం లేదు. నిర్వాహకులు చాలా వరకు గ్రామ ప్రజలు విన్నపాలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. క్వారీలున్న ప్రాంతంలోని గ్రామాల రహదారులు ధ్వంసం చేస్తున్నారు.

అనుమతులు పొందాక..

క్వారీ నిర్వాహకులు లైసెన్సులు తీసుకునే సమయంలో పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి గ్రామస్థులకు రోడ్లు, తాగునీటి వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వాతావరణ కాలుష్యం కాకుండా, పొలాలపై దుమ్ముధూళి పడకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వాగ్దానాలు చేశారు. అయితే అనుమతులు పొందాక అందుకు విరుద్ధంగా క్వారీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు ధ్వంసమవుతున్నాయి. క్వారీ యజమానులు కనీసం మరమ్మతులు చేపట్టడంలేదు. దీంతో కొత్తపల్లె పంచాయతీలోని బండకాడపల్లి నుంచి బొమ్మనచెరువు రోడ్డుతోపాటు ఉడుమువారిపల్లె, కోటావారిపల్లె, నారావాండ్లపల్లె గుంతలుగా మారాయి. బండకాడపల్లె నుంచి అడవీలోపల్లె తారురోడ్డు పూర్తిగా దెబ్బతింది. కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. కొద్దిపాటి వర్షం కురిస్తే ఈ మార్గం బురదగా మారుతోంది. ద్విచక్రవాహనాలు, ఆటోలు సైతం అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నాయి.

నిత్యం భారీ వాహనాల రాకపోకలు

మదనపల్లె మండలంలోని కొత్తపల్లె, కోటావారిపల్లె పంచాయతీల్లో కలర్ గ్రానైట్ క్వారీలు దాదాపు 10 ఉన్నాయి. ఇక్కడి నుంచి చిత్తూరు, నెల్లూరు, కడప తోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు గ్రానైట్ రాయిని రవాణా చేస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా భారీ వాహనాలు గ్రామాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. రోజూ 20కి పైగా భారీ వాహనాలు గ్రామీణ రహదారులపై వెళ్తున్నాయి.

దెబ్బతింటున్న పంటలు

క్వారీల వల్ల ఆయా గ్రామాల్లో పంట పొలాలు దెబ్బతింటున్నాయి. దుమ్ముధూళి కారణంగా పంటపొలాలను రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఈ మార్గాల్లో వరి, టమాట పంటలతోపాటు ఉద్యాన పంటలున్నాయి. అలాగే బ్లాస్టింగ్ కారణంగా చుట్టు పక్కల గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు ఈ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి క్వారీల ద్వారా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. క్వారీ విషయమై ఇప్పటికే గ్రామ పంచాయతీ ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు.

సబ్ కలెక్టర్ ఏమన్నారంటే..

ఈ సమస్యను సబ్ కలెక్టర్ కల్యాణి దృష్టికి తీసుకెళ్లగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. క్వారీ నిర్వాహకులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు.

తొలగిన ఇబ్బందులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపారు. 'మేమున్నాం మీకోసం' శీర్షిక 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ వీధిలో దీపాలకు పురపాలక సిబ్బంది మరమ్మతులు చేయడంతో అంధకారం తొలగింది. పట్టణంలోని లచ్చనవీధిలో చెత్తడబ్బాను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. డీఎల్‌పీవో భారతి మండలంలోని ఉప్పరపల్లెలో పంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించి రోడ్డుపై మురుగు పారకుండా చూశారు. మండలంలోని కొండామర్రిపల్లెలో రోడ్డు తాత్కాలిక మరమ్మతులు చేయడంతో ప్రజల రాకపోకలకు ఉపశమనం కలిగింది. సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని ఎంపీడీవో తెలిపారు. వేంపల్లెలో పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లో పూడిక తొలగించడంతో మురుగు సాఫీగా ముందుకు సాగింది. నేతాజీకాలనీలో మురుగు నిల్వలేకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

లబ్ధిదారుల చెంతకే పింఛన్ పంపిణీ

నీరుగట్టువారిపల్లెలో పింఛను అందజేస్తున్న తెదేపా బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం సిద్దప్ప, ఏఎంసీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యంరెడ్డి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛను పంపిణీ చేస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని నీరుగట్టువారిపల్లె, నిమ్మనపల్లె కూడలి, బర్మావీధి, జనసేనికాండ తదితర ప్రాంతాల్లో పర్యటించి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారునికి తెదేపా మైనార్టీ విభాగం నాయకుడు ఎస్.ఎస్.ఇస్మాన్ పింఛను అందజేశారు. నీరుగట్టువారిపల్లెలో తెదేపా బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం సిద్దప్ప, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సుబ్రహ్మణ్యంరెడ్డి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందజేశారు. ఎమ్మెల్యే వెంట తెదేపా నాయకులు నవీన్‌చౌదరి, బాలుస్వామి, లక్ష్మన్ తదితరులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుధాకర్ బాబు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని ఆయన కోరారు.

భూ సమస్యలపై వినతుల వెల్లువ

అర్జీదారుల సమస్యలు విచారిస్తున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : భూముల, రహదారుల సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కారవేదికను తుపానుకారణంగా వాయిదా వేశారు. అయినప్పటికీ డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి ప్రజలు 68 మంది మదనపల్లె సబ్ కలెక్టర్ వద్దకు వచ్చి సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి వినతులు సమర్పించారు. 14మంది, సామాజిక భద్రత పింఛన్లు, భూ సర్వే తదితర సమస్యలపై అర్జీలు ఇచ్చారు. సమస్యలపై ఆయా మండల అధికారులతో ఆమె మాట్లాడారు. గడువులోగా సమస్యలు పరిష్కరించాలని నిర్దేశించారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

మదనపల్లె పట్టణం: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు విభాగాధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని పురపాలక సంఘం కమిషనర్ ప్రమీల సూచించారు. సోమవారం ఉదయం ఆమె తన కార్యాలయంలో ప్రజలు తీసుకొచ్చిన అర్జీలను స్వీకరించి పరిష్కారం కోసం సంబంధిత విభాగం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రెడ్డెప్ప, ఏఈలు రమేంద్రనాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటసుబ్బయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోకు సన్మానం

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : పీటీఎం ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్‌రెడ్డిని సోమవారం తెదేపా నాయకులు ఘనంగా సన్మానించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకునిగా పనిచేస్తున్న శ్రీనివాసులు పీటీఎం డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచులు రెడ్డెప్ప, శ్రీకంఠరెడ్డి, నాయకులు సికిందర్, నాగార్జున, చిన్నపరెడ్డి, మహబూబ్‌బాషా, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అన్వేషణ-2025 పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : అన్వేషణ 2025 పోటీల్లో మదనపల్లె శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు సోమవారం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. ఇటీవల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో అన్వేషణ -2025 నిర్వహించారు. పోస్టర్ అండ్ ఓరల్ ప్రెజెంటేషన్ పోటీల్లో హెల్త్ సైన్సెస్ అండ్ అల్లైడ్ సబ్జెక్ట్ విభాగంలో ఎం.గుణసాయి సమర్పించిన పరిశోధన పత్రానికి రెండో స్థానం, ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ విభాగంలో ఎం.ఐశ్వర్య మూడో బహుమతి సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కరస్పాండెంట్, ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి తదితరులు

బాధ్యతల స్వీకరణ

కలకడ, న్యూస్‌టుడే : కలకడ మండల డిప్యూటీ ఎంపీడీవోగా చక్రపాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వాల్మీకిపురంలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తూ, పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

కలికిరి : కలికిరి మండల డిప్యూటీ ఎంపీడీవో (ఎంఏవో)గా వినయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తూ.. ఆయన డిప్యూటేషన్‌పై కలికిరి డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గుర్రంకొండ : గుర్రంకొండ మండల ఉప ఎంపీడీవోగా శ్రీహరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఆయన స్థానిక మేజర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించేవారు. పదోన్నతిపై ఉప ఎంపీడీవోగా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య మెరుగుకు కృషి చేస్తానన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూస్తానన్నారు.

చంద్రబాబు సహకారంతో జిల్లా ఏర్పాటు

రెడ్డివారిపల్లె వద్ద సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : మదనపల్లె జిల్లా కల ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నెరవేరుతోందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రెడ్డివారిపల్లెలో రైతులకు రాయితీపై ప్రభుత్వం ఇస్తున్న విత్తనాలు, యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మదనపల్లెను జిల్లాగా చేయడానికి అన్ని సౌకర్యాలు ఉన్నా వైకాపా నాయకులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించారన్నారు. తెదేపా ప్రభుత్వం ప్రతినెలా సకాలంలో పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు ఇస్తుంటే వారి కళ్లలో ఆనందం కనబడుతోందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు వెంకటరమణ, రాజంపేట పార్లమెంటరీ మీడియా అధికారప్రతినిధి రాజన్న, రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి, నాయకులు మునిరత్నం, సుజాత, దేవేంద్రరెడ్డి, శ్రీపతి, నాగరాజనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే మహమ్మారి దూరం

ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని సోమవారం మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు, మానహారాలు, సదస్సులు నిర్వహించారు. అవగాహనతోనే వ్యాధిని దూరం చేయవచ్చని వైద్య అధికారులు, అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ వ్యాప్తి, దాని నివారక చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. - న్యూస్‌టుడే, బృందం

వాల్మీకిపురంలో విద్యార్థుల మానవహారం

నిమ్మనపల్లె : ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ములకలచెరువులో జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రదర్శన

భూసేకరణ పనులు పూర్తి చేయండి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : రహదారులకు సంబంధించిన భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వీఆర్వోలను తహసీల్దారు కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో భూసేకరణ సమస్యలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ 71కు సంబంధించి పోతబోలు పంచాయతీ పరిధిలోని భూసేకరణ ఇబ్బందులపై ఆరా తీశారు. వెంటనే నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు జరగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన బాధ్యత వీఆర్వోలపై ఉందన్నారు. కార్యక్రమంలో డీటీ వెంకటస్వామి, ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

M.V.O.P. No.33/2024

పెడబల్లి నారాయణమ్మ, భర్త నాగభూషణం, హిందూ, వయస్సు 42 సం॥లు, పి.ఎన్.కాలనీ గ్రామం, సంబేపల్లె (మం). **- పిటీషనరు**

Vs

R2) చింతల విజయకుమార్‌రెడ్డి, తండ్రి రామచంద్రారెడ్డి, వయస్సు 38 సం॥లు, R/o మోరెళ్లపల్లె గ్రామం, కలికిరి మం॥, అన్నమయ్య జిల్లా. **- 2వ రెస్పాండెంటు**

నోటీసు ప్రకటన

పై నెంబరు దావాలో పిటీషనరు, 2వ రెస్పాండెంటు అయిన నీపైన మిగతా రెస్పాండెంట్లు పైన నష్టపరిహారం కొరకు పిటీషన్ను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీరు **5.12.2025**వ తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ, వకీలు గారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెల్పుకోవలయును. లేనందున పరోక్షంగా తీర్మానించబడును.

ఇట్లు : శ్రీ పి.శ్రీనివాసులు, B.A., B.L., పిటీషనరు పరం అడ్వకేటు, రాయచోటి.

ఇళ్ల ముంగిట.. మురుగుతో తంటా

కాలువలు లేకపోవడంతో ఇళ్ల ముందు నిల్వ చేరిన మురుగు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ బండ మీద ఎస్సీ కాలనీలో సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో 15 ఏళ్ల కిందట సిమెంటు కాంక్రీట్ రోడ్లు వేసి డ్రైనేజీలు నిర్మించలేదు. దీంతో ఇళ్లల్లో నుంచి వచ్చే వ్యర్థపు నీరంతా రోడ్లపై పారుతోంది. ఇళ్ల ముందు నిల్వ చేరుతోంది. ఫలితంగా పరిసరాలు దుర్భరంగా మారుతున్నాయి. దుర్వాసన వస్తోంది. ఇక్కడ దోమలు వ్యాప్తి చెంది తరచూ రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కనీసం పారిశుద్ధ్య పనులు చేపట్టిన దాఖలాలు లేవని గ్రామస్థులు వాపోతున్నారు. ఫలితంగా తరచూ విషజ్వరాలు వ్యాపించి ఆసుపత్రుల పాలవుతున్నామని వారు ఆవేదన వెలుబుచ్చారు. ఇదే విషయమై పలు మార్లు అధికారులకు మొరపెట్టుకుని వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. సమస్యను ఎంపీడీవో శివకుమార్ దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ అధికారులతో మాట్లాడి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. దోమల నివారణ మందు పిచికారీ చేసేలా చూస్తామన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలంలోని బాలాజీనగర్‌కు చెందిన సుభాష్ (25) కుటుంబ సమస్యలతో సోమవారం ఉదయం ఇంట్లోనే విష ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ మిట్టపల్లెకు చెందిన రవీంద్రారెడ్డి (39) కుటుంబ విషయమై భార్యతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన అతను మదనపల్లె పట్టణానికి సమీపంలోని ఈశ్వరమ్మ కాలనీకి వచ్చి అక్కడే పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని స్థానికులు గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

గొలుసు దుకాణం నిర్వాహకుడి అరెస్ట్

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండలంలోని టి.పసలవాండ్లపల్లె గొల్లపల్లె క్రాస్ సమీపంలో రహదారిపై గొలుసు (బెల్టు షాపు) దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సోమవారం ఎస్ఐ బాలకృష్ణ చెప్పారు. నిందితుడి నుంచి అక్రమంగా కలిగియున్న 32 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు.

కేసు ఉపసంహరించుకోవాలని కుటుంబంపై దాడి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కేసు వెనక్కు తీసుకోవాలని ఓ కుటుంబంపై బంధువులే దాడి చేసి గాయపరిచిన ఘటన మదనపల్లె మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. మండలంలోని పొన్నూటిపాలెం పంచాయతీ సవరంవారిపల్లెకు చెందిన రాజశేఖర్ (50)కు అతని సోదరులకు రమేశ్, నరసింహనాయుడుకు మధ్య కొంత కాలంగా గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో రెండు నెలల కిందట రాజశేఖర్ కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి రాజశేఖర్ కుటుంబ సభ్యులను కేసు వెనక్కు తీసుకోవాలని రమేశ్, నరసింహనాయుడు, అతని కుటుంబ సభ్యులు కోరారు. దీనికి ఒప్పుకోకపోవడంతో ఆగ్రహించిన వారు రాజశేఖర్‌తో పాటు అతని భార్య కోమల, కుమార్తె మాధవిలపై దాడి చేసి కొట్టారు. దీంతో బాధితులు 112కు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గొడవను అడ్డుకుని బాధితులను మదనపల్లెకు తీసుకొచ్చారు. దీనిపై విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

కలకడ, న్యూస్‌టుడే : మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఎర్రయ్యగారిపల్లెకు చెందిన రెడ్డిలక్ష్మి, సోమల మండలం ముడియంవారిపల్లెకు చెందిన వెంకటేశ్‌లకు 2015లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత ఐదు ఏళ్లుగా ఆమె తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భర్త వెంకటేశ్, మామ శ్రీనివాసులు, అత్త సుశీల అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు.

ఆటోను ఢీకొన్న లారీ : ఒకరికి గాయాలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట మండలం కనిగలతోపు వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ఆటో డ్రైవరు గంగులప్పకు (48) గాయాలయ్యాయి. కురబలకోట మండలం తెట్టుకు చెందిన గంగులప్ప బాడుగకు ఆటోను తీసుకుని కనిగలతోపునకు వచ్చాడు. రహదారి పక్కన ఆటో నిలుపుకొని ఉండగా వెనుక నుంచి వచ్చిన తమిళనాడుకు చెందిన లారీ ఢీకొంది. ఈ సమయంలో ఆటోలో ఉన్న డ్రైవరుతో పాటు మరో మహిళకు గాయాలయ్యాయి. వీరిలో ఆటో డ్రైవరును వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ప్రమాద బాధితుడు ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని స్థానిక సీఐ గోపాల్‌రెడ్డి తెలిపారు.

In the Court of the II Additional District Judge, Madanapalle

I.A. 386/2024 in O.S. 47/2023

Petitioner / Plaintiff: Sri V.S.Vidyasagar reptd. by the S.P.A. Holder / Duly Constituted agent Sri Nadella Venkataswamy Naidu

Respondents / Defendants:
Sri Kolla Bayya Reddy and others

I.A. Notice to Respondent 15 in I.A. 386/2024 in O.S. 47/23

R15: Chade Venkataramana, S/o Chade Siddappa, Pullaguravandlapalle, H/o Thettu (Po) of Kurabalakota Mandal.

పై దావాలోని I.A. 386/2024 మనవిలో మీకు అనగా 15వ రెస్పాండెంట్‌కు అనేకమార్లు కోర్టు మరియు పోస్టు ద్వారా I.A. నోటీసులు పంపగా మీరు తీసుకొనక వృథా కాలయాపన దురుద్దేశ్య పూర్వకముగా చేయుచున్నారు. కావున పై దావాలోని I.A. 386/2024 మనవిలో పై తెల్పిన కోర్టులో నేరులో గానీ, లేక నిర్ణీత అడ్వకేట్ ద్వారా గానీ **30.12.2025**వ తేదీన 10.30 A.Mకు హాజరగుటకు గాను వాయిదా యున్నది. మీరు పై వాయిదాకు హాజరు కానంతట కోర్టు వారు మీ పరోక్షమున తగు పుత్తర్వులు పాలించెదరని తెలియపరచడమైనది.

"By Order of the Court"

మదనపల్లి

తేదీ: 01.12.2025

సం/- సిరస సుబ్రమణ్యం, B.A., LL.B., న్యాయవాది, డి.నెం.2-413-సి-2, రామాలయం వీధి (సొసైటి కాలనీ), మదనపల్లి.

తెదేపా శ్రేణుల సందడి

బి.కొత్తకోటలో అన్నదానం చేస్తున్న నాయకులు

బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దమండ్యం, న్యూస్‌టుడే : తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ పుట్టినరోజు వేడుకలను సోమవారం బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె మండలాల్లో తెదేపా కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. కేకును కోసి బాణసంచాను కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం నిరుపేదలకు అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పాలు, పండ్లు అందజేశారు. ఆలయాల్లో ఆయన పేరిట ప్రత్యేక పూజలు చేయించారు. పెద్దమండ్యంలో జరిగిన కార్యక్రమంలో తెదేపా నాయకులు శ్రీనివాసులు, మనోహర్, సర్పంచి నటరాజన్‌నాయక్, రఘునాథ్ యాదవ్, పెద్దన్న, హుసేన్, చింటు, బాబాజాన్, శ్రీనివాసయాదవ్, ఓబులేశు, భాను, సయ్యద్‌షావలి, తులసీధర్‌నాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు. ములకలచెరువులో నాయకులు చెన్నకృష్ణ, వెంకటస్వామి, మౌలా, సుధాకర్‌నాయుడు, సోమశేఖర్, కట్టా చలపతి, శివన్న, సుధాకర్, నాగమల్లప్ప, సుధాకర్, రామాంజులు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు. బి.కొత్తకోటలో సమన్వయకర్త శ్రీనివాసులు, నాయకులు నారాయణస్వామిరెడ్డి, సుకుమార్, వెంకట్రమణ, ప్రసాద్, డి.కుమార్, ప్రకాశ్, సుదర్శన్‌రెడ్డి, సురేంద్రబాబు, నాగరాజు, అంజి పాల్గొన్నారు.

క్లౌడ్ సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి

మాట్లాడుతున్న ఐటీ ట్రైనర్ స్లిటోన్ జార్జ్ పాల్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు క్లౌడ్ సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని చెన్నైకు చెందిన వింగ్స్ టెక్నాలజీస్ కార్పొరేట్ ఐటీ ట్రైనర్ స్లిటోన్ జార్జ్ పాల్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్ విభాగం ఆధ్వర్యంలో 'డేవోప్స్ జర్నీ ఆన్ క్లౌడ్ ఏడబ్ల్యూఎస్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సాంకేతిక రంగంలో వేగంగా మారుతున్న క్లౌడ్ సాంకేతికతను అర్థం చేసుకుని పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ సామర్థ్యం కలిగిన టూల్స్ వినియోగం, డేటా సెక్యూరిటీ, బ్యాకప్ సదుపాయాలు, పరిశోధన, కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ నవీన్‌కుమార్, సమన్వయకర్త ఎన్.నిర్మలాదేవి, డాక్టర్ శివరాజ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80080 01768

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 91771 11468

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ప్రభుత్వ భూముల ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దారు క్రాంతికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు క్రాంతికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను అధికారులు కాపాడాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సిద్దవటం విద్యార్థి ఎంపిక

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి **శ్రీవిద్య** జాతీయ స్థాయి గట్కా క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ చంద్రావతి తెలిపారు. కర్నూలులోని ఎమ్మిగనూరులో సోమవారం అండర్-19 రాష్ట్ర స్థాయి గట్కా పోటీలు జరగగా శ్రీవిద్య ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. అదే పాఠశాలకు చెందిన వెంకట దివ్య, వంశీలు బ్రాంజ్ మోడల్ సాధించినట్లు ఆమె చెప్పారు. త్వరలో పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో శ్రీవిద్య పాల్గొననుండటంతో బాధ్య హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు వై. పవన్‌కుమార్‌రెడ్డి కుటుంబానికి సోమవారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి రూ. 2.30 లక్షల ఆర్థిక సాయం అందించారు. జిల్లాలోని హోంగార్డులు ఒక్క రోజు డ్యూటీ అలవెన్సును స్వచ్ఛందంగా విరాళంగా ఇచ్చారని ఆయన తెలిపారు. పోలీసులు కేవలం చట్టాన్ని కాపాడే వారు మాత్రమే కాదని ఒకరికొకరు అండగా నిలిచే కుటుంబమని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) ఎం. వెంకటాద్రి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఎం. పెద్దయ్య, ఆర్ఎస్సై శ్రీనివాసులు, ఏఆర్ఎస్సై బాలాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే
బురద తొక్కాల్సిందే

మండల పరిషత్తు కార్యాలయానికి వెళ్లే దారి ఇలా ఉంది

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రైల్వేకోడూరు మండల పరిషత్తు ప్రాంగణంలో ఎంపీడీవో కార్యాలయంతో పాటు విద్యాశాఖ, పంచాయతీరాజ్, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధిహామీ, తహసీల్దారు, వ్యవసాయ శాఖ, ఐసీడీఎస్, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్య మున్న ప్రాంతంలో కనీసం ఒక్క కార్యాలయానికీ సరైన దారి లేదు. చిన్నపాటి వర్షం కురిస్తే ప్రతి కార్యాలయం ముందు బురద, వర్షపునీరు నిండుకుంటోంది. కాలు పెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. రూ. కోట్లు ఖర్చు చేసి భవనాలు నిర్మించారు. కానీ ఒక్క కార్యాలయానికీ సరైన దారి ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఆ ప్రాంగణమంతా వర్షపునీరు నిలిచిపోయి ఇబ్బందికరంగా ఉంది. ప్రజలు కనీసం అధికారులను కలవాలన్నా వీల్లేకుండా మారింది. అన్ని ముఖ్యమైన శాఖల అధికారులూ అక్కడే తిరుగుతున్నా ఏ ఒక్కరు స్పందించకపోవడం గమనార్హం. ఈ విషయంపై ఎంపీడీవో నాగిరెడ్డి మాట్లాడుతూ కార్యాలయాల ముందు పరిస్థితి ఇబ్బందికరంగానే ఉందన్నారు. వర్షాలు ఆగిపోగానే ఉన్నతాధికారులతో మాట్లాడి ఇక్కడి కార్యాలయాలకు మంచి దారులు వేయడానికి చర్యలు చేపడతామని వివరించారు.

సచివాలయం ఎదుట ఇలా...

సీఎం దృష్టికి రాజంపేట ప్రజల ఆకాంక్ష

సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలనే ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రం ఏర్పాటు విషయంలో గత వైకాపా పాలనలో తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే అంశంపై ప్రజల అభిప్రాయాలను సీఎంకి విన్నవిస్తానన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన

రాజంపేట గ్రామీణ: రాజంపేట మండలం హత్యరాల వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్యానాయుడు, హత్యరాల మాజీ ఆలయ ఛైర్మన్ నరసింహులు, పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్‌నాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల చెంతకు చేరిన పింఛను నగదు

సుండుపల్లి: దివ్యాంగుడికి నగదు అందిస్తున్న కూటమి నాయకులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. రాజంపేట మండలంలోని మందరం, కొత్తపల్లి, హత్యరాల గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు.

రాయచోటి గ్రామీణ: రాయచోటి మండలం గుంటిమడుగు గ్రామంలో సోమవారం ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. **లక్కిరెడ్డిపల్లె:** వృద్ధులకు ఆపన్న హస్తంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని రాష్ట్ర అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డెయ్య యాదవ్ అన్నారు. సోమవారం ఆయన తెదేపా మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ షేక్‌నాయబ్‌తో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. **సుండుపల్లి:** ఎన్టీఆర్ పింఛన్ భరోసా కార్యక్రమంలో భాగంగా మండలంలో తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సి. మహేష్‌నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సి. రమేష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి యూసుఫ్‌లతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

లక్కిరెడ్డిపల్లెలో పింఛను పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

రాయచోటి: లబ్ధిదారుకు పింఛను అందిస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి

చెన్నకేశవా.. తాళం తొలగదా!

● అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

డిజిటల్ తాళం లేక పోవడంతో తెరవని చెన్నకేశవ స్వామి ఆలయం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: తాళ్లపాక అన్నమాచార్యులు స్వయంగా పూజలు చేసిన చెన్నకేశవ స్వామి ఆలయ నిర్వహణ తితిదే ఆధ్వర్యంలో ఉంది. ఆలయంలో విలువైన ఆభరణాలు, వస్తువులు ఉండడంతో ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ తాళం ఏర్పాటు చేశారు. ఈ ఆలయం తలుపులు తెరవాలంటే తప్పని సరిగా ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ అధికారుల ఆధ్వర్యంలో జరగాల్సి ఉంది. అయితే ఆదివారం పూజలు పూర్తి చేసిన అనంతరం ఆ తాళాన్ని ఆలయం లోపల ఉంచి, ఆలయం తలుపులు మూసి వేశారు. తిరిగి సోమవారం ఆలయం తలుపులు తెరవడానికి ప్రయత్నం చేయగా తాళం లేకపోవడం, మరోక తాళం తితిదే విజిలెన్స్ అధికారులు వద్ద ఉండటంతో ఆలయం తెరవలేకపోయారు. దీంతో గ్రామస్థులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ... ఇక్కడ పని చేయాల్సిన అధికారులు, తిరుపతి, ఒంటిమిట్ట ప్రాంతాలకు వెళ్లడంతోనే ఇలాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. దీనిపై స్పందించిన అధికారులు, తిరుపతి నుంచి వచ్చి ఆలయం తలుపులు తెరిచారు. ఈ వ్యవహారంపై తితిదే అధికారులు విచారణకు ఆదేశించారు.

వాడవాడలా చైతన్య ప్రదర్శనలు

రాజంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో, వైద్యులు, సిబ్బంది

రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. అధికారులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొని ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. - న్యూస్‌టుడే, బృందం

సంబేపల్లె పీహెచ్‌సీలో వైద్య అధికారులు, సిబ్బంది

డిప్యూటీ ఎంపీడీవోగా జ్యోతీశ్వర్‌రాజు

వీరబల్లి, న్యూస్‌టుడే: డిప్యూటీ ఎంపీడీవోగా జ్యోతీశ్వర్‌రాజు స్థానిక కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. అనంతరం ఆయన్ని కూటమి నాయకులు కలిసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

5న మండల సమావేశం

చిన్నమండెం: చిన్నమండెం మండల సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 5న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆదినారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సమస్యలపై సభ్యులు చర్చిస్తారన్నారు. ఎంపీపీ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య.. కేసు నమోదు

సుండుపల్లి, న్యూస్‌టుడే: రాయవరం కస్పాహరిజనవాడకు చెందిన హర్షవర్ధన్(20) ఈ నెల27 విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బంధువులు గుర్తించి బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందారు. అందిన సమాచారంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

రైల్వేకోడూరు: రోడ్డు దాటుతున్న ఓ మహిళను కారు ఢీకొట్టిన ఘటన రాఘవరాజపురం వద్ద చోటుచేసుకుంది. బాలిరెడ్డిపల్లెకు చెందిన సింగిరి గంగమ్మ ఆదివారం అర్ధరాత్రి కారులో తిరుపతి నుంచి రాఘవరాజపురం వచ్చింది. తమ బంధువుల ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. కేసు పోలీసు విచారణలో ఉంది.

రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తారనే ఆశాభావం

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యంనాయుడు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తారనే సంపూర్ణ నమ్మకం ఉందని తెదేపా నాయకుడు, మన్నూరు సొసైటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. స్థానిక ర.భ.శాఖ అతిథి గృహంలో సోమవారం రాజంపేట సాధన సమితి ఐకాస సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి కావాల్సిన అన్ని మౌళిక సదుపాయాలు రాజంపేటలో ఉన్నాయన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తానని, మెడికల్ కళాశాలను తీసుకొస్తానని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుబ్బనరసయ్యానాయుడు, ఐకాస నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభల విజయవంతానికి వినతి

గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు కోరారు. ఈ మహాసభలకు సంబంధించిన గోడ పత్రాలను స్థానిక పురపాలక కార్యాలయ ఆవరణలో సోమవారం సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాగ్యలక్ష్మి, రమణ, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటాన్ని విలీనం చేయొద్దంటూ వినతులు

సిద్దవటంలో తహసీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న ఐకాస నాయకులు

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం మండలాన్ని అన్నమయ్య జిల్లాలో విలీనం చేసే ప్రక్రియను విరమించుకుని కడప జిల్లాలోనే కొనసాగించాలంటూ సిద్దవటం మండలంలోని తెదేపా, జనసేన నాయకులు సోమవారం పలువురు ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. అన్నమయ్య జిల్లాలో విలీనం చేస్తే ప్రజలకు కలిగే నష్టాలను తహసీల్దారు తిరుమలబాబుకు వివరించారు. మాధవరం-1 ఐకాస నాయకులు మండల ప్రజలతో సంతకాలు సేకరించి ఆ నివేదికను ఆయనకు అందజేశారు.

శిక్షణ తరగతులకు తెదేపా శ్రేణులు

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుతో మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు తదితరులు

వీరబల్లి, న్యూస్‌టుడే: విజయవాడలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా తరగతులకు సోమవారం వీరబల్లి తెదేపా మండల అధ్యక్షుడు ఎం. భానుగోపాల్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు హాజరయ్యారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎలా తీసికెళ్లాలనే విషయాలపై నాయకులు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితను, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కలిశారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ

సంబేపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కర్నూల్- చిత్తూరు జాతీయ రహదారిపై మొటుకువాండ్ల పల్లె క్రాస్ వద్ద రూరల్ సీఐ వరప్రసాద్ సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సులను, వాహన రికార్డులను పరిశీలించారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంబేపల్లె ఎస్సై రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ వరప్రసాద్

మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS No. 23/2025
షేక్ ఇద్రుతుల్లా సాహెబ్, తండ్రి రసూల్ సాహెబ్, ముస్లిం, వయస్సు 52 సం॥లు, కొత్తపల్లె గ్రామం, రాయచోటి టౌన్ & మండలం. - వాది
Vs
పీలం రామయ్య, తండ్రి నాగయ్య, 79 సం॥లు, సాకిన్ బోసనగర్ వీధి, రాయచోటి టౌన్ & మండలం. - ప్రతివాది
నోటీసు ప్రకటన
పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన సీపైన అగ్రిమెంటు కొరకు దావా మరియు IA No. 383/25 రు ఇంజంక్షను పిటీషన్ను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మరియు ఇంజంక్షను పిటీషన్నులో 10-12-25 తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెల్పుకోవలయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.
ఇట్లు : శ్రీ యం.ఇలియాస్, B.Sc., LLB
వాదిపరం అడ్వకేటు, రాయచోటి.

ఆ బొమ్మలు పాఠాలు చెబుతున్నాయ్

✧ 425 పాఠశాలల్లో అమలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రాథమిక స్థాయి విద్యార్థులకు బొమ్మలతో విద్యను అందించేందుకు సరఫరా చేసిన 'జాదూయి పిటారా'తో(మాయా పెట్టె) ఉపాధ్యాయులు సాధన చేయిస్తున్నారు. ఇందులోని పలు రకాల బొమ్మలతో చిన్నారులు అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు దోహదపడతాయి. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో అమలు చేస్తోంది. జిల్లాలో 1798 ప్రాథమిక పాఠశాలలు ఉండగా మాయాపెట్టెలు 425 పాఠశాలలకు సరఫరా చేశారు.

పెట్టెలో 62 రకాల వస్తువులు

ఈ పెట్టెలో మొత్తం 62 రకాల వస్తువులున్నాయి. రంగు రంగుల బొమ్మలు, బోధనోపకరణాలు, ఫ్లాష్ కార్డులు, కథల పుస్తకాలు, అంకెలు, అక్షరాలు, రంగు పెన్సిళ్లు, తోలు బొమ్మలు, పోస్టర్లు, తెలుగు, ఆంగ్ల అక్షరాలు, గణిత సంబంధ వస్తువులను సులువుగా లెక్కించేటటువంటి వస్తువులున్నాయి. వీటిని ప్రాథమిక పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు అనుబంధంగా ఒకటి, రెండు తరగతులున్న పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా సరఫరా చేశారు.

రెడ్డివారిపల్లె పాఠశాలలో బొమ్మలతో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ప్రయోజనం ఉంది

విద్యార్థుల హాజరు వంద శాతం ఉంటుంది. ఆసక్తికర అభ్యసనానికి బొమ్మలు దోహదం చేస్తే కథల పుస్తకాలు, తోలుబొమ్మలు చిన్నారుల్లో ఊహాశక్తి, భాషా నైపుణ్యాల పెంపుకు ఉపయోగపడతాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఫ్లాష్ కార్డులు గుర్తింపునకు, అంకెలు, తెలుగు, ఆంగ్ల అక్షరాలు గుర్తించడంతో పాటు పదాలను కలిపి పలికేందుకు, పోస్టర్లు, వర్క్‌షీట్లు అభ్యసనా కార్యకలాపాలకు ఉపయోగపడతాయని అంటున్నారు. మాయాపెట్టె చిన్నారుల్లో ప్రాథమిక విద్య పునాదికి దోహదపడుతుందని ఎస్ఎస్ఏ ఏఎంవో అసదుల్లా తెలిపారు.

సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న సీఐ ఏపీ మస్తాన్

పుల్లంపేట, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను నివారించి బాలికల భవిష్యత్తుకు బంగారు బాట వేద్దామని సీఐ ఏపీ మస్తాన్ అన్నారు. సోమవారం పుల్లంపేట మండలంలోని కేజీబీవీలో బాలికలకు సైబర్ నేరాలు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో వచ్చే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ రూత్‌మేరీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఐసీటీసీ కౌన్సిలర్‌గా వెంకటసుబ్బయ్య

అవార్డు స్వీకరిస్తున్న వెంకటసుబ్బయ్య

రాజంపేట: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాయచోటిలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య చేతుల మీదుగా ఉత్తమ ఐసీటీసీ కౌన్సిలర్‌గా అవార్డును వెంకటసుబ్బయ్య అందుకున్నారు. హెచ్ఐవీ పరీక్షలు, మందుల అందజేయడం వంటి విభాగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఈ అవార్డు లభించిందన్నారు.

ఘనంగా గీతా జయంతి

గీతా పారాయణం చేస్తున్న భక్తులు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణ పరిధి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం శ్రీభగవాన్ గీతా సేవా సత్సంగం ఆధ్వర్యంలో గీతా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని భగవద్గీతలోని 18 అధ్యాయలను సంపూర్ణ పారాయణం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు అరవ రమణయ్య, తితిదే ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు వెంకటరమణ, గీతా సేవా సత్సంగ సంఘ అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయా ఆలయాల్లోని మూలవిరాట్ విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం గీతాపారాయణం చేపట్టారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468


6వ వర్ధంతి
మంచితనం మూర్తీభవించే మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన మీరు మా కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి మా నుండి దూరమై దైవసన్నిదికి చేరి 6 సం॥ గడిచిననూ మీ జ్ఞాపకాలు మా వెంటే ఉన్నాయి. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో...
భార్య : కీ॥శే॥ శ్రీమతి మట్లి ప్రభావతమ్మ, Rtd. H.M.,
కుమారులు : కీ॥శే॥ మట్లి కృష్ణమోహన్‌రావు, మట్లి రవి ప్రతాప్, మట్లి లక్ష్మి మనోహరరావు
కోడళ్లు : బి.శ్రీకళాదేవి, ఎం.సునీత, ఎం.దేవిశ్రీ
మనుమలు : మనుమరాండ్రు :
డా॥ఎం.ధీరజ్, M.D., ఎం.హృతిక, B.Tech., ఎం.జైహింద్, M.Tech ఎం.చంద్రసేన, B.D.S., ఎం.భోళా ప్రభాత్ ఎం.జైదీప్ నారాయణ్
కీ॥శే॥ మట్లి లక్ష్మీనారాయణ గారు
Rtd. Head Master, రాయచోటి.
S/o కీ॥శే॥ మట్లి సుబ్బమ్మ, Rtd. Teacher
జననం : 01.07.1940 మరణం : 02.12.2019

(c) eenadu

నమోదు కొరకు: 91549 91113 సమయం : ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

బాధ్యతగా పనిచేయాలి: మంత్రి

అద్దంకి, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం మైలవరం పంచాయతీ శివారు ఏలేశ్వరపాలెం ఎస్సీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో స్పౌజ్ పింఛన్లు

ఎన్ని మంజూరయ్యాయని మంత్రి ప్రశ్నించగా.. సచివాలయ సిబ్బంది నుంచి ఎలాంటి స్పందన లేదు. గ్రామస్థాయి నేత చొరవ తీసుకుని 'నాలుగిచ్చాం' అన్నారు. ఈ క్రమంలో మంత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించారు. ఎంపీడీవో వరూధిని, తహసీల్దార్ శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు బాపట్ల

జీడిమామిడికి జీవం.. కొత్త రకాలకు అంకురం

బాలారిష్టాలు అధిగమించిన పరిశోధన కేంద్రం

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, బాపట్ల

జీడిమామిడికి జీవం పోసేందుకు జిల్లాలో ప్రయత్నం జరుగుతోంది. సాగును నమ్ముకున్న రైతులకు అండగా నిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పరిశోధన కేంద్రం ద్వారా 70 ఏళ్లలో 10 రకాలు ఉత్పత్తి చేయగా.. రాబోయే ఎనిమిదేళ్లలో ఐదు వెరైటీలను అందబాటులోకి తెచ్చేందుకు ముందడుగు పడుతోంది.

జీడిమామిడి కాయలు

పందిరి సాగుపై అధ్యయనం

1955లో బాపట్ల పరిశోధన కేంద్రం ఏర్పాటైంది. అప్పటి నుంచి 10 కొత్త రకాలు అందుబాటులోకి వచ్చాయి. 1982లో 6 రకాలు ఉత్పత్తి కాగా.. హైబ్రీడ్ 2, సెలక్షన్ జాబితాలో 4 ఉన్నాయి. ఆ తర్వాత 1992లో 2 హైబ్రీడ్ రకాలను శాస్త్రవేత్తలు రైతులకు చేరువ చేశారు. 2017లో బీపీపీ-10, 11 పేరుతో మరో రెండు రకాలు అందుబాటులోకి తెచ్చారు. నిధుల కొరత, నీటి సమస్యలు ఇబ్బంది పెడుతున్నా, వాటిని ఎదుర్కొంటూనే శాస్త్రవేత్తలు పరిశోధనలపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం పరిశోధనలో ఉన్న ఐదు వెరైటీల్లో రెండింటిని పూర్తిస్థాయిలో సిద్ధం చేసి రెండేళ్లలో అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. హైబ్రీడ్ జాబితాలోని హెచ్-218, హెచ్-491, హెచ్-464, హెచ్-472, హెచ్-474 రకాలు ప్రస్తుతం పరీక్షల దశలో ఉన్నాయి. పార్వతీపురం, బాపట్లలోని వివిధ ప్రాంతాల్లో పందిరి జీడిమామిడిపై లోతైన అధ్యయనం చేస్తున్నారు.

దోమను తట్టుకునే రకం

వాస్తవానికి తూర్పు తీర ప్రాంతంలో జీడిమామిడి సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో ఏర్పాటైన కేంద్రం రాష్ట్రంలో ఏకైక పరిశోధన కేంద్రంగా గుర్తింపు పొందింది. శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి సహా రాష్ట్రంలోని అనేక జిల్లాలకు జీడిమామిడి సాగులో విశేష సలహాలు, సూచనలు ఇక్కడి నుంచే అందుతున్నాయి. అయితే 27 ఏళ్లపాటు ఎలాంటి వెరైటీలను ఉత్పత్తి చేయలేకపోయారు. 1982లో తొలి అడుగుపడినా తర్వాత పదేళ్లకు రెండు రకాలే రైతులకు చేరువయ్యాయి. 2017 నుంచి శాస్త్రవేత్తలు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడంతో కొంతమేర ఫలితాలు వస్తున్నాయి. దోమను తట్టుకునేలా, గింజ పరిమాణం మెరుగ్గా ఉండేలా ప్రస్తుత రకాలు సిద్ధమవుతున్నట్లు బాపట్ల పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఉమామహేష్ 'ఈనాడు'కు తెలిపారు. పరిశోధనల గురించి ఆయన వివరించారు.

దిత్వా గండం గడిచినట్లేనా?

బాపట్ల, న్యూస్‌టుడే

దిత్వా తుపాను ముప్పు నుంచి జిల్లా బయట పడింది. జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. సముద్ర తీరానికి పర్యాటకుల రాకను నిలిపివేశారు. సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లను మంగళవారం వరకు మూసివేశారు. ఎవరూ రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. డెల్టాలో వరి కోతలు, నూర్పిడులు ఆగిపోయాయి. వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో అన్నదాతల్లో భయం కొనసాగుతోంది.

బాపట్ల మండలంలో ధాన్యంపై కప్పిన పట్టలు

జిల్లాలో ధాన్యం సేకరణ వేగవంతం

5,603 టన్నులు కొనుగోలు

ధాన్యం సేకరణను అధికారులు వేగవంతం చేశారు. 811 మంది రైతుల నుంచి 5603 టన్నులు కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. మరో 11,236 టన్నుల సేకరణకు షెడ్యూల్ ఇచ్చామని, తేమ శాతం 17లోపు ఉండాలని నిబంధన ఉన్నా ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో 20 ఉన్నా అనుమతిస్తున్నామని తెలిపారు. నూర్పిడి చేసిన ధాన్యం తడవకుండా రైతులు పట్టలు కప్పుతున్నారు.

తీరంలో అలల ఉద్ధృతి

తుపాను ప్రభావంతో జిల్లాలోని సముద్ర తీరంలో అలల ఉద్ధృతి పెరిగింది. నీరు 10 నుంచి 20 అడుగులు ముందుకు వచ్చింది. ఉదయం నుంచి రాత్రి వరకు చల్లనిగాలులు వీచాయి. చలికి చిన్నారులు, వృద్ధులు గజగజ వణికారు.

దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దు

కొల్లూరు, న్యూస్‌టుడే: ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని సంయుక్త కలెక్టర్ భావన రైతులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె మండలంలో పర్యటించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం అమ్మకాల విషయమై రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆమె కొల్లూరు, క్రాప తదితర ప్రాంతాల్లోని రైతులను అడిగి తెలుసుకున్నారు. పట్టలు కప్పి ఉంచిన ధాన్యంలో నెమ్ము చేరడంతో రంగు మారి, నాణ్యత దెబ్బతింటోందని, తేమ శాతం పేరుతో కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోయారు. తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని ప్రమాణాల మేరకు తరుగు తీసి వేసి కొనుగోలు చేయాలని, యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేసి మిల్లులకు చేర్చాలని ఆమె అధికారులను ఆదేశించారు.

రైతులతో మాట్లాడుతున్న జేసీ భావన

ఈవీగా దూసుకెళ్దాం

రామ్‌నగర్ (అద్దంకి), న్యూస్‌టుడే

ఎలక్ట్రానిక్ వాహనాల వినియోగం పెరుగుతోంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాలు, కార్ల ఛార్జింగ్ కోసం వినియోగదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈవీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం అద్దంకి విద్యుత్తు డివిజన్ పరిధిలోని మేదరమెట్లలో 3, అద్దంకిలో ఒకటి నడుస్తోంది. మరొకటి అద్దంకి విద్యుత్తు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నారు. రాబోయే రోజుల్లో అన్ని ఉప కేంద్రాల పరిధిలో వీటిని నెలకొల్పాలని ఏపీసీపీడీసీఎల్ సంస్థ యోచిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు.

జాతీయ, రాష్ట్రీయ రహదారుల వెంబడి.. జిల్లాలోని విద్యుత్తు ఉపకేంద్రాలున్న జాతీయ, రాష్ట్రీయ రహదారులు, జడ్పీ రహదారుల వెంబడి ఈవీ కేంద్రాలు నెలకొల్పబోతున్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల నుంచి సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం వరకు నామ్ రహదారి

జిల్లాలో 26 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు!

విస్తరించి ఉంది. తిమ్మనపాలెం నుంచి మార్టూరు మండలం రాజుపాలెం వరకు కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి ఉంది. వీటితో పాటు చీరాల, రేపల్లె, వేమూరు, పర్చూరు నియోజకవర్గాల్లోని రహదారుల వెంబడి ఉన్న విద్యుత్తు ఉపకేంద్రాల వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు. రోడ్ల పక్కన ఉప కేంద్రాలు కలిగిన అద్దంకిలో 12, పర్చూరులో 5, చీరాలలో 6, రేపల్లె, బాపట్ల, వేమూరులో ఒక్కొక్కటి చొప్పున వీటిని నెలకొల్పబోతున్నారు.

ఉప కేంద్రాల పరిధిలోనే..

'జిల్లాలో విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో తొలుత ఎలక్ట్రానిక్ ఛార్జింగ్ కేంద్రాలు నెలకొల్పే అవకాశముంది. ఎంపిక చేసిన కేంద్రాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించాం. అనుమతి మంజూరు అనంతరం వాటిని నెలకొల్పుతాం' అని అద్దంకి విద్యుత్తు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు.

46 అడుగుల సుబ్రహ్మణ్యుడి ఏకశిలా విగ్రహం

కొరిశపాడు మండలం పమిడిపాడు శివారు కృష్ణంరాజువారిపాలెం(రెడ్డిపాలెం)లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రంలో స్వామి వారి 46 అడుగుల ఏకశిలా విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. 2022లో దేవస్థానం ఆవరణలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ గుడి సమీపంలోనే షట్కోణాకారంలో తమిళనాడులో ప్రసిద్ధిచెందిన ఆరు క్షేత్రాల్లోని స్వామి వారి విగ్రహ ప్రతిమలతో కొత్తగా మరో దేవాలయం నిర్మిస్తున్నారు. మధ్యలో ఈ ఏకశిలా విగ్రహం ఉంటుంది. దీనికి కావాల్సిన రాయిని చిలకలూరిపేట సమీపంలోని గ్రానైట్ క్వారీ నుంచి సేకరించారు. 2019లో మహాబలిపురానికి చెందిన శిల్పి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విగ్రహ పనులు మొదలుపెట్టారు. 2022, మే 26న ప్రారంభించారు. భూమిపై పది అడుగుల బేస్‌మెంట్‌తో కలుపుకొని ఇది 56 అడుగుల ఎత్తులో ఉంటుంది. దేశంలోనే స్వామివారికి ఇంత పెద్ద ఏకశిలా విగ్రహం మరెక్కడా లేదని ఆలయ నిర్వాహకురాలు నాగరాజస్వామి తెలిపారు.

– న్యూస్‌టుడే, పమిడిపాడు (మేదరమెట్ల)

దివ్యాంగులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: దివ్యాంగులకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందని శాప్ ఛైర్మన్ రవి నాయుడు అన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గుంటూరు బీఆర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను రవి నాయుడుతో పాటు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, శాప్ ఎండీ భరణి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. రవి నాయుడు మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

రైతేరాజు 20 సెంట్లు.. 50 పంటలు | పందిరి సారం.. లాభాలు భళా

6లో

బాపట్ల, నిజాంపట్నం, న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛను పథకాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం నిజాంపట్నంలో

లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని పేదరికం నుంచి బయటపడాలన్నారు. తుపాను రక్షిత భవనంలో అరటి బోదెలతో తయారు చేస్తున్న గృహోపకరణాలను పరిశీలించారు. ఉత్పత్తుల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకుని కొనుగోలు చేశారు. రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి వర్షాలకు పంటలు తడిసి దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేపల్లె ప్రధాన కాలువ వద్ద దెబ్బతిన్న లాకులను పరిశీలించారు. భారత తీర రక్షక దళ కార్యాలయాన్ని సందర్శించారు. కొత్త లైట్ హౌస్ నిర్మాణానికి స్థలం కేటాయించామని తెలిపారు. ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

❖ జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల పరీక్ష ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల, చీరాల, రేపల్లె పరిధిలోని 11 కేంద్రాల్లో మొత్తం 2,412 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు వివరించారు.

ఎంత నిర్లక్ష్యం!

కాలం చెల్లిన పాల ప్యాకెట్లు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహార పంపిణీలో నిర్లక్ష్యం నెలకొంది. కాలం చెల్లిన టెట్రా పాల ప్యాకెట్లు సరఫరా చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొన్నాళ్ల కిందట కారంపూడి మండలంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి గడువు ముగిసిన పాల ప్యాకెట్లు సరఫరా చేశారు. గమనించిన కార్యకర్త సరఫరాదారు దృష్టికి తీసుకెళ్లగా వాటిని వెనక్కి తీసుకుని, కొత్త ప్యాకెట్లు అందించారు. తాజాగా ఆ ప్యాకెట్లను మండాది శివారులోని కానుగ వాగు వంతెన వద్ద కుప్పలుగా పోసి నిప్పు పెట్టడంతో విషయం బయటకొచ్చింది. - న్యూస్‌టుడే, వెల్దుర్తి

నది వద్ద పరిశీలిస్తున్న తహసీల్దారు తదితరులు



బాపట్ల, న్యూస్‌టుడే: భగవద్గీత సారం తెలుసుకోవడం ద్వారా మానవ జీవితం సార్థకమవుతుందని ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ డి.ప్రభాకరశర్మ అన్నారు. హైందవి ఫౌండేషన్ కన్వీనర్ మామిడి రాజశేఖర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో గీతా జయంతి సందర్భంగా 960 మంది విద్యార్థులతో సామూ

(c) eenadu

పంట నష్టం సంభవించకుండా చర్యలు

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: దిత్వా తుపాను నేపథ్యంలో జిల్లాలో పంట నష్టం సంభవించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి శాఖకు అవసరమైన జూమ్ లైసెన్స్ కొనుగోలు చేసి నిరంతరం సమావేశాలు నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ధాన్యం సేకరణలో అవకతవకలు చోటుచేసుకుండదని, ప్రతి మిల్లులో బాధ్యత అధికారులదేనన్నారు. గాలుల వల్ల ఎక్కడైనా కరెంటు సరఫరాకు అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. మురుగు కాలువలు శుభ్రం ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 5న మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలన్నారు. ధాన్యం సేకరణలో సమస్యలు వస్తే టోల్ ఫ్రీ నంబరు 1967, కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ నంబరు 7702806804కు రైతులు ఫోన్ చేయవచ్చని తెలిపారు. జేసీ భావన, డీఎస్పీ జమీర్ బాషా, డీఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బాపట్ల బ్రాంచ్-00815, బాపట్ల, బాపట్ల జిల్లా-522101. ఇ-మెయిల్ : sbi.00815@sbi.co.in

ఇ-వేలం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం బ్యాంకుకు చార్జ్ చేయబడిన చర & స్థిరాస్తుల అమ్మకం

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులు తనఖా/చార్జ్, సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి ఉంచబడినవి. సదరు ఆస్తులు అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్ వారిచే లాంఛనాత్మకంగా స్వాధీనత చేసుకోబడి దిగువ నిర్దేశించబడిన నియమ నిబంధనలకు లోబడి "ఎక్కడ ఉన్నది. అక్కడ అలానే" "ఏది ఉంటే అది అలానే" ప్రాతిపదికన దిగువ తెలిపిన వివరముల ప్రకారం ఇ-వేలం వెబ్ పోర్టల్ https://www.baanknet.com ద్వారా విక్రయించబడతాయి.

ఆసక్తిగల కొనుగోలుదారు ఏదైనా బ్యాంకు పనిదినములో సంబంధిత అధికారి గారి ముందస్తు అనుమతితో ఆస్తిని తనిఖీ చేసుకొనవచ్చును.

ఋణగ్రహీత : 1) శ్రీమతి తంగా కామేశ్వరి, భర్త : తంగా వెంకట శ్రీధర్, డి నెం.6-8-32, 14వ వార్డు, శృంగారపురం, బాపట్ల, బాపట్ల జిల్లా-522101. 2) శ్రీ తంగా వెంకట శ్రీధర్, తండ్రి : తంగా హనుమంతరావు, డి నెం.6-8-32, 14వ వార్డు, శృంగారపురం, బాపట్ల, బాపట్ల జిల్లా-522101.

బకాయి మొత్తం : NPA: MC-SBI HOME LOAN A/c No. 35819423326, MC-SBI HOME TOPUP-TL A/c No. 35831995740, MC-EDU LN A/c No.37053342994, MC-HOME TOPUP A/c No.37839847213, EB-MSME-CC A/c No.35821877387 తేది.30.07.2025 నాటికి రూ.1,27,50,705/- (అక్షరాల ఒక కోటి ఇరవై ఏడు లక్షల యాభై వేల ఏడు వందల ఐదు రూపాయలు మాత్రమే) ప్లస్ తేది.30.07.2025 నుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను.

స్థిరాస్తి వివరములు

ఆస్తి నెం.1 : శ్రీమతి తంగా కామేశ్వరి, భర్త : వెంకట శ్రీధర్ గారి పేరున ఉన్న ఆస్తి రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. 2361/2006, తేది.25.05.2006 ప్రకారం

నరసరావుపేట ఆర్.డి., పాత గుంటూరు జిల్లా, ప్రస్తుతం బాపట్ల జిల్లా, బాపట్ల సబ్-జిల్లా, బాపట్ల మున్సిపాలిటీ, 15వ వార్డు, శృంగారపురం, వెస్ట్ బాపట్ల గ్రామ డి నెం.960/3 నందు విస్తీర్ణం 290.4 చ॥గు॥లు లేదా 243.93 చ॥మీ॥లులోని ఎమ్.టి. రూఫ్ ఆఫీస్ యొక్క గ్రౌండ్ ఫ్లోర్ స్థలం మరియు ఆర్.సి.సి. రూఫ్ గోడౌన్ & ఆర్.సి.సి. రూఫ్ రెసిడెన్షియల్ భవనం మొదటి అంతస్తు మాత్రమే. **హద్దులు : తూర్పు :** హక్కుదారులు స్వంత ప్రహరీ గోడ వైపు ఉప్పిరెట్ల నారాయణమ్మ గారి ఇంటి స్థలం – 60 లింకులు, **దక్షిణం :** హక్కుదారులు స్వంత ప్రహరీ గోడ వైపు గంధం పద్మలత గారి ఇంటి స్థలం – 100 లింకులు, **పడమర :** హక్కుదారులు స్వంత ప్రహరీ గోడ వైపు మున్సిపల్ బజార్ – 60 లింకులు, **ఉత్తరం :** హక్కుదారులు స్వంత ప్రహరీ గోడ వైపు మండలనేని సత్యవతమ్మ గారి ఇంటి స్థలం – 100 లింకులు.

పై హద్దుల యందు విస్తీర్ణం 290.4 చ॥గు॥లు లేదా 243.93 చ॥మీ॥లులోని ఎమ్.టి. రూఫ్ ఆఫీస్ యొక్క గ్రౌండ్ ఫ్లోర్ స్థలం మరియు ఆర్.సి.సి. రూఫ్ గోడౌన్ & ఆర్.సి.సి. రూఫ్ రెసిడెన్షియల్ భవనం మొదటి అంతస్తు మాత్రమే.

ఆస్తి నెం.2 : శ్రీమతి తంగా కామేశ్వరి, భర్త : వెంకట శ్రీధర్ గారి పేరున ఉన్న ఆస్తి రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. 2451/2006, తేది.14.06.2006 ప్రకారం

నరసరావుపేట ఆర్.డి., పాత గుంటూరు జిల్లా, ప్రస్తుతం బాపట్ల జిల్లా, బాపట్ల సబ్-జిల్లా, బాపట్ల మున్సిపాలిటీ, పాత వార్డు నెం.14, కొత్త వార్డు నెం.15, డోర్ నెం.6-8-17, శృంగారపురం, వెస్ట్ బాపట్ల గ్రామ డి నెం.960/3 నందు విస్తీర్ణం 60.5 చ॥గు॥లులోని విస్తీర్ణం 34.67 చ॥గు॥లు లేదా 29.12 చ॥మీ॥లులోని ఖాళీ స్థలం. **హద్దులు : తూర్పు :** ఇటు వైపున అమ్మకందారులు యొక్క మిగిలిన స్థలం – 15.6 అ॥లు, **దక్షిణం :** ఉప్పిరెట్ల వెంకట రత్నమ్మ గారి ఇంటి స్థలం – 20.6 అ॥లు, **పడమర :** తంగా కామేశ్వరి గారి ఇంటి స్థలం – 14.7 అ॥లు, **ఉత్తరం :** సామంతపూడి సత్యనారాయణ రాజు గారి ఇంటి స్థలం – 21.0 అ॥లు.

పై హద్దుల యందు విస్తీర్ణం 34.67 చ॥గు॥లు లేదా 29.12 చ॥మీ॥లులోని ఖాళీ స్థలం మాత్రమే.

ఆస్తి 1 & 2 కొరకు రిజర్వు ధర
రిజర్వు ధర : రూ.1,27,61,404/- ధరావత్తు : రూ.12,76,140/-
బిడ్ పెంపుదల మొత్తం : రూ. 20,000/-
ఇ-వేలం తేది సమయం: 07.01.2026 ఉ॥ 11.00 గం॥ నుండి సా॥ 4.00 గం॥ల వరకు (5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో)
ఆస్తి తనిఖీ తేది : 20-12-2025 ఉ॥ 10.00 గం॥ నుండి సా॥ 5.00 గం॥ల వరకు
EMD మరియు KYC పత్రాలు మరియు రుజువులను సమర్పించాల్సిన తేది & సమయం: తేది : 07-01-2026 న లేదా అంతకు ముందు సాయంత్రం 04.00 గం॥ల లోపు

అమ్మకం బ్యాంకు వారి నియమ నిబంధనలకు లోబడి జరుపబడును. తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలంలో పాల్గొనుటకు ముందుగా M/s PSB Alliance, https://www.baanknet.com వారి వెబ్ పోర్టల్ www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices మరియు హెల్ప్ లైన్ నెం. 8291220220, హెల్ప్ లైన్ ఇ-మెయిల్ ఐడి: support.baank.net@psballiance.com మరియు ఇ-వేలము నియమ, నిబంధనలు పూర్తి వివరములు పరిశీలించవలసినదిగా బిడ్డర్లను కోరడమైనది.

ఆసక్తి గల బిడ్డర్లు ఆస్తికి సంబంధించిన వివరాలకు బ్రాంచ్ మేనేజర్, మొబైల్: 99667 88720, ఇ-మెయిల్ ఐడి: sbi.00815@sbi.co.in, ఫీల్డ్ ఆఫీసర్ మొబైల్ నెం.99630 18778, అథరైజ్డ్ ఏజెన్సీ, మొబైల్ నెం.94922 84184 వారిని సోమవారం నుండి శనివారం వరకు పనిదినములలో సంప్రదించవచ్చును.

తేది : 26.11.2025, ప్రదేశం : బాపట్ల సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వసతులు కల్పిస్తాం.. మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి

మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

మైలవరం (అద్దంకి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాలయాల్లో ఉత్తీర్ణత పెరగాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని మైలవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 162 మంది విద్యార్థులకు సోమవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎంఈవో-2 కేవీ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గంలో 5300 మందికి సైకిళ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో వీటిని అందించినట్లు చెప్పారు. మరో 45 రోజుల్లో నాగ్ రహదారి నుంచి కొప్పెరపాడు వరకు ఉన్న గ్రామాలను కలుపుతూ రహదారి నిర్మాణం పూర్తవుతుందని, త్వరగా సైకిళ్లపై పాఠశాలకు చేరుకోవచ్చన్నారు. బడిలో అదనంగా నిర్మించిన మూడు గదులను రంగులు, బొమ్మలు, మౌలిక సదుపాయాల కల్పనతో సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత ముఖ్యం కాదు 500 మార్కులు పైగా అందరు విద్యార్థులు సాధించాలని కోరారు. బడి ఆవరణలో మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.నాగేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు రమేష్, తెదేపా నేత స్వయంప్రకాశ్ పాల్గొన్నారు.

చైతన్యంతోనే ఎయిడ్స్ నిర్మూలన

ప్రదర్శనలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు

బాపట్ల, న్యూస్‌టుడే: అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయటం ద్వారానే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమవుతుందని డీఆర్వో గంగాధర్ గౌడ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి అంబేడ్కర్ భవన్ వరకు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. జెండా ఊపి డీఎంహెచ్‌వో విజయమ్మ ప్రారంభించారు. విజయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఏఆర్టీ కేంద్రాల ద్వారా హెచ్ఐవీ బాధితులకు ఉచితంగా ఔషధాలు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి సోమలనాయక్, డీవో రత్న మన్మోహన్, వైద్యాధికారులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

సివిల్స్ కోచింగ్‌కు దరఖాస్తులు

బాపట్లటౌన్, న్యూస్‌టుడే : బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సివిల్స్ కోచింగ్‌కు అర్హత గలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆశాఖ సోమవారం ఒక ప్రకటనలో కోరింది. ఈనెల 3న గడువు ముగియనుందని, అభ్యర్థులు విద్యార్హతలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నాలుగు ఫొటోలతో బీసీ సంక్షేమశాఖకు అందివ్వాలని, ఇతర వివరాలకు 8179042760, 9963633578 నంబర్లను సంప్రదించాలని పేర్కొంది.

20 సెంట్లు.. 50 పంటలు

మహిళా రైతు ఆదర్శ సాగు

బాపట్ల టౌన్, పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: ప్రకృతి సేద్యం ఆహారం బహుస్నూ, భూమి తల్లిని మందులతో పాడుచేయకుండా ముందు తరాలకు అందించాలనే ఆశయ సంకల్పం నలుగురికి ఆదర్శప్రాయం. 2015 నుంచి ద్రవ జీవామృతంతో ప్రకృతి సాగు చేస్తూ, ఇతరులను అవగాహన కలిగిస్తూ తన ఆశయం వైపు సాగుతున్నారు. పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామానికి చెందిన గడ్డి కెతోరా తెరీషా డిగ్రీ పూర్తి చేసి, 20 సెంట్ల పొలంలో 50 రకాల పంటలకు పైగా పండిస్తున్నారు. వీటిలో దుంప రకం, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, పండ్ల మొక్కలు, పూలు, ఔషధ మొక్కల వంటి రకాలు ఉన్నాయి. నెలకు సగటున రూ.10 వేలు సంపాదిస్తూ ఇతరులకు మంచి ఆహారాన్ని అందిస్తున్నారు. పొలం పక్కనే ఉప్పు నీటి కాలువ ఉంది. వరదలకు తట్టుకునేలా చర్యలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు. వైవిధ్య పంటలు సాగు చేయడంతో పురుగు త్వరగా ఆశించదని తెరీషా తెలిపారు. తన భర్త షణ్ముక్ తనకు చేదోడు వాదోడుగా ఉంటున్నారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని అందరూ చేయాలని ఆమె సూచించారు.

పొలంలో పనిచేస్తున్న కెతోరా తెరీషా

రాయితీపై అపరాల విత్తనాలు

ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో 30 శాతం రాయితీపై మినుములు, పెసల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని డీఏవో సుమతి వెల్లడించారు. ఎల్‌బీజీ-752, పీయూ-31, వీబీఎన్-8 విత్తనాల 270 క్వింటాళ్లు, ఐపీఎం2-14 పెసలు విత్తనాలు 250 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. మినుములు కేజీ రూ.138గాను రూ.41.60 రాయితీ పోను రైతులు రూ.96.60 చెల్లించాలి. పెసలు కేజీ రూ.135 ధర ఉండగా రూ.40.50 రాయితీ పోను రైతులు రూ.94.50 ఇవ్వ చెల్లించాలి. కావాల్సిన వారు రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని కలిసి క్రిషి యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

రైతేరాజు

చలికాలం.. పశువుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గురజాల, న్యూస్‌టుడే: చలికాలంలో వాతావరణ మార్పులతో పాల ఉత్పత్తి తగ్గుతుంది. పశువులు రక్షించుకునేందుకు పోషకాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గురజాల పశుసంవర్ధక అధికారిణి సరోజాదేవి తెలిపారు. అధిక పోషకాలున్న దాణాతో పాటు మేలైన పచ్చగాసాలు అందించాలి. చూడితో ఉన్న పశువులకు పచ్చిమేతతో పాటు అదనంగా పోషకాలతో పాటు ప్రత్యేక దాణాలు, నల్లల నివారణ మందులు వేయించాలి. 50 కిలోల బరువున్న పశువుకు రోజుకు 7-8 లీటర్ల నీరు అవసరం. నీరు అందుబాటులో లేకుంటే కలుషిత జలాలు తాగే ప్రమాదం ఉంది. వాటిలో ఉండే ఈకోలి వంటి పరాన్నజీవులు రోగాలను వ్యాప్తి చేస్తాయి. చలి ఎక్కువైతే గోరువెచ్చని నీటిని అందిస్తే మేలు.

ఉష్ణోగ్రత - సంరక్షణ: చలి నుంచి రక్షణకు కొట్టాల చుట్టూ గోనెల పట్టాలి. వెచ్చదనం కోసం నేలపై ఎండుగడ్డిని పరచాలి. చుట్టూ నీరు, బురద లేకుండా చూడాలి. ఉష్ణోగ్రత 8 డిగ్రీలకు తగ్గకుండా చూసుకోవాలి. దూడలకు చల్లటి గాలులు తగిలితే 'న్యూమోనియా' బారినపడే ప్రమాదం ఉంది. సాయంత్రం వేళ దూడలను త్వరగా కొట్టాల్లో కట్టేయాలి. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వేపాకు పొగ పెట్టాలి.

వరిలో పొగాకు లద్దె పురుగు ఆవిర్భావం.. నివారణ

చినగంజాం, న్యూస్‌టుడే: వరి నారుమడుల్లో పొగాకు లద్దె పురుగు తీవ్రంగా ఆశించిందని చినగంజాం మండల వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్ తెలిపారు. ఇది రావడానికి కారణాలు, నివారణ మార్గాలను ఆయన వివరించారు.

❖ వరి కోతలు తర్వాత భూమిని దున్నకుండా వదిలేస్తే సన్నటి పగుళ్లలో విచ్ఛిన్నమవుతుంది. భూమి లోపల నుంచి పొగాకు లద్దె పురుగు తయారవుతుంది. ❖ మళ్లీ కొత్తగా సాగు సమయంలో నారుమడికి కావాల్సిన భూమిని దున్నుతారు. నీరు పెడతారు. ❖ అలా దున్నిన నారు మడి పెట్టాక మడిలోని నీటి తేమకి మిగిలిన భూమిలో పగుళ్ల ద్వారా లోపల ఉన్న గుడ్లు పొదగబడి, పిల్లలుగా తయారవుతాయి. ❖ నారు మడి నీటిని పీల్చుకొని దున్నని భూమిలోని గుడ్లు పెట్టిన పిల్లలు పెద్దయి పొగాకు లద్దె పురుగుగా ఆవిర్భవిస్తాయి. ❖ నారు మడిలో ప్రవేశించి, క్రమంగా నారును దెబ్బతీస్తాయి.

❖ పగలు వంద పురుగులు కన్పిస్తే రాత్రులు వెయ్యి పురుగులు భూమిలోపల నుంచి బయటకు వస్తాయి. ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది.

ఇలా చేస్తే.. ❖ చిన్నస్థాయిలో ఉండే పొగాకు లద్దె పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 ఎంఎల్ మందును లీటరు నీటిలో, లేదా రీమాన్ 1.0 ఎంఎల్ లీటరు నీటిలో, ఇండాక్సీకార్బ్ 1.0 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ❖ పెద్ద స్థాయిలో ఉండే పురుగు నివారణకు 20 కిలోల తవుడు, రెండు కిలోల బెల్లం కలుపుకొని ఉదయాన్నే క్లోరిపైరిఫాస్ 500 ఎంఎల్ కలిపి ఉండలుగా తయారుచేసి, పొలంలో విస్తరంగా ఎరగా వేస్తే పూర్తి స్థాయిలో పురుగు నివారణ అవుతుంది. ❖ పొగాకు లద్దె పురుగును రైతులందరూ సామూహికంగా కృషి చేస్తే నివారణ అవుతుంది. ❖ వరి కోతలు కాగానే మళ్లీ పంట కాలం లోపల రెండు మూడుసార్లు భూములను దున్నితే పురుగు ఆవిర్భవించదు.

పందిరి సొర.. లాభాలు భళా

ఇంకొల్లు, న్యూస్‌టుడే: పందిరి సొర సాగుతో లాభాలు ఆర్జిస్తున్నారు. ఇంకొల్లు మండలం పావులూరుకు చెందిన రైతు కార్లపాటి వినోద్. నాలుగెకరాల విస్తీర్ణంలో పందిళ్లపై హారిగాయ సొరసాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.1.70 లక్షల ఖర్చుతో (గ్రానైట్ రాళ్లు, వెదురు బొంగులు, ఇనుప తీగలు, ప్లాస్టిక్ తాళ్లు వినియోగించి) పందిళ్లు వేయించారు. మొత్తం పదెకరాల్లో సొర, కాకర, బీర, పొట్ల, దోసపాదులు పెట్టి డ్రిప్ పద్ధతిలో నీటిని వినియోగిస్తున్నారు. తొలుత ట్రాక్టర్‌తో దోడేలు వేయించారు. కలుపు బెడద లేకుండా మల్చింగ్ పేపరు ఉపయోగించారు. కంపోస్టు ఎరువుతో పాటు వాపామాలు ఎరువు వాడుతున్నారు. సస్యరక్షణ సక్రమంగా ఉంటే 60 రోజుల్లో తొలికోత వస్తుంది. తెగుళ్లు తక్కువగా ఉండటం, నాణ్యమైన దిగుబడులు ఎక్కువ రోజులు వచ్చే రైతు లాభాలు ఆర్జిస్తున్నారు.

ఖర్చు ఎక్కువైనా..: పందిరి సాగుకు తొలుత ఎక్కువ ఖర్చవుతుంది. ఒకసారి పందిరి వేసుకుంటే నాలుగేళ్లపాటు పనిచేస్తుంది. ప్రస్తుతం రెండెకరాల్లో సొర సాగు చేస్తున్నా. నెలలో రోజు మార్చి రోజు 15సార్లు కోత కోస్తున్నాం. ప్రతి కోతకు రెండు వేల కాయలు తెగుతున్నాయి. మాకు నెలసారిగా దిగుబడి వస్తుంది. గుంటూరు మార్కెట్‌లో వీటిని విక్రయిస్తున్నాం. ఖర్చులు పోను ఎకరాకు రూ.1.50 లక్షల మిగులు కనిపిస్తుందని రైతు వినోద్ తెలిపారు.

పందిరిపై కాసిన సొరకాయలు

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT.వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq.Yards గజాలు Site 10,000+Sq.Ft విల్లా అమ్మకమునకు కలదు. నోబ్రోకర్స్ Ph.99662 28370.

JOBS

Wanted area SalesManager. Qua:Inter/Degre. Min Exp. 2Yrs in building Material Industry. Sal: 25K. Ema Timbers, Gnt. 9989920203.

Wanted Sales Executives For Guntur, Ongole for Mahesh Extruions (P) Ltd Bellari Send Your Resumes maheshpvcpipes@gmail.com.

LG ఆథరైజ్డ్‌డీలర్, పద్మకేశవ సర్వీసెస్, మంగళగిరివారికి డిగ్రీ అర్హత, కంప్యూటర్ అనుభవమున్న లేడీ డేటాఎంట్రీ ఆపరేటర్స్, ITI/డిప్లొమో అర్హతగల హెల్పర్స్ కావలెను. 9542992200.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. జీతం : 10000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు : ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించండి ఫోన్ 8978480435.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్, క్లాసు ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు : ఇంటర్ నుండి పి.జి వరకు. వయస్సు 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యుండాలి. సంప్ర. ఫోన్ నెంబర్ : 8978480429.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Computer Operatorగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు : any Degree, 55 wpm Typing Speed, M.S Office Skils, వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర ఫోన్: 89784 80429.

గుంటూరు ఆర్.టి.సి కాలనీలోని ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సం॥సెల్: 80740 28964.

వంట మాస్టార్లు భార్య భర్తలు కావలెను వసతి కలదు, వరంగల్ సిటీలోని ప్రైవేటు మెడికల్ కాలేజిలో వంటచేయుటకు. ✆ 9390809999, 9849235255.

లలిత కోల్డ్ స్టోరేజి, ప్రత్తిపాడునకు గుమస్తా కావలెను. జీతం: 14,000/-. Age: 30Y, లలిత కోల్డ్ స్టోరేజి ఆఫీస్, జూనియర్ కాలేజ్ ప్రక్కన, ప్రత్తిపాడు.

గుంటూరు అరండల్‌పేటలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారికి 10th అర్హత కలిగి స్వంత సైకిల్ ఉన్న ఆఫీసు బాయ్ కావలెను. సంప్ర॥ 9391526523.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

బీఈఎస్‌లో 6జీ పరిశోధనాశాల

ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న బీఈఎస్ ఛైర్మన్ శ్రీనివాసరావు, కార్యదర్శి నాగేశ్వరరావు

బాపట్ల, న్యూస్‌టుడే: హేచినాయిక్స్ బహుళజాతి కంపెనీ భాగస్వామ్యంతో బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్రంలో తొలి 6జీ పరిశోధన అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బీఈఎస్ ఛైర్మన్ ముప్పలనేని శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 3న 6జీ పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. పరిశోధనలు, నూతన ఆవిష్కరణల కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ 6జీ సాంకేతికత అందుబాటులోకి వస్తే సమాచార సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని, డేటా వేగం పెరుగుతుందన్నారు. ఐవోటీ, కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కరస్పాండెంట్ దొడ్డపనేని వెంకయ్య చౌదరి, పాలకవర్గ సభ్యుడు కొమ్మినేని హరిపద్మ, కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, ఈసీఈ విభాగాధిపతి చంద్రమోహన్, డీఎస్‌పీ నిరంజన్‌బాబు పాల్గొన్నారు.

పాతకక్షలతో యువకుడి దారుణ హత్య

జగదీశ్వర్‌రెడ్డి

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: పాతకక్షల నేపథ్యంలో యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన పేట్‌బషీరాబాద్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కె.విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చీరాల ప్రాంతానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి(26) తల్లిదండ్రులతో కలిసి సూరారంలో నివాసం ఉంటాడు. అతనికి సుభాష్‌నగర్‌లో ఉంటున్న సోహెల్(21)తో స్నేహం ఏర్పడింది. ఇద్దరూ కలిసి అప్పుడప్పుడూ మద్యం తాగి గొడవ పడుతుండేవారు. ఇది మనసులో పెట్టుకున్న సోహెల్ జగదీశ్వర్ రెడ్డిని హత్య చేయలని పథకం రచించాడు. ఆదివారం సాయంత్రం అతన్ని సుభాష్‌నగర్‌కు పిలిపించాడు. అప్పటికే సోహెల్ మరో మిత్రుడితో కలిసి మద్యం తాగి జగదీశ్వర్ రెడ్డి రాగానే అతనితో గొడవకు దిగి కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని ఆసుపత్రికి తరలించేలోగా అప్పటికే మృతి చెందాడు. నిందితుడు సోహెల్‌ను అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పక్కా ప్రణాళిక ప్రకారం అతడిపై హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీడీవో కారుకు ప్రమాదం.. డ్రైవర్‌కు గాయాలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం ఎంపీడీవో కె.ధనలక్ష్మి కారు సోమవారం సాయంత్రం ప్రమాదానికి గురైంది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికంగా వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఒంగోలులోని ఇంటికి కారులో ఎంపీడీవో వెళుతున్నారు. ఆమెతో పాటు సీనియర్ అసిస్టెంట్ నిర్మల, టైపిస్ట్ బిందు ఉన్నారు. నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామ సమీపంలోని సీజీ కళాశాల వద్దకు వెళ్లేసరికి కారుకు సమస్య వచ్చింది. దీంతో డ్రైవర్ శివబ్రహ్మయ్య దిగి ముందు భాగంగా మరమ్మతులు చేస్తుండగా వెనుకనుంచి మరో కారు ఢీకొంది. డ్రైవర్‌కు గాయాలుకాగా, లోపల కూర్చున్న ముగ్గురిలో బిందుకు స్వల్ప గాయమైంది. కారు వెనుక భాగం దెబ్బతింది. డ్రైవర్‌ను 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా ఎంపీడీవో వెంట వెళ్లారు. దీనిపై కేసు నమోదు చేశారు.

ఆటోనగర్ స్థలాలు సభ్యులకు కేటాయించాలి

తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సభ్యులు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల మండలం ఈపూరుపాలెం ఆటో నగర్‌లోని స్థలాలు గతంలో నగదు చెల్లించిన సభ్యులకు కేటాయించాలని సభ్యులు డిమాండ్ చేశారు. చీరాల రెవెన్యూ కార్యాలయం ముందు సోమవారం వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. చీరాల ఆటోమొబైల్ యూనియన్ 40 ఏళ్ల పాటు ఆటోనగర్ స్థలాలను దురాక్రమణదారులు, ఇసుక వ్యాపారుల నుంచి కాపాడితే అధికారులు ఇప్పుడు బయట ప్రాంతాల వారికి ఇవ్వడం సరికాదన్నారు. కోర్టులో దీనిపై రెండు కేసులు నడుస్తున్న నేపథ్యంలో వెంటనే అక్కడ నిర్మాణాలు నిలిపివేయాలని కోరారు. తాము గతంలో అధికారులకు డీడీలు, చలానాల రూపంలో రూ.లక్షలు చెల్లించామన్నారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం డీటీ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం అందించారు. యూనియన్ కార్యదర్శి శంకరరావు, ఉపాధ్యక్షుడు బాషా పఠాన్, సభ్యులు పాల్గొన్నారు.

వాజ్‌పేయీ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

బాపట్ల, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహాన్ని పడమర బాపట్లలో 216 ఏ ఎన్‌హెచ్, బైపాస్ కూడలిలో ఏర్పాటుకు సోమవారం శంకుస్థాపన, భూమి పూజ చేశారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, మాజీ ఎమ్మెల్సీ సతీష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆర్డీవో గ్లోరియా అధికారులను ఆదేశించారు. మండలంలోని ఖాజీపాలెం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం రామ్‌నగర్ వద్ద తెనాలి డ్రెయిన్‌ను పరిశీలించి తహసీల్దార్ వెంకటేశ్వరరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు.

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా చింతయ్య

నగరం: భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కారంకివారిపాలెం గ్రామానికి చెందిన యార్లగడ్డ చింతయ్య నియమితులయ్యారు. జిల్లా కార్యవర్గం ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం ఆయన తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందని, జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 118, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -113 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, 135, 146 చికెన్ విత్ స్కిన్ - 236 చికెన్ స్కిన్‌లెస్ - 246.

మూడోస్థానంలో చీరాల జట్టు

మైలవరం : ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ వాలీబాల్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఒంగోలులోని క్యూఐఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు, నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల జట్టు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. మూడో స్థానాన్ని చీరాలలోని సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల, వీఆర్ సిద్ధార్థ కళాశాల జట్లు సంయుక్తంగా సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

ఇండియన్ బ్యాంక్, రేపల్లె బ్రాంచి
పి.బి.నెం.3, 5-30-11, బ్యాంక్ స్ట్రీట్, రేపల్లె, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-522265.

APPENDIX-IV-A [See Provision to rule 8(6) / 9(1)]*

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)/9(1) [illegible]

[illegible] తేది.01.12.2025 నాటికి రూ.1,42,67,306/- [illegible]

తనఖాపెట్టబడిన ఆస్తుల వివరాలు [illegible]

ఆస్తిపై ఎన్‌కంబరెన్స్	[illegible]
రిజర్వు ధర	రూ.90,00,000/-
బయానా మొత్తం	రూ.9,00,000/-
బిడ్ పెంపుదల మొత్తం	రూ.10,000/-
ఇ-వేలం తేది మరియు సమయం	తేది: 19.12.2025, సమయం: ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
ఆస్తి ఐడి	IDIB896676793

బిడ్డర్లు ఆన్‌లైన్ బిడ్లో పాల్గొనుటకు మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ (https://baanknet.com) ను సందర్శించవలెను. సాంకేతిక సహాయం కోసం దయచేసి PSB Alliance హెల్ప్‌లైన్ నెంబర్ 8291220220, email ID: support.baanknet@psballiance.com [illegible] EMD స్థితి కోసం దయచేసి support.baanknet@psballiance.com ను సంప్రదించండి. [illegible] https://baanknet.com [illegible]

తేది: 01.12.2025, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

మహిళల జీవనోపాధికి తోడ్పాటు

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: అతివల జీవనోపాధికి మహిళా సమాఖ్య ద్వారా చేయూత అందిస్తున్నట్లు మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డా.శరత్ బోస్ అన్నారు. మహిళా సమాఖ్య ప్రథమ వార్షికోత్సవాన్ని స్థానిక ఏకే హౌస్‌లో సోమవారం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షురాలు కోలా పద్మజ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎస్సై అనిత మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. శక్తి యాప్‌ను ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకుంటే అత్యవసర సమయంలో పోలీసుల భద్రత లభిస్తుందన్నారు. ప్రముఖ యోగా గురువు మంజులతను సత్కరించారు. మానవతా సంస్థ అధ్యక్షుడు పంగులూరి హరిప్రసాద్, వైస్ చైర్మన్ శాంతారామ్, ప్రధాన కార్యదర్శి గుంజాల శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య కార్యదర్శి అనంతకమారి, ఉపాధ్యక్షురాలు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

కావూరు (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని కావూరు పీఏసీఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ పద్మావతి సోమవారం ప్రారంభించారు. సొసైటీ పరిధిలోని రైతులు ఈ కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యం విక్రయించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏవో ఫరూక్, సొసైటీ ఛైర్‌పర్సన్ మండవ తాతాజీ, సీఈవో శ్రీరామయ్య, వీఏఏ పృథ్వీ, నేతలు నాగళ్ల గోపాల్, మక్కా కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

వాయుసేనా కేంద్రంలో క్షిపణి పరీక్షలు

బాపట్ల, న్యూస్‌టుడే: సూర్యలంక వాయుసేనా కేంద్రంలో క్షిపణి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు వరకు పరీక్షలు నిర్వహించారు. వాయుసేనా కేంద్రంలోని భూతలం నుంచి సముద్రంలోని గగనతలంలో ఉన్న నిర్దేశిత లక్ష్యాలను క్షిపణులు ఛేదించాయి. సూర్యలంక సముద్ర తీరంలో ఆంక్షలు విధించారు.

400 మందికి వైద్య సేవలు

శిబిరంలో అధికారులు, వైద్యులు, తెదేపా నేతలు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగడంతోపాటు ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా నేత అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె వీరపల్లి కొలయ్య కల్యాణ మండపంలో సోమవారం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సఖి సురక్ష ఉచిత వైద్య శిబిరంలో 35 నుంచి 60 ఏళ్ల వయసున్న 400 మంది మహిళలకు 16 రకాల వైద్య పరీక్షలు చేశారు. కమిషనర్ కార్ల సాంబశివరావు, వైద్యులు సురేందర్, హరిప్రసాద్, నీలిమ, శ్రావణి, మెప్మా టీఎంసీ బాబు, సీవో రాజేంద్ర, లక్ష్మీనరసమ్మ, నాగలీల, జయప్రద ఆర్పీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో నగర సంకీర్తన

చెరుకుపల్లి, న్యూస్‌టుడే : సమరసత సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చెరుకుపల్లి సంతబజారులోని మందిరంలో గీతాజయంతిని ఘనంగా నిర్వహించారు. మందిరంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని పూలదండలతో అలంకరించారు. మహిళలు పెద్దసంఖ్యలో హాజరై సామూహిక గీతాపారాయణ చేశారు. అనంతరం జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిగ్రామంలో ఏకాదశి పర్వదినాన నగర సంకీర్తన జరిపేందుకు భక్తులు శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, డివిజన్ ధర్మప్రచారక్ చింతల మురళీకృష్ణ, గీతామందిరం సభ్యులు బి నాగలక్ష్మి, గొల్లపూడి మురళీకృష్ణ పాల్గొన్నారు.

నీటి సమస్య... తీర్చాలి మరి

రైలుపేట (బాపట్లటౌన్) న్యూస్‌టుడే: పట్టణంలోని మూలపాలెం రోడ్డులోని కాలనీలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో నాలుగు రోజులకు, వారానికి ఒకసారి మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా ఇళ్ల సమీపంలో ఉన్న డబ్బాల్లో నీళ్లు పోసి వెళుతున్నారు. అవి రెండు రోజులకు మించి రావటం లేదు. నీటి కొరతతో తాగునీటికి, స్నానానికి, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. రైలుపేట సమీపంలోని ఉప్పరపాలెం, సాకలపాలెం, ఇస్లాంపేట, అంబేడ్కర్ నగర్, జగన్ కాలనీల నీటి సమస్య తీర్చేందుకు రూ.2 కోట్లతో ట్యాంక్ నిర్మించారు. పట్టణంలోని ఆయా ప్రాంతాలకు ఇంకా పైపులు ఏర్పాటు చేయకపోవడంతో కనెక్షన్లు ఇవ్వలేదని వాటర్ ట్యాంకును ప్రారంభించలేదు. అలానే మూలపాలెం పంచాయతీ గాదె వెంకటరెడ్డి ఎస్టీ కాలనీలో 40 కుటుంబాలకు ఒకే కుళాయి ఉండటం, చేతిపంపు కూడా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని వాటర్ ట్యాంక్

ట్యాంకరొస్తేనే నీళ్లు

మున్సిపాలిటీ ట్యాంకర్ల ద్వారా అందించే నీళ్లు సరిపోవటంలేదు. ట్యాంకర్లు వస్తేనే కాలనీకి నీళ్లు అన్నట్లు పరిస్థితి ఉంది. అవీ కూడా సరిపోవటంలేదు. అధికారులు పట్టించుకుని కాలనీకి పైపులైను వేసి కుళాయిల ద్వారా నీళ్లు ఇవ్వాలి.

- యశోద, జగన్ కాలనీ

వీధిలైట్లు వెలగడం లేదు

కాలనీలో ఒక్కటే నీటి పంపుతో అవస్థలు పడుతున్నాం. వీధి లైట్లు వెలగటంలేదు. పాములు తిరుగుతుండటంతో రాత్రిల్లో ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నాం. అధికారులు పట్టించుకుని వీధిలైట్లు ఏర్పాటు చేయాలి. నీటి సమస్యను పరిష్కరించాలి.

- యంకాయమ్మ, గాదె వెంకటరెడ్డి ఎస్టీకాలనీ

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

రహదారులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

గోవాడ, (అమృతలూరు), చెరుకుపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గోవాడలో ఆయన సోమవారం రూ.30లక్షలతో నిర్మించిన మూడు పక్కారహదారులను లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల తెదేపా అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు, సర్పంచి మండవ విజయలక్ష్మి, ఉప్పల వెంకటరామయ్య, తుమ్మల జగదీష్, కొత్తపల్లి మ్యాథ్యూస్, పావులూరి సుబ్బారావు, మండవ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

★ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని రాష్ట్ర తెదేపా కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అధికారులతో కలిసి భట్టిప్రోలులో పంపిణీ చేశారు. ★ చెరుకుపల్లి మండలంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు నగదు అందజేశారు. మిగిలిన వారికి కూడా అందజేస్తామని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆందోళన

కొల్లూరు, న్యూస్‌టుడే: బాధితుడికి న్యాయం చేయాలంటూ కొల్లూరులో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సోమవారం ధర్నాచేశారు. ఓ ప్రైవేటు సంస్థలో క్యాషియర్‌గా పనిచేస్తున్న సతీష్ బాబు 16 గ్రాముల బంగారు గొలుసు మేనేజర్‌కు ఇచ్చిన విషయంలో వివాదం నెలకొందని, దీనిపై బాధితుడు గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు చెప్పారు. సీసీ టీవీ ఫుటేజ్ ఇవ్వకుండా మేనేజర్ తాత్సారం చేశారని, బాధితుడికి మద్దతుగా ధర్నాకు దిగినట్లు చెప్పారు. సీఐ వీరాంజనేయులు హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

అవీ ఇవీ

సచివాలయాల అధికారి బాధ్యతలు

భట్టిప్రోలు: గ్రామ వార్డు సచివాలయాలకు ప్రత్యేక అధికారిగా నియమితులైన బి. మల్లికార్జునరావు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన చెరుకుపల్లి పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై భట్టిప్రోలుకు వచ్చారు. **చెరుకుపల్లి:** చెరుకుపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా అబ్దుల్ రహమాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. వేమూరు మండలం జంపని పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై చెరుకుపల్లి మండలానికి బదిలీపై వచ్చారు.

సాధన మండలిలో కర్పూర యజ్ఞం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో గీతా జయంతి పురస్కరించుకొని రెండో రోజు సోమవారం కర్పూర యజ్ఞం జరిగింది. ఆశ్రమం అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి, సభ్యులు శ్రీకృష్ణుడుని పూజించి భగవద్గీత పారాయణం చేశారు.

నమూనా పుస్తకాల పంపిణీ

వెల్లటూరు(భట్టిప్రోలు), న్యూస్‌టుడే : మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు రూపొందించిన నమూనా పరీక్ష పుస్తకాలను సోమవారం ఎంఈవో నీలం దేవరాజ్ ఆవిష్కరించి పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయురాలికి అవార్డు

బాపట్లటౌన్, న్యూస్‌టుడే : పేరలి ఎంపీపీఎస్ మోడల్ స్కూల్ పాఠశాల ఉపాధ్యాయురాలు విజయలక్ష్మికి తెలంగాణలో శారదా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఇచ్చే నేషనల్ ఇన్‌స్పిరేషన్ అవార్డును హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నుంచి అవార్డు అందుకున్నారు.

నిందితులను శిక్షించాలి

రేపల్లె అర్బన్: గంజాయిని నిర్మూలించాలని సీపీఎం రేపల్లె కార్యదర్శి సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. రేపల్లె ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో సోమవారం నెల్లూరులో సీపీఎం నేత పెంచలయ్యను హత్య చేసినవారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఇంటూరు, (అమృతలూరు): పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మైనేని రత్నప్రసాద్ అన్నారు. ఇంటూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గ్రంథాలయ పుస్తకాలను పర్యవేక్షించారు.

పాఠశాలలో ల్యాబ్ ప్రారంభం

అమృతలూరు: అమృతలూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం సమగ్ర శిక్షా(బాపట్ల) ఆధ్వర్యంలో పర్సనల్ ఎడాప్ట్ లెర్నింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. 30 ట్యాబులను ల్యాబ్‌లో అమర్చారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు తెలుగు, ఆంగ్లం, గణితం పాఠ్యాంశాలకు సంబంధించిన పలురకాల వీడియోలున్నాయని, ప్రశ్నాపత్రాలను ట్యాబుల్లో పొందుపరిచినట్లు సాంకేతిక సహాయకుడు సత్యనారాయణ తెలిపారు.

అయ్యప్పలకు అన్నదానం

బాపట్ల: అయ్యప్ప స్వామికి సేవ చేసే భాగ్యం కలగటాన్ని అదృష్టంగా భావిస్తున్నానని భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ అన్నారు. సోమేశ్వర స్వామి ఆలయంలో అన్నం సతీష్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పలకు అన్నదానం కార్యక్రమం జరిగింది. 21 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. దేవస్థానం ఛైర్మన్ రామసుబ్బారావు, గురుస్వామి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శంకర విద్యాలయ వార్షికోత్సవం

బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: శంకర విద్యాలయంలో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యాలయ ఉపాధ్యక్షుడు బాబూనాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

మానవహారంలో అధ్యాపకులు, విద్యార్థులు

నగరం, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని శ్రీవెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. అనంతరం నగరం ప్రధాన రహదారిలో మానవహారం చేపట్టారు. ★ రేపల్లె అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్, రెడ్‌రిబ్బన్ క్లబ్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మానవహారం, రెడ్‌రిబ్బన్ ప్రదర్శన నిర్వహించారు. ★ అమృతలూరు ఇంటూరులోని ప్రాథమిక వైద్యశాలలో ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

విజేతలకు బహుమతుల అందజేత

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

రేపల్లె అర్బన్: రేపల్లె ఓరియంట్ ఉన్నత పాఠశాలలో సోమవారం గీతా జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల్లో విజేతలకు పలువురు దాతల సహకారంతో బహుమతులు అందజేశారు. లక్ష్మీనారాయణభట్టాచార్యులు, పానకాలాచార్యులు, రాజీవాక్షి, రామకృష్ణ, భాస్కరరావు, లక్ష్మణశర్మ, రాధాకృష్ణమూర్తి, రామచంద్రుడు, సుబ్బారావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయుడు శేషతల్పసాయి, హరిఅన్నయ్యశాస్త్రి, రఘురాం, సుభాషిణి, వరప్రసాద్ పాల్గొన్నారు.

సమాజానికి యువ మేధస్సు అవసరం

బాపట్లటౌన్, న్యూస్‌టుడే : యువ మేదస్సు భారత సమాజానికి అవసరమని సమరస్త వేదిక కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవేకింగ్ యంగ్ మైండ్ అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎంతో చురుకుగా స్పష్టమైన ఆలోచనలతో ఉండాలని, చదువులో ఉన్నతంగా రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ టీఈజీకే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

అస్తవ్యస్తంగా బల్లికురవ కూడలి

న్యూస్‌టుడే, బల్లికురవ, అద్దంకి

కూడలి వద్ద రోడ్డుపైనే మురుగునీరు

గ్రానైట్ క్వారీలు, వివిధ రాష్ట్రాల కూలీలతో కళకళలాడే మండలం కేంద్రం బల్లికురవ అభివృద్ధిలో మాత్రం వెనుకబాటు కనిపిస్తోంది. మండలంలోని సనకొండ వద్ద ఖరీదైన గ్రానైట్ నిక్షేపాలున్నాయి. విరామం లేకుండా కార్మికులు గ్రానైట్ క్వారీల్లో పనులు చేస్తుంటారు. అందులో నుంచి వెలికితీసిన రాళ్లను రాత్రింబవళ్లు వాహనాల్లో మార్టూరు, ఒంగోలు, నరసరావుపేట తరలిస్తుంటారు. వీటికి అదనంగా పలు దుకాణాలు వెలిశాయి. అల్పాహార, భోజనశాలలు ఏర్పాటు చేశారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన బల్లికురవలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ఒక్క బస్సు లోపలకు వెళ్లే అవకాశం లేదు. చుట్టు పక్కల భూమిని స్థానికులు ఆక్రమించారు. సాయంత్రమైతే అపరిచిత వ్యక్తులు బస్టాండ్ ప్రాంతంలో తలదాచుకుంటున్నారు.

కళావిహీనంగా.. మూడు దశాబ్దాలుగా బల్లికురవ కూడలి నిరంతరం సందడిగా ఉండేది. నాలుగు రోడ్ల కూడలికి నలుదిక్కులా అన్నిరకాల దుకాణాలు, విద్యాలయాలు కొనసాగాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నేతల ఆగ్రహంతో దుకాణాలను పూర్తిగా తొలగించారు. అదేమంటే ప్రభుత్వ భూమిని ఆక్రమించారంటూ తొలగించారు. తిరిగి నిర్మిస్తామంటూ హామీ ఇచ్చారు. అనంతరం రంగ ప్రవేశం చేసిన నేతలు తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిన పూర్వ వైభవం సంతరించుకోలేదనేది నిర్వివాదాంశం. ప్రస్తుతం నాలుగు రోడ్ల కూడలి పూర్తి ఇరుకుగా మారింది. సైడు కాలువల్ని తవ్వారు, మట్టి కుప్పలు పోసి వదిలేశారు. దీంతో కొద్దిసేపు నిలబడాలన్నా వీలు కాని పరిస్థితి. బల్లికురవ అభివృద్ధి విషయమై కొంతమంది స్థానికులు పాలకులపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.. ప్రజా సమస్యలు పట్టించుకోకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా మండల కేంద్రం బల్లికురవ శాశ్వత అభివృద్ధికి చర్యలు తీసుకునే వారి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

రాయితీపై ట్రాక్టర్ అందజేత

మైలవరం(అద్దంకి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయదారులకు రాయితీపై ఉద్యాన యాంత్రీకరణలో భాగంగా యంత్ర పరికరాలు, యంత్రాలు అందిస్తోందని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి రవికుమార్ అన్నారు. ఉద్యాన శాఖ ద్వారా మైలవరం శివారు ఏలేశ్వరపాలెం గ్రామానికి చెందిన సోమబత్తిన బుల్లియ్యకు మినీ ట్రాక్టర్‌ను అందించారు. దీని ఖరీదు రూ.5.25 లక్షలు ఉండగా ప్రభుత్వం రూ.రెండు లక్షలు రాయితీ అందించింది. దీంతో రూ.3.25 లక్షలు రైతు వాటాగా చెల్లించారు.

జిల్లాస్థాయి కౌశల్ పోటీల్లో ప్రథమం

షాహుల్ హమీద్

చెరుకూరు (పర్చూరు), న్యూస్‌టుడే: జిల్లాస్థాయి కౌశల్ పోటీల్లో చెరుకూరు ఎన్ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్.కె షాహుల్‌హమీద్ ప్రథమస్థానం సాధించినట్లు హెచ్ఎం బెంజిమెన్ హనూక్ సోమవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో జరిగే ఈ పోటీల్లో జిల్లాలో ప్రథమస్థానాన్ని సాధించాడని, ఈనెల 27న తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని సైన్స్ ఉపాధ్యాయినులు అనిత, స్వర్ణలత తెలిపారు.

బస్సు ఆగదు.. బాధలు తీరవు

సంతమాగులూరు, న్యూస్‌టుడే

సంతమాగులూరులోని ప్రభుత్వ కార్యాలయ సముదాయ ప్రాంతం

ఆర్టీసీ బస్సు ఆగదు.. బాధలు తీరవు ఇది మండల కేంద్రం సంతమాగులూరులోని ప్రభుత్వ కార్యాలయ సముదాయ ప్రాంతంలో ఉన్న పరిస్థితి. అమరావతి-అనంతపురం జాతీయ రహదారి ఇటుగానే వెళుతోంది. దగ్గరలో పుట్టావారిపాలెం కూడలి నుంచి అద్దంకి-ఒంగోలు వెళ్లే నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారి అనుసంధాన మార్గం ఉంది. సంతమాగులూరు మండల కేంద్రం మీదుగా నిత్యం నరసరావుపేట, అద్దంకి ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నడుస్తోంది. రోడ్డుకు మరోవైపున ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల నడుస్తున్నాయి. ఆ పక్కన ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. 60 వేల మందికి పైగా జనాభా ఉన్న మండలంలో నిత్యం వందల సంఖ్యలో ప్రజలు, ఉద్యోగుల ప్రభుత్వ కార్యాలయ సముదాయానికి రాకపోకలు సాగిస్తుంటారు. రెవెన్యూ, మండల పరిషత్తు, ఐసీడీఎస్, వెలుగు, ఉపాధి హామీ, ఎన్నెస్పీ, పశు వైద్యశాల, ఎంఈవో, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఈ ప్రాంగణంలో నడుస్తున్నాయి. వీటికి ప్రజలతోపాటు ఉద్యోగ సిబ్బంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం ఈ కార్యాలయాల సముదాయ ప్రాంగణానికి కి.మీ దూరంలో ఉంది. దీంతో ఆర్టీసీ సర్వీసులు కొన్ని వీటి వద్ద నిలపకుండా బస్టాండ్ దగ్గర ఆపడంతో ప్రజలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా బస్సు ఎక్కాలంటే గంటల తరబడి ఈ ప్రాంతంలో పడిగాపులు కాయాల్సి వస్తోందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళుతున్న రోగులు చెబుతున్నారు. సమీప ఆర్టీసీ డిపోల ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంగణ ప్రాంతంలో ఆర్టీసీ సర్వీసులు నిలిపి ప్రయాణికుల్ని ఎక్కించుకోవడం, దించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆపేలా చర్యలు

మండల కార్యాలయ సముదాయ ప్రదేశం వద్ద ప్రయాణికులు చెయ్యెత్తినపుడు ఆర్టీసీ బస్సులు నిలిపేలా తక్షణం చర్యలు తీసుకుంటాం. ఎవరైనా బస్సు ఆపకుండా వెళితే ఆ బస్సు నంబరు వెంటనే తెలియజేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– మహబూబీ, డీఎం, అద్దంకి డిపో

విద్యార్థికి పసిడి పతకం అందజేత

వలపర్ల(మార్టూరు): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థి తన్నీరు అఖిలరాజ్ 470 గానూ 465 మార్కులు సాధించడంపై రాష్ట్ర మంత్రి గొట్టి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, దామచర్ల జనార్దనరావులు అభినందించారని వలపర్ల ఎంఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. సోమవారం ఒంగోలులో జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థికి వీటిని అందజేశారని చెప్పారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

నగదు అందజేస్తున్న ఛైర్మన్ సాంబశివరావు, పక్కన ఎమ్మెల్యే కొండయ్య

లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

చీరాల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే సాయికాలనీ, రామన్నపేట, పట్టణంలోని 5వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు నగదు అందజేశారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ పింఛన్ల పెంపు వృద్ధుల్లో ఆత్మవిశ్వాసం నింపిందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, ఏఎంసీ ఛైర్మన్ కె.జయచంద్ర, కమిషనర్ రషీద్, పట్టణాధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా మహేంద్రనాథ్ జన్మదిన వేడుకలు: తెదేపా అధికార ప్రతినిధి, యువనేత ఎం.మహేంద్రనాథ్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు నిర్వహించారు. భారీ కేకులు కోసి, పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అనాథ, వృద్ధ శరణాలయాల్లో అన్నదానాలు చేశారు.

ప్రతి పథకంపై ప్రత్యేక పర్యవేక్షణ

సూరవరపుపల్లి (యద్దనపూడి): దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తోందని, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం పారదర్శకంగా ఎవరికీ ఇబ్బంది లేకుండా అందేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. సోమవారం మండలంలోని సూరవరపుపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలో నూతనంగా 80 మందికి పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం రేషన్ సరుకుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో చేపట్టిన సైడ్ కాలువల పనులను పరిశీలించారు.

పర్చూరు, కారంచేడు: పర్చూరు నేతాజీ వృద్ధుల ఆశ్రమంలో ఎంపీడీవో వి.ప్రద్యుమ్నకుమార్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షంషుద్దీన్, కారంచేడులో ఎంపీడీవో నేతాజీ, పంచాయతీ కార్యదర్శి రమేష్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

జె.పంగులూరు: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 7810 గాను 7280 పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. ముప్పవరంలో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కుక్కపల్లి ఏడుకొండలు, అధికారులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. పంగులూరులో పార్టీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ పంపిణీ చేశారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

వేటపాలెం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. నూతన అధ్యక్షురాలుగా కె.సరళదేవి, ఉపాధ్యక్షులుగా ఎం.బ్రహ్మనందరెడ్డి, బాబావలి, లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శిగా బుద్ది భద్రయ్య, కార్యదర్శులుగా డి.హేమంత్ కుమార్, ఎం.శేఖరరావు, ఎస్.వి.శివయ్య, సీహెచ్ శ్రీహరి, అన్నపూర్ణ, జిల్లా కౌన్సిలర్లుగా జి.శ్రీనివాసరావు, ఎస్ఏవీ శ్రీనివాస్, బి.మోహనరావు, కె.బాస్కర్, పి.బ్రహ్మయ్య, డి.వి.ఆర్.నాగరాజు, నాగరత్నమ్మ, ఆడిట్ కమిటీ కన్వీనరుగా గుత్తి మురళీకృష్ణ ఎన్నికయ్యారు. పరిశీలకులుగా బుర్రా సాంబశివరావు వ్యవహరించారు.

సొంత నిధులతో డొంకరోడ్డు అభివృద్ధి

పొక్లెయిన్‌తో చిల్ల చెట్లు తొలగింపు

పూనూరు (యద్దనపూడి), న్యూస్‌టుడే: తుమ్మ పొదలు ఏపుగా పెరిగి, వానలకు మట్టి చుట్టుకుంటూ, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుండడంతో డొంక రోడ్డు అభివృద్ధికి సొంత నిధులతో రైతులు ముందుకు కదిలారు. మండలంలోని పూనూరు సినిమా హాలు సమీపంలోని తూర్పు పొలాల్లో వెళ్లే డొంకలో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్న అన్నదాతలు డొంకలో కమ్ముకుపోయిన తుమ్మ పొదలు, చిల్లచెట్లను తొలగించేందుకు పొక్లెయిన్‌తో పనులు చేపట్టారు. సుమారు 1.5 కిలోమీటర్ల పొడవున్న రోడ్డుకు ఇరువైపులా పొదలు తొలగించి, గుంతలు పూడ్చారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయని, అధికారులు, పాలకులు గ్రావెల్‌తో పర్మినెంట్ మార్గం సుగమం చేస్తారని కర్షకులు ఎదురు చూస్తున్నారు.

ఉపాధ్యాయులకు ఆటవిడుపు

బ్యాటింగ్ చేస్తున్న ఎంఈవో పున్నయ్య

పాపరాజుతోట (చీరాల అర్బన్), మేదరమెట్ల, న్యూస్‌టుడే: నిత్యం విద్యాబోధనలో నిమగ్నమయ్యే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆటల పోటీలు ఏర్పాటు చేయడం, వారికి ఆట విడుపుగా ఉంటుందని మండల విద్యాశాఖాధికారి పి.సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం ఉపాధ్యాయులకు మండల స్థాయి ఆటల పోటీలను స్థానిక ఎస్ఆర్ అండ్ పీఎం ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు సాల్మన్, క్రీడల సమన్వయకర్త పి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రాణి, రామిరెడ్డి, లావణ్య, సీతారామరాజు, భిక్షాలు, సుబ్బారావు, రంగారావు పాల్గొన్నారు. ★ కొరిశపాడు మండలం మేదరమెట్లలోని సెయింట్ ఆర్నాల్డ్స్ పాఠశాలలో ఉపాధ్యాయుల క్రీడా పోటీలు సందడిగా జరిగాయి. పోటీలను ఎంఈవో లాలం పున్నయ్య ప్రారంభించారు. ఉపాధ్యాయులు క్రికెట్ ఆడారు. మండల స్పోర్ట్స్ సమన్వయకర్త ఎస్కే కాజావలి పోటీలను పర్యవేక్షించారు.

భగవద్గీత పోటీల్లో బంగారు పతకం

పర్చూరు: జటిలేశ మైసూర్ అవధూత దత్తపీఠం ఆధ్వర్యంలో జరిగిన భగవద్గీత ఆన్‌లైన్ పోటీల్లో పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరుకు చెందిన కోట ప్రసన్న బంగారు పతకాన్ని సాధించారు. మైసూర్ దత్తపీఠంలో సోమవారం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి, కోట ప్రసన్న శ్రీనివాసరావు దంపతులకు పసిడి పతకం, జ్ఞాపికను అందజేసి ఆశీర్వచనాలు అందించారు.

రెస్టారెంట్లు, దాబాల్లో తనిఖీలు

ఈనాడు స్పందన

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు రెస్టారెంట్లు, దాబాల్లో ఎక్సైజ్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. 'ఈనాడు'లో ప్రచురితమైన 'అనధికార మద్యం విక్రయాలు' కథనానికి వారు స్పందించారు. సీఐ భవానీ నేతృత్వంలో తనిఖీ చేశారు. ఎలాంటి మద్యం విక్రయాలు, వినియోగం కనిపించలేదని వెల్లడించారు. ఈరోజుతోపాటు అన్ని రెస్టారెంట్లు, దాబాల వద్ద 'మద్యం విక్రయాలు అనుమతించం' అనే బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఎక్కడైనా అనుమతి లేని మద్యం విక్రయాలు, వినియోగాలు ఉంటే 94409 02497 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇళ్ల స్థలాలకు 20 అర్జీలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సోమవారం రెవెన్యూ అధికారులకు బాధితులు 20 అర్జీలు అందజేశారు. తుపాను నేపథ్యంలో పీజీఆర్ఎస్ రద్దు చేశారు. విషయం తెలియక అర్జీలతో వచ్చిన వారి నుంచి డీటీ సూర్యనారాయణ స్వీకరించారు.

వైభవంగా గీతా జయంతి

అద్దంకి: ప్రత్యేక అలంకరణలో స్వామివారు

చీరాల, కారంచేడు, యద్దనపూడి, అద్దంకి.న్యూస్‌టుడే : చీరాల, అద్దంకి గీతామందిరాల్లో సోమవారం శ్రీకృష్ణుడి మూలవిరాట్‌కు పూలాభిషేకం, తులసి దళాలతో అభిషేకం, 18 హోమగుండాలతో హోమం నిర్వహించారు. మండల కేంద్రం కారంచేడు, యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామాల్లోని వశిష్ఠ ఆశ్రమం, శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో గీతాజయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు గీతాపారాయణం చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు

డిప్యూటీ ఎంపీడీవోగా స్వరూపరాణి

ఇంకొల్లు: ఇంకొల్లు డిప్యూటీ ఎంపీడీవోగా స్వరూపరాణి నియమితులయ్యారు. తెనాలి మండలం జగ్గిలికుంట పంచాయతీగా కార్యదర్శిగా పని చేస్తున్న ఆమె పదోన్నతిపై ఇంకొల్లుకు బదిలీ అయ్యారు. సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో శ్రీనివాసరావు స్వాగతం పలికారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
పేరాల బ్రాంచ్-10206, పేరాల, బాపట్ల జిల్లా-523157

ఇ-వేలం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం బ్యాంకుకు చార్జ్ చేయబడిన చర & స్థిరాస్తుల అమ్మకం

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులు తనఖా/చార్జ్, సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి ఉంచబడినవి. సదరు ఆస్తులు అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్ వారిచే లాంఛనాత్మకంగా స్వాధీనత చేసుకోబడి దిగువ నిర్దేశించబడిన నియమ నిబంధనలకు లోబడి "ఎక్కడ ఉన్నది. అక్కడ అలానే" "ఏది ఉంటే అది అలానే" ప్రాతిపదికన దిగువ తెలిపిన వివరముల ప్రకారం ఇ-వేలం వెబ్ పోర్టల్ https://www.baanknet.com ద్వారా విక్రయించబడతాయి.

ఆసక్తిగల కొనుగోలుదారు ఏదైనా బ్యాంకు పనిదినములో సంబంధిత అధికారి గారి ముందస్తు అనుమతితో ఆస్థిని తనిఖీ చేసుకొనవచ్చును.

ఋణగ్రహీత ప్రస్తుత చిరునామా : శ్రీ గెరా ఎనోచ్ రాజీవ్, తండ్రి : గెరా ఆదమ్, ఫ్లాట్ నెం.556, శ్రీ హోమ్స్ అయ్యప్ప సొసైటీ, F9 కిచెన్ పక్కన, మాదాపూర్, షేక్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ-500081.
ఋణగ్రహీత ఆస్తి చిరునామా : శ్రీ గెరా ఎనోచ్ రాజీవ్, తండ్రి : గెరా ఆదమ్, డి నెం.3-16, II.TD హౌసింగ్ కాలనీ రోడ్, 2 టౌన్ పోలీస్ స్టేషన్, కొత్తపేట, చీరాల, బాపట్ల జిల్లా-523157.

NPA: EB-HOME LOAN A/C NO.40191600227, EB-HOME-TOP-UP LOAN A/C NO.41434150786, EB-INSTA-HOME TOP-UP LOAN A/C NO.41300197488

బకాయి మొత్తం : తేది.19.05.2025 నాటికి రూ.63,38,821/- (అక్షరాల అరవై మూడు లక్షల ముప్పై ఎనిమిది వేల ఎనిమిది వందల ఇరవై ఒక్క రూపాయలు మాత్రమే) ప్లస్ తేది.20.05.2025 నుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను.

స్థిరాస్తి వివరములు

శ్రీ గెరా ఎనోచ్ రాజీవ్, తండ్రి : గెరా ఆదమ్ గారి పేరున ఉన్న ఆస్తి రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. 3981/2021, తేది.27.05.2021 ప్రకారం

పాత ప్రకాశం జిల్లా, ప్రస్తుతం బాపట్ల జిల్లా, చీరాల సబ్-జిల్లా, వేటపాలెం మండలం, కొత్తపేట గ్రామం, కొత్తపేట గ్రామ పంచాయితీ, బ్లాక్ నెం.3, డోర్ నెం.3-46-1, I.L.T.D. కాలనీ ఏరియా, కొత్తపేట గ్రామం సర్వే నెం.180/3, ప్లాట్ నెం.18, ఎ. నెం.483 నందు విస్తీర్ణం 226 చ॥గ॥లు లేదా 188.56 చ॥మీ॥లులోని స్థలం మరియు 1200 చ॥అ॥లులోని నిర్మించబడిన ఆర్.సి.సి. రూఫ్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు రెసిడెన్షియల్ భవనం కలదు. హద్దులు : తూర్పు : జిట్టా వెంకట నరసింహా రావు గారి ఆస్తి, 58-00 అ॥లు, దక్షిణం : వేటూరి సుబ్బారావు గారి ప్లాట్ నెం.19 స్థలం, గెరా ఆదమ్ గారి ఆస్తి, 35-00 అ॥లు, పడమర : షేక్ బిజాన్ గారి ప్లాట్ నెం.17 స్థలం, 58-00 అ॥లు, ఉత్తరం : రోడ్డు, 35-00 అ॥లు.

పై హద్దుల యందు విస్తీర్ణం 226 చ॥గ॥లు లేదా 188.56 చ॥మీ॥లులోని స్థలం మరియు 1200 చ॥అ॥లులోని నిర్మించబడిన ఆర్.సి.సి. రూఫ్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు రెసిడెన్షియల్ భవనం మరియు అన్ని ఈజిమెంటరీ హక్కులతో కలదు.

రిజర్వ్ ధర : రూ. 88,45,200/- ధరావత్తు : రూ. 8,84,520/-
బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-

ఇ-వేలం తేది సమయం: 08-01-2026 ఉ॥ 11.00 గం॥ నుండి సా॥ 4.00 గం॥ల వరకు (5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో)

ఆస్తి తనిఖీ తేది : 20-12-2025 ఉ॥ 10.00 గం॥ నుండి సా॥ 5.00 గం॥ల వరకు

EMD మరియు KYC పత్రాలు మరియు రుజువులను సమర్పించాల్సిన తేది & సమయం: తేది : 08-01-2026 న లేదా అంతకు ముందు సాయంత్రం 04.00 గం॥ల లోపు

అమ్మకం బ్యాంకు వారి నియమ నిబంధనలకు లోబడి జరుపబడును. తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలములో పాల్గొనుటకు ముందుగా M/s PSB Alliance, https://www.baanknet.com వారి వెబ్ పోర్టల్ www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices మరియు హెల్ప్ లైన్ నెం. 8291220220, హెల్ప్ లైన్ ఇ-మెయిల్ ఐడి: support.baank.net@psballiance.com మరియు ఇ-వేలము నియమ, నిబంధనలు పూర్తి వివరములు పరిశీలించవలసినదిగా బిడ్డర్లను కోరడమైనది.

ఆసక్తి గల బిడ్డర్లు ఆస్తికి సంబంధించిన వివరాలకు బ్రాంచ్ మేనేజర్, మొబైల్: 99129 21123, ఇ-మెయిల్ ఐడి: sbi.10206@sbi.co.in (లేదా) మరియు ఆథరైజ్డ్ ఏజెన్సీ మొబైల్ నెం. 94922 84184 వారిని సోమవారం నుండి శనివారం వరకు పనిదినములలో సంప్రదించవచ్చును.

తేది : 27.11.2025, ప్రదేశం : పేరాల సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అవగాహనతోనే ఎయిడ్స్ దూరం

చీరాలలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

చీరాల, వేటపాలెం, న్యూస్‌టుడే: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉన్నపుడే దానిని తరిమివేయగలుగుతామని షాడోస్ ప్రతినిధి రాజాసాల్మన్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రభుత్వ మహిళా కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించి, పట్టణంలో ప్రదర్శన చేపట్టారు. ప్రిన్సిపల్ మురళి, వైస్ ప్రిన్సిపల్ రత్నపాప, నీరజ, భాగ్యలక్ష్మి, వీన, సుగుణ పాల్గొన్నారు. వేటపాలెం మండలం అక్కాయిపాలెం సచివాలయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పందిళ్లపల్లి వైద్యుడు హర్షవర్ధన్ ఆదిత్య మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి కట్టా రాణి, న్యాయవాది అశోక్ కుమార్, పీఎల్‌వీ మదీన్ పాల్గొన్నారు.

అద్దంకి, న్యూస్‌టుడే: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ వాహెలాచౌదరి, సాధారణ వైద్యనిపుణులు పి.శశికాంత్, న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, మార్తా శ్రీను, ఎం.ప్రకాష్, ధనుంజయరావు, ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్ పాల్గొన్నారు. అనంతరం పీడితులకు రొట్టెలు, పండ్లు పంచారు.

పర్చూరు, న్యూస్‌టుడే : పర్చూరు బీఏఅండ్‌టీఏ జూనియర్ కళాశాలలో చీరాల గెరాడ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

శింగరకొండపాలెంలో ఎన్.ఎస్.ఎస్. శిబిరం

శింగరకొండపాలెం(అద్దంకి): చిత్తశుద్ధి, క్రమశిక్షణ, విలువలకు మారుపేరు కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులని ప్రధానాచార్యుడు డాక్టర్ వి.మోహనరావు అన్నారు. శింగరకొండపాలెంలో ఎన్.ఎస్.ఎస్. యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. సచివాలయం వద్ద జరిగిన సభలో మాట్లాడుతూ కళాశాల విద్యార్థిని కీర్తిపాటి రేణుక జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి, ప్రీ రిపబ్లిక్‌డే వేడుకల శిక్షణకు హాజరైనట్లు గుర్తుచేశారు. యూనిట్ అధికారిణి డాక్టర్ ఎన్.షర్మిలారాణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు ఎన్ఎస్ఎస్ అనేది మలుపురాయిగా ఉంటుందని వివరించారు. తొలిరోజు నీటి ప్రాముఖ్యత గురించి గ్రామంలో ప్రదర్శన చేశారు. అధ్యాపకులు డాక్టర్ డి.రాజశేఖర్, డాక్టర్ వి.ప్రసాద్, డాక్టర్ బి.అశోక్‌కుమార్, ఎ.శిఖామణి, సీహెచ్.వెంకటనారాయణ, స్థానిక నేతలు వాసు, స్వాములు పాల్గొన్నారు.

చేనేతల స్థితిగతులపై పరిశీలన

వేటపాలెం, న్యూస్‌టుడే: చీరాల పర్యటనకు విచ్చేసిన ఏఐసీసీ పరిశీలకులు షారద్ అహర్ సోమవారం పందిళ్లపల్లిలోని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ నివాసానికి విచ్చేశారు. అక్కడ అల్పాహారం తీసుకుని ఆమంచితో కలిసి ఆయన కొణిజేటినగర్‌లోని చేనేత కుటుంబాలను కలిసి, వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి కఠారిపాలెం పరిధిలోని అయిదు మత్స్యకార గ్రామాలకు చెందిన వారితో మాట్లాడారు. మొంథా తుపానుకు సంబంధించి ప్రభుత్వ నుంచి ఎటువంటి పరిహారం అందలేదని పరిశీలకులకు వారు తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

పర్చూరు, న్యూస్‌టుడే: పర్చూరు ఇందిరా కాలనీకి చెందిన శ్రీను(45) సోమవారం రాత్రి పంచాయతీ కార్యాలయం వద్ద మురుగు కాలువలో పడి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. సాయంత్రం ఆ వ్యక్తి కాలువ వెంబడి పడి ఉండటంతో నిద్రపోతున్నాడని భావించామని, రాత్రి 9:10గంటల సమయంలో కాలువలో పడి ఉండటంతో లేపేందుకు ప్రయత్నించగా ఎంతసేపటికి స్పందన లేదన్నారు. 108కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారన్నారు.

నీటిని బయటకు పంపాలి

పర్చూరు, న్యూస్‌టుడే: అకాల వర్షాల కారణంగా మిరప, కూరగాయల పంటల్లో నిలిచిన నీటిని రైతులు బయటకు పంపాలని మండల ఉద్యాన శాఖాధికారి రవిప్రకాష్‌బాబు సూచించారు. సోమవారం మండల పరిధి నూతలపాడులో మిరప పంటను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఇది కాపు కొచ్చే మిరప తోటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు.

అవీ ఇవీ

హెల్ప్ సంస్థ సేవలు అభినందనీయం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినం సందర్భంగా బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో హెల్ప్ సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్‌కు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందించారు. జిల్లా లెప్రసీ టీబీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ వి.సోమ్లానాయక్, అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత

బల్లికురవ, అద్దంకి, సంతమాగులూరు, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో చలితీవ్రత పెరిగింది. రెండురోజులుగా అధికార యంత్రాంగం మొత్తం తుపాను హెచ్చరిక ప్రాంతాలపై దృష్టి సారించింది. కలెక్టర్ ఆదివారం అద్దంకి మండలంలో పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజల్ని అప్రమత్తం చేశారు. ఆది, సోమవారాల్లో పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడం, చిరుజల్లులు కురవడంతో వృద్ధులు, చిన్నారులు ఇళ్లకే పరిమితమయ్యారు. సోమవారం సాయంత్రం చలి తీవ్రత మరింత పెరిగింది. ఒకటి, రెండు రోజులపాటు ఇలాంటి వాతావరణమే ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

వంద మంది అయ్యప్ప మాలధారణ స్వీకరణ

కొత్తపాలెం (చినగంజాం), న్యూస్‌టుడే: కొత్తపాలెం శ్రీబాలకోటేశ్వరస్వామి (శివాలయం) ఆలయం వద్ద సోమవారం వంద మంది నూతనంగా అయ్యప్ప మాలధారణ స్వీకరించారు.

చిట్టిబాబుకు నివాళి

గంగవరం (ఇంకొల్లు): తెదేపా నాయకుడు కరి చిట్టిబాబుకు పార్టీ నాయకులు నివాళులర్పించారు. చిట్టిబాబు దశదిన కర్మ సోమవారం గంగవరంలో నిర్వహించారు. నేతలు హనుమంతరావు, రామకృష్ణ, రాజేష్, శ్రీనివాసరావు, వీరగంధం, సాగర్ సుబ్బారావు, సాంబయ్య, బి.సుబ్బారావు, శివయ్య పాల్గొన్నారు.

కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన

యద్దనపూడి, న్యూస్‌టుడే: మండల పరిధి యనమదలలో సైడ్ కాలువల నిర్మాణాలకు సోమవారం డిప్యూటీ ఎంపీడీవో కృష్ణ శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆదర్శగ్రామ యోజన కింద రూ.2లక్షలతో ఈ పనులు చేపట్టి గ్రామంలో మెరుగైన పారిశుద్ధ్యం కల్పిస్తామని పంచాయతీ కార్యదర్శి ఎ.రాణి తెలిపారు.

పెంచలయ్య హత్యకు కారకుల్ని శిక్షించాలి

అద్దంకి, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లాకు చెందిన పెంచలయ్యపై దాడిచేసి హతమార్చిన కామాక్షి బృందాన్ని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నేతలు అన్నారు. ఆ మేరకు సోమవారం సాయంత్రం బంగ్లా రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్ద వరకు జరిగిన ప్రదర్శనలో పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు మాట్లాడారు. తంగిరాల వెంకటేశ్వర్లు, డాక్టర్ కావూరి రఘుచంద్, జె.శ్రీనివాసరావు, బి.రఘురాం, రావులపల్లి కోటేశ్వరరావు, ఆదాం, శామ్యేలు, గణేష్ పాల్గొన్నారు.

సహకార సంఘం మాజీ అధ్యక్షుడి మృతికి సంతాపం

అద్దంకి, న్యూస్‌టుడే: మండలంలోని ధేనువకొండ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ మోహనరావు(68) సోమవారం ఒంగోలులో మృతిచెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ఈనాడు చిత్తూరు

మంగళవారం డిసెంబరు 2, 2025 5

చివరి ఊరు.. పొడవైన పేరు

దేశంలోనే అతి పొడవైన పేరున్న రైల్వేస్టేషన్ మన జిల్లాలోనే ఉందని తెలుసా మీకు.. అదే మన రాష్ట్ర సరిహద్దులోని చివరి రైల్వేస్టేషన్ 'వెంకటనరసింహరాజు వారిపేట'. ఇది లిమ్కా బుక్ రికార్డులోనూ స్థానం సంపాదించుకుంది. నగరి మండలం తమిళనాడు సరిహద్దులో ఉంది. ఆదాయం లేకపోవడంతో గతంలో ఈ స్టేషన్‌ను రద్దు చేయాలని రైల్వే అధికారులు యత్నించగా.. స్థానికులు అభ్యంతరం తెలిపి.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కాపాడుకున్నారు. పేరు కోసమే ఇక్కడి ప్రజలు రైలు ప్రయాణానికి ప్రాధాన్యమిస్తున్నారు. - న్యూస్‌టుడే, నగరి

పడిపోతారు జాగ్రత్త



చిత్తూరు శివారులోని బెంగుళూరు-చెన్నై జాతీయ రహదారిలో ఓ వ్యాన్‌లోని కూరగాయల బస్తాలపై కూలీలు ఇలా ప్రమాదకరంగా నిద్రిస్తూ కనిపించారు. అసలే జాతీయ రహదారి.. వాహనాలు వేగంగా దూసుకెళ్తుంటాయి. ఒక్కసారిగా బ్రేక్ వేస్తే పడిపోయే ప్రమాదం ఉంది.

– ఈనాడు, చిత్తూరు.

యూపీఐ చెల్లింపుల్లో పొరపాట్లా..?

మకోసం

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: యూపీఐ ద్వారా చెల్లింపులు చేసినప్పుడు ఒక్కోసారి పొరపాటున వేరొకరి ఖాతాకు జమ అవుతుంటాయి. లేదా పెండింగ్‌లో ఉండిపోతాయి. అలాంటి సమయంలో ఆందోళన చెందకుండా ఇలా చేస్తే పోయిన డబ్బులు తిరిగి రాబట్టుకోవచ్చు. లావాదేవీకి సంబంధించి స్క్రీన్‌షాట్ తీసుకొని ఈ నంబర్లను సంప్రదించాలి.

సంప్రదించాల్సిన నంబర్లు

- గూగుల్‌పే: 18004190157.
- ఫోన్‌పే 080 68727374
- పేటీఎం 01204456456
- బీహెచ్ఐఎం 18001201740
- ఎన్‌పీసీఐ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

బోయకొండ భక్తులకు ఆన్‌లైన్లో టికెట్లు

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: బోయకొండ గంగమ్మ ఆలయానికి వచ్చే భక్తులు ఇకపై ఆన్‌లైన్లో టికెట్లు తీసుకోవచ్చని ఈవో ఏకాంబరం తెలిపారు. ప్రతి శుక్రవారం రాహుకాల సమయంలో నిర్వహించే అభిషేకం సేవ టికెట్ రూ.1000, పౌర్ణమి రోజున జరిగే చండీహోమం సేవకు రూ.2116, వేదాశీర్వాదం రూ.1000, లఘు దర్శనం రూ.500, అంతరాలయ దర్శనం రూ.200, అతిశీఘ్ర దర్శనానికి రూ.100 చొప్పున ఆన్‌లైన్లో చెల్లించి టికెట్ పొందాలన్నారు. వివరాలకు మనమిత్ర వాట్సాప్ నంబరు 95523 00009 ద్వారా సేవలు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు.

సంక్షేమ అవస్థల గృహాలు

విద్యార్థులను వెంటాడుతోన్న సమస్యలు

పరిశీలన

ఈనాడు– చిత్తూరు; న్యూస్‌టుడే బృందం: వైకాపా హయాంలో సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేద విద్యార్థులు చలికి వణుకుతున్నా కార్పెట్లు, దుప్పట్లు ఇవ్వలేదు. జడివానతో గదుల్లోకి వర్షపు నీరు వచ్చినా కిటికీలకు మరమ్మతులు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారి కుప్పంలో పర్యటించినప్పుడే ఉమ్మడి జిల్లాలోని వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కొన్ని పనులు చేసినా మరికొన్ని సమస్యలు అలానే ఉన్నాయి. అద్దెభవనాల్లో ఇరుకు గదులు, నీటిశుద్ధి యంత్రాలు లేక విద్యార్థులు బయటి నుంచి తెచ్చుకుంటున్నారు. అక్కడక్కడా కిటికీలు దెబ్బతిన్నాయి. మెస్‌లు చిరిగిపోయాయి.

ఏడాదిన్నర వ్యవధిలో సాంఘిక సంక్షేమ వసతిగృహాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. బీసీ హాస్టళ్లపైనా కొంత ఖర్చు పెట్టినా ఆ మొత్తం సరిపోలేదు. ఆర్వో ప్లాంట్లు లేక కొందరు వార్డెన్లు బయటి నుంచి నీరు తెప్పిస్తున్నారు. పలమనేరు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో బోరు నీళ్లే దిక్కవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం నిధులిచ్చినా పది శాతం హాస్టళ్లలోనే ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

కుప్పం ఎస్సీ బాలుర వసతిగృహంలో ఇరుకు గదిలో నిద్రిస్తున్న విద్యార్థులు

చిత్తూరు జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలు

సాంఘిక	విద్యార్థులు	బీసీ	విద్యార్థులు	గిరిజన	విద్యార్థులు
57	3,500	47	2,382	2	120

రెండు జిల్లాల్లో రూ.20.97 కోట్ల ఖర్చు

జగన్ పాలనలో సంక్షేమ వసతిగృహాల్లోనూ నాడు- నేడు కింద వసతులు కల్పిస్తామని చెప్పినా ఆచరణలోకి రాలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రెండు జిల్లాల్లో రూ.20.97 కోట్లు ఖర్చు చేశారు. నెల రోజుల క్రితమే కార్పెట్లు, దుప్పట్లు ఇచ్చారు. ఈ ఏడాది మరో రూ.14 కోట్ల వ్యయంతో పనులకు ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని వేగవంతం చేస్తే మిగతా సమస్యలూ తీరతాయి.

శిథిలావస్థలో భవనాలు

శ్రీకాళహస్తి, పూతలపట్టు, నగరి, కుప్పం నియోజకవర్గాల్లోని సంక్షేమ వసతిగృహాలు శిథిలావస్థకు చేరాయి. నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులు ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్నారు. కుప్పం బీసీ సంక్షేమ వసతిగృహంలో పెచ్చులూడుతుండటంతో ఇటీవల 23 మందిని సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు మార్చారు. ఇప్పుడు 5 గదుల్లో 68 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడ కిటికీలు దెబ్బతిన్నాయి.

భావితరాల భాండాగారం

తాళపత్ర గ్రంథాలను సంరక్షిస్తున్న ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ

భద్రపరిచిన పురాతన తాళపత్ర గ్రంథాలు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ముక్తిని ప్రసాదించే తిరుపతి పుణ్యక్షేత్రం అతి పురాతన తాళపత్ర గ్రంథాలను తనలో దాచుకుంది.. వేద, ఉపనిషత్తులను సంరక్షిస్తూ భావితరాలకు అందిస్తోంది. అందుకు వేదికగా నిలుస్తోంది శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ).

తాళపత్ర గ్రంథాలను శుభ్రపరుస్తున్న సిబ్బంది

పునర్ ముద్రణలు

అముద్రిత గ్రంథాలను పరిష్కరించి వెలుగులోకి తేవడమే కాకుండా, ఎప్పుడో ముద్రించినా ఇప్పుడు అందుబాటులో లేని వాటిని తితిదే సహకారంతో పునర్ ముద్రిస్తోంది.

బీజం ఇలా..

నాటి మద్రాసు ముఖ్యమంత్రి పానగల్ రాజు ఆలోచనతో 1937లో తిరుపతిలో శ్రీవేంకటేశ్వర ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్‌కు బీజం పడింది. ఈ సంస్థ నాటి డైరెక్టర్ రంగస్వామి అయ్యంగార్ దేశం నలుమూలలకు పండితులను పంపి సంస్కృతం, తెలుగు, తమిళ భాషలకు చెందిన 10 వేలకు పైగా రాతప్రతులు, 20 వేలకు పైగా ముద్రిత గ్రంథాలను సమీకరించారు. సంస్థను 1956లో ఎస్వీయూలో విలీనం చేసి ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్ఐ)గా పేరు మార్చారు.

గ్రంథ పరిష్కారం.. సంరక్షణ

భారతీయ సంస్కృతిని తెలిపే తాళపత్రాలు, రాతప్రతులు, అమూల్య గ్రంథాలను పరిష్కరించి సంరక్షించడంతో పాటు భావితరాలకు అందించేందుకు డిజిటలైజ్ చేస్తున్నారు.

- వీటిని వెబ్‌సైట్: www. svuori.com లో అందుబాటులో ఉంచుతోంది.

మొత్తం సేకరణలు

- సంస్కృతం: 10,000
- ఆంగ్లం: 5,000
- తెలుగు: 15,000
- మిగతావి: 200

- **పరిశోధన:** పీహెచ్‌డీ, ఎంఫిల్ డిగ్రీల కోసం అముద్రిత గ్రంథాలను వీలైనంత వరకు పరిశోధనాంశాలుగా ఇస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 94 పీహెచ్‌డీలు, అనేక ఎంఫిల్ డిగ్రీలు వచ్చాయి.

గ్రంథాలయాల్లోనూ..

- ఇక్కడి గ్రంథాలయాల్లో గజవైద్యము, గణిత శాస్త్రము, గారడీ విద్య, వాస్తుసారము, శకునశాస్త్ర గ్రంథాలు, రామాయణ, మహాభారత, కావ్య, ప్రబంధ, శాస్త్రాలకు సంబంధించిన మొదటి ముద్రణ గ్రంథాలున్నాయి.

కాపరు వైరు.. స్వాహా

ఏపీ ట్రాన్స్‌కోలో రాత్రివేళ రహస్యంగా తరలింపు?

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరా సంస్థల్లో ఒకటైన ఏపీ ట్రాన్స్‌కో దోపిడీకి వేదికగా మారింది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో చిత్తూరు డివిజన్ ముందున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ డివిజన్ అధికారి చెప్పిందే వేదమని, ఆయన కనుసన్నల్లోనే అన్నీ జరుగుతున్నాయని, ఇప్పుడు ట్రంచ్‌లైన్‌లోని కాపర్ వైరును దిగమింగినట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు.

లూప్‌లైన్‌లో గేట్ వాల్వు పక్కన ఒకే రాడ్

చిత్తూరు గిరింపేటలో 220 కేవీ ఉపకేంద్రం 50-60 ఏళ్ల కిందట నిర్మించారు. ఇక్కడి నుంచే ఐరాల, పాకాల, నూనెగుండ్లపల్లెల్లోని 132 కేవీ ఉపకేంద్రాలకు విద్యుత్తు సరఫరా అవుతోంది. సరఫరా ఆన్-ఆఫ్‌కు ఏపీసీబీ బ్రేకర్ వినియోగించేవారు. ఇందుకు ప్రత్యేకంగా ట్రంచ్ కాపర్ లూప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఇలా ఏడు వరుసల్లో సుమారు మూడువేల మీటర్లు ఉంటుందని చెబుతున్నారు. తదనంతరం ఆటోమెటిక్ బ్రేకర్లు రావడంతో వాటి అవసరం లేకుండా పోయింది.

దండుకుందిలా..

ఉపకేంద్రం ప్రాంగణంలో ట్రంచ్ కాపర్‌రాడ్ లూప్‌లైన్ కనబడకుండా పైభాగంలో పలకలు అమర్చారు. ఇటీవల ఉపకేంద్రం నుంచి కాపర్‌రాడ్డును రాత్రి వేళ పక్కదారి పట్టించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఒప్పంద ఉద్యోగులను పురమాయించినట్లు సమాచారం. ఇలా 3-4 టన్నుల కాపర్ స్వాహా చేసినట్లు తెలిసింది. గతేడాది డివిజన్ పరిధిలోని ఉపకేంద్రాల్లో 20 ఏళ్లుగా నిల్వఉన్న రూ.లక్షల విలువ చేసే పాత పరికరాలు, అల్యూమినియం, కాపర్ తీగలు, స్టీల్ పరికరాలు ఇంటి దొంగలే పక్కదారి పట్టించిన ఘటన వెలుగుచూసింది.

అక్రమాలకు తావులేదు..: చిన్నబ్బ శేఖర్, ఈఈ, ట్రాన్స్‌కో

గిరింపేటలోని 220కేవీ ఉపకేంద్రంలో కాపర్ రాడ్ అక్రమంగా తరలించే ఆస్కారం లేదు. అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే సస్పెండ్ చేస్తాం.



దిత్వా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో తిరుమల ఘాట్ రోడ్డులోని జలపాతాలు నురగలు కక్కుతూ దూకుతున్నాయి. మొదటి ఘాట్ రోడ్డులోని మాల్వాడి గుండం భక్తులకు కనువిందు చేస్తోంది. రెండో ఘాట్ రోడ్డులోని 9వ కిలోమీటరు వద్ద కొండరాయి వర్షానికి కిందపడింది. సిబ్బంది తొలగించారు. పాపవినాశనం, శ్రీవారి పాదాలు మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. - న్యూస్‌టుడే, తిరుమల

పురుగే.. వణికిస్తోంది

చిగ్గర్ మైట్ కీటకం

- జిల్లాలో పెరుగుతున్న 'స్క్రబ్ టైఫస్' కేసులు
- జ్వరాలతో బాధపడుతున్న జనం

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాను కొత్త వ్యాధి హడలెత్తిస్తోంది. అది చిన్న కీటకమే అయినా జ్వరాలతో జనాలను ఆసుపత్రులకు పరుగులు పెట్టిస్తోంది. స్క్రబ్ టైఫస్ అనే జ్వరం చాపకింద నీరులా వ్యాపిస్తోంది. అప్రమత్తమై చికిత్స చేయించుకుంటే ప్రమాదం లేదని వైద్యులు చెబుతున్నారు.

లక్షణాలు

- కీటకం కుట్టిన వెంటనే బ్యాక్టీరియా శరీరంలోకి వెళ్తుంది. • పది రోజుల్లో జ్వరం వస్తుంది. తలనొప్పి తీవ్రంగా ఉంటుంది. • నిర్లక్ష్యం చేస్తే శరీరమంతా నల్ల మచ్చలు ఏర్పడతాయి. • మెదడు, ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. • వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 145 కేసులు నమోదయ్యాయి. పొరుగు రాష్ట్రాల్లో ఉంటున్న 234 మంది జిల్లా వాసుల్లో ఇది వెలుగు చూసింది. మొత్తంగా 379 కేసులు నమోదైనట్లు చెబుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే కేసులను కలుపుకొంటే ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందని అంచనా. • తిరుపతి జిల్లాలో 17 కేసులు నమోదయ్యాయి.

ఎలా వస్తుంది..?

- బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉన్న చిగ్గర్‌మైట్ అనే నల్లిని పోలిన కీటకం కుడితే ఈ జ్వరం వస్తుంది.

పట్టించుకోని అధికారులు

ఈ జ్వరాల కేసులు పెరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. పైగా ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే కేసులు, అనుమానిత కేసులను పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

- పాత మంచాలు, పరుపులు, దిండ్లను వారానికి ఒకసారైనా శుభ్రం చేసుకోవాలి. • కాళ్లు, చేతులు కప్పి ఉండేలా దుస్తులు వేసుకోవాలి • తడి నేలలు, పొలాలు, గడ్డివాములు, పశువుల పాకల్లో, వ్యర్థాలుండే చోట ఈ పురుగు ఉండే ప్రమాదం ఉంది. జాగ్రత్తలు తీసుకోవాలి.

చికిత్సతో నయం చేయొచ్చు

జ్వరం తగ్గకుండా ఉంటే.. శరీరంపై మచ్చలేవైనా ఉంటే పరీక్షలు చేసుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయితే వాటికి తగ్గ చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చు.

– గౌరీప్రియ, ఫిజీషియన్, చిత్తూరు

95% పింఛన్ల పంపిణీ

తొలిరోజే 2,54,662 మందికి రూ.109 కోట్లు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: సామాజిక పింఛన్ల పంపిణీ జిల్లాలో వేగంగా సాగింది. ఒకటో తేదీ సోమవారం ఉదయం నుంచే ప్రారంభించారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. మొదటిరోజు సాయంత్రానికి 95 శాతం పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. డిసెంబరుకుజిల్లాలో 2,68,066 మందికి రూ.114.80 కోట్లు మంజూరు కాగా, అందులో మొదటి రోజు సాయంత్రానికి 2,54,662 మందికి రూ.109.06 కోట్లు పంపిణీ చేశారు. మిగిలిన వారు నేడు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో తీసుకోవచ్చు.

శిక్షణ.. ఆరోగ్య రక్షణ

తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణకు సోమవారం మొబైల్ ట్రైనింగ్ సెంటర్ జాన్సన్ అండ్ జాన్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ వీల్స్ వాహనం వచ్చింది. ఈ బస్సులోనే జనరల్ సర్జరీ, యూరాలజీ, పీడియాట్రిక్స్, వివిధ విభాగాలకు సంబంధించి లాప్రోస్కోపిక్ విధానంపై ఎస్వీఎంసీ పీజీ వైద్య విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. రెండ్రోజుల పాటు శస్త్రచికిత్సల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

– ఈనాడు, తిరుపతి

నిరసన తెలిపి.. ఆకాంక్ష చాటి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరును జిల్లా చేయాలి, లేకుంటే నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని గడియార స్తంభం కూడలి వద్ద గూడూరు జిల్లా ఐకాస ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నెల్లూరుతో ఎన్నో సంవత్సరాలుగా అనుబంధం ఉందని, తిరుపతిలో కలపడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు అసోసియేషన్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గడియార స్తంభం కూడలి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఐకాస నాయకులు

WANTED

Required Experienced Marketing Executives for **Marketing Pesticides, Micro Nutrients and Bio Stimulants** to work for Sovereign Agro Insecticides, having 48 year's experience in Manufacturing and Marketing Agri Inputs.

Candidates with at least 10 years' experience in the same area can apply through WhatsApp for these following Districts.

ELURU, VIZIANAGARAM, VISAKHAPATNAM, SRIKAKULAM, NELLORE, PRAKASAM, BAPATLA, CHITTOR AND KADAPA Districts.

SOVEREIGN AGRO INSECTICIDES

6/13, Brodipet, GUNTUR. Mobile: 86397 49674

22 మండలాల్లో వర్షం

చిత్తూరు (మిట్టూరు): దిత్వా తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి జిల్లాలోని 22 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. సోమల 14, కార్వేటినగరం 12, విజయపురం 7.4, ఎస్ఆర్‌పురం 7.4, రొంపిచెర్ల 6 మి.మీ. కురిసింది.

104FM Tirupati ఈ FM 104 Mee FM

ఈఎఫ్ఎం కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9154991499

నియోజకవర్గానికో పశువుల వసతిగృహం

న్యూస్‌టుడే, తిరుపతి(వ్యవసాయం): పాడిరంగ అభివృద్ధిలో భాగంగా పశువుల వసతిగృహాల (యానిమల్ హాస్టల్) పేరుతో మెగా గోకులాల ఏర్పాటుకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కసరత్తు చేస్తోంది. వీటిని నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందుబాటులోకి తేనున్నారు. ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో అధికారులు విధివిధానాలు రూపొందించారు.

5-6 ఎకరాల విస్తీర్ణంలో..

- ఎంపిక చేసిన ప్రాంతంలో పోరంబోకు, అనాదీనం, ప్రభుత్వ జాగాలు గుర్తించి కలెక్టర్ కేటాయిస్తారు. • ప్రభుత్వ భూమి లేనిచోట ఐదేళ్ల లీజుకు ప్రైవేటు భూమిని సేకరించవచ్చు. • **విస్తీర్ణం:** 5 నుంచి 6 ఎకరాల్లో ఏర్పాటు చేస్తారు. • ఉపాధి హామీ నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలతో వీటిని నిర్మిస్తారు. • 25 నుంచి 30 పశువులు ఆశ్రయం పొందేలా ఎకరా స్థలంలో షెడ్డు, స్టోరేజీ గది ఉంటుంది. • మిగిలిన నాలుగైదు ఎకరాలలో గడ్డి పెంచుతారు. • ఒక్కో పశువుల శాల నిర్మాణానికి రూ.10 లక్షలు ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేస్తారు. • గ్రామంలోని మహిళా, రైతు సంఘాలు, సొసైటీలు, ఎఫ్‌పీవో తదితర సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. • ఆరు నెలల వ్యవధిలో పశువులశాలల నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు.

సంక్రాంతికి నారావారిపల్లెలో..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి స్వగ్రామం నారావారిపల్లె నుంచే వీటిని ప్రారంభించేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. సంక్రాంతికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందించారు. నారావారిపల్లె సమీపంలోని మూలపల్లె వద్ద ఐదెకరాల స్థలాన్ని ఇప్పటికే అధికారులు గుర్తించినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.ఎ. రవికుమార్ తెలిపారు.

నిర్వహణ ఇలా..

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా నీటి ట్యాంకు, బోరుబావి, గడ్డి పెంపకానికి, బయో గ్యాస్ ప్లాంట్‌లతో పాటు మహిళా సంఘాలు, సహకార సంఘాల ద్వారా గడ్డి కత్తిరింపు యంత్రాలు, పాలు పితికే యంత్రాలను సమకూర్చుతారు. • పశువులశాల నిర్వహణకు అయ్యే ఖర్చు, కూలీలు, ఇతర వ్యయాలను లెక్కించి గోబర్ గ్యాస్, సేంద్రియ ఎరువు విక్రయాలతో జమచేస్తారు. అదనపు ఖర్చును భరించాల్సి ఉంటుంది.

ప్రయోజనాలు..

- పాల ఉత్పత్తి 10-15 శాతం పెరగడంతో పాటు మార్కెటింగ్ సదుపాయం ఉంటుంది. • హాస్టల్‌లో లభ్యమయ్యే పేడ నుంచి సేంద్రియ ఎరువు, బయో గ్యాస్ ఉత్పత్తి అవుతాయి. • పశువుల ఆరోగ్యానికి, మేతకు భరోసా ఉంటుంది.

దహనక్రియలు

మంచితనానికి మారుపేరుగా నిలిచి, మాకు ప్రేమ, ఆప్యాయతానురాగాలను పంచి, మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, మా అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించిన మా ఇంటిదైవం శ్రీమతి కారపాకుల శాంతమ్మ గారు 01.12.2025వ తేదీ సోమవారం ఉదయం 7 గంటలకు స్వర్గస్తులైనారు.

తదుపరి దహనక్రియలు తేది 03.12.2025 బుధవారం ఉ॥ 10 గంటలకు మా స్వగ్రామం కె.వి.పల్లి (మం), చిన్నకమ్మపల్లి నందు జరుగును తెలియజేయుచున్నాము.

మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. శోకతప్త హృదయాలతో..

భర్త: కె.రెడ్డెప్పనాయుడు, మాజీ సర్పంచ్, చిన్నకమ్మపల్లి, కె.వి.పల్లి మండలం మరియు కుటుంబ సభ్యులు

సెల్: 9490495279, 9502196177

శ్రీమతి కారపాకుల శాంతమ్మ గారు
మరణం: 01.12.2025
చిన్నకమ్మపల్లి, కె.వి.పల్లి మండలం, అన్నమయ్య జిల్లా.

(c) eenadu

మళ్లీ బాంబు బెదిరింపులు.. తనిఖీలు

తిరుపతి (నేర విభాగం): బాంబు బెదిరింపులతో తిరుపతిలో మళ్లీ కలకలం రేగింది. నగరంలోని రాజ్ పార్క్, పాయ్ వైస్రాయ్ హోటళ్లను పేలుడు పదార్థాలతో పేల్చివేస్తున్నట్లు మెయిల్ చేసి హెచ్చరించారు. పాకిస్థాన్ ఐఎస్ఐ తమిళనాడులో శిక్షణ పొందిన ప్రముఖ తీవ్రవాద సంస్థ దేశవ్యాప్తంగా పేలుళ్లకు రూపకల్పన చేసినట్లు అందులో పేర్కొన్నారు. యాత్రికులు సేదతీరే రెండు హోటళ్లను పేల్చి వేయనున్నట్లు పేర్కొనడంతో వాటి యాజమాన్యం సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చింది. వెంటనే అలిపిరి ఎస్సై అజిత ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టి ఎలాంటి పేలుడు పదార్థాలు లేనట్లు నిర్ధారించారు.

దిత్వా.. అర్జీదారులు అరకొర

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చి అధికారులకు తమ సమస్యలను విన్నవిస్తుంటారు. ప్రస్తుతం దిత్వా తుపాను కారణంగా అరకొరగా అర్జీదారులు రావటంతో కలెక్టరేట్ ప్రాంగణం బోసిపోయింది. సాధారణంగా ప్రతి సోమవారం ప్రజలతో కిక్కిరిసే పీజీఆర్ఎస్ నిర్వహణ ప్రాంగణం అరకొర అర్జీదారులతో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. - ఈనాడు, చిత్తూరు

పంటల మార్పిడి అధిక దిగుబడి

కోట, న్యూస్‌టుడే: పంటల మార్పిడి విధానం ద్వారా కూరగాయలు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని వెంకన్నపాలెంకు చెందిన కస్తూరయ్య నిరూపిస్తున్నారు. కోట, చిల్లకూరు, గూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు నాటు వంగ సాగు చేస్తూ అధిక దిగుబడులు పొందుతున్నారు. ఈ క్రమంలోనే కస్తూరయ్య వెంకన్నపాలెంలో 50 సెంట్లు భూమిలో వంగ సాగు చేసి లాభాలు పొందుతున్నారు.

దిగుబడి: రెండు నెలల తరువాత వంకాయలు కాస్తాయి. ఒక్కోటి 50 నుంచి 60 గ్రాముల వరకు ఉంటుంది. ■ కోత కోసిన వారం రోజులకు ఒకసారి దిగుబడి వస్తుంది. ఎకరాలో 600 కిలోల వరకు దిగుబడి వస్తుంది.

మార్కెటింగ్: గూడూరు డివిజన్‌లోని గూడూరు, కోట, వాకాడు, చిల్లకూరు, నాయుడుపేట, చిట్టమూరు మండలాల్లో వంగకు మంచి గిరాకీ ఉంది. మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60లు వరకు ఉంది.

రూ.30 వేల ఆదాయం

50 సెంట్లు సాగుకు రూ.70వేల వరకు ఖర్చయింది. రూ. 30వేలకు పైగా ఆదాయం వచ్చే అవకాశముంది. సేంద్రియ ఎరువులతో పాటు రసాయన ఎరువులను వినియోగించి సాగు చేశా. - కస్తూరయ్య, రైతు

రైతేరాజు

వరిలో విత్తనశుద్ధి.. ప్రయోజనమండి

పుత్తూరు: విత్తనశుద్ధి ద్వారా కలిగే ప్రయోజనాలను నగరి వ్యవసాయ సహాయ సంచాలకులు కవిత వివరించారు.

ఇలా చేయాలి.. కిలో విత్తనానికి 2.5గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవచ్చు.

నారుమళ్లైతే.. లీటరు నీటికి 1 గ్రాము కార్బండిజమ్ కలిపి ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టాలి. మరో 24 గంటల పాటు మండె కట్టి మొలకలను దంప నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాల నానబెట్టేందుకు లీటరు నీరు అవసరమవుతుంది. ● విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. మొలకెత్తిన విత్తనాలను 0.2శాతం క్లోర్‌పైరిపాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి.

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రశ్న: వరి నాట్లు వేశాం. ఎటువంటి కలుపు మందు పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి? **- స్వామి, రైతు, కృష్ణాపురం**

జవాబు: వరి నాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లోపు బెన్సల్ఫ్యూరాన్ మిథైల్ 0.6 ప్లస్ ప్రెటిలాక్లోర్ 6 శాతం (గ్రాన్యూల్స్) ఎకరానికి నాలుగు కిలోల చొప్పున చల్లితే తుంగ, ఊదర, వెడల్పాటి ఆకు మొదలగు కలుపు మొక్కలన్నీ నశిస్తాయి. కలుపు మందు చల్లుకోవడానికి 48 గంటలు వర్షం లేని సమయం చూసి చల్లుకోవాలి.

- సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రేణిగుంట

ప్రజా సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలి

వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

పోలీసు గ్రీవెన్స్‌కు 31 ఫిర్యాదులు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 31 ఫిర్యాదులు అందాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు ఫిర్యాదు రూపంలో అందజేశారు. వాటిని ఎస్పీ తుషార్‌డూడి స్వీకరించి బాధితులతో మాట్లాడారు.

అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్: ప్రజా సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 232 వినతులు అందాయి. శిక్షణ కలెక్టర్ నరేంద్ర పడాల్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు ఇతర అధికారులు ఉన్నారు. ● తమ గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక భవనాలు నిర్మించాలని చౌడేపల్లె మండలం నూనిముద్దలపల్లి గ్రామస్థులు కోరారు. ● తమ అనుభవంలోని భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని పెద్దపంజాణి మండలం బనకందొడ్డికి చెందిన రైతులు విజ్ఞప్తి చేశారు.

● ఐరాల మండల కేంద్రం నుంచి గొల్లపల్లె వెళ్లే మార్గంలో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని ఐరాల పరిసర గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించారు. స్థానిక వీఎస్ అగ్రహారంలో ఉన్న మద్యం దుకాణాన్ని గొల్లపల్లె మార్గం వద్ద ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని గ్రామస్థులు రెడ్డెప్ప, రామకృష్ణ తదితరులు విన్నవించారు.

ఫొటో అప్‌లోడ్ చేస్తేనే వ్యవసాయ సర్వీసు

చిత్తూరు(మిట్టూరు): నూతన వ్యవసాయ విద్యుత్తు సర్వీసుల జారీలో పారదర్శకతకు చర్యలు చేపట్టామని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారుల పొలాల్లో నియంత్రికలు అమర్చి ఆ ప్రాంతాన్ని ఫొటో తీసి నిర్దేశిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆ తర్వాతే నూతన వ్యవసాయ సర్వీసు నంబరు జారీ చేస్తున్నామని చెప్పారు. తీసుకెళ్లిన నియంత్రికలు వెంటనే అమర్చాలని ఇంజినీర్లు, సిబ్బందిని ఆదేశించామన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సీఐటీయూ అఖిల భారత మహాసభలు ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గుప్తా తెలిపారు. స్థానిక జ్యోతిబా పులే విగ్రహం ఎదుట సోమవారం అఖిల భారత మహాసభల చలో విశాఖ గోడప్రతులు ఆవిష్కరించి మాట్లాడారు.

అఖండ అద్భుత భక్తికావ్య చిత్రం

త్రిశూలం, డమరుకంతో ఎమ్మెల్యే మురళీ మోహన్, చిత్రంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు

కాణిపాకం, న్యూస్‌టుడే: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ అద్భుత భక్తికావ్య చిత్రంగా చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తెలిపారు. సినిమాలో బాలకృష్ణ ఉపయోగించిన త్రిశూలం, డమరుకానికి వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. అనంతపురం జిల్లా బాలకృష్ణ అభిమానుల సంఘ సభ్యుడు జగన్ ఆధ్వర్యంలో చేపట్టిన పంచభూత లింగ ఆలయాల దర్శన యాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆలయ ఛైర్మన్ మణినాయుడు, బాలకృష్ణ అభిమానుల సంఘ జిల్లా అధ్యక్షుడు నరసింహులునాయుడు, చిత్తూరు నగర అధ్యక్షుడు ఎల్‌బీ నాయుడు, అభిమానులు కృష్ణ, కిరణ్, జ్ఞాను, యువకృష్ణ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన అవసరం

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రజలందరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి సుధారాణి సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు.

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం
కాణిపాకం గ్రామం - ఐరాల మండలం - చిత్తూరు జిల్లా

ఇ-ప్రొక్యూర్మెంటు టెండర్ ప్రకటన

ఆర్.సి.నెం.జె1/4773/2025, తేది: 01-12-2025

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానము, కాణిపాకంనకు అవసరమైన పూలు, పండ్లు మరియు ఇతర పూజాసామగ్రి ది:01-01-2026 నుండి 31-12-2026 వరకు సరఫరా కొరకు ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ద్వారా టెండరును ఆహ్వానించడమైనది. వివరముల కొరకు http://www.tender.apeprocurement.gov.in లో apendowments marketing నందు చూడగలరు. మిగిలిన వివరముల కొరకు ఫోన్ నెం. 9440836763, 9885886615 ద్వారా తెలుసుకొనగలరు.

సం/- కె.పెంచల కిషోర్
కార్యనిర్వహణాధికారి
మరియు ప్రత్యేక శ్రేణి ఉప కలెక్టర్

వరి సాగులో సూచనలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: రబీలో వరి సాగు చేసే రైతులు తగిన సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నాయుడుపేట ఏడీఏ నాగార్జున సాగర్ పేర్కొన్నారు. ఎక్కువగా బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, ఎంటీయూ 1224, ఎన్ఎల్ఆర్ 34449 రకాలు సాగు చేస్తున్నారు.

❖ బీపీటీ 5204 రకం నాట్లు వేశాక 10 నుంచి 20 రోజుల వయసులో అగ్గితెగులు సోకకుండా ఎకరాకు 120 గ్రాములు ట్రైసైక్లోజోల్ (బాణ్, ప్లాక్, సివిక్, భీమ్) మందు పిచికారీ చేయాలి. ❖ ఇతర రకాల నారు మడుల్లో బస్తా నారుకు కిలో కార్బోఫ్యూరాన్ గుళికలు నాటుకు వారం రోజుల ముందు వేయాలి. ❖ ఆర్ఎన్ఆర్ 15048 రకం నారు 22 రోజుల వయసులో నాట్లువేస్తే ఎక్కువగా పిలకలు వచ్చి ఎక్కువ దిగుబడులు వస్తాయి. ❖ నాట్లు చదరపు మీటరుకు 44 కుదుళ్లు ఉండేలా చూసుకోవాలి. ❖ నాట్లు వేసిన వారం రోజుల నుంచి నీరు పలుచగా నేల కనిపించేలా పెట్టాలి. గాలి, వెలుతురు పిలకలకు తగిలి ఎక్కువ దిగుబడి వస్తుంది. ❖ కాంప్లెక్స్ ఎరువులు 20:20:0, 19:19:19, 14:35:14, డీఏపీ(ఫాస్ఫేటు ఎరువులను) తప్పనిసరిగా నాట్లకు ముందు చివరి దుక్కిలో వేయాలి. ❖ నత్రజని (యూరియా)ను మూడు దఫాలుగా ఒక దఫాకు బస్తా(45కిలోలు) వంతున వేయాలి. ❖ పొటాష్ ఎరువును రెండు దఫాలుగా ఒక్కోసారి 15 కిలోలు చొప్పున నాట్లు వేసిన 15 రోజులకు ఒకసారి, (45 రోజులకు అంకురార్పణ దశ, చివరిదఫా యూరియాతో కలిపి) రెండోసారి వేసుకోవాలి.

❖ పైరు పెరుగుదలను బట్టి చివరి దఫాలో నానోయూరియా ఎకరాకు 500 మిల్లీలీటర్లు, నానో డీఏపీ 500 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలి. ❖ 40 రోజుల వరకు మందుల పిచికారీ అవసరం లేదు.

రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వ్యవసాయంతో పాటు పెరటి కోళ్ల పెంపకంతో రైతులు అభివృద్ధి బాటలో నడిచేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఆసక్తి కలిగిన పెంపకం దారులు పెరటి కోళ్ల పెంపకం ద్వారా లాభాలు పొందే అవకాశముంది. కోడి పిల్లల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

■ కోడి పిల్లలు మొదటి 4 నుంచి 6 వారాల వయసు వరకు చాలా జాగ్రత్తగా పెంపకం చేయాలి. ■ పొదిగిన గుడ్ల నుంచి వేరుబడిన పిల్లలను తల్లికోడి తన రెక్కల కింద ఉంచుకుని తగిన ఉష్ణోగ్రతను అందిస్తుంది. ■ అదే ఎక్కువ సంఖ్యలో కోడి పిల్లలు పెంచుతున్నప్పుడు ఒక రోజు వయసు కల్గిన కోడి పిల్లలను సంస్థల నుంచి తెచ్చుకొని వాటికి శాస్త్రీయ పద్ధతిలో బ్రూడర్ ఏర్పాటు చేయాలి. ■ అలా చేయకుంటే అధిక మరణాలు సంభవించే అవకాశముంది. ■ కోడి పిల్లలు తీసుకురావడానికి ముందే ఒక షెడ్డులో వరి పొట్టు వంటి లిట్టర్ 2-3 అంగుళాల ఎత్తు పోసి దానిపై పేపర్లు పరచాలి. ■ వాటిపైన దాణాకు నీటి పాత్రలను చక్రాకారంగా అమర్చవలెను. ■ గడ్డి వేడిగా ఉండేందుకు బల్బులను బ్రూడర్లకు వేలాడదీయాలి. మొదటి వారం 95 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండాలి. తరువాత ప్రతి వారం 5 డిగ్రీలు వంతున తగ్గించుకుంటూ రావాలి. ■ 3-4 వారాల వరకు బ్రూడర్లు ఏర్పాటు చేయాలి. ■ బ్రూడర్ కింద ఉష్ణోగ్రత సరిగా ఉంటే కోడిపిల్లలు అంతా సమంగా విస్తరించి ఉండేందుకు వీలుంటుంది. ■ ఉష్ణోగ్రతను బట్టి బ్రూడర్లను సరిగా ఏర్పాటు చేయాలి. ■ కోడి పిల్లలు ఫాంలోనికి వచ్చిన వెంటనే గ్లూకోజ్, ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీటిని అందుబాటులో ఉంచాలి. ■ బ్రూడర్ల నుంచి అడుగు దూరంలో చిక్ గార్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలి.

■ మొదటి రోజు మొక్కజొన్న గింజల పొడిని పేపర్ చల్లాలి, రెండో రోజు దాణాపై ఇవ్వాలి. దీని కోసం మార్కెట్‌లో లభించే లేయర్ గ్రోయర్ లేదా బ్రాయిలర్ వాడవచ్చు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే పెరటి కోళ్లు ఆరోగ్యవంతంగా, అత్యధిక బరువును కలిగి ఉండేందుకు వీలుంటుంది. **- డాక్టర్ భాస్కర్, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు, శ్రీకాళహస్తి**

కండలతో మెప్పించి.. పతకాలు సాధించి

పలమనేరు, న్యూస్‌టుడే: పలమనేరు పట్టణానికి చెందిన దేవా అర్జున్ శరీర సౌష్ఠవ పోటీల్లో సత్తాచాటాడు. ఇటీవల జరిగిన ఐసీఎన్ గోవా 2025 పోటీల్లో కండలతో మెప్పించాడు. లింగాయతివీధికి చెందిన రేవతి కుమారుడు అర్జున్ చెన్నైలో సీఏ చదువుతున్నాడు. పోటీల్లో మెన్స్ ఫిట్‌నెస్‌లో మొదటి స్థానం, బాడీ బిల్డింగ్, మెన్స్ ఫిజిక్‌లో నాలుగో స్థానాల్లో నిలిచాడు.

తిరుపతి జూకు చేరిన మకనా

తిరుపతి జూలో వాహనం నుంచి ఏనుగును దించుతున్న క్రేన్

యాదమరి, న్యూస్‌టుడే: గాయపడిన ఏనుగు (మకనా)ను తిరుపతిలోని జంతుప్రదర్శనశాలకు సోమవారం తరలించారు. యాదమరి మండలం డీపీపాళ్యం సమీప గుడ్డివాని చెరువులో లేవలేని స్థితిలో ఉన్న ఏనుగుకు సీసీఎఫ్ యశోదబాయి, ఇన్‌ఛార్జి డి.ఎఫ్.ఒ. శ్రీనివాసులు పర్యవేక్షణలో ఎస్వీ జంతు ప్రదర్శనశాల వైద్యులు అరుణ్, తోయిబాసింగ్ ప్రాథమిక చికిత్స చేశారు. ఆపై కుంకీలు, క్రేన్ సాయంతో తిరుపతికి తరలించి జూ అధికారులు, వైద్యులకు అప్పగించారు. ఏనుగు తుంటి, కాలి గాయానికి సంబంధించి ఎక్స్‌రే తీశారని, గాయం తీవ్రత బట్టి చికిత్స అందజేస్తామని డీఎఫ్వో తెలిపారు. రెండ్రోజుల పాటు ఏనుగును రక్షించేందుకు కష్టపడిన అటవీ, ఫైర్, రెవెన్యూ, పోలీసు సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

విశాఖపట్నం: పరవాడ మండలం లంకెలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన పలు జిల్లాల బాలబాలికలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ పరిశీలకులు పట్టాభిరామ్, సెలక్షన్ కమిటీ ప్రతినిధులు సోమవారం వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు నుంచి బాలుర జట్టుకు టి.సూర్యనారాయణ, ఎస్.బద్రీనాథ్; బాలికల జట్టుకు ఎం.యువశ్రీ, పి.జయశ్రీ, అర్చనరెడ్డి ఎంపికయ్యారు.

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీకి 62 వినతులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో జరిగిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి 62 వినతులు వచ్చాయి. సోమవారం సీఎండీ శివశంకర్ లోతేటి ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకున్నారు. తొమ్మిది జిల్లాల నుంచి వినియోగదారులు ఫోన్‌చేసి సమస్యలను తెలియజేశారు. సంస్థ డైరెక్టర్లు ఆయూబ్‌ఖాన్, గురవయ్య, రామ్మోహన్‌రావు, సీజీఎం జానకీరామ్ పాల్గొన్నారు.

మహిళపై చిరుత పిల్లల దాడి

ఐరాల, న్యూస్‌టుడే: మండలంలోని పుత్రమద్ది గ్రామ సమీప మామిడి తోటలో అదే గ్రామానికి చెందిన కాంతమ్మపై ఇటీవల రెండు చిరుత పిల్లలు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. ఈ దాడిలో ఆమె స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ డీఆర్వో రాకేష్‌కుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని సోమవారం పరిశీలించారు. ఇటీవల గ్రామ సమీప గుట్టలో చిరుత దాడిలో ఆవు మృతి చెందిన విషయం విదితమే. ప్రజలు చిరుతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

3న అవుట్ రీచ్ ప్రోగ్రామ్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మాజీ సైనికులు, వితంతువులు, ఆధారితుల పింఛను సమస్యల పరిష్కారానికి ఈ నెల 3న ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ భవనంలో స్పర్శ్ అవుట్ రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నామని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు తెలిపారు. కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్- సికింద్రాబాద్ బృందం పాల్గొంటుందన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in.
బ్రాంచ్ కార్యాలయము : పలమనేరు

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్-13(2) క్రింద డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022 వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిస్టరు కాబడి వారి రిజిస్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడ మైనది. బ్రాంచ్ కార్యాలయము: పలమనేరు

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా అపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా
1) డి.వరదప్ప తండ్రి మునస్వామి, డి.నెం.32-49/1, బోడిరెడ్డిపల్లి (గ్రామం), పలమనేరు, మార్కెట్ యార్డ్, చిత్తూరు జిల్లా - 517408
2) డి.జయమ్మ భర్త డి.వరదప్ప డి.నెం.32-49/1, బోడిరెడ్డిపల్లి (గ్రామం), పలమనేరు, మార్కెట్ యార్డ్, చిత్తూరు జిల్లా - 517408
3) పి.సుబ్రమణ్యం, తండ్రి చిన్నప్పోడు, డి.నెం.29-141, జి.కొత్తూరు, పలమనేరు, చిత్తూరు జిల్లా - 517408
4) డి.తేజేంద్ర, తండ్రి డి..వరదప్ప, డి.నెం.32-49/1, బోడిరెడ్డిపల్లి గ్రామం, పలమనేరు, మార్కెట్ యార్డు, చిత్తూరు జిల్లా - 517408

1) ఎన్‌పిఏ తేది: 31-03-2021 2) ఎన్‌పిఏ తేది: 30.09.2019
డిమాండ్ నోటీసు తేది: 20.09.2025
1) ఋణ మొత్తం రూ.10,00,000 (పది లక్షల రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: PLMNRTF1903150002
2) ఋణ మొత్తం రూ.15,00,000 (పదహైదు లక్షల రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: PLMNRTF1803280011
డిమాండ్ నోటీసు అమౌంట్: రూ. 58,19,407/- (యాభై ఎనిమిది లక్షల పంతొమ్మిది వేల నాలుగు వందల ఏడు రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు
చిత్తూరు జిల్లా, పలమనేరు సబ్ జిల్లా, పలమనేరు మండలం, పలమనేరు గ్రామ పంచాయతీ, ప్రస్తుత పలమనేరు మున్సిపాలిటీ వార్డునెం.32, పాత డి.నెంబర్లు 32/46 మరియు 32/47, కొత్త డి.నెం. 32/83, అసెస్మెంట్ నెం.1117012883 గల ఇల్లు. హద్దులు: గద్దూరు ఏరియా పలమనేరు సర్వేనెం.203/ఎ, 203/బి, 203/సి :తూర్పు: ఏ.వెంకాసురెడ్డి భూమి, పడమర: రోడ్డు, ఉత్తరం: మేస్త్రి నారాయణప్ప మరియు గోపాల్ స్థలం, దక్షిణం: కె.నారాయణశెట్టి మరియు ఇతరుల ఇళ్ళు (ప్రస్తుతం సుబ్బయ్యశెట్టి). ఈ హద్దుల మధ్య స్థలానికి కొలతలు: తూర్పు నుండి పడమర: 32 1/2అ. లేదా 9.906మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 28 1/2అ. లేదా 8.687మీ. వెరశి 103 చ.గ. ఖాళీ స్థలం మరియు ఇందున నిర్మించిన స్టోన్ స్లాబ్ టెర్రేస్ బిల్డింగ్ కొలతలు: 32 1/2అ. × 28 1/2అ. = 927 చ.అ. వాటికి అమర్చి యుండు ఫిక్చర్లు మరియు అనుబంధ స్థలంలో వున్న రెస్ మౌల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేమనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించ వలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనపరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియ జేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13) ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: పలమనేరు సం/- అధీకృత అధికారి,
తేది: 25.11.2025 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in.
బ్రాంచ్ కార్యాలయము : పుత్తూరు

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెస్ట్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్-13(2) క్రింద డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిస్టరు కాబడి వారి రిజిస్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడ మైనది. బ్రాంచ్ కార్యాలయము: పుత్తూరు

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా అపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా
1) ఎం. చిన్నస్వామి తండ్రి లేట్ మునిరత్నం, డి.నెం.4-44, బజార్ వీధి, రాచపాళెం, పుత్తూరు, చిత్తూరు జిల్లా - 517583
2) సి.మురుగమ్మాల్ భర్త ఎం.చిన్నస్వామి, డి.నెం.4-44, బజార్ వీధి, రాచపాళెం, పుత్తూరు, చిత్తూరు జిల్లా - 517583
3) ఎన్.శ్రీనివాసులు తండ్రి ఎన్.శ్రీరాములు, డి.నెం.20-42, చాకలపేట, పుత్తూరు, చిత్తూరు జిల్లా -517583

ఎన్‌పిఏ తేది: 31.03.2020 డిమాండ్ నోటీసు తేది: 11.09.2025
ఋణ మొత్తం రూ.10,00,000 (పది లక్షల రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: PUTTRTF1712310004
డిమాండ్ నోటీసు అమౌంట్: రూ.28,04,809/- (ఇరవై ఎనిమిది లక్షల నాలుగు వేల ఎనిమిది వందల తొమ్మిది రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు
చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, పుత్తూరు సబ్‌జిల్లా, పుత్తూరు మండలం, పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నెం.30, పుత్తూరు గ్రూప్, గోవిందపాళెం గ్రామలెక్కదాఖలా, గ్రామ కంఠం సర్వేనెం.206/14ఎ, వార్డునెం.13, కొత్తవీధి నుండి చాకలిపేటకు వెళ్ళు లేన్, రెసిడెన్షియల్ ఏరియా కొత్త డి.నెం.20-143/1గల ఆర్.సి.సి.బిల్డింగ్. హద్దులు: తూర్పు మంగమ్మ ఇల్లు, పడమర: కొత్తవీధి నుండి చాకలిపేటకు వెళ్ళు లేన్, ఉత్తరం: నటార్ ఇల్లు, దక్షిణం: రంగాచారి ఇల్లు, ఈ హద్దుల మధ్య స్థలానికి కొలతలు: తూర్పు నుండి పడమర: 28.5అ. లేదా 8.687 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: ఇరువైపులా 33అ. లేదా 10.058మీ. వెరశి 104.5 చ.గ. స్థలం, మరియు ఇందున పూర్తి విస్తీర్ణంలో నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్ అనగా 940.5 చ.అ. గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్ ఫ్లోర్ కొలతలు: తూర్పు నుండి పడమర: 22అ. లేదా 6.705మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 11అ. లేదా 3.352 మీ. వెరశి 242 చ.అ. మరియు 1వ ఫ్లోర్‌లోని వున్న 100 చ.అ. గోడలు లేని జింక్ షీట్ రూఫ్ గల వరండా, వాటికి అమర్చియుండు ఫిక్చర్లు మరియు అనుబంధ స్థలంతో సహా.

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేమనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించ వలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనపరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియ జేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13) ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: పుత్తూరు సం/- అధీకృత అధికారి,
తేది: 26.11.2025 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

EENADU Classifieds

EDUCATION
LAST CHANCE: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆9381287629.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
తిరుపతి - చంద్రగిరి టౌన్‌లో మెయిన్‌రోడ్‌కు ఆనుకొని హౌస్ - విల్లా - హోమ్‌స్టే & అపార్ట్‌మెంట్ కట్టుకునే TUDA అప్రూవల్ కొత్త వెంచర్‌లో కమర్షియల్ - రెసిడెన్షియల్ - ఇన్వెస్ట్‌మెంట్ కొరకు 100% వాస్తు Plots అమ్మబడును. సంప్ర॥ 9505502346.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

LEASE/ RENT
GENERAL
Tirupati, Mangalam, Karakambadi Road RTC Depo Road, Front 60 feet Road, 1200 Sft for Godown Purpose. Pls Con: 9652441555

JOBS
Exp. మాస్టర్స్(జీ: 30K) & వెయిటర్స్(జీ:12K) కావలెను. ఫ్రీ భోజనం + వసతి. హోటల్ శరవణ భవన్, తిరుచానూరు ✆ 7093543337, 8897940639.

నెల్లూరులోని ప్రముఖ మాల్‌లో క్రింది సిబ్బంది కావలెను. లాండ్రీ సూపర్‌వైజర్ : ఆటోమేటిక్ వాషింగ్ మిషన్‌లో యూనిఫారమ్స్ వాషింగ్, ఇస్త్రీ చేయుటలో మంచి అనుభవము ఉండవలెను. సెక్యూరిటీ సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డ్స్: ఎత్తు:5'8ft (పురుషులు), 5'4ft (స్త్రీలు) అనుభవజ్ఞులకు ప్రాధాన్యము. వయస్సు: 25-35 సంవత్సరాలు. మంచిజీతం, PF, ESI, గ్రాట్యూటీ, వార్షిక బోనస్ ఇవ్వబడును. దూరప్రాంత అభ్యర్థులకు ఉచిత బ్యాచిలర్ వసతి, భోజనం కలదు. ✆7997733000, 7997766000.

అన్న క్యాంటీన్‌కు తిరుపతి నుండి చిత్తూరుకు Food Transport చేయడానికి దోస్త్ వెహికల్‌కు పర్మనెంట్ డ్రైవర్స్ కావలెను. ✆ 99661 29199.

తిరుచానూరు మెయిన్ రోడ్డు లాడ్జి నందు పనిచేయుటకు (Male) రూమ్‌బాయ్స్ కావలెను. ✆ 91105 50998.

ప్రముఖ ఇంటర్నేషనల్ కొరియర్ సంస్థ బెంగుళూరు బ్రాంచ్ కొరకు TATA ACE డ్రైవర్స్ కావలెను. అకామిడేషన్ కలదు. 9014530584, 9291901305.

SECURITY GUARDS
Wanted Security Guards age 30-50Yrs, Good Salary with weekly off, For all over andhra. ✆ 9100058959, 9618508494.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

ముగ్గురు కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

పెనుమూరు: మండలంలోని కామచిన్నయ్యపల్లె పంచాయతీ కార్యదర్శి ప్రసన్న తిరుపతి జిల్లా నారాయణవనానికి, కలవకుంట కార్యదర్శి హాజీవల్లీఖాన్ వడమాలపేటకు ఉద్యోగోన్నతిపై వెళ్లారు. గుంటిపల్లె కార్యదర్శి బీకేమురళి గుడిపాల మండల డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొందారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ఆత్మసంతృప్తి

చిత్తూరు(సంతపేట): ఆధ్యాత్మిక చింతనతో ఆత్మ సంతృప్తి లభిస్తుందని ప్రవచనకర్త రాజయోగి రాంప్రసాద్ అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక విశ్వశాంతి భవన్‌లో శ్రీమద్భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్

నగరి, న్యూస్‌టుడే: ఈ నెల 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరి ఇన్‌ఛార్జి జడ్జి, పుత్తూరు అడిషనల్ సివిల్ జడ్జి కె.రమ్యసాయి సోమవారం కోరారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, న్యాయవాదులు, పోలీసులు అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు.

ధ్యానంతో అన్నింటినీ జయించొచ్చు

పుత్తూరు: ధ్యానంతో అన్నింటినీ జయించవచ్చని పీఎంసీ ట్రస్టు వైస్‌ఛైర్మన్ సంగీతబాబు పేర్కొన్నారు. అమరం కండ్రిగలో సుభద్రమ్మ, శంకర్‌నాయుడి వ్యవసాయ క్షేత్రంలో మహావతార్ బాబాజీ పిరమిడ్ ధ్యాన ఆశ్రమంలో మహావతార్ బాబాజీ జన్మదిన వేడుకలు పుత్తూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

విరమణ ఉద్యోగానికే.. క్రీడలకు కాదు

బాలాజీ సత్కార కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీవో)గా ఉద్యోగ విరమణ చేసిన బాలాజీని కలెక్టర్ సుమిత్‌కుమార్ సత్కరించారు. జిల్లా అధికారుల సంఘం నేతృత్వంలో సోమవారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ 30 ఏళ్లకుపైగా క్రీడా రంగానికి సేవలందించిన బాలాజీ.. ప్రతిభగల ఆటగాళ్లను వెలుగులోకి తెచ్చారని ప్రశంసించారు. విరమణ ఉద్యోగానికి మాత్రమేనని.. క్రీడా రంగానికి కాదన్నారు. శిక్షణ కలెక్టర్ నరేంద్ర పడాల్, డీఆర్‌వో మోహన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డీసీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

8న సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం: సంకటహర చతుర్థి సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీ ఉదయం, సాయంత్రం భక్తుల సౌకర్యార్థం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సామూహిక సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్, ఛైర్మన్ మణినాయుడు సోమవారం తెలిపారు. సాయంత్రం స్వామివారికి స్వర్ణ రథోత్సవం జరుగుతుందన్నారు. నాలుగో తేదీన పౌర్ణమి సందర్భంగా వరదరాజస్వామి వారి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, రాత్రి గరుడ సేవ నిర్వహిస్తామని చెప్పారు. ఐదో తేదీన హుండీ లెక్కింపు ఉంటుందని వారు పేర్కొన్నారు.

వర్షాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

కాణిపాకం, న్యూస్‌టుడే: వర్షాల్లో వరసిద్ధి వినాయకస్వామి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులు, సిబ్బందిని ఈవో పెంచల కిషోర్ ఆదేశించారు. ఆలయ పరిసరాలు, బస్టాండు, దార్శనిక్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను సిబ్బందితో కలిసి సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాలు, అయ్యప్ప భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు.

ఘనంగా గీతా జయంతి

పుత్తూరు: శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరాలయం ప్రాంగణంలోని గీతా మందిరంలో గీతా సేవా సమాజం ఆధ్వర్యంలో సోమవారం గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడికి అభిషేకం నిర్వహించి అలంకరించారు. భగవద్గీత పారాయణ, గీతా పారాయణ చేశారు. ఆలయ ఆవరణలో పెద్దఎత్తున అన్నదానం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

చిత్తూరు నగరం: ప్రజా సమస్యలపై అందే ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్-2, ప్రజారోగ్యం-2, టిడ్కో-1 చొప్పున మొత్తం ఐదు వినతులు అందాయి. సహాయ కమిషనర్, ఎంహెచ్‌వో పాల్గొన్నారు.

తప్పుడు సాక్ష్యం చెప్పిన కేసు 19కి వాయిదా

చిత్తూరు (న్యాయవిభాగం): చిత్తూరు మేయరు దంపతులు కఠారి అనురాధ, మోహన్ హత్య కేసు విచారణ సమయంలో 14 మంది న్యాయస్థానంలో తప్పుడు సాక్ష్యం ఇచ్చారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి వీరందరినీ ఎందుకు ప్రాసిక్యూట్ చేయకూడదో చెప్పాలని షోకాజ్ నోటీసులు ఇవ్వాలని [illegible] ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం నగరపాలక సంస్థ ఉద్యోగులు సీహెచ్.సురేష్‌కుమార్, జె.మల్లికార్జున, ఆర్.బాలకృష్ణ, పి.పద్మనాభశెట్టి, డి.ఆదాము, ఆర్.ఆనందనాయుడు, ఎస్.మునిరత్నం, డి.ముద్దుకృష్ణ యాదవ్, ఎస్.దొరైరాజ్, ఎంకే త్యాగరాజన్, జి.గోపీనాథ్, పి.ధనంజయ, కె.కిరణ్‌కుమార్(కో-ఆప్షన్ సభ్యులు), జీకే వాసుబాబు(కఠారి అనుచరుడు) కోర్టుకు హాజరయ్యారు. పూర్వాపరాలు పరిశీలించిన పిదప ఈ నెల 19కు వాయిదా వేసి ఆరోజు తప్పక సంజాయిషీ ఇవ్వాలని ఆరో అదనపు జిల్లా కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు.

దర్జాగా మింగేశారు..

- పంచాయతీ నిధుల దుర్వినియోగం
- నాడు వైకాపా నేతలతో కుమ్మక్కు
- స్వర్ణ పంచాయతీ యాప్‌తో కట్టడి

జిల్లా పంచాయతీ కార్యాలయం

న్యూస్‌టుడే, చిత్తూరు(జిల్లా పంచాయతీ): వైకాపా హయాంలో పలు పంచాయతీల్లో నిధులను పక్కదారి పట్టించారు.. ఆర్థిక సంఘ నిధులతో పాటు స్థానిక ఆదాయ వనరులను వైకాపా పాలనలో ఆ పార్టీ నేతలు, సిబ్బంది స్వాహా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమాలను వెలికితీశారు.. కొన్ని పంచాయతీల్లో విచారించి చర్యలు చేపట్టగా, వెలుగు రాని అక్రమాలు అనేకం ఉన్నాయి.. పల్లె పాలనలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ యాప్ అందుబాటులోకి తెచ్చింది.. పన్ను వసూళ్లతో పాటు, ఆర్థిక లావాదేవీలన్నీ ఈ యాప్‌లో నమోదు చేసి లెక్కలు పక్కాగా ఉంచేలా చర్యలు చేపట్టారు.. అయితే గ్రామీణ ప్రజల్లో నూతన విధానంపై అవగాహన అంతంత మాత్రంగానే ఉంది.

పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన, నిధులు, స్థానిక ఆదాయ వనరుల నుంచి వచ్చిన పన్నులు, ఇతరత్రా నిధులు ఎన్నో ఉంటాయి. వీటికి నిన్నమొన్నటి వరకు సరైన లెక్కలు లేవని, ఉన్న లెక్కలూ కాకి లెక్కలేననే బహిరంగ విమర్శలు ఉన్నాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో నాయకులతో కుమ్మక్కైన పంచాయతీ సిబ్బంది నిధుల దుర్వినియోగానికి సహకరించారనే ఫిర్యాదులూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనేక అక్రమాలు నిగ్గు తేల్చారు. ప్రత్యేకంగా విచారణ బృందాలను నియమించి పంచాయతీల్లో నిధులు, ఖర్చులు, లెక్కలు తెలుస్తున్నారు. అక్రమాలు తేలితే బాధ్యులపై చర్యలు చేపడుతున్నారు.

● బంగారుపాళ్యం మండలంలోని తుంబకుప్పం పంచాయతీలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి, వైకాపా నాయకులు కుమ్మక్కై నిధులను స్వాహా చేశారనే ఫిర్యాదు అందింది. దీనిపై ఉన్నతాధికారులు చిత్తూరు డీఎల్‌పీవో ఆధ్వర్యంలో విచారణకు ఆదేశించారు. ప్రారంభంలో హడావుడి చేసినా ఆపై రాజకీయ ఒత్తిళ్లతో విచారణ నిలిచిపోవడం విశేషం.

వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని, రికార్డులు సక్రమంగా నిర్వహించ లేదనే ఫిర్యాదులు అందడంతో ఆ సర్పంచి చెక్‌పవర్ రద్దు చేశారు. తానెలాంటి తప్పు చేయలేదని సంబంధిత సర్పంచి న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆదేశాలు పొంది తన చెక్‌పవర్ పునరుద్ధరింపజేసుకున్నారు.

మండలం గుండ్లకట్టమంచి పంచాయతీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని ఆ గ్రామస్థులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మూడేళ్లుగా బిల్లులు, ఎంబుక్ లేకనే పారిశుద్ధ్య పనులకు సంబంధించి రూ.10 లక్షలు డ్రా చేశారని, గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు రూ.2 లక్షలకు నకిలీ వోచర్లు సృష్టించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 లక్షలకు బిల్లులు, ఎంబుక్ లేకుండా చెక్కుల ద్వారా నిధులు డ్రా చేశారని సహచట్టం ద్వారా సేకరించిన వివరాలు ఉన్నతాధికారులకు నివేదించడంతో అప్పట్లో ఆ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. విచారణ పెండింగ్‌లో ఉందనే కారణం చూపి అతడికి ఇటీవల మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం.

అక్రమాలకు అవకాశం లేకుండా చర్యలు..

గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై చర్యలు చేపట్టాం. అక్రమాలకు అవకాశం లేకుండా ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ యాప్ తెచ్చింది. పన్నులు, పన్నేతరులు ఏదైనా ప్రజలు యాప్ ద్వారా డిజిటల్ రూపంలోనే చెల్లించాలి. పంచాయతీ నిధుల లెక్కలన్నీ ఈ యాప్‌లోనే అప్‌లోడ్ చేయాలి. అలాకాక నగదు రూపంలో లావాదేవీలు నిర్వహిస్తే చర్యలు చేపడతాం.

- సుధాకర్‌రావు, డీపీవో

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, గుడిపాల: సమస్య: రాసనపల్లె ఎస్సీకాలనీలోని కాల్వల్లో మురుగునీరు పేరుకుపోయింది.
- సెల్వకుమార్, స్థానికుడు
సమాధానం: కాల్వలు శుభ్రం చేయిస్తాం.
- శిరీష, ఎంపీడీవో

పుత్తూరు.. శ్రీరామలింగేశ్వరాలయంలో దీపాలు వెలిగించిన మహిళలు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడంతోనే అభివృద్ధి సాధ్యమని సీఐ ప్రమీల పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీరామలింగేశ్వరాలయంలో రాస్ మహిళా క్రాంతి పొదుపు సంఘాల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు. రాస్ సిబ్బంది వేదాచలం, బాలకృష్ణ, ప్రకాష్, మునిశేఖర్, ఏకాంబరం, ధనలక్ష్మి, ఉషారాణి పాల్గొన్నారు. **చిత్తూరు(సంతపేట):** నగరంలోని రాజుగుడి, కట్టమంచిలోని శ్రీ కుళందీశ్వరస్వామి ఆలయం, శ్రీ అగస్తీశ్వరస్వామి దేవస్థానాల్లో భక్తులు దీపారాధన నిర్వహించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. **బంగారుపాళ్యం:** మొగిలి స్వయంభు శ్రీ మొగిలీశ్వరస్వామి ఆలయం, కేజీసత్రంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సిద్ధేశ్వరసామి ఆలయం వద్ద వన భోజనాలు నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షులు ధరణీ ప్రసాద్‌నాయుడు, రాష్ట్ర సర్పంచుల సంఘ కార్యదర్శి మురళీ, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ వాహనాలు ఇంకెన్నాళ్లిలా..?

దశాబ్ద కాలం క్రితం బంగారుపాళ్యం సమితిగా ఉండేది. ఐరాల, తవణంపల్లె మండలాలు దీని పరిధిలో ఉండేవి. ఇక్కడ తహసీల్దారు, ఎంపీడీవోలు గ్రామాలకు విధి నిర్వహణకు జీపుల్లో వెళ్లేవారు. ఆపై మండలాల ఆవిర్భావంతో ఆయా వాహనాలు సైతం అందుబాటులో ఉన్నాయి. బంగారుపాళ్యంలో నాటి వాహనాలు నేటికీ నిరుపయోగంగా మారి మూలకు చేరాయి. వీటిని కనీసం పట్టించుకోకుండా ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో వదిలేశారు. జీపులే కదాని చిన్నచూపో.. నేడు అధునాతన వాహనాలు అందివచ్చాయనే ఉద్దేశమో.. పాత వాహనాలను పట్టించుకోకుండా ఇలా నిరుపయోగంగా వదిలేయడం గమనార్హం.

-న్యూస్‌టుడే, బంగారుపాళ్యం

విద్యార్థులకు సైకిళ్ల అందజేత

తవణంపల్లి, న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ మండలంలోని తెల్లగుండ్లపల్లిలో గత నెల 29న పర్యటించి విద్యుత్తు సరఫరాపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్న విషయం విదితమే. తెల్లగుండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు సైతం పరిశీలించారు. ప్రతిభ కనబరిచిన నాలుగో తరగతి విద్యార్థులు వైష్ణవి, తరుణ్‌కు ప్రోత్సాహకంగా సైకిళ్లను సోమవారం పంపిణీ చేశారు. ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ మునిచంద్ర, డిప్యూటీ డీఈవో ఇందిర పాల్గొన్నారు.

సైకిళ్లు అందజేస్తున్న విద్యుత్తు శాఖ ఎస్ఈ అహ్మద్, అధికారులు

త్రోబాల్ వేస్తున్న ఉపాధ్యాయులు

క్రీడలతో మానసికోల్లాసం

పెనుమూరు, న్యూస్‌టుడే: క్రీడలు మానసికోల్లాసానికి ప్రతీకలని ఎంఈవోలు రాజేంద్రన్, భాస్కర్‌నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందనలు తెలియజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదమరి: వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

'వృద్ధుల్లో ఆనందం కనిపిస్తోంది'

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ప్రతి నెలా ఒకటో తేదీ వస్తే వృద్ధుల్లో ఎక్కడాలేని ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. సోమవారం నగరంలోని పలు డివిజన్లలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్ పాల్గొన్నారు. **యాదమరి:** ఎమ్మెల్యే మురళీమోహన్.. జంగాలపల్లిలో పింఛన్లు పంపిణీ చేశారు. మండల తెదేపా అధ్యక్షుడు మురార్జీయాదవ్, ప్రధాన కార్యదర్శి రబీ, కాణిపాకం ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ మణినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షురాలు చిత్ర, మాజీ మండల అధ్యక్షుడు వినాయకం గౌండర్, తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి అమరనాథనాయుడు పాల్గొన్నారు. **పుత్తూరు:** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు భేష్‌గా ఉన్నాయని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలోని 3వ వార్డులో పింఛన్లు అందజేశారు. వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగరెడ్డి, పట్టణ తెదేపా అధ్యక్షుడు గాలి జీవరత్నం, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, కౌన్సిలర్ కేశవాచారి, నాయకులు మురళి, లక్ష్మీపతి పాల్గొన్నారు. **నిండ్ర:** ఎమ్మెల్యే భానుప్రకాష్.. చవరంబాకంలో పింఛను అందజేశారు. నాయకులు పాల్గొన్నారు. **పాలసముద్రం:** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్.. స్థానిక పంచాయతీ దళితవాడలో పింఛన్ల పంపిణీ సహా రూ.60 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువ ప్రారంభించారు. పార్టీ అధ్యక్షుడు శివ, పెనుమూరు ఏఎంసీ ఉపాధ్యక్షుడు అరుల్‌నాథన్, ఇందిరమ్మ, ఎంపీడీవో సతీష్‌రాజు, తహసీల్దార్ గురప్ప, ఎస్సై రాజశేఖర్, ఏఈ లోకేష్ రెడ్డి, రాఘవ, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు. * స్థానిక ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యా సామగ్రిని ఎమ్మెల్యే థామస్ అందజేశారు. ఎంఈవో రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చిత్తూరు(సంతపేట):** ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ ద్వారా వృద్ధులు, వితంతువుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని భాజపా చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం తెలిపారు. 37వ డివిజన్‌లోని లబ్ధిదారులకు ఆయన పింఛను పంపిణీ చేశారు.

పుత్తూరు.. మూడో వార్డులో మహిళకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పాలసముద్రం: సీసీరోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే థామస్

మాట్లాడుతున్న ప్రొఫెసర్ రితీష్ కుమార్ గంగ్వార్

సిద్ధార్థలో 'క్వాంటమ్ కంప్యూటింగ్'పై శిక్షణ

నారాయణవనం, న్యూస్‌టుడే: పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇంట్రడక్షన్ టు క్వాంటమ్ కంప్యూటింగ్' అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, జేఎన్టీయూ అనంతపురం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని కళాశాల ప్రిన్సిపల్స్ మధు, జనార్దన్‌రాజు తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు జరిగే ఈ కార్యక్రమంలో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాముఖ్యత, ప్రాథమిక సిద్ధాంతాలు, ఆధునిక పరిశోధనా ధోరణులు, అనువర్తనాలపై నిపుణులు అధ్యాపకులకు శిక్షణ అందిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా తిరుపతి ఐఐటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.రితీష్ కుమార్ గంగ్వార్, ఐఐఎస్ఈఆర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.చిత్రసేన్‌జేనా విచ్చేసి శిక్షణ ఇచ్చారు. కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

చిత్తూరు(వైద్య విభాగం): ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి భారతి, ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై చిన్నలు, పెద్దలకు అవగాహన అవసరమని ఎమ్మెల్యే జగన్మోహన్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి భారతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఎయిడ్స్ గురించి అందరూ తెలుసుకోవాలని, వైద్యారోగ్యశాఖ అధికారులు దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అనంతరం అధికారులు, విద్యార్థులు గాంధీ విగ్రహ కూడలి వరకు ర్యాలీగా వెళ్లారు. నగరంలోని వివిధ కళాశాలల్లోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, రెడ్ రిబ్బన్ క్లబ్ వాలంటీర్లు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. **పుత్తూరు, జీడీనెల్లూరు, నగరి, పెనుమూరు, గుడిపాల, నిండ్ర, బంగారుపాళ్యం, తవణంపల్లె** తదితర ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది, ఆయా ప్రభుత్వ కళాశాలల్లో రెడ్‌రిబ్బన్ క్లబ్‌ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు, మానవహారం నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు.

పుత్తూరు.. వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆలకించి.. దయచూపండయ్యా..!

- వ్యయప్రయాసలకోర్చి వచ్చాం
- బాధితుల వేడుకోలు

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు), కలెక్టరేట్

సమస్యల పరిష్కారానికి ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. పరిష్కారం చూపే నాథుడే లేరని.. మండలాల్లో కనీసం తమ గోడు ఆలకించే అధికారులే కరవయ్యారని పలువురు అర్జీదారులు కన్నీటి పర్యంతమయ్యారు.. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారంలో కనీసం చొరవ చూపడం లేదని వాపోతున్నారు.. దీంతో చేసేదేమీలేక విసిగి వేసారి, వ్యయప్రయాసల కోర్చి కలెక్టరేట్‌కు వచ్చామని ఆవేదన వెలిబుచ్చారు.. మీరైనా ఆలకించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

దివ్యాంగ పింఛను అందజేయండి..

తాను నడవలేని స్థితిలో ఉన్నానని, తనకు దివ్యాంగ పింఛను అందజేయాలని చిత్తూరు నగరం ఇరువారానికి చెందిన జయశంకర్ అధికారులను వేడుకున్నాడు. మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో రెండుకాళ్లు దెబ్బతిని రాడ్డు అమర్చారని చెప్పాడు. ఉన్నతాధికారులు దయతలచి తనకు పింఛను మంజూరు చేస్తే ఆ నగదు తనకు ఎంతో ఉపకరిస్తుందని విన్నవించాడు.

సమస్యలు పరిష్కరించాలి..

చిత్తూరు నగరంలోని కలెక్టరేట్‌కు సమీప నెప్ట్యూన్ నగర్ సమస్యలు పరిష్కరించాలని ఆ ప్రాంత వాసులు సాయిప్రసాద్, వాసుదేవన్, సుబ్రహ్మణ్యం తదితరులు అధికారులకు విన్నవించారు. తమ ప్రాంతంలో మూడు వీధులు ఉన్నాయని, రెండింటిలో పూర్తిగా రాళ్లు తేలిపోయి ద్విచక్ర వాహనదారులు, స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. మురుగునీటి కాలువలు నిర్మించడం సహా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

దళితవాడకు దారి ఏర్పాటు చేయాలి..

ఐరాల మండలం గాజులపల్లె దళితవాడకు దారి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామానికి తిరుపతి-కాణిపాకం వెళ్లే రోడ్డు నుంచి రహదారి ఉండేదని, అయితే కొందరు ఆ దారిలో అడ్డంగా రాళ్లు, మట్టి తరలిస్తున్నారన్నారు. తమను అటుగా వెళ్లనీయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఆలయ నిర్మాణానికి స్థలం ఇప్పించరూ..

తమ ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి స్థలం ఇప్పించాలని చిత్తూరు నగర పరిధి నరిగిపల్లె యానాది కాలనీ వాసులు వేడుకున్నారు. ఈ కాలనీలో 40 కుటుంబాలు ఉంటున్నాయన్నారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని విన్నవించారు.

క్రైం కార్నర్

తండ్రి ఇరుముడి కోసం వచ్చి ప్రమాదం
పుత్తూరు: శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టకు చెందిన త్రివేణి(20), తమిళనాడు రాష్ట్రం తిరుత్తణికి చెందిన మోహన్‌కుమార్ భార్యాభర్తలు. శ్రీకాళహస్తిలో ఉంటున్న త్రివేణి తండ్రి శబరిమలైకు వెళ్తుతుండటంతో భార్యాభర్త తిరుత్తణి నుంచి వచ్చారు. సోమవారం ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తి నుంచి తిరుత్తణికి వెళ్తుండగా పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం పంచాయతీ పరిధి కైలాసపురం దాటాక ముందు వెళ్తున్న సిమెంట్ లారీని అధిగమించే ప్రయత్నంలో ప్రమాదం జరిగి త్రివేణి కుడి కాలు పూర్తిగా దెబ్బతింది. భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను నగరి ఏరియా ఆస్పత్రికి, ఆపై చెన్నైకు తరలించారు. ఎస్సై ఓబయ్య కేసు నమోదు చేశారు

ద్విచక్ర వాహనం ఢీకొని పశువుల కాపరి దుర్మరణం పుత్తూరు: పట్టణ పరిధిలోని కోనేటిపల్లం నివాసి సుబ్రహ్మణ్యం(55) పశువులు మేపుకొని జీవిస్తున్నాడు. సోమవారం కోనేటి పల్లం వద్ద పశువులు మేస్తున్నాయి. అతడు రోడ్డు పక్కన నిల్చొని ఉండగా నందిమంగళానికి చెందిన శశి.. తన ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ ఆ వృద్ధుణ్ని ఢీకొట్టడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి సుబ్రహ్మణ్యాన్ని తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని, కేసు నమోదు చేశామని ఎస్సై ఓబయ్య తెలిపారు.

బస్సు ఢీకొని పెయింటర్.. చిత్తూరు(నేర వార్తలు): చిత్తూరు రూరల్ మండలం చెన్నమ్మ గుడిపల్లికి చెందిన వినోద్(30) పెయింటర్. సోమవారం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి బయల్దేరాడు. కలెక్టరేట్ సమీప డీటీసీ కార్యాలయం నుంచి సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సు అతడిని ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు రాకపోకలు పునరుద్ధరించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ముగ్గురికి గాయాలు.. వెదురుకుప్పం: ఎస్సార్‌పురం మండలం యల్లంపల్లెకు చెందిన సిద్ధమ్మ తిరుపతిలో నివసిస్తోంది. స్వగ్రామానికి వచ్చిన ఆమె తన కుటుంబీకులతో కలిసి బాడుగ ఆటోలో తిరుపతికి వెళ్తుండగా మార్గమధ్యలో వెదురుకుప్పం మండలం తంగేళిమిట్ట వద్ద దేవళంపేట వెళ్తున్న కారు వీరి ఆటోను ఢీకొట్టింది. సిద్ధమ్మ, కోడలు సుశీల, ఆటో డ్రైవర్ వెంకటేష్‌కు గాయాలయ్యాయి.

ద్విచక్ర వాహనం చోరీ.. కార్వేటినగరం: ఆలత్తూరు గ్రామానికి చెందిన పురుషోత్తం గత నెల 27న రాత్రి కొల్లాగుంటలోని బంధువుల ఇంటి ముందు తన ద్విచక్ర వాహనాన్ని ఉంచి నిద్రపోయాడు. మరుసటిరోజు ఉదయం లేచిచూసే సరికి అది కనబడకపోవడంతో ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేశామని ఎస్సై రమేష్ తెలిపారు.

ఆగడాలు అరికట్టాలి.. పుత్తూరు: పరమేశ్వర మంగళంలోని ఓ ప్రైవేటు న్యాయ కళాశాలలో జరుగుతున్న ఆగడాలను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. కళాశాల ఎదుట సోమవారం నిరసన తెలియజేశారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయ కళాశాల విద్యార్థులు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు
•పలమనేరు •కుప్పం •పుంగనూరు

బేస్‌బాల్ విజేతలు చిత్తూరు, కడప

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు సోమవారం హోరాహోరీగా జరిగాయి. బాలికల విభాగం ఫైనల్‌లో చిత్తూరుతో తలపడిన కడప జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలోనూ చిత్తూరు, కడప జట్లు పోటీ పడ్డాయి. చిత్తూరును ట్రోఫీ వరించింది. విజేతలకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

జ్ఞాపిక అందుకుంటున్న విజేత జట్టు

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి

అలంకరణలో విగ్రహాలు

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరులోని లక్ష్మీనరసింహ, శ్రీకృష్ణాలయాల్లో సోమవారం గీతా జయంతి నిర్వహించారు. శ్రీకృష్ణుడి ప్రతిమ, భగవద్గీత పుస్తకాలను మందిరంలో నెలకొల్పి పూజించారు. ● **భగవద్గీత కంఠస్థ పోటీలు..** కుప్పం పట్టణం: భగవద్గీత చదివితే జీవిత సత్యాలు తెలుస్తున్నాయని శ్రీప్రజ్ఞానంద సరస్వతి అన్నారు. సుజ్ఞానంద ఆశ్రమంలో భగవద్గీత కంఠస్థ పోటీలు సోమవారం నిర్వహించారు. గీతలో 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు ఉన్నాయన్నారు.

ఆస్తులు రాయించుకొని.. కుమారుడు గెంటేశాడు

అర్జీలు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో కడా ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ప్రజలు కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు అర్జీలు అందజేశారు. తమ భూమికి దారి కల్పించాలని, పనులకు బిల్లులు మంజూరు చేయించాలని పలువురు కోరారు. ● ఆస్తులు రాయించుకొని తల్లిదండ్రులను ఇంటి నుంచి బయటకు కుమారుడు గెంటేశాడని గుండ్లసాగరానికి చెందిన ఓ తండ్రి ఫిర్యాదు చేశారు. రోజూ ఇబ్బంది పడుతున్నామని, చనిపోవాలని అనిపిస్తోందని అధికారుల ముందు ఆవేదన చెందారు. ● గుడుపల్లెలోని హెచ్‌పీ డీలర్ నుంచి సమయానికి గ్యాస్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు కుప్పం పట్టణానికి చెందిన శ్రీనివాసులు అర్జీ ఇచ్చారు.

కునుకు కరవు.. నీళ్లు లేవు..

❖ వసతి గృహాల విద్యార్థులకు ఇక్కట్లు

పుంగనూరు, న్యూస్‌టుడే: తాగేది బోరు నీరు.. చన్నీటి స్నానాలు.. చలితో జాగారాలు.. ఇవి ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు నిధులు కేటాయించింది. అయినప్పటికీ పనుల్లో పురోగతి రాకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

నిద్రలేని రాత్రులు.. కొన్ని నెలలుగా విద్యార్థులకు సరైన దుప్పట్లు సరఫరా చేయడం లేదు. కాస్మోటిక్ బిల్లులు సైతం మంజూరు కావడం లేదు. దీంతో తల్లిదండ్రులు వచ్చే సమయంలో డబ్బులు ఇవ్వడం, సామగ్రి తీసుకురావడం లాంటివి చేస్తున్నారు. ప్రస్తుతం చలి, దోమల తీవ్రత పెరిగిన నేపథ్యంలో కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. చలితో విద్యార్థులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. కొన్ని వసతి గృహాల్లో శుద్ధ జలం లేక విద్యార్థులు కుళాయి నీరు తాగుతున్నారు. వేడినీళ్ల కోసం సోలార్ ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇవీ వివరాలు..
నియోజకవర్గం: పుంగనూరు
మండలాలు: 6 (పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల)
వసతి గృహాలు: 13 (ఎస్సీ, బీసీ బాలురు, బాలికలు)
ఖాళీలు: 1000
చేరింది: 830 మంది

శిథిల స్థితిలో బీసీ బాలుర వసతి గృహం

చేరికలపై ప్రభావం.. గతంలో ప్రభుత్వ వసతి గృహాల్లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడేవారు. వైకాపా హయాంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో చాలా చోట్ల భవనాలు శిథిలమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా వరకు రూపురేఖలు మార్చారు. నాణ్యమైన భోజనం, దుస్తులు, పుస్తకాలు అందిస్తున్నారు. కానీ వసతుల లేమితో చేరికలపై ప్రభావం పడుతోంది. నియోజకవర్గంలోనే 170 సీట్ల వరకు మిగిలిపోయాయి. విషయం పుంగనూరు బీసీ హాస్టల్ వార్డెన్ రమణ వద్ద ప్రస్తావించగా.. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

ప్రతిభకు పట్టం.. బహుమతులతో సత్కారం

పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై జరిగిన వక్తృత్వ పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు. ఉమశ్రీ (8వ తరగతి), అనుశ్రీ, భానుప్రియ (9వ తరగతి) విజేతలుగా నిలిచారు. వీరికి హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. **- న్యూస్‌టుడే, పలమనేరు**

కాలుష్య కోరల్లో పాలారు నది

శాంతిపురం సమీపంలోని పాలారు నదిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్లాస్టిక్, చెత్త, మాంసం వ్యర్థాలను పడేస్తున్నారు. అన్నీ ఒకే చోట పేరుకుపోవడంతో కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. దీంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలారు సప్లైఛానల్ చిన్నేటి వంకలోనూ నీరు కలుషితం కావడంతో మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నాయని రైతులు చెబుతున్నారు.
– న్యూస్‌టుడే, శాంతిపురం

దారి ఛిద్రం.. ప్రయాణం భారం

రోజూ వందల సంఖ్యలో వాహనాలు తిరిగే రోడ్డు ఇటీవల వర్షాలకు కుంటలా మారిపోయింది. పలమనేరు-చిత్తూరు జాతీయ రహదారిలో గంగవరం ఫ్లైఓవర్ కింద సర్వీసు రోడ్డు పరిస్థితి ఇది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోతులను అంచనా వేయలేక అదుపుతప్పి పడుతున్నారు. గుంతలు పూడ్చాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పలమనేరు

ప్రహరీ లేక విద్యార్థులకు అవస్థలు

పుంగనూరు మండలంలోని కృష్ణంరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలు ప్రమాదకరంగా మారాయి. కొన్నాళ్ల క్రితం ఇక్కడ పనులు ప్రారంభించి వదిలేశారు. అప్పటి నుంచి అలానే వదిలేయడంతో పశువులు లోపలికి వస్తున్నాయి. నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నిధులు మంజూరైతే చేస్తామని ఎంఈవో నటరాజరెడ్డి తెలిపారు.
– న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

నిర్మించారు.. వదిలేశారు

శాంతిపురం మండలంలోని కెనమాకులపల్లె సచివాలయం సమీపంలో రైతు సేవా కేంద్రం భవనం నిర్మించారు. చుట్టూ పనికిరాని మొక్కలు, ముళ్ల పొదలు పెరిగిపోయాయి. గుట్టలపై ఉండటంతో భవనం వినియోగించడం లేదు. దీంతో పాములు, విష కీటకాలు తిరుగుతున్నాయని పలువురు వాపోయారు. అధికారులు స్పందించి భవనం శుభ్రం చేసి, వినియోగించాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శాంతిపురం

కంకర రోడ్డులో కష్టాలు

గంగవరం మండలంలోని కేజీబీవీకి వెళ్లే రోడ్డు దుస్థితి ఇది. దీని వెనుక జగనన్న కాలనీ మంజూరు చేశారు. కానీ రోడ్డు వేయలేదు. దీంతో లబ్ధిదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వీరితో పాటు కేజీబీవీకి వస్తున్న విద్యార్థినులు సైతం కంకర రోడ్డులో అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే బురదగా మారుతోందని చెబుతున్నారు. సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రిన్సిపల్ రోహిణి తెలిపారు.
– న్యూస్‌టుడే, పలమనేరు

జాగ్రత్తలతో ఎయిడ్స్ దూరం

కుప్పం పట్టణంలో మానవహారం

పుంగనూరు గ్రామీణం, బైరెడ్డిపల్లె, పలమనేరు, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని వైద్యులు, విద్యార్థులు కుప్పంలో మానవహారం చేపట్టారు. ◆ పలమనేరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వైద్యులు సురేఖ, జయశంకర్, పుంగనూరు ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ రమ, అధ్యాపకులు, విద్యార్థులు, శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్, బైరెడ్డిపల్లెలో పీహెచ్‌సీ వైద్యులు అరుణ్ కుమార్, శాలిని ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ◆ **సోమల, కుప్పం గ్రామీణం, కల్లూరు, సదుం, చౌడేపల్లి:** సోమలలో వైద్యాధికారి జయసింహ, కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో రిసోర్స్ పర్సన్లు మమత, భాగ్యలక్ష్మి, పులిచెర్ల పీహెచ్‌సీలో వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, సదుం, చౌడేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు తులసీరామ్, జయప్రకాశ్ అవగాహన కల్పించారు.

అడవినాథునికుంట పాఠశాలలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాతాళ గంగ.. పైపైకి చేరంగ..

పలమనేరు, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో నీటిపారుదల శాఖ పరిధిలోని చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. జిల్లాలో పెద్దదైన శంకర్రాయలపేట చెరువు (100 ఎకరాల విస్తీర్ణం) నిండు కుండలా మారింది. ఇది నిండితే మిగిలిన అన్ని చెరువులకు నీరొచ్చినట్టే. దీంతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. చెరువుల్లో పుష్కలంగా నీరు చేరడంతో రబీ సాగుకు నీటి కొరత ఉండదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం వర్షాలకు వరి పంట దెబ్బతింది. నూర్పిడి చేసిన పంట ఎండబెట్టుకోడానికి వాతావరణం అనుకూలించడం లేదు. దీంతో రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఇరిగేషన్ పరిధిలో నీటితో నిండిన చెరువులు

మండలం	చెరువులు
పలమనేరు	105
పెద్దపంజాణి	287
గంగవరం	178
బైరెడ్డిపల్లె	176

నీటితో కళకళలాడుతున్న శంకర్రాయలపేట చెరువు

నీరు సమృద్ధిగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత పంట దెబ్బతిన్నా... ఇప్పుడైనా పండించొచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో వేరుసెనగ వేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. టమాట, మిరప సాగు చేయడానికి వాతావరణం అనుకూలంగా ఉంది.

వరి వేసుకోవచ్చు

ఈ నెలాఖరుకు నార్లు పోసుకుని మార్చి నాటికి ఫ్లవరింగ్ వచ్చేలా చూసుకోవాలి. వేరుసెనగ, రాగి కూడా వేసుకోవచ్చు. **– శివకుమార్, ఏడీఏ**

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

? పలమనేరు పట్టణంలోని సూరప్ప వీధిలో రోడ్డు పక్కన పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. **- సుందర్** ◆ సిబ్బందిని పంపించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. **- ఎన్వీ రమణారెడ్డి, పుర కమిషనర్** – న్యూస్‌టుడే, పలమనేరు

? ఇటీవల వర్షాలతో ప్రకాశం కాలనీ, నక్కబండలో వీధి దీపాలు పాడయ్యాయి. **- నారాయణ** ◆ వీధి దీపాలు బాగు చేస్తాం. **- మహేశ్, డీఈఈ** – పుంగనూరు

? పట్టణంలోని వారధి సమీపంలో డివైడర్ వద్ద సూచిక బోర్డు ఒరిగిపోయింది. **- రమేష్** ◆ సూచిక బోర్డును సరి చేస్తాం. **- శ్రీనివాసరావు, కమిషనర్** – కుప్పం పట్టణం

వీధి కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

పలమనేరు: పట్టణంలోని అయ్యాకణ్ణు వీధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగు తొలగించారు. వీధిలో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని 'ఈనాడు'లో వార్త ప్రచురితమవగా స్పందించి చర్యలు చేపట్టారు.

విద్యార్థుల్లో సేవా దృక్పథం పెరగాలి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సేవా దృక్పథం, సామాజిక బాధ్యత పెరగాలని అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు అన్నారు. సోమవారం పుంగనూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు భగత్‌సింగ్ కాలనీలో ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మొక్కలు నాటాలని, రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ప్రిన్సిపల్ గంగాధరనాయుడు, ఎంఈవో ఎంఈవో నటరాజరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి శరవణకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాళెం, బోడ్రెడ్డిగారిపల్లె, పాతపేట, కల్లూరు పంచాయతీల్లో పంట పొలాలపై ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు దాడి చేసినట్లు రైతులు తెలిపారు. పాళెం పంచాయతీలోని మధు, శంకర, అమరనాథ్, సురేంద్రనాయుడు, వంశీకృష్ణ, కిరణ్, సుబ్రహ్మణ్యం, నందగోపాల్, నవాబ్‌జాన్ పొలాల్లోని మామిడి చెట్లు, పశుగ్రాసం పంటను నాశనం చేసినట్లు వారు తెలిపారు.

గోతులు పూడ్చాలని నిరసన

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రామసముద్రం మార్గంలో ఏర్పడిన గోతులు పూడ్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రామ్మూర్తి, ఏఐటీయూసీ నాయకుడు పీవీ రెడ్డి, స్థానికులు నిరసన తెలిపారు. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. ఈ దారి మీదుగా వందల సంఖ్యలో గ్రామాలతో పాటు ప్రాంతీయ ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం రాకపోకలు సాగిస్తారని నాయకులు చెప్పారు.

కాలువలో పడి మహిళ మృత్యువాత

శాంతిపురం, న్యూస్‌టుడే: హంద్రీ- నీవా కాలువలో పడి మహిళ మృతి చెందారు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సంతూరు గ్రామానికి చెందిన గంగమ్మ (41) పొలం పనులు ముగించుకొని కాళ్లు కడుక్కునేందుకు కాలువకు వెళ్లారు. అనుకోకుండా జారి పడి మృతి చెందినట్లు భర్త ఆనంద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని రాళ్లబుదుగూరు పోలీసులు తెలిపారు.

మృతి చెందిన యువతిది తమిళనాడు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దగోపనపల్లి వద్ద ఆదివారం రైలులో నుంచి జారిపడి మృతి చెందిన యువతిది తమిళనాడు రాష్ట్రం ఆంబూరుగా పోలీసులు గుర్తించారు. రూఫియా (17) ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నారు. మరో యువతితో కలిసి బెంగళూరులోని ఆమె తల్లిదండ్రుల వద్దకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎర్రచందనం కేసులో అయిదేళ్ల జైలు

తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా రొంపిచెర్ల పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష విధించారు. ఒక్కొక్కరికి అయిదేళ్ల జైలు శిక్ష, రూ.3లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారని ఏపీపీ ఎ.అమరనారాయణ, లైజన్ అధికారులు హరిప్రసాద్, రవి తెలిపారు. సదుం మండలం బూరగమందకి చెందిన పి.వెంకటరమణ, అదేప్రాంతానికి చెందిన మల్లెల హరినాథ్‌లను అరెస్టు చేసి కోర్టుకు అప్పగించగా కేసు సాక్ష్యాధారాలతో నిరూపితమైంది.

రూ.13 లక్షలతో రహదారి నిర్మాణం

శాంతిపురం, న్యూస్‌టుడే: మండలంలోని రేగడదిన్నేపల్లె పంచాయతీ ఎస్సీ కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరైనట్లు తెదేపా మండలాధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నాయకులు రాజేంద్ర, రమేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామస్థులతో కలిసి భూమి పూజ చేసి రోడ్డు పనులు ప్రారంభించారు.

8న సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం: సంకటహర చతుర్థి సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీ ఉదయం, సాయంత్రం భక్తుల సౌకర్యార్థం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సామూహిక సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్, ఛైర్మన్ మణినాయుడు సోమవారం తెలిపారు. సాయంత్రం స్వామివారికి స్వర్ణ రథోత్సవం జరుగుతుందన్నారు. వరదరాజస్వామి వారి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, రాత్రి గరుడ సేవ నిర్వహిస్తామని చెప్పారు.

సమస్యల పరిష్కార వేదిక జనవాణి

పుంగనూరు: జనసేన వ్యవస్థాపకుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహించే జనవాణి సమస్యల పరిష్కారానికి వేదికగా ఉందని పార్టీ నియోజకవర్గ నాయకుడు కె.సోమశేఖర్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో అర్జీలు స్వీకరించారు. పింఛన్లు, రుణాలు, ఇళ్ల స్థలాలు, విద్యుత్తు సర్వీసుల సమస్యలను నాయకుల దృష్టికి పలువురు తీసుకెళ్లారు.

ఆదర్శకాలనీలో నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్, నాయకులు

పింఛను పంపిణీ చేస్తున్న రామచంద్రారెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

శాంతిపురం, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కూటమి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జి.శ్రీనివాసులు అన్నారు. దండికుప్పం, కొలమడుగు, శివరామపురంలో పింఛన్లు పంపిణీ చేశారు. ● కుప్పం పురపాలిక పింఛను పంపిణీలో 95.18 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచిందని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మోడల్ కాలనీలో ఎమ్మెల్సీ కె.శ్రీకాంత్ నగదు అందజేశారు. పురాధ్యక్షుడు సెల్వరాజ్ ఉన్నారు. ● కల్లూరు, కుప్పం గ్రామీణం: పుంగనూరు మండలంలోని 102ఇ.రామిరెడ్డిగారిపల్లెలో నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, నాయకులు పింఛను పంపిణీ చేశారు. ● కుప్పం మండలంలోని కంగుంది ఎస్సీ కాలనీలో తితిదే బోర్డు సభ్యుడు శాంతారాం, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి.ఎస్.మునిరత్నం, పింఛనుతో పాటు తితిదే లడ్డూలు అందజేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మామ వేధిస్తున్నాడని భర్తకు చెబితే కొట్టడంతో వివాహిత డీజిల్ తాగింది. కుటుంబ సభ్యులు వివరాల మేరకు.. రామసముద్రం మండలంలోని పైగడ్డకు చెందిన నరేష్, శిరీషకు 9 నెలల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి మామ వెంకటప్ప వేధింపులకు గురి చేస్తున్నాడు. విషయం భర్త దృష్టికి తీసుకెళ్లగా సర్దుకుపొమ్మని చెప్పాడు. వేధింపులు ఎక్కువయ్యాయని భర్తను నిలదీయగా కొట్టడంతో శిరీష డీజిల్ తాగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు ఆమె తమ్ముడు తెలిపాడు.

ఇంట్లో దాచిన సొమ్ము పోయిందని..

ఇంట్లో దాచిన సొమ్ము పోయిందని తెలిస్తే భర్త కొడతాడని మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చౌడేపల్లె మండలం బండమీదపల్లెలో చోటు చేసుకుంది. మునెప్ప నెల క్రితం ట్రాక్టర్ కొన్నారు. ట్రాలీ కొనుగోలు చేసేందుకు ఇంటిలో రూ.1 లక్ష భద్రపరిచారు. రూ.50 వేలు కనిపించకపోవడంతో భార్య రాజేశ్వరి పురుగు మందు తాగేశారు. కుటుంబ సభ్యులు పుంగనూరు ఆసుపత్రిలో చేర్చారు.

వైకాపా హయాంలో అవినీతిపై విచారణ

సమావేశంలో పాల్గొన్న నాయకులు

పలమనేరు, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో అవినీతి ఎక్కువగా జరిగిందని తెదేపా పట్టణాధ్యక్షుడు ఆర్బీసీ కుట్టి ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. గంటావూరు కాలనీలో అక్రమ పట్టాల పంపిణీపై అధికారులు విచారణ చేపడుతున్నట్లు చెప్పారు. వైకాపా నాయకుడు ప్రభుత్వ స్థలాన్ని పట్టాల రూపంలో విక్రయిస్తే ఎవరూ పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకుడు నాగరాజు, గంగమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు సుబ్రహ్మణ్యంగౌడ్, నదీం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా క్రీడలు

సోమల, న్యూస్‌టుడే: సోమల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల క్రీడా పోటీలు సోమవారం ఉల్లాసంగా జరిగాయి. ఎంఈవోలు విజయకుమారి, శివరత్నమ్మ పోటీలు ప్రారంభించారు. క్రికెట్‌లో నంజంపేట విజేతగా, సోమల పాఠశాల జట్టు రన్నర్‌గా నిలిచాయి. త్రోబాల్‌లో ఉపాధ్యాయినులు రాణించారు. వీరంతా డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎంలు హేమసుధాకర్, కుసుమాంబ, పీడీలు కరుణానిధి, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయులు

మల్లికార్జునుడికి విశేష పూజలు

బైరెడ్డిపల్లె: మండలంలోని పాతపేటలో చెన్నమల్లికార్జున ఆలయంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకం అనంతరం పుష్పాలంకరణ చేపట్టారు. **పలమనేరు:** మండలంలోని దేవళంపేట అడవిలో ఉన్న వందనమల్లేశ్వర ఆలయంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు అయ్యప్ప ఆలయం ఆవరణలో అయ్యప్ప మాలధారులకు 41 రోజుల పాటు భిక్ష నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జనవరి 10 వరకు రాహుల్ రెడ్డి మెమోరియల్ ట్రస్టు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తొలిరోజు పట్టణానికి చెందిన జయరాం దంపతులు అన్నదానం చేశారన్నారు.

కలుషిత నీరు.. బేజారు

గ్రామాల్లో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు రూ.లక్షల వ్యయంతో నిర్మించిన తాగునీటి తొట్టెల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రూ.30 వేల చొప్పున ఖర్చు చేసి పంచాయతీల్లో నిర్మించారు. కానీ నీరు కలుషితం కావడంతో మూగ జీవాలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని పాడి రైతులు వాపోతున్నారు. శాంతిపురం మండలంలోని 121- పెద్దూరులో ఇదే పరిస్థితి ఉంది. నిర్మించిన నుంచి నిర్వహణ సక్రమంగా లేదని, దీంతో పశువులను దూర ప్రాంతాలకు తీసుకువెళ్లాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, శాంతిపురం

చోరీ కేసులో నిందితుల అరెస్టు

పుంగనూరు గ్రామీణం: పట్టణ పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితులను ఆంధ్ర- కర్ణాటక సరిహద్దు వనమలదిన్నె మార్గంలో పట్టుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రభుత్వ ఐటీఐ, సింగిరిగుంట, సుగాలిమిట్ట సచివాలయాల్లో బ్యాటరీలు, టీవీలు, పరికరాలను బెంగళూరుకు చెందిన హమీద్‌ఖాన్, షాదాబ్ అహ్మద్‌బాషా, సాదిక్‌బాషా చోరీ చేశారు. వారిని సోమవారం అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు సీఐ చెప్పారు. ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది యల్లప్ప, రెడ్డెప్ప, రాజు, అల్లావుద్దీన్‌ను డీఎస్పీ డి.ప్రభాకర్ అభినందించారు.

(c) eenadu

ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం డిసెంబరు 2, 2025 5

యంత్రం.. విజ్ఞాన మంత్రం

జేఎన్‌టీయూ వద్ద ఆకట్టుకుంటున్న వాటర్ ట్యూబ్ బాయిలర్

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు సందర్శకులకు ఆశ్చర్యం కలిగించేలా కాకినాడ జేఎన్‌టీయూ ఆవరణలోని పరిపాలన కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఓపెన్ మ్యూజియం ఇది. 2020లో దీనిని ఏర్పాటు చేశారు. వీటిలో 1946 నాటి ఇంగ్లాండ్‌కు చెందిన హారిజంటల్ వాటర్ ట్యూబ్ బాయిలర్, వర్టికల్ కోల్ అండ్ కోక్ బాయిలర్ వంటి ఎన్నో యంత్ర పరికరాలు అబ్బురపరుస్తున్నాయి. ఇవి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులకు ఉపయోగపడడంతో పాటు అక్కడకు వచ్చే సందర్శకులను సైతం ఆకట్టుకుంటున్నాయి. - ఈనాడు, కాకినాడ

సేవా చిహ్నం

స్వామి దయానంద సరస్వతి, ఆర్యసమాజ్‌పై నాణేలు

స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి, ఆర్య సమాజ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఇటీవల రూ.200, రూ.150 నాణేలను విడుదల చేసింది. 1824 ఫిబ్రవరి 12న జన్మించిన దయానంద సరస్వతి 1875 ఏప్రిల్ 10న ఆర్యసమాజ్‌ను స్థాపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పుత్సా కామేశ్వరరావు ఈ నాణేలను సేకరించారు. నికెల్, సిల్వర్‌తో తయారు చేసిన ఇవి ఒక్కొక్కటి రూ.1232కు కొనుగోలు చేసినట్లు ఆయన చెప్పారు. ఒక్కొక్కటి 32 గ్రాముల బరువున్న ఇవి 60 శాతం రాగితో పాటు నికెల్, జింక్ చెరో 20 శాతం కలిగి ఉన్నాయన్నారు. ముంబయి, కోల్‌కతా, హైదరాబాద్ టంకశాలలు ఈ నాణేలను విడుదల చేశాయి. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

పవన్ వచ్చారు.. వెలుగులు తెచ్చారు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గత నెల 26న మలికిపురం మండలం కేశనపల్లి పర్యటన పూర్తైనా అంటూ ఆ గ్రామంలో పలు సౌకర్యాలు సమకూరాయి. స్థానిక ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో కూనవరం-కేశనపల్లి ర.భ. రహదారి నుంచి సుమారు 500 మీటర్ల దూరంలో శృంగవాటిక, వెళ్లనపడల కేంద్రాలు ఉన్నాయి. ప్రధాన రహదారి నుంచి వీటి దగ్గరికి వెళ్లడానికి రహదారి, వీధి దీపాలు లేవు. ఉప ముఖ్యమంత్రి కొబ్బరి తోటల పరిశీలనకు వచ్చిన క్రమంలో అప్పటికప్పుడు 500 మీటర్ల మేర పక్కా రహదారి నిర్మించి 5 విద్యుత్తు స్తంభాలు వేసి దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మలికిపురం

చిత్తశుద్ధి.. సంపద వృద్ధి

కేంద్రాల ఏర్పాటుకు పురపాలకశాఖ అడుగులు

ఈనాడు, అమలాపురం: నగరాలు, పట్టణాల్లో సేకరించే వ్యర్థాల నిర్వహణ గాడిలో పెట్టేందుకు సర్కారు చర్యలు చేపడుతోంది. గత ప్రభుత్వంలో చెత్త పన్ను వేశారు తప్ప చెత్త సేకరణ, నిర్వహణ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక తడి, పొడి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించడానికి అడుగులు వేస్తోంది. పట్టణ స్థానిక సంస్థల్లో చెత్త శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు ప్రైవేటు సంస్థల నుంచి ప్రకటన జారీ చేసింది. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో నగరపాలక, పురపాలక సంస్థలతో పాటు నాలుగు నగర పంచాయతీల్లో రూ.36 కోట్ల పనులున్నాయి.

ఇదీ ప్రస్తుత పరిస్థితి..

- రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నుంచి సేకరించిన చెత్తను 46వ డివిజన్‌లోని డంపింగ్ యార్డుకు తరలించి తడి, పొడి వ్యర్థాలుగా వేరుచేస్తున్నారు. ఎరువు తయారీ చేయడం లేదు.
- అమలాపురంలో వ్యర్థాలను నల్ల వంతెన సమీపంలో డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. ఈ స్థలం సరిపోవడం లేదు.
- మండపేట పురపాలిక నుంచి సేకరించిన చెత్తను సంఘం పుంతరోడ్డు సమీపంలో డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. ఇటీవల యంత్రంతో వ్యర్థాలను వేరుచేసే పని మొదలుపెట్టారు.
- రామచంద్రపురం పురపాలిక వ్యర్థాలను ఒకటో వార్డులోని కొత్తూరు రోడ్డులో డంపింగ్ యార్డులో వేస్తున్నారు. వీటి నిర్వహణ పట్టించుకున్న పాపాన పోలేదు.
- కొవ్వూరు పురపాలికకు డంపింగ్ యార్డు లేదు. రోడ్ల పక్కన, ప్రభుత్వ స్థలాల్లో వేసి నెలలు తరబడి వదిలేస్తున్నారు.

అమలాపురంలో వ్యర్థాలకు మంటపెట్టేస్తున్నారిలా

ప్రతిపాదనలు.. ఇలా..

పురపాలక సంఘాలు/ ★నగర పంచాయతీ	రోజువారీ ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు (టన్నుల్లో)	షెడ్ నిర్మాణాలకు అయ్యే వ్యయం అంచనా (రూ.కోట్లలో)
అమలాపురం	40	4.06
రామచంద్రపురం	30	3.05
మండపేట	30	3.05
★ముమ్మిడివరం	15	1.52

45 రోజుల్లోనే..

తడి, పొడి చెత్త నిర్వహణకు సంబంధించి టెండర్లు దక్కించుకున్న సంస్థ 45 రోజుల్లోనే పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎరువులతో పాటు, ప్లాస్టిక్ వ్యర్థాలతో కొత్త ఉత్పత్తులు తయారీ చేయాలి. దీని కోసం టన్నుకు సుమారు రూ.550 వరకు ఏజెన్సీకి చెల్లించనున్నారు. రెండేళ్ల పాటు ఆ ప్లాంట్ నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. ఇవి అందుబాటులోకి వస్తే పారిశుద్ధ్య సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారమవుతుందని పురపాలకశాఖ అధికారులు చెబుతున్నారు.

విధులకు గైర్హాజరైతే నోటీసులు

వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరయ్యే అధికారులను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ నిశాంతి, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో 135 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అర్జీలు స్వీకరించే సమయంలో అర్జీదారులతో అధికారులు మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు.

48 గంటల్లో ఉపాధి జాబ్ కార్డు

రావులపాలెం పట్టణం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం 48 గంటల్లో నూతన జాబ్‌కార్డు పొందే అవకాశం కల్పించింది. ఇన్నాళ్లూ రోజుల తరబడి కార్యాలయాలకు తిరగాల్సి వచ్చేది. కుటుంబ సభ్యుల పేర్ల నమోదుకూ ఇబ్బందులుండేవి. ప్రభుత్వ నిర్ణయంతో ఈకేవైసీ ద్వారా అర్హులైన శ్రామికులకు 48 గంటల్లో ఉచితంగా కొత్త జాబ్‌కార్డు అందజేస్తున్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి దరఖాస్తులు సమర్పిస్తే మండల కార్యాలయం నుంచి మరుసటి రోజుకే కార్డు నకలు అందిస్తారు. సభ్యుల పేర్ల నమోదు, చిరునామా, చేర్పులు, మార్పులకూ ఆదేశాలందాయి.

అత్తారింట్లో... అగచాట్లు!

వరకట్న వేధింపులు	బాలికలపై లైంగిక వేధింపులు	మహిళల అదృశ్య కేసులు
1,248	311	963

గత రెండేళ్లలో కేసుల వివరాలు ఇలా..

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

భర్త చిటికిన వేలు పట్టుకుని కోటి ఆశలతో కొత్త జీవితంలోకి అడుగు పెడుతున్న మహిళల్లో కొందరికి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. అత్తగారి మాట వినడం లేదని, అడిగినంత కట్నం తీసుకురాలేదని, తమకు ఇష్టం లేకుండా కుమారుడిని పెళ్లి చేసుకుందని.. ఇలా అనేక కారణాలతో మహిళలకు పలు వేధింపులు ఎదురవుతున్నాయి. చట్టాలను కఠినంగా అమలు చేస్తున్నా వీటికి కట్టడి పడడంలేదు.

అమలాపురం వన్‌స్టాప్ కేంద్రంలో ఓ కుటుంబానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

అండగా నిలవాల్సిన వారే..

మెట్టినింట్లో భార్యకు అండగా నిలవాల్సిన భర్త, బంధువులే ఆమె పాలిట శాపంగా మారుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు నిత్యం ఘర్షణ వాతావరణంలో నరకం చూస్తున్నారు. ఉన్నత విద్యావంతులకూ ఈ సమస్యలు తప్పడం లేదు.

ఉచితంగా సేవలు..

అత్తారింట్లో, బయట వేధింపులకు గురవుతున్న మహిళలకు ప్రభుత్వం ఉచితంగా సేవలు అందిస్తోంది.
- పోలీసు టోల్‌ఫ్రీ నంబరు 112, 100లో ఫిర్యాదు చేయవచ్చు.
- పోలీసు స్టేషన్‌కు వెళ్లి సహాయం కోరవచ్చు.
- మహిళా సహాయక కేంద్రం 181కు ఫోన్‌చేయొచ్చు.
- లీగల్ సెల్ అథారిటీ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చు.

కొన్ని ఘటనలు..

- అయిదు నెలల క్రితం అల్లవరం మండలం డి.రావులపాలేనికి చెందిన ఓ వివాహిత వరకట్న వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడింది. పదేళ్లుగా అదనపు కట్నం తీసుకురావాలని అత్తింటివారు వేధించారని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.
- భర్త మరో మహిళతో సన్నిహితంగా ఉండటంపై ప్రశ్నించినందుకు ముమ్మిడివరం మండలానికి చెందిన ఓ వివాహితను భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేశారు. ఆమె వన్ స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించింది.
- సఖినేటిపల్లి మండలానికి చెందిన ఓ యువతి ప్రేమ వివాహం చేసుకుంది. భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లడంతో అత్తగారి వేధింపులు ప్రారంభమయ్యాయి. ఆమె పోలీసులను ఆశ్రయించడంతో వారు ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు

అత్తగారి ఇంట్లో, పని ప్రదేశాల్లో, ఎక్కడైనా మహిళలకు వేధింపులకు గురవుతున్నట్లయితే నేరుగా అమలాపురంలో ఉన్న వన్‌స్టాప్ కేంద్రంలో ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదును పరిశీలించి, దాని తీవ్రత ఆధారంగా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పోలీసు ఉన్నతాధికారులతో నేరుగా సంప్రదించి సహాయం అందిస్తాం. 6నెలల్లో 15 కేసులు పరిష్కరించాం. **-ఆర్.అంబికా దేవి, వన్‌స్టాప్ సెంటర్, ఇన్‌ఛార్జి**

వాడపల్లిలో గీతా పారాయణం చేస్తున్న కృష్ణ పరివార్ మహిళలు

గీతా పఠనం.. తిరునక్షత్ర ఉత్సవం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: గీతా జయంతి సందర్భంగా కోనసీమ తిరుమల వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భగవద్గీత పారాయణం చేశారు. కాకినాడకు చెందిన కృష్ణ పరివార్ సంఘం సభ్యులు, రావులపాలెం మహిళలు గీతా పారాయణం చేశారు. ఆళ్వారుల సన్నిధిలో తిరుమంగై ఆళ్వారుల తిరునక్షత్ర ఉత్సవాలు రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. ద్రవిడ వేదపారాయణం, నీరాజన మంత్రపుష్పం, పల్లకీ సేవ కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా జరిపించారు.

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

సచివాలయాలకు సారథులు

ఇకపై నిరంతర పర్యవేక్షణ

న్యూస్‌టుడే, అల్లవరం

సచివాలయ వ్యవస్థలో జవాబుదారీతనం తీసుకొచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాయాల్లో సుమారు 3,900 మంది వరకు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిని పర్యవేక్షించే అధికారితో పాటు, వారికి జాబ్ చార్ట్ సైతం లేకపోవడంతో కొంత మంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మండలం, పురపాలక సంఘానికి ఒక్కొక్కరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు.

జవాబుదారీతనం పెంచేలా..

పంచాయతీరాజ్‌లో గ్రేడ్-1 కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు, ఈవోలుగా పనిచేసే వారికి పదోన్నతులు కల్పించి డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించారు.
- గతంలో జూనియర్ సహాయకుడిగా విధుల్లో చేరిన ఉద్యోగి సీనియర్ సహాయకుడిగా ఉద్యోగ విరమణ చేసేవారు. కూటమి ప్రభుత్వ చర్యలతో పదోన్నతి విధానం మారింది. గతంలో ఉన్న ఈవోపీఆర్డీ పోస్టును డిప్యూటీ ఎంపీడీవోగా మార్చారు. తాజాగా వీరికి అదనంగా సచివాలయ పర్యవేక్షణకు మరో డిప్యూటీ ఎంపీడీవోను నియమించారు.
- జాబ్ చార్ట్ ప్రకారం గ్రామ, వార్డు స్థాయి అభివృద్ధి ప్రణాళిక పనుల్లో పాల్గొనాలి. ప్రభుత్వ పథకాల అమలు, వాటి విస్తరణ కార్యక్రమాలు చేపట్టాలి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పౌరుల సమాచారం సేకరించాలి. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ఇంటింటికీ తీసుకువెళ్లాలి. విపత్తుల సమయంలో అత్యవసర సేవలు అందించాలి. సచివాలయాల ద్వారా వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి.

అల్లవరం మండలం డిప్యూటీ ఎంపీడీవోగా నియామకపత్రం అందుకుంటున్న లక్ష్మీనరసమ్మ

25 మంది ప్రత్యేక ఉద్యోగులు

ప్రతి మండలానికి, పురపాలికకు ప్రత్యేక అధికారిని ప్రభుత్వం నియమించింది. దీనివల్ల ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతాయి. సోమవారం 15 మంది వరకు విధుల్లో చేరారు. వీరికి ఈ వారంలో శిక్షణ ఉంటుంది.

- విజయ్, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ జిల్లా సమన్వయకర్త

జిల్లాలో వివరాలు	మండలాలు: 22	పంచాయతీలు: 385	గ్రామ సచివాలయాలు: 467	వార్డు సచివాలయాలు: 48	డిప్యూటీ ఎంపీడీవోలు: 26 మంది

మెగా సన్నద్ధత

ఈ నెల 5న పీటీఎం 3.0

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

జిల్లాలోని పాఠశాలలు..	
ప్రాథమిక:	1271
ప్రాథమికోన్నత:	72
ఉన్నత:	237
జూనియర్ కళాశాలలు:	13
విద్యార్థులు:	1.50 లక్షలు

పిల్లలు రోజూ పాఠశాలకు వస్తున్నారా..? బడిలో వారి ప్రవర్తన.. చదువు ఎలా ఉంది..? అనే విషయాలు తల్లిదండ్రులు తెలుసుకునేందుకు.. పిల్లల ప్రతిభను వివరించి.. లోటు పాట్లను ఉపాధ్యాయులు వారికి వివరించడానికి ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహిస్తోంది. మూడో విడతగా ఈ నెల 5న మెగా పీటీఎం ఏర్పాటుకు పాఠశాలల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి పాఠశాల నిర్వహణ నిధులు వినియోగించుకునేలా మార్గదర్శకాలు విడుదల చేశారు. నిర్వహణకు సంబంధించి ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చామని డీఈఓ షేక్ సలీంబాషా తెలిపారు.

వీరికి ఆహ్వానం: తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీ, స్థానిక ప్రజా ప్రతినిధులు, దాతలు, పూర్వ విద్యార్థులు.

కార్యక్రమ నిర్వహణ ఇలా..

- *ఉదయం 9 – 9.30:* ఆహ్వానం
- *9.30–10.50:* విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల వెల్లడి. బోధనలో అవలంబిస్తున్న నూతన విధానాలను వీడియోల రూపంలో ప్రదర్శిస్తారు. మంచి, చెడు స్పర్శ, (గుడ్ టచ్, బ్యాడ్ టచ్), నైపుణ్య ఆంధ్ర తదితర కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన.
- *10.50– 11.00:* టీఎల్ఎం, అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఉన్నచోట్ల), స్టెమ్ ల్యాబ్‌లు, క్రాఫ్ట్ ప్రాజెక్టుల సందర్శన.
- *11.00–12.45:* పాఠశాలకు విరాళాలు అందించిన దాతలు, అభివృద్ధికి కృషి చేసిన వారి గురించి సమావేశంలో విద్యార్థులకు వివరిస్తారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను చదివి వినిపించడంతో పాటు విద్యార్థులకు అందజేస్తారు. దాతల సహకారంతో విద్యా సామాగ్రి పంపిణీ.

రబీ పంటకు గోదావరి జలాల విడుదల

పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి, బండారు తదితరులు

ధవళేశ్వరం, మోరంపూడి: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టా పరిధిలోని రబీ పంటకు సోమవారం నీరు విడుదల చేశారు. మూడు జిల్లాల పరిధిలోని 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు అందనున్నాయి. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బండారు సత్యానందరావు, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ గోదావరి నదికి ప్రత్యేక పూజలు చేసి, చీర, హారతి సమర్పించారు. రైతులు, అధికారుల సమక్షంలో 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాటన్ బ్యారేజీ అంటే కేవలం నీటి విడుదల కాదని, వ్యవసాయాన్ని సుసంపన్నం చేసే ఓ చిహ్నమని పేర్కొన్నారు. నిబద్ధత, బాధ్యతకు తార్కాణమన్నారు. అన్నదాతలకు కూటమి సర్కారుపై ఎంతో విశ్వాసం ఉందన్నారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఎకరాకు నీరు అందిస్తామన్నారు. అధికారులు, సిబ్బందితో బ్యారేజీని సమర్థంగా నిర్వహిస్తామన్నారు. రబీ సీజన్‌లో సమృద్ధిగా పంటలు పండి, స్థిరమైన ఆదాయం లభించి, ఆహార భద్రత, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఇరిగేషన్ సీఈ కె.శేషుబాబు, ఎస్ఈ గోపినాథ్, వైస్ ఛైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చినుకుల్లోనే వరి కోతలు

దిగుబడిపై ప్రభావం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా వాతావరణం మేఘాలు కమ్మి.. మబ్బులు పట్టడంతో రైతులు హడావుడిగా కోతలు కోస్తున్నారు. కొన్ని వరిచేలల్లో పనలు గట్టుమీదకు రాకుండానే వర్షం కురవడంతో పంట తడిచిపోయింది. జిల్లాలో 1.69 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టడగా.. ఇంకా 55 వేల ఎకరాల్లో వరి పంట చేలల్లో ఉంది. వరి కోత యంత్రాలకు భారీగా డిమాండ్ ఏర్పడటం.. వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో అర్థంకాని పరిస్థితుల్లో పంటను గట్టు మీదకు తీసుకురావాలనే తపనతో యంత్రాలతో మాసూళ్లు చేస్తున్నారు. కంకులు తడిచిన సమయంలో యంత్రాలతో కోత కోయిస్తే గింజలు పూర్తిగా వేరు కాకుండా గడ్డిలో కలిసిపోతాయి. దీంతో ఎకరాకు రెండు నుంచి మూడు బస్తాలు దిగుబడి తగ్గుతుంది. జిల్లాలో సోమవారం 2500 ఎకరాల్లో వరిచేలను ఈ విధంగా మాసూలు చేశారు.

గాలి తగిలేలా..చూడాలి..

రాశుల్లో ఉన్న ధాన్యం తేమ కారణంగా వేడిగా మారి రంగు మారకుండా బరకాలను తీసి గాలి సోకేలా చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. చేలల్లో నీటిని తొలగించి పనలను తిరగేయడం వల్ల ఆరుదల వస్తుందన్నారు. తడిచిన వరి పైరు ఆరకుండా యంత్రాలతో కోతలు కోయవద్దని ఆయన సూచించారు.

పొద్దుపోయాక సైతం యంత్రంతో మాసూళ్లు

హౌసింగ్ సర్వే 14 వరకు పొడిగింపు

పి.గన్నవరం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై-గ్రామీణ్) ఆవాస్ ప్లస్-2024 కింద పేదలకు పక్కాఇళ్లు మంజూరు చేసేందుకు చేపట్టిన సర్వేను ఈ నెల 14 వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆ శాఖ పీడీ ఎం.వి.నరసింహారావు సోమవారం వెల్లడించారు. వాస్తవానికి అక్టోబరు 20తో గడువు ముగిసింది. ఈ ప్రకారం 14,206 మందిని అర్హులుగా గుర్తించారు. అనంతరం నవంబరు 30 వరకు గడువు పెంచడంతో జిల్లావ్యాప్తంగా లబ్ధిదారుల సంఖ్య 24 వేలకు చేరింది. తాజాగా గడువు పెంచడంతో మరింత మందిని గుర్తించే అవకాశం దక్కనుందని అధికారులు వెల్లడించారు.

అన్నవరంలో మరిన్ని వసతిగదులు

70 శాతం గదులకు ఆన్‌లైన్‌లో బుకింగ్

అన్నవరం: అన్నవరం ఆలయంలో భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా, సమయం ఆదా అయ్యేలా ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా ఆలయంలో ఉన్న గదుల్లో 70 శాతం గదులను ఆన్‌లైన్‌లో సోమవారం నుంచి అందుబాటులో ఉంచారు. రత్న, సత్యగిరులపై వివిధ వసతిసముదాయాల్లో సుమారు 480 గదులున్నాయి. ఇందులో 70 శాతం (336 గదులు) ఆన్‌లైన్లో ఉండగా భక్తులు aptemples.org ద్వారా, మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009 ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు.

19 బడి బస్సుల్లో లోపాల గుర్తింపు

అమలాపురంలో అగ్ని నిరోధక పరికరాన్ని పరిశీలిస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేష్

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యా సంస్థలకు చెందిన బస్సు డ్రైవర్లు రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలోని విద్యా సంస్థలకు చెందిన బస్సుల తనిఖీలను సోమవారం చేపట్టారు. 19 బస్సుల్లో సాంకేతికపరమైన లోపాలు గుర్తించి నోటీసులు జారీ చేశారు. వారం రోజులు లోపు వాటిని సరిచేసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 4 వరకు తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు. తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతి సురేష్, కౌశిక్ పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

నీళ్లు రావు.. వెతలు తీరవు

గత అయిదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన ఎత్తిపోతల పథకాలు

ఈనాడు, అమలాపురం; న్యూస్‌టుడే, ఆత్రేయపురం: నీటి వనరులు అందుబాటులో లేక ఎద్దడి ఎదుర్కొంటున్న పంట పొలాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన ఎత్తిపోతల పథకాలు అలక్ష్యానికి గురవుతున్నాయి. గత వైకాపా పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 29 పథకాలుంటే, అయిదు మాత్రమే సేవలందిస్తుండగా, రెండు శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులు, నిర్వహణకు నిధులు మంజూరుచేస్తే వచ్చే ఖరీఫ్ నాటికైనా పూర్తి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిర్వహణకు నోచుకోక..: ● మోటార్లు పంపులు మరమ్మతుకు గురైతే సరి చేసే పరిస్థితి లేదు. పైపులైన్లు లీకులున్నా కట్టడిలేదు. అన్ని పథకాలపై ఆధారపడి 47 వేల ఎకరాలుంటే 30 నుంచి 50 శాతం ఆయకట్టుకే నీరందుతోంది. ● మోటార్లు, పంపుల మరమ్మతులు, పైపులైన్ల పనులకు రూ.91.32 కోట్లు అవసరమని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

లీకులతో వసంతవాడ ఎత్తిపోతల పథకం

దాళ్వాకు సాగునీరందేనా..: ఆత్రేయపురం మండలం పేరవరం ఎత్తిపోతల పథకం ఏకధాటిగా 24 గంటలు పని చేస్తే ఏదో ఒక మరమ్మతులకు గురవుతుంది. మోటార్లు, పంపులు దెబ్బతింటున్నాయి. మరమ్మతులు చేయించేలోగా సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పథకం ద్వారా పేరవరం, రాజవరం, వెలిచేరు, వద్దిపర్రు, పులిదిండి ఆయకట్టు 3 వేల ఎకరాలు ఆధారపడి ఉంది.
- వసంతవాడ పథకం భూగర్భ పైపులైను దెబ్బతింది. లీకులతో సాగునీరు వృథా అవుతోంది. దీనికింద వసంతవాడ, తాడిపూడి, కట్టుంగ, నార్కెడుమిల్లి, అంకంపాలెం వరకు 3వేల పైబడి ఎకరాలకు సాగునీరు అందుతోంది.
- ఉచ్చిలి ఎత్తిపోతల పథకం పాడై ఏడేళ్లయింది. మోటార్లు, పంపులు, భవనం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆయకట్టులోని పంట కాలువలు ఆక్రమణలకు గురై కుంచించుకుపోయి ఉన్నాయి.

DEEPAK NEXGEN FEEDS PRIVATE LIMITED
Bommuluru, Near Hanumanjunction, Krishna District, A.P. 521105
WANTED
Deepak Nexgen is a leading and fast growing fish and shrimp feed manufacturing industry looking for the following positions
Safety Officer: B.Tech / Diploma with industrial safety certificate (mandatory) with 05-10 years relevant experience.
Safety Supervisor: Diploma or any degree with industrial safety certificate (mandatory) with 02-05 years relevant experience.
Interested Candidates may send their C.V to:
ifeedhr@gmail.com

(c) eenadu

కోరంగిలో విమానాశ్రయం ఏర్పాటుకు వినతి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: తాళ్లరేవు మండలం కోరంగిలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడును అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ బాలయోగి కోరారు. దిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో రామ్మోహన్‌నాయుడును ఎంపీ హరీష్ సోమవారం కలిశారు. రాష్ట్రం నుంచి వారణాసి, సూరత్ వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.

రామ్మోహన్‌నాయుడుకి వినతి అందజేసిన ఎంపీ హరీష్‌మాధుర్

సిద్ధివినాయక.. అఖిలాండనాయక

అయినవిల్లి సిద్ధివినాయకస్వామిని సోమవారం భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్నారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. వివిధ రుసుముల ద్వారా రూ.3,25,138 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, అయినవిల్లి

విజ్ఞాన వీచిక.. ప్రత్యక్ష పీఠిక

– న్యూస్‌టుడే, మామిడికుదురు

విద్యార్థులు మరిన్ని ప్రతిభా పాటవాలతో ప్రగతిని సాధించేందుకు సమగ్రశిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజ్ఞాన యాత్రలు వారిలో నైపుణ్యాలను పెంచుతున్నాయి. పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని సైన్స్, ఇతర అంశాలపై ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి నిర్దేశించిన ప్రాంతాలకు తీసుకువెళ్లి [illegible] అవగాహన పెంపొందించేలా కృషి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

ఉమ్మడి జిల్లాలో 77 పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేసి అందులో విద్యాభ్యాసం చేస్తున్న 9, 10 తరగతుల్లో 8 శాతం మంది అంటే 4,280 మంది విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు సిద్ధం చేసి నిర్వహిస్తున్నారు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.500 చొప్పున మొత్తం రూ.21.40 లక్షలు మంజూరు చేశారు. పది మంది విద్యార్థులకు ఒకరు చొప్పున సంరక్షకులతో పాటు మార్గదర్శక ఉపాధ్యాయులు వారి వెంట పంపిస్తున్నారు. ప్రతి అంశాన్ని సమగ్రంగా వివరించడంతో పాటు వారి సందేహాలను కూడా అక్కడే నివృత్తి చేస్తూ వారిలో మరింత విజ్ఞానాన్ని పెంచుతున్నారు.

వివరాలు ఇలా..

జిల్లా	పీఎంశ్రీ పాఠశాలలు
కోనసీమ	26
తూర్పుగోదావరి	20
కాకినాడ	31

ఎంపిక చేసిన ప్రదేశాలు

కాకినాడ పోర్టు, [illegible] యుద్ధ విమానం, రాజమహేంద్రవరంలోని రోడ్డు, రైల్వే బ్రిడ్జి, కోరింగ ఫారెస్టు, ధవళేశ్వరం ప్రాజెక్టు, మ్యూజియం, పెద్దాపురంలోని పాండవుల మెట్ట, అడ్డతీగలలోని ఔషధ మొక్కలు, రాజమహేంద్రవరంలోని ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్.

కాకినాడ పోర్టు వద్ద మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఇదీ లక్ష్యం

● విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా వీక్షించి పూర్తి అవగాహన పెంచుకోవడం ద్వారా వారిలో ఉన్న అన్నివిధాల సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. ● సైన్స్ అంశాలపై మరింత ఆసక్తి పెరుగుతుంది. ● కొత్త పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా విజ్ఞాన వికాసం కలుగుతుంది. ● మానసికంగా ఉత్తేజితులు కావడానికి దోహదం.

భవిష్యత్తుకు దోహదపడతాయి

ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90 శాతం విజ్ఞాన యాత్రలు పూర్తయ్యాయి. ఎంపిక చేసిన మిగతా పాఠశాలలు కూడా సన్నద్ధమవుతున్నాయి. ఇవి విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడతాయి.

- పి.రాంబాబు, ఏఎంవో, సమగ్రశిక్షా

అవగాహనతోనే ఎయిడ్స్ అంతం

● మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం: ఎయిడ్స్ మహమ్మారిపై అవగాహనతోనే దాన్ని పూర్తిగా అరికట్టగలమని, వ్యాధిగ్రస్థులకు చేయూత అందించాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగా రామచంద్రపురం పట్టణంలో సోమవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. ఏరియా ఆసుపత్రి వద్ద వివిధ వర్గాలవారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ర్యాలీని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ర్యాలీ ఏరియా ఆసుపత్రి నుంచి ప్రధానరోడ్డు మీదుగా రాజగోపాల్ సెంటర్ వరకు సాగింది. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ చక్రధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆర్. జయప్రద, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఉండవిల్లి శివ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గొల్లపల్లి కృష్ణ, కంచుమర్తి బాబూరావు, వైద్య విద్యార్థులు, కృత్తివెంటి పేర్రాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లకార్డుతో మంత్రి సుభాష్

అమలాపురంలో మహిళకు నగదు అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

తొలి రోజు 92 శాతం పింఛన్ల పంపిణీ

అల్లవరం, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా తొలిరోజు సోమవారం 92 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 2,35,729 మంది లబ్ధిదారులకు రూ.101.74 కోట్లు విడుదలయ్యాయి. తొలి రోజు 2,18,295 మందికి రూ.93.58 కోట్లు పంపిణీ చేశారు. కలెక్టర్ మహేష్‌కుమార్ అమలాపురం పట్టణ పరిధిలో అధికారులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

సూక్ష్మసేద్యం.. అన్నదాతకు వరం

పెద్దాపురం, న్యూస్‌టుడే: తుంపర, బిందుసేద్యం ఉపకరణాలపై గతంలో జీఎస్టీ 12 శాతం ఉండగా 6 శాతం ప్రభుత్వం చెల్లించేది. మిగిలిన 6 శాతం రైతు చెల్లించేవాడు. ప్రస్తుతం జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గించడంతో 7 శాతం ఆదా అయ్యింది. ఇందులో 2.5 శాతం ప్రభుత్వం చెల్లిస్తుండగా మిగిలినది మాత్రమే రైతు చెల్లించాలి. ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో పాటు రాయితీలు ఇచ్చి సూక్ష్మనీటి సాగు పథకాన్ని(డ్రిప్, తుంపర్ల) ప్రోత్సహించి అభివృద్ధి చేస్తుంది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయడంతో త్వరలోనే పరికరాలు పంపిణీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనుంది. ఈ వివరాలను ఏపీఎంఐపీ పథకం కాకినాడ జిల్లా అధికారి జీవీవీ ప్రసాదరావు తెలిపారు. ●

బోరుకు అమర్చిన డ్రిప్

మీ కోసం

2025-26లో లక్ష్యం: రూ.17 కోట్లతో 2 వేల హెక్టార్లు ● **ఇప్పటివరకు మంజూరు:** 179 మంది రైతులకు 230.36 హెక్టార్లలో..

రాయితీ వివరాలు (శాతంలో)

విభాగం	బిందు	తుంపర
2 హెక్టార్ల వరకు(ఎస్సీ, ఎస్టీలు)	100	50
2 హెక్టార్ల వరకు(ఇతరులు)	90	50
2 నుంచి 4 హెక్టార్లు	70	50
4 నుంచి 5 హెక్టార్లు	50	50

రైతేరాజు

అర్హతలు ఇలా..

☛ భూమి ఉన్న ప్రతిరైతు రాయితీకి అర్హులు.
☛ కౌలు రైతులు భూ యజమానితో ఏడేళ్ల పాటు కౌలు ఒప్పందం చేసుకోవాలి.
☛ సొంత బోరు, బావి, కుంట, కాలువ ద్వారా నీటి లభ్యత కలిగి ఉండాలి.
☛ అర్హులైన రైతులు ఏపీఎంఐపీ యాప్ లేదా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ నంబరుతో నమోదు చేసుకోవాలి.

వంగ తోటలో సస్యరక్షణ చర్యలు

నల్లజర్ల, న్యూస్‌టుడే: వంగ సాగులో విత్తిన దగ్గర నుంచి కాయకోత వరకు 18 రకాల పురుగులు, తెగుళ్లు ఆశించి మొక్క ఎదుగుదలను, కాయ నాణ్యతను దెబ్బతీస్తాయి. వీటి నివారణకు కృషివిజ్ఞాన కేంద్రం(వెంకట్రామన్నగూడెం) ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి పలు సూచనలిచ్చారు. విత్తిన 7 నుంచి 15 రోజుల్లో నేల నుంచి పిథాయం అను శిలీంధ్రం గింజ మొలకెత్తకుండా చేసి నారు కుళ్లిపోవడం జరుగుతుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరుకు 3 గ్రాములు నీటిలో కలిపి మట్టిని తడిపి విత్తుకోవాలి. కిలో విత్తనాన్ని కార్బండిజమ్, థైరమ్ 1.5 గ్రాములతో విత్తనశుద్ధి చేసుకోవాలి. పూత, పిందె దశలో క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ., ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి.

వరి కోతల్లో జాగ్రత్తలు పాటిద్దాం మద్దతు ధర పొందుదాం

తెలుసుకుందాం..

అయినవిల్లి, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన వరిపంటకు మంచి మద్దతు ధర పొందాలంటే కోతలు, ధాన్యం ఆరబెట్టే, నిల్వ చేసే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అయినవిల్లి మండల వ్యవసాయాధికారి శోభ వివరించారు. ● చేను పసుపు రంగులోకి మారిన తరువాత కోయాలి. ముందే కోస్తే తాలుగింజలు వస్తాయి. ● మంచుకురిసే సమయంలో కోస్తే ధాన్యం మెత్తబడి నల్లగా మారుతుంది. కోత ఆలస్యమైతే గింజ పగుళ్లు ఏర్పడి నూక వస్తుంది. ● వెన్నులు 80-90 శాతం పసుపు రంగులోకి మారినప్పుడు మాసూళ్లు చేయాలి. ● తేమశాతాన్ని తగ్గించేందుకు కోత అనంతరం రెండు నుంచి మూడు రోజులు ఆరబెట్టాలి. యంత్రంతో కోస్తే వెంటనే కల్లంలో ఆరబెట్టాలి. రాత్రిపూట మంచు తగలకుండా ధాన్యాన్ని కుప్పగా పోసి బరకాన్ని కప్పాలి. ● కోత సమయంలో వర్షం వస్తే 5 శాతం ఉప్పు కలిపిన నీటిని పిచికారీ చేయాలి. ధాన్యంలో దుమ్ము, ధూళి, మట్టిబెడ్డలు లేకుండా చూసుకోవాలి. తేమశాతం 17 కంటే తక్కువ ఉండేవిధంగా చూసుకోవాలి. ● ధాన్యం నిల్వ చేసుకునే ముందు గోనెసంచులను పది శాతం మలాథియన్ ద్రావణంలో ముంచి ఎండబెట్టాలి. ఈ చర్యల వల్ల ఆలస్యంగా విక్రయించినా పూర్తి మద్దతు ధర దక్కుతుంది.

కోతదశకు చేరుకున్న వరిచేను

అంతర పంట.. అదనపు ఆదాయమంట

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం పెంచుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆత్రేయపురం మండలం వాడపల్లికి చెందిన పోచిరాజు బాబూరావు. 12 ఎకరాల కొబ్బరి తోటలో అంతర పంటగా ఆరేళ్ల క్రితం కోకో మొక్కలు నాటారు. ఐదేళ్ల నుంచి దిగుబడులు వస్తున్నాయి. ఎక్కడా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ ఎరువులు, జీవామృతం తదితర వాటిని ఉపయోగించడం ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారు.

స్ఫూర్తి

కోకో చెట్టు వద్ద రైతు బాబూరావు

ఆదాయం బాగుంది

"ఆరేళ్ల క్రితం వరకు కొబ్బరి దిగుబడులు తగ్గడం, ధరలు లేకపోవడంతో ఆదాయం పడిపోయింది. దీనిని చక్కదిద్దుకునేందుకు కోకోను అంతర పంటగా వేశాను. సేంద్రియ ఎరువులతో భూసారం పెరిగింది. చీడపీడల నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తున్నాను. కోకోతో వరుసగా రెండేళ్లు ఖర్చులన్నీ పోను ఎకరాకు రూ.15 వేల చొప్పున ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.20 వేలు వచ్చిందని రైతు బాబూరావు తెలిపారు."

చేపల్లో పేనువ్యాధి నివారిద్దాం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: చేపల్లో ఈ కాలంలో పేను వ్యాధి ఎక్కువగా సోకే అవకాశం ఉంది. అర్గులస్ పోలియాసిస్ అనే పరాన్నజీవులు శరీరంపై చేరి ఎరుపురంగు మచ్చలు ఏర్పడి క్రమేపీ పుండ్లుగా మారతాయి. వీటి ప్రభావం ఎక్కువగా ఉంటే చేపలు ఎగిరిపడటం, నీటి ఉపరితలం పైకి వచ్చి ఈదడం వంటివి చేస్తుంటాయి. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉప్పలగుప్తం ఎఫ్‌డీవో బి.హేమానంద్ వివరించారు. డైక్లోరోవాస్(76 శాతం) ఎకరా చెరువుకు 500 మి.లీ. ద్రావణాన్ని చల్లుకోవాలి. లేదా డెల్టామైత్రిన్(1.75 శాతం) వంద మి.లీ. ద్రావణాన్ని చల్లుకోవాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు చల్లుకోవాలి. ఈ పేలు తిరిగి వ్యాప్తి చెందకుండా చెరువు చుట్టూ గడ్డిని తొలగించి వెదురుకర్రలు, మేతకు వినియోగించే సంచులను శుభ్రపరుచుకోవాలి.

వ్యాధి సోకిన చేప

తొలి విప్లవోద్యమ మార్గదర్శి పరంజ్యోతి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: మైదాన ప్రాంత తొలి విప్లవోద్యమ మార్గదర్శి గుర్రాల పరంజ్యోతి అని వక్తలు కొనియాడారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకుడు, అమరుడు పరంజ్యోతి వర్ధంతిని వెంకటాయపాలెంలోని స్మారక స్థూపం వద్ద సోమవారం నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, వెంటపల్లి భీమశంకరం, బి.సిద్ధూ, గాంధీరాజు, పరంజ్యోతి భార్య దయామణి, కుటుంబ సభ్యులు, సర్పంచులు కొత్తపల్లి అరుణ, యల్లమిల్లి సతీష్‌కుమారి తదితరులు నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ రైతుకూలీ ఉద్యమం, దళితులపై దాడులు, వేతన దోపిడీ, వెంకటాయపాలెం శిరోముండనం సహా పలు ఉద్యమాలను ముందుండి నడిపించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో చింతా రాజారెడ్డి, అంబటి కృష్ణ, గుబ్బల శ్రీనివాసు, శిరోముండనం కేసు బాధితులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రైతు సమస్యలపై 3న సమావేశాలు

అమలాపురం కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఈ నెల 3న సమావేశాలు నిర్వహించి రైతు సమస్యలను గుర్తించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత నెల 22 నుంచి జిల్లా వ్యాప్తంగా రైతన్న.. మీ కోసం కార్యక్రమం ద్వారా 1,45,345 మంది రైతుల నుంచి సమస్యలు తెలుసుకున్నట్లు చెప్పారు. రైతుసేవా కేంద్రాల వారీగా సమావేశాలు నిర్వహించి సమస్యలపై నివేదిక రూపొందించాలన్నారు. రాబోయే రబీ సీజన్‌లో సాగుకు అవసరమైన సూచనలు చేయాలన్నారు. రబీ సీజన్‌లో రెండో విడత నానో యూరియా వినియోగించే విధంగా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి బీవీ రమణ, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాను ఆదర్శంగా నిలపాలి

జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి పైపులైన్లు, ఇతర నిర్వహణ పనులకు సంబంధించి నిధుల కోసం అంచనాలు రూపొందించి నివేదిక అందించాలని తెలిపారు. ఎస్ఈ ఏఈస్ఈ రాజన్, డ్వామా పీడీ మధుసూదన్ పాల్గొన్నారు.

స్టాంపు డ్యూటీ గ్రాంటు విడుదల చేయాలి

అంబాజీపేట: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు స్టాంపు డ్యూటీ గ్రాంటు విడుదల చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి కోరారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో కె.మాధవికి వినతిపత్రం అందజేశారు. గత రెండేళ్లుగా స్టాంపు డ్యూటీ విడుదల చేయలేదన్నారు. కలెక్టర్ తక్షణం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచులు కోట బేబిరాణి, తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు ఉన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లలో

ఫారంరేటు	113-00
రిటైల్ లైవ్	140-00
డ్రెస్డ్	203-00
స్కిన్‌లెస్	231-00

పాల్ ల్యాబ్‌లకు 1200 ట్యాబ్‌లు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కోనసీమ జిల్లాలోని 40 పాల్ ల్యాబ్‌లకు 1,200 ట్యాబ్‌లను ప్రభుత్వం అందించిందని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానటరింగ్ అధికారి, పాల్ ల్యాబ్స్ జిల్లా నోడల్ అధికారి పి.రాంబాబు పేర్కొన్నారు. ఒక్కో ల్యాబ్‌కు 30 చొప్పున వీటిని కేటాయించామని వివరించారు. రామచంద్రపురంలోని శ్రీమతి ఇందిరా గాంధీ మున్సిపల్ హైస్కూల్లో పాల్ ల్యాబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయుడు చెప్పిన పాఠ్యాంశం అర్థం కాకపోయినా విద్యార్థి ట్యాబ్‌లో ఉన్న సమాచారంతో పునశ్చరణ చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యా ట్రస్టు బోర్డు ఛైర్మన్ వెంకప్పనాయుడు మాట్లాడుతూ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. హెచ్ఎం సత్యనారాయణమూర్తి, ఎస్ఎంసీ ఛైర్మన్ గుబ్బల విజయలక్ష్మి పాల్గొన్నారు.

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఏఎంవో రాంబాబు, విద్యా ట్రస్టు ఛైర్మన్ వెంకప్పనాయుడు

భద్రతా నియమాలు పాటించాలి

రావులపాలెం పట్టణం: ప్రయాణికులు రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం వాడపల్లికి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారని, ఆర్టీసీ బస్సుల్లో వచ్చేవారు సంయమనం పాటించాలన్నారు. ప్రమాదకరంగా ప్రయాణం చేయొద్దని, డ్రైవర్లకు సహకారం అందించాలని కోరారు.

APSRTC టెండరు ప్రకటన పల్లె వెలుగు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా (కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలు) పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాల్స్/ షాపులు, క్యాంటీన్ మొదలగు వ్యాపారములు చేసుకొనుటకు, అనుభవం, ఆసక్తి కలిగిన సంస్థలు/ వ్యాపారస్థుల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.02-12-2025 నుండి తేది.15-12-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు మరియు తేది.16-12-2025న మ॥1.00 గం॥ వరకు రాజమహేంద్రవరం డిపో నందు మాత్రమే అమ్మబడును. (2) [illegible] ... https://apsrtc.ap.gov.in ... APSRTC [illegible]

[illegible]

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బంగారు నగల వేలం ప్రకటన

[illegible]

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

[illegible] ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు: పేరు: [illegible] (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు: 98482 49289.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible] సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ [illegible] SARFAESI చట్టం 2002 (క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" [illegible]

డిమాండ్ నోటీసు తేది: 19-04-2024

[illegible]

రిజర్వు ధర: రూ.43,21,000/- | ధరావత్తు: రూ.4,32,100/- | బిడ్ పెంపుదల: రూ.10,000/-

ఇ-వేలం తేదీ: 24-12-2025 | సమయం: ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

[illegible] www.sbi.co.in/ [illegible] https://baanknet.com/eauction-psb/x-login & [illegible] support.baanknet@psballiance.com [illegible]

తేది: 26-11-2025, ప్రదేశం: విశాఖపట్నం | సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీసాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి ఆ రోజు మార్కెట్ రేటుకి కొనబడును. స్పాట్ క్యాష్. Cell: 94933 38823.

TENDER

ITC లిమిటెడ్, ABD, అనపర్తి-533342 వద్ద గల 124 KL HSD ట్యాంక్, 225 KVA స్టెబిలైజర్, MS, ఫుడ్, కన్వేయర్ బెల్టులు, SS, అల్యూమినియం, రబ్బర్, కేబుళ్లు కెపాసిటర్లు వగైరాలకు 15-12-2025న e-కోట్ కలదు. తనిఖీ 08-12-2025 నుండి 10-12-2025. టెండరు ఫారం ధర రూ.500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14. ఫోన్: 098407 31925. www.welcomeauctioneers.com.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

House For Sale Near Ashoknagar, Meeseva road, Kakinada. 370 Sq yards (52x65) Contact: RS RAO, ✆ 94927 70388.

PLOT FOR SALE

GENERAL

Open Plot For Sale Near Gokulam Temple, Gokulam Road, Kakinada. Plot No: 11 (45x67) 337 Sq Yards. RS RAO ✆ 94927 70388

JOBS

రాఘవ ఆటో ఫైనాన్స్‌కు రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, జగ్గంపేట, తుని, రావులపాలెంలలో బిజినెస్ & రికవరి ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 910092 7474, 90631 80344.

AISHWARYA GROUP OF INDUSTRIES NUTRITION FOR HAPPY LIFE

JOB OFFERS

Aishwarya Group is one of the leading rice mills in the industry with its established domestic brands in AP & TG, located near to Rajanagaram, East Godavari Dist. invites applications to fill the following vacancies.

1. HR MANAGER-1 (Min. 5 years experience)
2. SENIOR ACCOUNTANT-1 (Min. 5 years experience)
3. JUNIOR ACCOUNTANT-1 (Min. 1 year experience)
4. FACTORY OPERATIONS IN_CHARGE-1 (Min. 3 years experience)
5. PRODUCTION MANAGER-1 (Min. 5 years experience)
6. QUALITY MANAGER-1 (Min. 3 years experience)
7. MACHINERY MAINTENANCE ENGINEER-1 (Min. 5 years experience)
8. STORES SUPERVISOR - 1 (Min. 3 years experience)
9. SECURITY SUPERVISOR -1 (Ex-Service Men Preferable)
10. GENERAL SUPERVISORS - 2 (Min. 3 years experience)

Suitable Salary as per skills & experience of the candidates. Interested candidates can apply with the resume to email address: hr@aishwaryagroup.in

Management

WANTED: సేల్స్ & సర్వీస్ మేనేజర్ - కార్ షోరూమ్‌లో అనుభవం కనీసం 2 సంవత్సరాలు. డెమో ఎగ్జిక్యూటివ్‌లు, సేల్స్ & సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌లు, టెలికాలర్ (Female), సీనియర్ మెకానిక్స్ కావలెను. రాజమండ్రి, తుని, జగ్గంపేట, మండపేట, రావులపాలెం. Contact Cell: 97033 34844, 63019 19238.

జనప్రియ ఊరగాయలు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Contact: జనప్రియ ఊరగాయలు, రాయుడుపాకలు, రాజమండ్రి రూరల్, Cell: 98664 08924.

రాజమండ్రి, కొవ్వూరు, అనకాపల్లిలో ప్ర.కం., ప్రాజెక్టులు, షోరూమ్స్‌లో సె॥ గార్డ్స్, సె॥ సూపర్‌వైజర్స్ కావలెను. రూం+బో., జీ: 12-15 వేలు. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, RJY. ✆ 93922 69369.

SECURITY GUARDS

రాజమండ్రి, పోలవరం ప్రాజెక్ట్ దగ్గర పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 15,000/-, P.F, ESI, ఉచిత వసతి – భోజన సదుపాయం కలదు. Contact: 98665 94189, 85004 98115.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-40 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజోలు

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి

బాలబాలాజీ ఆలయంలో గీతా పారాయణం చేస్తున్న మహిళలు

ఆత్రేయపురం, మామిడికుదురు, ఆలమూరు, న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, మామిడికుదురు బాలబాలజీస్వామి, ఆలమూరు మండలం చింతలూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం గీతా జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సామూహిక గీతాపారాయణం చేశారు.

పోషక పదార్థాల ప్రదర్శన

ఆత్రేయపురం: పేరవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పీఎంశ్రీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఆధ్వర్యంలో ఆహారోత్పత్తుల విద్యా కమిటీ ఛైర్మన్ కుండ వెన్నెల ప్రారంభించారు. విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. ఎంఈవో అడపా సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయిని యు.భాగ్యవతి పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

సఖినేటిపల్లి: రామేశ్వరంలోని విలేజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ట్రస్ట్ సమకూర్చిన నిత్యావసర సరకులను వంద పేద కుటుంబాలకు ఎస్సై దుర్గాశ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు సోమవారం పంపిణీ చేశారు. సర్పంచి ఉమా మహేశ్వరరావు, మాజీ సర్పంచి విజయప్రసాద్, మదురవిరాజు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

నీటి వృథాకు అడ్డుకట్ట

రావులపాలెం గ్రామీణం: గోపాలపురంలో పబ్లిక్ కుళాయిలు పలు చోట్ల మరమ్మతుకు గురై నీరు వృథాగా పోతోందని పంచాయతీ కార్యదర్శి సాయిపట్టాబిరామయ్య దృష్టికి తీసుకువెళ్లగా మరమ్మతులు చేయించారు. నీటి వృథాను అరికట్టి ప్రజలకు తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

ఆత్రేయపురం: బొబ్బర్లంకలో వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నామంటూ స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి నరాలశెట్టి సుబ్బలక్ష్మి వద్ద ప్రస్తావించగా లైన్లకు మరమ్మతులు చేయించి దీపాలు వేయించారు.

కొమ్మలన్నీ కాయలే

మామిడికుదురు మండలం బి.దొడ్డవరానికి చెందిన బొరుసు సూర్యనారాయణ ఇంటి పెరట్లో బొప్పాయి చెట్టు పది తలలతో అబ్బురపరుస్తోంది. కొమ్మలన్నిటికీ దాదాపు 250 కాయలు ఉండటంతో పలువురు ఆసక్తిగా వీక్షిస్తున్నారు. చెట్టు ప్రధాన కొన భాగం దెబ్బతిన్నప్పుడు దాని పెరుగుదలను వాహకాలు పక్క భాగాలకు మళ్లించడం వల్ల కాండం మధ్యలో ఉన్న మొగ్గలు పలు శాఖలుగా ఏర్పడుతున్నాయని ఉద్యాన నిపుణుడు దిలీప్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

కాటన్ బ్యారేజీ గేట్లు మూసివేత

పి.గన్నవరం: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ద్వారా సముద్రంలోకి విడిచిపెట్టే జలాలను నిలిపివేసినట్లు హెడ్‌వర్క్స్ జె.ఇ. డి.రాధాకృష్ణ సోమవారం తెలిపారు. డిసెంబరు 1 నుంచి రబీ సీజన్ మొదలైంది. గోదావరికి ఎగువనుంచి వచ్చే జలాలు తగ్గిపోవడంతో బ్యారేజ్ 175 గేట్లు మూసేశారు. మళ్లీ జూన్ నుంచి సరఫరా మొదలవుతుంది. సోమవారం తూర్పుడెల్టాకు సాగునీరు నిలిపివేయగా మధ్యడెల్టాకు 150, పశ్చిమ డెల్టాకు 2 వేల క్యూసెక్కులు పంపిణీ చేస్తున్నారు.

ఇప్పటివరకు సముద్రంలోకి..: ఈ ఏడాది జూన్ నుంచి నవంబరు 30 వరకు బ్యారేజ్ ద్వారా సముద్రంలోకి 4,620 టీఎంసీలు విడిచిపెట్టారు. గతేడాది ఇదే రోజుకు బ్యారేజ్ నుంచి సముద్రంలోకి 17,382 క్యూసెక్కులు విడిచిపెట్టారు.

జనవరి, ఫిబ్రవరి నెల కల్యాణ టికెట్లు విడుదల

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో 2026 జనవరి, ఫిబ్రవరి నెలకు సంబంధించి స్వామి వారి కల్యాణం టికెట్లు సోమవారం విడుదల చేసినట్లు ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. రెండు నెలల్లో 58 రోజులకు సంబంధించి 6728 కల్యాణాలకు ఆన్‌లైన్‌లో 5220, కార్యాలయంలో 1508 టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు.

నైపుణ్యం ప్రదర్శించి.. పతకాలు సాధించి

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారిణులు

న్యూస్‌టుడే – రావులపాలెం పట్టణం, కొత్తపేట

నెట్‌బాల్ క్రీడలో తలపడుతున్న క్రీడాకారులు

నెట్‌బాల్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్ క్రీడాకారులు. ఒక పక్క చదువులో రాణిస్తూ మరోక వైపు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని విజయాలు సాధిస్తూ అందరి చేత అభినందనలు అందుకుంటున్నారు. క్రీడాకారులు రావులపాలెం, కొత్తపేట మండలాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో చదువుతూ క్రీడలపై శిక్షణ తీసుకుంటూ ఎన్నో పతకాలు సాధిస్తున్న క్రీడాకారుల విజయాలు లక్ష్యాలు వారి మాటల్లో..

క్రీడలంటే మక్కువ..

మాది కొత్తపేట మండలం వానపల్లి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. తండ్రి కౌలు రైతు, తల్లి గృహిణి. నాకు క్రీడలంటే ఇష్టం. టెన్నికాయిట్‌లో శిక్షణ పొందుతున్నా. విజయవాడ, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎనిమిదిసార్లు పాల్గొని పతకాలు సాధించా. చెన్నై, జమ్మూకశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొన్నా. జాతీయస్థాయి పోటీలో పాల్గొనేందుకు రామన్నపాలెంలో శిక్షణ పొందుతున్నా. – పలివెల లావణ్య

పీఈటీగా ఉద్యోగ సాధనే లక్ష్యం..

కొత్తపేట జూనియర్ కళాశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతున్నా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాఠశాల స్థాయి నుంచి టెన్నికాయిట్‌లో తర్ఫీదు పొందుతున్నా. వివిధ రాష్ట్ర స్థాయి పోటీల్లో పదిసార్లు పాల్గొని పతకాలు సాధించా. జమ్మూకశ్మీర్, చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పోటీలోనూ పాల్గొన్నా. వ్యాయామోపాధ్యాయినిగా ఉద్యోగం సాధించాలన్నది నా లక్ష్యం. – కొప్పాడి అనిత, వానపల్లి

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని..

మాది రావులపాలెం మండలం ఈతకోట. పదో తరగతి చదువుతున్నా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నెట్, హ్యాండ్ బాల్‌లో శిక్షణ పొందుతున్నా. 2023లో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించా. 2024లో గుంటూరులో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలన్నది నా లక్ష్యం. – దేవరపల్లి కల్యాణి, ఈతకోట

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని..

స్నేహితులు క్రీడా పోటీల్లో రాణించడాన్ని చూసి ఆసక్తి ఏర్పడింది. పీఈటీ రామకృష్ణ ప్రోత్సాహంతో నెట్‌బాల్ పోటీల్లో శిక్షణ పొందుతున్నా. పలు మండల, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ సంవత్సరం భీమవరంలో శ్రీనివాసపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించా. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. – గంటి దేవీప్రసన్న, దేవరపల్లి

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ఆలమూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం చొప్పెల్లలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నియోజకవర్గంలో మొత్తం 42,257 మందికి రూ.18.43 కోట్లు పింఛన్లుగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల కొత్తగా 52 వితంతు పింఛన్లు మంజూరయ్యాయన్నారు.

పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రాజోలు, న్యూస్‌టుడే: కొత్తగా మంజూరైన పింఛన్లను నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య సోమవారం రాజోలు గ్రామ పంచాయతీ వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచి రేవు జ్యోతి, ఉప సర్పంచి పామర్తి రమణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాజోలులో పింఛన్లు పంపిణీ చేస్తున్న తెదేపా ఇన్‌ఛార్జి అమూల్య

మలికిపురం: మట్టపర్రులో లబ్ధిదారులకు రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ బండి పద్మ, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి, సర్పంచి కవలి దుర్గాదేవి పింఛన్లు అందించారు.

భావప్రసార నైపుణ్యాన్ని పెంచుకోవాలి

రాజోలు, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి భావప్రసార నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుని లక్ష్యసాధనకు ముందడుగు వేయాలని రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి అన్నారు. శివకోటిలోని నారాయణ కళాశాలలో ఏజీఎం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ విశ్వనాథ్ అధ్యక్షతన సోమవారం జరిగిన 'మాస్టర్ ఆరేటర్' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కమ్యూనికేషన్ నైపుణ్యం వల్ల ప్రయోజనాలు, విద్య గొప్పదనాన్ని వివరించారు. డాక్టర్ సృజన, క్లస్టర్ ప్రిన్సిపల్ రామచంద్రం, ఏవో దుర్గాప్రసాద్, అధికారులు, వివిధ శాఖల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి

అవగాహనతో ఎయిడ్స్‌ను తరిమికొట్టొచ్చు

న్యూస్‌టుడే బృందం: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, హెచ్ఐవీ పరీక్షలు చేయించుకుని అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆసుపత్రి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. ✦ ఆత్రేయపురంలో పీహెచ్‌సీ వైద్యాధికారి హైమశ్రీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ✦ రావులపాలెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి రావులపాలెం సెంటర్ వరకూ ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. ✦ రావులపాలెం మండలం దేవరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎయిడ్స్ ఆంగ్ల అక్షరాకృతిలో కూర్చుని ప్రదర్శన నిర్వహించారు. ✦ మలికిపురం మండలం లక్కవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆర్.పావని ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, విశ్వేశ్వరాయపురంలో వికాసంద ఉన్నత పాఠశాల విద్యార్థులు మానవహారం ప్రదర్శన నిర్వహించారు. ✦ మామిడికుదురు మండలం పాశర్లపూడిబాడవ జడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ సూరమీను శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ✦ అంబాజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైద్యులు కె.ఎస్.శ్రీనివాస్, వి.గౌతమి పాల్గొన్నారు.

విశ్వేశ్వరాయపురంలో విద్యార్థుల ప్రదర్శన

కొత్తపేటలో మానవహారం

అంబాజీపేటలో అవగాహన ర్యాలీ

శతమానం భవతి

వెంకటరత్నానికి వేదపండితుల ఆశీర్వచనం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ముంగండ గ్రామానికి చెందిన కొడమర్తి వెంకటరత్నం 101వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు సోమవారం శతవసంత వేడుకను పండగ వాతావరణంలో నిర్వహించారు. వెంకటరత్నం 1924 డిసెంబరు 1న జన్మించారు. ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కోడళ్లు, మనవలు, మునిమనవళ్లతో సహా 29 మంది ఉన్నారు. భర్త నరసింహమూర్తి 98 సంవత్సరాల వయసులో 2011లో కాలం చేశారు. తండ్రి పేటేటి రామ్మూర్తి శ్రేష్ఠి పండితుడు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు తర్కగజకేసరి బిరుదును బహూకరించి సత్కరించింది.

నివాసాల చెంత వ్యర్థాలతో ఇక్కట్లు

ఉచ్చిలి చెరువు సమీపంలో నివాసాల చెంత చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి వ్యర్థాలను వదిలేస్తున్నారని, ఎప్పటికప్పుడు తొలగించేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి వద్ద ప్రస్తావించగా చెత్తను తొలగించి శుభ్రం చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ఇసుక పేరుకుపోయి.. రాకపోకలకు భయం

రావులపాడు శివారు పూరేటివారిచెరువు గ్రామంలో ప్రభుత్వ ఇసుక నిల్వ కేంద్రం వద్ద రహదారిపై ఇసుక పేరుకుపోయి పలువురు వాహన చోదకులు జారి పడిపోతున్నారు. లారీలపై నుంచి పడిన ఇసుక రోడ్డుపై పెద్దఎత్తున పేరుకుపోయినా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

కాలువ దుర్గంధం.. విద్యార్థుల సతమతం

రాజోలులో సోంపల్లి నుంచి చింతలపల్లి వరకు 7 కిలోమీటర్ల పొడవున్న మురుగు కాలువ వ్యర్థాలమయమైంది. దీన్ని ఆనుకుని బీసీ బాలుర, సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, జడ్పీ ఉన్నత పాఠశాల ఉన్నాయి. దోమల బెడదతో వసతిగృహ విద్యార్థులు సతమతమవుతున్నారు. నిద్ర ఉండటం లేదని వాపోతున్నారు. ఈ సమస్యపై డ్రెయిన్స్ ఏఈ ఆనంద్‌ను వివరణ కోరగా త్వరలో కాలువను బాగు చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రాజోలు

భవనం.. బాగుచేస్తే ప్రయోజనం

కేశనపల్లిలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం వార్డెన్ నివాస భవనం నిరుపయోగంగా ఉండటంతో శిథిలమవుతోంది. 1993లో నిర్మించిన ఈ భవనాన్ని చాలాకాలంగా ఉపయోగించడం లేదు. గదులు, హాలు, వంట గది శిథిలమవుతున్నాయి. మరమ్మతులు చేయిస్తే ప్రభుత్వ కార్యాలయంగా ఉపయోగించుకోవచ్చు. కేశనపల్లి వసతిగృహం ఇన్‌ఛార్జి అధికారి డి.జ్యోతిని వివరణ కోరగా భవనం పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

కుందాలపల్లి రహదారి నిర్మాణం పూర్తి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పప్పులవారిపాలెం నుంచి కుందాలపల్లి వరకు 1.66 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసిన తారురోడ్డు పనులకు సంబంధించి సోమవారం పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులు కొలతలు సేకరించారు. ఎన్నో సంవత్సరాలుగా అధ్వానంగా ఉన్న ఈ రహదారి దుస్థితిపై 'ఈనాడు' వెలుగులోకి తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం మోక్షం కలిగించింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చొరవతో ఉపాధి నిధులు రూ.78 లక్షలతో అభివృద్ధి చేశారు. ఇంకా కుందాలపల్లి నుంచి అడిచి ర.భ.శాఖ రహదారి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాల్సి ఉంది. దీనిని కూడా పూర్తిచేస్తే రైతులకు ఎంతోమేలు కలుగుతుంది. ఈ దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఈఈ పి.రామకృష్ణారెడ్డి, డి.ఇ.ఇ. అన్యం రాంబాబు పాల్గొన్నారు.

రహదారిపై ఆక్రమణల తొలగింపు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం రేవులో రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. జనవరిలో సంక్రాంతి సంబరాలు జరగనున్న దృష్ట్యా అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం మార్కింగ్ ఇచ్చి జేసీబీతో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, చెత్తడబ్బాలు ఏర్పాటు చేయాలని, దుకాణాలు వెనక్కు జరపాలని తహసీల్దారు టీఆర్ రాజేశ్వరరావు సూచించినప్పటికీ వ్యాపారులు పట్టించుకోలేదు. గత సంవత్సరం ప్రధాన కాలువలో రాష్ట్రస్థాయి ఈత, పడవ పోటీలు నిర్వహించారు. ఆ సమయంలో ఆక్రమణ దుకాణాల వల్ల రోడ్డు ఇరుకుగా ఉండటంతో వీక్షకులు ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్ సమస్య తలెత్తి గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. ఈ సంవత్సరం అలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా అధికారులు ముందస్తుగా పగడ్బందీ చర్యలు చేపట్టారు.

బొబ్బర్లంక రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

మత్తుపదార్థాలతో యువత జాగ్రత్త

కొత్తపేట, న్యూస్‌టుడే: మత్తుపదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్.విద్యాసాగర్ అన్నారు. సోమవారం కొత్తపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పిల్లల నడవడికను తల్లితండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్, ఓటీపీ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కొత్తపేట ఎస్సై సురేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

ఆలమూరు: జొన్నాడ-రావులపాలెం గోదావరి నది మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 50 సంవత్సరాల వయసు ఉంటుందని, మృతిచెంది మూడు రోజులు కావచ్చని ఎస్సై నరేష్ తెలిపారు. వారధిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక ఎగువ నుంచి మృతదేహం కొట్టుకువచ్చిందా అనేది దర్యాప్తులో తేలుతుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఆత్రేయపురం: పులిదిండికి చెందిన వల్లి సత్యనారాయణ గత నెల 27న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇంటి వద్ద, పరిసరాల్లో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదు. దీనిపై మనుమడు చక్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు.

'రెవెన్యూ అధికారుల పెత్తనం సరికాదు'

మాట్లాడుతున్న సెంట్రల్‌డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్

పి.గన్నవరం: రైతులకు సేవ చేసేందుకు వచ్చిన తమపై ఇతరుల పెత్తనం ఏమిటిని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ప్రశ్నించారు. రబీలో సాగునీటి ప్రణాళిక రూపొందించేందుకు జలవనరులశాఖ పి.గన్నవరం సబ్‌డివిజన్ పరిధిలోని నీటిపంపిణీ, సాగునీటి సంఘాల అధ్యక్షులతో పి.గన్నవరంలోని కార్యాలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. మొంథా తుపాను కారణంగా పంటకాలువల్లో కూలిన చెట్లను తొలగించే బాధ్యత రెవెన్యూ అధికారులు తమపై పెట్టడం సరికాదన్నారు. రబీకి పుష్కలంగా సాగునీరు అందిస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ శివారు ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు వెల్లడించారు. చేసిన పనులకు బిల్లులు సకాలంలో చెల్లించడం లేదన్నారు. ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, డీఈఈ భూపతిరాజు రవిప్రసాద్‌రాజు, ఇరిగేషన్, డ్రెయిన్ ఏఈఈలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

రాజోలు, మలికిపురం, న్యూస్‌టుడే: రాజోలు మండలం కాట్రేనిపాడులో భాష్విక వైద్యం నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.92,510 చెక్కును, మలికిపురం మండలం తూర్పుపాలెంలో లబ్ధిదారునికి మంజూరైన రూ.40,127 చెక్కును నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య సోమవారం అందజేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

హెచ్ఎం రాంబాబు, ఉపాధ్యాయుడు సతీష్‌ను సత్కరించిన గ్రామస్థులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: బదిలీపై వెళుతున్న తొండవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గుబ్బల రాంబాబు, ఉపాధ్యాయుడు చోడిశెట్టి వెంకటసతీష్‌లను సోమవారం గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. సర్పంచి పేరాబత్తుల దొరబాబు, కూటమి నేత పేరాబత్తుల పెద్దసుబ్బరాజు, తొండవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వి.కేశవాచార్యులు, పినిపే సత్యనారాయణ, ఎస్టీయూ రాష్ట్ర కన్వీనర్ బోనం గంగాధర్, కుంపట్ల సుబ్బారావు పాల్గొన్నారు.

తల్లే మొదటి గురువు

మలికిపురం: ప్రతి తల్లి మొదటి గురువుగా కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడుపుతుందని విద్యా భారతి రాష్ట్ర కార్యకారిణి సభ్యురాలు డాక్టర్ ధరణిప్రియ అన్నారు. లక్కవరంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సప్త శక్తి సంగం సమావేశంలో ఆమె ముఖ్యవక్తగా పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాది మైలవరపు శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈవో ఎం.విజయశ్రీ, సమావేశ కన్వీనరు మంగెన వందన, పాఠశాల కార్యదర్శి మంగెన నరసింహారావు, ప్రధాన ఆచార్యులు జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేవా పురస్కార గ్రహీతకు సత్కారం

మామిడికుదురు: కళా రంగంలో ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంగం సత్యనారాయణను స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో సోమవారం సంఘ కళాకారులు, స్థానికులు సత్కరించారు. నగరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఛైర్మన్ ఈలి శ్రీనివాసరావు, కళాకారులు పాల్గొన్నారు.

సత్యనారాయణను సన్మానించిన కళాకారులు

బీమా పరిహారం అందజేత

బీమా చెక్కును అందజేస్తున్న హరిప్రసాద్

మామిడికుదురు: మగటపల్లికి చెందిన జనసైనికుడు దొడ్డా సాయిన వీన్ గత జనవరిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో తండ్రి శ్రీనివాసరావుకు రూ.5 లక్షల ప్రమాద బీమా పరిహారం చెక్కును సోమవారం మంగళగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ పార్టీ తరపున అందజేశారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కల్యాణం శివశ్రీనివాస్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతకింద శ్రీనివాస్, పాల్గొన్నారు.

వీడని తుపాను భయం

అయినవిల్లి, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. అయినవిల్లి, నేదునూరు, పోతుకుర్రు, వెలువలపల్లి తదితర గ్రామాల్లో కల్లాలు, రహదారులపై వేసిన ధాన్యం రాశుల్లోకి నీరు చేరింది. సోమవారం తెరిపిచ్చినా మేఘాలు, మబ్బులు కమ్ముకోవడంతో వరికోతలు నిలిచిపోయాయి.

మామిడికుదురు: ఈదురుగాలులతో పలుచోట్ల సార్వా వరి చేలు నేలవాలుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 2,713 ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 1,950 ఎకరాల్లో కోతలు కోయాల్సి ఉంది. నగరం, పెదపట్నం, గెద్దాడ, ఈదరాడ, మొగలికుదురు తదితర చోట్ల వరి చేలను రక్షించుకునేందుకు హైరానా పడుతున్నారు. వరి కోత యంత్రాలు ఆశించినంతగా అందుబాటులో లేకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు.

పెదపట్నంలో పడిపోయిన వరి

దిత్వా ప్రభావం.. హార్బర్‌కే పరిమితం

దిత్వా తుపాను ప్రభావంతో అంతర్వేదిలో వర్షంతో కూడిన చలిగాలులు వీస్తున్నాయి. మత్స్యశాఖ అధికారుల హెచ్చరికలతో ఉప్పాడ, కాకినాడ, అనకాపల్లి తదితర జిల్లాలకు చెందిన గంగపుత్రులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా నాలుగు రోజులుగా మినీ ఫిషింగ్ హార్బర్‌కే పరిమితమయ్యారు. వారికి విశ్రాంతి భవనం లేకపోవడంతో ఒడ్డున లంగరు వేసిన బోట్లపైనే గడుపుతున్నారు. ఇక్కడ నిర్మించిన భవనాల్లో గదులను కొందరు ఆక్రమించుకోవడం, హాలు వలలతో నిండి అశుభ్రంగా ఉండటంతో తలదాచుకునే అవకాశం లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వసతి కల్పించాలని జాలర్లు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

బోట్లపైనే ఉన్న మత్స్యకారులు

డిప్యూటీ ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

అంబాజీపేట, అయినవిల్లి, ఆలమూరు, పి.గన్నవరం, న్యూస్‌టుడే: డిప్యూటీ ఎంపీడీవోలుగా అంబాజీపేటలో మహ్మద్ అబ్బాస్‌అలీ, అయినవిల్లిలో రాజమోహన్, ఆలమూరులో ఎస్.వీర్రాజు, పి.గన్నవరంలో ఆర్.సూర్యనారాయణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

సేవా గుణం అలవరచుకోవాలి

రాజోలు, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి సమాజానికి మేలు చేయాలని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.సాయిబాబు అన్నారు. సోంపల్లిలో సోమవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో ఆయన మాట్లాడారు. సర్పంచి కట్టా శ్రీనివాస్, పొలమూరి శ్యాంబాబు, ఎన్ఎస్ఎస్ అధికారి నల్లి రాజు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

జనవరి, ఫిబ్రవరి నెల కల్యాణ టికెట్లు విడుదల

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో 2026 జనవరి, ఫిబ్రవరి నెలకు సంబంధించి స్వామి వారి కల్యాణం టికెట్లు సోమవారం విడుదల చేసినట్లు ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. రెండు నెలల్లో 58 రోజులకు సంబంధించి 6728 కల్యాణాలకు ఆన్‌లైన్‌లో 5220, కార్యాలయంలో 1508 టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధి నిత్య, మాస, వార్షిక పూజలు, రుద్రహోమం, చండీ హోమం, లక్షపత్రి పూజ, మహాశివరాత్రికి ద్వాదశ నదీజలాభిషేకం టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. దేవస్థానం వెబ్‌సైట్ www.sriveereswaraswamytemple.com, aptemples.ap.gov.in లను సంప్రదించవచ్చన్నారు.

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాట - 36, వంకాయలు నలుపు - 40, వంకాయలు తెలుపు - 38, బెండకాయలు - 60, పచ్చిమిర్చి - 42, కాకరకాయ - 45, బీరకాయలు - 48, కాలీఫ్లవర్ -26, క్యాబేజీ - 32, క్యారెట్ - 55, దొండకాయలు - 30, బంగాళదుంపలు - 25, ఉల్లిపాయలు - 26, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు - 26, చిక్కుడుకాయలు - 80, చేమదుంపలు - 43, కంద - 55, బీట్‌రూట్ - 48, కీరదోసకాయలు -35, అల్లం - 75, క్యాప్సికం - 90, చిలకడదుంపలు - 45, గుమ్మడి - 30, ఉసిరి - 80, ముల్లంగి - 45, కరివేపాకు -55, నిమ్మకాయలు - 30, మామిడికాయ - 70.

ఒక్కొక్కటి చొప్పున ఆనబకాయ - 22, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ -15, ఆకుకూరలు కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 15, కొబ్బరికాయ - 25.

గున్నేపల్లి అగ్రహారంలో రహదారి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆనందరావు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గున్నేపల్లి అగ్రహారంలో పలు అభివృద్ధి పనులకు సర్పంచి పెద్దిరెడ్డి రామచంద్రరావుతో కలిసి సోమవారం శ్రీకారం చుట్టారు. తొలుత పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీనగర్ నవాబ్ నూతన షెడ్డు, గ్రామంలోని సీసీ రోడ్లను ప్రారంభించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరం శంకుస్థాపన చేశారు. నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ అధికారి జయవెంకటలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షుడు చొల్లంగి సాయిబాబా పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పండగ: అమలాపురం పట్టణం: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛను పథకం పేదలకు అండగా నిలుస్తోందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. అమలాపురం పట్టణంలోని సావరం బైపాస్‌రోడ్డులో మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ మహేష్‌కుమార్ సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు.

★ పట్టణంలోని 19, 20, 21వ వార్డుల్లో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తెదేపా నాయకులు మెట్ల రమణబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అధికారి జయలక్ష్మి, జనసేన కౌన్సిలర్లు యేడిద శ్రీను, తిక్కా సత్యలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అర్హులందరికీ అందిస్తున్నామని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం జి.వేమవరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుత్తుల సాయి, సాగిరాజు సూరిబాబు రాజు తదితరులు పాల్గొన్నారు.

6న బుద్ధవిహార్ వార్షికోత్సవం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: త్రిరత్న బుద్ధ విహార్ 17వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించాలని సంస్థ ప్రధాన కార్యదర్శి డీబీ లోక్ పిలుపునిచ్చారు. అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో లోక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న జరిగే కార్యక్రమానికి బౌద్ధులు, అభిమానులు తరలిరావాలన్నారు.

'సంస్కృతి ఉత్సవ్' బహుమతుల ప్రదానం

విజేతలతో డాక్టర్ అశ్లేష, చిత్రకారుడు అంజి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు భగవద్గీత, రామాయణం, భారతీయ విజ్ఞాన వైభవం తదితర అంశాలపై నిర్వహించిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని అకొండి సింహాచలం సర్వీస్ ట్రస్టు ఛైర్మన్ అకొండి పవన్ తెలిపారు. అమలాపురం యర్రమిల్లివారి వీధి శ్రీసకలకార్యసిద్ధి మరకత హనుమాన్ మందిరం ప్రాంగణంలో సంస్కృతి ఉత్సవ్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యక్తిత్వ వికాస నిపుణురాలు డాక్టర్ అశ్లేష, చిత్రకారుడు అంజి మాట్లాడారు.

ప్రాంగణ నియామకాల్లో ప్రతిభ

కాట్రేనికోన: చెయ్యేరులోని శ్రీనివాస స్వయంప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాలలో మదర్‌సన్ ఆటో మోడల్ టెక్నాలజి కమ్ ఇంజినీరింగ్ సంస్థ ప్రాంగణ నియామకాలు నిర్వహించింది. ప్రతిభ కనబరిచిన 26 మందికి నియామక పత్రాలు అందించామని ప్రిన్సిపల్ సురేష్‌బాబు తెలిపారు. వీరిలో బీవీసీ కళాశాల విద్యార్థులు ఉన్నారన్నారు.

ధరల నియంత్రణకు పర్యవేక్షణ అవసరం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధరల నియంత్రణకు పౌర సరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలని జేసీ నిశాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. నిత్యవసరాలు, కూరగాయలను వినియోగం, సరఫరా ఆధారంగా ధరలను నియంత్రించాలని తెలిపారు. నిత్యావసరాల ధరలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారి ఉదయ్ భాస్కర్, మార్కెటింగ్ శాఖ అధికారి విశాలాక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

విచారణ చేపడుతున్న డీఎస్పీ, పోలీసులు

పెనుమల్లలో డీఎస్పీ విచారణ

కాట్రేనికోన, న్యూస్‌టుడే : గేదె గడ్డి తినేసిందన్న కారణంతో ఓ తండ్రి అతని ఇద్దరు కుమారులు తనతోపాటు కుటుంబసభ్యులపై దాడి చేశారని నెల్లివారిపేటకు చెందిన నెల్లి వెంకటేశ్వరరావు గత నెల 28న కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై అదే గ్రామానికి చెందిన గొలకోటి నాగేశ్వరరావు, ఇద్దరు కుమారులు మణికంఠ, రాజుపై ఆదివారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ సోమవారం పెనుమల్లలో విచారణ చేపట్టారు. ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్, స్థానిక ఎస్సై అవినాష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఐ.పోలవరంలో ఓ యువకుడు విద్యుతాఘాతానికి గురై మృతి చెందాడు. ఐ.పోలవరానికి చెందిన కోడూరి వెంకటేష్(33) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం విద్యుత్తు పనులు చేస్తుండగా షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరడంతో స్థానికులు టి.కొత్తపల్లిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సమస్య వినాలి... పరిష్కరించాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమస్యలను ఓపికతో విని సాంత్వన కలిగించాలని పలువురు అర్జీదారులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో సామాజిక, వ్యక్తిగత సమస్యలు ఉన్నాయి.

తప్పుడు పత్రాలు సృష్టించారు

మా తల్లిదండ్రులకు అయిదుగురు సంతానం. నలుగురు అక్కచెల్లెళ్లు, ఒక సోదరుడు. మాకు అమలాపురం పట్టణం పరిధిలో ఎర్రవంతెన వద్ద 48 సెంట్లు భూమి ఉంది. మా తండ్రి 2015లో మరణించారు. మా అన్నయ్య తప్పుడు ధ్రువీకరణ పత్రాల ద్వారా ఆస్తి మొత్తం ఆయన పేరిట మార్పు చేయించుకున్నాడు. ఉన్నతాధికారులు పరిశీలించి తప్పుడు ధ్రువ పత్రాలు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. – ఆదిలక్ష్మి, సోదరీమణులు, అనాతవరం

నిధులు విడుదల చేయాలి

స్థానిక సంస్థల పరిధిలో క్రయ విక్రయాలు జరుగుతున్న స్థిరాస్తికి సంబంధించి స్టాంపు డ్యూటీ, సర్ ఛార్జిలను తక్షణం విడుదల చేయాలి. ఈ నిధులు కొన్నాళ్లుగా విడుదల చేయక గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బకాయిలను తక్షణం విడుదల చేయాలి. –సర్పంచులు

మండపేటను విడదీయొద్దు

డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి మండపేట నియోజకవర్గాన్ని వేరు చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. జిల్లాలో ఎంతో కొంత అభివృద్ధి చెందిన ప్రాంతం మండపేట. దీనిని వేరే జిల్లాలో కలపడం వల్ల కోనసీమ పూర్తిగా వెనుకబడిపోతుంది. ధాన్యం మిల్లులు, ఇతర పరిశ్రమలు జిల్లాకు అందుబాటులో లేకుండా పోతాయి. దీంతో రైతులకు ఇక్కట్లు తప్పవు. –ది చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

దాడికి పాల్పడుతున్నారు..

మాకు కొత్తపేట పరిధిలో 710/1లో 1.42 ఎకరాలు, 700/3 లో 50 సెంట్లు భూమి ఉంది. మేం ప్రస్తుతం ఉపాధి నిమిత్తం రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నాం. ప్రతి నెలా నేను, నా కుమార్తె కొబ్బరి దింపు తీయించుకునే వాళ్లం. గత నెల 30న దింపు తీయించేందుకు తోటకు వెళ్లగా వెంకట రమణ, రమేష్, లోకేశ్, బాలకృష్ణ అనే వ్యక్తులు మాపై దాడికి పాల్పడ్డారు. ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేయించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. – పుణ్యవతి సీతా మహాలక్ష్మి

శంకరశాస్త్రిని సత్కరిస్తున్న స్థానికులు

ఘనంగా గీతాపారాయణం

కాట్రేనికోన, న్యూస్‌టుడే: గీతా జయంతిని పురస్కరించుకుని కాట్రేనికోన మావుళ్లమ్మ తల్లి ఆలయ ఆవరణలో సోమవారం ఆకొండి శంకర శాస్త్రి ఆధ్వర్యంలో గీతాపారాయణం ఘనంగా నిర్వహించారు. ఆయనను స్థానికులు సన్మానించారు. సాయిబాబా, నారాయణమూర్తి, రామకృష్ణ పరమహంస, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అమలాపురం పట్టణం: సంస్కార భారతి కోనసీమ శాఖ ఆధ్వర్యంలో అమలాపురం భూపయ్య అగ్రహారం రామాలయంలో సోమవారం గీతా జయంతి కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, యువతులు, బాలికలు గీతా పారాయణం చేశారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

అల్లవరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికి ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యులు తెలిపారు. సోమవారం ఓడలరేవు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ శిక్షకుడు చంటి, ప్రధానోపాధ్యాయుడు మూర్తి, కోనసీమ కేర్ ఆసుపత్రి వైద్యులు కారెం రవితేజ, మధుర్ ప్రదీప్, అర్జున రావు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలతో పత్రాలతో విద్యార్థులు

234 మంది అసిస్టెంట్లకు శాఖల కేటాయింపు

యానాం: పుదుచ్చేరి పాలన సంస్కరణల విభాగం అసిస్టెంట్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసిన 234 మంది అసిస్టెంట్లకు శాఖలు కేటాయిస్తూ అండర్ సెక్రటరీ వి.జైశంకర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యానాం నుంచి ఎంపికైన 26 మంది వివిధ శాఖల్లో నియమితులయ్యారు. యానాంలో పనిచేస్తున్న ఐదుగురు యూడీసీలకు స్థానిక బదిలీలు జరిగాయి.

అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ రాహుల్‌మీనా

ఎస్పీ కార్యాలయానికి 25 అర్జీలు

అమలాపురం పట్టణం: ఎస్పీ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎస్పీ రాహుల్‌మీనా, ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి 25 అర్జీలు అందాయని పోలీసుల అధికారులు తెలిపారు.

'నార్ల' విలువలకు దిక్సూచి

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: విలువలకు దిక్సూచిగా నార్ల వెంకటేశ్వరరావు రచనలు నిలిచాయని పలువురు సాహితీవేత్తలు అన్నారు. ఐ.పోలవరంలో ప్రజ్ఞాసాహితి ఆధ్వర్యంలో డా. పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జీఎస్ఎన్ మూర్తి, విత్తనాల వరప్రసాదరావు, ఎ.ఎస్.ఎన్. మూర్తి, డి.మహేష్, ఎం.పాపారావు, ఎంఎన్ మూర్తి, ఆర్.బాణేశ్వరరావు, వి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మట్టాడిపాలెం నుంచి క్రాప చింతపూడి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. నల్లకంకర రాళ్లు లేచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ముమ్మిడివరం

మూడేళ్లుగా పునాది దశలోనే..

కాట్రేనికోన మండల కేంద్రంలో మూడేళ్ల క్రితం చేపట్టిన కాట్రేనికోన-1 రైతు సేవా కేంద్ర భవనం నిర్మాణం పునాది దశలోనే ఆగిపోయింది. కార్యకలాపాలను సొసైటీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కాట్రేనికోన

మూలకు చేరుతున్న కియోస్క్‌లు

రైతులకు అన్ని రకాల సేవలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే)కు కియోస్క్ యంత్రాలను అందించింది. వీటిని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఉప్పలగుప్తం కేంద్రంలోని కియోస్క్ ఇలా మూలకు చేరింది. ఈ ప్రభుత్వంలోనైనా వీటిని వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

మెప్పించేలా మాట్లాడారు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: ఉపన్యాస పోటీలతో విద్యార్థుల్లోని ప్రతిభ బయట పడుతుందని నాథ్ పాఠశాల ప్రిన్సిపల్ పోడూరి విశ్వనాథ్ పేర్కొన్నారు. అమలాపురం కాలేజీరోడ్డులోని నాథ్ పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉపన్యాస పోటీల్లో పాల్గొన్నారు. కర్రి శ్రీనిధి, అప్పారి జాస్మిని, చిట్టూరి సుహాసిని మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను, ప్రశంసా పత్రాలను స్కూల్ ఇన్‌ఛార్జి పి.రత్నకుమారి, ఉపాధ్యాయులు సీత, సత్య, కిరణ్‌కుమారి అందజేశారు.

విజేతలతో ఉపాధ్యాయులు పి.రత్నకుమారి, సీత, సత్య, కిరణ్‌కుమారి

నాథ్ పాఠశాలలో ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థిని

అమలాపురం గ్రామీణం: కామనగరువులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కన్నిడి సాత్విక, కొంకి రూన్సీ, నాగబత్తుల వర్షిణి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ప్రధానోపాధ్యాయుడు వి.చక్రధరరావు, ఉపాధ్యాయులు అయితాబత్తుల గంగాభవాని, కె.వి.జె.లక్ష్మీనరసమ్మ, జె.వి.ఎస్.ఎస్.ఎల్.రాజు, మాకే బాలార్జున సత్యనారాయణ అందజేశారు.

జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని ఉపన్యాసం

విజేతలతో ప్రధానోపాధ్యాయుడు చక్రధరరావు, ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 , ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

చెత్తను తరలించారు..

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పలిపాలెం సెంటర్‌లో రోడ్డు చెంతన చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. –సీహెచ్.సత్యనారాయణ

సమస్య: నగర పంచాయతీ పరిధిలోని మందబయలు కాలనీలో డ్రెయిన్ పూడిపోవడంతో నీరు ముందుకు సాగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. –ఎం.శ్రీనివాసరావు

పరిష్కారం: నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం, మందబయలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలను కమిషనర్ పి,రవివర్మ దృష్టికి తీసుకెళ్లగా.. సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు. –న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు రామారావు

విద్యుత్తు ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

అమలాపురం పట్టణం: జిల్లా ఎస్సీ, ఎస్టీ విద్యుత్తు ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గాన్ని అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్‌లో సోమవారం ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా సాకా రామారావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు, కార్యదర్శిగా నల్లి ప్రసాద్‌కుమార్, నిర్వాహక కార్యదర్శిగా మదన్మోహన్, కోశాధికారిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడుగా లక్ష్మీనారాయణలను ఎన్నిక చేశారు. అనంతరం వారికి పూలమాలలు వేసి అభినందించారు.

యథావిధిగా కొనసాగిన పాఠశాలలు

యానాం: తుపాను ప్రభావంతో పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాలు అతలాకుతలం అవుతుండగా హోంమంత్రి నమశ్శివాయం వాటితో పాటు యానాం, మాహేల పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. యానాంలో తుపాను ప్రభావం పెద్దగా లేకపోవడంతో స్థానిక విద్యాశాఖ అధికారులు సోమవారం పాఠశాలల్ని యథావిధిగా నిర్వహించారు.

'రెవెన్యూ అధికారుల పెత్తనం సరికాదు'

పి.గన్నవరం: రైతులకు సేవ చేసేందుకు వచ్చిన తమపై ఇతరుల పెత్తనం ఏమిటని గోదావరి సెంట్రల్‌డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ప్రశ్నించారు. రబీలో సాగునీటి ప్రణాళిక రూపొందించేందుకు జలవనరులశాఖ పి.గన్నవరం సబ్‌డివిజన్ పరిధిలోని నీటిపంపిణీ, సాగునీటి సంఘాల అధ్యక్షులతో పి.గన్నవరంలోని కార్యాలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. మొంథా తుపాను కారణంగా పంటకాలువల్లో కూలిన చెట్లను తొలగించే బాధ్యత రెవెన్యూ అధికారులు తమపై పెట్టడం సరికాదన్నారు. రబీకి పుష్కలంగా సాగునీరు అందిస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ శివారు ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు వెల్లడించారు. చేసిన పనులకు బిల్లులు సకాలంలో చెల్లించడం లేదన్నారు.

కాటన్ బ్యారేజీ గేట్లు మూసివేత

పి.గన్నవరం: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ద్వారా సముద్రంలోకి విడిచిపెట్టే జలాలను నిలిపివేసినట్లు హెడ్‌వర్క్స్ జె.ఇ. డి.రాధాకృష్ణ సోమవారం తెలిపారు. డిసెంబరు 1 నుంచి రబీ సీజన్ మొదలైంది. గోదావరికి ఎగువనుంచి వచ్చే జలాలూ తగ్గిపోవడంతో బ్యారేజీ 175 గేట్లు మూసేశారు. మళ్లీ జూన్ నుంచి సర్‌ప్లస్ మొదలవుతుంది. సోమవారం తూర్పుడెల్టాకు సాగునీరు నిలిపివేయగా మధ్యడెల్టాకు 150, పశ్చిమ డెల్టాకు 2 వేల క్యూసెక్కులు పంపిణీ చేస్తున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు కృషి

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. అమలాపురం బాలయోగి స్టేడియంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రమత్తంగా ఉండటం ద్వారా ఎయిడ్స్‌కు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా గుర్తించిన వారు తప్పనిసరిగా చికిత్స తీసుకోవాలన్నారు. అనంతరం బాలయోగి స్టేడియం నుంచి గడియారస్తంభం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో దుర్గారావుదొర, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.ఎస్.శర్మ, డీసీహెచ్ఎస్ కార్తీక్, అదనపు డీఎంహెచ్‌వో భరతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఎయిడ్స్ నేటికీ ప్రపంచాన్ని భయపెడుతుందని ఆ వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా స్థానిక కోర్టు ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వడ్డి నాగేశ్వరరావు, ప్యానల్ అడ్వకేట్ కేఆర్‌కే రాజు, టి.శాంతిసుధ, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచించారు. సోమవారం బోడసకుర్రులో సచివాలయ, వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సర్పంచి రొక్కాల విజయలక్ష్మి, ముత్యాల బాబి, సిబ్బంది సౌమ్య, సత్యనారాయణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

వర్షంతో అన్నదాతల అష్టకష్టాలు

ఉప్పలగుప్తం: దిత్వా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. భీమనపల్లి, కిత్తనచెరువు, కూనవరం, సరిపల్లి తదితర గ్రామాల్లో రైతులు సోమవారం హడావుడిగా ధాన్యం రాశులు, వరి పనలపై బరకాలు కప్పి రక్షించే ప్రయత్నం చేశారు.

కాట్రేనికోన: మండల వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచి చిరుజల్లుల వర్షం కురవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వరి కోతలు పూర్తయినవారు తేమ శాతం ఎక్కువగా ఉండటంతో ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. చెయ్యేరు, ఉప్పూడి, గెద్దనపల్లి సహ పలుచోట్ల చేలల్లో వరిపనలు వర్షానికి తడిచిపోయాయి.

కిత్తనచెరువులో వరి కుప్పవేస్తున్న రైతు

మండపేట

•మండపేట •రామచంద్రపురం

జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ

క్రీడాకారులతో కోచ్ రమేష్

మండపేట, న్యూస్‌టుడే: జమ్మూకశ్మీర్‌లో నవంబర్ 26 నుంచి 30 వరకు నిర్వహించిన 42వ జాతీయస్థాయి టెన్నికాయిట్ క్రీడా పోటీల్లో మండపేట క్రీడాకారులు ప్రతిభ చూపారు. రాష్ట్ర జట్టు తరఫున పోటీలో పాల్గొని బాలుర డబుల్స్ పోటీలో కొల్లి శివశంకర్‌ప్రసాద్, బళ్ల సత్యనారాయణ తృతీయస్థానంలో నిలిచారని కోచ్ మంచె రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని పట్టణానికి చెందిన ప్రముఖులు, క్రీడాభిమానులు అభినందించారు.

ధాన్యం రంగు మారకుండా సూచనలు

కాజులూరు: దిత్వా తుపాను వర్షాలతో తడిసిన ధాన్యం రంగుమారకుండా రైతులు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి వి.అశోక్ సూచించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ధాన్యం రంగు మారకుండా ఉండటానికి ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని చెప్పారు. వ్యవసాయ విస్తరణాధికారులు ప్రశాంత్, శ్రీనివాస్ వర్మ, వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న మతపెద్దలు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు ఉ॥ 10 - మ॥ 1
మండపేట: 80085 74183
రామచంద్రపురం: 80085 74191

మురుగు తొలగించారు..

సమస్య: మండపేట మండలం మెర్నిపాడు గ్రామం ఎస్సీకాలనీ డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడంలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. - కె.సత్యసాయి, మెర్నిపాడు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి కొట్ల హరేరామరెడ్డికి తెలియజేయగా సిబ్బందిని పంపించి మురుగు పారడంతో చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ

ప్రత్యేక అలంకరణలో మాచర జనార్దనస్వామి

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం మాచరలోని నవజనార్దన క్షేత్రాల్లో సప్తమ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీజనార్దనస్వామికి దాతలు నూతన ఉత్సవవిగ్రహాలు చేయించారు. ఆలయ అర్చకులు పెదపూడి లక్ష్మీజనార్దనమూర్తి, సీతారామాచార్యులు ఆధ్వర్యంలో మహా సంప్రోక్షణ పూజలు, విశేష హోమాలు, ప్రత్యేకపూజలు అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రహదారి అధ్వానం.. అవస్థల ప్రయాణం

న్యూస్‌టుడే, ద్వారపూడి

గ్రామీణ ప్రాంతాల మార్గాలపై నిర్లక్ష్యం

మండపేట మండలంలోని గ్రామీణ రహదారులపై నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. సిమెంట్, బీటీతో పాటు కల్వర్టుల వద్ద రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. జలవనరుల శాఖ పరిధిలోని ఆరు కిలోమీటర్ల మండపేట-ద్వారపూడి మార్గాన్ని మూడేళ్ల క్రితం నిర్మించారు. ఈ రహదారి మధ్యలో ఏడిద్వారపూడి కూడలిలో రెండు, ఇప్పనపాడులో రెండు, తాపేశ్వరంలో రెండు కల్వర్టులు ఉన్నాయి. ఆయా చోట్ల రోడ్డు అధ్వానంగా తయారయ్యాయని, ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆరు నెలల క్రితం కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. వాటిపై బీటీ వేయక పోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోజూ వాహనాలు అదుపు తప్పి పడిపోవడం, గాయాలపాలవడం, వాహనాలు మరమ్మతులకు గురవడంతో రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానికులు వినూత్నరీతిలో నిరసన తెలుపుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

తాపేశ్వరం వద్ద అధ్వానంగా ఉన్న కల్వర్టుపై రహదారి

ఇవీ సమస్యలు..

● చినద్వారపూడి సత్తెమ్మతల్లి గుడి వద్ద పంటకాలువపై నిర్మించిన కల్వర్టు రహదారి అధ్వానంగా మారడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడంలేదు. నిత్యం వందల మంది అటు రాజమహేంద్రవరం, ఇటు మండపేటకు రాకపోకలు సాగిస్తున్నారు.

● ఇప్పనపాడు వద్ద జూన్‌లో కల్వర్టు నిర్మించిన దానిపై రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారిపై రాత్రి వేళ లైటింగ్ లేని దృష్ట్యా వాహనాలు జారి పడిపోతున్నాయి.

● తాపేశ్వరం నుంచి అర్తమూరు వెళ్లే మార్గంలో కల్వర్టు గుంతలమయంగా మారడంతో చోదకులకు అవస్థలు తప్పడం లేదు. రోజూ వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఇతరత్రా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దాదాపు పదేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టుపై రహదారి ఇలానే ఉంది. నాలుగు చక్రాల వాహనాల కింది భాగాన్ని రోడ్డు తగిలి ఇంధనం లీకవుతోందని, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని చోదకులు వాపోతున్నారు.

తాత్కాలికంగా పనులు..

మండపేటలో మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహావిష్కరణకు కేంద్ర మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఆదివారం వస్తున్నారనే సమాచారంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ఆయా కల్వర్టులపై తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు శాశ్వత ప్రాతిపదికన పూర్తిచేస్తే కల్వర్టుల వద్ద ప్రమాదాలు తగ్గుతాయని స్థానికులు చెబుతున్నారు.

కల్వర్టులు నిర్మించిన తరవాతే రహదారి పనులు..

మండపేట-ద్వారపూడి రహదారిలో ఏప్రిల్‌లో కాలువలు మూసివేసిన తరవాత పూర్తిస్థాయిలో కల్వర్టులు నిర్మించి ఆ తరవాత రహదారి నిర్మాణం చేపడతాం. ప్రస్తుతం కల్వర్టులపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిలేకుండా తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాం.
- టి.వి.ఎస్.సూర్యనారాయణ, డీఈ, ఆర్‌అండ్‌బీ శాఖ

అర్తమూరులో చర్చి నిర్మాణానికి భూమిపూజ

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం అర్తమూరులో పునఃనిర్మాణం చేపట్టిన సెయింట్ జాన్స్ చర్చికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం భూమిపూజ చేశారు. మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పడాల సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, కర్రి సత్యనారాయణరెడ్డి, సంఘకాపరి శామ్యూల్, బిషప్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ ఆరాధన

అంగర: కపిలేశ్వరపురం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ ఆరాధన సోమవారం నిర్వహించారు. కపిలేశ్వరపురం క్రిస్టియన్ కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డా.జె. డేనియల్ పాల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల స్పిరిచ్యువల్ ఫెలోషిప్ కార్యదర్శి ప్రేమ్‌సుధీర్, వి.జార్జిబాబు, ఇమ్మానుయేల్, విజయ్ బాబు, ఎలీషా, సత్యారాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండ ఎన్టీఆర్ భరోసా: సుభాష్

రామచంద్రపురంలో పింఛన్ అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా నిరుపేదల బతుకుల్లో అండగా నిలుస్తోందని, సంక్షేమ పథకాల్లో కూటమి ప్రభుత్వం రాజీలేకుండా పనిచేస్తోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. పట్టణంలోని 5, 6 వార్డుల్లో సోమవారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక 17 నెలల కాలంలోనే రూ. 50,763 కోట్లతో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, డీఈ శ్రీకాంత్, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఉండవిల్లి శివ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, కూటమి నాయకులు కంచుమర్తి బాబూరావు, పడాల బాబి, చప్పిడి సతీష్, పంపన శ్రీను, ఏసుదాసు, వాసంశెట్టి చంద్రశేఖర్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

● ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రామచంద్రపురం నియోజకవర్గంలో 95 శాతం పంపిణీ చేశామని అధికారులు పేర్కొన్నారు.

91.41 శాతం పంపిణీ..

మండపేట: మండపేట పట్టణంలో సామాజిక పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. పలు వార్డుల్లో ఇంటింటా వెళ్లి లబ్ధిదారులకు నగదు అందించారు. పట్టణంలో మొత్తం మొత్తం 91.41 శాతం పింఛన్లు అందించినట్లు మున్సిపల్ కమిషనర్ టి.వి. రంగారావు తెలిపారు.

మండపేట గ్రామీణం: మండపేట మండలంలోని 12 పంచాయతీ గ్రామాల్లో 11,669 మంది పింఛన్‌దారులు ఉండగా 10,505 మందికి పింఛన్లు అందించారు. ఇది 90.02 శాతమని ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. ద్వారపూడి, కేశవరం, తాపేశ్వరం, ఏడిద గ్రామాల్లో కూటమి నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేశారు.

ఉపన్యాసంతో మెప్పించారు.. బహుమతులు పొందారు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

ఉపన్యాస పోటీల్లో భాష్యం పాఠశాల విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందించిన భాష్యం ప్రిన్సిపల్ పెరుమాళ్లు

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని భాష్యం ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలో మాట్లాడారు. వీరిలో 9వ తరగతి విద్యార్థిని కొనగళ్ల సాధిక ప్రథమ, 8వ తరగతి విద్యార్థిని ఆర్. తరణి తేజస్విని ద్వితీయ, అదే తరగతికి చెందిన జి.భవ్యలక్ష్మి తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ప్రిన్సిపల్ ఎం. పెరుమాళ్లు అందించారు. పోటీలకు డి. రాజబాబు, ఎం. భాగ్యవతి, జి. నీరజ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

పోటీలో పాల్గొన్న అక్షర పాఠశాల విద్యార్థులు

బహుమతులు అందించిన ఉపాధ్యాయులు

అక్షర ఆంగ్లమాధ్యమం పాఠశాలలో..

స్థానిక అక్షర ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోను ప్రభావం' అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ప్రతిభను చాటారు. వీరిలో 9వ తరగతి విద్యార్థిని ఎ. వైష్ణవి ప్రథమ, అదే తరగతికి చెందిన డి. లావణ్య ద్వితీయ, 8వ తరగతి విద్యార్థిని పి. శ్రావణి తృతీయ బహుమతి అందుకున్నారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.కిరణ్‌జ్యోతి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి.స్పందన, వి.వి.ప్రసన్న, టి.రాజేశ్ కుమార్ వ్యవహరించారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ప్రస్తుత డిప్యూటీ ఎంపీడీవో ఎం.శివప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా ఉన్న కె.పద్మజ్యోతి మూడు నెలలు సెలవులో వెళ్లడంతో ఆయన పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

రాజోలు, మలికిపురం: రాజోలు మండలం కాత్రేనిపాడులో భాష్విక వైద్యం నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 92,510 చెక్కును, మలికిపురం: తూర్పుపాలెంలో లబ్ధిదారునికి మంజూరైన రూ. 40,127 చెక్కును నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య సోమవారం అందజేశారు.

శివాలయంలో మంత్రి పూజలు

రాయవరం: పసలపూడిలోని మాణిక్యాంబ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. మార్గశిర శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి మంత్రి ఏకవార రుద్రాభిషేకం జరిపించారు. మంత్రి వెంట కూటమి నేతలు కర్రి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆత్మరక్షణ శిక్షణ

ఈనాడు కథనానికి స్పందన

బాలికల ఆత్మరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రాణీలక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్' తరగతులు మళ్లీ ప్రారంభమయ్యాయి. జిల్లాలోని పలు పాఠశాలల్లో కొంతకాలంగా శిక్షణ నిలిచిపోయిందని గత నెల 21న 'ఆత్మరక్షణ.. బాలికలకేదీ శిక్షణ' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం కపిలేశ్వరపురం మండలంలోని కాలేరు, అంగర, మాచర, వాకతిప్ప, వల్లూరు, కపిలేశ్వరపురం, టేకి, వెదురుమూడి ఉన్నత పాఠశాలల్లో యుద్ధ విద్య ప్రత్యేక శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. శిక్షకులు పలు అంశాల్లో బాలికలకు తర్ఫీదునిచ్చారు. ఏడాదిలో 20 రోజుల పాటు తరగతులు నిర్వహించనున్నట్లు శిక్షకులు తెలిపారు. - న్యూస్‌టుడే, అంగర

తోటకు కౌన్సిల్‌కు వచ్చే అర్హత లేదు..

మండపేట, న్యూస్‌టుడే: ఎక్స్ అఫీషియో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కౌన్సిల్‌కు వచ్చే అర్హత లేదని రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌కు ఇక్కడ పని చేయడం ఇష్టం లేకపోతే సెలవులో వెళ్లిపోవాలని సూచించారు. నిబంధనలు పాటించని ఆయనను సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీగా త్రిమూర్తులు మండల, కౌన్సిల్ సమావేశాలకు హాజరవడం సరికాదన్నారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పులో విలీనం చేయడంపై తొలి నుంచి ఆయన వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ప్రజల్ని తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు.

ప్రజలకు అవగాహన కల్పించేందుకే..: ఎమ్మెల్సీ

మండపేట: మండపేట నియోజకవర్గం అమలాపురం పార్లమెంట్ నియోజకవరం పరిధిలో ఉంటుందనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించేందుకే చెప్పానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఎమ్మెల్యే జోగేశ్వరరావు, లీలాకృష్ణ తదితరులు తనపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు.

ఆకట్టుకున్న విద్యార్థుల రెడ్‌రిబ్బన్ ప్రదర్శన

రామచంద్రపురం: రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రెడ్ రిబ్బన్ ఆకారంలో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్.రామకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆకట్టుకునే రంగుల దుస్తులు ధరించి ప్రత్యేక ఆకారంలో నిల్చున్నారు. కన్వీనర్ డాక్టర్ ఎన్.సుజాత, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వై.పద్మజ, డాక్టర్ ఎన్.వి.రమణ, డాక్టర్ పి.సారా పాల్గొన్నారు.

రెడ్‌రిబ్బన్ ఆకారంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

రోగులకు పండ్ల పంపిణీ

ద్రాక్షారామ: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ద్రాక్షారామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోగులకు భాజపా నాయకులు పండ్లు పంపిణీచేశారు. అంతకు ముందు పీహెచ్‌సీ నుంచి ప్రారంభమైన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, జిల్లా కార్యవర్గసభ్యుడు వాడ్రేవు వెంకట్రావు, నేతలు పుల్లెల రామ్మూర్తి, బీవీబీఎల్ నారాయణ పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకానికి రాట ముహూర్తం

ద్రాక్షారామ: భీమేశ్వరుని జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో మహా కుంభాభిషేకం, శివదీక్ష విరమణ కార్యక్రమాలు నిర్వహిస్తామని మాస శివరాత్రి కమిటీ సభ్యులు తాళ్ల సాంబశివరావు చెప్పారు. దీనికి సంబంధించి సోమవారం రాట ముహూర్తం నిర్వహించారు. 41 రోజుల పాటు మండల దీక్ష ఆచరించిన శివస్వాములు దీక్షలు విరమిస్తారని, ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో 1001 శివలింగాలకు ఏకకాలంలో అభిషేకాలు, శివస్వాములతో రుద్రహోమాలు జరిపిస్తామని పేర్కొన్నారు. మహిళలు సప్తగోదావరి జలాలతో స్వయంగా అభిషేకాలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు.

రాట ముహూర్తంలో శివస్వాములు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు..

మండపేట గ్రామీణం: మండపేట మండలం జడ్.మేడపాడు మూడురోడ్ల కూడలిలో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభిస్తోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ద్వారపూడి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులతో కూడలి నిత్యం రద్దీగా ఉంటూ వంతెనపై గంటల తరబడి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని 'జడ్.మేడపాడులో స్తంభించిన ట్రాఫిక్' శీర్షికన నవంబర్ 30న 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి మండపేట రూరల్ సీఐ పీతల దొరరాజు స్పందించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు విడతల వారీగా సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సులు వంతెన దగ్గర కాకుండా దిగువన నిలిపేలా సూచించామని చెప్పారు.

సూచనలు చేస్తున్న రూరల్ సీఐ దొరరాజు

హనుమత్ వ్రతానికి కోటిపల్లి ఆలయం ముస్తాబు

పామర్రు, న్యూస్‌టుడే: గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రం కోటిపల్లిలోని సువర్చలా సమేత ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల మూడో తేదీన హనుమత్ వ్రతం నిర్వహించడానికి భారీ ఏర్పాట్లుచేశారు. ఆంజనేయ స్వామి అర్ధాంగి సువర్చలా సమేతుడై ఉన్న ఆలయాలు రాష్ట్రంలో అరుదుగానే ఉన్నాయి. అలాంటి వాటిలో కోటిపల్లి ఒకటి. వ్రతంలో భాగంగా ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణలు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు, కమిటీ సభ్యులు తెలిపారు.

సువర్చలాసమేత ఆంజనేయస్వామి

గీతాసారం.. జీవితపారం

ప్రత్యేక పుష్పాలంకరణలో శ్రీకృష్ణుడు

ద్రాక్షారామ గీతామందిరంలో విశేష అలంకరణలో కృష్ణుడు

సత్యవాడలో హోమ సహితంగా భగవద్గీత 18 అధ్యాయాలు పారాయణ చేస్తున్న స్వామీజీలు, భక్తులు

మండపేట: గీతా జయంతి సందర్భంగా సోమవారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మహిళలు సామూహిక భగవద్గీత పారాయణ నిర్వహించారు. అంతకు ముందు భగవద్గీతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సంకా శ్రీనివాసరంగా ఆధ్వర్యంలో సంఘం ప్రముఖులు, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. స్థానిక జనార్దనస్వామి ఆలయంలో గీతా జయంతి సందర్భంగా అర్చకుడు ఖండవిల్లి గోపాలకృష్ణమాచార్యులు విష్ణుమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గీతాపారాయణ చేశారు.

అంగర: అంగర శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం గీతా జయంతి పూజలు నిర్వహించారు. అర్చకులు పెద్దింటి మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో భగవద్గీతకు పూజలు చేశారు. అనంతరం మహిళలు సామూహిక గీతా పారాయణం చేశారు.

రాయవరం: వెదురుపాక గీతాజ్ఞాన మందిరంలో గీతా జయంతి వేడుకలను నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శ్రీమద్భాగవతంలోని 18 అధ్యాయాల సామూహిక పారాయణం, శ్రీకృష్ణ అష్టోత్తర శతనామ పూజలు వైభవంగా జరిపించారు. భగవద్గీత పద్యపఠన పోటీల్లో విజేతలకు మాజీ సర్పంచి గొలుగూరి వరలక్ష్మి బహుమతులు అందించారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామలోని గీతా మందిరంలో ప్రముఖ పురాణ ప్రవచకులు కొంపెల్ల భరణీరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గీతా పారాయణం, పురాణ పఠనం కొనసాగాయి. మధ్యాహ్నం ఆళ్ల లక్ష్మీనారాయణ వంశీకుల సౌజన్యంతో అన్న సమారాధన ఏర్పాటుచేశారు. జగన్నాయకులపాలెంలో నందికోళ్ల బాబులు ఇంటి వద్ద గీతా జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణునికి పూజలు, గోపూజ మధ్యాహ్నం అన్నసమారాధన జరిగాయి.

పామర్రు: నిత్య సంఘర్షణతో సతమతమయ్యే మానవుని మనస్సే కురుక్షేత్రం.. పరిష్కారం చూపే బుద్ధి వివేకమే కృష్ణుడు. . ఇలా అన్ని సమస్యలకూ పరిష్కార మార్గం చూపేదే భగవద్గీత అని స్వామీజీలు హితబోధ చేశారు. సత్యవాడ శివానంద ధ్యాన ఆశ్రమంలో సోమవారం గీతాజయంతిని పురస్కరించుకుని ఆధ్యాత్మికవేత్త వెంకట్రావు ఆధ్వర్యంలో భగవద్గీత 18 అధ్యాయాలు సంపూర్ణ పారాయణ హోమ సహితంగా నిర్వహించారు. కాకినాడకు చెందిన గీతాశ్రమం అధిపతి దివ్యానంద స్వామీజీ, శ్రీశైలం పీఠాధిపతి మహేష్ స్వామీజీ, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దేవరపల్లి సత్యనారాయణ, ఆర్ఎస్ఎస్ ఖండ్‌ప్రముఖ్ బీవీబీఎల్ నారాయణ, భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు.

ధరల నియంత్రణపై సమీక్ష చేపట్టాలి

అమలాపురం కలెక్టరేట్: ధరల నియంత్రణకు పౌర సరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలని జేసీ నిశాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. నిత్యవసరాలు, కూరగాయలను వినియోగం, సరఫరా ఆధారంగా ధరలను నియంత్రించాలని తెలిపారు. నిత్యావసరాల ధరలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారి ఉదయ్‌భాస్కర్ అధికారులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత

మామిడికుదురు: మగటపల్లికి చెందిన జనసైనికుడు దొడ్డా సాయినవీన్ గత జనవరిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో తండ్రి శ్రీనివాసరావుకు రూ.5 లక్షల ప్రమాద బీమా పరిహారం చెక్కును సోమవారం మంగళగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ పార్టీ తరపున అందజేశారు.

'రెవెన్యూ అధికారుల పెత్తనం సరికాదు'

పి.గన్నవరం: రైతులకు సేవ చేసేందుకు వచ్చిన తమపై ఇతరుల పెత్తనం ఏమిటని గోదావరి సెంట్రల్‌డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ప్రశ్నించారు. రబీలో సాగునీటి ప్రణాళిక రూపొందించేందుకు జలవనరులశాఖ పి.గన్నవరం సబ్‌డివిజన్ పరిధిలోని నీటిపంపిణీ, సాగునీటి సంఘాల అధ్యక్షులతో పి.గన్నవరంలోని కార్యాలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. మొంథా తుపాను కారణంగా పంటకాలువల్లో కూలిన చెట్లను తొలగించే బాధ్యత రెవెన్యూ అధికారులు తమపై పెట్టడం సరికాదన్నారు. రబీకి పుష్కలంగా సాగునీరు అందిస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ శివారు ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు వెల్లడించారు. చేసిన పనులకు బిల్లులు సకాలంలో చెల్లించడం లేదన్నారు. ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, డీఈఈ భూపతిరాజు రవిప్రసాద్‌రాజు, ఇరిగేషన్, డ్రెయిన్ ఏఈఈలు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో యువత జాగ్రత్త

కొత్తపేట, న్యూస్‌టుడే: మత్తుపదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్.విద్యాసాగర్ అన్నారు. సోమవారం కొత్తపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లల నడవడికను తల్లితండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్, ఓటీపీ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కొత్తపేట ఎస్సై సురేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవస్థానం పాలకమండళ్ల ప్రమాణ స్వీకారం


పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన నేతలు

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండలం వెంటూరు పార్వతీ సమేత సోమేశ్వరస్వామి, శ్రీకేశవ పట్టాభిరామస్వామి దేవస్థానాల పాలకమండళ్ల సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. మండపేట దేవస్థానాల అధికారి శోభారాణి ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా గుత్తుల శ్రీనివాస్, పట్టాభిరామస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా వల్లూరి వెంకటరావు (శ్రీను) ప్రమాణం చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాలదొర, తెదేపా మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి మాధవరావు, చెల్లూరు సహకార సంఘం అధ్యక్షుడు దేవళ్ల వెంకటరావు, జనసేన అధ్యక్షుడు గొడితి సత్యం, ఉపసర్పంచి నున్న ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రామచంద్రపురం అడిషనల్ జూ॥ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No.200/25 O.S.No.379/25

Between:

మల్లిడి చెల్లారెడ్డి, S/o సర్రెడ్డి, వ్యవసాయం, 44 సం॥లు, కొమరిపాలెం(గ్రా), బిక్కవోలు (మం) ...పిటిషనర్/వాది

మరియు

1. కాకి గోవిందరాజు, S/o అప్పారావు, వ్యాపారం, 41 సం॥లు, డో.నెం.2-36, శివల (గ్రా), పామర్రు (మం), కోనసీమ జిల్లా 1వ రెస్పాండెంట్/1వ ప్రతివాది
2. కాకి శ్రీనివాసు, S/o అప్పారావు, వ్యాపారం, 43 సం॥లు, డో.నెం.2-36, శివల (గ్రా), పామర్రు (మం), కోనసీమ జిల్లా. 2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది

పబ్లిక్ నోటీసు

పై నెంబరు దావా సెటిల్‌మెంట్ దస్తావేజు Dated: 22-04-2025 దస్తావేజు నెం.1805/25, SRO, ద్రాక్షారామ. రద్దు నిమిత్తం వాది మరియు వాది ఇతర బాకీదార్ల తరఫున పై కోర్టులో దావా దాఖల చేసినారు. అనగా దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తికి సంబంధించినది గాన, కాకి గోవిందరాజు బాకీదార్లు ఎవరైనా ది. 24-12-2025న బుధవారం ఉదయం గం.10.30 ని॥లకు స్వయముగా గాని, లాయర్ గారి ద్వారా గాని పైకోర్టు నందు హాజరుకావచ్చు.

షెడ్యూల్ ఆస్తి

సర్వే నెంబర్ 89లో డో.నెం.2-129 తీసివేయగా ఏర్పడ్డ ఖాళీ స్థలం 142.63 చ॥గ॥ 2వ బ్లాకులో ఉన్న ఖాళీ స్థలానికి సరిహద్దులు.
తూ: అ.32 సూరంపూడి వెంకట్రావు గారి గోడ మరియు రోడ్; ప: అ.33 సిమెంట్ రోడ్;
ఉ: అ.39'.6" యిళ్ళ దుర్గమ్మ గారిల్లు; ద: అ.39'.6" బొక్కా పాపారావు గారి గోడ.
సమస్త ఈజిమెంట్ హక్కులు, నీటి వసరులు, దారి మార్గములతో సహా.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కె.వి.సుబ్బారెడ్డి, కె.భానుశిరీష
రామచంద్రపురం, ది.01-12-2025. వాది తరపు అడ్వకేట్స్, 99490 35905

ఈనాడు
తూర్పుగోదావరి
మంగళవారం డిసెంబరు 2, 2025

విజ్ఞాన.. యంత్రం

ఆకట్టుకొంటున్న హారిజాంటల్ వాటర్ ట్యూబ్ బాయిలర్, ఇతర యంత్రాలు..

కాకినాడ జేఎన్‌టీయూ ఆవరణలో పరిపాలన కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఓపెన్ మ్యూజియంలో వివిధ యంత్రాలు ఇవి.. వీటిలో 1946 నాటి ఇంగ్లాండ్‌కు చెందిన హారిజంటల్ వాటర్ ట్యూబ్ బాయిలర్, వర్టికల్ కోల్ అండ్ కోక్ బాయిలర్ లాంటి ఎన్నో యంత్ర పరికరాలు అబ్బురపరుస్తున్నాయి. - ఈనాడు, కాకినాడ

సేవా చిహ్నం

స్వామి దయానంద సరస్వతి, ఆర్యసమాజ్‌పై నాణేలు

స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి, ఆర్య సమాజ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఇటీవల రూ.200, రూ.150 నాణేలను విడుదల చేసింది. అమలాపురానికి చెందిన పుత్సా కామేశ్వరరావు వీటిని సేకరించారు. నికెల్, సిల్వర్‌తో తయారు చేసిన ఈ నాణేలను ఒక్కొక్కటి రూ.1232కు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ముంబయి, కలకత్తా, హైదరాబాద్ టంకశాలలు ఈ నాణేలను విడుదల చేశాయన్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఉమ్మడి భూ హక్కులు.. తప్పని పాట్లు..

పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు

న్యూస్‌టుడే, ధవళేశ్వరం, కడియం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వే రైతులకు సాంకేతిక చిక్కులు తెచ్చిపెట్టింది. ఉండాల్సిన విస్తీర్ణం కంటే తగ్గిందని, తమ భూమి జాయింట్ ఎల్‌పీఎంలో నమోదైందని రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

వివరాల సేకరణ

సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్న వారు ఎంతమంది, రాని వారు ఎంతమంది.. తదితర వివరాలు సేకరిస్తున్నారు. అన్ని అంశాలతో ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు. 'ఒక సర్వే నంబరులో ఉన్న రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దరఖాస్తు చేసుకుంటే ప్రయోజనం ఉంటుంది. ఇప్పటికే దరఖాస్తు చేసిన భూ యజమానుల సమస్యలు పరిష్కరిస్తున్నాం.' అని రాజమహేంద్రవరం గ్రామీణం తహసీల్దారు శ్రీనివాసరావు అన్నారు.

జాయింట్ ఎల్‌పీఎం అంటే..

గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన రీసర్వే గ్రామాల్లో అయిదారుగురు రైతులకు కలిపి ఒకే సంయుక్త ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సంఖ్య కేటాయించి భూహక్కు పత్రాలు అందజేసింది. అదే సంఖ్యలోని రైతులకు పదెకరాలకు మించి పొలం ఉన్నట్లు చూపుతోంది. దీంతో బియ్యం కార్డు మంజూరు కావాలన్నా, పంట రుణాలు, సంక్షేమ పథకాల మంజూరుకు జాయింట్ ఎల్‌పీఎం సమస్య వెంటాడుతుంది.

రీసర్వే చేస్తున్న అధికారులు

రీసర్వే జరిగిన రెవెన్యూ గ్రామాలు:	190
జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు:	9,834
పరిష్కరించినవి :	2,076
వెబ్‌ల్యాండులో మార్పులు చేయాల్సినవి:	2,318
చలానా కట్టినవి:	3,500

ఉత్తిపోతలు..!

నిధులు లేక పడకేసిన పథకాలు

ఈనాడు, రాజమహేంద్రవరం

నీటి వనరులు అందుబాటులో లేక.. ఎడ్డడి ఎదుర్కొంటున్న పంట పొలాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. గత వైకాపా పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో అవి మూలకు చేరే పరిస్థితికొచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 29 పథకాలుంటే, అయిదు మాత్రమే పూర్తిస్థాయిలో సేవలందిస్తుండగా, రెండు శిథిలావస్థకు ఉన్నాయి. కొన్ని అంతమాత్రంగానే పని చేస్తున్నాయి. వీటి మరమ్మతులు, నిర్వహణకు నిధులు మంజూరుచేస్తే వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి ఆయకట్టుకు సాగు నీరందే అవకాశం ఉంది.

పరిశీలన

కొవ్వూరులోని కుమారదేవం ఎత్తిపోతల పథకం దుస్థితి ఇది. నాలుగు మోటార్లలో రెండే పని చేస్తున్నాయి. 4600 ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో నిర్మించారు. ప్రస్తుతం 1900 ఎకరాలకే నీటిని అందిస్తోంది.

ఇది తాళ్లపూడి మండలంలోని తాడిపూడి ఎత్తిపోతల పథకం. 4 మోటార్లలో రెండు పని చేయడం లేదు. దీంతో 4000 ఎకరాలకు సాగు నీరందించాల్సిన పథకం 2000 ఎకరాలకే పరిమితమైంది.

నిర్వహణకు నోచుకోక..

- మోటార్ల పంపులు మరమ్మతుకు గురైతే సరి చేసే పరిస్థితి లేదు. అనేక చోట్ల పైపులైన్‌లకు లీకులున్నా కట్టడిలేదు. దీంతో శివారు ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం వీటిపై ఆధారపడి సుమారు 47 వేల ఎకరాలుంటే 30 నుంచి 50 శాతం ఆయకట్టుకే నీరందుతోందని ప్రాథమిక అంచనా.
- అనపర్తిలో కాపవరం పథకం ఆధారంగా 690 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ పథకానికి ఉన్న రెండు మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. పైపులైన్ల లీకుల సమస్య వెంటాడుతోంది.
- ఆత్రేయపురం మండలంలోని వసంతవాడ పథకానికి మూడు మోటార్లు ప్రస్తుతం పని చేస్తున్నా నిర్వహణకు నిధులు అవసరం. పైపులైన్ల లీకేజీలున్నాయి. దీంతో నీరంతా వృథా అవుతోంది.

రూ.91.32 కోట్లతో ప్రతిపాదనలు..

దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఎత్తిపోతల పథకాల మోటార్లు, పంపుల మరమ్మతులు, పైపులైన్ల పనులకు రూ.91.32 కోట్లు అవసరమని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

ఇక్కడంతే.. తీరు మారదంతే..

ఐవీఆర్ఎస్‌లో ఆరో స్థానంలో అన్నవరం

విభాగాల వారీగా అభిప్రాయాలు (శాతాల్లో)		
విభాగం	సంతృప్తి	అసంతృప్తి
దర్శనం	69.7	30.3
మౌలిక వసతులు	61.6	38.4
ప్రసాదం	77.6	22.4
పారిశుద్ధ్యం	64.2	35.8

అన్నవరం, న్యూస్‌టుడే: దేవాలయాల్లో భక్తులకు సంతృప్తిగా సేవలందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ టెలీ కాలింగ్ (ఇంటరాక్ట్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా అభిప్రాయ సేకరణలో అన్నవరం ఆరో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఏడు ప్రధాన దేవాలయాల్లో దర్శనం, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, ప్రసాదం తదితర వాటిపై నవంబరు నెల గణాంకాలు విడుదలయ్యాయి. పలు సేవలపై 67.8 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా 32.2 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి, ద్వారకాతిరుమల, శ్రీశైలం, కాణిపాకం, సింహాచలం ఆలయాలు మొదటి ఐదు స్థానాల్లో ఉండగా ఆరో స్థానంలో అన్నవరం ఉంది. ఆ తర్వాత విజయవాడ నిలిచింది. ప్రతీనెల భక్తుల నుంచి అసంతృప్తి శాతం ఎక్కువగా ఉంటున్నా అధికారులు దృష్టిసారించడంలేదు.

ఆలయంలో భక్తుల రద్దీ

గీతా పఠనం..

గీతా జయంతి సందర్భంగా కోనసీమ తిరుమల వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భగవద్గీత పారాయణం చేశారు. కాకినాడకు చెందిన కృష్ణ పరివార్ సంపుం సభ్యులు, రావులపాలెం మహిళలు గీతా పారాయణం చేశారు. ఆళ్వారుల సన్నిధిలో తిరుమంగై ఆళ్వారుల తిరునక్షత్ర ఉత్సవాలు రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. ద్రవిడ వేదపారాయణం, నీరాజన మంత్ర పుష్పం, పల్లకీ సేవ కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా జరిపించారు.

- న్యూస్‌టుడే, వాడపల్లి (ఆత్రేయపురం)

సేవా గుణం..!

సాయుధ దళాల జెండా దినోత్సవం (ఫ్లాగ్‌డే)ను పురస్కరించుకుని జిల్లా సైనిక్ సంక్షేమ అధికారులు సోమవారం విరాళాలు సేకరించారు. కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్ కీర్తి చేకూరి తన వంతు విరాళం అందజేశారు.

- న్యూస్‌టుడే, వీఎల్‌పురం

యువ ఉల్లాసం

కథానాయికలు ఆషిక రంగనాథ్, డింపుల్ హయాతి నృత్యాలు చేస్తూ, విద్యార్థులతో ముచ్చటిస్తూ సందడి చేశారు. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినీ బృందం సోమవారం జీజీయూలో సందడి చేసింది. బెల్లా.. బెల్లా.. అనే పాటను ఇక్కడ విడుదల చేశారు. దర్శకుడు కిషోర్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకొచ్చే ఈ వినోదాత్మక చిత్రాన్ని ఆదరించాలని కోరారు.

- న్యూస్‌టుడే, రాజానగరం

కార్తికేయ.. మాయాజాలం..!

ఈనాడు, కాకినాడ

కాకినాడ కేంద్రంగా అధిక వడ్డీ ఆశచూపి బోర్డు తిప్పేసిన కార్తికేయ బిల్డింగ్ సొసైటీ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఈ సంస్థ ఆస్తులు సీజ్ చేసి బాధితులకు న్యాయం చేసేందుకు సిద్ధమవుతున్న వేళ అందులో ఓ స్థలం తమదంటూ వేరొకరు తెరపైకి వచ్చారు. అదే సమయంలో కోర్టు కూడా వేలం ప్రక్రియ తాత్కాలికంగా నిలిపి కుంభకోణంపై నాలుగు నెలల్లో మళ్లీ విచారణ (రీ ట్రయల్) జరిపించాలని ఆదేశించడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

రూ.19.40 కోట్లు సేకరించి..

కార్తికేయ బిల్డింగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వీరవెంకట సత్యనారాయణ తన కుటుంబ సభ్యులనే డైరెక్టర్లుగా నియమించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 300 మందికి పైగా డిపాజిటర్ల నుంచి రూ.19.40 కోట్లు సేకరించారు. గడువు మీరినా వాటిని ఇవ్వలేదు. వడ్డీనే సుమారు రూ.2.05 కోట్లు చెల్లించాలి. డిపాజిట్ల మొత్తంలో రూ.10 కోట్లు సొసైటీ ఖాతాలో నమోదు చేయకుండానే నొక్కేశారు. రుణాలు ఇచ్చినట్లు చూపించి రూ.5.36 కోట్లు స్వాహా చేశారు. 2023లో సహకారశాఖ చేపట్టిన విచారణలో ఈ అక్రమాలన్నీ వెలుగుచూశాయి. 14 మందిపై కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేశారు. మోసపోయినవారికి న్యాయం చేయాలని సొసైటీ యజమానికి చెందిన మూడు ఆస్తులను సీజ్ చేశారు.

కొత్త వివాదం..

కార్తికేయ సొసైటీ భవనంతో పాటు యజమాని ఇల్లు, వాకలపూడిలోని 164-3, 173-6 సర్వే నంబర్లలో 1400 చ.గ విస్తీర్ణం ఉన్న స్థలాలను రెండేళ్ల కిందటే సీజ్ చేశారు. భవనానికి నెల కిందట సహకారశాఖ వేలం వేయగా ఒకరు దక్కించుకున్నా చెల్లించాల్సిన కొంత మొత్తం కట్టలేక వైదొలిగారు. వాకలపూడిలో వేలానికి సిద్ధమవగా 164-3 స్థలంపై తమకు హక్కులు ఉన్నాయని ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాకినాడ రూరల్ తహసీల్దారును పరిశీలించాలని ఆదేశించగా ఒకే స్థలంపై రెండు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించారు. క్షేత్రస్థాయిలో ఈ స్థలాలు రెండూ వేర్వేరు చోట్ల ఉన్నాయి.

పీజీఆర్ఎస్‌కు 178 వినతులు

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అందిన అర్జీలు నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జేసీ మేఘాస్వరూప్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు వివిధ సమస్యలపై 178 అర్జీలు వచ్చాయి. భూవివాదాలు, మౌలిక సదుపాయాలు, వ్యక్తిగత సమస్యలతోపాటు ఇళ్లస్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు కోరుతూ వచ్చిన అర్జీలు అధికంగా ఉన్నాయి.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

కల్తీ కనిపెట్టరు.. కాలుష్యం అరికట్టరు

ఆహార కల్తీలపై యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. వీటిని నిర్ధారించే సదుపాయాలు లేకుండా పోయాయి. దీంతో కాలుష్య, కల్తీకారకులపై చర్యలు తీసుకోవడానికి అవకాశం లేని పరిస్థితి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆహార భద్రత ప్రమాణాలశాఖ, కాలుష్య నియంత్రణ మండలి పని తీరు అధ్వానంగా ఉంది. స్థానికంగా ప్రయోగశాలలు లేకపోవడంతో హైదరాబాద్ వంటి నగరాలకు నమూనాలు పంపించి ఫలితాలకు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఈ లోగా కల్తీ, కాలుష్య కేసులు నీరుగారిపోతున్నాయి. - ఈనాడు, కాకినాడ

నిర్ధారణకు కానరాని సదుపాయాలు

కార్యాలయంలో మగ్గుతున్న ఆహార తనిఖీ సంచార వాహనం

కదలని చక్రాల బండి..

కొన్ని రకాల ఆహార కల్తీలను అక్కడికక్కడే గుర్తించేలా 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' పేరిట ఓ వాహనం ఏడాది కిందట ఇచ్చారు. డ్రైవర్‌తో సహా మరో అయిదు పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఏడాదిగా కార్యాలయంలోనే ఉండిపోయింది. ఈ సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ చెబుతున్నారు.

పక్క రాష్ట్రానికి పంపాల్సిందే..

మూడు జిల్లాల్లో ఉన్నంతలో ఆహార తనిఖీలు చేపట్టి నమూనాలు సేకరిస్తున్నా అవి కల్తీయా కాదానని నిర్ధారించేందుకు అవసరమైన ప్రయోగశాలలు ఇక్కడ లేవు. వాటిని హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ఒక్కో జిల్లాలో ఏటా 250 నుంచి 300 నమూనాలు సేకరిస్తున్నా వీటిలో కేసు పెట్టింది 5 నుంచి 10 శాతం మించడం లేదు.

కాలుష్యం కొలిచేది అంతంత మాత్రమే

కాకినాడ నగరాన్ని కాలుష్యం కమ్మేస్తోంది. పోర్టుకు బొగ్గు రైళ్లు నగరం నడిబొడ్డు నుంచే వెళుతుంటాయి. మరోవైపు పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం. ఇక పంట కాలువలు, సాగర జలాల కాలుష్యం కొలవలేనంతగా ఉంటున్నాయి. నీటి నమూనాలను విశాఖపట్నం తీసుకెళ్లి పరీక్షించాల్సి వస్తుంది. దీంతో తూతూ మంత్రంగా చేసి వదిలేస్తున్నారు. వివేకానంద పార్క్ సమీపంలో ఆటోమేటిక్‌గా ప్రతి 15 నిమిషాలకు కాలుష్యాన్ని గుర్తించే పరికరాలు ఏర్పాటు చేసినా అందుబాటులోకి తీసుకురాలేదు. త్వరలోనే ఆటోమేటిక్ వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరావు చెబుతున్నారు.

ముచ్చటగా మూడోసారి..

5న మెగా పేరెంట్స్ టీచర్ సమావేశాలు

రాజానగరం (సీతానగరం), న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు.. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచేలా కూటమి సర్కారు మెగా పేరెంట్స్ టీచర్స్(పేటీఎం) సమావేశాలు నిర్వహిస్తోంది. ఇప్పటివరకు రెండుసార్లు నిర్వహించగా డిసెంబర్ 5న ముచ్చటగా మూడోసారి నిర్వహించనుంది.



సమావేశానికి ఆహ్వాన లేఖ

ఎన్నో ప్రయోజనాలు..

✦ ఇల్లు, పాఠశాల, తరగతి గదిలో పిల్లల నడవడిక ఎలా ఉంది, ఎక్కడ ఎలా ప్రవర్తిస్తున్నారో తెలుసుకోవచ్చు. ✦ వారి చదువు, ఇష్టాలు, నైపుణ్యాలపై చర్చించొచ్చు. ✦ భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కల్పించొచ్చు. ✦ పిల్లలు తప్పుడు మార్గంలో వెళ్లకుండా దిశా నిర్దేశం చేయొచ్చు.

జిల్లాలో	
పాఠశాలలు:	973
విద్యార్థులు:	89,085

ఇలా జరుగుతుంది..

✦ 5న ఉదయం 9 నుంచి 9.30 మధ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, అధికారులను ఆహ్వానిస్తారు.

✦ ఉదయం 9.30 నుంచి 10.50 గంటల మధ్య ప్రతి విద్యార్థితో తల్లిదండ్రుల ఎదురుగానే వారి అభ్యసనా సామర్థ్యాలపై ఉపాధ్యాయులు వివరిస్తారు. బోధనలో అవలంబిస్తున్న నూతన విధానాలను వీడియో రూపంలో ప్రదర్శిస్తారు.

✦ 10.50 నుంచి 11 వరకు తల్లిదండ్రులు వీక్షించేలా టి.ఎల్.ఎం., అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, స్టెమ్ ల్యాబ్‌లు, తదితరాలను పిల్లలతో ప్రదర్శింపజేస్తారు.

✦ 11 నుంచి 12.45 వరకు జరిగే సమావేశంలో పిల్లల ప్రగతి నివేదికలు వారికి అందజేస్తారు.

అధికారులతో మాట్లాడుతున్న కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

నల్లజర్ల, గోపాలపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 3న నల్లజర్లలో జరిగే రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో పాల్గొంటారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. నల్లజర్ల శివారులోని బ్రహ్మరాజు వ్యవసాయ క్షేత్రం వద్ద జరిగే సభలో ఆయన పాల్గొంటారన్నారు. హెలిప్యాడ్, సభాస్థలాన్ని ఎమ్మెల్యే వెంకటరాజుతోపాటు కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ నరసింహకిశోర్, కొవూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్ పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులతో చంద్రబాబు ముఖాముఖికి తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా జరిగేలా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రైతేరాజు

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

రబీ పంటకు గోదావరి జలాల విడుదల

ధవళేశ్వరం, మోరంపూడి: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టా పరిధిలోని రబీ పంటకు సోమవారం నీరు విడుదల చేశారు. మూడు జిల్లాల పరిధిలోని 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు అందనున్నాయి. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బండారు సత్యానందరావు, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ గోదావరి నదికి ప్రత్యేక పూజలు చేసి, చీర, హారతి సమర్పించారు. రైతులు, అధికారుల సమక్షంలో 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాటన్ బ్యారేజీ అంటే కేవలం నీటి విడుదల కాదని, వ్యవసాయాన్ని సుసంపన్నం చేసే ఓ చిహ్నమని పేర్కొన్నారు. నిబద్ధత, బాధ్యతకు తార్కాణమన్నారు. అన్నదాతలకు కూటమి సర్కారుపై ఎంతో విశ్వాసం ఉందన్నారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఎకరాకు నీరు అందిస్తామన్నారు. అధికారులు, సిబ్బందితో బ్యారేజీని సమర్థంగా నిర్వహిస్తామన్నారు. రబీ సీజన్‌లో సమృద్ధిగా పంటలు పండి, స్థిరమైన ఆదాయం లభించి, ఆహార భద్రత, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఇరిగేషన్ సీఈ కె.శేషుబాబు, ఎస్ఈ గోపినాథ్, వైస్ ఛైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజీ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి, బండారు తదితరులు

ఉరుకులు పరుగులు

తేమ పేరుతో ధాన్యంలో కోత

తాళ్లపూడి, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: నిన్న మొంథా తుపాను వరి రైతులను కుంగదీసింది. ఇపుడు దిత్వా తుపాను కలవరపెడుతోంది. వర్షం పడుతుండటంతో అన్నదాతలు ఉరుకులు పరుగులతో ధాన్యం ఒబ్బిడి చేసుకోవడంలో తలమునకలయ్యారు. ఆర్ఎస్‌కేల్లో తేమ శాతం యంత్రాలు ఉన్నా రైసు మిల్లుల ఆధ్వర్యంలోనే తేమ నిర్ధరణ జరుగుతోందని రైతులు అంటున్నారు. శాతం ఒకలా వస్తే.. రైసు మిల్లుల్లో యంత్రాలు మరోలా చూపిస్తున్నాయని అంటున్నారు. కొన్ని రైసుమిల్లుల్లో పాతకాలం నాటి యంత్రాలు ఉండటంతో కచ్చితత్వం నిర్ధరణ కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

తాళ్లపూడి: ధాన్యాన్ని ఆరబెడుతున్న కూలీలు

తప్పని రవాణా భారం

రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) చిరిగిన గోనె సంచులు మాత్రమే ఉండటంతో మిల్లర్ల వద్దకు వెళ్తున్నారు. గోదాము ఒకచోట, మిల్లు మరోచోట ఉండటంతో రవాణా ఖర్చు భారంగా మారింది. ఆర్ఎస్‌కేలో ఉండే యంత్రాల్లో తేమ

బస్తాకు 40 కిలోల లెక్క..

గోనె సంచి 600 గ్రాములు ఉంటే కిలోగా లెక్కిస్తున్నారని, దీనివల్ల ఎకరానికి 25 నుంచి 30 కిలోల ధాన్యం నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేలకొరిగిన వరిచేలను కోసేందుకు యంత్రాల కొరత ఏర్పడింది. కోత ఖర్చులు కూడా తడిసిమోపెడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్ఎస్‌కేల్లో సిబ్బంది నడుచుకోవాలి.' అని ఆర్డీవో **రాణిసుస్మిత** అన్నారు.

మండలాలు:	18
కొనుగోలు కేంద్రాలు:	201
ధాన్యం సేకరణ:	4 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు చేసింది:	21,794 మంది రైతుల నుంచి 1,61,612 మె.టన్నులు
రైసుమిల్లులు:	157
ఇప్పటి వరకు కూపన్ల జారీ:	34,737
సొమ్ము చెల్లించింది:	10,008 మంది రైతులకు రూ.172.85 కోట్లు

MANAGEMENT SEATS AVAILABLE
LLB 3 years | BA . LLB 5 years | LLM 2 years
Cont : 8332041479, 9491606933

DEEPAK NEXGEN FEEDS PRIVATE LIMITED
Bommuluru, Near Hanumanjunction, Krishna District, A.P. 521105
WANTED
Deepak Nexgen is a leading and fast growing fish and shrimp feed manufacturing industry looking for the following positions
Safety Officer: B.Tech / Diploma with industrial safety certificate (mandatory) with 05-10 years relevant experience.
Safety Supervisor: Diploma or any degree with industrial safety certificate (mandatory) with 02-05 years relevant experience.
Interested Candidates may send their C.V to:
ifeedhr@gmail.com

(c) eenadu

గాల్లోకి బెలూన్లు ఎగురవేస్తూ ప్రదర్శన ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి తదితరులు

ముందస్తు జాగ్రత్తలతోనే ఎయిడ్స్ నిర్మూలన

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ముందస్తు జాగ్రత్తలతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా రాజమహేంద్రవరం వై జంక్షన్ వద్ద అవగాహన ప్రదర్శన డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రారంభదశలో దీనిని గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం పాజిటివ్ కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. జిల్లా న్యాయ సేవాధికారిణి సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ పిల్లల్లో నేర ప్రవృత్తిని తల్లిదండ్రులు గుర్తించి వారిని సరైన దారిలో నడిపించాల్సి బాధ్యత ఉందన్నారు. డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు డాక్టర్ ఎన్.వసుంధర, క్లస్టర్ మేనేజర్ ఆదిలింగం, ప్రిన్సిపల్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన వీచిక.. ప్రత్యక్ష పీఠిక

– న్యూస్‌టుడే, మామిడికుదురు

విద్యార్థులు మరిన్ని ప్రతిభా పాటవాలతో పురోగతి సాధించేందుకు సమగ్రశిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజ్ఞాన యాత్రలు వారిలో నైపుణ్యాలను పెంచుతున్నాయి. పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని సైన్స్, ఇతర అంశాలపై ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి నిర్దేశించిన ప్రాంతాలకు తీసుకువెళ్లి ఆచరణాత్మక అవగాహన పెంపొందించేలా కృషి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

ఉమ్మడి జిల్లాలో 77 పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేసి అందులో విద్యాభ్యాసం చేస్తున్న 9, 10 తరగతుల్లో 8 శాతం మంది అంటే 4,280 మంది విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు సిద్ధం చేసి నిర్వహిస్తున్నారు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.500 చొప్పున మొత్తం రూ.21.40 లక్షలు మంజూరు చేశారు. పది మంది విద్యార్థులకు ఒకరు చొప్పున సంరక్షకుడితో పాటు మార్గదర్శక ఉపాధ్యాయుడిని వారి వెంట పంపిస్తున్నారు. ప్రతి అంశాన్ని సమగ్రంగా వివరించడంతో పాటు వారి సందేహాలను కూడా అక్కడే నివృత్తి చేస్తూ వారిలో మరింత విజ్ఞానాన్ని పెంచుతున్నారు.

వివరాలు ఇలా..

జిల్లా	పీఎంశ్రీ పాఠశాలలు
కోనసీమ	26
తూర్పుగోదావరి	20
కాకినాడ	31

ఎంపిక చేసిన ప్రదేశాలు

కాకినాడ పోర్టు, అక్కడి యుద్ధ విమానం, రాజమహేంద్రవరంలోని రోడ్డు, రైల్వే బ్రిడ్జి, కోరింగ ఫారెస్టు, ధవళేశ్వరం ప్రాజెక్టు, మ్యూజియం, పెద్దాపురంలోని పాండవుల మెట్ట, అడ్డతీగలలోని ఔషధ మొక్కలు, రాజమహేంద్రవరంలోని ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్.

కాకినాడ పోర్టు వద్ద మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఇదీ లక్ష్యం

● విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా వీక్షించి పూర్తి అవగాహన పెంచుకోవడం వల్ల అన్నివిధాల సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. ● సైన్స్ అంశాలపై మరింత ఆసక్తి పెరుగుతుంది. ● కొత్త పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా విజ్ఞాన వికాసం కలుగుతుంది. ● మానసికంగా ఉత్తేజితులు కావడానికి దోహదం.

భవిష్యత్తుకు దోహదపడతాయి

ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90 శాతం విజ్ఞాన యాత్రలు పూర్తయ్యాయి. ఎంపిక చేసిన మిగతా పాఠశాలలు కూడా సన్నద్ధమవుతున్నాయి. ఇవి విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడతాయి.

– పి.రాంబాబు, ఏఎంవో, సమగ్రశిక్షా

సూక్ష్మసేద్యం.. అన్నదాతకు వరం

బోరుకు అమర్చిన డ్రిప్

పెద్దాపురం, న్యూస్‌టుడే: తుంపర, బిందుసేద్యం ఉపకరణాలపై గతంలో జీఎస్టీ 12 శాతం ఉండగా 6 శాతం ప్రభుత్వం చెల్లించేది. మిగిలిన 6 శాతం రైతు చెల్లించేవాడు. ప్రస్తుతం జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గించడంతో 7 శాతం ఆదా అయ్యింది. ఇందులో 2.5 శాతం ప్రభుత్వం చెల్లిస్తుండగా మిగిలినది మాత్రమే రైతు చెల్లించాలి. ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో పాటు రాయితీలు ఇచ్చి సూక్ష్మనీటి సాగు పథకాన్ని(డ్రిప్, తుంపర్ల) ప్రోత్సహించి అభివృద్ధి చేస్తుంది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయడంతో త్వరలోనే పరికరాలు పంపిణీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనుంది. ఈ వివరాలను ఏపీఎంఐపీ పథకం కాకినాడ జిల్లా అధికారి జీవీవీవీ ప్రసాదరావు తెలిపారు. ● 2025-26లో లక్ష్యం: రూ.17 కోట్లతో 2 వేల హెక్టార్లు ● ఇప్పటివరకు మంజూరు: 179 మంది రైతులకు 230.36 హెక్టార్లలో..

మీ కోసం

రాయితీ వివరాలు (శాతంలో)

విభాగం	బిందు	తుంపర
2 హెక్టార్ల వరకు(ఎస్సీ, ఎస్టీలు)	100	50
2 హెక్టార్ల వరకు(ఇతరులు)	90	50
2 నుంచి 4 హెక్టార్లు	70	50
4 నుంచి 5 హెక్టార్లు	50	50

రైతేరాజు

అర్హతలు ఇలా..

- భూమి ఉన్న ప్రతిరైతు రాయితీకి అర్హులు.
- కౌలు రైతులు భూ యజమానితో ఏడేళ్ల పాటు కౌలు ఒప్పందం చేసుకోవాలి.
- సొంత బోరు, బావి, కుంట, కాలువ ద్వారా నీటి లభ్యత కలిగి ఉండాలి.
- అర్హులైన రైతులు ఏపీఎంఐపీ యాప్ లేదా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ నంబరుతో నమోదు చేసుకోవాలి.

వంగ తోటలో సస్యరక్షణ చర్యలు

నల్లజర్ల, న్యూస్‌టుడే: వంగ సాగులో విత్తిన దగ్గర నుంచి కాయకోత వరకు 18 రకాల పురుగులు, తెగుళ్లు ఆశించి మొక్క ఎదుగుదలను, కాయ నాణ్యతను దెబ్బతీస్తాయి. వీటి నివారణకు కృషివిజ్ఞాన కేంద్రం(వెంకట్రామన్నగూడెం) ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి పలు సూచనలిచ్చారు. విత్తిన 7 నుంచి 15 రోజుల్లో నేల నుంచి వచ్చిన ఆశిలీంద్రం గింజ మొలకెత్తకుండా చేసే నారు కుళ్లిపోవడం జరుగుతుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరుకు 3 గ్రాములు నీటిలో కలిపి మట్టిని తడిసే విధంగా పిచికారీ చేయాలి. కిలో విత్తనాన్ని కార్బెండజిమ్, థైరమ్ 1.5 గ్రాములతో విత్తనశుద్ధి చేసుకోవాలి. పూత, పిందె దశలో క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ., ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

వరి కోతల్లో జాగ్రత్తలు పాటిద్దాం మద్దతు ధర పొందుదాం

తెలుసుకుందాం..

అయినవిల్లి, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన వరిపంటకు మంచి మద్దతు ధర పొందాలంటే కోతలు, ధాన్యం ఆరబెట్టడం, నిల్వ చేసే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అయినవిల్లి మండల వ్యవసాయాధికారి శోభ వివరించారు. చేను పసుపు రంగులోకి మారిన తరువాత కోయాలి. ముందే కోస్తే తాలుగింజలు వస్తాయి. మంచుకురిసే సమయంలో కోస్తే ధాన్యం మెత్తబడి నల్లగా మారుతుంది. కోత ఆలస్యమైతే గింజ పగుళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. ● వెన్నులు 80-90 శాతం పసుపు రంగులోకి మారినప్పుడు మాసూళ్లు చేయాలి. ● తేమశాతాన్ని తగ్గించేందుకు కోత అనంతరం రెండు నుంచి మూడు రోజులు ఆరబెట్టాలి. యంత్రంతో కోస్తే వెంటనే కళ్లంలో ఆరబెట్టాలి. రాత్రిపూట మంచు తగలకుండా ధాన్యాన్ని కుప్పగా పోసి బరకాన్ని కప్పాలి. ● కోత సమయంలో వర్షం వస్తే 5 శాతం ఉప్పు కలిపిన నీటిని పిచికారీ చేయాలి. ధాన్యంలో దుమ్ము, ధూళి, మట్టిబెడ్డలు లేకుండా చూసుకోవాలి. తేమశాతం 17 కంటే తక్కువ ఉండేవిధంగా చూసుకోవాలి. ● ధాన్యం నిల్వ చేసుకునే ముందు గోనెసంచులను పది శాతం మలాథియన్ ద్రావణంలో ముంచి ఎండబెట్టాలి. ఈ చర్యల వల్ల ఆలస్యంగా విక్రయించినా పూర్తి మద్దతు ధర దక్కుతుంది.

కోతదశకు చేరుకున్న వరిచేను

అంతర పంట.. అదనపు రాబడే ఏటా

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం పెంచుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆత్రేయపురం మండలం వాడపల్లికి చెందిన పోలి రాజు బాబూరావు. 12 ఎకరాల కొబ్బరి తోటలో అంతర పంటగా ఆరేళ్ల క్రితం కోకో మొక్కలు నాటారు. ఐదేళ్ల నుంచి దిగుబడులు వస్తున్నాయి. ఎక్కడా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ ఎరువులు, జీవామృతం తదితర వాటిని ఉపయోగించడం ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారు.

కోకో చెట్టు వద్ద రైతు బాబూరావు

స్ఫూర్తి

ఆదాయం బాగుంది

“ఆరేళ్ల క్రితం వరకు కొబ్బరి దిగుబడులు తగ్గడం, ధరలు లేకపోవడంతో ఆదాయం పడిపోయింది. దీనిని దృష్టిలో పెట్టుకుని కోకోను అంతర పంటగా వేశాను. సేంద్రియ ఎరువులతో భూసారం పెరిగింది. చీడపీడల నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తున్నాను. కోకోతో వరుసగా రెండేళ్లు పెట్టుబడులు పోను ఎకరాకు రూ.15 వేల చొప్పున ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.20 వేలు వచ్చింది” అని రైతు బాబూరావు తెలిపారు.

చేపల్లో పేనువ్యాధి నివారిద్దాం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: చేపల్లో ఈ కాలంలో పేను వ్యాధి ఎక్కువగా సోకే అవకాశం ఉంది. ఆర్గులస్ పోలియాసిస్ అనే పరాన్నజీవులు శరీరంపై చేరి ఎర్రటి మచ్చలు ఏర్పడి క్రమేపీ పుండ్లుగా మారతాయి. వీటి ప్రభావం ఎక్కువగా ఉంటే చేపలు ఎగిరిపడటం, నీటి ఉపరితలం పైకి వచ్చి ఈదడం వంటివి చేస్తుంటాయి. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉప్పలగుప్తం ఎఫ్‌డీవో బి.హేమసుందర్ వివరించారు. డైక్లోర్వాస్(76 శాతం) ఎకరా చెరువుకు 500 మి.లీ. ద్రావణాన్ని చల్లుకోవాలి. లేదా డెల్టామైత్రిన్(1.75 శాతం) వంద మి.లీ. ద్రావణాన్ని చల్లుకోవాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు చల్లుకోవాలి. ఈ పేలు తిరిగి వ్యాప్తి చెందకుండా చెరువు చుట్టూ గడ్డిని తొలగించి వెదురుకర్రలు, మేతకు వినియోగించే సంచులను శుభ్రపరుచుకోవాలి.

వ్యాధి సోకిన చేప

ఒప్పంద పత్రాలతో నిట్, రతన్‌టాటా హబ్ ప్రతినిధులు

నైపుణ్యా అడుగులు

● నిట్‌తో రతన్‌టాటా హబ్ కీలక ఒప్పందం

బొమ్మూరు, న్యూస్‌టుడే: యువతకు నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు రతన్‌టాటా హబ్ కీలక ఒప్పందం చేసుకుందని హబ్ సమన్వయకర్త, పరిశ్రమల అభివృద్ధి ప్రోత్సాహక అధికారి టి.వి.సూర్యప్రకాష్ తెలిపారు. నోడల్ అధికారి, జేసీ వై.మేఘాస్వరూప్ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) తాడేపల్లిగూడేంతో ఒప్పందం జరిగిందన్నారు. సోమవారం బొమ్మూరులోని ఇన్నోవేషన్ టాటా హబ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలు అందుకున్నారు. నిట్ డైరెక్టర్ ఎన్.వి.రమణరావు మాట్లాడుతూ జిల్లాలో యువతకు నూతన అంకురాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్గదర్శకాలు అందించేందుకు ఇదొక చక్కని అవకాశమన్నారు. కొత్త ఆలోచనలతో వచ్చే వారికి హబ్ తరఫున పూర్తి సహకారం అందుతుందని సూర్యప్రకాష్ తెలిపారు. ప్రొఫెసర్ జి.రవికిరణ్ శాస్త్రి, నిట్ బృందం పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీలో ఎంఏ తరగతులు ప్రారంభం

బొమ్మూరు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు మొదటి బ్యాచ్‌కు తరగతులు ప్రారంభమవ్వడం శుభపరిణామమని వీసీ డి.మునిరత్నం నాయుడు పేర్కొన్నారు. సోమవారం సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీసీ విద్యార్థులకు అభినందనలు తెలిపి కోర్సును దిగ్విజయంగా పూర్తిచేయాలన్నారు. అనంతరం శ్రీశైలం పీఠాధిపతి మునుగు శ్రీనివాసరావు, కూచిపూడి కళాక్షేత్రం వైస్ ప్రిన్సిపల్ చింతా రవిబాల కృష్ణ, సాహిత్య పీఠం ఇన్‌ఛార్జ్ పీఠాధిపతి గడ్డం వెంకన్నలతో దూరదృశ్య సమావేశంలో మాట్లాడారు. బోధనలో పూర్తి సహకారం అందించాలన్నారు. కూచిపూడి నాట్యగురువు డా.వేదం రాధేశ్యామ్, అధ్యాపకుడు వెంకటరామృకృష్ణ పాల్గొన్నారు.

చేరిన విద్యార్థులతో వీసీ మునిరత్నం నాయుడు

చిత్తశుద్ధి చూపేలా..!

● సంపద కేంద్రాల ఏర్పాటుకు పురపాలకశాఖ అడుగులు

ఈనాడు, కాకినాడ: నగరాలు, పట్టణాల్లో సేకరించే వ్యర్థాల నిర్వహణ గాడిలో పెట్టేందుకు సర్కారు చర్యలు చేపడుతోంది. గత ప్రభుత్వంలో చెత్తపన్ను వేశారు తప్ప చెత్త సేకరణ, నిర్వహణ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించడానికి అడుగులు వేస్తోంది. పట్టణ స్థానిక సంస్థల్లో చెత్త శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు ప్రైవేటు సంస్థల నుంచి ప్రకటన జారీ చేసింది. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో నగరపాలక, పురపాలక సంస్థలతో పాటు నాలుగు నగర పంచాయతీల్లో రూ.36 కోట్ల పనులున్నాయి.

ఇదీ ప్రస్తుత పరిస్థితి..

● రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నుంచి సేకరించిన చెత్తను 46వ డివిజన్‌లోని డంపింగ్ యార్డుకు తరలించి తడి, పొడి వ్యర్థాలుగా వేరుచేస్తున్నారు. ఎరువు తయారు చేయడం లేదు. ● కొవ్వూరు పురపాలికకు డంపింగ్‌యార్డు లేదు. రోడ్ల పక్కన, ప్రభుత్వ స్థలాల్లో వేసి నెలలు తరబడి వదిలేస్తున్నారు.

ప్రతిపాదనలు.. ఇలా..

పట్టణ/ స్థానిక సంస్థ	రోజువారీ ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు (టన్నుల్లో)	షెడ్ నిర్మాణాలకు అయ్యే వ్యయ అంచనా (రూ.కోట్లలో)
రాజమహేంద్రవరం	180	18.27
కొవ్వూరు	30	3.05
నిడదవోలు	30	3.05

రాజమహేంద్రవరం: సేంద్రియ ఎరువు తయారు చేసే యంత్రం

45 రోజుల్లోనే..

తడి, పొడి చెత్త నిర్వహణకు సంబంధించి టెండర్లు దక్కించుకున్న సంస్థ 45 రోజుల్లోనే పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎరువులతో పాటు, ప్లాస్టిక్ వ్యర్థాలతో కొత్త ఉత్పత్తులు తయారు చేయాలి. దీని కోసం టన్నుకు సుమారు రూ.550 వరకు ఏజెన్సీకి చెల్లించనున్నారు. రెండేళ్ల పాటు ఆ ప్లాంట్ నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. ఇవి అందుబాటులోకి వస్తే పారిశుద్ధ్య సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారమవుతుందని పురపాలకశాఖ అధికారులు చెబుతున్నారు.

క్యాన్సర్ కేంద్రం ఏర్పాటుకు కృషి: ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి గ్రామీణం: అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్యాన్సర్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడారు. పింఛనుతో పాటు మరికొంత నగదు కలిపి వడ్డీ మేరి అనే మహిళకు అందజేశారు. ప్రసూతి వార్డును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రి గురించి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వక్రభాష్యాలు చెబుతున్నారని, దానిపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. భవిష్యత్తులో ఆసుపత్రిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

APS RTC వల్లె వెలుగు
టెండరు ప్రకటన
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా (కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలు) పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాల్స్/ షాపులు, క్యాంటీన్ మొదలగు వ్యాపారములు చేసుకొనుటకు, అనుభవం, ఆసక్తి కలిగిన సంస్థలు/ వ్యాపారస్తుల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.02-12-2025 నుండి తేది.15-12-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు మరియు తేది.16-12-2025న మ॥1.00 గం॥ వరకు రాజమహేంద్రవరం డిపో నందు మాత్రమే అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.16-12-2025న మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, రాజమహేంద్రవరం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఏదే కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.
నెం. S1/437(5)/2025-DPTO/EG, తేది:28-11-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీసాయి గోల్డ్, తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి ఆ రోజు మార్కెట్ రేటుకి కొనబడును. స్పాట్ క్యాష్. Cell: 94933 38823.

TENDER

ITC లిమిటెడ్, ABD, అనపర్తి-533342 వద్ద గల 124 KL HSD ట్యాంక్, 225 KVA స్టెబిలైజర్, MS, వుడ్, కన్వేయర్ బెల్టులు, SS, అల్యూమినియం, రబ్బర్, కేబుళ్లు కెపాసిటర్లు వగైరాలకు 15-12-2025న e-కోట్ కలదు. తనిఖీ 08-12-2025 నుండి 10-12-2025. టెండరు ఫారం ధర రూ.500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14. ఫోన్: 098407 31925. www.welcomeauctioneers.com.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

House For Sale Near Ashoknagar, Meeseva road, Kakinada. 370 Sq yards (52x65) Contact: RS RAO, ✆ 94927 70388.

PLOT FOR SALE

GENERAL

Open Plot For Sale Near Gokulam Temple, Gokulam Road, Kakinada. Plot No: 11 (45x67) 337 Sq Yards. RS RAO ✆ 94927 70388

JOBS

రాఘవ ఆటో ఫైనాన్స్‌కు రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, జగ్గంపేట, తుని, రావులపాలెంలలో బిజినెస్ & రికవరి ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 910092 7474, 90631 80344.

AISHWARYA GROUP OF INDUSTRIES NUTRITION FOR HAPPY LIFE
JOB OFFERS
Aishwarya Group is one of the leading rice mills in the industry with its established domestic brands in AP & TG, located near to Rajanagaram, East Godavari Dist. invites applications to fill the following vacancies.
1. HR MANAGER-1 (Min. 5 years experience)
2. SENIOR ACCOUNTANT-1 (Min. 5 years experience)
3. JUNIOR ACCOUNTANT-1 (Min. 1 year experience)
4. FACTORY OPERATIONS IN_CHARGE-1 (Min. 3 years experience)
5. PRODUCTION MANAGER-1 (Min. 5 years experience)
6. QUALITY MANAGER-1 (Min. 3 years experience)
7. MACHINERY MAINTENANCE ENGINEER-1 (Min. 5 years experience)
8. STORES SUPERVISOR - 1 (Min. 3 years experience)
9. SECURITY SUPERVISOR -1 (Ex-Service Men Preferable)
10.GENERAL SUPERVISORS - 2 (Min. 3 years experience)
Suitable Salary as per skills & experience of the candidates. Interested candidates can apply with the resume to email address: hr@aishwaryagroup.in
Management

WANTED: సేల్స్ & సర్వీస్ మేనేజర్ - కార్ షోరూమ్‌లో అనుభవం కనీసం 2 సంవత్సరాలు. డెమో ఎగ్జిక్యూటివ్‌లు, సేల్స్ & సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌లు, టెలికాలర్ (Female), సీనియర్ మెకానిక్స్ కావలెను. రాజమండ్రి, తుని, జగ్గంపేట, మండపేట, రావులపాలెం. Contact Cell: 97033 34844, 63019 19238.

జనప్రియ ఊరగాయలు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Contact: జనప్రియ ఊరగాయలు, రాయుడుపాకలు, రాజమండ్రి రూరల్, Cell: 98664 08924.

రాజమండ్రి, కొవ్వూరు, అనకాపల్లిలో ప్ర.కం., ప్రాజెక్టులు, షోరూమ్స్లో సె॥ గార్డ్స్, సె॥ సూపర్‌వైజర్స్ కావలెను. రూం+భో., జీ: 12-15 వేలు. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, RJY, ✆ 93922 69369.

SECURITY GUARDS

రాజమండ్రి, పోలవరం ప్రాజెక్ట్ దగ్గర పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 15,000/-, P.F, ESI, ఉచిత వసతి – భోజన సదుపాయం కలదు. Contact: 98665 94189, 85004 98115.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-40 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	113-00
రిటైల్ లైవ్	140-00
డ్రెస్డ్	203-00
స్కిన్‌లెస్	231-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

కాకినాడ-శ్రీశైలం నూతన బస్సు సర్వీసు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ - శ్రీశైలం మధ్య వయా రాజమహేంద్రవరం, విజయవాడ మీదుగా నూతన బస్సు (సర్వీసు నంబరు 2861)ను నడుపుతున్నట్లు డిపో అసిస్టెంట్ ఎంయూవీ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు కాకినాడ డిపో నుంచి ప్రతిరోజు రాత్రి 7.45కు బయలుదేరి సామర్లకోట, పెద్దాపురం, రంగంపేట, రాజానగరం, రాజమహేంద్రవరం మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందన్నారు. అదేవిధంగా శ్రీశైలం నుంచి రాత్రి 7.15కు ప్రారంభమై తర్వాత రోజు ఉదయం 8.15కు కాకినాడ వస్తుంది. ముందస్తు రిజర్వేషన్ అందుబాటులో ఉందని, వివరాలకు 99592 25564, 99592 25543 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

● మరో ముగ్గురికి జీజీహెచ్‌లో వైద్యసేవలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లా అంగులూరు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతిచెందాడు. పశ్చిమగోదావరి జిల్లా బండివానిగుంటకు చెందిన గెద్దాడ రాజేష్ (28)తోపాటు మరికొంతమంది అల్లూరిజిల్లా గండిపోశమ్మ గుడికి వెళ్లి వస్తుండగా అంగులూరు వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 15 మంది గాయపడ్డారు. వీరిలో గెద్దాడ రాజేష్, శ్రీనును ఆదివారం రాత్రి జీజీహెచ్‌కు తీసుకురాగా శ్రీను, రాజేష్‌కు మెరుగైన వైద్యం నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం రాజేష్ మృతి చెందాడు. ఇదిలా ఉండగా ఇదే ఘటనలో జి.వరప్రసాద్, జీవరాజు, సురేష్ పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మెరుగైన చికిత్స నిమిత్తం సోమవారం జీజీహెచ్‌కు తరలించి న్యూరాలజీ విభాగంలో చికిత్స అందిస్తున్నారు.

అన్నవరంలో మరిన్ని వసతి గదులు

● 70 శాతం మేర ఆన్‌లైన్‌లో బుకింగ్

విష్ణుసదన్ వసతిగృహం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం ఆలయంలో భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా, సమయం ఆదా అయ్యేలా ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా ఆలయంలో ఉన్న గదుల్లో 70 శాతం గదులను ఆన్‌లైన్‌లో సోమవారం నుంచి అందుబాటులో ఉంచారు. రత్న, సత్యగిరులపై వివిధ వసతి సముదాయాల్లో సుమారు 480 గదులున్నాయి. ఇందులో 70 శాతం (336 గదులు) ఆన్‌లైన్లో ఉండగా భక్తులు aptemples.org ద్వారా, మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009 ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు.

అమలు సాధ్యమేనా..

అన్నవరంలో వసతిగదులకు డిమాండ్ ఉంటుంది. వ్రతాలు, వివాహాలు జరుగుతాయి. వివాహాలకు ముందుస్తుగా విష్ణుసదన్‌లో హాల్స్ బుకింగ్ చేసుకునేవారికి 2 గదులను కేటాయిస్తారు. ఇక్కడ 32 హాల్స్ ఉన్నాయి. అన్ని హాల్స్ బుకింగ్ అయితే 64 గదులు కేటాయించాలి. ఇతర ప్రదేశాల్లో వివాహాలు చేసుకునేవారికి గదులివ్వాలి. ఇలా సుమారు 30 శాతానికి పైగా వివాహలకు కేటాయించగా, 70 శాతం ఆన్‌లైన్లో ఉంచితే నేరుగా అన్నవరం వచ్చే వారికి గదులు దొరికే పరిస్థితి ఉంటుంది. సాధారణ రోజుల్లో బాగున్నా.. రద్దీ రోజుల్లో ఇబ్బంది ఎదురవుతుంది. దీనికి తోడు సిఫార్స్ లేఖల తాకిడీ ఉంటుంది. ఆన్‌లైన్లో దళారులు అడ్డదారుల్లో బుకింగ్ చేసుకుని ఆ తర్వాత అధిక ధరలకు భక్తులకు ఇచ్చే అవకాశముంటుంది.

93.89 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 93.89 శాతం పూర్తయింది. ఆయా కేటగిరిల కింద జిల్లాలో మొత్తం 2,34,520 లబ్ధిదారులకు రూ.102.70 కోట్ల మేర పింఛను సొమ్ము పంపిణీ చేయాల్సి ఉంది. సోమవారం ఉదయం 10 గంటలకే 79 శాతం పూర్తి చేయగా రాత్రి 7.55 గంటల సమయానికి మొత్తం 2,20,181 మందికి (93.89శాతం) రూ.96.13 కోట్లు అందించినట్లు కలెక్టర్ కీర్తి చేకూరి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి తెలిపారు. రాజమహేంద్రవరం గాంధీపురం-1లోని సుబ్బారావుపేటలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ పర్యవేక్షించారు.

ఉద్యోగం చేయకపోయినా జీతాల చెల్లింపు

● కుటుంబ సభ్యుల ఖాతాల్లో జమ
● ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి నిర్వాకం

బిక్కవోలు: ఉద్యోగం చేయకపోయినా కుటుంబ సభ్యుల పేరిట జీతాలు చెల్లించి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరికి చెందిన సాంగిశెట్టి రామకృష్ణ బలభద్రపురంలోని ఓ ప్రముఖ సంస్థలో హెచ్.ఆర్. విభాగంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తన సోదరుడు సాంగిశెట్టి రాజేశ్‌తో పాటు ఇతర బంధువులు, పరిచయం ఉన్న వ్యక్తులు ఇక్కడ పని చేయకపోయినా, జీతాలు మంజూరు చేశాడు. దాదాపు ఏడాది కాలంలో సుమారు రూ.9,38,175 మోసం చేసినట్లు గుర్తించారు. సంస్థ అంతర్గత విచారణ చేసేలోగా అతను పరారయ్యాడు. సంస్థ డీజీఎం సుధాకర్ సోమవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవిచంద్రకుమార్ తెలిపారు.

(c) eenadu

రాజమహేంద్రవరం

మెరుగైన వైద్యసేవలు అందించాలి

టి.నగర్, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నగరంలో ఎనిమిది యూపీహెచ్‌సీల వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్బన్ హెల్త్ సెంటర్లను నిత్యం పర్యవేక్షించాల్సి ఉంటున్నారు. కాలం చెల్లిన మందులు, కాలపరిమితి దగ్గర పడే మందులను గుర్తించి ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు.

సర్వే ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

టి.నగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. నూతన అధ్యక్షుడిగా పి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కేవీపీ రవికాంత్, కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, ఉప కార్యదర్శి గంగరాజు, కోశాధికారి వెంకటేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నాగేంద్ర, వరుణ్, షాజహాన్, రత్నాచారి, రాజ్‌కుమార్, సత్య మణికంఠ నియమితులయ్యారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపిక

స్నేహాంజలి

బొమ్మూరు, (హుకుంపేట): విజ్ఞాన్ విద్యార్థి మండన్- రాష్ట్రస్థాయి సైన్స్ క్యాంపునకు హుకుంపేట బొప్పన సావిత్రమ్మ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని స్నేహాంజలి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మూర్తి తెలిపారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని, ఆమె మెంటర్ రామతులసిని అభినందించారు.

చిన్న పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన

రాజానగరం: చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన యువతీ యువకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తాయని జిల్లా పరిశ్రమలశాఖ సీతజీ కె.జగదీష్, కోఆర్డినేటర్ హేమంత్ తెలిపారు. రాజానగరం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు నిర్వహించారు. జగపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేవారు ప్రాథమికదశలోనే కేంద్రం (జీరో ఎఫెక్ట్...జీరో డిఫెక్ట్) జడ్ సర్టిఫికెట్ ఉచితంగా అందజేస్తోందన్నారు. కొత్తగా ప్రారంభించనున్న వ్యాపారులకు గుర్తింపు ఇస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ రుణాలు, ప్రయోజనాల గురించి వివరించారు. రూ.మూడు లక్షల వరకు రుణ సదుపాయం ఇస్తోందన్నారు. ఏపీఎం సునీత, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు, సి.పి.రెడ్డినగర్ నివాసితులు

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలంటూ నిరసన

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రంగంపేట మండలం సింగంపల్లి సి.పి.రెడ్డినగర్‌లోని పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ(ఏపీఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం పీజీఆర్‌ఎస్‌లో జిల్లా సంయుక్త కలెక్టర్ మేఘాస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడారు. సింగంపల్లి గ్రామంలోని 12 ఎకరాల సీలింగ్ భూమిలో సుమారు 200 పేద కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని 25 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారన్నారు. కాలనీలో నేటికీ కనీస వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రజాప్రతినిధులు హామీలిచ్చి తర్వాత పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ(వి) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ఘనం.. నిర్వహణ శూన్యం

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించే ఉద్దేశంతో 'ఒన్ స్టేషన్ ఒన్ ప్రోడక్ట్' లో భాగంగా రైల్వే శాఖ రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో మూడేళ్ల కిందట ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ మూతపడి నిరుపయోగంగా దర్శనమిస్తోంది. స్థానిక కుటీర పరిశ్రమలకు చేయూతనందించేందుకు, స్వయం సహాయక మహిళలు, హస్త కళాకారుల తమ ఉత్పత్తుల విక్రయాల ద్వారా ఉపాధి పొందడానికి ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై 2022 అక్టోబరులో దీనిని ఏర్పాటు చేశారు. దీని కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే వారికి మూడు నెలలపాటు తక్కువ ఫీజుకు ఇస్తే వారి ఉత్పత్తులు విక్రయించుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తుదారుల ఎక్కువ మంది ఉంటే ప్రాధాన్యం ప్రకారం స్టాల్ అప్పగిస్తారు. స్థానికంగా తయారైన తినుబండారాలు, చేనేత వస్త్రాలు, బుట్ట బొమ్మలు, చెక్క వస్తువులు గిరిజన ఉత్పత్తులు ఇలా ఏ ఉత్పత్తులైనా ప్రయాణికులకు విక్రయించుకోవచ్చు. దీనికిగాను 15 రోజులకు రూ. వెయ్యి నామమాత్రపు అద్దె చెల్లిస్తే సరిపోతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.

నిరుపయోగంగా 'ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి' స్టాల్

ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఒకటో ప్లాట్‌ఫాంపై మూతపడి ఉన్న స్టాల్

కారణాలివే

● నిబంధనల ప్రకారం కొత్తవారికి అవకాశం కల్పించాలని, ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే వారికి స్టాల్ ఇవ్వాలని ఉన్నతాధికారులు చెప్పడంతో ప్రస్తుతం ఇది మూతపడి ఉంటోంది. ● చాలా మందికి స్టాల్ తీసుకోవాలంటే నిబంధనలు ఏమిటి, ఎక్కడ ఎవరికి ఎలా దరఖాస్తు చేసుకోవాలనేది తెలియక ముందుకు రావడం లేదు. ● కమర్షియల్ అధికారులు పట్టించుకోవడంలేదు. ● మహిళా సంఘాలు, హస్త కళాకారులను ప్రోత్సహించి స్టాల్ నిర్వహణపై అవగాహన కల్పించి వారితో దరఖాస్తు చేయించే ప్రయత్నాలు చేయడం లేదు.

4న జూనియర్స్ వాలీబాల్ జిల్లా జట్టు ఎంపికలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాలీబాల్ సంఘం ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా జూనియర్స్ బాల, బాలికల వాలీబాల్ జిల్లా జట్ల ఎంపికలు 4న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి కె.యశ్వంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, ధ్రువపత్రాలతో మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని సూచించారు.

'స్వర్ణాంధ్ర'లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణ, మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి ఉన్న మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు. డిసెంబరు 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, శిక్షణ సమయంలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

అటు గోకవరం.. ఇటు కోరుకొండ

● యథేచ్ఛగా గంజాయి రవాణా

ఈ ఏడాది ఇప్పటివరకు ఇలా..

మండలం	కేసులు	గంజాయి కిలోలు	విలువ రూ.లక్షల్లో	నిందితులు
కోరుకొండ	4	500	50	20
గోకవరం	5	1,000	100	18
సీతానగరం	1	100	10	2

కోరుకొండ, గోకవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ముఖద్వారం గోకవరం, దానికి ఆనుకుని ఉన్న కోరుకొండ ప్రాంతాలు గంజాయి రవాణా నిలయాలుగా మారాయి. అక్రమంగా తరలించేవారికి అటు, ఇటు ప్రాంతాలు అడ్డాగా ఉన్నాయి. వీటి మీదుగా జిల్లాలోకి పెద్దఎత్తున తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి మిగిలిన ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాల పరిధిలో ఏడాది కాలంలో సుమారు రూ. 1.60 కోట్ల విలువైన గంజాయి పట్టుకున్నారు.

18 కిలోలు స్వాధీనం..

కోరుకొండ పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులు 18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. 9 మందిని నిందితులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. కేసు వివరాలను మంగళవారం వెల్లడించనున్నారు.

ఒడిశా, సీలేరు నుంచి..

ఒడిశా, సీలేరు ప్రాంతాల నుంచి గోకవరం మీదుగా హైవే గుండా ఎక్కువగా రవాణా అవుతోందని గుర్తించారు. పర్యవేక్షణ లేకపోవడం, సులువుగా తప్పించుకునే అవకాశం ఉండటం వంటి కారణాలతో ఈ దారిని ఎంచుకున్నట్లు భావిస్తున్నారు.

● ఇటు కోరుకొండలోనూ అదే పరిస్థితి. ఏజెన్సీ ప్రాంతాల నుంచి తరలించే గంజాయిని పలు రకాలుగా కోరుకొండ మీదుగా రాజమహేంద్రవరం, విజయవాడ ప్రాంతాల వైపునకు పెద్ద మొత్తంలో తరలిస్తున్నారన్న సమాచారం ఉంది. 'గంజాయి రవాణాపై ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నాం. కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం. పాత కేసుల్లో శిక్షలు పడేటట్లు చేస్తున్నాం.' అని కోరుకొండ సీఐ సత్యకిషోర్ అన్నారు.

వైభవంగా శ్రీరంగనాథుడి ఊరేగింపు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో శ్రీరంగనాథస్వామి ఊరేగింపు వైభవంగా జరిగింది. జ్యోతిష్య పండితుడు తాడి కోదండరామ్, అనూరాధ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం గంటాలమ్మ గుడివీధిలోని సీతమ్మ సంఘం నుంచి ఊరేగింపు మొదలై పంకాయల వారి వీధిలోని అష్టలక్ష్మి ఆలయంలోని శ్రీరంగనాథస్వామి క్షేత్రానికి చేరుకుంది.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతులకు మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొంతమూరులోని కల్యాణ్‌నగర్, ఆదర్శనగర్, జంగాల కాలనీ, ఉద్యోగుల కాలనీ, నాలుగోవంతెన ప్రాంతం, శేషాద్రి లేఔట్, క్వారీ ప్రాంతాల్లో, ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆల్కాట్‌తోట ప్రాంతంలోని కన్నమ్మపల్లి గుడి వెనుక భాగం, కస్పామాల వీధి, గోదావరి బండ్ రోడ్డు, హెచ్చుపేటవీధి, ఆక్వామువీధి, నారాయణవీధి, వేమనవీధి, శారదవీధి, గోపాల్‌వీధి, విజయలక్ష్మివీధి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం

రాజానగరం: రైతు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ పరంగా చర్యలు తీసుకుంటానని మేకల వెంకటేశ్వరరావు అన్నారు. పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన ఆయన భాజపా జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

టి.నగర్, రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నగరంలో 1వ డివిజన్‌లో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తగా 40 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ● రాజమహేంద్రవరం ల్యాబ్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొక్కిరి శ్రీకిరణ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం చెరుకూరి తోటలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. రౌతు సూర్యప్రకాశరావు, జక్కంపూడి విజయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్స్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఎన్.డి.ఎస్.ఎస్.మూర్తి, పలు ప్రాంతాల టెక్నీషియన్లు పాల్గొన్నారు.

కడలి సేవలు అభినందనీయం : ఎస్పీ

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ పదవీవిరమణ పొందిన కడలి నీలభద్రరావును సోమవారం ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహకిషోర్ మాట్లాడుతూ పోలీసుశాఖకు నీలభద్రరావు చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఏఎస్పీ అడ్మిన్ ఎస్‌బీఎం మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

నీలభద్రరావు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ తదితరులు

పగలే విద్యుత్తు వెలుగులు

రాజమహేంద్రవరం శానిటోరియం వద్ద పగలే విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. ఒక వైపు ప్రభుత్వం విద్యుత్తు పొదుపు చేయాలని ప్రచారం చేస్తుంటే విమానాశ్రయం మార్గంలో సెంట్రల్ లైటింగ్ దీపాలు ఉదయం 11 గంటలకు కూడా వెలుగుతూనే ఉన్నాయి. నగరపాలక సంస్థ అధికారులు వెంటనే విద్యుత్తు వృథా అరికట్టాలని కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఒక్కోసారి రాత్రి పూట కూడా దీపాలు సక్రమంగా వెలగకపోవడం గమనార్హం. –న్యూస్‌టుడే, దేవీచౌక్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

నగరంలో నిత్యం రద్దీగా ఉండే నారాయణపురం వాటర్ ట్యాంకుల సమీపంలో వీధి మలుపులో మ్యాన్‌హోల్ గ్రిల్ దెబ్బతిని ప్రమాదకరంగా కనిపిస్తుంది. నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు సంచరించే ప్రధాన ప్రాంతం కావడంతో ఎవరైనా ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువ. సంబంధిత అధికారులు స్పందించి నూతన గ్రిల్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ఒరిగిన స్తంభం

నగరంలోని లాలాచెరువు రోడ్డులో నారాయణపురం ఆర్‌టీవో కార్యాలయం వద్ద విద్యుత్తు స్తంభం అడుగు భాగం దెబ్బతినడంతో ప్రమాదకరంగా ఉంది. తాడుతో స్తంభాన్ని చెట్టుకు కట్టారు. ప్రధాన రహదారిపై స్తంభం ఎప్పుడు పడిపోతుందోనని వాహనదారులు, పాదచారులను ఆందోళన చెందుతున్నారు.
–న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

చెట్ల కొమ్మల తొలగింపు

జయకృష్ణపురంలోని విద్యుత్తు స్తంభంపై ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను సిబ్బంది తొలగించారు. 'అల్లుకున్న ప్రమాదం' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్రవార్తకు స్పందించిన అధికారులు స్తంభానికి ఉన్న తీగలు, చెట్ల కొమ్మలు తొలగించారు.
–న్యూస్‌టుడే, దేవీచౌక్

స్పందనకు వందనం



గీతాసారం .. మానవాళికి వరం

అలంకరణలో స్వామి, అమ్మవార్లు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: మానవాళికి భగవద్గీత ఒక వరమని శ్రీజ్ఞాన సరస్వతీ పీఠం వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు అన్నారు. గీతాజయంతి సందర్భంగా సోమవారం సరస్వతీఘాట్‌లోని పీఠంలో వేడుక నిర్వహించారు. భగవద్గీత పఠనంపై మైసూర్ దత్తపీఠం స్వామీజీ గణపతి సచ్చిదానంద సరస్వతి ఆధ్వర్యంలో బంగారు పతకం గెలుచుకున్న ప్రయాగ రమాదేవికి గీతా పురస్కారం అందజేశారు. ● రామనగర్‌లోని దువ్వూరి రామకృష్ణారావు ట్రస్ట్ సభా మండపంలో జరిగిన కార్యక్రమంలో సంస్కృతాంధ్ర పండితుడు ప్రభల సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు. ● గౌతమిఘాట్‌లోని ఇస్కాన్ మందిరంలో స్వామీజీలు సంపూర్ణ భగవద్గీత పారాయణం చేసి గీతను పఠించారు. సత్యగోపీనాథ్ ప్రభుజీ ఆధ్వర్యంలో గీతా యజ్ఞం నిర్వహించారు.

రమాదేవికి గీతా పురస్కారంతో సత్కారం

చైతన్యంతోనే ఎయిడ్స్ నిర్మూలన

ఎస్‌కేవీటీ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

నినాదాలు చేస్తున్న రాజ్యలక్ష్మి కళాశాల విద్యార్థినులు

రాజమహేంద్రవరంసాంస్కృతికం,దేవీచౌక్,శ్యామలాసెంటర్,ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే : సురక్షిత జీవన విధానాలు పాటించడం ద్వారా ఎయిడ్స్ మహమ్మారిని తరిమి కొట్టాలని గైనకాలజిస్ట్ చందన పర్వత వర్ధిని అన్నారు. సోమవారం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ బి.వి.తిరుపణ్యం, రేడియాలజిస్ట్ డాక్టర్ డి.సౌమ్యశ్రీ తదితరులు మాట్లాడారు. ✦ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పిడింగొయ్యిలో సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించారు. అనంతరం వెంకటగిరి పాఠశాల విద్యార్థులతో కలిసి ఎయిడ్స్‌పై అవగాహన ప్రదర్శన చేశారు. ✦ ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు. ✦ ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపల్ డా.శివప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ✦ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ✦ కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు.

ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య విద్యార్థులు

వీనులవిందుగా శాస్త్రీయ సంగీతం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీసద్గురు సన్నిధి, శారదాంబిక శాస్త్రీయ సంగీత, నృత్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాకినాడకు చెందిన రాజ్ కౌశల్ వీణావాయిద్య సంగీతానికి కామేశ్వరరావు మృదంగం, రాయప్రోలు దినకర్ ఘటంపై సహకరించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన ఓలేటి రాజేశ్వరి గాత్రానికి ఓలేటి సూర్యప్రభ సహకార గాత్రం, మహేంద్రవాడ నరసింహమూర్తి వయోలిన్, కె.జగన్మోహిని మృదంగం, రాయప్రోలు దినకర్ సహకరించారు. పలువురు కళాభిమానులు హాజరయ్యారు.

గాత్రకచేరీ చేస్తున్న రాజేశ్వరి

ముత్యాలమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

మలకలపల్లిలో ముత్యాలమ్మ తిరునాళ్లు

తాళ్లపూడి: మలకపల్లిలో ముత్యాలమ్మ తిరునాళ్లు సోమవారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తిరునాళ్లలో దుకాణాలు, రంగులరాట్నాలతో సందడి నెలకొంది.

నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

కంబాలచెరువు, న్యూస్‌టుడే: టీకాస్తుండగా నిప్పంటుకోవడంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున వీరభద్రపురంలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వీరభద్రపురంలో ఉంటున్న సుంకర వరలక్ష్మీ(78) గ్యాస్‌స్టౌవ్‌పై టీ కాస్తుండగా చీర చెంగుకు నిప్పంటుకోవడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. మృతురాలి కుమారుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ID కార్డు పోయినది
చెశెట్టి సాయికుమార్, S/o వెంకటరావు అనే నాకు చెందిన ID కార్డు (HDFC బ్యాంకు) ID NO: 240318672300272 ది. 01-12-2025 న ఆర్యాపురం, రాజమండ్రి ఏరియాలో పోయినది. దొరికినవారు సంప్రదించండి.
Ph: 76619 64555

మెయిన్ రోడ్డు బాగుపడేదెప్పుడు..?

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: చారిత్రక నగరంలో మెయిన్ రోడ్డు కీలకమైంది. ఉభయగోదావరి జిల్లాలకు ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న నగరంలో మెయిన్ రోడ్డు ఆనుకొని వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ వ్యాపార దుకాణాలు వల్ల నగరపాలక సంస్థకు పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతోంది. కానీ రోడ్డు విస్తరణ విషయంలో నిర్లక్ష్యం కనబడుతుంది. వ్యాపార కార్యకలాపాల నిమిత్తం రోజుకు లక్ష మంది కొనుగోళ్లు కోసం ఇక్కడకొస్తారు. పదేళ్లుగా రోడ్డు విస్తరణ పనులు జరగలేదు.

తప్పని వెతలు..

నిత్యం ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయే దుస్థితి ఉంది. కొనుగోలు దారులు వాహనాలపై వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. ఇక్కడ రోడ్లు, సందుల్లో 10, 20, 30 అడుగుల రోడ్లు మాత్రమే దర్శనమిస్తాయి. కొంత కాలంగా పాత నగరాన్ని బాగు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ అడుగు ముందుకు పడడం లేదు. కనీసం ఇక్కడ శిథిల భవనాలను తొలగించడం లేదు.

రద్దీగా మెయిన్‌రోడ్డు

తొలగని ఆక్రమణలు

మెయిన్ రోడ్డు విస్తరించి, రోడ్డు వెడల్పు చేయాల్సి ఉండగా ముందుగా ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. అయితే వీటిని తొలగిస్తే వ్యాపారుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందనే ఉద్దేశంతో విస్తరణను అడ్డుకొన్నారు. గత ప్రభుత్వ హయంలో రోడ్డు మధ్యలో సుమారు రూ 80 లక్షలు ఖరీదుతో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయగా ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది. మెయిన్‌రోడ్డులో వ్యాపార దుకాణాల వల్ల ఏడాదికి 5 నుంచి 10 కోట్లు వరకూ పన్నుల రూపంలో ఆదాయం వస్తుంది. మెయిన్ రోడ్డు ఆనుకొని ఉన్న అనుసంధాన రోడ్లు కూడా పాడైపోయాయి. ఆదాయాన్ని తీసుకొచ్చే ప్రాంతంలో రోడ్లు బాగు చేయాలనే ఉద్దేశం కూడా లేకపోయింది.

ఫిర్యాదులు పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

పీజీఆర్ఎస్‌లో 23 వినతులు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నాను. వివిధ సమస్యలపై 23 అర్జీలు అందాయి.

పోలీసు కార్యాలయానికి 33 అర్జీలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు 33 ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. అధికంగా సివిల్, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాట కేసులు వచ్చాయన్నారు. వీటిపై సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

గీతాజయంతి వేడుకలు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి పాత పూరువరిం సత్తిపోలరెడ్డి తేతలిరామిరెడ్డి రామాలయంలో సోమవారం గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. అర్చకులు వేదాంతం భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భగవద్గీత పారాయణం చేశారు.

రంగంపేట: రంగంపేట గ్రామకచేరి వాడిరి వద్ద రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు భగవద్గీత శ్లోకాలను పఠించారు. రంగంపేట ఎస్.వి.ఎస్. పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు.

బాధ్యతల స్వీకరణ

బిక్కవోలు: బిక్కవోలు డిప్యూటీ ఎంపీడీవోగా వై.మహేశ్వరరావు (సచివాలయాలు) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్డీలో పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మహేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీవో, సిబ్బంది

అనపర్తి సావారంలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

వైకాపా హయాంలో అనర్హులకు లబ్ధి: ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి గ్రామీణం: వైకాపా హయాంలో పింఛన్ల పంపిణీలో నిబంధనలకు నీళ్లొదిలి పంచుకున్నారని, తప్పుడు ధ్రువీకరణపత్రాలతో అనర్హులు లబ్ధి పొందారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. సావారంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తప్పుడు పత్రాలతో వచ్చిన పింఛనును లబ్ధిదారుడు, ధ్రువీకరణపత్రం మంజూరు చేసిన అధికారులు, నాయకులు పంచుకున్నారని ఆరోపించారు. సావారానికి చెందిన ఓ వ్యక్తి రూ. 6వేల పింఛనుకు రూ. 15వేలు అందుకునేవారని, దానిపై విచారణ జరుగుతోందన్నారు. ఈ ఘటనలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిని సైతం బెదిరించారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఎన్‌ఆర్‌కే ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి(రంగంపేట): మండలంలోని పెదరాయవరంలో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఉత్తి కమిటీ ఛైర్మన్ ఎలుబంటి సత్తిబాబు, కమిటీ సభ్యుడు ఉప్పలపాటి బుల్లిరెడ్డి, ఎంపీటీసీ కమిటీ సభ్యుడు మద్దిపాటి సత్తిబాబు, తెదేపా మండల అధ్యక్షుడు ఉద్దండ్రావు శ్రీనివాసరావు, మెడుకూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన

రాజానగరం: చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన యువతీ యువకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తాయని జిల్లా పరిశ్రమలశాఖ సీతాపో కె.జగపతి, కోఆర్డినేటర్ హేమంత్ తెలిపారు. రాజానగరం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు నిర్వహించారు. జగపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారు పారిశ్రామికవేత్తల కేంద్రం (జీరో ఎఫెక్ట్...జీరో డిఫెక్ట్) జడ్ సర్టిఫికెట్ ఉచితంగా అందజేస్తోందన్నారు. కొత్తగా ప్రారంభించాలనుకునే వ్యాపారాలకు గుర్తింపు ఇస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ రుణాలు, ప్రయోజనాల గురించి వివరించారు. రూ. మూడు లక్షల వరకు రుణ సదుపాయం ఇస్తోందన్నారు. ఏపీఎం సునీత, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం.. యువత బాధ్యత

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: యువతలో సామాజిక బాధ్యత పెంచి దేశ ప్రగతి వైపు నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కడప రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి అనుపమానందజీ మహరాజ్ సూచించారు. అనపర్తి జీబీఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం వ్యక్తిత్వ వికాస సదస్సు నిర్వహించారు. రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం ప్రతినిధి స్వామి సేవ్యానందజీ మహరాజ్ మాట్లాడారు. సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సత్తివెంకటరెడ్డి, తేతలి సుందరరామారెడ్డి, ప్రధానకార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి, కార్యదర్శులు ప్రిన్సిపల్ డా.అబ్బాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటు గోకవరం.. ఇటు కోరుకొండ

• జిల్లాలోకి యథేచ్ఛగా గంజాయి సరఫరా

కోరుకొండ, గోకవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ముఖద్వారం గోకవరం, దానికి ఆనుకుని ఉన్న కోరుకొండ ప్రాంతాలు గంజాయి రవాణాకు నిలయాలుగా మారాయి. అక్రమార్కులు తరలించడానికి ఇటు, అటు ప్రాంతాలు అడ్డాగా ఉన్నాయి. వీటి మీదుగా జిల్లాలోకి వెల్లువెత్తున తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి మిగిలిన ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాల పరిధిలో ఏడాది కాలంలో సుమారు రూ.1.60 కోట్ల విలువైన గంజాయిని పట్టుకున్నారు.

18 కిలోలు స్వాధీనం..

కోరుకొండ పోలీసుస్టేషను పరిధిలో పోలీసులు 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. 9 మందిని నిందితులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. కేసు వివరాలను మంగళవారం వెల్లడించనున్నారు.

ఒడిశా, సీలేరు నుంచి..

ఏజెన్సీ ముఖద్వారం గోకవరం ప్రధానంగా గంజాయి రవాణా జరుగుతోంది. ఒడిశా, సీలేరు ప్రాంతాల నుంచి గోకవరం మీదుగా హైవే గుండా ఎక్కువగా రవాణా అవుతోందని గుర్తించారు. పర్యవేక్షణ లేకపోవడం, సులువుగా తప్పించుకునే అవకాశం ఉండటం వంటి కారణాలతో ఈ దారిని ఎంచుకున్నట్లు భావిస్తున్నారు. ఏడాది కాలంలో ఒక్క గోకవరంలోనే 1,000 కేజీల వరకు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారంటే రవాణా ఎంత స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇటీవల కోరుకొండలో భారీ మొత్తంలో పట్టుకున్న గంజాయి

ఈ ఏడాది ఇప్పటివరకు ఇలా..

మండలం	కేసులు	గంజాయి కిలోలు	విలువ రూ.లక్షల్లో	నిందితులు
కోరుకొండ	4	500	50	20
గోకవరం	5	1,000	100	18
సీతానగరం	1	100	10	2

మన్యం ప్రాంతాల నుంచి..

ఇటు కోరుకొండలోనూ అదే పరిస్థితి. ఏజెన్సీ ప్రాంతాల నుంచి తరలించే గంజాయిని పలు రకాలుగా కోరుకొండ మీదుగా రాజమహేంద్రవరం, విజయవాడ ప్రాంతాల వైపునకు పెద్ద మొత్తంలో తరలిస్తున్నారన్న సమాచారం ఉంది. రెండు నెలల క్రితం కోరుకొండలో పెద్ద మొత్తంలో పోలీసులు ఒకేసారి 400 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం..

గంజాయి రవాణాపై ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నాం. కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పాత కేసుల్లో శిక్షలు పడేటట్లు చేస్తున్నాం. గోకవరంలో ప్రత్యేకంగా నిరంతరం చెక్ పోస్ట్ ఏర్పాటు చేశాం. బూరుగుపూడి గేటు కూడలి వద్ద అనుమానం కలిగిన ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. గంజాయి రవాణాను అడ్డుకట్టవేయడానికి తగిన చర్యలు తీసుకున్నాం. - వై.సత్య కిషోర్, సీఐ, కోరుకొండ

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపిక

స్నేహాంజలి

బొమ్మూరు, (ధవళేశ్వరం): విజ్ఞాన్ విద్యార్థిని మండల- రాష్ట్రస్థాయి సైన్స్ క్యాంపునకు హుకుంపేట జెడ్పీ సావిత్రమ్మ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని స్నేహాంజలి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మూర్తి తెలిపారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని, ఆమె మెంటర్ రామతులసిని అభినందించారు.

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం

రాజానగరం: రైతు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ పరంగా చర్యలు తీసుకుంటానని సీతారామ కాశీ పేర్కొన్నారు. పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన ఆయన భాజపా జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలో 13 రకాల పింఛన్లు

శాటిలైట్ సిటీలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

మోరంపూడి: అర్హులు అందరికీ పింఛను ఇచ్చేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. సోమవారం శాటిలైట్ సిటీలో పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడన్నారు. రాష్ట్రంలో 65 లక్షల మందికి 13 రకాల పింఛన్లు అందిస్తున్నామన్నారు. కేంద్రం సహకారంతో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యామన నారాయణ గౌడ్, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందిరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త దరఖాస్తులకు త్వరలో..: కోరుకొండ, సీతానగరం: దరఖాస్తు చేసుకున్న అర్హులకు త్వరలోనే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. కోరుకొండ, సీతానగరం మండలాల్లో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీతానగరం మండలం బొబ్బిల్లంక, జాలిమూడి, కాటవరం, రఘుదేవపురం, చినకొండేపూడి గ్రామాలతో పాటు కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, దోసకాయలపల్లి, నిడిగట్ల గ్రామాల్లో పర్యటించి పింఛన్లు అందజేశారు.

గెలిచారు.. బహుమతులు సాధించారు..!

• 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

శ్యామల సెంటర్, న్యూస్‌టుడే: దివాన్‌చెరువులో 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం అంశంపై జరిగిన పోటీల్లో మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ సెల్‌ఫోన్ ప్రభావంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటువంటి అంశాలపై 'ఈనాడు' ఉపన్యాస పోటీలు నిర్వహించడాన్ని అభినందనీయమని పేర్కొన్నారు. ఎస్. సంపత్ (9వ తరగతి), టి.అర్పిత ఫ్లోరెన్స్ (9వ తరగతి), ఎన్. లక్ష్మీ నారాయణ (8వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను మేనేజరు ఏఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపల్ విమల అందజేశారు. పోటీలకు వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

విజేతలతో శ్రీప్రకాష్ పాఠశాల యాజమాన్యం

ఉపన్యాసం ఆలకిస్తున్న విద్యార్థులు

శ్రీ సద్గురు విద్యాలయంలో..

చైతన్యపురి కాతేరులోని శ్రీ సద్గురు విద్యాలయంలో ఉపన్యాస పోటీలు సోమవారం జరిగాయి. పోటీల్లో ఎ.కీర్తి (9వ తరగతి), వై.భాగ్యశ్రీ (8వ తరగతి), టి.సురేష్ కుమార్ (9వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను కరస్పాండెంట్ ఎం.వేదమని, ప్రిన్సిపల్ బి.చాముండేశ్వరి అందించారు. న్యాయనిర్ణేతగా వై.వెంకటలక్ష్మి వ్యవహరించారు.

విజేతలతో పాఠశాల యాజమాన్యం

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పరంజ్యోతి ఆశయాలు కొనసాగిద్దాం

రాజానగరం: విద్యార్థి దశ నుంచే ప్రగతిశీల, హేతువాద భావాలు కలిగిన పరంజ్యోతి ఆశయాలు కొనసాగిద్దామని వక్తలు పేర్కొన్నారు. సోమవారం పాత తుంగపాడులో జరిగిన పరంజ్యోతి వర్థంతి సభలో సీపీఐ (ఎంఎల్) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు అధ్యక్షత వహించారు. వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ ప్రాంతాల్లో కూలీ రేట్ల పెంపునకు చేసిన పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారన్నారు. పాలక వర్గ పార్టీలన్నీ కార్పొరేట్ సంస్థలకు, సామ్రాజ్యవాద దేశాలకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. నాయకులు పి.వెంకటనాయుడు, ఎం.ఏసు, జి.ఆదినారాయణమూర్తి, బాలరాజు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు రోడ్డు పనులు

రంగంపేట-జి.దొంతమూరు రోడ్డు పనులు చివరి దశకు చేరుకున్నాయి. దాదాపు రూ.2కోట్లతో రంగంపేట నుంచి ముకుందవరం మీదుగా దాదాపు 9 కి.మీ. వరకు రోడ్డు నిర్మిస్తున్నారు. మూడు నెలల క్రితం దాదాపు 6 కి.మీ. వరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు కొన్ని రోజులుగా వేగంగా జరుగుతున్నాయి. గుత్తేదారుకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు పూర్తవుతోంది. – న్యూస్‌టుడే, రంగంపేట

రోజుల తరబడి.. దోమలు పెరిగి

శాటిలైట్‌సిటీ-బి బ్లాక్ కనకదుర్గ గుడి ప్రక్కన ప్రధాన మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగు ముందుకు సాగక పైకి వస్తోంది. ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుందని, ఆ ప్రాంతమంతా దోమలు విపరీతంగా పెరిగాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మోరంపూడి

ఇంటిముందే మురుగు..

కడియపులంక పరిధిలోని దోశాలమ్మకాలనీ వాసులకు అవస్థలు తప్పట్లేదు. సీసీ రహదారులు నిర్మించగా, డ్రెయిన్లు మాత్రం నిర్మించలేదని స్థానికులు వాపోతున్నారు. మురుగు పారే వీలు లేక అవస్థలు తప్పట్లేదు. అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. డ్రెయిన్లు నిర్మించాలని కోరుతున్నారు. సంబంధిత అధికారుల వివరణ కోరగా ప్రతిపాదనలు పంపించామని, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కడియం

పేరుకుపోయిన చెత్త..

కొంతమూరు ఆంజనేయ స్వామి గుడి వద్ద చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. పశువులు వాటిని రోడ్డు పైకి లాగుతున్నాయి. వాహనాలకు ఒక్కసారిగా అడ్డు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెత్త తొలగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొంతమూరు

రోడ్డు ఎక్కాలంటే భయం

బొమ్మూరు జేఎల్‌బీ నగర్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో మట్టిరోడ్డులో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఎత్తుగా, కంకర తేలి ప్రయాణం నరకంగా మారింది. సర్వీసు రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. సమస్యపై కార్యదర్శి కాశీని సంప్రదించగా రోడ్డు చదును చేసి ప్రయాణించేందుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో దివాన్ చెరువులో ప్రత్యేక సేవా శిబిరం నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా నిర్వహించిన శిబిరం సోమవారంతో ముగిసింది. సామాజిక అంశాలు, సైబర్‌నేరాలపై వాలంటీర్లు అవగాహనా కల్పించారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత వివరించారు. శిరస్త్రాణం, ప్లాస్టిక్ నివారణ గురించి తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ పీవో శీలం రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ కేవీ స్వామి, ప్రిన్సిపల్ కె.విజయనిర్మల, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం

కోరుకొండ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం సాధించేందుకు దృష్టి సారించినట్లు జిల్లా పరిశీలకురాలు అంబా ప్రసాద్ పేర్కొన్నారు. కోరుకొండలో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ జోన్-2 సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా పార్టీ అధ్యక్ష, ఇతర పదవులకు ఆశావహుల నుంచి అభిప్రాయాల సేకరించారు. వివిధ విభాగాలలో పదవుల నియామకంపై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, వడియార్, గరగ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నియంత్రికల్లో రాగి తీగల దొంగలు అరెస్టు

రాజానగరం, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికలోని రాగి తీగలను కుందులుగా మార్చి విక్రయిస్తున్న నిందితులను రాజానగరం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపిన సమాచారం మేరకు. . కొంతమూరు, కోలమూరు ప్రాంతాలకు చెందిన షేక్ అక్బర్, పొడుగు వంశీ, బిక్కవోలు శివకుమార్, షేక్ మైనుద్దీన్, మార్తా దుర్గారావు నియంత్రికల్లో రాగి తీగలను చోరీ చేసి, కుందులుగా మార్చి అమ్ముకుంటున్నారు. చక్రద్వారబంధంలో అపహరిస్తుండగా పట్టుకున్నారు. నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ పర్యవేక్షణలో సీఐ కె.ప్రసన్న వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. వారి నుంచి 35 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి అపహరించిన రూ.2 లక్షలు విలువైన 120 కిలోల కాపర్ తీగ, దిమ్మెలు, ఆటో, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గోకవరం, రాజానగరం, కోరుకొండ, రంగంపేట, దేవరపల్లి, గండేపల్లి పోలీసుస్టేషన్లలో 21 కేసులు ఉన్నాయన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బిక్కవోలు, న్యూస్‌టుడే: కొమరిపాలెంలోని ఓ స్వీటు దుకాణంలో జరిగిన చోరీ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై రవిచంద్రకుమార్ తెలిపారు. తొస్సిపూడికి చెందిన ఖండవిల్లి విజయదుర్గ కొమరిపాలెంలో స్వీటు దుకాణం నిర్వహిస్తున్నారు. గత నెల 29న రూ.10,800 నగదు, రూ.18వేలు విలువైన చరవాణిని దుర్గారావు దొంగిలించాడు. తనను అరెస్టు చేసి, చరవాణి, రూ.800 స్వాధీనం చేసుకున్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

అనపర్తి గ్రామీణం: అనపర్తి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నాలుగు మండలాల అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది.

మెగా పేటీఎం విజయవంతం చేయాలి

అనపర్తి గ్రామీణం: నాలుగు మండలాల ఎంఈవోలతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిసోమవారం రామవరంలో సమావేశమయ్యారు. ఈనెల 5న జరిగే మెగా పేటీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, దాతలను ఆహ్వానించాలన్నారు. విద్యార్థుల ప్రగతిని వివరించాలని సూచించారు.

ఆరోగ్య కేంద్రం ప్రారంభం

బిక్కవోలు, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మెళ్లూరులో రూ.32.5 లక్షలతో నిర్మించిన హెల్త్‌కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలు, రహదారుల నిర్మాణానికి కేంద్రం నిధులు ఇస్తోందన్నారు. సీఎంఆర్‌కు ధాన్యం విక్రయిస్తే 4, 5 గంటల్లోనే నగదు జమ అవుతోందన్నారు.

7న కనకదుర్గ అమ్మవారి జాతర

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండలం మధురపూడిలో కనకదుర్గ అమ్మవారి జాతర ఈనెల 7న జరగనుంది. 36వ జాతర మహోత్సవాలు పురస్కరించుకుని సంబంధిత గోడ పత్రికను సోమవారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, సతీమణి బత్తుల వెంకటలక్ష్మి ఆవిష్కరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే దంపతులను ఉత్సవాలకు ఆహ్వానించారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

ముగిసిన షష్ఠి వేడుకలు

కోరుకొండ: కోరుకొండ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి షష్ఠి వేడుకలు సోమవారం రాత్రితో ముగిశాయి. ఆరు రోజుల పాటు ఉత్సవాలు జరిగాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పెద్దఎత్తున ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. ఆఖరిరోజున స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది.

పేదల అభ్యున్నతికి కృషి

బిక్కవోలు: మండలానికి నూతనంగా మంజూరైన పింఛన్లను యువనేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. పందలపాకలో 9 మంది వితంతువులకు సొమ్ము అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. ఎంపీపీ తేతలి సుమ, సొసైటీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.

గోశాలకు విరాళం

కడియం: కడియపులంకకు చెందిన టీవీసీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి గోశాలకు రూ.25వేలు విరాళం ఇచ్చారు. కడియంలోని మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కొలువైన గోశాల నిర్వహణకు సోమవారం బాధ్యతా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల వీర్రాజు చేతులమీదుగా ఈ మొత్తాన్నిం అందించారు. అయితిరెడ్డి అయ్యప్ప, గణేశుల చక్రవర్తి, పి.వీర్రాజు, కె.బాబులు, ఎం.చంద్రరావు, పి.గోవిందు, పి.నాగరాజు పాల్గొన్నారు.

సమగ్ర అవగాహనతో మహమ్మారి దూరం

అనపర్తి గ్రామీణం, రాజానగరం: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా అనపర్తిలో జీబీఆర్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సమగ్ర అవగాహనతో ఎయిడ్స్‌ని నిర్మూలిద్దాం అని నినదించారు. కళాశాల డైరెక్టర్ డా.ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. ● జీజీయూ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాజానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.జి.రామ్‌భాస్కర్, జీజీయూ స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ డా.ఎండీ ధనరాజు ర్యాలీ ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా పర్యవేక్షణలో చేపట్టారు. ● జీఎస్ఎల్ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఉచిత చర్మ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 500 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డా.గన్ని భాస్కరరావు, ప్రిన్సిపల్ డా.వీఎస్ గురునాథ్, మెడికల్ సూపరింటెండెంట్ డా.టీవీఎస్‌పీ మూర్తి పాల్గొన్నారు.

రాజానగరంలో..

అనపర్తిలో ర్యాలీ చేస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

విద్యాభివృద్ధికి అడుగులు

మోరంపూడి: పేదలకు విద్యను మరింత చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. సోమవారం శాటిలైట్ సిటీలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్లస్ బాలికల పాఠశాలలో రూ.72 లక్షలతో నిర్మించిన ఆరు అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. రూ.46.20 లక్షలతో నిర్మించినున్న ప్రయోగశాలలకు ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తితో కలిసి శంకుస్థాపన చేశారు. అవసరమైన సామగ్రి సమకూరుస్తామన్నారు. ఆ పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో కొత్త బోర్ వేయిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పరికరాలు అందించారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

సీసీ రోడ్డు నిర్మాణానికి వినతి

రంగంపేట, న్యూస్‌టుడే: పదిహేనేళ్లుగా తమ కాలనీకి కనీసం సీసీ రోడ్డు కానీ, మురుగునీటి కాలువలవ కానీ ఏర్పాటు చేయలేదని లక్ష్మీపతిరావు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రంగంపేటలో జరిగిన ప్రజాదర్బారులో తహసీల్దారును కలిసి వినతి పత్రం అందించారు. పదిహేన్నేళ్లుగా పంచాయతీ పన్నులు కడుతున్నామని, ఏ విధమైన సౌకర్యాలు కల్పించడంలేదని వాపోయారు.

మహానటి సావిత్రి జయంతి

రంగంపేట, న్యూస్‌టుడే: మహానటి సావిత్రి జయంతి ఉత్సవాలు సోమవారం రంగంపేటలో ప్రారంభమయ్యాయి. సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్య ఆధ్వర్యాన సినీ అభిమానులు సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె విజయాలను, సేవా నిరతిని గుర్తు చేసుకున్నారు. వారంపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.

(c) eenadu

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

ప్రతి అర్జీ పరిష్కారానికి చొరవ

కొవ్వూరు పట్టణం: స్వీకరించిన ప్రతి అర్జీ పరిష్కారానికి యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలని ఆర్డీవో రాణి సుస్మిత సూచించారు. డివిజన్ స్థాయిలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఏడురుకు నుంచి పోస్పస్తకం మంజూరు, రోడ్డు ఆక్రమణ, భూమికి సరిహద్దులు, సంక్షేమ పథకాలకు అర్హత తదితర అంశాలపై అర్జీలు స్వీకరించారు. వీటి స్వీకరణతోను 1100 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఆయా శాఖల డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పల్లెల్లో పరిశుభ్రతపై దృష్టి

తాళ్లపూడి: పల్లెల్లో పరిశుభ్రతపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని మలకపల్లి, పెద్దేవంలో రూ. 56.25 లక్షల పీఎంఏజీవై నిధులతో మురుగు కాలువల నిర్మాణానికి ఆయన సోమవారం భూమిపూజ చేశారు. మలకపల్లిలో ముగ్గురు, పెద్దేవంలో ఒకరికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2,66,700 చెక్కులను అందజేశారు. అంతకుముందు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచి రాపాకరాజేశ్వరి, ద్విసభ్యకమిటీ సభ్యులు సుబ్బరాయచౌదరి, రామకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ శ్రీరామ్, ఉపాధ్యక్షురాలు రేఖపల్లి మంగామణి, మాజీ సర్పంచి మద్దిపాటి ప్రకాశం, నాయకులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

భవన నిర్మాణ కార్మికుల బోర్డు ఏర్పాటు చేయాలి

నిడదవోలు: భవన నిర్మాణ కార్మికుల బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ నిడదవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈమని గ్రీష్మకుమార్, జిల్లా కమిటీ సభ్యుడు పామర్తి సత్యనారాయణ, రవ్వ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

నిడదవోలు: రోటరీ నిడదవోలు మిడ్ టౌన్ క్లబ్ సభ్యుడు ఐంజే శేఖర్, రూప్సీ రాణి దంపతుల ఆర్థిక సాయంతో శంకరాపురంలోని హృదయాలయ దివ్యాంగుల పాఠశాలకు సోమవారం నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గుబ్బల సత్యప్రసాద్, కార్యదర్శి ఆనందం మురళీకృష్ణ, కొయ్య నాగేశ్వరరావు, పెన్మెత్స రామవర్మ, నిర్వాహకుడు గణేష్ బాబు, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మండలస్థాయి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలను ఎంఈఓలు నెహ్రూ, బాలాజీ ప్రారంభించారు. ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. **ఉండ్రాజవరం:** ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రీడలకు సంబంధించి ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు ఎంఈఓ శరత్‌బాబు తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం ఎంపిక పోటీలు నిర్వహించారు.

అంబేడ్కర్ సర్కిల్‌గా గుర్తించాలి

నిడదవోలు: నిడదవోలు వర్రిపేట సంతమార్కెట్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అంబేడ్కర్ సర్కిల్‌గా గుర్తించాలని కోరుతూ జువ్వల రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్ కృష్ణవేణికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బైపే రాజేశ్వరరావు, ఈమని గ్రీష్మకుమార్, అంబటి పుల్లారావు, టి.ముత్యాలరావు, యు.ప్రభాకర్, ఎం.రాజేష్, ఎం.పండు, టి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాయోగం

న్యూస్‌టుడే, తాళ్లపూడి

✦ పాఠశాలలకు చేరిన పరికరాలు

రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా క్రీడా రిజర్వేషన్లను రెండు నుంచి మూడు శాతానికి పెంచడంతోపాటు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను ప్రోత్సాహకాలు అందజేస్తోంది. గతంలో అన్ని పాఠశాలలకు ఒకే విధమైన క్రీడా పరికరాలు అందించే వారు. తాజాగా విద్యార్థులకు ఇష్టమైన ఆటలు ఆడుకునేందుకు వీలుగా కోరుకున్న క్రీడా సామగ్రిని సమకూర్చారు. చదువులో ఒత్తిడిని తగ్గించడంతోపాటు క్రీడలపై ఆసక్తి పెరిగేలా చర్యలు చేపడుతున్నారు.

కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో అవసరమైన క్రీడా పరికరాలను ఇండెంట్ల ఆధారంగా సమకూర్చారు. పాఠశాల స్థాయిని బట్టి ఉన్నత పాఠశాలకు రూ.25వేల నుంచి రూ.30 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.10వేల నుంచి రూ.15 వేలు, ప్రాథమిక పాఠశాలలకు రూ.5వేల నుంచి రూ.10వేల లోపు విలువ చేసే కిట్లు సరఫరా చేశారు. ఆట్లెటిక్స్‌కు సంబంధించి అన్ని పాఠశాలలకు ఒకే తరహా సామగ్రి అందించారు. వాలీబాల్, త్రోబాల్, క్యారమ్ బోర్డులు, షటిల్, ఫుట్‌బాల్, హాకీ, నెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్, సాఫ్ట్‌బాల్ తదితర క్రీడలకు సంబంధించిన సామగ్రి సరఫరా చేశారు. విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. క్రీడలతో ఆరోగ్యం సమకూరుతుందని తద్వారా చదువుపై మరింత దృష్టి పెట్టి మెరుగైన ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందని వారంటున్నారు. క్రీడల్లో విద్యార్థులు రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం అందించిన పరికరాలు ఎంతగానో దోహదపడతాయని వ్యాయామోపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గాల వారీగా ఇలా..

నియోజకవర్గం	పాఠశాలలు	విద్యార్థులు
కొవ్వూరు	123	10,175
గోపాలపురం	153	13410
నిడదవోలు	157	10,819

✦ ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో సుమారు రెండు వేలమంది విద్యార్థులు చదువుతున్నారు.

తాళ్లపూడి : ప్రభుత్వం సమకూర్చిన పరికరాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు

జీవనంలో భగవద్గీతకు ఉత్కృష్ట స్థానం

కొవ్వూరు పట్టణం: బిజినెస్ మేనేజ్‌మెంట్ పాఠ్యాంశాల్లో భగవద్గీతను పరిశోధన గ్రంథంగా పాశ్చాత్య దేశాల విశ్వవిద్యాలయాలు గుర్తించాయని ఏబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.రమేష్ పేర్కొన్నారు. కళాశాలలో గీతాజయంతి కార్యక్రమాన్ని తెలుగు, సంస్కృత విభాగాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. భగవద్గీతను పూజించి, వైశిష్ట్యాన్ని అధ్యాపకులు జయరామలక్ష్మి, నూకరత్నం వివరించారు. భగవద్గీత శ్లోకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ● కొవ్వూరు పట్టణం, గ్రామీణంలోని వైష్ణవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాణ ప్రాశస్త్యమైన వరద గోపాలస్వామి ఆలయంలో విష్వక్సేన పూజ, రుత్విగ్వరుణ, అగ్నిప్రతిష్ఠాపన, పంచామృత స్నపన లక్ష తులసీదళార్చన, మహిళా భక్తుల ఆధ్వర్యంలో సంపూర్ణ గీతా పారాయణ చేశారు. క్షేత్రంలోని సుందర గోవిందుడు, నృసింహస్వామి, బసివిరెడ్డిపేట వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించగా అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ● **తాళ్లపూడి:** స్థానిక గీతామందిరంలో లక్ష తులసిపూజ, గణపతిపూజ, మండపారాధన, పంచామృతాభిషేకాలు, విష్ణు సహస్ర నామ, గీతాపారాయణ తదితర కార్యక్రమాలు జరిగాయి. ● **నల్లజర్ల:** దూబచర్ల సంఘమిత్ర పాఠశాలలో భగవద్గీత పఠించారు. పాఠశాల డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకరణలో సుందర గోవిందుడు

ఏబీఎన్ కళాశాలలో భగవద్గీతకు పూజ చేసిన అధ్యాపకులు, సిబ్బంది

పోటీతత్వం.. ఉజ్వల భవితకు మార్గం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కొవ్వూరు మండలంలోని పశివేదల జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై జరిగిన పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని చక్కగా ఉపన్యసించి ప్రతిభ చాటారు. ఎం.అమృత, యు.విష్ణు (9వ తరగతి), ఎస్.దుర్గాప్రసాద్ (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రధానోపాధ్యాయిని పి.కనకదుర్గ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. సిబ్బంది ఎన్.రవికుమార్ పాల్గొన్నారు.

విజేతలతో పశివేదల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కనకదుర్గ, తదితరులు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు

విజేతలతో కుమారదేవం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, తదితరులు

కుమారదేవం పాఠశాలలో..

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కొవ్వూరు మండలంలోని కుమారదేవం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై జరిగిన పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు చక్కగా ఉపన్యసించారు. ఎం.ఊహ, పి.ప్రవల్లిక (9వ తరగతి), వై.బిందుశ్రీ (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.చంద్రశేఖర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

పశివేదలలో ఉపన్యసిస్తున్న విద్యార్థిని

ఉపన్యసిస్తున్న విద్యార్థిని

అయ్యప్పకు విశేష పూజలు

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్ను అయ్యప్ప ఆలయంలో స్వామికి మాలధారులు, భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. తాడిపర్రులో తగ్రామోత్సవం నిర్వహించారు.

స్వామికి అన్నాభిషేకం

సుబ్రహ్మణ్యస్వామికి లక్షపత్రి పూజ

చాగల్లు: స్థానిక శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో 29వ వార్షిక లక్షపత్రి పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన, సూర్యనమస్కారాలు, జ్యోతిర్లింగార్చన, సుబ్రహ్మణ్యహోమం, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్ప నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మలకలపల్లిలో ముత్యాలమ్మ తిరునాళ్లు

తాళ్లపూడి: మలకపల్లిలో ముత్యాలమ్మ తిరునాళ్లు సోమవారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తిరునాళ్లలో దుకాణాలు, రంగులరాట్నాలతో సందడి నెలకొంది.

మలకపల్లి: ముత్యాలమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

మురుగు పారదు.. దుర్వాసన వీడదు

కొవ్వూరు ఒకటో వార్డు పరిధిలోని రాజీవ్ కాలనీ రామాలయం సమీపంలోని డ్రెయిన్లలో మురుగు నిలిచిపోతోంది. సిమెంటు రోడ్ల నిర్మాణాలతో అంతకుముందు ఉన్న కల్వర్టులు, డ్రెయిన్లు పల్లంగా మారాయి. ఓ మోస్తరు వర్షానికే మురుగు రహదారికి సమాంతరంగా చేరుతోంది. వ్యర్థాలు రోడ్డుపైకి చేరి దుర్వాసన వెల్లువెత్తుతోంది. ఈ అంశాన్ని కమిషనర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య నిర్వహణకు, అవసరమైన చోట్ల అవసరమైన డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

నీటిపారుదలకు చిక్కులు

పెరవలి మండల పరిధిలోని బ్యాంకు కాలువ ద్వారా 37 వేల ఎకరాల సాగునీరు అందాల్సి ఉంది. అయితే కాకరపర్రు నుంచి కాలువ వెంబడి చెట్లు పెరిగి వాటి కొమ్మలు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. దీని వల్ల శివారు భూములకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలువలోని తూడు, అడ్డుపడుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యను జలవనరులశాఖ ఏఈ ఎన్.బాలమురళీ దృష్టికి తీసుకు వెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, పెరవలి

కోతులతో అవస్థలు

దూబచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో కోతులు సంచరిస్తూ అటుగా వచ్చేపోయే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఆయా భవనాల గోడలపై రాత్రి వేళల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ఉదయం గుంపులుగా రోడ్లపైకి చేరుతున్నాయి. కాలినడకన వెళ్లే వారితో పాటు వాహనాలను వెంబడిస్తుండడంతో అటుగా రాకపోకలంటేనే భయపడిపోతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఆశా అలేఖ్య దృష్టికి తీసుకెళ్లగా కోతులను పట్టించి అటవీ ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, నల్లజర్ల

విభాజకాలు కళకళ

పురపాలక సంఘ వజ్రోత్సవాల సందర్భంగా నిడదవోలు పట్టణంలోకి రహదారుల మధ్య విభాజకాలపై వేసిన రంగులు, చిత్రాలు అటుగా రాకపోకలు సాగించే వారిని ఆకట్టుకుంటున్నాయి. గణపతి కూడలి నుంచి గణేష్‌చౌక్, అక్కడ నుంచి సమిశ్రగూడెం వంతెన వరకు విభాజకాలకు ఎనామిల్ పెయింట్, పంగిడి రోడ్డులో 3డి పెయింటింగ్ వంటి పనులు చేపట్టారు. పైగా వాటిపై వేసిన రంగులు, బొమ్మలు విశేషంగా ఆకట్టుకుని ఆహ్లాదం పంచుతున్నాయి. - న్యూస్‌టుడే, నిడదవోలు

ఐసీటీసీ టెక్నీషియన్‌కు పురస్కారం

కొవ్వూరు పట్టణం: హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య సేవలు, కేంద్ర నిర్వహణ తీరుకుగాను కొవ్వూరు ఐసీటీసీ విభాగం టెక్నీషియన్ వి.దుర్గాప్రసాద్‌కు పురస్కారం దక్కింది. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినం సందర్భంగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ (డీఏటీఎల్ఓ) అధికారిణి వసుంధర, తదితరుల చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఐసీటీసీ కేంద్ర పరిధిలో ఏఆర్టీ మందుల పంపిణీకిగాను ఈ అవార్డు వచ్చిందని, మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తానని దుర్గాప్రసాద్ తెలిపారు.

పురస్కారం అందుకుంటున్న దుర్గాప్రసాద్

నిడదవోలు వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇలా..

కొవ్వూరులో వైద్యులు, సిబ్బంది అవగాహన ప్రదర్శన

నిడదవోలులో ఎస్వీఆర్కే డిగ్రీ కళాశాల విద్యార్థుల మానవహారం

బాధితుల్లో మనోధైర్యాన్ని పెంచాలి

కొవ్వూరు పట్టణం, నిడదవోలు, న్యూస్‌టుడే: ఎయిడ్స్ మహమ్మారి శాశ్వత నివారణకు ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలని కొవ్వూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ, ఐసీటీసీ కేంద్రం సంయుక్తాధ్వర్యంలో సోమవారం ఆసుపత్రి నుంచి విజయవిహార్ కూడలి వరకు అవగాహన ప్రదర్శన నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఐసీటీసీ కౌన్సిలర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణ గల జీవన విధానంతో ఎయిడ్స్ నిరోధించవచ్చన్నారు. ఆసుపత్రి వైద్యులు, ఐసీటీసీ టెక్నీషియన్ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. ✦ నిడదవోలు ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ శోభారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో ప్రదర్శన, గణేష్‌చౌక్‌లో మానవహారం చేట్టారు. కళాశాలలో ఎయిడ్స్ గుర్తు ఆకారంలో విద్యార్థినులు కూర్చుని ఆకట్టుకున్నారు. వివిధ పోటీల్లో విజేతలకు ప్రధానాచార్యురాలు డాక్టర్ డి.రుద్ర చేతుల బహుమతులు అందించారు. ఎస్వీఆర్కే డిగ్రీ కళాశాలలో ప్రధానాచార్యురాలు డాక్టర్ కె.జ్యోతి, బాలుర జూనియర్ కళాశాలలో ప్రధానాచార్యురాలు బి.మేరీసుజాతల ఆధ్వర్యంలో ప్రదర్శన, మానవహారాలు చేపట్టారు.

తెదేపా అనుబంధ కమిటీల అధ్యక్షులు వీరే

గోపాలపురం, న్యూస్‌టుడే: గోపాలపురం నియోజకవర్గంలోని తెదేపా అనుబంధ కమిటీ అధ్యక్షులను నియమించారు. నాలుగు మండలాలకు ప్రాధాన్యం ఇస్తూ నియామకాలు పూర్తి చేశారు. తెలుగు రైతు అధ్యక్షుడిగా అబ్బిన సురేంద్ర, బీసీ సెల్- వేముల నాగరాజు, ఎస్టీ సెల్- తామ దుర్గారావు, ఎస్సీ సెల్- వీరమళ్ల అనిల్, తెలుగు మహిళా-కాకర్ల రామతులసి, వాణిజ్య విభాగం- ఇమ్మడి రత్నాజీ, తెలుగు యువత పాతూరి సహృదయ్, ఐటిడీపీ- కొత్తపల్లి భరత్‌కుమార్, టీఎన్‌టీయూసీ- ఆదిరెడ్డి రాంబాబు, క్రిస్టియన్ సెల్- పెనుమాక రాజ్‌కుమార్, విభిన్న ప్రతిభావంతులు- లక్కబత్తుల రమేష్, మైనారిటీ సెల్- షేక్ మెహబూబ్, సాంస్కృతిక విభాగం- చెరుకూరి వెంకటరమణారావు, న్యాయ విభాగం- జేమ్స్ కెన్నెడీ కోపెల్ల, టీఎన్ఎస్ఎఫ్- ఆలపాటి యశ్వంత్ వెంకటసాయి నియమితులయ్యారు. పలువురు వీరిని అభినందించారు.

మహారాజశ్రీ తణుకు శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్)

ఈ.పి.నెం. 74/2023 ఇన్ ఓ.యస్.నెం. 445/2016

బిట్వీన్

బత్తిన ఆశీర్వాదం ...డిహెచ్ఆర్ / వాది

అండ్

రాజాల శాంత కుమారి ...జేడీఆర్

డి.హెచ్.ఆర్ తరఫున చేసిన వేలం ప్రకటన.

పై నెంబర్ ఈ.పి.లో జేడీఆర్ తాలూకా దిగువ షెడ్యూల్ ఆస్తిని ది.16-12-2025 వ తేదీన ఉదయం 10.30 గం లాగాయితు శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) కోర్ట్, తణుకు వారి ఎదుట బహిరంగ వేలం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూల్ ఆస్తి వివరం

పశ్చిమ గోదావరి జిల్లా, నిడదవోలు సబ్‌డివిజన్‌లో చేరిన ఉండ్రాజవరం మండలం, కాల్దరి గ్రామం తాలూకా, జిరాయితీ మెరక ఆర్.యస్.నెం.284 కు సరియైన ఆర్.యస్.నెం. 284/4 284/4బి లో య.0.40 సెంట్స్ భూమికి హద్దులు: తూర్పు: గరగపర్తి వెంకటేశ్వర్లు భూమి, దక్షిణం: కొలుకుల కాంతమ్మ వగైరాల భూమి, పడమర: రాజాల కృష్ణమ్మ గారి యీ నెంబర్ లో భూమి, ఉత్తరం: చీపుళ్ళ బొజ్జియ్య వగైరాల భూమి.

యీ హద్దుల మధ్య య.0.40 సెంట్స్ లేక హె.0.162 రు భూమి ఇందలి సమస్త యిజుమెంట్ హక్కులు వగైరాలతో సహా.

డిహెచ్ఆర్ విలువ : రూ.3,00,000/-

జేడీఆర్ విలువ : తెలిపివుండలేదు

మార్కెట్ విలువ: రూ.6,40,000/-

అమిన విలువ : రూ.8,80,000/-

ఐనంపూడి కామేశ్వర రావు, ఐనంపూడి శ్రీదేవి కృష్ణ వేణి, అడ్వకేట్స్, తణుకు.

తణుకు ది.29-11-2025

జనరల్ నోటీసు

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), కొవ్వూరు

I.P.No. 22/2025 (క్రెడిటర్ I.P)

Between:

పిటిషనరు: లక్కోజు సత్యనారాయణ

మరియు

రెస్పాండెంట్లు: 1. శ్రీమతి పోతుల జ్యోతి
2. శ్రీమతి బొమ్మారెడ్డి దివ్యవందన
3. పోతుల ప్రవీణ్‌కుమార్ రెడ్డి
4. శ్రీమతి తప్పా రాధ మాధవి
5. ది. ఆఫీషియల్ రిసీవర్, ప.గో.జిల్లా, ఏలూరు

పిటిషనరు తరఫు యిచ్చిన జనరల్ నోటీసు

పై నెంబరు గ్రంథములో 1వ రెస్పాండెంటును ఇన్సాల్వెంట్ (అప్పు చెల్లించని వాని)గా ప్రకటించమని, 1 to 3 రెస్పాండెంట్లు, 4వ రెస్పాండెంటు పేరున వ్రాయించి యిచ్చిన రిజిష్టరు క్రియదస్తావేజును రద్దుచేయమని, సదరు ఆస్తిని 5వ రెస్పాండెంటుకు నిర్వహణ నిమిత్తం అప్పగించవలసినదిగా, ఖర్చులు వగైరా పరిహారములు కోరుచూ దాఖలు చేసినందున సదరు విషయమై ఎవ్వరికైనా ఎట్టి ఆక్షేపణలున్నా ది. 09-12-2025 సం॥ తేదీ ఉదయం 10.30 ని॥కు స్వయంగా గాని, లేదా వకీలు / అడ్వకేటు ద్వారా హాజరుకావలెను. లేనియెడల పై గ్రంథము యావన్మంది పరోక్షమున విచారణ మరియు తీర్మానం జరుగునని యావన్మందికి తెలియచేయడమైనది.

సం/- N.V.S.S.P.రామమోహన్
N.V.S.రామానుజం
అడ్వకేట్స్, తణుకు

కొవ్వూరు 1-12-2025 సెల్: 99088 22433, 98483 69653

మాలధారులకు అండగా..

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

● క్షేత్రంలోని అయ్యప్ప సన్నిధిలో అన్నదానం

కొవ్వూరు గోష్పద క్షేత్రంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణం కార్తిక మాసంలో నెల ముందు నుంచే శరణుఘోషతో మార్మోగుతోంది. అయ్యప్ప, శివ మాలధారులకు ఏటా ఇక్కడ అన్నప్రసాదం అందిస్తున్నారు. 1997లో ఈ ఆలయాన్ని నిర్మించగా 2010 ఏడాది నుంచి అన్నదానం ప్రారంభించారు. ఏటా విజయదశమి నుంచి సంక్రాంతి వరకు దీక్షాపరులకు భిక్ష పెడుతున్నారు. సంక్రాంతికి ముందు వరకు ఈ ప్రక్రియ 15 ఏళ్లుగా నిరాటంకంగా సాగుతోంది.

దాతల సహకారమే కీలకం..

కొవ్వూరు, పరిసర ప్రాంతాలకు చెందిన దాతలు అన్నదానానికి ఆర్థికంగా సహకరిస్తున్నారు. మరికొందరు కూరగాయలు, నిత్యావసర సరకులు ఇస్తున్నారు. ఏటా భిక్షకు వచ్చే మాలధారుల సంఖ్య కూడా తమ వంతు విరాళాలు అందించి ప్రోత్సహిస్తున్నారని కమిటీ ప్రతినిధులు అప్పలరాజు ప్రసాద్, నున్న సాయి, పరిమి రాజేష్ తెలిపారు.

రోజూ సుమారు 500 మంది..

అయ్యప్ప అన్నదాన కమిటీ ద్వారా రోజూ సుమారు 500 మంది అయ్యప్ప, 50 మంది శివమాల దారులకు భిక్ష పెడుతున్నారు. సుమారు 102 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి సుమారు రూ.10 లక్షలు వరకు వ్యయమవుతోంది.

భిక్ష స్వీకరిస్తున్న మాలధారులు

నిత్య పూజలు.. ప్రత్యేకతలు

మాలధారణ ప్రారంభం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామికి ప్రత్యేక పూజలు, భజనలు చేస్తుంటారు. మధ్యాహ్నం భిక్ష, ఆలయ ప్రాంగణంలో పడిపూజ, ప్రతి బుధవారం ప్రత్యేక అభిషేకం చేసి మహా హారతి, ప్రతి నెల ఉత్తర నక్షత్రం రోజున అఖండ హారతి సమర్పిస్తారు. మాలధారులతోపాటు నాగరాజస్వామికి పూజలు, సంక్రాంతి రోజున తిరువాభరణాల సేవ ప్రత్యేకతగా నిలుస్తోంది.

పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

ఉండ్రాజవరం, నిడదవోలు: పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనిలో భాగంగానే అధికారం చేపట్టిన వెంటనే పింఛన్ మొత్తం పెంచి లబ్ధిదారులకు అందిస్తోందని నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. మునిపల్లి, వెలగదుర్రు, తీపర్రులో లబ్ధిదారులకు సోమవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు వెలగల సూర్యారావు, నిడదవోలు డీసీ అధ్యక్షుడు జుజ్జవరపు సత్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ గారింకి జిన్నూరులు, నీటి సంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. నిడదవోలులోని తిరుగుడుమెట్టలో పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వార్డులో పట్టణ తెదేపా అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు.

వెలగదుర్రులో పింఛను అందిస్తున్న శేషారావు

నిరసన జెండా

అంగన్‌వాడీ కార్యకర్తలు మరోసారి ఉద్యమబాట పట్టారు. ఇచ్చిన హామీలను సర్కారు అమలులోకి తేలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి సోమవారం వేలాదిగా కదలివచ్చిన కార్యకర్తలు, ఆయాలు రైల్వేస్టేషన్ నుంచి స్వాతంత్ర్య ఉద్యానవనం వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించి.. ధర్నాకు దిగారు.. వారి నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. **(న్యూస్‌టుడే, బెంగళూరు)**

హనుమంతయ్య.. పాలనాదక్షుడు!

పుష్పార్చన చేస్తున్న సిద్ధరామయ్య

నివాళులర్పిస్తున్న డీకే శివకుమార్

పూలతోరణాలతో కెంగల్ హనుమంతయ్య విగ్రహం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి కెంగల్ హనుమంతయ్య చక్కని పరిపాలనా దక్షుడని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఆయన ఆదర్శాల దిశగానే మా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని చెప్పారు. కెంగెల్ వర్ధంతిని పురస్కరించుకుని విధానసౌధ పశ్చిమ ద్వారం సమీపంలోని విగ్రహం వద్ద ఆయన నివాళి అర్పించి విలేకరులతో మాట్లాడారు. కర్ణాటకకు రెండో ముఖ్యమంత్రిగా విధానసౌధ నిర్మాణాన్ని ఆయనే ప్రారంభించారని గుర్తు చేశారు. విధానసౌధను ప్రారంభించే సమయానికి ఆయన అధికారంలో లేకపోయినా.. తూర్పున మెట్ల వరుస పై భాగంలో 'ప్రజల పని దేవుని పని' అని చెక్కించేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. నేషనల్ హెరాల్డ్ కేసును అడ్డు పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం తమ నాయకులు సోనియా, రాహుల్‌పై కక్ష సాధింపునకు పాల్పడుతోందని దుయ్యబట్టారు.

● అన్నదమ్ముల్లా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కలిసి తాను పని చేస్తున్నానని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. విధానసౌధ ఆవరణలో కెంగల్ హనుమంతయ్య విగ్రహం వద్ద సోమవారం డీకే నివాళి అర్పించారు. అనంతరం తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడుతూ తమకు 140 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, అందరితో కలిసి పని చేస్తున్నామని చెప్పారు. 'ఒంటరిగా జన్మిస్తాం. ఒంటరిగా మరణిస్తాం. పార్టీ విషయం వస్తే అందరినీ కలుపుకొని వెళతాను. ఈ విషయంలో మీరు ఆందోళన చెందవలసిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిని అల్పాహార సేవనకు ఆహ్వానిస్తున్నారా అన్న ప్రశ్నకు అది మా ఇద్దరి మధ్య వ్యక్తిగత అంశమని పేర్కొన్నారు.

రాజకీయ అల్పాహారం: మింగుడుపడేనా?

ఈనాడు, బెంగళూరు : సంచలనం రేకెత్తించేలా నవంబరు చివరి వారంలో మొదలైన కాంగ్రెస్ రాజకీయ దుమారం ప్రస్తుతం త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతోంది. గత శనివారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇచ్చిన అల్పాహార విందు అనేక ప్రశ్నలను తెరపైకి తెచ్చింది. అధిష్ఠానం సైతం కర్ణాటక రాజకీయాల్లో నేరుగా జోక్యం చేసుకోకుండానే ఈ కుర్చీలాటకు విరామం ప్రకటించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లో ఆ సమావేశంలో ఏం చర్చించుకున్నారు? ఏ ఒప్పందం చేసుకున్నారని మాట్లాడుకునేలోగా మరో అల్పాహార సమావేశానికి రంగం సిద్ధమైంది. మంగళవారం ఉదయం డీకే శివకుమార్ నివాసంలో ముఖ్యమంత్రి అల్పాహారాన్ని తీసుకున్నారు. ఇప్పటికే ఈ అగ్రనేతల మధ్య భిన్నాభిప్రాయాలన్నీ సమసిపోయాయని నేతలంతా వ్యాఖ్యానిస్తుండగా.. మరో భేటీ అవసరమేమిటన్న చర్చ మొదలైంది. ఈసారి అధిష్ఠానం సూచన కూడా లేకుండా సిద్ధు, డీకే స్వయంగా ఏర్పాటు చేసుకున్న భేటీ ఇది.

సోదరభావంతో..

ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ప్రత్యేకంగా ఇష్టమైన అల్పాహార విందు ప్రత్యేకతలేంటో చెప్పాలని డీకేను పాత్రికేయులు అడిగారు. 'మేమిద్దరం సోదరుల్లా కలిసి నడుస్తున్నాం. ఇదే తరహాలో పార్టీని పరుగులెత్తిస్తాం' అని వివరించారు. 'మా మధ్య ఇకపై రాజకీయ చర్చలు ఉండవు. అంతా అధిష్ఠానం చూసుకుంటుంది. త్వరలో దిల్లీలో నిర్వహించే అఖిలపక్ష సమావేశానికి హాజరవుతాం. రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో ధ్వనించేలా చేయటంపై మేమిద్దరం చర్చించుకోవాలి' అని వివరించారు. ఈ భేటీ గురించి ముఖ్యమంత్రి కూడా స్పందిస్తూ డీకే ఇంట అల్పాహారానికి హాజరవుతున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు ఈ అల్పాహార సమావేశంతో రాజకీయం చేయరాదంటూ మంత్రులు దినేశ్ గుండూరావు, హెచ్.సి.మహదేవప్ప, భైరతి సురేశ్ తదితరులు విన్నవించారు. తొలిసారి చర్చల్లో వీరి మధ్య

మేమిద్దరం అన్నదమ్ముల్లాంటి వారమంటున్న డీకే. (పాతచిత్రం)

నేడు సిద్ధు, డీకే మరో విడత చర్చ

ఏం ఒప్పందం కుదిరిందో నాకైతే తెలియదని సీనియర్ నేత ఆర్.వి.దేశ్‌పాండే అన్నారు. మరోవైపు మంత్రి పదవి ఆశావహుల్లో ఒకరైన జేవర్గి ఎమ్మెల్యే అజయ్ ధరమ్‌సింగ్ మాట్లాడుతూ ప్రస్తుతానికి ఎలాంటి సమస్య లేదన్నారు. బెళగావి అసెంబ్లీ సమావేశాల తర్వాత అనివార్యంగా మార్పు ఉండాల్సిందేనన్నారు. అది జనవరిలోనా, ఫిబ్రవరిలోనా అన్నది వేచి చూడాలన్నారు. నాయకత్వ మార్పు కంటే మంత్రివర్గ విస్తరణ అవసరమని అజయ్ అభిప్రాయపడ్డారు.

గతవారమంతా నువ్వా? నేనా? అంటూ పోట్లాడుకున్న సీఎం, డీసీఎం.. ఒక్కసారిగా నెమ్మదించేందుకు కారణాలపై చర్చ మొదలైంది. ఐదేళ్ల వరకు తానే అంటూ ఢంకా మోగించిన సిద్ధరామయ్య.. నా 'సమయం' ఎప్పుడో చెప్పాలని పట్టుబట్టిన డీకే ఒక్కసారిగా చల్లబడేందుకు అధిష్ఠానం పంపిన సందేశం పార్టీలో ఇంత వరకు స్పష్టత రాలేదు. బెళగావిలో విధానసభ శీతాకాల సమావేశాలు, ఆపై జనవరి 16న దేవరాజ్ అరసు సుదీర్ఘకాల సీఎం రికార్డు, ఆ తర్వాత సంక్రాంతి పండగ, ఇంకాస్త ముందుకెళ్తే బడ్జెట్ సమావేశాలు.. ఆపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చిరకాల స్వప్నం కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి ప్రక్రియలు ఆయన పదవీ కాలంలోనే పూర్తి కావాల్సినవి. ఈ గడువులన్నీ దాటేంత వరకు డీకే, ఆయన మద్దతుదారులు ఏమేరకు సహనంతో ఉండగలరన్నదే రాజకీయ విశ్లేషకులను వెంటాడే ప్రశ్న.

రాష్ట్రానికి చెల్లించాల్సిందేమీ లేదే..

ఈనాడు, బెంగళూరు : 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం రాష్ట్రానికి చెల్లించాల్సిన ప్రత్యేక నిధులేవీ లేవని కేంద్రం స్పష్టం చేసింది. సోమవారం దిల్లీలో ప్రారంభమైన శీతాకాల సమావేశాల తొలి రోజున లోక్‌సభలో ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేశారు. బళ్లారి ఎంపీ తుకారామ్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ కర్ణాటక ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి లేఖలు రాసింది. ఇందులో ఆర్థిక సంఘం తొలి నివేదికలో రూ.5,495 కోట్ల ప్రత్యేక గ్రాంట్ల రూపంలో, రెండో నివేదికలో రూ.6 వేల కోట్లు చెరువుల రక్షణ, పెరిఫెరల్ వలయ రహదారి నిర్మాణం కోసం రాష్ట్రానికి చెల్లించాలని సిఫార్సు చేసినట్లు ప్రస్తావించారు. ఈ ప్రత్యేక గ్రాంట్లేవీ కేంద్రం చెల్లించే జాబితాలో లేవని పంకజ్ చౌదరి సభకు స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రూ.11,495 కోట్ల నిధులు చెల్లించని కారణంగానే రాష్ట్రం అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సైతం పలుమార్లు ఆరోపించిన విషయం తెలిసిందే.

నదుల అనుసంధానంపై..: సమావేశంలో మాజీ ప్రధానమంత్రి, రాజ్యసభ సభ్యుడు హెచ్.డి.దేవేగౌడ మాట్లాడుతూ రాష్ట్రాల్లో రైతుల ఆదాయం పెరగాలంటే నీటి కొరత నివారించాలన్నారు. ఇందుకు రాష్ట్రాల మధ్య నదుల అనుసంధానంపై కేంద్రం స్పష్టమైన విధానాలు రూపొందించాలన్న నిర్ణయాన్ని స్వాగతించారు. రాజ్యసభలో ఈ అంశంపై ప్రస్తావించిన దేవేగౌడ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు రాజకీయాలు మాని రైతుల కోసం ఏకాభిప్రాయానికి రావాలని పిలుపునిచ్చారు.

బాధ్యతలు చేపట్టిన సమీర్ జయసిన్హా

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : భారత వాయుసేన శిక్షణ కమాండ్‌కు సీనియరు ఎయిర్ స్టాఫ్ ఆఫీసరుగా ఎయిర్ మార్షల్ సమీర్ జయసిన్హా బాధ్యతలు చేపట్టారు. భారతీయ వాయుసేనలో 1989 డిసెంబరు 16న హెలికాప్టర్ పైలెట్‌గా చేరిన ఆయన గత 36 ఏళ్లలో 5100 ఫ్లైయింగ్ అనుభవాన్ని కలిగి ఉన్నారు. దేశంతో పాటు, విదేశాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న జయసిన్హా వాయుసేనా మెడల్, విశిష్ఠ సేవా మెడల్‌ను రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. వాయుదళ సిబ్బంది, అధికారులు ఆయనకు సోమవారం ఘన స్వాగతం పలికారు.

బాడుగ ఇంట్లో దంపతుల మృతదేహాలు

దంపతులు అశ్వత్థప్ప, హనుమక్క

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : గుడిబండె తాలూకా పోలంపల్లిలో ఓ బాడుగ ఇంట్లో ఉంటున్న అశ్వత్థప్ప (70), ఆయన భార్య హనుమక్క (60) అనుమానాస్పదస్థితిలో మరణించారు. జంగాలపల్లికి చెందిన ఈ దంపతులు తమ ఇద్దరు కుమార్తెలకు వివాహం చేసిన అనంతరం పోలంపల్లిలో బాడుగ ఇంట్లో ఉంటున్నారు. వారి ఇంటి నుంచి దుర్వాసన రావడంతో ఇరుగు పొరుగులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు సోమవారం ఉదయం తలుపులు పగలగొట్టి చూడగా.. వీరి మృతదేహాలు కనిపించాయి. ఆత్మహత్యా, హత్యా? అనే విషయం గుర్తించవలసి ఉందని గుడిబండె ఠాణా పోలీసులు విలేకరులకు వివరించారు.

గ్రామసీమలే ప్రగతికి పట్టుగొమ్మలు

ల్యాప్‌టాప్‌లో సాంకేతికత పనితీరును పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : తాలూకా బోర్డు సభ్యుని స్థానం నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ముఖ్యమంత్రిని అయ్యానని సిద్ధరామయ్య పేర్కొన్నారు. స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు బలోపేతమైతే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఈ దిశలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే తీసుకుంటున్న చర్యలు ఉత్తమంగా ఉన్నాయని ప్రశంసించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ విధానసౌధ బాంక్వెట్ హాల్‌లో నిర్వహించిన 2023-24 ఏడాదికి 'గాంధీ గ్రామ పురస్కారా'లను ప్రదానం చేసి, ఇ-స్వత్తు 2.0 సాంకేతికతను ప్రారంభించి మాట్లాడారు. గ్రామ భారతం అభివృద్ధి చెందకుండా, దేశాభివృద్ధి సాధ్యం కాదన్నారు. వెనుకబడిన వర్గాలు, దళితులు, మహిళలకు రిజర్వేషన్లు వద్దని భాజపా మొదటి నుంచి అడ్డుపడుతున్నా, కాంగ్రెస్ దాన్ని అమలులోకి తీసుకువచ్చిందని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ చట్టం చేయగా, భాజపా నాయకుడు రామా జోయిస్ సర్వోన్నత న్యాయస్థానంలో దాన్ని ప్రశ్నిస్తూ అర్జీ వేసుకున్నారని గుర్తు చేశారు. జలజీవన్ మిషన్‌కు కేంద్రం ఇప్పటికీ రూ.13 వేల కోట్ల బకాయిలను మిగుల్చుకుందని ఆరోపించారు. చెరకుకు మద్దతు ధర, మొక్కజొన్న కొనుగోళ్లకు సహకారం ఇవ్వాలని కోరినా ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదన్నారు. ఇ-స్వత్తు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడంతో రూ.1778 కోట్ల పన్ను ఆదాయం పెరుగుతుందని అంచనా వేసుకున్నామని చెప్పారు. దీన్ని పరిణామకారిగా వినియోగించుకుంటే.. ఏడాదిలోనే రూ.2 వేల కోట్లు అదనంగా పెరిగే అవకాశం ఉందన్నారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలో 8860 కి.మీ. రహదారులను అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రజలకు మద్దతుగా ఉన్న తమ ప్రభుత్వాన్ని కుప్పకూల్చేందుకు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతామని భాజపా పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు ప్రియాంక్ ఖర్గే, కేహెచ్ మునియప్ప తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గాంధీ గ్రామ పురస్కారాలు ప్రదానం చేస్తున్న సిద్ధు, శివుడు

ధార్వాడలో ఆందోళనకు దిగిన నిరుద్యోగ యువతీ, యువకులు

ధార్వాడలో నిరుద్యోగ ఢంకా

ఆందోళనకారులను బస్సు ఎక్కిస్తున్న పోలీసులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలు తక్షణమే భర్తీ చేయాలని ధార్వాడ నగరంలో నిరుద్యోగులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. జిల్లాధికారి కార్యాలయం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను బంధించి బస్సుల్లో పోలీసు ఠాణాలకు తరలించారు. నిరుద్యోగులు అక్కడే ధర్నా కొనసాగించారు. పోలీసు ఉన్నతాధికారుల అనుమతులు తీసుకున్నా అడ్డుకున్నారని ఉద్యోగావకాశాల పోరాటసమితి రాష్ట్ర సంచాలకుడు సిద్ధలింగ బాగేవాడి అభ్యంతరం తెలిపారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో 2.5 లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండు చేశారు. అరెస్టు చేసిన వారందరినీ తక్షణం విడుదల చేయాలని పట్టుబట్టారు.

అగ్రహార ఖైదీల ఆగ్రహం

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : రాజధాని నగరంలోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్ల స్వాధీనం, సిగరేట్, బీడీలకు అడ్డుకట్ట పడటంతో ఖైదీలు అసహనానికి.. ఆగ్రహానికి గురయ్యారు. అధికారుల చర్యలకు వ్యతిరేకంగా మూడు రోజులు నుంచి ఖైదీలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం బీడీ, సిగరేట్ విక్రయాలను నిషేధించారు. వాటిని నియంత్రించేందుకు 20 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశారు. ఆ దళం సభ్యులు తనిఖీలు నిర్వహించి ఇప్పటికే 50కి పైగా చరవాణులు, భారీగా బీడీలు, సిగరేట్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలకు వ్యతిరేకంగా కొందరు ఖైదీలు మూడు రోజులపాటు భోజనం తినకుండా నిరసన వ్యక్తం చేస్తున్నారు. కారాగార పరిపాలన కార్యాలయం వద్ద ధర్నాకూ దిగారని సమాచారం. వారెన్ని చేసినా నిబంధనలను అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

అల్లుడికి అత్త తాఖీదు

ధార్వాడ: యూట్యూబ్ కామెడీ స్టార్ ముకళెప్ప నివాసానికి అతని అత్త శివక్క కోర్టు తాఖీదులు తీసుకుని వచ్చింది. తన కుమార్తె గాయత్రి జాళిహాళను మోసం చేసి వివాహం చేసుకున్నాడని ఆరోపిస్తూ ఆమె ధార్వాడ హైకోర్టు పీఠంలో వ్యాజ్యం దాఖలు చేసింది. కోర్టు ఇచ్చిన సమన్లను ముకళెప్పకు ఇచ్చేందుకు శ్రీరామసేన కార్యకర్తలతో కలిసి సోమవారం ఆయన ఇంటికి చేరుకుంది. ఆ సమయంలో అల్లుడు, కుమార్తె ఇంట్లో లేకపోవడంతో కోర్టు కాగితాలను ఇంటి తలుపునకు అంటించి వెళ్లింది.

యువ ప్రతిభకు చక్కని ప్రోత్సాహం

విద్యార్థినులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న గాయత్రి

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : యువత, చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కన్నడ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ కేఎం గాయత్రి తెలిపారు. మల్లత్తహళ్లిలోని కళాగ్రామంలో కళా ప్రతిభోత్సవం-2025 పేరిట నిర్వహించిన కార్యక్రమాన్ని బెంగళూరు నగర జిల్లాధికారి జగదీశ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. బాలలు, విద్యార్థులకు ప్రతి ఏటా వివిధ సందర్భాల్లో పోటీలు నిర్వహించి, పురస్కారాలు, ప్రోత్సాహకాలను అందిస్తూ వస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఇచ్చిన నృత్య ప్రదర్శనలు, రూపకాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అధికారి ఆర్ చంద్రశేఖర, శిల్పకళా అకాడమీ అధ్యక్షుడు ఎంసీ రమేశ్, కనకదాస అధ్యయన కేంద్రం అధ్యక్షుడు కేటీ చిక్కణ్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెద్దల మాటలు నచ్చక విద్యార్థిని బలవన్మరణం

గదగ, న్యూస్‌టుడే : నిత్యం కళాశాలకు వెళ్లాలని, చక్కగా చదువుకోవాలని తల్లిదండ్రులు పదే పదే చెప్పడంతో వ్యథకు గురైన చంద్రిక నడువినమని (21) అనే ఇంజినీరింగ్ విద్యార్థిని బలన్మరణానికి పాల్పడింది. గదగలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ఆమె నగరం మధ్యలోని భీష్మ చెరువులో దూకి సోమవారం ఆత్మహత్య చేసుకుంది. బాగలకోటె జిల్లా శిరూరు గ్రామానికి చెందిన బాధితురాలు గదగ సంభాపుర రహదారిలోని లక్ష్మీనగరలో బాడుగ ఇంట్లో స్నేహితులతో కలిసి ఉంటోంది. స్నేహితులతో తిరుగుతూ, కళాశాలకు వెళ్లకుండా, చదవకుండా ఉండవద్దని తల్లిదండ్రులు ఫోన్ చేసి పదే పదే చెబుతున్నారని లేఖ రాసి పెట్టి ఆత్మహత్య చేసుకుంది.

పట్టా ఇవ్వలేదని..

బెళగావి : తనకు పీహెచ్‌డీ పట్టా ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపిస్తూ సుజాతా బెండె (32) అనే విద్యార్థిని విషం తాగి బలవన్మరణానికి ప్రయత్నించింది. ఆమెతో ఉన్న వారు తక్షణమే చికిత్స కోసం బాధితురాలిని ఆసుపత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సీఎం త్యాగరాజ్, రిజిస్ట్రార్ సంతోశ్ కామేగౌడ తనను లక్ష్యంగా చేసుకుని వేధిస్తూ వచ్చారని ఆమె ఆరోపించింది.

చిక్కలో నిషేధాజ్ఞలు

చిక్కమగళూరు: దత్త జయంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి గురువారం వరకు చిక్కమగళూరు సమీప ఇనాం దత్తాత్రేయ బాబా బుడాన్ స్వామి దర్గా పరిధిలో నిషేధాజ్ఞలను అమలులోకి తీసుకువచ్చారు. కొండను పూర్తిగా హిందూ పీఠంగా పరిగణించాలని చిక్కమగళూరులో హిందూ సంఘాల ప్రతినిధులు బుధవారం శోభాయాత్రకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించే సంతను కూడా రద్దు చేశారు. ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు చిక్కమగళూరు, దత్తపీఠానికి రావద్దని జిల్లాధికారి కోరారు. డిసెంబరు 4న దత్త పాదుకల దర్శనం ఉంటుంది. దత్త పీఠం, ముళ్లయ్యనగిరి, సీతాళయ్యనగిరి, మాణిక్యధార, గాళికెరె తదితర ప్రాంతాల్లోనూ నిషేధాజ్ఞలు జారీలో ఉంటాయని అధికారులు తెలిపారు. ప్రజల్లో ధైర్యం నూరిపోసేందుకు సాయుధ పోలీసులు ముందస్తు కవాతు నిర్వహించారు.

చిక్కమగళూరులో ముందస్తుగా సాయుధుల కవాతు

విద్యార్థినిపై దుష్ట చర్య

బెళగావి: ఓ విద్యార్థిని (17)పై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలపై నాగేశ్వర దేమినకొప్ప అనే అతిథి అధ్యాపకుడిని బెళగావి క్యాంప్ ఠాణా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రెండేళ్లుగా తనను బెదిరించి, ప్రాణహాని తలపెడతానంటూ అత్యాచారానికి పాల్పడుతూ వచ్చాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో బాధితురాలు పేర్కొంది. పోక్సో చట్టం కింద నిందితుడ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజ్వల్ కేసు విచారణ వాయిదా



బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : ఇంట్లో పనిమనిషిపై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలు రుజువు కావడంతో జీవిత ఖైదు శిక్ష పడిన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెయిలు కోసం వేసుకున్న అర్జీ విచారణ బుధవారానికి వాయిదా పడింది. తనకు విధించిన శిక్షపై స్టే విధించి, బెయిలు ఇవ్వాలని ప్రజ్వల్ వేసుకున్న అర్జీపై ఆయన తరఫు న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపించారు. తనపై అత్యాచారం జరిగిందని మూడేళ్ల అనంతరం బాధితురాలు ఫిర్యాదు చేయడం వెనుక కుట్ర ఉందని ఆయన తన వాదనల్లో పేర్కొన్నారు. పలువురిపై లైంగిక దాడులు, అత్యాచారాలను పాల్పడిన అతనికి బెయిలు ఇవ్వకూడదని సిట్ తరఫు న్యాయవాది వాదించారు.

నకిలీ స్టాంపులకు అడ్డుకట్ట

బెంగళూరు (మల్లేశ్వరం): నకిలీ స్టాంపు కాగితాలపై జరిగే ఒప్పందాలను అడ్డుకునేందుకు, పూర్తిస్థాయిలో ఈ-స్టాంపు వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణ భైరేగౌడ ప్రకటించారు. దీన్ని పౌరులు అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పౌరులకు దీన్ని అందుబాటులోకి తీసుకువస్తామని సోమవారం ఇక్కడ చెప్పారు. కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయం ఉంటే, దళారుల అవసరం లేకుండా రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో సొంతంగా ఈ-స్టాంపు కాగితాలను పొందవచ్చని వివరించారు. దస్తావేజుల్లో భాగంగా డిజిటల్ ఈ-స్టాంపు కాగితాలను పొంది, వాటిపై ఈ-సంతకాలను కూడా చేసుకోవచ్చని చెప్పారు. వినియోగదారుడు దేశంలో ఏ ప్రాంతం నుంచి అయినా వీటిని సిద్ధం చేసుకోవచ్చని తెలిపారు. అవసరమైతేనే వాటిని ముద్రించుకోవచ్చని వివరించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9121167525

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 9945050116

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

కృష్ణయ్యకు విశేష అలంకరణ

భక్తిశ్రద్ధలతో..గీతాజయంతి వేడుకలు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: గీతాజయంతిని పురస్కరించుకుని సోమవారం రామాంజినేయనగర్‌లోని గీతామందిరంలో గీతాచార్యుడికి, భగవద్గీత గ్రంథానికి ప్రత్యేక పూజలు చేశారు. పుష్పాలతో కృష్ణయ్యను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గీత గొప్పతనాన్ని ధార్మిక ప్రవచనకారులు భక్తులకు వివరించారు. మందిరం కమిటీ ప్రముఖులు జానకీరామ్, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

గవర్నరు చేతులమీదుగా ప్రశంసాపత్రాలను పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే రఘుమూర్తి

చెళ్లకెర(చిత్రదుర్గం): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 22 మంది జాతీయ సేవాపథకం స్వచ్ఛంద సేవకులు(విద్యార్థులు) తమ సామాజిక సేవల ద్వారా గుర్తింపు పొంది గవర్నరు థావర్‌చంద్ గహ్లోత్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు, అభినందనలు పొందడం తాలూకాకు గర్వకారణమని ఎమ్మెల్యే టి రఘుమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఇక్కడ హెచ్‌పీపీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను అభినందించి, ఎన్ఎస్ఎస్, రోవర్స్, రేంజర్స్, రెడ్‌క్రాస్ కార్యకలాపాలను ప్రారంభించారు. ప్రధానాచార్యుడు దేవప్ప, అధ్యాపకులు చెన్నకేశవ, విజయకుమార్, జగన్నాథ్, జయమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

నెల రోజుల్లో సాంస్కృతిక భవనాలు పూర్తి

నవలి -కల్మంగి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి శివరాజ్ తంగడగి

కారటగి, న్యూస్‌టుడే: కారటగి, కనకగిరి పట్టణాల్లో నిర్మిస్తున్న సాంస్కృతిక భవనాలు, ప్రభుత్వ అతిథి గృహాలను నెల రోజుల్లో ప్రారంభిస్తామని స్థానిక ఎమ్మెల్యే, కన్నడ, సాంస్కృతిక వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ తంగడగి తెలిపారు. నవలి -కల్మంగి, కనకగిరి -బొమ్మసాగర, చిక్క తాండా, యత్నట్టి గ్రామాల రోడ్ల పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం కనకగిరిలో నిర్మాణంలో ఉన్న సాంస్కృతిక భవనం, ప్రభుత్వ అతిథి గృహాలను పరిశీలించి మాట్లాడారు. రూ.2.85 కోట్లతో సాంస్కృతిక భవనం నిర్మిస్తామని, కళాశాల, పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ భవనం నిర్మిస్తున్నామన్నారు. 24 గంటలు ఈ భవనం వద్ద భద్రతా సిబ్బంది ఉంటారన్నారు. క్షేత్రంలోని గ్రామాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై కార్యశాల

బళ్లారి, న్యూస్‌టుడే: పరిశ్రమ, వాణిజ్య శాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, బళ్లారి, విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉదయం 10.30 గంటలకు బళ్లారి, విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ సభాభవనంలో కార్యశాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అల్లం కరిబసప్ప కళాశాలలో..

బళ్లారి, న్యూస్‌టుడే: పరిశ్రమ, వాణిజ్యశాఖ, జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈలపై మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక కంటోన్మెంట్‌లోని వీరశైవ విద్యావర్ధక సంఘం ఆధీనంలోని అల్లం కరిబసప్ప మేనేజ్‌మెంట్ కళాశాలలో కార్యశాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్తుతెలియని మృతదేహాల లభ్యం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి రైల్వే స్టేషన్ ఆవరణలోని ఆటో స్టాండ్‌లో గుర్తుతెలియని వృద్ధ(45) మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రానికి తరలించినట్లు రైల్వే పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. నా పేరు సూర్య, ఇంటి పేరు బండయ్య, 143 అని తెలుగులో రాసిన టీషర్ట్ ధరించారు. మృతుడి సంబంధీకులు ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

● బళ్లారి: బళ్లారి రైల్వే స్టేషన్ వ్యాప్తిలోని కొట్టూరు - హగరిబొమ్మనహళ్లి రైల్వేస్టేషన్ మధ్యలో ఓ గుర్తుతెలియని వృద్ధుని (60) మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. మృతదేహాన్ని శవాగారంలో ఉంచారు. మృతుడి సంబంధీకులు వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని సూచించారు.

తెలుగు కాలమానిని విడుదల


తెలుగు కాలమానిని విడుదల చేస్తున్న కమ్మవారి సంఘం ప్రముఖులు

హొసపేటె, న్యూస్‌టుడే: హొసపేటె కమ్మవారి సంఘం రూపొందించిన 2026వ సంవత్సరం తెలుగు కాలమానిని విడుదల కార్యక్రమం సోమవారం సంఘం భవనంలో జరిగింది. అధ్యక్షుడు మాల్యాద్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు నాగభూషేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి హరిబాబు, సంచాలకులు సురేశ్‌బాబు, అన్నెకోర్, సత్యేంద్ర, వైజయంత నాగరాజ్ పాల్గొని కొత్త సంవత్సరం కాలమానిని విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలమానినిలో తెలుగువారికి కావాల్సిన పంచాంగం, పర్వదినాలు, ఇతర సమాచారాన్ని పొందుపరచామని తెలిపారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

నాటక ప్రదర్శనలో కళాకారులు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి పేటె బసవేశ్వర నీలమ్మ జోడు రథోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మార్కెట్ ప్రాంతంలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన 'సమగార హరళయ్య' నాటకం ఆకట్టుకుంది. కంప్లి, రామసాగర బసవేశ్వర నాట్య కళాసంఘం కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. బసవణ్ణ పాత్రలో సి. చెన్న బసవ, హరళయ్య పాత్రలో కె. హనుమంతప్ప, అల్లమప్రభుగా కె. హాలయ్య, కల్యాణమ్మగా పి.గంగాధర్, లావణ్యమ్మగా పూర్ణిమ మనోహర, మధువరస పాత్రలో సాయి తదితరులు నటించారు. జాగటేరి లింగాయత మహాసభ అధ్యక్షుడు హేమయ్య స్వామి, అక్క మహాదేవి మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ శారదా హిరేమఠ, సమితి సభ్యుడు ఎ.సి.దానప్ప, తాలూకా మహాసభ తాలూకా అధ్యక్షుడు సి.ఎ.చెన్నప్ప పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

అలంకరణలో వీరభద్రేశ్వర శరణ బసవేశ్వర విగ్రహాలు

కారటగి, న్యూస్‌టుడే: కారటగి ప్రజల ఆరాధ్య దైవం వీరభద్రేశ్వర, శరణ బసవేశ్వర ఆలయంలో సోమవారం విశేష పూజలు జరిగాయి. ఆదివారం రాత్రి సహస్ర కార్తిక దీపోత్సవం జరుగగా సోమవారం ఉదయం రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు జరిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాల్ని పరిరక్షించాలి

సిరివారం(మాన్వి): మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందని స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాలకురాలు బ్రహ్మకుమారి జ్యోతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక శరణబసవేశ్వర శాఖామఠంలో శ్రీశైల భ్రమరాంబ గ్రామీణాభివృద్ధి యోజన ద్వారా కుటుంబ నిర్వహణలో మహిళల పాత్ర అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ప్రారంభించి మాట్లాడారు. సంస్థ జిల్లా డైరెక్టర్ మోహన్‌నాయక్ మాట్లాడారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, చంద్రహాస్, అయ్యనగౌడ ఐరెడ్డి, వనితా పాల్గొన్నారు.

పదిలమైన ఫలితాలే లక్ష్యం

■ మిషన్-40 ప్లస్ తరహా బోధన
■ విద్యాశాఖ కసరత్తు

నేర్చుకున్న పాఠాలను బోర్డుపై విద్యార్థులతో రాయిస్తున్న విద్యాశాఖాధికారి ఉమాదేవి

బళ్లారి, న్యూస్‌టుడే: పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో బళ్లారి జిల్లా చివరి మూడు స్థానాల్లో నిలుస్తోంది.. ఉన్నత విద్యాశాఖాధికారుల నుంచి ఏటా జిల్లా విద్యాశాఖాధికారులకు చీవాట్లు తప్పడం లేదు.. ఈ ఏడాది పదో తరగతిలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసి, దాని ఆధారంగా విద్యార్థుల్లో పరిహార బోధన చేస్తూ మిషన్-40ప్లస్ అమలు చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు, క్షేత్ర విద్యాశాఖాధికారులు బీఈవో, సీఆర్‌పీలు జిల్లాలో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం తగ్గిన 73 పాఠశాలలను దత్తత తీసుకున్నారు. వారానికోసారి ఓ పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు బోధించడం, వారిలో మార్పు వచ్చిందా? పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిశీలించి అత్యధికంగా వెనుకబడిన విద్యార్థులు కనీసం ఉత్తీర్ణత సాధించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

33 మార్కులు వస్తే చాలు..

ఈ ఏడాది పదో తరగతిలో 100కు 33 మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లు అవుతుంది. కన్నడ మాధ్యమం విద్యార్థులకు ఆంగ్లం కష్టం కావడం, ఆంగ్ల మాధ్యమ విద్యార్థులకు కన్నడ కష్టంగా భావిస్తున్నారు. ఇలాంటి విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన, పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. భాష సబ్జెక్టుల్లో ఉపాధ్యాయుల చేతుల్లో 25 మార్కులు ఉంటాయి. మిగిలిన సబ్జెక్టుల్లో 20 మార్కులు ఉంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆంగ్లంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి కచ్చితంగా మార్కులు వచ్చే ఆంగ్ల పద్యాలను సాధన చేయించడం, వ్యాసరచన, లేఖ రాయడంలో తర్ఫీదు ఇస్తున్నారు. ఈ మూడు తప్పులు లేకుండా రాస్తే కనీసం 13 మార్కులు వస్తాయి. దీని ఆధారంగా ప్రతి విద్యార్థి తప్పకుండా ఉత్తీర్ణత సాధించడానికి అవకాశం ఉంటుందని బోధన చేస్తున్నారు.

జిల్లాలో 19,587 మంది విద్యార్థులు

బళ్లారి జిల్లా వ్యాప్తంగా 321 ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వం 135, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు 34, ప్రైవేట్ పాఠశాలలు 152 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 19,587 మంది పదో తరగతి విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. గతేడాది పదో తరగతిలో 60.24 శాతం ఉత్తీర్ణత సాధించారు. మూడు విడతల్లో నిర్వహించిన పరీక్షల్లో మొత్తం 86 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది మూడు విడతల్లో కాకుండా రెండు విడుతల్లో మాత్రమే పరీక్షలు ఉండటం వల్ల ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడానికి ప్రయత్నిస్తున్నారు.

05: తోరణగల్లు బసవేశ్వర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారి

ప్రత్యేక దృష్టి పెట్టాం

ఆరుగురు విద్యాశాఖాధికారులు ఒక్కొక్కరు 12 ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత మెరుగుపరచడానికి దత్తత తీసుకున్నాం. వారానికో సారి పాఠశాలలకు వెళ్లి పరిశీలిస్తాం. చదువులో వెనుకబడిన విద్యార్థుల గుర్తించి వారికి ప్రత్యేకంగా సబ్జెక్టులను బోధిస్తున్నాం. కురుగోడు ప్రభుత్వ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు హిందీ అక్షరాలు రావడం గుర్తించి వారిలో మార్పు తీసుకొచ్చాం. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9.30 నుంచి 10.15 వరకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. సాయంత్రం 4 నుంచి 5.15 గంటల వరకు పాఠశాలలో జరిగిన పాఠ్యాంశాలను అదే రోజు నేర్చుకుని పరీక్ష రాసి ఇంటికి వెళ్లే విధంగా చర్యలు చేపట్టాం.

- ఉమాదేవి, జిల్లా విద్యాశాఖాధికారి, బళ్లారి

అతిథి ఉపన్యాసకుల సమస్యలపై చర్చించండి

ఎమ్మెల్యే గణేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం అధ్యక్షురాలు, సభ్యులు

కంప్లి, న్యూస్ టుడే: వేతన పరిష్కరణతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ కళాశాలల అతిథి ఉపన్యాసకులు కంప్లిలో ఎమ్మెల్యే గణేశ్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఉపన్యాసకుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగరత్న మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న తలంపుతో ప్రభుత్వం అతిథి ఉపన్యాసకులను నియమించింది. విద్యార్థులకు చదువుతో పాటు కళాశాలల్లో వివిధ పనులు నిర్వహిస్తూ ఉత్తీర్ణత శాతం మెరుగుకు ప్రయత్నిస్తున్నాం. తమకు ఇచ్చే గౌరవ వేతనం డీ గ్రూపు ఉద్యోగుల కన్నా తక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం నెలకు ఇచ్చే రూ.14 వేల గౌరవ వేతనాన్ని రూ.30 వేలకు పెంచాలంటూ వివిధ సమస్యల గురించి వివరిస్తూ బెళగావిలో జరిగే విధానసభ సమావేశాల్లో తమ సమస్యలను ప్రస్తావించాలని ఎమ్మెల్యేను కోరారు. వివిధ కళాశాలల అతిథి ఉపన్యాసకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో నేడు ఉద్యోగ మేళా

రాయచూరు: రాయచూరు, యాదగిరిలోని కళాశాలల్లో 2024, 25లో డిగ్రీ పూర్తి చేసి, నైపుణ్య శిక్షణ పొందిన విద్యార్థులకు మంగళవారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ యంకణ్ణ వెల్లడించారు. ఆయన సోమవారం పత్రికాభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొత్తం 15 కంపెనీలు నియామకాలు చేపడతాయని, ఇంతవరకూ 775 మంది పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు హాజరయ్యేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. సమావేశంలో ఉద్యోగ విభాగ సంచాలకుడు శివరాజ్, అధ్యాపకులు రాఘవేంద్ర నాయక్, మహంతేశ్ అంగడి ఉన్నారు.

రైతుల సమస్యలపై భాజపా ఆందోళన

కొప్పళలో నిరసన వ్యక్తంచేస్తున్న భాజపా శ్రేణులు

గంగావతి: రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక ధోరణిపై కొప్పళలో సోమవారం భాజపా నిరసన వ్యక్తంచేసింది. భాజపా రైతుమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఏఎస్ పాటిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. చెరకు ధర పెంచమని కోరితే ముఖ్యమంత్రి కేంద్రానికి లేఖరాసి చేతులు దులుపుకొన్నారన్నారు. వరి, మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లేకున్నా పట్టించుకోలేదన్నారు. తుంగభద్ర కాలువల ఆయకట్టుకు రెండో పంటకు నీరివ్వమంటూ చెలగాటమాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కుష్టగి శాసనసభ్యుడు దొడ్డనగౌడ, లోక్‌సభ మాజీ సభ్యుడు శివరామగౌడ, ఎమ్మెల్సీ హేమలతా నాయక్, శాసనసభ మాజీ సభ్యులు పరణ్ణ మునవళ్ళి, బసవరాజ ధడేసూగూరు, నవీన్ గుళగణ్ణవర్, విరుపాక్షప్ప సింగనాళ పాల్గొన్నారు.

గుడార నగర ప్రభుత్వ పాఠశాలను కొనసాగించాలి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి తాలూకా శ్రీధరగడ్డ గ్రామ పంచాయతీ వ్యాప్తిలోని గుడార నగర ప్రభుత్వ పాఠశాలను కొనసాగించాలని కోరుతూ ఏఐడీఎస్‌వో సంఘం సభ్యులు సోమవారం పాఠశాల ముందు నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరణ్ణ నేతృత్వంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. కేపీఎస్ మ్యాగ్నెట్ పాఠశాల పేరుతో రాష్ట్రంలో 40 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిలో బళ్లారి తాలూకా గుడారనగర ప్రభుత్వ పాఠశాల ఉంది. అక్కడ అలెమారి, దిన కూలీలు, కార్మికుల కుటుంబాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఈ పాఠశాలను మూసివేస్తే గుడారనగర విద్యార్థులకు పాఠశాలకు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సభ్యులు తిప్పేస్వామి, కాంతేశ్, రాము, బాబు, గాళెప్ప, కల్యాణ్ కుమార్, మందాకిని, లలితబాయి, మారెక్క, జ్యోతి పాల్గొన్నారు.

పాఠశాలను కొనసాగించాలని నిరసన తెలియజేస్తున్న ఏఐడీఎస్‌వో సంఘం సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

నిరుద్యోగులపై లాఠీఛార్జి చేయడం అమానుషం

బళ్లారి : నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న సంఘం సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగులను భర్తీ చేయాలని ధార్వాడలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగలపై లాఠీఛార్జి చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా నిరుద్యోగుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. సంఘం సభ్యులు పురుషోత్తమ నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. నిరుద్యోగ యువతీ, యువకులు డిమాండ్లు పరిష్కరించాలని ధార్వాడలోని శ్రీనగర నుంచి జిల్లా పాలనాధికారి కార్యాలయానికి ప్రదర్శనగా వస్తున్న సమయంలోనే పోలీసులు అడ్డుకుని లాఠీఛార్జి చేసి అరెస్టు చేశారు. నిరుద్యోగులు గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గంగావతి: ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్న నిరుద్యోగులపై ధార్వాడలో లాఠీఛార్జి చేయడంపై కొప్పళలో ఏఐడీవైవో నిరసన వ్యక్తం చేసింది. సోమవారం విద్యార్థులు కొప్పళలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంధించిన అందరినీ విడుదల చేయాలన్నారు. పోరాటానికి అనుమతి లేదన్న సాకుతో లాఠీలతో కొట్టారన్నారు. ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చినా ఇలా చేయడం దారుణమన్నారు. పదేళ్ల నుంచి ఎలాంటి నియామకాలు చేయక పోవడంతో ఈ ప్రదర్శన నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర సంచాలకులు సిద్ధలింగ బాగువాడి, భవానీ శంకర్, యల్లప్ప హెగ్డే పాల్గొన్నారు.

కొప్పళలో నిరసన వ్యక్తంచేస్తున్న ఏఐడీవైవో కార్య కర్తలు

పొంచి ఉంది ముప్పు.. ఏదీ కనువిప్పు?

విద్యుత్తు నియంత్రిక కింద వంగి వస్తున్న బాలుడు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె 10వ వార్డు మరిస్వామి మఠం ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. వార్డు ప్రజలు భయాందోళన చెందే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారిలో విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేసినా ఎలాంటి భద్రత లేదు. కింద నుంచి అందుకొనే విధంగా ఉంది. రహదారిపై వెళ్లే ప్రజలతో పాటు చుట్టుపక్కల పాఠశాల విద్యార్థులు నియంత్రిక వద్ద మూత్రవిసర్జన చేస్తున్నారు. కొంత మంది విద్యార్థులు దాని కింద వంగి వస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఇప్పటికైనా జెస్కాం అధికారులు నియంత్రికను ఎత్తులో ఏర్పాటు చేసి, చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం పొంచి ఉందని చూపుతున్న స్థానిక మహిళ

యువత రాజకీయాల్లోకి రావాలి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: యువత రాజకీయాల్లోకి వచ్చి రైతులు, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని జేడీఎస్ నాయకుడు వైఎస్‌వి. దత్త పేర్కొన్నారు. సిరిగేరి ఫిర్కా పరిధిలో హావనిహాళ్ గ్రామంలో సోమవారం రాజకీయ అకాడమీ సంస్థ ఏర్పాటు చేసిన నైతిక విలువలతో కూడిన నాయకుడు రామకృష్ణ హెగ్డే అనే కార్యక్రమంలో పాల్గొని ప్రజలను, యువతను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాలకు శాశ్వతమైన అధికారం, రైతుల పంట రుణాలపై వడ్డీ మాఫీ, లోకాయుక్త వంటి వ్యవస్థలను అమల్లోకి తెచ్చింది నాటి ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే ప్రభుత్వమేనన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి కట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయ అకాడమీ గౌరవ అధ్యక్షుడు సిరిగేరి యర్రిస్వామి, ముద్దటనూరు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు శేఖరప్ప, జిల్లా మహిళా అధ్యక్షురాలు పుష్ప, తాలూకా అధ్యక్షుడ శివనారాయణ పాల్గొన్నారు.

సిరిగేరిలో మాట్లాడుతున్న జేడీఎస్ నాయకుడు వై.ఎస్.వి.దత్త

కాస్త.. చూసెళ్లండోయ్!

బళ్లారి నగర పాలికె అనంతపురం రహదారిలోని భూగర్భ మురుగు కాలువ ఛాంబర్ పగలి ప్రమాదంగా మారింది. భారీ వాహనాలు పొరపాటున భూగర్భ ఛాంబర్‌పై వెళ్తే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. పాలికె అధికారులు మురుగుకాలువ ఛాంబర్‌ను మార్పు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, బళ్లారి

రోడ్డుపై మురుగు పరుగు

బళ్లారి నగర పాలికె 17వ వార్డు పరిధిలోకి వచ్చే అల్లం భవనం ముందు భూగర్భ మురుగు కాలువ గొట్టాలు స్తంభించాయి. ఈ మురుగునీరు రహదారిపై పరుగులు తీసింది. రహదారి పక్కన వ్యర్థాల మధ్యలో మురుగు నిలిచిపోవడంతో అపరిశుభ్రంగా తయారైంది. స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు రహదారిపైకి రాకుండా మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బళ్లారి

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

మాన్వి, న్యూస్‌టుడే: పట్టణంలోని వాసవీ కల్యాణ మంటపంలో శ్రీశ్రీనివాస కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ మంటపాన్ని వివిధ రకాల పువ్వులతో తీర్చిదిద్దారు. ప్రముఖ వర్తకులు రాజలబండి తిప్పణ్ణ శెట్టి, ముత్తురాజ్‌శెట్టి, రాఘవేంద్ర శెట్టి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. బెంగళూరు శ్రీవారి ఫౌండేషన్ వెంకటేశ్‌మూర్తి పండితుల సాన్నిధ్యంలో స్వామివారి కల్యాణ ఘట్టాన్ని కళ్లకు కట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర చిన్న నీటిపారుదల, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యానాయక్ హాజరయ్యారు. కొద్దిసేపు కల్యాణాన్ని తిలకించారు. తర్వాత శ్రీవారి పవళింపు సేవ కార్యక్రమాన్ని మనోరంజకంగా నిర్వహించారు. రాత్రి 11.30గంటల వరకు కల్యాణోత్సవం జరిగింది. గోవిందనామస్మరణలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. భక్తులకు రాజలబండి సోదరుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

01-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1622.80	1629.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,081	2,816
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	6,806	6,025
నీటి నిల్వ (టి.ఎం.సి)	69.534	93.278

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

(c) eenadu

అంతర్జాతీయ పోటీలకు
రేవునగరి సుందరీమణులు!

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రూపదర్శులు

మంగళూరు, న్యూస్‌టుడే : రేవునగరికి చెందిన నియతి, విద్యా సంపతి, యశోద రాజేశ్ అంతర్జాతీయ స్థాయి సౌందర్య పోటీలకు ఎంపికయ్యారు. నెదర్లాండ్‌లో నిర్వహించనున్న మిస్ యూనివర్స్ సెల్యులార్ పోటీలకు వచ్చే తరగతి విద్యార్థిని నియతి ఎంపిక కాగా, దుబాయిలో నిర్వహించే మిసెస్ ఇంటర్నేషనల్ టూరిజం క్వీన్ పోటీలకు యశోద రాజేశ్, ఫిలిప్పైన్స్‌లో నిర్వహించే మిసెస్ ఎర్త్ ఇంటర్నేషనల్ ఇండియా పోటీలకు విద్యా సంపత్ ఎన్నికయ్యారు. దేశంలో వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించే సౌందర్య పోటీల్లో పాల్గొంటూ ఆయా విభాగాల్లో ఇప్పటి వరకు విజేతలుగా నిలిచారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన అనంతరం మెర్సీ బ్యూటీ అకాడమీ నిర్వాహకురాలు మెర్సీ వీణా డిసోజా, ఫ్యాషన్ మోడలింగ్ స్టూడియోలో మార్గదర్శి దీపక్ గంగూలీ ప్రత్యేకంగా గ్రూమింగ్, శిక్షణ ఇస్తున్నారు. తన కుమార్తె పోటీలలో విచిత్ర వేషధారణ, ఇతర పోటీల్లో పాల్గొనడం చేసిన అనంతరం తాను కూడా పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి వచ్చిందని యశోద రాజేశ్ తెలిపారు.

అడవి లాంటి తోట.. అన్నదాత కలల పంట!

అడవిలాంటి తోటలో ప్రకాశ్ మంచాలె

శివమొగ్గ, న్యూస్‌టుడే : మలెనాడు ముఖద్వారం శివమొగ్గలో సేద్యం చేయడం కత్తిమీద సాము అని చెప్పవచ్చు. ప్రకృతి విపత్తులు, వన్యప్రాణుల దాడులు, కొత్తగా కొన్ని పంటలకు సోకుతున్న తెగుళ్లు. ఇవన్నీ తట్టుకుని నిలబడం అన్నదాతను సతమతం చేస్తున్న అంశాలు. సాగర తాలూకా మంచాలె గ్రామానికి చెందిన ప్రకాశ్ మంజాలె తన తోటను అడవిలా చేసుకుని లాభాలను ఆర్జిస్తుండటం ఇతర రైతులను ఆశ్చర్యం గొలుపుతోంది. రైతు కుటుంబానికి చెందిన ప్రకాశ్ పూర్వీకులు అందరూ సేద్యం చేస్తూనే వచ్చారు. వక్క, కాఫీ, మిరియాలు, కోకో తదితరాలను సాగు చేసేవారు. వంశపారంపర్యంగా ప్రకాశ్‌కు నాలుగెకరాల భూమి వచ్చింది. వక్క, కాఫీ, మిరియాలు, కోకోతో పాటు పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలు, కలప ఉపయోగపడే వృక్షాలు, అలంకార మొక్కలు, సుగంధ ద్రవ్యాలు తదితర 20 రకాలను తన పొలంలో నీడ కమతాల్లో వేశారు. నీడ అవసరమయ్యే మొక్కలను భారీ వృక్షాలకు చేరువలో ఉండేలా చేసుకున్నారు. పెద్ద వృక్షాలు, చెట్ల నీడ ఇతర పంటలపై పడకుండా జాగ్రత్త తీసుకున్నారు. ప్రకాశ్ వ్యవసాయ క్షేత్రంలోకి వెళితే చిట్టడివిలోకి వెళ్లినట్లే ఉంటుంది. స్థానిక కెళది శివప్ప నాయక వ్యవసాయ, ఉద్యాన శాఖ విద్యార్థులు తరచూ ఈ తోటకు వచ్చి అధ్యయనం చేసుకుని వెళుతుంటారు. సాగర తాలూకాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు వచ్చి ప్రకాశ్ మంచాలె మార్గదర్శనం పొందుతారు. గత 14 ఏళ్లుగా సేంద్రియ సాగు చేస్తూ అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణను పొందారు. వర్షం నీటిని నిలువ చేసుకోవడం అవసరానికి అనుగుణంగా బిందు, తుంపర సేద్యాలను కొనసాగిస్తున్నారు. భారీ వర్షాలు, తుపాను పరిస్థితుల్లో పంటలు దెబ్బతినకుండా, నేల కోతకు గురికాకుండా ఉండేందుకు పొలం చుట్టూ, మధ్యలో ఉండే చెట్లు, వృక్షాలు సహకరిస్తాయి. నేలలో తేమ ఆవిరి కాకుండా రాలిన చెట్ల ఆకులు అడ్డుకుంటాయి. కొద్ది రోజులకు అవే ఎరువుగా ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. తన పొలాన్ని కొబ్బరి, వక్క తోట, అడవి తోట, ఔషధ వనం, మసాలా దినుసుల సాగు విభాగంగా విభజించుకున్నారు. పొలం చుట్టూ చిన్న కందకాలను తీసుకుని దానిలో నీరు ఉండేలా, దాని పక్కనే కంచెను ఏర్పాటు చేసుకున్నారు. పొలంలో వేర్వేరుగా ఒక వరుసగా కాకుండా కాలిబాట ఏర్పాటు చేసుకున్నారు. అడవిలా ఉండే తోట్లలో ఫంగస్ సమస్య ఉంటుంది. ఆ సమస్య లేకుండా, సున్నం, బోర్డో ద్రావణాన్ని ఉపయోగించుకుంటానని ఆయన వివరించారు. నిత్యం ఆకుకూరలు, పండ్లు, కూరగాయలతో పాటు కాలానుగుణంగా వక్క, కాఫీ, మిరియాలు ఇతర ఉత్పత్తులు వస్తుంటాయని ఆయన తెలిపారు. తన సాగు విధానాలను చుట్టుపక్కల రైతులు ఇప్పుడు అనుసరిస్తూ వస్తున్నారని చెప్పారు.



విరగకాసిన మిరియాల తీగ

చురుకుగా పులుల వేట

ఇప్పటికే పట్టుకున్న పులులు

ఇప్పటికే 22 పట్టివేత

మైసూరు, న్యూస్‌టుడే : అడవికి సరిహద్దులుగా ఉన్న గ్రామాల్లోకి వచ్చి వెళుతున్న 22 పులులను బంధించామని అటవీశాఖ డీసీఎఫ్ పరమేశ్ తెలిపారు. వీటిలో 12 పులి పిల్లలు ఉన్నాయని చెప్పారు. గత 42 రోజులుగా వరుసగా కార్యాచరణను కొనసాగించారు. బంధించిన పులులను జంతు ప్రదర్శనశాలలతో పాటు బండీపుర, నాగరహొళెలోని పులుల సంరక్షణ వలయానికి తరలించామని చెప్పారు. హెడియాల, ఆలనహళ్లి, బడగలపుర, ఈరప్పన కొప్పలు, దేవలాపుర, పురదకట్టె ప్రాంతాల్లో వీటిని పట్టుకున్నామని తెలిపారు. ప్రతి ఏడాది సెప్టెంబరు నుంచి డిసెంబరు మధ్యలో పులులు పిల్లల్ని పెడతాయి. తమకు, పిల్లలకు సురక్షిత ప్రదేశాలను వెతుక్కుంటూ, అడవుల నుంచి గ్రామ శివారు ప్రాంతాలకు వస్తుంటాయని ఆయన వివరించారు. మరికొన్ని పులులు గ్రామాల సమీపంలో సంచరిస్తున్నాయని వచ్చిన ఫిర్యాదులతో కార్యాచరణను కొనసాగిస్తామని తెలిపారు.

వలలో పట్టుకు వస్తున్న పులి పిల్ల

సూరీడు.. కానరాడే!

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : తుపాను ప్రభావంతో బెంగళూరు నగరంలో చలి అధికమవుతోంది. వాతావరణంలో పెనుమార్పుల ఫలితంగా చలి ఎక్కువైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాజధాని వీధుల్లో రెండు రోజుల నుంచి సూర్యుడు అదృశ్యమయ్యాడు. చినుకులతో కూడిన చల్లటి వాతావరణానికి తోడు చిరుగాలి వణికిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రత 15- 18 డిగ్రీల మధ్య కొట్టుమిట్టాడుతోంది. పగలు 21 నుంచి 23 డిగ్రీల సెల్సియస్ మాత్రమే నమోదవుతున్నట్లు అధికారులు వివరించారు. రెండేళ్ల తరువాత అత్యధిక చల్లని వాతావరణం ఇప్పుడే ఎక్కువైనట్లు గుర్తించారు. తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో పరిస్థితి తీవ్రతను ఎదుర్కోవడం ఏమంత సులువు కాదు. వీధులకే వస్తే చలిపులి కొరకడం మొదలెడుతుంది. ప్రస్తుత తుపాను ప్రభావం ముగిశాక ఈ స్థితిలో కొంత మార్పు తథ్యమని అంచనా వేస్తున్నారు. బెంగళూరుతో పాటు ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో చలి తీవ్రమైంది. వృద్ధులు, బాలలు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయవేళ.. ఆలస్యంగా ఇంటి నుంచి బయటకు రావాలని, భద్రమైన దుస్తులు ధరించాలని, తరచుగా అవసరమైన వేడినీరు తాగాలన్నారు. శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాద నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరని హెచ్చరించారు.

బెంగళూరు నగరంపై పొగమంచు దుప్పటి

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	55
క్యారెట్-	70
బీరకాయలు-	60
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	105
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	80
టమాటా(సాధారణ)-	55
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	60
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	140

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	165
గ్రీన్ ఆపిల్-	325
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	30
ఆరంజి-	95
బత్తాయి-	60

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

అధికారుల దొడ్డ మనసు!

అతిథులకు చక్కని భోజన వసతి..

మైసూరు, న్యూస్‌టుడే : దొంబిదాస సంచార తెగకు చెందిన అశ్విని వివాహం హుణసూరు తాలూకా కుప్పె గ్రామానికి చెందిన పుట్టరాజుతో హెబ్బాళలోని లక్ష్మీకాంత దేవాలయంలో ఆదివారం నిర్వహించారు. వధువు, వరుని కుటుంబ సభ్యులు నిరుపేదలే. ఈ విషయాన్ని తెలుసుకున్న నగర డీసీపీ సుందర్ రాజ్, ఎన్ఆర్ పోలీసు ఠాణా ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ తళవార వివాహానికి వచ్చిన అతిథులకు తమ సొంత ఖర్చులతో భోజన వ్యవస్థను కల్పించారు. వివాహం చేసేందుకు, భోజనాలు పెట్టించేందుకు కూడా డబ్బులు లేక అప్పు కోసం ఇరు కుటుంబాలు ప్రయత్నించాయి. పలు వారాలుగా వివాహాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. దళిత సంఘర్ష సమితి నాయకుడు వెంకటేశ్ ద్వారా మొదట లక్ష్మీకాంత్ తళవార సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకుని డీసీపీ సుందర్ రాజ్ తన సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఇరువైపులా కుటుంబ సభ్యులు, బంధువులు 200 మంది రాగా అందరికీ మృష్టాన్న భోజనం, కొబ్బరికాయ, తాంబూల వ్యవస్థను కల్పించడంతో పాటు, వధూ, వరులు జీవితాన్ని ప్రారంభించేందుకు కొంత ఆర్థిక సహకారాన్ని అందించారు. పోలీసుల దాతృత్వానికి దొంబిదాస సముదాయం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన దంపతులతో కుటుంబ సభ్యులు

విమానాశ్రయానికి మరిన్ని బస్సులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : ఉద్యాననగరి నుంచి కెంపేగౌడ విమానాశ్రయం వరకు వాహన సేవలను విస్తరించడానికి బీఎంటీసీ ముందుకు వచ్చింది. నగర శివారు ప్రాంతాల వారికే ప్రత్యేకించి హెబ్బాళ ఎస్టీమ్ మాల్ బస్టాప్ నుంచి విమానాశ్రయం వరకు ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పదింటి వరకు ఈ బస్సుల సేవలు అందుబాటులో ఉంటాయి. రెండు ప్రాంతాల మధ్య ఛార్జీ రూ.30గా నిర్ణయించారు. బ్యాటరాయనపుర, ఐఏఎఫ్, చిక్కజాల స్టాపుల్లో ఆగుతాయి. అనంతపురం, హిందూపురం, చిక్కబళ్లాపుర, దొడ్డబళ్లాపుర, గౌరిబిదనూరు ప్రాంతాల నుంచి హెబ్బాళలో దిగే ప్రయాణికులు విమానాశ్రయం చేరుకోవడానికి ఈ వ్యవస్థ ఉపకరిస్తుందని బీఎంటీసీ అధికారులు వివరించారు.

ఎస్టీమ్ మాల్ సమీపంలో సేవలకు సిద్ధంగా బస్సులు

యువ పోటీలకు చక్కని స్పందన

తాడులాగుడు పోటీల్లో యువత ఉత్సాహం

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరులో లోక్‌సభ సభ్యుని క్రీడా మహోత్సవాల్లో భాగంగా 'ఫిట్ యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 35 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. మైసూరు విశ్వవిద్యాలయంలోని ఓవల్ మైదానంలో 300 మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత, పోలీసులు, అగ్నిమాపకదళ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే దిశలో ఈ తరహా పోటీలను నిర్వహిస్తున్నామని ఎంపీ యదువీర్ ఒడెయరు తెలిపారు. వివిధ విభాగాల్లో మైసూరు ప్యాంథర్స్, యదువీర్ బ్రిగేడ్, ఫైర్ ఫైటర్స్, మైసూరు సిటీ పోలీసు, మైసూరు టైగర్స్, సీఎఫ్ఓ జోన్ మైసూరు ఫైర్ మొదటి, రెండో స్థానాల్లో నిలువగా, మహిళల విభాగంలో మారమ్మ కొడుగు, మైసూరు భాజపా మహిళా మోర్చా, కూర్గ్ వింగ్స్, రెయిన్ బ్రో వారియర్స్ జట్టు ట్రోఫీ, పతకం, ప్రమాణ పత్రాలు అందుకున్నాయి.

సమాజ ఉన్నతికి విద్యార్థుల్లో జాగృతి

వేదికపై మాట్లాడుతున్న పోలీసు ఉన్నతాధికారులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : మహిళల సంక్షేమం, మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, సంచార నిబంధనలపై అవగాహన విషయంలో విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తామని నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ వెల్లడించారు. బెంగళూరులో సోమవారం ఏర్పాటు చేసిన ఓ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నగరంలో ఉన్న 750 మంది పోలీసు ఉన్నతాధికారులు విడతలవారీగా 1,250 పాఠశాలలు, కళాశాలలను సందర్శించి 2.5 లక్షల మంది విద్యార్థులను జాగృతం చేస్తారని ప్రకటించారు. మహిళల సంక్షేమం, రక్షణకు సహాయవాణి: 1090 సంప్రదించాలని సూచించారు. పోలీసుల ఆధ్వర్యంలో నడిచే 'హోయసళ' గస్తీ వాహన వ్యవస్థను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడంతో పాటు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పోలీసుల సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కూర్చున్న సీమంత్‌కుమార్‌సింగ్

హనుమమాల భక్తులకు సదుపాయాలు

గంగావతి,న్యూస్‌టుడే: హనుమదీక్ష చేపట్టి అంజనాద్రికి వచ్చే భక్తులకు ఊరూరా సదుపాయాలు కల్పించినట్లు కొప్పళ లోక్‌సభ సభ్యుడు రాజశేఖర్ హిట్నాళ తెలిపారు. ఆయన సోమవారం కొప్పళలో విలేకరులతో మాట్లాడారు. కొప్పళ అథ్లెటిక్ అసోసియేషన్, పరిశ్రమలు, స్థానికుల సహకారంతో ఈ ఏర్పాట్లు చేశామన్నారు. కొండపై జరిగే ధార్మిక కార్యక్రమాలను తిలకించేందుకు దిగువన ఎల్ఈడీ తెరలను అమర్చినట్లు చెప్పారు. పాదయాత్ర చేసే భక్తులకు ఊరూరా విశ్రాంతి, భోజన సదుపాయం కల్పించామన్నారు. సంగాపుర కణివే ఆంజనేయ, ఆనెగుంది దుర్గాదేవి, తిరుమలాపుర, సణాపుర బాలాంజనేయ, అగళకెరా అందగాళేశ్వర, హిట్నాళ క్రాస్, ఆనెగుంది కృష్ణదేవరాయ విగ్రహం వద్ద పందిళ్లు వేసినట్లు ఎంపీ చెప్పారు. పలుచోట్ల స్నానఘట్టాలు ఏర్పాటు చేశామన్నారు. స్నానానికి సబ్బులు బదులు శనగపిండి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. భక్తులెవరూ ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించక సహకరించాలని కోరారు. తమ దుస్తులను నదిలో పారేయకుండా ఎంపిక చేసిన చోట వేయాలన్నారు. కొప్పళ నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

వాకథాన్‌కు పచ్చ జెండా

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం జారీ చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పిలుపునిచ్చారు. జయనగరలో 'శక్తి సంజె' పేరిట ఆదివారం రాత్రి నిర్వహించిన చీరతో వాకథాన్‌కు పచ్చ జెండా ఊపి మాట్లాడారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి, ఇతర ప్రతినిధులు పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు శ్రద్ధ తీసుకుంటున్నారని ప్రశంసించారు. వివిధ పోటీల్లో విజేతలను సత్కరించి, వారికి చీరలు బహూకరించారు. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, నటి పూజా గాంధీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చీరలో వాకథాన్‌కు జెండా ఊపుతున్న డీకే శివకుమార్

అసమర్థ అధికారులతో అపఖ్యాతి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ఉద్యాననగరి బెంగళూరు రహదారులు, వాహన రద్దీ సమస్యలు ఇటీవల తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో బెంగళూరు ట్రాఫిక్‌పై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'బెంగళూరులో ట్రాఫిక్ చాలా ఘోరంగా ఉంది. నగర పోలీసులు నిష్ప్రయోజకులు' అని విమర్శలు గుప్పించారు. బెంగళూరుకు వచ్చి, ఇక్కడి నుంచి పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు తాను ఆదివారం దిల్లీ బయల్దేరగా.. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయానని ఆక్రోశించారు. వాహన రద్దీని క్లియర్ చేసేందుకు రహదారిపై ఒక్క ట్రాఫిక్ పోలీస్ కనిపించలేదన్నారు. విమానాశ్రయానికి సకాలంలో చేరుకునేందుకు ఇబ్బంది కావడంతో నగర పోలీసులను సంప్రదించినా.. అటునుంచి స్పందన కరవైందని సోమవారం తన సామాజిక మాధ్యమ వేదికలపై అసహనం వ్యక్తం చేశారు.

● ఈ ట్రాఫిక్ సమస్యను సోషల్ మీడియా వేదికగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దృష్టికి రాయ్ తీసుకెళ్లారు. బెంగళూరులో ట్రాఫిక్ నిర్వహణ సరిగా లేదని, అందమైన నగరంగా ప్రఖ్యాతి చెందినా ఇప్పుడు అసమర్థ అధికారుల తీరుతోనే అపఖ్యాతిని మూటగట్టుకుంటోందని విమర్శించారు. ట్రాఫిక్ సమస్యలతో అందరి నుంచి విమర్శలు ఎదుర్కొంటోందని అన్నారు. దీంతో నగర ట్రాఫిక్‌పై మరోసారి చర్చ మొదలైంది.

ఎక్కువైన విమర్శలు..: బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ సమస్యలపై ఇటీవల పలువురు ప్రముఖులు తీవ్రంగా విమర్శిస్తూ వస్తున్నారు. బయోకాన్ పార్క్‌కు వచ్చిన ఓ విదేశీ విజిటర్ నగరంలోని రోడ్లు, చెత్తపై చేసిన వ్యాఖ్యలతో తాను ఇబ్బందిపడ్డానని బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా పేర్కొనడంతో ఈ సమస్యపై చర్చలు మొదలయ్యాయి. ఇటీవల వ్యోమగామి శుభాన్షు శుక్లా బెంగళూరు ట్రాఫిక్‌పై స్పందిస్తూ. . బెంగళూరు రహదారులపై ప్రయాణం కన్నా అంతరిక్షంలోకి వెళ్లడమే సులువని అసహనం వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. బెంగళూరులో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి రూ.19 వేల కోట్ల విలువైన భూగర్భ సొరంగ రహదారి పనులకు టెండర్లు పిలిచామని గుర్తు చేశారు.

EENADU Classifieds
JOBS
హైదరాబాద్ / గుంటూరులోని CCTV కంపెనీకి ఫ్రెషర్స్ కావలెను, శాలరీ: 14000/-. ✆ 97315 67105, 97317 22666.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

నాద మండపంలో 'గీతా'రవిందం!

భగవద్గీత శ్లోకాలు పఠిస్తున్న వారితో గణపతి సచ్చిదానంద స్వామి

మైసూరు, న్యూస్‌టుడే : రాచనగరి గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలోని నాదమండపంలో ఐదు వేల మంది భక్తులు, మహిళలు, గాయకులు భగవద్గీతలోని 700 శ్లోకాలను పఠించారు. గీతా జయంతిలో భాగంగా ఆరేళ్ల నుంచి 75 ఏళ్ల వయసున్న దేశ, విదేశాలకు చెందిన భక్తులు భగవద్గీతలోని అన్ని శ్లోకాలను రాగయుక్తంగా పఠించారు. గీతలోని అన్ని శ్లోకాలను కంఠోపాఠం చేసి పఠించిన 948 మంది విద్యార్థులు, సాధకులకు గణపతి సచ్చిదానంద స్వామి బంగారు పతకాన్ని, ప్రమాణ పత్రాన్ని, బహుమతులను ఆదివారం రాత్రి వితరణ చేశారు. గీతలోని ప్రతి వాక్యాన్ని అర్థం చేసుకుని, జీవితంలో అలవర్చుకుంటే, ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన భక్తులకు పిలుపునిచ్చారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని ఒంటబట్టించుకున్న మన పూర్వీకులు గీతా సారాన్ని అనుసరించేవారని గుర్తు చేశారు. కొందరు శ్రీమంతులు చిన్న భగవద్గీత పుస్తకాలను ముద్రించి, ప్రజలకు ఉచితంగా వితరణ చేసేవారని తెలిపారు. ఆ సంప్రదాయాన్ని మళ్లీ తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని సూచించారు. వచ్చే ఏడాది జనవరి 22న హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఇదే తరహా గీతా శ్లోక పఠన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

పండగ సందడికి తెరతీసిన వేళ!

భారీ క్రిస్మస్ చెట్టు.. రంగుల దీపాల మధ్య మెరిసేట్టు..!

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : క్రిస్మస్.. డిసెంబరు వచ్చిందంటే ఆ పండగ సందడే వేరు! క్రిస్మస్ తాత చేసే సందడి.. బాలల హడావుడి అంతా ఇంతా కాదు. ఈ వేడుకల్లో భాగంగా బళ్లారి రోడ్డులోని ఓ ప్రముఖ మాల్‌లో 75 అడుగుల ఎత్తైన క్రిస్మస్ చెట్టును ముందస్తుగా ఏర్పాటు చేయడంతో అక్కడ సందడి నెలకొంది. వివిధ రంగాలకు చెందిన సెలబ్రిటీలు రణ్ విజయ్ సింగ్, ప్రిన్స్ నరులా, ప్రియాంక్ శర్మ, రాజీవ్ లక్ష్మణ్, అరుణ్ శర్మ దీన్ని ఆవిష్కరించారు. బాణసంచా కాల్పులు, విద్యుత్తు దీపాల వెలుగుల మధ్య చెట్టు అందాలు మిరమిట్లు గొలుపుతున్నాయి. డిసెంబరు నెలాఖరు వరకు వేడుకలు, వివిధ సాంస్కృతిక పోటీలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహక సంస్థ ప్రతినిధి రితు మెహ్తా వెల్లడించారు. క్రిస్మస్ ట్రీ ఏర్పాటు సందర్భంలో డీజే నిఖిల్ చిన్నప్ప, మరికొందరు గాయకుల ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది.

క్రిస్మస్ గీతాలను ఆలపిస్తున్న యువతులు.. అక్కడే జనసందడి

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

నృత్యం చేస్తున్న చిన్నారులు

పాఠశాలల వేదికలను ఉపయోగించుకోవాలి

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు పాఠశాలల్లోని వేదికలను విస్తృతంగా వినియోగించుకోవాలని స్పేస్ మ్యాట్రిక్స్ గ్లోబల్ సంస్థ ప్రధాన ఆర్థిక అధికారిణి, అకౌంటెంట్ సారిక పిలుపునిచ్చారు. సౌందర్య పాఠశాల వార్షికోత్సవాల్లో భాగంగా 'మనలోని అద్భుత భూమి- భావనల మ్యాజిక్‌ను ఆవిష్కరించుకోవడం' అనే పరికల్పనతో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. చక్కని ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు ఆమె ప్రశంసాపత్రాలు, ట్రోఫీలు వితరణ చేశారు.

పుస్తకాన్ని విడుదల చేసిన రామ్‌మాధవ్

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ తాను రచించిన శాఖా టూ నేషన్: ది గ్రేట్ స్పీచెస్ ఆఫ్ ఆర్‌ఎస్‌ఎస్ పుస్తకాన్ని బీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. దిల్లీలో అక్టోబరులో ఈ పుస్తకాన్ని మొదట విడుదల చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు హెచ్‌బీ హెగ్డేవార్, ఎంఎస్ గోల్వాల్కర్, మోహన్ భాగవత్ వేర్వేరు సందర్భాల్లో చేసిన ప్రసంగాలు, దేశం కోసం ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న సేవా కార్యక్రమాలు, తదితర అంశాలను ఈ పుస్తకంలో పొందుపరచానని ఆయన తెలిపారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, భాజపా సానుభూతిపరులతో రామ్ మాధవ్ ముఖాముఖి అయ్యారు. మిథిక్ సొసైటీ అధ్యక్షుడు వి నాగరాజ్, వ్యాపార చరిత్రకారుడు శ్రీరామ్ దేవతతో కలిసి పలువురి ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు.

హోసూరు కబుర్లు

మళ్లీ డీఎంకే, కాంగ్రెస్ జోడీ

హోసూరు, న్యూస్‌టుడే: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్ జోడీగానే పోటీ చేస్తాయని వక్తలు పేర్కొన్నారు. రింగ్ రోడ్డులో ఫిన్‌టెక్ సంస్థ ప్రారంభోత్సవంలో కృష్ణగిరి లోక్‌సభ సభ్యుడు కె.గోపీనాథ్, కాంగ్రెస్ విభాగం ఆర్.టి.ఐ. అధ్యక్షుడు కనకరాజ్, హోసూరు ఐ.ఎన్.టి.యు.సి. నాయకులు మాజీ ఎమ్మెల్యే కె.ఎ.మనోహరన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతిని వెలిగించి సంస్థను ప్రారంభించారు. కార్యక్రమానికి సంస్థ ఆర్.టి.ఐ. ఉపాధ్యక్షుడు తిరువేంకటం, సంస్థ ఛైర్మన్ ఆర్.టి.ఐ. ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ నేతృత్వం వహించారు. కార్యక్రమంలో కనకరాజ్ మాట్లాడుతూ డి.ఎం.కె. ఫ్రంటులో మిత్ర పక్షంగా ఉండడానికి తాము ఇష్టపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బ్యాలెట్ పద్ధతిలోనే ఓటింగ్ పెట్టాలని ఎన్నికల కమిషన్ అధికారులను కోరారు. కార్యక్రమంలో హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయరు ఎస్.ఎ.సత్య, ఉప మేయరు సి.ఆనందయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎ.మురళీధరన్, కార్పొరేటర్లు ఇంద్రాణి, దేవీ, భాగ్యలక్ష్మి, ఎన్.ఎస్. మాదేశ్వరన్, మైనార్టీ విభాగం హుస్సేన్, ఎన్.ఎ.సురేశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జ్యోతిని వెలిగిస్తున్న ఎంపీ గోపినాథ్, మాజీ ఎమ్మెల్యే కె.ఎ.మనోహరన్, కాంగ్రెస్ నాయకులు కనకరాజ్

కళాశాల డైరెక్టర్‌కు గౌరవ ప్రశస్తి

హోసూరు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన డాక్టర్ జి.రంగనాథ్ హోసూరు అదియమాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించి ఉత్తమ పేరు ప్రతిష్ఠలు పొందారు. సాంకేతిక విజ్ఞానంలో పరిశోధనలకు అనేక ప్రశస్తులు పొందారు. తాజాగా పాండిచ్చేరి ఎస్.ఎం.వి.ఇ.సి కళాశాల్లో గౌరవ ఫెలోషిప్ అవార్డు వరించింది. కార్యక్రమానికి విచ్చేసిన మాజీ విద్యా శాఖ మంత్రి సత్యపాల్‌సింగ్, ముంబాయి పోలీసు కమిషనరు(విశ్రాంత)డాక్టర్ పి.కె.దేశాయి తదితర ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశస్తిని అందుకున్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

డాక్టర్ రంగనాథ్‌ను సత్కరిస్తున్న ముఖ్య అతిథులు

ఉప విద్యుత్తు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

డెంకణీకోట న్యూస్‌టుడే: శివారులోని సందనపల్లి ప్రజల కోరిక మేరకు సోమవారం తళి ఎమ్మెల్యే రామచంద్రన్ ఉప విద్యుత్తు కేంద్రాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం వల్ల ఈ ప్రాంత ప్రజలు డెంకణీకోట వెళ్లాల్సిన అవసరం లేదని.. ఇక్కడే ప్రతి సమస్య పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మండల విద్యుత్తు శాఖ అధికారి మ్లాడుతూ ఈ కేంద్రం ఇక్కడ ఏర్పాటు కావడానికి తళి ఎమ్మెల్యే రామచంద్రన్, జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ కృషే కారణమన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉప డైరెక్టర్, ఉప ఇంజినీర్, కార్మికులు పాల్గొన్నారు....

ఉప విద్యుత్తు కేంద్రాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే

రైతులకు వర్షం తెచ్చిన ఇక్కట్లు

డెంకణీకోట న్యూస్‌టుడే: తాలూకాలోని డెంకణీకోట, తళి, అంచెట్టి, కెలమంగలం, రాయకోట ప్రాంతాల్లో రాగి పండించే రైతులు ఎక్కువగా ఉన్నారు. ఈ రైతులు గత 15 రోజులుగా తాము పండించిన రాగి పంటలను యంత్రాలతో కోస్తున్నారు. ఈ యంత్రాలు తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడకు తీసుకువచ్చి రాగులు కొసేవారు. కాని గత 10 రోజులుగా తాలూకాలో పలుచోట్ల విస్తృతంగా వర్షం కురుస్తుండడంతో ఇటు రైతులు, అటు యంత్రాలకు పనిలేక తీవ్ర ఇబ్బందికి గురౌతున్నారు.

పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే: బన్నేరుగట్ట అడవుల నుంచి వచ్చిన సుమారు 35 ఏనుగులు జవళగిరి, చూడసంద్రం, డెంకణీకోట ప్రాంతంలో సంచరిస్తూ పంటల్ని ధ్వంసం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తున్న ఈ ఏనుగులు సోమవారం సినిగిరిపల్లి మార్గంలోని బోడిచిపల్లి వద్ద పాలిటెక్నిక్ కళాశాల పరిసరాల్లోకి వచ్చాయి. ఈ ఏనుగులు ఆ ప్రాంత్రంలోని రాగి, వరి, జొన్న, ఆనప, టెంకాయ చెట్లను నాశనం చేశాయని రైతులు వాపోతున్నారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ప్రజల సహాయంతో భారీ శబ్దాలు చేస్తూ, బాణసంచా కాలుస్తూ వాటిని మరగట్ట అడవుల వైపు తరిమివేశారు.

అడవి బాట పట్టిన ఏనుగులు

మాజీ ఎమ్మెల్యే దేవరాజ్ కన్నుమూత

మైసూరు, న్యూస్‌టుడే : ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్‌వీ దేవరాజ్ సోమవారం కన్నుమూశారు. దైవ దర్శనం కోసం ఆయన చాముండీ బెట్టకు వెళ్లిన సమయంలో గుండెపోటు వచ్చింది. ఆయన పరిస్థితి గుర్తించిన అనుచరులు వెంటనే ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. ఆయన కన్నుమూసినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

వేదికపై చర్చాగోష్ఠిలో అతిథులు

సాంస్కృతిక ఉత్సవానికి విశేష స్పందన

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: కబ్బన్ ఉద్యానవనంలోని సెంచరీ క్లబ్‌లో నిర్వహించిన 'గ్రీన్ లిటరేచర్ ఫెస్టివల్'కు విశేష స్పందన లభించింది. అయిదో ఏడాది నిర్వహించిన ఈ సాహిత్య ఉత్సవాల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వంద మందికి పైగా రచయితలు ఉత్సవాల్లో నిర్వహించారు. చర్చాగోష్ఠలలో పాల్గొన్నారు. విద్యార్థులు, యువత కోసం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కథలు, సాహిత్య రచనలకు సంబంధించిన శిబిరంలో యువ, ఔత్సాహిక రచయితలు పాల్గొన్నారు. అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఇండియా, అట్రి, బెంగళూరు హబ్బ, బీప్యాక్ తదితర సంస్థలు సాహిత్య ఉత్సవాలకు మద్దతు ఇచ్చాయి.

జగజ్జేతలకు సత్కారం.. సంబరం

ప్రపంచ విజేతలుగా భారత కీర్తి పతాకను ఎగురవేసిన క్రీడాకారిణులు రాజధానిలో సోమవారం సందడి చేశారు. కబడ్డీ విశ్వ విజేత జట్టు సభ్యురాలు ధనలక్ష్మీ పూజారి ఘనంగా సత్కారం అందుకున్నారు. అంధుల క్రికెట్ టీ-20 ప్రపంచ చాంపియన్లు దీపికా బృందాన్ని అభిమానులు అభినందనల్లో ముంచెత్తారు.

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: ప్రపంచకప్ గెలిచిన భారత కబడ్డీ జట్టు సభ్యురాలు, ఆళ్వాస్ క్లబ్ క్రీడాకారిణి ధనలక్ష్మీ పూజారిని కువెంపు సభాగంణంలో ఘనంగా సన్మానించారు. సోమవారం మూడబిదిరే ఆళ్వాస్ ప్రతిష్ఠాన దక్షిణ కన్నడ జిల్లా అమెచ్యూర్ కబడ్డీ సంఘం, మూడబిదిరే తాలూకు అమెచ్యూర్ కబడ్డీ సంఘం, బ్రహ్మశ్రీ గురునారాయణస్వామి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ప్రతిష్ఠాన అధ్యక్షుడు డాక్టర్ ఎం.మోహన్‌ఆళ్వా ధనలక్ష్మీపూజారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో క్రీడా సాధకులను మరింతగా ప్రోత్సహించేలా ప్రభుత్వ ఉద్యోగాలను అందిస్తూ సహకరిస్తున్నాయన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలను అందించేందుకు ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర అమెచ్యూర్ కబడ్డీ సంఘం గౌరవాధ్యక్షుడు రాకేశ్‌మల్లి మాట్లాడారు. సన్మానం అందుకున్న ధనలక్ష్మీ మాట్లాడుతూ ప్రపంచ వేదికలో మువ్వన్నెల జెండాను ఎగరేసిన ఆ మధుర క్షణాలను తన జీవితంలో మరపురాని ఘడియలని పేర్కొంది. తన్న యశస్సుకు ఆళ్వాస్ సంస్థ పాత్రను కొనియాడిన ధనలక్ష్మీ ఆళ్వాస్‌కు తాను చేరకపోతే ఈ సాధన తనతో అయ్యేది కాదని అన్నారు.

మోహన్‌ఆళ్వా, తదితర ప్రముఖుల చేతుల మీదుగా ధనలక్ష్మీ పూజారికి సత్కారం

సమర్థనంలో అభిమానుల ధూం..ధాం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: విశ్వవిజేతలుగా నిలిచిన భారత అంధుల మహిళల క్రికెట్ జట్టు సభ్యులు దేశవ్యాప్తంగా వేల మంది అభిమానుల ప్రశంసలందుకొని సోమవారం సొంతగడ్డ సమర్థనం కళాకేంద్రానికి విచ్చేశారు. భారత జట్టు నాయకి టి.సి. దీపిక, సభ్యులు వి. కావ్య, ఎన్.ఆర్.కావ్య లకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. కళాకేంద్రంలో టపాసులు, వాయిద్యాలతో అభినందనలు తెలుపుతూ అట్టహాసం చేశారు. జట్టు మేనేజర్ శిఖ, ఫిజియో రాజశ్రీ కూడా క్రీడాకారిణుల వెంట ఉన్నారు. పండగ వాతావరణం నెలకొన్న కళాకేంద్రంలో సమర్థనం ట్రస్ట్ స్థాపకుడు, భారత అంధుల క్రికెట్ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్.మహంతేశ్ కివడణ్ణనవర్ తన సొంత బిడ్డలుగా వారిని ఆహ్వానించారు. జట్టు సభ్యుల సంకల్పం, సమర్థనం ట్రస్ట్ శ్రమ ఫలితంగా ఈ క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో ప్రతిభ చాటారని వారిని కొనియాడారు.

మహంతేశ్‌తో దీపికా, కావ్య, ఎన్.కావ్య, శిఖా, రాజశ్రీ

అక్రమ కట్టడాల కూల్చివేతలు

బెంగళూరు(బాణసవాడి), న్యూస్‌టుడే: గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను అధికారులు గుర్తించి వాటి కూల్చివేతల ప్రక్రియ చేపట్టారు. బెంగళూరు తూర్పు నగర పాలికె పరిధిలోని హుడీ ప్రాంతంలో అక్రమంగా వెలసిన నిర్మాణాలను సోమవారం ఉదయం నుంచి అధికారులు సమక్షంలో కార్మికులు కూల్చివేయడం ప్రారంభించారు. ఒక అంతస్తుకు అనుమతి తీసుకుని మూడు అంతస్తులు నిర్మించడంతో, పాలికెకు రావాల్సిన పన్నులు రావడం లేదు. దీంతో పాలికె ఆదాయం పడిపోతోంది. అలాంటి భవనాలను గుర్తించిన అధికారులు దగ్గరుండి కూల్చివేయిస్తున్నారు. ఆ ప్రాంతంలో రెండు భవనాలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను గుర్తించామని వాటిని కూల్చివేస్తామన్నారు. మహదేవపుర, మారతహళ్లి, కుందనహళ్లి, దొడ్డగుబ్బి, కృష్ణరాజపురం, దేవసంద్ర, రామమూర్తినగర, బాణసవాడి తదితర ప్రాంతాల్లో అక్రమంగా తలెత్తిన భవనాలను గుర్తించామని, యజమానులకు నోటీసులు ఇచ్చి తొలగింపు పనులు చేపడతామని వివరించారు. అక్రమ కట్టడాలు వల్ల పాలికె ఆదాయానికి గండిపడుతుందన్నారు.

హుడీలో అనుమతి లేని నిర్మాణాలను తొలగిస్తున్న కార్మికులు

నాణ్యతకే ప్రాధాన్యం

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: మాంసాహారం కన్నా, శాకాహారంలోనే రుచికర వంటకాలు ఉంటాయని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీశ్ రెడ్డి పేర్కొన్నారు. నాణ్యత, రుచి, ధరకు తగిన పరిమాణంలో పౌష్టికాహారాన్ని అందించే హోటళ్లకు డిమాండ్ ఉంటుందన్నారు. బేగూరు రోడ్డులో కొత్తగా ప్రారంభించిన 'జీఆర్ రుచికర' శాకాహార హోటల్‌ను, కేంద్ర మాజీ మంత్రి నారాయణ స్వామి, హోటల్ యజమాని గోపాలరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు.

స్వదేశీ రక్షణ సాంకేతికత అభివృద్ధి

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: కర్ణాటకకు చెందిన న్యూరాలిక్స్ ఏఐ అంకుర పరిశ్రమ రక్షణ శాఖ కోసం దేశంలో మొదటి 'స్వదేశీ కృత్రిమ మేధస్సుతో పని చేసే సాంకేతికత'ను అభివృద్ధి చేసింది. ఆత్మనిర్భర్ భారత్ నినాదానికి అనుగుణంగా ఈ సాంకేతికతను అభివృద్ధి చేశామని సంస్థ సహవ్యవస్థాపకుడు విక్రం జయరామ్ తెలిపారు. దిల్లీలోని మానిక్‌షా కేంద్రంలో నిర్వహిస్తున్న 'చాణక్య రక్షణ' చర్చాగోష్ఠిలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ ఈ సాంకేతికత సేవలను ప్రారంభించారని ప్రకటించారు.

హెచ్‌ఐవీ నియంత్రణకు సమష్టి భాగస్వామ్యం

తుమకూరు, న్యూస్‌టుడే: జిల్లాలో హెచ్‌ఐవీ రోగుల కోసం సరైన వసతి సౌకర్యాలు లేని కారణంగా హెచ్‌ఐవీ రోగులకు ప్రభుత్వేతర సంస్థలు సహకారం అందించాల్సిందిగా జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా కానూను సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి నూరున్నీసా పిలుపునిచ్చారు. నగరంలోని జిల్లా ఆస్పత్రి ఆవరణలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. జాగృతి జాథాకు పచ్చజెండా ఊపి ప్రారంభించి ఆమె మాట్లాడారు. హెచ్‌ఐవీ రోగులకు ప్రభుత్వం నుంచి మాత్రమే అన్ని సాయాలు అందడం సాధ్యం కాదని పలు దేశాల్లో ప్రభుత్వేతర సంఘాలు, సంస్థలు సమాజసేవా కార్యకలాపాల్లో పాల్గొనే విషయాన్ని వివరించారు. హెచ్‌ఐవీ పట్ల జనాల్లో జాగృతిని పెంపొందించాల్సి ఉందన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి మోహన్‌దాస్ మాట్లాడారు. జానపద కళా బృందాలతో సామాన్యుల్లో జాగృతిని పెంచుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమాధికారి డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ అశోక్ నియంత్రణ సిబ్బంది పాల్గొని నగరంలోని ప్రముఖ వీధుల్లో జాథా కొనసాగింది.

జాగృతి జాథాను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి నూరున్నీసా తదితరులు

నిరంతర శిక్షణతో ఒలింపిక్స్ స్వర్ణాలు సాధ్యమే: సీఎం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: చక్కని శిక్షణ, అనుభవం ఉన్న కోచ్‌లు, సౌకర్యాలు ఉంటే ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించడం కష్టం కాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం రాష్ట్ర యువజన సేవా క్రీడాశాఖతో ఏర్పాటు చేసిన 2022-2023 పరధికి ఏకలవ్య, జీవమానసాధన, కర్ణాటక క్రీడారత్న, కర్ణాటక క్రీడాపోషక ప్రశస్తి వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. యవనికాలో జరిగిన ఈ వేడుకల్లో సిద్ధరామయ్య మాట్లాడుతూ క్రీడాకారులు తమ లక్ష్యం దిశగా నిరంతరం కృషి చేయాలన్నారు. ఏడు కోట్ల కన్నడిగులు ఉన్న కర్ణాటక నుంచి పతకం సాధించడం గొప్పసంగతి కాదన్నారు. ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ క్రీడా పోటీల్లో బంగారు పతకం విజేతకు రూ.ఆరు కోట్ల నగదు పురస్కారం గ్రేడ్-1, లేక గ్రేడ్- ప్రభుత్వ ఉద్యోగం, వెండిపతకానికి రూ.నాలుగు కోట్లు కాంస్య పతక విజేతలకు రూ.మూడు కోట్లను అందిస్తామన్నారు. నాలుగు లక్షల నగదు పురస్కారంతో 30 మందికి ఏకలవ్య ప్రశస్తి అందించామని ఇకపై ప్రతి ఏడాది ఈ ప్రశస్తులు అందించాలని అధికారులకు సూచించారు. మూడు లక్షల నగదు బహుమతితో రాష్ట్ర క్రీడాకారులను తీర్చిదిద్దిన తొమ్మిది మంది కోచ్‌లకు అందించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే సాధకులను గుర్తించి 15 మందికి క్రీడారత్న ప్రశస్తి, రూ.రెండు లక్షల నగదు అందించామన్నారు. క్రీడాభివృద్ధికి కానుకలిస్తున్న ప్రైవేట్ సంస్థలను గౌరవించి క్రీడాపోషక ప్రశస్తిని వారికి ప్రదానం చేశారు.

ప్రశస్తి గ్రహీతలతో సీఎం సిద్ధరామయ్య తదితరులు

యువతి ఆత్మహత్యపై దర్యాప్తు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: సాఫ్ట్‌వేర్ ఇంజినీరు అచలా(22) హత్యా ఘటనపై పుట్టనహళ్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆమె ఉపయోగించిన చరవాణులను పోలీసులు స్వాధీనం చేసుకుని పరీక్ష చేసేందుకు ఎస్ఎఫ్ఎల్ ప్రయోగశాలకు పంపించారు. చరవాణిలో అచలా ఆమె ప్రియుడు మాయాంక్ మధ్య జరిగిన సంభాషణ, చాటింగ్ సమాచారాన్ని నిపుణులు సేకరిస్తారు. హసన్‌కు చెందిన అచలా ఉపాధి కోసం నగరానికివచ్చి జేపీనగర ఐదో స్టేజిలోని పాండురంగనగరలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మేనమామ వద్ద ఉండేవారు. ప్రియుడి వేధింపు తట్టుకోలేక గత నెల21న మేనమామ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రూ.8 కోట్ల జరిమానా వసూలు

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: సంచార నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులు 50శాతం జరిమానా చెల్లింపునకు వాహనదారులు నుంచి విశేష స్పందన వస్తుందని పోలీసు అధికారులు తెలిపారు. గత 10 రోజుల్లో రూ.8కోట్లు జరిమానా వసూలైనట్లు తెలిపారు. 2,82,793 కేసులు పరిష్కారమైనట్లు చెప్పారు. 50 శాతం జరిమానా చెల్లింపు ఈనెల12వ తేదీ వరకు అనుమతిస్తారు.

దర్శన్.. ఆహారానికి వరుసలో నిలబడాలి

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో గత మూడున్నర నెలల నుంచి పరప్పన అగ్రహార కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న నటుడు దర్శన్‌కు కష్టాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు బ్యారక్‌కు సిబ్బంది ఆహారం, అల్పాహారం, తేనీరు, కాఫీ, నీరు తదితరాలను తీసుకు వచ్చి ఇస్తున్నారు. కారాగారానికి ఇన్‌ఛార్జిగా వచ్చిన ఐపీఎస్ అధికారి ఈ నియమావళిని మార్చి వేశారు. సాధారణ ఖైదీగానే దర్శన్‌ను పరిగణించాలని, ఇతర ఖైదీల తరహాలో వరుసలో వచ్చి ఆహారాన్ని తీసుకోవాలని ఆదేశించారు. మరో వైపు బెయిలు కోసం న్యాయవాదులతో దర్శన్ సమాలోచన చేస్తున్నారు.

అంత్యక్రియలకు హాజరై..గుండెపోటుతో మృతి

చామరాజనగర, న్యూస్‌టుడే: హనూరు తాలూకా అణగళ్లిదొడ్డి గ్రామానికి చెందిన దొడ్డలింగయ్య (84) వృద్ధాప్య ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ శనివారం కన్నుమూశారు. ఆయన కుమారుడు మల్లణ్ణ (54) శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించి ఇంటికి వచ్చారు. కొంత సమయం అనంతరం ఛాతీ పట్టుకుని కుప్పకూలి పోయారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా ఆయన మరణించారు. హలగాపుర ప్రాథమిక పాఠశాలలో మల్లణ్ణ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. తండ్రి మరణంతోనే ఆయన వ్యధకు గురౌవ్వడంతో గుండెపోటు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. మల్లణ్ణ భౌతిక కాయానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డుప్రమాదంలో పాదచారి..

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: రహదారి దాటుతున్న పాదచారిని వేగంగా వచ్చిన కారు ఢీకొనటంతో ఆవ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి దేవనహళ్లి సంచార పోలీసు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. మృతుడిని జార్ఖండ్ నివాసి పింటు పాశ్వన్(29)గా పోలీసులు గుర్తించారు. ఉదయగిరి లేబర్ షెడ్‌లో నివసించేవారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్రైం కార్నర్

రౌడీషీటరు హత్య

మండ్య, న్యూస్‌టుడే: పాండవపుర తాలూకా అమృతి గ్రామంలో మహేశ్ (40) అనే రౌడీషీటరు హత్యకు గురయ్యాడు. లక్ష్మీసాగర గ్రామానికి చెందిన మహేశ్ బెంగళూరులో ఆటో డ్రైవరు. న్యాయస్థానంలో ఒక కేసు విచారణకు హాజరయ్యేందుకు గత శుక్రవారం ఊరికి వచ్చారు. శనివారం అర్ధరాత్రి వరకు స్నేహితులు మరిగౌడ, కిరణ్‌తో కలిసి మద్యం తాగాడు. బైకులో ఊరికి వెళ్తుండగా, కారులో వచ్చిన భీమ, రోహిత్, కేశవ, సిద్ధరాజు అనే వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసి పరారయ్యారు. బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించాడు. పాత కక్షలే హత్యకు కారణమని ప్రాథమిక విచారణలో గుర్తించారు. నిందితుల కోసం పాండవపుర గ్రామీణ ఠాణా పోలీసులు గాలింపు చేపట్టారు.

బస్సును ఢీకొని..యువకుడి దుర్మరణం

ముళబాగిలు, న్యూస్‌టుడే: ధర్మస్థల సమీపంలోని నెల్యాడిలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో దొడ్డిగనహళ్లి గ్రామ యువకుడు పి.దీపక్ (24) మృతి చెందాడు. ధర్మస్థలంలో స్నేహితుడి వివాహానికి వెళ్తూ కారును దాటే ప్రయత్నంలో రాష్ట్ర రవాణా బస్సును ఢీకొనడంతో ప్రమాదం బారిన పడ్డాడు. స్థానికులు అతణ్ని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. కోలారు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించాక కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బెల్తంగడి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

కోటేకల్ ప్రమాదంలో మరొకరి మృతి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కోటేకల్ జాతీయ రహదారిపై కారు, ఫార్చ్యూన్ కారు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగమ్మ(65) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. గ్రామీణ పోలీసుల వివరాల మేరకు.. ఆ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన కన్నడిగుల మృతుల సంఖ్య ఆరుకు చేరింది. శనివారం జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన గంగమ్మ భర్త వెంకటేశప్ప, మనవడు బినీత్‌గౌడ్, కూతురు మీనాక్షి, అల్లుడు సతీష్‌కుమార్ వీరి సంతానం రుత్విక్ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ చేతన్, గంగమ్మను చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గంగమ్మ ప్రాణాలు కోల్పోయారు. చేతన్ చికిత్స పొందుతున్నారు.

నిందితులకు శిక్ష విధించిన న్యాయస్థానం

ముళబాగిలు, న్యూస్‌టుడే: కోలారు జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లలో నమోదైన అనేక కేసుల్లో న్యాయస్థానం విచారణ పూర్తి చేసి నిందితులకు శిక్ష విధించింది. ఆయా కేసుల్లో నిందితులపై అభియోగాలు రుజువైనట్లు న్యాయమూర్తి ఎస్.శకుంతల తీర్పు ప్రకటించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

పావగడ,న్యూస్‌టుడే: తాలూకాలోని కోటగుడ్డ సహన పాఠశాల విద్యార్థులు సోమవారం జరిగిన క్లస్టర్ స్థాయి ప్రతిభా కారంజి వివిధ కళా పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో విజయం సాధించి తాలూకా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దేశభక్తి గీతం, భక్తిగీతం, చిత్రకళ, ధార్మిక పఠనం, ఆంగ్ల కంఠోపాఠం, కన్నడ కంఠోపాఠం, హిందీ కంఠోపాఠం, కవన వచన, అభినయగీత, కథలు చెప్పడం, మిమిక్రీ, భరతనాట్యం, రంగోలి, క్విజ్, జానపద గీతాలు తదితర పోటీల్లో మొత్తం 18 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని పాఠశాల నిర్వాహకులు ఎన్.శ్రీనివాసులు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఎన్.నరసింహప్ప, ఉపాధ్యాయులు లీలావతి, జినిశ్, జీజో, శ్వేత, మరియా, త్రివేణి, శిల్ప, చంద్రకళలు అభినందించారు.

ప్రశంసాపత్రాలు అందుకొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

అల్పాహార 'విందు' రాజకీయాలు

చిత్రదుర్గం,న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అల్పాహార విందు సమావేశాలంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారే కానీ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి బి.శ్రీరాములు విమర్శించారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి రెండున్నర సంత్సరాలు గడచినా ఇంకా పాలనపై సరైన దృష్టి పెట్టలేదన్నారు. అధికారమే పరమావధిగా కీచులాటలు కొనసాగుతున్నాయన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవుల ఆరాటంతోనే దిల్లీ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తీవ్రంగా విమర్శించారు. లక్షలాది మంది రైతులు సమస్యలు ఎదుర్కొంటుంటే వీరికి పట్టడం లేదన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు

సర్జాపురలో కుశాల్స్ నగల దుకాణం షురూ

బెంగళూరు(ఆడుగోడి),న్యూస్‌టుడే: ప్రముఖ ఆభరణాలు దుకాణం కుశాల్స్ జ్యువెలరీ సర్జాపురలో ప్రారంభమైంది. దేశీయ శైలిలో ఫ్యాషన్ ఆభరణాలకు ఖ్యాతి పొందింది. వెండితో చేసిన పెళ్లిళ్లకు సంబంధించిన వస్తువులు, ఎథ్నిల్ సిల్వర్ వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు ఆకట్టుకునే విధంగా ఫ్యాషన్ ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

హరిత మారథాన్‌కు చక్కని స్పందన

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేసేలా భారతీయ స్టేట్ బ్యాంకు నగరంలో ఆరో ఎడిషన్ గ్రీన్ మారథాన్‌ను నిర్వహించింది. నైస్ రోడ్డులో వేకువ జామునే ప్రారంభమైన మారథాన్‌ను సంస్థ ప్రతినిధులు వీఎన్ శర్మ, లేఖా మేనన్, ప్రఫుల్లకుమార్ జెనా, వెంకటగిరి చెలగంశెట్టి, శ్రీకాంత్ గుడివాడ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 5500 మంది 5, 10, 21 కి.మీ. (హాఫ్ మారథాన్)లో పాల్గొన్నారు. వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్‌కు అనువైన ఉత్పత్తులను వినియోగించడం, మొక్కలు నాటి సంరక్షించడం, కాలుష్యాన్ని తగ్గించే చర్యలకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇచ్చేలా జాగృతి కల్పించేందుకు నిర్వహించిన గ్రీన్ మారథాన్‌లో విజేతలకు నగదు ప్రోత్సాహకాలను వితరణ చేశారు. బెంగళూరుతో మరికొన్ని ఇతర నగరాల్లోనూ ఈ పరుగును నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలతో నిర్వాహకులు

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

ఆలయంలోని హనుమంతుడు

కృష్ణానది ఒడ్డున నేడు హనుమద్ వ్రతం

రాయచూరు, న్యూస్‌టుడే: తాలూకా కాడ్లూరు గ్రామానికి దగ్గర్లోని కృష్ణానది ఒడ్డున వెలసిన ఆలయంలో మంగళవారం హనుమద్ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ సమితి సభ్యులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉదయం పతకావిష్కరణ, ఆంజనేయుడికి పంచామృతాభిషేకం, వాయుస్తుతి పునశ్చరణ మంత్రం, అష్టోత్తర పఠనం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం, స్వామి వారికి మంగళహారతి, కృష్ణమ్మకు హారతి ఇస్తారు. సమితి సభ్యులు రంగరావు దేశాయి, జయకుమార దేశాయి, విజయకుమార దేశాయి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని భక్తుల్ని కోరారు.

నిరుద్యోగులపై లాఠీఛార్జి అమానుషం

రాయచూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని సోమవారం ధార్వాడ్‌లో ఆందోళన చేసిన నిరుద్యోగులపై లాఠీఛార్జి చేయడాన్ని ఉద్యోగ ఆకాంక్షితుల పోరాట సమితి రాష్ట్ర సహ సంచాలకుడు చెన్నబసవ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఊరేగింపు చేస్తున్న వారిపై లాఠీలు ఝళిపించడం దారుణమని పేర్కొన్నారు. నిర్బంధించిన నిరుద్యోగులు, యువకులు, సంఘాల ప్రతినిధులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండు చేశారు. ర్యాలీకి అనుమతి తీసుకోలేదన్న కారణాన్ని చూపి పోరాటాన్ని నిర్వీర్యం చేసేందుకు సర్కారు ప్రయత్నించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలను భర్తీ చేయక నిరాశతో కూరుకుపోయిన యువత పోరుబాటను ఎంచుకున్నట్లు తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాల్ని పరిరక్షించాలి

సిరివార,(మాన్వి): మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు మహిళలు నడుం బిగించాలని స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంచాలకురాలు బ్రహ్మకుమారి జ్యోతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సజ్జలశ్రీ శరణమ్మ తాయి శాఖామఠంలో శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ట్రస్టు కుటుంబ నిర్వహణలో మహిళల పాత్ర అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ధర్మస్థల సంస్థ మహిళల అభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మహిళల సబలీకరణ దిశగా సంస్థ ఎంతగానో చేయూతనిస్తుందని కొనియాడారు. సంస్థ జిల్లా డైరెక్టర్ మోహన్‌నాయక్ మాట్లాడారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, చంద్రహాస్, అయ్యనగౌడ ఐరెడ్డి, వనితా, జ్ఞానమిత్ర, సుధా, యశోదా, రేణుకా తదితరులు పాల్గొన్నారు.

జన జాగృతితోనే హెచ్‌ఐవీ నిర్మూలన

రాయచూరు: రాబోయే ఐదేళ్లలో (2030 నాటికి) హెచ్‌ఐవీ వ్యాప్తిని నిర్మూలించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడానికి ప్రజా సహకారం అవసరమని జిల్లా కోర్టు న్యాయమూర్తి, న్యాయసేవల ప్రాధికార సభ్య కార్యదర్శి హెచ్.ఎ.సాత్విక్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం సోమవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలో జన జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించింది. నగరంలో సంచరించే జాతాను సాత్విక్ ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌ఐవీ బారిన పడే వారిలో యువత అధికంగా ఉండడం ఆందోళన కల్గిస్తోందన్నారు. లైంగిక రోగాల నివారణ పట్ల అవగాహన కల్పించేందుకు ఆరోగ్య శాఖ చేపట్టిన కార్యక్రమాల్లో అంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రోగుల పట్ల వివక్షత చూపొద్దని విజ్ఞప్తి చేశారు. డీహెచ్‌ఓ డాక్టర్ సురేంద్రబాబు ప్రసంగిస్తూ ఈ జబ్బును పూర్తిగా నయం చేసేందుకు మందులు లేవని, వ్యాధిగ్రస్తులు జీవితాంతం మందులు వాడాలని తెలిపారు. శారీరక సుఖాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. జాతా.. మహవీర, భగత్‌సింగ్ కూడళ్ల మీదుగా డీహెచ్‌ఓ కార్యాలయాన్ని చేరుకుంది. జిల్లా సర్జన్ డాక్టర్ విజయశంకర్, ఆర్‌సీహెచ్ అధికారిణి డాక్టర్ ఎం.ఎస్.నందితా, సర్వేక్షణాధికారి డాక్టర్ గణేశ్, రిమ్స్ నర్సింగ్ ప్రిన్సిపల్ శ్రీశైల శంకరరెడ్డి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుగుణ, వైద్యులు మనోహర్ పత్తార్, ఇస్రత్ సిద్దికీ, సోమనాథ్, అరుణా, ఆరోగ్య శాఖ సిబ్బంది ఈశ్వర దానప్ప, బసయ్యా, అర్చన, సంతోష్‌కుమార్ హాజరయ్యారు.

ప్రసంగిస్తున్న న్యాయమూర్తి సాత్విక్

నగరంలో సంచరిస్తున్న జాతా

వ్యాధిగ్రస్తులను వేరుగా చూడొద్దు

మాన్వి,న్యూస్‌టుడే: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను సమాజం చూసే దృష్టి కోణం మారాలని, వారిని సమాజంలో వేరుచేసి చూడటం సరికాదని లయోలా జాగీర్ పన్నూరు ఆరోగ్య కేంద్రం సంచాలకురాలు సిస్టర్ లీనాపాయస్ పేర్కొన్నారు. విశ్వఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆరోగ్య శాఖ, లయోలా సమాజ సేవా కేంద్రం, లయోలా సమూహ శిక్షణ సంస్థల ఆధ్వర్యంలో ఎయిడ్స్ జాగృతి జాతాను నిర్వహించారు. స్థానిక బస్టాండులో చేసిన కార్యక్రమంలో కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నృత్య రూపకం ప్రదర్శించారు. ఈ క్రమంలో పలువురు వక్తలు, ఆరోగ్యాధికారులు మాట్లాడారు. ఆరోగ్య శిక్షణాధికారి చిన్నుబాబు, లయోలా సమాజ సేవా కేంద్రం సంచాలకుడు ఫాదర్ జార్జ్ పింటో, ఐసీటీసీ ప్రయోగశాల సాంకేతిక అధికారి గిరీశ్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ జాతాను ప్రారంభిస్తున్న లీనాపాయస్

నేడు ఉద్యోగ మేళా

రాయచూరు, న్యూస్‌టుడే: రాయచూరు, యాదగిరిలోని కళాశాలల్లో 2024, 25లో డిగ్రీ పూర్తి చేసి, నైపుణ్య శిక్షణ పొందిన విద్యార్థులకు మంగళవారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ యంకణ్ణ వెల్లడించారు. ఆయన సోమవారం పత్రికాభవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొత్తం 15 కంపెనీలు నియామకాలు చేపడతాయని, ఇంతవరకు 775 మంది పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

మాన్వి, న్యూస్‌టుడే: పట్టణంలోని వాసవీ కల్యాణ మంటపంలో శ్రీనివాస కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ మంటపాన్ని వివిధ రకాల పుష్పాలతో తీర్చిదిద్దారు. ప్రముఖ వర్తకులు రాజబండి తిప్పణ్ణ శెట్టి, ముత్తురాజ్‌శెట్టి, రామచంద్ర శెట్టి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. బెంగళూరు శ్రీవారి ఫౌండేషన్ వెంకటేశ్‌మూర్తి పండితుల సాన్నిధ్యంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కళ్లకు కట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర చిన్ననీటి శాఖ, సాంకేతిక శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసరాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ హాజరయ్యారు. కొద్దిసేపు కల్యాణాన్ని తిలకించారు. తర్వాత శ్రీవారి పవళింపు సేవ కార్యక్రమాన్ని మనోహరంగా నిర్వహించారు. రాత్రి 11.30గంటల వరకు కల్యాణోత్సవం జరిగింది. గోవిందనామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. హాజరైన ప్రముఖులు, భక్తులకు రాజబండి సోదరుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న సామాజిక నాటకం

రాయచూరు, న్యూస్‌టుడే: గోవింద స్వామి, పెద్దన్న స్వామి తాతల జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి రాయచూరు తాలూకా బాయిదొడ్డి గ్రామంలో 'కలియుగంలో గర్జించిన కర్ణ అర్జున' సామాజిక నాటకాన్ని ప్రదర్శించారు. రంగ నక్షత్ర సాంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నాటకాన్ని గ్రామ పంచాయతీ అధ్యక్షుడు ఆంజనేయ ప్రారంభించారు. కళాకారులు అద్భుత నటన, హావ భావాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రెండు గంటల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. గ్రామ ప్రముఖులు బి.మల్లేశ్‌రెడ్డి, కె.సి.నరసణ్ణ, కిశోర్‌రెడ్డి, గోవిందనాయక్, మల్లేశ్ నాయక్ తదితరులు వీక్షించారు.

నకిలీ అనిశా అధికారి ముఠా అరెస్టు

వరంగల్ క్రైం, న్యూస్‌టుడే: అనిశా డీఏస్పీనంటూ ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ డబ్బులు దండుకుంటున్న నకిలీ డీఎస్పీతో పాటు ఆయనకు సహకరించిన నలుగురిని వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి చరవాణులు, రూ.9 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కమిషనరేట్‌లో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ నిందితుల వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి పుట్టపర్తి జిల్లా నల్లమాడ మండలం వేలమద్ది గ్రామానికి చెందిన రాచపల్లి శ్రీనివాస్ ఎలియాస్ మంగళ శ్రీను, వాసు అనిశా డీఏస్పీగా చలామణి అవుతున్నాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన నవీన్ జేవర్, మంగళ రవీందర్, మురళీ, ఎన్.ప్రసన్నలతోపాటు సూర్యప్రకాశ్, తాటిపర్తి వేణు, కొత్తకోట రమణ కలిసి ముఠాగా ఏర్పాటయ్యారు. రాచపల్లి శ్రీనివాస్ అనిశా డీఎస్పీ అంటూ ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న అధికారులను లక్ష్యంగా చేస్తూ బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు సంపాదిస్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా ఆర్‌అండ్‌బీలో ఎంవీఐగా పని చేస్తున్న తుమ్మల జైపాల్‌రెడ్డికి ఫోన్ చేసి ఏసీబీ డీఎస్పీనంటూ బెదిరించి సుమారు రూ.10 లక్షలను వివిధ మార్గాల్లో దోచాడు.

వాహనచోదకులకు గాయాలు

రాయచూరు, న్యూస్‌టుడే: లారీ, బైకు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన చోదకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులైన అయ్యణ్ణ, అమరేశ్‌ను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. రాయచూరు తాలూకా కల్మల సమీపంలోని సీతానగర్ క్యాంపునకు దగ్గరలో రహదారిలో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ ముందున్న వాహనాన్ని తప్పించబోయే క్రమంలో లారీ అదుపు తప్పి పొలంలోకి దూసుకుని బోల్తా పడింది. డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహన చోదకులు సిరివార నుంచి రాయచూరుకు వస్తుండగా ఇంటికి బిగించే ఇనుప కడ్డీలను రవాణా చేస్తున్న లారీ సిరివార వైపు వెళ్లింది. పరస్పరం వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

బోల్తా పడిన లారీ

నాద మండపంలో 'గీతా'రవిందం!

భగవద్గీత శ్లోకాలు పఠిస్తున్న వారితో గణపతి సచ్చిదానంద స్వామి

మైసూరు, న్యూస్‌టుడే: రాచనగరి గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలోని నాదమండపంలో ఐదు వేల మంది భక్తులు, మహిళలు, గాయకులు భగవద్గీతలోని 700 శ్లోకాలను పఠించారు. గీతా జయంతిలో భాగంగా ఆరేళ్ల నుంచి 75 ఏళ్ల వయసున్న దేశ, విదేశాలకు చెందిన భక్తులు భగవద్గీతలోని అన్ని శ్లోకాలను రాగయుక్తంగా పఠించారు. గీతలోని అన్ని శ్లోకాలను కంఠోపాఠం చేసి పఠించిన 948 మంది విద్యార్థులు, సాధకులకు గణపతి సచ్చిదానంద స్వామి బంగారు పతకాన్ని, ప్రమాణ పత్రాన్ని, బహుమతులను ఆదివారం రాత్రి వితరణ చేశారు. గీతలోని ప్రతి వాక్యాన్ని అర్థం చేసుకుని, జీవితంలో అలవర్చుకుంటే, ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన భక్తులకు పిలుపునిచ్చారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని ఒంటబట్టించుకున్న మన పూర్వీకులు గీతా సారాన్ని ఆచరించేవారని గుర్తు చేశారు. కొందరు శ్రీమంతులు చిన్న భగవద్గీత పుస్తకాలు ముద్రించి, ప్రజలకు ఉచితంగా వితరణ చేసేవారని తెలిపారు. ఆ సంప్రదాయాన్ని మళ్లీ తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని సూచించారు. వచ్చే ఏడాది జనవరి 22న హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఇదే తరహా గీతా శ్లోక పఠన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

పండగ సందడికి తెరతీసిన వేళ!

క్రిస్మస్ గీతాలను ఆలపిస్తున్న యువతులు.. అక్కడే జనసందడి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: క్రిస్మస్.. డిసెంబరు వచ్చిందంటే ఆ పండగ సందడే వేరు! క్రిస్మస్ తాత చేసే సందడి.. బాలల హడావుడి అంతా ఇంతా కాదు. ఈ వేడుకలో భాగంగా బళ్లారి రోడ్డులోని ఓ ప్రముఖ మాల్‌లో 75 అడుగుల ఎత్తైన క్రిస్మస్ చెట్టును ముందస్తుగా ఏర్పాటు చేయడంతో అక్కడ సందడి నెలకొంది. వివిధ రంగాలకు చెందిన సెలబ్రిటీలు రణ్ విజయ్ సింగ్, ప్రిన్స్ నరూలా, ప్రియాంక్ శర్మ, రాజీవ్ లక్ష్మణ్, అరుణ్ శర్మ దీన్ని ఆవిష్కరించారు. బాణసంచా కాల్పులు, విద్యుత్తు దీపాల వెలుగుల మధ్య చెట్టు అందాలు మిరమిట్లు గొలుపుతున్నాయి. డిసెంబరు నెలాఖరు వరకు వేడుకలు, వివిధ సాంస్కృతిక పోటీలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహక సంస్థ ప్రతినిధి రితు మెహ్తా వెల్లడించారు. క్రిస్మస్ ట్రీ ఏర్పాటు సందర్భంలో డీజే నిఖిల్ చిన్నప్ప, మరికొందరు గాయకుల ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది.

భారీ క్రిస్మస్ చెట్టు.. రంగుల దీపాల మధ్య మెరిసేట్టు..!

చురుగ్గా పులుల వేట

ఇప్పటికే 22 పట్టివేత

ఇప్పటికే పట్టుకున్న పులులు

మైసూరు, న్యూస్‌టుడే : అడవికి సరిహద్దులుగా ఉన్న గ్రామాల్లోకి వచ్చి వెళుతున్న 22 పులులను బంధించామని అటవీశాఖ డీసీఎఫ్ పరమేశ్ తెలిపారు. వీటిలో 12 పులి పిల్లలు ఉన్నాయని చెప్పారు. గత 42 రోజులుగా వరుసగా కార్యాచరణను కొనసాగించారు. బంధించిన పులులను జంతు ప్రదర్శనశాలలతో పాటు బండీపుర, నాగరహొళెలోని పులుల సంరక్షణ వలయానికి తరలించామని చెప్పారు. హెడియాల, ఆళలహళ్లి, బడగలపుర, ఈరప్పన కొప్పలు, దేవలాపుర, పురదశెడ్డు ప్రాంతాల్లో వీటిని పట్టుకున్నామని తెలిపారు. ప్రతి ఏడాది సెప్టెంబరు నుంచి డిసెంబరు మధ్యలో పులులు పిల్లల్ని పెడతాయి. తమకు, పిల్లలకు సురక్షిత ప్రదేశాలను వెతుక్కుంటూ, అడవుల నుంచి గ్రామ శివారు ప్రాంతాలకు వస్తుంటాయని ఆయన వివరించారు. మరికొన్ని పులులు గ్రామాల సమీపంలో సంచరిస్తున్నాయని వచ్చిన ఫిర్యాదులతో కార్యాచరణను కొనసాగించామని తెలిపారు.

వలలో పట్టుకు వస్తున్న పులి పిల్ల

సూరీడు.. కానరాడే!

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : తుపాను ప్రభావంతో బెంగళూరు నగరంలో చలి అధికమవుతోంది. వాతావరణంలో పెనుమార్పుల ఫలితంగా చలి ఎక్కువైనట్లు వాతావరణం శాఖ అధికారులు తెలిపారు. రాజధాని వీధుల్లో రెండు రోజుల నుంచి సూర్యుడు అదృశ్యమయ్యాడు. చినుకులతో కూడిన చల్లటి వాతావరణానికి తోడు చిరుగాలి వణికిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రత 15- 18 డిగ్రీల మధ్య కొట్టుమిట్టాడుతోంది. పగలు 21 నుంచి 23 డిగ్రీల సెల్సియస్ మాత్రమే నమోదవుతున్నట్లు అధికారులు వివరించారు. రెండేళ్ల తరువాత అత్యధిక చల్లని వాతావరణం ఇప్పుడే ఎక్కువైనట్లు గుర్తించారు. తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో పరిస్థితి తీవ్రతను ఎదుర్కోవడం ఏమంత సులువు కాదు. వీధుల్లోకి వస్తే చలిపులి కొరకడం మొదలు పెడుతుంది. ప్రస్తుత తుపాను ప్రభావం ముగిశాక ఈ స్థితిలో కొంత మార్పు తథ్యమని అంచనా వేస్తున్నారు. బెంగళూరుతో పాటు ఉత్తర కర్ణాటక ప్రాంతాలో చలి తీవ్రమైంది. వృద్ధులు, బాలలు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయవేళ.. ఆలస్యంగా ఇంటి నుంచి బయటకు రావాలని, భద్రమైన దుస్తులు ధరించాలని, తరచుగా అవసరమైన వేడినీరు తాగాలన్నారు. శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాద నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరని హెచ్చరించారు.

బెంగళూరు నగరంపై పొగమంచు దుప్పటి

కూడలి వద్ద పనుల ఆరంభం

రాయచూరు, న్యూస్‌టుడే: నగరంలోని అంబేడ్కర్ కూడలి వద్ద నవీకరణ, ఇతర ప్రగతి పనులను చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ సోమవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ సకాలంలో పనులను ముగించేందుకు చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ప్రసంగిస్తూ నిర్మాణాలు పూర్తి అయితే కూడలి అత్యంత ఆకర్షణీయంగా కన్పిస్తుందని, సంచారాన్ని నియంత్రించేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు(ఆర్‌డీఏ)రాజశేఖర్, నగర పాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహోపాత్ర, మాజీ అధ్యక్షురాలు నరసమ్మ, కాంగ్రెస్ నాయకులు జయణ్ణ, కె.శాంతప్ప పాల్గొన్నారు.

తవ్వకం పనుల్లో మంత్రి, ఎమ్మెల్యే

లారీ దూసుకెళ్లి తండ్రీ కొడుకుల దుర్మరణం

రాయచూరు, న్యూస్‌టుడే: లారీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం.. తండ్రి కుమారులను బలి తీసుకుంది. రాయచూరు గ్రామీణ పోలీసుఠాణా పరిధి యరమరాస్ బైపాస్‌లో సోమవారం చోటుచేసుకున్న దుర్ఘటనలో నాగప్ప ఉప్పార(65), రమేశ్ ఉప్పార(35) ప్రాణాలు కోల్పోయారు. యరమరాస్ నివాసులైన వీరు బైపాస్ మలుపు వద్ద ద్విచక్ర వాహనం మీద కూర్చొని ఉండగా.. హైదరాబాద్ వైపు వెళుతున్న లారీ దూసుకొని రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయారు. పీఎస్సై ప్రకాశ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను రిమ్స్ శవాగారానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ పోటీలకు రేవునగరి సుందరీమణులు!

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రూపదర్శులు

మంగళూరు, న్యూస్‌టుడే : రేవునగరికి చెందిన నియతి, విద్యా సంపతి, యశోద రాజేశ్ అంతర్జాతీయ స్థాయి సౌందర్య పోటీలకు ఎంపికయ్యారు. నెదర్లాండ్‌లో నిర్వహించనున్న మిస్ యూనివర్స్ సెలస్టియల్ పోటీలకు పదో తరగతి విద్యార్థిని నియతి ఎంపిక కాగా, థాయిలాండ్‌లో నిర్వహించే మిసెస్ ఇంటర్నేషనల్ టూరిజం క్వీన్ పోటీలకు యశోద రాజేశ్, ఫిలిప్పైన్స్‌లో నిర్వహించే మిసెస్ ఎర్త్ ఇంటర్నేషనల్ ఇండియా పోటీలకు విద్యా సంపతి ఎన్నికయ్యారు. దేశంలో వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించే సౌందర్య పోటీల్లో పాల్గొంటూ ఆయా విభాగాల్లో ఇప్పటి వరకు విజేతలుగా నిలిచారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన అనంతరం మెర్సీ బ్యూటీ అకాడమీ నిర్వాహకురాలు మెర్సీ వీణా డిసౌజా, పాత్‌వే మోడలింగ్ స్టూడియోలో మార్గదర్శి దీపక్ గంగూలీ ప్రత్యేకంగా గ్రూమింగ్, శిక్షణ ఇస్తూ వస్తున్నారు. తన కుమార్తె పాఠశాలలో విచిత్ర వేషధారణ, ఇతర పోటీల్లో పాల్గొనడం చేసిన అనంతరం తాను కూడా పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి వచ్చిందని యశోదా రాజేశ్ తెలిపారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

01-12-2025 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1622.80	1629.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,081	2,816
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	6,806	6,025
నీటి నిల్వ (టి.ఎం.సి)	69.534	93.278

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

అధికారుల దొడ్డ మనసు!

మైసూరు, న్యూస్‌టుడే : దొంబిదాస సంచార తెగకు చెందిన అశ్విని వివాహం హుణసూరు తాలూకా కుప్పె గ్రామానికి చెందిన పుట్టరాజుతో హెబ్బాళలోని లక్ష్మీకాంత దేవాలయంలో ఆదివారం నిర్వహించారు. వధువు, వరుని కుటుంబ సభ్యులు నిరుపేదలే. ఈ విషయాన్ని తెలుసుకున్న నగర డీసీపీ సుందర్ రాజ్, ఎన్‌ఆర్ పోలీసు ఠాణా ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ తళవార వివాహానికి వచ్చిన అతిథులకు తమ సొంత ఖర్చులతో భోజన వ్యవస్థను కల్పించారు. వివాహం చేసేందుకు, భోజనాలు పెట్టించేందుకు కూడా డబ్బులు లేక అప్పు కోసం ఇరు కుటుంబాలు ప్రయత్నించాయి. పలు వారాలుగా వివాహాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. దళిత సంఘర్ష సమితి నాయకుడు వెంకటేశ్ ద్వారా మొదట లక్ష్మీకాంత్ తళవార సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకుని డీసీపీ సుందర్ రాజ్ తన సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఇరు వైపులా కుటుంబ సభ్యులు, బంధువులు 200 మంది రాగా అందరికీ మృష్టాన్న భోజనం, కొబ్బరికాయ, తాంబూల వ్యవస్థను కల్పించడంతో పాటు, వధూ, వరులు జీవితాన్ని ప్రారంభించేందుకు కొంత ఆర్థిక సహకారాన్ని అందించారు. పోలీసుల దాతృత్వానికి దొంబిదాస సముదాయం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన దంపతులతో కుటుంబ సభ్యులు

మొసళ్ల సంచారంతో జనం బెంబేలు

మాన్వి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో మొసళ్ల సంచారంతో నదీ తీరవాసులు భయాందోళన చెందుతున్నారు. ఎడివాళ, చికల్‌పర్వి, మద్లాపూర్, రాజబండ తదితర ప్రాంతాల్లో రోజూ మొసళ్లు ప్రత్యక్షమవుతున్నాయని స్థానికులు అంటున్నారు. నదిలో ఇసుక దిబ్బల పైకి, నది ఒడ్డుకు వచ్చి సేద తీరుతున్నాయని స్థానికులు తెలిపారు. పశువులను మేతకు తోలుకు వెళ్లాలన్న, నీరు పెట్టాలన్నా భయంగా వెళ్లాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్థానిక అటవీ శాఖ అధికారి పురుషోత్తం మాట్లాడుతూ మొసళ్లకు తుంగభద్ర నది ప్రకృతిపరమైన ఆవాసమన్నారు. మొసళ్లు ఒకే చోట ఉండవని, నీరు అధికంగా ఎక్కడుంటే అక్కడికి వలస వెళ్తుంటాయన్నారు. ప్రజలు నది దాటే చోట జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. పశువులు, గొర్రెల కాపరులు ఎక్కడంటే అక్కడ నదిలో దిగకుండా ముందస్తు జాగ్రత్త వహించాలని సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీలు, అటవీ శాఖ సంయుక్త కార్యాచరణ చేపట్టాలని కోరారు.

ఇసుక దిబ్బపై సేదతీరుతున్న మొసలి

అడవి లాంటి తోట అన్నదాత కలల పంట!

అడవిలాంటి తోటలో ప్రకాశ్ మంచాలె

శివమొగ్గ, న్యూస్‌టుడే : మలెనాడుకు ముఖద్వారం శివమొగ్గలో సేద్యం చేయడం కత్తిమీద సామే అని చెప్పవచ్చు. ప్రకృతి విపత్తులు, వన్య ప్రాణుల దాడులు, కొత్తగా కొన్ని పంటలకు సోకుతున్న తెగుళ్లు.. ఇవన్నీ తట్టుకుని నిలబడడం అన్నదాతను సతమతం చేస్తున్న అంశాలు. సాగర తాలూకా మంచాలె గ్రామానికి చెందిన ప్రకాశ్ మంజాలె తన తోటను అడవిలా చేసుకుని లాభాలను ఆర్జిస్తుండటం ఇతర రైతులను ఆశ్చర్యం గొలుపుతోంది. రైతు కుటుంబానికి చెందిన ప్రకాశ్ పూర్వీకులు అందరూ సేద్యం చేస్తూనే వచ్చారు. వక్క, కాఫీ, మిరియాలు, కోకో తదితరాలను సాగు చేసేవారు. వంశపారంపర్యంగా ప్రకాశ్‌కు నాలుగెకరాల భూమి వచ్చింది. వక్క, కాఫీ, మిరియాలు, కోకోతో పాటు పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలు, కలపకు ఉపయోగపడే వృక్షాలు, అలంకారకి మొక్కలు, సుగంధ ద్రవ్యాలు తదితర 20 రకాలను తన పొలంలో చిన్న కమతాల్లో వేశారు. నీడ అవసరమయ్యే మొక్కలను భారీ వృక్షాలకు చేరువలో ఉండేలా చేసుకున్నారు. పెద్ద వృక్షాలు, చెట్ల నీడ ఇతర పంటలపై పడకుండా జాగ్రత్త తీసుకున్నారు. ప్రకాశ్ వ్యవసాయ క్షేత్రంలోకి వెళితే చిట్టడివిలోకి వెళ్లినట్లే ఉంటుంది. స్థానిక కళది శివప్ప నాయక వ్యవసాయ, ఉద్యాన శాఖ విద్యార్థులు తరచూ ఈ తోటకు వచ్చి అధ్యయనం చేసుకుని వెళుతుంటారు. సాగర తాలూకాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు వచ్చి ప్రకాశ్ మంచాలె మార్గదర్శనం పొందుతారు. గత 14 ఏళ్లుగా సేంద్రియ సాగు చేస్తూ అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణను పొందారు. వర్షం నీటిని నిలువ చేసుకోవడం అవసరానికి అనుగుణంగా బిందు, తుంపర సేద్యాలను కొనసాగిస్తే వస్తున్నారు. భారీ వర్షాలు, తుపాను పరిస్థితుల్లో పంటలు దెబ్బతినకుండా, నేల కోతకు గురికాకుండా ఉండేందుకు పొలం చుట్టూ, మధ్యలో ఉండే చెట్లు, వృక్షాలు సహకరిస్తాయి. నేలలో తేమ ఆవిరి కాకుండా రాలిన చెట్ల ఆకులు అడ్డుకుంటాయి. కొద్ది రోజులకు అవే ఎరువుగా ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. తన పొలాన్ని కొబ్బరి, వక్క తోట, అడవి తోట, ఔషధ వనం, మసాలా దినుసుల సాగు విభాగంగా విడదీసుకున్నారు. పొలం చుట్టూ చిన్న కందకాలను తీసుకుని దానిలో నీరు ఉండేలా, దాని పక్కనే కంచెను ఏర్పాటు చేసుకున్నారు. పొలంలో వెళ్లేందుకు ఒక వరుసలా కాకుండా కాలిబాట ఏర్పాటు చేసుకున్నారు. అడవిలా ఉండే తోటల్లో ఫంగస్ సమస్య ఉంటుంది. ఆ సమస్య లేకుండా, సున్నం, బోర్డో ద్రావణాన్ని ఉపయోగించుకుంటానని ఆయన వివరించారు. నిత్యం ఆకుకూరలు, పండ్లు, కూరగాయలతో పాటు కాలానుగుణంగా వక్క, కాఫీ, మిరియాలు ఇతర ఉత్పత్తులు వస్తుంటాయని ఆయన తెలిపారు. తన సాగు విధానాలను చుట్టుపక్కల రైతులు ఇప్పుడు అనుసరిస్తూ వస్తున్నారని చెప్పారు.

విరగకాసిన మిరియాల తీగ

(c) eenadu

ఈనాడు ఒడిశా
మంగళవారం డిసెంబరు 2, 2025

ఆయువు కాపాడే ప్రాణవాయువేది?

వినియోగానికి దూరంగా ప్లాంట్

గుణుపురం సబ్ డివిజనల్ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్

గుణుపురం, న్యూస్‌టుడే: గుణుపురం సబ్ డివిజనల్ ఆసుపత్రిలో అయిదు సమితుల నుంచి రోగులు వస్తుంటారు. ఆపరేషన్లు కూడా జరుగుతాయి. అవసరం మేరకు ఆక్సిజన్ సిలిండర్లు ఇతర చోట్ల నుంచి తీసుకొస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆసుపత్రి ప్రాంగణంలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ● కొవిడ్ సమయంలో అన్నిచోట్లా ఆక్సిజన్ కొరత వచ్చింది. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ప్రభుత్వం ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు కోసం నిధులు విడుదల చేసింది. ప్లాంట్ నిర్మాణాన్ని హిందూస్థాన్ పెట్రోలియం సంస్థ ద్వారా 2021 సంవత్సరంలో పనులు మొదలు పెట్టారు. ఎంత ఖర్చు చేసిందీ వివరాల్లేవు. ప్లాంట్ నిర్మాణం పనులు, యంత్రాలు బిగించారు. నేరుగా వివిధ వార్డులకు పైప్ లైన్లు బిగించారు. నాలుగు సంవత్సరాలు గడిచినా నేటికీ ప్రారంభం కాలేదు. ప్రాణవాయువు కోసం ఇతర చోట్ల నుంచి సిలిండర్లు సరఫరా అవుతున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..

నేను విధుల్లో చేరిన తరువాత ఆక్సిజన్ ప్లాంట్ సమస్య నా దృష్టికి వచ్చింది. వెంటనే జిల్లా వైద్య అధికారి దృష్టికి తీసుకెళ్లాను. త్వరలో ప్రారంభం కోసం ప్రయత్నం చేస్తాను.

–డాక్టర్ శ్రీకాంత్ జెన్నా

ఆక్సిజన్ ప్లాంట్ విషయమై గతంలో ఆరోగ్య శాఖాధికారులతో మాట్లాడాను. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. ఆసుపత్రిలో సమస్యల గురించి ఉన్నతాధికారులు, నేతలకు వివరిస్తాను.

–సత్యజిత్ గమాంగ్, గుణుపురం ఎమ్మెల్యే

హిమ సోయగం.. ప్రకృతి పరవశం



ప్రకృతి సౌందర్యానికి నిలయం కొరాపుట్ జిల్లా. ఇక్కడ కనిపించే ప్రకృతి అందాలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటాయి. ఈ ప్రాంతంలో శీతాకాలంలో మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీంతో అద్భుతమైన దృశ్యాలు ఎక్కడికక్కడ కనిపిస్తుంటాయి. సిమిలిగుడ సమీపంలో ప్రతిష్ఠాత్మక భారతమాత రహదారి మూసుకుపోయి కనిపించే ఈ దృశ్యం విశేషంగా ఆకట్టుకుంది.

– న్యూస్‌టుడే, సిమిలిగుడ

కలెక్టర్ కార్యాలయంలో మహిళ ఆత్మహత్యాయత్నం

ఫిర్యాదు పత్రంతో మహిళ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఓ మహిళ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం. . గుసాని సమితి మహదేవపురం గ్రామానికి చెందిన మానస జెనా గ్రామంలోని ప్రశాంత్ డాలోకు రూ.3 లక్షలకు పైగా అప్పు ఇచ్చినట్లు, లిఖితపూర్వకంగా డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నట్లు తెలిపారు. ఆయన కొద్ది రోజుల కిందట మృతిచెందాడు. దీంతో ఆయన కుమారు జగదీష్ ఆ సొమ్ము తీర్చేస్తానని చెప్పి.. ఇవ్వడం లేదంటూ గురండి ఠాణాలో పలుమార్లు ఫిర్యాదు చేసింది. ఠాణా అధికారి ఓం నారాయణపాత్ర ఫిర్యాదు తీసుకోకుండా తనపై అసభ్యంగా ప్రవర్తిస్తూ.. దుర్భాషలాడినట్లు తెలిపారు. వినతుల స్వీకరణలో ఠాణా అధికారి పేరిట లిఖితపూర్వకంగా అదనపు ఎస్పీ సునీల్‌మహంత్ దృష్టికి తీసుకెళ్లింది. అనంతరం అదే ప్రాంతంలో ఉన్న కిటికీకి తన చీరను చుట్టి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఘటనపై స్పందించిన అదనపు ఎస్పీ మహిళకు నచ్చజెప్పి ఎస్‌డీపీఓకి పంపించి పూర్తి వివరాలు సేకరించిన అనంతరం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఆత్మహత్యాయత్నం నుంచి మహిళను కాపాడిన ఎస్పీ సునీల్‌మహంత్

ఎప్పుడు ఎవరి చేతిలోని తుపాకీ పేలుతుందో?

గంజాం జిల్లాలో భయం.. భయం

కారణాలు: పాతకక్షలు, వ్యాపారాల్లో విభేదాలు, భూదందాలు
పోలీసు జిల్లాలు: గంజాం, బ్రహ్మపుర
ఈ ఏడాది హత్యలు: వందకు పైగా...
ఏం చేయాలి: పోలీసుల నిఘా వ్యవస్థ పటిష్ఠం చేయడం, మ్యాన్ పవర్ పెంచుకోవడం, ప్రజా చైతన్యానికి చర్యలు తీసుకోవడం.

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశాకు ముఖద్వారం గంజాం జిల్లాలోని బ్రహ్మపుర. ప్రముఖ వ్యాపార కేంద్రంగా గుర్తింపు పొందింది. రోజురోజుకూ నేరాల రేటు పెరుగుతోంది. రాష్ట్రంలో అత్యధిక జనాభా గల గంజాం జిల్లా తొలి నుంచి నేర ఘటనల్లోనూ అగ్రస్థానంలో ఉంది. బ్రహ్మపుర, గంజాం పోలీసు జిల్లాల్లో ఈ ఏడాదిలో ఇంతవరకూ వందకుపైగా హత్యలు జరిగాయి. కొన్ని సందర్భాల్లో పోలీసులపై కూడా కాల్పులు జరిపిన ఘటనలు ఉన్నాయి. ఈ ఏడాది కుమార పౌర్ణమి (అక్టోబరు 6వ తేదీ) రాత్రి బ్రహ్మపుర బి.ఎన్.పూర్ ఠాణా పరిధిలోని వైకుంఠనగర్‌లో భాజపా నేత, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పితబాస పండాను పిస్తోలుతో కాల్చి చంపిన సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే ఏడాది రెండు పోలీసు జిల్లాల్లో పలు హత్యలు తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.

భాజపా నేత పితబాస పండా హత్యకు గురైన ప్రాంతంలో ఆధారాలు సేకరిస్తున్న శాస్త్రీయ బృందం

కఠిన చర్యలు తీసుకుంటున్నాం

హత్య ఘటనల్లో నిందితుల్ని పోలీసులు అరెస్టు చేయడంతోపాటు వారికి న్యాయస్థానాల్లో కఠిన శిక్షలు పడేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండల ఐజీ నితీ శేఖర్ ఓ వార్తా సంస్థకు తెలిపారు. నిబంధనలకు లోబడి నేర నియంత్రణకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. నిఘా విభాగం వైఫల్యం ఆరోపణల్ని ఖండించారు. ఠాణాల అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించకుంటే వారిపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

గంజాం జిల్లాలో గడిచిన పదేళ్లలో హత్యలు

గంజాం, బ్రహ్మపుర పోలీసు జిల్లాల్లో గత పదేళ్లలో నమోదైన హత్య ఘటనలపై సమాచార హక్కు చట్టం ద్వారా కార్యకర్తలు సేకరించిన వివరాలివీ..



పదుల సంఖ్యలో మారణాయుధాలు స్వాధీనం

గంజాం జిల్లాలో తుపాకీ సంస్కృతి పెరగడంతోపాటు కిరాయి మూకలతో హత్యలు మామూలయ్యాయి. ఇటీవల జరిగిన పితబాస హత్యకు కిరాయి హంతకులకు రూ.లక్షల్లో డీల్ జరిగిన సంగతి విదితమే. ఈ రెండు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో నేర చరిత్ర గలవారిని అరెస్టు చేసి, పదుల సంఖ్యలో పిస్తోళ్లు, రివాల్వర్లు, భారీగా తూటాల్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో పోలీసుల నిఘా విభాగం వైఫల్యం, మానవ వనరుల కొరత నేర నియంత్రణకు అడ్డంకిగా మారుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్రహ్మపుర పోలీసు కమిషనరేట్ ప్రతిపాదన ఏళ్ల తరబడి మూలపడింది.

పోలీసులంటే భయం లేదు

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న పిస్తోళ్లను పరిశీలిస్తున్న ఐజీ నితీ శేఖర్. చిత్రంలో గంజాం ఎస్పీ శుభేందు పాత్ర

నేరస్థులకు పోలీసులంటే భయం లేదని గంజాం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మనోజ్ పట్నాయక్ చెప్పారు. నేర చరిత్ర గలవారిని అన్ని రాజకీయ పార్టీలు ఎర్ర తివాచీలు వేస్తున్నాయని ఆరోపించారు. నేర చరిత్ర గల వారి జీవన శైలి, వారి హంగు, ఆర్భాటాలు చూస్తున్న కొందరు యువత అటువైపు ఆకర్షితులవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

బడ్జెట్ నిధులు ఖర్చు కాలేదు

● డబుల్ ఇంజిన్ పాలనంటే ఇదేనా?
● శాసనసభలో విపక్షాల నిలదీత

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాసనసభలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి చేసిన బడ్జెట్ కేటాయింపులు ఖర్చు కాకపోవడంపై బిజద, కాంగ్రెస్‌లు ధ్వజమెత్తాయి. డబుల్ ఇంజిన్ పాలన అంటూ గొప్పలు చెప్పుకోవడం ఎందుకని ఆ పార్టీల నాయకులు ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీలో సభాపతి సురమాపాడి ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అదనపు బడ్జెట్ పద్దులపై సమాధానం చెప్పాల్సి ఉన్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝికి బదులు ప్రజాపనులు, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ సమాధానమిచ్చారు.

సభలో మాట్లాడుతున్న బిజద నేత ప్రతాప్‌దేవ్

సమాధానమిస్తున్న మంత్రి హరిచందన్

మీది చేతకానితనం కాదా?

బడ్జెట్ స్వరూపం పెంచాం.. ప్రాధాన్యత రంగాలకు కేటాయింపులు పెంచామని మార్చిలో 2025-26 సంవత్సరానికి బడ్జెట్ సమర్పణ సమయంలో ఆర్థికశాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న సీఎం సభలో చెప్పిన విషయం గుర్తు చేసిన బిజద అగ్రనేత ప్రతాప్‌దేవ్ ఇప్పుడేం జరిగిందని నిలదీశారు. అక్టోబరు నెలాఖరు వరకు పరిశీలిస్తే...ఏ ఒక్క శాఖ కూడా 50 శాతం నిధులు ఖర్చు చేయలేకపోయిందని, ఇది 30 శాతం లోపుగా ఉండటం దురదృష్టం కాదా అంటూ ప్రశ్నించారు. ఇది మీ చేతకానితనానికి నిలువుటద్దం కాదా అంటూ ఎద్దేవా చేశారు. ఇప్పుడు అదనపు బడ్జెట్ సమర్పించిన సీఎం మార్చిలో 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పనకు సన్నద్ధం కావడం హాస్యాస్పదమన్నారు. ఈ నాలుగు నెలల వ్యవధిలో నూరు శాతం బడ్జెట్ నిధులు ఖర్చు చేయగలరా? అని ప్రశ్నించారు.

కేంద్రం నిధులేవీ?

ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రాష్ట్రానికి రూ.41 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, ఇంతవరకు దిల్లీ పాలకులు రూ.7,613 కోట్లు కేటాయించారు. దీనిపై మీరు కేంద్రానికి అడిగారా? నిధుల విడుదలలో ఎందుకు జాప్యం జరుగుతోందో చెప్పకుండా మౌనంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ సభాపక్షం(సీఎల్పీ) నేత రామచంద్ర కదం మాట్లాడుతూ సకాలంలో బడ్జెట్ కేటాయింపులు ఖర్చు చేయలేకపోవడం పాలనా వైఫల్యానికి ప్రతీకగా అభివర్ణించారు.

ఇది ఉద్దేశపూర్వకం

బడ్జెట్ పద్దులపై చర్చ జరుగుతుందని, విపక్షాలు నిలదీస్తాయని ఉద్దేశపూర్వకంగా సీఎం సభకు రాకుండా, దీంతో ప్రమేయం లేని మంత్రికి జవాబు చెప్పాలని ఆదేశించడం, తాము అడిగిందానికి సూటిగా సమాధానాలు చెప్పలేక తడబడటం తలవంపుగా అభివర్ణించారు.

ఖాళీగా ఉన్న ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ పోస్టులు

సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 46 ఐఏఎస్, 67 ఐపీఎస్, 70 ఐఎఫ్ఎస్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. సోమవారం కొంత మంది ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సీఎం లిఖితపూర్వకంగా సమాధానాలిచ్చారు.

★ ప్రస్తుతానికి రాష్ట్రంలోని ఠాణాల్లో 3 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దశలవారీగా భర్తీ చేస్తున్నామన్నారు.

★ రాష్ట్రంలో 1,768 మంది బంగ్లాదేశ్ చొరబాటుదారులున్నట్లు ప్రాథమికంగా తెలిసిందని, నలుగురిని బంగ్లాదేశ్‌కు పంపించామని, మిగతా వారి వివరాలు పరిశీలనలో ఉన్నాయని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి తెలిపారు.

★ 2024 జూన్ 12 నుంచి ఇంతవరకు 270 మందిపై విజిలెన్స్ కేసులు నమోదయ్యాయని, 187 మందిపై చర్యలు తీసుకున్నట్లు సీఎం చెప్పారు. 34 మంది అధికారులను సస్పెండు చేశామని, 65 మంది పింఛన్లు నిలిపివేశామని లిఖితపూర్వక సమాధానంలో సీఎం పేర్కొన్నారు.

గతేడాది కంటే బాగుంది

సమాధానమిచ్చిన మంత్రి హరిచందన్ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాదిలో బడ్జెట్ నిధుల వ్యయం బాగుందన్నారు. 2024 అక్టోబరు నెలాఖరు నాటికి 36 శాతం నిధులు కాగా, 2025 అక్టోబరు సరికల్లా 39 శాతం ఖర్చయ్యాయన్నారు. మరో నాలుగు నెలలు మిగిలుందని, నూరు శాతం నిధులు ఖర్చయ్యేలా చర్యలు తీసుకుంటామని, ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు చేపడుతున్నామన్నారు.

'కిట్' విద్యార్థి ఆత్మహత్య

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని కిట్ విద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం మొదట సంవత్సరం విద్యార్థి రాహుల్ యాదవ్ (26) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తనుంటున్న వసతి గృహంలోని గదిలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. మృతుడు ఛత్తీస్‌గఢ్ వాసి. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు చేస్తున్నారు. భువనేశ్వర్ ఏసీపీ సోనల్‌సింగ్ సర్కార్ విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలిసిందని, దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. కిట్ వర్సిటీలో ఈ ఏడాదిలో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఇదివరకు నేపాల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ ఘటనలపై దర్యాప్తు కొలిక్కి రాలేదు. ఇంతలో మరో ఘటన జరగడం ప్రస్తావనార్హం.

ముగిసిన మానబొస మా మహాలక్ష్మీ పూజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని గేటుబజారు సమీపాన చంద్రమణి పేటలో 15 రోజులకుపైగా నిర్వహించిన మానబొస మా మహాలక్ష్మీ పూజలు ఆదివారం రాత్రి నిమజ్జనోత్సవాలతో ముగిశాయి. తాత్కాలిక మండపంలో విశేష అర్చనలు, శాంతి పూజల అనంతరం పెద్ద సంఖ్యలో భారీ ఊరేగింపు నిర్వహించారు. కొత్తబస్టాండు రోడ్డులోని గొల్లపల్లి చెరువు వరకూ నిర్వహించిన ఇందులో వివిధ రకాల వేషధారులు, వాయిద్య బృందాలు సందడి చేశాయి. అనంతరం చెరువులో విగ్రహాన్ని, పూజా సామగ్రిని నిమజ్జనం చేశారు. అంతకుముందు మధ్యాహ్నం తాత్కాలిక మండపంలో నిర్వహించిన హోమం పూర్ణాహుతిలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా పాల్గొని పూజలు చేశారు.

నిమజ్జనోత్సవాల్లో పాల్గొన్న స్థానికులు

ఊరేగింపులో కాళీ వేషధారి నృత్యం

జాతీయ క్రికెట్ జట్టుకు ముగ్గురు ఎంపిక

బీణాగండ్

ఆధ్యాషా మిశ్ర

యజ్ఞసేని హరిజన్

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈనెలలో జరగనున్న మహిళా టెన్నీస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు నవరంగపూర్ జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా క్రీడా సంఘ అధ్యక్షుడు దేవాశిష్ పట్నాయక్ తెలిపారు. రాయ్‌ఘర్‌కు చెందిన బీణాగండ్, నవరంగపూర్‌కు చెందిన ఆధ్యాషామిశ్ర, యజ్ఞసేని హరిజన్‌లు రాష్ట్రం తరపున పోటీల్లో తలపడనున్నారు.

సీఎం నివాసంలో ఆచార్య గణేశీలాల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర మాజీ గవర్నరు ఆచార్య గణేశీలాల్ సోమవారం భువనేశ్వర్ వచ్చారు. సీఎం నివాసంలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనను సత్కరించిన మోహన్ కొద్దిసేపు ఆయనతో ముచ్చటించారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో జరిగిన ప్రగతి, అభివృద్ధి పనుల గురించి వివరించారు.

ఆచార్య గణేశీలాల్‌ను సత్కరిస్తున్న మోహన్‌చరణ్ మాఝి

16 నెలల్లో 3,398 అత్యాచార కేసులు

మాట్లాడుతున్న మోహన్‌మాఝి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గడిచిన 16 నెలల్లో 3,398 అత్యాచార కేసులు నమోదయ్యాయి. శాసనసభలో సోమవారం రాజ్‌గంగ్‌పూర్ ఎమ్మెల్యే సి.ఎస్. రాజెన్ ఎక్కా అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బదులిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. 2024 జూన్ 1 నుంచి 2025 సెప్టెంబరు 30 మధ్య ఈ కేసులు నమోదైనట్లు సీఎం వివరించారు. వీటిలో 1,779 మైనర్లపై అత్యాచార కేసులు, 116 సామూహిక అత్యాచారాలు, 856 మహిళా హత్య కేసులు ఉన్నాయి. 12 సామూహిక అత్యాచారాలతో మయూర్‌భంజ్ అగ్రస్థానంలో ఉంది. మైనర్ అత్యాచార కేసులపరంగా మయూర్‌భంజ్ (131) ప్రథమ స్థానంలో, 115 కేసులతో కేంఝర్ ద్వితీయ స్థానాల్లో ఉన్నాయి. ఇదే సమయంలో 6,279 వరకట్న వేధింపు కేసులు, 7,173 వరకట్నేతర వేధింపు కేసులు నమోదయ్యాయి.

13 మంది ఖైదీల పరారీ

వివిధ కేసుల్లో ఖైదీలుగా ఉన్న 13 మంది కారాగారాల నుంచి తప్పించుకొని పరారైనట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మరో 8 మంది ఖైదీలు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆయన వెల్లడించారు. పోలీసు కస్టడీలో ఉన్న 39 మంది నిందితులు పరారీలో ఉన్నారని సీఎం చెప్పారు. అదేవిధంగా కస్టడీలో ఉన్న 31 మంది విచారణ ఖైదీలు మృతిచెందారన్నారు.

తగ్గిన చలి... పెరిగిన ఉష్ణోగ్రతలు

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన రెండు తుపానుల ప్రభావం రాష్ట్రంపై పడలేదు. వరి కోతల సమయంలో చినుకు పడినా పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్రంలో మబ్బు వాతావరణం నెలకొంది. అక్కడక్కడా చినుకులు పడ్డాయని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి కె.ఎస్.మూర్తి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినందున చలి తగ్గిందని, మరో 48 గంటల తర్వాత చలి మళ్లీ పెరిగే సూచనలు ఉన్నాయన్నారు. మంగళవారం (2న) సుందర్‌గఢ్, ఝార్సుగుడ జిల్లాల్లో స్వల్పంగా మంచు కురిసే అవకాశం ఉందన్నారు. కొంధమాల్ జిల్లా దారింగిబాడిలో సోమవారం అత్యల్ప ఉష్ణోగ్రత 11.5 డిగ్రీలుగా నమోదు కాగా, మిగతా కేంద్రాల్లో 13 నుంచి 19 డిగ్రీలుగా ఉన్నట్లు చెప్పారు.

తరచూ తుపానులు.. రైతుకు ఇబ్బందులు

రాశులపై కప్పిన పరదాలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండంతో రైతుల గుండెల్లో అలజడి మొదలైంది. సోమవారం గజపతి జిల్లాలో రోజంతా తేలికపాటి చినుకులు కురవడంతో, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కోసిన పంటను జాగ్రత్తపరిచే పనిలో నిమగ్నమయ్యారు. ధాన్యాన్ని పరదాలత కప్పి భద్రపరిచారు. ఏడాదంతా కష్టపడి పండించే పంట చేతికొచ్చే సమయంలో తరచూ తుపానులు సంభవించడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సందడిగా యువ మహోత్సవం

నవరంగపూర్, న్యూస్‌టుడే: జిల్లాలోని మహిళా కళాశాల మైదానంలో సోమవారం యువ మహోత్సవాలు సందడిగా జరిగాయి. ప్రతిభావంతులైన విద్యార్థులు తమ జానపద నృత్యాలు, గీతాలు, సంప్రదాయ కళలు, ప్రసంగాలు, కవిత్వాలు, కథా రచనలు, చిత్రలేఖనం పోటీల్లో అద్భుతమైన ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 529 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా అదనపు పాలనాధికారి బిశ్వజిత్ బర్మాన్, జిల్లా క్రీడాధికారి ప్రశాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేదికపై నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఇండియా-సౌతాఫ్రికా క్రికెట్ మ్యాచ్‌కు పక్కాగా ఏర్పాట్లు

విస్తృత ఏర్పాట్లు, గట్టి బందోబస్తు

సంజయ్ బెహర

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ నెల 9న కటక్‌లోని బారాబటి స్టేడియం వేదికగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య టీ20 క్రికెట్ మ్యాచ్ జరగనుంది. దీనిని 42 వేల మంది తిలకించనున్నారు.

అపశ్రుతులు పునరావృతం కావు

ఒడిశా క్రికెట్ సంఘం (ఓసీఏ) కార్యదర్శి సంజయ్ బెహర సోమవారం కటక్‌లో విలేకర్లతో మాట్లాడుతూ గతసారి జరిగిన మ్యాచ్‌లో జరిగిన అపశ్రుతులు ఈసారి పునరావృతం కావని చెప్పారు. మైదానం అంతటా కాంతివంతమైన దీపాలు అమర్చామన్నారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. భద్రతకు ప్రాధాన్యమిచ్చామని, దీనిపై ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝిని కలిసి సాయం కోరామని, ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

ఆన్‌లైన్‌లో 2 వేల టికెట్లు

ఆన్‌లైన్‌లో 2 వేల టికెట్ల విక్రయానికి పరిమితం చేశామని, ఒకరికి రెండు మాత్రమే కేటాయించాలని నిర్ణయించామన్నారు. సోమవారం 2 వేల ఆన్‌లైన్ టికెట్లు రిజర్వు కాగా, 5న కౌంటర్ సేల్ జరుగుతుందన్నారు. 1, 3 గ్యాలరీలకు సంబంధించి 18 వేల విక్రయాలు జరుగుతాయని, టికెట్ ధర రూ.1,100లుగా నిర్ణయించామన్నారు. 2, 4వ నెంబర్ల గ్యాలరీల టికెట్ల ధర రూ.900లు కాగా, 5వ నెంబరు గ్యాలరీ టికెట్ వెల రూ.1,200లుగా తెలిపారు. 7వ నెంబరు గ్యాలరీ టికెట్ వెల రూ.600లని, స్పెషల్ ఎన్‌క్లోజర్ రూ.6 వేలు, ఏసీ బాక్స్ రూ.8 వేలు, న్యూపెవిలియన్ రూ.10 వేలు, కార్పొరేట్ బాక్స్ వెల రూ.20 వేలుగా నిర్ణయించామన్నారు.

ముఖ్యమంత్రి మోహన్‌కు ఆహ్వానం

సీఎం మోహన్‌కు టికెట్ అందజేస్తున్న సంజయ్‌బెహర

ఒడిశా క్రికెట్ సంఘం (ఓసీఏ) కార్యదర్శి సంజయ్ బెహర ఆదివారం రాత్రి భువనేశ్వర్‌లోని సీఎం అధికార నివాసంలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝిని కలిశారు. ఆయనకు భారత్-దక్షిణాఫ్రికా టీ 20 మ్యాచ్ తొలి టికెట్ అందజేసి ఆహ్వానించారు. ఈ నెల 9న కటక్-బారాబటి స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే.

(c) eenadu

నైతిక విలువలు పాటించాలి

● మాజీ గవర్నర్ ఆచార్య గణేశీలాల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌ 'కిస్‌' విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. ఈ వేదికలో ఒడిశా మాజీ గవర్నర్ ఆచార్య గణేశీలాల్ పాల్గొని విద్యార్థులకు పట్టాలను అందజేశారు. నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని, ఆధ్యాత్మిక భావాలు వీడరాదని, తల్లిదండ్రులు, గురువుల్ని గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా కటక్ ఎంపీ, ప్రముఖ జర్నలిస్టు భర్తృహరి మహతాబ్ సౌమ్యరంజన్ పట్నాయక్, సామాజిక కార్యకర్త జగదానందలకు గౌరవ డాక్టరేట్‌లు అందజేశారు. 464 మంది విద్యార్థులకు డిగ్రీలు, 20 మందికి పీహెచ్‌డీలు, 7 మందికి పసిడి, మరో 7 మందికి వెండి పతకాలు అందజేశారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య అశోక్‌కుమార్ పరిజా, డీన్ ఎస్.ప్రహరి పాల్గొన్నారు.



భర్తృహరికి గౌరవ డాక్టరేట్ డిగ్రీ అందజేత

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, డిగ్రీదారులు

నామఫలకాలు ఒడియాలో రాయాలి

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం పరిధిలోని అన్ని బజార్లలో వ్యాపార సంస్థల నామఫలకాలను ఒడియాలో రాయాలని అధికారులు చెబుతున్నారు. బీఈఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సిబ్బంది వాహనాల ద్వారా వివిధ ప్రాంతాల్లోని బజార్లలో వ్యాపారులు, సంస్థ యజమానులను చైతన్య పరుస్తున్నారు. కొద్ది రోజులుగా బ్రహ్మపురలో సిబ్బంది వాహనాలతో ఆడియో వాయిస్ ద్వారా బజార్లు తిరిగి హెచ్చరిస్తున్నారు. ఉపకమిషనర్ కల్యాణి సంఘమిత్ర స్వయంగా వెళుతూ పలు ప్రధాన బజార్లలో మైక్ ద్వారా కూడా అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్ కల్యాణి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వచ్చే 55 రోజుల్లోగా నగరంలోని అన్ని దుకాణాలు, వ్యాపారసంస్థలు, కార్యాలయాల నామఫలకాలు మార్చాలని, అరవై శాతం ఒడియా భాషలో పేరును రాయాలని, మిగిలిన నలభై శాతం తమకు నచ్చిన భాష, ఇతర లోగోలు, చిత్రాలుండాలని చెప్పారు.

మైకు ద్వారా చైతన్యపరుస్తున్న ఉపకమిషనర్ కల్యాణి సంఘమిత్ర

బినిత చానుకు పసిడి పతకం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఉత్తరాఖండ్‌లో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన 'పారా అథ్లెటిక్స్ -2025 ఇండియన్ ఓపెన్ స్ప్రింట్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన మరో క్రీడాకారిణి రెండు పసిడి పతకాలు సాధించింది. ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో కేడబ్ల్యూ-200 మీటర్లు, కేడబ్ల్యూ-200 మీటర్ల అంశాల్లో పోటీపడిన బినిత చాను మొదటిస్థానంలో నిలిచి రెండు పసిడి పతకాలు గెలుచుకుంది. మరో వైపు రాజస్థాన్‌లోని జైపుర్‌లో జరిగిన ఇంటర్ ఖేలో ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ సైక్లింగ్ పోటీల్లో భువనేశ్వర్ కిట్ విశ్వవిద్యాలయానికి చెందిన జ్యోతి రెజియా దేవి మహిళా ఎలైట్ 3 కిలోమీటర్ల వ్యక్తిగత ట్రాక్ సైక్లింగ్ అంశంలో మొదటిస్థానంలో నిలిచి పసిడి పతకం కైవసం చేసుకుంది. రాష్ట్ర క్రీడా శాఖ ఆయా విజేతలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేసి ఇద్దరు క్రీడాకారిణులను అభినందించింది.

పతకాలతో బినిత చాను

పసిడితో జ్యోతి రెజియా దేవి

నిందితులపై చర్యలు తీసుకోండి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన నిందితులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని వివిధ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆయా సంఘాల కార్యకర్తలు సోమవారం పోలీసుస్టేషన్‌లో ఐఐసీ ప్రసన్నకుమార్ బెహరాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్థానిక ప్రేమ్‌పాహాడ్ (ప్రేమకుల కొండ)పై ఉన్న భారీ శివుడి విగ్రహం ముందు ఇద్దరు యువకులు అనుచితంగా ప్రవర్తించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది, అది హిందువుల మనోభావాలను కించపరిచేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఐఐసీని కలిసిన వారిలో భజరంగదళ్ జిల్లా సమన్వయకుడు సత్యజ్యోతి బెహెరా, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు ఆనందరావు తదితరులు ఉన్నారు.

ఐఐసీ బెహరాకు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

హాల్ టౌన్‌షిప్‌ను అందంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ హాల్ టౌన్‌షిప్‌ను అందంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని హాల్ సీఈఓ ఎస్.చతుర్వేద అన్నారు. ప్రాజెక్ట్ ప్రకర్ కింద డిస్ట్రిక్ట్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసే ఆదివారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో చతుర్వేద మాట్లాడుతూ... సునాబెడకు చాలా ప్రాధాన్యత ఉందని, ఇక్కడ రక్షణ శాఖకు చెందిన కర్మాగారం హాల్ సంస్థ ఉండటంతో టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేసామన్నారు. సివిల్ విభాగం ఉపాధ్యక్షుడు సంచాలకులు శ్రీరంగ కోటే, ఇంజిన్ విభాగం జనరల్ మేనేజర్ కాలేక భట్టాచార్య, సుఖోయ్ విభాగం జనరల్ మేనేజర్ సరోజ్ కుమార్ పండా, ఏజీఎం సందీప్‌కుమార్ పాత్రోలతో పాటు హాల్ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న చతుర్వేద

ఆలూ ఉత్పత్తి పెంపునకు చర్యలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బంగాళాదుంపల(ఆలూ) ఉత్పత్తిని పెంచేందుకు సర్కారు చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ అన్నారు. ఆతాగఢ్‌లోని జగమోహన్‌పూర్, శిఖపురుడ, దురాపుడియాల్లో ఆదివారం నిర్వహించిన ఆలూ, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల అభివృద్ధి-2025 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రైతులకు ఆలూ విత్తనాలు పంపిణీ చేశారు. రాష్ట్రానికి ఇంతవరకు 1,40,000 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా కాగా, వీటిలో 91,633 క్వింటాళ్లను వివిధ జిల్లాల రైతులకు పంపిణీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో ఆతాగఢ్ ఎమ్మెల్యే రణేంద్ర ప్రతాప్ స్వయి తదితరులు పాల్గొన్నారు.

ఆలూ విత్తనాలు పొందిన రైతులతో సింగ్‌దేవ్, రణేంద్ర

పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభించిన సీఎం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని రైల్వే కాలనీ అతిథి భవనంలో పారిశ్రామిక ప్రదర్శన-2025ను ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి ఆదివారం ప్రారంభించి తిలకించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి వివరాల సంచిక వేదికపై ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి గోకులానంద మల్లిక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేదికపై సంచిక ఆవిష్కరిస్తున్న సీఎం మోహన్, మంత్రి గోకులానంద, అధికారులు

కలెక్టరేట్‌లకు నూతన భవనాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 30 జిల్లాల పాలనాధికారుల కార్యాలయ భవనాల ఆధునికీకరణ, విస్తరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి సోమవారం సాధారణ పాలనా విభాగం (జీఏ) అధికారవర్గాలు అన్ని జిల్లాల అధికారులకు లేఖ రాసినట్లు తెలిపింది. జనాభా, జిల్లా విస్తృతి అనుగుణంగా మూడు కేటగిరీలో నిర్మాణాలు జరుగుతాయి. గంజాం, కటక్ వంటి పెద్ద జిల్లాలకు 1.70 లక్షల చదరపు అడుగుల స్థలంలో పనులు జరుగుతాయి. మధ్యతరగతి (మీడియం) కలెక్టరేట్లు 1.40 లక్షల చదరపు అడుగులు, చిన్నతరహా జిల్లాల్లో లక్ష చదరపు అడుగుల స్థలంలో నిర్మాణాలు చేపడతారు. ఆయా చోట్ల స్థల సేకరణ, సివిల్‌వర్క్‌(ప్లాన్) వెంటనే సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెవెన్యూశాఖ నిర్మాణం పనులు చేపడుతుంది.

చిత్రకళా పోటీలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖరగ్‌పూర్(వెస్ట్) ఆధ్వర్యంలో స్థానిక గోల్‌బజారు, గుజరాతీ మిత్రమండల్ పాఠశాలలో ఆదివారం అంతర్ పాఠశాలల విద్యార్థులకు చిత్రకళా పోటీలు జరిగాయి. ఇందులో 28 పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చైతన్యంతో ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఎయిడ్స్ నిర్మూలనపై చైతన్య ర్యాలీలు నిర్వహించారు. ఎయిడ్స్ రోగుల నుంచి కాదు, రోగం నుంచి దూరంగా ఉండాలని నినాదాలు చేస్తూ... ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ చేయి చేయి కలిపితే దీన్ని నిర్మూలించగలమని పలువురు వైద్యాధికారులు ఈ సందర్భంగా తెలిపారు. - న్యూస్‌టుడే బృందం

బ్రహ్మపుర నగరం: ఎమ్కేసీజీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు

రాయగడ పట్టణం: అవగాహన ర్యాలీలో పాల్గొన్న రెడ్‌క్రాస్, కళాశాల విద్యార్థులు

కాశీనగర్‌లో...

పర్లాఖెముండిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి ఎంఎం అలీ

సిమిలిగుడ: ఎయిడ్స్‌పై చైతన్య ర్యాలీ

జయపురం: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఉపాధ్యాయులపై విద్యార్థుల ఫిర్యాదు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా రామనగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులపై 10వ తరగతి విద్యార్థులు కలెక్టర్ అశుతోష్ కులకర్ణికి ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌కు విద్యార్థులు వచ్చారు. పరీక్ష ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. రూ.450 ఫీజుకు గాను రూ.600 తీసుకుంటున్నారని చెప్పారు. పాలనాధికారి ఆదేశాల మేరకు విచారణ జరుపుతామని, ఇందులో భాగంగా జిల్లా విద్యాధికారి రామచంద్ర నాగ్ విద్యార్థులతో మాట్లాడారు. అధికారి రాగానే చర్యలు తీసుకుంటామని డీఈఓ పేర్కొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

మానవత్వం పరిమళించిన వేళ

సిమిలిగుడ, న్యూస్‌టుడే: మొబైల్‌ను ఇచ్చేందుకు 25 కిలోమీటర్లు ప్రయాణించి తనలో మానవత్వాన్ని చాటుకున్నాడు సాగర్ బాగ్ అనే యువకుడు. వివరాల్లోకి వెళ్తే... సునాబెడ హాల్ టౌన్‌షిప్‌లో నివాసముండే ఆనంద్ మౌళి పట్నాయక్ ఫోన్ ఎక్కడో పడిపోయింది. ఆ ఫోన్ బౌన్సీగుడకు చెందిన సాగర్ బాగ్‌కు రోడ్డుపై దొరికింది. రెండు గంటల తర్వాత ఆనంద్ ఫోన్ చేయగా, వివరాలు తెలుసుకుని 25 కిలోమీటర్లు వెనక్కి వచ్చి మొబైల్ ఇచ్చాడు. సాగర్ మంచితనానికి పలువురు అభినందించారు.

సాగర్‌తో బాధితుడు ఆనందమౌళి

మహానుభావుల విగ్రహాల ఆవిష్కరణ

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా రామన్నగుడ సమితి పాలుపాయి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఐదుగురు వరపుత్రుల విగ్రహాలు ఆవిష్కరించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి ఆసిమారావు ముఖ్య అతిథిగా హాజరై ఉత్కళమణి గోపబంధు దాస్, ఉత్కళ గౌరవ్ మధుసూదన్‌దాస్, రక్కుర్ బప్పా, సహీద్ లక్ష్మణ్ నాయక్, నేతాజీ సుభాస్ చంద్రబోస్ విగ్రహాలను ఆవిష్కరించారు.

పంటను ధ్వంసం చేస్తున్న ఏనుగులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కల్యాణ సింగుపూర్ సమితి పారిసలి పంచాయతీలో ఏనుగులు సంచరిస్తున్నాయి. దీంతో అక్కడి ప్రజలు భయాందోళన చెందుతున్నాయి. ఆదివారం రాత్రి వచ్చిన రెండు ఏనుగులు చేతికి వచ్చిన పంటలను ధ్వంసం చేస్తున్నాయని లెఖపాదర్, డింగమట్టి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై రేంజర్ కార్యాలయంలో స్థానికులు ఫిర్యాదు చేశారు. వాటిని అడవుల్లోకి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తునట్లు రేంజర్ గొమాంగ్ తెలిపారు.

పారిసలి ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగు

కాశీపూర్ వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోండి

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: తొరుమారి మృతదేహం విషయంలో లంచం అడిగిన కాశీపూర్ వైద్య సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం తొరుమారి తండ్రి కంబమారితో పాటు కుసుమగూడ వాసులు జిల్లా పాలనాధికారి ఆశుతోష్ కుకర్ణికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం బాలుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పచెప్పేందుకు వైద్య సిబ్బంది రూ.2 వేలు లంచం అడిగిన విషయం తెలిసిందే ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కలెక్టర్‌ని కలిసేందుకు వచ్చిన గ్రామస్థులు

టోర్నమెంట్ విజేత బొయిపరిగుడ

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సహీద్ లక్ష్మణ్ నాయక్ క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన కొరాపుట్ టీచర్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-2లో బొయిపరిగుడ విజేతగా నిలిచింది. 10 సమితులకు చెందిన టీచర్స్ సంఘాలు ఈ పోటీల్లో తలపడగా, ఫైనల్ మ్యాచ్ బందుగావ్‌పై బొయిపరిగుడ విజయం సాధించింది. విజేత, రన్నరప్ జట్లకు అతిథులు ట్రోఫీలను అందజేశారు. అతిథులుగా రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు త్రినాథ్ హరిజన్, జిల్లా అధ్యక్షుడు దాము కందపాన, సమితి అధ్యక్షుడు సురేంద్రకుమార్ ఖరా పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

రహదారిపై బైఠాయించి నిరసన

బ్రహ్మపుర నగరం: వివిధ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నిఖిల ఒడిశా ఆయుష్ విద్యార్థుల సంఘం చేపట్టిన నిరవధిక ఆందోళన సోమవారం ముమ్మరం చేశారు. బిజు పట్నాయక్ హోమియోపతిక్ వైద్య కళాశాల, అంకుశపూన్‌లోని కేపీటీఎస్ ఆయుర్వేదిక వైద్య కళాశాలల్లో విద్యార్థులు ప్రధాన గేటుకు తాళాలు వేసి 'తాళా బంద్' ఆందోళన కొనసాగిస్తున్నారు. హోమియోపతిక్ వైద్య కళాశాల విద్యార్థులు మధ్యాహ్నం స్థానిక పాతబస్టాండులో తపాలా శాఖ ప్రధాన కార్యాలయం బయట రహదారిపై బైఠాయించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

ఎనిమిది మందికి రూ.1.20 లక్షలు అందజేత

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాయగడలో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఎనిమిది మందికి రూ.1.20 లక్షలు సీఎం రిలీఫ్ నిధులను అందజేశారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మరో ఇద్దరికి రెడ్‌క్రాస్ నుంచి రూ. 20 వేలు మంజూరు చేసినట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది. మొత్తం 73 వినతులు అందగా, వీటిలో 40 వ్యక్తిగత, మిగతా 33 సామాజిక ఫిర్యాదులు ఉన్నట్లు పేర్కొంది. కలెక్టర్ అశుతోష్ కులకర్ణి, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ తదితరులతో పాటు వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణలో అశుతోష్, స్వాతి తదితరులు

సమస్యల పరిష్కారానికి వినతులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలోని కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి కలెక్టర్, రెవెన్యూ ఏడీఎం మునీంద్రా అధ్యక్షతన సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. 95 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో వ్యక్తిగతం 83 కాగా, 12 గ్రామ సమస్యలని అధికారులు తెలిపారు. అదనపు ఎస్పీ సునీల్ మహంత్, అదనపు కలెక్టర్ ఫాల్గుణ మాఝి, సబ్ కలెక్టర్ అనూప్ పండా, అదనపు జడ్పీ కార్య నిర్వహణ అధికారి పృథ్వీరాజ్ మండల్, జిల్లా ముఖ్య వైద్యాధికారి ఎంఎం అలీ, బీడీవో గౌరచంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్, న్యూస్‌టుడే: లమతపుట్ సమితి కేంద్రంలో సోమవారం కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. సమితి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. మొత్తం 28 వినతులు వచ్చినట్లు బీడీఓ జయంత్ కుమార్ మెహర్ తెలిపారు. తహసీల్దార్ దివాకర్‌బాగ్ పాల్గొన్నారు.

దివ్యాంగుడి ఫిర్యాదును వింటున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ మునీంద్రా, పక్కన అదనపు ఎస్పీ సునీల్ మహంత్

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

విద్యావిధానంలో మార్పులకు నివేదిక

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో 7 జిల్లాలకు చెందిన 262 మంది ఉపాధ్యాయులతో మేధోమదన కార్యక్రమం నిర్వహించారు. రానున్న విద్యాసంవత్సరంలో ప్రాథమిక విద్యా విధానాలలో మార్పులకు సంబంధించి చర్యలు చేపడుతున్న రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పలువురు అభిప్రాయపడ్డారు. ఇందులో పాల్గొన్న ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలతో ఓ నివేదిక తయారు చేసి అందజేయనున్నారు.

పాల్గొన్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు అభినందనలు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ డీఏవీ కళాశాలలో జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. సునాబెడ డీఏవీపీఎస్ విద్యాలయ, జవహర్ నవోదయ, కొరాపుట్ ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రధానోపాధ్యాయుడు దీపిక పట్నాయక్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం రాబణాగూడ ఆరోగ్య కేంద్రం వెనక ఉన్న అడవిలో గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ సచ్చీంద్ర ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆ వ్యక్తి వయస్సు 50 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని జిల్లా ప్రధానాసుపత్రిలో భద్రపరుస్తామని, 96 గంటల్లో సంబంధిత బంధువులు రాకపోతే శాఖ తరపున అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు.

యువకుడి హత్య

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ గ్రామంలో ఓ యువకుడ్ని హత్య చేశారు. ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన సోనియా టక్రి (26) ఇంట్లో పడుకుని ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన రవి సగరియ అనే వ్యక్తి ఆయన పీక కోసి పారిపోయారు. కొంతసేపటి తరువాత కుటుంబ సభ్యులు సోనియా గాయాలతో పడి ఉండడం గమనించి చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ఆయన మృతి చెందినట్లు చెప్పారు. ఈ విషయంపై పోలీసులు సమాచారం తెలుసుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు రవిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రవికి మతిస్థిమితం లేదని గ్రామస్థులు చెబుతున్నారు.

ఖరగ్‌పూర్‌లో ఏడుగురి అరెస్టు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పర్యాటక ప్రాంతం దిఘాలో ఆదివారం జరిగే రాష్ట్ర పోలీసు ఉద్యోగ నియామకాల్లో ఉద్యోగాలు వేయిస్తామని ఒక ముఠా నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసింది. ఒక హోటల్‌లో ఈ లావాదేవీలు జరిగాయి. ఈ సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

చోరీ కేసులో మరో ముగ్గురు..

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝూర్‌గ్రామ్ జిల్లా జాంబోని పోలీసుస్టేషన్ పరిధిలో గల చింద్రా గ్రామానికి చెందిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ శనివారం రాత్రి దొంగతనానికి గురైంది. గ్రామస్థుల సమాచారంతో గాలించిన పోలీసులు ఆకాష్‌బేరా, చంద్రకాంత్ గిరి, సంజిత్‌గిరిను అరెస్టు చేసి, ట్రాన్స్‌ఫార్మర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆయుధాల అక్రమ తయారీ కేంద్రం గుట్టురట్టు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: నయాగఢ్ జిల్లాలో అక్రమ ఆయుధాల తయారీ కేంద్రాన్ని పోలీసులు సీజ్ చేసి ఇద్దరి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. భౌంసగఢ్ కూడలి సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఓ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా నిందితుడి వద్ద పిస్తోలు గుర్తించారు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితులు తొఫాన్ నాయక్ అలియాస్ గుడ్డు(21), ప్రశాంత్ బిశ్వాల్ అలియాస్ పండా(45)లుగా గుర్తించారు. వీరిలో నాయక్ నివాసముంటున్న గొదిపాడలోని ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించగా ఇంటి మేడపై ఆయుధాల తయారీ కేంద్రాన్ని నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో నాయక్ నాటు తుపాకితో పోలీసులపై కాల్పులు జరపడంతో ఏఎస్సై ఎం.కె.దిగల్ మెడకు గాయమైంది. అనంతరం నాయక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు నిందితుల నుంచి రెండు తుపాకులు, ఆయుధాల తయారీకి వినియోగించే యంత్రం, ఇతరత్రా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ రవాణా: నలుగురి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా అస్కా రాణా పరిధిలోని 157వ నెంబరు జాతీయ రహదారిపై ఖండరబలి వద్ద సోమవారం ఉదయం 5.50 గంటల సమయంలో ఆబ్కారీ నిఘా విభాగం అధికారులు వెదుర్ల లోడుతో వెళుతున్న ఓ లారీని ఆపి తనిఖీలు చేశారు. అందులో వెదుర్ల కింద బస్తాల్లోని 105 కిలోల గంజాయిని గుర్తించారు. లారీ చోదకుడ్ని విచారించి, ఆయన ఇచ్చిన సమాచారం మేరకు గంజాయి అక్రమ రవాణాకు పైలెట్‌గా ముందు వెళుతున్న కారును కూడా అధికారులు పట్టుకుని, అందులో ఉన్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్ని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించినట్లు ఆ విభాగం ఉప సూపరింటెండెంటు శ్రుతికాంత్ రౌత్ మధ్యాహ్నం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులంతా కటక్ జిల్లాకు చెందిన వారని ఆయన పేర్కొన్నారు.

EENADU Classifieds
PEOPLE CARE
OLD AGE HOME
SVS Old Age Home Vizianagaram. Tasty Food Ac, Non AC Rooms, Day & Night Aaya, Nursing, Intivaddake Sevalu. ✆ 9440435006, 9347978375.
ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /-
(GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

కాయకష్టం బూడిదపాలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఎంతో కష్టపడితే చేతికొచ్చిన పంట ఒక్కసారిగా బూడిద పాలవ్వడంతో ఇద్దరు రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకెళ్తే.. నవరంగపూర్ జిల్లా టెంటులిఖుంటి సమితి కుకుడభాయి గ్రామానికి చెందిన పవిత్ర హరిజన్, సురేష్ హరిజన్‌లు 8 ఎకరాల్లో పండించిన వరి పంటను ఇటీవల కోత పూర్తికావడంతో పొలాల సమీపంలో మూడు కుప్పలుగా వేశారు. ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు వాటికి కాపలా ఉండి నిద్రపోవడానికి ఇంటికి వెళ్లారు. వేకువజామున వచ్చేసరికి మొత్తం కుప్పలు కాలిపోయాయి. గిట్టనివారు ఇలా చేశారని, దర్యాప్తు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయశాఖ తమ నష్టాన్ని గుర్తించి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

ధ్వంసమైన వరిచేను వద్ద బాధిత రైతులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఆధునిక విజ్ఞానంతో అభివృద్ధి

రాయగడ, గుణుపురం: భారత ప్రభుత్వం మేధోశక్తి హక్కులు (ఐపీఆర్) ప్రక్రియ ప్రారంభించిందని ఎమ్ఎస్ఎమ్ఈ సంచాలకుడు గంద్వాడి భాస్కర్ అన్నారు. గుణుపురం జీఐఈటీ వర్సిటీ మెగా ఆడిటోరియంలో ఆదివారం జరిగిన అకాడమిక్ భాగస్వామ్య ఒప్పందం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

యువతతో అభివృద్ధి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నవ సమాజం ఏర్పాటులో యువత పాత్ర కీలకమైందని దక్షిణ ఒడిశా వికాస్ కౌన్సిల్ అధ్యక్షులు బృగి భక్షి పాత్ర్ అన్నారు. సిమిలిగుడ ప్రభుత్వ కళాశాలలో సోమవారం 'కొరాపుట్‌లో యువత' అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా బృగి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువతతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

ఆకట్టుకున్న పరబ్ పోటీలు

కొరాపుట్, జయపురం: జిల్లా కేంద్రంలో పరబ్ క్రీడలు ఘనంగా సాగుతున్నాయి. కొరాపుట్ స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో 14 సమితుల నుంచి జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో కొరాపుట్ సమితి జట్టు విజేతగా నిలిచింది. ★ జయపురం సమితి స్థాయిలో పరబ్ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అధ్యక్షురాలు తిలోత్తమ ముదులి అధ్యక్షతన జరిగిన ఉత్సవాల్లో స్థానిక జగత్ జననీ ఆలయంలో పూజలు నిర్వహించారు.

వైభవంగా పూజలు

పర్లాఖెముండి, ఖరగ్‌పూర్ రాయగడ, మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని రాజా వీధిలో పొడుగు దేవాలయంలోని శ్రీ లలితా త్రిపుర సుందరి అమ్మ వారి సన్నిధానంలో కోటి కుంకుమార్చన మహోత్సవ పూజలు వైభవంగా ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ★ ఖరగ్‌పూర్ పట్టణ తిరుపతి వేంకటేశ్వర పెరుమాళ్ల దేవస్థానం 27వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చక్రస్నానం వైభవంగా సాగింది. ★ రాయగడలో గీతాజయంతి పర్వదినం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. భగవద్గీత, భాగవత పారాయణాలు, భగవద్గీత శ్లోకాల పోటీలు, గీతా హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ★ మల్కాన్‌గిరిలో మాల్యవంత మహోత్సవం సందర్భంగా కలశయాత్ర జరిగింది.

మల్కాన్‌గిరి: కలశయాత్రలో పాల్గొన్న మహిళలు, విద్యార్థులు, పట్టణ ప్రజలు

ఖరగ్‌పూర్: శాస్త్రోక్తంగా చక్రస్నానం

రాయగడలో గీతా హోమం నిర్వహిస్తున్న గణపతి శాస్త్రి బృందం

పర్లాఖెముండి: కోదూరు నారాయణరావుకు జ్ఞాపిక అందజేస్తున్న మాణిక్య మణిశర్మ, దుర్గాదాస్

(c) eenadu

విహరించే మనసులు.. వినిపించే ఊసులు

సీతంపేటలో ఆదివారం పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. ఉమ్మడి జిల్లా నుంచి సందర్శకులు తరలివచ్చారు. వన భోజనాలు చేసి, పలు పర్యాటక ప్రదేశాల్లో విహరించారు. ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో వివిధ సాహస క్రీడలు, బోటింగ్, ఊగే వంతెన తదితరచోట్ల కేరింతలు కొడుతూ సంతోషంగా గడిపారు. మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు. దోనుబాయి దరి సున్నపుగెడ్డ, మల్లి, బెనరాయి, ఈతమానుగూడ జలపాతాలు, ఆడలి వ్యూ పాయింట్, జగతిపల్లి హిల్ రిసార్ట్సు ప్రాంతాల వద్ద పర్యాటకుల సందడి కనిపించింది. –న్యూస్‌టుడే, సీతంపేట

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు సూచించారు. గోవిందపురం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.

మొక్క నాటుతున్న అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఈశ్వరరావు

అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రాంగణం, రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, ప్రిన్సిపల్ రమేశ్‌పట్నాయక్, మోహనరావు, తుంబనాథం, నారాయణ పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యం..!

వాలీబాల్‌లో రాణిస్తున్న ఉర్లాం విద్యార్థి

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

పట్టుదలకు సాధన తోడైతే సాధించలేనిది ఏదీ లేదని ఆ బాలుడు నిజం చేస్తున్నాడు. నరసన్నపేట మండలంలోని మారుమూల నడగాం గ్రామానికి చెందిన కె.వినయ్‌కుమార్‌ది నిరుపేద కుటుంబం. తండ్రి నాగభూషణం వ్యవసాయ కూలీ, తల్లి పద్మావతి గృహిణి. సదరు విద్యార్థి ఉర్లాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. వ్యాయామోపాధ్యాయుడు జగదీశ్ శిక్షణలో రాటుదేలి వాలీబాల్ క్రీడలో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ చూపుతున్నాడు.

పీడీ జగదీశ్ వద్ద మెలకువలు నేర్చుకుంటున్న వినయ్‌కుమార్

సాధించిన విజయాలు

★ గతేడాది నరసన్నపేట మండల, నియోజకవర్గస్థాయి (గ్రిగ్స్) పోటీల్లో వాలీబాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు.

★ 2024 నవంబర్‌లో భోగాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని పసిడి పతకం సాధించాడు.

★ 2024 డిసెంబర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో రాష్ట్రజట్టులో స్థానం దక్కించుకొని ప్రతిభ చూపాడు.

★ 2025 ఆగస్టులో జిల్లాస్థాయిలో జరిగిన అండర్- 14 అథ్లెటిక్ పోటీల్లో రాణించాడు. గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనప్పటికీ అనారోగ్య సమస్యతో పాల్గొనలేదు.

పాఠశాలకు పేరు తీసుకొస్తా... వ్యాయామోపాధ్యాయుడు ఎన్.జగదీశ్, ప్రధానోపాధ్యాయిని డి.భారతి, ఇతర ఉపాధ్యాయులు అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు. వారి సూచనలతో మరింత రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తానని క్రీడాకారుడు కె.వినయకుమార్ తెలిపాడు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎంఈవో ధనంజయ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: మాణిక్యపురం జడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు పత్రి వాసుదేవ్, జీతా నాయక్, జయశ్రీ దొలాయి అండర్-17 విభాగంలో జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మజ్జి వైకుంఠరావు తెలిపారు. నవంబరు 27 నుంచి 29 వరకు నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఇదే పోటీల్లో బాలుర విభాగంలో ఎంపాండ కార్తీక్, పత్రి వాసుదేవ్, కాళిదాసు సాహు రజత పతకాన్ని సాధించారు. విజేతలను వ్యాయామోపాధ్యాయులు ఆర్ రవి కుమార్ మహంతి, ఎం.తోటారావులను ఎంఈవో ధనంజయ మజ్జి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

జాతీయ సరిహద్దు భద్రతా దినోత్సవం సందర్భంగా సోమవారం కవిటి భారతీయ విద్యాకేంద్రం అర్ష విజ్ఞాన భారతి పాఠశాలలో విద్యార్థులు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో భారతదేశ రక్షణకు దేశ సైనికులు సరిహద్దులో చేస్తున్న సేవలు, త్రివిధ దళాల సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు శిరీష, కృష్ణ కుమార్, సుహాసిని, డిల్లీరావు, మాదికమ్మ, జ్యోతి, అంజలి, లక్ష్మీ, రాజేశ్వరి, సరిత పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పేరుకే 50 పడకల ఆసుపత్రి..!

– న్యూస్‌టుడే, పాతపట్నం

పాతపట్నం సామాజిక ఆసుపత్రిలో అరకొరగా సేవలందుతున్నాయి. జిల్లాకు శివారు ప్రాంతం అయినప్పటికీ సిబ్బంది కొరత, వసతుల లేమి, వినియోగానికి నోచుకోని పరికరాలతో పరిస్థితి దైన్యంగా మారింది. పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి మండలాల నుంచి రోజుకు సుమారు 200 మంది వరకు ఇక్కడికి వస్తుంటారు. కాలానుగుణ వ్యాధులు ప్రబలిన సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. వెనకబడిన, పేద ప్రజలు అధికంగా ఉండే నియోజకవర్గంలో పరిస్థితి ఇలా ఉండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాతపట్నం సీహెచ్‌సీలో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

వేధిస్తున్న సిబ్బంది కొరత

పాతపట్నం సామాజిక ఆసుపత్రి ఏర్పాటుచేసి దశాబ్దాలు గడిచినా పరిస్థితి మారలేదు. 50 పడకల ఆసుపత్రిగా అవతరించినప్పటికీ కొన్ని సేవలకే పరిమితమైంది. ప్రధానంగా అత్యవసర సమయాల్లో వినియోగించే ఆక్సిజన్ ప్లాంట్‌ను రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసినప్పటికీ సాంకేతిక సిబ్బంది లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. కంటి వైద్య నిపుణుల పోస్టు ఖాళీగా ఉంది. సహాయకుడు మాత్రమే ఉన్నారు. ఏడు సంవత్సరాలుగా హోమియో వైద్యులు లేరు. అక్కడ కింది స్థాయి సిబ్బందే పనిచేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో ఉద్యానం పనులు మధ్యలో వదిలేశారు.

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం

సామాజిక ఆసుపత్రిలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వైద్యుల కొరత వేధిస్తోంది. సాంకేతిక సిబ్బంది పోస్టులు భర్తీ చేస్తే ఆయా పరికరాలు వినియోగంలోకి వస్తాయి. - జి.వేణుగోపాలరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్

కండల ధీర..!

థాయ్‌లాండ్‌లో సత్తా చాటిన కంబకాయ యువకుడు

న్యూస్‌టుడే, నరసన్నపేట

నరసన్నపేట మండలం కంబకాయలో పేద కుటుంబానికి చెందిన పాగోటి సతీష్ అంతర్జాతీయ స్థాయిలో కండల వీరుడిగా గుర్తింపు పొందుతున్నాడు. థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ దేహదారుఢ్య పోటీల్లో (70 కిలోల విభాగం) సత్తా చాటాడు. మిస్టర్ ఏషియాగా నిలిచి తృతీయ స్థానం దక్కించుకున్నాడు. గతేడాది డిసెంబరులో నిర్వహించిన జాతీయ స్థాయి మిస్టర్ ఇండియా పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకుని బంగారు పతకం సొంతం చేసుకున్నాడు.

చదువుతూనే సాధన

సతీష్ తండ్రి వెంకటరావు వ్యవసాయం చేస్తూ కుమారుడిని ప్రోత్సహిస్తున్నారు. పదో తరగతి వరకు కరజాడ ఆదర్శ పాఠశాలలో చదివాడు. గుంటూరులో డిప్లొమా పూర్తి చేసి ప్రస్తుతం దూర విద్య విధానంలో బీటెక్ తృతీయ సంవత్సరం అభ్యసిస్తున్నాడు. విశాఖపట్నంలో చదువుకుంటూ దేహదారుఢ్య పోటీలకు శిక్షణ పొందుతూ సాధన చేస్తున్నాడు. శిక్షకులు సోమేష్, కోచ్ కోట చిరంజీవి వద్ద మెలకువలు నేర్చుకుంటున్నాడు. బాడీ బిల్డింగ్‌లో రాణించగలనన్న నమ్మకం పెంచుకుని ముందుకు సాగుతున్నానని సతీష్ తెలిపాడు.


పతకాలతో సతీష్

దాతల చేయూత

కంబకాయ గ్రామానికి చెందిన తంగుడు సురేష్ స్నేహితులతో కలిసి ప్రతి నెల రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నారని సతీష్ తెలిపాడు. గతేడాది జనవరి నుంచి వారు అందిస్తున్న చేయూత ఎంతగానో ఉపయోగపడిందన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించడమే లక్ష్యమని స్పష్టం చేశాడు.

చెట్టంత పుట్ట..!

సాధారణంగా పుట్ట 3 నుంచి 4 అడుగులు ఉంటుంది. సారవకోట మండలం పద్మాపురం వద్ద రావాడ మోహనరావు మామిడి తోటలోని పుట్ట మాత్రం అందుకు భిన్నంగా 11 అడుగుల ఎత్తు ఉండటంతో పలువురు ఆసక్తిగా చూస్తున్నారు. తోటలో వనభోజనాలు చేసేందుకు వచ్చిన వారు పుట్ట వద్ద ఫొటోలు తీసుకుంటున్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

క్రీడల్లో రాణించి.. కొలువు సాధించాలని..

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

వారంతా మత్స్యకార కుటుంబాల్లో పుట్టి క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ నిర్దేశించుకున్న లక్ష్యం వైపు అడుగులు వేస్తున్నారు. ఓ వైపు తల్లిదండ్రుల ప్రోత్సాహం మరో వైపు వ్యాయామోపాధ్యాయుల శిక్షణతో చక్కగా రాణిస్తున్నారు. క్రీడాసామగ్రి కొరత, సరైన మైదానం లేకపోయినా సాధించే తపనతో ముందుకు సాగుతున్నారు. అలా పలువురు విద్యార్థులు డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ కొలువుల్లో క్రీడా రిజర్వేషన్ల శాతం పెరిగిన నేపథ్యంలో ఆటల్లో మెరుగైన ప్రదర్శనలిస్తూ సర్కారీ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందడుగేస్తున్నారు.

ఐపీఎస్ అవుతా..

హేమలత 9వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు తమ్మయ్య, ఈశ్వరి రెక్కల కష్టం మీద ఆధారపడి నెట్టుకొస్తున్నారు. క్రీడలపై ఆసక్తితో రెండేళ్ల నుంచి శిక్షణ పొందుతూ ఇటీవల కడపలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో బంగారు, కర్నూల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్‌లో రజత పతకాలు సాధించింది. బాగా చదివి ఐపీఎస్ కావాలనే లక్ష్యం పెట్టుకుంది.

ఉపాధ్యాయురాలిగా..

అను పదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు చిన్నారావు, గంగమ్మ వేటపై ఆధారపడి జీవనం సాగిస్తూ కుమార్తెను చదివిస్తున్నారు. ఈమె ఇటీవల కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఉపాధ్యాయురాలు కావాలనే ఆకాంక్షతో విద్యలోనూ సత్తా చాటుతోంది.

గ్రూప్-I సాధిస్తా..

గోకుల్ పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు హిమాచలం, ఝాన్సీ ఇద్దరూ రైతులే. ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి అండర్-17 చదరంగం పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. గ్రూప్-1 ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెబుతున్నాడు.

వైద్యుడిగా..

పృథ్వీ పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ రైతులే. ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి అండర్-17 చదరంగం పోటీల్లో సత్తా చాటిన ఈ బాలుడు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువుల్లోనూ రాణిస్తున్నాడు. జాతీయ స్థాయిలో పతకం సాధించి, ప్రభుత్వాసుపత్రిలో వైద్యుడిగా ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నాడు.

గురువునవుతా..

చరణ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఈశ్వరరావు, హేమలత. తండ్రి వెల్డింగ్ చేస్తూ బాలుడిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి అండర్-14 చదరంగం పోటీల్లో మెరుగైన ఫలితాలు రాబట్టాడు. జాతీయ స్థాయి పతకం సాధించి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు అవ్వాలనుకుంటున్నాడు.

గుంతతో చింత

కాశీబుగ్గ ఎంపీడీవో కార్యాలయం వీధి నుంచి శ్రీనివాసనగర్‌కు వెళ్లే దారిలో గుంత తవ్వి వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ల మరమ్మతులకు తవ్విన గుంత పూడ్చకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పైపులైన్ల లీకుల పరిశీలన కోసం గుంతను పూడ్చకుండా ఉంచామని, సోమవారం పూడ్చేలా చర్యలు తీసుకుంటామని ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

కాలువలు లేక అవస్థలు

కవిటిలో మహాలక్ష్మి థియేటర్ వీధిలో కాలువలు లేక వాడుక నీరంతా రోడ్డుపైకి వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సమస్య అధికంగా ఉంటోందని, దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ ఈవో ఎం.రవిని వివరణ కోరగా కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

తలుపులు పాడై తిప్పలు

చినకోష్టలోని ఆరోగ్య ఉపకేంద్రం ఇది. తలుపులు పాడయ్యాయి. రంధ్రాలు ఏర్పడటంతో విషసర్పాలు ప్రవేశిస్తున్నాయి. వెనక భాగం తలుపు పూర్తిగా పాడైంది. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దీంతో సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. తలుపులు పాడైన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు సమకూర్చిన వెంటనే బాగుచేయిస్తామని సిరిపురం వైద్యాధికారి సాయి తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

స్తంభాలు ఒరిగిపోతున్నా పట్టదా..?

కవిటి మండలం బొరివంక నుంచి ఇద్దివానిపాలెం వెళ్లే రోడ్డులో పలు చోట్ల విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి పడిపోయే స్థితిలో ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఇద్దివానిపాలెం వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ యు.శ్రీనివాసరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

నిత్యం ఇబ్బందులే..

డొంకూరు సాగర తీరానికి వెళ్లే ప్రధాన రహదారిలో కాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వాడుక నీరు రోడ్డుపై నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉందని, రాకపోకలకు అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కృష్ణకు వివరణ కోరగా ఉన్నతాధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

డాలసరి ఆనందలహరి

మందస మండలం చీపి పంచాయతీ పరిధి డాలసరి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది జలపాతం. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో కొండల పైనుంచి నీరు జారిపడుతున్న దృశ్యం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పక్షుల కిలకిలారావాలు, మూడు వైపులా ఎత్తయిన కొండలు, నాలుగో వైపు పసుపుపచ్చని పంట పొలాలతో ఈ ప్రాంతం కళకళలాడుతోంది. ఆదివారం సందర్శకుల తాకిడి అధికంగా ఉంటోంది. – న్యూస్‌టుడే, మందస

అరకొర నిధులు.. తప్పని అవస్థలు..!

న్యూస్‌టుడే, పొందూరు

ఆసుపత్రుల అభివృద్ధికి ఏటా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. ఈ ఏడాది అరకొరగా జమ చేయడంతో వైద్యులు సొంత నిధులు వెచ్చించి సేవలందించాల్సిన పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నుంచి సొమ్ము అందుతుంది. సొమ్ము అందుబాటులో లేక రోగులకు తాగునీరు సమకూర్చడం, ఆసుపత్రిలో శుభ్రత, పనులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

★ జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంతర్జాలం, విద్యుత్తు బిల్లులు, గర్భిణులకు భోజనాలు, స్టేషనరీ, ఇతర ఖర్చులు కలిపి సుమారు రూ.50 వేల వరకు ఖర్చయిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఆగస్టులో రూ.30 వేలు జమ చేయగా మిగిలిన మొత్తం సొంత నిధులు వినియోగించారు.

★ఏటా మంజూరు చేయాల్సిన అభివృద్ధి నిధులు: రూ. 1.75 లక్షలు

★ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 66

ఆసుపత్రుల్లో పనులకు వైద్యులపై ఆర్థిక భారం

జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది నుంచి ఆహార పొట్లాలు అందుకున్న గర్భిణులు

నిధుల వినియోగం ఇలా..

★ ఏటా పీహెచ్‌సీలకు రూ.1.75 లక్షలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రూ.లక్ష చొప్పున కేటాయిస్తారు. రోగులకు తాగునీరు అందించడం, ఫినాయిల్, స్టేషనరీ కొనుగోలు, ఓపీ చీటీలు, దస్త్రాలు, కంప్యూటర్ మరమ్మతులు, ప్రింటర్ క్యాట్రిడ్జ్, అంతర్జాల బిల్లులు చెల్లించడానికి వినియోగిస్తారు.

★ అత్యవసర సమయంలో మందులు కొనుగోలు, ఆసుపత్రులకు వచ్చిన గర్భిణులకు అత్యవసరమైతే రవాణా ఖర్చులు భరించాలి.

★ జిల్లా కేంద్రం నుంచి ఔషధాలు తీసుకురావడానికి, ఆసుపత్రుల్లో చిన్నపాటి మరమ్మతులు చేయించడం, గ్రామాలకు టీకాల తరలింపు, ఉన్నతాధికారులు సందర్శనకు వచ్చినప్పుడు ఏర్పాట్లు ఇతర ఖర్చులకు ఆ నిధులే వినియోగించాలి.

త్వరలో జమ చేస్తాం..

ఆసుపత్రి అభివృద్ధి నిధులకు సంబంధించి ఈ ఏడాది రూ.30 వేలు చొప్పున జమ చేశాం. మిగిలిన మొత్తం ఖాతాలకు త్వరలో జమ చేస్తాం. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నాం. – డాక్టర్ కె.అనిత, డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

EENADU THE Ee WAY CLASSIFIEDS
పదవీ విరమణ శుభాకాంక్షలు
ఈనాడు క్లాసిఫైడ్స్
జన్మదిన శుభాకాంక్షలు
లీగల్ ప్రకటనలు
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు,
వేడుక ఏదైనా..
ఈనాడు ను
చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

(c) eenadu

సుస్థిర ప్రపంచ నిర్మాణానికి దోహదపడాలి

ప్రసంగిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి

చెన్నై, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక గురువు అయ్యా వైకుండర్ జీవితం, బోధనలు ప్రచారం చేయాలని ముఖ్యమని గవర్నర్ ఆర్.ఎన్.రవి తెలిపారు. మణలిలో జరిగిన వేడుకల్లో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బ్రిటిష్ వలసదారులు అక్రమ పాలన, అణచివేత, సామాజిక వినాశనం చేస్తున్న సమయంలో సామాజిక భద్రతకు, ధర్మాన్ని కాపాడేందుకు అయ్యా వైకుండర్ రాష్ట్రంలో అవతరించారని తెలిపారు. మతసామరస్యం, దయ, సోదరభావం వంటి ఆయన ఆధ్యాత్మిక బోధనలు సమాజాన్ని ఒకే కుటుంబంగా పునరుద్ధరించాయని పేర్కొన్నారు. ఆయన బోధనలను భారతీయ భాషల్లో మాత్రమే కాకుండా అంతర్జాతీయ భాషల్లోనూ అనువదించి ప్రశాంత, సుస్థిరమైన ప్రపంచాన్ని నిర్మించడానికి దోహదపడాలని పిలుపునిచ్చారు.

జాలర్ల సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరిస్తాం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరిస్తామని విళుపురం జిల్లా కోటకుప్పం ప్రాంతంలోని నడుకుప్పం జాలర్లు హెచ్చరించారు. ఈ గ్రామంలో సుమారు 300 జాలర్ల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. చేపల వేటకు ఉపయోగించే పడవలు, సామగ్రి తీరం వద్ద ఉంచుతుండటంతో ఇతర సామాజికవర్గానికి చెందిన వారు వ్యతిరేకిస్తున్నారు. ఒక్కోసారి తీరం కల్లోలంగా ఉన్నప్పుడు పడవలు సముద్రపు నీటిలో కొట్టుకుపోతున్నాయి. ప్రకృతి విపత్తుల సమయంలో జాలర్లు వేటకు వెళ్లని కారణంగా జీవనాధారం దెబ్బతింటోంది. ఈ విషయమై జాలర్లు అనేకసార్లు జిల్లా కలెక్టరు, మత్స్యశాఖ అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో సోమవారం జాలర్లు విలేకరులతో మాట్లాడుతూ తుపాను కారణంగా ఐదు రోజులుగా చేపల వేటకు వెళ్లలేదన్నారు. ప్రభుత్వం తమకు నివారణ సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే తమ ఇళ్ల పట్టాలను కలెక్టరుకు అప్పగిస్తామని తెలిపారు.

నీలగిరికి హైడ్రోజన్ రైలు!

- ప్రయోగాల తర్వాత నడిపే అవకాశం
- మరిన్ని రైళ్లకు ఐసీఎఫ్‌లో ముమ్మర పరిశోధన

ఈనాడు-చెన్నై

నీలగిరిలో పర్యావరణహిత హైడ్రోజన్ రైలు పరుగులు పెట్టనుంది. పర్యాటకుల్ని అమితంగా ఆకర్షించనుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నీలగిరి కొండల్లో ఈ రైలును నడిపేందుకు అనువైన పరిస్థితులు, అందుకు తగ్గట్లు డిజైన్లు ఎలా ఉండాలనేదానిపై ఐసీఎఫ్ ఉన్నతాధికారులు సైతం పరిశోధనలు చేస్తున్నారు.

ఇటలీ ప్రాజెక్టు ఫలితాలతో..

హైడ్రోజన్ రైళ్ల తయారీ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసీఎఫ్)కి అప్పగించింది. నీలగిరిలో ఈ తరహా రైలు నడపాలంటే అక్కడి పరిస్థితులకు అనుగుణంగా రైలు సామర్థ్యాన్ని పెంచాల్సి ఉంటుంది. ఇందుకోసం అధికారులు ఇటలీ లోయల్లో నడిపేందుకు సిద్ధమవుతున్న హైడ్రోజన్ రైళ్ల డిజైన్లనూ పరిశీలిస్తున్నారు. ఇటలీ రైల్వే విభాగాలు తాము రూపొందించిన రైలును తొలిసారిగా వాల్కమోనికా లోయలో నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం అన్నిరకాల పరీక్షలు చేస్తున్నారు. ఇక్కడి ఫలితాల్ని సైతం ఐసీఎఫ్ తెప్పించుకుంటోంది. నీలగిరిలోని పట్టాల సైజుతో పోల్చితే వాల్కమోనికా లోయ రైలు పట్టాలు మరింత చిన్నవి. ఈ రైళ్లకు వారెలాంటి సాంకేతికత ఉపయోగిస్తున్నారో పరిశీలిస్తున్నారు.

రైలు లోపలి భాగం

గంటకు 105 కి.మీ వేగంతో..

ఐసీఎఫ్ నుంచి తొలి హైడ్రోజన్ రైలు ఈ మధ్యే నార్తర్న్ రైల్వేకు పంపారు. జింద్-సోనిపట్ మధ్య 89 కి.మీ మార్గంలో నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోనే హైడ్రోజన్ ప్రొడక్షన్ ప్లాంటును ఏర్పాటుచేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉండటంతో అక్కడ తొలిసారిగా నడిపేందుకు ఆసక్తి చూపుతోంది. ఈ రైలు గంటకు 105 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది.

తొలివిడతగా 35..

దేశంలో ఈ రైళ్లు నడపాల్సిన అవసరం ఎక్కడెక్కడుంది, అక్కడి పరిస్థితులకు తగ్గట్లు ఎలా డిజైన్ చేయాలనేదానిపై ఐసీఎఫ్ పరిశీలన చేస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం 35 హైడ్రోజన్ రైళ్లు తయారు చేయాలని చూస్తున్నారు. ప్రత్యేకించి చారిత్రక, వారసత్వ ప్రాంతాలకు, కొండ ప్రాంతాలకు నడపాలని చూస్తున్నారు. ఇందులో భాగంగానే మెట్టుపాళయం నుంచి ఊటీ మధ్య 46 కి.మీ మేర నడపాలని కేంద్రం యోచిస్తోంది. ఈ 35 రైళ్ల ప్రాజెక్టును పూర్తిచేశాక భవిష్యత్తుకోసం మరిన్ని రైళ్లను ఉత్పత్తి చేయాలనే ఆలోచనతో ఐసీఎఫ్ ఉంది. వాటికి అవసరమైన పవర్‌కార్లను ఓ ప్రైవేటు కంపెనీతో కలిసి ఇక్కడి అధికారులు సిద్ధం చేస్తున్నారు.

తక్కువ ఖర్చు..

వందేభారత్ రైళ్ల తరహాలోనే హైడ్రోజన్ రైళ్లు సైతం పూర్తిస్థాయిలో ఐసీఎఫ్‌లోనే తయారయ్యేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాటి తయారీకి ఎంత వీలైతే అంత ఖర్చు తగ్గించాలనే లక్ష్యంతోనే పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేక బృందం పరిశోధనలు చేస్తోంది. మరోవైపు ఈ రైళ్లకు అవసరమైన హైడ్రోజన్ ఉత్పత్తి, దాని నిల్వ ఎలా అనేదానిపై ఆలోచనలు చేస్తున్నారు. ప్రయాణికులకు, సరకు రవాణాకు ఈ రైలు ఎంతవరకు పనికొస్తుంది, సామర్థ్యాన్ని ఏ స్థాయికి పెంచాలనేదానిపై ఐసీఎఫ్ కృషి చేస్తోంది. క్షేత్రస్థాయిలో వివిధ కోణాల్లో ఈ రైలును పరీక్షించిన తర్వాత మార్పులు చేర్పులు చేసే అవకాశం ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు

చెన్నైలో భారీవర్షం

తిరువొత్రియూర్ జోన్ తిరుచినాకుప్పంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఆహారం అందిస్తున్న జీసీసీ సిబ్బంది

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నైలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి మోస్తరు వర్షం కురవగా సోమవారం తెల్లవారుజాము నుంచి ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురిసింది. ఎగ్మూర్, అన్నాసాలై, నుంగంబాక్కం, తేనాంపేట తదితర ప్రాంతాల్లో విద్యార్థులు, ఉద్యోగానికి వెళ్లేవారు, వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. చాలా ప్రాంతాల్లో వాననీరు నిలిచిపోయింది. కొన్ని ప్రైవేటు పాఠశాలలు మధ్యాహ్నం నుంచి సెలవు ఇచ్చాయి. చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం సోమవారం మధ్యాహ్నం చెన్నై జిల్లాలో ఆరెంజ్ అలెర్ట్ జారీచేసింది. సాయంత్రం రెడ్ అలెర్ట్ జారీ అయింది. ఈదురుగాలులు బలంగా వీస్తుండడంతో మెరీనా బీచ్‌కి వెళ్లేందుకు ప్రజలకు అనుమతివ్వకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు.

5వ తేదీ వరకు..

నైరుతి బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి సముద్రతీరాల్లో నెలకొని ఉన్న దిత్వా తుపాను ఆదివారం సాయంత్రం తీవ్ర వాయుగుండంగా బలహీనపడినట్లు వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఇది ఉత్తర దిశలో నెమ్మదిగా పయనించి సోమవారం చెన్నైకి తూర్పు, ఆగ్నేయంగా సుమారు 50 కి.మీ దూరంలో, పుదుచ్చేరికి ఈశాన్యంగా 130 కి.మీ, కడలూరుకి 150 కి.మీ, ఏపీలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుకి దక్షిణ-ఆగ్నేయంగా 200 కి.మీ దూరంలో నెలకొన్నట్లు పేర్కొంది. 5వ తేదీ వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. చెన్నైలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

చెన్నై పట్టాళం ఆంజనేయ ఆలయం వద్ద వాననీటిలో వాహనాల రాకపోకలు

చేపల వేటకు వెళ్లొద్దు..

ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి సముద్రతీర ప్రాంతాలు, దక్షిణ తమిళనాడు, కన్నియాకుమరి, మన్నార్ గల్ఫ్, దక్షిణ ఆంధ్రప్రదేశ్, నైరుతి బంగాళాఖాతంలో మంగళవారం గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని జాలర్లు ఆ ప్రాంతాలకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీచేసింది. గత 24 గంటల్లో మహాబలిపురం(చెంగల్పట్టు) 6 సెం.మీ, సీర్కాళి(మైలాడుతురై), రాజా అన్నామలైనగర్(చెన్నై), కత్తివాక్కం(చెన్నై), కొళ్లిడం(మైలాడుతురై), అన్నామలైనగర్ (కడలూరు) తలా 4, మణలి పుదునగరం(చెన్నై), బేసిన్‌బ్రిడ్జి (చెన్నై), తరంగంపాడి(మైలాడుతురై), ఎన్నూర్ (తిరువళ్లూరు), తండయార్‌పేట(చెన్నై), ఐస్‌హౌస్(చెన్నై)లలో తలా 3 సెం.మీల వర్షపాతం నమోదైంది.

ఐదుకు పెరిగిన మృతులు

ప్యారిస్, న్యూస్‌టుడే: తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు మృతి చెందారు. గోడకూలి తంజావూరులో రేణుక(20), నాగపట్టినంలో సరోజ(6), తూత్తుకుడి జిల్లా ఏరల్‌కు చెందిన బలవేశం(85) ప్రాణాలు కోల్పోయారు. విద్యుదాఘాతంతో మైలాడుతురై జిల్లా సీర్కాళికి చెందిన ప్రతాప్(19), విళుపురం జిల్లా మయిలంలో సుబ్రమణి(55) మృతి చెందారు.

దిత్వా బాధితులకు పరిహారం అందించండి

సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: తుపాను బాధితులకు పరిహారం అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి స్టాలిన్ సూచించారు. దిత్వా ప్రభావం, పంట నష్టం, చేపడుతున్న సహాయక చర్యలపై సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. డెల్టా జిల్లాల్లో భారీవర్షాలు, వ్యవసాయ, ఉద్యానవన పంటల నష్టం, అంచనాల సేకరణపై చర్చించారు. భారీవర్షాలు కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో వరదనీటిని తొలగించే పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. అక్టోబరులో కురిసిన వర్షాలతో 33శాతానికి పైగా దెబ్బతిన్న 4,235 హెక్టార్ల వ్యవసాయ పంటలకు, 345 హెక్టార్ల ఉద్యానవన పంటలకు రాష్ట్ర విపత్తు సహాయ నిధి నుంచి తగిన సాయం అందించాలని ఆదేశించారు. తుపానుతో దెబ్బతిన్న గుడిసెలు, ఇతర ఇళ్లు, మానవ, పశువుల ప్రాణనష్టం వంటివాటికి జిల్లా కలెక్టర్లు త్వరగా పరిహారం అందించాలని సూచించారు. పలు జిల్లాల్లోని 39 సహాయ శిబిరాల్లో ఉన్న ప్రజలకు అవసరమైన తాగునీరు, ఆహారం, ఔషధ వసతులను వెంటనే కల్పించాలని, వాటిని అవసరమయ్యే కాలం వరకు కొనసాగించాలని సూచించారు.

శ్రీలంకలో తమిళులను ఆదుకోవాలి: సీమాన్

చెన్నై, న్యూస్‌టుడే: భారీవర్షాలకు శ్రీలంకలో ఇబ్బంది పడుతున్న తమిళులను ఆదుకోవాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నామ్ తమిళర్ కట్చి చీఫ్ కన్వీనర్ సీమాన్ డిమాండ్ చేశారు. ఆయన తన ప్రకటనలో... దిత్వా తుపాను కారణంగా శ్రీలంకలో పలువురు తమిళులు ఇళ్లు, వస్తువులు కోల్పోయి ఆకలితో అల్లాడుతున్నారని తెలిపారు. తలదాచుకోవడానికి శిబిరాలు కూడా లేని పరిస్థితుల్లో ఉన్నారని, తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాలు వెంటనే తగిన సహాయాలు అందించాలని డిమాండ్ చేశారు. శ్రీలంక విమానాశ్రయంలో 3 రోజులుగా ఆహారం కూడా లభించకుండా అవస్థ పడుతున్న 150 మందికిపైగా తమిళులు సహా 300 మందిని ఆదుకోవాలన్నారు.

గిండి రేస్‌క్లబ్‌లో చెరువుల ఏర్పాటుకు హైకోర్టు అనుమతి

ప్యారిస్, న్యూస్‌టుడే: గిండి రేస్‌క్లబ్ స్థలంలో వాననీటి సేకరణ చెరువుల ఏర్పాటుకు మద్రాసు హైకోర్టు అనుమతించింది. రేస్‌క్లబ్‌కు ఇచ్చిన స్థలం లీజు రద్దు చేసిన తమిళనాడు ప్రభుత్వం దానిని స్వాధీనం చేసుకుంది. ఆ స్థలంలో 118 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యానవన శాఖ తరఫున ప్రజలకు ఉపయోగపడేలా గ్రీన్ పార్క్, కార్పొరేషన్ తరఫున వాననీటిని సేకరించేందుకు నాలుగు చెరువుల ఏర్పాటుకు సిద్ధమైంది. చెరువుల ఏర్పాటు, లీజు రద్దుకు వ్యతిరేకంగా రేస్‌క్లబ్ తరఫున హైకోర్టులో కేసు దాఖలైంది. విచారణ జరిపిన సింగిల్ జడ్జి యథాతథస్థితి కొనసాగించాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అప్పీల్ దాఖలైంది. విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఎమ్ సుబ్రహ్మణ్యం, జస్టిస్ ముహమ్మద్ షఫిక్ ధర్మాసనం సోమవారం జారీచేసిన ఉత్తర్వుల్లో చెరువులు, గ్రీన్ పార్క్ ఏర్పాటుకు అనుమతిచ్చారు. గతంలో వరద కారణంగా చెన్నైలో ఏర్పడిన ఇబ్బందులను చూస్తే ఇలాంటి పథకాలు అవసరమని న్యాయమూర్తులు తెలిపారు. పర్యావరణ సమతుల్యత ఏర్పడటంతోపాటు గాలి కాలుష్యాన్ని తగ్గించడం వీలవుతుందన్నారు. చెన్నైలాంటి మహానగరాల్లో స్థల కొరత ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ జాగాను కొంతమంది వ్యక్తులు తమ వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించడాన్ని అనుమతివ్వడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

కార్తిక దీపోత్సవాల్లో భాగంగా సోమవారం తిరువణ్ణామలైలో భక్తజన సందోహం నడుమ అశ్వ వాహనంపై ఊరేగుతున్న ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామి

నవంబరులో అతి తక్కువ వర్షపాతం నమోదు

ప్యారిస్, న్యూస్‌టుడే: నవంబరులో అతి తక్కువ వర్షపాతం నమోదైనట్లు తమిళనాడు వెదర్‌మెన్ ప్రదీప్ జాన్ తెలిపారు. ఆయన తన ఎక్స్‌లో.. రాష్ట్రంలో నవంబరు నెలలో వర్షపాతం సాధారణం కన్నా అతి తక్కువగా నమోదైందని, సాధారణంగా నవంబరులో 181.77 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఈ ఏడాది 149.2 మి.మీ మాత్రమే నమోదైనట్లు చెప్పారు. చెన్నైలో నవంబరు నెల వర్షపాతం సాధారణ వర్షపాతం 373.6 మి.మీ అని, ఈ ఏడాది 104.77 మి.మీ మాత్రమే నమోదైనట్లు పేర్కొన్నారు.

‘సర్’పై 13న డీఎంకే న్యాయశాఖ కన్వీనర్ల సమాలోచన

చెన్నై, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్)పై డీఎంకే న్యాయశాఖ కన్వీనర్ల సమాలోచన 13న జరగనుంది. ఈ మేరకు ఆ పార్టీ న్యాయశాఖ కార్యదర్శి ఎంపీ ఎన్.ఆర్.ఇళంగో ప్రకటన విడుదల చేశారు. డీఎంకే న్యాయశాఖ నియమించిన జిల్లాస్థాయి కన్వీనర్లు(డీఎల్‌సీ), శాసనసభ నియోజకవర్గం స్థాయి కన్వీనర్లు(సీఎల్‌సీ-2) సమాలోచన ఉదయం 10 గంటలకు అన్నా అరివాలయంలో జరగనుంది. న్యాయశాఖ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది విడుతలై నేతృత్వంలో జరిగే సమాలోచనలో పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్.ఎస్.భారతి ప్రత్యేక ప్రసంగం చేస్తారన్నారు.

కండువా మార్చడంతో లక్ష్యమూ మారింది

ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిసామి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: సెంగోట్టైయన్ కండువా మార్చడంతో లక్ష్యం కూడా మారిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి విరుచుకుపడ్డారు. ఈరోడ్ శివారు వెస్ట్ జిల్లా అన్నాడీఎంకే తరఫున గోపిచెట్టిపాలయం తిరుమాళ్‌నగర్‌లో బహిరంగ సమావేశం జరిగింది. ఈపీఎస్ ప్రసంగిస్తూ.. రానున్న శాసనసభ ఎన్నికలలో అన్నాడీఎంకే కూటమి అపారమైన విజయం సొంతం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఓట్లకోసం అభ్యర్థించిన ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే రాజీనామా చేయడానికి ప్రజలను సంప్రదించారా అని ప్రశ్నించారు. గోపిలో ఉన్న ఒకరు(మాజీమంత్రి సెంగోట్టైయ్యన్) అత్తిక్కడవు-అవినాశి పథకం కార్యక్రమంలో ఎంజీఆర్, జయలలిత ఫొటోల్లేవని పాల్గొనలేదని చెప్పారు. ఇప్పుడు ఎవరి ఫొటో చూసి వేరే పార్టీలో చేరారని ప్రశ్నించారు. అధిష్ఠానానికి గడువు ఇచ్చినందుకే ఆయన్ని పార్టీ బాధ్యతల నుంచి తొలగించినట్లు స్పష్టం చేశారు. సత్పరిపాలన అందిస్తామని చెబుతున్న సెంగోట్టైయన్ అన్నాడీఎంకేలో మంత్రిగా ఉన్నపుడు అందించలేదా అని ప్రశ్నించారు.

ఈపీఎస్‌కు జవాబివ్వాల్సిన అవసరం లేదు

సెంగోట్టైయన్

ట్రిప్లికేన్: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి పెద్ద నాయకుడు కాదని, ఆయన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి సెంగోట్టైయన్ తెలిపారు. కోయంబత్తూరు విమానాశ్రయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎవరు ఎన్ని చెప్పినా తనకు సంబంధించినంత వరకు స్పష్టంగా ఉన్నానని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పు ఇస్తారని తెలిపారు.

ఈపీఎస్ మనసులో అమిత్‌షానే ఉన్నారు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: సెంగోట్టైయన్ పార్టీ మారలేదని, శాఖ మారారని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చలోక్తి విసిరారు. ఈరోడ్ జిల్లా మొడక్కురిచ్చి సమీపంలోని ఎళుమాత్తూర్‌లో పుదియ ద్రావిడ కళగ మహానాడు నిర్వహించారు. ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సూచన మేరకే సెంగోట్టైయ్యన్ వేరే పార్టీలో చేరారని తెలిపారు. ఎడప్పాడి పళనిసామి మనసులో అన్నా, ఎంజీఆర్, జయలలిత లేరని పూర్తిగా అమిత్‌షా మాత్రమే ఉన్నారని విమర్శించారు. అన్నాడీఎంకే సీనియర్ నాయకులు ఏ పార్టీలో చేరాలన్నా భాజపా అనుమతి తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే సహా పలు పార్టీలకు అమిత్‌షా ఇల్లు ప్రధాన కార్యాలయంగా ఉందన్నారు. బానిసల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఐక్యంగా మెలగాలని పిలుపునిచ్చారు. మంత్రులు ఎస్.ముత్తుసామి, సామినాథన్, కయల్‌విళి సెల్వరాజ్, మదివేందన్, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ, పుదియ ద్రావిడ కళగం వ్యవస్థాపకుడు కేఎస్ రాజ్‌గౌండర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉదయనిధి స్టాలిన్

అన్నాడీఎంకేను బలహీనపరుస్తున్న ఎడప్పాడి: టీటీవీ

ప్యారిస్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకేని ఎడప్పాడి పళనిసామి మరింత బలహీనపరుస్తున్నారని ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ విమర్శించారు. మదురైలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల పొత్తును ఖరారు చేయడానికి డిసెంబరు 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు. కూటమికి పలు పార్టీలు ఆహ్వానిస్తున్నాయని, ఖరారైన తర్వాత ప్రకటిస్తామని చెప్పారు. ద్రోహానికి మారుపేరు పళనిసామి అని సెంగోట్టైయన్ అన్నారని, 2017 నుంచి ఆయన చేస్తున్న ద్రోహాలకు భగవంతుడు శిక్ష విధిస్తూనే ఉన్నాడని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మంచి తీర్పునిస్తారని పేర్కొన్నారు.

మద్రాసు విశ్వవిద్యాలయంలో 4, 5 తేదీల్లో ధర్మనిధి ఉపన్యాసాలు

టీనగర్, న్యూస్‌టుడే: మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు ధర్మనిధి ఉపన్యాసాలు పేరిట సాహిత్య సదస్సు జరుగనుంది. తొలిరోజు ఉదయం 10.15 గంటలకు మెరీనా తీరంలోని రజతోత్సవ ప్రాంగణంలో ప్రారంభ సభతో కార్యక్రమం మొదలవుతుంది. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్యులు విస్తాలి శంకరరావు నేతృత్వంలో జరుగనున్న కార్యక్రమానికి గోపురం పసుపు, కుంకుమ సంస్థ అధినేత వైవీ హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆచార్య గంధం అప్పారావు ధర్మనిధి ఉపన్యాసం, 2 గంటలకు ఆర్కాటు ప్రకాశరావు, 3.15కు ములుమూడి ఆదిలక్ష్మి ధర్మనిధి ఉపన్యాసాలు జరగనున్నాయి. 5న ఉదయం 10.30కు ఎన్ఆర్ చందూర్ స్మారక ధర్మనిధి ఉపన్యాసం, ఉదయం 11.45కు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ధర్మనిధి ఉపన్యాసం, 2 గంటలకు ఆచార్య జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి ధర్మనిధి ఉపన్యాసం జరుగనుంది. సాయంత్రం 3.15కు ముగింపు సమావేశం నిర్వహించనున్నారు.

దర్గాకు వస్తున్న రెహమాన్

నాగూర్ దర్గాకు ఆటోలో వచ్చిన ఏఆర్ రెహమాన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నాగపట్నం జిల్లా నాగూర్ దర్గాలో కందూరి ఉత్సవంలో భాగంగా చందనకూడు ఊరేగింపు సోమవారం జరిగింది. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఉత్సవాలకు ఆటోలో విచ్చేశారు. సమాధి వద్ద చాలాసేపు క్యూలో నిల్చుని ప్రార్థించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారాయి.

శివగంగై రోడ్డు ప్రమాదం
10మంది మృతదేహాలు గుర్తింపు

ప్యారిస్, న్యూస్‌టుడే: శివగంగై జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 11 మంది మృతిచెందిన నేపథ్యంలో అందులో 10 మంది మృతదేహాలను గుర్తించి కుటుంబీకులకు అప్పగించారు. శివగంగై జిల్లా తిరుప్పత్తూరు సమీపం కుమ్మంకుడి వద్ద ఆదివారం సాయంత్రం రెండు ప్రభుత్వ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో తొమ్మిది మంది మహిళలు సహా 11 మంది మృతిచెందారు. 40 మంది గాయపడిన విషయం తెలిసిందే. వీరంతా తిరుప్పత్తూరు, మదురై, కారైక్కుడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 10 మంది మృతదేహాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఆ ప్రకారం నీలకోట్టైకి చెందిన బస్సు డ్రైవరు సెన్రాయన్(36), సింగంపుణరికి చెందిన ముత్తుమారి(60), కారైక్కుడికి చెందిన కల్పన(36), అరియక్కుడికి చెందిన మల్లిక(61), దేవకోట్టైకి చెందిన గుణలక్ష్మి(55), మేలూర్‌కి చెందిన సెల్వం(55), అమ్మన్‌కురిచ్చికి చెందిన దైవానై(58), వేలూర్‌కి చెందిన ముత్తులక్ష్మి(49), దిండుక్కల్‌కి చెందిన వెట్రిసెల్వి(60), చెన్నైకి చెందిన లావణ్య(50) ఉన్నారు. కారైక్కుడి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న ఓ మహిళ మృతదేహాన్ని ఇంకా గుర్తించలేదని పేర్కొన్నారు. మదురై, కారైక్కుడి, శివగంగై, తిరుప్పత్తూర్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 22 మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పెరియకరుప్పన్, జిల్లా కలెక్టరు పొర్కొడి ఘటనా స్థలిని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మృతదేహాలకు నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రకటించిన ఆర్థిక సాయం రూ.3లక్షల చెక్కులను అందజేశారు.

ప్రమాదానికి గురైన బస్సులను పరిశీలిస్తున్న దృశ్యం

బాధితులకు ఆర్థిక సాయం ప్రకటించిన ప్రధాని

చెన్నై, న్యూస్‌టుడే: శివగంగై జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కేంద్ర ఆర్థిక సాయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆయన తన ‘ఎక్స్’ పేజీలో... శివగంగై జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 11 మంది మరణించడం అత్యంత బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలను ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి అందించనున్నట్లు ప్రకటించారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున...

బాధిత కుటుంబ సభ్యులకు నగదు చెక్కు అందజేస్తున్న మంత్రి పెరియకరుప్పన్

చెన్నై: దుర్ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన చికిత్సలు అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.3లక్షలు, తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి రూ.లక్ష చొప్పున, స్వల్పంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి రూ.50వేల చొప్పున సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని అధికారులను ఆదేశించారు.

(c) eenadu

పార్టీ బలోపేతానికి కృషి: తిరుమావళవన్

కార్యనిర్వాహకులతో మాట్లాడుతున్న తిరుమావళవన్

వేలూరు, న్యూస్‌టుడే: పార్టీ కోసం నిరంతరాయంగా కృషి చేస్తున్నట్లు వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ తెలిపారు. వేలూరు జిల్లా గుడియాత్తం వద్ద పార్టీ కార్యనిర్వాహకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యనిర్వాహకుల ఎంపిక ప్రక్రియ 10 రోజులకుపైగా కొనసాగుతోందన్నారు. కంట్లో కణితి తనను అధికంగా బాధిస్తోందని, నివారణకు యాంటీబయాటిక్స్ వాడుతున్నానని తెలిపారు. పార్టీ బలోపేతానికి 15 నుంచి 18 గంటల పాటు నిర్విరామంగా పనిచేస్తున్న కారణంగా మోకాళ్ల నొప్పులు రోజురోజుకు ఎక్కువై బాధిస్తున్నాయని చెప్పారు.

వాలీబాల్ పోటీల్లో పీయూ కమ్యూనిటీ కళాశాల జట్టు సత్తా

వడపళని, న్యూస్‌టుడే: పాండిచ్చేరి యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ పోటీలు నవంబరు 13, 14 తేదీల్లో జరిగాయి. ముల్లైవైదిని పీఎస్వీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన పురుషుల పోటీల్లో 34 జట్లు పాల్గొన్నాయి. ఇందులో పాండిచ్చేరి వర్సిటీ కమ్యూనిటీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. నవంబరు 20, 21 తేదీల్లో మహిళలకు జరిగిన పోటీల్లో 14 జట్లు తలపడ్డాయి. ఇందులోనూ పాండిచ్చేరి యూనివర్సిటీ కమ్యూనిటీ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా పీయూ కమ్యూనిటీ కళాశాల ప్రిన్సిపల్, ఆచార్యులు లలిత రామకృష్ణన్ విజేతలను బహుమతులతో సత్కరించారని వర్సిటీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

ముడిచ్చూరు డిపోకా.. మేము వెళ్లం!

విముఖత చూపుతున్న ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు

- న్యూస్‌టుడే, వడపళని

చెన్నై నుంచి రాష్ట్రంలోని దక్షిణ, పశ్చిమ ప్రాంత జిల్లాల వైపునకు నడిచే ప్రైవేటు బస్సులు ముడిచ్చూరు వరకు వెళ్లడానికి సుముఖంగా లేరు. నగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రైవేటు బస్సుల కోసం ముడిచ్చూరులో ప్రత్యేకంగా డిపోను నిర్మించింది. అయితే అది చాలా దూరం కావడంతో ప్రయివేటు బస్సుల ఆపరేటర్లు మద్రాస్ హైకోర్టు ఆదేశాలను కూడా ఉల్లంఘిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ప్రయాణికులను ఎక్కించుకుంటూ దించుతున్నారు.

యజమానులతో చర్చిస్తాం

రెండు దశాబ్దాల క్రితం ఇదేవిధంగా ఎగ్మూరు నుంచి కోయంబేడుకు వెళ్లడానికి పలువురు నిరాకరించారని రవాణా శాఖ జాయింట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) పట్టుసామి చెప్పారు. 1990 నుంచి ప్రయివేటు బస్సుల ఆపరేటర్లు ఎగ్మూరు నుంచి సేవలు అందిస్తున్నారని, కోయంబేడుకు అలవాటు పడటానికి సమయం పట్టిందని, ముడిచ్చూరు డిపోకి మార్చేందుకు వారితో చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు.

రూ.42 కోట్లతో నిర్మాణం

రూ.42 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)లో ప్రయివేటు బస్సుల సౌకర్యార్థం నిర్మించిన డిపో అందుబాటులోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇందులో ఒకేసారి కేవలం 15 ప్రయివేటు బస్సులు మాత్రమే నిలబడి ఉన్నాయి. ఈ డిపోలో 150 బస్సులు నిలిపే సామర్థ్యం ఉంది. కోయంబేడులో డిపో వసతి ఉన్న ఆపరేటర్లకు ముడిచ్చూరు డిపో సిద్ధం అయ్యేవరకు వినియోగించుకునేందుకు వీలుగా మద్రాసు హైకోర్టు 2024 ఫిబ్రవరిలో అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో 2024 డిసెంబరులో ముడిచ్చూరు డిపో సిద్ధమైనప్పటికీ పలువురు ప్రయివేటు ఆపరేటర్లు అక్కడికి వెళ్లట్లేదు.

అన్ని వసతులున్నాయి

ముడిచ్చూరు డిపో నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఆర్ఆర్ ఏజెన్సీ సంస్థ సహ వ్యవస్థాపకుడు రమానాథన్ జయకుమార్ మాట్లాడుతూ... డిపోలో 180 పడకల డార్మిటరీ, ఐదు రెస్ట్‌రూములు, రెండు రెస్టారెంట్లు ఉన్నాయన్నారు. బస్సులకు పార్కింగ్ చార్జీగా రూ.150, డార్మిటరీ చార్జీ కింద ఒక్కొక్కరికి రూ.80 వసూలు చేస్తున్నామని, డార్మిటరీ లోపల మరుగుదొడ్ల వసతి కూడా ఉందన్నారు. గత నెలలో ఆపరేటర్లు ప్రత్యేకంగా ఎగ్జిట్ బే (బయటకు వెళ్లడానికి) కావాలని కోరడంతో దానిని నిర్మించామని, అయినా ఇక్కడికి రావడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ప్రజలు వచ్చే వరకు వేచి ఉండాలని సీఎండీఏ పేర్కొనడంతో నష్టాల్లో ఉన్నామని, ఐదుగురు సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నామని జయకుమార్ పేర్కొన్నారు.

ముడిచ్చూరు బస్ డిపో

తక్కువ బుకింగ్‌లతో సమస్య

కోయంబేడు నుంచి పెరుంగళత్తూరు మీదుగా కిలాంబాక్కం వరకు చెన్నై బైపాస్‌లో మాత్రమే నడపాలని కోర్టు వారిని ఆదేశించింది. కానీ వారు దానిని కూడా పాటించడం లేదు. కిలాంబాక్కం వరకు కనెక్టివిటీ లేకపోవడంతో ప్రజలు నగరంలో బుక్ చేసుకుంటున్నారని 'ఆల్ ఓమ్నీ బస్ అసోసియేషన్(ఏఓబీఏ)' అధ్యక్షుడు ఎ.అన్బళగన్ పేర్కొన్నారు. అంబత్తూరు నుంచి తమకు ఎనిమిది బుకింగ్‌లు, కోర్ సిటీలో 10 కన్నా ఎక్కువ, కిలాంబాక్కంలో కేవలం 3 నుంచి 4 బుకింగ్‌లు మాత్రమే వస్తున్నాయని, ఈ స్థితిలో ఆపరేటర్లు అక్కడి నుంచి సేవలు ఎలా నడపగలరని అన్బళగన్ చెబుతున్నారు.

రాష్ట్ర రైతులను మోసగిస్తున్న కేంద్ర ప్రభుత్వం

మంత్రి కోవి చెళియన్

ర్యాలీలో పాల్గొన్న మంత్రి కోవి చెళియన్ తదితరులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర రైతులను కేంద్రంలోని భాజపా ప్రభుత్వం మోసగిస్తోందని మంత్రి కోవి చెళియన్ విమర్శించారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా తంజావూరులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిని మంత్రి కోవి చెళియన్ ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న వరి పంటలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించి రైతులను ఆదుకునేందుకు పలు చర్యలు తీసుకున్నారని చెప్పారు. కానీ రాష్ట్ర రైతులను కేంద్ర ప్రభుత్వం మోసగిస్తోందని ఆరోపించారు. ప్రస్తుత వర్షాలకు అక్కడక్కడా నష్టాలు ఏర్పడుతున్నాయని, వాటి గురించి ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో చర్చించి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

డీఎంకే పాలనలో పెరిగిన వితంతువుల సంఖ్య

మాజీ మంత్రి వళర్మతి

పారిస్, న్యూస్‌టుడే: వితంతువులు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తమిళనాడు మొదటి స్థానానికి చేరడమే డీఎంకే ప్రభుత్వం సాధించిన విజయమని అన్నాడీఎంకే మాజీ మంత్రి వళర్మతి ఆరోపించారు. మదురైలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... జయలలిత మరణానంతరం అన్నాడీఎంకే అనేక పరీక్షలను ఎదుర్కొందని, వాటినన్నింటినీ తట్టుకుని నిలబడిన వ్యక్తి ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి అని పేర్కొన్నారు. డీఎంకేతో కొంతమంది ద్రోహులు కలిసి జయలలిత కలలను నాశనం చేసేలా కుట్రలు పన్నారని విమర్శించారు. 2021లో మద్యం వల్ల యువ వితంతువుల సంఖ్య పెరిగినట్లు ఎంపీ కనిమొళి అసత్య ప్రచారం చేశారని, నేడు వితంతువులు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉందన్నారు. బాలికలపై 61శాతం నేరాలు పెరిగాయన్నారు. గత నాలుగేళ్లలో 20 వేల మందికిపైగా లైంగిక వేధింపులకు గురయ్యారని, వారిలో అధికంగా విద్యార్థులు ఉన్నారని తెలిపారు.

'అపోలో మైక్రో సిస్టమ్స్'తో ఐఐటీఎం ఒప్పందం

వడపళని, న్యూస్‌టుడే: అత్యాధునిక రక్షణ సాంకేతిక పరిజ్ఞానాలను, స్వదేశీ అభివృద్ధిని వేగవంతం చేయడానికి ఐఐటీ మద్రాస్ భారత నావికాదళం, అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్‌తో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. నవంబరు 25న దిల్లీలో జరిగిన భారత నావికాదళం, 'స్వావలంబన్-2025' కార్యక్రమంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో ఒప్పందాలు జరిగాయని ఐఐటీ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఒప్పందం గురించి ఐఐటీ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు పీఏ రామకృష్ణ మాట్లాడుతూ... సాయుధ దళాల ప్రస్తుత, ఉద్భవిస్తున్న సాంకేతిక సమస్యల ప్రకటనలను సంయుక్తంగా పరిష్కరించడానికి ఒప్పందం ద్వారా సాధ్యపడగలదన్నారు. అపోలో మైక్రో సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కరుణాకర్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో ఒప్పందాలు మార్చుకుంటున్న దృశ్యం

నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవరు

అరక్కోణం, న్యూస్‌టుడే: చెన్నై నుంగంబాక్కం ప్రాంతానికి చెందిన ప్రియ, ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం చెన్నై నుంచి రైల్లో అరక్కోణం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో శోళింగర్ ఆలయానికి వెళ్లి, స్వామివారి దర్శనానంతరం అదే ఆటోలో అరక్కోణం రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైల్లో చెన్నైకి వెళ్లిపోయారు. వీరు ప్రయాణించిన ఆటోను అరక్కోణంలోని పళనిపేటకు చెందిన అన్వర్ బాషా(60) నడిపారు. ఇదిలా ఉండగా ఆయన ఆటోను శుభ్రం చేస్తుండగా 10 గ్రాముల బంగారు డాలర్ కనిపించింది. వెంటనే దానిని స్థానిక పోలీసు స్టేషన్లో అప్పగించి అందులో ఎక్కినవారి వివరాలు చెప్పారు. దీంతో పోలీసులు దర్యాప్తు చేసి ప్రియకు సమాచారం అందజేశారు. సోమవారం పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఆమెకు అన్వర్ బాషా సమక్షంలో సబ్ ఇన్‌స్పెక్టరు డాలర్‌ను అప్పగించారు. నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవరును సత్కరించారు.

అన్వర్ బాషా సమక్షంలో ప్రియకు డాలర్ అందజేస్తున్న ఎస్సై

ఊటీలోని అతిథిగృహాలకు బాంబు బెదిరింపులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఊటీ సమీపంలోని చర్చి హిల్, రోహిణి జంక్షన్ ప్రాంతాలలోని రెండు ప్రముఖ ప్రైవేట్ అతిథిగృహాలకు ఆదివారం రాత్రి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. సమాచారం మేరకు బాంబు స్క్వాడ్ ఆయా అతిథిగృహాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేపట్టింది. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుప్పూర్ కలెక్టరేట్‌కు...

ఆర్కేనగర్: తిరుప్పూర్ పల్లడం రోడ్డులో ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాంబు ఉన్నట్లు సోమవారం ఉదయం ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. వెంటనే బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. ఎలాంటి పేలుడు వస్తువులు లభించలేదు. కలెక్టరేట్‌కు ప్రస్తుతం మూడోసారి బెదిరింపులు రావడం గమనార్హం.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం ప్రకటన

చెన్నై, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా తిరుకళుకుండ్రంలో సోమవారం ఉదయం ప్రభుత్వ బస్సు, ప్రైవేటు వ్యాను ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు మహిళలు మరణించిన ప్రమాదంపై ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. చెంగల్పట్టులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, పూంజేరిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన చికిత్సలు అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.3లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారికి రూ.లక్ష చొప్పున, స్వల్పంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి రూ.50వేల చొప్పున సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని అధికారులను ఆదేశించారు.

రైళ్ల సేవలు ఆలస్యం

వడపళని, న్యూస్‌టుడే: నైరుతి రైల్వే (సౌత్ వెస్టర్న్ రైల్వే)లోని హెజ్జల, కెంగేరి స్టేషన్ల మధ్య జరుగుతున్న లైన్ బ్లాక్, ఇతర పనుల కారణంగా ఈ కింది రైలు 30 నిమిషాలు ఆలస్యంగా నడుస్తుందని దక్షిణ రైల్వే సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.

● **16021** చెన్నై సెంట్రల్-అశోకపురం కావేరి ఎక్స్‌ప్రెస్ 4న 21.15కు బయలుదేరే రైలు మార్గంలో 30 నిమిషాలు ఆలస్యం కానుంది. ● చెన్నై డివిజన్‌లో పనుల కారణంగా **17656** పుదుచ్చేరి-కాకినాడ పోర్ట్ సర్కార్ ఎక్స్‌ప్రెస్ 13.30 రైలు 6, 22, 27 తేదీలు 60 నిమిషాలు ఆలస్యం కానుంది. ● **17654** పుదుచ్చేరి-కాచిగూడ 12.45 రైలు 6, 26, 30 తేదీలు 60 నిమిషాలు ఆలస్యంగా నడవనుంది.

తాంబరం-తిరుచ్చి ప్రత్యేక రైలు సేవలు పొడిగింపు

తిరుచ్చిరాపల్లి-తాంబరం-తిరుచ్చిరాపల్లి ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్టు దక్షిణ రైల్వే సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ● **06190** తిరుచ్చిరాపల్లి-తాంబరం, ● **06191** తాంబరం-తిరుచ్చిరాపల్లి రైలు డిసెంబరు 2 నుంచి జనవరి 31వ తేదీ వరకు మంగళ, బుధ, శుక్ర, శని, ఆదివారాలు నడుస్తుంది. రిజర్వేషన్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

తిరుత్తణిలో అత్యాధునిక బస్సు షెల్టరు నిర్మాణం

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి పట్టణంలో అరక్కోణం ఎంపీ జగద్రక్షగన్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.23 లక్షల వ్యయంతో బస్సు షెల్టరు నిర్మించారు. ఏసీ సౌకర్యంతో కూడిన షెల్టరులో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, గర్భిణులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా కుర్చీలను ఏర్పాటు చేశారు. నేరాల నియంత్రణకు ఆధునిక సీసీ కెమెరాలను అమర్చారు. వీటిని మున్సిపల్ కార్యాలయానికి అనుసంధానించారు. దీనిని త్వరలో ప్రారంభించనున్నట్లు సమాచారం.

మెట్రో రైళ్లలో 92.86 లక్షల మంది పయనం

వడపళని, న్యూస్‌టుడే: మెట్రో రైళ్లలో నవంబరు నెలలో 92,86,753 మంది ప్రయాణాలు చేశారని, నవంబరు 10న అత్యధికంగా 3,60,342 మంది ప్రయాణించారని సీఎంఆర్ఎల్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎన్‌సీఎంసీ సింగార చెన్నై కార్డుతో 48,48,485 మంది, టోకెన్ ద్వారా 18,47,358 మంది, ఓఎన్‌డీసీ విధానంలో 9,09,859 మంది పయనించినట్లు పేర్కొంది.

అలంకరణలో వినాయక స్వామి ● పిచ్చాండవర్ ఊరేగింపు ● రథంపై ఊరేగుతున్న పరాశక్తి అమ్మవారు

అశ్వ వాహనంపై ఆదినాథుడు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవాల్లో భాగంగా సోమవారం చంద్రశేఖరస్వామి అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం వినాయకస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను అశ్వ వాహనంపై కొలువుదీర్చి ఊరేగింపునగా తీసుకెళ్లారు. కొండపై వెలిగించనున్న మహా దీపం కోసం 350 మీటర్ల పొడవైన గాఢ వస్త్రాన్ని ఉపయోగిస్తారు. ఈ వస్త్రాన్ని మధ్యాహ్నం ఆలయంలో స్వామివారి సన్నిధిలో ఉంచి పూజలు చేశారు. ఆ తర్వాత మేళతాళాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం పిచ్చాండవర్ ప్రత్యేక అలంకరణలో ఊరేగారు. ఆదివారం రాత్రి పరాశక్తి అమ్మవారి రథోత్సవం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కుంభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న భక్తులు

వైభవంగా మహా కుంభాభిషేకం

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి శేఖర్ వర్మ నగర్‌లో ఉన్న శ్రీ శక్తి గణపతి ఆలయ మహా కుంభాభిషేకం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా యాగ పూజల్లో ఉంచిన పవిత్ర జలాలున్న కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గోపుర కళాశాలపై అభిషేకించారు. వేడుకలో ఎమ్మెల్యే ఎస్.చంద్రన్, డీఎంకే ప్రధాన కార్యవర్గ సభ్యులు భూపతి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ సామిరాజ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జయంకొండం అయ్యనార్ ఆలయంలో...

ట్రిప్లికేన్: అరియలూరు జిల్లా జయంకొండంలోని ప్రసిద్ధ అయ్యనార్ ఆలయంలో సోమవరం కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. పుణ్య జలాలతో ఉన్న కళాశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి విమాన కలశాలు, అరుళ్‌మిగు సెల్వ వినాయకుడు, ధర్మశాస్తా పూర్ణ పుష్కళ సమేత అయ్యనార్, అరుళ్‌మిగు వీరనార్, కరుప్పుకరూర్, పశుపతీశ్వర ఆలయ విమాన కలశాలను అభిషేకించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

వెలిగరం ఆలయంలో ప్రత్యేక పూజలు

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపం వెలిగరం గ్రామంలో కొండపై వెలసిన మరగదవల్లి సమేత సోమనాథస్వామి ఆలయంలో కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. భక్తులకు ఆలయం తరఫున అన్నదానం చేశారు.

ఆలయానికి తరలివచ్చిన భక్తులు

ఈపీఎస్ బహిరంగ సభలో మృతి చెందిన కార్యకర్త

కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థికసాయం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే బహిరంగ సభలో స్పృహ కోల్పోయి మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి ఎడప్పాడి పళనిసామి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ఆదివారం రాత్రి ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాలయంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. అందులో పాల్గొన్న గోపి సమీపం కొండైయంపాలయానికి చెందిన కార్యకర్త అర్జునన్(43) స్పృహకోల్పోయాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు తెలిపారు. అర్జునన్ మృతిపై పళనిసామి విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్జునన్ మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేశారు. మరో రూ.10 లక్షలు అందజేయనున్నట్టు ప్రకటించారు.



అర్జునన్ తల్లికి చెక్కు అందజేస్తున్న పళనిసామి

రూ.8,119 కోట్ల విలువైన ఆలయాల భూములు స్వాధీనం

మంత్రి శేఖర్‌బాబు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పాలనలో రూ.8,119 కోట్ల విలువైన ఆలయాల భూములను స్వాధీనం చేసుకున్నట్లు దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. తంజావూర్ జిల్లా కుంభకోణంలోని శ్రీ మంగళాంబిక సమేత ఆదికుంభేశ్వరస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న మంత్రులు శేఖర్‌బాబు, కోవి చెళియన్ వేడుకను ప్రారంభించారు. అనంతరం శేఖర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో స్టాలిన్ నేతృత్వంలో ద్రావిడ మోడల్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆలయాల పునరుద్ధరణకు దాతలు రూ.1,557 కోట్లు విరాళంగా అందించారని, రూ.8,119 కోట్ల విలువైన ఆలయాల భూములను దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుందని పేర్కొన్నారు. సోమవారం ఒక్క రోజే దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న 31 ఆలయాలలో మహా కుంభాభిషేకాలు జరిగాయన్నారు. ఇప్పటివరకు తమ ప్రభుత్వంలో 3,896 ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించినట్లు తెలిపారు.

కుంభాభిషేకాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు శేఖర్‌బాబు, కోవి చెళియన్

రైలులో మహిళ ప్రసవం

సహకరించిన వైద్యురాలు

టీనగర్, న్యూస్‌టుడే: కర్ణాటకలోని బెంగుళూరుకు చెందిన సులైమాన్ భార్య రజియాబాను(25) నిండు గర్భిణీ. ఆమె కృష్ణగిరిలోని బంధువుల ఇంటికి వెళ్లి, అక్కడి నుంచి తిరుప్పూర్ వెళ్లడానికి రైలులో బయల్దేరింది. చెన్నై- కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా పురిటి నొప్పులు మొదలయ్యాయి. అదే రైలులో ఉన్న తిరుపూర్ ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు ప్రియాంక వెంటనే అక్కడికి చేరుకుని ఇతర మహిళా ప్రయాణికుల సహాయంతో నడుస్తున్న రైలులోనే సురక్షితంగా ప్రసవం చేయించారు. రైలు సేలం స్టేషన్‌కు చేరుకునే సమయానికి రజియాబానుకు ఆరోగ్యకరమమైన మగబిడ్డ జన్మించాడు. రైల్వే పోలీసులు, వైద్య సిబ్బంది తల్లీబిడ్డలిద్దరినీ సేలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రియాంకను తోటి ప్రయాణికులు, అధికారులు అభినందించారు.

తిరుచ్చి-దుబాయ్ విమానంలో సాంకేతిక లోపం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి విమానాశ్రయం నుంచి సోమవారం మధ్యాహ్నం 12.45 గంటలకు 160మంది ప్రయాణికులతో దుబాయ్‌కి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం బయలుదేరింది. కొన్ని గంటలకే టైర్లలో సాంకేతిక సమస్యను పైలట్ గుర్తించారు. దీంతో ల్యాండ్ కాలేకపోయింది. తిరుచ్చి నగరంపై గంటకుపైగా చక్కర్లు కొట్టింది. విమానాశ్రయ అధికారుల సూచనలతో నెమ్మదిగా సురక్షితంగా ల్యాండ్ చేశారు. అందులోని ప్రయాణికులకు విమానాశ్రయంలో బస ఏర్పాటు చేశారు. సమస్యను సరిచేసే పనిలో ఇంజినీర్లు నిమగ్నమయ్యారు.

పాఠశాల విద్యాశాఖలో నెలవారీ సమీక్ష

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పాఠశాల విద్య కార్యాచరణ ప్రణాళికలు, విద్యార్థుల అభ్యాసస్థితిపై నెలవారీ సమీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కన్నప్పన్ పేర్కొన్నారు. సమావేశం వివరాలను ప్రతినెలా 4వ వారాంతంలో ప్రాథమిక విద్యాధికారులకు పంపుతామన్నారు. వాటి ఆధారంగా విద్యా కార్యకలాపాలపై వివరణాత్మక అధ్యయనాలు నిర్వహిస్తామన్నారు. డిసెంబరుకు సంబంధించిన సమీక్ష 5న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనుందన్నారు.

EENADU Classifieds
JOBS
హైదరాబాద్ / గుంటూరులోని CCTV కంపెనీకి ఫ్రెషర్స్ కావలెను, శాలరీ: 14000/-. ✆ 9731567105, 9731722666.

పుట్టుకతో లోపాలున్న పిల్లలకు పునర్జన్మ

ఎగ్మూర్ ప్రభుత్వ పిల్లల సంక్షేమ ఆస్పత్రి వైద్యులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుట్టుకతో లోపాలున్న పిల్లలకు అధునాతన శస్త్రచికిత్సలు చేసి పునర్జన్మ కల్పించామని ఎగ్మూర్ ప్రభుత్వ పిల్లల సంక్షేమ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆస్పత్రి డైరెక్టర్ ఎస్.మణియన్, శస్త్రచికిత్స విభాగ అధిపతి శంకరభారతి, శిశు సంక్షేమశాఖ అధిపతి ముత్తుకుమరన్ మాట్లాడుతూ.. కొందరు పిల్లలు శ్వాసనాళం, అన్నవాహిక వేరు చేయని పరిస్థితిలో జన్మిస్తారన్నారు. ఈ పిల్లలు నోటి ద్వారా తినలేరన్నారు. ఇటీవల అలాంటి పరిస్థితి ఉన్న ముగ్గురు పిల్లలను ఆస్పత్రిలో చేర్పించగా మొదట గ్యాస్ట్రోఎక్టమీ చికిత్స అందించామన్నారు. వారి కడుపులోకి చిన్నగొట్టాన్ని చొప్పించి ఆహారం ఇస్తారన్నారు. సమస్యను సరిచేయడానికి పెద్దపేగులో కొంత భాగాన్ని కత్తిరించి అన్నవాహికలోని మూసుకుపోయిన భాగానికి అతికించారన్నారు. ఈ తరహా చికిత్సకు ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.15లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ముఖ్యమంత్రి బీమా పథకం కింద ఇక్కడ ఉచితంగా చేస్తున్నట్లు వివరించారు.

ఏటా 1.50కోట్ల పాస్‌పోర్టులు జారీ

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: విదేశాంగ మంత్రిత్వశాఖ ద్వారా దేశంలో ఏటా 1.50 కోట్ల పాస్‌పోర్టులు జారీ చేస్తున్నట్లు పాస్‌పోర్ట్ సర్వీస్ ప్రాజెక్టు జాయింట్ సెక్రటరీ, విదేశాంగ మంత్రిత్వశాఖ చీఫ్ పాస్‌పోర్ట్ అధికారి ముబారక్ తెలిపారు. దేశంలో 452వ తపాలా కార్యాలయ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం కోయంబత్తూరు జిల్లా పొళ్లాచ్చిలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముబారక్ విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది మే నెలలో ఈ-పాస్‌పోర్ట్ అమల్లోకి వచ్చిందన్నారు. ఇది పాస్‌పోర్ట్ దారుడి వ్యక్తిగత, బయోమెట్రిక్ సమాచారాన్ని నిల్వచేసే ఎలక్ట్రానిక్ చిప్‌తో అమర్చబడి ఉంటుందన్నారు. చిప్‌లో డిజిటల్ సంతకంతో కూడిన సమాచారం ఉంటుందని, దాన్ని మార్చడం నకిలీది సృష్టించడం కుదరదని చెప్పారు. ఈ ఏడాది నుంచి పాస్‌పోర్ట్ సర్వీస్ ప్రాజెక్టు 'వెర్షన్ 2'కి అప్‌గ్రేడ్ చేశామన్నారు. వేగం, భద్రత వంటి ప్రత్యేక లక్షణాలతో ప్రపంచవ్యాప్తంగా 202 రాయబార కార్యాలయాల్లో ఈ సేవ అమలవుతున్నట్లు వివరించారు.



విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారి ముబారక్

(c) eenadu

రాజకీయ కథా చిత్రంలో గౌతమ్ రామ్ కార్తిక్

పూజా కార్యక్రమంలో గౌతమ్ రామ్ కార్తిక్, గణేశ్ కె.బాబు, సెల్వరాఘవన్ తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: డ్రాఫ్ట్ బై జీకేబీ తన తొలి నిర్మాణం 'ప్రొడక్షన్ నంబరు-1' సినిమాకు సోమవారం పూజా కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో అతిథులుగా దర్శకులు హెచ్.వినోద్, రాజు మురుగన్, నిర్మాత ఫైవ్ స్టార్ కె.సెంథిల్ తదితరులు పాల్గొన్నారు. నిర్మాతగా ఇది దర్శకుడు గణేశ్ కె.బాబుకు తొలి చిత్రం. దీని గురించి ఆయన మాట్లాడతూ... నటుడు గౌతమ్ రామ్ కార్తిక్ తన కెరియర్‌లో స్థిరమైన స్థానాన్ని పొందారన్నారు. సామాన్యుడి రాజకీయ జీవితాన్ని హాస్యభరితంగా ఈ చిత్రం వెల్లడించనుందని తెలిపారు. చిత్రంలోని పాత్రకు గౌతమ్ రామ్ కార్తిక్ న్యాయం చేకూర్చుతారని, ఆయన నైపుణ్యం ఈ చిత్రానికి బలంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్రంలోని క్యారెక్టర్లు ద్వారా అభిమానుల హృదయాల్లో చెరగని ముద్రవేస్తారని తెలిపారు. చిత్రంలోని ఓ కీలకపాత్రలో సెల్వరాఘవన్ నటించనున్నారని, ఇప్పటివరకు పోషించని పాత్రలో ఆయన కనిపిస్తారని పేర్కొన్నారు. దర్శకుడు రాజు మురుగన్ వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసిన దినరాఘవన్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నారని తెలిపారు. ఈ చిత్రంలో అంజన నేత్రన్, రాబి, పి.వాసు, వెంకటేశన్, మారన్, ఇందుమతి, ఆదిత్య కతిర్, భాగ్యం శంకర్ తదితరులు నటించనున్నారు.

'కొంబుసీవి' క్రిస్మస్‌కు విడుదల

చెన్నై: పొన్‌రామ్ దర్శకత్వంలో దివంగత నటుడు విజయకాంత్ చిన్న కుమారుడు షణ్ముగ పాండియన్ ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'కొంబుసీవి'. ఇందులో శరత్‌కుమార్, కాళి వెంకట్, కల్కి, రాజా తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. యువన్ శంకర్‌రాజా సంగీతం అందించారు. 1996లో ఉసిలంపట్టి, ఆండిపట్టి, వైగై జలాశయం ప్రాంతాల్లో జరిగిన ఘటనలను కేంద్రంగా చేసుకుని ఈ చిత్రాన్ని రూపొందించారు. చిత్రాన్ని క్రిస్మస్ రోజు విడుదల చేయనున్నట్లు పోస్టరు ద్వారా చిత్రబృందం ప్రకటించింది.

'రామ్ లీలా' ఫస్ట్‌లుక్...

చెన్నై: రియో రాజ్, మాళవిక మనోజ్ జంటగా నటించిన 'ఆన్ పావం పొల్లాదతు' చిత్రం ఇటీవల విడుదలై ప్రేక్షాదరణ పొందింది. ఈ నేపథ్యంలో రియో రాజ్ నటించనున్న తర్వాతి చిత్రానికి టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్లను నటుడు విజయ్ సేతుపతి తన 'ఎక్స్'లో విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. రామచంద్రన్ కణ్ణన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి 'రామ్ లీలా' టైటిల్ ఖరారు చేశారు. చిత్రీకరణను సోమవారం ప్రారంభించారు. ఈ చిత్రం ద్వారా వర్తిక నాయికగా తమిళ చిత్రసీమకు పరిచయమవుతున్నారు.

ప్రసాద్ తోటకూరకు జ్ఞాపిక అందిస్తున్న శివకుమార్, జేకే రెడ్డి తదితరులు

ఘనంగా ఆలూరి రామస్వామి పూర్ణావతి ట్రస్టు ప్రారంభం

టీనగర్, న్యూస్‌టుడే: తెలుగు భాష, సంస్కృతి, సేవా కార్యక్రమాలు లక్ష్యంగా స్థాపించిన ఆలూరి రామస్వామి పూర్ణావతి తెలుగు చారిటబుల్ ట్రస్టు ప్రారంభోత్సవం సోమవారం చెన్నైలోని ఆంధ్రక్లబ్‌లో జరిగింది. కూచిపూడి నాట్య ప్రదర్శనతో ప్రారంభమైన కార్యక్రమంలో తానా (అమెరికా) పూర్వాధ్యక్షుడు డా.ప్రసాద్ తోటకూర ట్రస్టు లోగోను ఆవిష్కరించారు. ట్రస్టు వ్యవస్థాపకులు ఏవీ శివకుమార్ తాను చేపట్టనున్న సేవలు వివరించారు. మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షుడు డా.విస్తాలి శంకరరావు, ఆస్కా కార్యదర్శి దిలీప్‌కుమార్, విశిష్ట అతిథి మురళీకుమార్, వేదవిజ్ఞాన వేదిక సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కుదురూరి మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన సామర్థ్యంలో అగ్రగామి

సైదాపేట, న్యూస్‌టుడే: పారిశ్రామిక ఇంధన సామర్థ్యంలో తమిళనాడు అగ్రగామిగా నిలిచింది. 55.3 శాతంతో అగ్రస్థానంలో ఉన్నట్లు స్టేట్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఇండెక్స్ (ఎస్‌ఈఈఐ) పేర్కొంది.

రెండు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు

కాంచీపురం, న్యూస్‌టుడే: దిత్వా తుపాను కారణంగా మంగళవారం కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్లు సోమవారం సాయంత్రం ప్రకటనలు విడుదల చేశారు.

ప్రైవేటు బస్సు డ్రైవరుకు గుండెపోటు

• స్టీరింగ్‌పై కుప్పకూలి మృతి

సూళ్లూరుపేట (గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ గుండెపోటుతో స్టీరింగ్‌పై కుప్పకూలి మృతిచెందిన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. బస్సు కండక్టర్ వివరాల మేరకు.. చెన్నైకు చెందిన ప్రవీణ్(45) భారతీ ట్రావెల్స్‌లో కొంతకాలం నుంచి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ప్రవీణ్ బస్సులో ప్రయాణికులతో చెన్నై నుంచి నెల్లూరుకు బయల్దేరాడు. సోమవారం ఉదయం బస్సు సూళ్లూరుపేట పట్టణంలోకి రాగానే ప్రవీణ్ కాళ్లు, చేతులు లాగుతున్నాయని చెప్పి బస్సును పక్కకు ఆపి స్టీరింగ్‌పై కుప్పకూలిపోయాడు. కండక్టర్ స్థానికుల సాయంతో సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

రూ.10.50 కోట్లు విలువైన ఈ-సిగరెట్లు స్వాధీనం

ప్యారిస్, న్యూస్‌టుడే: చైనా నుంచి తరలించిన రూ.10.50 కోట్లు విలువైన ఈ-సిగరెట్లను తూత్తుకుడి పోర్టులో స్వాధీనం చేసుకున్నారు. పోర్ట్‌కు గతనెల 27న చైనా నుంచి తీసుకొచ్చిన కంటైనర్‌లో గొడుగుల పేరుతో అక్రమంగా ఈ-సిగరెట్లను తరలించినట్లు సెంట్రల్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకి సమాచారం అందింది. అధికారులు తనిఖీ చేయగా ఈ-సిగరెట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేరళకు చెందిన నాగరాజ్, చెన్నైకు చెందిన రాజ్‌కుమార్, స్వామినాథన్‌ను సోమవారం అరెస్టు చేశారు.

అమ్యూజ్‌మెంట్ పార్కు ప్రారంభం

చెన్నై, న్యూస్‌టుడే: తిరుపోరూర్‌లో ఏర్పాటు చేసిన అమ్యూజ్‌మెంట్ పార్కును ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. వండర్‌లా హాలిడేస్ లిమిటెడ్ చెంగల్పట్టు జిల్లా తిరుపోరూర్‌లో రూ.611 కోట్లతో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా అమ్యూజ్‌మెంట్ పార్కును ఏర్పాటు చేసింది. సచివాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి ప్రారంభించారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని గిండి లోక్‌భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న దివ్యాంగ ప్రతిభావంతులు 70 మందిని గవర్నర్ ఆర్.ఎన్.రవి సత్కరించారు. - న్యూస్‌టుడే, చెన్నై

డెల్టా జిల్లాల్లో 2 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: భారీ వర్షాలకు రాష్ట్రంలోని డెల్టా జిల్లాలలో సుమారు 2 లక్షల ఎకరాలలో వరి పంటలు నీటమునిగాయి. తంజావూరు జిల్లాలో 15వేల ఎకరాలు, నాగపట్టణం జిల్లాలో 60 వేలు, తిరువారూర్‌లో 75 వేలు, మైలాదుతురైలో 55 వేల ఎకరాలు మొత్తం 2.05 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు నీటమునిగాయి. బాధిత రైతులు తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

అవసరమైతే చెన్నైకు అదనపు బృందాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: అవసరమైతే చెన్నైకు అదనపు బృందాలను పంపుతామని ఎన్డీఆర్ఎఫ్ డీఐజీ హరి ఓం గాంధీ తెలిపారు. చెన్నై ఎగ్మోర్‌లోని రాష్ట్ర విపత్తు నిర్వహణ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. దిత్వా తుపాను ప్రభావంపై అక్కడి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు, పుదుచ్చేరిల్లో మొత్తం 25 జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందాలు ఉన్నాయన్నారు. వాటిలో 6 బృందాలు చెన్నైలో ఉన్నాయని తెలిపారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో ఇప్పటి వరకు పెద్దనష్టం ఏర్పడలేదన్నారు.

పంట నష్టం లెక్కించి సాయం అందించాలి

ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: వర్షానికి దెబ్బతిన్న పంట నష్టాలను లెక్కించి రైతులకు తగిన సాయం అందించాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... అల్పపీడనం, దిత్వా తుపాను కారణంగా నవంబరు 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. డెల్టా జిల్లాల్లో వరి నీట మునిగిందని, పలు జిల్లాల్లో అరటి, చెరకు, తమలపాకు తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయని తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలించి, అంచనా వేసి తగిన సాయం అందించాలన్నారు.

చెన్నై తండయారుపేట జోన్ వాసుకి నగర్ 2వ వీధిలో కూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

చెన్నైలోని ఓ ప్రాంతంలో వాహనదారుల ఇక్కట్లు

తిరుప్పరకుండ్రం కొండపై దీపం వెలిగించవచ్చు

• మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుప్పరకుండ్రం కొండపై ఉన్న దీప స్తంభంలో కార్తిక దీపం వెలిగించవచ్చని మదురై ధర్మాసనం అనుమతిచ్చింది. కొండపై ఉన్న పురాతన దీప స్తంభంపై దీపం వెలిగించేందుకు చట్టపరంగా నిషేధం లేదన్నారు. పోలీసులు పూర్తి భద్రత కల్పించాలని సోమవారం తీర్పు ఇచ్చారు.

సేలం కలెక్టరేట్ వద్ద దివ్యాంగుల ధర్నా

సేలం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు, టౌన్ పంచాయతీలకు ఒక్కో దివ్యాంగుడిని నామినేటెడ్ సభ్యులుగా ఎంపిక చేస్తామని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. ఎంపిక కోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ సహా ఐదుగురితో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కేవలం డీఎంకేకు చెందిన వ్యక్తులనే నామినేటెడ్ సభ్యులుగా ఎంపిక చేసిందంటూ సేలం జిల్లా కరుప్పూర్ టౌన్‌పంచాయతీకి చెందిన కొందరు దివ్యాంగులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. కలెక్టరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి డిసెంబరు 10 నుంచి దరఖాస్తులు: టీటీవీ

సైదాపేట, న్యూస్‌టుడే: ఏఎంఎంకే తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నవారు డిసెంబరు 10 నుంచి దరఖాస్తులు పొందవచ్చని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు 2026 జనవరి 3వ తేదీ లోపు అందించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: దిత్వా తుపానుతో ఏర్పడిన నష్టాలను త్వరగా భర్తీ చేయాలని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఎడతెరిపి లేని వర్షం కారణంగా రామనాథపురం, తూత్తుకుడి, డెల్టా జిల్లాల్లో చాలాచోట్ల ఇళ్లలోకి నీరు ప్రవేశించిందని, పలుప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ వరద బాధిత జిల్లాల్లో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వర్షంతో వెబ్‌సైట్‌లు సక్రమంగా పని చేయని కారణంగా పంట బీమా గడువును డిసెంబరు 15 వరకు పొడిగించాలని కోరారు.

బస్సు, వ్యాను ఢీ.. ఇద్దరు మహిళల మృతి

ఘటనాస్థలిలో వాహనాలు

మహాబలిపురం, న్యూస్‌టుడే: మహాబలిపురం సమీపం కూవత్తూర్ వద్ద ప్రభుత్వ బస్సు, వ్యాను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందగా 10మంది గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మహాబలిపురం సమీపం కున్నత్తూర్ నుంచి ఆదివారం 20మంది మహిళలతో వెళ్తున్న వ్యాను, చెన్నై నుంచి పుదుచ్చేరికి వెళ్తున్న ప్రభుత్వ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో వ్యానులో ఉన్న కీళ్‌కొల్లి గ్రామానికి చెందిన అమ్ములు(24), ఉమ(40) అక్కడికక్కడే మృతి చెందారు. పుదుపట్టిణం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 10మంది క్షతగ్రాతులను చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందులో ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉంది. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కారు అదుపుతప్పి లారీని ఢీకొనడంతో అత్త, అల్లుడు...

ఘటనాస్థలి

వేలూరు: కోయంబత్తూరు జిల్లా కోయంబత్తూరు సమీపం గౌండన్ పాళయం ప్రాంతానికి చెందిన ఐటీ ఉద్యోగి దివ్యమోహన్(50), లక్ష్మీ(45) దంపతులు. లక్ష్మీ తల్లి రోస్లిన్(70) అనారోగ్యానికి గురవడంతో రాణిపేట వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించడానికి భార్యాభర్తలు రోస్లిన్‌ను తీసుకొని కారులో రాణిపేటకు బయలుదేరారు. సోమవారం తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో కారు తిరుపత్తూరు జిల్లా ఆంబూరు తాలూకా విన్నమంగళం సమీపంలో చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొంది. ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసమైంది. అందులో ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రోస్లిన్, దివ్యమోహన్ అక్కడికక్కడే మృతిచెందారు. ఆంబూరు తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లక్ష్మీని ఆంబూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దివ్యమోహన్, రోస్లిన్ మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాడీఎంకే పుదుకోట్టై జిల్లా కార్యదర్శి...

వీసీ రామయ్య (పాతచిత్రం)

ఆర్కేనగర్: అన్నాడీఎంకే పుదుకోట్టై జిల్లా కార్యదర్శిగా వీసీ రామయ్య(68) వ్యవహరిస్తున్నారు. వాండకోట్టైలో నివాసం ఉంటున్న ఆయన సోమవారం ఉదయం తోటకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. తిరువరంగుళం రోడ్డులో వెళ్తుండగా కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబీకులు ఆయనను స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి నవవరుడు...

అరక్కోణం: రాణిపేట జిల్లా కలవై సమీపం అరుంబాకం గ్రామానికి చెందిన అజిత్‌కుమార్(26) చెన్నైలో ద్విచక్ర వాహనాల మెకానిక్ దుకాణం నడుపుతున్నాడు. ఐదేళ్లుగా కళ్లకురిచ్చి జిల్లాకు చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఇరువురి కుటుంబీకుల అంగీకారంతో ఆదివారం ఆరుంబాకం సమీపంలోని కులక్కరైవజై రేణుకాంబాళ్ అమ్మన్ ఆలయంలో వివాహం చేసుకున్నారు. అనంతరం ఆలయం వెనుక ఉన్న చెరువులో అజిత్‌కుమార్ స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు. కలవై పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో ప్రైవేటు సంస్థ ఉద్యోగి...

రెడ్‌హిల్స్: కేరళ రాష్ట్రం కోజికోడ్ సమీపం రామానాటుక్కార ప్రాంతానికి చెందిన అతుల్య కృష్ణన్(23) రెడ్‌హిల్స్ సమీపం కదిర్‌వేడులోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. పుళల్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈయన ఆదివారం సాయంత్రం దుస్తులు ఉతికి మిద్దెపై ఆరేస్తుండగా పైన వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పుళల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యానులోంచి పడి మహిళ...

మునియమ్మాళ్ (పాతచిత్రం)

పెరియపాళ్యం: తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం సమీపం వెంగల్‌కుప్పానికి చెందిన మునియమ్మాళ్(66) వ్యవసాయ కూలీ. ఈమె ఆదివారం సాయంత్రం వెంగల్‌కు వ్యానులో ప్రయాణించింది. కన్నిగై పేర్‌లో వ్యాను తలుపు తెరుచుకోవడంతో కింద పడిన మునియమ్మాళ్ తీవ్రంగా గాయపడింది. కుటుంబీకులు తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. వెంగల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు...

పొన్నేరి: తిరువళ్లూరు జిల్లా మీంజూరు సమీపం చేపాక్కంలో ప్రైవేటు కంటైనర్ యార్డు ఉంది. ఇందులో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన మున్నిలాల్(40) సోమవారం యార్డులో నడిచి వెళ్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పొన్నేరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మీంజూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

● **గుమ్మిడిపూండి:** తిరువళ్లూరు జిల్లా తిరునింద్రవూరుకు చెందిన అహ్మద్ హుస్సేన్(65) వంట మాస్టర్. ఈయన ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఎళావూరుకు బయలుదేరారు. పెరువాయల్‌లో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కవరప్పేట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● **విల్లివాక్కం:** ధర్మపురి జిల్లా పాప్పిరెడ్డిపట్టి సర్కిల్ బొమ్మిడి సమీపం కొట్టాయూర్‌కు చెందిన విజయన్(51) ఆదివారం బి.తురింజిపట్టికి వెళ్లి బొమ్మిడి నాలుగు రోడ్ల కూడలి వద్ద నడిచి వెళ్తున్నారు. అప్పుడు అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన జయపాల్ అనే వ్యక్తి విజయన్‌ని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై బొమ్మిడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ 11ఏళ్ల బాలిక...

తిరువణ్ణామలై: తిరువణ్ణామలై జిల్లా వెంబాక్కం తాలూకా పనముగై గ్రామానికి చెందిన కూలీ మణికంఠ, వనిత దంపతులు. వీరికి కుమార్తెలు ప్రణీత(11), దీక్షిత(9), డిక్షిత(7) ఉన్నారు. గత నెల 23వ తేదీ రాత్రి ముగ్గురు పిల్లలు వేరుసెనగలతో చేసిన చట్నీతో ఇడ్లీలు తిన్నారు. తర్వాత ముగ్గురూ కడుపునొప్పితో బాధపడ్డారు. తల్లిదండ్రులు మరుసటిరోజు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొంది ఆ రోజు సాయంత్రం ఇంటికి వచ్చారు. మళ్లీ ప్రణీత, దీక్షిత స్పృహకోల్పోయారు. వెంటనే వారిని వేలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రణీత ఆదివారం రాత్రి మృతి చెందింది. బ్రహ్మదేశం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ దారుణహత్య

ధనమ్మాళ్ (పాతచిత్రం)

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం చిన్న నత్తానికి చెందిన దయాళన్ వ్యవసాయ కూలీ. ఈయన భార్య ధనమ్మాళ్(44) పూల వ్యాపారి. ఈమె ఆదివారం ఉదయం వ్యాపారానికి వెళ్లి రాత్రికి ఇంటికి చేరుకోలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. ఈ క్రమంలో నత్తం ప్రాంతంలోని మామిడి తోటలో కత్తి గాయాలతో విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. సమాచారం మేరకు ఆరంబాక్కం పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

మార్కులు తక్కువ రావడంతో సీఏ విద్యార్థి ఆత్మహత్య

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ సమీపం మహాలక్ష్మి నగర్‌కు చెందిన సుందర్ (34) చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నారు. ఈయన కొద్ది రోజుల క్రితం సీఏ పరీక్షలు రాయగా తక్కువ మార్కులు వచ్చాయి. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రెడ్‌హిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వర్షపు నీటిలో చిక్కుకున్న కారు

చోదకుడికి తప్పిన ప్రమాదం

కారులోంచి దిగి బయటకు వస్తున్న డ్రైవరు

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నైలో సోమవారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తోంది. వేలప్పన్‌చావడి వద్ద పూందమల్లి హైరోడ్డు సర్వీస్ రోడ్డులో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రమాదాన్ని గుర్తించకుండా ఓ వ్యక్తి కారును ఆ మార్గంలోకి తీసుకెళ్లాడు. దీంతో వాహనం నీటిలో చిక్కుకుంది. కారు పూర్తిగా మునుగుతున్న క్రమంలో తలుపు తీసుకొని బయటపడ్డాడు.

మహిళ హత్య కేసులో ముగ్గురి అరెస్టు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా బర్గూర్ సమీపం ఐగుందం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని మేల్‌శ్రీనివాసపురానికి చెందిన మురుగన్ భార్య గోవిందమ్మాల్(56) ఈ నెల 25వ తేదీ ఉపాధి హామీ పథకం కింద పెరియమలై కొండ సమీపంలో జరుగుతున్న పనికి వెళ్లి అనుమానాస్పదంగా మృతి చెందారు. బర్గూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదికలో గోవిందమ్మాల్‌పై దుడ్డుకర్రతో దాడిచేసి గొంతునులిమి చంపినట్టు తెలిసింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందం దర్యాప్తు వేగవంతం చేసింది. ఆస్తి వివాదంలో శక్తివేల్, వెంకట్రామన్, గోవిందరాజ్ కలిసి హత్యచేసి సెల్‌ఫోన్, ఆమె ధరించిన బంగారు గొలుసులు, చెవి కమ్మలు తీసి గుంతలో విసిరి నగల కోసం హత్య జరిగినట్టు నాటకమాడారని తేలింది. దీంతో శక్తివేల్, వెంకట్రామన్, గోవిందరాజ్‌లను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు.

వదినను చంపిన మరిది...

తమిళరసి (పాతచిత్రం)

వేళచ్చేరి: కడలూర్ జిల్లా చిదంబరం సమీపం కాట్టుకూడలూర్ గ్రామానికి చెందిన గోపాకృష్ణన్, తమిళరసి(35) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. తమిళరసి కుటుంబ కలహాలతో భర్తను వదిలేసి ఇద్దరు కుమారులతో ఒంటరిగా జీవిస్తోంది. ఇదిలా ఉండగా గోపాలకృష్ణన్ సోదరులైన బాలకృష్ణన్, మురుగానందం కలిసి తనను లైంగికంగా వేధించినట్లు తమిళరసి చేసిన ఫిర్యాదు మేరకు చిదంబరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి మురుగానందాన్ని అరెస్టు చేశారు. బాలకృష్ణన్ పారిపోయాడు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిలుపై విడుదలైన బాలకృష్ణన్ ఆదివారం సాయంత్రం తమిళసి ఇంటికి వెళ్లి ఆమెతో గొడవపడ్డాడు. ఆగ్రహంతో కత్తితో నరికి హత్య చేశాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

యువతిని లైంగికంగా వేధించిన వైద్యుడు...

శక్తివేల్

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ సమీప కదిర్‌వేడుకు చెందిన శక్తివేల్ వైద్యుడు. ఇతను పుళల్ వినాయకపురానికి చెందిన 22ఏళ్ల యువతిని లైంగికంగా వేధించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పుళల్ పోలీసులు శక్తివేల్‌ను సోమవారం అరెస్టు చేశారు.

మత్తుమాత్రలు విక్రయిస్తున్న ఇద్దరు...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్, పరిసర ప్రాంతాల్లో కొందరు మత్తుమాత్రలు విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో అలమాది, ఎడప్పాళ్యం ప్రాంతాల్లో సోమవారం తనిఖీ చేపట్టారు. మత్తుమాత్రలు విక్రయిస్తున్న యోగేశ్వరన్, లక్ష్మీపతి అనే వ్యక్తులను అరెస్టు చేసి 1200 మత్తుమాత్రలను స్వాధీనం చేసుకున్నారు.

తిరుచ్చిలో ఇద్దరు...

ఆర్కేనగర్: తిరుచ్చి గాంధీ మార్కెట్ ప్రాంతంలో మత్తుమాత్రలు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు మార్కెట్‌లో ఇన్‌స్పెక్టర్ చంద్రు నేతృత్వంలో పోలీసులు సోమవారం ఉదయం తనిఖీలు చేపట్టారు. దుర్గమ్మ ఆలయం వద్ద ఓ యువకుడు మత్తుమాత్రలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతను తిరుచ్చి మేల్‌అంగాళపురానికి చెందిన శివప్రసాద్ (24)గా గుర్తించి అరెస్ట్ చేశారు. అతని నుంచి మత్తుమాత్రలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పాలక్కరై హీబర్ రోడ్డులో మత్తుమాత్రలు విక్రయిస్తున్న వెట్రివేల్ (20)ను అరెస్ట్ చేసి మాత్రలను స్వాధీనం చేసుకున్నారు.

నగదు దోపిడీ కేసులో పరారీ నిందితుడు...

సబీర్

ప్యారిస్: చెన్నై రిచ్చి స్ట్రీట్‌లో నరేష్‌కుమార్ ల్యాప్‌టాప్ విడిభాగాలు విక్రయించే దుకాణం నిర్వహిస్తున్నారు. గత అక్టోబరులో రూ.55 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్లారు. అప్పుడు అతనిని ముట్టడించిన ఇద్దరు వ్యక్తులు నగదు దోచుకుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో పరారీలో ఉన్న సబీర్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

40 మంది విద్యార్థినులను కాపాడి ప్రాణం విడిచిన కళాశాల బస్సు డ్రైవర్

ప్రమాదానికి గురైన బస్సు

శోళింగర్, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా ఆర్కాడు ప్రాంతంలో మహాలక్ష్మి మహిళా కళాశాలకు చెందిన బస్సు సోమవారం ఉదయం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి, ఆర్కేపేట, శోళింగర్ ప్రాంతాల్లో విద్యార్థినులను ఎక్కించుకుని వాలాజాపేట వైపు బయల్దేరింది. జంబుకుళం కూడలి వద్ద డ్రైవర్ రవి(70)కి కళ్లు తిరుగుతున్నట్లు అనిపించింది. వెంటనే విద్యార్థినులను దగ్గరకు పిలిచాడు. వారు డ్రైవర్ వద్దకు వెళ్లగానే బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చింతచెట్టును ఢీకొంది. తర్వాత రవి బస్సును పొలంలోకి మళ్లించి ఆపి స్టీరింగ్‌పై వాలిపోయాడు. అటుగా వెళ్తున్నవారు వచ్చి రవిని పరిశీలించారు. అతను గుండెపోటుతో మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనపై శోళింగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని రవి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

ప్రేమ పెళ్లి చేసుకున్న కుమారుడిపై తల్లి దాడి

తిరుత్తణి, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణానికి చెందిన సంగీత(31), అదే ప్రాంతానికి చెందిన బాలకుమార్ (31) ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందినవారు కావడంతో వారి ప్రేమను యువకుడి కుటుంబీకులు వ్యతిరేకించారు. ఇదిలా ఉండగా యువతి కుటుంబ సభ్యుల అంగీకారంతో ప్రేమజంట పెళ్లి చేసుకుంది. వధూవరులు బంధువులతో కలిసి సోమవారం ఉదయం తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి దర్శనానికి వెళ్లారు. అక్కడి వాహన పార్కింగ్ వద్దకు వస్తుండగా అక్కడే ఉన్న బాలకుమార్ తల్లి రాణి కుమారుడిపై దాడి చేసింది. దీంతో సంగీత కుటుంబీకులు ఆమెతో గొడవకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించారు.

తమిళనాడు ప్రభుత్వ దిల్లీ ప్రతినిధి నివాసంలో 300 సవర్ల నగల చోరీ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమిళనాడు ప్రభుత్వ దిల్లీ ప్రతినిధిగా ఉన్న ఏకేఎస్ విజయన్ నివాసంలో 300 సవర్ల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. పోలీసుల కథనం మేరకు... స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పడినప్పుడి నుంచి రాష్ట్ర ప్రభుత్వ దిల్లీ ప్రత్యేక ప్రతినిధిగా ఏకేఎస్ విజయన్ ఉన్నారు. అదేవిధంగా డీఎంకే వ్యవసాయ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈయన నివాసం తంజావూర్ పట్టణంలోని శేఖరన్ నగర్‌లో ఉంది. విజయన్ పని నిమిత్తం తరచూ దిల్లీ వెళ్లి వస్తుంటారు. ఇక్కడి ఇంట్లో కుటుంబీకులు ఉంటారు. కొన్నిరోజుల క్రితం కుటుంబ సభ్యులు వేరే ఊరికి వెళ్లారు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసి దిగ్భ్రాంతి చెందారు. లోనికెళ్లి చూడగా బీరువాలోని 300 సవర్ల బంగారు నగలు కనిపించలేదు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

పరిరక్షణ ఆమడ దూరం!

నరసాపురం మండలంలో మడ అడవులు

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: పశ్చిమలో గోదావరి నది, ఉప్పుటేరు, సముద్రంలో కలిసే ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన మడ అడవుల విధ్వంసం యథేచ్ఛగా కొనసాగుతోంది. పర్యావరణ సమతుల్యతను కాపాడే ఈ అడవులను పరిరక్షించాల్సిన స్థానిక అధికారులు ఆక్రమణలపై ఉదాసీనంగా వ్యవహరిస్తుండటమే దీనికి కారణమనే విమర్శలున్నాయి.

దస్త్రాల్లోనే లెక్కలు.. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, భీమవరం మండలాల్లో ఉప్పుటేరు, గోదావరి తీరం వెంబడి మడ అడవుల విస్తీర్ణం గణనీయంగా తగ్గి అంతరించిపోయే దశకు చేరింది. మిగిలిన వనాలను పరిరక్షించి పర్యాటక ప్రాంతంలో అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ సీహెచ్ నాగరాణి చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా జీవీల దర్భరేవు ప్రాంతంలో అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఇంతలోనే మడ అడవులను తొలగించి భారీ స్థాయిలో ఆక్వా చెరువులు ఏర్పాటు చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతంలో అటవీ శాఖకు క్షేత్రస్థాయి సిబ్బంది లేరు. కానీ.. రెవెన్యూ దస్త్రాల్లో అటవీ విస్తీర్ణం లెక్కలు పక్కాగా ఉన్నాయి.

ఉపగ్రహ చిత్రాలతో గుర్తింపు.. దర్భరేవు ఏటిగట్టు ప్రాంతంలో మడ అడవులు ధ్వంసమవుతున్నట్లు భారత అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ త్రినాథ్‌కుమార్ జీవీల ఉపగ్రహ ఛాయా చిత్రాల ద్వారా గుర్తించారు. దీనిపై కలెక్టర్‌, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. గత నెల 19న అటవీ శాఖ సిబ్బంది ఆ ప్రాంతాన్ని పరిశీలించి వనాలు ధ్వంసమైనట్లు నిర్ధారించారు. తర్వాత కలెక్టర్ సూచనలతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమై అటవీ శాఖాధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి మడ అడవులను ధ్వంసం చేయడానికి వినియోగించిన పొక్లెయిన్‌ను సీజ్ చేశారు. దీనికి బాధ్యులైన ఎనిమిది మందిపై కేసులు నమోదు చేయడంతో రూ.2,51,631 అపరాధ రుసుము విధించారు. ఈ అంశంపై ఫారెస్టు రేంజ్ అధికారి (భీమవరం) ఎం.కరుణాకరన్‌ను 'న్యూస్‌టుడే' సమాచారం కోరగా వాస్తవమేనని నిర్ధారించారు.

ఇంటింటా వెలుగులు.. అభివృద్ధి పరుగులు

- అందరి సహకారం.. ఉపాధి మార్గాలతో సాకారం
- ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు ఆకాంక్ష

ప్రదర్శనలు తిలకించి.. విధానాలు ఆలకించి!

ఉంగుటూరు మండలం నల్లమాడులో సోమవారం 20 నిమిషాలపాటు స్టాళ్ల పరిశీలన నిర్వహించిన ప్రజా వేదికలో పాల్గొనే ముందు.. ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్రదర్శనలను సీఎం చంద్రబాబు సందర్శించారు. సుమారు ఇరవై నిమిషాలపాటు అక్కడే గడిపారు. ప్రతి స్టాల్‌ను సందర్శించి రైతులు, వ్యాపారవేత్తలతో మాట్లాడారు. పలు రకాల వస్తువులు పరిశీలించి, వ్యాపారాల నిర్వహణ విధానాలు తెలుసుకున్నారు.

✦ ఏలూరు టీడీపీ ఆవరణలో 'సర్క్యులేటరీ ఆక్వా సిస్టం' విధానంలో సయ్యద్ సుల్తానా, టి.కృపారాణి బృందం చేపడుతున్న చేపల సాగు పద్ధతుల్ని సీఎంకు వివరించారు. ఈ విధానాన్ని ఇతరులు అవలంబించి ఆదాయ మార్గాలు పెంచుకోవచ్చని చంద్రబాబు సూచించారు.

✦ ఉంగుటూరుకు చెందిన ఎస్.బేబి ఇంటి వద్దే కోళ్ల పెంపకంతో చిన్నపాటి పరిశ్రమ నెలకొల్పి.. ఆ పద్ధతిని ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఆయన భేషుగ్గా ఉందని కితాబిచ్చారు. ఈ తరహాలో కోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకునే వారికి తోడ్పాటునందించాలని సీఎం సూచించారు.

✦ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించి.. అక్కడ ప్రదర్శించిన తివాచీలను పరిశీలించారు. ఏలూరు తివాచీ పరిశ్రమకు పునర్వైభవం తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.


పశ్చిమ గోదావరి జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘానికి రూ.2,80,40,098 బోనస్ వచ్చింది. నమూనా చెక్కును చంద్రబాబు రైతులకు అందజేశారు.

ఈనాడు-ఏలూరు, న్యూస్‌టుడే- ఉంగుటూరు, ఏలూరు అర్బన్, గణపవరం: ప్రతి ఇంటా వెలుగులు నింపడమే లక్ష్యం.. జిల్లా అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సాగులో వినూత్న పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. సోమవారం చంద్రబాబు ఉంగుటూరు నియోజకవర్గ పర్యటన తెదేపా కార్యకర్తలు, కూటమి నాయకుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక సభ కార్యక్రమాల్లో చంద్రబాబు పాల్గొన్నారు. గోపీనాథపట్నం, నల్లమాడు, గొల్లగూడెం గ్రామాల్లో వివిధ కారణాలతో నిలిచిపోయిన పనులతో సహా ఇంకా కొత్తగా ఏమైనా చేయాల్సినవి ఉంటే వాటిని పూర్తి చేసి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారు. గ్రామసభల్లో సంతోషం వ్యక్తం చేశారు. కార్యకర్తల సమావేశం ముగిసాక.. హెలి ప్యాడ్‌కు చేరుకునే క్రమంలో సీఎం వీడ్కోలు పలకడానికి ఎమ్మెల్యే ధర్మరాజు వెళ్లగా ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడారు. సమన్వయంతో ముందుకెళ్తున్నారని, ఈ విధానం కొనసాగించాలని సూచించారు.

పర్యటన సాగిందిలా..
ఉదయం ఉండవల్లి నుంచి హెలికాప్టర్లో బయల్దేరిన చంద్రబాబు.. 11:37 గంటలకు గొల్లగూడెం చేరుకున్నారు. రోడ్డు మార్గంలో గోపీనాథపట్నం చేరుకుని.. కిడ్నీ బాధితురాలు నాగలక్ష్మికి పింఛను అందజేశారు. అక్కణ్నుంచి నల్లమాడు చేరుకుని ప్రజా వేదికలో పాల్గొన్నారు. భోజన విరామం తర్వాత కార్యకర్తలతో సమావేశమయ్యారు. సాయంత్రం 4:59 గంటలకు ఉండవల్లి బయల్దేరారు.

ప్రజా వేదిక వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

మార్గదర్శకులకు సత్కారం

ఆర్నవ్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత, మార్గదర్శి మనోజ్‌కుమార్ సోంకార్, గ్రీన్ ఆసియా ఇంపెక్స్ పరిశ్రమ అధినేత, మార్గదర్శి పసుపులేటి వెంకట రామారావుకు జ్ఞాపిక ఇస్తున్న చంద్రబాబు, ఎమ్మెల్యే ధర్మరాజు

బలం, బలగం కార్యకర్తలే

'తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగం.. గత ఎన్నికల్లో మీరు కష్టపడి కూటమిని గెలిపించారు. ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయఢంకా మోగించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. గొల్లగూడెంలో సోమవారం నిర్వహించిన ఉంగుటూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రాన్ని బాగు చేయాలని నేను, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాత్రింబవళ్లు పని చేస్తున్నాం. మీరు క్షేత్ర స్థాయిలో చిన్న విషయాలకూ అలుగుతున్నారు. భవిష్యత్తులో ఈ పరిస్థితి రానివ్వను. తెదేపా, జనసేన, భాజపా కలయిక చారిత్రక అవసరం' అని గుర్తు చేశారు.

ఉంగుటూరుకు వరాల జల్లు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఉంగుటూరు నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారు. ప్రజా వేదికలో ఎమ్మెల్యే ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, పెదనింద్రకొలనుకు పీహెచ్‌సీకి, గణపవరంలో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి, పోలసానిపల్లిలోని గురుకుల పాఠశాలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ప్రకటించారు. నల్లజర్ల- లక్ష్మీనగరం ర.భ.శా.రహదారికి నిధులు కేటాయిస్తానని.. వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

కొల్లేరు సమస్య ఎక్కడ వరకు వచ్చింది?

కొల్లేరు సమస్య ఎక్కడ వరకు వచ్చిందంటూ సీఎం చంద్రబాబు ఆరా తీశారు. నల్లమాడులో వివిధ ప్రదర్శనల సందర్శనానంతరం.. అక్కడున్న కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కొల్లేరుపై కాసేపు మాట్లాడారు. ఈ నెల 4న సుప్రీంకోర్టుకు నివేదిక అందజేస్తామని కామినేని బదులిచ్చారు. ఎప్పటికప్పుడు తనకు సమాచారం ఇవ్వాలని, ఈ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని సీఎం పేర్కొన్నారు.

ప్రజా వేదికపై ఎవరు ఏమన్నారంటే!

✪ వ్యవసాయం, అనుబంధ రంగాల వృద్ధి రేటులో జిల్లా అయిదో స్థానంలో ఉంది. దాన్ని మూడో స్థానానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తాం. జిల్లాలో 62 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. **- వెట్రిసెల్వి, కలెక్టర్**

✪ దేశంలో ప్రతి నెలా లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ ఇస్తున్న ఏకైక సీఎం చంద్రబాబు. ఉంగుటూరు నియోజకవర్గంలో రూ.450 కోట్లతో ఆరు ఆర్వోబీల నిర్మాణాలను వచ్చే మార్చి నాటికి ప్రారంభిస్తాం. కొల్లేరు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నాం. **- పుట్టా మహేశ్‌కుమార్, ఎంపీ, ఏలూరు**

✪ ఉంగుటూరు నియోజకవర్గంలో 18 నెలల్లోనే రూ.140 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టాం. వైకాపా ప్రభుత్వం హౌసింగ్ కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేదు. ఆయా కాలనీల్లో ఉపాధిహామీ నిధులతో డబ్ల్యూబీఎం రోడ్లు నిర్మించాం. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిని ఉంగుటూరుకు అనుసంధానం చేయాలి. **- పి.ధర్మరాజు, ఎమ్మెల్యే, ఉంగుటూరు**


✪ ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేస్తున్నాం. యూనిట్ విద్యుత్తును రూ.1.50కు అందించడం ఆక్వా రైతులకు వరం. సంక్రాంతి నాటికి రోడ్ల బాగుకు చర్యలు తీసుకోవాలి. **- గన్ని వీరాంజనేయులు, ఆప్కాబ్ ఛైర్మన్**

14 వరకు గడువు పెంపు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: స్థలం కలిగి ఇల్లు కట్టుకోవాలని ఆశించే గ్రామీణ ప్రజలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ (పీఎంఏవై-జీ) పథకం కింద దరఖాస్తు చేసేందుకు ఈ నెల 14 వరకు ప్రభుత్వం గడువు పెంచింది. నవంబరు 30వ తేదీ నాటికి గడువు ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఈ మేరకు గడువు పెంచినట్లు సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇకపై గడువు తేదీ పెంచబోమని స్పష్టం చేయడం గమనార్హం. పెంచిన గడువు తేదీ నాటికి 'ఆవాస్+'2024 సర్వేను అనుసరించి అర్హులను గుర్తించాలని ఉత్తర్వుల్లో సూచించారు. పోలవరం నియోజకవర్గ పరిధిలో సోమవారం నాటికి ఆవాస్ ప్లస్ సర్వేలో భాగంగా 10,194 మంది వివరాలను నమోదు చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ అధికారులు తెలిపారు.

వినూత్నం.. విభిన్నం.. విత్తనశుద్ధి తప్పనిసరి
రైతేరాజు
కొబ్బరి సాగులో.. ఎరువుల యాజమాన్యమే కీలకం! 6లో

ఊరెళ్తే ఊడ్చేస్తున్నారు

☛ జిల్లాలో వరుస చోరీలు
☛ భయ పడుతున్న జనం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

దొంగలు పగటిపూట రెక్కీ నిర్వహిస్తున్నారు. అనువైన ఇళ్లను ఎంచుకుని రాత్రి చోరీలకు పాల్పడుతున్నారు. ఇళ్ల యజమానులు లేని సమయాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి గుట్టుగా రాత్రి పని కానిచ్చేస్తున్నారు. జైళ్ల నుంచి బయటకు వచ్చిన పాతనేరస్థులు కొందరు ముఠాలుగా ఏర్పడి మళ్లీ నేరాలు చేస్తున్నారు. స్టూవర్టుపురంలోని కరుడుగట్టిన దొంగలు కూడా ఇటీవల లక్కవరంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన విషయం విదితమే. అనతికాలంలోనే పోలీసులు ఆ కేసును ఛేదించి దొంగల ముఠాను పట్టుకుని సొత్తు రికవరీ చేశారు.

❝ కొద్ది నెలల క్రితం నూజివీడులో ఓ విద్యుత్తు శాఖ ఏడీఈ నివాసంలో చోరీ జరిగింది. దొంగలు ఇంట్లోకి చొరబడి 25 కాసుల బంగారు నగలు దోచుకుపోయారు. ❞

❝ ఇటీవల ఏలూరు నగర శివారు ద్వారకానగర్‌లో ఇంటి యజమానులు ఊరు వెళ్లిన సమయంలో దొంగలు తలుపు తాళాలు పగులగొట్టి మూడున్నర కాసుల బంగారు నగలు, కొంత నగదు అపహరించారు. ❞

పట్టుపడకుండా కళ్లుగప్పి.. ఇటీవల ఏలూరులో జరిగిన చోరీలో ఆ ఇంటి సీసీ కెమెరాల్లో పడకుండా పక్కకు తిప్పారు. అదే విధంగా వేలిముద్రలు పడకుండా కొన్నిచోట్ల గ్లౌజులు వేసుకోవటం, చోరీ జరిగిన చోట కారం చల్లటం, చెరిపేయటం వంటివి చేస్తున్నారు. పాతనేరస్థులకు కొత్తవాళ్లు కూడా జతకట్టటం, ఫోను ట్రాకింగ్‌కు కూడా దొరకకుండా జాగ్రత్తపడటం వంటివి చేస్తున్నారు. అందుకే అత్యంత అప్రమత్తంగా ఉంటున్నామని, పాతనేరస్థులపై ఓ కన్నేసి ఉంచామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇలా..

సంవత్సరం	చోరీలు
2022	340
2023	410
2024	396
2025	234

పకడ్బందీగా చర్యలు చేపట్టాం : చోరీలను అరికట్టేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాం. రాత్రి గస్తీని ముమ్మరం చేయటమే కాకుండా ఆధునిక సాంకేతికతతో అనేక నేరాలను ఛేదిస్తున్నాం. ఇటీవల పెద్దఎత్తున దొంగలను పట్టుకుని పోగొట్టుకున్న సొత్తును బాధితులకు అందజేశాం. ఫొటో ఐడీ కెమెరాలను ఏర్పాటు చేశాం. పాత నేరస్థులెవరైనా ఉంటే ఆ కెమెరాల్లో వివరాలు తెలిసిపోతాయి. పూర్తిస్థాయిలో దొంగలకు చెక్ పెట్టేలా ముందుకు వెళ్తున్నాం. **- ప్రతాప్ శివకిశోర్, ఎస్పీ**

పోలసానిపల్లి శివారులో కరిగిపోతున్న పోలవరం కాలువ గట్టు

భీమడోలులో పోలవరం కుడి కాలువ గట్టు మట్టిని ఇటీవల రెండు రోజులు అక్రమంగా తవ్వి తీసుకెళ్లిపోయారు. ఆఖరులో పోలీసు, రెవెన్యూ అధికారులు రెండు టిప్పర్లు స్వాధీనం చేసుకుని బాధ్యులపై కేసు నమోదు చేశారు. భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు మండలాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. అధికారుల చర్యలు నామమాత్రం కావడంతో అక్రమ తవ్వకాలు మూడు టిప్పర్లు.. ఆరు లారీలుగా కొనసాగుతోంది.

ఒట్టు.. మిగిలితే గట్టు

భీమడోలు, న్యూస్‌టుడే: తిలాపాపం తలా పిడికెడు చందంగా కాలువ గట్లు కరిగించేయడంలో అనేక మంది పాత్ర ఉంది. స్థానిక నాయకుల అండతో పోలవరం కుడి కాలువ గట్లను కొల్లగొట్టి దండిగా సంపాదిస్తున్నారు. ఇప్పటికే అక్రమార్కులు దాదాపుగా కరిగించేశారు.

నామమాత్రపు చర్యలు.. కాలువ గట్టుగా ఉన్న ఎర్రకంకరను (గ్రావెల్) అక్రమంగా కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపంతో బాధ్యులపై చర్యలు తీసుకోలేకపోతున్నారు. కుడి కాలువ తవ్విన సమయంలో వచ్చిన గ్రావెల్(కంకరను) భవిష్యత్తు అవసరాల కోసం పక్కనే గుట్టలుగా పోశారు. వాటిపై కన్నేసిన అక్రమార్కులు వాటిని యంత్రాలతో తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా కొల్లగొట్టి జేబులు నింపుకొంటున్నారు.

నిఘా పెంచుతాం.. అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు సాగించే వారిపై చర్యలు తీసుకుంటాం. కాలువ గట్టు వెంబడి నిఘా పెడుతున్నాం. ప్రజలు కూడా అక్రమ తవ్వకాల సమాచారం అధికారులకు తెలియజేయాలి. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. **- బి.రమాదేవి, తహసీల్దారు, భీమడోలు**

క్రిస్మస్ కాంతులు!

మండవల్లి : క్రీస్తు పుట్టుక నాటక ప్రదర్శనలో చిన్నారులు

క్రిస్మస్ సంబరాలు మొదలయ్యాయి. ఏలూరు శాంతినగర్‌లోని మన్నా చర్చితో పాటు రహదారి పొడవునా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు కాంతులు విరజిల్లుతున్నాయి. మండవల్లి స్టేషన్ రోడ్డులోని క్రీస్తు ప్రార్థన మందిరంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. –ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే, మండవల్లి

ఇక ఆహా అనేలా బడి బువ్వ!

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ధరలను కూటమి ప్రభుత్వం పెంచింది. ఆహారంలో పోషక విలువలు పెంపొందించాలన్న లక్ష్యంతో సన్నబియ్యంతో అన్నం, రాగి జావ, చిక్కీలు, వారానికి అయిదు రోజులు గుడ్డు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఆకుకూరలు, వంట సామగ్రి, గ్యాస్ తదితరాలను పథకం సిబ్బంది సమకూర్చుకుంటున్నారు. పెంచిన కేటాయింపులు 1 నుంచి 8 తరగతులకు ఫిబ్రవరి 19వ తేదీ, 9 నుంచి ఇంటర్ తరగతులకు ఆగస్టు 8వ తేదీ నుంచి అమలవుతాయి. 1 నుంచి 8 తరగతుల వరకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తుండగా 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు అయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోంది.

పెంచిన ఛార్జీలు (రూ.లలో) ఇలా..

తరగతులు	పాత	పెంచిన	పెరిగింది
1 - 5	5.45	6.19	0.74
6 - ఇంటర్ వరకు	8.17	9.29	1.12

భోజనం చేసే విద్యార్థులు
- పాఠశాలలు: 1709
- విద్యార్థులు: 1,04,606
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 19
- ఇంటర్ విద్యార్థులు: ప్రథమ: 2310 ద్వితీయ:1990

వద్దనుకున్నారా.. వదిలేశారా.!

మరుగున పడిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్‌పురం ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహణకు నోచుకోక మరుగున పడింది. మూడు నెలలకు ఒకసారి ఈ సమావేశం జరగాల్సి ఉంది. గతంలో తెదేపా ప్రభుత్వం క్రమం తప్పకుండా నిర్వహిస్తూ వచ్చింది. గత వైకాపా ప్రభుత్వం మన్యం ప్రాంతాన్ని, ఐటీడీఏను తీవ్ర నిర్లక్ష్యం చేసింది.

మన్యం గ్రామాల్లో ఆదివాసీ గిరిజనుల సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు, గిరిజన సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను సమీక్షించేందుకు పాలకవర్గ సమావేశం ఎంతో కీలకం.

ముంజులూరు రహదారి దుస్థితి

రెండేళ్ల మూడు నెలలుగా..
పాలకవర్గ సమావేశాన్ని 2023 ఆగస్టులో నిర్వహించారు. రెండు సంవత్సరాల మూడు నెలలు అయినా తదుపరి సమావేశాన్ని ఇంతవరకు నిర్వహించలేదు. దీంతో క్షేత్రస్థాయి సమస్యలపై చర్చ, పథకాలపై సమీక్ష పూర్తిస్థాయిలో ఉండటం లేదు. మారుమూల ఆదివాసీ కొండరెడ్డి తెగ గిరిజనుల నివాసిత గ్రామాలైన మోదెల, రేపల్లి, రేగులపాడు, డోలుగండి గ్రామాలకు సరైన రహదారి సదుపాయం లేక రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. తారురోడ్డు మంజూరైనా అటవీశాఖ అనుమతులు రాక నిలిచిపోయాయి. ఉర్రింక, గోగుమిల్లి, ముంజులూరు, గెడ్డపల్లి, గిన్నేపల్లి, తానిగూడెం, కొర్సావారిగూడెం, చింతకొండ, గొట్టాలరేవు తదితర గ్రామాల రోడ్డు కూడా అధ్వానంగా ఉంది. ఉన్న రహదారులు కూడా భారీ వర్షాలకు తీవ్ర కోతకు గురయ్యాయి.

రవాణా సదుపాయం లేక, ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణానికి సామగ్రి తరలించేందుకు కూడా అవస్థలు పడుతున్నారు. అత్యవసర చికిత్సలకు ఆసుపత్రులకు వెళ్లేందుకు ప్రాణాంతక పరిస్థితులను చవిచూస్తున్నారు.

✦ ఈ ఏడాది ఇంతవరకు జిల్లా మొత్తం మీద 692 మలేరియా కేసులు నమోదైతే వాటిలో కేవలం ఒక్క మన్యం ప్రాంతంలోనే 676 కేసులు ఉన్నాయి. దోమకాటు నుంచి రక్షణ పొందేందుకు 2021లో 2.25 లక్షల దోమతెరలు పంపిణీ చేశారు. తిరిగి మళ్లీ ఇచ్చేందుకు ఇంతవరకు సరఫరా కాలేదు.

✪ 'ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పథకాలు, కార్యక్రమాల అమలును సమీక్షిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. కలెక్టర్ అనుమతి తీసుకుని పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం' అని ఐటీడీఏ పీవో రాములు నాయక్ తెలిపారు.

ఐటీడీఏ పరిధిలో మన్యం మండలాలు: బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు	గిరిజనులు: 80,277 మంది

ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలపై మళ్లీ విచారణ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో నిరుపేదల ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన గృహ నిర్మాణ సంస్థకు చెందిన ఐదుగురు అధికారులపై మళ్లీ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ కార్యదర్శి సహదిత్ వెంకట త్రివినాగ్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ జి.సత్యనారాయణను నియమించింది. వివరాల్లోకి వెళ్తే.. నూజివీడు మండలంలో ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయని.. మెటీరియల్‌ను పక్కదారి పట్టించి చేతివాటం చూపించారని అప్పటి నూజివీడు సబ్ కలెక్టర్ ధ్రువీకరించారు. దీనిపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అక్రమాలకు పాల్పడిన అప్పటి అయిదుగురు అధికారులపై చర్యలు తీసుకున్నారు. వారు తమపై చర్యలు నిలుపుదల చేయాలని ప్రభుత్వానికి అప్పీలు చేసుకోవడంతో మళ్లీ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పుడు నిజమని తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది.

ట్రిపుల్ ఐటీ ఎన్‌సీసీ క్యాడెట్‌ల సత్తా

కౌంటర్ డ్రోన్ ఆవిష్కరణకు పురస్కారం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీ ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. వారు తయారు చేసిన కౌంటర్ డ్రోన్ ఎయిర్ మానిటరింగ్ అండ్ న్యూట్రలైజేషన్ సిస్టమ్ ఏపీ, తెలంగాణ పరిధిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన ఐడియా అండ్ ఇన్నోవేషన్ కాంపిటీషన్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంది.

మొదట ఇక్కడే.. నవంబరు 2, 3 తేదీల్లో నూజివీడులో జరిగిన పోటీల్లో ట్రిపుల్ ఐటీ ఎన్‌సీసీ క్యాడెట్లు సీహెచ్.యువ సాయి ప్రదీప్, బి.త్రిలోక్ వారు తయారు చేసిన కౌంటర్ డ్రోన్ ఎయిర్ మానిటరింగ్ అండ్ న్యూట్రాలైజేషన్ సిస్టమ్‌ను మొదట ప్రదర్శించారు. ఇక్కడ అందర్ని ఆకట్టుకుంది. అనంతరం అదే నెల 10 నుంచి 16 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా లెవల్ ఐడియా అండ్ ఇన్నోవేషన్ పోటీలో పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా వచ్చిన 85 అత్యుత్తమ ప్రాజెక్టుల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు టాప్ 30లో నిలిచారు. ఏపీ, తెలంగాణ పరిధిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆర్జీయూకేటీ డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ సీహెచ్.ఎస్.ఆర్.నవీన్‌కుమార్ తదితరులు అభినందించారు.

తయారు చేసిన డ్రోన్‌తో యువసాయిప్రదీప్, త్రిలోక్

దేశరక్షణే ధ్యేయంగా.. ఆధునిక యుద్ధ తంత్రాల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో దేశ రక్షణకు ముప్పు వాటిల్లనీయకుండా ఉండేలా దీనిని తయారు చేశాం. ఈ డ్రోన్ అత్యాధునిక విజన్ టెస్ట్ టెక్నాలజీ, సెన్సర్ల సాయంతో పేలుడు పదార్థాలు, ఇతర ప్రమాదకర వస్తువులను మోసుకుని వచ్చే శత్రువులను గుర్తిస్తుంది. వెంటనే గ్రౌండ్ స్టేషన్‌కు హెచ్చరికలు పంపుతుంది. కేవలం గుర్తించడమే కాకుండా శత్రువుల డ్రోన్లను గాలిలోనే నిర్వీర్యం చేయగల సామర్థ్యం దీని సొంతం.

- సీహెచ్.యువ సాయిప్రదీప్ (మండవల్లి), బి.త్రిలోక్ (విజయనగరం జిల్లా భోగాపురం మండలం గుడివాడ)

వినూత్నం.. విభిన్నం..

అంతర పంటలతో సాగు పండగ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంకు చెందిన రైతు డా.పాకలపాటి గాంధీ సేద్యాన్ని పండగ చేస్తున్నారు. వ్యవసాయాన్ని అమితంగా ప్రేమించే ఆయన మొదట్లో సంప్రదాయ పంటలైన వరి, చెరకు సాగు చేసి నష్టాలు చవిచూశారు. ఆ నష్టాలు నేర్పిన పాఠాలతో వినూత్న రీతిలో సాగు చేయాలన్న ఆలోచన ఆచరణలో పెట్టారు. తనకున్న 22 ఎకరాల్లో కొబ్బరి, కోకో, వక్క, మిరియం, పిప్పళ్లు ప్రధాన అంతర పంటలుగా సాగు చేయడమే కాకుండా తక్కువ కాలంలో చేతికొచ్చే అరటి, పసుపు, అల్లం, డ్రాగన్ ఫ్రూట్, చేమ దుంప, కంద ఇలా 25 రకాల బహుళ పంటలను సాగు చేస్తున్నారు. ఇలా ఒకటి తర్వాత మరో పంట చేతికొచ్చేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. గతంలో ఒకే రకం పంట సాగు చేయడం వల్ల ఎకరానికి రూ.50వేలు ఆదాయం రాగా ఇందులో కనీసం పెట్టుబడి ఖర్చులు పోను కూలి కూడా రాని పరిస్థితి అని రైతు చెబుతున్నారు. ప్రస్తుతం బహుళ పంటలు సాగు చేయడంతో ఒక పంటతో వల్ల నష్టపోయినా మరోదాంట్లో లాభం చేకూరుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఎకరానికి రూ.2లక్షలు నుంచి 2.50లక్షలు ఆదాయం వస్తుందని తెలిపారు.

తిరుమలంపాలెంలో బహుళ పంటలు సాగు చేస్తున్న పాకలపాటి గాంధీ

లాభదాయకంగా ఉండేలా..

ఆరు అంతస్తులుగా 30 రకాల పంటలను సాగు చేస్తున్నా. ఒకే పంట సాగు చేయడం వల్ల కూలి కూడా గిట్టని పరిస్థితి. ఎక్కువ పంటలతో నేలను కప్పి ఉంచడం వల్ల కలుపు కూడా రాదు. ఒక పంటకు పెట్టే నీరు అన్ని పంటలకు సరిపోతుంది. ఎక్కువ పంటలు ఉన్నాయి కదా అని ఎక్కువ నీరు అవసరం ఉండదు. పూర్తిగా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తున్నా. ఈ విధానం చాలా లాభసాటిగా ఉంది.

- పాకలపాటి గాంధీ, రైతు, తిరుమలం పాలెం

రైతేరాజు

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: మామిడిలో తేనె మంచు పురుగు ఉద్ధృతి కనిపిస్తోంది. నివారణ ఎలా ?

- చంద్రరావు, ద్వారకాతిరుమల

సమాధానం: కొత్త చిగురు వస్తున్న చెట్లను తేనె మంచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. కలుపు లేకుండా తోటను శుభ్రంగా ఉంచుకోవాలి. తోటల్లో గుబురుగా, అడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించుకోవాలి. ఇలా చేయడం వల్ల కొమ్మలపై గాలి తగిలి సూర్యరశ్మి ప్రసరిస్తుంది. తోటలు, పాదుల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. చిగుర్లు తడిచేలా 5 శాతం అజాడిరక్టిన్ 3000 పీపీఎం 2 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటిలో కలిపి మార్చి మార్చి పిచికారీ చేయాలి.

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

శ్రీవారి గోశాలలో మహాశాంతి హోమం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి గోశాలలో మహాశాంతి హోమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల గోశాలలోని గోవులు తరచూ మృతి చెందుతుండటంతో దాని నివారణ కోసం పండితులు ఈ క్రతువు జరిపించారు. ఆలయ గోశాలలో యజ్ఞ గుండాన్ని ఏర్పాటు చేసి, అగ్నిప్రతిష్ఠాపన చేసి మహా శాంతి హోమాన్ని జరిపారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు.

అసత్య ఆరోపణలతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు

న్యాయం చేయాలంటూ సీఎంకు మాజీ ఎమ్మెల్యే విజ్ఞప్తి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: తనపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును విచారణ చేయించి న్యాయం చేయాలని, అసత్య ఆరోపణలు చేసిన ఫిర్యాదుదారుపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే కొండ్రెడ్డి విశ్వనాథం సీఎం చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. నల్లమాడులో సోమవారం జరిగిన ప్రజావేదిక వద్ద సీఎంని కలిసి వినతిపత్రం అందజేశారు. భీమడోలులో తనకు 4.25 ఎకరాల భూమి ఉండగా, దానిలో 1.50 ఎకరం భూమిని భీమడోలుకి చెందిన కొత్తపల్లి చంద్రమౌళి తనదేనంటున్నాడన్నారు. వారసత్వంగా తనకు భూమి సంక్రమించిందనడానికి సకల రికార్డులు ఉన్నా ... ఈ క్రమంలో తనపై కక్ష పెంచుకుని, అసత్య ఆరోపణలు చేస్తూ 2022 అక్టోబరు 16న తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారని విశ్వనాథం వినతిపత్రంలో పేర్కొన్నారు.

చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న విశ్వనాథం

విత్తనశుద్ధి తప్పనిసరి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: వరి నారుమడి వేసే ముందు కచ్చితంగా విత్తనశుద్ధి చేయాలని.. దీని వల్ల చాలా ప్రయోజనాలున్నాయని మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. రబీ నారుమడి వేసే ముందు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. వివరాలు ఇవీ.. ★ కిలో పొడి విత్తనానికి 2.5 గ్రాముల కార్బెండజిమ్ కలిపి శుద్ధి చేసుకోవాలి. లేదా మొలకెత్తే విత్తనం కోసేటప్పుడు లీటరు నీటికి గ్రాము కార్బెండజిమ్ కలిపి విత్తనాన్ని 24 గంటలు నానబెట్టాలి. తరువాత 24 గంటలు మండి కడితే మొలక శాతం పెరుగుతుంది. ★ ఖరీఫ్‌లో పండిన విత్తనాలను రబీ పంటకు వాడాలంటే తప్పనిసరిగా గింజల్లో నిద్రావస్థను తొలగించాల్సిన అవసరం ఉంది. వరి రకాలను బట్టి నిద్రావస్థ కాలపరిమితి వేర్వేరుగా ఉంటుంది. దీనిని గుర్తించి సాగు చేస్తేనే సత్ఫలితాలు వస్తాయి.

కొబ్బరి సాగులో.. ఎరువుల యాజమాన్యమే కీలకం!

మార్టేరు, న్యూస్‌టుడే: సరైన ఎరువుల యాజమాన్యం పాటిస్తే కొబ్బరిలో మంచి దిగుబడులు పొందవచ్చని తణుకు ప్రాంతీయ ఉద్యానశాఖాధికారిణి కె.ప్రియదర్శిని తెలిపారు. కొబ్బరి చెట్ల వయసును బట్టి ఏడాదికి రెండు దఫాలుగా ఎరువులు వేసుకోవాలి. ★ 1- 4 ఏళ్ల వయసున్న చెట్లకు అర కిలో యూరియా, కిలో చొప్పున సింగిల్ సూపర్ పాస్పేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 20 కిలోల పశువుల ఎరువు వేసుకోవాలి. ★ 5 ఏళ్ల వయసున్న చెట్లకు కిలో యూరియా, 2.5 కిలోల చొప్పున సింగిల్ సూపర్ పాస్ఫేట్, 2.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 25 కిలోల పశువుల ఎరువును ఉపయోగించాలి. ★ ప్రతి చెట్టుకు 2 కిలోల వేప పిండి వేస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నేలలో సమ పాళ్లలో తేమ ఉన్నప్పుడు చెట్టు చుట్టూ 3 నుంచి 5 అడుగుల దూరంలో పళ్లెం చేయాలి. దానిలో ఎరువులను వేశాక మట్టితో కప్పి ఉంచాలి. ★ ఎరువులు వేసిన 15 రోజుల తరువాత నేలలో వేసుకునే బోరాన్‌ను 5 సంవత్సరాల లోపు చెట్లకు 50 గ్రాములు, 5 ఏళ్లు పైబడిన చెట్లకు 100 గ్రాముల చొప్పున వేసుకోవాలి.

వెంకటేశ్వరరావు

వెంకటరమణ

బీటీఏ జిల్లా కమిటీ ఎన్నిక

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా జి.వెంకటేశ్వరరావు, జి.వెంకటరమణ ఎన్నికయ్యారు. ఆ సంఘ జిల్లా సమావేశాన్ని సోమవారం ఏలూరులో నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.ఆనందరాజు, గౌరవ సలహాదారుగా సమర్పణరావు, కోశాధికారిగా బి.కృపాకరణ్, సహాధ్యక్షులుగా సీహెచ్ ధర్మలింగం, వి.ధనకాంత, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కె.రాజు, వి.జేసుదాసు, అదనపు ప్రధాన కార్యదర్శులుగా పి.శ్రీనివాసరావు, జి.రామదాసు, ఉప ప్రధాన కార్యదర్శులుగా పి.రాంబాబు, సీహెచ్ విమల, కార్యదర్శిగా కె.రాజశ్రీ, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.బాలస్వామి, ప్రచార కార్యదర్శిగా బి.శరత్, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.మనోజ్‌కుమార్, పి.సాల్మన్, బి.రామారావు, సాయిరాజు భల్లం ఎన్నికయ్యారు.

యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగ యువతకు కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏలూరులోని డీఎల్‌టీసీ ప్రధానాచార్యుడు డి.భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్, పెరిఫెరల్స్ కోర్సుల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, ఆపై కోర్సులు చదివి, 15 నుంచి 35 సంవత్సరాల వయస్కులు అర్హులన్నారు. ఈ నెల 6లోగా కలెక్టరేట్ సమీపంలోని డీఎల్‌టీసీలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వైద్య కళాశాలలో ర్యాగింగ్ భూతం

పోలీసులకు ఫిర్యాదు చేసిన జూనియర్లు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ భూతం జడలు విప్పింది. రెండో సంవత్సరం విద్యార్థులను కొన్నాళ్లుగా మూడో ఏడాది విద్యార్థులు విధిస్తుండటంతో.. సోమవారం అర్ధరాత్రి దాటాక వారు తిరగబడ్డారు. సీనియర్లు, జూనియర్లకు మధ్య గొడవ చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. రెండో పట్టణ సీఐ అశోక్ కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. మూడో సంవత్సరం విద్యార్థులు సుమారు 15 మంది తమను వేధిస్తున్నారని, రాత్రివేళ దుస్తులు విప్పి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరిస్తున్నారని జూనియర్లు పోలీసుల వద్ద వాపోయారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని.. వైద్య కళాశాలలంటే ఇలాగే ఉంటాయని.. సర్దుకుపోవాలని ఓ సహాయాధికారి చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు విద్యార్థుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు.

రొయ్యలకు ఈహెచ్‌పీ సోకితే తీవ్ర నష్టం

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆక్వా సాగులో రొయ్యలకు ఈహెచ్‌పీ వ్యాధి సోకితే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆక్వారంగ నిపుణుడు అడబాల గోపాలరావు తెలిపారు. దీని నివారణకు ఔషధాలు లేవని యాజమాన్య పద్ధతులతోనే నివారణ సాధ్యమని వెల్లడించారు.

వ్యాధి వ్యాప్తి ఇలా.. హిపటో పాంక్రియాట్రిక్ మైక్రో స్పోరిడియాసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా ఎంటరో సైటోజూన్ హిపటో పినై (ఈహెచ్‌పీ) వ్యాధి సంక్రమిస్తుంది. విదేశాల నుంచి బ్రూడర్‌తో పాటు, హేచరీల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, సాగు చెరువుల్లో ఒక చెరువులోని రొయ్యల నుంచి మరో చెరువులోని రొయ్యలకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన రొయ్యల్లో ఎదుగుదల లోపిస్తుంది. క్రమంగా మృత్యువాత పడతాయి.

నివారణ చర్యలు.. రైతులు హేచరీలో రొయ్య పిల్లల కొనుగోలుకు ముందే ఈహెచ్‌పీ నిర్ధారణకు పీసీఆర్ పరీక్ష చేయించి వ్యాధి లేదని నిర్ధారణ అయిన వాటినే చెరువుల్లో వదలాలి. చెరువుల్లో ఈహెచ్‌పీ వ్యాప్తి చెందకుండా ప్రోబయోటిక్స్ వినియోగించాలి. అది అంటువ్యాధి. పక్క చెరువుల నుంచి వ్యాధి కారక రొయ్యలను కాకులు, కొంగలు, పాములు, ఇతర జలచరాలు తీసుకురాకుండా నిరోధించేందుకు సాగు చెరువుల చుట్టూ వలలు, ఆపాలతో కంచె ఏర్పాటు చేయాలి. చెరువు వద్ద పనిచేసే కార్మికులు శుభ్రత పాటించాలి. పట్టుబడి చేసిన అనంతరం నేల కనబడేలా ఆరబెట్టాలి. తదుపరి సాగు చేసే ముందు చెరువులో 10నుంచి 15 చోట్ల మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌లో పరీక్ష చేయించి ఈహెచ్‌పీ ఉన్నట్లు నిర్ధారణ అయితే హెక్టారుకు ఆరుటన్నుల గుల్లసున్నం తడి నేలపై చల్లాలి. వారం రోజుల తర్వాత చెరువులో అడుగు లోతు నీరు పెట్టి ఆ నీటిని బయటకు తీసివేయాలి. తిరిగి చెరువులో నీటిని నింపి క్లోరిన్ లేదా పొటాషియం పెర్మాంగనేటు చల్లాలి. అడుగు భాగంలోని మురుగు ఎప్పటికప్పుడు తొలగించాలి.

కన్నాపురం రహదారి పనులు షురూ!

ఈనాడు కథనానికి స్పందన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: 'ఏ దారీ తెన్నూ లేక.. చేయమని చెప్పలేక' శీర్షికన గత నెల 17న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి యంత్రాంగం స్పందించింది. కొయ్యలగూడెం, కన్నాపురం మధ్య రహదారి నిర్మాణానికి పోలవరం శాసనసభ్యుడు చిర్రి బాలరాజు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారని ర.భ.శాఖ జంగారెడ్డిగూడెం డీఈఈ హరికృష్ణ సోమవారం తెలిపారు. సుమారు 7కి.మీల మేర రహదారి అభివృద్ధి పనులకు రూ.3.40 కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే.

మట్టి అక్రమ తరలింపుపై చర్యలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి శివారులో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఒక లారీని ఆ పథకం అధికారులు సోమవారం దాడి చేసి పట్టుకున్నారు. దీంతో పాటు మట్టి తవ్వకానికి వినియోగిస్తున్న యంత్రాన్ని పట్టుకున్నారు. పోలీసుల సహకారంతో వాటిని స్వాధీనం చేసుకొని, తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు ఆ పథకం ఏఈ ఎం.నాగరాజు తెలిపారు. ఎవరైనా అక్రమ తవ్వకానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

స్వాధీనం చేసుకున్న లారీ, పొక్లెయిన్

ఇసుక తరలిస్తున్న రెండు లారీల పట్టివేత

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: జీలుగుమిల్లి మండలం దర్భగూడెం సమీపాన జాతీయ రహదారిపై సోమవారం వాహన తనిఖీలు చేస్తుండగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సమీపంలోని ఇసుక ర్యాంపుల నుంచి తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న లారీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తుల బృందంలో మరొకరు మృతి

యలమంచిలి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా గండిపోశమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా వ్యాను అదుపుతప్పిన ఘటనలో మృతుల సంఖ్య రెండుకు పెరిగింది. ఈ ప్రమాదంలో గాయపడిన దొడ్డిపట్ల వాసి గెద్దాడ రాజేశ్ (35) రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఇతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. దొడ్డిపట్లలో వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగించే రాజేశ్, అబ్బిరాజుపాలేనికి చెందిన కాండ్రేగుల నరసింహస్వామి మిత్రులు. వీరిలో నరసింహస్వామి ఘటనా స్థలంలోనే మృతిచెందగా రాజేశ్ చికిత్స పొందుతూ చనిపోయారు.

రాజేశ్ (పాత చిత్రం)

వాయిదా వద్దనుకొని.. స్థానికుల కథనం ప్రకారం.. అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల గ్రామాలకు చెందిన 13 మంది బృందం ఆదివారం ఉదయం గండి పోశమ్మ ఆలయానికి వెళ్లేందుకు రెండు రోజుల కిందట ఏర్పాట్లు చేసుకున్నారు. తుపాను ప్రభావంతో శనివారం నుంచి వాతావరణం మారడంతో తొలుత యాత్రను వాయిదా వేద్దామనుకున్నారు. కానీ అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక వాయిదా వేయడం ఎందుకని భావించి ఆదివారం ఉదయం యాత్రకు వెళ్లారు. ఇంతలో ఊహించని ప్రమాదం ముంచుకొచ్చి ఇద్దరు మృత్యువాత పడ్డారని రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దొడ్డిపట్ల వాసి కుంచే శ్రీను రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నరసింహ స్వామి, రాజేశ్ మృతదేహాలు సోమవారం స్వగ్రామాలకు చేరాయి. నరసాపురం ఆర్డీవో దాసి రాజు, తహసీల్దారు పవన్‌కుమార్ వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో ఒకరు.. కూచింపూడి (పెదవేగి), న్యూస్‌టుడే: కూచింపూడి గ్రామానికి చెందిన దిమ్మిటి చినరాటాలు(37) అయిల్‌పామ్ గెలలు కోస్తూ జీవనం సాగిస్తాడు. సోమవారం ఉదయం రామశింగవరంలోని ఓ రైతు తోటలో గెలలు కోస్తుండగా అల్యూమినియం పైపు ప్రమాదవశాత్తు జారిపోయి విద్యుత్తు తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య జ్యోతి, పదో తరగతి, డిగ్రీ చదివే ఇద్దరు కుమారులున్నారు. ఎస్సై కె.రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మాట్లాడుతున్న రవి, పాల్గొన్న నాయకులు

'పోలవరం ఆదివాసీ ప్రాంతాన్ని కొత్త జిల్లాలో కలపాలి'

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: రంపచోడవరం కేంద్రంగా కొత్తగా ఏర్పాటు చేయనున్న పోలవరం జిల్లాలో కచ్చితంగా పోలవరం నియోజకవర్గంలోని ఆదివాసీ ప్రాంతాన్ని కలపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. బుట్టాయగూడెంలో ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం రౌండు టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరాన్ని విలీనం చేయకుండా ఆ పేరుతో జిల్లా ఏర్పాటు హాస్యాస్పదమన్నారు. పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితుల పునరావాసం ఇక్కడ ఉందన్నారు. ముంపు, పునరావాస మండలాలను కలపాలన్నారు. అప్పుడే అన్ని విధాలా సౌలభ్యం, సమన్వయానికి వీలు ఉంటుందన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర నాయకురాలు మొడియం నాగమణి, ఆదివాసీ ఐకాస జిల్లా ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు, ఆదివాసీ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలి కాగుతూ.. పొయ్యిలో పడి బాలికకు గాయాలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పొయ్యి దగ్గర చలి కాగుతూ ప్రమాదవశాత్తు అందులో పడి పండుగూడెంలో పూనెం గ్రీష్మిత అనే బాలిక తీవ్రంగా గాయపడింది. బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రీష్మిత తండ్రి కొర్సావారిగూడేనికి చెందిన మల్లేశ్వరరావు ఏడాది కిందట అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఈ బాలిక తల్లితో పాటూ పండుగూడెంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటుంది. అమ్మమ్మ కూడా చనిపోవడంతో తల్లి నాగదుర్గ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండో తరగతి చదువుతున్న గ్రీష్మిత ఆదివారం పొయ్యి దగ్గర చలికాగుతూ కూర్చుంది. ప్రమాదవశాత్తు పొయ్యిలో పడి శరీరం కాలి గాయపడింది. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు రిఫర్ చేయడంతో జనసేన మండల నాయకుడు జీవీఎస్ నాయుడు సహాయంతో జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న బస్సు.. త్రుటిలో తప్పిన ప్రమాదం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పైవంతెన రెయిలింగ్‌ను ఢీకొంది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ డిపోనకు చెందిన ఎక్స్‌ప్రెస్ లగ్జరీ బస్సు రాజమహేంద్రవరం నుంచి ఏలూరు వస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఏలూరు పాతబస్టాండ్ చేరుకున్న బస్సు కొత్త బస్టాండ్‌కు వస్తుండగా జూట్‌మిల్లు పైవంతెన డౌనులో అదుపు తప్పి వంతెన పక్కన రెయిలింగ్‌ను ఢీకొని ఆగిపోయింది. ఆ సమయంలో బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులున్నారు. డ్రైవరు అప్రమత్తమై బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.

హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణే లక్ష్యం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఏలూరులోని ఇండోర్ స్టేడియం వద్ద సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు దీనిపై తెలుసుకొని ఇతరులకు అవగాహన కల్పించడం సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎయిడ్స్, క్షయ నిర్మూలన అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ హెచ్ఐవీ పరీక్షలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా జైలు అధికారి స్వామి తదితరులు మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు.

ప్రదర్శనలో అధికారులు, విద్యార్థులు

స.హ. చట్టంపై అవగాహన అవసరం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సమాచార హక్కు(స.హ.) చట్టంపై అవగాహన అవసరమని డీఈవో వెంకటలక్ష్మమ్మ అన్నారు. ఈ చట్టం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నగరంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఈ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ★ జిల్లా యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ మైదానం నుంచి ప్రారంభమైన ప్రదర్శన అగ్నిమాపక కూడలి వరకు సాగింది. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ హాజరయ్యారు. సెట్‌వెల్ కార్యాలయ సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో డీఈవో వెంకటలక్ష్మమ్మ తదితరులు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు వాయిదా

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వీరవాసరం ఎంఆర్‌కే జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నుంచి 4వ తేదీ వరకు నిర్వహించాల్సిన అండర్ 17 బాలబాలికల అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీలు తుపాను కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఫెడరేషన్ కార్యదర్శులు డి.సునీత, పీఎస్ఎన్.మల్లేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. పోటీలు నిర్వహించే తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

రాత్రి బస్సు సర్వీసులు రద్దు

పోలవరం, న్యూస్‌టుడే: హిడ్మా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో మావోయిస్టులు ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాల నిర్వహణకు పిలుపు ఇవ్వడంతో పోలవరం వచ్చే నైట్‌హాల్ట్ సర్వీసులు రద్దు చేశారు. మూడు రోజులుగా బస్సులు లేక ఎందుకు రద్దు చేశారో తెలియక దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం కొవ్వూరు, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, ఏలూరు డిపోలకు చెందిన బస్సులు రాత్రి సమయంలో పోలవరం బస్టాండ్‌కు చేరుకుంటాయి. తిరిగి తెల్లవారుజామున బయలుదేరే బస్సుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఎదురుచూపులు చూస్తుంటారు. అయితే మూడు రోజులు ముందుగానే ఆర్టీసీ అధికారులు సర్వీసులు నిలిపివేయడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా రెండు నుంచి 8వ తేదీ వరకు రాత్రి వేళ వచ్చే బస్సులు రద్దు చేయాల్సిందిగా సూచించినట్లు పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లైవ్ గెయిన్ చేస్తే -113 లైవ్, డ్రెస్ 190 స్కిన్‌లెస్ - 203, లివర్ స్కిన్‌లెస్ - 231. కొమారవల్లి పౌల్ట్రీ ఫామ్స్ & బ్రీడర్స్ ప్రైవేట్ లిమిటెడ్: బ్రాయిలర్ ఫారం లైవ్ గెయిన్ - 132, 141, 152 డ్రెస్ స్కిన్ - 250 స్కిన్‌లెస్ - 300.

92.7FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds
BUSINESS SERVICES
బంగారం, బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టుతో ఉన్న బంగారం విడిపించి, అధిక ధర ప్రకారం కొనుగోలు. (దసరా బ్రాండ్) Ph: 81422 92071.
REAL ESTATE
PLOT FOR SALE
హైవేలో అత్యంత చౌకగా అమ్మకము: పెందుర్తి గ్రామం, ఏలూరు జిల్లా ... 9493244471, 9396972239.
TENDER
ITC లిమిటెడ్ ABD, అనపర్తి - 533342 వారు, 124 KL HSD ట్యాంక్, 225 KVA ట్రాన్స్‌ఫార్మర్, MS, ఫుడ్ గ్రేడ్ బెల్టులు, SS, అల్యూమినియం, రబ్బర్, కేబుల్స్, పాలిథీన్ వగైరాలను 15-12-2025న ఈ-బిడ్ ద్వారా అమ్మకము చేయనున్నారు. ఆసక్తి గలవారు 10-12-2025 లోపు పేరు నమోదు చేసుకోవలెను. సంప్రదించవలసిన చిరునామా: వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14. ఫోన్: 09840731925. www.welcomeauctioneers.com
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రజ విశ్వాసంతో ప్రచురిస్తున్నాము. ప్రకటనదారుల ఆర్థిక లావాదేవీలకు ఈనాడు బాధ్యత వహించదు.
ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS
నెక్ మూడంచ కోళ్లగుడ్ల ధర
* For the Information of Trade & Industry
* గోదావరి జోన్ సోమవారం పౌల్ట్రీ రైతుల వద్ద ధర రూ.6.40
వివరాలకు ఫోన్: 08819-224254

మహారాజశ్రీ ఏలూరు అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టులో
I.P. 27/2025
బిట్వీన్:
కమాదుల రేణుకాదేవి ... పిటీషనరు
మరియు
దొంగల వీరవెంకట పెద్దిరాజు మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్
పై నెంబరు I.P. గ్రంథములో 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని 2వ రెస్పాండెంట్ పేరున ఉన్న రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4741/2025ను రద్దుపరచమని పిటీషను దాఖలు చేసినందున దీనిపై ఎవరికైనా అభ్యంతరములు ఉన్నయెడల ది. 24-12-2025వ తేదిన ఉ. 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకోగలరు.
సం/- జి.సీతారామరాజు, న్యాయవాది, ఏలూరు, సెల్: 93986 68991

మహారాజశ్రీ IIవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, గుడివాడ
E.P.No. 2/2020
IN
ఓటివిల్ O.S.No. 62/2015
Between:
తిరువీడుల కృష్ణ ప్రసాద్, తండ్రి శ్రీనివాసరావు, వయస్సు-35, వ్యాపారం, Door No: 8-5-3, రామచంద్ర టవర్స్, ఇండస్ట్రియల్ పార్క్, ఏలూరు, భీమవరం, భీమవరం జి.సి.జి.సి. ~DHR
And
పోలవరపు కోటేశ్వరుడు, తండ్రి ... వయస్సు-49, వ్యాపారం, Door No. 14-112ఎ, ... కైకలూరు, ... ~JDR
పై నెంబరు దావా డిక్రీ ... ఆస్తి ... ది.19-12-2025 తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో వేలం వేయబడును. ... ది.15-3-2012న తేదిన ... Rs.6,00,000/- ...
షెడ్యూల్: ... Rs.No.588/2/ఏ 788.6 ... Door No. 14-112ఎ, RCC బిల్డింగ్ ...
DHR బకాయి : 55,00,000/-
అమ్మకం విలువ : 1,25,50,000/-
మార్కెట్ విలువ : 79,86,000/-
(గవర్నమెంట్ వాల్ విలువ)
(శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)
K.V. Rama Krishna Reddy, LLB Advocate Gudivada, Cell: 94908 81180
గుడివాడ ది.30-11-2025

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

నేడు సర్వసభ్య సమావేశం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. నగరాభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యే బడేటి చంటి సూచనల మేరకు మేయర్ నూర్జహాన్, నగర కమిషనర్ భానుప్రతాప్ అధికారులతో కలిసి 14 అంశాలతో తీర్మానాలు రూపొందించి అజెండా సిద్ధం చేశారు. సమావేశంలో పాలకవర్గ సభ్యుల ఆమోదానికి వాటిని కౌన్సిల్ ముందు ఉంచనున్నారు. మేయర్ నూర్జహాన్ అధ్యక్షతన నగర పాలక సంస్థ సమావేశ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలి

దెందులూరు, న్యూస్‌టుడే: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు కోరారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వలిలో రైతులు సోమవారం నిరసన తెలిపారు. కౌలు రైతులను ఆదుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ మొంథా తుపానుకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, కృష్ణా జిల్లా పరిధిలో రెండో పంట సాగుకు అవసరమైన విత్తనాలు రాయితీపై ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కౌలు రైతుల సంఘం నాయకులు పట్టపోతు రెడ్డియ్య, ఆవల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు (గ్రామీణ):	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

భీమడోలు, న్యూస్‌టుడే: ? భీమడోలులోని మొగలాయిపువీధిలో డ్రెయినేజీ ఆక్రమణల వల్ల మురుగు నిలిచిపోయి దోమల బెడద తీవ్రంగా ఉంది. జ్వరాల బారిన పడుతున్నాం.
- ఆకుల శ్రీను, అన్నెం లక్ష్మణకుమార్

✓ చర్యలు తీసుకుంటాం. - కె.వి.ఎల్.తనూజ, పంచాయతీ కార్యదర్శి, భీమడోలు

జాతర కమిటీల ప్రతినిధులకు సత్కారం

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: నగరంలో నిర్వహిస్తున్న గంగానమ్మ జాతర వైభవంగా ఏలూరు నగర ఆలయాల సంఘం ఆధ్వర్యంలో ఏలూరులోని వైఎంహెచ్ఏ హాలులో సోమవారం సమావేశం నిర్వహించారు. 200 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన గంగానమ్మ జాతరపై వివిధ కమిటీల పెద్దలు, సంబంధీకులు ప్రసంగించి వారి అనుభవాలు తెలిపారు. అమ్మవార్లను కొలిచే వేడుకపై కొలువుదీర్చారు. కొలువుల కమిటీ పెద్దలకు కేపీఎస్ ట్రస్ట్ తరఫున దీక్షా వస్త్రం అందించారు. భక్తులకు అమ్మవారి ప్రసాద వితరణ చేశారు. జాతర కమిటీ సభ్యులను సత్కరించారు. సంబంధీకుల బృందం జాతర విశిష్టత తెలిపారు. పార్వతీజ్యోతి బృందం లలిత సహస్రనామ పారాయణ చేశారు. గండికోట రాజేశ్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. యాజమాన్య కార్యనిర్వాహక కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు యర్రా సోమలింగేశ్వరరావు, కేపీ సత్యనారాయణ, మజ్జి కాంతారావు, పారిశుద్ధ్య వేణుగోపాల్ లునాని, వీవీ బాలకృష్ణారావు పాల్గొన్నారు.

వినతులు రాస్తున్న అధికారులు, సిబ్బంది

నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరించండి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజలు అందజేసే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ ప్రాంగణంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వోతోపాటు వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఎమ్మెల్యే ప్రభాకర్ ఆధ్వర్యంలో తయారు చేయించిన వరి కంకుల దండ సీఎంకు వేస్తూ..

స్థానికులకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతూ..

అడుగడుగునా.. ఉప్పొంగిన అభిమానం

ఉంగుటూరు, ఏలూరు అర్బన్, గణపవరం-నిడమర్రు (గ్రామీణ), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏలూరు జిల్లా పర్యటన విజయవంతమైంది. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉంగుటూరు మండలం గొల్లగూడెం, గోపీనాథపట్నం, నల్లమాడు వచ్చిన ఆయనకు.. స్థానికులు, తెదేపా కార్యకర్తలు, కూటమి నాయకులు అడుగడుగునా.. ఆత్మీయ స్వాగతం పలుకుతూ నినాదాలు చేశారు. వారికి అభివాదం చేస్తూ.. చంద్రబాబు ముందుకుసాగారు.

అనంతపల్లి గ్రామ నివేదికపై అసంతృప్తి.. ఉంగుటూరు మండలం నల్లమాడులో నిర్వహించిన ప్రజా వేదికలో గ్రామ నివేదికను సచివాలయ ఉద్యోగి ప్రేమ్‌కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎదుట వినిపించారు. ఆ నివేదిక సక్రమంగా లేకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ఎన్ని ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్లు లేవు? అంతర్గత రహదారులున్నాయా? మరుగుదొడ్లు లేనివి? అని సీఎం అడిగిన ప్రశ్నలకు ప్రేమ్‌కుమార్ సమాధానం ఇవ్వలేకపోయారు. కనీసం గ్రామంలోని మౌలిక సదుపాయాల వివరాలైనా చెప్పలేకపోతే ఎలాగని సీఎం ప్రశ్నించారు. ● ప్రజా వేదికపై పలువురు ప్రముఖులు ప్రసంగిస్తున్న సమయంలో మైక్ సరిగా పని చేయకపోవడంతో వారు అసౌకర్యానికి గురయ్యారు. దీన్ని గమనించిన కలెక్టర్ వెట్రిసెల్వి వెంటనే వేదికపైనుంచి కిందకు దిగి మైక్ సెట్ నిర్వాహకుడి వద్దకు వెళ్లి మాట్లాడారు. సాంకేతిక ఇబ్బందులను ముందుగానే ఎందుకు సరిచేసుకోలేదంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



చంద్రబాబును ఇంటికి తోడ్కొని వెళ్తున్న నాగలక్ష్మి కుమారుడు, కుమార్తె

తండ్రి పేరుతో సేవలు అభినందనీయం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: తండ్రి పేరుతో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సీఎం చంద్రబాబు అన్నారు. నల్లమాడులో సోమవారం నిర్వహించిన ప్రజావేదిక వద్ద చేబ్రోలుకు చెందిన దాత, తెదేపా నేత బూరుగుపల్లి వెంకట రమణమూర్తి తనయుడు ఆయన కుమారుడు నాగేంద్ర రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో సీఎంకు అందజేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈసీజీ యంత్రాలు, పీహెచ్‌సీల్లో ప్రత్యేక మంచాలను సమకూర్చేందుకు ఈ మొత్తాన్ని వెచ్చించాలని కోరారు.



సీఎంకు చెక్కు అందజేస్తున్న నాగేంద్ర

అధ్యయన పుస్తకాల పంపిణీ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక కస్తూర్బా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు సోమవారం అధ్యయన పుస్తకాలను పంపిణీ చేశారు. నగరపాలక కో-ఆప్షన్ సభ్యులు పెదబాబు, వెంకటరత్నం పాల్గొన్నారు.

రామశింగవరం(పెదవేగి), న్యూస్‌టుడే: పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చేందుకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను యూటీఎఫ్ పెదవేగి మండల శాఖ రామశింగవరంలో వేమూరి చెంచులక్ష్మి ఆర్థిక సహకారంతో ఎంఈవో-1 ఐవీవీ ప్రభాకర రావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. యూటీఎఫ్ పెదవేగి మండల ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి వెంకట రమణ, జిల్లా కౌన్సిలర్ బాల మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంతెన.. ప్రమాదపుటంచున

గణపవరం బొక్కెలి వంతెన ప్రమాదకర స్థితిలో దర్శనమిస్తోంది. ఈ వారధికిరువైపులా రక్షణ గోడలు దెబ్బతిని కూలిపోయాయి. దీని పైనుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే.. వంతెన కూలిపోతుందని స్థానికులు భయపడుతున్నారు. రాకపోకలు సాగించేందుకు పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. - న్యూస్‌టుడే, గణపవరం

ఆలయాల పునర్నిర్మాణానికి నిధులివ్వండి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు నగర నడిబొడ్డున గల అగ్రహారంలోని జనార్దనస్వామి, నాగేశ్వర స్వామి (శివాలయం), కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయాలు పురాతనమైనవి. ప్రస్తుతం దేవాదాయ శాఖ అధీనంలో ఉన్నాయి. ఆలయాలు రోడ్డుస్థాయి కంటే సుమారు 4 అడుగుల లోతుగా ఉండడంతో వర్షాకాలం వచ్చినప్పుడు నిరంతరం గర్భాలయాల్లోకి నీరు చేరి అర్చకులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆలయాల పునర్నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయాల్సిందిగా ఎమ్మెల్యే బడేటి చంటి సోమవారం ఉంగుటూరు మండలం గొల్లగూడెం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన చంద్రబాబు ఆ లేఖను పరిశీలించి తక్షణం రూ. 2 కోట్లు మంజూరు చేసేందుకు ఆమోదించారు. ఈ నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చి వివరిస్తున్న ఎమ్మెల్యే చంటి

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉంగుటూరు శాసనసభ్యుడు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బాదంపూడిలో కొత్తగా సామాజిక భద్రత పింఛను మంజూరైన లబ్ధిదారులకు సొమ్మును శాసనసభ్యుడు సోమవారం పంపిణీ చేశారు.

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే చంటి పేర్కొన్నారు. సోమవారం పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా 27 స్పౌజ్ పింఛన్లు, అయిదుగురికి మంచంమీద నుంచి లేవలేనివారి పింఛన్లు మంజూరయ్యాయన్నారు.

పింఛను పంపిణీ చేస్తున్న చింతమనేని ప్రభాకర్

జగన్నాథపురం(పెదవేగి), న్యూస్‌టుడే: పెదవేగి మండలం జగన్నాథపురంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంలో అధికారులు, నాయకులు ప్రజల కోసమే పని చేస్తారన్నారు.

బాదంపూడిలో లబ్ధిదారుకు నగదు అందజేస్తున్న ధర్మరాజు

ఏలూరు టూటౌన్: స్థానిక 5వ డివిజన్‌లో సచివాలయ సిబ్బందితో కలిసి టీచర్స్ కాలనీలో పింఛన్ల పంపిణీని కార్యక్రమాన్ని మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి ఆంజనేయులు పర్యవేక్షించారు.

వేగంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మరమ్మతులు

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: సమ్మర్ స్టోరేజీ ట్యాంకు మరమ్మతులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయని ఏలూరు నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎమ్ఆర్ పెదబాబు, నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. ఆశ్రం సమీపంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు లీకేజీ శాశ్వతపరిష్కార పనులు సోమవారం వారు ప్రారంభించారు. ఈ మేరకు రూ.5.50 కోట్లు వ్యయం అవుతుందని.. తొలివిడతలో రూ.1.94 కోట్లు అంచనాతో పనులు ప్రారంభించామని చెప్పారు. బండ్‌పై వెళ్లేందుకు నాలుగు వైపులా ర్యాంపులు నిర్మిస్తున్నారు. అనంతరం ట్యాంక్ చుట్టూ రోడ్లు, డ్రెయినేజీ, బండ్‌పై కంచె తదితర పనులు నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ ఎంఈ సురేంద్ర బాబు, డీఈలు నారాయణరావు, రజాక్, కార్పొరేటర్లు తదితరులున్నారు.

పారని మురుగు.. రహదారులపై పరుగు

పవర్‌పేట అంబికావారి వీధి నుంచి కింది వంతెనకు వెళ్లే రహదారిలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి డ్రెయినేజీ పొంగి మురుగంతా రోడ్లపైకి చేరింది. రహదారులన్నీ బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆయా వీధుల్లోని దుకాణాల ఎదుట చేరిన మురుగు తొలిగించుకునేందుకు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు రోడ్లపైకి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు

వృథాగా ప్రాణజలం.. పట్టించుకోని యంత్రాంగం

ఏలూరు అశోక్‌నగర్ రాజీవ్‌పార్కు వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకు సమీపంలో పత్తేబాద రోడ్డుకి వెళ్లే దారిలో పైపులైను పగిలి తాగునీరు డ్రెయినేజీలో కలుస్తోంది. కొన్ని నెలలుగా ప్రాణ జలం వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు

పంట వ్యర్థాలకు నిప్పు.. పుడమికి ముప్పు

పంట పూర్తయిన తరువాత వరి దుబ్బులు, ఎండు గడ్డికి రైతులు నిప్పు పెట్టి తగలబెట్టేస్తున్నారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల

దట్టమైన పొగ వ్యాపిస్తూ పర్యావరణానికి విఘాతం ఏర్పడడంతోపాటు పక్క పొలాల రైతులకు నష్టం ఏర్పడుతోంది. వందలాది ఎకరాల్లోని వరి గడ్డి కాలిపోతుండగా పశుగ్రాసం కొరత వాటిల్లుతోంది. దీనిపై వ్యవసాయశాఖ భీమడోలు ఏడీఏ సీహెచ్.ఉషారాజకుమారి మాట్లాడుతూ పంట కాలం పూర్తయిన తరువాత మిగిలిన వ్యర్థాలు, అవశేషాలను భూమిలో కలియ దున్నాలన్నారు. ఇలా చేయడం వల్ల భూమి గుల్లబారుతోంది. సేంద్రియ ఎరువుగా మారి తరువాత వేసే పంటకు పోషకాలు అందుతాయన్నారు. - న్యూస్‌టుడే, భీమడోలు

చెప్పినా చెవికెక్కించుకోరు..

పారిశుద్ధ్య కార్యక్రమాల్లో అధికార యంత్రాంగంతోపాటు ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయి. చెత్తను ఎక్కడపడితే అక్కడ, రహదారుల వెంబడి పడేయవద్దని, కుండీల్లో వేయాలని గ్రామ పంచాయతీ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నా.. ఫలితం ఉండటం లేదు. భీమడోలులో పలు కూడళ్ల వద్ద చెత్త వేసేందుకు పంచాయతీ అధికారులు చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని

హెచ్చరిక బోర్డులు పెట్టినా పట్టించుకోకుండా వాటి పక్కనే రహదారులపై వేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. స్థానిక హెచ్‌పీ గ్యాస్ గోదాము దారి పక్కన ఇదే విధంగా చెత్త పేరుకుపోయింది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె.వి.ఎల్.తనూజ మాట్లాడుతూ వెంటనే చెత్త తొలగిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, భీమడోలు

కైకరంలో పారాయణం చేస్తున్న మహిళలు

ఘనంగా గీతా జయంతి

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరం గ్రామంలో గీతామృత వాహిని సత్సంగం, సీతారామ గీతార్చన భజన మండలి ఆధ్వర్యంలో గీతా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్య షష్ఠి కళావేదికపై జరిగిన ఈ కార్యక్రమంలో గీతా గ్రంథానికి పూజలు చేశారు. మహిళలు సామూహికంగా గీతా పారాయణ చేశారు. ఆధ్యాత్మికవేత్త జటావల్లభుల రామమూర్తి పాల్గొన్నారు.

ఏలూరు గ్రామీణ: గీతా జయంతి సందర్భంగా లయన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఏలూరు సర్వజన ఆసుపత్రిలో సోమవారం 126 మందికి అన్నసమారాధన చేశారు. మానవత సభ్యులు మోహిని, అజయ్‌కుమార్ సహకరించారు.

స్టౌ మంటలు అంటుకొని వృద్ధురాలికి గాయాలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: స్టౌ మంటలంటుకొని వృద్ధురాలు గాయాలపాలైందని పోలీసులు తెలిపారు. భీమడోలు మండలం సూరప్పగూడానికి చెందిన అందుగుల అలివేలు (75) సోమవారం స్టౌపై వేడినీళ్లు కాస్తుండగా ప్రమాదవశాత్తూ ఆమె చీరకు మంటలంటుకున్నాయి. కుటుంబ సభ్యులు మంటలను అదుపు చేసి ఆమెను ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం అత్యవసర విభాగంలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ద్విచక్ర వాహనదారుడికి.. **ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** దెందులూరు మండలం తిమ్మాపురానికి చెందిన సత్యనారాయణ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై సోమవారం సూరప్పగూడెం వస్తుండగా కంఠ్రిక నరసింగపురానికి చెందిన అంబేడ్కర్ అనే మరో ద్విచక్ర వాహనదారుడు ఎదురుగా వస్తూ ఢీకొన్నాడు. దీంతో సత్యనారాయణకు తీవ్ర గాయాలు కాగా అతడ్ని స్థానికులు 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అంబేడ్కర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శక్తిమంతమైన ఆదర్శ హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: శక్తిమంతమైన ఆదర్శ హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పని చేస్తోందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్ అన్నారు. ప్రతి హిందువు తన సంస్కృతి, చరిత్ర, ధార్మిక విలువలు తెలుసుకొని వాటి పట్ల స్వాభిమానంతో ఉండాలన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏలూరులోని దత్తాశ్రమంలో సోమవారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. గీతా జయంతి సందర్భంగా హైందవి, తపన ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో విద్యార్థులతో సహస్రగళ సామూహిక యువగీతా పారాయణ చేశారు. ఏలూరులోని వివిధ పాఠశాలలకు చెందిన 1500 మంది విద్యార్థులు యువగీతా పారాయణ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయచౌదరి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకతీతంగా దేశ శ్రేయస్సు మన అందరి లక్ష్యం కావాలన్నారు. వ్యాపార, ఆధ్యాత్మిక వేత్త వేణుగోపాల్ లునాని, జిల్లా సంఘ్ చాలక్ గడ్డమణుగు సత్యనారాయణ, విభాగ్ సహ కార్యనిర్వాహక్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

హాజరైన విద్యార్థులు

మాట్లాడుతున్న జనార్దన్

ఊహించని వర్షాలతో అన్నదాతల ఆందోళన

భీమడోలు, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దక్కించుకోవడం అన్నదాతలకు తలకుమించిన భారమవుతోంది. దిత్వా తుపాను కారణంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సమస్యలు తలెత్తుతుండడంతో పంట మాసూళ్లు పూర్తి చేసుకున్న రైతులు రహదారుల వెంబడి ధాన్యం ఆరబోస్తున్నారు. భీమడోలు మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడిసి మొలకలు వచ్చి పూర్తిగా నష్టపోతామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్న రైతులు

కనీస వేతనాలు అమలు చేయండి

ధర్నాలో కార్మికులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ట్రైబ్యునల్ తీర్పులు అనుసరించి మున్సిపల్ పాఠశాలల స్వీపర్లు, పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు సోమయ్య కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల నుంచి వారికి ఒక్క రూపాయి కూడా వేతనం పెంచకపోవడం దారుణమన్నారు. నాయకులు బాలు, వెంకటేశ్వరరావు, భవానీ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION): ELURU

O. E. P. 6 OF 2025
O. S. No. 132 OF 2022

Between:
N.Munisankaraiah S/o N.Eswara Naidu, resident at D.No.5-320/1, Gayatri Nagar, Near Mahila University, S.V.U. Post, Tirupati, Tirupati District, Mobile No.9494114372. ...Decree Holder/Plaintiff

And:
Satish Medikonda ...Judgment Debtor/Defendant

Order XXI Rule 54
C.P.C Notice to the J.Dr

To
Mr. SATISH MEDIKONDA
S/O MEDIKONDA BHASAKARA RAO,
Flat No.4, Ramamohan Nilayam,
H.No.28-1-46, 7th Road,
Santhi Nagar, Eluru,
Andhra Pradesh - 534007
400 JEFFERSON PARK,
WHIPPANY, NJ 07981-1059,
USA. E-mail I.D.
Satish.medikonda@bar-clays.com,
Whatsapp Ph. No.002017078132.

Where as you have failed to satisfy a decree passed against you on the 25th day of November, 2024 in suit No. 132 Of 2022 in favour of D.Hr, It is ordered that you, the said persons and your are hereby prohibited and restrain until the further order of the court from transferring or charging the property specified in the scheduled here under annexed by sale gift or otherwise and that all persons be and that they are hereby, prohibited from receiving the same by purchase, gift or otherwise. It is also ordered that you should attend the Court on the 19th day of December 2025, to take notice of the date fixed for settling the terms of the proclamation of sale.
Hearing date: 19-12-2025

PALUGUDI SREENIVASULU NAIDU
P.N. MURALI, ADVOCATES,
TIRUPATI -9440239158

సామాజిక బాధ్యతగా ఎయిడ్స్ నివారణ

నిడమర్రు, న్యూస్‌టుడే: ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెదనిండ్రకొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.సుబ్బరాజు వర్మ అన్నారు. ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఎంపీహెచ్ఈవో రత్నంరాజు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమడోలులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్యాధికారులు

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.సునీత ఆధ్వర్యంలో వైద్యాధికారులు, వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు శ్రీదేవి, రమ్య, కళాశాల ప్రిన్సిపల్ బి.రవికుమార్, ఐసీటీసీ కౌన్సెలర్ సీహెచ్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు. ● పూళ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: నారాయణపురంలోని అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జి డి.రెడ్డయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ కొండా రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో చాటపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నగరంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఉప ప్రధానాచార్యుడు అజయ్‌కుమార్, రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా గొల్లపల్లి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో కొత్తబస్టాండ్, ఫ్రెండ్స్ ఆటో ఓనర్స్, డ్రైవర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు సోమవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా గొల్లపల్లి హనుమంతరావు గెలిపొందారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, నగర కార్యదర్శి ఎర్రా శ్రీనివాసరావు, ఏలూరు నగర, గ్రామీణ ఆటో ఓనర్స్, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఎన్.లీలాకృష్ణ మాట్లాడుతూ రవాణా రంగంలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ ఐక్యంగా, సంఘటితంగా ఉండి ఎప్పటికప్పుడు తమ హక్కుల రక్షణ కోసం ఉద్యమాలు చేయాలన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాని, నాయకులు గంగరాజు, నెహ్రూబాబు, విజయ్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఏలూరు లక్ష్మీవారపుపేటలోని ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణ నగరపాలక సంస్థ పాఠశాలకు చెందిన విద్యార్థినులు జె.పల్లవి మూడు కిలోమీటర్ల పరుగులో, ఎస్.యశశ్విని హై జంప్‌లో సత్తా చాటి తృతీయ స్థానంలో నిలిచారు. పల్నాడు జిల్లా వినుకొండలోని లయోలా ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 అథ్లెటిక్స్ పోటీల్లో ఈ ఘనత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.కాంతి జయకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలను వ్యాయామోపాధ్యాయులు ఎ.జోజి బాబు, టి.శ్రీనివాస్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్సాహంగా చదరంగం టోర్నీ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో ఇన్విటేషనల్ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ సోమవారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో 113 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో డి.లక్ష్మణరావు (ప్రథమ), జి.అభిషేక్ అవుహమ్ (ద్వితీయ), జె.అక్షిత (తృతీయ), ఎ.శ్రీకాంత్ (4వ), బి.శ్రీనివాస్ (5వ) బహుమతులు గెలుచుకున్నారు. స్కూల్ డైరెక్టర్ సిద్ధార్థ, ఏజీసీఏ డైరెక్టర్ హసన్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE Of NAME

I, POTHUKUCHI GANGA BHAVANI (Old Name), W/o.(late) BHASKARA RAO, H.No.: 11-12, Near Mehar Baba Temple, Katta Subbarao thota, ELURU- 534 003, W.G.Dist.
I, have changed my name as **PAMMI GANGA BHAVANI** (New Name). Here after my name is known as **PAMMI GANGA BHAVANI** (New Name) for all purposes.

(c) eenadu

పోలవరం
•పోలవరం •చింతలపూడి

భక్తిశ్రద్ధలతో గీతాజయంతి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం మదనగోపాలస్వామి ఆలయంలో గీతాజయంతి సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం విశేష అలంకరణలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మహిళలు భగవద్గీత పారాయణం చేశారు. కన్నాపురం శివాలయంలో గీతాపారాయణం చేశారు.

పోలవరం, న్యూస్‌టుడే: గీతా జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో జగదీస్‌దాస్ ఆత్మానందస్వామి పర్యవేక్షణలో పట్టిసీమలోని గీతా ఆశ్రమంలో సోమవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. వచ్చిన భక్తులు గీతా పారాయణం చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

ఉత్సాహంగా ఉపన్యాస పోటీలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక శ్రీరామచంద్ర ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం అన్న అంశంపై ఈ పోటీలు జరిగాయి. ఇందులో ఎం.అభినాష్, ఎన్.వైష్ణవి, పి.హర్షసాయి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి అకడమిక్ కోఆర్డినేటర్ ఉమా మనోహరి, ప్రిన్సిపల్స్ టి.హిమబిందు, రాధిక బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు విజయకేతనం

పోలవరం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ప్రభుత్వం అందజేసిన విజయకేతనం పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని ట్రైకార్ సంస్థ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బొరగం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.

'కార్మిక వ్యతిరేఖ విధానాలు వద్దు'

టి.నరసాపురం, న్యూస్‌టుడే: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలు వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ చింతలపూడి ప్రాంతీయ గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు అన్నారు. మక్కినవారిగూడెంలో ముఠా కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

అయ్యప్పస్వామి ఇరుముడులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బొర్రంపాలెంలో అయ్యప్ప మాలలు ధరించిన సుమారు 50 మంది భక్తులు దీక్ష పూర్తి కావడంతో సోమవారం ఇరుముడులు నిర్వహించారు. అనంతరం శబరిమలైలోని అయ్యప్ప స్వామి దర్శనానికి తరలి వెళ్లారు.

కాటాతో రైతులకు మేలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బండివారిగూడెం వద్ద నవభారత్ ఆయిల్‌పాం కంపెనీ ఏర్పాటు చేసిన కాటాతో ఈ ప్రాంత రైతులకు మేలు జరుగుతుందని మక్కినవారిగూడెం పీఏసీఎస్ అధ్యక్షుడు ఆచంట సూర్యనారాయణ అన్నారు. ఆ ఆయిల్‌పాం కాటాను సోమవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

కాటాను ప్రారంభిస్తున్న సూర్యనారాయణ, రైతులు

గుత్తకు రాక.. గూడుపురాణి!

సుమారు రూ.2 కోట్ల విలువైన 30 పనులకు గ్రహణం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నిధులున్నా పనులు చేయని విచిత్ర పరిస్థితి జంగారెడ్డిగూడెంలో ఉంది. పురపాలక సాధారణ నిధులతో చేయాల్సిన పనులకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు వీటిని ప్రారంభించకుండా తాత్సారం చేస్తున్నారు. సుమారు రూ.2 కోట్లు విలువ చేసే 30కిపైగా అభివృద్ధి పనులు వీరి నిరాసక్తత కారణంగా నిలిచిపోయాయి. దాదాపు నాలుగైదు నెలలుగా ఇదే పరిస్థితి. మరి కొద్ది నెలల్లో పురపాలక ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. దీంతో ఇవి ఎక్కడ ఆగిపోతాయోననే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. కాగా పూర్తయిన పనులకు దాదాపు రూ.2 కోట్ల వరకు బిల్లుల పెండింగ్ ఉంది. వీటి కోసం కొత్త పనులు చేయకుండా తాత్సారం చేస్తున్నారు. పైగా ఇవన్నీ వర్క్ ఆర్డర్లు ఇచ్చినవి కావడం గమనార్హం.

రూ.28 లక్షలతో రోడ్డు నిర్మించాల్సిన రామచంద్రపురంలోని ఒక వీధి

వేసవి నీటి ఎద్దడి నివారణ.. స్థానిక టీచర్స్ కాలనీల్లో ఈ ఏడాది వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం రూ. 16 లక్షలతో పైప్‌లైన్లు ప్రతిపాదించారు. వేసవి ముగిసింది. మరో వేసవి రానుంది. కానీ ఈ పనులు జరగలేదు. గుత్తేదారుల నిరసనలతో పనులు అటకెక్కాయి.

మున్సిపల్ పార్కులో.. జంగారెడ్డిగూడెం పట్టణ వాసులందరికీ శేషాద్రినగర్‌లో అల్లూరి సీతారామరాజు పురపాలక పార్కు ఒక్కటే ప్రధానమైంది. ఇందులో పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు, వివిధ అభివృద్ధి పనులకు రూ.7 లక్షలు కేటాయించారు. ఈ పనులు ముందుకు సాగలేదు.

రూ.28 లక్షలతో.. 5వ సచివాలయం పరిధిలో ఉన్న ఈ గ్రావెల్ రోడ్డును సీసీగా అభివృద్ధి చేసేందుకు రూ.28 లక్షలతో ప్రతిపాదించారు. 2024 ఫిబ్రవరి నుంచి ఈ పనులు జరగడం లేదు. ఈ పనులు జరిగి ఉంటే ప్రజలకు రహదారి సౌకర్యం అందుబాటులోనికి వచ్చేది. ఇలా మరి కొన్ని ముఖ్యమైన పనులు ప్రారంభానికి నోచుకోనివాటిలో ఉన్నాయి.

అవగాహన కల్పించినా..
పనులు చేయండి బిల్లులు విడుదల వుతాయని గుత్తేదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికి రెండు పర్యాయాలు గుత్తేదారులతో అవగాహన సదస్సు పెట్టాం. నిధులపై ఎటువంటి ఆంక్షలు లేవు. త్వరలోనే పెండింగ్ బిల్లులు విడుదల కావచ్చు.
- కె.వి.రమణ, కమిషనర్, జంగారెడ్డిగూడెం

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ? శ్రీనివాసపురం రోడ్డు నుంచి జూనియర్ కళాశాల మీదుగా సీతానగరం వెళ్లే రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. - **రమణ**

✔ అన్ని దీపాలు వెలిగిస్తాం. - **కె.వి.రమణ, కమిషనర్**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి ఎన్‌వీఎన్ కాలనీలో చేతిపంపు చుట్టు పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయి. - **అప్పారావు**

✔ చేతిపంపు పరిసరాలు శుభ్రం చేసి సమస్య పరిష్కరిస్తాం. - **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.**

? చింతలపూడి పట్టణం గంటావారివీధి శివారు బజారు వీధిలో ఉన్న నాలుగు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతున్నాం. - **కె.శ్రీనివాసరావు**

✔ వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేస్తాం. రహదారిపై గుంతలు పూడ్చి సమస్య పరిష్కరిస్తాం.
- **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

చింతలపూడి, న్యూస్‌టుడే: ? వెలగలపల్లి నుంచి ఫాతిమాపురం వరకు రహదారి మరమ్మతులు చేపడుతున్నారు. కొన్ని గోతులను వదిలేస్తున్నారు. - **మధు, ఫాతిమాపురం**

✔ పరిశీలించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేలా చర్యలు చేపడతాం. **-శ్రీకర్, ఆర్ అండ్ బీ డీఈ.**

? పట్టణంలోని మారుతీనగర్‌లో ఇళ్ల మధ్య మురుగు నిలిచిపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. - **శ్రీనివాస్, మారుతీనగర్.**

✔ మారుతీనగర్‌లో మురుగు నిలిచే ప్రాంతాలను పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. - **రాంబాబు, కమిషనర్**

పైపులైన్‌కు మరమ్మతులు

స్పందనకు వందనం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం పంచాయతీ పరిధి జెట్టీవీధిలో సత్యసాయి మంచి నీటి పథకం పైపులైన్ దెబ్బతినడంతో కొన్ని రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీనిపై గత నెల 27న 'మేమున్నాం..మీకుతోడుగా..' శీర్షికన ప్రచురితం కావడంతో పథకం నిర్వాహక సిబ్బంది స్పందించి సోమవారం మరమ్మతులు చేసి నీటి సరఫరా పునరుద్ధరించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

పేద కుటుంబాలకు భరోసా

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం పేద కుటుంబాలకు భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. సోమవారం బర్రింకలపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

లింగపాలెం, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, న్యూస్‌టుడే: రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం జనవరి నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు సన్నద్ధమవుతోందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడారు. చింతలపూడి మండలం గణిజర్లలో కూటమి నాయకులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలో పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు పాల్గొన్నారు. కామవరపుకోటలో మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ రామకృష్ణ కూటమి నేతలతో కలిసి పంపిణీ చేశారు.

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం మారంపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బర్రింకలపాడులో పింఛను అందజేస్తున్న బాలరాజు

ధర్మాజీగూడెంలో పంపిణీ చేస్తున్న రోషన్ కుమార్

జంగారెడ్డిగూడెం డిప్యూటీ ఎంపీడీవోగా శాంతి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం డిప్యూటీ ఎంపీడీవోగా డి.శాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన ఆమె ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. నియామకపత్రాన్ని ఎంపీడీవో కృష్ణప్రసాద్ నుంచి అందుకున్నారు.

సచివాలయాల అధికారిగా నాగలక్ష్మి.. టి.నరసాపురం, న్యూస్‌టుడే: మండల సచివాలయాల అధికారిగా ఎల్.నాగలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె బండివారిగూడెం పంచాయతీ కార్యదర్శిగా పని చేసి, ఉద్యోగోన్నతిపై ఈ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల పనితీరు సక్రమంగా ఉండే విధంగా తన బాధ్యత నిర్వహిస్తానని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ.. కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం మండల సచివాలయాల అధికారిగా కె.సురేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పరింపూడి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆయనకు ఉద్యోగోన్నతి లభించింది. దీంతో మండల స్థాయిలో నూతనంగా తీసుకొచ్చిన సచివాలయాల అధికారి పోస్టుకు ఎంపికయ్యారు.

హమ్మయ్య.. దూరం తగ్గింది!

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: నిత్యం బడికి వెళ్లి వచ్చే దూరం తగ్గిందని పాత పరింపూడి, పరింపూడి ప్రాంతాలకు చెందిన కొయ్యలగూడెం బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల బాలబాలికలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పరింపూడిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నుంచి నిత్యం సుమారు 100మంది వరకు విద్యార్థినులు పక్కనే ఉన్న పాఠశాలలకు వెళ్లి రావడానికి చుట్టూ తిరిగి రావడం, ఆకతాయిల బెడద, వాహనాల రద్దీ వంటి ఆందోళనలతో సతమతం అయ్యేవారు. వసతిగృహం ఎదురుగా రహదారిని కలుపుతూ పరింపూడి-1 సచివాలయం, పాఠశాలల వరకు సుమారు 150 మీటర్ల పైబడి రహదారి నిర్మించడంతో గ్రామస్థులకు కూడా పలు ప్రభుత్వ కార్యాలయాలకు మార్గం సుగమమైంది. పంచాయతీ ఆధ్వర్యంలో పనులు చేసినట్లు పీఆర్ ఏఈ సురేశ్ తెలిపారు.

కొందరింతే.. చెప్పినా వినరంతే!

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అచ్యుతాపురం నుంచి కొయ్యలగూడెం రహదారిలో సరకు రవాణా వాహనంపై ఒక వ్యక్తి ఎటువంటి ఆధారం లేకుండా ఇలా కూర్చుని ప్రమాదకరంగా ప్రయాణించాడు. సోమవారం దీనిని వాహనచోదకులు పలువురు గమనించి కొందరింతే.. చెప్పినా వినరని వ్యాఖ్యానించారు. అంతకుముందు గోపాలపురం, దేవరపల్లి తదితర కీలక కూడళ్లను దాటుకుంటూ వచ్చిన ఆ వాహనాన్ని గమనించిన పోలీసులు కానీ, అధికారులు కానీ దీనిని ప్రశ్నించకుండా వదిలేయడం గమనార్హం.

పరివర్తకం.. పట్టుకుంటే ప్రమాదం..

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: అల్లూరినగర్‌లో విద్యుత్తు పరివర్తకం ప్రమాదకరంగా కిందకు ఉంది. ఇళ్ల మధ్యలో పిల్లలకు అందేంత ఎత్తులో ఉండటంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పరివర్తకాన్ని ఎత్తులో ఉంచి ఒరిగిన స్తంభాన్ని సరిచేయాలని వారు కోరుతున్నారు. విద్యుత్తు శాఖ జేఈ కన్నబాబు మాట్లాడుతూ సిబ్బందితో సరిచేయిస్తామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
ద్వారకాతిరుమల శాఖ, సెల్: 91009 03077

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకునందు బంగారు నగలు తనఖాగాపెట్టి అప్పుతీసుకుని తిరిగి చెల్లించమని నోటీసులు పంపించినను చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం ది. 09-12-2025 మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు బ్యాంకు ఆవరణలో బంగారు ఆభరణములు వేలం వేయబడును. వేలం వేసినా బకాయి రద్దుకాని యెడల వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకుని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ తెలిపిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. నోటీసులు అందనివారు, తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిగా తెలియజేయటమైనది.

వ. నెం.	అప్పు ఖాతా నెంబర్	ఋణగ్రహీత పేరు / చిరునామా	బంగారం స్థూల బరువు గ్రాలలో
1	72630100056680	బోడపాటి వెంకటేశ్వరరావు S/o మాణిక్యాలరావు, I.S.రాఘవాపురం ద్వారకాతిరుమల మండలం	6.0

షరతులు: 1. వేలములో పాల్గొనువారు రూ. 10,000 (పది వేల రూపాయలు) సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించవలెను. వేలంలో ఆభరణములు పొందనివారికి సెక్యూరిటీ డిపాజిట్ వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. వేలంలో ఆభరణములు పొందినవారు సెక్యూరిటీ డిపాజిట్ మినహా మిగిలిన సొమ్ము చెల్లించి ఆభరణములను పొందవలెను. 2. ఏ స్థితిలోనైన వేలం నిలుపుదల చేయుటకు గాని, వాయిదా వేయుటకుగాని నియమ నిబంధనలను మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. 3. వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. 4. బంగారు వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని బంగారు రుణానికి సర్దుబాటు చేయగా మిలిగిన మొత్తాన్ని వారికి గల ఇతర రుణములకు జమచేయబడును.
ద్వారకాతిరుమల, తేది: 01-12-2025 సం/- బ్రాంచి మేనేజరు, ద్వారకాతిరుమల

తెదేపా వాణిజ్య విభాగం అధ్యక్షుడికి ఎంపిక

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలకు చెందిన ఇమ్మడి రత్నాజీ తెదేపా గోపాలపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు స్థానిక వైష్ణవి ఫంక్షన్ హాల్లో ఆయన్ని సోమవారం ఘనంగా సత్కరించారు.

కంటి వైద్య శిబిరం

కామవరపుకోట, న్యూస్‌టుడే: పాతూరులో సోమవారం జాగృతి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ లోకేశ్ 40 మందికి పరీక్షలు జరిపి, 12 మందికి కళ్ల జోళ్లు అందజేశారు. ఒకరికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు.

డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం పంచాయతీ పరిధిలోని పెద్దరామాలయం వీధిలో రింగ్ బండ్‌ను ఆనుకొని డ్రెయిన్ నిర్మాణానికి బొరగం శ్రీనివాసులు సోమవారం శంకుస్థాపన చేశారు. జడ్పీ నిధులు రూ.50 లక్షలతో పంచాయతీ పరిధిలోని మూడు ప్రాంతాల్లో డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగరాజు చెప్పారు.

కమిటీల ఏర్పాటుకు పిలుపు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల గ్రామ సంఘాల కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు విస్సంపల్లి సిద్ధూమాదిగ పిలుపునిచ్చారు. ఆ సంఘ సమావేశం మక్కినవారిగూడెంలో సోమవారం నిర్వహించారు.

ధైర్యంగా చెప్పండి: ఎస్సై

కుక్కునూరు, న్యూస్‌టుడే: ఏదైనా సమస్య వస్తే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు ధైర్యంగా చెప్పాలని ఎస్సై రాజారెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోక్సో, సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి స్పర్శ, చెడు స్పర్శల మధ్య తేడాను గుర్తించడంపై అవగాహన కల్పించారు.

ఇంద్ర బస్సు ఛార్జీలో 10 శాతం రాయితీ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : జంగారెడ్డిగూడెం డిపో నుంచి నడిచే ఇంద్ర బస్సు ఛార్జీల్లో ప్రయాణికులకు 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు డిపో మేనేజర్ గంగాధరరావు సోమవారం తెలిపారు. ఈ రాయితీ ఈ నెల 20 వరకు అమల్లో ఉంటుందన్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో రాయితీ పొందవచ్చని చెప్పారు.

సాయం అందించి ఆదుకోండి..

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : తన భర్త పేరాబత్తుల షణ్ముఖవల్లీకుమార్ వెల్డింగ్ దుకాణంలో పనులు చేస్తూ 2021 ఆగస్టులో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారని, ముగ్గురు పిల్లలతో కుటుంబ భారాన్ని మోస్తున్నానని పూర్ణిమ యామిని అనే మహిళ మున్సిపల్ కమిషనర్‌కు మొరపెట్టుకున్నారు. ఎన్టీఆర్ నగర్‌లో చిన్న బడ్డీ ఏర్పాటు చేసి పిల్లల్ని చదివిస్తున్నానని చెప్పారు. షణ్ముఖవల్లీకుమార్ మృతికి సంబంధించి చంద్రన్న బీమా మంజూరైందని, ప్రాథమికంగా దహన సంస్కారాలకు సచివాలయ అధికారులు రూ.10 వేల అందించారన్నారు. మిగిలిన పైకం ఇంత వరకు రాలేదని వాపోయారు. విద్యుత్తు శాఖ కూడా పట్టించుకోవడం లేదని తెలిపారు. తనకు పరిహారం వచ్చేలా చూసి తగిన న్యాయం చేయాలని పురపాలక కమిషనర్ రమణను యామిని అర్థించారు.

పురపాలక కమిషనర్‌కు విన్నవిస్తున్న పూర్ణిమయామిని

తప్పుడు కేసులు పెట్టడం సరికాదు

కుక్కునూరు, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలంలో నల్లరాయి క్వారీల వల్ల నష్టపోతున్న బాధితులకు న్యాయం చేయాలని పోరాడుతున్న ఆదివాసీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదని ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు పొడియం వేణుగోపాల్ అన్నారు. సోమవారం కుక్కునూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనింగ్ మాఫియాకు అండగా నిలిచిన అధికారులపై అట్రాసిటీ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు

నేడు 'జనవాణి'

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలో ఈ నెల రెండో తేదీన ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'జనవాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంపీడీవో కార్యాలయం వెనుక గల పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే బహిరంగ సమావేశంలో శాసనసభ్యుడు చిర్రి బాలరాజు పాల్గొని ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని ప్రకటనలో వివరించారు.

మీ కోసంలో పలు సమస్యలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం జరిగిన మీ కోసంలో ప్రజల అర్జీలను ఆర్డీవో ఎంవీ రమణ స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు అందాయి. 22ఎ నుంచి రాజవరంలోని తన భూమిని తొలగించాలని అయినపర్తి ఫిలప్ ఫిర్యాదు చేశారు. తన ఇంటి స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తూంపాటి గంగులు ఫిర్యాదు చేశారు. గురవాయిగూడెంలోని భూమి విషయంలో పోలీసులు పట్టించుకోవట్లేదంటూ పొంగులేటి సత్యవతి ఫిర్యాదు చేశారు. ఆర్‌అండ్‌ఆర్‌లో తన సోదరుడు మోహనరావు భూమిని సేకరించారని, తర్వాత ఆయన మరణించినా.. ఆ పైకం కుటుంబ సభ్యులకు జమ కాలేదని కడియం మంగ ఫిర్యాదు చేశారు. వీరభద్రవరంలో 30 ఎకరాల అటవీ భూమిని ఒకరు సాగు చేస్తున్నారని కామవరపుకోటకు చెందిన తలారి ప్రకాశ్ ఫిర్యాదు చేశారు. ఈ భూమిని అటవీ, రెవెన్యూ శాఖలు తమది కాదంటే తమది కాదని పరస్పరం చెబుతున్నాయని ప్రకాశ్ పేర్కొన్నారు. సర్వే చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కామవరపుకోట ప్రధాన కూడలిలో ఆక్రమణలు తొలగించాలని పి.రమేశ్ ఫిర్యాదు చేశారు. పంగిడిగూడెంలో ఎల్‌సీసీ భూమి పేదలకు పంచాలని మానుకొండ వెంకటరత్నం విన్నవించారు. తన భూమిని తహసీల్దారు ఆన్‌లైన్ చేయడం లేదని కొండపల్లి శారద ఫిర్యాదు చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

జంగారెడ్డిగూడెం, చింతలపూడి పట్టణం, కొయ్యలగూడెం, న్యూస్‌టుడే : ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరమని జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రి ఆర్ఎంవో రాంబాబు తెలిపారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పట్టణంలో జరిగిన అవగాహన ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఎస్‌డీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో అవగాహన ర్యాలీలు, ప్రదర్శనలు జరిగాయి. అనంతరం ఎయిడ్స్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేశారు. చింతలపూడి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేశారు. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలన గుర్తు ఆకారంలో కూర్చుని అవగాహన ప్రదర్శన చేశారు. అనంతరం ఎయిడ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కొయ్యలగూడెం ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. ద్వారకాతిరుమలు, కామవరపుకోట, లింగపాలెం, బయ్యనగూడెం, వేలేరుపాడు, కొయిదా, కుక్కునూరు తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న రాంబాబు

బుట్టాయగూడెంలో విద్యార్థుల ప్రదర్శన

వ్యక్తిపై కర్రతో దాడి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: వ్యక్తిని కొట్టి గాయపర్చిన వారిపై బాధితుడి ఫిర్యాదు మేరకు జంగారెడ్డిగూడెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామానికి చెందిన కలపాల కోటయ్య సోమవారం స్థానికంగా ఉన్న తన పొలానికి వెళ్లాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన యడ్లపల్లి రాంబాబు మరో నలుగురు కలిసి పొలంలో కోటయ్యపై కర్రతో దాడి చేశారు. దీంతో అతడు కేకలు వేయడంతో చుట్టపక్కల వారు వచ్చేసరికి దాడిచేసిన వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. దాడిలో కోటయ్య తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు అతడిని జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కోటయ్య ఫిర్యాదు మేరకు యడ్లపల్లి రాంబాబు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
హోమ్‌లోన్ సెంటర్-64187, మొదటి అంతస్తు, రవి కాంప్లెక్స్ బిల్డింగ్, డి.నెం.17-5-5, ఎ.ఎస్.ఆర్. స్టేడియం రోడ్డు, ఏలూరు, ఏలూరు జిల్లా-534005.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 రూల్ 8(1) & 8(2) క్రింద)

[illegible]

ప్రదేశం : ఏలూరు
తేది : 26.11.2025
సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

సమాజ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

ప్రదర్శనలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవపై ఆసక్తి పెంపొందించుకోవాలని కళాశాల ఛైర్మన్ డా.రావి వెంకటరావు తెలిపారు. ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కనసానపల్లిలో సోమవారం నుంచి ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, ఎయిడ్స్ వ్యాధిపై ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

సుబ్బారాయుడికి సహస్ర దీపారాధన

ముదినేపల్లి, న్యూస్‌టుడే: వైభవపేతంగా సాగుతున్న సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటరులోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి మహోత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన, సహస్ర దీపారాధన వంటి ప్రత్యేక పూజలు జరిపించారు. రాత్రి నిర్వహించిన సహస్ర దీపారాధనలో భాగంగా మహిళలు, భక్తులు భారీస్థాయిలో పాల్గొని దీపారాధన చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు :80085 74698	ఆగిరిపల్లి: 9121229090
ముసునూరు: 93983 81268	చాట్రాయి: 8008574700
కైకలూరు :73060 88555	మండవల్లి: 8106099008
కలిదిండి :90594 84862	ముదినేపల్లి: 8008574693

స్పందనకు వందనం

కొత్త దీపం ఏర్పాటు.. **కైకలూరు, న్యూస్‌టుడే:** కైకలూరు ఒకటో వార్డులో 16వ నంబరు పంచాయతీ వీధి దీపం సక్రమంగా వెలగడం లేదని స్థానికుడు పురుషోత్తం 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వై.ప్రసాద్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన కొత్త దీపం ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరించారు.

మాట్లాడి.. మైమరపించి
'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

విజేతలతో అధ్యాపకులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ మానవ మేధస్సుతోనే సాధ్యమైందని సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీమన్నారాయణ అన్నారు. సోమవారం కళాశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మాట్లాడారు. ఇందులో టి.దీప్తిసాయి సర్వజ్ఞ, బీవీఆర్.మనోజ్, మహమ్మద్ ఇర్ఫత్ సుల్తానా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. వారికి డీన్ సురేష్, ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

తెదేపాలో చేరిక

పార్టీలో చేరిన వారితో వెంకటేశ్వరరావు తదితరులు

చాట్రాయి, న్యూస్‌టుడే: జనార్దనవరంలో వైకాపా వర్గీయులు పెద్ద ఎత్తున తెదేపాలో చేరారని తెదేపా మండలాధ్యక్షుడు జజ్జవరపు వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన దారా చిన వెంకటేశ్వరరావు, దుర్గం బాలయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు తెదేపా గ్రామ అధ్యక్షుడు మారగాని చిన్నబ్బాయి సమక్షంలో పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. నీటి సంఘాధ్యక్షుడు వంగల సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించండి

దెందులూరు, న్యూస్‌టుడే: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు కోరారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో కొత్తూరులో రైతులు సోమవారం నిరసన తెలిపారు. కౌలు రైతులను ఆదుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడారు.

అన్నదాతల్లో కలవరింత
చిరు జల్లులతో ఉరుకులు.. పరుగులు

నూజివీడు, ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి సాగుచేసే రైతన్నకు పంట చేతి కొచ్చే సమయంలో ప్రతికూల వాతావరణం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. దిత్వా తుపాను ప్రభావంతో వాతావరణం మారింది. మబ్బులు, గాలుల తీవ్రత, జల్లుల కారణంగా ఆందోళన వ్యక్తమవుతోంది. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలో రైతులు 'దిత్వా' తుపాను బారి నుంచి వరి పంటను రక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అసలు ఖరీఫ్ సాగు ప్రారంభించిన దగ్గర నుంచి పంట చేతికొస్తున్న ప్రస్తుత తరుణం వరకు తుపాన్లు, భారీ వర్షాలు, ఈదురు గాలులు వెంటాడాయి. ఫలితంగా రైతులకు సాగు ఖర్చులు పెరగగా.. దిగుబడులు మాత్రం భారీగా తగ్గాయి.

దిత్వా ప్రభావంతో.. నూజివీడు నియోజకవర్గంలో 26,470 వేల ఎకరాల్లో అన్నదాతలు వరిసాగు చేస్తున్నారు. వరి కోతలు ఇప్పటికి 57 శాతం పూర్తయ్యాయి. 15,035 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లులకు చేరింది. 'దిత్వా' తుపాను ప్రభావంతో మారిన వాతావరణం రైతులను కలవరపెడుతోంది.

పనులకు అవరోధం తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా చిరుజల్లులు పడటంతో చేతికొచ్చిన పంట చేజారి పోతోందని, ధాన్యం ఎండబెట్టుకోవడానికి అవకాశం లేక పోవడంతో తేమ శాతం పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం భద్రపరచుకోవడం, రైస్ మిల్లులకు రవాణా చేయడానికి అదనపు ఖర్చులు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ సమయంలో గాలి వర్షం కురిస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెయ్యేరులో పచ్చి ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తి ఒబ్బిడి చేస్తూ..

పంట కోతకు సిద్ధంగా.. కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 23,007 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకు కేవలం 8,840 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. దాదాపు 1,431 ఎకరాల పంట ఆరబెడుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న పొలాలకు ముసురు తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉంది.

వాయిదా వేసుకోండి 'వరి కోతలు మూడు రోజులు వాయిదా వేసుకుంటే మంచిది. భద్రపరచుకున్న ధాన్యం రాశుల కింద, పైన టార్పాలిన్లు కప్పుకోవాలి. సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించండి.' అని వ్యవసాయ శాఖ ఏడీఏ సుబ్బారావు, నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న సూచించారు.

బాధ్యతల స్వీకరణ

మండవల్లి, ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండవల్లి ఉప ఎంపీడీవోగా నాగమణి, ముదినేపల్లి ఉప ఎంపీడీవోగా తాతా వెంకటవిజయభాస్కర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో వారికి బాధ్యతలు అప్పగించారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి ఉప ఎంపీడీవోగా పి.దుర్గారావు బాధ్యతలు చేపట్టారు. ఆయన నూజివీడు డీఎల్పీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ.. ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సువర్ణరాజు ఉప ఎంపీడీవోగా ఉద్యోగోన్నతిపై పెనుగంచిప్రోలు వెళ్లారు.

108 రకాలతో నైవేద్యం

చాట్రాయి, న్యూస్‌టుడే: కోటపాడు శివాలయంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పవళింపు సేవ నిర్వహించారు. స్వామికి 108 రకాలతో నైవేద్యాలు సమర్పించారు. కల్యాణ క్రతువులో వినియోగించిన అక్షింతలను భక్తులకు పంచారు.

రామలింగేశ్వరుడికి.. ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామిని అర్చకులు అలంకరించారు. భాస్కరరావు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. సోమవారంతో పాటు రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఈవో సీతారామయ్య, ఛైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాయిబాబాకు.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: వడాలి శివారు కొత్తపల్లెలోని శిర్డీ సాయిబాబా ఆలయం ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామికి పలు రకాల హారతులు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వ్యవసాయ, పారిశ్రామికరంగం ప్రగతే లక్ష్యం: మంత్రి

పింఛను సొమ్ము ఇస్తున్న పార్థసారధి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం, వ్యవసాయం, పారిశ్రామికరంగం అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం నూజివీడు మండలం మర్రిబందంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్రంలో రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని, రూ.4 వేల పింఛన్‌గా చంద్రబాబు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో చదువుకున్న వారికి ఉద్యోగాలు లేవని, ప్రస్తుతం విశాఖ గూగుల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను తీసుకు వస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు యనమదల వాసు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

పోతురెడ్డిపల్లి: సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ వినూత్న

నూజివీడు, రూరల్, న్యూస్‌టుడే: అన్నవరం, పోతురెడ్డిపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల పనితీరు, తదితరాల గురించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. గోనె సంచులు, టార్పాలిన్లు తదితరాలు ఉన్నాయా లేవా అంటూ ఆరా తీశారు. ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలించి.. తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.

ఘనంగా గీతా జయంతి

పారాయణం చేస్తున్న భక్తులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెంలోని బాబాజీ ఆలయంలో సోమవారం గీతా జయంతి మహోత్సవం నిర్వహించారు. కృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆసూరి రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. గీతను రోజూ పారాయణం చేయడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు.

విద్యార్థులకు అభినందన

ప్రతిభ చాటిన వారితో మంత్రి సత్యకుమార్‌యాదవ్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఏపీ ఎస్ఏసీఎస్(ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ) పర్యవేక్షణలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం కార్యక్రమం జరిగింది. దానికి ముఖ్య అతిథిగా వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీశ, విజయవాడ పడమట ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూజివీడులోని స్నేహ రైడ్స్ విద్యార్థులు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ.. ఒక స్కిట్ ప్రదర్శించారు. అది ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొంది. విద్యార్థుల ప్రతిభను మంత్రితో పాటు, కలెక్టరు, ఎమ్మెల్యే ఇతర అతిథులు అభినందించారు. స్కిట్‌కు ప్రథమ బహుమతిని అందించారు. స్నేహ రైడ్స్ నిర్వాహకుడు నగేశ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే బాధ్యులపై చర్యలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఒక సమస్యపై ప్రజలు పదే పదే కార్యాలయాల చుట్టూ తిరిగేలా చేస్తే సహించబోమని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మీకోసం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు జమ కావడం లేదని, చర్యలు తీసుకోవాలని చాట్రాయి మండలం తుమ్మగూడేనికి చెందిన ప్రత్తిపాటి రామయ్య అర్జీ ఇచ్చారు. సర్వే నంబరు 37-8తో పాటు తదితర నంబర్లలో భూములున్నాయని, ఆయా భూములను ఆన్‌లైన్ చేయించాలని తుమ్మగూడేనికి చెందిన పత్తిపాటి చంటి విజ్ఞప్తి చేశారు. మొత్తం 38 మంది అర్జీలు అందించగా.. వాటన్నింటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

సూచిక.. దారి చూపక

ముసునూరు-వలసపల్లి రహదారిలో ఇలా..

రహదారులపై ప్రయాణికులకు గమ్య స్థానాలు తెలుసుకునేందుకు ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు చాలా చోట్ల ఒరిగి, విరిగిపోయాయి. ముసునూరు నుంచి వలసపల్లి వైపు, గోపవరం నుంచి కాట్రేనిపాడు వైపు, గోపవరం నుంచి వేల్పుచర్ల వైపు వెళ్లే ప్రధాన రహదారుల మలుపుల వద్ద సూచిక బోర్డులు పడిపోయి నెలలు గడుస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి సూచికలను సరిచేయాలని చోదకులు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు మాట్లాడుతూ.. ఒరిగిన సూచికల బోర్డులను సరిచేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, ముసునూరు**

తనిఖీ పట్టదు.. తరలింపు ఆగదు

కృష్ణారావుపాలెంలో సిబ్బంది లేని తనిఖీ కేంద్రం

తెలంగాణలో ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి ఇసుక డిమాండ్ ఉంది. రాష్ట్రంలో ఉచితంగా సరఫరా చేస్తున్నారు. అక్కడా.. ఇక్కడా దళారులు కలిసిపోయి సమన్వయంతో ఇసుకను ఎంచక్కా తరలిస్తున్నారు. గతంలో 'ఈనాడు'లో కథనాలతో సరిహద్దులో తనిఖీ కేంద్రాన్ని కృష్ణారావుపాలెంలో రెవెన్యూ, పోలీసులతో ఏర్పాటు చేశారు. కొంత కాలం సజావుగా సాగినా.. తర్వాత మందగించాయి. రాత్రి గస్తీల్లో పోలీసులు.. వస్తూపోతూ రెవెన్యూ సిబ్బంది మమ అనిపిస్తున్నారు. దీంతో ఇసుకాసురులు ఎంచక్కా లారీలను సరిహద్దు దాటిస్తున్నారు. ఈ విషయమై ఉప తహసీల్దారు ఈశ్వరరావు మాట్లాడుతూ.. ఇకపై కచ్చితంగా తనిఖీ చేస్తామన్నారు. సిబ్బంది కొరత, బందోబస్తులతో కొంత మేరకు తనిఖీలు జరగడం లేదని ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఇకపై నిఘా పెడతామని ఇరువురూ తెలిపారు. **- న్యూస్‌టుడే, చాట్రాయి**

వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి

యువత క్రీడల్లోనూ పట్టు సాధించాలి

కైకలూరు, న్యూస్‌టుడే: యువత చదువుతో పాటు అన్ని రకాల క్రీడల్లో పట్టు సాధించి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కామినేని రాజేశ్వరమ్మ మెమోరియల్ వాలీబాల్ పోటీలను సోమవారం కూటమి నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. పోటీల్లో మొదటి నాగులు స్థానాల్లో నిలిచిన వారికి రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల నగదు బహుమతిని అందించనున్నట్లు నిర్వాహకుడు మంగినేని రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ అడవి కృష్ణ, నాయకులు పి.లక్ష్మీరాణి, బి.విజయలక్ష్మి, వెంకట రాంప్రసాద్, వీరాబత్తిన సుధ, కొల్లి బాబీ, బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపిక

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో జరిగే బాస్కెట్‌బాల్ అండర్-14 విభాగంలో నూజివీడు లేయా జోన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థి డానియల్ నేష్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.గ్రేస్ భూషణమణి తెలిపారు. డిసెంబరు 23 నుంచి 28వ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జోనాథన్, వ్యాయామోపాధ్యాయుడు పుల్లారావు తదితరులు విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను సోమవారం నూజివీడులోని ఎస్ఆర్ఆర్ పాఠశాలలో నిర్వహించారు. ఎంఈవో దేవ వరప్రసాద్ ప్రారంభించారు. పలువురు ఉపాధ్యాయినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు డీవైఈవో పీఎస్.సుధాకర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు పలువురిని ఎంపిక చేశారు.

తుపాను తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలి: ఏవో

ముసునూరు, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో కోతకు వచ్చిన పంటలు నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో చాముండేశ్వరి సూచించారు. సోమవారం ముసునూరు, వలసపల్లి, చింతలవల్లి, చెక్కపల్లి గ్రామాల్లో వరి పంటలు, రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ.. తుపాను హెచ్చరికతో మూడు రోజుల పాటు వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు పురపాలక సంఘంలో మంగళవారం కృష్ణా నీటి సరఫరా జరగదని మున్సిపల్ కమిషనర్ పి.పీరయ్య తెలిపారు. తాగునీటి పైప్‌లైన్ చిన్ననందిగామ వద్ద లీకయిందని, దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

గడ్డి వామి దగ్ధం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కొర్రగుంటపాలెంలో సోమవారం తెల్లవారుజామున వరిగడ్డి వామికి నిప్పంటుకుని దగ్ధమైంది. గ్రామానికి చెందిన పరసా నాగేశ్వరరావుకు చెందిన వరి గడ్డి వామికి నిప్పంటుకుంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కైకలూరు అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. దీంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పేదల భూములకు పట్టాలు ఇవ్వాలని వినతి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పేదల సాగులోని భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆగిరిపల్లి తహసీల్దారు కార్యాలయం దగ్గర సోమవారం ధర్నా నిర్వహించి తహసీల్దారు పీఎస్వీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఈదులగూడెంలో 65 కుటుంబాలకు చెందిన పేద దళితులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, షేక్ జహంగీర్ బాషా, ముత్యాల నరేశ్, స్టాలిన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అపోహలు వీడాలి

కైకలూరు: అధ్యాపకులు, విద్యార్థుల అవగాహన ర్యాలీ

కలిదిండి, నూజివీడు రూరల్, కైకలూరు, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై అపోహలు వీడాలని, బాధితులకు అండగా నిలవాలని వైద్యాధికారి జాహ్నవి సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం పురస్కరించుకుని కలిదిండి పీహెచ్‌సీ పరిధిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ● నూజివీడు పట్టణంలోని కోనేరుపేట ఆరోగ్య కేంద్రంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. వైద్యురాలు సాయిసుధ తదితరులు పాల్గొన్నారు. ● ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వై.శ్రీలత అన్నారు. కైకలూరులోని కళాశాలలో వైద్య ఆరోగ్యం, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

నూజివీడు: మాట్లాడుతున్న న్యాయమూర్తి పెదకాసిం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఎయిడ్స్ వచ్చిన వారిని దూరంగా పెట్టాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి పెదకాసిం అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ సోకిన వ్యక్తులు విధిగా ఆస్పత్రిలో చూపించుకోవాలన్నారు. న్యాయవాది ఎస్‌కేడీ.ప్రసాద్, ఆస్పత్రి సూపరిటెండెంట్ పద్మజారాణి, ఆర్ఎంవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కప్పు అందిస్తున్న నరేశ్‌కుమార్

బోధనలోనే కాదు.. ఆటల్లోనూ మేటి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రోజూ బోధన, పాఠశాలల నిర్వహణలో బిజీగా ఉండే ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించడం ఆటవిడుపు అని ఎంఈవో-2 నరేశ్‌కుమార్ అన్నారు. గురజ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలు ముగింపు సందర్భంగా సోమవారం బహుమతుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. క్రికెట్, త్రోబాల్ పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన జట్లకు కప్పు, జ్ఞాపికలు అందజేశారు.

కాళ్లు పడే బాధ.. చూసే కళ్లకే తెలుసు!
అధ్వానంగా వరహాపట్నం-ఉప్పుటేరు రోడ్డు

కైకలూరు, న్యూస్‌టుడే: వరహాపట్నం- ఉప్పుటేరు ప్రధాన రోడ్డు మార్గం కంకర రాళ్లు తేలి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు ఇటుగా ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డును కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరమ్మతులు చేయించింది. ప్రయాణాలకు సౌకర్యంగా మారిన తరుణంలో మొంథా తుపాను ప్రభావం, కొందరి రైతులు ఆక్వా చెరువుల వద్ద బోదెలను పూడ్చి వేసి నీటిని రోడ్డుపైకి తోడటంతో 20 రోజుల పాటు ముంపులోనే ఉంది. దీంతో రోడ్డంతా యథాస్థితికి చేరి పెద్దపెద్ద రాళ్లు తేలి గుంతలు పడ్డాయి.

భయాందోళనలో ప్రయాణం.. వరహాపట్నం ప్రారంభం నుంచి సీతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు 3 కిలోమీటర్లు ప్రమాదాలకు నిలయమైంది. ఇక రోడ్డు అంచుభాగం ధ్వంసం కావడంతో ఎదురుగా వాహనాలు వచ్చే క్రమంలో గమనించని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణమంటేనే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 12 గ్రామాలకు ఆదరవుగా ఉండే సీతనపల్లి 24 గంటల ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం వందలాది మంది రోగులు, గర్భిణులు, బాలింతలు ఇటుగానే వెళ్తారు. ఈ మార్గంలో వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అధికారులు స్పందించి కనీసం మరమ్మతులు అయినా నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈఈ అనిల్‌కుమార్ మాట్లాడుతూ. . త్వరలోనే రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి అధ్యాపకుల బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఏపీ కళాశాలల అధ్యాపకుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకులు డా.కె.చిన్నికృష్ణ, పల్లగాని వేణుగోపాల్ ప్రతిభ చాటి నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.సి.నాగ భాస్కర్ తెలిపారు. నవంబరు 29, 30 తేదీల్లో విజయవాడలో ఏపీ కళాశాల అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన అధ్యాపకులను కళాశాల ఛైర్మన్ డా.రావి వెంకటరావు, డైరెక్టర్ జి.సాంబశివరావు, సీఈవో ఎం.తేజ్‌సాయి తదితరులు సోమవారం అభినందించారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	రాజు వెడ్స్ రాంబాయి
సత్యనారాయణ మినీ	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	ఆంధ్రా కింగ్ తాలుకా
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	....
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	తెలుసు కదా
కైకలూరు: శ్రీవిజయలక్ష్మి జీ3	రాజు వెడ్స్ రాంబాయి
మాగంటి సినిమాస్	బిజినెస్‌మెన్
శ్రీవెంకటరమణ సినిమాస్	ఆంధ్రా కింగ్ తాలూకా
ముదినేపల్లి: పూర్ణిమ	ఆంధ్రా కింగ్ తాలూకా

వేలం ప్రకటన

మహారాజశ్రీ కైకలూరు సివిల్ జడ్జ్ వారి కోర్టులో (జూనియర్ డివిజన్)

ఇ.పి.నెం.11/2025 ఇన్ ఒ.యస్.నెం. 195/2023

బిట్వీన్:

జంపన చంద్రశేఖర్ ... డి.హెచ్.ఆర్./వాది
మరియు
పరసా రామ్ ప్రసాద్ ... జె.డి.ఆర్./ప్రతివాది

పై నెంబరు ఇ.పి.లో ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ కైకలూరు సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) కోర్టులో ది. 19-12-2025వ తేదీన ఉదయం 10.30 ని॥ల లగాయితూ శ్రీ కోర్టు వేళలలో వేలం వేయుదురు. ఆసక్తి గలవారు పాడుకొనవచ్చును. షెడ్యూలు ఆస్తిపై తనఖా కలదు. సదరు తనఖా బాకీకి లోబడి పాడుకొనవలసియున్నది. వేలం షరతులు శ్రీ కోర్టు వారి నుండి తెలుసుకొనవలెను.

షెడ్యూలు: పూర్వం కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, మండవల్లి సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, మండవల్లి మండలం, పెరికెగూడెం గ్రామ పంచాయతీ ఏరియాలోని పెరికెగూడెం గ్రామంలోని రి.స.నెం. 715 రులో య. 2.00 ట్లు భూమికి హద్దులు.

తూర్పు: పరసా వెంకట జనార్ధనరావు గారి భూమి, **దక్షిణం:** పరసా సూరినారాయణ గారి భూమి, **పడమర:** కుంచె మద్దిరామయ్య గారి భూమి, **ఉత్తరం:** పరసా వెంకట జనార్ధనరావు గారి భూమి

డి.హెచ్.ఆర్.విలువ : రూ. 12,00,000/-లు
అమీనా విలువ : రూ. 60,00,000/-లు

కైకలూరు
తేది: 30-11-2025

సం/- పి.పవన్‌కాంత్, అడ్వకేట్
(డి.హెచ్.ఆర్.తరపు న్యాయవాది)
కైకలూరు, సెల్: 94903 39161

(c) eenadu

యంత్రం.. విజ్ఞాన మంత్రం

ఆకట్టుకుంటున్న వాటర్ ట్యూబ్ బాయిలర్

కోల్ అండ్ కోక్ బాయిలర్..

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటంతో పాటు సందర్శకులకు ఆశ్చర్యం కలిగించే విధంగా కాకినాడ జేఎన్‌టీయూ ఆవరణలో పరిపాలన కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఓపెన్ మ్యూజియంలో వివిధ యంత్రాలు ఉన్నాయి. 2020లో దీనిని ఏర్పాటు చేశారు. వీటిలో 1946 నాటి ఇంగ్లాండ్‌కు చెందిన హారిజంటల్ వాటర్ ట్యూబ్ బాయిలర్, వర్టికల్ కోల్ అండ్ కోక్ బాయిలర్ లాంటి ఎన్నో యంత్ర పరికరాలు అబ్బురపరుస్తున్నాయి. ఇవి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులకు ఉపయోగపడటంతో పాటు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. - ఈనాడు, కాకినాడ

గీతా పఠనం..

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: గీతా జయంతి సందర్భంగా వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కాకినాడకు చెందిన కృష్ణ పరివార్ సంస్థ సభ్యులు, రావులపాలెం మహిళలు గీతా పారాయణం చేశారు.

200 మీటర్ల రోడ్డు.. ఎవరికీ పట్టని గోడు

ఈ కారు గుంత దాటేదెలా?.. సోమవారం బోల్తా పడిన ట్రాక్టరు(వృత్తంలో)

కాకినాడ నగరంలో కొండాయపాలెం కూడలి నుంచి ఎల్‌బీ నగర్ వరకు గత ప్రభుత్వంలో రూ.16 కోట్లతో రెండు వరుసల రహదారిని నిర్మించారు. ఇక్కడ ఈ స్థాయిలో రోడ్డు అవసరం లేకున్నా.. రాజకీయ నాయకులకు స్థలాలు ఉండటంతో పనిలాపనిగా వేశారు. పూర్తిస్థాయిలో నిర్మించకపోవడం మధ్యలో సుమారు 200 మీటర్ల మేర అభివృద్ధి చేయకుండా వదిలేశారు. ఇది గత నాలుగేళ్లుగా నగర ప్రజలకు శాపంగా మారింది. ఇక్కడ పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే వీటిలో నీరు చేరి ప్రయాణానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. సోమవారం ధాన్యం బస్తాలతో వెళ్తున్న ట్రాక్టరు బోల్తా పడడంతో రైతుకు నష్టం వాటిల్లింది. మరో ట్రాక్టర్ మొరాయించి ఇంజిన్ భాగం పైకి లేచింది. ఇప్పటికైనా అధికారులు ఈ రహదారిని బాగుచేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. - ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, బాలాజీచెరువు

కార్తికేయ.. ఆస్తుల మాయ

ఈనాడు, కాకినాడ: కాకినాడ కేంద్రంగా అధిక వడ్డీలు ఆశ చూపి బోర్డు తిప్పేసిన కార్తికేయ బిల్డింగ్ సొసైటీ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఈ సంస్థ ఆస్తులను సీజ్ చేసి బాధితులకు న్యాయం చేసేందుకు సిద్ధమవుతున్న వేళ అందులో ఓ స్థలం తమదంటూ వేరొకరు తెరపైకి వచ్చారు. అదే సమయంలో కోర్టు కూడా వేలం ప్రక్రియను తాత్కాలికంగా నిలిపి కుంభకోణంపై నాలుగు నెలల్లో మళ్లీ విచారణ (రీ ట్రయల్) జరిపించాలని ఆదేశించడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

రూ.19.40 కోట్లు సేకరించి..

కార్తికేయ బిల్డింగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె వీరవెంకట సత్యనారాయణ తన కుటుంబ సభ్యులనే డైరెక్టర్లుగా నియమించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 300 మందికి పైగా డిపాజిటర్ల నుంచి రూ.19.40 కోట్లు సేకరించారు. గడువు మీరినా వాటిని ఇవ్వలేదు. వడ్డీ సుమారు రూ.2.05 కోట్లు చెల్లించలేదు. డిపాజిట్ల మొత్తంలో రూ.10 కోట్లు సొసైటీ ఖాతాలో నమోదు చేయకుండానే నొక్కేశారు. రుణాలు ఇచ్చినట్లు చూపించి రూ.5.36 కోట్లు స్వాహా చేశారు. 2023లో సహకారశాఖ చేపట్టిన విచారణలో ఈ అక్రమాలన్నీ వెలుగుచూశాయి. 14 మందిపై కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేశారు. మోసపోయిన వారికి న్యాయం చేయాలని సొసైటీ యజమానికి చెందిన మూడు ఆస్తులను సీజ్ చేశారు. వాటిని అమ్మి ఆ సొమ్మును డిపాజిటర్లకు సర్దుబాటు చేయాలనుకోగా అవరోధాలు ఎదురవుతున్నాయి.

కొత్త వివాదం..

కార్తికేయ సొసైటీ భవనంతో పాటు యజమాని ఇల్లు, వాకలపూడిలో 164-3, 173-6 సర్వే నంబర్లలో 1400 చ.గ విస్తీర్ణం ఉన్న స్థలాన్ని రెండేళ్ల క్రితమే ప్రభుత్వం సీజ్ చేసింది. భవనానికి నెల క్రితం సహకారశాఖ వేలం వేయగా ఒకరు దక్కించుకున్నా చెల్లించాల్సిన కొంత సొమ్ము కట్టలేక తప్పుకున్నారు. వాకలపూడిలో వేలానికి సిద్ధమవగా 164-3 స్థలంపై తమకు హక్కులు ఉన్నాయని ఓ వ్యక్తి కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కాకినాడ రూరల్ తహసీల్దార్‌ను పరిశీలించాలని ఆదేశించగా ఒకే స్థలంపై రెండు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించారు. క్షేత్రస్థాయిలో ఈ స్థలాలు రెండూ వేర్వేరు చోట్ల ఉన్నాయి. ఒకటి గ్రామ కంఠంగా అనుమానిస్తున్నారు. ఈ వివాదం తేలిన తర్వాతే బాధితులకు న్యాయం జరిగే అవకాశముంది.

వీరిని చూసైనా.. కనికరం చూపరూ!

ఏలేశ్వరం మండలం ఎర్రవరానికి చెందిన గడ్డం లక్ష్మి, శివ దంపతుల కుమార్తె గడ్డం జాహ్నవి(8), కుమారుడు అభినవ్ కార్తీక్(5)లు బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నారు. పుట్టినప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యారు. తండ్రి వ్యవసాయ పనులు చేయనిదే ఇల్లు గడవని పరిస్థితి. బిడ్డల ఆరోగ్య పరిస్థితిని చక్కదిద్దేందుకు తలకు మించిన ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆర్థికంగా పూర్తిగా చితికిపోయారు. పిల్లలకు దివ్యాంగ పింఛనుకు దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. వారిని తీసుకుని తల్లి లక్ష్మి సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో తమ గోడును ఉన్నతాధికారులకు విన్నవించారు. - ఈనాడు, కాకినాడ

కడలి ఆగ్రహం.. కరిగె గృహం!

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంత గ్రామాలపై సముద్రం కోత ప్రభావం ఏ విధంగా ఉందో ఇక్కడ కనిపిస్తున్న చిత్రమే నిదర్శనం. ఈ ఏడాది మే నెలలో చుట్టూ ప్రహరీతో చెక్కు చెదరకుండా కనిపించిన పెంకుటిల్లు ప్రస్తుతం అలల తీవ్రతకు కోతకుగురై పైకప్పు మాత్రమే మిగిలింది. ఇదే ఇంటిలో ఇదివరకు నాలుగు మత్స్యకార కుటుంబాలు నివసించేవి. 20 సెంట్ల విస్తీర్ణంలో కొబ్బరి చెట్లతో ఇల్లు ఉండేదని యజమానులు తెలిపారు. ప్రస్తుతం వీరు ఇతర ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో ఉంటున్నామని వాపోతున్నారు. - న్యూస్‌టుడే, కొత్తపల్లి

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

పీజీఆర్ఎస్‌కు 388 వినతులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన 388 మంది వివిధ సమస్యలపై అర్జీలు దాఖలు చేశారు. డీఆర్వో వెంకటరావు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, కేఆర్సీ ఎస్డీసీ రత్నమణి, సీపీవో త్రినాథ, డీపీవో రవికుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటికి సంబంధించిన జిల్లాస్థాయి అధికారులతో చర్చించారు. గడువులోగా పరిష్కరించాలని డీఆర్వో ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే తాఖీదులు జారీ చేస్తామని హెచ్చరించారు.

వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో వెంకటరావు, అధికారులు

తొలిరోజు 92.23 శాతం పింఛన్ల పంపిణీ

కాకినాడ కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా తొలిరోజు 92.23 శాతం మేర ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెలకు 2,71,096 మందికి రూ.117,58,95,500 పింఛను సొమ్ములు విడుదల కాగా, సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు 2,50,035 మందికి రూ.107,88,27,500 పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి మంగళవారం అందజేస్తామని చెప్పారు.

కల్తీ కనిపెట్టరు.. కాలుష్యం అరికట్టరు

ఆహార కల్తీలపై యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. వీటిని నిర్ధారించే సదుపాయాలు లేకుండా పోయాయి. దీంతో కాలుష్య, కల్తీకారకులపై చర్యలు తీసుకోవడానికి అవకాశం లేని పరిస్థితి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆహార భద్రత ప్రమాణాలశాఖ, కాలుష్య నియంత్రణ మండలి పని తీరు అధ్వానంగా ఉంది. స్థానికంగా ప్రయోగశాలలు లేకపోవడంతో హైదరాబాద్ వంటి నగరాలకు నమూనాలు పంపించి ఫలితాలకు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఈ లోగా కల్తీ, కాలుష్య కేసులు నీరుగారిపోతున్నాయి. - ఈనాడు, కాకినాడ

నిర్ధారణకు కానరాని సదుపాయాలు

కార్యాలయంలో మగ్గుతున్న ఆహార తనిఖీ సంచార వాహనం

కదలని చక్రాల బండి..

కొన్ని రకాల ఆహార కల్తీలను అక్కడికక్కడే గుర్తించేలా 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' పేరిట ఓ వాహనం ఏడాది కిందట ఇచ్చారు. డ్రైవర్‌తో సహా మరో అయిదు పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఏడాదిగా కార్యాలయంలోనే ఉండిపోయింది. ఈ సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ చెబుతున్నారు.

పక్క రాష్ట్రానికి పంపాల్సిందే..

మూడు జిల్లాల్లో ఉన్నంతలో ఆహార తనిఖీలు చేపట్టి నమూనాలు సేకరిస్తున్నా అవి కల్తీయా కాదానని నిర్ధారించేందుకు అవసరమైన ప్రయోగశాలలు ఇక్కడ లేవు. వాటిని హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ఒక్కో జిల్లాలో ఏటా 250 నుంచి 300 నమూనాలు సేకరిస్తున్నా వీటిలో కేసు పెట్టింది 5 నుంచి 10 శాతం మించడం లేదు.

కాలుష్యం కొలిచేది అంతంత మాత్రమే

కాకినాడ నగరాన్ని కాలుష్యం కమ్మేస్తోంది. పోర్టుకు బొగ్గు రైళ్లు నగరం నడిబొడ్డు నుంచే వెళుతుంటాయి. మరోవైపు పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం. ఇక పంట కాలువలు, సాగర జలాల కాలుష్యం కొలవలేనంతగా ఉంటున్నాయి. నీటి నమూనాలను విశాఖపట్నం తీసుకెళ్లి పరీక్షించాల్సి వస్తుంది. దీంతో తూతూ మంత్రంగా చేసి వదిలేస్తున్నారు. వివేకానంద పార్క్ సమీపంలో ఆటోమేటిక్‌గా ప్రతి 15 నిమిషాలకు కాలుష్యాన్ని గుర్తించే పరికరాలు ఏర్పాటు చేసినా అందుబాటులోకి తీసుకురాలేదు. త్వరలోనే ఆటోమేటిక్ వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరావు చెబుతున్నారు.

కార్డు ఉంది.. లబ్ధిదారులేరి?

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పంపిణీకి నోచుకోని స్మార్ట్ రేషన్‌కార్డుల సరెండర్‌కు రంగం సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. సరకుల పంపిణీలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా వీటిని జారీ చేశారు. సెప్టెంబరు నెలలో జిల్లాకు 6,36,245 స్మార్ట్ రేషన్ కార్డులను పంపగా, వీటిని 21 మండలాల పరిధిలోని 1,060 చౌక దుకాణాలు, 620 గ్రామ, వార్డు సచివాలయాలకు చేరవేశారు. గత మూడు నెలల వ్యవధిలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటికీ 56,480 స్మార్ట్‌కార్డులు ఎవరూ తీసుకోలేదు. వీటికి సంబంధించిన లబ్ధిదారులు ఎక్కడున్నారో తెలియక డీలర్లు, సిబ్బంది సతమతమవుతున్నారు. వీటి పంపిణీకి ప్రభుత్వం నవంబరు 30 వరకు గడువు ఇస్తూ పౌరసరఫరాల శాఖకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. వాటి వివరాలను పొందుపర్చాలని, ఎందుకు పంపిణీ జరగలేదో కారణాలు పేర్కొంటూ వివరణ ఇవ్వాలని ఆదేశించారు. గడువు ముగిసిన నేపథ్యంలో స్మార్ట్‌కార్డుల సరెండర్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మాట్లాడుతూ డీలర్లు, సచివాలయాల్లో స్మార్ట్‌కార్డులు ఉన్నాయని, ఇంకా తీసుకోనివారు.. వెంటనే పొందాలని సూచించారు. వైకాపా పాలనలో మరణించిన వారిని తొలగించకుండా, మ్యాపింగ్ గురించి పట్టించుకోకుండా సచివాలయ సిబ్బంది జాబితాను పంపించి హడావుడిగా కొత్తకార్డులు ఇచ్చేశారు. కూటమి సర్కార్ అదే జాబితాను అనుసరించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

◗ కాకినాడ అర్బన్ మండలంలో 78,212 స్మార్ట్‌కార్డులను జారీ చేయగా, 11 వేలు పంపిణీ జరగలేదు. వీరిలో కొంత మంది అద్దె ఇళ్లు మారగా, మరికొందరు శాశ్వతంగా వలస వెళ్లారు. ◗ కాకినాడ గ్రామీణ మండలంలో 6వేలు, పెద్దాపురం-4వేలు, సామర్లకోట-3,500, తుని-3,300, పిఠాపురం-4వేలు, గొల్లప్రోలు-2వేలు, ఏలేశ్వరం మండలంలో 2,100 చొప్పున కార్డులు పంపిణీకి నోచుకోలేదు.

ఇక్కడంతే.. తీరు మారదంతే..

ఐవీఆర్ఎస్‌లో ఆరో స్థానంలో అన్నవరం

విభాగం	సంతృప్తి	అసంతృప్తి
దర్శనం	69.7	30.3
మౌలిక వసతులు	61.6	38.4
ప్రసాదం	77.6	22.4
పారిశుద్ధ్యం	64.2	35.8

విభాగాల వారీగా అభిప్రాయాలు (శాతాల్లో)

అన్నవరం, న్యూస్‌టుడే: దేవాలయాల్లో భక్తులకు సంతృప్తిగా సేవలందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ టెలీ కాలింగ్ (ఇంటరాక్ట్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా అభిప్రాయ సేకరణలో అన్నవరం ఆరో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఏడు ప్రధాన దేవాలయాల్లో దర్శనం, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, ప్రసాదం తదితర వాటిపై నవంబరు నెల గణాంకాలు విడుదలయ్యాయి. పలు సేవలపై 67.8 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా 32.2 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి, ద్వారకాతిరుమల, శ్రీశైలం, కాణిపాకం, సింహాచలం ఆలయాలు మొదటి ఐదు స్థానాల్లో ఉండగా ఆరో స్థానంలో అన్నవరం ఉంది. ఆ తర్వాత విజయవాడ నిలిచింది. ప్రతీనెల భక్తుల నుంచి అసంతృప్తి శాతం ఎక్కువగా ఉంటున్నా అధికారులు దృష్టిసారించడంలేదు.

ఆలయంలో భక్తుల రద్దీ

100 రోజులు.. రూ.25 కోట్లు

'స్త్రీ శక్తి'తో మహిళలకు లబ్ధి

న్యూస్‌టుడే:, సాంబమూర్తినగర్(కాకినాడ)

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తూ స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేసింది. దీనిని గత ఆగస్టు 15 నుంచి ప్రారంభించింది. ఈ పథకం అమలు తరువాత మహిళా ప్రయాణికుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంత ప్రజలు అధికంగా సద్వినియోగం చేసుకుంటున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళలకు ఆర్థిక ఉపశమనం లభిస్తోంది. ఈ పథకం ప్రారంభమై నవంబరు 22కు 100 రోజులు అయింది. ఆగస్టు 15 నుంచి ఇప్పటివరకు జిల్లాలోని కాకినాడ, తుని, ఏలేశ్వరం మూడు డిపోల పరిధిలో 71.65 లక్షల మంది మహిళలు ప్రయాణించి రూ.25.29 కోట్ల మేర లబ్ధి పొందారు. సెప్టెంబరు చివరిలో దసరా సెలవులు రావడంతో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగి వారికి ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరింది. జిల్లాలో మొత్తం 321 బస్సులు ఉండగా.. అందులో 190 వరకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు సర్వీసులున్నాయి. రద్దీ సమయాల్లో బస్సుల సంఖ్య పెంచుతున్నామని అధికారులు తెలిపారు.

డిపో	మొత్తం ప్రయాణికులు	మహిళలు	శాతం
కాకినాడ	49,53,112	28,24,358	57
తుని	35,01,809	23,66,443	68
ఏలేశ్వరం	28,23,691	19,74,798	70

సేవలకు పురస్కారం

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న వైద్యురాలు

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లోని ఫ్యామిలీ ప్లానింగ్ విభాగంలో మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్‌శివకోటి అర్చన ప్రియదర్శిని విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. ఈమె జీజీహెచ్‌లో మెడికల్ ఆఫీసర్‌గా 2017 నుంచి పనిచేస్తున్నారు. ఇప్పటివరకూ 3919 కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు, 75 మంది హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులకు ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఈ అవార్డును ప్రకటించింది. సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఆమెను ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి, సహచర వైద్యులు, సిబ్బంది అభినందించారు.

బరువులెత్తారు.. పతకాలు పట్టారు

వెయిట్‌లిఫ్టింగ్‌లో యువత సత్తా

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు కాకినాడకు చెందిన పలువురు యువతీయువకులు. వెయిట్‌లిఫ్టింగ్‌లో బరువులు ఎత్తుతూ ప్రతిభ కనబరుస్తూ ఔరా అనిపిస్తున్నారు. కోచ్‌లు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతూ తమ కలలను సాకారం చేసుకుంటున్నారు. ఇటీవల నిర్వహించిన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అంతర కళాశాలల పోటీల్లో పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి, సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారు. అక్కడ కూడా సత్తా చాటి మరిన్ని పతకాలు సాధిస్తామని పేర్కొంటున్నారు.

అమ్మ ప్రోత్సాహంతో..

డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నా. నాన్న సూర్యనారాయణ బీఎస్ఎఫ్‌లో పనిచేస్తారు. అమ్మ ప్రశాంతి గృహిణి. ఆమె ప్రోత్సాహంతో గత రెండేళ్ల నుంచి డీఎస్ఏలో కోచ్ సతీష్‌కుమార్ వద్ద శిక్షణ పొందుతున్నా. ఇప్పటివరకూ 6 రాష్ట్రస్థాయి పతకాలు సాధించా. సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యా. ప్రతిరోజూ రెండు పూటలా 4 గంటల పాటు సాధన చేస్తా. మరిన్ని పతకాలు సాధిస్తా. ఆర్మీలో చేరి దేశసేవ చేస్తా. - సాత్విక, కాకినాడ

రోజూ ఆరు గంటల సాధన

డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నా. నాన్న భీమారావు వ్యవసాయం, అమ్మ పార్వతి గృహిణి. గత రెండేళ్ల నుంచి శిక్షణ పొందుతున్నా. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించా. ఇటీవల బంగారు పతకం గెలవడం ఆనందంగా ఉంది. రెండు పూటలా కలిపి 6 గంటల పాటు సాధన చేస్తా. రైల్వేలో ఉద్యోగంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించాలనేది నా ఆశయం. - శ్యామ్‌సుందర్

జాతీయస్థాయిలో రాణించాలని..

డిగ్రీ ద్వితీయ ఏడాది చదువుతున్నా. నాన్న అప్పన్న పోలీసు కానిస్టేబుల్, అమ్మ తులసీరత్నం గృహిణి. గత మూడేళ్ల నుంచి వెయిట్‌లిఫ్టింగ్‌లో శిక్షణ పొందుతున్నా. ఇప్పటివరకూ 4 రాష్ట్రస్థాయి పతకాలు, యూనివర్సిటీ స్థాయిలో రెండు పతకాలు సాధించా. ఇటీవల జరిగిన పోటీల్లో 79 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించా. దాంతో త్వరలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యా. పవర్‌లిఫ్టింగ్‌లోనూ రాణిస్తున్నా. ప్రతిరోజూ 3 గంటల పాటు సాధన చేస్తా. గుడ్లు, పాలు, మాంసం, డ్రైఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకుంటా. జాతీయస్థాయిలో పతకం సాధించాలనేది నా లక్ష్యం. - యశ్వంత్

కాకినాడ-శ్రీశైలం నూతన బస్సు సర్వీసు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ - శ్రీశైలం మధ్య వయా రాజమహేంద్రవరం, విజయవాడ మీదుగా నూతన బస్సు (సర్వీసు నంబరు 2861)ను నడుపుతున్నట్లు డిపో అసిస్టెంట్ ఎంయూవీ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు కాకినాడ డిపో నుంచి ప్రతిరోజు రాత్రి 7.45కు బయలుదేరి సామర్లకోట, పెద్దాపురం, రంగంపేట, రాజానగరం, రాజమహేంద్రవరం మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందన్నారు. అదేవిధంగా శ్రీశైలం నుంచి రాత్రి 7.15కు ప్రారంభమై తర్వాత రోజు ఉదయం 8.15కు కాకినాడ వస్తుంది. ముందస్తు రిజర్వేషన్ అందుబాటులో ఉందని, వివరాలకు 99592 25564, 99592 25543 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

స్లాబ్ దశలోని ఇళ్లకూ బిల్లులు

ఈనాడు కథనానికి స్పందన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-2.0 సర్వే గడువును ఈ నెల 14 వరకు పొడిగిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఈనాడులో 'ఇళ్లు కట్టమన్నారు.. బిల్లు రాదంటున్నారు' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. స్లాబ్‌దశలో ఉన్న ఇళ్లను ఆవాస్+ సర్వేలో నమోదు చేసి, ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో 23,494 మంది సొంత స్థలాలున్న పేదలు ఇళ్లు నిర్మించుకోడానికి డిమాండ్ సర్వేలో గుర్తించారు. ఆదివారంతో దీని గడువు ముగియడంతో 7వేల మందికి పైగా సర్వేలో నమోదు కాకుండా వివిధ కారణాలతో మిగిలిపోయారు. ఇప్పుడు వీరికి సర్వేలో నమోదుకు అవకాశం కల్పించారు.

తాళ్లరేవులో 29.4 మి.మీ. వర్షపాతం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 21 మండలాల పరిధిలో వర్షం కురిసింది. తాళ్లరేవు మండలంలో అత్యధికంగా 29.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాకినాడ అర్బన్- 28.4, పెదపూడి, కరప- 23.2, యు.కొత్తపల్లి, కాకినాడ గ్రామీణం-12, సామర్లకోట- 11.4 మి.మీ. వర్షం పడింది. తుపాను ప్రభావం మరో రెండు రోజులు ఉంటుందని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు. పొలాల్లోకి చేరిన నీటిని బయటకు పంపి, 5 శాతం ఉప్పు ద్రావకాన్ని చల్లాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

DEEPAK NEXGEN FEEDS PRIVATE LIMITED
Bommuluru, Near Hanumanjunction, Krishna District, A.P. 521105
WANTED
Deepak Nexgen is a leading and fast growing fish and shrimp feed manufacturing industry looking for the following positions
Safety Officer: B.Tech / Diploma with industrial safety certificate (mandatory) with 05-10 years relevant experience.
Safety Supervisor: Diploma or any degree with industrial safety certificate (mandatory) with 02-05 years relevant experience.
Interested Candidates may send their C.V to:
ifeedhr@gmail.com

(c) eenadu

రింక్‌లో స్కేటింగ్ చేస్తున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు ప్రారంభం

మసీదు సెంటర్ (కాకినాడ): విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరేందుకు క్రీడలు దోహదపడతాయని కాకినాడ గ్రామీణం ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. కాకినాడ రాజాట్యాంక్‌లోని స్కేటింగ్ రింక్‌లో ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి సుమారు 450 మంది బాలబాలికలు, 50 మంది టెక్నికల్ అఫీషియల్స్ హాజరయ్యారు. క్వాడ్, రింక్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు పి.సుధారాణి, కె.శ్రీనివాసరావు, టోర్నమెంట్ సంయుక్త ఆర్గనైజింగ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. డీఈవో పి.రమేష్, శ్యామ్, రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జాన్సన్, డీవైఈవో సత్యనారాయణ, పీడీలు రవిరాజు, పరుశరామ్, సూరిబాబు, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, KAKINADA DIVISION

Tenders invited from the contractors for NIT No.5 to 7/2025-26, Dt:01.12.2025 for 3 works in Kakinada District Estimate cost varies from Rs.31.70 Lakhs to Rs.38.00 Lakhs.
Last date for receipt of tender Dt:09.12.2025 upto 4.00 PM
Note: For further details can be viewed at https://tender.eprocurement.gov.in or contact 0884-2378457
Executive Engineer APEWIDC, Kakinada

APSRTC పల్లె వెలుగు
టెండరు ప్రకటన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా (కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలు) పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాల్స్/ షాపులు, క్యాంటీన్ మొదలగు వ్యాపారములు చేసుకొనుటకు, అనుభవం, ఆసక్తి కలిగిన సంస్థలు/ వ్యాపారస్థుల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో **తేది.02-12-2025 నుండి తేది.15-12-2025 వరకు** అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు మరియు **తేది.16-12-2025న** మ॥1.00 గం॥ వరకు రాజమహేంద్రవరం డిపో నందు మాత్రమే ఇవ్వబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు **తేది.16-12-2025న** మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, రాజమహేంద్రవరం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు **మ.3.00 గం॥లకు** టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ **https://apsrtc.ap.gov.in**లో **tenders** ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు **APSRTC** కి పూర్తి అధికారము కలదు.

నెం. S1/437(5)/2025-DPTO/EG, తేది: 28-11-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ APSFC
రాజమహేంద్రవరం బ్రాంచ్
డి.నెం.19-5-9, 2వ అంతస్తు, స్వతంత్ర పెట్రోల్ బంక్ ప్రక్కన, కంబాలచెరువు దగ్గర, రామచంద్రరావుపేట, రాజమహేంద్రవరం, తూ.గో.జిల్లా. ఫోన్ : 0883-2442766, 9949358513, ఇ-మెయిల్ : rajahmundry@apsfc.com

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
రూల్-8(1) యొక్క చట్టంలోని అనుబంధం-IV క్రింద)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ సదరు సెక్షన్ 13(2) ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు **తేది.01.09.2025 న డిమాండ్ నోటీసు** జారీ చేయటమైనది **ఋణగ్రహీత : మెస్సర్స్ యష్ వెజిటబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వినయ్ అగర్వాల్,** ప్లాటు నెం.5ఎ/7, ఐడిఏ, వాకలపూడి, తమ్మవరం గ్రామం, లైట్ హౌస్ దగ్గర, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా, వారిని నోటీసులో తెలియజేయబడిన బకాయి **రూ.708.43 లక్షలు (అక్షరాల ఏడు కోట్ల ఎనిమిది లక్షల నలభై మూడు వేల రూపాయలు మాత్రమే)** మరియు **తేది.01-08-2025** నుండి జమకూడు తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో కలిపి నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవల్సినదిగా కోరడమైనది.

ఋణగ్రహీత/ష్యూరిటీదారులను సదరు మొత్తమును తిరిగి చెల్లించక విఫలమైనందున సదరు రూల్స్ లోని 8(1) వ రూల్‌తో చదవబడే సదరు చట్టంలో సెక్షన్ 13(4) క్రింద దిగువ సంతకందారు తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.26.11.2025 న స్వాధీనం** చేసుకున్నారని ఋణగ్రహీత/ఆస్తి యజమాని మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయటమైనది.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీత/ష్యూరిటీదారులకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైననూ **రూ.708.43 లక్షలు (అక్షరాల ఏడు కోట్ల ఎనిమిది లక్షల నలభై మూడు వేల రూపాయలు మాత్రమే)** మరియు **డి.01.08.2025** నుండి వడ్డీ, ఇతర ఖర్చులు కలిపి **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ, రాజమహేంద్రవరం బ్రాంచ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

మెస్సర్స్ యష్ వెజిటబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు లీజు భూమిలో నడుపుతున్న **పరిశ్రమ తాలూకు వివరము : 1)** కాకినాడ జిల్లా (మునుపటి తూర్పు గోదావరి జిల్లా), కాకినాడ రూరల్ మండలం, తమ్మవరం గ్రామం, వాకలపూడి, ఏపిఐఐసి ఇండస్ట్రియల్ పార్కు, సర్వే నెం.246(పి), 247(పి), 248(పి) లలోని ప్లాటు నెం.5ఎ/7 గా గల 6050 చ.మీ.లు / 7229.75 చ.గ.లు విస్తీర్ణం గల భూమి అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ, రాజమండ్రి బ్రాంచ్ వారి ఋణసహాయంతో నిర్మించిన భవనములు.

హద్దులు: ఉత్తరం : 30 మీ.లు వెడల్పు రోడ్డు, **దక్షిణం** : ప్లాటు నెం.5ఎ/7 లోని మిగిలిన భాగము, **తూర్పు** : ప్లాట్ నెం.6 మరియు **పడమర** : ప్లాటు నెం.5ఎ/6.

2) ఏపియస్ఎఫ్‌సి వారికి తనఖాచేసిన ప్లాంటు-మిషనరీ, టెస్టింగ్ ఎక్విప్‌మెంట్ మరియు ఇతరములు.

తేది : **26.11.2025** సం/- అధీకృత అధికారి,
స్థలం : రాజమహేంద్రవరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ

దేవస్థానానికి పెంకుటిల్లు విరాళం

దస్తావేజు పత్రాలను ఈవోకు అందిస్తున్న దాత

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానానికి ఓ దాత బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.40 లక్షలు విలువ (ప్రభుత్వ విలువ రూ.3.82 లక్షలు) కలిగిన పెంకుటింటిని విరాళంగా సోమవారం అందించారు. గ్రామానికి చెందిన లింగంపల్లి వెంకటసూర్యసత్యనారాయణ ఆయన తండ్రి సోమన్నదొర పేరు మీద ఈరంకివారి వీధిలో 98.51 చదరపు గజాల విస్తీర్ణంలో (సుమారు రెండు సెంట్లు)లో ఉన్న పెంకుటింటిని దేవస్థానానికి రాసి ఇచ్చారు. దస్తావేజు పత్రాలను ఈవో సుబ్బారావుకు దాత అందించారు.

మల్లిసాలలో వృద్ధునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

మల్లిసాలలో 500 ఎకరాల్లో పరిశ్రమల స్థాపన

- 5వేల మంది స్థానికులకు ఉపాధి
- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గంపేట మండలం మల్లిసాలలో సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని ప్రజలతో మాట్లాడారు. 500 ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామని, పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న 5 వేల మందికి ఉపాధి కల్పించడం లక్ష్యమన్నారు. గోవిందపురం శివారున భూపతిపాలెంలో 400 ఎకరాల్లో ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పశువైద్యాధికారి అందుబాటులో ఉండటం లేదని ఎమ్మెల్యే దృష్టికి రైతులు తీసుకురావడంతో ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి స్వప్నతో మాట్లాడి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. వృద్ధుల పింఛను నుంచి ఎటువంటి పన్నులు వసూలు చేయొద్దని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఆత్మ కమిటీ ఛైర్మన్ పైడిపాల సూరిబాబు, సర్పంచి నూకరత్నం, ఉప సర్పంచి రాజబాబు పాల్గొన్నారు.

ఐఆర్‌సీఎఫ్ పురస్కారానికి ఇద్దరు వైద్యుల ఎంపిక

మసీదు సెంటర్ (కాకినాడ), సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సిరిపరపు రామకృష్ణ, డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావులు ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్(ఐఎస్‌సీసీఎం) అందజేసే ప్రెసిడెన్షియల్ సిటేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. 2025-26 సంవత్సరానికి వారిని ఎంపిక చేసినట్లు సంస్థ అధ్యక్షుడు డా.సామవేదం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రామకృష్ణ క్రిటికల్ కేర్ వైద్యరంగంలో ఉత్తమ సేవలందిస్తున్నారని, డాక్టర్ చక్రరావు స్కూల్ సీఆర్‌పీ కార్యక్రమాన్ని రాష్ట్రం, దేశవ్యాప్తంగా అమలు చేస్తూ వేలాది మంది విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 27న చెన్నైలో జరిగే కార్యక్రమంలో వారికి ఈ అవార్డు అందజేయనున్నారు.

వైకాపాకు వార్డు కౌన్సిలర్ రాజీనామా

పెద్దాపురం, న్యూస్‌టుడే: వ్యక్తిగత కారణాలతో వైకాపాకు రాజీనామా చేసినట్లు పెద్దాపురం పట్టణానికి చెందిన 28వ వార్డు కౌన్సిల్ సభ్యుడు పప్పల దుర్గారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తన రాజీనామాను ఆమోదించాలని పార్టీ అధిష్ఠానానికి లేఖ పంపానన్నారు.

సూక్ష్మసేద్యం.. అన్నదాతకు వరం

బోరుకు అమర్చిన డ్రిప్

పెద్దాపురం, న్యూస్‌టుడే: తుంపర, బిందుసేద్యం ఉపకరణాలపై గతంలో జీఎస్టీ 12 శాతం ఉండగా 6 శాతం ప్రభుత్వం చెల్లించేది. మిగిలిన 6 శాతం రైతు చెల్లించేవాడు. ప్రస్తుతం జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గించడంతో 7 శాతం ఆదా అయ్యింది. ఇందులో 2.5 శాతం ప్రభుత్వం చెల్లిస్తుండగా మిగిలినది మాత్రమే రైతు చెల్లించాలి. ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో పాటు రాయితీలు ఇచ్చి సూక్ష్మనీటి సాగు పథకాన్ని(డ్రిప్, తుంపర్ల) ప్రోత్సహించి అభివృద్ధి చేస్తుంది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయడంతో త్వరలోనే పరికరాలు పంపిణీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనుంది. ఈ వివరాలను ఏపీఎంఐపీ పథకం కాకినాడ జిల్లా అధికారి జీవీవీ ప్రసాదరావు తెలిపారు.

మీ కోసం
- 2025-26లో లక్ష్యం: రూ.17 కోట్లతో 2 వేల హెక్టార్లు
- ఇప్పటివరకు మంజూరు: 179 మంది రైతులకు 230.36 హెక్టార్లలో..

రాయితీ వివరాలు (శాతంలో)

విభాగం	బిందు	తుంపర
2 హెక్టార్ల వరకు(ఎస్సీ, ఎస్టీలు)	100	50
2 హెక్టార్ల వరకు(ఇతరులు)	90	50
2 నుంచి 4 హెక్టార్లు	70	50
4 నుంచి 5 హెక్టార్లు	50	50

రైతేరాజు

అర్హతలు ఇలా..

- భూమి ఉన్న ప్రతిరైతు రాయితీకి అర్హులు.
- కౌలు రైతులు భూ యజమానితో ఏడేళ్ల పాటు కౌలు ఒప్పందం చేసుకోవాలి.
- సొంత బోరు, బావి, కుంట, కాలువ ద్వారా నీటి లభ్యత కలిగి ఉండాలి.
- అర్హులైన రైతులు ఏపీఎంఐపీ యాప్ లేదా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ నంబరుతో నమోదు చేసుకోవాలి.

వంగ తోటలో సస్యరక్షణ చర్యలు

నల్లజర్ల, న్యూస్‌టుడే: వంగ సాగులో విత్తిన దగ్గర నుంచి కాయకోత వరకు 18 రకాల పురుగులు, తెగుళ్లు ఆశించి మొక్క ఎదుగుదలను, కాయ నాణ్యతను దెబ్బతీస్తాయి. వీటి నివారణకు కృషివిజ్ఞాన కేంద్రం(వెంకట్రామన్నగూడెం) ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి పలు సూచనలిచ్చారు. విత్తిన 7 నుంచి 15 రోజుల్లో నేల నుంచి పిథాయం అను శిలీంధ్రం గింజ మొలకెత్తకుండా చేసి నారు కుళ్లిపోవడం జరుగుతుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరుకు 3 గ్రాములు నీటిలో కలిపి మట్టిని తడిపి విత్తుకోవాలి. కిలో విత్తనాన్ని కార్బండిజమ్, థైరమ్ 1.5 గ్రాములతో విత్తనశుద్ధి చేసుకోవాలి. పూత, పిందె దశలో క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ., ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి.

వరి కోతల్లో జాగ్రత్తలు పాటిద్దాం మద్దతు ధర పొందుదాం

తెలుసుకుందాం..

అయినవిల్లి, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన వరిపంటకు మంచి మద్దతు ధర పొందాలంటే కోతలు, ధాన్యం ఆరబెట్టే, నిల్వ చేసే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అయినవిల్లి మండల వ్యవసాయాధికారి శోభ వివరించారు. ● చేను పసుపు రంగులోకి మారిన తరువాత కోయాలి. ముందే కోస్తే తాలుగింజలు వస్తాయి. ● మంచుకురిసే సమయంలో కోస్తే ధాన్యం మెత్తబడి నల్లగా మారుతుంది. కోత ఆలస్యమైతే గింజ పగుళ్లు ఏర్పడి నూక వస్తుంది. ● వెన్నులు 80-90 శాతం పసుపు రంగులోకి మారినప్పుడు మాసూళ్లు చేయాలి. ● తేమశాతాన్ని తగ్గించేందుకు కోత అనంతరం రెండు నుంచి మూడు రోజులు ఆరబెట్టాలి. యంత్రంతో కోస్తే వెంటనే కల్లంలో ఆరబెట్టాలి. రాత్రిపూట మంచు తగలకుండా ధాన్యాన్ని కుప్పగా పోసి బరకాన్ని కప్పాలి. ● కోత సమయంలో వర్షం వస్తే 5 శాతం ఉప్పు కలిపిన నీటిని పిచికారీ చేయాలి. ధాన్యంలో దుమ్ము, ధూళి, మట్టిబెడ్డలు లేకుండా చూసుకోవాలి. తేమశాతం 17 కంటే తక్కువ ఉండేవిధంగా చూసుకోవాలి. ● ధాన్యం నిల్వ చేసుకునే ముందు గోనెసంచులను పది శాతం మలాథియన్ ద్రావణంలో ముంచి ఎండబెట్టాలి. ఈ చర్యల వల్ల ఆలస్యంగా విక్రయించినా పూర్తి మద్దతు ధర దక్కుతుంది.

కోతదశకు చేరుకున్న వరిచేను

అంతర పంట.. అదనపు రాబడే ఏటా

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

కోకో చెట్టు వద్ద రైతు బాబూరావు

స్ఫూర్తి

అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం పెంచుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆత్రేయపురం మండలం వాడపల్లికి చెందిన పోచిరాజు బాబూరావు. 12 ఎకరాల కొబ్బరి తోటలో అంతర పంటగా ఆరేళ్ల క్రితం కోకో మొక్కలు నాటారు. ఐదేళ్ల నుంచి దిగుబడులు వస్తున్నాయి. ఎక్కడా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ ఎరువులు, జీవామృతం తదితర వాటిని ఉపయోగించడం ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆదాయం బాగుంది

"ఆరేళ్ల క్రితం వరకు కొబ్బరి దిగుబడులు తగ్గడం, ధరలు లేకపోవడంతో ఆదాయం పడిపోయింది. దీనిని చక్కదిద్దుకునేందుకు కోకోను అంతర పంటగా వేశాను. సేంద్రియ ఎరువులతో భూసారం పెరిగింది. చీడపీడల నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తున్నాను. కోకోతో వరుసగా రెండేళ్లు ఖర్చులన్నీ పోను ఎకరాకు రూ.15 వేల చొప్పున ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.20 వేలు వచ్చిందని రైతు బాబూరావు తెలిపారు."

చేపల్లో పేనువ్యాధి నివారిద్దాం



వ్యాధి సోకిన చేప

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: చేపల్లో ఈ కాలంలో పేను వ్యాధి ఎక్కువగా సోకే అవకాశం ఉంది. అర్గులస్ పోలియాసిస్ అనే పరాన్నజీవులు శరీరంపై చేరి ఎరుపురంగు మచ్చలు ఏర్పడి క్రమేపీ పుండ్లుగా మారతాయి. వీటి ప్రభావం ఎక్కువగా ఉంటే చేపలు ఎగిరిపడటం, నీటి ఉపరితలం పైకి వచ్చి ఈదడం వంటివి చేస్తుంటాయి. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉప్పలగుప్తం ఎఫ్‌డీవో బి.హేమానంద్ వివరించారు. డైక్లోరోవాస్(76 శాతం) ఎకరా చెరువుకు 500 మి.లీ. ద్రావణాన్ని చల్లుకోవాలి. లేదా డెల్టామైథ్రిన్(1.75 శాతం) వంద మి.లీ. ద్రావణాన్ని చల్లుకోవాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు చల్లుకోవాలి. ఈ పేలు తిరిగి వ్యాప్తి చెందకుండా చెరువు చుట్టూ గడ్డిని తొలగించి వెదురుకర్రలు, మేతకు వినియోగించే సంచులను శుభ్రపరుచుకోవాలి.

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల సాయం

తాళ్లరేవు: ఇటీవల మృతి చెందిన గర్భిణి పెసింగి మల్లేశ్వరి కుటుంబానికి సీఎం ఆదేశాల ప్రకారం.. నాలుగు రోజుల్లో రూ.5 లక్షలు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. సోమవారం గాడిమొగ పంచాయతీ చినవలసలలోని కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ఆమె భర్తకు రూ.20వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందడం బాధాకరమన్నారు. నడింపల్లి వినోద్, పెసింగి ఈశ్వరరావు, రామాడి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యునికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

అన్నవరంలో మరిన్ని వసతి గదులు

- 70 శాతం మేర ఆన్‌లైన్‌లో బుకింగ్

విష్ణుసదన్ వసతిగృహం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం ఆలయంలో భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా, సమయం ఆదా అయ్యేలా ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా ఆలయంలో ఉన్న గదుల్లో 70 శాతం గదులను ఆన్‌లైన్‌లో సోమవారం నుంచి అందుబాటులో ఉంచారు. రత్న, సత్యగిరులపై వివిధ వసతి సముదాయాల్లో సుమారు 480 గదులున్నాయి. ఇందులో 70 శాతం (336 గదులు) ఆన్‌లైన్లో ఉండగా భక్తులు aptemples.org ద్వారా, మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009 ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు.

అమలు సాధ్యమేనా..

అన్నవరంలో వసతిగదులకు డిమాండ్ ఉంటుంది. వ్రతాలు, వివాహాలు జరుగుతాయి. వివాహాలకు ముందుస్తుగా విష్ణుసదన్‌లో హాల్స్ బుకింగ్ చేసుకునేవారికి 2 గదులను కేటాయిస్తారు. ఇక్కడ 32 హాల్స్ ఉన్నాయి. అన్ని హాల్స్ బుకింగ్ అయితే 64 గదులు కేటాయించాలి. ఇతర ప్రదేశాల్లో వివాహాలు చేసుకునేవారికి గదులివ్వాలి. ఇలా సుమారు 30 శాతానికి పైగా వివాహలకు కేటాయించగా, 70 శాతం ఆన్‌లైన్లో ఉంచితే నేరుగా అన్నవరం వచ్చే వారికి గదులు దొరికే పరిస్థితి ఉంటుంది. సాధారణ రోజుల్లో బాగున్నా.. రద్దీ రోజుల్లో ఇబ్బంది ఎదురవుతుంది. దీనికి తోడు సిఫార్సు లేఖల తాకిడీ ఉంటుంది. ఆన్‌లైన్లో దళారులు అడ్డదారుల్లో బుకింగ్ చేసుకుని ఆ తర్వాత అధిక ధరలకు భక్తులకు ఇచ్చే అవకాశముంటుంది.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

తాళ్లరేవు: గ్రామాల్లో జ్వర పీడితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా మలేరియా అధికారి ఐ.ప్రభాకర్ సూచించారు. సుంకరపాలెంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. జ్వరంతో బాధపడే రోగులకు రక్త పరీక్షలు చేసే కిట్లుపై ఆరా తీశారు. స్క్రబ్ టైఫస్ బ్యాక్టీరియా ప్రభావం డిసెంబరు, జనవరిలో అధికంగా ఉంటుందన్నారు. ఎప్పుడికప్పుడు జ్వరం బారిన పడిన బాధితుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నాలుగు రోజుల పాటు జ్వరం తగ్గకపోతే సంబంధిత ప్రభుత్వాసుపత్రులకు తరలించాలన్నారు. గాడిమొగ, తాళ్లరేవు పీహెచ్‌సీల పరిధిలో నలుగురు వైద్యులు ఉన్నారని వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పింఛను సొమ్ములో ఇంటిపన్ను కోత

- పోతులూరులో చోటుచేసుకున్న వ్యవహారం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలోని పోతులూరు గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ఇంటి పన్ను వసూలు చేస్తున్నారని గ్రామంలో సోమవారం చర్చ రేగింది. పింఛను మొత్తంలో రూ.వెయ్యి ఇంటిపన్నుగా మినహాయించి ఇస్తున్నారని సామాజిక మాధ్యమాల ద్వారా వ్యవహారాన్ని వైరల్ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో కుమార్‌బాబును వివరణ కోరగా తమకు లబ్ధిదారుల నుంచి ఎటువంటి రాతపూర్వక ఫిర్యాదులూ రాలేదన్నారు. దీనిపై విచారణ జరుపుతామన్నారు.

భార్యను హత్యచేసిన వ్యక్తిపై కేసు

సర్పవరం: కాకినాడ గ్రామీణం ఇంద్రపాలెంలో ఆదివారం భార్యను హత్యచేసిన కేసులో నిందితుడిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశామని సీఐ చైతన్యకృష్ణ, ఎస్సై వీరబాబు తెలిపారు. సీఐ మాట్లాడుతూ నర్సీపట్నం వేములపాడుకు చెందిన బేతా గంగరాజు బజ్జీల బండి నిర్వహిస్తుంటాడు. కొంతకాలంగా భార్య మల్లీశ్వరి(45)పై అనుమానంతో పని మానేసి ఇంటివద్దనే ఉంటూ తరచూ భార్యతో గొడవపడుతున్నాడు. నివాస స్థలం మారితే గొడవలు సర్దుకుంటాయని పెద్దలు చెప్పడంతో రెండు నెలల క్రితం వచ్చి ఇంద్రపాలెంలో ఉంటున్నారు. ఆదివారం రాత్రి భార్యతో గొడవపడి రాయితో తల పగలగొట్టి హత్య చేసి పరారయ్యాడు. గతంలో కుటుంబసభ్యులతో భార్యను చంపి తానుకూడా చచ్చిపోతానని హెచ్చరించేవాడని చెబుతున్నారు.

విద్యార్థి అభివృద్ధికి ప్రాథమిక స్థాయే పునాది

గొల్లప్రోలు: విద్యార్థి అభివృద్ధికి ప్రాథమిక స్థాయే పునాది అని, వారిలో అక్షర పరిజ్ఞానం, అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ పిలుపునిచ్చారు. చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సమావేశం సోమవారం రాత్రి నిర్వహించారు. అనంతరం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. ఈ నెల 5న జరిగే మెగా పీటీఎంను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఈవోలు శ్రీనివాస్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	113-00
రిటైల్ లైవ్	140-00
డ్రెస్డ్	203-00
స్కిన్‌లెస్	231-00

బాధితులకు అండగా నిలవాలి

మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, వేదికపై అధికారులు, సంస్థల ప్రతినిధులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎయిడ్స్, హెచ్ఐవీ బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని అసిస్టెంట్ కలెక్టర్ మనీషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని వైద్య,ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ మండలి, రెడ్‌క్రాస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. మనీషా మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణ, అవగాహనకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అవసరమైన చర్యలు చేపడుతున్నాయని, దీనికి అందరూ తోడ్పాటును అందించాలన్నారు. బాధితులు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడం, పోషకాహారం తీసుకోవడం ద్వారా సాధారణ వ్యక్తులుగా జీవించవచ్చునన్నారు. డీఎంహెచ్‌వో నరసింహానాయక్, రాష్ట్ర రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు తదితరులు అవగాహన కల్పించారు. అనంతరం ఓఎన్జీసీ, బీమాబాయి మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన పోషకాహార కిట్లను బాధిత చిన్నారులకు అందజేశారు. జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేసిన ఉద్యోగులు, వివిధ సంస్థలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం అధికారులు, చిన్నారులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మనీషా తన పుట్టినరోజును బాధిత చిన్నారులతో కలిసి జరుపుకున్నారు. కేకు కోసి వారికి తినిపించారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

నాన్న కొడుతున్నాడని.. ఇంటికి వెళ్లనని..

- ఏడుస్తున్న విద్యార్థినిని పిన్నికి అప్పగించిన అధికారులు

సామర్లకోట, న్యూస్‌టుడే: ఇంటికి వెళ్తే నాన్న కొడుతున్నాడు. చిత్రహింస పెడుతున్నాడు.. ఇంటికి వెళ్లనంటూ ఏడుస్తున్న విద్యార్థినిని సామర్లకోట పోలీసులు బంధువులకు అప్పగించిన ఘటన పట్టణంలో చర్చనీయాంశమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పెన్షన్‌లైనుకు చెందిన 12 ఏళ్ల విద్యార్థిని స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత తాను ఇంటికి వెళ్లనని ఏడుస్తుండడం, ఆమె బంధువు వచ్చి తనతో పంపించాలని కోరడంపై ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆరా తీశారు. మానవహక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ సహకారంతో పోలీసులకు, సీఆర్‌పీఎఫ్‌కు సమాచారం అందించారు. వారు బాలికను, ఆమె తండ్రిని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. సీఐ కృష్ణభగవాన్ కౌన్సెలింగ్ చేశారు. రెండు రోజులపాటు బాలికను తన పిన్ని ఇంటివద్ద ఉండమన్నారు. పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సోషల్ వర్కర్ లక్ష్మి విద్యార్థినిని బంధువుల సమక్షంలో ఆమె పిన్నికి అప్పగించారు.

విద్యుత్తు తీగలు తగిలి కార్మికుడి మృతి

గండేపల్లి, న్యూస్‌టుడే: చేతికందొచ్చిన కుమారుడు కూలీ పనులకు వెళ్లి అనుకోని ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఎస్సై శివనాగబాబు వివరాల ప్రకారం.. గండేపల్లి మండలం కె.సూరంపాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి శివసూర్యనారాయణ (24) తాపీ పనులకు వెళ్తుంటాడు. సోమవారం మండలంలోని పి.నాయకంపల్లి గ్రామంలో ఓ ఇంటి నిర్మాణానికి కూలీ పనికి వెళ్లాడు. పిట్టగోడ నిర్మాణంలో భాగంగా ఐరన్‌ఊసలు తీసుకుని మేడపైకి ఎక్కుతుండగా 11 కేవీ విద్యుత్ వైర్లు ఊసలకు తగిలి శివసూర్యనారాయణ అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు. మేనమామ వీరసత్యనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీసాయి గోల్డ్, తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి ఆ రోజు మార్కెట్ రేటుకు కొనబడును. స్పాట్ క్యాష్. Cell: 94933 38823.

TENDER

ITC లిమిటెడ్, ABD, అనపర్తి-533342 వద్ద గల 124 KL HSD ట్యాంక్, 225 KVA ట్రైలర్స్, MS, పైప్, డిస్కార్డ్ బెల్టులు, SS, అల్యూమినియం, రబ్బర్, [illegible] వస్తువులు 15-12-2025న ఈ-ఆక్షన్. తేది 08-12-2025 నుండి 10-12-2025. టెండరు ఫారం ధర రూ..500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14. ఫోన్: 098407 31925. www.welcomeauctioneers.com.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

House For Sale Near Ashoknagar, Meeseva road, Kakinada. 370 Sq yards (52x65) Contact: RS RAO, ✆ 94927 70388.

PLOT FOR SALE

GENERAL

Open Plot For Sale Near Gokulam Temple, Gokulam Road, Kakinada. Plot No: 11 (45x67) 337 Sq Yards. RS RAO ✆ 94927 70388

JOBS

[illegible] 910092 7474, 90031 80344.

AISHWARYA GROUP OF INDUSTRIES

JOB OFFERS

Aishwarya Group is one of the leading rice mills in the industry with its established domestic brands in AP & TG, located near to Rajanagaram, East Godavari Dist. invites applications to fill the following vacancies.

1. **HR MANAGER-1** (Min. 5 years experience)
2. **SENIOR ACCOUNTANT-1** (Min. 5 years experience)
3. **JUNIOR ACCOUNTANT-1** (Min. 1 year experience)
4. **FACTORY OPERATIONS IN_CHARGE-1** (Min. 3 years experience)
5. **PRODUCTION MANAGER-1** (Min. 5 years experience)
6. **QUALITY MANAGER-1** (Min. 3 years experience)
7. **MACHINERY MAINTENANCE ENGINEER-1** (Min. 5 years experience)
8. **STORES SUPERVISOR-1** (Min. 3 years experience)
9. **SECURITY SUPERVISOR-1** (Ex-Service Men Preferable)
10. **GENERAL SUPERVISORS-2** (Min. 3 years experience)

Suitable Salary as per skills & experience of the candidates. Interested candidates can apply with the resume to email address: hr@aishwaryagroup.in
Management

జనప్రియ ఊరగాయలు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Contact: జనప్రియ ఊరగాయలు, [illegible] రాజమండ్రి. Cell: 98664 08924.

[illegible] అనకాపల్లిలో ప్ర.కం., ప్రొడక్ట్స్, షోరూమ్స్‌కు సె॥ గార్డ్స్, సూపర్‌వైజర్స్ కావలెను. రూం+భో., జీ: 12 15 వేలు. రాజ్ సెక్యూరిటీ, RJY, ✆ 93922 69369.

SECURITY GUARDS

రాజమండ్రి, పోలవరం ప్రాజెక్ట్ దగ్గర పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 15,000/-, P.F, ESI, ఉచిత వసతి - భోజన సదుపాయం కలదు. Contact: 98665 94169, 85004 98115.

నేడు సూచించిన కోడిగుడ్డు ధర
For the information of Trade & Industry
[illegible] ధర 6-40 పైసలు
08857-226908

EENADU for Advertisement Contact: **8008597607**

గమనిక
[illegible]

WANTED: సేల్స్ & సర్వీస్ మేనేజర్ [illegible] (Female), [illegible] Contact Cell: 97033 34844, 63019 19238.

(c) eenadu

కాకినాడ

శివగణేష్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ రాంబాబు, అధ్యాపకులు

విద్యార్థికి అభినందన

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో స్థానిక పీఆర్ కళాశాలల ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న కె.శివగణేష్ 5 బంగారు, ఒక రజత పతకంతో సత్తా చాటాడు. అతడిని సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. జ్యోతుల రాంబాబు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

కంప్యూటర్లు, యోగా ఉపకరణాల బహూకరణ

కాకినాడ నగరం: స్థానిక పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పైడా శ్రీరామకృష్ణయ్య ఫౌండేషన్, అభయాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ లైబ్రరీ, ఆన్‌లైన్ తరగతులకు ఉపకరించేలా 20 కంప్యూటర్లు, ఇన్వర్టర్‌ను అందించారు. యోగాభ్యాసానికి కిట్లను అందించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ రూమ్‌ను కళాశాల ప్రిన్సిపల్ డా.జ్యోతుల రాంబాబుతో కలిసి దాత పైడా వెంకటేశ్వరరావు, కుటుంబసభ్యులు ప్రారంభించారు.

ఆసనాలను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ. 10 - మ. 1
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

వ్యర్థాలు తొలగించారు..

స్పందనకు వందనం

భానుగుడి సెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ దుమ్ములపేట బైపాస్ రహదారిలో హోల్‌సేల్ మార్కెట్ వద్ద వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. చెత్తాచెదారంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, ఎండు కొమ్మలతో రహదారి సగం వరకు మూసుకుపోయింది. దీనిపై 'ఈనాడు' లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. వ్యర్థాలతో పాటు మట్టిని తొలగించి శుభ్రం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలు.. సమస్యలకు నిలయాలు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీతో పాటు పలు సేవలందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కొరవడుతున్నాయి. కొన్నిచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకోగా, కొన్ని కేంద్రాలు అద్దె ఇళ్లలో, సామాజిక భవనాల్లో నడుస్తున్నాయి. చాలాచోట్ల అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. చిన్నారులకు ఆడుకునేందుకు సరైన ఆటస్థలం లేదు. చుట్టూ ప్రహరీ లేక భవనాలకు రక్షణ కరవై బిక్కుబిక్కుమంటూ సిబ్బంది కేంద్రాలను నడపాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో మరుగుదొడ్డి సౌకర్యం, కనీసం తాగేందుకు మంచినీటి సదుపాయం ఉండట్లేదు.

ఎస్.అచ్యుతాపురంలోని కేంద్రం వద్ద నిల్వ నీరు

వివరాలు ఇలా..	
అర్బన్ ప్రాజెక్టులో కేంద్రాలు	253
అద్దె భవనాల్లో ఉన్నవి	202
ప్రభుత్వ భవనాల్లో	33
ఉచిత భవనాల్లో	18

కొన్ని కేంద్రాల్లో ఇలా..

కాకినాడ శివారున ఉన్న మధురానగర్ జనచైతన్య లేవుట్ వద్ద ఎస్.అచ్యుతాపురం అంగన్‌వాడీ కేంద్రం దుర్భర స్థితిలో ఉంది. ప్రహరీ లేకపోవడంతో పశువులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. భవనం నలువైపులా వర్షం నీరు నెలల తరబడి నిలబడి ఉంటోంది. దుర్గంధంతోపాటు దోమల బెడద అధికంగా ఉంటోందని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రం పక్కనే ఓవర్ హెడ్ ట్యాంకు ఉంది. వాటి శిథిలాలు వేలాడుతున్నాయి. చిన్నారుల అవస్థలు గమనించిన అప్పటి కాకినాడ రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్) సీఐ కొండయ్య ముందు భాగాన ట్రాక్టర్లతో మట్టి వేయించారు. చీకటి పడితే ఆకతాయిలు చేరి మద్యం తాగి సీసాలను ఆవరణలో పడేస్తున్నారు.

● కొత్తకాకినాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గతంలో భాగ్యనగర్ గ్యాస్ సంస్థ సహకారంతో నిర్మించారు. మూడు గదులు ఉన్న ఈ కేంద్రంలో రెండు గదుల్లో నగరపాలక ప్రాథమిక పాఠశాల నడుస్తోంది. ఇక ఒకే గదిలో మూడు కేంద్రాలు నడుస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆకట్టుకుంటూ.. ఆలోచింపజేస్తూ..

అందరూ మంచివారే కాని నాటకంలో ఓ సన్నివేశం

గాంధీనగర్, న్యూస్‌టుడే: పంతం పద్మనాభ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో సూర్యకళామందిరంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు సోమవారం రాత్రి ఉత్సాహంగా జరిగాయి. ఆకెళ్ల సూర్యనారాయణమూర్తి కళాప్రాంగణాన్ని హైదరాబాద్‌కు చెందిన విశ్వశాంతి కళానికేతన్ అధ్యక్షుడు బి.ఎం.రెడ్డి ప్రారంభించారు. అనంతరం మానవతా ఎడ్లపాడు వారి 'అందరూ మంచివారే కాని' నాటకం ప్రదర్శితమైంది. తర్వాత ఎన్టీఆర్ జిల్లా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నల్లతాచు నీడలో నాటకం ప్రదర్శించారు. పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి బుర్రా పద్మనాభం, ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, సభ్యులు మార్ని జానకిరామ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి మార్గదర్శి భగవద్గీత

వేడుకల్లో పాల్గొన్న సభ్యులు, చిన్నారులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజానికి భగవద్గీత గొప్ప మార్గదర్శిగా నిలుస్తుందని, గీతలో సమస్త జ్ఞానం దాగుందని బాల సంస్కార శిక్షణ సమితి అధ్యక్షురాలు చల్లా శ్రీలక్ష్మీవాణి అన్నారు. సమితి ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లో గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. సామూహిక గీతాపారాయణంతోపాటు, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఉదయభాన్‌జీరావు, జి.శ్రీదేవి, ఎన్.సునీత, నాగమణి, సుజన తదితరులు పాల్గొన్నారు. గొడారిగుంట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. ● గీతా జయంతిని పురస్కరించుకుని గీతా భవిత్, గోవింద పరివార్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీగీతా గోవిందుల పట్టాభిషేక మహోత్సవాన్ని సోమవారం గాంధీనగర్‌లో గల క్షత్రియ పరిషత్ హాల్లో ఘనంగా నిర్వహించారు. సామూహిక గీతామంత్ర పారాయణం జరిగింది. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రవికిరణ్ పట్నాయక్, అపర్ణ, సమీర్, శ్రీవిద్య, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ మేనేజర్‌గా నిర్మలకుమారి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ మేనేజర్‌గా ఎస్.నిర్మలకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నగరపాలక సంస్థలో రెవెన్యూ అధికారి (ఆర్‌ఓ)గా పనిచేస్తున్న ఆమెను మేనేజర్‌గా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను పలువురు ఉద్యోగులు అభినందించారు.

మార్ఫింగ్ ఫొటోతో మహిళకు వేధింపులు

ఎండాడ, న్యూస్‌టుడే: 'ఫేస్‌బుక్, వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన ప్రొఫైల్ చిత్రాలను డౌన్‌లోడ్ చేసి వాటిని అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి వేధిస్తున్నందుకు ఓ వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నగరానికి చెందిన ఓ మహిళకు ఫేస్‌బుక్ నుంచి మరో మహిళ పేరుతో ఉన్న అకౌంట్ ద్వారా తెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. ఆమె చిత్రాలను ఫేస్‌బుక్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నగ్న చిత్రాలుగా మార్ఫింగ్ చేసి అసభ్యకరమైన మెసేజ్‌లతో వేధిస్తున్నాడు. బాధిత మహిళ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో కాకినాడ జిల్లాకు చెందిన తాటికాయల దివాకరమారుతిసత్యతేజ్ అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసి గత నెల 29న రిమాండ్‌కు పంపించారు.

ప్రతిభా పోటీల్లో సత్తా..

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రామారావుపేటలోని నారాయణ ఇ టెక్నో స్కూల్‌లో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస(స్పీచ్) పోటీలో బి.శ్రీలాస్య ప్రథమ, సి.హెచ్.అభిశ్రీ ద్వితీయ, పి.రియా డిసోజా తృతీయ బహుమతి సాధించారు. పాఠశాల ఏజీఎం రామచంద్రరావు, షర్మిల, అకడమిక్ డీన్ రమణరావు, ఉపాధ్యాయులు... జోనల్ కోఆర్డినేటర్ సుంకర మూర్తి, ప్రిన్సిపల్ యులు అభిలాష్, కాంచన, అపర్ణ పాల్గొన్నారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో ప్రిన్సిపల్ షర్మిల తదితరులు

లక్ష్మీనారాయణనగర్‌లో..

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ లక్ష్మీనారాయణనగర్‌లోని నారాయణ ఇ టెక్నో స్కూల్‌లో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాసం పోటీలు నిర్వహించారు. ఆరెకే హాసిని ప్రథమ, పి.స్నేహకుమారి ద్వితీయ, అనిష్ గుప్తా తృతీయ బహుమతులు సాధించారు. ఏజీఎం రామచంద్రరావు, ప్రిన్సిపల్ కవిత, అకడమిక్ డీన్ ఉపాధ్యాయులు రంగారావు, అన్నపూర్ణ, గణేష్, హారిక, ఒలింపియాడ్ ఇన్‌ఛార్జి బి.సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీకి హాజరైన విద్యార్థులు

విజేతలతో ఏజీఎం కె.రామచంద్రరావు, ప్రిన్సిపల్ కవిత తదితరులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 37 ఫిర్యాదులు

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. 37 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను తెలియజేశారు. వాటిని పరిశీలించి 7 రోజులలోపు విచారణ పూర్తిచేసి తగిన పరిష్కారం చూపాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

ఉద్యోగ విరమణ చేసిన ఎస్సైలకు సత్కారం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: సర్పవరం పీఎస్ పరిధిలోని ఎస్సై, ట్రైనింగ్ ఎస్సై ఎస్.జీవీడీరాజు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ సోమవారం సత్కరించారు. ఎస్పీ డీఎస్పీ సత్యనారాయణ, ఆర్మ్డ్ రిజర్వ్ సీఐ మూర్తి, సత్యమూర్తి, పోలీసు సిబ్బంది, వారి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: అవయవదానం ప్రాణదానం కంటే గొప్పదని ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఛైర్మన్ పాలడుగు సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక భానుగుడి సెంటర్‌లో సోమవారం ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్, డా.డీవీ రాజు మల్టీ ఆర్గానిక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ ఛైర్మన్ డా.జవహర్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం

చెక్కును ఈవో, ఛైర్మన్‌లకు అందజేస్తున్న దాత డాక్టర్ మరెళ్ల మల్లప్పరాజు

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని గాంధీనగర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతీనెలా రెండో శనివారం భక్తులకు ప్రసాద వితరణ చేసేందుకు దాత డాక్టర్ మారెళ్ల మల్లప్పరాజు రూ. లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. సోమవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వాసిరెడ్డి సత్యకుమార్, ఈవో శ్రీనివాసులకు దాత మల్లప్పరాజు చెక్కును అందజేశారు. ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పూడిక తీయరూ..

శ్రీనగర్ ప్రధాన రహదారి పక్కన కాలువలో పూడిక తీయకపోవడంతో అధ్వానంగా ఉంది. దాంతో మురుగు పారే వీలులేకుండా ఉందని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే,మసీదుసెంటర్

గుంత.. ప్రయాణానికి చింత..!

నగరంలోని కీలకమైన మిలటరీ రోడ్డులో శారదాంబగుడి-బాలికల పాలిటెక్నిక్ మధ్య రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదభరితంగా మారింది. కల్వర్టు కింద రహదారికి పెద్ద గుంత పడటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ఇక్కడ వీధి దీపాలు వెలగక. . ప్రమాదాల బారిన పడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. **- న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్**

పట్టపగలే వెలుగులు..

కాకినాడ గొడారిగుంట ప్రధాన రహదారిపై పట్టపగలే వీధిదీపాలు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. పట్టపగలు వీధిదీపాలు వెలగడంపై నగరవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాంతో ప్రభుత్వ ధనం వృథా అవుతోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మసీదుసెంటర్

వర్షంతో అవస్థలు

కాకినాడ నగరంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో ప్రధాన రహదారులతోపాటు కాలనీ వీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గొడారిగుంట మూడుగుళ్ల సమీపంలో, శాంతినగర్, పోస్టల్‌కాలనీ, కొత్తకాకినాడ, కొత్తపేట మార్కెట్, పళ్లంరాజునగర్ తదితర ప్రాంతాల్లోను, కాలనీ వీధుల్లో వర్షం నీరు నిలబడింది. వాహన దారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. పలుచోట్ల కాలువలు పొంగి పొర్లడంతో మురుగంతా రోడ్లపైకి, ఖాళీ స్థలాల్లోకి చేరింది.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)

కాకినాడ డిపోలో పదోన్నతుల సందడి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ ఆర్టీసీ డిపోలో పదోన్నతుల సందడి మొదలైంది. ఇక్కడ డిప్యూటీ సూపరింటెండెంట్(ట్రాఫిక్ విభాగం)గా పనిచేస్తున్న ఈఎస్ నారాయణ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది అమలాపురం డిపోకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో కాకినాడ డిపో స్టేషన్ మేనేజర్‌గా పనిచేస్తున్న ధర్మారావు డిప్యూటీ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. స్వామి సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీవో) కార్యాలయానికి బదిలీ అయ్యారు. అసిస్టెంట్ డిపో క్లర్క్‌లకు పదోన్నతులు లభించాయి.

ఎయిడ్స్ నివారణే ధ్యేయం

ఏఎస్‌డీ కళాశాలలో విద్యార్థినుల మానవహారం

ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

వీఎస్ లక్ష్మీ డిగ్రీ కళాశాల విద్యార్థినుల ర్యాలీ

మసీదు సెంటర్, సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్, మైక్రో బయాలజీ విభాగాల ఆధ్వర్యంలో ఆవరణలో విద్యార్థినులు మానవహారం నిర్వహించారు. శశికాంత్‌నగర్‌లో గల వీఎస్ లక్ష్మీ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు వలసపాకల, వాకలపూడి ప్రాంతాల్లో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం ఆయన 26వ డివిజన్ పరిధిలోని నాగరాజుపేట, పరదేశమ్మపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

12న అంగన్‌వాడీల ధర్నా

సాంబమూర్తినగర్(కాకినాడ): అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఈ నెల 12న ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పద్మావతి, ఎరుబండి చంద్రావతి తెలిపారు. దీనిపై సోమవారం ఐసీడీఎస్ పీడీ సిహెచ్.లక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

నేడు ప్రత్యేక అధికారి సమీక్ష

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం అధికారులతో సమీక్షించనున్నారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఈ సమావేశం జరగనుంది.

జేఎన్‌టీయూకేలో ఫార్మా సదస్సు ప్రారంభం

గాంధీనగర్, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకే ప్రాంగణంలోని అలూమ్ని ఆడిటోరియంలో సోమవారం స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్, ఐఎస్‌టి ఆధ్వర్యంలో 4 రోజులపాటు జరిగే సదస్సు సోమవారం ప్రారంభమైంది. వీసీ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ అధ్యాపకులు, విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎన్ఆర్‌డీసీ సీనియర్ రీజినల్ మేనేజర్ బిజయ్‌కుమార్ సాహు ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ దీర్ఘకాలిక ఆరోగ్య ఆర్థిక వ్యవస్థ, మేథోసంపత్తి హక్కులు తదితర అంశాలు వివరించారు. రెక్టార్ పి.సుబ్బారావు, ఓఎస్‌డి కోటేశ్వరరావు, ఐఎస్టీ డైరెక్టర్ బీ.టి.కృష్ణ, హెచ్‌వోడీ బి.భవాని, ప్రొఫెసర్ ఎంఎన్‌వి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

జీవో ప్రకారం జీతాలు పెంచాలి

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో సెక్యూరిటీ నిర్వహణ చేస్తున్న సంస్థ ప్రతినిధులు కార్మికులతో తక్షణమే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ సెక్యూరిటీ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డ్స్ సమావేశంలో సీఐటీయూ నగర కోకన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ జీవో ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. సీఐటీయూ నగర కమిటీ సభ్యుడు విజయకుమార్, భాగ్యలక్ష్మి, భాస్కరరావు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించాలని నిరసన

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో మహిళా సెక్యూరిటీ గార్డును ఫోన్ల ద్వారా లైంగికంగా వేధించిన వ్యక్తిని విధుల నుంచి తొలగించాలని సోమవారం ఉదయం బాధిత కుటుంబీకులు, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్, సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

మొర వినండి.. న్యాయం చేయండి

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

పీజీఆర్ఎస్‌లో బాధితుల వేడుకోలు

జిల్లా నలుమూలల నుంచి వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, పేదలు అనేకమంది సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతులు అందజేశారు. భూముల రీ-సర్వేలో జాయింట్ ఎల్‌పీఎంలు ఇవ్వడంతో ఇబ్బందులు పడుతున్నామని, అసైన్డ్ భూములు దక్కకుండా అన్యాయం చేస్తున్నారని, స్థలాలు కబ్జా చేస్తున్నారని, పింఛన్లు, రేషన్‌కార్డులు ఇప్పించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. వీటిని సావధానంగా విన్న అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

అసైన్డ్ భూమిని అప్పగించండి

కొన్నేళ్ల కిందట ప్రభుత్వం కోరంగి గ్రామంలోని సర్వే నంబరు 276/20లో మా కుటుంబానికి 2.40 ఎకరాల అసైన్డ్‌భూమిని ఇచ్చింది. ఇక్కడ 32 మంది పేదలకు 95 ఎకరాలను అప్పట్లో ఇచ్చారు. ఈ భూమిపై వివాదం ఉండటంతో కోర్టులో కేసు నడిచింది. తీర్పు మాకు అనుకూలంగా వచ్చింది. తిరిగి భూమిని అప్పగించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ మా పేరును తప్పించి, వేరేవారికి కట్టబెట్టాలని చూస్తున్నారు. మాకు న్యాయం చేయాలి.

- దుప్పి, అదృష్టదీపకుడు, కోరంగి, తాళ్లరేవు మండలం

వైద్యుల నిర్లక్ష్యంపై చర్యలేవి?

నా భార్య శివకోటి మణి కాన్పు కోసం తునిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాం. వైద్యులు నిర్లక్ష్యంతో ఆరోగ్యం విషమించింది. విశాఖపట్నంలో చేర్పించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. ఆయా ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేశారు. చంటిబిడ్డకు జన్మనిచ్చి నా భార్య మరణించింది. దీనిపై కలెక్టరేట్‌లో విచారణకు పిలిచినా, కొన్ని కారణాలతో హాజరుకాలేకపోయాను. మళ్లీ విచారణ జరిపి నా కుటుంబానికి న్యాయం చేయాలి.

- ఎస్.అనిల్, ఎ.కొత్తపల్లి, తొండంగి మండలం

పట్టాదారు పాసుపుస్తకం లేక ఇక్కట్లు

మా తల్లిదండ్రులది పిఠాపురం మండలం భోగాపురం. వారి నుంచి మా అక్కచెల్లెళ్లకు 44 సెంట్ల భూమి సంక్రమించింది. గతంలో వేర్వేరుగా పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. రీ-సర్వేలో జాయింట్ ఎల్‌పీఎం జారీ చేశారు. దీంతో ఇక్కట్లు పడుతున్నాం. తిరిగి సర్వే చేసి, నా పేరుతో పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలని కోరుతున్నాను. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు.

- కాపారపు రత్నం, భీమవరపుకోట, కోటనందూరు మండలం

అన్ని వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: అన్ని వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక 30వ డివిజన్‌లో సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏఎంసీ ఛైర్మన్ బచ్చు శేఖర్, అద్దేపల్లి గంగరాజు, పాబోలు పున్నయ్య, చెక్కా రమేష్, వైకుంఠరావు, పంది లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

AKSHARA SCHOOL
16-22-7/2, Pallamraju Nagar, Kakinada - 3
Affiliated to C.B.S.E., Aff. No.130123
NURSERY - XI
Admissions are open for Nursery to Class IX & Class XI from 01.12.2025
REQUIRED STAFF
Pre Primary Teachers, Special Educator
Primary Teachers (Grade: I -V)
Maths, Science, Social, English, Telugu, Hindi and Mother Teachers
Secondary Teachers (Grade: VI - X)
Maths, Science, Social, English, Telugu, Hindi, Computer Science
Senior Secondary Teachers (Grade: XI - XII)
Mathematics, Physics, Chemistry, Biology, computer Science, Accountancy, Economics, Physical Education
Expreience in teaching foundation courses (IIT JEE & NEET)
Eligibility : Minimum 3 to 5 Years Experience in CBSE Schools (Preferably B.Ed)
Interested and eligible candidates are invited to send the application through mail before 13th December, 2025
CONTACT DETAILS
Email: aksharaschool1990@gmail.com, 77940 77897 / 0884-2365053

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

వైభవంగా లక్ష తులసి అర్చన

పాదగయలో..

పిఠాపురం, న్యూస్‌టుడే: పాదగయ క్షేత్రంలో దత్త జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం ఆలయంలోని స్వయంభూ దత్తాత్రేయస్వామికి సహస్ర తులసి అర్చన వైభవంగా నిర్వహించారు. సోమవారం శ్రీపాద వల్లభుడికి ఈవో సౌజన్య ఆధ్వర్యంలో లక్షతులసి పూజ జరిపించారు.

సప్తాహ మహోత్సవం

కాజులూరు: కాజులూరు - తాళ్లరేవు మార్గంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం సప్తాహ మహోత్సవాలు నిర్వహించారు. నాలుగు భజన బృందాలు పాల్గొన్నాయి.

వైద్యురాలు మంజూషకు అభినందన

పిఠాపురం: గర్భిణులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్న గైనకాలజిస్టు డా.మంజూష సలాది తెలిపారు. సోమవారం పిఠాపురంలోని ఎంఎస్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది ఆమెను అభినందించారు. గర్భిణులకు ఉత్తమ సేవలందిస్తున్న ఆమె గత నెల 27న హైదరాబాద్‌లో ప్రైమ్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డును సినీ నటుడు సుమన్ చేతులమీదుగా అందుకున్నారు.

బాధ్యతల స్వీకరణ

కరప: కరప మండల డిప్యూటీ ఎంపీడీవోగా కర్రి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గంగవరం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

అర్జీదారులు సంతృప్తి చెందాలి

పిఠాపురం: పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపాలని, అర్జీదారులు సంతృప్తి చెందేలా ఉండాలని పాడా ఇన్‌ఛార్జి పీడీ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది.

విద్యార్థులకు స్థానిక పాలన పరిచయం

గొల్లప్రోలు: గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు స్థానిక 1, 2 వార్డు సచివాలయాలను సోమవారం పరిశీలించారు. స్థానిక పాలనలో ప్రజలకు అందిస్తున్న సేవలు తెలుసుకున్నారు. హెచ్ఎం సూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండల పరిషత్ సాధారణ సమావేశం మంగళవారం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో సలాట్ రాజు తెలిపారు.

వివక్ష చూపుతున్నారని ఆందోళన

కొత్తపల్లి: యండపల్లి జడ్పీ పాఠశాలలో గత నెల 28న విద్యార్థుల మధ్య వాగ్వాదం జరిగింది. వారిలో కొందరిని తమ తల్లిదండ్రులను పాఠశాలకు తీసుకురావాలని ఉపాధ్యాయులు సూచించారు. సోమవారం వారొచ్చి తమను మాత్రమే ఎందుకు పిలిచారంటూ ఆందోళనకు దిగారు. ఇద్దరు ఉపాధ్యాయులు తమ పిల్లలపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఎంఈవో వేణుగోపాల్, ఎస్సై వెంకటేష్ విచారణ చేస్తామని వారికి చెప్పారు.

మంత్రి లోకేశ్‌తో వర్మ చర్చలు

పిఠాపురం: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సోమవారం మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యకర్తలే అధినేత పేరుతో స్థానిక తెదేపా కార్యాలయంలో ప్రతి శుక్రవారం ప్రజల నుంచి అర్జీల స్వీకరణ గురించి వివరించారు. కార్యకర్తలు, నాయకుల కమిటీలపై చర్చించినట్లు చెప్పారు.

వందశాతం ఉత్తీర్ణత లక్ష్యం

తాళ్లరేవు: వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రతి పదో తరగతి విద్యార్థి పట్టుదల, క్రమశిక్షణతో చదవాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్(విద్యాశాఖ) నాగమణి అన్నారు. పి.మల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. తెల్లవారుజాము 4 గంటలకే నిద్రలేచి పాఠాలను చదవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడొద్దు

పెద్దాపురం: ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం సీఐ విజయ శంకర్ అన్నారు. దివిలి కిట్స్ ఫార్మసీ కళాశాల ఆవరణలో సోమవారం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొందరు విద్యార్థులు ఇళ్లకు వెళ్లకుండా పాన్ దుకాణాల వద్ద ఈవ్‌టీజింగ్‌కు తెగబడుతుండడంతో యాజమాన్యాలపైనా చర్యలు ఉంటాయన్నారు.

రాకపోకలకు సౌకర్యంగా..

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: వన్నెపూడి శివారున రహదారి ఆరేళ్లుగా గుంతలమయం కాగా వైకాపా ప్రభుత్వం కనీస మరమ్మతులు చేపట్టలేదు. కూటమి సర్కారు పల్లెపండగ కార్యక్రమంలో రూ.80 లక్షలతో తారురోడ్డు నిర్మించింది. రెండువైపులా గ్రావెల్‌తో బెర్మ్‌లు నిర్మించే పనులు రెండు రోజులుగా చేస్తున్నారు.

పురస్కారానికి ఎంపిక

పెదపూడి: శహపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఈశ్వరరావు తాను నేషనల్ టీచర్స్ ఇన్‌స్పైర్ అవార్డు అందుకున్నానని సోమవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగిందన్నారు. విద్యాబోధనలో వినూత్న విధానాలు అవలంబిస్తున్నందుకు తాను ఎంపికైనట్లు చెప్పారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ చేతులమీదుగా తీసుకున్నట్లు చెప్పారు.

నీరొస్తోంది.. నారు పోయండి

ఖరీఫ్ సాగు 70 శాతం వరకు పూర్తయింది. ప్రస్తుతం దిత్వా తుపాను కారణంగా వరి కోతలు వాయిదా వేయాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా జలవనరుల శాఖ అధికారులు రెండో పంటగా రబీ సాగుకు పూర్తి స్థాయిలో నీరందిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం పిఠాపురం బ్రాంచి కెనాల్ నుంచి నీటి విడుదల మొదలైంది. ఏలేరు ఆయకట్టుకు వచ్చే వారంలో అందించనున్నారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో ఆయకట్టుకు పిఠాపురం బ్రాంచి కెనాల్(పీబీసీ), ఏలేరు జలాశయం నుంచి సాగునీరు అందిస్తుంటారు. వీటి ద్వారా చెరువులు నింపడం ద్వారా సమీప ప్రాంతాల్లో వేలాది ఎకరాలు సాగవుతున్నాయి. ఖరీఫ్ పంట కోతలు మొదలైన నేపథ్యంలో రబీ సాగుకు నీరందించేందుకు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం గత నెల 21న జరిగింది. రెండు జలాశయాల్లోనూ నీరు పుష్కలంగా ఉండడంతో పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. అందులో భాగంగా సోమవారం గోదావరి నీటిని వదలడంతో పీబీసీ ఆయకట్టుకు నీరు చేరుతోంది. కాగా ఈ నెల మూడో తేదీలోపు ఏలేరు నీరు కూడా విడుదల చేయనున్నారు. ఏలేరు నుంచి 53,017 ఎకరాలు, పీబీసీ నుంచి 32,507, గోదావరి డెల్టా నుంచి 1,05,341 ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. రైతులు పంటలు సకాలంలో పూర్తిచేసి, రబీ సాగుకు సిద్ధమవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. డిసెంబరు 31 నాటికి నాట్లు పూర్తి చేసుకోవాలని, మార్చి 31 లోపు పంట పూర్తి చేయాలని చెబుతున్నారు. 125 రోజుల్లో పంట చేతికొచ్చే స్వల్పకాలిక రకాల విత్తనాలు వేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా మూడో పంటకు అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

ఆయకట్టు వివరాలు(ఎకరాల్లో)..

మండలం	పీబీసీ	ఏలేరు
పిఠాపురం	2,135	21,027
గొల్లప్రోలు	5,115	1,044
కొత్తపల్లి	14,076	--
పెద్దాపురం	--	9,692
సామర్లకోట	5,076	--
కాకినాడ రూరల్	2,907	--

నరసింగపురం రోడ్డులో ఏలేరు కాలువ

కాలువల శుభ్రతకు చర్యలు

ఏలేరు, పీబీసీ పరిధిలో కాలువల శుభ్రత చర్యలు చేపడతాం. పీబీసీలో ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ పథకంలో పనులకు రూ.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు చేస్తాం. రూ.50 లక్షలతో ఏలేరు కాలువల గండ్లు పూడ్చడం తదితర పనులు మొదలవుతాయి. పంట ఆలస్యంగా వేస్తే సాగునీటి ఎద్దడి ఎదుర్కోవాల్సివస్తుంది.

– సంతోష్‌కుమార్, డీఈ(పీబీసీ), ప్రసన్నకుమార్, ఏఈ(ఏలేరు)

రైతుల సంక్షేమానికి కృషి

చంద్రశేఖర్‌తో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కరప: రైతుల సంక్షేమానికి ఆత్మ కమిటీ కృషి చేయాలని ఎమ్మెల్యే నానాజీ సూచించారు. నడకుదురులోని ఏడీఏ కార్యాలయంలో సోమవారం ఆత్మ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఛైర్మన్‌గా గొల్లపల్లి చంద్రశేఖర్ తోపాటు కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాలకు చెందిన 21 మంది సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు.

గ్రామ సమస్యలు పరిష్కరిస్తాం

సర్పవరం: కొవ్వూరు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కాకినాడ కార్యాలయంలో సోమవారం జనసేన నేత గోవిందు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎమ్మెల్యే నానాజీని కలిశారు. గ్రామంలో చాలా ఏళ్లక్రితం ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలిచ్చిందని, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తే ఇళ్ల నిర్మాణం చేపడతామని విజ్ఞప్తి చేశారు.

లయన్స్‌క్లబ్‌తో సేవలు

సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌రాజు

సామర్లకోట: సేవ చేయాలనుకునేవారికి లయన్స్‌క్లబ్ గొప్ప వేదికని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎండోర్ సీ లయన్ విజయ్‌కుమార్‌రాజు పేర్కొన్నారు. సోమవారం సామర్లకోటలో భీమేశ్వర లయన్స్‌క్లబ్ 2024-25లో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈదల ఈశ్వర కుమార్ సాధించిన విజయాలకు సహకరించిన సభ్యులకు అవార్డులు అందించారు. ప్రస్తుత డిస్ట్రిక్ట్ గవర్నర్ వజ్రపు కోటేశ్వర రావు, జీటీఎం కోఆర్డినేటర్ వర్మ, జేవీడీజీ శ్రీనివాసు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● పెదపూడి: జి.మామిడాడకు చెందిన లయన్స్ క్లబ్ శ్రీసూర్య ఉత్తమ కార్యదర్శిగా ద్వారంపూడి యువరాజరెడ్డి సామర్లకోటలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైనట్లు క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీనివాస్ సోమవారం తెలిపారు.

ఐక్య క్రిస్మస్ వేడుక.. ప్రార్థనలకు వేదిక

సామర్లకోట సీబీఎం పాఠశాల మైదానంలో కొవ్వొత్తులతో క్రైస్తవులు

సామర్లకోట: సామర్లకోటలోని సీబీఎం స్కూలు మైదానంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ వార్షికోత్సవ ఐక్య క్రిస్మస్ వేడుక సభలు సోమవారం ముగిశాయి. నవంబరు 28 నుంచి అధ్యక్షుడు బ్లెస్సింగ్ ఆధ్వర్యంలో సభలు నిర్వహించారు. క్రైస్తవులు కొవ్వొత్తులు వెలిగించి ముందస్తు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ● పిఠాపురం: డా.మైటీ పోరస్ పిఠాపురం ఏబీసీ చర్చిలో నియోజకవర్గ స్థాయి ఐక్య క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. యువత క్రిస్మస్ గీతాలు ఆలపించారు. పాస్టర్ థియోపిలాస్, డా.జి.ఎలీషాబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో క్రిస్మస్ గీతాలు ఆలపిస్తున్న యువత

పంట కాలువ బాగు

ఈనాడు కథనానికి స్పందన

తాళ్లరేవు: సీతారామపురంలో పంట కాలువంతా గడ్డి, పిచ్చి మొక్కలతో మూసుకుపోయింది. నవంబరు 29న సాగునీరు పారేదెలా.. శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. జలవనరులశాఖ ఏఈ అనూష స్పందించి యంత్రంతో సోమవారం కాలువను శుభ్రం చేయించారు.

ఇంటిపన్నుల ఆదాయంతో అభివృద్ధి

గొల్లప్రోలు: ఇంటి పన్నుల ద్వారా లభించే ఆదాయంతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని ఎంపీడీవో సలాట్ రాజు అన్నారు. చెందుర్తిలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు.

చేపలకు మేతగా బియ్యం

తాళ్లరేవు: పి.మల్లవరం ఓం సదా శివాలయం నిర్వాహకులు సలాది రామన్నాయుడు 100 కేజీల బియ్యాన్ని తాళ్లరేవు ప్రధాన పంట కాలువలోని చేపలకు సోమవారం మేతగా వేశారు. తన మనవరాలికి చేపలంటే ఇష్టమని అందుకే బియ్యాన్ని ఆహారంగా వేశామన్నారు.

ఆలయానికి ఆదాయం

సామర్లకోట: సామర్లకోట భీమేశ్వరాలయం వద్ద దుకాణాల తాత్కాలిక నిర్వహణకు వేలం నిర్వహించగా రూ.27,28,333 ఆదాయం చేకూరిందని ఈవో నీలకంఠం సోమవారం తెలిపారు.

ఇటు వెళ్లాలా.. తస్మాత్ జాగ్రత్త

నీలమ్మ చెరువు ఎన్టీఆర్ ప్రాథమిక పాఠశాల కూడలిలో 20 రోజుల కిందట పైపులు ఏర్పాటుకు గుంత తవ్వారు. పనులు అసంపూర్తిగా ఉండిపోవడంతో గుంతలో మట్టి వేసి చుట్టూ కర్రలు పాతి ఎర్రని రిబ్బన్ ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో అవి కనిపించక ద్విచక్రవాహనదారులు ఢీకొని ప్రమాదాల బారినపడుతున్నారు. గుంత పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సామర్లకోట

ప్రధాన రహదారిపై చెత్త

స్థానిక కొండయ్యపేట చెరువు నుంచి రెడ్డిపేటకు వెళ్లే దారిని చెత్త ఆక్రమిస్తోంది. పందులు, కుక్కలు చెత్తను చిందరవందర చేస్తున్నాయి. డస్ట్‌బిన్ దారిలోనే ఉండడంతో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారంగా ఉంది. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. పురపాలిక కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం

ట్రాక్టరిచ్చారు.. ట్రక్కేదీ..?

వన్నెపూడి, ఎ.కె.మల్లవరం పంచాయతీలకు ఏడాది క్రితం ట్రాక్టరు ఇంజిన్లు కేటాయించినా ట్రక్కులు అందించకపోవడంతో నిరుపయోగంగా మిగిలాయి. గ్రామాల్లో చెత్త తరలించేందుకు వీల్లేకుండా ఉందని సర్పంచులు సుబ్రహ్మణ్యం, మణిబాబు వాపోయారు. చర్యలు చేపడతామని డిప్యూటీ ఎంపీడీవో కుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఆ కాస్త వదిలేశారేం.. అసౌకర్యంగా..

సర్పవరంలోని భావనారాయణస్వామి ఆలయం గోశాల పక్కన ఉన్న రహదారి సుమారు కిలోమీటరు దూరం నిర్మాణం చేపట్టారు. కేవలం 200 మీటర్ల మేర వదిలేయడంతో రైతులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏఈ వెంకటకృష్ణను అడగ్గా నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, సర్పవరం

బిల్లుల వెత.. ఉద్యానం మూత

కాకినాడ అర్బన్ ఒకటో డివిజన్‌లోని బోటుక్లబ్ ఉద్యానం సోమవారం సాయంత్రం మూతపడడంతో సేదదీరేందుకు, వ్యాయామం చేసేందుకు వచ్చినవారు ఇబ్బందులు పడ్డారు. కొన్ని నెలలుగా సెక్యూరిటీ గుత్తేదారుకు కార్పొరేషన్ అధికారులు బిల్లులను మంజూరు చేయకపోవడంతో సోమవారం సాయంత్రం వారి సేవలు నిలిపివేశారు. వాకర్స్ సమస్యను కార్పొరేషన్ ఏఈ రత్నావళికి చెప్పగా గుత్తేదారుతో చర్చించి గేటుకు తాళాలు తీయించారు. - న్యూస్‌టుడే, సర్పవరం

హెచ్ఐవీపై అప్రమత్తంగా ఉందాం

పిఠాపురం: హెచ్ఐవీని కట్టడి చేద్దామని పిఠాపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ కీర్తిప్రియ కోరారు. సోమవారం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు. ● పిఠాపురం: పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.సుభాషిణి, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. ● పెద్దాపురం: పెద్దాపురంలో వైజ్ సంస్థ, సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని ఆర్డీవో శ్రీరమణి ప్రారంభించారు. వైద్యాధికారి శ్రీనివాస్, ఎస్సై మౌనిక పాల్గొన్నారు. ● తాళ్లరేవు: గాడిమొగలో డాక్టర్ జయభార్గ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ● సర్పవరం: కాకినాడ అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో సోమవారం ప్రిన్సిపల్ ప్రశాంతిశ్రీ మాట్లాడారు. రమణయ్యపేటలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురికి నిత్యావసరాలు పంచారు.

పిఠాపురం: ర్యాలీలో వైద్యులు, అధ్యాపకులు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: స్థానిక కొండయ్యపేటలో రహదారిపై చెత్త పోగులున్నాయి. వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. – వెంకట్రావు

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా చెత్త తొలగింపు చర్యలు చేపట్టారు.

- న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: వేళంగి పీహెచ్‌సీ వద్ద డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు నీరు సరిగా వెళ్లడం లేదు. – శ్రీనివాస్

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావు సిబ్బందిని పంపి డ్రెయినేజీలో వ్యర్థాలు తొలగించారు.

- న్యూస్‌టుడే, కరప

సమస్య: కొత్తపల్లి గ్రామం ముత్యాలమ్మ చెరువు సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. – స్థానికులు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సిబ్బందిని పంపి చెత్తను తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: గొల్లప్రోలు శివాలయం కాలనీ ఎదురుగా రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. – స్థానికులు

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: పండూరు గ్రామం పీహెచ్‌సీ ప్రాంతంలో మురుగు కాలువలో పూడిక ఎప్పటికప్పుడు తీయడం లేదు. – రాంబాబు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌చౌదరి కార్మికులతో శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, రమణయ్యపేట

రైతుల్లో తుపాను గుబులు

ఎఫ్‌కేపాలెంలో దారి పొడవునా బరకాలు కప్పిన రాశులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో సార్వా వరి పంట నూర్పిడి చేసిన ధాన్యం కళ్లాల్లో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంత పంట కోయకపోవడంతో గాలులకు నేలవాలింది. కళ్లాల్లో ధాన్యాన్ని బస్తాల్లో నింపి మిల్లులకు తరలించే పనులు చేపట్టారు. గొల్లప్రోలు మండలంలో 1,500 హెక్టార్లలో ధాన్యం రాశులుగా, పనదశలో, కోత కోయకుండా ఉన్నట్లు ఏవో సత్యనారాయణ తెలిపారు. ● పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గవ్యాప్తంగా ఆరబెట్టుకుంటున్న ధాన్యం తడిస్తే ధర తగ్గిపోతుందనే భయం రైతులను వెంటాడుతోంది. సరైన కళ్లాలు లేక ఎక్కడికక్కడే రహదారుల చెంతనే రైతులు ధాన్యంపై బరకాలు కప్పి తడవకుండా చూసుకుంటున్నారు. ● తాళ్లరేవు: తాళ్లరేవు, లచ్చిపాలెం, చినబాపనపల్లి గ్రామాల్లో తడిసిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

లచ్చిపాలెంలో తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు

కనుల పండువగా తెప్పోత్సవం

హంస వాహనంలో సుబ్రహ్మణ్యస్వామి విహారం

గొల్లప్రోలు: తాటిపర్తిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సోమవారం రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. కోనేరులో అలంకరించిన హంస వాహనంలో స్వామి వారిని ఉంచి మూడుసార్లు తిప్పారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు. మల్లవరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించారు.

జాతీయ విద్యావిధానం ఉపసంహరించుకోవాలి

పిఠాపురం: జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ డిమాండ్ చేశారు. సోమవారంతో పిఠాపురంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు ముగిశాయి. రామ్మోహన్ మాట్లాడుతూ పలు తీర్మానాలు చేశామన్నారు. జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్ లోవరాజు, ఎం.గంగాసూరిబాబు, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, సాహిత్, సిద్ధూ, చిన్ని, జిల్లా సహాయ కార్యదర్శిగా సంజ్, వాసుదేవ్, సత్యం, అమృత్ తదితరులు ఎన్నుకున్నారు.

జిల్లా కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న రామ్మోహన్

పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

తాళ్లరేవు: నెల్లూరు జిల్లాలో గంజాయి గూండాల చేతిలో హత్యకు గురైన ప్రజా నాయకుడు పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ తాళ్లరేవులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సత్యశ్రీనివాస్, ఈశ్వరరావు, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

తాళ్లరేవు: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే బుచ్చిబాబు కోరారు. తాళ్లరేవు సీహెచ్‌సీలో వైద్యులు సునీత, శిరీష, అజయ్, ఆసుపత్రి అభివృద్ధికమిటీ సభ్యులతో సోమవారం సమీక్ష నిర్వహించారు.

పారిశుద్ధ్య నిర్వహణ.. పట్టుతప్పుతోంది..

న్యూస్‌టుడే, పెద్దాపురం, సామర్లకోట

పెద్దాపురం, సామర్లకోట పురపాలికల్లో దోమల బెడద అధికంగా ఉంది. ప్రస్తుతం వాతావరణం చల్లగా ఉంది. దీంతో చలి తీవ్రత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో పిల్లలు, పెద్దలు జలుబు, దగ్గు, జ్వరాల బారినపడి ఆసుపత్రిపాలవుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరాలు తగ్గకపోవడంతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. పరిసరాల శుభ్రత, మురుగు వ్యవస్థ అధ్వానంగా మారడం, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండటం, సిబ్బందికి గుర్తుకొచ్చినప్పుడు ఫాగింగ్ చేయడం తదితర కారణాలతో పట్టణ ప్రాంతాల్లో దోమలు దండ యాత్ర చేస్తున్నాయి.

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు వివరాలివీ..

సామాజిక ఆరోగ్య కేంద్రం	జ్వరం కేసులు
పెద్దాపురం పట్టణం	260
సామర్లకోట పట్టణం	225



వరహాలయ్యపేటలో పూడికతో కాలువ

దోమల నివారణ చర్యలేవి..

పెద్దాపురంలోని నువ్వులగుంటవీధి, మేదరవీధి, ఛానల్‌వీధి, వరహాలయ్యపేట, ప్లీడర్స్‌వీధి, వక్కలంకవారివీధి, పాతపెద్దాపురం, పద్మనాభకాలనీ తదితర ప్రాంతాల్లోని ప్రధాన, చిన్న కాలువలను నిత్యం శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరిగిపోయి ప్రజలు జ్వరాల బారినపడుతున్నారు. ● సామర్లకోట పట్టణంలో కొత్తూరు, మఠంసెంటర్, స్టేషన్ సెంటర్, గోలివారివీధి, బలుసులపేట, బ్రౌన్‌పేట, ఉప్పువారివీధి, పెన్షన్‌లైన్ తదితర ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో జనానికి దోమల బాధ తప్పడం లేదు.

ఫాగింగ్‌కు చర్యలు చేపడుతున్నాం..

దోమల నియంత్రణకు ఫాగింగ్ యంత్రాలతో చర్యలు చేపడుతున్నాం. కొన్ని కాలువల్లో పూడిక తొలగించాం. మిగిలిన వాటిలో చర్యలు తీసుకుంటాం. మురుగు కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, శ్రీవిద్య, కమిషనర్లు

AKSHARA SCHOOL
16-22-7/2, Pallamraju Nagar, Kakinada - 3
Affiliated to C.B.S.E., Aff. No.130123
NURSERY - XI
Admissions are open for Nursery to Class IX & Class XI from 01.12.2025
REQUIRED STAFF
Pre Primary Teachers, Special Educator
Primary Teachers (Grade: I -V)
Maths, Science, Social, English, Telugu, Hindi and Mother Teachers
Secondary Teachers (Grade: VI - X)
Maths, Science, Social, English, Telugu, Hindi, Computer Science
Senior Secondary Teachers (Grade: XI - XII)
Mathematics, Physics, Chemistry, Biology, computer Science, Accountancy, Economics, Physical Education
Expreience in teaching foundation courses (IIT JEE & NEET)
Eligibility : Minimum 3 to 5 Years Experience in CBSE Schools (Preferably B.Ed)
Interested and eligible candidates are invited to send the application through mail before 13th December, 2025
CONTACT DETAILS
Email: aksharaschool1990@gmail.com, 77940 77897 / 0884-2365053

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
సంక్షిప్త టెండర్ నోటీసు నెం: 01/2025, తేదీ: 02.12.2025
ఎంజీఎన్ఆర్ఈజీఎస్ (MGNREGS) కార్యక్రమం క్రింద మండలములోని వివిధ గ్రామ పంచాయతీలలో చేపట్టవలసిన పనులకొరకు పదార్థాలు / నైపుణ్యము కలిగిన మరియు అర్థనైపుణ్యము కలిగిన కార్మికులు/యంత్రాలు సరఫరాచేయుటకు మూసివేసిన సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి.
టెండర్ షెడ్యూలు జారీ తేదీలు: 05.12.2025 నుండి 12.12.2025 వరకు సాయంత్రం 5.00 గంటలవరకు ఎం.పి.డి.ఓ కార్యాలయం, కాజులూరు మండలములో
టెండర్ షెడ్యూలు స్వీకరణకు చివరి తేదీ: 12.12.2025 మధ్యాహ్నం 2.00 గంటల వరకు
బిడ్స్ సమర్పణకు చివరి తేదీ: 12.12.2025 మధ్యాహ్నం 5.00 గంటల వరకు
టెండర్లు తెరవడం: 13.12.2025 ఉదయం 11.00 గంటలకు
టెండర్ షెడ్యూలు ధర: రూ. 2000/-
టెండర్ ఆమోదించే అధికారి ఏదైనా టెండర్ లేదా అన్ని టెండర్లను అంగీకరించే లేదా తిరస్కరించే హక్కును కలిగి ఉంటారు. అలాగే, ఒప్పందం కుదుర్చుకోక ముందే ఎప్పుడైనా టెండరు ప్రక్రియను రద్దుచేసే అధికారము వారికి ఉంది. ఈ చర్యవల్ల ప్రభావిత బిడ్డర్ లేదా బిడ్డర్లపై ఎటువంటి బాధ్యత లేదా వారికి అనిర్ణయానికి గల కారణాలు తెలియజేయాల్సిన బాధ్యత టెండర్ ఆమోదించే అధికారికి ఉండదు.
మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజాపరిషత్, కాజులూరు మండలము

(c) eenadu

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ప్రతిభ చూపిన విద్యార్థులతో శిక్షకుడు

కరాటే పోటీల్లో పతకాలు

తుని: పట్టణంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభచూపి పతకాలు సాధించారు. గాజువాకలో ఆదివారం జరిగిన నేషనల్ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ 2025లో తుని బుడోకాన్ అకాడమీ నుంచి పాల్గొన్న 9 మంది సత్తాచాటారు. కరాటే కటా, కుమితే విభాగాల్లో నాలుగు బంగారు, రెండు రజత, మరో 10 కాంస్య పతకాలు దక్కించుకున్నారని శిక్షకుడు కె.రమణ తెలిపారు.

పేదల ఆకలితీరుస్తున్న అన్న క్యాంటీన్

జగ్గంపేట గ్రామీణం(జగ్గంపేట), న్యూస్‌టుడే: బాటసారుల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండల కేంద్రం జగ్గంపేట మెయిన్‌రోడ్డులో ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డించారు. గండేపల్లి మండలం ఎన్టీఆర్ రాజాపురం గ్రామానికి చెందిన కొనుకొలను రాజు ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భోజనాలు వడ్డిస్తున్న జ్యోతుల నెహ్రూ

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066 ఉ. 10 - మ. 1

సమస్య: మండలంలోని లింగంపర్తి నుంచి ఏలేశ్వరం వెళ్లే ర.భ.శాఖ రహదారిపై వర్షం నీరు నిలిచిపోతోంది. రాకపోకలకు అవస్థలు ఎదురవుతున్నాయి. - కృష్ణ, లింగంపర్తి

సమాధానం: రహదారిపై ఉన్న వర్షం నీటిని దిగువకు పోయేందుకు అవసరమైన పనులు చేపడతాం. - సాయికృష్ణ, జేఈ, ర.భ.శాఖ

– న్యూస్‌టుడే, ఏలేశ్వరం

నేడు ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

శంఖవరం, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు నేడు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ఎంఈవో ఎస్వీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. కత్తిపూడి ఉన్నత పాఠశాల మైదానంలో త్రోబాల్, క్రికెట్ పోటీలు జరుగుతాయని ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులంతా ఉదయం 9గంటలకు హాజరుకావాలన్నారు.

4 రోజులు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

తొండంగి, న్యూస్‌టుడే: మండలంలోని బెండపూడి 11 కేవీ విద్యుత్తు ఫీడర్‌పై మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో మంగళ, బుధ, గురు, శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ వీరభద్రరావు తెలిపారు. బెండపూడి గ్రామంలోని గృహ, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలన్నారు.

రక్షిత తాగునీటికి నిత్యం యాతన

▲ పగిలిపోతున్న పైప్‌లైన్లు ▲ సరఫరాలో అంతరాయం

న్యూస్‌టుడే, తుని: రక్షిత తాగునీటికి తుని పట్టణంలో ఆయా వార్డుల్లో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా ప్రతిరోజూ అనేక సమస్యలు ఎదురవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పైప్‌లైన్లను మార్చడానికి, విస్తరణకు సరైన ప్రణాళిక చేయలేకపోయారు. రక్షిత తాగునీటి వ్యవస్థ నిర్వహణకు ఏటా రూ.5 కోట్లకు పైబడి ఖర్చు అవుతున్నా ప్రజలకు పూర్తిస్థాయిలో నీరందడం లేదని స్థానికులు వాపోతున్నారు.

తాగునీటి వ్యవస్థ సమాచారం..

జనాభా	సుమారు 62 వేలు
వార్డులు	30
పురవీధులు	450
పైప్‌లైన్ల విస్తరణ	27.280 కి.మీ
రిజర్వాయర్లు	9
పవర్‌బోర్లు	13
ఇంటి కొళాయిలు	4,440
వీధి కొళాయిలు	342
రోజువారీ నీటి సరఫరా	5.15 ఎంఎల్‌డీ

సమస్యలు ఇవీ..

● ఆయా ప్రాంతాల్లోని పాత పైప్‌లైన్లు పాడైపోగా వాటిలో పేరుకుపోయిన మట్టి, బురద నీటి ప్రవాహ ఉధృతికి తరచూ కొండవారి పేట, గవరపేట తదితర ప్రాంతాల్లో కొళాయిలకు చేరుతోంది. దీంతో ప్రజలు బురద నీటిని తాగాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

● కట్టుల్ల వద్ద పైప్ లైన్ ధ్వంసం కావడంతో గత ఐదు రోజులుగా నెహ్రూనగర్, రెల్లిపేట, బోడికొండ పరిసరాల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. ● రాజీవ్ గృహకల్పలో ఉన్న ట్యాంకు వద్ద క్లోరినేషన్ ప్రక్రియ జరగడం లేదు. ● ఉప్పరిగూడెంలో రక్షిత ట్యాంక్ సకాలంలో శుభ్రం చేయకపోవడంతో నలకలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ● కొత్త ఉప్పరిగూడెం, రామకృష్ణాకాలనీ, సాయినగర్, నెహ్రూనగర్ శివారు ప్రాంతాల్లో ప్రధాన పైప్‌లైన్ వ్యవస్థ విస్తరించకపోవడంతో సరఫరాకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

కట్టుల్ల వద్ద పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న సిబ్బంది

● మండలంలోని రేఖవానిపాలెం వద్ద ఉన్న పంప్ హౌస్ తాండవ నది ఒడ్డున ఉండటంతో తరచూ పంపింగ్ పవర్‌బోర్లలోకి బురద చేరి ఇబ్బందులు కలుగుతున్నాయి. గత దశాబ్దకాలంలో దీనికోసం రూ.లక్షలు వెచ్చించినా పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రాలేదు.

చర్యలు తీసుకుంటున్నాం..

కట్టుల్ల వద్ద పగిలిన పైప్‌లైన్ స్థానంలో కొత్తగా గొట్టాలు వేసే పనులు త్వరగా పూర్తి చేస్తున్నాం. అప్పటివరకూ ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. మిగిలిన ప్రాంతాల్లో ట్యాంకులు శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకుంటాం.

- సీహెచ్ నాగ సతీష్, పురపాలక డీఈ, తుని

తొండంగి డిప్యూటీ ఎంపీడీవోగా శశికుమార్

తొండంగి: తొండంగి మండల డిప్యూటీ ఎంపీడీవోగా డి.శశికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈయన సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ మూర్తి, కార్యదర్శులు ప్రేమ్, రాజబాబు, అప్పారావు, సూరిబాబు,విశ్వేస్, శంకర్, తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్తిపాడు మండలానికి ఉషారాణి..

ప్రత్తిపాడు: మండల డిప్యూటీ ఎంపీడీవోగా గొల్లపల్లి ఉషారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పెదపూడి నుంచి పదోన్నతిపై వచ్చారు. మండలంలోని గ్రామ సచివాలయాల కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, పరిపాలనాధికారి ఏవీఎస్ఎన్ మూర్తిలు ఉషారాణిని సత్కరించారు.

హామీలన్నీ అమలుచేస్తున్న కూటమి ప్రభుత్వం

తొండంగి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మండలంలోని ఏవీనగరంలో సోమవారం తెదేపా నాయకులు యనమల నాగేశ్వరరావు, రాజేష్, కొయ్యా కేశవ, పెదబాబులతో కలిసి అందించారు. యల్లయ్యపేటలో మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు కోడ వెంకటరమణ, అప్పలరాజు, చొక్కా కొండబాబు, సత్యనారాయణలతో కలిసి పింఛన్లు అందించారు.

ఏవీనగరంలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని గ్రామీణం: ఎస్.అన్నవరం పంచాయతీ పరిధి జగన్నాథగిరిలో ఎమ్మెల్యే యనమల దివ్య పింఛను పంపిణీ చేశారు. ఎంపీపీ బొప్పనరాము, డిప్యూటీ ఎంపీడీవో జి.మరిడయ్య పాల్గొన్నారు. అనంతరం రామకృష్ణానగర్‌లో రూ.7లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. పంపిణీ చేశారు. కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, పెంద్ర శ్రీను, మూది నారాయణస్వామి, యండగొండి నాగబాబు పాల్గొన్నారు. పెద్దనాపల్లి, లింగంపర్తి గ్రామాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, పెదబాబు చేతులమీదుగా అందించారు.

గండేపల్లి: ప్రతి నెల పింఛన్లు అందించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామంలో సోమవారం పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పీడీ పాల్గొన్నారు. ఎంపీడీవో హరికృష్ణసత్యారెడ్డి, ఏవో చంద్రరావు, కార్యదర్శి వీరేంద్ర పాల్గొన్నారు.

అర్హు లందరికీ ఠంచనుగా పంపిణీ: ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం: ఠంచనుగా ఒకటో తేదీనే పింఛను అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఏలేశ్వరం ఐదో వార్డులో ఆమె పింఛన్

ఏలేశ్వరంలో సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

చి'వరి'లో చినుకు

ప్రత్తిపాడు, కిర్లంపూడి, తొండంగి, న్యూస్‌టుడే: దిత్వా తుపాన్ ప్రభావంతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సోమవారం గాలులతో కూడిన వర్షం కురిసింది. ఖరీఫ్ వరి చేతి కందే దశలో ఉంది. కోతలు పూర్తి చేసి పనలపైనే వదిలేశారు. వర్షానికి పనలు తడిసిపోవడంతో రైతులు ఆవేదనతో ఉన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ 11వేల హెక్టార్లలో వరి సాగయింది. ఇప్పటికి 40 నుంచి 50 శాతం మాత్రమే కోతలు పూర్తవ్వగా ఈనిన వరి క్షేత్రాల్లోనే ఉంది. టి.రాయవరం, లంపకలోవ, రౌతుపాలెం, ప్రత్తిపాడు తదితర గ్రామాల్లో వరిపనలు తడిశాయి.

● కిర్లంపూడి మండలంలోని ముక్కొల్లు, రామకృష్ణాపురం, చిల్లంగి, కిర్లంపూడి, గోనేడ, గెద్దనాపల్లి, కిర్లంపూడి తదితర గ్రామాల్లో పంటలు ప్రస్తుతం ముమ్మరంగా మాసూళ్లు చేస్తున్నారు. ● తొండంగి మండలంలోని తొండంగి, కోదాడ, ఏవీనగరం, శృంగవృక్షం, తదితర గ్రామాల్లో వరి పనలు తడిశాయి.

రౌతుపాలెం సమీపంలో పనలపై ఉన్న వరి చేలో నీరు

కిర్లంపూడికి సుబ్బారావు..

కిర్లంపూడి: కిర్లంపూడి మండలంలో సచివాలయాల పర్యవేక్షణకోసం డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్వీ సుబ్బారావు సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మండపేట మండలం ఇప్పనపాడు మేజర్ గ్రామపంచాయతీ గ్రేడ్‌వన్ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఎంపీడీవో హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో సచివాలయాల సమాచారాన్ని తెలుసుకున్నారు.

గీతా జయంతి వేడుకలు

ఏలేశ్వరం: ఏలేశ్వరం వీహెచ్‌పీ నాయకులు అలమండ దుర్గాప్రసాద్, కటకం కిరీటీ, టి.గుర్రయ్య ఆధ్వర్యంలో గీతా జయంతిని సోమవారం నిర్వహించారు. వీహెచ్‌పీ అనుబంధ మాతృశక్తి విభాగం మహిళలు గీతా పారాయణ చేశారు. లింగంపర్తిలో ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఆలమూరి సుబ్బారావు నేతృత్వంలో మహిళా సత్సంగం ప్రతినిధులు విష్ణు, లలిత సహస్ర పారాయణ పఠించారు.

ప్రత్తిపాడు: రాచపల్లి ఆంధ్రా అరుణాచలం క్షేత్రంలో సోమవారం గీతా జయంతి జరిగింది. గీతాజ్ఞాన యజ్ఞ సమితి, శ్రీరమణసేవాశ్రమం సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో 60 మంది విద్యార్థులు గీతా పఠనం చేశారు. సీనియర్ విభాగంలో పతివాడ పూజిత, ఎ.రామసత్యసాయి వెంకట్ ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. జూనియర్ విభాగంలో డి.కార్తిక్, బి.త్రిపుర అన్నిక మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.

ఏలేశ్వరంలో గీతా పారాయణ చేస్తున్న మహిళలు

తుని పట్టణం: పట్టణంలోని దివాణం వీధిలో ఉన్న బ్రహ్మకుమారీల ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా సత్తిబాబు

తొండంగి: యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా తొండంగి మండలం శృంగవృక్షం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు టి.సత్తిబాబును ఎంపిక చేసినట్లు సోమవారం తెలిపారు. తునిలో జరిగిన యూటీఎఫ్ సమావేశంలో ఈ ఎంపిక జరిగిందన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి, ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలకోసం రాజీలేని పోరాటం చేస్తానని ఈసందర్భంగా ఆయన తెలిపారు.

డ్రెయిన్‌లో పేరుకున్న ప్లాస్టిక్

కిర్లంపూడిలోని పలుచోట్ల మురుగుకాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. ఇళ్ల మధ్య కాలువల నుంచి ప్రధానంగా కొత్తపేట రోడ్డు, జగపతినగరం ర.భ రహదారికి ఆనుకున్న ప్రాంతం, మార్కెట్‌యార్డులో, చిల్లంగి రోడ్డులోని సంతప్రాంతంలోకి విపరీతంగా వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. దీంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. డిప్యూటీ ఎంపీడీవో శివప్రసాద్‌ని వివరణ కోరగా పేరుకున్న వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందితో తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కిర్లంపూడి

మురుగు కాలువ కాదు సీసీరోడ్డే

గ్రామాల్లో మురుగు కాలువల నిర్వహణ రోజురోజుకు అధ్వానంగా తయారవుతుందని ప్రజలు వాపోతున్నారు. కనీస సౌకర్యాలైన మురుగుకాలువల శుభ్రతకు చర్యలు తీసుకోక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామంలో మురుగు కాలువల శుభ్రతలేక సీసీ రోడ్లపైనే కాలువలు ప్రవహిస్తున్నాయి. రోజుల తరబడి నిల్వ ఉన్న మురుగుతో విషపూరిత దోమలు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

స్తంభానికి అల్లుకున్న పాదులు

మండల కేంద్రం జగ్గంపేట శ్రీరామ్‌నగర్‌లో విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకోవడంతో ప్రమాదాన్ని తలపిస్తుంది. విద్యుత్తు డివిజనల్ కార్యాలయం ప్రహరీగోడను ఆనుకుని ఉన్న స్తంభం చుట్టూ అధికమొత్తంలో పాదులు అల్లుకున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు. కాలనీలో పలుచోట్ల విద్యుత్తు వైర్లు చేతికందే ఎత్తులో వేలాడుతున్నా క్షేత్రస్థాయి సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. – న్యూస్‌టుడే– జగ్గంపేట గ్రామీణం

దుస్థితిలో భద్రవరం పీఏసీఎస్

భద్రవరంలోని పాత సొసైటీ భవనం నిర్వహణ లేక శిథిలస్థితికి చేరుకుంది. గతంలో భద్రవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉండేది. దశాబ్దం న్నర క్రితం ఈ సొసైటీని లింగంపర్తి పీఏసీఎస్‌లో విలీనం చేశారు. దీంతో భద్రవరంలో సొసైటీ కార్యాలయాన్ని నిర్వహించే భవనం నిరుపయోగంగా మారింది. కనీస మరమ్మతులు లేకపోవడంతో నిర్మాణం దుస్థితికి చేరుకుంది. అధికారులు భవనాన్ని పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏలేశ్వరం

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన కె.శ్రీనివాస్ రూ.లక్ష విరాళాన్ని సోమవారం అందించారు. దాతకు ఈవో సుబ్బారావు నిత్యాన్నదాన పత్రాన్ని అందించారు. సత్యదేవుని ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదం ఇచ్చారు.

పీఎంఏవై-2.0 సర్వేలో అక్రమాలపై చర్యలు చేపట్టండి

కాకినాడ కలెక్టరేట్: గండేపల్లి మండలం సూరంపాలెంలో నిర్వహించిన పీఎంఏవై-2.0ఆవాస్+ సర్వేలో అక్రమాలు జరిగాయని, బాధిత సిబ్బందిపై చర్యలు చేపట్టాలని సర్పంచి మారిశెట్టి గంగాభవానీ కోరారు. దీనిపై సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో డీఆర్వో వెంకటరావుకు ఫిర్యాదు చేశారు. నవంబరు 30తో సర్వే గడువు ముగిసిన నేపథ్యంలో హడావుడిగా నవంబరు 29న అర్ధరాత్రి వరకు గ్రామంలో సర్వే చేయించారని, అర్హులకు అన్యాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను భయభ్రాంతులకు గురిచేసి స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కుంచే రాజా తన ఇష్టానుసారంగా అనర్హులను నమోదుచేయించారని ఆరోపించారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

గండేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రాజమహేంద్రవరం నుంచి జగ్గంపేట వైపు వస్తున్న గుర్తుతెలియని వ్యక్తిని, ఓ వాహనం ఢీ కొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వ్యక్తి అక్కడికి అక్కడే మృతి చెందినట్లు వీఆర్వో ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంటకాలువలో మృతదేహం గుర్తింపు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ పక్కన పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు గల వ్యక్తి బహిర్భూమికి వెళ్లి కాలువలో పడిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నీలం రంగు టీషర్టు, షార్టు ధరించి ఉన్నాడు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఉబ్బిపోయి ఉందన్నారు. వేలంక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుమేరకు కిర్లంపూడి హెచ్‌సీ ఏవీవీఆర్ఎస్ మూర్తి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విభాగినిపైకి దూసుకెళ్లిన కారు

• ఐదుగురికి స్వల్ప గాయాలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు సమీపంలో కారు వేగంగా విభాగినిపైకి దూసుకెళ్లిన ఘటన సోమవారం జరిగింది. అందులో ప్రయాణిస్తున్న వారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. విజయవాడకు చెందిన పంచాంగం శ్రీకృష్ణ కుటుంబ సభ్యులు ఐదుగురు అన్నవరం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సంతోషిమాత గుడి కూడలి వద్ద సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి అడ్డం రావడంతో విభాగినిపైకి దూసుకెళ్లింది. ఐదుగురికి స్వల్పగాయాలవ్వగా ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడిచేసిన ఇద్దరి అరెస్టు

కోటనందూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ సిబ్బందిపై దుర్భాషలాడుతూ దాడిచేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. తుని నుంచి నర్సీపట్నం వెళ్తున్న బస్సులో సోమవారం మధ్యాహ్నం టికెట్లు తీసుకునే విషయంలో మరువాడ గ్రామానికి చెందిన డి.రాజు అనే వ్యక్తి కండక్టర్ ఎస్.వరలక్ష్మీ, డ్రైవర్ పీఎస్ బాబుతో గొడవపడ్డాడన్నారు. దీంతో అతనిని రేఖవానిపాలెం వద్ద బస్సు దించివేయగా, రాజు మరికొందరితో కలిసి కోటనందూరు సెంటర్‌కు వచ్చి బస్సు ఆపి మళ్లీ గొడవకు దిగారన్నారు. ఆర్టీసీ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, బెదిరించినందుకు కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో తక్షణం స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

బెదిరించి, సామగ్రి తీసుకువెళ్లారని ఫిర్యాదు

తుని పట్టణం, న్యూస్‌టుడే: తుని పట్టణంలోని పార్కు సెంటర్ సమీపంలో ఉన్న వ్యాపారి తనను కుటుంబ సభ్యులు కొందరు బెదిరించినట్లు ఫిర్యాదు చేశారని ఎస్సై విజయబాబు తెలిపారు. వ్యాపారి ఎన్.అప్పారావు ఇంటికి ఆయన వదిన, ఆమె పిల్లలు, అల్లుడు ఆస్తి తగాదాల నేపథ్యంలో బెదిరించి, కొన్ని సామగ్రి తీసుకుపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వినూత్న విధానాలకు పురస్కారం

కోటనందూరు: సూరపురాజుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని పోలమరశెట్టి ఇందూదేవి వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తున్నందుకు పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా 'నేషనల్ టీచర్స్ ఇన్‌స్పిరేషన్ అవార్డు -2025' అందించారు. దీనిని మాజీ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, సొసైటీ అధినేత పట్నం కమల మనోహర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ చేతులమీదుగా ఆమె ఆదివారం అందుకున్నారు.

వివక్ష చూపం.. వ్యాప్తి చెందనీయం

• ఎయిడ్స్ రహిత సమాజ కోసం వైద్యులు, విద్యార్థుల ర్యాలీలు

తొండంగి: ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని తొండంగి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మెహర్ అన్నారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులు పెరుమాళ్లపురంలో ర్యాలీ నిర్వహించారు. ● **జగ్గంపేట గ్రామీణం (జగ్గంపేట):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ ప్రతిజ్ఞ, వ్యాస రచన పోటీలు, ర్యాలీ నిర్వహించారు. ● **ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు సీహెచ్‌సీ, రాచపల్లి పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యులు ప్రతిజ్ఞ చేశారు. ● **శంఖవరం:** శంఖవరంలోని పీహెచ్‌సీ వైద్యులు రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ● **గండేపల్లి:** సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఫార్మసీ విద్యార్థులు వెంకటాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ● **తుని గ్రామీణం:** వి.కొత్తూరు కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ● **ఏలేశ్వరం:** ఏలేశ్వరం పట్టణంలో సీహెచ్‌సీ డాక్టర్ లావణ్య, సిబ్బంది, సభ్యులు ర్యాలీ నిర్వహించారు.

ప్రత్తిపాడు సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ర్యాలీ

జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రచారం

తునిలో ర్యాలీ చేస్తున్న కస్తూర్బాగాంధీ విద్యార్థినులు

భవన నిర్మాణ కార్మికుల సందడి

ఏలేశ్వరం: ఏలేశ్వరంలో భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీల సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. శ్రీ విఘ్నేశ్వర భవన నిర్మాణ, తాపీ మేస్త్రీల యూనియన్ సంఘ అధ్యక్షుడిగా గెద్ద అప్పన్న ఎన్నికయ్యారు. నామపత్రాలు ఒక్కరే అందించడంతో అప్పన్న ఎన్నిక ఏకగ్రీవమైంది. కార్మికులు అధ్యక్షుడు అప్పన్నను అభినందించి విజయోత్సవం నిర్వహించారు.

నందనవనంలో అభిషేకం

రౌతులపూడి, న్యూస్‌టుడే: శృంగవరం, ఎం.చామవరం గ్రామాల్లోని నందనవనంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉమావర్ధిని నాగలింగేశ్వరస్వామికి నిర్వహించిన పూజలు, అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

గండేపల్లి: ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. గండేపల్లి మండలం సూరంపాలెం శివారున జూదం ఆడుతున్న వీరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.14,100లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామన్నారు.

పాడిరైతుకు మందుల కరవు

• ఆర్ఎస్‌కేల్లో లేక మండల కేంద్రానికి రమ్మంటున్న అధికారులు

గండేపల్లి, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో పాడిరైతులు అధికంగా పశువులపై ఆధారపడి జీవిస్తారు. వ్యవసాయ రైతులకు గిట్టుబాటు ధరను, ఎరువులను సబ్సిడీల్లో అందిస్తున్న ప్రభుత్వం, పాడి రైతులకు భరోసాగా గ్రామాల్లో ఆర్ఎస్‌కేలు నెలకొల్పి పశువైద్యులను అందుబాటులో ఉంచింది. అయితే గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వెటర్నరీ వైద్యులు అందుబాటులో ఉన్నా వైద్యం అందించేందుకు అవసరమైన మందులు ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు,మేకలు	ఆర్ఎస్‌కేలు
గండేపల్లి	2,613	9,584	14,300	10
జగ్గంపేట	5,800	13,521	23,262	12
కిర్లంపూడి	3,627	12,913	7,500	15

ప్రథమ చికిత్స గగనమే..

ప్రస్తుత ఆర్ఎస్‌కేల్లో వైద్యులు పశువులకు వైద్యం చేసి.. మందులు అందించాల్సి ఉన్నా వాటికి సంబంధించిన కాటన్, సూదులు, ఆయింట్‌మెంట్‌లు, నొప్పుల మాత్రలు కూడా లేకపోవడంతో కనీసం ప్రథమచికిత్స చేయలేకపోతున్నారు. వీరు సంబంధిత సర్వేలకు, ఇతరేతర వాటికి తప్ప, వైద్యసేవలు ఆశించిన స్థాయిలో గ్రామాల్లో అందించడం లేదని పాడిరైతులు వాపోతున్నారు.

2023 నుంచి సరఫరా లేని వైనం

గత ప్రభుత్వంలో 2021-22లో రైతు భరోసా కేంద్రాలకు (ప్రస్తుత రైతు సేవా కేంద్రాలు) అరకొరగా మందులు పంపిణీ ఉండేది. 2023 నుంచి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పశువులకు ఎటువంటి అనారోగ్యం తలెత్తినా మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. కొంతమంది పశువులను అంత దూరం తీసుకువెళ్లలేక ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి డబ్బులు పోగొట్టుకుంటున్నామని అంటున్నారు. ప్రస్తుతం గాలికుంటు వ్యాధులు (పుండ్లు), దొమ్మ (గొంతువాపు), తదితర సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నా ఆర్ఎస్‌కేల్లో మందుల సరఫరా లేకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రామయ్యపాలెం ఆర్ఎస్‌కేలో మందులు ఉండాల్సిన చోట ఖాళీగా ఉన్న వైనం

ఉన్నత అధికారులకు తెలిపాం..

ఆర్ఎస్‌కేల్లో మందుల సరఫరా లేని మాట వాస్తవమే. వెటర్నరీ వైద్యులు మండల కేంద్రాలకు వచ్చినప్పుడు తమకు అవసరమైన మందులు తీసుకుని వెళ్తుంటారు. ప్రస్తుతం ఆర్ఎస్‌కేల్లో మందులు ఉండడం లేదని ఉన్నత అధికారులకు తెలియజేశాం.

- తాతియ్య ఏడీఏ, జగ్గంపేట

(c) eenadu

వీఆర్వో లంచావతారం ● అనిశాకు పట్టించిన విశ్రాంత జవాన్

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: దేవన కొండ మండలం నల్లచెలిమల గ్రామ వీఆర్వో అశోక్ సోమవారం సాయంత్రం పత్తికొండ పట్టణంలోని ఓ దస్తావేజు లేఖరి కేంద్రంలో రూ.40 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (అనిశా) అధికారులకు చిక్కాడు. నల్లచెలిమల గ్రామ రెవెన్యూ పరిధిలో తన తల్లి పేరు మీదున్న పొలాన్ని తన పేరుపైకి మార్చేందుకు పత్తికొండ మండలం చందోలికి చెందిన విశ్రాంత జవాన్ శివకుమార్ వీఆర్వోను సంప్రదించారు. రూ.40 వేలు లంచం ఇస్తే దస్త్రాలు మార్చేందుకు వీలుంటుందని చెప్పడంతో అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. పత్తికొండలో దస్తావేజు లేఖరి కేంద్రం వద్ద వీఆర్వోకు డబ్బులు ఇస్తుండగా అనిశా అధికారులు దాడులు చేసి పట్టుకొన్నారు. డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో చందోలికి చెందిన ఓ వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించారు. 'పూర్తి వివరాలు సేకరించి, పంచనామా అనంతరం వీఆర్వోపై కేసు నమోదు చేసి అనిశా కోర్టుకు తరలిస్తామని డీఎస్పీ సోమన్న తెలిపారు.

నగదుతో పట్టుబడిన వీఆర్వో అశోక్

1,350 ఖాళీల భర్తీకి మేళా

8న కేవీఆర్‌లో నిర్వహణ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలోని ప్రభుత్వ కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న ఉద్యోగ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డా.ఎ.సిరి సూచించారు. కర్నూలు కలెక్టరేట్‌లో సోమవారం నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా పోస్టర్లను కలెక్టర్, జేసీ నూరుల్ ఖమర్ ఆవిష్కరించారు. 19 ప్రైవేటు కంపెనీల్లో 1,350 ఖాళీల భర్తీ కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 18- 35 ఏళ్ల మధ్య వయసు కలిగిన పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, పీజీ చదివిన వారు హాజరవ్వాలని సూచించారు. nypunyam.ap.gov.in లింక్‌లో తమ వివరాలను నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. జిల్లా ఉపాధి కల్పనాధికారిణి పి.దీప్తి మాట్లాడుతూ ఉద్యోగ మేళాకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా 83742 31357, 63000 09183 నంబర్లకు సంప్రదించాలన్నారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ, నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చంటోళ్ల వణుకు.. వైద్యం కునుకు

● సీజనల్ వ్యాధుల బారిన భావితరం
● ప్రభుత్వాస్పత్రుల్లో వసతులు కరవు

చలి వణికిస్తోంది.. నవజాత శిశువులు, చిన్నారులు ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నారు.. దగ్గు, జలుబు, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. నిత్యం వెయ్యి వరకు చిన్నారుల ఓపీ ఉంటోంది. బనగానపల్లి, డోన్, ఆదోని, ఎమ్మిగనూరు వంటి పట్టణాల్లో వంద వరకు ఓపీ నమోదు అవుతోంది. ప్రాథమిక వైద్యం చేసి నంద్యాల, కర్నూలు జిల్లా కేంద్రాల్లోని సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. అక్కడ పడకలు దొరక్క ప్రైవేటుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.
– న్యూస్‌టుడే, కర్నూలు, ఆదోని, నంద్యాల వైద్యం

ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు

● నవజాత శిశువులను వార్మర్లు, ఇంక్యుబేటర్ల సేవలు అవసరం. కూర్పోగలిగిన చిన్నారులకు నెబ్యులైజర్లు అందుబాటులో ఉంచాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ఇవి కానరావడం లేదు. కొన్ని చోట్ల ఉన్నప్పటికీ అవసరమైన వైద్యులు, సిబ్బంది లేక నిరుపయోగంగా మారాయి.

● కొవిడ్‌కు ముందుకు సీహెచ్‌సీలకు విలువైన పరికరాలు అందజేశారు. వీటిని వినియోగించుకోకపోవడం.. చిన్నపాటి మరమ్మతులు చేయకపోవడంతో మూలన పడ్డాయి.

ఆసుపత్రి	సంఖ్య
ఏరియా	3
సామాజిక	18
ప్రాథమిక	87

ప్రైవేటులో భారం

ప్రైవేటుగా నెబ్యులైజర్లు పెట్టించాలంటే రూ.200 పెట్టి ఓపీ తీసుకోవాలి. తర్వాత నెబ్యులైజరుకు రూ.20-50 వరకు ఖర్చవుతుంది. ఇక ఇంక్యుబేటర్లు, వార్మర్లు సేవలు అందాలంటే రోజుకు సరాసరిన రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లించాల్సిందే.

వైద్యం కోసం చిన్నారులను కర్నూలు సర్వజన ఆసుపత్రికి తీసుకొచ్చిన తల్లులు

● కొవిడ్ సమయంలో ఆస్పత్రుల వద్ద ఎల్‌పీఎం ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటిని ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడం.. నిపుణులను నియమించకపోవడం, నిర్వహణ కొరవడంతో మూలకు చేరాయి.

సర్వజనం తరలివస్తోంది

● కర్నూలు సర్వజన వైద్యశాలలోని పీడియాట్రిక్ విభాగంలో ఈ ఏడాది అక్టోబరులో కేసులను పరిశీలిస్తే అప్పుడే పుట్టిన శిశువుల నుంచి నెలలోపు కేసులకు సంబంధించి 280 అడ్మిషన్లు జరిగాయి. ఇందులో 95 కేసులు ఆసుపత్రిలో జరిగిన ప్రసవాలు కాగా.. మరో 185.. బయట నుంచి వచ్చిన కేసులున్నాయి. నవంబరులో 292 న్యూబార్న్ అడ్మిషన్లు జరగ్గా.. అందులో 117 వరకు ఆసుపత్రిలో జరిగిన ప్రసవాలున్నాయి. 175 మంది బయటి నుంచి వచ్చిన కేసులే ఉన్నాయి.

● నంద్యాల సర్వజన ఆస్పత్రిలో చిన్నపిల్లల ఓపీ 150 వరకు ఉంటోంది. ఐపీ 80 వరకు ఉంది. మాతాశిశు సంరక్షణ వైద్యశాలలో ఎన్‌సీయూకు సంబంధించి 20 పడకలు ఉండగా.. మరో 10 వరకు అవసరమని వైద్యులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..

● ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో ఆరు నెబ్యులైజర్లు ఉండగా.. మూడు పనిచేయడం లేదు. ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవడంతో సిలిండర్ల ద్వారా ప్రాణ వాయువు అందిస్తున్నారు.

● ఎమ్మిగనూరులో 100 వరకు ఓపీ ఉంటోంది. అవసరమైన వార్మర్లు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

పత్తికొండ: సీహెచ్‌సీలో నిత్యం 80 వరకు ఓపీ ఉంటుంది. ఇంక్యుబేటర్లు ఉన్నప్పటికీ అవసరమైన సిబ్బంది లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

పల్లె సుగ్రంథం

పల్లె నరసింహారెడ్డి

"నిరుద్యోగ యువతకు బాసటగా నిలుస్తున్నారు విశ్రాంత ఉద్యోగి పల్లె నరసింహారెడ్డి. గ్రంథాలయ అధికారిగా పని చేసిన ఆయన ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఆయన ఓసారి తన సొంతూరు ఆర్.పాంపల్లెకు వెళ్లారు. అక్కడ యువత ఖాళీగా ఉండటాన్ని గమనించిన ఆయన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. రూ.5 లక్షలు వెచ్చించి రెండు గదులున్న ఇంటిని కొనుగోలు చేశారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం "భారత్ గ్రంథాలయం" విజ్ఞాన భాండాగారాన్ని నెలకొల్పారు. రూ.20 వేల ఖర్చుతో గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలను కల్పించారు. దినపత్రికలు, మాసపత్రికలతో పాటు ఉద్యోగ పరీక్షలకు అవసరమైన 500 పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఇందులో ఉద్యోగ పరీక్షలకు అవసరమైనవి, ఆధ్యాత్మిక గ్రంథాలు, నవలలు, కథల పుస్తకాలు ఉన్నాయి. లైబ్రరీ ఆవరణలో రోజూ సాయంత్రం విద్యార్థులు ఆడుకునేందుకు అవకాశం కల్పించారు. గ్రంథాలయ నిర్వాహకుడిని నియమించి ప్రతి నెలా రూ.3 వేల వేతనాన్ని అందిస్తున్నారు." – న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ

గూడువు పొడిగింపు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : గ్రామీణ పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. పీఎం ఆవాస్ గ్రామీణ్ యోజన 2.0 పథకం ద్వారా వీరికి ఎక్కువ మందికి ప్రయోజనం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. పక్కాగృహం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

దరఖాస్తు ఎలా

● సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోవాలని అనుకునేవారు గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ సహాయకులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్ లేదా ఇంటి స్థల పత్రం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలి.

● ఇంటి స్థలం లేని వారు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

	★ కర్నూలు	★ నంద్యాల
సొంతిల్లు లేనివారు	41,116	29,042
వచ్చిన దరఖాస్తులు	27,076	30,802

ఎంత ఇస్తారు

సొంత స్థలంలో పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.20 లక్షలు, స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, ఉపాధిహామీ పథకం కింద రూ.27 వేలు అందజేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.21 వేలు అందించనుంది. మొత్తం రూ.1.80 లక్షల సాయం అందనుంది.

70,158 మందికి సొంతిల్లు లేదు

ఉమ్మడి జిల్లాలో డిమాండ్ సర్వే ప్రకారం సొంతిల్లు లేని వారు 70,158 మంది ఉన్నట్లు గుర్తించారు. నవంబరు 30వ తేదీ వరకు 57,878 దరఖాస్తులు వచ్చాయి. డిమాండ్ సర్వే ప్రకారం మరో 12,280 మంది దరఖాస్తు చేసుకోలేదు.

7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)ను ఈనెల 7వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో శామ్యూల్‌పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు bse.ap.gov.in వెబ్‌సైట్, మనమిత్ర వాట్సప్ ద్వారా హాల్‌టికెట్లు పొందవచ్చన్నారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందుతుందని వివరించారు.

గీత ప్రదాతకు ప్రణామమ్

గీతా జయంతిని పురస్కరించుకుని కర్నూలులోని శ్రీకృష్ణ ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక పార్కు రోడ్డులోని ఇస్కాన్ ఆలయంలో బలభద్ర, సుభద్ర, జగన్నాథుల మూలవిరాట్టులకు ప్రత్యేక అలంకరణ చేశారు. రఘునందన్ ప్రభు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.
– న్యూస్‌టుడే, కర్నూలు ఆధ్యాత్మికం

పతకాల రాకెట్

కర్నూలు నగరానికి చెందిన ఇంటర్మీడియట్ కుర్రాడు డి.సాయి శంకర్ లాన్ టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు, ఆలిండియా స్థాయిలో 150వ ర్యాంకులో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ (ఎంపీసీ) మొదటి సంవత్సరం చదువుతున్న ఆ కుర్రాడు గత ఐదేళ్లుగా లాన్ టెన్నిస్ సాధన చేస్తున్నారు. ఇప్పటి వరకు 14 బంగారు, ఒక వెండి పతకం అందుకొన్నారు. ఆలిండియా లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 30న భువనేశ్వర్‌లో అండర్-17 విభాగంలో పాల్గొన్నారు. నవంబరు 3 నుంచి 6వ తేదీ వరకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకంతో సత్తా చాటారు. "నిత్యం రెండు గంటల పాటు మహమ్మద్ రఫీ వద్ద శిక్షణ తీసుకుంటున్నా.. వచ్చే ఏడాది థాయిలాండ్‌లో జరిగే ఐటీఎఫ్ (అంతర్జాతీయ టెన్నిస్ ఫెడరేషన్) పోటీల్లో ప్రవేశం పొందేందుకు సాధన చేస్తున్నట్లు" శంకర్ వివరించారు. – న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

ఇంటికొచ్చారు పంచాయితీ పెట్టారు

■ గందరగోళంగా స్వామిత్వ సర్వే

పల్లెల్లో ఇళ్ల స్థలాలకు యాజమాన్య హక్కు పత్రాలు అందించాలన్న ఉద్దేశంతో చేపడుతున్న స్వామిత్వ సర్వే గందరగోళంగా మారింది. ఇంజినీరింగ్ సహాయకులు భూములకు కొలతలు వేసిన తర్వాత సర్వేయర్ మ్యాప్‌లు సిద్ధం చేయాలి. దస్త్రాల నిర్వహణ, యాజమాన్య హక్కులు కల్పించేలా చూడాలి. లబ్ధిదారుల సమక్షంలో కొలతలు వేసి సర్వే చేయాల్సి ఉండగా ఇష్టానుసారంగా వ్యవహరించారు. మొదటి విడత సర్వే పూర్తైనా లబ్ధిదారులకు ఆస్తి పత్రాలు ఇవ్వలేదు.
– న్యూస్‌టుడే, కర్నూలు నగరం, నంద్యాల గ్రామీణ

విడత	గ్రామాలు	అసెస్‌మెంట్లు
తొలి	74	62,005
రెండు	13	15,620
మూడు	72	50,760

హాలహర్వి గ్రామ పంచాయతీలో రోవర్‌తో కొలతలు వేస్తున్న సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి తదితరులు

ఫిర్యాదుల వెల్లువ

» నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామంలో తొలి దశ సర్వే సరిగా చేయలేదంటూ గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు మరోసారి రోవర్లతో సర్వే చేయించి తప్పులు సరిదిద్దారు.

» గోస్పాడు గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన తొలి దశ సర్వేలో తప్పులున్నాయంటూ గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. హాలహర్వి మండలం మాచనూరు గ్రామంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

» రెండో విడత సర్వేలో భాగంగా మద్దికెర మండలం బురుజుల గ్రామంలో 16, హొళగుంద మండలం నకిరేకల్‌లో 30, పెద్దకడబూరు మండలం నౌలేకల్‌లో 5 ఫిర్యాదులొచ్చాయి.

రెండో విడత పూర్తికాకనే..

» ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండో విడత స్వామిత్వ సర్వే పూర్తి చేయలేదు. అంతలోనే మూడో విడత సర్వే ప్రారంభించడం గమనార్హం. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలంటూ ఉన్నతాధికారుల ఒత్తిళ్ల నేపథ్యంలో సిబ్బంది కార్యాలయాల్లో కూర్చుని మ్యాప్‌లు రూపొందిస్తుండటం గమనార్హం.

» పలు ప్రాంతాల్లో సర్వేయర్లు, వీఆర్వోలు అందుబాటులో లేకపోవడంతో సర్వే సాఫీగా జరగడం లేదు. ఉమ్మడి జిల్లాలో 19 రోవర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మండలానికి ఒక రోవర్ కూడా సమకూర్చలేని పరిస్థితి

కొలత.. యజమానుల కలత

» ఉమ్మడి కర్నూలు జిల్లాలో 973 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. తొలి విడత సర్వేలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 86 గ్రామాల్లో సర్వే చేశారు. అస్తవ్యస్తంగా చేశారని.. ఆస్తి పత్రాల్లో వివరాలు సరిగా నమోదు చేయలేదంటూ గ్రామ సభల్లో పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి.

» నిబంధనల ప్రకారం లబ్ధిదారుల సమక్షంలో సర్వే చేసి కొలతలు తీసి వివరాలు నమోదు చేయాల్సి ఉంది. చాలా గ్రామాల్లో ఇష్టానుసారంగా నమోదు చేయడంతో సమస్యలు ఏర్పడ్డాయి.

» స్థలాల కొలతల్లో తేడాలు రావడం.. సరిహద్దు సమస్యలు ఏర్పడ్డాయి. అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదు.

దివ్యధామం

పచ్చని కొండలు.. 50 ఎకరాల స్థలం.. దివ్యధామంగా వెలుగొందుతోంది. అవుకు మండలంలోని మంగంపేట శివారులోని కొండల్లో 20 ఏళ్ల కిందట గణపతిస్వామి ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. దాతలిచ్చిన రూ.10 లక్షలతో ఆంజనేయస్వామి ఆలయం, రూ.కోటితో కోదండరామాలయం నిర్మించారు. రూ.10 కోట్లతో వెంకటేశ్వరస్వామి ఆలయానికి పునాది వేశారు. ప్రస్తుతం గోపురాల నిర్మాణం జరుగుతోంది. అక్కడే ఉన్న కాశినాయన ఆశ్రమంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది. ఈనెల 5 నుంచి 7 వరకు జరిగే కాశినాయన ఆరాధనోత్సవాలకు ఆశ్రమం ముస్తాబైంది. వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, అనంతపురం ప్రాంతాల నుంచి 30 వేల మంది భక్తులు తరలొస్తారు. డోన్, అనంతపురం, బనగానపల్లి నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. – న్యూస్‌టుడే, అవుకు

పరీక్షకు పదింతల దోపిడీ

ప్రైవేటు పాఠశాలల దందా ● ఫిర్యాదులందినా చర్యలు శూన్యం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు పేరుతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు రూ.వేలల్లో దోచుకుంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ బడిలో రూ.125తో పాటు అదనంగా రూ.300 వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రైవేటు స్కూళ్లలో మాత్రం పరీక్ష రుసుముతో పాటు స్పెషల్ ఫీజు పేరుతో రూ.2- 3 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎందుకని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. అదనపు దోపిడీపై కలెక్టర్ స్పందించి అడ్డుకట్ట వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు విద్య

	■ ప్రైవేటు పాఠశాలలు	■ విద్యార్థులు
కర్నూలు	209	10,500
నంద్యాల	172	9,123

అధికారులకూ వాటా

● పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు పేరుతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అదనంగా రూ.వేలల్లో వసూలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు అందినా చర్యలు శూన్యమే.

● వసూలు చేస్తున్న సొమ్ములో జిల్లా పరీక్షల విభాగం అధికారులకు కొంత చెల్లిస్తున్నట్లు ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో పాటు పరీక్షల సమయంలో కేంద్రాల నిర్వహణ, నీరు, విద్యుత్తు ఇతర వసతులకు ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పెషల్ ఫీజు సేకరిస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

● ఈ సొమ్ముతో మీ పిల్లలకు అనువైన పరీక్ష కేంద్రాన్ని కేటాయించేందుకు ప్రయత్నిస్తామని కొన్ని పాఠశాలల నిర్వాహకులు చెబుతున్నారు.

వామ్మో.. స్పెషల్ ఫీజు

● వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. రెగ్యులర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రూ.125 రుసుము నిర్ణయించారు. సప్లిమెంటరీ కింద మూడు సబ్జెక్టుల్లోపు ఉంటే రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబరు 10వ తేదీ లోపు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించే అవకాశం ఉంది. ఆ గడువు దాటితే అపరాధ రుసుము వసూలు చేయాలని విద్యాశాఖ ప్రత్యేకంగా ఉత్తర్వు జారీ చేసింది. చాలామంది తల్లిదండ్రులకు దీనిపై సమాచారం లేకపోవడంతో అపరాధ రుసుము, స్పెషల్ ఫీజు పేరుతో రూ.125తో పాటు అదనంగా రూ.2 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

అమ్మల అవస్థ

కర్నూలు సర్వజన వైద్యశాలలోని ప్రసూతి, మాతాశిశు విభాగాల్లో నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటుంది. వైద్యం కోసం గంటల తరబడి క్యూలో నిరీక్షించాల్సి వస్తోంది. అరకొరగా కుర్చీలు ఏర్పాటుచేసినా కొన్ని దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు ఎక్కువసేపు నిలబడలేక అల్లాడుతున్నారు.– ఈనాడు, కర్నూలు

రూ.7 కోట్లు ఎప్పుడిస్తారో

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నుంచి సెప్టెంబరు 20వ తేదీ వరకు మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోళ్లు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో 2,804 మంది రైతుల నుంచి 19,713 మెట్రిక్ టన్నుల ఉల్లి కొనుగోలు చేశారు. వీరికి రూ.17 కోట్లు ఇవ్వాల్సి ఉంది. 70 రోజులవుతున్నా కొందరు రైతులకు ఇప్పటికీ నగదు చెల్లింపులు జరగలేదు.
–న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

● సెప్టెంబరు మొదటి వారంలో ప్రభుత్వం రూ.10 కోట్లను మార్క్‌ఫెడ్‌కు మంజూరు చేసింది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు మద్దతు ధరతో ఉల్లి విక్రయించిన 250 మంది రైతులకు రూ.1.54 కోట్ల మేర నగదు చెల్లింపులు చేశారు. ఆ తర్వాత అక్టోబరు 20 నుంచి నవంబరు మొదటి వారం వరకు సరకు అందించిన 1,441 మంది రైతులకు రూ.8.46 కోట్లు మంజూరు చేశారు.

● 1,100 మంది రైతులు గత రెండు నెలలుగా రూ.7 కోట్ల నగదు కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. వివిధ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోయింది.

నెలలుగా ఎదురుచూస్తున్నాం

– శ్రీనివాసులు, టి.సోమలగూడూరు

సెప్టెంబరు 12, 16 తేదీల్లో ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.1,200కు సుమారు 166 క్వింటాళ్ల ఉల్లిని కర్నూలు మార్కెట్‌లో ప్రభుత్వానికి విక్రయించా. ఉల్లి విక్రయించి 75 రోజులైనా ఇప్పటివరకు నగదు చెల్లించలేదు. రూ.1,91,553 కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నా. నగదు చెల్లించి పుణ్యం కట్టుకోండి. ఇప్పటికే సాగు కోసం అప్పులు చేశాం.

వరించిన నవార

రైతేరాజు 6లో

"30 సెంట్ల పొలం.. 5 క్వింటాళ్ల వరి ధాన్యం.. రూ.30 వేల ఆదాయం గడించారు సి.బెళగల్ మండలం కొత్తకోటకు చెందిన రైతు రంగస్వామి. నవార దేశీ రకం వరిని సాగు చేసి తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. రూ.360 వెచ్చించి 3 కిలోల వడ్లు కొనుగోలు చేశారు..రూ.100 వెచ్చించి ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేశారు. పొలంలో రెండు సంచుల వేప చెక్క కోసం రూ.1900 వెచ్చించారు. జీవామృతం, దశపద కషాయాల కోసం మరో రూ.2000 ఖర్చు చేశారు. చేతికొచ్చిన చేనును కోయగా ఐదు క్వింటాళ్ల ధాన్యం వచ్చింది. మిల్లులో మరాడించి 3 క్వింటాళ్ల బియ్యాన్ని క్వింటాకు రూ.12 వేలకు విక్రయించారు."– న్యూస్‌టుడే, సి.బెళగల్

జ్ఞాపకాల మదిలో...

జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప

స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు

కర్నూలు: 99899 97628
80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

బుల్లెట్ రైలు మార్గం

ముమ్మరంగా సర్వే పనులు ● ట్రాక్ నిర్మాణానికి అడుగులు

ఈనాడు, కర్నూలు

ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా బుల్లెట్ రైలు వెళ్లేందుకు 'మార్గం' సుగమం అవుతోంది. దేశవ్యాప్తంగా కొన్ని మార్గాల్లో బుల్లెట్ ట్రైన్లు నడపాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్- బెంగళూరు మార్గాన్ని ఎంపిక చేశారు.. అందుకు అనువైన ట్రాక్ నిర్మాణానికి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా గుంటూరు-గుంతకల్లు, ముద్కేడ్-డోన్ డబ్లింగ్ పనులు వేగవంతమయ్యాయి. అమృత్ భారత్ కింద స్టేషన్ల ఆధునికీకరిస్తున్నారు.

1.20 గంటలో బెంగళూరుకు

● కర్నూలు- బెంగళూరు మధ్య దూరం 427 కి.మీ. మేర ఉంది. ప్రస్తుతం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో 5.30 గంటలు పడుతోంది. దీని గరిష్ఠ వేగం 180 కి.మీ.లు అయినప్పటికీ 130 కి.మీ. వేగంతోనే నడుపుతున్నారు.

● బుల్లెట్ రైలు అందుబాటులోకొస్తే కర్నూలు నుంచి బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌కు 1.20 గంటలో చేరుకోవచ్చు. దీని గరిష్ఠ వేగం గంటకు 350 కి.మీ.. భద్రత కారణాల నేపథ్యంలో 320 కి.మీ. వేగంతోనే నడుపుతారు. ఈ వేగం తట్టుకునేలా అనువైన ట్రాక్ నిర్మించాల్సి ఉంటుంది.

డబ్లింగ్.. వేగవంతం

● గుంటూరు- గుంతకల్లు రైలు మార్గంలో డబ్లింగ్ పనులు తుది దశకు చేరుకొన్నాయి. రూ.3,631 కోట్లు వెచ్చించి 401.47 కి.మీ. మార్గాన్ని బాగు చేస్తున్నారు. 57.738 కి.మీ. మేర పనులు చేయాల్సి ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇవి పూర్తైతే నంద్యాల నుంచి గుంటూరు, విజయవాడ, గుంతకల్లు వైపు పలు నూతన సర్వీసులు నడిపేందుకు అవకాశం ఉంటుంది.

● ఉత్తర-దక్షిణ భారతదేశ ప్రాంతాలను కలిపే ఉద్దేశంతో ముద్కేడ్-డోన్ రైల్వే లైన్‌కు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మహారాష్ట్రలోని ముద్కేడ్ నుంచి ఏపీలోని డోన్ వరకు 417.88 కి.మీ. మేర రూ.4,686.09 కోట్లతో డబ్లింగ్ పనులు చేపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న మహబూబ్‌నగర్-డోన్ మధ్య 197 కి.మీ. మేర పనులు 2029 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. పూర్తైతే హైదరాబాద్ నుంచి బెంగళూరు, తిరుపతి, చెన్నై వైపు ఎక్కువ రైళ్లను నడిపే అవకాశముంటుంది.

పూత దశ.. జాగ్రత్తలతో రక్ష

రైతేరాజు

నవంబరు నుంచి జనవరి వరకు మామిడి చెట్లు పూతకు వస్తాయి. ఈ సమయంలో సరైన మెలకువలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ సూచించారు.

● జనవరి మూడో వారంలో లీటరు నీటిలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ.+కార్బండజమ్ ఒక గ్రాము లేదా హెక్సాకొనజోల్ ఒక మి.లీ. కలిపి చెట్లపై పిచికారీ చేసి దెబ్బకొట్టాలి. తేనెమంచు పురుగు, మచ్చ తెగుళ్లు, బూడిద తెగుళ్లను నివారించవచ్చు. ఈ మందులను పూత, మొగ్గ దశలో, బఠాణీ గింజ సైజులో పిందెలు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.

● పిందె రాలుడు: ఆకు మొగ్గలు పూతగా మారే వరకు చెట్లకు నీరు పారించరాదు. స్వతంతకు నీటి తేమను తగ్గించాలి. మొక్కల మధ్య నీరు నిలవకుండా చూడాలి. డిసెంబరు నుంచి చలి అధికంగా ఉండి రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గిన కారణంగా పూల కాడలు పొడవు పెరగకుండా కదిలించకపోతేయి. దిగుబడి పుష్పాలు తగ్గి దిగుబడిపై ప్రభావం పడుతుంది. ఈ పరిస్థితుల్లో నాఫ్తలిన్ ఎసిటిక్ ఆమ్లం 20 పీపీఎం గాఢతతో (2 మి.లీ. వంద లీటర్ల నీటికి) మొగ్గ బయటకు రాగానే ఒక సారి పిచికారీ చేయాలి. పూలకాడలు 15-20 సెం.మీ. పొడవు పెరిగి అధిక పుష్పాలు కలిగి ఉంటాయి.

● చెట్లు వారం నుంచి పది రోజుల్లో పుష్పించడానికి, పూత మొగ్గలు బయటకు రాగానే ఒక సారి నీటితడి ఇవ్వాలి. పుష్పించడానికి అవసరమయ్యే రసాయనాలు, హార్మోన్లు ప్రతి రెమ్మకు చేరి చెట్టంతా ఒకేసారి పుష్పిస్తుంది. కాయలన్నీ ఒకే దశలో ఉండటం వల్ల కాయల కోత కూడా సులభమవుతుంది.

● పిందెలు జొన్న గింజ, గోళీకాయ పరిమాణంలో ఉన్నప్పుడు ఎక్కువగా రాలుతుంటాయి. దీనివల్ల దిగుబడి తగ్గిపోతుంది. పిందె రాలుడు నివారణకు సరైన సమయంలో ఎన్ఏఏ ద్రావణాన్ని 20 పీపీఎం గాఢతతో పిచికారీ చేసి నివారించవచ్చు.

– న్యూస్‌టుడే, బేతంచెర్ల

పూతతో మామిడి తోట

నిప్పుపెడితే.. ముప్పే

జిల్లాలో వేలాది ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. పంటను కోసిన వెంటనే రెండో పంట సాగు చేసుకునేందుకు రైతులు భూమిని సిద్ధం చేయాలనే తొందరలో చాలా మంది అన్నదాతలు కొయ్యలకు నిప్పు పెడుతున్నారు. ఈసారి రెండో పంటకు నీరు లేదని అధికారులు ప్రకటించారు. కొంత మంది రైతులు వరి కొయ్యలు కాల్చేస్తున్నారు. నిప్పంటించడం వల్ల నేలను సారవంతం చేసే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు చనిపోతాయని విషయాన్ని కర్షకులు గమనించాలని హొళగుంద మండల వ్యవసాయాధికారి జిలానీబాషా తెలిపారు. వరి మాగాణుల్లో నిప్పు పెట్టడం వల్ల వాతావరణంలో కాలుష్యం పెరుగుతుంది. కొయ్యలు కాల్చిన చోట నేల బిగువుగా మారి, నీటిని పీల్చుకునే గుణం కోల్పోతుందని పేర్కొన్నారు.

వరి మాగాణిలో కాలుతున్న వరి గడ్డి

సందేహాలు సమాధానాలు

?: మినుము పంటలో ఆకులపై లేత పసుపు వర్ణం గుండ్రని చిన్న మచ్చలతో పాటు కాయల్లో రంధ్రాలు కనిపిస్తున్నాయి. పంట ఇప్పుడు పిందె దశ దాటి పోయింది. మరో నెల రోజుల్లోపు పంట చేతికొస్తుంది. నివారణ తెలపండి.
– పుల్లారెడ్డి, ఓంగుటూరు

✔: మారుకా మచ్చల పురుగు తెగులు ఇది. పంటపై మచ్చల పురుగు ఆశించి ఉంటుంది. పంటలో పురుగులు కనిపిస్తే.. వెంటనే ఒక లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా డయోడి కార్బ్ 1.0 గ్రాములు లేదా ఎసిఫేట్ 1.0 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉద్ధృతి అధికంగా ఉంటే.. ఒక లీటరు ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా క్లైనాల్ఫిడ్ 0.3 మి.లీ. నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
– న్యూస్‌టుడే, బనగానపల్లి

బాలరాజు, శాస్త్రవేత్త కేవీకే

పశువుల్లో శ్వాసకోశ వ్యాధులు

శీతాకాలంలో పాడి పశువులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హొళగుంద మండల పశువైద్యాధికారిణి ప్రసన్న తెలిపారు. చలి ఎక్కువగా ఉండటం వల్ల శ్వాసకోశ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది. షెడ్ చుట్టూ తెరలు, గోనెసంచులు కట్టి లోపలికి గాలి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గడ్డిని నేలపై పరుస్తూ వేయాలని, పశువులకు ఎండు గడ్డితో పాటు మేపాలన్నారు. ఉదయం మంచు తగ్గిన తర్వాత బయట వదలాలన్నారు. మాంసకృత్తులు ఉన్న దాణా రోజుకు అదనంగా 20శాతం పెంచి అందించాలని సూచించారు.
– న్యూస్‌టుడే, హొళగుంద

చలికాలం తెగుళ్లను తరిమేద్దాం

శీతాకాలంలో ముసురు వాతావరణం వల్ల మిరపలో పురుగు, తెగుళ్ల బెడద ఉంటుంది. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల నివారించుకోవచ్చని ఉద్యాన శాఖ అధికారి శ్రీవాణి తెలిపారు. రసం పీల్చే పురుగు, ఆకుమచ్చ, ఆకుముడత, బూడిద తెగుళ్లు ఆశిస్తున్నాయి.

● **బూడిద తెగులు:** తెగులు సోకిన మొక్కపైన, ఆకుల కింది భాగంలో తెల్లటి బూడిద రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు లీటరు నీటిలో గంధకం (నీటిలో కరిగేది) మూడు గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. లేదా కేరథాన్ ఒక మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

● **రసం పీల్చే పురుగులు:** నల్లి, పేను బంక, తామర పురుగులు మొక్క లేత భాగాల నుంచి రసం పీల్చడం వల్ల ఆకుముడత తెగులు వ్యాపిస్తోంది. మొక్కలు గిడసబారి పూత, పిందెలు రాలిపోతాయి. నివారణ కోసం కంది, జొన్న, సజ్జ వంటి పంటలతో కంచె పంట వేసుకోవాలి. ఎర పంటలుగా బంతి, ఆముదం వేసుకోవాలి. ఎకరానికి 10 నుంచి 20 నీలం, పసుపుపచ్చ రంగు అట్టలను పైరు కంటె అడుగు ఎత్తులో పెట్టుకోవాలి. లీటరు నీటిలో ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా థయోమిథాక్సామ్ 0.3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్న మొక్కలను పొలం నుంచి తొలగించి నాశనం చేయాలి.

● ఆకుమచ్చ తెగులు నివారణకు లీటరు నీటిలో కార్బెండిజమ్+మాంకోజెబ్ 2.5గ్రాములు లేదా అజాక్సిస్ట్రోబిన్ 2మి.లీ. కలిపి పిచికారీ చేసుకోవాలి.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

ఔషధాలు వాడండి.. ఆరోగ్యంగా జీవించండి

కర్నూలు వి.క్యాంపు, న్యూస్‌టుడే: హెచ్ఐవీతో బాధితులు ఏఆర్టీ ఔషధాలను క్రమం తప్పకుండా వాడుతూ ఆరోగ్యంగా జీవించాలని కలెక్టర్ డా.ఎ.సిరి సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ నుంచి సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 7 వేల మంది ఏఆర్టీ మందులు వాడుతున్నారని తెలిపారు. హెచ్ఐవీ బాధితుల పట్ల ప్రజలు మానవత్వంతో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.భాస్కర్, డీసీహెచ్ఎస్ డా.జాఫ్రుల్లా, వైద్య సిబ్బంది, వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చట్ట విరుద్ధం

కర్నూలు గాయత్రి ఎస్టేట్, న్యూస్‌టుడే: ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపటం చట్ట విరుద్ధమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా నగరంలోని న్యాయ సేవా సదన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ బాధితులు న్యాయ సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబరు 15100కు సంప్రదించాలని సూచించారు.

బాధితులకు న్యాయం చేస్తాం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయించిన బాధితుల ఫిర్యాదులపై విచారించి చట్టం పరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ హామీ ఇచ్చారు. కర్నూలు కొత్తపేటలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 102 మంది ఎస్పీకి ఫిర్యాదు పత్రాలు సమర్పించారు. అరికెర జిల్లా పరిషత్ పాఠశాలలో డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఇప్పిస్తానని రూ.1.95 లక్షలు, ఆరేకల్లు గురుకుల పాఠశాలలో స్పోర్ట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌లో పోస్టు ఇప్పిస్తానని రూ.80 వేలు తీసుకుని దయాకర్‌తో పాటు మరో ఇద్దరు మోసగించారని ఆలూరుకు చెందిన అంజలి ఫిర్యాదు చేశారు. తన 2.80 ఎకరాల పొలాన్ని అక్రమంగా తన పేరుపై నమోదు చేయించుకుని తమ్ముడు చిన్న తిరుపాలు మోసగించాడని వెల్దుర్తికి చెందిన చిన్న పుల్లయ్య విన్నవించుకున్నారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పేరుతో అబ్దుల్ గఫార్‌ఖాన్ రూ.50 వేలు తీసుకుని మోసగించాడని కర్నూలులోని కృష్ణానగర్‌కు చెందిన నాయుడు ఫిర్యాదు చేశారు. పదెకరాల పొలంలో పామాయిల్ మొక్కలు నాటిస్తానని రూ.లక్ష తీసుకుని గొల్ల రమేష్ మోసగించాడని గూడూరు మండలం చనుగొండ్లకు చెందిన గుడిసె గుంబప్ప ఎస్పీకి విన్నవించారు. దివ్యాంగుడినైన రియాజ్ అనే వ్యక్తి రుణం ఇప్పిస్తానని నమ్మించి ఆధార్‌కార్డు, ఫొటోలు తీసుకుని లోన్ ద్వారా రూ.80 వేల విలువ చేసే చరవాణి కొనుగోలు చేసి మోసగించాడని కర్నూలుకు చెందిన రజాక్‌బాషా వాపోయారు. నకిలీ విద్యార్హత, కుటుంబ ధ్రువీకరణ పత్రాలతో ఇద్దరు వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారని కర్నూలు గణేశ్‌నగర్‌కు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.

బాధితుల సమస్య వింటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

డిగ్రీ పరీక్షల్లో తొమ్మిది మంది డిబార్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం జరిగిన డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన తొమ్మిదిమంది విద్యార్థులను డిబార్ చేసినట్లు వీసీ వెంకటబసవరావు ఒక ప్రకటనలో తెలిపారు. 8,558 మంది విద్యార్థులకు గాను 7,736 మంది పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు.

93.38 శాతం పింఛన్ల పంపిణీ

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద సోమవారం ఉదయం నుంచి అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులకు పింఛను సొమ్ము పంపిణీ చేశారు. మొదటిరోజు 93.38 శాతం పింఛన్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు. 2,37,733 మందికి గాను 2,22,005 మందికి పింఛను నగదు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

తారాపురం కార్యదర్శి సస్పెన్షన్

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : పెద్దకడుబూరు మండలం తారాపురం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ డీపీవో భాస్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఆధార్ సంఖ్యలను తప్పుగా నమోదు చేయడంతో పాటు వాటిని సరిదిద్దడంలో నిర్లక్ష్యం వహించినందుకు విధుల నుంచి తప్పించాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశించారు. విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో పాటు ఇటీవల కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరవడం కూడా సస్పెన్షన్‌కు కారణమని తెలుస్తోంది.

◆ ఆదోని మండలం సాదాపురం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఆదోని ఎంపీపీ కార్యాలయ ఏవో నారాయణస్వామికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీపీవో సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పీజీ ఫలితాల్లో కేఎంసీ విద్యార్థులకు రాష్ట్ర ర్యాంకులు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన వైద్య విద్య ఫలితాల్లో కర్నూలు మెడికల్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ తెలిపారు. ఫిజియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, ఫార్మ పీజీ తృతీయ సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు సోమవారం ప్రిన్సిపల్‌ను కలిశారు. కమ్యూనిటీ మెడిసిన్‌లో డాక్టర్ కొప్పోలు కీర్తన ద్వితీయ, ఫిజియాలజీలో డాక్టర్ మౌనిక ద్వితీయ, డాక్టర్ యశ్వంత్ తృతీయ ర్యాంకులు సాధించారని వెల్లడించారు. ఫార్మసీ పీజీ పరీక్షల్లో డాక్టర్ ధరణి తృతీయ ర్యాంకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సింధియా శుభప్రద, ఫార్మ కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ రాజేశ్, ఫిజియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

టీటీసీ ఫలితాలు విడుదల

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఆగస్టులో జరిగిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికేట్ పరీక్షకు సంబంధించిన ఫలితాలు విడుదలైనట్లు డీఈవో శామ్యూల్‌పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్, జేసీ నూరుల్ ఖమర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను సమగ్రంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఉప కలెక్టర్లు అనురాధ, కొండయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డా.సిరి, జేసీ నూరుల్ ఖమర్

రామజలకు హారతి.. తీర్చాలి దాహార్తి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఏటా సమృద్ధిగా వర్షాలు కురిసి, చెరువు నీటితో కళకళలాడుతూ ప్రజల దాహార్తి తీర్చాలని పురప్రముఖులు ఆకాంక్షించారు. ఆదోని పట్టణ శివారులోని రామజల చెరువుకు సోమవారం రాత్రి జలహారతి కార్యక్రమం నిర్వహించారు. గీతా జయంతి సందర్భంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కల్లుమఠం మఠాధిపతి గురుసిద్ధలింగ దేవరు, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ లోకేశ్వరి హాజరై జలహారతిచ్చారు. పుర ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ సావిత్రమ్మ, నాయకులు విట్టా రమేష్, గుడిసె కృష్ణమ్మ, విరాట్ హిందూ సంస్థాన్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజినేయులు, దత్తాత్రేయ శర్మ, ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రజాప్రతినిధులు

ఇరు జిల్లాల వారధి.. చెదిరినది

కర్నూలు- అనంతపురం జిల్లాల వారిధి చెదురుతోంది. దారంతా పలు చోట్ల పూర్తిగా దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మద్దికెర మండలం యడవలి నుంచి బొమ్మనపల్లి వెళ్లే మార్గంలోని కల్వర్టు శిథిలమైంది. ఓ వైపు మట్టి పూర్తిగా కోతకు గురై, ప్రమాదంగా మారింది. – న్యూస్‌టుడే, పత్తికొండ, మద్దికెర

మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ డా.ఎ.సిరి విద్యార్థులకు సూచించారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఆమె గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పదో తరగతి అభ్యసన సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, గిరిజన సంక్షేమాధికారి సురేష్, ప్రధానోపాధ్యాయుడు శివకృష్ణ పాల్గొన్నారు.

సాయుధ దళాల సంక్షేమానికి విరాళాలు అందజేయండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : దేశ రక్షణ కోసం ఎన్నో త్యాగాలు చేస్తున్న సాయుధ దళాల కుటుంబాల సంక్షేమం కోసం ఫ్లాగ్‌డే నిధికి విరివిగా విరాళాలు అందజేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను కోరారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఆమె సైనిక్ వెల్ఫేర్ ఫండ్‌కు తనవంతుగా రూ.10 వేల విరాళం ప్రకటించారు. ప్రతి ఉద్యోగి, అధికారులు తమవంతు ఆర్థిక సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమాధికారిణి రత్నరూత్ పాల్గొన్నారు.

నేడు, రేపు రైతుసేవా కేంద్రాల్లో కార్యశాల

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : వారం రోజుల పాటు నిర్వహించిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో కర్నూలు రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ డా.ఎ.సిరి తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాల్ నుంచి సోమవారం ఆమె రైతన్నా మీకోసం, పారిశుద్ధ్యం, మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, డివిజన్ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈనెల 2, 3 తేదీల్లో రైతన్నా మీకోసం కార్యక్రమానికి సంబంధించి రైతు సేవా కేంద్రాల పరిధిలో రెండు రోజుల పాటు రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కార్యశాల నిర్వహించిన రాబోయే ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈనెల 5న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ 3.0ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో 12 రోజుల నుంచి ఒక్క అర్జీని కూడా చూడటం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పల్లెల బాట.. పశ్చిమాన పోరుబావుటా

■ ఆదోని జిల్లా కావాలని భారీ ప్రదర్శన
■ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ఆదోనికి కదిలొచ్చిన పల్లెజనం

ఆదోని ఎస్కేడీ కాలనీ, ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో వెనుకబడిన ఆదోని ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలన డిమాండ్ చేస్తూ.. జిల్లా సాధన ఐకాస ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. స్థానిక మున్సిపల్ మైదానం నుంచి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితర సంఘాల నాయకులు, ప్రజలు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. కోట్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలను కలుపుతూ ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, నూర్‌అహ్మద్, విరుపాక్షి, లలితమ్మ, కోదండ, దస్తగిరినాయుడు, విట్టా రమేశ్, చంద్రకాంత్‌రెడ్డి, దేవిశెట్టి ప్రకాశ్, అశోకానందరెడ్డి, కుంకునూరు వీరేశ్, మధుసూదన్‌శర్మ, తిరుమలేశ్, నీలకంఠప్ప, కల్లుబావి రాజు, సుదర్శన్, టి.వీరేశ్ తదితరులు మాట్లాడారు. ఆదోని జిల్లాగా ఏర్పడితే పరిశ్రమలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. ఆ దిశగా ప్రభుత్వం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదోని జిల్లా సాధించేంతవరకు ఈ ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

దీక్షలకు పెరుగుతున్న మద్దతు

ఆదోని పట్టణంలోని కోట్ల కూడలి వద్ద ఆదోని జిల్లా సాధన కోసం ఆదోని జిల్లా సాధన ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు కొనసాగుతునన్నాయి. సోమవారం దీక్షలో నూర్‌అహ్మద్, గోపాల్ ఆచారి, మల్లికార్జున ఆచారి, నరసింహులు, హనుమంతు, షకీల్ అహ్మద్ తదితరులు కూర్చొని తమ మద్దతు తెలిపారు. ఆదోని షరాఫ్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించి రిలే నిరాహార దీక్ష శిబిరానికి వచ్చి ఆదోని జిల్లాకు తమ వంతు మద్దతు తెలిపారు.

అన్ని అర్హతలు ఉన్నాయి.. మండలం చేయండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామాన్ని మండలం చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని, న్యాయం చేయాలని గ్రామస్థులు గోవిందరెడ్డి, శివ, సీతారం, సూరి అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్ కలెక్టర్ అజయ్ కుమార్‌ను గ్రామస్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దతుంబళం గ్రామం సమీపంలో కుప్పగల్, బల్లెకల్, పాండవగల్, గణేకల్, కడితోట, కొత్తురు, హనువాళు, జాలిమంచి, మాంత్రికి, సుల్తానాపురం, పెసలబండ, పెద్దకడబూరు మండలంలోని బసలదొడ్డి, గవిగట్టు, బాపులదొడ్డి, పీకలబెట్ట తదితర గ్రామాలు ఉన్నాయన్నారు.

పెద్దహరివాణంలో చేర్చండి

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండలంలోని ఐదు గ్రామాలను కొత్తగా ఏర్పాటవుతున్న పెద్దహరివాణం మండలంలో కలపాలని ఆదోనిలో తహసీల్దారు రమేష్‌ను కలిసిన ఐదు గ్రామాల నాయకులు, ప్రజలు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. హొళగుంద మండలంలోని ఇంగళదహాళ్, ఎండీ హళ్లి, పెద్దగోనేహాళ్, గజ్జహళ్లి, వందవాగిలి, మండల కేంద్రానికి 15 కి.మీ. పరిధిలో ఉన్నాయి. పెద్దహరివాణానికి 8 కి.మీ. పరిధి ఉంటుంది. ప్రజలకు రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని, ఈ ఐదు గ్రామాలను విలీనం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదినారాయణ రెడ్డి, మెడికల్ నాగరాజు, రేణుకాచార్య స్వామి, కర్రెప్ప, బండి తిమ్మప్ప, ఎండీ హళ్లి సర్పంచ్ సుధాకర్, వెంకటరామిరెడ్డి, వెంకరాముడ, పూజారి రామలింగ, వడ్డే విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లా సాధనకు కోట్ల కూడలిలో నిరసన

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని నాగిరెడ్డి రెవెన్యూకాలనీకి చెందిన సాయిరోషన్ (21) సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. స్థానిక ఐసీఐసీఐ బ్యాంకులో రుణాల విభాగం మేనేజరుగా పనిచేసే మస్తాన్‌రావుకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడైన సాయిరోషన్ ఇంటర్ పూర్తి చేశారు. మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకోగా కుటుంబ సభ్యులు గుర్తించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రెండో కౌన్సెలింగ్‌లోనూ బీఎస్సీ నర్సింగ్ సీటు రాలేదన్న మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండులో చోరీపై కొనసాగుతున్న దర్యాప్తు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు బస్టాండులో ఆళ్లగడ్డకు చెందిన రాజశేఖర్‌రెడ్డి, శారద దంపతుల బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితులు హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బస్సులో వెళ్తూ నవంబరు 30వ తేదీన కర్నూలు ఆర్టీసీ బస్టాండులో దిగారు. ఇక్కడి నుంచి ఆళ్లగడ్డకు వెళ్లేందుకు మరో బస్సు ఎక్కుతున్న క్రమంలో 10 తులాల బంగారు ఆభరణాలు ఉన్న వీరి బ్యాగు అపహరణకు గురైంది. బస్సు ఎక్కిన తర్వాత ఆభరణాల బ్యాగు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితులు కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించగా వీరితో పాటు బురఖా ధరించిన ఇద్దరు మహిళలు బస్సు ఎక్కి దిగారని, వారే నేరానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. ఆభరణాల బ్యాగులో చరవాణి ఉండటంతో పోలీసులు టవర్ లొకేషన్ ఆధారంగా రైల్వేస్టేషన్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు అక్కడికెళ్లి బ్యాగును, చరవాణిని స్వాధీనం చేసుకున్నారు గాని అందులో ఆభరణాలు లేవు. పాత మహిళా నేరస్థులే ఈ చోరీకి పాల్పడి ఉంటారన్న అనుమానంతో వారి కోసం గాలింపు చేపట్టారు.

YEMMIGANUR MUNICIPALITY
E-Procurement Tender Notice No. 11/15th FCG & General Fund - 2025-2026/E1, dt: 01-12-2025
మునిసిపల్ సాధారణ నిధులు మరియు 15వ ఆర్థిక సంఘం నిధులతో 30 పనులు గాను రూ. 146.33 లక్షలతో అర్హులైన కాంట్రాక్టర్ల నుండి టెండర్లు స్వీకరించబడును. వివరములకు apeprocurement.gov.in నుండి పొందగలరు.
సం/- కమిషనరు, ఎమ్మిగనూరు పురపాలక సంఘం

EENADU Classifieds

BUSINESS SERVICES
BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

TO LET
For Rent to Hospital, Polyclinics, Diagnostic Centers, 5200 Sft. G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: 89851 32552.

JOBS
G.N.R హాస్పిటల్, గాయత్రి ఎస్టేట్ కర్నూలులో పనిచేయుటకు అనుభవం కల్గిన రిసెప్షనిస్ట్ (F) కావలెను. అనుభవం బట్టి జీతం. సంప్ర: 96405 13249.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

అభివృద్ధి చూడలేక తప్పుడు ప్రచారాలు

హొళగుంద, న్యూస్‌టుడే: ఆలూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక, వైకాపా ఎమ్మెల్యే విరూపాక్షి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వేదవతి పథకం రూ.500 పనులు మారుపేరు అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. వైకాపా హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. తమపై బురదజల్లడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, దుర్గయ్య, వీరనాగప్ప, గోవింద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు విగ్రహం ఏర్పాటుకు విరాళం

విరాళం అందజేస్తున్న గోవింద గౌడ్

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో భక్త కనకదాసు విగ్రహం ఏర్పాటుకు తెదేపా సీనియర్ నాయకుడు ఈడిగ గోవింద గౌడ్, రాజేంద్ర గౌడ్ రూ.80 వేల విరాళం ఇచ్చారు. ఎల్లార్తి గ్రామస్థులు దరగన్న, గాదిలింగన్న, మల్లికార్జున దాతను సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా మాజీ మండల కన్వీనర్ వీరన్న గౌడ, మోయిన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మకర విళక్కు పూజ

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండలో మకర విళక్కు పూజ సందర్భంగా అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తిని సోమవారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అంతకు ముందు అయ్యప్ప స్వామి ఆలయం వద్ద స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఊరేగింపు సందర్భంగా మాలధారులు భక్తి గీతాలు పాడుతూ నృత్యాలు చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

చిన్నారులు వణికిపోతున్నారు

▸ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయని ఉపకరణాలు
▸ నిపుణుల కొరతతో అవస్థలు

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: ఆదోని ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రిలో ప్రతి నెల 400 ప్రసవాలు అవుతున్నాయి. ప్రతి రోజు చిన్నారుల ఓపీ 60 నమోదవుతోంది. చిన్నారులకు వైద్య నిపుణులు ఆరుగురికి గాను నలుగురు ఉన్నారు. ఆరు నెబులైజర్లలో మూడు పాతవి పనిచేయడం లేదు. ఇన్‌క్యుబేటర్లు రెండు ఉన్నాయి. సిబ్బంది లేక కొన్ని పనిచేయడం లేదు.

ఆదోని ప్రభుత్వ మాతా, శిశు ఆస్పత్రిలో 500 (ఎల్‌పీఎం-లీటర్ పర్ మినిట్) ఆక్సిజన్ ప్లాంట్ మరమ్మతుకు గురై నాలుగేళ్లవుతోంది. ఇంతవరకు నిపుణులను నియమించి, వినియోగంలోకి తీసుకురాలేకపోతున్నారు. ఆస్పత్రికి అనుబంధంగా ఎస్‌ఎన్‌సీయు(నవజాత శిశు సంరక్షణ కేంద్రం) 10 పడకలతో సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ నెలకు 120 దాకా చిన్నారులు సేవలు పొందుతున్నారు. ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవడం వల్ల సిలిండర్ల ద్వారా వాయువును అందిస్తున్నారు. ఒక్కో సిలిండర్ బరువు 425 కిలోలు ఉంటుంది. దీని ధర రూ.700. వారానికి ఐదు సిలిండర్లు వినియోగిస్తున్నారు. ఇక రూ.25-30 లక్షలతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులో ఉంటే వెంటిలేటర్ల సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ప్లాంట్ మరమ్మతుకు గురవడం, బిగించిన వాయు గొట్టాల నిర్మాణంలో లోపాలుండటంతో ఆక్సిజన్ లీకవుతోంది. దీంతో చిన్నారులకు అత్యాధునిక వైద్య సేవలందించలేదని పరిస్థితి.

సిబ్బందిలేక ఇబ్బంది

పత్తికొండ సీహెచ్‌సీ కేంద్రం
ప్రతినెలా ప్రసవాలు: 25-30
రోజువారీ ఓపీ: 80-100

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ సీహెచ్‌సీ కేంద్రంలో ఐదు ఫొటోథెరపీలకు గాను ఒక్కటే ఉంది. ఇక్కడ ఇంక్యుబేటర్లు, ఫొటో థెరపీ ఉపయోగించలేని పరిస్థితుల్లో కర్నూలు లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో పసిపిల్లల ఆరోగ్య అత్యవసర పరిస్థితిని బట్టి రూ.5 వేల నుంచి రూ.50 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. రోజుకు సుమారు 150పౌండ్లు వినియోగిస్తున్నారు. నెబులైజర్లు రెండు ఉన్నాయి. రోజుకు కనీసం 80 నుంచి 100 మంది ఓపీ ఉన్నా ఆసుపత్రిలో నెబులైజర్లు రెండే ఉండటం వల్ల ఎక్కువ మందికి చికిత్స అందించేందుకు వీలు కలగటంలేదు. క్షయ, ఇతర ఉబ్బస వ్యాధిగ్రస్తులకు అందుబాటులో ఉన్న ఈ రెండింటినే వినియోగించాలంటే చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు

అయ్యప్ప మాలతో ఆధ్యాత్మికత, ఆరోగ్యం

చిప్పగిరి, న్యూస్‌టుడే: అయ్యప్ప మాల ధరించిన వారికి ఆధ్యాత్మిక భావాలతో పాటు ఆరోగ్యం కూడా ఉంటుందని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. భక్తులకు నిరంతరం అన్నదానం చేసేందుకు రూ.1.50 లక్షలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు మహానంది, రామాంజనేయులు, రవి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

అమకతాడు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: ?: అమకతాడులో ప్రధాన రహదారి పక్కన మురుగు కాల్వ పూడిపోయింది. మురుగంతా రహదారిపైకి చేరుతోంది. – మధు, అమకతాడు

✔: మురుగు కాల్వలో పూడిక తొలగింపు చర్యలు చేపడతాం. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. – సరేశ్వర, సర్పంచి, అమకతాడు

?: యాటకల్లు గ్రామానికి వచ్చే రహదారి అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. హంద్రీ వాగుపై ఉన్న వంతెన పూర్తిగా పడిపోయింది. – వీరభద్ర, కృష్ణమూర్తి, యాటకల్లు

✔: గత నెలలో కురిసిన వర్షాలకు వంతెన పూర్తిగా పడిపోయింది. రహదారి, వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. – వెంకటేశ్వర్లు, పీఆర్‌ఏఈ, ఆస్పరి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని మీసేవ రహదారి, మున్సిపల్‌రోడ్‌లో వాణిజ్య దుకాణాల ముందు చెత్త పేరుకుపోయింది. దుకాణాల ముందు అపరిశుభ్రంగా మారుతోంది. సమస్య పరిష్కరించాలి. – నాగరాజు, ఆదోని

✔: ప్రజారోగ్య విభాగం ద్వారా సమస్య పరిష్కరిస్తాం. – నాసిరుహుసేన్, ఇన్‌ఛార్జి కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని మద్దిగేరి వీధిలోని దర్గా వద్ద ఉన్న స్తంభానికి పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతోంది. పగటి పూట వెలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. – బాషా, మద్దిగేరి వీధి, పత్తికొండ

✔: విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన స్విచ్‌లు పని చేయటంలేదు. సిబ్బందిని పంపి మరమ్మతులు చేపట్టి పగటి పూట వెలగకుండా చూస్తాం. – నరసింహులు, పంచాయతీ ఈవో

వేగవంతంగా కేసుల విచారణ

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ రవిశంకర్‌రెడ్డి

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇటీవల రహదారి ప్రమాదాలు పెరిగాయని, వాటి నివారణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఆలూరు పోలీసు స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా దస్త్రాలు పరిశీలించారు. వివిధ కేసుల వివరాలను సీఐ రవి శంకర్‌రెడ్డి, ఎస్సై మన్మథవిజయ్‌ని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను వెంటనే విచారణ చేపట్టి, పూర్తిచేయాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లు గుర్తించి తగిన సూచికలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, హాలహర్వి ఎస్సై మారుతి, తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు అడ్డంగా

ఆస్పరి నుంచి బళ్లారికి వెళ్లే ప్రధాన రహదారిలో భారీ లోడుతో వెళ్తున్న పెద్దలారీ రహదారికి అడ్డంగా ఆగిపోయింది. ఆస్పరి సమీపంలోని రైల్వేగేటు వద్ద ఆదివారం అర్ధరాత్రి ఇనుప సామాన్ల లోడుతో వస్తున్న పెద్దలారీ బ్రేక్ వేయడంతో ఒక్కసారిగా వెనుక భాగం పప్పుశనగ పొలంలోకి జారిపోయి, రహదారికి అడ్డంగా నిలిచింది. డ్రైవర్ చాకచక్యంగా వాహనాన్ని నిలపడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. రహదారిపై అడ్డంగా ఉండటంతో తిరిగే వాహనదార్లు ఇబ్బందులు పడ్డారు. రహదారికి అడ్డంగా ఉండటంతో లారీని తొలగించాలంటే క్రేన్ రావాలని డ్రైవర్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

నిద్రమత్తు వదలాలి.. ప్రయాణం సాగాలి

గుత్తి- పత్తికొండ ప్రధాన రహదారిలో ఆదివారం అర్ధరాత్రి లారీ, బస్సు చోదకులకు నిద్రమత్తు వదిలేలా తుగ్గలి పోలీసులు చర్యలు చేపట్టారు. తుగ్గలి ఎస్సై బాలనరసింహులు, పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ.. చోదకులకు ముఖం కడిగించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా తప్పదని ఎస్సై హెచ్చరించారు. బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, తుగ్గలి

అదుపు తప్పితే.. ముప్పు తప్పదంతే

ఆదోని ఆర్టీసీ డిపో పరిధిలో బస్సుల కొరత కారణంగా విద్యార్థులకు ఫుట్‌బోర్డు ప్రయాణం తప్పడం లేదు. పత్తికొండ-ఆదోని మార్గంలో సాయంత్రం వేళల్లో విద్యార్థులకు సరిపడా బస్సులు లేక కిక్కిరిసి ప్రయాణం సాగించాల్సి వస్తోంది. పత్తికొండ నుంచి ఆదోని మార్గంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. వీరికి తోడు సాధరణ ప్రయాణికులు కూడా ఉండటంతో బస్సుల్లో సీట్లు చాలడం లేదు. విద్యార్థులు మెట్ల మార్గంలో వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. ఏమాత్రం అదుపు తప్పినా.. ముప్పు తప్పదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం

ప్రమాదాల నివారణకు చర్యలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి సమీపంలోని 44వ జాతీయ రహదారి మధ్యలో కొత్తగా ఇనుప రెయిలింగ్ ఏర్పాటు పనులు చేపట్టారు. 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన 'టోల్ తీస్తున్నారు.. అవస్థలు దాస్తున్నారు' అనే కథనానికి అధికారులు స్పందించారు. దెబ్బతిన్న రెయిలింగ్‌ను తొలగించి వాటి స్థానంలో ప్రమాదాలు జరగకుండా కొత్తగా ఇనుప రెయిలింగ్‌ను బిగించారు. చెరుకులపాడు కూడలిలోని జాతీయ రహదారిపై పేరుకున్న మట్టిని శుభ్రం చేయించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే కొత్త లేయర్ పనులు చేపడతామని సిబ్బంది పేర్కొన్నారు.

స్పందనకు వందనం

కృష్ణగిరి సహకార సంఘం సీఈవో సస్పెన్షన్

కృష్ణగిరి, న్యూస్‌టుడే: కృష్ణగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవోగా పని చేస్తున్న కె.శివన్నను సస్పెండ్ చేసినట్లు కృష్ణగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ కేఈ శేషాద్రి సోమవారం తెలిపారు. సీఈవోగా పనిచేస్తున్న శివన్న సీఈవోతో పాటు ఏపీజీబీ బిజినెస్ కరస్పాండెంట్‌గా, డీఆర్‌డీఏ(ఐకేపీ) ఆగవెలి గ్రామంలో బుక్‌కీపర్‌గా బహుళ ఉద్యోగాలు చేస్తున్నారని, నిబంధనల మేరకు సీఈవో విధుల నుంచి సస్పెండ్ చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేసినట్లు ఛైర్మన్ కేఈ శేషాద్రి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండలం కర్ణాటక సరిహద్దు గ్రామం మార్లమడికి అంచున వేదవతి హగరి నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకొని రాణాకు తరలించారు. వీటిని జిల్లా మైనింగ్ శాఖకు అప్పగించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హొళగుంద ఎస్సై దిలిప్ కుమార్ అన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా

వెల్దుర్తి,న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపిన 8 మందికి రూ.80వేల జరిమానా విధించిన్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. వెల్దుర్తిలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టగా 8 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు కేసు నమోదు చేశామన్నారు. వీరిని డోన్ న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి అపర్ణ ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వసతిగృహ విద్యార్థి అదృశ్యం

కంబాలపాడు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: కృష్ణగిరి మండలం కంబాలపాడు ఎస్సీ వసతి గృహంలో ఉంటూ కంబాలపాడు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జండా అంజి ఆదివారం సాయంత్రం నుంచి కనబడటం లేదని కృష్ణగిరి పోలీసు స్టేషన్‌లో వసతి గృహ సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. డోన్ మండలం వెంకటనాయుని పల్లె గ్రామానికి చెందిన రామచంద్రుడు కుమారుడు అంజి ఐదేళ్లుగా వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం నుంచి కనిపంచడం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కృష్ణగిరి ఎస్సై చరవాణి సంఖ్య 91211 01117 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

జండా అంజి (దాచిన చిత్రం)

గళం వినిపించారు.. గెలుపు సాధించారు

ఈనాడు - ఈటీవీ ప్రతిభా పాటవ పోటీలు

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో పాఠశాల నిర్వాహకులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం వల్ల మెదుడు చురుగ్గా మారుతుందని పాఠశాల కరస్పాండెంట్ జి.గోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. ఆదోని పట్టణంలోని నేషనల్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో కె.యామిని, ద్వితీయ స్థానంలో ఇ.చైత్రిక, తృతీయ స్థానలో బి.మేఘన నిలించారు. విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, శివరాజ్, మాధవి, లత, లక్ష్మణ్, కిషోర్, గోవిందు, రవికుమార్ పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకొనేందుకు వక్తృత్వ పోటీలు ఎంతగానో దోహదపడతాయని పత్తికొండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.శ్రీదేవి అన్నారు. ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో భాగంగా విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశాన్ని చక్కగా వివరించి విద్యార్థినులు ఔరా అనిపించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన లక్ష్మి ప్రసన్న, ముబీనా తాజ్, జి.కావ్యను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కె.నారాయణ, ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ, శ్యామల, సరిత, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉచిత వివాహాలు సద్వినియోగం చేసుకోండి

ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న మఠాధిపతులు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: మైసూరు ప్రాంతంలో సుత్తూరు జగద్గురువు శివ్రాత్రీశ్వర శివయోగి(జేఎస్ఎస్) ఆధ్వర్యంలో జనవరి 16వ తేదీన ఉచిత సామూహిక వివాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆదోనిలోని చౌకిమఠం, కల్లుమఠం మఠాధిపతులు మర్రి రాచోటి, గురుసిద్ధ లింగ మహాస్వాములు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక కల్లుమఠంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా జరగే జాతరలో కులాలకు అతీతంగా బంగారు తాళిబొట్టు, వధూవరుల వస్త్రాలు, ఉచిత భోజనం, వసతి కల్పించి సామూహిక వివాహాలు జరిపిస్తారన్నారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు ఎగ్గటి ప్రతాప్, మరియాని చెన్నబసప్ప పాల్గొన్నారు.

పార్లమెంటులో బిల్లు ఆమోదించాలి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: బేడ బుడగ జంగం కుల రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ అన్నారు. స్థానిక బుడగ జంగం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఈబూది మద్దిలేటి, సుధాకర్, మధు, గణ మద్దిలేటి, బాలు, జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

పింఛను లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం

తుగ్గలి, న్యూస్‌టుడే: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఎద్దులదొడ్డి గ్రామంలో సోమవారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో తిరిగి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే పింఛను సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి విజయ్, పార్టీ నాయకులు మనోహర్‌చౌదరి, బత్తిన వెంకటరాముడు, శ్రీనివాసగౌడ్, తిరుపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవనం.. దృష్టిసారిస్తే ఘనం

☛ చిన్నపాటి మరమ్మతులతో అందుబాటులోకి

పశ్చిమ ప్రాంతంలో పలు భవనాలు చిన్నపాటి పనులు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు చిన్నపాటి పనుల వల్ల అందుబాటులోకి తేలేకపోతున్నారు. అధికారులు, పాలకులు వీటిపై దృష్టిసారించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

నిర్మించారు.. ఉపయోగం మరిచారు

చిప్పగిరి మండల పరిధి నగరడోణలోని ప్రజలకు మెరుగైన సేవలు కల్పించేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన రైతు సేవా కేంద్రం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకే కేంద్రాలు ఏర్పాటు చేశారు. చిప్పగిరిలో తప్ప ఎక్కడా ఈ భవనాలు ఉపయోగంలో లేవు. అరకొర సౌకర్యాలు ఉండటంతో భవనాలు అలంకారప్రాయంగా మారాయి. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని భవనాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకోరావాలని మండల ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చిప్పగిరి

నిలిచిన సచివాలయం

గత వైకాపా ప్రభుత్వం గ్రామ స్థాయి పాలన కోసం రూ.లక్షలు ఖర్చు సచివాలయ భవనాలను నిర్మించింది. అప్పటి ప్రభుత్వం నిధులు అరకొరగా ఇవ్వడంతో గుత్తేదారులు పనులు చేయకుండా వదిలేశారు. మండలంలో డి.కొటకొండ గ్రామంలో గ్రామ సచివాలయ భవనం నేటికీ పూర్తి కాలేదు. రెండేళ్లుగా ఇలానే ఉంది. దీంతో సచివాలయ ఉద్యోగులు గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు, సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు. పలు గ్రామాల్లో సరైన సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. సిబ్బంది సైతం ఇరుకు గదుల్లో, అద్దె భవనాల్లో, పాఠశాల తరగతి గదుల్లో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో ఎక్కడా భవనాలు ఖాళీ లేకపోవడంతో సమావేశాలు, గ్రామ సభలు నిర్వహించడం ఇబ్బందిగా మారింది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

కాస్త నిధులు మంజూరు చేస్తే చాలు..

హాలహర్వి మండల పరిధిలో కొక్కరచేడు పాఠశాల ఆవరణలో గత తెదేపా ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లో నిధులు కొరతతో పనులు నిలిచిపోయాయి. వైకాపా ప్రభుత్వంలో పాఠశాలలకు సంబంధించిన నాడు - నేడు నిధులతో కొంత మేర పనులు చేపట్టారు. ప్రస్తుతం రంగులు వేసి, చిన్నపాటి పనులు చేస్తే అంగన్‌వాడీ కేంద్రం అందుబాటులోకి వస్తుంది. అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదు. – న్యూస్‌టుడే, హాలహర్వి

సంక్షిప్త సమాచారం

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి పంచాయతీ మజరా గ్రామమైన మాచనూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం ఆదోని డిపో అధికారులకు వినతిపత్రం అందించినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామం నుంచి హాలహర్వి, ఆలూరుకు విద్యార్థులు వెళ్తుంటారని, గ్రామానికి బస్సు లేక నాలుగైదు కి.మీ. నడిచి వెళ్లాల్సి వస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని బస్సు నడపాలని వారు కోరారు.

హాలహర్వి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ఈరన్న వంట నిర్వాహకులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల దస్త్రాలు పరిశీలించారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి విద్యుత్తు ఉపకేంద్రం కార్యాలయంలో ఈ నెల 5న ప్రత్యేక విద్యుత్తు అదాలత్ నిర్వహించనున్నట్లు కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రి అన్నారు. విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కర్నూలు నిఘావిభాగం, న్యూస్‌టుడే: 'నేను చెబితే కూడా పని చేయవా... ప్రొటోకాల్ ఉన్న వ్యక్తిని నేను. నాకే ఎదురు సమాధానం చెబుతావా.. నీ కథ తెలుస్తా' అని ఆలూరు మార్కెట్‌యార్డు ఛైర్మన్ వెంకటేశ్వర్లు ఓ సర్వేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంభాషణ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. రీసర్వే పనుల్లో భాగంగా కొంత సమయం పడుతుందని, ప్రస్తుతం ఆ విధుల్లోనే ఉన్నానని సర్వేయర్ చెబుతున్నా.. వినిపించుకోకుండా ఆయనపై విరుచుకుపడ్డారు.

ఆస్పరి, న్యూస్‌టుడే: రెండేళ్లుగా వేతనం లేకుండానే వీవోఏగా పనిచేస్తున్నాని, తనకు వేతనం మంజూరు చేయించి న్యాయం చేయాలని ఆస్పరి మండల పొదుపు సంఘాల వివోఏ జయలక్ష్మి కలెక్టర్‌ను కోరారు. సోమవారం కర్నూలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పల్లె కబుర్లు

చిన్నహుల్తి(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: చిన్నహుల్తి సమీపంలో వెలసిన ఈరన్న స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆర్.మండగిరి (పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆర్.మండగిరి కొండపై వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

చెరుకులపాడు(వెల్దుర్తి), న్యూస్‌టుడే: చెరుకులపాడు వీఆర్‌ఏ లక్ష్మీదేవి మృతిచెందడంతో దహన సంస్కారాల కోసం ఆర్ఐ మంజుల, వీఆర్వో రమణారెడ్డిలు రూ.25 వేలు ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు అయ్యస్వామి, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లగుమ్మి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: పుల్లగుమ్మి గ్రామంలోని శ్రీకృష్ణుని ఆలయంలో గీతా జయంతి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పుల్లగుమ్మి భజన మండలి ఆధ్వర్యంలో ఆలయంలో భజనలు చేశారు.

గూళ్యం (హాలహర్వి), న్యూస్‌టుడే: వేదవతి నది ఒడ్డున వెలసిన దిబ్బల సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే స్వామికి జలాభిషేకం, ఆకుపూజ, మహా మంగళహారతి వంటి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతి, యువకుల ఉన్నత చదువుల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని మహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ బలరాముడు కోరారు. ఆయన మాట్లాడుతూ బీకాం, బీఎస్సీ, బీఏ ఇతర కోర్సుల్లో చేరేందుకు పరీక్ష రుసుములు చెల్లించాలన్నారు. ఈనెల 27వ తేదీలోపు ఆన్‌లైన్లో రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గృహ నిర్మాణాలకు గడువు పెంపు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ గృహాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం గడువు పెంచినట్లు మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ షేక్షావలి సోమవారం తెలిపారు. అర్హత గల లబ్ధిదారులు ఈనెల 14వ తేదీ లోపు సంబంధిత పత్రాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

వేరుసెనగ గరిష్ఠ ధర రూ.7,009

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7,009 మధ్యస్థ ధర రూ.5,220 కనిష్ఠ ధర రూ.5,219లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,790 మధ్యస్థ ధర రూ.5,789 కనిష్ఠ ధర రూ.5,590 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: ఎమ్మిగనూరు- కోడుమూరు రహదారి గుంతల పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- నారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు, పంపన్నగౌడ్**

✔: రహదారికి మరమ్మతులు చేస్తున్నాం. **- రమణ, డీఈ కోడుమూరు**

?: లక్ష్మణ్‌టాకీస్ సమీపంలో రహదారి అధ్వాన్నంగా ఉంది. **- సోమప్ప, సాయినగర్**

?:వెంకటసాయి కాలనీలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. కొత్త పైపు లైన్ వేయండి. **- ఆంజనేయులు కాలనీవాసి**

✔:పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్**

గూడూరు: ?: గొల్లవీధిలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- చంద్రశేఖర్, గూడూరు.**

?: నగరపంచాయతీలోని ఎస్సీ కాలనీలో పైపులైన్ల కోసం గుంతలు తవ్వి వదిలేశారు. **- సూరన్న, గూడూరు.**

✔: సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం. **- రమేష్‌బాబు, కమిషనర్.**

మంత్రాలయం, న్యూస్‌టుడే: ?: మంత్రాలయంలో ప్రధాన రహదారిపై అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. **- గ్రామస్థులు**

✔:దుకాణదారులకు మంత్రణం నిర్వహించి, బోర్డులు తొలగిస్తాం. **- సీఐ రామానుజులు**

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వృద్ధుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిందని కూటమి రాకతో అభివృద్ధికి పెద్ద పీటం వేసిందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కె.నాగలాపురంలో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో తాగునీటి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామన్నారు. రైతులు సాగునీరు అందించాలని లక్ష్యంతో ఆర్డీఎస్ కుడి కాల్వ మంజూరు చేశామన్నారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 4వ వార్డులో పార్లమెంటు తెలుగు యవత కార్యదర్శి చరణ్ కుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కె.నాగలాపురంలో మండల అధ్యక్షుడు జె.సురేష్ పింఛన్లు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాఘవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు వరదరాజులు, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్, సచివాలయ సిబ్బంది, నాయకులతో కలిసి పింఛన్లు అందజేశారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోనే అధిక మొత్తంలో పింఛన్లు పంపిణీ జరుగుతోందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ప్యాలకుర్తిలో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కొత్తగా 37 మంది వితంతవులకు పింఛన్లు వచ్చాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సీఎం చంద్రబాబునాయుడు నెరవేరుస్తున్నాడన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాముడు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


పింఛను ఇస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కొలిక్కిరాని నాడు-నేడు

★ పూర్తయ్యేది ఎప్పుడు

గుడేకల్లు: అసంపూర్తి నిర్మాణంలో చదువులు

ఎమ్మిగనూరు, సి.బెళగల్, న్యూస్‌టుడే: నత్తనడకన నాడు-నేడు పనులు విద్యార్థులకు ఇక్కట్లు.. పూర్తయ్యేది ఎప్పుడో.. గత వైకాపా హయంలో నాడు-నేడు కింద పనులు చేపట్టారు. అరకొర నిధులతో వాటిని సగంలో వదిలేశారు. కొన్ని గదులను కూల్చివేసి అదనపు గదుల నిర్మాణం చేపట్టిన ఆ పనులు అసంపూర్తిగా నిలిచాయి. కొన్నిచోట్ల పునాదుల వరకు పనులు ఆగిపోయాయి. దాంతో కడ్డీలు తుప్పు పట్టాయి. మరి కొన్ని చోట్ల సిమెంటు, తలుపులు, కిటికీలు ఇతర సామగ్రిని మూలన పడేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా.. ప్రతిపాదనలతో సరిపెట్టారు. ఫలితంగా విద్యార్థులకు గదులు చాలక చెట్ల కింద, అసంపూర్తి గదుల్లోనే పాఠాలు బోధిస్తున్నారు.

అసంపూర్తి గదుల్లో పాఠాలు

మండలంలోని గుడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1,050 మంది విద్యార్థులు ఉన్నారు. పాత గదులు శిథిలం కావడంతో కొన్నింటిని కూల్చివేశారు. గత ప్రభుత్వం 17 గదులకు నాడునేడు కింద రూ.2.10 కోట్లు మంజూరు చేసింది. పనులు పూర్తి కాక గదుల కొరతతో అసంపూర్తిగా ఉన్న గదుల్లో విద్యార్థులు కూర్చుంటున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి విద్యార్థులకు వసతి కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిశీలన

తుప్పు పట్టిన కడ్డీలు...

పట్టణంలోని మాచాని సోమప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో 3,362 మంది బాలికల ఉన్నారు. 50 సెక్షన్లు విభజించగా.. వాటిలో 13 సెక్షన్లకు ఆరుబయటే చదువులు కొనసాగిస్తున్నారు. గతంలో నాడు నేడు కింద 20 అదనపు గదుల కోసం రూ.2.40 కోట్లు మంజూరు చేశారు. అందులో 8 గదులను పూర్తి చేసి మరో నాలుగు గదులు పునాదులకే పరిమితమయ్యాయి. ఇప్పటివరకు దాదాపు రూ.కోటిపైగానే ఖర్చు చేశారు.

నియోజకవర్గాలు : ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు	
నాడు-నేడు కింద ఎంపికైన పాఠశాలలు : 54 జడ్పీ ఉన్నత పాఠశాలలు	
విద్యార్థుల సంఖ్య : 22 వేలు మందిపైగానే	అసంపూర్తిగా ఉన్న గదులు : 80 కి పైగానే ఉన్నాయి

పునాదులకే పరిమితం

సి.బెళగల్ కస్తూర్బా పాఠశాలలో 280 మంది బాలికలు ఉన్నారు. నాడు-నేడు రెండో విడతలో 8అదనపు గదుల కోసం రూ.87,99,957 నిధులు మంజూరు చేశారు. ఐదు గదులకు పైకప్పు వేసి వదిలేశారు. మూడు గదులు పునాదులకే పరిమితం చేశారు. ఆ భవనాలకు రూ.44,71,676 ఖర్చు చేశారని పాఠశాల ప్రత్యేకాధికారి జ్యోతి తెలిపారు.

సి.బెళగల్: పునాదులకే పరిమితమైన నిర్మాణాలు

పనులు సగానికే వదిలేసి...

ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 600 మంది ఉన్నారు. ఆరు గదులకు రూ.70లక్షల మంజూరు చేశారు. నిధులు రాక పనులు మధ్యలో ఆగిపోయాయి. అక్కడ చదుకు కోసం విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

మట్టి నమూనాల అవగాహన

మంత్రాలయం: మండలంలోని రచ్చుమర్రి ఆదర్శ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మట్టినమూనాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల లాభాలను వివరించారు. భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

మైదానం అపరిశుభ్రం

గూడూరు పట్టణంలోని ప్రభుత్వ కళాశాల పక్కనున్న కాల్వలో పూడిక పేరుకుపోయింది. దాంతో మురుగు రహదారిపై ప్రవహించి కళాశాల మైదానంలోకి చేరింది. ఫలితంగా ఆ ప్రదేశం అపరిశుభ్రంగా మారింది. అసలే అది మట్టి దారి కావడంతో చిత్తడిగా మారింది. స్థానికులు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మురుగు నిల్వకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

అసౌకర్యాలతో.. అంగన్‌వాడీ కేంద్రం

మండలంలోని పెద్దనెలటూరులో నాలుగో అంగన్‌వాడీ కేంద్రం అసౌకర్యాలకు నిలయంగా మారింది. కనీస వసతులు లేవు. సొంత భవనం లేదు. పశువుల పాక పక్కనే ఉంది. అక్కడ సుమారు 22 మంది పిల్లలు ఉన్నారు. కనీస వసతులు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం మంజూరు చేయాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రస్తుతం రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. - న్యూస్‌టుడే, గోనెగండ్ల

మురుగు నిలిచి.. దుర్వాసన పెంచి

మండలంలోని మాసుమాన్‌దొడ్డిలో ప్రధాన వీధిలో రహదారిపై మురుగు నిలిచి మడుగును తలపిస్తోంది. మురుగు నిల్వడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దోమలకు నిలయంగా మారి దోమల కాటుతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. డ్రైనేజీ కాల్వలు లేక, మురుగు రోడ్డుపైనే నిలిచి ఎటు కదలడం లేదు. ఆ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మురుగు నిల్వకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

హాల్వి: పీఠాధిపతికి తులాభారం చేస్తున్న యువకులు

ఘనంగా రామక్కమ్మ అమ్మవారి ఉత్సవం

కౌతాళం, న్యూస్‌టుడే: మండలంలోని హాల్వి గ్రామంలో వెలసిన రామక్కమ్మ అమ్మవారి ఉత్సవం సోమవారం నిర్వహించారు. అమ్మవారికి పూజలు, మహామంగళ హారతి వంటి పూజలను నిర్వహించారు. అమ్మవారిని హాల్వి మఠం పీఠాధిపతి అభినవ మహంతమహాస్వాములు దర్శించుకున్నారు. రాత్రి రామక్కమ్మ ఆలయం వద్ద హాల్వి మఠం పీఠాధిపతికి నాణేలతో యువకులు తులాభారం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు.

క్షేత్ర సహాయకురాలిపై చర్యలకు వినతి

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఉపాధి కల్పనకు ప్రభుత్వం మంజూరు చేసిన జాబ్ కార్డులు తమ అనుమతి లేకుండా తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ పద్మావతిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు గణెకంటి రామకృష్ణ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో నూర్జహాన్‌కు ఫిర్యాదు చేశారు. తన కుటుంబంలో 8 మందికి జాబ్ కార్డులు తొలగించారన్నారు. దాంతో ప్రభుత్వ గృహానికి దరఖాస్తు చేయలేకపోయామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని ఆదర్శ పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సాయిఉదయ్ ఆధ్వర్యంలో మండల కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షుడిగా సోమశేఖరరెడ్డి, కార్యదర్శి పవన్‌తో పాటు పది మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మహమ్మారిని తరిమికొడదాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో సోమవారం విజయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎయిడ్స్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొందరు పాఠశాల స్థలాన్ని ఆక్రమించారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.. జిల్లా అధికారులు, పోలీసులతో మాట్లాడి త్వరలోనే ఆక్రమణలను తొలగిస్తానని ఎమ్మెల్యే అన్నారు.

ప్లకార్డులు చూపుతున్న వైద్యాధికారులు

పురపాలక కమిషనర్ గంగిరెడ్డి, విజయ మహిళా మండలి వేణుగోపాల్, బర్లి కార్పొరేషన్ చైర్మన్ మిన్నప్ప, పాల్గొన్నారు.

కోడుమూరు పట్టణం: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

గూడూరు గ్రామీణం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ప్రత్యూష పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఎమ్మిగనూరు: ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయాధికార సేవా సంస్థ అధ్యక్షురాలు పి.హేమ సూచించారు. సీడీపీవో కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అందిస్తున్న సేవలు వివరించారు. ఎయిడ్స్ నియంత్రణకు గ్రామ స్థాయిలోనూ అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారని సీడీపీవో సఫరున్నీసాబేగం వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయవాదులు లింగమూర్తి, సాల్మన్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి పి.హేమ

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

వినతి పత్రం ఇస్తున్న చేనేత సంఘం నాయకులు

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గే మాదవస్వామి డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ధర్నా చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో చేనేత కుటుంబాల సమస్యలు తెలుపుతూ.. వినతిపత్రం అందజేశారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని బహుజన సమాజ్‌పార్టీ నాయకులు బంగారప్ప, లక్ష్మన్న డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ పి.రాజేశ్వరికి వినతిప్రతం ఇచ్చారు. స్పందించిన తహసీల్దార్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

నవజాతశిశువు.. సంరక్షణే ఆయువు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎస్‌ఎన్‌సీయూ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఆసుపత్రిలో చిన్నపిల్లల ఓపీ 70 నుంచి 100 వరకు ఉంది. నెలకు 250 నుంచి 300 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. కానీ ప్రభుత్వ ఆసుపత్రిలో పలు సౌకర్యాలు లేవు. ఉన్న సౌకర్యం వినియోగంలో నిర్లిప్తత నెలకొంది. ఆసుపత్రిలో నాలుగైదు గదుల్లో పిల్లల ఇన్‌పేషెంట్స్ చేరుతున్నారు. బరువు తక్కువతో జన్మించడం, కామెర్లు, ఉమ్మనీరు తాగిన వంటి నవజాత శిశువులకు ఎస్‌ఎన్‌సీయూలో 24గంటలు వైద్య సేవలు అందించేందుకు ఇద్దరు చిన్నపిల్లల వైద్యులు, 9మంది స్టాఫ్ ఉన్నారు. ఎస్‌ఎన్‌సీయూలో 10 వార్మర్లు ఉన్నాయి. అవి సరిపోవడం లేదు. దాంతో సోమవారం ఇద్దరు నవజాత శిశువులను ఒకే వార్మరులో ఉంచి వైద్యం అందిస్తున్నారు. మొబైల్ ఎక్స్‌రేటర్ డీఆర్‌బీ-1, ఈసీజీ-1, వెయింట్ మిషన్స్-3, థర్మామీటర్లు-10 వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎస్‌ఎన్‌సీయూలో విధుల్లో ఉండాల్సిన వైద్యులు సక్రమంగా హాజరు కావడం లేదని నవజాత శిశువుల బంధువులు వాపోతున్నారు. ఎస్‌ఎన్‌సీయూలో నిత్యం 10 నుంచి 15 మంది వరకు నవజాత శిశువులను అడ్మిట్ చేస్తున్నారు. అక్కడ ఉన్న సిబ్బందే వారికి వైద్య సేవలు అందిస్తున్నారు.

పరిశీలన

ఒకే వార్మరులో ఇద్దరు నవజాతశిశువులను ఉంచి వైద్యం అందిస్తూ..

సక్రమంగా అందని సేవలు

చలి కాలంలో పిల్లలు ఎక్కువగా జలుబుతో బాధపడుతూ.. తీవ్రత పెరిగి న్యూమోనియాకు దారి తీస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఆసుపత్రిలో 3 సంవత్సరాలు దాటినా పిల్లలు జలుబుతో వస్తే.. వైద్యం అందించక మందులు రాసి పంపిస్తున్నారని చిన్నపిల్లల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

తెదేపా కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయంలో తెదేపా కార్యాలయం కోసం ఇన్‌ఛార్జి రాఘవేంద్రరెడ్డి అధికారులు స్థానిక నాయకులతో స్థలాన్ని పరిశీలించారు. గ్రామ శివారులో ఎమ్మిగనూరు వైపు నల్లవంక, 167 జాతీయ రహదారి పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించారు. నల్లవంకకు పక్కనే ఉన్న సర్వే నెంబర్ 279లో 1.31 ఎకరాల్లో ప్రభుత్వ భూమిగా రికార్డులలో ఉందని రెవిన్యూ అధికారులు రాఘవేంద్రరెడ్డికి తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ జనార్దన్, వీఆర్వో భీమన్నగౌడు వీఆర్‌ఏ నరసయ్య, లీగల్ అడ్వైజర్ విజయ్‌కుమార్, ఎల్‌ఎల్‌సీ డీసీ 5 వైస్ ఛైర్మన్ సూగూరు నరసింహులు, రాఘవేంద్ర, రామచంద్ర, మంగళిమల్లి తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న రాఘవేంద్రరెడ్డి, తదితరులు

కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ డిమాండు చేశారు. వైఎస్సార్ సర్కిల్లో సోమవారం మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సీపీఐ రంగన్న, విజయేంద్ర, తిమ్మగురుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులకై ఉద్యమిద్దాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: దివ్యాంగుల హక్కుల సాధనకు ఉద్యమాలు చేద్దామని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సోమన్న పిలుపునిచ్చారు. దివ్యాంగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13వ తేదీన దివ్యాంగుల సమావేశాన్ని భారీ ఎత్తున నిర్వహిద్దామన్నారు. తకార్యక్రమంలో పెద్దయ్య, నాగశేషమ్మ, ప్రతాప్‌కుమార్, పెద్దయ్య, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల సమస్యలు పరిష్కరించండి

మంత్రాలయం, న్యూస్‌టుడే: పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండు చేశారు. మంత్రాలయంలోని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందించారు. సీసీఐ నిబంధనలు ఎత్తివేసి, గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జయరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరేశ్, ప్రాణేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోడుమూరు గ్రామీణం: ప్యాలకుర్తిలో తెదేపా కార్యకర్త విజయ్‌యాదవ్ తల్లి లక్ష్మీదేవి అనారోగ్యంతో మృతి చెందగా.. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కోడుమూరు గ్రామీణం: మండలంలో తెదేపా నాయకులు, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.

కోడుమూరు గ్రామీణం: కోడుమూరు కోట వీధిలో కుష్ఠు వ్యాధి నిర్ధారణపై పకడ్బందీగా సర్వే చేపట్టారు. వ్యాధి లక్షణాలపై పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న అవగాహన కల్పించారు.

గోనెగండ్ల: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బదిలీపై వచ్చిన డిప్యూటీ ఎంపీడీవో శశికళ బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో మణిమంజరి తెలిపారు.

ఎమ్మిగనూరు గ్రామీణం: సచివాలయాల్లో పశుసంవర్ధకశాఖ సహాయకుల ఉద్యోగాల్లో వందలాది మంది నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు సాధించినట్లు ఆరోపణలు ఉన్నాయని, ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండు చేశారు.

సి.బెళగల్: సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాణెమ్మ సమక్షంలో సచివాలయాల అధికారిగా షాషావలి బాధ్యతలు స్వీకరించారు.

సుంకేశ్వరి (మంత్రాలయం): బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి 15.20 లక్షలు విడుదల కావడంతో ఆ మొత్తాన్ని మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో కురువ కమ్యూనిటీ కులస్థులకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అందజేశారు.

కోటేకల్ ప్రమాదంలో మరొకరి మృతి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కోటేకల్ జాతీయ రహదారిపై కారు, ఫార్చ్యూన్ కారు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన గంగమ్మ(65) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. గ్రామీణ పోలీసుల వివరాల మేరకు.. జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన గంగమ్మ భర్త వెంకటేశప్ప, మనవడు బినీత్‌గౌడ్, కూతురు మీనాక్షి, అల్లుడు సతీష్‌కుమార్ వీరి సంతానం రుత్విక్ ప్రమాదంలో ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. గాయపడిన డ్రైవర్ చేతన్, గంగమ్మను చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గంగమ్మ మృతి చెందగా.. చేతన్ చికిత్స పొందుతున్నారు.

ముగ్గురు నిందితుల అరెస్టు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: పెద్దకడబూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జేసీబీల చీటింగ్ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. పెద్దకడబూరుకు చెందిన చింతకుంట నీలయ్య, ఆదోని పట్టణం చాకలి భార్గవరాముడు, పెద్దకడబూరుకు చెందిన జింక నాగరాజుతో పాటు మరికొందరు బృందంగా ఏర్పడి ఫైనాన్స్ కింద జేసీబీలు కొన్నారు. కంతులు చెల్లిస్తామని 8 జేసీబీలను అక్రమంగా విక్రయిస్తూ రూ.63.10 లక్షల సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలో జేసీబీ యజమాని నిర్మలాబాయి ఫిర్యాదుతో గుట్టు రట్టయిందని డీఎస్పీ వివరించారు. వారితో 8 జేసీబీలను స్వాధీనం చేసుకున్నామని, సంబంధిత యజమానులకు న్యాయస్థానం ద్వారా అప్పగిస్తామన్నారు.

భవనంపై నుంచి పడి యువకుడికి గాయాలు

కోసిగి, న్యూస్‌టుడే: పాఠశాల రెండోఫ్లోర్‌పై వెల్డింగ్ చేస్తూ.. కాలుజారి కింద పడగా.. ఓ యువకుడికి గాయాలైన సంఘటన కోసిగి కేజీబీవీ పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. ఎమ్మిగనూరుకు చెందిన నూర్‌బాషా కుమారుడు షావలి కొంతకాలంగా కేజీబీవీ పాఠశాలలో వెల్డింగ్ పనులు చేస్తున్నారు. సోమవారం వెల్డింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారడంతో తల, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈఎమ్‌టీ రామకృష్ణ, పైలెట్ బసవలు ఆదోని ఆసుపత్రికి తరలించారు.

ఉపాధికి ఊతం.. స్వచ్ఛతకు మార్గం

గుంత తవ్వుస్తున్న ఉపాధిహామీ సిబ్బంది

గోనెగండ్ల, న్యూస్‌టుడే: వ్యర్థాలు వృథాగా పడేయకుండా ఇంటివద్దే సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని ఆదాయం పొందే మార్గానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాంతో గ్రామాల్లో స్వచ్ఛత నెలకొనడంతో పాటు ఉపాధి హామీ పనులకు లబ్ధి చేకూరనుంది. ఇళ్ల ముందు, పశువుల పాకలో ఉపాధిహామీ పథకంలో ఉచితంగా కంపోస్టు గుంతలు నిర్మించుకునేందుకు సంకల్పించింది. గృహాలు పశువుల పాకల నుంచి వచ్చే వ్యర్థాలను ఎరువుగా మార్చడంతో పాటు గ్రామీణ ప్రజలకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు లబ్ధిదారులను గుర్తించారు. గుంతల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

● ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని సి.బెళగల్, గోనెగండ్ల, గూడూరు, నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లో కంపోస్టు గుంతలు నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా.. 6,594 గుంతలు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 118 మాత్రమే నిర్మించారు.

ఎమ్మిగనూరు పరిధిలోని వివరాలు

మండలం	పంచాయతీలు	మంజూరు	పూర్తి చేసిన నిర్మాణాలు
బెళగల్	18	1611	06
గోనెగండ్ల	20	1380	24
గూడూరు	09	251	13
నందవరం	15	1840	42
ఎమ్మిగనూరు	17	1512	33

★ ఇళ్ల వద్దే కంపోస్టు గుంతల తవ్వకం

కొలతలు ఇలా..

ఇంటి పరిసరాల్లో మీటరు పొడవు, వెడల్పు, అడుగు లోతులో వృత్తాకార, చతురస్త్రాకారంలో గుంతను తవ్వాలి. కూరగాయల వ్యర్థాలు, చెట్ల ఆకులు ఇతర చెత్తను గుంతల్లో వేయాలి. ఆ విధంగా ఇంట్లో మహిళలకు అవగాహన కల్పించాలి. అలా చేస్తే సేంద్రియ ఎరువు తయారవుతోంది. ఆ ఎరువును మొక్కల పెంపకానికి, వ్యవసాయ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం.

- అల్లీపీరన్, డ్వామా ఏపీడీ, ఎమ్మిగనూరు.

ప్రతి గ్రామంలో కంపోస్టు గుంతలపై ఉపాధిహామీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కావాల్సిన వారు ఉపాధి హామీ క్షేత్ర స్థాయి సిబ్బందిని సప్రదించాలి. గుంతలకు స్థలం చూపిస్తే ఉపాధి కూలీలతో తవ్విస్తారు. కేటాయించిన లక్ష్యాలను నిర్దేశించిన సమయానికి పూర్తయ్యేలా చూస్తాం.

In the Court of the Prl.Sr. Civil Judge Kurnool
E.A.No- 316/2024, In E.P.No- 61/2013
In O.S.No- 97/2012
B.Devashankaraiah - D.Hr/Petitioner
-Vs-
D.M.Subhan(died) his LRs, D.M.Gouribe and others - Respondents
Notice to Respondents 2 to 4 Under Section- 50(1) of C.P.C
D.M.గౌరిబీ W/o లేట్ D.M.సుభాన్, (2) 2) D.M.షేక్‌షావలి S/o లేట్ D.M.సుభాన్, (3) 3) D.M.సమీర్ S/o లేట్ D.M.సుభాన్, (4) 4) D.M.హసీనాబీ D/o లేట్ D.M.సుభాన్, (5), అందరూ, H.No: 4-166, గూడూరు (V) & (M), కర్నూలు (Dist.).
పై నెంబర్ E.P.లో D.M.సుభాన్ చనిపోయినందున అతనికి పై కనపరచిన రెస్పాండెంట్లను వారసులుగా చేర్చమని అర్జీదారు అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 2 నుంచి 5 రెస్పాండెంట్లు మీకు ఆక్షేపణలు ఉన్న 7.01.2026 తేదీన పగలు 10.30 గం॥కు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.
కోర్టు వారి ఉత్తర్వు మేరకు
బి.కృష్ణమూర్తి
అర్జీదారు/ D.Hr పరం అడ్వకేటు, కర్నూలు. Cell: 94407 70483

(c) eenadu

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

అర్హు లందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

పింఛను సొమ్ము అందజేస్తున్న కలెక్టర్ డా.సిరి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నట్లు కలెక్టర్ డా. ఎ.సిరి తెలిపారు. నగర పరిధిలోని కృష్ణానగర్‌లో సోమవారం ఆమె లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబరు నెలలో అర్హులైన 2,37,738 మందికి రూ.104.32 కోట్ల పింఛన్ సొమ్మును పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. సొంతిల్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తాగునీటి సమస్య ఉందా అని స్థానికులను అడిగారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్తు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో మంగళవారం ఉదయం 7 నుంచి 11 గంటల మధ్యలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు తీగల ఆధునికీకరణ పనుల్లో భాగంగా గాయత్రి ఎస్టేట్స్, బిర్లా కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే :
?: కొత్త మాట్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రహదారిలో గుంతల్ని పూడ్చేందుకు వదిలిన కంకర వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. - సంజీవ
?: బాలాజీనగర్‌లోని రహదారిలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. - శ్రీనివాస్
✓: సమస్యను పరిష్కరిస్తాం. - నగరపాలక అధికారులు

ముంచెత్తిన నిర్లక్ష్యం.. చెదిరిన పునరావాసం

◆ 15 ఏళ్లుగా పూర్తవని గృహాలు.. సమకూరని వసతులు
◆ ముంపు గ్రామాల ప్రజలకు దక్కని భరోసా

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : 2009లో హంద్రీ వరదలు నదీ తీరప్రాంత గ్రామాలను అతలాకుతలం చేశాయి. వేలామంది నిరాశ్రయులయ్యారు. ఇల్లువాకిలి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అలాంటి వారికి సురక్షితమైన ఆవాసం కల్పించాలన్న లక్ష్యంతో.. అప్పటి ప్రభుత్వం పునరావాస కాలనీల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. భూములు కొని.. బాధిత కుటుంబాలకు పట్టాలు ఇచ్చింది. పక్కా ఇళ్ల నిర్మాణం ప్రారంభించింది. తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో 15 ఏళ్లుగా ఇళ్లు పూర్తవలేదు.. ముంపు బాధితులకు భరోసా లభించలేదు.

ఐదు కాలనీలు.. 5 వేలమంది

ముంపు బాధితులకు పునరావాసం కల్పించేందుకు సుంకేసుల, జి.సింగవరం, నిడ్జూరు, ఇ.తాండ్రపాడు, బి.తాండ్రపాడు గ్రామాల్లో రూ.కోట్లు ఖర్చు పెట్టి 321 ఎకరాల భూములు కొనుగోలు చేశారు. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో 5 వేల మంది వరకు లబ్ధిదారుల్ని ఎంపిక చేశారు. వారికి నివేశన స్థలాలకు పట్టాలు పంపిణీ చేశారు. వాటిలో ఎలాంటి వసతులు కల్పించలేదు. కొన్నిచోట్ల మాత్రమే నిర్మాణాలు చేపట్టారు. అవి కూడా అసంపూర్తిగా మిగిలిపోయాయి. రూ.కోట్లలో నిధులు వృథా అయినా లక్ష్యం మాత్రం నెరవేరలేదు.

ఇ.తాండ్రపాడు పునరావాస కాలనీ లేఅవుట్‌లో పెరిగిన కంపచెట్లు

వసతులు కల్పించాలని వినతి

అప్పట్లో ప్రభుత్వం సేకరించిన భూములు గ్రామాలకు దూరంగా ఉండటం.. అక్కడ ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో వాటిపై ముంపు బాధితులు ఆసక్తి చూపలేదు. దీంతో అధికారులు కూడా ఇళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం పట్టాలిచ్చిన స్థలాల విలువ పెరగడం.. ముంపు భయం వెంటాడుతుండటంతో పునరావాస కాలనీల్లోకి వెళ్లేందుకు లబ్ధిదారులు మొగ్గుచూపుతున్నారు. ఆయా కాలనీల్లో రహదారులు, కాలువలు, నీరు, విద్యుత్తు ఇతర సౌకర్యాలు కల్పించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

ఎటుచూసినా కంపచెట్లే..

◆ సుంకేసులలో 39 ఎకరాలు కొనుగోలు చేసి 458 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వంద మందికి మాత్రమే పట్టాలు అందించారు.
◆ జి.సింగవరంలో 1160 మంది ముంపు బాధితులను గుర్తించారు. వీరికోసం 58 ఎకరాల భూమి సేకరించారు. 692 గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ ఇళ్లన్నీ మధ్యలోనే నిలిచిపోయాయి.
◆ నిడ్జూరులో 43 ఎకరాలు కొనుగోలు చేసి 654 ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా స్థల సమస్య కారణంగా ఇక్కడ కూడా పనులు జరగలేదు.
◆ ఇ.తాండ్రపాడులో 78 ఎకరాలు సేకరించి 1460 మందికి పట్టాలిచ్చారు. ఇంతవరకు ఇక్కడ నిర్మాణాలే ప్రారంభించలేదు.
◆ బి.తాండ్రపాడులో 1264 మందికి 103 ఎకరాల్లో స్థలాలు పంపిణీ చేశారు. ప్రజానగర్ కాలనీ మినహాయిస్తే అన్నిచోట్లా పనుల్లో పురోగతి కరవైంది. పునరావాస కాలనీలు మొండిగోడలు.. కంపచెట్లతో నిండిపోయాయి.

ఉపన్యాస పోటీలు.. జ్ఞాపకశక్తికి బాటలు

విజేతలతో కేవీఆర్ మహిళా కళాశాల అధ్యాపకులు

ఉపన్యాస పోటీలో పాల్గొన్న విద్యార్థిని

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉపన్యాస పోటీలతో జ్ఞాపకశక్తి మెరుగవుతుందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రసన్నకుమారి పేర్కొన్నారు. నగరంలోని కేవీఆర్ మహిళా జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం 'డ్రగ్ ఫ్రీ టెక్నాలజీ' అన్న అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. జాహ్నవి, వేదవతి, కీర్తనాబీ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, అధ్యాపకులు రేష్మ, రమణ, సునీత, శివయ్య బహుమతులు అందజేశారు.

బహుమతులు అందుకున్న విజేతలతో ఉపాధ్యాయులు

పోటీకి హాజరైన విద్యార్థినులు

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర బాలికల పాఠశాలలో 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని చరవాణుల దుర్వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎస్.అఫీఫ, పి.సమీర, జీఎస్ లిఖిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల డీన్ డా. మమతామోహన్ బహుమతులు అందజేశారు.

విలీన గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించండి

ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక సంస్థలో విలీనమైన పందిపాడు, పెద్దపాడు, లక్ష్మీపురం గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు కల్లూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలీన గ్రామాల్లో ఉపాధి పనులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జాబ్‌కార్డు లేని వారికి జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీవో జీఎన్ఎస్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాసులు, కె.మధు, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలపై రాజకీయ ఒత్తిడి అరికట్టాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : మెప్మా ఆర్పీలపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లను అరికట్టాలని మెప్మా ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు రుద్రమ్మ డిమాండ్ చేశారు. తమకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, మహిళా మార్ట్ కోసం గ్రూపు సభ్యులు చెల్లించిన రూ.66 లక్షలను తిరిగి చెల్లించాలన్న డిమాండ్‌తో సోమవారం ఏపీ మెప్మా ఆర్పీల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి, సీఐటీయూ జిల్లా నాయకులు గోపాల్, విజయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : భారతదేశంలో ఎయిడ్స్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించడమే లక్ష్యంగా ప్రతిఒక్కరు కృషిచేయాలని వీసీ వెంకటబసవరావు పిలుపునిచ్చారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం క్యాంపస్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విశ్వనాథరెడ్డి, సుందరానంద, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త నాగరాజు పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న వీసీ వెంకటబసవరావు

తేమతో నిమిత్తం లేకుండా పత్తి కొనాలి

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వమే పత్తి కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేయాలని, ఉల్లి రైతులకు ఇవ్వాల్సిన నష్ట పరిహారాన్ని తక్షణం వారి ఖాతాల్లో జమ చేయాలని, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్లతో సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా చేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ, నాయకులు కోటకొండ సూరి, మాజీ సర్పంచి జి.ఆంజనేయులు, మధు, శ్రీధర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కీర్తన.. విజయ పథాన

◆ లాన్ టెన్నిస్‌లో సత్తా చాటుతున్న చిన్నారి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరానికి చెందిన చిన్నారి కీర్తన ఆటలపై మక్కువతో రాకెట్ చేతపట్టి.. లాన్ టెన్నిస్ నేర్చుకుంది. ప్రత్యేకంగా శిక్షణ పొంది పోటీలకు సిద్ధమైంది. సీనియర్లతో పోటీ పడి నైపుణ్యాలు మెరుగుపర్చుకుని.. ఆత్మవిశ్వాసంతో బరిలో దిగి విజేతగా నిలుస్తూ.. పతకాలు, ప్రశంసలు అందుకుంటోంది. జాతీయ స్థాయిలో ఛాంపియన్‌గా నిలవడమే తన లక్ష్యమని చెబుతోంది ఈ చిన్నారి.

● జొహరాపురంలోని లక్ష్మీగార్డెన్స్‌లో నివసిస్తున్న రోషిని, సర్వోత్తమ్ దంపతుల కుమార్తె కీర్తన. ప్రస్తుతం మూడో తరగతి చదువుతోంది. కుమార్తె ఆటలపై మక్కువ చూపడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు లాన్ టెన్నిస్‌లో శిక్షణ ఇప్పించారు. ● 2025 మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు కర్నూలు నగరంలోని టెన్నిస్ కోర్టులో నిర్వహించిన జిల్లాస్థాయి లాన్‌టెన్నిస్ పోటీల్లో బంగారు పతకం అందుకుంది. ● 2025 మార్చి 17 నుంచి 18వ తేదీ వరకు అనంతపురంలో జరిగిన రాయలసీమ స్థాయి లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అండర్ 8 బాలికల విభాగంలో రజత పతకం గెలుపొందింది. ● 2025 ఆగస్టు 2న కర్నూలు నగరంలో ఆర్షియా టెన్నిస్ అకాడమీ వారు నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-8 బాలికల విభాగంలో రజత పతకం అందుకుంది. ● 2025 ఆగస్టు 15న హైదరాబాద్‌లోని బోయినపల్లి లియో టెన్నిస్ అకాడమీలో జరిగిన పోటీల్లో రజతం సాధించింది.

హుసేనాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మల్లెల రాజశేఖర్

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

ఓర్వకల్లు న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నంద్యాల జిల్లా తెదేపా అధ్యక్షుడు, తితిదే పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ పేర్కొన్నారు. హుసేనాపురం గ్రామంలో సోమవారం ఆయన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారని కొనియాడారు. గుట్టపాడులో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బ్రాహ్మణపల్లెలో పార్టీ మండల కన్వీనర్ నాగిరెడ్డి, ఓర్వకల్లులో మండల మాజీ కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లుచేశారు. కార్యక్రమంలో కాల్వబుగ్గ ఆలయ కమిటీ ఛైర్మన్ నారాయణ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని 24, 14 వార్డుల్లో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజుయాదవ్, తెలుగు యువత కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.అబ్బాస్ తదితరులు లబ్ధిదారులకు నగదు అందజేశారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన అవసరం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : దివ్యాంగుల హక్కులు, చట్టాలపై జిల్లా అధికారులు అవగాహన కలిగుండాలని కలెక్టర్ డా.ఎ.సిరి సూచించారు. దివ్యాంగుల హక్కుల చట్టం-2016, ఏపీ ప్రభుత్వ నియమాలు- 2023 తెలుగు, ఆంగ్లానికి సంబంధించిన పుస్తకాలను కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం కలెక్టర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను జిల్లాలోని అధికారులందరికీ అందించారు. వికలాంగుల హక్కుల పరిరక్షణలో జిల్లా అధికారులంతా ముందుండాలన్నారు. జిల్లా ఎస్పీ కూడా తన కార్యాలయంలో ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. ఇందులో కీలక అంశాలను పోస్టర్లుగా రూపొందించి తమ కార్యాలయాల్లో పంపిణీ చేస్తామని ఎస్పీ తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జేసీ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రయీస్ ఫాతిమా, సామాజికవేత్త మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

14న హైందవ శంఖారావం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నగరంలోని 50 ప్రాంతాల్లో హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు బాలాజీనగర్ బస్తీ నిర్వహణ సమితి అధ్యక్షుడు ఎస్.మాణిక్యరెడ్డి తెలిపారు. బాలాజీనగర్‌లోని సాయిబాబా కల్యాణ మండపంలో సోమవారం హైందవ శంఖారావానికి సంబంధించిన కరపత్రాలను బస్తీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి బాబయ్య, తదితరులు విడుదల చేశారు. ఈనెల 14న ఉదయం 10 గంటలకు క్లౌడ్ 9 అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో హైందవ శంఖారావం జరుగుతుందని వివరించారు.

మంత్రిపై బురదజల్లే ప్రయత్నం మానండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు, జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌పై కొంతమంది వైకాపా నాయకులు తప్పుడు ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేయడం తగదని తెదేపా

మాట్లాడుతున్న సోమిశెట్టి, పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పొరేటర్లు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని తెదేపా జిల్లా కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజుయాదవ్, కార్పొరేటర్లు జకియా అన్సారి, కె.పరమేష్, క్రాంతి, శ్రీధర్, పార్టీ నాయకులతో కలిసి సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్స్‌లోని స్థలం హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అనువైనదని అధికారులు ఎంపిక చేస్తుంటే, మంత్రి ఆ స్థలాలను కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారని ప్రచారం చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా వైకాపా వారు కుట్రలు మానుకొని అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కర్నూలు నగర ఖాజీగా షేక్ ఉమర్ ఫారూక్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వు జారీ చేసింది. నగరానికి చెందిన ఈయన పదేళ్ల పాటు ఖాజీగా సేవలందిస్తారని ఉత్తర్వులో పేర్కొంది.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : పత్తి క్వింటాకు రూ.12 వేల మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్స్‌ను ఖాళీ చేయించే నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : మైక్రో ఫైనాన్స్ సంస్థల అధిక వడ్డీ వేధింపుల నుంచి పేదలు, మహిళలను కాపాడాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మల, శ్యామల, అరుణ తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : లింగ నిర్ధారణ, భ్రూణహత్యలకు పాల్పడుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా స్పెషల్ కలెక్టర్ అనురాధకు వినతిపత్రం సమర్పించినట్లు డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుసేన్‌బాషా తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ : బడుగు, బలహీన వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రాణించాలని పరితపించిన జ్యోతిరావు పులె ఆశయ సాధనకు కృషి చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు నగేష్ పిలుపునిచ్చారు.

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : సర్వజన వైద్యశాలలో యూరాలజీ, న్యూరోసర్జరీ ఆపరేషన్ థియేటర్ల నిర్మాణాలు వేగంగా పూర్తిచేసి వచ్చే నెలలో ప్రారంభిస్తామని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జీజీహెచ్‌లోని పలు విభాగాల్లోని ఓపీ వార్డులను సోమవారం ఆయన తనిఖీ చేశారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి వేడుకలు

ఓర్వకల్లు న్యూస్‌టుడే : ఓర్వకల్లులోని జీవేశ్వరాలయంలో సోమవారం గీతా జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ భక్తులు ఆలయంలో భజనలు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఓర్వకల్లు, గుట్టపాడు, కన్నమడకల తదితర గ్రామాల ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భజనల్లో పాల్గొన్న భక్తులు

డా.హరికిషన్‌కు కళామిత్ర పురస్కారం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : కర్నూలుకు చెందిన ప్రముఖ కథా రచయిత డా.హరికిషన్‌కు కళామిత్ర పురస్కారం లభించింది. ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన కళామిత్ర మండలి వార్షికోత్సవంలో ఆయన అవార్డు అందుకున్నారు. జానపద బాల సాహిత్యాన్ని సేకరించడం, సామాజిక సమస్యలపై కథనాలు, ఒత్తులు, సంయుక్త అక్షరాలు లేకుండా కథలు, గేయాలు, నవలలు రచించి గుర్తింపు పొందిన హరికిషన్‌ను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, నూనె అంకమరావు తదితరులు సత్కరించి పురస్కారం అందచేశారు.

5న ప్రత్యేక లోక్‌అదాలత్

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : అపరిష్కృత విద్యుత్తు సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు పట్టణం, మండల, కల్లూరు, ఓర్వకల్లు, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల పరిధిలోని విద్యుత్తు వినియోగదారులు ఈ వేదికను ఉపయోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈనెల 5న వెల్దుర్తి మండల కేంద్రంలోని విద్యుత్తు ఉపకేంద్రం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్యలో నిర్వహించే ప్రత్యేక లోక్‌అదాలత్‌లో ఛైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు జి.మధుకుమార్, సాంకేతిక సభ్యుడు ఎ.శ్రీనివాసబాబు, స్వతంత్ర సభ్యురాలు డబ్ల్యూ విజయలక్ష్మి తదితరులు పాల్గొంటారని వివరించారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగర ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చే వినతులను పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. స్థానిక ఎస్బీఐ కాలనీలోని

సమస్య వింటున్న నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్

నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి 23 వినతులను స్వీకరించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర సమస్యలను ప్రజలు విన్నవించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.57 వేల విలువైన ఆర్థికసాయం చెక్కులను స్థానిక మాధవనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె లబ్ధిదారులకు అందజేశారు.

భూ ఆక్రమణదారుపై చర్యలకు డిమాండు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : మాజీ సైనికుల భూమి కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పి.జాన్ కలెక్టర్‌ను కోరారు. కర్నూలు మండలం భూపాల్‌నగర్‌లోని మిలటరీ కాలనీకి చెందిన బాధితుడు పి.జాన్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధంలో తమ తండ్రి పి.జ్ఞానముని సేవలకు గుర్తించి ప్రభుత్వం ఆయన భార్య లేట్ కరుణమ్మ పేరుతో రుద్రవరం గ్రామంలో 5 ఎకరాలకు పైగా భూమి కేటాయించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన రవిశంకర్‌గౌడ్ తన బంధువైన రెవెన్యూ అధికారి సాయంతో నకిలీ పాస్‌బుక్కు సృష్టించి కొంత భూమిని తన పేరున రాయించుకున్నారని ఆరోపించారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామస్థులతో కలిసి ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

నిధుల స్వాహాపై విచారణ జరిపించండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : అక్టోబరులో ప్రధానమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లలో నాసిరకం రోడ్లు నిర్మించి నిధులు స్వాహా చేసిన వారిపై విచారణ జరిపించాలని పట్టణ పౌర హక్కుల సంఘం నాయకుడు ఇ.పుల్లారెడ్డి, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం వారు కలెక్టర్ డా.ఎ.సిరికి వినతిపత్రం సమర్పించారు.

మహిళా దొంగను పోలీసులకు అప్పగించిన ప్రజలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులో సోమవారం ఓ వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీకి పాల్పడిన మహిళా దొంగను ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానిక చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన శంకర్‌రెడ్డి భార్య దేవమ్మ సమీప కాలనీలోని చౌకదుకాణంలో రేషన్ బియ్యం తీసుకుని నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా.. ముఖానికి వస్త్రం కట్టుకున్న ఓ మహిళ ఆమె మెడలోని గొలుసు తెంచుకెళ్లేందుకు యత్నించింది. బాధితురాలు అప్రమత్తమై గట్టిగా పట్టుకుంది. దుండగురాలు ఆమెను కొట్టి కింద పడేసి గొంతుపై కాలు పెట్టి కత్తితో బెదిరించి మెడలోని గొలుసును తెంచుకుని పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు. ఆమెను జొహరాపురం వాసిగా గుర్తించినట్లు సమాచారం.

కలెక్టరేట్‌లో.. కాలుపెట్టాలన్నా కష్టమే

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు కలెక్టరేట్ సముదాయంలో వాహనాల పార్కింగ్ అదుపు తప్పింది. ప్రాంగణంలో ఎటుచూసినా ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. వివిధ కార్యాలయాలకు వెళ్లే దారుల్లోనే అడ్డంగా బండ్లు ఆపి వెళ్తున్నారు. వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే సందర్శకులు, విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి లోపలికి వెళ్లేందుకు దారిలేకుండా పోతోంది.

● కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు చిన్నపాటి దారి వదిలి ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆ దారికి అడ్డంగా వాహనాలు నిలిపి వెళ్లిపోతున్నారు. దీంతో కలెక్టర్ కార్యాలయంలోకి అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. అధికారులు, సిబ్బందితో పాటు సందర్శకులు ఈ వాహనాల మధ్య నుంచి అష్టకష్టాలుపడుతూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

కలెక్టరేట్ సముదాయంలోకి వెళ్లిరావాలంటే ఈ వాహనాలను దాటాల్సిందే..

సోమవారం ముందుకెళ్లలేం

కలెక్టరేట్ సముదాయంలో కార్లు, ద్విచక్ర వాహనాలను వేర్వేరుగా పార్కింగ్ ఏర్పాటు చేయాలి. వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు సెక్యూరిటీ సిబ్బందిని నియమించినా ప్రయోజనం లేకుండాపోతోంది. సోమవారం వచ్చిందంటే చాలు వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో కలెక్టరేట్ ముఖద్వారం మూసుకుపోతోంది. ప్రధాన రహదారులపై ఎక్కడపడితే అక్కడ బైక్‌లు నిలుపుతుండటంతో అడుగుపెట్టాలన్నా కష్టంగా మారుతోంది. అధికారులు తమ వాహనాలతో కార్యాలయ సముదాయంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాలు ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

● కలెక్టరేట్ ముఖద్వారం ముందు రోడ్డుపై అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్ చేస్తున్నారని.. ద్విచక్రవాహనాలను ప్రత్యేకంగా పార్కింగ్ చేయించాలని కొన్నిరోజుల కిందట కార్యాలయ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినాసరే పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దారులకు అడ్డంగా వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని సందర్శకులు విన్నవిస్తున్నారు.

(c) eenadu

అవుకు మండలం మంగంపేట వద్ద కొండల్లో ఏర్పడిన జలపాతం సందడి చేస్తోంది. దీన్ని చూసేందుకు పర్యాటకులు వస్తున్నారు. స్వీయ చిత్రాలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. – ఈనాడు, నంద్యాల, న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

'తక్కువ ధరకు కోత కోస్తే ఒప్పుకోం'

■ సిండికేట్‌గా మారి బెదిరిస్తున్న కోత యంత్రాల ఏజెంట్లు

ఆళ్లగడ్డ, రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం మండలంలో వరికోతల విషయంలో కొందరు ఏజెంట్లు చెప్పిందే వేదంగా మారుతోంది. స్థానికంగా కొందరు ఏజెంట్లు రైతులను దోచుకోవడమే లక్ష్యంగా సిండికేట్‌గా మారుతున్నారు. సాధారణంగా ఇక్కడ గంటకు రూ.3,000 నుంచి రూ.3200 వరకు కోత యంత్రాల యజమానులు తీసుకుంటారు. ఈ ఏడాది ఆశించినంత దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయారు. కోతలకు నెల్లూరు ప్రాంతం నుంచి యంత్రాలు ఇక్కడికి వచ్చాయి. నెల్లూరు ప్రాంతానికి చెందిన ఒక ఏజెంట్ రైతుల దుస్థితిని గమనించి ఆదివారం మాచినేనిపల్లెలో రూ.2,600కే కోశారు. విషయం తెలుసుకున్న ఇతర ఏజెంట్లు తక్కువ ధరకు కోతలు చేసే యంత్ర యజమానిని బెదిరించారు. 'తక్కువ ధరకు పంటను కోస్తే ఒప్పుకోమని, ఇలానే చేస్తే పంట ఎలా కోస్తావో చూస్తా'మంటూ బెదిరించాడు. ఈ బెదిరింపులు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. రైతుల కష్టాన్ని గమనించి తక్కువ ధరకు కోతలు కోసేందుకు వస్తే స్థానిక ఏజెంట్లు అడ్డుకోవడం సబబు కాదని పలువురు పేర్కొంటున్నారు.

చిన్నారుల వైద్యం.. ఏమిటీ దైన్యం

పరిశీలన

చలి వణికిస్తోంది.. నవజాత శిశువులు, చిన్నారులు ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నారు.. దగ్గు, జలుబు, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. నిత్యం వెయ్యి వరకు చిన్నారుల ఓపీ ఉంటోంది. బనగానపల్లి, డోన్, ఆదోని, ఎమ్మిగనూరు వంటి పట్టణాల్లో వంద వరకు ఓపీ నమోదు అవుతోంది. 'ప్రాథమిక వైద్యం చేసి నంద్యాల, కర్నూలు జిల్లా కేంద్రాల్లోని సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. అక్కడ పడకలు దొరక్క ప్రైవేటుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. – న్యూస్‌టుడే, కర్నూలు, ఆదోని, నంద్యాల వైద్యం

● సీజనల్ వ్యాధుల బారిన బావితరం
● 'చలి'ంచని ప్రభుత్వ వైద్యులు

ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు

● నవజాత శిశువులను వార్మర్లు, ఇంక్యుబేటర్ల సేవలు అవసరం. కూర్పోగలిగిన చిన్నారులకు నెబ్యులైజర్లు అందుబాటులో ఉంచాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ఇవి కానరావడం లేదు. కొన్ని చోట్ల ఉన్నప్పటికీ అవసరమైన వైద్యులు, సిబ్బంది లేక నిరుపయోగంగా మారాయి.

● కొవిడ్‌కు ముందుకు సీహెచ్‌సీలకు విలువైన పరికరాలు అందజేశారు. వీటిని వినియోగించుకోకపోవడం.. చిన్నపాటి మరమ్మతులు చేయకపోవడంతో మూలన పడ్డాయి.

ఆసుపత్రి	సంఖ్య
ఏరియా	3
సామాజిక	18
ప్రాథమిక	87

ప్రైవేటులో భారం

ప్రైవేటుగా నెబ్యులైజర్లు పెట్టించాలంటే రూ.200 పెట్టి ఓపీ తీసుకోవాలి. తర్వాత నెబ్యులైజరుకు రూ.20-50 వరకు ఖర్చవుతుంది. ఇక ఇంక్యుబేటర్లు, వార్మర్లు సేవలు అందాలంటే రోజుకు సరాసరిన రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లించాల్సిందే.

వైద్యం కోసం కర్నూలు సర్వజన ఆసుపత్రికొచ్చిన తల్లులు

● కొవిడ్ సమయంలో ఆస్పత్రుల వద్ద ఎల్‌పీఎం ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటిని ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడం.. నిపుణులను నియమించకపోవడం, నిర్వహణ కొరవడంతో మూలకు చేరాయి.

సర్వజనం తరలివస్తోంది

● కర్నూలు సర్వజన వైద్యశాలలోని పీడియాట్రిక్ విభాగంలో ఈ ఏడాది అక్టోబరులో కేసులను పరిశీలిస్తే అప్పుడే పుట్టిన శిశువుల నుంచి నెలలోపు కేసులకు సంబంధించి 280 అడ్మిషన్లు జరిగాయి. ఇందులో 95 కేసులు ఆసుపత్రిలో జరిగిన ప్రసవాలు కాగా.. మరో 185.. బయట నుంచి వచ్చిన కేసులున్నాయి. నవంబరులో 292 న్యూబార్న్ అడ్మిషన్లు జరగ్గా.. అందులో 117 వరకు ఆసుపత్రిలో జరిగిన ప్రసవాలున్నాయి. 175 మంది బయటి నుంచి వచ్చిన కేసులే ఉన్నాయి.

● నంద్యాల సర్వజన ఆస్పత్రిలో చిన్నపిల్లల ఓపీ 150 వరకు ఉంటోంది. ఐపీ 80 వరకు ఉంది. మాతా శిశు సంరక్షణ వైద్యశాలలో ఎస్‌సీయూకు సంబంధించి 20 పడకలు ఉండగా.. మరో 10 వరకు అవసరమని వైద్యులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..

● ఆళ్లగడ్డలో గత ఎనిమిది నెలలుగా చిన్న పిల్లల వైద్యుడు లేరు. నవజాత శిశువులకు వైద్యం అందించేవారే కరవయ్యారు.

● బనగానపల్లి ఏరియా ఆసుపత్రిలో నిత్యం ఓపీ 100కు పైగా ఉంటుంది. వైద్యుల కొరత ఉండటంతో బాధితులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆక్సిజన్ ప్లాంట్ మరమ్మతుల కారణంగా నిరుపయోగంగా మారింది.

విజ్ఞాన కోవెలకు విశ్రాంత ఉద్యోగి పునాది

పల్లె నరసింహారెడ్డి

"నిరుద్యోగ యువతకు బాసటగా నిలుస్తున్నారు విశ్రాంత ఉద్యోగి పల్లె నరసింహారెడ్డి. గ్రంథాలయ అధికారిగా పని చేసిన ఆయన ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఆయన ఓసారి తన సొంతూరు ఆర్.పాంపల్లెకు వెళ్లారు. అక్కడ యువత ఖాళీగా ఉండటాన్ని గమనించిన ఆయన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. రూ.5 లక్షలు వెచ్చించి రెండు గదులున్న ఇంటిని కొనుగోలు చేశారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం "భారత్ గ్రంథాలయం" విజ్ఞాన భాండాగారాన్ని నెలకొల్పారు. రూ.20 వేల ఖర్చుతో గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలను కల్పించారు. దినపత్రికలు, మాసపత్రికలతో పాటు ఉద్యోగ పరీక్షలకు అవసరమైన 500 పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఇందులో ఉద్యోగ పరీక్షలకు అవసరమైనవి, ఆధ్యాత్మిక గ్రంథాలు, నవలలు, కథల పుస్తకాలు ఉన్నాయి. లైబ్రరీ ఆవరణలో రోజూ సాయంత్రం విద్యార్థులు ఆడుకునేందుకు అవకాశం కల్పించారు. గ్రంథాలయ నిర్వాహకుడిని నియమించి ప్రతి నెలా రూ.3 వేల వేతనాన్ని అందిస్తున్నారు." – న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ

గూడువు పొడిగింపు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : గ్రామీణ పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. పీఎం ఆవాస్ గ్రామీణ్ యోజన 2.0 పథకం ద్వారా వీరికి ఎక్కువ మందికి ప్రయోజనం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. పక్కాగృహం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

దరఖాస్తు ఎలా

● సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోవాలని అనుకునేవారు గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ సహాయకులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్ లేదా ఇంటి స్థల పత్రం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలి.

● ఇంటి స్థలం లేని వారు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

	★ కర్నూలు	★ నంద్యాల
సొంతిల్లు లేనివారు	41,116	29,042
వచ్చిన దరఖాస్తులు	27,076	30,802

ఎంత ఇస్తారు

సొంత స్థలంలో పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.20 లక్షలు, స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, ఉపాధిహామీ పథకం కింద రూ.27 వేలు అందజేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.21 వేలు అందించనుంది. మొత్తం రూ.1.80 లక్షల సాయం అందనుంది.

70,158 మందికి సొంతిల్లు లేదు

ఉమ్మడి జిల్లాలో డిమాండ్ సర్వే ప్రకారం సొంతిల్లు లేని వారు 70,158 మంది ఉన్నట్లు గుర్తించారు. నవంబరు 30వ తేదీ వరకు 57,878 దరఖాస్తులు వచ్చాయి. డిమాండ్ సర్వే ప్రకారం మరో 12,280 మంది దరఖాస్తు చేసుకోలేదు.

ఇక్కడ దూసుకెళ్తే.. మోసుకెళ్తారు!

బనగానపల్లి మండలం కృష్ణగిరి వద్ద దద్దణాల చెరువు వంకపై వంతెన నిర్మించారు. దీనికి ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు మాయమయ్యాయి. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. నెలలు గడుస్తున్నా రక్షణ గోడలు ఏర్పాటు చేయడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించేలా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.
– ఈనాడు, నంద్యాల, – న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

ఇంటికొచ్చారు పంచాయితీ పెట్టారు!

■ గందరగోళంగా స్వామిత్వ సర్వే

కర్నూలు నగరం, నంద్యాల గ్రామీణ, న్యూస్‌టుడే : పల్లెల్లో ఇళ్ల స్థలాలకు యాజమాన్య హక్కు పత్రాలు అందించాలన్న ఉద్దేశంతో చేపడుతున్న స్వామిత్వ సర్వే గందరగోళంగా మారింది. ఇంజినీరింగ్ సహాయకులు భూములకు కొలతలు వేసిన తర్వాత సర్వేయర్ మ్యాప్‌లు సిద్ధం చేయాలి. దస్త్రాల నిర్వహణ, యాజమాన్య హక్కులు కల్పించేలా పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లబ్ధిదారుల సమక్షంలో సర్వే చేయాల్సి ఉండగా ఇష్టానుసారంగా వ్యవహరించారు. మొదటి విడత సర్వే పూర్తైనా లబ్ధిదారులకు ఆస్తి పత్రాలు ఇవ్వలేదు.

హలహర్వి గ్రామ పంచాయతీలో రోవర్‌తో కొలతలు వేస్తున్న సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి తదితరులు

విడత	గ్రామాలు	అసెస్‌మెంట్లు
తొలి	12	7,391
రెండు	43	24,714
మూడు	188	1,69,302

ఫిర్యాదుల వెల్లువ

» నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామంలో తొలి దశ సర్వే సరిగా చేయలేదంటూ గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు మరోసారి రోవర్లతో సర్వే చేయించి తప్పులు సరిదిద్దారు.

» గోస్పాడు గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన తొలి దశ సర్వేలో తప్పులున్నాయంటూ గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. హాలహర్వి మండలం మాచనూరు గ్రామంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

» రెండో విడత సర్వేలో భాగంగా నంద్యాల జిల్లా ఆత్మకూరు మండల పరిధిలో 16, పగిడ్యాల-46, మహానంది-87, గోస్పాడు-130, నంద్యాల-34, బనగానపల్లి 27, అవుకు మండల పరిధిలో సుమారు 13 ఫిర్యాదులు అందాయి. ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. పరిష్కరించాలని కోరారు.

రెండో విడత పూర్తికాకనే..

» ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండో విడత స్వామిత్వ సర్వే పూర్తి చేయలేదు. అంతలోనే మూడో విడత సర్వే ప్రారంభించడం గమనార్హం. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలంటూ ఉన్నతాధికారుల ఒత్తిళ్ల నేపథ్యంలో సిబ్బంది కార్యాలయాల్లో కూర్చుని మ్యాప్‌లు రూపొందిస్తుండటం గమనార్హం.

» పలు ప్రాంతాల్లో సర్వేయర్లు, వీఆర్వోలు అందుబాటులో లేకపోవడంతో సర్వే సాఫీగా జరగడం లేదు. ఉమ్మడి జిల్లాలో 19 రోవర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మండలానికి ఒక రోవర్ కూడా సమకూర్చలేని పరిస్థితి

కొలత.. యజమానుల కలత

» ఉమ్మడి కర్నూలు జిల్లాలో 973 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. తొలి విడత సర్వేలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 86 గ్రామాల్లో సర్వే చేశారు. అస్తవ్యస్తంగా చేశారని.. ఆస్తి పత్రాల్లో వివరాలు సరిగా నమోదు చేయలేదంటూ గ్రామ సభల్లో పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి.

» లబ్ధిదారుల సమక్షంలో సర్వే చేసి కొలతలు తీసి వివరాలు నమోదు చేయాల్సి ఉంది. చాలా గ్రామాల్లో ఇష్టానుసారంగా నమోదు చేయడంతో సమస్యలు ఏర్పడ్డాయి.

» స్థలాల కొలతల్లో తేడాలు రావడం.. సరిహద్దు సమస్యలు ఏర్పడాయి. అధికారులు పరిష్కరించకపోవగా.. మరింత జటిలం చేశారు.

శంకర్ విసిరిన పతకాల రాకెట్

కర్నూలు నగరానికి చెందిన ఇంటర్మీడియట్ కుర్రాడు డి.సాయి శంకర్ లాన్ టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు, ఆలిండియా స్థాయిలో 150వ ర్యాంకులో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ (ఎంపీసీ) మొదటి సంవత్సరం చదువుతున్న ఆ కుర్రాడు గత ఐదేళ్లుగా లాన్ టెన్నిస్ సాధన చేస్తున్నారు. ఇప్పటి వరకు 14 బంగారు, ఒక వెండి పతకం అందుకొన్నారు. ఆలిండియా లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 30న భువనేశ్వర్‌లో అండర్-17 విభాగంలో పాల్గొన్నారు. నవంబరు 3 నుంచి 6వ తేదీ వరకు శ్రీకాళహస్తిలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకంతో సత్తా చాటారు. "నిత్యం రెండు గంటల పాటు మహమ్మద్ రఫీ వద్ద శిక్షణ తీసుకుంటున్నా.. వచ్చే ఏడాది థాయిలాండ్‌లో జరిగే ఐటీఎఫ్ (అంతర్జాతీయ టెన్నిస్ ఫెడరేషన్) పోటీల్లో ప్రవేశం పొందేందుకు సాధన చేస్తున్నట్లు" శంకర్ వివరించారు. – న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

పచ్చని కొండల్లో దివ్యధామం

పచ్చని కొండలు.. 50 ఎకరాల స్థలం.. దివ్యధామంగా వెలుగొందుతోంది. అవుకు మండలంలోని మంగంపేట శివారులోని కొండల్లో 20 ఏళ్ల కిందట గణపతిస్వామి ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. దాతలిచ్చిన రూ.10 లక్షలతో ఆంజనేయస్వామి ఆలయం, రూ.కోటితో కోదండరామాలయం నిర్మించారు. రూ.10 కోట్లతో వెంకటేశ్వర స్వామి ఆలయానికి పునాది వేశారు. ప్రస్తుతం గోపురాల నిర్మాణం జరుగుతోంది. అక్కడే ఉన్న కాశినాయన ఆశ్రమంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది. ఈనెల 5 నుంచి 7 వరకు జరిగే కాశినాయన ఆరాధనోత్సవాలకు ఆశ్రమం ముస్తాబైంది. వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, అనంతపురం ప్రాంతాల నుంచి 30 వేల మంది భక్తులు తరలొస్తారు. డోన్, అనంతపురం, బనగానపల్లి నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు.– న్యూస్‌టుడే, అవుకు

పరీక్షకు పదింతల దోపిడీ

ప్రైవేటు పాఠశాలల ఇష్టారాజ్యం ● ఫిర్యాదులందినా చర్యలు శూన్యం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు పేరుతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు రూ.వేలల్లో దోచుకుంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ బడిలో రూ.125తో పాటు అదనంగా రూ.300 వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రైవేటు స్కూళ్లలో మాత్రం పరీక్ష రుసుముతో పాటు స్పెషల్ ఫీజు పేరుతో రూ.2- 3 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎందుకని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. అదనపు దోపిడీపై కలెక్టర్ స్పందించి అడ్డుకట్ట వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు విద్య

	■ ప్రైవేటు పాఠశాలలు	■ విద్యార్థులు
కర్నూలు	209	10,500
నంద్యాల	172	9,123

అధికారులకూ వాటా

● పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు పేరుతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అదనంగా రూ.వేలల్లో వసూలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ చర్యలు శూన్యమే.

● వసూలు చేస్తున్న సొమ్ములో జిల్లా పరీక్షల విభాగం అధికారులకు కూడా కొంత మొత్తం చెల్లిస్తున్నట్లు ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో పాటు పరీక్షల సమయంలో కేంద్రాల నిర్వహణ, నీరు, విద్యుత్తు ఇతర వసతులకు ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పెషల్ ఫీజు సేకరిస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

● ఈ సొమ్ముతో అనువైన పరీక్ష కేంద్రాన్ని కేటాయించేందుకు ప్రయత్నం చేస్తామని కొన్ని పాఠశాలల నిర్వాహకులు చెబుతుండటం గమనార్హం.

వామ్మో స్పెషల్ ఫీజు

● వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. రెగ్యులర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రూ.125 రుసుము నిర్ణయించారు. సప్లిమెంటరీ కింద మూడు సబ్జెక్టుల్లోపు ఉంటే రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబరు 10వ తేదీ లోపు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించే అవకాశం ఉంది. ఆ గడువు దాటితే అపరాధ రుసుము వసూలు చేయాలని విద్యాశాఖ ప్రత్యేకంగా ఉత్తర్వు జారీ చేసింది. చాలామంది తల్లిదండ్రులకు దీనిపై సమాచారం లేకపోవడంతో అపరాధ రుసుము, స్పెషల్ ఫీజు పేరుతో రూ.125తో పాటు అదనంగా రూ.2 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

డబ్ల్యూఎంఎం చేయకనే నిర్మించిన బీటీ రహదారి

తారుస పడిన అక్రమాలు

నంద్యాల పట్టణం, కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే : వడ్డించేవాడు మనోడైతే బంతిలో ఎక్కడ కూర్చుంటే ఒకటే అనే చందంగా మారింది అధికారుల తీరు. రహదారి పనులను గుత్తేదారుడు అధ్వానంగా చేసినా అధికారులు పట్టించుకోలేదు. పైపై పూత పూసి నిధులు దిగమింగారు. ప్రభుత్వ ఖజానాకు పెద్దఎత్తున నష్టం చేకూర్చారు. జరిగిన పనులపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో దిద్దుబాటు చర్యలు తీసుకున్నారు.

రూ.కోట్ల అంచనాతో..

బనగానపల్లి నియోజకవర్గ పరిధిలోని కొలిమిగుండ్ల-పెట్నికోట ఆర్‌అండ్‌బీ రహదారిని మూడు నెలల కిందట నిర్మించారు. మేజర్ జిల్లా రహదారులు పథకం కింద రూ.2 కోట్ల అంచనాతో పిలవగా గుత్తేదారుడు 4 శాతం ఎక్కువకు టెండరు దక్కించుకున్నారు. 4 కి.మీ. పొడవునా నిర్మించిన ఈ రహదారి పనుల ప్రారంభం నుంచే ఆరోపణలు వెల్లువెత్తాయి.

నాసిరకం పనులతో..

రహదారిని డబ్ల్యూఎంఎం (వెట్‌మిక్స్) పద్ధతిలో నిర్మించాల్సి ఉంది. బీటీ రహదారి నిర్మాణంలో భాగంగా కింది ప్రాంతంలో డబ్ల్యూఎంఎం మెటల్ వేయాలి. 150 ఎంఎం నుంచి 200 ఎంఎం వరకు వేయాలి. రోలింగ్ చేసి నీళ్లు చల్లుతూ లెవలింగ్ పూర్తైన తర్వాత తారు వేయాలి. కానీ చాలావరకు డబ్ల్యూఎంఎం లేకుండానే 'పైపూత'తోనే రోడ్డు వేసి 'మమ' అనిపించేశారు. ఫలితంగా కొద్ది రోజులకే గుంతలు పడ్డాయి. గుత్తేదారుడు ఓ నేతకు 'అస్మదీయుడు' కావడంతో పనులు నాసిరకంగా చేసినా అధికారులు పట్టించుకోలేదు.

డీఎల్‌పీ పూర్తికాకనే..

డీఎల్‌పీ (డిఫెక్ట్ లయబులిటీ పీరియడ్) పద్ధతిలో రోడ్డు నిర్మించిన తర్వాత రెండేళ్లలోపు దెబ్బతింటే సంబంధిత గుత్తేదారుడే మరమ్మతులు చేయాలి. ఐదేళ్లలోపు ఈ రోడ్డుకు ప్రభుత్వం ఎలాంటి నిధులు ఇవ్వదు. దీనిని ఐదేళ్ల తర్వాతే రెన్యువల్ చేయాలి. కానీ కొలిమిగుండ్ల-పెట్నికోట రహదారికి గతంలో నిధులు కేటాయించారు. ఐదేళ్లు పూర్తికాకుండానే ప్రస్తుతం రెన్యువల్ పేరుతో మరోసారి రూ.2 కోట్లు కేటాయించడం గమనార్హం. ఈ పనులు సొంతం చేసుకున్న గుత్తేదారుడికి ఇది కలిసి వచ్చింది. నిర్మాణ పనుల్లో భాగంగా చాలా ప్రాంతాల్లో డబ్ల్యూఎంఎం ఉండడంతో పనులు తూతూమంత్రంగా చేశాడు. పాత రోడ్డుపైనే కొత్త పూత వేసి నిధులు మింగేశాడు.

అధికారుల దిద్దుబాటు చర్యలు

రహదారి పనులపై పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు. గుత్తేదారునితో మరో లేయర్ బీటీ వేయించారు. కింది భాగంలో డబ్ల్యూఎంఎం లేకుండానే పైపూత పనులతో నాణ్యత ఎంతవరకు ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యతా నియంత్రణ విభాగం అధికారుల తీరుపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. పనులను తనిఖీ చేయాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో అతిథిగృహాలకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి.

వరించిన నవార

"30 సెంట్ల పొలం.. 5 క్వింటాళ్ల వరి ధాన్యం.. రూ.30 వేల ఆదాయం గడించారు సి.బెళగల్ మండలం కొత్తకోటకు చెందిన రైతు రంగస్వామి. నవార దేశీ రకం వరిని సాగు చేసి తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. రూ.360 వెచ్చించి 3 కిలోల వడ్లు కొనుగోలు చేశారు..రూ.100 వెచ్చించి ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేశారు. పొలంలో రెండు సంచుల వేప చెక్క కోసం రూ.1900 వెచ్చించారు. జీవామృతం, దశపద కషాయాల కోసం మరో రూ.2000 ఖర్చు చేశారు. చేతికొచ్చిన చేనును కోయగా ఐదు క్వింటాళ్ల ధాన్యం వచ్చింది. మిల్లులో మరాడించి 3 క్వింటాళ్ల బియ్యాన్ని క్వింటాకు రూ.12 వేలకు విక్రయించారు."– న్యూస్‌టుడే, సి.బెళగల్

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన బాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప

స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
కర్నూలు: 99899 97628
80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

ఈనాడు, కర్నూలు

బుల్లెట్ రైలు మార్గం

ముమ్మరంగా సర్వే పనులు ● ట్రాక్ నిర్మాణానికి అడుగులు

ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా బుల్లెట్ రైలు వెళ్లేందుకు 'మార్గం' సుగమం అవుతోంది. దేశవ్యాప్తంగా కొన్ని మార్గాల్లో బుల్లెట్ ట్రైన్లు నడపాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్- బెంగళూరు మార్గాన్ని ఎంపిక చేశారు.. అందుకు అనువైన ట్రాక్ నిర్మాణానికి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా గుంటూరు-గుంతకల్లు, ముద్కేడ్-డోన్ డబ్లింగ్ పనులు వేగవంతమయ్యాయి. అమృత్ భారత్ కింద స్టేషన్ల ఆధునికీకరిస్తున్నారు.

1.20 గంటలో బెంగళూరుకు

● కర్నూలు-బెంగళూరు మధ్య దూరం 427 కి.మీ. మేర ఉంది. ప్రస్తుతం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో 5.30 గంటలు పడుతోంది. దీని గరిష్ఠ వేగం 180 కి.మీ.లు అయినప్పటికీ 130 కి.మీ. వేగంతోనే నడుపుతున్నారు.

● బుల్లెట్ రైలు అందుబాటులోకొస్తే కర్నూలు నుంచి బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌కు 1.20 గంటలో చేరుకోవచ్చు. దీని గరిష్ఠ వేగం గంటకు 350 కి.మీ.. భద్రత కారణాల నేపథ్యంలో 320 కి.మీ. వేగంతోనే నడుపుతారు. ఈ వేగం తట్టుకునేలా అనువైన ట్రాక్ నిర్మించాల్సి ఉంటుంది.

డబ్లింగ్.. వేగవంతం

● గుంటూరు-గుంతకల్లు రైలు మార్గంలో డబ్లింగ్ పనులు తుది దశకు చేరుకొన్నాయి. రూ.3,631 కోట్లు వెచ్చించి 401.47 కి.మీ. మార్గాన్ని బాగు చేస్తున్నారు. 57.738 కి.మీ. మేర పనులు చేయాల్సి ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇవి పూర్తైతే నంద్యాల నుంచి గుంటూరు, విజయవాడ, గుంతకల్లు వైపు పలు నూతన సర్వీసులు నడిపేందుకు అవకాశం ఉంటుంది.

● ఉత్తర-దక్షిణ భారతదేశ ప్రాంతాలను కలిపే ఉద్దేశంతో ముద్కేడ్-డోన్ రైల్వే లైన్‌కు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మహారాష్ట్రలోని ముద్కేడ్ నుంచి ఏపీలోని డోన్ వరకు 417.88 కి.మీ. మేర రూ.4,686.09 కోట్లతో డబ్లింగ్ పనులు చేపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న మహబూబ్‌నగర్-డోన్ మధ్య 197 కి.మీ. మేర పనులు 2029 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. పూర్తైతే హైదరాబాద్ నుంచి బెంగళూరు, తిరుపతి, చెన్నై వైపు ఎక్కువ రైళ్లను నడిపే అవకాశముంటుంది.

(c) eenadu

పూత దశ.. జాగ్రత్తలతో రక్ష

నవంబరు నుంచి జనవరి వరకు మామిడి చెట్లు పూతకు వస్తాయి. ఈ సమయంలో సరైన మెలకువలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ సూచించారు.

● జనవరి మూడో వారంలో లీటరు నీటిలో మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ.+కార్బండజిమ్ ఒక గ్రాము లేదా హెక్సాకొనజోల్ ఒక మి.లీ. కలిపి చెట్లపై పిచికారీ చేసి టెంకెపురుగు, తేనెమంచు పురుగు, మచ్చ తెగుళ్లు, బూడిద తెగుళ్లను నివారించవచ్చు. ఈ మందులను పూత, మొగ్గ దశలో, బఠాణి గింజ సైజులో పిందెలు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.

● పిందె రాలుడు: ఆకు మొగ్గలు పూతగా మారే వరకు చెట్లకు నీరు పారించరాదు. వీలున్నంతవరకు నేలలో తేమను తగ్గించాలి. మొక్కల మధ్య నీరు నిలవకుండా చూడాలి. డిసెంబరు నుంచి చలి అధికంగా ఉండి రాత్రి ఉష్ణోగ్రతలు



పూతతో మామిడి తోట

బాగా తగ్గిన కారణంగా పూల కాడలు పొడవు పెరగకుండా కుచించుకపోతాయి. ద్విలింగ పుష్పాలు తగ్గి దిగుబడిపై ప్రభావం పడుతుంది. ఈ పరిస్థితుల్లో నాఫ్తలిన్ ఎసిటిక్ ఆమ్లం 20 పీపీఎం గాఢతతో (2 మి.లీ. వంద లీటర్ల నీటికి) మొగ్గ బయటకు రాగానే ఒక సారి పిచికారీ చేయాలి. పూలకాడలు 15-20 సెం.మీ. పొడవు పెరిగి అధిక పుష్పాలు కలిగి ఉంటాయి.

● చెట్లు వారం నుంచి పది రోజుల్లో పుష్పించడానికి, పూత మొగ్గలు బయటకు రాగానే ఒక సారి నీటితడి ఇవ్వాలి. పుష్పించడానికి అవసరమయ్యే రసాయనాలు, హార్మోన్లు ప్రతి రెమ్మకు చేరి చెట్టంతా ఒకేసారి పుష్పిస్తుంది. కాయలన్నీ ఒకే దశలో ఉండటం వల్ల కాయల కోత కూడా సులభమవుతుంది.

● పిందెలు జొన్న గింజ, గోలీకాయ పరిమాణంలో ఉన్నప్పుడు ఎక్కువగా రాలుతుంటాయి. దీనివల్ల దిగుబడి తగ్గిపోతుంది. పిందె రాలుడు నివారణకు సరైన సమయంలో ఎన్ఏఏ ద్రావణాన్ని 20 పీపీఎం గాఢతతో పిచికారీ చేసి నివారించవచ్చు.

– న్యూస్‌టుడే, బేతంచెర్ల

నిప్పుపెడితే.. ముప్పే

జిల్లాలో వేలాది ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. పంటను కోసిన వెంటనే రెండో పంట సాగు చేసుకునేందుకు రైతులు భూమిని సిద్ధం చేయాలనే తొందరలో చాలా మంది అన్నదాతలు కొయ్యలకు నిప్పు పెడుతున్నారు. ఈసారి రెండో పంటకు నీరు లేదని అధికారులు ప్రకటించారు. కొంత మంది రైతులు వరి కొయ్యలు కాల్చేస్తున్నారు. నిప్పంటించడం వల్ల నేలను సారవంతం చేసే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు చనిపోతాయనే విషయాన్ని కర్షకులు గమనించాలని హాలహర్వి మండల వ్యవసాయాధికారి జిలానీబాషా తెలిపారు. వరి మాగాణుల్లో నిప్పు పెట్టడం వల్ల వాతావరణంలో కాలుష్యం పెరుగుతుంది. కొయ్యలు కాల్చిన చోట నేల బిగువుగా మారి, నీటిని పీల్చుకునే గుణం కోల్పోతుందని పేర్కొన్నారు.

వరి మాగాణిలో కాలుతున్న వరి గడ్డి

బాలరాజు, శాస్త్రవేత్త కేవీకే

సందేహాలు సమాధానాలు

?: మినుము పంటలో ఆకులపై లేత పసుపు వర్ణం గుండ్రని చిన్న మచ్చలతో పాటు కాయల్లో రంధ్రాలు కనిపిస్తున్నాయి. పంట ఇప్పుడు పింజ దశ దాటి పోయింది. మరో నెల రోజుల్లోపు పంట చేతికొస్తుంది. నివారణ తెలపండి.

– పుల్లారెడ్డి, టంగుటూరు

✔: మారుకా మచ్చల పురుగు తెగులు ఇది. పంటపై మచ్చల పురుగు ఆశించి ఉంటుంది. పంటలో పురుగులు కనిపిస్తే.. వెంటనే ఒక లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా థయోడి కార్బ్ 1.0 గ్రాములు లేదా ఎసిఫేట్ 1.0 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉద్ధృతి అధికంగా ఉంటే.. ఒక లీటరు ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా రైనాక్సిపిర్ 0.3 మి.లీ. నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

– న్యూస్‌టుడే, బనగానపల్లి

పశువుల్లో శ్వాసకోశ వ్యాధులు

శీతాకాలంలో పాడి పశువులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హొళగుంద మండల పశువైద్యాధికారిణి ప్రసన్నబాయి తెలిపారు. చలి ఎక్కువగా ఉండటం వల్ల శ్వాసకోశ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. షెడ్ చుట్టూ తెరలు, గోనెపట్టలు కట్టి లోపలికి గాలి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గడ్డిని నేలపై పరుపులా వేయాలని, ఆరుబయట కడితే పశువులకు ఎండ తగిలేలా చూడాలని, మంచు తగ్గిన తర్వాతే దాణాకు వదలాలన్నారు. మాంసకృతులు ఉన్న దాణా రోజుకు అదనంగా 20శాతం వరకు అందించాలని సూచించారు.

– న్యూస్‌టుడే, హాలహర్వి

చలికాలం తెగుళ్లను తరిమేద్దాం

చలి కాలంలో ముసురు వాతావరణం వల్ల మిరపలో పురుగు, తెగుళ్ల బెడద ఉంటుంది, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల నివారించుకోవచ్చని ఉద్యానశాఖ అధికారిణి శ్రీవాణి తెలిపారు. రసం పీల్చేపురుగు, ఆకుమచ్చ, ఆకుముడత, బూడిద తెగులు ఆశిస్తుందన్నారు.

● **బూడిద తెగులు:** తెగులు సోకిన మొక్క పైన, అడుగు భాగంలో తెల్లటి బూడిద రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు లీటరు నీటిలో గంధకం (నీటిలో కరిగే) మూడు గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. లేదా కేరథాన్ ఒక మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

● **రసం పీల్చే పురుగులు:** నల్లి, పేను బంక, తామర పురుగులు మొక్క లేత భాగాల

నుంచి రసం పీల్చడం వల్ల ఆకుముడత తెగులు వ్యాపిస్తోంది. మొక్కలు గిడసబారి పూత, పిందెలు రాలిపోతాయి. నివారణ కోసం కంది, జొన్న, సజ్జ వంటి పంటలతో కంచె పంట వేసుకోవాలి. ఎర పంటలుగా బంతి, ఆముదం వేసుకోవాలి. ఎకరానికి 10 నుంచి 20 నీలం, పసుపుపచ్చ రంగు అట్టలను పైరు కంటే అడుగు ఎత్తులో పెట్టుకోవాలి. లీటరు నీటిలో ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా థయామిథాక్సామ్ 0.3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉన్న మొక్కలను పొలం నుంచి తొలగించి నాశనం చేయాలి.

● ఆకుమచ్చ తెగులు నివారణకు లీటరు నీటిలో కార్బండిజమ్+మాంకోజెబ్ 2.5గ్రాములు లేదా అజాక్సిస్ట్రోబిన్ 2మి.లీ. కలిపి పిచికారీ చేసుకోవాలి.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

ఐబిస్ పక్షులు.. రైతు నేస్తాలు

ఆళ్లగడ్డ మండలంలోని పరిసర పొలాల్లో బ్లాక్ హెడెడ్ ఐబిస్ (థ్రెస్కియోర్నిస్ మెలనోసెఫాలస్) పక్షులు సందడి చేస్తున్నాయి. కొంగలను పోలి ఉన్నప్పటికీ వాటి కంటే భిన్నంగా కనిపిస్తాయి. తలపై రెబ్బలు ఉండి, ముక్కు సూటిగా, పొడవుగా ఉంటుంది. పక్షులకు తల నల్లగా, ముక్కు కింద వైపు వంగి ఉంటుంది. పరిమాణంలో కొంగల కంటే చిన్నగా ఉంటాయి. ఇవి రైతులకు నేస్తాలుగా పేరొందాయి. పంటలను నాశనం చేసే పురుగులు, కీటకాలు, సూక్ష్మ జీవులు, నీటిలో ఉండే హానికర జీవులు వీటి ప్రధాన ఆహారం. వాటిని తినడంతో వరి దిగుబడి పెరగడమే గాక కీటకనాశక మందులు తగ్గి పంట ఆరోగ్యం మెరుగవుతుంది. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం



దగ్గరి దారికి.. మరమ్మతులు

నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు

కుందూ నదిపై బారిగేడ్లు ఏర్పాటు చేసిన అధికారులు

నంద్యాల పట్టణంలో నెల రోజుల క్రితం తుపాను ప్రభావంతో కుందూ నదిపై ఉన్న పాత వంతెనపై నుంచి రెండు రోజుల పాటు వరద నీరు పారడంతో రాకపోకలు నిలిపివేశారు. వంతెనపై దెబ్బతిన్న రోడ్డు దాదాపు అర కిలోమీటరు వరకు గుంతలమయంగా మారింది. దీంతో అధికారులు సోమవారం వంతెనపై కొద్ది దూరం వరకు మరమ్మతులు చేస్తున్నారు. దాదాపు పది గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో అక్కడి వరకు వచ్చిన వారు పట్టణంలోకి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గడివేముల నుంచి నంద్యాలకు వచ్చేవారు ఆటోలు, కార్లలో పొలాల మీదుగా దాదాపు 13 కి.మీ చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. పక్కనే ఉన్న కొత్త వంతెన పనులు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

వైభవంగా లక్ష తులసీ అర్చన

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం కైశిక ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని పంచామృతాలతో అభిషేకించారు. పసుపు, చందనం, కర్పూరం వంటి లేపనాలు సమర్పించి ధూపదీపాలతో మంగళహారతి అందించారు. సాయంత్రం స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి లక్ష తులసీ దళ అర్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

తులసీ అర్చన చేస్తున్న అర్చక బృందం

నేత్రపర్వంగా పల్లకి ఉత్సవం

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయాధికారి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా పల్లకి ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకిని అందంగా అలంకరించి ఉత్సవ విగ్రహాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రాకార ఉత్సవం గావించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులున్నారు.

ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు వైభవంగా వెండి రథోత్సవం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వెండి రథంపై ఉంచి అర్చకులు మంగళహారతులు సమర్పించారు. శివనామస్మరణ మధ్య ఆలయ సిబ్బంది రథోత్సవం నిర్వహించారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

డబ్బు తీసుకొని కారు ఇవ్వలేదు

☛ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 45 ఫిర్యాదులు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 45 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని ఎస్పీ సునీల్ షొరాణ్ స్వయంగా స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్ణీత గడువు లోపల బాధితులకు న్యాయం చేయాలని ఫిర్యాదులను పునరావృతం కాకుండా చూడాలన్నారు.

● నంద్యాల పట్టణంలో చెన్న కేశవ కార్ కన్సల్టెన్సీకి చెందిన చెన్నకేశవ, ఆయన భార్య వారం రోజుల్లో కారును ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని చెప్పి రూ.3.10 లక్షలు తీసుకొని.. తప్పుడు అగ్రిమెంట్ చేయించి మోసం చేశారని పట్టణానికి చెందిన హుసేన్ బాషా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

● ఓలా కంపెనీ స్టోర్‌లో ఎలక్ట్రికల్ స్కూటర్ కావాలని రూ.1.19లక్షలు చెల్లించినప్పటికీ ఇంత వరకు స్కూటర్ ఇవ్వలేదని, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా కంపెనీ వారు కాలయాపన చేస్తున్నారని పట్టణానికి చెందిన బాలరాజు ఫిర్యాదు చేశారు.

బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సునీల్ షొరాణ్

మద్దిలేటిస్వామి క్షేత్ర దర్శనం ఇక సులువు

ఆర్.ఎస్. రంగాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు మెరుగైన దర్శన సేవలను అందిస్తున్నట్లు ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు పేర్కొన్నారు. వాట్సప్ నంబరు 95523 00009కు హాయ్ అని పంపడం ద్వారా దేవస్థాన సేవలను బుకింగ్ చేసుకోవచ్చని, వెబ్‌సైట్ ద్వారా కూడా సేవలను పొందవచ్చన్నారు. వాట్సప్ ద్వారా దర్శనం, ప్రసాదం, గదుల కేటాయింపు వంటి సేవలను ఆన్‌లైన్ ద్వారా భక్తులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్శనం రూ.100, లడ్డు ప్రసాదం రూ.15, అభిషేకం రూ.100, కల్యాణం రూ.1116 చెల్లించి మొబైల్ ఫోన్ ద్వారా సేవలు పొందవచ్చన్నారు.

సచివాలయం ద్వారా ప్రజల చెంతకు ప్రభుత్వం

భీమవరం(నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: సచివాలయం ద్వారా ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు వెళ్లాయని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల మండలంలోని భీమవరం గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, సీసీ రోడ్లను సోమవారం సర్పంచి భక్తవత్సలమ్మ, కలెక్టరు రాజకుమారితో కలిసి ప్రారంభించారు. గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పింఛన్ల మంజూరు కాలేదని బాధతో విన్నవించిన ఒక మానసిక వికలాంగుడి దరఖాస్తును స్వీకరించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, జడ్పీటీసీ సభ్యులు గోకుల్ కృష్ణారెడ్డి, ఆర్డీవో విశ్వనాథ్, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీవో సుగుణశ్రీ, నాయకులు విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టరు రాజకుమారి

ప్రజా భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. తెదేపా నాయకులు ఎన్ఎండీ. ఫయాజ్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంపీపీ ప్రభాకర్, తహసీల్దార్లు శ్రీనివాసులు, వాణి, ఎంపీడీవో సుగుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు విజయవంతం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్రంలోని ప్రజలకు అందించి సూపర్ సక్సెస్ చేశామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సౌదరదిన్నె గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి హాజరై లబ్ధిదారులకు పింఛన్ల సొమ్మును అందజేశారు. రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ.. స్థానిక సమస్యలను తెలుసుకొన్నానని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉందన్నారు. రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, బిందు సేద్యం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన పంటలను సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో బనగానపల్లి మార్కెట్ యార్డు ఛైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, నాయకులు గువ్వల సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మురళి, గడ్డం నాగేశ్వర రెడ్డి, గడ్డం అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పులుల గణన మొదలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఆరో విడత పులుల గణనలో భాగంగా నల్లమలలో ఫేజ్-1 గణన సోమవారం నుంచి మొదలైనట్లు డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్‌అప్పావ్ అన్నారు. ఇందులో భాగంగా కనిపించే జంతువులతో పాటు మాంసాహార జంతువుల పాదముద్రలు, పెంటికలు, ఇతర గుర్తులు సేకరిస్తారని తెలిపారు. మొదటి మూడు రోజులు మాంసాహార జంతువులు, మరో మూడు రోజులు శాఖాహార జంతువులను గణించనున్నట్లు తెలిపారు. ట్రాన్సెక్టర్ లైన్ల గుర్తింపు, కెమెరా ట్రాప్‌ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తిస్తారని తెలిపారు. ఫేజ్-3 సర్వే జనవరిలో ప్రారంభమౌతుందన్నారు.

పులి పాదముద్రలు సేకరిస్తున్న అటవీ సిబ్బంది

హెచ్ఐవీ బాధితులు అధైర్యపడొద్దు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: హెచ్ఐవీతో జీవిస్తున్న వారు అధైర్యపడొద్దు. సరైన చికిత్సతో ఆరోగ్య జీవనం సాధ్యమేనని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి ప్రభుత్వ సర్వజన వైద్యశాల వరకు నిర్వహించిన ప్రదర్శనను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితుల పట్ల సమాజంలో ఏ విధమైన అపోహలు ఉండకూడదన్నారు. సురక్షిత జీవన విధానాలు పాటించడం ప్రతి కుటుంబం అనుసరించాల్సిన బాధ్యత అన్నారు. అనంతరం హెచ్ఐవీ బాధితులతో కలసి అల్పాహారాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఎంహెచ్‌వో డా. వెంకటరమణ, డీసీహెచ్ఎస్ లలిత, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

సేవలపై ప్రజాభిప్రాయాన్ని మెరుగుపర్చండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సేవల పట్ల ప్రజాభిప్రాయాన్ని మెరుగుపరిచేలా కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు ఏ మేరకు చేరుతున్నాయనే అంశంపై వివిధ మార్గాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, దేవాదాయ, సర్వే, వ్యవసాయ శాఖలపై ప్రజల నుంచి మిశ్రమ స్పందన వస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రతపై 43శాతం అసంతృప్తి కనిపిస్తుందన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో వైద్య సేవలను మెరుగుపరిచే అంశంపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. బేతంచర్ల మద్దిలేటి స్వామి ఆలయంలో తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం, ప్రసాద నాణ్యతను మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువుల లభ్యతపై 61శాతం లోపాలపై సమగ్ర విచారణ జరపాలని పేర్కొన్నారు.

అర్జీల ఆడిట్‌ను వేగంగా పూర్తి చేయండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను వేగంగా, నాణ్యతగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక పీజీఆర్ఎస్ హాలులో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. 278 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడిట్‌కు సంబంధించి 1694 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందులో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 364, విద్యుత్ శాఖ 114, పోలీసు 95, మైనార్టీ సంక్షేమ శాఖ 43, హౌసింగ్ 39, రిజిస్ట్రేషన్ల శాఖ 36, సర్వే 26, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించి 26 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని త్వరగా పరిష్కరించాలన్నారు.

భార్య మృతికి వారి తల్లిదండ్రులే కారణం

ఎస్పీకి ఫిర్యాదు చేసిన భర్త

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: తన భార్య మాధురి(22)మృతికి ఆమె తల్లిదండ్రులే కారణమని భర్త రాజేష్ ఆరోపించారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సునీల్ షొరాణ్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లెకు చెందిన మాధురిని ఈ ఏడాది మార్చిలో అదే గ్రామానికి చెందిన రాజేష్ కులాంతర వివాహం చేసుకున్నారు. మాధురి తండ్రి ఐఏఎస్ అధికారి కావడంతో అప్పట్లో చాలా వరకు పంచాయితీలు చేసినా ప్రయోజన లేకుండా పోయింది. దీంతో దంపతులు ఇద్దరు కొన్ని రోజులుగా కర్నూలులో జీవనం సాగించారు. ఆ తర్వాత బేతంచెర్ల పక్కన ఉన్న సిమెంట్ నగర్‌లో జీవనం కొనసాగించే సమయంలో మాధురి గర్భం దాల్చింది. మాధురికి తల్లి గుర్తుకురావడంతో 'అమ్మ నిన్ను చూడాలని ఉందని' మెసెజ్ చేయడంతో తల్లి లక్ష్మి, బంధువులు సిమెంట్ నగర్‌కు వచ్చి బేతంచెర్ల స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ పంచాయితీ చేసి.. తన భర్త రాజేశ్‌కు ఉద్యోగం లేని కారణంగా కొన్ని రోజులు తల్లిదండ్రుల వద్ద ఉంటానని రాసి తల్లితో మాధురి వెళ్లిపోయింది. కొన్ని రోజులకే ఆదివారం తాడేపల్లెలో మాధురి అనుమానాస్పదంగా చనిపోవడంతో భర్త రాజేష్ నంద్యాల జిల్లా ఎస్పీని కలిశారు. తన భార్య మృతికి వారి తల్లిదండ్రులే కారణమని తాను వెళ్లేంత వరకు పోస్టుమార్టం జరగకుండా చూడాలని కోరారు. భార్య బంధువులతో తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలన్నారు. రాజేష్ వెంట వాల్మీకి సంఘం నాయకులు వచ్చారు.

YEMMIGANUR MUNICIPALITY

E-Procurement Tender Notice No. 11/15th FCG & General Fund - 2025-2026/E1, dt: 01-12-2025

మునిసిపల్ సాధారణ నిధులు మరియు 15వ ఆర్థిక సంఘ నిధులతో 30 పనులు గాను **రూ. 146.33** లక్షలతో అర్హులైన కాంట్రాక్టర్ల నుండి టెండర్లు స్వీకరించబడును. వివరములకు **apeprocurement.gov.in** నుండి పొందగలరు.

సం/- కమిషనరు, ఎమ్మిగనూరు పురపాలక సంఘం

ఆస్తి కోసం హత్య చేసి..

☛ నలుగురు నిందితుల అరెస్టు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగి ఒంటరిగా ఉన్నారని తెలిసి.. ఆయన ఆస్తి, డబ్బులు కాజేయాలని హత్య చేసిన నిందితులను నంద్యాల పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సునీల్ షొరాణ్ విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేదరి పుల్లయ్య(65) భార్యతో విడాకులు తీసుకొని వీసీ కాలనీలో ఒంటరిగా జీవిస్తున్నాడు. తన తండ్రి అదృశ్యమైనట్లు కుమారుడు ఆదిత్య ప్రసాద్ నవంబరు 15వ తేదీన మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి వచ్చిన ఫోన్ కాల్స్‌ను పరిశీలించి.. అనుమానం వచ్చిన వారిని అదుపులోకి తీసుకుని మూడో పట్టణ సీఐ కంబగిరి రాముడు విచారణ చేపట్టారు. వైఎస్సార్ నగర్‌కు చెందిన ధనుంజయ్, పెసరవాయి గ్రామానికి చెందిన కాటె పోగు సంతోష్, గంగాధర రాఘవ, బిలకలగుడూరు గ్రామానికి చెంది బెస్త శ్రీకాంత్‌లు సోమవారం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండగా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

మృతుడు పుల్లయ్యకు ధనుంజయ్ పరిచయమై రూ.30లక్షలతో ఇంటిని కొనుగోలు చేయించాడు. అతనికి ఎవరూ లేరని, ఆయనను చంపితే ఆస్తి తమకే వస్తుందని మరో ముగ్గురితో కలిసి హత్యకు ప్రణాళిక సిద్ధం చేశారు. నవంబరు 13వ తేదీన బొలేరో వాహనాన్ని అద్దెకు తీసుకొని పుల్లయ్యను తీసుకొని గడివేముల మండలం బోగేశ్వరం దేవాలయానికి వెళ్లే దారిలో వాహనాన్ని ఆపి రూ.25లక్షలు డిమాండు చేశారు. లేవని చెప్పినందుకు ధనుంజయ వెంటనే మెడకు తాడు వేసి లాగి పట్టుకోవడంతో రాఘవ ఎదపై బలంగా కొట్టాడు. శ్రీకాంత్ నుదిటిపై కొట్టడంతో తలకు బలమైన గాయమై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మద్దూరు గ్రామం దగ్గరలో ఉన్న కుందూనదిలో వేసి అతని చరవాణి, హెల్మెట్, కత్తి, తాడు నీళ్లలో వేసి వెళ్లారు. మృతుడి ఇంటికి వెళ్లి డబ్బుల కోసం వెతికారు. డబ్బులు దొరకనందున డీవీఆర్ బాక్స్, కొన్ని డాక్యుమెంట్లు, ల్యాప్‌టాప్ తీసుకొని వెళ్లి వాటిని పులిమద్ది గ్రామ వద్ద ఉన్న కుందూ నదిలో వేశారు. నవంబరు 29న తెల్లపురి గ్రామ సమీపంలో కుందూనదిలో మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మంద జావళి, మూడో పట్టణ సీఐ కంబగిరి రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను చూపుతున్న ఎస్పీ సునీల్ షొరాణ్

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

TO LET

For Rent to Hospital, Polyclinics, Diagnostic Centers, 5200 Sft. G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: 89851 32552.

JOBS

G.N.R హాస్పిటల్, గాయత్రి ఎస్టేట్ కర్నూలులో పనిచేయుటకు అనుభవం కల్గిన రిసెప్షనిస్ట్ (F) కావలెను. అనుభవం బట్టి జీతం. సంప్ర: 96405 13249.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల
•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

నిరుపేదలకు వరం.. సీఎం సహాయ నిధి

వెల్పనూరులో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వెల్పనూరు(వెలుగోడు), న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి పేదలు, ఆపదలో ఉన్నవారికి వరం లాంటిదని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సోమవారం వెలుగోడు మండలంలోని వెల్పనూరు గ్రామంలో అందజేశారు. నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాలకు చెందిన 48 మంది లబ్ధిదారులకు రూ.51.06 లక్షల విలువైన చెక్కులు అందజేశారు.

శ్రీశైలంలో శివదీక్షా విరమణలు ప్రారంభం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో కార్తిక మాస శివ దీక్షా విరమణలు సోమవారం ప్రారంభమయ్యాయి. శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం నుంచి శివదీక్ష శిబిరాల్లోకి తీసుకువచ్చారు. భక్తులు ముందుగా శ్రీస్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్న తర్వాత శివదీక్ష శిబిరాల్లో ఇరుముడులను సమర్పించుకున్నారు. ఏర్పాట్లను ఛైర్మన్ రమేష్ నాయుడు పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు: 94403 61729
ఆత్మకూరు: 90149 09024
నంద్యాల: 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని బైర్మల్ వీధిలో, అనకాపేటలో వీధి కుక్కల బెడద అధికమైంది. **-సాయి, రాజు, స్థానికులు.**

?: పట్టణంలోని ఈశ్వర్‌నగర్, గోపాల్‌నగర్, బాలాజీ కాంప్లెక్స్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. **-మధు, నిరంజన్, మహేంద్ర, స్థానికులు**

✔: త్వరలోనే కుక్కలను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం. సిబ్బందితో కాల్వలు శుభ్రం చేయిస్తాం. **-లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని బస్టాండు ప్రాంతంలో ఫాగింగ్ చేయడం లేదు. దోమల బెడద అధికంగా ఉంది. **-ప్రమోద్, స్థానికుడు**

?: ఎన్జీవోస్ కాలనీ పార్కులో కుక్కల బెడద అధికంగా ఉంది. వాకింగ్ చేయాలంటే భయంగా ఉంది. **-లక్ష్మీ, స్థానికురాలు**

✔: సిబ్బందితో ఫాగింగ్ చేయిస్తాం. కుక్కలను పట్టించి సమస్య పరిష్కరిస్తాం. **-లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

?: మిడుతూరులోని కురువపేట, తొగలువీధిలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి భరించరాని దుర్గంధం వస్తోంది. వెంటనే తగిన చర్యలు అవసరం. **- రమణ, కురువపేట**

?: ఈ రెండు కాలనీల్లోని కాలువలను వెంటనే శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. **- కల్యాణ్ సింగ్, తాత్కాలిక కార్యదర్శి**

?: మండలంలోని చౌట్కూరు బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో ఇబ్బందిగా ఉంది. **-శ్రీనివాసులు, చౌట్కూరు**

✔: వీధి దీపాలు వెలిగే విధంగా ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం. **- వినయ్, తాత్కాలిక కార్యదర్శి** - న్యూస్‌టుడే, మిడుతూరు

పోటీల్లో గెలిచి.. విజేతలుగా నిలిచి

బహుమతులు అందుకున్న విద్యార్థులు

నంద్యాల గాంధీ చౌక్, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని నంద్యాల న్యూక్లియస్ కళాశాల కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో 'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన సమీనా, తులసీనాథ్, జయచంద్రలకు కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డి, డైరెక్టర్ వెంకట వాసుదేవ రెడ్డి, హారిక బహుమతులు అందజేశారు.

ఉపన్యాస పోటీలో పాల్గొన్న విద్యార్థిని

ఇదేం చెత్త నిర్వహణ

◆ అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య పనులు

పరిశీలన

నంద్యాల రైతునగరం, ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పురపాలక సంఘంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను రహదారుల పక్కనే పడేస్తున్నారు. మరోవైపు రద్దీ సమయాల్లో చెత్తను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. పట్టణంలో రహదారులపై చెత్త లోడుతో వెళ్తున్న వాహనాలతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పురపాలక సంఘం: నంద్యాల
రోజూ వచ్చే చెత్త: 110
మెట్రిక్ టన్నులు ట్రాక్టర్లు: 12
కంపాక్టర్లు: 5
పెద్ద కంపాక్టర్లు: 2
టిప్పర్లు: 3, జేసీబీ: 1
మినీ జేసీబీలు: 2
ఒప్పంద కార్మికులు: 343
రెగ్యులర్ ఉద్యోగులు: 96

టార్పాలిన్ లేకుండానే చెత్త తరలిస్తున్న ట్రాక్టర్

నిబంధనలు గాలికి..

నంద్యాల పట్టణంలోని 42 వార్డుల్లో దాదాపు 2.5 లక్షల మంది నివసిస్తున్నారు. రోజుకు 110 మెట్రిక్ టన్నుల చెత్త, వ్యర్థాలను కార్మికులు ఇంటింటా సేకరిస్తున్నారు. ఆ చెత్తను శివారులోని డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. ఇందు కోసం ట్రాక్టర్లు, ఆటోలు, ఫ్లాప్ మినీ ఆటోలు, టిప్పర్లు, మినీ కంపాక్టర్లు, జేసీబీలను వినియోగిస్తున్నారు. వాస్తవానికి నిబంధనల ప్రకారం చెత్తను తరలించే వాహనాలపై టార్పాలిన్లను కప్పి గాలికి ఎగరకుండా నిర్వహించాలి. ఈ విధానాన్ని తప్పక అమలు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే పట్టణంలో ప్రయాణించే చెత్త సేకరణ వాహనాలకు ఒక్కదానికి కూడా టార్పాలిన్లు కప్పడంలేదు. దీంతో పట్టణంలోని ప్రధాన రోడ్లతో పాటు వీధులు, కాలనీల్లో తిరిగే చెత్త సేకరణ ట్రాక్టర్లు, ఆటోల నుంచి చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ సంచులు, వ్యర్థాలు గాలిలో ఎగిరిపడుతున్నాయి.

● నంద్యాల సాయిబాబానగర్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో రెండు చోట్ల చెత్త నిల్వ పాయింట్లు ఉన్నాయి. ఇక్కడ ఎప్పుడు చూసినా పెద్ద మొత్తంలో చెత్త కనిపిస్తోంది.

● బొమ్మలసత్రం వంతెన కింద రెండు చోట్ల చెత్త నిల్వ పాయింట్లు ఉన్నాయి. ఈ రెండు చోట్ల వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.

● వీటితో పాటు వైఎస్సార్‌నగర్, నందమూరినగర్, దేవనగర్, ఎన్జీవోస్ కాలనీ, మూలసాగరం, నడిగడ్డ, పద్మావతినగర్, శ్యాంనగర్ తదితర ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గుట్టలుగా వ్యర్థాలు

పురపాలక సంఘం: ఆత్మకూరు
జనాభా: 54,350
వార్డులు: 28
రోజూ వెలువడే వ్యర్థాలు: 22 మెట్రిక్ టన్నులు
రోజూ తొలగిస్తున్న వ్యర్థాలు: 17 మెట్రిక్ టన్నులు
తోపుడు బండ్లు: 32
కంపాక్టర్లు: 02
ట్రాక్టర్లు: 04

ఆత్మకూరు పురపాలక సంఘం 2011లో ఏర్పడినా వ్యర్థాలు, చెత్తాచెదారం నిల్వ చేయడానికి డంపింగ్‌యార్డు లేదు. పట్టణంలో వెలువడే వ్యర్థాలను [illegible] మార్గంలో గుట్టలుగా నిల్వ చేస్తున్నారు. నివాస ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో జనం చెత్త, వ్యర్థాలు పడేయడంతో ఖాళీ స్థలాలు అపరిశుభ్రతకు ఆవాసాలుగా మారుతున్నాయి. అలరాయపేట, స్టేట్ బ్యాంకు, లక్ష్మీనగర్, రంగాహాల్ రోడ్డు, కప్పలకుంట, అర్బన్ కాలనీల్లో ఒక్కరోజు వ్యర్థాలు తొలగించకపోతే గుట్టలుగా పేరుకుపోతున్నాయి. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ లేకపోవటంతో ఇష్టానుసారంగా వ్యర్థాలు పడేస్తున్నారు.

పింఛను ఇప్పించండి సార్

షేక్‌మహబూబ్‌బాషా

నంద్యాల బొమ్మలసత్రం, న్యూస్‌టుడే: 'పేదరికం అనారోగ్యంతో జీవన పోరాటం చేస్తూ, చేయూత కోసం ఎదురు చూస్తున్నారు పాణ్యం మండలం బలపనూరు గ్రామానికి చెందిన షేక్‌మహబూబ్‌బాషా. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. మధుమేహం వ్యాధి తీవ్రమై 9 నెలల క్రితం రెండు కాళ్లు తొలగించారు. దీంతో మంచానికి పరిమితమయ్యారు. ఇంట్లో పెద్ద దిక్కుకు ఇలా జరగడంతో కుటుంబం రోడ్డున పడాల్సి వచ్చింది. కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని.. ప్రతి రోజూ ఒకరు కూలి పని చేయకుండా ఇంట్లోనే ఉంటూ సేవ చేస్తున్నామని ఆయన భార్య, కుమార్తె సోమవారం కలెక్టర్‌కు విన్నవించారు. ఎలాంటి జీవనాధారం లేని తమకు పింఛన్, ట్రైసైకిల్ మంజూరు చేసి భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు. కలెక్టర్ స్పందించి జనవరిలో కొత్త పింఛను మంజూరు చేస్తామని తెలిపారు.

ఒరిగిన స్తంభం.. విద్యార్థుల్లో భయం

నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఒరిగాయి. ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయపడుతున్నారు. పక్కనే కొత్తగా ఏర్పాటు చేసిన స్తంభాలకు విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

దారిలో ధాన్యం.. ప్రయాణికులకు అవస్థలు

పాణ్యం బనగానపల్లె రహదారిలో కొణిదేడు, అయ్యలూరు గ్రామాల పరిధిలో ధాన్యం ఆరబోశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుండటంతో గంటల సమయం ట్రాఫిక్ జామ్ అవుతుంది. రహదారి మధ్య వరకు వరి ధాన్యం పోయడంతో ఒకే రహదారిలో రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. -న్యూస్‌టుడే, పాణ్యం గ్రామీణం

ఇలా.. రాకపోకలు ఎలా..

నంద్యాల పట్టణం నర్స్ క్వాటర్స్‌లో పైప్‌లైన్ పనుల కోసం రహదారిని పగలగొట్టారు. పనులు పూర్తయ్యాక గుంతను సిమెంటుతో పూడ్చలేదు. దీంతో గుంతలు ఏర్పడి గడ్డి పెరిగి నీరు నిలుస్తోంది. స్థానికులు ఈ దారిలో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

మంత్రి బంధువులు బంధించారని ఎస్పీకి ఫిర్యాదు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: తన కుమారుడిని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బంధువులు బంధించారంటూ తండ్రి తిరుమలేశ్వరరెడ్డి సోమవారం జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్‌కు ఫిర్యాదు చేశారు. తిరుమలేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. . కర్నూలుకు చెందిన తేజారెడ్డితో కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లెకు చెందిన మల్లారెడ్డి కుమార్తెతో కొన్నేళ్ల క్రితం వివాహమై వారికి ఒక కుమారుడు ఉన్నారు. గత కొంత కాలంగా వారికి విభేదాలు రావడంతో భార్య, భర్త దూరంగా ఉంటున్నారు. తన కుమారుడిని చూడటానికి తేజారెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించి అనుమతులు తీసుకొచ్చుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం కనకాద్రిపల్లెకు వెళ్లిన తేజారెడ్డిని బంధించి రూ.60లక్షలు ఇచ్చి వెళ్లాలని భార్య బంధువులు డిమాండు చేశారు. మంత్రి బంధువులు కావడంతోనే బంధించారని బాధితుడి తండ్రి తిరుమలేశ్వరరెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన కుమారుడిని రూ.60లక్షలు ఇస్తే వదిలేస్తామని లేదంటే చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని సంతజూటూరు గ్రామ శివారులో ఉన్న పికప్ ఆనకట్ట కుందూనదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీశారు. సోమవారం ఎస్సై జగన్మోహన్ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకొని కుందూ నీటి ప్రవాహంలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. గుర్తుపట్టలేని విధంగా ఉందని ఎస్సై చెప్పారు. శవపరీక్ష నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రమాదంలో మహిళకు గాయాలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మంగమ్మ అనే మహిళకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నంద్యాల మండలం వెంకటేశ్వరపురానికి చెందిన మంగమ్మ సోమవారం ప్రైవేటు పాఠశాల వద్ద ఆటో దిగి రహదారి దాటుతుండగా కర్నూలు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మంగమ్మను నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సంక్షిప్త సమాచారం

గడివేముల, న్యూస్‌టుడే: గడివేముల మండల డిప్యూటీ ఎంపీడీవోగా వీరశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.

గడివేముల, న్యూస్‌టుడే: గడివేముల మండల వైకాపా కన్వీనర్ మధుసూదన గుప్తా కారును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆదివారం రాత్రి ఇంటి బయటి నిలిపి ఉంచిన కారు డోరు అద్దాన్ని రాయితో పగలగొట్టినట్లు బాధితుడు తెలిపారు.

వెలుగోడు: పట్టణంలోని ఆత్మకూరు-నంద్యాల రహదారిపై ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తుందని తెదేపా నాయకులు ఎన్‌ఎండీ.ఫయాజ్ పేర్కొన్నారు. తొమ్మిదవ వార్డులో పింఛన్ల పంపిణీతో పాటు నూతన రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై అవగాహన పెరగాలని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం అన్నారు. వడ్డుగండ్ల గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు.

తిమ్మాపురం, (మహానంది), న్యూస్‌టుడే: ప్రతి వ్యక్తి ఆరోగ్యవిద్య, విజ్ఞానాన్ని పెంచుకోవాలని వైద్యులు డాక్టర్ వేణుకార్తికేయ పేర్కొన్నారు. ఎం.తిమ్మాపురంలో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఉమామహేశ్వరీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

గాజులపల్లె, (మహానంది), న్యూస్‌టుడే: ఆపదలో తోడుగా శక్తియాప్ ఉంటుందని నంద్యాల పోలీస్ శక్తి బృందం ప్రతినిధి హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గాజులపల్లె గ్రామంలోని శాంతినికేతన్ పాఠశాలలో శక్తియాప్‌పై అవగాహన నిర్వహించారు.

పగిడ్యాల,న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఎంతో అవసరమని ముచ్చుమర్రి ఎస్సై నరేంద్ర తెలిపారు. నెహ్రూనగర్ గ్రామంలో స్థానికులు సహకారంతో వేగ నిరోధక నియంత్రికలను ఏర్పాటు చేశారు.

పింఛన్ల పెంపు సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

నందికొట్కూరు గ్రామీణం,న్యూస్‌టుడే: పింఛన్ల పెంపు సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామంలో సోమవారం పింఛన్లు

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

పంపిణీ చేశారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు కొంత పింఛన్లు మంజూరు చేయాలని కొందరు ఎమ్మెల్యేను కోరారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని డీఈవో జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్పీజీ మైదానంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. డీఈవో స్వయంగా షాట్‌పుట్, లాంగ్ జంప్‌లో పాల్గొని విద్యార్థులకు స్ఫూర్తిని పెంచారు. జిల్లా విలీన విద్య సమన్వయకర్త జగన్‌మోహన్‌రెడ్డి

ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఈవో

విద్యార్థులకు పతకాలు అందజేశారు. నంద్యాల డయాలసిస్ బిషప్ సంతోష్ ప్రసన్నరావు, ఎంఈవో శివరాం ప్రసాద్, అలెస్కో సమన్వయకర్త ప్రసన్నకుమార్, విలీన విద్య సహాయ సమన్వయకర్త శ్రీనివాసుల, ఏఎంవో మాధవి పాల్గొన్నారు.

గిరిజన భూములకు పట్టాలు ఇవ్వాలి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఓంకారం శివారులో ఉన్న నాయినీ చెరువు గిరిజన భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట గిరిజనులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ, వ్య.కా.సం నాయకులు రత్నమయ్య, డేవిడ్‌లు మాట్లాడుతూ అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ మేరకు తహసీల్దారు పద్మావతికి వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన డిప్యూటీ ఎంపీడీఓలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నూతనంగా బాధ్యతలు తీసుకున్న డిప్యూటీ ఎంపీడీఓలు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను కలిశారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డు ఛైర్మన్ ఛాంబరులో ఎమ్మెల్యేను ఆరు మండలాల డిప్యూటీ ఎంపీడీఓలు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డిప్యూటీ ఎంపీడీఓలు నందికొట్కూరు పాండురంగారెడ్డి, మిడుతూరు సురేష్‌కుమార్, పగిడ్యాల మన్సూర్‌బాషా, జూపాడుబంగ్లా మోహన్‌నాయక్, పాములపాడు తిరుపాలయ్య, కొత్తపల్లి పీఎస్‌ఆర్‌శర్మ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి జనసేన సాయం

గాజులపల్లె, (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం గాజులపల్లె గ్రామం దళిత కాలనీకి చెందిన పి.బాలనరసింహుడు రెండు కాళ్లు ప్రమాదంలో కోల్పోవడంతో మండల జనసేన నాయకులు మానవతా సాయాన్ని సోమవారం అందించారు. ఇటీవల దివ్యాంగుడి సమస్యలపై 'ఈనాడు'లో ప్రచురించడంతో అతని వివరాలు తెలుసుకొని రూ.10 వేల విలువైన నిత్యవసర వస్తువులను నాయకులు చక్రపాణి, దమాల చందు, డి.మురళీ, రామచంద్రుడు, మహేష్, ప్రసాద్, నాగేష్, మహేంద్రతో పాటు పలువురు అందజేశారు.

భూముల సమస్యలు పరిష్కరించాలి

గడివేముల, న్యూస్‌టుడే: మండలంలో నెలకొన్న భూమి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసర్వే జరిగిన గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. సోలార్ భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వివరించారు. ధర్నా అనంతరం తహసీల్దారు వెంకటరమణకు వినతిపత్రం ఇచ్చారు. పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్‌సలాం, నాయకులు చిన్నశీలన్న తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరవచ్చు

తిమ్మాపురం, (మహానంది), న్యూస్‌టుడే: క్రమశిక్షణ గల జీవితమే ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మాధవీలత పేర్కొన్నారు. మహానంది మండల కేంద్రం ఎం.తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో లైబ్రేరియన్‌గా పనిచేసిన దివ్యాంగుడు దేశీయ వెంకటసుబ్బరాయుడు, ఉమాదేవి దంపతులకు ప్రధానోపాధ్యాయులు సీహెచ్ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పదవీ విరమణ సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ భూపాల్, ఎంఈవోలు రామసుబ్బయ్య, విజయకుమార్, ప్రతాపరెడ్డి, తెదేపా నేత ఉల్లి మధు పాల్గొన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10,200ల

ప్రసంగిస్తున్న మాధవీలత

విలువచేసే క్రీడా సామగ్రి అందజేసిన దాత, తెదేపా మండల మాజీ అధ్యక్షులు ఉల్లి మధును పీడీ నాగరాజుతో పాటు పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

చదరంగంలో జాతీయ స్థాయికి ఎంపిక

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ చెస్ పోటీల్లో శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం కళాశాలలో విద్యార్థులు సత్యవంశీ, రాజేశ్వరిలను అభినందించారు. విభాగాధిపతులు డేవిడ్, ఫరూక్, ఫిజికల్ డైరెక్టర్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని, అనేక సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని తెదేపా జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని మద్దూరు గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్రానికి అనేక సంస్థలు పెట్టుబడి పెట్టడానికి

పింఛను అందజేస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్‌గౌడ్

ముందుకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జయరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రంగారమేష్, నాయకులు ఖాదర్‌బాషా, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భాజపాకు పట్టుకొమ్మలు మోర్చా నాయకులు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: మోర్చా నాయకులు పార్టీకి పట్టుకొమ్మలని నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఆయన మోర్చా నాయకులకు నియామక పత్రాలు అందించారు. కిసాన్ మోర్చా నాయకులుగా బిజ్జం సుబ్బారెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులుగా బిజ్జం సుబ్బారెడ్డి, శ్రీధర్ యాదవ్, ఎస్సీ మోర్చా నాయకులుగా తపెట ప్రసాద్, మైనార్టీ మోర్చా నాయకులుగా సయ్యద్ రజాక్‌లను నియామకం చేపట్టి పత్రాలను అందజేశారు. రాష్ట్ర నాయకులు నరసింహారావు, డా.ఇంటిఆది నారాయణ, నిమ్మకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సంతజూటూరు, చిన్నదేవళాపురం, నారాయణాపురం, శింగవరం, లింగాపురం, సోమయాజులపల్లె, శింగవరం, జీసీపాలెం తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతాం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు తాళ్లపల్లి వీరయ్య కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. నంద్యాల కలెక్టరేట్ ఎదుట సోమవారం సీపీఐ నాయకులు, తాళ్లపల్లి వీరయ్య కుటుంబ సభ్యులు కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం

ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు

జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నంద్యాలకు చెందిన బిల్డర్ వేణు కోర్టు ఇచ్చిన తీర్పును పట్టించుకోకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో బాబాఫకృద్దీన్, సుంకయ్య, భార్గవ్, సోమన్న, బాధిత కుటుంబ సభ్యులు భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, సరస్వతి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: భగవద్గీతతో ముక్తి పొందవచ్చని గీత ప్రచారకులు, ప్రవచన కర్త మద్దయ్యస్వామి అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గీతా జయంతిని భక్తిశ్రద్ధలలో నిర్వహించారు పట్టణంలోని ఉమామహేశ్వర ఆశ్రమంలో, బొమ్మలసత్రం సాయిబాబా ఆలయంలో గీత జయంతిని నిర్వహించారు.

మహానంది, న్యూస్‌టుడే: అమృత తుల్యమైన గీతాసారాన్ని ప్రతివారు పొందాలని ప్రముఖ అంబికేశ చైతన్యస్వామి పేర్కొన్నారు. జినశంకర తపోవనంలో ఆశ్రమాధ్యక్షులు సంజీవకుమార్ ఆధ్వర్యంలో గీతాజయంతి నిర్వహించారు.

మలుపులు.. ప్రమాద పిలుపులు

◆గ్రామాల్లో ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ సమస్య
◆ కనిపించని సూచిక బోర్డులు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. అసలే ఇరుకు రోడ్లు కావడంతో మూల వద్దకు వెళ్లే వరకు ఎదురుగా వచ్చే వాహనం కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికే పలువురు ప్రమాదాల్లో గాయపడి వారు ఆసుపత్రుల పాలయ్యారు.

చాపిరేవులలో ఇరుకు రోడ్డులో వెళ్తున్న వాహనాలు

ఎక్కడెక్కడంటే..

మండలంలోని పెద్దకొట్టాల, చాపిరేవుల గ్రామాల్లో ఉన్న వంపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనపడని పరిస్థితి. రోడ్డులో ఎక్కడా సూచిక బోర్డులు లేవు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి.

◆ ఆళ్లగడ్డ వైపు నుంచి శ్రీశైలం, ఆత్మకూరు, మహానంది వెళ్లే వాహనాదారులు దగ్గరి దారి అయిన అయ్యలూరి మెట్ట నుంచి పెద్దకొట్టాల మీదుగా వెళ్లి పట్టణ శివారులోని చెరువుకట్ట మీదుగా వెళ్తుంటారు. ఆయా గ్రామాల్లోనూ మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో బైపాస్ రహదారి నిర్మిస్తే సమస్య తీరుతుంది. 2018లో తెదేపా ప్రభుతం బైపాస్ రహదారికి నిధులు మంజూరు చేయగా.. తర్వాత వచ్చిన వైకాపా పభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు ఆగిపోయాయి.

◆ నంద్యాల నుంచి బనగానిపల్లె, కోవెలకుంట్ల మీదుగా వెళ్లే వాహనాలు చాపిరేవుల మీదుగా వెళ్తుంటాయి. గ్రామంలోని రోడ్డు చిన్నది కావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఉదయాన్నే బనగానిపల్లె నుంచి నాపరాతి బండల ట్రాక్టర్లు, కంకర టిప్పర్లు, ఆర్టీసీ బస్సులు, పాఠశాలల బస్సులు, ఆటోలు నంద్యాల పట్టణానికి వస్తూ పోతూ ఉంటాయి. ఈ కారణంగా తరచూ గ్రామంలో గంటలకొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. గ్రామంలో బైపాస్ రహదారి గురించి ఇప్పటికే ప్రజలు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గడివేముల బస్టాండు కూడలిలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

వెలుగోడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు

వివక్ష తొలగిద్దాం.. ప్రాణాలు కాపాడుదాం

వెలుగోడు, గడివేముల, ఆత్మకూరు పట్టణం, నంద్యాల పాతపట్టణం, నందికొట్కూరు, పాణ్యం గ్రామీణం, మిడుతూరు,బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచి వివక్షను తొలగించి ప్రాణాలను కాపాడుదామని వైద్యాధికారిణి సులోచన అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వెలుగోడు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గడివేములలో కొత్తబస్టాండు కూడలిలో అవగాహన కల్పించారు. ఆత్మకూరులో ర్యాలీ నిర్వహించి గౌడు కేంద్రంలో మానవహారంగా నిలిచి ప్రతిజ్ఞ చేశారు. నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శోభారాణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పాములపాడులో ర్యాలీ నిర్వహించారు. రామకృష్ణ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును ఆ కళాశాల ఛైర్మన్ డా.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. నారాయణాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి దినేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మిడుతూరులో ర్యాలీ నిర్వహించారు.

(c) eenadu

అందుబాటులో తపాలా సేవలు

అవుకు, న్యూస్‌టుడే: మండలంలోని జూనూతలలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాంచి తపాలా కార్యాలయాన్ని నంద్యాల సూపరింటెండెంట్ అప్పలస్వామి సోమవారం ప్రారంభించారు. గ్రామస్థులకు మెరుగైన సౌకర్యాన్ని కల్పించడానికి వీలుగా నూతన శాఖను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అన్నిరకాల పొదుపు, బీమా, బ్యాంకింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రామస్థులు తపాలా సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

చక్కటి బోధనతో ఉత్తమ ఫలితాలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డా.ఎస్.శివారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదోని నుంచి ఈయన బదిలీపై ఆళ్లగడ్డకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు చక్కటి బోధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అధ్యాపకులు డా.సి.గంగన్న, నాగమస్తాన్, గాయత్రి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

సన్మార్గంలో నడిస్తేనే భవిష్యత్తు

డోన్, న్యూస్‌టుడే: అందరూ సన్మార్గంలో నడిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, సమాజం బాగుంటుందని వివేకానంద సేవాసమితి గౌరవాధ్యక్షులు సప్తశైల తిమ్మయ్య, జగన్‌మోహన్‌లు అన్నారు. సోమవారం వివేకానంద సేవాసమితి, గీతాయోగాసన సంఘం ఆధ్వర్యంలో వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఆళ్లగడ్డ: 8008 574916 డోన్ పట్టణం: 94408 57790 బనగానపల్లె: 80085 73763

రుద్రవరం, న్యూస్‌టుడే: ?: రుద్రవరంలోని మెయిన్ బజార్‌లో గత పది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. - రాజు, రుద్రవరం.

✔: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి.

?: ఆర్.నాగులవరంలో ప్రధాన రహదారి అనుకుని నీటిపైపులైన్ కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారింది. - నరసింహ, ఆర్.నాగులవరం

✔: గుంత పూడ్చేలా చర్యలు తీసుకుంటాం.
- సుబ్రహ్మణ్యం, ఏఈజ

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: కొండపేటలో బీసీ వసతిగృహం వెనుక మురుగు కాల్వ అధ్వానంగా మారింది.
- సుంకన్న, కొండపేట.

✔: పారిశుద్ధ్య పనులు చేపడతాం.
- సునీల్, శానిటరీ ఇన్‌ఛార్జి అధికారి.

చాకరాజువేముల (దొర్నిపాడు), న్యూస్‌టుడే: ?: చాకరాజువేముల ఎస్సీ కాలనీ వెళ్లే రహదారి పక్కన ఉన్న మురుగు కాల్వలో చెత్త చేరి అధ్వానంగా మారింది.
- శేఖర్, చాకరాజువేముల.

✔: సిబ్బందితో చెత్తను తొలగించి పరిష్కరిస్తాం.
- నాగార్జున, పంచాయతీ కార్యదర్శి.

కొలిమిగుండ్ల: ?: కొలిమిగుండ్లలోని ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడంలేదు. - గంగయ్య, కాలనీ వాసి.

✔: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- చంద్రమౌళీశ్వరగౌడ్, డిప్యూటీ ఎంపీడీవో.

?: బెలుం గ్రామంలోని ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. - సుబ్బరాయుడు, కాలనీవాసి.

✔పరిశుభ్రత చర్యలు చేపడతాం.
- చంద్రమౌళీశ్వరగౌడ్, డిప్యూటీ ఎంపీడీవో.

నందవరం ఆలయాభివృద్ధికి కృషి

నందవరం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరం చౌడేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆలయంలో ఆలయాధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతన పాలకమండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. దశల వారీగా నందవరం గ్రామాభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. త్వరలో ఆలయంలో ఏసీ కల్యాణమండపం నిర్మాణం చేపడతామన్నారు. ఆలయ ఛైర్మన్ నాగార్జునరెడ్డికి తన సహకారం ఉంటుందన్నారు. అంతకుముందు మండల తెదేపా అధ్యక్షులు, ఆలయ మాజీ ఛైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఆలయాభివృద్ధికి పాటుపడతామని నూతన ఛైర్మన్ తెలిపారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తదితరులు

శిశు వైద్యం.. అందనంత దూరం

పరిశీలన

మాతాశిశు ఆరోగ్య సేవలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. చాలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, పరికరాల కొరతతో నవజాత శిశువులకు ఆరోగ్య సేవలు అందడం లేదు. చలికాలం నేపథ్యంలో చాలా వైద్యశాలల్లో చిన్నారులకు శ్వాస సంబంధమైన వైద్య సేవలు అందక జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా బాలింతల వార్డు

ఆళ్లగడ్డ సీహెచ్‌సీలో గత ఎనిమిది నెలలుగా చిన్నపిల్లల వైద్య నిపుణులు లేరు. యాళ్లూరు సీహెచ్‌సీ నుంచి చిన్న పిల్లల వైద్యనిపుణుడు వారంలో మూడు రోజులు పాటు సేవలు అందించేందుకు వచ్చే వారు. రెండు నెలల కిందట ఆయనకు పదోన్నతి రావడంతో బదిలీ అయ్యారు. స్థానిక వైద్యులే జనరల్ ఓపీలో భాగంగా నవజాత శిశువులను పరీక్షిస్తున్నారు. నెలకు 100 నుంచి 120 వరకు ప్రసవాలు జరుగుతాయి. కొత్త భవనం అందుబాటులోకి రాకపోవడంతో పాత భవనంలోనే బాలింతలు, నవజాత శిశువులు సేవలు అందిస్తున్నారు. వర్షానికి గోడలు తడవడంతో వారికి ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి నూతన భవనాన్ని అందుబాటులోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

నెబ్యులైజర్ల కొరత

కోవెలకుంట్లలోని సీహెచ్‌సీలో ప్రతినెలా 10 నుంచి 15 ప్రసవాలు జరుగుతుంటాయి. ప్రతిరోజూ 50 నుంచి 60 మంది చిన్నపిల్లలు వైద్యసేవల కోసం వస్తుంటారు. ప్రస్తుతం చిన్నపిల్లల వార్డులో 8 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. చిన్నపిల్లల చికిత్సకు అవసరమైన నెబ్యులైజర్‌లు మూడు మాత్రమే ఉన్నాయి. బయట ఆసుపత్రిలో దీని కోసం రూ.100 నుంచి రూ.150 వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది.
– న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

అత్యవసరమైతే కర్నూలుకే..

డోన్ ప్రాంతీయ ఆసుపత్రిలో నవజాత శిశువుల చికిత్సకు కేవలం బేసిక్ యూనిట్ ద్వారానే వైద్యం అందిస్తున్నారు. ఐసీయూ వైద్యం అందాలంటే మాత్రం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి లేదా ప్రైవేటు ఆసుపత్రులను వెళ్తున్నారు. చిన్నారుల ఓపీ రోజుకు 40 వరకు ఉంటుంది. నెలకు 30 మంది చిన్నారుల అత్యవసరం వైద్యం కోసం కర్నూలు వెళ్లాల్సి వస్తోంది. నెలకు 70 నుంచి 80 ప్రసవాలు జరుగుతున్నాయి. తగినంత పరికరాలు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవటంతో కర్నూలు నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. మూడు నెలల కోసం 20 సిలిండర్లు, ఒక్కోదానికి రూ.400 వరకు ఖర్చు చేస్తున్నారు. తక్కువ నెబ్యులైజర్లు ఉన్న కారణంగా ఉన్నవాటితోనే సర్దుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. – న్యూస్‌టుడే, డోన్

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

డోన్, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకులు, కర్ణాటక రాష్ట్రం శాంతినగర్ ఎమ్మెల్యే ఎన్.ఎ.హారిస్ అన్నారు. సోమవారం డోన్, కోవెలకుంట్ల పట్టణాల్లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో కాంగ్రెస్‌పార్టీ పునాదులు గట్టిగా ఉన్నాయన్నారు. దేశంలో ప్రతి ఒక్కరూ సమానం అనేది కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. నంద్యాల జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్ష స్థానానికి 13 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆర్‌అండ్‌బీ వసతిగృహంలో కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి దరఖాస్తులను ఆయన స్వీకరించారు.



ఎమ్మెల్యే హారిస్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పింఛను కోసం పడిగాపులు

పింఛన్ల సొమ్ము కోసం వృద్ధులకు పడిగాపులు తప్పడం లేదు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని ఒకటో సచివాలయం వద్ద వృద్ధులు పింఛన్ల కోసం గంటల తరబడి వేచిచూశారు. కొనసాగిస్తున్న వృద్ధురాలి సేరు మహబూబ్‌బీ కాలికి తీవ్ర గాయమైంది. పింఛను సొమ్ము కోసం టిడ్కో గృహాల సముదాయం నుంచి వచ్చి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సాయంత్రం వరకు వేచి చూసింది. గతంలో సచివాలయ సిబ్బంది టిడ్కో గృహాల వద్దకే వచ్చి పింఛను సొమ్ము అందించేవారన్నారు.
– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

వెలగని విద్యుత్తు దీపాలు

డోన్ పట్టణంలో సుందరీకరణలో భాగంగా రైల్వేస్టేషన్ రహదారి రోడ్డుకు ఇరువైపులా 33 వీధి దీపాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో కొన్ని దీపాలు కాలిపోయాయి. మరికొన్ని తక్కువ కాంతితో వెలుగుతున్నాయి. నెల రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో వెళ్లేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. త్వరలో కొత్తవి అమర్చుతామని మున్సిపల్ ఏఈ సురేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

నాణ్యతా లోపం.. ప్రయాణానికి శాపం

దొర్నిపాడు మండలంలోని అర్జునాపురం-అమ్మిరెడ్డినగర్ గ్రామాల మధ్య రహదారి తారు, కంకర తేలి అధ్వానంగా మారింది. వైకాపా హయాంలో రూ.90 లక్షల నిధులతో కేసీ కాల్వ కట్ట నుంచి నందిపల్లె వరకు 7 కి.మీ. వరకు రోడ్డు పనులు చేపట్టారు. నిధుల లేమితో అర్జునాపురం వరకే రహదారి నిర్మించి వదిలేశారు. రెండున్నరేళ్ల కాలంలో వేసిన దారి దెబ్బతింది. మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అర్జునాపురం (దొర్నిపాడు)

కబడ్డీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

వెంకటేష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి వెంకటేష్ ఎంపికైనట్లు హెచ్‌ఎం పద్మావతమ్మ పేర్కొన్నారు. సోమవారం పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని ఆమెతో పాటు ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల మచిలీపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వెంకటేష్ ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. డిసెంబరు చివరి వారంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

రెండో పంటకు సాగునీరు అందించాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రబీలో వరితోపాటు ఇతర పంటలకు సాగునీరు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆళ్లగడ్డలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో వరితోపాటు, ఇతర పంటలు అధిక వర్షాలు, తెగుళ్లతో రైతులు తీవ్రంగా పోయారన్నారు. రెండో పంటకు సాగు

సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

నీరు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం జరగబోయే ఐఏబీ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు అండగా నిలవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

చాగలమర్రి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని తెదేపా నంద్యాల పార్లమెంటు బీసీ సెల్ స్పోక్స్ పర్సన్ సల్లానాగరాజు తెలియజేశారు. పట్టణంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయ కమ్యూనికేషన్స్ అధికారి అభిషేక్ రాజ్ తెలియజేశారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఉమారెడ్డి తెలిపారు.

అవుకు, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శపాఠశాల విద్యార్థులకు భూసారం, వాటి పరీక్ష నిర్వహణపై వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు.

సంజామల, న్యూస్‌టుడే: సంజామల డిప్యూటీ ఎంపీడీవోగా సురేష్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండల అభివృద్ధిలో ప్రజలు, అధికారులు సహకరించాలని ఆయన ఆకాంక్షించారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా బలోపేతానికి గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. యాగంటిపల్లి గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లారీ కాలికి తగలడంతో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి గాయపడ్డారు.

సంజామల, న్యూస్‌టుడే: ఇంటి నిర్మాణం కోసం ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు మండల ఏఈ బాలచంద్రుడు తెలిపారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: శ్రీనివాస నగర్‌లోని ఓ దుకాణంలో ఈనెల 25న ఇంద్ర కిషోర్ అనే వ్యక్తి కొనుగోలు చేసిన కూల్‌డ్రింక్‌లో బొద్దింక ఉంది. బాధితుడు అధికారులకు ఫిర్యాదు చేయగా సోమవారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాశీంవలి విచారణ చేపట్టారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధితులకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎం గ్రామీణ ఆవాస్ యోజన సర్వే గడువు ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు గృహనిర్మాణ శాఖ ఏఈ బాలచంద్రుడు సోమవారం తెలిపారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల ఫిర్యాదు వేదికలో మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: నీళ్లట్యాంకు వీధిలో సోమవారం ఓ ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వెళ్లి చిన్నారిని ఢీకొట్టడంతో బాలికకు గాయాలయ్యాయి.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బుగ్గానిపల్లెతండా గ్రామానికి చెందిన ఓ యువతి విజయవాడలో మృతిచెందారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం

ఆసుపత్రిలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, న్యూస్‌టుడే: పేదలకు వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం డోన్ ప్రభుత్వ వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. పలువురు మహిళలతో మాట్లాడి అందుతున్న వైద్యసేవల గురించి ఆరాతీశారు. సమయానికి వైద్యులు వస్తున్నారా, సరైన వైద్యం అందిస్తున్నారా, మందులు అన్ని సక్రమంగా ఇస్తున్నారా అని అడిగితెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. కొందరు సిబ్బంది రావటంలేదని, ఇలాగైతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. త్వరలోనే వైద్య పరికరాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

డోన్, డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దొరపల్లె గ్రామంతోపాటు డోన్ పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డోన్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అన్నివిధాలా కృషి చేస్తున్నానన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల కార్యదర్శి దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టం పరిహారం అందేలా చూస్తాం

వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

రుద్రవరం, న్యూస్‌టుడే: వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం త్వరగా అందేలా చూస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం ఆమె రుద్రవరంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రుద్రవరంలో ఇప్పటికే చాలాచోట్ల రహదారులు నిర్మించామన్నారు. మండలానికి సంబంధించి ఉపాధిహామీ పథకం కింద మొదటి విడతగా రూ.2.60 కోట్లు, రెండో విడతగా రూ.1.80 కోట్లు మంజూరైందన్నారు. తెదేపా నాయకులు రంగనాయకులు, గురుమూర్తి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు తప్పనిసరి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు భద్రత కోసం ప్రభుత్వ నియమాలను తప్పకుండా పాటించాలని మోటారు వాహనాల తనిఖీ అధికారి క్రాంతికుమార్ ప్రైవేట్ పాఠశాలల బస్సుల యాజమాన్యానికి సూచించారు. ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక శ్రీసుధ ఉన్నత పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల బస్సుల యాజమాన్యానికి, చోదకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ క్రాంతికుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఎంబాయి గ్రామానికి చెందిన బోయ శ్రీకాంత్ (29) సోమవారం స్వగ్రామం నుంచి రుద్రవరం గ్రామానికి బొలెరో వాహనంలో పూల లోడుతో వెళ్తున్నారు. మార్గ మధ్యలో కుక్క అడ్డు రాగా పక్కకు తిప్పడంతో రోడ్డు పక్కన ఉన్న గుంతలో వాహనం పడింది. దీంతో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

ఆళ్లగడ్డ సీహెచ్‌సీ వద్ద ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

డోన్: రైల్వేస్టేషన్ సర్కిల్‌లో..

నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం.. ఎయిడ్స్‌ను తరిమికొడదాం

ఎయిడ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమివేయడంతో పాటు బాధితులను ఆదరించడం ప్రతిఒక్కరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో వైద్యారోగ్య అధికారులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, సంజామల, చాగలమర్రి, అవుకు, డోన్.

డోన్ పట్టణం: మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.భారతి

కోవెలకుంట్ల: ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

బేతంచెర్ల: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాగరిక

ఉపన్యసించి.. బహుమతులు సాధించి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసినప్పుడే సార్థకత ఉంటుందని ప్రిన్సిపల్ ఎం.ఈ.గీత పేర్కొన్నారు. 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. పోటీల్లో టి.మాలిని(పదో తరగతి), కె.సుకన్య(ఎనిమిదో తరగతి), పి.సుసన్న(ఎనిమిదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మీ, ఉపాధ్యాయినులు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

పోటీలో ఉపన్యసిస్తున్న విద్యార్థిని

బహుమతులు అందుకున్న విజేతలతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయినులు

ఘనంగా గీతా జయంతి వేడుకలు

ఆధ్యాత్మికం

డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలోని విజయ కనక దుర్గాదేవి ఆలయంలో సోమవారం గీతా జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమార్చనలు చేపట్టిన గీతా పారాయణం చేశారు. ప్యాపిలి పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గీతా జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. బేతంచెర్ల పట్టణంలోని పలక చింతమాను ఆంజనేయస్వామి ఆలయంలో కృష్ణయ్య ఆధ్వర్యంలో సామూహిక గీతా పారాయణం చేశారు.

డోన్, న్యూస్‌టుడే: ఉడుములపాడు గ్రామ సమీపంలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పురోహితులు కల్లెశేషావలి శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో యాగాలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 5వ తేదీన వసంతోత్సవం ఉంటుందన్నారు.

పారాయణం చేస్తున్న మహిళలు

బేతంచెర్ల: హోమం చేస్తున్న భక్తులు

కూడలి లేక.. ప్రమాదాలు ఆగక

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జాతీయ రహదారికి కి.మీ. దూరంలో ఉన్న దొరపల్లి గ్రామానికి సరైన మార్గం లేదు. గ్రామానికి వెళ్లేందుకు హైవే కూడలి లేకపోవడంతో ఆరు గ్రామాల ప్రజలు ప్రయాణ అవస్థలు పడుతున్నారు. కొందరు అపసవ్య దిశలో, మరికొందరు విభాగినుల మధ్యలో నుంచి ప్రమాదకరంగా వెళ్తున్నారు. ఈ గ్రామాల గుండా ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు రద్దీగా తిరుగుతుంటాయి. ఈ వాహనాలన్నీ జాతీయ రహదారిపై అపసవ్య దిశలోనే వెళ్తున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియక ఈ ఆరు గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు.

ఆరు గ్రామాలకు తప్పని తిప్పలు

డోన్ మండలంలోని దొరపల్లి, లక్ష్మంపల్లి, మల్లెంపల్లి, బొంతిరాళ్ల, కృష్ణగిరి మండలం తాపలకొత్తూరు, కటారుకొండ గ్రామాల ప్రజలు వెళ్లే రహదారి శాపంగా మారింది. ఈ గ్రామాల ప్రజలు డోన్‌కు వెళ్లాలంటే జాతీయ రహదారి గుండానే వెళ్లాలి. డోన్ నుంచి తిరిగి గ్రామానికి వెళ్లేటప్పుడు జాతీయ రహదారిలో కూడలి లేకపోవడంతో రహదారిని దాటుకుని ప్రమాదకరంగా వెళ్తున్నారు. రహదారి దాటే క్రమంలో ప్రమాదాలు గురై చాలా మంది మృత్యువాత పడ్డారు. మరెందరో గాయాలపాలవుతున్నారు.

సర్వీసు రోడ్డు ఉన్నా..

కంబాలపాడు ఉపరితల వంతెన నుంచి యు.కొత్తపల్లి వరకు జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు వేశారు. డోన్ పట్టణం వైఎస్సార్ నగర్, కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి నగర్, యు.కొత్తపల్లికి వెళ్లే వారికి మాత్రమే సర్వీస్ రోడ్డు ఉపయోగపడింది. దొరపల్లి సర్కిల్ వద్దకు రాగానే అక్కడ రైల్వే బ్రిడ్జి ఉండటంతో సర్వీస్ రోడ్డు నిర్మాణం అక్కడికే ఆపేశారు. రైల్వే బ్రిడ్జి దాటిన తర్వాత నుంచి మళ్లీ సర్వీస్ రోడ్డు కొత్తపల్లి వరకు వేశారు. దీంతో ఆయా గ్రామాలకు ఏమీ ప్రయోజనం చేకూరలేదు.

విభాగిని మధ్య ప్రమాదకరంగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు

రైల్వే బ్రిడ్జి నిర్మిస్తేనే పరిష్కారం

ఆయా గ్రామాలకు వేళ్లే జాతీయ రహదారిలో సర్కిల్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని గ్రామస్థులు కోరుతున్నారు. లేదా సర్వీస్ రోడ్డు వెంట రైల్వే బ్రిడ్జి పక్కన నూతనంగా అండర్ బ్రిడ్జి నిర్మిస్తే ఈ గ్రామ ప్రజలకు దారి కష్టాలు తీరుతాయి. ఇలా చేస్తే ప్రమాదాలు జరగకుండా ప్రాణాలను కాపాడే వారవుతారని గ్రామస్థులు కోరుతున్నారు.

యంత్రాంగం చర్యలు తీసుకోవాలి

- శ్రీనివాసులు, దొరపల్లి

దొరపల్లి గ్రామాని వెళ్లేందుకు హైవే కూడలి లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి సర్వీసు రోడ్డుకు అనుకుని రైల్వే బ్రిడ్జి నిర్మిస్తే బాగుంటుంది. లేకుంటే జాతీయ రహదారి కింద అండర్ బ్రిడ్జి నిర్మించాలి. గ్రామస్థుల అవస్థలు తీర్చాలి.

(c) eenadu

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..! ఈనాడు

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. విద్యార్థి ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీ పాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం, గుంటూరులో డిసెంబరు 11వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి ● ఒక ప్రాజెక్టుకు ఇద్దరు విద్యార్థులకు అనుమతి ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టు మాత్రమే అనుమతి ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం ● రిజిస్ట్రేషన్ చివరి తేదీ : డిసెంబరు 7

నమోదు కొరకు: 91549 91113 సమయం : ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

కృష్ణా నదిలో నమూనాల సేకరణ

నది వద్ద పరిశీలిస్తున్న తహసీల్దారు తదితరులు

దాచేపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తంగెడ వద్ద కృష్ణా నదిలో రసాయన వ్యర్థాలపై తహసీల్దారు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు సోమవారం పరిశీలించారు. 'కృష్ణ నదిలో కాలుష్య తెట్టు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నీటి నమూనాలు సేకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ నివేదిక వచ్చిన తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. తంగెడ గ్రామానికి తాగునీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించినట్లు తెలిపారు.

ఈనాడు పల్నాడు

మంగళవారం డిసెంబరు 2, 2025

కారుమబ్బులతో కలవరం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

వేలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా వరి పంట

దిత్వా తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి, పత్తి రైతులు వణుకుతున్నారు. పలు మండలాల్లో ధాన్యం నూర్పిడి చేసి కల్లాల్లో ఆరుబయట నిల్వ చేశారు. వేలాది ఎకరాల్లో వరి కోతలు, నూర్పిడికి రైతులు సిద్ధమయ్యారు. రానున్న రెండ్రోజులు వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో కర్షకుల కంటి మీద కునుకు ఉండటం లేదు. ఈ సమయంలో భారీవాన కురిస్తే పంట నేలవాలుతుందని, కోత కోసిన ప్రాంతాల్లో ధాన్యం తడిసి రంగు మారుతుందని ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు సగటున 0.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం రోజంతా కారుమబ్బులు కమ్మి చలిగాలులు వీచాయి.

సాగు ఇలా..

పంట	హెక్టార్లలో
వరి	53,090
కంది	30,933
పత్తి	85,817
మిర్చి	41,811

పత్తి రైతుల ఆందోళన

ఇప్పటికే అధిక వర్షాలు, మొంథా తుపాను పత్తి రైతును కుంగదీశాయి. పత్తి తీత, కాపు దశలో కురిసిన వర్షాలకు పలు చోట్ల పత్తి రంగు మారడంతో పాటు పూత, పిందె రాలిపోయి దిగుబడులు తగ్గిపోయాయి. మొంథా తుపాను చేసిన గాయం నుంచి తేరుకుంటున్న రైతులకు దిత్వా తుపాను ఆందోళన కలిగిస్తోంది. ఈ సమయంలో భారీ వర్షాలు పడితే దిగుబడి తగ్గుతుందని అన్నదాతలు చెబుతున్నారు.

మొక్కజొన్నపై ప్రభావం

జిల్లాలో 50 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. నవంబరు మూడో వారం నుంచి విత్తనం నాటుతున్నారు. భారీ వర్షాలు పడితే వేలాది ఎకరాల్లో పంట ముంపు బారినపడే ప్రమాదముంది. రబీ సీజన్ ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా వ్యవసాయ శాఖ ఇంకా ఈ-పంట నమోదును ప్రారంభించలేదు.

రైతుల వెతలు పట్టవేమి?

పంపిణీకి నోచుకోని టార్పాలిన్లు

తుపానులు, విపత్తులు అన్నదాతల వెన్నువిరుస్తున్నాయి. పంట చేతికందే సమయంలో వర్షాలతో కష్టాలు ఎదురవుతున్నాయి. మొన్న మొంథా, ఇప్పుడు దిత్వా తుపాను ఆందోళన రేపుతోంది. పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు రైతులు ఎదుర్కొంటున్న వెతలు అన్నీఇన్నీ కావు. గత వైకాపా ప్రభుత్వం అన్నదాతల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. 2014 నుంచి 2019 వరకు రాయితీ పట్టల పంపిణీని అటకెక్కించింది. కూటమి అధికారంలోకి వచ్చాక రైతులకు మేలు చేసేలా పట్టలు పంపిణీ చేస్తారని ఆశిస్తే ఇంకా జాలి చూపించట్లేదు.

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

జిల్లాలో పత్తి తీతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొనుగోళ్లలోనూ వేగం పెరిగింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ సీసీఐ కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాలకు పత్తి తరలించాలన్నా, ఇళ్లలో నిల్వ చేయాలన్నా వర్షం కారణంగా ఇబ్బంది ఎదురవుతోంది. ☛ మాగాణి రైతుల పరిస్థితీ ఇలాగే ఉంది. వరి కోతలు, నూర్పిళ్ల సమయంలో వర్షాలు కురుస్తున్నందున నిల్వ చేసుకునేందుకు అవస్థలు తప్పడం లేదు. ☛ ఎండుమిర్చి ఆరబెట్టుకునేందుకు, మొక్కజొన్నలు నిల్వ చేసుకునేందుకు పట్టలు అవసరం. ముఖ్యంగా వర్షాలు కురిసేటప్పుడు తడవకుండా కాపాడుకునేందుకు ఇవి తప్పనిసరి. టార్పాలిన్ పట్టల పంపిణీపై ప్రభుత్వం ఇంకా దృష్టి సారించలేదు.

జిల్లాలో సాగు (హెక్టార్లలో)..

ఖరీఫ్‌లో వ్యవసాయ పంటల విస్తీర్ణం : 1,94,144

ఉద్యాన, ఇతర పంటల విస్తీర్ణం : 82,803

ముప్పాళ్ల మండలం రామకృష్ణాపురంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

రాయితీపై.. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.10 వేలు విలువ చేసే సిల్పాలిన్ పట్టను రాయితీపై రూ.5 వేలకు.. రూ.2,500 విలువచేసే నల్ల టార్పాలిన్ పట్టను రూ.1,250కి అందజేశారు. రైతుల విస్తీర్ణానికి తగ్గట్లు రెండు నుంచి మూడు వరకు అందించారు. గత కొన్నేళ్లుగా రాయితీ అందకపోవడంతో రైతులే వాటిని సొంతంగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇది రైతులకు అదనపు భారం అవుతోంది.

మోత తగ్గేలా.. సృజన పెరిగేలా..

నరసరావుపేట, సత్తెనపల్లి, న్యూస్‌టుడే

బడుల్లో నో బ్యాగ్ డే అమలుకు నిధులు

బడి సంచి మోత బరువు నుంచి వారంలో ఒకరోజు విద్యార్థులకు విముక్తి కల్పించి ఆ రోజంతా ఆటపాటలతో కూడిన అభ్యసన జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. నూతన జాతీయ విద్యా విధానంలో నోబ్యాగ్ డే అమలు ఎంతో కీలకం. ప్రతి శనివారం నోబ్యాగ్ డే అమలుకు ఎప్పుడో ఆదేశాలిచ్చినా చాలాచోట్ల అమలుకు నోచుకోవట్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో శనివారం పాఠశాలల్లో ఆటపాటల సందడి నెలకొనేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. విద్యార్థులు శనివారం పుస్తకాల సంచి ఇంట్లో పెట్టి ఖాళీ చేతులతో బడికి వెళ్లొచ్చు. ఆ రోజు సృజనాత్మకత, నైపుణ్యాల్ని వెలికితీసే.. మానసికోల్లాస కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఒకటి, రెండు తరగతులకు పాడుకుందాం, మాట్లాడుకుందాం, నటిద్దాం, సృజన.. 3, 4, 5 తరగతులకు సృజన, తోటకు పోదాం.. పరిశుభ్రం చేద్దాం, చదువుకుందాం, విందాం.. విందాం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులో సృజనాత్మకత, ఆటపాటలు, విద్యా, వైజ్ఞానిక నమునాల రూపకల్పన లాంటి కార్యక్రమాలు ఏర్పాటుచేస్తారు. ❖ ప్రస్తుత విద్యా సంవత్సరం ఒక్కో ప్రాథమిక పాఠశాలలకు రూ.500, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.వెయ్యి చొప్పున కేటాయించారు. వాటితో అవసరమైన సామగ్రిని పాఠశాలలు కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుందని సమగ్ర శిక్షా ఏఎంవో పూర్ణ తెలిపారు.

జిల్లా	ఎంపికైన పాఠశాలలు	మంజూరైన నిధులు(రూ.)
పల్నాడు	1512	8,72,000
బాపట్ల	1337	7,57,500

ఊరంతా ఉద్యోగులే!

బొల్లాపల్లి, వినుకొండ, న్యూస్‌టుడే

రెడ్డి పాలెం

అది నల్లమల అటవీ అంచునున్న చిన్న గిరిజన పల్లె. సుమారు 250 కుటుంబాలుంటే.. ప్రతి ఇంటా ఉద్యోగి ఉన్నారు. అదే బొల్లాపల్లి మండలంలో రెడ్డిపాలెం. పేరులో 'రెడ్డి' ఉన్నా నూరు శాతం ఎస్సీ, ఎస్టీలే ఉంటారు. స్వాతంత్ర్యానికి పూర్వం 1912లో రోమన్ క్యాథలిక్ చర్చితో పాటు పాఠశాల నెలకొల్పారు. గ్రామంలో విద్యాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు ప్రస్తుతం 65 మంది ఉన్నారు. నరసరావుపేటలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి మధుస్వామి తండ్రి బాలస్వామిది ఈ ఊరే. ఆయన వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. విశాఖలో పనిచేస్తున్న తహసీల్దార్ మొగిలి కిరణ్ ఇక్కడివారే. వీరితో పాటు ఉపాధ్యాయులు 16, బ్యాంకు ఉద్యోగులు 8 మందితో పాటు పోలీస్, పోస్టల్, రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు తదితరాల్లో అనేక మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఊరికి సమీపంలోని శ్రీచక్ర సిమెంట్ కర్మాగారంలో 40 మందికి పైగా పనిచేస్తున్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిని కలుపుకొంటే ప్రతి ఇంటా ఉద్యోగులు ఉన్నారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్

వేర్వేరు ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్లుగా పనిచేస్తున్న విజయ్, జ్ఞానసుందరరాజు, రాజేంద్ర సారథ్యంలో రెడ్డిపాలెం ఉద్యోగుల సంఘం ఏర్పాటైంది. ఇంటింటికీ కుళాయి కనెక్షన్, మరుగుదొడ్లతో పాటు ఊరంతా సిమెంట్ రోడ్లు నిర్మించారు. మొక్కలు నాటారు. ఏటా డిసెంబరు 3న నిర్వహించే పునీత ఫ్రాన్సిస్ శౌరి చర్చి పండగకు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ గ్రామానికి చేరుకుంటారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. 1981 తర్వాత స్వతంత్ర గ్రామ పంచాయతీగా ఏర్పడిన రెడ్డిపాలేనికి ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఎన్నికలు నిర్వహిస్తే ఏడుసార్లు ఏకగ్రీవం కావడం ప్రత్యేకమని గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కాండ్రకుంట ప్రకాష్ తెలిపారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ ఉన్నతాధికారులు హెచ్చరించారు. ఇప్పటివరకు అలా వసూలు చేసిన పాఠశాలల వివరాలపై నివేదిక ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారులకు సూచించారు. పదో తరగతి పరీక్ష ఫీజును రూ.125గా ప్రభుత్వం నిర్ణయించింది. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు, ప్రైవేటు పాఠశాలల్లో రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు అడ్డగోలుగా వసూలు చేస్తున్న వైనంపై సోమవారం 'ఈనాడు'లో 'పదిరెట్ల దోపిడీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన గుంటూరు ఆర్జేడీ లింగేశ్వర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిస్థితిపై ఆరా తీశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఎంఈవోలతో ప్రత్యేకంగా వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలిచ్చినా.. ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

రైతేరాజు: 20 సెంట్లు.. 50 పంటలు — పందిరి సాగు.. లాభాలు భళా

6లో

సచివాలయానికి వస్తేనే పింఛన్

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, దాచేపల్లి: ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు బేఖాతరు చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో సచివాలయానికే వృద్ధుల్ని పిలిపించుకుని నగదు అందజేస్తున్నారు. సోమవారం దాచేపల్లి మండలంలోని గ్రామాల్లో 'ఈనాడు - న్యూస్‌టుడే' బృందం పరిశీలనలో ఈ విషయం తేటతెల్లమైంది. ముత్యాలంపాడు, తంగెడ గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు వృద్ధుల్ని తమ కార్యాలయాలకే పిలిపించుకుని పింఛన్ సొమ్ము ఇస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట మధ్య పంపిణీ చేస్తున్నారు. ఇంటి వద్దకే వచ్చి ఇవ్వాలి కదా? అని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలతో వారు తప్పించుకోవడం గమనార్హం. ఉదయం 10 గంటలైనా ఉద్యోగులు ఇంటికి రాకపోవడంతో తామే సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకుంటున్నామని వృద్ధులు తెలిపారు.

ముత్యాలంపాడు సచివాలయంలో నగదు ఇస్తున్న ఉద్యోగి

జాప్యం ఉండదు.. భారం పడదు

"శివార్లలో కొత్తగా ఇళ్లు నిర్మించుకున్నవారు విద్యుత్తు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఇచ్చే పరిస్థితి మొన్నటివరకు ఉండేది కాదు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు స్తంభాలు, తీగలు అదనంగా వేయాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. క్షేత్రస్థాయి పరిశీలన, అంచనాలకు ఆమోదం పేరుతో ఏఈ నుంచి ఎస్ఈ.. కొన్నింటికి సీఎండీ కార్యాలయాల వరకు వెళ్లాల్సి వచ్చేది. నూతన కనెక్షన్ విషయంలో జాప్యాన్ని నిలువరించేలా, సేవల్లో జవాబుదారీతనం పెంచేలా విద్యుత్తు శాఖ చర్యలు తీసుకుంది.

నరసరావుపేట, న్యూస్‌టుడే

విద్యుత్తు కనెక్షన్ పొందడం ఇక సులువు

వినియోగదారులకు వేగంగా సేవలందించాలనే మంచి ఆలోచనతో ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్సీ) కొత్త విద్యుత్తు కనెక్షన్ల జారీలో సంస్కరణలు అమల్లోకి తెచ్చింది. నూతన కనెక్షన్, అదనపు లోడుకు కేటగిరీ ఆధారంగా స్థిర ఛార్జీలు నిర్ణయించారు. అదనపు ఛార్జీలు ఎత్తివేశారు. ❖ విద్యుత్తు లైన్‌కు, కొత్తగా కనెక్షన్ తీసుకునే ఇంటికి 30 మీటర్ల దూరం దాటితే స్తంభాల ఖర్చు ఇప్పటివరకు వినియోగదారులే భరించాల్సి వచ్చేది. దరఖాస్తు చేశాక.. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత అధికారులు రుసుము నిర్ణయించేవారు. దానికి అదనంగా సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ ఛార్జీలు అధికారికంగా, సిబ్బంది అనధికారికంగా వసూలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. దరఖాస్తు చేసిన వెంటనే అదనపు భారం లేకుండా 30 రోజుల్లోపే కనెక్షన్ ఇవ్వనున్నారు. అంతకు మించి ఆలస్యమైతే సంబంధిత ఉద్యోగులు, అధికారుల నుంచి ఫెనాల్టీ వసూలు చేయనున్నారు.

రుసుములు ఇలా..

గృహావసరాలు (ఎల్‌టీ): ఒక కిలోవాట్‌కు రూ.1500. ఒకటి నుంచి 20 కిలోవాట్ల వరకు అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ.2 వేల చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.12,600.

హెచ్‌టీ: 75 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.4,400 చొప్పున చెల్లించాలి. నియంత్రికను వినియోగదారులే ఏర్పాటు చేసుకోవాలి.

వాణిజ్య కనెక్షన్: ఒక కిలోవాట్‌కు రూ.1800, 20 కిలోవాట్లకు రూ.1,800తోపాటు అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ.2 వేల చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.12,600.

ఘనంగా గీతా జయంతి

భగవద్గీత గ్రంథాల నడుమ రాధాకృష్ణులు

నరసరావుపేట బరంపేటలోని శ్రీరాధా గోవిందచంద్ర మందిరంలో గీతా జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణులకు భగవద్గీత గ్రంథాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. భగవద్గీతలోని పలు అంశాలపై ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం భగవద్గీత గ్రంథాలతో తులాభారం ఏర్పాటు చేసి వాటిని పంపిణీ చేశారు.

- న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

4న జిల్లా స్థాయి పారా ఒలింపిక్స్

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఈ నెల 4న నరసరావుపేటలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో పారా ఒలింపిక్స్ నిర్వహించనున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ సోమవారం తెలిపారు. 4వ తేదీ ఉదయం 9 గంటలకు ఆటలు ప్రారంభం అవుతాయని, అన్ని పాఠశాలల హెచ్ఎంలు వారి పరిధిలోని ప్రత్యేక అవసరాలుగల పిల్లలను ఒక ఎస్కార్ట్ టీచర్ ఇచ్చి పంపించాలని సూచించారు. అండర్-17, 20 విభాగాల్లో రన్నింగ్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ తదితర పోటీలు ఉంటాయని వివరించారు.

భూసమీకరణపై కార్యాచరణ ప్రణాళిక

✦ రైతులతో చర్చించి ఒప్పించేలా కసరత్తు ✦ ముందుకురాని పక్షంలో భూసేకరణ

ఈనాడు, అమరావతి

రాజధాని ప్రాంతంలో తొలివిడత భూసమీకరణలో రైతుల నుంచి ఇంకా 2,492 ఎకరాలు సమీకరించాల్సి ఉంది. ఇందులో కొంతమంది ఆ విధానంలో ఇవ్వడానికి ఇటీవల ముందుకొచ్చారు. మరికొందరు న్యాయస్థానాల్లో కేసులు వేశారు. వీరితో సీఆర్డీఏ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు చర్చించడంతో కొందరు కేసులు ఉపసంహరించుకున్నారు. దీంతో మొత్తం 45 కేసులకుగాను ప్రస్తుతం 27 కేసులు మిగిలాయి. వీటిపై విచారణ డిసెంబరు 3న ఉంది.

సందేహాల నివృత్తి.. రాజధాని అమరావతి నగరం అభివృద్ధి చెందితే భూములిచ్చినవారికి కలిగే ప్రయోజనాలపై అధికారులతోపాటు త్రిసభ్య కమిటీ సభ్యులు రైతులకు వివరిస్తున్నారు. వారి సందేహాలను కమిటీ నివృత్తి చేస్తోంది. అందరూ సహకరిస్తే రాజధాని నిర్మాణం వేగవంతమవుతుందని చెబుతోంది. దీంతో కొంత మంది కేసులను ఉపసంహరించుకున్నారు. ❖ మరికొంతమంది భూసమీకరణకు వ్యతిరేకంగా ఉండడంతో వారి నుంచి భూసేకరణ ద్వారా తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను క్షేత్రస్థాయి యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ నెలలోనే ప్రకటన ఇవ్వడానికి కసరత్తు చేస్తోంది.

ఇంకా సమీకరించాల్సిన 2,492 ఎకరాల్లో వివిధ అవసరాలకు కొంత భూమి ఉపయోగించుకోనున్నారు. ఆ వివరాలు..

విభాగం	ఎకరాలు
సీడ్‌యాక్సెస్ రోడ్డు నిర్మాణం	22.40
భూముల కేటాయింపు	42.47
మౌలికవసతుల కల్పనలో వినియోగం	441.96
రిటర్నబుల్ ప్లాట్లకు కేటాయింపు	131.77
వివిధ అవసరాలకుపోగా మిగిలేది	1,853.50

ఎంత నిర్లక్ష్యం! అంగన్‌వాడీలకు కాలం చెల్లిన పాల ప్యాకెట్ల సరఫరా

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహార పంపిణీలో నిర్లక్ష్యం నెలకొంది. కాలం చెల్లిన టెట్రా పాల ప్యాకెట్లు సరఫరా చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొన్నాళ్ల కిందట కారంపూడి మండలంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి గడువు ముగిసిన పాల ప్యాకెట్లు సరఫరా చేశారు. గమనించిన కార్యకర్త సరఫరాదారు దృష్టికి తీసుకెళ్లారు. అప్రమత్తమైన సరఫరాదారు వాటిని వెనక్కి తీసుకుని, కొత్త ప్యాకెట్లు అందించారు. తాజాగా కాలం చెల్లిన ప్యాకెట్లను మండాది శివారులోని కానుగ వాగు వంతెన వద్ద కుప్పలుగా పోసి నిప్పు పెట్టడంతో విషయం బయటకొచ్చింది. వాటిలో కొన్ని అక్టోబర్లో గడువు ముగియగా, మరికొన్నింటిపై నవంబరు 28 గడువు తేదీ ఉంది. సుమారు 500 అట్టపెట్టెల్లో 5 వేల లీటర్ల పాల ప్యాకెట్లు ఉన్నట్లు తెలుస్తోంది. కాలం చెల్లిన విషయం కార్యకర్త గుర్తించకపోతే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, వెల్దుర్తి**

భూములిస్తాం.. బాగోగులు చూడండి

అమరావతి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతికి భూములు ఇచ్చేందుకు సిద్ధమని, అయితే తమ బాగోగులు ప్రభుత్వం చూసుకోవాలని పెదమద్దూరు గ్రామ రైతులు తెలిపారు. సోమవారం పెదమద్దూరులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో రెండో విడత భూసమీకరణపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కౌలు ఎక్కువగా ఇచ్చేలా చూడాలని, అందరికీ ప్లాట్లు అనుకూలమైన ప్రాంతంలో ఇవ్వాలని కోరారు. రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఓ రైతు మాట్లాడుతూ తన పొలానికి కౌలు ఇప్పటికే రూ.40 వేలు వస్తుందని.. ప్రభుత్వం ఇచ్చే రూ.30 వేలు చాలదని, దీనిపై పునరాలోచించాలని కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణమే లక్ష్యం.. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదమద్దూరులో 1,145 ఎకరాల సమీకరణకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. నాలుగు గ్రామాల్లో 9,617 ఎకరాలు సమీకరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో క్రీడానగరం, పారిశ్రామిక కారిడార్, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి వాటిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ డానియేలు, తెదేపా నాయకులు రాజ, వీరాంజనేయులు, శౌరయ్య, విష్ణు, బ్రహ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సభకు హాజరైన గ్రామస్థులు

'ఏపీకే'తో జాగ్రత్త.. అప్పనంగా కాజేస్తారు!

నరసరావుపేట వ్యవసాయం, మల్లమ్మ సెంటర్, న్యూస్‌టుడే: ఇటీవల తరచూ వింటున్న మాట ఏపీకే ఫైల్. సెల్‌ఫోన్లకు ఏపీకే ఫైల్ పంపి నిధులు కాజేయడం సైబర్ నేరగాళ్లకు వెన్నతో పెట్టిన విద్యలా మారింది. అనేక మంది సెల్‌ఫోన్లకు పీఎం కిసాన్ పథకం పేరుతో ఏపీకే ఫైల్ పంపి.. మీకు నగదు జమ కావాలంటే ఓటీపీ చెప్పాలని ఫోన్లు చేసి, ఖాతాల్లో నగదు కొల్లగొట్టేస్తున్నారు. ఇలా నిత్యం ఎక్కడో ఒకచోట ఏపీకే ఫైల్స్ బారిన పడి ప్రజలు మోసపోతున్నారు.

✶ రొంపిచర్లకు చెందిన వ్యాపారి పాపారావు సెల్‌ఫోన్‌కు కొద్ది రోజుల క్రితం పీఎం కిసాన్ పేరిట ఏపీకే ఫైల్ వచ్చింది. దానిని క్లిక్ చేయగా సైబర్ నేరగాళ్లు ఫోన్ హ్యాక్ చేసి అతని ఖాతా నుంచి రూ.2.20 లక్షల నగదును ఇతర ఖాతాకు బదిలీ చేసుకున్నారు.

త్వరపడొద్దు.. మీ మొబైల్‌కు ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) పేరుతో ఏదైనా ఫైల్ వచ్చిందా.. త్వరపడి తెరవకండి. సైబర్ నేరగాళ్లు వల విసిరారని గుర్తించండి. ఉదాహరణకు పీఎం కిసాన్ పథకం, ఆపరేషన్ సిందూర్, బ్యాంకు రుణాల పేర్లతో వాట్సప్, టెలిగ్రామ్ ఖాతాలు వ్యక్తిగత లేదా గ్రూపుల్లో షేర్ చేస్తారు. పీడీఎఫ్, వీడియో ఫైల్ రూపంలో ఈ సందేశం ఉంటుంది. దీన్ని క్లిక్ చేస్తే మన ఫోన్‌లోని ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచారం నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్తాయి.

ఎలా గుర్తించాలి.. కొత్త నంబర్ల నుంచి వచ్చే ఫైల్స్, వీడియో లింకుల్ని నమ్మొద్దు. ఫోన్‌కు ఏదైనా ఫైల్ వచ్చినప్పుడు అది ఏ రకమో చివరి అక్షరాల్లో సూచిస్తుంది. ఏపీకే ఫైళ్ల మీద క్లిక్ చేసినప్పుడు ప్రమాదకర ఫైల్ అని తెరపై కనిపిస్తుంది.

ఎవరిని సంప్రదించాలి: బ్యాంకు ఖాతా, క్రెడిట్ కార్డు నుంచి డబ్బు బదిలీ అయితే ఆలస్యం చేయకుండా 1930కి ఫిర్యాదు చేయాలి. తద్వారా నిందితుల ఖాతాల్లోకి డబ్బు చేరకుండా నిలువరించవచ్చు. అనుమానాస్పద ఫోన్ నంబరు, మెయిల్‌గా భావిస్తే డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చెక్ సస్పెక్ట్ విభాగంలో తనిఖీ చేయొచ్చు.

(c) eenadu

మాచర్ల రాజకీయాలు తెలుసుకుని మాట్లాడాలి: జూలకంటి

మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి, పక్కన ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో మాచర్ల ప్రాంతంలో పిన్నెల్లి సోదరులు సాగించిన దౌర్జన్యాలు, అక్రమాలను గురించి తెలుసుకుని మాట్లాడాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. జిల్లా తెదేపా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి ఆయన మాట్లాడారు. పిన్నెల్లి సోదరుల పాపం పండిందని జూలకంటి చేసిన ప్రకటనపై గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. 50 ఏళ్ల పాటు కాసు కుటుంబం పల్నాడును తీవ్రంగా మోసగించిందన్నారు. గత ఇరవై ఏళ్ల కాలంలో పిన్నెల్లి కుటుంబం చేసిన అభివృద్ధి ఏమిటో చర్చించేందుకు మాచర్ల రావాలని సవాల్ విసిరారు. తెదేపా హయాంలోనే వరికపూడిశెల ప్రాజెక్టుకు అనుమతులు లభించాయన్నారు. పిన్నెల్లి నేరచరిత్ర తెలుసుకోకుండా వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. చిన్నతనంలోనే ఇద్దరు ముస్లింలను హతమార్చిన చరిత్ర ఉందన్నారు. అలాగే తెదేపాలో అసంతృప్తులను చేరదీసి జంట హత్యలు చేయించి పల్నాడును రక్తసిక్తం చేయాలన్న ప్రయత్నాలు తాము సంయమనం పాటించడం వల్ల విఫలమైనట్లు తెలిపారు. విగ్రహాల దొంగగా పల్నాడు అంతా తెలిసిన వ్యక్తిని అమాయకుడని చెబుతున్న కాసు చరిత్ర తెలియనిది కాదన్నారు. తమ కుటుంబం ప్రజల కోసం ఆస్తులు అమ్ముకుంటే, పేదల విద్యాభివృద్ధికి పెద్దలు ఇచ్చిన కళాశాల భూములను ఆక్రమించి షాపింగ్ మాల్స్, కన్వెన్షన్ సెంటర్లు నిర్మించారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాసుకు నరసరావుపేట సీటు కావాలంటే జగన్‌ను నమ్ముకోవాలని, పిన్నెల్లిని కాదని హితవు పలికారు.

5 నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

పోటీల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తెదేపా నాయకులు

గురజాల, న్యూస్‌టుడే: గురజాల పాతపాటేశ్వరి తిరునాళ్ల పురస్కరించుకుని ఈనెల 5 నుంచి రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. 5 విభాగాల్లో పోటీలు జరుగుతాయని, రూ.10 లక్షల వరకు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. సోమవారం పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సాగర్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కాంతారావు, సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, శివనాగు, రైతు కమిటీ సభ్యులు మల్లయ్య, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా ఎం. శ్రీను, కోశాధికారిగా భాస్కరరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా విజయలక్ష్మిని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా వి. హనుమంతరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగేంద్రబాబు వ్యవహరిస్తారు. ఎన్నికల అధికారిగా కిశోర్, సహాయ అధికారిగా ఆనంద్, పరిశీలకుడిగా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్నేహమే.. కొంప ముంచిందా!

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో తల్లీ, కుమారుడు కృష్ణకుమారి, సాంబశివరావులను హత్యచేసి పట్టుబడిన ముగ్గురు మైనర్లలో ఇద్దరు తమను స్నేహమే కొంప ముంచిందని పోలీసుల ఎదుట కన్నీరుమున్నీరైనట్లు తెలుస్తోంది. తమ బిడ్డలు ఇలా చేశారంటే నమ్మశక్యంగా లేదని తల్లిదండ్రులు విలపించారు. ముగ్గురిలో ఒకరు చిలకలూరిపేటలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అతడి తాత పోలీసుశాఖలో అధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. మరో మైనర్ గుంటూరులోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇతడిది పేద సాధారణ కుటుంబం. పిల్లలు ఎందుకిలా చేశారో అర్థం కావట్లేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

టూర్‌కు వెళ్దాం.. బిర్యానీ తిందామంటూ..

టూర్‌కు వెళ్దాం.. బిర్యానీ తిందామని జంట హత్యల కేసులో ప్రధాన నిందితుడు తన ఇద్దరు స్నేహితులను ధూళిపాళ్లకు తీసుకొచ్చినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. రూ.500 వెచ్చించి అతడు మాంసంకొట్టే కత్తిని ఇటీవలే కొనుగోలు చేశాడు. కత్తి, గొడ్డలి, మంకీక్యాప్, గ్లౌజులు, యాప్రాన్‌ను ఒక కవర్‌లో పెట్టుకుని ద్విచక్ర వాహనంపై వచ్చారు. గణపవరం నుంచి వెళ్లిన ప్రధాన నిందితుడు ఆ ఇద్దరిని తీసుకుని బైకుపై కొండవీడుకుంటూ బయలుదేరాడు. బండిలో పెట్రోలు లేదని స్నేహితుడు చెప్పడంతో రూ.100కు పెట్రోలు పోయించాడు. కొండవీడుకు కాకుండా ధూళిపాళ్లకు రావడం.. హత్యలు చేయడం కలకలం రేపింది.

గురుకులంలో డీసీవో విచారణ

ఈనాడు కథనానికి స్పందన

విచారణ చేస్తున్న డీసీవో శ్రీదేవి

నూజెండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పలపాడు ఏపీ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో డీసీవో శ్రీదేవి సోమవారం విచారణ చేపట్టారు. ఇక్కడ యథేచ్ఛగా కుక్కలు తిరుగుతుండటంపై 'గురుకులం.. ఇలాగేనా పిల్లలకు భోజనం' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు స్పందించి విచారణ చేపట్టారు. విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారు కుక్కల సమస్యను వివరించారు. మెనూ సక్రమంగా లేదని, ప్రిన్సిపల్ అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. రాత్రిళ్లు తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. డీసీవో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రిన్సిపల్‌తో చాలాసేపు చర్చించారు. విచారణకు సంబంధించిన అంశంపై విలేకరులతో మాట్లాడేందుకు ఆమె నిరాకరించారు.

పరిసరాలు అపరిశుభ్రం.. వసతిగృహ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కుక్కలు తిరుగుతున్నాయి. దీంతో విద్యార్థినులు భయంభయంగానే వెళ్తున్నారు. ఆహార పదార్థాలు రుచికరంగా లేకపోవడంతో ఉదయం వడ్డించిన పులిహోరను విద్యార్థినులు డ్రమ్ములో పారబోశారు. మెనూ అమలు చేయడంలేదని బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

క్రోసూరు(అచ్చంపేట): మద్యం తాగి వాహనం నడిపిన కోటి రత్నంకు 30 రోజులు జైలు శిక్ష, మరో నలుగురికి జరిమానా విధిస్తూ సత్తెనపల్లిలోని న్యాయస్థానం న్యాయమూర్తి సోమవారం తీర్పునిచ్చారని క్రోసూరు ఎస్సై రవిబాబు తెలిపారు. రెండురోజుల కిందట 14వమైలుకు చెందిన కోటిరత్నం మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడన్నారు. మరో నలుగురికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారన్నారు.

20 సెంట్లు.. 50 పంటలు

మహిళా రైతు ఆదర్శ సాగు

బాపట్ల టౌన్, పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే

ప్రకృతి సేద్య ఆహారం భుజిస్తూ, భూమి తల్లిని మందులతో పాడుచేయకుండా ముందు తరాలకు అందించాలనే ఆ అతివ సంకల్పం నలుగురికి ఆదర్శప్రాయం. 2015 నుంచి ద్రవ జీవామృతంతో ప్రకృతి సాగు చేస్తూ, ఇతరులకూ అవగాహన కలిగిస్తూ తన ఆశయం వైపు సాగుతున్నారు. పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామానికి చెందిన గద్దె కెతోరా తెరీషా డిగ్రీ పూర్తి చేసి, 20 సెంట్ల పొలంలో 50 రకాల పంటలకు పైగా పండిస్తున్నారు. వీటిలో దుంప రకం, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, పండ్ల మొక్కలు, పూలు, ఔషధ మొక్కల వంటి రకాలు ఉన్నాయి. నెలకు సగటున రూ.10 వేలు సంపాదిస్తూ ఇతరులకు మంచి ఆహారాన్ని అందిస్తున్నారు. పొలం పక్కనే ఉప్పు నీటి కాలువ ఉంది. వరదలకు తట్టుకునేలా చర్యలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు. వైవిధ్య పంటలు సాగు చేయడంతో పురుగు త్వరగా ఆశించదని తెరీషా తెలిపారు. తన భర్త షడ్రక్ తనకు చేదోడు వాదోడుగా ఉంటున్నారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని అందరూ చేయాలని ఆమె సూచించారు.

పొలంలో పనిచేస్తున్న కెతోర తెరీషా

రాయితీపై అపరాల విత్తనాలు

ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో 30 శాతం రాయితీపై మినుములు, పెసల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని డీఎం సుమలత వెల్లడించారు. ఎల్‌బీజీ-752, పీయూ-31, వీబీఎన్-8 విత్తనాలు 270 క్వింటాళ్లు, ఐపీఎం2-14 పెసలు విత్తనాలు 250 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. మినుములు కేజీ రూ.138గాను రూ.41.60 రాయితీ పోను రైతులు రూ.96.60 చెల్లించాలి. పెసలు కేజీ రూ.135 ధర ఉండగా రూ.40.50 రాయితీ పోను రైతులు రూ.94.50 జమ చేయాలి. కావాల్సిన వారు రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని కలిసి కృషి యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

చలికాలం.. పశువుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గురజాల, న్యూస్‌టుడే: చలికాలంలో వాతావరణ మార్పులతో పాల ఉత్పత్తి తగ్గుతుందని, పశువులను రక్షించుకునేందుకు పోషకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గురజాల పశుసంవర్ధక అధికారిణి సరోజాదేవి తెలిపారు. అధిక పోషకాలున్న దాణాతో పాటు మేలైన పశుగ్రాసాలు అందించాలి. చూడితో ఉన్న పశువులకు పశువైద్యుల సలహా మేరకు అదనంగా పోషకాలతోపాటు ప్రత్యేక టీకాలు, నట్టల నివారణ మందులు వేయించాలి. 50 కిలోల బరువున్న పశువుకు రోజుకు 7-8 లీటర్ల నీరు అవసరం. నీరు అందుబాటులో లేకుంటే కలుషిత జలాలు తాగే ప్రమాదం ఉంది. వాటిలో ఉండే ఈకొలి వంటి పరాన్నజీవులు రోగాలను వ్యాప్తి చేస్తాయి. చలి ఎక్కువైతే గోరువెచ్చని నీటిని అందిస్తే మేలు.

ఉష్ణోగ్రత - సంరక్షణ: చలి నుంచి రక్షణకు కొట్టాల చుట్టూ గోనెలు కట్టాలి. వెచ్చదనం కోసం నేలపై ఎండుగడ్డిని పరచాలి. చుట్టూ నీరు, బురద లేకుండా చూడాలి. ఉష్ణోగ్రత 8 డిగ్రీలకు తగ్గకుండా చూసుకోవాలి. దూడలకు చల్లటి గాలులు తగిలితే 'న్యూమోనియా' బారినపడే ప్రమాదం ఉంది. సాయంత్రం వేళ దూడలను త్వరగా కొట్టాల్లో కట్టేయాలి. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వేపాకు పొగ పట్టాలి.

పందిరి సొర.. లాభాలు భళా

ఇంకొల్లు, న్యూస్‌టుడే: పందిరి సొర సాగుతో లాభాలు ఆర్జిస్తున్నారు.. ఇంకొల్లు మండలం పావులూరుకు చెందిన రైతు కొర్నెపాటి వినోద్. నాలుగేళ్లుగా వినోద్ పందిళ్లపై కూరగాయల సాగుచేస్తున్నారు. ఎకరాకు రూ.1.70 లక్షల ఖర్చుతో గ్రానైట్ రాళ్లు, వెదురు బొంగులు, ఇనుప తీగలు, ప్లాస్టిక్ తాళ్లను వినియోగించి పందిళ్లు వేయించారు. మొత్తం పందిళ్లలో సొర, కాకర, బీర, పొట్ల, దోసపాదులు పెట్టి డ్రిప్ పద్ధతిలో నీటిని వినియోగిస్తున్నారు. తొలుత ట్రాక్టరుతో దుక్కి దున్నించారు. కలుపు బెడద లేకుండా మల్చింగ్ షీటు ఉపయోగించారు. కంపోస్టు ఎరువుతో పాటు వానపాముల ఎరువు దుక్కిలో వేసి విత్తనాలు నాటారు. సస్యరక్షణ సక్రమంగా ఉంటే 60 రోజుల్లో తొలికోత వస్తుంది. తెగుళ్లు తక్కువగా ఉంటాయి, నాణ్యమైన దిగుబడులు ఎక్కువ రోజులు వస్తాయని రైతు లాభాలు ఆర్జిస్తున్నారు.

ఖర్చు ఎక్కువైనా..: పందిరి సాగుకు తొలుత ఎక్కువ ఖర్చవుతుంది. ఒకసారి పందిరి వేసుకుంటే నాలుగేళ్లపాటు పనికొస్తుంది. ప్రస్తుతం రెండెకరాల్లో సొర సాగు చేస్తున్నారు. నెలలో రోజు మార్చి రోజు 15రోజు కోత కోస్తున్నారు. ప్రతి కోతకు రెండు వేల కాయలు తెంపుతున్నారు. మూడు నెలలపాటు దిగుబడి వస్తుంది. గుంటూరు మార్కెట్లో వీటిని విక్రయిస్తున్నారు. ఖర్చులు పోను ఎకరాకు రూ.1.50 లక్షలు మిగులు కనిపిస్తోందని రైతు వినోద్ తెలిపారు.

పందిరిపై కాసిన సొరకాయలు

వరిలో పొగాకు లద్దె పురుగు ఆవిర్భావం.. నివారణ

చినగంజాం, న్యూస్‌టుడే: వరి నారు మడుల్లో పొగాకు లద్దె పురుగు తీవ్రంగా ఆశించిందని చినగంజాం మండల వ్యవసాయాధికారి ఆర్. చంద్రశేఖర్ తెలిపారు. ఈ దాడికి కారణాలు, నివారణ మార్గాలను ఏవో వివరించారు.

❖ వరి కోతలు తర్వాత భూమిని దున్నకుండా వదిలేస్తే సస్యం పైరుల పురుగులు అభివృద్ధి చెందుతాయి. భూమిలోపల నుంచి పొగాకు లద్దె పురుగు తయారవుతుంది. ❖ మళ్లీ కొత్తగా సాగు సమయంలో నారుమడికి కావాల్సిన భూమిని దున్నుతారు. నీరు పెడతారు. ❖ అలా దున్ని నారు మడి పెట్టగానే మడిలోని నీటి తేమకి మిగిలిన భూమిలో పురుగు ద్వారా లోపల ఉన్న గుడ్లు పొదగబడి, పిల్లలుగా తయారవుతాయి. ❖ నారు మడి నీటిని పీల్చుకుని దున్నిన భూమిలోని గుడ్లు పెట్టిన పిల్లలు పెద్దవి పొగాకు లద్దె పురుగుగా అభివృద్ధి చెందుతాయి. ❖ నారు మడిలో ప్రవేశించి, క్రమంగా నారును దెబ్బతీస్తాయి.

❖ పగలు వంద పురుగులు కన్పిస్తే రాత్రులు వెయ్యి పురుగులు భూమిలోపల నుంచి బయటకు వస్తాయి. ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది.

ఇలా చేస్తే..: ❖ చిన్నస్థాయిలో ఉండే పొగాకు లద్దె పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 ఎంఎల్ మందును లీటరు నీటిలో, లేదా రిమాన్ 1.0 ఎంఎల్‌ను లీటరు నీటిలో, ఇండాక్సకార్బ్ 1.0 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ❖ పెద్ద స్థాయిలో ఉండే పురుగు నివారణకు 20 కిలోల తవుడు, రెండు కిలోల బెల్లం పాకం కలుపుకొని ఉదయాన్నే క్లోరిపైరిఫాస్ 500 ఎంఎల్‌లో కలిపి ఉండలుగా చుట్టుకొని, పొలంలో విషపు ఎరగా వేస్తే పూర్తి స్థాయిలో పురుగు నివారణ అవుతుంది. ❖ పొగాకు లద్దె పురుగును రైతులందరూ సామూహికంగా కృషి చేస్తే నివారణ అవుతుంది. ❖ వరి కోతలు కాగానే మళ్లీ పంట కాలం లోపల రెండు మూడుసార్లు భూమిని దున్నితే పురుగు అభివృద్ధి చెందదు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలో తాకట్టులో ఉన్నది విడిపించి మీకు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును, బ్యాంకులో, ఇతర ప్రైవేట్ సంస్థలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT. వృద్ధులకు, పేషెంట్లకు సేవకు, ఇంటి/పనికి, బేబీకేర్ పనులకు కావలసినవారు సంప్రదించగలరు ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

కొలకలూరు, జయబేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq.Yards గుంటూరు Site 10,000+Sq.Ft విల్లా అమ్మబడును. Ph.99662 28370.

JOBS

Wanted area SalesManager Qua:Inter/Degre. Min Exp. 2Yrs in building Material Industry. Sal: 25K. Ema Timbers, Gnt. 9989920203.

Wanted Sales Executives For Guntur, Ongole for Mahesh Extrusions (P) Ltd Bellari Send Your Resumes maheshpvcpipes@gmail.com.

LG ఆటోఫ్లెక్స్, పెద్దకాకాని... ITI/డిప్లొమా అర్హతగల హెల్పర్స్ కావలెను. 9542992200.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ్ నందు హాస్టల్ ఇన్‌ఛార్జ్, వార్డెన్స్ పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 10000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరములు పైబడి ఉండవలెను. వివరములకు కాల్ చేయండి ఫోన్: 8978480435.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్ నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్, క్లాస్ ఇన్‌ఛార్జ్‌లుగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు. వయస్సు 22 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలు లోపు ఉండవలెను. ఫోన్ నెంబర్: 8978480429.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ్ నందు Computer Operators పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: any Degree, 55 wpm Typing Speed, M.S Office Skils, వయస్సు: 22 సంవత్సరములు పైబడి ఉండవలెను. ఫోన్: 89784 80429.

గుంటూరు ఆర్.టి.సి కాలనీలోని ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హతను బట్టి జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 80740 28964.

వంట మాస్టారు బాల్య బర్త్‌లు... వరంగల్ సిటీలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలో వంటచేయుటకు. ✆ 9390809999, 9849235255.

లలిత కోల్డ్ స్టోరేజ్, ప్రత్తిపాడు నందు గుమాస్తా కావలెను. జీతం 14,000/-. Age: 30Y, లలిత కోల్డ్ స్టోరేజ్ ఆఫీస్, జాలాదిక్...

గుంటూరు అరండల్‌పేటలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు 10th అర్హత కలిగి సొంత బైక్ ఉన్న ఆఫీస్ బాయ్ కావలెను. సంప్రదించండి: 9391526523.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలెను. ఏదైనా పొరపాటుకు సంభవించిన నష్టానికి ఈనాడు బాధ్యత వహించదు. ప్రకటనలలో ఇచ్చిన వివరాలకు ఈ వార్తాపత్రికకు ఎటువంటి సంబంధం లేదు. ప్రకటనదారుల ద్వారా వచ్చిన సమాచారాన్ని మాత్రమే ప్రచురిస్తాము. చట్టపరమైన చర్యల బాధ్యత ప్రకటనకర్తలదే. యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పబ్లిక్ హెల్త్ యూనిట్ బ్లాక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవి

యడ్లపాడు, న్యూస్‌టుడే: దిత్వా తుపాను నేపథ్యంలో పారిశుద్ధ్యం మెరుగుపరచి, జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గర్భిణులను కాన్పుల కోసం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.రవి అన్నారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈహెచ్ఆర్) ఓపీ సేవల గురించి అధికారులను ఆరా తీశారు. పీహెచ్‌సీలో నూతనంగా నిర్మిస్తున్న పబ్లిక్ హెల్త్ యూనిట్ బ్లాక్ నిర్మాణ పనులను పరిశీలించారు. వినికిడి లోపం ఉన్న వారి వివరాలు సేకరించి ఈనెల 7న చిలకలూరిపేట ప్రత్తిపాటి గార్డెన్స్‌లో నిర్వహించనున్న వైద్య శిబిరానికి తీసుకెళ్లాలన్నారు. పల్స్‌పోలియోపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి. భరద్వాజ, సూపర్‌వైజర్ రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు రావాలి

మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజరు అమలకుమారి

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతులు సాగులో ఎరువులు, పురుగుమందుల వాడకంతో అధిక ఖర్చుతో పాటు ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు పంటలు నష్టపోతున్నారని దానికి ప్రత్యామ్నాయంగా ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు రావాలని జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె. అమలకుమారి కోరారు. జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వనరుల కేంద్రం నిర్వాహకులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలతో పంటలు వైపరీత్యాలను తట్టుకునే శక్తిని ఇస్తుందన్నారు. గ్రామస్థాయిలో సహజ వ్యవసాయంపై జాతీయ కమిషన్ పథకం కింద ఏర్పాటు చేస్తున్న ప్రకృతి వనరుల కేంద్రాల ద్వారా అవసరమైన వనరులు అందుబాటులో ఉంటాయన్నారు. ఘన, ద్రవ, బీజామృతం, నీమాస్త్రం, దశపర్ణ కషాయం, పుల్లటి మజ్జిగ వంటి పదార్థాలను రైతులు స్వయంగా తయారు చేసుకోవటం ద్వారా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజరు ప్రేమ్‌రాజ్, సిబ్బంది సైదయ్య, సౌజన్య, నందకుమార్, అప్పలరాజు, మేరీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఆశ చూపి.. ఉసూరుమనిపించారు!

భూవివాదాలపై అధిక ఫిర్యాదులు

బాధితుల సమస్య వింటున్న ఎస్పీ కృష్ణారావు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించనున్నట్లు ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అర్జీలు స్వీకరించారు. బాధితుల గోడు ఆలకించి సత్వరమే పరిష్కారం చూపుతామని తెలిపారు. భూవివాదాలు - 41, ఆర్థిక మోసాలు - 13, కుటుంబ సమస్యలపై - 15, ఉద్యోగాల పేరిట మోసాలు - 02, దొంగతనాలు- 02, ఇతరులు- 21 మొత్తం 94 అర్జీలు అందినట్లు అధికారులు వివరించారు.

★ గురజాలకు చెందిన ఓ యువతి బీఈడీ చదివి ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తోంది. పట్టణానికే చెందిన ఓ జీవిత బీమా ఏజెంట్ ఆమె తండ్రికి పరిచయమై రాజకీయంగా తనకు పలుకుబడి ఉందని.. మీ కుమార్తెకు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.5 లక్షలు తీసుకున్నాడు. ఆరేళ్లు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకుండా, నగదు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బాధితుడు ఎస్పీ వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు.

★ రొంపిచర్ల మండలం గోగులపాడుకు చెందిన ఓ మహిళకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరూ బీటెక్ చదివి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. నాదెండ్ల మండలం తూబాడుకు చెందిన దంపతులు ఈమెకు పరిచయమై పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.50 లక్షలు ఖర్చు అవుతుందని నమ్మకంగా నగదు తీసుకున్నారు. ఇంత వరకు నగదు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. అంతేకాక ప్రత్తిపాడు చెందిన మరో వ్యక్తి పరిచయమై సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశారు. నమ్మించి మోసం చేసిన ముగ్గురిపై చర్యలు తీసుకుని నగదు ఇప్పించాలని బాధితురాలు ఎస్పీని ఆశ్రయించారు.

అర్జీల పరిష్కారంలో అశ్రద్ధ తగదు

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

నరసరావుపేట అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల ప్రజావేదికకు 112 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. డీఆర్వో మురళి ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. అర్జీల పరిష్కారంలో అశ్రద్ధ వద్దని డీఆర్వో అధికారులకు సూచించారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి: బొల్లాపల్లి మండలం గండిగనుమలలో సర్వే నంబరు 430లో ఉన్న 170 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని కోరుతూ ప్రజాసంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న నేపథ్యంలో పేదలను గుర్తించి వారికి మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంఘం కోటానాయక్, శ్రీనునాయక్, పీడీఎం నేతలు నల్లపాటి రామారావు, మస్తాన్‌రావు ఉన్నారు.

స్కానింగ్ సెంటర్ ఏర్పాటుకు వినతి: ప్రభుత్వ వైద్యశాలలో సీటీ స్కానింగ్, ఎంఆర్ఐ యంత్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య కోరారు. వైద్యశాలకు వచ్చిన రోగులు ఈ పరీక్షల కోసం బయటకు వెళ్లాల్సి వస్తుందని అధికారుల దృష్టికి తెచ్చారు. ఇటీవల వైద్యశాలకు వచ్చిన రోగులతో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సక్రమంగా వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియచేయునదేమనగా నా క్లయింటు విప్పర్ల గ్రామం, రొంపిచెర్ల మండలం, పల్నాడు జిల్లా ఆంధ్రప్రదేశ్‌లోని సర్వే నం.లు 365-సి, 365-సి, 365-ఎ2, 365-బి, 365-సి, 365-హెచ్1, 365-ఎ2, 365-బి, 365-సి, 365-డి, 365-జి, 365-ఎఫ్, 365-ఎఫ్1, 365-డి, 365-ఇ, 365-హెచ్, 365-హెచ్1, 365-జి, 365-జి1, 365-బి, 365-సి, 365-డి, 365-2ఎ, 365-ఇ, 366-2ఎ, 366-2ఎ, 366-2ఎ1, 365-ఎ1, 355-1-1, 355-1, 355-1-2, 365-ఎ2, 365-ఇ, 365-సి, 365-హెచ్, 366-2ఎ, 355-1లోని ఎ.28.28 సెంట్ల వ్యవసాయభూమిని ("ఆస్తి")ని (1) షేక్ ఖాజావలి తండ్రి పేరు లేట్ షేక్ బుడే సాహెబ్ మరియు (2) షేక్ ఖాజా షహబుద్దీన్ తండ్రి పేరు షేక్ ఖాజావలి ("విక్రేతలు") నుంచి కొనుగోలు చేయాలని భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, ఏ వ్యక్తికి అయినా సహజమైన లేదా న్యాయపరమైన ఆక్షేపణ, క్లెయిము, ప్రయోజనం, వివాదం కనుక సదరు ఆస్తి లేదా దానిలో భాగంలో విక్రయం, బదిలీ, తాకట్టు, ఛార్జి, బహుమతి, మెయింటెనెన్స్, వారసత్వం, స్వాధీనత, లీజు, టెనెన్సీ, సబ్-టెనన్సీ, లీన్, లైసెన్సు, టైటిలు బదిలీ లేదా లాభదాయక ప్రయోజనం ద్వారా ట్రస్ట్ రైట్ ఆఫ్ ప్రిస్క్రిప్షన్ లేదా ఏదైనా ఒప్పందం కింద ప్రి-ఎంప్షన్ లేదా ఇతర తీర్పు లేదా ఏదైనా డిక్రీ, ఆదేశం లేదా అవార్డు లేదా మరే ఇతరత్రా కనుక నా క్లయింటు యొక్క ప్రతిపాదిత విక్రయ లావాదేవీపై ఉంటే వారు ఆయన/ఆమె/వారికి గల ఆక్షేపణలు/క్లెయిములు/వివాదం(దాల) వివరాలను బలపరచు డాక్యుమెంటరీ రుజువులతో ఈ బహిరంగ ప్రకటన తేది నుంచి 7 (ఏడు) రోజులలోగా దిగువ సంతకందారును సంప్రదించవలెను, లేని ఎడల షెడ్యూలు ఆస్తిపై ఏ మూడవపక్షం వారికి క్లెయిములు/ఆక్షేపణలు/వివాదాలు లేవని, నా క్లయింట్లు విక్రయ లావాదేవీని పూర్తి చేసుకొనేందుకు ముందుకు కొనసాగుతారు, ఆ తరువాత ఏ క్లెయిములు/ఆక్షేపణలు/వివాదాలు పరిగణించబడవు.

దినేష్ బాబు ఈడి
లక్ష్మి కుమరన్ & శ్రీధరన్ అటార్నీస్ తరపున
చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్-001.
ఫోన్:+91 99515 32083.
ఇమెయిల్: dinesh.eedi@lakshmisri.com

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌ను నియంత్రించే విషయంలో ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పీఎన్‌సీ కేఆర్ కళాశాల వద్ద ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణంలోని నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా వ్యాధిగ్రస్థులకు చికిత్స, మందులు అందజేస్తుందని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ ఎయిడ్స్ గురించి సందేహాలు ఉంటే సమీపంలోని వైద్యశాలను సంప్రదించాలని, అలాగే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. జిల్లా అధికారులు మాధవీలత, సూపరింటెండెంట్ సురేష్ తదితరులు ఉన్నారు

ర్యాలీలో విద్యార్థులు, అధికారులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 118, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -113 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, 135, 146 చికెన్ విత్ స్కిన్ - 236 చికెన్ స్కిన్‌లెస్ - 246.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

నిఘా కళ్లతో నేరాలకు కళ్లెం

గడియారం స్తంభం సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ..

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: నిఘా కళ్లతో నేరాలకు కళ్లెం వేసేలా పోలీసుశాఖ చర్యలు తీసుకుంది. పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధతో పట్టణం నలువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసి, పనిచేయని సీసీ కెమెరాల మరమ్మతులు చేయించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఆకతాయిల బెడద, విద్యార్థుల గొడవలు ఎక్కువగా ఉండటంతో ఆరు కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో 32 సీసీ కెమెరాలు బిగించి, వాటిని పట్టణ పోలీసు స్టేషన్‌తో అనుసంధానం చేసే పనులు తుదిదశకు చేరాయి.

క్రమశిక్షణతో ఉన్నతస్థితి

మాట్లాడుతున్న ఎస్సై అనిల్‌కుమార్

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యాభ్యాసంతో జీవితంలో ఉన్నతస్థితికి చేరుకోగలరని ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోళ్లపాడు కేజీబీవీలో సోమవారం సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విలువలతో కూడిన విద్య అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ సభ్యుడు సోమశేఖర్ తల్లిదండ్రుల్లేని విద్యార్థినులకు చలికోట్లను అందజేశారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఎం బాలస్వామి, ప్రిన్సిపల్ ఝాన్సీ, సేవాసంస్థ బాధ్యుడు బుల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పూజ

అచ్చంపేట, న్యూస్‌టుడే: స్థానిక అచ్చం పేరంటాళ్లమ్మ మణికంఠ అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో 41 రోజుల అన్నదాన కార్యక్రమం సోమవారం ప్రత్యేక పూజ కార్యక్రమంతో ముగిసింది. స్థానిక శివాలయంలో మాల ధరించిన స్వాములు భజన నిర్వహించారు. అనంతరం సద్ది కార్యక్రమంలో 500 మందిపైగా పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు నానిశేఖర్, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవఘ్నీ ఆరామంలో గీతాజయంతి

అమరావతి, న్యూస్‌టుడే: వైకుంఠపురంలోని భవఘ్నీ ఆరామంలో గీతా జయంతి ఘనంగా నిర్వహించారు. భవఘ్నీ గురుదేవులు ఆధ్వర్యంలో గీతా హోమం చేశారు. అనంతరం వ్యాసభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవద్గీత పఠనం జీవిత మార్గానికి వెలుగు చూపిస్తుందన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు.

ప్రత్యేక తండాలుగా గుర్తించాలి

అచ్చంపేట: జనాభా 500పైగా ఉన్న తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు రామకోటేశ్వరనాయక్ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాదిపాడు, గింజుపల్లి, తాడువాయి, కొండూరు, నీలేశ్వరపాలెం గ్రామ పంచాయతీల పరిధిలో 8 గిరిజన తండాలు ఉన్నాయన్నారు. తండావాసులు విద్య, వైద్యం, సరైన రవాణా సౌకర్యానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మురుగు కాలువ శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని క్రిస్టియన్‌పేటలో అధ్వానంగా ఉన్న మురుగు కాల్వలపై 'మురుగు పారని కాలువ' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన చిత్రవార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. మురుగు కాలువను శుభ్రం చేయించారు.

పీఎంశ్రీ బడుల విద్యార్థులకు గుర్తింపు కార్డులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పీఎంశ్రీ విద్యాలయాల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. సమగ్ర శిక్షా గుర్తింపు కార్డుల జారీ బాధ్యతలను రాష్ట్రస్థాయిలో ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. సిబ్బంది వచ్చి యూడైస్ ప్లస్ వివరాల ఆధారంగా విద్యార్థుల ఫొటోలు తీసుకుంటున్నారు. జిల్లాలో 44 పీఎంశ్రీ విద్యాలయాలు ఉన్నాయి. సుమారు 20 వేల మంది చదువుతున్నారు. వారికి గుర్తింపు కార్డులు త్వరలోనే అందించనున్నట్లు జిల్లా సమన్వయకర్త పూర్ణ చెప్పారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

రెంటచింతల, న్యూస్‌టుడే: రెంటచింతల ఎంపీడీవోగా స్వరూపరాణి బాధ్యతలు చేపట్టారు. ఆమె నాదెండ్ల మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావు నాదెండ్ల మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దారును పలువురు అభినందించారు.

గొడవల జోలికెళితే.. జైలుకే

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

హత్యలు, గంజాయి, మత్తు పదార్థాల విక్రయం, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో రౌడీషీటర్లు పాల్గొంటున్నట్లు వెల్లడవుతున్న తరుణంలో వారి కదలికలపై పోలీసుశాఖ నిఘా పెట్టింది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించడంతోపాటు కౌన్సెలింగ్ ఇస్తోంది. ఎలాంటి నేరాల్లో పాల్గొంటున్నారు, ఎవరు ప్రోత్సహిస్తున్నారనే అంశాల్ని కూడా ఆరా తీస్తోంది. సత్తెనపల్లి పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలు ఉన్నాయి. సత్తెనపల్లి పట్టణంలో 11 మంది, మండలంలో ఆరుగురు, ముప్పాళ్లలో 12, రాజుపాలెంలో అత్యధికంగా 16 మంది, నకరికల్లులో 10, అమరావతిలో ఏడు, అచ్చంపేటలో ఆరు, పెదకూరపాడులో 13, క్రోసూరులో 13, బెల్లంకొండలో ఎనిమిది మంది చొప్పున రౌడీషీటర్లు ఉన్నారు. మొత్తం 102 మందితోపాటు ఇటీవల నేరాల్లో, గంజాయి, మత్తుపదార్థాల కేసుల్లో పట్టుబడిన 10 మందిని గుర్తించి స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ హనుమంతరావు

హనుమంతరావు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. అన్ని మండలాల్లోనూ ఈ ప్రక్రియ నిర్వహించారు. పట్టణానికి చెందిన ఇద్దరు రౌడీషీటర్ల ఆగడాలు ఎక్కువ కావడంతో వారిపై పీడీ యాక్టు ప్రయోగించారు. తరచూ నేరాల్లో పాల్గొంటున్న వారిని గుర్తించి పీడీ యాక్టులకు సిఫార్సు చేయాలనే ఆలోచన చేస్తున్నారు.

ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారు

చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు రౌడీషీటర్లకు హెచ్చరికలు చేశారు. రౌడీషీటర్లు సొంత గ్రామాల్లోనే ఉంటున్నారా, వేరే ప్రాంతాల్లో ఎవరి వద్ద తలదాచుకుంటున్నారు.. వారి వెనుక నేర నేపథ్యం ఏమైనా ఉందా అనే వివరాలను కూడా సేకరించారు. వారిని ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలున్న రాజకీయ పార్టీల నాయకులకు కూడా హెచ్చరికలు చేస్తున్నారు.

సత్ప్రవర్తనతో మెలిగితే ప్రోత్సాహం

చేసిన తప్పులు తెలుసుకుని మంచి మార్గంలో పయనించి, కుటుంబంతో ప్రశాంతంగా ఉంటున్న వారిపై రౌడీషీట్లను తొలగించే చర్యలు కూడా తీసుకుంటున్నారు. గత 15 ఏళ్ల ట్రాక్‌ను పరిశీలించి సత్ప్రవర్తనతో మెలుగుతుంటే మార్పును ప్రోత్సహిస్తున్నారు. రౌడీషీటర్ అనే ముద్రను తొలగిస్తున్నారు. ఇదే సమయంలో రాజకీయ సిఫార్సులతో రౌడీషీట్లను తొలగించుకుని తమ నేర స్వభావాన్ని వీడని వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు.

20న పిడుగురాళ్లలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

అమ్మవారి ఆలయం వద్ద చర్చిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని తదితరులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఈనెల 20న తితిదే ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పట్టణానికి తితిదే అధికారులు వచ్చి కల్యాణోత్సవానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో తెదేపా ప్రభుత్వంలో స్థానిక ఉన్నత పాఠశాలలో వేంకటేశ్వర కల్యాణం నిర్వహించినట్లు గుర్తుచేశారు. స్వామి ఆశీస్సులు గురజాల నియోజకవర్గ ప్రజలకు ఉండాలని కోరుతూ వేడుక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తితిదే సూపరింటెండెంటు మల్లికార్జున్, మున్సిపల్ ఛైర్మన్ కొత్త చినసుబ్బారావు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ తురకా వీరస్వామి, డీఎస్పీ జగదీష్, కమిషనర్ శ్రీనివాసులు, తహసీల్దారు మధుబాబు, పట్టణ సీఐ వెంకట్రావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం.. పిడుగురాళ్ల: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పట్టణంలోని 9, 10వ వార్డులకు చెందిన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మన రాష్ట్రంలో పెద్ద మొత్తంలో పింఛన్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. సంక్షేమం విషయంలో వెనకడుగు వేయడం లేదన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మండలంలోని కారంపూడి, కాకానివారిపాలెం, ఒప్పిచర్ల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి శ్రీకారం చుట్టారు. తొలుత కారంపూడిల బీసీ కాలనీలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. కాకానివారిపాలెంలో రూ.36 లక్షలతో నిర్మిస్తున్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు భూమిపూజ చేశారు. ఒప్పిచర్లలోని శ్మశానంపేటలో రూ.70 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో రూ.56.79 లక్షలతో నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పదో తరగతిలో జిల్లా ప్రథమ స్థానం సాధించిన పాపని చంద్రిక కోరిక మేరకు కారంపూడి-ఒప్పిచర్ల రహదారి నుంచి ఉన్నత పాఠశాల వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామన్నారు.

ఒప్పిచర్ల ఉన్నత పాఠశాలలో తరగతి గదుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

స్త్రీనిధి సొమ్ము రికవరీ చేయాలి

అమరావతి, న్యూస్‌టుడే: మండలంలో స్త్రీనిధి రుణాలు పక్కదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకుని, రికవరీ చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. అమరావతిలో సోమవారం జేఆర్సీ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం మహిళలకు రూ.కోటి బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేశారు. అందరికీ సక్రమంగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, ఏపీఎం ఉషశ్రీ పాల్గొన్నారు.

ప్రతి అర్జీ పరిష్కరించాలి: ప్రజల వద్దకే ప్రవీణ్ కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. పెదమద్దూరులో జరిగిన ప్రజలవద్దకే ప్రవీణ్ కార్యక్రమంలో గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరించారు. అంతకుముందు పెదమద్దూరు వంతెన నిర్మాణ పనులు పరిశీలించారు. తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో శివపార్వతి పాల్గొన్నారు.

మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ప్రసంగించి.. ప్రశంసలు పొంది

విజేతలతో స్కాలర్స్ పాఠశాల డైరెక్టర్లు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని స్కాలర్స్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను సోమవారం నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో బి.నందిత, పి.నేహ, జి.చరణ్‌బాలాజి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు డైరెక్టర్లు జి.శ్రీనివాసరెడ్డి, ఎం.జగదీష్ అందజేశారు.

మాచర్ల (కారంపూడి): మాచర్లలోని పల్నాడు జూనియర్ కళాశాలలో ప్రసంగ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు లక్ష్మీ సహస్రి, జుబేదా, మస్రీన్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి కళాశాల డైరెక్టర్ నాగూర్‌వలి, ప్రిన్సిపల్ శివభాస్కర్, లక్ష్మీరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

పల్నాడు కళాశాలలో..

మహిళా విభాగం అధ్యక్షురాలిగా నిర్మల

పిడుగురాళ్ల: తెదేపా పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలిగా తాళ్ల నిర్మలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నియమించారు. ఉపాధ్యక్షురాలిగా చల్లా అంజమ్మ, ప్రధాన కార్యదర్శిగా బిజిలి అంజలిలను నియమించారు.

కోలాటం పోటీల్లో ప్రతిభ

బెల్లంకొండ: జిల్లా స్థాయి బాలోత్సవంలో భాగంగా కోలాటం ప్రదర్శనలో చంద్రాజుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచారు. వారిని హెచ్ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పాతపాటేశ్వరి తిరునాళ్ల

ఉత్సవ విగ్రహం ఊరేగింపు

గురజాల, న్యూస్‌టుడే: పాతపాటేశ్వరి తిరునాళ్ల ప్రారంభమైంది. సోమవారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

దిత్వా.. ఏం చేస్తుందో..?

అన్నదాతల్లో తుపాను గుబులు

ధాన్యంపై కప్పిన పట్టాలు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ఏం చేస్తుందో? అనే భయం అన్నదాతల్ని వెంటాడుతోంది. మొంథా తుపానుతో రైతులు నష్టపోయారు. ముఖ్యంగా పత్తి రైతులను దెబ్బతీసింది. ఇప్పుడు మాగాణి రైతుల్లో దిత్వా తుపాను గుబులు రేపుతోంది. వరి కోతల సమయం కావడంతో ధాన్యం కాపాడుకునేందుకు వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు తరలించకముందే వర్షంతో పాడైపోతుందనే భయంతో ఉన్నారు. తుపాను ప్రభావంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న పైరు నేలవాలుతోంది. పంట చేతికి అందుతుందా? లేదా అనే దిగులుతో ఉన్నారు.

చెత్త తొలగించరూ..

దుర్గిలోని ముస్లిం వీధి నుంచి ఇందిరమ్మకాలనీకి వెళ్లే దారిలో చెత్త వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించే ప్రజలు ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోంది. సమీపంలోనే ఉర్దూ పాఠశాల ఉంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, దుర్గి**

విద్యార్థులే.. ఉద్యోగుల్లా..

రక్త నమూనాలు తీస్తున్న విద్యార్థులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: నర్సింగ్, పారా మెడికల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఉద్యోగుల్లా సేవలందిస్తున్నారు. ఉద్యోగుల పనితీరు పరిశీలించాల్సిన వారే రక్త నమూనాలు సేకరిస్తున్నారు. వారే రికార్డుల్లో వివరాలు నమోదు చేస్తున్నారు. వైద్యాధికారులు, ఉద్యోగుల పర్యవేక్షణ లోపించడంపై విమర్శలు వస్తున్నాయి.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ప్రదర్శన సోమవారం నిర్వహించారు. పట్టణంలోని ఆంధ్రా బ్యాంకు సెంటర్ నుంచి విద్యార్థులు, లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రదర్శనగా ఉన్నత పాఠశాల వరకు వెళ్లారు. వైద్యులు సుబ్బారావు ర్యాలీని ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు జనార్దనరావు, జోన్ ఛైర్మన్ సతీష్, ఏడుకొండలు, వెంకటస్వామి, కాశీవిశ్వనాథం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు(అచ్చంపేట): ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ సహకరించాలని పీహెచ్‌సీ ఆరోగ్యవిస్తరణాధికారి ఎస్.శ్యాంసన్ అన్నారు. సోమవారం ఎర్రబాలెం గ్రామంలో ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవ ప్రదర్శనలో ఆయన మాట్లాడారు.

బెల్లంకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ డే పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ మహమ్మారిని తరిమేయాలంటే అవగాహనతో పాటు జాగ్రత్తలు అవసరమన్నారు.

పెదకూరపాడు: ఎయిడ్స్‌పై అవగాహన పెరిగితేనే నియంత్రించవచ్చని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విద్య అన్నారు. సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

స్థానిక ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి

వివిధ అంశాలపై చర్చిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 54వ పోలింగ్ బూత్ బాధ్యులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో 90 శాతానికి పైబడి కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్‌హిట్ అయ్యాయన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయానికి ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించాలని నాయకుల్ని కోరారు. కౌన్సిలర్ అబ్రహం, మాజీ కౌన్సిలర్ సురేష్‌కుమార్, నాయకులు నాగరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ శాలివాహన సంఘం అధ్యక్షుడి ఎన్నిక

పిడుగురాళ్ల: పట్టణ శాలివాహన సంఘం అధ్యక్షుడిగా జమ్మిశెట్టి రామకృష్ణను ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో సంఘీయులు సమావేశమై ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్రరావు, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, మీడియా కన్వీనర్‌గా వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, శేషగిరిరావు, శివశంకర్ తదితరులను ఎన్నుకున్నారు.

జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా మధుబాబు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా దుర్గి మండలం ఓబులేశునిపల్లెకు చెందిన చిరుమామిళ్ల మధుబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. త్వరలో ఆయన ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

వేల్పూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: మాగులూరి ఫౌండేషన్ సహకారంతో వేల్పూరుకు చెందిన బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థిని నెల్లూరి నస్మితకు ల్యాప్‌టాప్‌ను స్థానిక తెదేపా నేతలు, సర్పంచి జువ్వా శంకర్, మాజీ సర్పంచి నాగమల్లేశ్వరరావు అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.కిరణ్, ప్రసాద్, కృష్ణారావు పాల్గొన్నారు.

హిందీ పండిట్‌కు పురస్కారం

పెదకూరపాడు, న్యూస్‌టుడే: దేశ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని కాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ లలితబాబు అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హిందీ పండిట్ షేక్ బాజీ పురస్కారం అందుకున్నారు. సోమవారం ఆయనను తోటి ఉపాధ్యాయులు సత్కరించారు.

సంక్షేమానికి పెద్దపీట

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని 22వ వార్డులో సోమవారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల నగదును లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛను రూ.4 వేలకు పెంచిందన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాష్ట్ర భట్రాజు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛను నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు

సత్తెనపల్లిలో శాశ్వత ఆటోనగర్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. స్థానిక ఆటోనగర్‌లో అసోసియేషన్ బాధ్యులు, కార్మికులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోనగర్ ఏర్పాటు చేస్తే ఎంతోమందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ సందర్భంగా మిత్ర ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ బాధ్యులు ఎమ్మెల్యేకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

కుడికాలువలోకి దూకిన జంట

మహిళ మృతదేహం వెలికితీత

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: భర్తకు దూరంగా ఉంటున్న మహిళ ఓ వ్యక్తితో కలిసి సోమవారం సాయంత్రం కాలువలో దూకింది. ఆమె మృతదేహం లభ్యం కాగా. . యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలిలా.. మాచర్ల పట్టణం పాతూరు రథం బజారులో నివాసముండే శ్రీలక్ష్మి (25)కి పట్టణానికి చెందిన ఓ వ్యక్తితో ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి అమ్మాయి, అబ్బాయి కలిగారు. నాలుగేళ్ల కిందట భర్తతో మనస్పర్థల కారణంగా ఆమె పుట్టింట్లో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. పట్టణానికి చెందిన గోవర్ధన్‌తో ఏడాది నుంచి పరిచయం పెంచుకోగా, అది వివాహేతర సంబంధంగా మారింది. ఏం జరిగిందో.. సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఇద్దరూ జమ్మలమడక వెళ్లే మార్గంలోని బొంబాయి కంపెనీ కుడికాలువలో దూకారు. విషయం తెలుసుకున్న బంధువులు గాలింపు చేపట్టగా శ్రీలక్ష్మి మృతదేహం లభ్యమైంది. గోవర్ధన్ ఆచూకీ తెలియలేదు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కార్మికులను నష్టపరిచి, కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం మాచర్లలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సీఐటీయూ నాయకుడు మహేష్, ఎంసీపీఐ నాయకుడు అబ్రహం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దాచేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీనగర్ గ్రామానికి చెందిన పులిపొంగు నూకరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రామ పెద్దలు మాశెట్టి పుల్లారావు, నరేంద్ర ప్రసాద్, మరియదాసు, రఫీ, జోగయ్య, బెంజిమెన్ రూ.25,000 బాధితులకు అందజేశారు.

పూత కానరాక.. దిగుబడి లేక..

వేల్పూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: అధిక వర్షాలు నిమ్మతోటల రైతులను దెబ్బతీశాయి. అక్టోబరు, నవంబరు నెలల్లో తుపాన్ల కారణంగా నిమ్మ చెట్లకు పూత రావడం నిలిచిపోయింది. దిగుబడి తగ్గుతోందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు తదితర మండలాల్లో 400 ఎకరాల్లో నిమ్మతోటలు ఉన్నాయి. పూత వచ్చిన నాలుగు నెలలకు కాయలు తయారయ్యేది. మార్చి, ఏప్రిల్ నాటికి దిగుబడి రావాల్సి ఉండగా.. ప్రస్తుతం చెట్లకు పూత కనిపించడం లేదు. తాజాగా తుపాను హెచ్చరికలతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

వేల్పూరులోని నిమ్మతోట

ధర అంతంతమాత్రమే.. ఉత్తరాది రాష్ట్రాలకు కాయల ఎగుమతి లేకపోవటంతో ధర అంతంత మాత్రంగానే ఉంది. టిక్కి (50 కిలోలు) ధర తెనాలి మార్కెట్‌లో రూ.500కు మించడం లేదు. కాయలు కోసినందుకు కూలీలకు రూ.300, రవాణా ఛార్జి రూ.150 ఖర్చు చేయాల్సి వస్తోంది. సీజన్‌లో ధర పెరుగుతుందన్న ఆశ ఉన్నా, దిగుబడి వచ్చేలా లేదని వేల్పూరుకు చెందిన రైతులు మంగయ్య, బాపయ్య చౌదరి తెలిపారు. తోటలు బెట్టకు రావాల్సిన సమయంలో వర్షాలతో తేమ ఎక్కువగా ఉందన్నారు.

తల్లీ, కుమారుడి మృతదేహాలు అప్పగింత

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ధూళిపాళ్లలో దారుణ హత్యకు గురైన తల్లీ, కుమారుడు కృష్ణకుమారి, సాంబశివరావు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య, కుమారుడి మృతితో కుటుంబ యజమాని వీరయ్య కన్నీరుమున్నీరుగా విలపించారు.

నేరం చేస్తే తప్పించుకోలేరు

'ఈనాడు' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

మాట్లాడుతున్న డీఎస్పీ జగదీష్

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: బ్రిటీష్‌కాలం నాటి న్యాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, గతేడాది మూడు కొత్త న్యాయ చట్టాలను అమలు తీసుకొచ్చినట్లు గురజాల డీఎస్పీ జగదీష్ చెప్పారు. సోమవారం పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డు విద్యాలయాల్లో పోలీసుశాఖ, 'ఈనాడు' సంయుక్తంగా కొత్త క్రిమినల్ న్యాయ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కొత్త న్యాయ చట్టాలతో సమూలమైన మార్పులు వచ్చాయన్నారు. నేరం చేస్తే తప్పించుకోలేరన్నారు. ఏదైనా సమస్య వస్తే ఫోన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అమ్మాయిలను టీజ్ చేస్తే భవిష్యత్తు పాడవుతుందని యువకులను హెచ్చరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల ఉద్యోగాలు ఇప్పిస్తామని, లాటరీ వచ్చిందని ఫోన్‌చేసి మోసాలు చేస్తున్నారని, వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పట్టణ సీఐ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు కొత్త న్యాయ చట్టాలతో మహిళలకు సంరక్షణ ఉంటుందని చెప్పారు. ఈ చట్టాలతో మహిళకు భద్రత పెరుగుతుందని తెలిపారు. గంజాయి విచ్చలవిడిగా సమాజంలోకి వచ్చిందని, దానికి యువత అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి అమ్మినా, తాగిన నేరమన్నారు. ఎస్సై శివనాగరాజు మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్స్ ద్వారా నేరం చేసిన వారికి గతంలో శిక్షలు వేసే వారని చెప్పారు. ఇప్పుడు కొత్త చట్టాల ద్వారా శిక్షలు వేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హాజరైన విద్యార్థులు

గేదె ఢీకొని ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: విధులు నిర్వర్తించడానికి ద్విచక్ర వాహనంపై స్టేషన్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో గేదె ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న వెంకటనాయక్, హోంగార్డు మస్తాన్ సోమవారం మాచర్ల నుంచి బైక్‌పై వెల్దుర్తికి బయలుదేరారు. ఉప్పలపాడు గ్రామ శివారులో గేదె ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి.

(c) eenadu

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం: కొమ్మాలపాటి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా పింఛన్లు అందించి రికార్డు నమోదు చేస్తుందన్నారు. పింఛన్లపై ఏటా రూ.33వేల కోట్లు ఏ రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేయడం లేదని తెలిపారు. మహిళలు, రైతులు, మత్స్యకారులు, ఆటో డ్రైవర్లు ఇలా అన్ని వర్గాలకు సాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన జీతాలతో పాటు పింఛన్లకు రూ.2700 కోట్లు వ్యయం చేస్తుందని ఇది ప్రభుత్వ సమర్థతకు నిదర్శనమన్నారు. పేదల ఇళ్లకు కేంద్రం ఇచ్చిన నిధులనే ఇచ్చి గతంలో హడావిడి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా 5 లక్షలు ఇళ్లు మంజూరు చేస్తుందని వివరించారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలోని సీఆర్ కాలనీలో ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు మొలచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - **వెంకటకృష్ణ**

✔ పరిశీలించి ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేసి, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటాం. - **రమణారావు, పారిశుద్ధ్య అధికారి – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం**

అడ్డంకులు అధిగమించి.. అథ్లెటిక్స్‌లో రాణించి..

గురుకుల విద్యార్థుల ప్రతిభ

న్యూస్‌టుడే చిలకలూరిపేట గ్రామీణ

వారు చదువుతో పాటు ఆటల్లో సత్తా చాటుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు అందిస్తున్న శిక్షణతో పాఠశాల స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడల్లోనూ ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచారు. వారే చిలకలూరిపేట మండలం రాజాపేటలోని ఏపీ గురుకుల పాఠశాలలో 10, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులు కుంచాల చంద్రశేఖర్, బైలడుగు నాగమణికంఠ. ఇటీవల లక్నోలో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో విజయం సాధించారు.

లాంగ్‌జంప్‌లో సత్తా...

మాది రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామం. అమ్మానాన్న వెంకటలక్ష్మి, సాంబశివరావు కూలి పనులు చేస్తుంటారు. ఆరో తరగతి నుంచి రాజాపేట గురుకుల పాఠశాలలో చదువుతున్నాను. వ్యాయామోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ బ్రహ్మాజీ అందించిన ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాను. ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ గత ఆగస్టులో చీరాలలో నిర్వహించిన రాష్ట్ర జూనియర్ అండర్-16 బాలుర విభాగం లాంగ్ జంప్‌లో, సెప్టెంబరు 26న ఏఎన్‌యూ లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానంలో నిలిచాను. పెంటాథ్లాన్ ఈవెంట్, మిడ్లే రిలేలో ద్వితీయస్థానం సాధించాను. ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వినుకొండలో నిర్వహించిన ట్రిపుల్‌జంప్‌లో ప్రథమస్థానం, 110 మీటర్ల హర్డిల్స్‌లో ద్వితీయ స్థానం, 4×400 రిలేలో ద్వితీయ స్థానం 400 మీటర్ల హర్డిల్స్‌లో ద్వితీయ స్థానం సాధించాను. ఏఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏఎన్‌యూలో జరిగిన సౌత్ ఇండియా అండర్-16 లాంగ్ జంప్‌లో ప్రథమస్థానం, ఏఎఫ్ఐ భువనేశ్వర్‌లో నిర్వహించిన లాంగ్ జంప్, పెంటాథ్లాన్‌లో ద్వితీయస్థానం సాధించాను. ఎస్‌జీఎఫ్ఐ ఉత్తరప్రదేశ్ లక్నోలో డిసెంబరు 10 నుంచి 13 వరకు జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో బాలుర విభాగంలో ట్రిపుల్‌జంప్‌లో పాల్గొనబోతున్నాను. ఆటలతో పాటు చదువులోనూ రాణించి ఐపీఎస్ సాధించాలన్నదే లక్ష్యం. - **కుంచాల చంద్రశేఖర్, 10వ తరగతి.**

పరుగు తీస్తే పతకం..

మాది బొల్లాపల్లి మండలం గంగుపల్లి గ్రామం. ఆరో తరగతి నుంచి రాజాపేట గురుకుల పాఠశాలలో చదువుతున్నాను. అమ్మానాన్నలు వీరమ్మ, చిన్న వెంకయ్య కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏలూరులో నిర్వహించిన జూనియర్ బాలుర విభాగం 4×400 పరుగుపందెంలో ప్రథమస్థానం, ఏపీ స్కూలు గేమ్స్ ఫెడరేషన్ వినుకొండలో నిర్వహించిన 400 మీటర్ల హర్డిల్స్‌లో ప్రథమ స్థానం, 4×400 రిలేలో ద్వితీయ స్థానం సాధించాను. లక్నోలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలలో అండర్-17 బాలుర విభాగంలో 400 మీటర్ల హర్డిల్స్, 4×400 రిలే పోటీల్లో పాల్గొనబోతున్నాను. ఆర్మీ అధికారిగా ఉద్యోగం సంపాదించి దేశ సేవ చేయాలన్నదే లక్ష్యం.

- **బైలడుగు నాగమణికంఠ, 9వ తరగతి**

ప్రాంగణ ఎంపికల్లో రాణించారు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు హెట్రో సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో రాణించి ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపికలకు హాజరైన విద్యార్థులకు మూడు దశల్లో (రాత, బృంద చర్చ, మౌఖిక) పరీక్షలు నిర్వహించారని తెలిపారు. 13 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. సంస్థ హెచ్ఆర్ సమీర్, టీపీవో బాలకోటేశ్వరరావు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

గాంధీనగర్ వద్ద రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధితో పాటు పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన సోమవారం భూమిపూజ నిర్వహించారు. ముందుగా వడ్డెంగుంటలో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఈ గ్రామంలో ఉప ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం రూ.36లక్షలు మంజూరు చేయడంతో దాతలు స్థలం దానం చేశారు. దీంతో ఇక్కడ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గాంధీనగర్ నుంచి పలుకూరు వరకు జిల్లా పరిషత్తు రహదారి నిర్మాణానికి రూ.4.50కోట్లు మంజూరు కావడంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. వెల్లటూరులో జల్‌జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికి నీటి కుళాయి ఏర్పాటుకు రూ. 70 లక్షలతో నిర్మాణ పనులు, సిమెంట్ రహదారి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఎంపీడీవో మాధురి, తహసీల్దార్ సుధాకర్, పార్టీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, వాసుదేవరెడ్డి, గోవిందునాయక్, హనుమానాయక్ దాసయ్య, దాసరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో దేశానికి ఆదర్శం

యడ్లపాడు: కారుచోలలో పింఛను పంపిణీలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట గ్రామీణ, పట్టణం, యడ్లపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 67 లక్షల కుటుంబాలకు ప్రతి నెల పింఛన్లు అందిస్తున్న ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు అన్నారు. చిలకలూరిపేట, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో వారు వేర్వేరుగా పాల్గొన్నారు. చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లోని రాజాపేట, మల్లాయపాలెం, కారుచోల గ్రామాలతో పాటు చిలకలూరిపేట పట్టణంలో 30, 31 వార్డుల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పింఛన్లు పంపిణీ చేసి, పేదల ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజాపేటలో రూ.9.80 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యడ్లపాడు మండలం కారుచోలలో రూ.61లక్షలతో చేపట్టిన ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఎస్‌కే రఫాని, యార్డు ఛైర్మన్ ఎస్‌కే కరిముల్లా, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, భాజపా నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, తెదేపా నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాది మదన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పఠాన్ సమద్‌ఖాన్, మద్దూరి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరాచక శక్తులను అణచివేశాం.. నరసరావుపేట సెంట్రల్: పట్టణంలోని వరవకట్ట ప్రాంతం గత వైకాపా హయాంలో అసాంఘిక శక్తులకు నిలయంగా ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడ అన్యాయాలు, అక్రమాలను నిలువరించి లబ్ధి చేకూర్చామని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం వరవకట్ట, 25, 26 వార్డులతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు 26 వార్డు సచివాలయ అడ్మిన్ అందుబాటులో ఉండటం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని అతన్ని మందలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసరావుపేట: వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

సైనిక కుటుంబాల సంక్షేమానికి సహకరించండి

పతాక దినోత్సవం స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న డీఆర్వో మురళి తదితరులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణత్యాగం చేసే అమరులైన సైనికుల కుటుంబాల సంక్షేమానికి విరాళాలు అందించి సహకరించాలని డీఆర్వో మురళి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ సందర్భంగా సైనిక సంక్షేమ శాఖకు సంబంధించిన సాయుధ దళాల పతాక దినోత్సవం స్టిక్కర్లను ఆవిష్కరించారు. సైనిక కుటుంబాల సంక్షేమం అందరి బాధ్యత అన్నారు. జిల్లా అధికారులు ఉన్నారు.

మాటలతో మైమరిపించారు

ఈనాడు ప్రతిభాపాటవ పోటీల్లో విద్యార్థుల ఉత్సాహం

నరసరావుపేట అర్బన్, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్ వాడకం పరిమితంగా ఉంటే మేలని పరిధి దాటితే ఇబ్బందులు తప్పవని విద్యార్థులు తెలిపారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై 'ఈనాడు' ఆధ్వర్యంలో నరసరావుపేట, చిలకలూరిపేటలోని పాఠశాలల్లో సోమవారం జరిగిన వక్తృత్వ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రసంగించారు. సెల్‌ఫోన్‌ను ఎక్కువ వినియోగిస్తే మెదడు, నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుందన్నారు. నరసరావుపేట ఎన్బీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోటీల్లో రాణించిన విద్యార్థులు బాలాజీ (10వ తరగతి), వాసవి, కుమరున్నీసా (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని చిట్టెమ్మ బహుమతులను అందజేసి అభినందించారు. ఉపాధ్యాయులు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

★ చిలకలూరిపేట చైతన్య ఎక్సెల్ పాఠశాలలో డైరెక్టర్ ఈదర గిరీష్ బాబు మాట్లాడుతూ ఇటువంటి పోటీలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను బయటకు తీసి ప్రోత్సహించేందుకు 'ఈనాడు' తెలుగు రాష్ట్రాల్లో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విజేతలైన విద్యార్థులు బాల మహేష్‌బాబు (9వ తరగతి), హర్షిత చైతన్యశ్రీ (9వ తరగతి), ఎస్‌కే నజీన్ (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. ప్రిన్సిపల్ డీవీ లక్ష్మి, ఏవో రామకృష్ణ, కో-ఆర్డినేటర్లు జి.సురేష్ బాబు, ఎం.శరత్ చక్రవర్తి పాల్గొన్నారు.

నరసరావుపేట: విజేతలతో ప్రధానోపాధ్యాయిని చిట్టెమ్మ

చిలకలూరిపేట: బహుమతులు అందుకున్న బాలికలతో చైతన్య ఎక్సెల్ స్కూలు డైరెక్టర్ ఈదర గిరీష్‌బాబు, ప్రిన్సిపల్ లక్ష్మి తదితరులు

కార్మికులకు సమవస్త్రాల పంపిణీ

వినుకొండ, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికులకు శివశక్తిలీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమవస్త్రాలు పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్ షకీల, తెదేపా పట్టణ అధ్యక్షుడు బొంకూరి రోశయ్య పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

శిక్షణ శిబిరంలో రాష్ట్ర బాలికల జట్టుతో గోనుగుంట్ల, హెచ్‌ఎం తదితరులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ సీనియర్ బాలికల జట్టుకు రొంపిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన శిక్షణ శిబిరాన్ని స్థానిక నేతలు జగ్గయ్య, ప్రభాకర్‌రెడ్డి, రత్నారెడ్డితో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు శరీరానికి చక్కని వ్యాయామమన్నారు. పాఠశాల హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. పీడీ సైదయ్య మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 19 వరకు పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు.

ఆదర్శ విద్యార్థినికి తెలుగు ప్రతిభా పురస్కారం

హారిక

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని వి.రెడ్డిపాలెం పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూలులో 9వ తరగతి చదువుతున్న పొలిమేర హారిక రాష్ట్ర స్థాయి తెలుగు ప్రతిభా పురస్కారం అందుకుంది. ఇటీవల మన సంస్కృతి సంస్థ నిర్వహించిన పోటీల్లో ఏపీ నుంచి సుమారు 2500 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారిలో తమ విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకుందని ప్రిన్సిపల్ డాక్టర్ బి.వినాయక్ సోమవారం తెలిపారు. తెలుగు అధ్యాపకుడు సీహెచ్ సోమేశ్వరరావు, ఏసుదయ, డాక్టర్ కె.హేమలత ఇచ్చిన శిక్షణతో ఆమె ఈ ఘనత సాధించిందన్నారు. విద్యార్థినిని ఎస్‌ఎంసీ ఛైర్మన్, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

తవ్వి వదిలేశారు

మండలంలో బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి గ్రామంలోకి వెళ్లే మార్గంలో పలు చోట్ల రహదారి మరమ్మతులో భాగంగా పది రోజుల క్రితం ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రాళ్లు లేచి ఉండటంతో పాటు కంకర లారీల నుంచి జారి పడుతున్న రాళ్ల కారణంగా ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని బొప్పూడి, రాజాపేట, గోపాళంవారిపాలెం గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యను ఆర్‌అండ్‌బీ ఏఈ సురేష్ దృష్టికి తీసుకెళ్లగా నాలుగు రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

బధిరులకు 7న వైద్య శిబిరం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో ప్రత్తిపాటి ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 7న వినికిడి, మూగ సంబంధిత సమస్యలున్న వారికి ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రమాదం.. చేతికందుతోంది!

శ్రీనివాసనగర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణ శివారున కోడెల శివప్రసాదరావు కాలనీ మొదటి లైన్‌లో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. తక్కువ ఎత్తులో ఉండటమే కాకుండా తీగలు కిందకు వేలాడుతున్నాయి. నియంత్రిక సమీపంలో చిన్నారులు ఆటలాడుతుంటారని, ఎటువంటి ప్రమాదం జరగక ముందే తీగలు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై నరసరావుపేట డీ-2 సెక్షన్ ఏఈ సురేంద్రను అడగ్గా వెంటనే సిబ్బందిని పంపి విద్యుత్తు తీగలు సరిచేయిస్తామన్నారు.

విధులు నిర్వర్తించకుండా నిందలు సరికాదు

పోట్లూరు(శావల్యాపురం), న్యూస్‌టుడే : పంచాయతీ చట్టం ప్రకారం గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించిన ఎంబుక్, తీర్మాన పుస్తకాలు గ్రామ పంచాయతీ కార్యదర్శి వద్దనే ఉండాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. పోట్లూరు పంచాయతీ వ్యవహారంపై శావల్యాపురం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీకి సంబంధించిన రికార్డులు సర్పంచి పోపూరి జ్యోతి వద్దనే ఉన్నాయని తెలిపారు. ఆమె తన విధులు, గ్రామసభలు సక్రమంగా నిర్వహించకుండా మండల స్థాయి అధికారులపై నిందలు మోపడం సరికాదన్నారు. డిప్యూటీ ఎంపీడీవో కె.వివేకానంద మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు ఎవరూ అక్రమంగా డ్రా చేసిన దాఖలాలు లేవన్నారు. సర్పంచి సంతకం ఫోర్జరీ చేసి నిధులు డ్రా చేయలేదని పంచాయతీ కార్యదర్శి ఎం.ఫ్రాన్సిస్ పేర్కొన్నారు.

లాభసాటి సాగుపై దృష్టిపెట్టాలి

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు తమ ఆలోచన ధోరణి మార్చుకుని లాభసాటి పంటలు సాగు చేసుకోవాలని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలో కొనకంచివారిపాలెం, గోగులపాడు గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి రైతులకు కరపత్రాలు అందజేశారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద నిధుల జమపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శివలలిత, ఆయా గ్రామాల పార్టీ నేతలు పాల్గొన్నారు.

సందడిగా మల్లాయపాలెం

కనపర్రు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం కనపర్రు శివారు మల్లాయపాలెం గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రార్థన మందిరానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గుంటూరు మేత్రాసన బిషప్ భాగ్యారావు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో మతగురువులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తిరుమల విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: తిరుమల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అపోలో టైర్స్ సంస్థలో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. ఎన్ఆర్ఐ కళాశాలలో సంస్థ ఎంపికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కళాశాల నుంచి 10 మంది హాజరు కాగా వారిలో ముగ్గురు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

బంగారం అపహరణపై ఫిర్యాదు

గాంధీపేట(చిలకలూరిపేట పట్టణం), న్యూస్‌టుడే: పట్టణంలోని గాంధీపేటలో విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ బి.సుజాత ఇంట్లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. క్లూస్ టీమ్ సోమవారం వచ్చి వేలిముద్రలు సేకరించారు. అనంతరం బీరువాను పరిశీలించిన బాధితురాలు 21 సవర్ల బంగారం, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రమేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవీ ఇవీ

ముగ్గు విషయంలో వివాదం - దాడి

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట పాతూరుకు చెందిన ఆర్.ప్రభులింగాచారి అతని ఇంటి పక్కనున్న కార్తిక్, కుటుంబ సభ్యులకు ఇంటి ముందు ముగ్గు విషయంలో వివాదం చెలరేగింది. దీంతో కార్తిక్ కుటుంబసభ్యులు ప్రభులింగాచారి అతని చెల్లెలిపై దాడికి పాల్పడ్డారు. దీనిపై బాధితుడు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సౌందర్‌రాజన్ తెలిపారు.

బాస్కెట్‌బాల్‌లో సత్తా

నరసరావుపేట క్రీడలు, ముప్పాళ్ల (ఈపూరు), న్యూస్‌టుడే: ఏఎన్‌యూ అంతర కళాశాలల మహిళల బాస్కెట్ బాల్ పోటీల్లో నరసరావుపేటలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానం సాధించిందని ప్రిన్సిపల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన అంతర కళాశాలల మహిళల బాస్కెట్‌బాల్ పోటీల్లో వివిధ డిగ్రీ కళాశాలల జట్లపై విజయాన్ని సాధించి ఈ ఘనత దక్కించుకున్నారని ఆయన చెప్పారు. పోటీల్లో ప్రతిభ చూపిన షేక్ దిల్‌అఫ్రోజ్, చిలకా సింధూర, కుంచాల నందిని ఏఎన్‌యూ జట్టుకు ఎంపికయ్యారని ఆయన వివరించారు.

★ ఈపూరు మండలం ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఐ.తిరుపతమ్మ, ఎస్‌కే నసీమా, పి.మౌనిక, డి.అమూల్య ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయం జట్టులో స్థానం సంపాదించినట్లు ప్రిన్సిపల్ చుండు వెంకటరావు తెలిపారు. వీరంతా ఈనెల 29నుంచి బెంగళూరులోని క్రైస్ట్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటారన్నారు

రెడ్డిపాలెంలో వాలీబాల్ పోటీలు ప్రారంభం

రెడ్డిపాలెం (బొల్లాపల్లి), న్యూస్‌టుడే. మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి మహోత్సవాలు పురస్కరించుకుని నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 16 జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు కాండ్రకుంట ప్రకాష్, ఆర్.సి.ఎం పాఠశాల ఉపాధ్యాయుడు రాజేశ్వరరావు తెలిపారు. క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఫాదర్ జాకబ్‌రెడ్డి తెలిపారు. ఈ గ్రామం నుండి సిస్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సౌజన్య పోటీలను ప్రారంభించారు. సమీప గ్రామాల నుండి క్రీడాభిమానులు వచ్చి చర్చి ప్రాంగణంలో జరుగుతున్న పోటీలను తిలకించారు.

పోటీలు ప్రారంభిస్తున్న సిస్టర్ సౌజన్య

లైంగిక వేధింపులపై మహిళ ఫిర్యాదు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: నగదు విషయంలో తలెత్తిన వివాదంలో ఓ వ్యక్తి తనపై కక్ష పెంచుకుని తన పేరిట సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పంపి లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు ఓ వివాహిత ఎస్పీ కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సత్తెనపల్లిలో తన టైలరింగ్ దుకాణం కింద ఉన్న చంద్రగిరి శ్రీరాముల అనే వ్యక్తి పరిచయం అయ్యాడని, అతని వద్ద కొంత నగదు అప్పుగా తీసుకున్నామన్నారు. ఈ నగదు విషయంలో వివాదం తలెత్తగా పోలీసుస్టేషన్‌లో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అయినా అతను తనపై కక్షతో ఫేస్‌బుక్‌లో తన పేరిట ఖాతా తెరిచి అసభ్యకర ఫొటోలు పెట్టి వేధిస్తున్నట్లు ఆరోపించారు. తాను చేసిన ఫిర్యాదు మేరకు ఎస్పీ కృష్ణారావు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై విఠంరాజుపల్లి పరిధి బాలాజీ ఎస్టేట్ సమీపంలో గుర్తు తెలియని కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా అది రోడ్డు పక్కన కట్టెలు కొట్టుకుంటున్న మహిళకు తగలడంతో ఆమెకు ద్విచక్ర వాహనంపై ఉన్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం వయ్యకంటి శివప్రసాద్ కాలనీలో నివాసం ఉండే ఏలూరు సుబ్బులు రోజూ మాదిరిగా కట్టెలు కొట్టుకుని రిక్షాపై వేస్తుండగా వినుకొండ నుండి నరసరావుపేట వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో అది రోడ్డు దాటి వెళ్లి మహిళను ఢీకొని తిరగబడింది. తీవ్ర గాయాలై ఆమె స్పృహ కోల్పోయింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ప్రకాశం జిల్లా కురిచేడు మండలం గంగవరానికి చెందిన అజయకుమార్, నారాయణకు గాయాలయ్యాయి. వీరిని ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లిపోయింది. బాధితులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం సుబ్బులును నరసరావుపేట తరలించారు. మిగిలిన ఇద్దరు వైద్యశాల నుండి వెళ్లిపోయారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అయిదుగురికి జరిమానా

ఈపూరు: మండలంలో వివిధ ప్రదేశాల్లో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతున్న అయిదుగురిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కె.వేణుగోపాల్ తెలిపారు. నిందితులను సోమవారం వినుకొండ న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి ఒక్కొక్కరికి రూ.10,500 చొప్పున జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

మద్యం కలిగి ఉన్న ఇద్దరు బైండోవర్

ఈపూరు, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం కలిగి ఉన్న మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ఇద్దరిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. కొండ్రముట్ల, అంగలూరు గ్రామాలకు చెందిన ఇద్దరిని తహసీల్దారు నళిని సమక్షంలో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

9 మంది జూదరుల అరెస్టు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలో కావూరు, బొప్పూడి గ్రామాల్లో కోతముక్క ఆడుతున్న 9మంది జూదరులను సోమవారం అరెస్టు చేసినట్లు గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. కావూరు ఎస్సీ కాలనీ వద్ద నలుగురు, బొప్పూడి ఊరి చివర అయిదుగురు పట్టుబడ్డారన్నారు. వారి నుంచి రూ. 7300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు

పది రోజుల వ్యవధిలో రెండోసారి శ్రీగంధం చెట్ల నరికివేత

చెట్టును నరికేశారిలా..

రొంపిచర్ల: మండలంలోని సుబ్బయ్యపాలెంలో ఓ పొలంలో శ్రీ గంధం చెట్లు నరికిన ఘటనపై సాక్షాత్తు జిల్లా ఎస్పీకి రైతు ఫిర్యాదు చేసిన వారం రోజులకే అదే పొలంలో మరోసారి శ్రీ గంధం చెట్లను కొందరు దొంగలు నరుక్కెళ్లారు. వివరాల్లోకెళితే.. గ్రామానికి చెందిన ఇంటూరి చిన వెంకట్రావు, ఇంటూరి ప్రసాద్ అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పక్కన వారికి ఉన్న 7.5 ఎకరాల్లో 12 ఏళ్ల క్రితం ఎర్రచందనం, శ్రీ గంధం మొక్కలు వేశారు. సోమవారం చిన వెంకట్రావు తన పొలానికి వెళ్లగా గతంలో నరికిన మొక్కలకు సమీపంలో కొత్తగా మొక్కలు నరికిన ఆనవాళ్లు కనిపించాయి. సుమారు 20 మొక్కలు నరికి దుంగలు ఎత్తుకెళ్లినట్లు రైతు గుర్తించాడు. వీటి విలువ రూ.లక్షల్లో ఉంటుందని ఆయన పేర్కొన్నాడు. గతనెల 20వ తేదీన ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు దర్యాప్తు చేసి దొంగలను పట్టుకుంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదని రైతు వాపోయాడు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

(c) eenadu

ఈనాడు
పార్వతీపురం మన్యం

మంగళవారం డిసెంబరు 2, 2025

ముట్టొద్దు మాదకద్రవ్యం

జాతీయ రహదారిపై భారీ ర్యాలీ

యాత్రలో సైకిల్ తొక్కుతున్న మంత్రి సంధ్యారాణి, ఎస్పీ మాధవరెడ్డి

సాలూరు, న్యూస్‌టుడే: డ్రగ్స్ రహిత సమాజమే సంక్షేమానికి సంకేతమని మంత్రి సంధ్యారాణి అన్నారు. ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అవగాహన సైకిల్ యాత్ర చేపట్టారు. సీతారామ ధర్మశాలలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో గంజాయి సాగు అరికట్టి, గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, కాఫీ తోటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. డీఎస్పీ రాంబాబు, సీఐలు, ఎస్సైలు, తెదేపా నేతలు, కార్యకర్తలు, కళాశాల, పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం పర్యటన 5న ఖరారు

పార్వతీపురం, భామిని, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 5న జిల్లాలో పర్యటించనున్నారు. పాలకొండ నియోజకవర్గం భామిని ఏపీ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల-జూనియర్ కళాశాలలో జరిగే మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఉండవల్లి నుంచి బయలుదేరి ఆ రోజు ఉదయం 10.30 గంటలకు పాఠశాలకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి కార్యాలయం పర్యటన వివరాలను అంచనా(టెంటెటివ్)గా విడుదల చేసింది. పర్యటన నేపథ్యంలో రాష్ట్ర సమగ్ర శిక్షా కమిషనర్ బి.శ్రీనివాసరావుతో కలిసి ఆదర్శ పాఠశాలలోని తరగతి గదులు, ప్రాంగణాన్ని కలెక్టర్ ప్రభాకరరెడ్డి సోమవారం పరిశీలించారు. ఆ రోజు తరగతుల నిర్వహణ, ఫొటో ఎగ్జిబిషన్ తదితరాలపై శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం సీఎంవో కార్యాలయం అధికారులు వచ్చి పరిశీలించారు.

హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జలజల.. గలగల

సాగునీటి ప్రాజెక్టులకు సర్కారు ప్రాధాన్యం

ఈనాడు, విజయనగరం

వ్యవసాయానికి ఊపిరిపోసే నీటి పారుదల రంగాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. ఉమ్మడి జిల్లాలో అన్నదాతలకు కన్నీరు మిగిల్చింది. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాధాన్యతా క్రమంలో తక్షణం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి రామానాయుడు, జలవనరుల శాఖ అధికారులతో అమరావతిలో సమావేశమయ్యారు. నివేదికలు పరిశీలించి ఉమ్మడి జిల్లాలోని నాలుగు ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చారు. పనులు పరుగులు పెట్టించాలని అధికారులను ఆదేశించారు.

తారకరామ

సాగు, తాగునీటికి ఉభయతారకంగా విజయనగరం జిల్లాలో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 16,538 ఎకరాల నూతన ఆయకట్టుతో పాటు 8,172 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఈ ప్రాజెక్టు లక్ష్యం. 44.40 శాతం పనులు పూర్తయ్యాయి. మూడు గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తే ప్రధాన అడ్డంకి తొలగుతుంది. సుమారు రూ.800 కోట్లలో కొంతైనా వస్తే జూన్ 2027 నాటికి ప్రాజెక్ట్ పూర్తవుతుందని అధికారులు విన్నవించారు.

తారకరామ తీర్థసాగర్ కాలువ నిర్మాణ పనులు

జంఝావతి

అంతర్రాష్ట్ర వివాదంలో చిక్కుకున్న జంఝావతి ప్రాజెక్టు పంట కాల్వల పనులు పూర్తికి రూ.59 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాలి. తమ భూభాగానికి ముంపు వాటిల్లుతుందని ఒడిశా ప్రభుత్వం మోకాలడ్డింది. ప్రస్తుతం తొమ్మిది వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్నారు. మిగిలిన పనులకు రూ.59 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపారు. నిధులిస్తే జూన్ 2027 నాటికి పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు.

తోటపల్లి

ఉమ్మడి జిల్లాలో తోటపల్లి ప్రాజెక్టు ప్రధానమైంది. మూడు జిల్లాల్లో 1,31,221 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 64 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా పనులు ప్రారంభించి 85 శాతం పూర్తిచేశారు. మిగిలిన 15 శాతం పూర్తికి రూ.290 కోట్లు అవసరం. నిర్వాసితులకు రూ.120 కోట్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు రూ.170 కోట్లు ఇస్తే ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు నివేదించారు.

రూ.32 కోట్లు కోరాం

ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. కనీస నిర్వహణ పనులకు రూ.32 కోట్లు అవసరమని కోరాం. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులిచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇందుకు ఒక కార్యాచరణ రూపొందించనున్నారు. త్వరలో దీనికి ఒక రూపు వస్తుందని ఆశిస్తున్నాం.

- స్వర్ణకుమార్, ఎస్ఈ, జలవనరుల శాఖ

నదుల అనుసంధానానికి..

తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా నాగావళి నది నుంచి చంపావతి నదికి నీటిని మళ్లించే అనుసంధానం నిధులు రాక నిలిచిపోయింది. ఇది పూర్తయితే విజయనగర వాసుల తాగునీటి అవసరాలు తీరుతాయి. గడిగెడ్డ జలాశయం కింద 2,950 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతుంది. ప్రభుత్వం రూ.24.80 కోట్లకు ఆమోదించింది. ఇప్పటివరకు రూ.3.27 కోట్లతో 19.32 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన నిధులిస్తే వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు నివేదించారు.

ఆపత్కాలంలో ఆపన్న హస్తం

● ముఖ్యమంత్రి సహాయనిధి

న్యూస్‌టుడే - రాజాం

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలను ఆపత్కాలంలో ఆదుకుంటోంది. ప్రమాదాలు, అనారోగ్య సమస్యల బారినపడి ఆసుపత్రి పాలై దిక్కుతోచని స్థితిలో ఉంటే చేయూతనిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో వేల మంది పేద, మధ్యతరగతి ప్రజలు లబ్ధిపొందారు. ఒక్క రాజాం నియోజకవర్గంలోనే 149 మందికి రూ.1.60 కోట్లు సమకూరాయి. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే ధ్రువపత్రాలు కీలకం. వీటన్నింటినీ సమీకరించి, దరఖాస్తు చేసుకుంటే సులువుగా సీఎం సహాయనిధి లబ్ధి పొందొచ్చు.

ఇవీ అవసరమైన పత్రాలు

- తేదీ, స్టాంపుతో సహా ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు ధ్రువీకరణ
- ఆదాయ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు
- రోగ నిర్ధారణ రిపోర్టులు, ఎక్స్‌రే, స్కాన్ వంటివి
- వైద్యుని సంతకం, స్టాంపుతో డిశ్చార్జి వివరాలు
- బ్యాంకు ఖాతా నకలు

వీరు అర్హులు..

ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని వినియోగించుకోకుండా ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. ఆసుపత్రిలో చేరి సొంతంగా నగదు వెచ్చించిన వారిని పరిగణనలోకి తీసుకుంటారు. ఎమ్మెల్యేల కార్యాలయాలతో పాటు వార్డు, గ్రామ సచివాలయాల్లోనూ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. ఏ ఆసుపత్రిలో చికిత్స పొందారు.. మందులకు ఎంత ఖర్చు చేశారు.. చరవాణి సంఖ్య ఇలా వివరాలన్నీ సిఫార్సుతో వీలైనంత వేగంగా లబ్ధి చేకూరి అందుతుంది.

మాస్టార్లు ఎప్పుడొస్తారు?

జేఎన్‌టీయూ గురజాడలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయాన్ని బోధకుల కొరత వేధిస్తోంది. ఇక్కడ నియమితులైన వారిలో 15 మంది విభజనకు ముందు జేఎన్‌టీయూ కాకినాడ, నరసారావుపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లి, తర్వాత ఐచ్ఛికం ఇచ్చి అక్కడే ఉండిపోయారు. వారంతా వెనక్కివస్తే కాని కొరత తీరే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఒప్పంద, అవర్లీ బేస్డ్ వారితో బోధన సాగిస్తున్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతోంది.

శాసన మండలిలో ప్రస్తావన

డిప్యుటేషన్‌పై వెళ్లిన వారిని వెనక్కి పంపించాలని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం అధికారులు గతంలో ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రజాప్రతినిధులకు వినతులు అందజేశారు. నాటి ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ సమస్యను అప్పట్లో మండలిలో ప్రస్తావించారు. ఎవరు ఎక్కడ వారన్న దానిపై స్పష్టత వస్తే కాని భవిష్యత్తులో నియామకాలు, పదోన్నతులు కష్టమని అధికారులు పేర్కొంటున్నారు. సమస్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం ఉప కులపతి వి.వి.సుబ్బారావు తెలిపారు.

బోధకుల విషయమై జేఎన్‌టీయూ కాకినాడ, గురజాడ మధ్య నాలుగేళ్లుగా వివాదం నలుగుతోంది. ఎవరెక్కడ? అన్నదానిపై స్పష్టత కొరవడడమే దీనికి కారణంగా పేర్కొంటున్నారు. తాజాగా ఈ విషయమై గవర్నర్ దృష్టికి వెళ్లడంతో ఫ్యాకల్టీ అంతర్గత పదోన్నతులకు సంబంధించిన కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) తాత్కాలికంగా నిలిపివేయడంతో విషయం తెరపైకి వచ్చింది.



ఇదీ ప్రస్తుత పరిస్థితి

★ ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం యూజీ, పీజీ ప్రోగ్రాంలకు వందమంది అధ్యాపకులు ఉండాలి. ప్రస్తుతం యూజీలో 72 మందికి 27 మంది రెగ్యులర్ అధ్యాపకులున్నారు. మిగిలిన వారంతా ఒప్పంద విధానంలో ఉన్న వారే. పీజీలో 28 మందికి అందరూ ఒప్పంద విధానంలోనే పనిచేస్తున్నారు.

★ యూజీ సివిల్ బ్రాంచిలో అసలు రెగ్యులర్ ఫ్యాకల్టీయే లేరు. ఈసీఈ మినహా మిగిలిన విభాగాలకు ఇద్దరు ముగ్గురే రెగ్యులర్ వారున్నారు.

★ అధ్యాపకుల కొరతతో న్యాక్, ఎన్‌బీఏ గుర్తింపునకు వర్సిటీ దూరమవుతోంది.

★ ప్రాంగణ నియామకాలు ఒకప్పటి కంటే తగ్గుముఖం పట్టాయి. 2021-22లో 265, 2022-23లో 174, 2023-24లో 120, 2024-25 64 మందికి అవకాశాలు లభించాయి.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో విశ్వవిద్యాలయానికి చోటు లభించని పరిస్థితి ఉంది.

★ గతంలో మెకానికల్, ఈసీఈ, సీఎస్సీ బ్రాంచిలకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్) గుర్తింపు ఉండేది. ఇప్పుడది ఈసీఈ, సీఎస్సీ బ్రాంచిలకే పరిమితమైంది.

కల్లాల్లో రాశులు.. కళ్లల్లో ఆందోళన

రైతు గుండెల్లో దిత్వా గుబులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఆరుగాల కష్టం ధాన్యలక్ష్మి రూపంలో ఇంటికి చేరుకుంటుందని మురిసిపోతున్న సమయంలో అకాల వర్షం రైతుకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. ఆదివారం రాత్రి నుంచి జిల్లాలో వర్షంతో అన్నదాత గుండెల్లో గుబులు మొదలైంది.

జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఖరీఫ్ పంట ఇంకా పొలాల్లోనే ఉంది. కొన్నిచోట్ల రైతులు వరి కోత కోసి, ఉంచారు. ఆదివారం రాత్రి వర్షానికి అదంతా తడిసిపోయింది. సోమవారం కూడా వర్షం కొనసాగింది. మంగళవారం ఎండ ఎక్కకపోతే తడిసిన ధాన్యంతో కుస్తీలు పట్టాల్సిన పరిస్థితులు తలెత్తుతాయని, రంగుమారి మొలకలు వస్తాయని ఆవేదన చెందుతున్నారు.

★ ఒక్క పార్వతీపురం మండలంలో 6,500 హెక్టార్లలో వరి సాగు కాగా 80 శాతం కోతలు జరిగాయి. అందులో 20 శాతం మాత్రమే కుప్పలుగా వేశారు. మిగిలిన పంట పొలాల్లోనే ఉంది.

★ కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, బలిజిపేట తదితర ప్రాంతాల్లో ధాన్యం బస్తాలకు నింపి, పొలాలు, కల్లాల్లో ఉంచారు. తడవకుండా టార్పాలిన్లు కప్పారు. అయినా బస్తాల కిందకి చెమ్మచేరితే ధాన్యం తడిసిపోతాయి. దీన్ని తీసుకోవడానికి మిల్లర్లు అంగీకరించరు. అదనంగా ఇవ్వాలని డిమాండు చేస్తారని ఆందోళన చెందుతున్నారు.

మూడు వేల టార్పాలిన్లు సిద్ధం

జిల్లాకు వాతావరణ హెచ్చరికలు లేవు. కానీ వర్షం పడుతోంది. ధాన్యం తడవకుండా అన్నదాతలకు ఇచ్చేందుకు రైతు సేవా కేంద్రాల్లో మూడు వేల వరకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాం. వాటిని వినియోగించుకోవచ్చు. సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

- ఆర్.అన్నపూర్ణ, జిల్లా వ్యవసాయాధికారిణి

జంఝావతి కూడలిలో ధాన్యాన్ని భద్రపరుస్తున్న రైతు

ఎన్నిక ఏకగ్రీవం

నూతన కార్యవర్గం సభ్యులు

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు తాలూకా ఎన్జీవో సంఘ ఎన్నిక ఏకగ్రీవమైంది. సోమవారం స్థానిక ప్రైవేటు భవనంలో నామినేషన్ల ప్రక్రియ నిర్వహించారు. అధ్యక్షురాలిగా బి.పద్మలత, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.నాగేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎం.చంద్రశేఖర్, షేక్ అబ్దుల్ ఫిరోజ్, టి.రాము, జె. వికాస్, షేక్ వహీదా, కార్యదర్శులుగా కె.శ్రీనివాసరావు, బీటీవీ రమణమూర్తి, కోశాధికారిగా సతీష్‌కుమార్‌తోపాటు మరికొందరిని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు జి.సూర్యనారాయణ, దుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కిషోర్, కన్వీనర్ రంగాచారి, ఎ.సురేష్, మాజీ అధ్యక్షుడు ప్రవీణ్ అభినందించారు.

విమానాశ్రయంలో త్వరితగతిన మౌలిక వసతులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన రహదారులు, కాలువలు, విద్యుత్తు తదితర మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులకు సోమవారం సూచించారు. నీటిని అందించేందుకు రూ.20 కోట్లతో చేపట్టిన పనులు, రూ.85 లక్షలతో ఏర్పాటు చేయనున్న విద్యుత్తు లైన్ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షంనీరు మళ్లించేందుకు నాలుగు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయాల్సిన కాలువలకు నీటి పారుదల అధికారులు అంచనాలు రూపొందించాలన్నారు.

POLYCAB LT/HT Power & Control Cables
Stockist:
SPARK ENTERPRISES
DABAGARDENS, VISAKHAPATNAM.
CELL: 9963223454, 9849022345
e-mail: spa_ark2004@yahoo.com

రైతేరాజు 6లో

దివ్యాంగులకు నేడు క్రీడా పోటీలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పారా ఒలింపిక్స్ అసోసియేషన్ సౌజన్యంతో 13-20 ఏళ్లలోపు దివ్యాంగ పిల్లలకు మంగళవారం జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో రాజ్‌కుమార్, ఏపీసీ తేజేశ్వరరావు, సహిత విద్య కో-ఆర్డినేటర్ భానుమూర్తి తెలిపారు. నర్సిపురం ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలు జరుగుతాయని, నడవలేని వారి కోసం ప్రధాన రోడ్డు నుంచి మైదానం వరకు ఆటో సౌకర్యం కల్పిస్తామన్నారు. సహాయకులు, తల్లిదండ్రులకు రవాణా ఛార్జీలు చెల్లిస్తామన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతూ 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగ విద్యార్థులు అర్హులని చెప్పారు.

ఇంకెన్నాళ్లు చేస్తారు కసరత్తు!

జిల్లాలో అందుబాటులోకి రాని ఓపెన్ జిమ్‌లు

న్యూస్‌టుడే-సాలూరు, పార్వతీపురం పురపాలిక, పాలకొండ

మారుతున్న జీవనశైలితో ప్రజలు మధుమేహం, రక్తపోటు, ఊబకాయం తదితర సమస్యలతో సతమతమవుతున్నారు. వీటన్నింటికీ ఉపశమనం కలిగించేది శారీరక శ్రమ ఒక్కటేనన్న వైద్యుల సూచనలతో ఉదయపు నడక బాట పడుతున్నారు. పలు నగరాలు, పట్టణాల్లో ఓపెన్ జిమ్‌లు వేలాది మందికి ఉపయుక్తంగా మారుతున్నాయి. మన జిల్లాలో మాత్రం పురపాలికలు, నగర పంచాయతీల్లో ఓపెన్ జిమ్‌లు పూర్తిస్థాయిలో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏర్పాటు చేసిన అరకొర జిమ్‌ల నిర్వహణ గాలికొదిలేశారు.

◆ పట్టణం: సాలూరు
❑ జనాభా: 50వేలు
✪ జిమ్ ఉన్న ప్రాంతాలు: అసలు లేవు
✦ ప్రతిపాదనల్లో ఉన్నవి: రామా కాలనీ, శ్రీనివాసకాలనీ పార్కులు
● అవసరమైన ప్రాంతాలు: డిగ్రీ కళాశాల మైదానం, గాంధీపార్కు
✸ అధికారిమాట: ఇప్పటికే ప్రతిపాదించిన పార్కులో పరికరాలు ఏర్పాటుకు చర్యలు చేపడతామని పుర కమిషనర్ టీటీ రత్నకుమార్ తెలిపారు.

◆ పార్వతీపురం | ❑ 60 వేలు | ✪ అసలు లేవు
✦ ఎస్ఎన్ఎం నగర్ పార్కు | ● ప్రధాన పార్కులు, డిగ్రీ కళాశాల
✸ ఎస్ఎన్ఎం నగర్‌లో ఓపెన్ జిమ్‌కు ప్రతిపాదనలు చేశాం. మిగిలిన ప్రాంతాలను కూడా పరిశీలనలోకి తీసుకుంటామని డీఈ జి.శ్రీనివాసరాజు తెలిపారు.

సాలూరులో మూలకు చేరిన వ్యాయామ పరికరాలు

జిల్లాలోని పట్టణాల్లో ఓపెన్ జిమ్ పరికరాల ఏర్పాటు ప్రక్రియ ప్రతిపాదనకే పరిమితం అయింది. 2019లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నాటి తెదేపా ప్రభుత్వం పట్టణాలకు రూ.లక్షలు విలువ చేసే వ్యాయామ పరికరాలను సరఫరా చేసింది. వైకాపా హయాంలో వీటిని పట్టించుకున్న ఊసేలేదు. ఆరేళ్లు గడిచినా సాలూరు, పార్వతీపురం పురపాలికల్లో ఇప్పటివరకు పరికరాలు అమర్చలేదు.

◆ పాలకొండ | ❑ 35వేలు
✪ వెంకటరాయుడు కోనేరు గట్టు
✦ ఏమీ లేవు
● కల్యాణి కోనేరుగట్టు, డిగ్రీ కళాశాల మైదానం
✸ పాలకవర్గం సూచన మేరకు నగర పంచాయతీలో అవసరమైన చోట ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తామని కమిషనర్ రత్నరాజు చెప్పారు.

WANTED
Required Experienced Marketing Executives for **Marketing Pesticides, Micro Nutrients and Bio Stimulants** to work for Sovereign Agro Insecticides, having 48 year's experience in Manufacturing and Marketing Agri Inputs.
Candidates with at least 10 years' experience in the same area can apply through WhatsApp for these following Districts.
ELURU, VIZIANAGARAM, VISAKHAPATNAM, SRIKAKULAM, NELLORE, PRAKASAM, BAPATLA, CHITTOR AND KADAPA Districts.
SOVEREIGN AGRO INSECTICIDES
6/13, Brodipet, GUNTUR. Mobile: 86397 49674

రక్షణ పరికరాలొచ్చాయ్..

పరికరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

కలెక్టరేట్ ప్రాంగణం: అగ్నిమాపక శాఖ, విపత్తుల నిర్వహణ అధికారులు ప్రకృతి వైపరీత్యాల సమయంలో రక్షణ చర్యలు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి సూచించారు. జిల్లాకు సరఫరా అయిన లైఫ్ జాకెట్లు, హెల్మెట్లు, రెయిన్ కోట్స్ తదితర సుమారు 330 రక్షణ పరికరాలను సోమవారం పరిశీలించి, మాట్లాడారు. విపత్తుల శాఖ సామర్థ్యాన్ని మరింత పెంపొందించుకోవాలన్నారు. గ్రామస్థాయిలో వాలంటీర్లను ఏర్పాటు చేసుకుని, శిక్షణ ఇవ్వాలని సూచించారు.

5న మెగా పేరెంట్-టీచర్ సమావేశం

పార్వతీపురం: మెగా పేరెంట్-టీచర్ సమావేశం ఈనెల 5న నిర్వహించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి పాఠశాల కమిటీ సభ్యులతోపాటు పూర్వ విద్యార్థులు హాజరు కావాలని కోరారు. విద్యార్థుల నడవడి, అలవాట్లు, చదువు ఎలా సాగుతోంది? వంటి విషయాలు చర్చిస్తారని, మెరుగ్గా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను ఉపాధ్యాయులు సూచిస్తారని పేర్కొన్నారు.

చిన్నా.. దారితప్పొద్దు..!

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

జిల్లాలో ఇటీవల ఇటువంటి ఘటనలు ఎక్కువవుతున్నాయి. విద్యార్థుల్లో కొందరు చదువుపై దృష్టిసారించడం లేదు. ఈరోజు కళాశాలలో ఏం చెప్పారు? విషయాలు ఏమిటి.. అని ఇంటి దగ్గర అడిగేవారు తగ్గిపోతున్నారు. కొందరు.. మావాడు ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నికల్, ఇంజినీరింగ్ అంటూ గొప్పలకు పోవడం తప్ప.. గాడి తప్పితే పట్టించుకునే దాఖలాలు లేవు.

వసతి గృహాల్లో చాలాచోట్ల పర్యవేక్షణ కరవవుతోంది. జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. సంరక్షకులు ఉన్నచోటా పిల్లల ప్రవర్తన చూసీచూడనట్లు వెళ్లిపోతున్నారు. ఎక్కడైనా.. ఎప్పుడైనా ఉపాధ్యాయులు, వార్డెన్ విద్యార్థిని మందలిస్తే తిరిగి ఫిర్యాదులు చేసేవారూ లేకపోలేదు. దీంతో బాలల భవిత ఎలా ఉంటే మాకేంటనే ధోరణిలో పలువురు వార్డెన్లు మిన్నకుంటున్నారు.

★ పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాల స్వాగతోత్సవాల్లో విద్యార్థుల మధ్య ఘర్షణ చివరకు కొట్లాటకు దారితీసింది.

★ తాజాగా కొమరాడ మండలం పెదఖేర్జల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సెల్‌ఫోన్ విషయమై సీనియర్ విద్యార్థులు జూనియర్లను విచక్షణారహితంగా కొట్టారు. చంపేస్తారేమో అనే భయంతో ఆ ఇద్దరు విద్యార్థులు రాత్రిపూట కాలినడకన పదుల కిలోమీటర్లు నడిచి ఇళ్లకు చేరుకున్నారు.

★ కొన్నాళ్ల క్రితం ఓ ప్రైవేట్ స్కూల్ వీడ్కోలు కార్యక్రమంలో పదోతరగతి విద్యార్థి మద్యం తాగి గలాటా సృష్టించాడు. యాజమాన్యం విద్యార్థిని బతిమలాడి ఇంటికి పంపించింది.

సగం మంది కూడా లేరు..

జిల్లాలో ఎస్సీ, బీసీ, ఎస్టీ వసతి గృహాలు 116 వరకు ఉన్నాయి. 28 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రధానంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వార్డెన్ల కొరత వేధిస్తోంది. సుమారు 65 పాఠశాలలుండగా సగం మంది కూడా సంరక్షకులు లేరు. దీంతో విద్యార్థులపై పర్యవేక్షణ ఉండడం లేదు.

వీపుపై తీవ్ర గాయాలతో విద్యార్థులు(పాతచిత్రం)

తల్లిదండ్రులు బాధ్యత చూపాలి...

పిల్లలు సక్రమ మార్గంలో నడవాలంటే తల్లిదండ్రులు బాధ్యత వహించాలి. వారి నడవడిక, ఇతర అంశాలపై దృష్టిపెట్టాలి. ఎంత బిజీగా ఉన్నా.. కొంత సమయం పిల్లలతో గడపాలి. మంచి చెడులు వివరించాలి. చెడు వైపు వెళ్తే ఎదురయ్యే పర్యవసానాలు తెలియజేస్తే ఫలితం ఉంటుంది.

- రష్మిత, మానసిక వైద్య నిపుణురాలు

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
లీగల్ ప్రకటనలు
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు,
వేడుక ఏదైనా.. ఈనాడును చేసుకోండి వేదిక
జి.ఎస్.టి. 5% అదనం
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9000866020, 8008597609

(c) eenadu

ఎంఎస్ఎంఈ పార్కు పనులకు గ్రహణం

న్యూస్‌టుడే- బొబ్బిలి, రామభద్రపురం

పార్కుకు కేటాయించిన భూములు

రామభద్రపురం మండలం కొట్టక్కి సమీపంలో కాకర్లవలస- కారేడువలస మధ్య ఎంఎస్ఎంఈ పార్కు పనులకు గ్రహణం వీడడంలేదు. ఇక్కడ ఏపీఐఐసీకి 187 ఎకరాల స్థలం ఉంది. దీంట్లో 87 ఎకరాల్లో పార్కు ఏర్పాటుకు ఈ ఏడాది మే 10న మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బేబినాయన భూమి పూజ చేశారు. రూ.7 కోట్లతో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ భూములపై వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. కొంత మంది రైతులు తమకు ఈ భూముల్లో పట్టాలు ఇచ్చారని అభ్యంతరం తెలుపుతున్నారు. ఆరు నెలలు గడిచినా ఒక్క అడుగూ ముందుకెళ్లలేదు.

కొలిక్కిరాని చర్చలు

అధికారులు ఆందోళనకారుల మధ్య ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో చర్చలు జరిగాయి. కాకర్లవలస- కారేడువలసకు చెందిన 20 మంది రైతులకు 2017లో అటవీశాఖ పోడు పట్టాలు ఇచ్చినట్లు చూపుతున్నారు. ఏపీఐఐసీ కూడా పార్కు కోసం ఆయా భూములను కొనుగోలు చేసినట్లు దస్త్రాల్లో ఉంది. రైతుల పట్టాలు ఒక చోట ఉన్నాయని, కానీ ఏపీఐఐసీ భూముల్లో సాగుచేశారని అధికారులు నిర్ధారించారు. పట్టాల్లోని భూమిని చదునుచేసి రైతులకు ఇస్తామని భరోసా ఇచ్చారు. అయినప్పటికీ గిరిజనులు వినిపించుకోలేదు. దీంతో వివాదం తేలలేదు. అధికారులు కొనుగోలు చేసిన నాటి నుంచి భూములకు సరైన రక్షణ చర్యలు చేపట్టలేదు. కంచె ఏర్పాటు చేసి బోర్డులు ఏర్పాటు చేస్తే ఈ సమస్య వచ్చేది కాదు. ఇప్పుడు పార్కు పనులు ప్రారంభమయ్యాక అసలు సమస్య మొదలైంది.

మాట్లాడుతున్నాం..

ఏపీఐఐసీ భూముల్లోనే పార్కు నిర్మాణం జరుగుతోంది. గిరిజనులకు ఇచ్చిన పట్టాలకు సంబంధించిన భూములను అప్పగిస్తామని చెప్పాం. అప్పటికీ వినకపోతే కేసులు పెడతాం. సంబంధిత లబ్ధిదారులకు న్యాయం చేస్తాం. ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రభుత్వ పరంగా చేపట్టే పనులు అడ్డుకోవడం చట్టరీత్యా నేరం. - **రఫీ జాన్ ఆజు, తహసీల్దారు, రామభద్రపురం**

అవగాహనతోనే ఎయిడ్స్ అంతం

ర్యాలీలో కలెక్టర్ ప్రభాకరరెడ్డి, అధికారులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల్లో అవగాహన పెంచితే ఎయిడ్స్ భూతాన్ని అంతం చేయొచ్చని కలెక్టరు ప్రభాకరరెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆర్సీఎం పాఠశాల వద్ద జెండా ఊపి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం అండగా ఉందని, ఏఆర్టీ కేంద్రాల్లో మందులు, పింఛను, ఇతర సంక్షేమ పథకాలు సక్రమంగా అందిస్తున్నట్లు వివరించారు. ఎయిడ్స్ రహిత జిల్లా నిర్మాణానికి అంతా కృషి చేయాలని కోరారు. అనంతరం కళాశాల ఆడిటోరియంలో జరిగిన సదస్సులో ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేస్తున్న వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అధికారులు మధ్యాహ్నం హెచ్ఐవీ బాధితులతో సహపంక్తి భోజనం చేశారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు, డీసీహెచ్ఎస్ జి.నాగభూషణరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎం.వినోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు విజయ్‌మోహన్, జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మ్యుటేషన్ దరఖాస్తులపై విచారణకు ఆదేశం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: తిరస్కరణకు గురైన మ్యుటేషన్ దరఖాస్తులపై విచారణ చేపట్టాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆర్డీవోలకు ఆదేశించారు. ఎక్కువగా ఫిర్యాదులొస్తున్న వీటిపై మండల ప్రత్యేకాధికారులు శ్రద్ధ వహించాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ వినతులపై అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ అంశాలపై ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలు అవగాహన పెంచుకోవాలని, మ్యుటేషన్ల కోసం పత్రాలు అప్‌లోడ్ చేయడంలో డిజిటల్ సహాయకులకు వారంపాటు శిక్షణ ఇవ్వాలన్నారు.

దారి చూపండి సారూ..

గుమ్మలక్ష్మీపురం మండలం దేరుగండకు రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి సన్యాసిరావు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే డోలీలే దిక్కవుతున్నాయని, సరకులు తీసుకెళ్లేందుకు కష్టాలేనన్నారు. - న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

168 మందికి ప్రత్యేక వైద్య సేవలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. దీన్ని కలెక్టర్ ప్రభాకరరెడ్డి ప్రారంభించారు. కలెక్టరు కార్యాలయం, ఐటీడీఏ, జిల్లా కార్యాలయాల సిబ్బంది 168 మందికి శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు చేసినట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి జి.నాగభూషణరావు తెలిపారు.

తక్షణమే పరిశీలించి.. వారంలో పరిష్కరించండి

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, ఏడు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. మొత్తం 24 ఫిర్యాదులు రాగా భూ తగాదాలు 9, కుటుంబ కలహాలు 4, నగదు వ్యవహారాలు 2, ఇతర అంశాలకు సంబంధించినవి తొమ్మిది ఉన్నాయన్నారు. ఫిర్యాదుదారుని అంశాలను పరిశీలించి, విచారణతో వాస్తవాలను గుర్తించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. నివేదికను జిల్లా కార్యాలయానికి పంపాలని సూచించారు. ఏఎస్పీ పి.సౌమ్యలత, డీసీఆర్బీ సీఐ కె.కుమారస్వామి, ఎస్బీసీఐలు లీలారావు, అంబేడ్కర్, ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు చట్టాలపై అవగాహన అవసరం

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: దివ్యాంగుల చట్టం-2016, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నియమాలు-2023 తెలుగు, ఆంగ్ల పుస్తకాన్ని సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ విజువల్లీ చాలెంజ్డ్ ఉద్యోగుల సంఘం ప్రచురించిన ఈ పుస్తకం ద్వారా విభిన్న ప్రతిభావంతులకు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులశాఖ అధికారి ఎస్.ఈశ్వరరావు, వీసీహెచ్ఈ సంఘ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

పంట నిల్వల్లో జాగ్రత్తలు తప్పనిసరి!

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పంట ఉత్పత్తులు నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల వేల టన్నుల్లో ఆహార ధాన్యాలు నష్టపోతున్నట్లు కురుపాం మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. దీని వల్ల రైతులు ఆదాయం కోల్పోతున్నారని వివరించారు. వరి, మొక్కజొన్న, జొన్న, కందులు, వేరుశనగ, మిర్చి, అపరాలు తదితర ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసి వినియోగించుకునే వరకు వివిధ స్థాయిల్లో క్రిమి, కీటకాల వల్ల నష్టంతో పాటు వృథాగా కోల్పోతున్నట్లు పేర్కొన్నారు. పండించిన ఆహార ధాన్యాల నిల్వలో సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు.

గృహాల్లో: పంట కోశాక ధాన్యాన్ని ఎండలో బాగా(వరిలో 11-14 శాతం, అపరాల్లో పది శాతం, నూనె గింజల్లో 7-8 శాతం తేమ ఉండేలా) ఆరబెట్టి నిల్వ ఉంచితే పురుగు పట్టకుండా ఆరు నుంచి పన్నెండు నెలల వరకు కాపాడవచ్చు. ధాన్యంలో వేపాకు, వేప గింజల పొడి, నూరిన వెల్లుల్లి, ఉసిరికాయ గింజలు, సీతాఫలం గింజలపొడి కలపడం ద్వారా ఆరు నుంచి ఎనిమిది నెలల వరకు పురుగు ద్వారా నష్టం జరగకుండా కాపాడవచ్చు. ఇవే కాకుండా కసవింద, ఉత్తరేణి, మిరప, నేల ఉమ్మెత్త, కీసర ఆకులు నాలుగు శాతం వాడితే ధాన్యాన్ని మూడు నెలలు పురుగు పట్టకుండా ఉంచవచ్చు.

గోదాముల్లో: నూర్పిడి చేసే యంత్రాలు ఉపయోగించే వాహనాలను వాడే ముందే శుభ్రపరచుకోవాలి. పాత గోనె సంచులు నిల్వ చేయటానికి ఉపయోగించే ముందు వాటికి చిరుగులు లేకుండా చేసి మలాథియాన్ 50 ఇ.సి. 2 మి.లీ/లీ. నీటికి కలిపిన ద్రావణంలో పది నిమిషాలు ముంచి ఆరబెట్టాలి. నిల్వ చేసే గోదాములను ముందుగా శుభ్రం చేసి పైకప్పు గోడలు, నేలలో పగుళ్లు, రంధ్రాలు లేకుండా సిమెంట్‌తో పూడ్చివేయాలి. నేలపై గోడలకు, పైకప్పు, గోనె సంచులపై మలాథియాన్ 50 ఇ.సి. పది మి.లీ. లేదా డైక్లోరోపాస్ 76 శాతం ఎస్.సి 7 మి.లీ. లేదా డెల్టామెత్రిన్ 2.5 డబ్ల్యూ.పి. 40 గ్రా./లీ. నీటికి కలిపి వంద చదరపు మీటర్ల ప్రాంతానికి మూడు లీటర్ల చొప్పున పిచికారీ చేసుకోవాలి. ధాన్యం బస్తాల్లో తేమ చేరకుండా ఉండటానికి చెక్క దిమ్మెలపై వాటిని అమర్చాలి. గోదాముల్లో పక్క గోడలు, పైకప్పునకు తగలకుండా బస్తాలు ఉంచాలి. ధాన్యంలో పురుగు ఆశిస్తే గాదెల్లో, పాత్రల్లో, గోదాముల్లో 50 శాతం అల్యూమినియం ఫాస్ఫైడ్ బిళ్లల ద్వారా ఊదర బెట్టి పురుగులు నివారించాలి. గోదాములు ఊదరబెట్టటానికి 28 ఘనపు మీటర్లకు 3 గ్రాముల బిళ్లలు 21 అవసరమవుతాయి.

రైతేరాజు

ఇలా చేస్తే మిరపలో లాభాలే..!

సకాలంలో తెగుళ్లను గుర్తించి.. నివారిస్తే మిరపలో లాభాలు పొందొచ్చని **ఉద్యాన అధికారిణి సీహెచ్ గిరిజ** సూచించారు. మిరపలో ఎండు తెగులు గుర్తించిన వెంటనే లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు కలిపిన ద్రావణాన్ని మొక్క మొదళ్లలో పిచికారీ చేయాలి. మూడు, నాలుగు రోజుల తర్వాత 5 గ్రాములు కార్బండిజమ్+మాంకోజెబ్ కలిపిన పొడి మందు మొదళ్లలో వేయాలి. నల్ల తామర పురుగులు ఉంటే ఆకర్షించడానికి పసుపు, నీలం జిగురు అట్టలను ఎకరాకు 25-35 ఏర్పాటు చేసుకోవాలి. జీవ శిలీంధ్రాలైన వర్టిసీలియా లకానీ 5 మి.లీ+ వేపనూనె 3 మి.లీ. కలిపి ఒకటి లేదా రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

మీరూ పుట్టగొడుగు పెంచొచ్చు..



న్యూస్‌టుడే, రేగిడి

యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పుట్టగొడుగుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంటు ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) ద్వారా యూనిట్లకు రాయితీ ఇస్తున్నాయి.

- యువత లేదా రైతులు 200 స్కేర్ మీటర్ల స్థలం కలిగి ఉండాలి. పెంపకానికి అనువుగా షెడ్డు వేసుకోవాలి. యూనిట్ ఖరీదు రూ.2 లక్షలు. 50 శాతం రాయితీ ప్రభుత్వం కల్పిస్తుంది. ఒక వ్యక్తి అయిదు యూనిట్ల వరకు ఏర్పాటు చేసుకోవచ్చు.
- పెద్ద యూనిట్ల ఏర్పాటుకూ అవకాశం ఉంది. ఇందులో పుట్టగొడుగుల విత్తనం తయారీ యూనిట్ కూడా పెట్టుకోవచ్చు. ప్రైవేటు వ్యక్తులైతే 40 శాతం, కేవీకే.. ఇతర ప్రభుత్వ సంస్థలకైతే 100 శాతం రాయితీ కల్పిస్తారు. కంపోస్టు యూనిట్ ఏర్పాటుకు యూనిట్ విలువ రూ.30 లక్షలు. దీనికి 40 శాతం రాయితీ ఉంటుంది.
- రూ.2 లక్షల యూనిట్‌కు బ్యాంకు రుణం అవసరం లేదు. ఉద్యాన వన శాఖ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఔత్సాహికులకు సలహాలు, సూచనలు అందజేస్తామని ఉద్యానశాఖ అధికారిణి ఉమామహేశ్వరి చెప్పారు.

ముందస్తు చర్యలతో అధిక దిగుబడులు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: జీడి, మామిడి తోటల్లో ఎండుకొమ్మలు తొలగించి ముందస్తుగా సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడల నుంచి రక్షణ పొంది అధిక దిగుబడులు వస్తాయని రస్తాకుంటుబాయి **కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు** తెలిపారు. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

? : మామిడిలో ప్రస్తుతం ఎలాంటి చర్యలు చేపట్టాలి? - **శ్రీనివాసరావు, బొండపల్లి**

☛: ప్రస్తుతం మామిడిలో ఎండుకొమ్మలను తొలగించి తోటను శుభ్రం చేయాలి. పలుచగా దుక్కి వేసుకుని, లీటరు నీటికి బ్లైటాక్ 3 గ్రాముల సల్ఫర్ వెడబుల్ 2 గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. లీటరు నీటికి మల్టీకే (పొటాషియం నైట్రేట్) 10 గ్రా. ఫార్ములా-7నే సూక్ష్మపోషకాలు ఉండే పొడి 5 గ్రా. వేస్తే పూత నిలుస్తుంది.

? : మొక్కజొన్నలో పాముపొడ తెగులు నివారణ ఎలా? - **ఆదినారాయణ, నెల్లిమర్ల**

☛: ఈ తెగులు రైజోక్టోనియా సొలాని అనే శిలీంధ్రం ద్వారా వస్తుంది. దీని నివారణకు నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన ఆకులను తీసివేయాలి. 200 లీటర్ల నీటిలో 200 గ్రా. కార్బెండజమ్ లేదా 200 మి.లీ. ప్రొపికొనజోల్ మందును కలిపి పిచికారీ చేయాలి.

? : జీడిమామిడి తోటల్లో కొన్ని చెట్ల ఆకులు పండుబారి రాలుతున్నాయి. కొమ్మలు ఎండి చనిపోతున్నాయి. నివారణ ఎలా? - **పి.పత్తి, దురిబిలి**

☛: ఇది కాండం వేరు పురుగు ఆశించడం వల్ల జరుగుతోంది. ప్రారంభ దశలోనే ఈ పురుగు లక్షణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. ఏడేళ్లు, ఆపై వయసు గల చెట్లు కాండం మొదలు అనగా 3 అడుగుల ఎత్తు వరకు భూమిపై కనబడే వేర్లను సన్నని ఇనుప వైరుతో చేసిన బ్రష్‌తో బాగా రుద్దాలి. ఆ తరువాత లీటరు నీటికి 50 మి.లీ. వేపనూనె, 0.5 గ్రా. సర్ఫ్ లేదా సబ్బు పొడి కలిపి ఏడాదికి 3 సార్లు పిచికారీ చేయాలి. ఈ పురుగు ఆశించిన చెట్ల నుంచి బంక కారుతుంది. గమనించిన వెంటనే బెరడు చెక్కి కింద దాగి ఉన్న లద్దె పురుగులను తొలగించాలి. అక్కడ లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 10 మి.లీ. కలిపి వేయాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

వరి కోతలు అనంతరం ఎలాంటి పంటలు వేయొచ్చు. రబీలో అపరాలు, వరి సాగులో సస్యరక్షణ చర్యలపై సలహాల కోసం 63034 02627 నంబరును సంప్రదించాలని రస్తాకుంటుబాయి కేవీకే సస్యపోషణ విభాగం శాస్త్రవేత్త డా.ఎస్.స్రవంతి తెలిపారు.

EENADU Classifieds

HEALTH & CARE

NEURO

నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్

మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు

Dr.Nirmala Vangapandu M.D.(Gen.Med) DM (Neuro) JIPMER Specialist in Brain & Nerve Problems & General Physician

R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టీప్లెక్స్ వెనుక వైపు,VZM FOR APPOINTMENT : 63054 71147

REAL ESTATE

FLAT FOR SALE

2BHK Flats (1300sft) for sale at 100ft ring road, Surya Nagar, beside Bashyam school, VZM. Con: 9849516146, 9908835262.

విజయనగరం సూర్య హాస్పటల్ సింహాద్రినగర్ దగ్గర MNR రెసిడెన్సీలో కార్‌పార్కింగ్‌తో 1000 Sft, 2BHK ఫ్లాట్ అమ్మకం. ✆ 8248738470.

PREMIUM FLATS FOR SALE



WWW.SATYABUILDERS.COM Site Address: CTO OFFICE LANE, NEAR RTC COMPLEX, VIZIANAGARAM 9346445777 9959812354

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

PLOT FOR SALE

CMR Layout 267 Sq. yards for sale. South facing near to Vizag Road, VZM. C: 8497961518, 8639817088.

200 చ॥గ॥ S/F "శ్రీకృష్ణ నగర్ లే-అవుట్" JNTU జంక్షన్, VZM. 267 చ.గ. N/F "భాస్కర్ నగర్" తాటిగూడ గ్రామం, గరివిడి అమ్మబడును. ✆ 8802889988, 9542031332.

విజయనగరం ప్రజయ్ విహార్, వి.టి.నగర్ R&B జంక్షన్ వద్ద అన్ని ఫేస్‌లలో ఉన్న స్థలములు అమ్మబడును. బ్యాంక్ లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 9618119380.

శ్రీ శ్రీనివాస రిసార్ట్స్ మరుపల్లి, గజపతినగరంలో 1000 గ॥, 500 గ॥, 200 గ॥ అమ్మకమునకు కలవు. గజం 4000/- ✆ 8179213275.

TO LET

To-let 3BHK Indp. House G/F, Carparking, Hajiali Nagar, Nr. Venkateswara Kalyana Mandapam, Phoolbagh Jn., VZM. ✆ 9849559024.

JOBS

Walk-In-Interview Employment for Retired Employees. In view of New Year 2026 and Pongal we invite Retired Employees to our Branches Vizag. Both Govt/ Private and Eligible for Salary + Perks from Rs. 1,50,000 to 2,00,000 P.M. T&C Apply. Interviews: 2nd Dec- 2025. Chandra Sekhar. ✆ 8142580999.

Wanted PROs & Telecallers (Reputed College, Vizag) PROs Required: Vijayanagaram (Local/ Non-Local) All Areas & Gajuwaka (Vizag) Telecallers Required: Visakhapatnam- Local. Work Location: NAD, Gajuwaka Salary: Negotiable. Contact: 9640205759, 8328684222 For Telecallers: 8886465396/ 7702222927.

Wanted Sr. Marketing Team Leader/ Manager for a reputed Wholesale Furniture Factory in Vizag. 2 Wheeler Mandatory. Marketing Experience must. Salary 20,000/- to 25,000/- +TA +Incentives. Contact: ✆ 8096806969.

విజయనగరం సమీపంలో గల ఆటోమొబైల్ అనుబంధ సంస్థలో పనిచేయుటకు విజయనగరం టౌన్ పరిసర ప్రాంతాలవారు సంప్ర : 9502266999.

విజయనగరంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా 3 వెంచర్లు మార్కెటింగ్ చేయుటకు ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు అనుభవం ఉన్న మార్కెటింగ్ లీడర్లు, యువతీ యువకులు, టెలికాలర్లు, కార్ డ్రైవర్, అకౌంటెంట్ కావలెను. ✆ 8688796746.

హైదరాబాద్ / గుంటూరులోని CCTV కంపెనీకి ఫ్రెషర్స్ కావలెను, శాలరీ: 14000/-. ✆ 9731567105, 9731722666.

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్, All (డిగ్రీ, B.Tech, Dip. & ITI) కావలెను. Sal: 18-25K Age: 35లోపు, స్పాట్ జాయిన్. ✆ 7995439539.

టోల్‌గేట్ వద్ద పనిచేయుటకు సూపర్‌వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, హెల్పర్స్, సెక్యూరిటీ, ఫైర్ & సేఫ్టీ కావలెను. Qlf: 10th- డిగ్రీ, ITI, Dip, B.Tech. జీతం: 18K-28K. ✆ 9121044796, 9573635594

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రోడ్డుపై మడుగు.. వేసేదెలా అడుగు

రాజాం పట్టణంలోని పాతబస్టాండ్‌లోని రోడ్డు దుస్థితి ఇది. కాలువల వ్యవస్థ లేకపోవడం, రహదారి లోతట్టుగా ఉండడంతో చిన్న వర్షం పడినా నీరు నిలిచి మడుగును తలపిస్తోంది. సకాలంలో తొలగించక రోజుల తరబడి అపరిశుభ్రత నెలకొంటోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే చిరు వ్యాపారులు కూరగాయలు విక్రయిస్తుండడంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. సమస్యను పురపాలిక కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రాజాం

నైతిక విలువలతో వ్యక్తిత్వ వికాసం

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

గీతాజయంతి సందర్భంగా సోమవారం నగరంలోని కోట సమీపంలో మూడుకోవెళ్ల ఆవరణలో సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. వాగ్దేవి సమారాధనం అధ్యక్షులు డాక్టర్ స్వప్నహైందవి, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 200 మంది పాల్గొని పారాయణం చేశారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా స్వప్నహైందవి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచడానికి, వ్యక్తిత్వ వికాసానికి ఇది దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎరుకునాయుడు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కంటోన్మెంట్

బస్టాండు.. సమస్యలు మెండు

పెరిగిన రద్దీ.. కానరాని సౌకర్యాలు

అపరిశుభ్రంగా మారిన పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు

పాలకొండ, గ్రామీణం, సాలూరు, కొమరాడ, న్యూస్‌టుడే: నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఆర్టీసీ కాంప్లెక్సుల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయడంతో రద్దీ మరింత పెరిగింది. కానీ ఆ స్థాయిలో సౌకర్యాలు కల్పించక ప్రయాణికులు ఆపసోపాలు పడుతున్నారు.

పాలకొండలో పాట్లే..

పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్సు ఖాళీ కొబ్బరిబొండాలు, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. విశాల ప్రాంగణం ఉండడంతో సమీపంలోని దుకాణదారులు, కాలనీవాసులు చెత్తను వేస్తున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. సరిపడా మరుగుదొడ్లు కూడా లేవు. ప్రస్తుతం స్త్రీ, పురుషులకు ఒక్కొక్కటి చొప్పున రెండే ఉన్నాయి. పదేళ్ల కిందట స్వచ్ఛ భారత్‌లో భాగంగా నిర్మించిన మరో రెండు నిరుపయోగంగా మారాయి. తాగునీరు అందుబాటులో లేదు. నిత్యం ఇక్కడి నుంచి 20 వేల మందికి పైగా రాకపోకలు చేస్తుంటారు. శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నంతో పాటు విజయవాడ, హైదరాబాద్‌కు పెద్ద సంఖ్యలో ఈ డిపో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

వినియోగంలో లేని మరుగుదొడ్లు

శుద్ధజలం కరవు..

అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అవసరం మేర మరుగుదొడ్లు లేవు. శుద్ధజలం అందుబాటులో లేదు. పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. నిత్యం 25 వేల మందికిపైగా రాకపోకలు చేస్తుంటారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. అధికారులు సౌకర్యాలపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

వర్షం వస్తే అవస్థలే..

పార్వతీపురం కాంప్లెక్స్‌లో వర్షమొస్తే నీరు నిలిచిపోతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం కావడంతో నిత్యం రద్దీగా ఉంటున్నా ఆ స్థాయిలో చర్యల్లేవు. మరుగుదొడ్లు చాలడం లేదు. నిత్యం 20 వేలకు పైగానే రాకపోకలు సాగిస్తున్నారు.

దృష్టిసారిస్తాం

ఇప్పటికే పార్వతీపురం కాంప్లెక్సులో పంకాలు, బెంచీలు ఏర్పాటు చేశాం. జిల్లాలోని మూడు కాంప్లెక్సుల్లో మరుగుదొడ్ల నిర్వహణ పెంచాం. అదనపు సిబ్బంది పని చేసేలా గుత్తేదారుకు ఆదేశించాం. సౌకర్యాల మెరుగుకు చర్యలు తీసుకుంటాం. - పి.వెంకటేశ్వరరావు, ప్రజా రవాణాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

జిల్లాలో మొత్తం బస్సులు: 262 ప్రయాణించే దూరం: 92 వేల కి.మీ. రోజూ ఆదాయం: రూ.45 లక్షలు ప్రయాణించేవారి సంఖ్య: 75 వేలు

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80081 11237

జూదరుల అరెస్టు

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస పోలీసుస్టేషన్ పరిధిలోని కుమ్మరబంజరు ప్రాంతంలో జూదమాడుతున్న ముగ్గురి వద్ద నుంచి రూ.24,400 , రెండు ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు సీఐ సీహెచ్.షణ్ముఖరావు సోమవారం తెలిపారు.

కరాటేలో సత్తా.. కొత్తవలస: గాజువాకలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ 2.0లో 50 కిలోల విభాగంలో వియ్యంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.మోహన్ ప్రకాష్ మొదటి స్థానం సాధించినట్లు హెచ్ఎం గోవిందరాజు సోమవారం తెలిపారు. శిక్షకుడు రాజాబాబు అభినందించారు.

ఖోఖో పోటీలకు ఎంపిక.. విశాఖపట్నం: జిల్లాకు చెందిన కె.పావని జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన జట్టులో స్థానం దక్కించుకుంది. పరవాడ మండలం లంకెలపాలెంలో జరిగిన ఎస్జీఎఫ్ పోటీల్లో ప్రతిభ చూపినవారిని జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ పరిశీలకులు వెల్లడించారు.

క్లస్టర్ అభివృద్ధిలో రైతుకు చేయూత

డెంకాడ, న్యూస్‌టుడే: మామిడి సాగులో శాస్త్రీయ పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి కె.చిట్టిబాబు అన్నారు. మండలంలోని అమకాంలో సోమవారం మామిడి తోటల యాజమాన్యంలో పోషకాల ప్రణాళిక, నీటి నిర్వహణ, పుష్పదశ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఈ విధానంతో పంట దిగుబడి, నాణ్యత పెరుగుతుందన్నారు. ప్రభుత్వం క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ద్వారా మామిడి రైతులకు చేయూతనిచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. శాస్త్రవేత్త శ్రీనివాసరాజు మాట్లాడుతూ మామిడి తోటల్లో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భోగాపురం ఉద్యానాధికారిణి ఉమా భరణి, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	132	234	244

'ఏమ్మా.. పింఛను అందుతోందా..'

వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

విజయనగరం గ్రామీణం, మయూరి కూడలి, న్యూస్‌టుడే: 'ఏమ్మా.. పింఛను సొమ్ము సకాలంలో అందుతోందా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా..?' అంటూ కలెక్టర్ ఎస్.రాంసుందరరెడ్డి వృద్ధులను ఆప్యాయంగా పలకరించి నగదు అందజేశారు. సోమవారం ఆయన మండలంలోని ద్వారపూడి గ్రామంలో పర్యటించి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నగరపాలకసంస్థ, పురపాలక సంఘాలు, పంచాయతీల్లో ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వృద్ధులు, దివ్యాంగులు, పింఛను అందుకుంటున్న వారిని గౌరవించాలన్నారు. ఆయన వెంట డీపీవో మల్లికార్జునరావు, సర్పంచి ఆదిలక్ష్మి, ఉపసర్పంచి శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

- విజయనగరం జిల్లాలో 2,72,499 మంది లబ్ధిదారులకు గానూ 2,56,771 మందికి (94.23 శాతం) పింఛన్లు పంపిణీ చేశారు. ఇందుకు రూ.115.66 కోట్లు విడుదల కాగా, రూ.108.67 కోట్లు ఇచ్చారు. రాష్ట్రంలో జిల్లా అయిదో స్థానంలో ఉంది.
- పార్వతీపురం మన్యం జిల్లాలో 1,39,593 లబ్ధిదారులకు గానూ 1,28,847 మందికి (92.03 శాతం) అందజేశారు. ఇందుకు రూ.59.49 కోట్లు విడుదల కాగా, రూ.54.66 కోట్లు పంపిణీ చేసినట్లు రెండు జిల్లాల డీఆర్డీఏ పీడీలు శ్రీనివాస్ పాణి, సుధారాణి తెలిపారు.

పోటీలో నిలిచి.. బహుమతులు గెలిచి

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థులపై చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్వతీపురం పట్టణంలోని శ్రీకృష్ణ పాఠశాలలో ఎం.లాస్య(10వ తరగతి) ప్రథమ స్థానంలో నిలవగా.. 8వ తరగతి విద్యార్థులు వి.నిహారిక, జె.శ్రీహారిక ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ప్రిన్సిపల్ గణేష్, ఉపాధ్యాయులు విద్యాసాగర్, దివాకర్, నాగరాజు ప్రశంసా పత్రాలు అందజేశారు. సాలూరు పట్టణంలోని భాష్యం హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో టి.శాంతికుమారి (7వ తరగతి) ప్రథమ, మహమ్మద్ ఇజ్మా (9వ తరగతి) ద్వితీయ, పి.పవ్యశ్రీ (9వ తరగతి) తృతీయ స్థానాలు సాధించారు. ప్రిన్సిపల్ సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు బహుమతులు అందించి అభినందించారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం, బెలగాం, సాలూరు

సాలూరు భాష్యం పాఠశాలలో ప్రసంగిస్తున్న బాలిక

సాలూరు: విజేతలకు ప్రశంసా పత్రాలు అందించిన ప్రిన్సిపల్ సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు

పార్వతీపురం శ్రీకృష్ణ పాఠశాలలో విజేతలకు బహుమతుల అందజేత

రోడ్డు నిర్మించండి.. నష్ట పరిహారం ఇవ్వండి

పార్వతీపురం, సీతంపేట, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్‌కు ఒకే సమస్యతో రెండోసారి ఎవరూ రాకూడదని, అర్జీలు పునఃపరిశీలన మాట లేకుండా అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో భాగంగా సోమవారం డీఆర్వో హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, ఉపకలెక్టర్లు ధర్మచంద్రారెడ్డి, దిలీప్‌చక్రవర్తితో కలిసి 69 వినతులు స్వీకరించారు.

సీతంపేటలో సమస్యలు వింటున్న పరిపాలనాధికారి సునీల్, డిప్యూటీ డీఈవో రామ్మోహనరావు

★ నాగావళి నదిలో నావ నడిపేందుకు వీలుగా అనుమతులు ఇవ్వాలని కోటవానివలస గ్రామానికి చెందిన గిరిజన యువకులు కోరారు.

★ గతంలో తోటపల్లి జలాశయంలో పడవలు నడిపి నిర్వాసిత గ్రామాల యువకులు ఉపాధి పొందేవారని, దాన్ని పునఃప్రారంభించాలని పలువురు వినతులు అందించారు.

★ సాలూరు మండలం కొత్తవలస గ్రామ పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామానికి చెందిన మహిళలు వినతిపత్రం అందించారు.

★ మక్కువ మండలంలోని బిరమాసి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని, ఏళ్లుగా అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు కోరారు.

మక్కువ మండలంలోని తూరుమామిడి గ్రామంలో ఆశా కార్యకర్తపై దాడిచేసిన ఆరోగ్య కార్యకర్తపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు.

★ తోటపల్లి జలాశయం ముంపునకు ముందు కోటవానివలస ప్రత్యేక పంచాయతీగా ఉండేదని, ఆ తర్వాత అడ్డాపుశీల పంచాయతీలోని స్థలంలో పునరావాసం కల్పించి.. దాని పరిధిలో కలిపారని ఆ గ్రామస్థులు తెలిపారు. తమను ప్రత్యేకంగా గుర్తించి, కోటవానివలస పంచాయతీని ఏర్పాటు చేయాలని కోరారు.

★ వీటితోపాటుగా 31 భూ సమస్యలు రెవెన్యూ క్లినిక్కులో నమోదయ్యాయి.

ఐటీడీఏకు 27 వినతులు

సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో పరిపాలనాధికారి సునీల్, డిప్యూటీ డీఈవో జి.రామ్మోహనరావు ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. 27 వినతులు అందాయి. కిల్లాడకు చెందిన ఆనందరావు ఫొటో స్టూడియోకు రుణం కోసం, కొంజరగూడకు చెందిన లలిత గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని, బిల్లగూడకు చెందిన అప్పన్న మొంథా తుపానుకు నష్టపోయిన పంటకు పరిహారమివ్వాలని, ఇతర సమస్యలపై పలువురు అర్జీలు అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి, డీఈ నాగభూషణరావు, ఏఈలు సత్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

?: అప్పయ్యపేటలో కొండ గెడ్డ ప్రవహిస్తోంది. కాలనీ వైపు రక్షణ గోడ నిర్మించాలి. – **రామారావు, స్థానికుడు** ❖ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. – **ప్రసాద్, ఎంపీడీవో – న్యూస్‌టుడే, సీతానగరం**

?: నర్సిపురం చిన్నవీధి రామమందిరం వద్ద విద్యుత్తు స్తంభం షాక్ కొడుతోంది. – **మురళీ, చిన్నవీధి** ❖ క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. – **రామారావు, ఏఈ, ట్రాన్స్‌కో** – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

?: రస్తా కుంటుబాయి నుంచి నీలకంఠాపురం వెళ్లే దారిలో ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగి, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. – **రామకృష్ణ, స్థానికుడు** ❖ తుప్పలు తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. – **సుశీల, జేఈ, ర.భ.శాఖ** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

పూడిక తొలగింపు

స్పందనకు వందనం

మక్కువ: కోన గ్రామ ఆంజనేయస్వామి ఆలయ సమీప కాలువలో పూడిక పేరుకుపోయి మురుగు నిలిచిపోయింది. దీనిపై 'ఈనాడు' 'మేమున్నాం..'లో వచ్చిన వార్తకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ పూడిక తొలగించి, మురుగు పారేలా చర్యలు చేపట్టారు.

నిత్యావసరాల పంపిణీ

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలోని దివ్యాంగులకు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ నిత్యావసరాలు పంపిణీ చేశారు. హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు దీర్ఘకాలిక పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ మంత్రి సంధ్యారాణికి సోమవారం వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు.

ఖజానా నిండుకుంది.. వేతనం అందకుంది

పూట గడవక సిబ్బంది పాట్లు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ నగర పంచాయతీ ఖజానా నిండుకుంది. కనీసం సిబ్బందికి వేతనాలు అందించలేని దుస్థితి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతేనే జీతాలు అందుతున్నాయి. ఆర్థిక వనరులపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు.

బోరు మరమ్మతులు చేస్తున్న ప్రజారోగ్య నీటి సరఫరా విభాగం సిబ్బంది

ఇదీ దుస్థితి..

నగర పంచాయతీలో పొరుగు సేవల విభాగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, విద్యుత్తు, ఆరోగ్య, నీటి సరఫరా విభాగంలో 89 మంది కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందలేదు. సుమారు రూ.44 లక్షలు బకాయి ఉంది. ఏటా ఆస్తి పన్ను, స్టాంప్‌డ్యూటీ కింద సమకూరుతున్న ఆదాయం రూ.2.50 కోట్లు నుంచే వీరికి ఇచ్చేవారు. గత 30 నెలలుగా స్టాంప్ డ్యూటీ నిధులు సక్రమంగా విడుదల కావడంలేదు. పట్టణ ఖాళీ స్థలాలపై పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయడం లేదు. వాణిజ్య ప్రకటన ఆదాయం అంతంతే. 142 దుకాణాల ద్వారా అత్తెసరు రాబడి సమకూరుతోంది. ట్రేడ్ లైసెన్సుల ద్వారా పూర్తిస్థాయిలో అందడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల ద్వారా రూ.70 లక్షల వరకు ఆస్తిపన్ను రావాల్సి ఉన్నా ఆ స్థాయిలో వసూలు కావడం లేదు.

పన్నులు చెల్లించక..

సిబ్బందికి వేతనాలు సైతం అందించలేని పరిస్థితి ఏర్పడడంతో కమిషనర్, సిబ్బంది ఆస్తి పన్నుల వసూళ్లకు తిరుగుతున్నారు. భారీగా ఆస్తిపన్నులు బకాయిలు ఉన్న యజమానుల వద్దకు వెళ్లి పరిస్థితి వివరిస్తున్నారు. మరోపక్క వేతనాలు అందక పూట గడవడం కష్టంగా మారిందని, తప్పని పరిస్థితుల్లో అప్పులు చేసి వడ్డీలు కట్టుకోవాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు.

ఆదాయంపై దృష్టి పెట్టాం

ఆదాయం పెంచేందుకు దృష్టి సారిస్తాం. ప్రస్తుతం ఆస్తి పన్ను బకాయిల వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల కాకపోవడంతో రెండు నెలలుగా సిబ్బందికి వేతనాలు అందజేయలేదు. – రత్నరాజ్, కమిషనర్, పాలకొండ

దారి దారుణం.. రాకపోకలు కష్టం

సాలూరు మండలం మరిపల్లి పంచాయతీ గంగన్నదొరవలసలోని ప్రధాన రహదారిలో అంగన్‌వాడీ ఎదుట పరిస్థితి ఇది. గ్రామంలో కాలువల నిర్మాణం జరగకపోవడంతో వాడుక, వర్షం, మురుగు నీరు ఇలా రహదారిపైకి వస్తోంది. మట్టి రోడ్డు కావడంతో గోతులు ఏర్పడి బురదమయంగా మారుతోంది. వర్షాల సమయంలో సమస్య తీవ్రంగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. కాలువల నిర్మాణానికి ప్రతిపాదించామని పంచాయతీ కార్యదర్శి వేణు తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

అసంపూర్తి భవనాలు.. అద్దింట్లో అవస్థలు

పాచిపెంట మండలం మాతుమూరులో సచివాలయ, రైతు సేవా కేంద్రాల భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.58.94 లక్షలతో పనులు చేపట్టారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా గుత్తేదారు మధ్యలోనే వదిలేశారు. దీంతో మూడేళ్లుగా అసంపూర్తిగా పడి ఉన్నాయి. మరోపక్క అద్దె భవనంలో ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతున్నారు. పీఆర్ జేఈ ఫరూక్ మాట్లాడుతూ.. నిధులున్నాయని, ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేపడతామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

చెత్త తెచ్చి.. దారిలో పడేసి..

కురుపాం మండలం మొండెంఖల్లు గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. పారిశుద్ధ్య సిబ్బంది రాకపోవడంతో కాలనీవాసులు ఇలా చెత్తను రోడ్డు పక్కన పోస్తున్నారు. అవి గాలికి ఎగిరి పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. వర్షం పడితే దుర్వాసన వస్తోందని పీహెచ్‌సీ రోగులు, విద్యార్థులు వాపోతున్నారు. చెత్త తొలగిస్తామని సర్పంచి గౌరీశంకరరావు చెప్పారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

మొరాయించినా.. పట్టించుకోరే!

వంతరాం పంచాయతీ కొండాపురం గ్రామంలో తాగునీటి కష్టాలు తీర్చేందుకు 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సోలార్ పథకం పనిచేయడంలేదు. దీంతో ఏడాదిగా గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామని తాగునీటి సరఫరా విభాగం జేఈ పవన్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

పేదింటి పెద్దన్న చంద్రన్న

సాలూరు, గుమ్మలక్ష్మీపురం, సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రతి పేదింటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలను అందిస్తూ పెద్దన్నగా ఆదుకుంటున్నారని గిరిజన శాఖ మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. సోమవారం సాలూరు పట్టణంలోని వివిధ వార్డుల్లో పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక ఎన్నికల్లో తెదేపాను గెలిపించాలని కోరారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు బిల్లె కె. చంద్రశేఖర్, కమిషనర్ రత్నకుమార్, వార్డు ఇన్‌ఛార్జి బాల తదితరులు పాల్గొన్నారు. ❖ గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండలో ప్రభుత్వ విప్ టి.జగదీశ్వరి పింఛన్లు పంపిణీ చేశారు. ఏఎంసీ ఛైర్మన్ కళావతి, ఎంపీడీవో లక్ష్మి, సర్పంచి జగ్గారావు, నాయకులు ఉన్నారు. ❖ సీతానగరం మండలం సూరంపేటలో కలెక్టరు ఎన్.ప్రభాకరరెడ్డి పింఛను పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దారు ప్రసన్నకుమార్ ఉన్నారు. ❖ మండల విద్యాశాఖ నుంచి ఎవరూ హాజరు కాకపోవడంతో ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ❖ బలిజిపేట మండలం వంతరాంలో ఎమ్మెల్యే బి.విజయచంద్ర, పార్వతీపురం మండలం నర్సిపురంలో మార్కెట్ యార్డు ఛైర్‌ జి.గౌరి పింఛన్లు అందించారు. నాయకులు ఉన్నారు.

సాలూరులో లబ్ధిదారుకు పింఛను అందిస్తున్న మంత్రి సంధ్యారాణి

పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న విప్ జగదీశ్వరి

సౌకర్యాల కల్పనకు చర్యలు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్ టి.జగదీశ్వరి తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో రూ.2.75 కోట్లతో అదనపు భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఏఎంసీ ఛైర్మన్ కళావతి, తెదేపా మండల కన్వీనర్ నరేష్, ఎస్టీ కమిషన్ సభ్యుడు మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు. ❖ కురుపాం మండలం గుమ్మగదబవలస గ్రామంలో రూ.23 లక్షలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి జగదీశ్వరి శంకుస్థాపన చేశారు.

గుళావల్లి దత్తత తీసుకుంటా: విజయచంద్ర

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట మండలంలో వెనుకబడి ఉన్న గుళావల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బి.విజయచంద్ర పేర్కొన్నారు. గ్రామంలో సోమవారం మధ్యాహ్నం తెదేపా కార్యాలయాన్ని ప్రారంభించి, మాట్లాడారు. తెదేపా మండల అధ్యక్షుడు పి.వేణుగోపాలనాయుడు, నాయకులు పాల్గొన్నారు. ❖ పార్వతీపురం పట్టణం: పార్వతీపురం రైతు బజారు సమీపంలోని యందు వంశీ సామాజిక భవనంలో విద్యాగణపతి సమేత, రాజ్యలక్ష్మీ సహిత రాధాకృష్ణ మందిరంలో గీతా జయంతి వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే విజయచంద్ర పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారానికే సచివాలయ వ్యవస్థ

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారని, ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే జయకృష్ణ చెప్పారు. ఆయన దేవనాపురంలో సోమవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గత ప్రభుత్వంలో పింఛను నిలిపేశారని, పునరుద్ధరించాలని వృద్ధురాలు పారమ్మ కోరగా, సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. తెదేపా సమన్వయకర్త పవన్, ఎంపీడీవో మిశ్ర, ఎస్.తోటముఖలింగం, బి.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

టమాటా పంట ధ్వంసం

కొమరాడ, న్యూస్‌టుడే: కళ్లికోటలో అడవి ఏనుగులు హల్‌చల్ చేశాయి. సోమవారం టమాటా సాగు ధ్వంసం చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'రైతు భరోసా' రాలేదు సార్..

కలెక్టరేట్ వద్ద అట్టలి గ్రామ మహిళలు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: తమకు 'రైతు భరోసా' నగదు అందించాలని పాలకొండ మండలం అట్టలి గ్రామానికి చెందిన మహిళలు విన్నవించారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. రీసర్వేలో తలెత్తిన సమస్యల కారణంగా లబ్ధి చేకూరలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని, సమస్య పరిష్కరించాలని కోరారు.

కంచె తొలగించాలి: బలిజిపేట మండలం పలగర రెవెన్యూ కాలనీలోని గ్రామ కంఠం భూమిలో కొంతమంది ఇనుప కంచె వేశారని, దాన్ని తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు డిమాండు చేశారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ప్రజా అవసరాలకు వినియోగించే స్థలాన్ని కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు రెడ్డి వేణు తదితరులు ఉన్నారు.

అర్హులకు పదోన్నతులు కల్పించాలి

పాలకొండ, న్యూస్‌టుడే: ఆర్టీసీలో అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి కోరారు. పాలకొండ డిపో వద్ద సోమవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. స్త్రీశక్తి పథకానికి సంబంధించి అదనపు బస్సులు ఏర్పాటు చేసి, సిబ్బందిని పెంచాలన్నారు.

అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో ప్రతిభ

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం సరస్వతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.సాత్విక్, కె.నిషిత రెండు రోజులుగా విశాఖపట్నంలో జరుగుతున్న అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో అండర్-10 విభాగంలో ప్రతిభ కనబరిచి రజత పతకాలు అందుకున్నారని కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ కె.శ్రీరామ్మూర్తినాయుడు, శిక్షకుడు నరేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

శతశాతం ఫలితాలకు కృషి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: పదో తరగతిలో విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏటీడబ్ల్యూవో చంద్రబాబు అన్నారు. సోమవారం వనజ, జియ్యమ్మవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హెచ్ఎం ఎ.రవిప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

అక్రమాలను అడ్డుకోవాలని వినతి

బలిజిపేట, గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్న మిల్లర్ల అక్రమాల నుంచి రైతులను కాపాడాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కోరారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఉప తహసీల్దారు శ్రీనివాసరావు, ఏవో శివగణేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రతి రైతు నుంచి 40 కిలోలకు బదులు 42 తీసుకుంటున్నారని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.సత్యనారాయణ చెప్పారు. రైతులు సింహాద్రినాయుడు, పాపినాయుడు, రమణ, ఫైల ప్రసాద్, శేఖరు ఉన్నారు.

బాధిత మహిళకు అండగా నిలవాలి

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: సాలూరులో ఒక ప్రజాప్రతినిధి సహచరుడు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారిని వదిలి. . సదరు మహిళను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రుల చుట్టూ తిప్పుతున్నారని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శ్రీదేవి, బి.లక్ష్మి మండిపడ్డారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరులతో మాట్లాడారు. తక్షణమే తప్పుచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. సభ్యులు ఉన్నారు.

మితిమీరిన వేగం తగదు

జియ్యమ్మవలస: చోదకులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై ప్రశాంత్‌కుమార్ అన్నారు. శిఖబడి కూడలి సమీపంలో వాహన తనిఖీలు, చోదకులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. మితిమీరిన వేగం పనికిరాదన్నారు. హెచ్‌సీ మోహనరావు, సిబ్బంది ఉన్నారు.

సీరపాణికి సత్కారం

పాలకొండ గ్రామీణం: పాలకొండకు చెందిన అభ్యుదయ రచయిత సీరపాణిని విజయనగరానికి చెందిన గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు సోమవారం ఘనంగా సత్కరించారు. తెలుగు సాహిత్యంలో ఆయన చేస్తున్న సేవలకు ఈ గుర్తింపు లభించిందన్నారు.

కల్యాణం.. కమనీయం

పాలకొండ నక్కలపేటలోని సకలదేవతా ఆలయ వార్షికోత్సవం, మార్గశిర ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి శివ పార్వతులు, సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

భక్తిశ్రద్ధలతో రుద్రయాగం

సాలూరు పట్టణంలోని పంచముఖేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రుద్రయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి వెంకటరమణ శర్మ ఈ పూజలు చేశారు. స్వామివారికి దర్బారు సేవ, నీరాజన మంత్రపుష్పం, సహస్ర కలశాభిషేకం జరిపారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు

వేణుగోపాల.. పూజలందుకో

బలిజిపేట, న్యూస్‌టుడే: గీతా జయంతి సందర్భంగా చిలకలపల్లి వేణుగోపాలస్వామిని అర్చకులు వివిధ రకాల పుష్పాలు, తులసీదళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి మూలవిరాట్‌కు తొలుత పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు గీతాపారాయణ పఠనం, ప్రత్యేక పూజలు చేశారు.

సబ్ కోర్టు ఏర్పాటు చేయండి

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరులో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కు సాలూరు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు టి.జగన్నాథరావు, న్యాయవాదులు సోమవారం వినతిపత్రం అందజేశారు. విజయనగరంలో ఆయనను కలిసి సమస్య విన్నవించారు.

రూ.లక్షలు వ్యయం.. నిరుపయోగం

మరమ్మతులకు గురైన వాహనం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య విభాగానికి కాంపాక్టర్ వాహనాలు ఎంతో అవసరం. సుమారు రూ.15 లక్షలు విలువైన ఈ వాహనం నాలుగు ట్రాక్టర్లతో తరలించే మూడు టన్నుల వ్యర్థాలు హైడ్రాలిక్ విధానంలో లోడ్ చేసుకుంటుంది. ప్రధాన కూడళ్ల వద్ద సేకరించిన చెత్తని పారిశుద్ధ్య సిబ్బంది ఇందులోనే డంపింగ్‌యార్డుకి తరలిస్తారు. జిల్లా కేంద్రంలో ఇవి పనిచేయక ఇబ్బందులు తప్పడం లేదు.

బయటే పడేస్తున్నారు..

పార్వతీపురం పురపాలక సంఘానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మంజూరు చేసిన రెండు కాంపాక్టర్ వాహనాలు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. ఏడాది కిందట వీటి మరమ్మతులకు రూ.1.50 లక్షలు ఖర్చు చేశారు. మళ్లీ కొన్నాళ్లకే పాడైపోయాయి. ఆపై బాగు చేయలేదు. దీంతో కార్మికులు తిప్పలు పడుతున్నారు. వ్యర్థాలను యార్డులోకి ట్రాక్టర్లతో తీసుకెళ్లడం కష్టం మారింది. వర్షాకాలంలో చిన్న వాహనాలు బురదలో దిగిపోతున్నాయని బయట పడేస్తున్నారు. వాహనాలను బాగు చేయించి, వినియోగంలోకి తీసుకువస్తామని కమిషనరు జి.శ్రీనివాసరాజు అన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కురుపాం సీహెచ్‌సీ సూపరింటెండెంటు సందీప్ విద్యార్థులు, సిబ్బందితో మానవహారం, ప్రతిజ్ఞ చేయించారు. జియ్యమ్మవలస పీహెచ్‌సీలో వైద్యుడు పి.జగదీష్, పార్వతీపురం మండలం బందలుప్పి, డోకిశీల పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు శంకరరావు, ఐశ్వర్య, గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ పీహెచ్‌సీ వైద్యుడు బుద్దేశ్వరరావు, బలిజిపేట మండలం అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివగాయత్రి ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సాలూరు, సీతంపేట, పాలకొండ, పాచిపెంట, వీరఘట్టంలో సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం

సాలూరు బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

(c) eenadu

గీతా సారం... మార్గదర్శనం

గీతా జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు అలరించారు. ఒంగోలు నగరంలోని వైఖానస సంఘ ఆశ్రమ భవనంలో శాంతి, నవ గ్రహ హోమాలు చేపట్టారు. నృత్య శిక్షకురాలు సరస్వతి నేతృత్వంలో విద్యార్థులు ప్రదర్శించిన బృందావనం నృత్యరూపకం ఆహూతులను మైమరపింపజేసింది. శర్మ కళాశాల అధ్యాపకులు ఎం.ఎస్.శాస్త్రి... భగవద్గీత ప్రసంగం ఆకట్టుకుంది. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పరాంకుశం కేశవాచార్యులు, డాక్టర్ గంజాం శ్రీనివాసమూర్తి, భరత్‌కుమార్ ఆత్రేయ, డాక్టర్ హరిబాబు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అర్చకులు హాజరయ్యారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు నగరం, సాంస్కృతికం

పింఛన్లు... 91.46 శాతం పంపిణీ

ఒంగోలు గ్రామీణం, టంగుటూరు, న్యూస్‌టుడే: డిసెంబర్ నెలకు సంబంధించి... తొలిరోజైన సోమవారమే 91.46 శాతం మేర ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 2,83,200 మంది లబ్ధిదారులు ఉండగా... రూ.124.71 కోట్ల నగదు విడుదలైంది. రాత్రి ఏడు గంటల సమయానికి 2,59,026 మందికి రూ.113.52 కోట్ల మేర అందజేశారు. మిగిలిన వారికి మంగళవారం పంపిణీ చేయనున్నారు. టంగుటూరు మండలం శివపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి నగదు అందజేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు.

మార్కాపురం జిల్లా... అభ్యంతరాలుంటే చెప్పండి

మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాలను కలిపి ప్రత్యేకంగా మార్కాపురం జిల్లా ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఏవైనా అభ్యంతరాలుంటే నెల రోజుల్లోగా తెలియజేయాలని సూచించింది. ఆ మేరకు అధికారులు... కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా పెట్టె ఏర్పాటు చేశారు. సూచనలు, సలహాలు సైతం తెలియజేయవచ్చని పేర్కొన్నారు.– ఈనాడు, ఒంగోలు

పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

మొదలైంది... పులుల గణన

నల్లమల అటవీ ప్రాంతంలో పులుల గణన ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. నంద్యాల, ఆత్మకూరు, మార్కాపురం, గిద్దలూరు డివిజన్లలో ఆధునిక సాంకేతిక వినియోగంతో లెక్కింపు మొదలుపెట్టారు. మొత్తం 25 రేంజ్‌ల పరిధిలో 250 మంది సిబ్బంది ఇందులో భాగస్వాములయ్యారు. వారు తమకు కేటాయించిన అయిదు కి.మీ.ల పరిధిలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పర్యటించారు. మాంసాహార జంతువులైన పెద్దపులి, చిరుత, ఎలుగుబంట్లు, రేసుకుక్కలు తదితరాల వివరాలను ఎకలాజికల్ యాప్‌లో నమోదు చేశారు. మూడు రోజుల పాటు ఇది కొనసాగనుంది. తరువాత మూడు రోజులు శాకాహార జంతువుల లెక్కింపు చేపడతారు.

– న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

రైతేరాజు: ఉద్యాన పంటలు.. ఇవీ జాగ్రత్తలు 6 లో..

రూ.108.87 కోట్లు

- మనుగడలో లేని ఖాతాల్లో మూలుగుతున్న మొత్తం
- తగిన పత్రాలు చూపితే తిరిగి పొందే అవకాశం

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో మనుగడలో లేని ఖాతాలు వేల సంఖ్యలో ఉన్నాయి. వీటిలో ఒకటీ.. రెండు కాదు... ఏకంగా రూ.108.87 కోట్ల నగదు మూలుగుతోంది. ప్రస్తుతం... సదరు ఖాతాదారులు ఈ మొత్తాన్ని పొందే అవకాశాన్ని ఆర్‌బీఐ కల్పించింది. ఆ మేరకు స్థానిక బ్యాంకుల వారూ అవసరమైన ఏర్పాట్లు చేశారు. –ఈనాడు, ఒంగోలు

నగదు చెల్లింపుల విషయమై బ్యాంకుల మేనేజర్లతో సమీక్షిస్తున్న ఎల్‌డీఎం రమేష్

ఆర్‌బీఐ ఆదేశాల మేరకు... ప్రభుత్వ పథకాల కోసం కొందరు, జీతం సొమ్ము కోసం మరికొందరు, ఉపకార వేతనాల కోసం విద్యార్థులు... ఇలా చాలామంది గతంలో ఖాతాలు తెరిచి వదిలేశారు. జిల్లాలో ఇలాంటి ఖాతాలు వేలల్లో ఉన్నాయి. ప్రభుత్వ శాఖలు సైతం లావాదేవీలు నిర్వహించకుండా వదిలేసినవి వందల్లో ఉన్నాయి. ఒక్కో ఖాతా పరంగా చూస్తే కొద్ది మొత్తమే ఉన్నా... మొత్తంగా చూస్తే రూ.కోట్లలో నగదు మూలుగుతోంది. ఇలా వదిలేసిన మొత్తాన్ని తిరిగి ఖాతాదారులకు పంపిణీ చేయాలని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశించడంతో బ్యాంకర్లు ఆయా ఖాతాదారులను వెతికే పనిలో పడ్డారు. ఈ విషయమై జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్... మూడు రోజుల క్రితం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఏయే శాఖల్లో ఎన్ని ఖాతాలు ఉన్నాయన్న వివరాలను సంబంధిత బ్యాంకు మేనేజర్లకు అందజేశారు.

అగ్రస్థానం యూనియన్ బ్యాంకుదే.. అప్పట్లో ఉన్న ఆంధ్రాబ్యాంకులో ఇలాంటి ఖాతాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం దీనితో పాటు కార్పొరేషన్ బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యాయి. ఆ ప్రకారం జిల్లా పరిధిలో యూనియన్ బ్యాంకులోని నిరర్థక ఖాతాల్లోనే అత్యధికంగా రూ.30 కోట్ల మేర నగదు నిల్వలు ఉన్నాయి. ఎస్‌బీఐలో రూ.27 కోట్లు, కెనరా బ్యాంకులో రూ.18 కోట్లు, పీడీసీసీబీలో రూ.2.77 కోట్లు ఉన్నాయి. మిగతా బ్యాంకుల శాఖల్లోనూ ఈ తరహా ఖాతాలున్నాయి.

ఆగస్టు 31 నాటికి జిల్లాలోని బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని ఖాతాలు, నగదు వివరాలు

రకం	ఖాతాల సంఖ్య	నగదు (రూ.కోట్లలో)
వ్యక్తిగతమైనవి	7,61,783	90.62
ప్రైవేటు సంస్థలు	9,587	11.01
ప్రభుత్వ సంస్థలు	7,400	7.24
మొత్తం	7,78,770	108.87

పదిహేనేళ్ల క్రితం అంతగా అవగాహన లేక ఫోన్ నంబరు, చిరునామా వంటి వివరాలు స్పష్టంగా పేర్కొనలేదు. పెద్దలకు ఖాతా ఉన్న విషయం పిల్లలకు తెలియకపోవడమూ సమస్యగా మారింది. వారసులెవరైనా నిర్దేశిత ధ్రువపత్రాలతో వస్తే నగదు అందజేస్తామని బ్యాంకర్లు చెబుతున్నారు. ఇలా... సంతపేట ఎస్‌బీఐ శాఖలో పదేళ్ల క్రితం వదిలేసిన రూ.4 లక్షలను వడ్డీతో సహా తిరిగి చెల్లించారు. విద్యాశాఖ ఖాతాలో మూలుగుతున్న రూ.40 లక్షలను అధికారులకు అప్పగించారు.

ఇలా తెలుసుకోవచ్చు ‘ఆర్‌బీఐ అందుబాటులోకి తీసుకొచ్చిన ఉద్గమ్ పోర్టల్‌లో పేరు, ఫోన్, పాన్ కార్డు వివరాలు నమోదు చేస్తే మనుగడలో లేని ఖాతాల వివరాలు తెలుసుకోవచ్చు. గతంలో ఖాతా తెరిచి వదిలేసిన విషయం గుర్తొస్తే సంబంధిత బ్యాంకుకు వెళ్లి వివరాలు అందజేస్తే పరిశీలించి మళ్లీ మనుగడలోకి తీసుకొస్తారు. చనిపోయిన వారికి సంబంధించిన నగదును తగిన ఆధారాలతో వారసులు పొందవచ్చ’ని లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్ తెలిపారు.

దూసుకొస్తున్న నయా రాకెట్

- టెన్నిస్‌లో సత్తా చాటుతున్న స్నిగ్ధ

జిల్లా నుంచి టెన్నిస్ రాకెట్ దూసుకొస్తోంది. జాతీయ స్థాయిలో సత్తా చాటి అంతర్జాతీయంగానూ ప్రతిభ చాటేందుకు సిద్ధమవుతోంది... గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లెకు చెందిన స్నిగ్ధ. అండర్-16, 18 విభాగాల్లో ఇప్పటికే తనదైన ముద్ర వేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఆమె తల్లిదండ్రులు కంతా శివరామకృష్ణ, కృష్ణవేణి. వ్యాపార రీత్యా వీరి కుటుంబం బెంగళూరులో ఉంటోంది. అక్కడే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న స్నిగ్ధ... ఇండియన్ టెన్నిస్ అసోసియేషన్ నిర్వహిస్తున్న టోర్నీల్లో కర్ణాటక రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ప్రస్తుతం తన విభాగంలో జాతీయ స్థాయిలో అయిదో ర్యాంకు... అంతర్జాతీయంగా 548వ స్థానంలో కొనసాగుతోంది.

వరించిన విజయాలు... నవంబరు 24న కొల్హాపూర్ (మహారాష్ట్ర)లో నిర్వహించిన టోర్నీలో జాతీయస్థాయిలో ఛాంపియన్‌గా నిలిచింది. అంతకు ముందు దిల్లీలో నిర్వహించిన లాన్ టెన్నిస్‌లో రన్నరప్ సాధించింది. ఐటీఎఫ్ ఆధ్వర్యంలో రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లో నిర్వహించిన పోటీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో జయకేతనం ఎగురవేసింది. – న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

గదిలో చెత్త... సహాయకులు ఆరుబయట!

ఐసీయూకు వెళ్లేదారిలో రోగుల సహాయకుల నిరీక్షణ

ఒంగోలు రిమ్స్‌లో కనిపించిన చిత్రాలివి. ఆసుపత్రిలో తుప్పుపట్టిన సామగ్రి, పనికిరాని పరికరాలను మూడో అంతస్తులోని పెద్ద గదిలో ఇలా నిల్వ చేశారు. మరోవైపు... ఐసీయూ, మెటర్నిటీ వార్డుల వద్ద తగిన వసతి లేక రోగుల సహాయకులు వరండాలోనే అవస్థలు పడుతూ నిద్రిస్తున్నారు. కొన్ని ఇతర గదులూ ఖాళీగా ఉన్నందున... వీరికి కేటాయిస్తే కొంత మేలు కలుగుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – ఈనాడు, ఒంగోలు

గదిలో నిల్వ చేసిన తుప్పు పట్టిన సామగ్రి

ధాన్యం సేకరణకు రంగం సిద్ధం

- జిల్లాలో 45 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

న్యూస్‌టుడే – ఒంగోలు గ్రామీణం

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధమైంది. గతేడాదితో పోలిస్తే సాగు ఖర్చులు పెరిగాయి. అందుకు అనుగుణంగానే మద్దతు ధర పెరిగింది. రబీ సీజన్ కింద ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలోని మండలాల్లో దాదాపు 43,210 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. 1,14,494 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. స్థానికంగా వినియోగ అవసరాలకు పోనూ కొనుగోలు కేంద్రాల ద్వారా 25 వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. మరో వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే రైతులకు అవగాహన సదస్సులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

పెద ఉల్లగల్లులో యంత్రంతో వరి కోత

మద్దతు ధర (క్వింటాకు)...	గ్రేడ్-ఏ:	సాధారణ:
	రూ.2,389	రూ.2,369

(గత ఏడాదితో పోలిస్తే రెండింటికి రూ.69 చొప్పున ధరలు పెంచారు)

201 ఆర్ఎస్‌కేల పరిధిలో... జిల్లాలోని 201 రైతు సేవా కేంద్రాల పరిధిలో 45 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రైతు సేవా కేంద్రాలను క్లస్టర్లుగా విభజించి వాటికి అనుగుణంగా పది మిల్లులను కేటాయించారు. పేర్లు నమోదు చేసుకున్న రైతుల నుంచి పంట కొనుగోలుకు మ్యాపింగ్ చేశారు. సకాలంలో బ్యాంకు ఖాతాలకు నగదు జమయ్యేలా చర్యలు చేపట్టారు. తేమ శాతం, తూకాల్లో తేడాలు రాకుండా కట్టుదిట్టం చేశారు. మిల్లర్లు 50 శాతం వరకు గోనె సంచులు సమకూరుస్తారు. పౌరసరఫరాలశాఖ అధికారులు, రెవెన్యూ ఉద్యోగులను మిల్లుల వద్ద కస్టోడియన్లుగా నియమించారు. దళారీ వ్యవస్థకు ఆస్కారం లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం వరలక్ష్మి తెలిపారు.

ఆగి... ముందుకు సాగి!

- జిల్లాలో పూర్తయిన బీపీసీఎల్ పైపులైను పనులు
- అధికారుల జోక్యంతో సమసిన వివాదాలు

ఈనాడు, ఒంగోలు

కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్‌కు భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న భారీ పైపులైను పనులు... పలు అభ్యంతరాలు, అవాంతరాలు దాటి జిల్లా వరకు పూర్తయ్యాయి. నేరుగా చమురు, గ్యాస్ సరఫరా చేసే లక్ష్యంతో ఈ నిర్మాణం చేపడుతున్నారు.

అభ్యంతరాలు దాటి...: జిల్లా వరకు ఆరు మండలాల పరిధిలో 63 కి.మీ. మేర చేపట్టిన పైపులైను పనులకు పలు చోట్ల అడ్డంకులు ఎదురయ్యాయి. ప్రధానంగా ఒంగోలు శివారు పేర్నమిట్ట రైతులు కోర్టుకు వెళ్లడంతో చాన్నాళ్లు నిలిచిపోయాయి. చెరువు మధ్యలోంచి పైపులు వేయడాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆందోళనలు చేపట్టడంతో చివరకు అలైన్‌మెంట్ మార్చారు. నగర సమీపంలోని భూములకు పరిహారం పెంచాలని కోరడంతో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని ఆ మేరకు చర్యలు తీసుకున్నారు. ఓ పార్టీకి చెందిన నేత తన పొలంలోంచి లైను వెళ్లేందుకు వీల్లేదని భీష్మించారు. జేసీ గోపాలకృష్ణ రంగంలోకి దిగి సర్దుబాటు చేయాల్సి వచ్చింది. మిగతా మండలాల్లోనూ పలు అభ్యంతరాలు తలెత్తినా చక్కదిద్దారు.

పేర్నమిట్ట సమీపంలో చేపడుతున్న పైపులైను పనులు

పోర్టు ఉన్న నెల్లూరు నుంచి బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నల్గొండ, యాదాద్రి మీదుగా హైదరాబాద్‌కు పైపులైను వెళ్తుంది. రాష్ట్రంలో 310 కి.మీ., తెలంగాణ పరిధిలో 115 కి.మీ. మేర సాగుతుంది.

శనివారం... ఆటవిడుపు!

- పాఠశాలల్లో ‘నో బ్యాగ్ డే’ అమలు

న్యూస్‌టుడే, ఒంగోలు విద్య

వారంలో ఒక రోజు పాఠశాల విద్యార్థులకు ఆట విడుపు. ప్రతి శనివారం ‘నో బ్యాగ్ డే’ అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. ఆ రోజు పాఠ్యాంశాల బోధన బదులు... పిల్లలతో వివిధ రకాల కృత్యాలు చేయిస్తారు. ఇందుకోసం పీఎంశ్రీ పాఠశాలలకు కేంద్రం, ఇతర ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాయి.

నూతనోత్సాహం కలిగేలా... ప్రతి రోజూ పాఠాల బోధన కారణంగా విద్యార్థులకు విసుగు కలగకుండా ఉండడంతో పాటు... పుస్తక సంచి మోతకు ఒక రోజు విరామం ఇవ్వడం ద్వారా పిల్లల్లో నూతనోత్సాహం కలుగుతుందన్న భావనతో ఈ కార్యక్రమం అమలుకు నిర్ణయించారు. కృత్యాల నిర్వహణకు పీఎంశ్రీ పథకం పరిధిలోని 246 విద్యాలయాలకు విద్యార్థుల సంఖ్యను బట్టి ఏడాదికి రూ.25 వేలు చొప్పున కేటాయించారు. మిగతా 2,295 ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్రం రూ.2 వేల నుంచి రూ.5 వేలు చొప్పున... రూ.13.12 లక్షలు కేటాయించింది. వీటితో పేపర్లు, పెయింట్‌లు, బ్రష్‌లు, మార్కర్లు, క్లే, క్రాఫ్ట్ మెటీరియల్, యోగా మ్యాట్‌లు, స్కిప్పింగ్ రోప్‌లు, పజిల్ బాక్సులు వంటివి కొనుగోలు చేయనున్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు సైతం అందుబాటులో ఉంచాలని సూచించారు. సంబంధిత మార్గదర్శకాలను ప్రధానోపాధ్యాయులకు పంపారు.

నో బ్యాగ్ డే రోజున సమకాలీన అంశాలపై క్విజ్, వక్తృత్వం, సదస్సుల నిర్వహణతో పాటు భాష, జీవన నైపుణ్యాలు, ఆటల పోటీలు, ఆర్ట్స్, క్రాఫ్ట్స్ తయారీ వంటి అంశాలను... ఆయా తరగతుల వారీగా పిల్లల స్థాయిని బట్టి నిర్వహిస్తారు.

ఉపాధ్యాయినుల ఉత్సాహం



పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం నిర్వహించిన లీప్ టీచర్స్ టోర్నీ ఉత్సాహంగా సాగింది. త్రోబాల్‌లో ఉపాధ్యాయినులు పాల్గొని హోరాహోరీగా తలపడ్డారు

– న్యూస్‌టుడే, పొదిలి

అవగాహనతోనే మహమ్మారి కట్టడి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యలు, చేపడుతున్న పలు కార్యక్రమాలతో హెచ్‌ఐవీ కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. ర్యాలీలో కలెక్టర్ పి.రాజాబాబు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, నగర మేయర్ గంగాడ సుజాత, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్ పి.రాజాబాబు, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్ తదితరులు

కలల గూడు సాకారం చేసుకోండి!

- వివరాల నమోదు గడువు 14 వరకు పెంపు

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు చేపడుతున్న సర్వే గడువును మరోసారి పొడిగిస్తూ... ఈ నెల 14 వరకు అవకాశం కల్పించారు. అర్హత కలిగి ఇంకా వివరాలు నమోదు చేసుకోని వారు సద్వినియోగం చేసుకోవాలని గృహనిర్మాణ శాఖ అధికారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

అర్హులందరికీ లబ్ధి చేకూరేలా... 2029లోగా పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యంలో భాగంగా... ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణశాఖ అధికారులు గతంలో సర్వే చేపట్టారు. అవగాహన లేక కొందరు వినియోగించుకోలేదు. విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో... కేంద్రంతో మాట్లాడి లబ్ధిదారుల గుర్తింపునకు నవంబరు నెలాఖరు వరకు అవకాశం కల్పించారు. ఆ మేరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటి డిమాండ్ సర్వే చేపట్టి... ఇప్పటివరకు 35,934 పక్కా గృహాల మంజూరు కోరుతూ వివరాలు నమోదు చేశారు. తాజాగా నమోదు గడువును ఈ నెల 14 వరకు పొడిగించినట్లు జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి పి.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు.

నాగులుప్పలపాడు మండలం చీర్వానుప్పలపాడులో వివరాలు నమోదు చేస్తున్న గృహనిర్మాణశాఖ అధికారులు

ఇవి తప్పనిసరి...

- గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇంటి స్థలం లేదా ప్రభుత్వం ఇచ్చిన పట్టా కలిగి ఉండాలి.
- తెల్ల రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, భార్యాభర్తల ఆధార్ జిరాక్సులు సమర్పించాలి.
- గతంలో గృహ నిర్మాణ లబ్ధి పొందిన వారికి ప్రస్తుత పథకం వర్తించదు.

ప్రత్యేక యాప్‌లో నమోదు... సొంత నివాస స్థలం లేదా ఇంటి పట్టా కలిగి... ఇల్లు లేని పేదల వివరాలు సేకరిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న మహిళల ప్రస్తుత నివాసం, నిర్మాణం చేపట్టనున్న స్థలం వద్ద ఉన్న ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పీఎంఏవై అర్బన్-2.0 కింద ఇల్లు మంజూరైన వారికి రూ.2.50 లక్షలు; గ్రామీణ ప్రాంతాల వారికైతే రూ.1.80 లక్షలు చొప్పున అందించనున్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్నవారికి సైతం యూనిట్ విలువ రూ.2.50 లక్షలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అందుకు అనుగుణంగా సర్వే యాప్‌లో వివరాలు నమోదు చేశారు.

నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు నమోదైన వారి వివరాలు

దర్శి	గిద్దలూరు	కనిగిరి	కొండపి	మార్కాపురం	ఒంగోలు	ఎస్.ఎన్. పాడు	వై. పాలెం
3,573	5,076	6,841	6,648	2,731	1,675	3,047	6,343

నలుగురి స్ఫూర్తి... ఆపన్నులకు దీప్తి

చిరుద్యోగుల సేవా సంకల్పం

పేరుకు వారు చిరుద్యోగులైనా వారి సేవా స్ఫూర్తి మరికొందరికి ఆదర్శమైంది. ఇంతింతై వటుడింతై అన్నట్లు ఆపన్నులకు బాసటగా నిలిచింది. నేడు ఓ సంస్థలా విస్తరించి అభాగ్యుల ఆకలి తీరుస్తోంది. –న్యూస్‌టుడే, టంగుటూరు

అడుగు పడిందిలా... టంగుటూరుకు చెందిన నలుగురు యువకులు ఒప్పంద పద్ధతిలో విద్యుత్తు శాఖలో పని చేస్తున్నారు. కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో బస్టాండ్‌లు, కూడళ్లు, రహదారులపై ఉండే అభాగ్యులు ఆకలితో పడుతున్న అవస్థలు వారిని కదిలించాయి. ఏ విధంగానైనా వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. తమకు వచ్చే ఆదాయం అంతంత మాత్రమే అయినా వెనుకడుగు వేయలేదు. 2020 ఏప్రిల్ 6న యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ పేరిట సేవలకు శ్రీకారం చుట్టారు. టంగుటూరు, సింగరాయకొండ, ఒంగోలు మార్గాల్లోని యాచకులు, వృద్ధులు, దివ్యాంగులకు మధ్యాహ్నం వేళ భోజనం పెట్టడం ప్రారంభించారు. ఇందుకోసం తమకు వచ్చే జీతంలో కొంత మొత్తం కేటాయించారు. క్రమం తప్పకుండా వారు చేస్తున్న కార్యక్రమాలు చూసి కొందరు దాతలు చేయూతనందించారు. స్థానిక యువకులూ బాసటగా నిలిచారు. దీంతో సేవలు మరింత విస్తరించారు.

బాధితులకు చేయూత నలుగురితో ప్రారంభమైన సంస్థలో నేడు రెండొందల మందికి పైగా సభ్యులున్నారు. పూట గడవని వృద్ధులకు నెలవారీ సరకులు, వైద్యం ఖర్చులు అందిస్తున్నారు. నిరుపేద విద్యార్థుల చదువుకు చేయూతనందిస్తున్నారు. ఆపద సమయంలో అవసరమైన వారికి రక్తదానం చేస్తూ ప్రాణాలు నిలుపుతున్నారు. పారదర్శకత కోసం చేస్తున్న జమా ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.23,16,420 వెచ్చించి 1,037 సేవా కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.

వైద్య ఖర్చుల కోసం వృద్ధురాలికి నగదు అందిస్తున్న సంస్థ సభ్యులు

(c) eenadu

జిల్లాపై 'మాగుంట' చెరగని ముద్ర

● వర్ధంతి సభలో ప్రజా ప్రతినిధులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి సేవలు ఎనలేనివని రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొనియాడారు. మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిపై మాగుంట కుటుంబం చెరగని ముద్ర వేసిందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ, సుబ్బరామిరెడ్డి విద్యా సంస్థలు నెలకొల్పి ఈ ప్రాంత పేదలకు విద్యను చేరువ చేశారని కొనియాడారు. కలెక్టర్ పి.రాజాబాబు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, ఏలూరి సాంబశివరావు, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జులు గూడూరి ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్ తదితరులు ఆయన సేవలను కొనియాడారు. సుమారు 10 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు

మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించండి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత పేద ప్రజలే ఎక్కువ మంది ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే జీజీహెచ్‌కు వస్తారని, కాబట్టి ఆ మేరకు వారికి మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. వైద్యశాల అభివృద్ధికి అర్బిటెక్ట్ సహాయంతో అవసరం మేర నిర్మాణాలు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోగుల నుంచి సౌకర్యాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో ఓబులేసు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, రిమ్స్ కళాశాల ప్రధానాచార్యులు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రాజాబాబు

సెంట్రల్ జోన్ వాలీబాల్ విజేత క్విస్ కళాశాల

మైలవరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన కాకినాడ జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ వాలీబాల్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ఒంగోలులోని క్విస్(క్యూఐఎస్) కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు, నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల జట్టు వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. మూడో స్థానాన్ని బాపట్ల జిల్లా చీరాలలోని సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల, వీఆర్ సిద్ధార్థ కళాశాల జట్లు సంయుక్తంగా సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఎల్బీఆర్‌సీఈ గౌరవ ఛైర్మన్ లకిరెడ్డి జయప్రకాశరెడ్డి, జేఎన్‌టీయూ ఏసీటీ కార్యదర్శి లోవరాజు, కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి తదితరులు బహుమతులు అందించారు.

మొదటి బహుమతి సాధించిన వారికి ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

ఆటోలో వృద్ధురాలి నుంచి 14 సవర్ల బంగారం చోరీ

మద్దిపాడు, న్యూస్‌టుడే: ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధురాలి సంచి నుంచి 14 సవర్ల బంగారం చోరీ జరిగిన సంఘటన సోమవారం మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య తెలిపిన ప్రకారం మండల పరిధిలోని తెల్లబాడు గ్రామానికి చెందిన మలిశెట్టి శేషగిరిరావు భార్య ధనలక్ష్మి (65) పిడుగురాళ్లలోని అక్క నల్లా సుశీల వద్దకు వెళ్లింది. తిరిగి వీరిద్దరూ తెల్లబాడు రావడానికి మద్దిపాడులో సోమవారం ఉదయం బస్ దిగి ఆటో ఎక్కారు. వీరితో పాటు ఇద్దరు మహిళలు కూడా అదే ఆటోలో ఎక్కారు. వీరి చేతిసంచిలో 14 సవర్ల బంగారం ఉండగా వీరికి తెలియకుండా దొంగిలించి ఆ మహిళలు వెల్లంపల్లిలో దిగిపోయారు. అక్కను తీసుకుని ధనలక్ష్మి ఇంటికి వెళ్లి బ్యాగు చూసుకోగా బంగారం కనిపించలేదు. దొంగతనం జరిగిందని గుర్తించి సోమవారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిడ్స్ భూతాన్ని తరిమి కొడదాం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రపంచ ఎయిడ్స్ నిరోధక దిన సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నగర శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఎంఏ హాలులో సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగయ్యనాయుడు, డాక్టర్ ఆనంద్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఎయిడ్స్ భూతాన్ని తరిమికొట్టడానికి ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.సుధాకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జాలాది మణిబాబు, డాక్టర్లు రావిపాటి జయశేఖర్, మన్నె వీరయ్యచౌదరి, కె.సుబ్బానాయుడు, డాక్టర్ శివసీతారామయ్య, జాకబ్ జక్రయ్య, రాధిక తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎయిడ్స్ నిరోధక ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపల్ డి.కల్యాణి ర్యాలీని ప్రారంభించారు.

ఐ.ఎం.ఎ. ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

చివరిలో చేద్దామిలా..!

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి కోత దశకు వచ్చింది. ప్రస్తుతం దిత్వా తుపాను గండం ముంచుకొస్తోంది. తీసుకోవాల్సిన జాగ్రత్తలను కంభం వ్యవసాయాధికారి షేక్.మహమ్మద్ వివరించారు. వర్షాలు తగ్గే వరకు కోతలను వాయిదా వేసుకోవాలి, ఇప్పటికే కోత కోసి ఉంటే పనలను కట్టలుగా కట్టి గట్లమీదకి చేర్చుకోవాలని సూచించారు. –న్యూస్‌టుడే, కంభం

▶ కల్లాల మీద ధాన్యం ఉన్నప్పుడు..: ఇప్పటికే కోత కోసి కుప్పల మీద ఉన్న ధాన్యానికి పట్టలు కప్పుకొని రక్షించుకోవాలి. సూర్యరశ్మి దాన్యం రెండు మూడు రోజులు ఎండబెట్టడానికి వీలుకాకపోతే కుప్పలలో గింజలు మొలకెత్తకుండా, రంగు మారకుండా క్వింటా ధాన్యానికి కిలో ఉప్పు 20 కిలోల పొడి ఊక కలపాలి.

▶ పాలు, గింజ పోసుకునే దశలో ఉంటే..: పొలంలోని నీటిని అంతర్గత కాలువల ద్వారా బయటకు పంపించాలి. పడిపోయిన చేనును పైకి లేపి కట్టుకోవాలి. గింజలు రంగు మారటం, మాగుడు తెగులు, మానిపండు తెగులు వ్యాప్తి నివారణకు ఎకరానికి 200 మి.లీ. ప్రోపికోనజోల్ పిచికారీ చేయాలి. కంకిలో మొలకలు కనిపిస్తే నీరు బయటకు పంపించిన తర్వాత 5 శాతం ఉప్పు ద్రావణం, (50 గ్రాముల కల్లు ఉప్పు లీటర్ నీటికి) కలిపి పిచికారీ చేయాలి.

కోత దశకు వచ్చిన వరిపైరు

▶ ముంపునకు గురైతే..: చేను ఎదుగుదల దశలో ఉండి పొలం ముంపునకు గురైతే. వీలైనంత త్వరగా నీటిని బయటకు పంపాలి. ఎకరానికి 30 కిలోలు యూరియా, 15 కేజీల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలి. పాముపొడ తెగులు ఉద్ధృతి ఎక్కువైతే మొక్కలు ఎండిపోతాయి. నివారణకు ప్రోపికొనజోల్ 1 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటర్ నీటికి కలిపి దుబ్బుకి తగిలేలా 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఇలాంటి వాతారణానికి వరిలో అగ్గి తెగులు వ్యాప్తి అధికమయ్యే అవకాశం ఉంటుంది. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లేదా కాసుగామైసిన్ 2 మి.లీ. లేదా ఫూజి వన్ 2 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అధిక నీటి ప్రవాహంతో సుడి దోమ ఆశించే అవకాశం ఉంది. నివారణకు ఇతోఫెన్‌ప్రాక్స్ 2 మి.లీ. లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 0.25 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.20 గ్రా. థయోమిథోక్సామ్ లేదా డైనెటో ఫ్యూరాన్ 0.25 లేదా బ్రిప్రొఫూజిన్ 1.6మి.లీ. లేదా పైమెట్రోజన్ 0.6 మి.లీ. చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

దర్శి మండలం బసిరెడ్డిపల్లిలో మిరప తోట పరిశీలిస్తున్న అధికారులు

ఉద్యాన పంటలు.. ఇవీ జాగ్రత్తలు

న్యూస్‌టుడే, దర్శి

మీ కోసం

మొంథా తుపాను దాటికి జిల్లాలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు మళ్లీ దిత్వా తుపాను వచ్చినందువల్ల తెగుళ్ల సోకి దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రధాన పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి దర్శి ఉద్యాన శాఖ అధికారి రవివెంకన్నబాబు తెలియజేశారు.

▶ బత్తాయి, నిమ్మ..: ఈ తోటల్లో నీరు నిలిస్తే తొలగించి పాదులను తవ్వి వేరు వ్యవస్థకు గాలి అందేటట్లు చేయాలి. నేలను తాకుతున్న కొమ్మలను కత్తిరించి, వాటికి బోర్డో పేస్టు రాయాలి. బంక తెగులు నివారించటానికి 1 శాతం బోర్డో మిశ్రమం లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. 5 సంవత్సరాలు దాటిన తోటల్లో అదనంగా 400 గ్రా. యూరియాతో పాటు 350 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువును చెట్టుకు అందించాలి.

▶ మిరప..: పొలంలో నీటిని తొలగించాలి, వాలిన మొక్కలను నిలబెట్టి చుట్టూ మట్టిని ఎగదోయాలి. ఉరకెత్తి తలలు వాల్చితే తేరుకోవటానికి లీటరు నీటికి 10 గ్రా. యూరియా కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలి. వడలిన మొక్కలకు లీటరు నీటికి 5 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నేల అదునుకు వచ్చి వెంటనే గొర్రుతో అంతరకృషి చేయాలి. తెగుళ్ల ఆశించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ మరియు 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. పంట పూర్తిగా నాశనం అయితే తొలగించి వేరే పంటను సాగు చేసుకోవాలి.

▶ కూరగాయలైన టమాట, వంగ, తీగజాతి, దుంపజాతి, ఆకుకూరలు వంటి వాటిలో వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలను పిచికారీ చేసుకోవాలి.

సమస్య • పరిష్కారం

▶ సమస్య: మా ఆవు ఈని మూడు రోజులైంది. ఆవు ఆకస్మికంగా మేత మానివేసింది. చొంగలు కక్కుతూ చలనం లేకుండా పడి ఉంది ఎందుకు ? నివారణ చర్యలు సూచించండి.

– వెంకటేశ్వర్లు, రావిపాడు

సమాధానం : ఆవు ఈనిన వెంటనే మేత మానివేసి చలనం లేకుండా ఉండి, డొక్క లోకి తల పెట్టి పడి ఉంటే అది పాల జ్వరంగా భావించాలి. వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి చికిత్స అందించాలి. శరీరంలో కాల్షియం శాతం తక్కువగా ఉన్నప్పుడు ఈ పరిస్థితి ఏర్పడుతుంది.

బాలచంద్రుడు, పశువైద్యాధికారి, రావిపాడు

▶ సమస్య: మా గొర్రెల మందలో కొన్ని ఇటీవల మేత మేస్తూ ఆకస్మాత్తుగా మృతి చెందాయి. కారణం ఏమిటి? – రంగయ్య, రావిపాడు

సమాధానం : గొర్రెలు మేత మేస్తూ ఆకస్మికంగా ఎగిరి కింద పడి మృతి చెందితే అది చిటుక లేదా నేలముచ్చు వ్యాధిగా గుర్తించాలి. తొలకరికి ముందు తప్పనిసరిగా చిటుక వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. ఈ వ్యాధికి చికిత్స లేదు. నివారణే ఉత్తమం.

–న్యూస్‌టుడే, బేస్తవారపేట గ్రామీణం

రైతేరాజు

పందిరి దొండ.. ఆదాయ అండ

మిగతా రైతులకు భిన్నంగా పందిరి దొండ సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు కురిచేడు మండలం బోధనంపాడు గ్రామానికి చెందిన రైతు పుల్లలచెరువు వెంకటేశ్వర్లు. సాగులో అనుసరించిన పద్ధతులు, ఇతర వివరాలను ఆయన మాటల్లోనే తెలుసుకుందాం. –న్యూస్‌టుడే, కురిచేడు

వెంకటేశ్వర్లు సాగు చేసిన పందిరి దొండ

'అర ఎకరా పొలంలో దొండసాగు చేపట్టాం. తొలుత మాములు విధానంలో పండించాం. ఆ తరువాత శాశ్వత పందిరి కోసం రూ.1.20 లక్షలు ఖర్చుపెట్టాం. నాణ్యమైన ఒక్కొక్క పిలక రూ.15 చొప్పున రాజమహేంద్రవరం నుంచి తెప్పించాం. అర ఎకరం విస్తీర్ణంలో 180 పిలకలు నాటాం. నాటిన రెండు నెలలకు పంట చేతికి రావడం ప్రారంభమైంది. ప్రస్తుతం ఉన్న పంట ఎనిమిది నెలల క్రితం వేసింది. పందిరికి అనుణంగా వాటిని నాటి, డ్రిప్ విధానంలో ప్రతి మొక్కకు నీరు, ఎరువు అందేలా ఏర్పాట్లు చేశాం. కలుపు లేకుండా ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నాం. దొండను ప్రధానంగా తెల్లదోమ, పురుగులు, ఎర్రనల్లి ఎక్కువగా ఆశిస్తుంటాయి. వాటిని నివారించడానికి తగినంత మోతాదులో డైపెంథ్యురాన్, నొవాల్యురాన్, హెక్సాథీయాజాక్స్ వంటి మందులు పిచికారీ చేసి వాటిని అరికడుతున్నాం. ఆకుమచ్చ తెగులుకు మాంకోజెబ్, కార్బండిజం వంటి వాటిని పిచికారీ చేస్తున్నాం. వారం రోజులకు ఒకసారి కోత కోస్తున్నాం. సీజన్, మార్కెట్‌ను బట్టి ధరలు ఉంటాయి. పెట్టుబడి పోను మంచి ఆదాయమే లభిస్తోంది'. అని రైతు వెంకటేశ్వర్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

తేది. 17.11.2025న విశ్వనాధుని సూర్యప్రకాశరావు, తండ్రి వి.వి.కొండయ్య, ఒంగోలు, ప్రకాశం జిల్లా అనువారి తరపున శ్రీ కరేటి శ్రీనివాసులు, అడ్వకేట్, ఒంగోలు వారు యిచ్చిన ఈనాడు పేపర్ పత్రికా ప్రకటనకి జవాబుగా ఈ బహిరంగ ప్రకటన.

మా క్లయింటు గుర్రం సీతారామయ్య, తండ్రి (లేటు) శేషయ్య, కన్యకాపరమేశ్వరి వీధి, ఒంగోలు, ప్రకాశం జిల్లా, అనువారు మాకు యిచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని, మా క్లయింటు అయిన గుర్రం సీతారామయ్యగారు, తేది. 29.05.2020న తన అన్నగారి కుమారుడైన గుర్రం శ్రీధర్‌బాబు నుండి మరియు తన అన్నగారైన గుర్రం క్రిష్ణమూర్తిగారి నుండి ఈ షెడ్యూలు ఆస్థిని మరియు వేరే రెండు స్థిరాస్తులను అస్వాధీనపు విక్రయ ఖరారు అగ్రిమెంటు ద్వారా కొనుగోలు చేసివున్నారు. సదరు విక్రయఖరారు అగ్రిమెంటు తేది. 29.05.2020న, గుర్రం శ్రీధర్‌బాబు మరియు గర్రం క్రిష్ణమూర్తిగారు అస్వాధీనపు అగ్రిమెంటు తాలూకా షెడ్యూలు ఆస్థుల యొక్క ఒరిజినల్ దస్తావేజులు, మా క్లయింటు అయిన గుర్రం సీతారామయ్యగారికి స్వాధీనపరచినారు.

తదుపరి మా క్లయింటు అయిన గుర్రం సీతారామయ్యగారు, సదరు గుర్రం శ్రీధర్‌బాబు మరియు గుర్రం క్రిష్ణమూర్తిగారిని, విక్రయ అగ్రిమెంటు తాలూకా షెడ్యూలు ఆస్థుల గురించి రిజిస్ట్రేషన్ చేయమని కోరగా, వారు రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేయుచుండగా, దానికి మా క్లయింటు ఒంగోలు 1వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టుయందు, గుర్రం శ్రీధర్‌బాబు మరియు గుర్రం క్రిష్ణమూర్తి వారి మీద ఓ.యస్.నెం. 25/2022రుగా స్పెసిఫిక్ పెర్ఫార్మెన్స్ దావా దాఖలు చేసి, తేది. 04.04.2024న డిక్రీ పొందియున్నారు. తదుపరి మా క్లయింటు అయిన గుర్రం సీతారామయ్యగారు సదరు కోర్టులో ఈ.పి.నెం.39/2024 ద్వారా తేది. 28.12.2024న ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని మరియు ఇతర రెండు ఆస్థులను రిజిస్ట్రేషన్ పొందియున్నారు. తదుపరి మా క్లయింటు గుర్రం సీతారామయ్యగారికి, సదరు కోర్టువారు ఈ.పి.నెం.11/2025 ద్వారా తేది.10.04.2025న కోర్టు అమీనా ద్వారా పై అగ్రిమెంటు తాలూకా ఆస్థులను మా క్లయింటుకు డెలివరీ యిచ్చివున్నారు. అప్పటి నుండి మా క్లయింటు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని, మరియు పై అగ్రిమెంటు తాలూకా వేరే రెండు ఆస్థులను, ఎటువంటి అభ్యంతరములు లేకుండా అనుభవించుచున్నాడు. తదుపరి ఒంగోలు మున్సిపాలిటీ ఆఫీసులో పైన తెలిపిన ఆస్థులను తన పేరిటకి మార్చుకొని, తేది. 31.03.2026 వరకు ఆస్థిపన్ను మొత్తం చెల్లించివున్నారు.

తేది. 17.11.2025న ఈనాడు పేపరు, ఒంగోలు ఎడిషన్‌లో ప్రచురించబడిన పత్రికా ప్రకటన ద్వారా, మా క్లయింటుకి తెలిసింది ఏమనగా, మా క్లయింటు అయిన గుర్రం సీతారామయ్య గారికి చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థికి, తూర్పు హద్దుదారుడైన, విశ్వనాధుని సూర్యప్రకాశరావు గారు, మా క్లయింటు అన్నగారైన గుర్రం క్రిష్ణమూర్తిగారి నుండి తేది. 15.03.2000న విక్రయం పొందినట్లు చెబుతున్న విషయములు అన్ని అవాస్తవములు. దీనికి సంబంధించి మా క్లయింటు అయిన గుర్రం సీతారామయ్యగారు యావన్మందికి యిస్తున్న సంజాయిషీ ఏమిటంటే, ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థి 1988వ సంవత్సరమున గుర్రం శ్రీధర్‌బాబు వారి పేరిటకి కొనుగోలు చేసిన ఆస్థి మాత్రమే, కాని గుర్రం క్రిష్ణమూర్తిగారి పేరిట కొనుగోలు చేసిన ఆస్థి కాదు, అదే విధంగా గుర్రం క్రిష్ణమూర్తిగారికి ఈ క్రింది షెడ్యూలు ఆస్థి గురించి క్రయ విక్రయాలు చేయుటకు ఆయనకు ఎటువంటి హక్కు, అధికారములు లేవు. కావున విశ్వనాధుని సూర్య ప్రకాశరావుగారు చెబుతున్నట్లు, గుర్రం క్రిష్ణమూర్తిగారి ద్వారా విక్రయం పొందటం అంతా అబద్ధం మరియు చట్టపరంగా చెల్లదు, మరియు సదరు విక్రయం కాలదోషం పట్టినది.

వాస్తవమునకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థి ఎప్పుడూ కూడా సదరు విశ్వనాధుని సూర్యప్రకాశరావుగారి స్వాధీన అనుభవంలో లేని ఆస్థి, అంతే కాకుండా అతను గుర్రం క్రిష్ణమూర్తి నుండి విక్రయ అగ్రిమెంటు ద్వారా కొనుగోలు చేయటం అంతా కూడా అబద్ధం. మా క్లయింటు సుమారు 76 సం॥ల వయస్సు కలిగివున్నారు, ఆయనను ఇబ్బంది పెట్టి ఈ క్రింది షెడ్యూలు ఆస్థిని మోసపూరితముగా పొందాలని ప్రయత్నం చేస్తున్నారు. కావున మా క్లయింట్ హక్కులకు మరియు షెడ్యూలు ఆస్థిపై తప్పుడు ప్రచారం చేసి నష్టం కలగుచేసినందుకు మా క్లయింటు విశ్వనాధుని సూర్యప్రకాశరావుగారి మీద అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకొనబడును.

అదే విధంగా సదరు గుర్రం శ్రీధర్‌బాబుగారు ఈక్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిపై తేది. 06.07.1995న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్.యం.ఈ.బ్రాంచ్, ఒంగోలు వారి ద్వారా మార్టగేజ్ లోను పొందియున్నారు. తదుపరి సదరు లోన్‌ని, మా క్లయింటు అయిన గుర్రం సీతారామయ్యగారు, గుర్రం శ్రీధర్‌బాబు తరపున, సదరు బ్యాంకు వారికి తేది.17.12.2018న మొత్తం లోన్ అమౌంట్ O.T.S. క్రింద కట్టి, N.O.C పొందియున్నారు. కావున విశ్వనాధుని సూర్యప్రకాశరావు గారు చెబుతున్నట్లు, తేది. 15.03.2000 నాటికి, ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థి బ్యాంకు లోనులో ఉన్నది. సదరు విశ్వనాధుని సూర్యప్రకాశరావు గారు తప్పుడు డాక్యుమెంటుని క్రియేట్ చేసి మా క్లయింటుకి చెందిన కోట్ల రూపాయలు విలువ గల ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని అన్యాయంగా, అక్రమంగా కాజేయాలని చూస్తున్నాడు. మా క్లయింటు దగ్గర నుండి తక్కువ ధరకు కొనుగోలు చేయాలని పబ్లిక్‌కి తప్పుడు సమాచారం యిస్తున్నాడు.

కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని మా క్లయింటు కోర్టు ద్వారా రిజిష్టర్ సేల్‌డీడ్ మరియు స్వాధీనపరచుకొని, ఎటువంటి వివాదములు లేకుండా స్వేచ్ఛగా నా క్లయింటు స్వాధీన అనుభవంలో వున్న ఆస్థి అయివున్నది. అని యావన్మందికి యిందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు:– ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ యిలాకా, ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, ఒంగోలు టౌన్, 2వ వార్డు, 6వ బ్లాకు, టి.యస్.నెం. 197రులో అసెస్‌మెంట్ నెం. 7082, డోర్ నెం. 20-1-156(3)రులో గల 52 సంవత్సరముల క్రితం కట్టబడిన పురాతన పెంకుటిల్లు, ఖాళీ స్థలమునకు హద్దులు. **తూర్పు:** విశ్వనాధుల వెంకట సుబ్బమ్మ ఆస్థి వెంబడి ఈ ఆస్థి స్వంత ఇంటి గోడ కొంత వరకు, ప్రహరీ గోడ కొంతవరకు - ఈ దిశ 46 అడుగుల 10 అంగుళములు - ప్రహరీ గోడ -21 అడుగులు, **దక్షిణం:** విశ్వనాధుల వెంకట సుబ్బమ్మ ఆస్థి వెంబడి ఈ ఆస్థి స్వంత ఇంటి గోడ కొంత వరకు, ప్రహరీ గోడ కొంతవరకు ఈ దిశ 21 అడుగుల 4 అంగుళములు, **పడమర:** ఈ విక్రయ ఆస్థికి మా తాలూకు ఆస్థికి మధ్య జాయింట్ ఇంటిగోడ - ఈ దిశ 45 అడుగుల 9 అంగుళములు, **ఉత్తరం:** బజారు ఈ దిశ 21 అడుగుల 4 అంగుళములు ప్రహరీ గోడ 21 అడుగులు.

ఈ హద్దులలోని 988 చదరపు అడుగులు లేక 13.3 చ.మీటర్లు పురాతనపు పెంకుటిల్లు, ఇంటికి సంబంధించిన తలుపులు, ద్వారబంధములు, యావద్విశిష్ట కప్పు, కలప సామానులతో సహా ఈ ఆస్థిలో గల నీటి హక్కులతో సహా పైన ఉదహరించిన ఆస్థిని పై మొత్తమునకు విక్రయించి స్వాధీనపరచడమైనది.

ఇట్లు **వేముల వెంకట పవన్ కుమార్,**
గునుపూడి లలిత, అడ్వకేట్స్
గోల్డెన్ టవర్స్, గ్రౌండ్‌ఫ్లోర్, జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు. సెల్ నెం: 98853 84348.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు మేనేజర్ దుర్మరణం

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: ముంగిస ఒక్కసారిగా దూసుకురావడంతో అదుపు తప్పి కిందపడి ఓ బ్యాంకు మేనేజర్ మృతి చెందారు. ఈ సంఘటన త్రిపురాంతకం మండలం సోమేపల్లి సమీపంలోని అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు దూపాడు శాఖలో మేనేజర్‌గా పనిచేస్తున్న షేక్ హబీబున్నీసా (30) సోమవారం విధులకు హాజరయ్యారు. త్రిపురాంతకంలోని ఏపీజీబీ బ్యాంకులో పని ఉండడంతో మధ్యాహ్న సమయంలో అసిస్టెంట్ మేనేజర్ సాయికుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో సోమేపల్లి సమీపంలో వీరి ద్విచక్ర వాహనం కిందకు ఓ ముంగిస దూసుకొచ్చింది. దీంతో వెనుక కూర్చొన్న మేనేజర్ హబీబున్నీసా ఆందోళనకు గురై అదుపు తప్పి కిందపడిపోయారు. ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే ఆటోలో త్రిపురాంతకంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో యర్రగొండపాలెం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె తండ్రి షేక్ అబ్దుల్ షుకూర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివ బసవరాజు తెలిపారు.

విష రసాయనం తాగి వ్యక్తి ఆత్మహత్య

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: నిప్పుల గుండంలో నడిచేందుకు వెళుతున్న వ్యక్తికి అక్కడివారు అభ్యంతరం చెప్పడంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన మండలంలోని కొలుకుల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు..కొలుకుల గ్రామంలో నవంబర్ 28 నుంచి పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పెద్ద షరగత్ నిర్వహించగా..స్థానికుడు పత్తి శ్రీనివాసులు (47) నిప్పులగుండంలో నాలుగుసార్లు నడిచారు. అయిదోసారి నడిచేందుకు వెళుతుండగా, గ్రామస్థులు మిగతా వారికి కూడా అవకాశం ఇవ్వాలంటూ సున్నితంగా వారించారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసులు ఇంటికి వెళ్లి విష రసాయనం తాగారు. వెంటనే వైద్యశాలలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు స్టేషన్ రైటర్ అంకయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వైద్యుడి మృతి: మార్కాపురం అర్బన్: చికిత్స పొందుతూ ఓ వైద్యుడు మృతిచెందారు. విశ్వసనీయ సమాచారం మేరకు..స్థానిక సర్వజన ఆసుపత్రిలో గౌతమ్‌రెడ్డి (28) వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఆరోగ్యం బాగా లేకపోవడంతో రెండు రోజుల క్రితం ఒంగోలు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 118, రిటైల్ లైవ్ - 145, చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్- 239

క్రిస్మస్ నక్షత్రం ఏర్పాటుచేస్తూ.. కడతేరిన పేద బతుకులు

న్యూస్‌టుడే, త్రిపురాంతకం : క్రిస్మస్ కాంతులు చూడకుండానే ఆ నిరుపేద బతుకులు కడతేరాయి..పండగ సమీపిస్తున్న వేళ..ఆయా కుటుంబాల్లో అంతులేని వేదనే మిగిలింది. స్తంభాన్ని నిలబెడుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు మృతి చెందగా..మరో ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. ఈ విషాద సంఘటన త్రిపురాంతకం మండలంలోని కొత్త అన్నసముద్రంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్త అన్నసముద్రంలోని ఎస్సీ కాలనీవాసులు క్రిస్మస్ సందర్భంగా తమ వీధిలో నక్షత్రాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావించారు. ప్రతి ఏటా పెద్దఎత్తున ఖర్చు చేసి కర్రలు పాతి నక్షత్రాన్ని ఏర్పాటు చేసేవారు. ఈసారి కేవలం ఓ స్తంభం ఏర్పాటుచేస్తే సరిపోతుందని భావించి ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో రోడ్డుకు ఓ వైపు 11 కేవీ లైన్ విద్యుత్తు స్తంభం ఉండగా..మరోవైపు ఇంకో స్తంభాన్ని నిలబెడుతుండగా, 11 కేవీ తీగలు తాకాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై పచ్చిగోర్ల విజయ్ (46), వీర్నపాటి దేవయ్య (49) రోడ్డుపై పడిపోయారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనలో దావీదు, యోహాన్, పిచ్చయ్య స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కుటుంబ యజమానుల మృతితో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్సై శివ బసవరాజు, విద్యుత్తు ఏఈ సురేష్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను యర్రగొండపాలెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విజయ్, దేవయ్య (పాత చిత్రాలు)

రెక్కాడితే కానీ.. : విద్యుత్తు ప్రమాదంలో మృతి చెందిన పచ్చిగోర్ల విజయ్, వీర్నపాటి దేవయ్య కుటుంబాలది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. ప్రతిరోజు కూలి పనులకు వెళ్తూ తమ జీవితాల్ని నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో యమపాశాలు వీరి కుటుంబాలను రోడ్డున పడ్డాయి. పాలకులు, అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు వాపోతున్నారు.

రోదిస్తున్న బాధితులు

చోరీ కేసులో బావే నిందితుడు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: బావమర్ది ఇంటిలో బావ దొంగతనం చేసి వెండి వస్తువులు అపహరించిన సంఘటన మండలంలోని సుంకరవారిపాలెంలో చోటు చేసుకుంది. ఎస్సై కె.కమలాకర్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ గ్రామంలో గత నెల 13న గునుపూడి సురేష్‌బాబు ఇంటిలో తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న వెండి వస్తువులను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మారెళ్లలో నివాసం ఉంటున్న సురేష్‌బాబు బావ అరవీటి కోటేశ్వరరావును పోలీసులు పట్టుకొని విచారించగా.. అతడి వద్ద సుమారు రూ. 1,10,000 విలువ చేసే వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. నిందితుడిని దర్శి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. ఏఎస్సై హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో గేదె మృతి

రాచర్ల, న్యూస్‌టుడే : చిరుత దాడిలో ఓ గేదె మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని అనుములపల్లి సమీపంలోని లింగమయ్య కొండ వద్ద సోమవారం జరిగింది. అటవీ అధికారుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొందరు గేదెలను మేపుకునేందుకు కొండ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఓ చిరుత ఆకస్మికంగా దాడి చేయడంతో భాస్కర్ అనే రైతుకు చెందిన గేదె మృతిచెందింది. దీంతో అటవీ సిబ్బంది ట్రాప్ కెమేరాలు ఏర్పాటు చేశారు. డీఆర్వో వంశీకృష్ణ కుమారి, బీట్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

డ్వాక్రా డబ్బులు కాజేశారని ఆందోళన

ముండ్లమూరు, న్యూస్‌టుడే: బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్మును స్వాహా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా సంఘాల మహిళలు ధర్నా చేపట్టారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సోమవారం పెదఉల్లగల్లు గ్రామానికి చెందిన అయిదు సంఘాల సభ్యులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దర్శిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో రుణాలు తీసుకున్నామని.. అందుకుగాను ప్రతి నెలా చెల్లించాల్సిన వాయిదాలను లక్ష్మీనగర్‌కు చెందిన బ్యాంకు మిత్ర మేడం మోహన్‌రెడ్డికి కడుతున్నామని తెలిపారు. ఆ నగదును బ్యాంకులో చెల్లించకుండా అతడు స్వాహా చేశాడని వాపోయారు. అందరం కూలీనాలీ చేసుకొని జీవనం సాగిస్తున్నామని, తమను మోసం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అయిదు గ్రూపుల సభ్యుల నుంచి మొత్తం రూ.4,34,000 నగదు కాజేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బ్యాంకు అధికారులను ప్రశ్నించగా.. తిరిగి తమపైనే కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఏపీఎం హనుమంతరావు, బ్యాంకు మేనేజర్లతో చరవాణిలో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ధర్నాలో 50 మంది మహిళలు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

ఇల్లు అపార్ట్‌మెంట్సు ల్యాండ్ డెవలప్‌మెంట్ కొరకు సంప్రదించండి. మాచే నిర్మించబడే నిర్మాణాలకు 5సం వత్సరాల వరకు వారంటీ లభించును. www.mistermason.in ✆6300923212

PLOT FOR SALE

East Facing 364 Sq.Yards Plot in SBI Colony, Kurnool Road, Ongole. is for URGENT sale. No Brokers. Ph: 83285 05374.

JOBS

Jobs in Bangalore International Airport. Handyman Baggage Loders. Q: 10+2/ ITI/Degree. Age: 18 to 27. Salary: 16500 to 25000. ✆ 7989597376.

Wanted Sales Executives For Guntur, Ongole for Mahesh Extruions (P) Ltd Bellari Send Your Resumes maheshpvcpipes@gmail.com

హోటల్ కావేరి గ్రాండ్, ఒంగోలు నందు పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్ట్, మేనేజర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ఫ్రీ భోజనం +వసతి కలదు. 9390644167.

నెల్లూరు సిటీ ప్రముఖ పాల ఫ్యాక్టరీలో పనిచేయుటకు హెల్పర్స్ కావలెను. జీతం+ రూమ్+EPF+ESI కలదు. సెల్: 9705551528.

వంట మాస్టార్లు భార్యభర్తలు కావలెను వసతి కలదు, వరంగల్ సిటీలోని ప్రైవేటు మెడికల్ కాలేజిలో వంటచేయుటకు. ✆ 9390809999, 9849235255.

ఒంగోలు, మార్కాపురం APSRTC కార్గో కౌంటర్ నందు పనిచేయుటకు (M) కావలెను. మంచి జీతం కలదు. సెల్: 95428 67588, 80081 22450

WANTED
సాయిగౌతమి ఎర్త్ మూవర్స్ & టిప్పర్ సర్వీసెస్ & కన్‌స్ట్రక్షన్‌లో పనిచేయుటకు M.S. ఆఫీస్, Excel లో అనుభవం కల్గిన (స్త్రీ) కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సంతనూతలపాడు, శాలరీ 15 వేలు
Cell: 9000429888
9949961572

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మార్కాపురం
•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

వై.పాలెం: బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మార్కాపురం పట్టణం: బహుమతులు అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

ఉపన్యాసాలతో అదరగొట్టారు

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: 'ఈనాడు' నిర్వహిస్తోన్న ప్రతిభా పాటవ పోటీలతో ప్రతిభా వికాసం సాధ్యమని వక్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపన్యాస పోటీల్లో ఎస్కే. సౌమ్య (ప్రథమ), బి.వరుణ్‌సాయి నాయక్(ద్వితీయ), జి.ఉమా మహేశ్వరి(తృతీయ) స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా 'ఈనాడు' అందించిన బహుమతులను ఉపాధ్యాయులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాణి, ఉపాధ్యాయులు చెన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

◗ మార్కాపురం పట్టణం: పట్టణంలోని జీఎంఆర్ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో డీవీ.సాయిగణేష్, ఎస్‌డి.తాజీబ్, ఈవీ.అరవింద్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వారికి పాఠశాల ప్రిన్సిపల్ జి.మల్లికార్జునరెడ్డి, ఇతర సిబ్బంది బహుమతులు అందజేసి అభినందించారు. ◗ పొదిలి: పొదిలిలోని ఆల్ఫా ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ బహుమతి షేక్ జహీద్‌బాషా (9వ తరగతి), ద్వితీయ బహుమతి జి.హవా విశ్వాక్ (9వ తరగతి), తృతీయ బహుమతి ఎస్.ప్రగతి (8వ తరగతి) గెలుచుకున్నారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ వెంకట్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

◗ మార్కాపురం గ్రామీణం: 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వేములకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఐ.కవితారెడ్డి (10వ తరగతి) ప్రథమ, టి.సంధ్యారాణి (10వ తరగతి) ద్వితీయ, ఐ.గాయత్రి (8వ తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డితో పాటు ఉపాధ్యాయులు శివకుమారి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, సూర్యచంద్ర, మధుసూదన్, విజయకుమారి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

పొదిలి : సత్తాచాటిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

మార్కాపురం గ్రామీణం: బహుమతులు ఇస్తున్న హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

కంభం, న్యూస్‌టుడే : లింగోజిపల్లిలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి పింఛన్ల నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, సొసైటీ బ్యాంకు ఛైర్మన్ కేతం శ్రీనివాసులు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జున, ఎంపీడీవో వీరభద్రాచారి, తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

అందని మధ్యాహ్న భోజనం బిల్లులు

☛ సాంకేతిక లోపంతో నిర్వాహకులు విలవిల

న్యూస్‌టుడే, కంభం

మధ్యాహ్న భోజనం బిల్లులు అందక నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఔరంగాబాద్ ప్రాథమిక పాఠశాలలో ఈ దుస్థితి నెలకొంది. దీంతో తమ కుటుంబం గడవడం కష్టంగా మారిందని వారు వాపోతున్నారు. ఆ పాఠశాలలో ఒకటి నుంచి అయిదో తరగతి వరకూ విద్యార్థులు చదువుకుంటున్నారు. అక్కడ మధ్యాహ్న భోజనం తయారుచేసిన వారికి సుమారు ఏడాదిన్నరగా బిల్లులు రావడం లేదు. గతేడాది పాఠశాలను సుమారు నెల రోజుల పాటు మూసివేయడంతో బడి ఐఎంఎంఎస్ ఐడీని క్లోజ్ చేశారు. ఆ తర్వాత మళ్లీ పాఠశాలను పునః ప్రారంభించారు. అప్పటినుంచి ఐడీ లేకపోవడంతో బిల్లులు రావడం లేదు. సొంత నిధులతో కూరగాయలు, నూనె వంటివి కొనుగోలు చేసి వండిపెడుతున్నానని వంట నిర్వాహకురాలు సరస్వతి వాపోయారు. గౌరవ వేతనం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయన్నారు. విద్యార్థులకు అవసరమైన గుడ్లు, చిక్కీలు క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు గని వెంకటేశ్వర్లు సొంత నిధులతో కొనుగోలు చేసి ఇస్తున్నారు. బియ్యం మాత్రం పలు బడుల్లో అప్పుగా తీసుకొచ్చి వండి పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మధ్యాహ్న భోజనం బిల్లులు అందించి పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. మూడు, నాలుగు రోజుల్లో ఐడీ వచ్చే అవకాశం ఉందని ఎంఈవో -2 శ్రీనివాసులు తెలిపారు.

పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

బస్సు వద్ద విద్యార్థులు, గ్రామస్థులు

జాఫ్లాపురానికి ఆర్టీసీ బస్సు సర్వీసు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మండలం జాఫ్లాపురం గ్రామానికి కంభాలపాడు మీదుగా ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభించినట్లు డీఎం శంకరరావు తెలిపారు. అక్కడి విద్యార్థుల సౌకర్యార్థం సోమవారం నుంచి బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రయోగాత్మకంగా ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం ఒక ట్రిప్పు తిరుగుతుందన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, భాజపా నాయకులు బి.విజయలక్ష్మి పలుమార్లు ఈ సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. గ్రామస్థులు బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటిసారిగా గ్రామానికి బస్సు రావడంతో జాఫ్లాపురం గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు.

దేశ సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: దేశానికి దశాదిశను చూపించి అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆ పార్టీ నేత నదీమ్ జావీద్ అన్నారు. సోమవారం బేస్తవారపేటలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా స్థాయిలో పార్టీ పనితీరు, నాయకత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల అభిప్రాయాల సేకరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తున్నట్లు తెలిపారు. భాజపా నిరంకుశ పాలనతో భారత రాజ్యాంగంతో పాటు భారతీయులందరికీ పెనుముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి ఈవీఎం ఓటు ఎన్నికలు వద్దు.. బ్యాలెట్ ఓటే ముద్దు అనే నినాదంతో సోషల్ మీడియా వేదికగా నిరసనలు చేపట్టాలంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ పరిశీలకులు డాక్టర్ జాన్‌బాబు, పీసీసీ డాక్టర్ సెల్ ఛైర్మన్ సతీష్, సీనియర్ నాయకులు చిలకల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత నదీమ్ జావీద్

యంత్రాంగం ఉరుకులు..పరుగులు

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: 'ఈనాడు' కథనాలతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. గ్రావెల్ అక్రమార్కులకు కళ్లెం వేశారు. కొమరోలు చెరువులో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారిని అడ్డుకున్నారు. 'చెరువులో దొంగలు పడ్డారు' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితం కావడంతో స్పందించిన తహసీల్దార్ కె. వెంకటేశ్వరరావు ఇతర అధికారులు మట్టి తవ్వుతున్న ప్రాంతానికి బయలుదేరారు. ఈ సమాచారం రవాణాదారులకు తెలియడంతో ట్రాక్టర్లు, జేసీబీలను అక్కడి నుంచి తరలించేశారు. అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇరిగేషన్ ఏఈ చంద్రశేఖర్, సర్వేయర్ రాములు నాయక్, వీఆర్వో వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

యర్రగొండపాలెం: చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఈనాడు కథనానికి స్పందన

మూగజీవాల కష్టాలు దూరం..

కంభం: ఔరంగాబాద్ గ్రామంలో పశువుల దాహం కష్టాలు తీరాయి. 'తొట్టె నిర్మించి.. నీళ్లు విస్మరించి..' శీర్షికన సోమవారం ఈనాడులో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన ఏపీవో జీవరత్నం సిబ్బందిని పంపించి తొట్టెలో నీరు నింపి పశువుల దాహార్తి తీర్చారు.

తొట్టెలోని నీరు తాగుతున్న పశువులు

ట్యాంకులకు నీటి సరఫరా

పెద్దారవీడు: గత నెల 30న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన గ్రామంలో నీటి సమస్యపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి పంచాయతీ కార్యదర్శి హర్ష, గ్రామ సర్పంచి ఇండ్లా రజితారెడ్డి స్పందించారు. మోటార్లకు మరమ్మతులు చేయించి, ట్యాంకులకు నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

శంకుస్థాపనలో పాల్గొన్న తెదేపా నేత ఎరిక్షన్‌బాబు, నాయకులు

పల్లె పండగతో గ్రామాభివృద్ధి

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే : పల్లె పండగతో గ్రామాభివృద్ధి పరుగులు పెడుతుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గంగపాలెంలో సోమవారం పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లె పండగ-1లో విస్తారంగా సీసీ రోడ్లు, డ్రైన్లు, తారురోడ్ల నిర్మాణం చేపట్టామని, మిగిలిన పనులను ఈ విడత పూర్తిచేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఏఎంసీ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల కన్వీనర్ చిట్యాల వెంగళరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు బలిజ సంఘం అధ్యక్షుడిగా కమతం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు బలిజ సేవా సంఘం అధ్యక్షుడిగా కమతం శ్రీనివాసులను సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గోనుగంట్ల నరసింహారావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పొదిలి, న్యూస్‌టుడే: ఉప్పలపాడు ఉప విద్యుత్తు కేంద్రంలో నిర్వహణ పనుల దృష్ట్యా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మోహన్ రెడ్డి తెలిపారు. కంభాలపాడు, పొదిలి, ఉప్పలపాడు, కాటూరివారిపాలెం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు సరఫరా ఉండదని, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

కొనకనమిట్ల, న్యూస్‌టుడే

?: నాగంపల్లి ఎస్సీ ప్రాథమిక పాఠశాల వెళ్లే దారిలో నివాసాల చెంత చెత్తా చెదారం పడేస్తున్నారు. దీంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. రహదారి వెంబడి చెత్త వేయకుండా చూడాలి. – గ్రామస్థులు

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. –శ్రీదేవి, ఈవోఆర్డీ

?:కొనకనమిట్ల మండలంలోని గార్లదిన్నె గ్రామంలో మంచినీటి పైపులైన్ దెబ్బతినడంతో కలుషితమై నీరు సరఫరాతో అవస్థలు పడుతున్నాం. - నారాయణయ్య, స్థానికుడు

✓:పంచాయతీ సిబ్బందితో మాట్లాడి త్వరలో పైపులైన్ మరమ్మతులు చేయిస్తాం. –శ్రీదేవి, ఈవోఆర్డీ

ప్రయాణం.. జర భద్రం

వందలాది వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే మార్కాపురం-దోర్నాల రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. పెద్దారవీడు మండలం కొత్తపల్లి సమీపంలోని చెరువు కట్టపై మూలమలుపు వద్ద పెద్ద నెర్రెలు ఏర్పడ్డాయి. వాహనాలు ఎదురెదురుగా వస్తే.. అంచున ఉన్న వాహనం దిగబడిపోయే ప్రమాదముంది. అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దారవీడు

పేరుకే పట్టణం..అంతా అధ్వానం

పొదిలి పేరుకే పట్టణం. అక్కడి మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇస్లాంపేటలోని ఓ వీధిలో మురుగునీటి కాలువలు లేకపోవడంతో నీరు కిందకు పారడం లేదు. మురుగు నిలిచిపోయి దోమల బెడద తీవ్రమవుతోంది. ఇక వర్షం పడినప్పుడు మురుగు నీరంతా ఇళ్ల ముందుకు వచ్చి నడిచేందుకు వీలు లేకుండా ఉంటోంది. - పొదిలి, న్యూస్‌టుడే

పదునైన చువ్వలతో ప్రమాదం

నిత్యం రద్దీగా ఉండే ఎస్వీకేపీ కళాశాల రోడ్డులోని హోండా షోరూం వద్ద ప్రధాన రహదారి పక్కన ఇనుప చువ్వలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల కారు ఢీకొట్టి అక్కడి మూడు స్తంభాలు విరిగిపోగా, వాటిని తీసేసిన సిబ్బంది ఇనుప చువ్వలు తొలగించకుండా వదిలేశారు. పదునుగా ఉన్న ఆ చువ్వలపై పడితే ప్రాణాపాయం తప్పదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. -న్యూస్‌టుడే, మార్కాపురం అర్బన్

సమస్యలు పరిష్కరించాలని అర్జీలు

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అర్జీలు సమర్పించారు. సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమానికి హాజరై పరిపాలనా అధికారి రవీంద్రరెడ్డికి వాటిని అందజేశారు. మార్కాపురం మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలంటూ సీపీఐ నాయకులు అర్జీ సమర్పించారు. తన భూమి ఆక్రమించారంటూ దోర్నాలకు చెందిన తోట లక్ష్మయ్య అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దరిమడుగులో అంబేద్కర్ విగ్రహానికి స్థలం కేటాయించాలంటూ చింతకుంట్ల బాబు అనే వ్యక్తి వినతిపత్రం అందజేశాడు. వివిధ సమస్యలపై మొత్తం 14 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ప్రైవేటు బడుల సమస్యల పరిష్కారానికి కృషి

పొదిలి: ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం ఆపుస్మా ముందుండి పోరాడుతుందని రాష్ట్ర అధ్యక్షుడు కె. తులసి విష్ణుప్రసాద్ అన్నారు. పొదిలిలో జరిగిన ఏపీ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి అవసరమైనప్పుడు న్యాయస్థానాల ద్వారా పోరాడుతున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు కె.మాధవరావు మాట్లాడుతూ జిల్లా నుంచి విడదీసి నాలుగు నియోజకవర్గాలతో ఏర్పాటు అవుతున్న మార్కాపురం జిల్లాలో ఆపుస్మా అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని కోరారు. మార్కాపురం ఉపవిద్యాశాఖాధికారి ఎం.శ్రీనివాసులు మాట్లాడారు. పొదిలి ఎంఈవో-2 నాగలక్ష్మి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు ఎస్.వెంకటేశ్వరరెడ్డి, బ్రహ్మారెడ్డి, నారాయణ, సురేష్, భరత్, శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు తులసి విష్ణుప్రసాద్

సద్దుమణిగిన పిటికాయగుళ్ల వివాదం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: పిటికాయగుళ్లలో ఇరు వర్గాల మధ్య తలెత్తిన వివాదం అధికారుల జోక్యంతో సద్దుమణిగింది. గ్రామ శివార్లలో ఓ సామాజికవర్గానికి చెందిన వారు పోలేరమ్మ గుడి నిర్మించి 16 రోజుల పండుగ నిమిత్తం పాత అంకాలమ్మ గుడి వద్ద పూజలు చేసేందుకు ఇటీవల ఊరేగింపుగా వచ్చారు. అయితే గ్రామంలో మరో సామాజక వర్గం వారు దీన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో అప్రమత్తమైన మార్కాపురం సబ్‌కలెక్టర్ శివరామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు, తహసీల్దార్ జితేంద్ర, కంభం సీఐ మల్లికార్జున సోమవారం ఇరువర్గాల వారిని స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్దకు పిలిపించారు. ఉద్రిక్తతకు దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకుని విచారించారు. సామరస్యంతో మెలగాలని ఇరు వర్గాల వారికి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఇరువర్గాలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు తదితరులు

మాట్లాడుతున్న వ్యకాస జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఇతర నాయకులు

అసైన్డ్ భూముల చట్టం సవరించొద్దు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములపై, ప్రభుత్వానికి చెందిన వివిధ రకాల భూములపై ఇప్పటి వరకు ఉన్న క్రయ విక్రయాల నిషేధాన్ని కొనసాగించాలని.. ఎట్టి పరిస్థితుల్లో దాన్ని సవరించొద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. ఆంజనేయులు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ కార్మిక మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంఘాల పోరాటాల ఫలితంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు లక్షల ఎకరాల భూములు స్వాతంత్య్రం అనంతరం పేదలకు పంచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గడచిన దశాబ్ద కాలంలో అధికారంలో ఎవరున్నా కార్పొరేట్ శక్తులకు అడ్డుగోలుగా కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఇటువంటి చర్యలు మానుకొని పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.బాలనాగయ్య, టి.ఏడుకొండలు, ఎం.రమేష్, శ్రీను పాల్గొన్నారు.

అవీ... ఇవీ... అన్నీ...

డిప్యూటీ ఎంపీడీవోగా గరీబ్‌ఖాజా

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండల డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్కే. గరీబ్‌ఖాజా బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామంలో గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై మార్కాపురం వచ్చినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

కంభం డిప్యూటీ ఎంపీడీవోగా..

కంభం, న్యూస్‌టుడే : మండల డిప్యూటీ ఎంపీడీవోగా దేవరశెట్టి బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొమరోలు పంచాయతీ ఈవోగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఎంపీడీవో వీరభద్రాచారికి ఉత్తర్వుల పత్రాలు అందజేశారు. ఆయన్ను కార్యాలయ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సత్కరించారు. పలువురు అభినందనలు తెలిపారు.

దివ్యాంగులకు ప్రోత్సాహం

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం దివ్యాంగులకు ప్రోత్సాహాన్ని అందిస్తోందని, క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి హాజరై ఫిజియోథెరపీ చేయించుకోవాలని ఎంఈవోలు కేటీ మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డి అన్నారు. వైద్యులు అంకారావు ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలను వారు సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం రవాణా వసతితో పాటు పలు సౌకర్యాలు కల్పిస్తోందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు హుస్సేనీ, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీగా మార్చాలని వినతి

యర్రగొండపాలెం పట్టణం: అయ్యంబొట్లపల్లెను గ్రామ పంచాయతీగా మార్చాలని భాజపా నాయకులు సోమవారం ఎంపీడీవో శ్రీనివాసరావుకు అర్జీ అందజేశారు. ప్రస్తుతం అయ్యంబొట్లపల్లె గంగపాలెం గ్రామ పంచాయతీలో ఉందని తెలిపారు. గంగపాలెం దూరంలో ఉన్నందున అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. భాజపా మండల అధ్యక్షుడు మాదాల సూర్యనారాయణ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, బాదరయ్యగౌడ్ పాల్గొన్నారు.

బోల్తాపడిన లారీ

త్రుటిలో తప్పిన ముప్పు

అల్లినగరం (కొమరోలు గ్రామీణం), న్యూస్‌టుడే: వేగంగా వెళ్తూ లారీ బోల్తాపడిన ఘటనలో త్రుటిలో ముప్పు తప్పింది. మైదుకూరు-తాటిచెర్ల రాష్ట్రీయ రహదారి మార్గంలోని తిమ్మారెడ్డిపల్లె వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. కడప నుంచి గుంటూరు వైపునకు ముడి ఇనుము లోడుతో లారీ బయలుదేరింది. సోమవారం ఉదయం రహదారి పక్కన లారీ బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాలేవీ అటువైపుగా రాకపోవడంతో ముప్పు తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ సందీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్రేన్ సాయంతో లారీని బయటికి తీసి ముడి ఇనుమును మరో లారీలో లోడ్ చేసి తరలించారు.

వైభవంగా గీతా జయంతి వేడుకలు

మార్కాపురం పట్టణం: మార్కాపురం పట్టణంలో సోమవారం రాత్రి విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక, హనుమాన్ శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీకృష్ణున్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కోలాటం, భాజా భజంత్రీల నడుమ మాఢ వీధుల్లో ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మహిళలచే భగవద్గీత పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు.

పూజలందుకున్న రాధాకృష్ణులు

పెద్దనల్లకాలువలో..

కంభం: గీతా జయంతిని పురస్కరించుకొని మండలంలోని పెద్దనల్లకాలువ గ్రామంలో సోమవారం రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతా పారాయణం, ఏకాదశి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

త్రిపురాంతకం గ్రామీణం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మ వారి ఆలయంలో గీతా జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి గ్రామంలో ప్రదర్శన చేశారు. భగవద్గీతలోని అధ్యాయాల గురించి వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యదర్శి యక్కలి రాఘవులు, సంస్కృత అధ్యాపకులు వై.రాధాకృష్ణమూర్తి వివరించారు.

మార్కాపురం పట్టణం: శ్రీకృష్ణులు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

జిల్లా ఏర్పాటుపై మాజీ సైనికుల సంబరాలు

కంభం, న్యూస్‌టుడే : మార్కాపురం జిల్లా ఏర్పాటుపై మాజీ సైనికులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక కార్యాలయంలో కేకు కోసి వేడుకలు నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు శెట్లం వేణుగోపాల్ మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం మాజీ సైనికుల దశాబ్దాల కల నెరవేరబోతోందని చెప్పారు. కొత్త జిల్లాలో కంభం చెరువు, వెలిగొండ ప్రాజెక్టులను పర్యాటకంగా తీర్చిదిద్దాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు అంకయ్యగౌడ్, ఉప కార్యదర్శి ఎస్.ప్రసాద్, ఎన్.పోలయ్య, మస్తాన్‌వలీ, నెమలిగుండం కోటయ్య, రామయ్య, మహిళలు లక్ష్మి, రాజమ్మ పాల్గొన్నారు.

కేకు కోసి ఆనందం పంచుకుంటున్న మాజీ సైనికులు

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

ఆకట్టుకున్న ఉపన్యాస పోటీలు

కనిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని చాకిరాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఎంతో చక్కగా తమ ఆలోచనలను వివరించారు. డి.వర్షిక, జి.అమర్, వి.అక్షయలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు టి.పెద్దిరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ సుశీల, ఉపాధ్యాయులు టి.వెంకటరమయ్య, బి.మల్లేశ్వరి, టి.రమణారెడ్డి, లక్ష్మీనారాయణ, నాగరాజు, లీలాకుమారి, రవిశంకర్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి తదితరులు

పారిశ్రామికాభివృద్ధితో ఉపాధి అవకాశాలు

పీసీపల్లి: మండలంలోని దివాకరపల్లిలో ఏర్పాటు చేస్తున్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటు ప్రాంతాన్ని కనిగిరి, కందుకూరు, పర్చూరు ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, ఏలూరి సాంబశివరావు, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యలు సోమవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజల వలసల నివారణకు బయోగ్యాస్, ఎంఎస్ఎంఈ పార్కులను సీఎం చంద్రబాబు మంజూరు చేశారన్నారు. దీనివల్ల పారిశ్రామికంగా అభివృద్ధి చెంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు

టంగుటూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రతి నెలా లబ్ధిదారులకు ఠంచనుగా పింఛను సొమ్ము అందిస్తుందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. మండలంలోని శివపురంలో పింఛన్ల పంపిణీ పాల్గొన్నారు. సామాజిక పింఛన్ల రూపంలో 17 నెలల్లో లబ్ధిదారులకు రూ.50,773 కోట్ల నగదు అందించామని, దేశంలో ఏ రాష్ట్రం ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయడం లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందిస్తున్నామన్నారు. ఆయన వెంట ఒంగోలు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, జనసేన కొండపి నియోజకవర్గ బాధ్యుడు కనపర్తి మనోజ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో దేవసేన కుమారి తదితరులు పాల్గొన్నారు. ● కనిగిరి: పింఛన్లు సకాలంలో ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఏడో వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో నియోజకవర్గంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. తెదేపా నాయకులు మనోహరరావు, ఫిరోజ్, రంగబాబు, రవి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ✷ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తూరులో చాయ్-3.0 కార్యక్రమంలో భాగంగా పర్యటించారు.

కనిగిరిలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, నాయకులు

రోడ్లు, మురుగు, తాగునీరు, విద్యుత్తు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా కనిగిరి- పామూరు జాతీయ రహదారిలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే, తెదేపా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● జరుగుమల్లి: మండలంలోని వావిలేటిపాడులో రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఎంపీడీవో రమణమూర్తి, తహసీల్దార్ మురళి, డిప్యూటీ ఎంపీడీవో కామేశ్వరరావు, మండల తెదేపా అధ్యక్షుడు రవీంద్ర, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● తాళ్లూరు: మండలంలోని కొర్రపాటివారిపాలెంలో దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 25 మందికి స్పౌజ్ కోటా కింద కొత్తగా పింఛన్లను అందజేస్తున్నట్లు తెలిపారు. సర్పంచి శ్రీదేవి, ఎంపీడీవో అజిత, తహసీల్దారు రమణారావు, సీఐ వై.రామారావు, దర్శి మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు. ● దర్శి: తెదేపా పట్టణ అధ్యక్షుడు చిన్నా ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పాపారావు, ఇతర నాయకులు దర్శిలో పింఛన్ల పంపిణీ చేశారు. ✷ ప్రకాశం జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని కొనసాగించేందుకు సహకరించిన జిల్లా కలెక్టర్ రాజాబాబుకు గొట్టిపాటి లక్ష్మితో కలిసి స్థానిక నేతలు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

తాళ్లూరు: కేవీపాలెంలో మహిళకు నగదు అందిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొండపి (గ్రామీణం)(టంగుటూరు): కొండపి మండలంలోని కె.ఉప్పలపాడు విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా చిన్నవెంకన్నపాలెం, వెన్నూరు, పోదవరం, ముప్పవరం గ్రామాలకు మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ పువ్వాడి శ్రీనివాసులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పట్టణం.. పడకేసిన పారిశుద్ధ్యం!

న్యూస్‌టుడే, కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీలో తరచూ సమస్య

కనిగిరి మున్సిపాలిటీ రోజు రోజుకూ విస్తరిస్తోంది. జనాభా కూడా పెరుగుతూనే ఉంది. అందుకు తగ్గట్లు వసతులు కల్పించడంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత కీలకం. ఎందుకంటే చాలా వీధులు ఇరుకుగా ఉండడం కాలువలు ఆక్రమణలకు గురికావడంతో ఏ మాత్రం వర్షం కురిసినా డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో రోడ్లపై రాకపోకలకు పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

దోమల వ్యాప్తితో వ్యాధుల భయం

ప్రస్తుతం చలి కాలానికి తోడు దిత్వా తుపాను ప్రభావంతో చినుకులు పడుతున్నాయి. దీంతో ఎక్కడికక్కడే రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. చాలా ప్రాంతాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ సరిగా లేక పోవడం, చెత్త నిల్వలు పేరుకు పోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఇలాంటి అపరిశుభ్రత వాతావరణం వల్ల వ్యాధులు వ్యాపిస్తాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జలుబు, దగ్గు, జ్వరాలు తదితర సీజనల్ వ్యాధులు ఎక్కువై ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగింది. ఇలాంటి తరుణంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సిబ్బంది కొరతతో మరింత జటిలం

కనిగిరి మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా, 15375 కుటుంబాలు, 52,139 మంది జనాభా ఉన్నారు. రోజూ 22 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. పారిశుద్ధ్య కార్మికులు పూర్తి స్థాయిలో చెత్తను తొలగించలేక పోతున్నారు. కారణం తగినంత మంది సిబ్బంది లేకపోవడమే. మరోవైపు సరిపడా చెత్త తరలించే వాహనాలు కూడా లేవు. కొన్ని వార్డుల్లో మురుగు కాలువల నిర్మాణం చేపట్టనందువల్ల రోడ్డుపైనే నీరుపారుతుంది. మరి కొన్ని చోట్ల కాలువల్లో పూడికలు తొలగించక దోమలకు నిలయాలకు మారుతున్నాయి. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్‌ను వివరణ కోరగా.. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేస్తామని తెలిపారు.

బీసీ కాలనీ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

కనిగిరి, న్యూస్‌టుడే: ఎయిడ్స్ రహిత సమాజం అందరి బాధ్యతని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సుజన తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్థుల పట్ల చులకన భావం వద్దన్నారు. హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, సూపరింటెండెంట్ వి.సుబ్బయ్య, వైద్యులు తిరుపతిరెడ్డి, ప్రియర్షానంద, వెంకట ఫణికుమార్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● తాళ్లూరు: ఎయిడ్స్ నివారణపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యురాలు కె.మౌనిక సూచించారు. దీనిపై ఆ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. డాక్టరు శ్రీకాంత్‌రెడ్డి, హెచ్ఈవో చంద్రశేఖరరాబు, పీహెచ్ఎన్ ఎంవీ.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుజన, మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్, వైద్యులు, సిబ్బంది

దర్శిలో పదోతరగతి టెస్టు పేపర్ల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు మాలకొండయ్య, రమాదేవి, ఉపాధ్యాయులు

మోడల్ పేపర్లతో విద్యార్థులకు ఉపయోగం

దర్శి, న్యూస్‌టుడే: పదోతరగతి విద్యార్థుల కోసం యూటీఎఫ్ తయారు చేసిన టెస్టు పేపర్ల పుస్తకాలను సోమవారం ఎంఈవోలు మాలకొండయ్య, రమాదేవిలు ఆవిష్కరించారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు మాట్లాడుతూ.. నిపుణులైన ఉపాధ్యాయులచే తయారు చేసిన ఈ పుస్తకాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మీనిగ శ్రీను, రాజశేఖర్, కె.శ్రీనివాసరావు, ఖాసీం, రామారావు, చెంచయ్య పాల్గొన్నారు. ● కనిగిరి: యూటీఎఫ్ అకడమిక్ సెల్ తయారు చేసిన పదోతరగతి మోడల్ పేపర్లను సోమవారం ఆ సంఘం ప్రాంతీయ కార్యాలయంలో ఎంఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థులు సులభతరంగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులతో టెస్ట్ పేపర్లు తయారు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, సంఘం నాయకులు ఎం.రాము, పి.నరసింహులు, రమణయ్య పాల్గొన్నారు.

1,114 పొగాకు బేళ్ల కొనుగోలు

కొండపి (గ్రామీణం)(టంగుటూరు), న్యూస్‌టుడే: కొండపి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 424 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. నెన్నూరుపాడు, మూగచింతల గ్రామాలకు చెందిన రైతులు 1,538 బేళ్లను తీసుకురాగా.. 1,114 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.310, కనిష్ఠ ధర రూ.50, సరాసరి ధర రూ.125 పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు.

మర్రిపూడి ఎంపీడీవోగా నాగూర్‌వలీ

మర్రిపూడి, న్యూస్‌టుడే: మర్రిపూడి ఎంపీడీవోగా షేక్.నాగూర్‌వలీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవోగా పనిచేస్తున్న జగదీష్‌ను స్వామిత్వ జిల్లా నోడల్ అధికారిగా నియమించారు. దీంతో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయనను పూర్తి బాధ్యతలతో ఎంపీడీవోగా నియమించారు. మండల అభివృద్ధికి కృషి చేస్తానని నాగూర్‌వలీ తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోలుగా నియామకం

పామూరు, న్యూస్‌టుడే: మండల డిప్యూటీ ఎంపీడీవోగా షేక్ హజరత్ అలీ బాధ్యతలు చేపట్టారు. మండల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు పారదర్శక సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని తెలిపారు. స్థానిక అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

● సి.ఎస్.పురం: డిప్యూటీ ఎంపీడీవోగా వి.బ్రహ్మానందరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సి.ఎస్.పురం గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై ఉప ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు సచివాలయ ఉద్యోగులు, మండల పరిషత్తు సిబ్బంది, నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు.

నారాయణ స్వామి ఆలయ ఆదాయం రూ.1,96,327

సి.ఎస్.పురం: మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.1,96,327 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు, దేవస్థానం వ్యవస్థాపక ఛైర్మన్ కె.చినఆదినారాయణ తెలిపారు. స్వామివారి దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.48,430, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,620, స్వామివారి పంచామృత అభిషేకాల ద్వారా రూ.16,548, శ్రీపాదకానుకల వల్ల రూ.3,000 సమకూరినట్లు చెప్పారు. శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,05,729 విరాళాలు రాగా.. అందులో సి.ఎస్.పురం గ్రామానికి చెందిన పాలకొల్లు వెంకట విజయ్‌కుమార్‌రెడ్డి, నవ్యదీపికా దంపతులు రూ.50,116 అందజేసినట్లు పేర్కొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరిలోని ఐసీటీసీ కేంద్రం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం విజయవాడలో వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా కనిగిరి ఐసీటీసీ కౌన్సిలర్ పాలడుగు శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ మల్లికార్జునరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

గుంతల దారి.. బాగు చేయరా మరి?

తాళ్లూరు మండలం శివరాంపురం నుంచి చీమకుర్తి మండలం చీమలమర్రికి ఉన్న రహదారి అధ్వానంగా తయారైంది. మంచికలపాడు నుంచి చీమలమర్రి వరకు మూడు కిలోమీటర్ల మేర పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ఇటువైపు రాకపోకలు సాగిస్తున్న చీమకుర్తి, తాళ్లూరు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై చీమకుర్తి ఎంపీడీవో కె.రాఘవేంద్రను సంప్రదించగా.. రహదారి అభివృద్ధికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని, మంజూరుకాగానే త్వరితగతిన పనులు చేయించి రహదారిని బాగు చేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

పేదలకు రూ.5లకే అల్పాహారం, భోజనం అందజేసే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ నిర్మాణం దర్శి పట్టణంలో తుది దశకు చేరుకుంది. గత తెదేపా హయాంలో శంకుస్థాపన చేసిన ఈ భవన నిర్మాణం స్లాబు దశలో నిలిచిపోయింది. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం క్యాంటీన్ నిర్మాణాన్ని మూలకు చేర్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం తిరిగి నిధులు మంజూరు చేయడంతో పనులు చివరి దశకు వచ్చాయి. త్వరలోనే క్యాంటీన్ ప్రారంభిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. -న్యూస్‌టుడే, దర్శి

చినుకు పడితే.. జారుడు బల్లే!

మండల కేంద్రమైన జరుగుమల్లిలో తహసీల్దార్, పంచాయతీ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న రోడ్డు దుస్థితి ఇది. ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికే బురదగా మారింది. ఈ కారణంగా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, వృద్ధులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల క్రితం వేసిన రోడ్డు కావడం, ఇళ్ల కంటే తక్కువ ఎత్తులో ఉండడంతోపాటు కాలువలు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపైనే నీళ్లు నిలిచిపోతున్నాయి. ఈ సమస్యపై ఎంపీడీవో రమణమూర్తిని వివరణ కోరగా.. ఇసుక ట్రాక్టర్లు నిత్యం ఇటుగా వస్తుంటాయని, అందువల్లే గుంతలు ఏర్పడ్డాయని చెప్పారు. గ్రామ పెద్దలతో మాట్లాడి రోడ్డు పునర్నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, జరుగుమల్లి

వీధి దీపాలు వేయరూ..!

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కాశిరెడ్డి నగర్‌లో రెండు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు తెలిపారు. ఈ ప్రాంతమంతా కొండలు, అడవి కావడంతో పాములు, ఇతర విష జంతువుల సంచారం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఎన్నిసార్లు మున్సిపల్ అధికార్లకు తెలిపినా అదిగో ఇదిగో వేస్తున్నామని చెబుతున్నారే తప్ప.. ఇంత వరకు ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే వీధిలైట్లు వేయాలని కోరుతున్నారు.



ఈ విషయమై మున్సిపల్ ఏఈఈ కోటేశ్వరరావును వివరణ కోరగా త్వరలోనే వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, కనిగిరి

పాఠశాల పక్కనే ఇదేం పని?

కనిగిరి మున్సిపాలిటీలోని శంకవరంలో గల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పక్కనే పేడ దిబ్బలు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటిలోని చెత్తతో పాటు, పశువుల పేడను పక్కనే వేస్తుండటంతో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోకి దుర్వాసన వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి పేడ దిబ్బలు దూరంగా వేయించేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్‌ను వివరణ కోరగా.. అక్కడ లేకుండా ఎత్తి వేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, కనిగిరి

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?:కురిచేడు మండలం బయ్యవరంలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. – నరసింహారావు, స్థానికుడు
✓:గ్రామంలో ఎక్కడెక్కడ వీధి దీపాలు లేవో పరిశీలించి, రెండు రోజుల్లో ఏర్పాటు చేయిస్తాం.
– వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి

?:మర్రిపూడి మండలం పన్నూరు బీసీ కాలనీలో బోరు పనిచేయక నీటికి ఇబ్బందిగా ఉంటుంది. -శ్రీనివాసులు, స్థానికుడు
✓: మెకానిక్‌ను పంపించి వెంటనే మరమ్మతులు చేయిస్తాం.
–నాగూర్‌వలీ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో

?:తాళ్లూరు మండలం రామభద్రాపురంలో విద్యుత్తు లోవోల్టేజీ కారణంగా రాత్రివేళ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు.
–ప్రభాకరరెడ్డి, గ్రామస్థుడు
✓: త్వరలోనే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
–రామకృష్ణారెడ్డి, ఏఈ

-న్యూస్‌టుడే, కురిచేడు, మర్రిపూడి, తాళ్లూరు

ఐకమత్యంతోనే ట్రిపుల్‌ఐటీ కళాశాల సాధన

పామూరు, న్యూస్‌టుడే: పామూరు ప్రాంతానికి ట్రిపుల్ ఐటీ కళాశాల రావాలంటే ప్రజలు ఐకమత్యంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు కోరారు. మండలంలోని దూబగుంట వద్ద ఈ కళాశాల నిర్మించాలని, వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ పామూరులో సోమవారం ఆయన పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్ర స్థానిక సుందరయ్య భవన్ నుంచి సీఎస్‌పురం రోడ్డు, డీవీపాలెం మీదుగా ట్రిపుల్ ఐటీ కళాశాల భూమి పూజ చేసిన దూబగుంట ప్రాంతం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పామూరు నుంచి పాదయాత్రగా బయలుదేరిన సీపీఎం నాయకులు

వల్లూరమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

టంగుటూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీవల్లూరమ్మ దేవస్థానం పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఇతర నాయకులు హాజరయ్యారు. ముందుగా పాలకవర్గ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో రమేష్ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నేతలు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, బెల్లం జయంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్, దామచర్ల సత్య తదితరులు

మైదానంలో దిగితే మెరుపులే!

న్యూస్‌టుడే, టంగుటూరు

వారంతా గ్రామీణ ప్రాంత బాలికలు. తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో సత్తా చాటుతున్నారు. పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల తర్ఫీదుతోపాటు, ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు స్వీకరిస్తూ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. వాలీబాల్, హ్యాండ్‌బాల్, బేస్‌బాల్, ఖోఖో, అథ్లెటిక్స్, క్రికెట్, టెన్నికాయిట్ వంటి క్రీడల్లో రాణిస్తున్నారు. మెరుగైన ఆటతీరుతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తున్నారు. వారే టంగుటూరు మండలం ఆలకూరపాడు, మర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులు.

ఆలకూరపాడు పాఠశాలలో విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు

వాలీబాల్ పోటీల్లో సత్తా

వరికూటి వందన ఆలకూరపాడు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తండ్రి రాము అదే పాఠశాలలో వాచ్‌మేన్‌గా పని చేస్తుండగా.. తల్లి కుమారి వ్యవసాయ కూలీ. చిన్ననాటి నుంచే తమ కుమార్తెకు క్రీడలంటే ఇష్టమనే విషయం గమనించారు. వాలీబాల్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లి జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించింది. పోలీసు ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమంటుంది.

రాష్ట్రస్థాయిలో పదిసార్లు తలపడి

మర్లపాడు పాఠశాలకు చెందిన **గుమ్మా కీర్తన** పది సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడింది. తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, మాధవిలు రైతులు. తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయురాలు కౌసల్య ప్రోత్సాహంతో మూడేళ్లుగా సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తుంది. జట్టులో ఫస్ట్‌బేస్‌గా ఉత్తమ ప్రదర్శన కనబరుస్తుంది. క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించడమే తన ధ్యేయమని చెబుతుంది కీర్తన.

పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని నిరసన

దర్శి, న్యూస్‌టుడే: నెల్లూరులో డీవైఎఫ్ఐ నాయకుడు, ప్రజా కళాకారుడు పెంచలయ్యను హతమార్చిన గంజాయి ముఠాను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు పిచ్చయ్య డిమాండ్ చేశారు. స్థానిక గడియార స్తంభం కూడలిలో సోమవారం పెంచలయ్య హత్యను నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పెంచలయ్య కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, కాలెబాషా, రంగారావు, జెస్సీపాల్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంపై తాఖీదులు

సి.ఎస్.పురం: సి.ఎస్.పురం పూర్వపు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన వై.మెర్సీకుమారి, ఉప తహసీల్దార్ పి.వెంకటేశ్వర్లుపై చర్యలకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారు సి.ఎస్.పురంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో 2017 జూన్‌లో ఓ రైతు వద్ద పట్టాదార్ పాసుపుస్తం మంజూరు కోసం ముసునూరు వీఆర్వో కె.మాల్యాద్రి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ కేసులో వీఆర్వోను విధుల నుంచి తొలగించారు. తహసీల్దార్ విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించినందుకు, దస్త్రాలు నిర్వహణ సక్రమంగా లేదని, కింది సిబ్బందిపై పర్యవేక్షణ సజావుగా చేయలేదనే కారణాలతో మెర్సీకుమారి, వెంకటేశ్వర్లుకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని సూచించారు.

రెడ్డిసాగర్‌లో కొండచిలువ కలకలం

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ పరిధి రెడ్డిసాగర్‌లో సోమవారం కొండచిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి పశువుల కొష్టంలో ఉన్న డ్రమ్ములోకి ప్రవేశించి అందులోనే దాగి ఉంది. కొష్టం వద్ద గేదెలకు మేత వేసేందుకు వెళ్లిన ఆ రైతు కొండచిలువను గమనించి ఆందోళనకు గురయ్యాడు. విషయాన్ని గ్రామస్థులకు తెలియజేయడంతో వారంతా వచ్చి చూశారు. అనంతరం గోతాంలో బంధించి అటవీ ప్రాంతంలో వదలి వేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపాలెం సమీపాన సోమవారం ఉదయం ఓ ప్రైవేటు పాఠశాల బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. రామభద్రాపురానికి చెందిన అల్లాభక్షూ రజానగరంలోని తన కుమార్తె వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. తూర్పుగంగవరంలోని పాఠశాలకు తాళ్లూరులోని పిల్లలను ఎక్కించుకొని వస్తున్న బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకుడికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ● దర్శి: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన తూర్పువెంకటాపురంలో సోమవారం చోటు చేసుకుంది. 108 అంబులెన్స్ సిబ్బంది వెంకటరెడ్డి, గౌస్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. అదే గ్రామానికి చెందిన జంపాల మూర్తయ్య పొలం నుంచి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అదే సమయంలో గ్రామం నుంచి పరిమి వెంకటేశ్వర్లు దర్శికి వెళుతున్నారు. రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం వెంకటేశ్వర్లును గుంటూరు తీసుకెళ్లారు.

ప్రజా సంఘాల పోరాటాలకు మద్దతు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు త్వరలో తగిన బుద్ధి చెబుతారని మాజీమంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక వైకాపా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థి సంఘాలు ఫీజు రీఎంబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలంటూ ధర్నాలు చేపడుతున్నా ప్రభుత్వంలో చలనం రాలేదని విమర్శించారు. ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు చేసే పోరాటాలకు వైకాపా పూర్తి మద్దతు ఇస్తుందని వివరించారు.

వేలం నోటీసు

ప్రకాశం జిల్లా, దర్శి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 20 బోరు పాత పైపులు వేలం వేయుటకు నిర్ణయించడమైనది.
వేలం తేది: 08-12-2025
సమయం: ఉదయం 11.00 గంటలు
స్థలం: మండల ప్రజా పరిషత్ కార్యాలయం, దర్శి.
ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవచ్చు. వేలంలో పాల్గొనదలచిన వారు వేలం ప్రారంభానికి 30 నిమిషాల ముందు నమోదు చేసుకొని రూ. 200 ధరావత్తు చెల్లించవలసి ఉంటుంది. పాట దక్కించుకున్న వారు ధరావత్తు పోను మిగిలిన మొత్తాన్ని వెంటనే చెల్లించవలెను.
వివరాలకు సంప్రదించవలసిన వారు: ఎంపీడీవో దర్శి

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఎస్.ఎన్.పాడు: మంగమూరులో పింఛన్లు అందజేస్తున్న ఎంపీడీవో సురేష్ బాబు

ప్రజా సంక్షేమానికే అధిక ప్రాధాన్యం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలులోని మరారిపాలెంలో ఇంటింటా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు షేక్ కపిల్‌బాషా, కొరారి నాగేశ్వరరావు, బండారు మదన్ పాల్గొన్నారు.

చీమకుర్తిలో.. మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, తదితరులు

● **ప్రథమ స్థానంలో.. చీమకుర్తి : చీమకుర్తి, న్యూస్‌టుడే:** పింఛన్ల పంపిణీలో చీమకుర్తి పురపాలక సంఘం జిల్లా స్థాయిలో మరోమారు ప్రథమ స్థానంలో నిలిచింది. పింఛనుదారులు మొత్తం 2588 మంది ఉన్నారు. సోమవారం 2,479 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు. ● **మద్దిపాడు, న్యూస్‌టుడే:** మద్దిపాడు మండలం పరిధిలో పలు గ్రామాల్లో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను సోమవారం సాయంత్రానికి 92.6 శాతం పంపిణీ చేశామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు.

కొత్తపట్నం: అల్లూరులో ఎంపీడీవో శ్రీకృష్ణ, తెదేపా నాయకులు

ఎస్.ఎన్.పాడు: పింఛన్ పంపిణీ చేస్తున్న డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్

తుపాను చర్యలపై అధికారులతో సమీక్ష

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో దిత్వా తుపాను ప్రభావిత అవకాశమున్న ప్రాంతాలను అధికారులు సందర్శిస్తున్నారు. అప్రమత్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా నాగులుప్పలపాడులో మండల స్థాయి అధికారులతో ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ సోమవారం సమీక్షించారు. చదలవాడ రామన్న చెరువు, కొత్తకోట హనుమాపురం వాగుల పరిస్థితిపై ఆరా తీశారు.

● **కొత్తపట్నం, న్యూస్‌టుడే:** తుపాన్ నేపథ్యంలో కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం సముద్రంలో అలలు ఎగిసెగిసి పడుతున్నాయి. కొంత మేర సముద్రం ముందుకు వచ్చింది. మండలంలోని తీర ప్రాంతాలు కె.పల్లెపాలెం, ఈతముక్కల, మడనూరు, పిన్నింటివారిపాలెం, గుండమాలలోని మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. సముద్ర తీర ప్రాంతానికి వచ్చిన సందర్శకులను లోపలికి వెళ్లకుండా ఆపివేశారు.

పీపీపీ పద్ధతిలో సముదాయ నిర్మాణం

● పాత మార్కెట్ స్థలంలో ఏర్పాటు
● దరఖాస్తుదారులతో తొలి సమావేశం

నగరపాలక సంస్థ ఆదాయ వనరులు పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. దానిలో భాగంగా నగరంలోని పాత కూరగాయల మార్కెట్ స్థలాన్ని పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ (పీపీపీ) పద్ధతిలో లీజుకు ఇచ్చేందుకు కొద్దిరోజుల క్రితం చర్యలు చేపట్టింది. తద్వారా మంచి ప్రయోజనం కలుగుతుందని ఆశిస్తోంది.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

స్థలం లీజు అంశంపై బిల్డర్లతో కమిషనర్ సమావేశం

ఆరుగురు బిల్డర్లు చొరవ చూపారు

పీపీపీ విధానం అమలుకోసం బిల్డర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా, జిల్లాకు చెందిన ఆరుగురు ముందుకొచ్చారు. వారు ఏమి నిర్మించాలనుకుంది, ఎంత వ్యయం అవుతుంది, ఎలాంటి నమూనాలున్నాయి, ప్రజా ప్రయోజనాలేమిటి వంటి వివరాలతో ప్రాజెక్టు రిపోర్టులు సమర్పించారు. వారితో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం సాయంత్రం తొలి సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

కార్పొరేషన్ డిజైన్ అనుసరించాలి

ఒకరిద్దరు బిల్డర్లు ఎస్ఎఫ్‌టీకి రూ.2500 చొప్పున ఖర్చు చూపుతూ రూ.39 నుంచి రూ.45 కోట్ల వ్యయంతో నాలుగు ఫ్లోర్ల దుకాణ సముదాయం నిర్మిస్తామని చెప్పారు. వీటిని నిశితంగా పరిశీలించి కార్పొరేషన్ డిజైన్‌కు అనుగుణంగా నిర్మాణాలు జరపాల్సి ఉంటుందని కమిషనర్ వారికి వివరించారు. లీజు అగ్రిమెంట్ ఎంతకాలం ఇవ్వాలనే అంశంపై స్పష్టత రానందున మరోసారి సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. ప్రాజెక్టు వ్యయాన్ని బట్టి 33 నుంచి 99 సంవత్సరాల వరకు లీజుకు ఇచ్చేలా మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. ఈనెల 8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారుల సమావేశం జరుగుతున్నందున అక్కడ నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకే నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

మాట్లాడుతున్న మోటార్ వాహన శాఖ అధికారి జయప్రకాష్

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రోడ్డు భద్రత అంటే చట్టాన్ని పాటించడం కాదు. మన ప్రాణాన్ని కాపాడుకోవడమేనని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ అన్నారు. సోమవారం స్థానిక శ్రీహర్షిణి జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్ అధ్యక్షత వహించారు. జయప్రకాష్ మాట్లాడుతూ రవాణా ఉల్లంఘనలకు చట్టప్రకారం ఉన్న జరిమానాలు, శిక్షలు గురించి వివరించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

పరవాడ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: పరవాడ మండలం లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 69వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరిగాయి. వీటిలో ప్రతిభ చాటిన బాలబాలికలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ పరిశీలకులు పట్టాభిరామ్ తెలిపారు. రాష్ట్రంలో తర్ఫీదు అయిన జట్టు జాతీయ స్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన జట్టును అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు అభినందించారు. ● బాలుర జట్టుకు ఎంపికైన వారిలో కె. వెంకటయ్య (ప్రకాశం), బాలికల జట్టులో.. టి. సింధు (ప్రకాశం) ఉన్నారు.

ఎస్సీ కాలనీ వాసుల స్థితిగతులపై ఆరా

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రాచవారిపాలెం ఎస్సీ కాలనీ(మాదిగ పల్లె)ని సోమవారం జిల్లా ఉన్నతాధికారులు సందర్శించారు. మొంథా తుపాను వల్ల ఇళ్లలోకి వరద నీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని కాలనీ వాసులు జిల్లా ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలిసి గత సోమవారం జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో విన్నవించుకున్నారు. దీంతో కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేశు, ఆర్డీవో లక్ష్మీ ప్రసన్నలు సదరు కాలనీని సోమవారం సందర్శించి ప్రజల స్థితిగతులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు వరద వచ్చిన ప్రతిసారీ తమ ఇళ్లలోకి నీరు వస్తుందని, తమకు మెరక ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కేటాయించి పునరావాసం కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ ఆదిలక్ష్మి, మండల సర్వేయర్ అంజని, ఆర్ఐ రమణయ్యలతో పాటు కాలనీవాసులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాలనీ వాసులతో మాట్లాడుతున్న జిల్లా ఉన్నతాధికారులు

రైతులను ఇక్కట్ల పాలు చేయొద్దు

ఒంగోలు కలెక్టరేట్: రైతులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. మొక్క జొన్న కొనుగోలు ప్రక్రియపై స్థానిక ప్రకాశం భవన్ చాంబర్లో సోమవారం మార్కెటింగ్ అధికారులు, వ్యాపారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, కోళ్లపరిశ్రమలకు అవసరమైన మొక్కజొన్నను స్థానిక రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేసి వినియోగించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంట వ్యవధిలో.. రెండు గొలుసు చోరీలు

ఒంగోలు నేర విభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు నగరంలో సోమవారం రాత్రి కేవలం గంట వ్యవధిలో రెండు చోట్ల చైన్‌స్నాచింగ్‌లు జరిగాయి. స్థానిక లాయర్‌పేట సాయిబాబా గుడి సమీపంలో రాత్రి 8.30 గంటల సమయంలో మందాడి కోటేశ్వరమ్మ అనే మహిళ నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని ఆగంతకుడు ఆమె మెడలో ఉన్న గొలుసు లాక్కుని పక్కవీధిలో నుంచి పరుగు తీశాడు. బాధితురాలు కేకలు వేసినా లాభం లేకపోయింది. ఈ ఘటన జరిగిన గంట వ్యవధిలోనే స్థానిక అయ్యప్పస్వామి గుడి సమీపంలో మరో చైన్‌స్నాచింగ్ జరిగింది. కొల్లిపర శారద అనే మహిళ మెడలో నుంచి నడుచుకుంటూ వస్తున్న యువకుడు ఒకరు బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. కోటేశ్వరమ్మ ధరించింది రోల్డ్‌గోల్డ్ ఆభరణం. శారద ధరించింది మూడు సవర్ల బంగారు గొలుసు. బాధితుల ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ సీఐ వై.నాగరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండ్ కూడలిలో విద్యార్థుల మానవ హారం

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

మద్దిపాడు, న్యూస్‌టుడే: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా నియంత్రించ వచ్చని మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ సోమవారం అన్నారు. కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థనా సమయంలో కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఆదినారాయణ, జంతు, వృక్ష శాస్త్ర అధ్యాపకులు కృష్ణారావు, రామచంద్రా రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

చీమకుర్తి, న్యూస్‌టుడే

?: చీమకుర్తి ప్రధాన రహదారి కెనరా బ్యాంకు వద్ద వీధి దీపం కొద్ది రోజులుగా వెలగడం లేదు. రాత్రి వేళల్లో తిరిగేందుకు ఇబ్బందిగా ఉంటోంది. వెంటనే మరమ్మతులు చేయించగలరు. **- శ్రీనివాసరావు, చీమకుర్తి.**

✓: సిబ్బందిని పంపించి పరిశీలిస్తాం. అవసరమైన మరమ్మతులు చేయిస్తాం.

- వై.రామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్, చీమకుర్తి.

కొత్తపట్నం, న్యూస్‌టుడే:

?: కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామంలో ఎంతో కాలం నుంచి డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

- శ్రీనివాసరావు, కొత్తపట్నం

✓: కాలువలు శుభ్రం చేయడం గురించి సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం. ఇతర సమస్యలూ పరిష్కరిస్తాం.

- షేక్. జబీనా, పంచాయతీ కార్యదర్శి

బాలికలను విద్యావంతులు చేయండి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు మానుకొని బాలికలను చదివించాలని సామాజిక కార్యకర్త బాలకాశమ్మ పేర్కొన్నారు. మండలంలోని చంద్రపాలెం, పి.తక్కెళ్లపాడులో గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో బాల్య వివాహాలు మానుకోవాలని ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు.

కొవ్వొత్తులతో మహిళల ప్రదర్శన

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించండి

మద్దిపాడు, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా సీపీఎం కార్యకర్త పెంచలయ్యను హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని పార్టీ మండల నాయకులు కనపర్తి సుబ్బారావు, ఉబ్బా ఆదిలక్ష్మిల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. గంజాయి ముఠా దాడి చేసి హత్య చేశారన్నారు.

మహిళా మార్ట్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలులోని మహిళా మార్ట్ పేరుతో భారీ స్థాయిలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం సీపీఎం నగర పార్టీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘాల నుంచి సేకరించిన సొమ్ము రూ.68 లక్షలు ఉండగా; అందులో ప్రస్తుతం రూ.27 లక్షలు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు చీకటి శ్రీనివాసరావు, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, ఎన్.వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ ముఠాలను అరెస్టు చేయాలని ఆందోళన

పేర్నమిట్ట (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: గంజాయి, డ్రగ్స్ ముఠాలను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బంకా సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి పేర్నమిట్టలో నెల్లూరులో డీవైఎఫ్ఐ నగర యువ నాయకుడు పెంచలయ్య హత్యకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పెంచలయ్యను గంజాయి మాఫియా హత్య చేసిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దాసరి చిన్నబాబు, తుళ్లూరు సుబ్బారావు, కోడూరు రామకృష్ణారెడ్డి, పొత్తూరి చిన్నశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సిమెంట్ రహదారికి భూమి పూజ చేస్తున్న దాతలు

గిరి ప్రదక్షిణ దారి నిర్మాణానికి పూజలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మల్లవరం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం చుట్టూ గిరి ప్రదక్షిణ సోమవారం గోవింద నామాలతో ఘనంగా నిర్వహించారు. గిరి ప్రదక్షిణ సిమెంట్ రహదారి ఏర్పాటుకు దాతలు మండవ జయంత్ బాబు, చలువాది బదరీ నారాయణ, మండవ గోపీచంద్‌తో పాటు గోవింద నామ బృందం వారు పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీవారి వనం అధ్యక్షుడు మార్నేని కృష్ణారావు, కోశాధికారి, మన్నం శ్రీనివాస్, బోయపాటి సుబ్బారావు, కనపర్తి శారద, నారిపెద్ది సతీష్, మార్నేని సుబ్బారావు, ముప్పవరపు ధనలక్ష్మి పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: భార్యను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న రిక్షా కార్మికుని కుటుంబానికి సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ చేదోడుగా నిలిచింది. పామూరు మండలం బోడవాడకు చెందిన యోహాన్ భార్య జాన్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా చికిత్స కోసం జీజీహెచ్‌లో చేర్చారు. నాలుగురోజుల క్రితం మృతి చెందింది. శవాన్ని మార్చురీలో పెట్టారు. విషయం తెలిసి ఆదివారం ఆసుపత్రికి వచ్చిన భర్త తనకు శవాన్ని సొంతూరు తీసుకెళ్లి ఆంత్యక్రియలు చేసే స్తోమత లేదని చెప్పడంతో ఒక స్వచ్ఛంద కార్యకర్త స్పందించి సూర్యశ్రీ ట్రస్ట్‌కు సమాచారం ఇచ్చారు. ట్రస్ట్ కార్యదర్శి ఎస్కే సర్దార్ స్పందించి అంబులెన్స్‌లో స్థానిక శ్మశానవాటికకు తీసుకెళ్లి భర్త, పిల్లల సమక్షంలోనే ఆంత్యక్రియలు జరిపారు. అనంతరం వారి కుటుంబ అవసరాలకు రూ.38వేలు సాయం అందించారు. ఇద్దరు చిన్నపిల్లల్ని ప్రభుత్వ చిల్డ్రన్‌హోంలో చేర్పించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఇల్లు కూల్చివేతపై చర్యలు అవసరం

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: నెహ్రూ కాలనీలో ఇల్లు కూల్చి వేయించిన నాయకులు పసుపులేటి శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవి శంకర్ మాట్లాడుతూ, నెహ్రూ కాలనీలోని డీకే పట్టా భూమిలో ఈద జాస్మిన్ 20 సంవత్సరాలుగా రేకుల షెడ్డు వేసుకుని ఉంటున్నట్లు తెలిపారు. నాయకులు శ్రీనివాసులు నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులతో వచ్చి ఇంటిని కూల్చి వేయించినట్లు ఆరోపించారు.

రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఖజానా శాఖ అధికారులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఖజానా, లెక్కలశాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కె.రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం సహాయ ఖజానా అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక దక్షిణ బైపాస్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఖజానా అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఉద్యోగోన్నతుల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏటీవో కెనడీ, ఎస్టీవోలు జె.వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎలీషారాణి, కార్యదర్శి పీవీ.నారాయణ, కోశాధికారి ఆంజనేయులు, నాయకులు శ్రీనాథ్, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డు ఉచితం

ఒంగోలు కర్నూలు రోడ్డు: భారత్ సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు తమ కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించిందని గుంటూరు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సప్పరపు శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం రూ.1తోనే 30 రోజుల పాటు వ్యాలిడిటీ ఉంటుందన్నారు.

కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి విద్యానగర్‌లో సోమవారం పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాలువలు శుభ్రం చేశారు. 'కాలువలు శుభ్రం చేయండి సారూ'.. అనే శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పురపాలక సంఘం అధికారులు స్పందించారు. నగర్‌లో పలు కాలువలు శుభ్రం చేయించారు. మురుగు సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు .

శిథిల వంతెన.. రాకపోకలకు యాతన

న్యూస్‌టుడే, మద్దిపాడు

నియోజకవర్గంలోని పలు వంతెనలు, వాటి పైనున్న చప్టాలు అధ్వాన స్థితికి చేరినా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ఇందుకు తాజా ఉదాహరణగా నిలుస్తోంది..ముదిగొండ వాగు నేల చప్టా.

తుపాను దెబ్బకు నిలిచిన రాకపోకలు

మద్దిపాడు మండల పరిధి జాతీయ రహదారి నుంచి పెదకొత్తపల్లితో పాటు ఎగువ గ్రామాలకు రాకపోకలు సాగించే ముదిగొండ వాగు నేల చప్టా ప్రమాదకరంగా మారింది. మొంథా తుపాను వల్ల వంతెన ద్వారా రాకపోకలు సాగించే వీలు లేక పలు గ్రామాలకు వారం రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. గతంలో మరమ్మతులు చేసినప్పటికీ తుపాను వరద ఉద్ధృతికి మరమ్మతులు కూడా కొట్టుకుపోయాయి. ద్విచక్ర వాహనాలు, పాదచారులు మాత్రమే రాకపోకలు కొనసాగించడానికి ప్రస్తుతం వీలుగా ఉంటోంది. నేల చప్టా వెడల్పులో సగభాగం శిథిలమైంది. కార్లు, ట్రాక్టర్లలో గ్రామాలకు రాకపోకలు సాగించేవారు భయాందోళనతో వెళ్తున్నారు.

మళ్లీ తుపాను వస్తే ఎలా..

ప్రభుత్వం దిత్వా తుపాను హెచ్చరికలు జారీ చేయడంతో వంతెన గుండా ప్రయాణాలు సాగించు పెదకొత్తపల్లి, గురవారెడ్డిపాలెం, నేలటూరు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరదలొస్తే ఎన్ని రోజులు జలదిగ్బంధంలో ఉండాలో... అని భయపడుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి వంతెన నూతనంగా నిర్మించి ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సగానికి పైగా దెబ్బతిన్న పెదకొత్తపల్లి వంతెన

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆగి ఉన్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మద్దిరాలపాడు వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..బాపట్ల జిల్లా చినగంజాం ఎంపీడీవో ధనలక్ష్మి విధులు ముగించుకొని కారులో ఒంగోలు వెళుతున్నారు. ఈ క్రమంలో మద్దిరాలపాడు శ్రీజీ కళాశాల వద్దకు రాగానే కారు రిపేర్ రావడంతో కారును పక్కన నిలిపి డ్రైవర్ క్యాబిన్ ఓపెన్ చేసి చూస్తున్నాడు. అదే క్రమంలో వేగంగా వస్తున్న కారు ఆగి ఉన్న కారును వెనుక భాగంలో ఢీకొంది. దీంతో కారు ముందు ఉన్న డ్రైవర్ మీదగా కారు వెళ్లడంతో అతనికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసం అయ్యాయి.

వాహనాలపై కేసుల నమోదు

చీమకుర్తి, న్యూస్‌టుడే: రామతీర్థం ప్రాంతంలోని గ్రానైట్ క్వారీల నుంచి తగిన వే బిల్లులు లేకుండా రాళ్లను రవాణా చేస్తున్న వాహనాలపై గనుల విజిలెన్స్ బృందం వారు కేసులు నమోదు చేశారు. ఇందులో ఓ వాహనాన్ని చీమకుర్తి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆయా వాహనాలపై జరిమానా విధించనున్నట్లు అధికారులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుమ్మడి అంజనీసాయి ప్రసాద్ S/o అంజయ్య, మద్దిరాలపాడు గ్రామం, నాగులుప్పలపాడు మండలం, ప్రకాశం జిల్లా అనువారల సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు తండ్రిగారు అయిన గుమ్మడి అంజయ్య విక్రయపత్రం తేది 19.7.1980 ద్వారా కొనుగోలు చేసిన స్వార్జితపు ఆస్థిని వారి మరణానంతరం నా క్లయింటు తల్లిగారు హైమావతి, నా క్లయింటు సోదరులు శ్రీధర్ మరియు సురేష్ అనువారలు నా క్లయింటు పేరట తేది 21.8.2025 డాక్యుమెంట్ నెం. 136/2025 రిజిష్టరు హక్కు విడుదల పత్రం వ్రాయడమైనది. నా క్లయింటు తండ్రిగారి ఒరిజినల్ విక్రయపత్రం తేది 19.7.1980 డాక్యుమెంటు నెం. 1229/1980 ఒంగోలులో జిరాక్స్ తీయించుకొని మోటారు సైకిల్‌పై మద్దిరాలపాడు పోవుచుండగా దారిలో పోయినది. కాన ఒరిజినల్ విక్రయపత్రం ఎవరికైనా దొరికిన యెడల యీ క్రింది అడ్రస్సుదారునికి చెందజేయగలరు.

ఇట్లు సం/- చుండూరి వెంకట్రావు
గోల్డెన్ టవర్స్, Ist ఫ్లోరు
జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం: 94405 10269.

(c) eenadu

స్వాతంత్ర్య సమరానికి గురుతులు

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న స్థానిక మహనీయుల పేరు లతో ఈ శిలాఫలకమిది. ఇది కావలి పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నేటికీ కనిపిస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పాతికేళ్లు పూర్తైన సందర్భంగా అప్పట్లో సమితిల వారిగా ఆనాటి సమరయోధుల పేర్లతో ఇలా శిలాఫలకాలు ఆవిష్కరించారు. కావలి సమితి పరిధిలో 12మంది మహనీ యులు గంగినేని ముత్యయ్యనాయుడు, నరసప్పనాయుడు, కట్టా రామావేంకటరమ్మ, ఒరుగంటి రామచంద్రయ్య, వెంకటసు బ్బయ్య, వెంకటేశ్వర్లు, తిప్పారెడ్డిరామిరెడ్డి, అమంచర్ల గోపా లరావు, వల్లూరు రంగయ్యనాయుడు, నాగసూరు వీరరామ య్య పేర్లు ఇందులో ఉన్నాయి. వారిలోపాటు భాషాప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు కూడా ఉంది. – న్యూస్‌టుడే, కావలి

తొలి రోజు 90.22% పింఛన్ల పంపిణీ

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం 90.22 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయం ఏడు గంటల నుంచే ప్రజాప్రతినిధులు, సచివాలయాల ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేశారు. జిల్లాలో 3,04,117 మందికి గాను 2,74,383 పింఛన్లు అందించారు. మిగిలిన 29,734 మందికి మంగళవారం అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు.

వీడని వర్షం.. జనజీవనానికి ఆటంకం

దిత్వా ప్రభావంతో 208 హెక్టార్లలో నీట మునిగిన నార్లు, వరిపైరు

నెల్లూరు అయ్యప్పస్వామి ఆలయ రోడ్డులో వర్షపు నీటిలో వెళుతున్న వాహనాలు

నెల్లూరు నగరం.. నీట మునిగిన ఆర్టీసీ కాలనీ

న్యూస్‌టుడే, నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, కలెక్టరేట్, పద్మావతీనగర్, చేజర్ల)

దిత్వా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సముద్రతీర ప్రాంత మండలాల్లోని అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. జిల్లాలో సోమవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరాసరిన 10.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నెల్లూరు నగరంలో 46.2, వెంకటాచలంలో 32.4, కోవూరు 29.6, నెల్లూరు రూరల్ 25.8, అల్లూరు 23.2 మిల్లీమీటర్ల వర్షం పడింది.

చెరువులను తలపిస్తున్న పొలాలు

తుపాను ప్రభావంతో పొలాల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతన్నలు సాగు పనుల్లో తలమునకలై ఉన్నారు. ఇప్పటి వరకు 4,835 హెక్టార్లలో నారుమడులు సాగు చేయగా.. 41 హెక్టార్లలో నేరుగా విత్తనం చల్లుకోగా, మరో 40 హెక్టార్లలో డ్రమ్ సీడర్ పద్ధతిలో నాట్లు వేశారు. 15,988 హెక్టార్లలో మామూలు విధానంలో వరి నాట్లు సాగుచేశారు. వర్షం కారణంగా 208 హెక్టార్లలో నారుమడులు, వరిపైరు దెబ్బతినే అవకాశం ఉంది.

మరమ్మతులు చేపట్టిన కావలి మండలం కొత్త సత్రం చెరువు

చేజర్ల- కలువాయి మార్గంలో నల్లవాగుపై నీరు

పొంగిన వాగులు

చేజర్ల మండలంలోని మడపల్లి- తూర్పుకంభంపాడు మధ్య నల్లవాగు పొంగడంతో ఆదివారం రాత్రి నుంచి అయిదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గొల్లపల్లి వద్ద పందల వాగు పొంగడంతో సంగం- చేజర్ల మార్గంలో రాకపోకలు ఆగిపోయాయి. చలపనాయుడుపల్లి, చేజర్ల ఎస్టీ కాలనీలో లోతట్టు ప్రాంతంలో ఉన్న కుటుంబాలను తహసీల్దారు ఆర్.మస్తానయ్య పరామర్శించారు.

నెల్లూరు రూరల్ ప్రాంతంలో నీట మునిగిన పంట పొలాలు

అధికారులతో పర్యవేక్షణ

వర్షాలకు చెరువులు, కాలువలు దెబ్బతినకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జలవనరుల శాఖ ఎస్‌ఈ దేశినాయక్ తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన ప్రాంతాల్లో చెరువులు, కాలువలను పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. కావలి మండలం కొత్త సత్రం చెరువు దెబ్బతినగా, వెంటనే ఇసుక బస్తాలతో మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు.

విద్యార్థి నేస్తం.. పుస్తకమే సమస్తం

న్యూస్‌టుడే, వెంకటాచలం

గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

వెంకటాచలంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం పుస్తకాల గనిలా ఉంది. తెలుగు భాష, సాహిత్యానికి సంబంధించిన అన్ని రకాల పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి. మొత్తం 9వేలు ఉండగా.. వాటిలో 6,500 పండితులు, కవులు, రచయితలు విరాళంగా ఇచ్చారు. 2500 కొనుగోలు చేశారు. వీటిలో తెలుగు భాష ఉన్నతి, పరిణామ క్రమ నేపథ్యం, సంస్కృతి సంప్రదాయాలు, సాహిత్యం, లిపులు, ప్రముఖ తెలుగు కవుల రచనలు తదితర ఆధునిక, ప్రాచీన గ్రంథాలన్నీ ఉన్నాయి.

అందరికీ అందుబాటులో

ఎవరైనా వచ్చి గ్రంథాలయంలోని పుస్తకాలు వినియోగించుకోవచ్చు. ఇంటికి తీసుకెళ్లేందుకు అనుమతివ్వరు. శని, ఆదివారాలు మినహా మిగిలిన రోజులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు గ్రంథాలయం తెరిచే ఉంటుంది. ఇక్కడి డిజిటల్ లైబ్రరీలో తాళపత్ర గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా వచ్చి కంప్యూటర్‌లో చూసుకోవచ్చు.

విద్యార్థుల పరిశోధనలు

తెలుగులో పరిశోధనలు చేస్తున్న వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు, తెలుగులో డిగ్రీ, పీజీ చేస్తున్న వారు గ్రంథాలయాన్ని వినియోగించుకుంటున్నారు. ఇక్కడి పుస్తకాల ఆధారంగా పరిశోధనలు చేస్తున్నారు. తెలుగులో సివిల్స్ రాసే వారు కూడా ఇక్కడకు వచ్చి సిద్ధమవుతుంటారు. కొందరు కవులు, సాహితీవేత్తలు తరచూ వచ్చి వారికి కావలసిన గ్రంథాలను పరిశీలిస్తుంటారు.

ఎవరైనా వినియోగించుకోవచ్చు

'గ్రంథాలయాన్ని ఎవరైనా వినియోగించుకోవచ్చు. కవులు, రచయితలు, సాహితీవేత్తలు పుస్తకాలు విరాళంగా ఇస్తే... వాటిపై వారి పేర్లు రాసి గ్రంథాలయంలో ఉంచుతాం' అని అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ తెలిపారు.

వైద్యసేవల్లో ఆర్థిక సమస్యలా.. సీఎంఆర్ఎఫ్ ఉందిగా!

మీకోసం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ముఖ్యమంత్రి సహాయనిధిపై ప్రత్యేక దృష్టి సారించింది. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు.. ప్రమాదాలు జరిగినప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య సేవలకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం ఆర్ఎఫ్) అండగా నిలుస్తోంది. అన్ని ధ్రువపత్రాలు ఉంటే పథకం కింద నిధులు పొందడం సులభం.

దరఖాస్తు ఇలా..

వైద్యం కోసం ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని వినియోగించకుండా సొంత డబ్బు వెచ్చించి ఉండాలి. స్థానిక గ్రామ, వార్డు సచివాలయం, ఎమ్మెల్యే కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తుదారుడి వివరాలు, ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా, ఆసుపత్రి పేరు, మందుల ఖర్చు వంటి వివరాలను నమోదు చేయాలి. తగిన పత్రాలు జమ చేసి ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేయాల్సి ఉంది.

ఏయే పత్రాలు కావాలంటే..

ఆధార్, తెల్లరేషన్ కార్డులు, ఆదాయ ధ్రువీకరణపత్రం, రోగ నిర్ధారణ రిపోర్టులు, ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, చికిత్స వివరాలు, మందుల బిల్లులు స్టాంపు తేదీతో ఉండాలి. డిశ్చార్జి వివరాలు, దానిపై వైద్యుడి సంతకం పెట్టి స్టాంపు వేయించాలి. బ్యాంకు పాసుపుస్తకం మొదటి పేజీ నకలు కావాలి. –న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

పట్టణంలో ర్యాలీ చేస్తున్న నాయకులు

గూడూరును నెల్లూరుజిల్లాలో కలపాలని..

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరును జిల్లా చేయాలి, లేకుంటే నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని గడియార స్తంభం కూడలి వద్ద గూడూరు జిల్లా సాధన సమితి ఐకాస ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో శిరీషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

ఆకృతి.. అవగాహన

అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా కావలి పట్టణంలోని జవహర్ భారతి ఎయిడెడ్ కళాశాలలో సోమవారం రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రెడ్ రిబ్బన్ ఆకృతిలో నిలబడి ఆకట్టుకున్నారు. –న్యూస్‌టుడే, కావలి

ఊరు మెచ్చగా.. రుణం తీర్చుకోగా

జన్మభూమి సేవలో ఉద్యోగులు

న్యూస్‌టుడే, చేజర్ల

ఊరు.. కన్నతల్లి ఒక్కటే.. అందుకే ఆ ఊరిని చదువుకున్నోళ్లు మరువలేదు. ఉద్యోగాలొచ్చి ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అందరూ ఒక్కటయ్యారు. అమ్మలాంటి ఊరి బాగుకు కదిలారు. ఏటా సంక్రాంతికి వచ్చి ఆ తల్లి మంచీచెడ్డలు చూసుకుంటున్నారు. సొంతంగా డబ్బులు సమకూర్చుకుంటున్నారు. చదువులమ్మకు సౌకర్యాలు కల్పించారు. గుడి కట్టారు. ఎవరికి ఏకష్టం వచ్చినా మేమున్నామని అండగా నిలుస్తున్నారు. ఇదీ జన్మనిచ్చిన భూమి రుణాన్ని తీర్చుకుంటున్న మండలంలోని నడిగడ్డ అగ్రహారానికి చెందిన ఉద్యోగుల తీరు.

ఇలా అడుగులు..

మండలంలో 500లోపు జనాభా కలిగిన చిన్న గ్రామం నడిగడ్డ అగ్రహారం. పైగా మారుమూల. వెనుకబాటుతనం. ఈనేపథ్యంలో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న రైల్వే ఉద్యోగి ఎ.శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు ఎన్. వెంగబాబు 2006లో ఊరికొచ్చారు. గ్రామంలో పరిస్థితులను చూసి కలత చెందారు. మార్చాలనుకున్నారు. నాడు సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఆతరువాత మిగిలిన వారు వీరి వెంట నడిచారు. ప్రస్తుతం 50 మంది వరకు అయ్యారు.

అభివృద్ధి ఇలా..: ఏటా సంక్రాంతికి గ్రామానికి వచ్చే వీరంతా గ్రామస్థులతో సమావేశమవుతారు. అవసరాలను గుర్తిస్తారు. అందుకు నిధులు పోగు చేస్తారు. ఇలా తొలుత బడిని తీర్చిదిద్దారు. గ్రామంలో ఆంగ్ల మాధ్యమం లేకపోవడంతో పిల్లలు ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. దీంతో 2014లో విద్యార్థులు లేని కారణంగా బడిని రద్దు చేసే పరిస్థితి ఏర్పడింది. ఇది గ్రహించిన ఉద్యోగులు ఆంగ్ల మాధ్యమ బోధనకు శ్రీకారం చుట్టారు. సొంత ఖర్చులతో ఉపాధ్యాయులను నియమించారు. కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ప్రకటించారు. దీంతో పిల్లలంతా ఊళ్లోనే చక్కగా చదువుకుంటున్నారు. ఇందు కోసం సుమారు రూ. 10 లక్షలు ఖర్చు చేశారు. అలాగే గుడి, రహదారులు తదితర వాటికి మరో రూ.10 లక్షలు వెచ్చించారు. విద్యావంతులైన యువకులు, ఉద్యోగులు గామాభివృద్ధికి తోడ్పాటు నివ్వడం ఆనందంగా ఉందని మాజీ సర్పంచి రామకృష్ణయ్య తెలిపారు.

ప్రాథమిక పాఠశాల

నడిగడ్డ అగ్రహారం గ్రామ ఉద్యోగుల సంఘం

విద్యార్థుల ప్రగతే అజెండా

5న పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య) తోటపల్లిగూడూరు

విద్యాభివృద్ధే లక్ష్యంగా ఈ నెల 5న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం(తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం) నిర్వహించనున్నారు. గత సంవత్సరం జరిగిన సమావేశాల్లో తల్లిదండ్రులకు ఆటలు, రంగోలి వంటి పోటీలు నిర్వహించారు. అలాంటి వాటిని ఈ సంవత్సరం పక్కన పెట్టి, కేవలం విద్యార్థుల ప్రగతిపైనే నిర్వహించనున్నారు. పిల్లల చదువులెలా ఉన్నాయి, వారి పురోభివృద్ధిని చర్చించనున్నారు. జిల్లాలో 2,527 ప్రభుత్వ పాఠశాలలు, 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో 1,64,4791 మంది, జూనియర్ కళాశాలల్లో 12,082 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో పండగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాల్సి ఉంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో పురోగతి, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశాలు జరగనున్నాయి. అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాఠశాలల్లోనే మధ్యాహ్న భోజనం చేసి సమావేశం ముగిస్తారు. ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా సమగ్రశిక్షా అభియాన్ ప్రాజెక్టు ఏపీసీ డాక్టర్ డి.వెంకటసుబ్బయ్య హెచ్‌ఎంలకు సూచించారు.

బాక్స్ క్రికెట్

పట్టణ యువతలో పెరుగుతున్న ఆసక్తి

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

కందుకూరు పట్టణంలో యువత క్రికెట్ ఆడేందుకు తగిన మైదానాలు లేవు. టీఆర్ఆర్, జడ్పీ హైస్కూల్ ఆట స్థలాలున్నా.. అవి అనువుగా లేవు. ఉన్న కొద్ది స్థలంలోనే వందలాది మంది పిల్లలు అక్కడకు చేరుతున్నారు. దీంతో ఎవరేం ఆడుతున్నారో.. ఏ బాల్ ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఈ లోటును భర్తీ చేస్తూ ఆదరణ పొందుతోంది 'బాక్స్ క్రికెట్'. నిర్దేశిత విస్తీర్ణంలో తగిన ప్రమాణాలతో చుట్టూ స్తంభాలు పాతి నెట్ అమర్చుతున్నారు. దీనివల్ల ఎంత భారీ షాట్ కొట్టినా, ఎంత వేగంతో బౌలింగ్ చేసినా బంతి బయటకు వెళ్లదు.

అధికారులు, ఉద్యోగులు, వైద్యులు కూడా..

పట్టణంలోని కోవూరు రోడ్డులో బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేశారు. యువకులే కాదు.. ఉద్యోగులు, వ్యాపారులు, వైద్యులు, రెవెన్యూ అధికారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం వచ్చి ఉత్సాహంగా ఆడుతున్నారు. వర్షం పడినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయడం, క్రీడా పరికరాలు నిర్వాహకులే సమకూరుస్తుండటంతో యువత ఇక్కడకు వచ్చి ఆడేందుకు ఇష్టపడుతున్నారు. రాత్రిపూట దీపాల వెలుతురులో ఆడేందుకు మక్కువ చూపుతున్నారు.

అవసరం పేరు.. ఆక్రమణ తీరు

చెరువుల వెంట భూముల కబ్జా

న్యూస్‌టుడే, కావలి

తొలుత చుట్టూ ఉండే పోరంబోకు భూములు, ఆ తరువాత చెరువులో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ఆక్రమిత స్థలాల్లోని భవనాల నుంచి వచ్చే మురుగును చెరువులోకే వదిలేస్తున్నారు. దాంతో ఆయకట్టు రైతులు గగ్గోలు పెడుతున్నారు. అయినా అధికారులు చర్యలు తీసుకోలేదు.

ఈ చిత్రంలో కనిపించేది కావలి పట్టణంలోని రామ్మూర్తిపేట. దీని వెంబడే పాపిరెడ్డిచెరువు ఉంది. రామ్మూర్తిపేటగా విస్తరించిన ఇక్కడ ఒకప్పుడు చాలావరకు చెరువే ఉండేది.

సమాంతరంగా..

తొలుత ప్రభుత్వ అవసరాల పేరిట నీటి వనరుల పోరంబోకు భూములను తీసుకుంటున్నారు. ఆ తరువాత వాటి వెంట ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. కావలి చెరువుల విషయంలోనూ అలాగే జరుగుతోంది. పాపిరెడ్డిచెరువు పోరంబోకు భూములను 1970లో ఆర్టీసీ గ్యారేజీ ఏర్పాటు నిమిత్తం సేకరించారు. ఆ తరువాత దానికి సమాంతరంగా దక్షిణం వైపున ఉండే పోరంబోకు భూములన్నీ ప్రైవేట్ నిర్మాణాల ఖాతాలోకి చేరాయి. నీటి వనరుల భూముల్ని ఇతర నిర్మాణాలకు వినియోగించవద్దని న్యాయస్థానాలు ఎప్పటి నుంచో హెచ్చరిస్తున్నా, వాటికి రెవెన్యూశాఖ నుంచి అనుమతులు ఉన్నాయని ఆక్రమిస్తున్నారు. చెరువుకట్టపై జీప్‌ట్రాక్ వసతి ఉండేది. ప్రస్తుతం చెరువు ఆనకట్టలు కూడా కరిగించేస్తున్నారు.

కార్యాలయాలకు స్థల సేకరణతో..

కావలి పట్టణంలోని మందాటి చెరువు వద్ద రాళ్లగుట్టపోరంబోకు భూముల విషయంలోనూ ఇలాగే జరిగింది. తొలుత 33-11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం, గిరిజన బాలికల గురుకులం, ఐసీడీఎస్ కార్యాలయాలకు కొంత స్థలం సేకరించారు. అదే అదనుగా చుట్టూ ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమణలతో ముందుకొచ్చారు. మందాటి చెరువుకట్ట ధ్వంసమయ్యేలా ట్రంకురోడ్డు వెంబడి అనేకమంది కబ్జాదారులు పేట్రేగిపోతున్నారు.

అన్ని శాఖలు కలిస్తేనే..

సర్వేపరంగా రెవెన్యూశాఖ సహకరించాలి. అక్రమ నిర్మాణాలు జరగకుండా మున్సిపాలిటీ చూడాలి. అన్నిశాఖలు కలసి వస్తేనే కబ్జాలను అడ్డుకోగలం. మా ఒక్క శాఖతో నియంత్రించలేం.

– జంపాని కిరణ్, సహాయక ఇంజినీర్, జలవనరులశాఖ, కావలి

రైతేరాజు మిశ్రమ సాగు.. లాభాలు బాగు 6 ..లో

అవిశ్వాస తీర్మానానికి పావులు

40 మంది కార్పొరేటర్లకు లీగల్ నోటీసులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగర మేయర్ పీఠాన్ని కూటమి నాయకులు కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. మేయర్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఈనెల 10న సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన 40 మంది కార్పొరేటర్లకు న్యాయవాది తిరుమురు మునికుమార్ లీగల్ నోటీసులు జారీ చేశారు. 2021 కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఉచితంగా నామినేషన్ పత్రాల తయారీ, అఫిడవిట్లు, డిక్లరేషన్లు, ఇతర అనుబంధాలను తన చేతిరాతతో సిద్ధం చేసి, ఎలాంటి ఫీజు తీసుకోకుండా సహాయం చేశానని నోటీసులో పేర్కొన్నారు. తాము వైకాపాకు కట్టుబడి ఉన్నామని, పార్టీ పట్ల నిబద్ధతతో ఉన్నామని నమ్మబలికారన్నారు. ఆ నమ్మకంతోనే ఉచితంగా నామినేషన్ ప్రక్రియ చేశానని వెల్లడించారు. కానీ 2024 సాధారణ ఎన్నికల్లో వైకాపా ఓటమి తర్వాత, వైఖరి మార్చుకుని పార్టీ నుంచి దూరమయ్యారని, ఇది అవకాశవాద రాజకీయ ద్రోహం కిందకు వస్తుందని పేర్కొన్నారు.

ఏడాదైనా సహకరించాలని.. కార్పొరేటర్లుగా ప్రజలు తమను ఎన్నుకుని నాలుగేళ్లయినా డివిజన్లలో ఏమీ చేయలేకపోయామని వాపోతున్నారు. తమ డివిజన్లలో తిరుగుతుంటే.. ప్రజలు ప్రశ్నిస్తున్నారని, ఉన్న ఏడాది కాలంలోనైనా అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారన్నారు. తాము పార్టీ మారి ఏడాదిన్నర కాలమైనా మేయర్ నుంచి ఎటువంటి సహకారం అందలేదని వాపోతున్నారు.

రూపం మార్చి.. ఏమార్చి

జిల్లాలో లిక్విడ్ గంజాయి

ఒక్కో సిరంజి రూ.500

- నెల్లూరు నగరం ఓ పోలీసు స్టేషన్ పరిధిలోని లాడ్జీలో గంజాయి వినియోగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే వెళ్లి పరిశీలించగా.. సిరంజీలో లిక్విడ్ గంజాయిని గుర్తించారు. ఒక సిరంజీలో 5 ఎంఎల్ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- మూడు నెలల పరిధిలో నెల్లూరు నగరంలో 110 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి నెల్లూరులో తాగేందుకు సిద్ధంగా ఉండగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

జిల్లాలో సిరంజీలో లిక్విడ్ గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఘన పదార్థాల్లో లభ్యమయ్యేది. ప్రస్తుతం ద్రవంలా మారి చాప కింద నీరులా వ్యాపిస్తోంది. చెడు వ్యసనాలకు అలవాటు పడి యువత నేరాలకు పాల్పడుతుంటే.. లిక్విడ్ గంజాయి మరింత ప్రమాదకరంగా మారే ప్రమాదం ఉంది. శివారు ప్రాంతాల్లో భారీ సంఖ్యలో అమ్ముడుపోతోంది. ఎవరికీ సమాచారం అందకుండా రహస్యంగా భారీస్థాయిలో విక్రయాలు చేస్తున్నారు. నెల్లూరు నగరంలోని చిన్నబజారు, నవాబుపేట, సంతపేట, దర్గామిట్ట, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీసు స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో వీటి అమ్మకాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

20 కేజీలకు అర లీటరు

పోలీసుల తనిఖీలు పెరగడం, అక్రమ రవాణాపై చర్యలు ఉపక్రమించడంతో అక్రమార్కులు తమ పంథా మార్చుకున్నారు. ఎండు గంజాయిని తరలించడం కష్టంగా మారడంతో లిక్విడ్‌గా తెరపైకి తెచ్చారు. 20 కేజీల గంజాయిని మరగిస్తే అర లీటరు లిక్విడ్ వస్తుంది. ఒక్కో సిరంజీ రూ. 500కు విక్రయిస్తున్నారు. సిగరెట్లలో పోసుకుని వినియోగిస్తున్నారు. ఇటీవల కాలం నుంచి ఈ తరహా గంజాయి వ్యాపారం జోరందుకుంది.



సిరంజీలో లిక్విడ్ గంజాయి

సమాచారం వచ్చింది

గంజాయి నిర్మూలనకు ఇప్పటికే ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. లిక్విడ్ గంజాయి విక్రయాలు తమ దృష్టికి వచ్చింది. సమాచారం అందిస్తే దాడులు చేస్తాం. ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

ఎం.గిరిధర్, ఇన్‌ఛార్జి నగర డీఎస్పీ

(c) eenadu

బాలికల చదువు.. మరింత మెరుగ్గా

టైప్‌-4 కేజీబీవీలకు నిధులు మంజూరు

దుత్తలూరు: ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య

ఒక్కో వసతిగృహానికి రూ. 15 లక్షలు

న్యూస్‌టుడే, దుత్తలూరు

బాలికా విద్యను మరింత బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో టైప్‌-4 కింద ఎంపిక చేసిన ఆదర్శ పాఠశాలల వసతిగృహాల్లో పూర్తిస్థాయి మరమ్మతుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఈమేరకు విద్యార్థినులు ఆయా వసతిగృహాల్లో ఇబ్బందులు లేకుండా చదువు కొనసాగించేలా సర్వశిక్షా అభియాన్‌ అధికారులను ఆదేశించింది. దీంతో ఎంపిక చేసిన వసతిగృహాలను సంబంధిత అధికారులు పరిశీలిస్తున్నారు. వాటిలో సమస్యలను గుర్తించి మరమ్మతులు చేయించనున్నారు.

జిల్లాలో 11 ఆదర్శ పాఠశాలలుండగా టైప్‌-4 కేజీబీవీలుగా దుత్తలూరు, మర్రిపాడు మండలంలోని నందవరం, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, కావలి మండలంలోని ఒట్టూరు, ఏఎస్‌పేటలోని ఆదర్శ పాఠశాలలను అనుబంధంగా నిర్మించిన బాలికల వసతిగృ

హాలను ఎంపిక చేశారు. వాస్తవంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునేందుకు సమీప గ్రామాలనుంచి వచ్చే విద్యార్థులు రాకపోకలకు సాగించడం దూరాభారంగా మారింది. ఈక్రమంలో కొందరు చదువుకు దూరమవుతున్నారు. ఇలాంటి పరిస్థితులు అధిగమించేందుకే టైప్‌-4 కేజీబీవీ పేరిట ఆదర్శ పాఠశాలలకు అనుబంధంగా వసతిగృహాలను ఎంపిక చేసి వాటిలో సౌకర్యాలు కల్పించనుంది. ఇంటర్మీడియట్‌ అమలవుతున్న పాఠశాలల్లోని వసతిగృహాలను బాగు చేయనున్నారు.

ఎంపిక చేసిన వసతిగృహాల్లో విద్యార్థినులకు అసౌకర్యాలు లేకుండా ప్రభుత్వం ఒక్కో దానికి మరమ్మతుల కోసం రూ. 15 లక్షలు మంజూరు చేసింది. మొదటి విడతగా రూ. 6 లక్షలు విడుదల చేసింది. వీటితో వంట రూములు, మరుగుదొడ్లు, స్నానాల గదులను బాగు చేయనున్నారు. ఈ వసతిగృహాల్లో తొమ్మిది, పది, ఇంటర్‌ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు తరగతికి 25 మంది వంతున మొత్తం వంద మందికి అవకాశం కల్పిస్తారు.

పూర్తిస్థాయిలో మరమ్మతులు

వెంకటసుబ్బయ్య, ఏపీసీ, ఎస్‌ఎస్‌ఏ

టైప్‌-4 కేజీబీవీలుగా జిల్లాలో ఏడు వసతి గృహాలు ఎంపికయ్యాయి. వాటిలో సౌకర్యాల మెరుగు కోసం ప్రభుత్వం ఒక్కో దానికి రూ. 15 లక్షల వంతున మంజూరు చేసింది. ఆయా వసతిగృహాల్లో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయిస్తాం. కేజీబీవీల్లో అమలవుతున్న మెనూనే ఇక్కడా అమలు చేస్తాం.

మిశ్రమ సాగు.. లాభాలు బాగు

న్యూస్‌టుడే, చేజర్ల

సాగులో సాంకేతిక జోడించి అధిక దిగుబడులకు బాటలు వేసుకొంటున్నారు చేజర్ల మండలంలోని రైతులు. సాధారణ పద్ధతికి భిన్నంగా పంటలను పొందుపరుస్తూ వినియోగించి మిశ్రమ పంటలు సాగు చేస్తున్నారు. బిందు సేద్యం మల్చింగ్‌ విధానంతో పత్తి, దోస ఒకేసారి సాగు చేసి ఎకరానికి రూ. రెండు లక్షల రాబడి సాధించారు ఓబులాయపల్లికి చెందిన పర్వూరి వెంకటేశ్వర్లు. ఒకే పెట్టుబడితో రెండు పంటలు వేసి రాబడి వచ్చిందని ఆయన తెలిపారు.

ఎరువులు చల్లి బోదెలు తీయించారు. నీటి సరఫరా కోసం బిందు సేద్య పరికరాలు అమర్చారు. దానిపై రెండు రకాల విత్తనాలను ఒకేసారి నాటారు. నీటిని వదిలి గింజల్ని మొలకెత్తించారు. పత్తి మొక్కలు నిటారుగా దోస తీగలు నేల మీదకు పాకడంతో రెండు పైర్ల మధ్య పోటీ లేకుండా పోయింది. రెండు నెలల్లో దోస పంట పూర్తి కావడంతో వాటి తీగలు తొలగించి పత్తికి రెండోసారి ప్రత్యేక ఎరువులను అందించారు.

పత్తి, దోస మిశ్రమ సాగు

చొప్పున దిగుబడి వచ్చింది.

ఆదాయ, వ్యయాలిలా

దుక్కి, బిందు సేద్య పరికరాలు, మల్చింగ్‌ పట్టాలు, విత్తనాలు వేయడం, కోత తదితర ఖర్చులకు ఎకరానికి రూ. 50 వేలు వంతున ఖర్చయ్యాయి. ఆరు టన్నుల దోస కాయలు రాగా రూ.60 వేలు, క్వింటాల్‌ పత్తికి రూ.7 వేలు వంతున 20 క్వింటాళ్లకు రూ.1.40 లక్షల రాబడి వచ్చింది. ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి పోగా, రూ. 1.50 లక్షల నికరాదాయం పొందారు.

సాగు చేశారిలా..

నేలను మూడు సార్లు దుక్కి చేసి

సమస్య-సమాధానం

ప్రశ్న: నానో యూరియాకి వెదజల్లే యూరియాకి మధ్య వ్యత్యాసం ఉందా? –బాబు, అల్లూరు

జవాబు: తేడా ఉండదు. రెండు ఒకే ఫలితాన్ని ఇస్తాయి.

ప్రశ్న: వర్షాలకు నారుమడులు దెబ్బతినకుండా ఏంచేయాలి? – మాధవ, అల్లూరు

జవాబు: యూరియా మోతాదు మించి వేయొద్దు. అదనపు నీరు బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

ప్రశ్న: సింగిల్‌ సూపర్‌ ఫాస్ఫేట్‌, ట్రిపుల్‌ సూపర్‌ ఫాస్ఫేట్‌ మధ్య తేడా ఏమైనా ఉందా? –గోవింద్‌, అల్లూరు

జవాబు: ట్రిపుల్‌ సూపర్‌ఫాస్ఫేట్‌ ఎకరాకు ఒక బస్తా, సింగిల్‌ సూపర్‌ఫాస్ఫేట్‌ మూడు బస్తాల చొప్పున వేసుకోవాలి.

ప్రశ్న: మొదటి పంటగా వేసే వ్యవసాయ పనుల్లో ఎలాంటి వెదజల్లవచ్చా. -రామయ్య, మొప్పూరు

జవాబు: వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం ప్రకారం సాగు చేయవచ్చు.

(రైతుల సందేహాలకు అల్లూరు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సమాధానాలు చెప్పారు.)

– న్యూస్‌టుడే, అల్లూరు

కలుపు సమస్య లేకుండా పత్తి మొక్కలు బాగా పెరిగి రెండు సార్లు కాయలు కాశాయి. సాధారణంగా ఎకరానికి 8-10 క్వింటాళ్ల దిగుబడి వస్తే పత్తి మల్చింగ్‌ విధానంలో 20 క్వింటాళ్ల

రైతేరాజు

కంది.. పండిందిగా!

వింజమూరు, న్యూస్‌టుడే: కంది సాగుచేసి అధిక దిగుబడి సాధించి లాభాలు పొందారు వింజమూరు మండలం చెందిన మద్దూరు గోపాల్‌రెడ్డి. వ్యవసాయ శాఖ రాయితీపై ఇచ్చిన ఎల్‌ఆర్‌జీ- 52 రకం విత్తనాలు వర్షాధారంగా వేశారు. సేద్యం, విత్తనాలు, కూలీలు, క్రిమిసంహారక మందులు పిచికారీ, కోత, నూర్పిడి తదితర వాటికి ఎకరానికి రూ.20 వేలు ఖర్చులయ్యాయి. ఆరు క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. గతేడాది క్వింటాల్‌ ధర రూ. 7500 ఉండగా ఈ ఏడాది ప్రస్తుతం రూ. 8 వేలకు పైగా ఉంది. ఎకరానికి రూ. 45 వేల వరకు రాబడి రాగా.. ఖర్చులు పోను రూ. 25 వేలు మిగిలాయి. వింజమూరు వ్యవసాయ సహాయ సంచాలకుల శేషగిరి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వర్షాధారంగా కంది సాగు రైతుకు లాభదాయకంగా ఉంటుందని వివరించారు.

సూక్ష్మపోషకం.. అధిగమిస్తే క్షేమం

సీతారామపురం, న్యూస్‌టుడే: సేనగలో సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి నివారిస్తే దిగుబడి బాగుంటుందని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం పంటల ఉత్పత్తి విభాగం శాస్త్రవేత్త డాక్టర్‌ కాసా కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

జింక్‌: మొక్క ఎదుగుదల లోపిస్తుంది. చిట్టి ఆకులు ఏర్పడతాయి. కాలిపోయిన మచ్చలు వస్తాయి. **నివారణ:** ఎకరాకు 20కిలోల జింక్‌ సల్ఫేట్‌ ఆఖరి దుక్కిలో వేయాలి. పైర్లపై లోప లక్షణాలు కనిపించినప్పుడు లీటరు నీటికి 2గ్రాముల జింక్‌సల్ఫేట్‌ కలిపి పిచికారీ చేయాలి.

ఇనుము: లేత ఆకులు పసుపు రంగులోకి మారి ఎండి రాలిపోతాయి. **నివారణ:** లీటరు నీటికి 5 గ్రాముల ఫెర్రస్‌ సల్ఫేట్‌ (అన్నభేది) ఒక గ్రాము నిమ్మ ఉప్పుతో కలిపి పైరుపై వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

గంధకం: తొలుత లేత చిగురు హరితత్వం కోల్పోయి ఆతరువాత మొక్క అంతా పసుపు రంగుకు మారుతుంది. **నివారణ:** ఎకరాకు 8-12 కిలోల నీటిలో కరిగే గంధకాన్ని విత్తనాలు వేసే సమయంలో వేయాలి.

సెనగ తోట

డాక్టర్‌ కిరణ్‌ కుమార్‌రెడ్డి, శాస్త్రవేత్త

సిరులు కురవంగ

న్యూస్‌టుడే, అల్లూరు

అనాదిగా సంప్రదాయ పంటలు వేసి రైతులు నష్టపోతున్నారు. ఎంత కష్టపడినా గిట్టుబాటు ధరలు దక్కక అప్పులపాలవుతున్నారు. ఈపరిస్థితుల్లో కూరగాయల తోటలు వేసి లాభాల బాట పట్టారు మండలంలోని నార్తుఆములూరుకు చెందిన శ్రీనివాసులు. ఆయనకున్న ఎకరాలో వంగ తోటపై సుమారు రూ. లక్ష వరకు ఆదాయం సాధించారు.

పండించారిలా..

ముందుగా పొలంలో నాలుగు ట్రక్కుల పశువుల ఎరువు వేసి సేద్యం చేయించారు.

పాదులు తీయించారు. నర్సరీ నుంచి మొక్కలు కొని నాలుగు చొప్పున కొనుగోలు చేసి తీసుకొచ్చి నాటించారు. మొదట్లో కూలీల ద్వారా నీరు అందించారు. పూత దశలో తెగుళ్లు, పురుగులు సోకకుండా వేప నూనె పిచికారీ చేయించారు. పిందె, కాయ దశకు రాగానే అవసరమైన సూక్ష్మ పోషకాలు అందించారు. ప్రారంభంలో 20 కేజీల చొప్పున దిగుబడి వచ్చింది. తరువాత 500 కేజీల వరకు కోతకొచ్చాయి. ఈ సమయంలో పురుగుల నివారణకు సేంద్రియ విధానంలో

మందులు పిచికారీ చేయడంతో పుచ్చు సమస్య తగ్గింది. పంట పూర్తయ్యే నాటికి సుమారు నాలుగు టన్నుల వరకు దిగుబడి వచ్చింది. కేజీ రూ. 40 చొప్పున అమ్మకాలు చేశారు. రూ. 1.60 లక్షల వరకు రాబడి వచ్చింది. ● సేద్యం, నారు, మందులు, కూలీలు తదితర వాటికి రూ. 60 వేల వరకు ఖర్చులయ్యాయి. ఇవి పోగా రూ. లక్ష వరకు ఆదాయం వచ్చింది. నిరంతరం తోట పర్యవేక్షణ చేయడంతో పాటు కొన్ని పనులు స్వయంగా చేసుకోవడంతో మంచి ఫలితాలు సాధించినట్లు రైతు శ్రీనివాసులు వివరించారు.

ప్రజా జీవనానికి విఘాతం కలిగించే వారిపై చర్యలు: ఐజీ

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ప్రజా జీవనానికి విఘాతం కలిగించే వారిపై

పోలీసులతో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్‌ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి చిన్నబజారు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, సస్పెక్ట్‌ షీట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌ కేసుల పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. శాంతిభద్రతల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నేరస్థుల కదలికలపై నిఘా పెంచాలని, వారికి క్రమంగా తప్పకుండా కౌన్సెలింగ్‌ ఇవ్వాలని, విజిబుల్‌ పోలీసింగ్‌ ముమ్మరం చేయాలన్నారు. ఆయన వెంట నగర ఇన్‌ఛార్జి డీఎస్పీ ఎం.గిరిధర్‌, చిన్నబజారు ఇన్‌స్పెక్టర్‌ చిట్టెం కోటేశ్వరరావు, ఎస్సైలు, పోలీసులు ఉన్నారు.

పింఛను అందిస్తున్న మంత్రి నారాయణ

రాష్ట్రంలో 68 లక్షల మందికి పింఛన్ల పంపిణీ : మంత్రి

నెల్లూరు (నగరపాలకసంస్థ), సంగం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఒకే రోజు 90 శాతం పింఛన్ల పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్‌ పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం నెల్లూరులోని 11వ డివిజన్‌లో లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 68 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. రూ.34వేల కోట్ల నగదు ఇస్తున్నామన్నారు.

మల్లి సుబ్బమ్మకు పింఛను అందిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

● సంగం మండలంలోని వరద బాధిత గ్రామం వీర్లగుడిపాడు కష్టాలు తీరేలా వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గాంధీజనసంఘంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

అవగాహనతో హెచ్‌ఐవీ నియంత్రణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: అవగాహనతో హెచ్‌ఐవీని నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి వి.సుజాత పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్‌ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలో అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం టౌన్‌హాల్‌లో

ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. వారి హక్కులను కాపాడాలని సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్‌, టీబీ నివారణ అధికారి ఎస్‌కే ఖాదర్‌వలీ మాట్లాడుతూ జిల్లాలో హెచ్‌ఐవీ తీవ్రత బాగా తగ్గిందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అన్ని ఐసీటీసీలలో ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తారని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ, ఎయిడ్స్‌ నియంత్రణ విభాగం, రెడ్‌క్రాస్‌ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు కూలితేనే స్పందిస్తారా..!

మనుబోలు మండల పరిధిలోని అక్కంపేట శ్రీరాంనగర్‌ వద్ద పొదలకూరు వెళ్లే రోడ్డుపై కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. పలు చోట్ల కుంగి గుంతలు ఏర్పడ్డాయి. స్థానికులు ఎప్పుడు కూలుతుందోనని ముళ్ల కంపను అడ్డు పెట్టి గోతాలను సూచికలుగా ఏర్పాటుచేశారు. పొదలకూరులో ఇలాగే కూలిందని ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని పలువురు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, మనుబోలు

విస్తరించారు.. కాలువలు విస్మరించారు

నగరంలోని పొదలకూరు రోడ్డు విస్తరించారు. కానీ కాలువలను నిర్మించలేదు. బారాషహీద్‌ దర్గా ఎదురుగా కొన్నేళ్లుగా కాలువలు ఆక్రమణలకు గురై పూడిపోయాయి. ఆక్రమణలు తొలగించడంతో కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. వీటితో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– నెల్లూరు (టౌన్‌), న్యూస్‌టుడే

అవస్థల ప్రయాణం ఇంకెంత కాలం?

నగర శివారు జొన్నవాడ రోడ్డులో పొట్టెపాలెం కలుజుకు ఇరువైపులా గుంతలమయంగా మారింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిలో పడి పలువురు వాహనదారులు గాయాలపాలవుతున్నారు. – నెల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే

ముట్టుకుంటే షాకే

కోవూరు మండలం ఇనమడుగు కూడలి వద్ద విద్యుత్తు నియంత్రిక చుట్టూ తీగజాతి మొక్కలు అల్లుకుపోయాయి. గాలి వీచినపుడు నిప్పురవ్వలు చెలరేగుతున్నాయని, సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు వాపోతున్నారు. డిస్కం అధికారులు పరిశీలించి నియంత్రిక చుట్టూ అల్లుకున్న మొక్కలు తొలగించి శుభ్రం చేయాలని పలువురు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కోవూరు

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 12,368
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 98,944
వెండి గ్రాము :	రూ. 184.20

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్‌	134
లేయర్‌	130
బ్రాయిలర్స్‌	244
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్‌	268
లేయర్‌ మాంసం	221

ర.భ.ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే: ర.భ. శాఖ ఎస్‌ఈగా డి.ప్రసాద్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల ఈఈగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇన్‌ఛార్జి ఎస్‌ఈ రామకృష్ణప్రసాద్‌ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ర.భ. ఉద్యోగుల జేఏసీ నాయకుడు శరత్‌ ఆధ్వర్యంలో సురేష్‌, షబ్బీర్‌, రత్నం, రాజశేఖర్‌, సురేష్‌బాబు, జాకీర్‌ తదితరులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి మాగుంట

నెల్లూరు(టౌన్‌), న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి అని మాజీ మంత్రి సీవీ శేషారెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరు పొగతోటలోని ఎం1 థియేటర్‌లో సుబ్బరామిరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాగుంట సుబ్బరామిరెడ్డికి ఒంగోలు, నెల్లూరు రెండు కళ్లు లాంటివన్నారు. నెల్లూరు మినీబైపాస్‌ రోడ్డు నిర్మాణానికి కృషి చేశారన్నారు. ప్రజాప్రతినిధులు ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు సేవ చేయాలన్నారు. నెల్లూరులో ఎన్నడూ లేని విధంగా హత్యలు, దోపిడీలు, గంజాయి విక్రయంతో పాటు లేడీ డాన్లు సామ్రాజ్యమేలడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం వీటిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మన్‌ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాగుంట మమతమ్మ, సుబ్బరామ్‌, రవీంద్రరెడ్డి, వీఎంపీ సుబ్బారావు, ఎల్లా విజయభాస్కర్‌రెడ్డి, కె. విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగుంట సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా భరత్‌

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నెల్లూరు వాసి భరత్‌కుమార్‌ ఎంపికయ్యారు. సోమవారం డెహ్రాడూన్‌లో జరిగిన ఏబీవీపీ జాతీయ మహాసభల్లో జాతీయ అధ్యక్షుడు రఘురామ్‌కిషోర్‌ తివారీ ఈవిషయాన్ని ప్రకటించారు.

జనరల్‌ నోటీసు

నా క్లయింట్‌ అయిన **Kakuturu Padmavathi W/o Dasaradha Rami Reddy (Late) Nellore** తరపున వారు ఇచ్చిన వివరముల మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్‌ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **M/s. Repco Home Finance Limited, Nellore Branch** వారు తే. **28-09-2025**దిన E-Auction కొరకు Paper Notification ఇచ్చివున్నారు. దరిమిలా నా క్లయింట్‌ సదరు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయదలచి E-Auction నందు Participate చేసి హెచ్చు Amount తో కొనుగోలు చేయదలచినాము. సదరు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **శ్రీమతి కనుమూరు ప్రమీల భర్త కనుమూరు సురేంద్రనాథ్‌రెడ్డి** గారు సదరు Repco Home Finance Ltd., వారి వద్ద నుండి హోమ్‌ లోన్‌ పొంది 1) **సందెపూడి విజయలక్ష్మి భర్త లేట్‌ రామచంద్రరావు 2) వెంకట రమణ S.B. S/o Late రామచంద్రరావు** వద్ద నుండి **తే. 21-01-2022దిన స్టోన్‌హౌస్‌పేట సబ్‌ రిజిస్ట్రార్‌ వారి ఆఫీసు నందు డాక్యుమెంట్‌ నెం. 370/2022** ద్వారా కొనుగోలు చేసియున్నారనియు తదుపరి తే. 21-01-2022దిన సదరు Repco Home Finance Limited వారికి స్టోన్‌హౌస్‌పేట SRO నందు **Doc No. 375/2022** ద్వారా MODT చేసియున్నారనియు తదుపరి సదరు **సందెపూడి విజయలక్ష్మి** గారు **తే. 04-03-2020**దిన స్టోన్‌హౌస్‌పేట సబ్‌ రిజిస్ట్రార్‌ ఆఫీసు నందు సెటిల్‌మెంట్‌ **Doc. No. 1276/2020** ద్వారా వారి కుమారుడు అయినటువంటి **వెంకటరమణ S.B.** అనువారికి చెందచేసియున్నారనియు మరియు లోగడ సదరు **సందెపూడి విజయలక్ష్మి** గారి భర్త గారును మరియు **వెంకటరమణ S.B.** గారి తండ్రి గారు అయిన **Late Ramachandra Rao** గారు ఆయన జీవించి వున్న కాలములో **Shaik Rafi** గారి వద్ద నుండి **తే. 27-12-2007**దిన **స్టోన్‌హౌస్‌పేట** SRO నందు Doc.No. 1011/2007 ద్వారాను మరియు **తే. 21-02-2008**దిన స్టోన్‌హౌస్‌పేట SRO నందు **Doc.No. 703/2008** ద్వారా కొనుగోలు చేసియున్నారనియు సదరు **Shaik Rafi S/o Khazamiya** గారు, **Sk.Shaina Begum** వారి వద్ద నుండి **తే. 09-09-1998**దిన నెల్లూరు SRO నందు గిఫ్ట్‌ డీడ్‌ Doc. No. 5780/1998 ద్వారా చెందినదనియు మరియు సదరు ఆస్తిపై ఇప్పటి వరకు ఎలాంటి పరాధీనములు, అన్యాక్రాంతములు, ఆడుమానములు, క్లయిమ్స్‌, అజైన్‌మెంట్లు, లీజులు మరియు కోర్టు వ్యవహారములు ఏమిని లేవని చెప్పుచున్నారు. కావున ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్నా ఈ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 10 రోజులు లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకంగా సరియగు ఆధారములతో తెలుపుకొనవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌కు బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

1వ అయిటం : శ్రీ పొట్టి శ్రీరాములునెల్లూరు జిల్లా, నెల్లూరు రిజిస్ట్రేషన్‌ డిస్ట్రిక్ట్‌ యిలాకా, స్టోన్‌హౌస్‌పేట, సబ్‌-రిజిస్ట్రారులో చేరిన, నెల్లూరు మునిసిపల్‌ కార్పొరేషన్‌ లిమిట్సులో చేరిన నెల్లూరు బిట్‌-2 ఏరియాలోని బంగ్లాతోట అను ప్రదేశం సి.ఏ.యస్‌.నెం. 152రులో ప్రస్తుతం వార్డు నెం.1రు, డోరు నెం. 1056రుకు సమీపమున అసెస్‌మెంట్‌ నెం. 1031001486రు, (మునిసిపల్‌ పన్ను రశీదు ప్రకారం డోరు నెం. 1-1348రు గల) 1397 చదరపు అడుగులు లేక 155.22 చదరపు గజముల స్థలమున్నూ ఇందులోని గ్రౌండ్‌ ఫ్లోర్‌, ఫస్ట్‌ ఫ్లోర్‌ మరియు సెకండ్‌ ఫ్లోర్‌ ఆర్‌.సి.సి. మిద్దె ఇల్లు వగైరాలకు హద్దులు : **తూర్పు :** 2వ అయిటం 5 అడుగులు వెడల్పు గల ఉమ్మడి దారి, ఈ దిశకొలత 39'-06"లు, **దక్షిణం :** రోడ్డు ఈ దిశ కొలత 35'-09" అడుగులు, **పడమర :** ఈ ఇంటి తాలూకు స్వంత గోడను ఆనుకొని షేక్‌ అహమద్‌ బాషా గారి వరసందు స్థలం, ఈ దిశ కొలత 39'-06" అడుగులు, **ఉత్తరం :** కనుమూరు సురేష్‌ సుబ్రహ్మణ్యం గారి ఇల్లు. ఈ దిశ కొలత 35'-00" అడుగులు

2వ అయిటం : పైన తెలిపిన 1వ అయిటం ఇల్లు, స్థలమును ఆనుకొని తూర్పు వైపున గల 39' అడుగులా 6" అంగుళములు పొడవు, 5' అడుగులు వెడల్పు గల ఉమ్మడి దారి స్థలమునకు హద్దులు : **తూర్పు :** షేక్‌ ఖాజావలి గారి ఇల్లు, ఈ దిశ కొలత 39'-6" అడుగులు, **దక్షిణం :** రోడ్డు ఈ దిశ కొలత 5'-0" అడుగులు, **పడమర :** పైన తెలిపిన 1వ అయిటం తాలూకు ఇల్లు. ఈ దిశ కొలత 39'-6" అడుగులు. **ఉత్తరం :** కనుమూరు సురేష్‌ సుబ్రహ్మణ్యం గారి ఇంటి స్థలం. ఈ దిశ కొలత 5'-00" అడుగులు.

కౌంటర్‌ సంతకం
కాకుటూరు పద్మావతి W/o దశరథరామిరెడ్డి(లేట్‌)
నెల్లూరు
సెల్‌: 92464 29977

చిన్నం శ్రీధర్‌, M.Com., L.L.B.,
అడ్వకేట్‌, ఫ్లాట్‌ నెం.79, డోర్‌ నెం. 26/2/33-I,
రిత్విక్‌ ఎన్‌క్లేవ్‌, ఏ.కె.నగర్‌, నెల్లూరు-524004
సెల్‌: 94402 77812, 63037 14647

వృద్ధాప్య పింఛన్‌ ఇవ్వాలని ఘర్షణ

తండ్రి చేతిలో కుమారుడి హతం

ఆత్మకూరు : వృద్ధాప్య పింఛన్‌ కావాలని తండ్రితో ఘర్షణ పడి కుమారుడు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆత్మకూరు మండలం బట్టేపాడు ఎస్సీ కాలనీలో మాముడూరు పుల్లయ్య సోమవారం సచివాలయ సిబ్బంది నుంచి వృద్ధాప్య పింఛను తీసుకున్నారు. కాసేపటికి కుమారుడు మస్తానయ్య(37) వచ్చి సెల్‌ఫోన్‌ బాగు చేయించుకునేందుకు నగదు ఇవ్వాలని కోరగా రూ.వెయ్యి ఇచ్చారు. మద్యం తాగి తిరిగి తండ్రి వద్దకొచ్చి నగదు ఇవ్వమనడంతో వీరి మధ్య ఘర్షణ నెలకొంది. సమీపంలో ఉన్న కర్ర తీసుకొని కుమారుడి తలపై కొట్టడంతో స్పృహకోల్పోయి కుప్పకూలారు. 108కు సమాచారమివ్వగా అప్పటికే మృతి చెందారని చెప్పారు. పోలీసులకు సమాచారమివ్వగా సీఐ గంగాధర్‌ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి పుల్లయ్యను అదుపులోకి తీసుకున్నారు. కుమారుడి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

దుబాయ్‌లో నర్సింగ్‌ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు విదేశీ ఉద్యోగాలు కల్పిస్తున్నటు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్‌ఖయ్యూం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో దుబాయ్‌ (యూఏఈ)లో హోమ్‌ కేర్‌ నర్సింగ్‌ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్‌ (అమ్మాయిలు) అర్హులన్నారు. గరిష్ఠంగా 40 సంవత్సరాల వయసు కలిగి కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు సుమారు రూ. 1,08,900- రూ. 2 లక్షల జీతంతో రెండు సంవత్సరాలు కాంట్రాక్ట్‌పై నియామకాలు జరగనున్నాయని వివరించారు. వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నగదు పోయిందని

సచివాలయ ఉద్యోగి డ్రామా

పోలీసుల హెచ్చరికతో లబ్ధిదారులకు అందజేత

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: పింఛన్ల పంపిణీకి బ్యాంకు నుంచి తీసుకెళుతున్న నగదు పోయిందని సచివాలయ ఉద్యోగి హైడ్రామా చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా ఎస్సై తనదైన శైలిలో విచారించగా.. చివరకు లబ్ధిదారులకు పింఛన్‌ నగదు పంపిణీ చేశారు. వరిగొండలో సచివాలయంలోని మత్స్యశాఖ సహాయకుడు పింఛన్ల పంపిణీకి సోమవారం రూ. 2.18 లక్షల నగదు బ్యాంకు నుంచి డ్రా చేసుకొని ద్విచక్రవాహనంపై బయల్దేరారు. గ్రామ సమీపంలో బ్యాగు ఎక్కడో పడిపోయిందని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శితో పాటు స్థానికులకు నమ్మించారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్సై తనదైన శైలిలో విచారించగా ఫిర్యాదు చేయకుండా వెనుదిరిగారు. అనంతరం స్నేహితుడి వద్ద అప్పు తెచ్చానని చెప్పి లబ్ధిదారులకు పింఛన్‌ పంపిణీ చేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లబ్ధిదారులకు పింఛన్‌ నగదు అందిందని, ఉద్యోగి తీరుపై విచారిస్తామన్నారు.

రూ.30 కోట్లకు మోసం

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ఓ సంస్థ ప్రజల నుంచి రూ. 30 కోట్లకు పైగా డిపాజిట్ల రూపంలో వసూలు చేసి బోర్డు తిప్పేసింది. దీనిపై బాధితులు నెల్లూరులోని దర్గామిట్ట పోలీసులకు సోమవారం తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని ఇన్‌స్పెక్టర్‌ కల్యాణరాజును వేడుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రాంఛైజీల పేరుతో డిపాజిట్లు తీసుకుని నిర్వాహకులు మోసం చేశారని కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. బాధితులకు అండగా ఉండి ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతామని చెప్పారు.

ఆసుపత్రికి తరలిస్తుండగా..

ఉద్యోగి మృతి

సీతారామపురం, న్యూస్‌టుడే: అప్పటి వరకు తోటి ఉద్యోగులతో సరదాగా మాట్లాడాడు. ఆ సమయంలో ఛాతీలో నొప్పిగా ఉండడంతో ఉద్యోగులు అతడ్ని కారులో ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గం మధ్యలో మృతిచెందారు. ఈ సంఘటన సీతారామపురంలో జరిగింది. వివరాల మేరకు పబ్బులేటిపల్లికి చెందిన మహిమలూరి వెంకటేష్‌ (27).. మారంరెడ్డిపల్లి జేఎల్‌ఎంగా పనిచేస్తున్నారు. సోమవారం సీతారామపురం విద్యుత్తు ఉపకేంద్రానికి వచ్చారు. ఈ క్రమంలో భోజన సమయంలో తోటి ఉద్యోగులతో సరదాగా మాట్లాడుతున్నారు. ఛాతీలో నొప్పిరావడంతో స్థానిక ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి మాత్ర మింగాడు. అయినా తగ్గక చెమటలు పోయడంతో ఉద్యోగులు కారులో ఉదయగిరిలోని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య, ఏడాది కుమారుడు ఉన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైం or ఫుల్‌ టైం ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 8500353577.

నేషనల్‌ బేరింగ్స్‌& ట్రాక్టర్‌ స్పేర్స్‌ షోరూం నందు పనిచేయుటకు కారు డ్రైవర్‌, సేల్స్‌ బాయ్స్‌ కావలెను. Age 20to25 సం|| ఆటోనగర్‌, నెల్లూరు. నెల్లూరు టౌన్‌ వారికి ప్రాధాన్యత 9849467099

వెంకటాచలం (మం) కాకుటూరు జైన్‌ టెంపుల్‌ దగ్గర క్రొత్తగా ప్రారంభిస్తున్నకుంభకోణం డిగ్రీ కాఫీ కేఫ్‌ నందు పనిచేయుటకు యువకులు కావలెను. ✆ 88015 53938

JOBS

శ్రీ దుర్గా పికెల్స్‌ ఫ్యాక్టరీలో ప్యాకింగ్‌ మిషన్‌ వద్ద ప్యాకింగ్‌ చేయుటకు మహిళలు కావలెను. నారాయణరెడ్డిపేట (జేవిన్‌పేట) నెల్లూరు. Contact ✆ 9100574129, 7675974297

సప్లయర్స్‌-5, కిచెన్‌ స్టాఫ్‌ కావలెను. శ్రీ దుర్గా హోటల్‌, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు. Contact Number ✆ 9701335689, 75697 92114

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్‌ వ్యవహారాలు... వివరాలకు..
B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్‌ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ఉలవపాడులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కలిగిరి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. గంగిరెడ్డిపాలెం పంచాయతీలో సోమవారం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. అర్హులైన వారు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాల కోసం స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెదేపా మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచి మాధవ, నాయకులు పాల్గొన్నారు. **బిట్రగుంట:** రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉండబోతుందని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అన్నారు. ముంగమూరులో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఓ వృద్ధురాలు గిరిజన కాలనీ సమస్యలు విన్నవించగా.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. తెదేపా సీనియర్ నాయకులు ఎన్నాబత్తిన వెంకటేశ్వర్లు తాగునీటి సమస్య తీవ్రతను వివరించడంతో రూ.25 లక్షలు నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. **ఉలవపాడు:** గ్రామాలకు నిధులు రాబట్టడంలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఉలవపాడులోని కొత్తూరు మసీదు వీధిలో ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు.

గంగిరెడ్డిపాలెంలో నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న వృద్ధురాలు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న అధికారులు

లింగసముద్రం : తిమ్మారెడ్డిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు1లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను తహసీల్దారు ఎం.కోటేశ్వరరావు, ఎస్సై నారాయణ పరిశీలించారు. ఈ ఆక్రమణలపై ఈ నెల 28న 'కన్నుపడితే.. కబ్జానే' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం భూములను పరిశీలించారు. దస్త్రాల ప్రకారం హద్దులు చూశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దేశంలో స్మారక చిహ్నాలు ఎన్ని : ఎంపీ

నెల్లూరు(నగరపాలకసంస్థ) : దేశంలో స్మారక చిహ్నాలు ఎన్ని ఉన్నాయి.. వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం లోక్‌సభలో ప్రశ్నించారు. వీటికి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా 3,685 పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలను భారత పురావస్తు శాఖ గుర్తించి పర్యవేక్షిస్తుందని మంత్రి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు: 70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: స్థానిక అంబేడ్కర్ బొమ్మ కూడలిలోని రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో దోమలు పెరుగుతున్నాయి. చర్యలు తీసుకోవాలి. - పి.జశ్వంత్, స్థానికుడు

సమాధానం: వాటి నివారణకు పారిశుద్ధ్య కార్మికులతో బ్లీచింగ్ చల్లిస్తాం. - నరేశ్, పంచాయతీ కార్యదర్శి గుడ్లూరు, న్యూస్‌టుడే

? రామకృష్ణాపురంలో మురుగు నీటి ప్రభావం వల్ల దోమలు అధికంగా ఉన్నాయి. వాటి నివారణకు చర్యలు చేపట్టాలి.- సతీశ్, గ్రామస్థుడు

✓వర్షాలు తగ్గగానే దోమల నివారణకు చర్యలు చేపడతాం.- మాధవరావు, పంచాయతీ కార్యదర్శి, లింగసముద్రం, న్యూస్‌టుడే

? కావలి పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు నుంచి పాపిరెడ్డి చెరువుకు తవ్విన కచ్చా కాలువ పూడిపోతోంది. దాని స్థానంలో శాశ్వత డ్రెయిన్ నిర్మించాలి. - పి.వెంకటేశ్వర్లు, రైతు

✓ఈ విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి ఉన్నాం. నిధులు మంజూరు కాగానే డ్రెయిన్ నిర్మాణ పనులు చేపడతాం. - జంపాని కిరణ్, ఏఈ, -కావలి, న్యూస్‌టుడే

నిబంధనలకు విలువేది.. క్రమబద్ధీకరణ మాటేది?

అక్రమంగా పుట్టుకొస్తున్న లేఅవుట్లు

ఉలవపాడు, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారులకు నిబంధనలు పట్టడం లేదు. అక్రమంగా లేఅవుట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. వాటి క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పలుమార్లు అవకాశం కల్పించినా.. తమకు అవేవీ అడ్డం కావులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటివి ముందుకేసే కాగితాల్లోనే.. లేఅవుట్లు చూపుతూ విక్రయాలు జరుపుతున్నారు.

లేఅవుట్ ఏర్పాటుకు తొలగిస్తున్న మామిడి తోట

ఎక్కడెక్కడంటే..

ఉలవపాడు జాతీయరహదారిలోని ఓ పలావు హోటల్ వెనుక వైపు, ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలోనూ, రైల్వే గేటు పరిసరాల్లో అనుమతులు లేకుండా రెండు లేఅవుట్లు వేశారు. చాగొల్లులో రెండు, వీరేపల్లిలో ఒకటి, కరేడు, రామాయపట్నం గ్రామాల్లో మూడు చొప్పున ఉన్నాయి. ఉలవపాడు పోలీస్‌స్టేషన్ వద్ద ఏళ్ల క్రితం అక్రమంగా వేసిన లేఅవుట్‌లోని పలు ప్లాట్లు ఇప్పటికే రెండు, మూడు చేతులు మారాయి.

ఇటీవల జాతీయ రహదారి పక్కన ఉలవపాడు సమీపంలో పది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మామిడితోటను కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు చెట్లు తొలగించకుండా, అనుమతులు లేకుండానే కాగితాలపైనే 290ప్లాట్లుగా విభజించారు. ఇక్కడ విస్తీర్ణం బట్టి ఒక్కో గది(అంకణం) రూ.80వేలు, ఒక్కో ప్లాట్ రూ.1.80లక్షల లెక్కన ధర పలుకుతోంది. ప్రస్తుతం అమ్మకాలు సాగుతున్నాయి. ఇప్పటికే 25 ప్లాట్ల వరకు కొనుగోళ్లు జరిగినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం మామిడి చెట్లను తొలగిస్తూ లేఅవుట్ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు.

అవకాశమిచ్చినా..

ఉలవపాడు మండలంలో సుమారు 20 లేఅవుట్లు ఉండగా 15 లేఅవుట్లకు అనుమతులు లేవు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతరగా మార్చడానికి ప్రభుత్వానికి రుసుము చెల్లించాలి. రోడ్లు, ఇతర సామాజిక కార్యకలాపాలకు కొంత స్థలాన్ని పంచాయతీలకు కేటాయించాలి. ఇలా చేయకుండానే లేఅవుట్లు వేస్తున్నారు. ఇలాంటి వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్ కింద ప్రభుత్వం వచ్చే ఏడాది జనవరి 23 వరకు అవకాశం కల్పించింది. కానీ రాజకీయ అండ ఉన్న స్థిరాస్తి వ్యాపారులు కొందరు పట్టనట్లుగా వ్యవహిస్తున్నారు. యథేచ్ఛగా నూతనంగా లేఅవుట్‌లు వేస్తున్నారు. నిబంధనల మేరకే ప్లాట్లు అమ్ముతున్నామని చెప్పి ప్రజలను నమ్మించి విక్రయాలు చేస్తున్నారు. ఇళ్లు నిర్మించుకునే సమయంలో కొనుగోలుదారులకు అనుమతులు రాక ఇబ్బందులు పడుతున్నారు.

ఈ విషయమై ఈవోపీఆర్డీ శ్రీనివాసరావును వివరణ కోరగా మండల పరిధిలో ఉన్న లేఅవుట్లను సుదా పరిశీలిస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేలా చూస్తామని తెలిపారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే: వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్ర బస్సు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. గండిపాళెంలో సోమవారం జరిగిన వీపీఆర్ నేత్ర బస్సు శిబిరాన్ని సందర్శించారు.

చెత్త రిక్షాలు.. నిరుపయోగం

స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించేందుకు ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి ఒక్కో పంచాయతీకి రెండు నుంచి మూడు రిక్షాలను అందజేసింది. కొన్ని రిక్షాలు చిన్నపాటి మరమ్మతులకు గురికాగా మరికొన్ని పూర్తిస్థాయిలో వినియోగంలో లేకపోవడంతో పక్కన పడేశారు. మరమ్మతులు చేయిస్తామని డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున తెలిపారు. **- న్యూస్‌టుడే, దుత్తలూరు**

కాలువలో స్తంభం.. పారుదలకు ఆటంకం

పట్టణంలోని విప్పగుంటరోడ్డు నుంచి కనిగిరి రోడ్డుకు వెళ్లే మార్గంలో బిలాల్‌నగర్ సమీపంలో మురుగు కాలువ మధ్యలోనే విద్యుత్తు స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో మురుగు పారుదలకు అడ్డంకిగా మారి చెత్తా చెదారం పేరుకుపోతోంది. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**

కార్యాలయం ఉరుస్తోంది

గుడ్లూరులోని తహసీల్దారు కార్యాలయం చిన్నపాటి వర్షానికి సైతం ఉరుస్తోంది. సుమారు పదిహేను ఏళ్ల క్రితం నిర్మించడంతో స్లాబు నెర్రెలిచ్చింది. చుట్టూ గోడలు పగుళ్లిచ్చాయి. కొన్ని చోట్ల పెచ్చులూడుతున్నాయి. కార్యాలయ ప్రధాన భాగంలో నీరుపడుతుండటంతో స్వీపర్లు పలుమార్లు తుడవాల్సి వస్తోంది. **- న్యూస్‌టుడే, గుడ్లూరు**

ఈ దారిలో.. రాకపోకలకు ఇబ్బందే

మోపాడు చెరువు అలుగు మార్గంలో నీరు పారుదల జరిగే దగ్గర ఉన్న కాంక్రీటు దెబ్బతింది. రాళ్లు కనిపిస్తున్నాయి. తలుపులు ఎత్తి దిగువకు నీరు వదిలిన సమయంలో కోతకు గురై ఈ పరిస్థితి వచ్చింది. ఈ మార్గంలో కొండముడుసుపాలెం రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం**

నీరు ఇలా.. వెళ్లేదెలా?

మండలంలోని ఆర్.ఆర్.పాలెంలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. గ్రామంలో రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువలు లేవు. దీంతో ఇళ్లలోని నీటితోపాటు వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉంటుంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, లింగసముద్రం**

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

కందుకూరుపట్టణం: ప్రదర్శనలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

కావలి, కందుకూరు పట్టణం, వింజమూరు, ఉలవపాడు, సీతారామపురం, న్యూస్‌టుడే: ఎయిడ్స్ ఇప్పటికీ సైలెంట్ కిల్లర్‌గా ఉందని, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. కళాశాలలో రంగోలి, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ ఐ.అనూష, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.నరేష్‌రాజా తదితరులు పాల్గొన్నారు. ఎయిడ్స్ నివారణ దినం పురస్కరించుకుని కావలి పట్టణంలోని జవహర్‌భారతి ఎయిడెడ్ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. వింజమూరులో విశ్రాంత డీఎంహెచ్‌వో కె.మాశిలామణి బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి వై.సుధాకర్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సీతారామపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయినిఖిల్, నాగేంద్ర నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు.

సీతారామపురంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు

ఉదయగిరి, న్యూస్‌టుడే: మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్ గ్రామాల్లో ఉదయగిరి ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం ఎన్ఎస్ఎస్ శిబిరాలను నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు సునీత, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు మద్యం, మత్తు పదార్థాలు వినియోగిస్తే కలిగే అనర్థాలతోపాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వైద్య బృందంతో ఆరోగ్య, దంత వైద్య శిబిరాలను నిర్వహించారు. అనారోగ్య సమస్యలతో బాధపడే వారిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

చల్లటి గాలులు.. చిరుజల్లులు

ముంగమూరు వద్ద పొంగి ప్రవహిస్తున్న పిల్లివాగు

దిత్వా తుపాను ప్రభావంతో సోమవారం వేకువజాము నుంచి చల్లని గాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. అది కూడా వస్తూ.. పోతూ ఉండడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులకు గురయ్యారు. కావలి డివిజన్‌లోని ఉబ్బలవాగు, పిల్లివాగు, చిప్పలేరు వంటి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బోగోలు మండలంలోని ముంపు గ్రామాల చుట్టూ వందల ఎకరాల మాగాణి భూముల్లోకి నీరు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకే నిండు కుండలా ఉన్న చెరువులు ప్రస్తుతం కలుజుల నుంచి నీరు ప్రవహిస్తుంది. జక్కేపల్లిగూడూరు, బోగోలు, నాగులవరం, అక్కరాజువారికండ్రిక చెరువులకు ముప్పు పొంచి ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహం కారణంగా అల్లూరు మండలంలోని పైడేరు ఉద్ధృతంగా ఉంది. స్వాంపు వాగులోకి నీరు అధికంగా వస్తోంది. భారీ వర్ష సూచనతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ సూచించారు. సోమవారం రామన్నచెరువు, స్వాంపు ప్రాంత కాలనీల్లో ఆయన పర్యటించారు. కావలి పట్టణ పరిధిలోని వివిధ లోతట్టు ప్రాంతాలైన శివరామసుబ్బయ్యకాలనీ, అనపగుంత, తదితర ప్రాంతాల్లో పురపాలక కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ పర్యటించారు. వర్షం తీవ్రత పెరిగితే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో తుపాను ప్రభావం అంతగా కనిపించలేదు. **- బిట్రగుంట, కావలి, అల్లూరు, న్యూస్‌టుడే**

కావలి: శివరామసుబ్బయ్య కాలనీని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్ తదితరులు

జక్కేపల్లిగూడూరు చెరువు కలుజు నుంచి ఉద్ధృతంగా తరలుతున్న నీరు.. అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డుపై చేరిన నీరు

రోడ్డుపై మడుగులు.. పడని అడుగులు

దారకానిపాడు వద్ద రహదారిపై పెద్ద మడుగు

గుడ్లూరు, న్యూస్‌టుడే: గుండ్లపాలెం అడ్డరోడ్డు నుంచి పూరేటిపల్లి వరకు తారురోడ్డు అధ్వానంగా మారింది. సుమారు తొమ్మిది కి.మీ దూరం మొత్తం గోతులు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో కందుకూరు నుంచి పెదపవనికి బస్సులు, వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. గుండ్లపాలెం, రాళ్లపాడు, దారకానిపాడు, పూరేటిపల్లి, చినపవని,పెదపవనితో పాటుమరో అయిదు గ్రామాల ప్రజలు ఈ రహదారిని ఉపయోగిస్తుంటారు. దారకానిపాడు వద్ద తారు, కంకర తొలగిపోవడంతో పెద్దమడుగు ఏర్పడింది. రాత్రి సమయాల్లో ప్రమాదకరంగా ఉందని కనీసం మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పి.చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు కయ్యల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కోతకు ఏవైనా పంటలు వచ్చి ఉంటే కోయవద్దన్నారు. వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలన్నారు. **దుత్తలూరు :** రానున్న రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలతో పాటు కాలనీ వాసులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు నాగరాజు సూచించారు. మండలంలోని నర్రవాడ ఏస్సీ కాలనీ, తెడ్డుపాడు కాలనీలను సోమవారం ఆయన పరిశీలించి స్థానికులకు తగిన సూచనలు చేశారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి, న్యూస్‌టుడే: మండలంలోని ఆర్లపడియ పంచాయతీ పప్పులవారిపల్లిలో ప్రభుత్వ భూములు ఆక్రమణ కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సోమవారం ఇన్‌ఛార్జి తహసీల్దారు షాజియాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీకి చెందిన కొందరు వ్యక్తులు తమ గ్రామం వద్ద ఉండే ప్రభుత్వ అనాధీనం, గయాలు, మేత పోరంబోకు భూములను ఆక్రమిస్తున్నారన్నారు. గతంలో యంత్రాలతో భూములను చదును చేయగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినప్పటికీ లెక్క చేయకుండా భూముల్లో జామాయిల్ చెట్లను నాటేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

అన్నదాతలకు యూరియా అందజేత

ఉదయగిరి : స్థానిక కొటాలపల్లి సొసైటీ కార్యాలయంలో సోమవారం మండలంలోని రైతులకు సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య యూరియా పంపిణీ చేశారు. అవసరమైన రైతులు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సీఈవో పోలయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనుల ప్రారంభం

కలిగిరి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన కలిగిరిలోని పర్వత వర్ధిని సతీసమేత రామలింగేశ్వర స్వామి(శివాలయం) ఆలయ జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా బాలాలయంలో విగ్రహాల మార్పిడి కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రస్తుతం ఆలయంలోని విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేసి వాటిని తాత్కాలికంగా బాలాలయంలోకి మార్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరయ్యారు.

ఆలయానికి కలశాలతో వస్తున్న భక్తులు

వినియోగంలోకి సీతారామపురం బస్‌షెల్టర్

సీతారామపురం, న్యూస్‌టుడే : సీతారామపురంలోని బస్‌షెల్టర్‌ను సోమవారం నుంచి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు ఉదయగిరి డిపో మేనేజర్ రమేష్ కుమార్ తెలిపారు. బస్‌షెల్టర్ వద్ద బస్సులు నిలుస్తాయని, ప్రయాణికులను ఎక్కించుకుని వెళతాయన్నారు. ❖ **ఉదయగిరి :** ఉదయగిరి నుంచి విశాఖపట్టణానికి నడుపుతున్న ఆర్టీసీ బస్సు సర్వీసును రద్దు చేయకుండా కొనసాగించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు షేక్ దస్తగిరిఅహ్మద్ విజ్ఞప్తి చేశారు. ఉదయగిరి ప్రాంతంలో ఉన్న ప్రజలు ఎక్కువ మంది వలసలు వెళ్లి జీవనోపాధి పొందే పరిస్థితి ఉందన్నారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న దూర ప్రాంత సర్వీసులను రద్దు చేయకుండా అందుబాటులో ఉంచాలన్నారు.

బంద్‌కు సహకరించాలి

కావలి, న్యూస్‌టుడే: గంజాయికి యువత దూరంగా ఉండాలని సీపీఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి అన్నారు. మంగళవారం జరగనున్న జిల్లా బంద్‌కు అన్నివర్గాల ప్రజానీకం సహకరించాలని కోరారు. గంజాయి ఆనవాళ్లు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై కావలి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇటీవల నెల్లూరు నగరంలో తమ పార్టీ నాయకుడు పెంచలయ్యను గంజాయి ముఠా హతమార్చడం దారుణమన్నారు. సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు. **ఉదయగిరి:** గంజాయి ముఠా చేతిలో దారుణంగా హత్యకు గురైన పెంచలయ్య ఆశయాలను కొనసాగించాలని సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య పేర్కొన్నారు. స్థానిక పుచ్చపల్లి సుందరయ్య భవనంలో పెంచలయ్య చిత్రపటానికి పూలమాలేసినివాళులర్పించారు. మంగళవారం ఉదయగిరిలో బంద్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజలు, ప్రజా సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, నాయబ్, ఫరుద్దీన్‌బాషా, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఉప్పుటేరు.. వృథా నీరు

గుడ్లూరు, న్యూస్‌టుడే: నీటి నిల్వలకు చెక్‌డ్యాంలు ఎంతో కీలకంగా ఉంటాయి. వీటి ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయి. మండలంలోని ప్రధాన నీటి వనరు అయిన ఉప్పుటేరుపై గుడ్లూరు సమీపంలో ఉన్న చెక్‌డ్యాం అధ్వానంగా మారింది. దీంతో నీరు వృథాగా పోతోంది.

ఉప్పుటేరు.. కొండాపురం మండలం నుంచి లింగసముద్రం మండలం మీదుగా 20 కి.మీ మేర ప్రవహించి కందుకూరు మండలం మాచవరంలోని మన్నేరులో కలుస్తుంది. దీనిపై పెదపవని, చెంచిరెడ్డిపాలెం గ్రామాల్లో తక్కువ ఎత్తులో, గుడ్లూరు, మాచవరం సమీపంలో చెక్‌డ్యాంలు ఉన్నాయి. ఇటీవల వచ్చిన మొంథా, ప్రస్తుతం దిత్వా తుపాన్ల ప్రభావంతో నీరు పొంగి ప్రవహిస్తోంది. దీనికి అడ్డుకట్ట లేకపోవడంతో వృథాగా పోతోంది.

ఏడాది పొడవునా..

తెదేపా ప్రభుత్వం హయాంలో 2017లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతోపాటు, స్థానిక తెదేపా నాయకుల సహకారంతో ఉప్పుటేరు నేలచప్టాను ఇసుక బస్తాలు వేసి చెక్‌డ్యాంగా మార్చడంతో సుమారు పది అడుగుల ఎత్తులో.. ఎగువకు రెండు కి.మీ మేర నీరు నిలిచింది. దీంతో గుడ్లూరులో ఉత్తరం వైపు ఉన్న పొలాలు, బసిరెడ్డిపాలెం పొలాలతో పాటు కూరగాయలు, మామిడి తోటలకు ఏడాది పొడవునా సాగునీరందించింది. భూగర్భ జలాలు సైతం పెరిగాయి.

గుడ్లూరు వద్ద పాతనేలచప్టా నుంచి దిగువకు పోతున్న నీరు

కొట్టుకుపోవడంతో..

2019లో కురిసిన భారీ వర్షాలకు చెక్‌డ్యాం కోసం వినియోగించిన ఇసుక బస్తాలు కొట్టుకుపోయాయి. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో చెక్‌డ్యాంతోపాటు, చప్టా కాంక్రీటు కూడా నెర్రెలిచ్చింది. అప్పటి నుంచి అధిక మొత్తంలో నీరు వృథాగా పోతోంది. తాత్కాలికంగా అయినా చప్టాను చెక్‌డ్యాంగా మార్చాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

రూ.8 కోట్లతో ప్రతిపాదనలు

గుడ్లూరు సమీపంలోని ఉప్పుటేరు ఎత్తు వంతెనకు ఎగువన 500 మీటర్ల దూరంలో చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ఇందుకోసం సుమారు రూ.ఎనిమిది కోట్లు ఖర్చు అవుతోంది. ప్రభుత్వ అనుమతులు రాగానే పనులు చేపడతాం.
సీతారామయ్య, జేఈ, జలవనరులశాఖ

పొలం విషయమై వృద్ధురాలిపై దాడి

కలిగిరి : పొలం విషయమై మాట్లాడటానికి వెళ్లిన వృద్ధురాలిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మండల పరిధిలో జరిగింది. బాధితురాలి వివరాల మేరకు.. దగదర్తి మండలం లింగాలపాడుకు చెందిన మునగాల బుజ్జమ్మకు కలిగిరి మండలం తూర్పుగుడ్లదొనలో 12.60 ఎకరాల పొలం ఉంది. ఈక్రమంలో తన పొలాన్ని ఆ గ్రామానికి చెందిన కోట ప్రసాద్ కుటుంబసభ్యులు దున్నినాట్లు వేస్తున్నారనే సమాచారంతో తన ఆడపడుచు లోకిరెడ్డి శ్రీదేవితో కలిసి సోమవారం పొలం వద్దకు వెళ్లారు. దీంతో వారిపై ప్రసాద్‌తోపాటు తిరుపాలమ్మ, వెంకటేశ్వర్లు, తిరుపాలునాయుడు కలిసి దాడికి యత్నించారు. భయాందోళనకు గురైన శ్రీదేవి వారి నుంచి తప్పించుకోగా బుజ్జమ్మపై దాడి చేశారు. ఈవిషయమై ఎస్సై ఉమాశంకర్‌ను వివరణ కోరగా ఘటన తరువాత బాధితురాలు చికిత్స నిమిత్తం కావలికి వెళ్లారని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం



వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, శబ్దకాలుష్యం, ఇలా వాతావరణం కలుషితమవుతోంది. తద్వారా మానవ మనుగడకే ప్రమాదం వాటిల్లుతోంది.
జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నివారణకు మనవంతు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేద్దాం
కొండాపురం మండల ప్రజలు

(c) eenadu

కోవూరు
• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

కూచిపూడి నృత్య ప్రదర్శనలో పూర్ణిమాశ్రీ ప్రతిభ

మనుబోలు, న్యూస్‌టుడే: మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి, శ్రీసిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాక్షేత్రం నిర్వాహకురాలు పుచ్చిపూర్ణిమాశ్రీ అరుదైన రికార్డును నమోదు చేశారు. తోటపల్లి గూడూరు మండలం నరుకూరు సంప్రదాయ కూచిపూడి కళాక్షేత్రం వ్యవస్థాపకుడు ఆనంద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శాస్త్రీయ నృత్యోత్సవంలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చింది. దీంతో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆమె పేరును నమోదు చేశారు. సౌత్ ఇండియా జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతినిధి రవికుమార్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతినిధి బింగీ నరేంద్రరాజు చేతులమీదుగా ప్రశంసా పత్రంతో పాటు అవార్డును అందుకున్నారు.

పలువురికి రాష్ట్రస్థాయి పురస్కారాలు

మనుబోలు, న్యూస్‌టుడే: వైద్యరంగంలో ఉత్తమ సేవ అందించినందుకు మండలానికి చెందిన పలువురికి రాష్ట్రస్థాయి సేవా పురస్కారాలు అందుకున్నారు. వీరంపల్లి గ్రామానికి చెందిన బాబురావు, కాగితాలపూరుకు చెందిన ఆదిశేషయ్య గూడూరులోని రక్త నిధిలో పనిచేస్తున్నారు. ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా గుంటూరులో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతులమీదుగా పురస్కారాలు అందుకున్నారు. పలువురు వారిని అభినందించారు.

మామిడిపూడి రోడ్డు నిర్మించాలని నిరసన

నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

ముత్తుకూరు, న్యూస్‌టుడే: ముత్తుకూరు నుంచి మామిడిపూడికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని... రోడ్డును సత్వరం నిర్మించాలంటూ ఆజాద్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆజాద్ జిల్లా కార్యదర్శి రషీద్ మాట్లాడుతూ... 34 గ్రామాలను కలిపే ప్రధాన రోడ్డు చాలా కాలంగా గుంతలమయంగా మారిందని, దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సాయిబాబా గుడి వద్ద నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి లక్ష్యం

పింఛన్ అందజేస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, న్యూస్‌టుడే: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని కృష్ణపట్నం రుద్ర, మల్లూరుల్లో సోమవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి నెల 38687 మందికి రూ.16.73 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి గిరిజనులకు రూ.2.55 లక్షలు, దళితులకు రూ.2.30 లక్షలకు పెంచిందని, త్వరలో 5 లక్షల ఇళ్ల మంజూరు చేస్తున్నారని, నాణ్యతతో వాటి నిర్మాణాలు జరుగుతాయని పేర్కొన్నారు.

సాగు భూములను తీసుకుంటే ఊరుకోం

తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతుల నిరసన

పొదలకూరు, న్యూస్‌టుడే: తాము సాగు చేసుకుంటున్న నిమ్మ తోటలను టిడ్కో ఇళ్లకు ఎలా కేటాయిస్తారని సోమవారం పొదలకూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట మొగళ్లూరుకు చెందిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ యాభై ఎకరాల్లో రెండు దశాబ్దాలకు పైగా నిమ్మతోటలు, మెట్ట పైర్లు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఈ భూములకు ప్రభుత్వ అధికారులు పట్టాలిచ్చారన్నారు. ఇటీవల సాగు అనుభవంలో ఉన్న వాటిని టిడ్కో సంస్థకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. వెంటనే ఆ సంస్థకు ఇచ్చిన భూములను రద్దు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో మహిళా రైతులు భాగ్యమ్మ, ప్రశాంతి, పెంచలమ్మ తదితరులు కలిసి తహసీల్దారు శివకృష్ణయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు.

నీటమునిగిన పొలాలు.. సాగుదారుల్లో దిగులు

సిద్ధీపురంలో పరిశీలిస్తున్న ఆర్డీవో పావని

అలుగు పారిన ఆత్మకూరు చెరువు

కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు, వెంకటగిరి బృందం, న్యూస్‌టుడే : మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. వెంకటాచలం మండలంలో చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. ముత్తుకూరు మండలంలో కొన్ని రోడ్లు దెబ్బతిన్నాయి. కసుమూరులో చందన్ మహల్ వద్ద నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. ● సూరాయపాలెంలో సుమారు 50 ఎకరాల్లో నారు నీట మునిగింది. వర్షపునీరు చేపలు, రొయ్యల గుంతల్లో చేరింది. ● తోటపల్లిగూడూరు మండల పరిధిలోని కొత్తకోడూరు, రవీంద్రాపురం తదితర గ్రామాల్లో తహసీల్దారు సుధీర్ పర్యటించారు. ఇందుకూరుపేట, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో రొయ్యలు సాగు చేస్తున్న రైతుల్లో ఆందోళన నెలకొంది. తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ● ఆత్మకూరు చెరువు అలుగు పారింది. పదేళ్ల తరువాత వాగు పొంగి నీరు రోడ్డుపై ప్రవహించింది. ఆర్డీవో పావని సంగం మండలం సిద్ధీపురంలోని ఎస్సీ కాలనీలో ఆమె తహసీల్దారు సోమ్లానాయక్‌తో కలసి పరిశీలించారు. ● విడవలూరు, కోవూరు మండలాల్లో జోరుగా వర్షం కురిసింది. తీరంలో చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంది. కోవూరులోని సాయిబాబా మందిరం సమీపంలో వంతెన కింద వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విడవలూరులో పలుచోట్ల మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి. నారుమడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవో లక్ష్మీ రైతులకు వివరించారు. ఊటుకూరు, అన్నారెడ్డిపాలెంలో వరి, వేరు సెనగ పొలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ● రాపూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వర్షాలకు నారుమడులకు నష్టం వాటిల్లిందని సాగుదారులు వాపోతున్నారు.

విడవలూరులో పరిశీలిస్తున్న ఏవో లక్ష్మీ.. సూరాయపాలెంలో నీట మునిగిన నారుమడులు.. పొదలకూరు ప్రధాన రోడ్డు జలమయం

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

సంగం, న్యూస్‌టుడే: పెన్నానది, బొగ్గేరు మధ్య ఉన్న వీర్లగుడిపాడు ప్రజలు రోడ్డు సదుపాయం లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పందించి నిధులు మంజూరు చేశారని మంత్రి ఆనం అన్నారు. సోమవారం సంగం మండలంలో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు.. ఏడు గ్రామాల్లో రోడ్డు నిర్మాణానికి రూ.27 కోట్లతో పనులు ప్రారంభమవుతాయన్నారు. అన్నారెడ్డిపాలెంలో త్వరలో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మిస్తామన్నారు. ప్రముఖ పర్వతారోహకుడు దివంగత మల్లి మస్తాన్‌బాబు ఇంటికి వెళ్లిన మంత్రి ఆనం అతని తల్లి యోగక్షేమాలను తెలుసుకున్నారు.. రెండెకరాల భూమి సాగుకు యోగ్యంగా లేదని ఆవేదన వ్యక్తం చేయడంతో వెంటనే తహసీల్దారు సోమ్లానాయక్‌తో మాట్లాడి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్డీవో పావని, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఎంపీడీవో షాలెట్, పీఆర్ ఇంజినీర్లు సుధాకర్‌రెడ్డి, మల్లికార్జున, తెదేపా నాయకులు కృష్ణమూర్తి, శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

? **సమస్య:** మనుబోలు మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో మురుగు కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. **–రమేష్, స్థానికుడు**

✓ **సమాధానం:** సిబ్బందికి చెప్పి శుభ్రం చేయిస్తాం. **–శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో**

? అనంతసాగరంలోని రామాలయం వీధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. అవి దాడులకు పాల్పడుతుండటంతో మహిళలు, చిన్నారులు వీధిలో సంచరించాలంటే భయాందోళనలకు గురవుతున్నారు. **–హుస్సేన్, గ్రామస్థుడు**

✓ సమస్యను పరిశీలించి తగిన రక్షణ చర్యలు చేపడతాం. **– అంజనేయులు, పంచాయతీ కార్యదర్శి**

? మర్రిపాడు మండలం పి.ఎన్.పల్లి బీసీ కాలనీలో సీసీ రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **– సుబ్బయ్య**

✓ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. **–శ్రీలత, పంచాయతీ కార్యదర్శి**

? సంగం మండలం తలుపూరుపాడులో బెజవాడ పాపిరెడ్డి కాలువ వద్ద నుంచి గ్రామంలోకి వచ్చే మార్గంలో వర్షపునీరు వెళ్లే కాలువ వద్ద రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. **– నాయబ్, తలుపూరుపాడు**

✓ కల్వర్టు నిర్మించేలా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. **–షాలెట్, ఎంపీడీవో**

? పొదలకూరు పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. సీహెచ్‌సీకి ఎక్కువ మంది బాధితులు వస్తున్నారు. **– ప్రసాద్,**

✓ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. **–యశ్వంత్‌సింగ్, ఈవో**

? తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు ఎస్సీ కాలనీ పక్కన పారుదల కాలువ గుర్రపుడెక్కతో నిండిపోయింది. **– స్థానికుడు**

✓ కాలువలో వ్యర్థాల తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **–లక్ష్మీనారాయణ, ఎంపీడీవో**

? తోటపల్లిగూడూరు మండలం పాత కోడూరు రోడ్డు గుంతలమయంగా మారింది. **– శేషయ్య, స్థానికుడు**

✓ఇబ్బందిలేకుండా చూస్తాం. **–రమేష్, పీఆర్ ఏఈ**

? పొదలకూరు రూరల్ పరిధిలోని డేగపూడిలో విద్యుత్తు దీపాలు పది రోజులుగా వెలగడం లేదు. **– శ్రీనివాసులు, స్థానికుడు**

✓ సరి చేయిస్తాం. **– రత్నయ్య, స్థానికుడు**

? బుచ్చి పురపాలక పరిధిలోని పన్నెండో వార్డులో వీధిదీపం వెలగడం లేదు. **–స్థానికులు**

✓ నూతన వీధి దీపం వేయిస్తాం.
– బాలకృష్ణ, పురపాలక కమిషనర్

విష సర్పాల సంచారం

కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బలో సచివాలయం, ఆర్‌ఎస్‌కే, ప్రాథమిక పాఠశాల సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పనికిరాని పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ, సచివాలయ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదు. మండల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

కాలువలు అధ్వానం.. పట్టించుకోని యంత్రాంగం

ఇందుకూరుపేట మండల పరిధిలో పారిశుద్ధ్య చర్యలు అధ్వానంగా ఉన్నాయి. మైపాడు, కొరుటూరు, నిడిముసలి, గంగపట్నం, లేబూరు, కుడితిపాళెం, నరసాపురం, కొమరిక గ్రామాల్లో స్థానికులు వ్యాధులతో సతమతమవుతున్నా పంచాయతీ అధికారులు సరిగా స్పందించడం లేదు. కొత్తూరులో మరింత అధ్వానంగా ఉంది. అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నారు. –న్యూస్‌టుడే, ఇందుకూరుపేట

దేవగుడి చిత్ర యూనిట్ సందడి

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు మండలం గంగవరం ఇంజినీరింగ్ కళాశాలలో దేవగుడి చిత్ర యూనిట్ సభ్యులు సోమవారం సందడి చేశారు. చిత్రంలోని హీరో, హీరోయిన్‌లు అభినవ శౌర్య, అనుశ్రీ సినిమాలోని పాటలకు స్టెప్పులేసి, డైలాగులతో అలరించారు. కళాశాల సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ శ్రావణ్‌కుమార్, డీన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరికరాలకు తుప్పు

కోవూరు పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు, ఇనుప సామగ్రి పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉంది. పర్యవేక్షణ కరవవడంతో ఈ దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పరిశీలించి ప్రాంగణం శుభ్రపరచాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

గుంత ప్రమాదాలతో చింత

ముత్తుకూరు నుంచి జెన్‌కో లోపలికి వెళ్లే మార్గంలో మలుపు వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఎదురెదురుగా వచ్చినపుడు అధిగమించే క్రమంలో వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పందించి గుంతలను తాత్కాలికంగా మట్టితోనైనా పూడ్చాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, ముత్తుకూరు

ఏడుగురిపై ‘పీడీ’కిలి బిగించారు!

సైదాబాద్, మాదన్నపేట, న్యూస్‌టుడే: మలక్‌పేట ఠాణా పరిధిలో ఆరుగురు, డబీర్‌పుర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరిపై పోలీసులు ప్రివెంటివ్ డిటెన్షన్(పీడీ) అస్త్రం ప్రయోగించారు. సీపీ సజ్జనార్ ఆదేశానుసారం.. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ ఏడుగురు నేరస్థులపై పీడీ చట్టం అమలు చేస్తూ సోమవారం వివరాలు వెల్లడించారు. మలక్‌పేట ఠాణా పరిధిలోని శాలివాహననగర్ ఉద్యానం వద్ద జులై 15న సీపీఐ తెలంగాణ కౌన్సిల్ సభ్యుడు, గిరిజన నేత కేతావత్ చందు రాథోడ్‌ను దారుణంగా హతమార్చారు. ఆరుగురు నిందితులను అప్పట్లో అరెస్టు చేయగా కోర్టు వారిని జైలుకు పంపించింది. శాంతి భద్రతల పరిరక్షణ కోసం వారిపై పీడీ చట్టం అమలుకు చర్యలు తీసుకున్నారు. ఆరుగురిలో సీపీఐ-ఎంఎల్ కార్యకర్త, ఉప్పల్ భగాయత్‌వాసి దొంతి రాజేష్ అలియాస్ రాజన్న కన్న(48), రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ నివాసి కుంబా ఏడుకొండలు(35), కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం నివాసి అత్మకూరి శ్రీను అలియాస్ నాగరాజు(45), యాదాద్రి జిల్లా అడ్డగూడూరు నివాసి కందుకూరి ప్రశాంత్(30), ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా కొడవలూరు మండలానికి చెందిన అర్జున్ జ్ఞాన ప్రకాష్ (26), మైపాడు మండలానికి చెందిన లింగిబెడి రాంబాబు(30) ఉన్నారు.

మైనర్లపై లైంగిక దాడులు

డబీర్‌పుర ఠాణా పరిధిలోని న్యూ మలక్‌పేటకు చెందిన సయ్యద్ అబ్దుల్ బాసిత్(23) ఏడాది కాలంలో మూడు పర్యాయాలు మైనర్లపై లైంగిక దాడులకు పాల్పడ్డాడు. మాదన్నపేట, డబీర్‌పుర ఠాణాల పరిధిలో 2024-25 ఏడాది వ్యవధిలో మూడు కేసులు నమోదయ్యాయి. మైనర్ల మీద లైంగిక దాడుల నియంత్రణకు పీడీ చట్టం అమలు చేశారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

మనుబోలు, న్యూస్‌టుడే : మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వృద్ధుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాకేశ్ తెలిపారు. మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన వృద్ధుడు పెంచలయ్య మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటరిగా ఉన్న ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం రాత్రి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

కలువాయి శివాలయంలో చోరీ

కలువాయి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన కలువాయిలోని రాజరాజేశ్వరీ సమేత నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. అయ్యప్పస్వామి మాల ధరించిన వారు సోమవారం వేకువ జామున ఆలయానికి వెళ్లారు. అక్కడ గుడి తలుపులు తాళాలు ధ్వంసం చేసి ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. శివాలయంలో ఉన్న నిఘానేత్రాలను ధ్వంసం చేశారు. దేవాలయంలో విలువైన వస్తువులు లేకపోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మనుబోలు, న్యూస్‌టుడే: దిత్వా తుపాను నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రమాదేవి, సీఐ శివరామకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని బద్దెవోలు, పల్లిపాలెం గ్రామాల్లో పర్యటించారు. కొలనుకుదురులోని తుపాను షెల్టరును పరిశీలించారు.

డివిజన్ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక

పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయినులు

పొదలకూరు, న్యూస్‌టుడే : పొదలకూరు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సోమవారం క్రీడా పోటీలు స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించారు. ఎంపీడీవో నరసింహారావు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలని కోరారు. త్రో బాల్ పోటీల్లో ఉపాధ్యాయినులు, క్రికెట్ పోటీల్లో ఉపాధ్యాయులు విజయం సాధించడంతో నెల్లూరు డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో గిరిజనులకు భోజన వసతి

పార్లపల్లిలో భోజనం పెడుతున్న తెదేపా నాయకులు

విడవలూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు విడవలూరు మండల తెదేపా మండల కన్వీనర్ అడపాల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో దిత్వా తుపాను కారణంగా ఇబ్బందులు పడుతున్న పార్లపల్లిలోని గిరిజనులను నూతనంగా నిర్మించిన షెడ్డులోకి తరలించి భోజన వసతి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఏసోబు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య మృతికి నివాళి

మనుబోలు : సీపీఎం నాయకులు పెంచలయ్య మృతికి ఆ పార్టీ నాయకులు సోమవారం రాత్రి నివాళులర్పించారు. మండలంలోని చెర్లోపల్లిలో సీపీఎం మండల కార్యదర్శి తలారి దేవదానం ఆధ్వర్యంలో పెంచలయ్య హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విద్యా రంగంలో ఏఐ పాత్ర కీలకం

వెంకటాచలం, న్యూస్‌టుడే: ప్రస్తుత సాంకేతిక యుగంలో బోధన, పరిశోధన విభాగంల్లో కృత్రిమ మేధ పాత్ర కీలకమని వీఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య సునీత తెలిపారు. విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ‘బోధన పరిశోధనలో ఏఐ అనుసంధానం’ అనే అంశంపై అయిదు రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి హాజరైన ఎన్‌ఐఈపీపీ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు హెడ్ ఆచార్య శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో సాంకేతికత విప్లవాత్మక మార్పులు తెచ్చిందన్నారు. ప్రిన్సిపల్ విజయ, ఆచార్యులు హుస్సేనయ్య, విజయలక్ష్మి, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

కొడవలూరు, న్యూస్‌టుడే: నార్త్‌రాజుపాలెంలోని శ్రీ హరిహర తనయ అయ్యప్ప స్వామి సేవాసమాజంలో పడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి మండపాన్ని, 18 మెట్లు వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన అయ్యప్ప మాలధారులు భజనలు చేశారు. గురుస్వాములు సుందర్ రాజా స్వామి, చరణ్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

తినుబండారాల్లో పురుగులున్నాయని ఆందోళన

కొడవలూరు: నార్త్‌రాజుపాలెంలోని ఒక దుకాణంలో విడవలూరుకు చెందిన ప్రతాప్ డ్రైఫ్రూట్స్ డబ్బా కొనుగోలు చేశారు. ఇంటికెళ్లి అవి తిందామని చూడగా డబ్బాలోని డ్రైఫ్రూట్స్‌లో చిన్న పురుగులు కనిపించడంతో ఆందోళన చెందారు. కాలంచెల్లిన తినుబండారాలు అమ్ముతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని బాధితుడు తెలిపారు. ఫుడ్ అండ్ కంట్రోల్ తనిఖీ అధికారులు పట్టణాలకే పరిమితం కాకుండా వివిధ మండల కేంద్రాల్లోని దుకాణాల్లో తనిఖీలు చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ, డబ్బే ప్రధానంగా వ్యవహరిస్తున్న దుకాణాల యజమానులపైకఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

వర్షంలోనూ పింఛన్ల పంపిణీ

విడవలూరులో పింఛన్ అందజేస్తున్న సిబ్బంది

కోవూరు, విడవలూరు, బుచ్చి, కొడవలూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు నియోజకవర్గం లోని విడవలూరు, కోవూరు, బుచ్చిరెడ్డిపాలెం. కొడవలూరు మండలాల్లో వర్షాన్ని కూడా లెక్క చేయకుండా సచివాలయ సిబ్బంది సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. దిత్వా తుపాను నేపథ్యంలో ఇంటింటికి వెళ్లి అందజేశారు.

జనరల్ నోటీసు

In The Court of The Hon'ble Senior Civil Judge, Kovur
I.P.No. 19/2025
Chintala Koteswara Rao... Petitioner (Debtor)
Vs
1. Jana Madhu Babu,
2. Nellore Kesavulu,
3. Divvela Penchala Naidu,
4. Dasari Venkateswarlu,
5. Maddasani Ramaiah,
6. Tanka Malakondaiah @Umal,
7. Bochu Manohar,
8. Bandaru Mohan,
9. Devarasetty Audinarayana,
10. V.Ramesh,
11. Mekala Malyadri,
12. Lekkala Ramanareddy@Ramaiah,
13. Mannavarapu Ragaiah,
14. Suresh,
15. Rathaiah Naidu ... Respondents (Creditors)

జనరల్ నోటీసు
పై నెంబరున పిటీషనరు తనని ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో I.P.No. 19/2025 ను దాఖలు చేసి యున్నందున, సదరు IPలో ఎవ్వరికైనను ఆక్షేపణలు ఉన్న యెడల తేది 06-01-2026న ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినదిగా ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
Ch.తిరుమలేష్, B.L.,
అడ్వకేట్, కోవూరు, నెల్లూరు జిల్లా. Cell: 98488 50197

మహారాజశ్రీ నెల్లూరు IV అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No. 205 of 2018
O.S.No. 428 of 2016
కె.సునీత .. డిక్రీ హోల్డర్ / వాది
Vs
ఎ.రాజేశ్వరి ..జడ్జిమెంట్ డెటార్ / ప్రతివాది

వేలం ప్రకటన
పై నెంబరు E.P.ను పై తెలిపిన డిక్రీ హోల్డర్ O.S.No. 428/2016 లోని డిక్రీ బాకీని రాబట్టుకొనుటకు పై తెలిపిన జడ్జిమెంట్ డెటార్ తాలూకా ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని బహిరంగ వేలం వేయుటకు గాను పై కోర్టు వారు నిర్ణయించి పై నెంబరు E.P.ను తే: 17-12-2025దికి వాయిదా వేసి ఆ రోజు బహిరంగ వేలం జరపాలని తీర్మానించినారు. కావున తే: 17-12-2025దిన ఉ॥ 10-30ని॥ల నుండి సాయంత్రం గం॥ 5-00లోపు పై వారి కోర్టులో ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని బహిరంగ వేలం వేయబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు
SPSR నెల్లూరు రి॥డి॥, ముత్తుకూరు స॥రి॥, వల్లూరు గ్రామం మరియు పంచాయితీ, ముత్తుకూరు మండలం, D.No.1/26, 5 అంకణముల స్థలము అందులోని గ్రౌండ్ ఫ్లోర్ RCC ఇల్లుకి **హద్దులు: తూర్పు:** అలపాక మల్లి గారి ఇల్లు, **దక్షిణం:** నాగరపు చెంగయ్య గారి ఇల్లు, **పడమర:** షేక్ బాషా గారి ఇల్లు, **ఉత్తరం:** రోడ్డు. పై తెలిపిన హద్దులలో 5 అంకణముల స్థలం అందులోని గ్రౌండ్ ఫ్లోర్ RCC ఇల్లు యావత్తు యాజమెంట్ హక్కులతోటి.

డిక్రీ హోల్డర్ విలువ: Rs.5,00,000/-
అమీనా విలువ : Rs.5,50,000/-
మార్కెట్ విలువ : Rs.4,00,000/-
యస్.శ్రీనివాసమూర్తి, B.A., B.L.,
డిక్రీహోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

చిన్నారులు.. ప్రతిభావంతులు

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

విద్యార్థి దశలో చక్కగా రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందన్న ఉపాధ్యాయుల సూచనలు వారు గ్రహించారు.. పేద కుటుంబాలకు చెందిన వీరంతా బుచ్చిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ వివిధ ప్రతిభా పరీక్షల్లో రాణిస్తున్నారు... ఇళ్లల్లో సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్నా చదువుల్లో ముందుంటున్నారు.. ఉన్నత లక్ష్యాలతో విద్యార్థి దశ నుంచి కష్టపడి వారి కలను సాకారం చేసుకునేందుకు కృషిచేస్తున్న పలువురు విద్యార్థులపై ప్రత్యేక కథనం.

పేరు: తరగతి : ప్రతిభ చూపింది: లక్ష్యం

● **వెంకటవరుణ్‌కుమార్** ● ఎనిమిదో తరగతి ● జిల్లా స్థాయి చెకుముకి ప్రతిభా పోటీల్లో ద్వితీయ స్థానం. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో రాణించడం. క్యారమ్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపుతూ వివిధ బహుమతులు దక్కించుకున్నాడు. ● జాతీయ స్థాయి క్యారమ్స్ ఛాంపియన్‌తో పాటు ఇంజినీర్ అవుతా.

● **హేమశ్రీవర్షిణి** ● పదోతరగతి ● ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ ఉపకారవేతనానికి ఎంపికై రూ.12వేలు తీసుకుంటోంది. వ్యాసరచన పోటీలతో పాటు మండల, జిల్లాస్థాయిలో వక్తృత్వం, క్విజ్ పోటీల్లో ముందంజలో నిలిచింది. ● ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించి ఇంజినీర్ కావడం.

● **కీర్తి ప్రియ** ● తొమ్మిదో తరగతి ● జిల్లాస్థాయిలో చెకుముకి ప్రతిభా పోటీల్లో ద్వితీయస్థానం. పాఠశాల, మండల స్థాయి చెస్ పోటీల్లో బహుమతులు దక్కించుకుంది. చదువులో ఉన్నతంగా రాణించడంతో పాటు క్రీడల్లో సైతం వివిధ పతకాలు సొంతం చేసుకుంది. ● గణిత ఉపాధ్యాయిని అవుతా..

ఆరుబయట వంట.. నిర్వాహకులకు తంటా..!

● పొదలకూరు మండలం ప్రధాన రహదారిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని వంట గది మరమ్మతులకు గురై రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంది. రేకులు ధ్వంసమై తలుపులు లేకపోవడంతో ఆకతాయిలకు నిలయంగా మారింది.

● డేగపూడి రాజుపాలెం ప్రధాన రహదారి వద్ద ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన ఉన్న వంట గది మూడేళ్లుగా వినియోగించడం లేదు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించగా తలుపులు సైతం లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది.

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, కోవూరు

కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలుకు అవస్థలు తప్పడం లేదు. కొన్ని పాఠశాలల్లో వంట గదులు శిథిలమవగా.. మరికొన్ని చోట్ల మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి. నిర్వాహకులు తమ ఇళ్ల వద్ద, పాఠశాలలోని ఆవరణలో వంటలు చేయాల్సి పరిస్థితి నెలకొంది.

చాలా చోట్ల వంట గదులు ఉన్నా వినియోగానికి పనికిరాకపోవడంతో నిర్వాహకులు ఆరుబయటే చేస్తున్నారు. వర్షాలు, ఈదురు గాలులు సమయంలో వంట చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కట్టెల పొయ్యిపై వంట చేసే సమయంలో దుమ్ము, ధూళి ఎగిరిపడి భోజనం కలుషితమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వాటిని వినియోగంలోకి తేవాలని విన్నవిస్తున్నారు. ● ఎంఈవో-2 శోభనాద్రి మాట్లాడుతూ పలు పాఠశాలల్లో మరమ్మతులకు గురైన వంట గదులు.. నిరుపయోగంగా ఉన్న వాటిని గుర్తించామన్నారు. ఉన్నతాధికారులకు నివేదించామని నిధులు మంజూరైతే వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

సర్వేపల్లి నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	276
ప్రాథమికోన్నత ॥	20
ఉన్నత ॥	37

డేగపూడిరాజుపాలెంలో నిరుపయోగంగా ఉన్న వంట గది

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

దేశంలో స్మారకచిహ్నాలు ఎన్ని? : ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: దేశంలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నాలుగా ఎన్ని ప్రాంతాలను గుర్తించారు.. వాటి సంరక్షణ తీసుకుంటున్న చర్యలేమిటని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. సోమవారం పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కాగా ఈవిషయమై ప్రస్తావించారు. దీనికి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా 3,685 పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అవశేషాలను భారత పురావస్తు శాఖ సర్వే చేసి గుర్తించిందన్నారు. వాటి సంరక్షణ కూడా జరుగుతుందని వివరించారు.

హెచ్‌ఐవీ నివారణకు అవగాహన పెంచాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని బుజబుజనెల్లూరులోని సింహపురి చిల్డ్రన్ హోంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా కార్యదర్శి కె.వాణి మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు, చట్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వాణి

నగరం.. జలమయం

రోజంతా ఒకటే వాన

బైపాస్ రోడ్ సెంటర్‌లో పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోళ్లు

నెల్లూరు, ఈనాడు, (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. పట్టువిడవకుండా కురుస్తుండడంతో జనజీవనానికి ఆటంకం కలిగింది. శివారు ప్రాంతాల వాసులు విలవిల్లాడుతున్నారు. రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. శివారు ప్రాంతాలైన బుజబుజనెల్లూరు, పోలీసు కాలనీ, వైఎస్సార్‌నగర్, జగనాశ్వమ్మపురం, సుందరయ్య, ఆర్టీసీ, రెవెన్యూ, భగత్‌సింగ్ తదితర కాలనీల్లో నీరు చేరింది. శివారు ప్రాంతాల్లో దాదాపు నాలుగు లక్షల మంది వరకు నివాసం ఉంటున్నారు. వర్షంతో పాటు చలిగాలులు వీస్తుండడంతో అల్లాడిపోతున్నారు. రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక జనావాసాల మధ్య మురుగునీరు నిలుస్తోంది. వర్షం కురవడంతో నరకం చూపిస్తోందని కాలనీల వాసులు ఆందోళన చెందుతున్నారు. ఏటా వర్షాకాలంలో శివారు కాలనీలు మునుగుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చేపట్టడం లేదు.

వర్షం నీటితో తల్పగిరి కాలనీకి వెళ్లే రోడ్డు.. చంద్రబాబునగర్ కాలనీలో దెబ్బతిన్న రోడ్డు

నాయకులే గుత్తేదారులు.. ప్రజాధనానికి కాళ్లు

చెత్త సేకరణ ట్రాక్టర్లు

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నగరంలో కొందరు ప్రజాప్రతినిధులు గుత్తేదారుల అవతారమెత్తి అందిన కాడికి దోచుకుంటున్నారు. బినామీ పేర్లతో పనులు చేస్తూ అక్రమార్జనకు తెరలేపారు. అద్దె వాహనాల పేరుతోనూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. ప్రతి నెలా వాహనాల పేరుతో రూ.2.10 కోట్లు దోచేస్తున్నారు. అక్రమాలపై 'ఈనాడు-ఈటీవీ' కథనం.

నగరంలో 54 డివిజన్లు ఉండగా.. పది లక్షల మంది నివాసం ఉంటున్నారు. ప్రతిరోజూ 320 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. గతంలో నగరపాలకసంస్థకు చెందిన ఆటోల ద్వారా తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే వారు. వాటి స్థానంలో 105 ట్రాక్టర్లను అద్దె ప్రాతిపదికన ప్రవేశపెట్టారు. అవన్నీ అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులకు సంబంధించినవి కావడం విశేషం. రోజుకు ఒక్కో ట్రాక్టరుకు నగరపాలకసంస్థ రూ.3,750 చొప్పున నెలకు రూ.1,12,500 అద్దెగా చెల్లిస్తోంది. నెలకు రూ.1,18,12,500 వీరి ఖాతాలకు చేరుతోంది. ఓ నాయకుడు నగరపాలకసంస్థ నుంచి రోజుకు రూ.3,750లు చొప్పున ఒక్కో ట్రాక్టరుకు వసూలు చేసే వాటి యజమానులకు రూ.3 వేల చొప్పున ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్లకు ప్రజాధనం రూ.కోటికి పైగా ఖర్చు చేస్తున్నా పారిశుద్ధ్యం మాత్రం మెరుగుపడడం లేదు.

స్వీపింగ్ యంత్రాల పేరుతో..: రోడ్లను శుభ్రం చేసేందుకు 26 స్వీపింగ్ వాహనాలను వినియోగిస్తున్నారు. వాటి నిర్వహణ బాధ్యతలను ప్రైవేటుసంస్థకు అప్పగించింది. ప్రతిరోజూ ఒక్కో వాహనం ఎనిమిది గంటల పాటు రోడ్లను శుభ్రం చేయాల్సి ఉంది. నిర్వహణ గంటకు రూ.1485 చెల్లిస్తున్నారు. ఒక్కో దానికి 8 గంటలకు రూ.11,880 చొప్పున 26 వాహనాలకు రూ.3,08,880, నెలకు రూ.92,66,400 ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు. ఇంత తీసుకుంటున్నా గుత్తేదారులు మూడు గంటలు కూడా రోడ్లను శుభ్రం చేయడం లేదు. ఎక్కడి దుమ్ము అక్కడే కనిపిస్తోంది. దీనిపై కమిషనర్ నందన్‌ను వివరణ అడగ్గా త్వరలో కాంట్రాక్ట్ ముగుస్తుందని, ఇ-వాహనాలు వస్తాయని తెలిపారు.

స్వీపింగ్ యంత్రాలు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: బాలాజీనగర్ ప్రాంతంలోని సరస్వతి నగర్‌లో కాలువలు శుభ్రం చేయడం లేదు. వర్షపునీటితో పాటు మురుగునీరు పారడం జరుగక దుర్వాసన వస్తోంది. – లీలావతి

సమాధానం: కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ కన్నా, ఆరోగ్యాధికారి

? ఇరుగాళమ్మ సంఘం రాజీవ్ గృహకల్పలో కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. గుంపులుగా చేరి దాడులు చేస్తున్నాయి. – రాయుళ్లు

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

పేదలకు వరం సీఎం సహాయ నిధి

నెల్లూరు(నగరపాలకసంస్థ): పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో 55 మందికి రూ.41,52,181 విలువైన సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు తాళ్లపాక అనురాధ, విజేతరెడ్డి, మామిడాల మధు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి కృషి

పారిశ్రామిక ప్రగతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో మెప్మా, నిపుణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. 258 మంది 42 కంపెనీల్లో ఉద్యోగాలు సాధించగా, నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ లీలారాణి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నాయకులు తాళ్లపాక అనూరాధ, భానుశ్రీ, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ రవిప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

మాట ప్రకారం ఇస్తున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఇచ్చిన మాట ప్రకారం రూ.4 వేలు పింఛను అందిస్తున్న మంచి ప్రభుత్వం తమదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కేశవులనగర్‌లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛను నగదు అందించారు. కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పింఛను నగదు అందిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

పెంచలయ్య హత్యపై కొవ్వొత్తులతో నిరసన

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని 17వ డివిజన్‌లో సోమవారం పెంచలయ్య మృతికి నిరసనగా సీపీఎం నాయకులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం గ్రామీణ నాయకులు కట్టా సతీష్ మాట్లాడుతూ గంజాయిపై పోరాటం చేస్తున్న పెంచలయ్యను కిరాతకంగా గంజాయి ముఠా చంపడం దారుణమన్నారు. మంగళవారం జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో సీపీఎం నాయకులు

వర్షాలతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

నెల్లూరు(మార్కెట్ సెంటర్): వర్షాలు కురుస్తున్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త లలితాశివజ్యోతి ఒక ప్రకటనలో సూచించారు. పొలాల్లో నీరు అయిదు రోజుల వరకు ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వరి, మినుము, కంది, వేరుసెనగ, జొన్న, మిరప, నిమ్మ రైతులు తెగుళ్లు ఆశించకుండా అధికారుల సూచనలు అనుసరించి పురుగుమందులు పిచికారీ చేయాలని వివరించారు.

విద్యా రంగంలో ఏఐ పాత్ర కీలకం

వెంకటాచలం: బోధన, పరిశోధన విభాగంల్లో కృత్రిమ మేధ పాత్ర కీలకమని వీఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య సునీత తెలిపారు. విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'బోధన పరిశోధనలో ఏఐ అనుసంధానం' అనే అంశంపై అయిదు రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఎన్ఐఈపీఏ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు హెడ్ ఆచార్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు

ఫత్తేఖాన్‌పేట పరిధిలోని శాంతినగర్‌లో రోడ్డు ఛిద్రంగా మారింది. భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకం పనుల్లో భాగంగా వీధిని ధ్వంసం చేశారు. పనులు పూర్తయ్యాక మట్టితో పూడ్చేశారు. దీంతో అధ్వానంగా మారింది. స్థానికులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

బ్రిడ్జి కింద మురుగుతో అవస్థలు

నగరంలోని అరవింద్‌నగర్‌లో రైల్వే బ్రిడ్జి కింద మురుగునీరు చేరుతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు

అంతా నీరు.. కార్యాలయంలోకి వెళ్లేదెలా!

నగరంలోని రామలింగాపురం సర్కిల్ వద్ద ఉన్న జలవనరుల శాఖ సెంట్రల్ డివిజన్ కార్యాలయం ముందు భారీగా నీరు చేరింది. దీంతో కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. –న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి నగర్)

ఎనీ టైమ్ మూత

నగరంలోని ఆచారి వీధిలో ప్రధాన పోస్టాఫీసు ముందున్న ఆశాఖ ఏటీఎం మూసేయడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. నగదు అవసరమైన వారు వచ్చి చూసి నిరాశగా వెళుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (దర్గామిట్ట)

తవ్వేస్తారు.. ఆపై పట్టించుకోరు

నగరంలోని నిప్పో ఫ్యాక్టరీ గేటు ఎదుట రోడ్డుపై అభివృద్ధి పనుల కోసం ఇటీవల గుంట తీశారు. పనులు పూర్తయ్యాక మట్టి పోసి వదిలేశారు. శాశ్వత పనులు చేయకుండా వదిలేశారు. అక్కడ వర్షానికి గుంతలు పడి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పనులు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి సెంటర్)

జనసైనికుల పింఛన్ల పంపిణీ

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని 37వ డివిజన్‌లో సోమవారం జనసేన నాయకులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. జోరు వర్షంలో నూనె మల్లికార్జునయాదవ్, షేక్ షానవాజ్, కిలారి తిరుపతినాయుడు అధికారులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

మాదక ద్రవ్యాల కేంద్రంగా నగరం: ఎమ్మెల్సీ

నెల్లూరు (వేదాయపాలెం): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెల్లూరు నగరం మాదకద్రవ్యాలకు కేంద్రంగా మారిందని వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం పార్టీ నగర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సమాజంలో శాంతి భద్రతలు క్షీణించి, యువత పెడదోవ పడుతుందని వాపోయారు. పెంచలయ్య మృతికి ఈ నెల 2న వామపక్షాలు తలపెట్టిన బంద్‌కు మద్దతు తెలియజేస్తున్నామన్నారు. సేవ్ ది నెల్లూరు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన

నెల్లూరు (నగరపాలకసంస్థ): ఆమంచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మన్నవరప్పాడు, గోటురువారికండ్రిగలో సాగునీటి సమస్య పరిష్కారానికి జిగ్మా కంపెనీ సీఎస్సార్ నిధులు రూ.30 లక్షలతో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుచేస్తున్నామని తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి పీ4 కార్యక్రమంలో భాగంగా రూ.30 లక్షలు నిధులు కేటాయించిన జిగ్మా కంపెనీకి ఆమంచర్ల గ్రామ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీ బిట్-2లో పింఛన్లు పంపిణీ చేశారు.

జడ్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మెహరీన్.. డిల్లీబాబు.. గౌతమ్‌కుమార్

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని దర్గామిట్ట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి తెలిపారు. వీరిని సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న రామాయణం గౌతమ్‌కుమార్, 9వ తరగతి విద్యార్థి వెట్టి డిల్లీబాబు, 8వ తరగతి విద్యార్థి దూదేకుల మెహరిన్ జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అరిగెల విజయ్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేడుకగా అయ్యప్పస్వామి మండల పూజలు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో కేరళ సంప్రదాయ పద్ధతిలో మండల పూజలు వేడుకగా సాగుతున్నాయి. సోమవారం స్వామి వారికి క్షీరాభిషేకం, మహాగణపతి హోమం, శివేలి ఉత్సవం, మహాదీపారాధన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అయ్యప్పస్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శేషగిరిరావు, కార్యదర్శి వెంకటరత్నం, కోశాధికారి రత్నం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు

ఘనంగా గీతా జయంతి

నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే : గీతా జయంతి సందర్భంగా కృష్ణుడి నామస్మరణతో నగరంలోని ఇస్కాన్ మందిరం మార్మోగింది. అధ్యక్షులు సుఖదేవ్ స్వామి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ విడుదల చేశారు. గీతావైభవ్ ట్రస్ట్ ఛైర్మన్ నజీర్ బాషా ఆధ్వర్యంలో దర్గామిట్టలో అష్టలక్ష్మి దేవస్థానంలో కృష్ణ మందిరం ప్రాంగణంలో దాదాపు మూడువేల మందితో వేడుకలు నిర్వహించారు. 1000 మంది విద్యార్థులు గీతా చాలీసా పఠించారు. త్రైత సిద్ధాంత సభ్యులు నెల్లూరు గ్రామీణ మండలం నుంచి గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయం వరకు గీతా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మూలాపేట శ్రీ రుక్మిణి సమేత సత్యభామ శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

క్యాలెండర్ విడుదల చేస్తున్న ఇస్కాన్ ప్రముఖులు

బంద్ విజయవంతం చేయాలి

నెల్లూరు (విద్య): గంజాయి బ్యాచ్ దమనకాండకు నిరసనగా వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం జరిగే జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

నెల్లూరు (వేదాయపాలెం) : సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్యకు నిరసనగా వామపక్షాలు తలపెట్టిన బంద్‌కు తమ పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఎస్కే మాబు తెలిపారు.

నెల్లూరు (విద్య): జిల్లా బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్ ప్రకటించారు. ఈ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి అహ్మద్, జమాతే ఇస్లాం నాయకులు నవీద్ పాల్గొన్నారు.

లారీ టైర్ల కింద నలిగిన ప్రాణం

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రొయ్యల లోడు లారీ వెనుక టైర్ల కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఉదంతమిది. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం పరిధిలోని చిన్నచెరుకూరులో ఈఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. టీపీగూడూరు మండలంలోని సౌత్‌ఆములూరులోని గమ్మలపాలెంలో ఉంటున్న ఓబిలి వేణు (27) కూలి పనులు చేసి జీవనం సాగిస్తున్నారు. ఆదివారం చిన్నచెరుకూరు రోడ్డులోని ఓ గోదాము వద్ద నిల్చొని ఉండగా రొయ్యల లోడు లారీ వెనక్కు వచ్చే క్రమంలో ఢీకొట్టింది. వెనుక టైర్ల కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులు నెల్లూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఖాళీ స్థలం.. మురుగు నిలయం

న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

నగరంలో ఖాళీ స్థలాలు మురుగునీటి తటాకాలుగా మారుతున్నాయి. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారడంతో సమీపంలో నివసించే వారు వ్యాధులకు గురవుతున్నారు. మాగుంటలేఅవుట్, హరనాథపురం, మనుమసిద్ధినగర్, పరమేశ్వరినగర్, చంద్రబాబునగర్, ఆర్టీసీ, తల్పగిరి కాలనీలు.. ఇలా నగరంలో లెక్కకు మిక్కిలిగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. నివాసాల మధ్య ఉండే వీటిలో నీరు చేరి మురుగుగా మారుతోంది. రోజుల తరబడి నిల్వ ఉంటున్న మురుగు కారణంగా ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగి, విషకీటకాలు చేరుతున్నాయి. పరిసరాల్లోని వారు భయాందోళన చెందుతున్నారు.

మినీబైపాస్ రోడ్డులోని ఖాళీ స్థలంలో చేరిన నీరు

ల్యాబ్‌టెక్నీషియన్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం

నెల్లూరు (జీజీహెచ్), న్యూస్‌టుడే: ప్రభుత్వ ల్యాబ్‌టెక్నీషియన్ల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగింది. అధ్యక్షుడిగా బీవీ రాజేష్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సీహెచ్ రత్నం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్‌డీ రసూల్‌సాహెబ్, కోశాధికారిగా మహమ్మద్‌షఫీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్కే మీరామొహిద్దీన్, మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా ఎస్.శాంతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పశ్చిమగోదావరి జిల్లా సంఘం కార్యదర్శి వీఎన్‌వీఆర్ కిషోర్, సహాయ ఎన్నికల అధికారిగా మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లక్ష్మీసుభద్ర, పరిశీలకులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ఎన్ మూర్తి వ్యవహరించారు.

రహదారిపై వర్షపునీరు చేరకుండా చర్యలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని రోడ్లపై వర్షపు నీరు చేరకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం గాంధీబొమ్మ, కనకమహల్ సెంటరు, లక్కీ షాపింగ్ మాల్, బృందావనం, సండే మార్కెట్ తదితర ప్రాంతాల్లో కాలువల్లో వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం చంద్రబాబునగర్ జాతీయ రహదారి ప్రాంతంలో కాలువల్లో వరదనీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నీరు రోడ్లపై చేరకుండా, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ నందన్

ఎం.I సినిమాస్.: స్క్రీన్..1 తేరే ఇష్క్ మె (హిందీ), బిజినెస్‌మేన్ (తెలుగు) స్క్రీన్. 2 ఆంధ్రా కింగ్ తాలుకా (తెలుగు), స్క్రీన్ .3 రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు) **స్పైస్.సినిమాస్:** స్క్రీన్.1 బిజినెస్‌మేన్ (తెలుగు) స్క్రీన్ 2. జూటోపియా 2..3డీ (తెలుగు, ఇంగ్లిష్) స్క్రీన్ 3 రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు) రివాల్వర్ రీటా.(తెలుగు) స్క్రీన్ 4. తేరే ఇష్క్ మె (హిందీ) స్క్రీన్.5.. ఆంధ్రా కింగ్ తాలుకా (తెలుగు) **రెయిన్ సినిమా:** స్క్రీన్..1 జూటోపియా 2..3డీ (తెలుగు, ఇంగ్లిష్), రివాల్వర్ రీటా .(తెలుగు) స్క్రీన్..2..ఆంధ్రా కింగ్ తాలుకా (తెలుగు), స్క్రీన్.3.. తేరే ఇష్క్ మె (హిందీ) స్క్రీన్..4.. రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు), రివాల్వర్ రీటా (తెలుగు)

బాబోయ్.. గుంతల రోడ్లు

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

నగరంలో ర.భ.శాఖ పరిధిలోని ప్రధానమైన పలురోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. వేదాయపాళెం నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు పలుచోట్ల ప్రధాన రోడ్డులో గుంతలు దర్శనమిస్తున్నాయి. పెద్దబజారు, ఆచారి వీధి, పాత జడ్పీ రోడ్డు, దండువారి వీధి, రాయాజీ వీధి సంతపేట, రంగనాయకులపేట పరిధిలోని పలు రోడ్ల పరిస్థితి ఇలాగే ఉంది. గ్రామీణ పరిధిలోని సుజాతమ్మ కాలనీ మెయిన్ రోడ్డు, ప్రగతి నగర్, సంజయ్‌గాంధీ నగర్, టక్కేమిట్ట, నెల్లూరు చెరువు సమీపాన నగర్, ఇలా వివిధ ప్రాంతాల్లో దెబ్బతిని గుంతలు పడ్డాయి. ఒక రోడ్డులో మొత్తం దెబ్బతిన కుండా కేవలం అక్కడక్కడ గుంతలు పడటంతో ప్రయాణించే సమయంలో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఎక్కడ గుంత ఉందో ..ఎక్కడ రోడ్డు బాగుందో అర్థంకాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు.

గత పాలన పోకడ పోవాలి..: సాధారణంగా ఒకటి రెండు గుంతలు ఉంటే వాటికి ప్యాచ్ పనులు చేస్తారు. వాటితో సమస్య తీరేది. కానీ గతపాలనలో కొన్ని ప్రాంతాల్లో ప్యాచ్ పనులు చేస్తే సమస్య తీరుతుందనే చోట ప్రజాధనం వృథా చేస్తూ ఆ వీధి మొత్తం కొత్తగా రోడ్డు నిర్మించేవారు. నాయకుల ఒత్తిడితో పనులు చేయడంతో అప్పట్లో అధికారుల తీరుపై విమర్శలొచ్చాయి. అందులో భాగంగా అప్పట్లో ఆచారివీధిరోడ్డు, పొగతోట, బృందావనం వంటి ప్రాంతాల్లో కొత్తగా సిమెంట్ రోడ్లు వేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజాధనం వృథా కాకుండా తక్కువ స్థాయిలో గుంతలు ఉన్న చోట కనీసం ప్యాచ్ పనులైనా చేయించాలని నగర, గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. ● ఇటీవల కురిసిన తుపాన్‌కు చాలారోడ్లు తిరిగి దెబ్బతిన్న మాట వాస్తవమే. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు పంపామని ర.భ. శాఖ, ఇన్‌ఛార్జి ఎస్ఈ రామకృష్ణప్రసాద్ తెలిపారు.

స్వర్ణాల చెరువుకు వెళ్లే మార్గంలో గుంతలో నిలిచిన నీరు

In The Court of The Vth Addl. District Motor Accident Claims Tribunal Judge, Nellore.
M.V.O.P.No. 158/2025
1. Yelluri Jyothi, and 2 Others ..Claimants
Vs
1. Shaik Masthan and 2 Others ..Respondents
Notice to 3rd Respondent
Yelluri Masthanaiah, S/o Masthaniah, Residing at 12th Street, Lakeview Colony, Podalakur Road, Nellore City, SPSR Nellore Dist.
పై నెంబరు కేసులో క్లైమెంట్సు మీ మీద యాక్సిడెంట్ నష్టపరిహారము కోరుచూ పైవారి కోర్టులో M.V.O.P.No.158/2025 దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తేది: 5-12-2025న వాయిదా వేసియున్నారు. ఆ రోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసింది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
గోడా సురేష్, M.A., M.L., క్లైమెంట్స్ తరపు అడ్వకేటు, నెల్లూరు.

(c) eenadu

ఈనాడు
శ్రీ సత్యసాయి
మంగళవారం డిసెంబరు 2, 2025

పారదర్శకంగా అర్జీల పరిష్కారం

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ మౌర్య భరద్వాజ్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఫిర్యాదుదారుల వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి.. నిర్ణీత గడువులోపే పరిష్కరించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్లో జరిగిన ప్రజాపరిష్కార వేదికలో జేసీ మౌర్య భరద్వాజ్‌తో కలిసి 244 వినతులు స్వీకరించారు. పుట్టపర్తి మండలం బత్తలపల్లి, గువ్వలగుట్టపల్లికి చెందిన కొందరు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. గ్రామాలకు సమీపంలోని భూములను ఆక్రమించుకుంటున్నారని.. వాటిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విన్నవించారు. ఇలా వివిధ ప్రాంతాల చెందిన వారు సమస్యలను ఏకరవు పెట్టారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఒకే సమస్యపై పదే పదే ఫిర్యాదులు వస్తే.. విచారణ చేసి సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

5 నుంచి ఎన్జీవోల సంఘం ఎన్నికలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవోల సంఘం తాలూకా యూనిట్ల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగా రామ్మోహన్ తెలిపారు. సోమవారం పుట్టపర్తిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మూడేళ్ల కాలపరిమితి ముగియడంతో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరుపుతున్నట్లు చెప్పారు. 5న పుట్టపర్తి తాలూకా, 6న సీకేపల్లి, 9న ధర్మవరం, 10న పెనుకొండ, 11న హిందూపురం, 12న కదిరి యూనిట్ల ఎన్నికలు ఆయా కేంద్రాల్లో జరుగుతాయని వెల్లడించారు.

‘ఫిర్యాదులు పునరావృతం కానివ్వొద్దు’

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులను చట్ట పరిధిలో వేగంగా పరిష్కరించాలని, వాటిని పునరావృతం కానివ్వొద్దని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, భూ, ఆస్తి వివాదాలు తదితరాలపై 98 ఫిర్యాదులు సమర్పించారు. వాటిని స్వీకరించిన ఎస్పీ బాధితులతో మాట్లాడి, సంబంధిత పోలీస్ అధికారులకు కేటాయించారు. కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఇందిర, న్యాయ సలహాదారు సాయినాథరెడ్డి, ఎస్బీ సీఐ వెంకటేశ్వర్లు, డీటీఆర్బీ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులతో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించండి: జిల్లాలో ఇటీవల మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, దాడులు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టి రక్షణ కల్పించాలంటూ వైకాపా జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఎస్పీకి వినతి పత్రం అందచేశారు.

రెవెన్యూలో దళారుల దందా

■ ఏ పని జరగాలన్నా.. వారి వద్దకు వెళ్లాల్సిందే

ఈనాడు, పుట్టపర్తి: ప్రభుత్వ శాఖల్లో కీలకమైంది రెవెన్యూ. ప్రస్తుతం పరిశ్రమలు, జాతీయ రహదారుల పనులు చురుగ్గా సాగుతుండటంతో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. ఇదే అదనుగా దళారులు రెచ్చిపోతున్నారు. అధికారులతో తమకు బాగా పరిచయాలున్నాయని, వెంటనే పనులు చేయిస్తామంటూ డబ్బు లాగుతున్నారు. కీలకమైన విభాగంలో రెవెన్యూ అధికారుల కొరత వారికి కలిసొస్తోంది

బయటి పనులే ఎక్కువ..

పెనుకొండ నియోజకవర్గంలోని ఓ మండల రెవెన్యూ అధికారి.. మరో మండలానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. సోమవారం తప్ప మిగిలిన రోజుల్లో ఇన్‌ఛార్జిగా ఉన్న మండలంలోనే ఉంటున్నారు. భూములకు సంబంధించి బయట ఇతరుల ద్వారా పనులు చక్కబెడతారనే ఆరోపణలున్నాయి. సామాన్యుల సమస్యలు త్వరగా పరిష్కారం కావనే విమర్శలున్నాయి.

జిల్లా:	శ్రీసత్యసాయి
రెవెన్యూ గ్రామాలు:	461
మండలాలు:	32
తహసీల్దార్లు లేని మండలాలు:	18

సమస్య ఉంటే చాలు వాలిపోతారు..

నకిలీ పాసుపుస్తకాల కేసులో నిందితుడైన ఓ వ్యక్తి తనకల్లు తహసీల్దార్ కార్యాలయంలో దళారిగా వ్యవహరిస్తున్నాడు. ఏ గ్రామంలో రెవెన్యూ సమస్య ఉన్నా. . తెలుసుకుని వాలిపోతాడు. ఓ రెవెన్యూ డివిజన్ అధికారితో సంబంధాలున్నాయని చెబుతూ పబ్బం గడుపుతున్నాడు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వీఆర్‌ఓ పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఉన్న వీఆర్‌ఓ సక్రమంగా పనిచేయకుండా భూమికి సంబంధించి ఏ సమస్య వచ్చినా విశ్రాంత వీఆర్‌ఓ వద్దకే పంపుతున్నారు. దీంతో సదరు విశ్రాంత ఉద్యోగే అన్నీ తానై భూవ్యవహారాలు చక్కబెడుతున్నాడు. కదిరిలో నివాసముంటున్న మరోవ్యక్తి నిత్యం కార్యాలయంలోనే ఉంటూ పనులు చేయిస్తుంటాడు.

ఉద్యోగి అవతారమెత్తి..

పుట్టపర్తి ఆర్‌డీఓ కార్యాలయం పరిధిలో ఓ వ్యక్తి మామ వీఆర్‌ఓ. కానీ సదరు వ్యక్తే ఉద్యోగాన్ని చేస్తుంటాడు. కార్యాలయానికి ఎవరు వచ్చినా.. నేరుగా ఆయనే డీల్ చేస్తాడు. ఈయనకు తోడు మరి కొంతమంది భూవ్యవహారాలు నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి.

తహసీల్దార్ల కొరతతో..

జిల్లాలో ప్రధానమైన మండలాల్లో తహసీల్దార్ల కొరత ఉంది. దీంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీన్ని మధ్యవర్తులు అవకాశంగా మలచుకుంటున్నారు. అధికారుల పేరుచెప్పి అందినకాడికి దండుకుంటున్నారు. ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ, కనగానపల్లి, రామగిరి, పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, ఓబుళదేవరచెరువు, గాండ్లపెంట, ఎన్‌పీ కుంట, తలుపుల, పెనుకొండ, సోమందేపల్లి, మడకశిర, అమరాపురం, అగళి, రొళ్ల మండలాల్లో తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్నవారికే ఇన్‌ఛార్జులుగా విధులు అప్పగించారు.

ఎప్పటికప్పుడు ఫిర్యాదులపై చర్యలు

- సూర్యనారాయణరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి

దళారులు, ఉద్యోగుల అవినీతిపై ఐవీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు అందుతున్నాయి. ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలువురికి నోటీసులిచ్చాం. తహసీల్దార్ల కొరత ఉన్నచోట భర్తీ చేయడానికి కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ పంపారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో 93.25 శాతం పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం 7 గంటలకే మొదలైంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేశారు. తొలిరోజు 93.25 శాతం పంపిణీ పూర్తయింది. 2,63,048 మందికి గాను 2,46,619 మందికి పంచారు. మిగిలిన వారికి మంగళవారం ఇవ్వనున్నారు. జిల్లాలో ధర్మవరం పట్టణం 95.96 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా అమరాపురం 91.07 శాతంలో చివరి స్థానంలో నిలిచింది.

పాడిరైతులకు సర్కారు చేయూత

● రాయితీతో దాణా పంపిణీ

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, న్యూస్‌టుడే: పాడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పాల ఉత్పత్తి పెంచి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేలా రాయితీ పథకాలను అమలు చేస్తోంది. అర్హులైన వారికి రాయితీతో దాణా పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. బహిరంగ మార్కెట్‌లో పశువుల దాణా ధరలు ఎక్కువగా ఉన్నాయి. 50 కేజీల బస్తా కొనుగోలు చేయాలంటే రూ.15,00 నుంచి 18,00 వెచ్చించాలి. దీంతో పశుపోషణ భారంగా మారింది. మరోవైపు పశుగ్రాసం కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. మరోవైపు పశుసంపద గణనీయంగా తగ్గుతోందని అధికార వర్గాలే పేర్కొంటున్నాయి. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం పాడిరైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. తెల్లరేషన్‌కార్డు కలిగిన పశుపోషకులకు 50 శాతం రాయితీతో అందిస్తోంది. రెండు పశువులు, దూడకు అవసరమైన దాణాను 90 రోజులకు విడుతల వారీగా 450 కిలోల మేర రాయితీతో ఇస్తోంది. దీంతో ఆర్థికంగా ప్రభుత్వానికి అదనపు భారం పడుతున్నప్పటికీ పాడిరైతుల అభ్యున్నతి, పశుసంపద పెంచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ శాఖ ఏడీ శ్రీనివాసులు చెబుతున్నారు.

జిల్లాకు మంజూరైన దాణా:	599 మెట్రిక్ టన్నులు
50 కిలోల బస్తా ధర:	రూ.1100
రాయితీతో:	రూ.550

ఎట్టకేలకు గేటు తెరుచుకుంది

పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల


కుడి కాలువలో ప్రవహిస్తున్న జలాలు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), కూడేరు, న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ అత్యవసర గేటు పైకిలేచింది. సోమవారం ఉదయం నుంచే గేటును పైకిలేపడానికి మరోసారి ప్రయత్నాలు మొదలు పెట్టారు. హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, డీఈలు కవిత, వెంకటరమణ, శ్రీనివాసులు, ఏఈలు ఓబిరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు అక్కడే మకాం వేశారు. గేట్ల మరమ్మతు టెండర్ దక్కించుకున్న కర్నూలు ఎస్‌వీ ఇంజినీరింగ్ సంస్థ నిర్వాహకులు శ్రీనివాసులు తమ సిబ్బందితో గత నెల 14 నుంచి విశ్వప్రయత్నాలు చేశారు. సిబ్బందే ప్రస్తుత గేటును ఎత్తారు. రాష్ట్ర జలవనరుల మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు సూచనలను పాటించారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గేటు పైభాగం కదిలింది. తొలుత అర అడుగు పైకిలేవడంతో సిబ్బందిలో ఉత్సాహం రెట్టింపు అయింది. మొదట్లో 150 క్యూసెక్కుల ప్రవాహం మొదలైంది. తరువాత రెండు అడుగులు పైకిలేపి 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మంగళవారం మరో 200 క్యూసెక్కులు పెంచి.. ప్రవాహాన్ని కొనసాగిస్తారు.

గతేడాది రెండు.. ఇప్పుడు ఒకటి

పీఏబీఆర్ కుడి కాలువకు గతేడాది అతికష్టంపై గేట్లను ఎత్తారు. అప్పట్లో డిసెంబరు 2న నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం అష్టకష్టాలు పడి ఒకటో తేదీన నీటిని విడుదల చేయడం విశేషం. సోమవారం రాత్రి 7 గంటల సమయానికి కూడేరు మండలం హంసాపల్లి దాటాయి. కాలువ పూర్తి సామర్థ్యం 800 క్యూసెక్కులు. గరిష్ఠంగా 700 క్యూసెక్కుల ప్రవాహాన్ని కొనసాగిస్తారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 5.3 టీఎంసీలు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 620.. అవుట్‌ఫ్లో 990 క్యూసెక్కులు నమోదు అవుతోంది. డ్యాం ఎగువ ప్రాంతాల్లోని పొలాలు మునగడంతో అత్యవసరంగా దిగువన ఉన్న నదికి 560 క్యూసెక్కులు వదిలారు.

రైతులు సహకరించాలి

- సుధాకర్‌రావు, ఎస్ఈ, హెచ్చెల్సీ

కుడి కాలువకు కనీసం 2.5 టీఎంసీలు ఇస్తాం. రైతులు సమన్వయం పాటించాలి. చివరి దాకా నీరు వెళ్లడానికి రైతులు సహకరించాలి. అటు తాడిమర్రి, ఇటు ధర్మవరం దాకా నీరు వెళ్లాల్సి ఉంటుంది. ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు సహకరించాలని మనవి. నిర్దేశిత చెరువులకు నీటిని సరఫరా చేస్తాం. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మత సామరస్యానికి ప్రతీక బాబయ్య దర్గా

నేటి నుంచి ఉరుసు

పెనుకొండ, న్యూస్‌టుడే: దక్షిణ భారత దేశంలోనే ప్రసిద్ధి చెందిన పెనుకొండ బాబయ్యస్వామి దర్గా శతాబ్దాల కాలం నుంచి మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. దర్గా 753 గంధం, ఉరుసు వేడుకలు హిందూ, ముస్లిం ఐక్యతకు చిహ్నంగా నిలుస్తాయి. బాబయ్యస్వామి దర్గా పీఠాధిపతి నజర్‌హుస్సేనీ, వంశపారంపర్య ముతవల్లి తాజ్‌బాబా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించే జాతీయ సర్వమత సమ్మేళనంలో ప్రముఖులు పాల్గొంటారు. ప్రభుత్వం తరపున రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత దర్గాకు చాదర్ సమర్పిస్తారు. రాత్రి 9గంటల నుంచి సర్వమత సమ్మేళనం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 2గంటలకు సందల్‌మహల్ నుంచి పీఠాధిపతి ఊరేగింపుగా గంధం తీసుకువచ్చి స్వామివారికి సమర్పిస్తారు. ఇక్కడ 38సంవత్సరాలుగా జాతీయ సర్వమత సమ్మేళనం నిర్వహిస్తున్నారు.


దీపాలంకరణలో బాబయ్యస్వామి దర్గా ప్రధాన ద్వారం

వంతెన నిర్మాణం.. మూడేళ్లకే అధ్వానం

■ గుంతలు పడి కడ్డీలు లేస్తున్నా పట్టించుకోని వైనం

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లకు ఆనుకుని ప్రవహించే చిత్రావతి నదిపై ఏడు దశాబ్దాల క్రితం అప్పటి పరిస్థితులు, వాహనాలు సంఖ్యకు అనుగుణంగా వంతెన నిర్మించారు. తర్వాత అత్యధిక బరువులతో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో కొత్తది నిర్మించాలని తలచారు. అనుకున్నట్లే 2014-19 తెదేపా హయాంలో గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (జీఏఐఎల్) నుంచి ఆనాటి ఎంపీ నిమ్మల కిష్టప్ప కృషితో రూ.4.75కోట్లు సీఎస్ఆర్ నిధులు నూతన వంతెన నిర్మాణానికి మంజూరయ్యాయి. దాదాపు మూడేళ్లకు పైగా నిర్మాణ పనులు కొనసాగించి 2022 ఏప్రిల్‌లో పూర్తిచేసి వైకాపా హయాంలో ప్రారంభించారు. ఏడాదికే టాపు లేచిపోవడం ప్రారంభమైంది. ఇప్పటికే మూడుసార్లు రంగులు వేసినట్లు సిమెంటు పూత పూశారు. ప్రస్తుతం దాదాపు ఆరేడుచోట్ల ప్రమాదకరంగా గుంతలు ఏర్పడి, ఇనుప చువ్వలు బయటపడ్డాయి. వాహనచోదకులు అతిజాగ్రత్తగా రాకపోకలు సాగించాల్సి ఉంది. ర.భ.శాఖ పరిధిలో ఉన్న ఆ రహదారి ఏడాది క్రితం జాతీయ రహదారుల పరిధిలోకి వెళ్లింది. బెంగళూరు, హిందూపురం, ధర్మవరం, పెనుకొండ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రద్దీతో ఎప్పుడూ ఒకేరకంగా ఉంటోంది. ఈక్రమంలో వంతెన పూర్తిపాడవక ముందే శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈసమస్యను ఎన్‌హెచ్‌ఏఐ డీఈఈ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు.

చిత్రావతిపై నిర్మించిన నూతన వంతెన దుస్థితి ఇలా..

ఖనిజ సంపద దోపిడీ

అడ్డగోలుగా అటవీభూముల్లో తవ్వకాలు

కొండుపల్లి వద్ద అటవీ భూములు.. వీటి కిందనే తవ్వకాలు సాగుతున్నాయి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ఆ ప్రాంతంలో ఏ భూముల్లో చూసినా విలువైన భూగర్భ ఖనిజాలు ఉంటాయి. దీంతో సదరు భూముల ధరకు రెక్కలొచ్చాయి. ఎకరం రూ.అరకోటి పైమాటే. ఉమ్మడి అనంత జిల్లాలో అత్యధికంగా పెద్దవడుగూరు మండలం కొండుపల్లి, క్రిష్టిపాడు గ్రామాల పరిధిలో సుమారు 36 భూగర్భగనులు ఉన్నాయి. కొందరికి మాత్రమే అనుమతులు ఉండగా మరికొందరు అడ్డగోలుగా భూగర్భగనుల్లో తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా భూములకు విలువ పెరుగుతూ వస్తోంది. మరోవైపు రాజస్థాన్‌లో భూగర్భగనులు బంద్ కావడంతో ప్రస్తుతం ఇక్కడి వాటికి డిమాండ్ పెరిగింది. అక్రమార్జనే ధ్యేయంగా తవ్వకాలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. రోజూ వేల టన్నుల ఖనిజం తరలిపోతున్నా అటవీ, రెవెన్యూ, గనులశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రెండు గ్రామాల పరిధిలోని భూగర్భంలో స్టియటైట్, డోలమైట్, సున్నపురాయి ఉన్నాయి. ఇందులో స్టియటైట్‌కు మంచి గిరాకీ ఉంది. దీంతో తవ్వకాలు జరిపి.. జేబులు నింపుకోవడానికి అక్రమార్కులు పోటీ పడుతున్నారు.

రహదారుల కింద సైతం..

కొండుపల్లి సమీపంలో అటవీ భూములు వందలాది ఎకరాల్లో ఉన్నాయి. సర్వే నంబరు 302-ఎలో 267.69 ఎకరాలు.. 1007 సర్వే నంబరులో 715.30 ఎకరాలతోపాటు కొండలు విస్తరించి ఉన్నాయి. అనుమతి గనుల పక్కనే ఉన్న అటవీభూముల వైపు తవ్వకాలు జరిపి విలువైన ఖనిజ సంపదను దోచుకుంటున్నారు. ఇదిలా ఉండగా గ్రామాలకు వెళ్లే రహదారుల కింది భాగంలో తవ్వకాలు జరిపి అక్రమార్జనకు తెరలేపారు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే ఎప్పుడు కుంగిపోతాయోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండుపల్లి, క్రిష్టిపాడు ప్రాంతాల్లో 16 గనులకే అనుమతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి వెళ్లారు. తిరిగి అక్రమార్కులు తవ్వకాలు సాగిస్తూ ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు.

పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం

-నారపరెడ్డి, అటవీశాఖ సెక్షన్ అధికారి, గుత్తి

కొండుపల్లి ప్రాంతంలోని అటవీభూముల్లో కొందరు భూగర్భంలో తవ్వకాలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తవ్వకాలు జరిపిన వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

టెట్ మినహాయింపునకు వినతి

కదిరి, న్యూస్‌టుడే: 2010 ఏడాదికి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శి తాహిర్‌వలి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో హోంలో సోమవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుతో దాదాపు లక్షమంది ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో 9, 10న డివిజన్ కేంద్రాల్లో నిరసనలు, 18న కలెక్టరేట్ వద్ద ధర్నా, జనవరి 4న భీమవరంలో భారీ ర్యాలీ, 29న చలో పార్లమెంటు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సమావేశంలో సమాఖ్య నాయకులు సుబ్బారెడ్డి, మల్లికార్జున, ఆజంబాష, సునీల్‌కుమార్, సంతోష్‌కుమార్, మండలాల నాయకులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం.. నిందితుడి అరెస్టు

ధర్మవరం: ధర్మవరం పట్టణంలో 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఒక నిందితుడిని సోమవారం ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. బాలిక గర్భం దాల్చడంతో అత్యాచార ఘటన బయటపడింది. బాలిక పెంపుడు తల్లి ఫిర్యాదుతో ఆమె భర్త, తమ్ముడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. నిందితుల్లో ఒకరైన పెంపుడు తల్లి తమ్ముడిని పట్టుకున్నట్లు పోలీసులు చెప్పారు. అతడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు వెల్లడించారు.

పేదింటి బిడ్డలు.. ఆటల్లో ఆణిముత్యాలు

మడకశిర, రొళ్ల, న్యూస్‌టుడే : నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన ఈ విద్యార్థులు కఠోర సాధనతో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు. కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూనే క్రీడలపై మక్కువ పెంచుకుని జాతీయ స్థాయి వరకు ఎంపికై ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆకట్టుకునే ఆటతీరు - లక్ష్మీప్రియ

రొళ్ల మండలం ఎం.రాయాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. తండ్రి లేకపోయినా తల్లి పార్వతి కూలీ చేసుకుంటూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తోంది. వాలీబాల్‌లో మంచి ఆటతీరు కనబరచడంతో అండర్-17 విభాగంలో జిల్లా స్థాయిలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఇటీవల తూర్పు గోదావరిలో కొవ్వూరులో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ఆడింది. డాక్టర్ కావాలని బాగా చదువుతున్నట్లు చెప్పింది.

ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే లక్ష్యం.. - దీక్ష

మడకశిర మండలం గంగులవాయిపాళ్యం రాజు, రత్నమ్మల కుమార్తె తల్లిదండ్రులు కూలీ పనులు చేసి గుండుమల కేజీబీవీలో చదివిస్తున్నారు. అండర్ 17 విభాగంలో పరుగు పందెంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించింది. చిన్నప్పటి నుంచి పరుగు పందెంలో ఎక్కడ పాల్గొన్న మొదటి స్థానంలో నిలిచేది. గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని 800మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించింది. దీంతో ఆ విద్యార్థిని జాతీయస్థాయికి ఎంపికైంది. లక్నోలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధం అవుతోంది. ఒలింపిక్స్‌లో పాల్గొని భారత్‌కు పతకాన్ని తీసుకురావాలనేదే తన లక్ష్యం అంటోంది దీక్ష.

క్రికెట్‌లో మూడుసార్లు జాతీయ స్థాయికి..

- వరుణ్ సందేశ్

రొళ్ల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ అండర్-17లో మూడు సార్లు క్రికెట్‌లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరు అంజలీదేవి, మధుసూదన్‌లు పెయింటింగ్ పని చేసుకుని చదివిస్తున్నారు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై మక్కువతో కష్టపడి ఆడుతూ ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు వెళ్లాడు. నెల్లూరులో నిర్వహించిన మినీ సౌత్ జోన్ అండర్-14లో ఏపీ జట్టు తరుపున ఆడాడు. హైదరబాద్‌లో 6వ జాతీయ క్రికెట్ టోర్నమెంటులో ఏపీ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ నెలలో దిల్లీలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనున్నాడు. ఇండియా క్రికెట్ జట్టులో ఆడాలని కోరికతో ఆడుతున్నాడు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

(c) eenadu

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు (మంగళవారం) రాత్రి 7.30 గంటలకు వెండి రథ ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు సాధారణ దర్శనం ఉంటుంది. 7 నుంచి 9 గంటల మధ్య అభిషేకం, స్వర్ణకవచ సేవలు జరుగుతాయి. 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

భక్తరపల్లిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలిరోజు సోమవారం స్వామి వారి ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని వివిధ పూలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు, కలశపూజ, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పట్టువస్త్రాలతో వస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు దంపతులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక

ధర్మవరం గ్రామీణ మండలం చిగిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో గత నెల 28 నుంచి జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పట్టణం లోని బాలికల ఉన్నత పాఠశాల (కళాజ్యోతి) విద్యార్థినులు సత్తాచాటారు. 32, 36 కేజీల విభాగం (అండర్-14)లో సింధు, దాక్షాయణి, 36 కేజీ(అండర్-19)ల్లో యువ సంధ్య బంగారు పతకాలు పొందారు. త్వరలో రాజస్థాన్, దిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను ప్రధానోపాధ్యాయిని సుమన, శిక్షకులు ఇనాయత్ బాషా, నవ్యశ్రీ అభినందనలు తెలిపారు.

-న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

పీఎం ధనధాన్య కృషి యోజనపై సమీక్ష

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: రైతులకు లాభాదాయక పంటల సాగులో ప్రోత్సాహం, మార్కెటింగ్ వ్యూహాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి సంబంధిత శాఖల అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. ఆయన సోమవారం కలెక్టరేట్లో పీఎం ధనధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) అమలు, పురోగతిపై సమీక్ష సమావేశం జరిపారు. ఆయా శాఖలు సాధించిన లక్ష్యాలు, విభాగాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. రైతులకు మార్కెట్ పాయింట్లు ఎక్కడ ఏర్పాటు చేయాలో స్పష్టమైన ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. వచ్చే ఏడాది మార్చి వరకు అమలు చేయాల్సిన భవిష్యత్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. పంటల స్థితి, సాగు విధానాల మెరుగు, మార్కెట్ డిమాండ్ తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

బాల సదనాలకు ధ్రువపత్రాల అందజేత

పుట్టపర్తి, న్యూస్‌టుడే: బాలల చట్టం-2015 ప్రకారం ప్రతి బాల సదనంలో కనీస ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్లో జిల్లాలోని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల సదనాల రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను జేసీ మౌర్యభరద్వాజ్ చేతుల మీదుగా నిర్వాహకులకు అందజేశారు. సదనాల్లో ఉంటున్న పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీడీసీ పీడీ ప్రమీలా, రీజనల్ ఇన్‌స్పెక్టర్ వెంకటప్రసాద్, బాలల సంక్షేమ శాఖ డీపీఓ అఖిల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా కిశోర్

పుట్టపర్తి పట్టణం: శ్రీసత్యసాయి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా బి.కిశోర్ సోమవారం పుట్టపర్తిలోని శాప్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నంద్యాలలో వాలీబాల్ శిక్షకుడుగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇంతకు ముందు పనిచేస్తున్న ఉదయ్‌కుమార్ చిత్తూరుకు బదిలీ అయ్యారు.

బొప్పాయి.. రాబడికి ఢోకాలేదోయి!

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: బొప్పాయి పంట వైపు మొగ్గు చూపి మంచి దిగుబడులతోపాటు అదే స్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నాడు కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లికి చెందిన రైతు మహేంద్ర. తనకున్న 25 ఎకరాల్లో గతంలో టమాటా, మిరప, కర్బూజా పంటలు సాగు చేసినా నష్టాలు మూటగట్టుకున్నాడు. ఆయా పంటల మధ్యలో కొంత వరకు బొప్పాయి పంట సాగు చేశారు. అందులో లాభాలు రావడంతో 6 ఎకరాల్లో బొప్పాయి పంట సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. తాజాగా మరో నాలుగెకరాల్లో పంట సాగు చేసేందుకు సిద్ధమయ్యారు.

● ప్రస్తుతం నంబరు -15 (పంద్రా) రకం బొప్పాయి రకాన్ని 9 నెలల కిందట 6×6 దూరంలో మొక్కలు నాటారు. నంబరు -15 (పంద్రా) రకం మహారాష్ట్రలోని పూణె నుంచి ఒక్కో మొక్క రూ.12లతో 6 వేల మొక్కలు కొనుగోలు చేశారు. మొక్కలకు రూ.72 వేలు, కంప్లెక్స్ ఎరువులకు రూ.40 వేలు, సేంద్రియ ఎరువులకు గాను ట్రాక్టర్‌కు రూ.6 వేలు వంతున 15 ట్రాక్టర్లు, డ్రిప్, ఫర్టిలైజర్ ఎరువులకు రూ.45 వేలు, కూలీలు ఇతర పెట్టుబడులు కలిపి దాదాపుగా రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు.

ఏపుగా పెరిగిన బొప్పాయి

రైతేరాజు

ప్రారంభమైన కోతలు..

నెల నుంచి పంట కోత దశకు వచ్చింది. మొదట, రెండో కోతలో ఒక్కో కోతకు 12-15 టన్నుల దిగుబడి వచ్చింది. మార్కెట్లో విక్రయించగా దాదాపు రూ.1.80 లక్షలు వచ్చింది. మూడో కోతలో 25 టన్నుల వరకు దిగుబడి రానుంది. నెలలో రెండు కోతల వరకు వస్తుంది. ఏడాదిన్నర వరకు పంట కాలం ఉంటుంది. కాలానుగుణంగా బొప్పాయి ధరలు పెరిగితే పంట కాలం పూర్తయ్యేంత వరకు రూ.20 లక్షల నుంచి రూ.32 లక్షల వరకు ఆదాయం వస్తుంది. సేంద్రియ ఎరువులు ఒక సారి తోటలో వేస్తే రెండేళ్ల పాటు పోషకాలు ఉంటాయి.

● వ్యాపారులు తోట వద్దకే వచ్చి దిగుబడులను కొనులుగోలు చేస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పండిన బొప్పాయి కాయలకు మంచి గిరాకీ ఉంది. దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ మార్కెట్లో విక్రయాలు చేస్తున్నారు. దీంతో రావాణా ఖర్చులు కలిసొస్తున్నాయి.

విపణిలో మంచి డిమాండ్

- మహేంద్ర, కుర్లపల్లి

గతంలో వ్యవసాయ క్షేత్రంలో పలు రకాల ఉద్యాన పంటలు సాగు చేసినా నష్టాలు వచ్చాయి. బొప్పాయి పంట పెట్టినప్పటి నుంచి దిగుబడులతో పాటు మంచి లాభాలు వస్తున్నాయి. ఈ పంట ఏడాదిన్నర పాటు ఆదాయం తెస్తోంది. సేంద్రియ ఎరువుల వాడకంతోనే బొప్పాయి కాయలు కూడా బాగానే ఉంటాయి. బొప్పాయి సాగు ఎంతో ఊరట ఇస్తోంది.

మామిడిలో సస్యరక్షణ చర్యలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మామిడి తోటల్లో పూత దశ ఎంతో కీలకం. తెగుళ్లు అధికమైతే పూతరావడం చాలా ఆలస్యమవుతుంది. ఫలితంగా దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. పూతరాక ముందే ఇప్పటి నుంచి రైతులు సస్యరక్షణా చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మామిడి పూత ఒకేసారిరాదు. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి వరకు పూత వస్తూనే ఉంటుంది. ఈ సమయంలో సస్యరక్షణా చర్యలు చేపట్టడం రైతులకు కష్టం, ఈ సమస్యను అధిగమించేందుకు తేమ తక్కువ ఉండే నేలల్లో తేలికపాటి నీటితడులివ్వాలి.

తేనె మంచు పురుగు నివారణ..

మామిడిలో తేనె మంచు పురుగు నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ, సల్ఫర్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పదిరోజుల తర్వాత ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ, హెక్సాకొనజోల్ 2 మి.లీ, 13:0:45 -10 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత పది రోజులకు బోరాన్ 2 గ్రా. సూక్ష్మధాతువు 2 గ్రా. కార్బండాజిమ్ ఒక గ్రా. లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయడం ద్వారా తేనెమంచు పురుగు, బూడిద తెగుళ్లను నివారించవచ్చు. దీంతో మామిడి పూత ఆరోగ్యంగా రావడానికి ఎంతో దోహదపడుతుంది.

కూటమి ప్రభుత్వంతోనే ప్రతి ఇంటికీ పథకాలు

ప్రజావేదికలో మంత్రి సవిత

సానిపల్లిలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి, తదితరులు

రొద్దం, న్యూస్‌టుడే : రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ప్రజా వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా మండలానికి చెందిన పలువురు వారి సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు ఆమె స్వీకరించారు. ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సుమారు 89 రాగా.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకతోనే నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో పాటు, పంచాయతీలకు నిధులు గ్రామాల్లో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. మండలంలోని దొడగట్ట, పెద్దగువ్వలపల్లి, నల్లూరు, రొద్దం గ్రామాల్లో సీసీ రోడ్లతోపాటు పెన్నానది వంతెనల నిర్మాణాలకు దాదాపు రూ.8.50 కోట్లు నిధులతో అభివృద్ధి పరిచినట్లు ఆమె పేర్కొన్నారు. పెనుకొండలో 18 విలేజ్ క్లినిక్‌ల కోసం రూ.10.50 కోట్లు మంజూరయ్యాయి. అదేవిధంగా నూతన పింఛన్ల, ఇళ్లల మంజూరుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మండలంలోని సానిపల్లిలో రూ.38 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీవో ఆనందకుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎంపీడీవో ఆనంద్‌ప్రసాద్, తహసీల్దారు ఉదయ శంకర రాజు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బెండకు మొవ్వకుళ్లు తెగులా?

గోవిందపల్లిలో సాగులో ఉన్న బెండతోట

చిట్కా

నార్పల, న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలో బెండ పంటను సాగు చేసిన రైతులు తెగుళ్లను సమర్థంగా నివారించి, తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. పంటకు మొవ్వకుళ్లు, కాయతొలిచే పురుగులు ఆశిస్తే తీవ్ర నష్టం వస్తుందన్నారు. ఇలాంటివి సోకినపుడు రైతులు వేపనూనె 5 మి.లీ, ఇమామెక్టిన్ బెంజాయేట్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకుంటే తెగుళ్లు పూర్తిగా నివారించవచ్చని శాస్త్రవేత్త తెలిపారు.

సమస్య సమాధానం

నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రబీ వ్యవసాయ సీజన్‌లో జిల్లాలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నారాయణస్వామి నంబరు: 62812 84235కు ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేయడానికి ఉల్లినారు వేశాం. దీనికి నారుకుళ్లు తెగులు సోకింది. తెగులు నివారణకు మార్గం తెలపండి. **- వెంకటేష్, పెద్దవడుగూరు**

సమాధానం : ఉల్లినారు కుళ్లు తెగులు నివారణకు రైతులు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి 10 రోజులకు ఒక సారి పిచికారీ చేసుకుంటే తెగులు ఉధృతి తగ్గుతుంది.

సమస్య : మామిడి తోటలో పూత రాలిపోతుంది. పూత రాలకుండా ఉండాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలి. **-నరసింహులు, గొల్లపల్లి**

సమాధానం: మామిడి చెట్లకు నీరు ఎక్కువగా పెట్టకూడదు. తేలికపాటి తడులు ఇవ్వాలి. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు, అర్కమాంగో స్పెషల్ 5 గ్రాముల చొప్పున పిచికారీ చేసుకుంటే సరిపోతుంది.

35 ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతూ..

పట్టుబడిన బస్సు దోపిడీ నిందితుడు!

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: ఒకటి కాదు.. రెండు కాదు.. 35 ఏళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఓ నిందితుడు ఎట్టకేలకు పట్టుబడిన ఘటన సోమవారం స్థానికంగా చోటుచేసుకుంది. కూడేరు సీఐ రాజు తెలిపిన వివరాలిలా.. . 1992 డిసెంబరు 28న అనంతపురం జాతీయ రహదారిలో జల్లిపల్లి- కూడేరు గ్రామాల మధ్య మదనపల్లి డిపోకు చెందిన బస్సును ముగ్గురు దొంగలు దోపిడీ చేశారు. ఈ ఘటనలో అప్పటి పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా.. తదుపరి వారు బెయిల్‌పై విడుదలయ్యారు. తదుపరి వారు పోలీసులకు లొంగిపోకపోవడంతో వారి మీద జారీ అయిన వారెంట్లు(ఎన్‌బీడబ్ల్యూ) 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ఎస్పీ పర్యవేక్షణలో పాత కేసుల ఛేదనలో భాగంగా ఈ కేసుపై అనంతపురం పోలీసులు దృష్టి సారించారు. ఇందులో ఏ3గా ముద్దాయిగా ఉన్న బోయ నరసింహులును సోమవారం అనంతపురంలో సీసీఎస్ సీఐ శేషగిరి ఆధ్వర్యంలోని పోలీసు బృందం అదుపులోకి తీసుకుంది. అనంతపురం గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసులోనూ నరసింహులు నిందితుడిగా ఉన్నట్లు తేలింది. వెంటనే అనంతపురం కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి ఈనెల 9 వరకు రిమాండు విధించారు.

పోలీసుల అదుపులో నిందితుడు నరసింహులు

రెండు ప్రాణాలను బలిగొన్న వేగ నియంత్రిక

కుమారుడిని పరీక్ష రాయించేందుకు వెళ్తూ తల్లీతండ్రి తిరిగిరాని లోకాలకు..

కృష్ణారెడ్డి, జ్యోతి

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: అమ్మానాన్న, ఇద్దరు పిల్లలతో ఎంతో సంతోషంగా సాగుతున్న ఆ కుటుంబంపై విధి చిన్నచూపు చూసింది. కుమారుడిని బాగా చదివించి ఉన్నత స్థాయిలో చూడాలని ఎన్నో ఆశలతో పరీక్ష రాయించేందుకు బెంగళూరుకు కారులో బయలుదేరిన ఆ తల్లిదండ్రులను వేగనియంత్రిక బలిగొంది. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం గుడ్డంపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి(41), జ్యోతి(35) దంపతులు రెండేళ్లుగా బెంగుళూరులో కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కుమారులను బాగా చదివిస్తున్నారు. పెద్దకుమారుడు మధుసూదన్‌రెడ్డి హాసన్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చిన్నకుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి బెంగుళూరులో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం బంధువుల ఇంట్లో పెళ్లి ఉండటంతో కుటుంబ సభ్యులతో గుడ్డంపల్లి గ్రామానికి వచ్చారు. పెద్దకుమారుడికి బెంగుళూరులో ఐటీఐకి సంబంధించిన పరీక్ష ఉందని దంపతులిద్దరు మరో వ్యక్తి చిదంబరరెడ్డి కలిసి సోమవారం తెల్లవారుజామున కారులో బయలుదేరారు. మడకశిర నుంచి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో కర్ణాటక రాష్ట్రం హొసకెర పట్టణంలో వేగనియంత్రికపై కారు దూసుకెళ్లడంతో అదుపుతప్పి బోల్తాపడి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణారెడ్డి, జ్యోతి అక్కడికక్కడే మృతి చెందగా మధుసూదన్‌రెడ్డి, చిదంబరరెడ్డి గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. చిన్న వయసులో తల్లిదండ్రులు అకాలమృత్యుపాలవడంతో పిల్లలు అనాథలుగా మిగిలారు. మృతుల కుటుంబీకులు, బంధువుల రోదన మిన్నంటింది. దంపతుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నకిలీ అనిశా అధికారి అరెస్టు

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, వివరాలను వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ డబ్బులు దండుకుంటున్న నకిలీ అనిశా డీఎస్పీతోపాటు ఆయనకు సహకరించిన నలుగురిని వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి చరవాణులు, రూ.9 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సీపీ సన్‌ప్రీత్‌సింగ్ నిందితుల వివరాలను వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం వేలమద్ది గ్రామానికి చెందిన రాచంపల్లి శ్రీనివాస్ అలియాస్ మంగళ శ్రీను, వాసు అనిశా డీఎస్పీగా చలామణి అవుతున్నాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన నవీన్ జేఆర్, మంగళ రవీందర్, మురళీ, ఎన్.ప్రసన్నతో పాటు సూర్యప్రకాశ్, తాటిమర్రి వేణు, కొత్తకోట రమణ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. రాచంపల్లి శ్రీనివాస్ అనిశా డీఎస్పీ అంటూ ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న అధికారులను లక్ష్యంగా చేస్తూ బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా ఆర్‌అండ్‌బీలో ఎంవీఐగా పని చేస్తున్న తుమ్మల జైపాల్‌రెడ్డికి ఫోన్ చేసి బెదిరించి సుమారు రూ.10 లక్షలను వివిధ మార్గాల్లో దోచాడు.

● ఎంవీఐ ఫిర్యాదు మేరకు మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని పట్టుకున్నారు. నకిలీ పోలీసు అధికారిగా చలామణి అయ్యాడు. రాయలసీమ ప్రాంతంలో చోరీల కేసుల్లో అరెస్టయిన నిందితుల కుటుంబసభ్యులను లక్ష్యంగా చేసుకుంటూ.. దొంగ సొత్తును దాచి ఉంచారని బెదిరించి బంగారం, డబ్బు దోపిడీకి పాల్పడ్డాడు. సుమారు 50 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. తిరిగి బయటకు వచ్చి రాయలసీమ, బెంగళూరు ప్రాంతాల్లో 41కిపైగా గొలుసు దొంగతనాలు చేశాడు. దోపిడీ చేసిన సొమ్ముతో ఇతర నిందితులతో కలిసి జల్సాలు చేయడం, క్యాసినోలో జూదం ఆడటం.. వ్యభిచార గృహాల్లో డబ్బులు ఖర్చు చేసేవాడు.

‘వైకాపా ఉనికికే జగన్ అసత్య కథనాలు’

ధర్మవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేస్తున్న రాష్ట్రాభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత పత్రిక సాక్షిలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు కూటమి నాయకులపై అసత్య కథనాలు రాయిస్తున్నాడని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం ధర్మవరంలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో చిచ్చు పెట్టేందుకు వైకాపా నాయకులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ముచ్చురామి గ్రామంలో గుర్రప్ప అనే రైతు తన పొలంలో పని చేసుకుంటుంటే, చెట్లు నరికారని వైకాపా అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పనిచేసిన పోలీసు అధికారులు కొందరు ధర్మవరం నియోజకవర్గంలో ఉన్నారని, వారు వైకాపాకు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. సాక్షిలో అసత్య కథనాలు వస్తే ఉపేక్షించమని, పచ్చటి గ్రామాల్లో చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తే తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని జిల్లా కో-ఆర్డినేటర్ ఆంజనేయులు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తిచేసి ఉద్యోగాలకు ఎదురుచూస్తున్న 19 నుంచి 26 ఏళ్ల యువతకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ, డీడీయూజీకేవై ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 90 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజనంతో పాటు యూనిఫారాలు ఇస్తారన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్‌స్కిల్స్, ఇంటర్‌నెట్ తదితర అంశాల్లో శిక్షణ లభిస్తుందన్నారు. 3 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, మరిన్ని వివరాలకు చరవాణి సంఖ్య 9640899337ను సంప్రదించాలని ఆయన కోరారు.

గంజాయి విక్రేతల రిమాండ్

పట్టుబడిన నిందితులు

అనంత నేరవార్తలు: అనంతపురం నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నవోదయ కాలనీలో గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను సీఐ వెంకటేశ్వర్లు సోమవారం మీడియాకు తెలియజేశారు. టీవీ టవర్ సమీపంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన షికారీ శీనా, షేక్ మహమ్మద్‌లు ఇతరుల వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, నగరానికి రవాణా చేసి అధిక ధరకు విక్రయిస్తుంటారు. ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు సరఫరా చేస్తుంటారు. వీరిపై పక్కా నిఘా ఉంచిన పోలీసులు నవోదయ కాలనీలోని హిందూ శ్మశాన వాటిక వద్ద గంజాయిని విక్రయిస్తుండగా ఆకస్మిక దాడి చేసి ఇరువురినీ పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. నిందితులను జిల్లా కోర్టు ఎదుట హాజరుపరచగా, కోర్టు నిందితులకు రిమాండ్ విధించింది.

APS RTC పల్లె వెలుగు

టెండరు ప్రకటన

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాల్స్/ షాపులు, ఖాళీ స్థలములలో వ్యాపారములు చేసుకొనుట, క్యాడెట్ పిల్లర్లపై ప్రకటనలు ఇచ్చుటకు, మరుగుదొడ్ల నిర్వహణకు అనుభవం ఆసక్తి కలిగిన సంస్థలు/ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.04-12-2025 నుండి తేది.17-12-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.18-12-2025న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, పుట్టపర్తి నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఏదే కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం. P3/437(07)/2025-DPTO(S), తేది: 01-12-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, పుట్టపర్తి, శ్రీసత్యసాయి జిల్లా.

కట్నం వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యాయత్నం

రాప్తాడు, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం ఓ కానిస్టేబుల్ వేధించడంతో యువతి ఆత్మహత్యాయత్నం ఘటన సోమవారం అనంతపురం రూరల్ ఆకుతోటపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం రూరల్ చిన్నకుంటకి చెందిన అగ్నిమాపక శాఖలో పని చేస్తున్న ఓ కానిస్టేబుల్‌కు రాప్తాడుకు చెందిన యమునతో 2014లో డబ్బు, బంగారం ఇచ్చి ఘనంగా పెళ్లి చేశారు. కొన్ని సంవత్సరాల తరువాత అదనపు కట్నం తీసుకొని రావాలని భర్త, అత్తమామలు వేధింపులు ప్రారంభించారు. పుట్టినింటి నుంచి ఎకరా పొలం తీసుకొని రావాలని తరచూ ఇంటిలో గొడవలు జరుగుతుండటంతో భరించలేక చాలాసార్లు బలవన్మరణానికి పాల్పడబోయింది. ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భార్యను పిల్లలను బాగా చూసుకుంటానని తెలపడంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. కానీ తరువాత కూడా ఎకరం పొలం తీసుకొని రావాలని వేధింపులకు గురి చేయడంతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబీకులు చికిత్స కోసం అనంతపురం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తరలించారు. బాధితురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వేధిస్తున్నారు.. కాపాడండి

ఎస్పీకి ఓ వైద్యుడి వేడుకోలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తనకు సంబంధం లేని అప్పులను చెల్లించాలని కొందరు మానసికంగా వేధిస్తున్నారనీ, బెదిరింపులకు పాల్పడుతున్నారని నగరానికి చెందిన వైద్యుడు కేవస్ అబ్దుల్ రజాక్ గఫూర్ ఎస్పీ జగదీశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సోమవారం పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ కార్యక్రమంలో ఎస్పీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన తెలుపుతూ.. తన కుమారుడు అర్షద్ నగరంలోని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించే వైద్యశాలలో వైద్యుడిగా పనిచేసేవాడనీ, ఈ క్రమంలో 2024, నవంబరు 4న ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. వ్యసనాలను తీర్చుకోవడానికి నగరంలోని కొందరి వద్ద తనకు తెలియకుండా అప్పులు చేశాడనీ, అవి తీర్చలేక, రుణదాతల ఒత్తిళ్లు భరించలేక చనిపోయాడని తర్వాత తెలిసిందన్నారు. వారిలో ప్రియాంక అనే యువతికి చెందిన బంగారం, డబ్బులు తీసుకున్నాడనీ, అవి చెల్లించాలనీ ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ యువతి కుటుంబ సభ్యులు తనను కుల సంఘాల వారితో పంచాయితీ చేయించి, బెదిరించి రూ.12 లక్షలు ఇచ్చేలా ఒప్పించారన్నారు. తాను ఇవ్వడానికి సిద్ధపడ్డానన్నారు. ఇంకా ఎక్కువ డబ్బులు, బంగారం కావాలని బెదిరిస్తున్నారన్నారు. గత నెల 29న యువతి తరఫు వారు ఆసుపత్రి వద్దకు వచ్చి రాజకీయ నాయకులు, పెద్దవాళ్ల పేర్లు చెప్పి బెదిరించారని తెలిపారు. మానసికంగా కుంగిపోయి అనారోగ్యం పాలయ్యానని చెప్పారు. వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విన్నవించారు.

బాలుడి హత్య కేసు నిందితుడి...

నిందితుడిని చూపుతున్న పోలీసులు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: నంబులపూలకుంట మండలం మరికొమ్మదిన్నె వద్ద గత నెల 26న హత్యకు గురైన తలుపుల మండలం గరికపల్లికి చెందిన బాలుడు హర్షవర్ధన్(5) కేసులో నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. ఆయన సోమవారం కదిరి గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు తెలిపారు. బాలుడి తండ్రి గంగాధర్‌పై కోపంతో ఆయన బావ ప్రసాద్ హర్షవర్ధన్‌ను ద్విచక్రవాహనంలో తీసుకెళ్లి గొంతు నులిమి చంపాడన్నారు. దర్యాప్తులో భాగంగా సోమవారం మూర్తిపల్లి సమీపంలో ఉన్న ప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడి నుంచి ద్విచక్రవాహనం, హత్యకు ఉపయోగించిన గ్లౌజులు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో సీఐ నాగేంద్ర, తలుపుల ఎస్సై నరసింహుడు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

REAL ESTATE

FLAT FOR SALE

3BHK, 2BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అందుబాటు ధరతో అనంతనగర నడిబొడ్డున నిర్మిస్తున్న మీనాక్షిఅపార్ట్మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. 7416560179, 9515651111

JOBS

Wanted: (1) ITI Electrician/ Operators (Cold Storage) (2) Supervisor@Fresh Cart Agro (P) Ltd., Kldroad, ATP (Intervie 03/12/2025) Cell: 9490571605, 8143697965

ట్రాక్టర్ అమ్మడంలో 4-5 సం||ల అనుభవం కల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. స్వరాజ్ ట్రాక్టర్స్ మార్కెటింగ్ కొరకు రామగిరి, నార్పల, గుత్తి, వజ్రకరూరు, తాడిపత్రి, పప్పూరు, BKS, కనగానపల్లి, యల్లనూరు, పుట్లూరు మండలాలకి. 8465066566, 8374559867.

డ్రీమ్‌హోమ్ కన్‌స్ట్రక్షన్, ATP నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్/ టెలీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. శాలరీ + ఇన్సెంటివ్స్. Ph: 7893932828.

S.R.రెడ్డి అపార్ట్‌మెంట్ గుత్తి నందు పనిచేయుటకు వాచ్‌మెన్ కావలెను. రూమ్ సదుపాయం కలదు. సంప్రదించు Cell No: 9000610030.

MARKETING/ SALES

Ceiling Fans, Electrical Gesyer (Standard Company) & Holiday Packagesలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల వ్యక్తులు కావలయును. Cell: 9440294666.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

ఆటో డ్రైవర్ల శ్రమదానం

గుంతలు పూడ్చుతున్న ఆటో డ్రైవర్లు

గుడిబండ: గుడిబండ మండలం నుంచి మండలపల్లి వరకు రోడ్డులోని గుంతలను ఆటో డ్రైవర్లు శ్రమదానంతో పూడ్చారు. ఈ రోడ్డు గుండా గుంతలు ఎక్కువగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉండడంతో ఫళారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లు నాగరాజు, కుమార్, అనుమేశ్, పాషా, శంకర్‌కుమార్, లోకేశ్, ఈరన్న, రాము, శ్రీను, రామచంద్రప్ప, షాజాహాన్, రంగప్పలు వెళ్లి తమ వంతు చేయిచేయి కలిపి గుంతలు పూడ్చారు. దీంతో రాకపోకలకు సులువుగా మారింది.

ఘనంగా నాగులమ్మదేవి ప్రాణప్రతిష్ఠాపన

హిందూపురం, న్యూస్‌టుడే: పరిగి మండలం వంగలపల్లిలో సోమవారం వేకువజామున నాగులమ్మదేవి ప్రాణప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు పెద్దఎత్తున మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు లక్ష్మయ్యస్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాగులమ్మదేవి మూలవిరాట్

ముద్దిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విజేతలతో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు

చరవాణి వినియోగం వ్యసనంగా మారకూడదు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం సమీపంలోని ముద్దిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్‌ల ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 9వ తరగతి చదువుతున్న చరణ్ ప్రథమ, 10వ తరగతి కి చెందిన మంజునాథ్ ద్వితీయ, బాలచంద్ర తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధామణి, ఉపాధ్యాయులు రామచంద్ర, బాబు బహుమతులు అందజేశారు.

అత్యవసరమైతే.. అగచాట్లే !

మండల కేంద్రాల్లో సామూహిక మరుగుదొడ్లు లేక పాట్లు

లేపాక్షి బస్టాండ్ వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రభుత్వాలు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ వేలాది రూపాయలు వెచ్చిస్తున్నాయి. మండల కేంద్రాలు, ప్రధాన కూడళ్లలో శౌచాలయాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలకు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పనుల మీద వచ్చే వారు కొందరైతే.. ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కనీసం మూత్ర విసర్జనకు అవకాశం లేక తిరిగి ఇంటికెళ్లే వరకు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

✦ మండల కేంద్రమైన లేపాక్షి బస్టాండులో శౌచాలయం లేక వివిధ పనులు కోసం కార్యాలయాలకు వచ్చే వారు అసౌకర్యానికి గురవుతున్నారు. కంచిసముద్రం, మైదుగోళం, బయన్నపల్లి, మమిడిమాకులపల్లి, బసవన్నపల్లి, తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు అధికంగా రాకపోకలు సాగిస్తున్నారు. లేపాక్షి పర్యాటక కేంద్రం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయ సందర్శనకు ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. ఇక్కడ శౌచాలయం లేక అనారోగ్య సమస్యలున్న వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఇప్పటికైనా కనీసం మరుగుదొడ్లయినా నిర్మించాలని కోరుతున్నారు.

చిలమత్తూరులోనూ అంతే..

హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిలోని కొడికొండ చెక్‌పోస్టులోనూ ఇదే సమస్య ఉంది. నిత్యం ఇక్కడికి చుట్టుపక్కల వారితో పాటూ ఇతర జిల్లాల వారు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. మరుగుదొడ్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రమైన చిలమత్తూరు, పరిగి, సోమందేపల్లిలో సైతం మరుగుదొడ్ల సౌకర్యం లేదు.

శౌచాలయాలు ఏర్పాటు చేయాలి

ప్రముఖ పర్యాటక కేంద్రం, మండల కేంద్రమైన లేపాక్షిలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మహిళలు, వృద్ధుల కష్టం చూడలేకున్నాం. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మండల కేంద్రాల్లో మరుగుదొడ్లు నిర్మించాలి. - శంకరాచారి, చోళసముద్రం, లేపాక్షి

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: కె.బసవనపల్లిలోని కురుబ వీధిలో ట్యాంకు వద్ద అపరిశుభ్రంగా ఉంది. నీరు పట్టుకోలేని పరిస్థితి ఉంది. -నారాయణప్ప
సమాధానం: రెండురోజుల్లో శుభ్రం చేయిస్తాం. - శివకుమార్, డిప్యూటీ ఎంపీడీవో.

సమస్య: ముతుకూరు తండాలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం. -జయరామ్‌నాయక్
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. -అమరీశ్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: మద్దనకుంటలో రక్షిత నీటి పథకం మోటారు, పంప్‌సెట్ చెడిపోయి నాలుగు రోజులుగా తాగునీటికి ఇబ్బందిగా ఉంది. -భాగ్యమ్మ
సమాధానం: వెంటనే మరమ్మతు చేయించి తాగునీటి సమస్య పరిష్కరిస్తాం. -అమరీశ్, కార్యదర్శి

–హిందూపురం గ్రామీణం, గుడిబండ

నదుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

పరిగిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హసీనాసుల్తానా, చిత్రంలో ఎంపీడీవో, ఎస్సై

పరిగి, న్యూస్‌టుడే: పరిగి మండలంలోని పెన్నా, జయమంగళి నదుల నుంచి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ హసీనాసుల్తానా ట్రాక్టరు, టిప్పరు, పొక్లెయిన్ యజమానులు, డ్రైవర్లను హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక అవసరాల కోసం నదుల నుంచి ఇసుక తరలించేందుకు అనుమతులు ఉన్నాయన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా బయటి ప్రాంతాలకు ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో రెడ్డప్ప, ఎస్సై రంగడుయాదవ్, ఆర్ఐ సిద్దేశ్వర్, పంచాయతీల కార్యదర్శులు, ట్రాక్టర్ల యజమానులు పాల్గొన్నారు.

కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా

పారిశ్రామివాడలో ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని తూముకుంట పారిశ్రామికవాడ వద్ద కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ ఈ కోడ్‌లను ఇలాగే కొనసాగిస్తే కార్మికుల జీవన ప్రమాణాలు దెబ్బతింటాయన్నారు. భవిష్యత్తులో మనుగడ ఉండదు. గతంలో త్యాగం చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, హరీష్‌రెడ్డి, రామాంజినేయులు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజమే ధ్యేయం

హిందూపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లునాయక్

హిందూపురం: హెచ్‌ఐవీ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి వెంకటేశ్వర్లునాయక్ అన్నారు. సోమవారం ప్రపంచ హెచ్ఐవీ నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించిన న్యాయమూర్తి జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదు అయితే దీనిబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు ఈ వ్యాధి సంక్రమిస్తోందని అందువలన దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో కల్లుమర్రి విద్యార్థుల సత్తా

విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రెడ్డి, పీఈటీ టి.ప్రకాశ్‌రెడ్డి

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కల్లుమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 10వ తరగతి విద్యార్థి సి.మను గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ అండర్-17 విభాగంలో 105 కేజీల బరువు ఎత్తి అత్యున్నత ప్రతిభ కనబరిచాడు. 7వ తరగతి చదువుతున్న ఎన్.సునంద చిత్తూరు జిల్లా మదనపల్లెలో జరిగిన బాలికల ఫుట్‌బాల్ అండర్-14లో రాణించి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. 9వ తరగతి చదువుతున్న జి.సంతోష్ కర్నూల్ జిల్లా అహోబిలంలో జరిగిన అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచాడు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు.

పీఎంఏవై దరఖాస్తు గడువు పొడగింపు

మడకశిర గ్రామీణం: ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం కింద గృహ నిర్మాణం కోసం ఈనెల 14వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సచివాలయాల్లో ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి ఇంటి నిర్మాణం కోసం సేకరించిన స్థలంలో జియోట్యాగింగ్ చేయించుకోవాలన్నారు. 2014 నుంచి 2019 వరకు మంజూరు చేసిన ఇళ్లకు కూడా జియోట్యాగింగ్ చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పఠనం

భగవద్గీతను పఠిస్తున్న మహిళా భక్తులు

హిందూపురం సాంస్కృతికం: సర్వ సమస్యల పరిష్కారానికి భగద్గీత పఠనమే ఏకైక మార్గమని హరేకృష్ణ మూవ్మెంట్ అధ్యక్షుడు భక్తబృందదాస్ పేర్కొన్నారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వాల్మీకికల్యాణమండపంలో సోమవారం రాత్రి 'పురం' హరేకృష్ణ ఆధ్వర్యంలో గీతాజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. **పెనుకొండ:** శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భగవద్గీత జయంతి నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేసి, భగవద్గీత గ్రంథాన్ని పూజించారు. పూజల్లో పాల్గొన్న ప్రజలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని నింకపల్లి రోడ్డులోని విద్యారణ్యఅవాస్ విద్యాలయంలో సోమవారం విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్ర, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు విశ్రాంత గురుకుల ప్రిన్సిపాల్ ప్రసాద్ రూ.7వేలు, భాజపా నాయకుడు కేవీ చలపతి పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు, శివసాయి శిల్క్ రంగనాథ్ రూ. 7వేలు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సభ్యులు దేవాంగం శంకరప్ప, కరెరమేశ్, జయప్రకాశ్, రత్నయ్య, లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడుగురు అక్కమ్మగార్లుకు ప్రత్యేక పూజలు

పెక్కాలచెరువు(చిలమత్తూరు), న్యూస్‌టుడే: పెక్కాలచెరువు సమీపంలో వెలసిన ఏడుగురు అక్కమ్మగార్లుకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పాడి రైతులకు దాణా పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

పశువులతో ఆర్థికాభివృద్ధి సాధ్యం

చిలమత్తూరు, న్యూస్‌టుడే: పశువులతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని కూటమి ప్రభుత్వ నాయకులు పేర్కొన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు సోమవారం రైతులకు పశువుల దాణా పంపిణీని చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి, కూటమి ప్రభుత్వ కన్వీనర్లు శ్రీనివాసులు, చిన్నప్రవీణ్, సాగునీటి సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, చంద్రమోహన్, తెదేపా నాయకులు గౌరీశంకర్, అశ్వర్థప్ప, ముద్దన్న, బాస్కర్, మంజునాథ, రామాంజి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు పూర్తి చేయాలి

చిక్కీలు దుర్వాసన వస్తున్నాయంటూ మంత్రికి ఫిర్యాదు

మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

పెనుకొండ, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో అట్టహాసంగా ప్రారంభించిన నాడు-నేడు పనులు అర్ధాంతరంగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు విన్నవించారు. సోమవారం రొద్దం మండలంలోని సానిపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించిన మంత్రికి మధ్యాహ్న భోజనంలో ఇస్తున్న చిక్కీలు దుర్వాసన వస్తున్నాయని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి చిక్కీలు రుచి చూశారు. గత నెలలో ఇచ్చినవి దుర్వాసన వచ్చిన విషయం నిజమేనని, ప్రస్తుతం కొత్తస్టాకు రావడంతో పాతవి పక్కన పెట్టామని ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమైన మంత్రి పాఠశాల సమస్యలపై ఆరాతీశారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు.

యువత వ్యాపార వేత్తలుగా ఎదగాలి

పెనుకొండ: యువత వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్‌కూడలిలో కోనాపురం గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త మూర్తి ఏర్పాటు చేసిన బయోడీ గ్రేడబుల్ కవర్స్ దుకాణాన్ని మంత్రి సవిత ప్రారంభించారు. దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి మంత్రి సవిత రూ.3లక్షలు సొంత నిధులు అందజేసి చేయూతనిచ్చారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ బయోడీగ్రేడబుల్ చేతి సంచుల వల్ల పర్యావరణానికి హాని జరగదన్నారు. యువతలో వ్యాపార నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమిశ్రేణులు పాల్గొన్నారు.

పెనుకొండ: అభివృద్ధి మాటల్లో చెప్పడం కాదని, చేసి చూపించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. సోమవారం పెనుకొండ మడకశిర ప్రధాన రహదారిలో హంద్రీనీవా కాలువ వంతెన వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా కూలీలతో ముచ్చటించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రవాణా సౌకర్యం మెరుగుపర్చడానికే అధిక ప్రాధాన్యం అన్నారు.

ఇసుక ట్రాక్టర్ జప్తు, కేసు నమోదు

అగళి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని హళ్లికెర చెరువు నుంచి సోమవారం సాయంత్రం అక్రమంగా కర్ణాటకకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అగళి పోలీసులు జప్తు చేశారు. ట్రాక్టర్ యాజమని కెంగప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శోభారాణి తెలిపారు. అక్రమంగా కర్ణాటకకు ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్ఐ శ్రీరాములు, బషీర్ పోలీస్ సిబ్బంది శివన్న పాల్గొన్నారు.

తెదేపాలో చేరిందని మహిళపై దాడి

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పందిపర్తికి చెందిన మహిళ వెంకటమ్మ ఇటీవల తెదేపాలో చేరిందనే కక్షతో అదే గ్రామ వైకాపా నాయకుడు చంద్రశేఖర్, శివమ్మ దాడి చేసినట్లు ఎస్సై రమేశ్‌బాబు తెలిపారు. ఐదు రోజుల కిందట జరిగిన ఈ దాడి ఘటనపై మంగళవారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశామన్నారు.

ఎస్టీయూ ఏపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోబ్రేనాయక్ ఎన్నిక

హిందూపురం, న్యూస్‌టుడే: ఎస్టీయూ ఏపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణంలోని ఈసీ బాయ్స్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం. గోబ్రేనాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ఆయన సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఆదివారం కదిరిలో నిర్వహించిన ఎస్టీయూ వార్షిక సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు ఆయన వివరించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

ముగ్గురికి గాయాలు

పరిగి. న్యూస్‌టుడే: మండల పరిధిలోని శిర కొడికొండ జాతీయ రహదారిలో సోమవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాగా మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. పరిగి పోలీస్‌స్టేషన్ ఎస్సై రంగడుయాదవ్ తెలిపిన వివరాల మేరకు.. హిందూపురం నుంచి ద్విచక్ర వాహనంలో యర్రగుంటకు వెళుతున్న చేనేత కార్మికుడు రాజు(25) అనే యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు తలకు బలమైన గాయాలు అయ్యాయి. పరిగి పోలీసులు చికిత్స కోసం 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడు రాజుకు భార్య ఉన్నారు. మరో సంఘటనలో జంగాలపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని కర్ణాటక రాష్ట్రం గంగవరం గ్రామానికి చెందిన వెంకటేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని చికిత్స కోసం హిందూపురం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పెనుకొండ,న్యూస్‌టుడే: మండలంలోని దుద్దేబండ కూడలి వద్ద 44వజాతీయ రహదారిపై సోమవారం రాత్రి ఓ గుర్తుతెలియని వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కియా ఇండస్ట్రియల్ ఏరియా పోలీస్‌స్టేషన్ ఎస్సై రాజేశ్ క్షతగాత్రున్ని పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108వాహనంలో అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రహదారి పై సోమవారం రాత్రి ద్విచక్రవాహనం ఆవును ఢీకుని జిలాన్‌బాషా అనే యువకుడు త్రీవంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

చేతికందే ఎత్తులో ప్రమాదం

అగళి లోని శిరా రోడ్డులో కిష్టప్ప ఫ్లోర్‌మిల్ సమీపంలోని విద్యుత్తు నియంత్రిక వద్ద ఫ్యూజ్ బాక్స్ లేక ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలు, ప్రజలు ఈ మార్గంలో అధికంగా ప్రయాణిస్తుంటారు. అధికారులు ప్రమాదం జరగకముందే స్పందించి కొత్త ఫ్యూజ్ బాక్స్‌ను ఏర్పాటు చేసి, నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అగళి

మూలమలుపులో కంపచెట్లు

కేకేపాళ్యం, ఉప్పార్లపల్లి రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి ఇబ్బందిగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కంపచెట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ మహంతేశ్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి కంపచెట్లు తొలగింపజేస్తామన్నారు. – న్యూస్‌టుడే, గుడిబండ

ఇళ్లలోని మురుగు రోడ్డుపై..

సున్నకల్లరహట్టి గ్రామంలో సీసీ రోడ్డు, కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు రహదారిపై నిలిచి ఇబ్బందిగా మారుతోంది. వర్షాకాలంలో పూర్తిగా బురదమయమై ప్రయాణానికి ఇబ్బందిగా మారుతోంది. ఈ విషయమై ఈవోఆర్డీ ప్రసాద్‌ను వివరణ కోరగా ప్రతిపాదనలు పంపామని నిధులు వచ్చాక పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, అమరాపురం

రహదారికి మోక్షమెన్నడో..!

హిందూపురం పట్టణంలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వెనుక భాగాన ఉన్న రహదారి నుంచి శివాలయం వెళ్లే మట్టి రోడ్డు ఉంది. వర్షానికి రహదారిలో ఉన్న గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారి ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకొంటామన్నారు. – న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలి

నక్కలగుట్ట పంప్‌హౌస్ వద్ద పరిశీలిస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి తదితరులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: హంద్రీనీవా కాలువలో వెయ్యి క్యూసెక్కుల కృష్ణా జలాలు ప్రవహించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి, రైతాంగాన్ని ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వారు సోమందేపల్లి నక్కలగుట్ట వద్దనున్న హంద్రీనీవా పంప్‌హౌస్‌ను, ఆరింటిలో కేవలం రెండు విద్యుత్తు పంపుల ద్వారా తోడి కాలువలోకి పోస్తున్న జలాలను పరిశీలించారు. అక్కడి ఇంజినీర్ వీరబాబుని వారు కలిసి పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. గొల్లపల్లి జలాశయం నుంచి మడకశిర బ్రాంచి కాలువ ద్వారా పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజక వర్గాల్లోని మొత్తం 265 చెరువులను కృష్ణా జలాలతో నింపాల్సి ఉండగా..నెల రోజులు దాటినా కేవలం మూడు చెరువులను నింపడం పట్ల వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేవలం 214 క్యూసెక్కులు మాత్రమే వదిలితే అన్ని చెరువులను ఎప్పుడు నింపుతారో..ప్రభుత్వం సమాధానం చెప్పాలని సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. ఏటా మడకశిర కాలువకు 5 టీఎంసీలు వదలాల్సి ఉన్నా.. ఇప్పటికి 0.85 టీఎంసీలు నీరు 173 కిలోమీటర్లు దూరం ప్రవాహం కొనసాగిందన్నారు. వాస్తవంగా ఈ దూరానికి, 265 చెరువులను నింపడానికి పందిపర్తి, మడకశిర వద్ద జలాశయాల నిర్మాణం చేపట్టాలన్నారు. రైతుకూలీ, పట్టు రైతుల సంఘాల నాయకులు కాశీం, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లే దారి మూసేశారు.. చర్యలు తీసుకోండి

గోరంట్ల, న్యూస్‌టుడే: పొలాలకు వెళ్లడానికి దారిలేక ఇబ్బంది పడుతున్నామని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని మలసముద్రం గ్రామస్థులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతి అందజేశారు. గ్రామం నుంచి బయనకుంటపల్లి, గౌనివారిపల్లి రెవెన్యూ గ్రామాల్లో ఉన్న పొలాలకు ఎన్నో ఏళ్లుగా రాకపోకలు సాగిస్తున్న దారి ప్రస్తుతం మూసేశారని దీంతో వందలాది మంది రైతులకు సమస్యగా మారిందని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యాయల జూనియర్ సహాయకుడు ప్రదీప్‌కు వినతి అందజేశారు.

12వ పీఆర్సీ కమిటీని నియమించాలని వినతి

పెనుకొండ,న్యూస్‌టుడే: ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీని నియమించి నగరపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవో గిరిధర్‌కు కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబసభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, అర్హులైన వారికి ఇల్లు, ఇంటిస్థలం మంజూరుచేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బాబావలీ, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు హరి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి

ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీసీ నాగమద్దయ్య

మడకశిర, న్యూస్‌టుడే : కర్ణాటక సరిహద్దులో ఉన్న గ్రామాల్లో అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కల్లు దుకాణాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించి కల్లును ల్యాబ్‌కు పంపించాలన్నారు. కల్తీ కల్లు విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో గొలుసు దుకాణాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ మురళీకిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

(c) eenadu

కొండగట్టుపల్లిలో నేడు ఉచిత వైద్యశిబిరం

ముదిగుబ్బ, ధర్మవరం, న్యూస్‌టుడే: ముదిగుబ్బ మండలం కొండగట్టుపల్లిలో మంగళవారం మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనుంది. క్యాన్సర్, గుండె, రక్తపోటు, మధుమేహం, కీళ్లు, ఎముకల నొప్పులు, కిడ్నీ, గ్యాస్ట్రో, న్యూరోసర్జరీ, ఈఎన్‌టీ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు హాజరవుతారని, గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ తెలిపారు. ధర్మవరం గ్రామీణ మండలం నేలకోట గ్రామంలోని ఆయుష్ ఆరోగ్య మందిరంలో 9న వైద్య శిబిరం ఉంటుందని ఆయన వెల్లడించారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

కరాటే పోటీల్లో సత్తా

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థులు సత్తాచాటారని మాస్టర్ అక్బర్‌అలీ తెలిపారు. కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్‌లో ఆదివారం జరిగిన కటాస్ విభాగంలో 11మంది విద్యార్థులు పోటీపడ్డారన్నారు. అసద్, హానిక రాయల్, భవ్యశ్రీ, లక్ష్మీప్రసన్న ప్రథమ, ప్రేక్షిత్, దనశ్రీ, జశ్వంత్, జతిన్ కౌశిక్ రాయల్ ద్వితీయ, హిమానిక తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. –న్యూస్‌టుడే, కదిరి

మేమున్నాం.. మీకు తోడుగా
పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: మండలంలోని ఎలకుంట్లలో గత వైకాపా ప్రభుత్వంలో సచివాలయ భవనాన్ని నిర్మించడానికి పునాదులు తీసి వదిలిపెట్టారు. సచివాలయ పునాది పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. - **రామాంజినేయులు, స్థానికుడు.**

సమాధానం: ప్రభుత్వం ఆదేశానుసారం నిర్మాణ పనులు చేపడతాం. రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి

సమస్య: మండలంలోని తగరకుంటలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. - **నారాయణస్వామి, స్థానికుడు.**

సమాధానం: ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చెత్త సంపద కేంద్రంలో వేసేలా చర్యలు తీసుకుంటాం. - **మనోహర్, పంచాయతీ కార్యదర్శి, తగరకుంట**

- న్యూస్‌టుడే, కనగానపల్లి

ప్రమాదకరంగా రైల్వే కింది వంతెనలు

- 15 అడుగుల మేర నీళ్లు
- గేదెలు, ఎద్దులు మృతి

ముదిగుబ్బ, ధర్మవరం, న్యూస్‌టుడే: రైల్వే కింది వంతెనల కింద వర్షపు నీరు 15 అడుగుల మేర నిల్వ ఉండటంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. రైతులు పంటపొలాలకు వెళ్లాలన్నా, ఉత్పత్తులు తెచ్చుకోవాలన్నా అవస్థలు తప్పడం లేదు. ఈ పరిస్థితి ధర్మవరం మండలం తుమ్మల గ్రామంలోని కింది వంతెన కనిపిస్తుంది. గ్రామస్థులు రైతులు పాడి ఆవులు, గేదెలను పొలాలకు తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. ఇటీవల ఓ గేదె ఈదలేక మృతి చెందింది. గతంలోనూ రెండు కాడెద్దులు చనిపోయాయి. వంతెనల కింద డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో రైతులు, స్థానికులకు శాపంగా మారింది.

రాకపోకలకు నిత్యం కష్టాలే..

రైల్వే కింది వంతెనలకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని ప్రాంతాల్లో వర్షాకాలంలో ఏటా రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ధర్మవరం, ముదిగుబ్బ, కదిరి, నల్లచెరువు, తనకల్లు మండలాల్లో 35 రైల్వే వంతెనలున్నాయి. వీటిలో తుమ్మల, వరదాపురం, నల్లబోయినపల్లి, రాళ్లఅనంతపురం, ఎం.కొట్టాలలో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. ధర్మవరం నుంచి కొత్తచెరువు, ప్రశాంతినిలయం, పెనుకొండ వెళ్లే మార్గాల్లో 12 అండర్ బ్రిడ్జిలు ఉన్నాయి. బీ.పేపల్లి, కొత్తచెరువు దగ్గర నీరు నిలబడుతున్నాయి. ప్రస్తుతం కొత్తచెరువు దగ్గర డ్రైనేజీ పనులు చేస్తున్నారు. పెనుకొండ నుంచి ధర్మవరం, అనంతపురం మధ్యలో 16 ఉండగా, బండిదమ్మకాలని, వసంతపురం దగ్గర నీరు నిల్వ ఉంటోంది.



నీళ్లలో వెళుతున్న గేదెలు

ఊటనీటితోనూ ఇబ్బందులు..

అండర్‌బ్రిడ్జి కింద చేరే నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లేందుకు తప్పనిసరిగా పటిష్ఠ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఐదుకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో చాలా చోట్ల ఇబ్బందిగా మారింది. తాత్కాలిక మోటర్లతో నీటిని బయటకు పంపింగ్ చేస్తున్నా, ఊట నీరు వచ్చి చేరుతుండడంతో పరిస్థితి మొదటికొస్తోంది. దీనికితోడు వర్షాలు కురిసినప్పుడు ఎగువ నుంచి వర్షపు ప్రాంతాల్లో ఉన్న వంతెనల కింద నీరు చేరుతోంది. జనసమ్మర్ధ జరుగుతుండటం రైల్వే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు, వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

హామీలు ఇచ్చాం.. నెరవేరుస్తున్నాం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చామని వాటిని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని దామాజిపల్లిలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. గ్రామంలోని పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. దారిలో స్థానికులతో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని ఆరాతీశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేరుగా పేదవారి ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్న వైనం ఈ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ఎంతో ఉపయోగమన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రెండు విడతలు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పంపిణీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామన్నారు. త్వరలోనే ఇంటి పట్టాలు, పక్కా ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. పలువురు గ్రామస్థులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో బాలకృష్ణుడు, తెదేపా మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఓబుళేసు, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కమిటీని సోమవారం ఎనుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం కమిటీ ఎన్నిక నిర్వహించారు. కమిటీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సురేష్, అమర్‌నాథ్ రెడ్డిని, గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, పలువురు సభ్యులను ఎన్నుకున్నామన్నారు.

ఇన్‌ఛార్జి తహసీల్దారు నియామకం

నల్లచెరువు, న్యూస్‌టుడే: నల్లచెరువు మండల ఇన్‌ఛార్జి తహసీల్దారుగా రవికుమార్ నాయక్ నియమితులయ్యారు. గతంలో తహసీల్దారుగా పనిచేసిన జమానుల్లాఖాన్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇక్కడే డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత

నల్లచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని తవలంమర్రి, ఉబిచెర్ల, నల్లచెరువు జడ్పీ ఉన్నత, కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రి, మాదిరి ప్రశ్నపత్రాల పుస్తకాలను ఎంఈవోలు తిరుపాల్ నాయక్, చెన్నకేశవులు సోమవారం అందజేశారు. వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయులు తయారు చేసిన మాదిరి ప్రశ్నపత్రాల పుస్తకాలు బాగా చదివితే మంచి మార్కులు వస్తాయన్నారు.

పలువురు కానిస్టేబుళ్ల బదిలీ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో ఎనిమిదిమంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం సాధారణ బదిలీలు చేశామని, వారంతా తక్షణం ఆయా స్థానాల్లో విధుల్లో చేరాలని ఎస్పీ ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు.

ఆక్రమణల తొలగింపునకు విజ్ఞప్తి

ముదిగుబ్బ: ముదిగుబ్బలో 24 ఏళ్లుగా ఆటోలు నిలిపే స్థలాన్ని ఆక్రమించారంటూ ఏపీ ట్రాలీ సంఘం సభ్యులు సోమవారం తహసీల్దారు నారాయణస్వామికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దారు ఆక్రమణలు తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శి, పోలీసులను ఆదేశించినట్లు సభ్యులు తెలిపారు.

ఉపన్యసించారు..ప్రతిభచాటారు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్పీఎస్ పురపాలక బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. చక్కగా మాట్లాడిన విద్యార్థులు ఎన్.లీలాకృష్ణ జి.చరణ్‌కుమార్ కేవీ నందకిశోర్‌రెడ్డి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయిని పద్మావతి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ఆదినారాయణ, సాల్‌దేవి, సుధారాణి బాబు కృష్ణ, అన్వేష్‌బాబు పాల్గొన్నారు.

కదిరి, న్యూస్‌టుడే: కదిరిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 'కృత్రిమ మేధతో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు జరిగాయి. ద్వితీయ ఇంటర్ విద్యార్థినులు చక్కగా ఉపన్యసించారు. పి.భార్గవి అఫ్షా, గౌసియా వరుసగా మొదటి స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ వెంకటేశ్వర ప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు నీలోఫర్, కవిత, కేవీఎస్ ప్రసాద్, మునిమోహన్, ముషర్త్ జహ, రాజేంద్ర ప్రసాద్, మురళి విద్యార్థులను అభినందించారు.

ధర్మవరం: విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయిని పద్మావతి

కదిరి: విద్యార్థులతో ప్రిన్సిపల్ వెంకటేశ్‌ప్రసాద్, అధ్యాపకులు

నాయకత్వ లక్షణాలు అవసరం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలంటే ఎన్ఎస్ఎస్‌లో చేరాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సురేష్‌బాబు తెలిపారు. పోతుకుంటలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఆర్డీటీ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఆయన ఉద్దేశించి మాట్లాడారు. సర్పంచి నాగవేణి, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి మల్లికార్జున, ప్రభుత్వ వైద్యుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులు అవాస్తవం: యార్డు వైస్‌ఛైర్మన్

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: కదిరిలోని ఓ భూ వ్యవహారంలో తాను వీఆర్వోను బెదిరించినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని కొత్తచెరువు మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్ ప్రేమనాథరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి తనపై తప్పుడు కేసులు పెట్టారని, విచారణ జరిపి తగు న్యాయం చేయాలని కోరారు.

సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని గోవిందరాజులపల్లిలో పలు ప్రారంభోత్సవాలు చేశారు. తొలుత పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి నరసింహులు, ఎంపీడీవో పార్థసారథి, తహసీల్దార్ దేవేంద్రనాయక్‌తో కలిసి సీఎస్ఆర్ నిధులు రూ.5లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. అనంతరం ఉపాధి నిధులు రూ.5లక్షలతో ధనియానిచెరువులో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పలు అభివృద్ధి పనులతో పాటు, సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రజలకు శుద్ధ జలాన్ని అందించాలనే ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరాజులపల్లి గ్రామస్థులు ఇళ్ల పట్టాల గురించి అడగ్గా, తహసీల్దార్‌ను పిలిచి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో ఏఎ లోకేశ్వర రెడ్డి, ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, వైద్యాధికారి ఆనందవర్ధన్, సీడీపీఓ రాధిక, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బిందు, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు నరసమ్మ, కూటమి నాయకులు దండేరవి, మౌలాసాబ్, హరి, హనుమంతురెడ్డి, రెడ్డెప్ప, షమీవుల్లా, అంజనప్పనాయుడు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట తదితరులు

మధ్యాహ్న భోజన షెడ్‌కు వితరణ

మండలంలోని కటారుపల్లి మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన షెడ్ ఏర్పాటుకు రూ.లక్ష విలువైన చెక్‌ను యోగివేమన ఆలయ నిర్వహణ సభ్యుడు, దాత తుంగ నందవేమారెడ్డి ప్రధానోపాధ్యాయుడు సురేష్ బాబుకు అందజేశారు. శిథిలావస్థకు చేరిన గదిని తొలగించి అక్కడ షెడ్ ఏర్పాటుకు అవసరమైన రేకులు, గ్రిల్‌కు ఈ మొత్తాన్ని ఉపయోగించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. అనంతరం దాతను ఉపాధ్యాయులు సత్కరించారు.
–న్యూస్‌టుడే, గాండ్లపెంట

నిర్మించారు.. పట్టించుకోరు

మండలంలోని కొడవండ్లపల్లి దగ్గర గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతు సేవా కేంద్రం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. రూ.21 లక్షలతో నిర్మించిన ఈ భవనం 90 శాతం పూర్తవగా, చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు భవనం చుట్టూ కంపచెట్లు పెరిగాయి. వినియోగంలో లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మెట్ల దగ్గర టైల్స్ ఊడిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ముదిగుబ్బ

మాజీ ఎంపీపీపై కేసు నమోదు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం మండలం రేగాటిపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు, మాజీ ఎంపీపీ గుర్రప్ప, అతడి కుమారుడు మల్లేష్‌పై గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిపై ముచ్చురామి గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు రామ్మోహన్ రెడ్డి ఫిర్యాదు చేశారు. తమ సాగులోని భూమిలో గుర్రప్ప, అతడి కొడుకు ప్రవేశించి ట్రాక్టర్‌తో దుక్కులు చేశారని, మామిడి చెట్లు నరికేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా బెయిల్ మంజూరు చేసింది.

దోషులను కఠినంగా శిక్షించాలి

కొత్తచెరువు, న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణ మండలంలో సీపీఎం నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలంటూ ప్రజా సంఘాలు సోమవారం నిరసన చేపట్టాయి. సీపీఎం నాయకులు ముత్యాలు, అంజి, షబానా ఆధ్వర్యంలో ఆందోళనకారులు రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గంజాయి మాఫియా అరాచకాలకు ఆయన బలయ్యారని, దోషులను శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ధర్మవరం పట్టణం: సీపీఎం నాయకుడు పెంచలయ్యను చంపిన దోషులను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు నిరసన తెలిపి మాట్లాడారు. గంజాయిని అరికట్టాల్సిన ప్రభుత్వం, పోలీసులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు.

తనకల్లు, న్యూస్‌టుడే: తనకల్లులో సీపీఎం నాయకులు అంబేడ్కర్ కూడలిలో నిరసన చేపట్టారు. గంజాయి మాఫియాను ఎదిరించిన తమ నేత పెంచలయ్యను దారుణంగా చంపిన దోషులను శిక్షించాలని నినాదాలు చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండు చేశారు. ధర్నాలో సీపీఎం నాయకుడు శివన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రమణ, వేమన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం పట్టణం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాల అమలు తెదేపాకే సాధ్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఆయన సోమవారం గోవిందరాజులపల్లిలో పర్యటించి ఎన్టీఆర్ భరోసా కింద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసి మాట్లాడారు. ప్రతి నెలా అందజేస్తున్న రూ.4వేలు పేదలకు భరోసాగా నిలుస్తోందన్నారు. రాబోయే రోజుల్లో అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సుధాకర్, రాఘవ, ప్రసాద్‌నాయుడు, విజయ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు, న్యూస్‌టుడే: సామాజిక భద్రతా పింఛన్లను అర్హులందరికీ అందజేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన బైరాపురం పంచాయతీలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచి రవి కుమార్, సహకార సంఘం అధ్యక్షుడు శంకరప్ప, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తహసీల్దార్ బాలాంజినేయులు, ఎంపీడీవో నటరాజ్‌తో కలిసి అనారోగ్యంతో మంచానికే పరిమితమైన లబ్ధిదారులు గంగన్న, వెంకటరాముడు, లింగారెడ్డి ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛను సొమ్ము అందజేశారు. అనంతరం చౌకధరల దుకాణంలో తెల్లరేషన్ కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోడ్డు దుస్థితిని ప్రజలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన రోడ్డు మరమ్మతులకు రూ.2కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంచనాలు రూపొందించి పంపాలని మండల అధికారులను ఆదేశించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

అమడగూరు: వృద్ధురాలికి నగదు అందిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

అమడగూరు (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్, కస్సముద్రం, అమడగూరు, చినగానిపల్లి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పర్యటించి లబ్ధిదారులకు పింఛన్ల మొత్తం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులు కుటుంబాలకు భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం వారికి పింఛన్లు అందజేసి అండగా నిలుస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి, న్యూస్‌టుడే: పట్టణ పురపాలిక ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీసా కమిషనర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లతో కలిసి పలు వార్డుల్లో లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తోందని గుర్తుచేశారు.



నంబులపూలకుంట: దివ్యాంగుడికి డబ్బులు ఇస్తున్న ఎమ్మెల్యే కందికుంట తదితరులు

ధర్మవరం: పెన్షన్ సొమ్ము అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

అవకతవకలపై చర్యలు తీసుకోరూ...

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల యానిమేటర్‌గా గతంలో పనిచేసిన రహమత్‌బీ అవకతవకలకు పాల్పడ్డారని, ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ కుమ్మరవాండ్లపల్లికి చెందిన మహిళలు ఆర్డీఓ వీవీఎస్ శర్మకు ఫిర్యాదు చేశారు. రహమత్‌బీ తన బంధువులు, కుటుంబ సభ్యులకు మేలు చేకూరేలా తీర్మానాలు చేయించి, ఒకే సమయంలో పలు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని మోసగించారన్నారు.

పక్కాగృహాల మంజూరుకు..

కదిరి పట్టణం: కదిరి-హిందూపురం రోడ్డులోని సర్వే నంబరు 1775లో పట్టాలిచ్చిన పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. వారు లబ్ధిదారులతో కలిసి ఈమేరకు ఆర్డీఓ వీవీఎస్‌శర్మకు వినతి పత్రం అందజేశారు. ఇంటి పట్టాలు మంజూరు చేసి పదేళ్లవుతోందని, నీటివసతి, రోడ్లు లేకపోవడంతో ఇళ్లు కట్టుకోలేక పోతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప ఆయన దృష్టికి తెచ్చారు.

రోడ్డు విస్తరణ సాగేనా..!

భూమిపూజతో మమ అనిపించారు

అంచనాలు రూపొందించాలని ఆదేశం

ధర్మవరం మార్గంలో అడ్డుగా ఉన్న విద్యుత్తు స్తంభాలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మేజర్ పంచాయతీలో ఆక్రమణలు తొలగించి చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు ముందుకు సాగుతాయని స్థానికులు ఎదురుచూస్తున్నారు. ధర్మవరం మార్గంలో అక్టోబరు నెల మొదట్లో రోడ్డు విస్తరణ పనులకు భూమిపూజ చేశారు. రోడ్డుకిరువైపులా రెండు దశాబ్దాల క్రితం సత్యసాయి తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తారురోడ్డు నిర్మాణానికి మట్టి పనులు ప్రారంభించారు. నాలుగడుగుల మేర మట్టి తవ్వడంతో పైపులు బయటపడ్డాయి. సమాచారం ఇవ్వకుండా పనులు చేపట్టడంపై సత్యసాయి తాగునీటి పథకం ప్రాజెక్టు అధికారులు అభ్యంతరం తెలిపారు. విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఇతర శాఖల అధికారులతో సమన్వయం లేకుండా విస్తరణ ఎలా చేపడతారని ప్రశ్నించారు.

మేజరు పంచాయతీలో రోడ్డుకిరువైపులా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. గోరంట్ల, పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల్లోని 140 గ్రామాలకు తాగునీరు అందించే సత్యసాయి ప్రాజెక్టు పైపులు, విద్యుత్తు స్తంభాలు, రోడ్లపై ఉన్న విగ్రహాలను పూర్తిగా మార్చి రోడ్డు విస్తరణ చేయాల్సి ఉంటుంది. సత్యసాయి జయంతి తర్వాత పనులు చేయాలని కలెక్టరు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలు వేర్వేరుగా పనులపై అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ధర్మవరం, పుట్టపర్తి రోడ్లలో ఓవైపు తవ్విన ట్రెంచ్‌ను పూడ్చి జయంత్యుత్సవాలకు కూడలిలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చదును చేయాలన్నారు. వారం క్రితం జయంత్యుత్సవాలు పూర్తయ్యాయి. కూడలిలో ట్రాఫిక్ కారణంగా రోడ్లపై దుమ్ము లేస్తుండడంతో స్థానికులు, వాహనచోదకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అధికారులు స్పందించి విస్తరణ పనులు వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ మైనింగ్‌ను అడ్డుకోండి

నల్లమాడ (పుట్టపర్తి పట్టణం): నల్లమాడలో కొత్తగా నిర్మించిన మార్కెట్‌యార్డు వద్ద జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలని యార్డు ఛైర్మన్ పూల శివప్రసాద్ జిల్లా ఖనిజ కార్యాలయ అధికారులను కోరారు. ఆయన సోమవారం జనసేన నాయకులతో కలిసి మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. అనుమతిని మించి పదిరెట్లు అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నించిన తమపై ఎదురు తిరిగారన్నారు. దీనిపై తగు విచారణ జరిపి నిజానిజాలు బయటకు తీయాలని మైనింగ్ అధికారులను కోరినట్లు చెప్పారు. ఆయన వెంట జనసేన నల్లమాడ, ఓడీసీ మండలాల కన్వీనర్లు మహేష్, ఈశ్వర్, నాయకులు రాము, కరుణాకర్, ప్రభాకర్, మల్లికార్జున తదితరులున్నారు.

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యం

అమడగూరు (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పంచసూత్రాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అన్నారు. అమడగూరు మండలం చినగానిపల్లిలో సోమవారం జరిగిన 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమంలో భాగంగా ఆమె అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి పొందుతున్న రైతుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేసి మాట్లాడారు. సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలని, కొత్త పంటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునెప్ప, ఏవో రమణాచారి, వెలుగు ఎంపీఎం భాగ్యమ్మ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లో సోమవారం ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాడవాడలా అవగాన ర్యాలీలు నిర్వహించారు. పుట్టపర్తిలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ కృషి చేయాలన్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, ఆసుపత్రుల సిబ్బంది, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. –న్యూస్‌టుడే బృందం

కదిరి: ప్రదర్శనగా వస్తున్న జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

పుట్టపర్తి: పచ్చజెండా ఊపుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

ధర్మవరం: ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

(c) eenadu

చినుకు.. వణుకు పుట్టిస్తోంది..!

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే నరసన్నపేట

దిత్వా తుపాను జిల్లాపైనా ప్రభావం చూపుతోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పలు ప్రాంతాల్లో తేలికపాటి చినుకులు పడ్డాయి. దీంతో అన్నదాతల గుండెల్లో గుబులు మొదలైంది.. పంట చేతికొచ్చి కొనుగోలు కేంద్రాలకు తరలించే వేళ తుపాను తీవ్రతపై ఆందోళన చెందుతున్నారు. మరోవైపు బస్తాలకు ఎత్తి రైతు సేవా కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకెళ్తే సర్వర్లు పని చేయని దుస్థితి. చేసేది లేక రెక్కల కష్టమంతా పరదాలు, గడ్డి కప్పి ఎక్కడికక్కడ రోడ్లపైనే ఉంచారు.

- పంటంతా కల్లాల్లో
- జోరందుకోని కొనుగోలు ప్రక్రియ

తామరాపల్లి వద్ద జాతీయ రహదారిపై తడిసిన ధాన్యం

అత్యధికంగా నరసన్నపేటలో

జిల్లాలో 22 మండలాలపై తుపాను తీవ్రత కనిపించింది. అత్యధికంగా నరసన్నపేటలో 11.8 మి.మీ., రణస్థలంలో 11.2, శ్రీకాకుళంలో 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గార, పోలాకి, ఎచ్చెర్ల, జలుమూరు, లావేరు, సంతబొమ్మాళి, సరుబుజ్జిలి, సారవకోట, బూర్జ, ఎల్ఎన్‌పేట, పాతపట్నం, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, పలాస, జి.సిగడాం, హిరమండలం, టెక్కలి, ఆమదాలవలస, కొత్తూరులో వర్షం పడింది.

కల్లాల్లోనే 4.50 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనేది అధికారుల లక్ష్యం. నేటికి 34,379 మెట్రిక్ టన్నులే సేకరించారు. సుమారు 4.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కల్లాల్లోనే ఉన్నట్లు అంచనా. జిల్లాలో 406 రైతు సేవా కేంద్రాలు ఉండగా, 303 ప్రారంభమయ్యాయి. అయినా ఆయా చోట్ల సర్వర్లు మొరాయించాయి. ఫలితంగా కొనుగోలు ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది.

అప్రమత్తంగా ఉండాలి..: తుపాను ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడా కురుస్తున్న వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలి. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే 4వేల వరకు పరదాలు ఆర్ఎస్‌కేలు, తహసీల్దారు కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిని రైతులు ఉచితంగా పొందవచ్చు.

- స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టరు

జిల్లాలో కొనుగోలు లక్ష్యం: 6.50 లక్షల మెట్రిక్ టన్నులు
షెడ్యూల్ జారీ: 49,108 మెట్రిక్ టన్నులు
ట్రక్‌షీట్లు ఇచ్చింది: 30,032
ఇప్పటి వరకు కొన్నది: 34,379

వచ్చే ఏడాది కొత్త పింఛన్లు

వచ్చే ఏడాది జనవరి నుంచి కొత్త పింఛన్లు అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండలం కొల్లిపాడులో 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా సోమవారం పింఛన్ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. 18 నెలల్లో రూ.51 వేల కోట్లు లబ్ధిదారులకు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వృద్ధుడికి పింఛను నగదు అందిస్తున్న మంత్రిని చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

గుండెలాంటి కొండ.. చేశారు కనిపించకుండా..!

జిల్లాలో అనుమతులు లేకుండా కొండలు పిండి చేస్తున్నారనేందుకు ఈ చిత్రమే నిదర్శనం.. పొందూరు మండలం రాపాక పంచాయతీ ఇల్లయ్యగారిపేట గ్రామం సర్వే నంబరు 244లో దశాబ్దాల కిందట కొండ ఉండేది. వైకాపా హయాంలో తవ్వకాలు ప్రారంభించారు. కూటమి లోనూ దందా కొనసాగించడంతో పూర్తిగా మాయమైంది. 100 నుంచి 200 మీటర్లు భూమి లోపలకి తవ్వకాలు చేపట్టారు. అధికారులకు తెలిసినప్పటికీ చర్యలు లేవు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వివరణ కోరగా సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామన్నారు.

– ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

సంగ్యాన్.. ఉర్రూతలూగించెన్

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సోమవారం సంగ్యాన్-25 పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య విద్యను పూర్తిచేసి బయటకు వెళ్తున్న విద్యార్థులు ఉత్తమ సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు కట్టిపడేశాయి. రెండేళ్లకోసారి జరిగే ఈ ఫెస్ట్‌లో పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎస్. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

ఆకట్టుకున్న వైద్య విద్యార్థినుల నృత్య ప్రదర్శన

91.50 శాతం పంపిణీ

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం 91.50 శాతం మేర ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. 3,10,099 మందికి మంజూరు కాగా 2,83,748 మందికి అందజేసినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. గార మండలంలో అత్యధికంగా 93.38, పాతపట్నంలో అత్యల్పంగా 88.14 శాతం పంపిణీ జరిగిందని వివరించారు.

ఆందోళన వద్దు.. అవగాహనే మందు

జిల్లా వ్యాప్తంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఐవీపై ఆందోళన చెందొద్దు..అవగాహనే మందు అని పిలుపునిచ్చారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ బంగ్లా, ఏడు రోడ్ల కూడలి వద్ద అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఇందులో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఎంహెచ్‌వో కె.అనిత, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సీనియర్ సివిల్ జడ్జి కె.హరిబాబు, సహాయ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో సాయిప్రత్యూష, ఏడీఎంహెచ్‌వో తాడేల శ్రీకాంత్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

రైతేరాజు 6లో

కాసుల కక్కుర్తి.. కల్తీ వక్రబుద్ధి..!

మద్యం దుకాణాల్లో మోసాలు

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

మందుబాబులు తాగే మద్యం నాణ్యమైందో, కాదో తెలియని పరిస్థితి జిల్లాలో నెలకొంది.. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా అక్రమార్కులు నకి'లీలలు' సాగిస్తూనే ఉన్నారు. ఇందుకు ఉదాహరణ జిల్లాలో వెలుగులోకి వస్తున్న ఉదంతాలే.. తక్కువ ధర కలిగిన మద్యాన్ని ఎక్కువ ధర సీసాల్లో నింపుతున్నారు. అందులో నీళ్లు కలిపేస్తున్నారు. ఇవన్నీ గొలుసు దుకాణాల్లో జరుగుతున్నాయంటే సరే అనుకోవచ్చు. ఏకంగా ప్రభుత్వం అనుమతి ఇచ్చినచోటే యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు.

- దుకాణాల్లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలోనే కల్తీలకు పాల్పడుతున్నట్లుగా అధికారులు గుర్తించారు.

రద్దీని ఆసరాగా చేసుకుని..

- అధిక ధరలు కలిగిన పింట్, క్వార్టర్ సీసాల నుంచి సగటున 30-40 ఎంఎల్ వరకు తీసి తక్కువ ధర కలిగిన మద్యాన్ని కలుపుతున్నారు.
- తీసిన మద్యాన్ని ఖాళీ సీసాల్లో నింపేసి వాటిలో కొంత నీరు పోస్తున్నారు.
- సీసా నుంచి కనీసం రూ.200-300 వరకు అదనంగా సొమ్ము చేసుకుంటున్నారు.

సెప్టెంబరు 3న సారవకోట మండలం అవలింగిలో ఓ వ్యక్తి ఇంట్లో బ్రాండ్ డూప్లింగ్ చేస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. 211.9 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేశారు.

★ గత నెల 28న సరుబుజ్జిలిలో ఓ దుకాణంలోని సీసాల్లో నీళ్లు కలిపి కల్తీ చేస్తుండగా 10.88 లీటర్ల నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసులు నమోదు చేశారు.

జిల్లాలో ప్రభుత్వం 176 మద్యం దుకాణాలకు లాటరీ ద్వారా అనుమతిచ్చింది. పట్టణాలు, గ్రామాల్లో సైతం వీటిని ఏర్పాటు చేశారు. అధిక ఆదాయం పొందాలనే దుర్బుద్ధితో కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. నకిలీ మద్యాన్ని విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారు.

క్యూఆర్ కోడ్‌నే మైమరపిస్తున్నారు..

కల్తీ మద్యం నివారణకు కూటమి ప్రభుత్వం సీసాలపై క్యూఆర్ కోడ్ విధానం తీసుకొచ్చింది. అక్రమార్కులు దీన్ని సైతం బురిడీ కొట్టిస్తున్నారు. అనుమానం రాకుండా పెద్ద సూదిని ఉపయోగించి మూతలు తీస్తున్నారు. ★ మద్యం సీసాల్లో సాధారణంగా (డిప్) 90ఎంఎల్, (నిప్) 180ఎంఎల్, (పింట్) 375 ఎంఎల్, (క్వార్టర్) 750ఎంఎల్ సీసాలుంటాయి. వీటిలో ఎక్కువగా డిప్ మినహా మిగిలిన మూడు రకాల సీసాల్లో కల్తీ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..: మద్యాన్ని కల్తీ చేస్తే తప్పనిసరిగా కఠిన చర్యలు ఉంటాయి. లైసెన్సు రద్దు చేసి, దుకాణాలు సీజ్ చేస్తాం. విక్రయదారులపైనా చర్యలు ఉంటాయి. ఎవరినీ ఉపేక్షించేది లేదు. ఎక్కడైనా కల్తీ జరిగినట్లుగా గుర్తిస్తే ఫిర్యాదు చేయండి **- పైడి రామచంద్రరావు, అసిస్టెంట్ కమిషనర్, ఎన్‌ఫోర్సుమెంట్, విభాగం శ్రీకాకుళం**

జిల్లాలో మద్యం దుకాణాల వివరాలు

శ్రీకాకుళం	ఆమదాలవలస	రణస్థలం	పొందూరు	నరసన్నపేట	కొత్తూరు	పాతపట్నం	టెక్కలి	కోటబొమ్మాళి	పలాస	సోంపేట	ఇచ్ఛాపురం
34	16	15	10	13	9	9	13	15	16	15	11

దారి కాచిన ప్రమాదం..

మందస మండలం కిల్లోయి నుంచి కుమ్మరకుట్టి వెళ్లే రహదారి దుస్థితి ఇది. బంజరుయువరాజపురం-కొంటాసాయి మధ్య కల్వర్టు కుంగి ప్రమాదకరంగా మారింది. దగ్గరకు వెళ్లేంత వరకు కనిపించకపోవడంతో స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని దాదాపు 20 గ్రామాలకు ఈ దారే ఆధారం. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలే రాకపోకలు సాగిస్తున్నాయి. పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. ఐటీడీఏ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. పరిశీలించి బాగుచేయిస్తామని సీతంపేట ఐటీడీఏ ఈఈ రమాదేవి తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

చదువు.. నైపుణ్యం.. అందుకో ఉన్నత శిఖరం..!

- సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జిల్లాలో 13 ఏపీ ఆదర్శ, 20 కస్తూర్బా, 4 సాంఘికసంక్షేమ గురుకుల, 20 జడ్పీ ఉన్నత, 10 ప్రభుత్వ ఉన్నత, మున్సిపల్ హైస్కూల్ ఒకటి, మహాత్మాగాంధీ జ్యోతిరావు పులే పాఠశాలలు రెండింటిలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణ ఇస్తున్నారు.
- గతంలో కేవలం 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు మాత్రమే శిక్షణ ఇవ్వగా ప్రస్తుతం ఆరో తరగతి నుంచి నేర్పిస్తున్నారు.
- ఎనిమిదో తరగతి వరకు ప్రీ ఒకేషనల్ ట్రైనింగ్ అని, తొమ్మిది నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఒకేషనల్ ట్రైనింగ్ అని పిలుస్తున్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి ధ్రువపత్రం అందిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

నేటి ఆధునిక యుగంలో రాణించాలంటే చదువొక్కటే సరిపోదు. నైపుణ్యం కూడా తోడవ్వాలి. అవే మన విజయాలకు సోపానాలుగా మారుతాయి. కూటమి ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. వారికి ఆసక్తి ఉన్న కోర్సుల్లో తీర్చిదిద్దుతోంది.

70 పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ

ఫేషియల్‌పై శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

శిక్షణ ఇచ్చే అంశాలు: ఆటోమోటివ్, అగ్రికల్చర్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, హెల్త్‌కేర్, రిటైల్, ఐటీఈఎస్, అప్పెరల్ అండ్ మేడప్స్‌కు సంబంధించిన అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

★ 14,388 మంది విద్యార్థులకు అకడమిక్ సబ్జెక్టులతోపాటుగా వివిధ రకాల ఒకేషనల్ ట్రైనింగ్‌లను వారానికి మూడు నుంచి నాలుగు తరగతుల్లో వీటిని ఓ పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. 142 మంది ఒకేషనల్ శిక్షకులను పొరుగు సేవల పద్ధతిలో నియమించారు. సమన్వయం చేసేందుకు ఇద్దరు ఉద్యోగులు ఉంటారు. ఏడాదికి మూడుసార్లు వృత్యంతర శిక్షణ నిర్వహిస్తున్నారు. మూడు నెలలకోసారి ఇండస్ట్రియల్ విజిట్, అతిథి అధ్యాపకులతో అవగాహన కల్పిస్తున్నారు.

★ 'విద్యార్థులు చదువుతోపాటు జీవన నైపుణ్యాలు పెంపొందించే ఒకేషనల్ శిక్షణ మరో పాఠ్యాంశంగా బోధిస్తున్నాం. భవిష్యత్తులో వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అభ్యసనలోనే అనుభవం విధానంలో నేర్పిస్తున్నాం.' సమగ్ర శిక్షా జిల్లా అదనపు సమన్వయ అధికారి పి.వేణుగోపాలరావు తెలిపారు.

జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవోగా డీఆర్‌డీఏ పీడీ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు ఇన్‌ఛార్జి సీఈవోగా సోమవారం డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం సీఈవోగా పని చేస్తున్న డి.సత్యనారాయణ 13 రోజుల పాటు పంచాయతీరాజ్ శాఖ విజయవాడలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి వెళ్లారు. ఆయన స్థానంలో కిరణ్ కుమార్ సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

POLYCAB LT/HT Power & Control Cables
Stockist:
SPARK ENTERPRISES
DABAGARDENS, VISAKHAPATNAM.
CELL: 9963223454, 9849022345
e-mail: spa_ark2004@yahoo.com

క్యూఆర్ కోడ్.. పరీక్ష కేంద్రానికి దారి చూపుతుంది

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పదో తరగతి విద్యార్థులకు మేలు

పదో తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలను సులువుగా గుర్తించి సకాలంలో చేరుకోవడానికి వీలుగా కూటమి ప్రభుత్వం హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్ ముద్రించాలని నిర్ణయించింది. గతంలో మాదిరిగా ఎక్కడున్నాయో వెతుక్కునే ఇబ్బందులుండవు. జాప్యం లేకుండా అక్కడికి చేరుకోవచ్చు.

- విద్యార్థుల హాల్ టికెట్లపై పరీక్ష కేంద్రం లొకేషన్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ ముద్రించనున్నారు. దీన్ని సెల్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే వివరాలు ప్రత్యక్షమవుతాయి.

ఇబ్బందులకు పరిష్కారం

- జంబ్లింగ్ విధానం అమలు చేస్తుండటంతో పరీక్ష రోజున కేంద్రాలకు చేరుకోవడం చాలా మందికి సవాలుగా మారుతోంది. ఎక్కడుందో గుర్తించడానికి తంటాలు పడుతుంటారు.
- మరోవైపు పట్టణాలు, జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటన్నింటినీ గుర్తించిన ప్రభుత్వం సాంకేతికత సాయంతో ఇబ్బందులను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంది.
- వాటిని పరిశీలించి కేంద్రానికి బయలుదేరితే సమయం ఆదా అవుతుందని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

- జిల్లాలో 450 ప్రభుత్వ, 191 ప్రైవేటు పాఠశాలల నుంచి 28,933 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. వీరందరికీ క్యూఆర్ కోడ్‌తో ఏ ఇబ్బంది లేకుండా అందులోని మ్యాప్ ఆధారంగా కేంద్రానికి ఎలా చేరుకోవాలో స్పష్టమవుతుందని.. జాతీయ ప్రతిభా ఉపకారవేతనాలకు (ఎన్ఎంఎంఎస్) సంబంధించి ఎంపిక పరీక్షల హాల్‌టికెట్లపై కూడా క్యూఆర్ కోడ్ ముద్రించనున్నట్లు డిప్యూటీ డీఈవో పి.విలియం తెలిపారు.

చెప్పినా వినరే.. ప్రమాదం కనరే..

ఇచ్ఛాపురం పట్టణంలో శిథిలావస్థలో ఉన్న బాహుదానది పాత వంతెన బలహీనంగా మారడంతో భారీ వాహనాలు రాకపోకలు నిషేధించారు. 2023లో వంతెన కూలింది. తర్వాత తాత్కాలికంగా పునరుద్ధరించారు. ద్విచక్ర, ఆటోలు మాత్రమే వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. ఈ మేరకు అధికారులు ఇరువైపులా బోర్డులు ఏర్పాటు చేసి గోడలు కట్టి తక్కువ ఖాళీ స్థలం ఉంచారు. ఎన్నికల ముందు గత ప్రభుత్వ హయాంలో కొత్త వంతెనకు శంకుస్థాపన చేస్తామని ఇనుప గేట్లు తొలగించారు. గోడలు కొంతమేర కూల్చివేశారు. దీంతో రాత్రిపగలూ తేడాలేకుండా ఇసుక ట్రాక్టర్లు దూసుకొస్తున్నాయి. అధిక బరువుతో దాటుతుండటంతో మళ్లీ కూలే ప్రమాదముందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ జేఈ విక్రమ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

శాశ్వత ఆరాటం.. తాత్కాలిక ఆర్భాటం..!

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

అరకొర వసతులతో రథసప్తమి వేడుకలకు సన్నాహాలు

అరసవల్లిలో సూర్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధిని దేవాదాయ శాఖ విస్మరించింది. సరైన ప్రణాళిక లేకపోవడంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ ప్రతిష్ఠాత్మకమైన రథసప్తమి ఉత్సవాలకు ముందు ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి చేసి ఆ తర్వాత మౌనం పాటిస్తున్నారు. ప్రభుత్వం గతేడాది రథసప్తమిని రాష్ట్ర పండగగా ప్రకటించింది. ఆలయ నిధులతో తాత్కాలిక ఏర్పాట్లు చేసి మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరి 19 నుంచి 25 వరకు ఉత్సవాలు నిర్వహించాలని సంకల్పించినా శాశ్వత ప్రాతిపదికన వసతులు కల్పించే దిశగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవైంది.

తాత్కాలిక షెడ్డులో సిద్ధం చేస్తున్న అన్నప్రసాదం

అటకెక్కిన త్రిసభ్య కమిటీ నివేదిక

- ఈ ప్రక్రియ నిమిత్తం ఆర్డీవో ఆధ్వర్యంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీ సమీక్షించి ఇటీవల కలెక్టర్‌కు నివేదిక అందజేసింది. దీనిపై నిర్ణయం రాకపోవడంతో కదలిక లేదు.
- రూ.4 కోట్లతో ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణకు టెండర్లు పిలిచినా తక్కువ సమయం ఉండటంతో రథసప్తమి నాటికి ఆయా పనులు పూర్తయ్యే అవకాశం లేదు.
- భక్తుల అవసరాలు, ఆలయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూ.12 కోట్లతో పనులు చేపట్టి రథసప్తమి నాటికి పూర్తి చేయాలని నెల కిందట మంత్రి అచ్చెన్నాయుడు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు.
- అవసరమైన స్థలాన్ని ఆలయానికి అనుకుని ఉన్న ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించి, ప్రత్యామ్నాయంగా వారికి మరోచోట ఆలయ భూములివ్వాలని నిర్ణయించారు.
- ప్రైవేటు స్థలాల సేకరణ సాధ్యపడే పరిస్థితి లేక పాత ప్రతిపాదనల మేరకు దశల వారీగా పనులు చేపట్టి ఇబ్బంది లేకుండా వసతులు కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు: ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు రథసప్తమి వేడుకల నిర్వహణకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యుద్దీపాలంకరణ, క్యూలైన్ల నిర్మాణం, టెంట్లు సమకూర్చడం ఇతర పనులకు దశల వారీగా టెండర్లు పిలుస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడతాం.

- పీవీవీడీ ప్రసాద్, ఈవో, ఆదిత్యాలయం

ప్రసాద్ పేరిట విధ్వంసం..

◆ గతేడాది రథసప్తమి వేడుకల ఏర్పాట్లలో భాగంగా ఆలయం వద్ద క్యూలైన్ల షెడ్లు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, షాపింగ్ కాంప్లెక్సు, అన్నదాన, అన్నప్రసాదాల తయారీ, ప్రసాదాల విక్రయ కేంద్రాలను, వివిధ నిర్మాణాలను కూల్చేశారు.

◆ కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం మంజూరు చేయకుండానే ఆ జాబితాలో చోటు దక్కుతుందనే విశ్వాసంతో ఆగమేఘాలపై నిర్ణయాలు తీసుకుని ధ్వంసం చేసేశారు.

◆ మౌలిక వసతుల్లేక భక్తులు ఇబ్బందులు పడుతుండటం, ప్రసాద్ పథకం ఇప్పట్లో మంజూరయ్యే అవకాశం లేకపోవడం, ఇక్కడ నెలకొన్న పరిస్థితులపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమవడంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

◆ ఆలయ నిధులు రూ.లక్షలు వెచ్చించి తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు, గోశాల, అన్నదాన కేంద్రం, ప్రసాదాల విక్రయశాల నిర్మాణ పనులు చేపట్టారు. ఇటీవల తాటాకు పందిర్లు వేశారు.

WANTED

Required Experienced Marketing Executives for **Marketing Pesticides, Micro Nutrients and Bio Stimulants** to work for Sovereign Agro Insecticides, having 48 year's experience in Manufacturing and Marketing Agri Inputs.

Candidates with at least 10 years' experience in the same area can apply through WhatsApp for these following Districts.

ELURU, VIZIANAGARAM, VISAKHAPATNAM, SRIKAKULAM, NELLORE, PRAKASAM, BAPATLA, CHITTOR AND KADAPA Districts.

SOVEREIGN AGRO INSECTICIDES
6/13, Brodipet, GUNTUR. Mobile: 86397 49674

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
లీగల్ ప్రకటనలు
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు,
వేడుక ఏదైనా.. ఈనాడును చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

(c) eenadu

వైద్యారోగ్య శాఖలో రగడ..!

ఉద్యోగోన్నతుల ప్రక్రియలో గందరగోళంతో నిలిచిన కౌన్సెలింగ్

న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

వైద్యారోగ్య శాఖలో ఉద్యోగోన్నతుల ప్రక్రియ గందరగోళంగా మారింది. 2019లో నియమితులైన గ్రామ, వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులకు కూటమి ప్రభుత్వం ఎంపీహెచ్‌ఏ(ఎఫ్) (గ్రేడ్ 3 ఏఎన్ఎం)లుగా ఉద్యోగోన్నతులు కల్పించడానికి గతేడాది అక్టోబరులో ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు హడావుడిగా రూపొందించిన జాబితాలో తప్పులు దొర్లినట్లు ఫిర్యాదులు అందాయి. ఆదివారం ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ అర్ధాంతరంగా నిలిచిపోయింది.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని డీఎంహెచ్‌వో అనితకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

ఆరోపణల వెల్లువ

★ ఉద్యోగోన్నతుల ప్రక్రియకు సంబంధించి రూపొందించిన సీనియారిటీ జాబితాను కొందరు మాయం చేసి.. కొత్తగా మరొకటి సిద్ధం చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

★ గతంలో రెండు సార్లు సస్పెండైన ఓ కీలక అధికారి, మరో ఇద్దరు ఉద్యోగులు, అదే శాఖలో పని చేస్తున్న ముగ్గురు కొంతమంది ఆరోగ్య కార్యదర్శులను మభ్యపెట్టి సుమారు రూ.70 లక్షలకు పైగా వసూలు చేసినట్లు తెలిసింది.

★ ఈ దస్త్రంపై సంతకాలు చేయడానికి కార్యాలయం ఏవో, ఉద్యోగులు నిరాకరించారు. ఇదిలా ఉండగా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన మరో కీలక అధికారి సెలవు పెట్టారని సమాచారం.

అభ్యంతరాలొచ్చినా బేఖాతరు

★ గతంలో సిద్ధం చేసిన జాబితాపై అభ్యంతరాలు రాలేదని కొనసాగిస్తున్నారు. అందులో సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్ష, వెయిటేజీ, బోనస్ మార్కులు, ర్యాంకులు విడివిడిగా చూపకుండా అన్నింటినీ కలిపి పెట్టడంతో పలువురు ఆరోగ్య కార్యదర్శులకు అర్థం కాక అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని తెలిసింది. ★ అదే దస్త్రాన్ని ఉద్యోగోన్నతులు కల్పించడానికి ప్రాతిపదికగా పరిగణిస్తుండటంతో చాలామంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ★ కలెక్టర్ చొరవ తీసుకోకుంటే అన్యాయం జరుగుతుందని ఆవేదన చెందుతున్నారు.

త్వరలో ప్రకటిస్తాం..

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, దివ్యాంగుల ఖాళీలు భర్తీ చేయాలనే కోరిక మేరకు కౌన్సెలింగ్ వాయిదా వేశాం. సచివాలయ ఆరోగ్య కార్యదర్శుల నియామక పత్రాల్లో పేరు, ఫోన్ నంబరు మాత్రమే ఇచ్చారు. వాటినే ఎస్ఆర్‌లో నమోదు చేస్తారు. రోస్టర్ పాయింట్లు, ర్యాంకులు ఇవ్వకపోవడంతో 605 ఎస్ఆర్‌లు పరిశీలించాల్సిన అవసరం లేదు. అన్నింటిని పరిగణనలోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తాం.
– డా. కె.అనిత, డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం

పాప్‌కార్న్ పండించి.. ఆదర్శంగా నిలిచి..!

ఒప్పంగిలో పాప్‌కార్న్ పంట

న్యూస్‌టుడే, జలుమూరు

మూడేళ్లుగా పాప్‌కార్న్ మొక్క జొన్న పండించి సంతృప్తికరమైన ఆదాయం చూస్తున్నారు ఒప్పంగి గ్రామానికి చెందిన రైతు మంత్రి అసిరినాయుడు. రెండు ఎకరాల్లో రెండేళ్ల కిందట ప్రయోగాత్మకంగా వేసి విజయం సాధించారు.

● నవంబరు, డిసెంబరు నెలల్లో విత్తనం నాటేందుకు అనుకూలంగా ఉంటుందని, వరి కోసిన వెంటనే దుక్కి చేసైనా.. లేదంటే నేరుగా పంట వేయొచ్చని, నవంబరులో వేస్తే ఎకరాకు 45 క్వింటాళ్లు, డిసెంబరులో అయితే 40 క్వింటాళ్లు దిగుబడి వస్తుందన్నారు.

● దుక్కి, కలుపు మందులు, నీటి తడులు అందించడం, ఎరువులు ఇలా పంట చేతికి అందే వరకు ఎకరాకు 25 వేల వరకు ఖర్చు అవుతుంది. క్వింటా గింజలు ధర రూ.2200 చొప్పున విక్రయిస్తే 45 క్వింటాళ్లకు రూ.99 వేలకు వస్తుంది. 2 ఎకరాల్లో పండించగా రూ.1.48,000 ఆదాయం వచ్చిందని అసిరి నాయుడు తెలిపారు.

● చల్లని వాతావరణంలో విత్తనం నాటితే మంచి దిగుబడులు వస్తాయి. నాతోపాటు చుట్టు పక్కల గ్రామాల రైతులను ప్రోత్సహించాను. ఆరుతడి పంటల్లో పాప్‌కార్న్ లాభదాయకమే.
– మంత్రి అసిరినాయుడు, రైతు, ఒప్పంగి గ్రామం

సస్య రక్షణ చర్యలు ఇలా..

● నవంబరు 15 నుంచి డిసెంబరు 15లో పంట వేసుకుంటే మంచిది. కిలో విత్తనాలకు సయాంత్ర నిలిప్రోల్, తయోమెథోక్సం 4 మి.లీ కలిపి విత్తన శుద్ధి చేయడంతో కత్తెరపురుగు ఉద్ధృతిని తగ్గించుకోవచ్చు. ● సాళ్ల మధ్య 60 సెంటీమీటర్లు, మొక్కల నడుమ 20 సెంటీమీటర్లు దూరం ఉండేలా చూసుకోవాలి. విత్తిన 30 నుంచి 60 రోజుల్లో ఎకరానికి 90 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 30 కిలోల పొటాషియం ఎరువులు మూడు దఫాలుగా వేసుకోవాలి. ● కలుపు నివారణకు అట్రాజిన్ ఒక కిలో 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి ● కాండం తొలుచు పురుగు ఆశిస్తే క్లోరాంట్రనిలిప్రోలు 60 మి.లీ, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి, తొలిదశలో వేపనూనె ఎకరాకు ఒక లీటరు వేయాలి. రెండో దశలో ఇమామేక్టిన్ బెంజోయేట్ మందు 100 గ్రాములు పిచికారీ చేయాలి. గింజలు తేమ 30 - 35 శాతం మధ్య ఉన్నప్పుడు కండెలు మొక్కనుంచి వేరుచేసి నీడలో ఆరబెట్టాలి. ఎండలో ఆరబెట్టే గింజలు పగిలి పేలాలు సరిగా రావని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.చిట్టిబాబు తెలిపారు.

రైతేరాజు

వంగపంటకు అజ్ఞాస్త్రం ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న తొగిరి రైతు దాలయ్య

సేంద్రియ బాట.. రసాయనాలకు టాటా

సారవకోట, న్యూస్‌టుడే: రైతుల ఆలోచన మారుతోంది. పంటల సాగులో పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగానికి దూరం జరుగుతున్నారు. సేంద్రియ పద్ధతిలో సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం ప్రజలు సైతం వాటి వైపే మొగ్గు చూపుతున్నారు.

● ఆవు పేడతో ఘనజీవామృతం, మూత్రం, పేడ, బెల్లం ఉపయోగించి ద్రవ జీవామృతం, జిల్లేడు, వేప, సీతాఫలం, కానుగ వంటి ఆకులతోపాటు ఆవు మూత్రం, వెల్లుల్లి, పొగాకు, పచ్చిమిర్చి వంటివి ఉపయోగించి కషాయాలు తయారు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారు చేసే అజ్ఞాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటివి వినియోగించి మంచి దిగుబడి సాధిస్తున్నారు. కిన్నెరవాడ, అంగూరు, కేలవలస తదితర పంచాయతీల్లో రైతులు అధికంగా సేంద్రియ బాటలో నడుస్తున్నారు.

● సారవకోట మండలంలోని తొగిరి గ్రామానికి చెందిన రైతు రావాడ దాలయ్య 2 ఎకరాల్లో వరి, వంగ, బరబాటి, ఆనప వంటి కూరగాయలు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

● 'ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడినప్పుడు దిగుబడి బాగున్నా పెట్టుబడి ఎకరాకు రూ.50వేలు నుంచి రూ.60వేలు అయ్యేదన్నారుజ్జ. 5 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరిస్తున్నట్లు చెప్పారు. పంట ఏపుగా పెరుగుతుందని, పెట్టుబడి లేదు. నాణ్యత బాగుంది. వేరుశనగ పంటకు ఆకులు పసుపు రంగులోకి మారడం బాగా తగ్గిందన్నారు.

● ఆసక్తి ఉన్న రైతులు సచివాలయాల్లో సంప్రదిస్తే సిబ్బంది నేరుగా వచ్చి ప్రకృతి వ్యవసాయంలో మెళకువలు నేర్పిస్తారు. జిల్లాలో 60 వేల ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన వనరుల కేంద్రాలు ఏర్పాటు చేశారు. తెగుళ్లు, పురుగుల నివారణకు కషాయాలు తక్కువ ధరకే లభిస్తాయి. దిరుబ్డాయలు కూడా అందుబాటులో ఉంటాయి. 'అని శ్రీకాకుళం ప్రకృతి వ్యవసాయ అదనపు డీపీఎం దనుంజయరావు తెలిపారు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

ఉద్యాన పంటల్లో ఎదురయ్యే సమస్యలపై ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తే పంటలు కాపాడుకోవచ్చో తెలుసుకోవాలంటే ఆమదాలవలస కృషివిజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.హరికుమార్ 8281440912 చరవాణికి సంప్రదించ గలరు.

పొలాలకు వర్మీ కంపోస్టు కావాలా..?

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

యాజమాన్య పద్ధతులు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగంలో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సొంతమవుతాయని తొగరాం పాలిటెక్నిక్ వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎస్.నీలవేణి తెలిపారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: చోడి పంటలో అధిక దిగుబడులు ఇచ్చే విత్తన రకాలు తెలపండి
– ఎస్.అప్పలనాయుడు, బుడుమూరు

సమాధానం: అనుకూలమైన విత్తన రకాల్లో వంపతి ఒకటి. పంట కాలం 80-85 రోజులు, ఎకరాకు 12 క్వింటాళ్లు, శ్రీచైతన్య 110-115 రోజుల పంట కాలం, ఎకరాకు 12-16 క్వింటాళ్లు, అలాగే హిమ అది తెల్ల చోడి రకం అధిక దిగుబడులు ఇస్తాయి. అగ్గి తెగులు తట్టుకుంటుంది.

ప్రశ్న: వేరు శనగ పంట సాగు చేయాలి అనుకుంటున్నాం. జిప్సం ఏ విధంగా వినియోగించుకోవాలో తెలియజేయండి
–కె.శంకరరావు, సనపలవానిపేట

సమాధానం: వేరుశనగ విత్తిన 40 రోజులకు రెండోసారి కలుపు తొలగించిన తరువాత జిప్సం వేసుకోవాలి. ఎకరాకు 200 కిలోల చొప్పున నాలుగు నుంచి 5 సెంటీమీటర్ల లోతులో వేస్తే సాగులో దిగుబడి బాగుంటుంది.

ప్రశ్న: పొలాలకు వినియోగించుకునేందుకు వర్మీ కంపోస్టు ఎక్కడ లభిస్తుందో తెలపండి
– పి.వెంకటలక్ష్మి, శ్రీకాకుళం

సమాధానం: వానపాముల ద్వారా తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువు ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, నైరా కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల తొగరాంలో విక్రయిస్తున్నారు. కొంతమంది రైతులు వద్ద కూడా అమ్మకానికి దొరుకుతుంది.

ఇసుక అక్రమ తవ్వకాలతో పర్యావరణానికి ముప్పు

● లీజు రద్దు చేయాలని ఎస్.మత్స్యలేశం వాసుల వినతి

● మీకోసంలో 124 అర్జీల స్వీకరణ

గార మండలం ఎస్.మత్స్యలేశం నుంచి వచ్చిన మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ తవ్వకాల లీజు రద్దు చేయాలని గార మండలం ఎస్.మత్స్యలేశం వాసులు సోమవారం జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. అక్రమ తవ్వకాలతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణం, ప్రజారోగ్యం దెబ్బతింటున్నాయని వాపోయారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 124 అర్జీలు అందాయి. కలెక్టర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పలువురు అధికారులు అర్జీలు స్వీకరించారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 61 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. పలువురితో ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.

తాళ్లవలసలో వైద్య శిబిరాలు

టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్, సిబ్బంది

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం తాళ్లవలసలో అతిసారం ప్రబలడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేపట్టారు. రెండు రోజులుగా వ్యాధి లక్షణాలతో సుమారు 8 మంది బాధపడుతుండగా.. వారిలో ఒకరు మృతి చెందిన విషయం విదితమే. మరో ముగ్గురు సోమవారం టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేరారు. బాధితుల రక్తం, గ్రామంలో నీటి నమూనాలను పరీక్షల నిమిత్తం పంపుతున్నామని అధికారులు తెలిపారు.

ముఖ్యమంత్రి ఆరా

తాళ్లవలసలో పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. రోగుల్ని పరామర్శించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో అనిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్, సిబ్బంది గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకులు క్లోరినేషన్ చేశారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇదిలా ఉండగా గ్రామంలో పొలాల మధ్య నేల బావి నుంచి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమై ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు.

పవర్ ప్లాంట్ వద్దు..!

సరుబుజ్జిలి, బూర్జ, న్యూస్‌టుడే: సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో గిరిజనుల నుంచి ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు నిరసన సెగ తగిలింది. వెన్నెలవలస గ్రామంలో సోమవారం లబ్ధిదారులకు పింఛను ఇస్తుండగా కొందరు గిరిజనులు థర్మల్ పవర్ ప్లాంటు విషయమై ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఆయన పవర్ ప్లాంట్ నిర్మించేది ప్రభుత్వమని, ఇప్పటికీ సర్వే దశలో ఉందని చెప్పగా ప్లాంటూ వద్దు.. ఉద్యోగాలూ వద్దు.. పంటలు పండించుకుని బతుకుతామని ఎదురుతిరిగారు. ఎంత నచ్చజెప్పినా శాంతించక పోవడంతో అక్కడి నుంచి ఎమ్మెల్యే వెళ్లిపోయారు. అంతకు ముందు సీతంపేట ఐటీడీఏ నుంచి రాయితీపై వచ్చిన ఆయిల్ ఇంజిన్లను పలువురు గిరిపుత్రులకు అందజేశారు. బూర్జ మండలం మశానపుట్టి, జంగాలపాడులోనూ ఎమ్మెల్యేకు ఇదే పరిస్థితి ఎదురైంది. తమకు పింఛను పంపిణీ చేయొద్దని, గ్రామాలకు రావొద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదన విరమించుకున్నప్పుడే రావాలనడంతో ఆయన పోలీసుల భద్రత మధ్య వెనుదిరిగారు.

గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

5న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్: కలెక్టర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం ఈ నెల 5న నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో జరిగే సమావేశాలకు తల్లిదండ్రులు హాజరు కావాలని సూచించారు. చదువు, ఇతర అంశాలపై ఉపాధ్యాయులతో మాట్లాడేందుకు ఇది మంచి వేదికని స్పష్టం చేశారు. ఉదయం 9 గంటలకు హాజరు కావాలని. . అక్కడే భోజనం చేసి వెళ్లాలన్నారు.

కనీస వేతనాలు చెల్లించకుంటే ఊరుకోం

చెక్కులు అందజేస్తున్న కార్మిక శాఖ ఉప కమిషనర్ దినేష్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రైవేటు, వ్యాపార సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కె. దినేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో సోమవారం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ఆన్‌లైన్ తనిఖీల్లో గుర్తించిన 13 మందికి కనీస వేతన చట్టం కింద రూ.1.87 లక్షలు చెల్లించారు. కార్మికులకు యజమానుల నుంచి నియామక పత్రాలు అందజేశారు. కనీస వేతనాలు అమలు చేయని వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్మికులు తప్పనిసరిగా ఈ-శ్రమ్‌లో నమోదు కావాలని సూచించారు.

బోరుభద్ర- కొల్లిపాడు రహదారి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

4 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన 4 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సంతబొమ్మాళి మండలం కొల్లిపాడులో సోమవారం పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో రూ.600 కోట్లతో ఇంటింటికి తాగునీరు అందిస్తామని తెలిపారు. త్వరలో బోరుభద్ర-పాత మేఘవరం రహదారిని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తెదేపా నాయకులు కూచెట్టి కాంతారావు, చిదపాన ధర్మార్జునరెడ్డి, దూపాన కృష్ణారావు, సూరాడ ధనరాజ్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ మత్స్యకారులకు 15 వరకు రిమాండ్

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, నరసన్నపేట, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం బడివానిపేట పంచాయతీ మూసవానిపేట తీరానికి ఆదివారం చేరుకున్న బంగ్లాదేశ్‌కు చెందిన 13 మంది మత్స్యకారులను మెరైన్ సీఐ బోర ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. చేపల వేటకు బయలుదేరి ప్రతికూల పరిస్థితుల్లో పడవ మరమ్మతులకు గురై ఇక్కడి తీరానికి చేరుకున్నారు. వారిని షకీర్, జహంగీర్, షబ్బీర్, కోకన్, మక్‌సూద్, మాలిక్, ఎండీ ఫరూక్, మాక్‌సూద్ వలీ, నజీర్, హెలాల్, ఫరూక్, అలాం, సమీమ్‌గా గుర్తించారు. కళింగపట్నం మెరైన్ పోలీసు స్టేషన్‌కు తరలించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వైద్య పరీక్షలు చేయించారు. సోమవారం రాత్రి నరసన్నపేటలోని ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఈ నెల 15 వరకు రిమాండ్ విధించారు. నరసన్నపేట ఉపకారాగారానికి తరలించాలని ఆదేశించారని మెరైన్ సీఐ ప్రసాదరావు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

EENADU Classifieds

JOBS

Wanted Civil Engineers having exp. in Water supply/ treatment and land survey be able to work on Auto Cad ✆ 8919167199.

హైదరాబాద్ / గుంటూరులోని CCTV కంపెనీకి ఫ్రెషర్స్ కావలెను, శాలరీ: 14000/-. ✆ 9731567105, 9731722666.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్, All (డిగ్రీ, B.Tech, Dip. & ITI) కావలెను. Sal: 18-25K Age: 35లోపు, స్పాట్ జాయిన్. ✆ 7995439539.

టోల్‌గేట్ వద్ద పనిచేయుటకు సూపర్‌వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, హెల్పర్స్, సెక్యూరిటీ, ఫైర్ & సేఫ్టీ కావలెను. Qlf: 10th- డిగ్రీ, ITI, Dip, B.Tech. జీతం: 18K-28K. ✆ 9121044796, 9573635594

FACULTY/ TEACHERS

Wanted Higher English Primary Hindi & Maths Faculties & Telecaller (F) Office Boy (M) Contact : 7382599568

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు మేనేజర్లుగా ఎంపిక

ఇమ్రాన్ బేగ్

మొయ్యి ఆనంద్‌కిరణ్

బూరవెల్లి మల్లేశ్వరరావు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి అండర్-19 పాఠశాలల క్రీడల పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు కోచ్, మేనేజర్లుగా ఎంపికయ్యారు. వ్యాయామోపాధ్యాయులు మొయ్యి ఆనంద్‌కిరణ్ (శ్రీకాకుళం గ్రామీణం), బూరవెల్లి మల్లేశ్వరరావు (కోటబొమ్మాళి) ఇమ్రాన్‌బేగ్ (లావేరు) నియమితులయ్యారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంపికైన 16 మంది బృందానికి వీరు నాయకత్వం వహించనున్నారు. ఈ పోటీలు హరియాణాలో ఈ నెల 5 నుంచి 9 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా వారిని డీఈవో ఎ.రవిబాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, జిల్లా ఒలింపిక్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు హర్షం వ్యక్తం చేశారు.

తమిళనాడు ప్రమాద ఘటనలో మరో యువకుడి మృతి

గుంట రాజు (పాత చిత్రం)

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం వీరరామచంద్రాపురానికి చెందిన గుంట రాజు(30) తమిళనాడు మదురైలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. గత నెల 26న శబరిమల నుంచి తిరిగొస్తుండగా తమిళనాడులోని రామేశ్వరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాస మండలం వీరరామచంద్రాపురానికి చెందిన పి. సాయి, పెదంచలకు చెందిన ఐ. నవీన్ అక్కడికక్కడే మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో నలుగురు యువకులు గాయపడగా.. తీవ్రంగా గాయపడిన గుంట రాజు సోమవారం ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మెళియాపుట్టి మండలం గోకర్ణపురం సచివాయలంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తుండేవారు. రాజు తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తుండగా..సోదరుడు విశాఖలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన తారకేశ్వరరావు ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు సమాచారం. గణేష్ రామనాథపురం ఆసుపత్రిలో, గణపతి పలాసలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం ఉర్లాం రైలు నిలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందినట్లు శ్రీకాకుళం రోడ్ జీఆర్పీ ఎస్సై మధుసూదనరావు తెలిపారు. సదరు వ్యక్తి ఎరుపు రంగు టీ షర్టు, నీలం రంగు గళ్ల లుంగీ ధరించినట్లు చెప్పారు. వయసు సుమారుగా 45 సంవత్సరాలు ఉంటుందని, కుడి చేతిపై హిందీలో పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు 94934 74582 నంబరును సంప్రదించాలని తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై పేర్కొన్నారు.

పేలిన ఫ్రిడ్జ్.. గృహోపకరణాలు దగ్ధం

బీరువాలో కాలిపోయిన వస్తువులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పుర పరిధి ముత్యాలమ్మపేటలో సోమవారం ఫ్రిడ్జ్ పేలడంతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. స్థానికంగా అద్దెకు ఉంటున్న డి.లక్ష్మణ్‌నాయుడు ఇంట్లో ఫ్రిడ్జ్ పేలడంలో ఇతర గదుల్లో ఉన్న కుటుంబ సభ్యులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తుండగా బీరువాలో వస్తువులన్నీ బూడిదయ్యాయి. ఇన్వెర్టర్, ఏసీ యంత్రం, పంకాలు, వంట సామగ్రి మొత్తం కాలిపోయాయి. స్థానికులు వచ్చి మంటలు అదుపు చేశారు. ఘటనలో లక్ష్మణ్ నాయుడు కుమార్తె జ్ఞానేశ్వరి కూచిపూడి నృత్యం, తైక్వాండో పోటీల్లో సాధించిన పతకాలు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు కూడా దగ్ధమయ్యాయి. మొత్తం రూ.5 లక్షల వరకూ నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

వ్యాన్-ప్రైవేటు బస్సు ఢీ

వ్యానులో ఇరుక్కున్న చోదకుడిని బయటకు తీస్తున్న స్థానికులు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం లోలుగు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక వ్యాను, ప్రైవేటు బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాను చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన ప్రైవేటు బస్సు జయపురం నుంచి బ్రహ్మపుర వైపు వెళ్తుండగా చిలకపాలెం నుంచి వస్తున్న వ్యాను ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. శబ్దానికి ఉలిక్కి పడ్డారు. ఏం జరిగిందో తెలియక భయాందోళనకు గురయ్యారు. బస్సు, వ్యాను ముందు భాగం నుజ్జవడంతో ఆ మధ్యలో ఇరుక్కున్న వ్యాను చోదకుడిని స్థానికులు వెలికి తీసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో అతడిని బయటకు తీసి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ఉప్పరపేట వాసికి 6 నెలల జైలు

సారవకోట, న్యూస్‌టుడే: బద్రి పంచాయతీ, ఉప్పరపేట గ్రామానికి చెందిన ఉమ్మిడిశెట్టి రామారావుకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై బి.అనీల్‌కుమార్ తెలిపారు. 2019 అక్టోబరు 25న సవరడ్డపనస గ్రామానికి చెందిన కొల్లి నారాయణమ్మ, భర్త రాములు, కుమారుడు సోమేశ్వరరావుతో కలిసి ఆటోలో సారవకోట వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తూ.. కేళవలస కూడలి వద్ద పండ్లు కొనేందుకు ఆటో నిలిపారు. రహదారి దాటుతుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న ఉమ్మడి శెట్టి రామారావు నారాయణమ్మను బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆమె తలకు గాయం కావడంతో ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందారు. అప్పటి ఎస్సై రవికుమార్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణ పూర్తికావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై అనీల్‌కుమార్ చెప్పారు.

కుప్పకూలి.. ప్రాణాలొదిలి..

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: వైద్య పరీక్షలకు ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి వస్తున్న ఓ వ్యక్తి గుండెలో నొప్పి రావడంతో కుప్పకూలి మృతి చెందిన ఉదంతమిది. టెక్కలి మండలం మెట్టపేటకు చెందిన తమ్మినేని తౌడు (58) సోమవారం ఆయన అల్లుడు సింగూరు వాసుదేవరావుతో కలిసి శ్రీకాకుళం నగరంలోని రైతుబజారు వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. బొందిలీపురం వద్దకు రాగానే తౌడుకు గుండెలో నొప్పి ఎక్కువైంది. ద్విచక్ర వాహనాన్ని నిలిపి మామకు నీరు తాగించే ప్రయత్నం చేశారు. స్థానికులు పరిశీలించి అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించారు. రెండో పట్టణ ఎస్సై లక్ష్మి ఘటనా స్థలాన్ని సందర్శించారు. వివరాలు ఆరా తీసి కేసు నమోదు చేశారు.

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

కవిటి మండలం సీమూరు వద్ద హడావుడిగా కుప్పలు వేస్తున్న రైతులు

చిరుజల్లులు.. ఉరుకులు, పరుగులు

బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాను కారణంగా సోమవారం వేకువజాము నుంచి చిరుజల్లులు పడుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కర్షకులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. కొందరు ఒకేసారి కోత, నూర్పిడి చేసే అధునాతన యంత్రాలతో ధాన్యం సేకరణ చేస్తుండగా.. మరికొందరు కోసిన చేనును కుప్పలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు, కవిటి గ్రామీణం, కంచిలి గ్రామీణం

ఉత్సాహంగా గ్రిగ్స్ పోటీలు

ఇచ్ఛాపురం సురంగి రాజా క్రీడామైదానంలో జరిగిన మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు ఉత్సాహ భరితంగా సాగాయి. ఇచ్ఛాపురం మండల పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం, జోన్-1 వ్యాయామోపాధ్యాయుల సంఘ అధ్యక్షులు పద్మనాభరెడ్డి, కృష్ణ పాడియా పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, మందస

విజ్ఞానంతోనే భవిష్యత్తు

విజ్ఞానంతోనే విద్యార్థులకు భవిష్యత్తు ఉందని విద్యావాహిని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పైల తిరుమలరావు అన్నారు. కళాశాల ఆవరణలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులపై ఇంటర్ విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వీరిలో డి.మేఘమాల (ప్రథమ సీఈసీ), బి.తేజ (ప్రథమ ఎంపీసీ), ఎస్.రాకేష్(ద్వితీయ బైపీసీ) తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

విజేతలకు కళాశాల కరస్పాండెంట్ బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఏవో పి.సంధ్యారాణి, అధ్యాపకులు ఎల్.రజని, ఎం.సుదర్శనరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

వ్యాయామ విద్య.. మిథ్యేనా..!

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేక క్రీడలకు ప్రాధాన్యం తగ్గుతోంది. ఇది విద్యార్థుల శారీరక, మానసిక స్థితిపై ప్రభావం చూపుతోంది. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి పెట్టగలరు. అందుకే పాఠశాలల్లో వ్యాయామ తరగతి తప్పనిసరి చేశారు. మైదానాలు లేకపోవడంతో అది జరగడం లేదు. దీంతో పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట మండలాల్లో జిల్లా పరిషత్తు ఉన్నత, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 73 ఉన్నాయి. అందులో కవిటి మండలంలో నెలవంక, గొనపపుట్టుగ, కుసుంపురం, పెద్ద మెళియాపుట్టుగ,

కనీస ఆట స్థలం లేని డి.జి.పుట్టుగ ఉన్నత పాఠశాల

ముత్యాలపేట, ఇచ్ఛాపురం మండలంలో బూర్జపాడు, కండ్రా వార్డు, సోంపేట మండలంలో బారువ బాలికల తదితర పాఠశాలలకు క్రీడా మైదానాలు లేవు. కంచిలి మండలంలో పలు పాఠశాలల్లో చిన్న మైదానాలున్నా అవి ప్రార్థనకు తప్ప ఆటలకు అనుకూలంగా లేవు.

ప్రైవేటు బడుల్లోనూ

నియోజకవర్గంలో 30 వరకు ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో 80 శాతం బడుల్లో ఆట స్థలాలు లేవు. క్రీడల కోసం వారు ఇతర మైదానాలను ఆశ్రయిస్తున్నారు. క్రీడా మైదానాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మరికొన్ని చోట్ల దాతల సహకారంతో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినా అవి ఆటలు ఆడేందుకు పనికిరాకుండా ఉన్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• మైదానాలు లేక క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు

ఏర్పాటుకు చర్యలు చేపడతాం

పలు ఉన్నత పాఠశాలల్లో మైదానాలు కొరత ఉన్న మాట వాస్తవమే. ఆయా చోట్ల క్రీడా మైదానాల ఏర్పాటుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. దాతల సహకారంతో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – పి.విలియం, డిప్యూటీ డీఈవో, టెక్కలి

అభివృద్ధి కోసమే కార్గో విమానాశ్రయం

మందస, న్యూస్‌టుడే: వెనకబడిన జిల్లాగా ఉన్న శ్రీకాకుళాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కార్గో విమానాశ్రయం ప్రత్యేక అధికారి, జిల్లా రెవెన్యూ విశ్రాంత అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మందసలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విమానాశ్రయం ఏర్పాటుతో భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ విషయమై గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేయాల్సి ఉందన్నారు. అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పలాస ఆర్డీవో బి.వెంకటేశ్, తహసీల్దారు ఎం.శ్రీకాంత్ పాల్గొన్నారు.

తరగతి గదుల పూర్తికి రూ.65 లక్షలు మంజూరు

భోజనాలు పరిశీలిస్తున్న సునీల్ కుమార్ రాజ్, వై.యశోదలక్ష్మి

కంచిలి, మందస, న్యూస్‌టుడే: కంచిలి పరిధి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన నాబార్డు, నాడు-నేడు తరగతి గదుల భవన నిర్మాణాలకు రూ.65 లక్షలు మంజూరు చేస్తున్నట్లు బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల అదనపు కార్యదర్శి సునీల్ కుమార్ రాజ్, శ్రీకాకుళం జిల్లా గురుకులాల సామాన్యాధికారిణి వై.యశోదలక్ష్మి తెలిపారు. కంచిలి గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించారు. శిథిలావస్థకు చేరుకొన్న డార్మెటరీ నిర్మాణానికి అంచనాలు పంపించమని అధికారులను ఆదేశించారు. మందస గురుకుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజనాలు పరిశీలించారు. ప్రిన్సిపల్స్ శ్రీనివాసరావు, లక్ష్మి పాల్గొన్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. లక్ష్యం మరిచారు

కంబాలరాయుడుపేట ప్రాథమిక పాఠశాలకు శుద్ధజలం అందించే లక్ష్యంతో వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద రూ.4లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఇది పనిచేయకపోవడంతో ఇక్కడ చదువుతున్న 60 మంది విద్యార్థులు స్వచ్ఛమైన తాగునీటికి దూరమయ్యారు. ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

మురుగు పారేదెలా?

ఇచ్ఛాపురం పుర పరిధి చిన్నమేదరవీధిలో కాలువ ధ్వంసమైంది. కనీస మరమ్మతులు లేకపోవడంతో వాడుకనీరు ముందుకు సాగడం లేదు. దీంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోయి, వర్షం పడితే రోడ్డుపై ప్రవహిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పుర కమిషనర్ నల్లి రమేష్‌ను వివరణ కోరగా.. సమస్యను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పేరు.. మారని తీరు

మందస మండలం సాబకోటలోని రైతు సేవా కేంద్రం ఇది. వైకాపా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రంగా పేర్కొనగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు సేవా కేంద్రంగా మార్చింది. ఈ జీవో వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇంకా భవనంపై పాత పేరు ఉండటం గమనార్హం. దీనిపై సర్పంచి సంధ్య స్పందిస్తూ త్వరలోనే పేరు మారుస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

తుప్పలు తొలగించండి

వజ్రపుకొత్తూరు మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయం పరిసరాల్లో ముళ్ల తుప్పలు దట్టంగా పెరిగాయి. రహదారిపైకి రావడంతో అటు వైపు నుంచి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

నిత్య వెలుగులు

వజ్రపుట్టుగ నుంచి చిన్నశ్రీరాంపురం వెళ్లే రహదారి పొడవునా విద్యుత్తు స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు నిత్యం వెలుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. దీంతో దీపాలు త్వరగా పాడవుతున్నాయని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ వద్ద ప్రస్తావించగా సమస్యను విద్యుత్తు శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

ఎయిడ్స్‌ను తరిమికొడదాం

ఎయిడ్స్ అక్షరాకృతిలో ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పలాస జీడిపండు కూడలి వద్ద న్యాయవాదులు, సామాజిక ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీ

బారువలో డిగ్రీ కళాశాల విద్యార్థుల మానవహారం

ప్రపంచాన్ని వణికిస్తున్న ఎయిడ్స్ వ్యాధిని తరిమికొడదామంటూ వక్తలు పిలుపునిచ్చారు. పూర్తిస్థాయి అవగాహన పెంచడం ద్వారా ఎయిడ్స్ రహిత సమాజం సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఎయిడ్స్ డే సందర్భంగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ర్యాలీలు నిర్వహించారు. మానవహారాలు ఏర్పడి నినాదాలు చేశారు.

– పలాస, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే బృందం

ఘనంగా గీతా పారాయణం

కపాసుకుద్దిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సిలగాం, కపాసుకుద్ది గ్రామాల్లోని ఆలయాల్లో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. కపాసుకుద్దిలో రామలింగేశ్వర ఆలయం వద్ద కృష్ణార్జునుల పూజను కీలు చంద్రశేఖర్ దంపతులు చేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సిలగాంలో విష్ణుమూర్తి ఆలయంలో విజ్ఞాన భారతి పాఠశాల విద్యార్థులు భగవద్గీత పారాయణం చేశారు. కరస్పాండెంట్ దాసప్ప పాల్గొన్నారు. ★ ఇచ్ఛాపురం మండలం నీలాపుపుట్టుగలో నిగమానంద గీతాశ్రమంలో గురు హరిహర చైతన్య స్వామి ఆధర్యంలో లోక కల్యాణం, హోమం, ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ డిల్లీరావు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సోంపేట, కంచిలి గ్రామీణం, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఏఎంసీ ఛైర్మన్ మద్దిల విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మాకన్నపురం పంచాయతీలో సర్పంచి ఎం.నాగేశ్వరరావుతో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ చేపట్టారు. ● కంచిలి మండలం పెద్ద కొజ్జిరియాలో తెదేపా నేతలు పింఛను పంపిణీ చేపట్టారు. ● ఇచ్ఛాపురం పురపాలకసంఘంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ అధ్యక్షుడు కొండ శంకర్‌రెడ్డి పింఛను పంపిణీలో పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

సోంపేట, న్యూస్‌టుడే: ఆంధ్రా సీడ్ ద్వారా పంపిణీ చేసిన శ్రీకాకుళం సన్నాలు నాటి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీన డిల్లీరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వ్యవసాయ శాఖ ఏడీ టి.భవానీ శంకర్, ఏవో బి.నర్సింహమూర్తి పలాసపురం, ఇతర ప్రాంతాల్లో సోమవారం పంట పొలాలు పరిశీలించి కేళీలు గుర్తించారు.

45 శ్లోకాలు చెప్పి.. ప్రథమ స్థానంలో నిలిచి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని **కీర్తిరెడ్డి** భగవద్గీతలోని కఠినమైన 45 శ్లోకాలు చెప్పి, వాటి తాత్పర్యం కూడా వివరించి అందరి మన్ననలు అందుకుంది. పురపాలకసంఘం ముత్యాలపేట పాఠశాలలో సోమవారం గీతాజయంతిని పురస్కరించుకుని గీతాశ్లోకాల పఠనం పోటీలు నిర్వహించారు. ఇందులో కీర్తిరెడ్డి మొదటి బహుమతి గెలుచుకుంది.

నాణ్యమైన పౌష్టికాహారం అందించండి

దస్త్రాలు తనిఖీ చేస్తున్న పీడీ విమల

ఇచ్ఛాపురం గ్రామీణం, మందస, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి విమల ఆదేశించారు. ఇచ్ఛాపురం ఐసీడీఎస్ కార్యాలయాన్ని సోమవారం సందర్శించి దస్త్రాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 445 మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతోపాటు జిల్లాలో 65 మంది సూపర్‌వైజర్లు, 14 మంది కార్యకర్తలు, 41మంది సహాయకుల పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామని తెలిపారు. ★ మందస ఐసీడీఎస్ ప్రాజెక్టును ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని సీడీపీవో పి.అరుణ తెలిపారు. పిడిమందస అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

క్రీడాకారులకు అభినందన

గుడారిరాజమణిపురం ఉన్నత పాఠశాల మైదానంలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి గ్రిగ్స్ పోటీల్లో సొండిపూడి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బాలురు, బాలికల జట్లు ప్రథమ స్థానాల్లో నిలిచాయి. పల్నాడు జిల్లా వెనుగొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పి.రాహుల్ 1500 మీటర్ల పరుగు పందెంలో సత్తా చాటాడని ప్రధానోపాధ్యాయుడు సుందర్ సోలామన్ తెలిపారు. హరిపురంలో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ మాక్ పరీక్షల్లో ఎల్.కౌశిక్ 120 మార్కులు పొందినట్లు పేర్కొన్నారు. వీరందరికి ఉపాధ్యాయులు సోమవారం ప్రోత్సాహకాలు అందజేసి అభినందించారు. – న్యూస్‌టుడే, మందస

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: మాణిక్యపురం జడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు పత్రి వాసుదేవు, జీతా నాయక్, జయశ్రీ దొలాయిలు అండర్-17 విభాగంలో జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మజ్జి వైకుంఠరావు తెలిపారు. నవంబరు 27 నుంచి 29 వరకు నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో ఎలమంచి కార్తీక్, పత్రి వాసుదేవు, కాళిదాసు సాహు రజత పతకాన్ని సాధించారు. విజేతలను ఎంఈవో ధనంజయ మజ్జి, ఉపాధ్యాయులు అభినందించారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

కవిటిలో అర్ష విజ్ఞాన భారతి పాఠశాల ప్రదర్శన

వజ్రపుకొత్తూరు గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఈశ్వరరావు సూచించారు. గోవిందపురం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ★ జాతీయ సరిహద్దు భద్రత దినోత్సవం సందర్భంగా సోమవారం కవిటి భారతీయ విద్యాకేంద్రం అర్ష విజ్ఞాన భారతి పాఠశాలల్లో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది.

ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బూర్జపాడుకు చెందిన సూరు జోగమ్మకు అదే గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. చందాలు పోగు చేసుకుని రూ.26,850 నగదును సోమవారం బాధిత కుటుంబానికి అందించారు. గ్రామ పెద్దలు ఎస్.గణపతి, పి.శ్రీను, పి.జోగారావు, డి.జోగారావు, ఆనందరావు, భీమారావు పాల్గొన్నారు.

పేదల కాలనీలు బాగుపడేదెప్పుడో!

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో పేదలు నివసించే కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పన ప్రశ్నార్థకమైంది. నివాసాలు ఏర్పాటు చేసుకొని దశాబ్దాలు కావస్తున్నా ఆయా ప్రాంతాల్లో రహదారులు, కాలువలు కానరావడం లేదు. పలు ప్రాంతాల్లో వీధి దీపాలు సైతం లేని దుస్థితి. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.

★ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని 31 వార్డులకు 8 వార్డుల పరిధిలో గ్రామీణ ప్రాంతం ఉంది. సుమారు ఐదు వార్డుల పరిధిలో వలస కూలీలు, పేదలు నివాసం ఉండే కాలనీలున్నాయి. సూదికొండ కాలనీ, సూర్యాకాలనీ, నర్సిపురం కాలనీ, ముస్లిం కాలనీ తదితర ప్రాంతాల్లోని ప్రజలు అసౌకర్యాల నడుమ జీవిస్తున్నారు.

కనీస సౌకర్యాలు లేని సూదికొండ కాలనీలోని ఓ వీధి

★ రైల్వే గేటు నుంచి నర్సిపురం కాలనీకి చెరువు గట్టు గుండా వెళ్లాల్సి ఉంటుంది. సౌకర్యాలు లేనందున గతంలో స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇప్పటికీ ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి కనబరచడంలేదు. దీనిపై పురపాలక సంఘ డీఈ కనకరాజు మాట్లాడుతూ కాలనీల్లో అవసరం మేరకు మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

★ సూదికొండ కాలనీ ఏర్పడి 40 ఏళ్లు కావస్తోంది. ఇక్కడ ఇప్పటికీ కాలువ వ్యవస్థ సక్రమంగా లేదు. 80 శాతం వీధులకు సీసీ రహదారులు లేవు. వాడుక నీరంతా నడిచే మార్గంపైనే ప్రవహిస్తోంది.

★ సూర్యాకాలనీ ఏర్పడి 20 ఏళ్లు అవుతోంది. ఇక్కడ ఒక్క వీధికీ సీసీ రహదారి లేదు. నర్సిపురం కాలనీలో ఒక్క వీధిలో మాత్రమే సిమెంట్ రహదారి ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రాంతమంతా మట్టి దారులే దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే ఈ ప్రాంతానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి తెచ్చిన సుమారు రెండున్నర కిలోల గంజాయితో ఉత్తర్ ప్రదేశ్‌వాసి పోలీసులకు చిక్కాడు. సీఐ ఎం.చిన్నంనాయుడు తన కార్యాలయంతో తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్ కాన్పూర్‌నగర్ జిల్లాకు చెందిన బదన్ సింగ్ తూములగుంట చెక్‌పోస్టు సమీపంలో స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసినప్పుడు అక్కడ గంజాయి వ్యాపారి అనూప్ పరిచయమయ్యాడు. అతను గంజాయి తీసుకొస్తే రూ.10 వేలు ఇస్తానని చెప్పడంతో ఇచ్ఛాపురం చేరుకున్నాడు. అనూప్ చెప్పిన మేరకు ఒడిశాలోకి గంజాయి విక్రేత అబెడ్ సభర్ గంజాయి తెచ్చి బదన్‌సింగ్‌కు అందించాడు. సరకుతో రైలు ఎక్కేందుకు వెళ్తుండగా, గ్రామీణ ఎస్సై ఆర్.జనార్దనరావుకు చిక్కాడు. అతడిని అరెస్టు చేసి, సరకు, చరవాణి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

మందుబాబులకు రూ.10 వేల చొప్పున జరిమానా

కాశీబుగ్గ: మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి సోమవారం తీర్పు ఇచ్చారని కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 19 మందికి రూ.1000లు చొప్పున జరిమానా విధించారని సీఐ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

ఇచ్ఛాపురం: మద్యం తాగి వాహనాన్ని నడిపిన తిప్పన రమణ అనే వ్యక్తికి ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి పి.పరేష్ కుమార్ ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు పట్టణ ఎస్సై ఎం.ముకుందరావు తెలిపారు. మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడిపితే, శిక్ష తప్పదని ఎస్సై హెచ్చరించారు.

ఆచార్యుల సమ్మేళనంలో ప్రతిభ

కవిటి గ్రామీణం: భారతీయ విద్యాకేంద్రం ఆదివారం విజయనగరం జిల్లా దుప్పాడ అష్టలక్ష్మి దేవాలయంలో నిర్వహించిన నాగావళి సంకుల ఆచార్యుల సమ్మేళనంలో కవిటి మండల ఉపాధ్యాయులు ప్రతిభ చూపారు. పురాణాల పోటీలో లక్ష్మి, రాజేశ్వరి, సరిత రెండు విభాగాల్లో ప్రథమస్థానం సాధించారు. తెలుగు గీత్ విభాగంలో కవిటి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ద్వితీయ స్థానం సాధించారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్ అన్నారు. సోమవారం బి.జి.పుట్టుగ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. స్వామిత్వ సర్వే రిపోర్టును చూసి సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రాష్ట్ర మహాసభల విజయవంతానికి పిలుపు

కాశీబుగ్గ: తిరుపతిలో జనవరి 10, 11 తేదీల్లో నిర్వహించనున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కాశీబుగ్గలో ఆ సభలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఐదు దశాబ్దాలుగా ప్రజా స్వామిక హక్కుల కోసం పౌర హక్కుల సంఘం పనిచేస్తుందన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

సోంపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని కలిసికట్టుగా అడ్డుకుందామని జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ పిలుపునిచ్చారు. సోమవారం సోంపేట పట్టణం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వైకాపా సోంపేట పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు సేవలందించిన వారికి పురస్కారాలు

ఎయిడ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు ఉత్తమ సేవలు అందించిన ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి వైద్యాధికారి పి.దేవేంద్రరెడ్డి, బొరివంక గెస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బి.శంకరరావులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తమ వైద్యుడు, ప్రచారకర్త అవార్డులు అందించారు. ఎయిడ్స్ డే సందర్భంగా శ్రీకాకుళంలో ప్రశంసా పత్రాలు అందించారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, కవిటి గ్రామీణం

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

పలాస: పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపించాలని పురపాలక ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పురపాలక కార్యాలయంలో ఇన్‌ఛార్జి కమిషనర్ డి.కనకరాజుకు సోమవారం వినతిపత్రం అందించారు. 2011, 2012లో పీఎఫ్ నిధులు జమ చేయాలని, 2023 నాటి సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం.. వజ్రపుకొత్తూరు: దిత్వా తుపాను ప్రభావంతో తేలికపాటి వర్షం పడే అవకాశం ఉన్నందున అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని తహసీల్దార్ సీతారామయ్య సూచించారు. ఈ మేరకు సోమవారం పలు గ్రామాల్లోని పంట పొలాలు సందర్శించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నగరంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ఏవో ధనంజయ్ పాల్గొన్నారు.

కీ॥శే॥ సాహుకారు కృష్ణమూర్తి మాస్టారు గారి దివ్య ఆశీస్సులతో..
ప్రథమ వార్షికోత్సవ శుభాకాంక్షలు
KRISHNA TEJA
CONVENTION & LODGE
RTC కాంప్లెక్స్ దగ్గర, ముత్యాలమ్మపేట, ఇచ్ఛాపురం
ప్రజల సౌకర్యార్థం ఇచ్ఛాపురం పట్టణంలో నూతనంగా నిర్మించిన కృష్ణతేజ కన్వెన్షన్ అండ్ లాడ్జి ప్రారంభించి నేటికి ఒక వసంతం పూర్తి చేసుకుని రెండవ సంవత్సరంలో అడుగుపెడుతున్న శుభసందర్భంగా మా కస్టమర్లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఎప్పటివలే తామంతా విచ్చేసి మా వ్యాపారాభివృద్ధికి తోడ్పడగలరని ఆకాంక్షిస్తూ...
ఇట్లు
శ్రీ సాహుకారు భానుతేజ - శ్రీమతి హిమబిందు
S/o కృష్ణమూర్తి మాస్టారు (లేటు), ఇచ్ఛాపురం, Cell : 94404 80240

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: టెక్కలి మండలం చాకిపల్లిలో మద్దాడ వీధి దిగువున చెరువు సమీపంలో కాలువను మూసివేస్తుండటంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - సింహాచలం, స్థానికుడు

★ ఇది గ్రామ శివారులో పంట పొలాల వద్ద సమస్య. దీనిపై రెండు కుటుంబాల మధ్య వివాదం ఉంది. పరిశీలించి అవసరమైన సూచనలు చేస్తాం. - శ్రీనురామ్, పంచాయతీ కార్యదర్శి, చాకిపల్లి

- న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

గుర్తుకొస్తున్నాయి..!

కోటబొమ్మాళి బాలుర ఉన్నత పాఠశాలలో 1978- 79 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం జరిగింది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని వారంతా సంతోషంగా గడిపారు. చదువు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. - న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

నిరంతర కృషితోనే ఫలితాలు

టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. నిరంతర కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రధానోపాధ్యాయుడు డి. దాశరథి విద్యార్థులకు సూచించారు. ఎల్. మణికంఠ (10వ తరగతి), ఆర్. కౌశిక్ (9వ తరగతి), కె. ప్రదీప్ (10వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. - న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

ప్రసంగించి.. ప్రతిభ చూపి

పాతపట్నం అమరజ్యోతి పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై సోమవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇప్పిలి జాహ్నవి (10వ తరగతి), ఇప్పిలి నివేదిత (9వ తరగతి), పీస పవిత్ర (10వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎం. సోమేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. - న్యూస్‌టుడే, పాతపట్నం

తొలగని అడ్డంకులు.. అందని తాగునీరు

- న్యూస్‌టుడే, పాతపట్నం, మెళియాపుట్టి

జిల్లాలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గం పాతపట్నం. మన్యం నీటి వనరులు పుష్కలంగా ఉన్నా.. వేసవిలో గుక్కెడు నీటికి ప్రజలు ఎదురు చూడాల్సిందే. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఉద్దానం ఫేజ్- 2 పనులకు సంబంధించి నిధులు మంజూరవడంతో ఇబ్బందులు తీరుతాయని నియోజకవర్గ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. పనులు ప్రారంభించి, నెలలు గడుస్తున్నా పూర్తిగాకపోవడంతో చివరికి నిరాశే మిగిలింది.

నెరవేరని లక్ష్యం

పాతపట్నం నియోజకవర్గంలో 578 గ్రామాల ప్రజల దప్పిక తీర్చేందుకు ఉద్దానం ఫేజ్- 2లో భాగంగా రూ.265 కోట్ల నిధులు మంజూరు చేశారు. 2026 మార్చి 31 నాటికి పనులు పూర్తి చేసి, ప్రజలకు తాగునీటిని అందించాలన్నది లక్ష్యం. నేటికి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందాన మారింది. పాతపట్నం క్లస్టర్‌లో 203, హిరమండలం పరిధిలో 199 గ్రామాలకు ఉపయోగం చేకూరనుంది. టెక్కలి, సీతంపేట మండలాలకు చెందిన 30 గ్రామాలకు ఇందులో భాగంగానే నీటిని అందించాల్సి ఉంది.

మెళియాపుట్టిలోని ట్రీట్మెంట్ ప్లాంట్

నత్తనడకన ఉద్దానం ఫేజ్- 2 పనులు

అనుసంధానం చేయకుండా వదిలేసిన తాగునీటి పైప్‌లైన్

పూర్తికాని ట్యాంకుల నిర్మాణం

మెళియాపుట్టిలో ఇప్పటికే శుద్ధజల ప్లాంట్ పనులు పూర్తయ్యాయి. కాగువాడలో 11 మిలియన్ లీటర్ల, సుభలయలో 18 మిలియన్ లీటర్ల కెపాసిటీ ట్యాంకులను నిర్మించాల్సి ఉంది. మెళియాపుట్టిలో ట్యాంకు నిర్మాణం జరిగినప్పటికీ పైప్‌లైన్ పనులు 55 శాతం మాత్రమే చేశారు.

అనుమతులు ఎప్పుడొస్తాయో?

మెళియాపుట్టి మండలంలో 17 ట్యాంకులు నిర్మించాల్సి ఉండగా 11 ట్యాంకులకు అటవీ అనుమతులు రావాలి. పాతపట్నంలో 17కు 12 ట్యాంకులకు, సుభలయ పరిధిలో 19కు 10 ట్యాంకుల నిర్మాణానికి అనుమతులు రావాల్సి ఉంది. ఆంధ్ర- ఒడిశాను అనుసంధానం చేస్తూ ఉన్న రైల్వే లైనుపై ఆరు చోట్ల క్రాసింగ్ పనులు చేయాల్సి ఉంది. 326ఏ జాతీయ రహదారిని దాటి పైప్‌లైన్ వేయాలి. దీనికి ఆయా శాఖల నుంచి అనుమతులు రావాలి. మొత్తం 761.85 కి.మీ. పైప్‌లైన్ నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 153 కి.మీ. మాత్రమే జరిగింది. మెళియాపుట్టి మండలంలో 16 గ్రౌండ్ లెవెల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు కట్టాల్సి ఉండగా కేవలం రెండు మాత్రమే అయ్యాయి. కాగువాడ పరిధిలో 39కి రెండు పూర్తయ్యాయి. సుభలయ పరిధిలో అసలు చేపట్టలేదు.

ప్లాంట్ సిద్ధంగా ఉంది

మెళియాపుట్టిలో ఇప్పటికే ట్రీట్మెంట్ ప్లాంట్ సిద్ధంగా ఉంది. పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే నీటిని అందిస్తాం. సుభలయ, కాగువాడలకు సంబంధించి అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

- ఆశాలత, డీఈఈ, ఉద్దానం ఫేజ్- 2, మెళియాపుట్టి

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

టెక్కలి పట్టణం(నందిగాం), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై నందిగాం మండలం పెద్ద బాణాపురం వద్ద వాహన తనిఖీల్లో భాగంగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గంజాయి కేసు నిందితుడు మల్సియా రాంబాబును అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించామని నందిగాం ఎస్సై షేక్ మహ్మద్ అలీ తెలిపారు. 2022, మార్చి 9న పారుకొండ అలీ మరో నిందితుడితో కలసి 392 కిలోల గంజాయిని వ్యాన్‌లో రవాణా చేస్తుండగా వారు నడుపుతున్న వాహనం అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తా పడింది. నిందితులు పరారవడంతో ఆనాటి నుంచి పోలీసులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆ కేసులో నిందితుడైన రాంబాబు ప్రస్తుతం పట్టుబడగా, మరొకరి కోసం దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పేదరికమే ప్రామాణికం: మంత్రి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: పేదరికమే ప్రామాణికంగా తీసుకుని ముఖ్యమంత్రి సహాయనిధి సాయం అందిస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.26.86 లక్షల విలువైన చెక్కులను సోమవారం కోటబొమ్మాళిలో మంత్రి అందజేశారు.

బాధ్యతల స్వీకరణ.. పోలాకి, ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: పోలాకి, ఎల్ఎన్‌పేట డిప్యూటీ ఎంపీడీవోలుగా సంధ్యారాణి, వెంకట అప్పలనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సాహసం చేయరా విద్యార్థి..!

జలుమూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పరిసర గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. సాయంత్రం కళాశాల విడిచిపెట్టిన సమయంలో ఒకేసారి ఎక్కువ మంది బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. ఆ సమయంలో శ్రీముఖలింగం, బద్రి బస్సులు మాత్రమే ఉంటున్నాయి. రద్దీ కారణంగా వేలాడుతూ ప్రయాణిస్తుంటారు. అధికారులు స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు సూచనలు చేస్తామని కళాశాల ప్రిన్సిపల్ జె.సారిక అన్నారు.

- న్యూస్‌టుడే, జలుమూరు

చేనుకు చేరని చెరువు నీరు

కొత్తూరు మండలం బమ్మిడి గ్రామంలో దానాల కోనేరులో పూడిక, పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. సుమారు 60 ఎకరాలకు సాగునీరందించే ఈ కాసారాన్ని ఐదేళ్లుగా పట్టించుకోక పోవడంతో అధ్వానంగా మారిందని అన్నదాతలు వాపోతున్నారు. నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయిందని ఇప్పటికైనా చెరువును మెరుగుపరచాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని నీటిపారుదల శాఖ ఏఈ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. - న్యూస్‌టుడే, కొత్తూరు

ఆలయం వద్ద అధ్వానం

కోటబొమ్మాళిలోని మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద స్థానికులు వ్యర్థాలు వేస్తుండటంతో కుప్పలుగా పేరుకుపోయాయి. దీంతో దర్శనానికి వచ్చే భక్తులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. తరచూ ఇదే పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి వస్తే ముక్కు మూసుకోవాల్సి వస్తుందని, సంబంధిత సిబ్బంది స్పందించాలని కోరుతున్నారు. సమస్యను ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

పనులు పూర్తి.. సేవలకెప్పుడు ప్రాప్తి

ఎల్ఎన్‌పేట మండలం ఎంబరాం గ్రామ సచివాలయం పరిధిలో విలేజ్ హెల్త్ క్లీనిక్ నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో వైద్య సేవలందడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. 2024 ఎన్నికల ముందు నుంచి నిరుపయోగంగా మారిందని, అధికారులు ఇప్పటికైనా స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎల్ఎన్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సునీత మాట్లాడుతూ.. గుత్తేదారుడు భవనం అప్పగించలేదని చెప్పారు. - న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

నిధులు.. నిర్లక్ష్యం పాలు..!

హిరమండలం పరిధి పిండ్రువాడ కాలనీలో ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఆర్వో ప్లాంటు నిర్మాణానికి రూ.4.83 లక్షల నిధులు మంజూరు చేశారు. పనులు పూర్తవడంతో గతేడాది జనవరిలో ఆయనే దాన్ని ప్రారంభించారు. రెండేళ్లుగా అలంకారప్రాయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల మోటారు మరమ్మతులకు గురైంది. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు మాట్లాడుతూ.. పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, హిరమండలం

జలుమూరులో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిప్రత్యూష

పరదాలు అందుబాటులో ఉంచాలి

జలుమూరు, న్యూస్‌టుడే: ధాన్యాన్ని మిల్లులకు చేర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్డీవో కె.సాయిప్రత్యూష తెలిపారు. జలుమూరు, కొండ పోలవలస, కొమనాపల్లి, తిమడాం వద్ద రహదారుల పక్కన ఉన్న ధాన్యాన్ని సోమవారం ఆమె పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అధైర్య పడొద్దని కొనుగోళ్లు వేగవంతం చేస్తామన్నారు. పరదాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు జె.రామారావుకు సూచించారు.

గట్కా పోటీల్లో ప్రతిభ

నరసన్నపేట, న్యూస్‌టుడే: సత్యవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి గట్కా పోటీల్లో ప్రతిభ చూపారు. గతనెల 29, 30 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరిగిన పోటీల్లో 9 మంది పతకాలు సాధించారు.

కళింగ వైశ్య కార్యవర్గానికి సత్కారం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు, 15 మంది డైరెక్టర్లను రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు సత్కరించారు. కోటబొమ్మాళి తెదేపా కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

జీసీసీ పటిష్ఠానికి ప్రణాళికలు

పాతపట్నం: జిల్లాలో గిరిజన కార్పొరేషన్ సంస్థ (జీసీసీ)ను పటిష్ఠం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు గిరిజన కార్పొరేషన్ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ నిమ్మల నిబ్రమ్ తెలిపారు. సోమవారం పాతపట్నం జీసీసీను ఆయన సందర్శించారు.

రైతుసేవా కేంద్రం సందర్శన

హిరమండలం: గులుమూరు రైతుసేవా కేంద్రాన్ని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు సోమవారం సందర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన దాని కంటే అదనంగా ధాన్యం తూకం వేయాలని మిల్లర్లు అడుగుతున్నారని పలువురు రైతులు ఆయన వద్ద వాపోయారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

హిరమండలం, న్యూస్‌టుడే: సుభలయ ఆర్ఆర్ కాలనీ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు సోమవారం జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు దుస్తులు పంపిణీ చేశారు. శీతాకాలంలో చలి నుంచి రక్షణ కోసం చలి కోట్లు అందించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

వరిచేను కుప్ప దగ్ధం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: జాడుపల్లిలో సోమవారం వేకువజామున వరిచేను కుప్ప దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు కక్షపూరిత ధోరణితో ఈ ఘటనకు పాల్పడ్డారని బాధితుడు కలమట సూర్యనారాయణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

టెక్కలి, న్యూస్‌టుడే: కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని సీఐటీయూ డిమాండు చేసింది. సోమవారం టెక్కలిలో చలో విశాఖ గోడ పత్రికలను ఆవిష్కరించారు. నాయకులు షణ్ముఖరావు, ఈశ్వరరావు, మోహనరావు, రామచంద్రుడు పాల్గొన్నారు.

రోగులకు పరామర్శ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: తాళ్లవలసలో అతిసారం బారినపడి టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను వైకాపా నేతలు సోమవారం పరామర్శించారు. తిలక్, శ్రీరామ్మూర్తి ఉన్నారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సుజాత

సేవలకు గుర్తింపు

జలుమూరు, న్యూస్‌టుడే: అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పూజరి సుజాత పనితీరుకు గుర్తింపు లభించింది. ఆమె సేవలను ప్రశంసిస్తూ.. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా కొత్తమ్మతల్లి ఆలయం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గుడి అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో చేపట్టాల్సిన పనులపై అధికారులు, నాయకులతో సోమవారం ఆయన దేవస్థానంలో చర్చించారు. ఆలయ అభివృద్ధికి సుసరాపు సూరిబాబు సోదరులు 50 అడుగులు స్థలం ఇచ్చేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. దేవాదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, డీఈ కృష్ణ, ఆర్డీవో కృష్ణమూర్తి, నాయకులు కింజరాపు ప్రసాదరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ గోవిందరాజులు పాల్గొన్నారు.

పనులపై అధికారులు, నాయకులతో చర్చిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

భగవద్గీత జీవితాన్ని నడిపే గురువు

నరసన్నపేట, సారవకోట, జలుమూరు, మెళియాపుట్టి, టెక్కలి, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: భగవద్గీత జీవితాన్ని నడిపే గురువు లాంటిదని పలువురు ప్రవచనకారులు పేర్కొన్నారు. గీతా జయంతి సందర్భంగా సోమవారం పలుచోట్ల విద్యార్థులకు భగవద్గీతపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, దేవాలయాల్లో గీతా పారాయణాలు ఆకట్టుకున్నాయి.

టెక్కలి పట్టణం: సామూహిక గీతా పారాయణంలో మహిళలు

పెయింటర్ కుటుంబానికి సాయం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: దామోదరపురం గ్రామానికి చెందిన పెయింటర్ పర్రి రామకృష్ణ కుటుంబానికి అభయం యువజన సేవా సంఘం సాయం అందించింది. ఇటీవల పెయింటింగ్ పనులు చేస్తూ ఆయన గాయపడ్డారు. రూ.6 వేల నగదు, 25 కిలోల బియ్యం, 20 రకాల నిత్యావసర సరకుల కిట్‌ను సంఘ అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు అందించారు. సభ్యులు వకుళాభరణం ఈశ్వరరావు, లాడి కామేశ్వరరావు, సింహాచలం, వీరభద్రాచారి, జగదీశ్ పొరిడ, పూర్ణాచారి పాల్గొన్నారు.

నిరుపేదలకు కొండంత అండ

నరసన్నపేట, కొత్తూరు, మెళియాపుట్టి, న్యూస్‌టుడే: టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సందడిగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు మాట్లాడుతూ.. నిరుపేదలకు పథకాలు అందిస్తూ ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని చెప్పారు.

నరసన్నపేట: గోపాలపెంటలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

మెళియాపుట్టి: ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో..

కర్షకుల కంటతడి

నరసన్నపేట, నరసన్నపేట గ్రామీణం, సారవకోట, జలుమూరు, న్యూస్‌టుడే: ఆరుబయట ఆరబెట్టిన ధాన్యం సోమవారం తెల్లవారు జాము నుంచి కురిసిన వర్షానికి తడిసి పోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నెలకొన్న సాంకేతిక సమస్య కొనసాగింది. అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. పలుచోట్ల కోత దశలో ఉన్న పైరు నేల వాలింది. రెక్కల కష్టాన్ని కాపాడుకునేందుకు కర్షకులు అష్టకష్టాలు పడుతున్నారు.

పెద్దదూగాంలో వర్షానికి తడిసిన వరి పనలు

నరసన్నపేట గ్రామీణం: బాలసీమ వద్ద నేల వాలిన వరి పంట

విస్తరణ వైపు వడిగా అడుగులు

- న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం

జిల్లా కేంద్రానికి దీటుగా టెక్కలిని అభివృద్ధి చేయాలన్న రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు ఆలోచనలకు అనుగుణంగా అడుగులు పడుతున్నాయి. 2014- 19 మధ్య పాత జాతీయ రహదారి, కచేరి వీధి, ప్రధాన రహదారులను విస్తరించారు. ఈసారి ప్రధాన వీధులు, కాలనీలపై దృష్టి పెట్టారు. తొలిదశలో శ్రీనివాసనగర్, మండాపొలం కాలనీ ప్రాంతాలను అభివృద్ధి చేయగా, టెక్కలి- చెట్లతాండ్ర రహదారి విస్తరణ పనులు సైతం ప్రారంభించారు. ప్రధానంగా పాత జాతీయ రహదారి నుంచి బైపాస్‌ను కలిపే భవానీనగర్- అయ్యప్పనగర్ రోడ్డును 48 అడుగుల మేర విస్తరించి నిర్మాణం పూర్తిచేశారు. తాజాగా కొండ్రవీధి- చిన్నబజారు రోడ్డును విస్తరించాలని అచ్చెన్న అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి చేయనున్న కొండ్రవీధి- చిన్నబజారు రోడ్డు

పూర్తయితే పూర్వ వైభవం

ఇందిరా కూడలి నుంచి అంబేడ్కర్ కూడలికి ఉన్న కచేరివీధి రహదారికి సమాంతరంగా కొండ్రవీధి రోడ్డు ఉంటుంది. టెక్కలి ప్రధాన కూరగాయల మార్కెట్, చేపలు, ఇతర మాంసాహార దుకాణాలన్నీ ఇక్కడే ఉన్నాయి. ఈ రహదారి విస్తరణ జరిగితే ట్రాఫిక్ మళ్లించడంతో పాటు వాణిజ్య లావాదేవీలకు సైతం పూర్వవైభవం వచ్చే అవకాశం ఉంటుందని పట్టణ వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో తాగునీటి ఎద్దడి దృష్ట్యా పనులు జరిగే సమయంలోనే ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

40 అడుగుల మేర మార్కింగ్

లక్ష్మీనృసింహస్వామి ఆలయ కూడలి నుంచి చిన్నబజారు వరకు ఉన్న కొండ్రవీధి- చిన్నబజారు రోడ్డు ఒకప్పుడు ప్రధాన వాణిజ్య లావాదేవీలకు వేదికగా ఉండేది. రహదారి ఇరుకుగా మారడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో 40 అడుగుల మేర విస్తరించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు స్థానికులు సైతం సహకరించేందుకు ముందుకొచ్చారు. రెవెన్యూ అధికారులు రోడ్డు మధ్య నుంచి చెరోవైపు 20 అడుగుల మేర మార్కింగ్ వేశారు.

ఓ ఇంటి వద్ద 40 అడుగులకు వేసిన మార్కింగ్

త్వరితగతిన ప్రారంభిస్తాం

కొండ్రవీధి రహదారిని 40 అడుగుల మేర విస్తరించాలని నిర్ణయించాం. ఈ మేరకు స్థానికుల సహకారంతో మార్కింగ్ వేశాం. ఏకాభిప్రాయంతో త్వరితగతిన పనులు ప్రారంభిస్తాం. - సత్యం, తహసీల్దార్, టెక్కలి

చైతన్యంతోనే ఎయిడ్స్ నిర్మూలన

టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, విద్యార్థులు చైతన్య ర్యాలీలు చేపట్టారు. గంగివలస కేజీబీవీ విద్యార్థినుల ప్రదర్శనను చిత్రంలో చూడొచ్చు.- న్యూస్‌టుడే బృందం

అక్రమాలపై విచారణ చేయాలి

కొత్తూరు: స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్.జయమ్మ, సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ఇక్కడ పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు సొంత ఖాతాలకు నిధులు మళ్లించుకున్నారని ఆరోపించారు.

గ్రామదేవత వార్షికోత్సవం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: నడసంద్ర గ్రామంలో కొలువైన శ్రీనీలమణి దుర్గ గ్రామదేవత వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారికి చల్లదనం చేసేందుకు ఘటాలతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తజనం

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఉపన్యాసంతో అదరగొట్టారు

శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ నగరపాలకోన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి అభిప్రాయాలు వెల్లడించారు. ఎల్.చార్మి, కె.లిఖిత (10వ తరగతి), ఒ.హర్షవర్ధన్ (9వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు డీఎస్‌వీ భరద్వాజ్, ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు తదితరులు బహుమతులు అందజేశారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

భలే మాట్లాడారు..!

ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఈనాడు ఆధ్వర్యంలో 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం'పై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. దిలీప్ (7వ తరగతి), ఎం.సాధ్విక (8వ తరగతి), కె.వినోద్‌కుమార్ (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.ఏ.రాములు, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

తెరపై ఈనాడు

● మారుతి: బిజినెస్‌మేన్ ● కిన్నెర: ప్రేమంటే ● కీర్తన: జనతా బార్ ● కీర్తిక: స్కూల్ డేస్ ● ఎస్‌వీసీ(రామలక్ష్మణ): ది గర్ల్ ఫ్రెండ్ ● సూర్యమహల్: రాజు వెడ్స్ రాంబాయి ● సన్‌మ్యాక్స్: తేరే ఇష్క్ మైనే ● సరస్వతి: ఆంధ్ర కింగ్ తాలూకా

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

వీధి దీపాలు ఏర్పాటు

స్పందనకు వందనం

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం టంకాలదుగ్గివలస గ్రామంలో పలు వీధుల్లో దీపాలు వెలగకపోవడంతో గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో ఈ నెల 1న 'ఈనాడు'లో 'చీకట్లో టీడీవలస' అనే శీర్షికతో ఇచ్చిన కథనానికి అధికారులు స్పందించి దీపాలు ఏర్పాటు చేశారు.

వేతనాల వెతలు.. పూట గడవక కష్టాలు..!

అధ్వానంగా క్లాప్ మిత్రల పరిస్థితి

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, ఆమదాలవలస గ్రామీణం, పొందూరు

గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంలో హరిత రాయబారులు (క్లాప్ మిత్రలు) పాత్ర కీలకం. శుభ్రంగా పల్లెలను ఉంచుతున్న వీరికి 2 నుంచి 11 నెలలుగా వేతనాలు అందకపోవడంతో కొలువు వదిలేసి పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్తున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల్లో 110 పంచాయతీలు ఉన్నాయి. 260 మంది క్లాప్‌మిత్రలు పని చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ నెలకు రూ.6 వేలు చొప్పున ప్రభుత్వం వేతనం చెల్లించాలి. కొందరి వివరాల దస్త్రాల్లో సరిగా లేకపోవడంతో కొందరికి 2 నెలలు, మరి కొందరికి 4 నెలలు, మరి కొంతమందికి 11 నెలల వేతన బకాయిలు ఉండిపోయాయి. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది.

షళంత్రి గ్రామంలో చెత్త సేకరిస్తున్న క్లాప్‌మిత్ర

సరుబుజ్జిలి మండలం.. 21 పంచాయతీల్లో 39 మంది క్లాప్ మిత్రలు పనిచేస్తున్నారు. వేతనాలు అందకపోవడంతో కూలి పనులకు వెళ్తున్నారు.

పొందూరు మండలంలోని 29 పంచాయతీల్లో 64 క్లాప్ మిత్రలు వేతనం ఇవ్వాలని అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. ప్రయోజనం ఉండటం లేదు.

ఆమదాలవలస మండలంలో.. 30 పంచాయతీలు ఉండగా 61 మందికి ఇవే ఇబ్బందులు.

బూర్జ మండలంలోని 30 పంచాయతీల్లో 96 మంది కుటుంబం పోషణ భారంగా ఉందని వాపోతున్నారు.

క్లాప్ మిత్రలకు కొన్ని నెలలుగా వేతనాలు అందకపోవడం వాస్తవమే. పంచాయతీలకు అరకొరగా నిధులు రావడంతో నెల నెలా ఇవ్వలేకపోతున్నారు. బిల్లులు మాత్రం ప్రతి నెలా ట్రెజరీకి పంపిస్తున్నాం. నిధులు మంజూరైతే క్లాప్ మిత్రల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తాం.' అని నాలుగు మండలాల ఈవోపీఆర్డీలు రామారావు, గోపాలరావు, సింహాచలం, విజయలక్ష్మి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

సమస్య: పట్టణంలోని బొడ్డేపల్లి పేట, కొర్లకోట కూడలి వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. – విజయ్, స్థానికుడు

సమాధానం: హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

ఎస్.బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

సమస్య: కంచరవానిపేటకు వెళ్లే ప్రధాన రహదారి నేటికీ మట్టి దారే

- వాసు, స్థానికుడు

సమాధానం: త్వరలోనే అన్ని వార్డుల్లో సీసీ రహదారుల నిర్మాణం జరుగుతుంది.

- జాన్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఆరుబయటకు వెళ్లాల్సిందే

జి.సిగడాం మండలం సీతంపేట పంచాయతీ నక్కపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. తలుపులు విరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి. విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల విద్యాశాఖాధికారి రవితో ప్రస్తావించగా సమస్య ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

–న్యూస్‌టుడే, జి.సిగడాం

బోరు పని చేయట్లే..!

బీఆర్‌నగర్ మొదట వీధిలో కొన్ని రోజులుగా బోరు పని చేయడం లేదు. దీంతో స్థానికులు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ సిబ్బందికి చెప్పినా.. మరమ్మతులు చేయలేదన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రవి వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కరిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

నిలువెత్తు నిర్లక్ష్యం

పొందూరు మండలం దళ్లవలస గ్రామం నుంచి పెనుబర్తి వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభానికి తీగ మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. తొలగించాలని స్థానికులు కోరారు. విద్యుత్తు శాఖ ఏఈ సుధీర్ వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కరిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

రోడ్డుపై మురుగు

ఎచ్చెర్ల మండలం అజ్జరాం పంచాయతీలోని గొల్లపేట గ్రామంలో పాఠశాల వద్ద కాలువలు లేక రోడ్డుపైన మురుగు నిలిచిపోతోంది. గ్రామస్థులు, విద్యార్థులు రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి లింగాల మురళీ వద్ద ప్రస్తావించగా నిధులు మంజూరైతే నిర్మిస్తామన్నారు. –న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

వ్యర్థాలతో ఇబ్బందులు

గోపీనగరం(ఆమదాలవలస గ్రామీణం),న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం గోపీనగం కొత్తరోడ్డు సర్వీస్ రహదారి నిండా చెత్త నిల్వలు పేరుకున్నాయి. నివాసితులు, హోటల్స్, ఇతర దుకాణాల వారు వేయడంతో సమస్య నెలకొంది. తక్షణమే చెత్త నిల్వలు తొలగిస్తామని ఈవోపీఆర్డీ గోపాలరావు తెలిపారు.

బాధితులను హీనంగా చూడొద్దు

ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని పలువురు వక్తలు స్పష్టం చేశారు. ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం రెండు నియోజవర్గాల్లో ర్యాలీలు, కార్యక్రమాలు జరిగాయి. ఎయిడ్స్ సంక్రమించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాధితులకు ఆప్యాయత పంచాలన్నారు. – న్యూస్‌టుడే బృందం

బలగ: ర్యాలీగా వెళ్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

రణస్థలం: ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించిన వైద్య సిబ్బంది, విద్యార్థులు

ఆమదాలవలసలో నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో..

అధునాతన వైద్య విధానంతో ఆరోగ్యంగా జీవించొచ్చు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: అధునాతన వైద్య విధానంతో హెచ్ఐవీ బాధితులు ఆరోగ్యంగా జీవించొచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హెచ్ఐవీ బాధితులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్ఐవీ బాధితులకు సంబంధించి అమలు చేస్తున్న రక్షణ చట్టాలను వివరించారు. అరబిందో పరిశ్రమ, లయన్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సమకూర్చిన పోషకాహార కిట్లు అందజేశారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.హరిబాబు, డీఎంహెచ్‌వో కె.అనిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

పేద ప్రజల సంక్షేమమే కూటమి ధ్యేయం

పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నాయకులు అన్నారు. సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు లావేరు మండలం గుమ్మడాంలో రణస్థలం మండలంలోని ఎర్రవరంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఎచ్చెర్ల మండలం కొంగరాంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నారాయణపురం ఆయకట్టు పరిధిలో సుమారు 3500 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. చినకొంగరాంలో పింఛన్లు పంపిణీ చేశారు.

– న్యూస్‌టుడే, బృందం

జి.సిగడాం: చెట్టుపొదలంలో వికలాంగునికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

సైనిక పతాక నిధికి విరాళాలివ్వండి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: సైనిక పతాక నిధికి విరివిగా విరాళాలివ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయంలో సోమవారం సాయుధ దళాల పతాక దినోత్సవం నిధికి సంబంధించిన గోడప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డైరెక్టర్, సైనిక్ వెల్ఫేర్, విజయవాడ పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ లేదా చెక్కు, ఆన్‌లైన్‌లో 62064304822, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విశాఖ బి కాలనీ, శ్రీకాకుళం పేరిట చెల్లించి రెల్లి వీధిలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో రసీదు అందజేయొచ్చని తెలిపారు.

విశ్రాంత ఏఎస్సైకు సత్కారం

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నందిగాం పోలీసుస్టేషన్లో ఏఎస్సైగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన కె.చిన్నారావును జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సత్కరించి వీడ్కోలు పలికారు. శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థంగా పని చేశారని ప్రశంసించారు. అదనపు ఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, పోలీసు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆర్.కృష్ణంనాయుడు, భుజంగరావు, జగదాంబ పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని విశ్రాంత ఆర్డీవో శ్రీనివాసాచార్యులు, సర్పంచి బొడ్డేపల్లి గౌరీపతి అన్నారు. సోమవారం ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ మండాది గ్రామంలో నూతనంగా రూ.13.20 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో రూ.13.20 లక్షలు నిధులు మంజూరు చేయగా భవనం పూర్తి చేశారు.

పాఠశాలను ప్రారంభిస్తున్న విశ్రాంత ఆర్డీవో శ్రీనివాసాచార్యులు, సర్పంచి బొడ్డేపల్లి గౌరీపతి

మహాసభలను జయప్రదం చేయాలి

రణస్థలం: ఈ ఏడాది డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో 5 రోజులు జరిగే సీఐటీయూ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. సోమవారం ఫ్రింజ్ లేబరేటరీ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. కార్మిక వర్గం హక్కులను హరించేందుకు ప్రభుత్వాలు పూనుకున్నాయన్నారు.

ఆమె నేత్రాలు సజీవం

బలగ(శ్రీకాకుళం): శ్రీకాకుళం నగరంలోని ఏపీ హెచ్‌బీ కాలనీకి చెందిన **పి.సుధారాణి** (65) సోమవారం కన్నుమూశారు. ఆమె కుమారులు రెడ్‌క్రాస్ బృందానికి సమాచారమిచ్చి నేత్రాలు దానం చేశారు.

మహిళా ప్రాంగణంలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలంలోని 'ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారిత కేంద్రం' (మహిళా ప్రాంగణం)లో మహిళలకు వివిధ స్వయం ఉపాధి శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం జిల్లా మేనేజర్ రెబెకా శామ్యూల్ సోమవారం తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో నిర్వహించే ఈ శిక్షణలకు 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళలు అర్హులన్నారు. అసిస్టెంట్ బ్యూటీథెరపిస్టు, హ్యాండ్ ఎంబ్రాయడర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తులను కేంద్రంలో నేరుగా అందజేయాలన్నారు. అర్హత, శిక్షణ కాలం, వసతి ఇతర వివరాలకు 83095 48067 ఫోన్ నంబరుకు సంప్రదించాలన్నారు.

సీసీ కెమెరా ఇన్‌స్టలేషన్‌కు..

ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ఈ నెల 11న ప్రారంభించనున్న సీసీ కెమెరా ఇన్‌స్టలేషన్ అండ్ సర్వీసింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కేంద్రం డైరెక్టర్ ఎన్.రామ్‌జీ సోమవారం తెలిపారు. 19 నుంచి 45 ఏళ్ల వయసున్న వారు కోర్సులో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 95534 10809, 79933 40407కు ఫోన్ చేయాలని సూచించారు.

విచారణ సమంజసమే

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలం తాడివలస ఉన్నత పాఠశాలలో జరిగిన ఆర్థిక వ్యవహారాలపై ప్రధానోపాధ్యాయుడు బల్ల కంఠయ్యపై విచారణను డీటీఎఫ్ నాయకులు ఖండించారు. దీనిపై తాడివలస సర్పంచి తమ్మినేని మనెమ్మ, పీఎంసీ ఛైర్మన్ అమ్మినేని అమ్మాజీ విమర్శలు గుప్పించారు. పాఠశాల ఆవరణలో విలువైన టేకు చెట్లు భారీ ధరకు అమ్ముకొని నిధులను దుర్వినియోగం చేశారన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో సత్తా

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండలం మెట్టవలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన లొడగల వినోద్ గత నెల నంద్యాలలో నిర్వహించిన అండర్ 17 బాలుర బేస్‌బాల్ క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచి సత్తాచాటాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సత్య నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మిలు అభినందించారు.

18 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం దన్నానపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులు మంగళగిరి ఎప్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.జానకీరామయ్య అభినందించారు.

డిమాండ్లు పరిష్కరించాల్సిందే



శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ నియమించి పురపాలక సంఘాల్లో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎన్.బలరాం కోరారు. ఈమేరకు నగరపాలక సంస్థ పర్యవేక్షణ అధికారిగా నియమితులైన సహాయ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్‌ను సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలు పంచాయతీ పరిధి బావాజీపేటలో సోమవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యటించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలో నకిలీ ధ్రువపత్రాలతో ఇళ్ల పట్టాలు పొందినట్లు తెలుసుకుని సమగ్ర విచారణ చేస్తామని తెలిపారు. అర్హులను గుర్తించి పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు. ఎంపీడీవో ప్రకాష్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

నెల్లిపర్తి సర్పంచి చెక్కు పవర్ రద్దు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం నెల్లిపర్తి పంచాయతీ సర్పంచి మానుకొండ రాజేశ్వరి చెక్కు పవర్ రద్దు చేసినట్లు ఎంపీడీవో ఆర్.వెంకటరావు సోమవారం తెలిపారు. పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేసినట్లు పలువురు ఫిర్యాదు చేయడంతో విచారించగా నిధులు ఖర్చు చేసినట్లు నిర్ధారణ అయింది. దీంతో జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య ఆరు నెలలు చెక్కు పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

అనాథ బిడ్డను పెంచిన దంపతులకు సత్కారం

శ్రీకాకుళం నగరంలో 22 ఏళ్ల కిందట ఆసుపత్రిలో వదిలేసిన ఓ ఆడ బిడ్డను పెంచిన రిక్షా కార్మికుడు తెంబూరి ముఖలింగం, నరసమ్మ దంపతులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ సత్కరించారు. గొంటి వీధిలో సోమవారం ఆ యువతికి ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ చేసినప్పుడు ఈ విషయం తెలిసింది. దివ్యాంగురాలైన బిడ్డను పెంచి పోషించడం అభినందనీయన్నారు. ● గార మండలం శ్రీకూర్మంలోని సెగిడిపేటలో కిడ్నీ బాధితుడికి ఎమ్మెల్యే పింఛను రూ.10 వేలు అందజేశారు.

–న్యూస్‌టుడే, గార, శ్రీకాకుళం నగరం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: జాతీయరహదారిపై ఎచ్చెర్ల మండలం చిలకపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జిపైన ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని పొందూరు మండలం రాపాక గ్రామానికి చెందిన దుబ్బాక అప్పారావు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఎచ్చెర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. లావేరు మండలం బెజ్జిపురం గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడు శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్సై జి.లక్ష్మణరావు వివరాలు నమోదుచేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి దృష్టికి సాగునీటి సమస్యలు

మంత్రి నిమ్మల రామానాయుడికి వినతి పత్రం అందజేస్తున్న పంచిరెడ్డి కృష్ణారావు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: నారాయణపురం ప్రాజెక్టు కమిటీ పరిధిలోని సాగునీటి వనరులకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని నారాయణపురం కుడికాలు ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు కోరారు. సోమవారం మంగళగిరిలోని తెదేపా కార్యాయంలో రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతపత్రం అందజేశారు. నాగావళి నది కుడివైపు ఒడ్డున ఉన్న జిరాయితీ భూములు నదిలో కలిసిపోతున్నాయి గ్రోయిను నిర్మించాలని, నారాయణపురం కుడికాలు గట్టుపై గ్రావెల్, మెటల్ రోడ్లు నిర్మించి షట్టర్లు, మదుములను మరమ్మతులు చేయాలన్నారు. లస్కర్లు నియమించాలన్నారు.

అధ్వానం.. అవస్థలకు అద్దం..!

న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం, ఎచ్చెర్ల

అసలే అధ్వానమైన దారులు ఆపై దిత్వా తుపాను ప్రభావం స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● పొందూరు మండలంలోని సోమవారం ఉదయం కురిసిన వర్షానికి కాలువల నుంచి మురుగు నీరు రోడ్లపైకి ప్రవహించింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అందులో నుంచే రాకపోకలు సాగించారు. అచంట వారి వీధి బురదగా మారడంతో నానా అవస్థలు పడ్డారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని కాలువలు, రోడ్లు వేస్తే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు కోరారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కరిస్తామన్నారు.

●ఎచ్చెర్ల మండలం జాతీయరహదారి నవభారత్ కూడలి నుంచి పెయ్యలవానిపేట మీదుగా దోమాం పోయే రహదారి అడుగడుగునా పెద్ద పెద్ద గోతులు ఏర్పడి రాళ్లు తేలాయి. రాకపోకలు ప్రజలు నరకం చూస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి ఇబ్బందికరంగా మారింది. సమస్య పంచాయతీ రాజ్ ఏఈ పోలినాయుడు దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరైతే రోడ్డు వేస్తామన్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం

మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా అరసవల్లిలో సోమవారం సూర్యనారాయణస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనివెట్టి మండపంలో ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఈ క్రతువు శాస్త్రోక్తంగా జరిగింది. భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

విధుల్లో చేరిన డిప్యూటీ ఎంపీడీవో

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండల డిప్యూటీ ఎంపీడీవో దుంపల అప్పన్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటం

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: హక్కుల సాధనకు కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని ఏఐటీయూసీ నాయకుడు టి.తిరుపతిరావు, ఆర్టీసీ పొరుగుల సేవల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.ముత్యాలరావు, కోశాధికారి డి.కిరణ్ కోరారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం సంఘ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సకాలంలో జీతాలు చెల్లించాలని.. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు సూచించిన ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు.

(c) eenadu

ఈనాడు
తిరుపతి
మంగళవారం డిసెంబరు 2, 2025 5

భావితరాల భాండాగారం

భద్రపరిచిన పురాతన తాళపత్ర గ్రంథాలు

తాళపత్ర గ్రంథాలను సంరక్షిస్తున్న ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ముక్తిని ప్రసాదించే తిరుపతి పుణ్యక్షేత్రం అతి పురాతన తాళపత్ర గ్రంథాలను తనలో దాచుకుంది.. వేద, ఉపనిషత్తులను సంరక్షిస్తూ భావితరాలకు అందిస్తోంది. అందుకు వేదికగా నిలుస్తోంది శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్ఐ).

పునర్ ముద్రణలు

అముద్రిత గ్రంథాలను పరిష్కరించి వెలుగులోకి తేవడమే కాకుండా, ఎప్పుడో ముద్రించినా ఇప్పుడు అందుబాటులో లేని వాటిని తిరిగి సహకారంతో పునర్ ముద్రిస్తోంది.

తాళపత్ర గ్రంథాలను శుభ్రపరుస్తున్న సిబ్బంది

బీజం ఇలా..

నాటి మద్రాసు ముఖ్యమంత్రి పానగల్ రాజు ఆలోచనతో 1937లో తిరుపతిలో శ్రీవేంకటేశ్వర ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్‌కు బీజం పడింది. ఈ సంస్థ నాటి డైరెక్టర్ రంగస్వామి అయ్యంగార్ దేశం నలుమూలలకు పండితులను పంపి సంస్కృతం, తెలుగు, తమిళ భాషలకు చెందిన 10 వేలకు పైగా రాత ప్రతులు, 20 వేలకు పైగా ముద్రిత గ్రంథాలను సమీకరించారు. సంస్థను 1956లో ఎస్వీయూలో విలీనం చేసి ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్ఐ)గా పేరు మార్చారు.

గ్రంథ పరిష్కారం.. సంరక్షణ

భారతీయ సంస్కృతిని తెలిపే తాళపత్రాలు, రాతప్రతులు, అమూల్య గ్రంథాలను పరిష్కరించి సంరక్షించడంతో పాటు భావితరాలకు అందించేందుకు డిజిటలైజ్ చేస్తున్నారు.

● వీటిని వెబ్‌సైట్: www. svuori.com లో అందుబాటులో ఉంచుతోంది.

మొత్తం సేకరణలు

సంస్కృతం:	10,000
ఆంగ్లం:	5,000
తెలుగు:	15,000
మిగతావి:	200

● **పరిశోధన:** పీహెచ్‌డీ, ఎంఫిల్ డిగ్రీల కోసం అముద్రిత గ్రంథాలను వీలైనంత వరకు పరిశోధనాంశాలుగా ఇస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 94 పీహెచ్‌డీలు, అనేక ఎంఫిల్ డిగ్రీలు వచ్చాయి.

గ్రంథాలయాల్లోనూ..

● ఇక్కడి గ్రంథాలయాల్లో గజవైద్యము, గణిత శాస్త్రము, గారడీ విద్య, వాస్తుసారము, శకునశాస్త్ర గ్రంథాలు, రామాయణ, మహాభారత, కావ్య, ప్రబంధ, శాస్త్రాలకు సంబంధించిన మొదటి ముద్రణ గ్రంథాలున్నాయి.

కేవీబీపురం, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు కాళంగి జలాశయానికి వరదనీరు కొద్దికొద్దిగా వచ్చి చేరుతుంది. దీంతో ఇరిగేషన్ అధికారులు సోమవారం నాలుగు గేట్లను మూడడుగుల ఎత్తారు. 750 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. 1440 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. జలాశయం సామర్థ్యం 222 అడుగులు కాగా.. ప్రస్తుతం 218 అడుగుల నిల్వ ఉన్నట్లు ఏఈ సురేష్ తెలిపారు.

పురుగే.. వణికిస్తోంది

చిగర్ మైట్ కీటకం

● జిల్లాలో పెరుగుతున్న 'స్క్రబ్ టైఫస్' కేసులు
● జ్వరాలతో బాధపడుతున్న జనం

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాను కొత్త వ్యాధి హడలెత్తిస్తోంది. అది చిన్న కీటకమే అయినా జ్వరాలతో జనాలను ఆసుపత్రులకు పరుగులు పెట్టిస్తోంది. స్క్రబ్ టైఫస్ అనే జ్వరం చాపకింద నీరులా వ్యాపిస్తోంది. అప్రమత్తమై చికిత్స చేయించుకుంటే ప్రమాదం లేదని వైద్యులు చెబుతున్నారు.

లక్షణాలు

● కీటకం కుట్టిన వెంటనే బ్యాక్టీరియా శరీరంలోకి వెళ్తుంది. ● పది రోజుల్లో జ్వరం వస్తుంది. తల నొప్పి తీవ్రంగా ఉంటుంది. ● నిర్లక్ష్యం చేస్తే శరీరమంతా నల్ల మచ్చలు ఏర్పడతాయి. ● మెదడు, ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. ● వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 243 కేసులు నమోదయ్యాయి. పొరుగు రాష్ట్రాల్లో ఉంటున్న 136 మంది జిల్లా వాసుల్లో ఇది వెలుగు చూసింది. మొత్తంగా 379 కేసులు నమోదైనట్లు చెబుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే కేసులను కలుపుకొంటే ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందని అంచనా. ● తిరుపతి జిల్లాలో 17 కేసులు నమోదయ్యాయి.

ఎలా వస్తుంది..?

● బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉన్న చిగర్‌మైట్ అనే నల్లిని పోలిన కీటకం కుడితే ఈ జ్వరం వస్తుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

● పాత మంచాలు, పరుపులు, దిండ్లను వారానికి ఒకసారైనా శుభ్రం చేసుకోవాలి. ● కాళ్లు, చేతులు కప్పి ఉండేలా దుస్తులు వేసుకోవాలి. ● తడి నేలలు, పొలాలు, గడ్డివాములు, పశువుల పాకల్లో, పుట్టలుండే చోట ఈ పురుగు ఉండే ప్రమాదం ఉంది. జాగ్రత్తలు తీసుకోవాలి.

పట్టించుకోని అధికారులు

ఈ జ్వరాల కేసులు పెరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. పైగా ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసులు, అనుమానిత కేసులను పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

చికిత్సతో నయం చేయొచ్చు

జ్వరం తగ్గకుండా ఉంటే.. శరీరంపై మచ్చలేవైనా ఉంటే పరీక్షలు చేసుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయితే వాటికి తగ్గ చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చు.
– గౌరీప్రియ, ఫిజీషియన్, చిత్తూరు



తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని మాల్వాడిగుండం జలపాతం భక్తులకు కనువిందు చేస్తోంది. రెండో ఘాట్ రోడ్డులోని 9వ కిలోమీటరు వద్ద కొండరాయి వర్షానికి కింద పడింది.పాపవినాశనం, శ్రీవారి పాదాలు మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. – న్యూస్‌టుడే, తిరుమల

యూపీఐ చెల్లింపుల్లో పొరపాట్లా..?

ముకోసం

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: యూపీఐ ద్వారా చెల్లింపులు చేసినప్పుడు ఒక్కోసారి పొరపాటున వేరొకరి ఖాతాకు బదిలీ అవుతుంటాయి. లేదా పెండింగ్‌లో ఉండిపోతాయి. అలాంటి సమయంలో ఆందోళన చెందకుండా ఇలా చేస్తే పోయిన డబ్బులు తిరిగి రాబట్టుకోవచ్చు. లావాదేవీకి సంబంధించి స్క్రీన్‌షాట్ తీసుకొని ఈ కింది నంబర్లను సంప్రదించాలి.

సంప్రదించాల్సిన నంబర్లు

● గూగుల్‌పే: 18004190157.
● ఫోన్‌పే 080 68727374
● పేటీఎం 01204456456
● బీహెచ్ఐఎం 18001201740
● ఎన్‌పీసీఐ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

నేడు జిల్లా అభివృద్ధిపై సమీక్ష

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొని జిల్లా అభివృద్ధి, సమస్యలపై చర్చించనున్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 10 గంటల్లో, రూ. 300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభించనుంది. ఆదివారం స్వామిని 68,187 మంది దర్శించుకున్నారు.

సంక్షేమ అవస్థల గృహాలు

విద్యార్థులను వెంటాడుతోన్న సమస్యలు

పరిశీలన

ఈనాడు– తిరుపతి; న్యూస్‌టుడే బృందం: వైకాపా హయాంలో సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేద విద్యార్థులు చలికి వణుకుతున్నా కార్పెట్లు, దుప్పట్లు ఇవ్వలేదు. జడివానతో గదుల్లోకి వర్షపు నీరు వచ్చినా కిటికీలకు మరమ్మతులు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారి కుప్పంలో పర్యటించినప్పుడే ఉమ్మడి జిల్లాలోని వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కొన్ని పనులు చేసినా మరికొన్ని సమస్యలు అలానే ఉన్నాయి. అద్దెభవనాల్లో ఇరుకు గదులు, నీటిశుద్ధి యంత్రాలు లేక విద్యార్థులు బయటి నుంచి తెచ్చుకుంటున్నారు. అక్కడక్కడా కిటికీలు దెబ్బతిన్నాయి. మెస్‌లు చిరిగిపోయాయి.

ఏడాదిన్నర వ్యవధిలో సాంఘిక సంక్షేమ వసతిగృహాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. బీసీ హాస్టళ్లపైనా కొంత ఖర్చు పెట్టినా ఆ మొత్తం సరిపోలేదు. ఆర్వో ప్లాంట్లు లేక కొందరు వార్డెన్లు బయటి నుంచి నీరు తెప్పిస్తున్నారు. పలమనేరు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో బోరు నీళ్లే దిక్కవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం నిధులిచ్చినా పది శాతం హాస్టళ్లలోనే ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఇది శ్రీకాళహస్తిలోని బీసీ బాలికల వసతిగృహం. ఇందులో కిటికీలకు మెస్‌లు లేవు. భవనం పెచ్చులూడుతోంది. మరుగుదొడ్లకు సక్రమంగా నీటి సరఫరా లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.

తిరుపతి జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలు

సాంఘిక	విద్యార్థులు	బీసీ	విద్యార్థులు	గిరిజన	విద్యార్థులు
65	4,822	61	5,600	16	4,072

రెండు జిల్లాల్లో రూ.20.97 కోట్ల ఖర్చు

జగన్ పాలనలో సంక్షేమ వసతిగృహాల్లోనూ నాడు- నేడు కింద వసతులు కల్పిస్తామని చెప్పినా ఆచరణలోకి రాలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రెండు జిల్లాల్లో రూ. 20.97 కోట్లు ఖర్చు చేశారు. నెల రోజుల క్రితమే కార్పెట్లు, దుప్పట్లు ఇచ్చారు. ఈ ఏడాది మరో రూ.14 కోట్ల వ్యయంతో పనులకు ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని వేగవంతం చేస్తే మిగతా సమస్యలూ తీరతాయి.

శిథిలావస్థలో భవనాలు

శ్రీకాళహస్తి, పూతలపట్టు, నగరి, కుప్పం నియోజకవర్గాల్లోని సంక్షేమ వసతిగృహాలు శిథిలావస్థకు చేరాయి. నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులు ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్నారు. కుప్పం బీసీ సంక్షేమ వసతిగృహంలో పెచ్చులూడుతుండటంతో ఇటీవల 23 మందిని సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు మార్చారు. ఇప్పుడు 5 గదుల్లో 68 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడ కిటికీలు దెబ్బతిన్నాయి.

శిక్షణ.. ఆరోగ్య రక్షణ

తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణకు సోమవారం మొబైల్ ట్రైనింగ్ సెంటర్ జాన్సన్ అండ్ జాన్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ వీల్స్ వాహనం వచ్చింది. ఈ బస్సులోనే జనరల్ సర్జరీ, యూరాలజీ, పీడియాట్రిక్స్, వివిధ విభాగాలకు సంబంధించి లాప్రోస్కోపిక్ విధానంపై ఎస్వీఎంసీ పీజీ వైద్య విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. రెండ్రోజుల పాటు శస్త్రచికిత్సల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

– ఈనాడు, తిరుపతి

చివరి ఊరు.. పొడవైన పేరు

దేశంలోనే అతి పొడవైన పేరున్న రైల్వేస్టేషన్ మన జిల్లాలోనే ఉందని తెలుసా మీకు.. అదే మన రాష్ట్ర సరిహద్దులోని చివరి రైల్వేస్టేషన్ 'వెంకటనరసింహరాజు వారిపేట'. ఇది లిమ్కా బుక్ రికార్డులోనూ స్థానం సంపాదించుకుంది. చిత్తూరు జిల్లా నగరి మండలం తమిళనాడు సరిహద్దులో ఉంది. ఆదాయం లేకపోవడంతో గతంలో ఈ స్టేషన్‌ను రద్దు చేయాలని రైల్వే అధికారులు యత్నించగా.. స్థానికులు అభ్యంతరం తెలిపి.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కాపాడుకున్నారు. పేరు కోసమే ఇక్కడి ప్రజలు రైలు ప్రయాణానికి ప్రాధాన్యమిస్తున్నారు. – న్యూస్‌టుడే, నగరి

తప్పిన దిత్వా ముప్పు

నేడు కొనసాగనున్న మోస్తరు వర్షాలు

తిరుపతి (కలెక్టరేట్), వరదయ్యపాళెం: జిల్లాకు దిత్వా తుపాను ముప్పు తప్పింది.. 3 రోజులుగా వాతావరణ శాఖ అప్రమత్తం చేస్తూ వచ్చింది. వర్షం ప్రభావం పెద్దగా లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం తీర ప్రాంతాల్లో జల్లులతో కూడిన వర్షం పడింది.

వరదయ్యపాళెం: వరి పొలంలో నిలిచిన వర్షపునీరు

జనజీవనానికి అంతరాయం

వరుసగా ఏర్పడుతున్న తుపాన్ల ప్రభావంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండురోజులుగా జల్లులు కొనసాగడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. రహదారులు, గ్రామాల్లోని వీధుల్లో నీరునిలిచి మురుగు కూపాలుగా మారాయి. మొంథాతో రైతులు ఇబ్బందులు పడగా రెండువారాల వ్యవధిలోనే మళ్లీ దిత్వా ఆవహించడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది.

నేడు విద్యా సంస్థలకు సెలవు లేదు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తుపాను తగ్గు ముఖం పట్టిన నేపథ్యంలో మంగళవారం విద్యా సంస్థలు యథావిధిగా పని చేస్తాయని డీఈవో కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు. కొందరు సెలవు అని ప్రచారం చేస్తున్నారని, ఎవరూ నమ్మొద్దని పేర్కొన్నారు.

వర్షపాతం వివరాలు (మి.మీ.)

సత్యవేడు:	38.02
తడ:	37.04
వరదయ్యపాళెం:	35.08
బుచ్చినాయుడుకండ్రిగ:	30.04
సూళ్లూరుపేట:	24.00
ఓజిలి:	20.08
పెళ్లకూరు:	20.04
కేవీబీపురం:	18.06
వాకాడు:	17.08

జిల్లాలో 92.78% పింఛన్ల పంపిణీ

తిరుపతి (భవానీనగర్, జీవకోన), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ సోమవారం తిరుపతి జిల్లాలో 92.78 శాతం పూర్తయింది. కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. దిత్వా ప్రభావంతో తీర ప్రాంతాల్లోని కొన్ని మండలాల్లో సాంకేతిక లోపాలు, రవాణా సమస్యలు ఎదురై కొంత ప్రభావం పడినట్లు వివరించారు. జీవకోనలోని 48, 49 డివిజన్లలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా, భద్రత పింఛన్ల పంపిణీలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య, శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరసన తెలిపి.. ఆకాంక్ష చాటి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరును జిల్లా చేయాలి, లేకుంటే నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని గడియార స్తంభం కూడలి వద్ద గూడూరు జిల్లా ఐకాస ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నెల్లూరుతో ఎన్నో సంవత్సరాలుగా అనుబంధం ఉందని, తిరుపతిలో కలపడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు అసోసియేషన్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గడియార స్తంభం కూడలి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఐకాస నాయకులు

8న ఐటీఐ అప్రెంటీస్‌షిప్ మేళా

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో ఐటీఐ ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు జిల్లాలోని గుర్తింపు పొందిన పరిశ్రమల్లో అప్రెంటీస్‌షిప్‌నకు అవకాశం కల్పిస్తున్నట్లు ఐటీఐల జిల్లా కన్వీనర్ పి.గణేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని ఐటీఐ ఆవరణలో జరిగే కార్యక్రమంలో తితిదే, ట్రాన్స్‌పోర్ట్, ఎస్పీడీసీఎల్ తదితర సంస్థలు హాజరవుతాయన్నారు.

సంప్రదించాల్సిన నంబర్లు
94416 47174, 82970 06849

WANTED

Required Experienced Marketing Executives for **Marketing Pesticides, Micro Nutrients and Bio Stimulants** to work for Sovereign Agro Insecticides, having 48 year's experience in Manufacturing and Marketing Agri Inputs.

Candidates with at least 10 years' experience in the same area can apply through WhatsApp for these following Districts.

ELURU, VIZIANAGARAM, VISAKHAPATNAM, SRIKAKULAM, NELLORE, PRAKASAM, BAPATLA, CHITTOR AND KADAPA Districts.

SOVEREIGN AGRO INSECTICIDES
6/13, Brodipet, GUNTUR. Mobile: 86397 49674

నియోజకవర్గానికో పశువుల వసతిగృహం

న్యూస్‌టుడే, తిరుపతి(వ్యవసాయం): పాడిరంగ అభివృద్ధిలో భాగంగా పశువుల వసతిగృహాల (యానిమల్ హాస్టల్) పేరుతో మెగా గోకులాల ఏర్పాటుకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కసరత్తు చేస్తోంది.

వీటిని నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందుబాటులోకి తేనున్నారు. ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో అధికారులు విధివిధానాలు రూపొందించారు.

5-6 ఎకరాల విస్తీర్ణంలో..

● ఎంపిక చేయబడిన ప్రాంతంలో పోరంబోకు, అనాధీనం, ప్రభుత్వ జాగాలు గుర్తించి కలెక్టర్ కేటాయిస్తారు. ● ప్రభుత్వ భూమి లేనిచోట ఐదేళ్ల లీజుకు ప్రైవేటు భూమిని సేకరించవచ్చు. ● **విస్తీర్ణం:** 5 నుంచి 6 ఎకరాల్లో ఏర్పాటు చేస్తారు. ● ఉపాధి హామీ నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలతో వీటిని నిర్మిస్తారు. ● 25 నుంచి 30 పశువులు ఆశ్రయం పొందేలా ఎకరా స్థలంలో షెడ్లు, స్టోరేజీ గది ఉంటుంది. ● మిగిలిన నాలుగైదు ఎకరాలలో గడ్డి పెంచుతారు. ● ఒక్కో పశువుల శాల నిర్మాణానికి రూ.10 లక్షలు ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేస్తారు. ● గ్రామంలోని మహిళా, రైతు సంఘాలు, సొసైటీలు, ఎఫ్‌పీవో తదితర సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. ● ఆరు నెలల వ్యవధిలో పశువులశాలల నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు.

సంక్రాంతికి నారావారిపల్లెలో..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి స్వగ్రామం నారావారిపల్లె నుంచే వీటిని ప్రారంభించేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. సంక్రాంతికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందించారు. నారావారిపల్లె సమీపంలోని మూలపల్లె వద్ద ఐదెకరాల స్థలాన్ని ఇప్పటికే అధికారులు గుర్తించినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.ఎ.రవికుమార్ తెలిపారు.

నిర్వహణ ఇలా..

● పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా నీటి ట్యాంకు, బోరుబావి, గడ్డి పెంపకానికి, బయో గ్యాస్ ప్లాంట్‌లతో పాటు మహిళా సంఘాలు, సహకార సంఘాల ద్వారా గడ్డి కత్తిరింపు యంత్రాలు, పాలు పితికే యంత్రాలను సమకూర్చుతారు. ● పశువులశాల నిర్వహణకు అయ్యే ఖర్చు, కూలీలు, ఇతర వ్యయాలను లెక్కించి గోబర్ గ్యాస్, సేంద్రియ ఎరువు అమ్మకాలతో జమచేస్తారు. అదనపు ఖర్చును భరించాల్సి ఉంటుంది.

ప్రయోజనాలు..

● పాల ఉత్పత్తి 10-15 శాతం పెరగడంతో పాటు మార్కెటింగ్ సదుపాయం ఉంటుంది. ● హాస్టల్‌లో లభ్యమయ్యే పేడ నుంచి సేంద్రియ ఎరువు, బయో గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ● పశువుల ఆరోగ్యానికి, మేతకు భరోసా ఉంటుంది.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

దహనక్రియలు

మంచితనానికి మారుపేరుగా నిలిచి,
మాకు ప్రేమ, ఆప్యాయతానురాగాలను పంచి,
మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి,
మా అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించిన
మా ఇంటిదైవం శ్రీమతి కారపాకుల శాంతమ్మ గారు
01.12.2025వ తేది సోమవారం ఉదయం 7 గంటలకు
స్వర్గస్తులైనారు.

తదుపరి **దహనక్రియలు**
తేది 03.12.2025 బుధవారం
ఉ॥ 10 గ॥లకు మా స్వగ్రామము
కె.వి.పల్లి (మం॥), చిన్నకమ్మపల్లి నందు
జరుగునని తెలియజేయడమైనది.

మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ..
శోకతప్త హృదయాలతో...

శ్రీమతి కారపాకుల శాంతమ్మ గారు
మరణం: 01.12.2025
చిన్నకమ్మపల్లి,
కె.వి.పల్లి మండలం, అన్నమయ్య జిల్లా.

భర్త: **కె.రెడ్డెప్పనాయుడు**
మాజీ సర్పంచ్, చిన్నకమ్మపల్లి, కె.వి.పల్లి మండలం
మరియు **కుటుంబ సభ్యులు**
సెల్: 9490495279, 9502196177

(c) eenadu

పంటల మార్పిడి అధిక దిగుబడి

కోట, న్యూస్‌టుడే: పంటల మార్పిడి విధానం ద్వారా కూరగాయల సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని వెంకన్నపాళెంకు చెందిన కస్తూరయ్య నిరూపిస్తున్నారు. కోట, చిల్లకూరు, గూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు నాటు వంగ సాగు చేస్తూ అధిక దిగుబడులు పొందుతున్నారు. ఈ క్రమంలోనే కస్తూరయ్య వెంకన్నపాళెంలో 50 సెంట్లు భూమిలో వంగ సాగు చేసి లాభాలు పొందుతున్నారు.

దిగుబడి: రెండు నెలల తరువాత వంకాయలు కాస్తాయి. ఒక్కోటి 50 నుంచి 60 గ్రాముల వరకు ఉంటుంది. ■ కోత కోసిన వారం రోజులకు ఒకసారి దిగుబడి వస్తుంది. ఎకరాలో 600 కిలోల వరకు దిగుబడి వస్తుంది.

మార్కెటింగ్: గూడూరు డివిజన్‌లోని గూడూరు, కోట, వాకాడు, చిల్లకూరు, నాయుడుపేట, చిట్టమూరు మండలాల్లో వంగకు మంచి గిరాకీ ఉంది. మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60ల వరకు ఉంది.

రూ.30 వేల ఆదాయం

50 సెంట్లు సాగుకు రూ.70వేల వరకు ఖర్చయింది. రూ. 30వేలకు పైగా ఆదాయం వచ్చే అవకాశముంది. సేంద్రియ ఎరువులతో పాటు రసాయనిక ఎరువులను వినియోగించి సాగు చేశా. **- కస్తూరయ్య, రైతు**

రైతేరాజు

వరిలో విత్తనశుద్ధి.. ప్రయోజనమండి

పుత్తూరు: విత్తనశుద్ధి ద్వారా కలిగే ప్రయోజనాలను నగరి వ్యవసాయ సహాయ సంచాలకులు కవిత వివరించారు.

ఇలా చేయాలి.. కిలో విత్తనానికి 2.5గ్రాముల కార్బెండజిమ్‌ను కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవచ్చు.

నారుమళ్లకైతే.. లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండజిమ్ కలిపి ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టాలి. మరో 24 గంటల పాటు మండె కట్టి మొలకలను దమ్ము నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాల నానబెట్టేందుకు లీటరు నీరు అవసరమవుతుంది. ■ విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. మొలకెత్తిన విత్తనాలను 0.2శాతం క్లోరిపైరిపాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి.

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రశ్న: వరి నాట్లు వేశాం. ఎటువంటి కలుపు మందు పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి? **- స్వామి, రైతు, కృష్ణాపురం**

జవాబు: వరి నాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లోపు బెన్సల్ఫ్యూరాన్ మిథైల్ 0.6 ప్లస్ పెట్రోలాక్లోర్ 6 శాతం గ్రాన్యూల్స్ ఎకరానికి నాలుగు కిలోల చొప్పున చల్లితే తుంగ, ఊదర, వెడల్పాటి ఆకు మొదలగు కలుపు మొక్కలన్నీ నశిస్తాయి. కలుపు మందు చల్లుకోవడానికి 48 గంటలు వర్షం లేని సమయం చూసి చల్లుకోవాలి.
- సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రేణిగుంట

వరి సాగులో సూచనలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: రబీలో వరి సాగు చేసే రైతులు తగిన సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నాయుడుపేట ఏడీఏ నాగార్జున సాగర్ పేర్కొన్నారు. ఎక్కువగా బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, ఎంటీయూ 1224, ఎన్ఎల్ఆర్ 34449 రకాలు సాగు చేస్తున్నారు.

❖ బీపీటీ 5204 రకం నాట్లు వేశాక 10 నుంచి 20 రోజుల వయసులో అగ్గితెగులు సోకకుండా ఎకరాకు 120 గ్రాములు ట్రైసైక్లోజోల్ (బాణ్, ప్లాక్, సివిక్, భీమ్) మందు పిచికారీ చేయాలి. ❖ ఇతర రకాల నారు మడుల్లో బస్తా నారుకు కిలో కార్బోఫ్యూరాన్ గుళికలు నాటుకు వారం రోజుల ముందు వేయాలి. ❖ ఆర్ఎన్ఆర్ 15048 రకం నారు 22 రోజుల వయసులో నాట్లువేస్తే ఎక్కువగా పిలకలు వచ్చి ఎక్కువ దిగుబడులు వస్తాయి. ❖ నాట్లు చదరపు మీటరుకు 44 కుదుళ్లు ఉండేలా చూసుకోవాలి. ❖ నాట్లు వేసిన వారం రోజుల నుంచి నీరు పలుచగా నేల కనిపించేలా పెట్టాలి. గాలి, వెలుతురు పిలకలకు తగిలి ఎక్కువ దిగుబడి వస్తుంది. ❖ కాంప్లెక్స్ ఎరువులు 20:20:0, 19:19:19, 14:35:14, డీఏపీ(పాస్పేటు ఎరువులను) తప్పనిసరిగా నాట్లకు ముందు చివరి దుక్కిలో వేయాలి. ❖ నత్రజని (యూరియా)ను మూడు దఫాలుగా ఒక దఫాకు బస్తా(45కిలోలు) వంతున వేయాలి. ❖ పొటాష్ ఎరువును రెండు దఫాలుగా ఒక్కోసారి 15 కిలోలు చొప్పున నాట్లు వేసిన 15 రోజులకు ఒకసారి, (45 రోజులకు అంకురార్పణ దశ, చివరిదఫా యూరియాతో కలిపి) రెండోసారి వేసుకోవాలి.

❖ పైరు పెరుగుదలను బట్టి చివరి దఫాలో నానోయూరియా ఎకరాకు 500 మిల్లీలీటర్లు, నానో డీఏపీ 500 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలి. ❖ 40 రోజుల వరకు మందుల పిచికారీ అవసరం లేదు.

రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వ్యవసాయంతో పాటు పెరటి కోళ్ల పెంపకంతో రైతులు అభివృద్ధి బాటలో నడిచేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఆసక్తి కల్గిన పెంపకం దారులు పెరటి కోళ్ల పెంపకం ద్వారా లాభాలు పొందే అవకాశముంది. కోడి పిల్లల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

■ కోడి పిల్లలు మొదటి 4 నుంచి 6 వారాల వయసు వరకు చాలా జాగ్రత్తగా పెంపకం చేయాలి. ■ పొదిగిన గుడ్ల నుంచి వేరుబడిన పిల్లలను తల్లికోడి తన రెక్కల కింద ఉంచుకుని తగిన ఉష్ణోగ్రతను అందిస్తుంది. ■ అదే ఎక్కువ సంఖ్యలో కోడి పిల్లలు పెంచుతున్నప్పుడు ఒక రోజు వయసు కల్గిన కోడి పిల్లలను సంస్థల నుంచి తెచ్చుకొని వాటికి శాస్త్రీయ పద్ధతిలో బ్రూడర్ ఏర్పాటు చేయాలి. ■ అలా చేయకుంటే అధిక మరణాలు సంభవించే అవకాశముంది. ■ కోడి పిల్లలు తీసుకురావడానికి ముందే ఒక షెడ్డులో వరి పొట్టు వంటి లిట్టర్ 2-3 అంగుళాల ఎత్తు పోసి దానిపై పేపర్లు పరచాలి. ■ వాటిపైన దాణాకు నీటి పాత్రలను చక్రాకారంగా అమర్చవలెను. ■ గడ్డి వేడిగా ఉండేందుకు బల్బులను బ్రూడర్లకు వేలాడదీయాలి. మొదటి వారం 95 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండాలి. తరువాత ప్రతి వారం 5 డిగ్రీలు వంతున తగ్గించుకుంటూ రావాలి. ■ 3-4 వారాల వరకు బ్రూడర్లు ఏర్పాటు చేయాలి. ■ బ్రూడర్ కింద ఉష్ణోగ్రత సరిగా ఉంటే కోడిపిల్లలు అంతా సమంగా విస్తరించి ఉండేందుకు వీలుంటుంది. ■ ఉష్ణోగ్రతను బట్టి బ్రూడర్లను సరిగా ఏర్పాటు చేయాలి. ■ కోడి పిల్లలు ఫాంలోనికి వచ్చిన వెంటనే గ్లూకోజ్, ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీటిని అందుబాటులో ఉంచాలి. ■ బ్రూడర్ల నుంచి అడుగు దూరంలో చిక్ గార్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలి.

■ మొదటి రోజు మొక్కజొన్న గింజల పొడిని పేపర్ చల్లాలి, రెండో రోజు దాణాపై ఇవ్వాలి. దీని కోసం మార్కెట్‌లో లభించే లేయర్ గ్రోయర్ లేదా బ్రాయిలర్ వాడవచ్చు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే పెరటి కోళ్ల ఆరోగ్యవంతంగా, అత్యధిక బరువును కలిగి ఉండేందుకు వీలుంటుంది. **- డాక్టర్ భాస్కర్, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు, శ్రీకాళహస్తి**

మున్సిపాలిటీ దిశ.. మారనున్న దశ

☛ సత్యవేడు, వరదయ్యపాళెంలో ఏర్పాటుకు అడుగులు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా సత్యవేడు, వరదయ్యపాళెం పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించేందుకు ప్రభుత్వం అడుగులు వేసింది. ఈ మేరకు ప్రజాభిప్రాయం, తీర్మానం చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో పట్టణ దశ, దిశ మారనుందని ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాటి ప్రతిపక్షనేతగా సత్యవేడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సత్యవేడు, వరదయ్యపాళెంను మున్సిపాలిటీలుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఆ హామీని నెరవేర్చే క్రమంలో వాటికి మూడు కి.మీ. పరిధిలోని పంచాయతీలు సైతం విలీనం చేసి మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దడానికిగల సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

సత్యవేడు టవర్‌క్లాక్

విలీనం కానున్న పంచాయతీలివే

సత్యవేడులో: వీఆర్‌కండ్రిగ, ఎన్‌ఆర్‌అగ్రహారం, కొత్తమరికుప్పం, కాళమనాయుడుపేట, మదనంబేడు పంచాయతీలు

వరదయ్యపాళెంలో: ఇందిరానగర్, సీఎల్‌ఎన్‌పల్లి, కదూరు, కాంబాక్కం, కురుంజలం, అరూరు, కంచరపాళెం పంచాయతీలు

మెజారిటీ ఆమోదం.. కొందరికి రాజకీయ ఖేదం

తమ పంచాయతీలు మున్సిపాలిటీ పరిధిలోకి వస్తే మౌలిక వసతులు సమకూరి అభివృద్ధి చెందుతాయని పలువురు సర్పంచులు, నాయకులు ఆమోదం తెలుపుతుండగా పంచాయతీలో తమ రాజకీయ ప్రాబల్యం తగ్గిపోతుందనే కారణంగా మరికొందరు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. తమ మండల కేంద్రానికి మూడు కి.మీ. దూరంపైగా ఉన్నందున తమకు ఆమోద యోగ్యం కాదని వరదయ్యపాళెం మండలం కంచరపాళెం, కురుంజలం పంచాయతీలు అంగీకరించలేదు. వరదయ్యపాళెం పక్కనే ప్రభుత్వ కార్యాలయాలన్నీ కొలువైన ఇందిరానగర్ సైతం తమకు అంగీకారం కాదని ఓ విపక్ష రాజకీయ నాయకుడు, స్థానిక ప్రజాప్రతినిధి వ్యతిరేకించినట్లు సమాచారం.

కార్యదర్శులకు నోటీసులు

సత్యవేడు మండలంలోని ఆరు పంచాయతీలు, వరదయ్యపాళెం మండలంలోని ఏడింటిని పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించేందుకు ప్రజాభిప్రాయం ద్వారా ఆయా పంచాయతీల నుంచి తీర్మానం చేసి నివేదించాల్సిందిగా నెలరోజుల కిందట కలెక్టరు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గడువు ముగిసినా కార్యదర్శులు తీర్మానం పంపకపోవడంతో వివరణ కోరుతూ ఆయా పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

తిరుపతి కేంద్రంగా రాయలసీమ అభివృద్ధి

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు నేతృత్వంలో సమగ్ర ప్రణాళికలు అమలవుతున్నాయని, విశాఖ, సెంట్రల్, రాయలసీమ జోన్లుగా విభజించి అన్ని ప్రాంతాలకూ మేలు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం జీవకోనలోని 48, 49 డివిజన్లలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా, భద్రత పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య, శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువన్షీతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తిరుపతి కేంద్రంగా రాయలసీమ జోన్‌ను స్పిరుచ్వల్ టూరిజం, పరిశ్రమలతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. నాయుడుపేట, సూళ్లూరుపేట వంటి ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ పరిశ్రమలు ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. తిరుపతి చుట్టుపక్కల నూతన టౌన్‌షిప్‌లు, కన్వెన్షన్ సెంటర్లు, టూరిజం హబ్బులు ఏర్పాటు చేయడానికి కేబినెట్ ఆమోదం లభించినట్లు చెప్పారు. పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో మొత్తం 2,62,108 మంది పింఛనర్లకు రూ.112.69 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే ఆరణి, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డితో కలసి పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యప్రసాద్

బ్లడ్ బ్యాంకు సిబ్బందికి సేవా పురస్కారం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: విధినిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు సిబ్బంది.. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ మౌలాలీ, సిబ్బంది బాబురావు, ఆదిశేషయ్య, దిలీప్‌లు అవార్డు అందుకున్న వారిలో ఉన్నారు.

మంత్రి సత్యకుమార్‌యాదవ్ నుంచి పురస్కారం అందుకుంటున్న వైద్య సిబ్బంది

తిరుమలలో గీతాపారాయణం

తిరుమల: గీతాజయంతి సందర్భంగా నాదనీరాజనం వేదికపై గీతా పారాయణాన్ని నిర్వహించారు. సోమవారం సాయంత్రం ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ శివసుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో 50 మంది వేదపండితులు భగవద్గీతలోని 18 అధ్యాయల్లోని 700 శ్లోకాలను పారాయణం చేశారు.

గూడూరును నెల్లూరులో కలపాలని వినతి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను తిరుపతిలో కలసి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎన్నికల్లో హామీ ఇచ్చారని మంత్రి సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. బిల్లు చెంచురామయ్య, రహీమ్ పాల్గొన్నారు.

తితిదే ఆలయాల్లో అన్నప్రసాదాల పెంపు

తిరుపతి (తితిదే): తిరుమల తరహాలో తితిదే పరిధిలోని 62 ఆలయాల్లో భక్తులకు తగినంత పరిమాణంలో దిట్టం పెంచి అన్నప్రసాదాలు రుచిగా, శుచిగా, నాణ్యంగా అందించాలని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. పలు అభివృద్ధి పనులపై స్థానిక పరిపాలనా భవనంలో సోమవారం సమీక్షించారు. పోటు సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చి పంపిణీ పటిష్ఠంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు.

న్యాయ కళాశాలల్లో ప్రవేశాల గొడవ

తిరుపతి (విద్య): ప్రైవేటు న్యాయ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద సీట్లు పొందిన విద్యార్థులను చేర్చుకోవడానికి సంబంధిత యాజమాన్యాలు నిరాకరించినట్లు ఆరోపణలొచ్చాయి. కళాశాలల్లో చేరడానికి సోమవారం ఆఖరు తేదీ కాగా ఆలస్యం చేశారని, నిబంధనలు వర్తించవని, సీట్లు లేవని చెప్పినట్లు విద్యార్థులు ఆరోపించారు. ఇక్కడి కన్వీనర్ సీట్లను తమిళనాడు విద్యార్థులకు అమ్ముకున్నారని, అందుకే తమకు ప్రవేశాలు నిరాకరించారని ఓ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ, విద్యార్థి ఐకాస ప్రతినిధులు ఆందోళనకు దిగారు. దీనిపై లాసెట్ కన్వీనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. బార్ కౌన్సిల్ నిబంధనల మేరకు కొందరిని అనర్హులిగా గుర్తించామని, కన్వీనర్ వివరణ తీసుకున్నాక ప్రవేశాలు కల్పిస్తామని సంబంధిత యాజమాన్యాలు వెల్లడించాయి.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని బుల్లితెర నటుడు కౌశల్ మంద, నటుడు గౌతంరాజు, తెలంగాణ మాజీమంత్రి పి.మహేందర్‌రెడ్డి దర్శించుకున్నారు.

సందడిగా.. లీన్

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి ఐఐటీలో జరుగుతున్న ఇండియన్ లీన్ కన్‌స్ట్రక్షన్ - 2025 కాన్ఫరెన్స్ (ఐఎల్‌సీసీ) సోమవారం సందడిగా కొనసాగింది. నాలుగురోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో సోమవారం పరిశ్రమల ప్రతినిధులు వారి అనుభవాలు పంచుకున్నారు. ముగింపు సెషన్‌లో ప్రశ్నోత్తరాలు జరిగాయి. పరిశ్రమలు, కళాశాలల నుంచి వచ్చిన నిపుణులు పరిశోధనా పత్రాలు, పోస్టర్లు ప్రదర్శించనున్నారు. ఐఐటీ తిరుపతి నోడల్ హబ్‌గా మారుతున్న నేపథ్యంలో ఈ కాన్ఫరెన్స్ ఆంధ్రప్రదేశ్ వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడానికి కీలకమైందని నిర్వాహకులు తెలిపారు. మార్టన్ మర్ఫుజుకీ(ఆస్ట్రేలియా), అశోక్‌కుమార్, సురభ్ వర్మ(కల్పతరు), సెను.కె. (ఎల్అండ్‌టీ), అశ్విన్ మహలింగ్, (ఐఐటీ మద్రాస్), ప్రసన్నకుమార్ (సివిల్ ఇంజినీరింగ్) తదితరులు పాల్గొన్నారు.

హాజరైన పరిశోధకులు, నిపుణులు

మళ్లీ బాంబు బెదిరింపులు.. తనిఖీలు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతిలో బాంబు బెదిరింపులతో మళ్లీ కలకలం రేగింది. నగరంలోని రాజ్‌పార్క్, పాయ్ వైస్రాయ్ హోటళ్లను పేలుడు పదార్థాలతో పేల్చివేస్తున్నట్లు మెయిల్ చేసి హెచ్చరించారు. పాకిస్థాన్ తీవ్రవాదిని తమిళనాడులో శిక్షించిన ఘటనపై ప్రముఖ తీవ్రవాద సంస్థ దేశవ్యాప్తంగా పేలుళ్లకు రూపకల్పన చేసినట్లు అందులో పేర్కొన్నారు. యాత్రికులు సేదతీరే రెండు హోటళ్లను పేల్చి వేయనున్నట్లు పేర్కొనడంతో వాటి యాజమాన్యం సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చింది. వెంటనే అలిపిరి ఎస్సై అజిత ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టి ఎలాంటి పేలుడు పదార్థాలు లేనట్లు నిర్ధారించారు.

తనిఖీలు నిర్వహిస్తున్న డాగ్ స్క్వాడ్ సిబ్బంది

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆9381287629.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

తిరుపతి - చంద్రగిరి టౌన్‌లో మెయిన్‌రోడ్‌కు ఆనుకొని హౌస్ - విల్లా - హోమ్‌స్టే & అపార్ట్‌మెంట్ కట్టుకునే TUDA అప్రూవల్ కొత్త వెంచర్‌లో కమర్షియల్ - రెసిడెన్షియల్ - ఇన్వెస్ట్‌మెంట్ కొరకు 100% వాస్తు Plots అమ్మబడును. సంప్ర॥ 9505502346.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

LEASE/ RENT

GENERAL

Tirupati, Mangalam, Karakambadi Road RTC Depo Road, Front 60 feet Road, 1200 Sft for Godown Purpose. Pls Con: 9652441555

JOBS

Exp. మాస్టర్స్(జీ: 30K) & వెయిటర్స్(జీ:12K) కావలెను. ఫ్రీ భోజనం + వసతి. హోటల్ శరవణ భవన్, తిరుచానూరు ✆ 7093543337, 8897940639.

నెల్లూరులోని ప్రముఖ మాల్‌లో క్రింది సిబ్బంది కావలెను. లాండ్రీ సూపర్‌వైజర్ : ఆటోమేటిక్ వాషింగ్ మిషన్‌లో యూనిఫారమ్స్ వాషింగ్, ఇస్త్రీ చేయుటలో మంచి అనుభవము ఉండవలెను. సెక్యూరిటీ సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డ్స్: ఎత్తు:5'8ft (పురుషులు), 5'4ft (స్త్రీలు) అనుభవజ్ఞులకు ప్రాధాన్యము. వయస్సు: 25-35 సంవత్సరాలు. మంచిజీతం, PF, ESI, గ్రాట్యూటీ, వార్షిక బోనస్ ఇవ్వబడును. దూరప్రాంత అభ్యర్థులకు ఉచిత బ్యాచిలర్ వసతి, భోజనం కలదు. ✆7997733000, 7997766000.

అన్న క్యాంటీన్‌కు తిరుపతి నుండి చిత్తూరుకు Food Transport చేయడానికి దోస్త్ వెహికల్‌కు పర్మనెంట్ డ్రైవర్స్ కావలెను. ✆ 99661 29199.

తిరుచానూరు మెయిన్ రోడ్డు లాడ్జి నందు పనిచేయుటకు (Male) రూమ్‌బాయ్స్ కావలెను. ✆ 91105 50998.

ప్రముఖ ఇంటర్నేషనల్ కొరియర్ సంస్థ బెంగుళూరు బ్రాంచ్ కొరకు TATA ACE డ్రైవర్స్ కావలెను. అకామిడేషన్ కలదు. 9014530584, 9291901305.

SECURITY GUARDS

Wanted Security Guards age 30-50Yrs, Good Salary with weekly off, For all over andhra. ✆ 9100058959, 9618508494.

THE EENADU CLASSIFIEDS WAY
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

నకిలీ సీఐ అరెస్టు

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే : పోలీసుశాఖలో తాను సీఐని అంటూ పలువురిని బెదిరిస్తున్న నకిలీ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపారు. జంగావాండ్లపల్లి పంచాయతీ అప్పేపల్లికి చెందిన రెడ్డిఈశ్వర్, భానుశ్రీలు భార్యాభర్తలు.. వీరిమధ్య మనస్పర్థలు రాగా శివకుమార్ అనే వ్యక్తి జోక్యం చేసుకున్నాడు. తాను సీఐని అంటూ రెడ్డిఈశ్వర్‌ను బెదిరించాడు. దీంతో అతను అనుమానంతో భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు కేవీపల్లి మండలం పెద్దకంపల్లికి చెందిన శివకుమార్ కడప స్పెషల్ బ్రాంచ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చలామణి అవుతున్నట్టు గుర్తించారు. సోమవారం భాకరాపేట హైవేరోడ్డులోని హోటల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు గతంలోనూ కలకడ మండలానికి చెందిన ఆంజనేయులకు ఉద్యోగం ఇప్పిస్తానని అతని నుంచి రూ.8 లక్షలు తీసుకొని మోసగించినట్లు వెల్లడైంది. ఎస్సైలు రాఘవేంద్ర, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పాపవినాశనం డ్యామ్ పటిష్ఠతపై పరిశీలన

తిరుమల, న్యూస్‌టుడే: పాపవినాశనం జలాశయం పటిష్ఠతపై కేంద్ర జలశక్తి విభాగానికి చెందిన సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలన చేపట్టారు. విభాగానికి చెందిన సైంటిస్టులు సెంథిల్, స్వామి, సహాయకుడు దీపక్‌తో కలిసి నీటి అడుగున అత్యాధునిక రిమోట్ ఆపరేటింగ్ వెహికల్ కెమెరాతో వీడియో రికార్డింగ్ చేపట్టారు. దీంతో పునాదులు, ఇతర స్ట్రక్చర్ల పటిష్ఠత, లోటుపాట్లను విశ్లేషిస్తున్నారు. గురువారానికి ముగియనుంది. ఇరిగేషన్ ఈఈ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పరిశీలనలో భాగంగా 40 సంవత్సరాలకు పైబడిన జలాశయాలు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. శాస్త్రవేత్తల విశ్లేషణ, నివేదిక అందాక ఏవైనా మరమ్మతులు, ఇతర ఏర్పాట్లు చేయాల్సి ఉంటే చేపడతామన్నారు.

వీడియోలు పరిశీలిస్తున్న సైంటిస్టులు సెంథిల్, స్వామి

ఎర్రచందనం కేసులో అయిదేళ్ల జైలు

తిరుపతి (లీగల్): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులు ఒక్కొక్కరికి అయిదేళ్ల జైలుశిక్ష, రూ.3లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి సోమవారం తీర్పు వెలువరించారు. సదుం మండలం బూరగమందకి చెందిన పి.వెంకటరమణ, అదే ప్రాంతానికి చెందిన మల్లెల హరినాథ్‌లను అరెస్టు చేసి కోర్టుకు అప్పగించగా కేసు సాక్ష్యాధారాలతో నిరూపితమైంది.

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీకి 62 వినతులు

తిరుపతి (నగరం): తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో జరిగిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి 62 వినతులు వచ్చాయి. సోమవారం సీఎండీ శివశంకర్ లోతేటి ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకున్నారు. తొమ్మిది జిల్లాల నుంచి వినియోగదారులు ఫోన్‌చేసి సమస్యలు తెలిపారు.

అల్లుడిపై వేడినూనె పోసిన అత్త

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: అల్లుడిపై అత్త, అతని భార్య కలసి వేడినూనె పోసిన ఘటన పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. రెండో పట్టణ ఎస్సై షాజహాన్ తెలిపిన వివరాల మేరకు.. ఓజిలి మండలం నెమళ్లపూడి గ్రామానికి చెందిన రాజాకు గూడూరు పట్టణంలోని శ్రీలక్ష్మీతో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. పట్టణంలోని ఇందిరానగర్‌లో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా రాజా ఇటీవల స్వగ్రామమైన నెమళ్లపూడిలో ఉంటున్నారు. ఈ క్రమంలో రాజా సోమవారం ఇందిరానగర్‌లోని భార్య ఉంటున్న నివాసానికి వెళ్లాడు. ఈ సందర్భంగా భార్య, అత్త సుధారాణిలతో వివాదం చోటుచేసుకుంది. దీంతో అల్లుడిపై అత్త వేడినూనె పోయడంతో అతను తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుచానూరు సమీపంలో మూడు మృతదేహాల గుర్తింపు

☛ ఆత్మహత్యగా పోలీసుల అనుమానం

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూరు సమీపంలోని దామినేడు ఇందిరమ్మ గృహాల్లో కుళ్లిన స్థితిలో ఉన్న ముగ్గురి మృతదేహాలను సోమవారం గుర్తించారు. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన సత్యరాజ్(30) తన భార్యను వదిలేసి అదే ప్రాంతానికి చెందిన వివాహిత పొంగొట్టై (21)తో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. మూడునెలల కిందట ఇక్కడికి వచ్చారు. స్థానిక ఇందిరమ్మ గృహాల్లో పొంగొట్టై, ఈమె మూడేళ్ల కుమారుడు మనీష్ (3)తో కలిసి ఉంటున్నాడు. స్థానికంగా కూలి పనులతో జీవనం సాగించేవాడు. ఈనెల 22న ఉదయం నుంచి ఈ జంట బయట కనిపించలేదు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గుర్తించి తిరుచానూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ సునీల్‌కుమార్, ఎస్సై అరుణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సత్యరాజ్ ఉరికి వేలాడుతుండగా... పొంగొట్టై, మనీష్ మృతదేహాలు గదిలోని మరుగుదొడ్డి వద్ద కనిపించాయి. సమీపంలో విషం సీసా లభ్యం కావడంతో ముందుగా పొంగొట్టై, ఆమె కుమారుడు విషం తాగి చనిపోయి ఉంటారని.. తరువాత సత్యరాజ్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనతో దామినేడు గృహాల్లో ఒక్కసారిగా కలకలం లేపింది.

పొంగొట్టై, మనీష్ (పాతచిత్రాలు)

స్టీరింగ్‌పై కుప్పకూలిన బస్సు డ్రైవర్

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సు డ్రైవర్ గుండెపోటుతో స్టీరింగ్‌పై కుప్పకూలిన ఘటన సూళ్లూరుపేటలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. బస్సు కండక్టర్ గాంధీ తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఊతుకోటం గ్రామానికి చెందిన శరవణన్(45) భారతి ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి చెన్నై నుంచి నెల్లూరుకు బస్సు బయలుదేరింది. సోమవారం ఉదయం బస్సు సూళ్లూరుపేటకు రాగానే కాళ్లు, చేతులు లాగుతున్నాయని బస్సును పక్కకు ఆపిన అతను స్టీరింగ్‌పైనే కుప్పకూలిపోయాడు. స్థానికుల సహాయంతో అతడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను గుండెపోటుతో మృతిచెందినట్లు డాక్టర్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

తిరుపతి జూకు చేరిన మకనా

యాదమరి, న్యూస్‌టుడే: గాయపడిన ఏనుగు(మకనా)ను తిరుపతిలోని జంతుప్రదర్శనశాలకు సోమవారం తరలించారు. యాదమరి మండలం డీపీపాళ్యం సమీప గుడ్డివాని చెరువులో లేవలేని స్థితిలో ఉన్న ఏనుగుకు సీసీఎఫ్ యశోదబాయి, ఇన్‌ఛార్జి డి.ఎఫ్.ఒ. శ్రీనివాసులు పర్యవేక్షణలో ఎస్వీ జంతు ప్రదర్శనశాల వైద్యులు అరుణ్, తోయిబాసింగ్ ప్రాథమిక చికిత్స చేశారు. ఆపై కుంకీలు, క్రేన్ సాయంతో తిరుపతికి తరలించి జూ అధికారులు, వైద్యులకు అప్పగించారు. ఏనుగు తుంటి, కాలి గాయానికి సంబంధించి ఎక్స్‌రే తీశారని, గాయం తీవ్రత బట్టి చికిత్స అందజేస్తామని డీఎఫ్వో తెలిపారు. రెండ్రోజుల పాటు ఏనుగును రక్షించేందుకు కష్టపడిన అటవీ, ఫైర్, రెవెన్యూ, పోలీసు సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వాహనం నుంచి ఏనుగును దించుతున్న క్రేన్

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

మల్లెమడుగు గేట్లు ఎత్తివేత

రేణిగుంట: కరకంబాడి పంచాయతీలోని మల్లెమడుగుకు భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో జీఎన్ఎస్ఎస్ అధికారులు 8 గేట్లు అడుగు చొప్పున ఎత్తి నీటిని విడుదల చేశారు. మరోపక్క అధికారులు ఇక్కడే ఉంటూ నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తున్నారు. వరద ప్రవాహం ఎక్కువైతే రాత్రికి మొత్తం 14 గేట్లు ఎత్తివేయనున్నట్లు అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

తహసీల్దారుగా బాధ్యతలు

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: తహసీల్దారుగా వాసుదేవకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పరమేశ్వర స్వామి ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఉప తహసీల్దారుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

మాట్లాడుతున్న విష్ణుప్రియ

ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవాలి

మహిళా వర్సిటీ (తిరుపతి), న్యూస్‌టుడే: యువత ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవాలని ఇస్కాన్ నుంచి విచ్చేసిన శ్రీకృష్ణభక్తులు విష్ణుప్రియ, చంద్రబాబు పేర్కొన్నారు. భగవద్గీతా జయంతిని శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ భువనేశ్వరిదేవి మాట్లాడుతూ ధ్యానం, ఓర్పు, సహనం భవద్గీత పారాయణంద్వారా లభిస్తాయని చెప్పారు. తర్వాత భగవద్గీతలోని 16వ అధ్యాయంలోని 24 శ్లోకాలను విద్యార్థినులకు నేర్పించారు. **పాకాల :** స్థానిక రామకృష్ణమఠం వద్ద మహిళా మండలి సభ్యులు గీతా పారాయణం చేశారు. మధ్యాహ్నం ప్రసాదవితరణ జరిగింది. **తిరుపతి (విద్య) :** ఎస్వీ జూనియర్ కళాశాలలో భగవద్గీత ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు, విశ్రాంత ఆచార్యులు దామోదర్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

రుద్రాక్షల అలంకరణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: కార్తిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేకువజామున స్వామివారికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. తొండవాడ సమీపంలోని శ్రీఅగస్తేశ్వర స్వామి, ఆనందవల్లీదేవి సపరివార దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. చంద్రగిరి ఆర్ఎఫ్ రోడ్డులోని శ్రీమల్లేశ్వర స్వామిని రుద్రాక్ష మాలలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అధ్యక్షులు మొగిలి రఘురామిరెడ్డి, మొక్కల వెంకటరమణారెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయం ఎదుట ప్రద్యుమ్న, కలెక్టర్ వెంకటేశ్వర్, మౌర్య, సందీప్ రఘువాన్షీ

అమ్మవారిని దర్శించుకున్న సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారిని సోమవారం సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద కలెక్టర్ డా.వెంకటేశ్వర్, నగరపాలక కమిషనర్ మౌర్య, శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

హాజరా.. మీ ఇష్టం

- ఎస్వీయూలో అందుబాటులోకి రాని బయోమెట్రిక్
- ఆయా విభాగాల్లో కొరవడిన సమయపాలన

ఎస్వీయూ పరిపాలనా భవనం

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ ఉద్యోగుల్లో సమయపాలన కొరవడింది. బోధన, బోధనేతర, తాత్కాలిక సిబ్బందికి నేటికీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఫేస్ రికగ్నిషన్, ఫింగర్ ఇంప్రెషన్ వంటివి అమలుకు నోచుకోకపోవడంతో ఎవరు ఏ సమయానికి వస్తున్నారో, ఎక్కడుంటున్నారో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కొందరు విధులకు రాకనే వచ్చినట్లుగా, మరికొందరు సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారనే విమర్శలున్నాయి. మరికొందరు రెండుమూడు రోజులకొకసారి సంతకాలు పెడుతున్నట్లు సమాచారం.

బోధనా సిబ్బందిదీ అదేతీరు

విద్యార్థులకు పాఠాలు బోధించే శాశ్వత ఆచార్యులు వర్సిటీలో 150 మంది వరకు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది సదస్సులు, పర్యటనల పేరుతో బయట ప్రాంతాల్లో ఉంటూ విద్యార్థులకు సరైన బోధన అందించటం లేదనే విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వం నుంచి ఆచార్యులు సరిగా హాజరుకావడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అకడమిక్ కన్సల్టెంట్లు 175 మందికి పైగా ఉన్నారు. ఇదేరీతిలో అతిథి ఆచార్యులు మరో 70 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. ఆచార్యులే రాకపోవడంతో బోధన, హాజరులో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కొందరిపైనే పనిభారం

బోధనేతర సిబ్బందిలో శాశ్వత ఉద్యోగులుగా 450 మంది, టైంస్కేల్ ఉద్యోగులు 370, ఎన్ఎంఆర్‌లు 312, వసతిగృహాల్లో 358 మంది, ప్రైవేటు ఔట్‌సోర్సింగ్ కింద మరో 117 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ కలిపి ప్రతి నెలా రూ.11 కోట్లకు పైగా జీతాలు చెల్లిస్తున్నారు. వర్సిటీలో మొత్తం మీద 50 నుంచి 60 శాతం మంది మాత్రమే విధులకు సక్రమంగా హాజరవుతున్నట్లు సంఘాల నేతలే పేర్కొంటున్నారు. దీంతో పనిభారం కొందరిపైనే అధికంగా పడుతోందని, ఐదుగురు చేయాల్సిన పనిని ఒకరే చేయాల్సి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆరోగ్య కేంద్రంలో సంతకాల తీరు

త్వరలో నూతన విధానం

ఉన్నత విద్యామండలికి ఆన్‌లైన్ హాజరుపై వివరాలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే అమలుకు చర్యలు తీసుకోనున్నాం. ఉద్యోగుల సెలవుల కోసం ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నారు. త్వరలో సమయపాలనను గాడినపెడతాం.

- డా.నరసింగరావు, ఉపకులపతి

విద్యార్థులున్నా.. వసతులు సున్నా

సొరకాలయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలోని సొరకాయల పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసతులు కొరవడ్డాయి. పాఠశాలను 1967లో స్థాపించారు. పదో తరగతి వరకు ఉండగా ప్రస్తుతం 87 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

సమస్యలు ఇలా.. : విద్యాబుద్ధులు నేర్పించడానికి హెచ్ఎం వ్యాయామ ఉపాధ్యాయుడితో పాటు 9 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులకు విద్యాబుద్ధులు నేర్పించడానికి మరొకరు ఉన్నారు. 2023 నుంచి హెచ్ఎం, పీఈటీ పోస్టులు రద్దు చేశారు. మైదానం అందుబాటులో ఉన్నా వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి. గత ప్రభుత్వంలో అమలైన నాడు - నేడుకు పాఠశాల ఎంపిక కాలేదు. మరుగుదొడ్లు దెబ్బతిన్నాయి. సమావేశాలు నిర్వహించడానికి గతంలో నిర్మించిన వేదిక మరమ్మతులకు గురవడంతో తరగతి గదిలోనే నిర్వహించాల్సిన దుస్థితి. రెండు పాత భవనాలు ఉండటంతో బీటలువారి వర్షంనీరు కారుతోంది.

పోస్టులు మంజూరు చేయాల్సి ఉంది.. గతంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున పోస్టులు రద్దు చేశారు. ప్రస్తుతం 87 మంది విద్యార్థులు ఉండటంతో వాటిని తిరిగి మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

- మార్కొండయ్య నాయుడు, మండల విద్యాధికారి

హామీల అమలు సంపూర్ణం

ఇంటివద్దనే పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని, కూటమి ప్రభుత్వం పరిశ్రమల స్థాపన, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి సర్వశక్తులు ఒడ్డుతోందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుచ్చినాయుడుపల్లి పంచాయతీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఆయన వృద్ధుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామసభలో మాట్లాడుతూ రూ.లక్షల కోట్ల అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను సంపూర్ణంగా నెరవేరుస్తోందన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లతోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లిస్తోందన్నారు. అనంతరం పంచాయతీలో నెలకొన్న సమస్యలపై ఆరాతీశారు. ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.

'అన్నదాతల డబ్బులతోనే వైకాపా నేతల విలాసాలు'

స్కామ్‌కు సంబంధించి కరపత్రాలు ప్రదర్శిస్తున్న తెదేపా నాయకులు

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: చిన్నగొట్టిగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో గత వైకాపా పాలనలో ఛైర్మన్ సహదేవరెడ్డి ఆధ్వర్యంలో రూ.2.37 కోట్ల స్కామ్ జరిగినట్లు తెదేపా నేతలు వెల్లడించారు. కార్యాలయంలో సోమవారం తెదేపా మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి మాట్లాడుతూ నకిలీ బంగారుపై రూ.72 లక్షలు, స్వల్ప-దీర్ఘకాల రుణాల్లో రూ.1.63 కోట్లు మాయమయ్యాయని ఆరోపించారు. ఈ కేసులో సంఘం కార్యదర్శి జగదీష్, అప్రైజర్ రాజాసురేష్ ఇప్పటికే అరెస్టు అయ్యారన్నారు. రైతుల సొమ్ముతో సహదేవరెడ్డి విలాసజీవితం గడుపుతున్నారని, ఇలాంటి వ్యక్తులను పెంచిపోషిస్తున్న వైకాపా నాయకులు సిగ్గుపడాలని, కేసులోని నిందితులకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్, మదనమోహన్, కొట్టే శివకుమార్, మోహన్‌రెడ్డి, శేఖర్ గౌడ్, మల్లిఖార్జునరెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చెరువు గండి పూడ్చివేత

భాకరాపేట, న్యూస్‌టుడే : మండలంలోని ఎగవూరు గ్రామ సమీపంలోని నిలపరెడ్డి కుంట గండిని పూడ్చివేశారు. వర్షాలకు నిండి భారీ గండి పడటంతో సమస్య ఎదురైంది. వెంటనే స్పందించిన అధికారులు, తెదేపా నాయకులు ట్రాక్టర్లతో మట్టిని తెచ్చి పూడ్చివేశారు.

జీఎస్ డిప్యూటీ ఎంపీడీవోగా మణి

మణిని సన్మానిస్తున్న ఎంపీడీవో దయాసాగర్ సిబ్బంది

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల (జీఎస్) డిప్యూటీ ఎంపీడీవోగా మణి సోమవారం నియమితులయ్యారు. ఈమేరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవో దయాసాగర్ వద్ద బాధ్యతలు స్వీకరించారు. ఏవో రంగనాథన్, కార్యాలయం సిబ్బంది ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తిరుచానూరు పంచాయతీ ఈవోగా పనిచేస్తూ పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

జాతీయస్థాయిలో ప్రతిభ

పురస్కారంతో విద్యార్థులు, ఛైర్మన్

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తిరుపతికి చెందిన డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో రాణించారు. ధనలక్ష్మి శ్రీనివాసన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన తొలి జాతీయస్థాయి మూట్ కోర్ట్ పోటీల్లో ధరణి, యశ్వంత్, జ్ఞాని పాల్గొని బెస్ట్ రీసెర్చర్ అవార్డు పొందారు. ఛైర్మన్ డా.తిప్పారెడ్డి, మూట్ ట్రైనర్లు అతిర, అక్షయ్, కమిటీ సభ్యులు, అధ్యాపకులు వారిని అభినందించారు.

రుయా..ఉరుస్తోంది

ముసురు వర్షాలతో రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో ఇబ్బందులు తప్పడం లేదు. దిత్వా తుపాను నేపథ్యంలో ఓపీ విభాగం బోసిపోయింది. వచ్చిన కొద్ది మందికీ తగిన వసతులు లేక అవస్థలు పడ్డారు.. ఎంఎం వార్డు స్త్రీల విభాగం వద్ద.. మెడికల్ ఓపీ ఉరుస్తుండటంతో ప్లాస్టిక్ డబ్బాలు ఏర్పాటు చేశారు. రుయా ఆవరణలో రోగులు చలి, వర్షానికి ఇబ్బందులుపడుతూ కన్పించారు.

- ఈనాడు, తిరుపతి

కాలువ పోరంబోకు.. చదును

గాంధీపురం పంచాయతీలో కాలువ పోరంబోకుపై ఆక్రమణదారుల కన్ను పడింది. బాలాజీ డెయిరీ సమీపంలో సర్వే నం.11లో ఉన్న స్థలంలో రెండురోజులుగా కొందరు జేసీబీలతో ముళ్లచెట్లు తొలగిస్తున్నారు. స్థానికులు దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో రెవెన్యూ అధికారులు పట్టాలు ఎలా ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. 'న్యూస్‌టుడే' ఇన్‌ఛార్జి తహసీల్దార్ మోహన్‌బాబును వివరణ కోరగా ప్రస్తుతం పనులు నిలిపివేశామని, రెవెన్యూ రికార్డుల్లో కాలువ పోరంబోకుగా ఉందని తెలిపారు. - న్యూస్‌టుడే, తిరుపతి (గ్రామీణం)

తిరుమలలో కొనసాగిన వర్షం

ఘాట్‌రోడ్డులో జారిపడిన కొండచరియలు

తిరుమల, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో తిరుమలలో సోమవారం వర్షాలు కొనసాగాయి. మరోవైపు చలితీవ్రత పెరిగింది. రెండో ఘాట్‌రోడ్డులో భద్రతను పెంచారు. 9వ కిలోమీటరు వద్ద వర్షానికి కొండరాయి కిందపడటంతో దాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. పాపవినాశనం, శ్రీవారి పాదాల మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు.

విద్యార్థుల శ్రమదానం

ఎం.కొంగరవారిపల్లి పంచాయతీ ఎం.కొత్తపల్లి (నడింపల్లి)ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దత్తత తీసుకున్నారు. ఈ క్రమంలో వారంరోజుల పాటు గ్రామంలో సమాజసేవా కార్యక్రమాలు చేపట్టారు. భజనమందిరం వద్ద సోమవారం బహిరంగ సమావేశం నిర్వహించి గ్రామంలో చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపల్ డా.భక్తవత్సలం వివరించారు. తెదేపా నాయకులు సాగర్, పుండరీకనాయుడు, జగ్గయ్యనాయుడు, సుబ్రహ్మణ్యంనాయుడు, ఎన్ఎస్ఎస్ అధికారి విజయకుమార్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, చంద్రగిరి

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

మంత్రి అనగాని సత్యప్రసాద్

మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, చిత్రంలో బొజ్జల సుధీర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పులివర్తి నాని తదితరులు ■ మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న ఆర్సీ మునికృష్ణ, చిత్రంలో ఆరణి శ్రీనివాసులు, సుగుణమ్మ తదితరులు

తిరుపతి (నగరం, రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి తెదేపా పార్లమెంట్ కార్యాలయంలో ప్రతినెలా ఒక రోజు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, వారి నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తాను అన్నివేళలా అందుబాటులో ఉంటానని, పార్టీ శ్రేణులు కూడా ప్రభుత్వ ఆలోచనలకు గుణంగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, బొజ్జల సుధీర్‌రెడ్డి మంత్రిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేలా చూడాలని పాశం నివేదించారు. సత్యవేడు నియోజకవర్గం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి మంత్రిని కలిసి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని కోరారు. తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకారం అందించాలని కోరుతూ సాధన సమితి సభ్యులు రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు.

● దామినేడు భూ బాధిత సంఘం నేతలు మంత్రిని కలిసి విన్నవించారు. నిషేధ జాబితాలోని భూములకు విముక్తి కల్పించాలని కోరగా మంత్రి స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు.

మంత్రికి సత్కారం.. తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: మంత్రి సత్యప్రసాద్‌ను నగరానికి చెందిన నాయకులు ఘనంగా సత్కరించారు. ఉపమేయర్ ఆర్సీ మునికృష్ణ ఆయన్ను కలిసి సూపర్ సిక్స్ జ్ఞాపికను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, తెదేపా రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో భూమి విక్రయం

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: తమ భూమిని నకిలీ సంతకాలతో విక్రయించి సొమ్ము చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు టి.ఇందిరమ్మ జిల్లా ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతిలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. 1976లో శ్రీనివాసపురం ప్రాంతంలో సర్వే నంబర్ 323లోని శ్రీశ్రీనివాస కోఆపరేటివ్ సొసైటీలోని ప్లాట్ నంబర్ 61లో 116 అంకణాల భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశామని ఆమె తెలిపారు. 2018లో తన భర్త అనారోగ్యంతో మృతిచెందగా అనంతరం తిరుపతికి వచ్చి పరిశీలించగా మరొకరి పేరున ఉన్నట్లు తెలిసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త వద్ద పనిచేసిన బట్టు చంద్రపాల్ అనే వ్యక్తి 1991లో కడప రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించినట్లు తేలిందన్నారు. ప్రస్తుతం వి.హరీష్‌కుమార్ అనే వ్యక్తి పేరున ఉన్నట్లు ఆమె తెలిపారు. కుమార్తె రమశ్రీ, రమేష్ పాల్గొన్నారు.

దారులు ఛిద్రం.. సంకట ప్రయాణం

మిట్టపాలెం సచావాలయం ఎదుట ఇలా..

చంద్రగిరి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామీణరోడ్లు ఛిద్రం అయ్యాయి. గత ప్రభుత్వంలో వర్షాలకు పలు వంతెనలు, కల్వర్టులు, చెక్‌డ్యాంలు కొట్టుకుపోయాయి. వరదనీటి ప్రవాహం తగ్గాక యుద్ధప్రాతిపదికన తెగిపోయిన రోడ్లు, కూలిపోయిన వంతెనలు నిర్మిస్తామంటూ ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మిగిలిపోవడంతో నేడు సమస్యలు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వంలో గతుకుల రోడ్లకు అతుకులు సైతం వేయలేకపోయింది.

● ఎం.కొత్తపల్లి, శానంబట్ల, శ్రీనివాసమంగాపురం, మిట్టపాళ్యం, బుచ్చినాయుడుపల్లి, నరశింగాపురం, మొండికాల్వ, తాటికోన తదితర గ్రామాల రాకపోకలకు ఆటంకాలు ఎదురయ్యాయి. ప్రధానంగా శానంబట్ల గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో భారీ టిప్పర్లు రాకపోకలు సాగించడంతో కోతకు గురై వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో నిత్యం విద్యార్థులతోపాటు రైతులు ప్రయాణాలు సాగిస్తున్నారు.

● చంద్రగిరి నుంచి శ్రీనివాసమంగాపురం వెళ్లే మార్గంలో, మిట్టపాలెం సచివాలయం ఎదుట రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడ్డాయి. ఆర్.ఎఫ్ రోడ్డు నుంచి ఎగువరెడ్డివారిపల్లికి వెళ్లే మార్గంలో రాళ్ల క్వారీల నుంచి కంకర తరలిస్తున్న భారీ టిప్పర్లతో అడుగు లోతు గుంతలు ఏర్పడ్డాయి.

● చంద్రగిరి నుంచి గంగుడుపల్లికి వెళ్లే రోడ్డుమార్గంలో రామచంద్రాపురం మండలం నుంచి నిత్యం పదుల సంఖ్యలో కంకర, గ్రావెల్ మట్టి తరలిస్తున్న టిప్పర్లు రాకపోకలతో అక్కడక్కడా భారీ గుంతలు పడ్డాయి. ఇదే మార్గంలో రాత్రివేళ వీధిదీపాలు సైతం సక్రమంగా వెలగడం లేదు. దీంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిష్కారానికి హామీ : సమస్యలను ప్రజలు ఇటీవల ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వర్షాలు తగ్గిన తర్వాత రోడ్డు మార్గాలను బాగు చేయిస్తామని హామీ ఇచ్చారు.

'నా పేరెందుకు తీసేశారు'

నాగలాపురం, న్యూస్‌టుడే: ప్రజల మద్దతుతో గెలిచిన నా పేరును ఆలయ కరపత్రాల్లో ఎలా తీసేస్తారంటూ పల్లికొండేశ్వరాలయ ఈవో లతను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిలదీశారు. ఆలయ దర్శనానికి సోమవారం వచ్చిన ఎమ్మెల్యే ఈవో వైఖరిని తప్పుపట్టారు. ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యేలకు సైతం కరపత్రాల్లో ప్రొటోకాల్‌ను అనుసరించి మర్యాదను ఇస్తుండగా.. తన పేరు లేకుండా ఇష్టానుసారం కరపత్రాలు ముద్రించడంపై ఆయన వివరణ కోరారు. మద్యం విక్రయాలు, బియ్యం అక్రమాల్లో ఉన్న వ్యక్తికి ఛైర్మన్‌గా, ఈడీ కేసుల్లో జైలుకు వెళ్లిన వ్యక్తిని సభ్యుడిగా ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. పాలకవర్గ పదవులకు దరఖాస్తులు చేసుకున్న వ్యక్తుల పట్ల సమగ్ర విచారణ చేయకనే నియామకాలు చేయడంతో పాటు కోర్టులో వ్యాజ్యం నడుస్తున్న తరుణంలో హడావిడిగా ప్రమాణ స్వీకారం చేయడమేంటన్నారు. ఛైర్మన్ పద్మనాభరాజు సూచనల మేరకే తాను కరపత్రాలను ముద్రించానని ఈవో తెలిపారు. జరిగిన తప్పుకు మన్నించాలని కోరిన ఆమె.. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కానివ్వబోనన్నారు. కాగా ఎమ్మెల్యే ఈవోతో మాట్లాడుతున్న సమయంలో ఛైర్మన్ తన గదికే పరిమితమయ్యారు.

ఎయిడ్స్ బాధితులకు బాసటగా నిలవాలి

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎంహెచ్‌వో డా.బాలకృష్ణ నాయక్ తదితరులు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.బాలకృష్ణనాయక్ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా బాధితులకు సంఘీభావ ర్యాలీ, మహతి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఉత్తమ పనితీరు ప్రదర్శించిన వైద్యులు, ఐసీటీసీ - ఏఆర్టీ కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, బ్లడ్‌బ్యాంక్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్వీఎంసీ ప్రిన్సిపల్ డా.రవిప్రభు, రుయా ఎంఎస్ డా.రాధ, అదనపు డీఎంహెచ్‌వో డా.శైలజ తదితరులు పాల్గొన్నారు. * హైరిస్క్ గ్రూప్‌లకు హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించడానికి వీలుగా మొబైల్ ఐసీటీసీ వాహనాన్ని డీఎంహెచ్‌వో ప్రారంభించారు. **తిరుపతి(మహిళా వర్సిటీ):** ఎయిడ్స్ బాధితులకు బాసటగా నిలవాలని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులు మానవహారం, ర్యాలీ నిర్వహించారు. **తిరుపతి (విద్య):** ఎస్‌జీఎస్ ఆర్ట్స్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.బి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారులు శివకుమార్, సులోచనరాణి పాల్గొన్నారు. **పాకాల :** డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ రమేష్‌కుమార్, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ విభాగం ఆధ్వర్యంలో సమావేశం, ర్యాలీల నిర్వహించారు.

మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

భస్మాంగరాగాయ మహేశ్వరాయ..!

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ శివలింగానికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సోమవారం సందర్భంగా ఉదయం గోక్షీరం, విభూదితో పాటు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అలంకరణలు పూర్తయ్యాక ధూప, దీప, నివేదనలు సమర్పించారు. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

మల్లెమడుగు గేట్లు ఎత్తివేత

రేణిగుంట: కరకంబాడి పంచాయతీలోని మల్లెమడుగుకు భారీగా వర్షపు నీరు చేరుతోంది. దీంతో జీఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఇక్కడ 8 గేట్లు ఒక అడుగు ఎత్తి నీటిని విడుదల చేశారు. మరో పక్క అధికారులు ఇక్కడే ఉంటూ నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తున్నారు. వరద ప్రవాహం ఎక్కువైతే రాత్రికి మొత్తం 14 గేట్లు ఎత్తివేయనున్నట్లు అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

కుక్కలదొడ్డి వాగులోకి నీరు

మండలంలోని అటవీ గ్రామమైన కుక్కలదొడ్డి గ్రామ సమీపంలోని వాగులోకు నీరు చేరింది. శేషాచల కొండల నుంచి ఇక్కడ నీరు పారుతుంది. ప్రతి ఏడాది ఈ సమయంలో ఇక్కడ భారీగా వర్షపు నీరు చేరుకోవడంతో పాటు దారి పొడువునా కనువిందు చేస్తుంది. మరో రెండు రోజులు వర్షం కురిస్తే నీరు భారీగా చేరుకుంటుంది. - న్యూస్‌టుడే, రేణిగుంట

కొట్టకాడు వంతెన ఎన్నాళ్లు నిలిచేనో..?

నాగలాపురం-కొట్టకాడు గ్రామాల నడుమ లోలెవల్ కాజ్‌వే దయనీయంగా మారింది. ఈ వంతెన వద్ద సిమెంటు కాంక్రీటు ఛిద్రమవడం, తారు కంకర దెబ్బతినటంతో అధ్వాన పరిస్థితి నెలకొంది. వంతెనపైన నీరు ప్రవహిస్తే రహదారిపై గుంతలను గుర్తించలేక పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉండటంతో వరదల సమయంలో కొట్టకాడుకు రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఈ వంతెనకు మోక్షం లభించడం లేదని వాపోతున్నారు. - న్యూస్‌టుడే, నాగలాపురం

పనులు సగం.. రాకపోకలకు నిత్యం నరకం

వరదయ్యపాళెం-సత్యవేడు మార్గంలో రహదారి ఆధునికీకరణ పనుల్లో భాగంగా యానాదివెట్టులో రహదారికి సగం వైపు సీసీరోడ్డు పనులను పూర్తి చేశారు. మిగిలిన సగం పనులు నాలుగు నెలలుగా అసంపూర్తిగా నిలిచి పోవడంతో వాహన చోదకుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఇటీవల శ్రీకాళహస్తి నుంచి చెన్నైకి వెళుతున్న టిప్పర్ అసంపూర్తిగా మిగిలిన రహదారిలో అదుపు తప్పి బోల్తా పడిన విషయం తెలిసిందే. అధికారులు స్పందించి అసంపూర్తి పనులను పూర్తి చేయాల్సి ఉంది.
- న్యూస్‌టుడే, వరదయ్యపాళెం

చినుకుపడితే చిత్తడి



శ్రీకాళహస్తి మండలంలోని వేడాంమిట్టకండ్రిగ రోడ్డు చిన్నపాటి చినుకు పడినా చిత్తడిగా మారుతోంది. గ్రామానికి వెళ్లే రోడ్డు దశాబ్దాలతరబడి తారురోడ్డుకు నోచుకోక పోవడంతో ఇలా బురదతో దర్శనమిస్తోంది. దీంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంది.
- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు)

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

నారాయణవనం : సమస్య: తుంబూరులో కాలువల నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో మురుగు ఇళ్ల వద్ద నిలిచి దుర్గంధంతో పాటు దోమలకు నెలవుగా మారడంతో ప్రజలు రోగాలతో మంచాన పడుతున్నారు. – వెంకటేష్

సమాధానం: చెత్తను తొలగించి మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. – నాగూరు, కార్యదర్శి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక పంచాయతీ ఎస్సీకాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. పరిసరాలు పొలాలు కావడంతో పాములు, విషపురుగుల బెడదతో రాత్రి వేళల్లో విధులు ముగించుకుని వచ్చే కార్మికులు భయాందోళనకు గురవుతున్నారు. – ఇళయరాజా

సమాధానం: రెండు రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. – పసిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

కేవీబీపురం, న్యూస్‌టుడే: సమస్య: కన్నూరి పురం గిరిజన కాలనీకి సరఫరా అయ్యే విద్యుత్తు నియంత్రిక వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో విద్యుత్తు సమస్యలు తలెత్తుతున్నాయి. – మంజుల

సమాధానం: సమస్య మా దృష్టికి రాలేదు. కాలనీలో విద్యుత్తు నియంత్రిక వద్ద ఉన్న పిచ్చి మొక్కలు తొలగిస్తాం. –తరుణాక్షరెడ్డి, ఈవీపీఆర్‌డీ

చెత్తకుప్పల తొలగింపు

స్పందనకు వందనం

సత్యవేడు: స్థానిక మసీదు వద్ద పడేసిన చెత్త కుప్పలను తొలగించారు. స్థానికులు, దుకాణదారులు చెత్త కుప్పలను మసీదు వద్ద పడేయడంతో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలకు అటువైపుగా వేళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారని ఈనెల 24 వ తేదీన 'ఈనాడు'లో మేమున్నాం. .మీకు తోడుగా శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్ పారిశుద్ధ్య కార్మికులతో చెత్త కుప్పలను తొలగించారు.

తుడా నిధులు వెనక్కి.. దశాబ్దాల కల హుష్‌కాకి

గుత్తేదార్ల అలక్ష్యం.. మురుగు సమస్యకు గ్రహణం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు గుత్తేదార్ల అలక్ష్యంతో వెనక్కి మళ్లే ప్రమాదం వరదయ్యపాళెంలో చోటు చేసుకుంది. పట్టణ ప్రజలను దీర్ఘకాలంగా వేధిస్తున్న మురుగు సమస్య పరిష్కారానికి గ్రహణం పట్టింది. పనులు ఆలస్యం కావడంతో నిధులు వెనక్కిమళ్లే ప్రమాదం పొంచి ఉంది.

వర్షాలకు రహదారిలో నిలిచిన నీరు

మడుగులను తలపిస్తున్న రోడ్లు

ఎన్నోఏళ్లుగా వరదయ్యపాళెం పంచాయతీలో మురుగు కాలువలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాలకు రహదారులపై నీరు నిలిచి మడుగులను తలపిస్తోంది. వర్షమొస్తే చాలు.. రహదారులు రొచ్చురొచ్చుగా మారి రాకపోకలకు నరకప్రాయంగా మారుతోంది. పంచాయతీలో మురుగు కాలువలను ఏర్పాటు చేయాలని ప్రజలు రెండు దశాబ్దాల కాలంగా ప్రతి ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవిస్తునే ఉన్నారు. భారీ స్థాయిలో నిధులు అవసరం కావడంతో పాలకులు జాప్యం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. తుడా నిధుల ద్వారా మురుగు కాలువల నిర్మాణాన్ని చేపట్టాలని తుడా కమిషనర్‌కు విన్నవించడంతో ఇటీవల కమిషనర్ వరదయ్యపాళెంలో పర్యటించి మురుగు సమస్యను నేరుగా పరిశీలించారు.

ఎట్టకేలకు నిధులు.. ప్రారంభంకాని పనులు

ఎట్టకేలకు తొలివిడత మురుగు కాలువల నిర్మాణానికి రూ.39 లక్షలు మంజూరైయ్యాయి. ఎన్నోఏళ్లకు సమస్య నుంచి విముక్తి కలుగనుందంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మూడు నెలల కిందట తుడా అధికారులు పట్టణంలో క్షేత్ర స్థాయిలో కాలువ నిర్మాణానికి ఏర్పాట్లను పరిశీలించి సర్వే చేశారు. అయితే పనులు ఇంకా ప్రారంభించక పోవడంతో నిధులు వెనక్కిమళ్లే ప్రమాదం నెలకొంది. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే మంజూరైన నిధులు వెనక్కిమళ్లే అవకాశం ఉండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పనులను ప్రారంభించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

● ఈ విషయమై తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ మురుగు కాలువల నిర్మాణానికి మంజూరైన నిధులను వెనక్కి మళ్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పనులు త్వరగా ప్రారంభించేలా అధికారులను ఆదేశించామన్నారు.

మంత్రికి ఘనస్వాగతం

రేణిగుంట, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. జిల్లా పర్యటన నిమిత్తం ఆయన సోమవారం ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయనకు తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, జేబీ శ్రీనివాస్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ జయప్రకాష్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

విమానాశ్రయం నుంచి వస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, నాయకులు

బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పోలీసుల తీరు పట్ల అసంతృప్తిని వ్యక్తం చేసిన న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. న్యాయవాది వినోద్‌ను, వాళ్ల నాన్నపై కొంత మంది దౌర్జన్యంగా కొట్టి గాయ పరిచిన ఘటనపై పోలీసులు స్పందించక పోవడం సరికాదని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పూడి వెంకటేశ్వర్లు, తులసీరాంలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మల్లికార్జునయ్య, సంయుక్త కార్యదర్శి కె.ఎం.నాగరాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఒకటో తేదీన ప్రతి లబ్ధిదారుడి ఇంటికెళ్లి అధికారులు, నేతలు పింఛన్లు అందజేయడంతో వాళ్ల ఆనందాలకు అవధుల్లేవని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సోమవారం ఊరందూరులో ఇంటింటికెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు ఎంతో సంతోషంతో ఉన్నారని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు పింఛను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్యానాయుడు, పట్టణ కమిటీ అధ్యక్షులు విజయకుమార్, పార్టీ నేతలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **శ్రీకాళహస్తి:** ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని పకడ్బందీగా నిర్వహించినట్లు పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షులు విజయకుమార్ అన్నారు. పట్టణ వ్యాప్తంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసినట్లు వివరించారు. పట్టణంలోని 19వ వార్డులో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలసి పింఛన్లను అందజేసినట్లు తెలిపారు. పురపాలక సంఘ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ శ్రేణుల నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా జరిపినట్లు వివరించారు.

నారాయణవనం: బ్రాహ్మణతాంగేల్ పంచాయతీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత పింఛన్లతో పాటు కొత్తగా మంజూరైన పింఛను నగదును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, ఎంపీడీవో అరుణ, ఈవోపీఆర్డీ వేనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊరందూరులో పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

అఖండ చలనచిత్రంలో వాడిన త్రిశూలం, ఢమరుకంతో తెదేపా నేతలు

'అఖండ-2' విజయం కోసం పూజలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సినీనటుడు నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 చలనచిత్రం విజయవంతం కావాలని ముక్కంటి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించినట్లు బాలకృష్ణ హెల్పింగ్ హ్యాండ్స్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ అన్నారు. చిత్రంలో బాలకృష్ణ వాడిన త్రిశూలాన్ని, ఢమరుకాన్ని సోమవారం ముక్కంటి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. త్రయంబకేశ్వరం, వారణాసి, శ్రీశైలం, కాణిపాకం క్షేత్రాలను దర్శించుకుని శ్రీకాళహస్తికి వచ్చినట్లు వివరించారు. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి.. గాలికి

ప్రతి పింఛనుదారుడికి ప్రభుత్వం తరఫున ఇచ్చే పింఛన్లను వాళ్ల ఇళ్ల వద్దకు వెళ్లి ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలోని 18వ వార్డులో ఆ నిబంధనలను గాలికి వదిలారు. సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు రాకపోవడంతో నిరీక్షించిన పింఛనుదారులు సచివాలయం వద్దకు వెళ్లారు. కొందరైతే వర్షంలోనే పింఛను తీసుకునేందుకు నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురైంది. కూటమి నేతల సమన్వయంతో పింఛను పంపిణీ చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా సచివాలయం ద్వారా పింఛన్లను అందజేయడం పట్ల విమర్శలు తలెత్తాయి. ఇకనైనా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.
- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

వర్షంలో సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న పింఛను దారులు

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎయిడ్స్ వ్యాధి అవగాహనతోనే నియంత్రించవచ్చునని స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ ప్రమీలమ్మ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బాధితులకు నిత్యావసర సరకులను అందజేశారు. వ్యాధి సోకిన గర్భిణులు, శిశువులకు వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన మందుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం బాధితులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వర్షాల కారణంగా ఇల్లు కూలిపోయిన బాధితుడికి రూ.ఐదు వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఐటీటీసీ కౌన్సిలర్ భారతి, డీఎస్‌ఆర్‌సీ కౌన్సిలర్ ఉష, ఏఆర్‌టీ కౌన్సిలర్ రాధిక, న్యాయవాదులు రాజేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, మల్లికార్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

'నా పేరెందుకు తీసేశారు'

నాగలాపురం, న్యూస్‌టుడే: ప్రజల మద్దతుతో గెలిచిన నా పేరును ఆలయ కరపత్రాల్లో ఎలా తీసేస్తారంటూ పల్లికొండేశ్వరాలయ ఈవో లతను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిలదీశారు. ఆలయ దర్శనానికి సోమవారం వచ్చిన ఎమ్మెల్యే ఈవో వైఖరిని తప్పుపట్టారు. ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యేలకు సైతం కరపత్రాల్లో ప్రోటోకాల్‌ను అనుసరించి మర్యాదను ఇస్తుండగా.. తన పేరు లేకుండా ఇష్టానుసారం కరపత్రాలు ముద్రించడంపై ఆయన వివరణ కోరారు. మద్యం విక్రయాలు, బియ్యం అక్రమాల్లో ఉన్న వ్యక్తికి ఛైర్మన్‌గా, ఈడీ కేసుల్లో జైలుకు వెళ్లిన వ్యక్తిని సభ్యుడిగా ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. పాలకవర్గ పదవులకు దరఖాస్తులు చేసుకున్న వ్యక్తుల పట్ల సమగ్ర విచారణ చేయకనే నియామకాలు చేయడంతో పాటు కోర్టులో వ్యాజ్యం నడుస్తున్న తరుణంలో హడావిడిగా ప్రమాణ స్వీకారం చేయడమేంటన్నారు. ఛైర్మన్ పద్మనాభరాజు సూచనల మేరకే తాను కరపత్రాలను ముద్రించానని ఈవో తెలిపారు. జరిగిన తప్పుకు మన్నించాలని కోరిన ఆమె.. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కానివ్వబోనన్నారు. కాగా ఎమ్మెల్యే ఈవోతో మాట్లాడుతున్న సమయంలో ఛైర్మన్ తన గదికే పరిమితమయ్యారు.

ఈవో లతను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

అన్నదాత సుఖీభవ నగదు జమ

సత్యవేడు, న్యూస్‌టుడే: రైతుల పొలాల్లో విత్తనాలు విత్తు కోవడానికి ముందస్తుగా కూటమి ప్రభుత్వ రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదును జమ చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని మదనంబేడు ఆర్‌ఎస్‌కేలో వేరుశనగ విత్తనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. రైతు ఉత్పత్తిదారుల అసోసియేషన్ ఛైర్మన్ రెడ్డివారి భక్తిరెడ్డి, రైతులు, వ్యవసాయ శాఖ ఏవో మురళి పాల్గొన్నారు.

శేషంబేడు దాటాలంటే సాహసం చేయాల్సిందేనా

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: మండలంలోని శేషంబేడు గ్రామం వద్ద ర.భ. రహదారి దయనీయంగా తయారైంది. పక్కనే అరణియార్ జలాశయం ఉండటంతో నిత్యం పర్యాటకుల తాకిడితో పాటు శ్రీకాళహస్తి మార్గం కావడంతో వాహనాల రద్దీ అధికంగానే ఉంటోంది. ఆరు సంవత్సరాలుగా రహదారి నిర్వహణ లేక పోవడంతో గుంతలతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిని ఆధునికీకరించాల్సి ఉంది.

శేషంబేడు వద్ద శ్రీకాళహస్తి రహదారి

తండ్రి ఇరుముడి కోసం వచ్చి ప్రమాదం

తీవ్రంగా గాయపడిన గాయత్రి

పుత్తూరు, న్యూస్‌టుడే: శబరిమలైకు తండ్రి వెళ్తుతుండటంతో ఇరుముడి కార్యక్రమానికి వచ్చి వెళ్తూ ప్రమాదానికి గురై తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలో సోమవారం జరిగింది. ఎస్సై ఓబయ్య కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టకు చెందిన త్రివేణి(20)ని తమిళనాడు రాష్ట్రం తిరుత్తణికి చెందిన మోహన్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. శ్రీకాళహస్తిలో త్రివేణి తండ్రి శబరిమలైకు వెళ్తుతుండటంతో భార్యాభర్త తిరుత్తణి నుంచి వచ్చారు. సోమవారం రాహుకాలం తర్వాత ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తి నుంచి తిరుత్తణికి బయలుదేరారు. పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం పంచాయతీ పరిధిలోని కైలాసపురం దాటాక ముందు వెళ్తున్న సిమెంట్ తరలించే లారీని అధిగమించే ప్రయత్నంలో ప్రమాదం జరిగి త్రివేణి కుడికాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ఆమె భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వెంటనే ఆమెను నగరి ఏరియా ఆస్పత్రికి తరలించి ఆపై మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు రెండో పట్టణ సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓ యువకుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సోమవారం పోలీసులకు స్థానికులు సమాచారం వచ్చిందన్నారు. పోలీసులు యువకుడిని ఏర్పేడు మండలం జంగాలపల్లికి చెందిన చిన్నా(30)గా గుర్తించి ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వర్షంతో స్తంభించిన జనజీవనం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో ఎడతెరపిలేకుండా రోజంతా మోస్తరు వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వర్షం దాటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత వర్షాలకే చెరువులు నిండుకోగా ప్రస్తుత వర్షాలకు మరింత వరదనీరు చెరువులకు చేరుకోవడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిగా నిండి ప్రమాదకరంగా ఉన్న ఇదులగుంట చెరువును రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలను సందర్శించి స్థానికులను అప్రమత్తం చేశారు. కారాకొల్లు వాగు, చిట్టత్తూరు కాజ్‌వేలపై వరద ప్రవాహం పెరుగు తుండటంతో తహసీల్దార్ భారతి పరిశీలించి రాకపోకలను నిషేధించారు.

కారాకొల్లు వాగుపై రాకపోకలకు అడ్డుగా ముళ్లకంపలు వేసి పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ భారతి

పాలేశ్వరుడికి ప్రత్యేక పూజలు

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలోని పాలమంగళం ఉత్తరంలో వెలసిన శ్రీకమలవల్లి సమేత పాలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో మూలవర్లకు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు ఊయల సేవ అనంతరం అఖండ దీపారాధన చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

అలంకరణలో పాలేశ్వరస్వామి

సిద్ధార్థలో 'క్వాంటమ్ కంప్యూటింగ్'పై శిక్షణ

నారాయణవనం : పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇంట్రడక్షన్ టు క్వాంటమ్ కంప్యూటింగ్' అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, జేఎన్టీయూ అనంతపురం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్స్ మధు, జనార్దన్ రాజు తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు జరిగే కార్యక్రమంలో క్వాంటమ్ కంప్యూటింగ్ యొక్క ప్రాముఖ్యత, ప్రాథమిక సిద్ధాంతాలు, ఆధునిక పరిశోధనా ధోరణులు, అనువర్తనాలపై నిపుణులు అధ్యాపకులకు శిక్షణ అందిస్తారన్నారు. ముఖ్య అతిథిగా తిరుపతి ఐఐటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. రితీష్ కుమార్ గంగ్వార్, ఐఐఎస్ఈఆర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.చిత్రసేన్‌జేనా హాజరై శిక్షణ నిచ్చారు. కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తిరుపతి ఐఐటీలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డా.రితీష్ కుమార్ గంగ్వార్

గుడిమల్లం ఆలయానికి మహర్దశ

శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏకశిలపై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కొలువుదీరి దేశంలోనే మొట్టమొదటి శివాలయంగా గుర్తింపు పొందింది ఏర్పేడు మండలంలోని గుడిమల్లం శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయం. రూ.కోట్లు నిధులతో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో పాటు ఆలయ ప్రాశస్త్యం గురించి పెద్దఎత్తున ప్రచారానికి శ్రీకారం చుట్టింది. దీంతో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున భక్తులు ఆలయ సందర్శనానికి రావడంతోపాటు అభివృద్ధికి తమవంతుగా విరాళాలు ప్రకటిస్తుండటంతో పురాతన ఆలయం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతుండటం గమనార్హం.

దాతల సహకారంతో అన్నదానానికి శ్రీకారం

తిరుమల, శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకునే పర్యాటకులు గుడిమల్లం ఆలయం సందర్శించే

రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు

విధంగా పర్యాటక కేంద్రం చర్యలు చేపట్టింది. దీంతో గతంలో రెండువేల మంది మాత్రమే భక్తులు ఆలయానికి వస్తుండగా ప్రస్తుతం సుమారు ఐదు నుంచి ఏడువేల మంది భక్తులు ఆలయానికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే భక్తులకు ఉపయోగకరంగా నిత్యాన్నదానం చేసేందుకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. అన్నదాన సత్రం లేక పోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఏక్‌నాథ్‌షిండే కుటుంబ సభ్యులు రూ. 25 లక్షలతో భూమిని కొనుగోలు చేసి ఆలయానికి అందజేయగా విశాఖపట్నంకు చెందిన మైత్రి భవన నిర్మాణ సంస్థ రూ.60లక్షలతో సత్రం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి పురావస్తుశాఖ నుంచి ఇటీవల అనుమతులు రావడంతో త్వరలోనే అన్నదాన సత్రం అందుబాటులోకి రానున్నది.

అందుబాటులోకి ఆలయ చరిత్ర

గుడిమల్లం ఆలయ చరిత్రను తెలియజేసే పుస్తకాన్ని తయారు చేయడంతో పాటు ఆలయ శిల్పకళను కళ్లకుకట్టినట్లుగా చిత్రాలను ముద్రించి భక్తులకు అందుబాటులో ఉంచారు. దేశవ్యాప్తంగా ప్రముఖులకు అందజేశారు. స్టాల్స్‌ను అందుబాటులో ఉంచడంతో గొప్పగుర్తింపు లభించింది.

రూ.2.30కోట్లతో బైపాస్

శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయానికి చేరుకునేందుకు సరైన రహదారి లేక పోవడంతో భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యను ఆలయ అధికారులు ప్రభుత్వానికి విన్నవించడంతో ఇటీవల కాలంలో రూ.2.32కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో పాపానాయుడు పేట పక్కనే కి.మీ బైపాస్ రహదారి, గుడిమల్లంలో 600మీటర్ల సిమెంట్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

(c) eenadu

గూడూరు
• గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 16 నుంచి రూ. 20 వరకు

రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 15 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ (రైతు ధర)	134
లేయర్	130
బ్రాయిలర్	244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	268
లేయర్ మాంసం	221

అయ్యప్ప పూజోత్సవం వాయిదా

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో ఈనెల 4న జరగాల్సిన అయ్యప్పస్వామి 44వ అఖండ కర్పూర జ్యోతి పూజోత్సవం 8న జరుగుతుందని సేవా కమిటీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి తెలిపారు.

ఆర్డీవో పరిశీలన

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: దిత్వా తుపానుతో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో కిరణ్మయి సూచించారు. సోమవారం స్థానిక అధికారులతో కలిసి తనయాలి వద్దనున్న కాళంగి నది, ఏకొల్లు, వెదురుపట్టు ప్రాంతాల్లోని పొలాలను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్సై అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డుపై 'ఏరు'

చిల్లకూరు మండలంలోని ఏరూరు వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది. గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మోమిడి, వరగలి, తమ్మినపట్నం తదితర గ్రామాలకు రాకపోకలు సాగించే వాహనదారులు రోడ్డుపై ఉన్న గుంతల్లో పడుతూ, లేస్తూ వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, చిల్లకూరు

నేలకొరిగిన స్తంభం.. రాకపోకలకు అంతరాయం

మండలంలోని ఉగ్గుమూడి గ్రామం నుంచి దేగవరి కండ్రిగకు వెళ్లే రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభానికి ఊతంగా నిలిపిన మరో స్తంభం నేలపై ఒరిగింది. రోడ్డుపైన వాలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి స్తంభాన్ని రోడ్డుపై నుంచి తొలగించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

దెబ్బతిన్న నియంత్రిక కేబుల్

గూడలి స్వర్ణముఖి సమీపంలోని సీపీడబ్ల్యూఎస్ పథకానికి సంబంధించిన విద్యుత్తు నియంత్రిక కేబుల్ రెండు రోజుల కిందట దెబ్బతింది. గూడలి, చెందోడు, ప్రకాశం కాలనీ, నెల్లూనపల్లి, జరగుమల్లి, చంద్రశేఖరపురంతోపాటు పలు గ్రామాలకు తాగునీరు సరఫరా కావడం లేదు. విద్యుత్తు నియంత్రిక కేబుల్ మరమ్మతుకు సోమవారం శ్రీకారం చుట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్ తెలిపారు.

- న్యూస్‌టుడే, కోట

కైవల్య నదికి గుర్రపు డెక్క బెడద

వెంకటగిరి- రాపూరు మార్గంలోని కైవల్య నది వంతెన వద్ద విస్తారంగా గుర్రపు డెక్క పెరిగింది. దిత్వా తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువులన్నీ నిండి కలుజులు పొంగి పొర్లడంతో ఈ నీరంతా కైవల్య నదిలోకి చేరుతోంది. వంతెన అడుగు భాగంలో గుర్రపు డెక్క పెరగడంతో వరద వెనక్కు ఎగదన్నుతోంది.

- న్యూస్‌టుడే, వెంకటగిరి

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

మాట్లాడుతున్న 7వ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని 7వ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ తెలిపారు. పట్టణంలో కోర్టు ప్రాంగణంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి సులోచనరాణి, ప్రతినిధులు ఆరవ పార్వతయ్య, రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు శ్రీధర్‌శర్మ, శివప్రసాద్, విజయ మహేష్, ఝాన్సీ, నారాయణరాజు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్య కేసును సిట్‌తో విచారించాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: నెల్లూరులో అత్యంత దారుణంగా హత్యకు గురైన పెంచలయ్య కేసును సిట్ అధికారులతో విచారించాలని సింహపురి యూత్ సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ హత్య వెనుక పెట్టుబడిదారులు, గ్యాంగ్‌లు, రాజకీయ సంబంధాలున్న వారిని సిట్‌తో విచారించాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వైకాపా విధ్వంసానికి కూటమి మందు

✦ మేనకూరు సెజ్‌లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం

✦ దెబ్బతిన్న పనుల్లో పురోగతి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో అయిదేళ్ల పాలనాకాలంలో కంపెనీలు తేకపోగా ఉన్న వనరుల్ని ధ్వంసం చేశారు. మేనకూరు సెజ్ పరిధిలోని ఇసుక, గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపారు. పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇక్కడి విద్యుత్తు సబ్‌స్టేషన్ల అభివృద్ధి పనుల్ని అర్ధాంతరంగా ఆపేశారు. కూటమి ప్రభుత్వం గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది.

రోడ్డు అంచులు బాగు చేస్తున్న యంత్రం

గత తెదేపా హయాంలో

సెజ్ పరిధిలోని అన్ని కంపెనీలకు అందుబాటులో ఉండేలా రహదారులు, డ్రైనేజీ పనులు చేపట్టారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి పచ్చదనం పెంచారు. కొన్ని పూర్తి చేయగా మరి కొన్ని వివిధ దశల్లో ఉండగా వైకాపా పాలనా పగ్గాలు అందుకుంది.

విధ్వంసం జరిగిందిలా

వైకాపా గద్దెనెక్కాక సెజ్ అభివృద్ధిని గాలికి వదిలేసింది. రూ. కోట్ల నిధులతో వేసిన రహదారులు, మురుగు కాలువల పనులను పక్కన పెట్టింది. పర్యవేక్షణ కొరవడటంతో రహదారులపై భారీ వాహనాల రాకపోకల సమయంలో దెబ్బతిన్నాయి. ఇసుక, మట్టి, గ్రావెల్ వాహనాల రాకపోకలతో కాలువల గోడలు ఒరిగిపోయాయి. విద్యుత్తు స్తంభాలకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకున్నాయి. విద్యుత్తు సబ్‌స్టేషన్లు ఏళ్ల తరబడి పని చేయకపోవడంతో దుస్థితికి చేరాయి. విలువైన వస్తు సామగ్రి పనికి రాకుండా పోయాయి.

వివరాలిలా..

ప్రత్యేక ఆర్థిక మండలికి కేటాయించిన భూములు : 4200 ఎకరాలు

మండలాలు : నాయుడుపేట, పెళ్లకూరు ఓజిలి

ప్రస్తుతం ఉన్న కంపెనీలు 50 పైగానే

వ్యయం : 330 కోట్లు

ప్రస్తుత పరిస్థితి

కూటమి ప్రభుత్వం సెజ్ పరిధిలో రహదారుల బాగుకు చర్యలు చేపట్టింది. రోడ్డు పనుల పూర్తికి నడుంబిగించింది. రహదారుల పొడవునా పడిన గాడులను యంత్రాలతో తవ్వి మట్టి పోసి పూడ్చుతున్నారు. దెబ్బతిన్న మురుగు కాలువల గోడల్ని తిరిగి నిర్మిస్తున్నారు. కంపెనీలకు అవసరమైన మౌలిక వసతుల కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ప్రజాప్రతినిధులు, మంత్రులు వచ్చి సెజ్‌లో నెలకొల్పాల్సిన కంపెనీల పనులపై కదలిక తెచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని దివిపాలెం ప్రాంతంలో రోడ్డుపై చెత్తాచెదారాలు వేయడంతో దుర్వాసన వస్తోంది. – గుణశేఖర్, గూడూరు

సమాధానం: చెత్తా చెదారాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వర్లు, కమిషనర్

బ్యారేజీకి చేరుతున్న వరద ప్రవాహం

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీకి వరద ప్రవాహం చేరుతోంది. దాంతో సోమవారం ఉదయం నాలుగు గేట్లను ఎత్తి దిగువకు 4 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ పరిధిలోని చెరువుల్లో నీరు ఉండటంతో ఎగువ నుంచి వస్తున్న వరదను దిగువకు వదిలేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

భస్మాంగరాగాయ మహేశ్వరాయ..!

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ శివలింగానికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సోమవారం సందర్భంగా ఉదయం గోక్షీరం, విభూదితో పాటు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అలంకరణలు పూర్తయ్యాక ధూప, దీప, నివేదనలు సమర్పించారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

రికార్డు నమోదు చేసిన నృత్య కళాకారులు

నాట్యాలంకార శిరోభూషణ్ అవార్డు అందుకుంటున్న నాట్యగురువు

వెంకటగిరి, న్యూస్‌టుడే: నెల్లూరులో ఆదివారం రాత్రి సంప్రదాయ కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సంప్రదాయ నృత్యోత్సవం కార్యక్రమంలో వెంకటగిరి నృత్యకళాకారులు రికార్డు నమోదు చేశారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నిరంతరం 305 మంది నృత్య కళాకారులు పాల్గొన్నారు. వీరిలో వెంకటగిరిలో కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న కాసాలక్ష్మి, సుమాలిగా, మునిసారిక, సింధు, లక్ష్మి, భార్గవి, చిత్రాక్షిసింగ్, శ్రేయాసింగ్, చైత్ర, బాలికోన్నత పాఠశాలకు చెందిన నిసిప్రియ పాల్గొన్నారు. వీరు అంతర్జాతీయ వండర్‌బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. నాట్య గురువు సతీష్‌కు నాట్యలంకార శిరోభూషణ్ అవార్డును అందించి సత్కరించారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

చెక్కు అందజేస్తున్న జలీల్ అహ్మద్ తదితరులు

కోట, న్యూస్‌టుడే: కోటకు చెందిన రమణయ్య కుటుంబ సభ్యులకు సోమవారం రూ. 2,23,815లు విలువజేసే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును తెదేపా మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, పార్టీ నాయకులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపీటీసీ దారసురేష్, నాయకులు మధుబాబు, తల్లం శ్రీనివాసులు, నందమోహన్ పాల్గొన్నారు.

గూడూరును జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న పనబాక కోటేశ్వరరావు

కోట, న్యూస్‌టుడే: గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, లేకపోతే నెల్లూరు జిల్లాలో కలపాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పామంజి కృష్ణయ్య, కోర్ కమిటీ జిల్లా సభ్యులు గిరిధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సురేష్ కోరారు. స్థానిక భాజపా కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేయాలని తెలిపారు. అంబరీష, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వర్షంలోనే పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో పింఛనును నాయకులతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. **సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** మండలంలోని సూళ్లూరు నీళ్ల ట్యాంక్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. దిత్వా తుపాన్ నేపథ్యంలో జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఏజీ కిషోర్ పాల్గొన్నారు. **బాలాయపల్లి- డక్కిలి, న్యూస్‌టుడే:** మండలంలో 5201 పింఛన్లకుగాను సోమవారం 4640 పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. డక్కిలి మండలంలో 6,272 మందికిగానూ 5553 మందికి పింఛను అందజేశారు. స్పౌజ్ కేటగిరి కింద 12 మందికి కొత్తగా వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో రవీంద్రబాబు వివరించారు. **వెంకటగిరి, న్యూస్‌టుడే:** పట్టణ పరిధిలో పింఛను నగదు పంపిణీని ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం చేపట్టారు. రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బీరం రాజేశ్వర్ రావు, పట్టణాధ్యక్షుడు అవ్వారు సత్యనారాయణ, మాజీ పట్టణాధ్యక్షుడు ఆనంద్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న కలుజు ❖ పాతనాలపాడు కాజ్‌వేను పరిశీలిస్తున్న అధికారులు

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల అప్రమత్తం

నాయుడుపేట, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాల్లో అధికారులు అప్రమత్తం అయ్యారు. అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో మామిడి కాలువను తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించారు. తిమ్మాజీకండ్రిగ స్వర్ణముఖి కాజ్‌వే, మాబాక, చిలమత్తూరు గ్రామాల దగ్గర రాకపోకలను నియంత్రించారు. **సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** మంగానెల్లూరు గ్రామంలో చెరువు నిండి, కలుజు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. **చిల్లకూరు, న్యూస్‌టుడే:** తిప్పగుంటపాలెం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామానికి రాకపోకలు సాగించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన చప్టాపై రెండున్నర అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలను నిలిపివేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది సోమవారం క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. **బాలాయపల్లి- డక్కిలి, న్యూస్‌టుడే:** డక్కిలి మండలం పాతనాలపాడు దగ్గర ఏరు కాజ్‌వేపై పొంగడంతో తహసీల్దారు శ్రీనివాసులు, వెంకటగిరి సీఐ వెంకటరమణ, అధికారులు వచ్చి మార్గంలో రాకపోకల్ని ఆపారు. బాలాయపల్లి మండలంలో 24.8 మిమీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దారు విజయలక్ష్మి తెలిపారు. నిండలి వద్ద కైవల్య నది కాజ్‌వే కొద్దిగా పొంగడంతో ముందస్తుగా రాకపోకలను నిలిపారు. **కోట, న్యూస్‌టుడే:** తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్, ఎస్సై పవన్‌కుమార్ సిబ్బందితో కలసి గూడలి, గోవిందపల్లిపాళెంతోపాటు పలుచోట్ల కాలువలు, కల్వర్టులు, నదుల ప్రవాహాన్ని పరిశీలించి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

మంత్రి సత్యప్రసాద్‌ను కలసిన నెలవల

నాయుడుపేట, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సోమవారం మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో మంత్రిని నెలవల సత్కరించారు. నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యల గురించి ఇరువురు చర్చించారు. పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

బాధ్యతల స్వీకరణ

కోట, న్యూస్‌టుడే: కోట మండల పరిషత్ జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా అల్లీబాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిల్లకూరు మండలం నుంచి పదోన్నతిపై కోటకు వచ్చారు. చిట్టమూరు జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా వెంకటరావ్ బాధ్యతలు తీసుకున్నారు. ఈయన పుదూరులో పని చేస్తూ పదోన్నతిపై చిట్టమూరుకు వచ్చారు.

రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్ల శాంతియుత నిరసన

సూళ్లూరుపేట: రాష్ట్ర రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్లు ధర్నాచౌక్ వద్ద విజయవాడలో శాంతియుతంగా నిరసన తెలిపారు. సోమవారం తిరుపతి, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన 50 లైసెన్స్ సర్వేయర్లతో పాటు ఇతర జిల్లాల నుంచి మొత్తం 200 మంది నిరసనలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరారు. తిరుపతి లైసెన్స్ సర్వేయర్ల ఉపాధ్యక్షుడు వెంకటయ్య, లైసెన్స్ సర్వేయర్లు పాల్గొన్నారు.

నదిలో దిగిన మతిస్థిమితం లేని వ్యక్తి క్షేమం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట స్వర్ణముఖి నదిలో సోమవారం మతిస్థిమితం లేని వ్యక్తి నీటిలో దిగి కొట్టుకుపోతుండటంతో డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, అగ్నిమాపక సిబ్బంది చేరుకొని అతడిని బయటకు తీశారు. డీఎస్పీ చెంచుబాబు, అగ్నిమాపక అధికారులు సిబ్బందితో చేరుకొని రోప్‌లు, జాకెట్‌లు వేసుకొని నీటిలో దిగి అతడిని బయటకు తీసుకొచ్చి స్థానిక ఆసుపత్రిలో చేర్చారు.

సర్టిఫికెట్స్ పోయినవి

తిరుపతి జిల్లా, వాకాడు గ్రామ వాస్తవ్యులు పూనమల్లి వెంకట క్రిష్ణయ్య గారి కుమారుడు శ్రీనివాసులుకి సంబంధించి టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంసీఏ సర్టిఫికెట్స్ వాకాడు మార్గమధ్యలో పోయినవి. దొరికినచో ఇవ్వగలరు.

PH: 9908360251

ప్రభుత్వ కార్యాలయంలో చోరీకి విఫలయత్నం

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో చోరీ ఘటన కలకలం రేపింది. సోమవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది తలుపులు బద్దలై ఉండటం గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గదులను పరిశీలించారు. కార్యాలయంలో అన్ని పరికరాలు, దస్త్రాలు ఉండటంతో వస్తువులు చోరీకి గురి కాలేదని నిర్ధారించారు. చోరీకి ప్రయత్నించి దొంగలు విఫలం అయినట్లు పోలీసులు తెలిపారు.

ధాన్యం లోడు లారీ బోల్తా

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని మేనకూరు పంచాయతీ చలివేంద్రం వద్ద సోమవారం ధాన్యం లోడు లారీ బోల్తా కొట్టింది. వర్షాలకు రోడ్డు అంచుభాగం కుంగిపోవడంతో లారీ పడిపోయింది. లారీలోని ధాన్యం బస్తాలను మరో లారీలోకి తరలించారు.

మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

హత్య కేసులో నిందితుడి అరెస్టు

తడ, న్యూస్‌టుడే: బిహార్‌కు చెందిన సహమద్ అలీ మృతి కేసులో నిందితుడు మీంజూరు ప్రతాప్‌ను తడ పోలీసులు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. ఈ మేరకు డీఎస్పీ చెంచుబాబు సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి అరెస్టు వివరాలను వెల్లడించారు. గత నెల 26న చేనిగుంట రహదారి సమీపంలో పంక్చర్ కొట్టు వద్ద గాలి పట్టమని చెప్పగా నిప్పల్ లేదని నిర్వాహకుడు చెప్పడంతో, నిందితుడు దాడి చేశారు. ఈ ఘటనలో సహమద్ అలీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు ప్రతాప్‌ను సోమవారం అరెస్టు చేసి నెల్లూరు జైలుకు రిమాండు నిమిత్తం తరలించారు. సీఐ మురళీకృష్ణ, ఎస్సై కొండప నాయుడు ఆయనతో ఉన్నారు.

గుత్తేదారుల కిరికిరి

❖ టెండర్లు పిలిచినా ముందుకురాని పరిస్థితి

❖ నిధులు మంజూరైనా చేపట్టని పనులు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో గత వైకాపా పాలనలో ర.భ శాఖ రోడ్లు దుస్థితికి చేరాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లన్నీ 2025 జనవరి నాటికి గుంతలు లేని రహదారులుగా మారుస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితి మాత్రం నేటికీ మారలేదు.

తేడా తెలియనంతగా

పలు రోడ్లకు నిధులు మంజూరై టెండర్లు పిలిచినా గుత్తేదారులు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఈ మాట చెబుతున్నది ఎవరో కాదు సాక్షాత్తు ఇంజినీర్లే. ఇటీవలి సంభవిస్తున్న వరుస తుపానులకు రోడ్లు గోతులుగా మారాయి. దీంతో రహదారిపై ఎక్కడ గుంత ఉందో లేదో తేడా తెలియడం లేదు. నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితి గురించి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పట్టించుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

దుస్థితిలో వాకాడు- చిట్టమూరు రోడ్డు

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 11.50 కోట్లతో పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. నేటికీ పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో ప్రజలు నరకదారులపై ప్రయాణం సాగిస్తున్నారు. వాకాడు మండలంలోని రావిగుంటపాలెం- నిడిగుర్తి రోడ్డు పనులకు రూ. 3 కోట్లు, విద్యానగర్- మెట్టు రూ. 4.20 కోట్లు, ఓజిలి- గొల్లపల్లి రోడ్డుకు రూ. 80 లక్షలు, కాంద్ర- జయంపు- మేగనూరు- ఉడతావారిపాలెం రహదారి పనులకు రూ. 3.50 కోట్ల మేర నిధులు మంజూరు చేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి మారింది.

ఇక్కడే అధికం

వాకాడు మండలంలోని తీర ప్రాంత గ్రామాలు, ముట్టెంబాక- దుర్గవరం, దుగరాజపట్నం, కొండూరు, వాకాడు- చిట్టమూరు, విద్యానగర్- గునపాడు, కోట- ఉత్తమనెల్లూరు, కోట- తూపిలిపాలెం, వాకాడు- కొండాపురం, కొత్తగుంట- మల్లాం, చిల్లకూరు మండలంలోని అంకులపాటూరు, చేడిమాల, ఏరూరు, విందూరు, పోటుపాలెం, తదితర గ్రామాల్లో రోడ్ల పరిస్థితి నానాటికి తీసికట్టుగా తయారైంది. ఈ విషయమై ర.భ శాఖ గూడూరు ఈఈ రామాంజనేయులను వివరణ కోరగా వర్షాలు తగ్గిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు.



(c) eenadu

అలల సవ్వడి... పర్యాటక సందడి

విశాఖ నగరంలోని కైలాసగిరి పైనుంచి చూస్తే బీచ్ రోడ్డు ఎంతో అందంగా కనిపిస్తుంది. తెన్నేటిపార్కు...అందులోని విద్యుత్తు కాంతులు...ఆ చెంతనే సాగర సొబగులు...ఒడ్డునున్న నౌక..ఇలా అన్నీ కంటికి ఇంపుగా ఉంటాయి. పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అలరించే ఆ తీరం సోమవారం సాయంత్రం ఇలా ఉంది. -ఈనాడు,విశాఖపట్నం

ఇరుముడితో... విమానాల్లో

అయ్యప్ప భక్తులు విమానాల్లో ఇరుముడితో వెళ్లేందుకు పౌర విమానయాన శాఖ అనుమతించడంతో సోమవారం విశాఖ నుంచి చెన్నైకు పలువురు భక్తులు వెళ్లారు. -న్యూస్‌టుడే, ఎన్.ఎ.డి.కూడలి (కాకానినగర్)

టికెట్ల మాయలోళ్లు

✦ క్రికెట్ అభిమానుల ఆశలతో ఆటలు!

✦ సామాజిక మాధ్యమాల్లో విక్రయం పేరిట మోసాలు

ఈనాడు, విశాఖపట్నం: ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో శనివారం మధ్యాహ్నం భారత్-దక్షిణాఫ్రికా మధ్య వన్డే మ్యాచ్ జరగనుంది. స్టేడియం సామర్థ్యం 22 వేలు కాగా... కోహ్లీ, రోహిత్ శర్మ వస్తున్న నేపథ్యంలో టికెట్ల కోసం డిమాండ్ పెరిగింది. దీన్ని కొందరు అవకాశంగా మార్చుకుని, అభిమానులను సామాజిక మాధ్యమాల వేదికగా మోసం చేస్తున్నారు.

అద్భుతాలు చూడాలని: 2023 మార్చిలో విశాఖలో భారత్, ఆస్ట్రేలియా మధ్య వన్డే మ్యాచ్ జరిగింది. ఈ రెండున్నరేళ్లలో ఇక్కడ భారత జట్టు టీ20, టెస్ట్ మ్యాచ్‌లు ఆడినా... వన్డేలు జరగలేదు. విశాఖ స్టేడియంలో విరాట్ కోహ్లీకి మంచి రికార్డులున్నాయి. గతంలో ఆడిన మ్యాచుల్లో సెంచరీలు సాధించి. జట్టును విజయతీరాలకు చేర్చాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడుతున్నారు. వారు బ్యాట్‌తో చేసే అద్భుతాలు వీక్షించాలని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

✦ గత నెల 28న, 30న రెండు విడతల్లో ఆన్‌లైన్‌లో డిస్ట్రిక్ (జొమాటో) యాప్‌లో టికెట్ల విక్రయాలు చేపట్టారు.

✦ విక్రయాలు ప్రారంభించిన గంటల వ్యవధిలోనే టికెట్లు అయిపోయాయి. దీంతో అభిమానులు నిరాశకు గురయ్యారు.

✦ చాలా మంది సామాజిక మాధ్యమాల్లో టికెట్లు అందుబాటులో ఉన్నాయని పోస్టులు పెడుతున్నారు. సంప్రదించిన వారి నుంచి డబ్బులు తీసుకున్నాక...

✦ మ్యాచ్ అదనపు టికెట్లు ఉన్నాయని ఓ వ్యక్తి ఎక్స్‌లో పోస్టు పెట్టాడు. విశాఖకు చెందిన ఒకరు సంప్రదించారు. ఒక్కో టికెట్‌కు రూ.4 వేలు చెల్లించాలని చెప్పడంతో ఫోన్‌పే చేశారు. డబ్బులు పంపిన తర్వాత అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. వాట్సాప్‌లోనూ నంబర్ బ్లాక్ చేశారు.

✦ మూడో విడత టికెట్లను బుధవారం విడుదల చేయనున్నారు. తరువాత వాటి విక్రయం పేరిట జరిగే ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

గతంలోనూ ఇలాగే: ఈ ఏడాది ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలోనూ అభిమానులకు ఇదే పరిస్థితి ఎదురైంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియం దగ్గర కొందరు బ్లాక్‌లో టికెట్లు విక్రయించడం గమనార్హం.

వైకాపా కార్పొరేటర్లకు ఆ నాయకుడు బంధువు. గత ప్రభుత్వంలో చెరువులో దర్జాగా అనధికారికంగా చేపలు పెంచి జేబులు నింపేసుకున్నాడు. మళ్లీ ఇప్పుడు 'కాసులిచ్చి దుకాణం పెట్టుకోండి. నేను చూసుకుంటా' అంటూ అక్రమార్కులకు పావులు కదిపాడు.

దుకాణ దందా.. ఆపేదుండా!!

- కాసులిస్తే చాలు చోటు దక్కినట్టే
- వైకాపా నాయకుడి హవా
- కళ్లప్పగించి చూస్తున్న యంత్రాంగం

కొండప్ప చెరువు సమీపంలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డు పక్కనే ఏర్పాటు చేశారిలా...

ఈనాడు-విశాఖపట్నం, భీమిలి(గ్రామీణం)- న్యూస్‌టుడే: జీవీఎంసీ ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ లంగ్స్' కార్యక్రమంలో భాగంగా తగరపువలసలోని ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారి సర్వీసు రహదారి పక్కన ఉన్న అనధికార దుకాణాలను తొలగించారు. అయితే వీటిలో కొన్ని సంగివలస కొండప్ప చెరువు గట్టు సమీపంలో ఎన్‌హెచ్ సర్వీసు రోడ్డు (676 లొకేషన్) పక్కనే రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. ఎలాంటి సమస్య రాకుండా ఉండాలంటే ఒక్కో దుకాణానికి రూ. 30 వేలు వరకూ సదరు నాయకుడికి ఇస్తే చాలనే భరోసా ప్రచారంలో ఉంది. అంతే కాదు...ఆ నాయకుడు కూడా రెండు దుకాణాలు ఏర్పాటు చేశాడు.

గుప్పిట్లో చెరువు: సంగివలసలో కొండప్ప చెరువు 10 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఎలాంటి అనుమతుల్లేకుండా సదరు వైకాపా నాయకుడు గత ప్రభుత్వంలో చెరువులో చేపలు అక్రమంగా సాగు చేశాడు. ఏటా రూ.లక్షల్లో ఆదాయం జేబులో వేసుకున్నాడు. చేపల పెంపకం వల్ల నీరు దిగువకు వెళ్లే మార్గం మూసేశారు. వర్షాకాలం నీరు పోటెత్తి జాతీయ రహదారి సర్వీసు రోడ్డు నీట మునిగిపోయేది. మురుగు చెరువులో కలిపి, చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు వేయడంతో దుర్గంధం వస్తుందనే ఫిర్యాదులు సైతం అందాయి. 'కూటమి' అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల తరువాత చెరువులో చేపల సాగుకు అడ్డుకట్టవేశారు.

ఆ స్థలంపై కన్నేసి: ఇక్కడి చెరువును దివీస్ ల్యాబ్స్ సీఎస్ఆర్ నిధులతో పార్కుగా అభివృద్ధి చేశారు. గ్రీన్ బెల్ట్ కింద కొంత భాగం వదిలేశారు. ఈ స్థలంలోనే ప్రస్తుతం దుకాణాలు పుట్టగొడుగుల్లా ఏర్పాటవుతున్నాయి. వీటిని ఇలాగే కొనసాగిస్తే కాలువల్లో మురుగు ముందుకు వెళ్లక మళ్లీ సర్వీసు రోడ్డులో సమస్య తలెత్తుతుందని అధికారులకు కొందరు అర్జీలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ అధికారులు స్పందించి క్రేన్, ఇతర యంత్రాలతో దుకాణాల తొలగింపునకు వెళ్లగా స్థానిక వైకాపా నాయకుడు అడ్డుకున్నారు. 'ఎన్‌హెచ్ స్థలం మూడు మీటర్లే ఉంది. రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో మేం మాట్లాడుకుంటాం' అంటూ వారిని వెనక్కి పంపినట్లు సమాచారం.

గాజు వంతెన ప్రారంభం: కైలాసగిరిపై పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఏర్పాటు చేసిన గాజు వంతెనను సోమవారం ప్రారంభించారు. ఎంపీ శ్రీభరత్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించిన తరువాత దీనిపై నడిచి సరికొత్త అనుభూతి పొందారు. -న్యూస్‌టుడే, విశాలాక్షినగర్

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. **ఎస్ఎంవీ బెంగళూర్-నరేంగి (06559/60)** రైలు డిసెంబర్ 2 నుంచి 23 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.40 గంటలకు ఎస్ఎంవీ బెంగళూర్‌లో బయలుదేరి మర్నాడు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ వచ్చి వెళుతుంది. డిసెంబర్ 6 నుంచి 27 వరకు ప్రతి శనివారం ఉదయం 5.30 గంటలకు నరేంగిలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ వచ్చి వెళ్తుంది.

సమయం లేదు.. రింక్ కొలిక్కి రాలేదు..!

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల నిర్వహణకు కేవలం మూడు రోజులు మాత్రమే సమయం ఉంది. అయినా వుడా పార్కులోని స్కేటింగ్ రింక్ ఆధునికీకరణ పనులు కొలిక్కి కాలేదు. దాదాపు మూడు నెలల కింద రూ.80లక్షలతో ఆయా పనులు ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయిలో రింక్‌ను తీర్చిదిద్దుతామని వీఎంఆర్డీఏ అధికారులు ప్రకటించారు. బ్యాంక్ రింక్, లెర్నర్ రింకుల్లో పలకలు మార్చారు. రింక్ రోడ్డులో పాలియూరితిన్ కోటింగ్ వేశారు. రాత్రి వేళల్లో కూడా పోటీల నిర్వహణకు వీలుగా చుట్టూ ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. పాత రైలింగ్‌ను తొలగించి దాని స్థానంలో ఫైబర్‌తో రైలింగ్ ఏర్పాటు చేస్తున్నారు. స్కేటర్లు పడిపోయినా దెబ్బలు తగలకుండా చర్యలు చేపట్టారు. బ్యాంక్ రింక్‌లో రోలర్‌హాకీకి సంబంధించిన సామగ్రిని ఏర్పాటు చేశారు. ప్రేక్షకులు కూర్చొనే విధంగా గ్యాలరీ నిర్మించారు. అయితే పనులు నత్తనడకన సాగుతుండటంతో పోటీల సమయానికి రింక్ సిద్ధమవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కొనసాగుతున్న రింక్ నిర్మాణం

మేఘాల నడుమ.. కొండల మధ్య

ఆకట్టుకునేలా ఏపీటీడీసీ రిసార్టులు

ఈనాడు, విశాఖపట్నం

పర్యాటక సీజన్ ఆరంభంతో సందర్శనీయ ప్రదేశాలు కళకళలాడుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటకుల వసతి కోసం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక ప్యాకేజీలు నిర్వహిస్తోంది. విశాఖతో పాటు అరకు, అనంతగిరి, లంబసింగిలో విలాసవంత సౌకర్యాలతో అందుబాటు ధరల్లో పర్యాటకులకు గదులు సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా లోయలను ఆనుకొని కొండల మధ్య ప్రశాంత వాతావరణం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

ఏపీటీడీసీ హోటళ్లలో ధరలు ఇలా (రూ.లలో)

గదుల రకం	సోమ-గురు	వారాంతం
అరకు వ్యాలీ రిసార్టు		
ప్రీమియం ఏసీ లగ్జరీ	4,200	4,900
ఏసీ సూట్	3,080	3,640
ఏసీ డీలక్స్	2,800	3,360
హిల్ రిసార్టు మయూరి (అరకు)		
ప్రీమియం ఏసీ లగ్జరీ	4,928	5,600
ఏసీ సూట్స్	3,8,08	4,480
ప్రీమియం ఏసీ	3,1,36	3,584
ఏసీ డీలక్స్	2,688	3,136
ఏసీ స్టాండర్డ్	2,240	2,688
క్రాఫ్ట్ సెంటర్	1,680	2,016
యాత్రి నివాస్ (విశాఖ)		
ఏసీ డీలక్స్	4,856	5,250
ఏసీ ఎగ్జిక్యూటివ్	3,281	3,675
ఏసీ సూట్	3,938	4,331

లంబసింగి రిసార్టు

లంబసింగిలో: లంబసింగిలోని హరితా రిసార్టు పచ్చని కొండల నడుమ అలరిస్తుంది. తెల్లవారుజాము పొగ మంచు, చల్లటి వాతావరణంతో సందర్శకులను మైమరపిస్తుంది. ఇక్కడి గదులు రూ.4 వేల నుంచి అందుబాటులో ఉన్నాయి.

అద్భుతం.. అనంతగిరి: ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థకు అనంతగిరి హిల్ రిసార్టు ఎంతో ప్రత్యేకం. కొండ వాలుకు ఆనుకొని ప్రత్యేకంగా నిర్మించిన రిసార్టు ఎంతగానో అలరిస్తుంది. ఏసీ సూట్ గదుల నుంచి చూస్తే ప్రకృతి అందాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి.

బుకింగ్ కోసం.. www.aptdc.in, www.tourism.ap.gov.in 9848813584 నంబర్‌లో సంప్రదించొచ్చు.

ప్రత్యేక ప్యాకేజీలతో: 'పర్యాటకుల కోసం ఏపీటీడీసీ వసతులను సిద్ధం చేసింది. గదుల వద్ద క్యాంప్‌ఫైర్, థింసా నృత్యం ఉంటాయి. బృందాలుగా, కుటుంబ సభ్యులతో వచ్చే వారికి ప్రత్యేక ప్యాకేజీలున్నాయి. బొంగు చికెన్, నాటు కోడి రుచులు అందిస్తాం' అని ఏపీటీడీసీ డీవీఎం జగదీష్ పేర్కొన్నారు.

సచివాలయాల్లో 'ఇంటికే ఉద్యోగం' పరీక్షలు

నేటి నుంచి ప్రారంభం

తగరపువలస, న్యూస్‌టుడే: కౌశలం పేరిట ఇంటికే ఉద్యోగం (వర్క్ ఫ్రం హోం) కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో తొలి విడత పరీక్షలు మంగళవారం నుంచి ఈనెల ఆరో తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సచివాలయాల్లో ఏర్పాట్లు చేశారు. పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థుల చరవాణులకు ముందుగా సంక్షిప్త సందేశం పంపుతున్నారు.

ఇలా నిర్వహణ.: డిసెంబరు రెండో తేదీ నుంచి ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం ఇద్దరికి చొప్పున పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు ఆయా సచివాలయాల్లో వెబ్ కెమెరా, హెడ్‌సెట్‌ను ఏర్పాటు చేశారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. విద్యార్హత, పరీక్షను బట్టి నియామకాలు ఉంటాయి.

✦ **స్కిల్ అసెస్‌మెంట్:** నిర్ణీత 45 నిమిషాల్లో పరీక్ష పూర్తి చేయాల్సి ఉంటుంది. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, వెర్బల్ అండ్ లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సైకోమెట్రిక్ ఎవాల్యూషన్, పర్సనలైజ్డ్ టెక్నికల్ క్వశ్చన్స్ బేస్డ్ ఆన్ యువర్ ఎడ్యుకేషన్ ప్రొఫైల్ అంశాలు ఉంటాయి.

✦ మూల్యాంకనం రెండు కేటగిరీల్లో ఉంటుంది.

✦ **కమ్యూనికేషన్ స్కిల్ అసెస్ మెంట్:** దీనికి 15 నిమిషాల వ్యవధి కేటాయించారు. ఇందులో మూడు ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఒక్కో దానికి 30 సెకన్ల పాటు ఇంగ్లిష్‌లో మాట్లాడి సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఇదంతా వెబ్ కెమెరాలో నమోదవుతుంది.

✦ పరీక్ష సమయంలో కెమెరా, మైక్రోఫోన్, ఫుల్‌స్క్రీన్, లొకేషన్ యాక్సెస్ తప్పనిసరిగా ఉండాలి.

✦ కేటాయించిన సెంటర్ (సచివాలయం)లోని కెమెరాలో పరీక్షకి హాజరయ్యే వారు కాకుండా ఇతరులు కనిపిస్తే అనర్హులు అవుతారు.

అభ్యర్థులెందరంటే..

✦ సర్వేలో పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు: 86,998 మంది

✦ తొలి విడతలో పరీక్షలు రాయనున్న వారు: 6068 మంది.

178 పాఠశాలల్లో మార్నింగ్ న్యూట్రిషన్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో జిల్లాలోని 178 పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు వారంలో మూడు రోజులపాటు మార్నింగ్ న్యూట్రిషన్ అందించనున్నారు. సోమవారం ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద చిన్నారులకు పౌష్టికాహారం అందజేయనున్నట్లు వివరించారు.

విద్యార్థులకు నచ్చేలా.. అందరూ మెచ్చేలా!

ఉపాధ్యాయురాలి ప్రతిభకు ప్రశంసల వెల్లువ

పినగాడి (పెందుర్తి), న్యూస్‌టుడే

సాధారణంగా పిల్లలు బడికి వెళ్లాలంటే మారాం చేస్తారు. డుమ్మా కొట్టేందుకు ఏదొక రకంగా ప్రయత్నిస్తారు. కానీ, పెందుర్తి మండలం పినగాడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మాత్రం దీనికి విరుద్ధం. బడి తలుపులు ఎప్పుడు తెరుస్తారా..? అని ఎదురు చూస్తుంటారు. ఇందుకు కారణం అక్కడి ఉపాధ్యాయురాలు పల్టాసింగి అలివేలి మంగ అలియాస్ సుధ. ఆటపాటలతో ఆమె బోధించే విధానానికి పిల్లలు ఆకర్షితులయ్యారు. ఆమె వినూత్న అభ్యసనా పద్ధతులను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమాల వేదికగా అభినందించడంతో ఆమెకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. 'సర్కారు బడుల్లో సృజనాత్మక బోధన జరగదనే అపోహ ప్రజల్లో ఉంది. దీన్ని రూపుమాపి పిల్లల్లో ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతోనే కృత్యాధారిత బోధనను కొనసాగిస్తున్నా' అని ఆమె పేర్కొన్నారు.

ఆటపాటలతో పిల్లలకు బోధిస్తూ..

ఆ ఆలోచన మార్చాలని: 'మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన పెదబయలు మా స్వస్థలం. తండ్రి నిత్యానందం కార్పెంటర్. తల్లి సూర్యకాంతమ్మ గృహిణి. ఇద్దరు తమ్ముళ్లున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వసతిగృహంలో చదివా. కష్టపడి చదివి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించా. 2014లో విధుల్లో చేరా. పినగాడిలో చేరినప్పుడు ఇంటింటికీ వెళ్లి పిల్లలను బడికి పంపాలని ఉపాధ్యాయులందరం కోరేవాళ్లం. ఆ క్రమంలో తల్లిదండ్రులు సర్కారు బడుల్లో బోధనపై అనుమానాలు వ్యక్తం చేసేవారు. అప్పుడే ఈ భావనను మార్చాలని నిర్ణయించుకున్నా. బడిలో ఉన్న కొద్దిమంది పిల్లలకే కమ్యూనికేషన్, ఆంగ్లం, డ్రెస్సింగ్, నడవడిక, సులభమైన పద్ధతుల్లో చదవడం, ఆటపాటలతో చదువుకోవడం వంటి వినూత్న పద్ధతులు వివరించగా ఎంతగానో ఆకర్షితులయ్యారు. తొలిరోజుల్లో వీడియోలు తీసి వాట్సాప్‌లో స్టేటస్‌గా పెట్టా. స్నేహితురాలి సూచన మేరకు ఇన్‌స్టాలో 'మిస్ యూనిక్' పేరిట అప్‌లోడ్ చేయడం ప్రారంభించా' అని ఆమె వివరించారు.

ప్రస్తుతం 1.65 లక్షల మంది నా ఇన్‌స్టా అనుసరిస్తున్నారు. ఈ వీడియోలను చూసిన మంత్రి లోకేశ్ పిల్లల చదువుల కోసం చేస్తున్న కృషిని అభినందించారు. ఆయన ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా బోధన చేస్తా' అని సుధ పేర్కొన్నారు.

నృసింహ దీక్షలకు వేళాయే!

సింహగిరిపై ఏర్పాట్లు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై వరాహ, నృసింహ అవతారాల కలయికతో శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామిగా భక్తులను అనుగ్రహిస్తున్నాడు అప్పన్న స్వామి. భక్తిశ్రద్ధలతో ఏటా శ్రీనృసింహ దీక్షలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులు. మార్గశిర శుద్ధ త్రయోదశి సందర్భంగా బుధవారం 41 రోజుల మండల దీక్షకు శ్రీకారం చుట్టనున్నారు.



దీక్షా ప్రాంగణంలో నమూనా విగ్రహం

రెండు విడతలుగా: శ్రీనృసింహ దీక్షలను భక్తులు రెండు విడతలుగా స్వీకరిస్తున్నారు. 41 మండల దీక్ష 3న ప్రారంభమవుతుంది. 32 రోజుల మూలమంత్ర దీక్ష ఈ నెల 11న చేపట్టాలని ఆలయ పెద్దలు నిర్ణయించారు. అప్పన్న స్వామికి 32 సంఖ్యతో అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని పెద్ద సంఖ్యలో భక్తులు ఈ దీక్షను స్వీకరిస్తుంటారు. నృసింహ స్వామి హిరణ్య కశ్యపుడిని సంహరించే సమయంలో 32 రూపాలను ప్రదర్శించడంతో పాటు ఉగ్రం వీరం.. అనే నృసింహ మంత్రంలో 32 అక్షరాలు ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో ఈ దీక్షను భక్తులు మూలమంత్ర దీక్షగా అభివర్ణిస్తారు. ఈ రెండు విడతల దీక్షలు వచ్చే ఏడాది జనవరి 12న సంప్రదాయ బద్ధంగా పరిసమాప్తమవుతాయి. సింహగిరికి చేరుకున్న మాలధారులు దీక్షలు విరమణ చేస్తారు. ఆ రోజున తిరుముడిని సింహగిరిపై స్వామికి సమర్పిస్తారు. పురుషులు ఏ వయసు వారైనా దీక్షలు స్వీకరించవచ్చు. 10 ఏళ్లలోపు బాలికలు, 50 ఏళ్లు దాటిన మహిళలు మాత్రమే దీక్షకు అర్హులు.

ఈ నెల మూడున దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు మాలధారణ చేయించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు తెలిపారు.

ఆటల తోటలో అందాల చెట్టు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: తెల్లని కాండంతో నిటారుగా పెరుగుతూ కొమ్మల చివర ముదురు పచ్చని ఆకులతో పుట్ట గొడుగులను పోలినట్టు ఉన్న ఈ పచ్చందాల చెట్టు పీఎంపాలెం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద కనువిందు చేస్తోంది. చైనీస్ మర్రి, ఇండియన్ లారెల్ పేర్లతో పిలిచే ఈ చెట్టు శాస్త్రీయనామం 'ఫైకస్ మైక్రోకార్పా' అని ఉద్యానవన విభాగం అధికారులు పేర్కొన్నారు. నర్సరీలో పెద్దగా పెరిగిన తర్వాత వేర్లతో సహా జాగ్రత్తగా తీసి ఇక్కడ నాటినట్లు స్టేడియంలో పచ్చదనం పెంపొందించే నిర్వాహకులు చెబుతున్నారు. 20 అడుగుల ఎత్తున్న ఈ చెట్టు వయసు సుమారు ఐదు సంవత్సరాలు.

MANAGEMENT SEATS AVAILABLE
LLB 3years | BA . LLB 5years | LLM 2 years
D.Pharma B.Pharma M.Pharma
Cont : 8332978328, 9154087107

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
పదవీ విరమణ శుభాకాంక్షలు
ఈనాడు క్లాసిఫైడ్స్
జన్మదిన శుభాకాంక్షలు
జయంతి, వర్ధంతి
లీగల్ ప్రకటనలు
అంత్యక్రియలు,
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

శ్రీకృష్ణార్జున దివ్యమూర్తులు

సుందర కృష్ణ.. సుమధుర 'గీత'..!

పాతనగరం రాజప్పనాయుడు వీధిలోని గీతా భవంతిలో సోమవారం భగవద్గీత జయంతిని ఘనంగా నిర్వహించారు. భగవద్గీత ప్రచార సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వరూప సహిత శ్రీకృష్ణార్జున దివ్యమూర్తులకు అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళధ్వని, వేద మంత్రాలతో గీతా జయంతి జరిపారు. భక్తులు సామూహిక సంపూర్ణ గీతా పారాయణం చేశారు. సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు, ఆధ్యాత్మిక వేత్తలు ఎంవీ రాజశేఖర్, ప్రసాద్, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, జగదాంబకూడలి

భారీ ప్రాజెక్టులు.. పట్టాలెక్కేదెప్పుడు?!

వీఎంఆర్‌డీఏ టెండర్లకు స్పందన కరవు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో కీలక ప్రాజెక్టులు పట్టాలెక్కడం లేదు. కన్సల్టెన్సీ, డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక)లకే పరిమితమవుతున్నాయి. భారీ అంచనాలతో ప్రతిపాదనలు తయారు చేసినా ఆ తర్వాత అధికారులు చేతులెత్తేస్తున్నారు. గుత్తేదారుల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ కోరి, టెండర్లకు వెళ్లేసరికి ఒకరిద్దరు పాల్గొంటున్నా పనులకు ఆసక్తి చూపడం లేదు.

▮ రుషికొండలో ఎనిమిది ఎకరాల్లో భారీ కన్వెన్షన్లు, సమావేశ మందిరాలు, క్లబ్బులు, హోటళ్లతో ఈస్టుకోస్టు హేబిటేట్ సెంటర్‌కు వీఎంఆర్‌డీఏ ప్రణాళిక చేసింది. డీపీఆర్ తయారు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్య (పీపీపీ) విధానంలో రూ.200 కోట్లతో నిర్మించాలనుకోగా..టెండర్లలో ఎవరూ ఆసక్తి చూపలేదు.

▮ పెద్ద రుషికొండ ఐటీ పార్కుకు సమీపంలో 50 అంతస్తులతో ఆరు ఐకానిక్ టవర్లు నిర్మించాలనుకున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ తరువాత ఆసక్తి వ్యక్తీకరణ కోరితే ఒక్క దరఖాస్తే వచ్చింది.

▮ రుషికొండ తీరంలో క్రీడా ప్రాధికార సంస్థతో కలిపి జల క్రీడల సముదాయం ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందుకోసం మూడు దఫాలుగా టెండర్లు పిలిచినా ఎవరూ స్పందించలేదు.

మరి వాటి సంగతో: గతంలో కొన్ని ప్రాజెక్టులను ప్రతిపాదించగా ప్రస్తుతం వాటిని పట్టాలెక్కిస్తారా, పక్కన పెడతారనేది తేలాల్సి ఉంది. బీచ్ రోడ్డులోని ఓషన్ డెక్, స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్లు, కాపులుప్పాడలో చారిత్రక మ్యూజియం, కైలాసగిరిపై సైన్స్ సిటీ, ప్లానిటోరియం వంటి ప్రాజెక్టులను గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుకు ప్రణాళిక చేశారు. వీటి ప్రణాళిక, ఇతర పనుల నిమిత్తం రూ.కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు వాటి ఊసెత్తడం లేదు.

ఎందుకలా: ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ తలపెట్టిన భారీ ప్రాజెక్టులకు రూ.వందల కోట్లు అవసరం. వీఎంఆర్‌డీఏ సొంతంగా చేపట్టలేని పరిస్థితి. దీంతో పీపీపీ విధానంపై ముందుకు వెళ్తున్నారు. విశాఖలో ఆయా ప్రాజెక్టులకు తగినంత మార్కెట్ ఉందా అని ప్రైవేటు సంస్థలు ఆలోచిస్తున్నాయి.

20వ వర్ధంతి

RAGHUPATRUNI GIRIDHAR
B.Tech., MIE, CEng.(I) FIIPE, MIIM
Founder: RgCON Group
జననం: 24-07-1958 | మరణం: 02-12-2005
మంచికి, మానవత్వానికి, మారుపేరుగా కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన మీరు భౌతికంగా మాకు దూరమైనా మీరు చూపిన మార్గంలోనే మీ అడుగు జాడలలోనే పయనిస్తున్నాము. మీ పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని ప్రార్థిస్తూ...
Wife: RAGHUPATRUNI INDIRA DEVI
Son: R.J.S.V.SANTOSH
Daughter In-Law: R.VARSHA
Grandson: R.S.G. AGASTYA KARTHIKEYA
and Other Family Members & Relatives
Daughter: R.SWATHI
Son-in-Law: M. RAM VIVEK
Staff & Team of RgCON
P.S.R. MURTHY
SRI SAI BALAJI ENGG. WORKS, VZM.

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 ఆంధ్ర కింగ్ తాలూకా

స్క్రీన్-2 - రాజు వెడ్స్ రాంబాయి

3 నుంచి విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.బోనంగి సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా పరవాడ, వాడచీపురుపల్లి, వెంకటాపురం, పెదముషిడివాడ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడురోజుల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని, వీలైనంత వరకు ప్రత్యామ్నాయమార్గాల ద్వారా సరఫరా అందించడానికి కృషి చేస్తామని చెప్పారు.

నూతన నియామకం

సబ్బవరం, న్యూస్‌టుడే: భారతీయ జనతాపార్టీ అనకాపల్లి జిల్లాలోని 5 విభాగాలకు నూతన అధ్యక్షులను నియమించింది. వీరిలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడుగా కిల్లాడ వెంకట సత్యనారాయణ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడుగా ఎస్.వి.వి. శంకరరావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఓరుగంటి నాగమణి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడుగా గొట్టివాడ స్రామాట్ కుమార్, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడుగా షేక్ బాబ్జీలను నియమిస్తూ జిల్లా భాజపా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు నియామక పత్రాలు విడుదల చేశారు. ఈ ప్రక్రియలో సబ్బవరం మండలం నుంచి ఇద్దరికి ప్రాధాన్యం లభించడం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ? : పరవాడలోని లుపిన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన పార్కు అధ్వానంగా తయారైంది. పిచ్చిమొక్కలు పెరిగిపోయి, ఆట వస్తువులు తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. –నాగేశ్వరరావు, పరవాడ. ✓: నిధుల సమస్య ఉన్నందున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో వినియోగంలో తీసుకొస్తాం. –మురళీధర్ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి, పరవాడ.

బాలలు సామాజిక సేవలో ముందుండాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్న వయసు నుంచే సామాజిక సేవాదృక్పథం కలిగి ఉండాలని పెందుర్తి శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ తారకేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో సామాజిక సేవా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలోని పారిశుద్ధ్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. డీన్ శేషగిరి, సి-బ్యాచ్ ఇన్‌ఛార్జి హఫ్‌సా, తదితరులు పాల్గొన్నారు.

సర్వే రాళ్ల ఏర్పాటుకు అనుమతించరూ..

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం పోర్లుపాలెం గ్రామంలో గతంలో తమకు కేటాయించిన స్థలాలకు సర్వే రాళ్లు ఏర్పాటు చేసుకోవడానికి సహకరించాలని ఆంధ్ర సిమెంట్స్ కంపెనీ ఇళ్ల స్థలాల యజమానుల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే రమేశ్‌బాబును కోరారు. ఈ మేరకు సోమవారం రత్నగిరినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. స్థలాల్లో తుప్పలు తొలగించుకుని సర్వే రాళ్ల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు అనుమతించాలని కోరారు. సంఘ ప్రతినిధులు ఆర్.అప్పారావు, వై.మోహన్‌రావు, బీకే నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

31 నుంచి సిటూ మహాసభలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) అఖిల భారత మహాసభలు ఈనెల 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరుగుతాయని సిటూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం సబ్బవరం మండలం వంగలి గ్రామంలో గోడపత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీఐటీయూ ఏర్పడిన తర్వాత ఈ మహాసభలు తొలిసారిగా విశాఖలో జరగనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఈ సభలను జయప్రదం చేయాలని కోరారు. సిటూ నాయకులు ఎర్ర సోంబాబు, రామునాయుడు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థల సమస్యకు పరిష్కారం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం శ్మశాన వాటిక సమస్యపై ఆ గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు గతంలో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ విచారణ చేపట్టి కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న సమస్యను పరిష్కరించారు. ఈ మేరకు అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులతోపాటు ఆ గ్రామ ఎస్సీ సామాజికవర్గ ప్రతినిధులు సోమవారం తహసీల్దార్ చిన్నికృష్ణను శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తమరాన బంగారునాయుడు, వీఆర్వో శేఖర్, సర్వేయర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

వాడచీపురుపల్లి(పరవాడ), న్యూస్‌టుడే: విద్యార్థులు బాల్యం నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నతస్థాయిలో రాణించాలని పరవాడ ట్రైనీ ఎస్సై ఎస్.విజయకుమారి అన్నారు. ముత్యాలమ్మపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ బాగా చదువుకోవాలని బాలబాలికలను చైతన్యపర్చారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రైనీ ఎస్సై విజయకుమారి

7న జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు ఈనెల 7వ తేదీన పోర్టు స్టేడియంలో జరగనున్నట్లు విశాఖపట్నం అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎ.నారాయణరావు తెలిపారు. అండర్-16, 18, 20 విభాగాల్లో బాల, బాలికలు; సీనియర్ విభాగంలో మహిళలు, పురుషులకు ఈ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ మేళాలో 18 మంది ఎంపిక

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఆర్.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యాకల్పన, నివేదిత, కిరణ్మయి, వరలక్ష్మి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ ఆర్.మంజుల, వివిధ కంపెనీల ప్రతినిధులు

గురి తప్పని బాణాలు..

విలువిద్యలో అదరగొడుతున్న క్రీడాకారులు..

రాష్ట్ర, జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పతకాల పంట

పరవాడ, న్యూస్‌టుడే: విలువిద్య (ఆర్చరీ) ఏకాగ్రతతో కూడిన క్రీడ. బాణం గురిపెట్టి వేస్తే గాని లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం. ఈ క్రీడలో సత్తా చాటాలంటే పట్టుదల, ఓర్పు, ఆత్మవిశ్వాసం చాలా అవసరం. ఈ మేరకు బాల్యం నుంచి ఆసక్తి పెంచుకున్న పరవాడ మండలం పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు చదువుతో పాటు ఈ క్రీడకు సమయం కేటాయించి ప్రతిభ చాటుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కోచ్‌ల వద్ద తర్ఫీదు పొందుతున్నారు. ఇటీవల జరిగిన వివిధ పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించిన పలువురి మనోగతం వారి మాటల్లోనే.

ఆర్చరీ పోటీల్లో క్రీడాకారులు

నా స్వస్థలం చింతల గొర్లెవానిపాలెం. తండ్రి సురేష్‌కుమార్ ఫార్మా ఉద్యోగి. తల్లి రమ్యకృష్ణ గృహిణి. ఇటీవల పాడేరులో అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పసిడి పతకం సాధించి జనవరిలో రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. గతంలో రాష్ట్ర స్థాయిలో 2 పసిడి, 2 రజత, 5 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నా. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని లక్ష్యం. –సాయిమనస్వి, 9వ తరగతి

మాది తాటిచెట్లపాలెం. తండ్రి వెంకటరావు బైకు మెకానిక్, తల్లి సరోజని గృహిణి. పాడేరులో అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో పసిడి పతకం సాధించి మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించా. జిల్లాస్థాయిలో ఒక రజత, రెండు కాంస్య పతకాలు సాధించా. –ఎన్.మోహిత, 12వ తరగతి

మా సొంతూరు విజయవాడ. నాన్న సునీల్‌కుమార్ ఎలక్ట్రీషియన్. అమ్మ ఉమాకుమారి గృహిణి. పాడేరులో అండర్-19 పోటీల్లో రజతం సాధించి జనవరిలో మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించా. జిల్లా స్థాయిలో రెండు కాంస్య, ఒక రజత పతకాలు సాధించా. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని లక్ష్యం –సీహెచ్ ప్రణీత్, 12వ తరగతి

మా ఊరు బొబ్బిలి. తండ్రి మధుసూదనరావు. తల్లి సీతామహాలక్ష్మి గృహిణి. పాడేరులో అండర్-14 పోటీల్లో కాంస్య పతకం సాధించి వారణాసిలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. గతంలో జిల్లా స్థాయిలో ఒక కాంస్య, రజత పతకాలు సాధించా. ఆర్చరీలో దేశానికి గుర్తింపు తేవాలనేది లక్ష్యం. –జి.జానేష్, 8వ తరగతి

మాది గాజువాక. తల్లిదండ్రులు చైతన్య, సృజన వైద్యులు. పాడేరులోని అండర్-14 పోటీల్లో రజత పతకం కైవసం చేసుకుని వారణాసిలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. గతంలో మినీ రాష్ట్ర స్థాయి పోటీల్లో రజత పతకం సాధించి విజయవాడలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జిల్లా స్థాయిలో 2 పసిడి, 2 రజత, ఒక కాంస్య పతకాలు సాధించా. ఆర్చరీలో దేశానికి పసిడి పతకం అందించాలని లక్ష్యం. –ఆద్య, 8వ తరగతి

ఘనంగా గీతాజయంతి వేడుకలు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట పరిసర ప్రాంతాల్లో సోమవారం గీతాజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. లక్ష్మీనరసింహనగర్ గోపీజనవల్లభస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, పెందుర్తి మండల తెదేపా ఇన్‌ఛార్జి గండిబాబ్జీ, కార్పొరేటర్ రాపర్తి కన్నా, జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, జోనల్ కమిషనర్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు. సచివాలయ కార్యదర్శులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చింతలగ్రహారం కృష్ణాలయంలో ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

గోపీజనవల్లభస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న గండి బాబ్జీ, రాపర్తి కన్నా తదితరులు

ప్రతిభ చాటారు..బహుమతి పొందారు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

ఎస్‌వీఎల్ఎన్, ఎస్‌వీపీ జూనియర్ కళాశాలలో ప్రసంగిస్తున్న విద్యార్థి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ పి.సత్య, అధ్యాపకుడు వెంకటరమణ

వేపగుంట, న్యూస్‌టుడే: 'కృత్రిమ మేధ (ఏఐ)తో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై సోమవారం ఆర్.ఆర్.వెంకటాపురం ఎస్‌వీఎల్ఎన్, ఎస్‌వీపీ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రసంగించారు. హెచ్.అఖిల, జాన్సన్ విజయ్‌పాల్, ప్రియాంక పాల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ పి.సత్య, అధ్యాపకుడు ఎ.వెంకటరమణ బహుమతులు అందజేశారు.

వేంకటాద్రిపై 16 నుంచి ధనుర్మాసోత్సవాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాసోత్సవాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమవుతాయని దేవస్థానం ఈవో నీలిమ తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించిన ప్రచార కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ వివరాలను ఆలయ ప్రధానార్చకులు మహాన్ రామానుజాచార్యులు తెలియజేశారు. 16వ తేదీన మధ్యాహ్నం నెల గంట పెట్టినప్పటి నుంచి వచ్చే ఏడాది జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస వ్రతం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నెల రోజుల పాటు ప్రతిరోజు తిరుప్పావై పాశుర విన్నపం, విశేష ఆరాధనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు.

ఉత్సవాల ప్రచార కరపత్రం విడుదల చేస్తున్న ఈవో నీలిమ, తదితరులు

అలాగే గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. జనవరి 1న ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా శ్రీనివాసుడు నవనీత అలంకారంలో భక్తులను అనుగ్రహిస్తారన్నారు. జనవరి 4న సుదర్శన హోమం, అన్న సమారాధన, 11న కూడారై ఉత్సవం, 13న తిరువీధి మహోత్సవం, 14న గోదా శ్రీరంగనాథుల కల్యాణంతో ధనుర్మాసోత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలియజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

93.08 శాతం పింఛన్ల పంపిణీ

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్న పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ

పెందుర్తి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం చురుగ్గా జరిగింది. పెందుర్తి మండలంలో తెల్లవారుజాము నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. మండలంలోని పది పంచాయతీల పరిధిలో 4,193 పింఛన్లకు గాను 3,903 పంపిణీ చేసి 93.08శాతం పూర్తి చేసినట్లు పెందుర్తి ఎంపీడీవో గుండు అప్పలరాజు తెలిపారు. తొలిరోజు రూ.1,64,11,500 నగదు పంపిణీ చేసినట్లు వివరించారు. పలు గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, కూటమి నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

గొల్లనారాయణపురం(వేపగుంట), న్యూస్‌టుడే: 93వవార్డు గొల్లనారాయణపురంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, జోనల్ కమిషనరు శంకర్రావు, ఏపీడీ చిరంజీవి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: మొగలిపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అందజేశారు. స్థానిక నాయకులు తమరాన బంగారునాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సబ్బవరంలో తాతారావు, ఇరువాడలో రేవుపల్లి రమణ,

లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు తదితరులు

బాటజంగాలపాలెంలో సర్పంచి పడాల వెంకటరమణ, బల్లిపాలెంలో శ్రీనివాసరావు సమక్షంలో అధికారులు వీటిని లబ్ధిదారులకు అందించారు. అనకాపల్లి జిల్లాలో సోమవారం సాయంత్రం 4 గంటలకు 94శాతం పింఛన్ల పంపిణీ చేసి జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నట్లు ఎంపీడీవో పి.పద్మజ పేర్కొన్నారు.

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను సోమవారం సచివాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. కన్నూరు గ్రామంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఇద్దరు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గ్రామీణాభివృద్ధిశాఖ పీడీ శచీదేవి, తహసీల్దార్ నాగరాజు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో షేక్ బేగం తదితరులు పాల్గొన్నారు.

కన్నూరులో లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 132 ఫిర్యాదులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 132 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ బాధితులు నుంచి అర్జీలు స్వీకరించారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడి ఆయా వినతులపై త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు సీపీ పేర్కొన్నారు.

ధోబీఖానా ప్రారంభించేదెప్పుడో..!

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అమృతపురం గ్రామంలో పదేళ్ల కిందట చేపట్టిన ధోబీఖానా నిర్మాణం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎట్టకేలకు పూర్తయ్యింది. ఇందుకోసం సుమారు రూ.13లక్షలు వెచ్చించారు. వీలైనంత తొందరగా దీన్ని ప్రారంభించాలని స్థానిక రజకులు కోరుతున్నారు.

సౌర ఫలకాల ఏర్పాటుకు ఈపీడీసీఎల్‌తో ఒప్పందం


ఒప్పంద పత్రాన్ని చూపుతున్న సీఎండీ పృథ్వీతేజ్, సద్బున్ సంస్థ డైరెక్టర్, తదితరులు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గృహాలపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసేందుకు ఏపీఈపీడీసీఎల్‌తో సద్బున్ ఫ్యూచర్‌టెక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. గురుద్వారా దరి ఈపీడీసీఎల్‌లోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి.సూర్యప్రకాశ్ సమక్షంలో సీజీఎం ఎల్.దైవప్రసాద్, సద్బున్ ఫ్యూచర్ టెక్ డైరెక్టర్ భూపేంద్ర సింగ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. పలు డివిజన్లలో 44,998 సర్వీసులకు 90 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో సుమారు రెండు లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలపై ఉచితంగా ప్లాంటు ఏర్పాటుచేయడానికి టెండర్ ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరు సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

వేపగుంట, న్యూస్‌టుడే: జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం జరిగింది. జెడ్సీ శంకర్రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏసీపీ రామలింగారెడ్డి, మంచినీటి విభాగం ఏఈ రాజశేఖర్, ఏపీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు తోటి అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కాలుష్యం, భూసమస్యలు తదితర వాటిపై 9 అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ శంకర్రావు

జీవీఎంసీకి 111 వినతులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 111 వినతులు వచ్చాయి. మేయరు పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ వాటిని స్వీకరించారు. జోన్-2కు 18, జోన్-3కు 16, జోన్-4కు 9, జోన్-5కు 11, జోన్-6కి 15, జోన్-8కు 11, ప్రధాన కార్యాలయానికి 31 చొప్పున వచ్చాయి. వాటిలో పరిపాలనకు 13, రెవెన్యూకు 13, ప్రజారోగ్యానికి 7, ప్రణాళికకు 48, ఇంజినీరింగ్‌కు 21, ఉద్యాన విభాగానికి 5, యూసీడీకి 4 వచ్చాయి. ఆయా సమస్యలను పరిష్కరించాలని మేయరు అధికారులను ఆదేశించారు.

★ బీచ్‌రోడ్డులో ఓ బహుళ అంతస్తు నిర్మాణానికి సంబంధించి దరఖాస్తు చేసిన ప్లానుకు కేంద్ర, పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అనుమతులు తీసుకోలేదని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 20 బోర్లు వేశారని, వాటిని తక్షణమే మూసివేయాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన

చింతలగ్రహారం (వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం జడ్పీ పాఠశాలలో ఇటీవల జరిగిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సంబంధిత విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని నాగమణి, ఉపాధ్యాయ బృందం సోమవారం అభినందించింది.

ఫుడ్‌ఫెస్టివల్‌లో పాల్గొన్న బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అప్రమత్తతతోనే ఎయిడ్స్ నివారణ

పెందుర్తి, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరు ఎయిడ్స్ వ్యాధి పట్ల అప్రమత్తతతో వ్యవహరించడం ద్వారానే నివారణ సాధ్యమని పెందుర్తి సీహెచ్‌సీ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ హెచ్ఆర్‌కే దొర అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం పెందుర్తి ఐసీటీసీ కౌన్సిలర్లు చీపురుపల్లి సురేశ్‌కుమార్, హేమలత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. వైద్యాధికారులు డాక్టర్ అవంతి, డాక్టర్ అరుణాదేవి, సిబ్బంది పాల్గొన్నారు. ★ పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఫ్లోరా ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ థియోఫిలస్, ఉప ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో మంజుల తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ వైద్యులు, ఐసీటీసీ సిబ్బంది

సబ్బవరంలో అవగాహన ర్యాలీ

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మానవహారం

సబ్బవరం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన సబ్బవరంలో చేపట్టిన ర్యాలీని పీహెచ్‌సీ వైద్యుడు ఎన్ఎస్ఆర్ చక్రవర్తి ప్రారంభించారు. సీఐ రామచంద్రరావు, ఐసీటీసీ కౌన్సిలర్ రాజశేఖర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించి ఎయిడ్స్ వ్యాధిని తరిమి కొడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం వైద్యుడు కె.కన్నంనాయుడు, ప్రధానాచార్యుడు కేశవరావు, సబ్బవరం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.శిరీషారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వార్డు పరిధి ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రిన్సిపల్ వివేకానందరావు ప్రారంభించారు. అవగాహన ద్వారానే ఎయిడ్స్ నివారణ సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పరవాడ మండలం ఇస్లాంపేటలో..

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవ బెహరా కళాశాలలో విద్యార్థులు ఎయిడ్స్ రిబ్బన్ ఆకృతిలో ప్రదర్శన చేపట్టారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ వరలక్ష్మీ ఆధ్వర్యంలో విద్యార్థులు నరవ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ చేపట్టి స్థానికులను చైతన్యపర్చారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

కాంగ్రెస్ బలోపేతం దిశగా అడుగులు

మురళీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తోందని, దీనికోసం పార్టీ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు సునీల్ అహిరే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అహిరే పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి పార్టీకి సేవ చేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రశంసిస్తూ పార్టీ ఎక్కడా బలహీన పడలేదని త్వరలోనే పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకోవాలంటే యువత కాంగ్రెస్‌ను ముందుండి నడిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో పార్టీని నడిపించే నాయకుల అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, పీసీసీ పరిశీలకులు మార్టిన్ లూథర్, అమర్‌బేగ్, వేగి వెంకటేశ్, ఇతర నాయకులు లక్కరాజు రామారావు, తదితరులు హాజరయ్యారు.

వన్డే మ్యాచ్‌కు ముమ్మరంగా పనులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఈనెల 6వ తేదీన ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న భారత్-దక్షిణాఫ్రికా వన్డే మ్యాచ్ నిర్వహణకు సంబంధించిన పిచ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే తయారు చేసిన పిచ్‌ను రోలింగ్ చేయడం వంటి పనులు సోమవారం చేపట్టారు. స్టేడియం హెడ్ క్యురేటర్ నాగమల్లయ్య, ఏసీఏ మీడియా మేనేజర్ వై.వెంకటేష్ సంబంధిత పనులను పరిశీలించారు. గ్యాలరీల్లో సీట్లను శుభ్రపర్చడమే కాక స్టేడియంలోని అవుట్‌ఫీల్డ్ పనులు కూడా చకచకా సాగుతున్నాయి. ఈ మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఆంధ్రా క్రికెట్ సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెంకటేశ్ తెలిపారు. ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, సెక్రటరీ ఎంపీ సానా సతీష్‌లు ఈ మ్యాచ్ నిర్వహణకు అన్ని విభాగాలను సన్నద్ధం చేశారని పేర్కొన్నారు

CHANGE OF NAME

I, ATCHYUTAMBA PEMMARAJU (Old Name), W/o. K Visweswara Rao, residing at D.No.10-13/1/9, Flat No.204, Lakshmi Kamalasri Enclave, PF Colony, Near Baba Temple, Chinamushidiwada, Pendurthi, Visakhapatnam-530051, Andhra Pradesh. Changing my Name from ATCHYUTAMBA PEMMARAJU (Old Name) to KROVVIDI ACHYUTAMBA (New Name), henceforth I am being called KROVVIDI ACHYUTAMBA (New Name), for all purposes

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్- రివాల్వర్ రీటా
రాములమ్మ- జనతా బార్
తాతా- రాజు వెడ్స్ రాంబాయి
సప్తగిరి- ఆంధ్ర కింగ్ తాలూకా

సామాజిక పింఛన్ల అందజేత

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్‌లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ఎన్టీఆర్ సామాజిక ఫించన్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందజేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ ఎల్.అప్పారావు, వార్డు అధ్యక్షుడు సీహెచ్.సన్యాసిరావు, బి.దొరబాబు, సీహెచ్.గోపి, చిక్కాల విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: కొత్తరోడ్డు నుంచి గొల్లల ఎండాడకు వచ్చే బస్సులు సమయపాలన పాటించడం లేదు. –సంతోష్, గొల్లల ఎండాడ ✓: క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. –మహేశ్వరరెడ్డి, డిపో మేనేజర్.

?: మిథిలాపురి వుడా కాలనీ(మధురవాడ)లో వాసల్య హాసపత్రికు వెళ్లే మార్గంలో పడిన గుంత ప్రమాదకరంగా మారింది. – కాలనీ వాసులు. ✓: త్వరలో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తాం. – కనకమహాలక్ష్మి, జెడ్సీ.

?: ఎస్ఎస్ఎస్ విద్యాలయం(ఎండాడ)కు వెళ్లే దారి గుంతలతో నిండి ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – ఎస్.నాయుడు. ✓: రహదారిని పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు చేస్తాం. –శ్రీనివాస్, ఏఈ.

?: దసపల్లాలేఅవుట్ నుంచి సాగర్‌నగర్‌కు వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగడం లేదు. – క్రాంతి, సాగర్‌నగర్. ✓: సిబ్బందిని పంపించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.– సాయిరాం, విద్యుత్ అధికారి.

పాఠశాలకు రండి.. పిల్లల ప్రగతి తెలుసుకోండి

5న పీటీఎం సమావేశాలు

మధురవాడ, న్యూస్‌టుడే: జీవితంలో ఎంతో కీలకమైన పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు ప్రతి విద్యార్థి శ్రమిస్తుంటారు. వారికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల తోడ్పాటు ఎంతో అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఈ ఏడాది 'పది' ఫలితాల్లో మెరుగైన ఫలితాలు రావాలని మంత్రి నారా లోకేశ్ సూచనతో విద్యా శాఖాధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. అన్ని పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా వచ్చే నెల 5న అన్ని ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) నిర్వహిస్తున్నారు. తద్వారా విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేయాలని నిర్ణయించారు.

పిల్లల తల్లిదండ్రులను పీటీఎంకు ఆహ్వానిస్తున్న సునీల్ శర్మ కాలనీ ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు

★ ఈ సమావేశానికి పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బృందాలుగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆహ్వానిస్తున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే క్రమంలో తల్లిదండ్రుల పాత్ర, బాధ్యతలను గుర్తు చేస్తున్నారు. పిల్లలను పరీక్షలకు సిద్ధం చేయడంలో వారి భాగస్వామ్యతను వివరిస్తున్నారు. సమావేశానికి వస్తే వారి ప్రగతి, లోటుపాట్లు తెలుస్తాయని, తద్వారా వంద రోజుల ప్రణాళికతో వారిని అన్ని విధాలా సంసిద్ధత చేసేందుకు అవకాశం ఉంటుందని తెలియజేస్తున్నారు.

మార్గదర్శకాలు ఇవీ..

★ విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా ఏ, బీ, సీ గ్రేడ్లుగా విభజన
★ వెనుకబడిన వారు సైతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయుల కృషి
★ పిల్లలపై వ్యక్తిగత శ్రద్ధతో పాటు ఆత్మ విశ్వాసం పెంపొందించడం
★ వార్షిక పరీక్షల తరహాలో నమూనా పరీక్షలు నిర్వహించి భయాన్ని పోగొట్టడం

విద్యార్థులపై ఒత్తిడి లేకుండా..: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా విద్యాశాఖ సూచనల మేరకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. వారిలో భయాన్ని పోగొట్టి పరీక్షలకు సంసిద్ధం చేసేందుకు వంద రోజుల ప్రణాళిక, నమూనా పరీక్షలు దోహదపడతాయి. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల ప్రగతి తెలుసుకుని వారు చదువులో శ్రద్ధ చూపేలా ప్రోత్సహించాలి.
– కురమాన గీతాదేవి (ప్రధానోపాధ్యాయిని, సునీల్‌శర్మ కాలనీ)

అలరించిన కృష్ణవేణి సంగీత నీరాజనం

సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

సింహాచలం, న్యూస్‌టుడే: కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సింహగిరిపై జరిగిన 'కృష్ణవేణి సంగీత నీరాజనం' శ్రోతలను అలరించింది. ఈ నెల 6, 7 తేదీల్లో విజయవాడలో జరిగే ప్రధాన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ముందస్తుగా సింహాచలం, శ్రీశైలం, శ్రీకాళహస్తి దేవస్థానాల్లో కచేరీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సింహగిరిపై కళా వేదికపై జరిగిన సంగీత కచేరీలో ప్రముఖ గాయకులు కుమాండూరి వెంకటకృష్ణ ప్రసిద్ధ కృతులను ఆలపించి అలరించారు. మావుడూరి సత్యనారాయణశర్మ వయోలిన్, మృదంగం కమలాకర యోగేశ్, ఘటం మవ్వటూరు సూర్యప్రకాశరావు విభావరిలో సహకరించారు. కళాకారులను దేవస్థానం డిప్యూటీ ఈవో సింగం రాధ, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి మాధవి, కేంద్ర సంగీత నాటక అకాడమీ ప్రతినిధులు శిల్ప, నాయక్, చంద్రశేఖర్, విజయనగరం సంగీత కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కేవీఎల్ఎన్ శాస్త్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ స్థలాలకు రీ సర్వే చేపట్టాలి

కొమ్మాది: జీవీఎంసీ జోన్-2 పరిధిలో 5 నుంచి 13 వార్డుల్లో గుర్తింపు కార్డులున్నా వీధి విక్రయదారులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చేందుకు రీ సర్వే చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్‌కు భాజపా నేతలు వినతిపత్రాన్ని సమర్పించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో భాజపా రాష్ట్ర మైనారిటీ మోర్చా ప్రతినిధి తాతపూడి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో చిరువర్తకులు, భాజపా నేతలు సమస్యను వివరించారు. ఇటీవల ప్రధాన కూడళ్లు, రహదారి మార్జిన్లు, నడకమార్గాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న చిరుదుకాణాలను ఆపరేషన్ లంగ్స్ పేరిట తొలగించారని, వారందరికీ ప్రత్యామ్నాయ స్థలాలు కోసం యూసీడీ విభాగంలో ఉన్న ఆర్పీల ద్వారా సర్వే చేయించారని, కానీ చాలా మంది ఆ సర్వేలో పేర్లు నమోదు చేసుకోలేదన్నారు. జిల్లా మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు నూరుభాషా, రాజబాబు, గణపతిరావు, సత్యనారాయణ, ముఖేష్, లక్ష్మి పాల్గొన్నారు

దివ్యాంగ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గంటా జన్మదినోత్సవం సందర్భంగా 6వ వార్డు తెదేపా అధ్యక్షుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో న్యాయ కళాశాల రోడ్డులోని విశాఖ అంధుల పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం మధ్యాహ్న భోజనం వితరణగా అందించారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శి లొడగల జానకీరామ్, రెడ్డి సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు పెంటకోట బబ్బేలు. కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

★ ఆరోవార్డు ఆర్‌హెచ్ కాలనీలో వార్డు మహిళా అధ్యక్షురాలు పెంటకోట బబ్బేలు ఆధ్వర్యంలో తెదేపా నాయకులు యార్లగడ్డ జీవన్‌కుమార్ వితరణగా సమకూర్చిన చీరలను పేద మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ దాసరి శ్రీనివాస్, ఉమాశంకర్‌వర్మ, నరసింహమూర్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. సేవా కార్యక్రమాలు

గంటాకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాగర్‌నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్పొరేటర్ అప్పారావు, తదితరులు

సింహాచలం, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాల అర్చకులు వేద మంత్రాలతో గంటాను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు.

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే గంటా జన్మదిన వేడుకలను కార్పొరేటర్ లొడగల అప్పారావు, 8వ వార్డు తెదేపా అధ్యక్షులు సీహెచ్.సన్యాసిరావు, సీహెచ్.గోపి, క్లస్టర్ ఇన్‌ఛార్జి బి.దొరబాబు, ఎ.రాంబాబు, ఎల్.రామ్మోహన్, కె.ఎల్లయ్యరెడ్డి, తదితరులు కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు.

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఆరోవార్డు పరిధి రేవళ్లపాలెంలో తెదేపా సీనియర్ నాయకులు నాగోతి వెంకట్రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వార్డు తెదేపా అధ్యక్షుడు గరే గురునాథ్ కేక్ కోశారు. పోతిన శ్రీను, పి.పెంటయ్య, వి.వెంకటప్పారావు, సూరిబాబు, పిల్లా అప్పలరాజు, వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేవళ్లపాలెంలో కేక్ కోసి సంబరాలు చేసుకుంటున్న తెదేపా నాయకులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గంటా పుట్టినరోజు సందర్భంగా సోమవారం అభిమానులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా కేకు కోసి పంచిపెట్టారు. నియోజకవర్గంలో పలుచోట్ల దివ్యాంగులు, పేద వృద్ధులకు వితరణగా అన్నప్రసాదాలు అందించడంతో పాటు వస్త్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గంటా సంపత్‌వినాయగర్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

కార్మికులకు రగ్గుల పంపిణీ

ఎండాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఏడో వార్డు తెదేపా సీనియర్ నాయకులు చెట్టిపల్లి గోపి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా పుట్టినరోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, పేద వృద్ధులు, బీచ్‌రోడ్డులోని అంధుల ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేశారు. ముందుగా కార్మికుల సమక్షంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. నాయకులు గద్దిపల్లి కృష్ణ, వై.లక్ష్మణ్, ఒమ్మి చంద్రరావు, దువ్వి పరమేశ్వరరావు, పి.అప్పలరాజు, బెల్లాన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎండాడలో పారిశుద్ధ్య కార్మికులకు రగ్గులు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

జోన్-2 పీజీఆర్ఎస్‌కు 9 వినతులు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి తొమ్మిది వినతిపత్రాలను అధికారులు స్వీకరించారు. ఇప్పటి వరకు జడ్సీగా బాధ్యతలు చేపట్టిన కె.కనకమహాలక్ష్మి ఆదివారంతో పదవీ విరమణ చేశారు. ఇన్‌ఛార్జి బాధ్యతలను ఎవరికి అప్పగించకపోవడంతో సోమవారం చేపట్టిన పీజీఆర్ఎస్ తూతూమంత్రంగా సాగింది. ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.రాజారవికుమార్, సూపరింటెండెంట్ అప్పలరాజు, డీఈ మణికుమార్ అర్జీదారుల సమస్యలు తెలుసుకున్నారు.

మిరకల్ చర్చిలో కిడ్స్ కార్నివాల్

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడలోని మిరకల్ ప్రార్థన మందిరం(చర్చి)లో 'కిడ్స్ కార్నివాల్' పేరుతో సోమవారం మెగా చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సండే స్కూల్ బాల, బాలికలు విభిన్న వేషధారణలతో సందడి చేశారు. ఏసు క్రీస్తు పుట్టి పెరిగిన నేపథ్యాన్ని నాటిక రూపంలో ప్రదర్శించిన స్కిట్స్ ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందించారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ఎంపికైన ఉపాధ్యాయినుల జట్టు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో ప్రభుత్వ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు సోమవారం మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భీమిలిలో జీవీఎంసీ మినీస్టేడియంలో క్రికెట్, త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన జట్టును జోనల్ స్థాయికి ఎంపిక చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, శైలాస్ రెడ్డి, అమృత రావు, సుజాత న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఎం.ఇ.ఓ ఎం.శివరాణి పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయుల జట్టు

ఎమ్మెల్యే గంటా జన్మదినం సందర్భంగా మూడోవార్డు తెదేపా అధ్యక్షుడు గోగాది నరేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి కనకల అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గంటా రవితేజ విచ్చేసి కేక్ కోశారు. అనంతరం భీమిలి సీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కంచర్ల కామేష్, అవాల సూరిబాబు, నక్కిళ్ల వెంకటరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, భీమునిపట్నం

వ్యర్థాల నిర్మూలనకు ఏఐ దోహదం

ప్రొఫెసర్ బ్రిజేష్‌కుమార్ దూబేను సత్కరిస్తున్న సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ముకుంద్ తదితరులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: దేశంలోని పట్టణాల్లో వెలువడే వ్యర్థాలను నిర్మూలించడానికి, రక్షిత నీటిని సరఫరా చేయడానికి కృత్రిమమేధ(ఏఐ) ఆధారిత సర్క్యులర్ ఎకానమీ నమూనా ఉపయోగపడగలదని ఐఐటీ (ఖరగ్‌పూర్) పర్యావరణ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ బ్రిజేష్‌కుమార్ దూబే పేర్కొన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'సుస్థిర అభివృద్ధిలో సర్క్యులర్ ఎకానమీ'పై సోమవారం నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. నీటి వనరుల కాలుష్యాన్ని నివారించడానికి ఏఐ, ఎమ్ఎల్ ఏ విధంగా ఉపయోగపడతాయో అనే అంశాల్ని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (దిల్లీ) పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ అశ్వనీకుమార్ తివారి వివరించారు. సౌదీ అరేబియా ప్రొఫెసర్ నబీసాబ్ ముబారక్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ పరిశోధకుడు డాక్టర్ గణేశ్‌కుమార్‌లు నూతన ఇంధనవనరులపై జరుగుతున్న అధ్యయనాలను తెలియజేశారు. గీతం డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్ర ప్రసాద్, విభాగాధిపతి డాక్టర్ డి.ముకుంద్, కార్యక్రమ కన్వీనర్లు డాక్టర్ సుభాష్‌చంద్ర, డాక్టర్ ఎస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి

బాబూరావు (పాతచిత్రం)

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం-అనకాపల్లి మార్గంలోని సర్వీస్ రోడ్డులో శొంఠ్యాం వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కారు డ్రైవర్ మృతి చెందిన ఘటన ఇది. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. తగరపువలస కొత్తపేట అలంకవారి వీధికి చెందిన అజ్జి బాబూరావు అదే ప్రాంతంలోని ఓ మిఠాయి దుకాణం యజమానికి కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో యజమానిని తీసుకురావడానికి తగరపువలస నుంచి విమానాశ్రయానికి బయలుదేరాడు. పెందుర్తి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా శొంఠ్యాం సమీపంలో మరో వాహనాన్ని ఢీకొట్టి స్పృహ కోల్పోయాడు. 108 వాహనంలో నగరంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కాగా అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి తండ్రి సత్యారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి శవపరీక్షలు నిర్వహించి బంధువులకు అప్పగించారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.శ్రీవాణి మాట్లాడుతూ అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం కొండపేట, కొత్తపేట, చిట్టవలస, తగరపువలస ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎన్ఎస్ఎస్ పీవో డా.స్వర్ణలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని కోరుతూ భీమిలిలోని ఐసీటీసీ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం భీమిలిలో ర్యాలీ నిర్వహించారు. భీమిలి సీహెచ్‌సీ వద్ద జరిగిన కార్యక్రమంలో వైద్య పర్యవేక్షక అధికారి డా.ఎం.ఫణికుమార్ మాట్లాడారు. సీహెచ్‌సీ నుంచి భీమిలి గంటస్తంభం కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఐసీటీసీ కౌన్సెలరు వి.శ్రీనివాస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు పి.రామ్‌ప్రసాద్, సీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భీమిలిలో విద్యార్థులతో ఎయిడ్స్ నివారణ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అధికారులతో చర్చిస్తున్న ఈవో సుజాత

ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటుపై పరిశీలన

సింహాచలం, న్యూస్‌టుడే: రాష్ట్ర దేవాదాయశాఖ ఆదేశాల మేరకు సింహాచలం దేవస్థానంలో ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ సేవల నేపథ్యంలో సోమవారం ఈవో ఎన్.సుజాత ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఈఈ సీహెచ్.రమణ, ఏఈ రవిరాజుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆన్‌లైన్‌లో రూ.100, రూ.300 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులను ప్రత్యేక క్యూలైన్లు ద్వారా ఆలయంలోకి పంపించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రసాదాల కేంద్రం వద్ద ఒక కౌంటర్‌ను ప్రత్యేకంగా కేటాయించారు. ఆయా క్యూలైన్లలో వచ్చే భక్తులు ఆన్‌లైన్ టికెట్లను స్కాన్ చేయించుకుని నేరుగా సేవలను వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. రాబోయే శనివారం పూర్తిస్థాయిలో పరీక్షించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలని నిర్ణయించారు.

అదుపుతప్పి చేపల వ్యాన్ బోల్తా

కారుషెడ్డు కూడలిలో బోల్తా పడిన వ్యాన్ నుంచి రోడ్డుపై పడిన చేపల పెట్టెలు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై కారుషెడ్డు కూడలి వద్ద సోమవారం ఉదయం చేపల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. పీఎంపాలెం ట్రాఫిక్ సీఐ నల్లి సాయి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి విమానాశ్రయానికి మినీ వ్యాన్‌లో ప్యాకింగ్ చేసిన బాక్సుల్లో చేపలు రవాణా చేస్తున్నారు. వేగంగా వస్తున్న వ్యాన్ కారుషెడ్డు కూడలికి వచ్చే సరికి ఎరుపు రంగు సిగ్నల్ పడింది. దీంతో అదుపు తప్పిన వ్యాన్ మధ్యలో విభాజకాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొన్ని పెట్టెలు దెబ్బతిని రోడ్డుపై దొర్లిన చేపలను స్థానికులు తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. ట్రాఫిక్ రద్దీ లేని సమయంలో ఘటన చోటు చేసుకోవడంతో పెను ప్రమాదం తప్పిందని సీఐ పేర్కొన్నారు. పోలీసుల సమక్షంలో క్రేన్ సాయంతో వాహనాన్ని పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శబరిమలకు స్వాముల పయనం

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం జాతరగట్టుపై వెలిసిన దుర్గాలమ్మ ఆలయంలో పెద్దఎత్తున అయ్యప్ప మాలలు ధరించిన స్వాములు శబరిమలకు సోమవారం పయనమయ్యారు. గురుస్వామి పిల్లా వెంకటరమణ (అన్నమయ్య) ఆధ్వర్యంలో 41 రోజులు దీక్ష చేసిన వందమంది స్వాములు ఇరుముడులు కట్టుకుని బయలుదేరారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కోలాహలంగా మారింది. 41 రోజులతో పాటు మరో 10 రోజులు స్వాములకు అన్నదానం చేపట్టిన శ్రీఅయ్యప్ప సేవాసంఘం (పీఠం) గురుస్వామి పిల్లా వెంకటరమణను సత్కరించారు. గురుస్వాములు పిల్లా శ్రీనివాసరావు, నాగోతి అప్పారావు, పిల్లా సతీష్, ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, అధ్యక్షులు పిల్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన స్వాములు

ఎస్‌వీపీఈసీ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం సాంకేతిక విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాల (ఎస్‌వీపీఈసీ) ఎన్ఎస్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఏడు రోజుల సేవా క్యాంప్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణ, ఉప ప్రిన్సిపల్ కె.సాయిలక్ష్మి, డైరెక్టర్ వి.శివరాంప్రసాద్, ఈఓ మధుభట్, ఏఓ ఎ.నాగేశ్వరరావు, హెచ్ఆర్ అక్షిత కొండూర్ తదితరులు సోమవారం ప్రారంభించారు. దీనికి శంభువానిపాలెం గిరిజన గ్రామాన్ని ఎంపిక చేసి మొదటి రోజు విజన్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో గ్రామస్థులతో పాటు విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద పి.దేవుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎం.మాధురి, ఎన్ఎస్ఎస్ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవా క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్, ఈఓ, ఏఓ తదితరులు

ఘనంగా గీతా జయంతి వేడుకలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యాపరిషత్(జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ హ్యూమన్ అండ్ స్పిరిట్యువల్ వేల్యూస్, ఇండియన్ సిస్టమ్ విభాగాల సంయుక్తాధ్వర్యంలో భగవద్గీత జయంతి సోమవారం నిర్వహించారు. జీవీపీ ఉపాధ్యక్షుడు డి.దక్షిణామూర్తి, సభ్యులు ఆచార్య ప్రగడ రాజగణపతి, డీవీఎస్.కామేశ్వరరావు, డాక్టర్ వారణాసి వేంకటేశ్వరశర్మ మాట్లాడారు. డాక్టర్ యూవీఎస్ఎస్.శాస్త్రీ, ఓఎస్ఆర్ ప్రకాశ్, ప్రిన్సిపల్ ఆచార్య కె.ఎస్.బోస్ పాల్గొన్నారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: గంభీరం ఐఐఎం రోడ్డులో శ్రీరాధా మదన్‌మోహన్ స్వామి ఆలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు వైభవంగా సోమవారం నిర్వహించారు.

ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి చర్యలు

సాగర్‌నగర్: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి 'వన్‌హెల్త్' భావన ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత అంశంగా మారిందని ప్రముఖ కేంద్రపరిశోధన సంస్థ సెంటర్ ఫర్ సెల్యులర్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) డైరెక్టర్ డాక్టర్ ఎన్.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'సర్ జగదీష్ చంద్రబోస్' జయంతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. యువత చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని గీతం సైన్స్, బిజినెస్ విభాగాల డీన్‌లు ప్రొఫెసర్లు అనంతరామకృష్ణ, రాజాఫణి పప్పు సూచించారు. నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహార పంపిణీ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: అక్షయపాత్ర ఫౌండేషన్ అందజేస్తున్న పోషకాహార పంపిణీని సాగర్‌నగర్‌లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జీఎం అంబరీష దాస సోమవారం ప్రారంభించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల (వాడపాలెం), ప్రాథమిక పాఠశాల (ఎండాడ) విద్యార్థులకు వీటిని అందజేశారు. వారంలో మూడు రోజులు (మంగళ, గురు, శనివారాల్లో) ఉదయం పూట దాతల సహకారంతో వచ్చే ఏడాది మార్చి నెల వరకు చిరుధాన్యాలతో తయారుచేసిన ఈ పోషకాహారాన్ని అందజేస్తామని అక్షయపాత్ర ఫౌండేషన్ (విశాఖ) రీజినల్ ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించిన భక్తదాస పేర్కొన్నారు. కార్పొరేటర్ ఎల్.అప్పారావు, 8వ వార్డు అధ్యక్షుడు సీహెచ్.సన్యాసిరావు, చిక్కాల విజయబాబు తదితర తెదేపా నేతలు పాల్గొన్నారు.

పోషకాహారం అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే గంటా తదితరులు

(c) eenadu

రూ.54లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీ కూరగాయల మార్కెట్ సమీపంలో ప్రజామరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 54లక్షల వ్యయంతో వీటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. పనులను సత్వరమే ప్రారంభించి సకాలంలో పూర్తిచేయాలని జీవీఎంసీ అధికారులను కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, తెదేపా నాయకులు బొట్టా వెంకటరమణ, ఉమ్మి అప్పారావు, కె.ఆనంద్, కె.నాగేశ్వరరావు, దువ్వి స్వామి, దువ్వి రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య
పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769
మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 19వ వార్డు శివాజీనగర్, మువ్వలవానిపాలెం ప్రాంతాల్లోని కాలువల్లో పూడికలు తీయడం లేదు. దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. – అప్పలరాజు, శివాజీనగర్. ✓: తక్షణమే సిబ్బందిని పంపించి కాలువల్లో పూడిక తీయిస్తాం. – వై.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 11వ వార్డు ముస్తఫాకాలనీ, లక్ష్మీనగర్ కాలనీ కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. – హిమాయతుల్లా, ముస్తఫా కాలనీ ✓: వెంటనే సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. – ఎన్.బంగార్రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ?: జోడుగుళ్లపాలెంలో రోజు విడిచి రోజు కుళాయిలు వస్తున్నాయి. మంచినీరు సరిపోవడం లేదు. – నూకాలమ్మ, స్థానికురాలు ✓: కుళాయిలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. –శ్రీనివాస్, ఏఈ.

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పెదవాల్తేరు నేతాజీనగర్, ఆదర్శనగర్‌లలో వీధి దీపాలు వెలగడం లేదు. ఆకతాయిలు ద్విచక్రవాహనాల విడిభాగాలు, పెట్రోల్‌ను చోరీ చేస్తున్నారు. – ఆర్.కన్నారావు, ఆదర్శనగర్. ✓: పరిశీలించి వీధి దీపాలు మరమ్మతులు చేయిస్తాం. – రాంకుమార్, వీధి దీపాల విభాగం పర్యవేక్షకుడు

స్పందనకు వందనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 22వ వార్డు మంగాపురం కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ స్పందించారు. సిబ్బంది చేత వ్యర్థాలు తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : పెదవాల్తేరు ఆదర్శనగర్, సుందర్‌నగర్‌లలో దోమలు అధికమయ్యాయని స్థానికులు 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' దృష్టి తీసుకొచ్చారు. దీనిపై సోమవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి మలేరియా అధికారి మంగరాజు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది వీధుల్లో ఫాగింగ్ చేశారు.

కూరగాయల ధరలు పైపైకి..!

వర్షాలతో తగ్గిన దిగుబడి, నాణ్యత

రైతుబజార్లకు అరకొరగా సరకు

ఆరిలోవ, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు సామాన్యులను భయపెడుతున్నాయి. భారీ వర్షాలకు పంటల దిగుబడులు తగ్గడంతో మార్కెట్‌కు సరకు రావడం తగ్గింది. ఆరిలోవ రైతుబజారుకు గత నెలలో అన్ని రకాల కూరగాయలు రోజుకు సుమారు 120 క్వింటాళ్లు వచ్చేవి. ప్రస్తుతం కేవలం 95 క్వింటాళ్లు వస్తున్నాయని ఎస్టేట్ మేనేజర్ వై.వి.నాయుడు తెలిపారు. మరో పక్క నాణ్యమైన కూరగాయలు దొరకడంలేదని వినియోగదారులు వాపోతున్నారు. కుళ్లిన టమాట, పుచ్చిన వంకాయలు, పాలిపోయిన ఆకుకూరలు వస్తున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. దేశవాళీ టమాట తక్కువగా వస్తుండడంతో బెంగళూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గత నెలలో పడిన భారీ వర్షాలతో టమాట మొక్కలు దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు.

కూరగాయల ధర (రూపాయల్లో)

సరకు	నవంబరు 10న	డిసెంబరు 01
టమాట	32	48
బెండ	50	58
దొండ	36	42
బీర	46	50
చిక్కుడు	50	56
కాకర	60	62
వంగ	60	40

ఆరిలోవ రైతుబజారులో కూరగాయల విక్రయం

■ **దిగుబడులు తగ్గి.. ధరలు పెరిగి..:** దిగుబడులు తగ్గడం ధరలు పెరగడానికి కారణమైంది. రైతుబజారుకు వస్తున్న వినియోగదారులు అధిక సరకు చూసి పెదవి విరుస్తున్నారు. కుళ్లిన, పాలిపోయిన కూరగాయలను తీసుకెళ్లి ఏమి చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. మరో పక్క ప్రైవేటు వ్యాపారులు నాణ్యమైన కూరగాయలను తమ వద్ద ఉన్నాయని చెబుతూ ధరలు పెంచేసి దోపిడీకి పాల్పడుతున్నారు. పలువురు వ్యాపారులు త్వరగా రైతుబజారుకు వెళ్లి నాణ్యమైన కూరగాయలు కొనుగోలు చేసి దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఉదయం 10గంటల తరువాత వెళ్లిన వినియోగదారులకు మంచి సరకు దొరకడం లేదు.

■ **సంచి నిండటంలేదు:** ధరలు పెరగడంతో కేజీ బదులు అరకేజీ కొనుగోలు చేయాల్సి వస్తోంది. రైతుబజారులో అన్ని రకాల కూరగాయలు దొరకడం లేదు. బయట దుకాణాల్లో ఎక్కువ ధర చెల్లించి కొనాల్సి వస్తోంది. రూ.500 ఖర్చు పెట్టినా సంచి నిండడం లేదు. – రామారావు, విశ్రాంత ఉద్యోగి.

■ **ఆకుకూరలు అధ్వానం:** ఆరిలోవ రైతుబజారులో తోటకూర మొదటి గంటలోనే అయిపోతోంది. రూ.20కు 3 చిన్న కట్టలు ఇస్తున్నారు. ఆకులపై రంధ్రాలు పడి ఉంటున్నాయి. మిగతా ఆకుకూరలదీ అదే పరిస్థితి. గతంలో వీధుల్లో తిరిగి ఆకుకూరలు అమ్మేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. – నన్నూరావు, అధ్యాపకులు.

■ **అన్ని రకాలు దొరకడం లేదు:** గతంలో కంటే అధిక శాతం కూరగాయలకు ఖర్చు చేయాల్సి వస్తోంది. నలుగురు సభ్యులున్న కుటుంబానికి సుమారు రూ.600 ఖర్చు అవుతోంది. అయినా అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు దొరకడంలేదు. – రామలక్ష్మి, గృహిణి

నమూనా పరీక్షలతో ప్రయోజనాలెన్నో..

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు వి.వి.జి. ట్రస్ట్ జేఈఈ మెయిన్స్, ఎంసెట్ నమూనా పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమని భాజపా రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయంలో సోమవారం సాయంత్రం నమూనా పరీక్షలకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. జనవరి నుంచి జూన్ వరకు నమూనా పరీక్షలు జరుగుతాయన్నారు. పోటీపరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు వెంకట్ పోలిశెట్టి, భాజపా నగర అధ్యక్షుడు పరశురామరాజు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, తదితరులు

నిస్సహాయ వృద్ధురాలికి సపర్యలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు కోస్టల్ బ్యాటరీ పరిసరాల్లో రెండు రోజులుగా నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధురాలి (65)ని రెడ్‌క్రాస్ సంస్థ ఆదుకుంది. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే దారిలో పడి ఉన్న ఆమెను పెదవాల్తేరు రెడ్‌క్రాస్ సంస్థ సిబ్బంది చూశారు. ఆమె దుస్థితిని గుర్తించి స్థానికుల సహకారంతో జుట్టు కత్తిరించి దుస్తులు మార్పించారు. అనంతరం వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్పించారు. వృద్ధురాలి పేరు, ఊరు తెలియాల్సి ఉంది.

జుట్టు కత్తిరిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

రెడ్‌రిబ్బన్ ఆకృతిలో నిల్చున్న విద్యార్థులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను ఆదరించాలని ప్రభుత్వ వృత్తివిద్య కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఎ.వి.శేఖరరావు సూచించారు. ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధ్యాపకులు ఎస్.సురేంద్రనాథ్, సి.హెచ్.త్రినాథ్, విజయరావు తదితరులు పాల్గొన్నారు. ★ డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని నివారించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు పి.జయ, పి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకులు సరే.. నీరేది?

దర్పణం

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ ప్రాంతంలో నీటి ఎద్దడి నివారణకు రోడ్లపై నీళ్ల ట్యాంకులు ఏర్పాటు చేశారు. ముస్తఫా కాలనీ, బాలాజీనగర్, కైలాస్‌నగర్ కాలనీల్లో రోడ్లపై సిమెంటు దిమ్మెలు నిర్మించి వాటిపై 10వేల లీటర్ల నీరు పట్టే సింథటిక్ ట్యాంకులు ఏర్పాటు చేసి వాటికి మూడేసి ట్యాప్‌లు బిగించారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి వీటిల్లో నింపుతారు. పరిసర ప్రాంత ప్రజలు బిందెలతో ఇక్కడి నుంచి నీరు తీసుకెళ్లి ఉపయోగించుకుంటారు. నీరు వృథా కాకుండా స్థానిక కాలనీ సంఘాలు పర్యవేక్షిస్తారు. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో ఆరిలోవ ప్రాంత ప్రజలు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొన్నారు. దీంతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు జీవీఎంసీ నిధులతో ఈ ట్యాంకులు ఏర్పాటు చేశామని నీటి సరఫరా విభాగ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ట్యాంకులు ఏర్పాటు చేసి మూడు నెలలైనా ఇప్పటి వరకు నీరు నింప లేదని స్థానికులు చెబుతున్నారు.

ఆరిలోవ ముస్తఫా కాలనీలో ఏర్పాటు చేసిన నీళ్ల ట్యాంకు

డచ్ పార్కు.. దయనీయం..

అధ్వానంగా ఉన్న డచ్‌పార్కు



పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు పార్కుహోటల్ కూడలి సమీపంలోని డచ్ పార్కు అధ్వానంగా మారింది. ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. ఖాళీ సీసాలు అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. దీపాలు కూడా వెలగకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీంతో సమీపంలోని నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కులో కుటుంబ సభ్యులతో కూర్చోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా ఎండిపోయిన ఆకులు, చెత్తతో నిండి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాడైన క్రీడా సామగ్రి

జోన్-3 పరిధిలో 94శాతం పింఛన్ల పంపిణీ

ఎంవీపీకాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, మేయర్ పీలా తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జోన్-3 పరిధిలో సోమవారం 94శాతం మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. మొత్తం 14,745 మందికి గాను 13,786 మందికి అందజేశామని, మిగిలిన వారికి మంగళవారం పంపిణీ చేస్తామన్నారు.

■ ఎంవీపీకాలనీలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు పింఛన్లు పంపిణీ చేశారు. 18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి, నాయకులు కె.రామారావు, సింహాద్రి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

■ 15వ వార్డు హెచ్‌బీకాలనీ, పాతవెంకోజీపాలెం, సింహాద్రిపురం ప్రాంతాల్లో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, 23వ వార్డు మద్దిలపాలెం, చైతన్యనగర్ ప్రాంతాల్లో వార్డు నాయకుడు బూస రాంబాబు, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : జోడుగుళ్లపాలెంలోని మత్స్యకార వృద్ధులకు సోమవారం ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి పింఛన్లు అందజేశారు. సూపర్‌సిక్స్ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో నాయకులు బుడుమూరి గోవింద్, వేజెళ్ల సుబ్బరాజు, ఉమ్మిడి సుజాతారాజ్, మారుపిల్లి చిన్నారావు, గరికిన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ ప్రాంతంలో సచివాలయ సిబ్బందితో కలిసి స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నామని వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి గాడి సత్యం తెలిపారు.

మత్స్యకార వృద్ధుడికి పింఛను అందిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

కుక్కల దాడిలో తాబేలు మృతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సముద్ర తీరంలో గుడ్లు పెట్టడానికి వచ్చిన తాబేలు సోమవారం కుక్కల దాడిలో మృతి చెందింది. వుడాపార్కు వెనకున్న సముద్రం నుంచి తాబేళ్లు అధికంగా తీరంలోని ఇసుకలో గుడ్లు పెట్టడానికి వస్తాయి. ఒడ్డుకు వచ్చే లోపు కుక్కలు గుంపులుగా వాటిని చుట్టుముట్టి దాడులు చేస్తున్నాయి. నిత్యం ఇలా తాబేళ్లు కుక్కల దాడులకు బలైపోతున్నాయి. అధికారులు తీరంలో కుక్కలు లేకుండా చర్యలు తీసుకుని తాబేళ్ల సంతతి వృద్ధి చెందేలా చూడాలని సందర్శకులు కోరుతున్నారు.

7న జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు ఈనెల 7వ తేదీన పోర్టు స్టేడియంలో జరుగుతాయని విశాఖపట్నం అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎ.నారాయణరావు తెలిపారు. అండర్-16, 18, 20 విభాగాల్లో బాల, బాలికలు; సీనియర్ విభాగంలో మహిళలు, పురుషులకు ఈ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

జోన్-3 కార్యాలయానికి 16 అర్జీలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జోన్-3 కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జోన్-3కు మొత్తం 16 వినతులు వచ్చాయన్నారు. వాటిలో రెవెన్యూ 3, ప్రజారోగ్యం 3, పట్టణప్రణాళిక 6, ఇంజినీరింగ్ 3, యూసీడీ విభాగానికి 1 చొప్పున వచ్చాయన్నారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వన్డే మ్యాచ్‌కు ముమ్మరంగా పనులు

పిచ్‌ను పరిశీలిస్తున్న హెడ్ క్యురేటర్ నాగమల్లయ్య

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో ఈనెల 6న భారత్- దక్షిణాఫ్రికా వన్డే మ్యాచ్ నిర్వహణకు పిచ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. హెడ్ క్యురేటర్ నాగమల్లయ్య, ఏసీఏ మీడియా మేనేజర్ వై.వెంకటేష్ సంబంధిత పనులను పరిశీలించారు. గ్యాలరీల్లో సీట్లను శుభ్రపర్చడమే కాక స్టేడియంలోని అవుట్‌ఫీల్డ్ పనులు కూడా చకచకా సాగుతున్నాయి. ఈ మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఆంధ్రా క్రికెట్ సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెంకటేశ్ తెలిపారు. ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, సెక్రటరీ ఎంపీ సానా సతీష్‌లు ఈ మ్యాచ్ నిర్వహణకు అన్ని విభాగాలను సన్నద్ధం చేశారని పేర్కొన్నారు.

బీచ్ సందర్శకులకు 'హెచ్చరిక'

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పర్యాటకులు సముద్రంలో స్నానాలకు దిగుతూ మృత్యువాత పడకుండా పోలీసులు పలు చర్యలు తీసుకుంటున్నారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం ఎదురుగా ఉన్న తీరంలో సోమవారం సాయంత్రం మూడో పట్టణ పోలీసులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గతంలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులతో పాటు అదనంగా మరో ఐదు అందుబాటులోకి తేనున్నట్లు సీఐ పైడయ్య తెలిపారు. కాళీమాత ఆలయం నుంచి పెదజాలరిపేట వరకు వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. వాటిపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఇచ్చట స్నానం చేయడం ప్రమాదకరమని రాయించినట్లు చెప్పారు.

హెచ్చరిక బోర్డు వద్ద సీఐ పైడయ్య

రైతుబజార్లలో జేబుదొంగలున్నారు.. జాగ్రత్త

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: రైతుబజార్లలో జేబుదొంగలు తిరుగుతున్నారని, వినియోగదారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎంవీపీ పోలీస్‌స్టేషన్ ఎస్సై రవికుమార్ సూచించారు. సోమవారం ఎంవీపీకాలనీ రైతుబజారులో దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. సెల్‌ఫోన్లు, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. అనంతరం రైతుబజారులో పలు చోట్ల గోడపత్రికలు అంటించారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, రైతుబజారు ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకులు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్సై రవికుమార్, రైతులు, వినియోగదారులు

కాంగ్రెస్ బలోపేతం దిశగా అడుగులు

మురళీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తోందని, దీనికోసం పార్టీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు సునీల్ అహీరే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అహీరే పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి పార్టీకి సేవ చేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రశంసిస్తూ పార్టీ ఎక్కడా బలహీన పడలేదని త్వరలోనే పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకోవాలంటే యువత కాంగ్రెస్‌ను ముందుండి నడిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో పార్టీని నడిపించే నాయకుల అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, పీసీసీ పరిశీలకులు మార్టిన్ లూథర్, అమర్‌బేగ్, వేగి వెంకటేశ్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, నేతలు హాసినీవర్మ, కె.వి.సూర్యనారాయణ, దండి ప్రియాంక, ఆనంద్‌కుమార్, గౌతమ్, పద్మిని, చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు సునీల్ అహీరే

ఫ్లాష్‌మాబ్‌తో జూనియర్లకు స్వాగతం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ రాజనీతి శాస్త్రవిభాగం ప్రాంగణంలో సోమవారం స్వాగతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్లను ఆహ్వానిస్తూ ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. తొలుత కొద్ది మందితో ప్రారంభమైన ఈ కార్యక్రమం తర్వాత విద్యార్థులంతా పాల్గొనడంతో ప్రాంగణం హోరెత్తింది.

ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

నిందితులను కఠినంగా శిక్షించాలని ఆందోళన

ఏయూ అవుట్ గేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఎస్.ఎఫ్.ఐ. కార్యకర్తలు

ఏయూ సమాచారం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: నెల్లూరులో డీవైఎఫ్ఐ యువ నాయకులు పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠాను కఠినంగా శిక్షించడంతోపాటు బాధితుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్.ఎఫ్.ఐ. విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏయూ అవుట్ గేట్ వద్ద నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శి డి.వెంకటరమణ మాట్లాడుతూ యువకులకు గంజాయిని అలవాటు చేస్తున్న ముఠాను పెంచలయ్య అడ్డుకున్నందునే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. అనంతరం పెంచలయ్యకు నివాళి అర్పించారు. యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు హర్షిత్, తరుణ్, సంయుక్త కార్యదర్శి పి.ప్రగతి, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా కిరణ్‌కుమార్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ పూర్వ విద్యార్థి గౌనిపల్లి కిరణ్‌కుమార్ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులైనట్లు ఏబీవీపీ విశాఖపట్నం శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లో జరుగుతున్న 71వ ఏబీవీపీ జాతీయ మహాసభల్లో ఆయన్ను ఈ పదవిలో నియమించారు. కిరణ్‌కుమార్ ఏబీవీపీలో ఏయూ అధ్యక్షుడిగా, రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్‌గా, దిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఉమ్మడి విశాఖపట్నం విభాగ కన్వీనర్‌గా సేవలందిస్తున్నారు.

ఎయిడ్స్‌పై మరింత అవగాహన అవసరం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అన్నారు. జిల్లా పరిషత్తు కార్యాలయంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ బారినపడ్డ చిన్నారులతో కలిసి కలెక్టర్ అల్పాహారం తీసుకుని, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ బాధితులు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు, ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలియోను అరికట్టినట్లు, ఎయిడ్స్‌ను కూడా తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రారంభించారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శంకరప్రసాద్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఏఎంసీ ప్రిన్సిపల్ సంధ్యారాణి, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ రోణంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

అదుపుతప్పి చేపల వ్యాన్ బోల్తా

పీఎంపాలెం, న్యూస్‌టుడే: జాతీయరహదారిపై కారుషెడ్డు కూడలి వద్ద సోమవారం ఉదయం చేపల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. పీఎంపాలెం ట్రాఫిక్ సీఐ నల్లి సాయి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి విమానాశ్రయానికి మినీ వ్యాన్‌లో ప్యాకింగ్ చేసిన బాక్సుల్లో చేపలు రవాణా చేస్తున్నారు. వేగంగా వస్తున్న వ్యాన్ కారుషెడ్డు కూడలికి వచ్చే సరికి ఎరుపు రంగు సిగ్నల్ పడింది. దీంతో అదుపు తప్పిన వ్యాన్ డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొన్ని పెట్టెలు దెబ్బతిని రోడ్డుపై దొర్లిన చేపలను స్థానికులు తీసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ట్రాఫిక్ రద్దీ తక్కువగా ఉన్న సమయంలో ఘటన చోటు చేసుకోవడంతో పెను ప్రమాదం తప్పిందని సీఐ పేర్కొన్నారు. పోలీసులు క్రేన్ సాయంతో వాహనాన్ని పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రాత్రయినా వెలగవు.. తెల్లవారినా ఆరవు..!

ఆరిలోవ, న్యూస్‌టుడే: 12, 13 వార్డుల పరిధిలోని పెదగదిలి, సింహగిరి కాలనీ, ఈశ్వరదేవి నగర్, చినగదిలి కొండవాలు ప్రాంతాల్లో కొన్ని వీధి దీపాలు రాత్రి 7 గంటల వరకు వెలగటం లేదు. ప్రస్తుతం సాయంత్రం 5 గంటలకే చీకటి పడుతోంది. కొండవాలు ప్రాంతాల్లోని వీధులు చీకటిగా ఉండటంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అవే దీపాలు ఉదయం 9 గంటల వరకు వెలుగుతున్నాయి. నిర్వహణ లోపమే దీనికి కారణమని స్థానికులు చెబుతున్నారు. దీనిపై వీధి దీపాల పర్యవేక్షకులు రామకృష్ణకు వివరణ కోరగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

పెదగదిలి కొండపై పగలు వెలుగుతున్న దీపం

సౌర ఫలకాల ఏర్పాటుకు ఒప్పందం

గురుద్వారా, న్యూస్‌టుడే: సీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గృహాలపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసేందుకు ఏపీఈపీడీసీఎల్‌తో సద్భున్ ఫ్యూచర్‌టెక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. గురుద్వారా దరి ఈపీడీసీఎల్‌లోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి.సూర్యప్రకాశ్ సమక్షంలో సీజీఎం ఎల్.దైవప్రసాద్, సద్భున్ ఫ్యూచర్ టెక్ డైరెక్టర్ భూపేంద్ర సింగ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు.

LOSS OF SALE DEED

That my client **Smt. Karanam Sravani** (Aadhar No. 7215 1776 6907), W/o. Golla Sanyasi Naidu, residing at D.No. 15-762, Lakshmi Nagar, Sector-4, Arilova Colony, Visakhapatnam -530040 as stated the she lost the below mentioned Original link Sale Deed on 24-11-2025 while she was travelling from Arilova to Jagadamba Junction, Visakhapatnam.

DETAIL OF SALE DEED

Sale deed dated 17-10-2010 which was registered as document **No. 372/2010,** in the office of Joint Sub Registrar, Madhurawada pertaining to Plot No.6 part, situated at Darapalem Village, hamlet of Mudasarlova Area covered by survey No 14/3, Visakhapatnam. If anybody finds the same please inform the undersigned immediately.

Sri D.V.RAMACHANDRA REDDY
Advocate
D.No. 53-16-59/1, Maddilapalem, Visakhapatnam
Cell: 9440138870 & 9505768098

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

సంపత్ వినాయకుడి సేవలో ఎమ్మెల్యే గంటా

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పుట్టిన రోజు సందర్భంగా సోమవారం రాత్రి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆశీలుమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట భారీగా కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు.

విద్యా ప్రగతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, అక్షయ పాత్ర ప్రతినిధి

గురుద్వారా, న్యూస్‌టుడే: విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రగతికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీపీటీకాలనీ ఎన్ఎంసీహెచ్ పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహించిన పోషకాహారం పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బిస్కెట్లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆకలితో ఉంటే మెదడు సరిగా పనిచేయక ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని గ్రహించి అక్షయ పాత్ర పోషకాహారం అందించడం గొప్ప విషయమన్నారు. దాతల సహకారంతో చేస్తున్న ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని రాణించాలన్నారు. వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధి యదురాజ దాస, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, శ్యామలాదీపిక, వార్డు అధ్యక్షురాలు బర్ల పద్మలత ప్రధానోపాధ్యాయుడు రాము తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో వాహనాల నిలిపివేతతో ప్రయాణాలకు ఇబ్బంది కలుగుతోంది. – రాజేంద్ర ✓: వాహనాల నిలిపివేయకుండా చర్యలు తీసుకుంటాం. – రామారావు, ద్వారకా ట్రాఫిక్ ఎస్సై

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు తెన్నేటినగర్‌లో 24/ఎ/2 స్తంభానికి ఉన్న వీధి దీపం గత కొన్ని రోజులుగా వెలగడం లేదు. రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. – ఆర్.వి.నాయుడు ✓: సిబ్బంది పంపి దీపాలు వెలిగేలా చూస్తాం. – అర్చన, వీధి దీపాల ఏఈ

స్పందనకు వందనం

రహదారికి మరమ్మతులు: మురళీనగర్, న్యూస్‌టుడే: మురళీనగర్ సెక్టార్-8 ప్రాంతంలో రహదారి కుంగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇక్కడి సమస్యపై 'కుంగిన దారి.. ప్రయాణికుల బేజారు' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. గుంతలను కాంక్రీటుతో పూడ్చి రాకపోకలు సుగమం చేశారు.

విరుచుకుపడుతున్న వీధి కుక్కలు

మాధవధార, న్యూస్‌టుడే

విశాఖ ఉత్తరం నియోజకవర్గంలోని ఏ వీధికెళ్లినా కుక్కల బెడద కనిపిస్తోంది. తెల్లవారుజామున, చీకటి పడిన తర్వాత వాకర్స్, వాహన చోదకులపై దాడులకు దిగుతున్నాయి. రహదారులపైకి గుంపుగా ఒక్కసారిగా వస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా జీవీఎంసీ 45, 46, 47, 48, 49, 50, 51 వార్డుల్లోని కొండవాలు ప్రాంతాలైన కైలాసపురం, రాంజీఎస్టేట్, సత్యనగర్, ఎన్‌జీజీఓఎస్ కాలనీ, మురళీనగర్, మాధవధార, కళింగనగర్, వుడాకాలనీ పరిసర ప్రాంతాల్లో వీటి తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ కాలనీల్లో నిర్మానుష ప్రదేశాలు అధికంగా ఉండటంతో ఆయా ప్రాంతాలను ఆవాసాలుగా మార్చుకుని అటుగా రాకపోకలు సాగించే పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, వాహనదారులపై విరుచుకుపడుతున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వీటిని నియంత్రించేందుకు నిబంధనలు ఒప్పుకోవడం లేదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయంటూ అధికారులు ఎప్పటికప్పుడు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

వుడాకాలనీ ప్రధాన రహదారిలో సంచరిస్తున్న శునకాలు

■ ఎక్కడి నుంచో తెచ్చి ఇక్కడ వదిలేస్తున్నారు: నగరంలోని ఇతర ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసిన అనంతరం వాటిని తీసుకొచ్చి ఉత్తరం నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాల్లో వదిలేస్తున్నారని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. అవన్నీ ఈ చుట్టుపక్కల ఉన్న కాలనీల్లో సంచరిస్తూ ప్రజలపై దాడులు చేస్తున్నాయని వాపోతున్నారు. రోజురోజుకీ ఈ ప్రాంతంలో శునకాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. హోటళ్లు, మాంసం దుకాణాల నుంచి వెలువడే వ్యర్థాలను తింటూ రోడ్లపై తిరుగుతూ ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్నాయని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

■ సచివాలయాలకు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు: వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి, ఆన్‌లైన్ ద్వారా రోజుకు మూడు కన్నా ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయి. కాని ఒక్క ఫిర్యాదు కూడా పరిష్కరించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక్కోసారి సిబ్బంది కుక్కల వాహనాన్ని తీసుకొచ్చి ఒక్క శునకాన్ని కూడా పట్టుకోకుండా ఫొటోలు తీసుకొని వెళ్లిపోతున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీటి నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా

మాధవధార, కంచరపాలెం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెంలో సోమవారం పలువురు లబ్ధిదారులకు ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు. పింఛను నగదు పేదలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు. ఉత్తరం నియోజకవర్గంలో దాదాపు 85 శాతం పంపిణీ పూర్తయిందని 14,986 మందికి నగదు అందజేసినట్లు అధికారులు తెలియజేశారు.

లబ్ధిదారులకు పింఛను నగదు అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, కూటమి నాయకులు

గురుద్వారా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, కూటమి నేతలు శ్యామలా దీపిక, పద్మలత, మజ్జి ఉమా మహేశ్వర్ రెడ్డి, ఈతలపాక సుజాత, ఏపీడీ రాము తదితరులు పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు ఈనెల 7వ తేదీన పోర్టు స్టేడియంలో జరగనున్నట్లు విశాఖపట్నం అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎ.నారాయణరావు తెలిపారు. అండర్-16, 18, 20 విభాగాల్లో బాల, బాలికలు; సీనియర్ విభాగంలో మహిళలు, పురుషులకు ఈ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

జీన్ థెరపీతో ఎయిడ్స్‌కు అడ్డుకట్ట

కంచరపాలెం, న్యూస్‌టుడే: ఏడాదికి రెండు ఇంజెక్షన్లతో ఎయిడ్స్ వ్యాధికి స్వస్తి చెప్పవచ్చునని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా కంచరపాలెంలోని సూర్య ఆసుపత్రిలో సోమవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం ఎయిడ్స్ వ్యాధి మరణాలు ఉండేవని, నేడు సాధారణ వ్యాధుల మాదిరిగానే పరిగణించడం జరుగుతోందన్నారు. ఎయిడ్స్ బారిన పడిన వారికి అత్యంత ఆధునిక జీన్ థెరపీ అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు డి.సుజాతదేవి, అచ్యుతరావు, అశ్విని, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు తదితరులు

వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్

పీజీఆర్ఎస్‌తో సమస్యలు పరిష్కారం

మాధవధార, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్య క్రమంలో పరిశీలించి తక్షణం పరిష్కారం చేలా తగు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 51వ వార్డులోని పీ4 కార్యాలయంలో సోమవారం జోన్-5 అధికారులతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని సంబంధిత విభాగం అధికారులకు పంపించి ఎప్పటికప్పుడు పరిశీలన చేసి పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఇల్లు, వీధి దీపాలు, రహదారుల నిర్మాణంపై వినతులు ఎక్కువగా వచ్చాయి. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, జెడ్సీ బి.రాము, ఈఈ పద్మావతి, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతం దిశగా అడుగులు

మురళీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తోందని, దీనికోసం పార్టీ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు సునీల్ అహీరే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్‌జీజీవోస్ కాలనీలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అహీరే పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి పార్టీకి సేవ చేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రశంసిస్తూ పార్టీ ఎప్పుడూ బలహీన పడలేదని తర్వాత పూర్వవైభవం [illegible]. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకోవాలంటే యువత కాంగ్రెస్‌ను ముందుండి నడిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో పార్టీని నడిపించే నాయకుల అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కమిటీ ఉపాధ్యక్షులు, పీసీసీ పరిశీలకులు మార్టిన్ లూథర్, అమర్‌బేగ్, వేణ వెంకటేశ్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, నేతలు హసినీ వర్మ, కె.వి.సూర్యనారాయణ, దండి ప్రియాంక, ఆనంద్‌కుమార్, గౌతమ్, పద్మిని, చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు సునీల్ అహీరే

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మీనా

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది **భీశెట్టి మీనా** 11వ అదనపు జిల్లా కోర్టు, ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ న్యాయస్థానంలో దాఖలయ్యే అన్ని క్రిమినల్ కేసుల్లో ప్రభుత్వం తరఫున ఆమె వాదిస్తారు. గత రెండున్నర దశాబ్దాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్న ఆమె పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు న్యాయ సలహాదారుగా సేవలందిస్తున్నారు.

కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో సత్తా

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: గత నెల 30న హైదరాబాద్‌లో జరిగిన ఓపెన్ నేషనల్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్-2025లో [illegible] క్వీన్‌మేరీ బాలికల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారని కోచ్ దుర్గాభవానీ తెలిపారు. వైజాగ్ గూడ్స్ కార్గో బెర్త్ (వీజీసీబీ-వేదాంత) సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా 373 మంది విద్యార్థులకు ఉచితంగా కరాటే, కుంగ్‌ఫూలో శిక్షణ ఇచ్చారన్నారు. ఇందులో 30 విద్యార్థులు పాఠశాల తరఫున పోటీల్లో పాల్గొని రెండో స్థానంలో నిలిచారని పేర్కొన్నారు.

హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని వినతి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని జర్నలిస్టులకు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ అధ్యక్షుడు పి.నారాయణ్ మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డుల్లేని జర్నలిస్టులకు సైతం ప్రీమియం చెల్లించాలని కోరారు. వైద్యపరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ స్పందించి జర్నలిస్టుల హెల్త్ ప్రీమియం వివరాలు సమర్పించాలని పౌరసంబంధాలశాఖ డీడీ సదాశివరావును ఆదేశించారు.

ఉక్కులో దుర్ఘటనపై విచారణకు డిమాండ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్టీల్‌ప్లాంటులో కన్వేయర్ బెల్టు దుర్ఘటన యాజమాన్యం తప్పిదమేనని, నిజాలు నిగ్గుతేల్చేందుకు సీఎండీని విధుల నుంచి దూరంగా ఉంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జె అచ్యుతరావు కోరారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంటు వ్యవహారాలపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగులే కన్వేయర్ బెల్ట్ కోసేశారని స్టీలు కార్యదర్శి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. సంఘం నాయకులు అచ్యుతరావు, బూసి వెంకటరావు పాల్గొన్నారు.

కేజీహెచ్ సిబ్బంది సేవలకు ప్రశంసలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా కేజీహెచ్ వైద్య బృందానికి జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందించారు. బాధితులకు చికిత్స అందించడంలో కృషి చేసినందుకుగానూ కేజీహెచ్‌కు మంచి గుర్తింపు వచ్చిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి పేర్కొన్నారు. కేజీహెచ్ బ్లడ్ బ్యాంకు, స్కూల్ ఆఫ్ నర్సింగ్, ఏఆర్‌టీ కేంద్రానికి ప్రశంసాపత్రాలు లభించాయని పేర్కొన్నారు.

ఉపాధి కల్పించాలని ఆందోళన

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మృతిచెందిన జీవీఎంసీ పొరుగుసేవల సిబ్బంది, ఉద్యోగ విరమణ చేసిన సిబ్బంది పిల్లలకు ఉపాధి కల్పించాలని కోరుతూ సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ అర్హులైనవారికి ఉపాధి కల్పిస్తామని గతంలో హామీ ఇచ్చారని, ఇప్పటికీ వరకు దానిపై చర్యలు తీసుకోలేదన్నారు.

కరాటేలో నగర క్రీడాకారిణి ప్రతిభ

స్వర్ణం గెలుపొందిన వైష్ణవి

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: అఖిల భారత అంతర్ జోనల్ కరాటే పోటీల్లో నగరంలోని ఎన్ఏడీ సమీప కాకానినగర్‌కు చెందిన వైష్ణవి వైషవిమానస స్వర్ణ పతకం గెలుపొందింది. ఈ పోటీలు సోమవారం దిల్లీలో జరిగాయి. ఆమె ప్రస్తుతం బెంగళూరులో చదువుతున్నందున కర్ణాటక రాష్ట్రం తరఫున ఈ పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. గతంలో ఆమె పలు పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సొంతం చేసుకుంది.

ఎయిడ్స్‌పై మరింత అవగాహన అవసరం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ అన్నారు. జిల్లా పరిషత్తు కార్యాలయంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినం నిర్వహించారు. ఎయిడ్స్ బారినపడ్డ చిన్నారులతో కలిసి కలెక్టర్ అల్పాహారం తీసుకుని, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఎస్ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. డీఎమ్‌హెచ్‌ఓ జగదీశ్వరరావు, డీసీహెచ్ఎస్ శంకరప్రసాద్, కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి, ఏఎంసీ ప్రిన్సిపల్ సంధ్యారాణి, రోణంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: నేటి సమాజంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు పేర్కొన్నారు. సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల నుంచి కాన్వెంట్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ సిస్టర్ షైజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మాణిక్యకుమారి పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: వాల్తేర్ డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో వైద్యులు సిబ్బంది బ్యానర్లు చేతపట్టి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. డీఆర్ఎం లలిత్ బోహ్రా, ఏడీఆర్ఎం శాంతారం, సీఎంఎస్ డాక్టర్ శరత్‌బాబు పాల్గొన్నారు.

విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయం ప్రారంభం

అల్లిపురం, న్యూస్‌టుడే: దక్షిణ నియోజకవర్గాభివృద్ధికి విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సూర్యబాగ్‌లోని జోన్-4 కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047పేరుతో విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు, కార్పొరేటర్లు కందుల నాగరాజు, కూటమి నాయకులు ఐతి మధుబాబు, కోసూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం, న్యూస్‌టుడే: ప్రతి సంక్షేమ పథకాన్ని అవినీతిరహితంగా ప్రజలకు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. 31వ వార్డులోని కనకల వీధిలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు.

కిరండూల్ రైలుకు అదనపు బోగీ

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాఖ- కిరండూల్(58501) రైలుకు అదనపు బోగీ జత చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. జనవరి 28న అల్వాజా-ధన్‌బాద్(13352) రైలు వయా రాజమహేంద్రవరం బదులుగా కొవ్వూరు మీదుగా దారి మళ్లించి నడపనున్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

జీవీఎంసీకి 111 వినతులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 111 వినతులు వచ్చాయి. మేయరు పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ వాటిని స్వీకరించారు. జోన్-2కు 18, జోన్-3కు 16, జోన్-4కు 9, జోన్-5కు 11, జోన్-6కి 15, జోన్-8కు 11, ప్రధాన కార్యాలయానికి 31 చొప్పున వచ్చాయి. వాటిలో పరిపాలనకు 13, రెవెన్యూకు 13, ప్రజారోగ్యానికి 7, ప్రణాళికకు 48, ఇంజినీరింగ్‌కు 21, ఉద్యాన విభాగానికి 5, యూసీడీకి 4 వచ్చాయి. ఆయా సమస్యలను పరిష్కరించాలని మేయరు అధికారులను ఆదేశించారు.

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 132 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ బాధితులు నుంచి అర్జీలు స్వీకరించారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడి ఆయా వినతులపై త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు సీపీ పేర్కొన్నారు.

బాధితుల సమస్యలను వింటున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

మాలధారణ భక్తులకు భిక్ష పొడిగింపు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న శిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గత 41 రోజులుగా అయ్యప్ప మాలధారణ భక్తులకు నిర్వహిస్తున్న అన్న సమారాధన(భిక్ష) కార్యక్రమాన్ని వచ్చే సంక్రాంతి పండగ వరకు పొడిగిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ భిక్షకు విరాళాలు రూపంలో ఇవ్వదలచిన దాతలు ఆలయంలోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 8019704567 నంబరులో సంప్రదించాలని కోరారు.

భిక్ష చేస్తున్న మాలధారణ భక్తులు

సౌర ఫలకాల ఏర్పాటుకు ఈపీడీసీఎల్‌తో ఒప్పందం

గురుద్వారా, న్యూస్‌టుడే: సీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గృహాలపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసేందుకు ఏపీఈపీడీసీఎల్‌తో సద్భన్ ఫ్యూచర్‌టెక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. గురుద్వారా దరి ఈపీడీసీఎల్‌లోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి.సూర్యప్రకాశ్ సమక్షంలో సీజీఎం ఎల్.దైవప్రసాద్, సద్భన్ ఫ్యూచర్ టెక్ డైరెక్టర్ భూపేంద్ర సింగ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. పలు డివిజన్లలో 44,998 సర్వీసులకు 90 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు.

ఒప్పంద పత్రాన్ని చూపుతున్న సీఎండీ పృథ్వీతేజ్, సద్భన్ సంస్థ డైరెక్టర్, తదితరులు

ఏపీఈపీడీసీఎల్ పరిధిలో సుమారు రెండు లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలపై ఉచితంగా ప్లాంటు ఏర్పాటుచేయడానికి టెండర్ ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరు సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

వన్డే మ్యాచ్‌కు ముమ్మరంగా పనులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఈనెల 6వ తేదీన ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న భారత్-దక్షిణాఫ్రికా వన్డే మ్యాచ్ నిర్వహణకు సంబంధించిన పిచ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే తయారు చేసిన పిచ్‌ను రోలింగ్ చేయడం వంటి పనులు సోమవారం చేపట్టారు. స్టేడియం హెడ్ క్యురేటర్ నాగమల్లయ్య, ఏసీఏ మీడియా మేనేజర్ వై.వెంకటేష్ సంబంధిత పనులను పరిశీలించారు. గ్యాలరీల్లో సీట్లను శుభ్రపర్చడమే కాక స్టేడియంలోని అవుట్‌ఫీల్డ్ పనులు కూడా చకచకా సాగుతున్నాయి. ఈ మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఆంధ్రా క్రికెట్ సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెంకటేశ్ తెలిపారు. ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, సెక్రటరీ ఎంపీ సానా సతీష్‌లు ఈ మ్యాచ్ నిర్వహణకు అన్ని విభాగాలను సన్నద్ధం చేశారని పేర్కొన్నారు.

పిచ్‌ను పరిశీలిస్తున్న స్టేడియం హెడ్ క్యురేటర్ నాగమల్లయ్య, ఏసీఏ మీడియా మేనేజర్ వెంకటేశ్

వైభవుడి సన్నిధిలో గీతా పారాయణం

మురళీనగర్, న్యూస్‌టుడే: గీతా జయంతి సందర్భంగా ఎన్‌జీజీఓస్‌కాలనీ కప్పరాడ వైభవ వేంకటేశ్వరుడి దివ్యక్షేత్రం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులు సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. ప్రధాన అర్చకులు వాసుస్వామి, శేషాచార్యులు భగవద్గీత సారాంశాన్ని వివరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రతిరోజూ భగవద్గీతలోని ఒక శ్లోకాన్ని చదవడం వల్ల వారి విద్యా నైపుణ్యం పెంపొందుతుందని 26వ వార్డు ఎన్‌జీజీఓఎస్‌కాలనీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి పేర్కొన్నారు. సోమవారం విద్యార్థులకు ఆమె భగవద్గీతపై అవగాహన కల్పించారు. అనంతరం వారితో భగవద్గీత శ్లోకాలను చదివించారు.

అలంకరణలో శ్రీకృష్ణుడు

గీతా పారాయణం చేస్తున్న భక్తులు

పసికందు హత్య కేసులో కొనసాగుతున్న విచారణ

నాయకులతో మాట్లాడుతున్న సీఐ కె.రవికుమార్

మాధవధార, న్యూస్‌టుడే: మీ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతున్నా, మానసిక స్థితి సక్రమంగా లేకుండా నేరాలు చేస్తున్న, ఒంటరిగా ఉంటూ వివిధ పూజలు, ఇతర కార్యక్రమాల నిర్వహిస్తున్న వారు మీ దృష్టికొస్తే తక్షణమే కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కె.రవికుమార్ పలువురు రాజకీయ నాయకులను కోరారు. పసికందు శరీర భాగాలు ముక్కలుగా నరికేసి కాలువలో పడేసిన కేసులో నిందితుడిని పట్టుకోవడానికి చేపడుతున్న దర్యాప్తులో భాగంగా సోమవారం స్టేషన్ పరిధిలోకి వచ్చే పలు వార్డుల్లో ఉన్న వివిధ పార్టీల నాయకులను, పెద్దలను పిలిచి సమావేశం నిర్వహించారు. కొండవాలు ప్రాంతాలు, మురికివాడల్లో సీసీ కెమెరాలను లేకపోతే వాటిని గుర్తించి తెలియజేస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి కెమెరాలను ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా వారందరికీ కరపత్రాలు అందజేసి వాటిని ఇంటింటికీ పంపిణీ చేసేలా సమాచారం ఇవ్వాలని కోరారు.

సీబీఐ విచారణకు డిమాండ్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న అవినీతిపై సీబీఐ విచారణ చేయించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. జగదాంబ కూడలి వద్దనున్న సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ పేరు దెబ్బతీయాలని కోకోవెన్ విభాగంలో నాసిరకం సరకును వాడుతున్నారని ఆరోపించారు. దీని వల్ల నాణ్యత లేని స్టీల్ ఉత్పత్తి అవుతోందన్నారు. ఒక్క ఏడాదిలోనే అనేక మంది కార్మికులను తొలగించడంతో కార్మికులపై పని భారం ఎక్కువైందన్నారు. సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

ఉద్యోగానికి 18 మంది ఎంపిక

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ ఆర్.మంజుల, వివిధ కంపెనీల ప్రతినిధులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఆర్.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యాకల్పన, నివేదిత, కిరణ్మయి, వరలక్ష్మి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

(c) eenadu

జ్యోతి వెలిగిస్తున్న బ్రహ్మకుమారి రామేశ్వరి

కుట్టు శిక్షణ ప్రారంభం

మల్కాపురం, న్యూస్‌టుడే : మహిళలు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బ్రహ్మకుమారి రామేశ్వరి అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు హిందుస్థాన్ షిప్‌యార్డుకాలనీలోని ప్రజాపిత రాజయోగ విశ్వ విద్యాలయం కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

చిత్రలేఖనంలో చిన్నారుల ప్రతిభ

గాజువాక, న్యూస్‌టుడే : ఎన్టీపీసీ యాజమాన్యం ఇటీవల నిర్వహించిన చిన్నారుల జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో గాజువాక హైస్కూలు విద్యార్థులు పతకాల పంట పండించుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన నికీషా, భవ్యశ్రీ, హేమలత, సుష్మలను హెచ్ఎం విజయప్రశాంతి, ఎంఈఓ త్రినాథ్, చిత్రలేఖనోపాధ్యాయుడు భావనారుషీ, ఉపాధ్యాయులు అభినందించారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం విజయప్రశాంతి

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ?: పాతగాజువాక పల్లా వీధిలో పందుల బెడద తీవ్రంగా ఉంది. దారిన పోయే వారిపై దాడి చేస్తున్నాయి. –పీవీరావు, గాజువాక ✔: సిబ్బంది పంపి లైను సరిచేస్తాం. –కేదార్‌నాథ్, ఏఈ

?: గాజువాక గణేశ్‌నగర్, మారుతీనగర్‌లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. చీకట్లో నానా ఇబ్బందులు పడుతున్నాం. – శ్యామలరావు, గాజువాక – పరశురామ్, హైస్కూలు రోడు, – రామారావు, గాజువాక

✔: వీధి దీపాలను పునరుద్ధరిస్తాం –శివ, వీధి దీపాల నిర్వాహకుడు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : ?: జీవీఎంసీ 92వ వార్డు నరసింహనగర్‌లోని పాఠశాల మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది.- కొవ్వు రాజు, నరసింహనగర్ ✔: పరిశీలించి చర్యలు చేపడతాం.– గోపి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం బీఆర్టీఎస్ రోడ్డులో గోతులు పడ్డాయి. మరమ్మతులు చేయించగలరు.– నాగభూషణం, గోపాలపట్నం ✔: రోడ్డు మరమ్మతులు చేపడతాం.– వెంకటలక్ష్మి, పనుల విభాగం డీఈ

కాలువల మరమ్మతులు

స్పందనకు వందనం

చినగంట్యాడ (గాజువాక), న్యూస్‌టుడే : చినగంట్యాడ పరిసర ప్రాంతాల్లో పూడిక నిండిన కాలువల శుభ్రతకు జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది కదిలారు. 'ఈనాడు'లో కాలువల దుస్థితిపై వచ్చిన వార్తలకు అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా మినీ జేసీబీతో పూడికలు తీసి మురుగుపారేలా చేశారు.

రద్దీ కూడళ్లు.. పనిచేయని సిగ్నళ్లు..

కరాస, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా బీఆర్‌టీఎస్ నిర్మించింది. ముఖ్యమైన కూడళ్లలో ప్రమాదాలు జరగకుండా సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేసింది. అయితే అవి కొద్దికాలం పని చేసి ఆగిపోయాయి. కంచరపాలెం మెట్టు నుంచి కరాస వరకు ఇదే పరిస్థితి. దీంతో ఈ దారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

మర్రిపాలెం కూడలిలో పనిచేయని సిగ్నల్ లైట్లు

సమస్య ఎక్కడంటే.. ✦ **కంచరపాలెం మెట్టు :** తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం, ఎన్ఏడీ వైపు నుంచి వచ్చే వాహనాలన్నీ ఈ కూడలిలోనే కలుస్తాయి. పైగా ఇక్కడ కూరగాయలు, చేపల మార్కెట్లు, ఫంక్షన్ హాల్స్, వ్యాపార సముదాయలు, తోపుడు బండ్లతో రద్దీ ఎక్కువ. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి పది గంటల వరకు కూడా ఇదే పరిస్థితి ఉంటుంది.

✦ **ఊర్వశికూడలి :** జాతీయ రహదారి డీమార్టు మీద నుంచి కంచరపాలెం, డాక్‌యార్డు వైపునకు వెళ్లే వాహనాలు, ఎన్ఏడీ-కంచరపాలెం వైపునకు వెళ్లేవారు ఎక్కువగా ఈ కూడలి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో సినిమా థియేటర్లు, వ్యాపార సముదాయలు, పలు పాఠశాలలు ఉంటాయి. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి తొమ్మిది వరకు ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది.

✦ **పాత ఐటీఐ కూడలి :** ఇక్కడ ఐటీఐ ఉండడంతో నిత్యం విద్యార్థులతో రద్దీగా ఉంటుంది. అలాగే కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోకి ఈ ప్రాంతం రావడంతో ఈ ప్రాంత ప్రజలు ఈ మార్గం ద్వారానే జాతీయ రహదారి మీద ఉన్న పోలీసు స్టేషన్‌కు వెళ్తారు. అలాగే ఇక్కడ వ్యాపార సముదాయాలు, పెట్రోల్‌బంకు, రేషన్ డిపోలు ఉన్నాయి.

✦ **ఇండస్ట్రియల్ ఎస్టేట్ :** ఎన్ఏడీ, కంచరపాలెం మధ్య ఎక్కువగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇది పారిశ్రామిక ప్రాంతం కావడంతో భారీ వాహనాలు ఇక్కడ మలుపు తిరగడం, వెళ్లడం వంటివి నిత్యం ఉంటాయి.

✦ **104 ఏరియా :** రైల్వే, డాక్‌యార్డు, హెచ్‌పీసీఎల్, పోర్టు, నౌకాదళం, ఆశీవానిపాలెం, బాపూజీనగర్, జ్యోతినగర్‌కు చెందిన ఉద్యోగులు, స్థానికులు ఎక్కువగా ఈ కూడలిని వినియోగిస్తారు. ఈ ప్రాంతంలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు చాలా రద్దీగా ఉంటుంది. దీంతో ఇక్కడ ప్రతిరోజు ఏదో ఒక సమయంలో వాహనాలు ఢీకొనడం సర్వసాధారణం.

✦ **మర్రిపాలెం :** ఇది మార్కెట్ ప్రాంతం. నిత్యం భారీ వాహనాలు ఇక్కడ ఉండే మర్రిపాలెం రైల్వే కమర్షియల్ యార్డుకు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులకు ఇదే దారి.

✦ **కరాస :** ఈ కూడలిలో సీఐఎస్ఎఫ్ క్వార్టర్సు, శివనగర్, గ్రీన్‌గార్డెన్స్, శాంతినగర్, మర్రిపాలెం వుడాలేఅవుట్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనచోదకులు వ్యతిరేక దిశలో ఎక్కువగా వచ్చి రోడ్డును క్రాస్ చేస్తారు. ఆ సమయంలో ప్రధాన రహదారిలో వేగంగా వచ్చే వాహనాలకు ఇక్కడ కూడలి ఉంది అనే విషయం తెలియక ప్రమాదాలు జరుగుతుంటాయి.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న గాజువాక హైస్కూలు ఉపాధ్యాయులు

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చదువులో మేటి.. ప్రసంగాల్లో ధాటి

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

గాజువాక, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం పాతగాజువాక మోహన్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అన్న అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన షర్మిల, సంజన, ప్రణవిలకు పాఠశాల కరస్పాండెంట్ మోహన్ ప్రసాద్, హెచ్ఎం ఆర్ఎస్ఏ నాయుడు, ఉపాధ్యాయులు సత్యవతి, అనిత, హరితల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

శ్రీసూర్యతేజ్ పాఠశాలలో..

చైతన్యనగర్ (పెదగంట్యాడ), న్యూస్‌టుడే : చైతన్యనగర్‌లోని శ్రీసూర్యతేజ్ పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అన్న అంశంపై నిర్వహించిన ఉపన్యాసం (స్పీచ్) పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన దీక్షితసాయి, సారూప్య, నాగ చరణ్‌తేజలకు పాఠశాల హెచ్ఎం సౌజన్య, ఉపాధ్యాయులు సౌమ్య, షబ్నం చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీసూర్యతేజ్ పాఠశాల ప్రతినిధులు

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కానరాని పచ్చదనం..

దర్పణం

గాజువాక, న్యూస్‌టుడే : పచ్చదనంతో కళకళలాడాల్సిన వుడా 130 అడుగుల రహదారి డివైడర్లు బోసిపోతున్నాయి. వంటిల్లు కూడలి నుంచి వుడా కాలనీకి వెళ్లే దారిలో డివైడర్‌పై ఎక్కడెక్కడినుంచో వ్యర్థాలను తెచ్చి డంప్ చేస్తున్నారు. ఇది చాలదన్నట్లుగా పగిలిన సిమెంటు గొట్టాలు, విద్యుత్తు స్తంభాలు, చిల్లర దుకాణాలతో పాటు ఇటీవల చెట్లను నరికి కొమ్మలు, ఎండుకర్రలను ఉంచారు. జీవీఎంసీ ఉద్యాన విభాగం అధికారులు ఇకనైనా మొక్కలు నాటి పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

ఎవరినెత్తిన పడుతుందో...!

ఫోకస్

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : కైలాస్‌నగర్‌లోని మహిళా రైతుబజారు వద్ద సోలార్ విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగి కూలడానికి సిద్ధంగా ఉంది. గెడ్డ వద్ద ఆరేళ్ల క్రితం ఎంపీ నిధుల నుంచి పలుచోట్ల కూడళ్లలో సోలార్ దీపాలను ఏర్పాటు చేశారు. నిర్వహణ చూసే నాథుడులేక ఇటీవల గాలికి స్తంభం ఒకవైపునకు ఒరిగింది. నిత్యం రద్దీగా ఉండే దారిలో స్తంభాన్ని సరిచేయాల్సి ఉంది.

భజన యజ్ఞం పోటీలు ప్రారంభం

చినగంట్యాడ (గాజువాక), న్యూస్‌టుడే: త్రిశక్తి భజన మండలి, భజరంగీ భజన మంజరి, హిందూ ధర్మ ప్రచార మండలి ఆధ్వర్యంలో భజన, కోలాట, నాట్య, పాటల పోటీలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భజన బృందాలు పాటలతో అలరించాయి. పోటీలను సాహిత్య సుధ వ్యవస్థాపకులు అద్దంకి రాఘవాచార్యులు ప్రారంభించారు. నిర్వాహకుడు బి.రాజారావు, అమ్మాజీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ విద్యుత్తు పనుల్లో కదలిక

వడ్లపూడి ప్రధాన రహదారిలో భూగర్భ విద్యుత్తు తీగల పనులు చేస్తున్న సిబ్బంది

స్పందనకు వందనం

కూర్మన్నపాలెం (వడ్లపూడి), న్యూస్‌టుడే : జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ప్రధాన రహదారిలో భూగర్భ విద్యుత్తు తీగల పనుల్లో కదలిక వచ్చింది. 'భారీ గుంతలు... తప్పని ఇక్కట్లు' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం కథనం ప్రచురించడంతో అధికారులు, గుత్తేదారులు స్పందించారు. ఉదయం నుంచే పనులు మొదలుపెట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాల పంపిణీ

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి ధర్మసత్రం కూడలిలో మహాత్మాగాంధీ స్వచ్ఛంద సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు గీతా పుస్తకాలను పంపిణీ చేశారు. సోమవారం గీతా జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు ముత్యాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక 66వ వార్డులో సీఎంఆర్ఎఫ్ కింద అజీమాబాద్‌కు చెందిన బాధితులు షేక్ నజీర్‌కు రూ.58వేలు, పీర్ అహ్మద్‌కు రూ.40వేల చెక్కులను తెదేపా వార్డు అధ్యక్ష కార్యదర్శులు గోమాడ వాసు, ఎండీ ముర్తజా, సత్యనారాయణ అందజేశారు. నాయకులు మహ్మద్‌పాషా, ఇమామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

అగనంపూడి, న్యూస్‌టుడే : పెదమెట్ట మర్రిపాలెం కూడలిలో జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి సోమవారం మృతిచెందారు. దువ్వాడ పోలీసుల కథనం ప్రకారం.. అగనంపూడి పరిధి దొంకాడ గ్రామానికి చెందిన బొబ్బిలి అప్పారావు(63) పది రోజుల క్రితం తన ద్విచక్ర వాహనంపై లంకెలపాలెం వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా కూడలిలో వాహనం ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. అప్పారావు 1980వ దశకంలో దొంకాడ గ్రామానికి సర్పంచిగా పనిచేశారు. దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్ బస్‌స్టాప్‌లో గుర్తుతెలియని వ్యక్తి (60) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో ఎయిర్‌పోర్టు పోలీసుల సమక్షంలో స్థానిక వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఆధ్వర్యంలో స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

సౌర ఫలకాల ఏర్పాటుకు ఒప్పందం

గురుద్వారా, న్యూస్‌టుడే: సీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గృహాలపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసేందుకు ఏపీఈపీడీసీఎల్‌తో సద్భున్ ఫ్యూచర్‌టెక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. గురుద్వారా దరి ఈపీడీసీఎల్‌లోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి.సూర్యప్రకాశ్ సమక్షంలో సీజీఎం ఎల్.దైవప్రసాద్, సద్భున్ ఫ్యూచర్ టెక్ డైరెక్టర్ భూపేంద్ర సింగ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. పలు డివిజన్లలో 44,998 సర్వీసులకు 90 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో సుమారు రెండు లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలపై ఉచితంగా ప్లాంటు ఏర్పాటు చేయడానికి టెండర్ ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన

గాజువాక, కూర్మన్నపాలెం (దువ్వాడ), అగనంపూడి, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ఎయిడ్స్ దినం సందర్భంగా పలుచోట్ల ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎయిడ్స్‌ను తరిమికొడదామని వక్తలు పేర్కొన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాలలో విద్యార్థులు ఎయిడ్స్ రిబ్బన్ ఆకారంలో నుంచున్నారు. ప్రిన్సిపల్ వై.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారిణి ఎస్.సత్యలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అగనంపూడిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

రిబ్బన్ ఆకారంలో విజ్ఞాన్ ఫార్మా కళాశాల విద్యార్థులు

శ్రీనగర్ ఆఫీషియల్‌కాలనీ డిజైర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆరోగ్య అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, సేవా సంస్థల ప్రతినిధులు

విద్యార్థులు కరాటేలో రాణించాలి

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడిలో షీల్డ్‌ఫోర్సు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీలను సోమవారం డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు కరాటేలోనూ రాణించాలని కోరారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి గడసాల అప్పారావు, 85వ వార్డు జనసేన అధ్యక్షుడు గవర సోమశేఖరరావు, కరాటే కోచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కోన తాతారావు తదితరులు

ఆర్.తరుణ్‌కుమార్, ఆర్.దిల్లేశ్వరి

రాష్ట్రస్థాయిలో పతకాల సాధన

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : ఇటీవల పరవాడ మండలంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్.తరుణ్‌కుమార్(9వ తరగతి) స్వర్ణం, ఆర్.దిల్లేశ్వరి(9వ తరగతి) రజత పతకం సాధించారని పాఠశాల పీడీలు ఇస్మాయిల్, నర్సింహమూర్తిలు తెలిపారు.

కరాటేలో విద్యార్థిని ప్రతిభ

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌కి చెందిన ఎం.వర్షిణి వైష్ణవి బెంగళూరులో 8వ తరగతి చదువుతోంది. ఇటీవల జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ జోనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించినట్లు కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు.

పాఠశాలల్లో విద్యా సామర్థ్య సర్వే

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 62వ వార్డు మల్కాపురంలో సోమవారం విద్యా సామర్థ్య సర్వే నిర్వహించారు. ములగాడ ఎంఈవో చలపతిరావు దీనిని నిర్వహించారు. విద్యార్థుల మార్కులు, ఉత్తీర్ణత వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాల్గొంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సర్వే జరుగుతుందన్నారు.

విద్యార్థుల వివరాలు తెలుసుకుంటున్న ఉపాధ్యాయులు

పాఠశాలను సందర్శించిన ప్రపంచబ్యాంక్ బృందం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం సాయంత్రం ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి బృందం సందర్శించింది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వానికి లోగడ ప్రపంచబ్యాంక్ నిధులను మంజూరు చేసింది. అవి వినియోగమవుతున్న తీరును తెలుసుకున్నారు. అలసంద్రు డిరోజ్, దీప బాలకృష్ణన్, ఎంఈఓలు రమణాజీ, శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు

ఇళ్లకు వెళ్లి.. చదువులపై ఆరా..

గోపాలపట్నం, న్యూస్‌టుడే: రానున్న పదో తరగతి సార్వత్రిక పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వం 100 రోజుల ప్రణాళిక అమలుచేస్తోంది. ఇందులోభాగంగా గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి విద్యార్థుల చదువులపై ఆరా తీస్తున్నారు. అందులో భాగంగా సోమవారం సోమవారం రాత్రి హెచ్.ఎం. స్వర్ణలత విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పలు సూచనలు చేశారు.


పిల్లల ఇంటికి వెళ్లి తల్లి దండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

7న జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు ఈనెల 7వ తేదీన పోర్టు స్టేడియంలో జరగనున్నట్లు విశాఖపట్నం అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎ.నారాయణరావు తెలిపారు. అండర్-16, 18, 20 విభాగాల్లో బాల, బాలికలు; సీనియర్ విభాగంలో మహిళలు, పురుషులకు ఈ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

సామాజిక సంక్షేమం కూటమికే సాధ్యం

సింధియా(శ్రీహరిపురం), మల్కాపురం, గోపాలపట్నం, న్యూస్‌టుడే : పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గణబాబు పింఛన్లు పంపిణీ చేశారు. 58వ వార్డు కారాడ వీధి, గుల్లలపాలెం, రామ్‌నగర్, 62వ వార్డు అంబేద్కర్‌నగర్‌లో, గోపాలపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో లబ్ధిదారుకు ఆయన పింఛను అందించారు. ఆయన వెంట జోన్ కమిషనర్ బి.రాము, తెదేపా నాయకులు కోరాడ శ్రీనివాసరావు, ఉమామహేశ్వరి, లక్ష్మణరావు, శ్రీను, రాము, జనసేన పశ్చిమ సమన్వయకర్త దుర్గాప్రశాంతి, కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, దాడి వెంకటరమేశ్, తెదేపా కార్యదర్శి వీఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో పింఛను అందిస్తున్న గణబాబు

భక్తిశ్రద్ధలతో గీతాజయంతి వేడుకలు

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే: గీతాజయంతి సందర్భంగా జీవీఎంసీ 89వ వార్డు సంతోశ్‌నగర్ రామాలయంలో సోమవారం విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు. వికాస తరంగణి సంస్థ ఆధ్వర్యంలో విష్ణు, గీతా పారాయణం, గోవిందనామాలు, కృష్ణాష్టకం పఠించారు. కార్యక్రమంలో భక్తులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పారాయణం చేస్తున్న భక్తులు

ఇలాగైతే రోగాలు రావా..

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్-కాకానినగర్ జాతీయ రహదారిని ఆనుకుని మురుగునీటితో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. స్థానికంగా భూగర్భడ్రైనేజీ లీకేజీతోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు నిల్వ నీరు చెరువును తలపిస్తోంది. ఈ నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో భూగర్భంలోకి ఇంకిపోతుంది. దీనివల్ల పరిసరాల్లోని బోరుబావుల్లోని నీరు కలుషితమవుతోంది. బోరునీరు కూడా దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిలిచిన మురుగునీరు

జీవీఎంసీకి 111 వినతులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 111 వినతులు వచ్చాయి. మేయరు పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ వాటిని స్వీకరించారు. జోన్-2కు 18, జోన్-3కు 16, జోన్-4కు 9, జోన్-5కు 11, జోన్-6కి 15, జోన్-8కు 11, ప్రధాన కార్యాలయానికి 31 చొప్పున వచ్చాయి. వాటిలో పరిపాలనకు 13, రెవెన్యూకు 13, ప్రజారోగ్యానికి 7, ప్రణాళికకు 48, ఇంజినీరింగ్‌కు 21, ఉద్యాన విభాగానికి 5, యూసీడీకి 4 వచ్చాయి. ఆయా సమస్యలను పరిష్కరించాలని మేయరు అధికారులను ఆదేశించారు.

✦ బీచ్‌రోడ్డులో ఓ బహుళ అంతస్తు నిర్మాణానికి సంబంధించి దరఖాస్తు చేసిన ప్లానుకు కేంద్ర, పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అనుమతులు తీసుకోలేదని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 20 బోర్లు వేశారని, వాటిని తక్షణమే మూసివేయాలని పేర్కొన్నారు.

భాజపా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా ప్రకాశ్

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 62వ వార్డు అంబేద్కర్ కాలనీకి చెందిన ములకలపల్లి ప్రకాశ్‌ని జిల్లా భాజపా ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌కి భాజపా జిల్లా అధ్యక్షులు పరశురామరాజు చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందజేశారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర పార్టీ అధ్యక్షులు మాధవ్, నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలను తెలియజేశారు.

PASSPORT LOST
I, CHENNURI PRASAD S/o. CHENNURI RADHA KRISHNA, Residing at Door No. 7-9-4/1,Panthulugari Meda, Paradesamma Temple,Gajuwaka, Visakhapatnam, Andhra Pradesh, hereby declare that I have lost my original Passport bearing No. M2865253, while I was going on Motor bike 05-11-2025 going from my house to Gajuwaka Jn., Visakhapatnam. If any one found, please contact: 99497 34269

(c) eenadu

పంచాయతీలకు.. తనిఖీల గుబులు!

గంట్లాం పంచాయతీలో తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా సచివాలయ అధికారిణి

● గత నెల 25న భోగాపురం మండలం గూడెపువలస గ్రామ పంచాయతీలో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని అధికారుల పరిశీలనలో తేలింది. 19 రకాల దస్త్రాల్లో తొమ్మిది ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించడం లేదని గుర్తించారు.

● నవంబరు 29న డెంకాడ మండలం గంట్లాంలో జరిపిన తనిఖీల్లో పంచాయతీ ఆదాయం రూ.1.60 లక్షల్లో 95 శాతం కేవలం నీటిట్యాంకు నిర్వహణ, జీతభత్యాలకే వెచ్చించడాన్ని తప్పుబట్టారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ అధికారులు(డీఎల్‌డీవోలు) పంచాయతీల్లో ఇటీవల చేపట్టిన తనిఖీల్లో ఒక్కొక్కటిగా లోపాలు వెలుగు చూస్తున్నాయి. జిల్లాలో విజయనగరం డివిజన్‌లో రెండు పంచాయతీల్లో చేపట్టిన తనిఖీల్లో రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడం, కార్యాచరణ కమిటీలు కాగితాలకే పరిమితం అవుతున్నట్లు గుర్తించారు. బొబ్బిలి, చీపురుపల్లి డివిజన్లలో తనిఖీలకు అధికారులు సిద్ధమవుతున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

జిల్లాలో 775 పంచాయతీలున్నాయి. డీఎల్‌డీవో నెలకు నాలుగు పంచాయతీలు తనిఖీలు చేయాలని లక్ష్యం విధించారు. కార్యాచరణ కమిటీల పనితీరు, పన్ను వసూలు, పారిశుద్ధ్యం, చెత్త సంపద కేంద్రాలు సమగ్రంగా పరిశీలించాలి. వీరితోపాటు డిప్యూటీ ఎంపీడీవోలు తరచూ తనిఖీలు చేయాల్సి ఉన్నా, అవేవీ జరగడం లేదు. పనితీరు మార్చుకోవాలని పంచాయతీల అధికారులను ఆదేశించినట్లు జిల్లా సచివాలయ అధికారిణి ఎస్.రోజారాణి తెలిపారు.

గుర్తించిన ప్రధాన లోపాలివి.. ● ప్రతి పంచాయతీకి కార్యాచరణ కమిటీలు ప్రధానమైనవి. నీరు-పారిశుద్ధ్య కమిటీ, వ్యవసాయం, లబ్ధిదారుల కమిటీ, ప్రజారోగ్యం, విద్య రవాణా కమిటీలు ఏర్పాటు చేయాలి. వీటిలో ఒక్క శానిటేషన్ కమిటీ తప్ప, మిగిలినవి నిర్వహణలో లేవని, కొన్నిచోట్ల ఏర్పాటు కాని పరిస్థితి ఉన్నట్లు గుర్తించారు. ● ఇంటిపన్ను ఈ సమయానికి 75 శాతం వసూలు చేయాలి. జిల్లాలో రూ.24 కోట్ల పన్ను వసూలు లక్ష్యానికి 10.53 శాతం అంటే.. రూ.2.57 కోట్లే వసూలు చేయగలిగారు.

కార్యవర్గం ఎన్నిక

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా వాణిజ్య పన్నుల శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా రాయుడు రామచంద్రప్రసాద్ వ్యవహరించారు. కార్యవర్గం అధ్యక్షుడిగా ఎం.శ్రీను, ప్రధాన కార్యదర్శిగా వి.సాయికుమార్, కోశాధికారిగా ఎం.వాసు, ఉపాధ్యక్షుడిగా కేవీ అప్పారావు, ఎల్.పద్మ, వై.శంకరరావు, కార్యదర్శులుగా ఎల్‌వీ ప్రసాద్, శంకరరావు, జి.మధు ఎన్నికైనట్లు రామచంద్రరావు తెలిపారు.

జలజల.. గలగల

సాగునీటి ప్రాజెక్టులకు సర్కారు ప్రాధాన్యం

ఈనాడు, విజయనగరం

వ్యవసాయానికి ఊపిరిపోసే నీటి పారుదల రంగాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. ఉమ్మడి జిల్లాలో అన్నదాతలకు కన్నీరు మిగిల్చింది. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాధాన్యతా క్రమంలో తక్షణం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి రామానాయుడు, జలవనరుల శాఖ అధికారులతో ఇటీవల అమరావతిలో సమావేశమయ్యారు. నివేదికలు పరిశీలించి ఉమ్మడి జిల్లాలోని నాలుగు ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చారు. పనులు పరుగులు పెట్టించాలని అధికారులను ఆదేశించారు.

తోటపల్లి ఉమ్మడి జిల్లాలో తోటపల్లి ప్రాజెక్ట్ ప్రధానమైంది. మూడు జిల్లాల్లో 1,31,221 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 64 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా పనులు ప్రారంభించి 85 శాతం పూర్తిచేశారు. మిగిలిన 15 శాతం పూర్తికి రూ.290 కోట్లు అవసరం. నిర్మాణాలకు రూ.120 కోట్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు రూ.170 కోట్లు ఇస్తే ఈ ప్రాజెక్ట్‌ను వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు నివేదించారు.

తారకరామ సాగు, తాగునీటికి ఉభయతా రకంగా విజయనగరం జిల్లాలో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 16,538 ఎకరాల నూతన ఆయకట్టుతో పాటు 8,172 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఈ ప్రాజెక్టు లక్ష్యం. 44.40 శాతం పనులు పూర్తయ్యాయి. మూడు గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తే ప్రధాన అడ్డంకి తొలగుతుంది. సుమారు రూ.800 కోట్లలో కొంతైనా వస్తే జూన్ 2027 నాటికి ప్రాజెక్ట్ పూర్తవుతుందని అధికారులు విన్నవించారు.

తారకరామ తీర్థసాగర్ కాలువ నిర్మాణ పనులు

జంఝావతి అంతరాష్ట్ర వివాదంలో చిక్కుకున్న జంఝావతి ప్రాజెక్టు పంట కాల్వల పనులు పూర్తికి రూ.59 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాలి. తమ భూభాగానికి ముంపు వాటిల్లుతుందని ఒడిశా ప్రభుత్వం మోకాలడ్డింది. ప్రస్తుతం తొమ్మిది వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్నారు. మిగిలిన పనులకు రూ.59 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపారు. నిధులిస్తే జూన్ 2027 నాటికి పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు.

రూ.32 కోట్లు కోరాం

ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. కనీస నిర్వహణ పనులకు రూ.32 కోట్లు అవసరమని కోరాం. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులిచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. ఇందుకు ఒక కార్యాచరణ రూపొందించనున్నారు. త్వరలో దీనికి ఒక రూపు వస్తుందని ఆశిస్తున్నాం.

- స్వర్ణకుమార్, ఎస్ఈ, జలవనరుల శాఖ

నదుల అనుసంధానానికి.. తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాలువ ద్వారా నాగావళి నది నుంచి చంపావతి నదికి నీటిని మళ్లించే అనుసంధానం నిధులు రాక నిలిచిపోయింది. ఇది పూర్తయితే విజయనగర వాసుల తాగునీటి అవసరాలు తీరుతాయి. గడిగెడ్డ జలాశయం కింద 2,950 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతుంది. ప్రభుత్వం రూ.24.80 కోట్లకు ఆమోదించింది. ఇప్పటివరకు రూ.3.27 కోట్లతో 19.32 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన నిధులిస్తే వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు నివేదించారు.

మెట్టపల్లిలో అప్రమత్తం

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం మెట్టపల్లిలో ఇటీవల స్క్రబ్ టైఫస్‌తో ఓ మహిళ(40) మృతి చెందడంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఇమ్యూనిటీ అధికారి సత్తిరాజు, జిల్లా సర్వేలయన్స్ అధికారి సత్యనారాయణ కర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతోనే కుటుంబీకులు ఆమెను ఆసుపత్రికి తరలించారన్నారు. గ్రామంలో అయిదు రోజుల పాటు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఎలాంటి జ్వర లక్షణాలున్నా అన్ని పరీక్షలు జరిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

మహిళ మృతిపై విచారణ

వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. మెట్టపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో జీవనరాణి సోమవారం సాయంత్రం సందర్శించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మితో మాట్లాడారు. ఆమె అందించిన వివరాలతో మహిళకు చీపురుపల్లిలో చికిత్స అందించిన ఆసుపత్రిని సందర్శించారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి నివేదిక సిద్ధం చేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

మాస్టార్లు ఎప్పుడొస్తారు?

జేఎన్‌టీయూ గురజాడలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయాన్ని బోధకుల కొరత వేధిస్తోంది. ఇక్కడ నియమితులైన వారిలో 15 మంది విభజనకు ముందు జేఎన్‌టీయూ కాకినాడ, నరసారావుపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లి, తర్వాత ఐచ్ఛికం ఇచ్చి అక్కడే ఉండిపోయారు. వారంతా వెనక్కివస్తే కాని కొరత తీరే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఒప్పంద, అవర్లీ బేస్డ్ వారితో బోధన సాగిస్తున్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతోంది.

శాసన మండలిలో ప్రస్తావన

డిప్యుటేషన్‌పై వెళ్లిన వారిని వెనక్కి పంపించాలని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం అధికారులు గతంలో ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రజాప్రతినిధులకు వినతులు అందజేశారు. నాటి ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ సమస్యను అప్పట్లో మండలిలో ప్రస్తావించారు. ఎవరు ఎక్కడ వారన్నదానిపై స్పష్టత వస్తే కాని భవిష్యత్తులో నియామకాలు, పదోన్నతులు కష్టమని అధికారులు పేర్కొంటున్నారు. సమస్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం ఉప కులపతి వి.వి.సుబ్బారావు తెలిపారు.

బోధకుల విషయమై జేఎన్‌టీయూ కాకినాడ, గురజాడ మధ్య నాలుగేళ్లుగా వివాదం నలుగుతోంది. ఎవరెక్కడ? అన్నదానిపై స్పష్టత కొరవడడమే దీనికి కారణంగా పేర్కొంటున్నారు. తాజాగా ఈ విషయమై గవర్నర్ దృష్టికి వెళ్లడంతో ఫ్యాకల్టీ అంతర్గత పదోన్నతులకు సంబంధించిన కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) తాత్కాలికంగా నిలిపివేయడంతో విషయం తెరపైకి వచ్చింది.

ఇదీ ప్రస్తుత పరిస్థితి

★ ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం యూజీ, పీజీ ప్రోగ్రాంలకు వందమంది అధ్యాపకులు ఉండాలి. ప్రస్తుతం యూజీలో 72 మందికి 27 మంది రెగ్యులర్ అధ్యాపకులున్నారు. మిగిలిన వారంతా ఒప్పంద విధానంలో ఉన్న వారే. పీజీలో 28 మందికి అందరూ ఒప్పంద విధానంలోనే పనిచేస్తున్నారు.

★ యూజీ సివిల్ బ్రాంచిలో అసలు రెగ్యులర్ ఫ్యాకల్టీయే లేరు. ఈసీఈ మినహా మిగిలిన విభాగాలకు ఇద్దరు ముగ్గురే రెగ్యులర్ వారున్నారు.

★ అధ్యాపకుల కొరతతో న్యాక్, ఎన్‌బీఏ గుర్తింపునకు వర్సిటీ దూరమవుతోంది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో విశ్వవిద్యాలయానికి చోటు లభించని పరిస్థితి ఉంది.

★ ప్రాంగణ నియామకాలు ఒకప్పటి కంటే తగ్గుముఖం పట్టాయి. 2021-22లో 265, 2022-23లో 174, 2023-24లో 120, 2024-25 64 మందికి అవకాశాలు లభించాయి.

★ గతంలో మెకానికల్, ఈసీఈ, సీఎస్సీ బ్రాంచిలకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్) గుర్తింపు ఉండేది. ఇప్పుడది ఈసీఈ, సీఎస్సీ బ్రాంచిలకే పరిమితమైంది.

మెరుగైన వైద్య సేవలకు ముందడుగు

ఎస్.కోట ప్రాంతీయాసుపత్రిలో అందుబాటులోకి భవనాలు

న్యూస్‌టుడే, శృంగవరపుకోట

ఎస్.కోట పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువకానున్నాయి. ప్రాంతీయాసుపత్రికి నాబార్డు నిధులు రూ.12.60 కోట్లతో చేపట్టిన కొత్త భవనాల నిర్మాణం దాదాపు పూర్తి కావడంతో రోగులకు అదనపు సౌకర్యాలు కలగనున్నాయి. ఇన్నాళ్లూ భవనాలు చాలక పలు యూనిట్లు మంజూరైనా ఏర్పాటు కాలేదు. ఓపీ చూసేందుకూ వీల్లేక ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు సేవలు అందిస్తున్నారు. పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు నేలపైనే కూర్చోవాల్సిన పరిస్థితి. భవనాలు ఈ నెలలో ప్రారంభమైతే.. సమస్యలు తొలగడంతో పాటు కొత్తగా రక్తనిధి కేంద్రం, డయాలసిస్ సదుపాయం, ఆడియాలజీ, ఎక్స్‌రే విభాగం అందుబాటులోకి రానున్నాయని ఆసుపత్రివర్గాలు చెబుతున్నాయి.

తుది మెరుగులు దిద్దుకుంటున్న ఆసుపత్రి భవనం

ఆడియాలజీ గది మంజూరు

ఆసుపత్రికి ఆడియాలజీ గది మంజూరైంది. వినికిడి సంబంధిత రోగులు పరీక్షలు చేయించుకోవడానికి, సదరం ధ్రువపత్రాల జారీకి ఆడియాలజీ గది ఎంతో అవసరం. రూ.6.42 లక్షలతో ఈ గది నిర్మించారు.

రక్తనిధి కేంద్రం ఏర్పాటు

ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు 17 రకాల పరికరాల కోసం రూ.18.53 లక్షలు కేటాయించారు.

రోజుకు 15 మందికి డయాలసిస్

ఆసుపత్రికి డయాలసిస్ కేంద్రం మంజూరైంది. పీఎం నేషనల్ డయాలసిస్ కార్యక్రమంలో భాగంగా మంజూరైన ఈ కేంద్రం ద్వారా రోజుకు మూడు సెషన్ల ద్వారా 15 మందికి రక్తశుద్ధి సదుపాయం కలుగుతుంది. ఇందుకోసం రూ.75 లక్షల విలువైన రక్త శుద్ధి యంత్రాలు, పరికరాలు సమకూర్చుతున్నారు. ప్రస్తుతం కిడ్నీ వ్యాధి బాధితులు డయాలసిస్ కోసం వ్యయప్రయాసలకు ఓర్చి విజయనగరం లేదా విశాఖ వెళ్తున్నారు.

ఎక్స్‌రే యూనిట్, ఫ్రీజర్ ఏర్పాటు

ఆసుపత్రికి 300ఎంఏ ఎక్స్‌రే యూనిట్ మంజూరైనా స్థలం లేక ఏర్పాటు చేయలేదు. 100ఎంఏ ఎక్స్‌రే యూనిట్‌తో లాంబాస్ పెయిన్(నడుం నొప్పి) వంటివి తీయడానికి వీలు పడడం లేదు.

ఈ నెలలోనే అందుబాటులోకి..

ప్రాంతీయ ఆసుపత్రి భవనాల నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. ఈ నెలలో అందుబాటులోకి తీసుకొచ్చి, సేవలు అందిస్తాం.

– ఎన్.భారతి, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారిగా మురళి

విజయనగరం విద్యా విభాగం : జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారిగా మురళి సోమవారం నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కేఆర్‌సీసీ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డీఆర్వో బాధ్యతలు కూడా అదనంగా చేపట్టనున్నారు.

రైతేరాజు 6లో

MANAGEMENT SEATS AVAILABLE
LLB 3years | BA . LLB 5years | LLM 2 years
D.Pharma B.Pharma M.Pharma
Cont : 7382478328, 9491606933

POLYCAB LT/HT Power & Control Cables
Stockist:

SPARK ENTERPRISES
DABAGARDENS, VISAKHAPATNAM.
CELL: 9963223454, 9849022345
e-mail: spa_ark2004@yahoo.com

నాన్నను నేనున్నానుగా కన్నా..

ఈ చిత్రంలో కనిపిస్తున్నది సంతకవిటి మండలం ఎస్.రంగరాయపురం గ్రామానికి గుంప లక్ష్మం. తన 15 ఏళ్ల దివ్యాంగ కుమారుడు షణ్ముఖరావు ఆధార్ ఇన్‌యాక్టివ్‌లోకి వెళ్లిపోయింది. సోమవారం పింఛన్లు పంపిణీ చేసిన అధికారులు ఆధార్ కార్డు నవీకరించుకోవాలని సూచించారు. గ్రామానికి రెండు కి.మీల దూరంలోని గుళ్లసీతారాంపురం సచివాలయానికి వెళ్లగా.. పరికరాలు పనిచేయడం లేదని సిబ్బంది చెప్పారు. పింఛను ఆగిపోతుందేమోననే భయంతో కుమారుడిని భుజాలపై మోసుకుంటూ.. గ్రామం నుంచి 3 కి.మీ దూరం నడిచి, అక్కడి నుంచి 5 కి.మీలు ఆటోలో ప్రయాణించి సంతకవిటి మీసేవా కేంద్రానికి తీసుకెళ్లి పని పూర్తిచేయించారు. లక్ష్మం ఏడాది కిందటే గుండె శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో కుమారుడ్ని భుజాలపై మోసుకుంటూ వెళ్లారు. గుళ్లసీతారాంపురం సచివాలయంలో సేవలు నిలిచిపోయాయనే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పరికరాలు పనిచేస్తే తప్ప అందే పరిస్థితి లేదని ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, సంతకవిటి

ఆపత్కాలంలో ఆపన్న హస్తం

ముఖ్యమంత్రి సహాయనిధి

న్యూస్‌టుడే – రాజాం

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలను ఆపత్కాలంలో ఆదుకుంటోంది. ప్రమాదాలు, అనారోగ్య సమస్యల బారినపడి ఆసుపత్రి పాలై దిక్కుతోచని స్థితిలో ఉంటే చేయూతనిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో వేల మంది పేదలు, మధ్యతరగతి ప్రజలు లబ్ధిపొందారు. ఒక్క రాజాం నియోజకవర్గంలోనే 149 మందికి రూ.1.60 కోట్లు సమకూరాయి. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే ధ్రువపత్రాలు కీలకం. వీటన్నింటిని సమీకరించి, దరఖాస్తు చేసుకుంటే సులువుగా సీఎం సహాయనిధి లబ్ధి పొందొచ్చు.

ఇవీ అవసరమైన పత్రాలు

★ తేదీ, స్టాంపుతో సహా ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు ధ్రువీకరణ ★ ఆదాయ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ★ రోగ నిర్ధారణ రిపోర్టులు, ఎక్స్‌రే, స్కాన్ వంటివి ★ వైద్యుడి సంతకం, స్టాంపుతో డిశ్ఛార్జి వివరాలు ★ బ్యాంకు ఖాతా నకలు

వీరు అర్హులు..

ఎన్టీఆర్ వైద్య సేవా పథకాన్ని వినియోగించుకోకుండా ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. ఆసుపత్రిలో చేరి సొంతంగా నగదు వెచ్చించిన వారిని పరిగణనలోకి తీసుకుంటారు. ఎమ్మెల్యేల కార్యాలయాలతో పాటు వార్డు, గ్రామ సచివాలయాల్లోనూ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. ఏ ఆసుపత్రిలో చికిత్స పొందారు.. మందులకు ఎంత ఖర్చుచేశారు.. చరవాణి సంఖ్య నమోదు చేయాలి. ఎమ్మెల్యేల సిఫారుసుతో వీలైనంత వేగంగా లబ్ధి చేతికి అందుతుంది.

విమానాశ్రయంలో త్వరితగతిన

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన రహదారులు, కాలువలు, విద్యుత్తు తదితర మౌలిక వసతులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులకు సోమవారం సూచించారు. నీటిని అందించేందుకు రూ.20 కోట్లతో చేపట్టిన పనులు, రూ.85 లక్షలతో ఏర్పాటు చేయనున్న విద్యుత్తు లైన్ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షంనీరు మళ్లించేందుకు నాలుగు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయాల్సిన కాలువలకు నీటి పారుదల అధికారులు అంచనాలు రూపొందించాలన్నారు. జేసీ సేధు మాధవన్, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీ, ఆర్డీవో కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆటలో పోలీస్ పవర్

రెండు స్వర్ణాలు సాధించిన త్రినాథరావును అభినందిస్తున్న ఎస్పీ

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: పవర్‌లిఫ్టింగ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నవంబరు 30న విశాఖలో నిర్వహించిన పోటీల్లో రెండు విభాగాల్లో విజయనగరం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న ఆల్తి త్రినాథరావు రెండు బంగారు పతకాలు సాధించినట్లు జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం తన కార్యాలయంలో ఏఎస్సైని అభినందించారు. గతంలోనూ విశాఖ, కేరళలో జరిగిన పోటీల్లో త్రినాథరావు ఆరు స్వర్ణాలు సాధించారని, ఈ నెల 29 నుంచి జనవరి రెండో తేదీ వరకు నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో సీఐ ఆర్‌వీఆర్‌కే.చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

WANTED

Required Experienced Marketing Executives for Marketing Pesticides, Micro Nutrients and Bio Stimulants to work for Sovereign Agro Insecticides, having 48 year's experience in Manufacturing and Marketing Agri Inputs.

Candidates with at least 10 years' experience in the same area can apply through WhatsApp for these following Districts.

ELURU, VIZIANAGARAM, VISAKHAPATNAM, SRIKAKULAM, NELLORE, PRAKASAM, BAPATLA, CHITTOR AND KADAPA Districts.

SOVEREIGN AGRO INSECTICIDES
6/13, Brodipet, GUNTUR. Mobile: 86397 49674

కార్పొరేట్‌కు భూములు దోచిపెట్టే కుట్ర

పీజీఆర్ఎస్‌లో కొవ్వాడ అగ్రహారం రైతుల ఆవేదన

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే

గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గ రైతులకు చెందిన 48 ఎకరాల భూమిని వారికి తెలియకుండా రెవెన్యూ రికార్డుల్ని సృష్టించి, కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు కుట్ర జరుగుతోందని, న్యాయం చేయాలని పూసపాటిరేగ మండలం కొవ్వాడ అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్లు 254, 255, 256లలో భూమిని 1965లో లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేయగా.. నేటి వరకు తమ సాగుబడిలోనే ఉందన్నారు. స్థిరాస్తి వ్యాపారి, ఓ ప్రజాప్రతినిధి.. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై 15 ఎకరాల్లో సంబంధం లేని వ్యక్తుల పేర్లను రికార్డుల్లో నమోదు చేశారని, విచారణ చేపట్టాలని కోరారు.

మా స్థలం ఇప్పించండి..

చనిపోయిన నా భర్త సంజీవికి వారసత్వంగా వచ్చిన భూమిలో వాటాను ఇప్పించాలని రామభద్రపురం మండలం నేరెళ్లవలసకు చెందిన బోయిన పైడమ్మ అధికారులను వేడుకున్నారు. గ్రామంలో సర్వే నంబరు 132-3లో భర్తకు 2.48 ఎకరాల భూమి ఉందన్నారు. ఆయన చనిపోయిన తర్వాత కన్నవారి ఊరైన ఖరాసవలసకు కుటుంబంతో వెళ్లి కూలి పనిచేసుకుని బతుకుతున్నామన్నారు. అధికారులు సర్వే చేసి భూమి అప్పగించాలని ఆమె కోరారు.

కలెక్టరేట్‌లో కొవ్వాడ అగ్రహారం గ్రామ రైతులు

1బీ లేక.. పథకం అందక..

సాగులో ఉన్న తమ భూములకు 1బీ ఇవ్వాలని రేగిడి మండలం సంకిలి గ్రామానికి చెందిన రైతులు అధికారులను కోరారు. 35 ఏళ్ల కిందట కొండ పోరంబోకు భూముల్లో 68 కుటుంబాలకు డి.పట్టాలిచ్చారని తెలిపారు. సాగు చేసుకుంటున్నా తమకు 1బీ లేకపోవడంతో అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందలేదని రైతులు పేర్కొన్నారు.

201 అర్జీలు అందజేత

కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు మొత్తం వివిధ సమస్యలపై 201 అర్జీలు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 73 వినతులు అందాయి. కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్, ప్రత్యేక ఉప కలెక్టర్లు మురళీ, డి.వెంకటేశ్వరరావు, రాజేశ్వరి, ప్రమీలాగాంధీ, బి.శాంతి, కళావతి వినతులు స్వీకరించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

9000866020, 8008597609

(c) eenadu

ఎంఎస్ఎంఈ పార్కు పనులకు గ్రహణం

పార్కుకు కేటాయించిన భూములు

న్యూస్‌టుడే- బొబ్బిలి, రామభద్రపురం

రామభద్రపురం మండలం కొట్టక్కి సమీపంలో కాకర్లవలస- కారేడువలస మధ్య ఎంఎస్ఎంఈ పార్కు పనులకు గ్రహణం వీడడంలేదు. ఇక్కడ ఏపీఐఐసీకి 187 ఎకరాల స్థలం ఉంది. దీంట్లో 87 ఎకరాల్లో పార్కు ఏర్పాటుకు ఈ ఏడాది మే 10న మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బేబీనాయన భూమి పూజ చేశారు. రూ.7 కోట్లతో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ భూములపై వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. కొంత మంది రైతులు తమకు ఈ భూముల్లో పట్టాలు ఇచ్చారని అభ్యంతరం తెలుపుతున్నారు. ఆరు నెలలు గడిచినా ఒక్క అడుగూ ముందుకెళ్లలేదు.

కొలిక్కిరాని చర్చలు

అధికారులు ఆందోళనకారుల మధ్య ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో చర్చలు జరిగాయి. కాకర్లవలస- కారేడువలసకు చెందిన 20 మంది రైతులకు 2017లో అటవీశాఖ పోడు పట్టాలు ఇచ్చినట్లు చూపుతున్నారు. ఏపీఐఐసీ కూడా పార్కు కోసం ఆయా భూములను కొనుగోలు చేసినట్లు దస్త్రాల్లో ఉంది. రైతుల పట్టాలు ఒక చోట ఉన్నాయని, కానీ ఏపీఐఐసీ భూముల్లో సాగుచేశారని అధికారులు నిర్ధారించారు. పట్టాల్లోని భూమిని చదునుచేసి రైతులకు ఇస్తామని భరోసా ఇచ్చారు. అయినప్పటికీ గిరిజనులు వినిపించుకోలేదు. దీంతో వివాదం తేలలేదు. అధికారులు కొనుగోలు చేసిన నాటి నుంచి భూములకు సరైన రక్షణ చర్యలు చేపట్టలేదు. కంచె ఏర్పాటు చేసి బోర్డులు ఏర్పాటు చేస్తే ఈ సమస్య వచ్చేది కాదు. ఇప్పుడు పార్కు పనులు ప్రారంభమయ్యాక అసలు సమస్య మొదలైంది.

మాట్లాడుతున్నాం..

ఏపీఐఐసీ భూముల్లోనే పార్కు నిర్మాణం జరుగుతోంది. గిరిజనులకు ఇచ్చిన పట్టాలకు సంబంధించిన భూములను అప్పగిస్తామని చెప్పాం. అప్పటికీ వినకపోతే కేసులు పెడతాం. సంబంధిత లబ్ధిదారులకు న్యాయం చేస్తాం. ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రభుత్వ పరంగా చేపట్టే పనులు అడ్డుకోవడం చట్టరీత్యా నేరం. - **రఫీ జాన్ ఆజా, తహసీల్దారు, రామభద్రపురం**

ఎయిడ్స్‌పై అప్రమత్తం అవసరం

ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు తెలియజేయాలన్నారు. వ్యాధిగ్రస్థుల పట్ల వివక్ష చూపొద్దని, వారు కూడా సమాజంలో భాగమేనన్నారు. ఆర్టీసీ సముదాయం నుంచి ఐఎంఏ భవనం వరకు సాగిన ఈ ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారిణి కె.రాణి, సెట్విజ్ సీఈవో వి.విశ్వేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం హెచ్ఐవీ బాధితులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన ఐటీసీ సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

మ్యుటేషన్ దరఖాస్తులపై విచారణకు ఆదేశం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: తిరస్కరణకు గురైన మ్యుటేషన్ దరఖాస్తులపై విచారణ చేపట్టాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆర్డీవోలకు ఆదేశించారు. ఎక్కువగా ఫిర్యాదులొస్తున్న వీటిపై మండల ప్రత్యేకాధికారులు శ్రద్ధ వహించాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ వినతులపై అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ అంశాలపై ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలు అవగాహన పెంచుకోవాలని, మ్యుటేషన్ల కోసం పత్రాలు అప్‌లోడ్ చేయడంలో డిజిటల్ సహాయకులకు వారంపాటు శిక్షణ ఇవ్వాలన్నారు.

బహిరంగ ప్రకటన

1. నా క్లయింట్ M/s. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, (భారత ప్రభుత్వ రంగ సంస్థ) వారికి జంషెడ్జీ టాటా రోడ్, ముంబై - 400020లో కార్పొరేట్ కార్యాలయం కలదు. వీరికి విశాఖపట్నం - 530016, అక్కయ్యపాలెం, బాలాజీ మెట్రో చాంబర్స్, ఫస్ట్ ఫ్లోర్, డోర్ నెం. 43-29-54/8లో కార్యాలయము కలదు. ఈ కార్యాలయమునకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నా క్లయింట్- హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారి సూచనల మేరకు నేను ఈ క్రింది పబ్లిక్ నోటీసును జారీచేయుచున్నాను.
2. M/s. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విజయనగరం జిల్లా, బొబ్బిలి మండలం, పిరిడి గ్రామమందు సెక్షనలైసింగ్ వాల్వ్ స్టేషన్ నిర్మించు నిమిత్తము, కొనుగోలుపై దిగువ తెలిపిన షెడ్యూలు భూమిని లేట్ శ్రీ తుట్ట రాములు భార్య శ్రీమతి తుట్ట వరలక్ష్మి నుండి కొనుగోలు చేసుకొనేదుంకు నిర్ణయించారు.
3. ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా, పైన పేర్కొన్న షెడ్యూల్ భూములపై ఏదైనా వ్యక్తి (వ్యక్తులకు) ఏదైనా ఆక్షేపణ, దావా లేదా హక్కు, టైటిల్, అమ్మకపు ఒప్పందాలు, స్వాధీనం లేదా ఆసక్తి మొదలైనవి కలిగి ఉంటే, అతని / ఆమె వ్రాతపూర్వక అభ్యంతరాలను ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 15 రోజులలోపు వారు తమ వాదనలు లేదా ఇతర కారణాలను పేర్కొంటూ ఈ క్రింది చిరునామాకు లిఖిత పూర్వకముగా తగు సాక్ష్యాధారాలతో తెలియపరచవలెను. లేని యెడల షెడ్యూలు భూములు నిర్వివాదపు ఆస్తిగా నా క్లయింట్ భావించి కొనుగోలు చేసుకొందురు. ఆ తరువాత వచ్చు అభ్యంతరములు, ఆక్షేపణలు నాక్లయింట్ హక్కులను ఏ విధముగానూ బంధిపజాలవు.

షెడ్యూలు భూమి వివరములు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విజయనగరం జిల్లా, బొబ్బిలి మండలం, పిరిడి గ్రామములో ఉన్న సర్వే నెం. 345/16, పరిధిలో ఉన్న ఎ.0-54 సెంట్లు విస్తరించి ఉన్న ఖాళీ భూమి.
సరిహద్దులు : తూర్పు: గోర్జ రామునాయుడు భూమి, దక్షిణం: కొల్లి గణపతి భూమి, పడమర: గుల్ల కృష్ణమూర్తి భూమి, ఉత్తరం: గోర్జా.

శ్రీమతి సుంకర (ఎం) పద్మజ, M.A, M.L, న్యాయవాది
43-5-43 / 4, జి.ఎఫ్ -1, సూర్య అపార్ట్‌మెంట్స్,
రైల్వే న్యూ కాలనీ, విశాఖపట్నం -530016.
Cell: 98496 62172. Email: spadmajalaw@gmail.com

తక్షణమే పరిశీలించి.. వారంలో పరిష్కరించండి

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, ఏడు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. మొత్తం 24 ఫిర్యాదులు రాగా భూ తగాదాలు 9, కుటుంబ కలహాలు 4, నగదు వ్యవహారాలు 2, ఇతర అంశాలకు సంబంధించినవి తొమ్మిది ఉన్నాయన్నారు. ఫిర్యాదుదారుని అంశాలను పరిశీలించి, విచారణతో వాస్తవాలను గుర్తించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. నివేదికను జిల్లా కార్యాలయానికి పంపాలని సూచించారు. ఏఎస్పీ పి.సౌమ్యలత, డీసీఆర్‌బీ సీఐ కె.కుమారస్వామి, ఎస్బీసీఐలు లీలారావు, అంబేడ్కర్, ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు చట్టాలపై అవగాహన అవసరం

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: దివ్యాంగుల చట్టం-2016, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నియమాలు-2023 తెలుగు, ఆంగ్ల పుస్తకాన్ని సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ విజువల్లీ చాలెంజ్డ్ ఉద్యోగుల సంఘం ప్రచురించిన ఈ పుస్తకం ద్వారా విభిన్న ప్రతిభావంతులకు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులశాఖ అధికారి ఎస్.ఈశ్వరరావు, వీసీహెచ్ఈ సంఘ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

రైతేరాజు

పంట నిల్వల్లో జాగ్రత్తలు తప్పనిసరి!

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పంట ఉత్పత్తులు నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల వేల టన్నుల్లో ఆహార ధాన్యాలు నష్టపోతున్నట్లు కురుపాం మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. దీని వల్ల రైతులు ఆదాయం కోల్పోతున్నారని వివరించారు. వరి, మొక్కజొన్న, జొన్న, కందులు, వేరుశనగ, మిర్చి, అపరాలు తదితర ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసి వినియోగించుకునే వరకు వివిధ స్థాయిల్లో క్రిమి, కీటకాల వల్ల నష్టంతో పాటు వృథాగా కోల్పోతున్నట్లు పేర్కొన్నారు. పండించిన ఆహార ధాన్యాల నిల్వలో సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు.

గృహాల్లో: పంట కోశాక ధాన్యాన్ని ఎండలో బాగా(వరిలో 11-14 శాతం, అపరాల్లో పది శాతం, నూనె గింజల్లో 7-8 శాతం తేమ ఉండేలా) ఆరబెట్టి నిల్వ ఉంచితే పురుగు పట్టకుండా ఆరు నుంచి పన్నెండు నెలల వరకు కాపాడవచ్చు. ధాన్యంలో వేపాకు, వేప గింజల పొడి, నూరిన వెల్లుల్లి, ఉసిరికాయ గింజలు, సీతాఫలం గింజలపొడి కలపడం ద్వారా ఆరు నుంచి ఎనిమిది నెలల వరకు పురుగు ద్వారా నష్టం జరగకుండా కాపాడవచ్చు. ఇవే కాకుండా కసవింద, ఉత్తరేణి, మిరప, నేల ఉమ్మెత్త, కీసర ఆకులు నాలుగు శాతం వాడితే ధాన్యాన్ని మూడు నెలలు పురుగు పట్టకుండా ఉంచవచ్చు.

గోదాముల్లో: నూర్పిడి చేసే యంత్రాలు ఉపయోగించే వాహనాలను వాడే ముందే శుభ్రపరచుకోవాలి. పాత గోనె సంచులు నిల్వ చేయటానికి ఉపయోగించే ముందు వాటికి చిరుగులు లేకుండా చేసి మలాథియాన్ 50 ఇ.సి. 2 మి.లీ/లీ. నీటికి కలిపిన ద్రావణంలో పది నిమిషాలు ముంచి ఆరబెట్టాలి. నిల్వ చేసే గోదాములను ముందుగా శుభ్రం చేసి పైకప్పు గోడలు, నేలలో పగుళ్లు, రంధ్రాలు లేకుండా సిమెంట్‌తో పూడ్చివేయాలి. నేలపై గోడలకు, పైకప్పు, గోనె సంచులపై మలాథియాన్ 50 ఇ.సి. పది మి.లీ. లేదా డైక్లోరోపాస్ 76 శాతం ఎస్.సి 7 మి.లీ. లేదా డెల్టామెత్రిన్ 2.5 డబ్ల్యూ.పి. 40 గ్రా./లీ. నీటికి కలిపి వంద చదరపు మీటర్ల ప్రాంతానికి మూడు లీటర్ల చొప్పున పిచికారీ చేసుకోవాలి. ధాన్యం బస్తాల్లో తేమ చేరకుండా ఉండటానికి చెక్క దిమ్మెలపై వాటిని అమర్చాలి. గోదాముల్లో పక్క గోడలు, పైకప్పునకు తగలకుండా బస్తాలు ఉంచాలి. ధాన్యంలో పురుగు ఆశిస్తే గాదెల్లో, పాత్రల్లో, గోదాముల్లో 50 శాతం అల్యూమినియం ఫాస్పైడ్ బిళ్లల ద్వారా ఊదర బెట్టి పురుగులు నివారించాలి. గోదాములు ఊదరబెట్టటానికి 28 ఘనపు మీటర్లకు 3 గ్రాముల బిళ్లలు 21 అవసరమవుతాయి.

ఇలా చేస్తే మిరపలో లాభాలే..!

సకాలంలో తెగుళ్లను గుర్తించి.. నివారిస్తే మిరపలో లాభాలు పొందొచ్చని **ఉద్యాన అధికారిణి సీహెచ్ గిరిజ** సూచించారు. మిరపలో ఎండు తెగులు గుర్తించిన వెంటనే లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు కలిపిన ద్రావణాన్ని మొక్క మొదళ్లలో పిచికారీ చేయాలి. మూడు, నాలుగు రోజుల తర్వాత 5 గ్రాములు కార్బండిజమ్+మాంకోజెబ్ కలిపిన పొడి మందు మొదళ్లలో వేయాలి. నల్ల తామర పురుగులు ఉంటే ఆకర్షించడానికి పసుపు, నీలం జిగురు అట్టలను ఎకరాకు 25-35 ఏర్పాటు చేసుకోవాలి. జీవ శిలీంద్రాలైన వర్టిసీలియా లకానీ 5 మి.లీ+ వేపనూనె 3 మి.లీ. కలిపి ఒకటి లేదా రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.
– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

మీరూ పుట్టగొడుగు పెంచొచ్చు..

న్యూస్‌టుడే, రేగిడి

యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పుట్టగొడుగుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంటు ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) ద్వారా యూనిట్లకు రాయితీ ఇస్తున్నాయి.

● యువత లేదా రైతులు 200 స్కేర్ మీటర్ల స్థలం కలిగి ఉండాలి. పెంపకానికి అనువుగా షెడ్డు వేసుకోవాలి. యూనిట్ ఖరీదు రూ.2 లక్షలు. 50 శాతం రాయితీ ప్రభుత్వం కల్పిస్తుంది. ఒక వ్యక్తి అయిదు యూనిట్ల వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. ● పెద్ద యూనిట్ల ఏర్పాటుకూ అవకాశం ఉంది. ఇందులో పుట్టగొడుగుల విత్తనం తయారీ యూనిట్ కూడా పెట్టుకోవచ్చు. ప్రైవేటు వ్యక్తులైతే 40 శాతం, కేవీకే.. ఇతర ప్రభుత్వ సంస్థలకైతే 100 శాతం రాయితీ కల్పిస్తారు. కంపోస్టు యూనిట్ ఏర్పాటుకు యూనిట్ విలువ రూ.30 లక్షలు. దీనికి 40 శాతం రాయితీ ఉంటుంది. ● రూ.2 లక్షల యూనిట్‌కు బ్యాంకు రుణం అవసరం లేదు. ఉద్యాన వన శాఖ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఔత్సాహికులకు సలహాలు, సూచనలు అందజేస్తామని ఉద్యానశాఖ అధికారిణి ఉమామహేశ్వరి చెప్పారు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

వరి కోతలు అనంతరం ఎలాంటి పంటలు వేయొచ్చు. రబీలో అపరాలు, వరి సాగులో సస్యరక్షణ చర్యలపై సలహాల కోసం 63034 02627 నంబరును సంప్రదించాలని రస్తాకుంటుబాయి కేవీకే సస్యపోషణ విభాగం శాస్త్రవేత్త డా.ఎస్.స్రవంతి తెలిపారు.

ముందస్తు చర్యలతో అధిక దిగుబడులు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: జీడి, మామిడి తోటల్లో ఎండుకొమ్మలు తొలగించి ముందస్తుగా సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడల నుంచి రక్షణ పొంది అధిక దిగుబడులు వస్తాయని రస్తాకుంటుబాయి **కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు** తెలిపారు. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

? : మామిడిలో ప్రస్తుతం ఎలాంటి చర్యలు చేపట్టాలి? - **శ్రీనివాసరావు, బొండపల్లి**

☛: ప్రస్తుతం మామిడిలో ఎండుకొమ్మలను తొలగించి తోటను శుభ్రం చేయాలి. పలుచగా దుక్కి వేసుకుని, లీటరు నీటికి బ్లైటాక్ 3 గ్రాముల సల్ఫర్ వెడబుల్ 2 గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. లీటరు నీటికి మల్టీకే (పొటాషియం నైట్రేట్) 10 గ్రా. ఫార్ములా-7నే సూక్ష్మపోషకాలు ఉండే పొడి 5 గ్రా. వేస్తే పూత నిలుస్తుంది.

? : మొక్కజొన్నలో పాముపొడ తెగులు నివారణ ఎలా? - **ఆదినారాయణ, నెల్లిమర్ల**

☛: ఈ తెగులు రైజోక్టోనియా సొలాని అనే శిలీంద్రం ద్వారా వస్తుంది. దీని నివారణకు నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన ఆకులను తీసివేయాలి. 200 లీటర్ల నీటిలో 200 గ్రా. కార్బెండజమ్ లేదా 200 మి.లీ. ప్రొపికొనజోల్ మందును కలిపి పిచికారీ చేయాలి.

? :జీడిమామిడి తోటల్లో కొన్ని చెట్ల ఆకులు పండుబారి రాలుతున్నాయి. కొమ్మలు ఎండి చనిపోతున్నాయి. నివారణ ఎలా? - **పి.పత్తి, దురిబిలి**

☛: ఇది కాండం వేరు పురుగు ఆశించడం వల్ల జరుగుతోంది. ప్రారంభ దశలోనే ఈ పురుగు లక్షణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. ఏడేళ్లు, ఆపై వయసు గల చెట్లు కాండం మొదలు అనగా 3 అడుగుల ఎత్తు వరకు భూమిపై కనబడే వేర్లను సన్నని ఇనుప వైరుతో చేసిన బ్రష్‌తో బాగా రుద్దాలి. ఆ తరువాత లీటరు నీటికి 50 మి.లీ. వేపనూనె, 0.5 గ్రా. సర్ఫ్ లేదా సబ్బు పొడి కలిపి ఏడాదికి 3 సార్లు పిచికారీ చేయాలి. ఈ పురుగు ఆశించిన చెట్ల నుంచి బంక కారుతుంది. గమనించిన వెంటనే బెరడు చెక్కి కింద దాగి ఉన్న లద్దె పురుగులను తొలగించాలి. అక్కడ లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 10 మి.లీ. కలిపి వేయాలి.

EENADU Classifieds

HEALTH & CARE

NEURO

నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్
మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు
Dr.Nirmala Vangapandu
M.D.(Gen.Med) DM (Neuro) JIPMER
Specialist in Brain & Nerve Problems & General Physician
R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టీప్లెక్స్ వెనక వైపు,VZM
FOR APPOINTMENT : 63054 71147

REAL ESTATE

FLAT FOR SALE

2BHK Flats (1300sft) for sale at 100ft ring road, Surya Nagar, beside Bashyam school, VZM. Con: 9849516146, 9908835262.

విజయనగరం సూర్య హాస్పిటల్ సింహాద్రినగర్ దగ్గర MNR రెసిడెన్సీలో కార్‌పార్కింగ్‌తో 1000 Sft, 2BHK ఫ్లాట్ అమ్మకం. ✆ 8248738470.

PREMIUM FLATS FOR SALE
satya
WWW.SATYABUILDERS.COM
Site Address: CTO OFFICE LANE, NEAR RTC COMPLEX, VIZIANAGARAM
9346445777
9959812354

PLOT FOR SALE

CMR Layout 267 Sq. yards for sale. South facing near to Vizag Road, VZM. C: 8497961518, 8639817088.

200 చ॥గ॥ S/F "శ్రీకృష్ణ నగర్ లే-అవుట్" JNTU జంక్షన్, VZM. 267 చ.గ. N/F "భాస్కర్ నగర్" తాటిగూడ గ్రామం, గరివిడి అమ్మబడును. ✆ 8802889988, 9542031332.

విజయనగరం ప్రజయ్ విహార్, వి.టి.నగర్ R&B జంక్షన్ వద్ద అన్ని ఫేస్‌లలో ఉన్న స్థలములు అమ్మబడును. బ్యాంక్ లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 9618119380.

శ్రీ శ్రీనివాస రిసార్ట్స్ మరుపల్లి, గజపతినగరంలో 1000 గ॥, 500 గ॥, 200 గ॥ అమ్మకమునకు కలవు. గజం 4000/- ✆ 8179213275.

TO LET

To-let 3BHK Indp. House G/F, Carparking, Hajiali Nagar, Nr. Venkateswara Kalyana Mandapam, Phoolbagh Jn., VZM. ✆ 9849559024.

JOBS

Walk-In-Interview Employment for Retired Employees. In view of New Year 2026 and Pongal we invite Retired Employees to our Branches Vizag. Both Govt/ Private and Eligible for Salary + Perks from Rs. 1,50,000 to 2,00,000 P.M. T&C Apply. Interviews: 2nd Dec- 2025. Chandra Sekhar. ✆ 8142580999.

Wanted PROs & Telecallers (Reputed College, Vizag) PROs Required: Vijayanagaram (Local/ Non-Local) All Areas & Gajuwaka (Vizag) Telecallers Required: Visakhapatnam- Local. Work Location: NAD, Gajuwaka Salary: Negotiable. Contact: 9640205759, 8328684222 For Telecallers: 8886465396/ 7702222927.

Wanted Sr. Marketing Team Leader/ Manager for a reputed Wholesale Furniture Factory in Vizag. 2 Wheeler Mandatory. Marketing Experience must. Salary 20,000/- to 25,000/- +TA +Incentives. Contact: ✆ 8096806969.

విజయనగరం సమీపంలో గల ఆటోమొబైల్ అనుబంధ సంస్థలో పనిచేయుటకు విజయనగరం టౌన్ పరిసర ప్రాంతాలవారు సంప్ర : 9502266999.

విజయనగరంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా 3 వెంచర్లు మార్కెటింగ్ చేయుటకు ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు అనుభవం ఉన్న మార్కెటింగ్ లీడర్లు, యువతీ యువకులు, టెలికాలర్లు, కార్ డ్రైవర్, అకౌంటెంట్ కావలెను. ✆ 8688796746.

హైదరాబాద్ / గుంటూరులోని CCTV కంపెనీకి ఫ్రెషర్స్ కావలెను, శాలరీ: 14000/-. ✆ 9731567105, 9731722666.

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్, All (డిగ్రీ, B.Tech, Dip. & ITI) కావలెను. Sal: 18-25K Age: 35లోపు, స్పాట్ జాయిన్. ✆ 7995439539.

టోల్‌గేట్ వద్ద పనిచేయుటకు సూపర్‌వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, హెల్పర్స్, సెక్యూరిటీ, ఫైర్ & సేఫ్టీ కావలెను. Qlf: 10th- డిగ్రీ, ITI, Dip, B.Tech. జీతం: 18K-28K. ✆ 9121044796, 9573635594

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిం దిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

రోడ్డుపై మడుగు.. వేసేదెలా అడుగు

రాజాం పట్టణంలోని పాతబస్టాండ్‌లోని రోడ్డు దుస్థితి ఇది. కాలువల వ్యవస్థ లేకపోవడం, రహదారి లోతట్టుగా ఉండడంతో చిన్న వర్షం పడినా నీరు నిలిచి మడుగును తలపిస్తోంది. సకాలంలో తొలగించక రోజుల తరబడి అపరిశుభ్రత నెలకొంటోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే చిరు వ్యాపారులు కూరగాయలు విక్రయిస్తుండడంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. సమస్యను పురపాలిక కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం

నైతిక విలువలతో వ్యక్తిత్వ వికాసం

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

గీతాజయంతి సందర్భంగా సోమవారం నగరంలోని కోట సమీపంలో మూడుకోవెళ్ల ఆవరణలో సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. వాగ్దేవి సమారాధనం అధ్యక్షులు డాక్టర్ స్వప్న హైందవి, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 200 మంది పాల్గొని పారాయణం చేశారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా స్వప్న హైందవి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచడానికి, వ్యక్తిత్వ వికాసానికి ఇది దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎరుకునాయుడు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

బస్టాండు.. సమస్యలు మెండు

పెరిగిన రద్దీ.. కానరాని సౌకర్యాలు

అపరిశుభ్రంగా మారిన పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు

పాలకొండ, గ్రామీణం, సాలూరు, కొమరాడ, న్యూస్‌టుడే: నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఆర్టీసీ కాంప్లెక్సుల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయడంతో రద్దీ మరింత పెరిగింది. కానీ ఆ స్థాయిలో సౌకర్యాలు కల్పించక ప్రయాణికులు ఆపసోపాలు పడుతున్నారు.

పాలకొండలో పాట్లే..

పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్సు ఖాళీ కొబ్బరిబొండాలు, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. విశాల ప్రాంగణం ఉండడంతో సమీపంలోని దుకాణదారులు, కాలనీవాసులు చెత్తను వేస్తున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. సరిపడా మరుగుదొడ్లు కూడా లేవు. ప్రస్తుతం స్త్రీ, పురుషులకు ఒక్కొక్కటి చొప్పున రెండే ఉన్నాయి. పదేళ్ల కిందట స్వచ్ఛ భారత్‌లో భాగంగా నిర్మించిన మరో రెండు నిరుపయోగంగా మారాయి. తాగునీరు అందుబాటులో లేదు. నిత్యం ఇక్కడి నుంచి 20 వేల మందికి పైగా రాకపోకలు చేస్తుంటారు. శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నంతో పాటు విజయవాడ, హైదరాబాద్‌కు పెద్ద సంఖ్యలో ఈ డిపో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

వినియోగంలో లేని మరుగుదొడ్లు

శుద్ధజలం కరవు..

అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అవసరం మేర మరుగుదొడ్లు లేవు. శుద్ధజలం అందుబాటులో లేదు. పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. నిత్యం 25 వేల మందికిపైగా రాకపోకలు చేస్తుంటారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. అధికారులు సౌకర్యాలపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

వర్షం వస్తే అవస్థలే..

పార్వతీపురం కాంప్లెక్స్‌లో వర్షమొస్తే నీరు నిలిచిపోతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం కావడంతో నిత్యం రద్దీగా ఉంటున్నా ఆ స్థాయిలో చర్యల్లేవు. మరుగుదొడ్లు చాలడం లేదు. నిత్యం 20 వేలకు పైగానే రాకపోకలు సాగిస్తున్నారు.

దృష్టిసారిస్తాం

ఇప్పటికే పార్వతీపురం కాంప్లెక్సులో పంకాలు, బెంచీలు ఏర్పాటు చేశాం. జిల్లాలోని మూడు కాంప్లెక్సుల్లో మరుగుదొడ్ల నిర్వహణ పెంచాం. అదనపు సిబ్బంది పని చేసేలా గుత్తేదారుకు ఆదేశించాం. సౌకర్యాల మెరుగుకు చర్యలు తీసుకుంటాం. – పి.వెంకటేశ్వరరావు, ప్రజా రవాణాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

జిల్లాలో మొత్తం బస్సులు: **262** ప్రయాణించే దూరం: **92 వేల కి.మీ.** రోజు ఆదాయం: **రూ.45 లక్షలు** ప్రయాణించేవారి సంఖ్య: **75 వేలు**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

జూదరుల అరెస్టు

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస పోలీసుస్టేషన్ పరిధిలోని కుమ్మరబంజరు ప్రాంతంలో జూదమాడుతున్న ముగ్గురి వద్ద నుంచి రూ.24,400 , రెండు ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు సీఐ సీహెచ్.షణ్ముఖరావు సోమవారం తెలిపారు.

కరాటేలో సత్తా.. కొత్తవలస: గాజువాకలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ 2.0లో 50 కిలోల విభాగంలో వియ్యంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.మోహన్ ప్రకాష్ మొదటి స్థానం సాధించినట్లు హెచ్ఎం గోవిందరాజు సోమవారం తెలిపారు. శిక్షకుడు రాజాబాబు అభినందించారు.

ఖోఖో పోటీలకు ఎంపిక.. విశాఖపట్నం: జిల్లాకు చెందిన కె.పావని జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన జట్టులో స్థానం దక్కించుకుంది. పరవాడ మండలం లంకెలపాలెంలో జరిగిన ఎస్జీఎఫ్ పోటీల్లో ప్రతిభ చూపినవారిని జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ పరిశీలకులు వెల్లడించారు.

క్లస్టర్ అభివృద్ధిలో రైతుకు చేయూత

డెంకాడ, న్యూస్‌టుడే: మామిడి సాగులో శాస్త్రీయ పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి కె.చిట్టిబాబు అన్నారు. మండలంలోని అమకాంలో సోమవారం మామిడి తోటల యాజమాన్యంలో పోషకాల ప్రణాళిక, నీటి నిర్వహణ, పుష్పదశ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఈ విధానంతో పంట దిగుబడి, నాణ్యత పెరుగుతుందన్నారు. ప్రభుత్వం క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ద్వారా మామిడి రైతులకు చేయూతనిచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. శాస్త్రవేత్త శ్రీనివాసరాజు మాట్లాడుతూ మామిడి తోటల్లో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భోగాపురం ఉద్యానాధికారిణి ఉమ భరణి, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	132	234	244

'ఏమ్మా.. పింఛను అందుతోందా..'

వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

విజయనగరం గ్రామీణం, మయూరి కూడలి, న్యూస్‌టుడే: 'ఏమ్మా.. పింఛను సొమ్ము సకాలంలో అందుతోందా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా..?' అంటూ కలెక్టర్ ఎస్.రాంసుందరరెడ్డి వృద్ధులను ఆప్యాయంగా పలకరించి నగదు అందజేశారు. సోమవారం ఆయన మండలంలోని ద్వారపూడి గ్రామంలో పర్యటించి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నగరపాలకసంస్థ, పురపాలక సంఘాలు, పంచాయతీల్లో ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వృద్ధులు, దివ్యాంగులు, పింఛను అందుకుంటున్న వారిని గౌరవించాలన్నారు. ఆయన వెంట డీపీవో మల్లికార్జునరావు, సర్పంచి ఆదిలక్ష్మి, ఉపసర్పంచి శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

● విజయనగరం జిల్లాలో 2,72,499 మంది లబ్ధిదారులకు గానూ 2,56,771 మందికి (94.23 శాతం) పింఛన్లు పంపిణీ చేశారు. ఇందుకు రూ.115.66 కోట్లు విడుదల కాగా, రూ.108.67 కోట్లు ఇచ్చారు. రాష్ట్రంలో జిల్లా అయిదో స్థానంలో ఉంది.

● పార్వతీపురం మన్యం జిల్లాలో 1,39,593 లబ్ధిదారులకు గానూ 1,28,847 మందికి (92.03 శాతం) అందజేశారు. ఇందుకు రూ.59.49 కోట్లు విడుదల కాగా, రూ.54.66 కోట్లు పంపిణీ చేసినట్లు రెండు జిల్లాల డీఆర్డీఏ పీడీలు శ్రీనివాస్ పాణి, సుధారాణి తెలిపారు.

బొబ్బిలి
●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

చరిత్ర ఘనం.. వసతులు కనం

గుర్ల మండలం దేవునికణపాక ప్రాథమికోన్నత పాఠశాలకు వందేళ్ల చరిత్ర ఉంది. కానీ నేటికీ వసతులు సక్రమంగా లేవు. పెంకుల భవనం కూలిపోవడంతో ప్రభుత్వం పక్కా భవనం మంజూరు చేసింది. పునాదుల వరకే స్థలం తనదని ఓ వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ప్రహరీ కోసం మంజూరైన రూ.14 లక్షలు వెనక్కి మళ్లాయి. ప్రస్తుతం రెండు గదుల్లో తరగతుల విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. స్థల సమస్య పరిష్కారమయ్యాక పనులు చేపడతామని ఎంఈవో భానుప్రకాష్ తెలిపారు. –న్యూస్‌టుడే, గుర్ల

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో సోమవారం కూరగాయల ధరలు (కిలో రూ.ల్లో).. ●టమాటా: 52 ●వంకాయలు: 42 ●దొండ: 32 ●బీర: 48 ●బెండ: 52 ●కాకర: 58 ●చిక్కుడు: 42 ●ఆనపకాయ (ఒకటి): 25 ●అరటి (జత): 20 ●మునగ: 70 ●ఉల్లి: 30 ●బంగాళదుంపలు: 30 ●అల్లం: 75 ●వెల్లుల్లి: 82 ●పచ్చిమిర్చి: 52 ●క్యాబేజీ: 28 – న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

★ ఎస్వీసీ సీతారామా: ఆంధ్రాకింగ్ తాలూకా ★ ఎస్వీసీ సీతారామా మినీ: రాజు వెడ్స్ రాంబాయి ★ ఎస్వీసీ అప్సర: రివాల్వర్ రీటా. – న్యూస్‌టుడే, రాజాం.

బొబ్బిలిలో.. ★ లక్ష్మి: ఆంధ్రా కింగ్ తాలూకా ★ వాసవి: రాజు వెడ్స్ రాంబాయి ★ టీబీఆర్ ప్లెక్స్-1: రివాల్వర్ రీటా ★ టీబీఆర్ ప్లెక్స్-2: జటాధర – న్యూస్‌టుడే, బొబ్బిలి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? రాజాం పురపాలిక పరిధిలోని సారధి వెళ్లే రహదారిలో గజేశ్వరనగర్ వద్ద కాలువలో పూడికలు నిండాయి. - స్థానికులు ★ పూడికలు తొలగించమన్నారు. - ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

? గరివిడి గ్రామంలో మురుగు కాలువల్లో పూడిక నిండింది. తీవ్ర దుర్వాసన వస్తోంది. - స్థానికులు ★ పారిశుద్ధ్య కార్మికులను పంపిస్తాం. - విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

రూ.40 లక్షలతో ఎమ్మార్సీ భవనం

స్పందనకు వందనం

సంతకవిటి, న్యూస్‌టుడే: సంతకవిటి ఎమ్మార్సీ కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. నూతన భవనానికి రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు సమగ్ర శిక్షా ఏపీసీ వై. రామారావు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు.

వ్యర్థాల తొలగింపు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బోనంగి గ్రామంలో వ్యర్థాలు పేరుకుపోయి ప్రజలు ఇబ్బంది పడేవారు. దీనిపై గత నెలలో వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. సిబ్బందితో గ్రామం శుభ్రం చేయించారు.

ఆంధ్ర జలాశయం నీటి విడుదల

మెంటాడ, న్యూస్‌టుడే: ఆంధ్ర జలాశయంలో నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువ వరద చేరడంతో అదనపు నీటిని చంపావతి నదిలోకి విడుదల చేశామని తహసీల్దారు అరుణకుమారి తెలిపారు. సోమవారం తెల్లవారుజాము నుంచి 50 క్యూసెక్కుల నీరు స్పిల్‌వే ద్వారా విడుదల చేస్తున్నారు. ప్రజలు నదివైపు వెళ్లొద్దన్నారు.

అభివృద్ధి జరిగేలా.. అవస్థలు తీరేలా

న్యూస్‌టుడే- బొబ్బిలి

ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు, కాలువల పనులు

బొబ్బిలి పురపాలిక పరిధిలోని అభివృద్ధి పనుల్లో కదలికొచ్చింది. సీసీ రహదారులు, కాలువలు, పారిశుద్ధ్యం, వీధిదీపాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రెండు విడతల్లో విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రాధాన్య క్రమంలో పనులు చేపడుతున్నారు. మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నారు. ఇటీవల పుర సమావేశంలో పలు అభివృద్ధి పనులను ఆమోదించారు.

చెత్త సమస్య తొలగనుంది..

పురపాలికలో కాంపాక్ట్ బిన్లు పాడవడంతో చెత్త రహదారుల్లో పోగవుతోంది. ఈ నేపథ్యంలో కాంపాక్ట్ బిన్ల కొనుగోలుకు రూ.11.19 లక్షలు కేటాయించారు. ★ 19వ వార్డులోని పాత వెంకట కృష్ణా థియేటర్ వద్ద కాలువ ఎత్తు చేసేందుకు రూ.1.41 లక్షలు, 12వ వార్డు దమ్మావీధిలో సీసీ దారికి రూ.4 లక్షలు, 25వ వార్డు సాయినగర్ శివారు రైల్వే ప్రహరీ వరకు రోడ్డుకు రూ.99 వేలు, పుష్‌కార్ట్స్ మరమ్మతులు, చేతి గ్లౌజులు కొనుగోలుకు రూ.5 లక్షలు కేటాయించారు.

కాలువల్లేని పూల్‌బాగ్ రహదారి

వీధి దీపాల నిర్వహణకు ప్రాధాన్యం..

వీధిదీపాల నిర్వహణకు సంబంధించి ఎల్ఈడీ, ఎలక్ట్రికల్ డైవర్స్, పీసీబీ బోర్డుల కొనుగోలుకు రూ.9.65 లక్షలు వెచ్చించనున్నారు. ఎల్ఈడీ దీపాలకు రూ.5 లక్షలు, ఇందిరమ్మకాలనీలో తాగునీటి బోరుకు రూ.1.20 లక్షలు, 22వ వార్డులో సీసీ రహదారికి రూ.2 లక్షలు కేటాయించారు. 20వ వార్డు చీపురుపల్లి వీధిలో పైపులైన్లు వేసేందుకు రూ.2.50 లక్షలకు ఆమోదం తెలిపారు.

బుడా నిధులతో కొన్ని..

23వ వార్డులో సీసీ రోడ్డు, 10వ వార్డులో సీసీ రహదారి, పూల్‌బాగ్ రహదారిలో డ్రైన్ల నిర్మాణానికి రూ.80 లక్షలు, కొత్త ఎరుకులవీధిలో కాలువలకు, రూ.29 లక్షలు బొబ్బిలి పట్టణ అభివృద్ధి సంస్థ నిధులు కేటాయించారు. భోజరాజపురం నుంచి పట్టణం వరకు ప్రధాన తాగునీటి పైపులైన్ల మరమ్మతులకు రూ.5 లక్షలు, 14వ వార్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో సీసీ కాలువ, ఇతర పనులకు రూ.4.50 లక్షలు కేటాయించారు.

సకాలంలో పూర్తిచేస్తాం..: పురపాలిక పరిధిలో మరిన్ని పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాం. 15వ ఆర్థిక సంఘంలోని రెండు విడతల నిధులతో కొన్ని ప్రతిపాదించాం. సీసీ డ్రైన్లు, రహదారులు, తాగునీటి సరఫరా పునరుద్ధరణకు పెద్దపీట వేశాం. ఆయా పనులు సకాలంలో పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎల్.రామలక్ష్మి, పుర కమిషనర్, బొబ్బిలి

6న రాజాంలో మెగా ఉద్యోగ మేళా

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

రాజాం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 6న రాజాంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో సంబంధిత గోడప్రతులు ఆవిష్కరించారు. ప్రభుత్వం ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగానే ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తులు 6న ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగులంతా అర్హులేనన్నారు. డబ్ల్యూవిన్స్, హెటెరో, డీమార్ట్, వరుణ్‌మోటార్స్ వంటి 35 సంస్థలు పాల్గొంటాయన్నారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడులు పొందొచ్చని రఘుమండ్ల ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం గంట్యాడ మండలం గొడియాడలో రైతులకు మామిడి పంటల సాగుపై అవగాహన కల్పించారు. పూత దశ, పిందె దశలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ చర్యలతో లాభసాటి దిగుబడి పొందొచ్చన్నారు. ఉద్యానశాఖాధికారి స్వాతి, రైతులు పాల్గొన్నారు.

చరవాణి వద్దు.. పుస్తకమే ముద్దు

బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి పురపాలక ఉన్నత, గజపతినగరం మండలం మరుపల్లి ఏపీ ఆదర్శ, రాజాం పట్టణంలోని గురజాడ పాఠశాలల్లో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో "ప్రతిభా పాటవ పోటీలు" జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చారు. బొబ్బిలిలో సుస్మిత నాయుడు (10వ తరగతి), వి.ఓంప్రకాష్ (9వ తరగతి), వి.పూజిత (9వ తరగతి).. మరుపల్లిలో కె.హరి (9వ తరగతి), సి.హెచ్ మోహిని ప్రియ (9వ తరగతి), కె.మోనిక (10వ తరగతి).. రాజాంలో ఎం.గీతామాధురి (9వ తరగతి), ఎ.సుజన (7వ తరగతి), పి.కుమార్ (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గొల్లపల్లి పురపాలక ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శంకరరావు, ఉమామహేశ్వరరావు, మరుపల్లి ఆదర్శ పాఠశాల ప్రధానాచార్యుడు జి.ఈశ్వరరావు, రాజాం గురజాడ పాఠశాల ప్రధానాచార్యుడు ఎ.శ్రీనివాసరావు, డైరెక్టర్ జి.రాంప్రశాంత్ ఆయా చోట్ల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి, గజపతినగరం, రాజాం

బొబ్బిలి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

రాజాం: బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్, డైరెక్టర్

మరుపల్లిలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గజపతినగరం: విజేతలతో ఉపాధ్యాయులు

విశ్రాంత ఉద్యోగులకు కమిటీలు.. రామభద్రపురం: విశ్రాంత ఉద్యోగుల మండల కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సహాధ్యక్షుడు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు డైరెక్టర్ రౌతు రామ్మూర్తి అన్నారు. సోమవారం రామభద్రపురంలో విశ్రాంత ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. మండలాల్లోని విశ్రాంత ఉద్యోగులంతా ఒకటిగా చేరి, ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన.. గజపతినగరం: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న హరితరాయబారులకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నేత లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఎంపీడీవో కళ్యాణికి వినతిపత్రం అందించారు.

ఉద్యానం.. పరిసరాలు అధ్వానం

రాజాం పట్టణం పరిధి సారధి రహదారిలోని కోనేరు దుర్గంధంగా తయారైంది. పరిసరాలను ఉద్యానంగా తీర్చిదిద్దినా నీరు బయటకు పోయేందుకు మార్గం ఉంచలేదు. దీంతో నెల కొద్దీ నిల్వ ఉండి, రంగు మారుతోంది. కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు శుభ్రంగా లేవు. విషయం పురపాలిక కమిషనర్ ఎ.రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. ఉద్యానంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని, నీరు వాసన వస్తుండడంతో తోడించే ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం

కాలువల్లో ప్రజారోగ్యం

రాజాం పురపాలక సంఘం పరిధి కొత్తవలసలో తాగునీటి పైపులైన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. గోపాలపురం రక్షిత మంచినీటి పథకం నుంచి ఆయా ప్రాంతాలకు నీరు సరఫరా చేస్తున్నారు. ప్రధాన వీధిలో పైపులైను మురుగు కాలువలో ఉంది. ఏ మాత్రం లీకులు ఏర్పడినా.. నీరు కలుషితమై రోగాలు వ్యాపించే అవకాశముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విషయం కమిషనర్ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

పనులు పూర్తయ్యేదెన్నడో..?

బొబ్బిలి మండలం చిత్రకోట బొద్దవలసలో ఉపాధిహామీ నిధులతో చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణం ఏడాదిన్నరగా స్తంభాల దశలోనే ఉంది. గ్రామంలో సేకరించిన వ్యర్థాలు ఎక్కడికక్కడ పడేస్తున్నారు. అపరిశుభ్రత నెలకొంటోంది. గుత్తేదారుకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో పనులు జరగలేదంటున్నారు. విషయం డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు వద్ద ప్రస్తావించగా.. నిర్మాణం పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

కల్వర్టు లేక కష్టాలు

గుర్ల మండలం తెట్టంగి- కొండగండ్రేడు రహదారిలోని తెట్టంగి లక్ష్మి చెరువు వద్ద కల్వర్టు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గెడ్డ నుంచి నీరు వచ్చే సమయంలో రాకపోకలు నిలిచిపోతాయి. ఈ మార్గంలో పల్లిగండ్రేడు, కొండగండ్రేడు, పకీరుకిత్తలి, దేవునికణపాక, బూర్లిపేట, ముద్దాడపేట గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. విషయాన్ని ర.భ.శాఖ ఏఈ వినీత వద్ద ప్రస్తావించగా.. నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. – న్యూస్‌టుడే, గుర్ల

నిర్వహణ గాలికి.. యంత్రాలు మూలకి

రేగిడి మండలం సోమరాజుపేటలోని చెత్త సంపద కేంద్రానికి గత ప్రభుత్వ హయాంలో రెండు చెత్త గ్రేడింగ్ యంత్రాలు కేటాయించారు. ఒక్కరోజు కూడా వినియోగించలేదు. దీంతో దాని మోటారు తుప్పుపట్టిపోతోంది. చెత్త సేకరణ రిక్షాలు కూడా పూర్తిగా మూలకు చేరిపోయాయి. వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. విషయాన్ని ఎంపీడీవో వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రేగిడి

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

హాజరైన నిరుద్యోగ యువత

గజపతినగరం, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ పలు కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం గజపతినగరం తెదేపా కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐటీఐ అర్హత కలిగిన నిరుద్యోగ యువతతో సమావేశమయ్యారు. ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. అమర్‌రాజా, జేకే గ్రూప్ వంటి సంస్థలు ఏడాది పాటు ఉపకార వేతనంతో కూడిన నైపుణ్య శిక్షణ ఇస్తాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరుపల్లి, బొండపల్లి, కొండకిండాం ప్రాంతాల్లో కంపెనీలు ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రతినెలా పండగ వాతావరణం

వృద్ధుడికి పింఛను అందజేస్తున్న మంత్రి కొండపల్లి

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా 1న గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంటోందన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి, మండల కన్వీనరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కావలిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఎమ్మెల్సీ గ్రీష్మా

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. రాజాం మండలం కొఠారిపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ★ సంతకవిటి మండలం కావలి గ్రామంలో మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మా పింఛన్లు పంపిణీ చేశారు. ★ తెర్లాం: ఎమ్మెల్యే బేబీనాయన నెమలాం, సింగిరెడ్డివలస, సీతారాంపురం గ్రామాల్లో పింఛన్లు అందజేశారు. అనంతరం గ్రామాల్లోని సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

రైతు గుండెల్లో తుపాను భయం

న్యూస్‌టుడే బృందం: ఇటీవలే మొంథా తుపానుతో సగం నష్టపోయిన రైతులను ఇప్పుడు దిత్వా తుపాను భయపెడుతోంది. ప్రస్తుతం వరిపంట చేతికందొచ్చింది. ముమ్మరంగా కోతలు, నూర్పులు జరుగుతున్నాయి. ఈ తరుణంలో కురుస్తున్న చిన్నపాటి వర్షాలతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పంటను కాపాడుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. వరి కుప్పలపై పరదాలు కప్పుతున్నారు. వీలైనంత వరకు ధాన్యం ఇళ్లకు, కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. పొలాల్లోని కుప్పల్లో నీరు చేరి మొలకలు వచ్చే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల చివరిదశలో ఉన్న పంట నేలకొరిగింది.

రామభద్రపురంలో నేలమట్టమైన వరిచేను

జీవిత పాఠం భగవద్గీత

గీతా సారాంశాన్ని ఉపదేశిస్తున్న స్వామీజీలు

గరివిడి, న్యూస్‌టుడే: భగవద్గీతను ఆచరించి జీవిత పాఠాలు నేర్చుకోవాలని స్వామీజీలు ఉపదేశించారు. గరివిడి బ్రహ్మవిద్యా కుటీరంలో నిర్వాహకురాలు వాకాడ జయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం గీతా జయంతి నిర్వహించారు. నిత్య తృప్తానంద సరస్వతి (పుణ్యగిరి), ప్రకాశనంద సరస్వతి (రిషికేశ్), వామన మహరాజ్‌స్వామి (పశ్చిమ బెంగాల్), శాంతానంద సరస్వతి (హైదరాబాద్) హాజరయ్యారు. భగవద్గీత సారాంశాన్ని బోధించారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

గుర్ల, న్యూస్‌టుడే: గుర్ల మండలం అచ్యుతాపురం వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన గోదాము అసంపూర్తిగా ఉంది. ఎనిమిదేళ్ల క్రితం దీని నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయి. గుత్తేదారులు పనులు మధ్యలోనే వదిలేశారు. పండించిన పంటను భద్రపర్చుకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరామని తెట్టంగి సొసైటీ సీఈవో రామునాయుడు అన్నారు.

గీతా జయంతి వేడుకలు

రాజాం, న్యూస్‌టుడే: బాల సంస్కార కేంద్రం ఆధ్వర్యంలో రాజాం పట్టణంలో సోమవారం గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గీతా పారాయణం చేపట్టారు. శ్లోక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కేంద్రం నిర్వాహకుడు శెట్టి శ్రీనివాసరావు, విజయకోదండ రామాశ్రమం అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్వప్న హైందవి పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

న్యూస్‌టుడే బృందం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం బొబ్బిలి, రాజాం, గజపతినగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గజపతినగరంలో మండల న్యాయసేవా సాధికార సంస్థ నిర్వహించిన ర్యాలీలో న్యాయమూర్తి ఎ.విజయ్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గజపతినగరం: ర్యాలీలో న్యాయమూర్తి, తదితరులు

ఆదర్శ రైతు మృతికి నివాళి

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణానికి చెందిన ఆదర్శ రైతు సాలా మురళీకృష్ణారావు (72) అనారోగ్యంతో సోమవారం తన స్వగృహంలో మృతిచెందారు. మామిడి సాగులో విభిన్న పద్ధతులు పాటించి, మేలైన రకాలు పండించి పలు పురస్కారాలు సొంతం చేసుకున్నారు. పలువురు నాయకులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

క్రమశిక్షణతో నాయకత్వ లక్షణాలు

స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో ఎస్సై, ఉపాధ్యాయులు

బాడంగి, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణ, కష్టపడే తత్వం అలవర్చుకోవాలని ఎస్సై తారకేశ్వరరావు అన్నారు. సోమవారం బాడంగి ఉన్నత పాఠశాలలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేశారు. క్రమశిక్షణతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మాజీ సైనికులకు అన్యాయం'.. బొబ్బిలి: ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన మాజీ సైనికులకు భూముల కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందని ఆ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం సంఘ కార్యాలయంలో మాజీ సైనికుల సమావేశం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు, ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారుడికి చేయూత

రాజాం: డోలపేటకు చెందిన టి.జగదీష్‌కుమార్ ఇటీవల అండర్-19 జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. పేద కుటుంబం కావడంతో స్థానికులు సాయం అందించేందుకు ముందుకొస్తున్నారు. ఇటీవల రంగస్థల కళాకారుడు జి.ఆదినారాయణ, ఆటో డ్రైవర్ సీహెచ్ హరి రూ.15 వేలు అందించారు. సోమవారం లోలుగు సుశీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20వేల విలువైన క్రికెట్ కిట్‌ను ప్రతినిధులు ఎ.శ్యామలరావు, ఎ.రాంబాబు అందించారు.

డాక్యుమెంట్ పోయినది

తేది. 16.11.2025 ఆదివారం గంట్యాడ మండలం, నరవ గ్రామం నుంచి విజయనగరం వెళ్లుచున్న మార్గం మధ్యలో ఆచార్య అశోక్‌కుమార్ S/o. లేటు ఆచార్య ఆరుముగం మా సైట్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 1069/2012 Dated 28.03.2012ది పోయినది ఎవరికైనా దొరికిన యెడల దయచేసి ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు. వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

Contact: ఆచార్య అశోక్‌కుమార్
S/o లేటు ఆచార్య ఆరుముగం
సెల్: 9908217292

కరాటేలో పతకాలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లికి చెందిన పలువురు విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటి పతకాలు సాధించారు. గత నెల 27 నుంచి 29 వరకు విశాఖపట్నం రాజీవ్ స్టేడియంలో 28వ జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. దీనిలో జి.నీరజ్‌నాయుడు, రుద్రాన్ష్ బంగారు, ఎస్.గౌతంమోహన్, కె.భారత్, టి.పల్లవిష్ రజత, పి.దరహాస్, రాధాకృష్ణ, వర్షిత్ కాంస్య పతకాలు సాధించారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన

జయంతిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఇటీవల అమరావతిలోని రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో జరిగిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న తెర్లాం మండలం నెమలాం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని జయంతిని తెర్లాం మండలం బూరిపేటలో ఎమ్మెల్యే బేబినాయన సోమవారం అభినందించారు. చిన్నారి విషయ పరిజ్ఞానాన్ని, అసెంబ్లీలో మాట్లాడిన తీరును మెచ్చుకొని సత్కరించారు.

National Pollution Prevention Day
పర్యావరణ కాలుష్యం నివారణ లేని వ్యాధి, మన ప్రయత్నాలు మాత్రమే ఈ వ్యాధిని నివారించగలవు
డా॥ G. శశిభూషణరావు
సూపరింటెండెంట్, CHC, బొబ్బిలి

శ్రద్ధాంజలి
నిరంతరం ప్రజల సంక్షేమం కోసం, పార్టీ శ్రేయస్సు కోసం కృషి చేసిన మీరు భౌతికంగా మా నుండి దూరమైనారన్న నిజం నమ్మలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ పైల అప్పారావు గారు
తెలుగుదేశం పార్టీ నాయకులు
సర్పంచ్ ప్రతినిధి, బొత్సవానివలస
మరణం : 12-11-2025
RVSKK రంగారావు (బేబినాయన)
MLA, బొబ్బిలి
తెంటు లక్ష్మునాయుడు
బుడా చైర్మన్, బొబ్బిలి

విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల • ఎస్.కోట

ఉపన్యసించి.. బహుమతులు అందుకుని

నగరంలోని కె.ఎల్.పురం శ్రీకృష్ణ గణపతి ఆంగ్లమాధ్యమ పాఠశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో ఆకట్టుకుని బహుమతులు సాధించారు. వై.నవనీత్(ఏనిమిదో తరగతి), వి.పూర్ణసింధు (తొమ్మిదో తరగతి), వి.షారోన్ ఏంజెల్ (ఏనిమిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ప్రధానాచార్యులు జి.పద్మజారావు, ఉపాధ్యాయులు జి.అనిల్‌కుమార్, ఎస్.వసంతరావు, ఎం.మణికంఠ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. - న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయం

ఎస్.కోట, కొత్తవలస, వేపాడ, విద్యావిభాగం, భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల: ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయమని ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.నీల అన్నారు. సోమవారం పట్టణంలో ప్రాంతీయ ఆసుపత్రి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు, మండల న్యాయ సేవా కమిటీ సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ★ కొత్తవలసలో జూనియర్ సివిల్ జడ్జి విజయ చందర్, వైద్యాధికారిణి సీతామహాలక్ష్మి, దేవి, మహేంద్ర ర్యాలీ నిర్వహించారు. ★ వేపాడలో పీహెచ్‌సీ వైద్యాధికారి చేబ్రు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థులు మానవ హారంగా ఏర్పడ్డారు. ★ మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాల ఆధ్వర్యంలో దర్భపురి గాయత్రి నగర్‌లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ★ భోగాపురంలోని సుందరపేట సీహెచ్‌సీ వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ★ డెంకాడ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ★ నెల్లిమర్ల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ తిరుమలదేవి ఆధ్వర్యంలో ర్యాలీ, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

ఎస్.కోటలో ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ప్రతిన

విద్యుత్తు వెలుగులు ఎప్పుడో?

అయిదేళ్లుగా నిలిచిన 220 కేవీ ఉపకేంద్రం ఏర్పాటు

జిల్లా కేంద్రంతో పాటు డివిజన్‌లోని పలు ప్రాంతాల ప్రజల విద్యుత్తు ఇక్కట్లు ఏళ్లుగా తీరడం లేదు. అవసరాల మేరకు సామర్థ్యం పెంపేలా వేణుగోపాలపురం వద్ద ప్రతిపాదించిన 220/132/33 కిలో వాట్స్ ఉపకేంద్రం నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. ఏటేటా అంచనాలు పెరుగుతున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2017-18లో రూ.85 కోట్లతో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తర్వాత వైకాపా ప్రభుత్వం టెండర్ల దశలోని పనులను రద్దు చేసింది. మళ్లీ 2023లో రివైజ్డ్ అంచనాలు తయారు చేసి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.183 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అనుమతులు రావాల్సి ఉంది. దీనిపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఎమ్మెల్యే అదితి తీసుకెళ్లారు. - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పూర్తయితే ఇదీ ప్రయోజనం..

వేణుగోపాలపురంలో ఎనిమిది ఎకరాల స్థలంలో దీని నిర్మాణానికి ప్రతిపాదించారు. ఈ పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే నగరంలోని ప్రజల విద్యుత్తు అవసరాలు తీరుతాయి. నాణ్యమైన, అంతరాయం లేని నిరంతర విద్యుత్తు అందుతుంది. నగరం పట్టణీకరణ పెరిగి, విద్యుత్తు అవసరాలు పెరిగాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రానుంది. ప్రస్తుతం బంటికొండ వద్ద 132/33 కేవీ సబ్‌స్టేషన్‌నుంచి గరివిడి, బొండపల్లి నుంచి సరఫరా అవుతోంది. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్ పరిధిలోని ఎస్.కోట, చీపురుపల్లి, నెల్లిమర్ల, గజపతినగరం అవసరాలు తీరనున్నాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. కరెంటు కోతలు, నియంత్రికలపై ఒత్తిడి, ఇక్కడి సమస్యలు పరిష్కరించేందుకు కొత్త ఉపకేంద్రాల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. గతేడాది అక్టోబరు నుంచి ఇంత వరకు ఇక్కడ రూ.24.53 కోట్లతో కరెంటు సరఫరా నెట్ వర్కు బలోపేతానికి వివిధ చర్యలు చేపట్టారు. ఇది కాకుండా ఏపీ ట్రాన్స్‌కో ద్వారా రూ.10 కోట్లతో 50 మెగావాట్స్ సామర్థ్యం కలిగిన మూడో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఇవన్నీ పూర్తయితే ప్రయోజనమే.

వేణుగోపాలపురం వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం

అంచనాలు పంపించాం

వేణుగోపాలపురంలో రూ.183 కోట్లతో నిర్మించతలపెట్టిన 220 కేవీ సబ్‌స్టేషన్ పనులకు సంబంధించి రివైజ్డ్ అంచనాలను ట్రాన్స్‌కోకు పంపించాం. అక్కడ ఆమోదం పొందిన తర్వాత టెండర్లు పిలిచి పనులు చేపడతాం. - శ్రీచరణ్, ఈఈ, ఏపీ ట్రాన్స్‌కో, విజయనగరం డివిజన్

తెరపై ఈనాడు

★ ఎన్సీఎస్ : ఆంధ్రాకింగ్ తాలూకా ★ శ్రీకృష్ణ : రాజు వెడ్స్ రాంబాయి ★ అదిత్య: జనతా బార్ ★ లీలామహల్ : రివాల్వర్ రీటా ★ రంజని స్క్రీన్–1 ఆంధ్రాకింగ్ తాలూకా ★ శివరంజని స్క్రీన్–2 : రివాల్వర్ రీటా ★ హిమగిరి : 12ఎ రైల్వే కాలనీ ★ సప్తగిరి : మఫ్టీ పోలీస్ – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	8008574326
భోగాపురం	70959 54646

?: చింతపల్లి గ్రామంలో వీధి కాలువల్లో మురుగు, చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. - స్థానికులు, చింతపల్లి

❖ పరిశీలిస్తాం. మురుగు తొలగించి దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటాం. - ఈవోపీఆర్డీ, జానేశ్వరరావు

?: నగరంలోని పీఎస్ఆర్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - శ్రీను, స్థానికుడు

❖ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - స్రవంతి, ఏఈ, నగర పాలక సంస్థ

?: నగరంలోని వైఎస్సార్ నగర్ శివారులో కాలువలు, రోడ్లు లేవు. - రాయుడు, స్థానికుడు

❖ నిధుల లభ్యత మేరకు ప్రాధాన్యతా క్రమంలో రోడ్లు, కాలువలు నిర్మిస్తాం. - పి.నల్లనయ్య, కమిషనరు, నగర పాలక సంస్థ

- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

నగరంలోని గంట్యాడరోడ్‌లోని కామాక్షినగర్‌లో సిబ్బంది కాలువలు శుభ్రం ముమ్మరంగా చేపట్టారు. ఇక్కడి సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా'కు స్థానికులు ఫిర్యాదు చేశారు. విషయాన్ని ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

హామీ ప్రకారం చేయండి

ఎస్.కోట: హామీ నెరవేర్చకుంటే భూములు తిరిగి ఇవ్వాలంటూ జిందాల్ నిర్వాసితులు డిమాండు చేశారు. సోమవారం వారంతా కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అదీబర్ ప్యాకేజీలో ఇచ్చిన హామీ ప్రకారం కంపెనీలో తాము 50 శాతం వాటాదారులుగా ఉన్నామని తమకు షేర్ బుక్, ధ్రువపత్రాలు ఇప్పించాలన్నారు.

పూర్తయ్యేది ఎప్పటికో!

విజయనగరం మండలం బియ్యాలపేట గ్రామ సచివాలయ భవన నిర్మాణం మూడేళ్లుగా నిలిచిపోయింది. దీంతో సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీని నిర్మాణానికి సుమారు రూ.37 లక్షలు ఖర్చు చేసినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. నిర్మాణ గుత్తేదారుడు, నాయకుల మధ్య సమన్వయ లోపంతో భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఉన్నతాధికారులు దృష్టి తీసుకెళ్లానని ఎంపీడీవో వెంకటరావు తెలిపారు. - న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

పచ్చిక మైదానం కాదండోయ్..!

అందాలను ఒలకబోస్తున్నట్లు కనిపిస్తున్న ఈ చిత్రంలోని ప్రదేశం సుందర మైదానం అనుకున్నారా.. కానే కాదు. తామరాకులతో నిండిన కొత్తపేట కోనేరు ఇది. ప్రకృతి ప్రేమికులు, చూపరులను కనువిందు చేసిన ఈ చిత్రాన్ని సోమవారం 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. - న్యూస్‌టుడే, లక్కవరపుకోట

దుర్వాసన భరించలేం బాబోయ్

జామి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకుని కోనాకార్పస్(ఏడాకుల) చెట్లు ఉన్నాయి. వీటి నుంచి విపరీతమైన దుర్వాసన రావడంతో భరించలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఇక్కడ సుమారు 500 మంది విద్యార్థులున్నారు. విషయం ప్రధానోపాధ్యాయుడు కుమార్ వద్ద ప్రస్తావించగా ఇవి పాఠశాల పరిధిలో లేవని, తొలగింపునకు గ్రామ పెద్దలతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. –న్యూస్‌టుడే, జామి

తాగునీరు వృథా!

ఎల్.కోట మండలంలోని కళ్లెంపూడిలో రక్షితనీరు పైపుల నుంచి వృథాగా పోతోంది. సమీప పంట పొలాలను ముంచుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తాటిపూడి జలాశయం నుంచి పైపులైన్ ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ కుళాయి పథకంలో భాగంగా నీరు సరఫరా చేస్తున్నారు. ఈ పైపులైను జొద్దుం మీదుగా ఒబలయ్యపాలెం, గొల్జాం, కళ్లెంపూడి, చింతడ వరకు ఉంది. కళ్లెంపూడి సమీపంలో పైపులైను పగిలి వృథాగా పోతోంది. విషయం పైపులైను పర్యవేక్షకుడు లెంక రామారావు వద్ద ప్రస్తావించగా మరమ్మతులు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, లక్కవరపుకోట

ఆక్రమణల తొలగింపు

కొత్తవలస తహసీల్దార్ పి.అప్పలరాజు ఆక్రమణల పాల్పడ్డారని ఆర్డీవో నివేదిక ఇవ్వడంతో ఆయన్ను కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి సస్పెండ్ చేశారు. దీంతో మండల రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయంలో చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా సోమవారం తహసీల్దార్ సునీత, ఆర్ఐ షణ్ముఖరావు ఆదేశాలతో కొత్తవలస రెవెన్యూలోని సర్వే నంబరు 168లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన రేకుల షెడ్, 164/2లో వేసిన ఫెన్సింగ్‌లను వీఆర్వో ఎల్.రాధాకృష్ణ జేసీబీతో తొలగించారు. ఫిరంగి కొండ నుంచి అక్రమంగా కంకర తవ్వకాలు జరగకుండా ట్రెంచ్ కటింగ్ చేయించారు. – న్యూస్‌టుడే, కొత్తవలస

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనరు నల్లనయ్య

అక్రమ నిర్మాణాలు తొలగించండి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: భవనాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. సోమవారం కార్యాలయంలో ప్రణాళిక కార్యదర్శులు, ఎల్టీపీలతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి భవనాన్ని పరిశీలించి అనుమతులు మీరి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏసీపీలు హరిబాబు, రమణమూర్తి, టీపీఓ అప్పలరాజు, టీపీఎస్ అనిత పాల్గొన్నారు.

పేదలకు భరోసా

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం పేదవారికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం ఉదయం మండలంలో కాపుసోంపురం, భవానీనగర్, పట్టణంలో బర్మాకాలనీలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ జీఎస్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు అచ్చింనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పుర సేవలు మరింత విస్తృతం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజాఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి పుర సేవలను మరింత విస్తృత పరచనున్నట్లు కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగానికి చెందిన రెండేసి వచ్చాయన్నారు. సహాయక సిటీ ప్లానరు హరిబాబు పాల్గొన్నారు.

వైద్యాధికారిణికి డిప్యుటేషన్

కొత్తవలస: పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీతల్ వర్మను జామి మండలం అలమండ పీహెచ్‌సీకి డిప్యుటేషన్‌పై బదిలీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి జీవనరాణి తెలిపారు.

కల్లాల్లో పోగులు.. గుండెల్లో గుబులు

తుపాను ప్రకటనతో రైతుల ఆందోళన

న్యూస్‌టుడే జరజాపుపేట, భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, విజయనగరం గ్రామీణం, వ్యవసాయ విభాగం

విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంట సేకరణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసినా, ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. కొన్నిచోట్ల కేంద్రాలు తెరవ ఇవ్వలేదు. మరోవైపు మిల్లర్లు పూర్తిస్థాయిలో గ్యారెంటీలు ఇవ్వలేదు. దీనికితోడు తుపాను ప్రకటనలు అన్నదాతను నిండా భయాందోళనకు గురిచేస్తున్నాయి.

వాతావరణ మార్పులతో..

ప్రస్తుతం అల్పపీడనం ప్రభావం కనిపించడం, సోమవారం రోజంతా మబ్బులు పట్టి, చినుకులు పడుతుండడంతో ముందుగా ధాన్యం సిద్ధం చేసిన రైతుల్లో గుబులు మొదలైంది. ఇప్పటికే కోతలు పూర్తికాని వారు పంట దెబ్బతింటుందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో వరికోతలు మొదలుపెట్టి, నూర్పులు చేసి ధాన్యం కల్లాలు, ఇంటి వద్ద బస్తాలను నిల్వ చేసి ఉంచారు. కేంద్రాల్లో వెంటనే సేకరిస్తే నష్టం తప్పుతుందని వాపోతున్నారు. మరికొన్నిచోట్ల రెండ్రోజులుగా వరి కోతలు ముమ్మురంగా చేస్తున్నారు.

నెల్లిమర్లలో వరి కోతలు చేపడుతున్న రైతులు

కేంద్రాలివే... రైతులకు గిట్టుబాటు మేరకు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. నెల్లిమర్లలో రామతీర్థం, సతివాడ, గుషిణి, బొప్పడాం, కొండగుంపాం, కొండవెలగాడ, పూసపాటిరేగలో కుమిలి, రెల్లివలస, ఎల్‌పీపాలెం, కృష్ణాపురం, భోగాపురంలో పోలిపల్లి, భోగాపురం, సవరవల్లి, కవులవాడ, మంజేరు, బైరెడ్డిపాలెం, డెంకాడ మండలంలో పెదతాడివాడ, డెంకాడ, సింగవరం, చోల్లంగిపేట, అక్కివరం, అమకాం, విజయనగరంలో కోరుకొండ, చెల్లూరు, జొన్నవలస, రాకోడు, ద్వారపూడిల్లో ఏర్పాటు చేశారు.

మండలాల వారీగా పంట (ఎకరాల్లో) లక్ష్యం(టన్నుల్లో) వివరాలు..

మండలం	పంట	లక్ష్యం	కేంద్రాలు
నెల్లిమర్ల	6200	12,000	6
పూసపాటిరేగ	6160	7,600	4
డెంకాడ	6252	16,200	6
భోగాపురం	1200	1,024	6
విజయనగరం	5040	8,800	5

అలసత్వం చేస్తే చర్యలు: నెల్లిమర్ల, విజయనగరం ప్రాంతాల్లో చాలా మంది రైతులు వరి సాగు ఆలస్యంగా చేపట్టారు. అన్ని మండలాల్లో కేంద్రాలు అందుబాటులో ఉంచాం. ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాం. సేకరణలో కేంద్రాల సిబ్బంది అలసత్వం చేస్తే చర్యలు తప్పవు. - ఎ.నాగభూషణం, ఏడీ, విజయనగరం

సచివాలయాల అధికారిగా రాజ్‌కుమార్

డెంకాడ: మండల పరిషత్తు కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న కర్రోతు రాజ్‌కుమార్‌కు మండలం గ్రామ, వార్డు సచివాలయాల అధికారిగా పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఎంపీడీవో వై.భవానీ తెలిపారు.

అక్రమ కబేళాలు మూసివేయాలి

విజయనగరం పట్టణం: నగర పాలక సంస్థ పరిధిలోని కంటోన్మెంట్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న కబేళాలు, దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ డిమాండు చేశారు. కమిషనరు నల్లనయ్యకు వినతిపత్రం ఇచ్చామన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

వేపాడ: ఆకులసీతంపేటకు చెందిన కె.అమ్మాజీ కుటుంబానికి వాసవీ క్లబ్ సభ్యులు రూ.7000, కె.గుప్తాకు ఒక బియ్యం బస్తా అందించారు. శ్రీనివాసరావు, శ్రీరామ్మూర్తి, సంపత్‌కుమార్ ఉన్నారు.

మైనర్లకు కౌన్సెలింగ్

ఎస్.కోట: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న పది మంది మైనర్లకు వారి తల్లిదండ్రులకు సోమవారం రాత్రి ఎస్సై సత్యనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. లైసెన్సు లేకుండా మైనర్లకు బండి ఇవ్వడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల బండి యజమానిపై శిక్ష పడుతుందని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఎల్.కోట సమీపంలో పట్టుబడిన ఇద్దరికి ఏడు రోజులు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు.

23 మందికి జరిమానా

పూసపాటిరేగ: వివిధ గ్రామాల్లో గత కొన్ని రోజులుగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 23 మందిని స్థానిక ఎస్సై దుర్గాప్రసాద్ సోమవారం జిల్లా కోర్టులో హాజరపర్చగా న్యాయమూర్తి శ్రీవిద్య ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించారు. మద్యం తాగి బండి నడుపిన నలుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

అర్హులందరికి పింఛన్ల పంపిణీ

విజయనగరం గ్రామీణం, భోగాపురం, నెల్లిమర్ల: గుండాలపేట పంచాయతీలో ఎమ్మెల్యే అదితిగజపతిరాజు సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచి జగదీశ్వరి పాల్గొన్నారు. ★ భోగాపురం మండలంలోని రాజాపులోవలో లబ్ధిదారులకు మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు అందజేశారు. సత్యనారాయణ ఉన్నారు. నెల్లిమర్ల మండలం గొర్లిపేటలో తెదేపా నాయకుడు సువ్వాడ రవిశేఖర్ పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ భవనాల కోసం ప్రతిపాదించాం

ఎల్.కోట: మధ్యలో నిలిచిన అంగన్‌వాడీ భవనాలు పూర్తికి ఉన్నతాధికారులకు ప్రతిపాదన చేసినట్లు సీడీపీవో ఉమాదేవి తెలిపారు. కొత్తవలస, ఎల్.కోట, వేపాడ మండలాల్లో గత అయిదేళ్లలో 21 భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. కళ్లెంపూడి, గొల్జాంలో ఉన్న కేంద్రాలను సందర్శించి చిన్నారుల హాజరు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు.

చెరకు మద్దతుకు చర్యలు తీసుకోండి

విజయనగరం ఉడాకాలనీ, బాబామెట్ట, న్యూస్‌టుడే: జిల్లాలో చెరకు రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.3,550ను సంకిలి చక్కెర పరిశ్రమ ద్వారా ఇప్పించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఆదినారాయణమూర్తి, రాంబాబు డిమాండు చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం ప్రైవేటు తూకం యంత్రాలను పెట్టి సేకరణ చేస్తూ రైతులను దోపిడీ చేస్తోందని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పలు సంఘాలు, వ్యక్తులు తమ సమస్యలు విన్నవించేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు.

❖ బలహీన వర్గాల వారికి కేటాయించిన కాలనీ ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులాల ఐక్య వేదిక నాయకులు చోడి ఆదినారాయణ, ఇప్పిలి రామారావు, పైడిరాజు, దుర్గారావు, కరీమ్, ఐశ్వర్య డిమాండు చేశారు. కార్యక్రమంలో గంద్రేటి శ్రీను, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ❖ రాష్ట్రప్రభుత్వం పాఠశాలలకు ఉచితంగానే వంట గ్యాస్‌ను సరఫరాచేసి, ప్రస్తుతం పనిచేస్తున్న వంట నిర్వాహకులకు న్యాయంచేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు సంఘం జిల్లా కార్యదర్శి బి.సుధారాణి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

విశ్వాస్ ఉపాధ్యాయ బృందాన్ని సత్కరించిన హెచ్‌ఎం

నియోజకవర్గ స్థాయి ప్రతిభా పరీక్ష

వేపాడ, న్యూస్‌టుడే: సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విశ్వాస్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నియోజవకర్గ స్థాయి ప్రతిభా పరీక్ష సోమవారం నిర్వహించారు. వేపాడ, లక్కవరపుకోట, శృంగవరపుకోట, కొత్తవలస మండలాలకు చెందిన జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. సోంపురం, గంగుబూడి, కళ్లేపల్లిరేగ పాఠశాలలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. వీరికి రూ.4,500, 3,000, 1,500ల నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. సంస్థ అధ్యక్షుడు చిరంజీవిరావు, రాజు పాల్గొన్నారు.

కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడిగా లోకాభిరామకోటి

ఎస్.కోట, కంటోన్మెంట్: భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా శివరామరాజుపేటకు చెందిన కొట్యాడ లోకాభిరామకోటి నియమితులయ్యారు. సోమవారం విజయనగరం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ నియామక పత్రం అందించారు.

వాసవీ పెనుగొండ పేరును స్వాగతిస్తున్నాం

కొత్తవలస, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ పేరును వాసవీ పెనుగొండగా మార్పుచేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు హర్షం వ్యక్తంచేశారు. తమకు అన్ని విషయాల్లో అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సంఘ నాయకులు శ్రీనివాసరావు, సత్యానందం, మల్లేశ్, సాయి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లలితకుమారిని సత్కరించిన నాయకులు

తైక్వాండోలో ప్రతిభ



అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయస్థాయి అండర్-17 తైక్వాండో పోటీల్లో విజయనగరం దుప్పాడకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ముఖేష్ విశ్వనాథ్ కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ పోటీలు గత నెల 21-23 వరకు ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

దుర్గాభవానీని అభినందిస్తున్న ప్రిన్సిపల్ సంధ్య

డెంకాడ, న్యూస్‌టుడే: మండలంలోని అక్కివరం వద్ద ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ ఏడాది (ఎంఈసీ) చదువుతున్న పి.దుర్గాభవానీ అండర్-19 కేటగిరిలో బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సీహెచ్ సంధ్య సోమవారం తెలిపారు. 69వ రాష్ట్రీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైన ఆమెను ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయిని వరహాలు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఉపనిషత్తుల సారాంశమే భగవద్గీత

గీతా పఠనం పోటీ విజేతలు

ఎస్.కోట, విజయనగరం కంటోన్మెంట్: ఉపనిషత్తుల సారాంశమే భగవద్గీత అని సిమ్ సంస్థ వ్యవస్థాపకుడు, న్యాయవాది బి.రామకృష్ణ అన్నారు. సోమవారం వేణుగోపాలస్వామి ఆలయంలో గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. భగవద్గీత 12వ అధ్యాయంపై పఠన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కటకం పావని, ఉపాధ్యాయిని వి.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక గీతా పారాయణం నిర్వహించారు. ❖ భగవద్గీత సర్వకాలికం, సర్వజనీనమని, కర్తవ్య నిర్వహణపై కృష్ణుడు అర్జునుడికి చేసిన హితబోధే భగవద్గీత అని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, శ్రీసాయి సత్సంగ సేవా సంఘం వ్యవస్థాపకుడు వరప్రసాద్ పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కె.ఎల్.పురంలోని గీతాంజలి పాఠశాలలో గీతా జయంతి నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం

ప్రముఖ భారతీయ తత్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రంలో కొలువైన అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వర ఆలయంలో శ్రీనివాసునికి అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు రమేష్ ఆచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు వేదమంత్రాల నడుమ కనుల పండువగా కల్యాణం జరిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

(c) eenadu

ఈనాడు
పశ్చిమగోదావరి

మంగళవారం డిసెంబరు 2, 2025

ఉన్నవి వదిలేసి.. వద్దన్నా కట్టేసి!

సొసైటీల పాలిట గుది బండల్లా గోదాములు

ఆచంటలో తుప్పల మధ్య ఇలా..

ఆచంట, న్యూస్‌టుడే: నాటి వైకాపా పాలకుల అనాలోచిత నిర్ణయాలు సహకార సంఘాల పాలిట శాపంగా మారాయి. కొన్ని మార్కెట్ యార్డుల ప్రాంగణాల్లో అవసరానికి మించి గోదాములు ఉన్నా అప్పటి పాలకులు పట్టించుకోకుండా నాబార్డు రుణంతో కొత్త నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో అధికారులు, త్రిసభ్య కమిటీలు వారిస్తున్నా పట్టించుకోకుండా శివార్లు, రవాణా సదుపాయం లేని ప్రాంతాల్లో గోదాములను నిర్మించడంతో వాటిలో చాలా వరకు నిరుపయోగంగా మిగిలాయి. వాటి నుంచి ఆదాయం లేకున్నా ప్రతి నెలా రుణ వాయిదా చెల్లించడం సొసైటీలకు భారంగా మారింది.

ఒక్కో నిర్మాణానికి రూ.35 లక్షలు.. వైకాపా హయాంలో నాబార్డు రుణంతో ఏలూరు జిల్లాలో 44, పశ్చిమ గోదావరిలో 38 ఎంపీఏసీఎస్ గోదాములు నిర్మించారు. ఆచంట మృత్యుంజయ విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆచంట, పెనుమంట్రలో నిర్మించిన గోదాముకు సరైన దారి లేకపోవడంతో అది నిరుపయోగంగా మిగిలింది. ఆచంటలో కొత్త లేఅవుట్ ప్రాంతంలో నిర్మించిన గోదామును రైతులు వినియోగించుకునే పరిస్థితి లేకపోవడంతో శీతల పానీయాల సంస్థకు లీజుకు ఇచ్చారు. పెండితవిల్లూరులో గోదామును ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.60 వేలకు లీజుకు ఇచ్చారు. జిల్లాలో పలు సొసైటీల ఆధ్వర్యంలో నిర్మించిన గోదాముల్లో కొన్నింటికి అరకొర అద్దె వస్తుండగా.. మరికొన్ని వృథాగా ఉన్నాయి. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.35 లక్షల వరకు వెచ్చించారు. ఈ అంశంపై జిల్లా సహకార అధికారి ఎ.శ్రీనివాసరావును సంప్రదించగా ప్రభుత్వం దీనిపై కమిటీ వేసిందన్నారు. వృథాగా ఉన్న గోదాములను వినియోగంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

ఇంటింటా వెలుగులు.. అభివృద్ధి పరుగులు

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రదర్శనలు తిలకించి.. విధానాలు ఆలకించి!

20 నిమిషాల పాటు స్టాళ్ల పరిశీలన

ఉంగుటూరు మండలం నల్లమాడులో సోమవారం నిర్వహించిన ప్రజా వేదికలో పాల్గొనేముందు.. ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్రదర్శనలను సీఎం చంద్రబాబు సందర్శించారు. సుమారు ఇరవై నిమిషాలపాటు అక్కడే గడిపారు. ప్రతి స్టాల్‌ను సందర్శించి రైతులు, వ్యాపారవేత్తలతో మాట్లాడారు. పలు రకాల వస్తువులు పరిశీలించి, వ్యాపారం నిర్వహణ విధానాలు తెలుసుకున్నారు.

➤ ఏలూరు టీటీడీకే ఆవరణలో 'సర్క్యులర్ టెరీ ఆక్వా సిస్టం' ఏర్పాటు చేసిన సయ్యద్ సుల్తానా, టి.కృపారాణి బృందం చేపడుతున్న చేపల సాగు పద్ధతుల్ని సీఎంకు వివరించారు. ఈ విధానాన్ని ఇతరులు అవలంబించి ఆదాయ మార్గాలు పెంచుకోవచ్చని చంద్రబాబు సూచించారు.

➤ ఉంగుటూరుకు చెందిన ఎస్.వేణి ఇంటి వద్దే కోళ్ల పెంపకానికి చిన్నపాటి పరిశ్రమ నెలకొల్పి.. ఆ పద్ధతిని ముఖ్యమంత్రికి తెలియజేయగా.. ఆయన భేషుగ్గా ఉందని కితాబిచ్చారు. ఈ తరహాలో కోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకునే వారికి తోడ్పాటునందించాలని సీఎం సూచించారు.

➤ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సీఎం సందర్శించి.. అక్కడ ప్రదర్శించిన తివాచీలను పరిశీలించారు. ఏలూరు తివాచీ పరిశ్రమకు పునర్వైభవం తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.


పశ్చిమ గోదావరి జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘానికి రూ.2,80,40,098 బోనస్ వచ్చింది. నమూనా చెక్కును చంద్రబాబు రైతులకు అందజేశారు.

బలం, బలగం కార్యకర్తలే

'తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగం.. గత ఎన్నికల్లో మీరు కష్టపడి కూటమిని గెలిపించారు. ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయఢంకా మోగించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. గొల్లగూడెంలో సోమవారం నిర్వహించిన ఉంగుటూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రాన్ని బాగు చేయాలని నేను, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాత్రింబవళ్లు పని చేస్తున్నాం. మీరు క్షేత్ర స్థాయిలో చిన్న విషయాలకూ అలుగుతున్నారు. భవిష్యత్తులో ఈ పరిస్థితి రానివ్వను. తెదేపా, జనసేన, భాజపా కలయిక చారిత్రక అవసరం' అని గుర్తు చేశారు.

ఈనాడు-ఏలూరు, న్యూస్‌టుడే- ఉంగుటూరు, ఏలూరు అర్బన్, గణపవరం: ప్రతి ఇంటా వెలుగులు నింపడమే లక్ష్యంగా.. జిల్లా అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సాగులో వినూత్న పద్ధతులతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సోమవారం చంద్రబాబు ఉంగుటూరు నియోజకవర్గ పర్యటన తెదేపా కార్యకర్తలు, కూటమి నాయకుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక సభ కార్యక్రమాల్లో చంద్రబాబు పాల్గొన్నారు. గోపీనాథపట్నం, నల్లమాడు, గొల్లగూడెం గ్రామాల్లో వివిధ కారణాలతో నిలిచిపోయిన సహా ఇంకా కొత్తగా ఏమైనా చేయాల్సినవి ఉంటే వాటినీ పూర్తి చేసి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించడంతో గ్రామస్థుల్లో సంతోషం వ్యక్తమైంది. కార్యకర్తల సమావేశం ముగిశాక, హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎంకు వీడ్కోలు పలకడానికి ఎమ్మెల్యే ధర్మరాజు వెళ్లగా ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడారు. సమన్వయంతో ముందుకెళుతున్నారని, ఈ విధానం కొనసాగించాలని సూచించారు.

పర్యటన సాగిందిలా..

ఉదయం ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరిన చంద్రబాబు.. 11:37 గంటలకు గొల్లగూడెం చేరుకున్నారు. రోడ్డు మార్గంలో గోపీనాథపట్నం చేరుకుని. . కిడ్నీ బాధితురాలు నాగలక్ష్మికి పింఛను అందజేశారు. అక్కణ్నుంచి నల్లమాడు చేరుకుని ప్రజా వేదికలో పాల్గొన్నారు. భోజన విరామం తర్వాత కార్యకర్తలతో సమావేశమయ్యారు. సాయంత్రం 4:59 గంటలకు ఉండవల్లి బయల్దేరారు.

- అందరి సహకారం.. ఉపాధి మార్గాలతో సాకారం
- ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు ఆకాంక్ష

ప్రజా వేదిక వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

మార్గదర్శులకు సత్కారం

ఆర్నవ్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత మనోజ్‌కుమార్ సోంకార్, గ్రీన్ ఆసియా ఇంపెక్స్ పరిశ్రమ అధినేత పసుపులేటి వెంకట రామారావుకు జ్ఞాపిక ఇస్తున్న చంద్రబాబు, ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరుకు వరాల జల్లు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఉంగుటూరు నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారు. ప్రజా వేదికలో ఎమ్మెల్యే ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, పెదనిండ్రకొలను పీహెచ్‌సీకి, గణపవరంలో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి, పోలసానిపల్లిలోని గురుకుల పాఠశాలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ప్రకటించారు. నల్లజర్ల- లక్ష్మీనగరం ర.భ.శా. రహదారికి నిధులు కేటాయిస్తానని.. వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

కొల్లేరు సమస్య ఎక్కడ వరకు వచ్చింది?

కొల్లేరు సమస్య ఎక్కడ వరకు వచ్చిందంటూ సీఎం చంద్రబాబు ఆరా తీశారు. నల్లమాడులో వివిధ ప్రదర్శనల సందర్శనానంతరం. . అక్కడున్న ఎమ్మెల్యే కామినేనితో కొల్లేరుపై కాసేపు మాట్లాడారు. ఈ నెల 4న సుప్రీంకోర్టుకు నివేదిక అందజేస్తామని బదులిచ్చారు.

ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలపై మళ్లీ విచారణ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో నిరుపేదల ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన గృహ నిర్మాణ సంస్థకు చెందిన ఐదుగురు అధికారులపై మళ్లీ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ కార్యదర్శి సహదిత్ వెంకట త్రివినాగ్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ జి.సత్యనారాయణను నియమించింది. వివరాల్లోకి వెళ్తే.. నూజివీడు మండలంలో ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయని.. మెటీరియల్‌ను పక్కదారి పట్టించి చేతివాటం చూపించారని అప్పటి నూజివీడు సబ్ కలెక్టర్ ధ్రువీకరించారు. దీనిపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అక్రమాలకు పాల్పడిన అప్పటి అయిదుగురు అధికారులపై చర్యలు తీసుకున్నారు. వారు తమపై చర్యలు నిలుపుదల చేయాలని ప్రభుత్వానికి అప్పీలు చేసుకోవడంతో మళ్లీ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పుడు నిజమని తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది.

నరసాపురంలో 20.8 మి.మీ వర్షం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా నరసాపురంలో 20.8 మి.మీ వర్షపాతం నమోదైంది. యలమంచిలి 19.2, ఆచంట 16.0, మొగల్తూరు 15.4, పాలకొల్లు 15.2, పోడూరు 12.2, మిగిలిన మండలాల్లో పది మి.మీ కంటే తక్కువ వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 8.3 మి.మీగా నమోదైంది.

రైతేరాజు 6లో
వినూత్నం.. విభిన్నం.. విత్తనశుద్ధి తప్పనిసరి
కొబ్బరి సాగులో.. ఎరువుల యాజమాన్యమే కీలకం!

రబీకి వేళాయె

2.25 లక్షల ఎకరాల్లో సాగు

ఉండి, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు, గణపవరం తదితర మండలాల్లో ఖరీఫ్ పంట ఒడ్డుకు చేరిన చోట్ల నారుమడులు పోసుకునే పనిలో ఉన్నారు. మిగిలిన చోట్ల విత్తనాలు సేకరిస్తున్నారు. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 2.25 లక్షల ఎకరాల్లో సాగు కావొచ్చు.

దమ్ము చేస్తున్న యంత్రం

జల వనరుల శాఖ ఉండి, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ల పరిధిలోని ఉండి, పాలకోడేరు, ఆకివీడు, అత్తిలి, కాళ్ల, నరసాపురం, పాలకొల్లు, భీమవరం, ఆచంట, వీరవాసరం, పెనుమంట్ర, మొగల్తూరు, యలమంచిలి తదితర మండలాల్లోని వేలాది ఎకరాల భూములు డెల్టా కాలువల శివారున, మెరకలో ఉన్నాయి. వీటికి ఆశించిన స్థాయిలో నీరు అందితేనే పంట పండుతోంది. చాలా చోట్ల రైతులు ఇంజిన్లు, కారేలతో నీటిని తోడుతారు.

80 శాతం విత్తనాల సేకరణ..

- రబీకి 48 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. రైతు స్థాయిలోనే అత్యధికంగా 80 శాతం విత్తనాల సేకరణ జరుగుతోంది. ప్రైవేట్ వ్యాపారుల వద్ద మరో 7,800 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా ఎంటీయూ 1121 (శ్రీధృతి), ఎంటీయూ 1426 (చిరుసంచి), ఎంటీయూ 1282 తదితర రకాలను అధికారులు సూచిస్తున్నారు.
- జిల్లాలో సొంత భూములున్న రైతులు 1.03 లక్షల మంది కాగా మరో 72 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. వారిలో 56 వేల మందిని కౌలు రుణాలు పొందేందుకు అర్హులుగా తేల్చారు.
- 41,270 టన్నుల యూరియా, 63 వేల టన్నుల డీఏపీ, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు అవసరమని గుర్తించారు. 10 వేల టన్నుల యూరియా, 40 వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. మిగిలిన ఎరువులు త్వరలో రానున్నాయని చెప్పారు. రైతులు వీలైనంత త్వరగా నారుమడులు పోసుకోవాలని ఆయన సూచించారు.

నెరవేరుతుందా వేసవికి గూడెం ప్రజల ఆకాంక్ష

ఈనాడు డిజిటల్, తాడేపల్లిగూడెం: గత పాలకుల నిర్లక్ష్యంతో శంకుస్థాపనలకే పరిమితమైన తాడేపల్లిగూడెంలో రెండో వేసవి జలాశయం పనులు ఈ ప్రభుత్వంలో ప్రారంభమయ్యాయి. పట్టణంలోని సుమారు 22 వార్డులతో పాటు శివారునున్న ఏడు ప్రాంతాలకు మంచినీటిని అందించాలన్నది ఉద్దేశం.

జలాశయంలో నిలిచిపోయిన నీరు

తాడేపల్లిగూడెంలోని 35 వార్డుల్లో 1.25 లక్షల జనాభా ఉంది. సుమారు 18 వేల కుళాయిలకు రోజూ 12 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణం విస్తరించడంతో నీటి అవసరాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రోజుకు 20 మిలియన్ లీటర్లు కావాలి. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత తెదేపా హయాంలో అమృత్-2 నిధులతో కుంచనపల్లి వద్ద కడియపు చెరువులోని 54.93 ఎకరాల విస్తీర్ణంలో 980 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసేలా పథకానికి రూపకల్పన చేశారు. ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి.

నిర్లక్ష్యమిది.. ఇది పూర్తయి అందుబాటులోకి వస్తే 20 వేల మందికి తాగునీటి ఇబ్బందులు తీరేవి. జిల్లాలో ఏ మున్సిపాలిటీలో లేని విధంగా 24 గంటల పాటు మంచినీటిని సరఫరా చేసే అవకాశం ఉండేది. కానీ, వైకాపా పాలనలో మూడు పర్యాయాలు ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపనలు చేసి, రెండు శిలాఫలకాలు ఏర్పాటు చేసినా పనులు మొదలు కాలేదు. ఫలితంగా గుక్కెడు మంచి నీటి కోసం నేటికీ స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

బొలిశెట్టి చొరవతో.. పుర ప్రజల తాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చొరవ చూపడంతో గతేడాది పనులు మొదలుపెట్టారు. సమస్యను ఎప్పటికప్పుడు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లడంతో అమృత్ 2.0, మున్సిపాలిటీ నిధులతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు అవసరమైన సూచనలు చేస్తున్నారు.

కడియపు చెరువులో నీటిని భారీ మోటార్ల ద్వారా తోడి పూర్తిగా ఎండబెట్టారు. చెరువు చుట్టూ ఉన్న గట్లను పటిష్ఠం చేయడంతో పాటు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సన్నాహాలు చేశారు. ప్రత్తిపాడులో ఏలూరు కాలువలోని నీటిని ఎస్ఎస్ ట్యాంకు-2కు తీసుకొచ్చేందుకు పైపులైన్ల పనులు దాదాపు పూర్తి చేశారు. చెరువులోని నీటిని పాతూరులో నీటిశుద్ధి కేంద్రానికి తీసుకెళ్లేందుకు వీలుగా పైపులైన్లు ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మొన్నటి వర్షాలకు కొంత కాలంగా పనులు నిలిచిపోయాయి. పది రోజుల్లో మొదలవుతాయని డీఈ విజయ్‌కుమార్ తెలిపారు.

రాయగలరా.. చదవగలరా..

అభ్యసన సామర్థ్యాల గుర్తింపు సర్వే

భీమవరం పట్టణం, పెనుమంట్ర, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా విద్యాశాఖ ప్రణాళికలు అమలు చేస్తోంది. దీని కోసం 1 నుంచి 5వ తరగతి చదువుతున్న వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం అక్షరాస్యత అభ్యాసంపై బేస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక యాప్‌లో ప్రశ్నాపత్రం వస్తోంది. వాటి ద్వారా ఒకటో తరగతి విద్యార్థితో అక్షరాలు రాయడం, గుర్తించడం, ఆపై తరగతులు వారికి అక్షరాలు కలిపి చదవడం, రాయడం, సంఖ్యలు గుర్తించడం చేస్తారు. వాటికి ఇచ్చే సమాధానం ఆధారంగా మార్కులు వెంటనే నమోదవుతాయి.

డిజిటల్‌గా నమోదు.. లీప్ యాప్‌లో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఓఆర్ఎఫ్ టూల్ సహాయంతో ఎస్‌సీఈఆర్టీ చరవాణి యాప్‌ను రూపొందించారు. ఇది డిజిటల్ సర్వే. ఇప్పటి వరకు జిల్లాలో 53 శాతం పూర్తయిందని డీఈవో ఇ.నారాయణ తెలిపారు. సర్వే ఫలితాలు ఆధారంగా జనవరి 6 నుంచి 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తారు.

జిల్లాలో పాఠశాలలు	1167
విద్యార్థులు	30,454
క్లస్టర్లు	89

పరిరక్షణ ఆమడ దూరం!

ఆక్రమించి ఆక్వా చెరువుల ఏర్పాటు

నరసాపురం మండలంలో మడ అడవులు

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: పశ్చిమలో గోదావరి నది, ఉప్పుటేరు, సముద్రంలో కలిసే ప్రాంతాల్లో సహజ సిద్ధంగా రూపుదిద్దుకున్న మడ అడవుల విధ్వంసం యథేచ్ఛగా కొనసాగుతోంది. పర్యావరణ సమతుల్యతను కాపాడే ఈ అడవులను పరిరక్షించాల్సిన స్థానిక అధికారులు ఆక్రమణలపై ఉదాసీనంగా వ్యవహరిస్తుండమే దీనికి కారణమనే విమర్శలున్నాయి.

దస్త్రాల్లోనే లెక్కలు.. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, భీమవరం మండలాల్లో ఉప్పుటేరు, గోదావరి తీరం వెంబడి మడ అడవుల విస్తీర్ణం గణనీయంగా తగ్గి అంతరించిపోయే దశకు చేరింది. మిగిలిన వనాలను పరిరక్షించి పర్యాటక ప్రాంతంలో అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ సీహెచ్ నాగరాణి చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఇటీవల దర్భరేవు ప్రాంతంలో అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఇంతలోనే మడ అడవులను తొలగించి భారీ స్థాయిలో ఆక్వా చెరువులు ఏర్పాటు చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతంలో అటవీ శాఖకు క్షేత్రస్థాయి సిబ్బంది లేరు. కానీ రెవెన్యూ దస్త్రాల్లో అటవీ విస్తీర్ణం లెక్కలు పక్కాగా ఉన్నాయి. వీటిపై స్థానిక రెవెన్యూ సిబ్బందికి కూడా అవగాహన ఉంది. అక్రమార్కులు మడచెట్లను తొలగించి చెరువులుగా మార్పు చేస్తున్నా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఉపగ్రహ చిత్రాలతో గుర్తింపు.. దర్భరేవు ఏటిగట్టు ప్రాంతంలో మడ అడవులు ధ్వంసమవుతున్నట్లు భారత అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ త్రినాథ్‌కుమార్ ఇటీవల ఉపగ్రహ ఛాయా చిత్రాల ద్వారా గుర్తించారు. దీనిపై కలెక్టర్‌కు, అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. గత నెల 19న అటవీశాఖ సిబ్బంది ఆ ప్రాంతాన్ని పరిశీలించి వనాలు ధ్వంసమైనట్లు నిర్ధారించారు. తరువాత కలెక్టర్ సూచనలతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమై అటవీ శాఖాధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి మడ అడవులను ధ్వంసం చేయడానికి వినియోగించిన పొక్లెయిన్‌ను సీజ్ చేశారు. దీనికి బాధ్యులైన ఎనిమిది మందిపై కేసులు నమోదు చేయడంతో రూ.2,51,631 అపరాధ రుసుము విధించారు. ఈ అంశంపై ఫారెస్టు రేంజి అధికారి (భీమవరం) ఎం.కరుణాకర్‌ను 'న్యూస్‌టుడే' సమాచారం కోరగా వాస్తవమేనని నిర్ధారించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

పింఛను నగదులో కొంత పొదుపు చేసుకోండి: రఘురామ

నగదు అందజేస్తున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, అధికారులు

ఉండి, న్యూస్‌టుడే: దేశంలోనే అత్యధికంగా పింఛన్ల మొత్తాన్ని అందజేస్తున్న ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రజలందరూ గ్రహించాలని, ఆ నగదులో కొంత భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేసుకోవాలని ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. ఉండి పడవలరేవులో ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి సోమవారం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.50 వేల కోట్లు అందజేసిందని, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా ప్రజలకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారని అన్నారు. డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, డీపీఎం మురళీకృష్ణ, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఎం రాజేష్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు: కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దని కలెక్టర్ నాగరాణి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె అర్జీదారులతో స్వయంగా మాట్లాడారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్జీలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి సత్వర పరిష్కారం చూపాలన్నారు. ఒకసారి వచ్చిన ఫిర్యాదు మరోసారి రాకుండా చూసుకోవాలన్నారు. మొత్తం 134 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డీఆర్వో శివన్నారాయణరెడ్డి, గ్రామవార్డు సచివాలయాల జిల్లా అధికారి దోసిరెడ్డి, గృహ నిర్మాణ సంస్థ పీడీ పిచ్చయ్య పాల్గొన్నారు.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు శాఖకు 'మీకోసం' ద్వారా వచ్చే అర్జీలను చట్టపరిధిలో పరిష్కరించి వాటి వివరాలను అర్జీదారులకు తెలియజేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమానికి 13 అర్జీలు వచ్చాయని చెప్పారు.

D.N.R College (Autonomous), Bhimavaram
(Affiliated to Adikavi Nannaya University)
డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షల నోటిఫికేషన్

డి.యన్.ఆర్. కళాశాల(అటానమస్) భీమవరంలో 2001-02 నుండి 2019-20 మధ్య సంబంధిత డిగ్రీ కోర్సులలో (కామన్ కోర్ సిస్టమ్/ రివైజ్డ్ కామన్ కోర్ సిస్టమ్/ ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్) క్రింద ప్రవేశం పొంది వారు సంబంధిత బి.ఎ./ బి.కామ్.,/ బి.ఎస్సి., డిగ్రీ కోర్సులలో (థియరీ / ప్రాక్టికల్ / రెండూ) ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్ పరీక్షలు జనవరి/ఫిబ్రవరి 2026 నెలలో నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. అర్హులైన విద్యార్థులు ఈ స్పెషల్ డ్రైవ్ పరీక్షల సౌకర్యాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని కోరటమైనది. ఈ స్పెషల్ డ్రైవ్ పరీక్షల తర్వాత వారికి మునుపటి బ్యాక్ లాగ్ సబ్జెక్టులను పూర్తి చేయడానికి **విద్యార్థులకు మరో అవకాశం ఇవ్వబడదు.** ఈ స్పెషల్ డ్రైవ్ పరీక్షల ఫలితాలు వెల్లడించిన తర్వాత రీ వాల్యుయేషన్, రీ-టోటలింగ్, జవాబు పత్రాల భౌతిక పరిశీలన, జవాబు పత్రాల ఫోటో కాపీ సరఫరా మొదలగు సదుపాయాలకు అవకాశం లేదు. ఈ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు జనవరి/ఫిబ్రవరి, 2026లో ప్రారంభమవుతాయి. పరీక్ష ఫీజు చెల్లింపునకు ఆఖరి తేది : 31-12-2025.

మరిన్ని వివరాల కోసం సంప్రదించండి:
08816-228342, 224119, మొబైల్: 9390449007, 9491334119

జి.మోజెస్ – ప్రిన్సిపాల్
డి.శ్రీనివాస రాజు – కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) – సెక్రటరీ అండ్ కరస్పాండెంట్

(c) eenadu

ట్రిపుల్ ఐటీ ఎన్‌సీసీ క్యాడెట్ల సత్తా

కౌంటర్ డ్రోన్ ఆవిష్కరణకు పురస్కారం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీ ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. వారు తయారు చేసిన కౌంటర్ డ్రోన్ ఎయిర్ మానిటరింగ్ అండ్ న్యూట్రలైజేషన్ సిస్టమ్ ఏపీ, తెలంగాణ పరిధిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన ఐడియా అండ్ ఇన్నోవేషన్ కాంపిటీషన్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంది.

మొదట ఇక్కడే.. నవంబరు 2, 3 తేదీల్లో నూజివీడులో జరిగిన పోటీల్లో ట్రిపుల్ ఐటీ ఎన్‌సీసీ క్యాడెట్లు సీహెచ్.యువ సాయి ప్రదీప్, బి.త్రిలోక్ వారు తయారు చేసిన కౌంటర్ డ్రోన్ ఎయిర్ మానిటరింగ్ అండ్ న్యూట్రలైజేషన్ సిస్టమ్‌ను మొదట ప్రదర్శించారు. ఇక్కడ అందర్ని ఆకట్టుకుంది. అనంతరం అదే నెల 10 నుంచి 16 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా లెవల్ ఐడియా అండ్ ఇన్నోవేషన్ పోటీలో పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా వచ్చిన 85 అత్యుత్తమ ప్రాజెక్టుల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు టాప్ 30లో నిలిచారు. ఏపీ, తెలంగాణ పరిధిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆర్జీయూకేటీ డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ సీహెచ్.ఎస్.ఆర్.నవీన్‌కుమార్ తదితరులు అభినందించారు.

తయారు చేసిన డ్రోన్‌తో యువసాయిప్రదీప్, త్రిలోక్

దేశరక్షణే ధ్యేయంగా.. ఆధునిక యుద్ధ తంత్రాల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో దేశ రక్షణకు ముప్పు వాటిల్లనీయకుండా ఉండేలా దీనిని తయారు చేశాం. ఈ డ్రోన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ, సెన్సర్ సాయంతో పేలుడు పదార్థాలు, ఇతర ప్రమాదకర వస్తువులను మోసుకువచ్చే శత్రువులను గుర్తిస్తుంది. వెంటనే గ్రౌండ్ స్టేషన్‌కు హెచ్చరికలు పంపుతుంది. కేవలం గుర్తించడమే కాకుండా శత్రువుల డ్రోన్లను గాలిలోనే నిర్వీర్యం చేయగల సామర్థ్యం దీని సొంతం.

- సీహెచ్.యువ సాయిప్రదీప్ (మండవల్లి), బి.త్రిలోక్ (విజయనగరం జిల్లా భోగాపురం మండలం గుడివాడ)

వినూత్నం.. విభిన్నం..

అంతర పంటలతో సాగు పండగ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంకు చెందిన రైతు డా.పాకలపాటి గాంధీ సేద్యాన్ని పండగ చేస్తున్నారు. వ్యవసాయాన్ని అమితంగా ప్రేమించే ఆయన మొదట్లో సంప్రదాయ పంటలైన వరి, చెరకు సాగు చేసి నష్టాలు చవిచూశారు. ఆ నష్టాల నుంచి పాఠాలతో వినూత్న పద్ధతిలో సాగు చేయాలన్న ఆలోచన ఆచరణలో పెట్టారు. తనకున్న 22 ఎకరాల్లో కొబ్బరి, కోకో, వక్క, మిరియం, పిప్పళ్ల ప్రధాన అంతర పంటలుగా సాగు చేయడమే కాకుండా తక్కువ కాలంలో చేతికొచ్చే అరటి, పసుపు, అల్లం, డ్రాగన్ ఫ్రూట్, చేమ దుంప, కంద ఇలా 25 రకాల బహుళ పంటలను సాగు చేస్తున్నారు. ఇలా ఒకటి తర్వాత మరో పంట చేతికొచ్చేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. గతంలో ఒకే రకం పంట సాగు చేయడం వల్ల ఎకరానికి రూ.50వేలు ఆదాయం రాగా ఇందులో కనీసం పెట్టుబడి ఖర్చులు పోను కూలి కూడా రాని పరిస్థితి అని రైతు చెబుతున్నారు. ప్రస్తుతం బహుళ పంటలు సాగు చేయడంతో ఒక పంటలో వచ్చే నష్టాన్ని మరో పంట భర్తీ చేయడంతో లాభం చేకూరుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఎకరానికి రూ.2లక్షలు నుంచి 2.50లక్షలు ఆదాయం వస్తుందని తెలిపారు.

తిరుమలంపాలెంలో బహుళ పంటలు సాగు చేస్తున్న పాకలపాటి గాంధీ

లాభదాయకంగా ఉండేలా..

ఆరు అంతస్తులుగా 30 రకాల పంటలను సాగు చేస్తున్నా. ఒకే పంట సాగు చేయడం వల్ల కూలి కూడా గిట్టని పరిస్థితి. ఎక్కువ పంటలతో నేలను కప్పి ఉంచడం వల్ల కలుపు కూడా రాదు. ఒక పంటకు పెట్టే నీరు అన్ని పంటలకు సరిపోతుంది. ఎక్కువ పంటలు ఉన్నాయి కదా అని ఎక్కువ నీరు అవసరం ఉండదు. పూర్తిగా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తున్నా. ఈ విధానం చాలా లాభసాటిగా ఉంది.

- పాకలపాటి గాంధీ, రైతు, తిరుమలం పాలెం

రైతేరాజు

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: మామిడిలో తేనె మంచు పురుగు ఉధృతి కనిపిస్తోంది. నివారణ ఎలా?

- చంద్రరావు, ద్వారకాతిరుమల

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

సమాధానం: కొత్త చిగురు వస్తున్న చెట్లను తేనె మంచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. లేకుంటే తోటను శుభ్రంగా ఉంచుకోవాలి. తోటల్లో గుబురుగా, అడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించుకోవాలి. ఇలా చేయడం వల్ల కొమ్మలపై గాలి తగిలి సూర్యరశ్మి ప్రసరిస్తుంది. తోటలు, పాదుల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. చిగుర్లు తడిచేలా 5 శాతం అజాడిరక్టిన్ 3000 పీపీఎం 2 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటిలో కలిపి మార్చి మార్చి పిచికారీ చేయాలి.

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

శ్రీవారి గోశాలలో మహాశాంతి హోమం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి గోశాలలో మహాశాంతి హోమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల గోశాలలోని గోవులు తరచూ మృతి చెందుతుండటంతో దాని నివారణ కోసం పండితులు ఈ క్రతువు జరిపించారు. ఆలయ గోశాలలో యజ్ఞ గుండాన్ని ఏర్పాటు చేసి, అగ్నిప్రతిష్ఠాపన చేసి మహా శాంతి హోమాన్ని జరిపారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు.

యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగ యువతకు కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏలూరులోని డీఎల్‌టీసీ ప్రిన్సిపాల్ డి.భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద పీఎమ్ టెక్నీషియన్ కంప్యూటింగ్, పెరిఫెరల్స్ కోర్సులో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, ఆపై కోర్సులు చదివి, 15 నుంచి 35 సంవత్సరాల వయస్కులు అర్హులన్నారు. ఈ నెల 6లోగా కలెక్టరేట్ సమీపంలోని డీఎల్‌టీసీలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 94934 82414 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

అసత్య ఆరోపణలతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు

న్యాయం చేయాలంటూ సీఎంకు మాజీ ఎమ్మెల్యే విజ్ఞప్తి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: తనపై పెట్టిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును విచారణ చేయించి న్యాయం చేయాలని, అసత్య ఆరోపణలు చేసిన ఫిర్యాదుదారులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే కొండ్రెడ్డి విశ్వనాథం సీఎం చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. నల్లజర్లలో సోమవారం జరిగిన ప్రజావేదిక వద్ద సీఎంని కలిసి వినతిపత్రం అందజేశారు. భీమడోలులో తనకు 4.25 ఎకరాల భూమి ఉందని, దానిలో 1.50 ఎకరం భూమిని భీమడోలుకి చెందిన కత్తవల్లి చంద్రమౌళి తనకు విక్రయించినట్లు, వారసత్వంగా తనకు భూమి సంక్రమించిందంటూ నకిలీ వీలునామా పత్రాలు సృష్టించారన్నారు. ఈ క్రమంలో కులం పేరుతో దూషించానని, అసత్య ఆరోపణలు చేస్తూ 2022 అక్టోబరు 16న తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న విశ్వనాథం

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి: కలెక్టర్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి వద్ద అవగాహన ప్రదర్శనను సోమవారం ఆమె ప్రారంభించారు. జిల్లాలో సుమారు 1500 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, గర్భిణులకు వ్యాధి సోకకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో రవిబాబు, డీసీహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ, ఆసుపత్రి పర్యవేక్షకుడు లక్ష్మణ్ జీవానంద్ పాల్గొన్నారు.

ప్రదర్శనలో పాల్గొన్న నాగరాణి, అధికారులు

విద్యార్థులు నాయకులుగా ఎదగాలి..

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఐదేళ్ల అమరావతిలో మాక్ అసెంబ్లీకి హాజరై వచ్చిన జిల్లాకి చెందిన ఎనిమిది మంది విద్యార్థులను కలెక్టర్ నాగరాణి సోమవారం అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలు, పతకాలను అందజేశారు. చక్కటి ప్రతిభ కనబరిచారంటూ మెచ్చుకున్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డీఆర్వో శివన్నారాయణరెడ్డి, డీఈవో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

2,26,995 మందికి పింఛన్లు..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పథకంలో జిల్లాలో 2,26,995 మందికి రూ.97.29 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరం 11వ వార్డు గునుపూడి ఆదురువారిపేటలో లబ్ధిదారులకు సోమవారం పింఛన్లు అందజేశారు. ప్రతి నెలా ఇంటికి వచ్చి పింఛను ఇస్తున్నారా, సకాలంలో అందుతుందా, ఎంత ఇస్తున్నారు, ఆర్థికంగా ఎలా ఉంది అని పింఛనుదారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పింఛను సొమ్ముతో కొంత మొత్తాన్ని పొదుపు చేసుకోవాలని సూచించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు : జేసీ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని సంబంధిత అధికారులతో ఆయన సోమవారం కలెక్టరేట్ నుంచి జూమ్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ధాన్యంలో తేమశాతంపై రైతులకు రైస్ మిల్లర్లు సహకరించాలన్నారు. పొలాల వద్ద ధాన్యం తడవకుండా సరిపడా బరకాలను అందించాలన్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఉన్న వసతులు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: వరి నారు మడి వేసే ముందు కచ్చితంగా విత్తన శుద్ధి చేయాలని.. దీని వల్ల చాలా ప్రయోజనాలున్నాయని మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. రబీ నారుమడి వేసే ముందు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. వివరాలు ఇవీ.. ★ కిలో పొడి విత్తనానికి 2.5 గ్రాముల కార్బండిజమ్ కలిపి శుద్ధి చేసుకోవాలి. లేదా మొలకగట్టి వేసుకొనేటప్పుడు లీటరు నీటికి గ్రాము కార్బండిజమ్ కలిపి విత్తనాన్ని 24 గంటలు నానబెట్టాలి. తరువాత 24 గంటలు మండి కడితే మొలక శాతం పెరుగుతుంది. ★ ఖరీఫ్‌లో పండిన విత్తనాలను రబీ పంటకు వాడాలంటే తప్పనిసరిగా గింజల్లో నిద్రావస్థను తొలగించాల్సిన అవసరం ఉంది. వరి రకాలను బట్టి నిద్రావస్థ కాలపరిమితి వేర్వేరుగా ఉంటుంది. దీనిని గుర్తించి సాగు చేస్తేనే సత్ఫలితాలు వస్తాయి.

కొబ్బరి సాగులో.. ఎరువుల యాజమాన్యమే కీలకం!

మార్టేరు, న్యూస్‌టుడే: సరైన ఎరువుల యాజమాన్యం పాటిస్తే కొబ్బరిలో మంచి దిగుబడులు పొందవచ్చని తణుకు ప్రాంతీయ ఉద్యానశాఖాధికారిణి కె.ప్రియదర్శిని తెలిపారు. కొబ్బరి చెట్ల వయసును బట్టి ఏడాదికి రెండు దఫాలుగా ఎరువులు వేసుకోవాలి. ★ 1- 4 ఏళ్ల వయసున్న చెట్లకు అర కిలో యూరియా, కిలో చొప్పున సింగిల్ సూపర్ పాస్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 20 కిలోల పశువుల ఎరువు వేసుకోవాలి. ★ 5 ఏళ్ల వయసున్న చెట్లకు కిలో యూరియా, 2.5 కిలోల చొప్పున సింగిల్ సూపర్ పాస్ఫేట్, 2.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 25 కిలోల పశువుల ఎరువును ఉపయోగించాలి. ★ ప్రతి చెట్టుకు 2 కిలోల వేప పిండి వేస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నేలలో సమ పాళ్లలో తేమ ఉన్నప్పుడు చెట్టు చుట్టూ 3 నుంచి 5 అడుగుల దూరంలో పళ్లెం చేయాలి. దానిలో ఎరువులను వేశాక మట్టితో కప్పి ఉంచాలి. ★ ఎరువులు వేసిన 15 రోజుల తరువాత నేలలో వేసుకునే బోరాన్‌ను 5 సంవత్సరాల లోపు చెట్లకు 50 గ్రాములు, 5 ఏళ్లు పైబడిన చెట్లకు 100 గ్రాముల చొప్పున వేసుకోవాలి.

రొయ్యలకు ఈహెచ్‌పీ సోకితే తీవ్ర నష్టం

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆక్వా సాగులో రొయ్యలకు ఈహెచ్‌పీ వ్యాధి సోకితే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆక్వారంగ నిపుణుడు అడబాల గోపాలరావు తెలిపారు. దీని నివారణకు ఔషధాలు లేవని యాజమాన్య పద్ధతులతోనే నివారణ సాధ్యమని వెల్లడించారు.

వ్యాధి వ్యాప్తి ఇలా.. హిపటో పాంక్రియాట్రిక్ మైక్రో స్పోరిడియాసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా ఎంటరో సైటోజూన్ హిపటో పినై (ఈహెచ్‌పీ) వ్యాధి సంక్రమిస్తుంది. విదేశాల నుంచి బ్రూడర్‌తో పాటు, హేచరీల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, సాగు చెరువుల్లో ఒక చెరువులోని రొయ్యల నుంచి మరో చెరువులోని రొయ్యలకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన రొయ్యల్లో ఎదుగుదల లోపిస్తుంది. క్రమంగా మృత్యువాత పడతాయి.

నివారణ చర్యలు.. రైతులు హేచరీలో రొయ్య పిల్లల కొనుగోలుకు ముందే ఈహెచ్‌పీ నిర్ధారణకు పీసీఆర్ పరీక్ష చేయించి వ్యాధి లేదని నిర్ధారణ అయిన వాటినే చెరువుల్లో వదలాలి. చెరువుల్లో ఈహెచ్‌పీ వ్యాప్తి చెందకుండా ప్రోబయోటిక్స్ వినియోగించాలి. అది అంటువ్యాధి. పక్క చెరువుల నుంచి వ్యాధి కారక రొయ్యలను కాకులు, కొంగలు, పాములు, ఇతర జలచరాలు తీసుకురాకుండా నిరోధించేందుకు సాగు చెరువుల చుట్టూ వలలు, ఆపాలతో కంచె ఏర్పాటు చేయాలి. చెరువు వద్ద పనిచేసే కార్మికులు శుభ్రత పాటించాలి. పట్టుబడి చేసిన అనంతరం నేల కనబడేలా ఆరబెట్టాలి. తదుపరి సాగు చేసే ముందు చెరువులో 10నుంచి 15 చోట్ల మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌లో పరీక్ష చేయించి ఈహెచ్‌పీ ఉన్నట్లు నిర్ధారణ అయితే హెక్టారుకు ఆరుటన్నుల గుల్లసున్నం తడి నేలపై చల్లాలి. వారం రోజుల తర్వాత చెరువులో అడుగు లోతు నీరు పెట్టి ఆ నీటిని బయటకు తీసివేయాలి. తిరిగి చెరువులో నీటిని నింపి క్లోరిన్ లేదా పొటాషియం పెర్మాంగనేటు చల్లాలి. అడుగు భాగంలోని మురుగు ఎప్పటికప్పుడు తొలగించాలి.

మీరైనా న్యాయం చేయండి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమస్యలతో సతమతమవుతున్నాం.. అండగా నిలవండి...మా దుస్థితిని అర్థం చేసుకుని ఆసరా ఇవ్వండి. స్థానికంగా మాకు న్యాయం జరిగే పరిస్థితి లేదు. మీరైనా న్యాయం చేయండి. ఇలా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కి వచ్చి వారి సమస్యల్ని ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నారు. మీరైనా స్పందించి సాయం చేయాలంటూ వేడుకుంటున్నారు.

☛ మా అబ్బాయి సమీర్‌కి పద్నాలుగేళ్లు. భీమవరంలో అంధ పాఠశాలలో చదువుతున్నాడు. పరీక్షలు రాయాలంటే మరొకరు సాయంగా(స్క్రైబ్) ఉండాలి. అతనికి ఆర్థోపెడిక్ సమస్యతో పాటు అంధత్వం, మరుగుజ్జు సమస్యలున్నాయి. కాని మొదటి దానికి మాత్రమే సదరం ధ్రువపత్రం ఇచ్చారు. అంధత్వ సమస్యకి ధ్రువీకరణ ఇచ్చే ఆప్షన్ లేదంటున్నారు. కలెక్టర్‌ను కలిసి మా సమస్య చెప్పుకోవడానికి వచ్చాం.

- తోట వెంకటేశ్వరరావు, పరిమెళ్ల, పెంటపాడు మండలం

☛ 'దివ్యాంగురాలినైన నేను భీమవరంలోని సోమేశ్వరాలయానికి తరచూ వెళ్తుంటా. దేవదాయశాఖ ఈవో నాతో అసభ్యంగా ప్రవర్తించాడు. గట్టిగా నిలదీస్తే క్షమాపణ చెప్పాడు. ఇలాంటి వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. అందుకే కలెక్టరేట్ వరకు వచ్చా' అని ఓ బాధితురాలు ఉన్నతాధికారులకు తన గోడు వెళ్లబోసుకున్నారు.

జ్యోతి వెలిగిస్తున్న శ్రీధర్ స్వామిజీ

సమ్మేళనానికి హాజరైన భక్తులు

హైందవ ధర్మాన్ని రక్షించుకుందాం..

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రపంచానికి మార్గదర్శనం చేసిన హైందవ ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పెనుగొండ వాసవి పీఠాధిపతి శ్రీధర్ స్వామీజీ అన్నారు. తాడేపల్లిగూడెం ఎన్‌కే గ్రౌండ్స్‌లో సోమవారం నిర్వహించిన హిందూ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా శ్రీధర్ స్వామీజీ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) అఖిల భారత సభ్యుడు భాగయ్య మాట్లాడుతూ ఆసేతు హిమాచలం వరకు ఉన్న హిందువులంతా సంఘటితమై హైందవ ధర్మాన్ని పరిరక్షించుకుని భారతదేశాన్ని విశ్వగురువుగా నిలపాలని పిలుపునిచ్చారు. బూరుగపల్లి వేణుగోపాల కృష్ణ, కోరశిఖ అనురాధలు ఈ వేడుకకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏపీఎస్పీ కాకినాడ బెటాలియన్ కమాండెర్ కొండా నరసింహారావు దంపతులు పూరించిన శంఖారావం, చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి కార్యదర్శి ముత్తా రామారావు, భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి గట్టిం మాణిక్యాలరావు, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర సహ సంఘ చాలక్ సుంకవల్లి రామకృష్ణ, తాడేపల్లిగూడెం ఖండ సహచాలక్ గ్రంధి సత్యనారాయణ, భాజపా రాష్ట్ర కార్యదర్శి భోగిరెడి ఆదిలక్ష్మి, పట్టణ ప్రముఖులు, వ్యాపార వేత్తలు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మూడు సంస్థలతో నిట్ అవగాహన ఒప్పందాలు

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న నిట్ అధికారులు, కంపెనీ ప్రతినిధులు

ఏపీనిట్ (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్, డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన మిల్టన్ సోనిక్ డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలతో ఏపీ నిట్ సోమవారం అవగాహన ఒప్పందాలు(ఎంవోయూ) కుదుర్చుకుంది. ఏపీనిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు, రతన్‌టాటా ఇన్నోవేషన్స్ హబ్ ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ టీవీ సూర్యప్రకాశరావు, డాక్టర్ వైఎస్‌ఆర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, మిల్టన్ సోనిక్ డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బి.మహేందర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఒకరికొకరు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏపీనిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు మాట్లాడుతూ నిట్ విద్యార్థుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాలనే ఉద్దేశంతో కంపెనీలు, విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఏపీనిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎన్‌వీ రమణారావును శాలువాతో సత్కరించారు. ఏపీ నిట్ డీన్ జి.రవికిరణ్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్, ఆచార్యులు వినోత్‌కుమార్ రాజా సమన్వయకర్తగా వ్యవహరించారు.

APSRTC పల్లె వెలుగు

టెండరు ప్రకటన

పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని వివిధ డిపోల గ్యారేజీలలో మెయింటెనెన్స్ పద్ధతిలో ... బస్ స్టేషన్లను ఊడ్చుట మరియు శుభ్రపరుచుట(సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్స్), HSD ఆయిల్ ట్యాంకులు ... ఆసక్తి గల వ్యక్తులు/ కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు ఆహ్వానించుచున్నాము. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములో తేది. 02-12-2025 నుండి తేది. 11-12-2025 వరకు ... ఉ.10.30 గం॥ల నుండి సా.05.00 గం॥ల వరకు మరియు తేది. 12-12-2025 ఉ॥12 గం॥ల వరకు భీమవరం డిపో నందు మాత్రమే అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది. 12-12-2025న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, భీమవరం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం.P2/797(02)/2025-DPTO/WG, తేది:29-11-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.

చలి కాగుతూ.. పొయ్యిలో పడి బాలికకు గాయాలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పొయ్యి దగ్గర చలి కాగుతూ ప్రమాదవశాత్తు అందులో పడి పండుగూడెంలో పూనెం గ్రీష్మిత అనే బాలిక తీవ్రంగా గాయపడింది. బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రీష్మిత తండ్రి కొర్సావారిగూడేనికి చెందిన మల్లేశ్వరరావు ఏడాది కిందట అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఈ బాలిక తల్లితో పాటూ పండుగూడెంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటుంది. అమ్మమ్మ కూడా చనిపోవడంతో తల్లి నాగదుర్గ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండో తరగతి చదువుతున్న గ్రీష్మిత ఆదివారం పొయ్యి దగ్గర చలికాగుతూ కూర్చుంది. ప్రమాదవశాత్తు పొయ్యిలో పడి శరీరం కాలి గాయపడింది. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు రిఫర్ చేయడంతో జనసేన మండల నాయకుడు జీవీస్ నాయుడు సహాయంతో జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు.

వైద్య కళాశాలలో ర్యాగింగ్ భూతం

పోలీసులకు ఫిర్యాదు చేసిన జూనియర్లు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ భూతం జడలు విప్పింది. రెండో సంవత్సరం విద్యార్థులను కొన్నాళ్లుగా మూడో ఏడాది విద్యార్థులు వేధిస్తుండటంతో.. సోమవారం అర్ధరాత్రి దాటాక వారు తిరగబడ్డారు. సీనియర్లు, జూనియర్లకు మధ్య గొడవ చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. రెండో పట్టణ సీఐ అశోక్ కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. మూడో సంవత్సరం విద్యార్థులు సుమారు 15 మంది తమను వేధిస్తున్నారని, రాత్రి వేళ దుస్తులు విప్పి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరిస్తున్నారని జూనియర్లు పోలీసుల వద్ద వాపోయారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని.. వైద్య కళాశాలలంటే ఇలాగే ఉంటాయని.. సర్దుకుపోవాలని ఓ సహాయాధికారి చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు విద్యార్థుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు.

భక్తుల బృందంలో మరొకరు మృతి

రాజేశ్ (పాత చిత్రం)

యలమంచిలి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా గండిపోశమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా వ్యాను అదుపుతప్పిన ఘటనలో మృతుల సంఖ్య రెండుకు పెరిగింది. ఈ ప్రమాదంలో గాయపడిన దొడ్డిపట్ల వాసి గెద్దాడ రాజేశ్ (35) రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఇతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. దొడ్డిపట్లలో వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగించే రాజేశ్, అబ్బిరాజుపాలేనికి చెందిన కాండ్రేగుల నరసింహస్వామి మిత్రులు. వీరిలో నరసింహస్వామి ఘటనా స్థలంలోనే మృతిచెందగా రాజేశ్ చికిత్స పొందుతూ చనిపోయారు.

వాయిదా వద్దనుకొని.. స్థానికుల కథనం ప్రకారం.. అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల గ్రామాలకు చెందిన 13 మంది బృందం ఆదివారం ఉదయం గండి పోశమ్మ ఆలయానికి వెళ్లేందుకు రెండు రోజుల కిందట ఏర్పాట్లు చేసుకున్నారు. తుపాను ప్రభావంతో శనివారం నుంచి వాతావరణం మారడంతో తొలుత యాత్రను వాయిదా వేద్దామనుకున్నారు. కానీ అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక వాయిదా వేయడం ఎందుకని భావించి ఆదివారం ఉదయం యాత్రకు వెళ్లారు. ఇంతలో ఊహించని ప్రమాదం ముంచుకొచ్చి ఇద్దరు మృత్యువాత పడ్డారని రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దొడ్డిపట్ల వాసి కుంచే శ్రీను రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నరసింహ స్వామి, రాజేశ్ మృతదేహాలు సోమవారం స్వగ్రామాలకు చేరాయి. నరసాపురం ఆర్డీవో దాసి రాజు, తహసీల్దారు పవన్‌కుమార్ వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో ఒకరు.. కూచింపూడి (పెదవేగి), న్యూస్‌టుడే: కూచింపూడి గ్రామానికి చెందిన దిమ్మిటి చినరాటాలు(37) అయిల్‌పామ్ గెలలు కోస్తూ జీవనం సాగిస్తాడు. సోమవారం ఉదయం రామశింగవరంలోని ఓ రైతు తోటలో గెలలు కోస్తుండగా అల్యూమినియం పైపు ప్రమాదవశాత్తు జారిపోయి విద్యుత్తు తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య జ్యోతి, పదో తరగతి, డిగ్రీ చదివే ఇద్దరు కుమారులున్నారు. ఎస్సై కె.రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తండ్రి మందలింపు.. కుమారుడు ఆత్మహత్య

పెనుమంట్ర, న్యూస్‌టుడే: తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెనుమంట్ర మండలం మల్లిపూడిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుడిమెట్ల సాయిబాబా రెడ్డి(25) సరకులు ఆలస్యంగా తేవడంతో అతడిని తండ్రి శ్రీనివాస రెడ్డి బుధవారం మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన సాయిబాబా రెడ్డి పురుగుల మందు తాగి గ్రామంలో బంధువుల దుకాణం వద్ద కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు అతడిని బ్రాహ్మణచెరువులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -113 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు వాయిదా

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వీరవాసరం ఎంఆర్‌కే జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నుంచి 4వ తేదీ వరకు నిర్వహించాల్సిన అండర్ 17 బాలబాలికల అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ పోటీలు తుపాను కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఫెడరేషన్ కార్యదర్శులు డి.సునీత, పీఎస్‌ఎన్.మల్లేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. పోటీలు నిర్వహించే తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

నిలిచిన గూడ్స్ రైలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మీదుగా కైకలూరు వైపు వెళ్తున్న గూడ్స్ రైలు సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్థానిక దుంపగడప రైల్వే గేటు వద్ద నిలిచిపోయింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహన చోదకులు సిద్ధాపురం గేటు నుంచి వెళ్లారు. సాంకేతిక సమస్యతో నిలిచిపోయిందని సమాచారం. సుమారు 30 నిమిషాల అనంతరం రైలు వెళ్లిన తర్వాత గేటు తెరిచారని స్థానికులు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

TENDER

ITC లిమిటెడ్ ABD, అనపర్తి- 533342 వద్ద గల 124 KL HSD ట్యాంక్, 225 KVA స్టెబిలైజర్, MS, వుడ్, కన్వేయర్ బెల్టులు, SS, అల్యూమినియం, రబ్బర్, కేబుళ్లు కెపాసిటర్లు వగైరాలకు 15-12-2025న e-కోట్ కలదు. తనిఖీ 08-12-2025 నుండి 10-12-2025. టెండరు ఫారం ధర రూ.500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14. ఫోన్: 09840731925. www.welcomeauctioneers.com.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

REAL ESTATE

PLOT FOR SALE

వైజాగ్‌లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎండాడ, మధురవాడ, భోగాపురం ఏరియాలలో ఇళ్ల స్థలాలు అమ్మకం. ✆ 9493244471, 9396972239.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry ★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.40 పై॥ తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం
●భీమవరం ●ఉండి

393 మందికి రూ.3.47 కోట్ల సాయం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 393 మందికి రూ.3.47 కోట్లు సీఎం సహాయ నిధి నుంచి అందజేశామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తెలిపారు. ఆయన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 25వ విడత కార్యక్రమంలో 28 మంది లబ్ధిదారులకు రూ.23.67 లక్షలు అందజేశారు.

క్రీడా సంబరాలను విజయవంతం చేయాలి: కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: డిసెంబరు రెండు నుంచి పదో తేదీ వరకు నిర్వహించబోయే గోదావరి క్రీడా సంబరాలను విజయవంతం చేయాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. ఆ అంశంపై సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగే ఆటల పోటీల్లో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలన్నారు. మొదట డివిజన్ల స్థాయిలో పోటీలు నిర్వహించి తర్వాత జిల్లా పోటీలు నిర్వహిస్తామని, ఇప్పటి నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. ● జిల్లాలోని రోడ్ల అభివృద్ధికి, కోపెల్ల వంతెన నిర్మాణానికి రూ.37.70 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ నాగరాణి తెలిపారు. వాటితో రాష్ట్ర, జిల్లా రహదారులను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. వాటిలో కోపెల్ల వద్ద వంతెనకు రూ.12 కోట్లు కేటాయించారని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలో మెంటే వారి తోట, గ్రంధి చల్లారావు నగర్‌లో పలు చోట్ల వీధి దీపాలు వారం నుంచి వెలగడం లేదు. - ఎస్.వెంకట్రావు.

✔ చర్యలు తీసుకుంటాం. - సాంబశివరావు, పురపాలక ఏఈ

ఉండి, న్యూస్‌టుడే:? ఉండి కొండ్రొతుపేటలోని జంగాల కాలనీలో కొన్ని వీధిలైట్లు వెలగక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

- కె.లక్ష్మి, జంగాల కాలనీ, ఉండి

✔ చర్యలు తీసుకుంటాం.

-అనిల్‌కుమార్, గ్రామ కార్యదర్శి

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? పాలకోడేరు శివారు వేండ్ర వెళ్లే రహదారిలో చినలోగిళ్లు చెరువు వద్ద చెత్త, వ్యర్థాలను వేస్తున్నారు.

-ఎం.శ్రీనివాసరావు, పాలకోడేరు

✔ చర్యలు తీసుకుంటాం. - బి.గోపి, కార్యదర్శి

చెరువులు ఇలా.. వేసవిలో దాహం తీరేదెలా?

గొల్లలకోడేరు(పాలకోడేరు), భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే

వేసవి కాలం వచ్చిందంటే ఉండి, భీమవరం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చడం పరిపాటిగా మారింది. పలుచోట్ల ఆక్వా సాగుతో మంచినీటి చెరువులు కలుషితంగా కాగా.. మరి కొన్నిచోట్ల నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారవుతున్నాయి. ఫలితంగా దాదాపు అన్ని గ్రామాల్లో స్థానికులు ప్రైవేటు ఆర్వో ప్లాంట్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. స్థానిక శాసనసభ్యుడు కనుమూరు రఘు రామకృష్ణరాజు చొరవతో పలు గ్రామాల్లో మైక్రోఫిల్టర్లను ఏర్పాటు చేసినా.. పూర్తిస్థాయిలో చెరువులు వినియోగంలో లేకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

● మోగల్లు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వెనుక వైపు ఉన్న పంచాయతీ తాగునీటి చెరువు ఇది. సమీపంలో ఉన్న మరో మంచినీటి చెరువుకు అనుసంధానం చేసే ఆలోచనతో రెండుగా ఉన్న ఈ చెరువు గట్లు తొలగించి ఒకటిగా చేశారు. కాని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో గుర్రపుడెక్క పెరిగిపోయి నిరుపయోగంగా మారింది.

మోగల్లులో నిరుపయోగంగా చెరువు

అభివృద్ధి చేస్తేనే.. పాలకోడేరు మండలం మోగల్లు, గరగపర్రు, గొల్లలకోడేరు, శృంగవృక్షం, పెన్నాడ, విస్సాకోడేరు, పాలకోడేరు గ్రామాల్లో పలు పంచాయతీ చెరువులు నిర్వహణలోపంతో నేటికీ నిరుపయోగంగా మారాయి. పలుచోట్ల అవుట్‌లెట్, ఇన్‌లెట్ సౌకర్యం లేకపోవడం, గడిచిన 15 ఏళ్లుగా వినియోగంలో లేక వాటి రూపురేఖలు మారిపోయాయి. గరగపర్రులో ప్రధాన రహదారి పక్కన ఉన్న చెరువు ఆక్రమణలకు గురై బక్కచిక్కిపోయింది. పెన్నాడలో సుమారు అయిదెకరాల చెరువు వివాదంలో చిక్కుకుంది. గొల్లలకోడేరులో రెండు చెరువులు మురుగు గుంటలుగా మారిపోయాయి. నిరుపయోగంగా ఉన్న చెరువులను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని ఈవోపీఆర్డీ రామప్రసాద్ తెలిపారు.

● భీమవరం మండలం నరసింహపురం పంచాయతీ మంచినీటి చెరువు ఏడాది పొడవునా అధ్వానంగానే ఉంటోంది. ఇన్‌లెట్, అవుట్‌లెట్ సౌకర్యం లేకపోవడంతో నీరు రంగు మారి తాగడానికి కూడా పనికిరావడం లేదు. జనాభాకు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.

● పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, గరగపర్రు గ్రామాల్లో అదనంగా రెండు చెరువులు అందుబాటులో ఉన్నా అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో వేసవిలో తాగునీటి సమస్యను గ్రామస్థులు ఎదుర్కొంటున్నారు.

బాలలు.. ఉపన్యాసంలో దిట్టలు

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీఎన్నార్ పాఠశాల ఉపాధ్యాయినులు

విద్యార్థినులతో పీఎస్ఎం హెచ్ఎం, ఉపాధ్యాయులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలను భీమవరంలోని డీఎన్నార్ ఆంగ్లమాధ్యమ, పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులు ఉపన్యాసంతో ఆకట్టుకున్నారు. ● డీఎన్నార్ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో ఎస్‌కే షఫియా(7వ తరగతి), పి.భవ్యశ్రీ(9వ తరగతి), బి.ఎం.ఎన్.ఎస్.మణిదీప్(8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వారికి విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి, కరస్పాండెంట్ కె.రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ నిర్మలకుమారి, ఉపాధ్యాయిని డి.లక్ష్మి బహుమతులు అందించారు. ● పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో వై.అనిత(10వ తరగతి), పి.లోకేశ్వరి (10వ తరగతి), ఎం.షారోన్ పుష్ప(7వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా హెచ్ఎం బి.సాయి ప్రసాద్ బహుమతులు అందించారు.

రైతులు నష్టపోకుండా చర్యలు

తోలేరు (వీరవాసరం), న్యూస్‌టుడే: తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని విక్రయించినా రైతులు నష్టపోకుండా చూడాలని రైతులు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును కోరారు. తుపాను నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే వీరవాసరం మండలంలో పర్యటించారు. రైతులను కలిసి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత వేగంగా రైతులు ధాన్యం విక్రయాలు చేయాలని సూచించారు. తేమశాతంపై జిల్లా కలెక్టర్‌తో చర్చించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా సొసైటీ వద్ద అందుబాటులో ఉంచిన టార్పాలిన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వీరవల్లి చంద్రశేఖర్, మాజీ సర్పంచి యరకరాజు వెంకట సుబ్బ హ్యజ్ఞరాజు తదితరులు ఉన్నారు.

నేడు సెర్ప్ సీఈవో జిల్లా పర్యటన

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: సెర్ప్ సీఈవో వి.కరుణశ్రీ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటలకు మహదేవపట్నంలోని చాక్లెట్ తయారీ యూనిట్‌ను ఆమె పరిశీలిస్తారని, అక్కడ నుంచి నరసాపురం మండల సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించనున్నారు.

మాసూళ్లకు 'దిత్వా' అవరోధం

ఆకివీడు: గుమ్ములూరు రోడ్డులో బరకాలు కప్పి భద్రపరుచుకున్న ధాన్యం రాశులు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఉండి, భీమవరం నియోజకవర్గాల పరిధిలో ముమ్మరంగా సాగుతున్న ఖరీఫ్ పంట మాసూళ్లకు 'దిత్వా' తుపాను ప్రభావంతో మారిన వాతావరణం అవరోధం కలిగించింది. మొన్నటి వరకు రైతులు ఒకవైపు వరిచేలు కోతలు, మరో వైపు గట్టు చేర్చిన ధాన్యంలో తేమ శాతం తగ్గించుకునేందుకు ఎండబెట్టుకుంటూ ఉండేవారు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు రవాణా చేసుకుంటున్న తరుణంలో వాతావరణం మార్పులు చోటుచేసుకుని చిరుజల్లులు కురవడంతో సోమవారం కూడా మాసూళ్లు నిలిచిపోయాయి. పంటను రక్షించుకునేందుకు ధాన్యపు రాశులను బరకాలతో కప్పుతున్నారు. మాసూళ్ల ఖర్చులు పెరిగిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రద్దీకి అనుగుణంగా బస్టాండ్ అభివృద్ధి

బస్టాండ్ పరిస్థితిని కలెక్టర్ నాగరాణికి వివరిస్తున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు

ఉండి, న్యూస్‌టుడే: రాబోయే సంక్రాంతికి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్టాండ్ అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. ఉండి బస్టాండ్‌లో రూ.25 లక్షల ఉపాధి నిధులతో 10 మీటర్ల సీసీ రహదారి నిర్మాణానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి ఆయన సోమవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. జాతీయ రహదారికి చేర్చి ఖాళీ స్థలంలో మట్టి పూడిక పనులు చేయించామని, త్వరలోనే [illegible] ఏర్పాటుచేశామని చెప్పారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని, మరో 15 రోజుల్లో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. బస్టాండ్‌లోకి ఒకేసారి రెండు బస్సులు వచ్చినా ఇబ్బందులులేకుండా పక్కా రహదారి నిర్మాణ పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేయిస్తామని చెప్పారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్‌వీఆర్ వరప్రసాద్, డీఎం వేణు, ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు దాసరి వెంకటకృష్ణ, గ్రామ సర్పంచి సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, తెదేపా గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి పాల్గొన్నారు.

వివక్ష చూపొద్దు

మాట్లాడుతున్న న్యాయమూర్తి సురేశ్‌బాబు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపొద్దని భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జె.సురేశ్‌బాబు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం దుర్గాపురంలోని పట్టణ ఆరోగ్యకేంద్రంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ బాధితులు సమాజంలో ఔషధాలు వాడి, పోషకాహారం తిని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. వాడిపడేసిన సిరంజిలు, బ్లేడ్లు, సురక్షితం కాని లైంగిక సంబంధాలతో ఎయిడ్స్ వ్యాప్తి చెందుతుందని, అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. లెప్రసీ, టీబీ జిల్లా అధికారి ఎం.రవిబాబు, మెడికల్ అధికారి జె.లీలాలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.న్యూటన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు: తోట

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛను సొమ్ముతో పేదలు ప్రతి నెల మందుల కొనుగోలు, ఇతర అవసరాలు తీర్చుకోగలుగుతున్నారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. రాయలంలో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి సుజాతరామచంద్రరాజు, తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగబాబు, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు వినాయక, ప్రధాన కార్యదర్శి ఫణికుమార్ పాల్గొన్నారు.

రాయలంలో అందజేస్తున్న సీతారామలక్ష్మి

వీరవాసరంలో పంపిణీలో పాల్గొన్న సుజాత

వీరవాసరం, న్యూస్‌టుడే: ఏ ఆసరా లేని నిరుపేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మాజీ మంత్రి, రాష్ట్ర మహిళల ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా [illegible] సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా వీరవాసరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె వెంట జడ్పీటీసీ సభ్యుడు జయప్రకాశ్‌నాయుడు, సర్పంచి మంగతాయారు, పీఏసీ ఛైర్మన్ శ్రీనివాసరావు, భాజపా మండల అధ్యక్షుడు దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ప్రదర్శనలు



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కళలపై పట్టు సాధించాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. భీమవరంలోని వెస్ట్‌బెర్రీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలతో అలరించారు. పాఠశాల వ్యవస్థాపక డైరెక్టర్ మహేశ్ కుమార్, ప్రిన్సిపల్ సారా స్మిత, ప్రసన్న మండవ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకరు వితరణ

మహదేవపట్నం గ్రామానికి ట్యాంకర్‌ను బహూకరించిన సుబ్బరాజు

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: మహదేవపట్నం ఉపసర్పంచి, దాత ముదునూరి సుబ్బరాజు తన తండ్రి రామలింగరాజు పేరిట పంచాయతీకి సోమవారం మంచినీటి ట్యాంకరును బహూకరించారు. సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో కేశిరెడ్డి గోపాలకృష్ణ, సర్పంచి సుబ్బలక్ష్మి, ఇన్‌ఛార్జి గ్రామాభివృద్ధి అధికారి జేవీటీ నాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు దాతను అభినందించారు.

పురమిత్ర ఫిర్యాదులు సత్వరం పరిష్కరించండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్, పురమిత్ర యాప్‌లో వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని పురపాలక అధికారులను ఆర్డీ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. భీమవరం పురపాలక సంఘ కార్యాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమయ్యారు. ఆస్తిపన్ను వసూలు, డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్సులు, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. పట్టణంలో తడి, పొడి చెత్త సేకరణ నూరుశాతం జరగాలన్నారు. కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ ఎ.రాంబాబు పాల్గొన్నారు.

'అఖండ-2' చిత్రం విజయవంతం కోరుతూ పూజలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ-2' (తాండవం) చిత్రం విజయవంతం కావాలని కోరుతూ సోమేశ్వరస్వామికి అఖిల భారత బాలకృష్ణ ఫ్యాన్స్ కన్వీనర్ నంబూరి తిలక్ సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అఖండ' చిత్రం విజయవంతం కావాలని కోరుతూ పంచారామక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేయిస్తున్నట్లు తెలిపారు. ఫ్యాన్స్ పట్టణ గౌరవాధ్యక్షుడు, తెదేపా పట్టణాధ్యక్షుడు మద్దుల రాము, తెదేపా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీ ధర్నా వాయిదా

ఉండి, న్యూస్‌టుడే: ఉండి ఎంఈవో-1 వైఖరికి నిరసనగా డిసెంబరు 2 నుంచి జరపతలపెట్టిన ఎంఆర్‌సీ ధర్నా కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్.విజయరామరాజు, కేఎస్ఆర్‌కే.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన చర్చల్లో భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు రానివ్వనని ఎంఈవో-1 రాతపూర్వకంగా ఇచ్చిన హామీ ప్రకారం ధర్నా వాయిదా వేశామని యూటీఎఫ్ నాయకులు వివరించారు.

పరీక్షించేదెవరు.. మందులిచ్చేదెవరు..?

పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత

వీరవాసరం, భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరతతో రోగులకు మెరుగైన వైద్య సేవలందడం లేదు. వైకాపా ప్రభుత్వం కీలకమైన కొలువులను భర్తీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రస్తుతం పలు చోట్ల వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టు కొలువులు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

నియోజకవర్గంలోని గ్రామీణ మండలాల్లో జనాభా:	1.70 లక్షలు
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు:	4
ఆరోగ్య ఉప కేంద్రాలు:	45

ఇదీ పరిస్థితి.. భీమవరం నియోజకవర్గంలోని రెండు గ్రామీణ మండలాల్లో నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. నిత్యం 400 మంది ఓపీ నమోదవుతుంది. పీహెచ్‌సీల్లో కింది స్థాయి సిబ్బంది మినహా వైద్యులు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడంలేదు. వీరవాసరం పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొణితివాడ వైద్యులు డిప్యుటేషన్‌పై ఇక్కడ పని చేస్తున్నారు. వీరవాసరం పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, గొల్లవానితిప్పలో స్టాఫ్ నర్సు పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఇదే పీహెచ్‌సీలో ఏఎన్ఎంల కొరత ఉండటంతో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడంలేదు. ల్యాబ్ టెక్నీషియన్లు లేకపోవడంతో వైద్య పరీక్షల కోసం రోగులు ప్రైవేటు పరీక్షా కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనిపై వీరవాసరం సీహెచ్‌వో కె.ప్రసాద్ మాట్లాడుతూ సిబ్బంది కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

వీరవాసరం పీహెచ్‌సీలో వైద్య సేవల కోసం వచ్చిన రోగులు

నిరుపయోగంగా పరికరాలు.. పీహెచ్‌సీల్లో రూ.లక్షలు విలువైన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీరవాసరం పీహెచ్‌సీలో సుమారు పదేళ్ల క్రితం సుమారు రూ.6 లక్షలతో అందుబాటులోకి తీసుకొచ్చిన బేబీ వార్మింగ్ పరికరాన్ని వినియోగించిన దాఖలాలు కానరావడంలేదు. సాగుదారులు పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో విషప్రభావానికి గురైతే వారిని రక్షించేందుకు అందుబాటులో ఉంచిన పరికరం నిరుపయోగంగా ఉంది.

28 మందికి కొలువులు

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీస్ సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 29న ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో డీఎన్నార్ కళాశాలకు చెందిన 28 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ జి.మోజెస్ తెలిపారు. ఈ మేరకు వారిని కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పాలకవర్గ కార్యదర్శి, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు జి.పాండురంగరాజు, పాలకవర్గ సభ్యుడు పి.రామకృష్ణరాజు అభినందించారని ప్రకటనలో తెలిపారు.

ప్రారంభమైన క్రిస్మస్ సందడి

వీరవాసరం పెదపేట ఎఫిపానియా చర్చి వద్ద సంబరాలు

భీమవరం ఆధ్యాత్మికం, వీరవాసరం, న్యూస్‌టుడే: మోయర్ మెమోరియల్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ పండగ సందడి ఆదివారం రాత్రి ప్రారంభించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో చర్చిలను విద్యుద్దీపాలతో, భారీ నక్షత్రాలు, సెట్టింగ్‌లతో ముస్తాబు చేస్తున్నారు. రెస్టుహౌస్ రోడ్డులో లూథరన్ క్రీడా మైదానం సమీపంలో ఉన్న మోయర్ మెమోరియల్ లూథరన్ గురుమండలంలో పాస్టర్ ఎన్.విలియంకేరీ ప్రత్యేక ప్రార్థన చేసి క్రిస్మస్ వేడుకలకు నాంది పలికారు. సంఘ పెద్దలు, యూత్, సండే స్కూల్, స్త్రీల సమాజం సభ్యులు పాల్గొన్నారు. ● వీరవాసరం పెదపేట ఎఫిపానియా లూథరన్ దేవాలయం వద్ద పాస్టర్ రత్నరాజు చర్చి వద్ద నక్షత్రాన్ని వెలిగించి వేడుకలను ప్రారంభించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్ రత్నకుమార్, సంఘ పెద్దలు కిశోర్‌గాంధీ, వెంపళ్ల నరసింహమూర్తి, జయబాబు, దానియేలు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సామూహిక పారాయణం

భీమవరం: కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

భీమవరం సాంస్కృతికం, ఉండి, ఆకివీడు, న్యూస్‌టుడే: గీతా జయంతి సందర్భంగా చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో త్యాగరాజ భవనంలో సోమవారం పూజలు నిర్వహించారు. మిషన్ ఆచార్యులు ఈశాన్య చైతన్య మహిళలతో గీతా పారాయణం చేయించారు. ముఖ్య అతిథిగా కేజీఆర్ఎల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డీఎస్ చంద్రాజీ పాల్గొని భగవద్గీత విశిష్టతను వివరించారు. అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, వరప్రసాద్ పాల్గొన్నారు. ● కాళ్లకూరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పారాయణం బృందం సభ్యులు సామూహిక గీతా పారాయణం చేశారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ అడ్డాల శివరామరాజు పాల్గొన్నారు. ● ఉండి కొత్తపేటలోని శ్రీరాధా మదనమోహనస్వామి ఆలయంలో ఆశ్రమ ఇన్‌ఛార్జి శ్రీపాద కృష్ణస్వామి ఆధ్వర్యంలో తొలుత మదనమోహనస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపేట నుంచి గ్రామంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. నల్లా విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నల్లా సత్య కృష్ణ కిరణ్ ప్రసాద్ సహకారంతో 100 మందికి భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ఉండి చిన్నవంతెన కూడలిలో పంట కాలువలో గంగాహారతి వైభవోపేతంగా నిర్వహించారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు పరంశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు. ● ఆకివీడు శాంతినగర్ వినాయకుడి ఆలయం వద్ద నుంచి మాదివాడ వేంకటేశ్వర స్వామి, మల్లేశ్వరస్వామి ఆలయం వరకు గీతా శోభా యాత్ర నిర్వహించారు. గంధం ఉమా తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారదు.. డ్రెయిన్లు నిర్మించరు

సాయిదుర్గానగర్‌లో అధ్వానంగా రోడ్డు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నగర పంచాయతీ రెండో వార్డు పరిధిలో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే ముంపు సమస్య వెంటాడుతోంది. పలు నివాసిత ప్రాంతాల పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు లేవు, వీధి దీపాలు, వీధి కుక్కలు తదితర సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. వార్డుల్లోని ప్రాంతాలను పరిశీలించి దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

2వ వార్డు నివేదన

చంద్రబాబునగర్ ప్రాంతంలో సీసీ డ్రెయిన్లు లేవు. ● సాయిదుర్గానగర్ ప్రాంతానికి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మించాల్సి ఉంది. ఆ ప్రాంతంలో తరచూ బోదె పొంగి ముంపు సమస్య ఉత్పన్నమవుతోంది. ● సాయిదుర్గానగర్ ప్రాంతంలో పలు చోట్ల సీసీ రోడ్లు, డ్రెయిన్లు లేవు. ● జానకీనగర్‌లో సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ● వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. సుమారు 40 దీపాలు పాడయ్యాయి. ● జానకీనగర్‌లో పలు విద్యుత్తు స్తంభాలు ఒకవైపునకు ఒరిగి తీగలు దిగువకు వేలాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ● వార్డులో అన్ని ప్రాంతాల్లోను వీధి కుక్కలు, దోమల సమస్యలతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.

జనాభా: 2,800

ప్రధాన ప్రాంతాలు: సాయిదుర్గా నగర్, చంద్రబాబు నగర్, జానకీ నగర్

పోషకాహార కిట్లు అందజేత

ఆకివీడు: ప్రదర్శనలో పాల్గొన్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వైద్యులు



ఎన్‌సీసీ క్యాడెట్లు

ఆకివీడు, న్యూస్‌టుడే: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆకివీడు ఆదర్శ తదితర లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది వ్యాధిగ్రస్థులకు సుమారు రూ.40 వేల విలువైన పోషకాహార కిట్లు, పండ్లు అందజేశారు. అనంతరం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌ల అధ్యక్షులు కె.చంద్రశేఖర్, ఎస్.అనీల్‌కుమార్, వి.కృష్ణ, ఎం.శ్రీనివాసరావు, ఎండీ అహ్మద్, ఎస్.రమేష్, ఎన్.సతీష్ ఎం.మంగరాజులు వైద్యులు పాల్గొన్నారు.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎన్నార్ ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎయిడ్స్ నివారణ లోగో ఆకృతిలో నిలబడి అవగాహన కల్పించారు.

చట్టాలపై అవగాహన అవసరం

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: విద్యార్థులందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కాళ్ల ఎస్సై ఎన్.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం సీసలి ఉన్నత పాఠశాలలో ఆయన గుడ్, బ్యాడ్ టచ్, స్వీయ రక్షణ, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్లలో తెలియని యాప్‌లు, మెసేజ్ లింక్‌లపై టచ్ చేయకూడదన్నారు. ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సభ్యులను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఛైర్మన్‌గా వేమూరు వెంకట సీతారామశాస్త్రి, సభ్యులుగా చింతా ఆదిశేషు, పి.రాంబాబు, చుండూరి వెంకటేశ్వరరావు, జంగారెడ్డి మణికంఠ కొండారెడ్డి, ఎం.శ్రీదేవి, ఎం.దుర్గాభవాని, ఎన్.శ్రీలక్ష్మి, టి.చంద్రకుమారి, మొవ్వ వెంకటరత్నంలను నియమించారు.

తల్లిని గాయపరిచిన కుమారుడు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కన్నతల్లిని కొడుకు గాయపరిచిన సంఘటన ఇది. భీమవరం ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.మంగాయమ్మను ఆమె కుమారుడు ముత్యాలు తలపై కొట్టి గాయపరిచాడు. భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.వై కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్యం మత్తుతో తల్లిపై దాడి చేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

మహిళపై దాడి కేసు.. ఉండి, న్యూస్‌టుడే: ఫోన్ పోయిందని అడిగినందుకు పక్కింటికి చెందిన భార్యాభర్తలు తనింటికొచ్చి దాడి చేసి గాయపరిచారని మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదైందని పోలీసులు సోమవారం తెలిపారు. గత నెల 21వ తేదీన ఫోన్ కనిపించడంలేదని అడిగాననే కారణంతో పక్కింటికి చెందిన పి.నాగరాజు, అతని భార్య వరలక్ష్మి తనింటికొచ్చి కర్రతో కొట్టి గాయపరిచారని భవానీపేటకు చెందిన పడమటి కనకదుర్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమవరం ప్రభుత్వాసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేశారని పోలీసులు తెలిపారు.

జూద శిబిరంపై దాడి.. ఉండి, న్యూస్‌టుడే: ఉండి రాజులపేటలో జూదమాడుతున్న ముగ్గురిని ఎస్సై నసీరుల్లా ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారని పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.4,350 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

పాస్‌పోర్ట్ పోయినది

వరసాల మేరి సుజాత, W/o. శేఖర్, ఇంటి నెం.5-9, హరిజనపేట, చర్చి దగ్గర, పెదకాపవరం, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా, నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. P0639162 ను జిరాక్స్ తీయునిమిత్తం బ్యాగులో పెట్టుకుని ది.10.11.2025 సం॥రం తేదిన పెదకాపవరం నుండి ఆకివీడు రైల్వేస్టేషను సమీపంలో వెళ్ళుచుండగా మార్గమధ్యంలో సదరు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పెట్టిన బ్యాగ్ జారిపడి పోయినది. ఎంత వెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైననూ దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందజేయగలరు

వరసాల మేరి సుజాత W/o. శేఖర్, సెల్: 7288076071

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

త్వరితంగా వినతుల పరిష్కారం

సమస్య తెలుసుకుంటున్న ఆర్డీవో రాజు

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి అందే వినతులను త్వరితంగా పరిష్కరించాలని ఆర్డీవో దాసి రాజు సూచించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 38 మంది వినతులు అందినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్న ఒక రకం సరుకు నాణ్యత బాగా లేదని మొగల్తూరుకు చెందిన కుక్కల సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా తనపై దౌర్జన్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు.

పల్లెల్లో క్రిస్మస్ కాంతులు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: డిసెంబరు నెల ప్రారంభం కావడంతో గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. పెనుమంట్రలో లూథరన్ చర్చి వద్ద సోమవారం భారీ నక్షత్రం, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. పేరిస్ పాస్టర్ దాసి రాజరత్నం, సంఘ సీనియర్ దండి నాగేశ్వరరావు, పెద్దలు కేక్ కోసి ప్రారంభ వేడుకలు చేశారు.

పెనుమంట్ర చర్చి వద్ద నక్షత్రం, విద్యుద్దీపాలంకరణలు

శివయ్యకు అభిషేకాలు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏకాదశి సందర్భంగా పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల, పూలపల్లి, చింతపర్రు, లంకలకోడేరు శివాలయాల్లో స్వామికి సోమవారం ఉదయం అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

శివదేవుని చిక్కాలలో అలంకరణలో స్వామి

వాసవీమాతకు రజత కిరీటం సమర్పణ

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి తణుకు పట్టణానికి చెందిన ఆత్మకూరు నాగేంద్ర రాజేంద్ర, ప్రత్యూష దంపతులు 370 గ్రాముల రజత కిరీటాన్ని సోమవారం సమర్పించారు. తిరుపతికి చెందిన వాసవీ ఫౌండేషన్ ఛైర్మన్ దేవీ సుబ్బారావు అమ్మవారికి రూ.12 వేల విలువైన రజత ఛత్రం(గొడుగు), పెనుగొండ వాసులు గుడారి వెంకట సత్యనారాయణ, తెలజ దంపతులు నగరేశ్వర స్వామికి 117 గ్రాముల వెండి విభూది పట్టీని సమర్పించారు. దాతలను ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు అభినందించారు.

ఘనంగా గీతా జయంతి

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: గీతా జయంతిని సిద్ధాంతంలోని కృష్ణ మందిరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణం జరిగింది. ఆధ్యాత్మిక ప్రవచకుడు వంగూరి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ భగవద్గీత మానవ జీవనానికి మార్గదర్శకమన్నారు.

కృత్రిమ మేధ పాత్ర కీలకం

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజం కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తోంది. నూతన సాంకేతికతను అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అధ్యాపకులు పేర్కొన్నారు. పాలకొల్లు కోకనాడ మర్చంట్స్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను సోమవారం నిర్వహించారు. 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సీనియర్ ఇంటర్ విద్యార్థులు వి. మాధురి, కోల సుశీల, కర్రి తేజశ్రీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ బి.అప్పారావు, అధ్యాపకులు అవాల పెద్దిరాజు, జి.జాషువల బహుమతులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐదేళ్లయినా.. కొలిక్కిరాలే!

అసంపూర్తిగా పీహెచ్‌సీల నిర్మాణాలు

ఆచంట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గత వైకాపా ప్రభుత్వం పీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిధులు కేటాయించినా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా నిర్మాణాలు ఏళ్ల తరబడి కొలిక్కిరాలేదు. దీంతో శిథిల భవనాలు, తగిన వసతులు లేని ఇరుకు గదుల్లోనే వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆసుపత్రి భవనాలు శిథిలమైన చోట్ల కొత్త నిర్మాణాలు, మరమ్మతులను అయిదేళ్ల క్రితం చేపట్టిగా ఇప్పటికీ కొలిక్కి రాలేదు.

● ఆచంట వేమవరంలో అయిదేళ్ల కిందట మొదలుపెట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం ఇలా అసంపూర్తిగా నిలిచింది. దీనికి సుమారు రూ.కోటి కేటాయించారు. ఫ్లోరింగ్, ప్రహరీ నిర్మాణం, తలుపుల ఏర్పాటు, విద్యుత్ పనులు పూర్తికాకపోవడంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. దీంతో శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న పాత భవనంలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. గదుల్లో శ్లాబు పెచ్చులూడి పడుతోంది. వర్షం పడితే గదుల్లోకి నీరు చేరుతోంది. యలమంచిలి మండలం మేడపాడులోనూ పీహెచ్‌సీ భవన నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది.

✦ నరసాపురం మండలం ఎల్బీచర్ల పీహెచ్‌సీ ఆధునికీకరణకు రూ.20 లక్షలు కేటాయించారు. ఈ పనులు పూర్తికాకపోవడంతో రెండున్నరేళ్లుగా లేసు అల్లిక కేంద్ర భవనంలో ఆసుపత్రిని కొనసాగిస్తున్నారు. దీంతో రోగులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు.

✦ ఆచంట మండలం వల్లూరు పీహెచ్‌సీ ప్రహరీ కూలిపోయి ఏళ్ల గడుస్తున్నా పునర్నిర్మించలేదు.

✦ పోడూరు మండలం గుమ్ములూరులో కొత్త పీహెచ్‌సీ మంజూరైంది. వైద్య సిబ్బందిని కేటాయించారు. భవన నిర్మాణానికి స్థలం కూడా గుర్తించారు. కానీ పనులు చేపట్టకపోవడంతో సిబ్బంది 104 సంచార వైద్యసేవలకే పరిమితమవుతున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం

ఆసుపత్రి భవనాల నిర్మాణంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో వి.ప్రసాద్‌ను సంప్రదించగా ఆ పనులు ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. ఆర్‌అండ్ బీ డీఈ రమణను సంప్రదించగా త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	80085 74504	ఆచంట	90631 44737
పాలకొల్లు	80085 74510	పెనుగొండ	80085 74469
పోడూరు	90631 44741	పెనుమంట్ర	91212 29087

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? భగ్గేశ్వరం పరిధి పుష్పవారి వీధిలో డ్రైనేజ్ పూడిపోయి మురుగు నిలిచిపోతోంది. దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. - నాగరాజు, పాలకొల్లు
✔ పూడిక తీత పనులు చేయిస్తాం. - సునీతాదేవి, పంచాయతీ కార్యదర్శి

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? కొత్తపాలెంలో విద్యుత్ స్తంభానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. - నాగేశ్వరరావు
✔ పాదులు తొలగిస్తాం. - (ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి ఏఈ)

నరసాపురం, న్యూస్‌టుడే: ? తాగునీటి ట్యాంకు సమీపాన చెత్త పేరుకుపోయింది. - గాదిరెడ్డి వనమయ్య, నరసాపురం
✔ పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆక్వా రంగంలో అపార అవకాశాలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఆక్వా రంగంలో ఉన్న అపార అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పేర్కొన్నారు. లక్ష్మణేశ్వరంలోని తుపాను రక్షిత భవనంలో నిర్వహించిన మత్స్య కళాశాలను సీతారామపురం సౌత్ స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోకి తరలించారు. ఈ భవనాన్ని ఆయన సోమవారం తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వసతుల కోసమే తరగతులను ఇక్కడికి తరలించినట్లు చెప్పారు. ఈ కళాశాలలో వివిధ జిల్లాలకు చెందిన 120 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ నెల 4వ తేదీ తర్వాత మరో 60 మంది విద్యార్థులు చేరతారన్నారు. లిఖితపూడిలో అసంపూర్తిగా నిలిచిన ఆక్వా విశ్వవిద్యాలయ భవనం పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. పిషరీస్ యూనివర్సిటీ ఓఎస్డీ సుగుణ, ఏపీఎఫ్‌యూ అసోసియేట్ డీన్ కె.మాధవి, సహాయ ఆచార్యులు ఎన్.వీరభద్రరావు, కె.శ్రావణి, స్వర్ణాంధ్ర కళాశాల ఛైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కేవీ త్రినాథస్వామి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నాయకర్, రామరాజు

వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట నియోజకవర్గంలో వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెదేపా సీనియర్ నాయకులు గొడవర్తి శ్రీరాములు, కె.మీరయ్య, టి.ప్రసాద్ పేర్కొన్నారు. ఆచంటలో మార్కెట్ నుంచి కచేరీ కూడలి వరకు చేపట్టిన సీసీ రోడ్డు పనులను వారు సోమవారం ప్రారంభించారు. గతంలో అసంపూర్తిగా మిగిలిన పనులు పునఃప్రారంభమయ్యేలా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కృషి చేస్తున్నారన్నారు.

పనులు ప్రారంభిస్తున్న నాయకులు

అన్నదాతలకు అండగా ప్రభుత్వం.. ఆచంట, న్యూస్‌టుడే: ప్రతికూల వాతావరణ ప్రతికూల పరిస్థితులతో రైతులు అధైర్య పడొద్దు.. కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని జడ్పీటీసీ సభ్యుడు యు.సురేశ్‌బాబు అన్నారు. వల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన కూటమి నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పెనుగొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, 2027 డిసెంబరు నాటికి అమరావతిలో రహదారి పనులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. పెనుగొండలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెనుగొండ పేరును వాసవీ పెనుగొండగా మార్పు చేస్తూ కూటమి ప్రభుత్వం జీవో నంబరు 1495 విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఈ నిర్ణయంతో గ్రామానికి చారిత్రక గౌరవం దక్కిందన్నారు. సర్పంచి నక్కా శ్యామలాసోని, తెదేపా, భాజపా, జనసేన మండల అధ్యక్షులు గుత్తుల లోకేశ్, దొడ్డిపట్ల నాగూర్, కొండవీటి శ్రీనివాసరావు, సీపీఎం నాయకుడు మాదాసు నాగేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోడూరు: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పితాని

సహాయ నిధితో పేదలకు భరోసా.. పోడూరు, న్యూస్‌టుడే: పెనుగొండ నియోజకవర్గ పరిధిలో 31 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.8.58 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పితాని కొమ్ముచిక్కాలలోని తన కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేశ్‌రాజు, కవిటం సొసైటీ అధ్యక్షుడు ఊడిగ శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ప్రారంభం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: సీతారాంపురం సౌత్ గ్రామంలో స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరాన్ని సోమవారం సర్పంచి దొండపాటి వెంకట్ ప్రారంభించారు. వారం రోజుల పాటు గ్రామంలో పలు ప్రజాహిత, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని కళాశాల ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ ఎస్.సురేశ్ కుమార్ పేర్కొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభ

పోడూరు, న్యూస్‌టుడే: జిన్నూరులో ఈ ఏడాది ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ గ్రామ సభ సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 57 పనుల నిమిత్తం రూ.45,39,129 ఖర్చు చేసినట్లు డీఆర్‌పీ రాజు గ్రామసభలో సభ్యులకు వివరించారు. మెటీరియల్ నిమిత్తం 1.34,047 ఖర్చు చేశారన్నారు.

రహదారి పనులు పునఃప్రారంభం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట- పాలకొల్లు రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరైనా వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పనులు పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక నాయకులు ఈ పనులపై దృష్టి పెట్టి ఈ ఏడాది జనవరిలో పూర్తి చేయాలని ప్రయత్నించినా ఆచంటలో సీసీ రోడ్డు నిర్మాణం జరగలేదు. ఈ సమస్యపై 'ఈనాడు'లో పలు కథనాలు వెలువడ్డాయి. వీటిపై అధికారులు, పాలకులు స్పందించి ఆచంటలో కచేరీ కూడలి నుంచి మార్కెట్ వరకు సీసీ రోడ్డు పనులు పునఃప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టారు. వాహనాల మళ్లింపునకు అనువుగా మినీ బైపాస్ రోడ్డును సిద్ధం చేశారు. ఇప్పటికే మార్కింగులు వేశామని, స్థానికులు సహకరిస్తే వారం రోజుల్లో నిర్మాణం పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ టీఆర్వీ ప్రసాద్ తెలిపారు.

వాహనాల మళ్లింపునకు సిద్ధం చేసిన మినీ బైపాస్

ఈనాడు కథనాలకు స్పందన

సిబ్బంది నిర్లక్ష్యంతో ఇబ్బందులు

రుస్తుంబాద, (నరసాపురం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై క్షేత్ర స్థాయి సిబ్బంది స్పందించడంలేదని, వారి నిర్లక్ష్యంతో ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావినతుల పరిష్కార వేదిక'కు వచ్చిన కొందరు 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. క్షేత్రస్థాయి సిబ్బంది అలసత్వం కారణంగా కొన్ని సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు.

తరచూ ప్రమాదాలు

పేరుపాలెం బీచ్‌లో సముద్ర అలలు ప్రమాదకరంగా ఎగసి పడుతుండటంతో పర్యాటకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు మృత్యువాత పడుతున్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బీచ్‌లో స్నానాలకు అనుమతి లేకుండా చర్యలు చేపట్టాలి.

\- నాగిడి రాంబాబు, ముత్యాలపల్లి

ఆక్రమణలు తొలగించండి



కొప్పర్రు గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారి పొడవునా ఆక్రమణలు పెరిగిపోయాయి. దీనిపై గత కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నా. అధికారులకు ఫిర్యాదు చేశా. ఆక్రమణలు తొలగించాలని న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

\- తామరాడ కృష్ణ, కొప్పర్రు

ప్రయాణమంటే హడలే!

అధ్వానంగా గ్రామీణ మార్గాలు

పెనుగొండ గ్రామీణ, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ రహదారులు అధ్వానంగా మారడంతో ప్రయాణమంటే హడలిపోయే పరిస్థితి నెలకొంది. కొన్ని మార్గాలు గుంతలతో, రాళ్లు లేచి అధ్వానంగా మారడంతో వాహనదారులు అదుపు తప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. ✦ పెనుగొండ మండలంలో దొంగరావిపాలెం నుంచి సిద్ధాంతం, ములపర్రు నుంచి చినమల్లం వరకు రహదారుల్లో భారీగా గోతులు ఏర్పడ్డాయి. వడలి నుంచి రామన్నపాలెం వెళ్లే మార్గంలో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు దిగబడిపోయింది. ✦ నరసాపురం మండలంలోని పలు గ్రామీణ రహదారులు అధ్వాన స్థితికి చేరాయి. వైవీలంక, సరిపల్లి, స్టేషన్ పేట, గ్రేస్ నగర్ తదితర గ్రామాల్లో రోడ్లు రాళ్లు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ అంశంపై డిప్యూటీ ఎంపీడీవో సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ రహదారుల సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

గోతులతో ప్రమాదకరంగా మారిన వైవీలంక రోడ్డు

చట్టాలపై అవగాహన అవసరం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: విద్యార్థులకు చట్టాలు, భద్రతా నిబంధనలపై అవగాహన ఉండాలని పాలకొల్లు పట్టణ ఎస్సై జి.పృథ్వీ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ చట్టాలు, న్యాయపరమైన రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సై

ఒరిజినల్ లింకు దస్తావేజులు పోయినవి.

పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు, 26వ వార్డు,హౌసింగ్ బోర్డు కాలనీ, డోర్‌నెం.54-3-1.ఎమ్.ఐ.జి 49, కాపురస్తులు చెరుకురి సీతారామరాజు గారి కుమారుడు **చెరుకూరి రామకృష్ణరాజు** కు చెందిన లోసరి గూట్లపాడు గ్రామం తాలుకు య5.02ట్లు భూమి లింకుదస్తావేజులు 05.02.2007 సం॥రం తేదిన దస్తావేజు నెం. 833/2007, మరియు ది.12.07.2006 సం॥రం తేదిన 4415/2006, ది.12.08.1983 సం॥రం తేదిన దస్తావేజు నెం.3572/1983 ర్లు గల ఒరిజినల్ లింకు దస్తావేజులను జిరాక్స్ తీయు నిమిత్తం మా ఇంటి వద్ద నుండి పాలకొల్లు సెంటర్‌కి వెళ్తుండగా మార్గమధ్యలో దస్తావేజులను పెట్టిన కవరు జారిపడిపోయినది

ఎంత వెదికినను దొరకలేదు. కావున దొరికినవారు పై అడ్రస్ కు తెలియ చేయగలరు.

విద్యతోనే ఉన్నత స్థాయి

యలమంచిలి, న్యూస్‌టుడే: విద్యలో సత్ఫలితాలు సాధిస్తే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన పదోతరగతి నమూనా ప్రశ్న పత్రాల పుస్తకాలను ఆయన మట్లపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో విద్యార్థుల కోసం గత 15 ఏళ్లుగా నమూనా ప్రశ్న పత్రాలను ముద్రించి పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ మండల శాఖను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజ స్థితిగతులను అధ్యయనం చేయాలని సూచించారు. ఇలపకుర్రు, మేడపాడు, శిరగాలపల్లి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు దాతల సహకారంతో పుస్తకాలు అందజేసినట్లు యూటీఎఫ్ నాయకులు పోలిశెట్టి క్రాంతి, గుత్తిందీవి శ్రీనివాసరావు, పంతం రామ్మూర్తినాయుడు తెలిపారు.

పుస్తకాలు అందిస్తున్న గోపీమూర్తి

నరసాపురం, పట్టణం, న్యూస్‌టుడే: గౌతమి విద్యాసంస్థలు, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి నమూనా ప్రశ్న పత్రాల పుస్తకాన్ని నరసాపురంలో ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి, యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. నియోజకవర్గంలో అన్ని జడ్పీ, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఈ పుస్తకాలను ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చిన గౌతమి విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్‌ను ఎమ్మెల్సీ అభినందించారు.

విద్యా సంస్థల బస్సుల్లో తనిఖీలు

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణంలో విద్యాసంస్థల బస్సుల్లో రవాణాశాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ అజ్మీర బద్దు మాట్లాడుతూ బస్సుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చోదకులు, సిబ్బంది సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చోదకులతో పాటు సంబంధిత యాజమాన్యాలపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చోదకులకు సూచనలిస్తున్న అధికారులు

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం ఎంపీడీవోగా ఎం.నాసర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్‌లో పని చేసిన ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన కార్యాలయ పర్యవేక్షణాధికారి వీకే వీరభద్రరావు ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

కవిటంలో బీసీ సదస్సు

పోడూరు, న్యూస్‌టుడే: బీసీలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని జాతీయ బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కవిటంలోని రెడ్డి కల్యాణ మండపంలో సోమవారం జరిగిన బీసీ చైతన్య సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వేదిక జిల్లా కార్యదర్శులుగా బొక్కా శ్రీను, సానబోయిన ఏడుకొండలు, అడహక్ కమిటీ కన్వీనర్‌గా పెనుగొండకు చెందిన వేంద్ర రామును నియమించారు.

ప్రజాప్రతినిధులను విస్మరిస్తే సహించం: ఎంపీపీ

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరినీ అధికారులు గౌరవించాలని.. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి (వాసు) అన్నారు. పెనుమంట్ర మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.

31 నుంచి సీఐటీయూ జాతీయ మహాసభలు

పెనుగొండ, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో డిసెంబరు 31వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 4వ తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక త్యాగరాజ గానసభ భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నలుగురు కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు

పోడూరు, న్యూస్‌టుడే: మండలంలో పనిచేస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులు మండల సచివాలయ అధికారులుగా (డిప్యూటీ ఎంపీడీవో) ఉద్యోగోన్నతి లభించాయి. వీరిలో సీహెచ్‌కే వెంకటరెడ్డి (గుమ్ములూరు) కేవీ కృష్ణవేణి(కవిటం) కె. సీతారామరాజు (వేడంగి), భూసారపు శ్రీనివాసరావు(కొమ్ముచిక్కాల) ఉన్నారు. వీరంతా వేర్వేరు మండలాలకు బదిలీ అయ్యారు. దీనికి సంబంధించిన ఉత్తర్వుల ప్రతులను ఎంపీడీవో బీఎస్ఎల్ మంగాకుమారి నుంచి సోమవారం అందుకున్నారు.

వాలీబాల్ టోర్నీలో ద్వితీయ స్థానం

మైలవరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో రెండురోజుల పాటు నిర్వహించిన కాకినాడ జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ వాలీబాల్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఒంగోలులోని క్యూఐఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు, నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల జట్టు వరుసగా మొదటి, రెండో స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎల్బీఆర్సీఈ గౌరవ ఛైర్మన్ లకిరెడ్డి జయప్రకాశరెడ్డి, జేఎన్‌టీయూ ఐసీటీ కార్యదర్శి లోవరాజు బహుమతులు అందించారు.

నరసాపురం స్వర్ణాంధ్ర కళాశాల జట్టు

కొట్టు అద్దె లైసెన్స్ హక్కునకు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీ మదనగోపాల స్వామి వారి ఆలయం తాలూకు షాపు నెం.6ను ది. 01.01.2026 నుండి ది.31.12.2028 వరకు మూడు సంవత్సరముల అద్దె కాలమునకు ది.15.12.2025 సం.రం. తేదీన సోమవారం ఉదయం 11.00 గం.లకు సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షమున సదరు ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించబడును. షాపు నెం. 6, 18.6 X17.6 కొలతలు గల షాపునకు రూ.10,000/-లు ధరావత్తు చెల్లించి ఆసక్తి గల వారు పాటలో పాల్గొన వలసినదిగా కోరుచున్నాము.

నరసాపురం, **ఛైర్మన్** మరియు సం/- **కార్యనిర్వహణాధికారి**
తేది: 01-12-2025 **ధర్మకర్తల మండలి** సెల్ నెం. 94934 79599

అవగాహనతో ఎయిడ్స్ నివారణ

చైతన్య ప్రదర్శనలో ఏఎస్ఎన్ఎం కళాశాల విద్యార్థులు

పాలకొల్లు, యలమంచిలి, న్యూస్‌టుడే: ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా పాలకొల్లు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఛాంబర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం యడ్లబజారు కూడలిలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ నివారణ సందేశాలతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. అడవిపాలెంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలో ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్‌క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాలకొల్లులో లయన్స్‌క్లబ్, సన్‌షైన్ పాఠశాల, లియోక్లబ్‌ల ఆధ్వర్యంలో చైతన్య ప్రదర్శన నిర్వహించారు. క్లబ్ రీజినల్ ఛైర్‌పర్సన్ నందుల రమణి అందించిన రూ.47 వేల విలువైన పోషకాహారాన్ని వ్యాధి బాధితులకు అందించారు.

మత్స్యకారుడి మృతదేహం గుర్తింపు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఉప్పుటేరులో చేపల వేటకు వెళ్లి అదృశ్యమైన మత్స్యకారుడి మృతదేహాన్ని సోమవారం గ్రామస్థులు గుర్తించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన కొక్కిరగడ్డ శ్రీను(45) నాలుగేళ్ల కిందట అత్తవారి గ్రామమైన పాతపాడు వచ్చి స్థిరపడ్డారు. గత నెల 29న రాత్రి ఉప్పుటేరులో చేపలవేటకు వెళ్లిన ఆయన ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆయన ఆచూకీ కోసం గాలిస్తుండగా కృష్ణాజిల్లా గొల్లపాలెం గ్రామ పరిధి ఉప్పుటేరులో మృతదేహం లభ్యమైంది. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని సర్పంచి కొప్పాడ లక్ష్మీతులసి, ఉమామహేశ్వరరావు దంపతులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బొడ్డు సాంబమూర్తి తదితరులు పరామర్శించారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం రుస్తుంబాద వద్ద 216వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం లారీ బోల్తా కొట్టింది. స్థానికుల కథనం ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన కొవ్వొత్తుల రవాణా లారీ జాతీయ రహదారిపై నరసాపురం మీదుగా మచిలీపట్నం వెళ్తోంది. రుస్తుంబాద పరిధిలోకి లారీ రోడ్డు మార్జిన్ వైపు వెళ్లి దిగబడింది. మరో లారీతో దానిని బయటకు లాగుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా కొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No. 4/2024 in O.S.No. 147/2020

Between:
D.H.R: Pericherla Venkata Narasimha Raju
And
JDR: Vuyyuri Padma

పై నెంబరు E.P. గ్రంథములో DHRకు రావలసిన డిక్రీ బాకీ నిమిత్తము JDR తాలూకు EP Schedule ఆస్తిని వేలం వేయు నిమిత్తం ది. 17-12-2025 సం. తేదీ ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట పై సమయం లగాయితు పై కోర్టు వారి ఎదుట JDR తాలూకు షెడ్యూలు ఆస్తి వేలం వేయబడును గాన వేలం పాటలో పాల్గొనువారు పాల్గొని పాట పాడుకోవలసినదిగా యావన్మందికి తెలియపర్చడమైనది.

E.P.SCHEDULE

West Godavari District, Mogaltur Mandal, Mogaltur S.R.O., Perupalem North Panchayat area, Perupalem Revenue Village, R.S.No. 168/1, Zeroyati dry land in an extent of Ac. 1.00 cents with in the following boundaries.

East: Road, **South:** Land of Andey Suryanarayana, **West:** Tank and Land of Andey Suryanarayana, **North:** Land of Kadali Venkateswara Rao.

ఈ హద్దుల మధ్య ఉన్న య. 1.00 సెంట్లు భూమి అందులో ఫలవృక్షములు, నీటి హక్కులు, ఈజుమెంటు హక్కులతో సహా వేలము కాబడును.

DHR Value: Rs. 18,00,000/- Amin Value: Rs. 25,00,000/-

నరసాపురం సం/- **టి.కరుణానిధి,** అడ్వకేట్
1-12-2025 నరసాపురం, సెల్: 94925 66257

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక

ఆర్వీ సూర్యనారాయణ

తణుకు గ్రామీణం,న్యూస్‌టుడే: తణుకు మండలం వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు ఆర్వీ సూర్యనారాయణ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు మూడోసారి ఎంపికయ్యారు. ఈ నెల 6 నుంచి 9 వరకు హరియాణా పంచకుల ప్రాంగణంలో జరగనున్న ఎడ్యుకేషన్ ఫర్ ఆస్పైరింగ్ ఇండియా సైన్స్ సఫారీ, గేమ్స్, అడ్వెంచర్స్ వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు. సైన్స్ బోధనలో వినూత్న పద్ధతులు, ఆవిష్కరణలను ఆయన ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యాధికారులు, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

చదరంగంలో ప్రతిభ

బాలశ్రీ కార్తికేయను అభినందిస్తున్న వరుణ్‌దేవ్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని 23వ వార్డుకు చెందిన వంగసుండు బాలశ్రీకార్తికేయ రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. బాలభారతి విద్యాభవన్‌లో 8వ తరగతి చదువుతున్న కార్తికేయ 'సమర్థ స్కూల్ రేటింగ్ - స్పోర్ట్స్2024-25' అవార్డును గెలుచుకున్నారు. విజయవాడ నోవోటెల్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సమర్థ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వి.వరుణ్‌దేవ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, ఐదువేల రూపాయలు చెక్కును అందుకున్నారు. విద్యార్థిని స్నేహితులు, ఉపాధ్యాయులు అభినందించారు.

చరవాణి వినియోగంపై నియంత్రణ అవసరం

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

యాగర్లపల్లి, భూపాలనగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: "ఈనాడు" ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం యాగర్లపల్లిలోని మహాత్మాగాంధీ పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వై.హేమంత్, ఎం.దనలక్ష్మి, వి.పూజితలకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.వనజ, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

● "ఈనాడు" ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం భూపాలనగర్‌లోని అంగ్లాదుద్దిన ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా "విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం" అనే అంశంపై ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎం.సంజన, ఎ.కేతనశ్రీజ, వి.జోషితలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రమేశ్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

మందులు లేవు.. బయట తెచ్చుకోండి!

తణుకు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పశువైద్యశాలల్లో మందుల కొరత వేధిస్తోంది. దాదాపుగా మూడేళ్ల నుంచి రైతు సేవా కేంద్రాలకు మందులు పంపిణీ నిలిచిపోగా, పశువైద్యశాలలు వచ్చిన ఔషధాలను కొన్నింటిని పంపిణీ చేసి నెట్టుకొస్తున్నారు. చివరగా మే నెలలో సరఫరా చేయగా మళ్లీ ఇప్పటి వరకు వాటి ఊసే లేదు. దీంతో వైద్యులే ప్రైవేటు దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాలని చెబుతున్నారు.

ఇరగవరంలో అరకొరగా మందులు

తప్పని సమస్యలు.. పలు రకాల వ్యాధుల బారిన పడిన పశువులను పాడి రైతులు గ్రామాల్లోని పశువైద్యశాలలకు తీసుకొస్తుంటారు. కనీస ఔషధ సామగ్రి అయిన దూది, టించర్ ఐడిన్, గాజు గుడ్డలు సైతం పలు చోట్ల కరవయ్యాయి. ప్రస్తుతం చలికాలం కావడంతో దోమకాటు, జ్వరాలు, అరుగు వాపు, పొదుగు సమస్యలు అలర్జీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. మందులు సరఫరా అరకొరగా ఉండటంతో మూగజీవాలకు వైద్యం దైవాధీనంగా మారింది. దీంతో పాల దిగుబడి కూడా గణనీయంగా తగ్గుతోంది. అనారోగ్యానికి గురైతే దూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తరలించాల్సిన దుస్థితి నెలకొంది. కనీస సమస్యలకైనా మందులు అందుబాటులో ఉంచాలని పశుపోషకులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	పశువులు	వైద్యశాలలు	రైతుసేవా కేంద్రాలు
తణుకు	7200	4	4
ఇరగవరం	9600	4	14
అత్తిలి	6800	5	10

త్వరలో పంపిణీ.. ఈ ఏడాదిలో ఒక్క క్వార్టరు కూడా ఔషధాలు రాలేదు, ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో మందులు పంపిణీ చేస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.కోటిలింగరాజు తెలిపారు.

మందులు కొని.. పొదుగు వాపు సమస్యతో బాధపడుతున్న ఆవును అత్తిలి పశువైద్యశాలకు తీసుకొస్తే వైద్యులు పరీక్షించి చీటీపై రాసి పంపారు. మందులు లేవని, బయట నుంచి తెచ్చుకోవాలని చెప్పారని అత్తిలికి చెందిన జూజుకుల సత్యనారాయణ వాపోయారు.

● దువ్వకు చెందిన గూడూరి శ్రీనివాసరావు పశువులు పొదుగు వ్యాధితో అవస్థ పడుతుండటంతో దువ్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మందులు బయట కొనుక్కోవాలని సూచించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తాడేపల్లిగూడెం: 99488 53114
తణుకు: 85558 50851
తణుకు (గ్రామీణం): 63005 79402
అత్తిలి: 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? మసీదు సెంటర్‌లో వంతెన వద్ద వ్యర్థాలు పేరుకుని నీరు నిల్వ ఉండటంతో భరించలేని దుర్వాసన వస్తోంది. - నగేష్, స్థానికుడు
✔ వ్యర్థాలు తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపడతాం - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
? సావిత్రిపేటలోని సాయిబాబా ఆలయం సమీప ప్రాంతాల్లో రహదారులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు - కుమార్
✔ చర్యలు చేపడతాం - ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

అర్జీలు పరిశీలించి.. పరిష్కరిస్తాం..

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలు వారి హక్కుల గురించి అడగటంతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు అందించిన వినతులను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామన్నారు. పట్టణ ప్రజలు వారికి నిర్దేశించిన ప్రాంతాల్లోనే చెత్త వేయాలని, రహదారులపై చెత్తను వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఎల్.ఆర్.ఎస్, బి.ఆర్.ఎస్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఏసుబాబు సూచించారు. వీటి గడువు ఈనెల 23 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. గడువు తీరాక ఎవరికైనా భవన నమూనాలు లేకపోయినా, స్థలాలు క్రమబద్ధీకరణలో లేకపోయినా నష్టపోతారని, అందువల్లో అందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

బామ్మకు భరోసా ఇస్తున్న ఆరిమిల్లి

ఇరగవరం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఏలేటిపాడులో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారులు, కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, సర్పంచి గుడాల లక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తణుకు, న్యూస్‌టుడే: దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా పింఛన్లు పంపిణీ ప్రక్రియ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. 17 నెలలుగా ప్రతి నెలా 1వ తేదీన పింఛన్లు అందజేస్తున్నామన్నారు. దివ్యాంగులకు సైతం రూ.6వేలు నుంచి రూ.15వేలు వరకు పింఛన్లు పెంచి అందిస్తున్నామన్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేస్తూ అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తున్నామన్నారు.

సామాజిక పింఛన్లతో వృద్ధులకు భరోసా

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపుతో వృద్ధులకు పెంచి అందిస్తున్న సామాజిక పింఛన్లు వారికి భరోసాగా నిలుస్తున్నాయని ఏపీ భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, నవాబ్‌పాలెం గ్రామాల్లో నాయకులతో కలిసి లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న బాబ్జీ

పగలే వెన్నెలా..!

తణుకు గ్రామీణం,న్యూస్‌టుడే: విద్యుత్తును ఆదా చేయాల్సిన ప్రభుత్వ సిబ్బందే నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పురపాలికకు నష్టం వాటిల్లుతోంది. పట్టణంలోని స్థానిక సూర్యాలయం వీధి, కుమ్మర్ల వీధి, బాబుగారి వీధి సహా పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. తరచూ ఇదే పరిస్థితి కొనసాగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా మేల్కొని విద్యుత్ వృథా కాకుండా చూడాలని కోరుతున్నారు.

వంతెనపై ముప్పు!

ఇనుప చువ్వలు తేలి ఇలా..

తణుకు గ్రామీణం,న్యూస్‌టుడే: వీరభద్రాపురం నుంచి కొమరవరం వెళ్లే ప్రధాన మార్గంలో గోస్తాని కాలువపై ఉన్న వంతెనతో అధ్వానంగా తయారైంది. ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు శిథిలమై ఇనుప చువ్వలు బయటకొచ్చాయి. వంతెన బలహీనం కావడంతో 15 టన్నుల బరువుకి మించిన వాహనాల రాకపోకలు నిషేధించినా, ఈ వంతెన మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీని పై ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ స్పందిస్తూ వంతెన నిర్మాణానికి రూ.5 కోట్లు ప్రతిపాదనలకు పంపించామని తెలిపారు.

ఇది బస్సు షెల్టరా..?

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక హౌసింగ్ బోర్డు కూడలి వద్దనున్న బస్‌షెల్టర్ మురుగుబోదె వ్యర్థాలతో నిండిపోయింది. రోజులు గడుస్తున్నా వాటిని తొలగించకుండా వదిలేశారు. ఇది ఇప్పటికే ఆక్రమణలతో మూసుకుపోయింది. ఇప్పుడు లోపల కూడా వ్యర్థాలు పోగుపడటంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా పురపాలక సిబ్బంది స్పందించి బస్‌షెల్టర్‌ను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టుపై ఓ కన్నేయరూ..!

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని విజయవాడ టీస్టాల్ నుంచి సీతారాంపేటకు వెళ్లే రహదారి కల్వర్టు ప్రమాదకరంగా మారింది. నిత్యం వాహన చోదకులు, లోడు వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఇలా గత ఆరు సంవత్సరాలుగా స్థానికులు వివిధ పనులపై పట్టణానికి వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. పాదచారులు, వాహన చోదకులు కల్వర్టు దాటే క్రమంలో గాయాల పాలవుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలిలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కొలువైన అయ్యప్పకు సోమవారం ఆలయ అర్చకుడు వాడపల్లి సత్యనారాయణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని రకరకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని పెదతాడేపల్లిలో శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్(జాతీయ సేవా పథకం) యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం వారం రోజులపాటు నిర్వహించే సేవా శిబిరం సోమవారం ప్రారంభమైంది. దీనికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచి పోతుల అన్నవరం పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సేవా కార్యక్రమాల ద్వారా సామాజిక స్పృహపై అవగాహన పెరుగుతుందన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన అవసరం

తణుకు, న్యూస్‌టుడే: ఎయిడ్స్ నివారణలో ఔషధాల కంటే అవగాహన ముఖ్యభూమిక పోషిస్తుందని ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఆర్.కె.ఫణిధర్ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ (ఆర్ఆర్‌సి) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఆర్‌సి సమన్వయకర్త డా కె.నాగభూషణ రెడ్డి మాట్లాడుతూ వ్యాధి గురించి నిజమైన జ్ఞానం, నివారణ చర్యల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మారుతీదేవి, అశోక్ కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో విద్యార్థులు

ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

మాధవరంలో రక్తదానం.. తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకొని సోమవారం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు వైద్యాధికారి ఏవీ వెంకటేశ్ ఆధ్వర్యంలో పథాలజిస్టు వైద్యురాలు జి.రమ్య శృతి సహకారంతో 15 మంది రక్తదానం చేశారు.

ప్రథమ చికిత్స కిట్ల పంపిణీ

ఈనాడు కథనానికి స్పందన

తణుకు, న్యూస్‌టుడే: 'ప్రథమ చికిత్స కిట్టు.. మందులుంటే ఒట్టు' శీర్షికన గత నెల 6న ఈనాడులో ప్రచురితమైన కథనానికి తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ స్పందించారు. సోమవారం మండపాక గ్రామానికి చెందిన విజయవాడలోని రమేశ్ ఆసుపత్రి వైద్యుడు డా జి.వి.నాగేశ్వరరావు సహకారంతో 100 ప్రథమచికిత్స కిట్‌లను గిరిధర్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి బస్సులోని కండక్టర్ వద్ద కిట్టు ఉండేలా ఏర్పాటు చేశామన్నారు.

పాస్‌పోర్టు పోయినది

గుండుబోయిన రాజారత్నం C/o. G.నాగేశ్వరరావు, మోదుగగుంట గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పాస్‌పోర్టు నం: H6892594 గల (విశాఖపట్నం 05/11/2009 to 04/11/2019) ఒరిజినల్ పాస్‌పోర్టు మోదుగగుంట నుండి తాడేపల్లిగూడెం వెళ్ళుచుండగా దారిలో పడిపోయినది. తరువాత ఎంతవెదికినా దొరక లేదు. దొరికిన వారు పై అడ్రసుకు లేదా క్రింద సెల్ నంబరుకు ఫోన్ చేసి అందజేయగలరు.

సెల్: 95025 78926

చ॥గ॥ రూ॥3,700లకే ఇంటి స్థలం అమ్మకం

తాడేపల్లిగూడెం బైపాస్ ప్రక్కన శ్రీ సౌభాగ్యలక్ష్మి నగర్ నందు ఇండ్ల స్థలములు అమ్మకమునకు కలవు.

కాంటాక్ట్: 98852 49964 94916 24748

అగాధం.. ఆదమరిస్తే ప్రమాదం

వీరభద్రపురం ప్రమాదకరంగా గొయ్యి

తణుకు, న్యూస్‌టుడే: పట్టణం నుంచి భీమవరం వెళ్లే రహదారిలో వీరభద్రపురం వద్ద మలుపులో రహదారి ప్రమాదకరంగా మారింది. మలుపులో సీసీ రహదారి, బీటీ రోడ్డు కలయిక ఉండటంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇది జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారి కావడంతో పాటు ఆయా గ్రామాల నుంచి తణుకు పట్టణానికి వచ్చే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. రాత్రి వేళల్లో అగాధం తెలియక గాయాలపాలవుతున్నామని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని చోదకులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ ఏఈ యశ్వంత్ తెలిపారు.

ఉప ఎంపీడీవోగా వెంకట నారాయణ

ఇరగవరం, న్యూస్‌టుడే: ఇరగవరం మండల పరిషత్తు గ్రామ సచివాలయాల, వార్డు సచివాలయాల(జీఎస్‌డబ్ల్యూఎస్) డిప్యూటీ ఎంపీడీవోగా వి.వెంకటనారాయణ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన పెనుమంట్ర గ్రామ కార్యదర్శిగా పనిచేస్తూ, ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారని ఎంపీడీవో శ్రీనివాసరావు వివరించారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రీడా పోటీలను విద్యాధికారులు వి.హనుమ, పీఎంకే జ్యోతి సోమవారం శశి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెప్పే క్రమంలో ఒత్తిడికి గురవుతారని, ఇలాంటి క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉపశమనం కలుగుతుందన్నారు. క్రికెట్, త్రోబాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వర్, వెంకట్, సుభానీ, ఉమామహేశ్వరి, ఇంద్రాణి, కనకదుర్గ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న విద్యాధికారులు హనుమ, జ్యోతి

వృత్తి విద్యా శిక్షణ తరగతులు

తణుకు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్ఎన్‌వీటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ గ్రూపులు చదువుతున్న మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించినట్లు ప్రధానాధ్యాపకురాలు వి.తులసిలక్ష్మి తెలిపారు. ఈ మేరకు తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ శిక్షణ తరగతులు ప్రారంభించామని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.కె.స్వరూప, జి.సునీత, ఎంఎస్ఆర్.రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, న్యూస్‌టుడే: తారకాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు వావిలాల వెంకట పవన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉండ్రాజవరం కూడలి సమీపంలో ఇంపల్స్ జూనియర్ కళాశాల ఆవరణలో ఉదయం 9గంటల నుంచి ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), తణుకు, ప.గో.జిల్లా, వారి కోర్టులో

ఈ.పి.నెం.29/2023 ఇన్ ఓయస్ నెం.226/2013

బిట్వీన్ :-
గుణ్ణం రుద్ర కిషోర్ ...డిహెచ్ఆర్ / వాది
మరియూ
సూనె లక్ష్మీ నారాయణ తరపున జిపిఎ హోల్డర్ పరిమి భూపయ్య ...జేడీఆర్

డి.హెచ్.ఆర్ తరపున చేసిన వేలం ప్రకటన

పై నెంబరు ఈ.పి.లో జె.డి.ఆర్ తాలూకా దిగువ షెడ్యూల్ ఆస్తిని ది.31-12-2025 వ తేదీన ఉదయం 10-30 గం. లగాయితు శ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్ట్, తణుకు వారి ఎదుట బహిరంగ వేలం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూల్ ఆస్తి వివరం

పశ్చిమగోదావరి జిల్లా, శ్రీ భీమవరం జిల్లా రిజిస్ట్రార్, తణుకు సబ్ డివిజన్, తణుకు మండలం, వేల్పూరు గ్రామపంచాయితీ, వేల్పూరు గ్రామం, బ్లాక్ నెం. 4, రివిజన్ సర్వే నెం. 150/2ఎ నందు అల్లాడి వారి వీధిలో గల 157 5/6 చ.గ.ల స్థలం అందులో గల డోర్ నెం. 4-167, అసెస్మెంట్ నెం. 674 రు గల పెంకుటింటికి హద్దులు: తూర్పు: పంచాయితీ సిమ్మెంట్ కాంక్రీట్ రోడ్-9 1/3 గజాలు, దక్షిణం: చంద్రు నర్మద గారి ఇంటి స్థలం-15 1/3 గజాలు, పడమర: పంచాయితీ సిమ్మెంట్ కాంక్రీట్ రోడ్-12 గజాలు, ఉత్తరం: పంచాయితీ సిమ్మెంట్ కాంక్రీట్ రోడ్- 14 గజాలు.
పై హద్దుల మధ్య 157 5/6 చ.గ.ల స్థలం, అందుగల 986 చ.అ. లో గల పెంకుటిల్లు, 49 చ.అ. లో గల ఆర్ సి సి కప్పు గల టాయిలెట్, 16 చ.అ గల కప్పు లేని టాయిలెట్, ఎలక్ట్రికల్ కనెక్షన్, హేండ్ పంపు యావత్తూ ఈజిమెంట్ హక్కులతో సహా. సదరు ఆస్తి నందు జెడీఆర్ తాలూకా అవిభక్తపు సగ భాగం మాత్రమే.

డి.హెచ్.ఆర్ విలువ : రూ.14,00,000/-
జె.డి.ఆర్ విలువ : తెలుపలేదు
మార్కెట్ విలువ (సర్టిఫికెట్ ప్రకారం): రూ.8,05,700/-
అమీనా విలువ : రూ.15,00,000/-

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్యవెంకట వర ప్రసాద్
అడ్వకేట్స్, తణుకు-534211
తణుకు,
ది.02-12-2025

సరిహద్దు గొడవ.. ఇద్దరికి జైలు శిక్ష

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: సరిహద్దు గొడవల్లో కొట్లాటకు వెళ్లి ఒకరిని గాయపరిచిన ఇద్దరికి 15 నెలల జైలు శిక్ష రూ.5 వేలు జరిమానా విధిస్తూ తాడేపల్లిగూడెం అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సోమవారం తీర్పునిచ్చారు. దీనికి సంబంధించి తాడేపల్లిగూడెం గ్రామీణ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో మండలంలోని అప్పారావుపేటకు చెందిన అడపా వెంకటేశ్‌పై వారి బంధువులైన అడపా నారయ్య, అడపా విష్ణులు దాడి చేశారు. దీనిపై కేసు విచారణ అనంతరం ఇద్దరికి జైలు శిక్ష విధించారని తెలిపారు.

వరికోతలు వాయిదా వేయాలి

ఇరగవరం, న్యూస్‌టుడే: దిత్వా తుపాను కారణంగా రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున వరికోతలు వాయిదా వేయాలని మండల వ్యవసాయాధికారి వై.రాఘవేంద్రరావు రైతులకు సూచించారు. సోమవారం ఇరగవరం, ఏలేటిపాడు, పేకేరు గ్రామాల్లో వరిచేలు, ధాన్యం రాశులను పరిశీలించారు. ధాన్యం రాశులపై బరకాలు కప్పితే కింది నుంచి నీరు చేరే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే కోసిన పంటను వర్షానికి తడవకుండా బరకాలు కప్పి జాగ్రత్త పరచాలని సూచించారు.

సూచనలిస్తున్న రాఘవేంద్రరావు

బాల్య వివాహం నేరం

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తణుకు, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం, నేరమని దువ్వ అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. 'బాల్య వివాహ విముక్త భారత్' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని దువ్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహ నిరోధకంపై ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రతా దళాల సేవలు మరువలేనివి

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: సరిహద్దు భద్రతా దళాల సేవలు మరువలేనివని డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణం రాజు అన్నారు. భారత సరిహద్దు భద్రతా దళాల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సత్యవతి నగర్‌లో క్లబ్ ఉపాధ్యక్షుడు కాళ్ల గోపీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం విశ్రాంత బీఎస్ఎఫ్‌లో విశేష సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఆకుల సతీష్ నాయుడిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘసభ్యులు పాల్గొన్నారు

లేబర్ కోడ్‌లు రద్దు చేయండి

తణుకు గ్రామీణం,న్యూస్‌టుడే: పెట్టుబడిదారులకు అనుకూలంగా మోదీ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చెయ్యాలని వేల్పూర్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో అల్లాడి నాగ బలరాం అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల హక్కులను కోల్పోవడమే కాక పని గంటలు పెరుగుతాయని, కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి తెచ్చుకొన్న సంక్షేమ బోర్డు రద్దు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లంకె దుర్గారావు, బొక్కా బాలాజీ రావు, ఆనందం గంగాధర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చినవీరభద్రరావు

వేలం నోటీసు

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్)లో;

ఇ.పి.నెం. 10/2019 ఇన్ ఓ.ఎస్.నెం. 144/2017

బిట్వీన్: సత్తి సరోజ లక్ష్మి ... డి.హెచ్.ఆర్.
మరియు
గురజాడ నాగ బ్రహ్మం ... జె.డి.ఆర్.
S/o శ్రీరాములు, వయస్సు 49, పురుషుడు, వ్యాపారం, ఇంటి నెం. 10-14-7, తాళ్లముదునూరుపాడు, 18వ వార్డు, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా, TPG PJCJC

పై నెంబరు ఇ.పి. నందు జె.డి.ఆర్. యొక్క ఈ దిగువ షెడ్యూలు ఆస్తి ది. 15-12-2025వ తేదీన ఉదయం గం. 10-30 ని.ల లగాయితు పై కోర్టు వారి ఎదుట వేలం వేయబడును. ఆసక్తి గలవారు కోర్టువారి వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చును.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రీ, తాడేపల్లిగూడెం మునిసిపాలిటీ, తాళ్లముదునూరుపాడు గ్రామం, 18వ వార్డు, డో.నెం. 10-14-7న గల చ.గ. 120లు ఖాళీ స్థలమునకు హద్దులు: తూర్పు: కొవ్వూరి భామిరెడ్డి, దక్షిణం: మునిసిపల్ రోడ్, పడమర: సత్తి సరోజలక్ష్మి (పాత మల్లిడి వెంకటరెడ్డి), ఉత్తరం: కొవ్వూరి భామిరెడ్డి (పాత కొవ్వూరి వీర్రెడ్డి), ఈ హద్దుల మధ్య గల 120 గజముల స్థలము అందు అసెస్మెంట్ నెం. 1080009272 (పాత అసెస్మెంట్ నెం. 4161), కరెంట్ సర్వీసు నెం. 1541246105000053 (పాత 53) గల ఆస్బెస్టాస్ సిమెంట్ రేకుల షెడ్ వగైరాలతో, అందు యావత్తు ఈజుమెంటు హక్కులతో సహా. జె.డి.ఆర్. యొక్క 1/3వ వంతు అవిభాజ్యపు జాయింటు హక్కు.

డి.హెచ్.ఆర్.విలువ: రూ. 2,00,000/-
అమీనా విలువ: రూ. 2,30,000/-
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
సం/- కొవ్వూరి అప్పిరెడ్డి, న్యాయవాది,
తాడేపల్లిగూడెం - 534102
తాడేపల్లిగూడెం
తేదీ: 30-11-2025 ఫోన్ నెం. 99595 94995, 94401 28616

(c) eenadu

శ్మశాన వాటికలకు నరేగా నిధులు

ఈనాడు, కడప: పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ అనుమతులతో నరేగా నిధులు వినియోగించి మైదుకూరు నియోజకవర్గంలో శ్మశాన వాటికలను ప్రయోగాత్మకంగా నిర్మించారు. డయాన్‌ఖాన్‌పల్లె గ్రామంలో పూర్తి చేసిన నిర్మాణాన్ని మంగళవారం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. ఇక్కడ నరేగా నిధులు రూ.20 లక్షలు వెచ్చించి అన్ని రకాల వసతులతో ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ఇదే స్ఫూర్తితో నియోజకవర్గంలో మరో డెబ్బై కూడా నిర్మించేందుకు పనులు చేపట్టారు.

సాహసం.. శ్వాసగా.. సాగిపోదాం


అరణ్యమార్గంలోని కాలిబాటల్లో విద్యార్థుల సమూహం

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సాహసాలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. ప్రకృతి అందాల మధ్య, పర్వతారోహణ చేస్తూ కొత్త అనుభూతి పొందుతున్నారు. గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణకు వచ్చిన విద్యార్థులు సోమవారం గండికోట పరిసర ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌తో పాటు గండికోట - మైలవరం జలాశయంలో వాటర్ స్పోర్ట్స్‌లో నైపుణ్యాలు నేర్చుకున్నారు. అత్యవసర సమయాల్లో నీటిలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి. . ప్రథమ చికిత్స చేయడంపై పర్వతారోహకులు మురళీకృష్ణ, దుర్గారావు, ఎస్.ఆనంద్, అన్విత, ఈశ్వరప్ప శిక్షణ ఇచ్చారు.

మైలవరం జలాశయంలో విద్యార్థినుల జల విహారం

తూకాల తనిఖీల్లో తకరారు

◆ తగ్గిన ఆదాయం, కేసులు
◆ కానరాని అవగాహన కార్యక్రమాలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: తూనికలు, కొలతల శాఖ ఆదాయంలో వృద్ధి అంతంత మాత్రమే ఉంది. గత ఆర్థిక సంవత్సరం రాబడితో పోలిస్తే ఈ ఏడాది ఏడు నెలలకుగాను తగ్గింది. కేసుల సంఖ్య కూడా గతేడాది కంటే తక్కువే నమోదయ్యాయి. ముద్ర, అపరాధ రుసుముల్లో కూడా ఆదాయం బాగా తగ్గినట్లు కనిపిస్తోంది. క్రమం తప్పకుండా దాడులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అధికారులు.. ఆ దిశగా పూర్తి స్థాయిలో ప్రయత్నించకపోవడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది.

ప్రొద్దుటూరు మార్కెట్‌లో తూకం ముద్ర రాళ్లను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరకుమార్

2024, 2025 ఆర్థిక సంవత్సరం



ధర్మకాట ఊసేదీ!

● జిల్లాలో 36 మండలాలున్నాయి. అన్ని ప్రాంతాల్లో శాఖాపరంగా వినియోగదారులకు అధికారులు అవగాహన కల్పించాలి. ● ప్రత్యేకంగా ఆదివారాల్లో కూరగాయలు, పండ్ల మార్కెట్లతో పాటు మాంసం, చేపల విక్రయాల వద్ద ధర్మకాట నిర్వహించాలి. ● తూనికలు, కొలతల్లో మోసాలు, సరైన తూకాలపై వినియోగదారులకు వివరించాల్సి ఉంటుంది. ● నిత్యావసర వస్తువులపై నిర్ణీత ధరలు, తయారీ తేదీ, బరువు వివరాలు లేకపోతే పెద్ద ఎత్తున జరిమానాలు విధించాలి.

● ఎలక్ట్రానిక్ తూకాలు లేకపోయినా, రెండేళ్లకోసారి విధిగా తూకం రాళ్లపై ముద్రలు వేయించుకోకపోయినా కేసులు నమోదు చేయాలి. అయితే క్షేత్రస్థాయిలో అధికారుల తనిఖీల ప్రక్రియ తగ్గిపోవడంతో గతేడాది కంటే ప్రస్తుత రాబడి పడిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో వినియోగదారులు పెద్ద ఎత్తున మోసాలకు గురవుతుండటం గమనార్హం.

ప్రణాళిక రూపొందించాం

తనిఖీలపై తూనికలు, కొలతలు శాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ మహమ్మద్ గౌస్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరింది. అందుకు ఆయన మాట్లాడుతూ.. బదిలీపై కొత్తగా వచ్చినట్లు తెలిపారు. వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతేడాదితో పోలిస్తే కాస్త కేసులు, ఆదాయం తగ్గింది నిజమేనని చెప్పారు. మార్చి నెల చివరికంతా రాబడిని పెంపొందేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు.

భూచోళ్లపై డ్రోనాస్త్రం

సర్వే చేపట్టిన రెవెన్యూ అధికారులు

వైకాపా హయాంలో కొందరు నేతలు భూబకాసురుల అవతారమెత్తారు. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు మరింత రెచ్చిపోయారు. మైదుకూరు మండలం నంద్యాలంపేటలో అటవీ శాఖ భూముల్ని ఆక్రమించారు. దర్జాగా ఉద్యాన తోటల సాగు చేపట్టారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందడంతో ఎన్‌జీటీ అభ్యంతరం తెలిపింది. అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూశారంటూ అక్షింతలు వేసింది. ఆక్రమణలు తొలగించి భూముల్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. అయినా వారిలో చలనం లేకపోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత భూఆక్రమాలను సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆక్రమణల నిగ్గు తేల్చేందుకు ఆదేశించారు. **ఈనాడు, కడప:**

● నంద్యాలంపేట రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 22/43లో 1.20 ఎకరాలు, సర్వే నంబరు 22/44లో 2.02 ఎకరాలు, సర్వే నంబరు 22/45లో 2.58 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి.

● మైదుకూరు మండలం నంద్యాలంపేట రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 56/బిలో 2.82 ఎకరాల భూమిని ఖాజీపేటకు చెందిన ఓ నేత ఆక్రమించారు.

● సర్వే నంబరు 26/62లో 5.20 ఎకరాలు, సర్వే నంబరు 22/17లో 3.80 ఎకరాలను మాజీ ప్రజాప్రతినిధి ఒకరు ఆక్రమించుకుని ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

మైదుకూరు మండలం నంద్యాలంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే చేపట్టిన బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, సిబ్బంది

● **ఆక్రమణలోని భూముల గుర్తింపు:** భూఆక్రమణ నిగ్గు తేల్చేందుకు రెవెన్యూ అధికారులు ఇప్పుడు డ్రోన్ అస్త్రం ప్రయోగిస్తున్నారు. ఇందులో భాగంగా బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్రలు సిబ్బందితో కలిసి సోమవారం డ్రోన్ సర్వే చేపట్టారు. మొదటి రోజు ఓ మాజీ ఎమ్మెల్యే అనుచరుడు, ఖాజీపేటకు చెందిన నేత చేతిలో భూములున్నట్లు గుర్తించారు. మరో మాజీ ఎమ్మెల్యే స్వయంగా భూకబ్జాకు పాల్పడి మామిడి మొక్కలు నాటి పెంపకం చేపట్టినట్లు తెలుసుకున్నారు.

● **తొలగించబోతే బెదిరింపులు:** ఆక్రమిత భూములకు ఎస్పీడీసీఎల్ గతంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ సర్వీసులు మంజూరు చేసింది. వీటిని తొలగించే ప్రయత్నం ఎస్పీడీసీఎల్ చేపట్టగా మాజీ ఎమ్మెల్యే బెదిరింపులకు దిగారు. దీంతో అధికారులు వెనకడుగు వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగిస్తామని చెబుతున్నారు.

డ్రోన్ ద్వారా సర్వే చేసి చిత్రీకరించిన మాజీ ఎమ్మెల్యే ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిలోని మామిడి తోట

ఉపాధి ఉద్యోగులకూ బీమా

కమలాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక దృష్టి సారించింది. శ్రామికులతో పాటు ఉద్యోగులకూ భరోసా కల్పించేలా బీమా సదుపాయం అమలుకు నిర్ణయించింది. ఉద్యోగులకు ప్రమాదవశాత్తు ఏదేని ప్రమాదం వాటిల్లితే కుటుంబాలకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టింది.

● బీమా వర్తించాలంటే ఉపాధి హామీలో ఉద్యోగం చేస్తున్న వారికి తప్పనిసరిగా ఎస్‌బీఐ ఖాతా ఉండాలి. లేనివారు కొత్తగా తెరవాల్సి ఉంటుంది. అప్పుడే బీమా వర్తిస్తుందని డ్వామా అధికారులు తెలిపారు.

● రూ. 10 వేల నుంచి రూ. 25 వేల మధ్య వేతనం పొందే వారికి రూ. 3 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా వర్తిస్తుంది. రూ. 25 వేల నుంచి రూ. 50 వేల మధ్య వేతనదారులు రూ. 12 లక్షల ప్రమాద బీమాకు అర్హులు. రూ. 50 వేల నుంచి రూ.లక్ష వేతనం పొందేవారు రూ. 30 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. బీమా అమలుతో జిల్లాలో 349 మంది ఉద్యోగుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది.

● ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఏపీవోలు, ఈసీలు(ఇంజినీరింగ్ కన్సల్టెంట్), సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, పొరుగు సేవల సాంకేతిక సహాయకులు బీమాకు అర్హులు.

ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి
గ్రామోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

దీపాలతో చిన్నారులు, మహిళలు

అభిషేక ప్రియునికి భక్త నీరాజనం

పులివెందుల, న్యూస్‌టుడే: అయ్యప్ప స్వామి మండల పూజా మహోత్సవం పులివెందులలో సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో పడిమెట్లు, పూలతో మండపం ఏర్పాటుచేసి అయ్యప్ప స్వామిని కొలువుదీర్చారు. పంచామృత అభిషేకం, గంధాభిషేకం తదితర అభిషేకాలు నిర్వహించారు. భక్తులు భజనలు చేశారు. అనంతరం చేపట్టిన గ్రామోత్సవం కనుల పండువగా సాగింది.

అన్ని ఫోన్లూ కస్టమర్ కేర్ కాదు!

జాగ్రత్తలు పాటించకుంటే ఖాతాలు ఖాళీ

కమలాపురం, లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: గృహోపకరణాలు మరమ్మతులకు గురైతే క్షణం ఆలోచించకుండా గూగుల్‌లో తయారీ సంస్థ కస్టమర్ కేర్ నంబరును వెతికేస్తున్నారా! అక్కడ ప్రముఖంగా కనిపించే నంబరుకు కాల్ చేస్తున్నారా! అయితే అందులో నివి అన్నీ అసలైనవి కాదంటున్నారు నిపుణులు. ఈ విషయం తెలియక ఫోన్ చేయగానే పలకరించే అవతలి వ్యక్తులు నిజమైన కస్టమర్ కేర్ ప్రతినిధులని పొరబడితే.. సర్వీసు పొందేందుకు పంపే లింకు క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే మీరు మోసపోతారని సూచిస్తున్నారు. లింకులను క్లిక్ చేసిన క్షణాల్లోనే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయని హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించేందుకు నకిలీ కస్టమర్ కేర్ నంబర్లను అందుబాటులో ఉంచుతున్నట్లు చెబుతున్నారు.

● **ఒకవేళ మోసపోతే..** ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ లేదా స్థానిక పోలీసులను ఆశ్రయిస్తే పోగొట్టుకున్న డబ్బును వెంటనే రికవరీ చేయడానికి సాధ్యపడుతుంది.

ఏంచేయాలంటే!

కస్టమర్ కేర్‌ను సంప్రదించాలనుకుంటే నేరుగా గూగుల్, సామాజిక మాధ్యమాలను ఆశ్రయించకూడదు.

ఉత్పత్తి, వస్తువు కొనుగోలు చేసినప్పుడు తయారీ సంస్థలు ఇచ్చే వారంటీ కార్డు, బిల్లుల మీద నంబర్లను మాత్రమే సంప్రదించాలి.

● బ్యాంక్‌కు సంబంధించిన నంబరు కావాలంటే డెబిట్, క్రెడిట్ కార్డు మీద, లేదా సమీపంలోని శాఖలకు వెళ్లి సంప్రదించాలి.

● కస్టమర్ కేర్‌ను సంప్రదించాక వివరాల నమోదు, రీఫండ్ పేరుతో లింకు పంపించి క్లిక్ చేయాలని చెబితే నమ్మొద్దు.

నిశ్శబ్దం వీడి.. చైతన్యం చాటి

బిల్టప్(కడప), న్యూస్‌టుడే: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపన అందరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ మేరకు ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలను సోమవారం చేపట్టారు. జిల్లా హెచ్ఐవీ నియంత్రణ, నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కడప నగరంలో చేపట్టిన ర్యాలీని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైద్యాధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో రవిబాబు, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్, డెమో భారతి, ఉమా మహేశ్వర్‌రావు, గుణ శేఖర్, ఉషారాణి, ఆనంద్ కుమార్, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు

చెట్టు.. ప్రాముఖ్యత తెలిపేట్టు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి అనే సూక్తిని మదనపల్లెలోని గిరిరావ్ థియోసాఫికల్ పాఠశాల నిర్వాహకులు అనుసరిస్తున్నారు. 1999 ఆగస్టు 27న పాఠశాల ఆవరణలో వి.సురేంద్రనాథ్ రెడ్డి మెమోరియల్ గ్రంథాలయం, కంప్యూటర్ కేంద్రం నిర్మించారు. ఈ సమయంలో కొబ్బరి చెట్టును తొలగించకుండా భవనం పైకప్పు ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పటికీ ఆ చెట్టు కాయలు కాస్తోంది. విద్యార్థులు, పాఠశాల సందర్శనకు వచ్చే వారికి చెట్ల ప్రాముఖ్యతను తెలిపేందుకు ఇది ఎంతగానో దోహద పడుతోందని ప్రధానోపాధ్యాయుడు జగన్మోహన్ తెలిపారు.



రైతేరాజు 6లో

పేదలను ముంచుతున్న పెద్దలు

నిబంధనలకు పాతరేసి ఇళ్ల నిర్మాణాలు

పుట్లంపల్లె చెరువు అలుగుకు అడ్డంగా నిర్మించిన ఇళ్లు

మారుతీనగర్, న్యూస్‌టుడే: 'అధికారంలోకి వచ్చాక ప్రతి పేదకూ ఇల్లు కట్టిస్తా'నని ప్రజాసంకల్ప యాత్రలో వైకాపా అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆశ పెట్టారు. ప్రతిచోటా అదే మాట పదేపదే చెప్పి ఓట్లేయించుకున్నారు. గెలిచి గద్దెనెక్కాక దారీ తెన్నూ లేని ప్రాంతాల్లో లేఅవుట్లు వేయించారు. వాటితోనే అందరినీ ఉద్ధరిస్తున్నట్లు ప్రచారం ఊదరగొట్టారు. అదే సమయంలో అందిన కాడికి అయినవారికి జనం సొమ్ము దోచి పెట్టారు. అధ్వాన ప్రాంతాల్లో స్థలాలిచ్చి పేదలను నట్టేట ముంచారు. ఇందుకు కడప నగర శివారు పారిశ్రామికవాడ పరిసరాల్లోని పుట్లంపల్లె చెరువులో జగనన్న కాలనీ పేరుతో పేదలకు స్థలాలు కేటాయించారు. ప్రస్తుతం ఇక్కడ దాదాపు రెండు వందలకు పైగా ఇళ్లు వెలిశాయి. ఇదే అదనుగా కొందరు పెద్దలు బరితెగించారు. చెరువు మధ్యలో, అలుగు ఎదురుగా భవనాలు నిర్మించుకున్నారు. దీంతో పుట్లంపల్లె చెరువు నిండితే నీరు ప్రవహించే వీలు లేక ఇళ్లన్నీ మునిగిపోయే ప్రమాదం తలెత్తింది. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పుట్లంపల్లె చెరువులో గృహాలు

మనమూ రహ-వీర్‌లమవుదాం

◆ సకాలంలో చికిత్సతో క్షతగాత్రులకు జీవం
◆ సహాయకులకు రూ. 25 వేలు ప్రోత్సాహకం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డెక్కితే ఇంటికి క్షేమంగా చేరతామో లేదో తెలియని పరిస్థితులు. కొందరు నిబంధనలు పాటించకుండా రోడ్డు ప్రమాదాలకు కారణమతుంటారు. ఇలాంటి ప్రమాదాలు నిత్యం కళ్లెదుటే చోటుచేసుకుంటుంటాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలనే ఆలోచన పలువురికి ఉంటుంది. ఆ తర్వాత ఠాణాలు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయంతో పలువురు తన 'దారిన పోయే దానయ్య'లుగా మారుతారు. సకాలంలో చికిత్స అందకపోవడంతో చాలా మంది మృత్యువాత పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం క్షతగాత్రులను గోల్డెన్ అవర్(గంట లోపు)లో సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తే రూ. 25 వేలు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. వీరిని 'రహ-వీర్'లుగా వ్యవహరించనున్నట్లూ తెలిపింది.

వేధింపులుండవు:

రహదారి ప్రమాదంలో గాయపడిన వారిని ఎవరైనా మానవతా దృక్పథంతో ఆసుపత్రికి తీసుకెళ్తే ఆసుపత్రి సిబ్బంది వారిని వేధించకూడదు. సదరు వ్యక్తుల చిరునామా, ఆధార్, గుర్తింపు కార్డులివ్వాలంటూ వేధించరాదు. చికిత్స ఖర్చులు భరించాలని ఒత్తిడి తేకూడదు. క్షతగాత్రుడిని వెంటనే ఆసుపత్రిలో చేర్చుకోవాలి. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించే సమయంలో మృతి చెందితే 'రహ-వీర్'పై ఆ నేరాన్ని మోపరాదు.

పోలీసులూ ఇబ్బంది పెట్టకూడదు

ఠాణాల్లోనూ కేసు విషయంలో పోలీసులు ఇబ్బందులకు గురిచేయడం, ప్రశ్నలు అడగడం చేయరాదు. సాక్ష్యం కోసం బలవంతం పెట్టకూడదు. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో సాక్ష్యం కోసం కోర్టుకు పిలిస్తే ఒక్క రోజులోనే ముగించాలి. ప్రాణాలు కాపాడిన వ్యక్తికి చట్టపరంగా రక్షణ కల్పించాలి.

ప్రాణాలు కాపాడిన వారవుతారు - వీరరాజు, ఇన్‌ఛార్జి డీటీసీ

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని గోల్డెన్ అవర్(గంట లోపు)లో సమీపంలోని ఆసుపత్రులకు తరలిస్తే సకాలంలో చికిత్స పొంది చాలా మంది బతుకుతారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా అందరం చేద్దాం.

గత ఆరేళ్లలో రోడ్డు ప్రమాదాల వివరాలు..

సంవత్సరం	2019	2020	2021	2022	2023	2024
మృతులు	357	307	369	403	367	314
క్షతగాత్రులు	1,121	970	949	837	722	615

94 శాతం మంది చేతికి పింఛను నగదు

బి.మఠం మండలం సోమిరెడ్డిపల్లెలో పింఛను అందిస్తున్న డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప గ్రామీణ, బి.మఠం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియ సోమవారం సజావుగా సాగింది. జిల్లా వ్యాప్తంగా నగర పాలక, పురపాలకలు, మండల, గ్రామ స్థాయిల్లో లబ్ధిదారులకు ఇళ్ల వద్దే నగదు అందించారు. డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి బి.మఠం మండలం సోమిరెడ్డిపల్లెలో పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో ఈ నెల 2,55,719 మంది లబ్ధిదారులకు రూ. 111 కోట్లు మంజూరైంది. అందులో తొలిరోజు 2,40,233 మందికి(94 శాతం) పంపిణీ చేశారు.

(c) eenadu

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: చెరకు పంటలో పీక పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. నివారణ చర్యలు తెలుపగలరు. - చిన్న బాబు, మందరం, రైతు

సమాధానం: చెరకులో పీక పురుగు ఉధృతి తీవ్ర స్థాయిలో ఉంటే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేక మోనో క్రోటోఫాస్ 1.6 మి.లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొలం చుట్టూ ఉన్న రేగి, తుమ్మ, వేపచెట్ల కొమ్మలపై పురుగు పైకి రాకుండా కత్తిరించుకోవాలి.

- సుబ్రహ్మణ్యం, ఏవో, పెనగలూరు - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

అరటికి రాయితీ రక్ష కవచ

కడప, న్యూస్‌టుడే: అరటి సాగు చేసే రైతులను ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. సమగ్ర ఉద్యానాభివృద్ధి పథకం ద్వారా రాయితీలు ఇచ్చి వెన్నుదన్నుగా నిలవాలని సంకల్పించింది. ఆర్థికంగా ఊతమిచ్చే కొంత వరకు ఉపయోగం కలుగుతుందని రైతులు నిర్ణయించారు. జిల్లాలో 34,543.40 ఎకరాల్లో అరటి సాగు చేశారు. మార్కెట్లో ధరలు నిలకడగా ఉండటం లేదు. గిట్టుబాటు దక్కక ఇబ్బందులు పడుతున్నారు. ఈ దశలో దండా, తేలవటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. మరోవైపు సాగు వ్యయం క్రమేణా పెరుగుతూ వస్తోంది. కర్షకులపై భారం పడుతోంది. ఇలాంటి కష్టాల నుంచి ఉపశమనం కల్పించాలని ప్రణాళికలు రూపొందించింది.

● కొత్తగా పంట వేస్తున్న రైతులకు తొలి ఏడాది సేద్యం ఖర్చులు, మొక్కలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోళ్లు, కుంపులీత, నీటి తడులకు కలిపి హెక్టారుకు రూ.42 వేల రాయితీ ఇస్తారు. రెండో సంవత్సరంలో నిర్వహణ కోసం మరో రూ.28 వేలు ఇవ్వనున్నారు. రెండేళ్లు కలిపి రూ.70 వేలు పొందవచ్చు. పంట కుంట తవ్వకానికి 220x20x30 మీటర్ల వైశాల్యం రూ.1.80 లక్షలు ఖర్చు అవుతుంది. అందులో 50 శాతం ప్రభుత్వం భరిస్తుంది. మరో సగం (రూ.90 వేలు) రైతు భరించాల్సి వస్తోంది.

● పండ్ల సంరక్షణ కోసం హెక్టారుకు రూ.55 వేలు ఖర్చు కానుంది. ప్రభుత్వం రూ.25,500 రాయితీ ఇస్తుంది. పండును మగ్గబెట్టే శీతల యూనిట్ (రైపనింగ్ చాంబర్)కు ఏర్పాటు చేయాలంటే ఒక మెట్రిక్ టన్ను సామర్థ్యానికి రూ.1.20 లక్షలు ఖర్చు అవుతుంది. అందులో రాయితీ రూ.35 వేలు లబ్ధి పొందవచ్చు. హెక్టారుకు 10-30 టన్నుల సామర్థ్యంతో నిర్మించుకోవచ్చు. ● టిష్యూకల్చర్ మొక్కల ఉత్పత్తి యూనిట్‌ను పెట్టాలంటే కనీసం రూ.2.50 కోట్లు కావాలి. ప్రభుత్వం ద్వారా 40 శాతం లబ్ధి కలుగుతుంది. గరిష్ఠంగా రూ.కోటి వరకు పొందవచ్చు. కర్షకులకు ఉన్న కర్షకుల చేయూత ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా ఉప సంచాలకులు సతీష్ తెలిపారు.

రైతేరాజు

నీలి నాలుక వ్యాధిపై.. అప్రమత్తత తప్పనిసరి

చిన్నమండెం, న్యూస్‌టుడే: గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ కె.గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. వైరస్‌తో ఈ వ్యాధి వర్షాకాలంలో సోకుతుందన్నారు. బాహ్య పరాన్న జీవులైన దోమలను నివారిస్తేనే ఈ వ్యాధి నుంచి జీవాలను కాపాడుకోవచ్చన్నారు. ఆయన పలు సూచనలు చేశారు. ● దోమలు తాకిడి అధికంగా ఉండే డిసెంబరు, జనవరి నెలల్లో వ్యాధి ఉధృతి కనపడే అవకాశాలున్నాయి. వ్యాధి సోకిన జీవాల్లో తీవ్ర జ్వరం, నోటిలో పుండ్లు ఏర్పడటం, పెదవులు వాపు, మేత మేయలేకపోవటం, జొల్లు కార్చుట, తీవ్రమైన పరిస్థితుల్లో నాలుక నీలిరంగులోకి మారడం, అసంపూర్తిగా నెమరు వేసి మింగడంలో విఫలమై, నిలబడలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నిర్లక్ష్యం చేస్తే ఈసుకుపోయే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు. ● వ్యాధి సోకిన వాటిని మంద నుంచి వేరు చేసి నీరసించకుండా గ్లూకోజ్ ద్రావణం, కొబ్బరినీళ్లు, మజ్జిగ, రాగిజావ వంటివి తాపడం ద్వారా త్వరగా కోలుకుంటాయి. అవసరాన్ని బట్టి పశువైద్యుల సలహా మేరకు చికిత్స అందించాలి. ● పొక్కిపోయిన నోటిని పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో ఉదయం, సాయంత్రం శుభ్రం చేయాలి. బోరిక్ పౌడర్, కొబ్బరి నూనె కలిపి పూత మందుగా పూయాలి. ● దోమల వ్యాప్తిని అరికట్టడానికి సైపర్‌మెథ్రిన్ లీటరు నీటిలో అయిదు మిల్లీ లీటర్లు కలిపి జీవాలపై పిచికారీ చేయాలి. ఇలా చేయడం వలన రెండు వారాల వరకు దోమల నుంచి జీవాలను కాపాడుకోవచ్చు. గొర్రెలు ఉండే పాకలో వేపాకు పొగ వేసుకోవాలి. పాకలు శుభ్రంగా, పొడిగా ఉండేటట్లు చూసుకోవాలి. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగే టీకాలను సకాలంలో వేయించాలి.

బీడు పొలాల్లో మేస్తున్న గొర్రెలు

వరిలో ఎలుకల నివారణ

చిట్కా

వర్షాలు కురుస్తున్న వేళ వరి పంటపై ఎలుకల దాడి ఎక్కువగా ఉంటుంది. పొట్ట, కోత దశలో ఉన్న వరిని ఎలుకల నుంచి కాపాడుకునేందుకు రైతులు పొలం గట్లపై ఎకరాకు 20 చొప్పున తాటాకు బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. అందులో బ్రోమోడయోలిన్ ఎర(మందు+నూకలు+నూనె+వరినూక 2:2:96 నిష్పత్తి)లో ఉంచాలి. ఇలా చేయడం ద్వారా ఎలుకలు ఆకర్షించి బుట్టలలోకి వచ్చి చేరి చనిపోయే అవకాశం ఉంటుందని వీరబల్లి వ్యవసాయ శాఖ గ్రామ సహాయకుడు జగదీష్ తెలిపారు. - న్యూస్‌టుడే, రాయచోటి

బొప్పాయి సాగులో సీతప్ప గొప్పోయి!

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం మండలం చెంబకూరు గ్రామపంచాయతీ బలిజపల్లెకు చెందిన రైతు సీతప్ప తనకున్న 7.5 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు. అందులో ఎకరాకు ఐదు ట్రాక్టర్ లోడ్ల పశువుల ఎరువును దుక్కిలో కలిపారు. 20 రోజుల పాటు ముగ్గిన తరువాత 4x4 వెడల్పుతో బెడ్లు ఏర్పాటు చేశారు. బెడ్లకు మల్చింగ్ పేపర్ వేసి బిందుసేద్యం అమర్చారు. ఎకరా విస్తీర్ణంలో 800 చొప్పున హైబ్రిడ్ రకం బొప్పాయి (రెడ్ లేడీ) నాటారు. మొక్కలు ఎదుగుదలకు ఎకరా సాగుకు 25 కిలోల చొప్పున పోషక ఎరువులు బిందుసేద్యం ద్వారా అందించారు. అనంతరం మొక్క కాండం పటిష్ఠం కావడానికి మూడు నెలల పాటు పోషక ఎరువులు అందించకుండా సాగుకు నీరు మాత్రమే అందించారు. అయిదో నెల నుంచి మొక్కల్లో పూత, పిందెదశకు వచ్చాయి. కాయల పరిమాణం, నాణ్యత పెరగడానికి మొక్కలకు కాంప్లెక్స్ ఎరువులు అందించారు. ఆరు నెలల నుంచి దిగుబడులు ప్రారంభమయ్యాయి. దిల్లీ, హరియాణా వంటి మార్కెట్లకు ఎగుమతి చేశారు. 7.5 ఎకరాలకు సాగు వ్యయం రూ.20 లక్షలుకాగా రూ.30 లక్షల మేర రాబడి సమకూరినట్లు రైతు సీతప్ప తెలిపారు.

సాగు చేసిన బొప్పాయి తోట

సీతప్ప, రైతు

క్రికెట్ సంగ్రామానికి వెలుతురు అడ్డంకి

ఓవర్ల కోట ముగియక ముందే నిలిచిన ఆట

సెంచరీ చేసిన అక్షిత్‌రెడ్డి

అయిదు వికెట్లు తీసుకున్న దీక్షిత్

మహమ్మద్ ఐజార్ (89)

నాలుగు వికెట్లు తీసిన జత్విక్

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఏసీఏ అండర్-14 అంతర్ జిల్లాల మూడో రౌండ్ క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో వెలుతురు సరిగా లేకపోవడంతో మ్యాచ్‌ను ముందుగానే నిలిపేశారు. కెఎస్ఆర్ఎం, కెఓఆర్ఎం మైదానాల్లో పూర్తిస్థాయి ఆట జరిగింది.

✶ వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో మహమ్మద్ ఐజార్ అజేయంగా 89 పరుగులు, రక్షణ్ సాయి 51 పరుగులు చేయడంతో సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 72 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసింది. రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ బౌలర్లు జత్విక్ 4, యూనానిస్ 3 వికెట్లు తీసుకున్నారు.

✶ కెఓఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్‌లో సాయికృష్ణ చైతన్య 88, తాహిర్ 46 పరుగులు చేయడంతో రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్టు 69.5 ఓవర్లలో 181 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ బౌలర్లలో దీక్షిత్ 5, యోజిత్, నందన్ కృష్ణసాయి చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. ఆపై రెస్టాఫ్ నార్త్‌జోన్ జట్టు బ్యాటింగ్ చేసి తొలిరోజు ఆట ముగిసే సమయానికి 21 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది.

✶ కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో అక్షిత్‌రెడ్డి అజేయంగా 137 పరుగులు, విఘ్నేష్ 49 పరుగులు చేయడంతో నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 272 పరుగులు చేసింది. సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టులో రాంకిరణ్ విన్ని 4, యాసిన్ సిద్ధిఖీ 2 వికెట్లు తీసుకున్నారు.

తిరునాలకు పురాతన చర్చి ముస్తాబు

కలసపాడు, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని పురాతన 'పరిపేతురు-పరిపౌలు' సీఎస్ఐ (ఎస్‌పీజీ) తిరునాలకు ముస్తాబైంది. రంగురంగుల విద్యుత్తుదీపాలతో చర్చిని అలంకరించారు. భక్తులు వర్షానికి తడవకుండా జర్మన్ షెడ్ ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం నంద్యాల డయాసిస్ బిషప్ కె.సంతోష్‌ప్రసన్నకుమార్, బ్యూలా సంతోష్‌తో పాటు పలువురు ప్రముఖుల ఊరేగింపు ఉంటుందని డీనరీ ఛైర్మన్ ఎం.ఎఫ్.ఎస్. ఆనంద్‌కుమార్, కార్యదర్శి కిషోర్‌వినయ్‌దాస్, కోశాధికారి సైమన్‌సత్యబాబు తదితరులు తెలిపారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, దీపాల ఆరాధన, కానుకల సమర్పణ, 'ఏసుకృప' క్రైస్తవ బైబిల్ నాటకం, చర్చిలో సామూహిక ప్రార్థనలు ఉంటాయన్నారు. పోరుమామిళ్ల సీఐ హేమసుందర్‌రావు, ఎస్సై తిమోతి భారీ పోలీసు బందోబస్తు, వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

విద్యుత్తుదీపాల కాంతుల్లో సీఎస్ఐ చర్చి

అడుగుపెట్టలేం .. కూరగాయలు కొనలేం!

మున్సిపాల్టీలోని కూరగాయల మార్కెట్‌లో ప్రజలు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఊట ద్వారా నీరు ఉబికి పైకి రావడంతో చిత్తడిగా మారుతోందని వినియోగదారులు వాపోతున్నారు. నిత్యం తడిగా ఉన్నందున కూరగాయలు కొనేందుకు అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌ను పరిశీలించామని, కొంత ఎత్తు పెంచి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనరు వెంకటరామిరెడ్డి తెలిపారు. -న్యూస్‌టుడే, జమ్మలమడుగు

నిధుల దుర్వినియోగంపై కార్యదర్శులకు శ్రీముఖాలు

స్పందనకు వందనం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: గత మూడేళ్ల కాలంలో విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామసభలు నిర్వహించకుండా, పంచాయతీ తీర్మానం చేయకుండానే పనులు చేపట్టాలని అనుమతిచ్చారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ మరిచారు. కొలతల పుస్తకాలు, నగదు పుస్తకాల్లో చేసిన వివరాలను సమగ్రంగా నమోదు చేయకుండానే నిధులను దారి మళ్లించారు. ఈ అక్రమంపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ స్పందించారు. పలువురు కార్యదర్శులకు శ్రీముఖాలు జారీ చేశారు. పది రోజుల్లో లిఖితపూర్వంగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టర్, జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వులను బాధ్యులైన కార్యదర్శులకు ఇవ్వాలని డిప్యూటీ ఎంపీడీవో శ్రీలతకు ఎంపీడీవో జె.సుజాతమ్మ సూచించారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలో అయ్యప్ప స్వామి మండల పూజ మహోత్సవం సోమవారం వైభవోపేతంగా జరిగింది. పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కొలువు దీర్చారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ హోమం నిర్వహించారు. రాత్రి ఊరేగింపులో పుర వీధుల్లో కేరళ డప్పు వాయిద్యాలు, కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి అయ్యప్పస్వామి దర్శించుకున్నారు.

అలరించిన కేరళ డప్పువాయిద్యాల ప్రదర్శన

ప్రకృతి వ్యవసాయ పొలాల్లో పంటకోత ప్రయోగం

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అంబవరం, గూడెంచెరువు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంట సాగు చేసిన పొలాల్లో సోమవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ పంట కోత ప్రయోగం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను పండిస్తే అధిక దిగుబడితో పాటు ఖర్చు తగ్గి ఆదాయం వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భరత్, నరసింహారెడ్డి, శ్యామ్‌సుందర్, రైతులు పాల్గొన్నారు.

సిద్దవటాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: సిద్దవటం మండలాన్ని కడప జిల్లాలోనే కొనసాగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి మండల ప్రజలకు న్యాయం చేసేలా చూస్తామని తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రాత్రి సిద్దవటం తెదేపా నేతలతో కలిసి ఆయన కలెక్టర్ శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కడప నగరానికి కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలోనే సిద్దవటం ఉందని.. ఎక్కడో 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కలపడం ఏంటని ఆయన ప్రశ్నించారు. అదే సమయంలో జిల్లా కేంద్రం రాయచోటికి వెళ్లాల్సి వస్తే 80 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుందన్నారు. దీంతో సిద్దవటం ప్రజలు అనేక ఇబ్బందులు పడతారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చామని అదే విషయాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. నాయకులు జవహర్‌బాషా, దశరథ రామనాయుడు, మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రతాప్‌నాయుడు, శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.

కలెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సిద్దవటం నాయకులు

మహారాజశ్రీ కడప ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No.38/2025

O.S. No.149/1983

M.Annaiah having died rep by G.P.A. Holder M.Mohan Kumar ...D.Hr

Vs

S.M.Sogra Khathun, W/o Ghouse Mohiddin, D.No.20/317, Co-operative Colony, Kadapa City. ...J.Dr

NOTICE

పై కేసులో రాజశ్రీ కోర్టు వారు Order 21 Rule 22 of C.P.C Notice కొరకు 12.12.2025వ తేదీన వాయిదా వేసి ఉంటూ వున్నారు. కావున J.Dr అయిన మీరు 12.12.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు పైన తెల్పిన కోర్టులో హాజరు కావలసి వుంటూ వున్నది. లేనంతట మీ పరోక్షముగ తీర్మానించబడుతుంది.

టి.రామలింగేశ్వర రాజు
న్యాయవాది, కడప.

క్వాంటమ్ కంప్యూటరింగ్‌లో రాణించాలి

వేంపల్లె, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీ విద్యార్థులు క్వాంటమ్ కంప్యూటరింగ్‌పై రాణించాలని డైరెక్టర్ కుమారస్వామిగుప్తా అన్నారు. ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న క్వాంటమ్ కంప్యూటరింగ్ కార్యశాలకు సంబంధించిన బ్రోచర్స్‌ను సోమవారం ఆయన తోటి అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. క్వాంటమ్ కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఏవో రవికుమార్, ఆర్గనైజర్లు రత్నకుమారి, సుధాకర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, భాస్కరయ్య, కార్తీక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మురుగు కాలువలో చీరల వ్యాపారి మృతదేహం

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు రామేశ్వరం రోడ్డులోని సాయిబాబా గుడి సమీపంలో మురుగు కాలువలో సోమవారం ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన **బడిమెల నరసింహులు** (51) అనే చీరల వ్యాపారి మృతదేహం బయటపడింది. పోలీసుల వివరాల ప్రకారం.. నరసింహులు పొరుగు ప్రాంతాలకు వెళ్లి చీరల వ్యాపారం చేస్తుంటారు. ఇంటి నుంచి వెళ్తే 20 నుంచి 30 రోజుల వరకూ వచ్చేవారు కాదు. వ్యాపారంలో వచ్చిన డబ్బుతో మద్యం తాగుతుండేవారు. ఈ క్రమంలో 40 రోజుల క్రితం వ్యాపారం నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం రామేశ్వరంరోడ్డులోని మురుగు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడని తెలియడంతో నరసింహులు భార్య రమాదేవి, కుమారులు అక్కడి వెళ్లి పరిశీలించారు. మృతదేహం తన భర్తదేనని గుర్తించారు. అప్పటికే పురుగులు పట్టి కుళ్లిపోయి ఉండటంతో ఘటనా స్థలంలోనే శవ పరీక్షలు నిర్వహించారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కాలువలో పడి చనిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఒకటో పట్టణ రాణా పోలీసులు తెలిపారు.



EENADU e Classifieds

BUSINESS SERVICES | JOBS

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

Wanted PRO's for Admissions - Jeevan Jyothi Junior College and Edify Proddatur. Cell: 9440914765, 9908278718.

పల్లా హాస్పిటల్, 7 రోడ్స్ సర్కిల్, కడప నందు పని చేయుటకు వార్డు బాయిస్, నర్సింగ్ స్టాఫ్ కావలెను. Contact: 9849040153.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ|| 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

పురపాలక మాజీ ఛైర్మన్ రంగసింహ మృతి

మైదుకూరు : పురపాలక మాజీ ఛైర్మన్ సి.ఎన్.రంగసింహ (80) సోమవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన తాను స్థాపించిన శశికాంత్ నర్సింగ్ హోమ్‌లోనే చికిత్స పొందుతూ కన్నుమూశారు. రంగసింహకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. నియోజకవర్గ ప్రజలకు 46 ఏళ్లపాటు వైద్య సేవలు అందించారు. మైదుకూరు పురపాలక ఏర్పాటైన తరువాత 2014లో తెదేపా ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. రంగసింహకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తోపాటు పలువురు నాయకులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

నకిలీ అనిశా అధికారి ముఠా అరెస్ట్

వరంగల్ క్రైం, న్యూస్‌టుడే: అనిశా డీఎస్పీనంటూ ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ డబ్బులు దండుకుంటున్న నకిలీ డీఎస్పీతోపాటు ఆయనకు సహకరించిన నలుగురిని వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి చరవాణులు, రూ.9 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కమిషనరేట్‌లో సీపీ సన్‌ప్రీత్ సింగ్ నిందితుల వివరాలను వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం వేలమద్దికి చెందిన రాచంపల్లి శ్రీనివాస్ ఎలియాస్ మంగళ శ్రీను, వాసు అనిశా డీఎస్పీగా చలామణి అవుతున్నాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన నవీన్ జేఆర్, మంగళ రవీందర్, మురళీ, ఎన్.ప్రసన్నతోపాటు సూర్యప్రకాశ్, తాటిమర్రి వేణు, కొత్తకోట రమణ కలిసి ముఠాగా ఏర్పాటయ్యారు. రాచంపల్లి శ్రీనివాస్ అనిశా డీఎస్పీ అంటూ ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న అధికారులను లక్ష్యంగా చేస్తూ బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు సంపాదిస్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా ఆర్అండ్‌బీలో ఎంవీఐగా పని చేస్తున్న తుమ్మల జైపాల్‌రెడ్డికి ఫోన్ చేసి ఏసీబీ డీఎస్పీనంటూ బెదిరించి సుమారు రూ.10 లక్షలను వివిధ మార్గాల్లో దోచాడు. ఎంవీఐ ఫిర్యాదు మేరకు మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని పట్టుకున్నారు. ఇతను రాచంపల్లి శ్రీనివాస్ జ్యుడీషియల్ కస్టడీలో ఉంటూ స్నాచింగులకు పాల్పడ్డాడు. కడప, కర్నూలు జిల్లాల్లో నమోదైన కేసులో కడప జైలుకు వెళ్లాడు. అక్కడ నుంచి ఆరోగ్యం బాగా లేదని చెప్పి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. కాపలాగా ఉన్న పోలీసులను లొంగదీసుకుని ఆసుపత్రి నుంచి బయటకు వచ్చి బెంగళూర్ నగరంలో స్నాచింగ్‌కు పాల్పడి అక్కడి పోలీసులకు చిక్కాడు. దీంతో కాపలాగా ఉన్న సిబ్బందిని సస్పెండ్ చేశారు.

పోలీసులు, వివరాలను వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

పరవాడ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: పరవాడ మండలం లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన వివిధ జిల్లాలకు చెందిన బాలబాలికలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ పరిశీలకులు పట్టాభిరామ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ఎం.నాయుడు, హెచ్.ఎం. రౌతు నాగేశ్వరరావు, సెలెక్షన్ కమిటీ ప్రతినిధులు సోమవారం వెల్లడించారు. జాతీయ స్థాయి బాలుర జట్టుకు 12 మంది, బాలికల జట్టుకు 12 మంది క్రీడాకారులతో పాటు మరో ఐదుగురు చొప్పున స్టాండ్‌బై ప్లేయర్స్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. రాజస్థాన్‌లో త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు. బాలుర, బాలికల జట్లలో కడప జిల్లాకు చెందిన ఎస్.రామ్‌చరణ్, జి.అనుపమ (కడప)లకు చోటు దక్కింది.

'సీమ' అభివృద్ధికి ప్రత్యేక నిధులు అవసరం

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: రాయలసీమ సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి ఓబయ్య, స్టాండింగ్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నియోజక వర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల కడపలోని 6, 7 తేదీల్లో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు

చిన్నకొత్తపల్లి(ఒంటిమిట్ట), న్యూస్‌టుడే: మండలంలోని చిన్నకొత్తపల్లిలో విద్యుదాఘాతంతో కట్టా లిఖిత్ కుమార్ (6) అనే బాలుడు గాయపడ్డాడు. దిత్వా తుపాను ప్రభావంతో పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించడంతో ఇంటి సమీపంలో మిత్రులతో కలిసి ఆడుకుంటూ పక్కనే ఉన్న ఓ ఇల్లు ప్రహరీ ఎక్కి నడిచి వస్తుండగా తక్కువ ఎత్తులో ఉన్న 11కేవీ విద్యుత్తు తాకాయి. దీంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. స్థానికులు గుర్తించి కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గంగపేరూరు ఫీడర్‌లో విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయని.. వెంటనే మరమ్మతులు చేయాలని ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

చిట్టీల పేరిట రూ.4 కోట్లకు కుచ్చుటోపీ?

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం మండలం మాధవరం-1, 2, 3 వార్డుల గ్రామానికి చెందిన ఓ వ్యాపారి చిట్టీల పేరిట రూ.4 కోట్లకు పైబడి నగదుతో ఐపీ పెట్టి పరారైనట్లు బాధితులు ఆరోపించారు. స్థానిక బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు.. మాధవరం-1, 2, 3 వార్డుల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి 20 ఏళ్ల కిందట వస్త్ర వ్యాపారం చేసేవారు. తర్వాత కొన్నేళ్ల నుంచి చిట్టీల వ్యాపారం నిర్వహించారు. స్థానికులతో పాటు కడప, వెంకటగిరి, మాధవరం-1, ఒంటిమిట్టతో పాటు మరికొన్ని దూర ప్రాంతాల్లో ఉన్న స్థానికుల బంధువులతో చిట్టీలు నిర్వహించి లావాదేవీలు చేసేవారు. అంతేగాకుండా చిట్టీలు వేసే వారి నుంచి అప్పుగా కూడా తీసుకున్నాడు. ఈ క్రమంలో రెండు వారాల రోజుల కిందట ఆ వ్యాపారి తన నివాసానికి తాళం వేసి వెళ్లిపోయాడరన్నారు. తన చరవాణి కూడా పనిచేయలేదన్నారు. దీంతో కొందరు బాధితులు సిద్దవటం పోలీసులను ఆశ్రయించారు.

ఆలయానికి వెండి కిరీటం వితరణ

వేంపల్లె, న్యూస్‌టుడే: స్థానిక పులివెందుల-కడప బైపాస్ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయానికి మల్లె రవిశేఖర్ అనే దాత రూ.లక్ష విలువైన వెండి కిరీటాన్ని సోమవారం వితరణగా అందించారు. స్థానిక శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఆయన వెండి కిరీటాన్ని తయారు చేయించి ఇచ్చారని ఆలయ కమిటీ ఛైర్మన్ సింగారెడ్డి నరసింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో దాత కుటుంబీకులు, భక్తులు పాల్గొన్నారు.

వెండి కిరీటంతో దాత రవిశేఖర్

మంత్రి లోకేశ్ చొరవతో దివ్యాంగురాలికి పింఛను

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని నరసన్నపల్లె గ్రామానికి చెందిన వంద శాతం దివ్యాంగురాలైన సన్నబోయిన ధనలక్ష్మికి పింఛను రూ.6 వేలు మాత్రమే వస్తుండేది. సామాజిక మాధ్యమాల ద్వారా మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించగా వెంటనే మంత్రి స్పందించి రూ.15 వేలు ఇవ్వాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు సూచించారు. దీంతో స్పందించిన కలెక్టర్ డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో రామచంద్రారెడ్డి రూ.15 వేలు పింఛన్‌ను అందజేశారు.

6, 9 తేదీల్లో వైవీయూ డిగ్రీ, పీజీ పరీక్షలు

వైవీయూ, న్యూస్‌టుడే: దిత్వా తుపాను కారణంగా యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో వాయిదా పడిన డిగ్రీ, పీజీ పరీక్షలు నూతన తేదీలను వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1న డిగ్రీ వారికి జరగాల్సిన పరీక్షను ఈ నెల 6 వ తేదీన, పీజీ పరీక్ష ఈ నెల 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి ఆయా తేదీల్లో జరిగే పరీక్షలకు హాజరు కావాలన్నారు.

పీఎస్ హెచ్ఎం ఫోరం జిల్లా కమిటీ ఎన్నిక

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర పీఎస్ హెచ్ఎం జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. కడప నగరంలో సోమవారం ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ నూతన కమిటీ వివరాలు తెలియజేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా మస్తాన్‌వలి (కలసపాడు మండలం), జిల్లా అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి (ఖాజీపేట), ప్రధాన కార్యదర్శిగా శ్యాంసుందర్ (కొండాపురం), అసోసియేట్ అధ్యక్షుడిగా ఆదిల్ బాషా (కడప), ఉపాధ్యక్షులుగా ఓబులరెడ్డి, సుమలత (సిద్దవటం) నూతన కమిటీలో ఉన్నారన్నారు. నూతన కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 7వ తేదీన కడప నగరంలోని ఫోరం కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు.

సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు


శ్యాంసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీకి 62 వినతులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో జరిగిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి 62 వినతులు వచ్చాయి. సోమవారం సీఎండీ శివశంకర్ లోతేటి ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకున్నారు. తొమ్మిది జిల్లాల నుంచి వినియోగదారులు ఫోన్ చేసి సమస్యలను తెలియజేశారు. కర్నూలు నుంచి 15, కడప నుంచి 13, అనంతపురం నుంచి 11, నెల్లూరు నుంచి 8 వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 265 సమస్యలు రాగా వాటిలో 118 పరిష్కరించినట్లు సీఎండీ తెలిపారు.

ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

ప్రమాద ఘంటికలు మోగిస్తున్న విద్యుత్తు నియంత్రిక

మైదుకూరు పట్టణం ప్రొద్దుటూరురోడ్డులోని పశు వైద్యశాల.. మండలంలోని శివపురం రోడ్డుకు సమీపంలో తక్కువ ఎత్తులో రహదారి పక్కన ఉన్న విద్యుత్తు నియంత్రికలతో ప్రమాదం పొంచి ఉంది. బైపాస్‌రోడ్డు నిర్మాణంతో శివపురం రోడ్డుకు సమీపంలోని విద్యుత్తు నియంత్రిక ఎత్తు తక్కువైంది. జాతీయ రహదారి పక్కనే ప్రమాదం పొంచి ఉంది. కనీస హెచ్చరిక పలక ఏర్పాటు చేయలేదు. ఈ విషయమై విద్యుత్తుశాఖ ఏఈ రామభద్రయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పరిశీలించి రక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. -న్యూస్‌టుడే, మైదుకూరు

ఆపదొస్తే అంబులెన్స్ అయినా ఆగాల్సిందే!

ప్రొద్దుటూరు పురపాలక పరిధి వాణిజ్య ప్రాంతంలో ఆటో వంటి వాహనాలు వెళ్లడం కష్టంగా మారింది. పట్టణంలో పాతమార్కెట్, మెయిన్‌బజారు, చౌన్నేన్‌వల్లి దర్గావీధి, రాజబాటవీధి, మోక్షగుండం వీధుల్లో అంబులెన్సు వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. దుకాణాల ముందు రోడ్డుపై వాహనాలను ఉంచడమే కారణంగా నిలుస్తోంది. వాణిజ్య సముదాయాల్లో పార్కింగ్ చేయించాల్సిన దుకాణ యజమానులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం, పోలీస్‌శాఖల మధ్య సమన్వయం లేక నాలుగుచక్రాల వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

చెన్నకేశవస్వామి దేవాలయం వెనుక వైపు గ్యాస్ ఆటో వెళ్లలేని దుస్థితి

ఇరవై చోట్ల హిందూ సమ్మేళన సభలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: హిందువు అంటే ఒక జీవన విధానమని హిందూ సమ్మేళన సమితి సమన్వయ కర్త డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎంఆర్ కాలనీ సరస్వతి విద్యామందిరంలో హిందూ సమ్మేళన సభల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో ఈనెల మొదటి వారం నుంచి దాదాపుగా 20 ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఇందులో రామేశ్వరం, వసంతపేట, ఈశ్వర్‌రెడ్డినగర్, అయోధ్యనగర్, దొరసానిపల్లె, హనుమాన్‌నగర్, నాగేంద్రనగర్, శ్రీరామ్‌నగర్, గీతాశ్రమం వీధి, వినాయకనగర్, శ్రీరాములపేట, సరస్వతినగర్, బొల్లవరం, ప్రకాశ్‌నగర్, సంజీవనగర్, మోడంపల్లి, టీచర్స్ కాలనీ, బంగారు అంగళ్ల బజారు తదితరాలు ఉన్నాయన్నారు. హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై సభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమ్మేళన సమితి జిల్లా ప్రముఖ్ మహేష్, కార్యవాహ ప్రసాదు, నగర ప్రముఖ్ రఘు, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి ఎం.నాగేశ్వర్రావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ లక్ష్మణ్

3న వెల్లాలలో హనుమత్ వ్రతం

రాజుపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని వెల్లాలలో 3న హనుమత్ వ్రతం నిర్వహిస్తునట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ జీఎల్.నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి వ్రతం, హోమం నిర్వహిస్తునట్లు చెప్పారు.

అత్యవసరమైతే అష్టకష్టాలే..!

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

అంగన్‌వాడీ కేంద్రాల్లో శౌచాలయాల్లేక అవస్థలు

ప్రభుత్వం పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన వసతులు లేక నిత్యం అవస్థలు పడుతున్నారు. చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే గది ఉన్న వాటిలో కొనసాగుతున్నా మైదానాలు లేవు. అక్కడే చదువులు, ఆటలు, భోజనాలు, చేయాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో శౌచాలయాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు నరకయాతన పడుతున్నారు.

సగంలో ఆగిన పనులు

జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 307 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 2024-25 సంవత్సరానికి 58 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కో కేంద్రానికి రూ.36 వేలు చొప్పున మొత్తం సుమారు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. మరుగుదొడ్ల నిర్మాణాల బాధ్యతలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు అప్పగించారు. బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు పనులను సగంలోనే ఆపివేశారు. నిర్మాణాలు చేపట్టి ఏడాది దాటిన ఇంతవరకు పనులు అసంపూర్తిగా ఉండటంతో పలు కేంద్రాల్లో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటి వరకు కేవలంలో 14 మాత్రమే పూర్తి చేయగా మిగిలిన 44 శౌచాలయాలను మధ్యలోనే నిలిపేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గూడెంచెరువు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం

పూర్తి చేసేందుకు చర్యలు

నియోజకవర్గంలో 58 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాం. అయితే నిధుల ఆలస్యం, గుత్తేదారుల సమస్యతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిలిచిపోయిన మరుగుదొడ్ల పనులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పనులను ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తాం.

-కిరణ్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, జమ్మలమడుగు

బాలల హక్కులపై అవగాహన

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: బాలల హక్కులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి సునీత తెలిపారు. సోమవారం పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహంలోని విద్యార్థినులకు హక్కులపై అవగాహన కల్పించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి అపర్ణ, వసతిగృహం అధికారి సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా అన్వర్

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తనను ఎంపిక చేశారని పోరుమామిళ్లకు చెందిన అన్వర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి, మైదుకూరు కోర్టులో
I.A.No. 144/2021/ O.S.No. 46/2021
1. తిమ్మారెడ్డి పాపిరెడ్డి గారి వెంకట సుబ్బారెడ్డి ...వాది
Vs
2. సద్దల హనుమసింహారెడ్డి, తండ్రి లేట్ వెంకట శ్రీనివాసులరెడ్డి, వయస్సు 33 సం॥లు,
3. సద్దల హరిత, తండ్రి లేట్ వెంకట శ్రీనివాసులరెడ్డి, వయస్సు 30 సం॥,
4. సద్దల హస్వణి, తండ్రి లేట్ వెంకట శ్రీనివాసులరెడ్డి, వయస్సు 27 సం॥,
5. సద్దల హర్షితరెడ్డి, తండ్రి లేట్ వెంకట శ్రీనివాసులరెడ్డి, వయస్సు 26 సం॥,
R/o పై వారందరూ ఏకోపల్లె గ్రా॥, దువ్వూరు మం॥, కడప జిల్లా. ...ప్రతివాదులు 2-5
పై నెంబరు సివిల్ సూట్ O.S.No. 46/2021 దావా యందు 2-5 రెస్పాండెంట్స్ అయిన మీరు హాజరు అగుటకు గాను 04.12.2025వ తేదీన వాయిదా ఉంటూ ఉన్నది. సదరు వాయిదాకు మీరు గానీ, మీ తరఫు వకీలు ద్వారా గానీ ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలయును. లేనంతట ఎక్స్‌పార్టీగా తీర్మానించవచ్చును.
ఇట్లు : సోమేసుల శివరామకృష్ణ, సోమేసుల సుచిత్ర, ఎస్.కరీముల్లా, అడ్వకేట్స్, మైదుకూరు కడప జిల్లా.

ప్రొద్దుటూరు అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపా

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు అభివృద్ధి చెందకుండా వైకాపా నాయకులు, కౌన్సిలర్లు అడ్డుకుంటున్నారని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ఉన్నవాటిపైనే రోడ్లు, కాలువలు, రోడ్డు డివైడర్లు నిర్మించి పుర నిధులను దోచుకున్నారన్నారు. ప్రస్తుతం వర్షాల కారణంగా మురుగునీర్లు రోడ్లపైకి వస్తుండటంతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కాలువల పునర్నిర్మాణంతోపాటు అభివృద్ధి కోరుతూ అజెండాలో పొందుపరిచినా కౌన్సిల్ సమావేశం సజావుగా సాగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

మాట్లాడుతున్న నల్లబోతుల నాగరాజు, కౌన్సిలర్

న్యాయ విజ్ఞాన సదస్సు

జమ్మలమడుగు: స్థానిక క్యాంబెల్ ఆసుపత్రి నర్సింగ్ కళాశాలలో సోమవారం న్యాయవాదులు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పలు న్యాయవాదులు తెలిపారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం జరుగుతుందని ప్రజాప్రతినిధులు అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు, కూటమి నాయకులు ఇంటింటికి తిరిగి లబ్ధిదారులతో మాట్లాడారు. ఏ ఎన్నికలు జరిగినా సీఎం చంద్రబాబునాయుడుకు అండగా ఉండాలని కోరారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.4 వేలు పింఛన్ అందించడం ఆయనతోనే సాధ్యమన్నారు. -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం, పట్టణం, మైదుకూరు, బద్వేలు

వృద్ధురాలికి నగదు ఇస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి, నాయకులు

బద్వేలులో మడకలవారిపల్లెలో పింఛన్లను పంపిణీ చేస్తున్న తెదేపా ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి

మైదుకూరు సర్వాయపల్లె రోడ్డులో పింఛన్ సొమ్మును అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ముద్దనూరులో పాల్గొన్న భూపేష్‌రెడ్డి, తదితరులు

శ్రద్ధాంజలి

మా నుండి ఆకస్మికంగా దూరమైన కీ॥శే॥ వల్లెపు గురుభాస్కర్ గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
భార్య : వి.నరసమ్మ
అమ్మ : వి.వెంకటమ్మ
నాన్న : కీ॥శే॥ వి.తిప్పయ్య
కుమారులు : గురువిక్రాంత్, గురుకార్తీక్
కీ॥శే॥ వల్లెపు గురుభాస్కర్ గారు
మేకలబాలాయపల్లె, చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీ, యర్రగుంట్ల (మం). కడప జిల్లా.
30.11.2025 ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు.

శివాలయంలో పురాణ ప్రవచనాలు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణ నడిబొడ్డున ఉన్న శివాలయంలో సోమవారం సాయంత్రం పురాణ ప్రవచనాలు చేస్తున్న ఎం.వి.నారాయణరెడ్డి, పెద్దిరాజు నారాయణరెడ్డి, కె.నారాయణరెడ్డిలను ఆలయ ఛైర్మన్ వంగల నారాయణరెడ్డి శాలువ కప్పి సన్మానం చేశారు. ఆలయ ఛైర్మన్ మాట్లాడుతూ సోమవారం నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం ఆలయంలో భారత పురాణ ప్రవచనాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్రవచన పండితులను సన్మానిస్తున్న ఆలయ ఛైర్మన్ నారాయణరెడ్డి

ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రజలలోకి తీసుకెళ్లండి

ఖాజీపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్ అన్నారు. పూసలకొట్టాల వద్ద సోమవారం రాష్ట్ర దాసరి అభివృద్ధి సంక్షేమ సొసైటీ డైరెక్టర్ గోవిందు సుబ్బయ్యను కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

డైరెక్టర్ గోవిందు సుబ్బయ్యను సన్మానిస్తున్న 'నాయీబ్రాహ్మణ' డైరెక్టర్ వేణుగోపాల్

సమస్యల పరిష్కారానికి కార్మికుల డిమాండ్

బద్వేలు, న్యూస్‌టుడే: పన్నెండవ పీఆర్సీ కమిటీని నియమించి మున్సిపల్ కార్మికులకు వేతనాలను పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బద్వేలు పురపాలక కార్యాలయంలో సోమవారం కమిషనర్ నరసింహారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2025లో ఏడు రోజుల సమ్మెకాలానికి జీతం చెల్లించాలని కోరారు. ఆప్కాస్ సంస్థ ద్వారా ఉద్యోగ విరమణ చేస్తున్న కార్మికులకు ప్రయోజనాలు కల్పించాలన్నారు. యువజన నాయకులు చిన్ని, మస్తాన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు పుర కమిషనర్ నరసింహారెడ్డికి వినతిపత్రాన్ని ఇస్తున్న యనియన్ నాయకులు

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

కొండాపురం, న్యూస్‌టుడే: అప్పులు తెచ్చి పంటలు సాగు చేసి.. నష్టాల పాలై ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు రామ్మోహన్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని జిల్లా కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, రైతు సంఘం మండల అధ్యక్షుడు జయంతు, కనకరాజుతో కలిసి తహసీల్దారు గురప్ప, ఏవో రామాంజులురెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. పంటల సాగుకోసం అప్పులు చేసి, సరైన దిగుబడి రాకపోవడంతో యువ కౌలురైతు రామ్మోహన్‌రెడ్డి గత నెల 24వ తేదీ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆయన మృతితో కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో ఉందన్నారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలన్నారు.

గణిత బ్రహ్మకు స్మారక కేంద్రం ఏర్పాటెప్పుడో..?

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

పుట్టుకతో అంధుడు.. అసాధారణ ప్రజ్ఞాపాటవాలతో విమర్శకులను సైతం మెప్పించి 'గణిత బ్రహ్మ'గా ప్రశంసలు, సత్కారాలతో ఖ్యాతిపొందిన డాక్టర్ లక్కోజు సంజీవరాయ శర్మ. అవధాన ప్రక్రియలో పృచ్ఛకులు అడిగిన గణితంలోని ప్రశ్నలు, సూత్రీకరణకు సంక్లిష్టమైన ప్రశ్నలకు తన వివేకం (మేధో శక్తి) వాయిస్తూనే తప్పులు లేకుండా సమాధానాలు ఇవ్వడంతో మేధావులను ఆశ్చర్యపరిచారు. ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరులో 1907 నవంబరు 22న జన్మించిన సంజీవరాయశర్మ తల్లిదండ్రులు పెద్దపుల్లయ్య, నాగమ్మ. వండ్రంగి వృత్తి జీవనాధారం కలిగిన నిరుపేద కుటుంబం. అంధుడు కావడంతో బాల్యంలో పాఠశాలకు వెళ్లకుండానే ఇంటి వద్దనే తన అక్క అక్కమ్మ చదివి చెప్పిన 'పెద్దబాలశిక్ష' పుస్తకంలోని అక్షరాలు, అంకెలు, ఇతర విషయాలను గుర్తుపెట్టుకున్నారు. అసాధారణ ప్రజ్ఞాశాలి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, మద్రాసు నగరం, తదితర చోట్ల నిర్వహించిన గణితావధానాల్లో ప్రతిభ చూపారు. తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయంలోని ప్రధాన పరిపాలన కార్యాలయంలో లక్కోజు సంజీవరాయశర్మ చిత్రపటం ఏర్పాటుచేయడంతోపాటు విశిష్ట ఉపన్యాసకునిగా, డాక్టరేట్ పట్టా అందుకున్న ప్రజ్ఞాశాలి. డిసెంబరు 1997 డిసెంబరు 2న హైదరాబాదులో 'గణిత బ్రహ్మ' మరణించారు.

కల్లూరులో పశువుల పాకగా మారిన సంజీవరాయ శర్మ ఇల్లు

శిథిలావస్థలో లక్కోజు సంజీవరాయ శర్మ పుట్టిన ఇల్లు



జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో విగ్రహం

ఆదరణకు నోచుకోక..

సొంత ఊరు కల్లూరులో లక్కోజు సంజీవరాయ శర్మ పుట్టిన బోద గుడిసె ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పశువులకు పాకగా మారి కూలేలా ఉంది. అవిభక్త మద్రాసు, తెలుగు రాష్ట్రాలు, దక్షిణ రాష్ట్రాల్లో నిర్వహించిన గణిత అవధానాల్లో 'గణిత బ్రహ్మ'గా అసాధారణ ప్రతిభకనబర్చి చిరస్థాయిగా నిలిచారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో లక్కోజు సంజీవరాయశర్మ విగ్రహాన్ని ఏర్పాటుచేయడం మినహా ఆయన సొంతింటి స్మారక కేంద్రంగా ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భావితరాలకు గణిత బ్రహ్మ గొప్పదనాన్ని చాటిచెప్పేందుకు ఇంతకన్నా మరో అవకాశం ఉంటుందా అని ప్రశ్నిస్తున్నారు. 'గణిత బ్రహ్మ'కు సముచితమైన గుర్తింపు, గౌరవం కల్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను గ్రామస్థులు, ప్రజాసంఘాలు సీనియర సిటిజన్లు కోరుతున్నారు.

బాల్యం నుంచే భగవద్గీత నేర్పించాలి

పోరుమామిళ్ల, కలసపాడు, న్యూస్‌టుడే: బాల్యం నుంచే బాలలకు భగవద్గీత నేర్పించాలని కడప జిల్లా హిందూ ధర్మ ప్రచార కమిటీ సభ్యులు తుపాకుల శ్రీనివాసులు అన్నారు. పోరుమామిళ్లలోని వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణంలో సోమవారం గీత జయంతిని పురస్కరించుకుని భగవద్గీత పోటీలు నిర్వహించారు. ప్రచార కమిటీ సభ్యులు రవికేశ్వరావు, గురుమూర్తి, చెన్నకృష్ణయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. * కలసపాడు కృష్ణమందిరంలో శ్రీమద్ భగవద్గీత సత్సంగ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణార్జునుల పాలరాతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె.సుదర్శన్, నాయకులు ఎం.నాగరాజ, జాలాది నారాయణ, రవీంద్ర, సత్యవతమ్మ, సుంకు శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు పట్టణం: ఆధ్యాత్మిక రత్నంగా నిలిచిన గ్రంథం భగవద్గీత మాత్రమేనని ఇస్కాన్ ప్రతినిధి ప్రణవానంద తెలిపారు. సోమవారం ఇస్కాన్ మందిరంలో 'విలువలతో కూడిన విద్య' అనే అంశంపై జరిగిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం భగవద్గీత ప్రవచనాలను వినిపించారు.

కలసపాడులో పాలరాతి కృష్ణార్జునుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు

బహుమతిని అందిస్తున్న ఇస్కాన్ ప్రతినిధి ప్రణవానంద

జూదరుల అరెస్టు

పెద్దముడియం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొండసుంకేసుల ప్రాంతంలో జూదం ఆడుతున్న నలుగురిని సోమవారం పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. వీరి నుంచి 3 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.సుబ్బారావు తెలిపారు.

విద్యుత్తు తీగల చోరీ

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మండలంలో ఇల్లూరులోని పొలంలో ఉన్న విద్యుత్తు మోటార్ల తీగల చోరీపై కేసు నమోదు చేసినట్లు సోమవారం కలమల్ల పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. మోపూరి పెద్దదస్తగిరిరెడ్డి అనే రైతుకు సంబంధించిన దాదాపు రూ.15 వేల విలువగల తీగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు వివరించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంత్యక్రియలు

మంచి మనిషి, సహృదయులు శ్రీ డా॥ సి.ఎన్.రంగసింహ గారు 1.12.2025వ తేదీ సోమవారం ఉదయం 10.00 గం॥లకు స్వర్గస్తులైనారు.
అంత్యక్రియలు : 02.12.2025వ తేదీ మంగళవారం ఉదయం 11.00 గం॥లకు మైదుకూరు నందు జరుపబడును. కావున అందరికీ తెలపడమైనది.
కీ॥శే॥ డా॥ సి.ఎన్.రంగసింహ గారు
ప్రథమ మున్సిపల్ మాజీ ఛైర్మన్, మైదుకూరు, మరణం : 01-12-2025
చక్రవరం కుటుంబ సభ్యులు

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై- 600032. వెబ్‌సైట్: www.shriramfinance.me.
బ్రాంచ్ కార్యాలయము :డి.నెం.4/620, 1వ అంతస్తు, గాంధీరోడ్డు, ప్రొద్దుటూరు- 516360. కడపజిల్లా

డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేదీ: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేదీ: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఏ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడమైనది. బ్రాంచ్ కార్యాలయము: ప్రొద్దుటూరు (ఇకపై కంపెనీ / లెండర్‌గా వ్యవహరించబడతారు)

ఈక్రింద పేర్కొన్న ఋణగ్రహీత /సహఋణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) వారి వద్ద ఋణ సౌకర్యము పొంది ఉన్నారు. ఋణ సౌకర్యము పొందిన తర్వాత సదరు ఋణగ్రహీతలు/ గ్యారంటీదారులు ఋణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులకు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి ఉన్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా ఋణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా
1) కె.నారాయణరెడ్డి, తండ్రి కె.నారప్పరెడ్డి, కొత్తపల్లి పంచాయతీ, ప్రకాష్ నగర్ ఏరియా, ప్రొద్దుటూరు,కడప జిల్లా
2) ఆర్.లక్ష్మీదేవి, భర్త నారాయణరెడ్డి, డి.నెం.3-151 నుండి 495, వైఎంఆర్ కాలనీ & పార్క్ రోడ్డు, ప్రొద్దుటూరు,కడప జిల్లా
3) వై.ఆదినారాయణరెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి, డి.నెం.2/30ఎ, చిన్నశెట్టిపల్లి గ్రామం, రాజుపాలెం మండలం, కడప జిల్లా

ఎన్‌పిఏ తేదీ: 30.04.2011 డిమాండ్ నోటీసు తేదీ: 21.11.2025
ఋణ మొత్తం రూ.7,00,000 (ఏడు లక్షల రూపాయలు మాత్రమే)
ఋణఅగ్రిమెంట్ నెం. NRTFPR110E00084;
బకాయి అమౌంట్: రూ.38,88,407/- (ముప్పై ఎనిమిది లక్షల ఎనభై ఎనిమిది వేల నాలుగు వందల ఏడు రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు
కడపజిల్లా, ప్రొద్దుటూరుసబ్ జిల్లా, కొత్తపల్లి పంచాయతీ, ప్రకాష్‌నగర్ ఏరియా, మోడంపీడపల్లి ఫీల్డ్స్ సర్వేనెం66/4ఎలో ఎ.2.70 సెంట్లలోని స్వామినగర్ -1, ప్లాట్ నెం.24 యొక్క విస్తీర్ణం ఎ.0.08 సెంట్లు మరియు 113 చ.లింకులకు కొలతలు: తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు: 72.3అ. లేదా 22.037మీ. దక్షిణం వైపు: 72అ. లేదా 21.094మీ. ఉత్తరం నుండి దక్షిణం ఇరువైపులా 49అ. లేదా 14.935మీ. వెరసి 392.6చ.గ. ఇందున పడమర & దక్షిణం వైపురోడ్లలో అర్థభాగం హద్దులు:తూర్పు: బత్తిన చిన్న సుబ్బన్న భూమి, పడమర 30అ. వెడల్పు గల జాయింట్ రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.23 స్థలం, దక్షిణం: 26అ. వెడల్పు గల జాయింట్ రోడ్డు.

ఈ పరిస్థితులలో ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయునదేమనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తం భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించవలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి ఋణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనపరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13) ను అనుసరించి ఋణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకుండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: కడప
తేదీ: 01.12.2025
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

హెచ్ఐవీ లేని సమాజానికి పాటుపడదాం

హెచ్ఐవీ లేని సమాజం కోసం పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. హెచ్ఐవీతోపాటు సుఖవ్యాధులకు స్థానిక ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చని చెప్పారు. అంతకుముందు ఐసీటీసీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో పాఠశాలల నుంచి ర్యాలీ చేశారు. ఆశా కార్యకర్తలు, పర్యవేక్షకులు పాల్గొన్నారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, బృందం

మైదుకూరులో ప్రదర్శనలో పాల్గొన్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరులో ర్యాలీ చేస్తున్న కామనూరు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

చౌడేశ్వరీ దేవస్థానం ధర్మకర్తగా వుట్టి శారద

ప్రొద్దుటూరు పట్టణం: ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వుట్టి శారద సోమవారం నంద్యాల జిల్లా బనగానపల్లె సమీపాన ఉన్న నందవరం గ్రామంలో ఉన్న చౌడేశ్వరీ దేవస్థానం కమిటీ ధర్మకర్తగా ప్రమాణస్వీకారం చేశారు. గతంలో ఆమె భర్త వుట్టి నాగశయనం జిల్లా నుంచి మొదటివ్యక్తిగా చౌడేశ్వరీ దేవస్థానం ధర్మకర్తగా పని చేశారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న శారద

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఖాతాదారులతో కలిసి కేకు కోస్తున్న మేనేజర్ అబ్బయ్య

ఖాజీపేట, న్యూస్‌టుడే: బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాజీపేట మండలంలోని పుల్లూరు శాఖ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ డి.అబ్బయ్య ఆధ్వర్యంలో ఖాతాదారులు, ఎస్‌హెచ్‌జీ మహిళలతో కలిసి కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందిస్తామన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి పాటుపడాలని కోరారు. సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

పీజీ విద్యార్థినికి బంగారు పతకం

డాక్టర్ సంధ్యారాణిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ జమున

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో గత అక్టోబర్ నెలలో జరిగిన పీజీ పరీక్షలలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల అనస్థీషియా విభాగానికి చెందిన పీజీ వైద్య విద్యార్థిని సంధ్యారాణి స్టేట్‌లో అత్యధిక మార్కులు 637-800 సాధించి విశ్వవిద్యాలయ గోల్డ్ మెడల్‌కు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున తెలిపారు. కళాశాలలోని ఆమె కార్యాలయంలో సోమవారం గోల్డ్ మెడల్‌కు ఎంపికై పీజీ వైద్య విద్యార్థినిని విభాగం అధ్యాపకులతో కలిసి అభినందించారు.

ఒకటో తేదీనే ఠంచనుగా పింఛన్

వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ప్రతి నెల ఒకటో తేదీన లబ్ధిదారులకు ఠంచనుగా పింఛను అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే మాధవి అన్నారు. కడప నగరంలోని 35, 48, 05వ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆమె ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛను పెంచామని.. ప్రతి నెల ఒకటో తేదీ ఉదయం నుంచే వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఇంటింటికి వెళ్లి అందిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, తెదేపా నగర అధ్యక్షుడు మన్సూర్‌అలీ పాల్గొన్నారు.

తోల్లగంగన్నపల్లెలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, అధికారులు

వల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ పథకాల ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు సకాలంలో అందుతున్నాయని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. తోల్లగంగన్నపల్లెలో సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తెదేపా మండల సమన్వయకర్త నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దారు శ్రీవాణి నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

శ్రీవిద్య

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి శ్రీవిద్య జాతీయ స్థాయి గట్కా క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ చంద్రావతి తెలిపారు. కర్నూలులోని ఎమ్మిగనూరులో సోమవారం అండర్-19 రాష్ట్ర స్థాయి గట్కా పోటీలు జరగగా శ్రీవిద్య ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. అదే పాఠశాలకు చెందిన వెంకట దివ్య, వంశీలు బ్రాంజ్ మోడల్ సాధించినట్లు ఆమె చెప్పారు. త్వరలో పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో శ్రీవిద్య పాల్గొననుండటంతో బాధ్య హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు అభినందించారు.

తల్లిదండ్రుల సమక్షంలో మైనర్లకు కౌన్సెలింగ్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: డ్రైవింగ్ చేస్తున్న మైనర్లపై ట్రాఫిక్ పోలీసులు సోమవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో మైనర్లను ఠాణా వద్దకు తీసుకెళ్లి వారి తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో సీఐ సురేష్‌రెడ్డి, ఎస్సై జయరాములు కౌన్సెలింగ్ నిర్వహించారు. 18 ఏళ్లు దాటిన పిల్లలు రోడ్లపై డ్రైవింగ్ చేస్తున్నారంటే తల్లిదండ్రులే కారణమన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే పిల్లలు చెడిపోతున్నారని సూచించారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమవుతుందన్నారు. అనంతరం రాత్రి ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మద్యం తనిఖీలు చేపట్టారు. నగరంలోని పలు కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహనాల్లో వెళ్తున్న వారిని ఆపి శ్వాస విశ్లేషణ పరికరం ద్వారా తనిఖీలు చేపట్టారు. మద్యం తాగినట్లు తెలిస్తే వారిపై కేసులు నమోదు చేశారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి, ఎస్సై జయరాములు

సాయినగర్.. సమస్యలతో బేజారు

● అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరవు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: వారం.. నెల కాదు దాదాపు ఎనిమిదేళ్లుగా వారంతా అక్కడ నివాసం ఉంటున్నారు. నగరపాలికకు అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నారు. ప్లాన్ అప్రూవల్ కోసం రూ.3.20 లక్షలు సైతం చెల్లించారు. కానీ ఇప్పటి వరకు కనీసం ఒక్క సిమెంట్ రోడ్, మురుగు కాలువ నిర్మించలేదు. దీంతో ఎనిమిదేళ్లుగా అష్టకష్టాలు పడుతున్నారు.

● ఎనిమిదేళ్ల కిందట కడప పక్కీర్‌పల్లెలో శ్రీసాయినగర్ పేరిట ఓ కాలనీ ఏర్పడింది. ఇక్కడ దాదాపు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. దాదాపు ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఆ కాలనీ వాసులకు ఇప్పటి వరకు రోడ్లు, మురుగు కాలువలు నిర్మించకపోవడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

● చిన్నపాటి వర్షం కురిసినా వీధుల్లో వాననీరు నిలిచి అడుగు తీసి మళ్లీ వేయలేని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికీ నగరపాలిక అధికారులు రోడ్లు, మురుగు కాలువలు నిర్మించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా గూడు లేని పలువురు పేదలు ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షల నుంచి రూ.3.20 లక్షల చొప్పున నగరపాలిక కార్యాలయంలో చెల్లించారు.

పక్కీరుపల్లెలోని రహదారి దుస్థితి

● నగరంలో తిలక్‌నగర్, బీడీ కాలనీ, రామాంజనేయపురం, శాంతినగర్, వైఎస్సార్ కాలనీ తదితర కాలనీల్లో కూడా రోడ్లు లేవు. అధికారులు స్పందించి సిమెంటు రోడ్లు నిర్మించి మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

శ్రీసాయినగర్‌లో ఆరేళ్ల నుంచి నివాసం ఉంటున్నా. తమ కాలనీకి ఇప్పటి వరకు రోడ్లు, మురుగు కాలువలు నిర్మించలేదు. ఇంటి పన్నుతో సహా అన్ని రకాల పన్నులు కడుతున్నాం. కానీ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా మౌలిక వసతులు కల్పించాలి. **- పవన్‌కుమార్, స్థానికుడు**

విద్యాశాఖలో నూతన క్యాడర్‌ను సృష్టించాలి

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎన్టీఏ నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే: విద్యాశాఖలో ఉద్యోగోన్నతుల కోసం నూతన క్యాడర్లను సృష్టించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణంరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు సోమవారం పులివెందులలో ఎన్టీఏ నాయకులు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీ రామకృష్ణంరాజు మాట్లాడుతూ అనేక మంది ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతుల ఛానల్ లేక తాము చేరిన క్యాడర్‌లలోనే రిటైర్ అయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుత పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కూడా నూతనంగా డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పోస్టులను సృష్టించి ఆ శాఖలోని సీనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించారన్నారు. అదే విధంగా విద్యాశాఖలోనూ నూతన క్యాడర్‌లను సృష్టించి అర్హత గల సీనియర్ ఉపాధ్యాయులతో ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీచేసే విధంగా కృషిచేయాలని కోరారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఎన్టీఏ జిల్లా గౌరవాధ్యక్షుడు కూరాకు రవీంద్ర, జిల్లా నాయకులు మనోహర్‌రెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, సూర్యుడు, కృష్ణమూర్తి తదితరులున్నారు.

అవగాహన పెంచుదాం.. మహమ్మారిని తరిమేద్దాం

ప్రాణాంతక హెచ్ఐవీ, ఎయిడ్స్ మహమ్మారిని ముందుచూపుతో తరిమేద్దామని వైద్యాధికారులు పేర్కొన్నారు. కడప, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల్లోని పలు ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. నేటి యువత జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. **- న్యూస్‌టుడే, కడప క్లస్టర్ బృందం**

ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వైవీయూలో అవగాహన కార్యక్రమం నిర్వహించిన తెలుగు వేమన విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం యూనిట్-4 అధికారులు

కమలాపురం ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయమూర్తి మధుసూదన్‌రావు

మహిళా భద్రతపై అవగాహన

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆయా ఠాణాల పరిధిలోని పోలీసులు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల చట్టాల గురించి తెలియజేశారు. సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. అనవసరమైన లింకులు క్లిక్ చేయవద్దన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై అప్రమత్తం చేశారు. అత్యవసమైతే డయల్ 100, 112, 1098, 181, 1091, 1930 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ తాగే వారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల మండలం మల్లికార్జునపురంలో ఉన్న సాయిబాబా ఆలయంలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి ఆలయంలోని హుండీని దొంగలు పగుల కొట్టి అందులో ఉన్న నగదు, తదితర వస్తువులను తీసుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై సమాచారం అందుకున్న పులివెందుల పోలీసులు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. గ్రామస్థులు, పూజారి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఖాజీపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16) అదృశ్యమైంది. ఒంటిమిట్ట మండలంలోని ఓ గ్రామంలో ఉంటున్న మేనత్త ఇంటికి నెల కిందట ఆమె వచ్చింది. ఈ క్రమంలో గత నెల 29న తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె తండ్రి గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం పోలీసులను ఆశ్రయించడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన కారు

కడప నేరవార్తలు : కడప శంకరాపురంలో సోమవారం పార్కింగ్ చేసిన కారు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు లోపలి భాగం పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

స్వచ్ఛంద సంస్థ భవన నిర్మాణానికి వితరణ

పులివెందుల : పులివెందులలోని స్నేహిత అమృత హస్తం సేవా సమితికి సంబంధించిన నూతన భవన నిర్మాణానికి పులివెందులకు చెందిన వ్యాపారవేత్త రమేష్ నాయుడు తన వంతుగా విరాళం అందజేశారు. ఆయన స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు ముమ్మెల రాజుకు నూతన భవన నిర్మాణ అవసరాల కోసం రూ.25వేలు నగదును సోమవారం అందజేశారు.

తాగునీటి వృథాకు అడ్డుకట్ట

స్పందనకు వందనం

వేంపల్లె, న్యూస్‌టుడే: తాగునీటి పథకం పైపులైన్ దెబ్బతిని రోడ్డుపై వృథాగా పారుతున్న తాగునీటిని గ్రామ పంచాయతీ సిబ్బంది అరికట్టారు. ఈ సమస్యపై సోమవారం 'ఈనాడు'లో 'తాగునీరు వృథా.. తప్పని వ్యధ' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన గ్రామపంచాయతీ ఈవో నాగభూషణ్‌రెడ్డి తమ సిబ్బందిని అక్కడికి పంపించి దెబ్బతిన్న పాపఘ్ని తాగునీటి పథకం పైపులైన్‌కు గొయ్యితీసి మరమ్మతులు చేయించారు.

మెయిన్‌బజారులో పైపులైన్ లీకేజీని మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

30 శాతం ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న బహుజన టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున

కడప విద్య, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావొస్తున్నా ఇంత వరకు ఐఆర్ ప్రకటించకపోవడం బాధాకరమని ఇచ్చిన హామీ మేరకు వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని బహుజన టీచర్స్ యూనియన్ (బీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో సోమవారం బీటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల శివార్జున మాట్లాడుతూ.. పీఆర్సీ కాలపరిమితి గడిచిపోయినా ఇంత వరకు పీఆర్సీ కమిటీ వేయకపోవడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు తక్షణమే చెల్లించాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రధాన పాత్రవహించారన్నారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, ఐఆర్ ప్రకటించి, పీఆర్సీ కమిటీ వేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రాజబాబు, జిల్లా అధ్యక్షుడు గంగరాజు, జిల్లా కార్యదర్శి జయరాం పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలకు నామపత్రాల దాఖలు

బిల్టప్, కడప న్యూస్‌టుడే: కడప నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ మొదలైంది. స్టాండింగ్ కౌన్సిల్‌లో అయిదు మంది సభ్యులను ఎంపిక చేస్తారు. ఈ స్థానాల కోసం ఎనిమిది మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో అరుణ ప్రభ తెదేపాలో కొనసాగుతుండగా మిగిలిన ఏడుగురు వైకాపా కార్పొరేటర్లుగా ఉన్నారు. ఈ నెల 2వ తేదీ (మంగళవారం) నామినేషన్ల ప్రక్రియ జరుగుతుంది. అయిదో తేదీ నామినేషన్ల తిరస్కరణ ఉపసంహరణ చేపడతారు. తొమ్మిదో తేదీన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేస్తారు. 8 మంది నామినేషన్లు దాఖలు చేసిన నేపథ్యంలో ముగ్గురు పోటీ నుంచి తప్పుకోక పోతే తొమ్మిదో తేదీ ఎన్నిక అనివార్యం అవుతుంది. ఈ పాలక వర్గం ఏర్పడిన తర్వాత స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల ఎంపిక ఇప్పటి వరకు ఏకగ్రీవంగా జరిగింది.

భగవద్గీత పఠనం పుణ్యకార్యం

భగవద్గీత పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జిల్లా ఆవోపా అధ్యక్షుడు హరికృష్ణ తదితరులు

వేంపల్లె, న్యూస్‌టుడే: భగవద్గీత పఠనం ఎంతో మంచిదని ఆవోపా జిల్లా అధ్యక్షుడు గూడూరు హరికృష్ణ అన్నారు. గీతా జయంతి సందర్భంగా స్థానిక అమ్మవారిశాలలో సోమవారం దాతల సహకారంతో కొనుగోలు చేసిన భగవద్గీత పుస్తకాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆవోపా సంఘ నేతలందరూ పట్టణంలో పలువురి ఇళ్లకు వెళ్లి భగవద్గీత పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్‌కుమార్, జిల్లా కోశాధికారి రాజగోపాల్, వాసవీబ్లడ్‌బ్యాంక్ అధ్యక్షుడు పుల్లగూర అరవింద్, వీరేంద్ర, ద్వారక, సురేష్, సిద్దయ్య పాల్గొన్నారు.

సిద్దవటాన్ని విలీనం చేయొద్దంటూ వినతుల వెల్లువ

సిద్దవటంలో తహసీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న జేఏసీ నాయకులు

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం మండలాన్ని అన్నమయ్య జిల్లాలో విలీనం చేసే ప్రక్రియను విరమించుకుని కడప జిల్లాలోనే కొనసాగించాలంటూ సిద్దవటం మండలంలోని తెదేపా, జనసేన నాయకులు సోమవారం పలువురు ఉన్నతా అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. అన్నమయ్య జిల్లాలో విలీనం చేస్తే ప్రజలకు కలిగే నష్టాలను తహసీల్దారు తిరుమలబాబుకు వివరించారు. మాధవరం-1 జేఏసీ నాయకులు మండల ప్రజలతో సంతకాలు సేకరించి ఆ నివేదికను ఆయనకు అందజేశారు.

ఆదమరిస్తే కాలువలోకే!

కడప రాజారెడ్డి వీధిలోని ప్రధాన రహదారి నుంచి ఎస్పీ బంగ్లాకు వెళ్లే మార్గంలో మురుగు కాలువ ప్రమాదకరంగా ఉంది. నిత్యం వాహనాలు, జన సంచారంతో రద్దీగా ఉండే ప్రాంతమిది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చోదకులు, పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బిల్టప్, కడప**

ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏపీ ఎన్జీవో సంఘ వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డిలు కోరారు. సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు రామగిడ్డయ్యను ఆయన కార్యాలయంలో కలిసి వినతి చేశారు. గత కొన్నేళ్లుగా శాఖలో ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేస్తున్నవారికీ మహిళా సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతి ఇవ్వాలన్నారు. దీనికి ఆర్డీ స్పందించి పరిశీలించి సీనియార్టీ జాబితా తయారుచేసి ఇస్తామన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, కార్యదర్శి చంద్రమోహన్, నిత్యపూజయ్య, మహిళా విభాగ ఛైర్మన్ జమీలబేగం, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ఆర్డీ రామగిడ్డయ్యకు వినతి పత్రం ఇస్తున్న ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, తదితరులు

పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: హత్యకు గురైన పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలోని కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి కడపలోని అంబేడ్కర్ కూడలిలో నెల్లూరులో జరిగిన పెంచలయ్య హత్యను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. కులవివక్ష వ్యతిరేకపోరాట సమితి నాయకులు నరసింహ, ప్రవీణ్, తిమ్మయ్య, రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవిలు మాట్లాడుతూ మత్తు పదార్థాల నుంచి యువత బయటకు రావాలని కోరుతూ కళారూపాలతో చైతన్య పరుస్తున్న వైనాన్ని తట్టుకోలేనిగంజాయి ముఠా పెంచలయ్యను హత్య చేసిందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రూ. 50లక్షల ఆర్థిక సాయంతో పాటు ఆరెకరాల భూమి కేటాయించి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దెబ్బతిన్న ఘంటసాల విగ్రహం

కడప నగరంలోని నెహ్రూ పార్కులో రాయలసీమ ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అమర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహాన్ని కొన్నేళ్ల కిదంట ఏర్పాటు చేశారు. కొద్ది నెలల కిందట ఆకతాయిలు విగ్రహానికి ఉన్న ఒక చేయి విరగ్గొట్టారు. అప్పటి నుంచి కళా విహీనంగా ఉంది. స్వచ్ఛంద సంస్థలైనా ముందుకొచ్చి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆయన అభిమానులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కడప విద్య**

విభజన చట్టం హామీల అమలుకు డిమాండ్

వేంపల్లె, న్యూస్‌టుడే: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు రాష్ట్రంలోని ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో పోరాడాలని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆనాటి యూపీఏ ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్‌కు మూడు వరాలు ఇచ్చిందని, అందులో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడపలో ఉక్కు కర్మాగారం, విశాఖ - విజయవాడ మెట్రో రైలు, దుగరాజపట్నం వద్ద మేజర్ ఓడరేవు నిర్మాణం వంటి హామీలను అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అవి ఇప్పటికీ నెరవేరలేదన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన పార్లమెంటు శీతాకాలం సమావేశాల్లో రాష్ట్ర ఎంపీలు ఈ అంశాలను లేవనెత్తి పోరాటానికి దిగాలన్నారు.

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా... బంగాళదుంప-40, క్యాబేజీ-28, క్యారెట్-55, బీన్స్-45, బీట్‌రూట్-50, కీర-30, దోస-40, దొండకాయలు-50, ముల్లంగి-40, అల్లం-60, 80, కాలీఫ్లవర్-38, క్యాప్సికం-70, టమాట-35, మిరపకాయలు 40, వంకాయలు-20, బెండకాయలు-35, బీర-40, కాకర- 40, మటిక్కాయ-40, చిక్కుడు-58, అలసందకాయలు-45, అనపకాయలు-60, ఉల్లిపాయలు-20, 25, మునగకాయలు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ఏటా రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. పాత కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం దూదేకుల హక్కుల పోరాట సమితి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం ఎంతో అవసరమని అలాంటి వారికి ఇలాంటి శిబిరాలు మేలు చేస్తాయన్నారు. దూదేకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మన్నూరు అక్బర్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా బాధ్యతగా ఏటా డిసెంబరు ఒకటో తేదీన రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తెదేపా నాయకులు అమీర్‌బాబు, ముక్తియార్, గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, సుధాకర్, ఆమూరిబాలదాసు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలను అభినందిస్తున్న తెదేపా నేత పుత్తా నరసింహారెడ్డి, తెదేపా నాయకులు

అటకెక్కిన ప్లాస్టిక్ నిషేధం

ఆచరణలో అధికారులు విఫలం

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: ప్లాస్టిక్‌ను నిషేధించి భూమాత తాపాన్ని తగ్గించాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఎవరికీ పట్టడం లేదు. అందుకు తార్కాణం ఈ చిత్రాలే. కడప రైతు బజారుకు నిత్యం వందలాది మంది వినియోగదారులు కూరగాయల కొనుగోళ్లకు వస్తుంటారు. వారికి అవగాహన కల్పించేందుకు బజారు ప్రధాన ద్వారం వద్ద 'ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. దానికి బదులు వస్త్ర సంచులు వినియోగిద్దాం' అని ప్రచార సూచిక ఏర్పాటు చేశారు. కానీ.. దాన్ని ఎవరూ పట్టించుకోవడమే లేదు. ఓ వినియోగ దారు చేతిలో పాలిథిన్ కవరులోనే కూరగాయలు తీసుకెళ్లడం కనిపించింది.

● రైతుబజారు ఎస్టేట్ అధికారి కార్యాలయానికి ఎదురుగానే వస్త్ర సంచుల కోసం ఏటీఎం లాంటి యంత్రం ఒకటి గతంలోఏర్పాటు చేశారు. తగిన చిల్లర అందులో వేస్తే ఒక సంచి వస్తుంది. అంది ఎంతగానో ఉపయోగ పడింది. కొన్నాళ్లు బాగానే పని చేసినా అనంతరం మరమ్మతులకు గురైంది. ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ అధికారులు, తూనికలు, కొలతల అధికారులు చొరవ చూపి రైతుబజారును ప్లాస్టిక్ రహితంగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిషేధమని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్దే పాలిథిన్ కవరుతో వినియోగదారు .. నిరుపయోగంగా వస్త్ర సంచి మిషన్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu